यदा यदा हि धर्मस्य ग्लानिर्भवती भारत।
अभ्युत्थानमधर्मस्य तदाऽऽत्मनं सृजाम्यहम ।।

శ్రీభగవద్గీతాశాఙ్కరభాష్యమ్

ఆంధ్రభాషావ్యాఖ్యయా బాలానన్దిన్యా
సమఞ్చితమ్

వ్యాఖ్యాయా రచయితా
మహామహోపాధ్యాయః
ఆచార్యః డా. పుల్లెల శ్రీరామచన్ద్రః

DISTRIBUTORS:
SRI GOPAL PUBLICATIONS
3-3-860, Lane Opp: Aryasamaj
KACHIGUDA, HYD-27. Ph:4658101

ఆర్షవిజ్ఞానట్రస్టు
హైదరాబాదు
2001

శ్రీ భగవద్గీతా శాఙ్కరభాష్యం : బాలానందినితో

ప్రథమముద్రణ 2001

© ఆ.వి. ట్రస్టు

ప్రతులు 1000

వెల రూ. 150=00

ప్రతులకు

శ్రీ పమిడిఘంటం శ్రీరఘురామ్

అడ్వకేట్

శ్రీరామసదనం, ప్లాటు నెం. 1361, రోడ్ నెం : 45, జూబిలీహిల్సు,

హైదరాబాద్ - 500 033. ఫోన్ : 3608237, 3545145

Sribhagavadgita Sankara Bhashyam
with Balanandini by Mahamahopadhyaya
Dr. P. Sri Ramachandrudu

First Edition - 2001

Copies : 1000

Price : 150=00

For Copies

Sri Pamidighantam Sri Raghuram
Plot No. 1361, Road No. 45, Jubilee Hills,
Hyderabad - 500 033.
Tele Fax : 3608237, 3545145

Text Composed at :Samantha Graphics Hyderabad - 20. Ph : 7670949

Printed at : Sree Kalanjali Graphics, Hyderabad - 29. Phone : 3329831

శ్రీః

కృతి సమర్పణమ్

శ్రీహయవదనానుగ్రహసమాసాదితాసాధారణప్రతిభో
త్త్రాసితగీష్పతిభ్యః, స్వయంప్రతిభాతసకలశాస్త్రేభ్యః,
సార్ధశతగ్రన్థరచనావిష్కృతానేకశాస్త్రపురాణేతిహాసాదిపాణ్డితీకవితానైపు
ణీసమజ్చితేభ్యః,భాష్యార్కప్రకాశ - శంకరాశంకరభాష్య
విమర్శాద్యనేకవేదాన్తగ్రన్థవిశదీకృతాద్వైతసిద్ధాన్తరహస్యేభ్యః,
శ్రీబెల్లంకొండరామరాయకవివరేభ్యః
సప్రశ్రయాదరమియం మదీయా కృతిః బాలానన్దిన్యాఖ్యా శ్రీభగవద్గీతా
శాంకరభాష్యవ్యాఖ్యా సమర్ప్యతే.

బెల్లంకొండసువంశమౌక్తికమణిర్విజ్ఞానతేజోఘృణిః
దుర్వాదోద్ధతమత్తవారణసృణిః శిష్యాలిచిన్తామణిః,
గ్రన్థానాం మహితేన సార్ధశతకేనాక్రాన్తసర్వావనిః
లేభే యోఽభినవార్యశంకర ఇతి ప్రాజ్ఞేషు కీర్తిం గుణీ.

ఆచాన్తాఖిలశాస్త్రజాలజలధిర్వేదాన్తవిద్యానిధిః
శాన్తాత్మాదృతసంనిధిః సువిహితశ్రుత్యుక్తనానావిధిః,
సమ్యక్స్థాపితభేదధిక్కృతివిధిర్యః సద్గుణానాం నిధిః
సౌమ్యత్వస్య పరావధిశ్చ విదుషామాసీన్మహాన్ శేవధిః.

మహ్యా తేజోఽన్యభాష్యాణాం యద్భాష్యార్కప్రకాశతః,
రామరాయాయ కవయే కృతిస్తస్మై సమర్ప్యతే.

2001

పుల్లెల శ్రీరామచన్ద్రః

శ్రీః

విషయసూచిక

1.	ప్రథమోఽధ్యాయః – అర్జునవిషాదయోగః	1
2.	ద్వితీయోఽధ్యాయః – సాంఖ్యయోగః	19
3.	తృతీయోఽధ్యాయః – కర్మయోగః	146
4.	చతుర్థోఽధ్యాయః – జ్ఞానకర్మసంన్యాసయోగః	211
5.	పఞ్చమోఽధ్యాయః – సంన్యాసయోగః	283
6.	షష్ఠోఽధ్యాయః – ధ్యానయోగః	331
7.	సప్తమోఽధ్యాయః – జ్ఞానవిజ్ఞానయోగః	393
8.	అష్టమోఽధ్యాయః – ధారణాయోగః	438
9.	నవమోఽధ్యాయః – రాజవిద్యారాజగుహ్యయోగః	476
10.	దశమోఽధ్యాయః – విభూతియోగః	518
11.	ఏకాదశోఽధ్యాయః – విశ్వరూపదర్శనయోగః	549
12.	ద్వాదశోఽధ్యాయః – భక్తియోగః	598
13.	త్రయోదశోఽధ్యాయః – క్షేత్రక్షేత్రజ్ఞయోగః	627
14.	చతుర్దశోఽధ్యాయః– గుణత్రయవిభాగయోగః	728
15.	పఞ్చదశోఽధ్యాయః – పురుషోత్తమయోగః	757
16.	షోడశోఽధ్యాయః– దైవాసురసంపద్విభాగయోగః	782
17.	సప్తదశోఽధ్యాయః – శ్రద్ధాత్రయవిభాగయోగః	804
18.	అష్టాదశోఽధ్యాయః – మోక్షసంన్యాసయోగః	827

ప్రణతి

బ్రహ్మవిద్యను బోధించే గ్రంథాలలో భగవద్గీతకు విశిష్టస్థానం ఉంది. సాధించవలసిన లక్ష్యం ఒకటే అయినప్పటికీ సాధనమార్గాలు అనేకమని సూచిస్తూ గీత విస్తృత ప్రాచుర్యం పొందింది. లౌకిక పారలౌకిక సాధనలు రెండిటికీ అందులో ఉపజ్ఞలు, ఉపదేశాలు ఉన్నాయి. గాంధీజీ లౌకిక జీవితంలో గీతను ఆశ్రయించారు. జీవించడం ఒక కళ అయితే ఆ కళను గీత నేర్పుతుందన్నారాయన. స్థిత ప్రజ్ఞత్వాన్ని వివరిస్తూ గీత రెండవ అధ్యాయంలో చెప్పినదంతా ఇదేనని గాంధీజీ అభిప్రాయం.

భగవద్గీత కూడా ఒక ఉపనిషత్తు. నూట ఎనిమిది ఉపనిషత్తుల వేదాంతం అంతా గీత 18 అధ్యాయాలలో నిక్షిప్తమై ఉన్నదంటారు పెద్దలు. వేదాంతం అంటే ఉపనిషత్తులే. యోగశాస్త్రంగా కూడా గీత ప్రశస్తి వహించింది. చిత్తవృత్తిని నిరోధించేది యోగం. గీత దానినే బోధిస్తున్నది. వేద వేదాంగాలు, పురాణేతి హాసాలు చదివే అవకాశం లేని సామాన్యులు సైతం గీతాధ్యయనం చేయడానికి ఇష్టపడుతున్నారు,చేస్తున్నారు.

ప్రపంచ సాహిత్యంలో మరియే ఆధ్యాత్మిక గ్రంథానికి రానన్ని వ్యాఖ్యానాలు భగవద్గీతకు వచ్చాయి. ఇంచుమించు అన్ని భాషలలోనూ భగవద్గీతా గ్రంథాలు వెలువడ్డాయి. ఒక్కొక్క భాషలో అసంఖ్యాక వ్యాఖ్యానాలు వచ్చాయి కూడా. అలా అన్ని ఎందుకు వచ్చాయి?వాటి అవసరమేమిటి? ఇవి సహజంగానే ఉత్పన్నమయ్యే ప్రశ్నలు. సర్వేపల్లి రాధాకృష్ణన్ లాంటి తత్త్వవేత్తలు, బాలగంగాధర్ తిలక్ లాంటి నీతి కోవిదులు, అరవిందుల వంటి తపస్సంపన్నులు గీతా వ్యాఖ్యానాలు చేశారు. ఇదేదో ఇప్పుడు వచ్చిన పరిణామం కాదు. వందల సంవత్సరాలుగా ఇలా గీతా వ్యాఖ్యాన గ్రంథాలు వెలువడుతూనే ఉన్నాయి. తవ్వి తీసినకొద్ది ఆలోచనల మేలి రతనాలు దొరికే ఖని భగవద్గీత. ఎందరు తవ్వినా ఏవో కొత్త ఆలోచనలు వస్తూనే ఉంటాయి. ఎవరి బుద్ధిబలం కొద్దీ వారు, ఎవరి సంస్కారం కొద్దీ వారు గీతా శ్లోకాలకు అర్థాలు చెప్పారు, వ్యాఖ్యానాలు చేశారు. దేని ప్రత్యేకత దానిదే.

ఇంతటి విలక్షణమైన గ్రంథం కనుకనే భగవద్గీత ప్రస్థానత్రయంలో ఒకటిగా ఉపనిషత్తులతో, బ్రహ్మసూత్రాలతో సమస్థాయి గౌరవాన్ని పొందింది.

భగవద్గీతపై త్రిమతాచార్యులు తమవైన పద్ధతులలో వ్యాఖ్యానాలు రాశారు. అద్వైత, విశిష్టాద్వైత, ద్వైత సిద్ధాంతాలను విశ్వసించే వేర్వేరు మతాల వారు తమ ఆచార్యులు చెప్పినదే సరైనదని భావించి అధ్యయనం చేస్తున్నారు, అనుసరిస్తున్నారు.

ఆచార్య త్రయ భాష్యాలలో ఏది గొప్పది అనే చర్చ ప్రస్తుతాంశం కాదు. దేని విలువ దానికి ఉంది. ఇకముందు కూడా ఉంటుంది.

ప్రస్థానత్రయంలో దశోపనిషత్తులకు, బ్రహ్మసూత్రాలకు భాష్యం చెప్పిన ఆది శంకరుల వారు భగవద్గీతకు చెప్పిన భాష్యం ఇరవయ్యో శతాబ్దిలో సైతం ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఎందరో తత్త్వవేత్తలను ఆకర్షించింది. శంకరుల సునిశితమేధ వారిని అబ్బురపరచింది.

ఆదిశంకరులవారి రచనలుగా ప్రసిద్ధిలోకి వచ్చిన శతాధిక గ్రంథాలలో ప్రస్థాన త్రయ భాష్యాలే గాక మరెన్నో భాష్యాలు ఉన్నాయి. వాటిలో ఏవి శంకరులవో, ఏవి కావో ఇదమిత్థంగా తేల్చి చెప్పడం సాధ్యం కాదు. ఐతే, ప్రస్థానత్రయ భాష్యాల విషయంలో మట్టుకు అలాంటి పేచీలు లేవు. పాఠబేధాలు మాత్రం ఉన్నాయి. ముద్రణలేని కాలంలో రాసిన ప్రతులు కనుక అలాంటి వ్యత్యాసాలు సహజమే.

దేశకాల పరిస్థితుల ప్రభావం రచనల మీద తప్పనిసరిగా ఉంటుంది. ఆదిశంకరులు ఎప్పటివారనే విషయంలో వివాదాలు తలెత్తినప్పటికీ, ఆయన క్రీస్తు శకం ఎనిమిదవ శతాబ్ది వాడని నిర్ధారణ జరిగినట్టే భావించవచ్చు. ఇప్పటి కేరళ రాష్ట్రంలోని కాలడి ఆయన జన్మస్థలం. క్రీస్తు అంతేవాసి సెయింట్‌థామస్ మనదేశంలో క్రీస్తు శకం 52వ సంవత్సరంలో అడుగుపెట్టిన మలయత్తూరు గ్రామం కాలడికి ఎంతో దూరంలో లేదు. అప్పటిరాజ్యాధీశులు క్రీస్తుదూతను ఆహ్వానించి ఆదరించారు. ఇస్లామ్ మతం కూడా శంకరుల కాలానికి కేరళ గడ్డమీద కాలూనింది. బౌద్ధ, శైవ, వైష్ణవ, శాక్తేయ, కాపాలికాది మతాలు ఉన్నాయి. యూదులు సైతం అప్పటికి అక్కడ ఉన్నారు. ఇన్ని విశ్వాసాల, సిద్ధాంతాల మధ్య ఘర్షణ ప్రజలలో ఒక అయోమయావస్థను సృష్టించిన కాలమది. ఈ నేపథ్యంలో జన్మించిన ఆదిశంకరులు మూఢవిశ్వాసాలను తొలగించి వేదధర్మంలోని ఉత్తమ విలువలను పునఃప్రతిష్ఠించడానికి కృషి చేశారు. సమన్వయాన్ని సాధించారు. అద్వైతం ఆదిశంకరుల సృష్టి కాదు. అది ఆయనకు ముందునుంచి ఉన్నదే. ఐతే, శంకరులు దానికి మెరుగులు దిద్ది తన వ్యాఖ్యానాలద్వారా, భాష్యాలద్వారా దుర్భేద్య సిద్ధాంత దుర్గం కావించారు. శంకరులంతటి మహామేధావి ఇంతవరకు ఈ గడ్డమీద జన్మించలేదనిపించారు. హేతుబద్ధంగా ఆయన చేసిన రచనలు బహుళవ్యాప్తిని పొందాయి. సైన్యాలతోగాని, యుద్ధనైపుణ్యంతో గాని సంబంధం లేకుండా ఆ మహనీయుడు చతురామ్నాయాలకు చిహ్నాలుగా నాలుగు మఠాలను స్థాపించి దేశాన్ని సాంస్కృతికంగా ఏకం చేశారు.

జీవాత్మ, పరమాత్మల ఐక్యాన్ని సైద్ధాంతిక బలంతో నిరూపించినది గనుక శంకరుల మతం "అద్వైత"మనిపించుకొన్నది. శంకరుల రచనలన్నింటి అంతస్సూత్రం అద్వైతమే. వైరుధ్యాలకు ఆస్కారం లేని విధంగా ఆయన వ్యాఖ్యానాలు సాగాయి.

ప్రస్థానత్రయంలో గీతాభాష్యానికే ప్రాచుర్యం ఎక్కువ. భిక్షుసూత్రాలుగా కూడా పేరున్న బ్రహ్మసూత్రాల భాష్యాన్ని యతులే చదవాలనే విశ్వాసం కొందరిలో ఒకప్పుడు ఉండేది. అలాంటి అభ్యంతరాలేవీ లేకపోవడం వల్ల గీతా భాష్యం ఎక్కువమంది ఆదరణకు పాత్రమైంది. ప్రస్థానత్రయ భాష్యం చదవడానికి ముందు కొంత మౌలిక పరిజ్ఞానాన్ని ఆర్జించి ఉండటం అవసరమనికూడా కొంతకాలం అనుకొన్నారు.

శంకరుల భాష్యాలను తెలుగులో ప్రచురించే ప్రయత్నం వంద సంవత్సరాలుగా జరుగుతూనే ఉంది. కొందరు మూలంతో ప్రచురించడానికి ప్రయత్నిస్తే కొందరు కేవలం అనువాదం మాత్రమే చాలుననుకొన్నారు. ఇలా తెలుగులో కొన్ని రచనలు వెలువడినప్పటికీ

మూలం, తెలుగులో విశదీకరణ, ఇతర మతసిద్ధాంతాలతో పోల్చిచూడటం ఇంతవరకు ఒక పద్ధతి ప్రకారం జరగలేదు. వావిళ్లవారు భగవద్గీతను శంకరులవారి అద్వైత సిద్ధాంత పరంగా ప్రకాశింపచేస్తూ, మాధ్వ,రామానుజ వ్యాఖ్యలను కూడా సంక్షిప్తంగా అందించారు. ఐతే అందులో సంస్కృత మూలవ్యాఖ్య లేదు. అలా మూలంతో కూడిన తెలుగు గ్రంథం లేకపోవడం ఇంతకాలం కొరతగానే ఉండిపోయింది.

తెనాలిలోని సాధన గ్రంథమండలి కడచిన నాలుగు దశాబ్దాలుగా శంకరగ్రంథాలను ప్రచురిస్తూ భగవద్గీతాశాంకర భాష్యాన్ని కూడా 1999లో వెలువరించారు. ఇందులో మూలం కూడా ఇచ్చారు. ఐతే ఇందులోనూ ప్రతిపదార్థాలు లేవు. తాత్పర్యం మాత్రం ఉంది.

భగవద్గీతకు ఎవరెన్ని వ్యాఖ్యానాలు రాసినా శంకరభాష్యానికి ఒక ప్రత్యేకత ఉంది. వ్యాఖ్యానాలు, భాష్యాలు అక్కరలేదనుకొనేవారిని తప్పిస్తే సందేహాలు తీర్చే రచన కావాలనుకొనేవారు తమ తమ విశ్వాసాల మేరకు ఏదో ఒక భాష్యాన్ని ఎంచుకొంటారు. ఆదిశంకరులవారు తాము రచన చేసినప్పటి వరకు వచ్చిన వాదోపవాదాలను దృష్టిలో పెట్టుకొనే భాష్య రచన చేసి ఉంటారనడంలో సందేహం లేదు. అలా కొన్ని వాదాలను ఖండించిన తీరునుబట్టి ఆయనను "ప్రచ్ఛన్న బౌద్ధుడ"ని కొందరు ఆక్షేపించారు కూడా. శంకరుల భాష్యం వెలువడిన అనంతరం సైతం అందులోని వాదాలను విమర్శించిన వారున్నారు. అలాంటి విమర్శలకు ఎక్కడెక్కడ ఎవరెవరు ఎలా సమాధానాలు చెప్పారో గాని వాటన్నింటిలోకి ఇరవయ్యవ శతాబ్ది ఆరంభంలో బెల్లంకొండ రామ రాయకవి రాసిన "గీతాభాష్యార్కప్రకాశ"అత్యంత ప్రామాణికమైనదని పలువురు పండితుల అభిప్రాయం. రామరాయ కవి ఆదిశంకరులవలెనే నలభై యేళ్లయినా నిండకముందే కాలం చేశారు. శంకరులవలెనే చిన్న వయస్సులో స్తోత్రాలు, అష్టకాలు, భాష్యాలు రాశారు. మొత్తం 143 రచనలు చేశారు. ఆయన సొంత దస్తూరీలో ఉన్న రచనలను చూసే అదృష్టం నాకు కూడా కలిగింది. ఎన్ని వేల పుటలు చూసినా ఆయన రాతలో ఎక్కడా ఒక కొట్టివేత గాని, దిద్దుబాటుగాని కనిపించకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఆయన హయగ్రీవోపాసన చేశారని, అతి కఠినమైన పద్ధతిలో తపస్సు చేశారని పెద్దలవల్ల విన్నాము.

శంకరుల గీతా భాష్యానికి ఇప్పుడు ఆర్షవిజ్ఞాన ట్రస్టు తెలుగు అనువాదాన్ని అందిస్తున్నది. ఇది కేవలం అనువాదం మాత్రమే కాదు. అంతకు మించిన విశేషం ఈ రచనలో ఉంది.

న్యాయమూర్తి శ్రీ పమిడి ఘంటం కోదండ రామయ్యగారు స్థాపించిన ఆర్షవిజ్ఞాన ట్రస్టు ఒక ధర్మసంస్థ, పుణ్యసంస్థ. జిజ్ఞాసువులకు ఆర్షవిజ్ఞాన సంపదను ఎలాంటి లాభదృష్టి లేకుండా వీలైనంత తక్కువ ధరకు అందించాలన్న ఆశయంతో ఏర్పడిన సంస్థ గనుక "పుణ్యసంస్థ"అని కూడా అనవలసి వచ్చింది. అర్థతాత్పర్య విశేషవ్యాఖ్యలతో శ్రీమద్రామాయణ, శ్రీమహాభారతాలను, శంకరుల సూత్రభాష్యాన్ని,

పతంజలి సూత్రాలకు తెలుగు అనువాదాన్ని ప్రచురించిన ఈ సంస్థ శ్రీ కోదాండరామయ్య గారి అండదండలతో గీతాభాష్య ప్రచురణమనే బృహత్కార్యానికి పూనుకొన్నది.

తెలుగు అనువాదాల ప్రచురణలలో ట్రస్టుకు వెన్నుదన్నుగా నిలచిన మహనీయులు మహామహోపాధ్యాయ శ్రీ పుల్లెల శ్రీరామచంద్రుడుగారు. వాల్మీకి రామాయణానికి శ్రీరామచంద్రుడు గారు ప్రతిపదార్థ, తాత్పర్య,విశేష వ్యాఖ్యలను రచించారు. ఆర్షవిజ్ఞానాన్ని అభిమానించే ఎందరో ఈ కృషిని అభినందించారు. శ్రీరామచంద్రుడు గారి "బాలానందినీ" వ్యాఖ్యను ఒక వంక పండితులు, మరొక వంక సామాన్యులు సైతం అమితంగా అభిమానించి, ఆదరించారు. అలాగే పతంజలి యోగసూత్రాలకు, తరువాత బ్రహ్మసూత్ర భాష్యానికి ఆయన చేసిన అనువాదాలు సైతం పాఠకుల ఆదరణ పొందాయి. శ్రీరామచంద్రుడు గారు ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయక శ్రమించి శంకర గీతా భాష్యానికి ఇప్పుడు తెలుగు అనువాద రచనను అందించినందుకు ఆంధ్రపాఠకలోకం ఆయనకు రుణపడి ఉంది. ఏ విధమైన ప్రతిఫలాపేక్షా లేకుండా కేవలం ఆర్ష సాహిత్య సేవా దృష్టితో ఆయన చేసిన కృషికి ఆర్షవిజ్ఞాన ట్రస్టు కైమోడ్పులర్పిస్తున్నది. (ఆర్షవిజ్ఞానాన్ని, సంస్కృతాంధ్ర భాషలను అభిమానించే పాఠకుల సౌకర్యార్థం శ్రీరామచంద్రుడు గారు రచించిన వివిధ గ్రంథాల జాబితాను ఈ పుస్తకం చివరి పుటలలో అందిస్తున్నాము.)

శ్రీరామచంద్రుడు గారు శంకరభాష్యానికి ప్రతిపదార్థ, తాత్పర్యాలను ఇవ్వడమే గాక బెల్లంకొండ రామరాయ కవి రచించిన "ప్రకాశ"లోని వ్యాఖ్యలను సైతం సందర్భాలకు అనుగుణంగా పొందుపరిచారు. శంకరభాష్యానికి ఇవి తెలుగు భాషామ తల్లి అందిస్తున్న కొత్త సొబగులు. ఇన్ని ఆకర్షణలతో ఇలా ఇంతకు ముందెన్నడూ శంకరభాష్యానికి తెలుగు అనువాదం వెలువడలేదు.

భగవద్గీత గొప్పది. దానికి భాష్యం చెప్పిన ఆదిశంకరుల వారు మహనీయుదు. భాష్యం ఘనమైనది. భాష్యాన్ని తెలుగు చేసిన పుల్లెల శ్రీరామచంద్రుడు గారు మహా పండితులు. శంకర భాష్యంతోపాటు, రామరాయ కవి వ్యాఖ్యానాలను సైతం అందిస్తున్న ఈ రచన నిస్సందేహంగా ఘనతరమైనది. ఇన్ని గొప్పతనాల సమాహారం ఇప్పుడు మీ చేతులను అలంకరించిన మహాగ్రంథం. అద్వైత సిద్ధాంతాన్ని అధ్యయనం చేయదలచే జిజ్ఞాసువులకు ఈ గ్రంథం ఒక మహాజ్ఞాన నిధి. ఈ నిధిని తెలుగు వారికి అందిస్తున్న భాగ్యం ఆర్ష విజ్ఞాన ట్రస్టుది.

"బాలానందినీ వ్యాఖ్య"గా మహామహోపాధ్యాయ ఆచార్య పుల్లెల శ్రీరామ చంద్రుడు గారు అందిస్తున్న ఈ బృహద్రచన విశేషంగా పాఠకుల ఆదరాభిమానాలను అందుకొంటుందని ఆర్ష విజ్ఞాన ట్రస్టు విశ్వసిస్తున్నది.

పొత్తూరి వెంకటేశ్వరరావు,

అధ్యక్షుడు, ఆర్ష విజ్ఞాన ట్రస్టు

(ఛైర్మన్, ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ)

ట్రస్టు బోర్డు సభ్యులు

శ్రీ పొత్తూరి వేంకటేశ్వరరావు అధ్యక్షులు

అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ, హైదరాబాద్.

శ్రీ పల్లెంపాటి వేంకటేశ్వర్లు సభ్యులు

కాకతీయసిమెంట్స్ లిమిటెడ్, అశోక్‌నగర్, హైదరాబాద్.

శ్రీ ఆకెళ్ల సత్యనారాయణమూర్తి సభ్యులు

హైదరాబాద్

డా. ముక్తినూతలపాటి గురునాథ్ సభ్యులు

విజయవాడ

డా. ఉప్పులూరి బిందుమాధవ్ సభ్యులు

వాటర్లూ, కెనడా.

శ్రీ పమిడిఘంటం శ్రీరఘురామ్ కార్యదర్శి

హైదరాబాద్

ఆర్షవిజ్ఞానట్రస్టు

"శ్రీరామసదనము", ప్లాటు నం. 1361, రోడ్డు నం. 45

జూబిలీహిల్సు కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ, హైదరాబాద్ - 500 033.

ఆర్షవిజ్ఞాన ట్రస్టుకు ఆర్థికంగా హస్తావలంబనం అందించిన వదాన్యులు :

1. శ్రీమతి & శ్రీ జస్టిస్ సన్నపురెడ్డి దశరథరామరెడ్డి

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తులు

హైదరాబాద్

2. అల్లూర్‌కులకర్ణి జయప్రకాశరావ్

అడ్వకేట్, హైదరాబాద్

PRAISE SHOWERED BY GREAT - THINKERS ON BHAGAVADGITA

Swami Vivekananda :

1. Gita had not been much known to the generality of people before Shankaracharya made it famous by writing his great commentary on it.
2. Than the Gita no better commentary on the Vedas has been written or can be written.
3. The reconciliation of the different paths of Dharma and the work without desire or attachment - these are the two special characteristics of Gita.

Dr. Radhakrishnan :

It represents not any sect of Hinduism but Hinduism as a whole, not merely Hinduism but religion as such, in its universality, without limit of time or space.

Mahatma Gandhi :

It (Gita) calls upon us to dedicate oursleves body, mind and soul to pure duty and not become mental voluptuaries at the mercy of chance desires and undisciplined impulses.

Aurobindo :

The Bhagavat Gita is so wealthy of content that a hundred commentators may annotate it, and leave it, as though untouched, to a hundred more. It is a true scripture of the Race, a life rather than a book. For each age it has a new message, for each civilization a new word.

Rajaji :

The Gita is one of the most authoritative source of Hindu religion which is the background of all the noble philosophy, art, literature and civilization that we have inherited.

B.G. Tilak :

It can easily be said to be the immortal fruit of the tree of the Eternal Vedic religion.

Warren Hastings :

The Gita is a performance of great originality, of a sublimity of conception, reasoning and dictum almost unequalled.

Aldous Huxley :

The Gita is one of the clearest and most comprehensive summaries of perennial philosophy ever to have been made; hence its enduring value is not only for India but for all mankind.

Edwin Arnold :

So have I read this wonderful and spirit - thrilling speech,
By Krishna and Prince Arjuna held discoursing Each with each
So have I write its wisdom here - its hidden mystery,
For England : O our India! As dear to me as she!

Nevertheless, it is the most popular book in Hindu religious literature; the Gospel, one may say, of India. It has profoundly influenced the spiritual, cultural intellectual and political life of the Country throughout the centuries and it continues to do so today.

John Eglinton :

"Goethe, Wordsworth, Emerson and Thoreau among the moderns have something of this vitality and wisdom, but we can find all they have said and much more in the grand Sacred book of the East (Gita).

Emerson :

In the philosophical teaching of the Gita, Kirshna has all the attributes of the full - fledged monotheistic deity and at the same time the attributes of the upanishadic Absolute.

శ్రీః

ప్రస్తావన

యన్నామధేయస్మరణేన జన్తుః ప్రాప్నోతి నిఃశ్రేసభాగధేయమ్,
తాన్ శంకరాచార్యశుభాభిధేయాన్ నిత్యం నమామః శివరూపధేయాన్.

గీతా :– 'గీతా' అనే పదానికి 'గానం చేయబడినది, 'పాడబడినది' అని అర్థం. అయితే ఇక్కడ దీనికి 'చెప్పబడినది', 'ఉపదేశించబడినది' అని మాత్రమే అర్థం. ఆ ఉపదేశించబడినది ఏది అనే ప్రశ్నకు సమాధానంగా 'ఉపనిషత్' అనే పదాన్ని విశేష్యంగా అధ్యాహారం తెచ్చుకొని "ఉపదేశించబడిన ఉపనిషత్తు" అని అర్థం చెప్పుకోవాలి. ఉపనిషత్తు అనగా ఆత్మజ్ఞానం. ఆత్మజ్ఞానాన్ని బోధించే గ్రంథాన్ని కూడ ఉపనిషత్తు అని అంటారు. "భగవద్గీతా" అనగా భగవంతునిచేత ఉపదేశించబడిన ఉపనిషత్తు. మహాభారతంలోను, ఇతరపురాణాలలోను 'గీత' అనే పేరుతో నూరుకు మించి 'హంసగీత' మొదలైన అనేక గీత లున్నాయి. ఎవరైన గురువు శిష్యునకు చేసిన ఆత్మతత్త్వోపదేశానికి ప్రతీదానికీ 'గీత' అని పేరు ప్రచారంలోనికి వచ్చింది. ఈ విధంగా 'గీతా' శబ్దానికి, వ్యుత్పత్తిని పట్టి 'గానం చేయబడినది' చెప్పబడినది' అని మాత్రమే అర్థ మైనా, 'సరోజం' అనే పదం సరస్సులో పుట్టిన అన్ని వస్తువులనూ బోధించకుండా సరస్సులో పుట్టిన పద్మాన్ని మాత్రమే బోధించి నట్లు, "బోధించబడిన అధ్యాత్మవిద్య" అనే అర్థం యోగరూఢిచేత స్థిరంగా నిలిచిపోయింది.

భగవద్గీత :– భగవద్గీతలో మొత్తం ఏడు వందల శ్లోకాలున్నాయి. ఈ ఏడువందల శ్లోకాల గ్రంథానికి 'గీత' అని పేరు. ఈ గీత విషయంలో పండితుల ఆదరభావం పెరిగిపోవడంతో భగవద్గీత ఒక ఉపనిషత్తు కాదు ఇవి అనేక ఉపనిషత్తులు అని సూచిస్తూ 'భగవద్గీతాయామ్ ఉపనిషది' అనకుండా ప్రతీ అధ్యాయం చివరా కూడ 'భగవద్గీతాసు ఉపనిషత్సు' (భగవంతునిచేత ఉపదేశించబడిన ఉపనిషత్తులలో) అని బహువచనం ప్రయోగించడం ప్రారంభ మైనది. దీనిలోని ప్రతీ శ్లోకమూ ఒక ఉపనిషత్తు లేదా ఒక విషయాన్ని ప్రాతిపాదించే ఒక ఘట్టం, (ఒక శ్లోకసంఘాతం) ఉపనిషత్తు అనే అర్థంలో ఈ బహువచనం ప్రయోగించబడుచున్నది. అయితే శంకరభగవత్పాదులు –"తం ధర్మం భగవతా యథోపదిష్టం వేదవ్యాసః సర్వజ్ఞః భగవాన్ గీతాఖ్యైః సప్తభిః శ్లోకశతైః ఉపనిబబన్ధ" అని అంటూ ఈ ఏడువందల శ్లోకాల గ్రంథానికి 'గీత' అని పేరు అన్నట్లు సూచించారు. 'గీతాఖ్యైః' అనుపదానికి' గీతలు అనే పేరు గల' అనే అర్థం కూడా చెప్పవచ్చును కాని అది క్లిష్టకల్పన అవుతుంది. భగవత్పాదులు చాల చోట్ల ఈ గ్రంథాన్ని 'గీతాశాస్త్రం' అని నిర్దేశించారు.

ప్రస్తావన

ఏడు వందల శ్లోకాల భగవద్గీత పద్దెనిమిది అధ్యాయాలుగా విభక్తమై ఉన్నది. మహాభారతంలో భీష్మపర్వంలోని 25వ అధ్యాయం మొదలు 42వ అధ్యాయం వరకు ఉన్న 18 అధ్యాయాలు భగవద్గీత. ఈ పద్దెనిమిది అధ్యాయాలలో ప్రతిపాదించిన విషయాలను పట్టి ఒక్కొక్క అధ్యాయానికి 'అర్జున విషాదయోగః', 'సాంఖ్యయోగః' ఇత్యాది నామధేయాలు ఇవ్వబడ్డాయి. ఇవన్నీ తరువాతివాళ్ళు ఇచ్చిన పేర్లే గాని అవి మహాభారతంలో కాని, భాష్యాదులలో కాని ఉండి ఉండవు. అందుచేతనే ఒక్కొక్క అధ్యాయానికి చివర మూలంలో (భారతంలో) ఉన్నట్లు ఒక పేరు, ఒక భాష్యంలో ఒక పేరు, మరొక భాష్యంలో మరొక పేరు, ఒకే అధ్యాయానికి వేరు వేరు పాఠాలలో నాలుగైదు పేర్లు ఈ విధంగా కనబడుతున్నాయి. ఉదాహరణకు ఆరవ అధ్యాయానికి మహాభారత పాఠంగా 'ధ్యానయోగః' అను పేరు, శాంకరభాష్యానుసారం 'అభ్యాస యోగః' అను పేరు, రామానుజ భాష్యానుసారం 'యోగభ్యాసయోగః' అను పేరు కనబడు తున్నాయి. ఎనిమిదవ అధ్యాయానాకి ఒక్కదానికే 'తారకబ్రహ్మయోగః', 'బ్రహ్మాక్షరనిర్దేశ యోగః', 'అక్షరపరబ్రహ్మయోగః', 'ధారణయోగః', 'మహాపురుషయోగః', 'అభ్యాస యోగః', ఇత్యాదినామధేయాలు ఉన్నాయి. అందుచేత ఒక్కొక్క అధ్యాయం ఒక్కొక్క విషయాన్ని బోధిస్తున్న దని, అవి సాంఖ్యయోగ - కర్మయోగాలు ఎంత ప్రధానమైనవో అంత ప్రధానమైన యోగవిశేషా లనీ సమర్థించవలసిన అవసరం ,లేదు. అధ్యాత్మజ్ఞాన సంపాదనకు విషాదం కూడా చాల ముఖ్యమైన ఆవశ్యకస్థితి అనీ అందుచేతనే భగవద్గీత 'అర్జునవిషాదం'తో ప్రారంభం అయిన దనీ కొందరు వ్రాశారు; కొందరు ఎంతో పట్టుదలతో ఉపన్యసిస్తూంటారు. ఇలాంటి వన్నీ విషయప్రవేశం తక్కువగా ఉన్నవారికి శ్రవణమనోహరంగా ఉండే మాటలు, ఆత్మజ్ఞానానికి కావలసినది విషాదం కాదు; విషాదగంధశూన్య మైన వైరాగ్యం. అందుచేతనే శ్రీకృష్ణుడు అర్జునునికి జ్ఞానమార్గాన్ని చెప్పినా "నీకు కర్మమార్గంలోనే అధికారం - కర్మణ్యేవాధికారస్తే" అని ఖచ్చితంగా అన్నాడు. ఈ అధ్యాయానికి ఎవరో వ్రాయసగాడు లేదా వ్యాఖ్యాత "అర్జున విషాద యోగం" అని పేరు పెట్టా డంటే అర్థం దీనిలోని విషయం అర్జునవిషాదవర్ణనం అని మాత్రమే. ఇతరాధ్యాయల పేర్ల విషయంలో కూడ ఇంతే. నిజానికి గీతాశాస్త్రప్రారంభం రెండవ అధ్యాయంలోని 11వ శ్లోకంతోనే అని శంకరభగవత్పాదులు సూచించారు, శ్రీ రామరాయకవిగారు సమర్థించారు.

భగవద్గీతకున్నలోకప్రియత్వం :- అతి చిరకాలంనుంచి భగవద్గీతకు భారతదేశంలో అత్యధిక మైన గౌరవ ప్రచారా లున్నాయి. ఆంగ్లభాషానువాదాదుల ద్వారా దీనికి బాహ్యప్రపంచంతో సంబంధం ఏర్పడినది మొదలు ప్రపంచవాఙ్మయంలో

కూడ ఇది సకలమానవోన్నతిమార్గప్రదర్శకగ్రంథంగా మహోన్నతమైన స్థానాన్ని సంపాదించుకొన్నది. ఆధ్యాత్మికమార్గప్రదర్శకంగానే కాకుండా శాంతియుత మైన లౌకికజీవనవిధానాన్ని బోధించే నైతికగ్రంథంగా కూడ భగవద్గీతకు ప్రపంచ వాఙ్మయంలో ఉన్న స్థానం అద్వితీయమైనది. భారతీయసహజమైన సర్వమత సహనాన్ని, సర్వప్రాణుల శాంతియుతసహజీవనాన్ని ప్రారభంనుంచి చివరివరకు స్పష్టంగా బోధించిన గ్రంథం భగవద్గీత. మానసికంగా, బౌద్ధికంగా, ఆధ్యాత్మికంగా వేరు వేరు స్థాయిలలో ఉన్న మానవులలో ప్రతీ ఒక్కరికీ ఉపకరించే వేరు వేరు సన్మార్గాలను చూపడం ద్వారా సర్వలోకప్రియత్వాన్ని సంతరించుకొన్న సర్వజనహితగ్రంథం భగవద్గీత.

సర్వమత సామరస్యం :- "ఒకని దేవత మరొకనికి దయ్యం" (**"One man's god is another's devil"**) అనే పద్ధతిని భగవద్గీత నిరాకరిస్తుంది. "ఏ యే భక్తుడు ఏ యే స్వరూపాన్ని శ్రద్ధాపూర్వకంగా ఆరాధిస్తాడో వానికి ఉన్న ఆ శ్రద్ధను నేను స్థిరంగా ఉండే టట్లు చేస్తాను. అతడు ఆ శ్రద్ధతో కూడి ఆ దేవతను ఆరాధిస్తాడు. అలా ఆరాధించినందుకు ఫలాన్ని నేనే వానికి అందజేస్తాను" అని అంటాడు శ్రీకృష్ణుడు.

"యో యో యాం యాం తనుం భక్తః శ్రద్ధయార్చితుమిచ్ఛతి,
తస్య తస్యాచలాం శ్రద్ధాం తామేవ విదధామ్యహమ్.
స తయా శ్రద్ధయా యుక్తస్తస్యారాధనమీహతే.
లభతే చ తతః కామాన్ మయైవ విహితాన్ హితాన్." (భ.గీ. 7.21, 22)

"అర్జునా ! ఏ ఇతరదేవతా భక్తులు శ్రద్ధావంతులై (ఇతరదేవతలను) పూజిస్తారో వాళ్లు కూడ, పూజిస్తున్నది నన్నే; అయితే వాళ్లు నన్నే పూజిస్తున్నారనే విషయం వాళ్లకి తెలియదు" అని మరొక చోట అంటాడు -

"యేఽ ప్యన్యదేవతాభక్తా యజన్తే శ్రద్ధయాన్వితాః,
తేఽ పి మామేవ కౌన్తేయ యజన్త్యవిధిపూర్వకమ్" (భ.గీ.9.23)

"అర్జునా! నన్ను ఎవరు ఏ విధంగా ఆశ్రయిస్తారో వాళ్లని ఆ విధంగానే ఆదుకొంటాను. మనుష్యులు అన్ని వైపులనుండీ పయనిస్తూ చివరికి చేరేది నా మార్గాన్నే" అని మరొకచోట అంటాడు-

"యే యథా మాం ప్రపద్యన్తే తాంస్తథైవ భజామ్యహమ్,
మమ వర్త్మానువర్తన్తే మనుష్యాః పార్థ సర్వశః" (భ.గీ.4.11)

భగవద్గీతలో బోధించబడిన ఈ విశాలదృక్పథం భారతీయుల హృదయాలలో ఎంత దృఢంగా నాటుకొనిపోయిన దనగా ఇలాంటి భావాలను బోధించే ఎన్నో వచనాలు

నాడు నేడూ కూడా బహుళప్రచారంలో ఉన్నాయి. ఎనిమిదవ శతాబ్దానికి చెందిన ఒక కర్ణాటక దేశరాజు శిలాశాసనంలో ఉదాహరించిన ఈ క్రింది శ్లోకం అతిప్రసిద్ధమైనది-

"యం శైవాః సముపాసతే శివ ఇతి బ్రహ్మేతి వేదాన్తినో
బౌద్ధా బుద్ధ ఇతి ప్రమాణపటవః కర్తేతి నైయాయికాః,
అర్హన్నిత్యథ జైనశాసనరతాః కర్మేతి మీమాంసకాః
సోఽయం వో విదధాతు వాఞ్ఛితఫలం త్రైలోక్యనాథో హరిః".

"ఏ శ్రీమహావిష్ణువును శైవులు శివు డనీ, వేదాంతులు బ్రహ్మ అనీ, బౌద్ధులు బుద్ధు డనీ, నైయాయికులు (జగత్) కర్త అనీ, జైనులు అర్హన్ అనీ, మీమాంసకులు కర్మ అనీ ఉపాసిస్తూన్నారో త్రిలోకనాథుడైన ఆ శ్రీమహావిష్ణువు మన కోరికలను తీర్చు గాక"

గీతపదేశంలో పరిపూర్ణవిశ్వాసం గల ఆధునికులు కూడా పరమేశ్వరుణ్ణి ఈ విధంగా ప్రార్థించవచ్చును -

"యం శైవాః శివ ఇత్యహుర్మజద ఇత్యర్చన్తి యం పార్సికాః
యూదాశ్చైవ జహోవ ఇత్యభిదధత్యల్లేతి మాహమ్మదాః.
చీనాః షాగతిరిత్యచిన్త్యమహిమా సిక్ఖాః పరాత్మేతి తే
సర్వే క్రైస్తవకాశ్చ గాడితి స నః పాయాత్ సదాఽఽత్మా పరః" (పు.శ్రీ.రా)

"ఏ పరమాత్మను శైవులు శివు డనీ, పారసీలు అహుర్ మజ్ద అనీ, యూదులు యహోవా అనీ, ముసల్మానులు అల్లా అనీ, చైనాదేశీయులు షాంగ్ తి అనీ, సిఖ్‌లు పరమేశ్వరు డనీ, క్రిష్టియన్లు గాడ్ అనీ ఆరాధిస్తుంటారో ఆ పరమాత్మ మనలను రక్షించుగాక".

"ఆకాశాత్పతితం తోయం యథా గచ్ఛతి సాగరమ్,
సర్వదేవనమస్కారః కేశవం (ఈశ్వరం) ప్రతి గచ్ఛతి"

ఇత్యాది వచనాలు చదువుకొంటూ భారతీయు లందరూ దృఢంగా విశ్వసించే ఈ సర్వసంప్రదాయసహనభావానికి మూలకందం భగవద్గీత. ఈ భావాన్నే రామకృష్ణ పరమహంసాదులు స్వానుభవపూర్వకంగా నవీకరించారు. ఇది ప్రపంచంలోని మానవు లందరికీ భగవద్గీత చేసిన మహోపదేశం. ఇది ఇలా ఉండగా మనకు నీతిమార్గ (Ethics) సర్వమతసహనం (secularism) లేదా సర్వమతపరిహారం నేర్పుతాం అంటూ ముందుకు వస్తూన్నవాళ్లు ఎంత ధృష్టాత్ములో ఊహించుకొనవచ్చును.

స్వధర్మం :- ఇదే విధంగా - "ఇతరుల ధర్మాన్ని స్వీకరించి దానిని ఎంత చక్కగా ఆచరించినా దానికంటె స్వధర్మం, దాని ఆచరణలో ఏవైనా లోపా లున్నా కూడ, శ్రేయస్కరమైనది; స్వధర్మంలో మరణించడ మైనా మంచిది కాని పరధర్మం భయహేతువు";

"...... స్వస్వభావంచేత సంప్రాప్త మైన ధర్మాన్ని ఆచరించేవాడు (దానిలో ఏవైనా లోపా లున్నా) పాపం పొందదు" అని భగవద్గీత చేసిన ఉపదేశం ఎవరైనా ఏ కారణంచేత నైనా తాము గాని తమ పూర్వీకులు గాని స్వధర్మాన్ని పరిత్యజిస్తే దానిని పునః పరిగ్రహించడానికి ప్రయత్నించాలి అనీ, ఎవరూ ఎవరినీ స్వధర్మపరిత్యాగం చేసే టట్లు చేయకూడదనీ సూచిస్తూన్నది.

"శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మాత్స్వనుష్ఠితాత్,
స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః" (భ.గీ. 3.35)

"శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మాత్స్వనుష్ఠితాత్,
స్వభావనియతం కర్మ కుర్వన్నాప్నోతి కిల్బిషమ్" (భ.గీ. 18.47)

అధికారిభేదం, ఉపాయవైవిధ్యం :– అధికారిభేదాన్ని అనుసరించి అనేక విషయాలు ప్రతిపాదించి ఉండడంచేత కొందరు స్థూలదృక్కులైన పాశ్చాత్యవిమర్శకులు భగవద్గీతలో ఒకదానికీ ఒకదానికీ పొత్తు కుదరని, పరస్పరవిరుద్ధా లైన విషయా లున్నాయని చేసిన విమర్శలకు మరి కొందరు పాశ్చాత్య విమర్శకులే ఇందులోని విషయా లన్నీ పరస్పరసమన్వయంతో చక్కగా ప్రతిపాదించబడి ఉన్నా యని సమాధానాలు చెప్పారు. అధికారిభేదం అనే అంశాన్ని దృష్టిలో ఉంచుకొని పరిశీలిస్తే ఏ విరోధమూ కనబడదు. అంతే కాకుండా గ్రంథా న్నంతనీ చదివే ఓపిక ఉన్న వాళ్లకి అన్నీ సరిగానే కనబడతాయి. మనస్సులో ఏవేవో కొన్ని విపరీతభావాలతో ఏ గ్రంథాన్ని సమీపించినా అంతా అస్తవ్యస్తంగానే కనబడుతుంది. ఇలాంటి ప్రబుద్ధులు ఇప్పుడే కాదు; అన్ని కాలాలోను ఉన్నారు. శ్రీ శంకరాచార్యుల కాలంలోను అంతకు పూర్వమూ కూడ ఇలాంటి వాళ్లుండేవారు – "తదిదం గీతాశాస్త్రం సమస్తవేదార్థసార సంగ్రహభూతం దుర్విజ్ఞేయార్థం, తదావిష్కరణాయ అనేకైః వివృతపదపదార్థవాక్యార్థ న్యాయమపి అత్యన్తవిరుద్ధానేకార్థత్వేన లౌకికైః గృహ్యమాణముపలభ్యాహం వివేకతః అర్థనిర్ధారణార్థం సంక్షేపతః వివరణం కరిష్యామి" (ఉపోద్ఘాత భాష్యమ్) అని అంటూ భగవత్పాదులు కొందరు లౌకికులు (శాస్త్రజ్ఞానం లేనివాళ్లు) భగవద్గీత అంతా అత్యంతవిరుద్ధా లైన అనేక విషయాలతో నిండి ఉంది అంటున్నారు; ఆ అపప్రథను తొలగించడానికే నే నీ వ్యాఖ్య వ్రాస్తున్నాను అని అన్నారు. కొన్ని సందర్భాలలలో అర్జునునికే ఈ సందేహం వచ్చి – **"జ్యాయసీ ... కేశవ" "వ్యామిశ్రేణేవ ... ఆప్నుయామ్"** (3.1,2) అని కృష్ణుణ్ణే ప్రత్యక్షంగా ప్రశ్నిస్తాడు. అయితే కృష్ణుడు చెప్పినదానిలో పొరబాటు ఏదీ ఉండదు; తను అర్థం చేసికొనడంలో ఏదో లోపం ఉండి ఉంటుంది; అని అర్జునునికి తెలుసును. అయినా చనువుచేత నీ

మాటలు పరస్పరవిరుద్ధంగా ఉన్నాయి అని అంటాడు. అయితే ఈ రోజులలో ఇలా మాటలాడేవాళ్ల మాటలు, వ్రాసేవాళ్ల వ్రాతలూ. కూడ ప్రాచీనభారతీయసంస్కృతి సంప్రదాయాదులపట్ల ఏ మాత్రమూ ఆదరం లేనివాళ్లవి. అలాంటి వాళ్లు కూడ కొంచెం శ్రమ కోర్చి ఒకటికి రెండు సార్లు శాంకరభాష్యంతోనో, రామానుజభాష్యంతోనో, మరొక భాష్యంతోనో భగవద్గీతను చదివిన ట్లయితే దీనిలో ఉన్నట్లుగా కనబడే విరోధా లన్నీ పరిహృతము లవుతాయి. ఎందుచేతననగా ఆ యా ఆచార్యులు అన్ని విషయాలకీ తమ తమ సంప్రదాయాలను అనుసరించి సమన్వయం చూపారు. ఒక భాష్యంలో చెప్పిన సమన్వయం కుదరకపోతే మరొక భాష్యం పరిశీలించాలి. లేదా స్వతంత్రంగానే మూలమాత్రం చదివితే మేధావంతులు ఒక సమన్వయాన్ని తామే తెలుసుకొనకలుగుతారు. అప్రామాణ్యబుద్ధితో చదువుతే మాత్రం వృథాశ్రమే అవుతుంది. దీనిలోని వన్నీ అధికారిభేదాన్ని దృష్టిలో ఉంచుకొని చెప్పిన ఉపాయభేధాలు మాత్రమే.

శాంకరభాష్యం :– భగవద్గీతకు ఈ నాడు లభిస్తూన్న భాష్యాలలో అతిప్రాచీన మైనది శ్రీ శంకరభగవత్పాదుల భాష్యం. ఒక విధంగా చూస్తే భగవద్గీతకు ఇంత ప్రాచుర్యం తీసికొనివచ్చినవారు శ్రీ శంకరాచార్యులే. వారి భాష్యం తరవాతనే ఇతర భాష్యాలు బయలుదేరాయి. శ్రీశంకరాచార్యులకు పూర్వం కూడ భగవద్గీతకు కొందరు వ్యాఖ్యానాలు వ్రాసినట్లుగా పైన ఉదహరించిన వాక్యంవల్ల తెలుస్తూన్నది. ఈ వ్యాఖ్యాతల అభిప్రాయాలను కొన్నింటిని భగవత్పాదులు విమర్శించారు. వృత్తికారు దని చెప్పబడే బోధాయనుడు ఈ వ్యాఖ్యాతలలో ఒక రని ఆనందగిరి వ్యాఖ్య ద్వారా తెలుస్తూన్నది. ఈయన భగవద్గీతకు వ్రాసిన వ్యాఖ్య ఏ రూపంలో ఉండేదో తెలియదు. ఇప్పుడు లభ్యం కాదు. ఇతరప్రాచీనవ్యాఖ్య లేవీ కూడ లభ్యములు కావు.

శ్రీ కృష్ణుడు అర్జునునకు చేసిన ఉపదేశానికి సద్యః ఫలం అర్జునుడు యుద్ధరంగం నుండి వెనుకకు మరలిపోకుండా యుద్ధం చేసే టట్లు చేయడమే. అయితే ఆ తాత్కాలిక ఫలాన్ని సంపాదించడం కొరకై శ్రీకృష్ణుడు ప్రసక్తాను ప్రసక్తంగా అనేక విషయాలు చెప్పవలసి వచ్చింది. అర్జునుడు శోకసం విగ్నమానసుడై యుద్ధం చేయనంటూ ధనుస్సూ బాణాలు దూరంగా పడవేసి రథం మీద చతికిలబడ్డాడు. అప్పుడు అతనిని మామూలు స్థితికి తీసికొని రావడంకోసం శ్రీకృష్ణుడు – "కుతస్త్వా కశ్మలమిదం విషమే సముపస్థితమ్.. క్షుద్రం హృదయదౌర్బల్యం త్యక్త్వోత్తిష్ఠ పరంతప" అని ఉద్బోధించాడు. అయితే – అర్జునుడు, శంకరభగవత్పాదుల మాటలలో చెప్పాలంటే– "శోకమోహమహోదధిలో నిమగ్నుడై" ఉండడంచేత ఈ మాటలు అతని చెవి కెక్కలేదు. అందుచేత అర్జునుని శోకమోహాలు సమూలంగా తొలగించడానికై ఆత్మ జన్మజరామరణాదిరహిత మైనది

అని ఆత్మకు సంబంధించిన పరమార్థసత్యాన్ని ఉపదేశించవలసి వచ్చినది. ఈ పరమార్థ సత్యం నివృత్తిమార్గంతో ముడివడి ఉంది. "అయితే ఇంక నేమి; నేను ఈ నివృత్తిమార్గం లోనే ఉంటాను; ఈ విధంగా కూడ నేను యుద్ధం చేయవలసిన పని లేదు కదా? అని అర్జునుడు ఎక్కడ అనుకొనిపోతాడే అన్న శంకతో శ్రీకృష్ణుడు ఈ నివృత్తిమార్గం అందరికీ వర్తించేది కాదు; నీకు కూడ దీనియందు ప్రస్తుతం అధికారం లేదు. కొన్ని వేలమందిలో ఏ ఒక్కరికో తప్ప ఇది ఉపయోగించదు; దానికి అధికారం సంపాదించే వరకు నీతో సహా అందరూ కర్మయోగాన్ని అనుసరించవలసిందే అని స్పష్టీకరిస్తూ కర్మయోగాన్నీ తత్సంబద్ధాలైన ఇంకా అనేక విషయాలనూ చెప్పవలసి వచ్చింది. ఈ విధంగా భగవత్పాదులు ఉపోద్ఘాత భాష్యంలో చెప్పి నట్లు శ్రీకృష్ణుడు అర్జునునకు ధర్మద్వయం (వైదికమైన ప్రవృత్తి - నివృత్తి మార్గాలు రెండింటినీ) ఉపదేశించాడు. అర్జునుణ్ణి యుద్ధప్రవృత్తుని చేయడం అనే ప్రయోజనం నేరవేరింది.

అయితే ఈ ధర్మద్వయం, ప్రసక్తానుప్రసక్తంగా చెప్పిన ఇతర విషయాలు వీటి అన్నింటిలో ఏది పరమశ్రేయఃసాధన మైనది, ఏది ప్రధాన మైనది అనేది ప్రశ్న. దానికే శంకరభగవత్పాదులు తమ భాష్యంలో సమాధానం చెప్పారు. భగవద్గీత ఉపనిషత్తు అని అందరూ అంగీకరించిన విషయం. అందుచేత పరమశ్రేయఃసాధనంగా ఉపనిషత్తులు దేనిని చెపుతున్నాయో భగవద్గీత కూడ దానినే చెప్పాలి. అద్వితీయాత్మతత్త్వజ్ఞానం పరమశ్రేయః సాధనంగా, మోక్షహేతువుగా ఉపనిషత్తులలో ప్రతిపాదించబడింది. ఆ జ్ఞానానికి సాధనాలుగా అనేకఉపాసనాదులు (ఓంకారోపాసన మొదలైనవి) కూడ చెప్పబడ్డాయి. ఆ ఓంకారోపాసనాదులు, అంతఃకరణశుద్ధిజననం ద్వారా జ్ఞానానికి సాధనాలుగా ఉపయోగించే ఇంకా మరి కొన్ని విషయాలు భగవద్గీతలో ప్రతిపాదించ బడ్డాయి.

అద్వైతసిద్ధాంతం :- శంకరభగవదత్పాదులు కేవలం ఉపనిషత్తులను మాత్రమే ప్రమాణంగా గ్రహించి, అందుకు విరుద్ధంగా లేని స్మృతీతిహాసపురాణాదులను కూడ ఉపోద్బలకంగా చూపుతూ స్థాపించిన అద్వైతసిద్ధాంతస్వరూపం ఇది :

"సత్యం జ్ఞానమనన్తం బ్రహ్మ" (తై. ఉ. 2. 1. 1) (బ్రహ్మ సత్య మైనది, జ్ఞానరూపము, అంతం లేనిది, అనగా దేశకాలాలచేత పరిచ్ఛేదం లేనిది, ఇతరవస్తువుల ద్వారా కూడ పరిచ్ఛేదం లేనిది), "ఏకమేవాద్వితీయం బ్రహ్మ" (ఛా. ఉ. 6. 2. 1.) బ్రహ్మ ఒక్కటే; మరొక వస్తువు ఏదీ లేదు, దీనికి సజాతీయమైనది గాని, విజాతీయమైనది గాని, దీనిలో స్వగతభేదం (చెట్టులో కొమ్మ మాను ఆకులు ఇత్యాదిభేదా లున్నట్లు) కూడ లేదు), "విజ్ఞానమానన్దం బ్రహ్మ" (బృ. ఉ. 3. 9. 28) (బ్రహ్మ విజ్ఞానస్వరూప మైనది, ఆనందస్వరూప

మైనది) "నేతి నేతి" (బ్రహ్మ అంటే ఇది కాదు ఇది కాదు - అనగా బ్రహ్మను ఇది బ్రహ్మ అని చూపడానికి శక్యం కాదు; అందుచేత "ఇది బ్రహ్మ కాదు", "ఇది బ్రహ్మ కాదు" అని దృశ్యములైనవాటిని అన్నింటినీ నిషేధించుకొంటూ పోగా పోగా మిగిలేది బ్రహ్మ అని భావం) ఇత్యాది శ్రుతివాక్యాలు బ్రహ్మ ఒక్కటే సత్య మనీ, అది చిద్రూప మనీ, బ్రహ్మ తప్ప మరొక టేదీ లేదనీ చెపుతున్నాయి. బ్రహ్మ అంతటా వ్యాపించి ఉన్నది. బ్రహ్మభిన్నమైన పదార్థమే లేదు. అందుచేతనే ఇది సర్వవ్యాప్తం. ఇది ఈ ప్రదేశంలోనే ఉంది ఆ ప్రదేశంలో లేదు; ఈ కాలంలోనే ఉంది ఆ కాలంలో లేదు ఇత్యాదివిధంగా దేశకాలాలచేత పరిచ్ఛేదం లేదు. ఇది స్థూలం కాదు, సూక్ష్మం కాదు, హ్రస్వం కాదు, దీర్ఘం కాదు (**"అస్థూలమనణ్వహ్రస్వమదీర్ఘమ్" బృ.ఉ. 3.8.8.**) దీనికి అవయవాలు లేవు; క్రియ లేదు; ఎట్టి దోషాలు గుణాలు కూడ లేవు. దేనితోనూ సంబంధం లేదు (**"నిష్కలం నిష్క్రియం శాన్తం నిరవద్యం నిరఞ్జనమ్" (శ్వే.ఉ.6.19).** ఈ విధంగా బ్రహ్మ చిద్రూపము, సర్వవ్యాప్తము, అద్వితీయము అని బోధించే శ్రుతివాక్యాలు అనంఖ్యాకంగా కనబడుతున్నాయి. అయితే - ప్రత్యక్షాదిప్రమాణాలద్వారా పంచభూతాత్మక మైన జగత్తు కనబడుచున్నది; దీనిని చూచే, తెలుసుకొనే అనేక జీవులు కూడ ఉన్నారు. **"యతో వా ఇమాని భూతాని జాయన్తే, యేన జాతాని జీవన్తి. యత్ప్రయన్త్యభిసంవిశన్తి"** (తై.ఉ.3.1.), **"తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశః సంభూతః, ఆకాశాద్వాయుః,వాయోరగ్నిః"** (తై.ఉ.2.1.) ఇత్యాదిశ్రుతివాక్యాలే ఆకాశాదిజగత్సృష్టిస్థిత్యాదులను గూర్చి చెపుతున్నాయి. అలాంటప్పుడు "ఏకమేవాద్వితీయం బ్రహ్మ" **(ఛా.ఉ.6.2.1.) "నేహ నానాస్తి కించన" (బృ.ఉ. 4.4.19), "మృత్యోః స మృత్యుమాప్నోతి య ఇహ నానేవ పశ్యతి" (క.ఉ.2.4.11)** (భేదాన్ని చూచేవాడు జననమరణచక్రంలో తిరుగుతూంటాడు) ఇత్యాదివాక్యాలచేత బోధింపబడే ఈ అద్వైతం ఎలా కుదురుతుంది అనేది ఒక అతి క్లిష్టమైన ప్రశ్న. దీనికి సమాధానం కూడ శ్రుతులలోనే ఉంది. శ్రీ శంకర భగవత్పాదులు తమ భాష్యాలలోను, ఇతర ప్రకరణగ్రంథాలలోను చేసిన ప్రయత్నం ఇంత చిక్కైన ప్రశ్నను విడదీయడం కోసమే.

ఈ సంసారానికి, ఈ జగత్తుకు, ఆది కాని అంతం కాని లేదని దార్శనికులందరూ ఏకగ్రీవంగా అంగీకరించిన ఒక సిద్ధాంతం. బ్రహ్మసూత్రాలలో బాదరాయణులు ప్రతిపాదించిన ఈ విషయాన్ని బ్రహ్మసూత్రవ్యాఖ్యాత లందరూ అంగీకరించారు. అనగా - అనాదికాలంనుంచీ ఈ జగత్తూ ఉంది; ఈ జగత్తును చూస్తూ తమ తమ పనులు చేస్తూ సుఖదుఃఖాదులు అనుభవిస్తున్న జీవులూ ఉన్నారు; ఎల్లప్పుడూ భవిష్యత్తులో కూడ ఈ జగత్తూ ఉంటుంది; జీవులూ (ప్రాణులూ) ఉంటారు (యి). అయితే బ్రహ్మ ఒక్కటే సత్య మనీ అద్వితీయ మనీ (మరొకటి ఏదీ లేదనీ) చెప్పే శ్రుతివాక్యాలు బాధితము

లవుతున్నాయి కదా అనే ఆశంక కలుగుతుంది. అందుకు శ్రీభగవత్పాదులు శ్రుతిసూచితమైన మార్గం ఒకటి చూపించి ఈ ఆశంకను పరిహరించారు.

మాయ :- బ్రహ్మలో వర్ణింప శక్యం కాని ఒకానొక శక్తి ఉంది. దానికే మాయ అని పేరు. అగ్నిలో ఉన్న ఉష్ణత్వం అగ్నికంటె వేరు అని కాని కాదు అని కాని చెప్పడానికి ఏ విధంగా శక్యం కాదో, సూర్యునిలోని తేజస్సు సూర్యునికంటె వేరు అని కాని కాదు అని కాని చెప్పడానికి ఏ విధంగా శక్యం కాదో అట్లే ఈ మాయ అనే శక్తి బ్రహ్మస్వరూపమా - తద్భిన్నమా అని చెప్పడం శక్యం కాదు. అందుచేత ఒక విధంగా ఇది అనిర్వచనీయం. ఈ మాయచేతనే ఈ జగత్తు కనబడుతున్నది. జీవులు కూడ దేహభేదంచేత భిన్నులుగా కనబడుతున్నారు. మట్టి ఘటంగా మారినట్లు, బంగారం కుండలాద్యలంకారరూపాలలో మారినట్లు బ్రహ్మ ఏ విధమైన మార్పు చెందడంలేదు. అనగా బ్రహ్మ జగదాకారంగా పరిణమించడం లేదు. బ్రహ్మ ఎల్లప్పుడు నిర్వికారంగా, నిర్మలంగా, సర్వవ్యాప్తంగానే ఉంటూన్నది. మాయాశక్తిచేత ఆ బ్రహ్మయందు ఈ జగత్తు ఉన్నట్లు కనబడు తున్నది. బ్రహ్మయొక్క పరమార్థస్వరూపం తెలియగానే అలా తెలుసుకొన్నవానికి జగత్తు అంతర్హితం అవుతుంది. ఇందుకు ప్రసిద్ధంగా చెప్పే ఉదాహరణలు రజ్జుసర్ప - శుక్తిరజత - మరమరీచికోదక - స్వప్నతురగాదులు. త్రాడు చూచి సర్పం అనుకొంటాం, ముత్యపు చిప్పను చూచి వెండి అని భ్రాంతి పడతాం; ఎండలో తారురోడ్డుమీద ప్రయాణం చేస్తున్నప్పుడు ఫర్లాంగు దూరం ముందుకు చూస్తే నీళ్లు కెరటాలు కొడుతున్నట్లు కనబడుతుంది. స్వప్నంలో ఏ వేవో వస్తువులు కనబడతాయి. వీటి కన్నింటికీ దృష్టిదోష-ప్రకాశవిశేష - నిద్రాదోషాలు కారణం. ఇవి కొంత సేపటికి కనబడకుండాపోతాయి. ఇవి కనబడుతున్న సమయంలో కాని, కనబడనప్పుడు కాని ఇవి వేటిమీద ఉన్నట్లు కనడుతున్నాయో లేదా కనబడ్డాయో వాటిలో (రజ్జు-శుక్త్యాదులలో)ఏ విధమైన వికారమూ లేదు. అదే విధంగా మాయాకల్పితమైన ఈ జగత్తుచేత దాని కాధార మైన పరమాత్మతత్త్వంలో ఏ విధమైన మార్పు కలగదు. దీనికి మరొక ఉదాహరణం కూడ చూపవచ్చును. సినేమాహాలులో అమర్చిన తెల్లని తెరమీద గంటలకొలది అనేక కాల్పనిక దృశ్యాలను చూస్తున్నాం. ఆ దృశ్యాలు ఎన్ని మారినా దానికి ఆధారమైన తెర మాత్రం ఏ విధమైన మార్పూ చెందడంలేదు. కనబడతూన్నంత సేపూ ఆ దృశ్యా లన్నీ సత్యమైనవిగానే కనబడతాయి. వాటిని గూర్చి పరిశీలించి చూస్తే వాటి అసత్యత్వం తెలుస్తుంది. ఎవరో ముందుగా ఆ దృశ్యాలన్నీ సిద్ధం చేసికొని,ఏదో సాధనంతో తెరమీద వాటిని చూపుతున్నారు. కాని ఇక్కడ జగత్తును సృష్టించేదీ, చూపించేదీ, చూచేదీ కూడ బ్రహ్మయే. పై ఉదాహరణలలో సర్ప-రజతాదిభ్రాంతులు కలిగిన మరు క్షణంలో తొలగిపోవచ్చును. మరుమరీచికోదకం సూర్యప్రకాశం

ప్రసరిస్తూన్నంతసేపూ, స్వప్నదృశ్యాలు నిద్ర ఉన్నంతసేపూ, చిత్రదృశ్యాలు చూపినంతసేపూ ఉండవచ్చును. కంటికి ఒక విధంగా వ్రేలు అడ్డంపెట్టుకుని చూస్తే ఒక చంద్రుడు రెండు చంద్రుల వలె కనబడుతుంది. అది అసత్య మని అనుకొంటున్నా ఆ వ్రేలు అలా ఉన్నంతవరకు ద్విచంద్రజ్ఞానం కలుగుతూనే ఉంటుంది. ఇలా కనబడే సర్ప-రజతాదులు సత్యములా కావా అంటే అవి ఉన్నా యనడానికీ వీలు లేదు లేవనడానికీ వీలు లేదు. లేకపోతే కనబడకూడదు; కాని కనబడుతున్నాయి. ఉంటే బాధితములు కాకూడదు, అనగా "ఇవి నిజంగా లేవు, ఉన్నట్లు కనబడ్డాయి" అనే జ్ఞానం కలగకూడదు. కాని బాధితము లవుతున్నాయి. అందుచేత ఉన్నాయని కాని లేవని కాని కచ్చితంగా చెప్పడానికి శక్యం కాకపోవడంచేత ఇవి అనిర్వచనీయము లని అద్వైతులు అంటారు. తాత్కాలికదోషాలచేత కలిగే భ్రాంతిచేత కనబడే ఈ వస్తువులకు ప్రాతిభాసికసత్యా లని పేరు. మాయాప్రభావం చేత వాస్తవంలో బ్రహ్మమీద లేకపోయినా ఉన్నట్లు కనబడుతూన్న జగత్తు కూడ పైన చెప్పిన విధంగా అనిర్వచనీయమే. ఎవని కంటికి కొంచెం దోషం ఉంటే వానికి త్రాడు సర్పం గాను, ముత్యపుచిప్ప వెండిగాను కనబడుతుంది. నిద్రా దోషం ఉన్న వానికి ఒక రకమైన స్వప్నదృశ్యాలు కనబడతాయి. చిత్రశాలలో (సినేమాహాలులో) కూర్చొన్నవాళ్లందరికీ చిత్రదృశ్యాలు కనబడతాయి. ఇతరులకు కనబడవు. సినీమాచూచే వాళ్లందరూ ధనం వెచ్చించి సామూహికమైన భ్రాంతిజ్ఞానం కొనుక్కొంన్నారు. అందుచేత అలాంటి వందలాది జనులకు ఒకే సారి చిత్రదృశ్యాలు కనబడుతున్నాయి. మాయాశక్తి అపార మైనది, అతివిస్తృత మైనది, అందుచేత ప్రతీ జీవుడూ దీనిచేత ప్రభావితుడు కావలసిందే. అందుచేత అందరికీ జగత్తు కనబడుతుంది. పైన చెప్పిన భ్రాంతులు కొన్ని క్షణాల్లో, కొన్ని గంటలలో మాత్రమే ఉంటే ఈ భ్రాంతి కొన్ని వందల జన్మల పాటు కొనసాగుతుంది. ఇది ఇలా కనబడుతూన్నంతవరకూ ఈ జగత్తులో, చతుర్దశభువనాలలో జరిగే ప్రతీ వ్యవహారము కూడ సత్యమే. అందుచేత దీనిని (జగత్తును) వ్యావహారికసత్యం అంటారు. ఏ కాలంలోను, ఏ దేశంలోనూ కూడ మార్పు లేని సత్యత్వం కలది బ్రహ్మ ఒక్కటే. దానికి సంబంధించిన సత్యత్వాన్ని పారమార్థిక సత్యత్వం అంటారు. ఆ పారమార్థిక సత్యత్వదృష్టితో చూస్తే బ్రహ్మ తప్ప మరొకటి ఏదీ లేదు అనీ, బ్రహ్మయే సత్య మనీ చెప్పడంలో తప్పేమీ లేదు. త్రాడుమీద పాము కనబడినంత మాత్రాన అక్కడ ఏ విధంగా రెండు వస్తువులు ఉన్నా యని చెప్పడానికి వీలు లేదో అదే విధంగా పారమార్థికసత్యత్వం లేని జగత్తు ఉన్నట్లు భాసించినా కూడ బ్రహ్మయొక్క అద్వితీయత్వానికి భంగం ఏదీ లేదు.

ఈ విధంగా సత్యం అనే మాట కేవలం బ్రహ్మకు మాత్రమే వర్తిస్తుంది. కాని జగత్తుకు వ్యావహారికసత్యత్వమూ శుక్తిరజతాదులకు ప్రాతిభాసికసత్యత్వమూ ఉన్నా కూడ

వాటిని సత్యం అనడానికి వీలు లేదు. అందుచేత వాటికి శంకరభగవత్పాదులు 'మిథ్యా' అని పేరు పెట్టారు. ఇది ఒక పారిభాషికపదం. బ్రహ్మవలె పారమార్థికసత్యం కాదు అని అర్థం. అంతేనే కాని చెవులపిల్లి కొమ్ముమవలె, ఆకాశకుసుమం వలె తుచ్ఛం, అనగా అసలే లేనిది అని అర్థం కాదు. జగత్సత్యత్వవాదులైన ద్వైతి–విశిష్టాద్వైత్యాదులకు పుణ్యపాప–సుఖదుఃఖ–స్వర్గనరకాదుల విషయంలోను ఇతరలౌకికాలౌకికవిషయాలలోను ఈ జగత్తు ఎంత సత్యమో అద్వైతులకు అంతే సత్యం. ఈ విషయం గుర్తించకపోవడం చేతనో, గుర్తించి కూడ కావాలనో తరువాత వచ్చిన ఆచార్యులు ప్రత్యక్షాదుల ద్వారా కనబడుతూన్న ప్రపంచకాన్నే లేదంటున్నాడు! ఇది ఎలా కుదురుతుంది అని నిందాపూర్వకంగా శంకరభగవత్పాదులను అధిక్షేపించారు. తదనుయాయులు కూడ ఈ నిందావాక్యాలనే కంఠస్థం చేసికొంటూ ఏ వేవో అంటూంటారు. అద్వితీయాత్మ సాక్షాత్కారం కలిగేవరకు జగద్వ్యవహారం అంతా నిరాఘాటంగా జరుగుతుంది. ఆత్మజ్ఞానం లక్షలలో ఒకనికి శతకోటిజన్మలలో చేసిన పుణ్యానికి ఫలితంగా లభిస్తుంది. అప్పుడు అతడు ముక్తు డవుతాడు. ఆ స్థితి లభించేవరకు ప్రతీ ఒక్కడూ తన విధ్యుక్తధర్మాన్ని నిర్వర్తిస్తూ ఉండవలసిందే అని శంకరభగవత్పాదులు తమ గ్రంథాలలో కనీసం ఇరవై ముప్పై స్థలాలలో, కొన్ని చోట్ల విస్తృతంగాను, కొన్ని చోట్ల ఒకటి రెండు మాటలలోను చెప్పి ఉన్నారు.(ఈ విషయాన్ని గూర్చిన విస్తృత వివరణం మా బ్రహ్మసూత్రశాంకరభాష్య బాలానందినీవ్యాఖ్యాప్రస్తావనలో చూడవచ్చును). అలాంటప్పుడు ఇతరుల వలెనే జగత్తు సత్యం అని అంగీకరించవచ్చును కదా, మిథ్య అనడం ఎందుకు అని ప్రశ్నించవచ్చును. జగత్తునకు కూడ బ్రహ్మ కున్న సత్యత్వంతో సమాన మైన సత్యత్వం అంగీకరిస్తే "బ్రహ్మ ఒక్కటే సత్యం" అనిచెప్పే శ్రుతివాక్యానికి, జగత్తు కూడ సత్యమే అయిన పక్షంలో అది రెండవదిగా, బ్రహ్మకంటె భిన్నంగా ఉండడంచేత "బ్రహ్మ అద్వితీయం, సజాతీయ–విజాతీయ" స్వగతభేదరహితం అని చెప్పే శ్రుతివాక్యానికి భంగం కలుగుతుంది. (ఇంకా మరికొన్ని దోషాలు ముందు ముందు స్పష్టం అవుతాయి). ఈ విధంగా జగత్తుకు మిథ్యాత్వం స్థాపించడం ద్వారా "ఏకమేవాద్వితీయం బ్రహ్మ" అను శ్రుతివాక్యానికి ప్రామాణ్యం కాపాడబడింది.

ఇంక జీవ బ్రహ్మభేదాన్ని పట్టి, జీవుల పరస్పరభేదాన్ని పట్టీ బ్రహ్మకు సద్వితీయత్వం యథాతథంగా ఉండనే ఉంది కదా అనే ఆశంకకు సమాధానం చెప్పవలసి ఉంది. జీవుడు కూడ బ్రహ్మయే, జీవబ్రహ్మలకు భేదం లేదు అని శ్రుతులు ఘోషిస్తున్నాయి. అందుచేత జీవుణ్ణి పట్టి కూడ బ్రహ్మకు సద్వితీయత్వం లేదు అని శంకరభగవత్పాదులు శ్రుతి–న్యాయ– అనుభవాలచేత స్థాపించారు. (ఈ విషయం కూడ పూర్వోక్తాస్మదీయ బాలానందినీవ్యాఖ్యలో విశదీకరించబడింది).

బ్రహ్మ చిద్రూపమైనది. జ్ఞానరూప మైనది. విజ్ఞానఘనం. చైతన్యపు ముద్ద. జీవుడు కూడ చిద్రూపుడే అని శ్రుతులు అనుభవమూ కూడ చెపుతున్నాయి. పంచమహాభూతా లున్నాయి. ఆకాశం విభువు, అనగా అంతటా వ్యాపించి ఉన్నది. అది ఒక్కటే అని అందరూ అంగీకరించిన విషయమే. పృథివి చరాచరప్రాణుల దేహాలతో సంబంధించినదిగాను, మృత్-సికతా-పర్వత-శిలాదిరూపాలలోను అనేకవిధాలుగా కనబడుతున్నది. అయినా ప్రతీ వస్తువునూ ఒక్కొక్కభూతం అనకుండా పృథివి అనే మహాభూతం ఒక్కటే అని అంటున్నాం. అప్-తేజో-వాయువుల విషయంలో కూడ ఆ విధంగానే అంగీకరిస్తున్నాం. అట్లే చిద్ధాతువు ఆయాదేహాలలో వేరువేరు విధాలుగా ఉన్నట్లు కనబడినా చిద్ధాతువుగా అది ఒక్కటే; భేదం లేదు. అందుచేత చిద్రూపులైన జీవాత్మ; పరమాత్మలకు అభేదమే అంగీకరించాలి. అందుచేతనే శ్రుతి చెవిని ఇల్లు కట్టుకొని జీవాత్మ-పరమాత్మాభేదాన్ని అనేకవిధాల బోధిస్తూన్నది. "స వా ఏష మహానజ **ఆత్మాఽ జరోఽ మృతోఽ భయో బ్రహ్మ" "అయమాత్మా బ్రహ్మ సర్వానుభూః"** (బృ.ఉ. 2. 4.1.9) ఇత్యాదిశ్రుతివాక్యాలను ఎన్నైనా ఉదాహరించవచ్చును. జీవబ్రహ్మాభేదము జీవుల పరస్పరభేదమూ కూడ అవిద్యాకల్పితమే. ఉపాధిభేదకల్పితమే. ఆకాశం సర్వవ్యాప్తమై ఉన్నది. అదే ఆకాశం ఘటంలో ఉంటే చిన్నది వలె, అసలు ఆకాశంకంటె భిన్నమైనది వలె కనబడుచున్నది. మఠంలో ఉన్నది దానికంటె పెద్దదిగాను, మఠం బైట ఉన్నది దానికంటె పెద్దదిగాను భావించబడుచున్నాయి. ఘటంలో ఉన్న ఆకాశాన్ని ఘటావచ్ఛిన్నాకాశ మనీ, మఠంలో ఉన్నదానిని మఠావచ్ఛిన్నాకాశ మనీ అంటారు. ఘటమఠాదులను ఆకాశానికి ఉపాధు లంటారు. ఆ ఘటాదులు తొలగిపోతే అంతా మహాకాశమే. ఆ ఘటాదులను బ్రద్దలుకొట్టవలసినపని లేదు. అవి అలా ఉండగానే ఆకాశస్వరూపాన్ని మనం మనసా గుర్తించినట్లయితే ఆకాశం అంతా ఒకటే అనీ, భేదం ఉపాధికల్పిత మనీ తెలుసుకొనవచ్చును. ఒక చోట ఉన్న ఘటాన్ని మరొక చోటికి తీసికొని వెళ్ళినప్పుడు కూడా స్థానం మారేది ఘటమే కాని ఆకాశం కాదు. ఆకాశం ఒకే విధంగా ఒకేచోట ఉంది అదే విధంగా సర్వవ్యాప్తమై అచంచలమై ఉన్న చైతన్యం ఎల్లప్పుడూ అంతఃకరణాదులతో సంబంధించియే ఉంటుంది. మరొక విధంగా చెప్పాలంటే చైతన్యం లేని ప్రదేశం చతుర్దశభువనాలలోనూ కూడ లేదు. అందుచేత ప్రతీ పదార్థము కూడ చైతన్యసంపర్కం కలిగే ఉంటుంది. అయితే అంతఃకరణం అతిశుద్ధ మైనది. అద్దం వంటిది. అందుచేత అంతఃకరణంలో చైతన్యప్రకాశ అధికంగా ఉంటుంది. (ఈ విషయాన్ని భగవత్పాదులు అష్టాదశాధ్యాయంలో ౫౦వ శ్లోకం భాష్యంలో ప్రతిపాదించారు). అంతఃకరణావచ్ఛిన్న మైన చైతన్యమే జీవుడు. లేదా చైతన్యప్రకాశసంవలితమైన అంతఃకరణమే జీవుడు. చైతన్యం అచలం. దీనికి గమనాగమనాదులు లేవు.

వేరు వేరు దేహాలు ధరించేదీ, స్వర్గనరకాదులకు వెళ్లేదీ, చతుర్దశభువనాల్లో సంచరించేదీ అంతఃకరణమే. ఈ అంతః కరణం ఎక్కడికి వెళ్లినా అక్కడ చైతన్యం ఉండనే ఉంది గాన దీని సతచేనత్వానికి ఎప్పుడూ భగం లేదు. మనకు ఆక్సిజన్ ఎంతో అవసర మైనది. అది లేనిదే జీవితమే లేదు. అయితే మనతో కూడ ఆక్సిజన్ తీసికొనివెళ్లడం లేదు; అలాంటి శక్తి కూడ లేదు. ఎక్కడికి వెళ్లినా ఆక్సిజన్ లభిస్తూన్నది; దానిని తీసికొని జీవిస్తున్నాం. అదే విధంగా అంతఃకరణమూ, దానితోపాటు లింగశరీరమూ ఎక్కడికి వెళ్లినా అక్కడ చైతన్యం ఉండడంచేత అది సచేతనంగా ఉండి జీవు డని చెప్పబడుచున్నది. (మనం దృష్టాంతంలో చూచిన ఆక్సిజన్ కూడ కొన్ని ప్రదేశాలలోనే ఉంటుంది; దార్ష్టాంతికమైన ఆత్మచైతన్యం లేని ప్రదేశమే లేదు అనేది వేరే విషయం. కూడా తీసికొని వెళ్లకపోవడం అనేటంత వరకే ఈ ఉదాహరణం). అంతఃకరణాన్ని దూరం చేసి చూస్తే మిగిలేది చైతన్యమే. అది ఎల్లప్పుడూ శుద్ధచైతన్యమే. ఈ విధంగా బ్రహ్మకూ జీవునికీ ఏమీ భేదం లేదు. బ్రహ్మయే జీవుడు, జీవుడే బ్రహ్మ. బ్రహ్మనే అంతఃకరణరూపమైన ఉపాధిని పట్టి జీవుడన్నట్లు మాయారూపోపాధిని పట్టి సగుణుడైన ఈశ్వరు డని అంటున్నారు. ఈ విధంగా మిథ్యయైన జగత్తు బ్రహ్మయొక్క అద్వితీయత్వానికి భంగం కలిగింపజాలదు; జీవుడు అసలే కలిగించడు అని శంకరభగవత్పాదులు అద్వైతశ్రుతుల పరమప్రామాణ్యాన్ని ప్రతిష్ఠించి ఉన్నారు. వీరు స్థాపించిన జగన్మిథ్యాత్వవాదంలో ప్రత్యక్షాదిప్రమాణాలకు ఏమాత్రమూ విరోధం లేకపోవడమే కాకుండా శ్రుతిసమన్వయం కూడ చక్కగా కుదురుతుంది.

నిజానికి శంకరభతవత్పాదులు ప్రత్యక్షాదిప్రమాణానుసారం తప్పకుండా అంగీకరించవలసినవీ, ముందుగా చేసికొన్న కొన్ని కల్పనలను సమర్థించుకొనడం కోసం ప్రౌఢవాదం (మొండివాదం) చేసేవాళ్లు తప్ప ప్రమాణానుభవాదులకు కట్టుబడి ఉండేవారు ఎవరూ కూడ కాదనడానికి వీలు లేనివీ, లోక-శాస్త్రసంమతములూ అయిన కొన్ని ప్రధానాంశాలను దృష్టిలో ఉంచుకొని తమ సిద్ధాంతాన్ని రూపొందించారు.

1. దృశ్య మైన ప్రతీ వస్తువూ ఏ నాటికైనా నశించి తీరుతుంది.

2. సావయవ మైన వస్తువు అవయవాలు విడిపోవడం ద్వారా ఏ నాటికైనా నశిస్తుంది.

3. ఈశ్వరునికి శరీరం ఉంటుం దని అంగీకరిస్తే అది సావయవమే కాన నశించి తీరుతుంది. పరమేశ్వరుడు ఇచ్ఛానుసారం శరీరం ధరిస్తే ధరించవచ్చును గాని అది తప్పక అంతర్హిత మౌతుంది. అందుచేత పరమేశ్వరునకు రూపం లేదు. పరమేశ్వరునికి శరీరం ఉంటుంది; అది మన శరీరం వలె పాంచభౌతికం

కాదు; అప్రాకృతం; అందుచేత నశించదు అని చెప్పడం కల్పనామాత్రమే. ప్రమాణం ఏమీ లేదు. ప్రత్యక్షానుమానవిరుద్ధం.

4. ఈశ్వరునికి శరీరం ఉన్న దని ఒక ప్రక్క అంగీకరిస్తూ మరొక ప్రక్క ఈశ్వరుడు సర్వవ్యాపి, అంతటా వ్యాపించి ఉంటాడు; ఈశ్వరుడు లేని దేశం లేదు అనడం వరస్పరవిరుద్ధం. ప్రత్యక్షాదివిరుద్ధం. ఒక శరీరం ఇచ్చి ఒక చోట కూర్చోపెట్టినవాడు సర్వగతు డెలా అవుతాడు. సశరరీరత్వమేనా అసత్యం కావాలి, సర్వవ్యాపిత్వమేనా అసత్యం కావాలి. ఉపనిషత్ప్రామాణ్యాన్ని అంగీకరించేవాళ్లు ఈశ్వరుడు శరీరరహితుడు సర్వవ్యాపి అని మాత్రమే అంగీకరించాలి. శరీరధారి యైన ఈశ్వరుడు సగుణబ్రహ్మయే అని శాంకరుల మతం. తదతీతం నిర్గుణబ్రహ్మ.

5. ప్రపంచం బ్రహ్మనుండి పుట్టినా జీవుడు మాత్రం ఎవరినుండీ పుట్టలేదు, నిత్యుడు అని శ్రుతులు చెపుతున్నాయి. అలాంటి జీవుని పరిమాణం ఎంత అని ప్రశ్న వచ్చినప్పుడు శరీరాదిపరిమాణం వలె మధ్యమపరిమాణం అని అంటే జీవుడు ఏ నాటికైనా నశిస్తాడు అని అంగీకరించాలి. అణుపరిమాణం అని అంటే జీవుడు చిత్స్వరూపుడైనా కూడ సర్వశరీరవ్యాపి యైన జ్ఞానం కలగదు. అది అనుభవవిరుద్ధం. అందుచేతనే జీవుని పరిమాణం మహత్పరిమాణం అనీ, జీవుడు సర్వవ్యాప్తు డనీ, వాస్తవంలో సర్వవ్యాప్తమైన బ్రహ్మయే ఉపాధిభేదంచేత పరిచ్ఛిన్నమైన జీవుడుగా చెప్పబడుచున్న దనీ శంకరభగవ త్పాదులు ప్రతిపాదించారు. జీవుడు అణుపరిమాణుడే అని అంటూ దేహవ్యాపిజ్ఞానం కలగడానికి జ్ఞానరూపు డైన (ధర్మిజ్ఞాన మైన)జీవునకు ధర్మంగా మరొక జ్ఞానం ఉంటుం దని, అది ధర్మజ్ఞాన మనీ కొందరు చెప్పేదానికి ప్రమాణం ఏదీ లేదు. అనుభవం కూడ లేదు. మధ్యమపరిమాణ మైతే అనిత్యత్వదోషం కలుగుతుందనే అభిప్రాయంతో జీవులు అనంతసంఖ్యాలు, ప్రతీ జీవుడూ సర్వవ్యాపియే అని అంగీకరించే నైయాయికాదిమతం కూడ అయుక్తమే. అనేకులకు సర్వవ్యాపకత్వం ఉండదు కదా!

6. మృత్తు(మట్టి), బంగారం మొదలైనవి సావయవాలు. వాటిని ఘటకుండలాద్యాకారాలలోనికి మార్చవచ్చును. ఒక ఆకారంలో ఉన్న వస్తువు మరొక ఆకారానికి మారుతే అది పరిణామం, వికారం. కొందరు బ్రహ్మ జగత్తుగా పరిణమించినది అని అంటారు. అది శ్రుతివిరుద్ధం. పరిణామం చెందే సావయవవస్తువు అవయవవిశ్లేషంచేత ఏనాటికైనా నశిస్తుంది కదా. బ్రహ్మ కూటస్థ మనీ, నిరవయవ మనీ, నిర్వికార మనీ, అవ్యయం (మార్పు లేనిది)అనీ చెప్పే శ్రుతికి ఈ పరిణామవాదం విరుద్ధం. "పరిణామం చెందినా అది నిత్యమే అని శ్రుతివాక్యాన్ని పట్టి

అంగీకరిస్తాం"అని అంటే ప్రత్యక్ష- అనుమానాదిప్రమాణాలకు విరుద్ధం. అందుచేతనే శంకరభగవత్పాదులు జగత్తు బ్రహ్మవివర్తం అన్నారు. త్రాడుమీద సర్పం కనబడుతూన్నది;ముత్యపుచిప్పమీద వెండి కనబడుతూన్నది. ఇక్కడ త్రాడు సర్పంగా గాని,ముత్యపుచిప్ప వెండిముక్కగా గాని పరిణామం చెందలేదు. తిమిరాదిదోషంచేత అక్కడ సర్పమూ,వెండీ ఉన్నట్లు కనబడుతున్నాయి. ఆ దోషం ఉన్నంతవరకూ అలాగే కనబడతాయి. త్రాడు సర్పంగాను,ముత్యపుచిప్ప వెండిగాను వివర్తం చెందింది. దీనిని వివర్తవాదం అంటారు. అవి సర్పంగాను,వెండిగాను కనబడడానికి ముందు గాని,కనబడుతూన్న సమయంలో కాని,"ఇది సర్పం కాదు,వెండి కాదు"అని బాధాజ్ఞానం కలిగినతరువాత గాని అక్కడ ఉన్నవి త్రాడూ,ముత్యపుచిప్పా మాత్రమే. సర్పం అనే రెండవ వస్తువు గాని,వెండి అనే రెండవ వస్తువు గాని కాలత్రయంలోనూ లేదు. అట్లే ఎట్టి మార్పులూ లేని, నిత్యమైన,స్థిరమైన,సర్వవ్యాప్తమైన బ్రహ్మమీద మాయాప్రభావంచేత జగత్తు ఉన్నట్లు కనబడుతూన్నది. అయినా దీనివల్ల బ్రహ్మస్వరూపంలో మార్పేమీ లేదు. జగత్తులో ఉన్న పదార్థాలలో అంతఃకరణాలు అనేవి ఉన్నాయి. అవి చాలా నిర్మలమైనవి. సర్వవ్యాప్తమైన చైతన్యం పరిశుద్ధమైన అంతఃకరణమైన బుద్ధిలో,ప్రక్కనే ఉన్న మట్టిబెడ్డలో స్ఫుటం కాని ముఖం నిర్మలమైన అద్దంలో స్ఫుటం అయినట్లు,స్ఫుటం అవుతుంది. బుద్ధి సంబంధంవల్ల మనస్సు చైతన్యవంతంగా కనబడుతుంది. దానితో సంబంధంవల్ల ఇంద్రియాలు సచేతనాలుగా కనబడతాయి. వాటితో సంబంధంవల్ల దేహం సచేతనంగా కనబడుతుంది. వీటి సముదాయాన్నే జీవుడంటున్నారు. ఈ విషయం భగవద్గీతాభాష్యంలో స్పష్టంగా చెప్పబడింది- "అత్యన్తనిర్మలత్వస్వచ్ఛత్వసూక్ష్మత్వోపపత్తేః ఆత్మనః. బుద్ధేశ్చాత్మసమనైర్మల్యాద్యు పపత్తేః ఆత్మచైతన్యాకారాభాసత్వోపపత్తిః. బుద్ధ్యాభాసం మనః,తదాభాసాని ఇన్ద్రియాణి, ఇన్ద్రియాభాసశ్చ దేహః. అతః లౌకికైః దేహమాత్ర ఏవ ఆత్మదృష్టిః క్రియతే"(18.50). ఈ విధంగా ఉన్న దేహంనుంచి వెనుకకు వెనుకకు విడదీసుకుంటూ వెళ్లగా చివరికి చేరుకునేది అద్వితీయాత్మతత్త్వందగ్గరికే. అందుచేత జగత్తుగాని,జీవులు గాని బ్రహ్మయొక్క అద్వితీయత్వానికి సర్వగతత్వానికి భంగం కలిగింపజాలవు. ఈ విధంగా వివర్తవాదాన్ని అంగీకరించడంవల్ల శ్రుత్యుక్తమైన అద్వితీయాత్మపారమార్థికత్వం చక్కగా కుదురుతుంది.

జగత్తు మిథ్య అంటే ఇది ప్రత్యక్షాదివిరుద్ధం కదా అనే ఆశంకకు తావు లేదు. జగత్తు లేదని అంటే కదా ఈ ఆశంక? సాటిలేని మహామేధావి యైన శ్రీశంకరాచార్యులు ఎదురుగా కనబడుతూన్న జగత్తు లేదని ఎప్పుడైనా,ఎక్కడైనా అన్నారా? జగత్తే

లేదన్నాడు శంకరుడు అని అంటూ పరిహాసపూర్వకంగా ఆక్షేపిస్తూ తమ తమ గోష్ఠులలో ఆనందించే మహాబుద్ధిశాలులను చూచి ఏమనాలో తెలియదు!"అస్య జగతో నామరూపాభ్యాం వ్యాకృతస్య అనేకకర్తృభోక్తృసంయుక్తస్య ప్రతినియత దేశకాలనిమిత్తక్రియాఫలాశ్రయస్య,మనసాపి అచిన్త్యరచనారూపస్య" (బ్ర.సూ.భా. 1.2)ఇత్యాదివిధంగా అవకాశం వచ్చినప్పు డల్లా జగత్స్వరూపాన్ని ఉన్నదు న్నట్లుగా,కనబడుతున్నది కనబడుతూన్నట్లుగా వర్ణించే శ్రీశంకరా చార్యులు, ప్రవృత్తి-నివృత్తిరూపధర్మద్వయాచరణద్వారా ప్రేయఃశ్రేయఃసంపాదనమే మానవుని ఏకైకకర్తవ్యం అని నిరంతరమూ బోధించడం అనే మహోద్యమం చేపట్టి సాధించిన శ్రీశంకరాచార్యులు, అనేక గ్రంథాలు రచించి ముముక్షు జనోద్ధరణకై జీవితాంతం ప్రయత్నం చేసిన శ్రీశంకరాచార్యులు అసలు ఈ జగత్తే లేదని అన్నారు అనడం మహాసాహసం.ఇలాంటి ప్రబుద్ధులు కూడ ఉన్నారు, లేదా రాబోతారు అని ముందుగానే గ్రహించే ఆయన అద్వితీయాత్మసాక్షాత్కారం కలిగే వరకు ప్రత్యక్షాదులు నూటికి నూరుపాళ్లూ ప్రమాణాలే,వాటి ద్వారా తెలియబడే జగత్తు సత్యమే అని"లౌకికం తద్వదేవేదం ప్రమాణం త్వాఽఽ ఽ త్మనిశ్చయాత్''(బ్ర.సూ.భా. 1.1.4)ఇత్యాదివాక్యాలను ఉదాహరిస్తూ,తమ మాటలలో కూడ అనేకపర్యాయాలు చెప్పారు.అయినా కూడ అర్థరహితమైన ఆక్షేపణలు కొందరు వాదులు చేశా రంటే వాళ్లకి అసలు విషయం అర్థం కావడంలే దనుకోవాలి.ఎంత చెప్పినా అర్థం చేసికొనని ఇలాంటివాళ్లనే దృష్టిలో ఉంచుకొని భగవత్పాదులు-"తదేతత్ ఉక్తప్రతివచనమపి అసకృత్ అత్యన్తవిపరీత దర్శనభావితతయా మోముహ్యమానః లోకః శ్రుతమపి అసకృత్ తత్త్వం విస్మృత్య విస్మృత్య మిథ్యా ప్రసంగమ్ అవతార్య అవతార్య చోదయతి" (భ.గీ.భా. 14.18) అని అన్నారు.లేదా అర్థం అయినా కూడ కొందరు ఉపనిషత్సి ద్ధాంతాన్ని తారుమారుచేసి ఇతరసంప్రదాయాలలోని కొన్ని అంశాలను ఔపనిషద సిద్ధాంతంలో చొనిపి తమ వైశిష్ట్యాన్ని ప్రకటించుకొనడానికి ప్రయత్నిస్తూ ఉండాలి.ఏది ఏమైనా శంకరభగవత్పాదులు చూపిన తత్త్వద్విషయసమన్వయంలో ప్రత్యక్షాదివిరోధం లేదు.ఔపనిషదసిద్ధాంతం నిశ్చితరీతిలో నిర్దుష్టంగా సుస్థిరం చేయబడింది.

7. అంతకు పూర్వం లేక ఏర్పైన ఒక క్రియచేత సంపాదించబడినది తప్పక ఎప్పటికైనా నశిస్తుంది అనేది లోకప్రసిద్ధ మైన,ప్రత్యక్షాదిసిద్ధ మైన,నియమం.మోక్షం అనేది కూడ అంతకు పూర్వం లేదు క్రొత్తగా ప్రయత్నంచేత సాధింపబడుతుంది అని అంటే అది స్వర్గాదికం వలె అనిత్యమే అవుతుంది.అందుచేత అది నిత్యమైనది

కావాలంటే అది క్రొత్తగా సాధ్యం కాదు,ఎల్లప్పుడూ ఉన్నదే అని అంగీకరించాలి. జీవుడు ఎల్లప్పుడూ బ్రహ్మస్వరూపుడే.అందుచేతనే"అహం బ్రహ్మ అస్మి","తత్ త్వమ్ అసి"అని మహావాక్యాలు చెపుతున్నాయి ."అహం బ్రహ్మ భవిష్యామి"అని కాని "త్వం తత్ భవిష్యసి"అని కాని అనలేదు. అజ్ఞానంచేత భిన్నుడ నని అనుకొంటున్నాడు.ఆ అజ్ఞానం తొలగిస్తే చాలు స్వతఃసిద్ధమైన బ్రహ్మస్వరూపత్వాన్ని తెలుసుకొంటాడు.అందుచేత మోక్షం క్రొత్తగా సంపాదించవలసినది కాదు. అలా సంపాదించడానికి ఏ కర్మయొక్క అపేక్షా కూడ లేదు.మోక్షం కర్మాదిసాధ్యం అని చెప్పే వాదుల మతం ప్రమాణవిరుద్ధం.అద్వైతసిద్ధాంతంలో నైతే ప్రమాణవిరోధం ఏదీ లేదు.లోకాంతరగమనం ఉంటే ఉండవచ్చును కాని అది నిత్యమైన మోక్షం కాదు. స్వస్వరూపస్థితిమాత్రమే మోక్షం.

8. పైన చూచిన విధంగా ప్రపంచం మిథ్య అనగా దాని సరియైన అభిప్రాయం తెలుసుకొనని కొందరు వాదులు-మిథ్య అంటే ఏమిటో అర్థం అవడంకోసం ఉదాహరణంగా చూపిన శుక్తిరజత-రజ్జుసర్ప-స్వప్నదృశ్యాలు కూడ (అద్వైతి చెప్పినట్లు) అసత్యములు కావు;వాటిలో కూడ సత్యత్వం ఉంది. శుక్తిలో, రజతంలో కూడ ఉండే కొన్ని తెల్లని వస్తువుల అంశాలు ఉన్నాయి.అందుచేత అక్కడ కనబడిన వెండి సత్యమే.ఇట్లే రజ్జుసర్పాదులలో కూడ.స్వప్నంలో పరమేశ్వరుడు రథాదులను సృష్టించి ఆ నిద్రపోతూన్నవానికి చూపుతున్నాడు.అందుచేత అవి కూడ సత్యములే అంటూ. ఎంతో శబ్దాడంబరంతో కొన్ని వాదనలు చేస్తూంటారు.ఇవన్నీ ఎంత ప్రమాణవిరుద్ధాలో వేరుగా చెప్ప పని లేదు.

9. అంతర్యామిబ్రాహ్మణాదులలో ఆత్మ అంతర్యామి అని వర్ణించబడింది.దానినీ "ఈశ్వరః సర్వభూతానామ్"ఇత్యాదివాక్యాలను ఆధారంగా తీసికొని పరమాత్మ సర్వజీవాంతర్యామి అనీ 'తత్త్వమసి'ఇత్యాదివాక్యాలలో జీవునిలో ఉన్న అంతర్యామికీ, జగత్స్రష్టకీ అభేదం వర్ణించబడుతూన్నది కాని జీవపరమాత్మలకు కాదు అనీ ఈవిధంగా, స్పష్టంగా ఉన్న అర్థం మార్చి ఏవేవో అర్థాలు చెప్పారు.ఒక శరీరం ధరించి ఒక చోట ఉన్న ఈశ్వరుడు సర్వాంతర్యామిగా కూడ ఉన్నాడు అని చెప్పడం ప్రత్యక్ష-అనుభవాది విరుద్ధం.ఈశ్వరుని సశరీరరూపమైనా సత్యం కావాలి సర్వాంతర్యామిరూప మైనా సత్యం కావాలి.జీవులు జగత్తు వేరుగా సత్యపదార్థాలుగా ఉన్నప్పుడు పరమాత్మకు సర్వవ్యాపకత్వం కుదరదు.వాటి స్థానాన్ని విడిచి మిగిలిన స్థానంలో మాత్రమే ఉండగలుగుతాడు కదా. అందుచేత ఇది ప్రత్యక్షాదివిరుద్ధం.అద్వైతంలో నైతే జగత్తు మాయాకల్పితం గాన,జీవులు బ్రహ్మభిన్నులే గాన బ్రహ్మకు సర్వవ్యాపకత్వం కుదురుతుంది.అందుచేత జీవు

డని చెప్పబడే చైతన్యమూ, ఈశ్వరు డని చెప్పబడే చైతన్యమూ, అంతర్యామి చైతన్యము,బ్రహ్మ అని చెప్పబడే చైతన్యమూ అన్నీ కూడ ఒకటే.

10. అద్వైతశ్రుతులకు ఏదో విధంగా అర్థం చెప్పడంకోసం ఈశ్వరుడు శేషి (అవయవి) అనీ,చిత్తులైన జీవులూ,అచిత్తైన జగత్తూ ఈశ్వరునికి శేషాలనీ(అవయవా లనీ) చేసే కల్పనకు శ్రుతిప్రమాణం గాని,ప్రత్యక్షాదిప్రమాణాలుగాని ఏవీ లేవు.నేను ఈశ్వరుని అవయువాన్ని అని ఏ జీవుడూ అనుకొనడం లేదు కదా? విరాట్స్వరూపవర్ణనాదిపరములైన శ్రుతులు నామరూపాత్మకప్రపంచరూపంలో కనబడేది కూడ బ్రహ్మమే, ఇదంతా బ్రహ్మవివర్తమే అని చెప్పుచున్నాయి గాని ఈశ్వరుడు శేషి,జగజ్జీవులు శేషములు అని చెప్పడానికి ఉద్దిష్టములైనవి కావు.అవయవసముదాయమే కదా అవయవి అంటే.అవయవాలు దేని కది విడదీస్తే అవయవియే లేకుండా పోతుంది. ఈశ్వరునికి ఇలాంటి స్థితిని కల్పించడం అయుక్తం కదా?అవయవాలకంటె భిన్నంగా అవయవి ఉంటుంది అని అంటే అది ప్రత్యక్షాదిప్రమాణవిరుద్ధం.అద్వైతం ప్రత్యక్షాదివిరుద్ధం అంటూ ఒక మూల శ్రీశంకరాచార్యులను ఆక్షేపిస్తూ ఇలాంటి కల్పనలు చేయడం ఎంతవరకు యుక్తం?అందుచేత దురాగ్రహం వదలి, అద్వైతసిద్ధాంతానుసారం ఔపనిషద విషయాలకు భగవత్పాదులు చూపిన సమన్వయం అంగీకరిస్తే ఏ విరోధాలూ ఉండవు. ఆ యా ఆగమాదులలోను,తదనుసారిపురాణాలలోను లేదా పురాణానుసార్యాగమాలలోను ఉన్న విషయాలను ఉపనిషత్తులలో చొనపడంకోసం చేసే ప్రయత్నాలవల్ల వచ్చిన బాధ ఇది అంతా.అధికారానుసారం ఆ యా పురాణాగమాదులలో చెప్పిన భగవదారాధనాదుల ద్వారా చిత్తశుద్ధి సంపాదించుకొని ఉపనిషత్తులలో చెప్పిన జ్ఞానమార్గానికి వెళ్లడం మంచి దని బోధించడం అత్యుత్తమమైన మార్గం.ఉపనిషద్వాక్యాలకు వక్రార్థాలు చెప్ప నవసరమూ ఉండదు;శ్రీ శంకరాచార్యులను దూషించవలసిన పనీ ఉండదు.

11. ఏదైన ఒక గ్రంథాన్ని తీసికొని దానిలో ఉన్న విషయాలను పరిశీలించేటప్పుడు అటూ ఇటూ బెసగకుండా ఆ గ్రంథంలోని విషయాన్ని గూర్చి మాత్రమే చర్చించాలి కాని ఎన్నో స్వకపోలకల్పితవిషయాలు, అన్యసంప్రదాయసంబద్ధగ్రంథస్థ విషయాలు దానిలో చేర్చి ఇవన్నీ ఈ గ్రంథంలో ప్రతిపాదించినవే అనడం పండితజనామోదయోగ్యం కాదు. ప్రధానమైన ఉపనిషత్తులలో అన్నింటిలోనూ పరతత్త్వాన్ని బ్రహ్మ లేదా ఆత్మ అని మాత్రమే అంటూండగా ఆ బ్రహ్మకి తమ ఇష్టానుసారం ఒక పేరు పెట్టి. ఒక శరీరం ఇచ్చి ఒక ప్రధానమైన లోకం, ఏర్పరచి, వస్త్రాలు, అలంకారాలు, ఆయుధాలు, పరివారం, వాళ్లలో కూడ తారతమ్యాలు ఇవన్నీ కూడా కల్పించి (వీటిలో ఏ ఒక్కటీ కూడ ప్రధానోపనిషత్తు

లలో లేదు) ఇదే ఉపనిషచ్ఛ్రుతిపాద్యమైన అర్థం అని వాదిస్తే, ఉపనిషదర్థాన్ని తు చ తప్పకుండా వివరించేవాళ్లని నిందిస్తే ఏమనాలి! ఇవన్నీ కల్పనామాత్రాలే. ఇతరగ్రంథస్థవిషయాలే. వాటిని అక్కడనే ఉంచి, ఆ గ్రంథాలలో ఉపదేశించిన మార్గాన్ని ప్రచారం చేయవచ్చు. ఉపనిషత్తులలోనికి ఈ కల్పన లన్నీ తీసికొనిరావడం ఎందుకు? ప్రధానమైన ఉపనిషత్తులలో ఈ విషయాలలోని ఏ ఒక్క విషయమైనా ఉన్నదా? అన్నీ కల్పనలు. కల్పనలకు అంతం ఏ ముంటుంది? అందుచేతనే ఒక సందర్భంలో శ్రీ శంకరభగవత్పాదు లంటారు :

"అవిద్యమానార్థకల్పనాయాం సర్వార్థసిద్ధిప్రసంగాత్. ఇయానేవ అవిద్యమానః విరుద్ధో వా ఽ విరుద్ధో వార్థః కల్పనీయః, న అతో ఽ ధికః ఇతి నియమహేత్వ భావాత్.

కల్పనాయాశ్చ స్వాయత్తత్వాత్; ప్రభూతత్వసంభవాచ్చ. న చ వైశేషికైః కల్పితేభ్యః షడ్భ్యః పదార్థేభ్యః అన్యే అధికాః శతం సహస్రం వా హ్యర్థాః న కల్పయితవ్యాః ఇతి నివారకో హేతురస్తి. తస్మాద్యస్మై యద్రోచతే తత్సిధ్యేత్. కశ్చిత్ కృపాలుః ప్రాణినాం దుఃఖబహులః సంసార ఏవ మాభూదితి కల్పయేత్. అన్యో వా వ్యసనీ ముక్తానామపి పునరుత్పత్తిం కల్పయేత్. కస్తయోర్నివారకః స్యాత్" (బ్ర.సూ.భా. 2.2.17) (లేని విషయాలను కల్పించడం ప్రారంభిస్తే సిద్ధించని దంటూ ఏదీ ఉండదు. విరుద్ధ మైనా అవిరుద్ధ మైనా లేని అర్థం (విషయం) ఇంత మాత్రమే కల్పించాలి కాని ఇంతకు మించి కల్పించకూడదు అని చెప్పడానికి నియమ మేమీ లేదు కదా? కల్పన తన చేతిలో ఉంటుంది గాన ఎంత కల్పనైనా చేయవచ్చు. వైశేషికులు కల్పించిన ఆరు పదార్థాలకు మించి నూరు లేదా వెయ్యి పదార్థాలను కల్పించకూడదు అని నివారించే హేతువేదీ లేదు కదా? ఎవనికి ఏది ఇష్టమో అదంతా సిద్ధించేస్తుంది. దయాలు వైన ఒకడు ప్రాణులకు దుఃఖభూయిష్ఠ మైన ఈ సంసారమే ఉండగూడదు అని కల్పించవచ్చును. వెఱ్ఱి పట్టుదల గల మరొకడు ముక్తులు కూడ మళ్లీ పుడతారని కల్పించవచ్చు. వాళ్లిద్దరినీ కాదనే వా డెవడు?"

ఔపనిషదతత్త్వాన్ని అందజేస్తా నని ప్రారంభించి ఎన్నో బాహ్య విషయాలు, ప్రధానోపనిషత్తులలో కనబడని విషయాలు, చేర్చి వ్యాఖ్యానిస్తూ, అలా కాకుండా తమ భాష్యాదులలో అన్ని విధాలా ఉపనిషదర్థానికి దగ్గరగా ఉంటూన్న శ్రీ శంకరాచార్యాదులను 'అనాదిపాపవాసనాదూషితాంతఃకరణులు' ఇత్యాది వాక్యాలతో దూషించేవారిని చూస్తే ఆశ్చర్యమే కలుగుతుంది. అయితే ప్రధానోప నిషత్తు లేవి అని ఎవరైనా ప్రశ్నించవచ్చును. ఏ ఉపనిషద్వాక్యాలను విషయవాక్యాలుగా గ్రహించి సూత్రకారు లైన బాదరాయణులు తమ సిద్ధాంతాన్ని

స్థాపించారో అవే ప్రధానోపనిషత్తులు. అవి ఈశాదిదశోపనిషత్తులు లేదా ఏకాదశోపనిషత్తులు. అందుచేతనే శ్రీ శంకరభగవత్పాదులు వాటికే భాష్యాలు రచించారు.

ఔపనిషద సిద్ధాంతం స్వయంసంపూర్ణం. ఇతర గ్రంథస్థ విషయాలు తీసికొని వచ్చి ఉపనిషదర్థోపబృంహణం చేయవలసిన పని లేదు. వీటి విషయం శ్రీ బాదరాయణ - శంకరాచార్యాదులకు విడిచిపెట్టి ఆ ఆగమాదులలోని ఉత్తమ విషయాలను, తత్తద్దేవతారాధన - ఆలయనిర్మాణ - పూజావిధానాదులను విశదీకరిస్తే శాంకరమతానుయాయులు ఎవ్వరూ కాదనరు. స్వస్వరుచిభేదాను సారం భక్తిప్రపత్తులతో స్వీకరిస్తారు.

"న పురాణాగమాద్యర్థైర్వేదార్థముపపీడయేత్,
బిభేత్యాగమికాద్వేదః మామయం ప్రతరేదితి" (పు.శ్రీ.రా)

రెండు యోగాలు:-భగవద్గీతలో రెండు విధాలైన నిష్ఠ బోధించబడింది. జ్ఞానులకు జ్ఞానయోగంచేత, ఇతరులకు కర్మయోగంచేత రెండు నిష్ఠలు బోధింపబడ్డాయి

"లోకేఽస్మిన్ ద్వివిధా నిష్ఠా పురా ప్రోక్తా మయానఘ,
జ్ఞానయోగేన సాంఖ్యానాం కర్మయోగేన యోగినామ్". (2.3)

అని శ్రీకృష్ణుడంటాడు. ఈ జ్ఞానయోగ-కర్మయోగాలమధ్య ఉపకార్యోపకారకభావం ఉన్నా కూడ అవి అత్యంతవిభిన్నస్వభావం కలవి. (కర్మయోగం జ్ఞానం కలగడానికి ఉపకరిస్తుంది గాన అది ఉపకారకం. జ్ఞానయోగం ఉపకార్యం). పైన చెప్పిన అద్వితీయాత్మతత్త్వజ్ఞానమే జ్ఞాన యోగం. కర్మానుష్ఠానం వేరు కర్మయోగం వేరు. శాస్త్రవిహితాలైన కర్మలను ఫలంకొరకు కోరికతో చేసినా కోరిక లేకుండా చేసినా అది కర్మానుష్ఠానమే. ఫలాపేక్ష లేకుండా చేసిన కర్మానుష్ఠానం కర్మయోగం. కర్మయోగమే భగవద్గీతలో చాలా చోట్ల కేవలం 'యోగ'శబ్దం చేత కూడ నిర్దేశించబడింది. భక్తియోగ-ధ్యానయోగాదులైనవి అన్నీ కూడ కర్మగానే పరిగణింపబడతాయి. వీటిని కూడ ఫలాపేక్ష లేకుండా అనుష్ఠిస్తే కర్మయోగంలో అంతర్గతము లవుతాయి. కర్మ, తత్సాధనాలు. దాని కర్త, దాని ఫలం, దానిని అనుభవించేవాడు ఇత్యాది భేదబుద్ధితో ఆచరించేది కర్మ. అలాంటి భేదాల గంధం కూడ లేని అద్వితీయాత్మ తత్త్వానుసంధానరూప మైనది జ్ఞానం. ఈ రెండూ ఒక మనుష్యునిచేత ఒకే సమయంలో అనుష్ఠించడానికి శక్యమైనవి కావు. అందుచేత గతి-స్థితుల వలె పరస్పరము విరుద్ధ మైనవి. అద్వితీయాత్మస్థితిరూపమైన మోక్షానికి ఏకైకసాధనం జ్ఞానమే. ఉపనిషత్తులలో ప్రధానంగా ప్రతిపాదించబడిన మోక్షం ఇదే. ఇతరమోక్షా లేవీ మోక్షాలు కావు. వాటికి కర్మ కూడ ఉపకరిస్తే ఉపకరించవచ్చునేమో గాని'బ్రహ్మాత్మనాస్థితి'అనే మోక్షానికి కర్మ ఉపయోగించదు. కొందరు అన్నట్లు జ్ఞానం కర్మా రెండూ కలిసి మోక్షం ఇస్తాయి అనేది ఔపనిషదమోక్షం విషయంలో కుదరదు. అందుచేతనే ఈ జ్ఞానకర్మసముచ్చయవాదాన్ని శ్రీభగవత్పాదులు అవకాశం వచ్చినప్పుడల్లా తమ భాష్యాలలో అనేకవిధాల ఖండించారు.

ప్రస్తావన

భగవద్గీతఅద్వైతప్రతిపాదకం:- ఆత్మస్వరూపాన్ని గూర్చి చెపుతూ భగవద్గీత ఇది (ఆత్మ)వినాశరహితం,నిత్యం,పుట్టుకలేనిది(అజం),అవ్యయం(మార్పులు లేనిది),అవ్యక్తం(చూడ శక్యం కానిది),సనాతనం,అచింత్యం(ఆలోచించడానికి శక్యం కానిది) అవికార్యం(ఎట్టి మార్పులూ కలిగించడానికి శక్యం కానిది)అని బోధిస్తూన్నది.ఏతాదృశ లక్షణలక్షితమైన ఆత్మ ఒక్కటే,అనేకాత్మలు గాని,జీవాత్మ పరమాత్మ అనే భేదం కాని లేదు అని కూడ అనేకప్రదేశాలలో స్పష్టంగా బోధిస్తూన్నది."య ఏనం వేత్తి హన్తారమ్"(2.19) మొదలు "అవ్యక్తోఽయమచిన్త్యోయమవికార్యోఽయముచ్యతే" (2.25)వరకు అనాత్మధర్మాలైన వికారాలేవీ ఆత్మకు లేవని ఉపదేశించబడింది."వాసుదేవః సర్వమ్"ఇత్యాదివాక్యాలు "బ్రహ్మైవేదం సర్వమ్""ఆత్మైవేదం సర్వమ్"ఇత్యాద్యుపనిషద్వాక్యాల అర్థాన్నే బోధిస్తున్నాయి."క్షేత్రజ్ఞం చాపి మాం విద్ధి సర్వక్షేత్రేషు భారత"(13.2) అనే శ్లోకం జీవాత్మపరమాత్మైకత్వాన్ని బోధిస్తూన్నది."క్షేత్రజ్ఞమ్"అని ఏకవచనప్రయోగం అన్ని శరీరాలలోను ఉన్న ఆత్మ ఒక్కటే అని బోధిస్తూన్నది."అవిభక్తం చ భూతేషు విభక్తమివ చ స్థితమ్"(3.16)అనే వాక్యంలో ఆత్మ ఉపాధిభేదంచేత వేరు వేరుగా ఉన్నట్లు కనబడినా వాస్తవంలో అది భేదరహితమే అని చెప్పబడింది.

"యదా భూతపృథగ్భావమేకస్థమనుపశ్యతి,
తత ఏవ చ విస్తారం బ్రహ్మ సంపద్యతే తదా" (13.30)

అనే శ్లోకం భేదభావాన్ని త్యజించి ఆత్మైక్యాన్ని చూచేవాడు బ్రాహ్మస్థితిరూపమైన మోక్షాన్ని పొందుతాడు అని చెప్పుచున్నది.ఈ విధంగా భగవద్గీత అనేకస్థలాలలో అద్వితీయాత్మ తత్త్వమే పరమార్థసత్యం అని ప్రతిపాదిస్తూన్నది.

జ్ఞానకర్మమార్గాలలో జ్ఞానం ఒక్కటే మోక్షసాధనం;జ్ఞానానికీ కర్మకీ ఏ మాత్రమూ పొత్తు కుదరదు అని కూడ అనేకస్థలాలలో స్పష్టంగా చెప్పబడింది.

"దదామి బుద్ధియోగం తం యేన మాముపయాన్తి తే" (10.10)
న హి జ్ఞానేన సదృశం పవిత్రమిహ విద్యతే" (4.38)
"అపి చేదసి పాపేభ్యః సర్వేభ్యః పాపకృత్తమః,
సర్వం జ్ఞానప్లవేనైవ వృజినం సంతరిష్యసి" (4.36)
"యథైధాంసి సమిద్ధోఽగ్నిః భస్మసాత్కురుతేఽర్జున,
జ్ఞానాగ్నిః సర్వకర్మాణి భస్మసాత్కురుతే తథా" (4.37)
"జ్ఞానీ త్వాత్మైవ మే మతమ్"(7.18)

ఆత్మజ్ఞానాని కున్న వైశిష్ట్యాన్ని, మోక్షానికి జ్ఞానమే ఏకైకసాధనమనీ బోధించే ఇలాంటి వాక్యాలు భగవద్గీత నిండా ఎన్నో ఉన్నాయి.హఠయోగాదుల ద్వారా ఇంద్రియాలను గట్టిగా బిగ బెట్టుకొని కూర్చున్నా మనస్సులో మాత్రం భోగవాంఛ ఉండనే ఉంటుంది;అది కూడా పోవాలంటే ఆత్మసాక్షాత్కారం ఒక్కటే మార్గం అని చెప్పబడింది.

విషయా వినివర్తన్తే నిరాహారస్య దేహినః,
రసవర్జమ్;రసోఽప్యస్య పరం దృష్ట్వా నివర్తతే" (2.59)

సర్వకర్మసంన్యాసం:- ఇలాంటి ఆత్మజ్ఞానసంపన్నునికి కర్తవ్యా లేవీ ఉండవు. సర్వకర్మసంన్యాసం ఒక్కటే అతని కర్తవ్యం.

"యస్త్వాత్మరతిరేవ స్యాదాత్మతృప్తశ్చ మానవః,
ఆత్మన్యేవ చ సంతుష్టః తస్య కార్యం న విద్యతే" (3.17)
"నైవ తస్య కృతేనార్థో నాకృతేనేహ కశ్చన,
న చాస్య సర్వభూతేషు కశ్చిదర్థవ్యపాశ్రయః" (3.18)

నిజానికి ఇలాంటి ఆత్మజ్ఞాని సర్వకర్మసంన్యాసాన్ని కూడ ఒక కర్తవ్యంగా చేయడు;కర్మలు వాటంతట అవే వానినుంచి దూరం అవుతాయి.అయితే ప్రారబ్ధకర్మవశంచేత లోకసం గ్రహంకోసం,లోకాన్ని సన్మార్గంలో ప్రవర్తింపచేయడంకోసం,జ్ఞాని కూడ కర్మ లాచరిస్తాడు, అయితే వాటిచేత అతడు లిప్తుడు కాడు అని శంకరభగవత్పాదులు భగవద్గీతా ప్రామాణ్యాన్ని చూపుతూ సిద్ధాంతీకరించారు.ఇలాంటి ప్రారబ్ధకర్మ లేని జ్ఞానులైతే నిత్యము బ్రహ్మానుసంధానపరాయణులుగానే ఉంటారు.ఏవో పుణ్యకార్యాలు చేస్తా మని ధనోపార్జన చేయడం,ఏవేవో అలౌకికశక్తులను సంపాదించడం కోసం మంత్రజపాదులు చేయడం కూడ వాళ్లకి నిషేధించబడింది."ధ్యానయోగపరః నిత్యమ్-నిత్యగ్రహణం మన్త్రజపాద్యన్య కర్తవ్యాభావప్రదర్శనార్థమ్" (భ.గీ.భా. 18.52)"శరీరధారణప్రసంగేన ధర్మానుష్ఠాననిమిత్తేన వా బాహ్యః పరిగ్రహః ప్రాప్తః;తం విముచ్య"(18.53).భగవద్గీతలో బోధింప బడిన అత్యుత్తమ మైన యోగం ఈ సంన్యాసయోగం.మిగిలిన వన్నీ దీన్ని సంపాదించ డానికి ఉపయోగించే సాధనాలు. వెయ్యిమంది నిరంతరసాధకులలో ఏ ఒక్కరికో లభించే స్థితి ఇది.అందుచేత-వేదాంతం చదివి అందరూ సంన్యాసు లవా లన్నాడు శంకరుడు అని కొందరు ఆధునికులైన విద్యావంతులు కూడా చేసే ఆక్షేపం నిరాధారం.నిజానికి ఇలాంటి (సంన్యాసయోగ్య) చిత్తప్రవృత్తిని అలవరచుకొన్న తరవాతనే వేదాంతం చదవాలి. అంతవరకూ వాటి జోలికి వెళ్లకూడదు అని సాధనచతుష్టయాద్యావశ్యకతాప్రతిపాదనాదుల ద్వారా శ్రీభగవత్పాదులు అనేకపర్యాయాలు సూచించి ఉన్నారు.అయితే ఈ మహోత్తమ లక్ష్యాన్ని గూర్చి సైద్ధాంతికంగా తెలుసుకొంటే కూడ గొప్ప మానసికవికాసం, చిత్తనైర్మల్యం. కలుగు తుంది.అందుచేత గీతోపదేశప్రారంభంలో-**"క్షుద్రం హృదయదౌర్బల్యం త్యక్త్వోత్తిష్ఠ పరంతప""తస్మాద్యుధ్యస్వ భారత"**అని "యుద్ధం చెయ్యి"అని ప్రత్యక్షంగా బోధించినా తటపటాయిస్తూన్న అర్జునునికి శ్రీకృష్ణుడు "నీకుమాత్రం కర్మయందే అధికారం"అని అంటూనే జ్ఞానమార్గోపదేశం చేసి చివరికి "అసలు పరమార్థం ఇది;నే చెప్పిన దంతా విన్నావు కదా?ఇప్పుడు నీ ఇష్టం వచ్చినట్లు చెయ్యి"(**విమృశ్యైతదశేషేణ యథేచ్ఛసి తథా కురు.**(18.63)అని మాత్రమే అంటాడు."యుద్ధం చెయ్యాలి"అని బోధించడు.అంతకు పూర్వం "యుద్ధం చెయ్యను"అని బిగుసుకొని కూర్చున్న అర్జునుడు-

"నష్టో మోహః స్మృతిర్లబ్ధా త్వత్ప్రసాదాన్మయాచ్యుత,
స్థితోఽస్మి గసందేహః కరిష్యే వచనం తవ"(18.73)

అని అంటాడు. ఈ ఘట్టంలో శ్రీకృష్ణుడు -

"కచ్చిదేతచ్ఛ్రుతం పార్థ త్వయైకాగ్రేణ చేతసా,
కచ్చిదజ్ఞానసంమోహః ప్రణష్టస్తే ధనంజయ" (18.72)

అని ప్రశ్నిస్తాడు. అర్జునుడు"నష్టో మోహః"ఇత్యాదివాక్యం సమాధానం చెపుతాడు. ఈ ప్రశ్న ప్రతివచనాలను పట్టి భగవద్గీతాశాస్త్రపరమప్రయోజనం మోహశోకాదివినాశమే అని స్పష్టంగా తెలుస్తూన్నది అని శ్రీశంకరభగవత్పాదులు విశదీకరించారు. "అనేన మోహనాశ ప్రశ్న ప్రతివచనేన సర్వశాస్త్రార్థజ్ఞానఫలమేతావదేవేతి నిశ్చితం దర్శితం భవతి యదుత అజ్ఞానసంమోహనాశః ఆత్మస్మృతిలాభశ్చేతి. తథా చ శ్రుతౌ "అనాత్మవిత్ శోచామి" ఇత్యుపన్యస్య ఆత్మజ్ఞానే సర్వగ్రన్థివిప్రమోక్షః ఉక్తః "భిద్యతే హృదయగ్రన్థిః ఛిద్యన్తే సర్వసంశయాః" "తత్ర కో మోహః కః శోకః ఏకత్వమనుపశ్యతః"ఇతి చ మన్త్రవర్ణః"(భ.గీ.భా. 18.73)

భగవద్గీతలో అనేకవిషయాలను ప్రతిపాదించినా పరమనిఃశ్రేయససాధనం జ్ఞానం మాత్రమే. అంతే కాని కర్మ గాని, జ్ఞానకర్మలు రెండూ కాని కావు అని ఆ యా స్థలాలలో ప్రతిపాదించి, శ్రీభగవత్పాదులు అష్టాదశాధ్యాయంలోని 66వ శ్లోకం భాష్యంలో ఈ విషయాన్నే ప్రమాణయుక్తిపూర్వకంగా స్పష్టంగా విస్తృతంగా విశదీకరించారు.

శ్రీశంకరభగవత్పాదులు ఉపనిషద్ గీతాదిప్రమాణగ్రంథాలను అనుసరించి చెప్పిన ఆత్మజ్ఞాన-సంన్యాసాల విషయంలో ఒక విషయం గుర్తించవలసి ఉన్నది. కర్మసంన్యాసం అనగా శ్రుతి-స్మృతివిహితములైన కర్మల(శ్రౌతకర్మల స్మార్తకర్మల) సంన్యాసమే కాని దేహధారణాదులకు అవసరమైన, లేదా లోకసంగ్రహానికి ఉపయుక్తములైన కర్మలు కూడ పరిత్యజించడం కాదు. జ్ఞానులలో కొందరు ఇలాంటి కర్మలు కూడ పరిత్యజిస్తే పరిత్యజించ వచ్చు. వీరిలోనే కొందరు ప్రారబ్ధకర్మప్రేరితులై లౌకికకర్మలయందు ప్రవృత్తులు కావచ్చును. అలాంటివాళ్లు లౌకికుల దృష్టిలో కర్మ చేస్తూన్నట్లు కనబడినా అహంభావ-మమభావాలు లేనివాళ్లవడంచేత కర్మలు చేయనట్లే. కర్మలు చేస్తూన్నట్లు కనబడినంత మాత్రాన వారు ఆత్మజ్ఞానశూన్యులు కాదు. గౌతమ బుద్ధుడు, నానక్, శ్రీరామకృష్ణపరమహంస, వివేకానందులు, గాంధీ, వినోబాభావే మొదలైనవారు కొంతవరకు ఈ కోవకు చెందిన వారే. ప్రారబ్ధకర్మవశంచేత పీఠాధిపత్యా దులు నిర్వహించవలసి వచ్చిన, జనుల మధ్య నివసించవలసివచ్చిన ఎందరో జీవన్ముక్తులు, కర్మాచరణోద్యుక్తులుగా కనబడుచున్నారు. శృంగేరపీఠాధీశ్వరులుగా ఉన్న శ్రీచంద్రశేఖర భారతీస్వాములవారు, అభినవవిద్యాతీర్థ స్వాములవారు, కామకోటి పీఠాధీశ్వరులుగా ఉన్న శ్రీచంద్రశేఖరేంద్రసరస్వతీస్వాముల వారు, శ్రీరమణమహర్షి మొదలైనవారు ఇందుకు

ఉదాహరణం.అందుచేతనే జనకాదు లను గూర్చి చెప్పేటప్పుడు శ్రీభగవత్పాదులు జ్ఞానులైనా వారు లోకసంగ్రహంకోసం కర్మవ్యాపృతులై నట్లు కనబడుతున్నారు అని అన్నారు. నిజానికి శ్రీశంకరభగవత్పాదులే ఇందుకు ఉదాహరణం. ఈ విషయాన్ని సూచిస్తున్నారా అన్నట్లు వారొక చోట- "అపి చ నైవాత్ర వివదితవ్యమ్ బ్రహ్మవిదా కంచిత్కాలం శరీరం ధ్రియతే వా న వా ఇతి.కథం హ్యేకస్య స్వహృదయ ప్రత్యయం బ్రహ్మవేదనం దేహధారణం చ అపరేణ ప్రతిక్షేప్తుం శక్యేత? శ్రుతిస్మృతిషు చ స్థితప్రజ్ఞలక్షణనిర్దేశేన ఏతదేవ నిరుచ్యతే"(బ్ర.సూ.భా. 4.1.15)అని అన్నారు. ఇది ఇతరకర్మవ్యాపృతులవడానికి ఉపలక్షణం. ఈ విషయంలో విద్యారణ్యులు అతిస్పష్టంగా కొన్ని విషయాలు చెప్పి ఉన్నారు.బ్రహ్మజ్ఞానాన్ని సంపాదించుకొనదలచినవాడు ప్రారంభదశలో లౌకికవ్యవహారాలన్నీ కట్టిపెట్టి శ్రవణమనననిదిధ్యాసనలయందే చిత్తం స్థిరంగా ఉంచుకోవాలి.బ్రహ్మజ్ఞానం కలిగినతరువాత నిఃసంశయంగా లౌకిక వ్యవహారాలలో ప్రవృత్తుడు కావచ్చును.

"జనకాదేః కథం రాజ్యమితి చేద్దృఢబోధతః,
తథా తవాపి చేత్తర్కం పఠ యద్వా కృషిం కురు". (పం.ద.తృ.దీ.130)

(జనకాదులు జ్ఞానమార్గప్రవృత్తులు కదా?వాళ్లు రాజ్యం ఎలా చేశారు అని అంటే దానికి సమాధానం వారి ఆత్మజ్ఞానం దృఢంగా ఉన్నది గాన వారు రాజ్యపాలనాది కార్యాలు కూడ నిర్వహించారు అని.అలాంటి దృఢజ్ఞానం నీకు కూడా ఉంటే నువ్వు కూడా హాయిగా తర్కశాస్త్రం చదువుకో,లేదా వ్యవసాయం చేసికో).

"లోకవ్యవహారంలో ఉంటేమాత్రం ఈ ప్రపంచం అంతా మాయామయం, ఆత్మ చైతన్యస్వరూప మైనది అను జ్ఞానం కలిగి ఉండడంలో విరోధం ఏముంది?" "ప్రపంచం సత్యం అయితేనే,ఆత్మకూడ జడం అయితేనే ప్రపంచవ్యవహారం జరుగుతుంది అనే నియమం ఏముంది?ప్రపంచవ్యవహారానికి కావలసిన దల్లా మన-ఇంద్రియాది సాధనాలు"

"ప్రపంచవ్యవహారానికి కావలసినవల్లా మనోవాక్కాయాదులు, బాహ్యపదార్థాలూను. తత్త్వవేత్త వీటిలో వేటినీ నశింపచేయలేదు కదా? (వానికి అవన్నీ ఉన్నాయి కదా?) అలాంటప్పుడు వానికి లోకవ్యవహారం ఎందుకు ఉండదు?"

"మాయామయః ప్రపఞ్చోఽయమాత్మా చైతన్యరూపధృక్,
ఇతి బోధే విరోధః కో లౌకికవ్యవహారిణః"
"అపేక్షతే వ్యవహృతిర్న ప్రపఞ్చస్య వస్తుతామ్,
నాప్యాత్మజాడ్యం కిం త్వేషా సాధనాన్యేవ కాఙ్క్షతి."
"మనోవాక్కాయతద్బాహ్యపదార్థాః సాధనాని తాన్,
తత్త్వవిన్నోపమృద్నాతి వ్యవహారోఽస్య నో కుతః" (పం.ద. ధ్యాన. 88-90)

"అతడు చిత్తాన్ని మర్దించేవాడైతే అతడు ధ్యానం చేసేవా డవుతాడు గాని తత్త్వవేత్త కాడు.ఘటతత్త్వం తెలుసుకొన్నవాడు చిత్తమర్దనం చేయడు కదా"

"ఉపమృద్నాతి చిత్తం చేద్ధ్యాతాసౌ న తు తత్త్వవిత్,

న బుద్ధిమర్దయన్ దృష్టో ఘటతత్త్వస్య వేదితా" (పం.ద.ధ్యానదీప.91)

లౌకికవ్యవహారానికీ తత్త్వజ్ఞానానికీ ఏ మాత్రమూ విరోధం లేదు. అందుచేత జ్ఞాన వంతుడు లౌకికవ్యవహారాలను ఇంతరులకంటే బాగా చక్కబెట్టగల డంటారు విద్యారణ్యులు -

"తత్త్వవిత్త్వవిరోధిత్వాల్లౌకికం సమ్యగాచరేత్" (పం.ద.ధ్యానదీప.87)

అందుచేత ఆత్మజ్ఞానసంపన్నుడు లౌకికవ్యవహారాలలో ఏ మాత్రమూ కలగచేసికొనగూడ దని గాని, లౌకికవ్యవహారవ్యాపృతు లెవరూ ఆత్మజ్ఞానవంతులు కారని గాని,కాషాయ వస్త్రం ధరించిన ప్రతీవాడూ ఆత్మజ్ఞానం కలవాడని గాని;సంన్యాసి సంఘానికి దూరంగానే ఉండా లని గాని శాంకరసిద్ధాంతంతో సరియైన పరిచయం ఉన్నవా ళ్లెవరూ అనుకొనరు.

కర్మయోగం:- భగవద్గీతలో వివిధయోగప్రక్రియలూ,అనేకవిధాలైన యజ్ఞాలు, ఓంకారోపాసన మొదలైన అనేకవిషయాలు ప్రతిపాదింపబడ్డాయి.వీటి కన్నింటికీ ఉపనిషదాదులలో మూలం కనబడుతుంది.అయితే 'కర్మయోగం'అనేది భారతీయతాత్త్విక శాస్త్రానికి భగవద్గీత తత్ప్రథమంగా అందజేసిన అతిప్రధానము,ఆస్తికదార్శనికు లందరూ అంగీకరించినదీ అయిన మహోన్నతమైన అపూర్వసిద్ధాంతంగా కనబడుతుంది.

వేదాలలో ఆ యా ఫలాలను ఉద్దేశించి విధించబడిన యజ్ఞాదికర్మ లున్నాయి. ఇవి కామ్యకర్మలు.ఫలానా ఫలంకొరకు చేయవచ్చును అని కాకుండా (ఫలానా ఫలం లభిస్తుంది అని చెప్పకుండా) ఈ కర్మలు మాత్రం తప్పక చెయ్యాలి అని వేదంచేతనే విధించబడిన సంధ్యావందన-అగ్నిహోత్రాదికర్మ లున్నాయి.ఇవి నిత్యకర్మలు.సూర్య సంక్రమణాదులు,సూర్యచంద్రోపరాగాదులు అనే నిమిత్తాన్ని పురస్కరించుకొని చేయవలసిన కొన్ని కర్మ లున్నాయి.అవి నైమిత్తికకర్మలు.వీటిలో కొన్ని నిత్యకర్మలక్రిందికే వస్తాయి,ఆహితాగ్ని గృహం దగ్ధం అయితే ఫలానా కర్మ చెయ్యాలి అని విధింపబడిన కర్మ వంటి కర్మలు నైమిత్తికకర్మలు అని కొంద రంటారు.ఇవన్నీ వేదవిహితాలే గాన శ్రౌతకర్మలు. క్షత్రియుడు ధర్మరక్షణంకోసం యుద్ధం చెయ్యాలి,పరిపాలకుడు దుష్టులను దండించాలి, వైశ్యుడు కృషి,పశుపాలనం,వాణిజ్యం మొదలైనవి చెయ్యాలి,ప్రతి ఒక్కడూ ధార్మికమైన వృత్తిని అవలంబించి తనమీద ఆధారపడి ఉన్నవాళ్ల నందరినీ పోషించాలి-ఈ విధంగా స్మృతులలో విధించబడిన కర్మ లన్నీ స్మార్తకర్మలు. యజ్ఞాదులు శ్రౌతకర్మలు,దేవతా పూజాదులు, (వ్రతాదులు,పంచమహాయజ్ఞాదులు)స్మార్తకర్మలు అని కూడ శ్రీశంకరభగ వత్పాదులు సూచించి ఉన్నారు-"క్షత్రియస్య యుద్ధం స్మార్తం కర్మ స్వధర్మః" (భ.గీ.భా.2.11)."యజ్ఞశ్చ శ్రౌతః అగ్నిహోత్రాదిః,స్మార్తశ్చ దేవయజ్ఞాదిః" (భ.గీ.భా.16.1).ఈ స్మార్తకర్మలలో కూడ కొన్ని నిత్యకర్మలు,కొన్ని కామ్యాలు,కొన్ని నైమిత్తికకర్మలు అని విభాగం చేస్తే చేయవచ్చును.ఇదంతా ప్రతిపాదనాచాతుర్యం (intepretational skill) మీద ఆధారపడి ఉంటుంది.

నిత్యకర్మలకు ఫలం ఉంటుం దని వేదంలో చెప్పబడలేదు.అందుచేత వాటికి ఏదైనా ఫలం ఉంటుందా ఉండదా అని ప్రశ్న.నిత్యకర్మలు ఆచరించినా ఫలం ఏమీ ఉండదు;ఆచరించకపోతే మాత్రం ప్రత్యవాయం,పాపం,కలుగుతుంది అని పూర్వ మీమాంసకుల అభిప్రాయం.శ్రీశంకరభగవత్పాదులు ఈ మతాన్ని తమ భాష్యా లన్నింటిలోను నిర్ద్వంద్వంగా ఖండించారు.నిత్యకర్మ లైన సంధ్యావందన అగ్నిహోత్రాదులను ఆచరించడం ఎంతో శ్రమసాధ్య మైన పని. వీటికి ఫలితం ఏదీ లేదు;చేయకపోతే మాత్రం మహాపాపం, తత్ఫలితాన్ని అనుభవించవలసి ఉంటుంది, "అని అంటే ఆచరించినా ఆచరించకపోయినా కూడ ఫలం క్లేశం మాత్రమే అని చెప్పిన ట్లవుతుంది. వేదం క్లేశమాత్రఫలాలైన ఇలాంటి కర్మలను ఎన్నడూ విధించదు.అలా విధిస్తే అది అప్రమాణమే అవుతుంది. అందుచేత నిత్యకర్మలకు కూడ ఏదో ఒక ఫలం, చిత్తశుద్ధి-దేవతానుగ్రహాదికం,తప్పకుండా ఉంటుంది అని అంగీకరించాలి.అట్లే నిత్యకర్మలు చేయకపోవడం అనగా అదొక అభావం.కర్మాభావం. అభావంనుండి భావపదార్థం పుట్టదు.ఘటం అనే భావపదార్థం మట్టి అనే భావపదార్థం నుంచే పుడుతూన్నది; అభావం నుండి (ఏమీ లేకపోవడంనుండి)పుట్టడంలేదు.అలా అయితే శూన్యాకాశంనుండి ఘటాదిభావపదార్థాల నిరంతరవర్షం పడుతూ ఉండాలి!అందుచేతనే భగవంతుడు "నాసతో విద్యతే భావః"(2.16)అన్నాడు.(ఈ సందర్భంలో ఈ వాక్యాన్ని ఉదాహరించడం ద్వారా శ్రీభగవత్పాదులు దీనికి "అభావంనుండి భావం పుట్టదు", "అభావం ఎన్నడూ భావం కాజాలదు" అని రెండర్థాలు సూచించినట్లయింది).ఇలా చెప్పడంలో శాస్త్రీయవిషయాన్ని యుక్తియుక్తంగా ప్రతిపాదించడంలోనే శ్రీ శంకరాచార్యుల తాత్పర్యం కాని నిత్యకర్మలు అనుష్ఠించవలసిన పని లేదని చెప్పడంలో కాదు. భర్తృహరి-

"ఆయుర్వర్షశతం నృణాం పరిమితం రాత్రౌ తదర్ధం గతం
తస్యార్ధస్య పరస్య చార్ధమపరం బాలత్వవృద్ధత్వయోః,
శేషం వ్యాధివియోగదుఃఖసహితం సేవాదిభిర్నీయతే
జీవే వారితరఙ్గచఞ్చలతరే సౌఖ్యం కుతః ప్రాణినామ్". (వై.శ.49)

"మానవుల గరిష్ఠాయుఃప్రమాణం నూరుసంవత్సరాలు.దీనిలో సగం రాత్రులలో గడిచి పోయింది.మిగిలిన సగంలో సగం బాలత్వ-వృద్ధత్వాలలో గడిచి పోయింది. రోగాలతోను, వియోగాలతోను,ఇతరదుఃఖాలతోను నిండి ఉన్న మిగిలిన భాగాన్ని సేవాదులలో గడు తూంటారు.జలతరంగాగ్రం వలె చంచలమైన జీవితంలో మానవులకు సుఖం ఎక్కడ?" అని చెప్పినట్లు మానవుని కున్న అత్యల్పకాలంలో నైనా పవిత్ర మైన సంధ్యాదికాలాలలో నిత్యకర్మాచరణం చెయ్యాలి అనే నియమం పెట్టుకొని ఆచరిస్తే జీవితానికి కొంతవరకు సార్థక్యం కలుగుతుంది.వ్యర్థవాగ్వాద-క్రీడా-వినోద-వ్యసనాదులతో గడిపితే నిత్యకర్మ చేయని పాపం లేకపోయినా జీవితం వ్యర్థం చేసికొన్నందుక పశ్చాత్తాపం పడవలసి వస్తుంది.ఏకారణంచేతనైనా ఆ విహితనిత్యకర్మలు చేయజాలకపోయినా ఆ సమయాలలో తత్సదృశము లైన ధ్యానదేవతారాధనాదులు చేసినవాళ్లు సార్థకజన్ములై ఆధ్యాత్మికంగా

పురోభివృద్ధి చెందుతారు అనే శాంకరమతం."వేదో నిత్యమధీయతాం తదుదితం కర్మ స్వనుష్ఠీయతామ్"(సోపానపంచకం)అనే కదా వారి ఉపదేశం?

ఈ విధమైన అనేకకర్మలు విధింపబడినా వీటి ఫలితాన్ని ఆశించకుండా, లేదా ఈశ్వరార్పణబుద్ధితో, ఈ కర్మలను ఆచరించాలి అని ఉపనిషత్తులలో గాని, తదితర వేదభాగాలలో గాని చెప్పబడలేదు."కుర్వన్నేవేహ కర్మాణి జిజీవిషేచ్ఛతం సమాః"అని ఈశావాస్యోపనిషదాదులలో,నూరు సంవత్సరాలూ కర్మ లాచరిస్తూనే జీవించాలి అని చెప్పినా కర్మఫలం కోసం ఆశించకూడదు అని చెప్పలేదు.కర్మఫలాన్ని ఆశించకుండా ఈశ్వరార్పణబుద్ధిలో కర్మలు, ప్రధానంగా నిత్యనైమిత్తికకర్మలు, ఆచరించాలి; దానివల్ల చిత్తశుద్ధి కలిగి తద్వారా ఆత్మతత్త్వజ్ఞానం సంపాదించి మోక్షం పొందవచ్చును అని మొట్టమొదట ఉపదేశించినది భగవద్గీతయే.ఈ ఉపదేశాన్నే దృష్టిలో ఉంచుకొని శ్రీశంకరభగవత్పాదులు బ్రహ్మసూత్రభాష్యాదులలో కూడా ఆ యా ప్రసంగాలలో నిష్కామకర్మను గూర్చి ముచ్చ టించారు."తమేతం వేదానువచనేన బ్రాహ్మణా వివిదిషన్తి యజ్ఞేన దానేన తపసానాశకేన" (బృ.ఉ.4.4.22)ఇత్యాద్యుపనిషద్వాక్యాలలో యజ్ఞాదులు వివిదిషకు (ఆత్మను తెలుసు కోవాలనే అభిలాష కలగడానికి)ఉపకరిస్తాయి అని చెప్పినా ఈ కర్మలు ఫలాభిసంధిరహితంగా చెయ్యాలి అని ఎక్కడా చెప్పలేదు.చతుర్విధ భక్తులలో కొందరు ప్రయోజనాన్ని ఉద్దేశించి భగవంతుణ్ణి సేవించినా "ఉదారాః సర్వ ఏవైతే"(7.18)అని అన్నట్లు కామ్యకర్మలు ఆచరించేవారైనా వేదోక్తకర్మలు ఆచరిస్తున్నారు గాన ఏనాటికైనా వాళ్లకి చిత్తశుద్ధి కూడ కలిగి వివిదిష కలుగుతుందని మాత్రమే పై శ్రుతివాక్యానికి అభిప్రాయం అయి ఉండవచ్చును.ఈ భగవద్గీతోపదిష్టకర్మయోగాన్నే అక్కడ కూడ సమ న్వయిస్తూ శ్రీశంకరభగవత్పాదులు పూర్వోదాహృతశ్రుతివాక్యాదులను గూర్చి చర్చించిన సర్వాపేక్షాధికరణంలో-"స్మృతిష్వపి భగవద్గీతాద్యాసు అనభిసంధాయ ఫలమనుష్ఠితాని యజ్ఞాదీని ముముక్షోః జ్ఞానసాధనాని భవన్తీతి ప్రపఞ్చితమ్"(బ్ర.సూ.భా.3-4-27)అని అన్నారు.

ఫలాభిలాష లేకుండా ఆచరించడం అనేది అన్ని విధాలైన కర్మలకూ కూడ (శ్రౌత-స్మార్త-నిత్య-నైమిత్తిక-కామ్యాదులకు)వర్తిస్తుంది.మానవుని దైనందిన ప్రవృత్తిలో కూడ ఈ కర్మయోగం ఎంతగానో ఉపయోగిస్తుంది.శక్తివంచన లేకుండా తన కర్తవ్యాన్ని తను చేసినప్పుడు దానివల్ల పొందవలసిన ఫలం లభిస్తే ఉప్పొంగవలసిన పని లేదు,అది అనుకొన్న విధంగా లభించకపోతే క్రుంగిపోకూడదు.ఇది మానవునికి ఎంత ఊరటను ఇస్తుందో,మనఃశాంతిని కలిగిస్తుందో ఊహామాత్రవేద్యం.అన్ని కర్మల విషయంలోను ఈ విధమైన చిత్తవృత్తిని అలవరచుకొన్నవాని మనస్సు క్రమక్రమంగా నిర్మలమై ఆధ్యాత్మికజ్ఞానసముపార్జనకు తగి ఉంటుం దనడంలో సందేహం లేదు.అందుచేతనే పరస్పరవిరుద్ధాలుగా కనబడినా, చివరికి లభించే ఫలితాన్ని పట్టి చూస్తే జ్ఞానయోగ-కర్మ యోగాలు రెండూ ఒకటే అని భగవంతుడు చెప్పాడు-

"సాంఖ్యయోగౌ పృథగ్బాలాః ప్రవదన్తి న పణ్డితాః,

ఏకమప్యాస్థితః సమ్యగుభయోర్విన్దతే ఫలమ్" (5.4)

కర్తవ్యాలను మరచి హక్కులను గూర్చి మాత్రమే మాటలాడే ఈ కాలంలో కర్మ యోగాన్ని గూర్చి చెపితే కొంత ఎబ్బెట్టుగానే కనబడుతుంది. బాలుల హక్కులు, పసిపిల్లల హక్కులు, స్త్రీల హక్కులు, పాలకుల హక్కులు, పాలితుల హక్కులు, అల్పసంఖ్యాకుల హక్కులు, అధికసంఖ్యాకుల హక్కులు, వికలాంగుల హక్కులు, ఉద్యోగుల హక్కులు, నిరుద్యోగుల హక్కులు ఈ విధంగా తమ తమ కర్తవ్యాలు మరచి ప్రతి ఒక్కరూ తమ హక్కులకోసమే పోరాడితే అవి సంరక్షించి వాళ్లకి దక్కనిచ్చేవా రెవరు? ఈ సమస్యను తీర్చడానికి ఏకైకో పాయం కర్మయోగావలంబనం. ప్రతి ఒక్కరూ కర్మయోగం అవలంబించి తమ కర్తవ్యం నిర్వహిస్తే వాళ్ల హక్కులు తమంతటట తాముగానే చక్కబడతాయి. ఎవరి హక్కులు వాళ్లకి లభిస్తాయి. కార్మికుడు తన కర్తవ్యం నిర్వహించాలి, స్వామి(యజమాని)తన కర్తవ్యం నిర్వహించాలి. మొదటివాడు తన కర్తవ్యం నిర్వహించినా రెండవవాడు(స్వామి)తన కర్తవ్యం సరిగా నిర్వహించకపోతే మొదటివాని హక్కులు దెబ్బతింటాయి. రెండవవాడు సరిగా తన కర్తవ్యం నిర్వహిస్తే మొదటివాని హక్కులు వాటంతట అవే చక్కబడతాయి. ఇదే పద్ధతి అన్ని రంగాలలోను కర్తవ్యానికే (duty) ఎక్కువ ప్రాధాన్యంఇచ్చే గ్రంథం భగవద్గీత.

నిజానికి ఈ రాజయోగానుష్ఠానం పాలకులతో ప్రారంభం కావాలి. అప్పుడు పాలితులలో అప్రయత్నంగానే వ్యాపిస్తుంది. అందుచేతనే సృష్ట్యారంభంలో తాను (పరమేశ్వరుడు)ఈ యోగాన్ని వివస్వంతునికి బోధించినట్లు, అతడు మనుచక్రవర్తికి బోధించినట్లు, అతడు ఇక్ష్వాకుమహారాజుకు బోధించినట్లు, ఆతని తరువాత ఈ యోగం రాజపరంపరచేత అభ్యసించబడినట్లు శ్రీకృష్ణుడు అన్నాడు-

"ఇమం వివస్వతే యోగం ప్రోక్తవానహమవ్యయమ్,

వివస్వాన్మనవే ప్రాహ మనురిక్ష్వాకవేఽబ్రవీత్"(4.1)

"ఈ యోగబలం ఉన్నట్లయితే జగత్తును పాలించే క్షత్రియులు ధర్మాన్ని చక్కగా రక్షించ కలుగుతారు. అందుచేత అలాంటి క్షత్రియులకు ఇది ఉపదేశించబడింది"అని శ్రీశంకర భగవత్పాదులు భాష్యంలో వివరించారు. అయితే భోగలాలసత్వం పెరిగిపోవడంతో పాలకు లందరూ దుర్బలు లయ్యారు. ఈ యోగంనుండి దూరం అయిపోయారు. దానితో లోకం (జనసామాన్యం)పరమపురుషార్థానికి దూరం అయిపోయింది. అందుచేత నీకు మళ్లీ ఈ యోగం బోధిస్తున్నాను అంటాడు శ్రీకృష్ణుడు-"దుర్బలాన్ అజితేన్ద్రియాన్ ప్రాప్య నష్టం యోగమిమముపలభ్య లోకం చాపురుషార్థసంబన్ధినమ్-

"స ఏవాయం మయా తేఽద్య యోగః ప్రోక్తః పురాతనః,

భక్తోఽసి మే సఖా చేతి రహస్యం హ్యేతదుత్తమమ్" 4.2)

దీనిని పట్టి కూడ ఈ యోగం చాలా కాలానికి భగవద్గీత ద్వారా పునరుద్ధరించబడింది అని స్పష్టం అవుతున్నది. అందుచేతనే పై రెండు శ్లోకాలలో విద్యావంశం పేర్కొనబడింది.

ప్రస్తావన

ఈ విధంగా బహుకాలానంతరం తొలిసారిగా భగవద్గీతలో ప్రతిపాదించబడిన ఈ యోగం భారతీయతత్త్వశాస్త్రంలో ఒక అత్యధికప్రాధాన్యం గల విషయంగా స్థానం సంతరించుకొన్నది.

గుణత్రయసిద్ధాంతం :-భగవద్గీత ద్వారా భారతీయతత్త్వశాస్త్రంలో,వేదాంతానికి సంబంధించిన అన్ని సంపదాయాలలోను, స్థిరమైన స్థానాన్ని సంపాదించుకొన్నది గుణత్రయసిద్ధాంతం. సాంఖ్యసిద్ధాంతం అతిప్రాచీనమైనది. భారతంలోను,పురాణాలలోను దీనికి సంబంధించిన చతుర్వింశతితత్త్వాదుల వర్ణన అత్యధికంగా కనబడుతున్నది. అయితే ఇది అవైదిక మని అంటూ బాదరాయణులు అనేకస్థలాలలో ఈ సిద్ధాంతాన్ని ఖండించారు. తదనుసారంగా శ్రీశంకరాద్యాచార్యులు తమ భాష్యాలలో-సాంఖ్యసిద్ధాంతానుగుణంగా ఉన్నట్లు కనబడే కొన్ని శ్రుతివాక్యాలు తదనుగుణాలు కావని విశదీకరించి సాంఖ్యసిద్ధాం తానికి వేదం ద్వారా ప్రామాణ్యం లేదని నిరూపించి ఈ సిద్ధాంతాన్ని ఖండించారు. మూల ప్రకృతికి సంబంధించినవిగా సాంఖ్యులు అంగీకరించిన సత్త్వరజస్తమస్సు లనే మూడు గుణాల చర్చ,నామనిర్దేశం కూడ,ప్రధానములైన ఉపనిషత్తులలో వేటిలోనూ లేదు. ఎక్కడైనా మహదాదుల చర్చ కనబడితే ఇవి వేరు సాంఖ్యుల మహత్తత్త్వాదులువేరు అని భాష్యకారాదులు కొట్టిపారవేశారు. శ్రీశంకరాచార్యులు భగవద్గీతకు భాష్యం వ్రాయడంతో ఇతరాచార్యులు కూడా స్వస్వసంప్రదాయానుగుణంగా దీనికి భాష్యాలు వ్రాశారు. భగవద్గీతలోని రెండో మూడో అధ్యాయాలు తప్ప మిగిలిన అన్ని అధ్యాయాలలోను గుణత్రయ-తత్ప్రభావాదుల సువిస్తృతమైన వర్ణన ఉన్నది. భగవద్గీతకు కూడ భాష్యాలు వ్రాసి దానికి ప్రామాణ్యాన్ని అంగీకరించి ఉండడంచేత సాంఖ్యసిద్ధాంతంలోని ప్రకృతి స్వాతంత్ర్యం మొదలైన కొన్ని ప్రధానవిషయాలను ఖండించినా అడుగడుగునా ఈ మూడు గుణాలను గూర్చి వాటి ప్రభావాన్ని గూర్చి (ఇతరభాష్యాలలో కూడ)ముచ్చటిస్తూ వాటిని అంగీకరించారు. శ్రీశంకరాచార్యులు భగవచ్ఛక్తిరూప మైన మాయను ప్రకృతి అని త్రిగుణాత్మక మనీ,కాని సాంఖ్యుల ప్రకృతి వలె స్వతంత్ర మైనది కాదనీ రెండు మూడు స్థలాలలో అన్నారు :

"నాత్ర ప్రధానం నామ కిం చిత్ స్వతన్త్రం తత్త్వమభ్యుపగమ్య తస్మాద్వే దవ్యపదేశః ఉచ్యతే. కిం తర్హి? యది ప్రధానమపి కల్ప్యమానం శ్రుత్యవిరోధేన అవ్యాకృతాది శబ్దవాచ్యం భూతసూక్ష్మం పరికల్ప్యేత పరికల్ప్యతామ్ (బ్ర.సూ.భా. 1.2.22)

"గుణసంఖ్యానే కాపిలే శాస్త్రే. తదపి గుణసంఖ్యానం శాస్త్రం గుణభోక్తృవిషయే ప్రమాణమేవ,పరమార్థబ్రహ్మైకత్వవిషయే యద్యపి విరుధ్యతే"(భ.గీ.భా. 18:19)

"ప్రకృతిః మాయా త్రిగుణాత్మికా...ప్రకృత్యైవ చ నాన్యేన మహదాదికార్యకారణా కారపరిణతయా"(భ.గీ.భా. 13.29)

ప్రస్తావన

ఇట్లే "కార్యకారణకర్తృత్వే హేతుః ప్రకృతిరుచ్యతే"(13.20)అనే శ్లోకానికి అర్థం వ్రాస్తూ-"అథవా షోడశ వికారాః కార్యమ్,సప్తప్రకృతివికృతయః కారణం,తాన్యేవ కార్యకారణాన్యుచ్యన్తే"అని అన్నారు. ఈ విధంగా సాంఖ్యసిద్ధాంతానికి సంబంధించిన కొన్ని విషయాలకు,గుణత్రవిభాగాదులకు వేదాంతశాస్త్రంలో సుస్థిరస్థానం కల్పించినది భగవద్గీత.

భగవద్గీతలోని భక్తియోగం- భాగవతసంప్రదాయం : నిర్గుణబ్రహ్మజ్ఞానాన్ని ప్రధానంగా ప్రతిపాదించే ఉపనిషత్తులలోఅనేకసగుణబ్రహ్మోపాసనావిధానాలు కూడ చెప్పబడి ఉన్నాయి. అయితే ఆ ఉపాసనావిధానం అంతా భావనాప్రధాన మైనది. హిరణ్యశ్మశ్రు-హిరణ్యకేశ-సువర్ణసదృశమూర్త్యాదుల ధ్యానం అక్కడక్కడ చెప్పినా తాదృశమూర్తులకు ఒక లోకంలో నివాసం, పరివారం ఉండడం మొదలైన విషయాలు ప్రధానమైన ఉపనిషత్తులలో కనబడవు. అవి కనబడే ఉపనిషత్తులు ఏవైనా ఉంటే అవి అర్వాచీనములే. పురాణాగమాదులను అనుసరించి ఎవరో రచించి ఉపనిషత్తు లని పేరు పెట్టినవే. ముస్లింలు ఆరాధించే అల్లాను స్తుతిస్తూ 'అల్లోపనిషత్తు'బయలుదేరడం ఇందుకు ఉదాహరణం. తావన్మాత్రంచేత వాటికి ప్రామాణ్యం గాని ఉపయోగం గాని లేదని అర్థం కాదు. తత్తదాకారాలలో ఉన్న పరమాత్మను ఆ యా ఆకారాలలో వర్ణించే తదారాధనోపయుక్తాలైన అన్ని గ్రంథాలూ ప్రమాణములే. అయితే ఉపనిషత్తులలో ఉన్న సగుణబ్రహ్మోపాసనకూ భగవద్గీతలో ఉన్న భక్తియోగం అనే పేరుతో ప్రసిద్ధమైన యోగంతో సంబంధించిన సగుణోపాసనకూ చాలా భేదం ఉన్న దనే విషయాన్ని గుర్తించడమే ప్రకృతవిషయం.

భాగవతసంప్రదాయం అనే సంప్రదాయం ఒకటి ఉన్నది. ఇది బౌద్ధమతావిర్భావానికి పూర్వమే ప్రచారంలో ఉండే దని ఆధునికవిమర్శకుల నిర్ణయం. అందుచేత దీనిమీద క్రైస్తవమతప్రభావం ప్రసరించినది అని చెప్పే కొందరు పాశ్చాత్యపండితుల అభిప్రాయం నిరాధార మైనది. దీని స్వరూపం మహాభారతంలోని శాంతిపర్వంలో 334 మొదలు 351 అధ్యాయం వరకు ఉన్న 17 అధ్యాయాలలో సువిస్తృతంగా వర్ణించబడింది. ఈ ఘట్టానికి నారాయణీయం అని పేరు. ఇది నారదునికి నారాయణుడు(బదరికాశ్రమంలోని పురాణముని)చేసిన ఉపదేశంతో ప్రారంభం అవుతుంది. భగవద్గీతలోని భక్తియోగప్రతిపాదకము లైన ఘట్టాలలో భాగవతసంప్రదాయచ్ఛాయలు స్పష్టంగా కనబడుతున్నాయి. ఒకే గ్రంథంలో(మహాభారతంలో)ఉన్న రెండు ఘట్టాలలో(భగవద్గీతా-నారాయణీయాలలో) చెప్పిన విషయాలలో సామ్యం ఉండడం సహజమే. అయితే నారాయణీయంలో ప్రధానంగా చెప్పబడిన సంప్రదాయం భగవద్గీతలో అనేకవిషయాలలో ఒక విషయంగా చెప్పబడింది.

ఈ భక్తియోగం కర్మయోగాంతర్గతమే. నిర్గుణబ్రహ్మతత్త్వాన్ని పరమార్థతత్త్వంగా అంగీకరించి సగుణోపాసనాదులకు కూడ అధికారిభేదానుసారం సముచితస్థానం

కల్పించిన అద్వైతానికి భక్తియోగం సర్వథా అంగీకార్యమే. ఈ సంప్రదాయానికి సంబంధించిన అనేకవిషయాలు మాకు కూడ అంగీకర్యాములే అని శ్రీశంకర భగవత్పాదులు ఉత్పత్త్యసంభవాధికరణంలో స్పష్టంగా చెప్పారు–"తత్ర యత్తావదుచ్యతే యోఽసౌ నారాయణః పరోఽవ్యక్తాత్ప్రసిద్ధః పరమాత్మా సర్వాత్మా స ఆత్మనాత్మాన మనేకధా వ్యూహ్య అవస్థిత: ఇతి తన్న నిరాక్రియతే."న ఏకధా భవతి త్రిధా భవతి"(ఛాం.ఉ.7.26.27)ఇత్యాదిశ్రుతిభ్యః పరమాత్మనః అనేకధాభావస్యాధి గతత్వాత్.యదపి తస్య భగవతోఽభిగమలక్షణమారాధనమజస్రమనన్యచిత్తతయాభి ప్రేయతే,తదపి న ప్రతిషిధ్యతే.శ్రుతిస్మృత్యోః ఈశ్వరప్రణిధానస్య ప్రసిద్ధత్వాత్". (బ్ర.సూ.భా. 2.2.42)

ఈ విధంగా భక్తియోగం అంగీకార్యమే కాని భగవద్గీతలో బోధించిన ప్రధానమైన అత్యుత్తమయోగం భక్తియోగం అనే విషయం మాత్రం అద్వైతికి అంగీకార్యం కాదు.ఎలాంటి సందేహాలకీ తావు లేకుండా బోధించబడిన అద్వైతతత్త్వాన్ని ప్రధాన లక్ష్యంగా ఉంచుకొని వ్యావహారికదశలో సార్థకము లైన ఇతర పద్ధతు లన్నీ తత్సాక్షాత్కారానికి ఉపయుక్తా లైన సాధనా లని చెప్పడంలోనే తగిన శాస్త్రసమన్వయం కుదురుతుంది.అలా కాక భక్తియోగ–ధ్యానయోగాదులకే పరమ ప్రాధాన్యం ఇచ్చిన పక్షంలో ఏ వేవో కల్పనలు చేస్తూ అద్వైతతత్త్వప్రతిపాదకవాక్యాలకు వక్రవ్యాఖ్యలు చేయవలసి వస్తుంది. భగవద్గీతాదులలో ప్రతిపాదించిన అద్వైతతత్త్వం– "యావానర్థ ఉదపానే సర్వతః సంప్లుతోదకే" (భ.గీ.46) అని చెప్పినట్లు 'సర్వతఃసంప్లుతోకస్థానం'వంటిది. అన్నింటినీ తనలో ఇమడ్చుకొంటుంది;తాను మాత్రం దేనిలోనూ ఇమడదు.

శ్రీకృష్ణుడు మొదటినుండి చివరివరకూ అస్మచ్ఛబ్దప్రయోగం చేయడంచేత విష్ణుభక్తియోగంగా గ్రహించబడిన ఈ భగవద్గీతోక్తభక్తియోగాన్ని శ్రీకంఠాచార్య – అభినవగుప్తాచార్యాదులు శివభక్తియోగంగా ప్రతిపాదించడం గమనార్హం. పరతత్త్వం ఒకటే అయినప్పుడు తదవిరుద్ధాలైన అన్ని యోగాలూ అంగీకార్యములే."ఉత్తమః పురుష స్త్వన్యః" అని చెప్పిన పరమాత్మ మహావిష్ణువు కావచ్చు,పరమశివుడు కావచ్చు, మహా గణపతి కావచ్చు మహాశక్తి కావచ్చు.

శ్రీ శంకరభగవత్పాదుల గీతాభాష్యరచన ఒక విశిష్టమైన పద్ధతిలో నడిచింది. "భగవద్గీతకు కొందరు వ్యాఖ్యానాలు వ్రాసి ఉన్నారు.కాని కొందరు ఆధునికులు దీనిలోని విషయాలు పరస్పరవిరుద్ధమైనవిగా ఉన్నాయి అంటూన్నారు. అందుచేత వివిధ విషయాలను విశదీకరిస్తూ సంక్షిప్తమైన వ్యాఖ్య వ్రాస్తాను"అని ప్రతిజ్ఞ చేసి, ఏ అధ్యాయానికి ఆ అధ్యాయంలో ఉన్న విషయవివేచనం,వెనుకటి అధ్యాయానికీ రాబోయే అధ్యాయానికీ ఉన్న సంబంధమూ తెలిపి, జ్ఞానకర్మసముచ్చయవాద–భేదాభేదవాదాదులను యథావకాశంగా ఖండిస్తూ,అద్వైతసిద్ధాంతానికి సంబంధించిన అనేక అంశాలను వివరిస్తూ,విరోధాభాసలను పరిహరిస్తూ శ్రీభగవత్పాదులు వ్యాఖ్య వ్రాశారు. సూత్రభాష్యంలో

ఉన్న పద్ధతికీ ఈ భాష్యంలో ఉన్న పద్ధతికీ కొంచెం భేదం ఉంది. పదిపదిహేను అక్షరాల సూత్రాన్ని ఆధారంగా తీసికొని పేజీల కొలది సాగే గ్రంథంలో అనేకవిషయాలను సూత్ర భాష్యంలో ప్రతిపాదించారు. ఈ భాష్యంలో పద్ధతి అది కాదు. శ్లోకాలకు వ్యాఖ్యలు వ్రాస్తూ వెనుకటి శ్లోకంతో రాబోయే శ్లోకానికి ఉన్న సంబంధాన్ని అర్థగర్భితములైన అవతారికల ద్వారా విశదీకరిస్తూ భాష్యం రచించారు. ఒక్కొక్కప్పుడు శ్లోకవ్యాఖ్య మధ్యలో ఎంతో ప్రధానమైన విషయాన్ని ఒక చిన్నవాక్యంలో చెప్పడం జరుగుతూంటుంది. పఠితలు దీనిని గుర్తించకపోవడానికి కూడ అవకాశం ఉంటుంది. ఉదాహరణకి-ఆత్మజ్ఞానికి మంత్రజపాదు లలో కూడ ఆసక్తి ఉండకూడదు. వాటివల్ల వచ్చే శక్త్యాదులు ఆత్మానుసంధానానికి ప్రతి బంధకము లవుతాయి. ఈ విషయాన్ని "నిత్యగ్రహణం మన్త్రజపాద్యన్యకర్తవ్య వ్యావృత్త్యర్థమ్"(18.52)అని వ్యాఖ్యానం మధ్యలో చెప్పారు. దేవాలయాలు కట్టించాలి; ఈ ధర్మకార్యం చెయ్యాలి ఆ ధర్మం చెయ్యాలి అని అంటూ చాలామంది కాషాయాం బరకృతవేషులు కూడ దేశంలో సంచరించడం చూస్తున్నాం. అది కూడ యుక్తం కాదు అని "ధర్మానుష్ఠాన నిమిత్తేన వా బాహ్యః పరిగ్రహః ప్రాప్తః"(18.53)అని వ్యాఖ్యామధ్యంలో ఉన్న చిన్న వాక్యంలో చెప్పారు.

మూలాన్ని వ్యాఖ్యానిస్తూ మధ్య మధ్య సూత్రప్రాయాలైన వాక్యాలు లేదా పద సమూహాలు ఉపయోగిస్తూ వాటిని కూడ వ్యాఖ్యానించడం, వివరించడం భాష్యలక్షణం. అది కూడ ఈ భాష్యంలో అనేక స్థలాలలో, ప్రధానంగా ఏదైన విషయం చర్చించే సందర్భంలో, కనబడుతుంది. ఉదా. "న; అనుష్ఠేయస్య భావాభావవిశేషోపపత్తేః"(2.21) అని ఒక చిన్న వాక్యం ముందుగా ప్రయోగించి తరువాత ఐదారు వాక్యాలలో దీని భావం విశదీకరించబడింది.

శ్లోకాల వ్యాఖ్యానం అన్వయముఖాన గాక శ్లోకంలోని పదాలు ఏ క్రమంలో ఉన్నాయో అదే క్రమంలో చేయబడింది. ఈ పద్ధతిలో అన్వయాన్ని పఠితలు మార్చుకోవాలి. ఒక పదాన్ని ఎత్తికొని దాని పర్యాయపదం ఇచ్చి, దాన్ని ఇంకా ఒక మారు మరి కొన్ని పదాలతో వివరించి మళ్లీ ఆ పదాన్ని గ్రహించడం జరుగుతూంటుంది. ఉదా- "శ్రుతివిప్రతిపన్నా-అనేకసాధ్యసాధనసంబన్ధప్రకాశనశ్రుతిభిః శ్రవణైః విప్రతిపన్నా, నానా ప్రతిపన్నా శ్రుతివిప్రతిపన్నా, విక్షిప్తా సతీ"(2.53). ఆంధ్రానువాదం కూడా ఇదే పద్ధతిలో చేయబడింది. శ్లోకానికి వెంటనే ప్రతిపదార్థం మాత్రం అన్వయక్రమంలో ఇవ్వబడింది.

గీతాభాష్యం ఎప్పుడో చదివినా, అప్పుడప్పుడు ఏదైన అవసరం వచ్చినప్పుడు చదువుతూన్నా సూత్రభాష్యం విషయంలో ఉన్న శ్రద్ధ నాకు దీని విషయంలో ఉండేది కాదు. దాదాపు మూడు సంవత్సరాల క్రితం కొందరు శ్రద్ధాళువులతో కలిసి నియతపద్ధతిలో గీతాభాష్యం చదివే సదవకాశం లభించింది. సూత్రభాష్యం శాస్త్రవిషయభరిత మైనా కూడ గీతాభాష్యం గొప్ప మననగ్రంథం అనే అభిప్రాయం అప్పుడు కలిగింది. సూత్రభాష్యానికి తెలుగులో వ్యాఖ్య వ్రాసి అది ప్రకటింపబడిన తరువాత దీనికి కూడా వ్యాఖ్య వ్రాయవలె

నని అగస్టు 2000 సంవత్సరంలో అభిప్రాయం కలిగి ప్రారంభించినా మధ్య విఘ్నాలు కలగడంవల్ల పూర్తి చేయడం చాలా ఆలస్య మైనది. గురుదేవతానుగ్రహంచేత 3.3.2001 నాటికి పూర్తియైనది.

గీతాభాష్యానికి ఆనందగిరి రచించినది పరిపూర్ణవ్యాఖ్య. దీనికంటె కూడ అత్యంతసమగ్రవ్యాఖ్య శ్రీ బెల్లంకొండ రామరాయకవిగారు రచించిన భాష్యార్కదీపః అనే వ్యాఖ్య. హయగ్రీవానుగ్రహంచేత అఖండమైన సకలశాస్త్రపాండితీప్రకర్షను సంపాదించిన మహామేధావి శ్రీరామరాయకవిగారు. "ప్రపేదిరే ప్రాక్తనజన్మవిద్యాః" (పూర్వజన్మకు సంబంధించిన విద్యలు వాటంతట అవే వచ్చి (పార్వతిని)చేరాయి)అన్న కాళిదాసోక్తి వీరి విషయంలో కూడా వర్తిస్తుంది. న్యాయవేదాంతశబ్దశాస్త్రాలలో అసాధారణపాండితీసంపన్ను లైన వీరు గుంటూరు జిల్లాలోని పమిడిపాడు గ్రామంలో 1875 లో జన్మించి 38 వర్షాల అల్పాయుస్సులో బ్రహ్మీభూతు లయ్యారు.

ఇంతటి అల్పాయుష్కులైన శ్రీరామరాయకవి దాదాపు 150 గ్రంథాలు రచించారు. వీరు రచించిన అద్వైతవేదాంతానికి సంబంధించిన గ్రంథాలు అత్యుత్తమము లైనవి. వీరికి 'అభినవశంకరులు'అనే బిరుదాన్ని పండితలోకంనుండి సంపాదించి పెట్టినవి. భాష్యార్కప్రకాశలో శ్రీరామరాయకవిగారు ప్రధానమల్లనిబర్హణ న్యాయంచేత శ్రీమద్రామానుజభాష్యాన్ని అనేకస్థలాలలో ఖండిస్తూ శాంకరభాష్యం విషయంలో శ్రీరామానుజార్యులు శ్రీవేదాంతదేశికులు చేసిన వైయక్తికదూషణ పూర్వకములైన ఆక్షేపణలకు, వారు ఎంత తీవ్రమైన భాషతో ఆక్షేపణలు చేశారో అంత తీవ్రమైన భాషలో సమాధానాలు చెప్పారు.

"తత్ర చ శంకరభాష్యప్రతిపక్షభూతభాష్యమధ్యే రామానుజభాష్యమేవ ప్రధానమితి ప్రధానమల్లనిబర్హణన్యాయేన రామానుజభాష్యే వేదాన్తదేశికకృతతాత్పర్య చన్ద్రికాసహితే శ్రుతియుక్త్యాదిభిర్విమృష్టే సతి శంకరభాష్యం నిరవద్యమప్రతిభటం స్థితం స్యాదిత్యేతదర్థమహామధునా మన్దమతిరపి శ్రీహయగ్రీవదేవకృపయా శ్రీశాంకరభగవద్గీతా భాష్యవ్యాఖ్యానే ప్రయుక్తః. కిం నామ దుష్కరమచిన్త్యవిచిత్రశక్తేర్భగవతః కృపాయాః? తృణమపి శ్రీరామేణ నిహితశక్తికం బ్రహ్మాస్త్రమభవత్కిల కాకాసురే!" (భాష్యార్కప్రకాశ. మొదటి సంపుటం. పేజి. 2)

ఈ వ్యాఖ్యానంలో పరమతఖండనమే కాక అద్వైతతత్త్వవిశదీకరణం కూడా చాలా చోట్ల చేయబడినది. ప్రధానంగా ఈ రెండవకారణాన్ని పురస్కరించుకొని దీనిలోని కొన్ని అంశాలు మా వ్యాఖ్య బాలానందిలో కూర్చడం జరిగింది. అయితే అనారోగ్యకృతమైన అంతరాయంచేత వ్యాఖ్యారచనమే నిలిచిపోతుందేమో అని భయపడి 13వ అధ్యాయం 27వ శ్లోకం వరకు మాత్రమే ఆ అంశాలను చేర్చి నా వ్యాఖ్యను శ్రీరామానుగ్రహంచేత పూర్తిచేయకలిగాను.

ప్రస్తావన

నే నీ వ్యాఖ్య రచిస్తూన్నట్లు తెలిసి,ఆర్షవిజ్ఞానట్రస్టుస్థాపకులైన మాననీయ న్యాయమూర్తులు శ్రీపమిడిఘంటం కోదండరామయ్యగారు ఏతాదృశగ్రంథప్రకటనలో వారికున్న సహజోత్సాహముతో-"ఈ వ్యాఖ్య కూడ ఆర్షవిజ్ఞానట్రస్టు ద్వారా ప్రకటించెదము" అని ఆ భారాన్ని తమపై వేసికొన్నారు.అందుకు వారికి, ఆర్షవిజ్ఞానట్రస్టు ఇతర సభ్యులకు నా కృతజ్ఞతను తెలుపుతున్నాను.

శ్రీ కోదండరామయ్యగారు చాలాకాలం ధర్మసంమతమైన రీతిలో న్యాయవాద వృత్తిని అవలంబించి హైకోర్టు న్యాయమూర్తిగా తమనే కాక తమ అధికారపరిధిలోనికి వచ్చినవారిని కూడ ధర్మమార్గంలో నడిపించారు. మొదటినుండీ శ్రీకంచి కామకోటి పరమాచార్యుల పరమానుగ్రహప్రాతులైన వీరు వారినుండి సమయసమయాలలో లభిస్తూన్న అంతఃప్రేరణచేత అనేక పుణ్యకార్యాలు నిర్వహిస్తున్నారు. ఆర్షవిజ్ఞానట్రస్టుస్థాసన, రామయణాదిగ్రంథప్రచురణ వాటిలో ఒకటి. ఇవి నిరంతరము కొనసాగించే శక్తిని వీరికి వీరి ఆరాధ్యదైవమైన శ్రీరాముడే అందజేస్తూన్నాడు. వీరి "Light of Ramayana" రామాయణ కల్పతరుగలితఫలం. ఏతాదృవకార్యనిర్వహణకు కూడ వీరికి నాకృతజ్ఞతాభివందనములు.

ఆర్షవిజ్ఞానట్రస్టు అధ్యక్షులు,సుప్రసిద్ధపత్రికాసంపాదకులు,ఆంధ్రప్రదేశ్‌ప్రెస్ అకాడమీ అధ్యక్షులు,బహుశ్రుతులు,వివిధలౌకికవిద్యాప్రవీణులు,భారతీయసంస్కృతి శ్రద్ధాలువులు అయిన శ్రీపొత్తూరి వెంకటేశ్వరరావు గారు ఈ గ్రంథానికి చక్కని **'ప్రణతి'** వ్రాసి **'సుధీప్రణుతి'** పాత్రు లైనారు.వారికి నాకృతజ్ఞతలు.

శ్రీజొన్నలగడ్డ శ్రీనివాసరావుగారు (Rtd.Chief Manager,Bank of Baroda) భారతీయసంస్కృతి పట్ల అత్యధికమైన ప్రేమాదరములు గలవారు. ఆధ్యాత్మికవిద్యాశ్రద్ధాసంపన్నులు. ఈ మధ్యనే తమ తండ్రిగారి పుణ్యస్మృతికై లక్షాధికరూప్యములు వెచ్చించి తెలుగులో ప్రతిపదార్థతాత్పర్యాలతో అధ్యాత్మరామాయణం ప్రకటించి ఆస్తికలోకానికి ఉపకారం చేశారు.వారిని కోరగా ఈ పుస్తకానికి సంబంధించిన ప్రాగ్రూపాలు(Proof) చదివి ఎన్నో దోషాలు పరిహరించడానికి సాహాయ్యం చేశారు.వారికి నా సస్నేహాభినందనములు తెలుపుచున్నాను.

ఈ గీతాభాష్యానికి కూడ తెలుగులో వ్యాఖ్య వ్రాయ వలె ననే అభిలాష నా మనస్సులో అంకురించడానికి శ్రీ కరణం అరవిందరావుగారు I.P.S. Addl. Commissioner of Plice, Hyderabad, సుప్రసిద్ధ మానసికరోగ వైద్యులు డా. M.V.R. శర్మగారు ప్రధానకారణభూతులు.కొన్ని విఘ్నాలు రాబోయినా ఈ గ్రంథం పూర్తి అవడానికి కారణం వారి పరిశుద్ధమనఃసంకల్పం.వారికి నా ఆశీఃపూర్వకాభినందనములు.

21.6.2001 పుల్లెల శ్రీరామచంద్రుడు

శ్రీః

శాన్తిపాఠః

శివనామ్ని విభావితేఽన్తరజ్ఞే

మహతి జ్యోతిషి మానినీమయార్ధే,

దురితాన్యపయాన్తి దూరదూరం

ముహురాయాన్తి మహాన్తి మఙ్గలాని. 1

స్మృతే సకలకల్యాణభాజనం యత్ర జాయతే,

పురుషస్తమజం నిత్యం వ్రజామి శరణం హరిమ్. 2

హరిః ఓం-శం నో మిత్రః శం వరుణః;శం నో భవత్వర్యమా; శం న ఇన్ద్రో బృహస్పతిః;శం నో విష్ణురురుక్రమః;నమో బ్రహ్మణే;నమస్తే వాయో;త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మాసి;త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మ వదిష్యామి;ఋతం వదిష్యామి;సత్యం వదిష్యామి;తన్మామవతు;తద్వక్తారమవతు;అవతు మామ్;అవతు వక్తారమ్. ఓం శాన్తిః శాన్తిః శాన్తిః. 1

సహ నావవతు;సహ నౌ భునక్తు;సహ వీర్యం కరవావహై; తేజస్వి నావధీతమస్తు; మా విద్విషావహై. ఓం శాన్తిః శాన్తిః శాన్తిః. 2

యశ్ఛన్దసామృషభో విశ్వరూపః;ఛన్దోభ్యోఽధ్యమృతాత్సంబభూవ;స మేన్ద్రో మేధయా స్పృణోతు;అమృతస్య దేవ ధారణో భూయాసమ్;శరీరం మే విచర్షణమ్,జిహ్వా మే మధుమత్తమా,కర్ణాభ్యాం భూరి విశ్రువమ్,బ్రహ్మణః కోశోఽసి మేధయా పిహితః; శ్రుతం మే గోపాయ-ఓం శాన్తిః శాన్తిః శాన్తిః. 3

అహం వృక్షస్య రేరివా;కీర్తిః పృష్ఠం గిరేరివ;ఊర్ధ్వపవిత్రో వాజినీవ స్వమృతమస్మి; ద్రవిణగ్ం సువర్చసమ్;సుమేధా అమృతోక్షితః;ఇతి త్రిశఙ్కోర్వేదానువచనమ్-ఓం శాన్తిః శాన్తిః శాన్తిః. 4

పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్పూర్ణముదచ్యతే,పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే.ఓం శాన్తిః శాన్తిః శాన్తిః. 5

ఆప్యాయన్తు మమాఙ్గాని వాక్ప్రాణశ్చక్షుఃశ్రోత్రమథో బలమిన్ద్రియాణి చ సర్వాణి; సర్వం బ్రహ్మౌపనిషదమ్;మాహం బ్రహ్మ నిరాకుర్యామ్;మా మా బ్రహ్మ నిరాకరోద నిరాకరణమస్త్వనిరాకరణం మేఽస్తు.తదాత్మని నిరతే య ఉపనిషత్సు ధర్మాస్తే మయి సన్తు తే మయి సన్తు.ఓం శాన్తిః శాన్తిః శాన్తిః. 6

వాఙ్మే మనసి ప్రతిష్ఠితా;మనో మే వాచి ప్రతిష్ఠితమ్;ఆవిరావీర్మ ఏధి వేదస్య మ ఆణీ స్థః;శ్రుతం మే మా ప్రహాసీః;అనేనాధీతేనాహోరాత్రాన్ సందధామి. ఋతం వదిష్యామి; సత్యం వదిష్యామి;తన్మామవతు;తద్వక్తారమవతు;అవతు మామ్;అవతు వక్తారమ్- ఓం శాన్తిః శాన్తిః శాన్తిః. 7

ఓం భద్రం నో అభివాతయ మనః. ఓం శాన్తిః శాన్తిః శాన్తిః. 8

ఓం భద్రం కర్ణేభిః శృణుయామ దేవాః. భద్రం పశ్యేమాక్షభిర్యజత్రాః; స్థిరైరఙ్గైస్తుష్టు వాగ్ంసస్తనూభిః;వ్యశేమ దేవహితం యదాయుః; స్వస్తి న ఇన్ద్రో వృద్ధశ్రవాః;స్వస్తినః పూషా విశ్వవేదాః;స్వస్తి నస్తార్క్ష్యో అరిష్టనేమిః స్వస్తినో బృహస్పతిర్దధాతు. ఓం శాన్తిః శాన్తిః శాన్తిః. 8

ఓం నమో బ్రహ్మాదిభ్యో బ్రహ్మవిద్యాసంప్రదాయకర్తృభ్యో వంశర్షిభ్యో నమో గురుభ్యః. సర్వోపప్లవరహితః ప్రజ్ఞానఘనః ప్రత్యగర్థో బ్రహ్మైవాహమస్మి. అధీహి భో! భగవః!

సదాశివసమారమ్భాం శంకరాచార్యమధ్యమామ్,
అస్మదాచార్యపర్యన్తాం వన్దే గురుపరంపరామ్. 1

నారాయణం పద్మభువం వసిష్ఠం శక్తిం చ తత్పుత్రపరాశరం చ,
వ్యాసం శుకం గౌడపదం మహాన్తం గోవిన్దయోగీన్ద్రమథాస్య శిష్యమ్. 2

శ్రీశంకరాచార్యమథాస్య పద్మపాదం చ హస్తామలకం చ శిష్యమ్,
తం తోటకం వార్తికకారమన్యానస్మద్గురూన్ సంతతమానతోఽస్మి. 3

శ్రుతిస్మృతిపురాణానామాలయం కరుణాలయమ్,
నమామి భగవత్పాదశంకరం లోకశంకరమ్. 4

యదవిద్యావిలాసేన భూతభౌతికసృష్టయః,
తం నౌమి పరమాత్మానం సచ్చిదానన్దవిగ్రహమ్. 5

శంకరం శంకరాచార్యం కేశవం బాదరాయణమ్,
సూత్రభాష్యకృతౌ వన్దే భగవన్తౌ పునః పునః.

దక్షిణామూర్తి స్తోత్రమ్

మౌనవ్యాఖ్యాప్రకటితపరబ్రహ్మతత్త్వం యువానం
వర్షిష్ఠాన్తేవసదృషిగణైరావృతం జ్ఞాన (బ్రహ్మ) నిష్ఠైః,
ఆచార్యేన్ద్రం కరకలితచిన్ముద్రమానన్దమూర్తిం
స్వాత్మారామం ముదితవదనం దక్షిణామూర్తిమీడే. 1

విశ్వం దర్పణదృశ్యమాననగరీతుల్యం నిజాన్తర్గతం
పశ్యన్నాత్మని మాయయా బహిరివోద్భూతం యథా నిద్రయా,
యః సాక్షాత్కురుతే ప్రబోధసమయే స్వాత్మానమేవాద్వయం
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే. 1

బీజస్యాన్తరివాఙ్కురో జగదిదం ప్రాజ్ నిర్వికల్పం పున
ర్మాయాకల్పితదేశకాలకలనావైచిత్ర్యచిత్రీకృతమ్,
మాయావీవ విజృమ్భయత్యపి మహాయోగీవ యః స్వేచ్ఛయా
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే. 2

యస్యైవ స్ఫురణం సదాత్మకమసత్కల్పార్థగం భాసతే
సాక్షాత్తత్త్వమసీతి వేదవచసా యో బోధయత్యాశ్రితాన్,
యత్సాక్షాత్కరణాద్భవేన్న పునరావృత్తిర్భవామ్భోనిధౌ
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే. 3

నానాచ్ఛిద్రఘటోదరస్థితమహాదీపప్రభాభాస్వరమ్
జ్ఞానం యస్య తు చక్షురాదికరణద్వారా బహిః స్పన్దతే,
జానామీతి తమేవ భాన్తమనుభాత్యేతత్సమస్తం జగ
త్తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే. 4

దేహం ప్రాణమపీన్ద్రియాణ్యపి చలాం బుద్ధిం చ శూన్యం విదుః
స్త్రీబాలాన్ధజడోపమాస్త్వహమితి భ్రాన్తా భృశం వాదినః
మాయాశక్తివిలాసకల్పితమహావ్యామోహసంహారిణే
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే. 5

రాహుగ్రస్తదివాకరేన్దుసదృశో మాయాసమాచ్ఛాదనా
త్సన్మాత్రః కరణోపసరిహరతో యో౽భూత్సుషుప్తః పుమాన్,
ప్రాగస్వాప్సమితి ప్రబోధసమయే యః ప్రత్యభిజ్ఞాయతే
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే. 6

బాల్యాదిష్వపి జాగ్రదాదిషు తథా సర్వాస్వవస్థాస్వపి
వ్యావృత్తాస్వనువర్తమానమహమిత్యన్తఃస్ఫురన్తం సదా,
స్వాత్మానం ప్రకటీకరోతి భజతాం యో భద్రయా ముద్రయా
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే. 7

విశ్వం పశ్యతి కార్యకారణతయా స్వస్వామిసంబన్ధతః
శిష్యాచార్యతయా తథైవ పితృపుత్రాద్యాత్మనా భేదతః,
స్వప్నే జాగ్రతి య ఏష పురుషో మాయాపరిభ్రామిత
స్తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే. 8

భూరమ్భాంస్యనిలోఽనలోఽమ్బరమహర్నాథో హిమాంశుః పుమా
నిత్యాభాతి చరాచరాత్మకమిదం యస్యైవ మూర్త్యష్టకమ్,
నాన్యత్కించన విద్యతే విమృశతాం యస్మాత్పరస్మాద్విభో
స్తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే. 9

సర్వాత్మత్వమితి స్ఫుటీకృతమిదం యస్మాదముష్మింస్తవే
తేనాస్య శ్రవణాత్తదర్థమననాద్ధ్యానాచ్చ సంకీర్తనాత్,
సర్వాత్మత్వమహావిభూతిసహితం స్యాదీశ్వరత్వం స్వతః
సిధ్యేత్తత్పునరష్టధా పరిణతం చైశ్వర్యమవ్యాహతమ్. 10

వటవిటపిసమీపే భూమిభాగే నిషణ్ణం
సకలమునిజనానాం జ్ఞానదాతారమారాత్,
త్రిభువనగురమీశం దక్షిణామూర్తిదైవం
జననమరణదుఃఖచ్ఛేదదక్షరం నమామి. 1

చిత్రం వటతరోర్మూలే వృద్ధాః శిష్యా గురుర్యువా,
గురోస్తు మౌనం వ్యాఖ్యానం శిష్యాస్తు ఛిన్నసంశయాః. 2

అఙ్గుష్ఠతర్జనీయోగముద్రావ్యాజేన దేహినామ్,
శ్రుత్యర్థం బ్రహ్మజీవైక్యం దర్శయన్నోఽవతాచ్ఛివః. 3

సమం సర్వేషు భూతేషు తిష్ఠన్తం పరమేశ్వరమ్,
మన్నాథం పరమాత్మానం ప్రణతోఽస్మి సదా శివమ్. 4

శ్రీభగవద్గీతాపారాయణవిధిః

అఙ్గన్యాసకరన్యాసౌ

ఓమ్ అస్య శ్రీభగవద్గీతాశాస్త్రమహామన్త్రస్య భగవాన్ వేదవ్యాసః ఋషిః,అనుష్టుప్ ఛన్దః;శ్రీకృష్ణపరమాత్మా దేవతా;"అశోచ్యానన్వశోచస్త్వం ప్రజ్ఞావాదాంశ్చ భాషసే"ఇతి బీజమ్. "సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ"ఇతి శక్తిః;"అహం త్వా సరపాపేభ్యో

మోక్షయిష్యామి మాశుచః"ఇతి కీలకమ్;"నైనం ఛిన్దన్తి శస్త్రాణి నైనం దహతి పావకః" ఇత్యఙ్గుష్ఠాభ్యాం నమః."న చైనం క్లేదయన్త్యాపో న శోషయతి మారుతః" ఇతి తర్జనీభ్యాం నమః."అచ్ఛేద్యోఽయమదాహ్యోఽయమక్లేద్యోఽశోష్య ఏవ చ"ఇతి మధ్యమాభ్యాం నమః."నిత్యః సర్వగతః స్థాణురచలోఽయం సనాతనః"ఇత్యనామికాభ్యాం నమః."పశ్య మే పార్థ రూపాణి శతశోఽథ సహస్రశః"ఇతి కనిష్ఠికాభ్యాం నమః."నానావిధాని దివ్యాని నానావర్ణాకృతీని చ"ఇతి కరతలకరపృష్ఠాభ్యాం నమః.ఇతి కరన్యాసః.

అథ హృదయాదిన్యాసః

"నైనం ఛిన్దన్తి శస్త్రాణి నైనం దహతి పావకః"ఇతి హృదయాయ నమః. "న చైనం క్లేదయన్త్యాపో న శోషయతి మారుతః"ఇతి శిరసే స్వాహా." అచ్ఛేద్యోఽయమదాహ్యోఽయమక్లేద్యోఽశోష్య ఏవ చ"ఇతి శిఖాయై వషట్."నిత్యః సర్వగతః స్థాణురచలోఽయం సనాతనః" ఇతి కవచాయ హుమ్."పశ్య మే పార్థ రూపాణి శతశోఽథ సహస్రశః"ఇతి నేత్రత్రయాయ వౌషట్."నానా విధాని దివ్యాని నానావర్ణాకృతాని చ"ఇతి అస్త్రాయ ఫట్."భూర్భువస్సువరోమ్"ఇతి దిగ్బన్ధః.ఓం శ్రీకృష్ణప్రీత్యర్థే గీతాపారాయణే (జపే వా) వినియోగః.

ధ్యానమ్

ఓమ్- పార్థాయ ప్రతిబోధితాం భగవతా నారాయణేన స్వయం
వ్యాసేన గ్రథితాం పురాణమునినా మధ్యేమహాభారతమ్,
అద్వైతామృతవర్షిణీం భగవతీమష్టాదశాధ్యాయినీ
మమ్బ త్వామనుసందధామి భగవద్గీతే! భవద్వేషిణీమ్. 1

నమోఽస్తు తే వ్యాస విశాలబుద్ధే ఫుల్లారవిన్దాయతపత్రనేత్ర,
యేన త్వయా భారతతైలపూర్ణః ప్రజ్వాలితో జ్ఞానమయప్రదీపః. 2

ప్రపన్నపారిజాతాయ తోత్రవేత్రైకపాణయే,
జ్ఞానముద్రాయ కృష్ణాయ గీతామృతదుహే నమః. 3

వాచకః ప్రణవో యస్య క్రీడావస్త్వఖిలం జగత్,
శ్రుతిరాజ్ఞా వపుర్జ్ఞానం తం వన్దే దేవకీసుతమ్. 4

సర్వోపనిషదో గావో దోగ్ధా గోపాలనన్దనః,
పార్థో వత్సః సుధీర్భోక్తా దుగ్ధం గీతామృతం మహత్. 5

వసుదేవసుతం దేవం కంసచాణూరమర్దనమ్,
దేవకీపరమానన్దం కృష్ణం వన్దే జగద్గురుమ్. 6

భీష్మద్రోణతటా జయద్రథజలా గాన్ధారనీలోత్పలా
శల్యగ్రాహవతీ కృపేణ వహినీ కర్ణేన వేలాకులా,
అశ్వత్థామవికర్ణఘోరమకరా దుర్యోధనావర్తినీ
సోత్తీర్ణా ఖలు పాణ్డవై రణనదీ కైవర్తకే కేశవే. 7

పారాశర్యవచఃసరోజమమలం గీతార్థగన్ధోత్కటం
నానాఖ్యానకకేసరం హరికథాసద్బోధనా బోధితమ్,
లోకే సజ్జనషట్పదైరహరహః పేపీయమానం ముదా
భూయాద్భారతపఙ్కజం కలిమలప్రధ్వంసి నః శ్రేయసే. 8

మూకం కరోతి వాచాలం పఙ్గుం లఙ్ఘయతే గిరిమ్,
యత్కృపా తమహం వన్దే పరమానన్దమాధవమ్. 9

యం బ్రహ్మా వరుణేన్ద్రరుద్రమరుతః స్తున్వన్తి దివ్యైః స్తవై
ర్వేదైః సాఙ్గపదక్రమోపనిషదైర్గాయన్తి యం సామగాః,
ధ్యానావస్థితతద్గతేన మనసా పశ్యన్తి యం యోగినో
యస్యాన్తం న విదుః సురాసురగణా దేవాయ తస్మై నమః. 10

అతః పరం యథార్థం సంపూజ్య పారాయణాదికం కార్యమ్.

అతామ్రపాణికమలప్రణయప్రతోద
మాలోలహారమణికుణ్డలహేమసూత్రమ్,
అవిఃశ్రమామ్బుకణమమ్బుదనీలమవ్యా
దాద్యం ధనంజయరథాభరణం మహో నః.

———— ••• ————

శ్రీభగవద్గీతాశాఙ్కరభాష్యమ్

ఆంధ్రభాషావ్యాఖ్యయా బాలానన్దిన్యా సమఞ్చితమ్

ం

వ్యాఖ్యాయా రచయితా

మహామహోపాధ్యాయః

ఆచార్యః డా. పుల్లెల శ్రీరామచన్ద్రః

DISTRIBUTORS:

SRI GOPAL PUBLICATIONS

3-3-860, Lane Opp: Aryasamaj

KACHIGUDA, HYD-27. Ph:4658101

ఆర్షవిజ్ఞానట్రస్టు

హైదరాబాదు

2001

శ్రీః

ఓం స్వస్తి శ్రీగణేశాయ నమః

శ్రీమద్భగవద్గీతా

బాలానన్దినీసంవలిత శ్రీశాంకరభాష్యసమేతా

శ్రీమచ్ఛాఙ్కరభాష్యోపక్రమణికా

మూ. ఓం నారాయణః పరోఽవ్యక్తాదణ్డమవ్యక్తసంభవమ్;
అణ్డస్యాన్తస్త్విమే లోకాః సప్తద్వీపా చ మేదినీ.

బాలానన్దిని

నత్వా శ్రీతాతపాదాదీన్ సర్వశాస్త్రార్థసద్గురూన్,
శాఙ్కరం భగవద్గీతాభాష్యమాన్ధ్ర్యాం వివృణ్మహే
భగవన్ దక్షిణామూర్తే సదా సంనిహితో మయి
త్వయా విరచితం భాష్యం త్వమేవ వివృణు ప్రభో.

శ్రీమన్మహాభారతాంతర్గత మైన భగవద్గీత సర్వోపనిషత్సారసంగ్రహరూప మైనది. దీనిలో ప్రధానంగా కర్మనిష్ఠ, జ్ఞాననిష్ఠ అనే రెండు నిష్ఠలు (యోగాలు) ప్రతిపాదించబడినవి. వీటిలో జ్ఞాననిష్ఠ ఉపేయం, సాధకునిచేత ప్రయత్నపూర్వకంగా సంపాదింపదగినది. దానిని సంపాదించడానికి ఉపాయం కర్మనిష్ఠ. అనగా సాధకులు మొదట కర్మనిష్ఠులై తరవాత జ్ఞాననిష్ఠను సంపాదించుకోవాలి. అట్టి నిష్ఠాద్వయాన్ని ప్రతిపాదించే భగవద్గీతకు వ్యాఖ్యానము చేయడానికి ప్రారంభించిన శ్రీ శంకరభగవత్పాదులు తపఃప్రభావసంపన్నులైన తాము ప్రారంభించిన గ్రంథరచనారూపకార్యమునకు ఎట్టి విఘ్నాలూ కలగడానికి అవకాశం లేకపోయినా, ఏతద్గ్రన్థపఠనపాఠనాద్యుద్యుక్తులైన తమ శిష్యులకు కూడ సకలవిఘ్ననివృత్తి కొరకై పౌరాణికశ్లోకోద్ధరణపూర్వకంగా నారాయణస్మరణ చేయుచున్నారు.

నారాయణః ఇతి :- అవ్యక్తాత్ = అవ్యక్తంకంటె, నారాయణః = నారాయణుడు, పరః =పరుడు; అతీతుడు; దానికంటె గొప్పవాడు. అణ్డమ్ = బ్రహ్మాండము, అవ్యక్తసంభవమ్ = అవ్యక్తంనుండి పుట్టినది. ఇమే = ఈ లోకాః = లోకాలు, చతుర్దశభువనాలు, సప్తద్వీపా = ఏడు ద్వీపాలు గల, మేదినీ చ = భూమీ, అణ్డస్య = అండము యొక్క అన్తః = లోపల నున్నవి.

వివరణం :- "ఆపో నారా ఇతి ప్రోక్తా ఆపో వై నరసూనవః ;
అయనం తస్య తాః పూర్వం తేన నారాయణః స్మృతః" (మను. 1.10)

అను స్మృతివాక్యం **నారాయణ** శబ్దానికి స్థూలంగా ఒక వ్యుత్పత్తిని ప్రతిపాదిస్తూన్నది. **నారాః** అనగా ఉదకం. నరు డనగా పరమాత్మ. పరమాత్మనుండి పుట్టిన దవడంచేత ("నరస్య అపత్యాని నారాః" అనే విగ్రహాన్ని అనుసరించి) ఉదకానికి 'నారాః' అని పేరు. బ్రహ్మ (సృష్టికర్త) రూపియైన, పరమాత్మ ఉదకములలో నివసించడం చేత (నారాః అయనం యస్య సః' అనే విగ్రహంచేత) పరమాత్మకు నారాయణు డని పేరు. ఇది ఈ శబ్దానికి చెప్పిన స్థూలార్థం.

అయితే **నారాయణ** శబ్దానికి విజ్ఞులు చెప్పే అర్థం ఇది - **నర** శబ్దానికి చరాచరాత్మక మైన శరీరసముదాయం అని అర్థం. ఆ శరీరసముదాయంలో నిత్య సంనిహితులైన, చైతన్యాభాసరూపు లైన జీవులు **నారాః** (నారులు). ఆ నారులకు, జీవులకు, అయనం అనగా ఆశ్రయం. అయిన, సర్వాంతర్యామీ, సర్వనియామకుడూ అయిన పరమాత్మయే, పరబ్రహ్మయే, నారాయణుడు. ఆ నారాయణుడు అవ్యక్తంకంటె పరుడు. భిన్నుడు; అతీతుడు. ప్రపంచం నామరూపాత్మక మైనది. కర్మ- కరణ - ఫలరూప మైనది. అనగా ప్రపంచం అంటే పేర్లు, ఆకారాలు, ఆ యా పనులు, ఆ పనులు చేయడానికి సాధనాలు, వాటి ఫలాలు - ఇవే. వీటిని మించిన ప్రపంచం అంటూ ఏదీ లేదు. ఈ ప్రపంచంయొక్క సృష్టి - స్థితి - ప్రలయాల చక్రం నిరంతరం తిరుగుతూనే ఉంటుంది. దీనికి ఆది లేదు, అంతం లేదు. నామరూపాద్యాత్మకమైన ఈ ప్రపంచం బైటకు కనబడినప్పుడు అది సృష్టి. ప్రపంచం కొంత కాలం నిలిచి ఉన్నప్పుడు అది స్థితి. అది తన కారణంలో అణగి పోయినప్పుడు అది దాని ప్రలయం. ఈ విధంగా ప్రపంచం ప్రలయం చెందిన, నామరూపాలతో కనబడని స్థితి అవ్యక్తావస్థ. కొంత కాలం తరువాత మళ్లీ సృష్టి జరుగుతుంది. ప్రపంచం నామరూపాలతో స్పష్టంగా కనబడుతుంది. అందుచేత అవ్యక్తం అనగా సృష్టికి పూర్వం ఉన్న స్థితి. అవ్యక్తం అన్నా అవ్యాకృతం అన్నా ఒకటే. ఈ అవ్యక్తానికే ఉపనిషత్తులలో ఒకప్పుడు ఆకాశం. అనీ, కొన్నిచోట్ల అక్షరం అనీ కొన్ని చోట్ల మాయ అనీ నిర్దేశం కనబడుతుంది. అందుచేతనే శ్రీ శంకర భగవత్పాదులు సూత్ర భాష్యంలో– "తదేతద వ్యక్తం క్వచిదాకాశశబ్దనిర్దిష్టమ్ - "**ఏతస్మిన్ను ఖల్వక్షరే గార్గి ఆకాశ ఓతశ్చ ప్రోతశ్చ**" (బృ. ఉ. 3.8.11) ఇతి శ్రుతేః. క్వచిదక్షరశబ్దోదితమ్" - "**అక్షరాత్పరతః పరః**" (ము. ఉ. 2.1) ఇతి శ్రుతేః. క్వచిన్మాయేతి సూచితమ్ - "**మాయాం తు ప్రకృతిం విద్యా న్మాయినం తు మహేశ్వరమ్**"(శ్వే. ఉ. 4.10) ఇతి మన్త్రవర్ణాత్"(బ్ర. సూ. భా. 1.4.3)అన్నారు. **ఆకాశ - అక్షర - అవిద్యా** - మాయాదిశబ్దనిర్దిష్ట మైన ఈ అవ్యక్తం ఈశ్వరశక్తిరూపమైనది. తదాశ్రితము; తదభిన్నమా తద్భిన్నమా అని నిర్వచించడానికి శక్యం కానిది. అయితే ఈశ్వరుడు మాత్రం దీనికి అతీతుడు. దీని ధర్మా లేవీ ఈశ్వరునికి అంటవు. దీని సాహాయ్యం చేతనే పరమేశ్వరునికి సృష్టికర్తృత్వం ఆపాదించబడుతున్నది. ఈ విషయాన్నే శ్రీ శంకరభగవత్పాదులు - "పరమేశ్వరాధీనా త్వియమస్మాభిః ప్రాగవస్థా జగతోఽభ్యుపగమ్యతే,

న స్వతన్త్రా. సా చావశ్య మభ్యుపగన్తవ్యా. అర్థవతీ హి సా. న హి తయా వినా పరమేశ్వరస్య స్రష్టృత్వం సిధ్యతి; శక్తిరహితస్య తస్య ప్రవృత్త్యనుపపత్తేః.... అవిద్యాత్మి కా హి బీజశక్తిరవ్యక్తశబ్దనిర్దేశ్యా పరమేశ్వరాశ్రయా మాయామయీ మహాసుప్తిః" (బ్ర.సూ.భా. 1.4.3) అని చెప్పి ఉన్నారు.

ఈ అక్షరం నుండి అండం జనించినది. అండం అనగా పంచీకృతములు కాని పంచమహాభూతాల స్వరూపంలో ఉండే హిరణ్యగర్భతత్త్వం. ఇది సూక్ష్మభూత సమష్టి రూపం. అండం అని చెప్పబడే ఈ హిరణ్యగర్భతత్త్వంలో అన్ని లోకాలూ అంతర్గతాలు. అనగా భూరాదిలోకా లన్నీ హిరణ్యగర్భతత్త్వంనుండి జనించా యని అర్థం. ఈ స్థూల భూతాదుల సమష్టికి విరాట్ అని పేరు.

ఈ శ్లోకాన్ని ఉదాహరించడం ద్వారా శ్రీ శంకరభగవత్పాదులు ఈ గ్రంథానికి సంబంధించిన విషయం, సంబంధం, అధికారి, ప్రయోజనం అనే అనుబంధచతుష్టయాన్ని సూచించారు. నారాయణశబ్దంచేత శుద్ధబ్రహ్మ ప్రతిపాద్య మని సూచింపబడినది. నారులకు, అనగా జీవులకు, అయనం అని చెప్పడంచేత జీవస్వరూపం కల్పితమే గాన జీవులు వాస్తవంలో స్వాయనమైన, అనగా తమ అధిష్ఠాన మైన పరమాత్మకం అభిన్నులు అని సూచించబడింది. ఈ విధంగా జీవబ్రహ్మైక్యం ప్రతిపాద్యవిషయం. గ్రంథానికీ విషయానికీ ప్రతిపాద్య ప్రతిపాదకభావసంబంధం. 'పరోऽవ్యక్తాత్' అని చెప్పడం ద్వారా పరమాత్మకు మాయాస్పర్శ లేదని ప్రతిపాదించడంచేత సర్వానర్థనివృత్తిరూప మైన మోక్షమే ఫలం అని సూచించబడింది. అట్టి మోక్షమునందు ఇచ్ఛ గలవాడు అధికారి.

భాష్యమ్

స భగవాన్ సృష్ట్వేదం జగత్తస్య చ స్థితిం చికీర్షుః మరీచ్యాదీనగ్రే సృష్ట్వా ప్రజాపతీన్ ప్రవృత్తిలక్షణం ధర్మం గ్రాహయామాస వేదోక్తమ్. తతోऽన్యాంశ్చ సనకసనన్దనాదీనుత్పాద్య నివృత్తిలక్షణం ధర్మం జ్ఞానవైరాగ్యలక్షణం గ్రాహయామాస.

బాలానందిని

అవ్యక్తంకంటె పరుడైన ఆ నారాయణుడు ఈ జగత్తును సృజించి, దానికి స్థితిని (నిలుగడను) కల్పించ దలచినవాడై, (ఆ జగత్తు నిలచే టట్లు చేయదలచినవాడై) ముందుగా మరీచి మొదలైన ప్రజాపతులను సృష్టించి వాళ్లకు వేదోక్తమైన, ప్రవృత్తి రూపమైన, అనగా ఆ యా కర్మల ఆచరణము అనే, ధర్మాన్ని బోధించాడు. తరువాత సనక - సనంద నాదులను సృజించి వాళ్లకు జ్ఞానము వైరాగ్యము అనే స్వరూపం గల నివృత్తిలక్షణధర్మాన్ని బోధించాడు.

భాష్యమ్

ద్వివిధో హి వేదోక్తో ధర్మః - ప్రవృత్తిలక్షణః నివృత్తిలక్షణశ్చ. జగతః స్థితి కారణం ప్రాణినాం సాక్షాదభ్యుదయనిఃశ్రేయసహేతుః యః స ధర్మో బ్రాహ్మణాద్యైః వర్ణిభిః ఆశ్రమిభిశ్చ శ్రేయోర్థిభిః అనుష్ఠీయమానః. దీర్ఘేణ కాలేన అనుష్ఠాతౄణాం కామోద్భవాత్ హీయమానవివేకవిజ్ఞానహేతుకేన అధర్మేణ అభిభూయమానే ధర్మే, ప్రవర్ధమానే చ అధర్మే, జగతః స్థితిం పరిపిపాలయిషుః స ఆదికర్తా నారాయణాఖ్యః విష్ణుః భౌమస్య బ్రహ్మణః, బ్రాహ్మణత్వస్య రక్షణార్థం దేవక్యాం వసుదేవాత్ అంశేన కిల సంబభూవ. బ్రాహ్మణత్వస్య హి రక్షణేన రక్షితః స్యాత్ వైదికః ధర్మః; తదధీనత్వాత్ వర్ణాశ్రమ భేదానామ్

బాలానందని

ద్వివిధ ఇతి :- ప్రవృత్తి రూపము, నివృత్తి రూపము అని వేదోక్తధర్మం రెండు విధాలు. (ఆ యా కర్మలను చేయడం ప్రవృత్తి లక్షణ ధర్మం; వాటి నుండి విరమించి జ్ఞాన మార్గాన్ని అవలంబించడం నివృత్తిలక్షణధర్మం). జగత్తు నిలిచి ఉండడానికి కారణం ఈ ధర్మమే. ప్రాణులకు సాక్షాత్తు అభ్యుదయాన్ని నిఃశ్రేయసాన్నీ ఇచ్చే ఈ ధర్మం శ్రేయస్సు కావా లనే కోరిక గల ఆ యా వర్ణాలకు చెందిన బ్రాహ్మణాదులచేత, గార్హస్థ్యాద్యాశ్రమాలలో ఉన్నవారిచేత ఆచరించబడుతుంది. (ఐహికము పారలౌకికమూ అయిన సుఖాదుల అభివృద్ధి **అభ్యుదయం.** ఇది ప్రవృత్తిలక్షణధర్మం ఆచరించడంవల్ల కలిగే ఫలం. సంసారబంధ నివృత్తిరూపమైన మోక్షం నిఃశ్రేయసం; ఇది నివృత్తిలక్షణధర్మఫలం). ఇలా ధర్మాన్ని అనుష్ఠిస్తూండగా, సుదీర్ఘకాలానికి, ఈ ధర్మానుష్ఠానం చేసేవాళ్లలో కామం (దురాశ) పెరిగి పోయింది. దానితో వాళ్లలోని వివేకజ్ఞానం సన్నగిలి అధర్మం పెచ్చు పెరిగి ధర్మాన్ని అణచి వేయడం ప్రారంభించింది. అలాంటి పరిస్థితిలో జగత్తుయొక్క స్థితిని పరిపాలించా లనే ఉద్దేశ్యంతో మొట్టమొదటి సృష్టికర్త యైన నారాయణు డనే విష్ణువు భౌమమైన (భూమి మీద నున్న) బ్రహ్మను, అనగా బ్రాహ్మణత్వాన్ని, రక్షించడం కోసం ఒక అంశతో వసుదేవుని ద్వారా దేవకియందు జన్మించాడట. వర్ణాశ్రమభేదాలు బ్రాహ్మణత్వంమీద ఆధారపడి ఉంటాయి గాన బ్రాహ్మణత్వాన్ని రక్షిస్తే వైదికధర్మాన్ని రక్షించి నట్లు అవుతుంది.

వి. ఇక్కడ "భౌమస్య బ్రహ్మణః బ్రాహ్మణత్వస్య చ" అని 'చ' కారసహిత మైన పాఠాన్ని గ్రహించి కొందరు "భూలోకంలో ఉన్న వేదాన్నీ, బ్రాహ్మణత్వాన్నీ రక్షించడం కోసం అని అర్థం వ్రాశారు. (భా.అ.ప్ర). బ్రహ్మశబ్దానికి వేదం అనే అర్థం ప్రసిద్ధమే కాని అప్పుడు 'భౌమస్య' అనే విశేషణం నిరర్థకం అవుతుంది. ఇక్కడ భగవత్పాదులు **"భౌమస్య బ్రహ్మణో గుప్త్యై వసుదేవాదజీజనత్"** అనే స్మృతివాక్యంలోని **"భౌమస్య**

బ్రహ్మణః” అనే మాటలను ప్రయోగించి, వాటి అర్థాన్నే ‘బ్రాహ్మణత్వస్య’ అనే పదంచేత చెప్పారని ఆనందగిరి సూచించి ఉన్నారు. అదే యుక్తం అని కనబడుతున్నది. ‘చ’ కారం అనావశ్యకం. నారాయణుడు అంశచేత జన్మించినా డనగా తన మాయాశక్తిచేత ఈ రూపంలో కనబడినా డని మాత్రమే అర్థం. అంతే కాని నారాయణుని కొంత భాగం ఈ రూపంలో పుట్టింది అని అర్థం కాదు. నారాయణునిలో భాగాలూ, అవయవాలూ ఉండవు. ఇలా అవతరించడం కూడా మాయావిలాసమే. వాస్తవంలో అవతరించడం అనేది కూడా లేదు. అందుచేతనే “సంబభూవ కిల’ (పుట్టినాడట; పుట్టినట్లు కనబడ్డాడు) అని ‘కిల’ శబ్దం ప్రయోగించబడింది.

భాష్యమ్

స చ భగవాన్ జ్ఞానైశ్వర్యశక్తిబలవీర్యతేజోభిః సదా సంపన్నః త్రిగుణాత్మికాం వైష్ణవీం స్వాం మాయాం మూలప్రకృతిం వశీకృత్య అజః, అవ్యయః భూతానామ్ ఈశ్వరః, నిత్యశుద్ధబుద్ధముక్తస్వభావోఽపి సన్ స్వమాయయా దేహవానివ, జాత ఇవ చ, లోకానుగ్రహం కుర్వన్నివ లక్ష్యతే. స్వప్రయోజనాభావేఽపి భూతానుజిఘృక్షయా వైదికం హి ధర్మద్వయమ్ అర్జునాయ శోకమోహమహోదధౌ నిమగ్నాయోపదిదేశ – గుణాధికైః హి గృహీతః అనుష్ఠీయమానశ్చ ధర్మః ప్రచయం గమిష్యతీతి తం ధర్మం భగవతా యథోపదిష్టం వేదవ్యాసః సర్వజ్ఞః భగవాన్ గీతాఖ్యైః సప్తభిః శ్లోకశతైః ఉపనిబబన్ధ. తదిదం గీతాశాస్త్రం సమస్తవేదార్థసారసంగ్రహభూతం దుర్విజ్ఞేయార్థమ్. తదర్థావిష్కరణాయ అనేకైః వివృతపదపదార్థ వాక్యార్థన్యాయమపి అత్యన్తవిరుద్ధానేకార్థత్వేన లౌకికైః గృహ్యమాణమ్ ఉపలభ్య అహం వివేకతః అర్థనిర్ధారణార్థం సంక్షేపతః వివరణం కరిష్యామి.

బాలనందిని

ఎల్లప్పుడూ జ్ఞాన – ఐశ్వర్య – శక్తి – బల – వీర్య – తేజస్సులతో కూడి ఉన్న ఆ భగవంతుడు, త్రిగుణస్వరూప మైనది (సత్త్వ – రజస్ – తమస్సు లనే మూడు గుణాలే స్వరూపంగా గలది), మూలప్రకృతీ, విష్ణువునకు (పరమేశ్వరునకు) సంబంధించినది అయిన తన మాయను. తన వశములో ఉంచుకొని తాను అవ్యయుడు (ఎట్టి మార్పు లేనివాడు) సమస్త ప్రాణులకు నియామకుడు అయినను, స్వభావంచేత (సహజంగా) నిత్యుడు, శుద్ధుడు (ఎట్టి మాలిన్యమూ లేనివాడు), బుద్ధుడు (జ్ఞానస్వరూపుడు) ముక్తుడు (సంసారముతో ఏ విధమైన సంబంధమూ లేనివాడూ) అయినా కూడ, తన మాయచేతనే దేహం ధరించినవాడు వలె, పుట్టినవాడు వలె, లోకానుగ్రహం చేస్తూన్నవాడు వలె కనబుచున్నాడు. (విషయాలను తెలిసికొనడం జ్ఞానం. అందరినీ వశంలో ఉంచుకొనడం ఐశ్వర్యం. ఆ యా కార్యాలను సాధించగలిగిన సామర్థ్యం శక్తి. సహాయసంపత్తి బలం. ఎవరిచేతా ఎదిరింప శక్యం

కాకపోవడం తేజస్సు. తన కే విధమైన ప్రయోజనమూ లేకపోయినా కూడ భగవంతుడు సకలప్రాణులను అనుగ్రహించా లనే కోరికతో, ఈ రెండు ధర్మాలనూ కూడ, శోక మోహము లనే మహాసముద్రంలో మునిగిపోయిన అర్జునునికి ఉపదేశించాడు. అధిక గుణవంతుడు గ్రహించి అనుష్ఠించి నట్లయితే ధర్మం అభివృద్ధి - ప్రచురప్రచారం - చెందుతుంది. అనే అభిప్రాయంతో (సద్గుణశాలియైన) అర్జునునికి ఉపదేశించాడు. భగవంతుడు ఉపదేశించినది ఉపదేశించినట్లుగా, సర్వజ్ఞుడు, పూజ్యుడు అయిన వేదవ్యాసుడు, ఆ ధర్మద్వయాన్ని గీతలు అను పేరు గల ఏడు వందల శ్లోకాలలో కూర్చాడు. (శ్లోకాలకు గీత లని నామాంతర మని భగవత్పాదుల అభిప్రాయం).

తదిదమితి :- సమస్త మైన వేదార్థం సారముయొక్క సంగ్రహమైన, (దేనియందు సమస్తమైన వేదార్థముయొక్క సారం సంగ్రహించబడిందో అట్టి) ఈ గీతాశాస్త్రంయొక్క అర్థం తెలుసుకొనడం చాలా కష్టమైన పని. దీని అర్థాన్ని విశదీకరిస్తూ ఎంతో మంది పదాలను, పదార్థాలను, వాక్యార్థాలను, న్యాయాలను అనగా ఆక్షేప - సమాధానాదులను వివరించి ఉన్నారు. అయినా కూడ కొందరు లౌకికులు గీతలో చెప్పిన అనేక విషయాలు పరస్పరవిరుద్ధంగా ఉన్నాయి అని అంటూండడం చూచి, నేను, ఎక్కడి కక్కడికి వివేచన చేసి గీతా ప్రతిపాదితము లైన విషయాలను స్పష్టంగా నిర్ధరించడానికై, సంక్షిప్తంగా, వివరణం చేస్తాను.

భాష్యమ్

తస్యాస్య గీతాశాస్త్రస్య సంక్షేపతః ప్రయోజనం పరం నిఃశ్రేయసం. సహేతుకస్య సంసారస్య అత్యన్తోపరమలక్షణమ్. తచ్చ సర్వకర్మసంన్యాసపూర్వకాత్ ఆత్మజ్ఞానిష్ఠారూపాత్ ధర్మాత్ భవతి. తథా ఇమమేవ గీతార్థధర్మమ్ ఉద్దిశ్య భగవతైవ ఉక్తమ్ -

"స హి ధర్మః సుపర్యాప్తో బ్రహ్మణః పదవేదనే" (మ.భా అశ్వ 16.12)

ఇత్యనుగీతాసు. తత్రైవ చ ఉక్తమ్ -

"నైవ ధర్మీ న చాధర్మీ న చైవ హి శుభాశుభీ (మ.భా. అశ్వ 19.7)

యః స్యాదేకాసనే లీనః తూష్ణీం కించిదచిన్తయన్"(మ.భా.అశ్వ. 19.1)

ఇతి. "జ్ఞానం సంన్యాసలక్షణమ్" (మహా. అశ్వ.43.25)

ఇతి చ. ఇహాపి చ అన్తే ఉక్తమ్ అర్జునాయ

"సర్వధర్మాన్పరిత్యజ్య మామేకం శరణం వ్రజ" (18.66) ఇతి.

అభ్యుదయార్థోఽ పి యః ప్రవృత్తిలక్షణో ధర్మః వర్ణాశ్రమాంశ్చోద్దిశ్య విహితః సః దేవాదిస్థానప్రాప్తిహేతురపి సన్ ఈశ్వరార్పణబుద్ధ్యా అనుష్ఠీయమానః సత్త్వశుద్ధయే భవతి ఫలాభిసంధిరహితః. శుద్ధసత్త్వస్య చ జ్ఞాననిష్ఠాయోగ్యతాప్రాప్తిద్వారేణ, జ్ఞానోత్పత్తి హేతుత్వేన చ నిఃశ్రేయసహేతుత్వమపి ప్రతిపద్యతే. తథా చ ఇమమేవ అర్థమ్ అభిసంధాయ వక్ష్యతి – "బ్రహ్మణ్యాధాయ కర్మాణి" **(5.10)** "యోగినః కర్మ కుర్వన్తి సంగం త్యక్త్వాత్మశుద్ధయే" **(5.11)** ఇతి.

బాలానందిని

తస్యేతి :– అట్టి ఈ గీతాశాస్త్రానికి పరమప్రయోజనం ఏమిటి అని ఒక్క మాటలో చెప్పాలంటే నిఃశ్రేయసమే, అనగా మోక్షమే. సంసారమూ, దాని హేతువూ (అవిద్యా) పూర్తిగా తొలగిపోవడమే నిఃశ్రేయసం అనగా. ముందు సర్వకర్మలను సంన్యసించి ఆత్మజ్ఞానంలో స్థిర మైన స్థితిని సంపాదించడం అనే ధర్మంవల్ల నిఃశ్రేయసం కలుగుతుంది. అందుచేతనే గీతార్థమైన ఈ జ్ఞాననిష్ఠారూపధర్మాన్నే నిర్దేశిస్తూ భగవంతునిచేతనే అనుగీతలలో – బ్రహ్మ యొక్క స్థానాన్ని, అనగా మోక్షాన్ని, పొందడానికి, ఆ ధర్మమే, అనగా వెనుక నీకు ఉపదేశించిన గీతలో చెప్పిన జ్ఞాననిష్ఠారూపధర్మమే పూర్తిగా చాలును" అని చెప్పబడింది. అక్కడనే "నైవ ధర్మీ... శుభాశుభీ" అని, "యః స్యాదేకాసనే... అచిన్తయన్" అనీ, "జ్ఞానం సంన్యాసలక్షణమ్" అనీ కూడా చెప్పబడింది. "యః = ఎవడు, నైవ ధర్మీ = ధర్మము కలవాడు కాడో, అనగా పుణ్యకర్మాదులను ఆచరించడో, న చ అధర్మీ = అధర్మాచరణం కూడ చేయడో, "అని" కించిత్ = దేనిని గూర్చీ కూడ, అచిన్తయన్ = ఆలోచించనివాడై, తూష్ణీమ్ = వాగాదీంద్రియాల వ్యాపారాలు కూడా లేకుండా, ఏకాసనే = అద్వీతయమైన బ్రహ్మయందు స్థితిలో, లీనః = అణిగి ఉంటాడో అట్టివానికి సర్వకర్మసంన్యాసంవల్ల కలిగే జ్ఞానం ముక్తిహేతువు అవుతుంది" అనీ శ్లోకార్థాలకు అర్థం. "జ్ఞానం సంన్యాసమే లక్షణంగా గలది" (జ్ఞానానికి లక్షణం సర్వకర్మసంన్యాసమే) అని మూడవ వాక్యానికి అర్థం, ఇక్కడ కూడా, అనగా భగవద్గీతలోనే, చివర "సర్వధర్మాన్....వ్రజ" (సమస్తమైన ధర్మాలను, అధర్మాలను త్యజించి అద్వితీయాత్మస్వరూపుడ నైన నాయందే స్వాత్మభావంతో నిష్ఠను పొందుము) అని అర్జునునకు ఉపదేశించబడింది.

వర్ణాలను ఆశ్రమాలను ఉద్దేశించి అభ్యుదయంకొరకై విధించబడిన, ప్రవృత్తి లక్షణ మైన ఏ ధర్మం ఉన్నదో అది దేవాదిస్థానాలను పొందడానికి హేతు వైనా కూడ, దాని ఫలంమీద ఆసక్తి లేకుండా ఈశ్వరార్పణబుద్ధితో ఆచరిస్తే అది అంతఃకరణశుద్ధిని కలిగిస్తుంది. పరిశుద్ధమైన అంతఃకరణం కలవానికి, ఇట్టి కర్మ జ్ఞాననిష్ఠను పొందడానికి యోగ్యత్వం సంపాదించడం ద్వారా వానికి జ్ఞానం కలగడానికి హేతువై మోక్షానికి కూడా హేతువు అవుతుంది. ఈ విషయాన్నే మనస్సులో ఉంచుకొని **"బ్రహ్మణ్యాధాయ కర్మాణి"**

(కర్మలను బ్రహ్మయందు సమర్పించి, అని, **"యోగినః.... శుద్ధయే"** (యోగులు కర్మఫలాసక్తిని విడచి అంతఃకరణశుద్ధికొరకై కర్మ చేస్తారు) అనీ చెప్పనున్నాడు.

భాష్యమ్

ఇమం ద్విప్రకారం ధర్మం నిఃశ్రేయసప్రయోజనం, పరమార్థతత్త్వం చ వాసుదేవాఖ్యం పరం బ్రహ్మ అభిధేయభూతం విశేషతః అభివ్యఞ్జయత్ విశిష్ట ప్రయోజన సంబన్ధాభిధేయవత్ గీతాశాస్త్రమ్. యతః తదర్థే విజ్ఞాతే సమస్తపురుషార్థసిద్ధిః ఇత్యతః తద్వివరణే యత్నః క్రియతే మయా.

శ్రీమచ్ఛాఙ్కరభాష్యోపక్రమణికా సమాప్తా

బాలానందిని

ఇమమితి :- భగవద్గీతాశాస్త్రం నిఃశ్రేయసం ప్రయోజనంగా గల రెండు విధాలైన ఈ ధర్మాన్నీ, ప్రతిపాద్యవిషయమైన వాసుదేవు డనే పేరు గల పరమతత్త్వ మైన పరబ్రహ్మనూ ముఖ్యంగా తెలుపుచున్నది గాన దీనికి (ఈ గీతాశాస్త్రానికి) విశిష్టమైన ప్రయోజనము, సంబంధము, విషయమూ కూడా ఉన్నాయి. (నిఃశ్రేయసం ప్రయోజనం. పరబ్రహ్మ అభిధేయం, అనగా విషయం. నిఃశ్రేయసరూప మైన ఫలానికీ శాస్త్రానికీ నిష్పాద్యయం ద్వారా సాధ్యసాధనభావసంబంధం. విషయమైన బ్రహ్మతో శాస్త్రానికి విషయవిషయిభావసంబంధం. ఇవి మూడు అనుబంధాలు. ముముక్షుత్వం నాల్గవ అనుబంధంగా సూచింపబడింది. **యతః ఇతి** . అందువల్ల దీని (గీతాశాస్త్రంయొక్క) అర్థం తెలిసినట్లయితే సమస్తపురుషార్థాలు సిద్ధిస్తాయి గాన దానిని (గీతాశాస్త్రార్థాన్ని) వివరించ డానికై నాచేత ప్రయత్నం చేయబడుచున్నది.

శ్రీమచ్ఛాంకరభాష్యోపక్రమణిక సమాప్తం

అథ ప్రథమోఽధ్యాయః

మూ. ధృతరాష్ట్ర ఉవాచ -

మూ. ధర్మక్షేత్రే కురుక్షేత్రే సమవేతా యుయుత్సవః;
మామకాః పాణ్డవాశ్చైవ కిమకుర్వత సంజయ. 1

ప్ర.అ. **ధర్మక్షేత్రే ఇతి** :- ధృతరాష్ట్రుడు ప్రశ్నించాడు - సంజయ = ఓ ! సంజయా ! యుయుత్సవః = యుద్ధం చేయదలచినవారై, ధర్మక్షేత్రే = ధర్మక్షేత్ర మైన, కురుక్షేత్రే = కురుక్షేత్రంలో, సమవేతాః = కలిసిన, మామకాః = నావాళ్లు (దుర్యోధనాదికౌరవులు), పాణ్డవాః చ ఏవ = పాండవులూ, కిమ్ = ఏమి, అకుర్వత = చేశారు?

మూ. సఞ్జయ ఉవాచ -

మూ. దృష్ట్వా తు పాణ్డవానీకం వ్యూఢం దుర్యోధనస్తదా,
ఆచార్యముపసంగమ్య రాజా వచనమబ్రవీత్. 2

ప్ర.అ. ధర్మక్షేత్రే ఇతి :- తదా అప్పుడు, రాజా = రాజైన, దుర్యోధనః = దుర్యోధనుడు, వ్యూఢమ్ = యుద్ధానికి సిద్ధంగా నిలపబడిన, పాణ్డవానీకమ్ = పాండవుల సైన్యాన్ని, దృష్ట్వా = చూచి, ఆచార్యమ్ = ద్రోణాచార్యుని, ఉపసంగమ్య = సమీపించి, వచనమ్ = వచనమును, అబ్రవీత్ = పలికెను. 2

మూ. పశ్యైతాం పాణ్డుపుత్రాణామాచార్య మహతీం చమూమ్,
వ్యూఢాం ద్రుపదపుత్రేణ తవ శిష్యేణ ధీమతా. 3

ప్ర.అ. పశ్యేతి :- ఆచార్య = ఆచార్యా , తవ శిష్యేణ = నీ శిష్యుడు, ధీమతా = బుద్ధిమంతుడూ అయిన, ద్రుపదపుత్రేణ = ద్రుపదుని పుత్రునిచేత(ధృష్టద్యుమ్నునిచేత), వ్యూఢామ్ = యుద్ధానికి సిద్ధంగా నిలపబడిన, మగహతీమ్ = గొప్పదైన, పాణ్డుపుత్రాణామ్ = పాండవుల, ఏతామ్ = ఈ, చమూమ్ = సేనను, పశ్య = చూడుము. 3

మూ. అత్ర శూరా మహేష్వాసా భీమార్జునసమా యుధి,
యుయుధానో విరాటశ్చ ద్రుపదశ్చ మహారథః. 4
ధృష్టకేతుశ్చేకితానః కాశిరాజశ్చ వీర్యవాన్,
పురుజిత్ కున్తిభోజశ్చ శైబ్యశ్చ నరపుఙ్గవః. 5
యుధామన్యుశ్చ విక్రాన్త ఉత్తమౌజాశ్చ వీర్యవాన్,
సౌభద్రో ద్రౌపదేయాశ్చ సర్వ ఏవ మహారథాః. 6

ప్ర.అ. అత్ర = ఈ సైన్యంలో, శూరాః = శూరులు, మహేష్వాసాః = గొప్ప ధనస్సులు గలవారు, యుధి = యుద్ధమునందు, భీమార్జునసమాః = భీమార్జునులతో సమానులు అయిన, యుయుధానః = యుయుధానుడు, విరాటశ్చ = విరాటుడు, మహారథః = మహారథుడైన, ద్రుపదః = ద్రుపదుడు, ధృష్టకేతుః = ధృష్టకేతువు, కాశిరాజః = కాశి రాజైన, వీర్యవాన్ = పరాక్రమవంతు డైన, పురుజిత్ = పురిజిత్తు. కున్తిభోజః = కుంతి భోజుడు, నరపుఙ్గవః = నరులలో శ్రేష్ఠుడైన, శైబ్యః చ = శైబ్యుడు, విక్రాన్తః = పరాక్రమము గల, యుధామన్యుశ్చ = యుధామన్యువు, వీర్యవాన్ = పరాక్రమవంతు డైన, ఉత్తమౌజాః = ఉత్తమౌజస్సు, సౌభద్రః = అభిమన్యుడు, ద్రౌపదేయాః చ = ద్రౌపది కుమారులు, ఉన్నారు. సర్వే = అందరూ, మహారథాః ఏవ = మహారథులే. 4 - 6

మూ. అస్మాకం తు విశిష్టా యే తాన్నిబోధ ద్విజోత్తమ,
నాయకా మమ సైన్యస్య సంజ్ఞార్థం తాన్ బ్రవీమి తే. 7

ప్ర.అ. **అస్మాకమితి** :- ద్విజోత్తమ = ఓ ! ద్విజశ్రేష్ఠుడా! అస్మాకం తు = మనవారిలో నైతే, యే = ఎవరు, విశిష్టాః = గొప్పవారో, తాన్ = వాళ్ళను గూర్చి, నిబోధ = తెలుసు కొనుము. మమ సైన్యస్య = నా సైన్యముయొక్క, నాయకాః = నాయకు లెవరో, తాన్ = వాళ్లను గూర్చి, తే = నీకు, సంజ్ఞార్థమ్ = గుర్తు కొరకు, బ్రవీమి = చెప్పుచున్నాను. 7

మూ. భవాన్ భీష్మశ్చ కర్ణశ్చ కృపశ్చ సమితింజయః,
అశ్వత్థామా వికర్ణశ్చ సౌమదత్తిర్జయద్రథః. 8

ప్ర.అ. **భవానితి** :- భవాన్ = నీవు, భీష్మశ్చ = భీష్ముడు, కర్ణశ్చ = కర్ణుడు, సమితింజయః = యుద్ధములలో జయించు, కృపశ్చ = కృపాచార్యుడు, అశ్వత్థామా = అశ్వత్థామ, వికర్ణశ్చ = వికర్ణుడు, సౌమదత్తిః = సోమదత్తుని కుమారుడైన, జయద్రథః = జయద్రథుడు = ఉన్నారు. 8

మూ. అన్యే చ బహవః శూరా మదర్థే త్యక్తజీవితాః,
నానాశస్త్రప్రహరణాః సర్వే యుద్ధవిశారదాః. 9

ప్ర.అ. **అన్యే ఇతి** :- నానాశస్త్రప్రహరణాః = అనేకవిధాలైన శస్త్రములు ఆయుధములుగా గలవారు, మదర్థే = నా నిమిత్తం, త్యక్తజీవితాః = విడవబడిన జీవితాలు గలవారు (ప్రాణాలు విడవడానికి సిద్ధంగా ఉన్నవారు) అయిన, అన్యే = ఇతరులైన, బహవః = చాలామంది, శూరాః = శూరులు - ఉన్నారు. సర్వే = వీరందరూ, యుద్ధవిశారదాః = యుద్ధంలో నేర్ప గలవారు. 9

మూ. అపర్యాప్తం తదస్మాకం బలం భీష్మాభిరక్షితమ్,
పర్యాప్తం త్విదమేతేషాం బలం భీమాభిరక్షితమ్. 10

ప్ర.అ. **అపర్యాప్తమితి** :- తత్ = ఆకారణంవల్ల, భీష్మాభిరక్షితమ్ = భీష్మునిచేత రక్షింపబడిన, అస్మాకం బలమ్ = మన సైన్యము, అపర్యాప్తమ్ = అపరిమిత మైనది. తు = కాని, భీమాభిరక్షితమ్ = భీమునిచేత రక్షించబడిన, ఏతేషామ్ = వీళ్లయొక్క, ఇదం బలమ్ = ఈ సైన్యం, పర్యాప్తమ్ = పరిమితమైనది.

వి. మనది పదకొండు అక్షౌహిణుల సైన్యం; చాలా పెద్దది. వాళ్ళది ఏడు అక్షౌహిణులు మాత్రమే. అందుచేత చిన్నది అని భావం. కొందరు వ్యాఖ్యాతలు 'పర్యాప్త' శబ్దానికి సమర్థము అని అర్థం గ్రహించి మన సైన్యం వాళ్లని జయించడానికి అసమర్థమైనది, వాళ్లది మన సైన్యాన్ని జయించడానికి సమర్థమైనది అని అర్థం చెప్పారు. కాని దుర్యోధనుడు ఇలా అంటాడా అని సందేహం. 10

మూ. అయనేషు చ సర్వేషు యథాభాగమవస్థితాః,
భీష్మమేవాభిరక్షన్తు భవన్తః సర్వ ఏవ హి. 11

ప్ర.అ. అయనేష్వితి :- భవన్తః = మీరు, సర్వే ఏవ హి = అందరూ; సర్వేషు = సమస్తమైన, అయనేషు = సేనాప్రవేశనిర్గమస్థానాదులలో, యథాభాగమ్ = తమ తమ స్థానాన్ని, అనుసరించి నిలచినవారై, భీష్మమేవ = భీష్ముణ్ణే, రక్షన్తు = రక్షించెదరుగాక. 11

మూ. తస్య సంజనయన్ హర్షం కురువృద్ధః పితామహః,
సింహనాదం వినద్యోచ్చైః శఙ్ఖం దధ్మౌ ప్రతాపవాన్. 12

ప్ర.అ. తస్యేతి :- ప్రతాపవాన్ = ప్రతాపవంతుడు, కురువృద్ధః = కౌరవులలో వృద్ధుడూ అయిన, పితామహః = భీష్ముడు, తస్య = దుర్యోధనునకు, హర్షమ్ = ఆనందాన్ని, సంజనయన్ = పుట్టించుచు, ఉచ్చైః = బిగ్గరగా, సింహనాదమ్ = సింహం ధ్వని చేసినట్లు, వినద్య = ధ్వని చేసి, శఙ్ఖమ్ = శంఖమును, ప్రదధ్మౌ = పూరించెను. 12

మూ. తతః శఙ్ఖాశ్చ భేర్యశ్చ పణవానకగోముఖాః,
సహసైవాభ్యహన్యన్త స శబ్దస్తుములోఽభవత్. 13

ప్ర.అ. తత ఇతి :- తతః = అటు పిమ్మట, సహసైవ = వెంటనే, శఙ్ఖాశ్చ = శంఖాలు, భేర్యశ్చ = భేరీలు, పణవానకగోముఖాః = తాళాలు, దుందుభులు, కొమ్ముబూరాలు, అభ్య హన్యన్త = మ్రోగించబడినవి. సః శబ్దః = ఆ శబ్దం, తుములః= చాలా వ్యాకులంగా, అభవత్ = అయినది. 13

మూ. తతః శ్వేతైర్హయైర్యుక్తే మహతి స్యన్దనే స్థితౌ,
మాధవః పాణ్డవశ్చైవ దివ్యౌ శఙ్ఖౌ ప్రదధ్మతుః. 14

ప్ర.అ. తత ఇతి :- తతః = అటు పిమ్మట, శ్వేతైః = తెల్లని, హయైః = గుఱ్ఱములతో, యుక్తే = కూర్చబడిన (తెల్లని గుఱ్ఱాలు కట్టిన), మహతి = గొప్ప, స్యన్దనే = రథము నందు, స్థితౌ = ఉన్న, మాధవః = శ్రీకృష్ణుడు, పాణ్డవః చైవ = అర్జునుడూ, దివ్యౌ = దివ్యములైన, శఙ్ఖౌ = శంఖాలను, ప్రదధ్మతుః = పూరించిరి. 14

మూ. పాఞ్చజన్యం హృషీకేశో దేవదత్తం ధనంజయః,
పౌణ్డ్రం దధ్మౌ మహాశఙ్ఖం భీమకర్మా వృకోదరః. 15

ప్ర.అ. పాఞ్చజన్యమితి :- హృషీకేశః = శ్రీకృష్ణుడు, పాఞ్చజన్యమ్ = పాంచజన్య మనే శంఖాన్ని, దధ్మౌ = పూరించెను. ధనంజయః = అర్జునుడు, దేవదత్తమ్ = దేవదత్తాన్ని పూరించెను. భీమకర్మా = భయంకర మైన పనులు గల, వృకోదరః = భీముడు, పౌణ్డ్రమ్ = పౌండ్రం అను, మహాశఙ్ఖమ్ = గొప్ప శంఖాన్ని పూరించెను. 15

మూ. అనన్తవిజయం రాజా కున్తీపుత్రో యుధిష్ఠిరః,
నకులః సహదేవశ్చ సుఘోషమణిపుష్పకౌ. 16

ప్ర.అ. అనన్తేతి :- కున్తీపుత్రః = కుంతి కుమారుడు, రాజా = రాజూ అయిన, యుధిష్ఠిరః = యుధిష్ఠిరుడు, అనన్తవిజయమ్ = అనంత విజయ మనే శంఖాన్ని పూరించాడు. నకులః = నకులుడు, సహదేవశ్చ = సహదేవుడు, సుఘోషమణిపుష్పకౌ = సుఘోష మణిపుష్ప కములను పూరించారు. 16

మూ. కాశ్యశ్చ పరమేష్వాసః శిఖణ్డీ చ మహారథః,
ధృష్టద్యుమ్నో విరాటశ్చ సాత్యకిశ్చాపరాజితః. 17
ద్రుపదో ద్రౌపదేయాశ్చ సర్వశః పృథివీపతే,
సౌభద్రశ్చ మహాబాహుః శఙ్ఖాన్ దధ్ముః పృథక్ పృథక్. 18

ప్ర.అ. కాశ్య ఇతి :- పృథివీపతే = మహారాజా ! పరమేష్వాసః = గొప్ప ధనుస్సు గల, కాశ్యః చ = కాశీరాజు, మహారథః = మహారథుడైన, శిఖణ్డీ చ = శిఖండి, ధృష్టద్యుమ్నః = ధృష్టద్యుమ్నుడు, విరాటశ్చ = విరాటుడు, అపరాజితః = ఓడింపబడని, సాత్యకిశ్చ = సాత్యకి, ద్రుపదః = ద్రుపదుడు, దౌపదేయాశ్చ = ద్రౌపది కుమారులు, మహాబాహుః = గొప్ప బాహువులు గల; సౌభద్రశ్చ = అభిమన్యుడు, సర్వశః = అన్ని వైపుల నుండి, పృథక్ పృథక్ = వేరు వేరుగా, శఙ్ఖాన్ = శంఖాలను, దధ్ముః = పూరించిరి. 17, 18

మూ. స ఘోషో ధర్తరాష్ట్రాణాం హృదయాని వ్యదారయత్,
నభశ్చ పృథివీం చైవ తుములో వ్యనునాదయన్. 19

ప్ర.అ. తుములః = వ్యాకులమైన, సః ఘోషః = ఆ ధ్వని, నభశ్చ = ఆకాశాన్ని, పృథివీం చైవ = భూమినీ, వ్యనునాదయన్ = ప్రతిధ్వనింపచేస్తూ, ధార్తరాష్ట్రాణామ్ = కౌరవుల యొక్క హృదయాని = గుండెలను, వ్యదారయత్ = చీల్చెను, కంపింపచేసెను. 19

మూ. అథ వ్యవస్థితాన్ దృష్ట్వా ధార్తరాష్ట్రాన్ కపిధ్వజః,
ప్రవృత్తే శస్త్రసంపాతే ధనురుద్యమ్య పాణ్డవః. 20
హృషీకేశం తదా వాక్యమిదమాహ మహీపతే.

ప్ర.అ. అథేతి :- మహీపతే = మహారాజా ! అథ = అటుపిమ్మట, శస్త్రసంపాతే = యుద్ధం, ప్రవృత్తే = ప్రారంభం కానుండగా, కపిధ్వజః = హనుమంతుడు ధ్వజమునందు గల, పాణ్డవః = అర్జునుడు, వ్యవస్థితాన్ = యుద్ధసన్నద్ధులై నిలచి ఉన్న, ధార్తరాష్ట్రాన్ = కౌరవులను, దృష్ట్వా = చూచి, తదా = అప్పుడు, హృషీకేశమ్ = శ్రీకృష్ణుని గూర్చి, ఇదం వాక్యమ్ = ఈ వాక్యమును, ఆహ = పలికెను. 20 ½

మూ. అర్జున ఉవాచ –

సేనయోరుభయోర్మధ్యే రథం స్థాపయ మేఽచ్యుత, 21

యావదేతాన్నిరీక్షేఽహం యోద్ధుకామానవస్థితాన్,

కైర్మయా సహ యోద్ధవ్యమస్మిన్ రణసముద్యమే. 22

ప్ర.అ. సేనయోరితి :– అచ్యుత = శ్రీకృష్ణా ! అస్మిన్ = ఈ, రణసముద్యమే = యుద్ధ ప్రయత్నంలో, మయా = నాచేత, కైః సహ = ఎవరితో, యోద్ధవ్యమ్ = యుద్ధం చేయవలసి ఉన్నదో, తెలుసుకొనడానికి, అవస్థితాన్ = ఇక్కడ నిలచి ఉన్న, యోద్ధుకామాన్ = యుద్ధం చేయవలె నను కోరిక గల, ఏతాన్ = వీళ్లను, అహమ్ = నేను యావత్ నిరీక్షే = చూస్తాను; రథమ్ = రథమును, ఉభయోః, రెండు = సేనయోః = సేనల, మధ్యే = మధ్యమందు, స్థాపయ = నిలుపుము. 21, 22

మూ. యోత్స్యమానానవేక్షేఽహం య ఏతేఽత్ర సమాగతాః,

ధార్తరాష్ట్రస్య దుర్బుద్ధేర్యుద్ధే ప్రియచికీర్షవః. 23

ప్ర.అ. దుర్బుద్ధేః = దుర్బుద్ధియైన, ధార్తరాష్ట్రస్య = దుర్యోధనునికి, యుద్ధే = యుద్ధము నందు, ప్రియచికీర్షవః = ప్రియం చేయదలచుచున్నవారై, యే ఏతే = ఏ వీళ్లు, అత్ర = ఇక్కడ, సమాగతాః = వచ్చి ఉన్నారో, అట్టి, యోత్స్యమానాన్ = యుద్ధం చేయబోయే వాళ్లను, అహమ్ = నేను, అవేక్షే = చూస్తాను. 23

మూ. సంజయ ఉవాచ –

ఏవముక్తో హృషీకేశో గుడాకేశేన భారత,

సేనయోరుభయోర్మధ్యే స్థాపయిత్వా రథోత్తమమ్. 24

భీష్మద్రోణప్రముఖతః సర్వేషాం చ మహీక్షితామ్,

ఉవాచ పార్థ పశ్యైతాన్ సమవేతాన్ కురూనితి. 25

ప్ర.అ. ఏవమితి :– భారత = ధృతరాష్ట్రమహారాజా ! గుడాకేశేన = అర్జునునిచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తః = చెప్పబడిన, హృషీకేశః = శ్రీకృష్ణుడు, ఉభయోః = రెండు, సేనయోః = సేనలయొక్క, మధ్యే = మధ్యయందు, రథోత్తమమ్ = శ్రేష్ఠమైన రథాన్ని, స్థాపయిత్వా = నిలిపి, భీష్మద్రోణప్రముఖతః = భీష్మద్రోణుల ఎదుట, సర్వేషామ్ = అందరు, మహీక్షితాం చ = రాజులయొక్క, ఎదుట, రథోత్తమమ్ = శ్రేష్ఠమైన రథమును, స్థాపయిత్వా = నిలిపి, పార్థ = అర్జునా, సమవేతాన్ = ఒక్క చోట కలిసి ఉన్న, ఏతాన్ = ఈ, కురూన్ = కౌరవులను, పశ్య = చూడుము, ఇతి = అని, ఉవాచ = పలికెను. 24,25

మూ. తత్రాపశ్యత్ స్థితాన్ పార్థః పితౄనథ పితామహాన్,
ఆచార్యాన్ మాతులాన్ భ్రాతౄన్ పౌత్రాన్సఖీంస్తథా. 26
శ్వశురాన్ సుహృదశ్చైవ సేనయోరుభయోరపి. 26 ½

ప్ర.అ. తత్రేతి :- అథ = పిమ్మట, పార్థః = అర్జునుడు, తత్ర = అక్కడ, ఉభయోః = రెండు, సేనయోరపి = సేనలలోనూ కూడ, స్థితాన్ = ఉన్న, పితౄన్ = తండ్రులను, పితామహాన్ = తాతలను, ఆచార్యాన్ = గురువులను, మాతులాన్ = మేనమామలను, భ్రాతౄన్ = సోదరులను, పుత్రాన్ = పుత్రులను, పౌత్రాన్ = పౌత్రులను, తథా = మరియు, సఖీన్ = స్నేహితులను, శ్వశురాన్ = మామలను, సుహృదః చ ఏవ = మంచి హృదయం గల మిత్రులను, అపశ్యత్ = చూచెను. 26

మూ. తాన్ సమీక్ష్య స కౌన్తేయః సర్వాన్ బన్ధూనవస్థితాన్, 27
కృపయా పరయాऽऽవిష్టో విషీదన్నిదమబ్రవీత్.

ప్ర.అ. తానితి :- సః = ఆ, కౌన్తేయః = అర్జునుడు, తాన్ = ఆ, సర్వాన్ = సమస్తమైన, అవస్థితాన్ = నిలబడి ఉన్న, బన్ధూన్ = బంధువులను, సమీక్ష్య = చూచి, పరయా = గొప్ప, కృపయా = జాలితో, ఆవిష్టః = ఆవేశించబడినవాడై, విషీదన్ = దుఃఖించుచు, ఇదమ్ = ఈ వాక్యమును, అబ్రవీత్ = పలికెను. 27 1/2

మూ. అర్జున ఉవాచ -
దృష్ట్వేమం స్వజనం కృష్ణ యుయుత్సుం సముపస్థితమ్, 28
సీదన్తి మమ గాత్రాణి ముఖం చ పరిశుష్యతి.
వేపథుశ్చ శరీరే మే రోమహర్షశ్చ జాయతే. 29

ప్ర.అ. అర్జునుడిట్లనెను. దృష్ట్వా ఇతి :- కృష్ణ = కృష్ణా! సముపస్థితమ్ = ఇక్కడికి వచ్చి ఉన్న, యుయుత్సుమ్ = యుద్ధం చేయ గోరుచున్న, ఇమమ్ = ఈ, స్వజనమ్ = బంధు జనాన్ని, దృష్ట్వా = చూచి, మమ గాత్రాణి = నా అవయవాలు, సీదన్తి = బలం ఉడిగి పోయినవి అవుతున్నాయి. ముఖం చ = ముఖం (నోరు) కూడా, పరిశుష్యతి = ఎండిపోవుచున్నది. మే శరీరే = నా శరీరంలో, వేపథుః చ = కంపము, జాయతే = కలుగుచున్నది. రోమహర్షః చ = రోమాంచం కూడా, జాయతే = కలుగుచున్నది. 28, 29

మూ. గాణ్డీవం స్రంసతే హస్తాత్ త్వక్చైవ పరిదహ్యతే,
న చ శక్నోమ్యవస్థాతుం భ్రమతీవ చ మే మనః. 30

ప్ర.అ. గాణ్డీవమితి :- హస్తాత్ = చేతినుండి, గాణ్డీవమ్ = గాండీవము (ఆ పేరు గల ధనుస్సు), స్రంసతే = జారిపోవుచున్నది. త్వక్ = చర్మ, పరిదహ్యతే చైవ =

కాలిపోతూన్నది. అవస్థాతుం చ = నిలబడడానికి కూడా, న శక్నోమి = సమర్థుడను కాను, మే = నా యొక్క మనః = మనస్సు, భ్రమతీవ చ = తిరిగిపోతున్నట్లున్నది. 30

మూ. నిమిత్తాని చ పశ్యామి విపరీతాని కేశవ,
న చ శ్రేయోఽనుపశ్యామి హత్వా స్వజనమాహవే. 31

ప్ర.అ. **నిమిత్తానీతి** :- కేశవ = కృష్ణా, విపరీతాని = విపరీతమైన, నిమిత్తాని = శకునాలను, పశ్యామి చ = చూస్తున్నాను కూడ, ఆహవే = యుద్ధంలో, స్వజనమ్ = బంధుజనాన్ని, హత్వా = చంపి (చంపడంవల్ల), శ్రేయః = శ్రేయస్సును, న అనుపశ్యామి చ = (నేను) చూడడం లేదు కూడ. 31

మూ. న కాఙ్క్షే విజయం కృష్ణ న చ రాజ్యం సుఖాని చ,
కిం నో రాజ్యేన గోవిన్ద కిం భోగైర్జీవితేన వా. 32

ప్ర.అ. **నేతి** :- కృష్ణ = కృష్ణా! విజయమ్ = జయాన్ని, న కాఙ్క్షే = నేను కోరను. రాజ్యం చ = రాజ్యాన్ని కూడ, న = కోరను. సుఖాని చ = సుఖాలను కూడ కోరను. గోవిన్ద = ఓ! శ్రీకృష్ణా ! నః = మనకు, రాజ్యేన = రాజ్యంచేత, కిమ్ = ఏమి ప్రయోజనం? భోగైః = భోగాలచేత గాని, జీవితేన వా = జీవితంచేత గాని, కిమ్ = ఏమి ప్రయోజనం? 32

మూ. యేషామర్థే కాఙ్క్షితం నో రాజ్యం భోగాః సుఖాని చ
త ఇమేఽవస్థితా యుద్ధే ప్రాణాంస్త్యక్త్వా ధనాని చ. 33

ప్ర.అ. **యేషామితి** :- యేషామ్ అర్థే = ఎవరి నిమిత్తమై, నః =మనకు (మనచేత), రాజ్యమ్ = రాజ్యం, కాఙ్క్షితమ్ = కోరబడుచున్నదో, భోగాః = భోగాలు, సుఖాని చ = సుఖాలూ కూడ కోరబడుచున్నాయో, తే = అట్టి, ఇమే = వీళ్లు, ప్రాణాన్ = ప్రాణాలను, ధనాని చ = ధనాలను, త్యక్త్వా = విడచి, యుద్ధే = యుద్ధరంగంలో, అవస్థితాః = నిలచి ఉన్నారు. 33

మూ. ఆచార్యాః పితరః పుత్రాస్తథైవ చ పితామహాః,
మాతులాః శ్వశురాః పౌత్రాః శ్యాలాః సంబన్ధినస్తథా. 34

ప్ర.అ. **ఆచార్యా ఇతి** :- ఆచార్యాః = గురువులు, పితరః = తండ్రులు, పుత్రాః = పుత్రులు, తథైవ = అట్లే, పితామహాః చ = తాతలు, మాతులాః = మేనమామలు, శ్వశురాః = మామలు, పౌత్రాః = పౌత్రులు, శ్యాలాః = బావమరదులు, తథా = మరియు, సంబన్ధినః = ఇతర బంధువులు - వీళ్లందరు ప్రాణాలు త్యజించడానికి సిద్ధంగా ఉన్నారు.

మూ. ఏతాన్న హన్తుమిచ్ఛామి ఘ్నతోఽపి మధుసూదన,
అపి త్రైలోక్యరాజ్యస్య హేతోః కిం ను మహీకృతే. 35

ప్ర.అ. **ఏతానితి** :- మధుసూదన = కృష్ణా! ఘ్నతః అపి = (నన్ను) చంపుచున్నా కూడ, ఏతాన్ = వీళ్లను, త్రైలోక్యరాజ్యస్య హేతోః అపి = ముల్లోకాలపై ఆధిపత్యంకొరకు కూడ, హన్తుమ్ = చంపడానికి, న ఇచ్ఛామి = ఇష్టపడను, మహీకృతే = ఈ భూమి కోసమై, కిం ను = చెప్ప నేల? 35

మూ. నిహత్య ధార్తరాష్ట్రాన్నః కా ప్రీతిః స్యాజ్జనార్దన,
పాపమేవాశ్రయేదస్మాన్ హత్వైతానాతతాయినః. 36

ప్ర.అ. జనార్దన = కృష్ణా! ధార్తరాష్ట్రాన్ = ధృతరాష్ట్రకుమారులను, నిహత్య = చంపి, నః = మనకు, కా = ఏమి, ప్రీతిః = ఆనందం, స్యాత్ = కలుగును? ఏతాన్ = ఈ, ఆతతాయినః = ఆతతాయులను, హత్వా = చంపి, అస్మాన్ = మనలను, పాపమేవ = పాపమే, ఆశ్రయేత్ = ఆశ్రయించును (చుట్టుకొనును).

వి. **"అగ్నిదో గరదశ్చైవ శస్త్రపాణిర్ధనాపహః,**
క్షేత్రదారాపహర్తా చ షడేతే ఆతతాయినః.
ఆతతాయినమాయాన్తం హన్యాదేవావిచారయన్,
నాతతాయివధే దోషో హన్తుర్భవతి కశ్చన".

"ఇంటికి నిప్పు పెట్టినవాడు, విషం ఇచ్చినవాడు, మారణాయుధాలు ధరించినవాడు, ధనం అపహరించినవాడు, భూమిని అపహరించినవాడు, భార్యను అపహరించినవాడు ఈ ఆరు రకాల మనుష్యులు ఆతతాయులు. ఆతతాయి ఎదురుగా వస్తూంటే ఏ మాత్రమూ సందేహించ కుండా చంపివెయ్యాలి. ఆతతాయిని చంపితే చంపినవానికి ఎలాంటి దోషమూ లేదు" అని ధర్మశాస్త్రం. ఇలా ధర్మశాస్త్రం చెపుతున్నా కౌరవులు ఆతతాయు లని ఒక ప్రక్క అంటూనే వాళ్లను చంపితే పాపం వస్తుంది అని అర్జునుడు అంటున్నా డనగా ఆ సమయంలో ఆతని మనస్సు ఎంత వికలంగా ఉందో తెలుస్తూన్నది. 36

మూ. తస్మాన్నార్హా వయం హన్తుం ధార్తరాష్ట్రాన్ స్వబాన్ధవాన్,
స్వజనం హి కథం హత్వా సుఖినః స్యామ మాధవ. 37

ప్ర.అ. **తస్మాదితి** :- తస్మాత్ = ఆ కారణంవల్ల, వయమ్ = మనము, స్వబాన్ధవాన్ = మన బంధువులే అయిన, ధార్తరాష్ట్రాన్ = కౌరవులను, హన్తుమ్ = చంపుటకు, న అర్హాః = తగినవారము కాదు. మాధవ = కృష్ణా ! స్వజనమ్ = బంధుజనాన్ని, హత్వా = చంపి, కథమ్ = ఎట్లు, సుఖినః = సుఖవంతులము, స్యామ = అగుదుము? 37

మూ. యద్యప్యేతే న పశ్యన్తి లోభోపహతచేతసః,
కులక్షయకృతం దోషం మిత్రద్రోహే చ పాతకమ్. 38
కథం న జ్ఞేయమస్మాభిః పాపాదస్మాన్నివర్తితుమ్,
కులక్షయకృతం దోషం ప్రపశ్యద్భిర్జనార్దన. 39

ప్ర.అ. **యద్యపీతి** :- జనార్దన = కృష్ణా! ఏతే = వీళ్లు, లోభోపహతచేతసః = దురాశచేత చెడిపోయిన మనస్సులు కలవారై, కులక్షయకృతమ్ [illegible]ను నశించడంవల్ల చేయబడిన (కలుగు), దోషమ్ = దోషమును, మిత్రద్రోహే = మిత్రులకు ద్రోహం చేయడంలో, పాతకమ్ = పాపాన్నీ, న పశ్యన్తి యద్యపి = చూడకపోయినా, కులక్షయకృతమ్ = కులక్షయం వల్ల కలిగే, దోషమ్ = దోషాన్ని, ప్రపశ్యద్భిః = చూస్తూన్న, అస్మాభిః = మనచేత, అస్మాత్ = ఈ, పాపాత్ = పాపంనుండి, నివర్తితుమ్ = వెనుకకు మరలుటకు, కథం న జ్ఞేయమ్ = ఎందుకు తెలియబడకూడదు? 38,39

మూ. కులక్షయే ప్రణశ్యన్తి కులధర్మాః సనాతనాః,
ధర్మే నష్టే కులం కృత్స్న మధర్మోఽభి భవత్యుత. 40

ప్ర.అ. **కులక్షయే ఇతి** :- కులక్షయే = కులం నశించగా (భ్రష్టము కాగా), సనాతనాః = శాశ్వతమైన, ప్రాచీనకాలంనుండీ వస్తూన్న, కులధర్మాః = కులంలో ఆచరించబడే ధర్మాలు, ప్రణశ్యన్తి = నశిస్తాయి. ధర్మే = ధర్మం, నష్టే = నశించిన దగుచుండగా, కృత్స్నమ్ = సమస్తమైన, కులమ్ = కులమును, అధర్మః = అధర్మం, ఉత = తప్పక, అభిభవతి = అణచి వేస్తుంది. 40

మూ. అధర్మాభిభవాత్ కృష్ణ ప్రదుష్యన్తి కులస్త్రియః,
స్త్రీషు దుష్టాసు వార్ష్ణేయ జాయతే వర్ణసంకరః. 41

ప్ర.అ. **అధర్మేతి** :- కృష్ణ = కృష్ణా! అధర్మాభిభవాత్ = ధర్మాన్ని అధర్మం అణచి వేయడంవల్ల కులస్త్రియః = కులస్త్రీలు, ప్రదుష్యన్తి = చెడిపోతారు. వార్ష్ణేయ = శ్రీకృష్ణా! స్త్రీషు = స్త్రీలు, దుష్టాసు = చెడిపోగా, వర్ణసంకరః = వర్ణసంకరం, జాయతే = కలుగును. 41

మూ. సంకరో నరకాయైవ కులఘ్నానాం కులస్య చ,
పతన్తి పితరో హ్యేషాం లుప్తపిణ్డోదకక్రియాః. 42

ప్ర.అ. **సంకర ఇతి** :- సంకరః = వర్ణసంకరం, కులఘ్నానామ్ = కులాన్ని నశింప చేసినవాళ్లయొక్క, కులస్య చ = కులముయొక్క నరకాయైవ = నరకముకొరకే అవుతుంది. వాళ్లకు నరకాన్ని ఇస్తుంది. హి = ఎందువల్ల ననగా, ఏషామ్ = వీళ్లయొక్క పితరః = పితరులు (పూర్వపురుషులు), లుప్తపిణ్డోదకక్రియాః = లోపించిన పిండక్రియ,

ఉదక క్రియా కలవారై (పిండదానము, జలతర్పణము లేనివారై), పతన్తి = అధోలోకాల్లో పడిపోతారు. 42

మూ. దోషైరేతైః కులఘ్నానాం వర్ణసంకరకారకైః,
ఉత్సాద్యన్తే జాతిధర్మాః కులధర్మాశ్చ శాశ్వతాః. 43

ప్ర.అ. **దోషైరితి** :- వర్ణసంకరకారకైః = వర్ణసంకరం కలిగించే, ఏతైః = ఈ, కులఘ్నానాం దోషైః = కులాలను నశింపచేసేవాళ్ల దోషాలచేత, శాశ్వతాః = శాశ్వతములైన, జాతి ధర్మాః = జాతియొక్క ధర్మాలు, కులధర్మాశ్చ = కులానికి (వంశానికి) సంబంధించిన ధర్మాలు, ఉత్సాద్యన్తే = నశింపచేయబడతాయి. 43

మూ. ఉత్సన్నకులధర్మాణాం మనుష్యాణాం జనార్దన,
నరకే నియతం వాసో భవతీత్యనుశుశ్రమ. 44

ప్ర.అ. **ఉత్సన్నేతి** :- జనార్దన = కృష్ణా ! ఉత్సన్నకులధర్మాణామ్ = నశించిన కులధర్మాలు గల, మనుష్యాణామ్ = మానవులకు, నియతమ్ = తప్పక, నిరయే = నరకంలో, వాసః = నివాసం, భవతి ఇతి = కలుగుతుంది అని, అను శుశ్రుమ = వింటున్నాము. 44

మూ. అహో బత మహత్పాపం కర్తుం వ్యవసితా వయమ్,
యద్రాజ్యసుఖలోభేన హన్తుం స్వజనముద్యతాః. 45

ప్ర.అ. **అహో ఇతి** :- అహో = అయ్యో ! బత = ఎంత కష్టము ! రాజ్యసుఖలోభేన = రాజ్యసుఖమునందు దురాశచేత, వయమ్ = మనము, యత్ = ఎందువలన, స్వజనమ్ = మన బంధుజనాన్ని, హన్తుమ్ = చంపుటకు, ఉద్యతాః = ఉద్యుక్తుల మైనామో అందువలన, మహత్ = గొప్ప, పాపమ్ = పాపమును, కర్తుమ్ = చేయుటకు, వ్యవసితాః = నిశ్చయించుకొన్నాము. 45

మూ. యది మామప్రతీకారమశస్త్రం శస్త్రపాణయః,
ధార్తరాష్ట్రా రణే హన్యుస్తన్మే క్షేమకరం భవేత్. 46

ప్ర.అ. **యదీతి** :- అశస్త్రమ్ = ఆయుధముల లేనివాడను, అప్రతీకారమ్ = ప్రతిక్రియ చేయనివాడను అయిన, మామ్ = నన్ను, శస్త్రపాణయః = ఆయుధములు హస్తములలో గల, ధార్తరాష్ట్రాః = కౌరవులు, రణే = యుద్ధమ నందు, హన్యుః యది = చంపినట్లయితే, తత్ = అది, మే = నాకు, క్షేమకరమ్ = క్షెమం కలిగించేది, భవేత్ = అగును. 46

మూ. సంజయ ఉవాచ -

ఏవముక్త్వార్జునః సంఖ్యే రథోపస్థ ఉపావిశత్,
విసృజ్య సశరం చాపం శోకసంవిగ్నమానసః. 47

ఇతి శ్రీమహాభారతే శతసాహస్ర్యాం సంహితాయాం వైయాసిక్యాం భీష్మ పర్వణి శ్రీమద్భగవద్గీతాసు ఉపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే శ్రీకృష్ణార్జున సంవాదే అర్జునవిషాదయోగో నామ ప్రథమోఽధ్యాయః. 1

ప్ర.అ. సంజయు డిలా అన్నాడు -

ఏవమితి :- అర్జునః = అర్జునుడు, సంఖ్యే = యుద్ధంలో (యుద్ధరంగంలో), ఏవమ్ = ఇట్లు, ఉక్త్వా = పలికి, సశరమ్ = బాణాలతో కూడిన, చాపమ్ = ధనస్సును, విసృజ్య = విడచి, శోకసంవిగ్నమానసః = శోకముతో కలత చెందిన మనస్సు కలవాడై, రథోపస్థే = రథపీఠముమీద, ఉపావిశత్ = కూర్చుండిపోయెను. 47

వ్యాసరచితమైన లక్ష శ్లోకాల సంహితయైన మహాభారతంలో, భీష్మపర్వంలో

శ్రీకృష్ణార్జునసంవాదరూపము యోగశాస్త్రము, ఉపనిషత్తులు, బ్రహ్మవిద్య అయిన

శ్రీమద్భగవద్గీతలలో అర్జున విషాదయోగం అను ప్రథమాధ్యాయం సమాప్తం.

"బాలనందిని" అను / శ్రీమద్భగవద్గీతాశాంకరభాష్యాంధ్ర

వ్యాఖ్యానంలో ప్రథమాధ్యాయం సమాప్తం.

అథ ద్వితీయోఽధ్యాయః

మూ. సంజయ ఉవాచ -

తం తథా కృపయావిష్టమశ్రుపూర్ణాకులేక్షణమ్,
విషీదన్తమిదం వాక్యమువాచ మధుసూదనః. 1

సంజయుడు ఇట్లు చెప్పెను -

ప్ర.అ. తమితి :- తథా = అట్లు, కృపయా = జాలితో, ఆవిష్టమ్ = ఆవహించబడిన వాడు, అశ్రుపూర్ణాకులేక్షణమ్ = కన్నీళ్లతో నిండిన వ్యాకులమైన నేత్రాలు కలవాడు, విషీదన్తమ్ = విషాదం చెందుతూన్నవాడు అయిన, తమ్ = ఆ అర్జునుని గూర్చి, మధుసూదనః = శ్రీకృష్ణుడు, ఇదం వాక్యమ్ = ఈ వాక్యమును, ఉవాచ = పలికెను. 1

మూ. కుతస్త్వా కశ్మలమిదం విషమే సముపస్థితమ్,
అనార్యజుష్టమస్వర్గ్యమకీర్తికరమర్జున. 2

ప్ర.అ. భగవంతుడైన శ్రీకృష్ణు డిట్లనెను.

కుత ఇతి :- అర్జున = అర్జునా ! అనార్యజుష్టమ్ = ఆర్యులు కానివారిచేత, అనగా, శాస్త్రజ్ఞానం లేనివారిచేత; పొందబడేది, అస్వర్గ్యమ్ = స్వర్గానికి ఉపకరించనిది. స్వర్గం ఇవ్వనిది, అకీర్తికరమ్ = అకీర్తిని కలిగించేది అయిన, ఇదమ్ = ఈ, కశ్మలమ్ = మాలిన్యము, విషమే = క్లిష్టసమయంలో, కుతః = ఎక్కడినుండి, త్వా = నిన్ను, సముపస్థితమ్ = వచ్చిచేరినది? 2

మూ. క్లైబ్యం మా స్మ గమః పార్థ నైతత్త్వయ్యుపపద్యతే.
క్షుద్రం హృదయదౌర్బల్యం త్యక్త్వోత్తిష్ఠ పరంతప. 3

ప్ర.అ. **క్లైబ్యమితి** :- పార్థ = అర్జునా ! క్లైబ్యమ్ = అధైర్యమును, మా స్మ గమః = పొందకుము. ఏతత్ = ఇది, త్వయి = నీయందు, న ఉపపద్యతే = తగదు. పరంతప = శత్రువులను పీడించేవాడా ! క్షుద్రమ్ = నీచమైన, హృదయదౌర్బల్యమ్ = హృదయదౌర్బల్యాని, త్యక్త్వా = విడచి, ఉత్తిష్ఠ = లెమ్ము. 3

మూ. అర్జున ఉవాచ -
కథం భీష్మమహం సంఖ్యే ద్రోణం చ మధుసూదన,
ఇషుభిః ప్రతియోత్స్యామి పూజార్హావరిసూదన. 4

ప్ర.అ. అర్జునుడిట్లనెను -

కథమితి :- అరిసూదన = శత్రువులను నశింపచేయువాడా ! మధుసూదన = కృష్ణా! పూజార్హౌ = పూజించుటకు తగిన, భీష్మమ్ = భీష్ముణ్ణి, ద్రోణం చ = ద్రోణాచార్యునీ. సంఖ్యే = యుద్ధమునందు, అహమ్ = నేను, కథమ్ = ఎట్లు, ఇషుభిః = బాణాలతో. ప్రతియోత్స్యామి = ఎదిరించి యుద్ధం చేయుదును? 4

మూ. గురూనహత్వా హి మహానుభావాన్
శ్రేయో భోక్తుం భైక్ష్యమపీహ లోకే,
హత్వార్థకామాంస్తు గురూనిహైవ
భుఞ్జీయ భోగాన్ రుధిరప్రదిగ్ధాన్. 5

ప్ర.అ. **గురూనితి** :- మహానుభావాన్ = గొప్ప తపోవిద్యాదిసంపద గల, గురూన్ = గురువులను, పూజ్యులను, అహత్వా = చంపకుండా, ఇహ లోకే = ఈ లోకంలో, భైక్ష్యమ్ = భిక్షాన్నమును, భోక్తుమ్ అపి = తినుటకు కూడ (తినుట కూడ), శ్రేయః = శ్రేయస్కరము. గురూన్ = గురువులను, హత్వా తు = చంపి యైతే (చంపినట్లయితే). ఇహైవ = ఇక్కడ మాత్రమే, అర్థకామాన్ = అర్థములను, కామాలను, రుధిర ప్రదిగ్ధాన్ =

రక్తముచేత పూయబడిన, భోగాన్ = భోగాలను, అనగా రక్తంలో తడిసిన భోగాల రూపంలో ఉన్న అర్థకామాలను, భుఞ్జీయ = అనుభవింతును. వాటిని ఈ లోకంలో మాత్రమే అనుభవిస్తానేమో కాని స్వర్గాద్యుత్తమలోకప్రాప్తి మాత్రం ఉండదు అని భావం. 5

మూ. న చైత ద్విద్మః కతరన్నో గరీయో
యద్వా జయేమ యది వా నో జయేయుః,
యానేవ జిత్వా న జిజీవిషామ
స్తే౽ వస్థితాః ప్రముఖే ధార్తరాష్ట్రాః. 6

ప్ర.అ. నేతి :- యద్వా జయేమ = మనం జయించినా, నః = మనలను, యది వా జయేయుః = వాళ్లు జయించినా, కతరత్ = ఏది, గరీయః = గొప్పదో, ఏతత్ = ఈ విషయాన్ని, న విద్మః = మేము తెలుసుకొనజాలకున్నాము. యానేవ = ఎవరిని, హత్వా = చంపి, న జిజీవిషామః = జీవించా లని కోరుకొనమో, తే = ఆ, ధార్తరాష్ట్రాః = ధృతరాష్ట్ర కుమారులు, ప్రముఖే = మన ఎదుట, అవస్థితాః = నిలచి ఉన్నారు. 6

మూ. కార్పణ్యదోషోపహతస్వభావః,
పృచ్ఛామి త్వాం ధర్మసంమూఢచేతాః,
యచ్ఛ్రేయః స్యాన్నిశ్చితం బ్రూహి తన్మే
శిష్యస్తే౽ హం శాధి మాం త్వాం ప్రపన్నమ్. 7

ప్ర.అ. కార్పణ్యేతి :- కార్పణ్యదోషోపహతస్వభావః = దైన్యం అనే దోషంచేత కొట్టబడిన స్వభావం (చిత్తం) కలవాడనై, ధర్మసంమూఢచేతాః = ధర్మం విషయంలో మోహం చెందిన మనస్సు కలవాడనై, త్వామ్ = నిన్ను, పృచ్ఛామి = అడుగుచున్నాను. మే = నాకు, యత్ = ఏది, శ్రేయః = శ్రేయస్సుగా, స్యాత్ = అగునో, తత్ = దానిని, నిశ్చితమ్ = నిశ్చితంగా, బ్రూహి = చెప్పుము. అహమ్ = నేను, తే = నీయొక్క, శిష్యః = శిష్యుడను, త్వామ్ = నిన్ను, ప్రపన్నమ్ = శరణుజొచ్చిన, మామ్ = నన్ను, శాధి = శాసించుము. 7

మూ. న హి ప్రపశ్యామి మమాపనుద్యా
ద్యచ్ఛోకముచ్ఛోషణమిన్ద్రియాణామ్,
అవాప్య భూమావసపత్నమృద్ధం
రాజ్యం సురాణామపి చాధిపత్యమ్. 8

ప్ర.అ. నేతి :- భూమౌ = భూలోకమునందు, అసపత్నమ్ = శత్రువులు లేని, ఋద్ధమ్ = సకలైశ్వర్యసంపన్నమైన, రాజ్యమ్ = రాజ్యమును, అవాప్య = పొందినా, సురాణామ్ = దేవతల, ఆధిపత్యమ్ అపి = ఆధిపత్యాన్ని పొందినా కూడ, యత్ = ఏది,

ఇన్ద్రియాణామ్ = ఇంద్రియాలకు, ఉచ్ఛోషణమ్ = శోషణమును కలిగించే, మమ శోకమ్ = నా శోకాన్ని, అపనుద్యాత్ = తొలగించునో, అట్టి దానిని దేనినీ కూడ, న ప్రపశ్యామి హి = చూడను. 8

మూ. సంజయ ఉవాచ -

ఏవముక్త్వా హృషీకేశం గూడాకేశః పరంతపః,
న యోత్స్య ఇతి గోవవిన్దముక్త్వా తూష్ణీం బభూవ హ. 9

ప్ర.అ. సంజయుడు పలికెను -

ఏవమ్ ఇతి :- పరంతపః = శత్రుసంతాపకారియైన, గుడాకేశః = అర్జునుడు, హృషీకేశమ్ = ఇంద్రియాలకు ప్రభువైన (సకల ప్రాణుల ఇంద్రియాల ప్రవృత్తికి కారణ భూతుడైన), గోవిన్దమ్ = శ్రీకృష్ణుణ్ణి గూర్చి, ఏవమ్ = ఇట్లు, ఉక్త్వా = పలికి, న యోత్స్యే = యుద్ధం చెయ్యను, ఇతి = అని, ఉక్త్వా = అని, తూష్ణీం బభూవ హ = మౌనముగా ఉండిపోయెను. 9

మూ. తమువాచ హృషీకేశః ప్రహసన్నివ భారత,
సేనయోరుభయోర్మధ్యే విషీదన్తమిదం వచః. 10

ప్ర.అ. **తమితి** :- భారత = మహారాజా ! ఉభయోః = రెండు, సేనయోః మధ్యే = సేనల మధ్యయందు, విషీదన్తమ్ = దిగులు చెందుచున్న, తమ్ = ఆ అర్జునుని గూర్చి, హృషీకేశః = శ్రీకృష్ణుడు, ప్రహసన్నివ = పరిహసిస్తూన్నవాడు వలె, ఇదమ్ = ఈ, వచః = వచనమును, ఉవాచ = పలికెను. 10

వి. "ధర్మక్షేత్రే కురుక్షేత్రే" ఇత్యాదిప్రథమాధ్యాయప్రథమశ్లోకం మొదలు ద్వితీయాధ్యాయంలోని ఈ పదవ శ్లోకం వరకు ఉన్న గ్రంథభాగం. ఉపోద్ఘాతకథారూపమైనది. అసలు భగవద్గీత ద్వితీయాధ్యాయంలోని పదకొండవ శ్లోకంతో - "అశోచ్యానన్వశోచస్త్వమ్" ఇత్యాది శ్లోకంతో, ప్రారంభం అవుతుంది. అందుచేతా ఇంతవరకూ ఉన్న గ్రంథం వ్యాఖ్యానాపేక్షం కాకపోవడం చేతా, శ్రీ శంకరభగవత్పాదులు ఈ శ్లోకంనుంచే తమ భాష్యం ప్రారంభించారు.

శ్రీ బెల్లంకొండ రామారావు అను ప్రసిద్ధ నామధేయం గల శ్రీ రామరాయకవి నాతిచిరభూతకాలంలో ఆంధ్రదేశాన్ని అలంకరించిన అద్వైతవిద్యాప్రవీణులలో అగ్రగణ్యులు. 1875లో జన్మించిన వీరు ముప్పై ఎనిమిది సంవత్సరాల అత్యల్పవయస్సులో స్వర్గస్థులైనారు. హయగ్రీవోపాసన చేసి హయగ్రీవానుగ్రహంచేత సమస్తశాస్త్రాలను హస్తామలకం చేసికొన్న ఈ మహాపురుషుడు అద్వైతసిద్ధాంతానికి సంబంధించిన అనేకగ్రంథాలు రచించారు. శ్రీ శంకరభగవత్పాదప్రణీత మైన భగవద్గీతాభాష్యానికి వీరు "భాష్యార్క ప్రకాశ"

అనే పేరుతో సువిస్తృతమూ ప్రామాణికమూ అయిన వ్యాఖ్య రచించారు. భగవద్రామానుజులు, వారి అనుయాయులైన వేదాంతదేశికాదులు తమ గ్రంథాలలో శాంకరభాష్యం మీద చాలా ఆక్షేపణలు చేసి ఉన్నారు. ఈ ఆక్షేపణ లన్నింటికీ శాంకరభాష్యాదులలోనే సమాధానాలు దొరుకుతాయి. అయినా కూడ శ్రీ రాయకవి చెప్పినట్లు ఆక్షేపణంకొరకే ఆక్షేపణ అన్న పద్ధతిలో నడిచాయి ఈ ఆక్షేపణలన్నీ. "గీతాభిప్రాయః శాఙ్కరభాష్యాదేవ జ్ఞేయః, న తు రామానుజభాష్యాదిభిః, తేషాం శ్రీ శఙ్కరభాష్యనిన్దైకప్రధానోద్దేశత్వాత్ మూలాననుగతార్థత్వాత్ వేదాన్తవిరుద్ధత్వేనాప్రమాణత్వాచ్చ తద్భాష్యాణామ్" (భా.అ.ప్ర. ప్రారంభంలో). అందుచేత ఆ ఆక్షేపణ లన్నింటికీ తగు సమాధానాలు చూపుతూ ప్రత్యాక్షేపణలు చేయడంకోసమే శ్రీరామరాయకవి తాము వ్యాఖ్య వ్రాయడానికి పూనుకొనునట్లు ప్రారంభంలోనే చెప్పుకొన్నారు. – "తత్ర చశఙ్కరభాష్యప్రతిపక్షభూతభాష్యమధ్యే రామానుజభాష్యమేవ ప్రధానమితి ప్రధానమల్లనిబర్హణన్యాయేన రామానుజభాష్యే వేదాన్తదేశికకృత తాత్పర్యచన్ద్రికాసహితే శ్రుతియుక్త్యాదిభిః విమృష్టే సతి శాంకరభాష్యం నిరవద్యమ్, అప్రతిభటం స్థితం స్యాదిత్యేతదర్థమహమధునా మన్దమతిరపి శ్రీ హయగ్రీవదేవకృపయా శ్రీ శాఙ్కరభగవద్గీతాభాష్యవ్యాఖ్యానే ప్రవృత్తః" (భా.అ.ప్ర. ప్రారంభం). ఆ యా ఆక్షేపాలకు సమాధానాలు చెప్పే సందర్భాలలో శ్రీ రామరాయకవి తమ కున్న శాస్త్రపాటవంతోపాటు, ప్రతిపక్షులనే అనకరిస్తూ, వాక్కాటవం కూడా చూపించారు. ఈ ఆక్షేప – సమాధాన – ప్రత్యాక్షేపాదులు విషయ జిజ్ఞాసువులైన ధీమంతులకు చమత్కారజనకంగాను, తత్తత్సిద్ధాంత జ్ఞానోపయుక్తాలుగాను ఉంటా యనే అభిప్రాయంతో, కాటవాన్ని మాత్రం పరిత్యజించి, ఆ విషయాలను ఈ బాలానందినిలో ప్రతిపాదించడం జరిగింది.

భా.అ.ప్ర. "శంకరమతంలో గురుశిష్యాదిద్వైతమే లేనప్పుడు గ్రంథారంభమే అనుపపన్నం, యుక్తం కాదు అని వేదాంతదేశికుల ఆక్షేపం. దానికి సమాధానం పరమార్థ దశలో ద్వైతం లేకపోయినా వ్యవహారదశలో ఉంది కాబట్టి గ్రంథారంభం చేయడంలో అనుపపత్తి ఏదీ లేదు. సమాధి (నిర్వికల్పకసమాధి) మొదలైన అవస్థలలో ద్వైతం ఉండదు, తద్భిన్నావస్థలలోనే ద్వైతం ఉంటుంది. అని ద్వైతులు కూడా అంగీకరించవలసిన విషయమే కదా? ఎక్కడో ఎందుకు – సుషుప్తిలో (గాఢనిద్రావస్థలో) ద్వైతం ఉండ దనీ, ద్వైతం స్వప్నజాగరితావస్థలలో మాత్రమే ఉంటుం దనీ ప్రాణు లందరికీ తెలిసిన విషయమే. అందుచేతనే – **"యత్ర సర్వమాత్మైవాభూత్ తత్ కేన కం పశ్యేత్"** (అంతా ఆత్మయే అయినప్పుడు దేనితో దేనిని చూస్తాడు) అనే శ్రుతి సుషుప్తికి, ముక్తికీ కూడా అన్వయిస్తుంది అని వ్యాసుడే **"స్వాప్యయసంపత్త్యోః"** అనే సూత్రంలో ప్రతిపాదించాడు. అయితే "ద్వైతం ఉంటేనే వ్యవహారం ఉంటుంది, వ్యవహారం ఉంటేనే ద్వైతం ఉంటుంది" అని అన్యోన్యాశ్రయదోషం కదా అనడానికి వీలులేదు. బీజాంకురాల వలె ఈ ద్వైత – వ్యవహారాలు అనాదులు గాన (ఇవి ఫలానా సమయంలో ప్రారంభం అయినా యని చెప్పడానికి శక్యం

కావు గాన) అ దోషం లేదు. ఈ వ్యవహారం అజ్ఞానులకు మాత్రమే సంబంధించినది అనడానికి కూడ వీలు లేదు. అలా అంటే ఈశ్వరుడు కూడా లీలచేత జగజ్జన్మాదివ్యవహారం చేస్తున్నాడు గాన ఆ ఈశ్వరుడు కూడా అజ్ఞానియే అనవలసి వస్తుంది. ఈ ఉభయమూ కూడ (ద్వైతమూ, వ్యవహారమూ కూడ) అద్వితీయబ్రహ్మయందు కల్పితాలే గాన బ్రహ్మకు సద్వితీయత్వం అనేది కూడా ప్రసక్తం కాదు.

నిజానికి ఈ దోషం ప్రతిపక్షి శిరస్సుమీదనే వజ్రప్రహారం వలె పడుతుంది. అదెట్లనగా – ప్రలయావస్థలో ఈశ్వరుడు సూక్ష్మరూపంలో ఉన్న చిత్తులతోను (జీవులతోను) అచిత్తులతోను (జీవభిన్నజడపదార్థాలతోను) విశిష్టుడై (కలిసి) ఉంటాడనీ, ప్రపంచ దశలో స్థూలచిదచిత్తులతో కలిసి ఉంటా డనీ విశిష్టాద్వైతులు చెపుతారు. అందుచేత ఈశ్వరుడు ఎల్లప్పుడూ చిదచిద్విశిష్టుడే గాన చిదచిత్తులకు ఈశ్వరునితో సాయుజ్యం నిత్యమూ ఉండనే ఉంది. అందుచేత (ఈశ్వర సాయుజ్యరూప మైన మోక్షంకొరకై) వేదాంతశాస్త్రారంభం విశిష్టాద్వైతమతం ప్రకారం నిష్ఫలమే (అవసరం లేనిదే) అని చెప్పాలి. చిత్స్వరూపుడైన జీవునికి అచిత్తుతో కూడ కలిసి ఉన్న ఈశ్వరునితో సాయుజ్యం లభిస్తే ఈ చిత్తైన జీవుని అర్థాంశంచేత అచిత్త్వం కూడా, స్థావరత్వం కూడా, ప్రాప్తిస్తుంది. గాన వేదాంతాధ్యయనంవల్ల కలిగే ఈ సాయుజ్యం అనర్థకారి కూడ అవుతుంది. చిదచిత్తులు ఈశ్వరునికి విడదీయరాని విశేషణాలు, అంశాలు. అందుచేత తనతో నిత్యసంబద్ధులూ, తనకంటె భిన్నములుకాని వారూ అయిన చేతనులను ఉద్దేశించి ఈశ్వరుడు ఉపదేశించడం కుదరదు గాన కృష్ణుడు అర్జునునికి ఉపదేశించడం అనేది అనుపపన్నం. అర్జునుడు చిత్, శాస్త్రం అచిత్; ఈ చిదచిత్తులతో విశిష్టుడు (కూడి ఉన్నవాడు) ఈశ్వరుడు అనే స్థితిలో అర్జున – శాస్త్రవిశిష్టుడైన ఈశ్వరుడు అర్జునునికి శాస్త్రం ఉపదేశిస్తున్నాడు అనే మాటకు అర్థం లేదు కదా? ఎందుచేత అనగా ఆ శాస్త్రాన్ని ఉపదేశించడం అర్జునాదిభిన్నులైన వారికే (ఈశ్వరుని శేషులు కానివారికే) చేయబడడం యుక్తం కదా? లక్షణచేత విశేషణాంశాన్ని విడిచి పెడతాం అనడానికి కూడ కుదరదు. అనగా – "ఈశ్వరుడు అర్జునునికి శాస్త్రం ఉపదేశిస్తున్నాడు" అన్నప్పుడు విశేషణాలైన అర్జునుణ్ణి, శాస్త్రాన్ని వేరుగా చేసి ఈశ్వరు డనగా శుద్ధ డైన ఈశ్వరుడు అని లక్షణచేత చెపుతాం అనడానికి కుదరదు.) విడదీయరాని విశేషణాలను దూరం చేయడం కుదరదు కదా? అలా దూరం చేయకలిగితే అవి విశేషణాలే కాజాలవు. అర్జునుని దేహం అనే అచిత్తుతో విశిష్టుడైన ఈశ్వరుడు, కృష్ణదేహం అనే అచిత్తుతో విశిష్టుడైన ఈశ్వరుడు ఒక్కడే గాన గురువు, శిష్యుడూ, అనే భేదం కూడా కుదరదు. ఈశ్వరుడు కృష్ణదేహంలోనే ఉన్నాడు కాని అర్జునదేహంలో లేదు అని అంటే ఈశ్వరడు సర్వవ్యాపి అనే మీ సిద్ధాంతానికి భంగం వస్తుంది. అర్జునదేహవిశిష్ట చిత్తుకు కృష్ణదేహవిశిష్టేశ్వరుడు ఉపదేశిస్తున్నాడు అన్నా కూడా కుదరదు. ఎందుచేత ననగా అర్జున దేహంలో వలె కృష్ణదేహావచ్ఛిన్నుడైన ఈశ్వరుడు చిద్విశిష్టుడు కాకపోవడంవల్ల అపుడు ఆ ఈశ్వరుడు చిదచిద్విశిష్టేశ్వరుడు కాకుండా పోతాడు.

అర్జునదేహంతోను అర్జునచిత్‌తోను విశిష్టుడైన ఈశ్వరుడు, కృష్ణదేహంతోను కృష్ణచిత్‌తోను విశిష్టుడైన ఈశ్వరుడు ఒక్కడే కదా? ఈ విషయం ముందు ముందు స్పష్టం కాబోతుంది, అందుచేత ఇక్కడ విరమిస్తున్నాం" (పేజి. 3. వ్యాఖ్యాప్రారంభం)

భాష్యమ్

అత్ర "చ దృష్ట్వా తు పాణ్డవానీకమ్" (1.2) ఇత్యారభ్య యావత్ "న యోత్స్య ఇతి గోవిన్దముక్త్వా తూష్ణీం బభూవ హ" (2.9)

ఇత్యేతదన్తః ప్రాణినాం శోకమోహాదిసంసారబీజభూతదోషోద్భవకారణ ప్రదర్శనార్థత్వేన వ్యాఖ్యేయః గ్రన్థః.తథాహి - అర్జునేన రాజ్యగురుపుత్రమిత్ర సుహృత్స్వజనసంబన్ధిబాన్ధవేషు అహమ్ ఏషామ్" "మమ ఏతే" ఇత్యేవం భ్రాన్తిప్రత్యయనిమిత్తస్నేహవిచ్ఛేదాదినిమిత్తౌ ఆత్మనః శోకమోహౌ ప్రదర్శితౌ - "కథం భీష్మ మహం సంఖ్యే" (2-4) ఇత్యాదినా. శోకమోహాభ్యాం హి అభిభూతవివేకజ్ఞానః స్వత ఏవ క్షత్త్రధర్మే యుద్ధే ప్రవృత్తోఽపి తస్మాత్ యుద్ధాత్ ఉపరరామ; పరధర్మం చ భిక్షాజీవనాదికం కర్తుం ప్రవవృతే. తథా చ సర్వప్రాణినాం శోకమోహాదిదోషావిష్టచేతసాం స్వభావత ఏవ స్వధర్మపరిత్యాగః ప్రతిషిద్ధసేవా చ స్యాత్. స్వధర్మే ప్రవృత్తానామపి తేషాం వాఙ్మనఃకాయాదీనాం ప్రవృత్తిః ఫలాభిసంధిపూర్వికా ఏవ సాహఙ్కారా చ భవతి. తత్ర ఏవం సతి ధర్మాధర్మోపచయాత్ ఇష్టానిష్టజన్మసుఖదుఃఖాదిలక్షణః సంసారః అనుపరతః భవతి ఇత్యతః సంసారబీజభూతౌ శోకమోహౌ. తయోశ్చ సర్వకర్మసంన్యాసపూర్వకాత్ ఆత్మజ్ఞానాత్ నాన్యతః నివృత్తిః ఇతి తత్ ఉపదిదిక్షుః సర్వలోకానుగ్రహార్థమ్ అర్జునం నిమిత్తీకృత్య ఆహ భగవాన్ వాసుదేవః అశోచ్యానిత్యాది.

బాలనందిని

అత్రేతి :- ఇక్కడ "దృష్ట్వా తు పాణ్డవానీకమ్" మొదలు "న యోత్స్య ఇతి గోవిన్ద ముక్త్వా తూష్ణీం బభూవ హ" వరకు, ప్రాణులసంసారానికి బీజమైన శోకమోహాదిదోషాలు పుట్టడానికి ఏది కారణమో దానిని ప్రదర్శించడంకోసం ఉద్దిష్ట మైనది అని వ్యాఖ్యానించాలి (అర్థం చేసుకోవాలి). అదెట్లనగా - అర్జునుడు-రాజ్యం, గురువులు,పుత్రులు,మిత్రులు, సుహృత్తులు,స్వజనులు,సంబంధులు,బంధువులు-వీళ్ళ విషయంలో "నేను వీళ్ళవాడను", "వీళ్ళు నావాళ్ళు" అనే భ్రాంతిజ్ఞానంతో ఉన్నాడు. దానిచేత అతనికి వారిపై స్నేహం ఏర్పడింది. వాళ్లు మరణిస్తే ఆ సబంధం ఎక్కడ విచ్ఛిన్నం అవుతుందో అన్న భయం కూడా ఏర్పడింది. ఈ స్నేహ - విచ్ఛేదాదులవల్ల ఆతనిలో కలిగిన శోకమోహాలను అతడు "కథం భీష్మమహం సంఖ్యే" ఇత్యాదివాక్యాలలో ప్రదర్శించాడు. శోకమోహాలు అతని వివేకవిజ్ఞానాన్ని అణచివేయడంతో,అతడు తానుగానే క్షత్రియధర్మ మైన యుద్ధం చేయడానికి

సిద్ధమైనా కూడ, ఆ యుద్ధంనుండి విరమించాడు; పరధర్మమైన (సంన్యాసాదుల ధర్మమైన) భిక్షా జీవనాదికం స్వీకరించడానికి ఉద్యమించాడు. సర్వప్రాణులూ కూడ, వాళ్ల మనస్సులు శోక - మోహాది ఆవేశంలో ఉన్నప్పుడు, ఈ విధంగానే స్వధర్మాన్ని విడవడం, నిషిద్ధకర్మలు ఆచరించడం అనేది చేస్తూ ఉంటారు. అది స్వాభావికం. వాళ్లు స్వధర్మం ఆచరిస్తున్నా కూడ వాక్కుతోను, మనస్సుతోను, శరీరంతోను వాళ్లు చేసే పను లన్నీ ఫలకామనా పూర్వకంగా ఉంటాయి. (ఏదో ఫలం లభించా లనే కోరికతోనే ఆ కర్మలు చేస్తూంటారు). అహంకారపూర్వకంగా ఉంటాయి. (ఈ కర్మ నేను చేస్తున్నాను, నా కీ ఫలం లభిస్తుంది లేదా లభించాలి అనే ఆలోచనతో కర్మలు చేస్తారు). ఇలా చేయడంతో ధర్మాధర్మాలు పెరిగి పోతూనే ఉండడంవల్ల, ఇష్టానిష్టాలు కలగడంచేత సుఖదుఃఖాలు ప్రాప్తించడం అనే సంసారం నిరంతరం కొనసాగుతూనే ఉంటుంది. (ధర్మంవల్ల ఇష్టమైన ఫలం లభిస్తుంది, దానివల్ల సుఖం కలుగుతుంది. అధర్మంవల్ల అనిష్టం కలుగుతుంది. దానివల్ల దుఃఖం కలుగుతుంది. ఈ సుఖదుఃఖప్రాప్తియే సంసారం. అహంకారఫలాభిసంధు లున్నంత వరకూ ఈ సంసారం అవిచ్ఛిన్నంగా సాగుతూ ఉంటుంది అని భావం). అందుచేత సంసారానికి బీజమైనవి శోక-మోహాలు. అవి తొలగా లంటే సర్వకర్మసంన్యాసపూర్వక మైన ఆత్మజ్ఞానం ఒక్కటే ఉపాయం అనే విషాయాన్ని, అర్జునుణ్ణి నిమిత్తంగా చేసికొని, (అర్జునునికి ఉపదేశించడం ద్వారా సర్వలోకాన్ని అనుగ్రహించడం కోసం ఉపదేశించా లనే అభిలాషతో) భగవంతుడైన వాసుదేవుడు **"అశోచ్యానన్వశోచస్త్వమ్"** ఇత్యాదికం చెపుతున్నాడు.

భాష్యమ్

అత్ర కేచిత్ ఆహుః-సర్వకర్మసంన్యాసపూర్వకాత్ ఆత్మజ్ఞాననిష్ఠామాత్రాత్ ఏవ కేవలాత్ కైవల్యం న ప్రాప్యతే ఏవ-కిం తర్హి?అగ్నిహోత్రాదిశ్రౌతస్మార్తకర్మ సహితాత్ జ్ఞానాత్ కైవల్యప్రాప్తిః ఇతి సర్వాసు గీతాసు నిశ్చితః అర్థః ఇతి. జ్ఞాపకం చ ఆహుః అస్య అర్థస్య-**"అథ చేత్త్వమిమం ధర్మ్యం సంగ్రామం న కరిష్యసి"** (2.33), **"కర్మణ్యేవాధికారస్తే"** (2.47), **"కురు కర్మైవ తస్మాత్త్వమ్"** (4.15)ఇత్యాది. హింసాది యుక్తత్వాత్ వైదికం కర్మ అధర్మాయ ఇతి ఇయమ్ అపి ఆశఙ్కా న కార్యా. కథమ్? క్షాత్రం కర్మ యుద్ధలక్షణం గురుభ్రాతృపుత్రాదిహింసాలక్షణమ్ అత్యన్తక్రూరమ్ అపి స్వధర్మః ఇతి కృత్వా న అధర్మాయ; తదకరణే చ-**"తతః స్వధర్మం కీర్తిం చ హిత్వా పాపమవాప్స్యసి"**(2.33)ఇతి బ్రువతా యావజ్జీవాదిశ్రుతిచోదితానాం పశ్వాదిహింసా లక్షణానాం చ కర్మణాం ప్రాగేవ న అధర్మత్వమితి సునిశ్చితమ్ ఉక్తం భవతి-ఇతి.

బాలానందిని

అత్రేతి:- ఇక్కడ కొందరు ఇలా అంటున్నారు-సర్వకర్మసంన్యాసపూర్వక మైన ఆత్మజ్ఞాననిష్ఠామాత్రంచేత (సర్వకర్మలను సంన్యసించి ఆత్మజ్ఞానమునందే స్థిరంగా ఉండడం

చేత) కైవల్యం (మోక్షం)లభించనే లభించదు. మరేమిటి?అగ్నిహోత్రం మొదలైన శ్రౌతకర్మల తోను, స్మార్త (స్మృతులలో చెప్పిన)కర్మలతోను కలిసిన జ్ఞానంవల్ల మాత్రమే కైవల్యం లభిస్తుంది అనేది గీతలలో సునిశ్చితమైన విషయం అని అంటున్నారు.**"అథ....కరిష్యసి"** (ధర్మంసంమతమైన ఈ యుద్ధం నువ్వు చేయకపోతే),**"కర్మణ్యేవాధికారస్తే"**(నీకు కర్మయందే అధికారం),**"కురు కర్మైవ తస్మాత్త్వమ్"**(అందువల్ల నువ్వు కర్మయే చెయ్యి)ఇత్యాదివాక్యాలు ఈ విషయాన్నే సూచిస్తున్నాయి అని కూడా అంటున్నారు. అయితే హింసాదు లుండడం చేత వైదికకర్మ అధర్మానికి హేతువు అవుతుంది కదా అనే ఆశంక కూడా చేయవలసిన పని లేదు. అది ఎట్లు?"గురు-భ్రాతృ-పుత్రాదుల హింసతో కూడిన యుద్ధరూప మైన క్షత్రియధర్మం అత్యంతం క్రూరమైనా కూడ అది స్వధర్మం గాన అధర్మం కాదు. అది ఆచరించకపోతే-**"తతః...పాపమవాప్స్యసి"**(స్వధర్మాన్ని కీర్తిని కోల్పోయి పాపం పొందుతావు) అని చెప్పిన శ్రీకృష్ణుడు యావజ్జీవశ్రుతులచేత విధించబడిన ("జీవించి ఉన్నంతవరకు అగ్నిహోత్రం చెయ్యాలి"అని శ్రుతివాక్యాలచేత విధించబడిన)పశ్వాదిహింసలతో కూడిన కర్మలు అసలే అధర్మం కావు అని చెప్పి నట్లు అయింది-(అని అంటారు).

భాష్యమ్

తత్ అసత్;జ్ఞానకర్మనిష్ఠయోః విభాగవచనాత్ బుద్ధిద్వయాశ్రయయోః. **"అశోచ్యాన్"**(2.11)ఇత్యాదినా,భగవతా,యావత్**"స్వధర్మమపి చావేక్ష్య"**(2.31) ఇత్యేతదన్తేన గ్రన్థేన యత్పరమార్థాత్మతత్త్వనిరూపణం కృతం తత్ సాంఖ్యమ్. తద్విషయా చ బుద్ధిః ఆత్మనః జన్మాదిషడ్విక్రియాభావాత్ అకర్తా ఆత్మా ఇతి ప్రకరణార్థనిరూపణాత్ యా జాయతే, సా సాంఖ్యబుద్ధిః. సా యేషాం జ్ఞానినామ్ ఉచితా భవతి తే సాంఖ్యాః. ఏతస్యాః బుద్ధేః జన్మనః ప్రాక్ ఆత్మనః దేహాదివ్యతిరిక్తత్వకర్తృత్వభోక్తృత్వాద్య పేక్షః ధర్మాధర్మవివేకపూర్వకః మోక్షసాధనానుష్ఠానలక్షణః యోగః. తద్విషయా. బుద్ధిః యోగబుద్ధిః. సా యేషాం కర్మిణామ్ ఉచితా భవతి తే యోగినః. తథా చ భగవతా విభక్తే ద్వే బుద్ధీ నిర్దిష్టే **"ఏషా తేఽభిహితా సాంఖ్యే బుద్ధిర్యోగే త్విమాం శృణు"**(2.39) ఇతి.తయోశ్చ సాంఖ్యబుద్ధ్యాశ్రయాం జ్ఞానయోగేన నిష్ఠాం సాంఖ్యానాం విభక్తాం వక్ష్యతి- **"పురా వేదాత్మనా మయా ప్రోక్తా"**(3.3)ఇతి.తథా చ యోగబుద్ధ్యాశ్రయాం కర్మయోగేన నిష్ఠాం విభక్తాం వక్ష్యతి- **"కర్మయోగేన యోగినామ్"**(3.3)ఇతి.ఏవం సాంఖ్యబుద్ధిం యోగ బుద్ధిం చ ఆశ్రిత్య ద్వే నిష్ఠే విభక్తే భగవతా ఏవ ఉక్తే జ్ఞానకర్మణోః కర్తృత్వాకర్తృత్వైకత్వా నేకత్వబుద్ధ్యాశ్రయయోః యుగపత్ ఏకపురుషాశ్రయత్వాసంభవం పశ్యతా.

బాలానందిని

తదితి:- ఇది(వీరు చెప్పేది) అయుక్తం; ఎందువల్ల ననగా-రెండు విధా లైన బుద్ధులను ఆశ్రయించి ఉన్న ఈ జ్ఞాననిష్ఠా కర్మనిష్ఠా కూడ వేరు వేరైనవి అని చెప్పబడింది.

"అశోచ్యాన్"మొదలు,**"స్వధర్మమపి చావేక్ష్య"**వరకు ఉన్న గ్రంథంలో భగవంతుడు ఏ పరమార్థాత్మతత్త్వాన్ని ప్రతిపాదించాడో అది సాంఖ్యం. ప్రకరణార్థనిరూపణంవల్ల,అనగా ఆ ప్రకరణంలో,ఘట్టంలో, ఉన్న **"న జాయతే మ్రియతే"** ఇత్యాదిశ్లోకాల అర్థాన్ని పరిశీలించడంవల్ల, ఆత్మకు జన్మ మొదలైన ఆరు వికారాలు లేవు(పుట్టడం,ఉండడం,మార్పు చెందడం,పెరగడం,క్షీణించడం,నశించడం అనేవి ప్రతీ పదార్థానికీ ఉండే వికారాలు.అవి ఆత్మకు లేవు).అందువల్ల ఆత్మ అకర్త(కర్తృత్వం లేనిది, ఏ పనీ చేయనిది) అని దానిని గూర్చిన(పరమార్థాత్మతత్త్వాన్ని గూర్చిన) ఏ బుద్ధి (నిశ్చితజ్ఞానం) కలుగుతుందో అది సాంఖ్యబుద్ధి. అట్టి బుద్ధి ఏ జ్ఞానులకు తగి ఉంటుందో (అట్టి బుద్ధి కలగడానికి ఎవరు తగినవారో) వాళ్లు సాంఖ్యులు. ఈ సాంఖ్యబుద్ధి పుట్టడానికి ముందు ఉండేది యోగం. దీనిలో-ఇది ధర్మం, ఇది అధర్మం అనే వివేకంతో మోక్షసాధనాల(కర్మాదుల)అనుష్ఠానం ఉంటుంది. దేహాదులకంటె ఆత్మ భిన్న మైనది, అయితే దీనికి కర్తృత్వం,భోక్తృత్వం మొదలైనవి ఉంటాయి అనే భావం కూడ ఈ యోగంలో ఉంటుంది. అట్టి యోగాన్ని గూర్చిన బుద్ధి యోగబుద్ధి.కర్మాచరణాసక్తు లైన ఎవరి కైతే యోగబుద్ధి ఉచితమైనదో వాళ్లు యోగులు. **"ఏషా తే... శృణు"**(నీ కింతవరకు ఈ సాంఖ్యబుద్ధిని గూర్చి చెప్పాను;యోగబుద్ధిని గూర్చి చెపుతాను,విను) అని అంటూ భగవంతుడు ఈ రెండు బుద్ధులనూ వేరు వేరుగా చెప్పాడు. ఆ రెండింటిలో సాంఖ్యబుద్ధిని ఆశ్రయించిన జ్ఞానయోగనిష్ఠను సాంఖ్యులకు ఉద్దిష్ట మైనదానినిగా- **"పురా వేదాత్మనా మయా"** అని వేరుగా చెప్ప నున్నాడు. అట్లే యోగబుద్ధిని ఆశ్రయించిన కర్మయోగనిష్ఠను కూడ వేరుగా(జ్ఞానయోగనిష్ఠకంటె భిన్నంగా)**"కర్మయోగేణ యోగినామ్"**(యోగులకు కర్మయోగంచేత నిష్ఠ)అని చెప్పనున్నాడు. జ్ఞాననిష్ఠ అకర్తృత్వాన్ని, ఏకత్వాన్ని ఆశ్రయించి ఉంటుంది. (అనగా ఆత్మకు కర్తృత్వం లేదు, ఆత్మ అద్వితీయము అని తెలుసుకొన్నవానికి జ్ఞాననిష్ఠయందు అధికారం). కర్మనిష్ఠ కర్తృత్వాన్ని,అనేకత్వాన్ని ఆశ్రయించి ఉంటుంది(అనగా ఆత్మకు కర్తృత్వం ఉంది; భేదం కూడ ఉంది అని అనుకొనే వానికే కర్మనిష్ఠ).అందుచేత ఒక పురుషుడు ఒకే సమయంలో జ్ఞాననిష్ఠను కర్మనిష్ఠను అవలంబించడం అసంభవ మైన విషయం అని గ్రహించిన భగవంతుడు సాంఖ్యబుద్ధిని ఆశ్రయించిన జ్ఞాననిష్ఠ, యోగబుద్ధిని ఆశ్రయించిన కర్మనిష్ఠ వేరు వేరుగా(పరస్పరసంబంధం లేనివిగా)ప్రతిపాదించాడు.

వి.**"పురా వేదాత్మనా మయా ప్రోక్తా"**అనే వాక్యం-**"లోకేఽస్మిన్ ద్వివిధా నిష్ఠా పురా ప్రోక్తా మయానఘ;జ్ఞానయోగేన సాంఖ్యానాం కర్మయోగేన యోగినామ్"**(3.3)అనే శ్లోకానికి అర్థతోఽనువాదం.**"పురాప్రోక్తా"**అనగా సృష్ట్యాదియందు వేదార్థసంప్రదాయాన్ని ఆవిష్కరించిన నాచేత చెప్పబడింది అని అర్థం. ఆ భావమే ఇక్కడ **"పురా వేదాత్మనా మయా"** (పూర్వం వేదస్వరూపుడ నైన నాచేత) అని అనువదించబడింది."జ్ఞానయోగః", 'కర్మయోగః' అనగా 'జ్ఞానమే యోగం', 'కర్మయే యోగం' అని అర్థం.

భాష్యమ్

యథా ఏతద్విభాగవచనం తథైవ దర్శితం శాతపథీయే బ్రాహ్మణే-"ఏతమేవ ప్రవ్రాజినో లోకమిచ్ఛన్తో బ్రాహ్మణాః ప్రవ్రజన్తి" ఇతి సర్వకర్మసంన్యాసం విధాయ తచ్ఛేషేణ-"కిం ప్రజయా కరిష్యామో యేషాం నోఽయమాత్మాఽయం లోకః "(బృ.ఉ.4.4. 22)ఇతి.తత్రైవ చ ప్రాగ్ దారపరిగ్రహాత్ **'పురుషః' 'ఆత్మా'**ప్రాకృతః ధర్మజిజ్ఞాసోత్తర కాలం లోకత్రయసాధనం-పుత్రం,ద్విప్రకారం చ విత్తం మానుషం దైవం చ;తత్ర మానుషం కర్మరూపం పితృలోకప్రాప్తిసాధనం,విద్యాం చ దైవతం విత్తం దేవలోకప్రాప్తి సాధనం "సోఽకామయత"ఇతి అవిద్యాకామవతః ఏవ సర్వాణి కర్మాణి శ్రౌతాని దర్శితాని.తేభ్యః వ్యుత్థాయ ప్రవ్రజన్తి ఇతి వ్యుత్థానమ్ ఆత్మానమ్ ఏవ లోకమ్ ఇచ్ఛతః అకామస్య విహితమ్. తదేతద్విభాగవచనమ్ అనుపపన్నం స్యాత్ యది శ్రౌతకర్మ జ్ఞానయోః సముచ్చయః అభిప్రేతః స్యాత్ భగవతః.

బాలానందిని

(భగవద్గీతలో)జ్ఞాననిష్ఠా-కర్మనిష్ఠల విభాగం ఏ విధంగా చూపబడిందో అట్లే శాతపథీయబ్రాహ్మణంలో కూడ **"ఏతమేవ...ప్రవ్రజన్తి"**(ప్రవ్రాట్లైన బ్రాహ్మణులు ఈ లోకాన్నే (బ్రహ్మలోకాన్నే, బ్రహ్మ అనే లోకాన్నే) కోరుకుంటూ సంన్యసిస్తున్నారు)అని సర్వకర్మ సంన్యాసం విధించి దాని తరువాతి వాక్యంలో "కిం ప్రజయా...లోకః"(మనకు ఈ ఆత్మయే లోకంగా ఉండగా సంతానంతో ఏమి చేస్తాం) అని చెప్పబడింది.(అనగా ఈ జ్ఞానులకు సంతానాదుల ద్వారా సంపాదించ దగిన లోకాలతో సంబంధం ఏదీ లేదని అర్థం). అదే బ్రాహ్మణంలో పురుషుడు-ప్రాకృతమైన(జ్ఞానం లేని)ఆత్మ.వివాహానికి పూర్వం, ధర్మజిజ్ఞాస చేసిన తరువాత (అనగా గురుకులంలో వేదాధ్యయనం చేసి ధర్మం కూడ తెలుసుకొన్న తరువాత మూడు లోకాలూ పొందడానికి సాధన మైన పుత్రుణ్ణి, రెండు రకాలైన మానుషము దైవమూ అయిన విత్తాన్నీ-వీటిలో మానుషవిత్తం కర్మరూప మైనది, పితృలోకం పొందడానికి సాధనమైనది, విద్య దైవవిత్తం, ఇది దేవలోకప్రాప్తిసాధన మైనది,(ఈ మూడూ మూడు లోకాలు పొందడానికి సాధనాలు)-**"సోఽకామయత"**(అతడు కోరాడు)అని చెపుతూ,శ్రౌతాదికర్మ లన్నీ అవిద్య కామమూ ఉన్నవానికి మాత్రమే చూపబడ్డాయి.**"తేభ్యః వ్యుత్థాయ** ప్రవ్రజన్తి" (వాటినుండి(కర్మలనుండి) పైకి లేచి అనగా వీటి నన్నింటినీ విడచి సంన్యసిస్తున్నారు)అని వ్యుత్థానం(కర్మసంన్యాసం)ఆత్మ అనే లోకాన్ని మాత్రమే ఇచ్ఛయించే కామరహితునికి విధించబడింది.(శతపథీయబ్రాహ్మణంలో ఉన్న)ఈ విభాగ వచనం(విభాగప్రతిపాదనం),శ్రౌత కర్మలకీ జ్ఞానానికీ సముచ్చయమే భగవంతునికి అంగీకారయోగ్యమైన పక్షంలో, కుదరదు.

భాష్యమ్

న చ అర్జునస్య ప్రశ్నః ఉపపన్నః భవతి"జ్యాయసీ చేత్కర్మణస్తే"(3.1) ఇత్యాదిః.ఏకపురుషానుష్ఠేయత్వాసంభవం బుద్ధికర్మణోః భగవతా పూర్వమ్ అనుక్తం కథమ్ అర్జునః అశ్రుతం బుద్ధేశ్చ కర్మణః జ్యాయస్త్వం భగవతి అధ్యారోపయేత్ మృషైవ- "జ్యాయసీ చేత్కర్మణస్తే మతా బుద్ధిః"(3.1)ఇతి?

బాలానందిని

న చేతి:-అంతే కాక అర్జునుడు వేసిన "జ్యాయసీ చేత్కర్మణస్తే" ఇత్యాదిప్రశ్న అనుపపన్నం అవుతుంది.(అర్థరహితం అవుతుంది).బుద్ధికర్మలు రెండూ (ఒకే సమయంలో) ఒకే పురుషునిచేత అనుష్ఠింపబడడం అసంభవ మని భగవంతుడు ముందుగా చెప్పి ఉండకపోతే, బుద్ధి కర్మకంటె గొప్పది అని విని ఉండకపోయినట్లయితే అర్జునుడు-భగవంతుడు చెప్పని ఈ రెండు విషయాలూ భగవంతునిమీద ఆరోపిస్తూ "కర్మకంటె బుద్ధియే గొప్పది అని నీ అభిప్రాయ మైతే నన్ను ఘోరమైన కర్మ చేయు మని ఎందుకు నియోగిస్తావు"అని అంటూ ఎలా ప్రశ్నిస్తాడు?

భాష్యమ్

కిం చ-యది బుద్ధికర్మణోః సర్వేషాం సముచ్చయః ఉక్తః స్యాత్,అర్జునస్యాపి స ఉక్త ఏవ ఇతి-"యచ్ఛ్రేయ ఏతయోరేకం తన్మే బ్రూహి సునిశ్చితమ్"(5.1)ఇతి కథముభయోః ఉపదేశే సతి అన్యతరవిషయః ఏవ ప్రశ్నఃస్యాత్? న హి పిత్త ప్రశమనార్థినః వైద్యేన మధురం శీతం చ భోక్తవ్యమ్ ఇతి ఉపదిష్టే" తయోః అన్యతరత్ పిత్తప్రశమనకారణం బ్రూహి"ఇతి ప్రశ్నః సంభవతి!అథ అర్జునస్య భగవదుక్తవచనార్థ వివేకానవధారణనిమిత్తః ప్రశ్నః కల్ప్యతే,తథాపి భగవతా ప్రశ్నానురూపం ప్రతివచనం దేయమ్-"మయా బుద్ధికర్మణోః సముచ్చయః ఉక్తః,కిమర్థం త్వమిత్థం భ్రాన్తోఽసి" ఇతి.న తు పునః ప్రతివచనమననురూపం పృష్టాత్ అన్యత్ ఏవ-"ద్వే నిష్ఠే మయా పురా ప్రోక్తే"(3.3)ఇతి వక్తుం యుక్తమ్.

బాలానందిని

కిం చేతి:- మరొక విషయం ఏమనగా జ్ఞానకర్మసముచ్చయమే అందరికీ చెప్పబడితే (జ్ఞానమూ,కర్మా ఈ రెండూ కలిస్తేనే శ్రేయస్సు ఇస్తాయి అని అందరికీ చెప్పబడితే)అర్జునునికి కూడ అదే చెప్పబడిన ట్లవుతుంది.అలాంటప్పుడు,రెండింటినీ ఉపదేశించినప్పుడు"ఈ రెండింటిలో ఏది నాకు శ్రేయస్కరమో నాకు నిశ్చితంగా చెప్పు"అని ఒకదానిని గూర్చి ప్రశ్న ఎలా కుదురుతుంది?పిత్తదోషం శాంతించడానికి మధురమూ, శీతమూ అయిన ఆహారం తినాలి అని వైద్యుడు ఉపదేశించి నప్పుడు "ఆ రెండిటిలో ఏది

పిత్తాన్ని శాంతింప చేస్తుందో చెప్పు"అని అడగడం ఉండదు కదా? అది కాదు-అర్జునునికి భగవంతుడు చెప్పిన మాటల అర్థం తెలియక అతడు అలా ప్రశ్నించాడు అని కల్పించినా-అలాంటప్పుడు భగవంతుడు ప్రశ్నకు తగిన విధంగా-"నేను జ్ఞానకర్మల సముచ్చయం చెప్పాను; నీకు ఈ విధంగా భ్రాంతి ఎందుకు కలిగింది?" అని కృష్ణుడు సమాధానం చెప్పి ఉండాలి. అంతే కాని"పూర్వం నేను రెండు నిష్ఠలు చెప్పి ఉన్నాను". అని అంటూ అడిగినదానికి అనురూపం కాని ప్రతివచనం ఇచ్చి ఉండకూడదు.

భాష్యమ్

నాపి స్మార్తేనైవ కర్మణా బుద్ధేః సముచ్చయే అభిప్రేతే విభాగవచనాది సర్వమ్ ఉపపన్నమ్. కిం చ క్షత్రియస్య యుద్ధం స్మార్తం కర్మ స్వధర్మః ఇతి జానతః-**"తత్కిం కర్మణి ఘోరే మాం నియోజయసి"(3.1)**ఇతి ఉపాలమ్భః అనుపపన్నః. తస్మాద్ గీతాశాస్త్రే ఈషన్మాత్రేణాపి శ్రౌతేన స్మార్తేన వా కర్మణా ఆత్మజ్ఞానస్య సముచ్చయః న కేన చిద్దర్శయితుం శక్యః.

బాలనందిని

నాపీతి:- స్మార్తకర్మతో జ్ఞానానికి సముచ్చయం అంగీకార్యం అయిన పక్షంలో కూడ విభాగాదివచనం(జ్ఞాననిష్ఠ వేరు కర్మనిష్ఠ వేరు ఇత్యాదివచనం)ఉపపన్నం కాదు.

వి.జ్ఞానానికి శ్రౌతకర్మతో సముచ్చయం కుదరకపోయినా స్మార్తకర్మతో కుదురుతుంది అని కూడ అనడానికి వీలు లేదు. సముచ్చయం కుదరదు అనడానికి పైన చెప్పిన యుక్తు లన్నీ స్మార్తకర్మవిషయంలో కూడ ప్రవర్తిస్తాయి అని భావం.

కించేతి:-మరొక విషయ మేమనగా-స్మార్తకర్మ యైన(స్మృతివిహితకర్మ యైన) యుద్ధం క్షత్రియునికి స్వధర్మం అని తెలిసినవాడు"నన్ను ఇంత ఘోర మైన కర్మ చేయడానికి ఎందుకు ప్రేరేపిస్తావు"అని అంటూ భగవంతుణ్ణి నిందించడం యుక్తం కాదు. అందుచేత గీతాశాస్త్రంలో ఆత్మజ్ఞానానికి శ్రౌతకర్మతో గాని, స్మార్తకర్మతో గాని సముచ్చయం, కొంచెం కూడ, ఎవరూ చూపజాలరు.

భాష్యమ్

యస్య తు అజ్ఞానాత్ రాగాదిదోషతో వా కర్మణి ప్రవృత్తస్య యజ్ఞేన, దానేన, తపసా వా విశుద్ధసత్త్వస్య జ్ఞానమ్ ఉత్పన్నం పరమార్థతత్త్వవిషయం "ఏకమేవేదం సర్వం బ్రహ్మ అకర్తృ చ" ఇతి తస్య కర్మణి కర్మప్రయోజనే చ నివృత్తేఽపి లోకసంగ్రహార్థం యథా పూర్వం ప్రవృత్తః తథైవ కర్మణి ప్రవృత్తస్య యత్ప్రవృత్తిరూపం దృశ్యతే న తత్ కర్మ,యేన బుద్ధేః సముచ్చయః స్యాత్;యథా భగవతః వాసుదేవస్య క్షాత్రధర్మచేష్టితం న జ్ఞానేన సముచ్చీయతే పురుషార్థసిద్ధయే తద్వత్.తత్ఫలాభిసంధ్య

హంకారాభావస్య తుల్యత్వాత్. తత్త్వవిత్తు నాహం కరోమీతి మన్యతే,న చ తత్ఫలమ్ అభిసంధత్తే. యథా చ స్వర్గాదికామార్థినః అగ్నిహోత్రాదికామసాధనానుష్ఠానాయ ఆహితాగ్నేః కామ్య ఏవ అగ్నిహోత్రాదౌ ప్రవృత్తస్య సామి కృతే వినష్టేఽపి కామే తదేవ అగ్నిహోత్రాది అనుతిష్ఠతోఽపి న తత్ కామ్యమ్ అగ్నిహోత్రాది భవతి.

బాలానందిని

యస్య త్వితి :- అజ్ఞానంవల్ల గాని, రాగాదిదోషాలవల్ల గాని ఒకడు కర్మాచరణానికి ప్రవర్తించి కర్మచేస్తూ ఉంటాడు. ఇంతలో యజ్ఞంచేత గాని,దానంచేత గాని, తపస్సుచేత గాని వాని అంతఃకరణం పరిశుద్ధమై"ఇదంతా అద్వితీయబ్రహ్మమే,దీనికి కర్తృత్వం లేదు" అనే పరమార్థతత్త్వానికి సంబంధించిన జ్ఞానం కలుగుతుంది. అప్పుడాతని కింక కర్మతో గాని,కర్మఫలంతో గాని పని లేదు. అయినా కూడ అతడు(మార్గదర్శనం ద్వారా) లోకాన్ని ఉద్ధరించడంకోసం,పూర్వం(పరమార్థతత్త్వవిషయకజ్ఞానం కలగడానికి పూర్వం) ఏ విధంగా కర్మ చేసేవాడో అలాగే (ఇప్పుడు కూడ) కర్మలు చేస్తూన్నా నిజానికి అవి కర్మలు కావు; అందుచేత ఆ కర్మలను పట్టి వీనిలో జ్ఞానకర్మసముచ్చయం ఉందని చెప్పడానికి వీలు లేదు. ఉదాహరణకి-భగవంతు డైన వాసుదేవు డాచరించే క్షాత్రకర్మాచరణానికి ఏ విధంగా పురుషార్థసిద్ధికోసం జ్ఞానంతో సముచ్చయం ఉంది అని చెప్పడం కుదరదో అట్లే ఇతని విషయంలో కూడ; ఎందువల్ల ననగా ఫలమునందు ఆసక్తి,అహంకారమూ లేకపోవడం ఇద్దరి విషయంలోనూ సమానమే. తత్త్వవేత్త యైతే 'నేను చేస్తున్నాను'అని అనుకొనడు,చేసే కర్మయొక్క' ఫలం కూడా కోరుకొనడు. స్వర్గాదిఫలాలను కోరి ఆ కామాలు సిద్ధించడానికి సాధనా లైన అగ్నిహోత్రాదులను అనుష్ఠించడంకోసం ఆహితాగ్ని యైనవాడు అగ్నిహోత్రాది కామ్యకర్మలను అనుష్ఠిస్తూండగా,ఆ కర్మ మధ్యలోనే వానికి ఆ కామం నశించిపోయినా కూడ అతడు ఆ అగ్నిహోత్రాద్యనుష్ఠానం కొనసాగించవచ్చును. అయినా కూడ అది(అగ్నిహోత్రాదికం)కామ్యకర్మ కాజాలదు. (ఈ ఉదాహరణ చూపడంలో మొదట కామ్యకర్మగా ప్రారంభించబడిన కర్మ ఏ విధంగా కార్యకర్మకానిదిగా మారిపోతుందో అదే విధంగా అహంకారమూ,ఫలాభిసంధీ లేని తత్త్వవేత్త'చేసే కర్మ కూడ కర్మాభాసమాత్రమే కాని కర్మ కాదు అని భావం).

భాష్యమ్

తథా చ దర్శయతి భగవాన్"కుర్వన్నపి న లిప్యతే"(5.7),"న కరోతి న లిప్యతే"(13.31)ఇతి తత్ర తత్ర. యచ్చ "పూర్వైః పూర్వతరం కృతమ్"(4.15), "కర్మణైవ హి సంసిద్ధిమాస్థితా జనకాదయః"(3.20)ఇతి, తత్తు ప్రవిభజ్య విజ్ఞేయమ్. తత్కథమ్? యది తావత్పూర్వే జనకాదయః తత్త్వవిదః అపి ప్రవృత్తకర్మాణః స్యుః, తే లోకసంగ్రహార్థం "గుణా గుణేషు వర్తన్తే"(3.28) ఇతి జ్ఞానేనైవ సంసిద్ధిం ఆస్థితాః.

కర్మసంన్యాసే ప్రాప్తేఽపి కర్మణా సహైవ సంసిద్ధిమ్ ఆస్థితాః న కర్మసంన్యాసం కృతవన్తః ఇత్యర్థః. అథ న తే తత్త్వవిదః-ఈశ్వరసమర్పితేన కర్మణా సాధనభూతేన సంసిద్ధిం,సత్త్వశుద్ధిం,జ్ఞానోత్పత్తిలక్షణాం వా సంసిద్ధిమ్ ఆస్థితాః జనకాదయః ఇతి వ్యాఖ్యేయమ్. ఏతమేవ అర్థం వక్ష్యతి భగవాన్"సత్త్వశుద్ధయే కర్మ కుర్వన్తి"(5-11) ఇతి. "స్వకర్మణా తమభ్యర్చ్య సిద్ధిం విన్దతి మానవః"(18.46)ఇత్యుక్త్వా సిద్ధిం ప్రాప్తస్య చ పునః జ్ఞాననిష్ఠాం వక్ష్యతి-"సిద్ధిం ప్రాప్తో యథా బ్రహ్మ"(18.50)ఇత్యాదినా.

తస్మాత్ గీతాశాస్త్రే కేవలాత్ ఏవ తత్త్వజ్ఞానాత్ మోక్షప్రాప్తిః,న కర్మ సముచ్చితాత్ ఇతి నిశ్చితః అర్థః. యథా చ అయమర్థః తథా ప్రకరణశః విభజ్య తత్ర తత్ర దర్శయిష్యామః.

బాలానందిని

తథేతి :- ఈ విషయమే అక్కడక్కడ భగవంతుడు "కుర్వన్నపి న లిప్యతే" (కర్మ చేస్తూన్నా దాని ఫలంచేత-పుణ్యపాపాలచేత లిప్తుడు కాడు)"న కరోతి న లిప్యతే"(జ్ఞాని యైనవాడు కర్మ చేస్తూన్నా చేయనట్లే, దానిచేత అతడు లిప్తుడు కాడు)అని చెపుతాడు. ఇంక "పూర్వైః పూర్వతరం కృతమ్"పూర్వులచేత చాలకాలం పూర్వం కర్మ చేయబడింది), "కర్మణైవ హి సంసిద్ధిమాస్థితా జనకాదయః"(జనకుడు మొదలైనవారు కర్మచేతనే సిద్ధిని పొందారు) ఇత్యాదికం ఏది కనబడుతుందో దానిని బాగా విషయవిభజన చేసి అర్థం చేసికోవాలి. అదెట్లు? పూర్వులైన జనకాదులు తత్త్వవేత్తలే అయినా "గుణాః గుణేషు వర్తన్తే"(గుణాలు గుణాలయందు ప్రవర్తిస్తున్నాయి. అవి వాటి పనులు చేస్తున్నాయి)అనే దృష్టితో కర్మాచరణంలో ప్రవర్తిస్తే కూడ వారు సంసిద్ధిని పొందినది జ్ఞానంచేతనే. నిజానికి వారు కర్మసంన్యాసం చేయడానికి అవకాశం ఉన్నా కూడ కర్మతో కూడానే సంసిద్ధిని పొందారు,కర్మసంన్యాసం చేయలేదు అని అర్థం.(అంతేనే కాని వారు కర్మచేతనే సంసిద్ధి పొందారు అని అర్థం కాదు). తత్త్వవేత్తలు కాకపోతే ఆ జనకాదులు ఈశ్వరార్పణబుద్ధితో చేసిన కర్మను సాధనంగా చేసికొని సంసిద్ధిని,అనగా చిత్తశుద్ధిని,లేదా జ్ఞానం కలగడం అనే సంసిద్ధిని,పొందారు అని వ్యాఖ్యానించాలి(అనగా ఈశ్వరార్పణబుద్ధితో చేసిన కర్మ చిత్తశుద్ధిని కలిగిస్తుంది, లేదా ఆత్మజ్ఞానం పుట్టిస్తుంది;అంతేనే కాని ముక్తిని మాత్రం ప్రత్యక్షంగా ఇవ్వజాలదు. ప్రత్యక్షంగా ముక్తి ఇవ్వకలిగినది జ్ఞానం మాత్రమే అని భావం)."అంతఃకరణశుద్ధికోసమై కర్మ చేస్తారు" అని అంటూ భగవంతుడు ఈ విషయమే చెప్ప నున్నాడు. "స్వకర్మణా... మానవః"(మానవుడు తనకు శాస్త్రం విధించిన కర్మచేత పరమేశ్వరుణ్ణి అర్చించి సిద్ధిని పొందుతాడు)అని చెప్పి, మళ్లీ ఆ సిద్ధిని పొందినవాడు జ్ఞాననిష్ఠను ఎలా పొందుతాడో "సిద్ధిం ప్రాప్తో యథా బ్రహ్మ" ఇత్యాదికంచేత చెప్పబోతాడు.(దీనిని బట్టి కర్మచేత లభించిన సిద్ధి జ్ఞాననిష్ఠకు సాధనమే కాని ఇదే పరమపురుషార్థాన్ని ప్రత్యక్షంగా ఇవ్వజాలదు అని స్పష్టం అవుతున్నది).

यदा यदा हि धर्मस्य ग्लानिर्भवती भारत।
अभ्युत्थानमधर्मस्य तदाऽऽत्मनं सृजाम्यहम ॥

అందువల్ల మోక్షప్రాప్తి కేవలం తత్త్వజ్ఞానంవల్ల మాత్రమే కలుగుతుంది కాని కర్మసహితమైన తత్త్వజ్ఞానంవల్ల కలుగదు అనేది గీతలలో నిశ్చిత మైన విషయం. గీతా ప్రతిపాద్యమైన అర్థం ఇదే అనే విషయాన్ని ఏ ప్రకరణాని కా ప్రకరణం విడగొట్టి అక్కడక్కడ ప్రతిపాదిస్తాం.

భాష్యమ్

తత్రైవం ధర్మసంమూఢచేతసః మహతి శోకసాగరే నిమగ్నస్య అర్జునస్య అన్యత్ర ఆత్మజ్ఞానాత్ ఉద్ధరణమ్ అపశ్యన్ భగవాన్ వాసుదేవః తతః అర్జునమ్ ఉద్ది ధారయిషుః ఆత్మజ్ఞానాయ అవతారయన్ ఆహ-

మూ. శ్రీ భగవానువాచ-

అశోచ్యానన్వశోచస్త్వం ప్రజ్ఞావాదాంశ్చ భాషసే,
గతాసూనగతాసూంశ్చ నానుశోచన్తి పణ్డితాః. 11

బాలానందిని

తత్రేతి:- ఈ విధంగా చిత్తం ధర్మం విషయంలో మోహం చెందగా గొప్ప శోకసముద్రంలో మునిగిపోయిన అర్జునుణ్ణి ఉద్ధరించాలంటే(పైకి తియ్యాలంటే) ఆత్మజ్ఞానం తప్ప మరొక ఉపాయం ఏదీ లేదని గుర్తించిన భగవంతు డైన వాసుదేవుడు, అర్జునుణ్ణి దానినుండి(శోకసాగరంనుండి)ఉద్ధరించ దలచి, వానిని ఆత్మజ్ఞానమార్గంలో ప్రవేశపెడుతూ ఇలా అన్నాడు-

భగవంతుడు ఇట్లనెను-

ప్ర.అ. **అశోచ్యానితి :-** త్వమ్ =నువ్వు,అశోచ్యాన్ = దుఃఖింపతగనివాళ్లనుగూర్చి, అన్వశోచః =శోకించినావు(శోకిస్తున్నావు). ప్రజ్ఞావాదాన్ = బుద్ధిమంతులు పలికే మాటలను, భాషసే చ=పలుకుతున్నావు కూడ. పణ్డితాః=పండితులు,గతాసూన్=ప్రాణాలు పోయినవాళ్లను గూర్చి, అగతాసూన్ చ=ప్రాణాలు పోనివాళ్లను(జీవించి ఉన్నవాళ్లను)గూర్చి,నానుశోచన్తి=దుః ఖించరు.

భాష్యమ్

అశోచ్యానిత్యాది :- న శోచ్యాః అశోచ్యాః,భీష్మద్రోణాదయః సద్వృత్తత్వాత్, పరమార్థరూపేణ చ నిత్యత్వాత్.తాన్ అశోచ్యాన్ అన్వశోచః,అనుశోచితవానసి. తే మ్రియన్తే మన్నిమిత్తమ్.అహం తైర్వినాభూతః కిం కరిష్యామి రాజ్యసుఖాదినా ఇతి. త్వం ప్రజ్ఞావతాం బుద్ధిమతాం వాదాంశ్చ వచనాని చ భాషసే.తదేతత్ మౌఢ్యం పాణ్డిత్యం చ విరుద్ధం దర్శయసి ఆత్మని, ఉన్మత్త ఇవ ఇత్యభిప్రాయః.యస్మాత్ గతాసూన్

గతప్రాణాన్,మృతాన్,అగతాసూన్,అగతప్రాణాన్ జీవతశ్చ నానుశోచన్తి పణ్డితాః ఆత్మజ్ఞాః. పణ్డా ఆత్మవిషయా బుద్ధిః యేషాం తే హి పణ్డితాః. "పాణ్డిత్యం నిర్విద్య" (బృ. ఉ. 3. 5. 1)ఇతి శ్రుతేః. పరమార్థతస్తు నిత్యాన్ అశోచ్యాన్ అనుశోచసి, అతః మూఢః అసి ఇత్యభిప్రాయః. **11**

బాలానందిని

అశోచ్యానితి:- ఎవరిని గూర్చి దుఃఖించకూడదో వాళ్లు అశోచ్యులు. భీష్మ ద్రోణాదులు మంచి నడవడిక గలవారు, వాస్తవంలో నిత్యులు అవడంవల్ల అశోచ్యులు. అలాంటి అశోచ్యులను గూర్చి వాళ్లందరూ నా మూలాన మరణిస్తున్నారు, వాళ్లు లేకుండా నేను రాజ్యసుఖాదులతో ఏమి చేసికొనాలి అని దుఃఖించావు. మాటలు మాత్రం బుద్ధి మంతులు పలికే మాటలు మాట్లాడుతున్నావు. ఈ విధంగా ఉన్మత్తుడవు వలె పరస్పర విరుద్ధ మైన మూఢత్వాన్నీ,పాండిత్యాన్నీ నీలో కనబరుస్తున్నావు.ఎందువల్ల ననగా- పండితులు,అనగా ఆత్మజ్ఞానం కలవారు, గతాసూన్=ప్రాణాలు పోయినవాళ్లను,మరణించిన వాళ్లను,అగతాసూన్=ప్రాణాలు పోనివాళ్లను,జీవించి ఉన్నవాళ్లను గూర్చి దుఃఖించరు. పణ్డా=ఆత్మకు సంబంధించిన జ్ఞానం, ఎవరికి ఉంటుందో వాళ్లు పండితులు."పాణ్డిత్యం నిర్విద్య"(ఆత్మజ్ఞానాన్ని పొంది) అని శ్రుతి చెప్పుచున్నది.(పైకి పండితుడవు వలె కనబడినా) నువ్వు అశోచ్య లైన నిత్యమైనవాళ్లని గూర్చి దుఃఖించడంచేత,నిజానికి మూఢుడవే అని అభిప్రాయం.**11**

బా. అ. ప్ర:-ఇక్కడ శ్రీ రామానుజాచార్యులు-"శ్రీకృష్ణుడు""న **త్వేవాహం**" ఇత్యాది వాక్యాలతో ఉపదేశించడం ప్రారంభించాడు"అని అంటూ అశోచ్యానిత్యాదిశ్లోకాన్ని గీతా శాస్త్రంనుండి వేరుచేశారు.(అనగా అశోచ్యానిత్యాదిశ్లోకంతో అసలు గీతాశాస్త్రం ప్రారంభం అని శంకరభగవత్పాదులు సూచించగా,దీనితో కాదు "**న త్వేవాహమ్**"ఇత్యాదిశ్లోకంతో అని ఆయన అన్నారు). అది యుక్తం కాదు. భీష్మాదులు నిత్యమైన స్వరూపం గలవారు;వాళ్లను గూర్చి దుఃఖించకూడదు.పండితులు మరణించినవాళ్లను గూర్చి గాని జీవించినవాళ్లను గూర్చి గాని దుఃఖించరు.నువ్వు పండితుడవు.అందుచేత దుఃఖించకు అని హితాన్ని, బోధించే ఈ శ్లోకం కూడ శాస్త్రంలో అంతర్గతం అవడమే యుక్తం.

ఉపదేశించబోయే విషయంమీద అర్జునుడు చిత్తం సావధానం చేయడంకోసం అతనిని పరిహసించడమే ఈ శ్లోకంయొక్క ప్రయోజనం, అందుచేత, ఇది శాస్త్రంలో అవతరణం (ప్రవేశపెట్టేది)మాత్రమే గాని శాస్త్రాంతర్గతం కాదు అని వేదాంతదేశికులు అన్నది కూడ అయుక్తమే.శోకసాగరంలో మునిగి ఉండి తన పాదాలను శరణు జొచ్చిన అర్జునుని విషయంలో భగవంతుడు పరిహాసం చేస్తూ మాటలాడడం అసంగతం కూడా. ఆయనే ఇలా కూడ అన్నాడు-"లేదా '**అశోచ్యాన్**'ఇత్యాదిశ్లోకానికి(పదవ శ్లోకంలోని)'ప్రహ సన్నివ'అనేదానితో సంబంధం. అదే శ్లోకంలో ఉన్న 'ఇదమ్' అనే పదం'**న త్వేవాహమ్**'

ఇత్యాదివాక్యాలకు సంబంధిస్తుంది;(అనగా'అశోచ్యాన్'ఇత్యాదివాక్యంతో పరిహసిస్తూ 'న త్వేవాహమ్' ఇత్యాదివాక్యాన్ని పలికాడు అని అర్థం)". ఈ వ్యాఖ్యానం కూడ అయుక్తమే.'ఇదమ్' అనే పదం వెంటనే చెప్పబడేదానినే నిర్దేశిస్తుంది.అందుచేత 'ఇదం వచః'అనగా వెంటనే చెప్పిన అశోచ్యానిత్యాదికాన్ని కాక దూరంగా ఉన్న 'న త్వేవాహమ్'ఇత్యాదికం పలికాడు అని చెప్పడంలో ప్రమాణం ఏదీ కాదు.'అశోచ్యాన్'ఇత్యాదిశ్లోకానికి 'ప్రహసన్'అనేదానితో అన్వయం కుదరదు.అక్కడ లేని'ఇతి'అనే శబ్దం అధ్యాహారం తెచ్చుకొని'అశోచ్యానన్వశోచస్త్వం ప్రజ్ఞావాదాంశ్చ భాషసే'ఇతి ప్రహసన్"అని వ్యాఖ్యానిస్తే సమాప్తపునరాత్తత్వదోషం(ఒక విషయం చెప్పడం పూర్తి అయిన తరువాత మళ్లీ దానిని గ్రహించి మరొకదానితో అన్వయించడం అనే అలంకరాశాస్త్రప్రసిద్ధ మైన దోషం) కలుగుతుంది. 'ఇతి'అనే పదాన్ని అధ్యాహారం తెచ్చుకోవడం అనేది కూడ గౌరవానికి,(అనగా వాక్యంలో లేని అర్థాన్ని మోపడం అనే అనావశ్యకమైన బరువుకు)కారణం అవుతుంది.అశోచ్యానిత్యాది పూర్వార్ధం పరిహాస వాక్యం అని చెప్పిన పక్షంలో ఇంక మిగిలిన 'గతాసూన్' ఇత్యాద్యుత్తరార్ధం అటు పరిహాస వాక్యమూ కాక,ఇటు,శాస్త్రంతో సంబంధించినదీ కాక వ్యర్థమైన వాక్యం అని చెప్పవలసి వస్తుంది."పరిహాసవాక్యం వదన్ ఇవ" (పరిహాసవాక్యం పలుకుతున్నాడా అన్నట్లు)అని 'ఇవ'శబ్దం ప్రయోగించడంచేత నిజానికి పరిహాసవాక్యం పలకలేదు అని సిద్ధిస్తుంది గాన ఈ శ్లోకం భగవంతుడు చెప్పినదికాదు అనవలసి ఉంటుంది.అందువల్ల అశోచ్యానిత్యాది శ్లోకమే గీతాశాస్త్రానికి ప్రారంభశ్లోకం(కాని 'న త్వేవాహం'ఇత్యాదిశ్లోకం కాదు). (భా.అ.ప్ర.పేజి.257)ఇక్కడ శ్రీ రామానుజులు 'గతాసూన్'అనగా ప్రాణాలు పోయిన దేహాలను'అని 'అగతాసూన్'అనగాప్రాణాలు పోని ఆత్మలను'అనీ అర్థం చెప్పారు.అది అయుక్తం. మృతదేహాలు ప్రాణాలు పోయినవే అయినా, మరణించని దేహాలు ప్రాణాలు పోనివే కాబట్టి 'అగతాసు'శబ్దానికి'జీవించి ఉన్న దేహాలు' అనే అర్థం మాత్రమే లభిస్తుంది.'గతాసు''అగతాసు' శబ్దాలకు,లోకంలో,'మరణించినవాడు','జీవించి ఉన్నవాడు అని మాత్రమే అర్థం ప్రసిద్ధంగా ఉంది. మీ గ్రామంలో నివసిస్తున్న మావాళ్లు దేవదత్త-యజ్ఞదత్తులు సుఖంగా ఉన్నారా అని విష్ణుమిత్రుడు అడుగగా కృష్ణశర్మ దేవదత్తుడు గతాసు వయ్యాడు.యజ్ఞదత్తుడు అగతాసువుగా ఉన్నాడు అని సమాధానం చెప్పాడు.ఆ మాట విన్నవాడు దేవదత్తు డనే దేహం గతాసు వైనది,యజ్ఞదత్తు డనే జీవుడు మాత్రం అగతాసువుగా ఉన్నాడు అని అర్థం చేసి కొనడు.దేవదత్తుడు మరణించాడు,యజ్ఞదత్తుడు జీవించి ఉన్నాడు అని మాత్రమే గ్రహిస్తాడు.

మరొక ఇషయం ఏమనగా దేహం వలె ప్రాణాలు కూడ ఆత్మకు ఒక కోశమే (ప్రాణమయకోశం)అవడంచేత అవి కూడ ఉపాధిమాత్రమే.వాస్తవంలో ఆత్మలకు కోశాలు లేవు గాన అని గతాసువులే(ప్రాణాలులేనివే).అలాంటప్పుడు •త్మలు అగతాసువు లని చెప్పడం ఎలా కుదురుతుంది?మరొక విషయం-ఆత్మ సచ్చిదానందరూపమే అయినా అది అన్నమయకోశావచ్ఛిన్నం అవడంచేత మనుష్యుడు,వృద్ధుడు,జీర్ణించిపోయాడు,కృశించి

పోయాడు అనీ,ప్రాణమయకోశావచ్ఛిన్నం అవడంచేత ఆకలిదప్పికలతో బాధపడుతున్నాడు అని ఎవరు అనుకుంటారో అలాంటి అజ్ఞానులు శోచ్యులే.అందుచేత అగతాసువులైన ఆత్మలు,అనగా ప్రాణాలతో సంబంధం పెట్టుకొన్న ఆత్మలు, శోచ్యులే అవుతారు కాని అశోచ్యు లెలా అవుతారు?మరొకవిషయం-గతాసువులైన దేహాలను గూర్చి పండితులు శోకించరు అన్నప్పుడు అపండితులు శోకిస్తారు అని అర్థం వస్తుంది.కాని అది అలా కనబడడం లేదు.అపండితులలో కూడ దేహం ధరించిన నా పుత్రుడు మరణించాడు అని మాత్రమే ప్రతీవాడూ శోకిస్తాడు కాని దేహం కాల్చబడింది.దేహం కుక్కలచేత తినబడింది అని శోకించదు.అందుచేత, శ్రీ రామానుజులు చెప్పిన అర్థం సరియైనది కాదు (భ. అ.ప్ర. పేజి. 26)

vi.భగవద్గీతలోని 18 అధ్యాయాలను ఆరేసి అధ్యాయాలు ఒక కాండం అని విభజించి మూడు కాండలలో మూడు విషయాలు ప్రధానంగా చెప్పబడ్డాయి.ప్రథమషట్కాత్మక మైన పూర్వకాండలో త్వంపదార్థం(జీవస్వరూపం)చెప్పబడింది.ద్వితీయషట్కాత్మక మైన మధ్యమకాండలో తత్పదార్థం(పరమాత్మస్వరూపం)చెప్పబడింది.తృతీయషట్కాత్మక మైన అంత్యకాండంలో తత్త్వంపదార్థాల ఐక్యరూప మైన వాక్యార్థం చెప్పబడింది.అక్కడక్కడ ప్రసంగవశంచేత ఆ జ్ఞానానికి సాధనాలు చెప్పబడ్డాయి.కేవలం తత్త్వజ్ఞానం మాత్రమే కైవల్యానికి సాధనం అనే విషయం సునిశ్చితం.

భాష్యమ్

కుతః తే అశోచ్యాః? యతః నిత్యాః. కథమ్?

మూ. న త్వేవాహం జాతు నాసం న త్వం నేమే జనాధిపాః,
న చైవ న భవిష్యామః సర్వే వయమతః పరమ్. 12

న త్వేవ జాతు కదాచిత్, అహం నాసమ్.కిం తు ఆసమేవ అతీతేషు దేహోత్పత్తివినాశేషు. నిత్య ఏవ అహమ్ ఆసమ్ ఇత్యభిప్రాయః.తథా న త్వం నాసీః , కిం తు ఆసీః ఏవ.తథా న ఇమే జనాధిపాః న ఆసన్,కిం తు ఆసన్నేవ.తథా న చైవ న భవిష్యామః;కిం తు భవిష్యామః ఏవ సర్వే వయమ్ అతః అస్మాత్ దేహవినాశాత్ పరమ్ ఉత్తరకాలే౽పి త్రిష్వపి కాలేషు నిత్యాః ఆత్మస్వరూపేణేత్యర్థః. దేహభేదానువృత్త్యా బహువచనం; న ఆత్మభేదాభిప్రాయేణ. 12

బాలానందిని

కుత ఇతి:- ఎందువల్ల అశోచ్యులు?వాళ్లు నిత్యులు కాబట్టి. అదెట్లు?

ప్ర.అ. నేతి :- అహమ్=నేను, జాతు=ఎన్నడూ న ఆసమ్ ఇతి నైవ = ఉండ లేదు అనే మాట లేదు. త్వమ్ = నువ్వు, న=ఉండలే దనే మాట లేదు.ఇమే = ఈ, జనాధిపాః

=రాజులు, న=ఉండలేదు అనే మాట లేదు. వయమ్=మనం,సర్వే=అందరమూ,అతః =ఇటుపైన, న భవిష్యామః ఇతి చ నైవ=ఉండబోము అనే మాట కూడ లేదు.

న త్వేవేతి:- నేను పూర్వం ఉండలేదు అనే మాట ఎన్నడూ లేదు; మరేమనగా నేను పూర్వం కూడా ఉండేవాడిని. గడచిన(పూర్వకాలంలో జరిగిన)దేహోత్పత్తుల సమయాలలోను,దేహవినాశసమయాలలోనూ కూడ నిత్యుడ నైన నేను ఉండేవాడనే అని అభిప్రాయం. అట్లే నీవు కూడ(పూర్వం)ఉండలే దనే మాట లేదు. అనగా తప్పకుండా ఉండేవాడవు. అట్లే ఈ రాజులు కూడా ఉండేవారు కారు అనే మాట లేదు. తప్పక ఉండేవారు. అట్లే (మున్ముందు)మనం ఉండము అనే మాట కూడ లేదు. మరే మనగా-మన మందరమూ,అతః పరమ్=ఈ దేహం నశించినతరువాత కూడ, తప్పక ఉంటాం. మనం అందరం మూడు కాలాలలోను ఆత్మస్వరూపంచేత నిత్యమైన వాళ్లమే అని అర్థం. ఆత్మ ఒక్కటే అయినా కూడ దేహభేదం అనువర్తిస్తూనే ఉండడంచేత,(ఆత్యంతికమోక్షం కలిగే వరకూ అనేకదేహాలు అనువర్తిస్తూనే ఉండడంచేత)ఆ దేహాల భేదాన్ని పట్టి "సర్వే వయమ్"అని బహువచనం ప్రయోగించబడింది. (నిజానికి అన్ని దేహాలతోను సంబంధించిన ఆత్మ ఒక్కటే అవడంచేత,ఆ దృష్ట్యా ఏకవచనప్రయోగం చేసినా చేయవచ్చు నని భావం).

భా.అ.ప్ర. ఈ శ్లోకానికి తాత్పర్యం చెపుతూ శ్రీరామానుజాచార్యులు-సర్వేశ్వరుడు మాత్రం నిత్యుడు అని తేలినది అని వ్రాశారు. అది అయుక్తం. శ్రీకృష్ణుడు సర్వేశ్వరుడైన, నిత్యమైన, ఆత్మ అని అర్జునుడు అనుకొనడం లేదుకదా?"**అపరం భవతో జన్మ పరం జన్మ వివస్వతః, కథమేతద్విజానీయాం త్వమాదౌ ప్రోక్తవానితి**"(వివస్వంతుడు ఎప్పుడో పూర్వం పుట్టాడు, నువ్వు ఈ మధ్య పుట్టావు. నువ్వు వివస్వంతునికి ఉపదేశించడం ఏమిటి)అని అతడు అడగ నున్నాడుకదా? కుంతికి పుట్టిన తన విషయంలో అర్జునునికి నేను అనిత్యుడను అనే జ్ఞానం ఎలా ఉంటుందో,దేవకికి పుట్టిన కృష్ణుని విషయంలో కూడా అలాంటి అనిత్యత్వబుద్ధియే ఉంటుంది. ఎందువల్ల ననగా తనకు వలెనే కృష్ణునికి కౌమారాద్యవస్థలు ఉన్నట్లు అతడు ప్రత్యక్షంగా చూస్తున్నాడు. ఈ శ్లోకంలో తాను సర్వేశ్వరుడను అని చెప్పుకోవడం కృష్ణుని తాత్పర్యం కాదు. అది ప్రకృతానికి ఉపయోగించదు. తాను నిత్యుడు అని చెప్పడంలోనే కృష్ణుని తాత్పర్యం. నిత్యుడను అని చెప్పి నంతమాత్రంచేత ఈశ్వరుడను అని చెప్పి నట్లు అవుతుం దనే నియమం లేదు. మీ మతం ప్రకారం ప్రకృతి,పురుషుడు (జీవుడు),ఈశ్వరుడు-ముగ్గురూ నిత్యులే గాన నిత్యత్వఈశ్వరత్వాలు సమనియతాలు కావు: అనగా నిత్యమైన దల్లా ఈశ్వరుడే కావాలనే నియమం లేదు;జీవుడూ కావచ్చు, ప్రకృతి కూడ కావచ్చు. మరొక విషయ మేమనగా 'అహమ్' శబ్దం (నేనుఅనేది)కేవలం వక్తను (మాటలాడువానిని) మాత్రమే బోధిస్తుంది కాని ఈశ్వరత్వాదిగుణాలు కల నేను అనే అర్థాన్ని బోధించదు. అందుచేత ఇక్కడ నేను సర్వేశ్వరుణ్ణి అని కృష్ణుడు సూచిస్తున్నాడు అనడం అసంగతమైనది. కవికి కూడ ఈ విషయంలో తాత్పర్యం లేదు.

"సర్వేశ్వరుడను,పరమాత్మను అయిన నేను నిత్యుడను అనే విషయంలో ఏ విధంగా సంశయం లేదో అట్లే క్షేత్రజ్ఞు లైన మీరు కూడ నిత్యులే అని తెలుసుకోవాలి" అని శ్రీరామానుజులు చెప్పినది యుక్తం కాదు. ఈ శ్లోకంలో "**న త్వేవాహం జాతు నాసమ్**" దృష్టాంతం అనీ,మిగిలిన భాగం దార్ష్టాంతికం(దేనికి మరొకటి దృష్టాంతంగా,ఉదాహరణగా, చూపబడుతుందో అది దార్ష్టాంతికం)అనీ కల్పించడానికి ప్రమాణం ఏదీ లేదు. దృష్టాంతత్వాన్ని సూచించే 'యథా'శబ్దం ఇక్కడ లేదు.కృష్ణుడు నిత్యుడు అనే నిశ్చయం అర్జునునకు లేనే లేదు. అలాంటప్పుడు ఆ కృష్ణుణ్ణి దృష్టాంతంగా చూపడం కుదరదు.నిత్యుడైన ఈశ్వరు డొక డున్నాడు అని ఆస్తికు డైన అర్జునుడు విశ్వసిస్తే విశ్వసించుగాక;కృష్ణుడే ఈశ్వరుడు, నిత్యుడుఅని అత డనుకొనడం లేదు.అలాగే అనుకొంటే ఆతనిని సారథ్యాదుల యందు నియమించేవాడు కాదు.కృష్ణునికి శ్రీరామానుజులు చెప్పిన అర్థంలోనే తాత్పర్యం ఉంటే"**న త్వేవాహమ్**"ఇత్యాదివిధంగా కాక"**ఈశ్వరో௨ హం యథా నిత్యో జీవా యూయం తథైవ హి**"అని చెప్పి ఉండేవాడు.మరొక విషయ మేమనగా-ఈశ్వరుడు పరమాత్మ,జీవు లైతే ఆత్మలు అని చెప్పడం కుదరదు.ఎందువల్ల ననగా-"**య ఆత్మాపహతపాప్మా**","**సర్వవ్యాపీ సర్వభూతాన్తరాత్మా**""**ఐతదాత్మ్యమిదం సర్వం స ఆత్మా తత్త్వమసి**""**అయమాత్మా బ్రహ్మ**" ఇత్యాదిశ్రుతులలో ఈశ్వరుడు ఆత్మశబ్దంచేతనే చెప్పబడుచున్నాడు;జీవునికి ఈశ్వరునికీ అభేదం కూడ ఉపదేశించబడుచున్నది.

శ్రీరామానుజులు ఇక్కడ ఇంకా-"అజ్ఞానంచేత మోహితుడైన అర్జునునికి,ఆతని అజ్ఞానం తొలగడంకోసం పారమార్థికమైన నిత్యత్వాన్ని చెప్పే సందర్భంలో భగవంతు డిక్కడ 'నేను','నువ్వు''ఈరాజులు'అని వేరు వేరుగా నిర్దేశించడంవల్ల భగవంతు డైన సర్వేశ్వరుని కంటె ఆత్మలు భిన్న మైన వనీ,ఆత్మలు కూడ తమలో తాము భిన్నములైన వనీ, ఈ భేదం సత్యమైనదే అనీ తెలుస్తూన్నది.భేదం ఉపాధిభేదం చేత కలిగింది అనే వాదంలో ఆత్మభేదం తాత్త్వికం కాదు గాన తత్త్వోపదేశం చేసే సమయంలో భేదం చెప్పడం కుదరదు" అని చెప్పారు.ఇది యుక్తం కాదు.భీష్మాదులు అనిత్యమైనవా ళ్లవడంచేత వాళ్లు శోచ్యులు అని అనుకొంటూన్న అర్జునునికి-భీష్మాదులు నిత్యులు,అందుచేత శోచ్యులు కారు అని ఆ సమయంలో,ఉపదేశించడం యుక్తం కాని ఆత్మైకత్వాన్ని ఉపదేశించడంయుక్తం కాదు.ఆ విషయాన్ని కృష్ణుడే స్వయంగా"**అవినాశి తు తద్విద్ధి యేన సర్వమిదం తతమ్**"ఇత్యాదికం చేత తరువాత ఉపదేశించనున్నాడు. అక్కడ(ఆత్మవిషయంలో) బహువచనం ప్రయోగించవలసి ఉన్నా జాత్యేకవచనం ప్రయోగించబడింది"అని మరొక గతి లేకపోవడంచేత శ్రీరామానుజులే చెప్ప నున్నారు.ఆత్మభేదమే వాస్తవం అని కృష్ణుని అభిప్రాయం అయితే "**అనాశినస్తు తాన్విద్ధి యైః సర్వమిదమావృతమ్**"అనియే చెప్పిఉండేవాడు.

మరొక విషయ మేమనా-ఆత్మలు అనేకము లైతే ఒక్కొక్క ఆత్మ ఒక్కొక్కదేహంలో మాత్రమే ఉండడంచేత అవి సర్వవ్యాపకములు అవడానికి వీలులేదు. చైత్రుని ఆత్మ మైత్రుని దేహంలో వ్యాపించి ఉన్నట్లు కనబడడంలేదు కదా? అలా అయితే చైత్రాత్మకు మైత్రుని దేహంలో కలిగే సుఖదుఃఖాల అనుభవం ఉండాలి. అలాంటి దేదీ లేదు. ఆత్మ ఆ యా దేహాలచేత అవచ్ఛిన్నం కాకపోయినప్పుడే. ఆ ఆత్మలో భేదం కలిగించేది ఏదీ లేదు గాన అప్పుడు ఆత్మ సర్వవ్యాపకం అనీ, ఒక్కటే అనీ చెప్పడానికి వీలవుతుంది. (అప్పుడు "**యేన సర్వమిదం తతమ్**"-ఏ ఆత్మచేత ఇదంతా వ్యాప్త మైనదో-అనే మాట యుక్తంగా ఉంటుంది అని భావం). అట్లు కాదు-"అవినాశి"అనే శ్లోకం పరమాత్మను మాత్రమే చెపుతుంది, అని అంటే-అప్పుడు సర్వవ్యాపకు డైన పరమాత్మ మాత్రమే నిత్యుడు ఇతరఆత్మ లన్నీ ఘటాదుల వలె పరిచ్ఛిన్నా లవడంచేత అనిత్యములు అని చెప్పవలసిన పెద్ద అనిష్టం వచ్చి పడుతుంది. అందుచేత శ్రీకృష్ణుడు "**న త్వేవాహం**"అనే శ్లోకంలో ఆత్మభేదాన్ని **అవినాశీ**త్యాది శ్లోకంలో ఆత్మభేదాన్నీ ప్రతిపాదిస్తున్నా డనగా ఆత్మభేదం ఔపాధికం మాత్రమే; యథార్థం కాదు అని మాత్రమే ఆతని అభిప్రాయ మని విద్వాంసులు అనాయాసంగా నిశ్చయించుకొన వచ్చును.

తత్త్వం ఉపదేశించేటప్పుడు కూడ ముందు ఔపాధిక మైన భేదాన్ని అనువదించే తరువాత పారమార్థిక మైన అభేదాన్ని ఉపదేశించవలసి ఉంటుంది. అందచేత పైకి కనబడే భేదాన్ని అనువదించినంతమాత్రంచేత అది పారమార్థికం అయిపోదు. ఈ శ్లోకాన్నీ'**యేన సర్వమితం తతమ్**'అనేదాన్నీ ఒకదానితోఒకటి సమన్వయించుకొని అర్థం చెప్పుకోవాలి. అప్పుడు-కృష్ణు డనీ, అర్జును డనీ, రాజు లనీ వ్యవహరించబడుతూన్న మనం అందరమూ కూడ అవినాశి యైన బ్రహ్మయే అని ఏకవాక్యార్థం లభిస్తుంది. అందుచేత సర్వవ్యాపకమూ,నిత్యమూ అయిన ఆత్మకు భేదం కల్పించకలిగినది ఏదీ లేకపోవడంవల్ల, పారమార్థిక మైన ఆత్మభేదం లేదు. భేదకా లన్నీ ఆత్మచేత వ్యాపింపబడి ఉన్నాయి కదా? వ్యావహారికంగా మాత్రం,ఆకాశభేదం వలె,కల్పిత మైన ఆత్మభేదం ఉంది.

శంకరమతంలో గ్రంథారంభమే కుదరదు. పరమార్థదృష్టి గల పరమపురుషునికి నిర్విశేషము,కూటస్థనిత్యము,చైతన్యరూపము అయిన ఆత్మయొక్క యథార్థస్వరూపం తెలిసి ఉండడంచేత ఆతనికి అజ్ఞానం కాని దాని కార్యాలు కాని ఉండవు. అలాంటివానికి అజ్ఞానం చేత ఏర్పడిన భేదాన్ని చూడడం,అలా భేదం కనబడడంచేత ఉపదేశాదులుచేయడం అనేది కుదరవు అని శ్రీరామానుజులు చేసిన ఆక్షేపం సారరహిత మైనది. మీ మతంలో కూడ, సమస్తకామాలు తీరినవాడు,పరిపూర్ణుడు,ఆత్మారాముడు,ఆనందమయుడు అయిన పరమ పురుషునికి అర్జునుని దుఃఖం చూడడం,వానికి ఉపదేశించడం మొదలైన వ్యవహారాలు ఎలా కుదురుతాయి? లీలచేత అని సమాధానం చెపితే మాయచేత అని మేం సమాధానం చెపుతాం. పుట్టుక లేనివాడు,అవ్యయుడు,సకలభూతాల ఈశ్వరుడూ అయిన కూడ

భగవంతుడు మాయావశంచేత పుట్టినవాడు వలె, ఉగ్రసేనుని రాజ్యంలో అతనిచేత పరిపాలించదగినవాడు వలె ఎలా కనబడుతున్నాడో అట్లే అర్జునునికి ఏమేమో ఉపదేశిస్తున్నట్లు కనబడకూడదా?పరమార్థంలో నైతే కృష్ణుడూ లేదు,పార్థుడు లేదు,ఉపదేశమూ లేదు.ఉన్నది ఏకైకఅద్వితీయబ్రహ్మయే.వ్యవహారావస్థలో అంతా ద్వైతమే. అందుచేత మాకేమీ నష్టం లేదు.

సరే!పరిపూర్ణుడూ,నిష్కాముడూ అయిన హరిలో లీలమాత్రం ఎలా కలుగుతుంది? చెప్పు.బాలునిలో కలిగి నట్లు అని చెప్పడానికి వీలు లేదు.బాలుడు అజ్ఞానవంతుడు,కోరికలు ఉన్నవాడు;అందుచేత అతనిని దృష్టాంతంగా చెప్పకూడదు.రాజు బంతి ఆడుకున్నట్లు అనికూడ చెప్పడం కుదరదు.వానికి కూడ దానిలో (కందుకక్రీడలో)సుఖాభిలాషచేతనే ప్రవృత్తి కనబడుతున్నది.లోకానుగ్రహం కోసం అని కూడ చెప్పడం కుదరదు.లోకానుగ్రహం అనే ప్రయోజనం ఇంకా మిగిలి ఉంటే భగవంతుడు పూర్ణకాముడు అనే మాటకు వ్యాఘాతం కలుగుతుంది.అందుచేత మీకు కూడ మాయయే శరణం.మాయచేత మాత్రం అసంగతమైన (కురదని)విషయాలు ఎలా సిద్ధిస్తాయి అనే ప్రశ్నకు అవకాశం లేదు.మాయలో ప్రతీదీ కుదురుతుంది అని కదా లోకప్రసిద్ధి?

(అక్షేపం)పరమపురుషుడు అర్జునునికి ఉపదేశం చేస్తున్నా డంటే అది మాయచేతనే అయితే కావచ్చును;ఈనాటి ఆచార్యపరంపర శిష్యపరంపరకు ఉపదేశం చేయడం ఎలా కుదురుతుంది!(ఆచార్యునికి)ద్వైతం కనబడితే అతడు విద్వాంసు డని(జ్ఞాని అని) చెప్పడం కుదరదు,ద్వైతం కనబడకపోతే మాటలాడడం ఉండదు అన్నట్లయితే-(సమాధానం)అట్లు కాదు.గురువు ఆత్మతత్త్వాన్ని సాక్షాత్కరించుకొన్నా కూడ దేహం ఉన్నంతవరకూ బాధితమైన అధ్యాస (ఇదంతా అసత్యమే అనే జ్ఞానంచేత అధ్యాసబాధించబడినా కూడ అది) అనువర్తిస్తూనే ఉంటుంది గాన వ్యవహారానికి లోపం ఉండదు.ఆత్మ దేహంకంటె భిన్న మైనది అని తెలిసి కూడ నేను మనుష్యుడను,నేను వైష్ణవుడను,నేను రామానుజుడను అని నువ్వు ఎలా అంటున్నావో అదే విధంగా మాకు మాత్రం ఎందుకు కాకూడదు?బాధించబడిన భేదజ్ఞానం అనువర్తించినా కూడ అది ఉపదేశాదిప్రవృత్తులకు హేతువు కాకూడదు అనడానికి వీలు లేదు.ఆత్మజ్ఞానంచేత బాధితమైన తరువాత కూడ అనువర్తిస్తూన్న దేహాత్మభ్రమ(దేహమే ఆత్మ)అనే భ్రమవల్ల భోజనాదికార్యాలలో ప్రవృత్తి కనబడుతున్నది కదా?ఆత్మ దేహంకంటె భిన్న మైనది అనే జ్ఞానం ఉన్న నీవు భోజనాది వ్యాపారాలు లేకుండా ఉండడంలేదు కదా? భోజనాది వ్యాపారం అంతా దేహాత్మభ్రాంతివల్ల జరిగేది కదా?నేను దేహం కాను అను అనుకొనేవాడు నోటితో తినడు, తినా లని అనుకొనడు కదా?

బింబ మైన ఈశ్వరుడు తన ప్రతిబింబ మైన అర్జునునికి తత్త్వం ఎలా ఉపదేశిస్తాడు? ఉన్మత్తుడు కానివా డెవడూ కూడ అద్దంలో ఉన్న తన ప్రతిబింబానికి ఏమీ ఉపదేశించడు

కదా!అని అంటూ శ్రీరామానుజులే చేసిన ఆక్షేపం కూడ అర్థరహిత మైనది.ఎవ్వడూ కూడ తన ప్రతిబింబంతో మాటలాడకపోవడానికి కారణం-బింబప్రతిబింబాలు రెండిటికీ పూర్తిగా భేదం లేకపోవడమా,ప్రతిబింబం మిథ్య అవడమా లేక ప్రతిబింబంలో చైతన్యం లేకపోవడమా?మొదటి పక్షం కుదరదు.అత్యంతమూ అభేదమే అన్నట్లయితే ఇది బింబం, ఇది ప్రతిబింబం అనే వ్యవహారమే ఉండదు.ఘటానికి పటానికీ మధ్య భేదం ఉండడంచేత ఇది ఘటం,ఇది పటం అనే వ్యవహారం జరిగి నట్లు ఇది బింబం, ఇది ప్రతిబింబం అనే వ్యవహారం బింబప్రతిబింబాల భేదంమీదనే ఆధారపడి ఉంటుంది కదా?మరొక విషయ మేమనగా-అద్దంలో ఉన్న మరొకని ప్రతిబింబం పూర్తిగా తనకంటె భిన్న మైనదే. అయినా పురుషుడు దానికి ఉపదేశించడం లేదు?(ఉపదేశించడానికి కేవలం భిన్నత్వం కారణం కాదని భావం).రెండవది కూడ కాదు.రజ్జుసర్పం రజ్జుజ్ఞానంచేత బాధించబడి నట్లు ప్రతిబింబం ఏ జ్ఞానంచేతా బాధించబడుచున్నట్లు కనబడడంలేదు.బాధించబడనిది మిథ్య కాదు.అద్దంలో ఉన్న తన ప్రతిబింబం మిథ్య అని ఎవ్వడూ అనుకొనడు కదా?ఇక మిగిలినది మూడవ పక్షం.అనగా ప్రతిబింబం అచేతనం గాన ఎవ్వడూ తన ప్రతిబింబంతో మాటలాడ డనే పక్షం అంగీకరించాలి.అయితే అవిద్యలో ఉన్న చిత్ప్రతిబింబాలు చైతన్యం ఉన్నవే కాని అద్దంలో ఉన్న ప్రతిబింబాల వంటివి కావు.అందుచేత కృష్ణుడుతన కంటె భిన్నములైన తన ప్రతిబింబాలకు ఉపదేశించడం యుక్తమే.బింబప్రతిబింబా లైన జీవేశ్వరులు వేరు వేరే అయితే అద్వైతం ఎలా సిద్ధిస్తుంది అనే ప్రశ్నకు తావు లేదు. అవిద్య ఉన్నంతవరకు బింబ ప్రతిబింబాదిభేదం ఉన్నా కూడ పరమార్థదశలో అవిద్యయే లేదు గాన బింబ ప్రతిబింబభేదం కూడ ఉండదు;అందుచేత అద్వైతానికి ఏమీ హానిలేదు.దీనిని పట్టి "**నిత్యో నిత్యానాం చేతనశ్చేతనామ్**"ఇత్యాదిమంత్రాన్ని పట్టి జీవేశ్వరుల మధ్య భేదమే ఉన్నట్లు సిద్ధిస్తుంది అనే రామానుజుల వచనానికి కూడ సమాధానం చెప్పబడినట్లే.ఎందువల్ల ననగా "**ఏకో బహూనాం విదధాతి కామాన్**"(తాను ఒకటే అయి ఉండి అనేకుల కామాలను పూరిస్తాడు) అనే ఆ మంత్రం వ్యావహారిక మైన) జీవేశ్వరభేదాన్నీ,రక్ష్యరక్షకభావాన్నీ(జీవుడు రక్షింప దగినవాడు ఈశ్వరుడు రక్షించేవాడు అనే విషయాన్నీ)ప్రతిపాదిస్తూన్నది కాని పారమార్థికమైన భేదాన్ని చెప్పడం లేదు.

మరొక విషయ మేమనగా-శుద్ధచిత్స్వరూపానికి ఏ ధర్మాలూ ఉండవు.అందుచేత శుద్ధచిత్తు ఉపదేశిస్తుంది.,మరొక పని చేస్తుంది అని చెప్పడం కుదరదు.కృష్ణుని దేహేంద్రియా ద్యాకారంలో పరిణమించిన మాయచేత అవచ్ఛిన్నమైన చైతన్యానికే ఈ ఉపదేష్టృత్వాదికం (ఉపదేశించేదిగా ఉండడం)మొదలైనది ఉంటుం దని చెప్పాలి.ఆ కృష్ణదేహాద్యాకార పరిణతమాయావచ్ఛిన్నచిత్ అర్జునదేహేంద్రియాద్యాకారపరిణతావిద్యావచ్ఛిన్నచిత్‌కంటె భిన్నమే.(మాయ కృష్ణుని దేహంగా పరణమించింది.ఆ మాయచేత అవచ్ఛిన్న మైన చైతన్యం ఉపదేశకుడు.అవిద్య అర్జునదేహాద్యాకారంలో పరిణమించింది.అట్టి అవిద్యచేత అవచ్ఛిన్నమైన

చైతన్యం ఉపదేశ్యం. అందుచేత ఈ ఉపదేష్టకీ, ఉపదేశ్యునికీ కాల్పనికమైన భేదం ఉంది అని భావం). అందుచేతనే కదా అద్వైతులు 'తత్త్వమసి' అన్నప్పుడు తత్ పదార్థమైన పరమేశ్వరునికి విశేషణంగా ఉన్న సర్వజ్ఞత్వాదులను, త్వంపదార్థమైన జీవునికి విశేషణంగా ఉన్న కించిద్‌జ్ఞత్వాదులను దూరంగా ఉంచి పరిశుద్ధమైన చైతన్యానికి అభేదం చెపుతారు? అందుచేత విశేషణవిశిష్టులైన కృష్ణార్జునులకు భేదం ఉంది గాన ఉపదేశం ఉపపన్నమే.

గురువుకు కలిగిన అద్వితీయాత్మజ్ఞానంచేతనే బ్రహ్మజ్ఞానమూ, దాని కార్యాలూ నశించిపోతాయి కాబట్టి శిష్యునికి ఉపదేశించడం వ్యర్థం అని అంటూ శ్రీ రామానుజులే చేసిన మరొక ఆక్షేపంలో కూడ సారం లేదు. ఆత్మజ్ఞానికి కూడా దేహపాతం అయేవరకు (ఈ దేహం పడిపోయేవరకు) దేహేంద్రియాదిప్రపంచజ్ఞానం ఉంటుంది అనే విషయం వెనుకనే ప్రతిపాదించబడింది. ఐంద్రజాలికుడు ఆకాశంలో నిర్మించిన గంధర్వనగరాన్ని గూర్చి ఇది నిజానికి గంధర్వనగరం కాదు, ఇది కేవలం మాయచేత నిర్మించినదే అనే జ్ఞానం ఉన్నవాళ్లకు కూడ ఆ ఇంద్రజాలం ఉన్నంతవరకూ ఆ నగరం కనబడుతూనే ఉంటుంది. ఈ ప్రపంచం కూడ ఎవని అద్వితీయాత్మజ్ఞానంచేత బాధింపబడిందో (సత్యం కాదు అని నిర్ధరించబడిందో) వానికి మాత్రమే అది, దగ్ధపటం వలె, బంధహేతువు కాకుండా ఉంటుంది. (నేలపై పరచిన వస్త్రం ఈ చివరినుండి ఆ చివరివరకు కాలిపోయినా కూడ పైకి చూడడానికి వస్త్రం వలె కనబడుతుంది. కాని అది ఏపనికీ ఉపయోగించదు. అట్లే జ్ఞానికి కూడ ప్రపంచం పైకి ఉన్నట్లు కనబడుతుంది కాని బంధహేతువు కాదు). అంతేనే కాని అది ఇతరులకు కూడ బంధహేతువు కాకుండా ఉండదు. అందచేత గురువుకు ఆత్మజ్ఞానం కలుగుతే శిష్యునికి అజ్ఞాననివృత్తి కలగదు. మరొక విషయం ఏ మనగా–ఏ మనిషి అవిద్య వానిదే–అందుచేత ఎవని ప్రపంచం వానిదే. (అనగా ఎంతమంది జీవు లున్నారో అన్ని అవిద్య లుంటాయి. అందుచేత ఒకని అవిద్య తొలగుతే మరొకనికి జ్ఞానోదయం కలగదు). చాలా మంది పురుషులు కళ్లదగ్గర చేతులు అడ్డం పెట్టుకొన్నప్పుడు వాళ్ల కెవరికీ సూర్యుడు కనబడదు. అలా కంటిదగ్గర చెయ్యి ఉంచుకొననివానికి ఆ సూర్యుడే కనబడతాడు. చెయ్యి అడ్డం లేనివాడు సూర్యుణ్ణి చూడకలిగి ఉండడం ఏ విధంగా ఇతరుల (చెయ్యిఅడ్డం పెట్టు కొన్నవాళ్ల) సూర్యజ్ఞానాన్ని నివర్తింపచేయజాలదో అట్లే ప్రస్తుతవిషయంలో కూడ ఒకనికి కలిగిన జ్ఞానం వల్ల మరొకని భ్రమ తొలగుతుం దని చెప్పడం విపరీత మైన మాట. ఒకనికి రజ్జుస్వరూపం తెలియడంచేత ఇతరుల రజ్జుసర్పభ్రాంతి తొలగుతుంది అని ఎక్కడా వినబడదు కనబడదు.

నిజానికి ఉపదేశం కుదరకపోవడం అనే దోషం అది అనర్థకం అనే దోషం రామానుజమతానికే గట్టిగా పడుతుంది. అదెట్లనగా–చిత్తు అచిత్తూ కూడ పరమాత్మ యైన శ్రీకృష్ణుని శరీరాలు గాన అతడు వాటి లోపల ఉంటాడు. అలా లోపల ఉండవలసిన పరమాత్మ బైటకు వచ్చి, చిత్తైన అర్జునుని ఎదుట నిలబడి గురువుగా ఎలా వ్యవహరిస్తాడు?

లోపల ఉండవలసిన వస్తువు బైటికు రాకూడదు కదా? చిదచిత్తులకు బైట కూడా కృష్ణుడు ఉంటే అప్పుడు కృష్ణుడే చిదచిత్తుల శరీరం అవుతాడు; చిదచిత్తులచేత వ్యాపించబడిన వా డవుతాడు. వ్యాపకమైన శస్త్రాదులచేత వ్యాప్యమైన దేహానికి నాశం కలిగి నట్లు చిదచిత్తులచేత కృష్ణునికి నాశం కూడా కలగవచ్చును. (ఈ వాక్యం భావం స్పష్టంగా తెలియదంలేదు. "వ్యాపకేన శస్త్రాదినా వ్యాప్యస్య దేహస్యేవ చిదచిద్భ్యాం కృష్ణస్య నాశోఽపి స్యాత్" అని ఇక్కడ ఉన్న వాక్యం). చిదచిత్తులు ఈశ్వరునికి అపృథక్సిద్ధాలైన విశేషణాలు, (విడదీయడానికి శక్యం కాకుండా అంటి పెట్టుకొని ఉన్న అవయవాలు లేదా ధర్మాలు). అలాంటప్పుడు - తనకంటె అపృథక్సిద్ధ మైన గంధంనుండి దూరంగా పృథివి ఏ విధంగా ఉండజాలదో అదే విధంగా ఈశ్వరుడు కూడ చిదచిత్తులను విడిచి దూరంగా ఉండజాలడు గాన, వేరుగా ఉండే రెండు వస్తువుల ధర్మమైన గురుశిష్యభావం అపృథక్సిద్ధు లైన చిదీశ్వరు లైన కృష్ణార్జునులకు ఎలా కుదురుతుంది? అపృథక్సిద్ధా లైన విశేషణాలను బోధించే శబ్దాలు విశేష్యం దాకా వెళ్లి విశేష్యాన్ని కూడా బోధిస్తాయి అనే నియమం ఉండడంవల్ల అర్జునశబ్దానికి కూడ అర్థం చిదచిద్విశిష్టేశ్వరుడే అని చెప్పాలి. అప్పుడు కృష్ణుడు అర్జునునికి ఉపదేశించాడు అనే వాక్యం కూడ కుదరదు. అంతటా వ్యాపించి ఉన్నవాడు, అంతా తన శరీరంగానే కలవాడు, అన్నింటి లోపల ఉన్నవాడూ అయిన ఈశ్వరుడు కృష్ణదేహేంద్రియాదులవిషయంలో 'నేను' 'నాది' అన్నట్లు అర్జునదేహేంద్రియాదివిషయంలో కూడ 'నేను' 'నాది' అనడమే ఉచితంగా ఉంటుంది. అలాంటప్పుడు - కృష్ణుడ నైన నేను, నువ్వు, ఈ రాజులు అని యుష్మచ్ఛబ్ద - ఇదం శబ్దాలచేత నిర్దేశం ఎలా కుదురుతుంది? కృష్ణుడ నైన నేను, అర్జునుడ నైన నేను, రాజు లైన నేను అనాలి; లేదా నా కృష్ణుడు, నా అర్జునుడు, నా రాజులు అనాలి.

మరొక విషయం - చేతనాచేతనాత్మక మైన సకలజగత్తుకు పరమకారణమైన ఈశ్వరుడు కృష్ణుడు. అలాంటివాడు తననుండి పుట్టినవా ళ్లవడంచేత తనకంటె భిన్నులు కాని అర్జునాదుల విషయంలో భేదబుద్ధితో ఎలా ఉంటాడు? ఘటం మట్టికంటె భిన్నం కాదు కదా? తనకంటె భిన్నుడు కాని అర్జునునికి ఎలా ఉపదేశిస్తాడు? ఉపదేశించడం అనేది భేదం ఉంటేనే జరుగుతుంది కదా? ఇదే విధంగా - అర్వాచీనులైన ఆచార్యుల పరంపరకు తామూ, ఇతరచేతనులూ కూడ పరమకారణమైన ఈశ్వరునికంటె వేరు కాదు అని తెలుసును. అలా తెలుసుకొన్న ఆచార్యపరంపర పరమకారణ మైన ఈశ్వరునికంటె అభిన్నమైన తనకంటె అభిన్నమైన చేతనశిష్యులకు ఏ విషయమైన ఎలా ఉపదేశిస్తుంది?

(విశిష్టాద్వైతి) - జీవులు సహజంగా జ్ఞానమాత్రస్వరూపులు, నిత్యులు. అందుచేత పరమేశ్వరునినుండి పుట్టుచున్నా రనగా మా అభిప్రాయం ఉపాధులను (శరీరాదులను) పుట్టియే పుట్టుచున్నట్లు కనబడుతున్నారు అని మాత్రమే అని అంటే - (అద్వైతి) అయితే కేవలజ్ఞాన మాత్రస్వరూప మైన ఆత్మలో నిజమైన భేదాన్ని కల్పించకలది ఏదీ లేకపోవడంచేత అద్వైతమే సిద్ధిస్తుంది. ఈ విధంగా నీకు తన మతాన్ని విడిచిపెట్టడం, పరమతంలో ప్రవేశించడం అనే

రెండు దోషాలు తగుల్కొంటాయి.స్వరూపతః భేదం లేకపోయినా ధర్మాలను పట్టి భేదం ఉంది అని అనడం కూడ కుదరదు;ఆ ధర్మం ఉపాధికృతమే గాన స్వరూపానికి చెందినది కాదు కదా?

ఇదే విధంగా-ఆత్మ కేవలజ్ఞానమాత్రస్వరూపం అయినప్పుడు అలాంటిఆత్మకు ఉపదేశంచేత సంపాదించవలసిన గుణాలు గాని,ఉపదేశంచేత తొలగించవలసిన దోషాలు గాని లేకపోవడంచేత ఉపదేశం కూడ వ్యర్థమే.నీచమైన ఉపాధిని విడిచిపెట్టడం,ఉత్కృష్ట మైన ఉపాధిని స్వీకరించడం అనేదే ఉపదేశానికి ఫలం అని కూడ అనడానికి వీలులేదు. మట్టిపాత్ర అనే ఉపాధిని విడచి బంగారుపాత్ర అనే ఉపాధిని స్వీకరించడంచేత ఆకాశానికి ఏ విధంగా లాభమేమీ ఉండదో అట్లే మనుష్యోపాధిని త్యజించి దేవోపాధిని గ్రహించినా కూడ వికారరహిత మైన ఆత్మకు లాభం ఏమీ ఉండదు. దేహమే ఆత్మ అనే భ్రమ ఉంటే పురుషుడు-నేను దేవుణ్ణి,నేను యక్షుణ్ణి అని సంతోషించవచ్చునేమో.ప్రకృతంలో నైతే ఉపదేశంచేత దేహాత్మభ్రమ తొలగి దేహాతిరిక్తాత్మజ్ఞానం కలిగిన తరువాత వానికి ఇంక దేవతాదేహంచేత ప్రయోజనం ఏముంటుంది?ఈ దేవదేహం నాది అనుకొని పురుషుడు సంతోషిస్తాడు అనడం కూడ సరికాదు."అసంగో హ్యయం పురుషః" అను శ్రుతి చెప్పినట్లు ఆత్మ అసంగం అని తెలుసుకొన్నవాడు దేవదేహం నాది అని ఎలా అనుకొంటాడు?

(విశిష్టాద్వైతి) అసంగశ్రుతి అర్థం వేరు.పురుషుడైతే ఎల్లప్పుడూ సూక్ష్మదేహంతోనే ఉంటాడు కాబట్టి ససంగుడే.అదే విధంగా సూక్ష్మమైన దేహాలు ఉపాధులుగా ఉండడంచేత పురుషుడు కేవలజ్ఞానస్వరూపుడైనా కూడ అనేకవిధా లైనవాడే అనగా ఉపాధిభేదాన్ని పట్టి జీవులు భిన్నులే. ఈ ఉపాధి ప్రలయంలోను,ముక్తిలోనూ కూడ నశించదు.అందుచేత జీవులు ఎల్లప్పుడూ పరస్పరం వేరు వేరైన వారే.ఉపదేశంవల్లా,ఈశ్వరోపాసన చేయడంవల్లా జీవులకు ఈశ్వరుని వంటి జ్ఞానైశ్వర్యాదులు, అప్రాకృతమైన (మామూలు దేహంవంటివి కాని)దివ్యమంగలశరీరాలు సిద్ధిస్తాయి అని అంటే(అద్వైతి)-ఇదికూడ కుదరదు.ఎల్లప్పుడు లింగదేహంతో ఉండే పురుషుడు లింగదేహాకారం కలవా డవుతాడు కాని జ్ఞానైకాకారుడు కాడు. పంచీకృతములు కాని పంచభూతాలనుండి పుట్టిన లింగశరీరం అనాది యైన జీవుని ఎల్లప్పుడూ ఉపాధిగా ఉండడం కూడ కుదరదు. నీ మతం ప్రకారం ప్రకృతి పురుషేశ్వరులే అనాదులు కాని లింగం ప్రకృతియొక్క కార్యం కాబట్టి సాది(ఎప్పుడో ఒకప్పుడు పుట్టినది)కావాలి.ముక్తిలో కూడ లింగశరీరం ఉండే పక్షంలో దానిలో అంతర్గత మైన మనస్సు కూడ ఉంటుంది గాన,అది తాను అంతకు పూర్వం అనుభవించిన సంసారాన్ని గూర్చి స్మరించే అవకాశం ఉండడంచేత ముక్తిలో కూడ కొంచెం దుఃఖం ఉండడానికి అవకాశం ఏర్పడుతుంది.నిజానికి మోక్షం అంటే లింగశరీరభంగమే గాన మోక్షావస్థలో కూడ లింగశరీరం ఉంటుం దనడం కూడ యుక్తంకాదు. సగుణముక్తిస్థానం ఉపాసనచేతనే లభిస్తూంటే తత్త్వజ్ఞానం ఉపదేశించడం వ్యర్థమే అవుతుంది.ఉపాసన లేకుండా కేవలం తత్త్వోపదేశమాత్రంచేత జీవులకుముక్తి లభించనప్పుడు,నీ మతంలో, తత్త్వోపదేశం వ్యర్థమే.

మరొక విషయ మేమనగా-ఆస్తికు లైన లౌకికులు,తార్కికులూ కూడ వేద-అనుమానాదిప్రమాణాలచేత తమకంటె వేరుగా ఈశ్వరు డనేవా డొక డున్నా డని తెలుసుకొని వానినుండి భయపడుతూనే ఉంటారు."భీషాస్మాద్వాతః పవతే"అని శ్రుతిలో చెప్పి నట్లు వాయుసూర్యాదులు కూడ ఈశ్వరునికి భయపడుతూంటారు.అలాంటప్పుడు అభయంకోసం తనను శరణుజొచ్చిన శిష్యునికి గురువు భయజనకమైన ఆ జీవేశ్వరభేదాన్నే ఉపదేశిస్తే శిష్యునికి ఏమి ఫలం లభిస్తుంది? ఏమీ లభించదు.పైపెచ్చు భయం పెరుగుతుంది. "య ఉదరమన్తరం కురుతే అథ తస్య భయం భవతి"(ఏ కొంచెం భేదబుద్ధి చూపించినా (భయం కలుగుతుంది)అని కదా శ్రుతి చెపుతూన్నది?అందుచేత శిష్యుడు భేదవాదియైన గురువును ఆశ్రయించడంవల్ల ఏమీ ప్రయోజనం లేదు.(భా.అ.ప్ర.పే.27-31).12

భాష్యమ్

తత్ర కథమి వ నిత్యః ఆత్మా ఇతి దృష్టాన్తమాహ -

మూ. దేహినోఽస్మిన్ యథా దేహే కౌమారం యౌవనం జరా.
తథా దేహాన్తరప్రాప్తిర్ధీరస్తత్ర న ముహ్యతి. 13

దేహిన ఇతి :- దేహః అస్య అస్తీతి దేహీ,తస్య దేహినః,దేహవదాత్మనః, అస్మిన్ వర్తమానే దేహే యథా యేన ప్రకారేణ కౌమారం కుమారభావః బాల్యావస్థా, యౌవనం యూనో భావః మధ్యమావస్థా, జరా వయోహానిః జీర్ణావస్థా ఇతి ఏతాః తిస్రః అవస్థాః అన్యోన్యవిలక్షణాః,తాసాం ప్రథమావస్థానాశేన నాశః,ద్వితీయావస్థోపజనేనోపజననమ్ ఆత్మనః,కింతర్హి?అవిక్రియస్యైవ ద్వితీయతృతీయావస్థాప్రాప్తిః ఆత్మనః దృష్టా యథా,తథా తద్వదేవ,దేహాత్ అన్యః దేహాన్తరమ్,తస్య ప్రాప్తిః దేహాన్తరప్రాప్తిః అవిక్రియస్యైవ ఆత్మనః ఇత్యర్థః.ధీరః ధీమాన్ తత్ర ఏవం సతి న ముహ్యతి న మోహమ్ ఆపద్యతే. 13.

బాలానందిని

తత్రేతి:- అయితే-ఆత్మ దేని వలె నిత్య మైనది అని ప్రశ్న కలగగా దృష్టాంతం చెపుతున్నాడు-దేహినః ఇతి:-

ప్ర.అ.దేహినః ఇతి:-దేహినః=జీవునకు,అస్మిన్ దేహే=ఈ దేహంలో, కౌమారమ్ =బాల్యము, యౌవనమ్=యౌవనము, జరా=ముసలితనము, యథా=ఎట్లు కలుగునో, దేహాన్తరప్రాప్తిః= మరొక దేహం యొక్క ప్రాప్తి కూడ, తథా= అట్లే కలుగుతూ ఉంటుంది.తత్ర=ఆ విషయంలో, ధీరః=బుద్ధిమంతుడు, న ముహ్యతి= మోహం చెందదు.

దేహిన ఇతి:- ఎవనికి దేహం ఉంటుందో అతడు దేహి;అట్టి దేహికి,అనగా దేహం గల ఆత్మకు, ప్రస్తుతం ఉన్న ఈ దేహంలో, యథా=ఏ ప్రకారంచేత, కౌమారమ్=కుమారత్వం,

అనగా బాల్యావస్థ,యువకుని ధర్మం యౌవనం;మధ్యమావస్థ;జరా=వయస్సు గడచిపోవడం. జీర్ణావస్థ,అనే పరస్పరవిలక్షణా లైన, ఒక దానితో ఒకటికి పోలిక లేని,మూడు అవస్థలు- వీటిలో మొదటి అవస్థ నశించినా ఆత్మ నశించడం లేదు;రెండవ అవస్థ పుట్టినా ఆత్మ మళ్ళీ పుట్టడం లేదు;మరేమనగా-ఆత్మ ఎలాంటి వికారాలూ లేకుండా ఉండగానే రెండవ అవస్థ, మూడవ అవస్థ దేహానికి కలుగుతున్నట్లు ఏ విధంగా కనబడుతూన్నదో, అదే విధంగా ఆత్మ ఏ వికారాలూ చెందకుండా ఉండగానే, దేహాంతరంయొక్క అనగా మరొక దేహం యొక్క ప్రాప్తి కలుగుతూంటుంది. ఇది ఇలా జరుగుతూండగా బుద్ధిమంతుడు మోహం చెందడు. 13

భాష్యమ్

యద్యపి ఆత్మవినాశనిమిత్తః మోహః న సంభవతి నిత్యః ఆత్మా ఇతి విజానతః, తథాపి శీతోష్ణసుఖదుఃఖప్రాప్తినిమిత్తః మోహః లౌకికః దృశ్యతే సుఖవియోగనిమిత్తః దుఃఖసంయోగనిమిత్తశ్చ శోకః ఇత్యేతత్ అర్జునస్య వచనమ్ ఆశఙ్క్య ఆహ-

మూ. మాత్రాస్పర్శాస్తు కౌన్తేయ శీతోష్ణసుఖదుఃఖదాః,
అగమాపాయినోऽనిత్యా స్తాంస్తితిక్షస్వ భారత. 14

మాత్రాస్పర్శా ఇతి :- మాత్రాః-ఆభిః మీయన్తే శబ్దాదయః ఇతి శ్రోత్రాదీని ఇన్ద్రియాణి. మాత్రాణాం స్పర్శాః శబ్దాదిభిః సంయోగాః, తే శీతోష్ణసుఖదాః శీతమ్, ఉష్ణం,సుఖం,దుఃఖం చ ప్రయచ్ఛన్తి ఇతి. అథవా-స్పృశ్యన్తే ఇతి స్పర్శాః,విషయాః శబ్దాదయః. మాత్రాశ్చ స్పర్శాశ్చ;శీతోష్ణసుఖదుఃఖదాః శీతం కదాచిత్ సుఖం కదాచిత్ దుఃఖం. తథా ఉష్ణమప్యనియతరూపమ్.సుఖదుఃఖే పునః నియతరూపే యతః న వ్యభిచరతః అతః తాభ్యాం పృథక్ శీతోష్ణగ్రహణమ్.యస్మాత్ తే మాత్రాస్పర్శాదయః అగమాపాయినః, అగమాపాయశీలాః తస్మాత్ అనిత్యాః అతః తాన్ శీతోష్ణాదీన్ తితిక్షస్వ ప్రసహస్వ తేషు హర్షం విషాదం చ మా కార్షీః ఇత్యర్థః. 14

బాలానందిని

యద్యపీతి:- ఆత్మ నిత్య మైనది అని తెలిసినవానికి ఆత్మ నశిస్తుంది అనుకొనడంచేత కలిగే మోహం కలగకపోయినా శీత-ఉష్ణ-సుఖ-దుఃఖాలను పొందడంచేత కలిగే లౌకికమైన మోహమూ,సుఖం దూరం అవడంవల్లా,దుఃఖంతో సంబంధంవల్లా కలిగే శోకమూ కనబడుతున్నది కదా అని అర్జునుడు అంటా డని ఆశంకించుకొని అంటున్నాడు-**మాత్రేతి:**-

ప్ర.అ. **మాత్రేతి** :- కౌన్తేయ=కుంతీపుత్రా! భారత=భరతవంశంలో పుట్టినవాడా! మాత్రాస్పర్శాః తు=ఇంద్రియాలకు శబ్దాదివిషయాలతో, కలిగే సంబంధా లైతే శీతోష్ణ సుఖదుః

ఖదాః=చలి,వేడి, సుఖమూ,దుఃఖమూ-వీటిని కలిగిస్తాయి. ఆగమాపాయినః =రావడమూ,పోవడమూ అనేవి ఉన్నవి. వస్తూంటాయి, పోతూంటాయి. అనిత్యాః= అనిత్యమైనవి. తాన్ =వాటిని, తితిక్షస్వ= సహించుము.

మాత్రాస్పర్శా ఇతి:- వేటిచేత శబ్దాదులు గ్రహించబడతాయో అవి మాత్రలు. అనగా శ్రోత్రాదీంద్రియాలు. ఆ ఇంద్రియాలకు శబ్దాదులతో స్పర్శలు,అనగా సంయోగాలు శీతాన్ని, ఉష్ణాన్ని,సుఖాన్ని,దుఃఖాన్నీ ఇస్తూంటాయి. లేదా-'స్పర్శాః'అనగా స్పృశింపబడేవి అని అర్థం. అనగా శబ్దాదివిషయాలు. మాత్రాస్పర్శాః అనగా ఇంద్రియాలు,విషయాలూ అని అర్థం. అవి శీతోష్ణసుఖదుఃఖదాలు. ఒకప్పుడు చల్లదనం సుఖకరంగా ఉంటుంది మరొకప్పుడు దుఃఖ కరంగా ఉంటుంది. ఉష్ణం కూడా ఇదే విధంగా అనిశ్చితరూపంగా ఉంటుంది. కాని సుఖ దుఃఖాలు మాత్రం ఒకే రూపంలో ఉంటాయి. వాటికి వ్యభిచారం లేదు. మార్పు లేదు. అందుచేతనే సుఖదుఃఖాలకంటె వేరుగా శీతోష్ణాలు చెప్పబడ్డాయి. (అనగా శీతంవల్ల కలిగినా ఉష్ణంవల్ల కలిగినా దుఃఖం దుఃఖమే,అదే విధంగా సుఖం కూడ. దుఃఖం సుఖం కాదు, సుఖం దుఃఖం కాదు. శీతోష్ణా లైతే ఒకప్పుడు సుఖజనకాలు కావచ్చును, మరొకప్పుడు దుఃఖజనకాలు కావచ్చును. అందచేత మారుతూ ఉండే శీతోష్ణాలనూ,మారకుండా ఉండే సుఖాదుఃఖాలనూ వేరువేరుగా చెప్పవలసి వచ్చింది. శీతోష్ణప్రదాలైనంతమాత్రంచేత సుఖ దుఃఖప్రదా లౌతా యనే నియమం లేదు కదా అని భావం). ఈ మాత్రాస్పర్శాదులు ఆగమాపాయినః, వచ్చే పోయే స్వభావం గలవి. అందుచేత అవి అనిత్యాలు. అందువల్ల ఆ శీతోష్ణాదులను సహించుము. వాటి విషయంలో సంతోషించవద్దు,విషాదం పొందవద్దు అని అర్థం.

భా.అ.ప్ర. తమ తమ ఆశ్రయా లైన ఆకాశాదులతో కూడిన శబ్దాదులు తన్మాత్రల నుండి పుట్టినవి అవడంచేత ఇక్కడ 'మాత్రా'శబ్దంచేత నిర్దేశించబడుతున్నాయి అని శ్రీరామానుజులు చెప్పినది యుక్తం కాదు. తన్మాత్ర లనగా శబ్దాదులే కదా? అవి కాదు,సూక్ష్మ భూతాలు తన్మాత్రలు అని అంటే-అలా అయినా కూడ సాశ్రయశబ్దాదిరూపాలైన సూక్ష్మ భూతాలే తన్మాత్రలు గాన సాశ్రయశబ్దాదులు తన్మాత్రకార్యము లని చెప్పడం యుక్తం కాదు. సాశ్రయశబ్దాదు లనగా మా అభిప్రాయం మృదంగాలు,పుష్పాలు మొదలైన ఆశ్రయాలతో కూడిన శబ్దరూపాదులు అని అన్నట్లయితే-అవి మహాభూతకార్యాలు కాని తన్మాత్రకార్యాలు కావు. సాశ్రయశబ్దాదు లనగా మహాభూతాలు అనే చెప్పవచ్చు కదా? సాశ్రయా లైన శబ్దాదులు అని వక్రంగా చెప్పడం ఎందుకు? అలా చెప్పడంలో దోషం కూడ ఉంది. ఇంద్రియాలు కూడ తన్మాత్రలనుండి పుట్టినవేగాన భూతాలనే గ్రహించాలి అని చెప్పడానికి నియామకమైన హేతు వేమీ లేదు. అలా కాక-మాత్రలనగా శబ్దాదులకు ఆశ్రయ మైనవి; వాటిని గ్రహించే ఇంద్రియాలు మాత్రాశబ్దంచేత చెప్పబడతాయి అన్నట్లయితే -"మీయన్తే ఇతి మాత్రాః" అని అభిధచేతనే (ముఖ్యార్థంగానే)ఇంద్రియా లనే అర్థం

చెప్పకుండా లక్షణచేత చెప్పడం ఎందుకు? లక్షణ ఆశ్రయించడం అగతికగతి(మరొక మార్గం లేకపోతే చేయవలసిన పని) కదా? అట్లే "శీతోష్ణ సుఖదుఃఖదాః" అనేదానికి "శీతోష్ణ రూపాలైన సుఖదుఃఖాలను ఇచ్చేవి" అని అర్థం చెప్పడం కూడ అయుక్తమే. శీతోష్ణాల కార్యాలైన సుఖదుఃఖాలు శీతోష్ణాలు ఎలా అవుతాయి? యథాసంఖ్యంగా తీసికొని శీతం సుఖహేతువనీ, ఉష్ణం దుఃఖహేతు వనీ చెప్పడం కుదరదు. శీతం కూడా హేమంతంలో దుఃఖహేతువు అవుతుంది, ఉష్ణం సుఖహేతువు అవుతుంది కదా? (భా. అ. ప్ర. పే. 32, 33,) 14.

భాష్యమ్

శీతోష్ణాదీన్ సహతః కిం స్యాత్ ఇతి శృణు-

మూ. యం హి న వ్యథయన్త్యేతే పురుషం పురుషర్షభ,
సమదుఃఖసుఖం ధీరం సోఽమృతత్వాయ కల్పతే. 15

యం హీతి:- యం హి పురుషం సమదుఃఖసుఖం, సమే దుఃఖసుఖే యస్య తం సమ దుఃఖసుఖం, సుఖదుఃఖప్రాప్తౌ హర్షవిషాదరహితం, ధీరం ధీమన్తం న వ్యథయన్తి న చాలయన్తి నిత్యాత్మదర్శనాత్, ఏతే యథోక్తాః శీతోష్ణాదయః సః నిత్యాత్మదర్శననిష్ఠః, ద్వన్ద్వసహిష్ణుః, అమృతత్వాయ మోక్షాయ, కల్పతే సమర్థః భవతి. 15

బాలానందిని

శీతేతి:- శీతోష్ణాలను సహించేవానికి ఏమి అవుతుందో వినుము-

ప్ర. అ. యం హీతి :- పురుషర్షభ = పురుషులలో శ్రేష్ఠుడా, ఏతే=ఇవి, సమదుఃఖసుఖమ్ = సమానమైన సుఖదుఃఖాలు గల, ధీరమ్=బుద్ధిమంతుడైన, యం పురుషమ్ =ఏ పురుషుణ్ణి, న వ్యథయన్తి = బాధించవో, సః=అతడు, అమృతత్వాయ=మోక్షానికి, కల్పతే=అర్హుడవుతాడు.

యం హీతి:- సుఖదుఃఖాలను ఎవడు సమంగా చూస్తాడో, సుఖం వచ్చినప్పుడు హర్షాన్నీ, దుఃఖం వచ్చినప్పుడు విషాదాన్నీ పొందడో, అతడు సమదుఃఖసుఖుడు. అట్టి బుద్ధిమంతుణ్ణి, న వ్యథయన్తి = నిత్యమైన ఆత్మదర్శనంనుండి కదల్చజాలవు. ఏతే = పైన చెప్పిన శీతోష్ణాదులు. నిత్యాత్మదర్శనంలో స్థిరంగా ఉండి, ద్వంద్వాలను సహించేవాడు, అమృతత్వానికి, మరణరాహిత్యానికి, మోక్షానికి, సమర్థు డవుతాడు.

భా. అ. ప్ర. :- ధైర్యవంతుడు, తప్పనిసరి యైన దుఃఖాన్ని సుఖంగానే భావించేవాడు, తన వర్ణానికి తగిన యుద్ధాదికర్మను ఫలాభిసంధి లేకుండా చేసేవాడు అయిన ఏ పురుషుణ్ణి ఆ యుద్ధాదికర్మలకు సంబంధించిన ఆయుధప్రహారం మొదలైన స్పర్శలు పరితాపంచేత చలింపచేయవో అతడే అమృతత్వాన్ని సాధించకలుగుతాడు కాని దుఃఖం సహించజాలని నీవంటివాడు సాధించజాలడు అని శ్రీరామానుజులు చెప్పినది అయుక్తం. ఎందుచేత

ననగా - అలాంటి పురుషుడు యుద్ధంలో మరణిస్తే వీరస్వర్గం సాధిస్తాడు, జయం పొందుత పరరాజ్యాన్నిగాని, చిత్తశుద్ధిని గాని పొందుతాడు; అంతేనే కాని మోక్షం పొందదు. మోక్షం పొందడానికి జ్ఞానం తప్పక మరొక ఉపాయం ఏదీ లేదు కదా? సాంఖ్యాన్ని గూర్చి చెప్పే ఈ ప్రకరణంలో కర్మను గూర్చి చెప్పడం కూడా అయుక్తమే 'పురుషర్షభ' అన్నప్పుడు కాకువును ఆశ్రయించడం (ఆక్షేపపూర్వకమైన స్వరంతో ఓ మహాపురుషా! అనడం) కూడ అయుక్తం. ఎందువల్ల ననగా పరమార్థాన్ని ఉపదేశించే భగవంతుడు ఇక్కడ శిష్యుణ్ణి కాకుస్వరంతో బోధించడం అనుచితం. నిజానికి అర్జునుడు పురుషాధముడే అయితే అతనికి శాస్త్రోపదేశం చేయడమే అయుక్తం. (భా.అ.ప్ర.పే.33) 15

భాష్యమ్

ఇతశ్చ శోకమోహౌ అకృత్వా శీతోష్ణాదిసహనం యుక్తం కర్తుమ్. యస్మాత్-

మూ. నాఽసతో విద్యతే భావో నాఽభావో విద్యతే సతః,
ఉభయోరపి దృష్టోఽన్తస్త్వనయోస్తత్త్వదర్శిభిః. 16

నాసతః ఇతి :- (న) అసతః అవిద్యమానస్య శీతోష్ణాదేః సకారణస్య న విద్యతే నాస్తి, భావః, భవనమ్, అస్తితా. న హి శీతోష్ణాది సకారణమ్ ప్రమాణైః నిరూప్యమాణం వస్తుసత్ భవతి. వికారో హి సః. వికారశ్చ వ్యభిచరతి. యథా ఘటాదిసంస్థానం చక్షుషా నిరూప్యమాణం మృద్వ్యతిరేకేణ అనుపలబ్ధేః అసత్ తథా సర్వో వికారః కారణవ్యతిరేకేణ అనుపలబ్ధేః అసన్.జన్మప్రధ్వంసాభ్యాం ప్రాక్ ఊర్ధ్వం చ అనుపలబ్ధేః అసత్ తథా సర్వో వికారః కారణవ్యతిరేకేణ అనుపలబ్ధేః అసనే జన్మ ప్రధ్వం సాభ్యాం మృదాదికారణస్య చ తత్కారణవ్యతిరేకేణ అనుపలబ్ధేః అసత్త్వమ్.

బాలానందిని

ఇతశ్చేతి :- ఈ కారణంవల్ల కూడ శోకమోహాలు చేయకుండా శీతోష్ణాదులను సహించడం యుక్తం; ఏ కారణంవల్ల ననగా -

ప్ర.అ. నాసతః ఇతి :- అసతః = అసత్తుకు, లేనిదానికి, భావః = ఉనికి, ఉండుట, న = లేదు. సతః = సత్తుకు, ఉన్నదానికి, అభావః = లేకపోవుట, న = లేదు. అనయోః = ఈ, ఉభయోః = సత్ - అసత్తులు రెండింటియొక్క అన్తః = (యథార్థస్వరూప) నిర్ణయం. తత్త్వదర్శిభిః = ఉత్త్వవేత్తలచేత, దృష్టః చూడబడినది.

వి. "ఏకమేవాద్వితీయం బ్రహ్మ" ఇత్యాదిశ్రుతులు బ్రహ్మ ఒక్కటే ఉన్నది, బ్రహ్మ తప్ప మరేవీ లేవు అని బోధిస్తున్నాయి. అయితే పంచమహాభూతాలు వాటి కార్యాలు - ఇవన్నీ కనబడుతున్నాయి; అందుచేత అవి కూడ ఉన్నాయి కదా అనే ప్రశ్న ఉదయిస్తుంది. దానికి సమాధానం ఏ మనగా - ఇవన్నీ బ్రహ్మనుండి పుట్టినవి గాన బ్రహ్మకార్యాలే.

అందుచేత కారణమైన బ్రహ్మలో ఉన్న సత్త్వమే (ఉండడం అనే ధర్మమే) కార్యంలో కనబడుతున్నది గాన కారణసత్త్వానికి భిన్నంగా కార్యానికి స్వతంత్ర మైన సత్త్వం లేదు. ఉదాహరణకు మట్టితో తయారు చేసిన కుండ ఉంది. ముద్ద ఆకారంలో ఉన్న మట్టియే మరొక ఆకారంలో కనబడితే కుండ అంటున్నాం. అందుచేత కుండకు మట్టియొక్క సత్తకంటె వేరుగా సత్త లేదు. మట్టియొక్క సత్తయే కుండకు ఆపాదించబడుచున్నది. మట్టికి కూడా స్వతంత్రమైన సత్త (అస్తిత్వం) లేదు. అది ఏ కారణం నుండి పుట్టిందో దాని అస్తిత్వం మట్టిలో ఆరోపించబడుతున్నది. ఇలా - కార్యం, దాని కారణం, ఆ కారణానికి కారణం అని అంటూ మూలకారణ మైన బ్రహ్మ దాకా వెళ్లాలి. అప్పుడు మూలకారణమైన బ్రహ్మలో ఉన్న సత్తయే (సత్త్వమే) దానినుండి ఒకదాని తరవాత ఒకటిగా పుట్టిన కార్యాలలో కనబడుతున్నది.

ఒక కార్యం (ఘటం) పుట్టింది. దానిలో సత్త ఉంది. ఆ కార్యం నశించింది. అపుడు దాని సత్త దాని కారణంలో (మృత్తులో) కనబడుతుంది. అదీ నశించింది. దాని సత్త దాని కారణమైనదానిలో (జలంలో) కనబడుతుంది. అందుచేత కార్యాలు నశించినా వాటి సత్త మాత్రం నశించకుండా దాని కారణంలో కనబడుతుంది. ఈ విధంగా సత్త మూలకారణంలో స్థిరంగా నిలిచిపోతుంది. ఇది పరిణామవాదంలో కూడ కనబడే విషయం.

నిజానికి ఈ జగత్తంతా అద్వితీయాత్మయందు, త్రాడుమీద సర్పం ఆరోపించబడి నట్లు ఆరోపించబడింది. త్రాడు చూడగా కలిగిన సర్పబుద్ధి కొన్ని క్షణాలో తొలగవచ్చును గాని బ్రహ్మయందు ఆరోపించిన జగద్బుద్ధి తొలగడానికి మాత్రం కొన్ని వందల జన్మలు పట్టవచ్చును. అది వేరే విషయం. త్రాడు చూచి ఇక్కడ సర్పం ఉంది అంటున్నాం. నిజంగా సర్పం లేదు, ఇక్కడ సర్పంలో ఉన్నట్లు కనబడుతూన్న సత్త్వం త్రాడుకు సంబంధించినది. త్రాడుకు సంబంధించిన సత్త్వాన్ని సర్పంమీద ఆరోపించాం. సర్పం లేదు అని తెలియగానే దాని సత్త్వం త్రాడుకు సంబంధించినదే అనే విషయం తెలిసింది. ఈ విధంగా జగత్తులోని ఏ పదార్థానికి చెందిన సత్త్వమైనా చివరికి వెళ్లగా వెళ్లగా మూలకారణ మైన, సద్రూపమైన బ్రహ్మకు సంబంధించినదే అనే విషయం గుర్తించబడుతుంది.

ఈ విధంగా కార్యంనుండి కారణం వైపు వెళ్లకపోయినా 'సత్త్వం' అనేది సత్యమైన దనీ, దానితో సంబంధించినట్లు కనబడే ఇతరపదార్థా లన్నీ అసత్యమైన వనీ నిరూపించవచ్చును. 'సన్ ఘటః' - సన్ పటః' (ఘటం ఉంది, పటం ఉంది) అంటున్నాం. ఘటం నశించింది. అయినా సత్త్వం నశించలేదు. అది పటంలో ఉంది. పటం నశించినా సత్త్వం ఘటంలో ఉంది. రెండూ నశించినా మరొకదానిలో కనబడుతుంది. ఈ విధంగా వస్తువులు నశించినా సత్త మాత్రం నశించదు. ఆ సత్తయే అద్వితీయాత్మతత్త్వం. ఈ అద్వైతసిద్ధాంతం ఈ శ్లోకంలో ప్రతిపాదించబడుచున్నది.

నాసతః ఇతి:- అసతః = లేనిదైన, దాని కారణంతో కూడిన శీతోష్ణాదికానికి, అనగా లేని శీతోష్ణాదికానికి దాని కారణానికీ కూడ, భావం అనగా అస్తిత్వం, అనగా ఉనికి లేదు. కారణంతో కూడిన శీతోష్ణాదికమైన వస్తువూ దాని కారణమూ కూడ ప్రమాణాలచేత బాగా పరీక్షించిన ట్లయితే సత్ (అస్తిత్వం కలది) కాదు కదా? ఎందువల్ల ననగా అది వికారం (కార్యం). వికారం ఎల్లప్పుడూ వ్యభిచరిస్తుంది; అనగా మారిపో తూంటుంది. (ఎల్లప్పుడు నియతంగా ఒకే రూపంలో ఉండేది అవ్యభిచారి, అలా ఉండనిది వ్యభిచారి). ఘటం మొదలైన అవయవసంనివేశాన్ని కంటిచేత బాగాపరీక్షించి నప్పుడు మట్టికంటె వేరుగా ఘటం అనేది కనబడకపోవడంచేత అది ఏ విధంగా అసత్తో (అస్తిత్వం లేనిదో), అదే విధంగా అన్ని కార్యాలూ కూడ కారణంకంటె భిన్నంగా కనబడకపోవడంచేత అసత్తులే. అవి పుట్టడానికి ముందు లేవు. నశించిన తరవాత కూడ ఉండబోవు. ఆ రెండు కాలాలలోనూ కనబడకపోవడంచేత కూడా అవి అసత్తులే. (ఘటాదులు తమ కారణంకంటె వేరుగా కనబడకపోవడంచేత ఏ విధంగా అసత్తులో) వాటి కారణాలైన మృదాదులు కూడ తమ కారణాలకంటె వేరుగా కనబడకపోవడంచేత అసత్తులే.

భాష్యమ్

తదసత్త్వే చ సర్వాభావప్రసంగః ఇతి చేత్- న; సర్వత్ర బుద్ధిద్వయోపలబ్ధేః- సద్బుద్ధిః అసద్బుద్ధిః ఇతి. యద్విషయా బుద్ధిః న వ్యభిచరతి తత్ సత్, యద్విషయా బుద్ధిః వ్యభిచరతి తత్ అసత్ ఇతి సదసద్విభాగే బుద్ధితన్త్రే స్థితే సర్వత్ర ద్వే బుద్ధీ సర్వైః ఉపలభ్యేతే సామానాదికరణ్యేన నీలోత్పలవత్ సన్ ఘటః, సన్ పటః, సన్ హస్తీ ఇతి (ఇది బెల్లం కొండ రామరాయ కవిగారు ఇచ్చిన పాఠం. "... సర్వైః ఉపలభ్యేతే సమానాధికరణే న నీలోత్పలవత్ సన్ ఘటః, సన్ పటః, సన్ హస్తీ ఇతి" అని ఆనందగిరి సంమతపాఠం. ఆనందగిరి పాఠంలో కూడ 'న' ను తొలగిస్తే మొదటి పాఠం ప్రకారం వచ్చే అర్థమే లభిస్తుంది) ఏవం సర్వత్ర తయోః, బుద్ధ్యోః ఘటాదిబుద్ధిః వ్యభిచరతి తథా చ దర్శితమ్, న తు సద్బుద్ధిః. తస్మాత్ ఘటాదిబుద్ధివిషయః అసన్, వ్యభిచారాత్; న తు సద్బుద్ధివిషయః, అవ్యభిచారాత్.

బాలానందిని

తదసత్త్వే ఇతి:- అది కూడ (కార్యకారణం కూడ అసత్తే అంటే చివరికి ఏమీ మిగలకుండా పోయి శూన్యవాదం ఏర్పడుతుంది అనడానికి అవకాశం లేదు ఎందువల్ల ననగా అన్ని చోట్లా సద్బుద్ధి, అసద్బుద్ధి అని రెండు బుద్ధులు కనబడుతున్నాయి. దేనిని గురించిన బుద్ధి వ్యభిచరించదో (మార్పు చెందదో) అది సత్. దేనిని గురించిన బుద్ధి వ్యభిచరిస్తుందో అది అసద్బుద్ధి. (అనగా మొదటిది సత్తను గూర్చిన బుద్ధి, రెండవది అసత్తను గూర్చిన బుద్ధి). ఈ విధంగా బుద్ధిని పట్టి ఏర్పడిన సదసద్విభాగం (ఇది సత్,

ఇది అసత్ అనే విభాగం) ఉంటూండగా 'నీలోత్పలమ్' అన్నప్పుడు వలె సమానాధికరణాలైన రెండు బుద్ధులు, అన్నింటి విషయంలోను, అందరిచేత, "సన్ ఘటః", సన్ హస్తీ" ఇత్యాది విధంగా చూడబడుచున్నాయి. ఇట్లే అంతటా కూడ ఈ రెండు బుద్ధులలో ఘటాదిబుద్ధి (ఘటః, పటః, హస్తీ ఇత్యాదిబుద్ధి) వ్యభిచరిస్తుంది. అది ఎలా వ్యభిచరిస్తుందో ("వికారశ్చ వ్యభిచరతి" ఇత్యాదివాక్యాలలో) చూపబడింది. అంతే కాని సత్ అనే బుద్ధి మాత్రం వ్యభిచరించడం లేదు. అందువల్ల ఘటాదిబుద్ధికి విషయ మైనది (ఘటాదికం) వ్యభిచరించడం వల్ల అసత్. సద్బుద్ధికి విషయమైనది మాత్రం వ్యభిచరంచకపోవడంవల్ల సత్.

vi. సామానాదికరణ్యం అనగా వేరు వేరు అర్థాలు గల రెండు పదాలు ఒకే వస్తువును బోధించడం 'నీల'. శబ్దానికి నలుపు అని అర్థం 'ఉత్పల' శబ్దానికి కలవ అని అర్థం. 'నీలోత్పలమ్' అన్నప్పుడు వేరు వేరు అర్థాలు గల ఈ రెండు శబ్దాలు ఒకే వస్తువును బోధిస్తున్నాయి. ఇక్కడ సామానాధికరణ్యం ఉంది. 'సత్' అనగా ఉన్నది అని అర్థం. 'ఘటః' అనగా కలశం అని అర్థం. "సన్ ఘటః" అన్నపుడు ఈ రెండు పదాలు ఒకే వస్తువును బోధిస్తున్నాయి గాన వీటికి సామానాధికరణ్యం. "సర్వైః ఉపలభ్యేతే సమానాధికరణే; న నీలోత్పవత్" అనే పాఠం తీసికొని ఆనందగిరి చేసిన వ్యాఖ్య క్లిష్టకల్పనగా ఉంది. 'నీలోత్పలమ్' ఇత్యాదులలో ఉన్న సామానాధికరణ్యం గౌణం అని ఆయన చెప్పినది కూడ సరిగా లేదని విశదీకరిస్తూ రామరాయకవి చూపిన పాఠమూ వ్యాఖ్యా కూడ సోపపత్తికంగా ఉన్నాయి.

భాష్యమ్

ఘటే వినష్టే ఘటబుద్ధౌ వ్యభిచరన్త్యాం సద్బుద్ధిరపి వ్యభిచరతి ఇతి చేత్, న పటాదౌ అపి సద్బుద్ధిదర్శనాత్ విశేషణవిషయైవ సా సద్బుద్ధిః. సద్బుద్ధివత్ ఘటబుద్ధిరపి ఘటాన్తరే దృశ్యతే ఇతి చేత్, న పటాదావదర్శనాత్. సద్బుద్ధిరపి నష్టే ఘటే న దృశ్యతే ఇతి చేత్, న విశేష్యాభావాత్. సద్బుద్ధిః విశేషణవిషయా సతీ విశేష్యాభావే విశేషణానుపపత్తౌ కింవిషయా స్యాత్, న తు పునః సద్బుద్ధేః విషయాభావాత్. ఏకాధికరణత్వం ఘటాదివిశేష్యాభావే న యుక్తమ్ ఇతి చేత్. న 'ఇదమ్ ఉదకమ్' ఇతి మరీచ్యాదౌ అన్యతరాభావేఽపి సామానాధి కరణ్యదర్శనాత్. తస్మాత్ దేహాదేః ద్వన్ద్వస్య చ సకారణస్య అసతో న విద్యతే భావః ఇతి.

బాలానందిని

(ప్రశ్న) ఘటం నశించినప్పుడు ఘటబుద్ధి వ్యభిచరించి నట్లు (లేకుండా పోయినట్లు) సత్ అనే బుద్ధి కూడ వ్యభిచరిస్తున్నది కదా? (సమాధానం) అది సరికాదు. ఈ సద్బుద్ధి పటాదుల విషయంలో కనబడుతున్నది కదా? (ఘటం నశించిన తరువాత 'సన్ ఘటః' అనే బుద్ధి కలగకపోయినా 'సత్' అనే బుద్ధి పూర్తిగా లేకుండా పోదు. ప్రక్కనే ఉన్న పటం విషయంలో "సన్ పటః" అనే బుద్ధి కలుగుతున్నది గాన సద్బుద్ధికి వ్యభిచారం లేదు అని

భావం). ఆ సద్బుద్ధి విశేషణానికి సంబంధించినది మాత్రమే. ("నీలమ్ ఉత్పలమ్", "నీలమ్ అమ్బరమ్", 'నీలం వాసః" ఇత్యాదులలో 'నీలమ్' అనేది విశేషణం. ఉత్పలాదులు విశేష్యాలు. విశేష్యాలైన ఉత్పలాదులు లేకపోతే నీలం అనే విశేషణాన్ని ప్రయోగించడానికి అవకాశం ఉండదు. తావన్మాత్రంచేత నీలం అనేదే ఎక్కడా లేదు అని ఏ విధంగా అనడానికి వీలు లేదో అట్లే ఘటం పోయినా దానికి విశేషణంగా ఉపయోగించిన సత్త్వం పోదు. అది మరొక దానిలో దేనిలోనో ఉండే ఉంటుంది అని భావం). (ప్రశ్న) ఘటం నశించినా సద్బుద్ధి పటంలో ఉన్నట్లు ఘటబుద్ధి మరొక ఘటంలో ఉంటుంది కదా? (అలాంటప్పుడు అది మాత్రం వ్యభిచరిస్తుంది అని ఎలా అంటావు?) (సమాధానం) అది యుక్తం కాదు. ఒక ఘటం నశించిన తరువాత ఘటం విషయంలో సద్బుద్ధి లేకపోయినా పటంలో ఉన్నట్లు, ఘటబుద్ధి పటంలో లేదు కదా? ('సత్' అనే బుద్ధి అన్ని పదార్థాల విషయంలోనూ ఉంటుంది. ఘటాదిబుద్ధి మాత్రం ఘటాదులకు మాత్రమే పరిమిత మైనది అందుచేత మొత్తం ఘటాదు లన్నీ నశించినా ఈ సద్బుద్ధి మాత్రం ఎక్కడో ఒక చోట ఉంటుంది. అదే సర్వ వికల్పాశ్రయ మైన బ్రహ్మ అని భావం.)

(ప్రశ్న) ఘటం నశించగానే 'సన్ ఘటః' అని అంతవరకూ ఉన్న సద్బుద్ధి కూడ నశిస్తున్నది కదా? (సమాధానం) విశేష్యమైన ఘటం నశించినప్పుడు దానికి సంబంధించిన సద్బుద్ధి కూడ అక్కడ కనబడకుండా పోవడానికి కారణం విశేష్యం లేకపోవడం మాత్రమే. విశేష్యం లేనప్పుడు విశేషణం దేన్ని ఆశ్రయించుకొని ఉంటుంది? అంతేనే కాని సద్బుద్ధికి ఎక్కడా విషయం లేకపోవడం అనేది లేదు. (సకలారోపాలకీ ఆశ్రయమైన బ్రహ్మ దానికి విషయంగా ఉండనే ఉంది కదా అని భావం.)

అవ. సద్బుద్ధి అనువర్తిస్తూనే ఘటాదిబుద్ధులు వ్యభిచరిస్తున్నాయి, గాన ఘటాదులు అసత్యములు అని చెప్పినట్లయింది. "యత్ వ్యావృత్తేషు అనువృత్తం తత్ పరమార్థసత్, యథా సర్పధారాదిషు అనుగతః ఇదమంశః'. ఎదుట ఉన్న త్రాడును చూచి నప్పుడు అది సర్పం అని ఒకరికీ, జలరేఖ అని కొందరికీ నేల నెరద అని మరి కొందరికీ భ్రాంతి కలగవచ్చును. ఈ జ్ఞానాలలో భాసించే సర్పం, జలధార, భూచ్ఛిద్రం మొదలైనవి మారుతున్నా ఇదంతాంశం ('ఇది' అనేది) మాత్రం అనుస్యూతంగా అన్ని జ్ఞానాలలోను అనువర్తిస్తూనే ఉంది గాన అది సత్యమైనది, సర్పత్వాదులు అసత్య మైనవి. అదే విధంగా "సన్ ఘటః", "సన్ హస్తీ" ఇత్యాదిజ్ఞానాలలో ఘటాదులు వ్యావృత్తము లవుతున్నా సత్త్వం మాత్రం అనువర్తిస్తూనే ఉన్నది గాన అది సత్యమైనది అని ఈ అనుమానప్రయోగంవల్ల తెలుస్తున్నది. అదే విధంగా "యత్ వ్యావృత్తం తత్ మిథ్యా, యథా సర్పధారాది; విమతం మిథ్యా, వ్యభిచారిత్వాత్, సంప్రతిపన్నవత్" – ఏది వ్యావృత్తమో – మారిపోతూ ఉంటుందో – అది మిథ్య, ఉదాహరణకు – 'ఇది' అని నిర్దేశించబడే త్రాడుమీద కనబడి మారిపోతూన్న సర్ప – జలధారా – భూచ్ఛిద్రాదుల వలె. ఈ అనుమానప్రయోగాన్ని పట్టి "విమత మైనది (దేని

పారమార్థికరూపాన్ని గూర్చి చర్చ జరుగుచున్నదో అది, ఘటాదికం) మిథ్య, ఎందువల్లననగా అది వ్యభిచరిస్తున్నది, సంప్రతిపన్నం (ఉభయవాద్యంగీకృత మైన సర్పజలధారాదికం) వలె' అనే రెండవ అనుమానం లభిస్తుంది. ఈ విధంగా ఘటాదులు మిథ్య అని తేలింది. అయితే సత్యమైన సత్త్వానికీ, మిథ్య అయిన, వాస్తవంలో లేని ఘటాదులకూ సామానాధికరణ్యం (సన్ ఘటః, పటః ఇత్యాదులలో) ఎలా కుదరుతుంది? నీలమూ సత్యమే (వ్యావహారికంగా) ఉత్పలమూ సత్యమే గాన వాటికి సామానాదికరణ్యం చెప్పవచ్చు గాని, ఒక సత్యానికి, ఒక మిథ్యావస్తువుకు సామానాధికరణ్యం ఎలా కుదురుతుంది అని ప్రశ్నిస్తున్నాడు – **ఏకాధికరణత్వమ్ ఇతి:–** ఘటాదులైన విశేష్యాలు లేకపోతే, మిథ్య అవుతే, ఏకాధికరణత్వం (సత్త్వానికి ఘటాదులతో సామానాధికరణ్యం') యుక్తం కాదు కదా? అని అంటే ఆ దోషం లేదు (మరుప్రదేశంలో ప్రసరించిన) సూర్యకిరణాదులయందు, రెండెంటిలో ఒకటి లేకపోయినా కూడ 'ఇదమ్ ఉదకమ్' అని సామానాధికరణ్యం కనబడుచున్నది కదా? ("ఇదమ్ ఉదకమ్" అనే జ్ఞానంలో ఇదంత్వాంశం (ఇది అనే అంశం) ఉదకత్వాంశం అని రెండు అంశా లున్నాయి. వాటిలో ఇదంత్వాంశం అక్కడ ఉన్న మరీచికలకు సంబంధించినది. ఉదకత్వాంశం అక్కడ లేని నీటికి సంబంధించినది. ఇక్కడ ఒక ఉన్నదానికీ, ఒక లేనిదానికీ సామానాధికరణ్యం ఏ విధంగా ఉందో అట్లే "సన్‌ఘటః" ఇత్యాదులలో కూడ ఉండవచ్చును అని భావం). అందువల్ల అసత్తైన దేహానికీ, కారణసహితమైన ద్వంద్వానికి (అనగా శీతోష్ణాదిద్వంద్వాలకీ వాటి కారణాలకీ కూడ భావం (అస్తిత్వం) లేదు.

భాష్యమ్

తథా సతశ్చ ఆత్మనః అభావః అవిద్యమానతా న విద్యతే, సర్వత్ర అవ్యభిచారాత్ ఇతి అవోచామ. ఏవమ్ ఆత్మానాత్మనోః సదసతోః ఉభయోః అపి దృష్టః ఉపలబ్ధః అన్తః నిర్ణయః, సత్ సదేవ, అసత్ అసదేవ ఇతి తు అనయోః యథోక్తయోః, తత్త్వదర్శిభిః. తదితి సర్వనామ. సర్వం చ బ్రహ్మ; తస్య నామ ఇతి తత్. తద్భావః తత్త్వమ్, బ్రహ్మణః యాథాత్మ్యమ్, తత్. ద్రష్టుం శీలం యేషాం తే తత్త్వదర్శినః తైః తత్త్వదర్శిభిః. త్వమపి తత్త్వదర్శినాం దృష్టిమ్ ఆశ్రిత్య శోకం మోహం చ హిత్వా శీతోష్ణాదీని నియతానియతరూపాణి ద్వన్ద్వాని వికారః అయమ్ అసన్నేవ మరీచిజలవత్ మిథ్యా అవభాసతే ఇతి మనసి నిశ్చిత్య తితిక్షస్వ ఇత్యభిప్రాయః ("శీతోష్ణాదీన్ తితిక్షస్వ ఇత్యభిప్రాయః" అని పాఠాంతరం).

బాలానందిని

తథేతి :– అట్లే సత్‌కు – ఆత్మకు, అభావం – లేకపోవడం, లేదు అంతటా (ఎక్కడా) దీనికి (సద్బుద్ధికి) వ్యభిచారం లేదు గాన అని చెప్పి ఉన్నాం. ఈ విధంగా ఆత్మానాత్మ లైన సదసత్తులు రెండింటియొక్క అన్తః = నిర్ణయం, సత్ సత్తే, అసత్ అసత్తే

అనే నిర్ణయం దృష్టః = పొందబడినది, అనయోః వెనుక వివరించబడిన ఈ రెండింటి యొక్క, తత్త్వదర్శిభిః– 'తత్' అనేది సర్వమునూ (అన్నింటినీ) బోధించ గల శబ్దం. బ్రహ్మ సర్వస్వరూప మైనది. అందుచేత 'తత్' అనేది (సర్వమైన) బ్రహ్మకు పేరు. దాని ధర్మం తత్త్వం; అనగా బ్రహ్మయొక్క యథార్థస్వరూపం. దానిని చూచే స్వభావం ఎవరికి ఉంటుందో వారు తత్త్వదర్శులు. అట్టి తత్త్వదర్శులచేత (పొందబడినది). నువ్వు కూడ తత్త్వదర్శుల దృష్టిని అవలంబించి, శోకమోహాలను విడచి, నియతానియతరూపా లైన (కొన్ని నిశ్చితమైన స్వరూపం గలవి కొన్ని కానివి అయిన) ఈ శీతోష్ణాదిద్వన్ద్వాలు కేవలం వికారాలు మాత్రమే, వాస్తవమైన సత్త్వం లేని వైనా మరీచిజలం వలె మిథ్యగానే కనబడుతున్నాయి అని మనస్సులో నిశ్చయించి వీటిని సహించుము అని అభిప్రాయం.

భా.అ.ప్ర. ఇక్కడ శ్రీ రామానుజాచార్యులు – "అసత్ అయిన దేహానికి సత్త్వం (ఉండుట అనేది) లేదు, సత్ అయిన ఆత్మకు అసత్త్వం లేదు, తెలియబడుతూన్న దేహాత్మలు రెండింటియొక్క అంతం, అవి ఎలా తెలియబడుతున్నాయో ఆ విధంగా, తత్త్వవేత్తలచేత చూడబడినది. నిరూపణానికి (ఒక విషయాన్ని తెలుసుకొన్నందుకు) ప్రయోజనం నిర్ణయమే కదా? ఇక్కడ "అన్త" శబ్దంచేత నిర్ణయం అనే అర్థం చెప్పబడుతుంది. అచిద్వస్తు వైన దేహంయొక్క స్వరూపం అసత్త్వమే (ఉండక పోవడమే), చేతన మైన ఆత్మయొక్క స్వరూపం ఉండడమే అను నిర్ణయం చూడబడింది అని అర్థం. అసత్త్వం అనగా నశించే స్వభావం (కలిగి ఉండడం), సత్త్వం అనగా నశించకపోవడం అనే స్వభావం అని అర్థాలు కదా?" అని వ్రాశారు.

ఈ సందర్భంలో విచారణ చేయబడుచున్నది–సత్తైన ఈశ్వరు డనే కారణంనుండి పుట్టిన ఈ జగత్తు సత్తే అని సత్కార్యవాదాన్ని అంగీకరించిన నీకు "అసత్తైన దేహమునకు" అని అర్థం చెప్పడంచేత, తన మతాన్ని విడచిపెట్టడం అనే దోషం, పరమతాన్ని అంగీకరించిన దోషమూ ప్రాప్తిస్తున్నాయి. "అసతః దేహస్య" అని దేహాన్ని మాత్రమే చెప్పడం అయుక్తం; అలాంటివి శీతోష్ణాదులు కూడ ఉన్నాయి.కదా? మూలంలో ఉన్న 'భావః' అనే పదానికి 'సద్భావః' 'అభావః' అనే పదానికి 'అసద్భావః' అని అర్థాలు చెప్పడం కూడ అయుక్తం; ఎందువల్ల ననగా – 'సద్భావః', 'అసద్భావః' అని అంటే యోగ్యత్వము 'అయోగ్యత్వము' అను ఇతర అర్థాలు స్ఫురిస్తాయి. 'సద్భావః' అంటే 'సత్తా' అనీ, "అసద్భావః" అంటే అసత్తా అనీ అర్థాలను గ్రహించడం క్లిష్టంగా ఉంటుంది. 'సతః' అనగా 'ఆత్మనః' అని అర్థం చెప్పడం కూడా అయుక్తమే, ప్రకృతి, పురుషుడు, ఈశ్వరుడు అనే త్రయమూ కూడ సత్యమే, నిత్యమే అని కదా నీ మతం? ఆత్మలు అనేకములు గాన ("సతః ఆత్మనః" అని) ఏకవచనప్రయోగం అయుక్తం. "దేహాత్మలు తెలియబడుచున్నాయి గాన" అనడం కూడ యుక్తం కాదు. దేహం తెలియబడుచున్నా కూడ ప్రమాత (తెలిసికొనేది) అయిన ఆత్మ

తెలియబడుతుంది అని చెప్పకూడదు. ఇది కూడ ఉపలభ్యమానమే అయితే దేహాదులవలె ఇది కూడ (ఆత్మ కూడ) జడం అని చెప్పవలసివస్తుంది. "తత్త్వదర్శిభిః" అనే దానికి 'యథోపలబ్ధి' (ఎలా తెలియబడుతున్నాయో అలాగ) అని లేని పదం చేర్చడం అనావశ్యకం. ఆ శేషపూరకపదం లేకపోయినా అర్థం లభిస్తూ ఉంది; అలా లేని పదాన్ని పూరించడం మూలకారునికి సంమతం కూడ కాదు. "అచిద్వస్తువైన దేహంయొక్క స్వరూపం అసత్త్వమే" అన్నమాట కూడ అయుక్తం. అసత్త్వం అనేది గుణం గాన అది దేహస్వరూపం కాజాలదు. 'అసత్త్వమ్ ఏవ' అని 'ఏవ' కారాన్ని ప్రయోగించడంచేత దేహానికి అసత్త్వం ఒక్కటే స్వరూపం అనే అర్థం వస్తుంది. అది అనిష్టం. అచిద్వస్తువులు అచిత్స్వరూపాలు కదా? అట్లే ఆత్మకు సత్త్వం మాత్రమే స్వరూపం అనే మాట కూడ అయుక్తమే. ఆత్మ కేవల జ్ఞానస్వరూపం కలది. "అసత్త్వం అనగా నశించే స్వభావం కలిగి ఉండడం" అనడం కూడ అయుక్తమే, నీ మతంలో సత్యత్వానికీ నిత్యత్వానికి భేదం ఉంది కదా? ఈ జగత్తు సత్యమైనది, అనిత్యము అని కదా ఈ సిద్ధాంతం. ఇదే కారణంచేత "సత్త్వం అనగా అవినాశ స్వభావం" అని చెప్పడం కూడ అయుక్తమే. (భా.అ.ప్ర.పే 40,41) 16

భాష్యమ్

కిం పునః తత్ యత్ సత్ ఏవ, సర్వదా ఏవ అస్తి ఇతి, ఉచ్యతే – అవినాశీతి:–

మూ. అవినాశి తు తద్విద్ధి యేన సర్వమిదం తతమ్,
వినాశమవ్యయస్యాస్య న కశ్చిత్కర్తుమర్హతి. 17

బాలానందిని

కిమితి :– ఏది కేవలము సత్తో, అనగా ఎల్లప్పుడూ ఉంటుందో, 'అవినాశి' ఇత్యాదికంచేత చెప్పబడుచున్నది (చెపుతున్నాం, విను) –

ప్ర.అ. **అవినాశీతి :–** ఇదం సర్వమ్ = ఈ జగత్తంతా, యేన = దేనిచేత, తతమ్ = వ్యాపింపబడినదో, తత్ తు = దాని నైతే, అవినాశి = నాశనం లేనిధానినిగా, విద్ధి = తెలుసుకొనుము. కశ్చిత్ = ఎవ్వడూ కూడ, అవ్యయస్య = మార్పులు లేని, అస్య = దీని యొక్క, వినాశమ్ = నాశనాన్ని, కర్తుమ్ = చేయుటకు, న అర్హతి = సమర్థుడు కాదు.

భాష్యమ్

అవినాశి, న వినష్టుం శీలమ్ అస్య ఇతి. తుశబ్దః అసతః విశేషణార్థః. తత్ విద్ధి విజానీహి. కిమ్? యేన సర్వమ్ ఇదం జగత్ తతమ్ వ్యాప్తం సదాఖ్యేన తతమ్ వ్యాప్తం సదాఖ్యేన బ్రహ్మణా, సాకాశమ్, ఆకాశేనేవ ఘటాదయః. వినాశమ్ అదర్శనమ్ అభావమ్, అవ్యయస్య = న వ్యేతి, ఉపచయాపచ న యాతీతి అవ్యయమ్, తస్య అవ్యయస్య. నైతత్

సదాఖ్యం బ్రహ్మ స్వేన రూపేణ వ్యేతి, వ్యభిచరతి, నిరవయవత్వాత్, దేహాదివత్. నాపి ఆత్మీయేన, ఆత్మీయాభావాత్, యథా దేవదత్తః ధనహాన్యా వ్యేతి. న తు ఏవం బ్రహ్మ వ్యేతి, అతః అవ్యయస్య అస్య బ్రహ్మణః వినాశం న కశ్చిత్ కర్తుమ్ అర్హతి. న కశ్చిత్ ఆత్మానం వినాశయితుం శక్నోతి ఈశ్వరోఽపి. ఆత్మా హి బ్రహ్మ. స్వాత్మని చ క్రియావిరోధాత్ ("యథా చక్షుర్గతరేఖాదీన్ చక్షుః న పశ్యతి" అనే వాక్యం భా.అ.ప్ర. అధికంగా ఉన్నది).

బాలానందిని

అవినాశీతి :- నశించే స్వభావం దేనికి లేదో అది అవినాశి. 'తు' శబ్దం అసత్తుకంటె ఇది (సత్) భిన్నమైనది అనే అర్థం చెపుతుంది ('అసత్' అలా ఉంటే 'సత్' మాత్రం ఇలాంటిది అనే అర్థాన్ని సూచిస్తుంది). దానిని తెలిసికొనుము. దేనిని? 'సత్' అను పేరు గల ఏ బ్రహ్మచేత, ఆకాశంచేత ఘటాదులు వ్యాపింపబడినట్లు, ఆకాశంతో సహా ఈ జగ త్తంతా వ్యాపించబడిందో (ఆ బ్రహ్మను). వినాశమును, కనబడకుండా పోవుటను లేకపోవుటను అవ్యయస్య - న వ్యేతి = పెరగడం గాని తరగడం గాని ఏది పొందదో అట్టి అవ్యయమైన దానియొక్క. సత్ అనే పేరుగల ఈ బ్రహ్మకు అవయవాలు లేవు. అందుచేత అవయవాలున్న దేహాదికం వలె ఇది తన స్వరూపంచేత మార్పు చెందదు. దీనికి సంబంధించిన (బాహ్యవస్తువు ఏదీ) లేదు; అందుచేత తనకు సంబంధించినదాని ద్వారా కూడ ఇది మార్పు చెందదు. దేవదత్తుడు (తనకు సంబంధించిన) ధనం నశించడంచేత ఏ విధంగా మార్పు చెందుతాడో (అంతవరకు సధనుడుగా ఉన్నవాడు నిర్ధనుడు అవుతాడో) ఆ విధంగా కూడ బ్రహ్మ వికారం చెందదు. ఈ విధంగా అవ్యయమైన ఈ బ్రహ్మను ఎవ్వడూ కూడ నశింపచేయజాలడు. ఈశ్వరుడు కూడ ఆత్మను నశింపచేయజాలడు; (ఇందుకు రెండు కారణాలు) ఆత్మయే బ్రహ్మ (అదొక కారణం). తన విషయంలో తానే ఏ విధమైన క్రియా కూడ జరిపించడం శక్యం కాదు. (ఎవ్వడూ తన భుజం మీద తాను కూర్చొనజాల నట్లు; అగ్ని తనను కాల్చజాల నట్లు. ఇది రెండవ కారణం) (కంట్లో ఉన్న రేఖాదులను కన్ను చూడ జాలనట్లు)

భా.అ.ప్ర. ఇక్కడ శ్రీరామానుజాచార్యులు ఇలా అన్నారు. "చేతనమైన ఏ ఆత్మతత్త్వం చేత దానికంటె భిన్నమైన ఈ అచేతనతత్త్వం అంతా వ్యాపించబడినదో అట్టి ఆత్మతత్త్వం నశించనది అని తెలుసుకొనుము. ఆత్మ అంతటా వ్యాపించి ఉంటుంది. దీనికంటె సూక్ష్మవస్తువు ఏదీ లేదు. దీనికి ఎలాంటి వికారాలూ ఉండవు. అందుచేత దానికంటె భిన్నమైన ఏదీ కూడ దీనిని నశింపచేయజాలదు. ఎందుచేత ననగా ఆత్మకంటె వేరుగా ఉన్న వన్నీ ఆత్మచేత వ్యాపింపబడతాయి. అవి స్థూలములు. అందుచేత ఆత్మ అవినాశి" దీని భావం వివరిస్తూ వేదాంతదేశికులు - "ఆత్మకంటె సూక్ష్మమూ, దానిని నశింప చేయగలిగినదీ మరొకటి ఏదీ లేదు. దీనిని నశింపచెయ్యా లనే సంకల్పం ఈశ్వరునికి కూడ ఉండదు; (అందుచేత ఆత్మ అవినాశి) అని భావం" అని వ్రాశారు.

ఈ విషయంలో విచారణ చేయబడుచున్నది – మూలంలో 'తత్' అని నపుంసక లింగంలో ఉన్న శబ్దానికి 'సత్ అయిన బ్రహ్మ' అనే అర్థం స్పష్టంగా తెలుస్తూండగా ఆ అర్థం విడిచిపెట్టి 'ఆత్మతత్త్వం' అనే అర్థాన్ని గ్రహించడానికి ప్రమాణం ఏదీ లేదు 'ఆత్మానమ్' (ఆత్మను) అంటేనే సరిపోతూండగా 'తత్త్వ' పదం వ్యర్థం. "ఈ సమస్త మైన అచేతనతత్త్వం' అనగా జీవేశ్వరభిన్న మైన సమస్తమూ అనే కదా నీ అభిప్రాయం? సూక్ష్మముగా పరిచ్ఛిన్న మైన జీవుడు దానినంతనీ ఎలా వ్యాపిస్తాడు? పరిచ్ఛిన్నమైన వస్తువు అంతనీ వ్యాపించి ఉండడం ఎక్కడా కనబడదు కదా? పరిచ్ఛిన్నమైన ఘటం సర్వవ్యాపకంగా కనబడదు కదా? సర్వవ్యాపి అనగా అంతటా ఉండడం అని కదా అర్థం? పరిచ్ఛిన్నుడైన వాడు అంతటా ఎలా ఉంటాడు? కఱ్ఱలు, రాళ్లు, మట్టి మొదలైన అచేతన పదార్థాలలో ఎక్కడైనా జీవుడు కనబడుతున్నాడా? అలా కనబడితే ఆ కఱ్ఱలు మొదలైనవి కూడ సచేతనాలే అవుతాయి కాని అచేతనాలు కాకూడదు. బుద్ధిపరిచ్ఛిన్నుడు, మనోమయకోశంకంటె లోపల నున్నవాడు, సూక్ష్మతరుడు అయిన, విజ్ఞానమయుడైన జీవుడు మనోమయకోశాన్ని వ్యాపించి ఉంటే ఉండవచ్చు నేమో. సమస్తదేహాన్ని వ్యాపించి ఉండడం ఎలా సంభవం? తన దేహాన్నే పూర్తిగా వ్యాపించజాలనివాడు ఇతరదేహాలలోనికి ఎలా వ్యాపిస్తాడు? అన్ని దేహాలను వ్యాపిస్తాడు అని అంగీకరిస్తే ఏకజీవవాదం (జీవు డనే వాడు ఒక్కడే అనే వాదం) ప్రసక్తం అవుతుంది (అంగీకరించవలసి వస్తుంది). ఆత్మలు అనేకములు అని అంటే ఆత్మ సర్వవ్యాపకము అనే మాటకు భంగం వస్తుంది. ఈ దోషంనుండి తప్పించుకొనడం కోసం జాత్యేకత్వాన్ని అంగీకరించి (ఆత్మలు అనగా ఆత్మజాతి అని అర్థం అంగీకరించి) సమస్త మైన అచేతనసముదాయమూ కూడ ఈ ఆత్మజాతిచేత, ఆత్మసముదాయంచేత, వ్యాపించబడినది అని అర్థం చెప్పినట్లయితే అపుడు 'సర్వ' పదం కుదరదు. ఆత్మసముదాయం పాషాణాద్యచేతనసముదాయా న్నంతనీ వ్యాపించ సమర్థం కాదు కదా? 'సర్వ' పదానికి సమస్త అచేతనసముదాయాన్ని అని కాక "సమస్తమైన మనుష్యాదిదేహసముదాయాన్నీ' అని సంకుచితమైన అర్థం చెపితే అది మూలకారుని అభిప్రాయానికి విరుద్ధం అవుతుందనే విషయం స్పష్టమే. జాత్యేకత్వాన్ని అంగీకరించి ఆత్మ వ్యాపించి ఉండడం అనగా ఒక్కొక్క ఆత్మ ఒక్కొక్క దేహంలో వ్యాపించి ఉంటుంది అని అర్థం చెపుతాం అని అంటే కూడ కుదరదు. ఒక్కొక్క దేహం లోపల ఉన్న ఆత్మ, పెట్టెలో ఉన్న వస్త్రం పెట్టెను అంతనూ ఏ విధంగా వ్యాపించ జాలదో అదే విధంగా దేహాన్నంతనీ వ్యాపించ జాలదు. ఆకాశం వలె ఏది లోపలా, బైటా కూడ ఉంటుందో దానినే కదా వ్యాపకం అంటాం? వహ్ని ధూమవ్యాపకం అంటున్నాం. అందుకు కారణం ధూమం లేని అయోగోలకంలో వహ్ని ఉండడం. ఆ విధంగా దేహం లేని ఆకాశాదులలో చైతన్యం లేనప్పుడు చైతన్యం దేహవ్యాపకం అనడం ఎలా కుదురుతుంది? జీవుడు దేహవ్యాపకుడు కాకపోవడం సరికదా – జీవుడు లేని శయ్యాదులమీద దేహం ఉండడంచేత దేహమే జీవవ్యాపకం అని చెప్పవలసి వస్తుంది. (ఇది తార్కికుల్లు చెప్పిన వ్యాపకత్వలక్షణాన్ని దృష్టిలో పెట్టుకొని చేసిన దూషణం). ఏది

లోపల ఉంటుందో అది వ్యాపకం అని చెప్పడం కూడ కుదరదు; అప్పుడు ఇంటి లోపల ఉన్న ఘటం గృహవ్యాపకం అని చెప్పవలసివస్తుంది. జీవుడు అణుపరిమాణం కలవాడే అయినా వాని ధర్మమైన జ్ఞానాన్ని పట్టి వానికి వ్యాపకత్వం కుదురుతుంది అనడానికి కూడ వీలులేదు. అచేతనమైన దేహంలో ధర్మభూతజ్ఞానానికి వృత్తి కలగదు కదా? సిద్ధాంతంలో (అద్వైత సిద్ధాంతంలో) నైతే జ్ఞానస్వరూపుడైన జీవునిలో ధర్మభూత మైన జ్ఞానం ఉంటుందనే విషయమే అంగీకార్యం కాదు. జ్ఞానంలో మరొక జ్ఞానం ఉండదు కదా? జీవునికి ధర్మమైన జ్ఞానం ఉంటుంది అని అంటే అప్పుడు జీవుడు జ్ఞాని అవుతాడు కాని జ్ఞానస్వరూపుడు కాజాలడు. నైయాయికుల మతంలో నైతే జీవుడొక జడద్రవ్యం కాబట్టి, ద్రవ్యంలో గుణం ఉండవచ్చును కాబట్టి, జీవునికి ధర్మభూతజ్ఞానం ఉంటుంది అని చెప్పడం కుదురుతుంది. నీ మతంలో నైతే జీవుడు జ్ఞానైకాకారుడు (జ్ఞానమాత్ర స్వరూపుడు) అని అంగీకరించినప్పుడు మళ్లీ వానికి ధర్మభూతజ్ఞానం అంటూ ఎలా ఉంటుంది? ఒకే జ్ఞానం ఒక ఆశ్రయంలో స్వరూపంగాను ధర్మంగానూ కూడ ఉండదు కదా? ధర్మభూతజ్ఞానం అనగా వృత్తిజ్ఞానం అని అంటే అప్పుడు వృత్తిజ్ఞానం అంతఃకరణధర్మం అవుతుంది కాని ఆత్మధర్మం కాదు. అందుచేత సూక్ష్మమైన ఆత్మకు వ్యాపకత్వం అసంభవం గాన ఆత్మతత్త్వం చేత సమస్తమైన అచేతనతత్త్వమూ వ్యాపించబడి ఉన్నది అని చెప్పడం అయుక్తం.

మరొక విషయం ఏమనగా - అచేతనం ఆత్మకంటె భిన్నమైనది అని చెప్పడానికి కూడ శక్యం కాదు **"ఆత్మనః ఆకాశః సంభూతః"** అని శ్రుతి చెప్పినట్లు ఆత్మకార్య మైన అచేతనం ఆత్మకంటె వ్యతిరిక్తం కాదు కదా? ఆత్మ నిరతిశయసూక్ష్మం (దానికంటె సూక్ష్మ మైనది ఏదీ లేనంత సూక్ష్మం) అని చెప్పడం కూడ అయుక్తమే. అది నిరతిశయసూక్ష్మం అయితే వ్యాపకం ఎలా అవుతుంది? శరీరంలో కూడ మొత్తం శరీరాన్ని వ్యాపించనపుడు సమస్తశరీరంలోను వ్యాపించి యున్న శైత్యాదులవల్ల కలిగే సుఖాదుల జ్ఞానం కలగడానికి అవకాశం లేదు. ఆ సుఖాదులు త్వగింద్రియాదుల ద్వారా తెలుస్తాయి అనడానికి కూడ వీలు లేదు; సూక్ష్మతమ మైన ఆత్మకు త్వగాదీంద్రియాలతో సంబంధం కూడ సంభవం కాదు కదా? అంతే కాక **"అణోరణీయాన్ మహతో మహీయాన్"** (ఆత్మ అణువుకంటె కూడ చిన్నది, మహత్‌కంటె (ఆకాశాదికంకంటె) పెద్దది) అనే శ్రుతిని అనుసరించి ఆత్మ అన్నింటికంటె ఏది పెద్దదో దానికంటె పెద్దది. అణువుకంటె అణువు, అనగా సూక్ష్మమైనదాని కంటె సూక్ష్మమైనది; అనగా తెలియడానికి శక్యం కానిది అని మాత్రమే అర్థం కాని చిన్నది అని అర్థం కాదు. ఇతరపదార్థాలన్నీ ఆత్మచేత వ్యాపింపబడడంచేత స్థూల మైనవి, అవి ఆత్మను నశింపజేయజాలవు అని చెప్పడం కూడ అయుక్తమే. అణు వైన ఆత్మ వ్యాపకము అని సిద్ధిస్తే కదా అచేతనం ఆ ఆత్మచేత వ్యాపింపబడుతుంది అనే మాట సిద్ధిస్తుంది? ఆత్మకు వ్యాపకత్వమే కుదరదు అని పైన ప్రతిపాదించబడింది. పోనీ నీ మాట తాత్కాలికంగా

అంగీకరించి వ్యాపత్వం అనగా అన్నింటికంటె లోపల ఉండడం అని గ్రహించి ఆత్మ వ్యాపకం, దేహం వ్యాప్యం అని అంగీకరించినా కూడ వ్యాప్యమైన స్థూలవస్తువు లోపల నున్న సూక్ష్మవస్తువును నశింపచేయజాలదు అనే నీ ఇష్టం సిద్ధించదు. స్థూలమైన కొండచిలువ సూక్ష్మమైన మేకను నశింపచేయడం కనబడుతున్నది కదా? అట్లే స్థూలమైన పిడికిలి దాని లోపల నున్న పురుగును నశింపచేయడం కనబడుతున్నది. స్థూలమైన ఇల్లు కాలిపోతూంటే దానిలో ఉన్న జంతువులు నశిస్తున్నాయి. అట్లే సూక్ష్మమైన నల్లివల్ల స్థూలమైన మనిషి నశిస్తున్నట్లు కనబడడం లేదు. సూక్ష్మమైన ఉదకంచేత స్థూలమైన అగ్ని కూడ నశించడంలేదు.

ఈశ్వరుడు ఆత్మకంటె కూడ సూక్ష్మతరుడు అని చెప్పడం కూడ యుక్తం కాదు. ఆత్మకంటె సూక్ష్మతరు డైతే ఒక ఆత్మలో ఉన్న ఈశ్వరుడు మరొక ఆత్మలో ఉండడం కుదరదు. మరి నువ్వైతే ఈశ్వరుడు సర్వభూతాంతర్యామి, అనగా సమస్తభూతాల లోపల ఉంటా డని అంటున్నావు. ఆ ఈశ్వరుడు ఒక్కడే అని అంగీకరించి ఉన్నావు, అందుచేత ఎన్ని దేహాలో అన్ని ఆత్మలు అన్నట్లు ఎన్ని ఆత్మలో అంతమంది ఈశ్వరులు అనడానికి కూడ అవకాశం లేదు. అందువల్ల చేతనాచేతనరూప మైన సర్వజగత్తుకు లోపలా బైటా కూడ వ్యాపించి ఉన్నాడు అని చెప్పబడే ఈశ్వరుడు సూక్ష్మతముడు అని చెప్పడం స్వప్నంలో కూడ అసంభావ్యం. **"మహాన్తం విభుమాత్మానం మత్వా ధీరో న శోచతి"** ఇత్యాదులైన వందల కొలది శ్రుతులు ఈశ్వరుడు సర్వవ్యాపి అని చెపుతున్నాయి. ఈశ్వరుడు సూక్ష్మమైన వాడు అని అక్కడక్కడ చెప్పినదానికి తెలియడానికి శక్యమైనవాడు కాదు అని మాత్రమే అర్థం అని వెనకనే చెప్పబడింది.

జీవుడు ఈశ్వరునికంటె భిన్ను డైతే **"యతో వా ఇమాని భూతాని జాయన్తే"** ఇత్యాది శ్రుతుల ప్రకారం జీవునికి కూడ ఈశ్వరునినుండి సృష్టిస్థితిప్రలయాలు జరుగుతున్నట్లు చెప్పవలసి వస్తుంది. అభిన్ను డైతే మాత్రం ఎలా అంటావా-ఎలాగా కాదు. జీవుడు ఈశ్వరుని కంటె వేరు కాదు కాబట్టే వానికి జన్మనాశాదులు ఉండవు;అంతే కాని ఈశ్వరుడు సంకల్పించక పోవడంవల్ల కాదు. జీవుడు ఈశ్వరునికంటె వేరు అనే పక్షంలో-**"సదేవ సోమ్యేదమగ్ర ఆసీత్, ఏకమేవాద్వితీయం బ్రహ్మ"**అని ఉపక్రమించి,**"తదైక్షత బహు స్యాం ప్రజాయేయ"** అని ఆ సత్‌కు అనేకరూపాలు ధరిస్తాను అనే సంకల్పం కలిగింది అని చెప్పి **"తత్సృష్ట్వా తదేవానుప్రావిశత్"**అని,**"తదనుప్రవిశ్య సచ్చ త్యచ్చాభవత్"**అని జగత్తును సృజించినట్లు, దానిలో ప్రవేశించి నట్లూ శ్రుతి చెపుతూన్నది కదా? ఇక్కడ చెప్పిన ఈశ్వరసంకల్పంవల్ల జీవుడు పుట్టాడా లేదా? పుట్టాడు అని అంటే-"జాతస్య హి ధ్రువో మృత్యుః" అని గీతలోనే చెప్పినట్లు ఆ జీవుడు నశిస్తా డని చెప్పాలి.రెండవ పక్షంలో(పుట్టలేదు అనే పక్షంలో)ఈశ్వరుని కంటె భిన్నుడైన జీవుడు ఎక్కడినుంచి వచ్చాడు?"ఏకమేవాద్వితీయం బ్రహ్మ"అను శ్రుతి ననుసరించి సృష్టికి పూర్వం జీవుడు లేడు కదా?అందుచేత జీవుడు ఈశ్వరునికంటె వేరు

కాదు. అప్పుడు ఈశ్వరునికి తన నాశం విషయంలో సంకల్పం అనేది ఏ విధంగానూ ఉండదు అని చెప్పడానిక అవకాశం ఉంటుంది. సృష్టికి పూర్వం కూడ చిదచిద్విశిష్టమైన బ్రహ్మయే ఉంది కాని శుద్ధ బ్రహ్మ కాదు అని అన్నట్లయితే ఈశ్వరుడు కూడ స్వభావం చేతనే నిత్యుడే అవుతాడు కదా– అలాంటప్పుడు ఈశ్వరసంకల్పం లేకపోవడంచేత నిత్యుడు అని ఎందుకు అన్నావు?

నిజానికి–బ్రహ్మ చిదచిద్విశిష్టం అని అంటే అప్పుడు బ్రహ్మ సవికారమే (బ్రహ్మలో వికారాలు కలుగుతాయి)అని చెప్పవలసి వస్తుంది. చిదచిత్తులుబ్రహ్మకు అపృథక్ సిద్ధవిశేషణాలు కదా?(విడదీయ రాని అంశాలు కదా?) అందుచేత విశేషణాలైన చిదచిత్తులలో ఉండే స్థూలసూక్ష్మాదివికారాలు విశేష్య మైన బ్రహ్మకు కూడ చెందడంచేత అరి సవికారం అవుతుంది. సవికారం అయితే ఆ బ్రహ్మయే అనిత్యం అవుతుంది అనే గొప్ప అనిష్టం ప్రాప్తిస్తుంది. (భా.అ.ప్ర.పే.44)

భాష్యమ్

కిం పునః తత్ అసత్ యత్ స్వాత్మసత్తాం వ్యభిచరతి ఇతి? ఉచ్యతే – అన్తవన్తః ఇతి :

మూ. అన్తవన్త ఇమే దేహా నిత్యస్యోక్తాః శరీరిణః,
అనాశినోఽ ప్రమేయస్య తస్మాద్యుధ్యస్వ భారత. 18

బాలానందని

కిమితి :– ఏది తనయొక్క సత్తను వ్యభిచరిస్తుందో (దేనియొక్క సత్త వ్యభిచరిస్తూంటుందో)అట్టి అసత్ ఏది? అన్తవన్తః ఇత్యాదికం చెప్పబడుచున్నది.

ప్ర.అ. అన్తవన్తః ఇతి :– నిత్యస్య = నిత్యుడు, అనాశినః = నశించనివాడు, అప్రమేయస్య = ఊహింప శక్యం కానివాడు అయిన, శరీరిణః = శరీరధారియైన జీవుని యొక్క, ఇమే = ఈ, దేహాః = దేహములు, అన్తవన్తః = అంతం కలవి. భారత = అర్జునా, తస్మాత్ = ఆ కారణంవల్ల, యుధ్యస్వ= యుద్ధంచేయుము.

భాష్యమ్

అన్తవన్తః, అన్తః వినాశః విద్యతే యేషాం తే అన్తవన్తః; యథా మృగతృష్ణికోదకాదౌ సద్బుద్ధిః అనువృత్తా ప్రమాణనిరూపణాన్తే విచ్ఛిద్యతే, స తస్యాః అన్తః, తథా ఇమే దేహాః. స్వప్నమాయాదేహాదివచ్చ అన్తవన్తః. నిత్యస్య శరీరిణః, శరీరవతః, అనాశినః, అప్రమేయస్య ఆత్మనః అన్తవన్తః ఇత్యుక్తాః, వివేకిభిః ఇత్యర్థః

నిత్యస్య అవినాశినః ఇతి న పునరుక్తం, నిత్యత్వస్య ద్వివిధత్వాత్ లోకే, నాశస్య చ; యథా దేహో భస్మీభూతః అదర్శనం గతః నష్టః ఉచ్యతే; విద్యమానః అపి అన్యథా పరిణతః వ్యాధ్యాదియుక్తః జాతః నష్టః ఉచ్యతే. తత్ర అనాశినః నిత్యస్య ఇతి ద్వివిధేనాపి నాశేన అసంబన్ధః అస్య ఇత్యర్థః. అన్యథా పృథివ్యాదివదపి నిత్యత్వం స్యాత్ ఆత్మనః ,తత్ మా భూదితి నిత్యస్య, అనాశినః ఇత్యాహ.

బాలానందిని

అన్తవన్తః ఇతి:- అన్తః = వినాశము, వేటికి ఉంటుందో అవి అంతవత్తులు. ఎండమావులలో కనబడిన నీళ్లు మొదలైనవాటి విషయంలో సద్బుద్ధి(నీళ్లు ఉన్నాయి అనే బుద్ధి) కొంత సేపు అనువర్తిస్తుంది. ప్రమాణాలచేత బాగా పరిశీలించినతరువాత ఆ సద్బుద్ధి విచ్ఛిన్నం అవుతుంది. అదే దానికి అంతం అనగా. అట్లే ఈ దేహాలు కూడ. ఇవి స్వప్నములో చూచిన దేహాల వలె, మాయానిర్మితాలైన దేహాల వలె అంతం కలవే. నిత్యు డైన శరీరి యొక్క, శరీరం కలవానియొక్క, నశించని, అప్రమేయు డైన ఆత్మయొక్క ఈ దేహాలు అంతం కల వని వివేకవంతులచేత చెప్పబడుచున్నవి అని అర్థం.(ఈ విధంగా ఇక్కడ 'అన్తవన్తః'అనే పదానికి నశించేవి అని మామూలు అర్థం కాకుండా మిథ్య యైనవి అని అర్థం చెప్పబడింది). 'నిత్యస్య'అన్నా 'అనాశినః'అన్నా అర్థం ఒక్కటే గాన పునరుక్తి ఉన్నది అనుకొనగూడదు. ఎందువల్ల ననగా–లోకంలో నిత్యత్వము, నాశమూ కూడ రెండు విధాలు. ఎట్లనగా–భస్మ మైపోయి కనబడకుండా పోయిన దేహం నష్టమైనది(నశించినది)అని అంటారు. అట్లే దేహం ఉండగానే వ్యాధ్యాదులచేత మరొక విధంగా మారిపోతే కూడ అది నష్టం అయినది అంటారు. ఇలా ఉండగా–ఈ రెండు విధాలైన నాశంతోనూ కూడ ఆత్మకు సంబంధం లేదు అని 'అనాశినః','నిత్యస్య' అనే పదాల అర్థం. అలా చెప్పకపోతే.(ఈ రెండు విశేషణాలలో ఏ ఒక్క విశేషణ మైనా ప్రయోగించకపోతే) పృథివి మొదలైనవి అనేకవిధాలైన పరిణామాలు చెందుతున్నా కూడ ఏ విధంగా నిత్యములు అని అంటున్నామో అలాంటి నిత్యత్వమే ఆత్మకు కూడ అనే అభిప్రాయం కలగవచ్చును. అలాంటి అభిప్రాయము కలగకుండా ఉండడం కోసం 'నిత్యస్య''అనాశినః'అని అంటున్నాడు.

భాష్యమ్

అప్రమేయస్య – న ప్రమేయస్య;ప్రత్యక్షాదిప్రమాణైః అపరిచ్ఛేద్యస్య ఇత్యర్థః. నను ఆగమేన ఆత్మా పరిచ్ఛిద్యతే;ప్రత్యక్షాదినా చ పూర్వమ్?న(పూర్వమ్ ఆత్మనః స్వతఃసిద్ధత్వాత్. సిద్ధే హి ఆత్మని ప్రమాతరి ప్రమిత్సోః ప్రమాణాన్వేషణా భవతి. న హి పూర్వమ్ "ఇత్థమ్ అహమ్"ఇతి ఆత్మానమ్ అప్రమాయ పశ్చాత్ ప్రమేయపరిచ్ఛేదాయ ప్రవర్తతే. (న హి ప్రమాతుమ్ ఇచ్ఛన్ పూర్వమ్ ఇత్థం నిత్యః అవిక్రియశ్చ

ఆత్మా అహమ్ ఇతి ఆత్మానం ప్రమాయ పశ్చాత్ ప్రమేయపరిచ్ఛేదాయ ప్రవర్తతే"అని భా.అ.ప్ర.పాఠం) న హ్యాత్మా కస్య చిత్ అప్రసిద్ధః భవతి.

బాలానందిని

అప్రమేయస్య=ప్రమేయం కాని.అనగా ప్రత్యక్షాదిమప్రమాణాలచేత (దీని స్వరూపం ఇది అని)పరిచ్ఛేదం చేయడానికి శక్యం కాని అని అర్థం.((ప్రశ్న)ఆత్మ శ్రుతిచేత పరిచ్ఛేద్యం కదా?శ్రుతికి ముందు ప్రత్యక్షాదిప్రమాణాలచేత పరిచ్ఛేద్యం(తెలియదగినది) కదా?(అనగా సుఖాదులనువలె ఆత్మను మనస్సుచేత గ్రహించవచ్చును.అందుచేత అది మానసప్రత్యక్ష విషయం.జగజ్జన్మాదులచేత అనుమానప్రమాణగమ్యం కూడ.అలాంటప్పుడు అప్రమేయం ఎలా అవుతుంది అని ప్రశ్న). (సమాధానం)అది యుక్తం కాదు.ఇతరప్రమాణాలు ప్రవర్తించడానికి పూర్వమే ఆత్మ స్వతఃసిద్ధ మైనది.(తనంత తానే) ప్రమాతయైన(ప్రమాణాల సహాయంచేత విషయాలను తెలుసుకొనేదైన)ఆత్మ ముందుగా సిద్ధమై ఉంటేనే కదా, ఆ ఆత్మకు తెలుసుకోవా లని కోరిక కలిగినప్పుడు ప్రమాణాలను అన్వేషించడం అనేది జరుగుతుంది?తెలుసుకొనదలచిన ఆత్మ నిత్యమూ.వికారరహితమూ అయిన ఆత్మ నేనే అని ముందుగా తెలిసికొని తరువాత ప్రమేయాన్ని పరిచ్ఛేదంచేయడంకోసం (ప్రమేయ స్వరూపాన్ని తెలుసుకొనడంకోసం) ప్రవర్తించడు కదా?ఆత్మ అనేది తెలియని వాడెవడూ లేడు కదా?

వి. ప్రమాత(తెలుసుకొనేవాడు)అనేవా డొకడు ఉండాలి.వానికి ఏదైన విషయం తెలుసుకోవా లనే బుద్ధి కలిగినప్పుడు అందుకు ఉపకరించే ప్రత్యక్ష-అనుమాన-ఆగమాది ప్రమాణాలకు సాధనాలుగా గ్రహిస్తాడు.వాటి ద్వారాను కావలసిన విషయాలను తెలుసుకుంటాడు.తనను తెలుసుకొనడానికి ఆతనికి ఇతరసాధనాపేక్ష ఏదీ ఉండదు.తనను తానే తెలుసుకుంటాడు. ప్రతీవాడూ 'నేను' అనుకొంటాడు కదా?ఆ నేనే ప్రమాత.ప్రమాతయే ఆత్మ.అందుచేత ఆత్మ అప్రమేయుడు అని చెప్పడం యుక్తమే అని భావం.

భాష్యమ్

శాస్త్రం తు అన్త్యం ప్రమాణమ్ అతద్ధర్మారోపణమాత్రనివర్తకత్వేన ప్రమాణత్వమ్ ఆత్మని ప్రతిపద్యతే;న తు అజ్ఞాతార్థజ్ఞాపకత్వేన. తథా చ శ్రుతిః-"యత్సాక్షాదపరోక్షా ద్బ్రహ్మ,య ఆత్మా సర్వాన్తరః"(బృ.ఉ.3.4.1)ఇతి.యస్మాత్ ఏవం నిత్యః అవిక్రియశ్చ ఆత్మా తస్మాత్ యుధ్యస్వ;యుద్ధాత్ ఉపరమం మా కార్షీః ఇత్యర్థః.న హి అత్ర యుద్ధకర్తవ్యతా విధీయతే.యుద్ధే ప్రవృత్తః ఏవ హి అసౌ శోకమోహప్రతిబద్ధః తూష్ణీమ్ ఆస్తే.తస్య కర్తవ్యప్రతిబన్ధాపనయనమాత్రం భగవతా క్రియతే.తస్మాత్ యుధ్యస్వ ఇతి అనువాదమాత్రమ్;న విధిః. 18.

బాలానందిని

శాస్త్రమితి:-శాస్త్ర మైతే(ఆత్మవిషయంలో)చిట్టచివరి ప్రమాణం.అయితే ఇది ఆత్మమీద ఆరోపించబడిన,దానివి కాని, ధర్మాలను నివర్తింపచేయడం ద్వారా ఆత్మ విషయంలో ప్రమాణం కాని తెలియని క్రొత్త విషయాన్ని తెలుపడం ద్వారా కాదు.(అనగా పైన చెప్పిన విధంగా ఆత్మను గూర్చి ప్రతి ఒక్కనికీ తెలియును.అందుచేత శ్రుతి అనే ప్రమాణం తెలియని ఆత్మను గూర్చి క్రొత్తగా తెలిపే ప్రశ్న లేదు.ఆత్మకు సంబంధించని కర్తృత్వభోక్తృత్వాదిధర్మాలు దానిమీద ఆరోపించబడి ఉన్నాయి.శ్రుతి చేసే దల్లా ఆ ధర్మాలు ఆత్మకు చెందవు,ఆత్మ నిర్గుణము,అద్వితీయము,శుద్ధము అని బోధించడం మాత్రమే అని అర్థం). అందుచేతనే"యత్......సర్వాన్తరః" (ఏది సాక్షాత్తు ప్రత్యక్షంగా కనబడే బ్రహ్మయో,ఆత్మ అన్నిటికంటె లోపల అందరిలోనూ ఉన్నది)అని శ్రుతి అంటూన్నది.(అనగా-ఆత్మ అందరికీ స్వయంగానే ప్రత్యక్షవేద్యం అని చెప్పుచున్నది.)

ఎందువల్ల ఈ విధంగా ఆత్మ నిత్యమో వికారరహితమో అందువల్ల,యుద్ధం చేయుము.అనగా యుద్ధంనుండి విరమించవద్దు అని అర్థం.ఇక్కడ నీకు యుద్ధం కర్తవ్యం అని క్రొత్తగా ఉపదేశం చేయబడడంలేదు. మరేమనగా-యుద్ధం చేయడానికి ప్రవర్తించినవాడే,అర్జునుడు,శోకమోహాలచేత అడ్డగించబడినవాడై ఊరకనే ఉండిపోయాడు.వాని కర్తవ్యం విషయంలో ఏర్పడిన ప్రతిబంధకాన్ని తొలగించడం మాత్రమే భగవంతునిచేత చేయబడుచున్నది.అందువల్ల 'యుధ్యస్వ'అనేది అనువాదం మాత్రమే కాని విధి కాదు.(క్రొత్తగా ఏదైన విషయం చెప్పడం,ఒక పని చేయ మని) చెప్పడం విధి.ముందే తెలిసిన విషయాన్ని లేదా చేపట్టిన పనిని ప్రయోజనాంతరం ఉద్దేశించి పేర్కొనడం అనువాదం).

భా.అ.ప్ర.:-ఇక్కడ శ్రీరామానుజాచార్యులు ఈ విధంగా వ్రాశారు-"దిహ ఉపచయే"(దిహధాతువునకు వృద్ధిపొందడం అర్థం)అని చెప్పినట్లు ఉపచయరూపా లైన ఈ దేహాలు నశించే స్వభావం కలవి.ఉపచయాత్మకా లైన ఘటాదులు నశిస్తూ న్నట్లుగా కనబడుతున్నాయి కదా?"పుణ్యః పుణ్యేన కర్మణా"ఇత్యాది శాస్త్రాలు చెప్పినట్లుగా నిత్యుడైన శరీరికి(జీవునకు)పంచభూతసముదాయరూపాలైన ఈ దేహాలు వానికి కర్మఫలోపభోగం కోసం మాత్రమే ఏర్పడుతూంటాయి గాన ఆ కర్మ పూర్తి అయిపోవడంతో నశిస్తూంటాయి". ఇది అయుక్తం.'దిహ ఉపచయే'అని చెప్పినట్లు దేహాలు ఉపచయరూపంగా ఉండడం అనేది వృద్ధికే హేతువు గాని క్షయానికి హేతువు కాదు.ఉపచయం అనగా అర్థం వృద్ధిపొందడం కదా?ఘటాదులు(నువ్వు చెప్పినట్లు) ఉపచయాత్మకాలుగా కనబడడం లేదు.కుమ్మరి ఒక

ఘటాన్ని ఎంత పరిమాణంతో తయారుచేశాడో అంతకంటె ఎక్కువగా అది మన ఇళ్లలో పెరగడం లేదు కదా?

ఈ దోషం తొలగించడం కోసమే వేదాంత దేశికులు 'ఉపచయరూపాః'అనే పదానికి "సావయవాః"(అవయవాలతో కూడినవి)అని అర్థం చెప్పారు అని అనడం కూడ యుక్తం కాదు.దేహశబ్దానికి అలాంటి అర్థం లభించదు కదా?ఉపచయం సావయవానికి మాత్రమే ఉంటుంది కాని నిరవయవానికి(అవయవాలు లేనిదానికి) ఉండదు అనే సిద్ధాంతాన్ని అనుసరించి దేహశబ్దానికి అలాంటి అర్థం లభిస్తుంది; దేహానికి అవయవాలు లేకపోతే అది వృద్ధి పొందజాలదు కదా?అని అనడం కూడ యుక్తం కాదు.ఘటం సావయవమే అయినా దానిలో ఉపచయం(పెరగడం) కనబడడం లేదు;అందుచేత సావయవత్వ-ఉపచయాలకు సమనియతత్వం లేదు గాన అలాంటి అర్థం లభించదు(ఇది ఉంటే తప్పకుండా అది కూడ ఉంటుంది,అది ఉంటే తప్పక ఇది కూడ ఉంటుంది అని రెండు వస్తువుల లేదా విషయాల విషయంలో చెప్పడానికి వీలుంటే ఆ రెండు వస్తువులూ సమనియతాలు అని చెప్పబడతాయి.సావయత్వం ఉన్నచోటల్లా ఉపచయం ఉంటుంది అనే మాట ఘటాదులలో లేదు గాన,ఘటం సావయవమైనా పెరగడం లేదు గాన, సావయవత్వ-ఉపచయాల మధ్య, సమనియ తత్వం లేదు అని అర్థం).మరొక విషయం ఏమనదా-ఆకాశం నిరవయవమే అయినా మఠ వైశాల్యాన్ని పట్టి మఠాకాశం ఉపచయం పొందుతుంది అని నీ మతం గాన నిరవయ వానికి ఉపచయం ఉండదు అని నియమించడం కూడ శక్యం కాదు.

దేహంలో ఉపచయం ఈ విధంగా జరుగుతుంది అని ప్రతిపాదించడం కూడ, నిజానికి,కష్టమైన విషయమే.దేహం,ఘటం వలె,ఎన్ని అవయవాలతో తయారైనదో వాటికంటె భిన్నమైన అవయవాలు,ఆ దేహంలో ఉపచయం కలగడానికి, ఎక్కడినుండి వచ్చాయి?బాల్యావస్థలోకంటె యౌవనంలో దేహంలో వృద్ధి కనబడు తూన్నది;అది అలా కనబడడం అనేదాని బలంచేత మరి కొన్ని అవయవాలు వచ్చి చేరతాయి అని కల్పిస్తాం అని సమాధానం కూడ కుదరదు.ఇలాంటి కల్పన చేయడానికి తగిన ప్రమాణం ఏమీ లేదు.అందుచేత ఆ వృద్ధి మాయామయమే అని చెప్పాలి.

ఘటాదులు ఏ విధంగా నశించేవిగా కనబడుతున్నాయో అదే విధంగా దేహాలు కూడ నశించేవిగా కనబడుతూనే ఉన్నాయి.ఈ విధంగా దేహాలలో సిద్ధంగా ఉన్న ప్రత్యక్షంగా కనబడుతూన్న,అంతవత్వాన్ని భగవంతుడు సావయవత్వాది హేతువులచేత సాధించడం ఎందుకు?సిద్ధించినదానినే సాధించడం వ్యర్థం గాన అదొక దోషంగా పరిగణింపబడుతుంది

కదా?శరీరికి కర్మఫలోపభోగం కలగడంకోసమే దేహం లభిస్తుంది అని శాస్త్రాలు చెపుతున్నాయి గాన అనే అర్థవివరణం కూడ అయుక్తమే. 'కర్మఫలోపభోగార్థం'అని మూలంలో లేదు;మూలంలో లేనిదానిని మూలానికి బైట కల్పించినట్లు అవుతుంది.ప్రమాణా లన్నిటిలోకి ప్రత్యక్షం బలీయం అవడంచేత, దేహాలు,వాటి వినాశస్వభావమూ ప్రత్యక్షంగానే తెలుస్తూన్నప్పుడు 'శాస్త్రాలు చెపుతున్నాయి'అనడం కూడ అయుక్తమే.(భా.అ.ప్ర.పే.47,48).

18

భాష్యమ్

శోకమోహాదిసంసారకారణనివృత్త్యర్థం గీతాశాస్త్రం,న ప్రవర్తకమ్,ఇత్యస్య అర్థస్య సాక్షిభూతే ఋచౌ· ఆనినాయ భగవాన్. యత్తు మన్యసే యుద్ధే భీష్మాదయో మయా హన్యన్తే;అహమ్ ఏవ తేషాం హన్తా ఇతి,ఏషా బుద్ధిః మృషైవ తే.కథమ్?

మూ. య ఏనం వేత్తి హన్తారం యశ్చైనం మన్యతే హతమ్,
ఉభౌ తౌ న విజానీతో నాయం హన్తి న హన్యతే. 19

శోకేతి:– గీతాశాస్త్రం శోకము.మోహమూ మొదలైన సంసారకారణాల నివృత్తికొరకే ఉదిష్టమైనది గాని, కర్మాచరణాదులలో ప్రవర్తింపచేసేది కాదు అనే విషయానికి సాక్షులైన (ప్రమాణాలైన)రెండు ఋక్కులను భగవంతు డిక్కడికి తీసికొనివచ్చాడు(ఉదాహరించాడు). యుద్ధంలో భీష్మాదులు నాచేత చంపబడుచున్నారు,నేనే వాళ్లను చంపేవాడను అనే నీ బుద్ధి అసత్య మైనదే(వ్యర్థమైనదే). ఎట్లు?

ప్ర.అ. యః ఇతి :- యః = ఎవడు; ఏనమ్ = ఈ దేహధారియైన జీవుణ్ణి, హన్తారమ్ = చంపేవానినిగా, వేత్తి = తెలుసుకుంటాడో,యః చ = ఎవడు కూడ, ఏనమ్ = ఈ శారీరుణ్ణి, హతమ్ = చంపబడినవానినిగా, మన్యతే = తలుస్తాడో, తౌ ఉభౌ = వాళ్లిద్దరూ కూడ, న విజానీతః = ఎరుగరు. అయమ్ = ఈ దేహి, న హన్తి = చంపడు, న హన్యతే = చంపబడడు.

భాష్యమ్

య ఏనమితి:– యః ఏనం ప్రకృతదేహినం,వేత్తి జానాతి,హన్తారమ్ హనన క్రియాయాః కర్తారమ్,యః చ ఏనమ్ అన్యః మన్యతే హతం, దేహహననే హతో௨హమితి హననక్రియాయాః కర్మభూతమ్,తౌ ఉభౌ న విజానీతః న జ్ఞాతవన్తౌ,అవివేకేన ఆత్మానమ్ అహంప్రత్యయవిషయమ్."హన్తా అహమ్","హతః అస్మి అహమ్"ఇతి

దేహహననేన ఆత్మానమ్ అహంప్రత్యయవిషయం యౌ విజానీతః తౌ ఆత్మస్వరూపాన భిజ్ఞౌ ఇత్యర్థః.యస్మాత్ న అయమ్ ఆత్మా హన్తి,న హననక్రియాయాః కర్తా భవతి,న హన్యతే న చ కర్మ భవతి ఇత్యర్థః,అవిక్రియత్వాత్. 19

బాలానందని

యః ఇతి :- ఎవడు, ప్రకృతుడైన(మనం ఎవరిని గూర్చి ముచ్చటిస్తున్నామోఅట్టి) దేహిని,వేత్తి = తెలుసుకుంటాడో,హన్తారమ్ = చంపుట అనే క్రియకు కర్తనుగా (తలుస్తాడో), ఏ ఇతరుడు వీనిని చంపబడినవానినిగా తులస్తాడో,దేహం చంపబడినప్పుడు నేను చంపబడ్డాను అని చంపుట అనే క్రియకు కర్మనుగా తలుస్తాడో,వాళ్లిద్దరూ కూడ,వివేకం లేకపోవడంచేత (లేనివాళ్లవడంచేత)నేను అనే జ్ఞానంలో గోచరమైన ఆత్మను గూర్చి సరిగా తెలుసుకొనడంలేదు.దేహాన్ని చంపడంచేత "నేను చంపేవాడను""నేను చంపబడుచున్నాను" అని అహంప్రత్యయానికి విషయమైన ఆత్మను గూర్చి ఎవళ్లు అనుకొంటున్నారో వాళ్లు ఆత్మస్వరూపం తెలిసినవాళ్లు కారు అని అర్థం.ఎందువల్ల ననగా,ఎట్టి వికారాలూ లేని దవడంచేత ఈ ఆత్మ,న హన్తి = హననం అనే క్రియలో కర్త కాదు; న హన్యతే = (హననక్రియకు) కర్మ కూడ కాదు.

భా. అ. ప్ర.:- ఇక్కడ శ్రీరామానుజాచార్యులు ఇలా అంటున్నారు-"ఏనమ్ ఉక్తస్వభావమ్ ఆత్మానం ప్రతి-ఈచెప్పబడిన స్వభావంగల ఆత్మను గూర్చి,హన్తారమ్-చంపడానికి హేతువునుగా,కమపి-ఎవనినైనా ఎవడు అనుకొంటాడో,ఎవడైతే వీనిని,కేనాపి హేతునా-ఏ హేతువుచేతనైనా చంపబడినవానినిగా తలుస్తాడో".ఇది అయుక్తము. 'ప్రతి', 'కమ్''అపి'అనే మూడు పదాలను అధ్యాహారం తెచ్చుకొనడం అనేది ఒక దోషం.ఇలా అధ్యాహారం తెచ్చుకోవడంవల్ల 'ఏనమ్ హన్తారమ్' (వీనిని హంతనుగా)అని పదప్రయోగ స్వారస్యంచేత స్పష్టంగా కనబడే సామానాధికరణ్యానికి భగం కలుగుతుంది.ఇదొక దోషం. "హన్తారమ్"అన్నప్పుడు హన్‌ధాతువుకు చేర్చిన 'తృ'ప్రత్యయం కర్త అనే అర్థాన్ని బోధిస్తుంది కాని హేతువు అనే అర్థాన్ని బోధించదు.అందుచేత హననంలో(చంపడంలో)కర్త అనధానికి బదులు చంపడంలో హేతువు అని అర్థం చెప్పడం వక్రమార్గం.అట్లే 'హతమ్' అనేదానికి ఏదో హేతువుచేత చంపబడిన అని అర్థం చెప్పడం కూడ అసంగతమే.'హతమ్' అన్నప్పుడు కర్మార్థంలో 'క్త'ప్రత్యయం చేర్చబడింది.చంపబడిన అని అర్థం.అప్పుడు ఎవనిచేత చంపబడిన అని కర్తయొక్క ఆకాంక్షయే కలుగుతుంది కాని 'ఏ హేతువుచేత చంపబడిన'అనే హేత్వాకాంక్ష కలగదు.అందుచేత కర్త్రాకాంక్షను పూర్తి చేయడానికి ఎవడో కర[ం]త అనే అర్థమే చెప్పాలి. 'హేతు' శబ్దం కారణము,ఫలము అనే రెండర్థాలను చెపుతుంది కాని దీనికి కర్త అనే అర్థాన్ని ఆశ్రయించడం ప్రమాణవిరుద్ధం కూడ.

అట్లే-ఈయన ఈ ఆత్మ హననానికి హేతువు కాదు అని కూడ అన్నారు. అది అయుక్తమే. 'తిప్'అనే ప్రత్యయం'హన్'ధాతువుకు చివర చేర్చడంచేత ఏర్పడిన 'హన్తి'అనేది హననకర్తనే బోధిస్తుంది కాని హననహేతువును బోధించదు. ఆఖ్యాతం(తిజ్‌ప్రత్యయం) ఆశ్రయం అనే అర్థాన్ని బోధిస్తుంది గాన హననకర్త అనగా హననం అనే క్రియకు ఆశ్రయ మైనవాడు (చంపడం అనే పని ఎవనిలో ఉందో వాడు)అని అర్థం. "రామో రావణం జఘాన బాణేన భార్యాపహారిత్వాత్"(రాముడు రావణుణ్ణి భార్యని అపహరించడంవల్ల బాణంతో చంపాడు)అనే వాక్యంలో చంపడం క్రియ;ఆ క్రియకు కర్త రాముడు;కరణం(చంపడానికి సాధనం)బాణం;భార్యను అపహరించడం హేతువు;కర్మ రావణుడు. ఈ విధంగా కర్త వేరు హేతువు వేరు. అందుచేత "నాయం హన్తి"అనే వాక్యం ఆత్మకు హననకర్తృత్వం లేదు అని చెపుతూన్నది గాని హననహేతుత్వం లేదు అని చెప్పడంలేదు. 'తిప్'ప్రత్యయం కర్త్రర్థంలో మాత్రమే విధింపబడింది కదా? అలాంటప్పుడు రామానుజులు,'నాయం హన్తి'అనే వాక్యంచేత ఆత్మకు హననహేతుత్వాన్ని ఎలా నిషేధిస్తారు?

ఇక్కడ ప్రత్యయం హేతువనే అర్థాన్ని మాత్రమే బోధించా లని వివక్ష (ప్రయోక్త యొక్క ఇచ్ఛ) అని వేదాంతదేశికులు చెప్పినది కూడ అయుక్తమే.'హన్తి'అనే పదాన్ని ప్రయోగించిన వ్యాసుడు ఈ అభిప్రాయంతోనే ప్రయోగించాడు. అని కల్పించడానికి ప్రమాణం ఏదీ లేదు. ప్రసిద్ధమైన కర్త్రర్థాన్ని విడిచిపెట్టడానికి కారణం కూడ లేదు. నేను చంపడానికి హేతువును అని ఏ మూఢుడూ అను కొనడు కదా? నేను శత్రువును చంపాను;చంపడంలో నేను కర్తను అని మాత్రమే అనుకుంటాడు. అలా చంపడానికి హేతువు ధనరాజ్యాదికమే అని అత డనుకొంటాడు. అందుచేత "ఆత్మ హననహేతువు కాదు"అనే ఉపదేశం వ్యర్థం. "తన కోసం శత్రువులను చంపుతున్నాడు"అని అనడం ఉంది గాన ఆత్మకు హేతుత్వం ఉంది అని అనడానికి వీలు లేదు. అక్కడ 'తన కోసం'అనగా "తనకు సుఖాదులు కలగడంకోసం"అనే అర్థం. అలా చెప్పకపోతే'హన్తి'అని హననక్రియాశ్రయం అని చెప్పబడే ఆత్మ హననహేతువు అవడం అసంభవం. "ఆత్మార్థే పృథివీం త్యజేత్"(తనకోసం భూమినే విడిచిపెట్టాలి) ఇత్యాదులలో ఆత్మ ఫలరూపమైన హేతువుగా చెపితే చెప్పవచ్చు నేమో కాని కారణరూప హేతువుగా మాత్రం ఎక్కడా చెప్పడం కుదరదు. "హననహేతుః న"(చంపడానికి హేతువు కాదు)అని అంటూ నువ్వు హననకారణత్వమే లేదని చెపుతున్నావు. అలా చెప్పడం అయుక్తం. నిషేధం అనేది ప్రసక్తి పూర్వక మైనది (అనగా-ఏదైన జరగడానికిగాని,ఉండడానికి గాని, అవకాశం ఉంటేనే అది అలా కాదు అని నిషేధించాలి). కర్త యైన ఆత్మకు హేతుత్వమే ప్రసక్తం కానప్పుడు దానిని నిషేధించడం ఏమిటి? "ఆత్మనా పుత్రమ్ ఉత్పాదయతి"(తనచేత పుత్రుణ్ణి పుట్టిస్తున్నాడు)అన్నచోట ఆత్మకు హేతుత్వం ఉంది కదా అనడానికి వీలులేదు. అక్కడ ఆత్మశబ్దానికి దేహం అని అర్థం. అక్కడ ఉన్న తృతీయావిభక్తి కరణార్థంలో విధించబడింది.

మరొక విషయ మేమనగా–"హన్తా చేన్మన్యతే హన్తుం హతశ్చేన్మన్యతే హతమ్"అనే కఠవల్లిలోని వాక్యం ఇక్కడ సమన్వితం అవుతుంది అని నువ్వు కూడా చెప్పావు. అక్కడ 'హన్తా చేత్'అనేదానికి హననకర్త అని అర్థమా, హననహేతువు అని అర్థమా? రెండవ పక్షం కుదరదు. హననహేతువు హననకర్త కాదు కాబట్టి అలాంటప్పుడు వానికి హననబుద్ధి ఎలా కలుగుతుంది? "హన్తుం మన్యతే"అని చంపడం అనే బుద్ధి చెప్పబడుతున్నది. అలాంటి హననబుద్ధి నేను చంపుతున్నాను అని ఎవడు అనుకొంటాడో అట్టి హంతకే ఉంటుంది. అందుచేత మొదటి అర్థమే (హననకర్త అనే అర్థమే) మిగిలి ఉంది. (దానినే శ్రుతివాక్యంలో గ్రహించాలి). అందుచేత మూలమైన శ్రుతివాక్యంలో ఉన్న హన్తృశబ్దానికి ఏ అర్థమో అదే అర్థం గీతాశ్లోకంలో ఉన్న హన్తృశబ్దానికి కూడ చెప్పాలి కాని మరొక అర్థం చెప్పకూడదు. అందుచేత 'హన్తా'అన్నదానికి నువ్వు చెప్పిన'హననహేతువు'అనే అర్థం శ్రుతివిరుద్ధం కూడ.

అంతే కాకుండా ఈ అర్థం"లః కర్మణి చ భావే చాకర్మకేభ్యః"అనే పాణినిసూత్రానికి కూడ విరుద్ధం. లకారానికి ఆదేశాలుగా వచ్చిన 'తిప్'మొదలైనవి కర్త, కర్మ, భావం అనే అర్థాన్ని బోధిస్తాయి అని ఆ సూత్రానికి అర్థం. 'తిప్'ప్రత్యయం హేతువు అనే అర్థంలో విధించబడలేదు. అదే విధంగా 'తృన్''తృచ్'అనే ప్రత్యయాలు కూడ కర్త్రర్థంలోనే విధించబడ్డాయి కాని హేత్వర్థంలో విధించబడలేదు. "ఆఖ్యాతానికి ఆశ్రయత్వం అర్థం"అని చెప్పడం వ్యుత్పత్తి వాదానికి విరుద్ధం కూడ. హేతుత్వం ఆఖ్యాతానికి అర్థం అని అక్కడ చెప్పబడలేదు కదా? అంతే కాకుండా ఆత్మ హేతువు కాదు అని ఉపదేశించడం కూడ వ్యర్థమే. ఈ కారణా లన్నింటిచేత రామానుజభాష్యము, తదనుసారియైన వేదాంతదేశికుల తాత్పర్యచంద్రికా కూడ అయుక్తములే. (భా. అ. ప్ర. పే. 49,50). 19

భాష్యమ్

కథమివ అవిక్రియః ఆత్మా ఇతి ద్వితీయో మన్త్రః -

మూ. న జయాతే మ్రియతే వా కదాచి
న్నాయం భూత్వా భవితా వా న భూయః,
అజో నిత్యః శాశ్వతోఽయం పురాణో
న హన్యతే హన్యమానే శరీరే. 20

బాలానందని

కథమితి :- ఆత్మ ఏ విధంగా వికారాలేవీ లేనిది అని రెండవ మంత్రం చెప్తున్నది–

ప్ర.అ. నేతి :- అయమ్ = ఈ ఆత్మ, కదాచిత్=ఎన్నడూ కూడ, న జాయతే = పుట్టదు. వా=మరియు న మ్రియతే=మరణించదు. భూత్వా = (కొంతకాలం)ఉండి, భూయః

= మరల, అభవితా = ఉండనిది న = కాదు. న వా = కొంతకాలం ఉండక తరువాత ఉండేది కూడ కాదు. అయమ్ = ఇది, అజః = పుట్టుక లేనిది. నిత్యః = నిత్య మైనది. శాశ్వతః = తరుగుదల లేనిది. పురాణః = ప్రాచీనమైనది. (వృద్ధిపొందనిది). శరీరే = శరీరం, హన్యమానే = పరిణమింపచేయబడుచున్నా కూడ, న హన్యతే = పరిణమింపచేయబడదు.

భాష్యమ్

న జాయతే నోత్పద్యతే. జనిలక్షణా వస్తువిక్రియా న ఆత్మనః విద్యతే ఇత్యర్థః. న మ్రియతే వా. వాశబ్దః చార్థే. న మ్రియతే చ ఇతి అన్త్యా వినాశలక్షణా విక్రియా ప్రతిషిధ్యతే. కదాచిచ్ఛబ్దః సర్వవిక్రియాప్రతిషేధైః సంబధ్యతే–న కదాచిత్ జాయతే, న కదాచిత్ మ్రియతే ఇత్యేవమ్. యస్మాత్ అయమ్ ఆత్మా భూత్వా భవనక్రియామ్ అనుభూయ పశ్చాత్ అభవితా, అభావం గన్తా న, భూయః పునః; తస్మాత్ న మ్రియతే. యో హి భూత్వా న భవితా సః మ్రియతే ఇత్యుచ్యతే లోకే. వాశబ్దాత్ నశబ్దాచ్చ అయమ్ ఆత్మా అభూత్వా భవితా వా దేహవత్ న భూయః పునః; తస్మాత్ న జాయతే. యః హి అభూత్వా భవితా సః జాయతే ఇత్యుచ్యతే. న ఏవమ్ ఆత్మా; అతః న జాయతే. యస్మాత్ ఏవం తస్మాత్ అజః. యస్మాత్ న మ్రియతే తస్మాత్ నిత్యః చ.

బాలానందిని

నేతి :– న జాయతే = పుట్టదు. ఆత్మకు పుట్టడం అనే ఇతర భావపదార్థాల కుండే వికారం ఉండదు అని అర్థం. మరణించదు కూడ. 'వా'శబ్దానికి 'చ'(కూడా)అని అర్థం. 'న మ్రియతే చ'అని చివరి దైన వినాశరూప మైన వికారం కూడ ఆత్మకు లేదని చెప్పబడు చున్నది. 'కదాచిత్'(ఎన్నడూ కూడ)అనే శబ్దం వికారాలను నిషేధించే అన్ని శబ్దాలతోను, 'న కదాచిత్ జాయతే'"న కదాచిత్ మ్రియతే"ఇత్యాదివిధంగా అన్వయిస్తుంది. (ఎన్నడూ పుట్టదు, ఎన్నడూ నశించదు అని అర్థం). ఏ కారణంవల్ల ఈ ఆత్మ భూత్వా=ఉండడం అనే క్రియను అనుభవించి (కొంత కాలం ఉండి)తరువాత, భూయః = మళ్లీ, అభవితా = అభావాన్ని పొందేది కాదో అందువల్ల మరణించదు. కొంత కాలం ఉండి ఏది తరువాత లేకుండా పోతుందో అది మరణిస్తూన్నది అని లోకంలో అంటారు కదా? ఇక్కడ 'వా'శబ్దమూ 'న'శబ్దమూ ప్రయోగించడంచేత–ఈ ఆత్మ కొంత కాలం ఉండక మళ్లీ దేహం వలె పుట్టదు, అందువల్ల జనించదు అని కూడ అర్థం చెప్పుకోవాలి. ('భూత్వా భూయః అభవితా న" అని శ్లోకంలో ఉన్న పదాలను 'అభూత్వా న భవితా"అని కూడ మార్చుకొని అర్థం చెప్పుకోవాలి. అలా అర్థం చెప్పుకుంటేనే రెండవ పాదంలోని 'వా"న'అనే పదాలకు అన్వయం కుదురు తుంది). అంతకు ముందు లేనిదై ఏది కొంత కాలం తరువాత ఉంటుందో అదే పుట్టుచున్నది.

అని చెప్పబడుతుంది. ఆత్మ ఇలాంటిది కాదు. అందువల్ల పుట్టదు. ఇలాంటిది కాబట్టి ఇది అజం(పుట్టుక లేనిది). మరణించదు కాబట్టి నిత్యం.

భాష్యమ్

యద్యపి ఆద్యన్తయోః వికారయోః ప్రతిషేధే సర్వాః విక్రియాః ప్రతిషిద్ధాః భవన్తి తథాపి మధ్యభావినీనాం విక్రియాణాం స్వశబ్దైః ఏవ తదర్థైః ప్రతిషేధః కర్తవ్యః ఇతి అనుక్తానామ్ అపి యౌవనాదిసమస్తవిక్రియాణాం ప్రతిషేధః యథా స్యాత్ ఇత్యాహ శాశ్వతః ఇత్యాదినా. శాశ్వతః ఇతి అపచయలక్షణా విక్రియా ప్రతిషధ్యతే. శశ్వత్ భవః శాశ్వతః. నాపక్షీయతే స్వరూపేణ, నిరవయవత్వాత్;నిర్గుణత్వాచ్చ నాపి గుణక్షయేణ అపక్షయః. అపక్షయవిపరీతాపి వృద్ధి లక్షణా విక్రియా ప్రతిషిధ్యతే పురాణః ఇతి. యః హి అవయవాగమేన ఉపచీయతే సః వర్ధతే,అభినవః ఇతి చ ఉచ్యతే. అయం తు ఆత్మా నిరవయవత్వాత్ పురాపి నవః ఏవ ఇతి పురాణః;న వర్ధతే ఇత్యర్థః. తథా న హన్యతే న విపరిణమ్యతే,హన్యమానే విపరిణమ్యమానేఽపి శరీరే. హన్తిః అత్ర విపరిణామార్థః ద్రష్టవ్యః అపునరుక్తతాయై. న విపరిణమతే ఇత్యర్థః. అస్మిన్ మన్త్రే షట్ భావవికారాః లౌకికవస్తువిక్రియాః ఆత్మని ప్రతిషిధ్యన్తే. సర్వప్రకారవిక్రియారహితః ఆత్మా ఇతి వాక్యార్థః. యస్మాత్ ఏవం తస్మాత్ ఉభౌ తౌ న విజానీతః ఇతి పూర్వేణ మన్త్రేణ అస్య సంబన్ధః. 20

బాలానందిని

యద్యపీతి :- (ప్రతీ భావపదార్థంలోను ఆరు వికారాలుంటాయి. వాటిలో) మొదటిదైన పుట్టుట అనే వికారమూ,చివరిదైన నశించుట అనే వికారమూ లేదు అని చెప్పగానే మధ్యలో ఉన్న మిగిలిన నాలుగు వికారాలు కూడ ఆత్మకు లేవు అని అర్థం లభిస్తుంది. అయినా కూడ మధ్యలో ఉన్న వికారాలను కూడ వాటిని ప్రత్యక్షంగా బోధించే శబ్దాలనే ప్రయోగించి నిషేధించడం చెయ్యాలి అనే అభిప్రాయంతోను,ఈ షడ్భావవికారాలలో పేర్కొనబడని సమస్తమైన యౌవనాదివికారాలను కూడ నిషేధించాలనే అభిలాషతోను'శాశ్వతః'ఇత్యాదికం చెపుతున్నాడు. శాశ్వత మైనది అని చెప్పడంచేత ఆత్మకు అపక్షయరూప మైన (తరిగిపోవడం అనే)వికారం లేదని చెప్పబడింది. 'శశ్వత్ భవః శాశ్వతః". ఎల్లప్పుడూ ఉండేది. ఆత్మకు అవయవాలు లేకపోవడంచేత (వార్ధక్యంలో శరీరం క్షీణించినట్లు)అవయవాలు తొలగడం ద్వారా అపక్షయం చెందదు. గుణాలు లేని దవడంచేత (ఒక చిత్తరువు రంగు మారిపోవడంచేత అపక్షయం చెందినట్లు)ఉన్న గుణాలు పోవడంచేత అపక్షయంచెందదు. 'పురాణః'అని చెప్పడం చేత, అపక్షయానికి విపరీత మైన వృద్ధిరూప మైన వికారం కూడ ఆత్మకు లేదని చెప్పబడు చున్నది. క్రొత్త అవయవాలు చేరడంచేత పెరిగినదానిని వృద్ధిపొందిన దని,(బాల్యంలో చూచిన

వ్యక్తిని యౌవనంలో చూచినప్పుడు పూర్తిగా క్రొత్త మనిషి అయిపోయాడు అన్నట్లు)క్రొత్తదనీ చెప్పబడుతుంది. ఈ ఆత్మ యైతే అవయవాలు లేనిది. అందుచేత ఇది పూర్వం కూడ క్రొత్తదే. అనగా వృద్ధి పొందదు అని అర్థం. ("పురాపి నవః పురాణః"అని పురాణశబ్దవ్యుత్పత్తి). తథా-న హన్యతే = పరిణామం పొందింపబడదు, అనగా పరిణామం పొందదు. శరీరం, హన్యమానే = పరిణామం పొందింపబడుచున్నా కూడ. ఇక్కడ హనధాతువునకు విపరిణామం అని అర్థం చెప్పుకోవాలి. అప్పుడు పునరుక్తిదోషం ఉండదు. అనగా పరిణామం పొందదు అని అర్థం. (హనధాతువున ప్రసిద్ధ మైన అర్థం 'చంపుటకు'ఇక్కడ 'న హన్యతే'అనే దానికి చంపబడదు అనే అర్థమే చెప్పినట్లయితే,"న మ్రియతే"అని మొదటనే చెప్పబడింది గాన చెప్పిన విషయమే మళ్లీ చెప్పడం అనే (పునరుక్తతా)దోషం ప్రాప్తిస్తుంది. అందుచేత "ధాతూనామ్ అనేకార్థత్వమ్"(ధాతువులు అనేకమైన అర్థాలను భోదిస్తాయి)అనే న్యాయాన్ని అనుసరించి ఇక్కడ హనధాతువుకు పరిణామం పొందించడం అనే అర్థం గ్రహించాలి అని అర్థం). ఈ మంత్రంలో ఆరు భావవికారాలు అనే, లౌకికవస్తువులలో కనబడే వికారాలు ఆత్మలో ఉండవు అని చెప్పబడింది. (ఈ ఘట్టంలో మూడు భావవికారాలను గూర్చియే చెప్పినా "భూత్వా భవితా న" లేదా"అభూత్వా భవితా న"అని వెనుక చెప్పినదానిచేత అస్తిత్వరూప వికారం కూడ నిషేధింపబడినట్లే అని భావం). ఆత్మలో ఏ విధమైన వికారాలూ ఉండవు అని వాక్యార్థం. ఇది ఇలా ఉండడంవల్ల **"ఉభౌ తౌ న విజానీతః"**(వాళ్లిద్దరూ కూడ ఎరుగరు) అని వెనుకటి మంత్రంతో సంబంధం. 20

భాష్యమ్

"య ఏనం వేత్తి హన్తారమ్"ఇత్యనేన మన్త్రేణ హననక్రియాయాః కర్తా కర్మ చ న భవతీతి ప్రతిజ్ఞాయ **"న జాయతే"**ఇత్యనేన అవిక్రియత్వేహేతుమ్ ఉక్త్వా ప్రతిజ్ఞాతార్థమ్ ఉపసంహరతి-

మూ. వేదావినాశినం నిత్యం య ఏనమజమవ్యయమ్,
కథం స పురుషః పార్థ కం ఘాతయతి హన్తి కమ్. 21

య ఇతి:- "య ఏవం వేత్తి హన్తారమ్"అనే మంత్రంచేత (ఆత్మ)చంపడం అనే క్రియకు కర్త గాని,కర్మ గాని కాదు అని చెప్పి. ఆత్మ వికారరహితము అనడానికి హేతువుగా **"న జాయతే"** ఇత్యాదికం చెప్పి,చెప్పబడిన విషయాన్ని ఉపసంహరిస్తూన్నాడు-

ప్ర. అ. వేదేతి:- పార్థ = అర్జునా! యః = ఎవడు, ఏనమ్ = ఈ ఆత్మను, అజమ్ = పుట్టుక లేనిదానినిగాను,అవ్యయమ్ = మార్పులు లేనిదానినిగాను, వేద= తెలుసుకుంటాడో, సః = ఆ పురుషుడు, కథమ్ = ఎట్లు. కమ్ = ఎవనిని, ఘాతయతి = చంపిస్తాడు?కమ్ = ఎవనిని,హన్తి = చంపుతాడు?

భాష్యమ్

వేదావినాశినమితి:- వేద విజానాతి,అవినాశినమ్ అన్త్యభావవికారరహితం, నిత్యం,విపరిణామరహితం"యః వేద"ఇతి సంబన్ధః.ఏనం పూర్వేణ మన్త్రేణ ఉక్త లక్షణమ్ అజం,జన్మరహితమ్,అవ్యయమ్ అపక్షయరహితం,కథం కేన ప్రకారేణ సః విద్వాన్ పురుషః అధికృతః,హన్తి హననక్రియాం కరోతి;కథం వా ఘాతయతి హన్తారం ప్రయోజయతి.న కథంచిత్ హన్తి న కథంచిత్ కంచిత్ ఘాతయతి ఇతి ఉభయత్ర ఆక్షేపః ఏవార్థః ప్రశ్నార్థాసంభవాత్. హేత్వర్థస్య తుల్యత్వాత్ విదుషః సర్వకర్మప్రతిషేధ ఏవ ప్రకరణార్థః అభిప్రేతః భగవతః.హన్తేస్తు ఆక్షేపః ఉదాహరణార్థత్వేన.

బాలానందిని

వేదేతి:- వేద = తెలుసుకొనుచున్నాడో.అవినాశినమ్ = చివరిదైన భావవికారం లేనిదానిని గాను, నిత్యమైనదానినిగాను,పరిణామం లేనిదానినిగాను ఎవడు తెలుసుకుంటాడో అని అన్వయం.ఏనమ్=వెనుకటి మంత్రంచేత చెప్పబడిన లక్షణాలు గల.అజమ్=జన్మ లేనిదానినిగా,అవ్యయమ్=అపక్షయం లేనిదానినిగా.కథమ్=ఏ ప్రకారంచేత,సః పురుషః= ఈ. విధంగా తెలుసుకొన్న పురుషుడు,అధికృతు డైన, అనగా జ్ఞానంలో అధికారంగల, పురుషుడు.హన్తి = చంపడం అనే పని చేస్తాడు.ఎట్లు,ఘాతయతి=చంపేవానిని ప్రేరేపిస్తాడు. ఇక్కడ ఎవనిని ఏలా చంపుతాడు అని ప్రశ్నించడం కుదరదు.అందచేత ఏ విధంగానూ కూడ ఎవనినీ కూడ చంపజాలడు,ఏ విధంగానూ,ఎవనినీ కూడ చంపించజాలడు అని రెండు చోట్లా కూడ ఆక్షేపమే(చంపడమూ,చంపించడమూ ఎలా కుదురుతాయి, అనగా కుదరవు అని చెప్పడమే)అర్థం.ఆత్మ వికారరహితము అనే హేతువుయొక్క అర్థం అన్ని కర్మల విషయంలోనూ సమానమే గాన విద్వాంసునకు ఏ కర్మలూ ఉండవు అని చెప్పడమే భగవంతునికి ఈ ప్రకరణంలో చెప్పవలసిన విషయంగా ఇష్ట మైనది. చంపడమూ,చంపించ డమూ కుదరదు అని ఇక్కడ చెప్పడం కేవలం ఉదాహరణం కొరకే(అనగా ఆత్మకు ఏ వికారాలూ ఉండవు గాన చంపడమూ,చంపించడమూ అనే క్రియలతో ఏ విధంగా సంబంధం కుదరదో అదే విధంగా ఇతరక్రియలతో వేటితోనూ కూడ సంబంధం కుదరదు అని చెప్పడం కోసమే ఇక్కడ హన్ ధాత్వర్థం ఉదాహరణంగా చూపబడింది.)

భాష్యమ్

విదుషః కం కర్మాసంభవే హేతువిశేషం పశ్యన్ కర్మాణి ఆక్షిపతి భగవాన్ "కథం స పురుషః" ఇతి? నను ఉక్త ఏవ ఆత్మనః అవిక్రియత్వం సర్వకర్మా సంభవకారణవిశేషః? సత్యమ్ ఉక్తః, న తు స కారణవిశేషః, అన్యత్వాత్ విదుషః

అవిక్రియాత్ ఆత్మనః ఇతి. న హి అవిక్రియం స్థాణుం విదితవతః కర్మ న సంభవతి ఇతి చేత్, న విదుషః ఆత్మత్వాత్. న దేహాదిసంఘాతస్య విద్వత్తా; అతః పారిశేష్యాత్ అసంహతః ఆత్మా విద్వాన్ అవిక్రియః ఇతి తస్య విదుషః కర్మాసంభవాత్ ఆక్షేపః యుక్తః "కథం స పురుషః" ఇతి. యథా బుద్ధ్యాద్యాహితస్య శబ్దాద్యర్థస్య అవిక్రియః ఏవ సన్ బుద్ధివృత్త్యవివేకవిజ్ఞానేన అవిద్యయా ఉపలబ్ధా ఆత్మా కల్ప్యతే, ఏవమేవ ఆత్మానాత్మవివేకజ్ఞానేన బుద్ధివృత్త్యా విద్యయా అసత్యరూపయైవ పరమార్థతః అవిక్రియః ఏవ ఆత్మా విద్వాన్ ఉచ్యతే. విదుషః కర్మాసంభవవచనాత్ యాని కర్మాణి శాస్త్రేణ విధీయన్తే తాని అవిదుషః విహితాని ఇతి భగవతః నిశ్చయః అవగమ్యతే.

బాలానందిని

విదుషః ఇతి : (ప్రశ్న) విద్వాంసునకు కర్మాచరణం అసంభవం అనడానికి ఏ విశేషహేతువును చూచి, భగవంతుడు, "కథం స పురుషః" అని కర్మలను ఆక్షేపిస్తున్నాడు? (సమాధానం) – ఏ కర్మలూ కూడ సంభవం కావు అని చెప్పడానికి ఆత్మ అవిక్రియం (వికారరహితం) అవడమే కారణవిశేషం అని చెప్పబడింది కదా? (పూర్వపక్షి) నిజమే చెప్పబడింది. అది కారణవిశేషం కాదు. అవిక్రియ మైన ఆత్మ వేరు, విద్వాంసుడు వేరూ కదా? బండ్రాయి వికారరహిత మైనది అని తెలుసుకున్నవానికి కర్మ సంభవం కాదు అని చెప్పడం కుదరదు కదా? (సిద్ధాంతి) అది కాదు. ఎందవల్ల ననగా విద్వాంసుడే ఆత్మ; దేహేంద్రియాదిసముదాయానికి విద్వత్త్వం లేదు. అందుచేత ఇంక మిగిలినది దేహాది సంఘాతంతో సంబంధం లేని విక్రియారహిత మైన ఆత్మయే విద్వాంసుడు. అలాంటి విద్వాంసునకు కర్మ సంభవం కాదు గాన "కథం స పురుషః" అని ఆక్షేపం యుక్తమే. ఆత్మ అవిక్రియమే అయినా బుద్ధివృత్తి వేరు ఆత్మ వేరు అనే వివేకం లేకపోవడంచేత బుద్ధ్యాదులు తీసికొనివచ్చి సమర్పించిన శబ్దాదివిషయాలను గ్రహించేది ఆత్మయే అని, అవిద్యచేత, ఎలా కల్పించబడుచున్నదో అదే విధంగా ఆత్మానాత్మవివేకరూప మైన బుద్ధివృత్తి ద్వారా, అసత్యరూపమే అయిన విద్యచేత, ఆత్మ వాస్తవంలో అవిక్రియమే అయినా కూడ, విద్వాంసుడు అని చెప్పబడుచున్నది. విద్వాంసునికి కర్మ సంభవం కాదు అని చెప్పడం వల్ల శాస్త్రం విధించే కర్మ లన్నీ అవిద్వాంసునకే అని భగవంతుని నిశ్చయం అని తెలుస్తూన్నది.

వి. అదృష్టము, ఇంద్రియాదులు వీటిచేత సహకృత మైన అంతఃకరణం, దీపకాంతి ప్రసరించి నట్లు విషయాలకు వెళ్లి విషయాకారంలో పరిణమించినప్పుడు అది బుద్ధివృత్తి అని చెప్పబడుతుంది. దానిలో చైతన్యం ప్రతిబింబిస్తుంది. చైతన్యాన్ని అభివ్యంజింప చేసిన బుద్ధి వృత్తి వేరు చైతన్యం వేరు అనే విషయం గుర్తించకపోవడంచేత అలాంటి చైతన్యమే విషయజ్ఞానం అని చెప్పబడుతుంది. దానిని పట్టి ఆత్మ జ్ఞాత అని కల్పిస్తున్నాం. ఇది (ఈ

జ్ఞా తృత్వం) అవిద్యచేత ఏర్పడిన మిథ్యాసంబంధంచేత కల్పిత మైనది. తత్త్వమసీత్యాది మహావాక్యాల శ్రవణమననాదుల ద్వారా ఆత్మానాత్మవివేకజ్ఞానంచేత బ్రహ్మాత్మైక్యాన్ని వ్యంజింపచేసే ఒక బుద్ధివృత్తి ఏర్పడుతుంది. వెనుకటివలెనే ఈ బుద్ధివృత్తికీ, అక్కడ ప్రతిఫలించిన ఆత్మకూ గల భేదాన్ని గుర్తించకపోవడంచేత ఆత్మయే బ్రహ్మాత్మైక్యాన్ని తెలుసుకుంటున్న దని అనుకుంటున్నాం. ఈ తెలుసుకోవడం విద్య. నిజానికి ఇది కూడ అసత్యమే. అందుచేత ఈ జ్ఞాతృత్వంచేత కూడ ఆత్మయొక్క అవిక్రియత్వానికి భంగం లేదు. అలాంటివాడు విద్వాంసు డని చెప్పబడుతున్నాడు. 'అహం బ్రహ్మ' అనే ఈ బుద్ధివృత్తి శరీరాద్యుపాధి ఉన్నంతవరకే ఉంటుంది కాని మోక్షావస్థలో ఉండదు.

భాష్యమ్

నను విద్యాపి అవిదుష ఏవ విధీయతే; విదితవిద్యస్య పిష్టపేషణవత్ విద్యావిధానానర్థక్యాత్; తత్ర అవిదుషః కర్మాణి విధీయన్తే, న విదుషః ఇతి విశేషః నోపపద్యతే. న; అనుష్ఠేయస్య భావాభావవిశేషోపపత్తేః. అగ్నిహోత్రాదివిధ్యర్థ జ్ఞానోత్తరకాలమ్ అగ్నిహోత్రాది కర్మ అనేకసాధనోపసంహారపూర్వకమ్ అనుష్ఠేయం, 'కర్తా అహమ్' 'మమ కర్తవ్యమ్' ఇత్యేవంప్రకారవిజ్ఞానవతః అవిదుషః యథా అనుష్ఠేయం భవతి న తు తథా "న జాయతే" ఇత్యాద్యాత్మస్వరూప విధ్యర్థజ్ఞానోత్తర కాలభావి కించిత్ అనుష్ఠేయం భవతి (కిం తు) "న అహం కర్తా" "న అహం భోక్తా" ఇత్యాద్యాత్మైకత్వాకర్తృత్వాదివిషయజ్ఞానాత్ అన్యత్ న ఉత్పద్యత ఇతి ఏషః విశేషః ఉపపద్యతే. యః పునః "కర్తా అహమ్" ఇతి వేత్తి ఆత్మానం తస్య "మమ ఇదం కర్తవమ్" ఇతి అవశ్యంభావినీ బుద్ధిః స్యాత్. తదపేక్షయా సః అధిక్రియతే ఇతి తం ప్రతి కర్మాణి, స చ అవిద్వాన్ – "ఉభౌ తౌ న విజానీతః" (2.19) ఇతి వచనాత్. విశేషితస్య చ విదుషః కర్మాక్షేపవచనాత్ – "కథం స పురుషః" (2.21) ఇతి. తస్మాత్ విశేషితస్య అవిక్రియాత్మదర్శినః విదుషః ముముక్షోః చ సర్వకర్మసంన్యాసే ఏవ అధికారః.

బాలానందిని

నన్వితి :- (ప్రశ్న) విద్య కూడ అవిద్వాంసునికే విధించబడుతున్నది; విద్య సంపాదించినవానికి మళ్లీ విద్యను విధించడం పిషపేషణం వలె వ్యర్థమే కదా? అలాంటప్పుడు కర్మలు అవిద్వాంసునికి విధింపబడుతున్నాయి, విద్వాంసునికి కాదు అనే ఈ విశేషం ఉపపన్నం (యుక్తం) కాదు, (సమాధానం) అది కాదు. అనుష్ఠేయం (చేయవలసినది) ఉండడం లేకపోవడం అనే విశేషం ఉపపన్నమే. అగ్నిహోత్రాదివిధుల అర్థం తెలుసుకొన్న

తరవాత అనేకమైన సాధనాలను సమకూర్చుకొని చేయవలసిన అగ్నిహోత్రాదికర్మను "నేను కర్తను", "నాకు ఇది కర్తవ్యము" అనే జ్ఞానం కల, అవిద్వాంసుడు ఏ విధంగా చేయవలసి ఉంటుందో, (ఆ విధుల అర్థం తెలుసుకొన్నంత మాత్రంచేత ఏ విధంగా చాలదో), ఆ విధంగా ఆత్మస్వరూపబోధకాలైన "న జాయతే" ఇత్యాది వాక్యాల అర్థం తెలుసుకొన్న తరవాత చేయవలసినది ఏదీ ఉండదు. (మరేమనగా) "నేను కర్తను కాదు", "నేను భోక్తను కాదు" ఇత్యాదివిధంగా ఆత్మైకత్వజ్ఞానమూ, అకర్తృత్వాదుల జ్ఞానమూ తప్ప మరి ఏదీ పుట్టదు అనే ఈ విశేషం (విద్వాంసుని విషయంలో) ఉపపన్నమే. "నేను కర్తను" అని తనను గూర్చి అనుకొనేవానికి "ఇది నేను చేయవలసిన కర్మ" అనే బుద్ధి తప్పక కలుగుతుంది. దానిని పట్టి వానికి కర్మలయందు అధికారం ఉంటుంది గాన కర్మలు వానిని గూర్చి చెప్పబడ్డాయి. **"ఉభౌ తౌ న విజానీతః"** అని చెప్పడంచేత అతడు అవిద్వాంసుడు. విశేషితుడైన పురుషునికైతే "కథం స పురుషః" అని కర్మాక్షేపం చెప్పబడింది (వానికి కర్మ లేమిటి అని చప్పబడింది). అందువల్ల ఆత్మ వికారరహితము అని చూచే విశేషితుడైన విద్వాంసునకు, ముముక్షులైనవానికి సర్వకర్మసంన్యాసంలోనే అధికారం.

భాష్యమ్

అత ఏవ భగవాన్ నారాయణః సాంఖ్యాన్ విదుషః, అవిదుషః చ కర్మిణః ప్రవిభజ్య ద్వే నిష్ఠే గ్రాహయతి – **"జ్ఞానయోగేన సాంఖ్యానాం కర్మయోగేణ యోగినామ్"** (3.3.) ఇతి. తథా చ పుత్రాయ అహ భగవాన్ వ్యాసః – **"ద్వావిమావథ పన్థానౌ"** (మ.భా.శాం 240–6) ఇత్యాది. తథా చ **"క్రియాపథశ్చైవ పురస్తాత్ పశ్చాత్ సంన్యాసశ్చ"** (తై. ఆ. 10.62.12 అర్థతోనువాదం). ఇతి ఏతమేవ విభాగం పునః పునః దర్శయిష్యతి భగవాన్ **"అతత్త్వవిదహంకారవిమూఢాత్మా కర్తాహమితి మన్యతే"**, **"తత్త్వవిత్తు న అహం కరోమి"** (3.27.28) ఇతి తథా చ **"సర్వకర్మాణి మనసా సంన్యస్యాస్తే"** (5.13) ఇత్యాది

బాలానందిని

అత ఇతి :– అందువల్లనే భగవంతుడైన నారాయణుడు విద్వాంసుడైన సాంఖ్యులను, అవిద్వాంసులైన కర్మపరులను (రెండు తెగలుగా) విభజించి "జ్ఞానయోగేన... యోగినామ్" (సాంఖ్యులకు జ్ఞానయోగంచేత, యోగులకు కర్మయోగంచేత) అని రెండు నిష్ఠలు తెలుపుతున్నాడు. అట్లే భగవంతు డైన వ్యాసుడు "ద్వావిమావథ పన్థానౌ" (ఇవి రెండు మార్గాలు) ఇత్యాది విధంగా పుత్రునికి చెపుతున్నాడు. అట్లే "క్రియాపథః.... సంన్యాసః" (ముందు కర్మమార్గం తరువాత సంన్యాసం) అని కూడ చెప్పబడింది. ఈ విభాగాన్నే

భగవంతుడు "తత్త్వవేత్త కానివాడు అహంకారంచేత మూఢ మైన బుద్ధి కలవాడై "నేను కర్తను" అనుకుంటాడు. తత్త్వవేత్త యైతే "నేను చేయడంలేదు" అనుకుంటాడు" అని మళ్ళీ చూపనున్నాడు. "సర్వధర్మాలను మనస్సుచేత సన్యసించి ఉంటాడు" అని కూడ చెప్పనున్నాడు.

భాష్యమ్

తత్ర కేచిత్ పణ్డితంమన్యాః వదన్తి – జన్మాదిషడ్భావవిక్రియారహితః, అవిక్రియః అకర్తా, ఏకః, అహమ్ ఆత్మా ఇతి న కస్య చిత్ జ్ఞానమ్ ఉత్పద్యతే, యస్మిన్ సతి సర్వకర్మసంన్యాసః ఉపదిశ్యతే. న. **"న జాయతే"** ఇత్యాదిశాస్త్రోపదేశానర్థక్యాత్. యథా చ శాస్త్రోపదేశసామర్థ్యాత్ ధర్మాధర్మాస్తిత్వవిజ్ఞానం కర్తుశ్చ దేహాన్తర సంబన్ధజ్ఞానం చ ఉత్పద్యతే, తథా శాస్త్రాత్ తస్యైవ ఆత్మనః అవిక్రియత్వాకర్తృత్వైకత్వాదివిజ్ఞానం కస్మాత్ న ఉత్పద్యతే ఇతి ప్రష్టవ్యాః తే. కరణాగోచరత్వాత్ ఇతి చేత్, న "మనసైవానుద్రష్టవ్యమ్" (బృ.ఉ. 4.4.39) ఇతి శ్రుతేః. శాస్త్రాచార్యోపదేశ శమదమాదిసంస్కృతం మన ఆత్మదర్శనే కరణమ్. తథా చ తదధిగమాయ అనుమానే ఆగమే చ సతి జ్ఞానం నోత్పద్యతే ఇతి సాహసమ్ ఏతత్. జ్ఞానం చ ఉత్పద్యమానం తద్విపరీతమ్ అజ్ఞానమ్ అవశ్యం బాధతే ఇతి అభ్యుపగన్తవ్యమ్. తచ్చ అజ్ఞానం దర్శితం "హన్తా అహమ్, హతః అహమ్ అస్మి ఇతి ఉభౌ న విజానీతః" ఇతి. అత్ర చ ఆత్మనః హననక్రియాయాః కర్తృత్వం, కర్మత్వం హేతుకర్తృత్వం చ అజ్ఞానకృతం దర్శితమ్.

బాలానందిని

తత్రేతి :– ఈ సందర్భంలో– మేమే పండితులం అనుకొనే కొందరు (మీమాంసకులు – ఆనందగిరి) "జన్మాదిభావవికారాలు ఆరూ లేని, ఇతర వికారాలు కూడ ఏవీ లేని, కర్తను కూడ కాని, అద్వితీయమైన ఆత్మ నేనే అనే జ్ఞానం ఎవనికీ కలగదు; అలాంటి జ్ఞానం కలిగితే కదా సర్వకర్మసంన్యాసం ఉపదేశించేది?" అని అంటారు. అది యుక్తం కాదు. అలా అంటే **"న జాయతే"** ఇత్యాది శాస్త్రోపదేశం వ్యర్థం అయిపోతుంది. ధర్మాధర్మాలనేవి ఉన్నా యనే జ్ఞానమూ, ఇంకా ఇతర దేహాలతో సంబంధం ఏర్పడుతుం దనే జ్ఞానమూ శాస్త్రోపదేశసామర్థ్యంచేత ఏ విధంగా కలుగుతున్నదో అదే విధంగా ఆత్మకు కర్తృత్వం కాని, వికారాలు కాని లేవు, అది అద్వితీయము అనే జ్ఞానం కూడా అదే శాస్త్రంనుండి ఎందుకు కలగదు అని వాళ్లని అడగాలి. ఈ విషయా లేవీ ప్రత్యక్షంగా ఇంద్రియాలకు కనబడడంలేదు కదా అని అంటే (అది యుక్తం కాదు) 'మనస్సుచేతనే చూడదగినది' అని శ్రుతి చెప్పుచున్నది కదా? శాస్త్రము, ఆచార్యోపదేశము, శమము, దమము మొదలైనవాటిచేత

సంస్కరించబడిన మనస్సు ఆత్మసాక్షాత్కారానికి సాధనం. ఆ విధంగా ఆత్మస్వరూపాన్ని తెలుసుకొనడానికి అనుమానమూ, ఆగమమూ (వేదమూ) ఉంటూండగా జ్ఞానం పుట్టదని అనడం కేవలం సాహసమే. జ్ఞానం పుట్టిన దనగా దానికి విపరీతమైన అజ్ఞానాన్ని బాధిస్తుంది. అని తప్పక అంగీకరించాలి. ఆ అజ్ఞానం 'హన్తా అహమ్' "హతః అస్మి" ఇత్యాదిరూపాలలో ఉంటుం దని "**ఉభౌ తౌ న విజానీతః**" అని (అనే వాక్యంచేత) చూపబడింది. హననక్రియలో ఆత్మకు కర్తృత్వం గాని, కర్మత్వం గాని, ప్రేరకకర్తృత్వం గాని అజ్ఞానంచేత కల్పించబడినదే అని ఇక్కడ చూపబడింది.

భాష్యమ్

తచ్చ సర్వక్రియాస్వపి సమానం కర్తృత్వాదేః అవిద్యాకృతత్వమ్, అవిక్రియత్వాత్ ఆత్మనః. విక్రియావాన్ హి కర్తా ఆత్మనః కర్మభూతమ్ అన్యం ప్రయోజయతి కురు ఇతి. తదేతత్ అవిశేషేణ విదుషః సర్వక్రియాసు కర్తృత్వం హేతుకర్తృత్వం చ ప్రతిషేధతి భగవాన్ విదుషః కర్మాధికారాభావప్రదర్శనార్థమ్ "వేదావినాశినమ్" "కథం స పురుషః" ఇత్యాదినా. క్వ పునః విదుషః అధికారః ఇతి ఏతదపి ఉక్తం పూర్వమేవ "జ్ఞానయోగేన సాంఖ్యానామ్" (3.3.) ఇతి తథా చ సర్వకర్మసంన్యాసం వక్ష్యతి "సర్వకర్మాణి మనసా" (5.13) ఇత్యాదినా.

బాలానందిని

తచ్చేతి :- ఆత్మ వికారాలు ఏవీ లేని దవడంవల్ల ఆత్మకు కర్తృత్వాదికం అవిద్యచేత ఆరోపించబడినదే అనేది (హననక్రియ విషయంలోనే కాక) అన్ని క్రియల విషయంలోను సమానమే. ఆత్మ వికారం కల దైతేనే తాను కర్తగా ఉండి కర్మయైన మరొకనిని ప్రేరేపిస్తాడు కదా? (కర్తృత్వమే లేకపోతే ప్రేరకత్వమూ ఉండ దని అర్థం). అందువల్ల విద్వాంసునికి కర్మల విషయంలో అధికారం లేదు అని చూపడానికి భగవంతుడు 'వేదావినాశినమ్' "**కథం స పురుషః**" ఇత్యాదివాక్యాలచేత, విద్వాంసునికి, విశేషం ఏదీ లేకుండా (ఈ క్రియ ఆ క్రియ అనే భేదం ఏదీ లేకుండా) అన్ని క్రియల విషయంలోను కూడ కర్తృత్వం గాని హేతుకర్తృత్వం (ప్రవర్తకత్వం) గాని లేదని చెపుతున్నాడు. అయితే - విద్వాంసునికి దేనియందు అధికారం ఉంటుంది? ఈ విషయం "**జ్ఞానయోగేన సాంఖ్యానామ్**" అని వెనుకనే చెప్పబడింది. అల్లే ఎదుట కూడ "**సర్వకర్మాణి మనసా**" (మనస్సుచేత సర్వకర్మలను త్యజించి) ఇత్యాదికంచేత సర్వకర్మసంన్యాసం (విద్వాంసునికి) చెప్పనున్నాడు.

భాష్యమ్

నను '**మనసా**' ఇతి వచనాత్ న వాచికానాం కాయికానాం చ సంన్యాసః ఇతి చేత్, న "**సర్వకర్మాణి**" ఇతి విశేషితత్వాత్. మానసానామేవ సర్వకర్మణామ్

ఇతి చేత్, న; మనోవ్యాపారపూర్వకత్వాత్ వాక్కాయవ్యాపారాణాం మనోవ్యాపారాభావే తదనుపపత్తేః. శాస్త్రీయాణాం వాక్కాయకర్మణాం కారణాని మానసాని వర్జయిత్వా అన్యాని సర్వకర్మాణి మనసా సంన్యసేత్ ఇతి చేత్, న. **"నైవ కుర్వన్న కారయన్"** ఇతి విశేషణాత్. సర్వకర్మ సంన్యాసః అయం భగవతా ఉక్తః మరిష్యతః, న జీవతః ఇతి చేత్–న. **"నవద్వారే పురే దేహీ ఆస్తే"** ఇతి విశేషణానుపపత్తేః. న హి సర్వకర్మ సంన్యాసేన మృతస్య తద్దేహే ఆసనం సంభవతి అకుర్వతః అకారయతశ్చ.

బాలానందిని

నన్వితి :- (ప్రశ్న) 'మనసా' అనడంచేత (సర్వకర్మలను మనస్సుచేత త్యజించి అని అనడంచేత) వాక్కుచేత, శరీరంచేత చేసే కర్మల సంన్యాసం చెప్పబడలేదు – అన్నట్లుయితే (సమాధానం) అది యుక్తం కాదు. "అన్ని కర్మలనూ' అని విశేషించి చెప్పబడింది కదా? (ప్రశ్న) సర్మకర్మలు అని అన్నా కూడ మానసికములైన కర్మ లన్నీ అని అర్థం చెప్పవచ్చు కదా? (సమాధానం) వాక్కుతో చేసే పనులు, శరీరంతో చేసే పనులూ కూడ మనోవ్యాపార పూర్వకంగానే ఉంటాయి గాన (ముందుగా ఒక పనిని గూర్చి మనస్సుతో ఆలోచించి దానినే మాటలలో చెప్పడం గాని, చేతలలో చూపడం గాని ఉంటుంది గాన) మనోవ్యాపారం లేకపోతే వాచిక – కాయిక కర్మలు కూడ కుదరవు కదా? (ప్రశ్న) శాస్త్రోక్తములైన వాచిక – కాయిక కర్మలకు కారణమైన మానసకర్మలను మినహాయించి మిగిలిన అన్ని కర్మలను మనస్సుచేత సంన్యసించాలి అని అర్థం చెప్పవచ్చు కదా అంటే (సమాధానం) అది కాదు, "నైవ కుర్వన్ న కారయన్" (ఏమీ చేయకుండా, ఏమీ చేయించకుండా) అని విశేషించి చెప్పబడింది కదా? (ప్రశ్న) భగవంతుడు చెప్పిన ఈ సర్వకర్మసంన్యాసం మరణించబోయే వానికే కాని జీవించి ఉన్నవానికి కాదు అని అంటే (సమాధానం) అది కాదు అలా చెపితే "సంన్యసించి) శారీరుడు తొమ్మిది ద్వారాలు గల పట్టణంలో (శరీరంలో) ఉంటాడు" అని విశేషించి చెప్పినది కుదరదు. సర్వకర్మ సంన్యాసం చేసి వెంటనే మరణించినవాడు ఏమీ చేయకుండా, చేయించకుండా ఆదే హంలోనే ఉండడం సంభవం కాదు కదా?

భాష్యమ్

దేహే సంన్యస్య ఇతి సంబన్ధః, న దేహే ఆస్తే ఇతి చేత్, న సర్వత్ర ఆత్మనః అవిక్రియత్వావధారణాత్. ఆసనక్రియాయాశ్చ అధికరణాపేక్షత్వాత్, తదనపేక్షత్వాచ్చ సంన్యాసస్య. సంపూర్వః తు న్యాసశబ్దః త్యాగార్థః, న. నిక్షేపార్థః. తస్మాత్ గీతాశాస్త్రే ఆత్మ జ్ఞానవతః సంన్యాసే ఏవ అధికారః న కర్మణి ఇతి తత్ర తత్ర ఉపరిష్టాత్ ఆత్మజ్ఞానప్రకరణే దర్శయిష్యామః.

బాలానందిని

దేహే ఇతి :- 'దేహంలో సంన్యసించి' అనే అన్వయం కాని "దేహంలో ఉంటాడు" అని కాదు అన్నట్లయితే - అది యుక్తం కాదు. ఆత్మ అవిక్రియ మని అంతటా (శ్రుతి - స్మృతులన్నింటిలోను) నిర్ధారణ చేయబడింది కదా? ఉండుట అనే క్రియకు అధికరణం (ఆధారం) యొక్క అపేక్ష ఉంటుంది కాని సంన్యాసానికి అధికరణాపేక్ష ఉండదు (ఉంటాడు అంటే 'దేనియందు ఉంటాడు' అనే ప్రశ్న కలుగుతుంది కాని 'సంన్యసించి' అనగా 'దేని యందు సంన్యసించి' అనే ప్రశ్న ఉదయించదు గాన 'శరీరంలో సంన్యసించి' అని చెప్పడం యుక్తం కాదు అని అర్థం). 'సమ్' అనే ఉపసర్గను ముందు చేర్చిన న్యాస శబ్దానికి విడిచిపెట్టడం అని అర్థం కాని ఉంచడం అని కాదు. అందువల్ల గీతాశాస్త్రం ప్రకారం ఆత్మజ్ఞానం కలవానికి సంన్యాసమునందే అధికారం కాని కర్మయందు అధికారం లేదు అని ముందు ముందు ఆత్మజ్ఞానాన్ని గూర్చి చెప్పే ప్రకరణంలో అక్కడక్కడ చూపించగలం.

భా.అ.ప్ర. :- ఇక్కడ శ్రీరామానుజాచార్యులు - "ఆ పురుషుడు దేవ మనుష్య - తిర్యక్ - స్థావరశరీరాలలో ఉన్న ఆత్మలలో ఏ ఆత్మనైనా ఎలా చంపిస్తాడు; ఎలా చంపుతాడు" అని వ్రాశారు. ఇది అయుక్తం. **"అవినాశి తు తద్విద్ధి యేన సర్వమిదం తతమ్"**, **"య ఏనం వేత్తి హన్తారమ్"** **"అజో నిత్యః శాశ్వతోఽయం పురాణః"** **"వేదావినాశినం నిత్యం య ఏనమజమవ్యయమ్"**, **"అన్తవన్త ఇమే దేహా నిత్యస్యోక్తాః శరీరిణః"** **"నవాని దేహీ"** **"నైనం ఛిన్దన్తి శస్త్రాణి"**, **"అచ్ఛేద్యోఽయమ్"** **"అవ్యక్తోఽయమ్,"** **"ఆశ్చర్యవత్ పశ్యతి కశ్చిదేనమ్"** "ఇత్యాదులలో అంతటా కూడ ఆత్మ ఒక్కటిగానే నిర్దేశించబడుచున్నది. ఆత్మలు అనేకములైతే అప్పుడవి పరచ్ఛిన్నములు గాన ఘటాదుల వలె అనిత్యములు కావలసి ఉంటుంది. ఆత్మలు అవయవరహితాలు గాన పరమాణవుల పుంజాల (ప్రోగులు) వలె ఆత్మల సమూహం కూడ అనిత్యం కాదు అనడానికి వీలు లేదు. నిరవయవాలైన పరామాణవులు ప్రోగునే అంగీకరించడం కుదరదు. అవయవాలు లేని పరమాణువులు ఒక ప్రోగుగా ఏర్పడవు కదా? అవయవా లున్న అనేకవస్తువులు కలిస్తేనే కదా ప్రోగు ఏర్పడుతుంది. అవయవా లున్న వస్తువే పెరుగుతుంది. కాని అవయవాలు లేనిది పెరగదు అని నువ్వే వెనుక అన్నావు కదా? పుంజం కాక పోతే కాకపోనీ; నిరవయవా లైన పరమాణువులు ఏ విధంగా నిత్యాలుగా ఉన్నాయో అదే విధంగా ఆత్మలు ఉంటాయి అని అనడం కూడ కుదరదు. అవయవాలు లేని పరమాణువులు ఉంటా యని చెప్పడానికే ప్రమాణం ఏదీ లేదు. పరమాణుకారణవాదం శారీరకమీమాంసలో నిరాకరించబడింది. నిరవయవ మైన పరమాణువు వంటిదైన ఆత్మకు సర్వవస్తువులతో సంయోగం ఉండదు గాన అది అన్నింటినీ ప్రకాశింపచేయజాలదు. కాని **"తస్య భాసా సర్వమిదం విభాతి"** అను శ్రుతి ఆత్మ సర్వాన్ని ప్రకాశింపచేస్తుంది అని చెపుతున్నది. అక్కడ ఆత్మ అనగా

ఈశ్వరుడు అని అంగీకరించినా కూడ ఈశ్వరుడు జీవునికంటె కూడ సూక్ష్మం అవడం చేత సర్వావభాసకత్వం ఈశ్వరునికి అసలే కుదరదు.

అట్లే - "దేవమనుష్యతిర్యక్స్థావరశరీరావస్థితాత్మసు" అని అంటూ మూలంలో లేని పదపరంపరను (దీర్ఘసమాసాన్ని) కల్పించడానికి కూడ ప్రమాణం ఏదీ లేదు. "ఎవడైతే ఆత్మ నిత్య మని ఎరుగునో వాడు ఆత్మను ఎలా చంపుతాడు?" అని అన్నప్పుడు ఆత్మ అనిత్యం అని తెలుసుకొన్నవాడు మాత్రం ఆత్మను చంపుతాడు అనే అర్థం వస్తుంది. అది అనిష్టం. తెలిసినా తెలియకపోయినా ఆత్మ నిత్యమే కదా? తెలుసుకొన్నంతమాత్రంచేత అంతకు ముందు లేని నిత్యత్వం ఆత్మకు రాదు కదా? అందుచేత "యః వేద సః" (ఎవడైతే ఎరుగునో వాడు) అనేది విపరీతార్థాన్ని ఇస్తూన్నది. మూలకర్త అభిప్రాయం అయితే అప్పుడు అతడు "కః కథం నిత్యమ్ ఆత్మానం హన్తి, కం ఘాతయతి' అని ఉండేవాడు.

మరొక విషయ మేమనగా - 'కమ్' అనేది కూడ వ్యర్థమే. జ్ఞానైకస్వరూపత్వం మొదలైనవాటిచేత (కేవలజ్ఞానస్వరూపం అవడం ఇత్యాదులచేత) ఆత్మ ఏకరూపమే అని నువ్వు కూడా అంగీకరిస్తూన్నప్పుడు దేనిని చంపుతాడు అనే ప్రశ్నకు అర్థం లేదు కదా? మరొక విషయం - ఆత్మనిత్యత్వాన్ని తెలిసినవాడు నిత్యాత్మహననం ఎలా చేస్తాడు అని ఆక్షేపించడంచేత అనిత్యమైన అనాత్మను చంపడంలో ఆక్షేపం లేదు అని అర్థం అవుతుంది. నిత్యాత్మను చంపడం తప్ప మరి ఏ ఇతరక్రియ కైనా ఆశ్రయం కావచ్చును అని కూడ అర్థం వస్తుంది. ఈ ఉభయమూ అనిష్టమే. ఎందువల్ల ననగా - విద్వాంసులకు అవిద్వాంసులకు కూడ సమానంగా వర్తించే విధంగా - "మా హింస్యాత్సర్వా భూతాని" అను శ్రుతి హింసను నిషేధిస్తూన్నది. అయితే పైన చెప్పిన విధంగా ఆత్మజ్ఞుడైన విద్వాంసుడు హింస చేయవచ్చు నని ప్రాప్తిస్తుంది. పశ్వాదిహింస చేసినా కూడ ఆత్మ హింసించబడడం, లేదు, మరే మనగా అనాత్మయైన దేహమే హింసించబడుతుంది. ఆ విధంగా అనాత్మను విద్వాంసుడు హింసించినా దోషం లేదు కదా? మరొకవిషయ మేమనగా - ఆత్మ నిత్యం అని తెలుసుకొన్న విద్వాంసుడు చంపడు, చంపించడు. అయితే స్తుతిస్తాడు, నిందిస్తాడు, తిరస్కరిస్తాడు అని అంటే, అనగా హనన - ఘాతనాదులు తప్ప మిగిలిన పనులు చేస్తాడు అని అంటే, అప్పుడు అతడు చేసే ఆత్మదూషణాదికం నరకహేతువు అవుతుంది. అందుచేత - ఆత్మవేత్తకు ఏ కర్మలయందు కూడ అధికారం అసంభవం అనే విషయమే ఈ శ్లోకం చేత చెప్పబడుచున్నది అని అంగీకరించడమే దోషరహితం (భా.అ.ప్ర.పే. 60) 21.

భాష్యమ్

తత్ర ఆత్మనః అనాశిత్వం ప్రతిజ్ఞాతమ్. తత్కిమివ ఉత్యుచ్యతే -

మూ. వాసాంసి జీర్ణాని యథా విహాయ
నవాని గృహ్ణాతి నరోఽపరాణి,
తథా శరీరాణి విహాయ జీర్ణా
న్యన్యాని సంయాతి నవాని దేహీ. 22

బాలానందిని

తత్రేతి :- ఆత్మ నాశనం లేని దని చెప్పబడింది. అది దేని వలె అనే విషయం చెప్పబడుచున్నది.

ప్ర.అ. వాసాంసీతి :- జీర్ణాని = చినిగిపోయిన, వాసాంసి = వస్త్రాలను, విహాయ = విడచి, నరః = మానవుడు, అపరాణి = ఇతరములైన, నవాని = నూతనవస్త్రములను, యథా = ఎట్లు, గృహ్ణాతి = గ్రహిస్తాడో, తథా = అట్లే, దేహీ = జీవుడు, జీర్ణాని = జీర్ణములైన (దుర్బలములై పోయిన), శరీరాణి = శరీరాలను, విహాయ = విడచి, అన్యాని = ఇతరము లైన, నవాని = క్రొత్త శరీరాలను, సంయాతి = పొందును.

భాష్యమ్

వాసాంసీతి :- వాసాంసి వస్త్రాణి, జీర్ణాని దుర్బలతాం గతాని, యథా లోకే, విహాయ పరిత్యజ్య, నవాని అభినవాని, గృహ్ణాతి ఉపాదత్తే, నరః పురుషః, అపరాణి, అన్యాని, తథా తద్వదేవ శరీరాణి విహాయ జీర్ణాని అన్యాని సంయాతి సంగచ్ఛతి నవాని, దేహీ ఆత్మా, పురుషవత్ అవిక్రియః ఏవ ఇత్యర్థః. 22

బాలానందిని

వాసాంసీతి :- వస్త్రాలను, దుర్బలత్వం పొందినవాటిని, ఏ విధంగా లోకంలో పరిత్యజించి ఇతరములైన క్రొత్తవాటిని పురుషుడు గ్రహిస్తాడో అట్లే, దేహీ = ఆత్మ, జీర్ణములైన శరీరాలను విడచి, వస్త్రములను పరిత్యజించిన పురుషుడు ఏ విధంగా ఎట్టి వికారాలు లేకుండా ఉంటాడో అట్లే ఉంటూ, ఇతరములైన క్రొత్త శరీరాలను చేరుతాడు. 22

భాష్యమ్

కస్మాత్ అవిక్రియః ఏవ ఇతి? ఆహ –

మూ. నైనం ఛిన్దన్తి శస్త్రాణి నైనం దహతి పావకః,
న చైనం క్లేదయన్త్యాపః న శోషయతి మారుతః. 23

బాలానందిని

కస్మాదితి :- పురుషుడు వికారాలు లేకుండానే ఎందుకు ఉంటాడు అనగా చెప్పుచున్నాడు.

ప్ర.అ. నైనమితి :- శస్త్రాణి = ఆయుధాలు, ఏనమ్ = ఈ ఆత్మను, న ఛిన్దన్తి = ఛేదించవు. పావకః = అగ్ని, ఏనమ్ = దీనిని, న దహతి = కాల్చదు, ఆపః చ = నీళ్ళు, ఏనమ్ = దీనిని, న క్లేదయన్తి = తడపవు, మారుతః = వాయువు, న శోషయతి = ఎండేటట్లు చేయదు.

భాష్యమ్

నైనం ఛిన్దన్తీతి :- ఏనం ప్రకృతం దేహినం న ఛిన్దన్తి శస్త్రాణి నిరవయవత్వాత్ న అవయవవిభాగం కుర్వన్తి శస్త్రాణి అస్యాదీని. తథా న ఏనం దహతి పావకః అగ్నిః అపి న భస్మీకరోతి. తథా న ఏనం క్లేదయన్తి ఆపః. అపాం హి సావయవస్య ఆర్ద్రీభావకరణేన అవయవవిశ్లేషాపాదనే సామర్థ్యం, తత్ న నిరవయవే ఆత్మని సంభవతి. తథా స్నేహవత్ ద్రవ్యం స్నేహశోషణేన నాశయతి వాయుః. ఏనం తు ఆత్మానం న శోషయతి మారుతః అపి. 23

బాలానందిని

'నైనమితి' :- ప్రకృతమైన (ఏ ఆత్మను గూర్చి కూటలాడుచున్నామో అట్టి) ఈ ఆత్మను ఆయుధాలు ఛేదించవు. దీనికి అవయవాలు లేవు గాన కత్తి మొదలైన ఆయుధాలు దీని అవయవాలను విడదీయ జాలవు. అట్లే అగ్ని కూడ దీనిని భస్మం చేయజాలదు. అట్లే నీళ్లు దీనిని తడికలదానినిగా చేయజాలవు. అవయవా లున్న వస్తువులను తడిపి వాటి అవయవాలను విడిపోయే టట్లు చేసే సామర్థ్యం నీళ్లకు ఉంటుంది. అవయవాలు లేని ఆత్మను అలా చేయడం సంభవించదు. అట్లే గాలి చము రున్న వస్తువులోని చమురును ఎండింపచేసి ఆ వస్తువును నశింపచేస్తుంది. అలాంటి వాయువు కూడ ఈ ఆత్మను శుష్కింపచేయజాలదు. 23

భాష్యమ్

యతః ఏవం తస్మాత్ -

మూ. అచ్ఛేద్యోఽయమదాహ్యోఽయమక్లేద్యోఽశోష్య ఏవ చ,
నిత్యః సర్వగతః స్థాణురచలోఽయం సనాతనః. 24

బాలానందిని

యతః ఇతి. ఇతి ఇలా ఉండడంవల్ల -

ప్ర.అ. అచ్ఛేద్యః ఇతి :- అయమ్ = ఈ ఆత్మ, అచ్ఛేద్యః = ఛేదించడానికి శక్యం కానిది. అయమ్ = ఇది, అదాహ్యః = కాల్చడానికి శక్యం కానిది. అక్లేద్యః = తడపడానికి శక్యం కానిది. అశోష్యః ఏ వ చ = ఎండింపచేయడానికి కూడ శక్యం కానిది. అయమ్= ఈ ఆత్మ, నిత్యః = నిత్యమైనది. సర్వగతః = అంతటా వ్యాపించి ఉన్నది. స్థాణుః = స్థిర మైనది. అచలః = కదలనిది, సనాతనః = ప్రాచీన మైనది.

భాష్యమ్

అచ్ఛేద్యోఽయమితి :- యస్మాత్ అన్యోన్యనాశహేతూని భూతాని ఏనమ్ ఆత్మానం నాశయితుం న ఉత్సహన్తే తస్మాత్, నిత్యః, నిత్యత్వాత్ సర్వగతః, సర్వగతత్వాత్ స్థాణుః, స్థాణుః ఇవ స్థిరః, ఇత్యేతత్. స్థిరత్వాత్ అచలః అయమ్ ఆత్మా, అతః సనాతనః చిరంతనః, న కారణాత్ కుతశ్చిత్ నిష్పన్నః. అభినవః ఇత్యర్థః. నైతేషాం శ్లోకానాం పౌనరుక్త్యం చోదనీయమ్-యత ఏకేనైవ శ్లోకేన ఆత్మనః నిత్యత్వమ్ అవిక్రియత్వం చ ఉక్తమ్ - "న జాయతే మ్రియతే వా" ఇత్యాదినా; తత్ర యదేవ ఆత్మవిషయం కించిత్ ఉచ్యతే తత్ ఏతస్మాత్ శ్లోకార్థాత్ న అతిరిచ్యతే. కించిత్ శబ్దతః పునరుక్తం, కించిత్ అర్థతః ఇతి. దుర్బోధత్వాత్ ఆత్మవస్తునః పునః పునః ప్రసంగమ్ ఆపాద్య శబ్దాన్తరేణ తదేవ వస్తు నిరూపయతి భగవాన్ వాసుదేవః కథం ను నామ సంసారిణామ్ అవ్యక్తం తత్త్వం బుద్ధిగోచరతామ్ ఆపన్నం సత్ సంసారనివృత్తయే స్యాదితి. 24

బాలానందిని

అచ్ఛేద్య ఇతి :- పరస్పరము నశింపచేసుకొనడానికి హేతువు లైన భూతాలు (పంచమహాభూతాలు) ఈ ఆత్మను నశింపచేయడానికి సమర్థములు కావు గాన ఈ ఆత్మ నిత్య మైనది. నిత్యం అవడంచేత అంతటా వ్యాపించి ఉండేది (సర్వవ్యాపక మైనది మాత్రమే నిత్యంగా ఉండగలదు అని భావం). సర్వగతం అవడంచేత స్థాణువు. శిలవలె స్థిర మైనది అని అర్థం. స్థిరం అవడంవల్ల అచలం, కదలనిది. అందుచేతనే సనాతనం, చాలా కాలంనుంచి ఉన్నది, ఏదో ఒక కారణంనుంచి పుట్టిన క్రొత్త వస్తువు కాదు అని అర్థం. (ఆశంక) "న జాయతే మ్రియతే వా" ఇత్యాదికమైన ఒక్క శ్లోకంలోనే ఆత్మ నిత్యం, వికారములు లేనిది అని చెప్పబడింది. ఇంక ఆత్మను గూర్చి తరువాత చెప్పిన దంతా ఆ శ్లోకంలో చెప్పినదానికంటె అధికం ఏదీ లేదు.ఒక విషయం శబ్దతః పునరుక్తం అయితే

(చెప్పిన విషయమే అదే శబ్దం చేత మళ్లీ చెప్పబడితే) మరొకటి అర్థతః పునరుక్తం (చెప్పిన విషయమే మరొక శబ్దాన్ని ప్రయోగించి చెప్పబడింది). అందుచేత ఈ శ్లోకాలలో పౌనరుక్త్యం (చెప్పినదే చెప్పడం అనే దోషం) ఉంది అని ఆశంకించకూడదు. (సమాధానం) ఆత్మస్వరూపం తెలుసుకొనడానికి చాలా కష్ట మైనది. అందుచేత మాటిమాటికి ఏదో ఒక ప్రసంగం కల్పించి భగవంతు డైన వాసుదేవుడు, ఆ ఆత్మవస్తువునే వేరు వేరు మాటలలో ప్రతి పాదిస్తున్నాడు. ఈ అవ్యక్తమైన ఆత్మతత్త్వం సంసారులకు స్పష్టంగా తెలిసి వాళ్లకు సంసారనివృత్తిని ఎలా కలిగిస్తుందా అనేదే భగవంతుని ఆలోచన. 24

భాష్యమ్

కిం చ

మూ. అవ్యక్తోఽయమచిన్త్యోఽయమవికార్యోఽయముచ్యతే,
తస్మాదేవం విదిత్వైనం నానుశోచితుమర్హసి. 25

బాలానందిని

కిం చేతి :- ఇంకా ఏమనగా

ప్ర.అ. అవ్యక్త ఇతి :- అయమ్ = ఈ ఆత్మ, అవ్యక్తః = వ్యక్తం కానిది, అచిన్త్యః = ఊహింప శక్యం కానిది. అయమ్ = ఇది, అవికార్యః = వికారం పొందింపశక్యం కానిది అని, ఉచ్యతే = చెప్పబడుచున్నది. తస్మాత్ = ఆ కారణంవల్ల, ఏనమ్ = దీనిని గూర్చి, ఏవమ్ = ఈ విధంగా, విదిత్వా = తెలిసికొని, అనుశోచితుమ్ = దుఃఖించుటకు, న అర్హసి = తగవు.

భాష్యమ్

అవ్యక్తోఽయమితి :- అవ్యక్తః సర్వకరణావిషయత్వాత్ న వ్యజ్యతే ఇతి అవ్యక్తః అయమ్ ఆత్మా. అత ఏవ అచిన్త్యః అయమ్; యత్ హి ఇన్ద్రియగోచరం వస్తు తత్ చిన్తావిషయత్వమ్ ఆపద్యతే. అయం తు ఆత్మా అనిన్ద్రియగోచరత్వాత్. అచిన్త్యః. అవికార్యః అయమ్. యథా క్షీరం దధ్యాతఞ్చనాదినా వికారి న తథా అయమ్ ఆత్మా. నిరవయవత్వాత్ చ అవిక్రియః. న హి నిరవయం కించిత్ విక్రియాత్మకం దృష్టమ్. అవిక్రియత్వాత్ అవికార్యః అయమ్ ఆత్మా ఉచ్యతే. తస్మాత్, ఏవం యథోక్తప్రకారేణ ఏనమ్ ఆత్మానం విదిత్వా త్వం న అనుశోచితుమ్ అర్హసి - "హన్తా అహమ్ ఏషామ్", "మయా ఇమే హన్యన్తే" ఇతి. 24

బాలానందిని

అవ్యక్తోఽ యమితి :- ఈ ఆత్మ ఏ ఇంద్రియానికీ కూడ గోచరం కాదు, అందుచేత (ఇంద్రియాదులచేత) తెలుపబడదు గాన అవ్యక్తం. అందువల్లనే ఇది అచింత్యం. ఇంద్రియానికి గోచర మైన వస్తువును గూర్చి ఆలోచించడానికి వీలుంటుంది. ఈ ఆత్మయైతే ఇంద్రియగోచరం కాదు. అందువల్ల అచింత్యం. ఇది అవికార్యం. పెరుగు తోడుపెట్టడం మొదలైనవాటిచేత పాలు ఏ విధంగా వికారం (పరిణామం, మార్పు) చెందుతుందో ఈ ఆత్మ అలాంటిది కాదు. అవయవాలు లేకపోవడంచేత దీనికి వికారం కలగదు. అవయవాలు లేని ఏ వస్తువూ కూడ వికారం చెందుతున్నట్లు కనబడడం లేదు కదా? ఈ విధంగా ఈ ఆత్మ అవిక్రియం అవడంచేత అవికార్యం (వికారం పొందింప శక్యం కాదు) అని చెప్పబడుచున్నది. అందువల్ల ఈ ఆత్మను గూర్చి పైన చెప్పిన విధంగా తెలుసుకొని "నేను వీళ్లను చంపుతున్నాను" "నాచేత వీళ్లు చంపబడుచున్నారు" అని నువ్వు దుఃఖించుటకు తగవు (దుఃఖించకుము). 25

భాష్యమ్

ఆత్మనః అనిత్యత్వమ్ అభ్యుపగమ్య ఇదమ్ ఉచ్యతే -

మూ. అథ చైనం నిత్యజాతం నిత్యం వా మన్యసే మృతమ్,
తథాపి త్వం మహాబాహో నైవం శోచతుమర్హసి. 26

బాలానందిని

ఆత్మనః ఇతి:- ఆత్మకు అనిత్యత్వాన్ని అంగీకరించి ఇది చెప్పబడుచున్నది -

ప్ర.అ. ఏనమ్ = ఈ ఆత్మను, నిత్యజాతమ్ = నిత్యమూ పుట్టుచున్నదానినిగానూ, నిత్యమ్ = ఎల్లప్పుడు, మృతం వా = మరణించేదానినిగాను, త్వమ్ = నీవు, మన్యసే అథ చ = తలుస్తున్నా కూడ, మహాబాహో = గొప్ప బాహువులు గల ఓ అర్జునా! ఏవమ్ = ఈ విధంగా, శోచితుమ్ = దుఃఖించడానికి, న అర్హసి = తగవు.

భాష్యమ్

అథ చైనమితి :- 'అథ చ ఇతి అభ్యుపగమార్థః. ఏనం ప్రకృతమ్ ఆత్మానం, నిత్యజాతం, లోకప్రసిద్ధ్యా ప్రత్యనేకశరీరోత్పత్తిం జాతః జాతః ఇతి మన్యసే, తథా ప్రతితద్వినాశం నిత్యం వా మన్యసే మృతం, మృతః మృతః ఇతి, తథాపి తథాభావిన్యపి ఆత్మని త్వం మహాభాహో న ఏవం శోచితుమ్ అర్హసి. జన్మవతః జన్మ నాశవతః నాశశ్చ ఇత్యేతౌ అవశ్యం భావినౌ ఇతి.

బాలానందిని

అథేతి :- "అథ చ" అనేది అంగీకారం అనే అర్థం గలది. ("మాటవరసకి ఈ వాదాన్ని అంగీకరించినా కూడ" అనే అర్థాన్ని బోధిస్తుంది). ప్రకృతమైన ఆత్మను గూర్చి (దేవదత్తుడు పుట్టాడు, దేవదత్తుడు మరణించాడు ఇత్యాది) లోకప్రసిద్ధిని అనుసరించి అనేకమైన శరీరాలలో ఒక్కొక్క శరీరంయొక్క పుట్టుకను బట్టి (ఆత్మ) పుట్టినది, పుట్టినది అని నువ్వు అనుకున్నా, అట్లే శరీరాలు నశించినపు డల్లా నశించినది, నశించినది అని అనుకున్నా కూడ, తథాపి = ఆత్మ అలాంటిదే (జనన మరణలాలు కలదే) అయినా కూడ, ఓ! మహాబాహూ! నువ్వు ఈ విధంగా దుఃఖించకూడదు. జన్మకలది జన్మిస్తూనే ఉంటుది, నశించేది నశిస్తూనే ఉంటుంది; ఈ జన్మనాశాలు తప్పక జరుగుతాయి. అందుచేత దుః ఖించకూడదు.

వి. ఇక్కడ భాష్యంలోని 'నిత్యజాతం' తరవాత **"లోకప్రసిద్ధ్యా కృద్ధో జాతః తృప్తో జాతః, హృష్టో జాతః ఇత్యన్తఃకరణవిక్రియాభేదమను విక్రియతే ఇతి మన్యసే, తథా తత్ప్రత్యయవినాశమను వినశ్యతీతి"** అను వాక్యాలు రామరాయకవిగారి వ్యాఖ్యతో కూడిన పుస్తకంలో అధికంగా ఉన్నాయి. కాని వాటికి ఈ ఘట్టంలో సమన్వయం సరిగా కుదరడం లేదు. ఈ వాక్యాలు ఆనందగిరి వ్యాఖ్యాదులతో కూడిన ఇతరప్రతులలో లేవు.

భా.అ.ప్ర. :- ఇక్కడ శ్రీరామానుజాచార్యులు నిత్యము జనించే నిత్యమూ మరణించే దేహమునే ఈ ఆత్మనుగా నీవు భావిస్తే" అని అర్థం వ్రాశారు. అది అయుక్తం. మూలంలో దేహపదం లేదు. ఆస్తికు డైన అర్జునుడు నాస్తికులైన బౌద్ధాదులవలె దేహమే ఆత్మ అని అనుకొనడు కదా? మరేమనగా – దేహంకంటె భిన్నమైన ఆత్మ ఉంది; అయితే అది జన్మ మొదలైన వికారాలు లేనిది కాదు; ఎందువల్లననగా అది దేహంతో పుడుతున్నది, దేహంతో పాటు నశిస్తున్నది అని మాత్రమే అర్జునుని అభిప్రాయం. పుత్రుడు పుట్టాడు, పుత్రుడు మరణించాడు అని లోకవ్యవహారం ఉంది కదా? మరణించిన పుత్రదేహం కనబడుతున్నా పుత్రుడు నశించాడు అని పిత్రాదులు దుఃఖిస్తారు కదా? అందువల్ల అర్జునుడు కూడ దేహమే ఆత్మ అని అనుకొనడు; మరేమనగా దేహానికి వలె ఆత్మకు కూడ జన్మనాశాలు ఉంటాయి అని అనుకొంటాడు. అందుచేత శ్రీరామానుజభాష్యం అయుక్తం.

భాష్యమ్

తథా చ సతి

మూ. **జాతస్య హి ధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్య చ,**
తస్మాదపరిహార్యేఽర్థే న త్వం శోచితుమర్హసి.

బాలానందిని

తథేతి :- ఇది ఇలా ఉండగా

ప్ర.అ. జాతస్యేతి :- జాతస్య = పుట్టినవానికి, మృత్యుః = మృత్యువు, ధ్రువః హి = తప్పనిది కదా? మృతస్య = మరణించినవానికి, జన్మ చ = పుట్టుక కూడ, ధ్రువమ్ = తప్పనిది, తస్మాత్ = ఆ కారణంవలన, అపరిహార్యే = తప్పించుకొనడానికి శక్యం కాని, అర్థే = విషయంలో, త్వమ్ = నువ్వు, శోచితుమ్ = దుఃఖించుటకు, న అర్హసి = తగవు.

భాష్యమ్

జాతస్యేతి :- జాతస్య = లబ్ధజన్మనః, ధ్రువః = అవ్యభిచారీ, మృత్యుః మరణమ్. ధ్రువం జన్మ మృతస్య చ. అపరిహార్యః అయం జన్మమరణలక్షణః అర్థః, యస్మాత్ తస్మాత్ అపరిహార్యే అర్థే న త్వం శోచితుమ్ అర్హసి. (జన్మవతః నాశః, నాశవతః జన్మ ఇతి చ స్వాభావికః చేత్ అపరిహార్యార్థః తస్మిన్ అపరిహార్యే అర్థే న త్వం శోచితుమ్ అర్హసి). (బ్రాకెట్లలోని పాఠం కొన్ని ప్రతులలో అధికంగా ఉన్నది.)

బాలానందిని

జాతస్యేతి :- జాతస్య = పొందబడిన జన్మ కలవానికి (పుట్టినవానికి) ధ్రువః = తప్పనిసరి యైనది, మృత్యుః = మరణము, మరణించినవానికి జన్మకూడ ధ్రువమే. అందువల్ల జన్మ - మరణరూప మైన ఈ విషయంలో నువ్వు దుఃఖించకూడదు. (పుట్టుక కలవానికి నాశము, నాశము కలవానికి జన్మ ఇవి స్వాభావికములే అయితే అపరిహార్య మైన ఆ విషయంలో నీవు శోకించకూడదు)

భా. అ.ప్ర. నశించినదానికి ఉత్పత్తి ఎలా ఉపపన్నం అవుతుంది అని ఆక్షేపించుకొని శ్రీరామానుజాచార్యులు ఇక్కడ సత్కార్యవాదాన్ని ప్రవేశపెట్టారు. ఆ విషయంలో విచారణ చేయుబడుచున్నది - సత్ అయిన మృత్ అనే ద్రవ్యమే ఘటాదుల రూపాలలో వికారం పొందుతూన్నది. ఘటాదుల ఉత్పత్తివినాశాదులు మట్టి అనే ద్రవ్యంయొక్క అవస్థావిశేషాలు మాత్రమే అనే వీళ్ల ఘోష అవిచారితరమణీయం (ఆలోచించనంతవరకు అందంగానే ఉంటుంది). అదెట్లనగా ఏది వికారం చెందుతుందో అది సత్ కాదు; ఉదాహరణకు ఘటాదులు. ఏది వికారం లేనిదో అది సత్, ఉదాహరణకు ఘటాదులకంటె భిన్నమైన ఆత్మ. ఈ నియమం ఉండగా వికారం చెందే మృద్ద్రవ్యం సత్ ఎలా అవుతుంది. "**నాసతో విద్యతే భావః నాభావో విద్యతే సతః**" అని చెప్పినట్లు కాలత్రయంలోను లేకపోవడమే అసత్త్వానికి లక్షణం. మృద్ద్రవ్యం మహాభూతాలు పుట్టకముందు, మహాభూతాలు ప్రళయం చెందిన తరువాత కూడ లేదు గాన అది అసత్. "**మృత్తికేత్యేవ సత్యమ్**" అనే శ్రుతికి

ప్రపంచం ఉన్నంతవరకు మాత్రమే మృత్తిక సత్యం అని అభిప్రాయం. మృద్ద్రవ్యం అనిత్యమే అయినా రజ్జుసర్పం వలె అసత్ కాదు, సత్తే అని చెప్పడానికి కూడ అవకాశం లేదు; వినాశస్వభావం కలిగి ఉండడం అసత్త్వం అనీ వినాశస్వభావం లేకపోవడం సత్త్వం అనీ నువ్వే చెప్పావు కదా? నిత్యమైన వస్తువులో అసత్త్వము, అసత్తైన వస్తువులో నిత్యత్వమూ ఎక్కడా కనబడదు కదా? “అవినాశి తు తద్విద్ధి” అని తు శబ్దంచేత ఆత్మకంటె భిన్నమైనది ప్రతీదీ వినాశియే అని ప్రతిపాదించబడింది. మృదాదులు కూడ అవినాశులే అయితే మృదాదులకూ ఆత్మకూ వైలక్షణ్యం (తేడా) ఉంది అని ప్రతిపాదించే ‘తు’ శబ్దాన్ని ప్రయోగించడం కుదరదు. “ఆత్మనః ఆకాశః సంభూతః” అని శ్రుతి ఆకాశాదులు ఆత్మ నుండి పుట్టా యనీ, “పృథివ్యప్సు ప్రలీయతే” ఇత్యాదిశ్రుతి పృథివ్యాదులు తమ తమ కారణాలలో లీనం అవుతాయనీ చెపుతూన్నప్పుడు పృథివ్యాధిభూతాలు సద్ద్రవ్యాలు అని అంగీకరించడం ఎలా కుదురుతుంది? పృథివ్యాదులు సద్ద్రవ్యాలయితే కదా వాటి వికారాలైన ఘటాదులు సత్కార్యాలు అని చెప్పడానికి అవకాశం ఉండేది? అది కాదు ప్రకృతి అనేది సత్; దాని కార్యాలైన పృథివ్యాదులు కూడ సత్‌లే. ఆ పృథివ్యాదుల కార్యా లవడంచేత ఘటాదులు కూడ సత్తులే; ఈ విధంగా పరంపరచేత ఘటాదులకు సత్కార్యత్వం లభిస్తుంది, అనడానికి కూడ వీలు లేదు. ఎందువల్ల ననగా – ఇక్కడ ప్రకృతి అంటే సాంఖ్యులు అంగీకరించిన ప్రధానం. అది శ్రుతిచేత చెప్పబడలేదు అని బ్రహ్మసూత్రాలలో ప్రతిపాదించబడింది. ఇంక ప్రకృతి అంటే మాయయే అని చెప్పాలి. మాయ అనగా ఈశ్వరశక్తి. అగ్నియొక్క దాహకత్వాది శక్తి అగ్నికంటె వేరుగా ఉండ నట్లు ఈ మాయ కూడ ఈశ్వరునికంటె వేరుగా ఉండదు. కార్యాన్ని పట్టి మాత్రమే మాయ అనేది ఒకటి ఉంది. అని తెలుసుకొనవలసి ఉంటుంది. దీని కార్యం ప్రపంచం. అది ప్రలయంలో నశిస్తుంది. మహాభూతప్రలయంలో కూడ ప్రకృతి ఉన్నది అని చెప్పడం ఎలా? లింగం (దానిని ఊహించడానికి సాధనమైన ప్రపంచం) లేదు కదా? “పాదోఽస్య విశ్వా భూతాని త్రిపాదస్యామృతం దివి” (ఈ ప్రపంచం అంతా బ్రహ్మయొక్క ఒక వంతు మాత్రమే, మిగిలిన మూడు పాదాలు ద్యులోకంలో (ప్రపంచానికి అవతల ఉన్నాయి) అనే శ్రుతి ముక్తులచేత పొందదగిన బ్రహ్మలో మాయ గాని, దాని కార్యాలు గాని లేవని చెప్పుచున్నది. అందుచేత ముక్తావస్థలో ప్రకృతి లేదు. అందుచేత ప్రకృతి కూడ సద్ద్రవ్యం కాదు. దీనిచేత – జీవుడు ఈశ్వరుని విడదీయరాని విశేషణం అనే వాదం కూడ నిరాకరించబడి నట్లే. ఆ వాదం అంగీకరించిన పక్షంలో జీవుని సత్త కూడ ఈశ్వరుని సత్త మీదనే ఆధారపడి ఉంటుంది గాన, వానికి స్వతంత్రమైన సత్త లేకపోవడంచేత జీవుడు కూడ అసత్తే అని చెప్పవలసి ఉంటుంది. జీవునికి సత్యత్వాన్ని అంగీకరించిన నీకు అది అనిష్టం కదా? అందువల్ల ఆత్మకంటె భిన్నమైనది అసత్తే, సత్తైన ఆత్మకు వికారా లేవీ లేవు. అందుచేత సత్కార్యవాదం

సిద్ధించదు. మరొక విషయం ఏమనగా - సత్ అయిన ద్రవ్యం మరొక అవస్థను పొందడమే ఉత్పత్తి అనగా, అని అంగీకరించినా కూడ పూర్వంలేని మరొక అవస్థయే క్రొత్తగా పుడుతున్నది గాని ఉన్నది పుట్టడం లేదుగాన నువ్వు కూడ చివరికి అసత్కార్యవాదాన్నే అంగీకరించవలసి ఉంటుంది. మట్టిలో అంతకు ముందు లేని ఘటాద్యాకారమే కర్త, కరణం మొదలైన కారకాల వ్యాపారంచేత క్రొత్తగా పుట్టుచున్నది కదా? కారకాల వ్యాపారానికి ముందు ఘటాద్యాకారం లేకపోవడంచేతనే కారకాదివ్యాపారం అవసరం అవుతుంది. అలా కాకపోతే అది అనావశ్యకం అనే దోషం కలుగుతుంది.

అందుచేత సత్కార్యవాదమూ కాదు, అసత్కార్యవాదమూ కాదు, మిథ్యాకార్యవాదం మాత్రమే దోషరహిత మైనది. ఎందువల్ల ననగా సత్తుకు ఉత్పత్తి మొదలైన వికారాలు కుదరవు. అసత్ శశశృంగం వలె దృశ్యం కాజాలదు. అందుచేత దృశ్యమై వికారం పొందుతూన్న ప్రతీ కార్యమూ కూడ శుక్తికమీద కనబడి, నాశరూపమైన (తరవాత కనబడకుండా పోవడం అనే) వికారాన్ని పొందుతూన్న రజతం వలె మిథ్యయే. (భా. అ.ప్ర.పే. 65,66,) 27.

భాష్యమ్

కార్యకరణసంఘాతాత్మకాన్యపి భూతాని ఉద్దిశ్య శోకః న యుక్తః కర్తుమ్, యతః -

మూ. అవ్యక్తాదీని భూతాని వ్యక్తమధ్యాని భారత,
అవ్యక్తనిధనాన్యేవ తత్ర కా పరిదేవనా. 28

బాలానందిని

కార్యేతి :- కార్యకరణసంఘాతరూపా లైన భూతాలను గూర్చి కూడ (పంచ మహాభూతాలే శరీరము, ఇంద్రియాలు మొదలైనవాటి సముదాయాలుగా ఏర్పడుతున్నాయి; అలాంటి భూతాలను గూర్చి, అనగా శరీరేంద్రియాదులను గూర్చి,కూడ శోకం చేయ కూడదు.ఎందువల్ల ననగా-

ప్ర.అ. అవ్యక్తేతి:- భారత= అర్జునా!భూతాని =పుత్రమిత్రాదిరూపాలలో ఉన్న శరీరేంద్రియాదులు, అవ్యక్తాదీని = కనబడకుండా ఉండడమే ఆదియందు కలవి.(పుట్టక మునుపు కనబడనివి);వ్యక్తమధ్యాని = వ్యక్తమైన (కనబడే)మధ్య కలవి(మధ్యలో కనబడేవి),అవ్యక్తనిధనాన్యేవ = తప్పక కనబడకుండా పోవడం అనే నాశం గలవి.తత్ర =అలాంటి విషయంలో,పరిదేవనా = ఏడ్పు,కా = ఏమిటి?(ఎందుకు?).

భాష్యమ్

అవ్యక్తాదీనితి:- అవ్యక్తాదీని-అవ్యక్తమ్ అదర్శనమ్,అనుపలబ్ధిః ఆదిః యేషాం భూతానాం పుత్రమిత్రాదికార్యకరణసంఘాతాత్మకానాం తాని అవ్యక్తాదీని భూతాని ప్రాక్ ఉత్పత్తేః. ఉత్పన్నాని చ ప్రాక్ మరణాత్ వ్యక్తమధ్యాని.అవ్యక్తనిధనాన్యేవ-పునః అవ్యక్తమ్ అదర్శనం నిధనం మరణం యేషాం తాని అవ్యక్తనిధనాని.మరణాత్ ఊర్ధ్వమ్ అవ్యక్తతామేవ ప్రతిపద్యన్తే ఇత్యర్థః.తథా చోక్తమ్.

"అదర్శనాదాపతితః పునశ్చాదర్శనం గతః,
నాసౌ తవ న తస్య త్వం వృథా కా పరిదేవనా"(మ.భా.స్త్రీప.2-13)ఇతి.

తత్ర కా పరిదేవనా,కో వా ప్రలాపః అదృష్టదృష్టనష్టభ్రాన్తిభూతేషు భూతేషు ఇత్యర్థః. 28

బాలానందిని

అవ్యక్తాదీనీతి:- పుత్ర-మిత్రాపశరీరేంద్రియసముదాయరూపా లైన ఏ భూతాలు అవి పుట్టడానికి ముందు అవ్యక్తాదులో-అనగా అవ్యక్తం,కనబడకపోవడం,తెలియబడక పోవడం ఆదియందు గలవో అట్టి భూతాలు అవ్యక్తాదులు.పుట్టిన ఆ భూతాలే మరణానికి పూర్వం వ్యక్తమధ్యాలు(మధ్యలో కొంత కాలం కనబడతాయి).మళ్లీ అవ్యక్తమే,కనబడక పోవడమే మరణం వేటికో అవి అవ్యక్తనిధనాలు. అనగా మరణం తరవాత కూడ అవి అవ్యక్తములు అవుతాయి. కనబడవు అని అర్థం. ఈ విషయమే "అదర్శనా .. పరిదేవనా" (కనబడని స్థితినుండి హఠాత్తుగా వచ్చాడు, మళ్లీ ఆ కనబడని స్థితికే వెళ్లిపోయాడు; వీడు నీ కేమీ కాడు, వానికి నువ్వేమీ కావు. ఈ వృథావిలాపం ఎందుకు) అని చెప్పబడింది. ఆ విషయంలో ముందు కనబడక, తరవాత కొంతకాలం కనబడి, మళ్లీ కనబడకుండా పోవడంచేత భ్రాంతిరూపమైనవే అయిన ఈ భూతాలను గూర్చి, ఈ ప్రలాపాలు, విలాపాలు ఏమిటి; ఎందుకు? అని అర్థం.

భా.అ.ప్ర :- "మనుష్యాదిభూతాలు సత్తులే అయినా వాటి పూర్వావస్థ ఎవరికీ తెలియదు, మనుష్యత్వం మొదలైన వాటి మధ్యమావస్థ మాత్రం తెలుస్తుంది. తరవాత వాటి ఉత్తరావస్థ కూడ తెలియదు" అని శ్రీరామానుజాచార్యులు ఇక్కడ వ్రాసినది అయుక్తం. జన్మ నాశము మొదలైన వికారాలు గల మనుష్యాది భూతాలు సత్‌లు అని అనడం కుదరదు. వికారా లేవీ లేని వస్తువే సత్ అనగా; అలాంటి సత్త్వం బ్రహ్మకు మాత్రమే ఉంది అని "వేదావినాశినమ్" ఇత్యాది శ్లోకంలో చూపబడింది. వాటి పూర్వావస్థ తెలియదు అనడం కూడ అయుక్తమే, అన్నము, వీర్యము, రక్తమూ మొదలైన వాటి పూర్వావస్థ తెలుస్తూనే

ఉంది కదా? వాటి ఉత్తరావస్థ తెలియదు అని చెప్పడం కూడ అయుక్తమే; భస్మం, మట్టి మొదలైన వాటి ఉత్తరావస్థ కూడ తెలుస్తున్నది కదా? (భా. అ. ప్ర. పే. 67)

భాష్యమ్

దుర్విజ్ఞేయః అయం ప్రకృతః ఆత్మా; కిం త్వామేవ ఏకమ్ ఉపాలభే సాధారణే భ్రాన్తినిమిత్తే? కథం దుర్విజ్ఞేయః అయమ్ ఆత్మా ఇతి ఆహ -

మూ. ఆశ్చర్యవత్పశ్యతి కశ్చిదేన
మాశ్చర్యవద్వదతి తథైవ చాన్యః,
ఆశ్చర్యవచ్చైనమన్యః శృణోతి
శ్రుత్వాప్యేనం వేద న చైవ కశ్చిత్. 29

బాలానందిని

దుర్విజ్ఞేయః ఇతి :- ప్రకృతమైన ఈ ఆత్మ తెలుసుకొనడానికి చాల కష్టమైనది. భ్రాంతికి కారణం అందరికీ సాధారణమే అయినప్పుడు (అందరూ ఆత్మ విషయంలో భ్రాంతి చెందుతూన్నప్పుడు) నిన్ను ఒక్కనినే ఎందుకు నిందించాలి? తప్పు పట్టాలి? ఈ ఆత్మ ఏ విధంగా దుర్విజ్ఞేయమో చెప్పుచున్నాడు -

ప్ర. అ. ఆశ్చర్యవదితి :- కశ్చిత్ = ఒకడు, ఏనమ్ = ఈ ఆత్మను, ఆశ్చర్యవత్ = ఆశ్చర్యమును వలె, పశ్యతి = చూస్తాడు. తథైవ = అట్లే, అన్యః చ = మరి యొక్కడు, ఆశ్చర్యవత్ = ఆశ్చర్యమును వలె, వదతి = చెపుతాడు, అన్యః = మరియొకడు, ఏవమ్ = ఈ ఆత్మను, ఆశ్చర్యవత్ = ఆశ్చర్యమును వలె, శృణోతి = వింటాడు. కశ్చిత్ = ఒకడు, ఏనమ్ = ఈ ఆత్మను గూర్చి, శ్రుత్వాపి = విని కూడ, న చైవ వేద = తెలిసికొననే తెలిసికొనడు.

భాష్యమ్

ఆశ్చర్యవదితి :- ఆశ్చర్యమ్, అదృష్టమ్, అకస్మాత్ దృశ్యమానం తేన తుల్యమ్ ఆశ్చర్యవత్, ఆశ్చర్యమివ ఏనమ్ ఆత్మానం పశ్యతి కశ్చిత్. ఆశ్చర్యవత్ ఏనం వదతి తథైవ చ అన్యః. ఆశ్చర్యవత్ చ ఏనమ్ అన్యః శృణోతి. శృత్వా దృష్ట్వా ఉక్త్వా అపి ఏనం వేద న చ ఏవ కశ్చిత్. అథవా-యః అయమ్ ఆత్మానం పశ్యతి సః ఆశ్చర్యతుల్యః యః వదతి యశ్చ శృణోతి సః అనేకసహస్రేషు ఏకః ఏవ భవతి. అతః దుర్బోధః ఆత్మా ఇత్యభిప్రాయః. 29

బాలానందిని

ఆశ్చర్యవదితి :- ఆశ్చర్యవత్ - ఆశ్చర్యం అనగా పూర్వం ఎన్నడు చూడబడక అకస్మాత్తుగా చూడబడిన అద్భుతము. దానిని వలె ఒకడు ఆత్మను చూస్తాడు. మరొకడు దీనిని ఆశ్చర్యాన్ని గూర్చి వలె మాటలాడతాడు. మరొకడు ఆశ్చర్యాన్నివలె వింటాడు. మరొకడు దీనిని గూర్చి, విన్నా, చూచినా, మాటలాడినా కూడ తెలుసుకొనజాలడు. లేదా - ఎవడైతే ఈ ఆత్మను చూస్తాడో వాడు ఆశ్చర్యంవంటివాడు (చాలా అరుదు.) ఎవడు మాటలాడతాడో, ఎవడు వింటాడో అలాంటివాడు ఎన్నో వేలల్లో ఒకడే ఉంటాడు. (కశ్చిత్ అనగా కొన్నివేల మందిలో ఏ ఒక్కడో అని అర్థం). అందువల్ల ఆత్మ ఎంతో కష్టంమీద కాని తెలియ శక్యం కానిది అని అభిప్రాయం. 29

భాష్యమ్

అథ ఇదానీం ప్రకరణార్థమ్ ఉపసంహరన్ ఆహ -

మూ. దేహీ నిత్యమవధ్యోఽయం దేహే సర్వస్య భారత,
తస్మాత్సర్వాణి భూతాని న త్వం శోచితుమర్హసి. 30.

బాలానందిని

అథేతి :- ఇపుడు ఈ ప్రకరణంలో చెప్పిన అర్థాన్ని ఉపసంహరిస్తూ అంటున్నాడు-

ప్ర.అ. **దేహీతి :-** భారత = అర్జునా! సర్వస్య = అందరియొక్క, దేహే = దేహంలో ఉన్న, అయమ్ = ఈ, దేహీ = ఆత్మ, నిత్యమ్ = నిత్యమూ (ఏనాటికీ), అవధ్యః = చంప శక్యమైనది కాదు, తస్మాత్ = ఆ కారణంవల్ల, త్వమ్ = సర్వాణి భూతాని = అన్ని భూతములను గూర్చి (ఏ భూతాన్నీ గూర్చి కూడ) శోచితుమ్ = దుఃఖించుటకు, న అర్హసి తగవు.

భాష్యమ్

దేహీ ఇతి :- దేహీ శరీరీ, నిత్యం సర్వదా, సర్వావస్థాసు, అవధ్యః నిరవయవత్వాత్ నిత్యత్వాచ్చ. తత్ర అవధ్యః అయం దేహే శరీరే సర్వస్య సర్వగతత్వాత్ స్థావరాదిషు స్థితః అపి. సర్వస్య ప్రాణిజాతస్య దేహే వధ్యమానేఽపి అయం దేహీ న వధ్యః, యస్మాత్ తస్మాత్ భీష్మాదీని సర్వాణి భూతాని ఉద్దిశ్య న త్వం శోచితుమ్ అర్హసి. 30

బాలానందిని

దేహీ ఇతి :- దేహీ = శరీరి, జీవాత్మ, నిత్యమ్ = ఎల్లప్పుడు, అన్ని అవస్థల యందూ కూడ, అవధ్యః- అవయవాలు లేనిది అవడంవల్ల, నిత్యమైనది అవడంవల్ల

కూడ చంప శక్యం కానిది. ఈ ఆత్మ అందరి శరీరాలలోను ఉన్నది. సర్వగతము. ఈ విధంగా స్థావరాదులలో ఉన్నదైనా కూడ ఇది అవధ్యము. సకలప్రాణుల దేహాలు చంపబడుచున్నా కూడ ఈ దేహిని మాత్రం చంపడం ఏ కారణంవల్ల శక్యం కాదో అందువల్ల, నువ్వు భీష్మాదు లైన సమస్తభూతాలను గూర్చి, (భీష్మాది రూపాలలో ఉన్న ఏ శరీరేంద్రియాలను గూర్చీ కూడ) దుఃఖించకూడదు. 30

భాష్యమ్

ఇహ పరమార్థతత్త్వాపేక్షాయాం శోకో మోహో వా న సంభవతి ఇత్యుక్తమ్. న కేవలం పరమార్థతత్త్వాపేక్షాయామేవ, కిం తు -

మూ. స్వధర్మమపి చావేక్ష్య న వికమ్పితుమర్హసి.
ధర్మ్యాద్ధి యుద్ధాచ్ఛ్రేయోఽన్యత్ క్షత్రియస్య న విద్యతే. 31

బాలానందిని

ఇహేతి :- పరమార్థతత్త్వం దృష్టితో చూస్తే శోకానికి కాని మోహానికి కాని అవకాశమే లేదు అని చెప్పబడింది. కేవలం పరమార్థతత్త్వదృష్టితో ఆలోచిస్తేనే కాదు, మరే మనగా-

ప్ర.అ. **స్వధర్మమితి :-** సర్వధర్మమ్ అపి = స్వధర్మాన్ని కూడ, అవేక్ష్య చ = చూచి, వికమ్పితుమ్ = చలించడానికి, న అర్హసి = తగవు. క్షత్రియస్య = క్షత్రియునకు, ధర్మ్యాత్ = ధర్మసంమతమైన, యుద్ధాత్ = యుద్ధంకంటె, అన్యత్ = మఱి యొక, శ్రేయః = శ్రేయస్కర మైనది, న విద్యతే = లేదు.

భాష్యమ్

స్వధర్మమితి :- స్వధర్మమపి - స్వః ధర్మః క్షత్రియస్య యుద్ధమ్; తమపి అవేక్ష్య త్వం న వికమ్పితుం ప్రచలితుం అర్హసి, క్షత్రియస్య స్వాభావికాత్ ధర్మాత్, ఆత్మస్వాభావ్యాత్ ఇత్యభిప్రాయః. తత్ చ యుద్ధం పృథివీజయద్వారేణ ధర్మార్థం ప్రజారక్షణార్థం చ ఇతి పరమం ధర్మ్యమ్. ధర్మాత్ అనపేతం ధర్మ్యమ్ తస్మాత్ ధర్మ్యాత్ యుద్ధాత్ శ్రేయః అన్యత్ క్షత్రియస్య న విద్యతే హి యస్మాత్. 31

బాలానందిని

స్వధర్మమితి :- స్వధర్మమును కూడ. స్వధర్మః- క్షత్రియుని స్వధర్మం యుద్ధం; దానిని కూడ చూచి (దృష్టిలో ఉంచుకొని), క్షత్రియునకు స్వాభావిక మైన, వాని స్వభావానికి అనుగుణమైన అని అభిప్రాయం, ధర్మంనుండి నువ్వు చలించకూడదు. ఆ యుద్ధం పృథివిని

జయించడం ద్వారా ధర్మానికీ, ప్రజారక్షణానికీ ఉపయోగిస్తుంది గాన చాలా ధర్మ్యము. అనగా ధర్మంనుండి దూరం కానిది; ధర్మసంమత మైనది. అట్టి ధర్మసంమత మైన యుద్ధం తప్ప క్షత్రియునకు శ్రేయస్కర మైనది మరొకటి ఏదీ ఎందువలన లేదో అందువలన.

వి. 'వికమ్పితుమ్' అన్నప్పుడు "కస్మాత్ వికమ్పితుమ్" అని ప్రశ్న కలుగుతుంది. అందుచేత 'స్వాభావికాత్ ధర్మాత్' అని అధ్యాహారం చేసికొనబడినది.

భా.అ.ప్ర. :- శ్రీరామానుజాచార్యులు 'ఇదం యుద్ధమ్' అని శ్లోకంలో లేని పదాలను కల్పించుకొని 'స్వధర్మమైన ఈ యుద్ధాన్ని' అని అర్థం చెప్పారు. శ్లోకంలో లేని 'ఇదం యుద్ధమ్' అని కల్పించడానికి ప్రమాణం ఏదీ లేదు. (భా.అ.ప్ర.పే. 69)

భాష్యమ్

కుతశ్చ తత్ యుద్ధం కర్తవ్యమ్ ఇతి; ఉచ్యతే -

మూ. యదృచ్ఛయా చోపపన్నం స్వర్గద్వారమపావృతమ్,
సుఖినః క్షత్రియాః పార్థ లభన్తే యుద్ధమీదృశమ్. 32

బాలానందిని

కుతశ్చేతి :- ఇంకా మరే కారణంచేత ఈ యుద్ధం చెయ్యాలి? చెప్పబడుచున్నది?

ప్ర.అ. యదృచ్ఛయా ఇతి :- పార్థ = అర్జునా, యదృచ్ఛయా = దైవవశంచేత, ఉపపన్నమ్ = వచ్చినది, అపావృతమ్ = తెరవబడిన, స్వర్గద్వారమ్ = స్వర్గద్వారమూ అయిన, ఈదృశమ్ = ఇట్టి, యుద్ధమ్ = యుద్ధమును, క్షత్రియాః = ఏ క్షత్రియులు, లభన్తే = పొందుదురో వారు, సుఖినః = సుఖవంతులు.

భాష్యమ్

యదృచ్ఛయేతి :- యదృచ్ఛయా చ అప్రార్థితతయా, ఉపపన్నమ్ ఆగతం. స్వర్గద్వారమ్, అపావృతమ్ ఉద్ఘాటితం యే తత్ ఈదృశం యుద్ధం లభన్తే క్షత్రియాః హే పార్థ కిం న సుఖినః తే. 32

బాలానందిని

యదృచ్ఛయా = కోరకుండా వచ్చినది, తెరవబడిన స్వర్గద్వారమూ అయిన ఇలాంటి యుద్ధాన్ని ఏ క్షత్రియులు పొందుతారో, అర్జునా! వాళ్లు సుఖ వంతులు కారా?

మూ. అథ చేత్త్వమిమం ధర్మ్యం సంగ్రామం న కరిష్యసి,
తతః స్వధర్మం కీర్తిం చ హిత్వా పాపమవాప్స్యసి. 33

బాలానందిని

అథ = అట్లుకాక, ఇమమ్= ఈ, ధర్మ్యమ్ = ధర్మసంమత మైన, సంగ్రామమ్ = యుద్ధమును, త్వమ్ = నీవు, న కరిష్యసి చేత్ = చేయకపోయినట్లయితే, తతః = అప్పుడు, స్వధర్మమ్= స్వధర్మాన్ని, కీర్తిం చ = కీర్తినీ, హిత్వా = విడచి, పాపమ్ = పాపమును, అవాప్స్యసి = పొందగలవు.

భాష్యమ్

ఏవం కర్తవ్యతాప్రాప్తమపి అథ చేత్ త్వమ్ ఇమం, ధర్మ్యం ధర్మాత్ అనపేతం, సంగ్రామం యుద్ధం, న కవిష్యసి చేత్, తతః తదకరణాత్ సర్వధర్మం, కీర్తిం చ మహాదేవాది సమాగమాదినిమిత్తాం హిత్వా పాపమ్ అవాప్స్యసి. 33

బాలానందిని

అథేతి :– అట్లు కాక, నువ్వు ధర్మసంమతమైన ఈ యుద్ధం చేయకపోతే అందువలన స్వధర్మాన్నీ మహాదేవాదులను కలవడం మొదలైన గొప్ప కార్యాలవల్ల కలిగిన కీర్తిని పోగొట్టుకొని కేవలం పాపం మాత్రమే పొందుతావు. 33

మూ. అకీర్తిం చాపి భూతాని కథయిష్యన్తి తేఽవ్యయామ్,
సంభావితస్య చాకీర్తిర్మరణాదతిరిచ్యతే. 34

ప్ర.అ. భూతాని = జనులు, తే = నీయొక్క, అవ్యయామ్ = అంతము లేని, అకీర్తిం చాపి = అపకీర్తిని కూడ, కథయిష్యన్తి = చెప్పగలరు. సంభావితస్య = గౌరవించబడిన వానికి, అకీర్తిః = అపకీర్తి, మరణాత్ = మరణంకంటె, అతిరిచ్యతే చ = అధికమైనది అవుతుంది (చెడ్డది).

భాష్యమ్

న కేవలం స్వధర్మకీర్తిపరిత్యాగః అకీర్తిం చాపి భూతాని కథయిష్యన్తి.తే తవ అవ్యయాం దీర్ఘకాలామ్. ధర్మాత్మా, శూరః ఇత్యేవమాదిభిః గుణైః సంభావితస్య చ అకీర్తిః మరణాత్ అతిరిచ్యతే. సంభావితస్య చ అకీర్తేః వరం మరణమ్ ఇత్యర్థః. 34

బాలానందిని

నేతి :– స్వధర్మాన్నీ కీర్తిని కోల్పోవడమే కాదు – జనులు చాలా కాలం పాటు నీ అపకీర్తిని గూర్చి కూడ చెప్పుకుంటూ ఉంటారు. ధర్మాత్ముడు, శూరుడు ఇత్యాది గుణా లున్న వాడుగా గౌరవించబడినవానికి అపకీర్తి మరణంకంటె గొప్పది. (చాలాకాలం) గౌరవించబడినవానికి అపకీర్తికంటె మరణమ్ మంచిది అని అర్థం. 34

భాష్యమ్

కిం చ -

మూ. భయాద్రణాదుపరతం మంస్యన్తే త్వాం మహారథాః
యేషాం చ త్వం బహుమతో భూత్వా యాస్యసి లాఘవమ్. 35

బాలానందిని

ఇంకా ఏ మనగా -

ప్ర.అ. భయాదితి :- మహారథాః = మహారథులు, త్వామ్ = నిన్ను, భయాత్ = భయంవలన, రణాత్ = యుద్ధంనుండి, ఉపరతమ్ = విరమించినవానినిగా, మంస్యన్తే = తలవగలరు. త్వమ్ = నీవు, యేషామ్ = ఎవరికైతే, బహుమతః = గౌరవపాత్రుడవో, భూత్వా = ఆ విధంగా గౌరవపాత్రుడ వయి (వాళ్లకే), లాఘవమ్ = తేలిక అయిపోవుటను, యాస్యసి = పొందగలవు.

భాష్యమ్

భయాదితి :- భయాత్ కర్ణాదిభ్యః, రణాత్ యుద్ధాత్, ఉపరతం నివృత్తం మంస్యన్తే చిన్తయిష్యన్తి, న కృపయా ఇతి, త్వామ్ మహారథాః దుర్యోధనప్రభృతయః. యేషాం చ త్వం దుర్యోధనాదీనాం బహుమతః బహుభిః గుణైః యుక్తః ఇత్యేవం బహుమతః భూత్వా, పునః యాస్యసి లాఘవం లఘుభావమ్. 35

బాలానందిని

భయాదితి :- కర్ణాదులకు భయపడి నువ్వు యుద్ధంనుండి విరమించావు అని దుర్యోధనాదులు అనుకుంటారు; అంతే కాని కృపచేత విరమించా వని అనుకొనరు. నువ్వు ఏ దుర్యోధనాదులకు – అనేకసద్గుణా లున్నవాడ వని గౌరవపాత్రుడవో, ఆ విధంగా గౌరవపాత్రుడవై ఉండి మళ్లీ లఘుత్వాన్ని పొందుతావు, వాళ్ల దృష్టిలో తేలిక అయిపోతావు. 35

భాష్యమ్

కిం చ -

మూ. అవాచ్యవాదాంశ్చ బహూన్వదిష్యన్తి తవాహితాః,
నిన్దన్తస్తవ సామర్థ్యం తతో దుఃఖతరం ను కిమ్. 36

బాలానందిని

మరొక విషయ మేమనగా -

ప్ర.అ. **అవాచ్యేతి** :- తవ అహితాః = నీ శత్రువులు, తవ సామర్థ్యమ్ = నీ సామర్థ్యాన్ని, నిన్దన్తః = నిందిస్తూన్నవారై, బహూన్ = అనేకమైన, అవాచ్యవాదాన్ = పలకకూడని మాటలను, వదిష్యన్తి = పలకగలరు. తతః = దానికంటె, దుఃఖతరమ్ = ఎక్కువ దుఃఖం కలిగించేది, కిమ్ = ఏమి ఉంటుంది?

భాష్యమ్

అవాచ్యవాదానితి :- అవాచ్యవాదాన్ అవక్తవ్యవాదాన్ చ = బహూన్ = అనేక ప్రకారాన్, వదిష్యన్తి తవ అహితాః శత్రవః, నిన్దన్తః = కుత్సయన్తః, తవ త్వదీయమ్, సామర్థ్యం నివాతకవచాదియుద్ధనిమిత్తమ్. తతః తస్మాత్ నిన్దాప్రాప్తేః దుఃఖాత్, దుఃఖతరం ను కిమ్. తతః కష్టతరం దుఃఖం నాస్తి ఇత్యర్థః. 36

బాలానందిని

అవాచ్యవాదాన్ ఇతి :- అవాచ్యవాదాలను, పలకకూడని మాటలను, అనేక విధాలైన వాటిని పలుకుతారు. నీ శత్రువులు, నివాతకవచాదులతో యుద్ధం చేయడం వలన కలిగిన నీ సామర్థ్యాన్ని నిందిస్తూ పలుకుతారు. దానికంటె, నిందవల్ల కలిగే దుఃఖంకంటె ఎక్కువ దుఃఖం కలిగించేది ఏమి ఉంటుంది? దానికంటె ఎక్కువ కష్టమైన దుఃఖం మరొకటి ఉండదు అని అర్థం. 36

భాష్యమ్

యుద్ధే పునః క్రియమాణే కర్ణాదిభిః-

మూ. హతో వా ప్రాప్స్యసి స్వర్గం జిత్వా వా భోక్ష్యసే మహీమ్,
తస్మాదుత్తిష్ఠ కౌన్తేయ యుద్ధాయ కృతనిశ్చయః. 37

యుద్ధే ఇతి :- కర్ణాదులతో యుద్ధం చేస్తే మాత్రం -

ప్ర.అ. **హతః ఇతి** :- హతః వా = చంపబడితివా, స్వర్గమ్ = స్వర్గాన్ని, ప్రాప్స్యసి = పొందగలవు. జిత్వా వా = జయించినట్లయితే, మహీమ్ = భూమిని, భోక్ష్యసే = అనుభవించగలవు. తస్మాత్ = అందువలన, కౌన్తేయ = అర్జునా! యుద్ధాయ = యుద్ధం కొరకు, కృతనిశ్చయః = చేయబడిన నిశ్చయం కలవాడవై, ఉత్తిష్ఠ = లెమ్ము.

భాష్యమ్

హతో వేతి :- హతో వా ప్రాప్స్యసి స్వర్గమ్. హతః సన్ స్వర్గం ప్రాప్స్యసి. జిత్వా వా కర్ణాదీన్ శూరాన్ భోక్ష్యసే మహీమ్. ఉభయథాపి తవ లాభః ఏవ

ఇత్యభిప్రాయః. యతః ఏవం తస్మాత్ ఉత్తిష్ఠ కౌన్తేయ యుద్ధాయ కృతనిశ్చయః, జేష్యామి శత్రూన్, మరిష్యామి వా ఇతి నిశ్చయం కృత్వా ఇత్యర్థః. 37

బాలానందిని

హతో వేతి:- హతో వా ప్రాప్స్యసి స్వర్గమ్ - చంపబడినవాడవై స్వర్గం పొందుతావు. కర్ణాదులైన శూరులను జయించావా భూమిని అనుభవిస్తావు. రెండు విధాలా నీకు లాభమే అని అభిప్రాయం. ఇది ఇలా ఉండడంవల్ల, అర్జునా! యుద్ధానికి నిశ్చయం చేసి, శత్రువులను జయించనేనా జయిస్తాను లేదా మరణిస్తాను అని నిశ్చయం చేసి అని అర్థం, లెమ్ము. 37

భాష్యమ్

తత్ర యుద్ధం స్వధర్మః ఇత్యేవం యుద్ధమానస్య ఉపదేశమ్ ఇమం శృణు :-

మూ. సుఖదుఃఖే సమే కృత్వా లాభాలాభౌ జయాజయౌ
తతో యుద్ధాయ యుజ్యస్వ నైవం పాపమవాప్స్యసి. 38

బాలానందిని

తత్రేతి :- యుద్ధం స్వధర్మం అనుకొని యుద్ధం చేసే నీకు తగిన ఈ ఉపదేశం చేస్తాను విను.

ప్ర.అ. సుఖేతి :- సుఖదుఃఖే = సుఖదుఃఖాలను, సమే కృత్వా = సమమైనవాటినిగా చేసి, లాభాలాభౌ = లాభాన్ని, అలాభాన్ని, జయాజయౌ = జయపరాజయాలను కూడ, సమమైనవాటినిగా చేసి, తతః = అటుపైన, యుద్ధాయ =యుద్ధంకొరకు, యుజ్యస్వ = సన్నద్ధుడవు అగుము. ఏవమ్ = ఈ విధంగా, పాపమ్ = పాపమును, న అవాప్స్యసి = పొందవు.

భాష్యమ్

సుఖదుఃఖే ఇతి :- సుఖదుఃఖే సమే కృత్వా - రాగద్వేషౌ అకృత్వా ఇత్యేతత్. తథా లాభాలాభే, జయాజయౌ చ సమౌ కృత్వా తతః యుద్ధాయ, యుజ్యస్వ ఘటస్వ. నైవం యుద్ధం కుర్వన్ పాపమ్ అవాప్స్యసి ఇత్యేష ఉపదేశః ప్రాసంగికః. 38

బాలానందిని

సుఖదుఃఖే ఇతి :- సుఖదుఃఖాలను సమంగా చేసికొని, రాగద్వేషాలను చేయక అని భావం, అట్లే లాభాలాభాలను, జయపరాజయాలను కూడ సమంగా భావించి అటుపైన

యుద్ధానికి పూనుకొనుము. ఈ విధంగా యుద్ధం చేస్తూ (చేసినట్లయితే) పాపం పొందవు; ఈ ఉపదేశం ప్రసంగవశంచేత చేయబడినది.

వి. పరమార్థతత్త్వాన్ని గూర్చి చెప్పే ప్రకరణంలో యుద్ధం చెయ్యి అని ఉపదేశించడం చేత పరమార్థతత్త్వజ్ఞానంతో పాటు యుద్ధాచరణాదిరూపమైన కర్మకు కూడ సముచ్చయం అని భ్రాంతి పడకూడదు. నువ్వు క్షత్రియుడవు గాన యుద్ధం నీ ధర్మం అని చెప్పే ప్రసంగంలో ఈ మాటలు చెప్పబడ్డాయి అని భావం. 38

భాష్యమ్

శోకమోహాపనయనాయ లౌకికః న్యాయః "స్వధర్మమపి చావేక్ష్య" ఇత్యాద్యైః శ్లోకైః ఉక్తః, న తు తాత్పర్యేణ. పరమార్థదర్శనం తు ఇహ ప్రకృతమ్. తచ్చ ఉక్తమ్ ఉపసం హ్రియతే - "ఏషా తే౽భిహితా" ఇతి శాస్త్రవిభాగదర్శనాయ. ఇహ హి దర్శితే పునః శాస్త్రవిషయవిభాగే ఉపరిష్టాత్ "జ్ఞానయోగేన సాంఖ్యానాం కర్మయోగేన యోగినామ్" (భ.గీ.3.3.) ఇతి నిష్ఠాద్వయవిషయం శాస్త్రం సుఖం ప్రవర్తిష్యతే, శ్రోతారశ్చ విషయవిభాగేన సుఖం గ్రహీష్యన్తి ఇత్యతః ఆహ -

మూ. ఏషా తే౽భిహితా సాంఖ్యే బుద్ధిర్యోగే త్విమాం శృణు,
బుద్ధ్యా యుక్తో యయా పార్థ కర్మబన్ధం ప్రహాస్యసి. 39

బాలానందిని

శోకేతి :- "స్వధర్మమపి చావేక్ష్య" ఇత్యాది శ్లోకాలచేత లౌకికమైన న్యాయం, (లోకంలో మామూలుగా చెప్పుకొనే మాట) శోకమోహాలను తొలగించడం కోసం చెప్పబడింది కాని తాత్పర్యం చేత (ఇదే ప్రధానవిషయం అనే అభిప్రాయంతో) చెప్పబడలేదు. ఇక్కడ నైతే ప్రకృత మైనది పరమార్థదర్శనం. చెప్పబడిన ఆ పరమార్థ దర్శనమే **"ఏషా తే౽భిహితా"** అని, శాస్త్రంలోని విషయాన్ని వేరు వేరుగా స్పష్టంగా చూపడానికై ఉపసంహరించ బడుచున్నది. ఇక్కడనే శాస్త్రవిషయవిభాగం (స్పష్టంగా విడగొట్టి) చూపించినట్లయితే ముమ్ముందు **"జ్ఞానయోగేన సాంఖ్యానం కర్మయోగేన యోగినామ్"** (సాంఖ్యులకు జ్ఞానయోగంచేత యోగులకు కర్మయోగంచేత) అని చెప్పబడబోయే నిష్ఠాద్వయానికి సంబంధించిన శాస్త్రం సుఖంగా నడిచిపోతుంది. శ్రోతలు కూడ విషయవిభాగపూర్వకంగా సుఖంగా గ్రహిస్తారు అనే ఉద్దేశ్యంతో చెపుతున్నాడు -

ప్ర.అ. **ఏషా ఇతి :-** పార్థ = అర్జునా! సాంఖ్యే = సాంఖ్యానికి సంబంధించిన, ఏషా బుద్ధిః = ఈ బుద్ధి, తే = నీకు, అభిహితా = చెప్పబడింది. యోగే = తు యోగమునందైతే

ఇమామ్ = ఈ బుద్ధిని, శృణు = వినుము. యయా = ఏ, బుద్ధ్యా = బుద్ధితో, యుక్తః = కూడినవాడవై, కర్మ బన్ధమ్ = కర్మబంధాన్ని, ప్రహాస్యసి = విడువగలవో.

భాష్యమ్

ఏషా త ఇతి :- ఏషా, తే తుభ్యమ్, అభిహితా ఉక్తా, సాంఖ్యే పరమార్థవస్తు వివేకవిషయే, బుద్ధిః జ్ఞానం, సాక్షాత్ = శోకమోహాదిసంసారహేతుదోషనివృత్తికారణమ్. యోగే తు తత్ప్రాప్త్యుపాయే నిఃసంగతయా ద్వన్ద్వప్రహాణపూర్వకమ్ ఈశ్వరారాధనార్థే కర్మయోగ కర్మానుష్ఠానే సమాధియోగే చ, ఇమామ్, అనన్తరమ్ ఏవ ఉచ్యమానాం బుద్ధిం శృణు. తాం బుద్ధిం స్తౌతి ప్రరోచనార్థమ్ - బుద్ధ్యా యయా యోగవిషయయా యుక్తః హే పార్థ, కర్మబన్ధం - కర్మైవ ధర్మాధర్మాఖ్యః బన్ధః తం, ప్రహాస్యసి ఈశ్వరప్రసాదనిమిత్తజ్ఞానప్రాప్తేః ఇత్యభిప్రాయః. 39

బాలానందిని

ఏషా త ఇతి :- నీకు సాంఖ్యం విషయంలో అనగా పరమార్థవస్తువివేకం విషయంలో, సంసారానికి హేతువైన శోకమోహాదుల నివృత్తికి సాక్షాత్తుగా కారణమైన, ఈ, బుద్ధిః = జ్ఞానము, చెప్పబడింది. ద్వంద్వాలను విడచి సంగం లేకుండా ఈశ్వరారాధనం కొరకు చేయబడేది, సాంఖ్యబుద్ధిప్రాప్తికి ఉపాయమూ అయిన యోగంలోను, అనగా కర్మానుష్ఠానరూప మైన కర్మయోగంలోను, సమాధియోగంలోను, ఇమామ్ - ఈ, ఇప్పుడే చెప్పబడబోయే బుద్ధిని వినుము. ప్రరోచనంకొరకై (దానియందు ఆసక్తి కలగడానికై) ఆ బుద్ధిని స్తుతిస్తున్నాడు. ఓ అర్జునా యోగానికి సంబంధించిన ఏ బుద్ధితో కూడినవాడవై, ధర్మాధర్మరూప మైన కర్మయే బంధం, ఆ బంధాన్ని విడిచిపెడతావో, ఈశ్వరప్రసాదం అనే నిమిత్తంవల్ల కలిగే జ్ఞానం లభించడంవల్ల విడిచిపెడతావో, అని అభిప్రాయం.

'భా.అ.ప్ర :- ఇక్కడ శ్రీ రామానుజాచార్యులు - "సంఖ్యా అనగా బుద్ధి; బుద్ధిచే నిర్ధారణచేయ దగిన ఆత్మతత్త్వం సాంఖ్యం. ఆత్మతత్త్వం తెలుసుకొనవలసి ఉన్నది గాన దానిని తెలిసికొనడానికై ఏ బుద్ధి చెప్పవలసి ఉందో అది **"న త్వేవాహమ్"** అని ప్రారంభించి **"తస్మాత్సర్వాణి భూతాని న త్వం శోచితుమర్హసి"** అన్నంతవరకు ఉన్న గ్రంథంచేత చెప్పబడింది. మోక్షానికి సాధన మైన కర్మను ఆత్మజ్ఞానపూర్వకంగా అనుష్ఠించడం విషయంలో ఏ బుద్ధియోగం ఇంక చెప్పవలసి ఉన్నదో అది ఇక్కడ యోగశబ్దంచేత చెప్పబడుచున్నది" - అని అన్నారు. అది అయుక్తం. "యా అభిధేయా సా" అని మూడు పదాలను, మూలంలో లేనివాటిని, కల్పించడానికి ప్రమాణం ఏదీ లేదు. మూలకర్త అభిప్రాయం ఇదే అయితే **"సైషా తేఽభిహితా"** అని ఉండేవాడు. "దాని జ్ఞానంకొరకు బుద్ధి" అనే వాక్యానికి అర్థం అసంగతంగా ఉంది. బుద్ధి అనగా జ్ఞానమే గాన "బుద్ధి జ్ఞానంకొరకు" అనడం అసంభవం కదా? ఏదీ కూడ తానే తనకొరకు కాజాలదు కదా?

"నాస్త్యకృతః కృతేన", (చేయబడే కర్మవల్ల నిత్యమైన మోక్షం లభించదు) **"నాన్యః పన్థా విద్యతేఽ యనాయ"** (మోక్షానికి జ్ఞానం తప్ప మరొక మర్గం ఏదీ లేదు) అని శ్రుతులు చెప్పుచుండగా కర్మలు మోక్షసాధనాలు అని చెప్పడం శ్రుతివిరుద్ధం. **"తరతి శోక మాత్మవిత్"** (ఆత్మను తెలుసుకొన్నవాడు శోకాన్ని దాటతాడు). **"బ్రహ్మవిద్ బ్రహ్మైవ భవతి"** (బ్రహ్మవేత్త బ్రహ్మగానే అవుతాడు) ఇత్యాదిశ్రుతుల ననుసరించి ఆత్మజ్ఞానమే మోక్షసాధన మని నిర్ణయించబడింది. కర్మలు కర్త మొదలైన కారకాల వ్యాపారంచేత సాధింపబడేవి; అలాంటప్పుడు - "నిష్కలం నిష్క్రియం శాన్తమ్", "సాక్షీ చేతా కేవలో నిర్గుణశ్చ" ఇత్యాదిశ్రుతులలో చెప్పినట్లు కర్తృత్వము, భోక్తృత్వము, వికారా లేవీ కూడా లేని సాక్షిచైతన్యరూపమైన ఆత్మను తెలిసికొన్నవానికి కర్మలయందు ప్రవృత్తి ఎలా కలుగుతుంది? అట్లే - "కర్మానుష్ఠానం విషయంలో ఏ బుద్ధిని చెప్పాలో అట్టి ఈ బుద్ధిని వినుము" అంటేనే చెప్పదలచిన విషయం చెప్పబడినప్పుడు - "కర్మానుష్ఠానం విషయంలో ఏ బుద్ధియోగాన్ని చెప్పవలసిఉన్నదో, దాని విషయంలో ఏ బుద్ధిని చెప్పాలో అట్టి దానిని వినుము" అంటూ ఈ వక్రమార్గం ఏమిటి? కర్మానుష్ఠానవిషయబుద్ధికి, యోగవిషయబుద్ధికీ వైలక్షణ్యం (తేడా) ఏమిటో చెప్పడానికి శక్యం కాదు కదా? (భా.అ.ప్ర.పే. 71, 72) 39

భాష్యమ్

కిం చాన్యత్

మూ. **నేహాభిక్రమనాశోఽస్తి ప్రత్యవాయో న విద్యతే,**
స్వల్పమప్యస్య ధర్మస్య త్రాయతే మహతో భయాత్. **40**

బాలానందిని

కిం చేతి :- మరొక విషయం ఏ మనగా -

ప్ర.అ. నేతి :- ఇహ = ఈ కర్మయోగంలో, అభిక్రమనాశః = ప్రారంభముయొక్క నాశం, నాస్తి = లేదు. ప్రత్యవాయః = ప్రత్యవాయం (విపరీత మైన ఫలం) న విద్యతే = లేదు. అస్యధర్మస్య = ఈ ధర్మంయొక్క, స్వల్పమ్ అపి = స్వల్పం కూడ, మహతః = గొప్ప, భయాత్ = భయమునుండి, త్రాయతే = రక్షించును.

భాష్యమ్

నేహాభీతి :- న ఇహ మోక్షమార్గే కర్మయోగే అభిక్రమనాశః- అభిక్రమణమ్ అభిక్రమః- ప్రారమ్భః, తస్య నాశః నాస్తి యథా కృష్యాదేః, యోగవిషయే ప్రారమ్భస్య న అనైకాన్తికఫలత్వమ్ ఇత్యర్థః. కిం చ న అపి చికిత్సావత్ ప్రత్యవాయః విద్యతే. కిం

తు స్వల్పమ్ అపి అస్యయోగధర్మస్య అనుష్ఠితం, త్రాయతే రక్షతి, మహతః సంసార భయాత్ జన్మమరణాదిలక్షణాత్. 40

బాలానందిని

నేతి :- ఇహ - మోక్షానికి మార్గమైన ఈ కర్మయోగంలో, అభిక్రమనాశః- అభిక్రమణముయొక్క ప్రారంభముయొక్క నాశం, లేదు. కృషి - వాణిజ్యాదుల విషయంలో వలె యోగవిషయంలో ప్రారంభానికి ఫలం అనిశ్చితంగా ఉండడం అనేది లేదు. (కృష్యాదులు ప్రారంభించినా అవి సఫలాలు కాకపోవచ్చును. అలాంటిది ఈ యోగం విషయంలో లేదు). మరియు, చికిత్సలో వలె ప్రత్యవాయం (చికిత్స ప్రారంభించి నప్పుడు దురదృష్టవశంచేత రోగం ఎక్కువ అవడం మొదలైన అనర్థాలు కలుగునట్లు విపరీతఫలం) కూడ లేదు. ఈ యోగరూపధర్మాన్ని ఏ కొంచెం అనుష్ఠించినా జన్మమరణాదిరూపమైన గొప్ప సంసారభయం నుండి రక్షిస్తుంది. 40

వి. సర్వపాపేషు రక్తోఽపి ధ్యాయన్నిమిషమచ్యుతమ్.
యతిస్తపస్వీ భవతి పఙ్క్తిపావనపావనః".

(అన్ని విధా లైన పాపాలు చేసినవా డైనా ఒక్క నిమిషం పాటు శ్రీమహావిష్ణువును ధ్యానించినవాడు పంక్తిని పవిత్రంచేసే వాళ్లను పవిత్రంచేయగలిగిన తపఃశాలియైన యతి అవుతాడు) అని స్మృతిలో చెప్పి నట్లు అతిస్వల్ప మైనా కూడ ఈ ధర్మం గొప్ప భయంనుండి రక్షిస్తుంది. 40

భాష్యమ్

యేయం సాంఖ్యే బుద్ధిః ఉక్తా యోగే చ వక్ష్యమాణలక్షణా సా -

మూ. వ్యవసాయాత్మికా బుద్ధిరేకేహ కురునన్దన.
బహుశాఖా హ్యనన్తాశ్చ బుద్ధయోఽవ్యవసాయినామ్. 41

బాలానందిని

యా ఇతి :- సాంఖ్యవిషయంలో ఈ విధమైన ఏ బుద్ధి చెప్పబడిందో, యోగంలో కూడ ఏ బుద్ధి చెప్పబడబోయే లక్షణాలు గలదో అట్టి -

ప్ర. అ. :- వ్యవసాయేతి :- వ్యవసాయాత్మికా = నిశ్చయరూప మైన (నిశ్చిత మైన స్వరూపం గల), బుద్ధిః = బుద్ధి, ఇహ = ఈ శ్రేయోమార్గంలో, ఏకా = ఒక్కటే. కురునన్దన = అర్జునా! అవ్యవసాయినామ్ = నిశ్చయం లేనివాళ్లయొక్క, బుద్ధయః = బుద్ధులు, బహుశాఖాః = అనేకమైన శాఖలు (భేదాలు) కలవి, అనన్తాః = అంతం లేనివి కూడ.

భాష్యమ్

వ్యవసాయేతి :- వ్యవసాయాత్మికా నిశ్చయస్వభావా, ఏకైవ బుద్ధిః ఇతరవిపరీతబుద్ధిశాఖాభేదస్య బాధికా సమ్యక్ప్రమాణజనితత్వాత్, ఇహ శ్రేయోమార్గే, హే కురునన్దన. యాః పునః ఇతరాః బుద్ధయః, యాసాం శాఖాభేదవశాత్ అనన్తః, అపారః, అనుపరతః సంసారః నిత్యప్రతతః విస్తీర్ణః భవతి, ప్రమాణజనివివేకబుద్ధి నిమిత్తవశాచ్చ ఉపరతాసు అనన్తభేదబుద్ధిషు సంసారః అపి ఉపరమతే, తాః బుద్ధయః బహుశాఖాః బహ్వ్యః శాఖాః యాసాం తాః బహుశాఖాః, బహుభేదాః ఇత్యేతత్. ప్రతిశాఖాభేదేన చ అనన్తాః బుద్ధయః, కేషామ్? అవ్యవసాయినామ్, ప్రమాణజనిత వివేకబుద్ధిరహితానామ్ ఇత్యర్థః. 41

బాలానందిని

వ్యవసాయేతి :- వ్యవసాయాత్మికా - నిశ్చయస్వభావం గల, బుద్ధి ఒక్కటే; అది మంచి ప్రమాణాల ద్వారా కలిగిన దవడంచేత ఇతరములైన, విపరీతము లైన బుద్ధుల శాఖాభేదాలను బాధిస్తుంది (తొలగిస్తుంది); అది ఒక్కటే (దానిలో వేరు వేరు అభిప్రాయభేదాలకు తావు లేదు). ఇహ = ఈ శ్రేయోమార్గంలో హే కురు నన్దన - ఓ అర్జునా! ఇంక ఇతరము నైన బుద్ధు లే వైతే ఉన్నాయో, వేటియొక్క శాఖాభేదాలవల్ల ఈ సంసారం అనంతమై, అపారమై (దాట శక్యం కానిదై) తొలగనిదై నిత్యమూ అల్లుకొంటూ విస్తరిస్తూ ఉంటుందో, అయితే ప్రమాణాలవల్ల కలిగిన వివేకబుద్ధిచేత అనంతము లైన ఆ బేధబుద్ధులు అణగిపోవడంతో ఈ సంసారం కూడ నశిస్తుంది - అలాంటి అనేక మైన శాఖలు గలవి, అనగా అనేక మైన భేదాలు కలవి అని అర్థం. ఈ విధంగా ఒక్కొక్క శాఖాభేదాన్ని పట్టి, (మతాల, ఆలోచనల భేదాన్ని బట్టి లేదా వేదశాఖల భేదాలను పట్టి) బుద్ధులు అనంత మైనవి. ఎవరికి? అవ్యవసాయులకు; అనగా ప్రమాణంచేత కలిగన వివేకబుద్ధి లేనివాళ్లకు అని అర్థం.

వి. ఆత్మ వికారాలు లేనిది, సర్వగతము, నిత్యము, ఒక్కటే. స్వప్రకాశము, తెలియడానికి శక్యం కానిది అనే నిశ్చయం రూపంలో ఉన్న బుద్ధి సాంఖ్యబుద్ధి. ఫలాసక్తిని విడచి, సిద్ధ్యసిద్ధులలో సముడుగా ఉంటూ శాస్త్రవిహితా లైన కర్మలను ఈశ్వరారాధన బుద్ధితో చెయ్యాలి అనే నిశ్చయం రూపంలో ఉన్న బుద్ధి యోగబుద్ధి. ఆత్మ కర్త, భోక్త, ఆత్మ ధర్మాదిపురుషార్థాలను సంపాదించాలి, స్వర్గం కావాలంటే జ్యోతిష్టోమయాగం చెయ్యాలి, పశువులు కావాలనుకున్నవాడు కారీరేష్టి చెయ్యాలి ఇత్యాదిబుద్ధులు విపరీతబుద్ధులు. అనంతము లైన బహుశాఖాబుద్ధులు.

భా.అ.ప్ర. :- ఇక్కడ శ్రీ రామానుజాచార్యులు - ఆత్మయథార్థస్వరూపనిశ్చయ పూర్వక మైన (వ్యవసాయాత్మికమైన) బుద్ధి ఒకే ఫలానికి సాధన మైనదానికి సంబంధించిన దవడంచేత ఒక్కటి. మోక్ష మనే ఒక్క ఫలంకొరకే కర్మలు విధించబడుచున్నవి కదా?" అని అన్నారు. ఇది నిఃసారం. ఆత్మయొక్క యథార్థస్వరూపం - నిత్యత్వము, స్వయం ప్రకాశ్వము, ఆనందత్వము, పాపరహితత్వము ఇత్యాదిరూప మైనది అని రెండు పక్షాల వాళ్లకీ సంమతమే. దీని నిశ్చయం ఉన్నవానికి కర్మలయందు ప్రవృత్తి ఎలా ఉంటుంది? ఏ విధంగానూ ఉండదు. ఎందువల్లననగా కర్మవల్ల ఆత్మకు సంపాదింపతగిన ఉత్కర్ష గాని, కర్మచేత తొలగించవలసిన అపకర్ష కాని లేదు కదా? అనేక మైన కారకాలను సమకూర్చుకొనడం ద్వారా కర్మలను అనుష్ఠించడంవల్ల కలిగే దుఃఖం ఆనందరూప మైన ఆత్మకు కుదరదు. మోక్షం కర్మచేత పుట్టించవలసిన దైతే అపు డది ఘటాదుల వలె అనిత్యం అవుతుంది. కర్మలు సకాముల కైతే స్వర్గాదిఫలాలు కలగడం కోసము, నిష్కాములకైతే చిత్తశుద్ధికోసమూ విధించబడ్డాయి గాని మోక్షం కోసం అవి విధించబడలేదు. **"జ్యోతిష్టోమేన స్వర్గకామో యజేత"** ఇత్యాదిశ్రుతులు స్వర్గాదులకోసం జ్యోతిష్టోమాదులు చెయ్యాలి అని విధిస్తున్నాయి, **"తమేతం వేదానువచనేన బ్రాహ్మణా వివిదిషన్తి యజ్ఞేన దానేన తపసానాశకేన"** ఇత్యాదిశ్రుతులు చిత్తం పరిశుద్ధమై జ్ఞానోత్పత్తికి అనుకూలం అవడంకోసం యజ్ఞదానాదులు చెయ్యాలి అని చెపుతున్నాయి. అంతే కాని మోక్షం కావా లని కోరుకునేవాడు ఈ కర్మ చెయ్యాలి అని ఏ శ్రుతీ బోధించడంలేదు. నిత్య మైన ఆత్మలో క్రియలు చేయడం వంటి వికారాలు ఉండకూడదు. ఇంతే కాకుండా 'వ్యవసాయాత్మికా' అనే పదంనుండి నిశ్చయపూర్వక మైన అనే అర్థం లభించదు. 'ఆత్మ' శబ్దానికి 'పూర్వము' అనే అర్థం లేదు కదా? (భా.అ.ప్ర.పే. 74) 41.

భాష్యమ్

యేషాం వ్యవసాయాత్మికా బుద్ధిః నాస్తి తే -

మూ. యామిమాం పుష్పితాం వాచం ప్రవదన్త్యవిపశ్చితః,
వేదవాదరతాః పార్థ నాన్యదస్తీతి వాదినః.

బాలానందిని

యేషామితి :- ఎవరి కైతే నిర్ణయాత్మక మైన బుద్ధి లేదో వాళ్లు -

ప్ర.అ. పార్థ = అర్జునా! వేదవాదరతాః = వేదవాక్యాలయందే ఆసక్తి కలవారై, అన్యత్ = మరేదీ, నాస్తి ఇతి = లేదు అని, వాదినః = అంటున్నవారై, పుష్పితామ్ = పుష్పించిన, పుష్పం వలె పైకి అందంగా కనబడే, యాం వాచమ్ = ఏ వాక్కును, వదన్తి = పలుకుచున్నారో, వారు. అవిపశ్చితః = అవిద్వాంసులు.

భాష్యమ్

మూ

యామితి :- యామిమాం వక్ష్యమాణాం, పుష్పితాం పుష్పితవృక్ష ఇవ శోభమానాం శ్రూయమాణరమణీయాం, వాచం వాక్యలక్షణాం ప్రవదన్తి. కే? అవిపశ్చితః అల్పమేధసః అవివేకినః ఇత్యర్థః. వేదవాదరతాః బహ్వర్థవాదఫలసాధన ప్రకాశకేషు వేదవాక్యేషు రతాః హే! పార్థ! న అన్యత్ స్వర్గప్రాప్త్యాదిఫలసాధనేభ్యః కర్మభ్యః అస్తి ఇత్యేవం వాదినః వదనశీలాః. 42

బాలానందిని

యామితి :- ఏ, ఇమామ్ - చెప్పబడబోయే, పుష్పితామ్ - పుష్పించిన వృక్షం వలె ప్రకాశిస్తూన్న, వింటూన్నంత సేపూ రమణీయంగా ఉండే, వాక్యాలరూపంలో ఉండే వాక్కును, పలుకుతారో, వాళ్లు ఎవరు? అవిపశ్చితః- అల్పమైన మేధ కలవారు, వివేకం లేనివాళ్లు అని అర్థం. వేదవాదరతాః- అనేకములైన అర్థవాదలు, ఫలములు, వాటికి సాధనాలు -వీటిని ప్రకాశింపచేసే వేదవాక్యాలయందు ఆసక్తి గలవారు, ఓ! అర్జునా! వాళ్లు స్వర్గప్రాప్తి మొదలైన ఫలాలకు సాధనాలైన కర్మలకంటె వేరైనది మరేదీ లేదు అని చెప్పే స్వభావం గలవాళ్లు. 42

భాష్యమ్

తే చ -

మూ. కామాత్మానః స్వర్గపరాః జన్మకర్మఫలప్రదామ్,
క్రియావిశేషబహులాం భోగైశ్వర్యగతిం ప్రతి. 43

బాలానందిని

వాళ్లు -

ప్ర.అ. **కామేతి :-** కామాత్మానః = కామస్వభావులై, స్వర్గపరాః = స్వర్గమే అత్యుత్తమము అనే అభిప్రాయం గలవారై, క్రియావిశేషబహులామ్ = అనేకమైన క్రియావిశేషాలతో కూడిన, జన్మకర్మఫలప్రదామ్ = జన్మ అనే కర్మఫలాన్ని ఇచ్చే (వాచమ్ = వాక్కును), భోగైశ్వర్యగతిం ప్రతి = భోగాలయొక్క ఐశ్వర్యముయొక్క ప్రాప్తిని గూర్చి (ప్రవదన్తి అని పై శ్లోకంలో పదంతో అన్వయం).

భాష్యమ్

కామాత్మానః ఇతి :- కామాత్మానః కామస్వభావాః కామపరాః ఇత్యర్థః. స్వర్గపరాః స్వర్గః పరః పురుషార్థః యేషాం తే స్వర్గపరాః స్వర్గప్రధానాః, జన్మకర్మ

ఫలప్రదాం కర్మణః ఫలం కర్మఫలమ్, జన్మైవ కర్మఫలం జన్మకర్మఫలం, తత్ ప్రదదాతి ఇతి జన్మకర్మఫలప్రదా, తాం వాచం ప్రవదన్తి ఇతి అనుషజ్యతే. క్రియావిశేషబహులాం క్రియాణాం విశేషాః తే బహులాః యస్యాం వాచి తాం, స్వర్గపశుపుత్రాద్యర్థాః యయా వాచా బాహుల్యేన ప్రకాశ్యన్తే; భోగైశ్వర్యగతిం ప్రతి – భోగశ్చ ఐశ్వర్యం చ భోగైశ్వర్యే, తయోః గతిః ప్రాప్తిః భోగైశ్వర్యగతిః, తాం ప్రతి సాధనభూతాః యే క్రియావిశేషాః తద్బహులాం తాం వాచం ప్రవదన్తః మూఢాః సంసారే పరివర్తన్తే ఇత్యర్థః. 43

బాలానందిని

కామాత్మానః ఇతి :– కామాత్మానః– కామస్వభావులై, కామములందే ఆసక్తి గలవారై, స్వర్గమే ఉత్తమపురుషార్థము ఎవరికో వారు స్వర్గపరులు; స్వర్గమే ప్రధానం అనుకోనేవారు, అట్టివారై, కర్మయొక్క ఫలం కర్మఫలం. జన్మయే కర్మఫలం జన్మకర్మఫలం. దానిని ఇచ్చే వాక్కును పలుకుతారు అని అన్వయం. క్రియావిశేషబహులామ్ – క్రియావిశేషా లనగా క్రియల విశేషాలు. ఆ క్రియావిశేషాలే ఏ వాక్కులో అధికంగా ఉంటాయో, ఏ వాక్కుచేత స్వర్గమూ, పశువులు, పుత్రులు మొదలైన విషయాలు అధికంగా వర్ణింపబడుతూ ఉంటాయో (అట్టి వాక్కును). భోగైశ్వర్యగతిం ప్రతి – భోగము, ఐశ్వర్యము – ఈ రెండింటియొక్క గతిని, అనగా ప్రాప్తిని గూర్చి, సాధనాలైన ఏ క్రియావిశేషా లున్నాయో అవి అధికంగా ఉన్న వాక్కును పలుకుచు ఉన్న మూఢులు సంసారంలో తిరుగుతూ ఉంటారు అని అభిప్రాయం. 43

భాష్యమ్

తేషాం చ

మూ. భోగైశ్వర్యప్రసక్తానాం తయాఽపహృతచేతసామ్,
వ్యవసాయాత్మికా బుద్ధిః సమాధౌ న విధీయతే. 44

బాలానందిని

ప్ర.అ. తేషామితి :– తయా = ఆ పుష్పితవాక్కుచే, అపహృచేతసామ్ = అపహరించబడిన చిత్తము గలవారు, భోగైశ్వర్యప్రసక్తానామ్ = భోగమునందు, ఐశ్వర్యమునందు ఆసక్తులూ అయిన (తేషాం చ = వాళ్లయొక్క), సమాధౌ = అంతఃకరణమునందు, వ్యవసాయాత్మికా = వ్యవసాయాత్మక మైన, బుద్ధిః = బుద్ధి, న విధీయతే = ఉండదు.

భాష్యమ్

భోగేతి :- భోగైశ్వర్య ప్రసక్తానాం - భోగః కర్తవ్యమ్ ఐశ్వర్యం చ ఇతి భోగైశ్వర్యయోః ఏవ ప్రణయవతాం తదాత్మభూతానాం, తయా క్రియావిశేష బహులయా వాచా అపహృతచేతసామ్ ఆచ్ఛాదితవివేకప్రజ్ఞానాం వ్యవసాయాత్మికా సాంఖ్యే యోగే వా బుద్ధిః, సమాధౌ సమాధీయతే అస్మిన్పురుషోపభోగాయ సర్వమ్ ఇతి సమాధిః అన్తఃకరణమ్,బుద్ధిః,తస్మిన్ సమాధౌ, న విధీయతే న భవతీత్యర్థః. 44

బాలానందిని

భోగేతి:- భోగైశ్వర్యప్రసక్తానామ్ = భోగమే నా కర్తవ్యం. ఐశ్వర్యసంపాదనమే నా కర్తవ్యం అని భోగైశ్వర్యములయందు ఆసక్తి కలిగి పూర్తిగా భోగైశ్వర్యరూపులే అయినట్టి, తయా = క్రియావిశేషబహుల మైన వాక్కుచేత,అపహరించబడిన చిత్తం కల,ఆ వాక్కుచేత కప్పివేయబడిన వివేకప్రజ్ఞ కల,వాళ్లకు,సాంఖ్యములో గాని,యోగంలో గాని వ్యవసాయాత్మక మైన బుద్ధి,పురుషుని భోగం నిమిత్తం దేనియందు సమస్తమూ ఉంచబడుతుందో అది 'సమాధి',అనగా అంతఃకరణం,ఆ సమాధియందు,బుద్ధి విధింపబడదు,అనగా ఉండదు అని అర్థం.

వి. 'సమాధిః అన్తఃకరణమ్'అని సమాధిశబ్దానికి అంతఃకరణం అని అర్థం చెప్పి, పై నున్న'బుద్ధిః'అనే పదాన్ని పునఃపరిగ్రహించి "బుద్ధిః సమాధౌ న విధీయతే"అని అర్థం చెప్పబడింది. 44

భాష్యమ్

యే ఏవం వివేకబుద్ధిరహితాః తేషాం కామాత్మనామ్-

మూ. త్రైగుణ్యవిషయా వేదా నిస్త్రైగుణ్యో భవార్జున,
నిర్ద్వన్ద్వో నిత్యసత్త్వస్థో నిర్యోగక్షేమ ఆత్మవాన్. 45

బాలానందిని

యే ఇతి:- ఈ విధంగా ఎవళ్లైతే వివేకబుద్ధిశూన్యులో అట్టి కామాత్ములకు -

ప్ర.అ. త్రైగుణ్యేతి:- వేదాః = వేదాలు, త్రైగుణ్యవిషయాః = సంసారాన్ని మాత్రమే ప్రకాశింపచేస్తాయి. అర్జున = అర్జునా! నిస్త్రైగుణ్యః = త్రైగుణ్యం (సంసారం)లేనివాడవుగాను, నిర్ద్వన్ద్వః = ద్వంద్వాలు లేనివాడవుగాను, నిత్యసత్త్వస్థః = నిత్యమూ, సత్త్వమునందే ఉన్న వాడవుగాను, నిర్యోగక్షేమః = యోగక్షేమాలు లేనివాడవుగాను, ఆత్మవాన్ =అప్రమత్తుడవు గాను, భవ = ఉండుము.

భాష్యమ్

త్రైగుణ్యేతి:- త్రైగుణ్యవిషయాః - త్రైగుణ్యం సంసారః విషయః ప్రకాశయితవ్యః యేషాం తే వేదాః త్రైగుణ్యవిషయాః. త్వం తు నిస్త్రైగుణ్యః భవ అర్జున! నిష్కామః భవ ఇత్యర్థః. నిర్ద్వన్ద్వః-సుఖదుఃఖహేతూ సప్రతిపక్షౌ పదార్థౌ ద్వన్ద్వశబ్దవాచ్యౌ, తతః నిర్గతః నిర్ద్వన్ద్వః భవ. త్వం నిత్యసత్త్వస్థః సదా సత్త్వగుణాశ్రితః భవ. తథా నిర్యోగక్షేమః - అనుపాత్తస్య ఉపాదానం యోగః, ఉపాత్తస్య రక్షణం క్షేమః. యోగక్షేమప్రధానస్య శ్రేయసి ప్రవృత్తిః దుష్కరా ఇత్యతః నిర్యోగక్షేమః భవ. ఆత్మవాన్ అప్రమత్తశ్చ భవ. ఏషః తవ ఉపదేశః స్వధర్మమ్ అనుతిష్ఠతః. 45

బాలానందిని

త్రైగుణ్యేతి:- వేదాలు(కామాత్ములకు) త్రైగుణ్యవిషయములు-త్రైగుణ్యం అనగా సంసారం. అదే ఏ వేదాలకు విషయమో, ప్రకాశింపచేయ దగినదో అట్టి వేదాలు త్రైగుణ్య విషయాలు-(అనగా వేదాలు సంసారానికి సంబంధించిన విషయాలను మాత్రమే బోధిస్తాయి అని అర్థం). అర్జునా ! నీవైతే నిస్త్రైగుణ్యుడవు అగుము. అనగా కామాలు లేనివాడవు అగుము అని అర్థం. నిర్ద్వన్ద్వః- సుఖదుఃఖాలకు హేతువు లైన, పరస్పరవిరుద్ధా లైన పదార్థాలు ద్వంద్వ శబ్దంచేత చెప్పబడతాయి. (శీతోష్ణాదులు). అలాంటి ద్వంద్వములను దాటినవాడవు అగుము. నువ్వు ఎల్లప్పుడు సత్త్వగుణాన్ని ఆశ్రయించి ఉండుము. అట్లే నిర్యోగక్షేముడవుగా ఉండుము. సంపాదించనిదానిని సంపాదించడం యోగం, సంపాదించినదానిని రక్షించడం క్షేమం. యోగ క్షేమాలే ప్రధానంగా కలవాడు శ్రేయస్సు విషయంలో ప్రవర్తించడం చాలా కష్టమైన పని. అందువల్ల నిర్యోగక్షేముడవు(యోగక్షేమాలను దాటినవాడవు)అగుము. ఆత్మవంతుడవుగా, అనగా ఏమరిపాటు లేనివాడవుగా ఉండుము. స్వధర్మాన్ని ఆచరిస్తూన్న నీకు ఉపదేశించవలసి నది ఇదే. (నువ్వు ముముక్షువు కావలసిన పని లేదు; స్వధర్మాచరణం చేస్తున్నప్పుడు కూడ నువ్వు ఈ విధంగా ఉండాలి అని భావం). 45

భాష్యమ్

సర్వేషు వేదోక్తేషు కర్మసు యాని అనన్తాని ఫలాని తాని నాపేక్ష్యన్తే చేత్ కిమర్థం తాని ఈశ్వరాయ ఇతి అనుష్ఠీయన్తే ఇతి; ఉచ్యతే శృణు-

మూ. యావానర్థ ఉదపానే సర్వతఃసంప్లుతోదకే,
తావాన్ సర్వేషు వేదేషు బ్రాహ్మణస్య విజానతః. 46

బాలానందిని

సర్వేష్వితి:- వేదం బోధించే అన్ని కర్మలలో ఉన్న అనంత మైన ఫలాలు అపేక్షించ బడకపోయిన ట్లయితే,వాటిని ఈశ్వరుని కోసం అని మాత్రం ఆచరించడం ఎందుకు అని ప్రశ్నిస్తే చెపుతున్నాం,విను -

యావానితి:- ఉదపానే = కూపాదిక మైన ఉదకం లభించే స్థానంలో, యావాన్ = ఎంత, అర్థః = ప్రయోజనం లభిస్తుందో,సర్వతః సంప్లుతోదకే = అంతటా ప్రవహిస్తున్న ఉదకం గల విశాల మైన ఉదకస్థానంలో, తావాన్ = అంత ప్రయోజనమూ కూడ లభిస్తుంది. ఇట్లే, సర్వేషు = సమస్తమైన, వేదేషు = వేదాలలో (వేదోక్తకర్మలలో), అర్థః = ఏ ప్రయోజనం లభిస్తుందో,తావాన్ =అంత ప్రయోజనం,విజానతః = పరమార్థతత్త్వం తెలుసుకొన్న, బ్రాహ్మణస్య = బ్రాహ్మణునకు (సంన్యాసికి),లభిస్తుంది.

భాష్యమ్

యావానితి:- యథా లోకే కూపతడాకాద్యనేకస్మిన్ ఉదపానే,పరిచ్ఛిన్నోదకే, యావాన్ యత్పరిమాణః స్నానపానాదిః అర్థః ఫలం ప్రయోజనం సః సర్వః అర్థః సర్వతఃసంప్లుతోదకే తావానేవ సంపద్యతే.తత్ర అన్తర్భవతి ఇత్యర్థః, ఏవం తావాన్ తత్పరిమాణః ఏవ సంపద్యతే సర్వేషు వేదేషు వేదోక్తేషు కర్మసు యః అర్థః యత్ కర్మఫలమ్,సః అర్థం బ్రాహ్మణస్య సంన్యాసినః పరమార్థతత్త్వం విజానతః యః అర్థః విజ్ఞానఫలం సర్వతః సంప్లుతోదకస్థానీయం తస్మిన్ తావానేవ సంపద్యతే.తత్రైవ అన్తర్భవతి ఇత్యర్థః. **"సర్వం తత్ అభిసమేతి యత్ కిం చ ప్రజాః సాధు కుర్వన్తి యస్తద్వేద యత్ స వేద"**(ఛా.ఉ.4.1.4) ఇతి శ్రుతేః. "సర్వం కర్మాఖిలమ్"(4.33)ఇతి చ వక్ష్యతి.తస్మాత్ ప్రాక్ జ్ఞాననిష్ఠాధికారప్రాప్తేః కర్మణి అధికృతేన కూపతడాగాద్యర్థ స్థానీయమ్ అపి కర్మ కర్తవ్యమ్. 46

బాలానందిని

యావానితి:- లోకంలో,పరిమిత మైన ఉదకం గల నుయ్యి, చెరువు మొదలైన అనేక ఉదపానాలలో(జలస్థానాలలో)ఎంత స్నానపానాదిక మైన ప్రయోజనం లభిస్తుందో అంత ప్రయోజనమే (ప్రయోజనమూ కూడ)ఏ విధంగా అంతటా పొంగి పొరలుతూన్న జలం గల ఉదకస్థానంలో పొందబడుతుందో,అనగా ఆ ప్రయోజనం దీనిలో అంతర్భవిస్తుందో (ఇమిడిపోతుందో)అదే విధంగా, అంత పరిమాణంకలదే సమకూరు తుంది. (దీనికే వివరణం)-అన్ని వేదాలలో,అనగా వేదోక్త కర్మలలో ఏ ప్రయోజనం, ఏ కర్మఫలం, ఉన్నదో అది పరమార్థం తెలిసిన బ్రాహ్మణునకు,అనగా సంన్యాసికి,లభించే.

సర్వతఃసంప్లుతోదకం వంటి ఏ విజ్ఞానఫలం ఉన్నదో,దానిలో,అంతయే సంపన్నం అవుతుంది. దానిలోనే అంతర్గతం అవుతుంది అని భావం.

వి. **"యథా లోకే...ఏవం తావాన్ తావత్పరిమాణ ఏవ సంపద్యతే"**అనేది ఒక పెద్ద వాక్యం. మొదటి వాక్యంలో భాగమైన **"ఏవం తావాంస్తత్పరిమాణ ఏవ సంపద్యతే"** అనే సంగ్రహవాక్యానికి వివరణం. "బ్రాహ్మణస్య'అనే పదానికి 'సంన్యాసినః'అని అర్థం చెప్పబడింది.జ్ఞానియైె సర్వకర్మలను విడిచిపెట్టినా కూడ వాని జ్ఞానఫలంలో సర్వకర్మఫలం, సంప్లుతోదకంలో కూపతటాకాదిలభ్యఫలం అంతర్గతం అయినట్లు, అంతర్గతం అవుతుంది అని ప్రకృతార్థాన్ని సమర్థించడానికి ఈ అర్థం చెప్పబడింది.

సర్వమితి: "సర్వం...వేద"(ఎవడు బ్రహ్మను తెలుసుకుంటాడో అతడు, ప్రజలు చేసేసకల సాధుకర్మల ఫలాన్నీ పొందుతాడు;రైక్వుడు ఏ వస్తువును బ్రహ్మను, తెలుసుకొన్నాడో దానినే తెలుసుకోవాలి)అను శ్రుతి సకలకర్మఫలము జ్ఞానఫలంలో అంతర్గతం అవుతున్న దని చెప్పుచున్నది."సర్వం కర్మాఖిలమ్"అని కూడ (భగవంతుడే)చెప్పనున్నాడు. అందువల్ల జ్ఞాననిష్ఠయందు అధికారం లభించడానికి పూర్వం కర్మలలో అధికారం ఉన్నవాడు కూప-తడాకాదుల ప్రయోజనం వంటి ప్రయోజనాన్ని మాత్రమే ఇచ్చేదయినా కూడ కర్మను ఆచరించాలి.

భా.అ.ప్ర: ఇక్కడ శ్రీరామానుజాచార్యులు 'బ్రాహ్మణస్య'అనేదానికి 'వైదికస్య'(వేదాధ్యయనం చేసినవానియొక్క)అని అర్థం చెప్పారు.కాని ఇక్కడ 'విజానతః'అని విశేషణం ఉండడం వల్ల బ్రహ్మజ్ఞాని యైన సంన్యాసి అనే అర్థమే యుక్తం. "వేదవాదరతాః పార్థ"ఇత్యాది వాక్యాలచేత కేవలవేదవేత్తలు బ్రహ్మవేత్తలు కాజాల రని సూచించబడినది కదా? బ్రాహ్మణ శబ్దానికి 'బ్రహ్మ అనితి'అని వేదాంతదేశికులు చెప్పిన వ్యుత్పత్తి కూడ యుక్తం కాదు.శకంధ్వాదిగణంలో చేర్చి 'బ్రహ్మన్ అన్' అన్నప్పుడు పరరూపం చేయడానికీ ప్రజ్ఞాదిగణంలో చేర్చి "అణ్"ప్రత్యయం చేయడానికీ తగిన ప్రమాణం లేదు.ప్రసిద్ధప్రయోగం గల పదాలను ఆకృతిగణాలలో చేర్చాలి గాని ఏదో విధంగా మన కిష్టమైన పదం సాధించడానికి ఆకృతి గణాలలో చేర్చడం యుక్తం కాదు. అంతే కాక **"బ్రహ్మ అనితి"**అను వ్యుత్పత్తి చెప్పినప్పుడు **'కర్మణ్యణ్'**వచ్చి 'బ్రహ్మణః' అను రూపం కావలసి ఉంటుంది.(భా.అ.ప్ర.పే.78). ఇక్కడ శ్రీరామానుజాచార్యులు ఇంకా ఇలా అన్నారు-"వేదంలో చెప్పబడినది అంతా అందరికీ గ్రాహ్యం కాదు.అందరికోసము నిర్మించబడినదై అన్ని వైపులా పొర్లుతూన్న ఉదపానంలో, దప్పిక కలవానికి ఎంత ప్రయోజనమో అంత పానీయమే. వానిచేత గ్రహించబడుతుంది. కాని అంతా ఏ విధంగా గ్రహించబడదో అట్లే అన్ని వేదాలలోను 'బ్రాహ్మణస్య విజానతః", ముముక్షు వైన వైదికునికి ఏది మోక్షసాధనమో అది మాత్రమే గ్రహించబడుతుంది కాని

ఇతర మైనది గ్రహించబడదు". ఇది అయుక్తం. 'సర్వతఃసంప్లుతోదక'శబ్దం నుండి "అందరి కోసం ఏర్పరచబడిన"అనే అర్థం లభించదు. కూపాదికం స్నానాదికమైన ఏదో కొన్ని ప్రయోజ నాల కోసమే నిర్మించబడుతుంది కాని అది సర్వార్థపరికల్పితం కాదు కూడ. స్త్రీ పశ్వాదులు కావా లనుకొనేవానికి కూపాదులవల్ల ప్రయోజనం ఏదీ ఉండదు కదా? సర్వశబ్దార్థానికి సంకోచం చేయడం న్యాయం కూడ కాదు. ఎంత ప్రయోజనమో అంతే వానిచేత గ్రహించ బడుతుంది అనడం కూడ యుక్తం కాదు. గ్రహించబడేది జలమే కాని ప్రయోజనం కాదు కదా? అర్థశబ్దం ప్రయోజనం అనే అర్థాన్నే బోధిస్తుంది కాని జలం అనే అర్థాన్ని బోధించదు. ఎంత అర్థంచేత, జలంచేత, ప్రయోజనమో అంతే జలం వానిచేత గ్రహించబడుతుంది అనడం యుక్తం. నేను అలాగే అన్నాను అనడం కూడ కుదరదు; అక్కడ 'యావాన్'అని ప్రథమాంత పదం ఉంది కదా? 'తేన' "ఉపాదీయతే'అని కర్మను, క్రియను రెండింటినీ మూలంలో లేనివాటిని కల్పించడం జరిగింది కదా? 'దప్పికొన్నవానికి'అని సంకోచించడం కూడ యుక్తం కాదు. స్నానం చెయ్యాలనుకొనేవాళ్లవంటివారు కూడ ఉంటారుకదా? 'పిపాసోః'అనేది కేవలం ఉదాహరణం కోసం చూపబడింది అని అంటే ఉద్యానానికి నీరు పెట్టదలచుకొనేవాడు మొదలైనవాళ్లను కూడ గ్రహించాలి. అది మాకిష్టమే అనడం కుదరదు. అలాంటివానికి మొత్తం కూపజలంతో ప్రయోజనం ఉంటుంది. అలాంటివాడు అంతమాత్రమే గ్రహిస్తాడు మొత్తం గ్రహించడు అని చెప్పడం కుదరదు.

బ్రాహ్మణశబ్దానికి వైదికుడు అనే అర్థం చెప్పకూడదు అని వెనుకనే చెప్పి ఉన్నాం. 'విజానతః'అనే శబ్దానికి కూడ ముముక్షువు అనే అర్థం లభించదు. ఎందువల్ల ననగా వేదవా దరతులైన వైదికులలో చాలామంది కామాత్ములే కనబడుతున్నారు. 'వైదికుడు' 'అథాతో ధర్మజిజ్ఞాసా' అంటూ కర్మాచరణమునందే ప్రవర్తిస్తాడు గాని వానికి ముముక్షుత్వం ఉండదు. "త్రైగుణ్యవిషయా వేదా నిస్త్రైగుణ్యో భవార్జున"అని అంటూ భగవంతుడే వైదికత్వం కామహేతు వని దూషించి ఉన్నాడు. ముముక్షుత్వం అనేది నిష్కామునికే ఉంటుంది. నిష్కాము డైతే అతడు వైదికుడు కాదు; అతడు వేదాంతియే అని సిద్ధాంతం.

ఎవ డైతే విశేషించి ఆత్మతత్త్వాన్ని తెలుసుకుంటాడో వానినే "విజానన్"అని అంటారు. అలాంటివాడు ముక్తుడే. ఇక వానికి ముముక్షుత్వం ఏమిటి? నిత్యముక్తు లైన అనంత - గరుడాదులు, ఈశ్వరుడు 'జానన్తః' అని నీవు కూడ అనవు కదా? మరొక విషయం ఏ మనగా - ముముక్షువులకు మాత్రమే జ్ఞానానికి అధికారం ఉంటుంది. ముముక్షువు వేదాంత శ్రవణాదికం చేసి ఆత్మను బాగా తెలుసుకొంటాడు గాన విజానత్త్వం ముముక్షుత్వం ఎలా అవుతుంది? ముముక్షుత్వం తరువాత లభించేది కదా విజ్ఞానం? "యదేవ మోక్షసాధనం తదేవ ఉపాదేయమ్"అనే వాక్యం మూలంలో లేనిది కల్పించబడింది; అందుచేత అది పూర్తిగా అప్రమాణం.

మోక్షసాధన మైన జ్ఞానం వేదాంతాలలో మాత్రమే వినబడుతుంది గాన 'వేదాలలో మోక్షసాధనం'అని చెప్పడం కూడ అయుక్తమే.ధర్మాదిసాధన మైన యజ్ఞాదికం వలె మోక్ష సాధనం కూడ వేదాలలోనే ఉంటే వేదాంతశ్రవణం వ్యర్థం అవుతుంది.పూర్వమీమాంస,ఉత్తర మీమాంస అంటూ రెండు శాస్త్రాలను కల్పించడం అయుక్తం అవుతుంది.సర్వశబ్దస్వారస్యాన్ని పట్టి ఉపనిషత్తులు కూడ వేదాలే అనడం యుక్తం కాదు."త్రైగుణ్యవిషయా వేదాః" అని భగవంతుడే అన్నాడు. ఉపనిషత్తులు సత్త్వాదిగుణాతీతమైన బ్రహ్మను ప్రతిపాదిస్తాయి కదా? (భా.అ.ప్ర.పే.80,81) 46

భాష్యమ్

తవ చ -

మూ. కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన,
మా కర్మఫలహేతుర్భూర్మా తే సంగోఽస్త్వకర్మణి. 47

బాలానందిని

తవేతి:- నీకైతే -

ప్ర.అ. కర్మణీతి:- తే = నీకు, కర్మణ్యేవ = కర్మయందే, అధికారః =అధికారము, ఫలేషు = ఫలాల విషయంలో, కదాచన = ఎన్నడూ కూడ, మా = లేకుండుగాక, కర్మఫలహేతుః = కర్మఫలాలకు కారణం, మా భూః = కాకుందువు గాక. తే = నీకు, అకర్మణి = కర్మ చేయకపోవడం విషయంలో కూడ, సంగః = ఆసక్తి, మాస్తు = లేకుండుగాక.

భాష్యమ్

కర్మణీతి:- కర్మణ్యేవ అధికారః,న జ్ఞాననిష్ఠాయాం,తే తవ-తత్ర చ కర్మ కుర్వతః మా ఫలేషు అధికారః అస్తు,కర్మఫలతృష్ణా మా భూత్ కదాచన, కస్యాంచిదప్యవస్థాయామ్ ఇత్యర్థః.యదా కర్మఫలే తృష్ణా తే స్యాత్ తదా కర్మఫలప్రాప్తేః హేతుః స్యాః;ఏవం మా కర్మఫలహేతుః భూః. యదా హి కర్మపలతృష్ణాప్రయుక్తః కర్మణి ప్రవర్తతే తదా కర్మ ఫలస్యైవ జన్మనో హేతుః భవేత్.యది కర్మఫలం నేష్యతే కిం కర్మణా దుఃఖరూపేణ ఇతి,మా,తే తవ, సంగః అస్తు అకర్మణి,అకరణే ప్రీతిః మా భూత్. 47

బాలానందిని

కర్మణీతి:- నీకు కర్మయందే అధికారం కాని జ్ఞాననిష్ఠలో అధికారం లేదు. అలాంటప్పుడు నువ్వు కర్మలు చేస్తూన్నా కూడ,నీకు ఏ అవస్థలోనూ కూడ ఫలాల విషయంలో

అధికారం లేకుండుగాక; అనగా పలాల విషయంలో ఆసక్తి లేకుండుగాక. కర్మఫలాలమీద ఆశ ఉంటే అప్పుడు నువ్వు కర్మఫలాలు లభించడానికి కారణం అవుతావు;ఈ విధంగా కర్మఫలకారణం కావద్దు.ఎప్పుడైతే(మానవుడు)కర్మఫలమునందు ఆశచేత ప్రేరితుడై కర్మలో ప్రవర్తిస్తాడో అప్పుడు కర్మఫలమైన జన్మకు హేతువు అవుతాడు.కర్మఫలం కావాలని అనుకొన నప్పుడు దుఃఖరూపమైన ఈ కర్మ చేయడం ఎందుకు అనుకొని నీకు, అకర్మయందు, కర్మలను ఆచరించకపోవడమునందు, సంగం,ప్రీతి,లేకుండుగాక.(అలా అనుకొని కర్మాచరణం మానకూడదు అని భావం).

భా.అ.ప్ర.:- ఇక్కడ శ్రీరామానుజాచార్యులు "ఫలస్య-ఆకలి తొలగడం మొదలైన దానికి,నీవు హేతువు కాకూడదు"అని వ్రాశారు.అది అయుక్తం. ఎందువల్ల ననగా భోజనాది కర్మలు కర్మలు కావు;అకలి తగ్గడం మొదలైనది ఫలమూ కాదు. ఏ శాస్త్రమూ కూడ ఎవనికీ కూడ భోజనాదికర్మలను విధించడం లేదు కదా?అలాంటిదేదైనా ఉంటే నీకు భోజనాదికర్మయందే అధికారం అని చెప్పడానికి అవకాశం ఉండేది.రాత్రిభోజనం, ఉపవాసానంతరపారణం మొదలైన వైతే నిత్యనైమిత్తికకర్మాంగాలే గాన వాటి విషయంలో స్వతంత్రంగా విధి ఉండదు. ఇక్కడ చెప్పిన కర్మఫలం క్షున్నివృత్తి మొదలైనది మాత్రమే అయితే భోక్తకు దానియందు సంగం లేకుండా ఎలా ఉంటుంది?యజ్ఞాదికర్మలవల్ల కలిగే స్వర్గాదిఫల మైతే ఎప్పుడో కాలాంతరంలో లభిస్తుంది గాన దాని విషయంలో పురుషుడు సంగం త్యజించకలుగుతాడు. ఫలంమీద కోరిక లేకుండా యజ్ఞాదులు చేస్తే చేయవచ్చును; ఆకలికొన్నవాడు క్షున్నివృత్తిని అపేక్షించకుండా భోజనంలో ఎందుకు ప్రవర్తిస్తాడు?అలా కాకపోతే ఆకలి లేనివాడు భోజనానికి సిద్ధపడాలి.ఆకలి, దప్పిక మొదలైనవి ప్రాణధర్మాలు, భోజనాదులు శరీరధర్మాలు అని అనుసంధానం చేసుకొంటూండాలి అనేది జ్ఞాననిష్ఠ క్రిందకే వస్తుంది;అలా మననం చేయడం వికారరహిత మైన ఆత్మను చూడడానికి హేతువు కదా?అట్లే "కర్మకీ,ఫలానికీ కూడ హేతువు అవకుము"అని శ్రీరామానుజాచార్యులు చెప్పినది కూడ అయుక్తమే. "కర్మణ్యే వాధికారః" అని నువ్వు కర్మకు హేతువుగా ఉండుము చెప్పబడింది కదా?

నేను కర్తను అని అనుసంధానం చేసికొనకుండా ఉండడమే కర్మాహేతుత్వం అనగా అని వేదాంతదేశికులు చెప్పినది కూడ అయుక్తమే.కర్తృత్వానభిసంధానం ఫలానికి మాత్రమే హేతువు కాకుండా ఉంటుంది. నేను కర్తను అని ఎవుడు అనుకొంటాడో అతడే ఫలాన్ని గూర్చి ఆలోచిస్తాడు కదా? ఫలానికి హేతువు కాకపోతే ఫలమే ఏ విధంగా ఉత్పన్నం కాదో కర్మాహేతు వైతే కర్మయే జరగదు కదా? (భా.అ.ప్ర.పే.82) 47

భాష్యమ్

యది కర్మఫలప్రయుక్తేన న కర్తవ్యం కర్మ కథం తర్హి కర్తవ్యమ్ ఇతి? ఉచ్యతే-

మూ. యోగస్థః కురు కర్మాణి సంగం త్యక్త్వా ధనంజయ,
సిద్ధ్యసిద్ధ్యోః సమో భూత్వా సమత్వం యోగ ఉచ్యతే. 48

బాలానందిని

యదీతి:- కర్మఫలంచే ప్రేరితుడై (కర్మఫలంకోసం)కర్మ చేయగూడదు అన్నట్లయితే మరి ఎట్లు చెయ్యాలి?చెప్పబడుచున్నది-

ప్ర.అ. యోగస్థః ఇతి:- ధనంజయ = అర్జునా ! సంగమ్ = ఆసక్తిని,త్యక్త్వా = విడచి, సిద్ధ్యసిద్ధ్యోః = సిద్ధియందు, అసిద్ధియందూ కూడ, సమః భూత్వా = సముడవై, యోగస్థః = యోగములో ఉన్నవాడవై, కర్మాణి = కర్మలను, కురు = చేయుము. సమత్వమ్ సమంగా ఉండడమే, యోగః ఇతి = యోగం అని, ఉచ్యతే = చెప్పబడుచున్నది.

భాష్యమ్

యోగస్థః ఇతి:- యోగస్థః సన్ కురు కర్మాణి, కేవలమ్ ఈశ్వరార్థమ్, తత్రాపి ఈశ్వరః మే తుష్యతామ్ ఇతి సంగం త్యక్త్వా, ధనంజయ,ఫలతృష్ణాశూన్యేన క్రియమాణే కర్మణి సత్త్వశుద్ధిజా, జ్ఞానప్రాప్తిలక్షణా సిద్ధిః, తద్విపర్యయజా అసిద్ధిః; తయోః సిద్ధ్యసిద్ధ్యోః అపి సమః తుల్యః భూత్వా కురు కర్మాణి. కః అసౌ యోగః యత్రస్థః కురు ఇతి ఉక్తమ్?ఇదమేవ తత్ సిద్ధ్యసిద్ధ్యోః సమత్వం యోగః ఉచ్యతే. 48

బాలానందిని

యోగస్థః ఇతి:- అర్జునా ! యోగంలో ఉన్నవాడవై,కేవలం ఈశ్వరునికొరకై, అందులోనూ కూడ నా విషయంలో ఈశ్వరుడు సంతోషించాలి అనే సంగాన్ని కూడ విడచి,కర్మలు చేయుము.ఫలమునందు ఆసక్తి లేకుండా కర్మ చేస్తూండగా అంతఃకరణశుద్ధివల్ల కలిగే జ్ఞానప్రాప్తి రూప మైనది సిద్ధి;అందుకు విపరీతమైన స్వరూపం గలది అసిద్ధి. ఈ సిద్ధి - అసిద్ధులు రెండింటి విషయంలోను సముడవుగా ఉంటూ కర్మలు చెయ్యుము.దేనిలో నిలచి కర్మలు చెయ్యి అని చెప్పబడిందో ఆ యోగం ఏది?సిద్ధి-అసిద్ధుల విషయంలో సమంగా ఉండడం అనేది యోగం అని చెప్పబడుతూన్నది.

భా.అ.ప్ర. ఇక్కడ శ్రీరామానుజాచార్యులు - సంగం త్యక్త్వా అనగా రాజ్యమూ, బంధువులూ మొదలైన వాటి విషయంలో సంగం విడచి,వాటిలో అంతర్గతమైన విజయాది సిద్ధ్యసిద్ధులలో సముడవై అని వ్యాఖ్యానించారు.అది అర్థరహితం. రాజ్యాదిఫలసంగం విడిచి పెట్టాలి అనేది "మా ఫలేషు కదాచన" అనేదానిచేతనే చెప్పబడించి.బంధువులు మొదలైన వారియందు సంగాన్ని విడిచిపెట్టాలి అనే విషయం'అశోచ్యాన్' ఇత్యాదికంతో ప్రారంభించి

"న త్వం శోచితుమర్హసి"అనే వరకు ఉన్న గ్రంథంచేత ప్రతిపాదించబడింది. ప్రధానమైన ఫలముయొక్క సిద్ధ్యసిద్ధుల విషయంలో సమత్వం అనే అర్థం కాదని తదంతర్భూతవిజయాది సిద్ధ్యసిద్ధులలో సమత్వం అనే అర్థం చెప్పడం అయుక్తం. ప్రధానఫలసిద్ధ్యసిద్ధుల విషయంలో సమత్వం ఇంతకు ముందుకు చెప్పబడలేదు కదా. "సుఖదుఃఖే సమే కృత్వా" అనే శ్లోకంలో జయాపజయసమత్వం చెప్పబడే ఉంది. (భా. అ. ప్ర. పే. 83) 48

భాష్యమ్

యత్పునః సమత్వబుద్ధియుక్తమ్ ఈశ్వరారాధనార్థం కర్మ ఏతస్మాత్ కర్మణః

మూ. దూరేణ హ్యవరం కర్మ బుద్ధియోగాద్ధనంజయ,
బుద్ధౌ శరణమన్విచ్ఛ కృపణాః ఫలహేతవః. 49

బాలానందిని

యత్పునరితి:- ఈశ్వరారాధనకోసం చేయబడే, సమత్వబుద్ధియుక్త మైన ఏ కర్మ ఉన్నదో ఈ కర్మకంటె -

ప్ర. అ. దూరేణేతి:- ధనంజయ = అర్జునా! కర్మ = ఫలాపేక్షతో చేసే కర్మ, బుద్ధి యోగాత్ = సముత్వబుద్ధితో కూడిన కర్మకంటె, దూరేణ = చాలాదూరంచేత, అవరమ్ = తక్కువది, నీచ మైనది. బుద్ధౌ = బుద్ధియందు, శరణమ్ = రక్షణమును, అన్విచ్ఛ = ప్రార్థించుము. కృపణాః = ఫలమునందు ఆసక్తి గలవారు, ఫలహేతవః = ఫలానికి హేతువు లవుతారు.

భాష్యమ్

దూరేణేతి:- దూరేణ అతివిప్రకర్షేణ, హి అవరం నికృష్టం, కర్మ ఫలార్థినా క్రియమాణం, బుద్ధియోగాత్ సమత్వబుద్ధియుక్తాత్ కర్మణః జన్మమరణాదిహేతుత్వాత్, ధనంజయ. యతః ఏవం, యోగవిషయాయాం బుద్ధౌ, తత్పరిపాకజాయాం వా సాంఖ్య బుద్ధౌ, శరణమ్ ఆశ్రయమ్ అభయప్రాప్తికారణమ్, అన్విచ్ఛ ప్రార్థయస్వ; పరమార్థ జ్ఞానశరణః భవ ఇత్యర్థః యతః అవరం కర్మ కుర్వాణాః, కృపణాః దీనాః, ఫలహేతవః ఫలతృష్ణాప్రయుక్తాః సన్తః "యో వా ఏతదక్షరం గార్గ్యవిదిత్వాస్మాల్లోకాత్ప్రైతి స కృపణః"(బృ. ఉ. 3. 8. 10)ఇతి శ్రుతేః. 49

బాలానందిని

దూరేణేతి:- అర్జునా ! ఫలం కావాలనుకొనేవాడు చేసే కర్మ బుద్ధియోగంకంటె, అనగా సమత్వబుద్ధితో చేసే కర్మకంటె, చాల నికృష్ట మైనది. అందువల్ల బుద్ధియందు, అనగా యోగ

విషయమైన బుద్ధియందు,లేదా,యోగవిషయబుద్ధి పరిపాకం చెందగా కలిగే సాంఖ్యబుద్ధి యందు,శరణమును అభయప్రాప్తికి కారణమైన ఆశ్రయాన్ని, ప్రార్థించుము. పరమార్థజ్ఞానమే శరణము అని నమ్ముకొనుము అని అర్థం. ఎందువల్ల ననగా–నికృష్టమైన కర్మ చేసే దీనులు, ఫలమునందు ఆసక్తిచేత ప్రేరేపించబడినవారై, ఫలానికి హేతువు అవుతారు."యో వా...కృపణః" (గార్గీ! ఈ ఆత్మను తెలుసుకొనకుండా ఎవడైతే ఈ లోకంనుంచి వెళ్లిపోతాడో అతడు కృపణుడు,దీనుడు)అని శ్రుతి చెపుతూన్నది.

భా.అ.ప్ర.: ఇక్కడ 'బుద్ధియోగాత్'అనే పదానికి "బుద్ధియోగంతో కూడిన కర్మకంటె" అని శ్రీరామానుజాచార్యులు అర్థం చెప్పగా "జహల్లక్షణచేత ఈ అర్థం చెప్పాలి"అని వేదాంత దేశికులు ఇందుకు ఉపపత్తి చెప్పారు. ఇద్దరు చెప్పినదీ అయుక్తమే.లక్షణను ఆశ్రయించడం దుష్ట మైనది.'బుద్ధియుక్తాత్'అను అర్థమే సరిపోతూన్నప్పుడు 'బుద్ధియోగయుక్తాత్'అని చెప్పడం అనవాశ్యకం కూడ.(భా.అ.ప్ర.పే.84). 49

భాష్యమ్

సమత్వబుద్ధియుక్తః సన్ స్వధర్మమ్ అనుతిష్ఠన్ యత్ ఫలం ప్రాప్నోతి తత్ శృణు –

మూ. బుద్ధియుక్తో జహాతీహ ఉభే సుకృతదుష్కృతే,
తస్మాద్యోగాయ యుజ్యస్వ యోగః కర్మసు కౌశలమ్. 50

బాలానందిని

సమత్వేతి : సమత్వబుద్ధితో కూడినవాడై స్వధర్మాన్ని అనుష్ఠించేవాడు ఏ ఫలాన్ని పొందుతాడో అది వినుము–

ప్ర.అ. బుద్ధీతి:– బుద్ధియుక్తః = సమత్వబుద్ధితో కూడినవాడు, సుకృతదుష్కృతే = పుణ్యపాపములను, ఉభే = రెండింటినీ, ఇహ = ఇక్కడనే, జహాతి = విడచును. తస్మాత్ = ఆ కారణంవలన, యోగాయ = బుద్ధియోగానికి, యుజ్యస్వ = సంబంధించి ఉండుము. కర్మసు = కర్మలయందు, కౌశలమ్ = నేర్పు, యోగః = యోగ మని చెప్పబడుచున్నది.

భాష్యమ్

బుద్ధీతి:– బుద్ధియుక్తః సమత్వవిషయయా బుద్ధ్యా యుక్తః బుద్ధియుక్తః, జహాతి పరిత్యజతి,ఇహ అస్మిన్ లోకే,ఉభే సుకృత–దుష్కృతే పుణ్యపాపే,సత్త్వశుద్ధిజ్ఞానప్రాప్తి ద్వారేణ యతః తస్మాత్ సమత్వబుద్ధియోగాయ యుజ్యస్వ ఘటస్వ.యోగో హి కర్మసు కౌశలం స్వధర్మాఖ్యేషు కర్మసు వర్తమానస్య యా సిద్ధ్యసిద్ధ్యోః సమత్వబుద్ధిః ఈశ్వరార్పిత

చేతస్తయా, తత్ కౌశలం కుశలభావః.తద్ధి కౌశలం యద్ బన్ధస్వభావాన్యపి కర్మాణి సమత్వబుద్ధ్యా స్వభావాత్ నివర్తన్తే. తస్మాత్ సమత్వబుద్ధియుక్తో భవ త్వమ్. 50

బాలానందిని

బుద్ధీతి:- సమత్వం విషయంగా గల బుద్ధితో(సమబుద్ధితో) కూడినవాడు, జహాతి = పరిత్యజిస్తాడు. ఇహ = ఈ లోకంలో,పుణ్యపాపాలను రెండింటినీ కూడా అంతఃకరణ ద్వారా. జ్ఞానం పొందడం ద్వారా. అందువలన సమత్వబుద్ధియోగంకొరకు ప్రయత్నించుము. కర్మలయందు నేర్పే యోగము. స్వధర్మము లని చెప్పబడే కర్మలను ఆచరిస్తూన్నవానికి, అతడు తన మనస్సును ఈశ్వరునియందు అర్పించి ఉండడంచేత, సిద్ధ్యసిద్ధుల విషయంలో ఏ సమత్వబుద్ధి ఉంటుందో అదే కౌశలం (నేర్పు). సహజంగా బంధం కలిగించే వయినా కర్మలు, సమత్వబుద్ధిచేత, తమ స్వభావాన్ని విడిచిపెట్టివేస్తాయి అంటే అదే కదా కౌశలం! అందువల్ల నువ్వు సమత్వబుద్ధితో కూడినవాడవు అగుము.

భా.అ.ప్ర.:- "బుద్ధియోగయుక్తుడు అనే యోగం బుద్ధియోగం.కౌశలం అనగా చాల సామర్థ్యం.చాల సామర్థ్యంచేత సాధించదగినది అని అర్థం" అని శ్రీరామానుజాచార్యులు ఇక్కడ వ్రాసినది అయుక్తం.'బుద్ధి' శబ్దానికి బుద్ధియోగం అనే అర్థం లేదు.ప్రకృతయోగం కర్మయోగం.అందుచేత కర్మయోగం బుద్ధియోగశబ్దంచేత చెప్పబడదు కదా? 'బుద్ధి'శబ్దం 'జ్ఞాన' శబ్దానికి పర్యాయం.అందుచేత బుద్ధియోగం అనగా జ్ఞానయోగం అనే అర్థం మాత్రమే లభిస్తుంది.వెనుకటి శ్లోకంలో 'బుద్ధియోగ'శబ్దం ఉన్నది గాన ఈ శ్లోకంలోని 'బుద్ధి'శబ్దం బుద్ధియోగం అనే అర్థాన్ని బోధిస్తుంది అనడానికి కూడ వీలు లేదు.అక్కడ కూడ 'బుద్ధి యుక్తాత్'అనే అర్థమే సిద్ధాంతీకరించబడింది.'యోగః' 'కౌశలమ్'అనే పదాలకు స్వారసికంగా సామానాధికరణ్యం కనబడుతూండగా దాన్ని విరిచి 'కౌశలసాధ్యమైనది'అని లాక్షణికార్థం చెప్పడానికి తగిన ప్రమాణం ఏదీ లేదు(భా.అ.ప్ర.పే.84) 50

భాష్యమ్

యస్మాత్ -

మూ. కర్మజం బుద్ధియుక్తా హి ఫలం త్యక్త్వా మనీషిణః,
జన్మబన్ధవినిర్ముక్తాః పదం గచ్ఛన్త్యనామయమ్. 51

బాలానందిని

యస్మాదితి - ఎందువల్ల ననగా ("యోగాయ యుజ్యస్వ"అని ఎందువల్ల చెపుతున్నానగా)-

ప్ర.అ. **కర్మజమితి** :- బుద్ధియుక్తాః = సమత్వబుద్ధితో కూడిన, మనీషిణః = విద్వాంసులు, కర్మజమ్ = కర్మవల్ల కలిగిన, ఫలమ్ = ఫలమును, త్యక్త్వా = విడచి, జన్మబన్ధవినిర్ముక్తాః = జన్మ అనే బంధమునుండి ముక్తులై, అనామయమ్ = ఏ కష్టములూ లేని, పదమ్ = స్థానమును, గచ్ఛన్తి హి = పొందుచున్నారు కదా?

భాష్యమ్

కర్మజమితి:- కర్మజం ఫలం 'త్యక్త్వా'ఇతి వ్యవహితేన సంబన్ధః. ఇష్టానిష్టదేహప్రాప్తిః కర్మజం ఫలం,కర్మభ్యః జాతం,బుద్ధియుక్తాః సమత్వబుద్ధియుక్తాః, హి యస్మాత్,ఫలం,త్యక్త్వా పరిత్యజ్య, మనీషిణః జ్ఞానినః భూత్వా, జన్మబన్ధవినిర్ముక్తాః - జన్మైవ బన్ధః జన్మబన్ధః, తేన వినిర్ముక్తాః, జీవన్తః ఏవ జన్మబన్ధవినిర్ముక్తాః సన్తః, పదం పరమం విష్ణోః మోక్షాఖ్యం,గచ్ఛన్తి, అనామయం సర్వోపద్రవరహితమిత్యర్థః. **అథవా-"బుద్ధియోగాద్ధనంజయ"** ఇత్యారభ్య పరమార్థదర్శనలక్షణైవ సర్వతః సంప్లుతోదకస్థానీయా కర్మయోగజసత్త్వశుద్ధిజనితా బుద్ధిః దర్శితా,సాక్షాత్ సుకృతదుష్కృతప్రహాణాది హేతుత్వశ్రవణాత్. 51

బాలానందిని

కర్మజమితి :- కర్మజం ఫలం, దీనికి 'త్యక్త్వా' అనే దూరంగా ఉన్న పదంతో అన్వయం. కర్మవల్ల కలిగే ఫలం అనగా ఇష్టములూ అనిష్టములూ అయిన దేహాల ప్రాప్తి. దానిని, బుద్ధి యుక్తులు, సమత్వబుద్ధితో కూడినవారు. హి = ఎందువల్ల, ఫలాన్ని విడిచి, మనీషిణః = జ్ఞానవంతులై,జన్మయే బంధం;దానిచేత; విడవబడినవారై,జీవించి ఉండగానే జన్మబంధ వినిర్ముక్తులై,మోక్షం అనే పేరు గలది,అనామయమూ,అనగా ఏ విధాలైన ఉపద్రవాలు లేనిదీ అయిన విష్ణువుయొక్క పరమపదాన్ని పొందుతారు.

అవ. నలభైతొమ్మిదవ శ్లోకంలోని 'బుద్ధి యోగాత్, అనేదానికి సవత్వబుద్ధియుక్తమైన కర్మవలన అని అర్థం చెప్పి తరువాత వచ్చిన బుద్ధిశబ్దానికి కూడ ఆ అర్థమే చెప్పబడింది. అయితే సమత్వబుద్ధి సాక్షాత్తు సుకృతదుష్కృతవినాశాదులకు కారణం కాదు.సాంఖ్యబుద్ధిని పుట్టించడం ద్వారా మాత్రమే అది వాటికి కారణం అవుతుంది.అందుచేత 'బుద్ధి'శబ్దానికి ఈ అన్ని శ్లోకాలలోను కూడా సాంఖ్యబుద్ధి అనియే అర్థం చెప్పవచ్చును అని చెపుతున్నారు. **అథవా ఇతి**:-లేదా "బుద్ధియోగాద్ధనంజయ"అని మొదలు సర్వతఃసంప్లుతోదకంవంటిది, కర్మయోగంవల్ల పుట్టిన అంతఃకరణశుద్ధివలన కలిగినది అయిన పరమార్థతత్త్వజ్ఞాన రూపమైన బుద్ధియే చూపబడింది అని చెప్పవచ్చును.ఎందువల్ల ననగా సాక్షాత్తు సుకృతదుష్కృతాలను విడవడానికి ఈ బుద్ధి హేతు వని చెప్పబడుచున్నది. 51

భాష్యమ్

యోగానుష్ఠానజనితసత్త్వశుద్ధిజా బుద్ధిః కదా ప్రాప్యతే ఇతి. ఉచ్యతే -

మూ. యదా తే మోహకలిలం బుద్ధిర్వ్యతితరిష్యతి.
తదా గన్తాసి నిర్వేదం శ్రోతవ్యస్య శ్రుతస్య చ. 52

బాలానందిని

యోగేతి :- యోగానుష్ఠానంవల్ల కలిగిన అంతఃకరణశుద్ధిచేత పుట్టే బుద్ధి ఎప్పుడు లభిస్తుంది? చెప్పబడుచున్నది(చెపుతున్నాం;విను).

ప్ర. అ. యదేతి:- తే బుద్ధిః = నీ బుద్ధి, యదా = ఎప్పుడైతే, మోహకలిలమ్అవివేకం అనే కాలుష్యాన్ని, వ్యతితరిష్యతి = దాటివేస్తుందో, తదా = అప్పుడు, శ్రోతవ్యస్య = వినదగిన దాని విషయంలోను, శ్రుతస్య చ = విన్నదాని విషయంలోను, నిర్వేదమ్ = వైరాగ్యమును, గన్తాసి = పొందగలవు.

భాష్యమ్

యదేతి :- యదా = యస్మిన్ కాలే, తే తవ, మోహకలిలం మోహాత్మకమ్ అవివేకరూపం కాలుష్యం,యేన ఆత్మానాత్మవివేకబోధం కలుషీకృత్య విషయం ప్రత్యన్తః కరణం ప్రవర్తతే తత్,తవ బుద్ధిః,వ్యతితరిష్యతి వ్యతిక్రమిష్యతి,శుద్ధిభావమ్ ఆపత్స్యతే ఇత్యర్థః. తదా తస్మిన్ కాలే,గన్తాసి,ప్రాప్స్యసి,నిర్వేదం వైరాగ్యం,శ్రోతవ్యస్య చ శ్రుతస్య చ. తదా శ్రోతవ్యం శ్రుతం చ నిష్ఫలం ప్రతిపద్యతే (ప్రతిభాతి) ఇతి అభిప్రాయః. 52

బాలానందిని

యదేతి:- ఎప్పుడైతే,ఏ కాలంలో నైతే,తే=నీయొక్క మోహకలిలమ్ = మోహాత్మక మైన,అనగా అవివేకరూప మైన కాలుష్యాన్ని, దేనిచేతనైతే ఆత్మానాత్మవివేకజ్ఞానాన్ని కలుషం చేసి అంతఃకరణం విషయాల వైపు ప్రవర్తింపచేయబడుతుందో అట్టి కాలుష్యాన్ని,నీ బుద్ధి దాటుతుందో,అనగా పరిశుద్ధత్వాన్ని పొందుతుందో,అప్పుడు శ్రోతవ్యం విషయంలోను,శ్రుతం విషయంలోను,వైరాగ్యాన్ని పొందుతావు. అప్పుడు వినదగినది,విన్నదీ కూడ నిష్ఫలం అవుతుంది;(అనగా ఆత్మభిన్న మైనది అంతా కూడ వ్యర్థంగా కనబడుతుంది). అని అభిప్రాయం. 52

భాష్యమ్

మోహకలిలాత్యయద్వారేణ లబ్ధాత్మవివేకప్రజ్ఞః కదా కర్మయోగజం ఫలం పరమార్థయోగమ్ అవాప్స్యామి ఇతి చేత్ శృణు -

మూ. శ్రుతివిప్రతిపన్నా తే యదా స్థాస్యతి నిశ్చలా,
సమాధావచలా బుద్ధిస్తదా యోగమవాప్స్యసి. 53

బాలానందిని

మోహేతి :- అవివేకకాలుష్యం తొలగిపోవడం ద్వారా ఆత్మవివేకంవల్ల కలిగిన ప్రజ్ఞ. (జ్ఞానం)కలవాడనై,కర్మయోగంవల్ల కలిగే ఫలమైన పరమార్థయోగాన్ని ఎప్పుడు పొందుతాను అని అంటే విను -

ప్ర.అ. **శ్రుతీతి:-** శ్రుతివిప్రతిపన్నా=వేరు వేరు శ్రుతలచేత అనేకవిధాల ఆలోచనలతో నిండిన (విక్షిప్తమైన),తే = నీయొక్క, బుద్ధిః = బుద్ధి; యదా = ఎప్పుడు; సమాధౌ = ఆత్మ యందు, నిశ్చలా = నిశ్చలమైనదై, (విక్షేపం లేనిదై), స్థాస్యతి = నిలుస్తుందో, అచలా = చలించనిదై (సంశయాలు లేనిదై) ఉంటుందో, తదా = అప్పుడు, యోగమ్ = యోగాన్ని అవాప్స్యసి = పొందగలవు.

భాష్యమ్

శ్రుతివిప్రతిపన్నేతి:- శ్రుతివిప్రతిపన్నా అనేక సాధ్యసాధనసంబన్ధప్రకాశన శ్రుతిభిః శ్రవణైః విప్రతిపన్నా నానాప్రతిపన్నా శ్రుతివిప్రతిపన్నా,విక్షిప్తా సతీ,తే తవ బుద్ధిఃయదా యస్మిన్ కాలే స్థాస్యతి స్థిరీభూతా భవిష్యతి, నిశ్చలా విక్షేపచలనవర్జితా సతీ, సమాధౌ-సమాధీయతే చిత్తమ్ అస్మిన్ (ఇతి) ఇతి సమాధిఃఆత్మా.తస్మిన్ ఆత్మని ఇత్యేతత్.అచలా తత్రాపి వికల్పవర్జితా ఇత్యేతత్.బుద్ధిః అన్తఃకరణం తదా తస్మిన్ కాలే యోగమ్ అవాప్స్యసి,వివేకప్రజ్ఞాం సమాధిం ప్రాప్స్యసి. 53

శ్రుతీతి:- అనేకములైన సాధ్యాలయొక్క అనేకములైన సాధనాలయొక్క సంబంధాన్ని ప్రకాశింపచేసే శ్రుతులచేత,వేదాలచేత, విప్రతిపన్నమైన, నానావిధమార్గాలను పొందిన, విక్షిప్తమైన(నిలకడ లేని)నీ బుద్ధి,ఏ కాలంలో,స్థిరం అవుతుందో నిశ్చలా=విక్షేపరూపరమైన చలనం లేనిదై,సమాధియందు, దేనిమీద చిత్తం నిలుపబడుతుందో అది సమాధి,అనగా ఆత్మ, ఆ ఆత్మయందు(స్థిరంగా ఉంటుందో) అప్పుడు కూడ వికల్పాలు లేనిదై ఉంటుంది అని తాత్పర్యం,బుద్ధి అనగా అంతఃకరణం,అప్పుడు యోగాన్ని పొందగలవు.వివేకప్రజ్ఞను సమాధినీ (చిత్తైకాగ్రతనూ) పొందగలవు.(నిశ్చలత్వం అనగా విక్షేపం లేకపోవడం. అచలత్వం అనగా వికల్పాలు లేకపోవడం.విక్షేపం అనగా విపర్యయజ్ఞానం,భ్రాంతి,వికల్పం అనగా సంశయం).

భా.అ.ప్ర:- ఇక్కడ శ్రీరామానుజాచార్యులు "సమాధౌ అనగా మనస్సునందు, బుద్ధి నిలుస్తుంది"అని చెప్పారు.అది యుక్తం కాదు.మనస్సు,బుద్ధీ కూడా ఒకే తత్త్వం

అవడం చేత ఒకటి ఆధార మనీ,మరొకటి ఆధేయ మనీ చెప్పడం యుక్తం కాదు.ఒకే అంతఃకరణం సంకల్పవికల్పరూపమై నప్పుడు మనస్సు అనీ, నిశ్చయరూప మైనప్పుడు బుద్ధి అనీ చెప్పబడుతుంది."విప్రతిపన్నా"అనగా "విశేషించి పొందినది'అని అర్థం చెప్పడం కూడ యుక్తం కాదు. విప్రతిప్రత్తి శబ్దానికి విరుద్ధజ్ఞానము అని అర్థం అయినట్లే విప్రతిపన్న శబ్దానికి అలాంటి అర్థమే చెప్పడం న్యాయం. (భా.అ.ప్ర.పే.88) 53

భాష్యమ్

ప్రశ్నబీజం ప్రతిలభ్య అర్జునః ఉవాచ లబ్ధసమాధిప్రజ్ఞస్య లక్షణబుభుత్సయా–

అర్జున ఉవాచ –

మూ. స్థితప్రజ్ఞస్య కా భాషా సమాధిస్థస్య కేశవ,
స్థితధీః కిం ప్రభాషేత కిమాసీత వ్రజేత కిమ్. 54

బాలానందిని

ప్రశ్నేతి:– అర్జునుడు,ప్రశ్న వేయడానికి నిమిత్తం దొరకిన దని గ్రహించి సమాధి ప్రజ్ఞను(ఆత్మయందు లేదా సమాధానంచేత ప్రజ్ఞను,అనగా పరమార్థదర్శనాన్ని పొందినవాని లక్షణాలను తెలుసుకొనా లనే కోరికతో ఇలా అన్నాడు –

ప్ర.అ. స్థితేతి :– కేశవ = శ్రీకృష్ణా ! సమాధిస్థస్య = సమాధిలో ఉన్న,ఆత్మయందు ఉన్న, స్థితప్రజ్ఞస్య = స్థితప్రజ్ఞునియొక్క భాషా = భాష, కా = ఏది? స్థితధీః = స్థితప్రజ్ఞుడు, కిమ్ = ఏమి, ప్రభాషేత = మాటలాడతాడు? కిమ్ = ఎట్లు, ఆసీత = కూర్చుంటాడు? కిమ్ = ఎట్లు, వ్రజేత = వెడతాడు?

భాష్యమ్

స్థిప్రజ్ఞస్యేతి :– స్థితా ప్రతిష్ఠితా "అహమ్ అస్మి పరం బ్రహ్మ" ఇతి ప్రజ్ఞా యస్య సః స్థితప్రజ్ఞః;తస్య కా భాషా?కిం తస్య భాషణమ్, వచనం,కథమ్ అసౌ పరైః భాష్యతే ఇత్యర్థః. సమాధిస్థస్య సమాధౌ స్థితస్య,కేశవ, స్థితధీః స్థితప్రజ్ఞః స్వయం వా కిం ప్రభాషేత?కిమ్ ఆసీత,వ్రజేత కిమ్?ఆసనం వ్రజనం వా తస్య కథమ్ ఇత్యర్థః. స్థితప్రజ్ఞస్య లక్షణమ్ అనేన శ్లోకేన పృచ్ఛ్యతే. 54

బాలానందిని

స్థితప్రజ్ఞస్యేతి :–"స్థితా ప్రతిష్ఠితా అహమస్మి పరం బ్రహ్మ ఇతి ప్రజ్ఞా యస్య సః స్థితప్రజ్ఞః" అని విగ్రహవాక్యం.నేను పరబ్రహ్మను అని ఎవని ప్రజ్ఞ(జ్ఞానం)స్థిరంగా నిలిచి

ఉంటుందో అతడు స్థితప్రజ్ఞుడు.వాని భాష, భాషణం,వచనం ఏది?ఇతడు పరులచేత ఎలా మాటలాడబడతాడు అని అర్థం.(ఇతనిని గూర్చి ఇతరులు ఏమంటారు అని భావం). సమాధిలో ఉన్న స్థితప్రజ్ఞునియొక్క; శ్రీకృష్ణా!స్థితప్రజ్ఞుడు తాను ఎట్లు మాట్లాడతాడు?ఎలా కూర్చుంటాడు?ఎలా నడుస్తాడు?అతడు ఒక చోట కూర్చునే పద్ధతి ఎలా ఉంటుంది?మరొక చోటికి వెళ్లే పద్ధతి ఎలా ఉంటుంది?ఈ శ్లోకంచేత స్థితప్రజ్ఞుని లక్షణం ప్రశ్నించబడు చున్నది.

వి. లోకులు ఎలాంటివానిని స్థితప్రజ్ఞు డంటారు?స్థితప్రజ్ఞుడు తనను గూర్చి తాను ఏమనుకొంటాడు! వాని మనోవ్యాపారం ఎలా ఉంటుంది?వాని శరీరవ్యాపారం ఎలా ఉంటుంది?వాని వాగ్వ్యాపారం ఎలా ఉంటుంది అని అర్జునుని ప్రశ్నలభావం(భా.అ.ప్ర).

భా.అ.ప్ర. :–"స్థితప్రజ్ఞస్య కా భాషా" అనేదానికి శ్రీరామానుజాచార్యులు "స్థితప్రజ్ఞుణ్ణి చెప్పే శబ్దం ఏమిటి" అని అర్థం చెప్పారు. అది అయుక్తం.'స్థితప్రజ్ఞ'శబ్దమే స్థితప్రజ్ఞుణ్ణి(స్థిత ప్రజ్ఞు డనే అర్థం)చెపుతూంటే మరొక వాచకపదాన్ని గూర్చి ప్రశ్న నిరర్థకం కదా?54

భాష్యమ్

యః హి ఆదితః ఏవ సంన్యస్య కర్మాణి జ్ఞానయోగనిష్ఠాయాం ప్రవృత్తః యశ్చ కర్మయోగేన తయోః "ప్రజహాతి"ఇత్యారభ్య అధ్యాయసమాప్తిపర్యన్తం స్థితప్రజ్ఞలక్షణం సాధనం చ ఉపదిశ్యతే, సర్వత్రై వ హి అధ్యాత్మశాస్త్రే కృతార్థలక్షణాని యాని తాన్యేవ సాధనాని ఉపదిశ్యన్తే యత్నసాధ్యత్వాత్.యాని యత్నసాధ్యాని సాధనాని,లక్షణాని చ భవన్తి తాని.

శ్రీభగవానువాచ –

మూ. ప్రజహాతి యదా కామాన్ సర్వాన్ పార్థ మనోగతాన్.
ఆత్మన్యేవాత్మనా తుష్టః స్థితప్రజ్ఞస్తదోచ్యతే. 55

బాలానందిని

య ఇతి:– ఎవడైతే మొదటనే (బ్రహ్మచారిగా ఉండగానే)కర్మలను సంన్యసించి జ్ఞానయోగనిష్ఠయందు ప్రవర్తిస్తాడో,ఎవడైతే కర్మయోగం ద్వారా జ్ఞానయోగనిష్ఠలో ప్రవర్తిస్తాడో వారిద్దరి విషయంలోనూ, 'ప్రజహాతి'ఇత్యాదిశ్లోకంతో ప్రారంభించి అధ్యాయం చివరి వరకు. స్థితప్రజ్ఞుని లక్షణము, స్థితప్రజ్ఞత్వం సంపాదించడానికి సాధనమూ కూడ ఉపదేశించబడు చున్నది.అధ్యాత్మశాస్త్రంలో అంతటా కూడ ఏవి కృతార్థునిలో ఉన్న లక్షణాలో అవే కృతార్థుడు కానివాడు ప్రయత్నపూర్వకంగా సంపాదించుకొనవలసిన సాధనాలుగా ఉపదేశింపబడుతూ

ఉంటాయి. ఏవి (కృతార్థుడు కానివాడు)ప్రయత్నపూర్వకంగా సంపాదించుకొనవలసిన సాధనాలో అవి (కృతార్థుని)లక్షణాలు కూడ అవుతాయి.

శ్రీభగవంతుడు ఇలా అన్నాడు -

ప్ర.అ.:- పార్థ = అర్జునా! యదా = ఎప్పుడు, ఆత్మన్యేవ = ఆత్మయందే, ఆత్మనా = ఆత్మతో, తుష్టః = సంతోషించినవాడై, మనోగతాన్ = మనస్సులో ఉన్న, సర్వాన్ = సమస్తమైన, కామాన్ = కామాలను, ప్రజహాతి = విడిచిపెడతాడో, తదా = అప్పుడు, స్థితప్రజ్ఞః = స్థిత ప్రజ్ఞుడుగా, ఉచ్యతే = చెప్పబడతాడు.

భాష్యమ్

ప్రజహాతీతి:- ప్రజహాతి ప్రకర్షేణ జహాతి పరిత్యజతి,యదా యస్మిన్ కాలే,సర్వాన్ సమస్తాన్,కామాన్ ఇచ్ఛాభేదాన్,హే పార్థ,మనోగతాన్ మనసి ప్రవిష్టాన్ హృది ప్రవిష్టాన్. సర్వకామపరిత్యాగీ తుష్టికారణాభావాత్ శరీరధారణనిమిత్తశేషే చ సతి ఉన్మత్తప్రమత్తస్యేవ ప్రవృత్తిః ప్రాప్తా ఇత్యతః ఉచ్యతే-ఆత్మని ఏవ ప్రత్యగాత్మస్వరూపే ఏవ, ఆత్మనా స్వేన ఏవ, బాహ్యలాభనిరపేక్షః,తుష్టః పరమార్థ దర్శనామృతరసలాభేన అన్యస్మాత్ అలంప్రత్యయవాన్, స్థితప్రజ్ఞః, స్థితా ప్రతిష్ఠితా ఆత్మానాత్మవివేకజా ప్రజ్ఞా యస్య సః విద్వాన్ తదా ఉచ్యతే. త్యక్తపుత్రవిత్తలోకైషణః,సంన్యాసీ,ఆత్మారామఃఆత్మక్రీడః స్థితప్రజ్ఞః ఇత్యర్థః. 55

బాలానందిని

ప్రజహాతీతి:- ప్రజహాతి = పూర్తిగా విడిచిపెడతాడో, యదా = ఏ కాలంలో, సర్వాన్ = సమస్తమైన, కామాన్ = వేరు వేరు కోరికలను, అర్జునా ! మనస్సులో ఉన్న, మనస్సులో ప్రవేశించిన, హృదయంలో ప్రవేశించిన (కామాలను విడిచిపెడతాడో) అన్ని కామాలను విడిచివేసిన తరువాత ఆనందం కలగడానికి కారణం ఏదీ ఉండదు కదా? అప్పుడు శరీరం ఇంకా నిలవడానికి తగిన ప్రారబ్ధకర్మ మిగిలి ఉంటుంది.అప్పుడు వాని ప్రవృత్తి పిచ్చివాని ప్రవృత్తి వలె, మత్తెక్కినవాని ప్రవృత్తి వలె ఉండవలసివస్తుంది కదా అని ప్రాప్తింగా చెప్పబడుచున్నది-ఆత్మన్యేవ = ప్రత్యగాత్మ స్వరూపమునందే; ఆత్మనా = తాను మాత్రమే, బాహ్యా వస్తువుల లాభంమీద అపేక్ష ఏదీ లేనివాడై సంతోషిస్తూ, పరమార్థ దర్శనం అనే అమృతరసం లభించడంచేత మిగిలిన వేవీ మనకు వద్దులే అనే ఆలోచన కలవాడు స్థితప్రజ్ఞుడు. అప్పుడు ఆత్మానాత్మవివేకంవల్ల కలిగిన ఎవనియొక్క ప్రజ్ఞ స్థిరంగా ఉంటుందో అట్టి స్థితప్రజ్ఞుడుగా,విద్వాంసుడుగా చెప్పబడతాడు.పుత్రైషణ(పుత్రులమీద కోరిక), విత్తైషణ(ధనంమీద కోరిక)లోకైషణ(లోకంలోని విషయాలమీద ఆసక్తి)విడచి,సంన్యాసియై, ఆత్మారాముడై,తనలో తాను క్రీడిస్తూ ఆనందించేవాడే స్థితప్రజ్ఞుడు అని అర్థం.

భాష్యమ్

కిం చ-

మూ. దుఃఖేష్వనుద్విగ్నమనాః సుఖేషు విగతస్పృహః,
వీతరాగభయక్రోధః స్థితధీర్మునిరుచ్యతే. 56

బాలానందిని

కిం చేతి :- మరియు -

ప్ర.అ. దుఃఖేష్వితి :- దుఃఖేషు = దుఃఖాలలో,అనుద్విగ్నమనాః = క్షోభ చెందని మనస్సు కలవాడు,సుఖేషు = సుఖాలయందు, విగతస్పృహః = ఆసక్తి లేనివాడు,వీతరాగభయక్రోధః = ఆసక్తి భయము,కోపము లేనివాడు అయిన, మునిః = ముని, స్థితధీః = స్థితప్రజ్ఞుడు అని, ఉచ్యతే = చెప్పబడతాడు.

భాష్యమ్

దుఃఖేష్వితి :- దుఃఖేషు ఆధ్యాత్మికాదిషు ప్రాప్తేషు న ఉద్విగ్నం న ప్రక్షుభితం దుఃఖప్రాప్తౌ మనః యస్య సః అనుద్విగ్నమనాః;తథా సుఖేషు ప్రాప్తేషు విగతా స్పృహా యస్య,న అగ్నిరివ ఇన్ధనాధానే సుఖాన్యనువివర్ధతే సః విగతస్పృహః,వీతరాగభయక్రోధః రాగః చ భయం చ క్రోధశ్చ వీతాః విగతాః యస్మాత్ సః వీతరాగభయక్రోధః,స్థితధీః స్థితప్రజ్ఞః మునిః సన్న్యాసీ తదా ఉచ్యతే. 56

బాలానందిని

దుఃఖేష్వితి :- దుఃఖేషు = ఆధ్యాత్మికాదులైన దుఃఖాలు-(జ్వరం, శిరోరోగం మొదలైన వాటివల్ల కలిగే దుఃఖాలు ఆధ్యాత్మికదుఃఖాలు, వ్యాఘ్ర-సర్పాదులవల్ల కలిగే దుఃఖాలు ఆధిభౌతికదుఃఖాలు,తుపానులు,అధికవర్షాలు మొదలైనవాటివల్ల కలిగే దుఃఖాలు ఆధిదైవికాలు)వచ్చినప్పుడు ఎవని మనస్సు దిగులు చెందదో అతడు అనుద్విగ్నమనస్కుడు. అట్లే సుఖములు వచ్చి నప్పుడు ఎవనికి స్పృహ(వాటియందు అత్యాసక్తి)ఉండదో,కట్టెలు వేసిన కొలది అగ్ని వృద్ధిపొంది నట్లు సుఖాలు వచ్చినకొలదీ ఎవని స్పృహ(సుఖాసక్తి)పెరగదో అతడు విగతస్పృహుడు.రాగం(కొందరిపై లేదా కొన్నింటిపై అత్యాసక్తి) భయం,క్రోధం ఇవి ఎవనినుండి తొలగిపోయాయో అతడు వీతరాగభయక్రోధుడు.అట్టి ముని,అనగా సంన్యాసి, స్థితప్రజ్ఞుడు అని అప్పుడు (అనగా తృష్ణారాగాదులు లేని స్థితిలో)చెప్పబడతాడు. 56

భాష్యమ్

కిం చ -

మూ. యః సర్వత్రానభిస్నేహస్తత్తత్ప్రాప్య శుభాశుభమ్,
నాభినన్దతి న ద్వేష్టి తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా. 57

బాలానందిని

కించేతి :- మరియు -

ప్ర.అ.యః ఇతి :- యః = ఎవడు, సర్వత్ర = అన్నింటియందు, (దేనియందూ కూడ)అనభిస్నేహః = ఆసక్తి లేనివాడై,తత్ తత్ = ఆ యా,శుభాశుభమ్ = శుభాన్ని అశుభాన్ని,ప్రాప్య = పొంది, నాభినన్దతి = సంతోషించడో,న ద్వేష్టి = ద్వేషించడో, తస్య = వానియొక్క ప్రజ్ఞా = ప్రజ్ఞ, ప్రతిష్ఠితా = స్థిరంగా నిలచి ఉన్నది.

భాష్యమ్

యః సర్వత్రేతి:- యః మునిః,సర్వత్ర దేహజీవితాదిష్వపి అనభిస్నేహః అభిస్నేహవర్జితః, తత్ తత్ ప్రాప్య శుభాశుభం, తత్ తత్ శుభమ్ అశుభం వా లబ్ధ్వా న అభినన్దతి, న ద్వేష్టి,శుభం ప్రాప్య న తుష్యతి న హృష్యతి అశుభం చ ప్రాప్య న ద్వేష్టి ఇత్యర్థః.తస్య ఏవం హర్షవిషాదవర్జితస్య వివేకజాప్రజ్ఞా ప్రతిష్ఠితా భవతి. 57

బాలానందిని

యః సర్వత్రేతి:- యః = ఏ ముని, సర్వత్ర = దేహము, జీవితమూ మొదలైన వాటియందు కూడ, అనభిస్నేహః = ఆసక్తి లేనివాడై,ఆ యా శుభాశుభాన్ని పొంది, శుభమును కాని అశుభమును కాని పొంది,అభినందంచడో,ద్వేషించడో,శుభం పొంది సంతోషించడో, అశుభం పొంది ద్వేషించడో అని అర్థం;తస్య = ఈ విధంగా హర్షవిషాదాలు లేనివానియొక్క, ప్రజ్ఞా = వివేకంవల్ల కలిగిన జ్ఞానం, స్థిరంగా నిలిచి ఉంటుంది.(అతడు స్థితప్రజ్ఞుడు). 57

భాష్యమ్

కిం చ -

మూ. యదా సంహరతే చాయం కూర్మోఽఙ్గానీవ సర్వశః,
ఇన్ద్రియాణీన్ద్రియార్థేభ్యస్తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా. 58

బాలానందిని

కిం చేతి:- మరియు -

ప్ర.అ. యదేతి:- యదా = ఎప్పుడు,అయమ్ = ఇతడు,ఇన్ద్రియాణి = ఇంద్రియాలను, ఇన్ద్రియార్థేభ్యః = ఇంద్రియములచేత గ్రహింపబడే వస్తువులనుండి, సర్వశః = అన్ని వైపుల నుండీ కూడ, కూర్మః = తాబేలు, అఙ్గానీవ = అవయవాలను వలె,సంహరతే చ =వెనుకకు లాగికొంటాడో, అప్పుడు, తస్య = వానియొక్క ప్రజ్ఞా = ప్రజ్ఞ, ప్రతిష్ఠితా = స్థిరంగా నిలుపబడి ఉంటుంది.

భాష్యమ్

యదా సంహరతే ఇతి :- యదా సంహరతే సమ్యక్ ఉపసంహరతే, చ, అయం జ్ఞాననిష్ఠాయాం ప్రవృత్తః యతిః కూర్మః భయాత్ స్వాని అఙ్గాని ఉపసంహరతి సర్వతః ఏవం జ్ఞాననిష్ఠః, ఇన్ద్రియాణి, ఇన్ద్రియార్థేభ్యః సర్వవిషయేభ్యః ఉపసంహరతే, తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ఇతి ఉక్తార్థం వాక్యమ్. 58

బాలానందిని

యదా సంహరతే ఇతి: ఎప్పు డైతే, సంహరతే = బాగా ఉపసంహరిస్తాడో, అయమ్ = జ్ఞాననిష్ఠయందు ప్రవర్తిస్తూన్న ఈ ముని, కూర్మః అఙ్గానీవ సర్వశః-కూర్మం భయంవల్ల తన అవయవాల నన్నింటినీ అన్ని వైపులనుండీ ఎట్లు ఉపసంహరిస్తుందో అట్లే జ్ఞాననిష్ఠుడు ఇంద్రియాలను సమస్తమైన విషయాలనుండి ఉపసంహరిస్తాడో,వాని ప్రజ్ఞ స్థిరంగా ఉంటుంది అనే వాక్యానికి అర్థం వెనుకనే చెప్పబడింది. 58

భాష్యమ్

తత్ర విషయాన్ అనాహరతః ఆతురస్యాపి ఇన్ద్రియాణి నివర్తన్తే, కూర్మాఙ్గానీవ సంహ్రియన్తే, న తు తద్విషయః రాగః.సః కథం సంహ్రియతే ఇతి. ఉచ్యతే -

మూ. విషయా వినివర్తన్తే నిరాహారస్య దేహినః,
రసవర్జం రసోఽప్యస్య పరం దృష్ట్వా నివర్తతే. 59

బాలానందిని

తత్రేతి:- అయితే- రోగంతో బాధపడుతూన్నవాడు భోగ్యవస్తువులను గ్రహించడు; అందుచేత వాని ఇంద్రియాలు,కూర్మాంగాలు వలె,విషయాలనుండి ఉపసంహరింపబడతాయి.కాని ఆ విషయాలను గూర్చిన రాగం(ఆసక్తి)మాత్రం నివర్తించదు.ఆ రాగం ఎట్లు నివర్తించాలి? చెప్పబడుచున్నది-

ప్ర.అ. **విషయాః ఇతి:-** నిరాహారస్య = ఆహారం లేని,అనగా ఇంద్రియాల ద్వారా ఆ యా వస్తువులను అనుభవించని,దేహినః = మానవుని యొక్క (ని విషయంలో), రసవర్జమ్

= రాగం మినహాయించి, విషయాః = విషయాలు, వినివర్తన్తే = నివర్తించును. పరమ్ = పరమాత్మను. దృష్ట్వా = చూచి, అస్య = వీనియొక్క రసః అపి = ఆసక్తి కూడ,నివర్తతే = నివరిస్తుంది.

భాష్యమ్

విషయా ఇతి:– యద్యపి – విషయోపలక్షితాని విషయశబ్దవాచ్యాని ఇన్ద్రియాణి, అథవా విషయాః ఏవ, నిరాహారస్య అనాహ్రియమాణవిషయస్య కష్టే తపసి స్థితస్య మూర్ఖస్య అపి, వినివర్తన్తే, దేహినః దేహవతః రసవర్జం–రసః రాగః విషయేషు యః తం వర్జయిత్వా, రసశబ్దో రాగే ప్రసిద్ధః"స్వరసేన ప్రవృత్తః" "రసికః","రసజ్ఞః" ఇత్యాది దర్శనాత్.సః అపి రసః రఞ్జనరూపః సూక్ష్మః అస్య యతేః పరం పరమార్థతత్త్వం బ్రహ్మ,దృష్ట్వా ఉపలభ్య"అహమేవ తత్"ఇతి వర్తమానస్య నివర్తతే నిర్బీజం విషయజ్ఞానం సంపద్యతే ఇత్యర్థః. న అసతి సమ్యగ్దర్శనే రసస్య ఉచ్ఛేదః. తస్మాత్ సమ్యగ్దర్శనాత్మికా యాః ప్రజ్ఞాయాః స్థైర్యం కర్తవ్యమ్ ఇతి అభిప్రాయః. 59

బాలానందిని

విషయా ఇతి :– 'యద్యపి'అనే దానికి 'వినివర్తన్తే'అనే పదంతో అన్వయం. "విషయాః"అనగా విషయాలచేత గుర్తించబడినవి,లేదా విషయాలతో కూడినవి అవడంచేత 'విషయ'శబ్దంచేత చెప్పదగిన ఇంద్రియాలు అని అర్థం.(అప్పుడు ఇంద్రియాలు వెనుకకు మరలుతాయి అని అర్థం) లేదా 'విషయాః అనగా శబ్దాదివిషయా లనే అర్థం.అవి నిరాహరస్య = విషయాలను గ్రహించక కష్టమైన తపస్సులో ఉన్న మూర్ఖుడైన మానవునికి కూడ, (విద్యాగంధం ఏమీ లేక మొండి పట్టుదలతో విషయాలమీదకు ఇంద్రియాలు వెళ్లకుండా నిగ్రహించుకొని కూర్చున్నవానికి కూడ),యద్యపి వినివర్తన్తే = నివర్తించినాకూడ,అవి రసాన్ని మినహాయించి మాత్రమే నివర్తిస్తాయి. 'రస' శబ్దానికి ప్రసిద్ధమైన అర్థం రాగం, అభిరుచి. అందుచేతనే "స్వరసేన ప్రవృత్తః"(తన సహజమైన అభిరుచిచేత,ఇచ్ఛచేత ప్రవర్తించాడు). రసికః(రాగం,ఆసక్తి ఉన్నవాడు), "రసజ్ఞః(రసాన్ని అనగా చెప్పదలచిన అవసరమైన విషయాన్ని గ్రహించేవాడు) ఇత్యాది ప్రయోగాలు ఉన్నాయి.అస్య = ఈ యతియొక్క మనస్సులో అతిసూక్ష్మంగా ఉండే రంజనరూపమైన, (వస్త్రాదులకు రంగు అంటుకొన్నట్లు మనస్సును అంటుకొని ఉన్న ఆ రసం కూడ, ఆ యతి ఎప్పుడైతే, పరమ్ = పరమార్థతత్త్వ మైన బ్రహ్మను, దృష్ట్వా = తెలుసుకొని, 'నేను ఆ బ్రహ్మను' అనే భావంతో ఉంటాడో, అప్పుడు నివర్తిస్తుంది.విషయజ్ఞానం విత్తనం కూడ లేకుండా నివర్తిస్తుంది.అని అర్థం. (విషయ విజ్ఞానానికి బీజం రసమే గాన రసం పోవడంతో విషయవిజ్ఞానం సమూలంగా నశిస్తుంది

అని భావం). సమ్యగ్దర్శనం(పారమార్థికమైన ఆత్మైకత్వజ్ఞానం) కలిగేవరకు రసం నశించదు. అందువల్ల సమ్యగ్దర్శనరూప మైన ప్రజ్ఞను స్థిరం చేసుకోవాలి అని అభిప్రాయం. 59

భాష్యమ్

సమగ్దర్శనలక్షణ ప్రజ్ఞాస్థైర్యం చికీర్షతా ఆదౌ ఇన్ద్రియాణి స్వవశే స్థాపయితవ్యాని, యస్మాత్ తదనవస్థాపనే దోషమ్ ఆహ –

మూ. యతతో హ్యపి కౌన్తేయ పురుషస్య విపశ్చితః,
ఇన్ద్రియాణి ప్రమాథీని హరన్తి ప్రసభం మనః. 60

బాలానందిని

సమ్యగితి:– సమ్యగ్దర్శనరూప మైన ప్రజ్ఞయొక్క స్థైర్యం సంపాదించాలి అనుకొనే వాడు ముందుగా ఇంద్రియాలు తన వశంలో ఉంచుకోవాలి;ఎందువలన అనగా–వాటిని అదుపులో పెట్టుకొనకపోతే దోషం చెపుతున్నాడు–

ప్ర.అ.యతతః ఇతి :– కౌన్తేయ = అర్జునా, యతతః అపి = ప్రయత్నం చేయుచున్న, విపశ్చితః అపి = విద్వాంసుడైనా కూడ, పురుషస్య = పురుషుని యొక్క ప్రమాథీని = బాధ కలిగించే స్వభావం గల, ఇన్ద్రియాణి = ఇంద్రియాలు, ప్రసభమ్ = బలాత్కారంగా, మనః = మనస్సును, హరన్తి = హరించును.

భాష్యమ్

యతతః ఇతి :– యతతః ప్రయత్నం కుర్వతః యస్మాత్ కౌన్తేయ,పురుషస్య, విపశ్చితః మేధావినః అపీతి వ్యవహితేన సంబన్ధః. ఇన్ద్రియాణి ప్రమాథీని ప్రమథనశీలాని, విషయాభిముఖం హి పురుషం విక్షోభయన్తి ఆకులీకుర్వన్తి, ఆకులీకృత్య చ హరన్తి ప్రసభం ప్రసహ్య ప్రకాశమేవ పశ్యతః, వివేకవిజ్ఞానయుక్తం మనః యతః తస్మాత్. 60

బాలానందిని

యతతః ఇతి :–యతతః = ప్రయత్నం చేస్తూన్న, హి = ఎందువలన అనగా, అర్జునా! 'విపశ్చితః', దీనికి దూరంగా ఉన్న అపితో అన్వయం, మేధావంతు డైనా కూడ, పురుషునియొక్క, ఇంద్రియాలు, ప్రమాథీని – బాధించే స్వభావం కలవి. విషయాభిముఖుడైన పురుషుణ్ణి ఇవి క్షోభింపచేస్తాయి. వ్యాకులునిగా చేస్తాయి కదా? అలా వ్యాకులునిగా చేసి, ప్రసభమ్ = బలాత్కారంగా,చూస్తుండగానే బాహాటంగా,వివేకవిజ్ఞానంతో కూడిన మనస్సును

కూడ ఏ కారణంచేత హరిస్తాయో(అందువలన వాటిని తన వశంలో ఉంచుకోవాలి అని రాబోయే శ్లోకంతో అన్వయం). 60

మూ. తాని సర్వాణి సంయమ్య యుక్త ఆసీత మత్పరః,
వశే హి యస్యేన్ద్రియాణి తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా. 61

ప్ర.అ. తాని సర్వాణి = ఆ ఇంద్రియాలను అన్నింటినీ, సంయమ్య = నిగ్రహించి, యుక్తః = ఏకాగ్రచిత్తం కలవాడై, మత్పరః = నేను ప్రాప్యుడుగా (పొందదగినవాడుగా)కలవాడై, ఆసీత = కూర్చోవాలి. ఇన్ద్రియాణి = ఇంద్రియాలు, యస్య = ఎవనికి, వశే = వశంలో ఉంటాయో, తస్య = వానియొక్క ప్రజ్ఞా = ప్రజ్ఞ, ప్రతిష్ఠితా = స్థిర మైనది.

భాష్యమ్

తానీతి:– తాని సర్వాణి సంయమ్య సంయమనం వశీకరణం కృత్వా, యుక్తః సమాహితః సన్, ఆసీత.మత్పరః అహం వాసుదేవః సర్వప్రత్యగాత్మా పరః యస్య సః మత్పరః, "న అన్యః తస్మాత్" ఇతి ఆసీత ఇత్యర్థః.ఏవమ్ ఆసీనస్య యతేః వశే హి యస్య ఇన్ద్రియాణి వర్తన్తే అభ్యాసబలాత్ తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా. 61

బాలానందిని

తానీతి:– వాటిని అన్నింటినీ, సంయమ్య = సంయమనం, అనగా వశంలో ఉంచుకొనడం చేసి,యుక్తః సమాహితుడై,ఏకాగ్రచిత్తం కలవాడై కూర్చోవాలి. మత్పరః=వాసుదేవుడను,అందరి ప్రత్యగాత్మనూ అయిన నేనే పరుడుగా,ప్రధానగమ్యంగా కలవాడై,అనగా "నేను ఆ పరమాత్మకంటె భిన్నుడను కాను"అని అనుకొంటూ ఉండాలి. ఇలా కూర్చున్న యతియొక్క ఇంద్రియాలు, అభ్యాసబలంచేత వాని వశంలోనికి వస్తాయి. అప్పుడు వాని ప్రజ్ఞ స్థిరంగా ఉంటుంది.

భా. అ. ప్ర:– "మత్పరః అనగా చిత్తానికి శుభ మైన ఆశ్రయమైన నాయందు మనస్సును నిలిపి"అని ఇక్కడ శ్రీరామానుజాచార్యులు చెప్పిన అర్థం అయుక్తం. ఎందువల్లననగా – స్థితప్రజ్ఞు డైన సాంఖ్యునికి,యోగికి వలె, ధ్యానధారణలు అసంభావ్యములు. సచ్చిదానందబ్రహ్మాత్మతత్త్వాన్ని తెలుసుకొన్న స్థితప్రజ్ఞుడు మనస్సులో ఏదో ఒక ఆకారం కల్పించుకొని ధ్యానించడు కదా? ఎందువల్ల ననగా అలా కల్పించుకొన్నది మిథ్యయే. కల్పనం క్లేశం కలిగిస్తుంది. కల్పిత మైనది చాలాకాలం నిలవదు;అది క్షణికం మాత్రమే. అది దుఃఖహేతువు కూడ. స్థితప్రజ్ఞుడు తనకంటె భిన్ను డైన పరమాత్మను అంగీకరించడు.

ధ్యానించదు. **"ద్వితీయాద్వై భయం భవతి"** అను శ్రుతి చెప్పినట్లు అలా అంగీకరించడం భయహేతువు. తత్త్వమస్యాదిశ్రుతులచేత బ్రహ్మాత్మైక్యం ప్రతిపాదించబడింది గాన సమాహితమైన మనస్సులో సచ్చిదానందలక్షణమైన ఆత్మస్వరూపంకంటె భిన్నంగా ఆత్మస్వరూపం స్ఫురించదుకూడ. పరమాత్మ కూడ సచ్చిదానందరూపుడే గాన ఆత్మ స్వరూపంకంటె వేరుగా ఉన్నాడని చెప్పడం కుదరదు. 61

భాష్యమ్

అథేదానీం పరాభవిష్యతః సర్వానర్థమూలమ్ ఇదమ్ ఉచ్యతే -

మూ. ధ్యాయతో విషయాన్ పుంసః సంగస్తేషూపజాయతే,
సంగాత్సంజాయతే కామః కామాత్ క్రోధోఽభిజాయతే.

బాలానందిని

అథేతి:- ఇక ఇప్పుడు ఆత్మజ్ఞాన ప్రాప్తి విషయంలో ఓటమి చూరగొనవలసి ఉన్నవాడికి కలిగే సర్వానర్థాలకు మూలమైన ఇది చెప్పబడుచున్నది.

ప్ర.అ. విషయాన్ = విషయాలను, ధ్యాయతః = ఆలోచిస్తూన్న, పుంసః = పురుషునకు, తేషు = వాటియందు, సంగః సంగము(ఆసక్తి), ఉపజాయతే = కలుగుతుంది. సంగాత్ = సంగంవల్ల, కామః = (సంపాదించాలనే)కోరిక, సంజాయతే = పుడుతుంది. కామాత్ = కామంవల్ల, క్రోధః = కోపం, అభిజాయతే = కలుగుతుంది.

భాష్యమ్

ధ్యాయత ఇతి :- ధ్యాయతః చిన్తయతః, విషయాన్ శబ్దాదివిషయవిశేషాన్ ఆలోచయతః, పుంసః పురుషస్య, సంగః ఆసక్తిః,ప్రీతిః,తేషు విషయేషు ఉపజాయతే. సంగాత్ ప్రీతేః సంజాయతే సముత్పద్యతే,కామః తృష్ణా. కామాత్ కుతశ్చిత్ ప్రతిహతాత్, క్రోధః అభిజాయతే. 62

బాలానందిని

ధ్యాయతః ఇతి:- ధ్యాయతః = ఆలోచిస్తూన్న, విషయాన్ = శబ్దాదులైన ఆ యా భోగ్యవస్తువులను గూర్చి ఆలోచిస్తూన్న పురుషునకు ఆ విషయాలమీద, సంగం అనగా ఆసక్తి, ప్రీతి, కలుగుతుంది. ప్రీతివల్ల కోరిక, అనగా వాటిపై ఆశ, కలుగుతుంది. ఆ కోరికకు ఏదైనా అడ్డు తగులుతే క్రోధం కలుగుతుంది. 62

మూ. క్రోధాద్భవతి సంమోహః సంమోహాత్స్మృతివిభ్రమః,
స్మృతిభ్రంశాద్ బుద్ధినాశో బుద్ధినాశాత్ప్రణశ్యతి. 63

ప్ర.అ.: క్రోధాత్ = క్రోధంవల్ల, సంమోహః = అవివేకం, భవతి = కలుగుతుంది. సంమోహాత్ = అవివేకంవల్ల, స్మృతివిభ్రమః = స్మృతియొక్క నాశం కలుగుతుంది. స్మృతిభ్రంశాత్ = స్మృతి భ్రష్టం అవడంవల్ల, బుద్ధినాశః = బుద్ధియొక్క నాశం కలుగుతుంది. బుద్ధినాశాత్ = బుద్ధినాశంవల్ల,ప్రణశ్యతి = నశిస్తాడు.

భాష్యమ్

క్రోధాత్ భవతి సంమోహః అవివేకః కార్యాకార్యవిషయః. క్రుద్ధః హి సంమూఢః సన్ గురుమ్ అపి ఆక్రోశతి.సంమోహాత్ స్మృతివిభ్రమః శాస్త్రాచార్యోపదేశాహిత సంస్కారజనితాయాః స్మృతేః స్యాత్ విభ్రమః భ్రంశః, స్మృత్యుత్పత్తినిమిత్త ప్రాప్తౌ అనుత్పత్తిః. తతః స్మృతిభ్రంశాత్ బుద్ధేః నాశః. కార్యాకార్యవిషయవివేకాయోగ్యతా అన్తః కరణస్య బుద్ధేః నాశః ఉచ్యతే. బుద్ధినాశాత్ ప్రణశ్యతి. తావదేవ హి పురుషః యావత్ అన్తఃకరణం తదీయం కార్యాకార్యవిషయవివేకయోగ్యమ్;తదయోగ్యత్వే నష్టః ఏవ పురుషః భవతి. అతః తస్య అన్తఃకరణస్య బుద్ధేః నాశాత్ ప్రణశ్యతి. పురుషార్థాయోగ్యః భవతి ఇత్యర్థః. 63

బాలానందిని

క్రోధాదితి:- క్రోధంవల్ల సంమోహం,అనగా చేయదగినది ఏది,చేయదగనిది ఏది అనే దానిని గూర్చిన అవివేకం కలుగుతుంది. కోపం వచ్చినవాడు యుక్తాయుక్తవివేచన లేక మూఢుడై గురువును కూడ నిందిస్తాడు కదా?సంమోహంవల్ల స్మృతివిభ్రమం కలుగుతుంది. స్మృతివిభ్రమం అనగా శాస్త్రంచేత,ఆచార్యుని ఉపదేశంచేత ఉంచబడిన (లభించిన) సంస్కారంవల్ల కలిగే స్మృతియొక్క విభ్రమం, భ్రంశ కలగడం. స్మృతి కలగడానికి తగిన నిమిత్తాలు ఉన్నా కూడ స్మృతి కలగకపోవడం (స్మృతిభ్రంశ). తరువాత ఆ స్మృతి భ్రంశం వల్ల బుద్ధినాశం కలుగుతుంది. అంతఃకరణం కార్యాకార్యాలను గూర్చిన వివేకం కలగడానికి అయోగ్యం అయిపోవడమే బుద్ధినాశం అనగా. బుద్ధినాశంవల్ల నశిస్తాడు. ఒకని అంతఃకరణం కార్యాకార్యములను గూర్చిన వివేకానికి యోగ్యంగా ఉన్నంతవరకే కదా వానిని పురుషుడు అనడానికి తగి ఉంటాడు?అట్టి వివేకయోగ్యత్వం లేకపోతే ఆ పురుషుడు నశించినట్లే. అందువల్ల ఆ అంతఃకరణముయొక్క బుద్ధియొక్క నాశంవల్ల పురుషుడు నశిస్తాడు. పురుషార్థానికి అయోగ్యు డవుతాడు అని అర్థం. 63

భాష్యమ్

సర్వానర్థస్య మూలముక్తం విషయాభిధ్యానమ్. అథ ఇదానీం మోక్షకారణమ్ ఇదమ్ ఉచ్యతే –

మూ. రాగద్వేషవియుక్తైస్తు విషయానిన్ద్రియైశ్చరన్.
ఆత్మవశ్యైర్విధేయాత్మా ప్రసాదమధిగచ్ఛతి. 64

బాలానందిని

సర్వేతి:- సకల అనర్థాలకీ మూలకారణం విషయాలను గూర్చి ఆలోచించడమే అని చెప్పబడింది. ఇంక ఇప్పుడు మోక్షమునకు కారణమైన ఈ విషయం చెప్పబడుచున్నది-

ప్ర.అ. రాగద్వేషవియుక్తైరితి :- రాగద్వేషవియుక్తైః = రాగముచేత ద్వేషముచేత, విడవబడిన (రాగద్వేషాలు లేని) ఆత్మవశ్యైః = తనకు వశమైన, ఇన్ద్రియైః = ఇంద్రియాలచేత, విషయాన్ = విషయాలను, చరన్ తు = అనుభవిస్తూన్నవా డైతే, విధేయాత్మా = తనకు లొంగిన అంతఃకరణం కలవాడై, ప్రసాదమ్ = చిత్తనిర్మలత్వాన్ని, అధిగచ్ఛతి = పొందుతాడు.

భాష్యమ్

రాగద్వేషేతి :- రాగద్వేషవియుక్తైః - రాగశ్చ ద్వేషశ్చ రాగద్వేషౌ. తత్పురఃసరా హి ఇన్ద్రియాణాం ప్రవృత్తిః స్వాభావికీ. తత్ర యః ముముక్షుః భవతి సః తాభ్యాం వియుక్తైః శ్రోత్రాదిభిః ఇన్ద్రియైః విషయాన్ అవర్జనీయాన్ చరన్ ఉపలభమానః, ఆత్మవశ్యైః ఆత్మనః వశ్యాని వశీభూతాని తైః ఆత్మవశ్యైః విధేయాత్మా ఇచ్ఛాతః విధేయః ఆత్మా అన్తఃకరణం యస్య సః అయం ప్రసాదమ్ అధిగచ్ఛతి. ప్రసాదః ప్రసన్నతా స్వాస్థ్యమ్. 64

బాలానందిని

రాగద్వేషేతి :- రాగద్వేషవియుక్తైః = రాగశ్చ ద్వేషశ్చ రాగద్వేషౌ = రాగము (ఆసక్తి) ద్వేషము. ఇంద్రియాల ప్రవృత్తి సహజంగా రాగద్వేషాలను పురస్కరించుకొనే ఉంటుంది కదా? (రాగద్వేషాలే ఇంద్రియప్రవృత్తికి కారణాలు). అందుచేత మోక్షేచ్ఛ గలవాడు ఆ రాగద్వేషాలతో శూన్యములైన శ్రోత్రాదీంద్రియాలచేత, తప్పనిసరిగా అనుభవించవలసిన విషయాలను మాత్రమే,చరన్ = గ్రహిస్తూ,ఆత్మవశ్యైః = తనకు వశమైన (ఇంద్రియాలతో), విధేయాత్మా = తన ఇచ్ఛ ప్రకారం విధేయమైన (లొంగిఉన్న) అంతఃకరణం కలవాడై, ప్రసాదాన్ని పొందుతాడు.ప్రసాదం అనగా ప్రసన్నత్వం స్వస్థుడై ఉండుట, (సుఖాత్మక మైన తన అసలు స్వభావం ఏదో దానిలో ఉండుట).

భా.అ.ప్ర. :- 'చరన్' అనే పదానికి "తిరస్కరించి ఉంటూ" అని శ్రీరామానుజాచార్యులు వ్రాసిన అర్థం అయుక్తం. చరధాతువుకు అలాంటి అర్థం ఏదీ లేదు."ఇక్కడ చర ధాతువునకు ఆక్రమణరూపమైన గమనం లేదా భక్షణం కోసంచేసే సంహారం అని అర్థం. అందుచేత తిరస్కరించడం అనే అర్థం లభిస్తుంది" అని వేదాంతదేశికులు చెప్పినది కూడ నిఃసార మైనది. ఎందువల్ల ననగా గమనానికి, ఆక్రమణానికీ చాలా భేదం ఉంది.పొందుట

ఆక్రమించుట అనే అర్థాలకు ఏదో విధంగా భేదం లేదనుకొన్నా 'ఆక్రమణం' నుంచి 'తిరస్కారం' అనే అర్థం లభించదు. భక్షణసంహారములకు భేదం ఉంది. భక్షణం హింసాత్మకం కాదు;సంహారమైతే హింసాత్మకం.భక్షణం హింసాత్మకం అని అంగీకరించినాకూడ అది తిరస్కారరూపం కాదు.భక్షణం అనగా అనుభవించడం, తిరస్కారం అంటే అనాదరం. అది అనుభవించకపోవడమే అవుతుంది. "అన్నాన్ని తిరస్కరించి భక్ష్యాలను తింటున్నాడు" ఇత్యాది ప్రయోగాలు ప్రసిద్ధంగా ఉన్నాయి కదా? అందుచేత చర ధాతువుకు తిరస్కరించడం అనే అర్థం ఉందనడానికి ప్రమాణం ఏదీ లేదు.(భా.అ.ప్ర.పే.96) 64

భాష్యమ్

ప్రసాదే సతి కిం స్యాత్ ఇతి? ఉచ్యతే -

మూ. ప్రసాదే సర్వదుఃఖానాం హానిరస్యోపజాయతే,
ప్రసన్నచేతసో హ్యాశు బుద్ధిః పర్యవతిష్ఠతే. 65

బాలానందిని

ప్రసాదే ఇతి:- ప్రసాదం కలుగుతే ఏమి జరుగుతుంది?చెప్పబడుచున్నది-

ప్ర.అ. ప్రసాదే ఇతి:- అస్య = వీనికి, ప్రసాదే = ప్రసాదం కలగగా, సర్వదుఃఖానామ్ = సమస్త దుఃఖములయొక్క హానిః = నాశము, ఉపజాయతే = కలుగును. ప్రసన్నచేతసః = ప్రసన్నమైన చిత్తం కలవానియొక్క, బుద్ధిః = బుద్ధి, ఆశు = శీఘ్రంగా, పర్యవతిష్ఠతే హి = స్థిరంగా నిలిచి ఉంటుంది కదా?

భాష్యమ్

ప్రసాద ఇతి:- ప్రసాదే సర్వదుఃఖానామ్ ఆధ్యాత్మికాదీనాం హానిః వినాశః అస్య యతేః ఉపజయాతే.కిం చ ప్రసన్నచేతసః స్వస్థాన్తఃకరణస్య హి యస్మాత్ ఆశు శీఘ్రం బుద్ధిః పర్యవతిష్ఠతే,ఆకాశమివ పరి సమన్తాత్,అవతిష్ఠతే ఆత్మస్వరూపేణైవ నిశ్చలీభవతి ఇత్యర్థః.ఏవం ప్రసన్నచేతసః అవస్థితబుద్ధేః కృతకృత్యతా యతః తస్మాత్ రాగద్వేషవియుక్తైః ఇన్ద్రియైః శాస్త్రావిరుద్ధేషు అవర్జనీయేషు యుక్తః సమాచరేత్ ఇత్యర్థః. 65

బాలానందిని

ప్రసాదే ఇతి: ప్రసాదం కలగగా ఈ యతియొక్క ఆధ్యాత్మికాదిసమస్తదుఃఖాలు నశిస్తాయి.మరొక విషయ మేమనగా-ప్రసన్నచేతస్కుడైనవాని,స్వస్థమైన అంతఃకరణం కలవాని, బుద్ధి శీఘ్రంగా, నిలకడతో ఉంటుంది కదా?ఆకాశం వలె అంతటా ఆత్మస్వరూపం

తోనే నిశ్చలం అవుతుంది అని అర్థం. ఈ విధంగా స్థిరమైన బుద్ధి కలవాడే కృతకృత్యుడవుతాడు గాన రాగద్వేషాలు లేని ఇంద్రియాలతో శాస్త్రవిరుద్ధాలు కాని, తప్పని సరియైన విషయాల యందు యుక్తుడై (ఇంద్రియాలతో వాటిని గ్రహిస్తూ వాటి విషయంలో పారవశ్యం చెందక) ప్రవర్తించాలి అని (రెండు శ్లోకాలలో) ప్రతిపాదించబడిన విషయం.

భాష్యమ్

సేయం ప్రసన్నతా స్తూయతే -

మూ నాస్తి బుద్ధిరయుక్తస్య న చాయుక్తస్య భావనా,
న చాభావయతః శాన్తిరశాన్తస్య కుతః సుఖమ్. 66

బాలానందిని

సా ఇతి:- ఈ ప్రసన్నత్వం స్తుతించబడుచున్నది -

ప్ర. అ. నాస్తీతి:- అయుక్తస్య = అంతఃకరణంయొక్క నిలకడలేనివానికి, బుద్ధిః = బుద్ధి, న అస్తి = లేదు. అయుక్తస్య = అయుక్తునికి, భావనా = ఆత్మజ్ఞానం విషయంలో పట్టుదల, న చ = లేదు. అభావయతః = భావించనివానికి (భావన లేనివానికి), శాన్తిః = శాంతి, న చ = లేదు. అశాన్తస్య = శాంతుడు కానివానికి, సుఖమ్ = సుఖము, కుతః = ఎట్లు?

భాష్యమ్

నాస్తీతి :- నాస్తి న విద్యతే, న భవతి ఇత్యర్థః. బుద్ధిః ఆత్మస్వరూపవిషయా, అయుక్తస్య అసమాహితాన్తఃకరణస్య. న చ అస్తి అయుక్తస్య భావనా ఆత్మజ్ఞానాభినివేశః; తథా న చ అస్తి అభావయతః ఆత్మజ్ఞానాభినివేశమ్ అకుర్వతః, శాన్తిః ఉపశమః; అశాన్తస్య కుతః సుఖమ్? ఇన్ద్రియాణాం హి విషయసేవాతృష్ణాతః నివృత్తిః యా తత్సుఖం, న విషయవిషయా తృష్ణా; దుఃఖమేవ హి సా. న తృష్ణాయాం సత్యాం సుఖస్య గన్ధమాత్రమపి ఉపపద్యతే ఇత్యర్థః. 66

బాలానందిని

నాస్తీతి :- నాస్తి = లేదు; కలగదు అని అర్థం. బుద్ధిః = ఆత్మస్వరూపం విషయంగా గల (ఆత్మస్వరూపాన్ని గూర్చిన) బుద్ధి, అయుక్తస్య = ఏకాగ్రమైన అంతఃకరణం లేనివానికి. అయుక్తునికి భావన కూడ, ఆత్మజ్ఞానం విషయంలో పట్టుదల కూడ ఉండదు. అల్లే ఆత్మజ్ఞానం విషయంలో పట్టుదల వహించనివానికి ఉపశమం ఉండదు. అశాంతునికి సుఖం ఎలా

లభిస్తుంది? విషయాలను సేవించా లనే తృష్ణనుండి, తీవ్రమైన కోరికనుండి, ఇంద్రియాలు నివర్తించడమే సుఖం; అంతే కాని విషయాలను గూర్చిన తృష్ణ సుఖం కాదు. అది దుఃఖమే. ఆ తృష్ణ ఉన్నంతవరకు సుఖలేశం కూడ ఉండడం సభవం కాదు కదా అని అర్థం. 66

భాష్యమ్

అయుక్తస్య కస్మాత్ బుద్ధిః నాస్తి ఇతి; ఉచ్యతే -

మూ. ఇన్ద్రియాణాం హి చరతాం యన్మనోఽనువిధీయతే
తదస్య హరతి ప్రజ్ఞాం వాయుర్నావమివామ్భసి. 67

బాలానందిని

అయుక్తస్యేతి:- అంతఃకరణకు ఏకాగ్రత లేనివానికి బుద్ధి ఎందువల్ల ఉండదు? చెప్పబడుచున్నది-

ఇన్ద్రియాణామితి:- ఇన్ద్రియాణామ్ = ఇంద్రియాలు, చరతామ్ = తమ తమ విషయాల వైపు సంచరిస్తూండగా, యత్ = ఏ, మనః = మనస్సు, అనువిధీయతే = వాటి వెనుకనే తిరుగుతూ ఉంటుందో, తత్ = అది, వాయుః = గాలి, అమ్భసి = నీటిలో, నావమ్ ఇవ = నావను వలె, అస్య = వీనియొక్క ప్రజ్ఞామ్ = ప్రజ్ఞను, హరతి హి = హరించును కదా?

భాష్యమ్

ఇన్ద్రియాణామితి:- ఇన్ద్రియాణాం, హి యస్మాత్, చరతాం స్వస్వవిషయేషు ప్రవర్తమానానాం యత్ మనః, అనువిధీయతే అనుప్రవర్తతే, తత్ ఇన్ద్రియవిషయ వికల్పనేన ప్రవృత్తం మనః, అస్య యతేః, హరతి, ప్రజ్ఞామ్ ఆత్మానాత్మవివేకజాం నాశయతి. కథమ్? వాయుః నావమ్ ఇవ, అమ్భసి ఉదకే. జిగమిషతాం సాంయాత్రికాణాం మార్గాత్ ఉద్ధృత్య ఉన్మార్గే యథా వాయుః నావం ప్రవర్తయతి ఏవమ్ ఆత్మవిషయాం ప్రజ్ఞాం హృత్వా మనః అన్యవిషయాం కరోతి. 67

బాలానందిని

ఇన్ద్రియాణామితి:- హి = ఎందువలన, ఇంద్రియాలు తమ తమ విషయాల వైపు ప్రవర్తిస్తుండగా ఏ మనస్సు ఆ ఇంద్రియాలను అనుసరించి ప్రవర్తిస్తుందో, ఇంద్రియాల విషయాలను గూర్చి ఆలోచన చేయడంలో ప్రవర్తించే ఆ మనస్సు, అస్య = ఈ యతియొక్క, ప్రజ్ఞను, ఆత్మానాత్మవివేకంవల్ల కలిగిన బుద్ధిని, నశింపచేస్తుంది. ఎట్లు? వాయువు నీటిలో ఉన్న నావను వలె. ఓడల వర్తకులు ఏ మార్గాన వెళ్లా లని అనుకొంటారో ఆ మార్గం నుండి

వాళ్ళ ఓడను తప్పించి, వాయువు ఏ విధంగా మరొక మార్గంలోనికి తీసికొనిపోతుందో,అదే విధంగా మనసు ఆత్మను గూర్చి ప్రవర్తిస్తూన్న ప్రజ్ఞను దానినుండి తప్పించి విషయాల వైపు త్రిప్పుతుంది. 67

భాష్యమ్

"యతతో హ్యపి"(2.60)ఇతి ఉపన్యస్తస్య అర్థస్య అనేకధా ఉపపత్తిమ్ ఉక్త్వా తం చ అర్థమ్ ఉపపాద్య ఉపసంహరతి -

మూ. తస్మాద్యస్య మహాబాహో నిగృహీతాని సర్వశః,
ఇన్ద్రియాణీన్ద్రియార్థేభ్యస్తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా. 68

బాలానందిని

"యతతో హ్యపి"అనే శ్లోకంలో చెప్పిన అర్థానికి అనేకవిధాలుగా ఉపపత్తి (సమర్థక ములైన యుక్తులు) చెప్పి ఆ అర్థాన్ని సమర్థించి ఉపసంహరిస్తున్నాడు -

ప్ర.అ. **తస్మాదితి:** మహాబాహో = ఓ! మహాబాహూ ! తస్మాత్ = అందువలన, యస్య = ఎవనియొక్క, ఇన్ద్రియాణి = ఇంద్రియాలు, సర్వశః = అన్నివిధాలా, ఇన్ద్రియార్థేభ్యః = ఇంద్రియాల విషయాలనుండి. నిగృహీతాని = నిగ్రహించబడినవో,తస్య = వానియొక్క ప్రజ్ఞా = ప్రజ్ఞ, ప్రతిష్ఠితా = స్థిరంగా నిలిచి ఉంటుంది.

భాష్యమ్

ఇన్ద్రియాణాం ప్రవృత్తౌ దోషః ఉపపాదితః యస్మాత్,తస్మాత్,యస్య యతేః హే! మహాబాహో!నిగృహీతాని సర్వశః సర్వప్రకారైః మానసాదిభేదైః,ఇన్ద్రియాణి ఇన్ద్రియార్థేభ్యః శబ్దాదిభ్యః తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా. 68

బాలానందిని

ఇన్ద్రియాణామితి:- తస్మాత్ = ఇంద్రియాలు స్వేచ్ఛగా ప్రవర్తిస్తే కలిగే దోషం ఎందువల్ల ఉపపాదించబడిందో అందువల్ల,ఎవని ఇంద్రియాలు శబ్దాదులైన ఇంద్రియార్థాల నుండి, సర్వశః = అన్ని విధాలా, అనగా మానసిక - వాచిక - కాయిక క్రియలు అన్నింటి నుండీ, మరల్చబడతాయో అతని ప్రజ్ఞ స్థిరంగా ఉంటుంది. 68

భాష్యమ్

యోఽయం లౌకికః వైదికః చ వ్యవహారః సః ఉత్పన్నవివేకజ్ఞానస్య స్థితప్రజ్ఞస్య అవిద్యాకార్యత్వాత్ అవిద్యానివృత్తౌ నివర్తతే. అవిద్యాయాః చ విద్యావిరోధాత్ నివృత్తిః ఇత్యేతమ్ అర్థం స్ఫుటీకుర్వన్ ఆహ -

మూ. యా నిశా సర్వభూతానాం తస్యాం జాగర్తి సంయమీ,
యస్యాం జాగ్రతి భూతాని సా నిశా పశ్యతో మునేః. 69

బాలానందిని

యః ఇతి:- లౌకికమూ,వైదికమూ అయిన ఏ ఈ వ్యవహారం అంతా ఉందో అది అవిద్యవల్ల ఏర్పడినది వివేకజ్ఞానం కలిగిన స్థితప్రజ్ఞునికి అవిద్య తొలగిపోవడంతో ఇది (లౌకిక-వైదికవ్యవహారం)కూడా తొలగిపోతుంది. అవిద్య విద్యకు (జ్ఞానానికి)విరుద్ధ మైనది గాన అది విద్యచేత నివర్తిస్తుంది అనే విషయాన్ని స్పష్టం చేస్తూ చెపుతున్నాడు-

ప్ర.అ. యా ఇతి :- యా = ఏది (ఏ పరమార్థతత్త్వం) సర్వభూతానామ్ = సర్వ ప్రాణులకు (అజ్ఞాను లందరికీ),నిశా = రాత్రియో, తస్యామ్ = దానియందు, సంయమీ = జితేంద్రియు డైన యోగి, జాగర్తి = మేల్కొని ఉంటాడు. యస్యామ్ = దేనియందు, భూతాని = ప్రాణులు, జాగ్రతి = మేల్కొని ఉంటాయో, సా = అది, పశ్యతః = (పరమార్థతత్త్వాన్ని) చూస్తూన్న, మునేః = మునికి,నిశా = రాత్రి.

భాష్యమ్

యా నిశేతి:- యా నిశా రాత్రిః సర్వపదార్థానామ్ అవివేకకరీ తమఃస్వ భావత్వాత్, సర్వేషాం భూతానాం సర్వభూతానామ్; కిం తత్?పరమార్థతత్త్వం స్థితప్రజ్ఞస్య విషయః. యథా నక్తంచరణామ్ అహరేవ సత్ అన్యేషాం నిశా భవతి,తద్వత్ నక్తం చరస్థానీయానామ్ అజ్ఞానాం సర్వభూతానాం నిశేవ నిశా పరమార్థతత్త్వమ్; అగోచర త్వాత్ అతద్బుద్ధీనామ్. తస్యాం పరమార్థతత్త్వలక్షణాయామ్ అజ్ఞాననిద్రాయాః ప్రబుద్ధః జాగర్తి,సయంమీ సంయమవాన్ జితేన్ద్రియః యోగీ ఇత్యర్థః.

బాలానందిని

యా నిశేతి:-ఏది సమస్తభూతాలకు రాత్రియో,తమస్సుతో నిండిన దవడంచేత సర్వపదార్థాల విషయంలో అవివేకాన్ని కలిగించే రాత్రియో,అది ఏమిటి?స్థితప్రజ్ఞునికి విషయ మైన పరమార్థతత్త్వం. పగలు అందరికీ పగలే అయినా ఏ విధంగా అది రాత్రి సంచరించే తిర్యగ్జంతువులు మొదలైనవాటికి రాత్రి అవుతుందో అదే విధంగా పరమార్థ తత్త్వం, దానియందు బుద్ధి లేనివాళ్లకు గోచరం కాదు గాన నక్తంచరులవంటివారైన, అజ్ఞానులైన సర్వభూతాలకూ,సకలజనులకూ,రాత్రివంటిది. పరమార్థతత్త్వంరూప మైన దాని యందు, అజ్ఞాననిద్రనుండి మేల్కొన్న సంయమి,సంయమం ఉన్నవాడు, జితేంద్రియు డైన యోగి,మేల్కొని ఉంటాడు. ("అన్యేషామ్ అహరేవ సత్ నక్తంచరాణాం నిశా భవతి"అని భాష్యవాక్యాన్వయం).

భాష్యమ్

యస్యాం గ్రాహ్యగ్రాహకభేదలక్షణాయామ్ అవిద్యానిశాయాం ప్రసుప్తాన్యేవ భూతాని జాగ్రతి ఇతి ఉచ్యన్తే(తే)(యస్యాం)నిశాయాం ప్రసుప్తా ఇవ స్వప్నదృశః, సా,నిశా, అవిద్యారూపత్వాత్,పరమార్థతత్త్వం పశ్యతః మునేః.అతః కర్మాణి అవిద్యావస్థాయామేవ చోద్యన్తే న విద్యావస్థాయామ్.విద్యాయాం హి సత్యామ్,ఉదితే సవితరి శార్వరమ్ ఇవ తమః,ప్రణాశమ్ ఉపగచ్ఛతి అవిద్యా. ప్రాక్ వివేకోత్పత్తేః అవిద్యా ప్రమాణబుద్ధ్యా గృహ్యమాణా క్రియాకారకఫలభేదరూపా సతీ సర్వకర్మ హేతుత్వం ప్రతిపద్యతే.న అప్రమాణబుద్ధ్యా గృహ్యమాణాయాః కర్మహేతుత్వో పపత్తిః. "ప్రమాణభూతేన వేదేన మమ చోదితం కర్తవ్యం కర్మ"ఇతి హి కర్మణి కర్తా ప్రవర్తతే,న అవిద్యామాత్రమ్ ఇదం సర్వం నిశా ఇవ ఇతి జానన్.

బాలానందిని

యస్యామితి:-తెలియదగినది,తెలుసుకొనేది అనే భేదమే లక్షణంగా గల అవిద్య అనే ఏ రాత్రియందు,నిద్రపోతూనే ఉన్నా కూడ భూతాలు,రాత్రి నిద్రపోతూ స్వప్నం చూచేవాళ్ల వలె,మెలకువగా ఉన్నారు అని చెప్పబడుచున్నారో,అది అవిద్యారూపం అవడంచేత,పరమార్థ తత్త్వాన్ని చూస్తూన్న మునికి రాత్రియే.అందువల్ల కర్మలు అవిద్యావస్థలోనే విధించబడు చున్నాయి కాని విద్యావస్థలో కాదు. విద్య(జ్ఞానం) కలిగినప్పుడు,సూర్యు డుదయించగానే రాత్రికి సంబంధించిన చీకటి తొలగిపోయి నట్లు,అవిద్య నశిస్తుంది.విద్య పుట్టడానికి (జ్ఞానం కలగడానికి) ముందు,క్రియలు,క్రియాసాధనాలు,వాటి ఫలాలు-వీటి భేదా లనే స్వరూపంలో ఉన్న అవిద్య ప్రమాణంగా గ్రహించబడుచున్నంతవరకు సర్వకర్మలకు హేతువు అవుతుంది.ఇది (ఈ అవిద్యాస్థితి) ప్రమాణం కాదు అని గ్రహించబడినప్పుడు ఇంక అది కర్మహేతువు కాజాలదు."ప్రమాణ మైన వేదంచేత నాకు విధించబడిన కర్మను నేను చెయ్యాలి" అనుకొనే కర్తయే కదా కర్మ చేయడానికి ప్రవర్తిస్తాడు? ఇదంతా,రాత్రి వలె,అవిద్యామాత్రమే అని తెలుసుకొన్నవాడు ప్రవర్తించడు.

భాష్యమ్

యస్య పునః"నిశేవ అవిద్యామాత్రమ్ ఇదం సర్వం భేదజాతమ్"ఇతి జ్ఞానం తస్య ఆత్మజ్ఞస్య సర్వకర్మసంన్యాసే ఏవ అధికారః,న ప్రవృత్తౌ.తథా చ దర్శయిష్యతి- "తద్బుద్ధయస్తదాత్మానః" (5.17)ఇత్యాదినా జ్ఞాననిష్ఠాయామ్ ఏవ తస్య అధికారమ్. తత్రాపి ప్రవర్తకప్రమాణాభావే ప్రవృత్త్యనుపపత్తిః ఇతి చేత్;న. స్వాత్మవిషయత్వాత్ ఆత్మజ్ఞానస్య.న హి ఆత్మనః స్వాత్మని ప్రవర్తకప్రమాణాపేక్షా;ఆత్మత్వాదేవ.తదన్తత్వాత్

సర్వప్రమాణానాం ప్రమాణత్వస్య. న హి ఆత్మస్వరూపాధిగమే సతి పునః ప్రమాణ ప్రమేయవ్యవహారః సంభవతి. ప్రమాతృత్వం హి ఆత్మనః నివర్తయతి అన్త్యం ప్రమాణమ్. నివర్తయదేవ చ అప్రమాణీభవతి స్వప్నకాల ప్రమాణమివ ప్రబోధే. లోకే చ వస్త్వధిగమే ప్రవృత్తిహేతుత్వాదర్శనాత్ ప్రమాణస్య. తస్మాత్ న ఆత్మవిదః కర్మణి అధికారః ఇతి సిద్ధమ్. 69

బాలానందిని

యస్యేతి:- ఈ సమస్తమైన భేదసముదాయమూ కూడ, రాత్రి వలె, అవిద్యామాత్రమే అనే జ్ఞానం ఎవని కైతే ఉంటుందో అట్టి ఆత్మజ్ఞానికి సంన్యాసమునందే అధికారం; ప్రవృత్తిలో (కర్మాచరణంలో) అధికారం లేదు. అలాంటి వానికి జ్ఞాననిష్ఠయందే అధికారం అని **"తద్బుద్ధయస్తదాత్మానః"** ఇత్యాదికంచేత ప్రతిపాదించనున్నాడు.

అవ. అవిద్యను ప్రమాణ మనే బుద్ధితో చూచి నంతవరకు కర్మప్రవృత్తి ఉంటుంది; అది తొలగగానే, దానిని ప్రమాణంగా చూడడం మానివేయగానే, కర్మప్రవృత్తి ఉండదు అని చెప్పిన పక్షంలో జ్ఞానం సంపాదించాలి అని విధించే ప్రమాణం లేనప్పుడు జ్ఞానం విషయంలో మాత్రం ప్రవృత్తి ఎలా కలుగుతుంది అని ప్రశ్న కలగవచ్చును; అలా ఆశంకించి దానికి సమాధానం చెపుతున్నాడు-**తత్రాపీతి:**-ప్రవర్తింప చేసే ప్రమాణం లేకపోతే ఆత్మజ్ఞానం విషయంలో కూడ ప్రవృత్తి కుదరదు కదా అని అనడానికి వీలు లేదు; ఎందువల్ల ననగా - ఆత్మజ్ఞానం (ఎవడు) ఆ జ్ఞానం సంపాదించవలసి ఉంటుందో) వానిదే అయిన ఆత్మ విషయంగా కలది; (ఆ జ్ఞానం తనను గూర్చిన జ్ఞానమే). తనను తాను తెలుసుకొనడం కోసం అందుకు ప్రవర్తింపచేసే మరొక ప్రమాణంయొక్క అపేక్ష ఉండదు కదా? అందుకు కారణం ఆ తెలియబడేది తానే అవడం. అన్ని ప్రమాణాలయొక్క ప్రమాణత్వం ఆత్మజ్ఞానంతో ఆగిపోతుంది. (అద్వితీయమైన) ఆత్మయొక్క స్వరూపం తెలిసిన తరువాత ఇంక ప్రమాణము, దానిచేత తెలియదగినది (ప్రమేయము) అనే వ్యవహారం ఉండదు కదా? (అవిద్యాకృత మైన భేదభావం ఉన్నంతవరకే ఇది ప్రమాణం, ఇది ప్రమేయం, ఇతడు ప్రమాత అనేవి ఉంటాయి. ప్రమాణాల ప్రామాణ్యం ఆత్మజ్ఞానం కలగడంతో అంత మైపోతుంది. ఆత్మజ్ఞానం కలిగిన తరువాత ఆ వ్యవహారం లుప్తమైపోతుంది గాన ఇంక జ్ఞానానికి విధి అనేది ఉండదు అని భావం).

అవ. ప్రమాణప్రమేయాదిభావం లేకపోతే అద్వైతజ్ఞానం ఎలా ప్రమాణం అవుతుంది అని ఆశంకించుకొని చెపుతున్నారు- **ప్రమాతృత్వమితి:**- చివరిదైన ప్రమాణం అనగా శాస్త్రరూపమైన ప్రమాణం, ఆత్మయొక్క ప్రమాతృత్వాన్ని నివర్తింపచేస్తుంది.

వి. ప్రమేయం, తెలియదగినది అంటూ ఒకటి ఉంటే తెలుసుకొనేవాడు ప్రమాత అవుతాడు. వానికి ప్రమాతృత్వం ఉంటుంది. ఆత్మ స్వయంప్రకాశం. అది ప్రమేయం కాదు. అలాంటి ఆత్మస్వరూపంయొక్క సాక్షాత్కారం కలగగానే దానికంటె భిన్నమైన ద్వైతప్రపంచమే బాధితమైపోతుంది. ఈ విధంగా అన్త్యప్రమాణ మైన శాస్త్రం బ్రహ్మాకారవృత్తిని కలిగించడం ద్వారా, లేదా ఆత్మస్వరూపసాక్షాత్కారం కలిగించడం ద్వారా అంతవరకు అవిద్యావస్థలో ఆత్మ కున్న ప్రమాతృత్వాన్ని తొలగిస్తుంది. అని భావం.

నివర్తయదేవేతి:- మెలకువ రాగానే స్వప్నకాలంలో ఉన్న ప్రమాణం అప్రమాణం అయినట్లు, చివరి ప్రమాణమైన శాస్త్రం ఆత్మయొక్క ప్రమాతృత్వాన్ని నివర్తింపచేస్తూనే (చేయగానే) అప్రమాణం అవుతుంది.

వి. స్వప్నంలో ఏదో గ్రామంతరం వెళ్లి అక్కడ విషయాలను చూచినట్లు విన్నట్లు అనుకొంటాడు. ఆ సమయంలో ఆ విషయాలను చూచిన, విన్న, చక్షుఃశ్రోత్రాదులు ప్రమాణాలే. మెలకువ రాగానే ఆ ప్రమాణాల ప్రామాణ్యం తొలగిపోతుంది. అట్లే శాస్త్రం కూడ అంతవరకు ఆత్మ కున్నట్లుగా కనబడిన ప్రమాతృత్వాన్ని తొలగించి ఆ వ్యక్తికి సంబంధించినంతవరకు తాను కూడ అప్రమాణం అయిపోతుంది. శాస్త్రం చేసే దల్లా ద్వైతప్రపంచాన్ని నిషేధించడమే. ద్వైతప్రపంచం నిషేధించబడిన తరువాత ఆత్మస్వరూపం తనంతట తానే సాక్షాత్కారగోచరం అవుతుంది. ద్వైతనివృత్త్యనంతరం ఇంక ప్రవృత్తి ఉండదు.

లోకే చేతి:- లోకంలో కూడ, వస్తువును తెలిసికొనడం జరిగిన తరవాత ప్రమాణం ప్రవృత్తికి హేతువు అవడం కనబడడం లేదు కదా? అందువల్ల ఆత్మవేత్తకు కర్మయందు అధికారం లేదు అని సిద్ధించినది.

వి. చక్షురాది ప్రమాణాల సహాయంతో, ఒక ఉన్న వస్తువును (ఘటాదికాన్ని) గ్రహించిన తరువాత, ఆ జ్ఞానం కలిగించడంతో ఆ ప్రమాణాలు చేయవలసిన పనులు పూర్తి అయి పోతాయి. ఇంక ఆ ప్రమాణాలు ఘటంతో ఈ పని చెయ్యి, ఆ పని చెయ్యి అని ప్రేరేపించవు. ఇది భ్రాంతికల్పితసర్పాదిబాధకా లైన, ప్రమాణజనితా లైన "నాయం సర్పః" (ఇది సర్పం కాదు) ఇత్యాదిజ్ఞానాలలో స్పష్టంగా కనబడుతుంది. ప్రత్యక్షప్రమాణం ఇక్కడ 'సర్పం కాదు, త్రాడు' అని జ్ఞాన కలిగించింది. తరువాత 'ఇది ఇలా చెయ్యి' అని ఆ ప్రమాణం ఏమీ చెప్పదు. లోకంలోనే ఇలా ఉన్నప్పుడు అంత్యప్రమాణమైన శాస్త్రం ఆత్మతత్త్వాన్ని కేవలం దూరం నుంచి చూపిస్తుందే కాని కర్మాదులయందు మానవుణ్ణి ప్రవర్తింపచేయదు అని వేరే చెప్పాలా అని భావం. 69

భాష్యమ్

విదుషః త్యక్తైషణస్య స్థితప్రజ్ఞస్య యతేః ఏవ మోక్షప్రాప్తిః న తు అసంన్యాసినః కామకామినః ఇత్యేతమ్ అర్థం దృష్టాన్తేన ప్రతిపాదయిష్యన్ ఆహ-

మూ. అపూర్యమాణమచలప్రతిష్ఠం సముద్రమాపః ప్రవిశన్తి యద్వత్,
తద్వత్కామా యం ప్రవిశన్తి సర్వే స శాన్తిమాప్నోతి న కామకామీ. 70

బాలానందిని

విదుషః ఇతి:- పుత్రైషణాదులను విడచి, స్థితప్రజ్ఞుడైన యతికే మోక్షం లభిస్తుంది కాని సంన్యాసికానివాడై కామములనే కోరేవానికి లభించదు అనే ఈ విషయాన్ని దృష్టాంత పూర్వకంగా ప్రతిపాదించనున్నవాడై చెపుతున్నాడు -

ప్ర.అ. అపూర్యమాణమితి:-అపూర్యమాణమ్ = నింపబడుచున్నదైనా కూడ, అచల ప్రతిష్ఠమ్ = మార్పు లేని స్థితి గల,సముద్రమ్=సముద్రమును,యద్వత్=ఏ విధంగా,ఆపః = జలములు,ప్రవిశన్తి=ప్రవేశిస్తాయో,తద్వత్=ఆ విధంగా, సర్వే=సమస్త మైన,కామాః = కామములు,యమ్ = ఎవనిని,ప్రవిశన్తి = ప్రవేశిస్తాయో, సః = అతడు,శాన్తిమ్ = శాంతిని, ఆప్నోతి = పొందును. కామకామీ = కామాలు కోరేవాడు, న = పొందడు.

భాష్యమ్

అపూర్యేతి:- ఆ పూర్యమాణమ్ అద్భిః,అచలప్రతిష్ఠమ్ అచలతయా ప్రతిష్ఠా అవస్థితిః యస్య తమ్ అచలప్రతిష్ఠం,సముద్రమ్ ఆపః సర్వతః గతాః ప్రవిశన్తి,స్వాత్మస్థమ్ అవిక్రియమేవ సన్తం యద్వత్,తద్వత్ కామాః విషయసంనిధౌ అపి సర్వతః ఇచ్ఛావిశేషాః యం పురుషం, సముద్రమ్ ఇవ ఆపః అవికుర్వన్తః ప్రవిశన్తి ఆత్మన్యేవ ప్రలీయన్తే,న స్వాత్మవశం కుర్వన్తి సః శాన్తిం మోక్షమ్ ఆప్నోతి, న ఇతరః కామకామీ, కామ్యన్తే ఇతి కామాః విషయాః,తాన్ కామయితుం శీలం యస్య సః కామకామీ నైవ ప్రాప్నోతి ఇత్యర్థః. 70

బాలానందిని

అపూర్యేతి :- జలములచేత నింపబడుచున్నది,అచలప్రతిష్ఠమ్-అచలంగా ప్రతిష్ఠ అనగా స్థితి దేనికో అట్టిది అయిన సముద్రాన్ని అన్నివైపులనుండి వచ్చే జలములు ఎలా ప్రవేశిస్తాయో,ఎట్టి వికారాలూ లేక తాను ఎట్లు ఉండేదో అట్లే ఉన్న సముద్రాన్ని ప్రవేశిస్తాయో, అట్లే, విషయాలు దగ్గరగా ఉన్నా కూడ,సమస్తమైన కామాలు,అన్ని వైపులా ఉండే ఇచ్ఛా విశేషాలు, ఏ పురుషుణ్ణి,జలాలలు సముద్రంలో ఏ వికారమూ కూడ కలిగించకుండా ప్రవేశించినట్లు, ఏ వికారమూ కలిగించకుండా ప్రవేశిస్తాయో,అన్నీ ఆత్మలోనే లీనం అయిపోతాయో, వానిని(ఆ యతిని) తమకు వశుడైపోయే టట్లు చేయజాలవో,అతడే,శాంతిని, మోక్షమును,పొందుతాడు. అంతేనే కాని ఇతరుడు,కామకామీ -కామము లనగా కోరబడేవి; అనగా విషయాలు,వాటిని కోరే స్వభావం కలవాడు కామకామి. అట్టివాడు పొందడు అని అర్థం. 70

భాష్యమ్

యస్మాదేవం తస్మాత్ -

మూ. విహాయ కామాన్యః సర్వాన్ పుమాంశ్చరతి నిఃస్పృహః,
నిర్మమో నిరహంకారః స శాన్తిమధిగచ్ఛతి. 71

బాలానందిని

యస్మాదితి:- ఇది ఇలాగ కావున -

ప్ర.అ. విహాయేతి:- యః పుమాన్ = ఏ పురుషుడు, కామాన్ = కామాలను, విహాయ = విడచి,నిఃస్పృహః = ఆశ లేనివాడై, నిర్మమః=మమకారం లేనివాడై,నిరహంకారః = అహంకారం లేనివాడై, చరతి = సంచరిస్తాడో(జీవనయాత్ర చేస్తాడో), సః = అతడు,శాన్తిమ్ = శాంతిని, అధిగచ్ఛతి = పొందును.

భాష్యమ్

విహాయేతి:- విహాయ పరిత్యజ్య,కామాన్,యః సంన్యాసీ,పుమాన్, సర్వాన్ అశేషతః కార్త్స్న్యేన,చరతి జీవనమాత్రచేష్టాశేషః పర్యటతి ఇత్యర్థః. నిఃస్పృహః- శరీర జీవనమాత్రేఽపి నిర్గతా స్పృహా యస్య సః నిస్పృహః సన్,నిర్మమః శరీరజీవనమాత్రాక్షిప్తపరిగ్రహే అపి'మమ ఇదమ్' ఇతి అభినివేశవర్జితః,నిరహంకారః విద్యావత్త్వాది నిమిత్తాత్మసంభావనారహితః ఇత్యర్థః. సః ఏవంభూతః స్థితప్రజ్ఞః బ్రహ్మవిత్,శాన్తిం సర్వసంసారదుఃఖోపరమలక్షణాం నిర్వాణాఖ్యామ్ అధిగచ్ఛతి ప్రాప్నోతి. బ్రహ్మభూతః భవతి ఇత్యర్థః. 71

బాలానందిని

విహాయేతి:- సంన్యాసి యైన ఏ పురుషుడు సమస్త మైన కామాలను పూర్తిగా విడచి సంచరిస్తాడో అని అర్థం; నిస్పృహః -శరీరం జీవించి ఉండడంలో కూడ స్పృహ (ఆసక్తి)ఎవనికి పోయినదో అట్టివాడై నిర్మమః- కూడబెట్టుకొనిన శరీరజీవనంకోసం మాత్రమే అవసరమైనవాటి విషయంలో కూడ 'ఇది నాది'అనే పట్టుదల లేనివాడు;నిరహం కారః -విద్యావంతుడై ఉండడం మొదలైనవాటివల్ల కలిగే "నేను చాలా గొప్పవాడను"అనే అహంకారం లేనివాడు అని అర్థం. సః=ఇట్టి స్థితప్రజ్ఞు డైన బ్రహ్మవేత్త,శాన్తిమ్-సమస్తమైన సంసారదుఃఖములు నశించడం అనే లక్షణం గల'నిర్వాణం'అని చెప్పబడే స్థితిని,పొందుతాడు. బ్రహ్మస్వరూపు డవుతాడు అని అర్థం. 71

భాష్యమ్

సైషా జ్ఞాననిష్ఠా స్తూయతే -

మూ. ఏషా బ్రాహ్మీ స్థితిః పార్థ నైనాం ప్రాప్య విముహ్యతి,
స్థిత్వాఽస్యామన్తకాలేఽపి బ్రహ్మనిర్వాణమృచ్ఛతి. 72

ఇతి శ్రీమహాభారతే శతసాహస్ర్యాం సంహితాయాం వైయాసిక్యాం భీష్మపర్వణి శ్రీమద్భగవద్గీతాసు ఉపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే శ్రీకృష్ణార్జున సంవాదే సాంఖ్యయోగో నామ ద్వితీయః అధ్యాయః.

బాలానందిని

సైషా ఇతి:- అట్టి ఈ జ్ఞాననిష్ఠ స్తుతింపబడుచున్నది -

ప్ర.అ. ఏషా ఇతి:- పార్థ = అర్జునా, ఏషా = ఇది, బ్రాహ్మీ = బ్రహ్మయందు ఏర్పడే, స్థితిః = స్థితి, ఏనామ్ = దీనిని, ప్రాప్య = పొంది, న విముహ్యతి = మోహం చెందదు. అస్యామ్ = ఈ బ్రాహ్మ స్థితియందు, అన్తకాలేఽపి = మరణసమయంలో నైనా, స్థిత్వా = ఉండి, బ్రహ్మనిర్వాణమ్ = బ్రహ్మరూప మైన మోక్షాన్ని, ఋచ్ఛతి = పొందుతాడు.

భాష్యమ్

ఏషా బ్రాహ్మీతి :- ఏషా యథోక్తా బ్రాహ్మీ బ్రహ్మణి భవా ఇయం స్థితిః, సర్వం కర్మ సంన్యస్య బ్రహ్మరూపేణైవ అవస్థానమ్ ఇత్యేతత్. హే పార్థ; న ఏనాం స్థితిం,ప్రాప్య లబ్ధ్వా,న విముహ్యతి న మోహం ప్రాప్నోతి. స్థిత్వా అస్యాం స్థితౌ బ్రాహ్మ్యాం యథోక్తాయామ్,అన్తకాలేఽపి అన్తే వయస్యపి, బ్రహ్మనిర్వాణం బ్రహ్మనిర్వృతిం, మోక్షమ్, ఋచ్ఛతి గచ్ఛతి. కిము వక్తవ్యం బ్రహ్మచర్యాదేవ సంన్యస్య యావజ్జీవం యో బ్రహ్మణ్యేవ అవతిష్ఠతే స బ్రహ్మనిర్వాణమ్ ఋచ్ఛతీతి? 72

ఇతి శ్రీ మత్పరమహంస పరివ్రాజకాచార్య గోవిన్దభగవత్పూజ్యపాదశిష్య శ్రీమచ్ఛఙ్కరభగవతః కృతౌ శ్రీమద్భగవద్గీతాభాష్యే ద్వితీయః అధ్యాయః

బాలానందిని

ఏషా బ్రాహ్మీతి:- ఏషా = ఇంతవరకు చెప్పబడినది, బ్రాహ్మీ = బ్రహ్మయందు కలిగే, స్థితి. సర్వకర్మలను సంన్యసించి బ్రహ్మరూపంలో ఉండడం అనేది అని అర్థం. అర్జునా! ఈ స్థితిని పొంది(ఇక)మోహం చెందదు. అన్తకాలమునందైనను,చివరి వయస్సులో నైనా,

ఇంతవరకు చెప్పిన ఈ బ్రాహ్మస్థితిలో ఉండి(ఉన్నవాడు)బ్రహ్మనిర్వాణమును,బ్రహ్మసుఖమును, మోక్షమును పొందుతాడు. బ్రహ్మచర్యంనుండే సంన్యసించి యావజ్జీవం బ్రహ్మయందు ఉండే వాడు బ్రహ్మనిర్వాణం పొందుతా డని వేరే చెప్పవలెనా? 72

"బాలానందిని"అను శ్రీశాంకరభగవద్గీతాభాష్యాంధ్రవ్యాఖ్యానంలో
ద్వితీయాధ్యాయం
సమాప్తం.

అథ తృతీయః అధ్యాయః

భాష్యమ్

శాస్త్రస్య ప్రవృత్తి(నివృత్తి) విషయభూతే ద్వే బుద్ధీ భగవతా నిర్దిష్టే సాంఖ్యే బుద్ధిః, యోగే బుద్ధిః ఇతి చ. తత్ర "ప్రజహాతి యదా కామాన్'(2.55)ఇత్యారభ్య ఆ అధ్యాయపరిసమాప్తేః సాంఖ్యబుద్ధ్యాశ్రితానాం సంన్యాసం కర్తవ్యమ్ ఉక్త్వా తేషాం తన్నిష్ఠతయైవ చ కృతార్థతా ఉక్తా "ఏషా బ్రాహ్మీ స్థితిః"(2.72)ఇతి. అర్జునాయ చ "కర్మణ్యేవాధికారస్తే"..."మా తే సంగోఽస్త్వకర్మణి"(2.47)ఇతి కర్మైవ కర్తవ్యమ్ ఉక్తవాన్ యోగబుద్ధిమ్ ఆశ్రిత్య,న తతః ఏవ శ్రేయఃప్రాప్తిమ్ ఉక్తవాన్.

బాలానందిని

శాస్త్రస్యేతి:– శాస్త్రం ప్రవర్తించడానికి విషయా లైన (ఏ విషయాలను బోధించడానికై శాస్త్రం ప్రవర్తిస్తుందో అట్టి) రెండు బుద్ధులు,సాంఖమునందు బుద్ధి,యోగమునందు బుద్ధి అనేవి, భగవంతునిచేత ప్రతిపాదించబడ్డాయి. వాటిలో – "ప్రజహాతి యదా కామాన్"అని ప్రారంభించి అధ్యాయం చివరివరకు సాంఖ్యబుద్ధిని ఆశ్రయించినాళ్లు సంన్యాసమునే చెయ్యాలి అని చెప్పి,వాళ్లు సాంఖ్యబుద్ధినిష్ఠులై ఉంటే చాలు, దానిచేతనే కృతార్థు లవుతారు అని "ఏషా బ్రాహ్మీ స్థితిః"అనే శ్లోకంలో చెప్పబడింది. అయితే "కర్మణ్యేవాధికారస్తే... మా తే సంగోఽస్త్వకర్మణి" అని అంటూ అర్జునుడు మాత్రం యోగబుద్ధి నాశ్రయించి కర్మయే చెయ్యాలి అని (భగవంతుడు) చెప్పాడు. అయితే దానివల్లనే శ్రేయస్సు లభిస్తుంది అని మాత్రం చెప్పలేదు.

భాష్యమ్

తదేతత్ ఆలక్ష్య పర్యాకులబుద్ధిః అర్జునః ఉవాచ–కథం భక్తాయ శ్రేయోర్థినే యత్ సాక్షాత్ శ్రేయఃసాధనం సాంఖ్యబుద్ధినిష్ఠాం శ్రావయిత్వా మాం కర్మణి దృష్టానే కానర్థయుక్తే పారంపర్యేణాపి అనైకాన్తికశ్రేయఃప్రాప్తిఫలే నియుఞ్జ్యాత్ ఇతి యుక్తః

పర్యాకులీభావః అర్జునస్య తదనురూపశ్చ ప్రశ్నః "జ్యాయసీ చేత్" (3.1) ఇత్యాదిః. ప్రశ్నాపాకరణవాక్యం చ భగవతా ఉక్తం (భగవతో యుక్తం) యథోక్తవిభాగవిషయే శాస్త్రే.

బాలానందిని

తదితి:- దీనిని చూచి అర్జునుడు వ్యాకుల మైన బుద్ధి కలవాడై పలికాడు (ప్రశ్నించాడు). శ్రేయస్సులను కోరేవాడను, భక్తుడను అయిన నాకు, ఏదైతే సాక్షాత్తు శ్రేయస్సుకు సాధనమో అట్టి సాంఖ్యబుద్ధినిష్ఠను గూర్చి (ముందు) చెప్పి, నన్ను మాత్రం ప్రత్యక్షంగా అనేక మైన అనర్థాలు కనబడుతున్నది, పరంపరయా కూడ శ్రేయఃప్రాప్తి అనే ఫలాన్ని ఇస్తుం దనే నమ్మకం లేనిదీ అయిన కర్మ చెయ్యాలి అని (భగవంతుడు) ఎట్లు ఆదేశిస్తాడో అని అర్జునుడు కంగారుపడడం, దానికి అనుగుణంగా "జ్యాయసీ చేత్" ఇత్యాదివిధంగా ప్రశ్నించడమూ కూడ యుక్తమే. పైన చెప్పిన విభాగాలు గల విషయాలను ప్రతిపాదించే శాస్త్రం విషయంలో భగవంతుడు అర్జునుని ప్రశ్నకు సమాధానంగా చెప్పిన వాక్యం కూడా యుక్తమే.

భాష్యమ్

కేచిత్తు అర్జునస్య ప్రశ్నార్థమ్ అన్యథా కల్పయిత్వా తత్ప్రతికూలం భగవతః ప్రతివచనం వర్ణయన్తి. యథా చాత్మనా సంబన్ధగ్రన్థే గీతార్థః నిరూపితః తత్ప్రతికూలం చ ఇహ పునః ప్రశ్నప్రతివచనయోః అర్థం నిరూపయన్తి. కథమ్? తత్ర సంబన్ధగ్రన్థే తావత్ సర్వేషామాశ్రమిణాం జ్ఞానకర్మణోః సముచ్చయః గీతాశాస్త్రే నిరూపితః అర్థః ఇతి ఉక్తమ్-పునః విశేషితం చ-యావజ్జీవశ్రుతిచోదితాని కర్మాణి పరిత్యజ్య కేవలాదేవ జ్ఞానాత్ మోక్షః ప్రాప్యతే ఇత్యేతత్ ఏకాన్తేనైవ ప్రతిషిద్ధమ్ ఇతి. ఇహ తు ఆశ్రమ వికల్పం దర్శయతా యావజ్జీవశ్రుతిచోదితానామ్ ఏవ కర్మణాం పరిత్యాగః ఉక్తః. తత్ కథమ్ ఈదృశం విరుద్ధమ్ అర్థమ్ అర్జునాయ బ్రూయాత్ భగవాన్? శ్రోతా వా కథం విరుద్ధమ్ అర్థమ్ అవధారయేత్?

బాలానందిని

కేచిదితి:- కొంద రైతే (వృత్తికారాదులు) అర్జునుని ప్రశ్నకు మరొక విధంగా అర్థం కల్పించి భగవంతుని ప్రతివచనాన్ని దానికి ప్రశ్నకు విరుద్ధంగా వర్ణిస్తున్నారు. తామే సంబంధ గ్రంథంలో (గీతావ్యాఖ్యకు ఉపోద్ఘాతంగా వ్రాసిన భాగంలో) గీతార్థాన్ని ఏ విధంగా ప్రతిపాదించి ఉన్నారో దానికి విరుద్ధంగా ఇక్కడ (తృతీయాధ్యాయప్రారంభంలో) ప్రశ్న ప్రతివచనాల అర్థం నిరూపిస్తున్నారు. ఎట్లు? అన్ని ఆశ్రమాలవాళ్లకీ కూడ జ్ఞానకర్మసముచ్చయమే గీతాశాస్త్రంలో చెప్పబడిన విషయం అని (వాళ్లు) సంబంధగ్రంథంలో చెప్పారు. ఈ విషయాన్నే ఇంకా స్పష్టీకరిస్తూ యావజ్జీవశ్రుతులచేత ("జీవించి ఉన్నంతవరకు అగ్నిహోత్రం చెయ్యాలి, ఆ యా కర్మలు చెయ్యాలి" అని విధించే శ్రుతులచేత) విధించబడిన కర్మలను

పరిత్యజించి కేవలం జ్ఞానవల్లనే మోక్షం లభిస్తుంది అనేది(గీతాశాస్త్రంలో)పూర్తిగా నిషేధించ బడినది అని (అక్కడ,సంబంధగ్రంథంలో) చెప్పారు. అయితే-ఇక్కడ(తృతీయాధ్యాయంలో) ఆశ్రమవికల్పాన్ని చూపుతున్న భగవంతునిచేత యావజ్జీవశ్రుతులచేత విధించబడిన కర్మలనే త్యజించ మని చెప్పబడింది.(సంన్యాసులకు జ్ఞాననిష్ఠ,కర్మరులకు కర్మనిష్ఠ అని ఆశ్రమ విభాగాన్ని చెపుతూ సంన్యాసులు యావజ్జీశ్రుతులు విధించిన కర్మలు కూడ పరిత్యజించాలి అని చెపుతున్నాడు అని అర్థం.ఇది వృత్తికారాదుల సంబంధగ్రంథంలో చెప్పిన ఏ ఆశ్రమం వాళ్లూ కూడ కర్మలను త్యజించకూడదు అని చెప్పినదానికి విరుద్ధం అని భావం).భగవంతుడు ఇలాంటి పరస్పరవిరుద్ధమైన విషయం అర్జునునికి ఎలా బోధిస్తాడు?శ్రోతయైన అర్జును డైనా ఈ విరుద్ధార్థాన్ని ఎలా సరిగానే ఉన్న దని గ్రహిస్తాడు?

భాష్యమ్

తత్ర ఏతత్ స్యాత్ – గృహస్థానామ్ ఏవ శ్రౌతకర్మపరిత్యాగేన కేవలాత్ ఏవ జ్ఞానాత్ మోక్షః ప్రతిషిధ్యతే, న తు ఆశ్రమాన్తరాణామ్ ఇతి;ఏతదపి పూర్వోత్తర విరుద్ధమేవ. కథమ్?సర్వాశ్రమిణాం జ్ఞానకర్మణోః సముచ్చయః గీతాశాస్త్రే నిశ్చితః అర్థః ఇతి ప్రతిజ్ఞాయ కథం తద్విరుద్ధం కేవలాదేవ జ్ఞానాత్ మోక్షం బ్రూయాత్ ఆశ్రమాన్తరాణామ్?అథ మతమ్ – శ్రౌతకర్మాపేక్షయా ఏతద్వచనమ్;కేవలాదేవ జ్ఞానాత్ శ్రౌతకర్మరహితాత్ గృహస్థానాం మోక్షః ప్రతిషిధ్యతే ఇతి; తత్ర గృహస్థానాం విద్యమాన మపి స్మార్తం కర్మ అవిద్యమానవత్ ఉపేక్ష్య జ్ఞానాదేవ కేవలాత్ ఇత్యుచ్యతే ఇతి; ఏతదపి విరుద్ధమ్. కథమ్?గృహస్థస్యైవ స్మార్తకర్మణా సముచ్చితాత్ జ్ఞానాత్ మోక్షం ప్రతిషిధ్యతే న తు ఆశ్రమాన్తరాణామ్ ఇతి కథం వివేకిభిః శక్యమ్ అవధారయితుమ్?

బాలానందిని

తత్రేతి:– "శౌతకర్మను పరిత్యజించి కేవలం జ్ఞానం సంపాదించనంతమాత్రాన మోక్షం కలుగదు అనేది గృహస్థుల విషయంలో మాత్రమే",సంన్యాస్యాదుల విషయంలో కాదు అని వాళ్ల(వృత్తికారాదుల) అభిప్రాయం కావచ్చును;ఇలా చెప్పినా కూడ జ్ఞానకర్మ సముచ్చయమే గీతాశాస్త్రంలో ప్రతిపాదించబడింది అని(వెనుక)చెప్పి,దానికి విరుద్ధంగా (ఇక్కడ) ఆశ్రమాంతరాలకు (గృహస్థేతరులకు)కేవలజ్ఞానంవల్లనే మోక్షం అని ఎలా చెపుతారు?

అవ. గృహస్థులు శ్రౌతకర్మ తప్పకుండా చెయ్యాలి అనే అభిప్రాయంతోనే వాళ్లకు కేవలం ఆత్మజ్ఞానంవల్ల మోక్షం రాదు అని చెపుతున్నాం;అంతేనే కాని గృహస్థులకు జ్ఞాన మాత్రంచేత మోక్షం నిషేధించి ఇతరులకు మాత్రం కేవలజ్ఞానంచేత మోక్షం వస్తుంది అని చెప్పడం మా ఉద్దేశ్యం కాదు;ఇతరాశ్రమాలవాళ్లకి స్మార్తకర్మతో జ్ఞానానికి సముచ్చయం

ఉంటుంది అని మేం అంగీకరిస్తున్నాం అని పూర్వపక్షియొక్క సమాధానాన్ని ఆశంకించుకొని సమాధానం చెపుతున్నారు. **అథేతి:**- శ్రౌతకర్మను దృష్టిలో ఉంచుకొని ఇలా చెప్పబడింది, గృహస్థులకు శ్రౌతకర్మరహితమైన కేవలజ్ఞానంవల్ల మోక్షం రాదు అని చెప్పబడింది, శ్రౌతకర్మ చేయని గృహస్థులకు స్మార్తకర్మ ఉన్నా కూడ అది లేనట్లు ఉపేక్షించి(పరిగణించి)కేవలజ్ఞానం వల్ల (మోక్షం లేదు)అని చెప్పబడుచున్నది-అనగా శ్రౌతకర్మ చేయని గృహస్థులు స్మార్తకర్మ చేస్తూండడంచేత దానితో జ్ఞానానికి సముచ్చయం ఉంది అని చెప్పడానికి వీలున్నా కూడ, ఆ స్మార్తకర్మ లేనట్లే పరిగణించి 'కేవలజ్ఞానం' అనే పదం ప్రయోగింపబడింది-అని మత మైన ట్లయితే,అది కూడ విరుద్ధమే.ఎట్లు? గృహస్థునికి మాత్రమే స్మార్తకర్మసముచ్చితమైన జ్ఞానంవల్ల(శ్రౌతకర్మతో కూడ సముచ్చితం కాని జ్ఞానంవల్ల)మోక్షం రాదు, ఇతరాశ్రమాల వాళ్లకి మాత్రం (స్మార్తకర్మతో సముచ్చితమైన జ్ఞానవల్ల)లభిస్తుంది అని వివేకవంతులు నిర్ధారణ చేయడానికి ఎట్లు శక్యం అవుతుంది?

వి. గృహస్థుల కైతే శ్రౌతకర్మ స్మార్తకర్మ రెండింటితో సముచ్చితమైతేనే జ్ఞానం మోక్షం ఇస్తుంది,ఇతరులకు కేవల స్మార్తకర్మతో సముచ్చితం అయితే చాలు అని చెప్పి నప్పుడు గృహస్థేతరుల విషయంలో పక్షపాతం చూపినట్లవుతుంది అని భావం.

భాష్యమ్

కించ యది మోక్షసాధనత్వేన స్మార్తాని కర్మాణి ఊర్ధ్వరేతసాం సముచ్చీయన్తే తథా గృహస్థస్య అపి ఇష్యతాం స్మార్తైః ఏవ సముచ్చయః న శ్రౌతైః.అథ శ్రౌతైః స్మార్తైశ్చ గృహస్థస్యైవ సముచ్చయః మోక్షాయ, ఊర్ధ్వరేతసాం తు స్మార్తకర్మమాత్ర సముచ్చితాత్ జ్ఞానాత్ మోక్షః ఇతి తత్ర ఏవం సతి గృహస్థస్య ఆయాసబాహు ల్యాత్ శ్రౌతాం స్మార్తం చ బహుదుఃఖరూపం కర్మ శిరసి ఆరోపితం స్యాత్.

బాలానందిని

కించేతి:- మరొక విషయ మేమనగా - మోక్షానికి సాధనంగా స్మార్తకర్మలను మాత్రమే సంన్యాసులకు (జ్ఞానంతో)సముచ్చయం చేసే పక్షంలో వాళ్లకి వలెనే గృహస్థునికి కూడ స్మార్తకర్మలతో మాత్రమే సముచ్చయం అంగీకరించాలి కాని శ్రౌతకర్మలతో కూడ అంగీకరించకూడదు.గృహస్థునికి మోక్షం రావా లంటే శ్రౌతస్మార్తకర్మలు రెండింటితోను సముచ్చయం ఉండాలి,ఊర్ధ్వరేతస్కులకైతే(సంన్యాసులకైతే),స్మార్తకర్మలతో మాత్రం సముచ్చయం ఉంటే మోక్షం లభిస్తుంది అని అప్పుడు అత్యధికమైన శ్రమ చేయవలసి ఉండడంచేత అత్యధికదుఃఖరూప మైన శ్రౌతమూ,స్మార్తమూ అయిన కర్మ గృహస్థుని నెత్తిమీద మోపిన ట్లవుతుంది.

భాష్యమ్

అథ గృహస్థస్యైవ ఆయాసబాహుల్యకారణాత్ మోక్షః స్యాత్,న ఆశ్రమాన్త రాణామ్;శ్రౌతనిత్యకర్మరహితత్వాత్ ఇతి?తదపి అసత్;సర్వోపనిషత్సు ఇతిహాసపురాణ యోగశాస్త్రేషు చ జ్ఞానాఙ్గత్వేన ముముక్షోః సర్వకర్మసంన్యాసవిధానాత్,ఆశ్రమవికల్ప సముచ్చయవిధానాచ్చ శ్రుతిస్మృత్యోః.

బాలానందిని

అథేతి:- అట్లు కాక-అత్యధిక మైన శ్రమ ఉండడంచేత గృహస్థునికి మాత్రమే మోక్షం లభిస్తుంది;శ్రౌతము లైన నిత్యకర్మలు లేని ఇతరాశ్రమాలవాళ్లకి మోక్షమే లభించదు అని అంటాం-అంటే,అది కూడ అయుక్తమే.ఎందువల్ల ననగా-అన్ని ఉపనిషత్తులలోను, ఇతిహాస-పురాణ-యోగశాస్త్రాలలోను ముముక్షువునకు,జ్ఞానం సంపాదించడానికి అగంగా సర్వకర్మసంన్యాసం విధించబడింది.అట్లే శ్రుతులలోను,స్మృతులలోను కూడ ఆశ్రమవికల్పం, సముచ్చయం విధింపబడి ఉన్నాయి.

వి. "బ్రహ్మచర్యం సమాప్య గృహీ భవేద్వనీ భూత్వా ప్రవ్రజేత్,యది వేతరథా బ్రహ్మచర్యాదేవ ప్రవ్రజే-ద్గృహాద్వా వనాద్వా" అను శ్రుతివాక్యం "ఒక వ్యక్తి బ్రహ్మచర్యం పూర్తిచేసికొని గృహస్థుడు కావాలి;తరువాత వానప్రస్థుడు కావాలి;తరువాత సంన్యసించాలి" అని అన్ని ఆశ్రమాల సముచ్చయాన్ని(ఒక వ్యక్తి ఒకదాని తరువాత ఒకటిగా అన్ని ఆశ్రమాలూ ప్రవేశించాలి అని సముచ్చయం) బోధిస్తూన్నది.అట్లే "అలా కాకపోతే బ్రహ్మచర్యం నుంచే సంన్యసించవచ్చును, గృహస్థాశ్రమంనుంచి సంన్యసించవచ్చు లేదా వానప్రస్థాశ్రమంనుంచి సంన్యసించవచ్చు" అని వికల్పాన్ని చెపుతూన్నది.

భాష్యమ్

సిద్ధః తర్హి సర్వాశ్రమిణాం జ్ఞానకర్మణోః సముచ్చయః?న.ముముక్షోః సర్వకర్మ సంన్యాసవిధానాత్. "పుత్రైషణాయాశ్చ విత్తైషణాయాశ్చ లోకైషణాయాశ్చ వ్యుత్థాయాథ భిక్షాచర్యం చరన్తి"(బృ.ఉ.3-5-1), "తస్మాత్ న్యాసమేషాం తపసామ్ అతిరిక్తమ్ ఆహుః"(మహానా.ఉ.24.1)"న్యాస ఏవాత్యరేచయత్"(మహానా.ఉ.21.2)ఇతి."న కర్మణా న ప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వమానశుః" (మహానా ఉ.10.5కై.ఉ.2) ఇతి చ."బ్రహ్మచర్యాదేవ ప్రవ్రజేత్" (జాబా.ఉ.4.) ఇత్యాద్యాః శ్రుతయః.

"త్యజ ధర్మమధర్మం చ ఉభే సత్యానృతే త్యజ,
ఉభే సత్యానృతే త్యక్త్వా యేన త్యజసి తత్త్యజ" (శాం.ప.329.40;331.44)
"సంసారమేవ నిఃసారం దృష్ట్వా సారదిదృక్షయా,
ప్రవ్రజన్త్యకృతోద్వాహాః పరం వైరాగ్యమాశ్రితాః" (నారదపరి.ఉ.3.15)

ఇతి బృహస్పతిః.

"కర్మణా బధ్యతే జన్తుర్విద్యయా చ విముచ్యతే.
తస్మాత్ కర్మ న కుర్వన్తి యతయః పారదర్శినః" (శాం.ప.241.7)

ఇతి శుకానుశాసనమ్.

ఇహాపి చ- "సర్వకర్మాణి మనసా సంన్యస్య" (5-13)ఇత్యాది. మోక్షస్య చ అకార్యత్వాత్ ముముక్షోః కర్మానర్థక్యమ్.

బాలానందిని

సిద్ధ ఇతి:- అయితే అన్ని ఆశ్రమాలవాళ్లకీ జ్ఞానకర్మసముచ్చయం ఉండా లని తేలింది కదా?అట్లు కాదు."పుత్రైషణాయాశ్చ...చరన్తి"(పుత్రైషణనుండి,విత్తైషణనుండి, లోకైషణనుండి పైకి లేచి, ఆ ఏషణలను,కోరికలను,విడచి,భిక్షాచర్యం చేస్తారు-సంన్యసిస్తారు) "తస్మాత్...అహుః"(అందువల్ల ఈ తపస్సులలో సంన్యాసమే గొప్పతపస్సు అని అంటారు) "న్యాస ఏవాత్యరేచయత్"(సంన్యాసమే సర్వోత్కృష్టంగా అయింది)అని ముముక్షువుకు సర్వకర్మసంన్యాసమే విధించబడింది కదా?"న కర్మణా....అనశుః"(జనులు కర్మచేత గాని, సంతానంచేత గాని,ధనంచేత గాని మోక్షాన్ని పొందలేదు.సంన్యాసంచేతనే కొందరు ధీమంతులు పొందారు) అని కూడ చెప్పబడింది. "బ్రహ్మచర్యాదేవ ప్రవ్రజేత్"(బ్రహ్మచర్యం నుండే సంన్యసించాలి)" ఇత్యాదిశ్రుతులు ఈ విషయమే చెప్పుచున్నాయి."త్యజ....తత్త్యజ" (ధర్మాన్ని,అధర్మాన్నీ కూడ విడచిపెట్టుము.సత్యాన్ని అసత్యాన్నీ కూడ విడిచిపెట్టుము.సత్యా నృతాలను రెండింటినీ విడిచిపెట్టి ఏ మనస్సుచేత వీటి నన్నింటినీ విడిచిపెడుతున్నావో దానిని కూడ విడిచిపెట్టుము), (అని స్మృతి చెప్పుచున్నది) "సంసారమేవ...ఆశ్రితాః" (సంసారం సారరహిత మైన దని చూచి, తత్త్వాన్ని చూడా లనే కోరికతో,వివాహం చేసికొనని వారై,గొప్ప వైరాగ్యాన్ని ఆశ్రయించి సంన్యసిస్తున్నారు)అని బృహస్పతి చెప్పిఉన్నాడు."కర్మణా... పారదర్శినః"(నరుడు కర్మచేత బంధింపబడతాడు.విద్యచేత (జ్ఞానంచేత)విముక్తు డౌతాడు. అందువల్ల పారమును(తత్త్వమును)చూచిన యతులు కర్మ చేయరు)అని శుకుని ఉపదేశం. ఇక్కడ(భగవద్గీతలో)కూడ"సర్వకర్మాణి మనసా"ఇత్యాదికం చెప్పబడింది.మరొక విషయమే మనగా మోక్షం(ఏ పనైనా చేసి)పుట్టించబడేది కాదు.అందువల్ల కూడ ముముక్షువునకు కర్మలతో పని లేదు.

భాష్యమ్

నిత్యాని ప్రత్యవాయపరిహారార్థమ్ అనుష్ఠేయాని ఇతి చేత్,న అసంన్యాసి విషయత్వాత్ ప్రత్యవాయప్రాప్తేః. న హి అగ్నికార్యాద్యకరణాత్ సంన్యాసినః ప్రత్యవాయః

కల్పయితుం శక్యః యథా బ్రహ్మచారిణామ్,అసంన్యాసినామపి కర్మిణామ్. న తావత్ నిత్యానాం కర్మణామ్ అభావాదేవ భావరూపస్య ప్రత్యవాయస్య ఉత్పత్తిః కల్పయితుం శక్యా;'కథమసతః సజ్జాయేత"(ఛా. ఉ. 6. 2. 2)ఇతి అసతః సజ్జన్మాసంభవశ్రుతేః. యది విహితాకరణాత్ అసంభావ్యమ్ అపి ప్రత్యవాయం బ్రూయాత్ వేదః తదా అనర్థకరః వేదః అప్రమాణమ్ ఇతి ఉక్తం స్యాత్;విహితస్య కరణాకరణయోః దుఃఖమాత్రఫలత్వాత్'. తథా చ కారకం శాస్త్రమ్;న జ్ఞాపకమ్ ఇతి అనుపపన్నార్థం 'కల్పితం స్యాత్, న చైతత్ ఇష్టమ్. తస్మాత్ న సంన్యాసినాం కర్మాణి;అతః జ్ఞానకర్మణోః సముచ్చయానుపపత్తిః.

బాలానందిని

నిత్యానీతి:ప్రత్యవాయం(ఏదైన ఒక కర్మ యథావిధిగా చేయకపోయినా,చేయవలసిన కర్మ చేయకపోయినా కలిగే దుష్ఫలితం ప్రత్యవాయం)కలగకుండా చూచుకొనడం కోసం నిత్యకర్మలు చేయవలసి ఉంటుంది అన్నట్లయితే-అది యుక్తం కాదు.ఎందువల్ల ననగా ప్రత్యవాయం కలగడం అనేది సంన్యాసి కానివానికి మాత్రమే వర్తిస్తుంది.అగ్నికార్యాదులు చేయకపోవడంవల్ల బ్రహ్మచారులకు ప్రత్యవాయం కలిగినట్లు సంన్యాసులకు గాని, సంన్యాసులు కానివారైనా ఇతరకర్ములకు గాని కలుగుతుం దని కల్పించడం శక్యం కాదు కదా?

వి. అగ్నికార్యాదులు బ్రహ్మచారికి విధించబడిన నిత్యకర్మలు. అవి చేయకపోతే బ్రహ్మచారికి ప్రత్యవాయం కలగవచ్చునేమో కాని ఏ కర్మలూ లేని సంన్యాసికి (అగ్నికార్యాద్యకరణంవల్ల)ప్రత్యవాయం కలుగుతుం దని చెప్పడం కుదరదు.సర్వకర్మలనూ విడచిన సంన్యాసులకే కాదు,కొన్ని కర్మలు ఆచరించ వలసి ఉన్న గృహస్థాదులకు కూడ అగ్నికార్యాద్యకరణంవల్ల ప్రత్యవాయం కలగదు.అగ్నికార్యాదులు బ్రహ్మచారికే విధింపబడ్డాయి గాన వానికే అవి చేయకపోతే ప్రత్యవాయం కలుగుతుంది.అది విధించని కర్మమార్గంలో ఉన్నవాళ్లకైనా ప్రత్యవాయం కలగదు.అలాంటప్పుడు అన్ని కర్మలూ విడచి ఏ కర్మయందూ కూడ అధికారం లేని సంన్యాసికి ప్రత్యవాయం కలిగే అవకాశం ఏముంటుంది అని భావం.

న తావదితి:- నిజానికి-(నిత్యకర్మలు చేయకపోవడం అనగా నిత్యకర్మల అభావం) నిత్యకర్మాభావంనుండి భావపదార్థ మైన ప్రత్యవాయం పుడుతుంది అని కల్పించడం శక్యం కాదు. **"కథమసతః సజ్జాయేత"**(అసత్తునుండి (అభావంనుండి)సత్(భావపదార్థం)ఎలా పుడుతుంది)అను శ్రుతి అసత్తునుండి సత్తు పుట్టదు అని చెప్పుచున్నది కదా? విధించబడిన

కర్మను చేయకపోవడంవల్ల అసంభావ్యమైనా కూడ (పుట్టడానికి ఏ మాత్రము అవకాశం లేనిదైనా కూడ)ప్రత్యవాయం పుడుతుంది అని వేదం చెప్పిన ట్లయితే అప్పుడు వేదం అనర్థకర మైనది;అందుచేత ప్రమాణం కాదు అని చెప్పిన ట్లవుతుంది.ఎందువల్ల ననగా విహితమైన ఆ కర్మ(నిత్యకర్మ)చేసినా దుఃఖమే చేయకపోయినా దుఃఖమే కలుగుతున్నది. అలా అంగీకరిస్తే శాస్త్రం కారకమే కాని జ్ఞాపకం కాదు గాన అనుపపన్న మైన(యుక్తి సంగతం కాని) అర్థం కలది అని కల్పించిన ట్లవుతుంది.ఇది(అనుపపన్నమైన అర్థాన్ని బోధించడంచేత వేదం అప్రమాణం అనే విషయం)ఇష్టం నీకూ నాకూ కూడ (అంగీకార యోగ్యం)కాదు.అందువల్ల సంన్యాసులకు కర్మలు లేవు;అందువల్ల జ్ఞానకర్మలకు సముచ్చయం కుదరదు.

వి. నిత్యకర్మ లైన సంధ్యావందనాదులు వేదవిహితకర్మలు. ఈ నిత్యకర్మలను చేసినందువల్ల ఫలం ఏదీ ఉండదు కాని చేయకపోతే ప్రత్యవాయం కలుగుతుంది అని మీమాంసకు లంటారు. చేయకపోతే ప్రత్యవాయం కలుగుతుంది అని చెప్పడం యుక్తం కాదు.అభావం నుండి భావం పుట్టదు కదా?ఆ కర్మలు చేసినా ఫలం ఏమీ ఉండదు; చేసే శ్రమవల్ల కలిగే దుఃఖం కలుగుతుంది.చేయకపోతే ప్రత్యవాయరూప మైన దుఃఖం కలుగు తుంది.ఈ విధంగా చేసినా ఫలం దుఃఖమే చేయకపోయినా దుఃఖమే అని బోధించే శాస్త్రం, అనర్థమాత్రకరమైన శాస్త్రం, ప్రమాణం ఎలా అవుతుంది?అభావంనుంచి భావం పుట్టదు అనేది లోకంలో ఉంటే ఉండవచ్చు, వేదం చెపుతూన్నది గాన అభావానికే భావాన్ని పుట్టించే శక్తిని వేదం కలిగిస్తుంది అని అనడానికి వీలు లేదు. ఏ యే వస్తువులలో ఏ యే శక్తు లుంటాయని లోకంలో ప్రసిద్ధి ఉంటుందో ఆ ప్రసిద్ధినే అనుసరించి వేదం ఆ యా విషయాలను తెలుపుతుంది కాని పదార్థాలలో లేని శక్తిని పుట్టింపజాలదు.అ విధంగా అది జ్ఞాపకమే కాని కారకం కాదు.చీకట్లో ఉన్న ఘటాన్ని మనకు కనబడే టట్లు చేసే దీపం ఆ ఘటానికి జ్ఞాపకం (ఉన్న దని చూపేది)మాత్రమే కాని కారకం (పుట్టించేది) కాదు.అట్లే శాస్త్రం కూడ కారకం కాదు.అందుచేత అభావంనుండి భావం పుడుతుం దని శాస్త్రం చెప్పినా అది పుట్టదు.అలాంటి వేవీ శాస్త్రం చెప్పదుఅని"**తథా చ కారకం శాస్త్రమ్**"ఇత్యాది వాక్యానికి అర్థం.

భాష్యమ్

"జ్యాయసీ చేత్కర్మణస్తే మతా బుద్ధిః"(3-1)ఇతి అర్జునస్య ప్రశ్నానుపపత్తేశ్చ. యది హి భగవతా ద్వితీయే అధ్యాయే జ్ఞానం కర్మ చ సముచ్చయేన త్వయా అనుష్ఠేయమ్ ఇతి ఉక్తం స్యాత్ తతః అర్జునస్య ప్రశ్నః అనుపపన్నః- "జ్యాయసీ

చేత్కర్మణస్తే మతా బుద్ధిః" ఇతి. అర్జునాయ చేత్ బుద్ధికర్మణీ త్వయా అనుష్ఠేయే ఇతి ఉక్తే యా కర్మణః జ్యాయసీ బుద్ధిః సాపి ఉక్తా ఏవ ఇతి– **"తత్కిం కర్మణి ఘోరే మాం నియోజయసి కేశవ"**(3.1)ఇతి ప్రశ్నః న కథంచన ఉపపద్యతే.న చ అర్జునస్యైవ జ్యాయసీ బుద్ధిః న అనుష్ఠేయా ఇతి భగవతా ఉక్తం పూర్వమ్ ఇతి కల్పయితుం యుక్తం,యేన జ్యాయసీ చేత్ ఇతి ప్రశ్నః స్యాత్.

బాలానందిని

జ్యాయసీతి:– మరొక విషయం ఏమనగా– **"జ్యాయసీ...బుద్ధిః"**(కర్మకంటె బుద్ధి ఎక్కువ మంచిది అని నీ అభిప్రాయ మైతే)అని అర్జునుడు ప్రశ్నించడం యుక్తం కాదు. ద్వితీయాధ్యాయంలో భగవంతుడు "నువ్వు జ్ఞానాన్నీ కర్మనీ కలిపి అనుష్ఠించాలి"అని చెప్పి ఉన్నట్లయితే అప్పుడు **"జ్యాయసీ చేత్కర్మణస్తే మతా బుద్ధిః"**అని అర్జునుడు ప్రశ్నించడం యుక్తం కాదు."బుద్ధికర్మలను రెండింటినీ నువ్వు అనుష్ఠించాలి"అని అర్జునునకు చెప్పిన పక్షంలో కర్మకంటె గొప్పదైన బుద్ధి కూడ ఆతనికి చెప్పబడే ఉంది గాన **"తత్కిం కర్మణి ఘోరే మాం నియోజయసి"** (అలాంటప్పుడు నన్ను ఘోరమైన కర్మయందు ఎందుకు నియ మిస్తున్నావు?) అను ప్రశ్న ఏ విధంగానూ కుదరదు. భగవంతుడు వెనుక,కర్మకంటె మంచిదైన బుద్ధిని నీవు మాత్రమే అనుష్ఠించకూడదు అని అర్జునునికి చెప్పాడు అని కల్పించడానికి వీలుంటే **'జ్యాయసీ చేత్'** ఇత్యాదిప్రశ్నకు అవకాశం ఉండేది;కాని అలాంటి కల్పన చేయడానికి ఆధారం ఏదీ లేదు.

భాష్యమ్

యది పునః ఏకస్య పురుషస్య జ్ఞానకర్మణోః విరోధాత్ యుగపత్ అనుష్ఠానం న సంభవతీతి భిన్నపురుషానుష్ఠేయత్వం భగవతా పూర్వమ్ ఉక్తం స్యాత్ తతః అయం ప్రశ్నః ఉపపన్నః–**"జ్యాయసీ చేత్"** ఇత్యాదిః. అవివేకతః ప్రశ్నకల్పనాయామపి భిన్న పురుషానుష్ఠేయత్వేన భగవతః ప్రతివచనం నోపపద్యతే.న చ అజ్ఞాననిమిత్తం భగవ త్ప్రతివచనం కల్ప్యమ్.అస్మాచ్చ భిన్నపురుషానుష్ఠేయత్వేన జ్ఞానకర్మనిష్ఠయోః భగవతః ప్రతివచనదర్శనాత్ జ్ఞానకర్మణోః సముచ్చయానుపపత్తిః.తస్మాత్ కేవలాదేవ జ్ఞానాత్ మోక్షః ఇతి ఏషః అర్థః నిశ్చితో గీతాసు సర్వోపనిషత్సు చ.జ్ఞానకర్మణోః ఏకం వద నిశ్చిత్య ఇతి చ ఏకవిషయైవ ప్రార్థనా అనుపపన్నా ఉభయోః సముచ్చయసంభవే. **"కురు కర్మైవ తస్మాత్త్వమ్"**(4.15)ఇతి చ జ్ఞాననిష్ఠాసంభవమ్ అర్జునస్య అవధారణేన దర్శయిష్యతి.

బాలానందిని

యదీతి:- జ్ఞాన -కర్మలు పరస్పర విరుద్ధము లైనవి అవడంచేత,వాటిని ఒక పురుషుడు ఒకే సమయంలో అనుష్ఠించజాలడు,అందుచేత అవి వేరు వేరు పురుషులు అనుష్ఠింపదగినవే అని భగవంతుడు వెనుక చెప్పి ఉంటేనే అప్పుడు "జ్యాయసీ చేత్" ఇత్యాది ప్రశ్న ఉపపన్నం అవుతుంది. అవివేకంవల్ల ప్రశ్నవేయబడింది అని కల్పించినా(అనగా భగవంతుడు చెప్పినది జ్ఞానకర్మసముచ్చయమే. అది సరిగా అర్థం చేసికొనలేక అర్జునుడు ఇలా ప్రశ్నించాడు అని కల్పించినా)వీటిని వేరు వేరు పురుషులు అనుష్ఠించాలి అని భగవంతుని ప్రతివచనం కుదరదు. భగవంతుడు అజ్ఞానంచేత ఇలా సమాధానం చెప్పాడు అనడం యుక్తం కాదు. ఈ విధంగా భగవంతుడు జ్ఞాన-కర్మనిష్ఠలు వేరు వేరు పురుషుల చేత అనుష్ఠేయములు అని ప్రతివచనంలో చెప్పడంవల్ల కూడ జ్ఞాన-కర్మలకు సముచ్చయం కుదరదు. అందువల్ల మోక్షం కేవలజ్ఞానంవల్ల మాత్రమే కలుగుతుంది అనేదే గీతలలోను, సకలఉపనిషత్తులలోను నిశ్చితమైన విషయం. రెండింటికీ సముచ్చయం కుదిరే పక్షంలో "జ్ఞానకర్మలలో ఏదో ఒకదానినే నిశ్చయించి చెప్పుము"అని అంటూ ఒకేదానిని గూర్చిన ప్రార్థన కూడ ఉపపన్నం కాదు. మరొక విషయ మేమనగా-"అందువల్ల నువ్వు కర్మనే చేయుము"అని అంటూ భగవంతుడు అర్జునునికి జ్ఞాననిష్ఠ సంభవం కాదు అని నిశ్చయ పూర్వకంగా చూపనున్నాడు.

భా.అ.ప్ర. అర్జునునకు కర్మయందే అధికారం గాని జ్ఞాననిష్ఠయందు లేదు అని శ్రీ శంకరభగవత్పాదులు ఇక్కడ ప్రతిపాదించినదానిని పట్టి "ఆత్మయాథాత్మ్యా న్ని తెలుసుకొని కర్మ చెయ్యాలి" అనే శ్రీరామానుజమతం నిరాకరించబడినది. ఎందువల్ల ననగా - ఆత్మతత్త్వదర్శనం సాంఖ్యులకు సంబంధించినది. కర్మ యోగులకు సంబంధించినది. ఆత్మ కర్త కాదు, భోక్త కాదు అనే దర్శనం కర్తృత్వాద్యభి మానం ఉంటేనే కాని కుదరని కర్మలకు విరుద్ధ మైనది. (భా.అ.ప్ర. పే.113)

అర్జున ఉవాచ- అర్జును డిలా అన్నాడు-

మూ. జ్యాయసీ చేత్కర్మణస్తే మతా బుద్ధిర్జనార్దన,
తత్కిం కర్మణి ఘోరే మాం నియోజయసి కేశవ. 1

బాలానందిని

ప్ర.అ. జ్యాయసీతి:- జనార్దన =శ్రీకృష్ణా! కర్మణః = కర్మకంటె, బుద్ధిః = బుద్ధి, జ్యాయసీ = ఉత్తమ మైనదిగా, తే = నీకు,మతా చేత్ = అంగీకార్యం అయితే, తత్ = అలాంటప్పుడు, కేశవ = ఓ!కేశవా! మామ్ = నన్ను; ఘోరే = భయంకరమైన,కర్మణి = కర్మయందు, కిం నియోజయసి = ఎందుకు నియోగి స్తున్నావు?

భాష్యమ్

జ్యాయసీ శ్రేయసీ,చేత్ యది,కర్మణః సకాశాత్,తే తవ,మతా అభిప్రేతా,బుద్ధిః జ్ఞానమ్, హే! జనార్దన! యది బుద్ధికర్మణీ సముచ్చితే ఇష్టే తదా ఏకం శ్రేయః సాధనమ్ ఇతి **"కర్మణో జ్యాయసీ బుద్ధిః"** ఇది కర్మణః అతిరిక్తకరణం బుద్ధేః అనుపపన్నమ్ అర్జునేన కృతం స్యాత్. న హి తదేవ హి తస్మాత్ ఫలతః అతిరిక్తం స్యాత్. తథా కర్మణః శ్రేయస్కరీ భగవతా ఉక్తా బుద్ధిః, అశ్రేయస్కరం చ కర్మ కురు ఇతి మాం ప్రతిపాదయతి;తత్ కిం ను కారణమ్,ఇతి భగవతః ఉపాలమ్భమ్ ఇవ కుర్వన్, తత్;కిం కస్మాత్,కర్మణి,ఘోరే క్రూరే హింసాలక్షణే,మాం నియోజయసి కేశవ ఇతి చ యత్ ఆహ తత్ న ఉపపద్యతే.అథ స్మార్తేనైవ కర్మణా సర్వేషాం భగవతా ఉక్తః అర్జునేన చ అవధారితః చేత్ **"తత్ కిం కర్మణి ఘోరే మాం నియోజయసి"** ఇత్యాది కథం యుక్తం వచనమ్? 1

బాలానందిని

జ్యాయసీ ఇతి:- ఓ ! జనార్దనా! బుద్ధిః = జ్ఞానం, కర్మణః సకాశాత్ = కర్మకంటె, జ్యాయసీ = శ్రేయసిగా, ఎక్కువ ప్రశస్యమైనదిగా, నీకు అంగీకార్యం అయితే -

అవ. ఇప్పుడు జ్ఞానకర్మసముచ్చయం అంగీకార్యం కాదనే విషయం ఇక్కడ ప్రతిపాదించబడుచున్నది అని వివరిస్తూన్నారు - **యదీతి**:- సముచ్చితము లైన (కలిసిన) బుద్ధికర్మలు శ్రేయఃసాధనాలు అని భగవంతునికి ఇష్టమైన పక్షంలో రెండూ కలవగా ఏర్పడిన ఆ ఏకమే శ్రేయఃసాధనం గాన **"జ్యాయసీ బుద్ధిః"**అని అంటూ అర్జునుడు బుద్ధినుంచి కర్మను వేరు చేసి నిర్దేశించడం యుక్తం కాదు.అదే దానికంటె ఫలాపేక్షయా వేరు కాదు కదా?(అనగా సముచ్చయపక్షంలో బుద్ధి-కర్మలు సమప్రాధాన్యం కలవి గాన రెండూ కలిసియే ఒక ఫలాన్ని సమకూర్చాలి.అలాం టప్పుడు ఫలాన్ని ఇవ్వడానికి సంబంధించి నంతవరకు బుద్ధి కర్మకంటె గొప్పది అని చెప్పడం యుక్తం కాదు. బుద్ధి-కర్మలు రెండూ కలిసిపోయి నప్పుడు అవి విడదీయరానివి గాన బుద్ధి అంటే కర్మనూ, కర్మ అంటే బుద్ధినీ గ్రహించి నట్లవుతుంది. బుద్ధి కర్మకంటె గొప్పది అని అంటే బుద్ధి బుద్ధికంటె గొప్పది అని చెప్పినట్లు పర్యవసిస్తుంది.అది అయుక్తం అనిభావం).అట్లే "భగవంతుడు బుద్ధి కర్మకంటె శ్రేయస్కరం అని చెప్పాడు;నన్ను మాత్రం శ్రేయస్కరం కాని కర్మ చేయవలసిందిగా ఆదేశిస్తున్నాడు; ఇందుకు కారణం ఏమై ఉంటుంది"అనుకొన్న అర్జునుడు భగవంతుణ్ణి నిందిస్తున్నాడా అన్నట్లు **"కస్మాత్కర్మణి ఘోరే మాం నియోజయసి కేశవ"**(కేశవా! హింసారూప మైన క్రూర మైన కర్మయందు నన్ను ఎందుకు నియోగిస్తున్నావు?)అని ప్రశ్నించడం ఉపపన్నం కాదు.

ఇక - భగవంతుని అభిప్రాయం ప్రకారం అందిరికీ కూడ స్మార్తకర్మతో(జ్ఞానానికి)సముచ్చయం ఇష్ట మైనది అన్నట్లయితే,అదే విధంగా అర్జునుడు కూడ నిశ్చితంగా గ్రహించి ఉంటే "తత్కిం కర్మణి ఘోరే మాం నియోజయసి" ఇత్యాదివాక్యం యుక్తం ఎలా అవుతుంది? (ఈ మతం ప్రకారం జ్ఞానంతో పాటు శ్రేయఃసాధనానికి స్మార్తకర్మ కూడ ఆవశ్యకమే గాన భగవంతుడు తనను స్మార్తమైన యుద్ధాచరణరూపకర్మయందే ప్రవర్తింపచేస్తున్నాడు గాన ఆ విషయం తెలిసిన అర్జునుడు అధిక్షేపపూర్వకంగా ప్రశ్నిస్తున్నట్లు ఇలా ప్రశ్నించకూడదు అని భావం). 1

భాష్యమ్

కిం చ -

మూ. వ్యామిశ్రేణేవ వాక్యేన బుద్ధిం మోహయసీవ మే,
తదేకం వద నిశ్చిత్య యేన శ్రేయోఽహమాప్నుయామ్. 2

బాలానందిని

కిం చేతి:- మరియు -

ప్ర.అ. **వ్యామిశ్రేణేతి**:- వ్యామిశ్రేణ ఇవ = కలిసిపోయినది వలె, అస్పష్టం వలె, ఉన్న,వాక్యేన=వాక్యంచేత,మే=నాయొక్క,బుద్ధిమ్=బుద్ధిని,మోహయసి ఇవ=మోహింపచేస్తున్నట్లు ఉన్నావు. తత్ = అందువల్ల, యేన = దేనిచేత,అహమ్ = నేను, శ్రేయః = శ్రేయస్సును, ఆప్నుయామ్ = పొందకలుగుతానో అట్టి; ఏకమ్ = ఒక్కదానిని, నిశ్చిత్య = నిశ్చయించి, వద = చెప్పుము.

భాష్యమ్

వ్యామిశ్రేణేతి:- వ్యామిశ్రేణేవ-యద్యపి వివిక్తాభిధాయీ భగవాన్ తథాపి మమ మన్దబుద్ధేః వ్యామిశ్రమ్ ఇవ భగవద్వాక్యం ప్రతిభాతి-తేన మమ బుద్ధిం మోహయసి ఇవ మమ బుద్ధివ్యామోహాపనయాయ హి ప్రవృత్తః త్వం తు కథం మోహయసి? అతః బ్రవీమి బుద్ధిం మోహయసీవ,మే మమ,ఇతి. త్వం తు భిన్నకర్తృకయోః జ్ఞానకర్మణోః ఏకపురుషానుష్ఠానాసంభవం యది మన్యసే తత్ర ఏవం సతి తత్ తయోః ఏకం బుద్ధిం కర్మ వా ఇదమ్ ఏవ అర్జునస్య యోగ్యం, బుద్ధిశక్త్యవస్థానురూపమ్ ఇతి నిశ్చిత్య వద బ్రూహి. యేన జ్ఞానేన కర్మణా వా అన్యతరేణ శ్రేయః అహమ్; ఆప్నుయాం ప్రాప్నుయామ్. యది హి కర్మనిష్ఠాయాం గుణభూతమపి జ్ఞానం భగవతా ఉక్తం స్యాత్ తత్ కథం తయోః ఏకం వద ఇతి ఏకవిషయైవ అర్జునస్య శుశ్రూషా స్యాత్? న హి

భగవతా ఉక్తమ్: అన్యతరదేవ జ్ఞానకర్మణోః వక్ష్యామి నైవ ద్వయమ్ ఇతి;యేన ఉభయ ప్రాప్త్యసంభవమ్ ఆత్మనః మన్యమానః ఏకమేవ ప్రార్థయేత్. 2

బాలానందిని

వ్యామిశ్రేణేతి:- వ్యామిశ్రేణేవ భగవంతుడు వివిక్తాభిధాయి,(ఏ విషయానికి ఆ విషయం విభజించి చెప్పేవాడు)అయినా కూడ మందబుద్ధి నైన నాకు భగవంతుని(నీ) వాక్యం వ్యామిశ్రం వలె కనబడుతూన్నది.అందుచేత నువ్వు నా బుద్ధిని మోహపెట్టుతున్నావా అన్నట్లున్నావు.నా బుద్ధిలో కలిగిన వ్యామోహాన్ని తొలగించడం కోసం ప్రవర్తిస్తూన్న నువ్వు ఎందుకు మోహపెడతావు?అందువల్ల నా బుద్ధిని మోహపెట్టుచున్నావా అన్నట్లు ఉన్నావు. జ్ఞానం కర్మ అనేవి వేరు వేరు కర్తలు కలవి.ఒకే పురుషుడు(ఒకే సమయంలో)వాటిని రెండింటిని అనుష్ఠింపజాలడు అని నీవు భావిస్తూన్న ట్లయితే అప్పుడు,వాటిలో ఒకటియే- బుద్ధి లేదా కర్మ,అర్జునునికి తగినది;వాని బుద్ధికి,శక్తికి,అతని అవస్థకు అనురూపంగా ఉంటుంది అని నిశ్చయించి చెప్పుము.అలా చెపితే నేను జ్ఞానమో,కర్మయో ఏదో ఒకటి పరిగ్రహించి శ్రేయస్సును పొందడానికి వీలవుతుంది.

అవ :- అర్జునుని ప్రార్థనను పట్టి కూడ జ్ఞానకర్మసముచ్చయవాదం గీతాసంమతం కాదని సూచింపబడుచున్న దని పునరుద్ఘాటిస్తున్నారు-

యది హీతి: - భగవంతుడు జ్ఞానాన్ని కర్మలో గుణంగా (నైనా ప్రధానంగా కాకపోతే అప్రధానంగా నైనా) చెప్పి ఉన్నట్లయితే వాటిలో ఒకటి చెప్పు అని అర్జునుడు ఒకదానిని గూర్చియే వినాలనే అభిలాష ఎలా వ్యక్తం చేస్తాడు?(అనగా జ్ఞానంతో కూడిన కర్మను భగవంతుడు బోధించి ఉన్నట్లయితే జ్ఞానకర్మలలో ఒకదానిని నాకు చెప్పు అని అర్జునుడు ఎలా అడుగుతాడు అని భావం)జ్ఞానకర్మలలో ఏదో ఒకదానిని గూర్చియే చెపుతాను, రెండింటిని చెప్పను అని భగవంతుడు అనలేదు కదా?భగవంతుడు అలా అని ఉన్నట్లయితే తనకు రెండూ అనుకూలం కావనే అభిప్రాయంతో అర్జునుడు ఏదో ఒకటి చెప్పుము అని అడగడానికి అవకాశం ఉండేది.(రెండింటిలో నాకు ఏది మంచిదో చెప్పుము అని అర్జునుడు అడిగా డనగా,భగవంతుడు రెండూ కలిస్తేనే శ్రేయస్కరాలు అని చెప్పలే దనే విషయం అర్జునుడు స్పష్టంగా గ్రహించా డనే అర్థం.అందుచేత ఇక్కడ సముచ్చయవాదంలేదని అర్జునుని ప్రార్థనను పట్టి కూడ, తెలుస్తూన్నది అని భావం).

భా. అ. ప్ర: -ఇక్కడ శ్రీరామానుజాచార్యులు-"ఆత్మావలోకానికి సాధనము, సకలేంద్రియాల వ్యాపారం అణగిపోవడ మనే స్వరూపం గలది అయిన జ్ఞాననిష్ఠకు దానికి విరుద్ధమైన స్వభావం గల కర్మ సాధన మైనది;దానినే చెయ్యి"అని చెప్పే వాక్యం వ్యామిశ్రమే అనగా విరుద్ధమే.అందుచేత మిశ్రరూపం కాని ఒక వాక్యం చెప్పుము.ఆ వాక్యంచేత నేను

అనుష్ఠేయం ఏదో నిశ్చయించుకొని శ్రేయస్సును పొందుతాను" అని వ్యాఖ్యానించారు. అది అయుక్తం. జ్ఞానయోగం కర్మయోగంచేత లభిస్తుంది అని చెప్పే వాక్యం విరుద్ధం ఎలా అవుతుంది. కర్మయోగమే జ్ఞానయోగం అని చెపితే-వాటిలో ఒకటి ఇంద్రియవ్యాపారరూపం అవడంచేత, రెండవది ఇంద్రియవ్యాపారోపరమరూపం అవడంచేత విరుద్ధం అయితే కావచ్చును. మరొక విషయ మేమనగా-ఇంద్రియవ్యాపారంచేత సాధ్యం అవడం అనేది ఇంద్రియవ్యాపారోపరమానికి విరుద్ధం అనడానికి కూడ వీలు లేదు. **"తదుదితః స హి యో యదనన్తరః"**(ఏది దేని తరువాత పుడుతుందో అది దానినుండి పుట్టినదే కదా) అనే న్యాయాన్ని అనుసరించి ఇంద్రియవ్యాపారం తరువాత కలిగిన, ఇంద్రియ వ్యాపారోపరతిరూపమైన నిద్ర ఇంద్రియవ్యాపారంనుండే పుట్టినట్లు కనబడుతున్నది కదా? అట్లే మనోవ్యాపారోపరమం ఇంద్రియనిగ్రహం మొదలైన మనోవ్యాపారంచేతనే సాధించబడుచున్నట్లు కనబడుతూన్నది. అట్లే-'వ్యామిశ్రమ్'అనగా 'విరుద్ధం'అనీ,'ఏకమ్'అనగా 'అవిరుద్ధం'అనీ అర్థం చెప్పడం కూడ అయుక్తమే. ఆ పదాలవల్ల ఆ అర్థాలు లభించడంలేదు కదా?

"కర్మయోగంవల్ల సంపాదింపదగిన బుద్ధి గొప్పది అని నీ అభిప్రాయమైతే నన్ను ఘోరకర్మలో ఎందుకు నియోజిస్తున్నావు?"అనే అధిక్షేపణంకూడ అనుపపన్నమే. కర్మయందు నియుక్తు డైనవాడు కర్మయోగం సాధించిన తరువాత వానికి దానివల్ల సంపాదించబడే జ్ఞానయోగం ఎలాగా లభిస్తుంది కదా? బుద్ధి-కర్మలను గూర్చి మాటలాడే సందర్భంలో 'ఏకం వద' అన్నప్పుడు వాటిలో ఒకటి చెప్పుము అనే అర్థమే అక్కడ నున్న పదసంనివేశాన్ని పట్టి లభిస్తుండగా,'వద'అంటేనే సరిపోతూండగా,'వాక్యం వద'అని వ్యాఖ్యానించడం పౌనరుక్త్య దోషాన్ని కలిగిస్తూన్నది.

'నిశ్చిత్య' అనేదానిని 'వద'తో అన్వయించి 'నిశ్చిత్య వద'అని అర్థంచెప్పకుండా నేను నిశ్చయించుకొని శ్రేయస్సును పొందుతాను అనే అర్థం వచ్చేటట్లు తరువాతి వాక్యంతో అన్వయించడం కూడ అయుక్తమే. భగవంతుడొక విషయం నిశ్చయించిన తరువాత తాను నిశ్చయించడానికి అవకాశం ఏమీ ఉండదు కదా! భగవంతు డెలా చెపితే అలాగే చెయ్యాలి కాని తన నిశ్చయానికి తావెక్కడ? పురుషుడు నిశ్చయిస్తే ప్రయోజనం ఏమిటి?'నిశ్చిత్య వద' అని అంటే భగవంతుని సర్వజ్ఞత్వానికి భంగం కదా(ఏదో బాగా ఆలోచించి చెప్పుము అంటే భగవంతుణ్ణి మనవంటి వానినిగానే చూచిన ట్లవుతుంది కదా)అనడానికి వీలు లేదు. నాకు వాక్యార్థం నిశ్చితం అయే టట్లు చెప్పుము అనడంలో దోషం లేదు.'యేన'అనేదానికి 'ఏ వాక్యంచేత'అని అర్థం చెప్పడం కూడ యుక్తం కాదు. "శ్రేయఃప్రాప్తికి ఏది సాధనమో అది చెప్పుము"అని మాత్రమే ఇక్కడ వక్తయొక్క అభిప్రాయం కదా? కేవలం వాక్యంవల్ల శ్రేయస్సు లభించదు గాన అది (వాక్యం) కరణం (సాధనం)కాదు. "త్వం కర్మైవ కురు"(నువ్వు

కర్మయే చెయ్యాలి)అనే వాక్యమే నిశ్చయాత్మకం గాన "వాక్యంచేత నిశ్చయించి'అనే అర్థం కూడ పొసగదు. (భా. అ.ప్ర. పే. 116). 2

భాష్యమ్

ప్రశ్నానురూపమేవ ప్రతివచనం శ్రీ భగవాన్ ఉవాచ -

శ్రీ భగవానువాచ -

మూ. లోకేఽస్మిన్ ద్వివిధా నిష్ఠా పురా ప్రోక్తా మయానఘ,
జ్ఞానయోగేన సాంఖ్యానాం కర్మయోగేన యోగినామ్. 3

బాలానందిని

ప్రశ్నేతి:- ప్రశ్నకు అనురూపమైన ప్రతివచనాన్నే శ్రీభగవంతుడు చెప్పాడు.

ప్ర.అ. లోకే ఇతి:- అనఘ = దోషాలు లేనివాడా! సాంఖ్యానామ్ = సాంఖ్యులకు, జ్ఞానయోగేన = జ్ఞానయోగంచేత, యోగినామ్ = యోగులకు,కర్మయోగేన = కర్మయోగంచేత, ద్వివిధా = రెండు విధాలైన, నిష్ఠా = నిష్ఠ, పురా = పూర్వమునందు, మయా = నాచేత, అస్మిన్ = ఈ, లోకే = లోకంలో, ప్రోక్తా = చెప్పబడినది.

భాష్యమ్

లోకేఽస్మిన్నితి :- లోకే అస్మిన్ శాస్త్రార్థానుష్ఠాధికృతానాం త్రైవర్ణికానాం, ద్వివిధా ద్విప్రకారా,నిష్ఠా స్థితిః అనుష్ఠేయతాత్పర్యమ్,పురా పూర్వం సర్గాదౌ ప్రజాః సృష్ట్వా తాసామ్ అభ్యుదయనిఃశ్రేయసప్రాప్తిసాధనం వేదార్థసంప్రదాయమ్ ఆవిష్కుర్వతా, ప్రోక్తా,మయా స్వర్వజ్ఞేన ఈశ్వరేణ,హే అనఘ అపాప.తత్ర కా సా ద్వివిధా నిష్ఠా ఇత్యాహ- తత్ర జ్ఞానయోగేన జ్ఞానమ్ ఏవ యోగః తేన,సాంఖ్యానామ్ ఆత్మానాత్మవిషయవివేకజ్ఞానవతాం, బ్రహ్మచర్యాదేవ కృతసంన్యాసానాం,వేదాన్త విజ్ఞాన సునిశ్చితార్థానాం,బ్రహ్మణ్యేవ అవస్థితానాం,నిష్ఠా ప్రోక్తా. కర్మయోగేన-కర్మైవ యోగః కర్మయోగః తేన కర్మయోగేన,యోగినాం కర్మిణాం నిష్ఠా ప్రోక్తా ఇత్యర్థః.

బాలానందిని

లోకేఽస్మిన్నితి :- ఈ లోకంలో శాస్త్రోక్తవిషయాలను ఆచరించడానికి అధికారం ఉన్న త్రైవర్ణికులకు రెండు విధాలైన, రెండు ప్రకారాలు గల, నిష్ఠ,అనగా స్థితి, అనుష్ఠించ వలసినదానియందు తత్పరత్వం,పురా = పూర్వము, సృష్టిప్రారంభంలో ప్రజలను సృష్టించి వాళ్లకు అభ్యుదయం కలగడానికి నిఃశ్రేయసం(మోక్షం)లభించడానికి సాధన మైన వేదార్థ

సంప్రదాయాన్ని ఆవిష్కరించిన,సర్వజ్ఞుడను,ఈశ్వరుడను అయిన నాచేత, చెప్పబడింది. హేఅనఘ=పాపాలు లేనివాడా!ఆ ద్వివిధ మైన నిష్ఠ ఏదో చెపుతున్నాడు జ్ఞానమే ఒక యోగం.ఆ జ్ఞానయోగంచేత, సాంఖ్యానామ్=ఆత్మానాత్మలను గూర్చిన వివేకజ్ఞానం కలవారు, బ్రహ్మచర్యాశ్రమంనుండే సంన్యాసం చేసినవారు, ఉపనిషదర్థాన్ని బాగా తెలుసుకొనడంచేత దృఢంగా నిశ్చితమైన తాత్త్వికవిషయం కలవారు,బ్రహ్మయందే స్థిరంగా ఉన్నవారూ అయిన పరమహంసపరివ్రాజకులకు నిష్ఠ(జ్ఞానయోగంచేత నిష్ఠ)చెప్పబడింది.కర్మయే ఒక యోగం. ఆ కర్మయోగంచేత యోగులకు,అనగా కర్మలనాచరించేవారికి,నిష్ఠ చెప్పబడింది అని అర్థం.

భాష్యమ్

యది చ ఏకేన పురుషేణ ఏకస్మై పురుషార్థాయ జ్ఞానం కర్మ చ సముచ్చిత్య అనుష్ఠేయం భగవతా ఇష్టమ్,ఉక్తం వక్ష్యమాణం వా గీతాసు,వేదేషు చ ఉక్తం కథమ్ ఇహ అర్జునాయ ఉపసన్నాయ ప్రియాయ విశిష్టభిన్నకర్తృకే ఏవ జ్ఞానకర్మనిష్ఠే బ్రూయాత్?యది పునః అర్జునః జ్ఞానం కర్మ చ ద్వయం శ్రుత్వా స్వయమేవ అనుష్ఠాస్యతి, అన్యేషాం తు భిన్నపురుషానుష్ఠేయతాం వక్ష్యామి ఇతి మతం భగవతః కల్ప్యేత,తదా రాగద్వేషవాన్,అప్రమాణభూతః భగవాన్ కల్పితః స్యాత్.తచ్చ అయుక్తమ్.తస్మాత్ కయాపి యుక్త్యా న సముచ్చయః జ్ఞానకర్మణోః యత్ అర్జునేన ఉక్తం కర్మణః జ్యాయస్త్వం బుద్ధేః, తచ్చ స్థితమ్ అనిరాకరణాత్.తస్యాః చ జ్ఞాననిష్ఠాయాః సంన్యాసినామేవ అనుష్ఠే యత్వం,భిన్నపురుషానుష్ఠేయత్వవచనాత్.భగవతః ఏవమేవ అనుమతమ్ ఇతి గమ్యతే. 3

బాలానందిని

అవ. జ్ఞానకర్మసముచ్చయవాదాన్ని మళ్లీ క్రొత్త యుక్తులను చూపి ఖండిస్తున్నారు- **యదీతి**:- ఒక పురుషుడు ఒకే పురుషార్థం కోసమై జ్ఞానాన్ని కర్మనీ కలిపి అనుష్ఠించాలి అని భగవంతునిచేత అంగీకరించబడితే,గీతలలో కూడ వెనుక చెప్పబడి ఉంటే,మున్ముందు కూడ చెప్పబడ నుంటే,వేదాలలో కూడ అలాగే చెప్పబడి ఉంటే భగవంతు డిక్కడ,తనకు ప్రియుడు,తనను శరణుజొచ్చినవాడు అయిన అర్జునునికి,ఈ జ్ఞానకర్మనిష్ఠలు వేరు వేరు లక్షణాలు గల వేరు వేరు పురుషులచేత అనుష్ఠింపతగినవి అని ఎలా బోధిస్తాడు?జ్ఞానమూ, కర్మా-ఈ రెండింటినీ గూర్చి విని అర్జునుడు తానే సముచ్చయం ఆచరిస్తాడులే;ఇతరులకు మాత్రం ఇవి వేరు వేరు పురుషులచేత అనుష్ఠింపదగినవి అని బోధిస్తాను అని భగవంతుని అభిప్రాయం అయి ఉంటుంది అని కల్పిస్తే (అనగా భగవంతుని కిష్టమైనది సముచ్చయ వాదమే.అందుచేతనే తనకు బాగా ప్రియుడైన అర్జునుడు రెండూ విన్నాడు కాబట్టి జ్ఞానకర్మ

సముచ్చయానుష్ఠానం చేసి శ్రేయస్సు పొందుతాడు;ఇతరులకు శ్రేయస్సు కలిగే ఉపాయం నేనెందుకు చెప్పాలి;అందుచేత రెండు యోగాలూ వేరు వేరు పురుషులు చేయవలసినవి అని చెపుదాం అని భగవంతుని కపటాలోచన ఉన్నట్లు కల్పిస్తే) భగవంతుడు రాగద్వేషాలున్నవాడవడంచేత ప్రమాణం కాదు(నమ్మదగినవాడు కాదు)అని కల్పించి నట్లు అవుతుంది. అది అయుక్తం.అందువల్ల ఏ యుక్తిచేత కూడ జ్ఞానకర్మలకు సముచ్చయం కుదరదు.కర్మ కంటె బుద్ధి గొప్పది అని అర్జును డన్న మాటను భగవంతుడు నిరాకరించలేదు;అందుచేత అది అలాగే ఉంది.ఈ రెండు నిష్ఠలు వేరు వేరు పురుషులచేత అనుష్ఠింపదగినవి అని చెప్పడంచేత జ్ఞాననిష్ఠ అనుష్ఠించ తగినవారు సంన్యాసులే.భగవంతుని అభిప్రాయం ఇదే అని తెలుస్తూన్నది. 3

భాష్యమ్

మాం చ బన్ధకారణే కర్మణ్యేవ నియోజయసి ఇతి విషణ్ణమనసమ్ అర్జునం కర్మ న ఆరభే ఇతి మన్వానమ్ ఆలక్ష్య ఆహ భగవాన్–న కర్మణామనారమ్భాదితి. అథవా–జ్ఞానకర్మనిష్ఠయోః పరస్పరవిరోధాత్ ఏకేన పురుషేణ యుగపత్ అనుష్ఠాతుమ్ అశక్యత్వే సతి ఇతరేతరానపేక్షయోః ఏవ పురుషార్థహేతుత్వే ప్రాప్తే.కర్మనిష్ఠాయాః జ్ఞాననిష్ఠాప్రాప్తిహేతుత్వేన పురుషార్థహేతుత్వం,న స్వాతన్త్ర్యేణ,జ్ఞాననిష్ఠా తు కర్మనిష్ఠోపాయలబ్ధాత్మికా సతీ స్వాతన్త్ర్యేణ పురుషార్థహేతుః,అన్యానపేక్షా ఇత్యేతమ్ అర్థం ప్రదర్శ యిష్యన్ ఆహ భగవాన్ –✓

మూ. న కర్మణామనారమ్భాన్నైష్కర్మ్యం పురుషోఽశ్నుతే
న చ సంన్యసనాదేవ సిద్ధిం సమధిగచ్ఛతి. 4

బాలానందిని

మామితి:– నన్ను మాత్రం బంధకారణ మైన కర్మయందే నియోగిస్తున్నావు అని మనస్సులో దిగులు చెందిన అర్జునుడు నేను కర్మ ప్రారంభించను (చేయను)అని మనస్సులో అనుకొంటున్నా డని గుర్తించి భగవంతుడు 'న కర్మణామనారమ్భాత్'ఇత్యాదికం చెపుతున్నాడు. లేదా జ్ఞాననిష్ఠా–కర్మనిష్ఠలు పరస్పరవిరుద్ధములు.అందుచేత ఒక పురుషుడు ఒకే సమయంలో అనుష్ఠింపజాలడు గాన అవి ఒకదాని అపేక్ష మరొకదానికి లేకుండానే పురుషార్థమునకు హేతువులు అని చెప్పవలసి ఉండగా,అట్లు కాదు;కర్మనిష్ఠ, జ్ఞాననిష్ఠాప్రాప్తికి హేతువు అవడం ద్వారా మాత్రమే పురుషార్థహేతువుకాని స్వతంత్రంగా కాదు;కర్మనిష్ఠ ద్వారా జనించిన జ్ఞాననిష్ఠమాత్రం మరొకదాని దేని అపేక్షా లేకుండా, స్వతంత్రంగానే పురుషార్థహేతువు అని చూపడానికై భగవంతు డన్నాడు –

శ్రీ.అ. నేతి:- కర్మణామ్ అనారమ్భాత్ అప్రారమ్భాత్,కర్మణాం క్రియాణాం యజ్ఞాదీనామ్ ఇహ జన్మని జన్మాన్తరే వా అనుష్ఠితానామ్ ఉపాత్తదురితక్షయహేతుత్వేన సత్త్వశుద్ధికారణానాం,తత్కారణత్వేన చ జ్ఞానోత్పత్తిద్వారేణ జ్ఞాననిష్ఠాహేతూనాం.

"జ్ఞానముత్పద్యతే పుంసాం క్షయాత్పాపస్య కర్మణః
యథాదర్శతలప్రఖ్యే పశ్యత్యాత్మానమాత్మని" (శాం.ప.204.8)

ఇత్యాదిస్మరణాత్,అనారమ్భాత్ అననుష్ఠానాత్,నైష్కర్మ్యమ్ నిష్కర్మభావం కర్మశూన్యతాం, జ్ఞాన యోగేన నిష్ఠాం నిష్క్రియాత్మస్వరూపేణైవ అవస్థానమ్ ఇతి యావత్,పురుషః న అశ్నుతే న ప్రాప్నోతి ఇత్యర్థః.

బాలానందిని

నేతి:- "న కర్మణామ్ - అనారమ్భాత్"- యజ్ఞాదిక్రియల అనారంభంవల్ల, ఈ జన్మలో కాని,జన్మాంతరాలలో కాని అనుష్ఠింపబడి,కూడబెట్టుకొనబడిన పాపాల క్షయం ద్వారా చిత్తశుద్ధికి కారణములు,సత్త్వశుద్ధికి కారణం అవడంచేత,"జ్ఞానముత్పద్యతే...ఆత్మనా" (పాపకర్మ నశించడంవల్ల,అద్దం వంటి అంతఃకరణంలో ఆత్మను చూడకలిగే టట్లుగా, పురుషులకు జ్ఞానం కలుగుతుంది)అని స్మృతిలో చెప్పి నట్లు,జ్ఞానం పుట్టడం ద్వారా జ్ఞాననిష్ఠకు హేతువు లైన కర్మలయొక్క,అనారమ్భాత్ = అనుష్ఠానం చేయకపోవడంవల్ల, నైష్కర్మ్యమ్ = నిష్కర్మత్వాన్ని,కర్మ లేకపోవడాన్ని,అనగా జ్ఞానయోగనిష్ఠను,అనగా సకలక్రియాశూన్య మైన ఆత్మస్వరూపంతోనే స్థితిని,పురుషుడు పొందడు అని అర్థం.

భాష్యమ్

"కర్మణామ్ అనారమ్భాత్ నైష్కర్మ్యం న అశ్నుతే"ఇతి వచనాత్ తద్విపర్యయాత్, తేషామ్ ఆరమ్భాత్ నైష్కర్మ్యమ్ అశ్నుతే ఇతి గమ్యతే.కస్మాత్ పునః కారణాత్ కర్మణామ్ అనారమ్భాత్ నైష్కర్మ్యం న అశ్నుతే ఇతి-ఉచ్యతే-కర్మారమ్భస్యైవ నైష్కర్మ్యోపాయత్వాత్. న హి ఉపాయమ్ అన్తరేణ ఉపేయప్రాప్తిః అస్తి.కర్మయోగోపాయత్వం చ నైష్కర్మ్య లక్షణస్య జ్ఞానయోగస్య;శ్రుతౌ ఇహ చ ప్రతిపాదనాత్. శ్రుతౌ తావత్ ప్రకృతస్య ఆత్మలోకస్య వేద్యస్య వేదనోపాయత్వేన -

"తమేతం వేదానువచనేన బ్రాహ్మణా వివిదిషన్తి యజ్ఞేన"(బృ.ఉ.4.4.2)

ఇత్యాదినా కర్మయోగస్య జ్ఞానయోగోపాయత్వం ప్రతిపాదితమ్.ఇహాపి చ-

"సంన్యాసస్తు మహాబాహో దుఃఖమాప్తుమయోగతః"(5.6)

"యోగినః కర్మ కుర్వన్తి సంగం త్యక్త్వాత్మశుద్ధయే"(5.11)

"యజ్ఞో దానం తపశ్చైవ పావనాని మనీషిణామ్"(18.5)

ఇత్యాది ప్రతిపాదయిష్యతి.

బాలానందిని

కర్మణామితి:- కర్మలను చేయకపోవడంవల్ల నైష్కర్మ్యాన్ని పొందదు అని చెప్పడం వల్ల,అందుకు విపరీతంగా,కర్మలను చేయడంవల్ల నైష్కర్మ్యాన్ని పొందుతాడు అని తెలుస్తూన్నది.కర్మలను చేయకపోవడంవల్ల నైష్కర్మ్యాన్ని ఎందుకు పొందదు?చెప్పబడుచున్నది -విను.కర్మలు చేయడమే నైష్యర్మ్యానికి ఉపాయం అవడంవల్ల(కర్మలు చేయనివాడు నైష్కర్మ్యం పొందజాలడు).ఉపాయం లేకుండా ఉపేయం లభించదు కదా?నైష్కర్మ్యరూప మైన జ్ఞాన యోగానికి కర్మయోగమే ఉపాయం అని శ్రుతిలోను,ఇక్కడా(భగవద్గీతలో)కూడ ప్రతిపాదించ బడినది.ప్రకృతమైన,తెలియదగిన ఆత్మలోకాన్ని(ఆత్మయే లోకం) తెలుసుకొనడానికి ఉపాయంగా,**"తమేతం...యజ్ఞేన"**(బ్రాహ్మణులు ఈ ఆత్మను వేదాధ్యయనంచేత,యజ్ఞంచేత తెలుసుకొనడానికి కోరుతారు)ఇత్యాదిశ్రుతిచేత కర్మయోగం జ్ఞానయోగానికి ఉపాయంగా ప్రతిపాదించబడింది.ఇక్కడ కూడ"సంన్యాస్తు...అయోగతః,**"యోగినః...శుద్ధయే"**,**"యజ్ఞో... మనీషిణామ్"** ఇత్యాది వాక్యాలలో ప్రతిపాదించనున్నాడు.

భాష్యమ్

నను చ **"అభయం సర్వభూతేభ్యో దత్త్వా నైష్కర్మ్యమాచరేత్"**(అశ్వమేధపర్వ. 46.18) ఇత్యాదౌ కర్తవ్యకర్మసంన్యాసాదపి నైష్కర్మ్యప్రాప్తిం దర్శయతి.లోకే చ కర్మణామ్ అనారమ్భాత్ నైష్కర్మ్యమ్ ఇతి ప్రసిద్ధతరమ్.అతశ్చ నైష్కర్మ్యార్థినః కిం కర్మారమ్భేణ ఇతి ప్రాప్తమ్;అత ఆహ-న చ సంన్యసనాదేవేతి:-నా పి సంన్యసనాదేవ కేవలాత్ కర్మపరిత్యాగమాత్రాదేవ జ్ఞానరహితాత్ సిద్ధిం నైష్కర్మ్యలక్షణాం జ్ఞానయోగేన నిష్ఠాం, సమధిగచ్ఛతి న ప్రాప్నోతి. 4

బాలానందిని

నను చేతి:-"అభయం... ఆచరేత్"(సమస్తభూతాలకు అభయం ఇచ్చి అహింసా ప్రతిజ్ఞ చేసి,నైష్కర్మ్యం ఆచరించాలి)ఇత్యాదివాక్యాలు చేయవలసిన కర్మలను సంన్యసించడం వల్ల కూడ నైష్కర్మ్యం లభిస్తుం దని చూపుతున్నాయి.కర్మలు చేయకపోవడంవల్లనే నైష్కర్మ్యం లభిస్తుంది(కర్మలు చేయకపోవడమే నైష్కర్మ్యం అనగా)అని లోకంలో కూడ అధికంగా ప్రసిద్ధంగా ఉంది కదా?అందువల్ల నైష్కర్మ్యం కావాలనుకొనేవానికి కర్మారంభం ఎందుకు అనే ప్రశ్న ఉదయిస్తుంది. అందుకు సమాధానంగా చెపుతున్నాడు-**న చ సంన్యసనాదేవేతి:-** సంన్యసనాదేవ = జ్ఞానం లేకుండా కేవలం కర్మసంన్యాసం చేసినంతమాత్రంవల్ల, నైష్కర్మ్య రూపమైన సిద్ధిని,జ్ఞానయోగంచేత నిష్ఠను,పొందదు.

భా. అ. ప్ర. "అనారమ్భాత్ = ఉపక్రమించకపోవడంవల్ల; సంన్యసనాత్ = ప్రారంభించిన దానిని మధ్యలో విడచివేయడంవల్ల" అని శ్రీరామానుజాచార్యవ్యాఖ్యానం అయుక్తం. కర్మలను ప్రారంభించకపోవడంవల్ల సిద్ధి కలగదు అని చెప్పినప్పుడు ప్రారంభించిన కర్మను మధ్యలో విడిచివేయడంవల్ల సిద్ధి కలగదు అనే విషయం కూడ తెలుస్తూనే ఉన్నప్పుడు మళ్లీ అది చెప్పడం అనావశ్యకం. కర్మ పూర్తికాకపోయినా ఫలం లభిస్తుం దని ఎవ్వడూ అనుకొనడు కదా? సమాప్తం కాని కృష్యాదులవల్ల ఫలం లభించకపోవడం కనబడుతూనే ఉంది. ఈమతంలో "సంన్యసనాదేవ" అని 'ఏవ' కారం నిరర్థకం అవుతుంది. (భా. అ. ప్ర. పే. 119). 4

భాష్యమ్

కస్మాత్ పునః కారణాత్ కర్మసంన్యాసమాత్రాదేవ జ్ఞానరహితాత్ సిద్ధిం నైష్కర్మ్య లక్షణాం పురుషః న అధిగచ్ఛతి ఇతి హేత్వాకాఙ్క్షాయామ్ ఆహ–

మూ. న హి కశ్చిత్ క్షణమపి జాతు తిష్ఠత్యకర్మకృత్,
కార్యతే హ్యవశః కర్మ సర్వః ప్రకృతిజైర్గుణైః. 5

బాలానందిని

కస్మాదితి:– జ్ఞానం లేని సంన్యాసంమాత్రంచేత పురుషుడు నైష్కర్మ్యరూపమైన సిద్ధిని ఏ కారణంవల్ల పొందడు అని హేతువును గూర్చి ఆకాంక్ష, ప్రశ్న, కలుగగా చెపుతున్నాడు–

ప్ర. అ. నహీతి: కశ్చిత్ = ఎవ్వడూ కూడ, అకర్మకృత్ = పని చేయనివాడై, జాతు = ఎన్నడూ, క్షణమ్ అపి = క్షణకాలమైనా, న తిష్ఠతి హి = ఉండడు కదా? సర్వః = ప్రతి ఒక్కడూ కూడ, అవశః = తనవశంలో లేనివాడై, ప్రకృతిజైః = ప్రకృతివల్ల కలిగిన, గుణైః = గుణాల చేత, కర్మ = పనిని, కార్యతే హి = చేయించబడతాడు కదా?

భాష్యమ్

న హీతి:– న, హి యస్మాత్, క్షణమ్ అపి కాలం, జాతు కదాచిత్, కశ్చిత్ తిష్ఠతి అకర్మకృత్ సన్. కస్మాత్? కార్యతే, హి యస్మాత్, అవశః ఏవ కర్మ సర్వః ప్రాణీ, ప్రకృతిజైః ప్రకృతితః జాతైః సత్త్వరజస్తమోభిః గుణైః, అజ్ఞః ఇతి వాక్యశేషః, యతో వక్ష్యతి–"గుణైర్యో న విచాల్యతే" (14.23) ఇతి. సాంఖ్యానాం పృథక్కరణాత్ (3.3) అజ్ఞానామ్ ఏవ హి కర్మయోగః, న జ్ఞానినామ్. జ్ఞానినాం తు గుణైః అచాల్యమానానాం స్వతః చలనాభావాత్ కర్మయోగః నోపపద్యతే. తథా చ వ్యాఖ్యాతం "వేదావినాశినమ్" (2.21) ఇత్యత్ర. 5

బాలానందిని

న హీతి:- హి = ఎందువలన, క్షణకాల మైనా, ఎన్నడూ కూడ, ఎవ్వడూ కూడ కర్మ చేయకుండా ఉండడో. ఎందువలన? ఎందువలన అనగా - ప్రతీ ప్రాణీ కూడ ప్రకృతి వలన కలిగిన సత్త్వ - రజస్- తమోగుణాలచేత, వశం తప్పినవాడై (వానికిష్టం ఉన్నా లేకపోయినా) కర్మలు ఆచరించే టట్లు చేయబడతాడు.

ఇక్కడ "అజ్ఞః'అని వాక్యం చివర చేర్చాలి.(అనగా అజ్ఞుడైనవాడే ఈ విధంగా కర్మలు చేసే టట్లు చేయబడతాడు అని అర్థం).జ్ఞానిని గూర్చి చెపుతూ మున్ముందు "గుణై ర్యో న విచాల్యతే"(ఎవడు గుణాలచేత చలింపచేయబడడో)అని చెప్పనున్నాడు.(దీనినిపట్టి గుణాలచేత పని చేయించబడేవాడు అజ్ఞుడే అని తెలుస్తూన్నది అని భావం).("జ్ఞానయోగేన సాంఖ్యానామ్"అని అంటూ)సాంఖ్యులను వేరుచేయడంవల్ల కర్మయోగం అజ్ఞానులకే కాని జ్ఞానులకు కాదు కదా?గుణాలచేత చలింపచేయబడని జ్ఞానుల కైతే స్వతః (తమకు తాముగా) చలనం లేదు గాన కర్మయోగం కుదరదు.ఇది ఎట్లో "వేదావినాశినమ్"అనే చోట వ్యాఖ్యానించ బడింది. 5

భాష్యమ్

యస్తు అనాత్మజ్ఞః చోదితం కర్మ న ఆరభతే ఇతి తత్ అసదేవ ఇత్యాహ-

మూ. **కర్మేన్ద్రియాణి సంయమ్య య ఆస్తే మనసా స్మరన్,**
ఇన్ద్రియార్థాన్ విమూఢాత్మా మిథ్యాచారః స ఉచ్యతే. 6

బాలానందిని

యస్త్వితి:- ఆత్మజ్ఞానం లేని ఎవ డైతే విధించబడిన కర్మ చేయడో అది(చేయక పోవడం)చెడ్డదే అని చెపుతున్నాడు -

ప్ర.అ. కర్మేతి:- యః = ఎవడు, కర్మేన్ద్రియాణి = కర్మేంద్రియాలను, సంయమ్య = బలాత్కారంగా కట్టిపెట్టి, మనసా = మనస్సుతో, ఇన్ద్రియార్థాన్ = ఇంద్రియవిషయాలను, స్మరన్ = స్మరిస్తూ, ఆస్తే = ఉంటాడో, సః = అట్టి, మూఢాత్మా = మూఢబుద్ధి కలవాడు, మిథ్యాచారః = అసత్యమైన, చెడ్డదైన, ప్రవర్తన కలవాడుగా, ఉచ్యతే = చెప్పబడును.

భాష్యమ్

కర్మేన్ద్రియాణీతి :- కర్మేన్ద్రియాణి హస్తాదీని, సంయమ్య సంహృత్య, యః ఆస్తే తిష్ఠతి మనసా స్మరన్ చిన్తయన్, ఇన్ద్రియార్థాన్ విషయాన్, విమూఢాత్మా విమూఢాన్తఃకరణః మిథ్యాచారః మృషాచారః పాపాచారః, సః ఉచ్యతే. 6

బాలానందిని

కర్మేన్ద్రియాణీతి:- హస్తపాదాదులైన కర్మేంద్రియాలను వాటి పనులు చేయకుండా ఉపసంహరించుకొని, ఎవడైతే ఉంటాడో, ఇంద్రియాలచే అనుభవించ వలసిన భోగ్యవస్తువులను మనస్సుతో స్మరిస్తూ (ఉంటాడో), విమూఢ మైన అంతః కరణం గల అతడు అసత్య మైన ఆచారం కలవాడుగా, పాపాచారం కలవాడుగా చెప్పబడతాడు.

భా.అ.ప్ర. ఒక విధంగా సంకల్పించి మరొక విధంగా ఆచరించడంచేత అతడు మిథ్యాచారుడు అని ఇక్కడ శ్రీరామానుజవ్యాఖ్య అసంగతం. ఈ అజ్ఞుడు -నేను కర్మ చేయను అని సంకల్పించి ఆ విధంగానే కర్మ చేయలేదు;అంత మాత్రంచేత అతడు మిథ్యాచారు డెలా అవుతాడు?మనస్సుచేత విషయాలను స్మరించడం కర్మ కాదు కదా?అది కర్మ అయే పక్షంలో వాని ఆచారం సంకల్పానికి విపరీతం అని చెప్పడానికి అవకాశం)ఉండేది.నేను జ్ఞానయోగం చేస్తాను అని సంకల్పించి విషయ స్మరణం చేయడంవల్ల వీనిని మిథ్యాచారు డనవచ్చును కదా అనడానికి వీలులేదు; ఎందువల్ల ననగా అజ్ఞునికి జ్ఞానయోగాన్ని గూర్చిన సంకల్పమే ఉండదు. జ్ఞానం కలిగిన తరువాత కదా జ్ఞానయోగానుష్ఠానం? మరొక విషయం ఏ మనగా "న హి కశ్చిత్" అని ప్రారంభించి కర్మయోగమే ప్రకృత మైనది గాన ఈ ఘట్టంలో జ్ఞానయోగ ప్రసంగం లేదు."యస్త్విన్ద్రియాణి"అనే రాబోయే శ్లోకంలో కూడ ఇంద్రియనియమ పూర్వకంగా చేసే కర్మయోగమే వివరించబడింది.(భా.అ.ప్ర.పే.121). 6

మూ. యస్త్విన్ద్రియాణి మనసా నియమ్యారభతేఽర్జున,
కర్మేన్ద్రియైః కర్మయోగమసక్తః స విశిష్యతే. 7

ప్ర.అ. అర్జున = అర్జునా! యః తు = ఎవడైతే, ఇన్ద్రియాణి = జ్ఞానేంద్రియాలను మనసా = మనస్సుతో, నియమ్య = వశం చేసుకొని,అసక్తః = ఆసక్తి లేనివాడై, కర్మే న్ద్రియైః = కర్మేంద్రియాలచేత, కర్మయోగమ్ = కర్మయోగాన్ని, ఆరభతే = ప్రారంభిస్తాడో (చేస్తాడో), సః = అతడు, విశిష్యతే = విశేషం కలవాడవుతాడు.

భాష్యమ్

యస్త్వితి:- యస్తు పునః కర్మణి అధికృతః అజ్ఞః బుద్ధీన్ద్రియాణి మనసా నియమ్య ఆరభతే, అర్జున, కర్మేన్ద్రియైః వాక్పాణ్యాదిభిః. కిమారభతే ఇత్యాహ - కర్మ యోగమ్,అసక్తః సన్ సః విశిష్యతే ఇతరస్మాత్ మిథ్యాచారాత్. 7

బాలానందిని

యస్త్వితి:- కర్మయందు అధికారం గల ఏ అజ్ఞు డైతే బుద్ధీంద్రియాలను మనస్సుతో నియమించుకొని వాక్కుహస్తం మొదలైన కర్మేంద్రియాలచేత ప్రారంభిస్తాడో-ఏమి ప్రారం

భిస్తాడో చెపుతున్నాడు - కర్మయోగమును ప్రారంభిస్తాడో, ఆసక్తి లేనివాడై, అతడు (పూర్వ శ్లోకంలో చెప్పిన) మిథ్యాచారునికంటె విశేషం కలవాడు, గొప్పవాడు. 7

భా.అ.ప్ర. ఇతడు జ్ఞాననిష్ఠునికంటె విశిష్టుడు అని శ్రీరామానుజాచార్యులు చెప్పినది అయుక్తం. కర్మయోగంచేత సంపాదింపదగిన జ్ఞాననిష్ఠకంటె కర్మయోగనిష్ఠ చాలా అల్పమైనది అనే విషయం అందరికీ తెలిసనదే కదా?యజ్ఞంచేత సంపాదింపదగిన స్వర్గం అనుభవిస్తూన్నవానికంటె యజ్ఞం చేస్తూన్నవాడు విశిష్టు డౌతాడా?జ్ఞానంచేత సాధించతగిన ముక్తిని పొందినవానికంటె జ్ఞాననిష్ఠుడు విశిష్టు డౌతాడా?(భా.అ.ప్ర.పే.122). 7

భాష్యమ్

యతః ఏవమ్ అతః -

మూ. నియతం కురు కర్మ త్వం కర్మ జ్యాయో హ్యకర్మణః,
శరీరయాత్రాపి చ తే న ప్రసిద్ధ్యేదకర్మణః. 8

బాలానందిని

యతః ఇతి:- ఇది ఇలా ఉన్నది గాన -

ప్ర.అ. త్వమ్ = నువ్వు, నియతమ్ = తప్పకుండగా చేయదగిన, నిత్యమైన, కర్మ = కర్మను, కురు = చేయుము. అకర్మణః = కర్మ లేకపోవడంకంటె, కర్మ = కర్మ, జ్యాయః = మంచిది. అకర్మణః = కర్మ చేయకపోవడంవల్ల, తే = నీయొక్క, శరీరయాత్రాపి = శరీర యాత్రకూడ, న ప్రసిద్ధ్యేత్ = జరగదు.

భాష్యమ్

నియతమితి:- నియతం నిత్యం, యః యస్మిన్ కర్మణి అధికృతః ఫలాయ చ అశ్రుతం తత్ నియతం కర్మ; తత్ కురుహే అర్జున. యతః కర్మ జ్యాయః అధికతరం ఫలతః,హి యస్మాత్,అకర్మణః అకరణాత్ అనారమ్భాత్.కథమ్?శరీరయాత్రా శరీరస్థితిః అపి చ,తే తవ, న ప్రసిద్ధ్యేత్ ప్రసిద్ధిం న గచ్ఛేత్ అకర్మణః అకరణాత్.అతః దృష్టః కర్మాకర్మణోః విశేషః లోకే. 8

బాలానందిని

నియతమితి:- నియతమ్ = నిత్యమైన ఎవడు ఏ కర్మ చేయడానికి అధికారం ఉన్నవాడో,ఏది ఫలంకొరకు వినబడలేదో(అనగా కామ్యకర్మ కాదో)అది నియతకర్మ.ఆ నియతకర్మను,అర్జునా! నువ్వు ఆచరించుము.ఎందువల్ల ననగా-కర్మ,జ్యాయః=అధికతరమైనది.హి = ఎందువలన, అకర్మణః = చేయకుండా ఉండడంకంటె,అనారంభంకంటె,

ఫలాన్ని పట్టి కర్మ అధికతర మైనదో ఆకారణంవల్ల. ఎట్లు? కర్మ చేయకపోవడంవల్ల నీ శరీరయాత్ర కూడ, జీవితపు మనుగడకూడ సిద్ధించదు. అందువల్ల కర్మాకర్మల విశేషం లోకంలోనే కనబడుచున్నది.

వి. ధనోపార్జన, అన్నాదిసంపాదన మొదలైన లౌకికకర్మలు చేస్తేనే దేహం నిలవడం మొదలైన ఫలాలు లభిస్తూన్నట్లు స్పష్టంగా కనబడుతున్నది. అలాంటప్పుడు శాస్త్రవిహిత మైన కర్మలను, ముఖ్యంగా నిత్యకర్మలను, ఆచరించడంవల్ల ఫలం కలుగుతుం దని వేరే చెప్పాలా. నిత్యకర్మలకి ఫలానా ఫలం ఉంటుం దని చెప్పకపోయినా చిత్తశుద్ధ్యాదికం, తద్ద్వారా జ్ఞానప్రాప్తి ఉండనే ఉన్నాయి. అర్జునా! నువ్వు క్షత్రియుడవు గాన నీకు యుద్ధం చేయడం నిత్యకర్మ. అది తప్పక చెయ్యాలి అని భావం.

భా. అ. ప్ర. ఇక్కడ శ్రీరామానుజాచార్యులు -"అకర్మణః = జ్ఞానయోగంకంటె కర్మయే గొప్పది. జ్ఞాననిష్ఠు డైనా కర్మ చేయకపోతే వాని దేహయాత్ర కూడ నడవదు. జ్ఞాననిష్ఠుడు కూడ యజ్ఞాదికర్మ చేయవలసిందే. ఆత్మయాథాత్మ్యానుసంధానం కూడ కర్మయోగంలోనే అంతర్గతం"అని చెప్పారు. అది సారవిహీనమైన వ్యాఖ్యానం. జ్ఞాననిష్ఠ సాక్షాత్తు(ఇతరాపేక్ష లేకుండా)మోక్షానికి హేతు వని "స్థిత్వాస్యామన్తకాలేఽ పి బ్రహ్మనిర్వాణమృచ్ఛతి"అనే వాక్యం చేత ఇక్కడనే చెప్పబడింది. "న హి జ్ఞానేన సదృశం పవిత్రమిహ విద్యతే, తత్స్వయం యోగసంసిద్ధః కాలేనాత్మని విన్దతి"అని చతుర్థాధ్యాయంలో చెప్పనున్నాడు. జ్ఞానంతో సమాన మైన పవిత్రవస్తువు మరొక టేదీ లేదు అని చెప్పిన భగవంతుడే జ్ఞానకంటె కర్మ ఉత్కృష్ట మైనది అని అంటూ పరస్పర విరుద్ధ మైన మాటలు పలుకుతాడా? ఈ విధంగా ప్రమాణం కానివా డవుతాడా? భగవంతుని గీతలకు అపవ్యాఖ్యానం చేసి భగవంతుణ్ణే అప్రమాణం గా చేయడం ఏమి బాగుంది? భగవంతుడే చతుర్థాధ్యాయంలో "నిరాశీర్యతచిత్తాత్మా త్యక్త సర్వపరిగ్రహః, శారీరం కేవలం కర్మ కుర్వన్నాప్నోతి కిల్బిషమ్"అనీ, "జ్ఞానాగ్నిః సర్వకర్మాణి భస్మసాత్ కురుతేఽ ర్జున"అనీ,"సర్వం జ్ఞానప్లవేనైవ వృజినం సంతరిష్యసి"అనీ చెప్పనున్నాడు. అలాంటప్పుడు యజ్ఞం చేయగా మిగిలిన అన్నాన్ని తినకపోవడంవల్ల యతికి పాపం ఎలా వస్తుంది? అలా పాపం వస్తుంది అనే కదా జ్ఞాననిష్ఠుడు కూడ యజ్ఞాదికర్మలు చెయ్యాలి అని మీ అభిప్రాయం? భిక్షాటనాదికర్మ ఉంటూండగా వానికి దేహయాత్ర లేకుండా ఎలా పోతుంది? నివృత్తిరూప మైన జ్ఞానయోగంలో స్థిరంగా ఉన్నవానికి యాజ్ఞదులయందు ప్రవృత్తి ఎలా కలుగుతుంది? ప్రవృత్తి-నివృత్తులను రెండింటినీ ఒకటిగానే ఎవ్వడూ చేయజాలడు కదా?

ఫలాభిసంధిని విడచి కర్మలను ఆచరించడం కర్మయోగం. అలాంటి కర్మయోగంలో ఆత్మయథాత్మ్యానుసంధానం ఎలా అంతర్గతం అవుతుంది? సచ్చిదానందరూపత్వము,

వికారాలు లేకపోవడము,అకర్తృత్వము,అభోక్తృత్వము-ఇవే కదా ఆత్మయొక్క యథార్థ స్వరూపం?ఇలాంటి ఆత్మస్వరూపాన్ని అనుసంధానం చేసికొనే పురుషుడు కర్మాచరణకి ఎలా ప్రవర్తిస్తాడు?ఆత్మ కర్త అని ఎలా అనుకొంటాడు?కర్తృత్వం లేని ఆత్మయొక్క జ్ఞానం పురుషుణ్ణి కర్మలనుండి నివర్తింపచేస్తుంది కదా?అందుచేత ఆత్మజ్ఞానం కర్మలో అంతర్గతం అవుతుంది అనడం సూర్యుడు అంధకారంలో అంతర్గతుడు అని చెప్పడంవంటిదే.

మరొక విషయ మేనగా-ఆత్మయథార్థస్వరూపానుసంధానం శాస్త్ర-ఆచార్యోపదేశ - శమ - దమాదులచేత సంస్కృత మైన అంతఃకరణం కలవారుమాత్రమే సాధింప దగినది.అలాంటిది,కర్మలలో విక్షిప్తమైన మనస్సు కలవానికి ఎలా సాధ్యం అవుతుంది? జ్ఞాననిష్ఠుడు కూడ ఇతరవ్యవహారా లేవీ లేని సమయంలో మాత్రమే ఆత్మయథార్థస్వరూపాను సంధానం చేయకలుగుతాడు కదా?అందువల్ల రామానుజవ్యాఖ్య అర్థశూన్యం.(భా. అ.ప్ర. పే.123,124) 8

భాష్యమ్

యచ్చ మన్యసే బన్ధార్థత్వాత్ కర్మ న కర్తవ్యమ్ ఇతి, తదపి అసత్.కథమ్?

మూ. యజ్ఞార్థాత్కర్మణోఽన్యత్ర లోకోఽయం కర్మబన్ధనః,
తదర్థం కర్మ కౌన్తేయ ముక్తసంగః సమాచర. 9

బాలానందిని

యచ్చేతి:- బంధహేతువు అవడంవల్ల కర్మను చేయకూడదు అని నీవు అనుకొంటు న్నది కూడ అయుక్తమే. ఎందువల్ల?

ప్ర.అ. యజ్ఞార్థాదితి:- అయం లోకః = ఈ పురుషుడు, యజ్ఞార్థాత్ = విష్ణువు కొఱకు చేసే, కర్మణః = కర్మకంటె, అన్యత్ర = ఇతరకర్మయందు, కర్మబన్ధనః = కర్మ బంధనంగా కలవాడు, కౌన్తేయ = అర్జునా ! ముక్తసంగః = విడవబడిన సంగం కలవాడవై, తదర్థమ్ = విష్ణువు కొరకు, కర్మ = కర్మను సమాచర = ఆచరించుము.

భాష్యమ్

యజ్ఞార్థాదితి:- "యజ్ఞో వై విష్ణుః" ఇతి శ్రుతేః యజ్ఞః ఈశ్వరః. తదర్థం యత్ క్రియతే తత్ యజ్ఞార్థం కర్మ.తస్మాత్ కర్మణః అన్యత్ర అన్యేన కర్మణా లోకః అయమ్ అధికృతః కర్మకృత్ కర్మబన్ధనః కర్మ బన్ధనం యస్య సః అయం కర్మబన్ధనః లోకః,న తు యజ్ఞార్థాత్.అతః తదర్థం యజ్ఞార్థం,కర్మ,కౌన్తేయ,ముక్తసంగః కర్మఫల సంగవర్జితః సన్,సమాచర నిర్వర్తయ. 9

బాలానందిని

యజ్ఞార్థాదితి:- "యజ్ఞో వై విష్ణుః"(యజ్ఞ మనగా విష్ణువు)అను శ్రుతివలన యజ్ఞం అనగా ఈశ్వరుడు. ఆ ఈశ్వరునికొరకై ఏ కర్మ చేయబడుతుందో అది యజ్ఞార్థ మైన కర్మ. అట్టి కర్మకంటె, అన్యత్ర=మరొక కర్మచేత, అయం లోకః = అధికృతుడై కర్మ చేసేవాడు, కర్మ బన్ధనః =కర్మ ఎవనికి బంధనమో అట్టివాడు. అంతే కాని యజ్ఞార్థకర్మచేత కర్మబంధనుడు కాడు. అందువల్ల, యజ్ఞం(పరమేశ్వరుని) కొరకై, (పరమేశ్వరార్పణబుద్ధితో), అర్జునా! ముక్త సంగః = కర్మఫలమునందు ఆసక్తి లేనివాడవై, సమాచర = ఆచరించుము.

భా.అ.ప్ర. ఇక్కడ శ్రీరామానుజాచార్యులు - "యజ్ఞార్థాత్ = యజ్ఞాలు మొదలైన శాస్త్రీయకర్మలకు అంగమైన ద్రవ్యములను సంపాదించడం మొదలైన కర్మ తప్ప తన ప్రయోజనంకోసం ఉపయోగించే కర్మ చేయబడితే"అని వ్యాఖ్యానించారు. అది అయుక్తం. 'యజ్ఞార్థాత్'అనే పదంలో ఆదిపదం లేదు. యజ్ఞశబ్దం ఉపలక్షణచేత ఇతరమైన వాటిని కూడ బోధిస్తుంది అని చెప్పడం అప్రామాణికం. ప్రధానకర్మ యైన యజ్ఞం బంధకం కానప్పుడు దానికోసం చేసే కర్మ బంధకం ఎలాగా కాదు;అలాం టప్పుడు దానిని చెప్పడం అనావశ్యకం. యజ్ఞంకోసం చేసే కర్మ తప్ప మిగిలిన కర్మ లన్నీ బంధకా లన్నప్పుడు యజ్ఞం కూడ యజ్ఞంకోసం చేసే కర్మలకంటే భిన్నమే గాన అది(యజ్ఞం)బంధకం అని చెప్పిన ట్లవుతుంది. యుద్ధం కోసం సిద్ధమై వచ్చి వెనుకదీసిన అర్జునునికి"యుద్ధం చెయ్యుము"అని మాత్రమే ఉపదేశించాలి కాని యుద్ధంకోసం ఉపకరించే ద్రవ్యార్జనాదులు చెయ్యుము అని ఉపదేశించ డం అసంగతం. అవన్నీ పూర్తిచేసికొనే ఇతడు యుద్ధానికి వచ్చాడు కదా?(భా.అ.ప్ర.పే. 124)9

భాష్యమ్

ఇతశ్చ అధికృతేన కర్తవ్యం కర్మ -

మూ. సహయజ్ఞాః ప్రజాః సృష్ట్వా పురోవాచ ప్రజాపతిః,
అనేన ప్రసవిష్యధ్వమేష వోఽస్త్విష్టకామధుక్. 10

బాలానందిని

ఇతశ్చేతి:- ఈ కారణంవల్ల కూడ అధికారం ఉన్నవానిచేత కర్మ చేయదగినది.

ప్ర.అ. సహేతి :- పురా = పూర్వమునందు, ప్రజాపతిః = బ్రహ్మదేవుడు, సహయజ్ఞాః = యజ్ఞంతో కూడిన, ప్రజాః = ప్రజలను, సృష్ట్వా = సృజించి, అనేన = దీనిచేత, ప్రసవిష్యధ్వమ్ = ఉత్పత్తిని చేయండి; ఏషః = ఇది, వః = మీకు, ఇష్టకామధుక్ = ఇష్టమైన కామాలను ఇచ్చేది, అస్తు = అగుగాక అని, ఉవాచ = పలికెను.

భాష్యమ్

సహేతి :- సహయజ్ఞాః = యజ్ఞసహితాః, ప్రజాః త్రయో వర్ణాః, తాః, సృష్ట్వా ఉత్పాద్య, పురా సర్గాదౌ, ఉవాచ ఉక్తవాన్, ప్రజాపతిః ప్రజానాం స్రష్టా, అనేన యజ్ఞేన, ప్రసవిష్యధ్వం ప్రసవః వృద్ధిః ఉత్పత్తిః తాం కురుధ్వమ్ ఏషః యజ్ఞః, యుష్మాకమ్, అస్తు భవతు, ఇష్టకామధుక్ ఇష్టాన్ అభిప్రేతాన్ కామఫలవిశేషాన్ దోగ్ధి ఇతి ఇష్టకామధుక్. 10

బాలానందిని

సహేతి :- యజ్ఞంతో కూడిన మూడు వర్ణాలను సృజించి, పూర్వం అనగా సృష్టి ప్రారంభంలో ప్రజల స్రష్టయైన ప్రజాపతి ఇలా చెప్పాడు - ఈ యజ్ఞంచేత, ప్రసవిష్యధ్వమ్ - ప్రసవం అనగా వృద్ధి, పుట్టడం, దానిని చెయ్యండి. ఈ యజ్ఞం మీకు ఇష్టకామధుక్ - ఇష్టమైన కామాలను, ఫలవిశేషాలను పితికేది (ఇచ్చేది) కాబట్టి ఇష్టకామధుక్, అట్టిది అగుగాక.

భా.అ.ప్ర. : ఇక్కడ శ్రీ రామానుజాచార్యులు ఆత్మకు వృద్ధి చెయ్యండి అని వాఖ్యానించారు. ఆత్మకు వృద్ధి - క్షయాదివికారాలు లేవు గాన ఈ వ్యాఖ్య అసంగతం (భా.అ.ప్ర.పే. 125) 10

భాష్యమ్

కథమ్?

మూ. దేవాన్ భావయతానేన తే దేవా భావయన్తు వః,
పరస్పరం భావయన్తః శ్రేయః పరమవాప్స్యథ. **11**

బాలానందిని

కథమితి :- ఎట్లు?

ప్ర.అ. అనేన = దీనిచేత, దేవాన్ = దేవతలను, భావయత = వృద్ధి పొందించండి. **తే దేవాః** = ఆ దేవతలు, వః = మిమ్ములను, భావయన్తు = వృద్ధిపొందించెదరు గాక; పరస్పరమ్, = పరస్పరమును, భావయన్తః = అభివృద్ధిపొందించుకొనుచు, పరమ్ = అధికమైన, శ్రేయః = శ్రేయస్సును, అవాప్స్యథ = పొందగలరు.

భాష్యమ్

దేవానితి :- దేవాన్ ఇన్ద్రాదీన్, భావయత వర్ధయత. అనేన యజ్ఞేన తే దేవాః భావయన్తు అప్యాయయన్తు వృష్ట్యాదినా వః యుష్మాన్; ఏవం, పరస్పరమ్

అన్యోన్యమ్, భావయన్తః శ్రేయః పరమపి జ్ఞానప్రాప్తిక్రమేణ అవాప్స్యథ; స్వర్గం వా పరం శ్రేయః అవాప్స్యథ. 11

బాలానందిని

దేవానితి :- ఇంద్రాదిదేవతలను ఈ యజ్ఞంచేత వృద్ధిపొందించండి. ఆ దేవతలు వృష్ట్యాదులచేత మిమ్ములను సంతృప్తిపరచెదరు గాక. ఈ విధంగా పరస్పరమును అభివృద్ధి పొందించుకొంటూ, జ్ఞానప్రాప్తిద్వారా ఉత్తమశ్రేయస్సును, అనగా మోక్షాన్ని లేదా స్వర్గరూపమైన ఉత్తమశ్రేయస్సును పొందగలరు. 11

భాష్యమ్

కించ -

మూ. ఇష్టాన్ భోగాన్ హి వో దేవా దాస్యన్తే యజ్ఞభావితాః,
తైర్దత్తానప్రదాయైభ్యో యో భుఙ్క్తే స్తేన ఏవ సః. 12

బాలానందిని

కించేతి :- మరొక విషయ మేమనగా.

ప్ర.అ. ఇష్టానితి :- దేవాః దేవతలు, యజ్ఞభావితాః = యజ్ఞంచేత సంతోషింపచేయబడినవారై, వః = మీకు, ఇష్టాన్ = ఇష్టములైన, భోగాన్ = భోగాలను, దాస్యన్తే = ఇవ్వగలరు. తైః = వాళ్లచేత, దత్తాన్ = ఇవ్వబడినవాటిని, ఏభ్యః = వీళ్లకు, అప్రదాయ = ఇవ్వకుండా, యః = ఎవడు, భుఙ్క్తే = అనుభవిస్తాడో; సః = అతడు, స్తేనః ఏవ = దొంగయే.

భాష్యమ్

ఇష్టాన్ భోగానితి :- ఇష్టాన్ అభిప్రేతాన్, భోగాన్ హి, వః యుష్మభ్యం, దేవాః దాస్యన్తే వితరిష్యన్తి, స్త్రీ - పశు - పుత్రాదీన్, యజ్ఞభావితాః యజ్ఞైః వర్ధితాః తోషితాః ఇత్యర్థః. తైః దేవైః, దత్తాన్ భోగాన్ అప్రదాయ అదత్త్వా, ఆనృణ్యమ్ అకృత్వా ఇత్యర్థః. ఏభ్యః దేవేభ్యః, యః, భుఙ్క్తే స్వదేహేన్ద్రియాణ్యేవ తర్పయతి, స్తేనః ఏవ తస్కరః ఏవ, సః దేవాదిస్వాపహారీ. 12

బాలానందిని

ఇష్టానితి :- దేవతలు, యజ్ఞాలచేత వృద్ధిపొందిపబడినవారై,అనగా సంతోషపెట్టబడినవారై,మీకు ఇష్టమైన భోగాలను ఇస్తారు కదా? ఆ దేవతలచేత ఇవ్వబడిన భోగాలను

వాళ్లకు ఇవ్వకుండా,ఋణం చెల్లించకుండా అని అర్థం,ఎవడు అనుభవిస్తాడో,తన దేహేంద్రియాలను మాత్రమే తృప్తిపరచుకొంటాడో,దేవాదుల సొత్తులను అపహరించిన అట్టివాడు దొంగయే. 12

భాష్యమ్

యే పునః -

మూ. **యజ్ఞశిష్టాశినః సన్తో ముచ్యన్తే సర్వకిల్బిషైః,**
భుఞ్జతే తే త్వఘం పాపా యే పచన్త్యాత్మకారణాత్. 13

బాలానందిని

యే ఇతి:- ఎవరైతే -

ప్ర.అ. **యజ్ఞేతి** :- యజ్ఞశిష్టాశినః = యజ్ఞాలు చేయగా మిలినదానిని ఎవరు తింటారో, సన్తః = అట్టి సత్పురుషులు, సర్వకిల్బిషైః = సమస్తపాపాలచేత, ముచ్యన్తే = విడవబడతారు. యే = ఎవళ్లు, ఆత్మకారణాత్ = తమకోసం మాత్రమే, పచన్తి = వండుకొంటారో, తే = ఆ, పాపాః = పాపాత్ములు, అఘమ్ = పాపాన్నే, భుఞ్జతే = తినుచున్నారు.

భాష్యమ్

యజ్ఞేతి:- దేవయజ్ఞాదీన్ నిర్వర్త్య తచ్ఛిష్టమ్ అశనమ్ అమృతాఖ్యమ్ అశితుమ్ శీలం యేషాం తే యజ్ఞశిష్టాశినః సన్తః,ముచ్యన్తే సర్వకిల్బిషైః సర్వపాపైః చుల్ల్యాదిపఞ్చసూనాకృతైః,ప్రమాదకృతహింసాజనితైః చ అన్యైః. యే తు ఆత్మంభరయః భుఞ్జతే,తే తు,అఘం పాపం,స్వయమ్ అపి పాపాః యే,పచన్తి పాకం నిర్వర్తయన్తి ఆత్మకారణాత్ ఆత్మహేతోః. 13

బాలానందిని

యజ్ఞేతి :- దేవయజ్ఞాదులు చేసి అవి చేయగా మిగిలిన 'అమృతం'అనే దానిని తినే అలవాటు గల ఏ యజ్ఞశిష్టాశు లున్నారో ఆ సత్పురుషులు చుల్ల్యాదిపంచసూనల వలన కలిగేవి,పొరబాటున చేసే హింసాదులవలన కలిగేవి అయిన సమస్తపాపాలచేత విడవబడతారు.ఆత్మంభరులై తమ పొట్టలు మాత్రమే నింపుకొనేవాళ్లై, స్వయంగా పాపాత్ములే అయి ఉన్న ఎవరైతే తమకొరకు మాత్రమే వండుకొంటారో, వాళ్లు పాపాన్నే తింటున్నారు.

వి. దేవతాదులకు సమర్పించగా మిగిలినది 'అమృతం'.

"పఞ్చసూనా గృహస్థస్య చుల్లీ పేషణ్యుపస్కరః,
కణ్డనీ చోదకుమ్భశ్చ బధ్యతే యాస్తు వాహయన్"(మ.స్మృ3.68)

గృహస్థుడు ఎంత జాగరూకతతో ఉన్నా నిత్యమూ ఐదు హింసలు చేస్తుంటాడు. వంటచేసే పొయ్యి,పచ్చళ్లు చేసికొనే రుబ్బురోలు మొదలైనవి,చెత్తబుట్ట చీపురు మొదలైనవి, కూరలు కోసే కత్తులు మొదలైనవి,జలకుంభం ఇవి ఐదు సూనా(హింసా) స్థానాలు.వాటికి ప్రతిక్రియ చేసికొననివాడు పాపములచేత బద్ధు డవుతాడు. ఈ పాపాలు 1.బ్రహ్మయజ్ఞం (వేదాధ్యయనాధ్యాపనాలు) 2. పితృయజ్ఞం (పితృదేవతలను సంతోషపెట్టడం)3.దేవయజ్ఞం (హోమం) 4.భూతయజ్ఞం (తిర్యగ్జంతువులకు కూడ యథాశక్తి ఆహారం ఇవ్వడం) 5. మనుష్యయజ్ఞం(అతిథిపూజ)అనే ఐదు యజ్ఞాలు నిత్యమూ అనుష్ఠించడంచేత నశిస్తాయి అని మనుస్మృత్యాదులలో చెప్పబడింది. 13

భాష్యమ్

ఇతశ్చాధికృతేన కర్మ క ర్తవ్యమ్. జగచ్చక్రప్రవృత్తిహేతుర్హి కర్మ. కథమితి? ఉచ్యతే-

మూ. అన్నాద్భవన్తి భూతాని పర్జన్యాదన్నసంభవః,
యజ్ఞాద్భవతి పర్జన్యో యజ్ఞః కర్మసముద్భవః. 14

బాలానందిని

ఇతశ్చేతి:- ఈ కారణంవల్ల కూడ అధికారి కర్మలు చెయ్యాలి;ఎందువల్ల ననగా- కర్మ జగచ్చక్రం ప్రవర్తించడానికి హేతువు.అది ఎట్లు? చెప్పబడుచున్నది-

ప్ర.అ. అన్నాత్ = అన్నంవల్ల, భూతాని = ప్రాణులు,భవన్తి = పుట్టుచున్నాయి. పర్జన్యాత్ = మేఘంవల్ల, అన్నసంభవః = అన్నముయొక్క పుట్టుక జరుగుతుంది.యజ్ఞాత్ = యజ్ఞంవల్ల, పర్జన్యః = మేఘం(వర్షం), భవతి = పుట్టును, యజ్ఞః = యజ్ఞం, కర్మసముద్భవః = కర్మవల్ల పుట్టేది.

భాష్యమ్

అన్నాద్భవన్తీతి: అన్నాత్ భుక్తాత్ లోహితరక్తపరిణతాత్ ప్రత్యక్షం భవన్తి జాయన్తే, భూతాని; పర్జన్యాత్ వృష్టేః అన్నస్య సంభవః అన్నసంభవః. యజ్ఞాత్ భవతి పర్జన్యః-

"అగ్నౌ ప్రాస్తాహుతిః సమ్యగాదిత్యముపతిష్ఠతే,
ఆదిత్యాజ్జాయతే వృష్టిర్వృష్టేరన్నం తతః ప్రజాః" (మను.3.76) ఇతి స్మృతేః.

యజ్ఞః అపూర్వమ్,స చ యజ్ఞః కర్మసముద్భవః, ఋత్విగ్యజమానయోశ్చ వ్యాపారః కర్మ;తతః సముద్భవః యస్య యజ్ఞస్య అపూర్వస్య సః యజ్ఞః కర్మసముద్భవః.14

బాలానందిని

అన్నాదితి:- తినబడినదై,ప్రత్యక్షంగానే స్త్రీశోణితరూపంలోను పురుషరేతోరూపం లోను పరిణమించిన అన్నంనుండి, భూతాలు పుట్టుచున్నాయి. పర్జన్యునినుండి, అనగా వర్షంనుండి, అన్నముయొక్క పుట్టుక జరుగుచున్నది.(పర్జన్యశబ్దానికి ఇక్కడ లక్షణచేత వర్షము అని అర్థము).యజ్ఞంనుండి వర్షం పుడుతుంది."అగ్నౌ...ప్రజాః"(అగ్నియందు ఉంచబడిన ఆహుతి సరిగా సూర్యుణ్ణి చేరుతుంది.సూర్యునినుండి వర్షం కలుగుతుంది. వర్షంవల్ల అన్నం పుడుతుంది.అన్నంనుండి ప్రజలు పుడుతున్నారు)అని స్మృతి చెప్పుచున్నది. (ఇక్కడ యజ్ఞశబ్దానికి లక్షణచేత యజ్ఞంవల్ల కలిగే అపూర్వం అని అర్థం.యజ్ఞమే ఒక కర్మ అయినప్పుడు యజ్ఞం కర్మవల్ల పుడుతుం దనగా కర్మ కర్మవల్ల పుడుతుంది అని అర్థం వస్తుంది.అది అసంగతం కదా?అందుచేత లక్షణాశ్రయణం). అపూర్వం కర్మవల్ల, అనగా ఋత్విక్కులయొక్క,యజమానులయొక్క వ్యాపారంవల్ల పుడుతుంది.కర్మనుండి, ఋత్విగ్యజమానుల వ్యాపారంనుండి,అపూర్వం పుడుతుంది గాన అది కర్మ సముద్భవం. 14

భాష్యమ్

తచ్చ వివిధం కర్మ కుతః జాతమ్ ఇత్యాహ -

మూ. కర్మ బ్రహ్మోద్భవం విద్ధి బ్రహ్మాక్షరసముద్భవమ్,
తస్మాత్సర్వగతం బ్రహ్మ నిత్యం యజ్ఞే ప్రతిష్ఠితమ్. 15

బాలానందిని

తచ్చేతి:- అనేకవిధాలైన ఆ కర్మ దేనినుండి పుట్టినదో చెపుతున్నాడు -

ప్ర.అ. కర్మేతి :- కర్మ = కర్మను, బ్రహోద్భవమ్ = వేదమే కారణంగా కలదానినిగా, విద్ధి = తెలుసుకొనుము.బ్రహ్మ = వేదమును, అక్షరసముద్భవమ్ = పరబ్రహ్మనుండి పుట్టిన దానినిగా తెలుసుకొనుము.తస్మాత్ = అందువల్ల, సర్వగతమ్ = అంతటా వ్యాపించి ఉన్నది. నిత్యమ్ = నిత్యమూ అయిన,బ్రహ్మ = బ్రహ్మ(వేదము), యజ్ఞే = యజ్ఞమునందు, ప్రతిష్ఠితమ్ = ప్రతిష్ఠితమై ఉన్నది, స్థిరంగా ఉన్నది.

భాష్యమ్

కర్మేతి:- కర్మ బ్రహోద్భవం-బ్రహ్మ వేదః,సః ఉద్భవః కారణం యస్య తత్ కర్మ బ్రహ్మోద్భవం,విద్ధి జానీహి.బ్రహ్మ పునః వేదాఖ్యమ్ అక్షరసముద్భవమ్,అక్షరం బ్రహ్మ పరామాత్మా సముద్భవః యస్య తత్ అక్షరసముద్భవం బ్రహ్మ వేదః ఇత్యర్థః. యస్మాత్ సాక్షాత్ పరమాత్మాఖ్యాత్ అక్షరాత్ పురుషనిఃశ్వాసవత్ సముద్భూతం బ్రహ్మ

తస్మాత్ సర్వార్థప్రకాశకత్వాత్ సర్వగతమ్. సర్వగతమ్ అపి సత్ నిత్యం, సదా యజ్ఞవిధి ప్రధానత్వాత్ యజ్ఞే ప్రతిష్ఠితమ్. 15

బాలానందిని

కర్మేతి:- కర్మను బ్రహ్మోద్భవమునుగా తెలిసికొనుము. బ్రహ్మ అనగా వేదం. వేదం ఏ కర్మకు ఉద్భవమో,కారణమో,అది బ్రహ్మోద్భవం. వేదం కారణంగాకలది. వేద మనే బ్రహ్మ యైతే,అక్షరసముద్భవం- అక్షరం అనగా బ్రహ్మ,పరమాత్మ దేనికి కారణమో అది అక్షరసముద్భవం. (వేద మని చెప్పబడే బ్రహ్మ అక్షర మని చెప్పబడే బ్రహ్మనుండి పుట్టినది). వేదం, ఏ కారణంవల్ల సాక్షాత్తు పరమాత్మ అని చెప్పబడే అక్షరంనుండి,పురుషునినుండి నిట్టూర్పు వలె, పుట్టినదో అందువల్ల సకలవిషయాలను ప్రకాశింపచేసే దవడంవల్ల సర్వగతం. సర్వగతమే అయినా కూడ ఇది యజ్ఞవిధినే ప్రధానంగా బోధిస్తుంది గాన యజ్ఞమునందు ప్రతిష్ఠిత మైనది. (సర్వగత మైనదానిని యజ్ఞంలోనే ప్రతిష్ఠితం అయిన దని సంకుచితం చేయడం ఎందువల్ల ననగా ఇది ప్రధానంగా యజ్ఞానుష్ఠానాన్ని విధిస్తుంది గాన అని సమాధానం).

భా.అ.ప్ర. ఇక్కడ శ్రీరామానుజాచార్యులు - "యజ్ఞం,కర్మసముద్భవః =ద్రవ్యం సంపాదించడంమొదలైన క్రియలచేత సాధింపదగినది. కర్మ,బ్రహ్మోద్భవమ్ = శరీరం నుండి పుట్టినది. బ్రహ్మ=శరీరం,అక్షరసముద్భవమ్=జీవునినుండి పుట్టినది=ఎందువల్ల ననగా అన్నపానాదులచేత తృప్తుడైన అక్షరునిచేత (జీవునిచేత)అధిష్ఠింపబడిన శరీరమే కర్మ చేయడానికి సమర్థం అవుతుంది. సర్వగతమ్ = అధికారు లందరితోను సంబంధించిన శరీర మనే బ్రహ్మ,ఎల్లప్పుడు యజ్ఞమునందు ప్రతిష్ఠిత మైనది;యజ్ఞానికి మూలం అని అర్థం" అని వ్యాఖ్యానించారు. ఇది నిఃసారమైన వ్యాఖ్యానం. యజ్ఞమే క్రియారూపం గాన అది క్రియచేత సాధించబడదు కదా? మరేమనగా ఫలాదికమే క్రియచేత సాధించబడుతుంది. ఇక్కడ యజ్ఞం అనగా అపూర్వాత్మక మైన యజ్ఞం అని గ్రహించిన పక్షంలో అప్పు డది ద్రవ్యార్జనాదిక్రియాసాధ్యం కాదు;ఋత్విగ్యజమానుల వ్యాపార మనే క్రియచేత సాధింప దగినది. బ్రహ్మశబ్దానికి శరీరం అనే అర్థంలో ప్రయోగం ప్రసిద్ధం కాదు. "మమ యోనిర్మహ ద్బ్రహ్మ"అనే చోట ప్రకృతి అనే అర్థంలో బ్రహ్మశబ్దప్రయోగం ఉన్నా కూడ శరీరం అనే అర్థంలో దానిని ప్రయోగించి నట్లు కాదు. ప్రకృతి బ్రహ్మ కాబట్టి ప్రకృతియొక్క కార్యమైన శరీరం కూడ ఉపచారంవల్ల బ్రహ్మ అని చెప్పవచ్చు ననడం లక్షణను అంగీకరించవలసి ఉండడంవల్ల అయుక్తం. బ్రహ్మశబ్దానికి ప్రకృతి అనే అర్థమే లక్షణచేత చెప్పవలసినపుడు మళ్లీ దానికి లక్షణనే ఆశ్రయించి శరీరం అని అర్థం చెప్పడం క్లిష్టకల్పనం అవుతుంది. "శరీరవాఙ్మనోభిర్యత్ కర్మ ప్రారభతే నరః"అని కర్మ మనోవాక్కాయాలచేత చేయబడుతుం

దని చెప్పనున్నాడు. అలాంటప్పుడు కర్మకు కారణం శరీరం మాత్రమే అని చెప్పడం ఎలా కుదురుతుంది?"అన్నపానాదులచేత తృప్తుడైన జీవుడు"అనడం అయుక్తం. జీవుడు భోక్త కాడు. అలాంటివానికి తృప్తి కలుగుతుంది అనడం కుదరదు. తృప్తి కలిగేది ప్రాణాదులకు మాత్రమే. జీవునికి అన్నాదులవల్ల తృప్తి కలుగుతుంది అనట్లయితే అన్నాదులు లభించకపోతే శోకాదులు కలుగుతా యని కూడ చెప్పవలసి వస్తుంది. వికారరహితుడు సచ్చిదానందమ యుడు అయిన జీవుని విషయంలో ఇది యుక్తం కాదు.

జీవుడు విజ్ఞానస్వరూపుడు,కర్త,భోక్తా కూడ; అంతేనే కాని సచ్చిదానందస్వరూపుడు కాదు అన్నట్లయితే,అప్పుడు అతడు అక్షరుడు కాడు,క్షరుడే(నశించేవాడే)అవుతాడు. కర్తృత్వాది వికారాలు ఉన్నవాడు అనిత్యు డవాలి కదా? వికారం చెందే వస్తు వేదీ లోకంలో నిత్యంగా ఉన్నట్లు కనబడడంలేదు కదా? ఘటాదిరూపంలో వికారం చెందుతూన్న మట్టి మొదలైన ద్రవ్యం కూడ ప్రలయంలో నశిస్తూన్నది కదా?'సర్వగతమ్'అనే పదానికి అధికారు లందరికీ చెందిన అనే అర్థం కూడ అయుక్తమే. సర్వశబ్దానికి ఉన్న అర్థం కుదించి అధికారులు మాత్రమే అనే అర్థం చెప్పడానికి తగిన కారణం ఏదీ లేదు. అధికారులు కాని పశ్వాదుల శరీరం కూడ యజ్ఞమూలకమే గాన కేవలం అధికారం కలవాళ్ల శరీరమే అనడం అయుక్తం. ఈ దోషాన్ని పరిహరించడానికి సమస్తజీవులకు సంబంధించిన అని అర్థం చెప్పడం కూడ అయుక్తమే. ఎందువల్ల ననగా సముద్రంలో ఉన్న మత్స్యాదులు వర్షోదకం ద్వారా పండిన వ్రీహ్యాదుల ద్వారా జీవించడంలేదు గాన మత్స్యాదుల శరీరాలు యజ్ఞమూలాలు కాదు కదా?(భా.అ.ప్ర.పే.128,129) 15

మూ. ఏవం ప్రవర్తితం చక్రం నానువర్తయతీహ యః,
అఘాయురిన్ద్రియారామః మోఘం పార్థ స జీవతి. 16

ప్ర.అ. ఏవమితి:- పార్థ = అర్జునా! ఇహ = ఈ లోకంలో, ఏవమ్ = ఈ విధంగా, ప్రవర్తితమ్ = ప్రవర్తింపచేయబడిన, చక్రమ్ = చక్రమును, యః = ఎవడు, న అనువర్తయతి = ప్రవర్తింపచేయడో, అఘాయుః = పాపజీవితం కలవాడు, ఇన్ద్రియారామః = ఇంద్రియము లయందే క్రీడించేవాడూ అయిన, సః = అతడు, మోఘమ్ = వ్యర్థంగా, జీవతి = జీవించు చున్నాడు.

భాష్యమ్

ఏవమితి:- ఏవమ్ ఇత్థమ్ ఈశ్వరేణ వేదయజ్ఞపూర్వకం జగచ్చక్రం ప్రవర్తితం నానువర్తయతి,ఇహ లోకే, యః కర్మణ్యధికృతః సన్,అఘాయుః - అఘం పాపమ్ ఆయుః జీవనం యస్య సః అఘాయుః, పాపజీవనః ఇతి యా ఎత్. ఇన్ద్రియారామః -

ఇన్ద్రియైః ఆరామః ఆరమణమ్ ఆక్రీడా విషయేసు యస్య సః ఇన్ద్రియారామః,మోఘం వృథా,హే పార్థ సః జీవతి.తస్మాత్ అజ్ఞేన అధికృతేన కర్తవ్యమేవ కర్మ ఇతి ప్రకరణార్థః.

బాలానందిని

ఏవమితి:- ఈ విధంగా, వేద-యజ్ఞపూర్వకంగా ఈశ్వరుడు ప్రవర్తింపచేసిన ఈ జగచ్చక్రాన్ని, ఈ లోకంలో,కర్మయందు అధికారం కలిగి ఉండికూడ,ఎవడు అనుసరించడో, అఘాయుః = పాపమైన ఆయుర్దాయం గల,పాపజీవనం గల అని అర్థం,ఇన్ద్రియారామః = ఇంద్రియాలతో,విషయాలయందు ఆరామం,విహరించడం,క్రీడించడం ఎవడు చేస్తూంటాడో వాడు,అర్జునా! వ్యర్థంగా జీవిస్తున్నాడు.అందువల్ల ఆత్మజ్ఞానంలేని కర్మాధికారి కర్మలు చేస్తూనే ఉండాలి అనేది ఈ ప్రకరణంలో (ఈ ఘట్టంలో) ప్రతిపాదించబడిన అర్థం.

భాష్యమ్

ప్రాగాత్మజ్ఞాననిష్ఠాయోగ్యతాప్రాప్తేః తాదర్థ్యేన కర్మానుష్ఠానమ్ అధికృతేన అనాత్మజ్ఞేన కర్తవ్యమ్ ఏవ ఇత్యేతత్ **"న కర్మణామనారమ్భాత్"**(భ.గీ. 3-4)ఇత్యతః ఆరభ్య**"శరీరయాత్రాపి చ తే న ప్రసిద్ధ్యేదకర్మణః"**(భ.గీ. 3. 8)ఇత్యేవమన్తేన ప్రతిపాద్య **"యజ్ఞార్థాత్కర్మణోఽన్యత్ర"**(భ.గీ. 3. 9)ఇత్యాదినా**"మోఘం పార్థ స జీవతి"** (భ.గీ. 3. 16) ఇత్యేవమన్తేన అపి గ్రన్థేన ప్రాసంగికమ్ అధికృతస్య అనాత్మవిదః కర్మానుష్ఠానే బహు కారణమ్ ఉక్తమ్.తదకరణే చ దోషసంకీర్తనం కృతమ్. **16**

బాలానందిని

ప్రాగితి:-ఆత్మజ్ఞాననిష్ఠకు యోగ్యత లభించడానికి పూర్వం,అలాంటి యోగ్యత లభించడంకోసం కర్మలయందు అధికారం గల,ఆత్మజ్ఞానరహితుడు కర్మయోగం చెయ్యాలి అని **"న కర్మణామనారమ్భాత్"**మొదలు,**"శరీరయాత్రాపిపి...అకర్మణః"**వరకు ఉన్న గ్రంథం చేత ప్రతిపాదించి,ప్రసంగవశంచేత-**"యజ్ఞార్థాత్కర్మణోఽన్యత్ర"**అని మొదలు, **"మోఘం పార్థ స జీవతి"**వరకు ఉన్న గ్రంథంచేత ఆత్మవేత్తకాని కర్మాధికారి కర్మలు అనుష్ఠించాలి అనడానికి అనేకకారణాలు చెప్పి,కర్మలు చేయకపోవడం దోషం అని కూడ చెప్పబడింది.

భా. అ. ప్ర. ఇక్కడ శ్రీరామానుజాచార్యులు-"అన్నంనుంచి భూతశబ్దంచేత చెప్పబడిన, జీవులతో కూడిన శరీరాలు,పర్జన్యునినుంచి అన్నం,యజ్ఞం నుంచి పర్జన్యుడు, కర్తయొక్క వ్యాపార మైన కర్మనుంచియజ్ఞం, సజీవశరీరంనుంచి కర్మ,మళ్ళీ సజీవశరీరం అన్నంనుంచి

ఈ విధంగా పరస్పరమూ కార్యకారణభావంచేత చక్రం వలె తిరుగుచున్నది. ఇన్ద్రియారామః అనగా వీనికి ఇంద్రియాలే ఉద్యానాలుగా అవుతాయి గాన ఇతడు జ్ఞానయోగాదులలో ప్రయత్నిస్తున్నా కూడ నిష్ఫలమైన ప్రయత్నం కలవాడవడంచేత వ్యర్థంగా జీవిస్తున్నాడు"అని వ్యాఖ్యానించారు. ఇదంతా అవిచారితరమణీయం. ఎందువల్ల ననగా- "కర్మ బ్రహ్మోద్భవం విద్ధి బ్రహ్మాక్షరసముద్భవమ్"అన్నచోట ఈయనయే శరీరంనుంచి కర్మ పుడుతుంది, శరీరం జీవునినుండి పుడుతుంది అని వెనుక చెప్పి ఉన్నారు. ఇప్పుడైతే-కర్మ సజీవశరీరంనుండి పుడుతుంది, సజీవశరీరం అన్నంనుండి పుడుతుంది అని చెపుతున్నారు. ఇది పూర్వాపరవిరుద్ధం కదా? నీ మతం ప్రకార మైనా మూలంనుంచి ఈ అర్థం ఎలా లభిస్తుంది? "అన్నాద్భవన్తి భూతాని"అన్నచోట భూతశబ్దం ఏ విధంగా సజీవశరీరం అనే అర్థాన్ని బోధిస్తూన్నదో అదే విధంగా "కర్మ బ్రహ్మోద్భవమ్"అనే చోట కూడ బ్రహ్మశబ్దం సజీవశరీరాన్ని బోధిస్తుందా నిర్జీవశరీరాన్ని బోధిస్తుందా? మొదటి పక్షం కుదరదు. "బ్రహ్మాక్షరసముద్భవమ్"అని 'అక్షర'శబ్దంచేత చెప్పబడే సజీవశరీరంనుండి సజీవశరీరం పుట్టడం విరుద్ధం కదా? ఒకే వస్తువు కార్యంగానూ కారణంగానూ కాజాలదు కదా? 'అక్షర'శబ్దం 'సజీవశరీరం'అనే అర్థం బోధించదు, కేవలజీవుణ్ణే బోధిస్తుంది అని చెప్పడం కూడ కుదరదు. కేవలజీవునినుండి సశరీరజీవుడు పుడతాడు అని చెప్పడం కూడ విరుద్ధ మైన మాటయే; ఎందువల్ల ననగా కారణజీవునికంటె కార్యజీవునికి భేదం లేదు కదా? రెండవ పక్షం(బ్రహ్మశబ్దానికి అజీవశరీరం అని అర్థం అనే పక్షం) కూడ అయుక్తమే; అజీవశరీరం కర్మ చేయజాలదు కదా? జీవునితో కూడిన శరీరమే కర్మ చేస్తుంది అనేది అందరూ అంగీ కరించిన విషయం. మరొక విషయం ఏమనగా-సజీవశరీరంపుట్టింది అనడంలో జీవుడు కూడ పుట్టాడు అనే అర్థం వస్తుంది. అది "అజో నిత్యః"ఇత్యాది శ్రుతులకు విరుద్ధం గాన అయుక్తం.

అందువల్లనే ఇక్కడ చక్రత్వం కూడ లభించదు. ఎందువల్ల ననగా అక్షరశబ్దంచేత చెప్పబడే దేహకారణమైన జీవుడు దేనినుండీ పుట్టినట్లు వినబడడం లేదు, అలా పుట్టడం కుదరదు కూడ. అలా పుడితే నశించవలసి ఉంటుంది గాన వానికి అక్షరత్వం కుదరదు. నశించకపోవడమే కదా అక్షరత్వం అనగా? పుట్టింది అంటే నశించక తప్ప దని "జాతస్య హి ధ్రువో మృత్యుః"అనే వాక్యం చెపుతూన్నది. "బ్రహ్మాక్షరసముద్భవమ్"అనేది లేకపోతే 'భూత' 'బ్రహ్మ'శబ్దాలు (మీప్రకారం)ఒకే అర్థాన్ని బోధించడంచేత "అన్నంనుండి భూతాలు పుడతాయి. మళ్లీ ఆ బ్రహ్మ అన్నంనుంచి పుడుతుంది"అని చక్రత్వం కుదరవచ్చును. సరే అలాగే గ్రహిద్దాం అంటే "మూలచ్ఛేదీ తవ పాణ్డిత్యప్రకర్షః"అన్న ట్లవుతుంది.

భూత-బ్రహ్మ-అక్షర శబ్దాలు మూడు కూడ సజీవశరీరం అనే అర్థాన్నే బోధిస్తాయి, బ్రహ్మశబ్దంచేత చెప్పబడే సజీవశరీర మైన పుత్రుడు 'అక్షర'శబ్ద చేత చెప్పబడే సజీవశరీర మైన తండ్రినుండి జనించాడు అని చెపితే దోషం లేదు కదా అని అంటే, అది కూడ

యుక్తం కాదు. ఎందువల్ల ననగా–తండ్రి దేహంనుండి పుత్రుని దేహం పుట్టి నట్లు తండ్రి దేహం కూడ తాత దేహంనుండి పుట్టింది గాన అక్షరశబ్దవాచ్య మైన పితృదేహం అన్నం నుండి పుట్టలేదు. "అన్నాద్భవన్తి భూతాని" అన్నప్పుడు కూడ "అన్నమయమైన తండ్రిదేహం నుండి పుత్రదేహాలు పుడతాయి" అనే అర్థం అవడానికి కూడ వీలులేదు. అప్పుడు "బ్రహ్మాక్షర సముద్భవమ్" అనేదానిచేత పౌనరుక్త్యదోషం కలుగుతుంది. 'బ్రహ్మాక్షరసముద్భవమ్' అని పునరుక్తి ఉన్నా కూడ చక్రత్వం కుదరుతుంది గాన పునరుక్తి దోషం కాదు అనడం కూడ యుక్తం కాదు. చక్రత్వాన్ని సమర్థించడానికి స్వపదాలే ఉపయోగించి "కర్మ భూతోద్భవం విద్ధి భూతమన్నసముద్భవమ్" అని చెప్పడం యుక్తం కదా? స్వపదంచేత గాని, పర్యాయపదం చేత గాని చెప్పకపోయినా 'అన్నాద్భవన్తి భూతాని' 'కర్మ బ్రహ్మోద్భవమ్' అని చెప్పడంమాత్రం చేతనే చక్రత్వం స్పష్టంగా కనబడుతుంది కదా. అందువల్ల భూత–బ్రహ్మ–అక్షరశబ్దాలు సమానార్థకాలు అని అనడం యుక్తం కాదు; అవి భిన్నార్థము లైనప్పుడు నువ్వు చెప్పిన చక్రత్వం సిద్ధించదు.

'ఇన్ద్రియారామః' అన్నప్పుడు కరణా లైన ఇంద్రియాలయందు ఉద్యానత్వారోపం కూడ విరుద్ధం. అరామం అనగా విహరించేస్థానం కాని విహరించే సాధనం కాదు. ఇక్కడ విహారవిషయాలు శబ్దాదులే. అందువల్ల శబ్దాదులయందూరామత్వాన్ని ఆరోపించడమే యుక్తం కాని ఇంద్రియాలయందు కాదు. "విషయభోగమునందు ఒక్కదానియందు మాత్రమే ఆసక్తి కలవాడు" అని ఫలితార్థం చెప్పాం కదా అనడం కూడ సరికాదు. ఋజుమార్గాన్ని విడచి వక్రమార్గాన్ని ఆశ్రయించడం అయుక్తం కదా?

అట్లే–జ్ఞానయోగాదులలో ప్రయత్నించేవా డైనా, వాని ప్రయత్నం నిష్ఫలం అవడంచేత అతడు వ్యర్థంగానే జీవిస్తున్నాడు అని చెప్పడం కూడ అయుక్తమే. జ్ఞానయోగంలో ప్రయత్ని స్తూన్న సంన్యాసికి యజ్ఞాన్ని అనుష్ఠించే అధికారం ఉండదు కదా? ఎవనికి ఏది విధించబడిందో అతడు దానిని అనుష్ఠించిన ట్లయితే వ్యర్థజీవనుడు కాదు; జ్ఞానయోగికి విధించబడినది జ్ఞానమే కాని కర్మ కాదు; అలాంటప్పుడు కర్మను ఆచరించకపోతే జ్ఞానయోగి వ్యర్థజీవను డెలా అవుతాడు? ఇంద్రియారాముడై ఉండడంచేత జ్ఞానయోగి వ్యర్థజీవను డవుతాడు అనడం కూడ యుక్తం కాదు. ఇది సంన్యాసి కాని అజ్ఞానిని గూర్చి చెప్పే ఘట్టం. "యస్త్విన్ద్రియాణి" ఇత్యాది శ్లోకాలు రెండింటిలో సంన్యాసి యైన ప్రాజ్ఞునికి కర్మ ఉండదు అని చెప్పబడనున్నది కూడ. (భా. అ. ప్ర. పే. 130, 131) 16

భాష్యమ్

ఏవం స్థితే కిమ్ ఏవం ప్రవర్తితం చక్రం సర్వేణ అనువర్తనీయమ్ ఆహోస్విత్ పూర్వోక్తయోగానుష్ఠానోపాయప్రాప్యామ్, అనాత్మవిదా, జ్ఞానయోగేనైవ నిష్ఠామ్, ఆత్మ

విద్భిః సాంఖ్యైః అనుష్ఠేయామ్ అప్రాప్తేన ఏవ ఇత్యేవమర్థమ్ అర్జునస్య ప్రశ్నమ్ ఆశఙ్క్య,స్వయమేవ వా శాస్త్రార్థస్య వివేకప్రతిపత్త్యర్థమ్–"ఏతం వై తమాత్మానం విదిత్వా నివృత్తమిథ్యాజ్ఞానాః సన్తః బ్రాహ్మణాః మిథ్యాజ్ఞానవద్భిః అవశ్యం కర్తవ్యేభ్యః పుత్రైషణాదిభ్యో వ్యుత్థాయ అథ భిక్షాచర్యం శరీరస్థితిమాత్రప్రయుక్తం చరన్తి,న తేషామ్ ఆత్మజ్ఞాననిష్ఠావ్యతిరేకేణ అన్యత్ కార్యమ్ అస్తి"ఇత్యేవం శ్రుత్యర్థమ్ ఇహ గీతాశాస్త్రే ప్రతిపిపాదయిషితమ్ ఆవిష్కుర్వన్ ఆహ భగవాన్– ✓

మూ. యస్త్వాత్మరతిరేవ స్యాదాత్మతృప్తశ్చ మానవః,
ఆత్మన్యేవ చ సంతుష్టస్తస్య కార్యం న విద్యతే. 17

బాలానందిని

ఏవమితి:– 'అనాత్మవిదా'అనేది 'అప్రాప్తేన'తో అన్వయిస్తుంది. ఇది ఇలా ఉండగా, ఈ విధంగా ప్రవర్తింపచేయబడిన చక్రాన్ని అందరూ అనువర్తించాలా లేక వెనుక చెప్పబడిన కర్మయోగానుష్ఠానం అనే ఉపాయంచేత పొందదగినది,ఆత్మవేత్తలైన సాంఖ్యులు అనుష్ఠింప దగినదీ అయిన జ్ఞానయోగంచేత నిష్ఠను పొందని ఆత్మవేత్త కానివాడు మాత్రమే అనువర్తించాలా అనే విషయాన్ని గూర్చి అర్జునుడు ప్రశ్నిస్తా డని ఆశంకించుకొని,లేదా శాస్త్రార్థాన్ని వివిక్తంగా(ఎక్కడి కక్కడికి విడగొట్టి)తెలుసుకొనడంకోసమై–"ఈ ఆత్మను తెలుసు కొని,మిథ్యాజ్ఞానం తొలగిపోయినవారై బ్రాహ్మణులు,మిథ్యాజ్ఞానం ఉన్నవాళ్లు తప్పక ఆచరించ వలసి ఉన్న పుత్రైషణాదులనుండి పైకి లేచి(ఏషణలను విడచి),శరీరస్థితికి మాత్రమే అవసర మైన భిక్షాచర్యం చేస్తూంటారు,వాళ్లకి ఆత్మజ్ఞాననిష్ఠ తప్ప మరొక కార్యం ఏదీ లేదు"అని ఈ గీతాశాస్త్రంలో ప్రతిపాదించడానికి ఉద్దిష్ట మైన శ్రుత్యర్థాన్ని (శ్రుతిలో చెప్పిన విషయాన్ని) తానే ఆవిష్కరిస్తూ భగవంతుడు అంటున్నాడు–("ఏతం వై తమాత్మానమ్" మొదలు "అన్యత్కార్యమస్తి"వరకు ఉన్న వాక్యం బృ.ఉ. 3.5.1కి (అర్థతోనువాదం).

ప్ర.అ. యస్త్వితి:– యః మానవః తు = ఏ మానవు డైతే,ఆత్మరతిః ఏవ=ఆత్మ యందే రతికలవాడు,స్యాత్=అవుతాడో, ఆత్మతృప్తః చ=ఆత్మచేత తృప్తి చెందిన వాడవుతాడో. ఆత్మని ఏవ = ఆత్మయందే,సంతుష్టః చ=సంతోషించినవాడు కూడ అవుతాడో,తస్య=వానికి, కార్యమ్=చేయవలసిన కర్మ ఏదీ,న విద్యతే=లేదు.

భాష్యమ్

యస్తు ఇతి:– యస్తు సాంఖ్యః ఆత్మజ్ఞాననిష్ఠః ఆత్మరతిః ఆత్మన్యేవ రతిః న విషయేషు యస్య సః ఆత్మరతిః ఏవ స్యాత్ భవేత్,ఆత్మతృప్తః చ ఆత్మనైవ తృప్తః న

అన్నరసాదినా,మానవః మనుష్యః,సంన్యాసీ,ఆత్మని ఏవ చ సంతుష్టః,సంతోషః హి బాహ్యార్థలాభే సర్వస్య భవతి,తమ్ అనపేక్ష్య ఆత్మని ఏవ చ సంతుష్టః, సర్వతః వీతతృష్ణః ఇత్యేతత్. యః ఈదృశః ఆత్మవిత్ తస్య కార్యం కరణీయం న విద్యతే, నాస్తి ఇత్యర్థః. 17

బాలానందిని

యస్త్వితి:- ఆత్మజ్ఞాననిష్ఠుడైన ఏ సాంఖ్యుడైతే,ఆత్మయందే రతి కలవాడు కాని ఇతరవిషయాలు వేటియందూ రతికలవాడు కాడో,అత్మతృప్తః చ = ఆత్మచేతనే తృప్తి పొందుతాడో,అన్నరసాదులచేత తృప్తుడు కాడో,మానవః = అలాంటి సంన్యాసియైన ఏ మనుష్యుడు,ఆత్మయందే సంతోషిస్తాడో,ప్రతీవానికీ బాహ్యమైన విషయాలు లభించినప్పుడు సంతోషం కలుగుతుంది. అలాంటి బాహ్యార్థాన్ని దేనినీ అపేక్షించకుండా తనలోనే సంతోషించేవాడో,అనగా వేటి విషయంలోను ఆసక్తి లేనివాడు అని భావం. ఇలాంటి ఏ ఆత్మవేత్త ఉన్నాడో,వానికి చేయవలసిన పని ఏదీ లేదు అని అర్థం.

వి. రతి- తృప్తి-సంతోషపదాల అర్థం ఇంచుమించుగా ఒకటే;అయినా మోద-ప్రమోద -ఆనందాలకు వలె స్వల్పమైన అవాంతరభేదం చూచుకోవాలి. లేదా-భోగ్యవిషయాలమీద ఆసక్తి రతి. కొన్ని విషయాలసంబంధంవల్ల కలిగిన సుఖం తృప్తి. కోరిన విషయాలు లభించ నంతమాత్రంచేత లభించే సుఖసామాన్యం సంతోషం అని వీటి భేదం. (ఆనందగిరి. పే. 118)

భా. అ. ప్ర. "ఈ శ్లోకంలోను,రాబోయే శ్లోకంలోను ముక్తులను గూర్చి చెప్పబడుచున్నది"అని శ్రీరామానుజాచార్యులు,"ఇది సంన్యాసాశ్రమిని గూర్చి చెప్పినది కాదు; వానికి కూడ స్వాశ్రమధర్మాలనుండి నివృత్తి అసంభవం కదా? వర్ణాశ్రమధర్మాల ఆరంభం వర్ణాశ్రమములున్నవానికే కాని వర్ణాశ్రమాలకు అధీనమైన నామరూపాలనుండి దూరమైన వానికి కాజాలవు అని ముక్తశబ్దానికి భావం"అని వేదాంతదేశికులూ చెప్పినది అర్థశూన్యమైనది. కారణమేమనగా-ఇక్కడ ముక్తుని ప్రసక్తియే లేదు. గీతాశాస్త్రం ముముక్షువును గూర్చియే ప్రవర్తిస్తూన్నది. వేదాంతశాస్త్రంలో ముముక్షువునకు మాత్రమే అధికారం ఉంటుంది. **"ఆత్మన్యేవాత్మనా తుష్టః స్థితప్రజ్ఞస్తదోచ్యతే"**అని చెప్పినట్లు ఆత్మతుష్టి స్థితప్రజ్ఞుని లక్షణం. స్థితప్రజ్ఞుడు జ్ఞానయోగియే కాని ముక్తుడు కాడని అందరూ అంగీకరించిన విషయం. **"దుఃఖేష్వనుద్విగ్నమనాః"**ఇత్యాదిశ్లోకాలలో చెప్పినధర్మాలకు ముక్తుల విషయంలో ప్రసక్తియే లేదు. ముక్తునికి దుఃఖాలుండవు కదా? దుఃఖాలుంటే కదా దుఃఖాలు కలిగినా ఉద్వేగం చెందని మనస్సుతో ఉంటాడు అని చెప్పేది? మరొక విషయ మేమనగా-'మానవః'అనే పదం ఈ శ్లోకం సాధకుణ్ణి గూర్చి చెప్పిన దనడానికి లింగం. సిద్ధునికి మానవత్వాదికం

ఉండదు కదా?మానవత్వాదికం దేహధర్మం. ముక్తుడు ఆత్మ. అందుచేత ముక్తులలో మానవ-అసుర-దేవతాదివిభాగం ఉండదు. మరొక విషయం-'**ఆత్మరతిః ఏవ**'అని 'ఏవ' కారానికి నీ మతంలో ప్రయోజనం ఉండదు. ముక్తిలో భోగ్యవిషయా లేవీ ఉండవు కదా?అవి లేనప్పుడు 'ఆత్మయందు మాత్రమే రతి కలవాడు'అని అంటూ ఆత్మభిన్న మైన విషయాలను మిన హాయించడం ఎందుకు?అలా కాక-ముక్తి అనగా విష్ణుపదం;వైకుంఠలోకం. అక్కడ అప్రాకృతా లైన విషయా లుంటాయి అని అంటే అప్పుడు ముక్తునికి విషయరతియే ఉంటుంది కాని ఆత్మరతి ఉండదు. అక్క డున్న అప్రాకృతవిషయాలు ముక్తుని ఇంద్రియాలను ఆకర్షిస్తాయి కదా? ముక్తులు ఆ విషయాలను అనుభవించరు అని అంటే పరమేశ్వరుడు అప్రాకృతా లైన ఆ విషయాలను సృష్టించడం వ్యర్థమే అవుతుంది. ఈ విధంగా వ్యర్థమైన విషయాలను సృష్టించిన విష్ణువు వ్యర్థప్రలాపం చేసే ఉన్మత్తుడు వలె అప్రమాణమే అవుతాడు. మరొక విషయం -రాబోయే 'నైవ'ఇత్యాదిశ్లోకంలో 'ఇహ'అనే పదం ఉంది. అది ఈ లోకంలో అనే అర్థాన్ని బోధిస్తుంది కదా? ముక్తునికి ఇహలోకసంబంధం ఎలా కుదురుతుంది? ఏ విధంగానూ కుదరదు. అందువల్ల ఈ రెండు శ్లోకాలు ముక్తులను గూర్చినవి కాదు, సాంఖ్యులను గూర్చినవే.

సంన్యాసికి కూడ వర్ణాశ్రమధర్మం ఉన్న దని చెప్పడంకూడ అయుక్తం. కుటీచకాది సంన్యాసులకు దండ-తర్పణాదిధర్మాలు ఉన్నా కూడ పరమహంస యైన సంన్యాసికి అల్పమైన ధర్మం కూడ లేదు. (నాలుగు ఆశ్రమాలలోని అవాంతరభేదాలనుగూర్చిచూ అస్మదీయ బ్రహ్మసూత్రశంకరభాష్యాంధ్రవ్యాఖ్య బాలానందిని పేజి1321,22). "**యే బ్రాహ్మణా గామవధూతలిఙ్గాశ్చరన్తి తేభ్యః శివమస్తు రాజ్ఞామ్**"అని భాగవతం చెపుతున్నతది. దిగంబరులు, దండకపాలాదులు లేనివారు,అయినవాళ్లు "కరతలభిక్షస్తరుతలవాసః"ఇత్యాదివచనాలలో చెప్పిన కరతలభిక్షాదులు కలవారు కదా?"నిస్త్రైగుణ్యే పథి విచరతాం కో విధిః కో నిషేధః" (త్రిగుణాతీత మైన మార్గంలో సంచరించేవాళ్లకు విధి ఏమిటి,నిషేధం ఏమటి)అని చెప్పబడింది కదా?వాళ్లకు కూడ నివృత్తిధర్మం ఉంది కదా అనడం యుక్తం కాదు. ఎందువల్ల ననగా-ఆత్మరత్యాదులే నివృత్తిధర్మాలు. నువ్వు చెప్పిన పద్ధతిలో అవి ముక్తులలో కూడ ఉండవచ్చును కదా?(భా. అ. ప్ర. పే. 132,133) 17

భాష్యమ్

కిం చ-

మూ. నైవ తస్య కృతేనార్థో నాకృతేనేహ కశ్చన,
న చాస్య సర్వభూతేషు కశ్చిదర్థవ్యపాశ్రయః. 18

~~హేతువు~~ ~~యోగవాసిష్ఠము~~ 5-89-22 page 194

బాలానందిని

కిం చేతి:- మరొక విషయ మేమనగా-

ప్ర.అ.నైవేతి:- తస్య = వానికి, ఇహ = ఈ లోకంలో, కృతేన = కర్మచేత, అర్థః = ప్రయోజనం, నైవ = లేనే లేదు. అకృతేన = చేయకపోవడంచేత, కశ్చన = ఏమీ, న= లేదు. అస్య = వీనికి, సర్వభూతేషు = అన్ని భూతములయందు (ఏ భూతమునందూ కూడ). అర్థవ్యపాశ్రయః = ప్రయోజనాన్ని ఉద్దేశించి ఆశ్రయించడం, కశ్చిత్ = ఏదీ కూడ, న చ = లేదు.

భాష్యమ్

నైవేతి:- నైవ తస్య పరమాత్మరతేః కృతేన కర్మణా అర్థః ప్రయోజనమ్ అస్తి. అస్తు తర్హి అకృతేన అకరణేన ప్రత్యవాయాఖ్యః అనర్థః?న అకృతేన ఇహ లోకే కశ్చన కశ్చిదపి ప్రత్యవాయప్రాప్తిరూపః ఆత్మహానిలక్షణో వా నైవాస్తి.న చ అస్య సర్వ భూతేషు బ్రహ్మాదిస్థావరాన్తేషు భూతేషు కశ్చిత్ అర్థవ్యపాశ్రయః,ప్రయోజననిమిత్త క్రియాసాధ్యః,వ్యపాశ్రయః వ్యపాశ్రయణమ్.కంచిద్ భూతవిశేషమ్ ఆశ్రిత్య న సాధ్యః కశ్చిత్ అర్థః అస్తి,యేన తదర్థా క్రియా అనుష్ఠేయా స్యాత్. 18

బాలానందిని

నైవేతి:- పరమాత్మయందే రతి గలవానికి కర్మచేత ప్రయోజనం లేదు.అయితే కర్మ చేయకపోవడంచేత ప్రత్యవాయం అనే అనర్థం ఉండాలి కదా? (సమాధానం) చేయకపోవడం చేత కూడ,ఈ లోకంలో,ప్రత్యవాయం కలగడం అనే లేదా తనకు ఏదో హాని కలగడం అనే అనర్థం కూడ,ఏదీ లేదు.వీనికి బ్రహ్మదేవుడు మొదలు స్థావరాలవరకు ఉన్న భూతాలలో, అర్థవ్యపాశ్రయః-ప్రయోజనం నిమిత్తంగా గల ఏదో ప్రయోజనాన్ని ఉద్దేశించి చేసే, వ్యపాశ్రయం,అనగా ఆశ్రయించడం కూడ ఏదీ ఉండదు.ఏదో ఒక భూతాన్ని, దేవతాదులను, ఆశ్రయించి సాధించవలసిన కార్యం,ప్రయోజనం,ఏదీ ఉండదు.అలాంటి ప్రయోజనం ఏదైనా ఉంటే అందుకోసం ఏదైన క్రియ(కర్మ)చేయవలసి ఉండేది. 18

భాష్యమ్

న త్వమ్ ఏతస్మిన్ సర్వతఃసంప్లుతోదకస్థానీయే సమ్యగ్దర్శనే వర్తసే;యతః ఏవమ్-

మూ. తస్మాదసక్తః సతతం కార్యం కర్మ సమాచర,
అసక్తో హ్యాచరన్ కర్మ పరమాప్నోతి పూరుషః. 19

బాలానందిని

నేతి:- అయితే నువ్వు మాత్రం సర్వతఃసంప్లుతోదకంవంటి సమ్యగ్దర్శనంలో లేవు. ఇది ఇలా ఉంది కాబట్టి-

ప్ర.అ. తస్మాదితి:-అందువల్ల, అసక్తః = ఆసక్తి లేనివాడవై, సతతమ్ = ఎల్లప్పుడు, కార్యమ్ = చేయదగిన, కర్మ = కర్మను, సమాచర = ఆచరించుము. అసకక్తః = ఆసక్తి లేనివాడై, కర్మ = కర్మను, ఆచరన్ = ఆచరించుచున్న, పూరుషః = పురుషుడు, పరమ్ = మోక్షమును, ఆప్నోతి హి = పొందుతాడు కదా?

భాష్యమ్

తస్మాదితి:- తస్మాత్ అసక్తః సంగవర్జితః, సతతం సర్వదా,కార్యం కర్తవ్యం నిత్యం,కర్మ,సమాచర నిర్వర్తయ. అసక్తః హి యస్మాత్సమాచరన్ ఈశ్వరార్థం కర్మ కుర్వన్.పరం మోక్షమ్ ఆప్నోతి పురుషః,సత్త్వశుద్ధిద్వారేణ ఇత్యర్థః. 19

బాలానందిని

తస్మాదితి:- అందువల్ల, (నీకు జ్ఞాననిష్ఠాధికారం లేదు గాన),సంగం లేనివాడవై ఎల్లప్పుడూ చేయదగిన నిత్యకర్మను చేయుము. హి = ఎందువల్లననగా, అసక్తుడై ఈశ్వరార్పణ బుద్ధితో కర్మ చేసే పురుషుడు,అంతఃకరణశుద్ధి ద్వారా మోక్షం పొందుతాడు.

భా.అ.ప్ర.:-"పరమ్ అనగా ఆత్మను,జీవుణ్ణి పొందుతాడు"అని శ్రీరామానుజాచార్యుల వ్యాఖ్య అయుక్తం. ఆతని మతం ప్రకారం జీవుడు పరమాత్మ కాదు. జీవుడు జీవుణ్ణి పొందడం ఫలం కాజాలదు. (భా.అ.ప్ర.పే.134) 19

భాష్యమ్

యస్మాచ్చ -

మూ. కర్మణైవ హి సంసిద్ధిమాస్థితా జనకాదయః
లోకసంగ్రహమేవాపి సంపశ్యన్ కర్తుమర్హసి. 20

బాలానందిని

యస్మాదితి :- ఏ కారణంవల్ల కూడ-

ప్ర.అ. కర్మణేతి :- జనకాదయః = జనకుడు మొదలైనవారు, కర్మణైవ = కర్మచేతనే, సంసిద్ధిమ్ = సిద్ధిని,ఆస్థితాః = పొందినారో(అందువల్ల కూడ కర్మ ఆచరించుము). లోక సంగ్రహమ్ ఏవ = లోకోపకారమును మాత్రమే, సంపశ్యన్ వా అపి = చూచుచున్నవాడవైనా కూడ, కర్తుమ్ = కర్మ చేయుటకు, అర్హసి = తగి ఉన్నావు.

భాష్యమ్

కర్మణైవేతి:- కర్మణైవ హి యస్మాత్ పూర్వే క్షత్రియాః విద్వాంసః, సంసిద్ధిం మోక్షం, గన్తుమ్, ఆస్థితాః ప్రవృత్తాః. కే?జనకాదయః జనకాశ్వపతిప్రభృతయః. యది తే ప్రాప్తసమ్యగ్దర్శనాః తతః లోకసంగ్రహార్థం ప్రారబ్ధకర్మత్వాత్ కర్మణా సహైవ, అసంన్యస్యైవ కర్మ, సంసిద్ధిమ్ ఆస్థితాః ఇత్యర్థః. అథ అప్రాప్తసమ్యగ్దర్శనాః జనకాదయః తదా కర్మణా, సత్త్వసంశుద్ధిసాధనభూతేన,క్రమేణ సంసిద్ధిమ్ ఆస్థితాః ఇతి వ్యాఖ్యేయః శ్లోకః. అథ మన్యసే పూర్వైః అపి జనకాదిభిః అపి అజానద్భిః ఏవ కర్తవ్యం కర్మ కృతం తావతా న అవశ్యమ్ అన్యేన కర్తవ్యం సమగ్దర్శనవతా కృతార్థేన ఇతి తథాపి ప్రారబ్ధకర్మాయత్తః త్వం లోకసంగ్రహమ్ ఏవ అపి,లోకస్య ఉన్మార్గప్రవృత్తి నివారణం లోకసంగ్రహః,తమ్ ఏవ అపి ప్రయోజనం సంపశ్యన్ కర్తుమ్ అర్హసి. 20

బాలానందిని

కర్మణైవేతి :- హి = ఎందువల్ల విద్వాంసులైన (జ్ఞానులైన)పూర్వికు లైన క్షత్రియులు కర్మచేతనే,సంసిద్ధిని,మోక్షాన్ని,పొందడానికి ప్రవర్తించారో,ఎవరు వాళ్లు?జనకుడు,అశ్వపతి మొదలైనవాళ్లు.వాళ్లు సమ్యగ్దర్శనం (ఆత్మజ్ఞానం)పొందినవా రైతే,(అనగా జ్ఞానం పొంది కూడ కర్మాచరణలో ప్రవర్తిస్తే)అప్పుడు, లోకసంగ్రహంకోసం కర్మాచరణం ప్రారంభించి ఉన్నారు గాన వాళ్లు(అలవాటు ప్రకారం చేస్తూనే)కర్మతో కూడ, కర్మను సంన్యసించకుండా (కర్మ సంన్యసించడానికి అకాశం ఉన్నా కూడ కర్మసంన్యాసం చేయకుండా)మోక్షం పొంద డానికి ప్రవర్తించారు అని అర్థం.అలా కాక,జనకాదులకు ఆత్మజ్ఞానం లభించలేదు అన్నట్ల యితే,అప్పుడు(కర్మచేతనే సంసిద్ధిని పొందారు అను దానికి భావం)వాళ్లు అంతఃకరణశుద్ధికి సాధన మైన కర్మచేత క్రమంగా సంసిద్ధిని ఆస్థితులైనారు అని శ్లోకాన్ని వ్యాఖ్యానించాలి.

అవ:- జనకాదులు అజ్ఞానులే అవడంచేత చిత్తశుద్ధికై కర్మాచరణం చేస్తే చేసి ఉండవచ్చును.నేను ఇంతవరకు అజ్ఞానినే అయినా ఇప్పుడు నీవు చేసిన ఉపదేశంచేత జ్ఞాని నయ్యాను.ఇంక నేను కర్మ ఎందుకు చెయ్యాలి అని అర్జునుని ప్రశ్నను ఊహించుకొని చెపుతున్నాడు. **అథేతి:**- పూర్వికు లైన జనకాదులు కూడ ఆత్మజ్ఞానం లేనివా ళ్లవడంచేతనే కర్మ చేశారు;తావన్మాత్రంచేత సమ్యగ్దర్శనం గల కృతార్థుడు కూడ తప్పక కర్తవ్యకర్మ చేయ వలసిన పని లేదు అని నువ్వు అభిప్రాయపడుతున్నా కూడ ప్రారబ్ధకర్మాధీనుడ వైన నువ్వు,లోక సంగ్రహమేవాపి = లోకం చెడు మార్గంలో ప్రవర్తించకుండా చూడడం లోకసంగ్రహం;ఆ లోకసంగ్రహ మనే ప్రయోజనాన్ని ఉద్దేశించి యైనా, కర్మ చెయ్యాలి.(నువ్వు జ్ఞాని వైతే కావచ్చును. కాని నీ ప్రారబ్ధకర్మ యుద్ధాది కర్మలను చేయిస్తుంది.అందుచేత చెయ్యాలి అని భావం). 20

భాష్యమ్

లోకసంగ్రహం కః కర్తుమ్ అర్హతి? కథం చ? ఇత్యుచ్యతే -

మూ. యద్యదాచరతి శ్రేష్ఠస్తత్తదేవేతరో జనః,
స యత్ ప్రమాణం కురుతే లోకస్తదనువర్తతే. 21

బాలానందిని

లోకేతి:- లోకసంగ్రహం ఎవడు చెయ్యాలి?ఎలా చెయ్యాలి?సమాధానం చెప్ప బడుచున్నది -

ప్ర.అ. యద్యదితి:- శ్రేష్ఠః = ప్రధానుడైనవాడు,యత్ యత్ = దేనిని దేనిని, ఆచరతి = ఆచరిస్తాడో, తత్ తత్ ఏవ = ఆ యా పనినే, ఇతరః జనః = ఇతరు డైన సామాన్యజనుడు ఆచరిస్తాడు. సః= ఆశ్రేష్ఠుడు, యత్ = దేనిని, ప్రమాణమ్ = ప్రమాణముగా, కురుతే = చేస్తాడో, తత్ = దానినే, లోకః = లోకం (సామాన్యజనుడు)అనువర్తతే = అనుసరిస్తాడు.

భాష్యమ్

యద్యదితి:- యద్యత్ కర్మ ఆచరతి,యేషు యేషు,శ్రేష్ఠః ప్రధానః తత్తదేవ కర్మ ఆచరతి, ఇతరః అన్యః జనః తదనుగతః. కిం చ సః శ్రేష్ఠః, యత్ ప్రమాణం కురుతే, లౌకికం వైదికం వా, లోకః తత్ అనువర్తతే తదేవ ప్రమాణీకరోతీత్యర్థః. 21

బాలానందిని

యద్యదితి:- ఏ యే జనులలో ప్రధాను డైనవాడు ఏ ఏ కర్మ చేస్తాడో ఆ యా కర్మనే వానిని అనుసరించే జనుడు చేస్తాడు.మరియు,ఆ శ్రేష్ఠుడు లౌకికకర్మ యైనా,వైదికకర్మ యైనా-దేనిని ప్రమాణంగా గ్రహిస్తాడో దానినే లోకం కూడ అనువర్తిస్తుంది,ప్రమాణంగా గ్రహిస్తుంది అని అర్థం. 21

భాష్యమ్

యది అత్ర తే లోకసంగ్రహకర్తవ్యతాయాం విప్రతిపత్తిః తర్హి మాం కిం న పశ్యసి?-

మూ. న మే పార్థాస్తి కర్తవ్యం త్రిషు లోకేషు కించన,
నానవాప్తమవాప్తవ్యం వర్త ఏవ చ కర్మణి. 22

బాలానందిని

యదీతి:-లోకసంగ్రహంయొక్క కర్తవ్యత్వాన్ని గూర్చి(చెయ్యాలా అవసరం లేదా అని)నీకు అభిప్రాయభేదం(సందేహం)ఉంటే నన్నే ఎందుకు చూడవు?

ప్ర.అ. నేతి:- పార్థ = అర్జునా! త్రిషు లోకేషు = మూడు లోకాలలోనూ కూడ, మే = నాకు, కర్తవ్యమ్ = చేయదగినది(పని చేసి సంపాదించదగినది), నాస్తి = లేదు, అవాప్తవ్యమ్ = పొందదగిన, అనవాప్తమ్ = పొందబడనిది ఏదీ (మూడు లోకాలలోనూ)లేదు. కర్మణి = కర్మయందు, వర్తే ఏవ చ = ప్రవర్తిస్తూనే ఉన్నాను.

భాష్యమ్

న మ ఇతి:- న,మే మమ,పార్థ,నాస్తి న విద్యతే కర్తవ్యం త్రిషు అపి లోకేషు, కించన కించిదపి-కస్మాత్?న,అనవాప్తమ్ అప్రాప్తమ్,అవాప్తవ్యం ప్రాపణీయం,తథాపి వర్తే ఏవ చ కర్మణి అహమ్. 22

బాలానందిని

నేతి:- అర్జునా ! ఈ మూడు లోకాలలోనూ కూడ నేను చేయవలసినది ఏదీ లేదు.ఎందువల్ల?ఇంతకు ముందు పొందబడనిది,ఇప్పుడు పొందవలసినదీ కూడ ఏదీ లేదు.అయినా కూడ నేను కర్మయందు ప్రవర్తిస్తూనే ఉన్నాను. 22

మూ. యది హ్యహం న వర్తేయ జాతు కర్మణ్యతన్ద్రితః,
మమ వర్త్మానువర్తన్తే మనుష్యాః పార్థ సర్వశః. 23

ప్ర.అ. యదీతి:- పార్థ = అర్జునా ! అహమ్ =నేను, అతన్ద్రితః = అలసత్వం లేనివాడనై, జాతు = ఎప్పుడైనా, కర్మణి = కర్మయందు, న వర్తేయ యది = ప్రవర్తించక పోయినట్లయితే, మనుష్యాః = మనుష్యులు, సర్వశః = అన్ని విధాలా కూడ, మమ = నా యొక్క వర్త్మ = మార్గాన్ని, అనువర్తన్తే = అనుసరిస్తారు.

భాష్యమ్

యది పునః న వర్తేయ,జాతు కదాచిత్,కర్మణి,అతన్ద్రితః అనలసః సన్, మమ, శ్రేష్ఠస్య సతః,వర్త్మ మార్గమ్,అనువర్తన్తే, మనుష్యాః హే పార్థ సర్వశః సర్వప్రకారైః. 23

బాలానందిని

యదీతి:- నేను అలసుడను కానివాడనై,ఎప్పుడైనా,కర్మయందు ప్రవర్తించకపోతే, అప్పుడు,అర్జునా మనుష్యులు,శ్రేష్ఠుడ నైన నా మార్గన్ని అన్నివిధాలా అనుసరిస్తారు. 23

భాష్యమ్

తథా చ కః దోషః?ఇత్యాహ -

మూ. ఉత్సీదేయురిమే లోకా న కుర్యాం కర్మ చేదహమ్,
సంకరస్య చ కర్తా స్యాముపహన్యామిమాః ప్రజాః. 24

బాలానందిని

తథేతి:-అయితే మాత్రం దోషం ఏమిటి? చెపుతున్నాడు-

ప్ర.అ. ఉత్సీదేయురితి:- అహమ్ = నేను,కర్మ = కర్మను, న కుర్యాం చేత్ = చేయకపోయినట్లయితే, ఇమే = ఈ, లోకాః = లోకాలు,ఉత్సీదేయుః = నశించిపోవచ్చును; సంకరస్య = సంకరానికి,కర్తా = కర్తను, స్యామ్ = అగుదును;ఇమాః=ఈ ప్రజాః=ప్రజలను, ఉపహన్యామ్ = నశింపచేసినవాడను అగుదును.

భాష్యమ్

ఉదితి:- ఉత్సీదేయుః వినశ్యేయుః,ఇమే సర్వే లోకాః, లోకస్థితినిమిత్తస్య కర్మణః అభావాత్;న కుర్యాం కర్మ చేత్ అహమ్.కిం చ సంకరస్య చ కర్తా స్యామ్.తేన కారణేన ఉపహన్యామ్ ఇమాః ప్రజాః.ప్రజానామ్ అనుగ్రహాయ ప్రవృత్తః,ఉపహతిమ్ ఉపహననం,కుర్యామ్ ఇత్యర్థః.మమ ఈశ్వరస్య అననురూపమ్ ఆపద్యేత. 24

బాలానందిని

ఉదితి:- లోకంయొక్క స్థితికి నిమిత్త మైన కర్మ లేకపోవడంచేత ఈ లోకా లన్నీ, ఉత్సీదేయుః = నశించును - నేను కర్మ చేయకపోతే - మరియు నేను సంకరం చేసినవాడను అవుతాను. ఆ కారణంచేత,ప్రజల అనుగ్రహంకొరకు ప్రవర్తించిన నేను ఆ ప్రజలనే నశింప చేసినవాడను అవుతాను.ఉపహన్యామ్ అనగా ఉపహతిని,అనగా వినాశమును చేసినవాడను అవుతాను అని అర్థం.అలా చేస్తే ఈశ్వరుడ నైన నాకు తగనిది జరుగుతుంది. 24

భాష్యమ్

యది పునః అహమివ త్వం కృతార్థబుద్ధిః,ఆత్మవిత్ అన్యో వా,తస్యాపి ఆత్మనః కర్తవ్యాభావేఽపి పరానుగ్రహః ఏవ కర్తవ్యః ఇతి-

మూ. సక్తాః కర్మణ్యవిద్వాంసో యథా కుర్వన్తి భారత,
శ్లో కుర్యాద్విద్వాంస్తథాఽసక్తశ్చికీర్షుర్లోకసంగ్రహమ్. 25

బాలానందిని

యదీతి:- నావలె నీవు కూడ ఆత్మవేత్త వై కృతార్థుడను అను బుద్ధి కలవాడవైతే, మరొక డెవడైనా అలా అయితే,(నీవూ)అతడూ కూడ తనకోసం చేయవలసినది ఏదీ లేక పోయినా కూడ పరానుగ్రహం చేయవలసినదే గాన-

ప్ర.అ. సక్తాః ఇతి :- భారత = అర్జునా! కర్మణి = కర్మయందు,సక్తాః = ఆసక్తులైన, అవిద్వాంసః = అజ్ఞానులు, యథా= ఏ విధంగా, కుర్వన్తి = చేస్తారో, లోకసంగ్రహమ్ = లోకసంగ్రహమును, చికీర్షుః = చేయదలచిన,విద్వాన్ = విద్వాంసుడు(జ్ఞాని), అసక్తః = ఆసక్తి లేనివాడై, తథా = అట్లే (అంత శ్రద్ధాసక్తు లున్నట్లు),కుర్యాత్ = చేయవలెను.

భాష్యమ్

సక్తాః ఇతి:- సక్తాః,కర్మణి అస్య కర్మణః ఫలం మమ భవిష్యతి ఇతి కేచిత్ అవిద్వాంసః యథా కుర్వన్తి,భారత,కుర్యాత్,విద్వాన్ ఆత్మవిత్,తథా,అసక్తః సన్. తద్వత్ కిమర్థం కరోతి తత్ శృణు. చికీర్షుః కర్తుమ్ ఇచ్ఛుః,లోకసంగ్రహమ్. 25

బాలానందిని

సక్తాః ఇతి:- ఈ కర్మ చేసినందుకు నాకు ఫలం కలుగుతుంది అని కర్మయందు ఆసక్తి గలవారై కొందరు అజ్ఞానులు ఏ విధంగా కర్మ లాచరిస్తారో, అర్జునా ! ఆత్మవేత్త కూడ అట్లే, ఆసక్తి లేనివాడై, చేయవలెను. వాళ్ల వలె ఎందుకు చేస్తాడో విను- లోక సంగ్రహాన్ని చేయ గోరుచున్నవాడై చేస్తాడు. 25

భాష్యమ్

ఏవం లోకసంగ్రహం చికీర్షోః న మమ ఆత్మవిదః కర్తవ్యమ్ అస్తి;అన్యస్య వా లోకసంగ్రహం ముక్త్వా. తతః తస్య ఆత్మవిదః ఇదమ్ ఉపదిశ్యతే -

మూ. న బుద్ధిభేదం జనయేదజ్ఞానాం కర్మసంగినామ్,
జోషయేత్సర్వకర్మాణి విద్వాన్ యుక్తః సమాచరన్. 26

బాలానందిని

ఏవమితి:- ఈ విధంగా లోకసంగ్రహం చేయగోరుచున్న ఆత్మజ్ఞానవంతుడ నైన నాకు గాని,ఆత్మజ్ఞానవంతు డైన మరొకనికి గాని, లోకసంగ్రహం తప్ప మరొక కర్తవ్యం ఏదీ లేదు. అందువల్ల అలాంటి ఆత్మవేత్తకు ఇది ఉపదేశించబడుచున్నది-

ప్ర.అ. నేతి:-కర్మసంగినామ్=కర్మలయందు ఆసక్తు లైన,అజ్ఞానామ్ = అజ్ఞులకు, బుద్ధిభేదమ్ = బుద్ధిభేదాన్ని (బుద్ధిలో అస్థిరత్వాన్ని), న జనయేత్ = పుట్టించకూడదు.

విద్వాన్ = విద్వాంసుడు, యుక్తః = శ్రద్ధావంతుడై,సమాచరన్ = తాను చేస్తూ, సర్వకర్మాణి =అన్ని కర్మలను, జోషయేత్ = చేయించాలి.

భాష్యమ్

నేతి:- బుద్ధేః భేదః బుద్ధిభేదః; మయా ఇదం కర్తవ్యమ్, భోక్తవ్యం చ అస్య కర్మణః ఫలమ్ ఇతి నిశ్చితరూపాయాః బుద్ధేః. భేదనం చాలనం బుద్ధిభేదః;తం న జనయేత్,న ఉత్పాదయేత్,అజ్ఞానామ్ అవివేకినామ్,కర్మసంగినాం కర్మణి ఆసంగ వతామ్.కిం ను కుర్యాత్?జోషయేత్ కారయేత్,సర్వకర్మాణి విద్వాన్ స్వయం తదేవ అవిదుషాం కర్మ,యుక్తః అభియుక్తః,సమాచరన్. 26

బాలానందిని

నేతి:- బుద్ధియొక్క భేదం (విడగొట్టడం)బుద్ధిభేదం."నేను ఈ కర్మ చెయ్యాలి; ఈ కర్మయొక్క ఫలితాన్ని అనుభవించాలి"అని నిశ్చితంగా ఉన్న బుద్ధియొక్క భేదనం, అనగా దానిని చలింపచేయడం బుద్ధిభేదం.దానిని, అజ్ఞానామ్ = వివేకం లేని, కర్మసంగినామ్ = కర్మలయందు ఆసంగం కలవారికి, న జనయేత్ = పుట్టించకూడదు. ఏమి చెయ్యాలి? జోషయేత్ = చేయించాలి;అన్ని కర్మలనూ కూడ.విద్వాంసుడు తాను అవిద్వాంసులు చేస్తూన్న ఆ కర్మనే,యుక్తః = అభియుక్తుడై,శ్రద్ధ కలవాడై,ఆచరిస్తూ. 26

భాష్యమ్

అవిద్వాన్ అజ్ఞః కథం కర్మసు సజ్జతే ఇత్యాహ -

మూ. ప్రకృతేః క్రియమాణాని గుణైః కర్మాణి సర్వశః,
అహంకారవిమూఢాత్మా కర్తాహమితి మన్యతే. 27

బాలానందిని

అవిద్వానితి:- ఆత్మజ్ఞానం లేని అవిద్వాంసుడు కర్మలలో ఏ విధంగా సక్తు డౌతాడో (లగ్ను డవుతాడో)చెప్పుచున్నాడు -

ప్ర.అ. ప్రకృతేరితి :- ప్రకృతేః = ప్రధానంయొక్క(మాయయొక్క), గుణైః = గుణాలచేత, కార్యాలైన దేహాదులచేత, క్రియమాణాని = చేయబడుతున్న,కర్మాణి=కర్మలను గూర్చి, సర్వశః = అన్ని విధాలా, (దీనిని 'క్రియమాణాని'తో అన్వయించినా అన్వయించ వచ్చు). అహంకార విమూఢాత్మా = అహంకారంచేత మూఢమైన బుద్ధి గలవాడై,అహమ్ = నేను, కర్తా = కర్తను, ఇతి = అని, మన్యతే = తలుస్తూంటాడు.

భాష్యమ్

ప్రకృతేః ఇతి :- ప్రకృతిః-ప్రకృతిః ప్రధానం సత్త్వరజస్తమసాం గుణానాం సామ్యావస్థా,తస్యాః ప్రకృతేః,గుణైః వికారైః కార్యకరణరూపైః,క్రియమాణాని కర్మాణి, లౌకికాని శాస్త్రీయాణి చ,సర్వశః సర్వప్రకారైః, అహంకారవిమూఢాత్మా, కార్యకరణాత్మ ప్రత్యయః అహంకారః, తేన వివిధం నానావిధం,మూఢః ఆత్మా అన్తఃకరణం యస్య సః అయం కార్యకరణధర్మా, కార్యకరణాభిమానీ,అవిద్యయా కర్మాణి ఆత్మని మన్య మానః, తత్తత్కర్మణామ్ అహం కర్తా ఇతి మన్యతే. 27

బాలానందిని

ప్రకృతేరితి :- ప్రకృతి అనగా సత్త్వరజస్తమోగుణాల సామ్యావస్థారూపమైన ప్రధానం(ఇది సాంఖ్యు లంగీకరించే స్వతంత్రప్రధానం కాక శ్రుతిసంమతమైన,పరమేశ్వరా ధీన మైన మాయ). ఆ ప్రకృతియొక్క గుణైః=శరీరేంద్రియరూపమైన వికారాలచేత,చేయబడు చున్న లౌకికాలు,శాస్త్రీయాలు అయిన కర్మలను గూర్చి సర్వప్రకారములచేతనూ కూడ అహంకారవిమూఢాత్మయై దేహేంద్రియసముదాయమే నేను అను జ్ఞానం అహంకారం. దానిచేత అనేక విధాల మూఢమైన అంతఃకరణం కలవాడైన,ఈ కార్యకరణధర్ముడై (కార్య కరణాల ధర్మాలను తనపై ఆరోపించుకొని)అవిద్యచేత కార్యకరణాభిమానం కలవాడు, అవిద్య చేత కర్మలను తనకు సంబంధించి నట్లు తలుస్తూ(అవిద్యయా అనేది రెండు ప్రక్కలా అన్వయించబడింది),ఆ యా కర్మలకు నేనే కర్తను అని అనుకొంటాడు. 27

భాష్యమ్

యః పునః విద్వాన్ -

మూ. తత్త్వవిత్తు మహాబాహో గుణకర్మవిభాగయోః,
గుణా గుణేషు వర్తన్త ఇతి మత్వా న సజ్జతే. 28

ప్ర.అ. మహాబాహో = గొప్ప బాహువులు కలవాడా! గుణకర్మవిభాగయోః = గుణవిభాగ-కర్మవిభాగలయొక్క తత్త్వవిత్ తు=తత్త్వం తెలిసినవా డైతే, గుణాః = ఇంద్రియరూపము లైన గుణాలు(వికారాలు),గుణేషు = విషయరూపా లైన వికారాల యందు, వర్తన్తే = ప్రవర్తిస్తున్నాయి ఇతి=అని,మత్వా=తెలిసికొని, న సజ్జతే = ఆసక్తుడు కాడు.

భాష్యమ్

తత్త్వవిదితి:- తత్త్వవిత్ తు, మహాబాహో,కస్య తత్త్వవిత్? గుణకర్మవిభాగయోః గుణవిభాగస్య కర్మవిభాగస్య చ తత్త్వవిదిత్యర్థః. గుణాః కరణాత్మకాః,గుణేషు విషయాత్మ కేషు వర్తన్తే.న ఆత్మా ఇతి మత్వా,న సజ్జతే సక్తిం న కరోతి. 28

బాలానందిని

తత్త్వవిదితి:- ఓ ! మహాబాహో! తత్త్వవేత్త(యధార్థంతెలిసినవాడు)అయితే.దేని తత్త్వం తెలిసినవాడు?గుణకర్మవిభాగయోః-గుణవిభాగంయొక్క కర్మవిభాగంయొక్క తత్త్వం తెలిసినవాడు అని అర్థం.ఇంద్రియరూపా లైన గుణాలు విషయరూపా లైన గుణాలయందు ప్రవర్తిస్తున్నాయి కాని ఆత్మ ప్రవర్తించడంలేదు అని తెలుసుకొని ఆసక్తిని చేయడు(ఆసక్తుడు కాడు). 28

భాష్యమ్

యే పునః -

మూ. ప్రకృతేర్గుణసంమూఢాః సజ్జన్తే గుణకర్మసు,
తానకృత్స్నవిదో మన్దాన్ కృత్స్నవిన్న విచాలయేత్. 29

బాలనందిని

యే ఇతి:- ఎవల్లైతే -

ప్ర.అ. ప్రకృతేరితి:- ప్రకృతేః = ప్రకృతియొక్క, గుణసంమూఢాః = గుణాలచేత మూఢులై, గుణకర్మసు=గుణాల కర్మలయందు,సజ్జన్తే = సక్తు లవుతారో,తాన్ =అట్టి, అకృత్స్నవిదః = అసంపూర్ణ మైన విషయాలను మాత్రమే తెలుసుకొన్న,మన్దాన్= మందబుద్ధులను, కృత్స్నవిత్=పరిపూర్ణయథార్థం తెలిసినవాడు,న విచాలయేత్ = చలింపచేయగూడదు.

భాష్యమ్

ప్రకృతేరితి:- ప్రకృతేః గుణైః సమ్యక్ మూఢాః మోహితాః సన్తః సజ్జన్తే. గుణానాం కర్మసు, వయం కర్మ కుర్మః ఫలాయ ఇతి. తాన్ కర్మసంగినః,అకృత్స్నవిదః కర్మఫలమాత్రదర్శినః,మన్దాన్ మన్దప్రజ్ఞాన్,కృత్స్నవిత్ ఆత్మవిత్ స్వయం,న విచాలయేత్, బుద్ధిభేదకరణమేవ చాలనం,తత్ న కుర్యాత్ ఇత్యర్థః. 29

బాలానందిని

ప్రకృతేరితి:- (ఎవరైతే)ప్రకృతియొక్క గుణాలచేత బాగా మోహింపచేయబడినవాళ్లై. "మేం ఫలంకోసం కర్మ చేస్తున్నాం"అనుకొంటూ,గుణాల కర్మలయందు సక్తు లవుతారో, అట్టి కర్మసంగు లైన,అకృత్స్నవేత్త లైన,కర్మఫలం మాత్రమే చూచేవాళ్లైన,మందబుద్ధులను, కృత్స్నవిత్=తాను ఆత్మవేత్తయై ఉన్నవాడు,చలింపచేయగూడదు. ఇక్కడ చలింపచేయడం అనగా బుద్ధిభేదం కలిగించడమే. అట్టి చాలనం చేయకూడదు. 29

భాష్యమ్

కథం పునః కర్మణి అధికృతేన అజ్ఞేన ముముక్షుణా కర్మ కర్తవ్యమ్ ఇతి? ఉచ్యతే-

మూ. **మయి సర్వాణి కర్మాణి సంన్యస్యాధ్యాత్మచేతసా,**
నిరాశీర్నిర్మమో భూత్వా యుధ్యస్వ విగతజ్వరః. 30

బాలానందిని

కథమితి:- కర్మలయందు అధికారం కలవాడు,ముముక్షువు(మోక్షేచ్ఛ కలవాడు) అయిన అజ్ఞుడు(ఆత్మజ్ఞానరహితుడు)కర్మ ఎలా చెయ్యాలి?చెప్పబడుచున్నది-

ప్ర.అ.మయీతి:- సర్వాణి = సమస్త మైన, కర్మాణి = కర్మలను, అధ్యాత్మచేతసా = వివేకబుద్ధితో, మయి = నాయందు, సంన్యస్య = సంన్యసించి(నాకే సమర్పించి), నిరాశీః = కోరికలు లేనవాడవుగా, నిర్మమః = మమకారం లేనివాడవుగా, భూత్వా = అయి, విగతజ్వరః = పోయిన దుఃఖం కలవాడవై, యుధ్యస్వ = యుద్ధం చేయుము.

భాష్యమ్

మయీతి :- మయి వాసుదేవే పరమేశ్వరే సర్వజ్ఞే సర్వాత్మని,సర్వాణి కర్మాణి, సంన్యస్య నిక్షిప్య,అధ్యాత్మచేతసా వివేకబుద్ధ్యా,అహం కర్తా ఈశ్వరాయ భృత్యవత్ కరోమి ఇత్యనయా బుద్ధ్యా,కిం చ,నిరాశీః త్యక్తాశీః,నిర్మమః మమభావః చ నిర్గతః యస్య తవ సః త్వం నిర్మమః భూత్వా, యుధ్యస్వ, విగతజ్వరః విగతసంతాపః, విగతశోకః సన్ ఇత్యర్థః. 30

బాలానందిని

మయీతి:- వాసుదేవు డను,పరమేశ్వరు డను,సర్వజ్ఞు డను,సర్వాత్మను అయిన నాయందు అన్ని కర్మలను ఉంచి,అధ్యాత్మచేతస్సుతో,అనగా వివేకబుద్ధితో,కర్త నైన నేను ఈశ్వరుని కొరకై భృత్యుడు వలె చేస్తున్నాను అనే బుద్ధితో;మరియు-నిరాశీః = విడువబడిన కోరికలు కలవాడవై,నిర్మమః = ఏ నీనుండి మమకారం తొలగిపోయినదో అట్టివాడవై, విగతజ్వరః = పోయిన సతాపం కలవాడవై,శోకం పోయినవాడవై అని అర్థం;యుద్ధం చేయుము.

వి. అధ్యాత్మం చేతః = అధ్యాత్మచేతః = పరమాత్మవిషయక మైన జ్ఞానం. పరమాత్మ కోసం నేను కర్మ చేస్తున్నాను అనుబుద్ధి.

భాష్యమ్

యదేతత్ మతం కర్మ కర్తవ్యమ్ ఇతి సప్రమాణమ్ ఉక్తం తత్ తథా -

మూ. యే మే మతమిదం నిత్యమనుతిష్ఠన్తి మానవాః,
శ్రద్ధావన్తోఽనసూయన్తో ముచ్యన్తే తేఽపి కర్మభిః. 31

బాలానందిని

యదితి:- కర్మ చేయతగినదే(చెయ్యాలి)అని ఏ మతం సప్రమాణంగా చెప్పబడిందో అది అట్లే -

ప్ర.అ.యే ఇతి:- యే మానవాః = ఏ మానవులు, శ్రద్ధావన్తః = శ్రద్ధ కలవారై, అనసూయన్తః = అసూయ చూపనివారై(అసూయ లేనివారై), మే = నాయొక్క, ఇదం మతమ్ = ఈ మతాన్ని, నిత్యమ్ = ఎల్లప్పుడూ, అనుతిష్ఠన్తి = ఆచరిస్తారో, తే అపి = వాళ్లు కూడ, కర్మభిః = కర్మలచేత,ముచ్యన్తే = విడవబడతారు.

భాష్యమ్

యే మ ఇతి:- యే,మే మదీయమ్ ఇదం మతమ్,అనుతిష్ఠన్తి అనువర్తన్తే, మానవాః మనుష్యాః,శద్ధావన్తః శ్రద్ధధానాః,అనసూయన్తః అసూయాం మయి గురౌ వాసుదేవే అకుర్వన్తః,ముచ్యన్తే,తే అపి ఏవంభూతాః,కర్మభిః ధర్మాధర్మాఖ్యైః. 31

బాలానందిని

యే ఇతి:- ఏ మనుష్యు లైతే,నా ఈ మతాన్ని,నమ్మకం గలవారై, అనసూయన్తః = గురువు నైన వాసుదేవుడ నైన నాయందు అసూయ చేయనివారై,అనుసర్తిస్తారో,ఇలాంటి వాళ్లు కూడ,ధర్మము అధర్మము అనే కర్మలనుండి ముక్తు లవుతారు. 31

మూ. యే త్వేతదభ్యసూయన్తః నానుతిష్ఠన్తి మే మతమ్,
సర్వజ్ఞానవిమూఢాంస్తాన్ విద్ధి నష్టానచేతసః. 32

బాలానందిని

ప్ర.అ. యే తు ఇతి:- యే తు = ఎవరైతే,మే = నాయొక్క, ఏతత్ = ఈ, మతమ్ = మతమును, అభ్యసూయన్తః = అసూయతో చూస్తున్నవారై, న అనుతిష్ఠన్తి = ఆచరించరో,సర్వజ్ఞానవిమూఢాన్ =సర్వవిధాలైన జ్ఞానాల విషయంలో మూఢులైన, తాన్ = వాళ్లను, అచేతసః = వివేకం లేనివాళ్లనుగాను, నష్టాన్ = నశించినవాళ్లను గాను, విద్ధి = తెలుసుకొనుము.

భాష్యమ్

యే త్వితి:- యే తు తద్విపరీతాః, ఏతత్ మమ మతమ్ అభ్యసూయన్తః, న అనుతిష్ఠన్తి నానువర్తన్తే మే మతం,సర్వేషు జ్ఞానేషు వివిధం మూఢాః తే సర్వజ్ఞాన విమూఢాః,తాన్,విద్ధి,నష్టాన్ నాశం గతాన్,అచేతసః అవివేకినః 32

బాలానందిని

యే త్వితి:- వెనుక చెప్పినవాళ్లకు విపరీతు లైన ఎవళ్లైతే అసూయవంతులై నా మతాన్ని అనువర్తించరో,అన్ని జ్ఞానాలలోను అనేకవిధాలుగా మూఢులైన వాళ్లు వివేకరహితు లనీ,నశించినవాళ్లే అనీ తెలుసుకొనుము. 32

భాష్యమ్

కస్మాత్ పునః కారణాత్ త్వదీయం మతం న అనుతిష్ఠన్తి పరధర్మాన్ అను తిష్ఠన్తి?స్వధర్మం చ న అనువర్తన్తే?త్వత్ప్రతికూలాః కథం న బిభ్యతి త్వచ్ఛాసనాతిక్రమణ దోషాత్? తత్రాహ-

మూ. సదృశం చేష్టతే స్వస్యాః ప్రకృతేర్జ్ఞానవానపి,
ప్రకృతిం యాన్తి భూతాని నిగ్రహః కిం కరిష్యతి. 33

బాలానందిని

కస్మాదితి:- వీళ్లు నీ మతాన్ని ఎందుకు ఆచరించరు?పరధర్మాలను ఎందుకు అనుసరిస్తారు?స్వధర్మాలను ఎందుకు ఆచరించరు?నీకు ప్రతికూలంగా నడుస్తూ, వీళ్లు, నీ శాసనాన్ని అతిక్రమించడం అనే దోషంనుండి ఎందుకు భయపడరు?ఈ విషయంలో చెపుతున్నాడు-

ప్ర.అ.సదృశమితి:- జ్ఞానవానపి=జ్ఞానవంతుడు కూడ,స్వస్యాః = తనదైన, ప్రకృతేః = స్వభావానికి, సదృశమ్ = తగినట్లుగా,చేష్టతే = ప్రవర్తిస్తాడు, భూతాని = ప్రాణులు, ప్రకృతిమ్ = తమ స్వభావాన్నే, యాన్తి = పొందుతుంటాయి. నిగ్రహః = నిగ్రహం, కిం కరిష్యతి = ఏమి చేయగలదు?

భాష్యమ్

సదృశమితి:- సదృశమ్ అనురూపమ్,చేష్టతే.కస్యాః?స్వస్యాః స్వకీయాయాః ప్రకృతేః.ప్రకృతిః నామ పూర్వకృతధర్మాదిసంస్కారః వర్తమానజన్మాదౌ అభివ్యక్తః, సా ప్రకృతిః, తస్యాః సదృశమేవ సర్వః జన్తుః జ్ఞానవాన్ అపి,కిం పునః మూర్ఖః.తస్మాత్ ప్రకృతిం యాన్తి భూతాని;నిగ్రహః కిం కరిష్యతి,మమ వా అన్యస్య వా. 33

బాలానందిని

సదృశమితి:- సదృశమ్ = అనురూపంగా,ప్రవర్తిస్తాడు. దేనికి? స్వస్యాః= తనకు సంబంధించిన,ప్రకృతికి.ప్రకృతి అనగా-ప్రస్తుతం జరుగుతూన్న జన్మ ప్రారంభంలో అభివ్యక్త

మైన,పూర్వజన్మకృతధర్మాధర్మాదుల సంస్కారం.అది ప్రకృతి. దానికి తగినట్లుగానే ప్రతీ జంతువూ, జ్ఞానవంతుడు కూడ;మూర్ఖుని మాట చెప్పాలా?అందువల్ల భూతాలు తమ ప్రకృతినే పొందుతాయి.నేను గాని మరెవరైనా గాని చేసే నిగ్రహం(వాళ్లని ఆపాలనే ప్రయత్నం) ఏమి చేస్తుంది?(ధర్మాధర్మాలవల్ల కలిగే సంస్కారాలు.వాటి పరిణామాలు మొదలైన విషయాలను గూర్చి అస్మదీయపాతంజలయోగసూత్రాంధ్రవ్యాఖ్య బాలానందినిలో చూడవచ్చును. సాధనపాదం సూ.13-15) 33

భాష్యమ్

యది సర్వః జన్తుః ఆత్మనః ప్రకృతిసదృశమేవ చేష్టతే-న చ ప్రకృతిశూన్యః కశ్చిదస్తి,తతః పురుషకారస్య విషయానుపపత్తేః శాస్త్రానర్థక్యప్రాప్తౌ ఇదమ్ ఉచ్యతే-

మూ. ఇన్ద్రియస్యేన్ద్రియస్యార్థే రాగద్వేషౌ వ్యవస్థితౌ,
తయోర్న వశమాగచ్ఛేత్తౌ హ్యస్య పరిపన్థినౌ. 34

బాలానందిని

యదీతి:- ప్రతీ జన్తువూ తన ప్రకృతినే అనుసరించి ప్రవర్తిస్తే, ప్రకృతి లేనివాడంటూ ఎవడూ ఉండడు కూడ,అప్పుడు పురుషకారానికి (పురుషప్రయత్నం ద్వారా మంచి మార్గంలో ప్రవర్తించడానికి)విషయమే(అవకాశమే)ఉండదు.గాన(మంచి చెడ్డలను బోధించే) శాస్త్రం వ్యర్థం అని చెప్పవలసి వస్తుంది కదా అను ఆశంక కలుగుతుంది.అందుకు సమాధానంగా ఇది చెప్పబడుచున్నది.

ప్ర.అ.ఇన్ద్రియస్యేతి:- ఇన్ద్రియస్య ఇన్ద్రియస్య = ప్రతీ ఇంద్రియముయొక్క, అర్థే= విషయమునందు, రాగద్వేషౌ = రాగద్వేషములు, వ్యవస్థితౌ = నిలచి ఉన్నవి. తయోః = ఆ రెండింటియొక్క, వశమ్ = వశమును, న ఆగచ్ఛేత్ = పొందగూడదు; తౌ = ఆ రెండూ, అస్య = ఈ పురుషునియొక్క, పరపన్థినౌ హి= విఘ్నమును చేసేవి కదా?

భాష్యమ్

ఇన్ద్రియస్యేతి:- ఇన్ద్రియస్య ఇన్ద్రియస్య అర్థే సర్వేన్ద్రియాణామ్ అర్థే శబ్దాదివిషయే, ఇష్టే రాగః అనిష్టే ద్వేషః ఇత్యేవం ప్రతీన్ద్రియార్థం రాగద్వేషౌ అవశ్యంభావినౌ, తత్ర అయం పురుషకారస్య శాస్త్రార్థస్య చ విషయః ఉచ్యతే-శాస్త్రార్థే ప్రవృత్తః పూర్వమేవ రాగద్వేషయోః వశం న ఆగచ్ఛేత్-యా హి పురుషస్య ప్రకృతిః సా రాగద్వేషపురః స్సరైవ స్వకార్యే పురుషం ప్రవర్తయతి.తదా స్వధర్మపరిత్యాగః పరధర్మానుష్ఠానం చ భవతి.యదా పునః రాగాద్వేషౌ తత్ప్రతిపక్షేణ నియమయతి తదా శాస్త్రదృష్టిః ఏవ

భవతి న ప్రకృతివశః. తస్మాత్ తయోః రాగద్వేషయోః వశం న గచ్ఛేత్. యతః తౌ హి అస్య పురుషస్య పరిపన్థినౌ శ్రేయోమార్గస్య విఘ్నకర్తారౌ తస్కరౌ ఇవ ఇత్యర్థః. 34

బాలానందిని

ఇన్ద్రియస్యేతి:– అన్ని ఇంద్రియాల విషయా లైన శబ్దాదికమునందు, ఇష్టమైనదాని యందు ఆసక్తి, అనిష్టమైనదానియందు ద్వేషము అని ఈ విధంగా ప్రతీ ఇంద్రియార్థాల విషయంలోను రాగద్వేషాలు తప్పక కలుగుతూంటాయి. అలాంటప్పుడు పురుషకారానికి (పురుషప్రయత్నానికి) శాస్త్రార్థానికీ విషయంగా ఇది చెప్పబడుచున్నది–శాస్త్రార్థంలో ప్రవర్తించే వాడు రాగద్వేషాలకు వశుడు కాకుండా ముందుగానే జాగర్త పడాలి. పురుషుని ప్రకృతి రాగద్వేషపురఃసరంగానే (రాగద్వేషాల సాహాయ్యంతో మాత్రమే) పురుషుణ్ణి తన (ప్రకృతియొక్క) కార్యంలో ప్రవర్తించే టట్లు చేస్తుంది. అప్పుడు స్వధర్మాన్ని విడిచిపెట్టడం పరధర్మాన్ని అనుష్ఠించడం అనేవి జరుగుతాయి. కాని ఎప్పుడైతే రాగద్వేషాలను వాటికి విరుద్ధమైన దానిచేత (అనగా వివేకవిజ్ఞానంచేత) నియమిస్తాడో (అణగద్రొక్కుతాడో) అప్పుడు పురుషుడు శాస్త్రదృష్టికలవాడే అవుతాడు గాని ప్రకృతికి వశుడు కాడు. అందువల్ల ఆ రాగద్వేషాలకు వశుడు కాగూడదు. ఎందువల్ల ననగా అవి ఈ పురుషునికి శ్రేయోమార్గంలో, దారిదొంగల వలె, విఘ్నం కలిగిస్తాయి అని అర్థం. 34

భాష్యమ్

తత్ర రాగద్వేషయుక్తః మన్యతే శాస్త్రార్థమపి అన్యథా పరధర్మోఽపి ధర్మత్వాత్ అనుష్ఠేయః ఏవ ఇతి. తత్ అసత్ –

మూ. శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మాత్ స్వనుష్ఠితాత్,
స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః. 35

బాలానందిని

తత్రేతి:– లోకంలో రాగద్వేషాలచేత ప్రేరేపింపబడినవాడు– "పరధర్మం కూడా ధర్మమే గాన దానిని నేను అనుష్ఠించవచ్చును" అని శాస్త్రార్థాన్ని కూడ మరొక విధంగా, (విరుద్ధరీతిలో) తలుస్తాడు. అది మంచిది కాదు.

ప్ర. అ. **శ్రేయానితి:–** స్వనుష్ఠితాత్ = పరిపూర్ణంగా చక్కగా అనుష్ఠించబడిన, పరధర్మాత్ = పరధర్మకంటె, విగుణః = అనుష్ఠానంలో కొన్ని లోపా లున్నా కూడ, స్వధర్మః = స్వధర్మం, శ్రేయాన్ = ఎక్కువ శ్లాఘించదగినది. స్వధర్మే = స్వధర్మమునందు, నిధనమ్ = మరణం కూడ, శ్రేయః = మంచిది. పరధర్మః = పరధర్మం, భయావహః = భయం కలిగిస్తుంది.

భాష్యమ్

శ్రేయానితి:- శ్రేయాన్ ప్రశస్యతరః, స్వః ధర్మః స్వధర్మః, విగుణః అపి అనుష్ఠీయమానః, పరధర్మాత్ స్వనుష్ఠితాత్ సాద్గుణ్యేన సంపాదితాదపి;స్వధర్మే స్థితస్య నిధనం మరణమపి శ్రేయః పరధర్మే స్థితస్య జీవితాత్. కస్మాత్?పరధర్మః భయావహః నరకాదిలక్షణం భయమ్ ఆవహతి యతః. 35

బాలానందిని

శ్రేయానితి:- స్వః = తనదైన,ధర్మం, విగుణః అపి = గుణాలు లేనిదిగా (కొన్ని లోపాలతో) అనుష్ఠింపబడుచున్నా కూడ, శ్రేయాన్ = ఎక్కువ ప్రశస్త మైనది. పరధర్మం మంచి గుణాలతో(ఏ లోపాలూ లేకుండా)అనుష్ఠింపబడినా కూడ దానికంటె (స్వధర్మం అధిక ప్రశస్తమైనది).పరధర్మంలో ఉన్నవాడు జీవించి ఉండడంకంటె స్వధర్మంలో ఉన్నవాడు మరణించడం కూడ శ్రేయస్కరమే.ఎందువల్ల?ఎందువల్ల ననగా-పరధర్మం భయం కలిగిస్తుంది; నరకాదిరూప మైన భయాన్ని కలిగిస్తుంది. 35

భాష్యమ్

యద్యపి అనర్థమూలమ్ "ధ్యాయతో విషయాన్ పుంసః"(2.621)ఇతి, "రాగ ద్వేషౌ హ్యస్య పరిపన్థినౌ"(3.34)ఇతి చ ఉక్తమ్;విక్షిప్తమ్ అనవధారితం చ తదుక్తమ్; తత్ సంక్షిప్తం నిశ్చితం చ ఇదమ్ ఏవ ఇతి జ్ఞాతుమ్ ఇచ్ఛన్ అర్జునః ఉవాచ; జ్ఞాతే హి తస్మిన్ తదుచ్ఛేదాయ యత్నం కుర్యామ్ ఇతి-

అర్జున ఉవాచ -

మూ. అథ కేన ప్రయుక్తోఽయం పాపం చరతి పూరుషః,
అనిచ్ఛన్నపి వార్ష్ణేయ బలాదివ నియోజితః. 36

బాలానందిని

యద్యపీతి:- "ధ్యాయతో విషయాన్ పుంసః"అనీ, "రాగద్వేషౌ అస్య పరిపన్థినౌ"అనీ అనర్థానికి ఏది మూలమో అది(వెనుక) చెప్పబడినది.అయినా కూడ అది విక్షిప్తం గాను (వేరు వేరు ప్రదేశాలలోనూ) అనిశ్చితంగాను(అనర్థానికిమూలం ఇదే అనే నిశ్చయం లేకుండాను) చెప్పబడింది. అందుచేత అది ఇదే అని సంక్షిప్తరూపంలో(ఒకే చోట) నిశ్చితంగా తెలుసుకోవా లని కోరుతూ అర్జునుడు ప్రశ్నించాడు. అదేదో (స్పష్టంగా నిశ్చితంగా) తెలిస్తే దానిని పెకి లించివేయడానికి ప్రయత్నం చేస్తాను అని ఆతని అభిప్రాయం -

అర్జును డిలా అన్నాడు-

ప్ర.అ.అథేతి:- అథ = మరి, వార్‌ష్ణేయ = వృష్ణివంశంలో పుట్టిన శ్రీకృష్ణా! అయమ్ = ఈ, పూరుషః = పురుషుడు, అనిచ్ఛన్ అపి = ఇష్టపడకున్నా కూడ, బలాత్ = బలాత్కారంగా, నియోజితః ఇవ = ఆజ్ఞాపించబడ్డాడా అన్నట్లు, కేన = ఎవనిచేత(దేనిచేత), ప్రయుక్తః = ప్రేరేపింపబడినవాడై, పాపమ్ = పాపాన్ని, చరతి = ఆచరిస్తున్నాడు?

భాష్యమ్

అథేతి:- అథ కేన హేతుభూతేన ప్రయుక్తః సన్,రాజ్ఞేవ భృత్యః, అయం పాపం కర్మ,చరతి ఆచరతి,పురుషః,స్వయమ్-అనిచ్ఛన్ అపి,హే వార్‌ష్ణేయ వృష్ణికుల ప్రసూత, బలాదివ నియోజితః,రాజ్ఞా ఇవ ఇతి ఉక్తః దృష్టాన్తః. 36

బాలానందిని

అథేతి:- మరి,హేతు వైన దేనిచేత,రాజుచేత భృత్యుడు వలె,ప్రేరేపింపబబడినవాడై పురుషుడు,తాను ఇష్టపడకపోయినా కూడ,పాపకర్మను ఆచరిస్తున్నాడు?వృష్ణివంశంలో పుట్టిన ఓ!కృష్ణా!. బలాత్కారంగా రాజుచేత ఆజ్ఞాపించబడినవాడు వలె అని దృష్టాంతం చూపబడినది. 36

భాష్యమ్

శృణు త్వం, తం వైరిణం సర్వానర్థకరం, యం త్వం పృచ్ఛసి-

శ్రీభగవానువాచ-

"ఐశ్వర్యస్య సమగ్రస్య ధర్మస్య యశసః శ్రియః,
వైరాగ్యస్యాథ మోక్షస్య షణ్ణాం భగ ఇతీఙ్గ(ర)నా"(వి.పు.6.5.74)

ఐశ్వర్యాదిషట్కం యస్మిన్ వాసుదేవే నిత్యమ్ అప్రతిబద్ధత్వేన సామస్త్యేన చ వర్తతే,

"ఉత్పత్తిం ప్రలయం చైవ భూతానామాగతిం గతిమ్,
వేత్తి విద్యామవిద్యాం చ స వాచ్యో భగవానితి" (వి.పు.6.5.78)

ఉత్పత్త్యాదివిషయం చ విజ్ఞానం యస్య సః వాసుదేవః వాచ్యః భగవాన్ ఇతి.

మూ. కామ ఏష క్రోధ ఏష రజోగుణసముద్భవః,
మహాశనో మహాపాప్మా విద్ధ్యేనమిహ వైరిణమ్. 37

బాలానందిని

శృణ్వితి:- నీవు సర్వానర్థాలను కలిగించే ఏ శత్రువును గూర్చి ప్రశ్నిస్తున్నావో దానిని గూర్చి(చెపుతున్నాను)విను.శ్రీభగవంతు డిట్లన్నాడు.(సమగ్రస్య=పరిపూర్ణ మైన. ఇది

'ఐశ్వర్యస్య'ఇత్యాదు లన్నింటికీ విశేషణంగా అన్వయిస్తుంది)"పరిపూర్ణమైన ఐశ్వర్యానికి(నియమన శక్తికి),ధర్మానికి,యశస్సుకు,లక్ష్మికి,వైరాగ్యానికి,మోక్షానికి(మోక్షసాధనాలకి)-ఈ ఆరింటికీ 'భగం'అని పేరు."ఈ ఐశ్వర్యాదులు ఆరూ కూడ ఎల్లప్పుడు, ఎట్టి ప్రతిబంధకమూ లేకుండా,పరిపూర్ణంగా ఏ వాసుదేవునియ దుంటాయో,"భూతాల పుట్టుకను, ప్రలయాన్ని, రాకను, పోకను, విద్యను, అవిద్యను ఎవడు తెలుసుకొనకలుగుతాడో వానినే 'భగవాన్' అనలి". ఉత్పత్త్యాదులకు సంబంధించిన విజ్ఞానం ఏ వాసుదేవునకు ఉన్నదో అతనినే 'భగవాన్' అనాలి(ఆ భగవంతు డిలా అన్నాడు)-

ప్ర.అ. కామ ఇతి:- ఏషః = ఇది, రజోగుణసముద్భవః = రజోగుణంనుండి పుట్టిన, కామః = కామం (కోరిక); ఏషః = ఇది, రజోగుణసముద్భవమైన, క్రోధః = క్రోధం. ఇది, మహాశనః= అత్యధికమైన ఆహారం కలది.మహాపాప్మా = చాలా పాపము గలది. ఏనమ్ = దీనిని, ఇహ = ఇక్కడ, వైరిణమ్ = శత్రువునుగా, విద్ధి = తెలుసుకొనుము.

భాష్యమ్

కామ ఇతి :-కామః ఏషః సర్వలోకశత్రుః, యన్నిమిత్తా సర్వానర్థప్రాప్తిః ప్రాణినామ్.సః ఏషః కామః ప్రతిహతః కేనచిత్ క్రోధత్వేన పరిణమతే.అతః క్రోధః అపి ఏష ఏవ.రజోగుణసముద్భవః-రజః చ తత్ గుణశ్చ సః రజోగుణః;సః సముద్భవః యస్య సః కామః రజోగుణసముద్భవః.రజోగుణస్య వా సముద్భవః కామః హి ఉద్భూతః రజః ప్రవర్తయన్ పురుషం ప్రవర్తయతి."తృష్ణయా హి అహం కారితః" ఇతి దుఃఖితానాం రజఃకార్యే సేవాదౌ ప్రవృత్తానాం ప్రలాపః శ్రూయతే.మహాశనః -మహత్ అశనమ్ అస్య ఇతి మహాశనః. అతః ఏవ మహాపాప్మా. కామేన హి ప్రేరితః జన్తుః పాపం కరోతి. అతః విద్ధి ఏనం కామమ్ ఇహ సంసారే వైరిణమ్. 37

బాలానందిని

కామః ఇతి:- ఈ కామమే సమస్తలోకానికీ శత్రువు.ఈ కామాన్నే నిమిత్తంగా చేసుకొని ప్రాణులకు అన్ని అనర్థాలూ వచ్చి పడుతూంటాయి.ఈ కామమే దేనిచైతనైనా (ఎవరిచేతనైనా) అడ్డుకొనబడి నప్పుడు క్రోధంగా మారుతుంది.అందుచేత క్రోధం కూడ కామమే(కామం యొక్క రూపాంతరమే).రజోగుణసముద్భవః-రజస్సు అనే గుణం రజోగుణం.అది ఏ కామానికి ఉత్పత్తిస్థానమో (ఏ కామం రజోగుణంనుండి పుడుతుందో)అది రజోగుణ సముద్భవం.లేదా (కామమే)రజోగుణానికి ఉత్పత్తిస్థానం.(కామంనుండే రజోగుణం పుడుతుంది).ఎందువల్ల ననగా కామం పుట్టగానే అది రజోగుణాన్ని ప్రవర్తింపజేసి పురుషుడు

ఆ యా పనులు చేసే టట్లు చేస్తుంది. రజోగుణకార్య మైన సేవాదులలో ప్రవర్తించినవాళ్లు "దురాశయే నాచేత ఈ పని చేయించింది"అని ప్రలపిస్తూండగా వింటూంటాం కదా? గొప్ప ఆహారం కలది. (దీని ఆకలి ఎంతతిన్నా తీరదు). అందుచేతనే చాలా పాపస్వభావ మైనది. మానవుడు కామంచేత ప్రేరితుడై నప్పుడే పాపం చేస్తాడు కదా? అందువల్ల ఈ సంసారంలో ఉన్న శత్రువు కామమే అని తెలుసుకొనుము. 37

భాష్యమ్

కథం వైరీ ఇతి దృష్టాన్తైః ప్రత్యాయయతి:-

మూ. ధూమేనావ్రియతే వహ్నిర్యథాఽఽదర్శో మలేన చ,
యథోల్బేనావృతో గర్భస్తథా తేనేదమావృతమ్. 38

బాలానందిని

కథమితి:- ఇది ఏ విధంగా శత్రువు అనే విషయాన్ని దృష్టాంతాలచేత తెలియ పరుస్తున్నాడు.

ప్ర.అ. ధూమేనేతి:- వహ్నిః = అగ్ని, యథా = ఏ విధంగా, ధూమేన = ధూమంచేత, ఆవ్రియతే = ఆవరించబడుతుందో, ఆదర్శః = అద్దము, మలేన చ = పరాగాదికంచేత కప్ప బడుతుందో, గర్భః = గర్భము, ఉల్బేన = మావిచేత, యథా = ఏవిధంగా, ఆవృతః = కప్పబడిందో, తథా = ఆ విధంగా, తేన = ఆ కామంచేత, ఇదమ్ = ఇది (జ్ఞానం), ఆవృతమ్ = కప్పబడింది.

భాష్యమ్

ధూమేనేతి:- ధూమేన సహజేన ఆవ్రియతే వహ్నిః ప్రకాశాత్మకః, అప్రకాశాత్మ కేన, యథా వా ఆదర్శః మలేన చ, యథా ఉల్బేన గర్భవేష్టనేన జరాయుణా, ఆవృతః ఆచ్ఛాదితః, గర్భః తథా తేన ఇదమ్ ఆవృతమ్. 38

బాలానందిని

ధూమేనేతి:- అగ్నిలో సహజంగా ఉండే, ప్రకాశాత్మకం కాని(నల్లని)ధూమంచేత ప్రకాశస్వభావం గల అగ్ని ఏ విధంగా కప్పివేయబడుతుందో, అద్దం ధూళిచేత ఏ విధంగా కప్పబడుతుందో, గర్భం చుట్టూ ఉండే మావిచేత గర్భం ఏ విధంగా కప్పబడుతుందో అదే విధంగా కామంచేత ఇది కప్పబడుచున్నది. 38

భాష్యమ్

కిం పునః తత్ ఇదం శబ్దవాచ్యం యత్ కామేన ఆవృతమ్ ఇతి; ఉచ్యతే-

మూ అవృతం జ్ఞానమేతేన జ్ఞానినో నిత్యవైరిణా,
కామరూపేణ కౌన్తేయ దుష్పూరేణానలేన చ. 39

బాలానందిని

కిమితి:- కామంచేత కప్పబడే ఆ 'ఇది'ఏది? చెప్పబడుచున్నది-

ప్ర.అ. అవృతమితి:- కౌన్తేయ = అర్జునా ! జ్ఞానినః = జ్ఞానవంతునకు, నిత్య వైరిణా = నిత్యశత్రువు, దుష్పూరేణ = నింప శక్యం కానిది,అనలేన చ "ఇంక చాలును" అనే మాట లేనిది, కామరూపేణ = ఇచ్ఛ అనే రూపం గలదీ అయిన, ఏతేన = దీనిచేత (కామంచేత), జ్ఞానమ్ = జ్ఞానము, అవృతమ్ = కప్పబడినది.

భాష్యమ్

అవృతమితి:- ఆవృతమ్ ఏతేన జ్ఞానం, జ్ఞానినః నిత్యవైరిణా. జ్ఞానీ హి జానాతి అనేన అహమ్ అనర్థే ప్రయుక్తః ఇతి పూర్వమేవ, దుఃఖీ చ భవతి నిత్యమేవ, అతః అసౌ జ్ఞానినః నిత్యవైరీ న తు మూర్ఖస్య. స హి కామం తృష్ణాకాలే మిత్రమివ పశ్యన్ తత్కార్యే దుఃఖే ప్రాప్తే జానాతి తృష్ణయా అహం దుఃఖిత్వమ్ ఆపాదితః ఇతి, న పూర్వమేవ. అతః జ్ఞానినః ఏవ నిత్యవైరీ. కింరూపేణ? కామరూపేణ –కామః ఇచ్ఛైవ రూపమ్ అస్యేతి కామరూపః, తేన కామరూపేణ. దుష్పూరేణ-దుఃఖేన పూరణమ్ అస్య ఇతి దుష్పూరః, తేన.అనలేన-న అస్య అలం పర్యాప్తిః,విద్యతే ఇతి అనలః .తేన. 39

బాలానందిని

అవృతమితి:- జ్ఞానికి నిత్యశత్రు వైన దీనిచేత జ్ఞానం కప్పివేయబడుతుంది."ఈ కామం నన్ను అనర్థంలో ప్రవర్తింపచేస్తూన్నది." అని జ్ఞానికి ముందుగానే తెలియును. అందుచేత నిత్యమూ దుఃఖపడుతూంటాడు.అందువల్ల ఇది జ్ఞానికే నిత్యవైరి కాని మూర్ఖునికి నిత్యవైరి కాదు.ఎందువల్ల ననగా–ఆశ కలిగిన సమయంలో మూర్ఖునికి కామం మిత్రుడు వలె కనబడుతుంది. ఆ కామంవల్ల చివరికి ఏదైనా దుఃఖం కలిగిన తరువాతనే అతడు ఈ కామంచేత నేను కష్టాలలో చిక్కుకొన్నాను అని తెలుసుకొంటాడు కాని అంతకుపూర్వం తెలుసుకొనడు.అందుచేత ఇది జ్ఞానికే నిత్యవైరి.ఏ రూపం గలది?కామరూప మైనది. కామం అనగా ఇచ్ఛ(కోరిక).అదే దీని రూపం గాన ఇది కామరూపం.దీనిని నింపడం చాలా కష్టం.అందుచేత ఇది దుష్పూరం. దీనికి అలం,అనగా చాలును అనే మాట,లేదు. అందుచేత ఇది అనలం. 39

చాలా కష్టం.అందుచేత ఇది దుష్పూరం. దీనికి అలం,అనగా చాలును అనే మాట,లేదు. అందుచేత ఇది అనలం. 39

భాష్యమ్

కిమధిష్ఠానః పునః కామః జ్ఞానస్య ఆవరణత్వేన వైరీ సర్వస్య ఇతి అపేక్షాయామ్ ఆహ. జ్ఞాతే హి శత్రోః అధిష్ఠానే సుఖేన శత్రునిబర్హణం కర్తుం శక్యతే ఇతి-

మూ. ఇన్ద్రియాణి మనో బుద్ధిరస్యాధిష్ఠానముచ్యతే,
ఏతైర్విమోహయత్యేష జ్ఞానమావృత్య దేహినమ్. 40

బాలానందిని

కిమితి:- ఈ కామం దేనిని నివాసస్థానంగా చేసికొని,జ్ఞానాన్ని కప్పివేస్తూ అందిరికీ శత్రువుగా ఉంటూన్నది అని ప్రశ్న కలుగగా చెపుతున్నాడు.ఎందువల్ల ననగా శత్రువు ఉండే స్థానం తెలిస్తే వానిని అనాయాసంగా నశింపచేయడానికి శక్యం అవుతుంది.

ప్ర.అ. **ఇన్ద్రియాణీతి:-** ఇన్ద్రియాణి = ఇంద్రియాలు, మనః = మనస్సు, బుద్ధిః= బుద్ధి, అస్య = దీనియొక్క, అధిష్ఠానమ్ = నివాసస్థానంగా, ఉచ్యతే = చెప్పబడుచున్నది. ఏషః = ఇది, ఏతైః = ఈ నివాసస్థానాలచేత(లో ఉంటూ), జ్ఞానమ్ = జ్ఞానాన్ని, ఆవృత్య = కప్పివేసి, దేహినమ్ = మానవుణ్ణి, విమోహయతి = మోహంచెందే టట్లు చేస్తూన్నది.

భాష్యమ్

ఇన్ద్రియాణీతి:- ఇన్ద్రియాణి,మనః బుద్ధిః చ అస్య కామస్య,అధిష్ఠానమ్ ఆశ్రయః ఉచ్యతే.ఏతైః ఇన్ద్రియాదిభిః ఆశ్రయైః,విమోహయతి వివిధం మోహయతి,ఏషః కామః జ్ఞానమ్, ఆవృత్య అచ్ఛాద్య, దేహినం శరీరిణమ్. 40

బాలానందిని

ఇన్ద్రియాణీతి:- ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి ఇవి కామానికి అధిష్ఠానం అని, ఆశ్రయం అని,చెప్పబడుచున్నది.ఇంద్రియాదు లైన ఈ ఆశ్రయాలచేత,కామం,జ్ఞానాన్ని కప్పివేసి,పురుషుణ్ణి అనేకవిధాల మోహపెడుతూ ఉంటుంది. 40

భాష్యమ్

యతః ఏవమ్ -

మూ. తస్మాత్త్వమిన్ద్రియాణ్యాదౌ నియమ్య భరతర్షభ,
పాప్మానం ప్రజహిహ్యేనం జ్ఞానవిజ్ఞాననాశనమ్. 41

బాలానందిని

యత ఇతి:- ఇదీ పరిస్థితి కాబట్టి -

ప్ర.అ. **తస్మాదితి**:- భరతర్షభ = భరతవంశీయులలో శ్రేష్ఠుడా ! తస్మాత్ = అందువల్ల, త్వమ్ = నువ్వు ఆదౌ = ముందుగా, ఇన్ద్రియాణి = ఇంద్రియాలను, నియమ్య = వశంలో ఉంచుకొని, పాప్మానమ్ = పాపస్వభావం గలది, జ్ఞానవిజ్ఞాననాశనమ్ = జ్ఞానవిజ్ఞాలను నశింపచేసేదీ అయిన, ఏనమ్ = దీనిని, ప్రజహిహి = విడిచిపెట్టుము.

భాష్యమ్

తస్మాదితి:- తస్మాత్, త్వమ్,ఇన్ద్రియాణి,ఆదౌ పూర్వం, నియమ్య వశీకృత్య, భరతర్షభ, పాప్మానం పాపాచారం, కామం,ప్రజహిహి పరిత్యజ.ఏనం ప్రకృతం వైరిణం, జ్ఞానవిజ్ఞాననాశనమ్-జ్ఞానం శాస్త్రతః ఆచార్యతః చ ఆత్మాదీనామ్ అవబోధః.విజ్ఞానం విశేషతః తదనుభవః,తయోః జ్ఞానవిజ్ఞానయోః శ్రేయఃప్రాప్తిహేత్వోః నాశనం,ప్రజహిహి ఆత్మనః పరిత్యజ ఇత్యర్థః. 41

బాలానందిని

తస్మాదితి:- అందువల్ల, ఓ! అర్జునా! నువ్వు ముందుగా ఇంద్రియాలను వశంలో ఉంచుకొని పాపాచారం గల కామాన్ని విడిచిపెట్టుము.శాస్త్రంవల్ల ఆచార్యునివల్ల ఆత్మాదులను తెలుసుకొనడం జ్ఞానం.ఆ జ్ఞానాన్ని విశేషించి అనుభవంలోనికి తెచ్చుకొనడం విజ్ఞానం. శ్రేయఃప్రాప్తికి హేతువు లైన ఈ జ్ఞానవిజ్ఞానాలను రెండింటినీ నశింపచేసే ఈ శత్రువును, ప్రస్తుతం మనం దేనిని గూర్చి మాటలాడుకొంటున్నామో అట్టి కామం అనే శత్రువును, విడిచిపెట్టుము.నీనుండి దూరం చేయుము అని అర్థం.(లేదా 'ఆత్మనః'కు "జ్ఞానవిజ్ఞానయోః"తో అన్వయం. 'తన జ్ఞానవిజ్ఞానలను నశింపచేసే'అని అర్థం) 41

భాష్యమ్

ఇన్ద్రియాణి ఆదౌ నియమ్య కామం శత్రుం జహిహి ఇతి ఉక్తమ్.తత్ర కిమాశ్రయః కామం జహ్యాత్ ఇతి-ఉచ్యతే-

మూ. ఇన్ద్రియాణి పరాణ్యాహురిన్ద్రియేభ్యః పరం మనః,
మనసస్తు పరా బుద్ధిర్యో బుద్ధేః పరతస్తు సః. 42

బాలానందిని

ఇన్ద్రియాణీతి:- ముందుగా ఇంద్రియాలను నిగ్రహించి శత్రువైన కామాన్ని విడచి పెట్టుము అని చెప్పబడింది. ఐతే-దేనిని ఆశ్రయించి కామాన్ని విడవాలి? సమాధానం చెప్ప బడుచున్నది-

ప్ర.అ. ఇన్ద్రియాణీతి:- ఇన్ద్రియాణి = ఇంద్రియాలను, పరాణి ఉత్కృష్టమైన వాటినిగా, ఆహుః = చెప్పుచున్నారు. మనః = మనస్సు, ఇన్ద్రియేభ్యః = ఇంద్రియాలకంటె, పరమ్ = ఉత్కృష్ట మైనది. బుద్ధిః తు = బుద్ధి యైతే, మనసః = మనస్సుకంటె, పరా = ఉత్కృష్టమైనది. యః తు = ఏ దైతే, బుద్ధేః = బుద్ధికంటె, పరః = పరమైనదో, సః అది ఆత్మ.

భాష్యమ్

ఇన్ద్రియాణీతి:- ఇన్ద్రియాణి శ్రోత్రాదీని పఞ్చ దేహం స్థూలం బాహ్యం పరిచ్ఛిన్నం చ అపేక్ష్య. సౌక్ష్మ్యాన్తరస్థత్వవ్యాపిత్వాది అపేక్ష్య, పరాణి ప్రకృష్టాని ఆహుః పణ్డితాః. తథా ఇన్ద్రియేభ్యః పరం మనః సంకల్పవికల్పాత్మకమ్. తథా మనసః తు పరా బుద్ధిః నిశ్చయాత్మికా. తథా యః సర్వదృశ్యేభ్యః బుద్ధ్యన్తేభ్యః అభ్యన్తరః, యం దేహినమ్ ఇన్ద్రియాదిభిః ఆశ్రయైః యుక్తః కామః జ్ఞానావరణద్వారేణ మోహయతి ఇతి ఉక్తం సః బుద్ధేః, ద్రష్టా పరః ఆత్మా. 42

బాలానందిని

ఇన్ద్రియాణీతి:- స్థూలమూ, బైట ఉన్నది, పరిచ్ఛిన్నప్రమాణం కలదీ అయిన దేహాన్ని అపేక్షించి, అనగా దేహంకంటె, శ్రోత్రాదిపంచేంద్రియాలు, వాటి కున్న సూక్ష్మత్వమూ, లోపల ఉండడము, వ్యాపించడం అనే ధర్మాలను అపేక్షించి(ఆ ధర్మాలను పట్టి) ప్రకృష్ట మైనవి అని పండితులు చెపుతున్నారు. అట్లే సంకల్పవికల్పాత్మక మైన మనస్సు ఇంద్రియాల కంటె పరమైనది. అట్లే నిశ్చయాత్మక మైన బుద్ధి మనస్సుకంటె పర మైనది. అట్లే ఏదైతే దృశ్యము లైన బుద్ధివరకూ ఉన్న అన్ని పదార్థాలకంటె లోపల ఉంటుందో, జీవరూపంలో ఉన్న దేనిని ఇంద్రియాదులైన ఆశ్రయములతో కూడిన కామం జ్ఞానాన్ని కప్పివేయడం ద్వారా మోహపెడుతుంది అని చెప్పబడిందో అట్టి; ద్రష్టయైన ఆత్మ బుద్ధికంటె పర మైనది.

భా.అ.ప్ర.:- బుద్ధికంటె పర మైనది కామం అని శ్రీరామానుజాచార్యుల వ్యాఖ్య సారరహిత మైనది.

"ఇన్ద్రియేభ్యః పరా హ్యర్థా అర్థేభ్యశ్చ పరం మనః,
మనసస్తు పరా బుద్ధిర్బుద్ధేరాత్మా మహాన్ పరః,

మహతః పరమవ్యక్తమవ్యక్తాత్పురుషః పరః,
పురుషాన్న పరం కించిత్సా కాష్ఠా సా పరా గతిః"

అని కఠోపనిషత్తులో చెప్పబడిన విషయమే ఇక్కడ చెప్పడానికి ఉద్దిష్ట మైనది. ("ఇంద్రియాల కంటె విషయాలు పర మైనవి,వాటికంటె మనస్సు,దానికంటె బుద్ధి,దానికంటె మహత్తత్త్వం, దానికంటె అవ్యక్తం పర మైనవి.దానికంటె పరమైనవాడు పురుషుడు.పురుషునికంటె పర మైనది ఏదీ లేదు"అని పై శ్రుతివాక్యాలకు అర్థం).

ఉపనిషత్తులో చెప్పినదే ఇక్కడ చెప్పడానికి ఉద్దేశిస్తే దానిలో చెప్పిన అర్థ–మహత్–అవ్యక్తాలను ఇక్కడ చెప్పలేదు కదా అన్ని ప్రశ్నించవచ్చును.ఉపలక్షణచేత వాటిని కూడ ఇక్కడ చెప్పినట్లు గ్రహించవచ్చు నని సమాధానం.నిజానికి గ్రాహ్యాలైన విషయాలకంటె గ్రాహకాలైన ఇంద్రియాలే పరమైన వని చెప్పడం యుక్తం.మహత్తత్త్వం అనేది లేదని సూత్రభాష్యంలో ప్రతిపాదించబడింది.మహత్తత్త్వం అనగా బుద్ధియే అని చెప్పబడింది. అవ్యక్తం అనగా అజ్ఞానం,మాయ. అది కూడ బుద్ధియే.మాయ అనగా సమస్తబుద్ధి సమష్టియే కదా? ఈ అభిప్రాయం చేతనే ఇక్కడ అర్థాదులను చెప్పలేదు.మరొక విషయం ఏమనగా–"కామః సంకల్పో విచికిత్సా" ఇత్యాదిశ్రుతి చెప్పి నట్లు కామాదులు మనోధర్మాలు.ఈ విషయం అందరూ అంగీకరించినదె కూడ.ఈ విధంగా మనోధర్మ మైన కామం మనస్సు కంటె పరమైన బుద్ధికంటె పరం ఎలా అవుతుంది?ఈ ఘట్టంలో పూర్వపూర్వ ధర్మి (ధర్మం కల పదార్థం) కంటె ఉత్తరోత్తరధర్మికి ఉత్కర్ష చెప్పబడుచున్నది. ఈ ఉత్కర్షకు కారణం ఆ యా ధర్మాలలో ఉన్న వేరు వేరు ధర్మాలు.ఇంద్రియాలకు సూక్ష్మత్వం–వ్యాపిత్వం మొదలైన ధర్మా లుండడంవల్ల కదా అవి దేహంకంటె ఉత్కృష్ట మైనవి అని చెప్పబడింది?అలాంటప్పుడు కామమే సర్వోత్కృష్టం అయిన పక్షంలో కామం అనే ధర్మం ఉండడంచేత మనస్సే బుద్ధికంటె పరమైనది అని చెప్పి ఉండాలి;అలా చెప్పలేదు.మరొక విషయం–కామం అనే ధర్మం మన స్సనే ధర్మికి అధీన మైనది.అది స్వతంత్రపదార్థం కాదు.అలాంటప్పుడు స్వతంత్రపదార్థాల తారతమ్యాన్ని గూర్చి చెప్పే సందర్భంలో అస్వతంత్రమైన ధర్మాన్ని గూర్చి చెప్పడం ఎలా కుదురుతుంది?

కామం బుద్ధికంటె పరం అనడానికి కారణం ఏ మనగా–బుద్ధివరకూ ఉన్న అన్నీ ఉపరతా లైనా కూడ(పనిచేయడం మానివేసినా కూడ)ఇచ్ఛ అని చెప్పబడే కామం కనక ఉన్నట్లయితే అదే ఈ ఇంద్రియాదులను తమ తమ విషయాలలో ప్రవర్తింపచేసి ఆత్మ జ్ఞానాన్ని నిరోధిస్తుంది అని అంటూ ఆయనే చెప్పిన ఉపపత్తి చాలా హాస్యాస్పద మైనది. బుద్ధి కూడ ఉపరమిస్తే ఇంక కామం ఎక్కడ పుడుతుంది?అప్పుడు కూడ కామం ఉంటే నిర్వికల్పసమాధియే లేకుండా పోతుంది.

"యదోపరామో మనసో నామరూపరూపస్య దృష్టస్మృతసంప్రమోషాత్,
య ఈయతే కేవలయా సంస్థయా హంసాయ తస్మై శుచిషద్మనే నమః"

అని అంటూ,వ్యాసుడు భాగవతంలో,మనస్సు ఉపరమించి నప్పుడు హంసస్ఫూర్తి కలుగుతుంది అని చెప్పి ఉన్నాడు.అది కుదరదు.నువ్వ చెప్పినదానిని పట్టి అప్పుడు కామమే ఆవిర్భవించాలి కదా?మరొక విషయం-ధర్మియైన మనస్సే ఉపరతం అయిన తరువాత ధర్మం ఎలా నిలిచి ఉంటుంది?అగ్ని శాంతించిన తరువాత దాహం నిలిచి ఉంటుందా?మనో బుద్ధిలు ఉపరతాలైన సుషుప్త్యవస్థలో నీకు కామం ఏమైన కలుగుతుందా-ఇలా చెప్పడానికి?

'ఇన్ద్రియాణి' ఇత్యాది శ్లోకంలో,ఆత్మను నాలుగు మోహంపచేస్తాయి అని చెప్పడం వల్ల ఈ శ్లోకంలో ఆ నాల్గింటినే గ్రహించడం యుక్తం అని వేదాంతదేశికులు చెప్పినది కూడ అయుక్తమే.కామం ఒక్కటే పురుషుణ్ణి మోహింపచేస్తుంది అనీ, ఇంద్రియాదులు కామానికి అధిష్ఠానము లనీ అక్కడ చెప్పబడింది. ఈ నాలుగూ మోహింపచేస్తాయి అని చెప్పబడలేదు.ఇంద్రియాదులను ఆశ్రయించని కామం గాని,కామంచేత ఆశ్రయించబడని ఇంద్రియాదులు గాని మోహింపచేయజాలవు కదా?ఇంద్రియాదులను ఆశ్రయించి ఉన్న కామమే మోహజనకం అని మూలంలో స్పష్టంగా చెప్పబడింది."ఏతైర్విమోహయత్యేషః" అనడంచేత ఇంద్రియాదులు కేవలం సాధనాలు మాత్రమే అని తెలుస్తూన్నది.మనోధర్మమైన కామానికి మనస్సు కరణం ఎలా అవుతుంది అను ప్రశ్నకు ధర్మమైన కామంలో కర్తృత్వం ఆరోపించడంచేత దానికి మనస్సు కరణం అని చెప్పబడింది అని సమాధానం. నిజానికి ఇంద్రియాదులు కామానికి కరణాలు కానే కావు;అవి కామానికి ఆశ్రయాలు. "ఇన్ద్రియాదిభిః ఆశ్రయైః"అనే భాష్యకారులు చెప్పి ఉన్నారు.ధర్మానికి ధర్మి ఆశ్రయం అవుతుంది కదా?మనోధర్మ మైన కామానికి ఇంద్రియాలు ఎలా ఆశ్రయం అవుతాయి అని ప్రశ్నకు సమాధానం ఏ మనగా మనస్సు ఇంద్రియాలతో సంబంధించినప్పుడు మనస్సు ద్వారా ఇంద్రియాలు కూడ కామానికి ఆశ్రయాలు అని చెప్పడం యుక్తమే.అట్లే మనోబుద్ధులు రెండూ ఒకే అంతఃకరణం కాబట్టి కామం బుద్ధ్యాశ్రితం అనడం కూడ యుక్తమే (భా.అ.ప్ర.పే.148) 42

మూ. ఏవం బుద్ధేః పరం బుద్ధ్వా సంస్తభ్యాత్మానమాత్మనా,
జహి శత్రుం మహాబాహో కామరూపం దురాసదమ్. 43

ఇతి శ్రీమహాభారతే శతసాహస్ర్యాం సంహితాయాం వైయాసిక్యాం
భీష్మపర్వణి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే
శ్రీకృష్ణార్జునసంవాదే కర్మయోగో నామ తృతీయోఽ ధ్యాయః.

ప్ర.అ. ఏవమితి:- మహాబాహో = గొప్ప బాహువులు కలవాడా! ఏవమ్ = ఈ విధంగా, బుద్ధేః = బుద్ధికంటె, పరమ్ = పరమైన ఆత్మను, బుద్ధ్వా = తెలుసుకొని, ఆత్మానమ్ = మనస్సును, ఆత్మనా = మనస్సు చేతనే, సంస్తభ్య = నిశ్చలంగా చేసికొని, దురాసదమ్ = పొంద శక్యం కాని(తెలియ శక్యం కాని), కామరూపమ్ = కామం అనే రూపం గల, శత్రుమ్ = శత్రువును, జహి = సంహరించుము.

భాష్యమ్

ఏవమితి:-ఏవం బుద్ధేః పరమ్ ఆత్మానం, బుద్ధ్వా జ్ఞాత్వా,సంస్తభ్య సమ్యక్ స్తంభనం కృత్వా, ఆత్మానం స్వేన ఏవ ఆత్మనా సంస్కృతేన మనసా సమ్యక్ సమాధాయ ఇత్యర్థః.జహి ఏనం శత్రుం,హే మహాబాహో,కామరూపం,దురాసదమ్- దుఃఖేన, ఆసదః ఆసాదనం ప్రాప్తిః, యస్య తం దురాసదమ్, దుర్విజ్ఞేయానేకవిశేషమ్ ఇతి. 43

ఇతి శ్రీమత్పరమహంసపరివ్రాజకాచార్యగోవిన్దభగవత్పూజ్య పాదశిష్యశ్రీమచ్ఛంకరభగవతః కృతౌ శ్రీమద్భగవద్గీతాభాష్యే కర్మప్రశంసాయోగో నామ తృతీయోఽధ్యాయః.

బాలానందిని

ఏవమితి:- ఈ విధంగా బుద్ధికంటె పరమైన ఆత్మను తెలుసుకొని(ఆత్మ బుద్ధికంటె పరమైన దని తెలుసుకొని), సంస్తభ్య= బాగుగా నిలబెట్టి, సంస్కరించబడిన తన మనస్సు చేతనే తన మనస్సును చక్కగా ఏకాగ్రంగా ఉండే టట్లు చేసి అని అర్థం. ఓ ! మహాబాహూ! కామరూప మైన ఈ శత్రువును ఉన్మూలించుము.దురాసదమ్-దేని ప్రాప్తి(తెలుసుకొనడం) అతికష్టంమీద జరుగుతుందో అట్టిది.కామం అనే ఈ శత్రువునకు ఎన్నెన్ని విశేషా లున్నాయో తెలుసుకొనడం కష్టం.(అట్టి దీనిని నిర్మూలించుము)

భా.అ.ప్ర.:- ఇక్కడ- "బుద్ధికంటె పరమైన కామమును"అను శ్రీరామానుజవ్యాఖ్య అయుక్త మైన దని వెనుకటి శ్లోకంలోనే ప్రతిపాదించబడింది.కామాన్ని జయించా లంటే కామం బుద్ధికంటె పర మైనది అని తెలుసుకొనడం అనావశ్యకం కదా?అలా ఉపదేశించిన భగవంతునికి కూడ అప్రామాణికత్వం ఈ మతంలో ప్రాప్తిస్తుంది.(భా.అ.ప్ర. పే. 149)43

బాలానందిని అను శ్రీమద్భగవద్గీతాశాంకరభాష్యాంధ్రవ్యాఖ్యా నంలో తృతీయాధ్యాయం సమాప్తం.

శ్రీవిక్రమనామసంవత్సరభాద్రపదకృష్ణచతుర్దశ్యాం జయవాసరే సమాప్తిమగమత్. 26.9.2000

అథ చతుర్థః అధ్యాయః

శ్రీ భగవాన్ ఉవాచ -

భాష్యమ్

యః అయం యోగః అధ్యాయద్వయేన ఉక్తః జ్ఞాననిష్ఠాలక్షణః సంన్యాసః కర్మయోగోపాయః,యస్మిన్ వేదార్థః పరిసమాప్తః ప్రవృత్తిలక్షణః నివృత్తిలక్షణశ్చ,గీతాసు చ సర్వాసు అయమేవ యోగః వివక్షితః భగవతా. అతః పరిసమాప్తం వేదార్థం మన్వానః తం వంశకథనేన స్తౌతి శ్రీభగవాన్-

మూ. ఇమం వివస్వతే యోగం ప్రోక్తవానహమవ్యయమ్,
వివస్వాన్మనవే ప్రాహ మనురిక్ష్వాకవేఽబ్రవీత్. 1

బాలానందిని

యోఽయమితి:- కర్మయోగం ఉపాయంగా కలది(కర్మయోగం ద్వారా సాధించ తగినది), సంన్యాసముతో కూడినది అయిన జ్ఞాననిష్ఠారూప మైన ఏ యోగం అధ్యాయ ద్వయంచేత(ద్వితీయతృతీయాధ్యాయాలలో)చెప్పబడినదో దానియందే ప్రవృత్తిరూపము, నివృత్తిరూపము అయిన వేదార్థం పరిసమాప్తం అయినది.భగవంతుడు గీతలలో కూడ ఈ యోగాన్నే చెప్పదలచాడు.అందువల్ల వేదప్రతిపాద్య మైన విషయం అంతా పరిసమాప్త మైనది(చెప్పడం పూర్తి అయినది)అని భావిస్తూ భగవంతుడు వంశాన్ని చెప్పడం ద్వారా దానిని (జ్ఞానయోగాన్ని)స్తుతిస్తున్నాడు.

వి. ప్రతిపాదింప వలసిన తత్వాన్ని ప్రతిపాదించి ఈ విద్య ఏ గురువుల ద్వారా ఏ శిష్యులకు సంక్రమించినదో చెపుతూ గురుశిష్యపరంపరారూపమైన సంప్రదాయాన్ని,విద్య చివర, వర్ణిస్తారు.ఇది బృహదారణ్యకోపనిషదాదుల చివర ఉన్నది.దీనిలో విద్యావంశం చెప్పబడుతుంది గాన దీనికి వంశకథనం అని పేరు.

ప్ర.అ. ఇమమితి :- అహమ్= నేను; అవ్యయమ్ = నాశరహిత మైన, ఇమం యోగమ్ = ఈ యోగమును, వివస్వతే = సూర్యునకు, ప్రోక్తవాన్ = చెప్పినాను. వివస్వాన్ = సూర్యుడు, మనవే = మనువునకు, ప్రాహ = చెప్పెను. మనుః = మనువు, ఇక్ష్వాకవే = ఇక్ష్వాకువునకు, అబ్రవీత్ = చెప్పెను.

భాష్యమ్

ఇమమ్ అధ్యాయద్వయేన ఉక్తం యోగం వివస్వతే ఆదిత్యాయ,సర్గాదౌ,ప్రోక్త వాన్ అహం జగత్పాలయితౄణాం క్షత్రియాణాం బలాధానాయ.తేన యోగబలేన

యుక్తాః సమర్థాః భవన్తి బ్రహ్మ రక్షితుమ్. బ్రహ్మక్షత్రే పరిపాలితే జగత్ పరిపాలయితుమ్ అలమ్. అవ్యయమ్ అవ్యయఫలత్వాత్. న హి అస్య సమ్యగ్దర్శననిష్ఠాలక్షణస్య మోక్షాఖ్యం ఫలం వ్యేతి. స చ వివస్వాన్ మనవే ప్రాహ. మనుః ఇక్ష్వాకవే స్వపుత్రాయ ఆదిరాజాయ అబ్రవీత్. 1

బాలానందిని

ఇమమితి:- అధ్యాయద్వయంలో చెప్పబడిన ఈ యోగాన్ని,నేను, సృష్టిప్రారంభంలో, జగత్తును పరిపాలించవలసి ఉన్న క్షత్రియులకు బలం చేకూర్చడం నిమిత్తం, ఆదిత్యునికి బోధించాను. ఈ యోగబలం ఉన్నట్లయితే క్షత్రియులు బ్రాహ్మణజాతిని రక్షించడానికి సమర్థులవుతారు. బ్రహ్మ-క్షత్రియజాతులను జాగర్తగా రక్షించుకుంటే ఇవి జగత్తును పాలించడానికి సమర్థము లవుతాయి. ఈ యోగంవల్ల కలిగే ఫలం నాశం లేనిది గాన యోగం కూడ అవ్యయమే.(నాశం లేనిది). సమగ్దర్శనమునందు(యథార్థజ్ఞానమునందు)స్థిరంగా ఉండడ మనే ఈ యోగంవల్ల కలిగే మోక్షం అనే ఫలం నశించేది కాదు కదా?ఆ ఆదిత్యుడు మనువుకు బోధించాడు. మనువు తన కుమారుడు,మొట్టమొదటి రాజూ అయిన ఇక్ష్వాకువునకు బోధించాడు.

మూ. ఏవం పరమ్పరాప్రాప్తమిమం రాజర్షయో విదుః,
స కాలేనేహ మహతా యోగో నష్టః పరంతప. 2

ప్ర.అ. **ఏవమితి**:- పరంతప = శత్రువులను పీడించేవాడా! ఏవమ్ =ఈ విధంగా, పరమ్పరాప్రాప్తమ్ = గురుశిష్యపరంపరచేత వచ్చిన, ఇమమ్ = ఈ యోగాన్ని, రాజర్షయః = రాజర్షులు, విదుః = తెలుసుకొనుచున్నారు. సః యోగః = అట్టి ఆ యోగం,మహతా కాలేన = దీర్ఘకాలంచేత(చాలా కాలానికి),ఇహ =ఈ కాలంలో, నష్టః = నశించినది.

భాష్యమ్

ఏవమితి:- ఏవం క్షత్రియపరమ్పరాప్రాప్తమ్ ఇమం, రాజర్షయః; రాజానః చ తే ఋషయః చ రాజర్షయః; విదుః ఇమం యోగమ్. సః యోగః కాలేన ఇహ మహతా దీర్ఘేణ, నష్టః విచ్ఛిన్నసంప్రదాయః సంవృత్తః, హే పరంతప, ఆత్మనః విపక్షభూతాః పరాః ఉచ్యన్తే, తాన్ శౌర్యతేజోగభస్తి భిః భానుః ఇవ తాపయతి ఇతి పరంతపః;శత్రుతాపన ఇత్యర్థః. 2

బాలానందిని

ఏవమితి:- ఈ విధంగా క్షత్రియపరంపర ద్వారా వచ్చిన ఈ యోగాన్ని రాజర్షులు- ఎవరు రాజులుగా ఉండి ఋషులుగా కూడ ఉంటారో వారు రా:- ్షులు,వాళ్లు,ఎరుగుదురు.

ఆ యోగం ఇప్పుడు,చాల కాలం తరువాత నష్టమైపోయినది;దీని సంప్రదాయం విచ్ఛిన్న మైపోయినది. ఓ!పరంతపా!తనకు ఎదిరిపక్షంలో ఉన్నవాళ్లు పరులు.సూర్యుడు తన కిరణాల చేత తపింపచేసి నట్లు, పరులను శౌర్యము,తేజస్సు అనే కిరణాలచేత తపింపచేసేవాడు పరంతపుడు.శత్రువులను పీడించేవాడు అని అర్థం. 2

భాష్యమ్

దుర్బలాన్ అజితేన్ద్రియాన్ ప్రాప్య నష్టం యోగమ్ ఇమమ్ ఉపలభ్య,లోకం చ అపురుషార్థసంబన్ధినమ్-

మూ. స ఏవాయం మయా తేఽద్య యోగః ప్రోక్తః పురాతనః,
భక్తోఽసి మే సఖా చేతి రహస్యం హ్యేతదుత్తమమ్. 3

బాలానందిని

దుర్బలేతి:- జితేంద్రియులు కాని దుర్బలులను చేరి ఈ యోగం నష్టమైన దనీ, లోకం పరమపురుషార్థంతో సంబంధం లేకుండా పోతూన్న దనీ చూచి-

ప్ర.అ.స ఇతి:-మే=నాయొక్క, భక్తః అసి=భక్తుడవు అయి ఉన్నావు;సఖా చ = స్నేహితు డవుగా కూడ అయి ఉన్నావు;ఇతి=ఈ కారణంచేత,పురాతనః = ప్రాచీనమైన, సః ఏవ=అదే యోగం అయిన,అయం యోగః=ఈ యోగం,అద్య=ఇప్పుడు, మయా=నాచేత,తే=నీకు, ప్రోక్తః=చెప్పబడినది. ఇదమ్=ఇది, ఉత్తమమ్=ఉత్తమమైన, రహస్యం హి= రహస్యం కదా?

భాష్యమ్

స ఏవాయమ్ ఇతి:- సః ఏవ అయం మయా,తే తుభ్యమ్,అద్య ఇదానీమ్, యోగః ప్రోక్తః పురాతనః,భక్తః అసి,మే సఖా చ అసి ఇతి.రహస్యం హి ఏతత్ ఉత్తమం యోగః జ్ఞానమ్ ఇత్యర్థః. 3

బాలానందిని

స ఏవాయమితి:- ప్రాచీన మైన ఆ యోగమే ఇది;నువ్వు నా భక్తుడవు అపడంవల్ల, మిత్రుడవు అవడంవల్ల,ఇప్పుడు నీకు చెప్పబడింది.ఎందువల్ల ననగా-ఇది, ఈ యోగం,అనగా జ్ఞానం,ఉత్తమ మైన రహస్యం. 3

భాష్యమ్

భగవతా విప్రతిషిద్ధమ్ ఉక్తమ్ ఇతి మా భూత్ కస్య చిత్ బుద్ధిః ఇతి పరిహా రార్థం చోద్యమ్ ఇవ కుర్వన్-

అర్జున ఉవాచ -

మూ. అపరం భవతో జన్మ పరం జన్మ వివస్వతః,
కథమేతద్విజానీయాం త్వమాదౌ ప్రోక్తవానితి. 4

బాలానందిని

భగవతా ఇతి:- భగవంతుడు చెప్పినది విరుద్ధంగా ఉన్నదే అని ఎవనికీ కూడ అభిప్రాయం కలగకూడదు అనే ఉద్దేశ్యంతో ఆక్షేపపూర్వకంగా ప్రశ్నిస్తున్నాడా అన్నట్లు అర్జునుడు ఇలా అన్నాడు-

అపరమితి:- భవతః = నీయొక్కజన్మ=పుట్టుక,అపరమ్=తరువాత జరిగినది. వివస్వతః=సూర్యునియొక్క,జన్మ=జన్మ,పరమ్=ఎప్పుడో వెనుక జరిగినది. ఆదౌ=మొట్టమొదట, త్వమ్=నువ్వు,ప్రోక్తవాన్ ఇతి=చెప్పినావు అని,ఏతత్=ఈ విషయాన్ని,కథమ్=ఎట్లు, విజానీయామ్=గ్రహింతును?

భాష్యమ్

అపరమితి: -అపరమ్ అర్వాక్ వసుదేవగృహే భవతః జన్మ.పరం పూర్వం సర్గాదౌ,జన్మ ఉత్పత్తిః,వివస్వతః ఆదిత్యస్య. తత్ కథమ్ ఏతత్ విజానీయామ్ అవిరుద్ధార్థ తయా,యః త్వమ్ ఏవ ఆదౌ ప్రోక్తవాన్ ఇమం యోగం సః ఏవ త్వమ్ ఇదానీం మహ్యాం ప్రోక్తవాన్ అసి ఇతి. 4

బాలానందిని

అపరమితి: – నీ జన్మ అపరం;తరువాతి కాలంలో వసుదేవుని గృహంలో జరిగింది. ఆదిత్యుని ఉత్పత్తి పరం,పూర్వం ఎప్పుడో సృష్టిప్రారంభంలో జరిగినది. అలాంటప్పుడు- ఏ నీవు సృష్టి ప్రారంభంలో ఈ యోగాన్ని బోధించావో ఆ నీవే ఇప్పుడు నా కీ యోగాన్ని బోధిస్తున్నావు అనే విషయాన్ని విరుద్ధంగా లేనట్లు,ఎలా గ్రహించగలను?

భాష్యమ్

యా వాసుదేవే అనీశ్వరాసర్వజ్ఞాశఙ్కా మూర్ఖాణాం తాం పరిహరన్ శ్రీభగ వానువాచ,యదర్థః హి అర్జునస్య ప్రశ్నః-

శ్రీభగవానువాచ-

మూ. బహూని మే వ్యతీతాని జన్మాని తవ చార్జున,
తాన్యహం వేద సర్వాణి న త్వం వేత్థ పరంతప. 5

బాలానందిని

యా ఇతి:- వాసుదేవుని విషయంలో అతడు ఈశ్వరుడు కా డనీ, సర్వజ్ఞుడు కా డనీ మూర్ఖులకు ఏ శంక ఉన్నదో దానిని తొలగిస్తూ,ఏ ప్రయోజనాన్ని ఉద్దేశించి అర్జునుడు ప్రశ్నించాడో దానిని కూడ దృష్టిలో ఉంచుకొని శ్రీభగవంతుడు ఇలా అన్నాడు -

ప్ర.అ. బహూనీతి:- అర్జున = అర్జునా! మే = నాకు,తవ చ=నీకూ కూడ,బహూని =అనేకమైన,జన్మాని=జన్మలు,వ్యతీతాని=గడచినవి. ఇపరంతప=ఓ! శత్రుపీడాకరుడా!అహమ్ = నేను,తాని సర్వాణి=వాటిని అన్నింటినీ,వేద=ఎరుగుదును;త్వమ్=నీవు;న వేత్థ=ఎరుగవు.

భాష్యమ్

బహూనీతి:-బహూని,మే మమ,వ్యతీతాని అతిక్రాన్తాని,జన్మాని తవ చ హే అర్జున.తాని అహం,వేద జానే,సర్వాణి,న త్వం,వేత్థ జానీషే,ధర్మాధర్మాదిప్రతిబద్ధ శక్తిత్వాత్.అహం పునః నిత్యశుద్ధబుద్ధముక్తస్వభావత్వాత్ అనావరణజ్ఞానశక్తిః ఇతి వేద, అహం, హే పరంతప. 5

బాలానందిని

ప్ర.అ.బహూనీతి:- అర్జునా!నాకు,నీకూ కూడ అనేక మైన జన్మలు గడచాయి. వాటిని అన్నింటినీ నేను ఎరుగుదును.నీ జ్ఞానశక్తి ధర్మాధర్మాదులచేత ప్రతిబంధింపబడడం వల్ల (అడ్డుకొనబడడంవల్ల)నువ్వు ఎరుగవు.పరంతపా! నే నైతే నిత్యమూ శుద్ధ మైనది,జ్ఞాన రూపము,ముక్తము అయిన స్వభావం కలవాడను. అందుచేత నా జ్ఞానశక్తి ఆవృతం కాదు (కప్పివేయబడలేదు).అందువల్ల నేను ఎరుగుదును. 5

భాష్యమ్

కథం తర్హి తవ నిత్యేశ్వరస్య ధర్మాధర్మాభావేఽపి జన్మ ఇతి? ఉచ్యతే-

మూ. అజోఽపి సన్నవ్యయాత్మా భూతానామీశ్వరోఽపి సన్,
ప్రకృతిం స్వామధిష్ఠాయ సంభవామ్యాత్మమాయయా. 6

బాలానందిని

కథమితి:-అయితే నిత్యేశ్వరుడ వైన నీకు ధర్మాధర్మాలు లేవు కదా;అవి లేకపోయినా జన్మ ఎలా కలుగుతూన్నది?సమాధానం చెప్పబడుచున్నది-

ప్ర.అ. అజః ఇతి :- అజః అపి సన్=పుట్టుక లేనివాడ నైనా,అవ్యయాత్మా=మార్పు లేని స్వరూప స్వభావాలు కలవాడ నైనా,భూతానామ్=సమస్త భూతాలకు,ఈశ్వరః అపి

సన్=ప్రభువును (నియామకుడను)అయినా నేను,స్వామ్=నాకు సంబంధించిన, ప్రకృతిమ్ = ప్రకృతిని,అధిష్ఠాయ=అధిష్ఠించి (త్రిగుణాత్మకప్రకృతిని నా చెప్పుచేతలలో నిలుపుకొని) ఆత్మమాయయా=నాయొక్క మాయాశక్తిచేత,సంభవామి=పుట్టుచుంటాను.

భాష్యమ్

అజోఽపీతి:- అజః అపి జన్మరహితః అపి సన్;తథా,అవ్యయాత్మా అక్షీణజ్ఞానశక్తిస్వభావః అపి సన్,తథా,భూతానాం బ్రహ్మాదిస్తమ్బపర్యన్తానామ్,ఈశ్వరః ఈశనశీలః అపి సన్,ప్రకృతిం స్వాం మమ వైష్ణవీం మాయాం త్రిగుణాత్మికాం,యస్యాః వశే సర్వం జగత్ వర్తతే,యయా మోహితం సత్ స్వమ్ ఆత్మానం వాసుదేవం న జానాతి తాం ప్రకృతిం స్వామ్,అధిష్ఠాయ వశీకృత్య,సంభవామి దేహవాన్ ఇవ భవామి;జాతః ఇవ, ఆత్మమాయయా ఆత్మనః మాయయా,న పరమార్థతః లోకవత్. 6

బాలానందిని

అజః అపీతి:- జన్మ లేనివాడ నైనను,అట్లే,అవ్యయాత్మా=క్షీణించని జ్ఞానశక్తిస్వభావం కలవాడ నైనను,అట్లే బ్రహ్మమొదలు తృణం వరకూ ఉన్న భూతాలకు ఈశ్వరుడ నైనను, వాటిని నియమించేవాడ నైనను,నా ప్రకృతిని,త్రిగుణాత్మకము విష్ణువునకు(పరమాత్మకు) సంబంధించినదీ అయిన మాయను,ఈ జగత్తంతా దేనివశంలో ఉంటూన్నదో,దేనిచేత మోహింపబడినదై(జగత్తు)తనను వాసుదేవ(పరమాత్మ)స్వరూపమైనదానినిగా తెలుసుకొనుట లేదో,అట్టి నా ప్రకృతిని అధిష్ఠించి,ఆ ప్రకృతిని వశం చేసుకొని, సంభవామి=దేహం కలవాడు వలె అవుతున్నాను. నా మాయచేత పుట్టినవాడు వలె కనబడుతున్నాను.అంతే కాని ఇతర జనులవలె వాస్తవంలో నేను పుట్టుటలేదు.

వి:- ఇక్కడ శ్రీ బెల్లంకొండ రామరాయకవి అవతారవాదానికి సబంధించిన కొన్ని విషయాలు వివరించారు.ప్రకృతీ,మాయా ఒకటే కదా;ప్రకృతిని అధిష్ఠించి మాయచేత పుడతాను అని మూలంలో చెప్పినది,పరమార్థంగా లోకం అనేదే లేదు కాబట్టి నేను లోకం వలె పరమార్థతః జనించడంలేదు అని భాష్యకారులు వ్రాసినదీ కూడ అయుక్తంగా ఉన్నాయి కదా అని ఆశకించుకొని శ్రీరామరాయకవి ఈ విధంగా సమాధానాలు(రెండు మూడు రకాలుగా)చెప్పారు.

ప్రకృతి అనగా కేవల అవిద్య.దోషంతో కూడిన అవిద్య మాయ.అవిద్య అనే ఉపాదాన కారణంవల్ల పుట్టిన కార్యం వ్యావహారికం,అందుచేత అది నిజంగా పుట్టినది అని చెప్పబడు తున్నది.మాయ అనే ఉపాదానకారణంనుండి పుట్టిన కార్య మైతే ప్రాతిభాసికం;అందుచేత అది నిజంగా పుట్టలేదు అని చెప్పబడుచున్నది.అవిద్యవల్ల జనించిన సర్పాన్ని సత్యసర్పం

అంటున్నాం. మాయామయమైన రజ్జుసర్పం మిథ్యాసర్పం. అవిద్యవల్ల పుట్టిన జాగ్రత్ప్రపంచం సత్యప్రపంచం. మాయామయ మైన స్వాప్నప్రపంచం మిథ్యాప్రపంచం. అట్లే జీవులకు శరీర సంయోగం అవిద్యవల్ల కలుగుతుంది, ఈశ్వరునిది మాత్రం మాయామయ మైనది అని గ్రహిస్తే దోషం లేదు. "పరమేశ్వరుని శరీరసంయోగం, జీవుల శరీరసంయోగం వలె అవిద్యా మయం కాదు. అవిద్య ఈశ్వరాధీన మైనది గాన ఈశ్వరునికి శరీరసంయోగాన్ని కల్పించ జాలదు" అని బోధించడం కోసం "ప్రకృతిం స్వామధిష్ఠాయ" అని చెప్పబడింది. అవిద్య జీవులను తన వశంలో ఉంచుకొని వాళ్లకి శరీరసంయోగం కలగజేస్తుంది. ఇక్కడ జీవు - డనగా కూటస్థమైన ఆత్మ కాదు; మరే మనగా విజ్ఞానాత్మ అని చెప్పబడేదీ, ఆత్మాభాససహితమూ అయిన బుద్ధియే జీవు డనగా. తత్త్వమస్యాదిశ్రుతులలో చెప్పి నట్లు కూటస్థాత్మ ఈశ్వరాభిన్నమే కదా? అయితే - జీవుని వాస్తవస్వరూపం కూటస్థాత్మయే; ఆత్మాభాససహిత మైన బుద్ధి జీవుని వ్యావహారికరూపం.

లేదా - త్రిగుణాత్మక మైన మాయ ప్రకృతి. ఇంద్రజాలశక్తివంటిది మాయ. జీవులకు సంబంధించిన దేహేంద్రియాదికం ప్రకృతియొక్క కార్యం; అది వ్యావహారికం. ఈశ్వరునికి సంబంధించిన, మాయాకార్యమైన దేహేంద్రియాదిక మైతే ఐంద్రజాలికుడు నిర్మించిన గంధర్వ నగరాదికం వలె ప్రాతిభాసిక మైనది. అందుచేతనే "న పరమార్థతః, లోకవత్" అన్నారు భాష్య కారులు. ఇక్కడ 'పరమార్థతః' అనగా 'వ్యవహారతః' అని అర్థం; అంతేనే కాని 'వస్తుతః' అని దీని అర్థంకాదు. వస్తుతః లోకమే లేదు కదా?

ఇక్కడ ఈ విషయం గుర్తుంచుకోవాలి - వ్యావహారికసత్, పారమార్థికసత్, ప్రాతిభాసిక సత్, అసత్యంతాసత్ అని పదార్థసముదాయం నాలుగు విధాలు. దోషాలు లేని ప్రమాణాలచేత జాగ్రద్దశలో తెలియబడే మనుష్య-పశు-పక్ష్యాదికజగత్తు, పృథివ్యాదిభూతాత్మకజగత్తు వ్యావహారికసత్. 'ఏకమేవాద్వితీయమ్' అని చెప్పబడిన బ్రహ్మ పారమార్థికసత్' దోషా లున్న ప్రమాణాలచేత గ్రహింపబడేది, తెలియబడే సమయంలో మాత్రమే ఉండేది అయిన స్వప్న- ఇంద్రజాల-రజ్జుసర్పాదికం ప్రాతిభాసికత్. వంధ్యాపుత్రుడు, శశశృంగం మొదలైనది, ఎన్నడూ కూడ అసలే కనబడనిది అత్యంతాసత్. అందుచేతనే- "వన్ధ్యాపుత్రో న తత్త్వేన మాయయా వాపి జాయతే" (యథార్థంగా గాని, మాయచేత గాని వంధ్యాపుత్రుడు జనించడు) అని అంటారు.

ఇది ఇలా ఉండగా ఈశ్వరావతారా లైన రామకృష్ణాదులు పూర్తిగా అసత్తులు కారు. వాళ్ల ప్రతీతి (జ్ఞానం) కలుగుతూన్నది కదా? సత్తులు కూడ కాదు, ఊహింప శక్యం కాని జన్మాదులుకల వాళ్లకు వ్యావహారికసత్త్వం ఉండదు కదా? అందుచేత వాళ్లకి ఇంక మిగిలిన ప్రాతిభాసికసత్త్వాన్ని అంగీకరించడం యుక్తం, ఎందువల్ల ననగా వాళ్ల ఉనికి

గంధర్వనగరాదుల ఉనికి వలె అవిచారితరమణీయం(పట్టి చూచి పరిశీలించినంతవరకు అందంగానే ఉంటుంది).ఒక స్త్రీ చతుర్భుజుడు,శంఖచక్రకిరీటాదులను ధరించినవాడు అయిన,సర్వజ్ఞుడైన శిశువును కన్న దని ఎవ రైనా చెపితే అది సత్యమే అని ఎవ రైనా నమ్ముతారా?అట్లే భయంకరాకారుడు,నరసింహరూపుడూ అయిన పురుషుడు స్తంభంనుండి పుట్టినా డని చెపితే అతి సత్య మని ఎవరైనా గ్రహిస్తారా?విచారాక్షమమైన (విచారపూర్వకంగా నిరూపించడానికి శక్యం కానిది)ఇంద్రజాలం వలె మిథ్యయే అని అంగీ కరించాలి.

"ఏతస్మాత్కిమివేన్ద్రజాలమపరం యద్గర్భవాసస్థితం
రేతశ్చేతతి హస్తమస్తకపదప్రోద్భూతనానాఙ్కురైః,
పర్యాయేణ శిశుత్వయౌవనజరావేషైరనేకైర్వృతం
పశ్యత్యత్తి శృణోతి జిఘ్రతి తథా గచ్ఛత్యథాఽఽ గచ్ఛతి"

(గర్భవాసంలో ఉన్న రేతస్సు చైతన్యం పొందుతున్నది;చేతులు,తల,కాళ్లు మొదలైన అనేకము లైన అంకురాలను తొడుగుతున్నది.ఒకదాని తరువాత ఒకటిగా శిశుత్వం, యౌవనం, ముసలితనం మొదలైన అనేకవేషాలు ధరిస్తూ చూస్తూన్నది,తింటూన్నది, వింటూన్నది, వాసనచూస్తున్నది, వెడుతూన్నది,వస్తూన్నది!ఇంతకంటె గొప్ప ఇంద్రజాలం మరొక టేదైనా ఉన్నదా!)అని చెప్పి నట్లు సిద్ధాంతంలో,వ్యావహారిక జగత్తు కూడ విచారాక్షమమే అయినా రేతస్సు,విత్తనాలు, మట్టి మొదలైనవాటినుండి దేహం,వృక్షాలు, ఘటం మొదలైనవి పుట్టడం అందరికీ అనుభవ సిద్ధం గాన వాటి విషయంలో ఎవరికీ కొంచెం కూడ ఆశ్చర్యం గాని,అప్రమాణ్యబుద్ధి గాని కలగదు.అందుచేత లౌకికులకు ఏది ఆశ్చర్యవిషయం కాదో అది విచారక్షమం అని చెప్ప బడుతుంది.అందువల్ల ఇంద్రజాలం వలె ఆశ్చర్యహేతు వైన ఈశ్వరశక్తి మాయ;అందరికీ సాధారణ మైనది ప్రకృతి.

శ్రీరామరాయకవి చేసిన పారమార్థికసదాదిపంచవిధ సద్విభాగంతో పాటు) ఆరవదైన 'అలౌకిసత్'లేదా"లోకోత్తరసత్"అనేదానిని పారమార్థిక-వ్యావహారిక సత్త్వాల మధ్య చేర్చి ఈశ్వరాధీనమైన మాయచే కల్పిత మైన రామ-కృష్ణాదిశరీరంయొక్క సత్త 'లోకోత్తరసత్త' లేదా'అలౌకికసత్త'అని చెపితే బాగుంటుంది. "ఆత్మమాయయా దేహవానివ,జాత ఇవ సంభవామి"అని భగవత్పాదుల వర్ణన ఆ దేహాలకు కూడ (మాయాకల్పితా లవడంచేత) యుక్తంగానే ఉంటుంది)

లేదా-ప్రకృతి అన్నా మాయ అన్నా ఒకటే.ప్రకృతిని వశంచేసుకొన్న నేను ప్రకృతి చేతనే పుట్టుచున్నాను కాని ధర్మాధర్మాదినిమిత్తాలచేత కాదు అని చెప్పడంకోసం "ఆత్మ మాయయా"అని చెప్పబడింది.ధర్మధర్మాదుల సంస్కారంతో కూడిన ప్రకృతినుండి పుట్టిన మానవాదులు నిజంగా పుట్టినట్లు చెప్పబడతారు.కేవలం మాయవల్ల మాత్రమే పుట్టిన

రామకృష్ణాదులు నిజానికి పుట్టలేదు;పుట్టినట్లు కనబడుతున్నారు అని చెప్పబడతారు. కామంతో కర్మ చేసే అజ్ఞానియొక్క కర్మ వాస్తవంలో కూడ కర్మయే. ప్రాజ్ఞుడు చేసే నిష్కామకర్మ మాత్రం బంధహేతువు కాకపోవడంవల్ల వాస్తవంలో కర్మ కాదు;కర్మ వలె కనబడుతుంది. అదే విధంగా -రామకృష్ణాదిదేహాలను ధరించడం అనే కర్మ ప్రాజ్ఞుడైన ఈశ్వరునికి బంధహేతువు కాదు గాన వాస్తవంలో అది జన్మ కాదు;జన్మవలె కనబడుతుంది. కాని అజ్ఞుడైన జీవుని దేహధారణ రూప మైన జన్మ బంధహేతువు కాబట్టి అది వాస్తవంగా జన్మయే. ఈశ్వరుని జన్మ కర్మాధీనం కాదు,లీలచేతనే గ్రహించబడుతుంది అని ద్వైతులు కూడ అంగీకరిస్తారు. ఆ లీల అంటే ఏమిటి? మాయయే కదా,మాయామయమే కదా? నిర్విశేషుడైన ఈశ్వరునిలో,వాస్తవానికి, లీల కుదరదు కదా?

మొత్తంమీద ఈ శ్లోకానికి భావం ఏ మనగా-జీవు డని చెప్పబడే సాభాసబుద్ధికి ప్రకృతివల్ల జనించే శరీరంతో సంయోగం అనే జన్మ ఏ విధంగా ఉంటుందో,ఈశ్వరు డని చెప్పబడే,ప్రకృతిపరతంత్రం కాని కూటస్థ మైన ఆత్మకు ప్రకృతివల్ల పుట్టే శరీరంతో సంబంధం ఏర్పడడం అనే జన్మ ఉండదు;అది కేవలం మాయామయమే.

(ప్రశ్న)ఈశ్వరశరీరం ప్రాతిభాసికం అవడంచేత మాయామయ మైనది,జీవశరీరాలు వ్యావహారికా లవడంచేత ప్రకృతిమయాలు అనే ఈ విభేదం కుదరదు. అర్జునశరీరం వలె. కృష్ణశరీరం కూడ వ్యవహారం ఉన్నంతవరకూ ఉండనే ఉంది కదా?(సమాధానం)కృష్ణశరీరం అనేకవిధాలుగా ఉండడంచేత,ఒకప్పుడు కనబడకపోవడంచేత అది మాయామయం. రజ్జుసర్పం ఒక్కొకప్పుడు దండాదిరూపంలో కనబడుతూంటుంది. ఒకప్పుడు కనబడదు. అందుచేత అది ఏ విధంగా మాయామయమో అట్లే ఇది కూడ. అందువల్ల అర్జునాదుల కున్నట్లు కృష్ణునకు వాస్తవంలో జన్మలేదు కాబట్టి కృష్ణుడు నిత్యుడు,అజుడు,ఈశ్వరుడు అని చెప్పడం కుదురుతుంది.

భా.అ.ప్ర.:- "ఈ కృష్ణజన్మ ఇంద్రజాలాదికం వలె మిథ్య కాదు;సత్యమే -ప్రకృతిమ్ =స్వభావాన్ని,అధిష్ఠాయ=విడవకుండగనే,ఆత్మమాయయా=సంకల్పజ్ఞానంచేత పుట్టుచున్నాను. "ఆదిత్యవర్ణం హిరణ్యవర్ణం సర్వే నిమేషా విద్యుతః పురుషాత్"ఇత్యాది శ్రుతులు ఈశ్వరుని స్వరూపాన్ని వర్ణిస్తున్నాయి"అని ఇక్కడ శ్రీరామానుజాచార్యులు వ్రాసినది అసంగతం. "సచ్చిదానన్దం బ్రహ్మ","నిష్కలం నిష్క్రియం శాన్తం "అశబ్దమస్పర్శమరూపమవ్య యమ్" ఇత్యాదిశ్రుతులు ఈశ్వరుడు రూపాదిరహిత డని చెపుతున్నాయి. హిరణ్యవర్ణత్వాది రూపం ఉపాసనకొరకై కల్పించబడింది. అందుచేత అది ఇంద్రజాలం వలె మాయామయము అని నిశ్చితం అవుతూన్నది. ఈశ్వరునికి శరీరం ఉంటె అన్నింటిలోను ఉండడం,సాక్షిత్వం మొద లైనవి కుదరవు. దృశ్యం అవడంచేత ఘటాదుల వలె ఈశ్వరుడు కూడ అనిత్యుడు అని

చెప్పవలసి వస్తుంది.పుట్టుక లేనివాడు సంకల్పించినా కూడ పుట్టడం కుదరదు. సంగ రహితుపురుషు డైన ఈశ్వరునికి,వాస్తవంలో,శరీరంతో సంబంధం కుదరదు. ఈ కారణా లన్నింటిచేతా ఈ కృష్ణావతారం మిథ్యయే(భా.అ.ప్ర.పే.154) 6

భాష్యమ్

తచ్చ జన్మ కదా,కిమర్థం చ ఇతి? ఉచ్యతే-

మూ. యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత,
అభ్యుత్థానమధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్. 7

బాలానందిని

తచ్చేతి:- ఆ జన్మ ఎప్పుడు జరుగుతుంది,ఎందుకు?చెప్పబడుచున్నది-

ప్ర.అ. యదేతి:- భారత=అర్జునా! యదా యదా హి=ఎప్పుడెప్పుడైతే,ధర్మస్య = ధర్మానికి, గ్లానిః =దౌర్బల్యం,భవతి=కలుగుతుందో,అధర్మస్య=అధర్మానికి,అభ్యుత్థానమ్=పైకి లేవడం (పెరుగుదల)కలుగుతుందో,తదా=అప్పుడు,ఆత్మానమ్=నన్ను,సృజామి=సృష్టిస్తూ ఉంటాను.

భాష్యమ్

యదేతి:- యదా యదా హి ధర్మస్య,గ్లానిః హానిః,వర్ణాశ్రమాదిలక్షణస్య ప్రాణి నామ్ అభ్యుదయనిఃశ్రేయససాధనస్య,భవతి,భారత,అభ్యుత్థానమ్ ఉద్భవః అధర్మస్య తదా ఆత్మానం సృజామి అహం మాయయా. 7

బాలానందిని

యదేతి:- అర్జునా! ఎప్పు డెప్పు డైతే,ప్రాణుల అభ్యుదయానికి(వివిధసుఖాద్యభి వృద్ధికి),నిఃశ్రేయసానికి(మోక్షానికి)సాధన మైన వర్ణాశ్రమాదిరూప మైన ధర్మానికి హాని కలుగుతుందో, అధర్మంయొక్క పుట్టుక కలుగుతుందో అప్పుడు,మాయచేత నన్ను నేను సృజిస్తాను. 7

భాష్యమ్

కిమర్థమ్-

మూ. పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్,
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే. 8

బాలానందిని

కిమర్థమితి:- ఎందుకు?

ప్ర.అ. పరిత్రాణాయేతి:- సాధూనామ్=సత్పురుషులయొక్క పరిత్రాణాయ= రక్షణంకొరకు, దుష్కృతామ్=పాపాత్ములయొక్క వినాశాయ చ = వినాశంకొరకు, ధర్మసంస్థాపనార్థాయ =ధర్మాన్ని నిలబెట్టడంకొరకు,యుగే యుగే= ప్రతీ యుగంలోను, సంభవామి = పుడతాను.

భాష్యమ్

పరిత్రాణాయేతి:-పరిత్రాణాయ పరిరక్షణాయ,సాధూనాం సన్మార్గస్థానాం, వినాశాయ చ దుష్కృతాం పాపకారిణాం,కించ ధర్మసంస్థాపనార్థాయ ధర్మస్య సమ్యక్ స్థాపనం తదర్థం సంభవామి,యుగే యుగే ప్రతియుగమ్. 8

బాలానందిని

పరిత్రాణాయేతి:- సన్మార్గంలో ప్రవర్తించేవాళ్ల రక్షణంకొరకు,పాపాలు ఆచరించేవాళ్ల వినాశంకొరకు,మరియు,ధర్మాన్ని బాగుగా స్థాపించడంకొరకు ప్రతీ యుగంలోను జన్మిస్తూం టాను.

భా.అ.ప్ర.:- సాధూనాం అనగా విష్ణువుయొక్క విరహాన్ని సహించని వైష్ణవాగ్రేసరుల యొక్క రక్షణంకొరకు అని శ్రీరామానుజాచార్యులు చేసిన వ్యాఖ్య చాలా సారరహిత మైనది.వైష్ణ వాగ్రేసరు లనగా జ్ఞానులా అజ్ఞానులా?మొదటి పక్షంలో "**వాసుదేవః సర్వమితి,స మహాత్మా సుదుర్లభః**"అని చెప్పిన విధంగా "సర్వమూ బ్రహ్మయే"అనీ, అనంతు డైన పరమాత్మ సర్వ గతు డవడంచేత "**స ఏవాహమవస్థితః, మత్తః సర్వమహం సర్వే మయి సర్వం సనాతనే**" అని ప్రహ్లాదుడు చెప్పినట్లుగా "**అహం బ్రహ్మాస్మి**"అనీ ఎవరికి జ్ఞానం ఉంటుందో అలాంటి అద్వైతులే వైష్ణవాగ్రేసరులు.వాళ్లకు విష్ణువిరహం కలిగే ప్రసక్తి ఏముంది?ఎందువల్ల ననగా వాళ్లకి విష్ణువే స్వాత్మ;వాళ్లు ఎల్లప్పుడు విష్ణురూప మైన ఆనందాన్ని అనుభవించడంలోనే వ్యగ్రులై ఉంటారు.రెండవ పక్షం సరికాదు.విష్ణువును ఎరుగనివాళ్లు వైష్ణవు లెలా అవుతారు? విష్ణువును గూర్చి తెలుసుకొంటూ ఆ విష్ణువునందు భక్తి గలవారే వైష్ణవులు కదా? "**విష్ణ్వర్పితాఖిలాచారః స హి వైష్ణవ ఉచ్యతే**"అని శాస్త్రం."**న చలతి నిజవర్ణధర్మతో యః స్థిరమనసం తమవేహి విష్ణుభక్తమ్**"అని చెప్పడంవల్ల ఎవడు స్వవర్ణాశ్రమ ధర్మాలలో స్థిరంగా ఉంటాడో అతడే వైష్ణవుడు అని చెప్పడం కూడ కుదరదు.అలాంటివాడు యోగి అవుతాడు.యోగియే వైష్ణవుడు అన్నట్లయితే జ్ఞాని వైష్ణవుడు కాదు అని చెప్పవలసి వస్తుంది.అప్పుడు "**ప్రియో౽హి జ్ఞానినో౽త్యర్థమహం స చ మమ ప్రియః**"అని రాబోయే

గీతాశ్లోకంతో విరోధం వస్తుంది. విష్ణువునకు ఇష్టుడైన జ్ఞాని విష్ణు భక్తుడు కాదు అనడానికి శక్యం కాదు కదా?సరే!నువ్వన్నట్లు జ్ఞానశూన్యుడైన యోగి కూడ వైష్ణవుడే అనుకొందాం. అతడు భగవంతుని విరహాన్ని సహింపజాలకపోవడం ఎలా కుదురు తుంది?వానికి భగవత్స్వరూపస్వభావాదిజ్ఞానమే లేదు కదా?తప్తశంఖచక్రచిహ్నాలను,ఊర్ధ్వపుండ్రాలను ధరించి అర్చాపూజ (దేవతావిగ్రహపూజ)చేసేవాళ్లు వైష్ణవులు అనడంకూడ యుక్తం కాదు. ఎందువల్ల) ననగా తాపాదులు వేదవిరుద్ధాలైన ఆచారాలు. అందువల్ల సాధుపదం కనబడగానే ఇక్కడ వైష్ణవజనాడంబరం చేయడానికి తగిన ప్రసక్తి లేదు.(భా.అ.ప్ర. పే.155) 8

భాష్యమ్

తత్ –

మూ. జన్మ కర్మ చ మే దివ్యమేవం యో వేత్తి తత్త్వతః,
త్యక్త్వా దేహం పునర్జన్మ నైతి మామేతి సోఽర్జున. 9

బాలానందిని

తదితి:– తత్ = అందువల్ల–

ప్ర.అ.జన్మేతి:– మే=నాయొక్క, దివ్యమ్=దివ్యమైన, జన్మ=జన్మను,కర్మ చ = కర్మను, యః =ఎవడు తత్త్వతః = యథార్థంగా, వేత్తి = తెలుసుకొంటాడో,సః = అతడు, అర్జున= అర్జునా! దేహమ్ = దేహమును, త్యక్త్వా = విడిచి, పునః = మరల, జన్మ = జన్మను, న ఏతి = పొందడు. మామ్ = నన్ను,ఏతి= పొందుతాడు.

భాష్యమ్

జన్మేతి:– జన్మ మాయారూపం,కర్మ చసాధుపరిత్రాణాది,మే మమ,దివ్యమ్ అప్రాకృతమ్ ఐశ్వరమ్,ఏవంయథోక్తం,యః వేత్తి తత్త్వతః తత్త్వేన యథావత్,త్యక్త్వా దేహమ్ ఇమం,పునః జన్మ ఉత్పత్తిం న ఏతి న ప్రాప్నోతి;మామ్,ఏతి ఆగచ్ఛతి,సః ముచ్యతే,హే అర్జున. 9

బాలానందిని

జన్మేతి:– అర్జునా! మాయారూప మైన జన్మను,నాయొక్కదివ్య మైన,ప్రాకృతం కాని. ఈశ్వరుడే చేయదగిన సాధుపరిత్రాణం మొదలైన కర్మను,ఈ విధంగా,పైన చెప్పిన విధంగా, ఎవడు తత్త్వంచేత అనగా యథాతథంగా తెలుసుకొంటాడో అతడు ఈ దేహాన్ని విడచి తిరిగి జన్మను,పుట్టుకను,పొందడు;నన్నే చేరుతాడు, ముక్తుడౌతాడు.

భా.అ.ప్ర.:–"నా జన్మకర్మలను తెలుసుకొని,పాపాలు లేనివాడై,నన్ను ఆశ్రయించి, నే నొక్కడనే ప్రియుడుగా కలవాడై,నాయందు చిత్తం కలవాడై నన్నే చేరుతాడు.అను శ్రీరామానుజవ్యాఖ్య మూలంలో లేని మదాశ్రయః ఇత్యాదిపదాలు చాలా చేర్చడంచేత అప్రమాణం(భా.అ.ప్ర.పే.156) 9

భాష్యమ్

నైషః మోక్షమార్గః ఇదానీం ప్రవృత్తః;కిం తర్హి?పూర్వమపి–

మూ. వీతరాగభయక్రోధా మన్మయా మాముపాశ్రితాః,
బహవో జ్ఞానతపసా పూతా మద్భావమాగతాః. 10

బాలానందిని

నేతి:– ఈ మోక్షమార్గం ఇప్పుడే ప్రారంభం కాలేదు.మరేమిటి?పూర్వం కూడ–

ప్ర.అ. వీతేతి:– వీతరాగభయక్రోధాః = నశించిన రాగము,భయము,క్రోధము కలవారు,మన్మయాః =నేనే స్వరూపంగా గలవారు,మామ్=నన్ను,ఉపాశ్రితాః=ఆశ్రయించిన వారు అయిన, బహవః=చాలామంది,జ్ఞానతపసా=జ్ఞాన మనే తపస్సుచేత,పూతాః=పవిత్రింప చేయబడినవారై,మద్భావమ్=నా స్వరూపాన్ని,ఆగతాః=పొందినారు.

భాష్యమ్

వీతరాగేతి:– వీతరాగభయక్రోధాః-రాగశ్చ భయం చ క్రోధః చ వీతాః విగతాః యేభ్యః తే వీతరాగభయక్రోధాః,మన్మయాః బ్రహ్మవిదః ఈశ్వరాభేదదర్శినః,మామేవ పరమేశ్వరమ్ ఉపాశ్రితాః,కేవలజ్ఞాననిష్ఠాః ఇత్యర్థః.బహవః అనేకే,జ్ఞానతపసా జ్ఞానమేవ చ పరమాత్మవిషయం తపః,తేన జ్ఞానతపసా,పూతాః పరాం శుద్ధిం గతాః సన్తః మద్భావమ్ ఈశ్వరభావం మోక్షమ్ ఆగతాః సమనుప్రాప్తాః.ఇతరనిరపేక్షజ్ఞాననిష్ఠాః ఇత్యస్య లిఙ్గం జ్ఞానతపసా ఇతి విశేషణమ్. 10

బాలానందిని

వీతేతి:– రాగము,భయము,క్రోధముఎవరినుండి తొలగిపోయినవో అట్టివారు,మన్మయులు–అనగా ఈశ్వరునకు తమకు భేదం లే దని గ్రహించిన బ్రహ్మవేత్తలు,పరమేశ్వరుడ నైన నన్నే ఆశ్రయించినవారు,అనగా కేవలం జ్ఞాననిష్ఠమాత్రమే ఉన్నవారు(కర్మాదులతో సంబంధం లేనివారు)అని అర్థం;అట్టి చాలామంది, పరమాత్మను గూర్చిన జ్ఞానమే తపస్సు–దానిచేత,పూర్తిగా పరిశుద్ధిని పొందినవారై,మద్భావాన్ని,అనగా ఈశ్వరత్వాన్ని,మోక్షాన్ని పొందారు.'జ్ఞానతపసా'అని విశేషించి చెప్పడం వాళ్ళు ఇతరము లైన కర్మలు తపస్సులూ మొదలైనవాటి అపేక్ష లేని జ్ఞానమునందు నిష్ఠ గలవారు అని చెప్పడానికి లింగం (గుర్తు). 10

భాష్యమ్

తవ తర్హి రాగద్వేషౌ స్తః,యేన కేభ్యశ్చిదేవ ఆత్మభావం ప్రయచ్ఛసి న సర్వేభ్యః ఇతి. ఉచ్యతే -

మూ. యే యథా మాం ప్రపద్యన్తే తాంస్తథైవ భజామ్యహమ్,
మమ వర్త్మానువర్తన్తే మనుష్యాః పార్థ సర్వశః. 11

బాలానందిని

తవేతి:-అయితే -నువ్వు కొందరికే ఆత్మభావం ఇస్తున్నావు;అందరికీ ఇవ్వడంలేదు; అందుచేత నీకు రాగద్వేషా లున్నా యన్నమాట!సమాధానం చెప్పబడుచున్నది.

ప్ర.అ. యే ఇతి:- యే=ఎవరు,మామ్ = నన్ను, యథా =ఎట్లు; ప్రపద్యన్తే = ఆశ్రయిస్తూంటారో, తాన్ =వాళ్లను,తథైవ=అట్లే,అహమ్=నేను,భజామి=అనుగ్రహిస్తాను.పార్థ = అర్జునా!మనుష్యాః=మనుష్యులు,మమ = నాయొక్క వర్త్మ=మార్గాన్ని,సర్వశః=అన్ని వైపుల నుండి,అనువర్తన్తే=అనుసరిస్తున్నారు.

భాష్యమ్

యే యథేతి:- యే యథా యేన ప్రకారేణ,యేన ప్రయోజనేన,యత్ఫలార్థితయా మాం ప్రపదయన్తే తాన్,తథైవ తత్ఫలదానేన,భజామి అనుగృహ్ణామి,అహమ్ ఇత్యేతత్. తేషాం మోక్షం ప్రతి అనర్థిత్వాత్.న హి ఏకస్య ముముక్షుత్వం ఫలార్థిత్వం చ యుగపత్ సంభవతి.అతః యే ఫలార్థినః తాన్ ఫలప్రదానేన,యే యథోక్తకారిణః తు అఫలార్థినః ముముక్షవః చ తాన్ జ్ఞానప్రదానేన,యే జ్ఞానినః సంన్యాసినః ముముక్షవః చ తాన్ మోక్షప్రదానేన,తథా ఆర్తాన్ ఆర్తిహరణేన ఇత్యేవం యథా ప్రపద్యన్తే యే తాన్ తథైవ భజామి ఇత్యర్థః. న పునా రాగద్వేషనిమిత్తం మోహనిమిత్తం వా కం చిత్ భజామి. సర్వథాపి సర్వావస్థస్య మమ ఈశ్వరస్య, వర్త్మ మార్గమ్,అనువర్తన్తే మనుష్యాః యత్ఫలార్థితయా యస్మిన్ కర్మణి అధికృతాః యే ప్రయతన్తే తే మనుష్యాః అత్ర ఉచ్యన్తే- హే పార్థ,సర్వశః సర్వప్రకారైః. 11

బాలానందిని

యే ఇతి:- ఎవరు,యథా=ఏ ప్రకారంచేత,ఏ ప్రయోజనంచేత,ఏ ఫలాన్ని కోరుతూ, నన్ను ఆశ్రయిస్తారో,వాళ్లను,అట్లే,ఆ ఫలాన్ని ఇవ్వడంచేత,నేను భజిస్తాను,అనుగ్రహిస్తాను అని అర్థం.వాళ్లు మోక్షం కోరనివా ళ్లవడంవల్ల ఏది కోరితే అదే ఇస్తాను.ఒకే వ్యక్తికి మోక్షేచ్ఛ ఉండడమూ,ఇతర ఫలాభిలాష ఉండడమూ అనేవి ఒకే సమయంలో ఉండవు

కదా?అందువల్ల ఎవళ్లు ఫలం కోరుకుంటారో వాళ్లను ఫలం ఇవ్వడంచేత,ఎవళ్లు ఫలాన్ని కోరనివారై విధించిన కర్మలు ఆచరిస్తారో,మోక్షేచ్ఛ కలవారై కూడ ఉంటారో వాళ్లను జ్ఞానం ఇవ్వడంచేత,ఎవళ్లు జ్ఞానవంతులై, సంన్యాసులై, ముముక్షువులుగా ఉంటారో వాళ్లను మోక్షం ఇవ్వడంచేత,ఎవళ్లు రోగాదిపీడితులో వాళ్లను ఆ బాధలను తొలగించడంచేత,ఈ విధంగా ఎవరు ఏ విధంగా ఆశ్రయిస్తారో వాళ్లను ఆ విధంగానే అనుగ్రహిస్తాను అని అర్థం.అంతే కాని ఎవనినీ కూడ రాగం అనే నిమిత్తంచేత గాని,మోహం అనే నిమిత్తంచేత గాని అనుగ్రహించను.అన్ని విధాల కూడా మనుష్యులు వివిధావస్థలలో (అనేకరూపాలలో)ఉన్న పరమేశ్వరుడనైన నాయొక్క మార్గాన్నే అనుసరిస్తూంటారు. ఇక్కడ మనుష్య లనగా ఎవరు ఏ ఫలాలను కోరుతూ, ఏ కర్మలయందు అధికారం గలవారై ప్రవర్తిస్తారో వాళ్లు అని అర్థం. ఓ ! పార్థా! సర్వశః =అన్ని విధాలా కూడ.

భా.అ.ప్ర.:- మమ వర్మ = నా స్వభావాన్ని,అనువర్తన్తే = అనుభవించి అను వర్తిస్తారు అని శ్రీరామానుజవ్యాఖ్య అయుక్త మైనది. వర్మన్ శబ్దానికి స్వభావం అనే అర్థం లేదు.ఇక్కడ 'అనుభూయ'(అనుభవించి)అనే పదం కూడ లేదు. మనుష్యులు అన్ని విధాలా భగవత్స్వభావాన్ని అనుభవించడం శక్యం కాదు కూడ(భా.అ.ప్ర.పే.157). 11

భాష్యమ్

యది తవ ఈశ్వరస్య రాగాదిదోషాభావాత్(వః తదా)సర్వప్రాణిషు అనుజిఘృక్షాయాం తుల్యాయాం,సర్వఫలప్రదానసమర్థే చ సతి త్వయి సతి "వాసుదేవః సర్వమ్" (7.19)ఇతి జ్ఞానేనైవ ముముక్షవః సన్తః కస్మాత్ త్వామేవ సర్వే న ప్రతిపద్యన్తే ఇతి? శృణు తత్ర కారణమ్ -

మూ. కాఙ్క్షన్తః కర్మణాం సిద్ధిం యజన్త ఇహ దేవతాః,
క్షిప్రం హి మానుషే లోకే సిద్ధిర్భవతి కర్మజా. 12

బాలానందిని

యదీతి:- ఈశ్వరుడ వైన నీకు రాగాదిదోషాలు లేకపోయిన ట్లయితే, సర్వప్రాణులను అనుగ్రహించా లనే కోరిక నీకు సమంగానే ఉండగా, నీవు సమస్తఫలాలను ఇచ్చే సామర్థ్యం కలవాడవై ఉండగా మానవులు అందరూ ముముక్షువులై "వాసుదేవః సర్వమ్"(సర్వమూ పరమాత్మస్వరూపమే)అనే జ్ఞానంచేతనే నిన్నే ఎందుకు ఆశ్రయించడం లేదు? అందుకు కారణం ఏమో విను -

ప్ర.అ. **కాఙ్క్షన్తః ఇతి**:- కర్మణామ్ = కర్మలయొక్క, సిద్ధిమ్ = సిద్ధిని, కాఙ్క్షన్తః = కోరుచున్నవారై, ఇహ = ఈ లోకంలో, దేవతాః = దేవతలను, యజన్తే = పూజిస్తూ

ఉంటారు. మానుషే లోకే = మనుష్యలోకంలో, కర్మజా = కర్మలవల్ల, కలిగే, సిద్ధిః = సిద్ధి, క్షిప్రమ్ = శీఘ్రంగా,భవతి హి = కలుగుతుంది కదా?

భాష్యమ్

కాఙ్క్షన్తః ఇతి:– కాఙ్క్షన్తః అభీప్సన్తః కర్మణాం సిద్ధిం ఫలనిష్పత్తిం ప్రార్థయన్తః యజన్తే,ఇహ అస్మిన్ లోకే, దేవతాః ఇన్ద్రాగ్న్యాద్యాః **"అథయోఽన్యాం దేవతాముపాస్తే ఽన్యోఽసావన్యోఽహమస్మీతి న స వేద యథా పశురేవం స దేవానామ్"** (బృ.ఉ. 1.4.10) ఇతి శ్రుతేః. తేషాం హి భిన్నదేవతాయాజినా పలాకాఙ్క్షిణాం, క్షిప్రం శీఘ్రం,హి యస్మాత్,మానుషే లోకే,మనుష్యలోకే హి శాస్త్రాధికారః **"క్షిప్రం హి మానుషే లోకే"**ఇతి విశేషణాత్ అన్యేష్వపి కర్మఫలసిద్ధిం దర్శయతి భగవాన్. మానుషే లోకే వర్ణాశ్రమాదికర్మాధికారః ఇతి విశేషః. తేషాం వర్ణాశ్రమాద్యధికారికర్మణాం ఫలసిద్ధిః క్షిప్రం భవతి.కర్మజా కర్మణో జాతా. 12

బాలానందిని

కాఙ్క్షన్తః ఇతి:– కాఙ్క్షన్తః=పొంద గోరుచున్నవారై,కర్మలయొక్కసిద్ధిమ్=ఫలసిద్ధిని ప్రార్థిస్తున్నవారై,పూజిస్తున్నారు. ఇహ=ఈ లోకంలో,దేవతాః=ఇంద్రాగ్న్యాదిదేవతలను"అథ... దేవానామ్"(ఇక ఎవ డైతే నేను వేరు ఈ దేవత వేరు అని భావిస్తూ మరొక దేవతను ఉపాసిస్తాడో అతడు ఏమీ ఎరుగడు.అతడు దేవతలకు పశువు ఎట్లోఅట్లే) అని శ్రుతి చెప్పు చున్నది. ఎందువల్ల ననగా–వేరైన దేవతలను పూజించే,ఫలాభిలాష కలవాళ్లకు మనుష్య లోకంలో శీఘ్రంగా సిద్ధి కలుగుతుంది. శాస్త్రాధికారం మనుష్యలోకంలోనే కదా?"క్షిప్రం హి మానుషే లోకే"(మనుష్యలోకంలో శీఘ్రంగా లభిస్తుంది)అని చెప్పడంచేత ఇతర లోకాలలో కూడ కర్మఫలసిద్ధి కలుగుతుంది(అయితే–కొంచెం ఆలస్యంగా)అని భగవంతుడు చూపు తున్నాడు. అయితే వర్ణాశ్రమాదికర్మలు మనుష్యలోకంలోనే ఉంటా యనేది విశేషం(వర్ణాశ్రమాదిభేదం లేకుండా విధించబడిన కర్మలు ఇతరలోకాలలో కూడ ఉండవచ్చు నని భావం). ఆ వర్ణాశ్రమాద్యధికారులు చేసే కర్మల ఫలసిద్ధి శీఘ్రంగా జరుగుతుంది. కర్మజా =కర్మలవల్ల పుట్టిన. 12

భాష్యమ్

మానుషే ఏవ లోకే వర్ణాశ్రమాదికర్మాధికారః న అన్యేషు లోకేషు ఇతి నియమః కింనిమిత్తః ఇతి? అథవా– వర్ణాశ్రమాదిప్రవిభాగోపేతా మనుష్యాః మమ వర్త్మ అనువర్తన్తే సర్వశః ఇతి ఉక్తమ్. కస్మాత్ పునః కారణాత్ నియమేన తవైవ వర్త్మ అనువర్తన్తే న అన్యస్య ఇతి? ఉచ్యతే–

మూ. చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మవిభాగశః,
తస్య కర్తారమపి మాం విద్ధ్యకర్తారమవ్యయమ్. 13

బాలానందిని

మానుషే ఇతి:- వర్ణాశ్రమాది కర్మాధికారం మనుష్యలోకంలోనే కాని ఇతరలోకాలలో లేదు అనే నియమం ఏమి నిమత్తం కలది(నియమానికి నిమిత్తం ఏమిటి)? లేదా వర్ణాశ్రమాది విభాగా లున్న మనుష్యులు అన్ని వైపులనుండీ నీ మార్గాన్నే అనుసరిస్తారు? ఇతరుల మార్గాన్ని ఎందుకు అనుసరించరు? సమాధానం చెప్పబడుచున్నది-

ప్ర.అ.చాతుర్వర్ణ్యమ్ ఇతి:-చాతుర్వర్ణ్యమ్=నాలుగు వర్ణాలు,గుణకర్మవిభాగశః = గుణములయొక్క,కర్మలయొక్క విభాగాన్ని అనుసరించి, మయా=నాచేత; సృష్టమ్ = సృజించబడినది. తస్య=అ చాతుర్వర్ణ్యానికి, కర్తారమ్=కర్తనే అయినా కూడ, మామ్ = నన్ను, అకర్తారమ్=కర్త కానివానిగా;విద్ధి=తెలుసుకొనుము.

భాష్యమ్

చాతుర్వర్ణ్యమితి:-చాతుర్వర్ణ్యం చత్వారః ఏవ వర్ణాః చాతుర్వర్ణ్యమ్, మయా ఈశ్వరేణ,సృష్టమ్ ఉత్పాదితమ్ **"బ్రాహ్మణోఽస్య ముఖమాసీత్"**(ఋ.సం.10.90.12; తై.ఆ.3.12.13)ఇత్యాదిశ్రుతేః.గుణకర్మవిభాగశః గుణవిభాగశః కర్మవిభాగశః చ. గుణాః సత్త్వరజస్తమాంసి.తత్ర,సాత్త్వికస్య సత్త్వప్రధానస్య బ్రాహ్మణస్య"శమః దమః తపః" (18.42) ఇత్యాదీని కర్మాణి.సత్త్వోపసర్జనరజఃప్రధానస్య క్షత్రియస్య "శౌర్యతేజః" ప్రభృతీని కర్మాణి(18.43)తమఉపసర్జనరజఃప్రధానస్య వైశ్యస్య కృష్యాదీని కర్మాణి(18.44). రజఉపసర్జనతమఃప్రధానస్య శూద్రస్య శుశ్రూషైవ కర్మ(18.44) ఇత్యేవం గుణకర్మవిభాగశః చాతుర్వర్ణ్యం మయా సృష్టమ్ ఇత్యర్థః.తచ్చేదం చాతుర్వర్ణ్యం న అన్యేషు లోకేషు, అతో "మానుషే లోకే" ఇతి విశేషణమ్.హన్త తర్హి చాతుర్వర్ణ్యసర్గాదేః కర్తృత్వాత్ తత్ఫలేనయుజ్యసే;అతః న త్వం నిత్యముక్తః,నిత్యేశ్వరః ఇతి? ఉచ్యతే - యద్యపి మాయాసంవ్యవహారేణ తస్య కర్మణః కర్తారమ్ అపి సన్తం మాం పరమార్థతః విద్ధి అకర్తారమ్,అతః ఏవ అవ్యయమ్ అసంసారిణం చ మాం విద్ధి.13

బాలానందిని

చాతుర్వర్ణ్యమితి:- చాతుర్వర్ణ్యం అనగా నాలుగు వర్ణాలు.అది ఈశ్వరుడనైన నాచేత సృష్టింపబడినది. **"బ్రాహ్మణోఽస్య ముఖమాసీత్"**(బ్రాహ్మణుడు ఈ పరమాత్మయొక్క ముఖంగా అయినాడు;పరమాత్మముఖంనుండి బ్రాహ్మణుడు పుట్టినాడు)ఇత్యాదిశ్రుతివాక్యం

ఈ విషయాన్నే చెపుతూన్నది. గుణవిభాగానుసారము,కర్మవిభాగానుసారమూ కూడ,గుణాలనగా సత్త్వ-రజస్-తమోగుణాలు. వాళ్లలో, సాత్త్వికుడైన,సత్త్వప్రధానుడైన,బ్రాహ్మణునకు శమం దమం మొదలైన కర్మలు, సత్త్వగుణం అప్రధానంగా ఉండి రజోగుణం ప్రధానంగా ఉన్న క్షత్రియునకు శౌర్యము తేజస్సు మొదలైన కర్మలు,తమస్సు అప్రధానంగా ఉండి రజస్సు ప్రధానంగా ఉన్న వైశ్యునకు కృషిమొదలైన కర్మలు,రజస్సు అప్రధానంగా ఉండి తమస్సు ప్రధానంగా ఉన్న శూద్రునకు శుశ్రూష మాత్రమే కర్మ అని ఈ విధంగా గుణకర్మ విభాగానుసారంగా చాతుర్వర్ణ్యం నాచేత సృజించబడింది అని అర్థం. ఈ చాతుర్వర్ణ్యం ఇతరలోకాలలో లేదు;అందుచేతనే (వెనుకటి శ్లోకంలో)"మానుషే లోకే"అని విశేషించి చెప్పబడింది. అటులనా!అయితే చాతుర్వర్ణ్యాన్ని సృష్టించడం మొదలైన కర్మకు కర్తవు గాన నీకు దాని ఫలంతో సంబంధం ఉంటుంది;అందుచేత నువ్వు నిత్యముక్తుడవు కావు,నిత్యేశ్వరుడవు కావు!సమాధానం చెప్పబడుచున్నది - మాయావ్యవహారంచేత(మాయ చేసినదానిని నాకు ఆరోపించడంచేత) చాతుర్వర్ణ్యసృష్టి అనే కర్మకు కర్తనే అయినా కూడ నన్ను,పరమార్థ స్థితిలో కర్తను కానివానినిగా తెలుసుకో,అందువల్లనే నేను అవ్యయుణ్ణి,సంసారం లేనివాణ్ణి అని తెలుసుకో. 13

భాష్యమ్

యేషాం తు కర్మణాం కర్తారం మాం మన్యసే,పరమార్థతః తేషామ్ అకర్తైవ అహం; యతః -

మా. న మాం కర్మాణి లిమ్పన్తి న మే కర్మఫలే స్పృహా,
ఇతి మాం యోఽభిజానాతి కర్మభిర్న స బధ్యతే. 14

బాలానందిని

యేషామితి:- నేను ఏ కర్మలకు కర్తను అని నీవు అనుకొంటున్నావో, వాస్తవంలో నేను వాటి కర్తను కాను. ఎందువల్ల ననగా-

ప్ర.అ.నేతి:- కర్మాణి=కర్మలు,మామ్=నన్ను,న లిమ్పన్తి=అంటవు. మే=నాకు,కర్మఫలే =కర్మల ఫలమునందు,స్పృహా=ఆసక్తి,న=లేదు. ఇతి=ఈ విధంగా,యః=ఎవడు,మామ్=నన్ను, అభిజానాతి=తన ఆత్మగా గుర్తిస్తాడో,సః=అతడు కూడ, కర్మభిః =కర్మలచేత,న బధ్యతే= బంధింపబడడు.

భాష్యమ్

నేతి:- న,మాం,తాని కర్మాణి,లిమ్పన్తి దేహాద్యారమ్భకత్వేన;అహంకారాభావాత్. న చ,తేషాం కర్మణాం,ఫలేషు,మే,స్పృహా తృష్ణా. యేషాం తు సంసారిణామ్ అహం

కర్తా ఇత్యభిమానః,కర్మసు స్పృహా తత్ఫలేషు చ,తాన్ కర్మాణి లిమ్పన్తీతి యుక్తమ్.తదభావాత్ న మాం కర్మాణి లిమ్పన్తి. ఇతి ఇత్యేవం యః అన్యోఽపి మామ్ ఆత్మత్వేన అభిజానాతి,న అహం కర్తా న మే కర్మఫలే స్పృహా ఇతి,సః కర్మభిః న బధ్యతే. తస్యాపి న దేహారమ్భకాణి కర్మాణి భవన్తి ఇత్యర్థః. 14

బాలానందిని

నేతి:–నన్ను ఆ కర్మలు అంటవు.దేహాదులను పుట్టించడం ద్వారా నన్ను బంధించవు. ఆ కర్మల ఫలములందు నాకు ఆసక్తి కూడ లేదు.ఏ సంసారుల కైతే "నేను కర్తను"అనే అభిమానం ఉంటుందో,కర్మలయందు వాటి ఫలాలయందు ఆసక్తి ఉంటుందో వాళ్లను కర్మలు అంటుతాయి అనేది యుక్తమే.అవి(అభిమానాదులు)లేకపోవడంవల్ల నన్ను కర్మలు అంటవు.ఈ విధంగా నన్ను ఎవడు తన ఆత్మనుగా గుర్తిస్తాడో,నేను కర్తను కాను,నాకు కర్మఫలమునందు ఆసక్తి లేదు అని అనుకొంటాడో,అతడు కర్మలచేత బంధించబడడు. అతడు చేసిన కర్మలు కూడ వానికి దేహాదులను పుట్టించవు అని అర్థం.

వి.:–పరమేశ్వరునికి కర్మఫలములమీద ఆసక్తి లేదు;అందుచేత పరమేశ్వరుడు కర్మలచేత లిప్తుడు కాడు అని క్షేత్రజ్ఞుడు(జీవుడు)తెలిసికొన్నంతమాత్రాన వాని కేమీ ప్రయోజనం ఉండదు.ఎవనికో ఏదో ఉందని తెలుసుకొనడంవల్ల మరొకనికి ప్రయోజనం ఏమిటి?అందుచేత "మామ్ అభిజానాతి"అనగా "నన్ను తన యథార్థ స్వరూపమునుగా ఎవడు గుర్తిస్తాడో"అని అర్థం.నేనే పరమాత్మను అని తన యథార్థస్వరూపం తెలిసిన జీవుడు కూడ పరమేశ్వరు డైన శ్రీకృష్ణుడు అనుకొన్నట్లు "**న మాం కర్మాణి లిమ్పన్తి న మే కర్మఫలే స్పృహా**"అనుకొంటాడు గాన వానికి కూడ కర్మబంధం ఉండదు అని భావం. 14

భాష్యమ్

నాహం కర్తా, న మే కర్మఫలే స్పృహా ఇతి –

మూ. ఏవం జ్ఞాత్వా కృతం కర్మ పూర్వైరపి ముముక్షుభిః,
కురు కర్మైవ తస్మాత్త్వం పూర్వైః పూర్వతరం కృతమ్. 15

బాలానందిని

నేతి:–"నేను కర్తను కాను;నాకు కర్మఫలంమీద ఆసక్తి లేదు"అనే భావంతో–

ప్ర.అ. ఏవమితి:– పూర్వైః=పూర్వీకు లైన, ముముక్షుభిః అపి=మోక్షేచ్ఛ కలవారి చేత గూడ, ఏవమ్=ఈ విధంగా జ్ఞాత్వా =తెలుసుకొని, కర్మ =కర్మ, కృతమ్=చేయబడినది. తస్మాత్=అందువలన,త్వమ్=నీవు, పూర్వైః = ప్రాచీనులచేత,కృతమ్ = ఆచరింపబడిన.

పూర్వతరమ్ = అతిప్రాచీన మైన (సంప్రదాయసిద్ధంగా వస్తూన్న), కర్మైవ = కర్మనే, కురు = చేయుము.

భాష్యమ్

ఏవమితి:- ఏవం జ్ఞాత్వా కృతం కర్మ,పూర్వైః అపి అతిక్రాన్తైః ముముక్షుభిః. కురు తేన కర్మైవ త్వం, న తూష్ణీమ్ ఆసనం, న సంన్యాసః కర్తవ్యః తస్మాత్ త్వం, పూర్వైరపి అనుష్ఠితత్వాత్.యది అనాత్మజ్ఞస్త్వం తదా ఆత్మశుద్ధ్యర్థం,తత్త్వవిత్ చేత్ లోకసంగ్రహార్థం,పూర్వైః జనకాదిభిః,పూర్వతరం కృతం, న అధునాతనం,కృతమ్ అనుష్ఠితమ్. 15

బాలానందిని

ఏవమితి:- ఈ విధంగా తెలుసుకొని, పూర్వులైన,భూతకాలంలో కలిసిపోయిన, ముముక్షువులచేత కూడ కర్మ చేయబడింది.అందుచేత నువ్వు కర్మనే చేయుము; ఊరక (ఏ పనీ చేయకుండా)కూర్చొనడం కాని,కర్మసంన్యాసం కాని చేయకూడదు.అందువలన, పూర్వికులచేత చేయబడిన దవడంవల్ల,నీవు,ఆత్మజ్ఞానవంతుడవు కాకపోతే అంతఃకరణశుద్ధి కోసం, తత్త్వజ్ఞానం కలిగినవాడ వైతే లోకసంగ్రహం నిమిత్తమూ,కర్మ చేయుము. అతి ప్రాచీన మైన,అధునాతనం కాని,ఈ కర్మ ప్రాచీనులైన జనకాదులచేత ఆచరించబడింది. 15

భాష్యమ్

తత్ర కర్మ చేత్ కర్తవ్యం త్వద్వచనాదేవ కరోమి అహమ్;కిం విశేషితేన "పూర్వైః పూర్వతరం కృతమ్"ఇతి? ఉచ్యతే-యస్మాత్ మహత్ వైషమ్యం కర్మణి;కథమ్?

మూ. కిం కర్మ కిమకర్మేతి కవయోఽప్యత్ర మోహితాః,
తత్తే కర్మ ప్రవక్ష్యామి యద్ జ్ఞాత్వా మోక్ష్యసేఽశుభాత్. 16

బాలానందిని

తత్రేతి:- సరే! కర్మయే చేయవలసి ఉంటే నువ్వు చెప్పావు కదా అనే చేస్తాను; "**పూర్వై పూర్వతరం కృతమ్**"అంటూ ఈ విశేషా లన్నీ చెప్పడం ఎందుకు?చెపుతున్నాను; విను.కర్మవిషయంలో చాలా వైషమ్యం(విరుద్ధాభిప్రాయం)ఉంది. ఎట్లనగా-

ప్ర.అ.కిమితి:- కర్మ=కర్మ అనగా, కిమ్=ఏమి?అకర్మ=అకర్మ అనగా, కిమ్=ఏమి. ఇతి = అని, అత్ర = ఈ విషయంలో, కవయః అపి =మేధావులు కూడ, మోహితాః = మోహం చెందారు(మోహింపబడినారు). యత్=దేనిని (ఏ కర్మాదికాన్ని) జ్ఞాత్వా = తెలిసికొని.

అశుభాత్=అశుభమునుండి, మోక్ష్యసే = ముక్తుడవు కాగలవో, తత్ = అట్టి, కర్మ = కర్మను గూర్చి (అకర్మను గూర్చి కూడ)తే = నీకు, ప్రవక్ష్యామి = చెప్పెదను.

భాష్యమ్

కిం కర్మేతి:- కిం కర్మ కిం చ అకర్మ ఇతి, కవయః మేధావినః అపి, 'అత్ర అస్మిన్ కర్మాదివిషయే, మోహితాః మోహం గతాః. అతః తే తుభ్యమ్,అహం కర్మ అకర్మ చ ప్రవక్ష్యామి. యద్ జ్ఞాత్వా విదిత్వా కర్మాది మోక్ష్యసే అశుభాత్ సంసారాత్.

బాలానందిని

కిమితి:- ఏది కర్మ,ఏది అకర్మ అని మేధావంతులు కూడ ఈ కర్మాదివిషయంలో మోహం చెంది ఉన్నారు.అందువల్ల నీకు నేను కర్మను గూర్చి,అకర్మను గూర్చి చెప్పగలను. ఏ కర్మాదికాన్ని తెలుసుకొని అశుభంనుండి,అశుభమైన సంసారంనుండి, ముక్తుడవు కాగలవో. 16

భాష్యమ్

న చ ఏతత్ త్వయా మన్తవ్యమ్-కర్మ నామ దేహాదిచేష్టా; లోకప్రసిద్ధమ్;అకర్మ తదక్రియా తూష్ణీమ్ ఆసనం;కిం తత్ర బోద్ధవ్యమ్ ఇతి. కస్మాత్?ఉచ్యతే-

మూ. కర్మణో హ్యపి బోద్ధవ్యం బోద్ధవ్యం చ వికర్మణః,
అకర్మణశ్చ బోద్ధవ్యం గహనా కర్మణో గతిః. 17

బాలానందిని

న చేతి:-కర్మ అంటే ఏముంది-దేహాదిచేష్టయే.అది లోకప్రసిద్ధమే.ఆ దేహాదిచేష్ట చేయకుండా ఊరక కూర్చొనడం అకర్మ. ఇంతే కదా? దీనిలో తెలిసికొనవలసినది ఏముంది? అని నువ్వు అనుకొనకూడదు.ఎందువల్ల ననగా-చెప్పబడుచున్నది.

ప్ర.అ. **కర్మణో హ్యపీతి:-** హి=ఎందువలన, కర్మణః అపి= కర్మనుండి, బోద్ధవ్యమ్ = తెలియదగినది ఉన్నదో,వికర్మణః చ = నిషిద్ధకర్మనుండి కూడ, బోద్ధవ్యమ్= తెలియదగినది ఉన్నదో,అకర్మణః చ = కర్మ చేయకుండా ఉండడంనుండి కూడ,బోద్ధవ్యమ్=తెలియదగినది ఉన్నదో,అందువల్ల,కర్మణః=కర్మయొక్క,గతిః=గతి,గహనా=తెలియ శక్యం కానిది.

భాష్యమ్

కర్మణః ఇతి:- కర్మణః శాస్త్రవిహితస్య హి యస్మాత్,అపి అస్తి బోద్ధవ్యం, బోద్ధవ్యం చ అస్తి ఏవ,వికర్మణః ప్రతిషిద్ధస్య,తథా అకర్మణశ్చ తూష్ణీంభావస్య బోద్ధవ్యమ్ అస్తి ఇతి త్రిష్వపి అధ్యాహారః కర్తవ్యః.యస్మాత్ గహనా విషమా దుర్జ్ఞానా,కర్మణః

ఇతి ఉపలక్షణార్థం కర్మాదీనాం కర్మాకర్మవికర్మణాం,గతిః యథాత్మ్యమ్ తత్త్వ మిత్యర్థః. 17

బాలానందిని

కర్మణ ఇతి:- ఎందువల్ల శాస్త్రవిహితమైన కర్మనుండి కూడ తెలియవలసినది ఉన్నదో, వికర్మణః = నిషేధించబడిన కర్మనుండి కూడ తెలియవలసినది ఉన్నదో, అట్లే, అకర్మణః = ఊరక ఉండుటనుండి కూడ తెలియవలసినది ఉన్నదో,అని మూడు చోట్లా కూడ 'అస్తి'అనే పదం అధ్యాహారం తెచ్చుకోవాలి.ఎందువలన గహనా = విషమమైనది తెలియ శక్యం కానిదో అందువలన. "కర్మణః"అనేది కర్మ మొదలుగా గల కర్మ-అకర్మ-వికర్మలకు ఉపలక్షణం.గతిః =యథార్థస్వరూపం అనగా తత్త్వం అని అర్థం. 17

భాష్యమ్

కిం పునః తత్త్వం కర్మాదేః యత్ బోద్ధవ్యం వక్ష్యామి ఇతి ప్రతిజ్ఞాతమ్?ఉచ్యతే-

మూ. కర్మణ్యకర్మ యః పశ్యేదకర్మణి చ కర్మ యః,
స బుద్ధిమాన్ మనుష్యేషు స యుక్తః కృత్స్నకర్మకృత్. 18

కిమితి:- ఏది తెలియదగినదో దానిని చెపుతాను అని దేనిని గూర్చి ప్రతిజ్ఞ చేయ బడినదో అట్టి కర్మాదికముయొక్క తత్త్వం ఏమిటి?చెప్పబడుచున్నది-

ప్ర.అ. **కర్మణీతి**:- యః=ఎవడు;కర్మణి=కర్మయందు,అకర్మ=అకర్మను,పశ్యేత్=చూస్తాడో,యః=ఎవడు,అకర్మణి=అకర్మయందు,కర్మ=కర్మను చూస్తాడో,సః=అతడు,మనుష్యేషు=మనుష్యులలో,బుద్ధిమాన్=బుద్ధిమంతుడు.సః=అతడు, యుక్తః=యోగసంపన్నుడు;కృత్స్నకర్మకృత్=సమస్తమైన కర్మను చేసినవాడు.

భాష్యమ్

కర్మణీతి:-కర్మణి-కర్మ క్రియతే ఇతి,వ్యాపారమాత్రమ్.తస్మిన్ కర్మణి అకర్మ కర్మాభావం,యః పశ్యేత్,అకర్మణి చ కర్మాభావే-కర్తృతన్త్రత్వాత్ ప్రవృత్తినివృత్త్యోః వస్తు అప్రాప్యైవ హి సర్వ ఏవ క్రియాకారకాదివ్యవహారః అవిద్యాభూమౌ ఏవ-కర్మ యః పశ్యేత్ పశ్యతి,సః బుద్ధిమాన్ మనుష్యేషు,సః యుక్తః యోగీ, కృత్స్నకర్మకృత్ సమస్త కర్మకృత్ చ సః ఇతి స్తూయతే కర్మాకర్మణోః ఇతరేతరదర్శీ.

బాలానందిని

కర్మణీతి:- "క్రియతే ఇతి కర్మ"అనే విగ్రహంచేత చేయబడే వ్యాపారమాత్రం, అనగా ప్రతి పనీ కూడ కర్మ అని చెప్పబడుతుంది.ఆ కర్మయందు, ఎవడు,అకర్మను, కర్మా

భావాన్ని చూస్తాడో, అకర్మయందు,కర్మాభావమునందు-ప్రవృత్తి,నివృత్తి అనేవి కర్తకు అధీనమైనవి. అందువల్ల సమస్తమైన క్రియలు, కారకములు అనే వ్యవహారం, (వీటి వ్యవహారం) పరమార్థవస్తువును పొందక మునుపు అవిద్యావస్థలో మాత్రమే ఉంటుంది గాన- కర్మను చూస్తాడో అతడు మనుష్యులలో బుద్ధిమంతుడు.యుక్తుడు అనగా యోగి; అతడే సమస్త కర్మలను చేసినవాడు. ఈ విధంగా కర్మాకర్మల భేదాన్ని గుర్తించగలవాడు స్తుతింపబడు చున్నాడు.

భాష్యమ్

నను కిమిదం విరుద్ధమ్‌త ఉచ్యతే కర్మణి అకర్మ యః పశ్యేత్ ఇతి,అకర్మణి చ కర్మ ఇతి? న హి కర్మ అకర్మ స్యాత్ అకర్మ వా కర్మ? తత్ర విరుద్ధం కథం పశ్యేత్ ద్రష్టా?నను అకర్మైవ పరమార్థతః సత్ కర్మవత్ అవభాసతే మూఢదృష్టేః లోకస్య తథా కర్మైవ అకర్మవత్;తత్ర యథాభూతదర్శనార్థమాహ భగవాన్ **"కర్మణ్యకర్మ యః పశ్యేత్"** ఇత్యాది. అతో న విరుద్ధమ్.బుద్ధిమత్త్వాద్యుపపత్తేశ్చ. బోద్ధవ్యమ్ ఇతి చ యథాభూతదర్శనమ్ ఉచ్యతే.న చ విపరీతజ్ఞానాత్ అశుభాత్ మోక్షణం స్యాత్. **"యద్ జ్ఞాత్వా మోక్ష్యసేஉశుభాత్"** ఇతి చ ఉక్తమ్. తస్మాత్ కర్మాకర్మణీ విపర్యయేణ గృహీతే ప్రాణిభిః; తద్విపర్యయగ్రహణనివృత్త్యర్థం భగవతో వచనం **"కర్మణ్యకర్మ యః"**ఇత్యాది. న చ అత్ర కర్మాధికరణమ్ అకర్మ అస్తి కుణ్డే బదరాణీవ;నాపి అకర్మాధికరణం కర్మ అస్తి;కర్మాభావత్వాత్ అకర్మణః. అతః విపరీతగృహీతే ఏవ కర్మాకర్మణీ లౌకికైః యథా మృగతృష్ణికాయామ్ ఉదకం, శుక్తికాయాం వా రజతమ్.

బాలానందిని

అవ:-ఎవడు కర్మయందు అకర్మను చూస్తాడో,అకర్మయందు కర్మను చూస్తాడో వాడు బుద్ధిమంతుడు అని చెప్పబడింది.దీని భావం ఇది. ప్రతీ పురుషుడూ నేను ఈ పనులు చేస్తున్నాను.నేను కర్తను అని అనుకొంటూ ఉంటాడు.వాస్తవంలో ఆత్మకు కర్తృత్వం లేదు.పనులు చేసేది దేహేంద్రియాదిసంఘాతమే.అందుచేత నేను చేస్తున్నాను అని అనుకొనడం భ్రాంతిజ్ఞానం.దేహేంద్రియాదులే చేస్తున్నాయి అనే జ్ఞానం యథార్థజ్ఞానం. అందుచేత కర్మ చేస్తూన్నట్లు భావింపబడుతూన్న ఆత్మయందు అకర్మను(కర్మాభావాన్ని) గుర్తించినవాడు బుద్ధిమంతుడు. ఇట్లే ఒక్కొకప్పుడు పురుషుడు-దేహేంద్రియాదులు ఏ కర్మా చేయకుండా ఉన్నప్పుడు, నే నేమీ చేయడంలేదు అనుకొంటుంటాడు. దేహేంద్రియాదులలో ఉన్న కర్మా భావాన్ని తనమీద ఆరోపించుకొంటున్నాడు.అది కూడ భ్రాంతిజ్ఞానమే.ఇంతవరకు ఏవేవో పనులు చేస్తూన్న దేహేంద్రియాదిసంఘాతం ఆ కర్మలనుండి నివర్తించింది.అందుచేత అది అకర్మ వలె ఉన్నది;అని గ్రహించడం

యథార్థజ్ఞానం. అయితే-కర్మలు చేయడం మానడం అనేవి అవిద్యావస్థలోనే ఉంటాయి. అందుచేత దేహేంద్రియాదిసంఘాతం కర్మలు చేయకుండా అకర్మగా ఉన్న దనగా అది పనిచేయకపోవడం అనే కర్మ చేస్తూన్నది అని అర్థం. హస్తపాదాదులను వెనుకకు, ముందుకు ప్రక్కలకూ ప్రసరింపచేయడం ఏ విధంగా కర్మయో వాటిని ముణిచిపెట్టుకొని కూర్చొనడం కూడ కర్మయే. ఈ విధంగా దేహేంద్రియాదులలోని అకర్మయందు కర్మను చూచేవాడు కూడ బుద్ధిమంతుడే అని చెప్పబడింది.

'కర్మణి' అనే పదం సప్తమీవిభక్తిలో ఉన్నది. సప్తమీవిభక్తి ఆధారాన్ని (అధికరణాన్ని) బోధిస్తుంది. ఔపశ్లేషికం, వైషయికం, అభివ్యాపకం అని ఆధారం మూడు విధాలు "కటే ఆస్తే" (చాపలో కూర్చున్నాడు) అన్నప్పుడు కటం ఔపశ్లేషికాధారం. "మోక్షే స్పృహా అస్తి" (మోక్షమునందు-మోక్షం విషయంలో-ఆసక్తి ఉన్నది)అన్నప్పుడు అది వైషయికాధారం. "తిలేషు తైలమ్" ఇత్యాదులలో అభివ్యాపకాధారం. ఇక్కడ "కర్మణి" అన్నపుడు కర్మ వైషయికాధారమా లేక ఔపశ్లేషికాధారమా అని నిర్ణయించడానికి ముందు ఔపశ్లేషికాధారత్వం కుదరదు అని అశంకాపూర్వకంగా ప్రతిపాదించబడనున్నది. ముందుగా విరోధాన్ని అశంకిస్తున్నాడు-

నను ఇతి:- కర్మలో అకర్మను చూడాలి, అకర్మలో కర్మను చూడాలి అని ఏమిటిది విరుద్ధంగా చెప్పబడుతున్నది? కర్మ అకర్మ కాదు, అకర్మ కర్మ కాదు కదా? అలాంటప్పుడు వాటిని చూచేవాడు విరుద్ధంగా ఎలా చూస్తాడు? సమాధానం చెపుతున్నారు - **నను ఇతి:-** వాస్తవంలో కర్మరహితమే అయినా కూడ, బ్రహ్మ, మూఢదృష్టి గల లోకానికి కర్మ కలదిగా కనబడుతున్నది; అల్లే నిజానికి ఏ దేహాదికానికి (కర్మవిరమణరూపమైన)కర్మ ఉన్నదో అది అకర్మ వలె కనబడుతున్నది. అందుచేత ఉన్న దున్నట్లు యథార్థస్వరూపాన్ని తెలుసుకోవాలి అని చెప్పడంకోసమై భగవంతుడు**"కర్మణ్యకర్మ యః పశ్యేత్"**ఇత్యాదికం చెపుతున్నాడు. అందుచేత ఈ వాక్యం విరుద్ధం కాదు. బుద్ధిమత్త్వాదికం కూడ కుదురుతుంది(అనగా ఈ విధ మైన యథాభూతదర్శనం ఉంటేనే**"స బుద్ధిమాన్"**అని చెప్పిన బుద్ధిమత్త్వం కుదురుతుంది). (**"కర్మణో హ్యపి బోద్ధవ్యమ్"**ఇత్యాదిపూర్వశ్లోకంలో)'బోద్ధవ్యమ్'అని యథాభూతదర్శనం(ఉన్నదానిని ఉన్నట్లు చూడడం)చెప్పబడుతున్నది. విపరీతజ్ఞానం ఉన్నట్లయితే అశుభం నుండి మోక్షణం కుదరదు. **"యద్ జ్ఞాత్వా మోక్ష్యసేఽశుభాత్"**అని(వెనుకటి శ్లోకంలో) చెప్పబడింది. అందువల్ల-ప్రాణులు కర్మాకర్మలను విపరీతంగా గ్రహిస్తున్నారు. ఆ విపర్యయజ్ఞానం పోవాలి అనే ఉద్దేశ్యంతో భగవంతుడు **"కర్మణ్యకర్మ"**ఇత్యాదికం చెపుతున్నాడు. అంతేనే కాని కుండలో రేగిపళ్లు ఉన్నట్లు కర్మలో అకర్మ ఉంది, అకర్మలో కర్మ ఉంది అని కాదు (భగవంతుని అభిప్రాయం). 'అకర్మ'అనగా కర్మాభావం కదా? (అది కర్మకు ఆధారం ఎలా అవుతుంది?)అందుచేత- ఎండమావులలో ఉదకం వలె, ముత్యపు చిప్పమీద వెండి

వలె లౌకికులచేత కర్మాకర్మలు విపరీతంగా గ్రహించబడుతున్నాయి. (అనగా ఇక్కడ సప్తమికి ఔపశ్లేషికాధారం గాని,అభివ్యాపకాధారం గాని అర్థం కాదు, వైషయికాధారం అర్థం. శుక్తి విషయంలో రజతం కనబడి నట్లు అకర్మవిషయంలో కర్మ,కర్మవిషయంలో అకర్మ మూఢాత్ము లకు కనబడుతున్నాయి. అని భావం).

భాష్యమ్

నను కర్మ కర్మైవ సర్వేషామ్; న క్వచిద్వ్యభిచరతి? తత్ న.నౌస్థస్య నావి గచ్ఛన్త్యాం తటస్థేషు అగతిషు నగేషు ప్రతికూలగతిదర్శనాత్,దూరేషు చక్షుషః అసంనికృష్టేషు గచ్ఛత్సు గత్యభావదర్శనాత్.ఏవమ్ ఇహాపి అకర్మణి "అహం కరోమి" ఇతి కర్మదర్శనం, కర్మణి చ అకర్మదర్శనం విపరీతదర్శనమ్;యేన తన్నిరాకరణార్థ ముచ్యతే**"కర్మణ్యకర్మ యః పశ్యేత్"**ఇత్యాది. తత్ ఏతత్ ఉక్తప్రతివచనమ్ అపి అసకృత్, అత్యన్తవిపరీతదర్శనభావితతయా మోముహ్యమానః లోకః శ్రుతమపి అసకృత్ తత్త్వం విస్మృత్య విస్మృత్య, మిథ్యాప్రసంగమ్ అవతార్య అవతార్య చోదయతి ఇతి పునః పునః ఉత్తరమ్ ఆహ భగవాన్, దుర్విజ్ఞేయత్వం చ. ఆలక్ష్య వస్తునః.**"అవ్యక్తో౽యమచిన్త్యో౽యమ్"**(2.20),"న జాయతే మ్రియతే"(2.25)ఇత్యాదినా ఆత్మని కర్మాభావః శ్రుతిస్మృతిన్యాయప్రసిద్ధః ఉక్తః వక్ష్యమాణః చ తస్మిన్ ఆత్మని కర్మాభావే అకర్మణి కర్మవిపరీతదర్శనమ్ అత్యన్తనిరూఢమ్;యతః-**"కిం కర్మ కిమకర్మేతి కవయో౽ప్యత్ర మోహితాః"** (4.16).దేహాద్యాశ్రయం చ కర్మ ఆత్మని ఆరోప్య "అహం కర్తా;మమ ఏతత్ కర్మ;మయా అస్య కర్మణః ఫలం భోక్తవ్యమ్"ఇతి చ;తథా-"అహం తూష్ణీం భవామి యేన అహం నిరాయాసః అకర్మా సుఖీ స్యామ్" ఇతి కార్యకరణాశ్రయం వ్యాపారోపరమం,తత్కృతం చ సుఖిత్వమ్ ఆత్మని అధ్యారోప్య "న కరోమి కించిత్, తూష్ణీమ్ ఆసే"ఇతి అభిమన్యతే లోకః.తత్ర ఇదం లోకస్య విపరీతదర్శనాప నయనాయ ఆహ భగవాన్-**"కర్మణ్యకర్మ యః పశ్యేత్"**ఇత్యాది.

బాలానందిని

నన్వితి:-(ఆక్షేపం)కర్మ అందరికీ కర్మయే కదా?అది ఎక్కడా కూడ వ్యభి చరించదు(కర్మ కాకుండా పోదు).(సమాధానం)అలా కాదు.నావ ప్రయాణం చేస్తున్నప్పుడు నావలో ఉన్నవానికి, నడవకుండా ఒడ్డుమీద నున్న చెట్లు ఎదురుగా వస్తున్నట్లు కనబడతాయి. చూపుకు చాలా దూరంగా ఉన్నవి నడుస్తూన్నా నడవ నట్లు కనబడతాయి. అట్లే ఇక్కడ కూడ కర్మ లేని ఆత్మయందు నేను "కర్మ చేస్తూన్నాను"అని కర్మ ఉన్నట్లు కనబడడం, కర్మ

యందు కర్మ లేనట్లు కనబడడం అనే విపరీతదర్శనం ఉంది. అందుచేతనే ఆ విపరీత దర్శనాన్ని నిరాకరించడానికి **"కర్మణ్యకర్మ యః పశ్యేత్"** ఇత్యాదికం చెప్పబడుచున్నది. (**"ఉక్తప్రతివచనమపి"**అనేది**"మిథ్యాప్రసంగమ్"**అనేదానికి విశేషణం). చాల విపరీత మైన దృష్టితో నిండి ఉండడంచేత అత్యధికంగా మోహం చెందుతూన్న లోకం అనేకపర్యాయాలు వినబడిన దైనా కూడ తత్త్వాన్ని మరచిపోయి,అనేకపర్యాయాలు సమాధానం చెప్పినా కూడ భ్రాంతికల్పిత మైన ప్రసంగాన్ని (ఆత్మకు కర్తృత్వాదిసంబంధాన్ని)మాటిమాటికీ లేవనెత్తుతూ లేవనెత్తుతూ ప్రశ్నిస్తూంటుంది;అందువల్లా,ఆత్మస్వరూపం తెలుసుకొనడానికి చాల కష్ట మైన దని గుర్తించీ భగవంతుడు మాటి మాటికి సమాధానం చెపుతూ ఉంటాడు. శ్రుతులలోను, స్మృతులలోను, న్యాయానుసారమూ కూడ ప్రసిద్ధమైన,ఆత్మలో కర్మ లేదు అనే విషయం **"అవ్యక్తోఽయమచిన్త్యో యమ్" "న జాయతే మ్రియతే వా"** ఇత్యాదివాక్యాలలో చెప్పబడింది;ముమ్మందు చెప్పబడబోతున్నది కూడ. అట్టి అకర్మ యైన,కర్మ లేని, ఆత్మ విషయంలో కర్మ అనే విపరీతంయొక్క దర్శనం బాగా పాతుకొనిపోయి ఉంది;ఎందువల్ల ననగా ఏది కర్మ ఏది అకర్మ అనే విషయంలో కవులు కూడ మోహితులై ఉన్నారు. దేహాదులు ఆశ్రయంగా గల (దేహాదులలో ఉన్న)కర్మను ఆత్మయందు ఆరోపించుకొని "నేను కర్తను, ఇది నా కర్మ నేను దీని ఫలం అనుభవించాలి"అనీ, అట్లే "నేను ఊరకనే ఉంటాను, ఏ పనీ చేయకుండా,ఆయాసం లేనివాడనై సుఖంగా ఉంటాను"అనీ అంటూ దేహము ఇంద్రియాలు ఆశ్రయంగా గల వ్యాపారం నిలచిపోవడాన్నీ,దానివల్ల కలిగే సుఖాన్నీ ఆత్మయందు ఆరోపించి, "నే నేమీ చేయడంలేదు,సుఖంగా ఉన్నాను"అని లోకం అనుకొంటూ న్నది. లోకాని కున్న ఈ విపరీతదర్శనాన్ని తొలగించడం కోసమై భగవంతుడు ఈ **"కర్మణ్య కర్మ యః పశ్యేత్"**ఇత్యాదికం చెపుతున్నాడు.

భాష్యమ్

అత్ర చ కర్మ కర్మైవ సత్ కార్యకరణాశ్రయం కర్మరహితే అవిక్రియే ఆత్మని సర్వైః అధ్యస్తమ్; యతః పణ్డితో పి "అహం కరోమి" ఇతి మన్యతే- అతః ఆత్మ సమవేతతయా సర్వలోకప్రసిద్ధే కర్మణి, నదీకూలస్థేష్వివ వృక్షేషు గతిః ప్రాతిలోమ్యేన, అకర్మ కర్మాభావం యథాభూతం, గత్యభావమివ వృక్షేషు, యః పశ్యేత్, అకర్మణి చ కార్యకరణవ్యాపారోపరమే,కర్మవత్ ఆత్మన్యధ్యారోపితే, "తూష్ణీమ్ అకుర్వన్ సుఖమ్ ఆసే"ఇతి అహంకరాభిసంధిహేతుత్వాత్,తస్మిన్ అకర్మణి చ కర్మ యః పశ్యేత్; యః ఏవం కర్మాకర్మవిభాగజ్ఞః సః బుద్ధిమాన్ పణ్డితః మనుష్యేషు, సః యుక్తః యోగీ, కృత్స్నకర్మకృచ్చ,సః అశుభాత్ మోక్షితః కృతకృత్యో భవతి ఇత్యర్థః.

బాలానందిని

అత్రేతి:- దేహేంద్రియాలను ఆశ్రయించి ఉన్న కర్మ కర్మగానే ఉంటూ కర్మ రహితమూ, వికారాలు లేనిదీ అయిన ఆత్మయందు, అందరిచేత అధ్యసించబడుచున్నది (ఆరోపించ బడుచున్నది). పండితుడు కూడ "నేను చేస్తున్నాను"అని అనుకొంటాడు కదా? అందువల్ల, నదీతీరంమీద ఉన్న చెట్లమీద ఎదురుగా నడిచిరావడాన్ని ఆరోపించి నట్లు,ఆత్మతో సంబంధించి నట్లుగా సర్వలోకప్రసిద్ధ మైన కర్మయందు, ఎవడు వృక్షాలయందు గత్యభావాన్ని చూచి నట్లు యథార్థ మైన అకర్మను(కర్మాభావాన్ని)చూస్తాడో,దేహేంద్రియాల వ్యాపారం ఉపసంహరించడం అనే ఏ అకర్మ,"నేను ఏమీ చేయకుండా సుఖంగా కూర్చున్నాను"అను అహంకారపూర్వక మైన అభిప్రాయానికి హేతువు అవడంచేత కర్మ వలెనే ఆత్మయందు ఆరోపించబడుచున్నదో అట్టి అకర్మయందు కర్మను ఎవడు చూస్తాడో, అట్టి ఈ విధంగా కర్మాకర్మల విభాగం తెలుసుకొన్నవాడు మనుష్యులలో బుద్ధిమంతుడు, పండితుడు, అతడే యుక్తుడు అనగా యోగి, సమస్తకర్మలను చేసినవాడు. అతడు అశుభంనుండి ముక్తుడై కృతకృత్యు డవుతాడు అని అర్థం.

భాష్యమ్

అయః. శ్లోకః అన్యథా వ్యాఖ్యాతః కైశ్చిత్. కథమ్? నిత్యానాం కిల కర్మణామ్ ఈశ్వరార్థే అనుష్ఠీయమానానాం తత్ఫలాభావాత్ అకర్మాణి తాని ఉచ్యన్తే,గౌణ్యా వృత్త్యా. తత్ర నిత్యే కర్మణి అకర్మ యః పశ్యతి ఫలాభావాత్,యథా ధేనుః అపి గౌః అగౌః ఉచ్యతే క్షీరాఖ్యం ఫలం న ప్రయచ్ఛతి ఇతి,తద్వత్. తథా నిత్యాకరణే తు అకర్మణి కర్మ యః పశ్యేత్ నరకాదిప్రత్యవాయఫలం ప్రయచ్ఛతి ఇతి. నైతత్ యుక్తం వ్యాఖ్యానమ్. ఏవం జ్ఞానాత్ అశుభాత్ మోక్షానుపపత్తేః, **"యద్ జ్ఞాత్వా మోక్ష్యసేఽశుభాత్"** ఇది భగవతా ఉక్తం బాధ్యేత. కథమ్? నిత్యానామ్ అనుష్ఠానాత్ అశుభాత్ స్యాన్నామ మోక్షణం,న తు తేషాం ఫలాభావజ్ఞానాత్. న హి నిత్యానాం ఫలాభావజ్ఞానం అశుభ ముక్తిఫలత్వేన చోదితం,నిత్యకర్మజ్ఞానం వా. న చ భగవతా ఇహైవ ఉక్తమ్.

బాలానందిని

అవ:- ఇప్పుడు వృత్తికారుని మతం అనువదించి ఖండిస్తున్నారు-**అయమితి**:- కొందరిచేత ఈ శ్లోకం మరొక విధంగా వ్యాఖ్యానింపబడింది. ఎట్లు? ఈశ్వరార్పణబుద్ధితో చేసిన నిత్యకర్మలు తమ ఫలం ఇవ్వవు గాన అవి, గౌణవృత్తిచేత, అకర్మ లని చెప్పబడతాయి. నిత్యకర్మలను ఆచరించకపోవడం అనేది అకర్మ. అయితే అది(చేయకపోవడం)ప్రత్యవాయం అనే ఫలాన్ని ఇవ్వడంచేత గౌణవృత్తిచేతనే కర్మ అని చెప్పబడుతుంది. పాలు అనే ఫలాన్ని

ఇవ్వకపోవడంచేత ఆవును కూడ ఇది ఆవు కాదు అన్నట్లు, ఫలం ఇవ్వని(ఈశ్వరార్పణ బుద్ధితో చేసే)నిత్యకర్మయందు అకర్మను ఎవడు చూస్తాడో,అట్లే నిత్యకర్మలను ఆచరించక పోవడం అనే అకర్మయందు,అది నరకాదిప్రత్యవాయఫలాన్ని ఇవ్వడంచేత, కర్మను ఎవడు చూస్తాడో(అతడు బుద్ధిమంతుడు)అని (వాళ్లు వ్యాఖ్యానించారు). ఇది యుక్తమైన వ్యాఖ్యానం కాదు. ఈ విధంగా తెలుసుకొనడంవల్ల అశుభాలనుండి మోక్షం కలగదు గాన"యద్ జ్ఞాత్వా మోక్ష్యసేఽశుభాత్"అను భగవంతుడు చెప్పిన వాక్యం బాధితం(అర్థరహితం)అవుతుంది. ఎట్లు?నిత్యకర్మలను అనుష్ఠించడంచేత అశుభంనుండి మోక్షణం కలిగితే కలగవచ్చును; అంతేనే కాని వాటికి ఫలంలేదు అని తెలుసుకొనడంవల్ల కలగదు.నిత్యకర్మలకు ఫలం లేదని తెలుసుకొన్నా, లేదా నిత్యకర్మలను గూర్చి తెలుసుకొన్నా అశుభాలనుండి ముక్తి అనే ఫలం లభిస్తుంది అని ఎక్కడా (శ్రుతిస్మృత్యాదులలో)విధింపబడలేదు(చెప్పబడలేదు). ఈ భగవద్గీతలలోనే భగవంతుడు కూడ చెప్పలేదు.

భాష్యమ్

ఏతేన అకర్మణి కర్మదర్శనం ప్రత్యుక్తమ్.న హి అకర్మణి కర్మేతి దర్శనం కర్తవ్యతయా ఇహ చోద్యతే,నిత్యస్య తు కర్తవ్యతామాత్రమ్.న చ అకరణాత్ నిత్యస్య ప్రత్యవాయో భవతి ఇతి విజ్ఞానాత్ కించిత్ ఫలం స్యాత్.నాపి నిత్యాకరణం జ్ఞేయత్వేన చోదితమ్.నాపి కర్మ అకర్మ ఇతి మిథ్యాదర్శనాత్ అశుభాత్ మోక్షణమ్, బుద్ధిమత్త్వమ్, యుక్తతా, కృత్స్నకర్మకృత్త్వాది చ ఫలమ్ ఉపపద్యతే, స్తుతిర్వా.మిథ్యాజ్ఞానమేవ హి సాక్షాత్ అశుభరూపం,కుతః అన్యస్మాత్ అశుభాత్ మోక్షణమ్?న హి తమః తమసః నివర్తకం భవతి.

బాలానందిని

ఏతేనేతి: -దీనిచేత(కర్మయందు అకర్మను చూడడం విషయంలో చెప్పిన యుక్తిచేత) అకర్మయందు కర్మను చూడడం కూడ నిరాకరించబడినట్లే. అకర్మయందు కర్మను చూడాలి అని ఇక్కడ విధించబడడంలేదు కదా?నిత్యకర్మ ఆచరించదగినది అని మాత్రమే విధించ బడుచున్నది.నిత్యకర్మను చేయకపోతే ప్రత్యవాయం కలుగుతుంది అని తెలుసుకొనడంవల్ల ఫలం ఏమీ కలగదు.నిత్యకర్మను చేయకపోవడాన్ని గూర్చి తెలుసుకోవాలి అనే విధి కూడ ఎక్కడా లేదు.అంతే కాక-కర్మను అకర్మ అని గ్రహించే మిథ్యాజ్ఞానంవల్ల (ఒక వస్తువును మరొక దానినిగా గ్రహిస్తే అది భ్రాంతి జ్ఞానమే అవుతుంది గాన కర్మను అకర్మగా గ్రహిస్తే అది భ్రాంతియే అని భావం) అశుభంనుండి మోక్షణము,బుద్ధిమత్త్వము,యుక్తత్వము, కృత్స్నకర్మకృత్త్వము మొదలైన ఫలం గాని,స్తుతి గాని ఉపపన్నం కాదు కదా? మిథ్యా

జ్ఞానమే సాక్షాత్తూ అశుభం అయినప్పుడు మరొక అశుభంనుండి విడిపింపచేయడం అనేది ఎక్కడ కుదురుతుంది. చీకటి చీకటిని తొలగించదు కదా?

వి.:- సమాన మైన గుణాలు ఉండడంచేత ఒకదానిని మరొకటిగా చెప్పడం జరుగుతుంది. సింహంలో ఉన్న శౌర్యధైర్యాదులవంటి శౌర్యధైర్యాదు లుండడంచేత “ఈ వీరుడు సింహం’అంటాం. ఇక్కడ సింహశబ్దం గౌణవృత్తిచేత వీరుని విషయంలో ప్రయోగించబడింది. శబ్దం అర్థం బోధించడం అనే వ్యాపారం(పని)చేస్తుంది. వ్యాపారానికే వృత్తి అని కూడ పేరు. గుణసామ్యాన్ని పట్టి ఒక శబ్దం తన అసలు అర్థం కాక మరొక అర్థాన్ని బోధించే వృత్తి గౌణవృత్తి.

భాష్యమ్

నను కర్మణి యత్ అకర్మదర్శనమ్ అకర్మణి వా కర్మదర్శనం న తత్ మిథ్యా జ్ఞానమ్; కిం తర్హి? గౌణం ఫలభావాభావనిమిత్తమ్. న. కర్మాకర్మవిజ్ఞానదపి గౌణాత్ ఫలా శ్రవణాత్. నాపి శ్రుతహాన్యశ్రుతకల్పనయా కశ్చిద్విశేషో లభ్యతే. స్వశబ్దేనాపి శక్యం వక్తుం నిత్యకర్మణాం ఫలం నాస్తి, అకరణాచ్చ తేషాం నరకపాతః స్యాత్ ఇతి. తత్ర వ్యాజేన పరవ్యామోహరూపేణ “కర్మణ్యకర్మ యః పశ్యేత్” ఇత్యాదినా కిమ్? తత్రైవం వ్యాచక్షాణేన భగవతోక్తం వాక్యం లోకవ్యామోహార్థమ్ ఇతి వ్యక్తం కల్పితం స్యాత్. న చ ఏతత్ ఛద్మరూపేణ వాక్యేన రక్షణీయం వస్తు; నాపి శబ్దాన్తరేణ పునః పునః ఉచ్య మానం సుబోధం స్యాత్ ఇత్యేవం వక్తుం యుక్తమ్. “కర్మణ్యేవాధికారస్తే”(2.47)ఇత్యత్ర హి స్ఫుటతరః ఉక్తః అర్థః న పునః వక్తవ్యః భవతి. సర్వత్ర చ ప్రశస్తం బోద్ధవ్యం చ కర్తవ్యమేవ; న నిష్ప్రయోజనం బోద్ధవ్యమ్ ఇత్యుచ్యతే. న చ మిథ్యాజ్ఞానం బోద్ధవ్యం భవతి, తత్ప్రత్యుపస్థాపితం వా వస్త్వాభాసమ్.

బాలానందిని

నన్వితి:- (ఆశంక)కర్మయందు అకర్మను చూడడం, అకర్మయందు కర్మను చూడడం అనేది మిథ్యాజ్ఞానం కాదు. మరే మనగా-ఫలం ఉండడం లేకపోవడం అనేదానినిపట్టి ఏర్పడిన గౌణజ్ఞానం(ఫలం లేకపోతే అకర్మగా చూడా లన్నాం, ఫలం ఉంటే కర్మగా చూడా లన్నాం అని భావం). (సమాధానం). అది యుక్తం కాదు; గౌణమైన కర్మాకర్మవిజ్ఞానంవల్ల ఫలం ఉంటుం దని ఎక్కడా వినబడలేదు.

అవ.:- కర్మను అకర్మగాను, అకర్మను కర్మగాను చూడాలి అని అంటూ గౌణజ్ఞానాన్ని చెప్పడం అనే మిషచేత నిత్యకర్మలు తప్పకుండా చెయ్యాలి అని చెప్పడమే భగవంతుని ఉద్దేశ్యం అంటాం అను పూర్వపక్షియొక్క ఆశంకకు సమాధానం చెపుతున్నారు-

నాపేతి:-స్పష్టంగా వినబడుతున్నదానిని విడవడం అనే శ్రుతహానిచేత, వినబడనిదానిని కల్పించడం అనే అశ్రుతపరికల్పనచేత విశేషం ఏదీ లభించడం లేదు కదా?(జ్ఞానం వల్ల అశుభమోక్షణం కలుగుతుంది అని స్పష్టంగా వినబడుతున్నది.దానిని కాదని ఇక్కడ నిత్యకర్మానుష్ఠానం విధించబడుతున్నది అని వినబడనిదానిని కల్పించడంవల్ల విశిష్టమైన ప్రయోజనం ఏదీ లేదు అని అర్థం).నిత్యకర్మలకు ఫలం ఉండదు;చేయకపోతే నరకపాతం కలుగుతుంది అని స్వశబ్దాలచేతనే(ప్రత్యక్షంగా)చెప్పవచ్చును కదా?పరులకు వ్యామోహం కలిగించే"కర్మణ్యకర్మ యః పశ్యేత్"అంటూ వ్యాజంతో(మిషతో)చెప్పడం ఎందుకు?(ఈ శ్లోకానికి)ఈ విధంగా వ్యాఖ్యానం చేసినవాడు భగవంతుని ఈ వాక్యం లోకాన్ని మోహపెట్టడం కోసం చెప్పబడింది అని స్పష్టంగా కల్పించినవా డవుతాడు. ఈ విషయం ఛద్మరూపమైన వాక్యంచేత(రహస్యార్థమైన మాటలచేత code language)గూఢంగా ఉంచదగినది కాదు. చెప్పినదానినే మరొక శబ్దంచేత మళ్లీ మళ్లీ చెపితే సులభంగా అర్థం అవుతుంది అనే అభిప్రాయంతో ఈ విధంగా చెప్పడం యుక్తం కాదు."కర్మణ్యేవాధికారస్తే" అనే చోటనే అతిస్పష్టంగా చెప్పబడిన విషయాన్ని మళ్లీ చెప్పవలసిన అవసరం లేదు.(మొదట చెప్పినది అస్పష్టంగా ఉన్నదేమో నని మళ్లీ స్పష్టంగా చెపితే చెప్పవచ్చును.మొదట సుస్పష్టంగా చెప్పిన తరువాత మళ్లీ అస్పష్టశబ్దాలలో చెప్పడంలో ప్రయోజనం ఏముంటుంది అని భావం).ఏది ప్రశస్త మైనదో,ఏది ఆచరించదగినదో అదే తెలియదగినది అని అంతటా (లోకంలోను,వేదంలోను కూడ)చెప్పబడుతుంది;అంతేనే కాని నిష్ప్రయోజన మైనదానిని బోద్ధవ్యం(తెలియదగినది)అని అనరు.అందుచేత మిథ్యాజ్ఞానం)కాని, ఆ మిథ్యాజ్ఞానం ద్వారా ప్రత్యుపస్థాపిత మైన (అందించబడిన) వస్త్వాభాసం కాని బోద్ధవ్యం కాజాలదు.(ఈ విధంగా గౌణజ్ఞానపక్షం నిఃసార మైనది.)

భాష్యమ్

నాపి నిత్యానామ్ అకరణాత్ అభావాత్ ప్రత్యవాయభావోత్పత్తిః; **"నాసతో విద్యతే భావః"**(2.16)ఇతి, **"కథమసతః సజ్జాయేత"**(ఛా.ఉ.6.2.2)ఇతి చ దర్శితమ్. అసతః సజ్జన్మప్రతిషేధాత్.అసతః సదుత్పత్తిం బ్రువతా అసదేవ సద్ భవేత్ సచ్చ అసద్భవేత్ ఇతి ఉక్తం స్యాత్.తచ్చ అయుక్తమ్;సర్వప్రమాణవిరోధాత్. న చ నిష్ఫలం విదధ్యాత్ కర్మ శాస్త్రమ్;దుఃఖస్వరూపత్వాత్, దుఃఖస్య చ బుద్ధిపూర్వకతయా,కార్యత్వానుపపత్తేః. తదకరణే చ నరకపాతాభ్యుపగమాత్ అనర్థాయైవ ఉభయథాపి కరణే అకరణే చ శాస్త్రం నిష్ఫలం కల్పితం స్యాత్.స్వాభ్యుపగమవిరోధశ్చ-నిత్యం నిష్ఫలం కర్మేతి అభ్యుపగమ్య మోక్షఫలాయ ఇతి బ్రువతః.తస్మాత్ యథాశ్రుత ఏవ అర్థః కర్మణ్యకర్మ ఇత్యాదేః.తథా చ వ్యాఖ్యాతః అస్మాభిః శ్లోకః.

బాలానందిని

నాపీతి:-మరొక విషయం ఏ మనగా-**"నాసతో విద్యతే భావః"**అని,**"కథమసతః సజ్జాయేత"**అనీ చెప్పడంచేత నిత్యకర్మలు చేయకపోవడం అనే అభావం నుండి ప్రత్యవాయం అనే భావపదార్థం పుట్టదు అని వెనుక చూపబడింది.అసత్‌నుండి సత్ పుట్టడం నిషేధించ బడింది.అసత్తునుండి సత్తు పుడుతుంది అని చెప్పేవాడు అసత్తే సత్తు అవుతుం దనీ సత్తు అసత్తు అవుతుం దనీ చెప్పి నట్లు అవుతుంది.అది సకలప్రమాణాలకీ విరుద్ధం గాన అయుక్తం.మరియు శాస్త్రం నిష్ఫలమైన కర్మను విధించదు.అలాంటి కర్మ కేవలం దుః ఖరూపమే అవుతుంది. దుఃఖాన్ని ఎవ్వడూ కూడ బుద్ధిపూర్వకంగా ఆచరిస్తాడు అనేది ఉపపన్నం కాదు. నిత్యకర్మను ఆచరించకపోతే నరకపాతం కలుగుతుంది అని అంగీకరించడంవల్ల ఆచరించినా, ఆచరించకపోయినా రెండు విధాలా కూడ శాస్త్రం నిష్ఫలమే అని కల్పించిన ట్లవుతుంది. మరొక విషయ మేమనగా-ఒక ప్రక్క నిత్యకర్మకు ఫలం లేదని అంటూ అది మోక్షఫలం ఇస్తుంది అని చెపుతున్న నీవు నీ మాటను నువ్వే కాదన్న ట్లవుతుంది. అందువల్ల 'కర్మణ్యకర్మ' ఇత్యాదికానికి స్పష్టంగా ఏ అర్థం కనబడుతుందో అదే అర్థం.మేం ఆ విధంగా శ్లోకం వ్యాఖ్యానించి ఉన్నాం.

భా.అ.ప్ర.:- ఆత్మయొక్క యథార్థస్వరూపాన్ని అనుసంధానం చేసికొనడంచేత తాను అనుష్ఠిస్తున్న కర్మనే ఎవడు జ్ఞానరూప మైనదానినిగా చూస్తాడో,ఆ జ్ఞానం కర్మలో అంతర్గతం అవడంచేత దానిని(జ్ఞానాన్ని)కర్మస్వరూప మైనదానినిగా చూస్తాడో అతడు బుద్ధిమత్త్వాదిగుణములు కలవాడు అని శ్రీరామానుజాచార్యులు చెప్పినది యుక్తం కాదు. పరస్పరము భిన్నమ లైన కర్మజ్ఞానాలను ఒకదానిని మరొకదానినిగా చూడడం కుదరదు. అలా చూస్తే అది మిథ్యాజ్ఞానమే అవుతుంది. ఆత్మయాథాత్మ్యానుసంధానంచేత కర్మ జ్ఞానా కారం అవడం,జ్ఞానం కర్మస్వరూపం అవడమూ కూడ యుక్తమే అని చెప్పడం కుదరదు. ఆత్మయాథాత్మ్యజ్ఞానంచేత గాని ఏదైన మరొకదానిచేత గాని ఒకటి మరొకటిగా అవడం ఉపపన్నం కాదు కదా?భ్రాంతి లేకుండా ఆత్మతత్త్వానుసంధానం చేయడంచేత ఆత్మకు అక్రియత్వం ఉంటే ఉండుగాక,దేహాశ్రయ మైన కర్మ జ్ఞానాకారం ఎలా అవుతుంది?అట్లే మానసమైన"అయం ఘటః"అనే జ్ఞానం కర్మాకారం ఎలా అవుతుంది.జ్ఞానశక్తి బుద్ధిలో ఉంటుంది,క్రియాశక్తి ప్రాణంలో ఉంటుంది. ఈ రెండు శక్తులు లేదా వీటికి ఆశ్రయా లైన బుద్ధిప్రాణాలు ఒకటే అని ఏ పండితు డైనా అంగీకరిస్తాడా?అవి ఒకటి అనుకుంటే అధ్యాసయే అవుతుంది.ఫలాదుల అభిసంధానం లేకపోవడంచేత కర్మ జ్ఞానాకారం అవుతుంది అనడం కూడ అయుక్తమే.ఫలాభిసంధి ఉంటే కర్మ బంధకం అవుతుంది,లేకపోతే బంధకం కాదు అని మాత్రమే సిద్ధాంతం.బంధకత్వంఅనేది లేదు అనే కారణాన్ని పురస్కరించుకొని

కర్మను జ్ఞానాకారమైనదానినిగా తెలుసుకొనడం గౌణజ్ఞానమే కాని మిథ్యాజ్ఞానంకాదు అనడం కూడ యుక్తం కాదు. ఇలాంటి గౌణజ్ఞానం ఉన్నా కూడ భగవంతుడు ప్రతిజ్ఞ చేసిన అశుభ మోక్షణరూప మైన ఫలం లభించదు. ఫలాభిసంధ్యాదులు లేకుండా కర్మ చేయడంవల్ల పురుషుడు అశుభంనుండి ముక్తు డవుతాడు కాని ఫలాభిసంధ్యాదులు లేని కర్మ బంధకం కాకపోవడంచేత జ్ఞానంతో సమాన మైనది అని తెలుసుకొన్నంతమాత్రంచేత ముక్తుడు కాడు కదా?

జ్ఞానం కర్మలో అంతర్గతం అవడంచేత(ఉండడంచేత)జ్ఞానం కర్మరూప మైనది అని చెప్పడం విద్వాంసుల పరిహాసానికి ఆస్పదమైనది. దేహాద్యంతర్గతమైన దేహాద్యాకారం కలది అవుతుందా? అందుచేత దేహాదుల లోపల నున్న ఆత్మను దేహాదిరూపంలో గ్రహించడం ఏ విధంగా మిథ్యాజ్ఞానమో అదే విధంగా కర్మాంతర్గతమైన జ్ఞానాన్ని కర్మగా గ్రహించడం మిథ్యాజ్ఞానమే అవుతుంది. కుండలో రేగిపళ్లు ఉన్నట్లు కర్మలో జ్ఞానం ఉండదు కూడ; ఎందువల్ల ననగా–జ్ఞానం మనస్సులో ఉంటుంది, కర్మ దేహాన్ని ఆశ్రయించి ఉంటుంది. జ్ఞానయుక్తమైన కర్మను చెయ్యాలి అనడం కూడ అయుక్తమే;కర్మజ్ఞానాలకు యోగమే (సంబంధమే)కుదరదు కదా? "ఇది ఘటం"అనే జ్ఞానం గమనాదిక్రియతో కలవదు కదా? కర్మజ్ఞానాలకు ఒకే సమయంలో చెయ్యాలి అనడం కూడ కుదరదు;అలా చేయడం శక్యం కాదు కదా?

నిలచి ఉండడానికి నడవడానికీ పరస్పరం విరోధం ఉన్నట్లు జ్ఞాన–కర్మలకు పరస్పర విరోధం లేదు గాన వాటిని ఒకే సమయంలో అనుష్ఠించడం అసంభవం కాదు అన్నట్లయితే – అది యుక్తం కాదు."నేను కర్తను" అనే జ్ఞానానికి కర్మతో విరోధం లేకపోయినా "నాకు కర్తృత్వం లేదు"అనే జ్ఞానానికీ కర్మకీ విరోధం ఉండనే ఉంటుంది.అలాంటప్పుడు "నేను కర్తను కాను"అని తెలుసుకొన్నవాడు మళ్లీ తాను కర్తయే అనుకొంటూ కర్మ ఎలా చేయకలుగుతాడు?దీనిచేత(ఈ యుక్తిచేత)"జ్ఞాని కర్మానుష్ఠానం కూడ చెయ్యాలి"అనేది కూడ నిరాకరించబడినట్లే.ఆత్మవేత్త కృతకృత్యు డని చెప్పడంచేత అతనికి కర్తవ్యం ఏదీ ఉండదు అని సిద్ధిస్తుంది కదా?పరోక్షజ్ఞానానికీ,కర్మకీ విరోధం లేదు అనడం కూడ యుక్తం కాదు.ఆత్మ ఎల్లప్పుడూ అపరోక్షమే,అలాంటి ఆత్మయొక్క జ్ఞానం పరోక్షం అవడ మనేదే అసంభవం."నాకు ఆత్మసాక్షాత్కారం లేదు"అని ఎవడు అనుకుంటాడో వాడు ఆత్మవేత్త కానే కాడు.అలాంటి అనాత్మవిదుడు కర్మలు చేయవలసిందే అని మేమూ అంగీకరిస్తున్నాం.ఈ అనాత్మవిదుడు ఆత్మ అకర్త అని నిశ్చితంగా గ్రహించడు; వాని జ్ఞానం సంశయాత్మకంగానే ఉంటుంది.ఆత్మసాక్షాత్కారం కలగకుండా అలాంటి నిశ్చయం కలగదు. ఆపాతజ్ఞానంతో (అనిశ్చితమైన జ్ఞానంతో)కూడిన కర్మ చెయ్యాలి అని కూడ చెప్పడ కుదరదు.ఎందుచేత ననగా–"ఆత్మయాథాత్మ్యానుసంధానపూర్వకంగా కర్మ చెయ్యాలి"అని నువ్వు అనేకపర్యాయాలు

అన్నావు. ఆత్మయాథాత్మ్యజ్ఞానం అంటే అపరోక్ష జ్ఞానమే కాని ఆపాతజ్ఞానం కాదు. మరొక విషయ మేమనగా-ఆత్మతత్త్వానుసంధానం ఏకాగ్రచిత్తంతో సాధించవలసినది; అలాంటిది కర్మలను చేయడంలో వ్యగ్రమైన చిత్తంచేత ఆత్మతత్త్వానుసంధానం ఎలా కుదురుతుంది? మనస్సు ఆత్మమీద నిలచి ఉన్నప్పుడు దేహేంద్రియాలు పనులలో ప్రవర్తించవు కదా? అలా కాకపోతే-సమాధిలో ఉన్న పురుషుడు కూడ కర్మలు చేయవలసి ఉంటుంది. దేహేంద్రియాదుల వ్యాపారం మనోవ్యాపారం మీద ఆధారపడి ఉంటుంది. మనస్సు మరో ఆలోచనలో ఉన్నప్పుడు చక్షురాదులు ఘటాదిదర్శనాదులు చేయజాల వనే విషయం అందరికీ తెలిసినదే. అందువల్ల ఒకే సమయంలో మనసు ఆత్మయథాత్మ్యానుసంధానం చేయడం, దేహాదులతో కలిసి కర్మలు ఆచరించడం అనేది అనుపపన్నమే. దేహేంద్రియాదుల వ్యాపారం అనే స్వరూపం గల కర్మ, "నేను సచ్చిదానంద స్వరూపమైన ఆత్మను" అనే జ్ఞానము-ఈ రెండింటికి పరస్పరాకారత్వం (ఇది అది గాను, అది ఇది గాను అవడం) స్వప్నంలో కూడ ఊహించడానికి శక్యం కానిది. అందువల్ల శ్రీరామానుజభాష్యం సదోషం (భా. అ. ప్ర. పే. 172-173) 18

భాష్యమ్

తదేతత్ కర్మణి అకర్మాదిదర్శనం స్తూయతే-

మూ. యస్య సర్వే సమారమ్భాః కామసంకల్పవర్జితాః,
జ్ఞానాగ్నిదగ్ధకర్మాణం తమాహుః పణ్డితం బుధాః. 19

బాలానందిని

తదితి:-అట్టి ఈ, కర్మయందు అకర్మాదిదర్శనం స్తుతించబడుచున్నది-

ప్ర.అ. యస్య ఇతి:- యస్య=ఎవని యొక్క, సర్వే = సమస్తమైన, సమారమ్భాః =కర్మలు, కామసంకల్ప వర్జితాః=కామములతోను సంకల్పాలతోను శూన్యములై ఉంటాయో, జ్ఞానాగ్నిదగ్ధకర్మాణమ్ = జ్ఞానాగ్నిచేత కాల్చివేయబడిన కర్మలు గల, తమ్ = అతనిని, పణ్డితమ్= పండితునిగా, బుధాః = పండితులు, ఆహుః = చెప్పుదురు.

భాష్యమ్

యస్యేతి:- యస్య యథోక్తదర్శినః, సర్వే యావన్తః సమారమ్భాః కర్మాణి, సమారభ్యన్తే ఇతి సమారమ్భాః, కామసంకల్పవర్జితాః కామైః తత్కారణైః చ సంకల్పైః వర్జితాః, ముధైవ చేష్టామాత్రాః అనుష్ఠీయన్తే, ప్రవృత్తేన చేత్ లోకసంగ్రహార్థం, నివృత్తేన చేత్ జీవనమాత్రార్థం, తం జ్ఞానాగ్నిదగ్ధకర్మాణం, కర్మాదౌ అకర్మాదిదర్శనం జ్ఞానం,

తదేవ అగ్నిః,తేన జ్ఞానాగ్నినా దగ్ధాని శుభాశుభలక్షణాని కర్మాణి యస్య తమ్,ఆహుః పరమార్థతః,పణ్డితం,బుధాః బ్రహ్మవిదః. 19

బాలానందిని

యస్యేతి:-పైన చెప్పిన విధంగా కర్మణ్యకర్మాదర్శనం చేసే ఎవనియొక్కసమస్త మైన,ఎన్ని ఉండడానికి అవకాశం ఉన్నదో అన్ని,సమారంభములు,"సమారభ్యన్తే ఇతి సమారమ్భాః"(ఆరంభించబడేవి కాబట్టి సమారంభము లని చెప్పబడును)అను విగ్రహంచేత కర్మలు అని అర్థం,కామములచేత,కామాలకు కారణాలైన సంకల్పాలచేత విడవబడినవై, (కామసంకల్పాలు లేనివై)తన కోసమై ఏ ఫలమూ అపేక్షించకుండా కేవలం శరీరేంద్రియాల చేష్టలుగా మాత్రమే అనుష్ఠింపబడతాయో,కర్మాచరణంకోసం ప్రవృత్తు డైతే లోకసంగ్రహం కోసం కర్మలను చేస్తాడు,నివృత్తు డైతే కేవలం జీవనం కోసం చేస్తాడు,అట్టి, జ్ఞానాగ్ని దగ్ధకర్మను-కర్మాదులయందు అకర్మాదులను చూడడం జ్ఞానం,అదే అగ్ని, ఆ జ్ఞానాగ్నిచేత ఎవని పుణ్యాపుణ్యరూపాలైన కర్మలు కాల్చివేయబడ్డాయో వానిని, పరమార్థతః పండితుణ్ణిగా బ్రహ్మవేత్తలు చెప్పుదురు.

భా. అ.ప్ర.:- ఇక్కడ శ్రీరామానుజాచార్యులు-"కర్మ జ్ఞానాకారం అవడం ఎలా కుదురుతుంది అనే శంకకు ఈ శ్లోకంలో సమాధానం చెప్పబడుచున్నది. సంకల్పం అనగా తనను ప్రకృతితోను ప్రకృతిగుణాలతోను ఏకంగా చేసి వ్యవహరించడం అని అర్థం"అని వ్రాశారు. అది యుక్తంగా లేదు. ఈ శ్లోకం కర్మ జ్ఞానాకారం అని ప్రతి పాదించడంలేదు. కామసంకల్పాల అభావాన్ని చెప్పినంతమాత్రంచేత కర్మ జ్ఞానాకార మైనది అనే విషయం చెప్పినట్లు కాదు కదా! "జ్ఞానాగ్నిదగ్ధకర్మాణమ్"అని జ్ఞానకర్మలు పరస్పరవిరుద్ధము లనే చెప్పబడుచున్నది. కర్మ తనను కాల్చివేసే జ్ఞానంయొక్క స్వరూపాన్ని పొందుతుంది అని స్వప్నంలో కూడ ఊహించడం శక్యం కాదు. దూది అగ్న్యాకారం ఎప్పుడైనా అవుతుందా?కర్మ కాల్చివేయబడిన తరువాత జ్ఞానాకారాన్ని పొందుతుంది అనడం కూడ యుక్తం కాదు. తాను ఉన్నప్పుడే జ్ఞానాకారాన్ని పొందజాలనిది నశించిన తరువాత ఎలా పొందుతుంది?మరొక విషయమేమనగా-నశించిన కర్మ అనగా అర్థం కర్మాభావమే కాని కర్మ కాదు. కర్మాభావం జ్ఞానాకారం అయితే అవవచ్చు నేమో కాని తావన్మాత్రంచేత కర్మకు జ్ఞానాకారత్వం ఎలా లభిస్తుంది?

ఇప్పుడు చేయబడుతూన్న కర్మ జ్ఞానాగ్నిచేత కాల్చబడుతుంది అని మేము అనడం లేదు;మరేమనగా ప్రాచీన మైన పుణ్యాపుణ్యలక్షణమైన కర్మ దహించబడుతుంది అని అంటున్నాం అని అంటే-అయితే చేయబడుచున్న కర్మ జ్ఞానాకార ం అని ఈ శ్లోకంలో ఎలా చెప్పబడింది?(పూర్వపక్షి సమాధానం) ఎవడైతే సమస్తకర్మలను కామసంకల్పాలు

లేకుండా ఆచరిస్తాడో అతడు జ్ఞానాగ్నిదగ్ధకర్మ అని చెప్పడంవల్ల కర్మ జ్ఞానాకార మైనది అని సిద్ధిస్తుంది; జ్ఞానం అనగా కామసంకల్పవర్జితసర్వసమారంభత్వమే కదా అన్నట్లయితే– (సి.సమాధానం)అది యుక్తం కాదు. కామసకంల్పవర్జితసమారంభత్వం జ్ఞానానికి లింగమే (గుర్తు) కాని జ్ఞానం కాదు. ఆత్మయాథాత్మ్యానుసంధానమే జ్ఞానం అని నీకు కూడ అంగీకార్యమే కదా?ఎందుచేతననగా–"కర్మాన్తర్గతాత్మయాథాత్మ్యానుసన్ధానేన జ్ఞానేన" అని నువ్వే అన్నావు. అందువల్ల ఆత్మయాథాత్మ్యం తెలుసుకొన్నవాడు కామసంకల్పరహితాలైన కర్మలు చేస్తాడు, తెలుసుకొననివాడు కామసంకల్పసహితకర్మలు చేస్తాడు. ఈ విధంగా కర్మ చేయడంవల్ల కూడ జ్ఞానికి బంధం కలుగుతుం దని ఆశంకించుకొని భగవంతుడు "జ్ఞానాగ్నిదగ్ధకర్మాణమ్"అని చెపుతున్నాడు. కర్మలలో ఉన్న లేపనసామర్థ్యాన్ని జ్ఞానం నశింప చేసివేయడంచేత ఆత్మజ్ఞానికి కర్మలు అంటవు.కామసంకల్పాలు ఉంటే కర్మలకు లేపన సామర్థ్యం ఉంటుంది.ఆత్మజ్ఞాని యైనవాడు కామసంకల్పాలనే విడచివేశాడు.వానికి కర్మలు ఎలా అంటుకొంటాయి?ఈ విధంగా జ్ఞానవశంచేత నిర్లేపకాలుగా అయిపోయిన కర్మలు జ్ఞానాకారాలు ఎలా అవుతాయి?ఒక వస్తువు తనలో ఒక గుణాన్ని కల్పించిన మరొక వస్తువుగా మారిపోదు కదా?ఇంక 'సంకల్ప' శబ్దానికి నీవు చెప్పిన అర్థమైతే నిఘంటువులు మొదలైనవాటికి విరుద్ధ మైనది అనే విషయం అందరికీ తెలిసినదే. 19

భాష్యమ్

యస్తు కర్మాదౌ అకర్మాదిదర్శీ సః అకర్మాదిదర్శనాత్ ఏవ నిష్కర్మా సంన్యాసీ జీవనమాత్రార్థచేష్టః సన్ కర్మణి న ప్రవర్తతే.యద్యపి ప్రాక్ వివేకతః ప్రవృత్తః. యః తు ప్రారబ్ధకర్మా సన్ ఉత్తరకాలమ్ ఉత్పన్నాత్మసమ్యగ్దర్శనః స్యాత్ సః కర్మణి ప్రయోజనమ్ అపశ్యన్ ససాధనం కర్మ పరిత్యజత్యేవ. సః కుతశ్చిత్ నిమిత్తాత్ కర్మ పరిత్యాగాసంభవే సతి కర్మణి తత్ఫలే చ సంగరహితతయా,స్వప్రయోజనాభావాత్ లోకసంగ్రహార్థం పూర్వవత్ కర్మణి ప్రవృత్తః అపి నైవ కించిత్ కరోతి;జ్ఞానాగ్నిదగ్ధ కర్మత్వాత్.తదీయం కర్మ అకర్మైవ సంపద్యతే ఇత్యేతమ్ అర్థం దర్శయన్ ఆహ–

మూ. త్యక్త్వా కర్మఫలాసంగం నిత్యతృప్తో నిరాశ్రయః,
కర్మణ్యభిప్రవృత్తో౾పి నైవ కించిత్కరోతి సః. 20

బాలానందిని

యస్త్వితి:– ఎవడైతే కర్మాదులయందు అకర్మాదులను చూడకలుగుతాడో అతడు అకర్మాదిదర్శనంవల్లనే కర్మరహితుడై సంన్యాసియై, వివేకం కలగడానికి పూర్వం కర్మయందు ప్రవర్తించినా కూడ ఇప్పుడు జీవనమాత్రంకోసం ఉపయోగించే చేష్ట(పని)మాత్రమే చేస్తూ కర్మలో ప్రవర్తించడు.ఎవడైతే (ఏదో ఒక దీర్ఘకాలం కొనసాగించవలసిన) కర్మ ప్రారంభించి

మధ్యలో కొంత కాలానికి ఆత్మజ్ఞానం పొందుతాడో అతడు కర్మలో ప్రయోజనం ఏదీ లేదని తెలుసుకొని ఆ కర్మను,కర్మసాధనాలనూ కూడ పరిత్యజించవలసినదే. అయినా కూడ అతడు ఏ కారణంచేతనో కర్మపరిత్యాగం చేయడం కుదరక, తన కేమీ ప్రయోజనం లేకపోవడంచేత కర్మయందు, దాని ఫలమందూ సంగం లేనివాడై కేవలం లోకసంగ్రహం కోసం వెనుకటి వలెనే కర్మయందు ప్రవర్తించినా కూడ జ్ఞానాగ్నిదగ్ధకర్ము డవడంచేత ఏమీ చేయ నట్లే; అతని కర్మ అకర్మయే అవుతుంది అనే ఈ అర్థాన్ని,విషయాన్ని,చూపుతూ చెపుతున్నాడు.

ప్ర.అ. త్యక్త్వా ఇతి:– కర్మఫలాసంగమ్ = కర్మలయందు,ఫలమునందు ఆసక్తిని, త్యక్త్వా=విడచి,నిత్యతృప్తః = ఎల్లప్పుడూ తృప్తుడై, నిరాశ్రయః=ఆశ్రయం లేనివాడై, కర్మణి=కర్మయందు,అభిప్రవృత్తః అపి = ప్రవర్తించినా కూడ,సః=అతడు,కించిత్ =ఏదీ, నైవ కరోతి=చేయడమే లేదు.

భాష్యమ్

త్యక్త్వేతి:– త్యక్త్వా కర్మసు అభిమానం ఫలాసంగం చ యథోక్తేన జ్ఞానేన,నిత్యతృప్తః నిరాకాఙ్క్షః విషయేషు ఇత్యర్థః–నిరాశ్రయః ఆశ్రయరహితః ఆశ్రయః నామ యత్ ఆశ్రిత్య పురుషార్థం సిసాధయిషతి, దృష్టాదృష్టేష్టఫలసాధనాశ్రయరహితః ఇత్యర్థః. విదుషా క్రియమాణం కర్మ పరమార్థతః అకర్మైవ;తస్య నిష్క్రియాత్మదర్శనసంపన్నత్వాత్. తేన ఏవం భూతేన ప్రయోజనాభావాత్ ససాధనం కర్మ పరిత్యక్తమ్ ఏవ ఇతి ప్రాప్తే తతః నిర్గమాసంభవాత్, లోకసంగ్రహచికీర్షయా,శిష్టవిగర్హణాపరిజిహీర్షయా వా పూర్వవత్ కర్మణి అభిప్రవృత్తః అపి నిష్క్రియాత్మదర్శనసంపన్నత్వాత్ నైవ కించిత్ కరోతి సః. 20

బాలానందిని

త్యక్త్వేతి :–వెనుక చెప్పిన జ్ఞానంచేత కర్మలయందు అభిమానాన్ని,ఫలమునందు ఆసక్తిని విడచి,నిత్యతృప్తుడై,భోగ్యవస్తువులయందు కోరిక లేనివాడై అని అర్థం,ఆశ్రయం లేనివాడై;దేనిని ఆశ్రయించి ఏదైన పురుషార్థాన్ని సాధించా లని అనుకొంటాడో అది ఆశ్రయం.అది లేనివాడై అనగా దృష్టమైన లేదా అదృష్టమైన ఇష్టమైన ఫలాన్ని సమకూర్చే సాధనంయొక్క ఆశ్రయం లేనివాడు అని అర్థం;విద్వాంసుడు నిష్క్రియ మైన ఆత్మయొక్క సాక్షాత్కారం పొందినవా డవడంచేత అతడు కర్మ చేసినా అది వాస్తవంలో అకర్మయే. అలాంటివానికి ప్రయోజనం ఏదీ లేకపోవడంచేత అతడు కర్మనూ తత్సాధనాలనీ తప్పక విడిచివేయాలి అని ప్రాప్తించగా–ఆ కర్మనుండి బయటపడలేకపోవడంచేత గాని,లోకసంగ్రహం చేయాలనే అభిలాషచేత గాని,శిష్టులనుండి అధిక్షేపాన్ని పరిహరించాలనే కోరికచేత

గాని వెనుకటి వలె కర్మయందు ప్రవర్తించినా కూడ, నిష్క్రియాత్మసాక్షాత్కారం కలవాడవడం చేత అతడు ఏమీ చేయడంలేదు(ఏమీ చేయ నట్లే).

భా.అ.ప్ర. ఇక్కడ–"నైవ కించిత్కరోతి"అనగా "కర్మ అనే వంకచేత జ్ఞానభ్యాసమే చేస్తున్నాడు"అని శ్రీరామానుజాచార్యులు,"విపరీత మైన విషయాల వైపు ప్రవర్తించి జ్ఞానా భ్యాసానికి విరోధులుగా ఉండే ఇంద్రియాలను అనుకూల మైన విషయాల వైపు సంచరింప చేయడమే కర్మయోగం అని భావం"అని వేదాంతదేశికులు అన్నారు.అది అర్థరహిత మైనది.శ్రీరామానుజాచార్యులు అనుకొన్న అర్థమే చెప్పవలసి ఉంటే వ్యాసుడు "**నైవ కిం చిత్ కరోతి సః**"కు బదులు "**జ్ఞానమేవ కరోతి సః**"అని ఉండేవాడు.ఇంద్రియాల వ్యాపారాన్ని అరికట్టడం అనే స్వరూపం గల జ్ఞానాభ్యాసానికి ఇంద్రియాలు విపరీత విషయాల వైపు సంచరించడం ఏ విధంగా విరోధియో అనుకూలవిషయాల వైపు సంచరించడం కూడ విరోధియే.ఇంద్రియాలు విషయాల వైపు ప్రవర్తించడమే ఇంద్రియ వ్యాపారోపరమానికి (ఇంద్రియాల పనిని నిలుపుచేయడానికి)ప్రతిబంధకం గదా?జ్ఞానాభ్యాసం అనేది అంతర్ముఖ మైన మనస్సుచేత సాధించదగినది;అనుకూలము లైనా,ప్రతి కూలము లైనా అన్ని విషయాలూ కూడ బహిర్ముమనోవేద్యాలు.అందుచేత అనుకూలము లైన విషయాలు జ్ఞానాభ్యాసానికి విరోధులు కావనడం ఎలా కుదురుతుంది?అందుచేత ఎవ డైతే నిఃసంగంగా కర్మ ఆచరిస్తాడో అతడు కర్మయోగాన్నే ఆచరిస్తున్నవా డవుతాడు కాని జ్ఞానయోగం ఆచరించేవాడు కాడు.జ్ఞానయోగంలో కర్మయోగాకారం లేదు కదా? (భా.అ.ప్ర.పే.175). 20

వి.:– "**త్యక్త్వా కర్మఫలాసంగం**"ఇత్యాదిశ్లోకానికి భాష్యకారు లిచ్చిన అవతారికను శ్రీరామరాయకవి ఈ విధంగా వ్యాఖ్యానించారు.ఇక్కడ మూడు విధాలైన పురుషులు చెప్పబడ్డారు–అసలు కర్మాచరణమే చేయక కర్మణ్యకర్మాదిదర్శనం చేయగలవాడు తరువాత కూడ కర్మలలో ప్రవర్తించనే ప్రవర్తించడు.రెండవరకం పురుషుడు వివేకజ్ఞానం కలగడానికి ముందు కర్మలు ప్రారంభించినా తరువాత జ్ఞానం కలగగానే కర్మలను పరిత్యజించి వేస్తాడు.మూడవ రకం పురుషుడు జ్ఞానం కలిగినా ఏ కారణంచేతనో కర్మలను పరిత్యజించడు.ఈ మూడవవానిని గూర్చి ఈ శ్లోకం చెప్పబడింది.అని శ్రీ రామరాయకవి అభిప్రాయం.ఈ వ్యాఖ్యానం ప్రకారం "**యద్యపి ప్రాగ్వివేకతః ప్రవృత్తః**"అనేదానిని ముందు వాక్యంతో కాక "**యస్తు ప్రారబ్ధకర్మా**"ఇత్యాదివాక్యంతో అన్వయించారు.ఈ అన్వయం ఇక్కడ నున్న వాక్యనిర్మాణానికి అనుగుణంగా లేదు."**యస్తు ప్రారబ్ధకర్మా**"అనే వాక్యాన్ని 'యస్తు'అని ప్రారంభించడానిని పట్టి "**యద్యపి ప్రాగ్వివేకతః ప్రవృత్తః**"అనేదానిని ఈ వాక్యంతో అన్వయించడంకంటె పూర్వవాక్యంతో అన్వయించడమే యుక్తంగా ఉంటుంది. అందుచేత మొదటి వాక్యం ఏనాడూ కర్మాచరణ చేయనివానిని గూర్చి చెప్పబడింది అనడం సరిగాలేదు.

అందుచేత ఇక్కడ రెండు రకాల పురుషులనే దృష్టిలో ఉంచుకొని అవతారిక వ్రాయబడింది. ఒకడు వివేకం కలగడానికి పూర్వం కర్మాచరణప్రవృత్తుడై ఉన్నాడు;వివేకం కలగగానే కర్మ మానివేశాడు. కేవలం శరీరస్థితిమాత్రోపయుక్తకర్మ చేస్తున్నాడు. రెండవవాడు కర్మ ప్రారంభించాడు. తరువాత జ్ఞానం కలిగింది. కర్మ మానివేయ వచ్చు. ఎందుచేతనో మానలేదు. వానిని గూర్చి ఈ శ్లోకం అతడు కర్మలిప్తుడు కాడు అని చెపుతున్నది. అందుచేత ఈ ఇద్దరూ కూడా వివేకజ్ఞానోదయానిముందు కర్మ లాచరించినవారే. మొదటివాడు విడిచివేశాడు; రెండవవాడు విడవలేకపోయాడు. 'ప్రారబ్ధకర్మా'అనగా ఏదో సుదీర్ఘకాలనిర్వర్త్య మైన కర్మ ప్రారంభించినవాడు అని అర్థం. అలాంటి వాడు కర్మమధ్యంలో జ్ఞానం కలిగినా లోకసంగ్రహం కోసమో, ప్రారంభించిన కర్మ సగంలో విడిచివేశాడు అని శిష్టులు నిందిస్తా రనే భయంచేతనో విడవజాలకపోయాడు అని చెప్పుకుంటే బాగుంటుంది. ఇందుకు "స్వప్రయోజనాభావాత్ ససాధనం కర్మ పరిత్యక్తవ్యమ్ ఇత్యేవ ప్రాప్తేతతః నిర్గమాసంభవాత్, లోకసంగ్రహచికీర్షయా, శిష్టవిగర్హణాపరిజిహీర్షయా వా పూర్వవత్ కర్మణి అభిప్రవృత్తోఽపి"ఇత్యాది శ్లోకభాష్యం అనుకూలంగా ఉంది. మరొక విషయం ఏమనగా–"నిరాశీర్యతచిత్తాత్మా"ఇత్యాదిశ్లోకం ఎన్నడూ కూడ కర్మమార్గంలో లేని జ్ఞానిని గూర్చి చెప్పి నట్లు భాష్యకారులు చెప్ప నున్నారు. దానిని పట్టి పై శ్లోకావతారికలో నిర్దేశించబడినవాళ్లు జ్ఞానోదయాత్పూర్వం కర్మమార్గంలో ఉన్నవారే అని అర్థం అవుతుంది. అవతారికలో చెప్పబడిన మొదటివాడు అసలే కర్మలు చేయని,జ్ఞానోదయం కలిగిన పురుషుడు అని అర్థం చెప్పి ఉండడంచేత,ఇక్కడ శ్రీరామరాయ కవి "ప్రాగేవ కర్మారమ్భాత్"అనే భాష్యంలోని పదానికి "గృహస్థాశ్రమం స్వీకరించదానికి ముందే" అని అర్థం కల్పించుకొనవలసి వచ్చినది. విద్వద్భిర్విచారణీయమ్. 20

భాష్యమ్

యః పునః పూర్వోక్తవిపరీతః ప్రాగేవ కర్మారమ్భాత్ బ్రహ్మణి సర్వాన్తరే ప్రత్యగాత్మని నిష్క్రియే సంజాతాత్మదర్శనః సః దృష్టాదృష్టేష్టవిషయాశీర్వివర్జితతయా దృష్టాదృష్టార్థే కర్మణి ప్రయోజనమ్ అపశ్యన్ ససాధనం కర్మ సంన్యస్య శరీరయాత్రామాత్రచేష్టః యతిః జ్ఞాననిష్ఠః ముచ్యతే ఇత్యేతమ్ అర్థం దర్శయితుమ్ ఆహ–

మూ. నిరాశీర్యతచిత్తాత్మా త్యక్తసర్వపరిగ్రహః,
శారీరం కేవలం కర్మ కుర్వన్నాప్నోతి కిల్బిషమ్. 21

బాలానందిని

యః పునః ఇతి :– వెనుక చెప్పినవానికి విపరీతు డైన ఎవడైతే కర్మ ప్రారంభించ డానికి ముందే అందరియందు ప్రత్యగాత్మగా ఉన్నది, నిష్క్రియము అయిన బ్రహ్మయందు

(బ్రహ్మవిషయంలో)ఇదే నా ఆత్మ అనే జ్ఞానం కలిగినవాడో అట్టి, చూడబడినవి, చూడబడనివి అయిన ఇష్టవస్తువులమీద కోరిక లేనివా డవడంచేత దృష్టభోగాలను అదృష్టభోగాలను పొందడంకోసం ఉపయోగించే కర్మయందు ఏ ప్రయోజనమూ చూడక, కర్మను, తత్సాధనాలను సంన్యసించి శరీరయాత్రకు మాత్రమే అవసర మైన చేష్టలు గల యతి జ్ఞాననిష్ఠుడై ముక్తుడౌతాడు అనే ఈ విషయాన్ని చూపడంకోసం చెపుతున్నాడు.

ప్ర.అ. నిరాశీరితి:- నిరాశీః=కోరిక లన్నీపోయినవాడు,యతచిత్తాత్మా=నిగ్రహించుకొనబడిన అంతఃకరణము,దేహేంద్రియములు కలవాడు,త్యక్తసర్వపరిగ్రహః=విడువబడిన సమస్తమైన పరిగ్రహాలు(సంపాదించిన వస్తువులు)కలవాడు,కేవలమ్=కేవలము,శారీరమ్ = శరీరానికి ఉపయోగించే,కర్మ=కర్మను,కుర్వన్=చేస్తున్నవాడు,కిల్బిషమ్=పాపమును, న అప్నోతి=పొందడు.

భాష్యమ్

నిరితి:- నిరాశీః - నిర్గతాః ఆశిషః యస్మాత్ సః నిరాశీః, యతచిత్తాత్మా = చిత్తమ్ అన్తఃకరణమ్,ఆత్మా బాహ్యః కార్యకరణసంఘాతః,తౌ ఉభౌ అపి యతౌ సంయతౌ యేన సః యతచిత్తాత్మా, త్యక్తసర్వపరిగ్రహః-త్యక్తః సర్వః పరిగ్రహః యేన సః త్యక్తసర్వపరిగ్రహః,శారీరమ్ శరీరస్థితిమాత్రప్రయోజనమ్,కేవలమ్,తత్రాపి అభిమానవర్జితమ్,కర్మ కుర్వన్ న అప్నోతి న ప్రాప్నోతి కిల్బిషమ్ అనిష్టరూపం పాపం ధర్మం చ. ధర్మో౽పి ముముక్షోః కిల్బిషమేవ,బన్ధాపాదకత్వాత్. తస్మాత్ తాభ్యాం ముక్తః భవతి సంసారముక్తః భవతీత్యర్థః.

బాలానందిని

నిరితి:-ఎవనినుండి కోరికలు వెడలిపోయినవో అతడు నిరాశీః చిత్తము అనగా అంతఃకరణం,ఆత్మ,అనగా బాహ్యశరీరేంద్రియసముదాయము,ఈ రెండూ కూడ ఎవనిచేత నిగ్రహించుకొనబడినవో అతడు యతచిత్తాత్మ. అంతఃకరణాన్ని దేహేంద్రియాలను నిగ్రహించుకొన్నవాడు.ఎవనిచేత పరిగ్రహా లన్నీ విడవబడినాయో అతడు త్యక్తసర్వ పరిగ్రహుడు.పరిగ్రహా లన్నీ విడచినవాడు. శారీరమైన,అనగా శరీరం నిలవడానికి మాత్రం ఉపయోగించే,కేవలమైన,అనగా దాని విషయంలో కూడ అభిమానం లేని, కర్మను చేస్తూ కిల్బిషాన్ని,అనగా అనిష్టరూపమైన పాపాన్ని,ధర్మాన్నీ కూడ పొందడు. ధర్మం కూడ బంధం కలగచేసేది కాబట్టి ముముక్షువునకు కిల్బిషమే.దానినుండి,ఆ రెండింటినుండి ముక్తుడవుతాడు. సంసారంనుండి ముక్తు డవుతాడు అని అర్థం.

భాష్యమ్

(కించ)"శారీరం కేవలం కర్మ"ఇత్యత్ర కిం శరీరనిర్వర్త్యం శారీరం కర్మ అభిప్రేతమ్ ఆహోస్విత్ శరీరస్థితిమాత్రప్రయోజనం శారీరం కర్మ ఇతి? కిం చాతః యది శరీరనిర్వర్త్యం శారీరం కర్మ యది వా శరీరస్థితిమాత్రప్రయోజనం శారీరమ్ ఇతి? ఉచ్యతే-యదా శరీరనిర్వర్త్యం కర్మ శారీరమ్ అభిప్రేతం స్యాత్ తదా దృష్టాదృష్ట ప్రయోజనం కర్మ ప్రతిషిద్ధమపి శరీరేణ కుర్వన్ న ఆప్నోతి కిల్బిషమ్ ఇతి బ్రువతః విరుద్ధాభిధానం ప్రసజ్యేత. శాస్త్రీయం చ కర్మ దృష్టాదృష్టప్రయోజనం శరీరేణ కుర్వన్ న ఆప్నోతి కిల్బిషమ్ ఇత్యపి బ్రువతః అప్రాప్తప్రతిషేధప్రసంగః. శారీరం కర్మ కుర్వన్ ఇతి విశేషణాత్ కేవలశబ్దప్రయోగాచ్చ వాఙ్మనసనిర్వర్త్యం కర్మ విధిప్రతిషేధవిషయం ధర్మాధర్మ శబ్దవాచ్యం కుర్వన్ ప్రాప్నోతి కిల్బిషమ్ ఇత్యుక్తం స్యాత్. తత్రాపి వాఙ్మనసాభ్యాం విహితానుష్ఠానపక్షే కిల్బిషప్రాప్తివచనం విరుద్ధమ్ ఆపద్యేత. ప్రతిషిద్ధసేవాపక్షేఽపి సః ఏవ దోషః స్యాత్.

బాలానందిని

శారీరమితి:-('కించ'అనేది కొన్ని ప్రతులలో లేదు. అనావశ్యకం). "శారీరం కేవలం కర్మ"అన్నప్పుడు'శారీరం'అనగా శరీరంచేత చేయవలసిన కర్మ అను అర్థం ఇష్టమైనదా (వివక్షితమా)లేక శరీరం నిలబడడానికి మాత్రం ఉపయోగించే కర్మ శారీరం అని అర్థం వివక్షితమా? శరీరంచేత చేయదగినది శారీరం అనిగ్రహించినా, శరీరస్థితిమాత్రప్రయోజనం శారీరం అని గ్రహించినా దానిలో విశేషం ఏమిటి? చెపుతున్నాం విను. శరీరంచేత చేయదగిన కర్మ అని అర్థం గ్రహిస్తే, దృష్టాదృష్టప్రయోజనాలు గల (కనబడే ప్రయోజనాలను కనబడని ప్రయోజనాలనూ ఇచ్చే)నిషిద్ధకర్మను చేసినా కిల్బిషం పొందదు అని చెప్పడంవల్ల విరుద్ధ మైన విషయం చెప్పిన ట్లవుతుంది. (శాస్త్రనిషిద్ధ మైన శారీరకర్మ చేస్తే కిల్బిషం (పాపం)కలగాలి కదా?)అట్లే దృష్టాదృష్టప్రయోజనం గల శాస్త్రవిహిత మైన కర్మను చేసేవాడు కిల్బిషం పొందదు అని చెప్పినప్పుడు అది అప్రాప్తమైనదానిని నిషేధించిన ట్లవుతుంది. (అనగా శాస్త్రవిహితమైన కర్మ చేస్తే పాపం కలిగే ప్రసక్తియే లేదు గాన శాస్త్రీయశారీరకకర్మ చేస్తే కిల్బిషం రాదు అని చెప్పడం అప్రసక్త మైనదానిని, (రావడానికి అవకాశమే లేని దానిని)నిషేధించిన ట్లవుతుంది. అంతే కాకుండా"శారీరం కర్మ కుర్వన్" అని విశేషించి (శారీరము అని)చెప్పడంచేత, 'కేవలమ్'అనే పదం ప్రయోగించడంచేత(శరీరనిర్వర్త్య మైన కర్మ చేస్తే కిల్బిషం రాదు కాని)విధిప్రతిషేధాలకు విషయ మైన, ధర్మాధర్మా లనే పేరు గల, వాక్కుచేతా మనస్సుచేతా చేయవలసిన కర్మ చేసేవాడు కిల్బిషం పొందుతాడు అని చెప్పిన ట్లవుతుంది. అప్పుడు కూడ వాఙ్మనసములచేత శాస్త్రవిహితకర్మను అనుష్ఠించి నప్పుడు

కూడ కిల్బిషం కలుగుతుం దని చెప్పడం విరుద్ధవచనం అవుతుంది. శాస్త్రనిషిద్ధకర్మను ఆచరించిన పక్షంలో కూడ(వాక్కుచే గాని మనస్సుచేత గానిశాస్త్రనిషిద్ధకర్మలు చేస్తే పాపం కలుగుతుం దనే విషయం ప్రసిద్ధ విషయమే గాన)ఉన్నవిషయాన్నే వ్యర్థంగా అనువదించి నట్లు అవుతుంది.(అందుచేత శరీరనిర్వర్త్య మైన అను అర్థం చెప్పకూడదు అని భావం).

భాష్యమ్

యదా తు శరీరస్థితిమాత్రప్రయోజనం శారీరం కర్మ అభిప్రేతం భవేత్ తదా దృష్టాదృష్టప్రయోజనం కర్మ విధిప్రతిషేధగమ్యం శరీరవాఙ్మనసనిర్వర్త్యమ్ అన్యత్ అకుర్వన్ తైరేవ శరీరాదిభిః శరీరస్థితిమాత్రప్రయోజనం కేవలశబ్దప్రయోగాత్ "అహం కరోమి"ఇతి అభిమానవర్జితః శరీరాదిచేష్టామాత్రం లోకదృష్ట్యా కుర్వన్ న ఆప్నోతి కిల్బిషమ్.ఏవంభూతస్య పాపశబ్దవాచ్యకిల్బిషప్రాప్త్యసంభవాత్,కిల్బిషం సంసారం న ఆప్నోతి,జ్ఞానాగ్నిదగ్ధసర్వకర్మత్వాత్,అప్రతిబన్ధేన ముచ్యతే ఏవ ఇతి పూర్వోక్తసమ్యగ్దర్శన ఫలానువాదః ఏవ ఏషః. ఏవం "శారీరం కేవలం కర్మ"ఇత్యస్య అర్థపరిగ్రహే నిరవద్యం భవతి.

21

బాలానందిని

యదా త్వితి:- 'శారీరం కర్మ' శరీరస్థితిమాత్రప్రయోజన మైన కర్మ అను అర్థం చెప్పకుంటే విధిప్రతిషేధశాస్త్రాలచేత తెలియదగినది,శరీర-వాక్-మనస్సులచేత చేయదగినది,దృష్టాదృష్టఫలాలు గలదీ అయిన మరొక కర్మ ఏదీ చేయకుండా,ఆ శరీరా దులచేతనే శరీరస్థితికి మాత్రమే ఉపయోగించే శరీరచేష్టను మాత్రమే లోకదృష్ట్యా చేస్తున్న వాడు,అది కూడ 'కేవల'శబ్దం ప్రయోగించడంచేత "నేను చేస్తున్నాను"అనే అభిమానం లేకుండా చేస్తున్నవాడు,కిల్బిషం పొందడు.(ఈ విధంగా శరీరచేష్ట చేస్తున్నప్పుడు లోకులు ఇతడు ఈ వ్యవహారం చేస్తున్నాడు అని అనుకొంటారు గాని జ్ఞానికి మాత్రం తాను ఆ వ్యవహారం చేస్తున్న దృష్టి కూడ ఉండదు.ఆతనికి సంబంధించినంతవరకు అతడు ఏ వ్యవహారమూ చేయనట్లే.వ్యవహారం చేసేవి దేహేంద్రియాలు కాని ఆతడు కాదు కదా. ఈ భావాన్ని సూచించడం కోసం భాష్యంలో "లోకదృష్ట్యా" అనే పదం ప్రయోగించ బడింది).ఇలాంటివాడు పాపం అని చెప్పబడే కిల్బిషాన్ని పొందే అవకాశం లేదు గాన, కిల్బిషాన్ని,సంసారాన్ని,పొందడు.ఆతని సర్వకర్మలు జ్ఞానాగ్నిచేత కాల్చివేయబడడంచేత ఎట్టి ప్రతిబంధాలూ లేకుండా తప్పక మోక్షం పొందుతాడు అని వెనుక చెప్పిన సమ్యగ్ దర్శనంయొక్క ఫలాన్ని అనువదించడం మాత్రమే ఇది. "శారీరం కేవలం కర్మ" అనేదానికి ఈ విధంగా అర్థం గ్రహిస్తే నిర్దుష్టంగా ఉంటుంది.

భా. అ. ప్ర.:-ఇక్కడ **"శారీరం కేవలం కర్మ కుర్వన్"**అనగా జ్ఞాననిష్ఠతో వ్యవధానం లేని కర్మయోగాన్ని అనుష్ఠిస్తున్నవాడు, కిల్బిషాన్ని, సంసారాన్ని,పొందడు"అని శ్రీరామానుజాచార్యులు వ్రాసినది అయుక్తం.ఎందువల్ల ననగా వాచిక-మానసిక-జపధ్యానాది కర్మలను చేయడంవల్ల సంసారం ప్రాప్తించే అవకాశం ఉంటుంది. 'కేవల' శబ్దానికి 'వ్యవధానం లేకపోవడం'అనే అర్థం గ్రహించడానికి ప్రమాణ మేమీ లేదు. (భా.అ. ప్ర. పే. 178) 21.

భాష్యమ్

త్యక్తసర్వపరిగ్రహస్య యతేః అన్నాదేః శరీరస్థితిహేతోః పరిగ్రహస్య అభావాత్ యాచనాదినా శరీరస్థితికర్తవ్యతాయాం ప్రాప్తాయాం -**"అయాచితమసంక్లృప్తముపపన్నం యదృచ్ఛయా"**(భౌ.ధ.సూ. 21-8-12;అనుగీతా. 45. 19)ఇత్యాదినా వచనేన అనుజ్ఞాతం యతేః శరీరస్థితిహేతోః అన్నాదేః ప్రాప్తిద్వారమ్ ఆవిష్కుర్వన్ ఆహ-

మూ. యదృచ్ఛాలాభసంతుష్టో ద్వన్ద్వాతీతో విమత్సరః,
సమః సిద్ధావసిద్ధౌ చ కృత్వాపి న నిబధ్యతే. 22

బాలానందిని

త్యక్తేతి:- సమస్తమైన పరిగ్రహాలను(సంపాదించిన వస్తువులను)విడిచివేసిన యతికి శరీరం నిలుపుకొనడానికి హేతువైన అన్నాదికమైన పరిగ్రహం లేకపోవడంచేత,అతడు యాచనాదులచేత శరీరం నిలుపుకోవాలి అని ప్రాప్తించగా(చెప్పవలసి ఉండగా) **"అయాచితమ్... యదృచ్ఛయా"**ఇత్యాదివచనంచేత అనుమతించబడిన యతియొక్క శరీరస్థితి కొరకై అన్నాదికం లభించే ద్వారాన్ని(మార్గాన్ని) విశదీకరిస్తూ చెపుతున్నాడు -

వి.: 'అన్నాదేః'అన్నప్పుడు 'ఆది'పదంచేత పాదుకలు,ఆచ్ఛాదనాదికం గ్రహించాలి. "యాచనాదినా"అన్నప్పుడు 'ఆది'పదంచేత సేవ,కృషి మొదలైనవి గ్రహించాలి. భిక్షాటనం కోసం ప్రయత్నించడానికి ముందే యోగ్యు డైన ఎవరైనా సమర్పించిన భైక్షం(భిక్షగా ఇచ్చిన ఆహారం) అయాచితం. ఫలానావాళ్ల ఇళ్ళకి వెళ్లాలి అని ముందుగా అనుకొన కుండగా, వెలివేయబడ్డవాళ్ల ఇళ్ళను, పతితుల ఇళ్ళను విడిచి,ఐదు లేదా ఏడు ఇళ్లనుండి సంపాదించిన భిక్షాన్నం 'అసంక్లృప్తం'.భక్తులు తన దగ్గరికి తీసుకొనివచ్చి ఇచ్చిన సిద్ధాన్నం 'ఉపపన్నం'. 'యదృచ్ఛయా'అనగా తన ప్రయత్నం ఏదీ లేకుండా అని అర్థం. "ఇత్యాదినా వచనేన" "అన్నప్పుడు" ఆది పదంచేత-

"మాధుకరసంక్లృప్తం ప్రాక్ప్రణీతమయాచితమ్,
తాత్కాలికోపపన్నం చ భైక్షం పఞ్చవిధం స్మృతమ్"

ఇత్యాదివచనాలు గ్రహించబడును(ఆనందగిరి. పే. 159).

ప్ర.అ. యదృచ్ఛేతి:- యదృచ్ఛాలాభసంతుష్టః=అయాచితంగా దైవవశంచేత లభించడం(లభించినదాని)చేత సంతుష్టి చెందినవాడు,ద్వన్ద్వాతీతః=శీతోష్ణాదిద్వంద్వాదు లను అతిక్రమించినవాడు,విమత్సరః=మాత్సర్యం లేనివాడూ,సిద్ధౌ=సిద్ధియందు,అసిద్ధౌ చ =అసిద్ధియందు,సమః=సమాన మైనవాడు,కృత్వాపి=కర్మలు ఆచరించికూడ,న నిబధ్యతే= బద్ధుడు కాడు.

భాష్యమ్

యదృచ్ఛేతి:- యదృచ్ఛాలాభసంతుష్టః-అప్రార్థితోపనతః లాభః యదృచ్ఛా లాభః. తేన సంతుష్టః సంజాతాలంప్రత్యయః, ద్వన్ద్వాతీతః-ద్వన్ద్వైః శీతోష్ణాదిభిః హన్యమానః అపి అవిషణ్ణచిత్తః ద్వన్ద్వాతీతః ఉచ్యతే. విమత్సరః విగతమత్సరః నిర్వైరబుద్ధిః,సమః తుల్యః యదృచ్ఛాలాభస్య సిద్ధౌ అసిద్ధౌ చ.యః ఏవంభూతః యతిః అన్నాదేః శరీరస్థితిహేతోః లాభాలాభయోః సమః హర్షవిషాదవర్జితః,కర్మాదౌ అకర్మాదిదర్శీ యథాభూతాత్మదర్శననిష్ఠః శరీరస్థితిమాత్రప్రయోజనే భిక్షాటనాదౌ శరీరనిర్వర్త్యే **"నైవ కించిత్ కరోమి అహమ్"**(5.8) **"గుణాః గుణేషు వర్తన్తే"**(3.28) ఇత్యేవం సదా సంపరిచక్షాణః,ఆత్మనః కర్తృత్వమ్ అపశ్యన్ నైవ కించిత్ భిక్షాటనాదికం కర్మ కరోతి.లోకవ్యవహారసామాన్యదర్శనేన తు లౌకికైః ఆరోపితకర్తృత్వే భిక్షాటనాదౌ కర్మణి కర్తా భవతి.స్వానుభవేన తు శాస్త్రప్రమాణజనితేన అకర్తైవ.సః ఏవం పరాధ్యారో పితకర్తృత్వం శరీరస్థితిమాత్రప్రయోజనం భిక్షాటనాదికం కర్మ కృత్వాపి న నిబధ్యతే; బన్ధహేతోః కర్మణః సహేతుకస్య జ్ఞానాగ్నినా దగ్ధత్వాత్ ఇతి ఉక్తానువాద ఏషః.
22

బాలానందిని

యదృచ్ఛేతి:- యదృచ్ఛాలాభసంతుష్టుడు-ప్రార్థించకుండా వచ్చిన లాభం యదృచ్ఛాలాభం.దానిచేత సంతుష్టుడు,అనగా చాలును అనుబుద్ధి పుట్టినవాడు.ద్వంద్వా తీతుడు-శీతోష్ణాదిద్వంద్వాలచేత పీడించబడుచున్నా కూడ మనస్సులో విషాదం(దిగులు) చెందనివాడు ద్వంద్వాతీతు డని చెప్పబడతాడు.మత్సరం లేనివాడు;బుద్ధిలో ఎవరియందూ వైరం లేనివాడు, యదృచ్ఛాలాభం సిద్ధించినా సిద్ధించకపోయినా కూడ సమంగా, తుల్యుడుగా ఉండువాడు.ఈ విధమైన ఏ యతి శరీరస్థితికి హేతువైన అన్నాదులు లభించినా లభించకపోయినా కూడ సముడై,హర్షం కాని విషాదం కాని లేనివాడై,కర్మాదులందు అకర్మాదులను చూచుచు,యథార్థ మైన ఆత్మదర్శనమునందు నిష్ఠ(స్థిరమైన స్థితి)కలవాడై,శరీరాదులచేత చేయదగిన,శరీరస్థితికొరకు మాత్రమే ఉపయోగించే భిక్షాట నాది కర్మ విషయంలో కూడ "నే నేమీ చేయడంలేదు""గుణాలు గుణాలలో ప్రవర్తిస్తున్నాయి"

అని పరిశీలిస్తూ తనకు కర్తృత్వం లేకపోవడాన్ని చూస్తూ(అతడు)భిక్షాటనాదికర్మను దేనినీ కూడ చేయడంలేదు. అయితే-లోకంలో జరిగే వ్యవహారంతో పోలిక కనబడడంచేత, లౌకికులచేత ఆరోపింపబడిన కర్తృత్వం గల(దేని విషయంలో వీనికి కర్తృత్వం ఉన్న దని లౌకికులు ఆరోపిస్తారో అట్టి)భిక్షాటనాదికర్మయందు కర్త అవుతాడు. శాస్త్రప్రమాణాది జనితమైన స్వానుభవంచేత మాత్రం అతడు అకర్తయే. ఈ విధంగా అతడు పరులచేత ఆరోపింపబడిన కర్తృత్వం గల, శరీరస్థితిమాత్రప్రయోజన మైన భిక్షాటనాదికర్మ చేసినా కూడ, బంధానికి హేతు వైన కర్మ దాని హేతు వైన అవిద్యతో పాటు జ్ఞానాగ్నిచేత కాల్చి వేయబడినది అవడంచేత, బంధింపబడదు అని వెనుక చెప్పినదానికే ఇది అనువాదం(మళ్ళీ చెప్పడం). 22

భాష్యమ్

"త్యక్త్వా కర్మఫలాసంగమ్"(4.20)ఇత్యనేన శ్లోకేన యః ప్రారబ్ధకర్మా సన్ యదా నిష్క్రియబ్రహ్మాత్మదర్శనసంపన్నః స్యాత్ తదా తస్య ఆత్మనః కర్తృకర్మప్రయోజనా భావదర్శినః కర్మపరిత్యాగే ప్రాప్తే కుతశ్చిన్నిమిత్తాత్ తదసంభవే సతి పూర్వవత్, తస్మిన్ **"కర్మణి అభిప్రవృత్తః అపి నైవ కించిత్కరోతి సః"**(4.20)ఇతి కర్మాభావః ప్రదర్శితః. యస్యైవం కర్మాభావః దర్శితః తస్యైవ –

మూ. గతసంగస్య ముక్తస్య జ్ఞానావస్థితచేతసః,
యజ్ఞాయాచరతః కర్మ సమగ్రం ప్రవిలీయతే. 23

బాలానందిని

త్యక్త్వేతి:- ఏ పురుషుడు కర్మను ప్రారంభించి, ఎప్పు డైతే"నేనునిష్క్రియబ్రహ్మ స్వరూపుడను"అను జ్ఞానం కలవా డవుతాడో అప్పుడు-కర్త, కర్మ, ప్రయోజనం-వీటియొక్క అభావాన్ని చూచిన(కర్మగాని, కర్తృత్వంగాని, ప్రయోజనం గాని లేవు అని గ్రహించిన) అతడు కర్మను పరిత్యజించవలసి ఉన్నా కూడ ఏదో కారణంచేత ఆ కర్మ పరిత్యాగంచేయడం కుదరక, వెనుకటి వలె ఆ కర్మయందు ప్రవర్తించినా కూడ అతడు ఏమీ కూడ చేయడంలేదు అని "త్యక్త్వా కర్మఫలాసంగమ్"అనే శ్లోకంచేత అతనికి కర్మాభావం ప్రదర్శింపబడింది. ఈ విధంగా ఎవనికి కర్మాభావం ప్రదర్శించబడినదో అట్టి –

ప్ర.అ. **గతసంగస్యేతి:-** గతసంగస్య=సంగం లేనివాడు, ముక్తస్య=ముక్తుడు, జ్ఞానావస్థితచేతసః=జ్ఞానమునందు నిలచిన చిత్తం కలవాడు, యజ్ఞాయ=యజ్ఞం జరగడం కొరకు, కర్మ=కర్మను, ఆచరతః=ఆచరించుచున్నవాడు అయిన వానియొక్క, సమగ్రమ్=ఫల సహితమైన కర్మ, ప్రవిలీయతే=లీనమైపోవును.

భాష్యమ్

గతసంగస్య సర్వతః నివృత్తాసక్తేః,ముక్తస్య నివృత్తధర్మాదిబన్ధనస్య,జ్ఞానావస్థిత చేతసః జ్ఞానే ఏవ అవస్థితం చేతః యస్య సః అయం జ్ఞానావస్థితచేతాః తస్య,యజ్ఞాయ యజ్ఞనిర్వృత్త్యర్థమ్ అచరతః కర్మ,సమగ్రం సహ అగ్రేణ ఫలేన వర్తతే ఇతి సమగ్రం కర్మ,తత్ సమగ్రం ప్రవిలీయతే వినశ్యతి ఇత్యర్థః. 23

బాలానందిని

గతేతి:- అన్నింటివిషయంలోను ఆసక్తి పోయినవాడు,ముక్తుడు అనగా ధర్మా ధర్మాదిబంధనాలు నివర్తించినవాడు,జ్ఞానమునందు మాత్రమే స్థిరంగా నిలచిన చిత్తం కలవాడు,యజ్ఞంకొరకు అనగా ప్రారంభించిన యజ్ఞం పూర్తి అవడంకొరకు కర్మను నడిపి స్తూన్నవాడు అయినవానియొక్కసమగ్రం అనగా అగ్రంతో, అనగా ఫలంతో,కూడినది అని అర్థం; అట్టి సమగ్రమైన కర్మ విలీనం అవుతుంది,అనగా నశిస్తుంది అని అర్థం.

వి.:- ఈ శ్లోకానికి భాష్యకారులు వ్రాసిన అవతారికను పట్టి కూడ ఇరవైయవ శ్లోకం అవతారికకు మేం చూపిన భావం సంగతంగా కనబడుతున్నది.అందుచేతనే **"యజ్ఞాయ"**అను పదానికి **"యజ్ఞనిర్వృత్త్యర్థమ్"**(ప్రారంభించిన యజ్ఞం పూర్తి అవడం కొరకు)అనీ, **'ఆచరతః'** అను పదానికి **"నిర్వర్తయతః"**(ఆపకుండా నడిపిస్తూన్న)అనీ భాష్య కారులు అర్థం వ్రాశారు.దీని నంతనీ పట్టి దీర్ఘకాలసాధ్య మైన కర్మ ప్రారంభించి ఆ కర్మ పూర్తి కాకుండా జ్ఞానోదయం కలిగినవాని విషయంలోనే ఇది చెప్పబడుచున్న దని స్పష్టం అవుతున్నది.అక్కడ ఆ విధంగా వ్రాసిన శ్రీరామరాయకవి కూడ ఇక్కడ-"యజ్ఞనిర్వృత్త్యర్థమ్ ఇతి-ప్రారబ్ధయజ్ఞస్య, సమాప్త్యర్థమ్ ఆచరతః వ్యాప్రియమాణస్య,యజ్ఞం నిర్వర్తయతః ఇత్యర్థః అని వ్రాశారు. ఈ దృష్టితో పరిశీలించగా-"యజ్ఞనిర్వృత్త్యర్థం యజ్ఞశబ్దితస్య భగవతః విష్ణోః నారాయణస్య ప్రీతిసంపత్త్యర్థమితి యావత్"అని ఆనందగిరి వ్యాఖ్య చింత్యం.అందుచేతనే శ్రీరామారాయకవికూడ "న చ యజ్ఞాయ ఈశ్వర ప్రీత్యర్థమ్ ఇతి వాచ్యమ్;ఆత్మవిదో౾ స్య ఈశ్వరప్రీత్యర్థక సంకల్పాసంభవాత్. అయం హి ఆత్మానమేవేశ్వరం జానాతి.తతశ్చ ఆత్మప్రీత్యర్థమేవ ఇత్యుక్తం స్యాత్.తచ్చానిష్టమ్.స్వప్రీతిరూపే౾ పి ఫలే సంగస్య అకార్యత్వాత్" అని వ్రాశారు. 23

భాష్యమ్

కస్మాత్ పునః కారణాత్ క్రియమాణం కర్మ స్వకార్యారమ్భమ్ అకుర్వత్ సమగ్రం ప్రవిలీయతే ఇతి? ఉచ్యతే. యతః-

మూ. బ్రహ్మార్పణం బ్రహ్మ హవిర్బ్రహ్మాగ్నౌ బ్రహ్మణా హుతమ్,
బ్రహ్మైవ తేన గన్తవ్యం బ్రహ్మకర్మసమాధినా. 24

భాష్యమ్

కస్మాదితి:– చేయబడుచున్న కర్మ ఏ కారణంవల్ల తాను చేయవలసిన కార్యం చేయకుండా ఫలసహితంగా లీనం అయిపోతుంది? చెప్పబడుచున్నది. ఎందువల్ల ననగా–

ప్ర. అ. అర్పణమ్=హోమసాధనం, బ్రహ్మ=బ్రహ్మయే, హవిః=హవిస్సు, బ్రహ్మ = బ్రహ్మయే. బ్రహ్మాగ్నౌ = బ్రహ్మరూప మైన అగ్నియందు, బ్రహ్మణా =బ్రహ్మచేత, హుతమ్=హోమంచేయడం కూడ, బ్రహ్మయే, బ్రహ్మకర్మసమాధినా =బ్రహ్మయే అయిన కర్మయందు సమాధిగల, తేన=వాని చేత, గన్తవ్యమ్= పొందదగినది, బ్రహ్మైవ =బ్రహ్మయే.

భాష్యమ్

బ్రహ్మేతి:–బ్రహ్మ అర్పణమ్–యేన కరణేన బ్రహ్మవిత్ హవిః అగ్నౌ అర్పయతి తత్ బ్రహ్మైవ ఇతి పశ్యతి. తస్య ఆత్మవ్యతిరేకేణాభావం పశ్యతి, యథా శుక్తికాయాం రజతాభావం పశ్యతి; తత్ ఉచ్యతే బ్రహ్మార్పణమ్ ఇతి. యథా యత్ రజతం తత్ శుక్తికైవ ఇతి. బ్రహ్మ అర్పణమ్ ఇతి అసమస్తే పదే. యదర్పణబుద్ధ్యా గృహ్యతే లోకే తదస్య బ్రహ్మవిదః బ్రహ్మైవ ఇత్యర్థః. బ్రహ్మ హవిః–తథా యత్ హవిర్బుద్ధ్యా గృహ్యమాణం తత్ బ్రహ్మైవ అస్య. తథా బ్రహ్మాగ్నౌ ఇతి సమస్తం పదమ్. అగ్నిః అపి బ్రహ్మ ఏవ యత్ర హూయతే. బ్రహ్మణా కర్త్రా, బ్రహ్మైవ కర్తా ఇత్యర్థః. యత్ తేన హుతం హవనక్రియా తత్ బ్రహ్మ ఏవ. యత్ తేన గన్తవ్యం ఫలం తదపి బ్రహ్మైవ. బ్రహ్మకర్మసమాధినా–బ్రహ్మైవ కర్మ బ్రహ్మకర్మ. తస్మిన్ సమాధిః యస్య సః బ్రహ్మకర్మసమాధిః, తేన బ్రహ్మకర్మసమాధినా బ్రహ్మ ఏవ గన్తవ్యమ్.

బాలానందిని

బ్రహ్మేతి:– ఏ సాధనంచేత అగ్నిలో హవిస్సును అర్పిస్తాడో అట్టి స్రుక్ మొదలైనది బ్రహ్మయే అని బ్రహ్మవేత్త చూస్తాడు. ఆత్మకంటె వేరుగా ఆ అర్పణసాధనమైన స్రుగాదికం లేదు అని, శుక్తికయందు రజతాభావాన్ని చూచినట్లు, చూస్తాడు. ఆ విషయమే "బ్రహ్మైవ అర్పణమ్" (అర్పణసాధనం బ్రహ్మయే) అని చెప్పబడుచున్నది. అర్పణం బ్రహ్మయే అని చెప్పడం ఏది రజతమో అది శుక్తియే అని చెప్పి నట్లు. (దీనిని బాధాయాం సామానాధికరణ్యం

అంటారు).బ్రహ్మ, అర్పణమ్ అనేవి వేరు వేరు పదాలు.లోకంలో దేనిని అర్పణసాధనం అని అనుకొంటారో అది ఈ బ్రహ్మవేత్తకు బ్రహ్మయే అని అర్థం.హవిస్సు బ్రహ్మ. దేనిని హవిస్సు అని లోకు లనుకొంటారో అది వీనికి బ్రహ్మయే."బ్రహ్మాగ్నౌ"అనేది సమస్తపదం. దేనియందు హోమం చేయబడుతుందో ఆ అగ్ని కూడ బ్రహ్మయే.బ్రహ్మణా =కర్త యైన బ్రహ్మచేత.కర్త బ్రహ్మయే అని అర్థం.వానిచేత చేయబడిన ఏ హుతం,అనగా హవనక్రియ ఉన్నదో అది బ్రహ్మయే.వానిచేత పొందదగిన ఫలం కూడ బ్రహ్మయే.బ్రహ్మ కర్మసమాధినా– బ్రహ్మకర్మ అనగా కర్మయే బ్రహ్మ అని అర్థం.దానియందు ఎవనికిసమాధి, ఏకాగ్రత,ఉన్నదో అతడు బ్రహ్మకర్మసమాధి.వానిచేత పొందదగినది బ్రహ్మయే.

భాష్యమ్

ఏవం లోకసంగ్రహం చికీర్షుణాపి క్రియమాణం కర్మ పరమార్థతః అకర్మ, బ్రహ్మబుద్ధ్యుపమృదితత్వాత్.నివృత్తకర్మణోఽ పి సర్వకర్మసంన్యాసినః సమ్యగ్దర్శనస్తుత్యర్థం యజ్ఞత్వసంపాదనం జ్ఞానస్య సుతరాముపపద్యతే–యత్ అర్పణాది అధియజ్ఞే ప్రసిద్ధం తత్ అస్య అధ్యాత్మం బ్రహ్మైవ పరమార్థదర్శినః ఇతి.అన్యథా సర్వస్య బ్రహ్మత్వే అర్పణాదీనామేవ విశేషతః బ్రహ్మత్వాభిధానమ్ అనర్థకం స్యాత్.తస్మాత్ బ్రహ్మైవ ఇదం సర్వమ్ ఇతి జానతః విదుషః కర్మాభావః;కారకబుద్ధ్యభావాచ్చ.న హి కారకబుద్ధిరహితం యజ్ఞాఖ్యం కర్మ దృష్టం?సర్వమ్ ఏవ అగ్నిహోత్రాదికం కర్మ శబ్దసమర్పితదేవతావిశేషసంప్రదానాదికారకబుద్ధిమత్ కర్త్రభిమానఫలాభిసంధిమత్ చ దృష్టమ్;న ఉపమృదితక్రియాకారకఫలభేదబుద్ధిమత్ కర్తృత్వాభిమానఫలాభిసంధిరహితం వా.

బాలానందిని

ఏవమితి:– ఈ విధంగా లోకసంగ్రహం చేయదలచినవానిచేత చేయబడే కర్మ కూడ బ్రహ్మబుద్ధిచేత బాధించబడడంచేత,వాస్తవంలో అకర్మయే.ఇది ఇలా ఉన్నప్పుడు (కర్మ లోకసంగ్రహం కోసం చేయబడుతున్నా చేయబడతూనే ఉన్నది.ఈ విధంగా ఆచరించబడే కర్మయే అకర్మ అవుతుంది అన్నప్పుడు)అన్ని కర్మలూ తొలగిపోయిన సర్వకర్మసంన్యాసి యొక్క జ్ఞానానికి,సమ్యగ్దర్శనాన్ని స్తుతించడం కోసం యజ్ఞత్వసంపాదనం(వాని జ్ఞానమునందు యజ్ఞత్వాన్ని ఆరోపించడం)పూర్తిగా ఉపసన్నంగా ఉంది.వైదికమైన యజ్ఞంలో ప్రసిద్ధమైన ఏ అర్పణాదికం ఉన్నదో అది పరమార్థదర్శి దృష్టిలో,అధ్యాత్మమునందు (అధ్యాత్మభూమికలో)బ్రహ్మయే అని వాని జ్ఞానానికి(ఈ శ్లోకంలో)యజ్ఞత్వసంపాదనం చేయబడుచున్నది.

వి:- ఒక జ్ఞాని జ్ఞానం కలిగిన తరువాత కూడ లోకసంగ్రహాద్యర్థం కర్మ చేయ వచ్చును. అతడు చేసే కర్మలతో సంబంధించిన అర్పణాదు లన్నీ బ్రహ్మయే అని చెప్పడం ద్వారా ఈ శ్లోకం ఆ జ్ఞాని చేసే కర్మ వాస్తవంలో అకర్మయే అని సూచిస్తూన్నది. బాహ్యాము లైన యజ్ఞాదులను చేసే సామర్థ్యం లేనివానికి సంకల్పాత్మక మైన యజ్ఞం(అతడు చేసే ఆయా పనులే యజ్ఞంలో చేసే ఆ యా పను లని వర్ణిస్తూ)చెప్పబడింది. అదే విధంగా ఈ శ్లోకం-జ్ఞానియై సర్వకర్మసంన్యాసం చేసినవాని జ్ఞానంమీద యజ్ఞత్వాన్ని ఆరోపిస్తూ న్నది. ఇలా ఆరోపించడంలోని అభిప్రాయం ఆత్మజ్ఞానికి సంబంధించిన యజ్ఞం ఈ విధం గానే ఉంటుంది కాని బాహ్యాము లైన వేదవిహితయజ్ఞాదులతో వానికి పనిలే దని సూచించడం.

అవ:-సమ్యగ్దర్శనాన్ని స్తుతించడంకోసం దానియందు యజ్ఞత్వసంపాదనం చేయబడుచున్నది అనడానికి కారణం ఏమిటి అనే ఆశంకకు సమాధానం చెపుతున్నారు **-అన్యథా ఇతి:**-అలా కాకపోతే(ఇక్కడ యజ్ఞత్వసంపాదనం చేయబడుచున్నది అని అంగీకరించకపోతే)సర్వమూ బ్రహ్మయే అయి నప్పుడు విశేషించి అర్పణాదులే బ్రహ్మ అని చెప్పడం వ్యర్థం అవుతుంది. అందువల్ల ఇదంతా బ్రహ్మయే అని తెలుసుకొన్న విద్వాంసునకు ఏ కర్మలూ ఉండవు. కారకబుద్ధి లేకపోవడంచేత కూడ వానికి ఏ కర్మలూ ఉండవు. (కర్త,కర్మ, కరణం,సంప్రదానం మొదలైనవి కారకాలు). కారకబుద్ధి లేని యజ్ఞం అనే కర్మ కనబడదు కదా? అగ్నిహోత్రం మొదలైన సమస్తకర్మా కూడ వేదంచేత చెప్పబడిన దేవతావిశేషరూప మైన సంప్రదానం మొదలైన కారకాల జ్ఞానం కలదిగాను "నేను కర్తను" అనే అభిమానము, ఫలంమీద కోరిక కలదిగాను కనబడుతున్నది గాని తొలగింప బడిన క్రియా-కారక-ఫలభేద బుద్ధికలది గాను,కర్తృత్వాభిమానం ఫలాభిసంధి లేనిది గాను కనబడదు కదా?

వి:-ఫలానా దేవతకు హవిస్సు సమర్పించాలి;దీనివల్ల ఫలానా ఫలం లభిస్తుంది అని వేదం బోధిస్తుంది. ఏ దేవతకు హవిస్సు ఇవ్వబడుతుందో ఆ దేవతకు (వ్యాకరణశాస్త్రానుసారం)సంప్రదానకారకం అని పేరు. ఇవ్వబడేదానికి కర్మకారకం అని,ఇచ్చేవానికి కర్తృ కారకం అనీ పేర్లు. అగ్నిహోత్రం మొదలైన ఏ కర్మ తీసికొన్నా దానిలో దేవతాదిరూపమైన సంప్రదానకారకాదుల జ్ఞానం,నేను కర్తను అను అభిమానం,ఈ ఫలం నాకు లభించాలి అనే కోరిక ఇవన్నీ ఉండి తీరుతాయి. ఇవి లేని కర్మ ఉండదు అని భావం.

భాష్యమ్

ఇదం తు బ్రహ్మబుద్ధ్యుపమృదితార్పణాదికారకక్రియాఫలభేదబుద్ధి కర్మ;అతః అకర్మైవ తత్. తథా చ దర్శితమ్-"కర్మణ్యకర్మ యః పశ్యేత్"(4.18),"కర్మణ్యభిప్రవృత్తో ఽపి నైవ కించిత్ కరోతి సః"(4.20),"గుణా గుణేషు వర్తన్తే"(6.28),"నైవ కించిత్కరోమీతి యుక్తో మన్యేత తత్త్వవిత్"(5.8)ఇత్యాదిభిః. తథా చ దర్శయన్ తత్ర

క్రియాకారకఫలభేదబుద్ధ్యుపమర్దనం కరోతి. దృష్టం చ కామ్యాగ్నిహోత్రాదౌ కామోపమర్దేన కామ్యాగ్నిహోత్రాదిహానిః. తథా మతిపూర్వకామతిపూర్వకాదీనాం కర్మణాం కార్యవిశేషస్య ఆరమ్భకత్వం దృష్టమ్. తథా ఇహాపి బ్రహ్మబుద్ధ్యుపమర్దితార్పణాదికారక క్రియాఫలభేదబుద్ధేః బాహ్యచేష్టామాత్రేణ కర్మ అపి విదుషః అకర్మ సంపద్యతే. అతః ఉక్తం "సమగ్రం ప్రవిలీయతే"(4.23)ఇతి

బాలానందిని

ఇదమితి:-ఈ కర్మ యైతే బ్రహ్మబుద్ధిచేత అణగద్రొక్కబడిన అర్పణం మొదలైన కారకాలయొక్క క్రియలయొక్క ఫలాలయొక్క భేదబుద్ధి గలది(ఈ కర్మకు సంబంధించిన భేదబుద్ధి బ్రహ్మబుద్ధిచేత నశింపచేయబడినది); అందుచేత ఇది అకర్మయే. ఈ విషయమే -**"కర్మణ్యకర్మ యః పశ్యేత్", "కర్మణ్యభిప్రవృత్తోఽపి నైవ కించిత్ కరోతి సః", "గుణా గుణేషు వర్తన్తే", "నైవ కించిత్ కరోమీతి యుక్తో మన్యేత తత్త్వవిత్"** ఇత్యాదులచేత చూపబడినది. అట్లే అక్కడక్కడ చూపుతూ క్రియా-కారక-ఫలాల భేదబుద్ధిని నశింప చేస్తూంటాడు. కామ్యాగ్నిహోత్రాదులలో కామాన్ని అణచివేయడంచేత కామ్యాగ్నిహోత్రాదుల వినాశం కనబడుచున్నది. (ఏదో ఒక కామాన్ని తీర్చే అగ్నిహోత్రం కామ్యాగ్నిహోత్రం. అయితే ఆ అగ్నిహోత్రాన్నే ఫలకామన లేకుండా చేస్తే అది కామ్యాగ్నిహోత్రం కాకపోవడంచేత కామ్యాగ్నిహోత్రం నశించిన ట్లవుతుంది). అట్లే మతిపూర్వకంగాను(ఏదో ఫలం పొందాలి అనే మతితోను) అనుమతిపూర్వకంగాను (అలాంటి మతి లేకుండగాను చేసిన కర్మలు ఫలవిశేషాలను కలిగించడం కనబడుతున్నది. అట్లే బ్రహ్మబుద్ధిచేత నశింప చేయబడిన అర్పణం మొదలైన కారకాల, క్రియల, ఫలాల భేదబుద్ధి గల విద్వాంసుని, బాహ్యచేష్టామాత్రం చేత జరపబడే కర్మ కూడ అకర్మయే అవుతుంది. అందుచేతనే **"సమగ్రం ప్రవిలీయతే"**అని చెప్పబడింది.

భాష్యమ్

అత్ర కేచిదాహుః-యత్ బ్రహ్మ తత్ అర్పణాదీని. బ్రహ్మైవ కిల అర్పణాదినా పఞ్చవిధేన కారకాత్మనా వ్యవస్థితం సత్ తదేవ కర్మ కరోతి. తత్ర న అర్పణాదిబుద్ధిః నివర్త్యతే, కిం తు అర్పణాదిషు బ్రహ్మబుద్ధిః ఆధీయతే. యథా ప్రతిమాదౌ విష్ణ్వాదిబుద్ధిః యథా వా నామాదౌ బ్రహ్మబుద్ధిః ఇతి.

సత్యమ్ ఏవమ్ అపి స్యాత్ యది జ్ఞానస్తుత్యర్థం ప్రకరణం న స్యాత్. అత్ర తు సమ్యగ్దర్శనం జ్ఞానశబ్దితమ్; అనేకాన్ యజ్ఞశబ్దితాన్ క్రియావిశేషాన్ ఉపన్యస్య "శ్రేయాన్ ద్రవ్యమయాద్యజ్ఞాత్ జ్ఞానయజ్ఞః"(4.33) ఇతి జ్ఞానం స్తౌతి. అత్ర చ

సమర్థమ్ ఇదం వచనం "బ్రహ్మార్పణమ్"ఇత్యాది జ్ఞానస్య యజ్ఞత్వసంపాదనే ఇత్యుక్తమ్.యే తు అర్పణాదిషు, ప్రతిమాయాం విష్ణుదృష్టివత్, బ్రహ్మదృష్టిః క్షిప్యతే,నామాదిషు ఇవ చ,ఇతి బ్రువతే న తేషాం బ్రహ్మవిద్యా ఉక్తా ఇహ వివక్షితా స్యాత్;అర్పణాదివిషయత్వాత్ జ్ఞానస్య.

బాలానందిని

అత్రేతి:- ఇక్కడ కొందరు ఈ విధంగా వ్యాఖ్యానిస్తున్నారు-"ఏది బ్రహ్మయో అదే అర్పణాదికము.బ్రహ్మయే ఐదు విధా లైన కారకాల రూపంలో ఉన్నదై 'అదే కర్మను చేస్తూన్నది.ఇలా చెప్పడంవల్ల అర్పణాదిబుద్ధి నివర్తింపబడడంలేదు(తొలగింపబడడంలేదు); మరేమనగా అర్పణాదులయందు బ్రహ్మబుద్ధి ఉంచబడుచున్నది.ప్రతిమాదులయందు విష్ణ్వాదిబుద్ధి ఏ విధంగాఉంచబడుతుందో(ప్రతిమయందు విష్ణుత్వం ఏ విధంగా ఆరోపించ బడుచున్నదో)నామాదులయందు ("నామ బ్రహ్మేత్యుపాసీత"అని చెప్పి నట్లు)బ్రహ్మ బుద్ధి ఏ విధంగా చేయబడుచున్నదో అట్లే ఇది కూడ."

వి. ఈ వ్యాఖ్యానం ప్రకారం అర్పణం బ్రహ్మ అని అర్థం కాదు,బ్రహ్మ అర్పణం అని అర్థం.అట్లే-బ్రహ్మ హవిస్సు,బ్రహ్మ అగ్ని బ్రహ్మ కర్త, బ్రహ్మయే హోమం,బ్రహ్మయే ఫలం అని అర్థం.అర్పణం కరణ కారకం,హవిస్సు కర్మకారకం,అగ్ని అధికరణకారకం, యజమానుడు కర్తృకారకం,దేవత సంపదానకారకం.ఈ విధంగా ఇక్కడ ఐదు కారకాలు చెప్పబడ్డాయి.బ్రహ్మయే ఈ కారకాల రూపంలో పరిణమించినది అని వీరి అభిప్రాయం.ఈ విధంగా బ్రహ్మ అర్పణాదికం అని చెప్పడంచేత అర్పణాదిబుద్ధి మర్దింపబడడంలేదు. అర్పణాదులు అర్పణాదిరూపంలోనే కనబడతాయి.సిద్ధాంతి వ్యాఖ్యానంలో అర్పణమే బ్రహ్మ ఇత్యాదివిధంగా చెప్పడంచేత అర్పణాదిబుద్ధి పూర్తిగా తొలగిపోయి బ్రహ్మబుద్ధి మాత్రమే ఉంటుంది.ఇది ఈ రెండు వ్యాఖ్యానాలలలో భేదం.

అ.వ.:- ఈ విధంగా ఈ వాక్యాలకి అర్థం చెప్పడానికి అవకాశం ఉంది కాని ఇక్కడ ఉన్న ప్రకరణాన్ని పట్టి ఈ అర్థం కుదరదు. ఈ ఘట్టంలో జ్ఞానయజ్ఞంమీద యజ్ఞత్వాన్ని ఆరోపించి,ఈ జ్ఞానయజ్ఞంతో ఇంకా మరి కొన్ని యజ్ఞాలు చెప్పి,అన్ని యజ్ఞాలలో జ్ఞానయజ్ఞం గొప్పది అని చెప్పబడనున్నది. అందుచేత జ్ఞానాన్ని యజ్ఞంగా చెప్పా లంటే అర్పణాదులను పూర్తిగా ఉపమర్దించి వాటిని బ్రహ్మరూపంలో చూస్తేనే కుదురు తుంది.అందుచేత మొదట చూపిన వ్యాఖ్యానమే యుక్తం అని చెపుతున్నారు-**సత్యమితి:**- ఈ ప్రకరణం జ్ఞానస్తుతికోసం ఉద్దిష్టం కాకపోతే ఈ విధంగా కూడ చెప్పవచ్చును; నిజమే. అ౯ుతే ఇక్కడ యజ్ఞం అనే పేరు గల అనేకక్రియావిశేషాలను చెప్పి సమ్యగ్దర్శనానికి కూడ జ్ఞానయజ్ఞం అని పేరు

పెట్టబడింది."శ్రేయాన్ ద్రవ్యమయాద్యజ్ఞాత్ జ్ఞానయజ్ఞః" అని జ్ఞానాన్ని స్తుతిస్తున్నాడు. ఇక్కడ నున్న"బ్రహ్మార్పణమ్"ఇత్యాదివాక్యం జ్ఞానానికి యజ్ఞత్వాన్ని సంపాదించడానికి సమర్థంగా ఉంది. అలా కాకపోతే(యజ్ఞత్వసంపాదనం ఉద్దిష్టం కాకపోతే)అంతా బ్రహ్మయే అయినప్పుడు విశేషించి అర్పణాదులకే బ్రహ్మత్వాన్ని చెప్పడం నిరర్థకం అవుతుంది. ప్రతిమాదులయందు విష్ణుదృష్టి వలె,నామాదులయందు బ్రహ్మదృష్టి వలె, అర్పణాదులయందు బ్రహ్మదృష్టి ఉంచబడుతున్నది అని ఎవరు చెపుతున్నారో వారి వ్యాఖ్యానం ప్రకారం ఇక్కడ చెప్పడానికి ఉద్దేశించినది బ్రహ్మవిద్య అని చెప్పడానికి అవకాశం ఉండదు. ఎందువల్ల ననగా(వారి ప్రకారం)ఈ జ్ఞానం అర్పణాదులకు సంబంధించినది.

భాష్యమ్

న చ దృష్టిసంపాదనజ్ఞానేన మోక్షఫలం ప్రాప్యతే-"బ్రహ్మైవ తేన గన్తవ్యమ్" ఇతి చ ఉచ్యతే. విరుద్ధం చ సమ్యగ్దర్శనమన్తరేణ మోక్షఫలం ప్రాప్యతే ఇతి. ప్రకృత విరోధాచ్చ. సమ్యగ్దర్శనం చ ప్రకృతం "కర్మణ్యకర్మ యః పశ్యేత్".(4.18)ఇత్యత్ర. అన్తే చ సమ్యగ్దర్శనం,తస్యైవ ఉపసంహారాత్. "శ్రేయాన్ ద్రవ్యమయాద్యజ్ఞాత్ జ్ఞాన యజ్ఞః"(4.33),"జ్ఞానం లబ్ధ్వా పరాం శాన్తిమ్"(4.39) ఇత్యాదినా సమ్యగ్దర్శనస్తుతి మేవ కుర్వన్ ఉపక్షీణః అధ్యాయః-తత్ర అకస్మాత్ అర్పణాదౌ బ్రహ్మదృష్టిః అప్రకరణే, పతిమాయామ్ ఇవ విష్ణుదృష్టిః, ఉచ్యతే ఇతి అనుపపన్నమ్. తస్మాత్యథావ్యాఖ్యాతార్థః ఏవ అయం శ్లోకః. 24

బాలానందిని

న చేతి:-(అర్పణాదులందు బ్రహ్మ)దృష్టియొక్క సంపాదనానికి సంబంధించిన జ్ఞానంచేత మోక్షరూప మైన ఫలం లభించదుకూడ. మరి ఇక్కడ "బ్రహ్మైవ తేన గన్తవ్యమ్" అని చెప్పబడుతున్నది. సమ్యగ్దర్శనం లేకుండానే మోక్షరూపఫలం సిద్ధిస్తుం దని చెప్పడం (శాస్త్ర)విరుద్ధం. (ఈ వ్యాఖ్యానంలో)ప్రకృతవిరోధం కూడ ఉంది. "కర్మణ్యకర్మ యః పశ్యేత్" అన్నచోట సమ్యగ్దర్శనం ప్రకృతం. చివర కూడ ఆ సమ్యగ్దర్శనాన్ని గూర్చియే ఉప సంహరించడంవల్ల అక్కడ కూడ సమ్యగ్దర్శనమే ప్రకృతం. "శ్రేయాన్...యజ్ఞః", "జ్ఞానం... శాన్తిమ్" ఇత్యాదికంచేత సమ్యగ్దర్శనంయొక్క స్తుతినే చేస్తూ ఈ అధ్యాయం ముగుస్తుంది. అలాంటప్పుడు,ప్రకరణం కాని ప్రకరణంలో(బ్రహ్మదృష్టివిధాయకప్రకరణం కాని జ్ఞాన ప్రకరణంలో)అకస్మాత్తుగా,ప్రతిమయందు విష్ణుదృష్టి వలె,అర్పణాదులయందు బ్రహ్మ దృష్టి చెప్పబడుచున్నది అనడం అనుపపన్నం. అందువల్ల ఈ శ్లోకానికి మేం ఎలా వ్యాఖ్యానం చేశామో అదే యుక్త మైన అర్థం.

భా.అ.ప్ర. ఇక్కడ శ్రీరామానుజాచార్యులు – “బ్రహ్మార్పణమ్=బ్రహ్మ మైన అర్పణం. అనగా స్రుగాదికం గల,బ్రహ్మ=బ్రహ్మయైన హవిస్సు, బ్రహ్మాగ్నియందు,బ్రహ్మయైన ఏ కర్తచేత. హోమం చేయబడినదో అట్టి సమస్తమైన కర్మ కూడ బ్రహ్మాత్మకము,బ్రహ్మమయము అని ఎవడు నిష్చయపూర్వకంగా తెలుసుకుంటాడో అతడు బ్రహ్మకర్మసమాధి. వానిచేత బ్రహ్మయే పొందదగినది. బ్రహ్మాత్మకు దవడంచేత బ్రహ్మ యైన ఆత్మ స్వరూపం పొంద దగినది. ముముక్షువుచేత చేయబడే కర్మ,పరబ్రహ్మాత్మకమే అని అనుసంధానం కల దవడంచేత, జ్ఞానాకారమై సాక్షాత్తు ఆత్మదర్శనానికి సాధనం అవుతుంది, అంతే కాని దీనికి మోక్షానికీ మధ్య జ్ఞాననిష్ఠయొక్క వ్యవధానంఉండదు”అని వ్రాశారు. “కర్మయోగంచేత సాక్షాత్కరింప చేసికొన దగిన ఆత్మస్వరూపం ఇక్కడ స్రుక్కు హవిస్సు,అగ్ని మొదలైనవి వలె బ్రహ్మశబ్దంచేత చెప్పబడుతున్నది”అని వేదాంతదేశికులు వ్రాశారు. వీరిద్దరి మాటలు కూడ సర్వథా అయుక్త మైనవి. ఎందువల్ల ననగా–సర్వమూ బ్రహ్మమయం అని చూచేవాడు ఆత్మసాక్షాత్కారం పొందుతాడు అని చెప్పడం అయుక్తం. ఆత్మ సాక్షాత్కారానికీ, సర్వమూ బ్రహ్మయే అనే జ్ఞానానికి కార్యకారణభావం లేదు(మొదటిది రెండవదానినుండి పుడుతుంది అని ఎక్కడా చెప్పబడలేదు). సమస్తకర్మ బ్రహాత్మక మైనది అనే జ్ఞానంవల్ల ఏదో విధంగా బ్రహ్మసాక్షాత్కారం కలుగుతే కలగవచ్చునేమో,ఆత్మసాక్షాత్కారం మాత్రం కలగడానికి వీలులేదు. నీ మతంలో బ్రహ్మ వేరు ఆత్మ వేరూ కదా? మరొక విషయ మేమనగా–ఇంద్రి యవ్యాపారం ఉపరమించడం అనే రూపం గల జ్ఞాననిష్ఠ లేకుండా లోపల నున్న ఆత్మ వస్తువుయొక్క సాక్షాత్కారం ఎలా కలుగుతుంది? ఆంతరమైన(అన్నింటికంటె లోపలగా ఉన్న)ఆత్మసాక్షాత్కారం కలగడానికి సాధనం మనస్సే కదా? అంది అంతర్ముఖంగా ఉండ డమే జ్ఞాననిష్ఠ అనగా. ఎవడైతే కర్మాచరణాసక్తుడో అతని మనస్సు కారకాదు లన్నీ బైట ఉండడంవల్ల, బహిర్ముఖంగానే ఉంటుంది. ఆత్మ బయట నుండే వస్తువు కాదు;అలా అయితే కర్మవ్యగ్రమై బహిర్ముఖంగా ఉన్న మనస్సుచేత దాని సాక్షాత్కారం కలగడానికి అవకాశం ఉండేది. ‘కర్మయే బ్రహ్మ’అనే జ్ఞానం ఆత్మసాక్షాత్కారానికి హేతువు అవుతుంది అని చెప్పడం యుక్తం కాదు. ఆ పక్షంలో“ఘటం బ్రహ్మ”అనే జ్ఞానంవల్ల కూడ ఆత్మ సాక్షాత్కారం కలగాలి. కలుగుతుంది అని అంటే అలాంటి అనుభవం లేదు కదా? ఎవరికీ కలగడం లేదు కదా?

మరొక విషయ మేమనగా–అన్నీ బ్రహ్మకార్యా లవడంచేత బ్రహ్మయే అయి నప్పుడు అర్పణాదికం కూడ బ్రహ్మయే అవుతుంది;అలాంటప్పుడు ప్రత్యేకించి వాటికి బ్రహ్మభూతత్వం చెప్పడం ఎందుకు? అవిద్వాంసుడు కూడ అబ్రహ్మ యైన (బ్రహ్మ కాని) అర్పణాదికాన్ని చేయజాలడు కదా? అలాంటి అవకాశం ఏదైనా ఉంటే అబ్రహ్మాగ్నియందు అబ్రహ్మార్పణంచేత అబ్రహ్మహవిస్సు హోమం చేయబడుతుందేమో,అలా కాకూడదు అని ఈ విధంగా ప్రత్యేకించి చెప్పవలసిన అవసరం ఉంటుంది. బ్రహ్మకార్య మైన ప్రతీదీ బ్రహ్మయే గాన,ఈ విషయం

తెలిసిన విద్వాంసు డైనా, తెలియని అవిద్వాంసు డైనా బ్రహ్మార్పణాదులనే ఉపయోగిస్తాడు కదా?

హవిస్సు మొదలైనదివలె ఆత్మ కూడ బ్రహ్మాత్మకం అని వేదాంతదేశికులు చెప్పిన మాట 'వేదాంతదేశికుడు'అనే పేరు ఈయనకు విరుద్ధలక్షణచేత పెట్టబడిం దని స్పష్టీ కరిస్తూన్నది.ఎందువలన అనగా–ఆత్మ హవిస్సు,అగ్ని మొదలైనవి వలె బ్రహ్మాత్మకము అని చెప్పడానికి కారణం అది బ్రహ్మంనుండి పుట్టడం వల్లనా లేక బ్రహ్మచేత జ్ఞేయంగా (తెలియబడేదిగా)ఉండడమా?"అజో నిత్యః శాశ్వతః"ఇత్యాది వాక్యాలకు విరుద్ధం అవడం చేత మొదటి పక్షం కుదరదు.ప్రకృతి,పురుషుడు,కాలం మొదలైనవి నీమతంలో కూడ అనాదులూ నిత్యములూ కూడ గదా?రెండవ పక్షం కూడ కుదరదు.బ్రహ్మ వలె ఆత్మ కూడ ద్రష్టయే గాన(తెలుసుకొనేదే గాన)అది బ్రహ్మచేత జ్ఞేయం కాదు.అలా కాని పక్షంలో ఆత్మ జడం కావలసివస్తుంది."చేతనశ్చేతనానామ్"అను శ్రుతిలో జీవులు చేతనులు అని నువ్వే అంగీకరించి ఉన్నావు.

ఆత్మ బ్రహ్మచేత జ్ఞేయం అవడంవల్ల అది బ్రహ్మాత్మకం అని అంటే బ్రహ్మకూడ ఆత్మచేత జ్ఞేయం కావున బ్రహ్మ ఆత్మాత్మకం అని చెప్పవలసి వస్తుంది. "దృశ్యతే త్వగ్ర్యయా బుద్ధ్యా"ఇత్యాదిశ్రుతిచేత బ్రహ్మ కూడ ఆత్మచేత జ్ఞేయం అని ప్రతిపాదింపబడుచున్నది కదా?బ్రహ్మయొక్క ఈ జ్ఞేయత్వం సత్యం అనడానికి వీలు లేదు;అలా అంగీకరిస్తే బ్రహ్మ జడ మనీ,పరిచ్ఛిన్నం అనీ,అనిత్యం అనీ ఈ మొదలైన దోషాలు ప్రాప్తిస్తాయి.ఇలా చెప్పడం "నాన్యోఽతోఽస్తి ద్రష్టా", "సాక్షీ చేతా"ఇత్యాదిశ్రుతులకు విరుద్ధం కూడ. అందుచేత బ్రహ్మయొక్క జ్ఞేయత్వం కల్పితమే.అట్లే ఆత్మయొక్క జ్ఞేయత్వం కూడ కల్పితమే. బ్రహ్మయే ఆత్మ కదా?అందుచేత ఆత్మ బ్రహ్మాత్మకం అనగా బ్రహ్మాభిన్నం అనియే అర్థం. (భా.అ. ప్ర. పే. 146) 24

భాష్యమ్

తత్రాధునా సమ్యగ్దర్శనస్య యజ్ఞత్వం సంపాద్య తత్స్తుత్యర్థమ్ అన్యేఽపి యజ్ఞాః ఉపక్షిప్యన్తే దైవమేవేత్యదినా –

మూ. దేవమేవాపరే యజ్ఞం యోగినః పర్యుపాసతే,
బ్రహ్మాగ్నావపరే యజ్ఞం యజ్ఞేనైవోపజుహ్వతి. 25

బాలానందిని

తత్రేతి :– ఈ విధంగా సమ్యగ్దర్శనానికి యజ్ఞత్వం సంపాదించి (యజ్ఞత్వారోపం చేసి) దానిని స్తుతించడంకొరకు ఇతర యజ్ఞాలు కూడ ప్రతిపాదించబడుచున్నవి. (లేదా సమ్యగ్దర్శనాన్ని స్తుతించడంకొరకు దానికి యజ్ఞత్వసంపాదనం చేసి అని అన్వయం)–

ప్ర. అ. దైవమితి :- అపరే = మరి కొందరు, యోగినః = కర్మఠులు, దైవమ్ = దేవతలకు సంబంధించిన, యజ్ఞమ్ ఏవ = యజ్ఞమునే, పర్యుపాసతే = సేవించుచున్నారు. అపరే = కొందరు బ్రహ్మవేత్తలు బ్రహ్మాగ్నౌ = బ్రహ్మ అనే అగ్నియందు, యజ్ఞేనైవ = ఆత్మ చేతనే, యజ్ఞమ్ = ఆత్మను, ఉపజుహ్వతి = హోమం చేస్తున్నారు. (ఈ విధంగా జ్ఞాన మనే యజ్ఞం చేస్తున్నారు.)

భాష్యమ్

దైవమ్ ఏవ - దేవాః ఇజ్యన్తే యేన యజ్ఞేన అసౌ దైవః యజ్ఞః; తమ్ ఏవ అపరే యజ్ఞం, యోగినః కర్మిణః పర్యుపాసతే, కుర్వన్తి ఇత్యర్థః. బ్రహ్మాగ్నౌ - **"సత్యం జ్ఞానమనన్తం బ్రహ్మ")** (తై. ఉ. 21) **"విజ్ఞానమానన్దం బ్రహ్మ"** (బృ. ఉ. 3. 9. 28), **"యత్సాక్షాదపరోక్షాదపరోక్షాత్ బ్రహ్మ య ఆత్మా సర్వాన్తరః"** (బృ. ఉ. 3. 5. 1) ఇత్యాదివచనోక్తమ్, అశనాయాపిపాసాదిసర్వసంసారధర్మవర్జితమ్ (బృ. ఉ. 3. 5. 1) "నేతి ఇతి" (బృ. ఉ. 4. 4. 22)ఇతి నిరస్తాశేషవిశేషం బ్రహ్మశబ్దేన ఉచ్యతే. బ్రహ్మ చ తత్ అగ్నిశ్చ సః హోమాధికరణత్వవివక్షయా బ్రహ్మాగ్నిః, తస్మిన్ బ్రహ్మాగ్నౌ, అపరే అన్యే బ్రహ్మవిదః, యజ్ఞమ్, యజ్ఞశబ్దవాచ్యః ఆత్మా, ఆత్మనామసు యజ్ఞశబ్దస్య పాఠాత్; తమ్ ఆత్మానం యజ్ఞం, పరమార్థతః పరమేవ బ్రహ్మ సన్తం బుద్ధ్యాద్యుపాధిసంయుక్తమ్, అధ్యస్తసర్వోపాధిధర్మకమ్, ఆహుతిరూపం, యజ్ఞేనైవ ఆత్మనైవ ఉక్తలక్షణేన, ఉపజుహ్వతి ప్రక్షిపన్తి. సోపాధికస్య ఆత్మనః నిరూపాధికేన పరబ్రహ్మస్వరూపేణైవ యత్ దర్శనం సః తస్మిన్ హోమః, తం కుర్వన్తి బ్రహ్మాత్మైకత్వ దర్శననిష్ఠాః సంన్యాసినః ఇత్యర్థః. సః అయం సమ్యగ్దర్శనలక్షణః యజ్ఞః దైవయజ్ఞాదిషు యజ్ఞేషు ఉపక్షిప్యతే "బ్రహ్మార్పణమ్" ఇత్యాదిశ్లోకైః. "శ్రేయాన్ద్రవ్యమయాద్యజ్ఞాద్ జ్ఞాన యజ్ఞః పరంతప" ఇత్యాదినా స్తుత్యర్థమ్. 25

బాలానందిని

దైవమేవేతి:- దేనిచేత దేవతలు పూజించబడతారో ఆ యజ్ఞం దైవయజ్ఞం. ఆ యజ్ఞాన్నే కొందరు యోగులు, కర్మఠులు, ఉపాసిస్తారు. చేస్తారు. అని అర్థం. బ్రహ్మాగ్నౌ- **"సత్యం జ్ఞానమనన్తం బ్రహ్మ"**(బ్రహ్మ సత్యజ్ఞానరూపము, అంతం లేనిది), **"విజ్ఞానమానన్దం బ్రహ్మ"**(బ్రహ్మ జ్ఞాన-ఆనందరూపము), **"యత్సాక్షాదపరోక్షాద్బ్రహ్మ"**(బ్రహ్మ సాక్షాత్తుగా ప్రత్యక్షంగా తెలియబడుతుంది). **"య ఆత్మా సర్వాన్తరః"** (ఏది అన్నింటికంటె లోపల నుంటుందో అది ఆత్మ)ఇత్యాదిశ్రుతివాక్యాలచేత ప్రతిపాదించబడినది, ఆకలి మొదలైన సమస్త సంసారధర్మాలచేత విడవబడినది (ధర్మాలు లేనిది), **"నేతి నేతి"**(ఇది కాదు, ఇదికాదు అని)

నిషేధించబడిన సమస్తవిశేషాలుగలది(ఏ విశేషాలూ లేనిదిగా చెప్పబడినది)అయిన పరమార్థస్వరూపం బ్రహ్మశబ్దంచేత చెప్పబడుతుంది. హోమానికి ఆధారంగా చెప్పడానికి ఉద్దేశింపబడడంచేత అలాంటి బ్రహ్మయే అగ్ని అని చెప్పబడుతున్నది. అట్టి బ్రహ్మాగ్నియందు, కొందరు,అనగా బ్రహ్మవేత్తలు,యజ్ఞమ్-ఆత్మయొక్క పేర్లలో యజ్ఞశబ్దం పఠించబడింది. అందుచేత యజ్ఞం అనగా ఆత్మ. వాస్తవంలో బ్రహ్మయే అయినదీ(బ్రహ్మగానే ఉన్నదీ), బుద్ధిమొదలైన ఉపాధులతో కూడినది, అధ్యసించబడిన సమస్తోపాధిధర్మాలు కలదీ అయిన ఆ ఆత్మను యజ్ఞేనైవ-పైన చెప్పిన లక్షణాలు గల ఆత్మచేతనే,హోమం చేస్తారు. (ఈ విధమైన ఆత్మను ఆ విధమైన బ్రహ్మలో పడవేస్తారు). ఉపాధులతో కూడిన ఆత్మను ఉపాధిరహిత పరబ్రహ్మరూపంలో చూడడమే హోమం చేయడ మనగా; బ్రహ్మాత్మైకత్వదర్శననిష్ఠులైన సంన్యాసులు అట్టి హోమం చేస్తారు అని అర్థం. "శ్రేయాన్ పరంతప"(అర్జునా! ద్రవ్యాలతో చేసే యజ్ఞాలకంటె జ్ఞానయజ్ఞం గొప్పది)అని స్తుతించడంకోసమై,సమ్యగ్దర్శనరూప మైన యజ్ఞం,"బ్రహ్మార్పణమ్"ఇత్యాదిశ్లోకాలచేత దైవయజ్ఞాదులతో కలిపి చెప్పబడు చున్నది.

భా.అ.ప్ర. ఇక్కడ శ్రీరామానుజాచార్యులు- 'దైవమ్'అనగా దేవతార్చనారూప మైన యజ్ఞమును అని,యజ్ఞమ్=హవిస్సును, యజ్ఞేన=స్రుక్‌మొదలైనదానిచేత అనీ వ్యాఖ్యానించారు. ఇది యుక్తం కాదు. యజ్ఞశబ్దానికి అప్రసిద్ధార్థాలు కల్పించడం న్యాయం కాదు. 'బ్రహ్మాగ్నౌ'అనే పదంలోని 'బ్రహ్మ'అనే విశేషణానికి,ఈ వ్యాఖ్యానంలో,ప్రయోజనం ఉండదు. (భా.అ.ప్ర. పే. 187) 25

మూ. శ్రోత్రాదీనీన్ద్రియాణ్యన్యే సంయమాగ్నిషు జుహ్వతి,
శబ్దాదీన్విషయానన్య ఇన్ద్రియాగ్నిషు జుహ్వతి. **26**

ప్ర.అ.శ్రోత్రాదీనీతి:- అన్యే = కొందరు,శ్రోత్రాదీని=చెవులు మొదలైన,ఇన్ద్రియాణి = ఇంద్రియాలను, సంయమాగ్నిషు = నిగ్రహించడం అనే అగ్నులలో, జుహ్వతి=హోమం చేస్తున్నారు. అన్యే = మరి కొందరు, శబ్దాదీన్ = శబ్దం మొదలైన,విషయాన్ = విషయాలను, ఇన్ద్రియాగ్నిషు = ఇంద్రియా లనే అగ్నులయందు, జుహ్వతి = హోమం చేస్తు న్నారు.

భాష్యమ్

శ్రోత్రాదీనీతి:- శ్రోత్రాదీని ఇన్ద్రియాణి,అన్యే యోగినః,సంయమాగ్నిషు, ప్రతీన్ద్రియం సంయమః భిద్యతే ఇతి బహువచనమ్, సంయమాః ఏవ అగ్నయః, తేషు జుహ్వతి. ఇన్ద్రియసంయమమ్ ఏవ కుర్వన్తి ఇత్యర్థః. "శబ్దాదీన్విషయానన్య ఇన్ద్రి

యాగ్నిషు జుహ్వతి”-ఇన్ద్రియాణ్యేవ అగ్నయః తేషు ఇన్ద్రియాగ్నిషు జుహ్వతి. ఇన్ద్రియాదిభిః అవిరుద్ధవిషయగ్రహణం హోమం మన్యన్తే. 26

బాలానందిని

శ్రోత్రాదీనీతి:-మరి కొందరు యోగులు శ్రోత్రాదీంద్రియాలను సంయమాలే ఇంద్రియాలను నిగ్రహించుకొనడాలే, అగ్నులు,వాటిలో హోమం చేస్తున్నారు. ఒక్కొక్క ఇంద్రియాన్ని నిగ్రహించుకొనడం వేరుగా ఉంటుంది గాన(సంయమం అనే అగ్ని అని ఏకవచనం ప్రయోగించకుండా)సంయమా లనే అగ్నులు అని బహువచనం ప్రయోగించబడింది. ఇంద్రియాలే అగ్నులు.ఆ ఇంద్రియాగ్నులలో కొందరు శబ్దాది విషయాలను హోమం చేస్తున్నారు.అనగా శ్రోత్రాదులచేత విరుద్ధములు కాని (శాస్త్రనిషిద్ధములు కాని)విషయాలను గ్రహించడమే హోమం అని భావిస్తున్నారు.
26

భాష్యమ్

కిం చ -

మూ. సర్వాణీన్ద్రియకర్మాణి ప్రాణకర్మాణి చాపరే,
ఆత్మసంయమయోగాగ్నౌ జుహ్వతి జ్ఞానదీపితే. 27

కించేతి :- మరియు -

ప్ర. అ. సర్వాణీతి:-అపరే = మరికొందరు, సర్వాణి = సమస్తమైన, ఇన్ద్రియకర్మాణి = ఇంద్రియకర్మలను,ప్రాణకర్మాణి చ = ప్రాణవాయువుయొక్క కర్మలను, జ్ఞానదీపితే = జ్ఞానముచేత ప్రజ్వలింపచేయబడిన, ఆత్మసంయమయోగాగ్నౌ = ఆత్మ యందు మనస్సును నిలపడం అనే యోగ మనే అగ్నిలో,జుహ్వతి=హోమంచేస్తున్నారు.

భాష్యమ్

సర్వాణీతి:- సర్వాణి ఇన్ద్రియకర్మాణి ఇన్ద్రియాణాం కర్మాణి,తథా ప్రాణకర్మాణి -ప్రాణః వాయుః ఆధ్యాత్మికః తత్కర్మాణి అకుఞ్చనప్రసారణాదీని తాని చ,అపరే,ఆత్మసంయమయోగాగ్నౌ-ఆత్మని సంయమః ఆత్మ సంయమః.స ఏవ యోగాగ్నిః,తస్మిన్ ఆత్మసంయమయోగాగ్నౌ జుహ్వతి ప్రక్షిపన్తి,జ్ఞానదీపితే, స్నేహేనేవ ప్రదీపితే,వివేక విజ్ఞానేన ఉజ్జ్వలభావమ్ ఆపాదితే జుహ్వతి ప్రవిలాపయన్తి ఇత్యర్థః. 27

బాలానందిని

సర్వాణీతి:- మరి కొందరు సమస్త మైన ఇంద్రియకర్మలను,ప్రాణకర్మలను-శరీరంలో ఉన్న ప్రాణవాయువుయొక్క కర్మలైన ముణవడం,చాపడం మొద లైన కర్మలను, ఆత్మసంయమయోగాగ్నియందు-ఆత్మయందు చిత్తాన్ని నిలపడం ఆత్మసంయమం;అదే యోగాగ్ని;ఆ ఆత్మసంయమయోగాగ్నియందు;హోమం చేస్తున్నారు,పడవేస్తున్నారు.వివేక విజ్ఞానంచేత,చమురుచేత వలె మండే టట్లు,ప్రకాశించే టట్లు, చేయబడిన దానియందు హోమం చేస్తున్నారు.అనగా ఈ ఇంద్రియాది కర్మలన్నీ ఆత్మసంయమయోగాగ్నిలో విలీనం అయిపోయే టట్లు చేస్తున్నారు అని అర్థం. 27

మూ. ద్రవ్యయజ్ఞాస్తపోయజ్ఞా యోగయజ్ఞాస్తథా౽పరే,
స్వాధ్యాయజ్ఞానయజ్ఞాశ్చ యతయః సంశితవ్రతాః. 28

ప్ర.అ.ద్రవ్యయజ్ఞా ఇతి:- ద్రవ్యయజ్ఞాః=కొందరు ధనంచేత ఇతరవస్తువులచేత చేయబడిన యజ్ఞం గలవారు.తథా=అట్లే అపరే=మరి కొందరు,యోగయజ్ఞాః=యోగ మనే యజ్ఞం గలవారు.సంశితవ్రతాః=తీవ్రంగా ఉండే టట్లు చేయబడిన నియమాలు గల,యతయః =మరి కొందరు యతులు, స్వాధ్యాయజ్ఞానయజ్ఞాః చ = స్వాధ్యాయయజ్ఞము, జ్ఞానయజ్ఞమూ కలవారు.

భాష్యమ్

ద్రవ్యేతి:- ద్రవ్యయజ్ఞాః తీర్థేషు ద్రవ్యవినియోగం యజ్ఞబుద్ధ్యా కుర్వన్తి యే తే ద్రవ్యయజ్ఞాః. తపోయజ్ఞాః-యే తపస్వినః తే తపోయజ్ఞాః.యోగయజ్ఞాః-ప్రాణాయామప్రత్యాహారాదిలక్షణః యోగః యజ్ఞః యేషాం తే యోగయజ్ఞాః తథా అపరే. స్వాధ్యాయ జ్ఞానయజ్ఞాః చ-స్వాధ్యాయః యథావిధి ఋగాద్యభ్యాసః యజ్ఞః యేషాం తే స్వాధ్యాయయజ్ఞాః;జ్ఞానయజ్ఞాః- జ్ఞానం శాస్త్రార్థపరిజ్ఞానం యజ్ఞః యేషాం తే జ్ఞానయజ్ఞాః చ, యతయః యతనశీలాః,సంశితవ్రతాః సమ్యక్ శితాని తనూకృతాని, తీక్ష్ణీ కృతాని వ్రతాని యేషాం తే సంశితవ్రతాః. 28

బాలానందిని

ద్రవ్యేతి:-ఎవ రైతే పుణ్యక్షేత్రాలయందు లేదా సత్పాత్రలయందు,యజ్ఞం అనే బుద్ధితో ద్రవ్యవినియోగం(దానాదికం)చేస్తారో వారు ద్రవ్యయజ్ఞులు.ఎవరైతే తపఃశాలులో వారు తపోయజ్ఞులు.అట్లే మరికొందరు ప్రాణాయామం,ప్రత్యాహారం మొదలైన యోగమే యజ్ఞంగా గలవారు.స్వాధ్యాయజ్ఞానయజ్ఞులు-యథాశాస్త్రంగా ఋగ్వేదాదులను అభ్యసించడం

స్వాధ్యాయం. అదే యజ్ఞంగా గలవారు స్వాధ్యాయయజ్ఞులు. జ్ఞాన మనగా శాస్త్రార్థం చక్కగా తెలుసుకొనడం. ఆ జ్ఞానమే యజ్ఞంగా గలవారు జ్ఞానయజ్ఞులు. యతయః సర్వదా ప్రయత్నించే స్వభావం కలవారు. ఎవరైతే వ్రతాలను (నియమాలను)బాగా పదునుండే టట్లు తీక్షణంగా ఉండే టట్లు చేస్తారో వాళ్లు సంశితవ్రతులు. 28

భాష్యమ్

కిం చ -

మూ. అపానే జుహ్వతి ప్రాణం ప్రాణేఽపానం తథాపరే,
ప్రాణాపానగతీ రుద్ధ్వా ప్రాణాయామపరాయణాః. 29

కించేతి :- మరియు-

ప్ర.అ. **అపానే ఇతి**:-(కొందరు)ప్రాణమ్=ప్రాణమును, అపానే=అపాన మునందు, జుహ్వతి=హోమం చేస్తారు. తథా=అట్లే, అపరే=మరి కొందరు, అపానమ్= అపానమును, ప్రాణే=ప్రాణమునందు హోమం చేస్తారు. (మరి కొందరు)ప్రాణాపానగతీ= ప్రాణపానముల గతులను, రుద్ధ్వా=అరికట్టి, ప్రాణాయామపరాయణాః = ప్రాణాయామ మునందు ఆసక్తి కలవారు అవుతారు.

భాష్యమ్

అపానే ఇతి:- అపానే అపానవృత్త్యా-జుహ్వతి ప్రక్షిపన్తి, ప్రాణం ప్రాణవృత్తిం. పూరకాఖ్యం ప్రాణాయామం కుర్వన్తి ఇత్యర్థః. ప్రాణే అపానం తథా అపరే జుహ్వతి. రేచకాఖ్యం ప్రాణాయామం కుర్వన్తి ఇత్యేతత్. ప్రాణాపానగతీ ముఖనాసికాభ్యాం వాయోః నిర్గమనం ప్రాణస్య గతిః, తద్విపర్యయేణ అధః గమనమ్ అపానస్య. తే ప్రాణాపానగతీ ఏతే(కే) రుద్ధ్వా నిరుధ్య ప్రాణాయామపరాయణాః ప్రాణాయామతత్పరాః కుమ్భకాఖ్యం ప్రాణాయామం కుర్వన్తి ఇత్యర్థః. 29

బాలానందిని

అపానే ఇతి:- ప్రాణవృత్తిని అపానవృత్తియందు హోమం చేస్తున్నారు, (దానిలో చేరుస్తున్నారు). పూరకం అనే ప్రాణాయామం చేస్తున్నారు అని అర్థం. కొందరు ప్రాణము నందు అపానాన్ని హోమం చేస్తున్నారు. రేచకం అనే ప్రాణాయామం చేస్తున్నారు అని అర్థం. కొందరు ప్రాణాపానగతులను-ముఖనాసికల ద్వారా వాయువు బైటకు వెళ్లడం ప్రాణగతి; దానికి భిన్నంగా వాయువు క్రిందకి వెళ్లడం అపానంయొక్క గతి. ఆ ప్రాణాపాన గతులను నిరోధించి ప్రాణాయామమునందు ఆసక్తి కలవారై ఉంటారు. కుంభకం అనే ప్రాణాయామం చేస్తారు అని అర్థం. 29

భాష్యమ్

కిం చ -

మూ. అపరే నియతాహారాః ప్రాణాన్ ప్రాణేషు జుహ్వతి,
సర్వేఽప్యేతే యజ్ఞవిదో యజ్ఞక్షపితకల్మషాః. 30

ప్ర.అ.:- మరియు- అపరే=మరి కొందరు,నియతాహారాః =పరిమితమైన ఆహారం కలవారై,ప్రాణాన్ = ప్రాణవాయువులను, ప్రాణేషు ఏవ = ప్రాణవాయువులయందే, జుహ్వతి = హోమం చేస్తున్నారు.యజ్ఞవిదః=యజ్ఞములు తెలిసిన, ఏతే = వీళ్లు,సర్వేఽపి = అందరూ కూడ,యజ్ఞక్షపిత కల్మషాః = యజ్ఞాలచేత తొలగింపబడిన పాపాలు కలవారు. 30

భాష్యమ్

అపరే ఇతి:-అపరే నియతాహారాః, నియతః పరిమితః ఆహారః యేషాం తే నియతాహారాః సన్తః ప్రాణాన్ వాయుభేదాన్ ప్రాణేషు ఏవ జుహ్వతి. యస్య యస్య వాయోః జయః క్రియతే ఇతరాన్ వాయుభేదాన్ తస్మిన్ తస్మిన్ జుహ్వతి. తే తత్ర ప్రవిష్టాః ఇవ భవన్తి.సర్వేఽపి ఏతే యజ్ఞవిదః యజ్ఞక్షపితకల్మషాః - యజ్ఞైః యథోక్తైః క్షపితః నాశితః కల్మషః యేషాం తే యజ్ఞక్షపితకల్మషాః. 30

బాలానందిని

అపర ఇతి:-మరి కొదరు పరిమిత మైన ఆహారం భుజిస్తూ ప్రాణము లనే వాయు భేదాలను(ప్రాణాపానాదివాయువులను)ప్రాణాలలోనే హోమం చేస్తున్నారు. ఏ యే వాయువు జయింపబడుతుందో దానియందు ఇతరవాయుభేదాలను హోమం చేస్తారు. ఆ వాయువులు వాటియందు ప్రవేశించిన ట్లవుతాయి. యజ్ఞములను తెలిసికొనిన వీళ్లందరూ కూడ యజ్ఞక్షపితకల్మషులు, పైన చెప్పిన యజ్ఞాలచేత నశింపచేయబడిన కల్మషం కలవారు. 30

భాష్యమ్

ఏవం యథోక్తాన్ యజ్ఞాన్ నిర్వర్త్య-

మూ. యజ్ఞశిష్టామృతభుజో యాన్తి బ్రహ్మ సనాతనమ్,
నాయం లోకోఽస్త్యయజ్ఞస్య కుతోఽన్యః కురుసత్తమ. 31

బాలానందిని

ఏవమితి:- ఈ విధంగా, చెప్పిన రీతులలో పై యజ్ఞాలను ఆచరించి-

యజ్ఞేతి:- యజ్ఞశిష్టామృతభుజః = యజ్ఞములు చేయగా మిగిలిన అమృతాన్ని భుజించేవాగు, సనాతనమ్ = సనాతన మైన,బ్రహ్మ = బ్రహ్మను, యాన్తి = పొందుతారు. కురుసత్తమ = ఓ! కౌరవశ్రేష్ఠా! అయజ్ఞస్య = యజ్ఞం లేనివానికి, అయం లోకః = ఈ లోకం కూడ, నాస్తి = లేదు;అన్యః = మరి యొక లోకం, కుతః = ఎక్కడి నుండి లభిస్తుంది?

భాష్యమ్

యజ్ఞాశిష్టామృతభుజః–యజ్ఞానాం శిష్టం యజ్ఞశిష్టమ్.యజ్ఞశిష్టం చ తత్ అమృతం చ యజ్ఞశిష్టామృతమ్.తత్ భుఞ్జతే ఇతి యజ్ఞశిష్టామృతభుజః. యథోక్తాన్ యజ్ఞాన్ కృత్వా తచ్ఛిష్టేన కాలేన యథావిధి చోదితం అన్నమ్ అమృతాఖ్యం భుఞ్జతే ఇతి యజ్ఞశిష్టామృతభుజః.యాన్తి గచ్ఛన్తి. బ్రహ్మ సనాతనం చిరంతనం.ముముక్షవః చేత్ కాలాతిక్రమాపేక్షయా ఇతి సామర్థ్యాత్ లభ్యతే. న అయం లోకః సర్వప్రాణి సాధారణః అపి అస్తి యథోక్తానాం యజ్ఞానామ్ ఏకః అపి యజ్ఞః యస్య నాస్తి సః అయజ్ఞః తస్య; కుతః అన్యః విశిష్టసాధనసాధ్యః,కురుసత్తమ. 31

బాలానందిని

యజ్ఞేతి:- యజ్ఞశిష్టామృతభుజః – యజ్ఞాలయొక్క శేషించిన అమృతాన్ని భుజించే వాళ్లు యజ్ఞశిష్టామృతభుక్కులు. (దేవతాయజ్ఞాదులలో యజ్ఞం చేయగా కొంత పురోడాశాదికం మిగిలుతుంది.అదే అమృతం.దానిని భుజించేవాళ్లు అని ఒక అర్థం.ఇంద్రియ హోమాదిరూపాలైన ఇతర యజ్ఞాలలో యజ్ఞం చేయగా తినడానికి మిగిలే పదార్థా లంటూ ఏవీ ఉండవు.అందుచేత ఈ పదానికే మరొక అర్థం చెప్పబడుచున్నది) చెప్పిన విధంగా యజ్ఞాలను చేసి మిగిలిన కాలంలో శాస్త్రప్రకారం విహిత మైన అన్నాన్ని (అదే అమృతం) తినేవాళ్లు సనాతనమైన,అనగా చిరంతనమైన,బ్రహ్మను పొందుతారు.వాళ్లు ముముక్షువులైతే(ఈ యజ్ఞంచేత చిత్తశుద్ధి కలగగా) కాలాంతరంలో మోక్షం పొందుతారు అని సామర్థ్యాన్ని పట్టి(అనగా జ్ఞానయజ్ఞం తప్ప ఇతరయజ్ఞాలకు సాక్షాత్తు మోక్షం ఇచ్చే శక్తి లేదు గాన) తెలుస్తూన్నది.చెప్పిన ఈ యజ్ఞాలలో ఒక్క యజ్ఞమైనా లేనివాడు అయజ్ఞుడు.వానికి సర్వప్రాణులకు సాధారణమైన ఈ లోకమే ఉండదు(అనగా ఈ లోకంలోనే సుఖప్రాప్తి రూప మైన అభ్యుదయం ఉండదు).ఇంక విశిష్టమైన సాధనాలచేత సాధింపవలసిన పరలోకం ఎలా ఉంటుంది- ఎక్కడినుండి వస్తుంది. కురుశ్రేష్ఠా! 31

మూ. ఏవం బహువిధా యజ్ఞా వితతా బ్రహ్మణో ముఖే
కర్మజాన్ విద్ధి తాన్ సర్వానేవం జ్ఞాత్వా విమోక్ష్యసే. 32

ప్ర.అ.:- ఏవమ్ = ఈ విధంగా, బహువిధాః = అనేకవిధా లైన, యజ్ఞాః = యజ్ఞాలు, బ్రహ్మణః = వేదముయొక్కముఖే = ముఖమునందు, వితతాః = విస్తృతంగా చెప్పబడినవి. తాన్ సర్వాన్ = వాటిని అన్నింటినీ, కర్మజాన్ = కర్మవలన పుట్టినవాటినిగా, విద్ధి = తెలుసుకొనుము. ఏవమ్ = ఈ విధంగా, జ్ఞాత్వా = తెలిసికొని, విమోక్ష్యసే = విముక్తుడవు కాగలవు.

భాష్యమ్

ఏవమితి:- ఏవం యథోక్తాః బహువిధాః బహుప్రకారాః యజ్ఞాః వితతాః విస్తీర్ణాః బ్రహ్మణః వేదస్య, ముఖే ద్వారే. వేదద్వారేణ అవగమ్యమానాః బ్రహ్మణః ముఖే వితతాః ఉచ్యన్తే. తద్యథా – **"వాచి హి ప్రాణాన్ జుహుమః"** (ఐ.ఆ. 3.2.6) ఇత్యాదయః. కర్మజాన్ కాయికవాచికమానసకర్మోద్భవాన్ విద్ధి తాన్ సర్వాన్ అనాత్మజాన్. నిర్వ్యాపారః హి ఆత్మా. ఆత్మాః ఏవం జ్ఞాత్వా విమోక్ష్యసే అశుభాత్. "న మద్వ్యాపారాః ఇమే, నిర్వ్యాపారః అహమ్, ఉదాసీనః"ఇత్యేవం జ్ఞాత్వా అస్మాత్ సమ్యగ్దర్శనాత్,మోక్ష్యసే సంసారబన్ధనాత్ ఇత్యర్థః. 32

బాలానందిని

ఏవమితి:- ఈ విధంగా (పైన) చెప్పబడిన అనేకప్రకారా లైన యజ్ఞాలు వేదము యొక్క ద్వారమునందు విస్తృతంగా ఉన్నవి. వేదం ద్వారా తెలియబడుచున్నవి అవడం చేత ఇవి వేదముయొక్క ముఖమునందు విస్తృతములైనవి అని చెప్పబడుచున్నాయి. అదెట్లనగా **"వాచి హి ప్రాణాన్ జుహుమః"**(వాక్కునందు ప్రాణాలను హోమం చేస్తున్నాము) ఇత్యాదులు వేదం ద్వారా తెలుస్తూన్నవి. అవి అన్నీ కూడ కాయికకర్మల నుండి,వాచిక కర్మలనుండి,మానసకర్మలనుండి పుట్టినవి అని తెలుసుకొనుము. అంతే కాని అవి ఆత్మనుండి పుట్టినవి(ఆత్మచేత చేయబడేవి)కావు. ఆత్మ వ్యాపారశూన్యం కదా? అందువలన ఈ విధంగా తెలుసుకొని అశుభంనుండి విముక్తుడవు అవుతావు."ఇవి నా వ్యాపారాలు కాదు;నేను వ్యాపారరహితుడను,ఉదాసీనుడను"అని తెలుసుకొని, ఈ విధమైన సమ్యగ్దర్శనం ఉండడం వల్ల సంసారబంధనం నుండి విముక్తుడవు అవగలవు అని అర్థం. 32

భాష్యమ్

"బ్రహ్మార్పణమ్"ఇత్యాదిశ్లోకేన సమ్యగ్దర్శనస్య యజ్ఞత్వం సంపాదితమ్. యజ్ఞాశ్చ అనేకే ఉపదిష్టాః. తైః సిద్ధపురుషార్థప్రయోజనైః జ్ఞానం స్తూయతే. కథమ్?

మూ. శ్రేయాన్ ద్రవ్యమయాద్యజ్ఞాద్ జ్ఞానయజ్ఞః పరంతప,
సర్వం కర్మాఖిలం పార్థ జ్ఞానే పరిసమాప్యతే. 33

బాలానందిని

బ్రహ్మేతి:- "బ్రహ్మార్పణమ్"ఇత్యాదితశ్లోకంచేత సమ్యగ్దర్శనానికి యజ్ఞత్వం సంపాదించబడింది(సమ్యగ్దర్శనం ఒక యజ్ఞం అని చెప్పబడింది). అనేకమైన యజ్ఞాలు కూడ చెప్పబడ్డాయి. ప్రసిద్ధమైన పురుషార్థరూప మైన ప్రయోజనం గల వాటిచేత(వాటిని చూపుతూ)జ్ఞానం స్తుతించబడుచున్నది. (పురుషార్థా లనే ప్రయోజనం వేటివల్ల సిద్ధ మైనదో అట్టి యజ్ఞాలచేత అని కూడ అర్థం చెప్పవచ్చును).

ప్ర.అ.:- పరంతప = శత్రువులను పీడించేవాడా! ద్రవ్యమయాత్ = ఆ యా పదార్థాలచేత సాధించదగిన,(ద్రవ్యరూపమైన), యజ్ఞాత్ = యజ్ఞంకంటె, జ్ఞానయజ్ఞః = జ్ఞానయజ్ఞం, శ్రేయాన్ = ఎక్కువ ప్రశస్తమైనది. పార్థ=అర్జునా!సర్వమ్=సమస్తమైన,కర్మ = కర్మ, అఖిలం = ఏ అడ్డంకులూ లేకుండా, జ్ఞానే = జ్ఞానమునందు, పరిసమాప్యతే = సమాప్తిచెందును.

భాష్యమ్

శ్రేయానితి:- శ్రేయాన్,ద్రవ్యమయాత్ ద్రవ్యసాధనసాధ్యాత్ యజ్ఞాత్ జ్ఞానయజ్ఞః హే పరంతప. ద్రవ్యమయో హి యజ్ఞః ఫలస్య ఆరమ్భకః;జ్ఞానయజ్ఞః న ఫలారమ్భకః అతః శ్రేయాన్ ప్రశస్యతరః. కథమ్? యతః సర్వం కర్మ సమస్తమ్. అఖిలమ్ అప్రతిబద్ధం, పార్థ, జ్ఞానే మోక్షసాధనే సర్వతః సంప్లుతోదకస్థానీయే పరిమాప్యతే, అన్తర్భవతి ఇత్యర్థః **"యథా కృతాయ విజితాయాధరేయాః సంయన్త్యే వమేనం సర్వం తదభిసమేతి యత్కిం చిత్ ప్రజాః సాధు కుర్వన్తి యస్తద్వేద యత్ స వేద"** (ఛా.ఉ.4.1.4) ఇతి శ్రుతేః 33

బాలానందిని

శ్రేయానితి:-ద్రవ్యములచేత ఇతరసాధనాలచేత సాధింప దగిన ద్రవ్యమయ యజ్ఞంకంటె, ఓ!పరంతపా!జ్ఞానయజ్ఞం ఎక్కువ ప్రశంసనీయము. ద్రవ్యయజ్ఞం ఫలాన్ని పుట్టిస్తుంది. జ్ఞానయజ్ఞం ఫలాన్ని పుట్టించదు. అందువల్ల ఇది ఎక్కువ ప్రశంసనీయం. (ద్రవ్యయజ్ఞం అనడంచేత ఇతరమైన స్వాధ్యాయాదియజ్ఞాలను కూడ ఉపలక్షణచేత గ్రహించినట్లే). ఎట్లు? ఎందువల్లననగా-పార్థా!సమస్త మైన కర్మా కూడ,అఖిలంగా,ఎట్టి ప్రతిబంధమూ లేకుండా, సర్వతఃసంప్లుతోదకం వంటిది,మోక్షసాధనమూ అయిన జ్ఞానంలో పరిసమాప్తి చెందుతుంది. అంతర్గతం అవుతుంది అని అర్థం. "యథా....వేద" (కృతం జయించబడినప్పుడు దాని క్రిందివి ఏ విధంగా దానిని పొందుతాయో అట్లే ప్రజలు చేసే ప్రతీ సాధుకృత్యమూ కూడ విద్యావంతు డైన ఈ పురుషుణ్ణి చేరుతుంది. ఏ విద్యావంతు

డనగా-ఏ తత్త్వాన్ని రైక్వుడు తెలుసుకొన్నాడో ఆ తత్త్వాన్ని తెలుసుకున్న విద్వాంసుణ్ణి"అని శ్రుతి చెప్పుచున్నది.

వి.:- ద్యూతంలో కృతం,త్రేత,ద్వాపరం,కలి అని నాలుగు పందా లుంటాయట. కృతానికి నాలుగు ఆయాలు. త్రేతకు మూడు,ద్వాపరానికి రెండు,కలికి ఒకటి ఉంటాయి. కృతం అనే పందెం జయించినవాడు దాని క్రింద నున్న మూడింటినీ జయించి నట్లే. ఇందుకు కారణం ఏ మనగా నాలుగు అనే పెద్దసంఖ్యలో మూడు,రెండు,ఒకటి అనే చిన్న సంఖ్యలు అంతర్గతము లైపోతాయి.అదే విధంగా రైక్వుడు ఏ ఆత్మతత్త్వాన్ని తెలుసుకొన్నాడో ఆ ఆత్మతత్త్వం తెలుసుకొన్నవానిని లోకంలో అందరూ చేసిన పుణ్య కర్మ లన్నీ చేరుతాయి;అనగా ఆ పుణ్యకర్మ లన్నీ తత్త్వజ్ఞానంలో అంతర్గతా లవుతాయి అని శ్రుతివాక్యానికి భావం.

భా. అ. ప్ర. ఉభయాకార మైన కర్మలో కర్మాంశంకంటె జ్ఞానాశం ప్రశస్యతర మైనది అని ఇక్కడ శ్రీరామానుజాచార్యులు చేసిన వ్యాఖ్య అయుక్తం. కర్మ ఉభయాకారము అను విషయమే సిద్ధించలేదు కదా? ఎందువల్ల ననగా-కర్మ ఎల్లప్పుడూ కర్మాకారమే, జ్ఞానం జ్ఞానాకారమే.కర్మ జ్ఞానాలకు పరస్పరాకారాలు కల్పించుట శక్యం కాదు. మరొక విషయ మేమనగా-జ్ఞానాంశ కర్మాంశ రెండూ ఉన్నది ఉభయమే అవుతుంది కాని కర్మ ఎలా అవుతుంది?(భా. అ. ప్ర. పే. 192) 33

భాష్యమ్

తదేతత్ విశిష్టం జ్ఞానం కేన ప్రాప్యతే ఇతి? ఉచ్యతే-

మూ. తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా,
ఉపదేక్ష్యన్తి తే జ్ఞానం జ్ఞానినస్తత్త్వదర్శినః. 34

బాలానందిని

తదితి:- అట్టి ఈ విశిష్టమైన జ్ఞానం ఎవనిచేత(ఏ ఉపాయంచేత)పొందబడు తుంది?చెప్పబడుచున్నది-

ప్ర.అ. తత్=ఏ విధానంచేత పొందబడుతుందో దానిని,విద్ధి=తెలుసుకొనుము. ప్రణిపాతేన=సాష్టాంగప్రణామంచేత,పరిప్రశ్నేన=ప్రశ్నించడంచేత, సేవయా=సేవచేత, తే = నీకు, తత్త్వదర్శినః = తత్త్వసాక్షాత్కారం పొందిన, జ్ఞానినః = జ్ఞానులు, జ్ఞానమ్= జ్ఞానమును, ఉపదేక్ష్యన్తి = ఉపదేశించగలరు.

భాష్యమ్

తద్విద్ధీతి:- తత్ విద్ధి విజానీహి యేన విధినా ప్రాప్యతే ఇతి. ఆచార్యాన్ అభిగమ్య,ప్రణిపాతేన ప్రకర్షేణ నీచైఃపతనం ప్రణిపాతః,దీర్ఘనమస్కారః, తేన;కథం బన్ధః?కథం మోక్షః?కా విద్యా? కా చ అవిద్యా?ఇతి పరిప్రశ్నేన,సేవయా గురుశుశ్రూషయా,ఏవమాదినా ప్రశ్రయేణ ఆవర్జితాః ఆచార్యాః,ఉపదేక్ష్యన్తి కథయిష్యన్తి తే జ్ఞానం యథోక్తవిశేషణమ్,జ్ఞానినః,జ్ఞానవన్తః అపి కేచిత్ యథావత్ తత్త్వదర్శనశీలాః అపరే న;అతః విశినష్టి తత్త్వదర్శినః ఇతి. 34

బాలానందిని

తద్విద్ధీతి:- ఏ విధిచేత (జ్ఞానం)పొందబడుతుందో అది తెలుసుకొనుము. ఆచార్యులను చేరి,ప్రణిపాతం అనగా ఎక్కువగా క్రింద పడడం,దీర్ఘనమస్కారం(చాలా సేపు వంగి నమస్కరించడం)ఆ ప్రణిపాతంచేత, బంధం ఎట్లు వచ్చినది?మోక్షం ఎట్లు లభిస్తుంది?విద్య అనగా ఏమిటి?అవిద్య అనగా ఏమిటి?అని ప్రశ్నించడంచేత,గురుశుశ్రూషచేత,ఈ మొదలైన వాటిచేత,వినయంచేత ఆవర్జింపబడిన ఆచార్యులు,నీకు పైన చెప్పిన విశేషణాలు గల జ్ఞానాన్ని ఉపదేశిస్తారు;చెపుతారు.జ్ఞానవంతులైనా కూడ(లలో కూడ) కొందరు తత్త్వాన్ని ఉన్నది ఉన్నట్లుగా చూడకలుగుతారు,కొందరు చూడజాలరు.అందుచేత తత్త్వదర్శినః అని విశేషణం ప్రయోగించి తత్త్వం చూడ గలిగిన జ్ఞానులు అని చెప్పబడినది. 34

భాష్యమ్

యే సమ్యగ్ దర్శినః తైః ఉపదిష్టం జ్ఞానం కార్యక్షమం భవతి ఇతి భగవతః మతమ్.తథా చ సతి ఇదమ్ అపి సమర్థం వచనమ్-

మూ. యద్ జ్ఞాత్వా న పునర్మోహమేవం యాస్యపి పాణ్డవ,
యేన భూతాన్యశేషేణ ద్రక్ష్యస్యాత్మన్యథో మయి. 35

బాలానందిని

యే ఇతి :- ఎవరైతే సమ్యగ్దర్శనం ఉన్నవాళ్లో వాళ్లు ఉపదేశించిన జ్ఞానమే కార్యక్షమం (పనికివచ్చేది) అవుతుంది, ఇతర మైనది (సమ్యగ్దర్శనం లేనివాళ్లు ఉపదేశించేది) కార్యక్షమం కాదు అని భవంతుని మతం. ఇలా చెపుతేనే ఈ క్రింది వచనం కూడ సమర్థం (యథార్థం) అవుతుంది.

ప్ర.అ. యదితి :- పాణ్డవ = అర్జునా! యత్ = ఏ జ్ఞానాన్ని, జ్ఞాత్వా = పొంది, పునః = మరల, ఏవమ్ = ఈ విధంగా, మోహమ్ = మోహమును, న యాస్యసి =

పొందవో, యేన = దేనిచేత, అశేషేణ = పూర్తిగా, భూతాని = భూతాలను, ఆత్మని = తనయందు, అథో = మరియు, మయి = నాయందు, ద్రక్ష్యసి = చూడగలవో.

భాష్యమ్

యదితి :- యత్ జ్ఞాత్వా, యత్ జ్ఞానం తైః ఉపదిష్టమ్ అధిగమ్య ప్రాప్య, పునః భూయః మోహమ్, ఏవమ్ యథా ఇదానీమ్ మోహః గతః అసి, పునః ఏవం న యాస్యసి హే పాణ్డవ. కిం చ యేన జ్ఞానేన భూతాని అశేషేణ, బ్రహ్మాదీని స్తమ్బపర్యన్తాని ద్రక్ష్యసి సాక్షాత్ ఆత్మని ప్రత్యగాత్మనిమత్సంస్థాని ఇమాని భూతానిఇతి, అథోఅపి మయి వాసుదేవే పరమేశ్వరే చ ఇమాని ఇతి, క్షేత్రజ్ఞే శ్వరైకత్వం సర్వోపనిషత్ప్రసిద్ధం ద్రక్ష్యసి ఇత్యర్థః. 35

బాలానందిని

యదితి :- యత్ జ్ఞాత్వా = వారిచేత ఉపదేశించబడిన ఏ జ్ఞానాన్ని పొంది, మరల, ఇప్పుడు ఏ విధంగా మోహం చెందావో ఆ విధంగా, మోహమును పొందవో, ఓ! అర్జునా! ఏ జ్ఞానంచేత బ్రహ్మ మొదలు స్తంబం వరకు ఉన్న అన్ని భూతాలను (ప్రాణులను) ఈ భూతాలన్నీ ప్రత్యగాత్మ నైన (ఈ దేహంలో ఉన్న జీవుడ నైన) నాయందే ఉన్నాయి అనీ, మరియు ఇవన్నీ పరమేశ్వరుడను, వాసుదేవుడను అయిన నాలో ఉన్నా యనీ చూడగలవో. (ఈ భూతా లన్నీ నాలో ఉన్నాయి, పరమేశ్వరునిలో ఉన్నాయి అనగా నేను పరమేశ్వరుడు ఒకటే అని అర్థం). అందుచేత సమస్త ఉపనిషత్తులలో ప్రసిద్ధమైన క్షేత్రజ్ఞ (జీవ) ఈశ్వరుల ఏకత్వాన్ని చూడగలవు అని అర్థం.

భా. అ. ప్ర. ఇక్కడ శ్రీ రామానుజాచార్యులు – "ప్రకృతిచేత విడవబడిన సమస్తమైన ఆత్మవస్తువూ కూడ పరస్పరమూ సమాన మైనది, సర్వేశ్వరునితో కూడ సమానమైనది అని శ్లోకం యొక్క ఫలితార్థం" అని అన్నారు. "నిదర్శనం అయిన స్వాత్మయందు, స్థాలీపులా కాదిన్యాయంచేత, సమస్తభూతాలను చూస్తావు అనీ, 'అథో మయి' అనగా నా దృష్టాంతంచేత స్వాత్మను పసులను కూడ చూస్తావు అని అర్థం" అని వేదాంతదేశికులు వివరించారు. ఇదంతా అసంగతం. తాను నిదర్శనం అన్నట్లయితే **"ఆత్మానమివ సర్వాణి భూతాని ద్రక్ష్యసి'** (తనను వలె అన్ని భూతాలను చూస్తావు) అని ద్వితీయావిభక్తి ఉపయోగించాలి. సప్తమి అధికరణార్థంలో విధించబడినది కాని కర్మార్థంలో విధింపబడలేదు కదా? ఇది "యస్య చ భావేన..." ఇత్యాది సూత్రంచేత విధించబడిన భావలక్షణసప్తమి (సతిసప్తమి) అనడం కుదరదు. ఆత్మనిదర్శనత్వం సర్వభూతదర్శనానికి లక్షణం (గుర్తు) కాదు కదా? మూలంలో లేని 'నిదర్శనభూత' అనే పదాన్ని కల్పించడం కూడ అప్రామాణికం "భవన్తీతి భూతాని"

(పుట్టేవి) కాబట్టి భూతా లని చెప్పబడతాయి) అను వ్యుత్పత్తిని అనుసరించి భూతశబ్దం దేహేంద్రియాదికార్యాల సంఘాతాన్ని బోధిస్తుంది. పుట్టుక లేనిదీ, నిత్యమూ అయిన ఆత్మ విషయంలో ప్రయోగించడం యుక్తం కాదు.

మరొక విషయ మేమనగా – ఆత్మ ప్రకృతిచేత విడవబడిన తరవాత భేదాన్ని కలిగించేది ఏదీ లేదు గాన ఆత్మ ఒకటే కావాలి, అనేకాత్మలు సిద్ధించవు. అలాంటప్పుడు "సర్వమ్ ఆత్మవస్తు" (అన్ని ఆత్మలు) అనడం కూడ అయుక్తం. ఆత్మలకు ఈశ్వరునితో సమత్వం కూడ అయుక్తమే. నియామ్యము (జీవాత్మ నియమింపదగినది) నియామకము (పరమాత్మ నియమించేది) అను భేదం ఉంటుంది కదా? చైతన్యాత్మత్వం వాస్తవం కాబట్టి చైతన్యస్వరూపాన్ని పట్టి ఆత్మ పరమాత్మలకు సామ్యం చెప్పవచ్చును కదా అంటే – అది సామ్యం కాదు; అభేదమే అవుతుంది. ఎందుచేత ననగా చైతన్యం అనేది ఒక్కటే, అనేక చైతన్యాలను కల్పించడం కుదరదు. ఘటత్వం అనే జాతిలో వలె చైతన్యజాతిలో అభేదం ఉన్నా కూడ ఘటాలు భిన్నము లైనట్లు చైతన్యవ్యక్తులు భిన్నములని చెప్పవచ్చును అనడం కుదరదు. ఘటాదులలో వ్యక్తిభేదానికి కారణ మైన ఆకారభేదం ఉన్నట్లు నిరాకారమైన చైతన్యంలో అలాంటి ఆకారభేదం అసంభవం కదా? ఘటాకాశాదులకు వలె ఉపాధులను పట్టి భేదం ఏర్పడుతుంది అనడం కూడ యుక్తం కాదు. "ప్రకృతివినిర్ముక్తమ్ ఆత్మవస్తు" అని అంటూ నువ్వు ఉపాధిరహిత మైన ఆత్మను గూర్చియే మాట్లాడుతున్నావు కదా? (భా.అ.ప్ర.పే. 195) 35

భాష్యమ్

కిం చైతస్య జ్ఞానస్య మాహాత్మ్యమ్ –

మూ. అపి చేదసి పాపేభ్యః సర్వేభ్యః పాపకృత్తమః,
సర్వం జ్ఞానప్లవేనైవ వృజినం సంతరిష్యసి. 36

బాలానందిని

కిం చేతి :– ఈ జ్ఞానంయొక్క మాహాత్మ్యాన్ని కూడ ('ద్రక్ష్యసి' అని వెనుక ఉన్నపదంతో అన్వయం) చూడగలవు –

ప్ర.అ. అపీతి :– సర్వేభ్యః = సమస్తమైన, పాపేభ్యః = పాపాత్ములకంటె, పాపకృత్తమః = అత్యధికపాపాత్ముడవు, అసి అపి చేత్ = (నువ్వు) అయినా కూడ. సర్వమ్ = సమస్త మైన, వృజినమ్ = పాపాన్ని, జ్ఞానప్లవేనైవ = జ్ఞాన మనే తెప్ప చేతనే, స తరిష్యసి = దాటగలవు.

భాష్యమ్

అపేతి :- అపి చేత్ అసి, పాపేభ్యః, పాపకృద్భ్యః, సర్వేభ్యః అతిశయేన పాపకృత్ పాపకృత్తమః, సర్వం, జ్ఞానప్లవేనైవ, జ్ఞానమ్ ఏవ ప్లవం కృత్వా, వృజినం వృజినార్ణవం పాపం, సంతరిష్యసి. ధర్మః అపి ఇహ ముముక్షోః పాపమ్ ఉచ్యతే. 36

బాలానందిని

అపీతి :- సమస్తమైన పాపాత్ములకంటె నువ్వు అత్యధికంగా పాపాలు చేసినవాడవు అయినా కూడ సమస్తమైన పాపసముద్రాన్ని, పాపాన్ని, జ్ఞానం అనే తెప్పచేత దాటగలవు. ముముక్షువుకు ధర్మం కూడ పాపమే అని చెప్పబడుతుంది. (అందుచేత పుణ్యపాపాల సముద్రాన్ని, జ్ఞానసహాయంతో దాటగలవు అని భావం.) 36

భాష్యమ్

జ్ఞానం కథం నాశయతి పాపమ్ ఇతి సదృష్టాన్తమ్ ఉచ్యతే –

మూ. యథైధాంసి సమిద్ధోఽగ్నిర్భస్మసాత్కురుతేఽర్జున,

జ్ఞానాగ్నిః సర్వకర్మాణి భస్మసాత్ కురుతే తథా. 37

బాలానందిని

జ్ఞానమితి :- జ్ఞానం పాపాన్ని ఎలా నశింపచేస్తుందో దృష్టాంతపూర్వంగా చెప్పబడుచున్నది –

ప్ర.అ. యథేతి :- అర్జున = అర్జునా! సమిద్ధః = ప్రజ్వలింపచేయబడిన, అగ్నిః = అగ్ని, ఏధాంసి = కట్టెలను, యథా = ఏ విధంగా, భస్మసాత్ = భస్మముగా, కురుతే = చేస్తుందో, తథా = అట్లు, జ్ఞానాగ్నిః = జ్ఞాన మనే అగ్ని, సర్వకర్మాణి = సమస్తకర్మలను, భస్మసాత్ = భస్మముగా, కురుతే = చేస్తుంది.

భాష్యమ్

యథేతి :- యథా, ఏధాంసి కాష్ఠాని, సమిద్ధః సమ్యక్ ఇద్ధః దీప్తః, అగ్నిః, భస్మసాత్ భస్మీభావం, కురుతే అర్జున, జ్ఞానమేవ అగ్నిః భస్మసాత్ కురుతే తథా, నిర్బీజీకరోతి ఇత్యర్థః. నహి సాక్షాదేవ జ్ఞానాగ్నిః కర్మాణి ఇన్ధనవత్ భస్మీకర్తుం శక్నోతి. తస్మాత్ సమ్యగ్దర్శనం సర్వకర్మణాం నిర్బీజత్వే కారణమ్ ఇత్యభిప్రాయః. సామర్థ్యాత్ – యేన కర్మణా శరీరం ఆరబ్ధం తత్ ప్రవృత్తఫలత్వాత్ ఉపభోగేనైవ క్షీయతే అతః

యాని అప్రవృత్తఫలాని జ్ఞానోత్పత్తేః ప్రాక్ కృతాని జ్ఞానసహభావీని చ అతీతానే జన్మకృతాని చ తాన్యేవ భస్మసాత్ కురుతే. 37

బాలానందిని

యథేతి :- ఏ విధంగా కట్టెలను, బాగా ప్రజ్వలింపచేయబడిన, మండుచున్న అగ్ని భస్మీభావాన్ని చేస్తుందో, (పొందిస్తుందో) అర్జునా! జ్ఞానమే అగ్ని - జ్ఞానాగ్ని సర్వకర్మలను భస్మంగా చేస్తుంది. నిర్బీజంగా, ఫలాన్ని ఇవ్వ గలిగిన విత్తనం లేనిదానినిగా చేస్తుంది అని అర్థం. జ్ఞానాగ్ని ఇంధనాలను వలె, కర్మలను సాక్షాత్తు భస్మం చేయజాలదు కదా? అందువల్ల సమ్యగ్దర్శనం అన్ని కర్మలూ కూడ బీజములు లేకుండా అవడానికి కారణం అవుతుంది అని అభిప్రాయం.

అవ. అయితే జ్ఞానం కలిగిన వెంటనే దేహపాతం జరగడం లేదు గాన శాస్త్ర సామర్థ్యాన్ని పట్టి లేదా జ్ఞానసామర్థ్యాన్ని పట్టి ఈ క్రింది విధంగా అర్థం చేసుకోవాలి అని చెపుతున్నారు-**సామర్థ్యాదితి** :- లేదా సామర్థ్యాత్ అనే దానిని "కారణమ్ ఇత్యభిప్రాయః" అనే వెనుకటి వాక్యంతో అన్వయించుకోవాలి. ఎప్పుడో చేయబడి నశించిన కర్మలను జ్ఞానం ఇప్పుడు క్రొత్తగా నశింపచేయడం కుదరదు గాన కర్మలను నశింపచేస్తుందనగా కర్మలవల్ల ఏర్పడిన ఫలోత్పాదశక్తిని నశంప చేస్తుంది అని శాస్త్రసామర్థ్యంచేత చెప్పాలి అని అప్పుడు అర్థం.

యేనేతి :- ఏ కర్మచేత శరీరం (ఏ శరీరంలో జ్ఞానం ఆవిర్భవించిందో ఆ శరీరం) పుట్టించబడిందో అది ఫలం ఇవ్వడానికి ప్రారంభించినది గాన భోగంచేతనే క్షీణిస్తుంది. ఫలం ఇవ్వడానికి ప్రారంభించనివి, ఈ శరీరంచేతనే జ్ఞానోత్పత్తికి పూర్వం చేయబడినవి అయిన కర్మలు, గడచిన అనేకజన్మలలో చేసిన కర్మలు - ఆ కర్మలను అన్నింటిని మాత్రమే భస్మం చేస్తుంది అని వచనసామర్థ్యాన్ని పట్టి అనుభవసామర్థ్యాన్ని పట్టి తెలుస్తూన్నది. 37

భాష్యమ్

యతః ఏవమ్ అతః-

మూ. న హి జ్ఞానేన సదృశం పవిత్రమిహ విద్యతే,
తత్స్వయం యోగసంసిద్ధః కాలేనాత్మని విన్దతి. 38

బాలానందిని

యత ఇతి:- ఇది ఇట్లు కాబట్టి -

ప్ర.అ. **న హీతి**:- జ్ఞానేన = జ్ఞానంతో; సదృశమ్ = సమానమైన, పవిత్రమ్ =

పవిత్ర మైనది, ఇహ = ఈ లోకంలో, న విద్యతే హి = లేదు కదా. యోగసంసిద్ధః= కర్మయోగంచేత సమాధియోగంచేత సంసిద్ధుడు (తనను సిద్ధంగా చేసుకొన్నవాడు), తత్= దానిని,కాలేన=కాలంచేత,స్వయం=స్వయంగానే,ఆత్మని=తనలో,విన్దతి=పొందుతాడు.

భాష్యమ్

న హీతి:– న హి జ్ఞానేన సదృశం తుల్యం పవిత్రం పావనం శుద్ధికరమ్, ఇహ విద్యతే. తత్ జ్ఞానం స్వయమేవ యోగసంసిద్ధః, యోగేన కర్మయోగేన సమాధి యోగేన చ సంసిద్ధః సంస్కృతః యోగ్యతామ్ ఆపన్నః ముముక్షుః కాలేన మహతా ఆత్మని విన్దతి లభతే ఇత్యర్థః. 38

బాలానందిని

న హి ఇతి:– జ్ఞానంతో సమాన మైన పవిత్ర మైనది;శుద్ధి కలిగించేది ఇక్కడ లేదు. యోగసంసిద్ధుడు కర్మయోగంచేత, ఇంద్రియమనోజయాత్మక మైన **"తాని సర్వాణి సంయమ్య యుక్త ఆసీత మత్పరః"** అని చెప్పబడిన సమాధియోగంచేతా సంస్కృతుడైన, యోగ్యతను సంపాదించుకొన్న ముముక్షువు చాలా కాలానికి ఆ జ్ఞానాన్ని స్వయంగానే తనలో పొందుతాడు అని అర్థం. 38

యేన ఏకాన్తేన జ్ఞానప్రాప్తిః భవతి సః ఉపాయః ఉపదిశ్యతే –

మూ. శ్రద్ధావాన్ లభతే జ్ఞానం తత్పరః సంయతేన్ద్రియః,
జ్ఞానం లబ్ధ్వా పరాం శాన్తిమచిరేణాధిగచ్ఛతి. 39

బాలానందిని

యేనేతి:–దేనిచేత తప్పక జ్ఞానప్రాప్తి కలుగుతుందో ఆ ఉపాయం చెప్పబడుచున్నది–

ప్ర.అ. : శ్రద్ధావాన్ = శ్రద్ధ కలవాడు, తత్పరః= దానియందే ఆసక్తి గలవాడు, సంయతేన్ద్రియః = నిగ్రహించుకొనబడిన ఇంద్రియాలు కలవాడు అయిన పురుషుడు, జ్ఞానమ్ = జ్ఞానమును, లభతే = పొందును. జ్ఞానమ్ = జ్ఞానమును లబ్ధ్వా = పొంది, అచిరేణ = చాల తక్కువ కాలంలో, శాన్తిమ్ = శాంతిని, అధిగచ్ఛతి = పొందును.

భాష్యమ్

శ్రద్ధావానితి :– శ్రద్ధావాన్ శ్రద్ధాలుః లభతే జ్ఞానమ్. శ్రద్ధాలుత్వేఽపి భవతి కశ్చిత్ మన్దప్రస్థానః, అతః ఆహ – తత్పరః గురూపసదానాదౌ అభియుక్తః, జ్ఞానలబ్ధ్యుపాయే శ్రద్ధావాన్; తత్పరోఽపి అజితేన్ద్రియః స్యాత్ ఇత్యతః ఆహ = సంయతేన్ద్రియః. సంయతాని విషయేభ్యః నివర్తితాని యస్య ఇన్ద్రియాణి సః

సంయతేన్ద్రియః. యః ఏవంభూతః శ్రద్ధావాన్ తత్పరః సః యతేన్ద్రియశ్చ సః అవశ్యం జ్ఞానం లభతే ప్రణిపాతాదిస్తు బాహ్యః అనైకాన్తికః అపి భవతి, మాయావిత్వాది సంభవాత్. న తు తత్ శ్రద్ధావత్త్వాదౌ, ఇతి ఏకాన్తతః జ్ఞానలబ్ధ్యుపాయః. కిం పునః జ్ఞానలాభాత్ స్యాత్ ఇతి ఉచ్యతే – జ్ఞానం లబ్ధ్వా పరాం మోక్షాఖ్యాం శాన్తిమ్ అచిరేణ క్షిప్రమేవ అధిగచ్ఛతి. సమ్యగ్దర్శనాత్ క్షిప్రమ్ మోక్షః భవతి ఇతి సర్వశాస్త్రన్యాయ సిద్ధః సునిశ్చితః అర్థః. 39

బాలానందిని

శ్రద్ధావానితి :– శ్రద్ధావంతుడు జ్ఞానాన్ని పొందుతాడు. శ్రద్ధాలు వైనా ఒకడు మందంగా ప్రయాణం చేసేవాడు కావచ్చు, మెల్లగా ప్రవర్తించవచ్చు. అందుచేత '**తత్పరః**' అని చెపుతున్నాడు. జ్ఞానం పొందడానికి ఉపాయ మైన గురువును చేరడం మొదలైన వాటియందు నిరంతరము ప్రయత్నించేవాడు అని అర్థం. శ్రద్ధావంతుడు తత్పరుడైనా కూడ జితేంద్రియుడు కాకపోవచ్చును. అందుచేత 'సంయతేన్ద్రియః" అని చెప్పుచున్నాడు. ఎవని ఇంద్రియాలు సంయతము లైనవో అనగా విషయాలనుండి వెనుకకు మరల్చబడినవో, అతడు సంయతేంద్రియుడు శ్రద్ధావంతుడు, తత్పరుడు, సంయతేంద్రి యుడు అయిన ఇలాంటివాడు తప్పక జ్ఞానం పొందుతాడు. పైకి చేసే ప్రణిపాతాదికం (వంగి వంగి నమస్కరించడం మొదలైనది) అనైకాంతికం (తప్పక ఫలం ఇస్తుంది అని చెప్పడానికి వీలు కానిది) కూడ కావచ్చును. ఎందువల్ల ననగా అలా చేసేవాడు మాయావిగా కూడ ఉండవచ్చును. శ్రద్ధాపత్త్వం మొదలైనవాటిలో నైతే ఆ దోషం లేదు గాన ఇది తప్పక జ్ఞానలబ్ధికి ఉపాయం. జ్ఞానలాభంవల్ల ఏమి కలుగుతుందో చెప్పబడుచున్నది – జ్ఞానాన్ని పొంది అతి శీఘ్రంగానే మోక్షరూప మైన గొప్ప శాంతిని పొందుతాడు. సమ్యగ్దర్శనం వల్ల శీఘ్రంగా మోక్షం కలుగుతుంది అనేది సునిశ్చితమైన విషయం. 39

భాష్యమ్

అత్ర సంశయః న కర్తవ్యః; పాపిష్ఠో హి సంశయః, కథమ్? ఉచ్యతే –

మూ. అజ్ఞశ్చాశ్రద్దధానశ్చ సంశయాత్మా వినశ్యతి,
నాయం లోకోఽస్తి న పరో న సుఖం సంశయాత్మనః. 40

బాలానందిని

అత్రేతి :– ఈ విషయంలో సందేహించకూడదు. సందేహం చాలా పాపిష్ఠం. ఎట్లు? చెప్పబడుచున్నది?

అజ్ఞ ఇతి :- అజ్ఞః చ = ఆత్మజ్ఞానం లేనివాడు, అశ్రద్దదానః చ = శ్రద్ధ లేనివాడు, సంశయాత్మా = సంశయించే స్వభావం కలవాడు (ముగ్గురూ కూడ), వినశ్యతి = నశిస్తాడు (రు). సంశయాత్మనః సంశయాత్మునకు, అయం లోకః = ఈ లోకం, న అస్తి = లేదు, పరః = పరలోకము, న = లేదు, సుఖమ్ = సుఖము, న = లేదు.

భాష్యమ్

అజ్ఞశ్చేతి :- అజ్ఞః చ అనాత్మజ్ఞః, అశ్రద్దధానః చ, సంశయాత్మా చ వినశ్యతి. అజ్ఞాశ్రద్ధధానౌ యద్యపి వినశ్యతః తథాపి న తథా యథా సంశయాత్మా. సంశయాత్మా తు పాపిష్ఠః సర్వేషామ్ - కథమ్? నాయం సాధారణః అపి లోకః అస్తి, తథా న పరః లోకః, న సుఖమ్, తత్రాపి సంశయోపపత్తేః, సంశయాత్మనః సంశయచిత్తస్య. తస్మాత్ సంశయః న కర్తవ్యః. 40

బాలానందిని

అజ్ఞశ్చేతి :- ఆత్మజ్ఞానం లేనివాడు, శ్రద్ధ లేనివాడు (నమ్మకం లేనివాడు), సంవయాత్మ నశిస్తాడు. అజ్ఞుడు అశ్రద్ధధానుడు కూడ నశించినా వాళ్లు సంశయాత్మ ఎలాంటివాడో అలాంటి వాల్లు కారు. సంశయాత్ము డైతే వీళ్లందరిలోకి పాపిష్ఠుడు. ఎట్లు? సంశయంతో నిండిన చిత్తం కలవానికి సర్వజనసాధారణమైన ఈ లోకమూ లేదు, పరలోకమూ లేదు. సుఖం కూడ లేదు. ఎందువల్ల ననగా సుఖం విషయంలో కూడ నేననుభవిస్తున్నది సుఖమేనా కాదా అని వానికి సంశయం కలగవచ్చును. అందువల్ల సంశయం చేయదగినది కాదు. 40

భాష్యమ్

కస్మాత్ -

మూ. యోగసంన్యస్తకర్మాణం జ్ఞానసంఛిన్నసంశయమ్,
ఆత్మవన్తం న కర్మాణి నిబధ్నన్తి ధనంజయ. 41

ఎందువల్ల ననగా -

ప్ర.అ. యోగేతి :- ధనంజయ = అర్జునా! జ్ఞానసంఛిన్న సంశయమ్ = జ్ఞానంచేత ఛేదింపబడిన సంశయాలు కలవాడు, యోగసంన్యస్తకర్మాణమ్ = యోగంచేత సంన్యసించబడిన సమస్తకర్మలు కలవాడూ అయిన, ఆత్మవన్తమ్ = ఏమరిపాటు లేనివానిని, కర్మాణి = కర్మలు, న నిబధ్నన్తి = పొందవు.

భాష్యమ్

యోగేతి : యోగసంన్యస్తకర్మాణమ్ - పరమార్థదర్శనలక్షణేన యోగేన సంన్యస్తాని కర్మాణి యేన పరమార్థదర్శినా ధర్మాధర్మాఖ్యాని యోగసంన్యస్తకర్మాణమ్. కథం యోగసంన్యస్తకర్మా ఇత్యాహ- జ్ఞానేన ఆత్మేశ్వరైకత్వదర్శనలక్షణేన సంఛిన్నః సంశయః యస్య సః జ్ఞానసంఛిన్నసంశయః. యః ఏవం యోగసంన్యస్తకర్మా తమ్, ఆత్మవన్తమ్ అప్రమత్తం, గుణచేష్టారూపేణ దృష్టాని కర్మాణి న నిబధ్నన్తి అనిష్టాదిరూపం ఫలం న ఆరభన్తే, హే ధనంజయ. 41

బాలానందిని

యోగేతి :- ఓ! అర్జునా! పరమార్థదర్శనరూప మైన యోగంచేత ఏ పరమార్థ దర్శి (జ్ఞాని) ధర్మాధర్మరూపా లైన కర్మలను సంన్యసిస్తాడో అట్టి యోగ సంన్యస్తకర్మను; అతడు ఎట్లు యోగసంన్యస్తకర్మయో చెప్పుచున్నాడు - ఆత్మయొక్క ఏకత్వాన్ని చూడడం అనే జ్ఞానంచేత ఎవని సంశయాలు ఛేదించబడ్డాయో అతడు జ్ఞానసంఛిన్నపసంశయుడు. ఎవడు ఈ విధంగా యోగసంన్యస్తకర్మయో అట్టి ఆత్మవంతుణ్ణి, అనగా ఏమరుపాటులేని వానిని, గుణాల చేష్టలుగానే చూడబడిన కర్మలు బంధించవు. వానికి అనిష్టాదిరూప మైన ఫలాన్ని ఇవ్వవు. 41

భాష్యమ్

యస్మాత్ కర్మయోగానుష్ఠానాత్ అశుద్ధిక్షయహేతుకజ్ఞానసంఛిన్నసంశయః న నిబధ్యతే కర్మభిః, జ్ఞానాగ్నిదగ్ధకర్మత్వాత్ ఏవ, యస్మాత్ చ జ్ఞానకర్మానుష్ఠానవిషయే సంశయవాన్ వినశ్యతి -

మూ. **తస్మాదజ్ఞానసంభూతం హృత్‌స్థం జ్ఞానాసినా త్మనః,**

ఛిత్త్వైనం సశయం యోగమాతిష్ఠోత్తిష్ఠ భారత. 42

ఇతి శ్రీమహాభారతే శతసాహస్ర్యాం సంహితాయాం వైయాసిక్యాం భీష్మపర్వణి శ్రీ మద్భగవద్గీతాసు ఉపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే జ్ఞానకర్మసంన్యాసయోగో నామ చతుర్థోఽధ్యాయః.

బాలానందిని

యస్మాదితి :- కర్మయోగం అనుష్ఠించడంవల్ల అశుద్ధి క్షీణించడం అనే హేతువు గల (కర్మయోగం అనుష్ఠించగా చిత్తమాలిన్యం తొలగిపోవడంచేత పుట్టిన) జ్ఞానంచేత

ఛేదించబడిన సంశయం కలవాడు, జ్ఞానాగ్నిదగ్ధకర్ముడవడంచేత, ఏ కారణంవల్ల కర్మలచేత బంధింపబడడో, ఎందువల్ల జ్ఞానకర్మానుష్ఠానం విషయంలో సంశయం ఉన్నవాడు నశిస్తాడో (తస్మాత్ = ఆకారణంవల్ల అని శ్లోకంలో ఉన్న 'తస్మాత్'తో అన్వయం) –

ప్ర.అ. **తస్మాదితి :–** తస్మాత్ = అందువలన, అజ్ఞానసంభూతమ్ = అజ్ఞానం వల్ల (అవివేకంవల్ల)పుట్టినది,హృత్స్థమ్=నీ హృదయంలో ఉన్నదీ అయిన,ఆత్మనః=నీ యొక్క; ఏనం సంశయమ్= ఈ సంశయమును, జ్ఞానాసినా = జ్ఞాన మనే కత్తిచేత, ఛిత్త్వా= ఛేదించి,భారత = అర్జునా! యోగమ్ =కర్మయోమును, ఆతిష్ఠ = ఆచరించు; ఉత్తిష్ఠ = లెమ్ము.

భాష్యమ్

తస్మాదితి:–తస్మాత్ పాపిష్ఠమ్ అజ్ఞానసంభూతమ్ అజ్ఞానాత్ అవివేకతో జాతం,హృత్స్థం హృది బుద్ధౌ స్థితం, జ్ఞానాసినా – శోకమోహాదిహరం సమ్యగ్ దర్శనం జ్ఞానం;తదేవ అసిః ఖడ్గః,తేన జ్ఞానాసినా,ఆత్మనః స్వస్య,ఆత్మవిషయత్వాత్ సంశయస్య, న హి పరస్య సంశయః పరేణ ఛేత్తవ్యతాం ప్రాప్తః యేన స్వస్య ఇతి విశేష్యతే. అతః ఆత్మవిషయః అపి స్వస్య ఏవ భవతి. ఛిత్త్వా ఏనం సంశయం స్వవినాశహేతుభూతం, యోగం సమ్యగ్దర్శనోపాయకర్మానుష్ఠామ్ ఆతిష్ఠ కుర్విత్యర్థః .ఉత్తిష్ఠ ఇదానీం యుద్ధాయ భారత ఇతి. 42

ఇతి శ్రీమత్పరమహంసపరివ్రాజకాచార్యగోవిన్దభగవత్పూజ్యపాదశిష్య శ్రీమచ్ఛఙ్కరభగవతః కృతౌ శ్రీభగవద్గీతాభాష్యే బ్రహ్మయజ్ఞ ప్రశంసా నామ చతుర్థోఽధ్యాయః

బాలానందిని

తస్మాదితి:– అందువలన,పాపిష్ఠము,అజ్ఞానంవల్ల,అవివేకంవల్ల పుట్టినది,నీ హృదయంలో,బుద్ధిలో;ఉన్నది అయిన నీయొక్క సంశయాన్ని,ఈ సంశయం ఆత్మను గురించినది అవడంవల్ల ఆత్మనః(తనది)అని చెప్పబడినది;ఒకనికి కలిగిన సంశయం మరొకనిచేత ఛేదించబడదు కదా?అందుచేత తనయొక్క అని ప్రత్యేకించి చెప్పవలసిన పని లేదు.అందుచేత ఇక్కడ 'తనయొక్క'అని చెప్పడంలో అభిప్రాయం నీ ఆత్మస్వరూపాన్ని గూర్చిన అని చెప్పడం.(దూరంగా ఉన్న చెట్టు మోదును చూడగానే ఇది చెట్టుమోడా మనిషా అని ఒకనికి సంశయం కలగవచ్చును.ఆ సంశయాన్ని ప్రక్క నున్నవాడు కూడ

తొలగించవచ్చును.కాని తన విషయంలో కలిగిన సంశయాన్ని తానే తీర్చుకోవాలి కాని పైవాడు తీర్చలేదు.అందుచేత తన సంశయాన్ని ఛేదించుకొని అని చెప్పడంలోని భావం నీకు స్వస్వరూపాన్ని గూర్చి కలిగిన సంశయాన్ని నీవే ఛేదించుకొని అని చెప్పడం). జ్ఞానాసి చేత - శోకం మోహం మొద లైన దోషాలను హరించే సమ్యగ్దర్శనం జ్ఞానం. అదే ఖడ్గం.దానిచేత స్వవినాశానికి హేతువైన ఈ సంశయాన్ని ఛేదించి,యోగమును,అనగా సమ్యగ్దర్శనానికి ఉపాయమైన కర్మానుష్ఠానాన్ని అవలంబించుము;చేయుము అని అర్థం. భారతా! ఇప్పుడు యుద్ధానికి లెమ్ము. 42

"బాలానందిని"అను శ్రీభగవద్గీతాశాంకరభాష్యాంధ్రవ్యాఖ్యానమునందు

చతుర్థాధ్యాయం సమాప్తం

అథ పఞ్చమోఽధ్యాయః

భాష్యమ్

"కర్మణ్యకర్మ యః పశ్యేత్"(4.18)ఇత్యారభ్య"స యుక్తః కృత్స్నకర్మకృత్" (4.18),"జ్ఞానాగ్నిదగ్ధకర్మాణమ్"(4.19),"శారీరం కేవలం కర్మ కుర్వన్"(4.21), "యదృచ్ఛాలాభసంతుష్టః"(4.22),"బ్రహ్మార్పణం బ్రహ్మ హవిః"(4.24),"కర్మజాన్ విద్ధి తాన్ సర్వాన్"(4.32),"సర్వం కర్మాఖిలం పార్థ"(4.33),"జ్ఞానాగ్నిః సర్వకర్మాణి"(4.37) "యోగసంన్యస్తకర్మాణమ్"(4.41)ఇత్యేతైః వచనైః సర్వకర్మణాం సంన్యాసమ్ అవోచత్ భగవాన్."ఛిత్త్వైనం సంశయం యోగమాతిష్ఠోత్తిష్ఠ" (4.42) ఇత్యనేన వచనేన యోగం చ కర్మానుష్ఠానలక్షణం అనుతిష్ఠ ఇత్యుక్తవాన్.తయోః ఉభయోశ్చ కర్మానుష్ఠానకర్మసంన్యాసయోః స్థితిగతివత్ పరస్పరవిరోధాత్ ఏకేన సహ కర్తుమ్ అశక్యత్వాత్, కాలభేదేన చ అనుష్ఠానవిధానాభావాత్,అర్థాత్ ఏతయోః అన్యతరకర్తవ్యతాప్రాప్తౌ సత్యాం యత్ ప్రశస్యతరమ్ ఏతయోః కర్మానుష్ఠానకర్మసంన్యాసయోః తత్ కర్తవ్యమ్,న ఇతరత్ ఇత్యేవం మన్యమానః ప్రశస్యతరబుభుత్సయా అర్జునః ఉవాచ - "సంన్యాసం కర్మణామ్" (5.1)ఇత్యాదినా -

బాలానందిని

కర్మణీతి:-"కర్మణ్యకర్మ యః పశ్యేత్"అని ప్రారంభించి-"స యుక్తః కృత్స్నకర్మకృత్,""జ్ఞానాగ్నిదగ్ధకర్మాణమ్","శారీరం కేవలం కర్మ కుర్వన్","యదృచ్ఛాలాభసంతుష్టః","బ్రహ్మార్పణం బ్రహ్మ హవిః","కర్మజాన్ విద్ధి తాన్ సర్వాన్","సర్వం కర్మాఖిలం పార్థ","జ్ఞానాగ్నిః సర్వకర్మాణి","యోగసంన్యస్తకర్మాణమ్"ఇత్యాదివాక్యాలచేత భగవంతుడు

సర్వకర్మసంన్యాసం చెప్పాడు. "ఛిత్త్వైనం సంశయం యోగమాతిష్ఠ"అనే వచనంచేత కర్మానుష్ఠానరూప మైన యోగాన్ని ఆచరించుము అని చెప్పాడు. ఈ కర్మానుష్ఠాన-కర్మ సంన్యాసాలు స్థితి-గతుల వలె(నిలిచి ఉండడం నడవడం వలె)పరస్పరవిరుద్ధ మైనవి. అందుచేత ఒకే పురుషుడు ఆ రెండింటిని కలిపి చేయడం అశక్యం. వీటిని కాలభేదంచేత అనుష్ఠించాలి (కొంత కాలం ఇదీ కొంత కాలం అదీ అనుష్ఠించాలి)అని విధించబడలేదు. అందుచేత అర్థాన్ని పట్టి,చూస్తే రెండింటిలో ఏదో ఒకటి చెయ్యాలి అని ప్రాప్తిస్తూన్నది(చెప్పవలసి ఉంది). అలాంటప్పుడు ఈ కర్మానుష్ఠానకర్మసంన్యాసాలలో ఏది ఎక్కువ ప్రశస్యమో అదే చెయ్యాలి కాని రెండవదానిని చేయకూడదు అని అనుకొంటూ అర్జునుడు ఏది ఎక్కువ ప్రశస్యమో దానిని తెలుసుకొనదలచి "సంన్యాసం కర్మణాం కృష్ణ"ఇత్యాదివాక్యాలు పలికాడు.

భాష్యమ్

నను చ ఆత్మవిదః జ్ఞానయోగేన నిష్ఠాం ప్రతిపాదయిష్యన్ పూర్వోదాహృతైః వచనైః భగవాన్ సర్వకర్మసంన్యాసమ్ అవోచత్,న తు అనాత్మజ్ఞస్య. అతశ్చ కర్మానుష్ఠాన కర్మసంన్యాసయోః భిన్నపురుషవిషయత్వాత్ అన్యతరస్య ప్రశస్యతరత్వబుభుత్సయా అయం ప్రశ్నః అనుపపన్నః. సత్యమేవమ్; త్వదభిప్రాయేణ ప్రశ్నః న ఉపపద్యతే; ప్రష్టుః స్వాభిప్రాయేణ పునః ప్రశ్నః యుజ్యతే ఏవ ఇతి వదామః. కథమ్?పూర్వోదాహృతైః వచనైః భగవతా కర్మసంన్యాసస్య కర్తవ్యతయా వివక్షితత్వాత్ ప్రాధాన్యమ్;అన్తరేణ చ కర్తారం తస్య కర్తవ్యత్వాసంభవాత్. అనాత్మవిదపి కర్తా పక్షే ప్రాప్తః అనూద్యతే ఏవ, న పునః ఆత్మవిత్కర్తృకత్వమ్ ఏవ సంన్యాసస్య వివక్షితమ్ ఇత్యేవం మన్వానస్య అర్జునస్య కర్మానుష్ఠానకర్మసంన్యాసయోః అవిద్వత్పురుషకర్తృకత్వమ్ అపి అస్తి ఇతి పూర్వోక్తేన ప్రకారేణ తయోః పరస్పరవిరోధాత్ అన్యతరస్య కర్తవ్యత్వే ప్రాప్తే ప్రశస్యతరం చ కర్తవ్యమ్,న ఇతరత్ ఇతి ప్రశస్యతరవివిదిషయా ప్రశ్నః న అనుపపన్నః.

బాలనందిని

నను చేతి:-(ప్రశ్న)ఆత్మవేత్తకు జ్ఞానయోగంచేత నిష్ఠను ప్రతిపాదింప నున్నవాడై భగవంతుడు వెనుక ఉదాహరించిన వచనాలచేత సర్వకర్మసంన్యాసాన్ని చెప్పాడు కాని ఆత్మజ్ఞానం లేనివానికి చెప్పలేదు. ఈ విధంగా కర్మానుష్ఠానము కర్మసంన్యాసము అనేవి వేరు వేరు పురుషులను గూర్చి చెప్పబడినవి గాన వాటిలో ఏది మిక్కిలి ప్రశస్య మైనది అని తెలుసుకొనవలె ననే ఇచ్ఛతో ఈ ప్రశ్న అనపపన్నం కదా?(సమాధానం). ఇది సత్యమే. నీ అభిప్రాయం ప్రకారం ప్రశ్న అనుపపన్నమే. కాని ప్రశ్నించేవాని స్వాభిప్రాయం ప్రకారం అయితే ఈ ప్రశ్న యుక్తమే అని అంటాం. అదెట్లు?భగవంతుడు,వెనుక ఉదాహరించిన

వచనాలచేత కర్మసంన్యాసమే కర్తవ్యంగా చెప్పదలచుకొన్నాడు గాన అది ప్రధాన మైనది. కర్త లేకపోతే దానికి కర్తవ్యత్వం కుదరదు. అందుచేత దీనికి కర్త ఎవరు అను ప్రశ్న ఉదయించినప్పుడు ఆత్మజ్ఞునితో పాటు అనాత్మజ్ఞుడు కూడ కర్త కావచ్చును గాన (ప్రతీవాడు ప్రధాన మైన దానిని ఆచరించడానికి ప్రయత్నిస్తాడు గాన సంన్యాసం ప్రధానమైనది అని గుర్తించగానే అనాత్మజ్ఞుడు కూడ అందుకు ప్రవర్తించే అవకాశం ఉంది. (అందుచేతనే ఆత్మజ్ఞానం లేకపోయినా కేవలవైరాగ్యంచేత కూడ సంన్యాసం స్వీకరించేవాళ్లు కనబడు తున్నారు అని భావం). అందచేత ఒక పక్షంలో ప్రాప్తించిన (సంన్యాసం ఆచరించేవాడు ఆత్మజ్ఞుడు అవడానికి ఎంత అకాశం ఉందో అనాత్మజ్ఞుడు అవడానికి కూడ అంత అవకాశం ఉంది అనే పక్షంలో ప్రాప్తించిన)కర్త కూడ తప్పక ఇక్కడ అనువదించబడు తున్నాడు (నిర్దేశించబడుతున్నాడు). అంతేనే కాని సంన్యాసం ఆత్మవేత్త మాత్రమే చెయ్యాలి అని చెప్పడానికి ఉద్దేశింపబడింది అని చెప్పడానికి వీలు లేదు. ఈ విధంగా కర్మానుష్ఠాన కర్మసంన్యాసాలను అవిద్వత్పురుషుడు కూడ చేయవచ్చును అని అర్జునుడు భావించాడు. అయితే-వెనుక చెప్పిన విధంగా ఈ రెండింటికి పరస్పరవిరోధం ఉండడంవల్ల ఏదో ఒకదానిని చెయవలసి ఉంటుం దని గ్రహించి, ఈ రెండింటిలో ఏది ప్రశస్యతరమో దానినే చెయ్యాలి కదా అని అనుకొని దానిని తెలుసుకొనడం కోసం అతడు ప్రశ్నించడం అనుపపన్నం కాదు.

వి. ఆత్మజ్ఞానం ఉన్నవాడు మాత్రమే కర్మసంన్యాసం చెయ్యాలి అని స్పష్టంగా చెప్పి ఉన్న ట్లయితే కర్మయోగం చేసేవాడు వేరు కర్మసంన్యాసం చేసేవాడు వేరు అని తెలిసి ఉంటుంది. అప్పుడు ఈ ప్రశ్నకు అవకాశం ఉండదు. ఆ విధ మైన స్పష్టీకరణం లేకుండా కర్మయోగకర్మసంన్యాసాలను గూర్చి ఒకదాని తరువాత ఒకటి చెప్పి నప్పుడు కర్మసంన్యాసం కూడ ప్రతీవాడు చేయవచ్చు ననే భావం కలుగుతుంది. వీటి స్వరూపాన్ని పట్టి ఒకే వ్యక్తి, ఒకే కాలంలో రెండూ చేయజాల దని తెలుస్తూనే ఉంది. అందుచేత ఏదో ఒకటి చెయ్యాలి. అందుచేత రెండింటిలో ఏది ప్రశస్యతరమో తెలుసుకొనడం కోసం ప్రశ్నించడం యుక్తమే.

భాష్యమ్

ప్రతివచన వాక్యార్థనిరూపణేనాపి ప్రష్టుః అభిప్రాయః ఏవమేవ ఇతి గమ్యతే. కథమ్? "సంన్యాసకర్మయోగౌ నిఃశ్రేయసకరౌ; తయోస్తు కర్మయోగః విశిష్యతే" (5.2) ఇతి ప్రతివచనమ్. ఏతత్ నిరూప్యమ్-కిమ్ అనేన ఆత్మవిత్కర్తృకయోః సంన్యాసకర్మ యోగయోః నిఃశ్రేయసకరత్వం ప్రయోజనమ్ ఉక్త్వా తయోః ఏవ కుతశ్చిత్ విశేషాత్ కర్మసంన్యాసాత్ కర్మయోగస్య విశిష్టత్వమ్ ఉచ్యతే, ఆహోస్విత్ అనాత్మవిత్కర్తృకయోః

సంన్యాసకర్మయోగయోః తదుభయమ్ ఉచ్యతే ఇతి. కించాతః-యది ఆత్మవిత్కర్తృకయోః సంన్యాస కర్మయోగయోః నిఃశ్రేయసకరత్వం,తయోస్తు కర్మసంన్యాసాత్ కర్మయోగస్య విశిష్ట త్వమ్ ఉచ్యతే,యది వా అనాత్మవిత్కర్తృకయోఃసంన్యాసకర్మయోగయోః తదుభయమ్ ఉచ్యతే ఇతి? అత్ర ఉచ్యతే- ఆత్మవిత్కర్తృకయోః సంన్యాసకర్మయోగయోః అసంభవాత్ తయోః నిఃశ్రేయసకరత్వవచనం,తదీయాచ్చ కర్మసంన్యాసాత్ కర్మయోగస్య విశిష్టత్వా భిధానమ్ ఇత్యేతత్ ఉభయమ్ అనుపపన్నమ్. యది అనాత్మవిదః కర్మసంన్యాసః, తత్ప్ర తికూలశ్చ కర్మానుష్ఠానలక్షణః కర్మయోగః సంభవేతాం తదా తయోః నిఃశ్రేయసకరత్వోక్తిః,కర్మయోగస్య చ కర్మసంన్యాసాత్ విశిష్టత్వాభిధానమ్ ఇత్యేతత్ ఉభయమ్ ఉపపద్యతే. ఆత్మవిదస్తు సంన్యాస కర్మయోగయోః అసంభవాత్ తయోః నిఃశ్రేయస కరత్వాభిధానం కర్మసంన్యాసాచ్చ కర్మయోగః విశిష్యతే ఇతి చ అనుపపన్నమ్.

బాలానందిని

ప్రతివచనేతి:- ప్రతివచనవాక్యంయొక్క అర్థాన్ని పరిశీలించడంచేత కూడ ప్రష్ట యొక్క అభిప్రాయం ఇదే అని తెలుస్తూన్నది. ఎట్లు? సంన్యాస - కర్మయోగాలు నిఃశ్రేయసాన్ని కలిగిస్తాయి,అయితే వాటిలో కర్మయోగం విశిష్ట మైనది అని ప్రతివచనం. ఈ ప్రతివచనాన్ని పరిశీలించాలి. ఆత్మవేత్త కర్తగా గల (ఆత్మవేత్త చేసే)సంన్యాసకర్మయోగాలు నిఃశ్రేయసకరా లనే ప్రయోజనం చెప్పి,ఆ రెండింటిలో కర్మయోగం,ఏదో ఒక విశేషంచేత కర్మసంన్యాసంకంటె విశిష్ట మని ఈ ప్రతివచనం చెపుతున్నదా లేదా అనాత్మవేత్త కర్తగా గల సంన్యాసకర్మయోగాల విషయంలో ఆ ఉభయమూ(నిఃశ్రేయసకరత్వ - కర్మయోగవైశిష్ట్యాలు)చెప్పబడుచున్నవా(అని పరిశీలించాలి). ఆత్మవేత్త కర్తగా గల సంన్యాస కర్మ యోగాలకు రెండింటికి నిఃశ్రేయసకరత్వం ఉండగా వాటిలో కర్మసంన్యాసంకంటె కర్మయోగం విశిష్టం అని చెప్పినందువల్ల గాని,అనాత్మవేత్త కర్తగా గల సంన్యాసకర్మ యోగాలకు ఆ ఉభయమూ చెప్పబడుచున్న దని చెప్పినందువల్ల గాని ఏ మవుతుంది? ఏమవుతుందో చెపుతున్నాం,విను. ఆత్మవేత్త సంన్యాసమూ కర్మయోగమూ రెండూ చేయడం అసంభవం గాన అవి నిఃశ్రేయసకరము లని చెప్పడమూ,కర్మసంన్యాసంకంటె కర్మయోగం విశిష్టమైన దని చెప్పడం,ఈ ఉభయమూ కూడ అనుపపన్నమే. అనాత్మవేత్తకు కర్మ సంన్యాసము,దానికి ప్రతికూలమైన కర్మానుష్ఠానరూప మైన కర్మయోగమూ సంభవము లైతే, అప్పుడు ఆ రెండూ నిఃశ్రేయసకరము లని చెప్పడమూ,వాటిలో కర్మయోగం కర్మ సంన్యాసంకంటె విశిష్ట మని చెప్పడం,ఈ ఉభయమూ కూడ ఉపపన్నం అవుతుంది. ఆత్మవేత్త కైతే సంన్యాసకర్మయోగాలు అసంభవ మైనవి,అందుచేత అవి నిఃశ్రేయసకరము లని చెప్పడం,కర్మసంన్యాసంకంటె కర్మయోగం విశిష్ట మని చెప్పడమూ కూడ కుదరదు.

భాష్యమ్

అత్రాహ-కిమ్ ఆత్మవిదః సంన్యాసకర్మయోగయోః ఉభయోః అపి అసంభవః ఆహోస్విత్ అన్యతరస్య అసంభవః?యదా చ అన్యతరస్య అసంభవః,తదా కిం కర్మ సంన్యాసస్య ఉత కర్మయోగస్య ఇతి. అసంభవే చ కారణం వక్తవ్యమ్ ఇతి. అత్రోచ్యతే-ఆత్మవిదః నివృత్తమిథ్యాజ్ఞానత్వాత్,విపర్యయజ్ఞానమూలస్య కర్మయోగస్య అసంభవః స్యాత్;జన్మాదిసర్వవిక్రియారహితత్వేన నిష్క్రియమ్ ఆత్మానమ్ ఆత్మత్వేన యః వేత్తి తస్య ఆత్మవిదః సమ్యగ్దర్శనేన అపాస్తమిథ్యాజ్ఞానస్య నిష్క్రియాత్మస్వరూపావస్థానలక్షణం సర్వకర్మసంన్యాసమ్ ఉక్త్వా తద్విపరీతస్య మిథ్యాజ్ఞానమూలకర్తృత్వాభిమానపురస్సరస్య సక్రియాత్మస్వరూపావస్థానరూపస్య కర్మయోగస్య ఇహ గీతాశాస్త్రే తత్ర తత్ర ఆత్మస్వరూపనిరూపణప్రదేశేషు సమ్యగ్జ్ఞానమిథ్యాజ్ఞానతత్కార్యవిరోధాత్ అభావః ప్రతిపాద్యతే యస్మాత్ తస్మాత్ ఆత్మవిదః నివృత్తమిథ్యాజ్ఞానస్య విపర్యయజ్ఞానమూలః కర్మయోగః న సంభవతి ఇతి యుక్తమ్ ఉక్తం స్యాత్.

బాలానందిని

అత్రేతి:-ఇక్కడ(విషయజిజ్ఞాసువు)ఇలా అంటున్నాడు-ఆత్మవేత్తకు సంన్యాస- కర్మ యోగాలు రెండూ అసంభవములా,లేక వాటిలో ఏదో ఒకటి అసంభవమా?ఏదో ఒకటి అసంభవం అయితే ఆ అసంభవ మైనది కర్మసంన్యాసమా,లేక కర్మయోగమా?అసంభవం అనడానికి కారణం కూడ చెప్పాలి. ఇక్కడ(సమాధానం)చెప్పబడుచున్నది. ఆత్మవేత్తయొక్క మిథ్యాజ్ఞానం తొలగిపోవడంవల్ల,వానికి విపర్యయజ్ఞానం మూలంగా గల కర్మయోగం సంభవం కాదు. ("తస్య ఆత్మవిదః సర్వకర్మసంన్యాసమ్ ఉక్త్వా తద్విపరీతస్య కర్మయోగస్య అభావః ప్రతిపాద్యతే"అని అన్వయం). జన్మాది సమస్తవికారాలూ లేకపోవడంచేత నిష్క్రియ మైన ఆత్మయే తన స్వరూపము అని ఎవడు తెలుసుకొంటాడో అట్టి,సమ్యగ్జ్ఞానంచేత మిథ్యాజ్ఞానం తొలగించుకొన్న ఆత్మవేత్తకు నిష్క్రియాత్మస్వరూపంలో ఉండడం అనే లక్షణం గల సర్వకర్మసంన్యాసం చెప్పి,దానికి(సర్వకర్మసంన్యాసానికి)విరుద్ధము,మిథ్యాజ్ఞానంవల్ల కలిగే కర్తృత్వాభిమానం పురఃసరంగా గలది(ముందుగా)కర్తృత్వాభిమానం ఉంటేనే తాను ఉండడానికి అవకాశం కలది),సక్రియ మైన ఆత్మస్వరూపంతో ఉండడం అనే స్వరూపం గలది అయిన కర్మయోగం,సమ్యగ్జ్ఞానమిథ్యాజ్ఞానాలకీ,వాటి కార్యాలకీ పరస్పరం విరోధం ఉండడంవల్ల, ఆత్మవేత్తకు ఉండదు అని ఈ గీతాశాస్త్రంలో,అక్కడక్కడ, ఆత్మస్వరూపాన్ని నిరూపించే ప్రదేశాలలో ఎందువల్ల ప్రతిపాదింపబడుచున్నదో, అందువల్ల (ప్రతిపాదింపబడు చున్నందువల్ల)మిథ్యాజ్ఞానం నివర్తించిన ఆత్మవేత్తకు కర్మయోగం సంభవం కాదు అని చెపితే యుక్తంగా ఉంటుంది.

భాష్యమ్

కేషు కేషు పునః ఆత్మ స్వరూపనిరూపణప్రదేశేషు ఆత్మవిదః కర్మాభావః ప్రతిపాద్యతే ఇతి? అత్రోచ్యతే–**"అవినాశి తు తత్"**(2.17)ఇతి ప్రకృత్య **"య ఏనం వేత్తి హన్తారమ్"**(2.19),**"వేదావినాశినం నిత్యమ్"**(2.21)ఇత్యాదౌ తత్ర తత్ర ఆత్మవిదః కర్మాభావః ఉచ్యతే. నను చ కర్మయోగోఽపిఆత్మస్వరూపనిరూపణప్రదేశేషు తత్ర తత్ర ప్రతిపాద్యతే ఏవ;తత్ యథా**"తస్మాత్ యుధ్యస్వ భారత"**(2.47)ఇత్యాదౌ అతశ్చ కథమ్ ఆత్మవిదః కర్మయోగస్య అసంభవః స్యాత్ ఇతి? అత్ర ఉచ్యతే–సమ్యగ్జ్ఞానమిథ్యాజ్ఞానతత్కార్యవిరోధాత్.**"జ్ఞానయోగేన సాంఖ్యానామ్"**(3.3)ఇత్యనేన సాంఖ్యానామ్ ఆత్మతత్త్వవిదామ్ అనాత్మవిత్కర్తృకకర్మయోగనిష్ఠాతః నిష్క్రియాత్మస్వరూపావస్థానలక్షణాయాః జ్ఞానయోగనిష్ఠాయాః పృథక్కరణాత్;కృతకృత్యత్వేన ఆత్మతత్త్వవిదః ప్రయోజనాన్తరాభావాత్,**"తస్య కార్యం న విద్యతే"**(3.17)ఇతి కర్తవ్యాన్తరాభావవచనాచ్చ. **"న కర్మణామనారమ్భాత్"**(3.4) **"సంన్యాసస్తు మహాబాహో దుఃఖమాప్తుమయోగతః"**(5.6) ఇత్యాదినా చ ఆత్మజ్ఞానాఙ్గత్వేన కర్మయోగస్య విధానాత్.**"యోగారూఢస్య తస్యైవ శమః కారణముచ్యతే"**(6.3)ఇత్యనేన చ ఉత్పన్నసమ్యగ్దర్శనస్య కర్మయోగాభావవచనాత్, **"శారీరం కేవలం కర్మ కుర్వన్నాప్నోతి కిల్బిషమ్"**(4.21)ఇతి చ శరీరస్థితికారణాతిరిక్తస్య కర్మణః నివారణాత్, **"నైవ కించిత్కరోమీతి యుక్తో మన్యేత తత్త్వవిత్"**(5.8)ఇత్యనేన చ శరీరస్థితిమాత్రప్రయుక్తేషు అపి దర్శనశ్రవణాదికర్మసు ఆత్మయాథాత్మ్యవిదః "నాహం కరోమి" ఇతి ప్రత్యయస్య సమాహితచేతస్తయా సదాకర్తవ్యత్వోపదేశాత్,ఆత్మతత్త్వవిదః సమ్యగ్దర్శనవిరుద్ధః మిథ్యాజ్ఞానహేతుకః కర్మయోగః స్వప్నేఽపి న సంభావయితుం శక్యతే యస్మాత్,తస్మాత్ అనాత్మవిత్కర్తృకయోః ఏవ సంన్యాసకర్మయోగయోః నిఃశ్రేయసకరత్వవచనం,తదీయాచ్చ కర్మసంన్యాసాత్ పూర్వోక్తాత్మవిత్కర్తృకసర్వకర్మసంన్యాసవిలక్షణాత్,సత్యేవ కర్తృత్వవిజ్ఞానే,కర్మైకదేశవిషయాత్, యమనియమాదిసహితత్వేన చ దురనుష్ఠేయాత్ సుకరత్వేన చ కర్మయోగస్య విశిష్టత్వాభిధానమ్ ఇత్యేవం ప్రతివచనవాక్యార్థనిరూపణేనాపి పూర్వోక్తః ప్రష్టుః అభిప్రాయః నిశ్చీయతే ఇతి స్థితమ్.

బాలానందిని

కేష్వితి:– ఆత్మస్వరూపాన్ని నిరూపించే ఏ యే ప్రదేశాలలో ఆత్మవేత్తకు కర్మాభావం ప్రతిపాదించబడుచున్నది? ఈ విషయంలో చెప్పబడుచున్నది.**"అవినాశి తు తద్విద్ధి"**అని ప్రారంభించి **"య ఏనం వేత్తి హన్తారమ్"**,**"వేదావినాశినమ్"**ఇత్యాదులలో అక్క డక్కడ, ఆత్మవేత్తకు కర్మ లేదు అని చెప్పబడింది.

(ప్రశ్న) అక్క దక్కడ ఆత్మస్వరూపనిరూపణప్రదేశాలలో కర్మయోగం కూడ చెప్ప బడుచున్నది కదా? అదెట్లనగా–**"తస్మాద్యుధ్యస్వ భారత"**, **"స్వధర్మమపి చావేక్ష్య"**, **"కర్మణ్యే వాధికారస్తే"**ఇత్యాదులలో (చెప్పబడుచున్నది). అలాంటప్పుడు ఆత్మవేత్తకు కర్మయోగాసంభవం ఎట్లు? ఇక్కడ (సమాధానం)చెప్పబడుచున్నది. సమ్యగ్జ్ఞానమూ, మిథ్యాజ్ఞానమూ పరస్పరవిరుద్ధములు. వాటి కార్యాలు కూడ పరస్పర విరుద్ధములు. అనాత్మవేత్తలు కర్తలుగా గల(వాళ్లుచేసే) కర్మయోగనిష్ఠ వేరు, సాంఖ్యులకు సంబంధించిన, నిష్క్రియాత్మస్వరూపంలో స్థిరంగా ఉండడం అనే లక్షణం గల జ్ఞానయోగనిష్ఠ వేరు అని **"జ్ఞానయోగేన సాంఖ్యానామ్"** అనేదానిచేత ప్రతిపాదింపబడింది. ఆత్మవేత్త కృతకృత్యు డవడంచేత వానికి మరొక ప్రయోజనం ఏదీ ఉండదు. **"తస్య కార్యం న విద్యతే"**అని వానికి మరొక కార్యం ఏదీ లేదని చెప్పబడింది. **"న కర్మణామనారమ్భాత్"**, **"సంన్యాసస్తు మహాబాహో దుఃఖమాప్తుమ యోగతః"**ఇత్యాదివాక్యాలచేత కర్మయోగం ఆత్మజ్ఞానానికి అంగంగా విధించబడింది. **"యోగారూఢస్య తస్యైవ శమః కారణముచ్యతే"**అనే వాక్యం సమ్యగ్జ్ఞానం కలిగినవానికి కర్మయోగం ఉండదు అని చెపుతూన్నది. **"శారీరం కేవలం కర్మ కుర్వన్నాప్నోతి కిల్బిషమ్"** అనే వాక్యంచేత శరీరస్థితికి కారణ మైన కర్మ తప్ప మరే కర్మ ఆత్మవేత్తకు ఉండదు అని చెప్పబడింది. ఆత్మయాథాత్మ్యాన్ని తెలుసుకొన్నవాడు ఆత్మయందే నిలపబడిన చిత్తం కలవా డవడంచేత శరీరస్థితిమాత్రంకోసం చేసే చూడడం వినడం మొదలైన కర్మల విషయంలో కూడ నే నేమీ చేయడంలేదు అని ఎల్లప్పుడూ అనుకోవాలి అని **"నైవ కించిత్కరోమీతి యుక్తో మన్యేత తత్త్వవిత్"**అనే వాక్యం ఉపదేశిస్తూన్నది. ఈ కారణా లన్నింటిచేత ఆత్మతత్త్వం తెలుసుకొన్నవానికి, సమ్యగ్జ్ఞానానికి విరుద్ధమూ, మిథ్యాజ్ఞానంవల్ల కలిగేదీ అయిన కర్మయోగం స్వప్నంలో కూడ ఊహింప శక్యం కాదు. అందువల్ల అనాత్మజ్ఞుడు చేసే సంన్యాసకర్మయోగాలే నిఃశ్రేయసకరము లని చెప్పబడుతున్నాయి, వాని కర్మసంన్యాసం కంటె(వాని)కర్మయోగం విశిష్ట మైనది అని చెప్పబడుచున్నది. అనాత్మజ్ఞుడు చేసే కర్మ సంన్యాసం వెనుక చెప్పిన ఆత్మవేత్త చేసే సర్వకర్మసంన్యాసంకంటె విలక్షణమైనది(భిన్న స్వభావం కలది). నేను కర్తను అని అనుకొంటూనే ఇతడు కర్మలలో ఏకదేశాన్ని(కొన్ని కర్మలను మాత్రమే)విడుస్తాడు. యమనియమాదులు కూడా ఉండడంవల్ల వీనికి సంన్యాసం చేయడం చాలా కష్టం. దాని దృష్ట్యా కర్మయోగం ఆచరించడం సులభం. అందుచేతనే అనాత్మజ్ఞునికి సంబంధించి నంతవరకు సంన్యాసంకంటె కర్మయోగం విశిష్టం అని చెప్పబడుతున్నది. ఈ విధంగా ప్రతివచనవాక్యంయొక్క అర్థాన్ని పరిశీలించినా కూడ ప్రష్టయొక్క అభిప్రాయం వెనుక చెప్పినదే అని నిశ్చితం అవుతున్నది.

భా. అ. ప్ర. (పూర్వపక్షం)**'కర్మణ్యకర్మ'**ఇత్యాదికంచేత చ ‹పబడిన జ్ఞానం కర్మ యోగానికి ఉపయోగించే జ్ఞానమే కాని సంన్యాసానికి సంబంధించినది కాదు. **"తస్మాద**

జ్ఞానసంభూతం హృత్స్థం జ్ఞానాసినాత్మనః,ఛిత్త్వైనం సంశయం యోగమాతిష్ఠోత్తిష్ఠ భారత" అని అధ్యాయోపసంహారంలో కర్మానుష్ఠానం విషయంలో కూడ సంశయం తొలగించు కొనడానికి జ్ఞానం అవసరం అని ప్రతిపాదించబడింది. "న మాం కర్మాణి లిమ్పన్తి న మే కర్మఫలే స్పృహా,ఇతి మాం యో౽భిజానాతి కర్మభిర్న స బధ్యతే","ఏవం జ్ఞాత్వా కృతం కర్మ పూర్వైరపి ముముక్షుభిః, కురు కర్మైవ తస్మాత్త్వం పూర్వైః పూర్వతరం కృతమ్" అని ఉపక్రమంలో కూడ కర్మ జ్ఞానపూర్వకంగానే అనుష్ఠింపదగినది అని చెప్పబడింది. ఈ విధంగా ఉపక్రమోపసంహారాలు సమంగా ఉన్నాయి. "యస్య సర్వే సమారమ్భాః కామసంకల్పవర్జితాః,జ్ఞానాగ్ని దగ్ధకర్మాణం తమాహుః పణ్డితం బుధాః""త్యక్త్వా కర్మఫలాసంగం నిత్యతృప్తో నిరాశ్రయః,కర్మణ్యభిప్రవృత్తో౽పి నైవ కించిత్కరోతి సః", "యజ్ఞాయాచరతః కర్మ సమగ్రం ప్రవిలీయతే","జ్ఞానాగ్నిః సర్వకర్మాణి భస్మసాత్ కురుతే ర్జున"అని మధ్యలో కూడ జ్ఞానపూర్వకర్మానుష్ఠానం చూపబడింది.అందుచేత ఆత్మవేత్త కర్మయోగం ఆచరించడం సంభవమే.ఆత్మవేత్తకు సంన్యాసం కూడ ఇతరవాక్యాలచేత చూపబడింది. అందుచేతనే అర్జునుడు"సంన్యాసం కర్మణాం కృష్ణ పునర్యోగం చ శంససి"అని అన్నాడు. అందుచేత ఆత్మవేత్త చేసే కర్మయోగ-సంన్యాసాల తారతమ్యాన్ని తెలుసుకొనడం కోసమే అర్జునుడు ప్రశ్నించాడు అనడం యుక్తతరంగా ఉంటుంది. మరొక విషయ మేమనా-అజ్ఞుడు కర్మ చేయడం సంభవమే అయినా వానికి విశిష్ట మైన కర్మయోగం సంభవం కాదు.కర్మయోగం అనగా కర్మలయందు ఫలాభిసంధ్యాదులను విడవడంచేత చేయబడేది.ఆ త్యాగం ఆత్మజ్ఞానం లేకుండా సంభవం కాదు.అందుచేతనే"త్యక్త్వా కర్మ ఫలాసంగమ్"అనే శ్లోకం ప్రవృత్తిమార్గంలో ఉన్న ఆత్మవేత్తను గూర్చి చెప్పబడింది అని భాష్యకారులు కూడ వ్యాఖ్యానించారు. "జ్ఞేయః స నిత్యసంన్యాసీ యో న ద్వేష్టి న కాఙ్క్షతి" అను భవంతుని ప్రతివచనాన్ని పట్టి కూడ కర్మయోగం అనుష్ఠించవలసినది ఆత్మవేత్తయే అని తెలుస్తూన్నది.జ్ఞానం లేకుండా రాగద్వేషాలు క్షీణించవు కదా?అందుచేత ప్రశ్న ఆత్మవేత్త చేయవలసిన సంన్యాసకర్మయోగాల తారతమ్యాన్ని తెలుసుకొనడం కోసం అడగ బడింది అని శ్రీరామానుజాచార్యాదులు అంటారు.(ఇది రామానుజాచార్యాదుల అభిప్రాయాన్ని దృష్టిలో పెట్టుకొని చేసిన పూర్వపక్షం).

దీనికి సమాధానం చెప్పబడుతున్నది-ఏ జ్ఞానం కర్మయోగానికి ఉపకరిస్తుందో, ఏ జ్ఞానం కర్మసంన్యాసానికి ఉపకరిస్తుందో నీకు అర్థం కాలేదు. అందుచేతనే నీకు ఈ ఆశంక కలిగింది. "ఆత్మ నిత్య మైనది;నేను ఈశ్వరునికొరకై కర్మ చేస్తున్నాను;నాకు ఏ నాటికైనా క్షయం పొందే స్వర్గాదిఫలం వద్దు.నేను విషయాభిముఖుడనుగా ఉండకూడదు. మనస్సును నా వశంలో ఉంచుకోవాలి. శీతోష్ణాదిద్వంద్వాలను సహించాలి. కర్మ సిద్ధించినా సిద్ధించకపోయినా సమచిత్తుడనై ఉండాలి" ఇత్యాదిజ్ఞానం కర్మయోగానికి ఉపకరిస్తుంది.

కర్మసంన్యాసాని కైతే-“ఆత్మ వికారాలు లేనిది. దీనికి కర్తృత్వభోక్తృత్వాలు లేవు;సచ్చిదానంద రూప మైనది. కర్మలు దేహాదులకు మాత్రమే చెందుతాయి” ఇత్యాదిజ్ఞానం ఉపకరిస్తుంది. దీనికే సమ్యగ్దర్శనం అని పేరు. ఈ జ్ఞానం ఎవనికి ఉంటుందో ఆతడే ఆత్మవేత్త అని చెప్పబడతాడు. అందుచేత ఆత్మవేత్త కర్మయోగం ఆచరించడం అసంభవమే. “త్యక్త్వా కర్మఫలాసంగమ్” ఇత్యాదికంచేత ఆత్మవేత్త చేసే కర్మయోగం చూపబడుచున్నది అని ఏది చెప్పబడిందో అది కర్మయోగం కాదు;అది అకర్మయే. ఎందువల్ల ననగా ఇది లోకసంగ్రహంకొరకే చేయబడుచున్నది;అభిమానం లేకుండా చేయబడుచున్నది. ఈ విషయం అనేకపర్యాయాలు విస్తృతంగా ప్రతిపాదించబడింది.

“జ్ఞానాసినా సంశయం ఛిత్త్వా యోగమాతిష్ఠ”అన్నప్పుడు చెప్పిన జ్ఞానం ఆత్మజ్ఞానం కాదు;మరేమనగా శోకమోహాదిదోషాలను గూర్చిన జ్ఞానమే. అది కర్మయోగానికి ఉపకారమే. భాష్యకారులు కూడ “దోషమోహాదిసమ్యగ్దదర్శనమ్”అనే వ్యాఖ్యానించారు. అంతే కాని ఆత్మదర్శనం అని వ్యాఖ్యానించలేదు. లేదా-తత్త్వవేత్త నైన నేను లోకసంగ్రహం కొరకు కర్మ చెయ్యాలా చేయ నవసరం లేదా అను సంశయాన్ని ఛేదించి జనకాది దృష్టాంతంచేత కర్మ చేయుము అని దాని అర్థం. అందుచేత అక్కడ జ్ఞానం అనగా- లోక సంగ్రహంకొరకు విద్వాంసుడు కూడ కర్మ చెయ్యాలి. క్షత్రియుడ నైన నేను చెయ్యాలి అనే జ్ఞానం అని గ్రహించాలి. లేదా-జ్ఞానం అనగా ఆత్మతత్త్వజ్ఞానమే అనుకుందాం. సంశయం అనగా నేను బ్రహ్మనా కాదా అను సంశయం అనే అనుకొందాం. లోకసంగ్రహంకోసం కర్మ చేయదగినది అని ఉపదేశించడంవల్ల ఆ విధంగా అర్థం తీసికొన్నా బాధ లేదు. ఎన్ని విధాల చూచినా కూడ వికారరహితబ్రహ్మరూపంలో ఉన్న కృతకృత్యుడైన తత్త్వవేత్తకు కర్మాసంభవమే. వానికి బ్రహ్మరూపంలో ఉండడం అనే లక్షణం గల సర్వకర్మసంన్యాసమే సంభవం అవుతుంది. “కర్మణ్యకర్మ”ఇత్యాదికంచేత భగవంతుడు జ్ఞానికే సంన్యాసం చెప్పాడు,అర్జును డైతే అది తెలియక ప్రశ్నించాడు అనడానికి వీలు లేదు. అలా అయితే శ్రీకృష్ణుడు-నేను చెప్పిన సంన్యాసం జ్ఞాని చేయవలసిన సంన్యాసమే కాని అజ్ఞాని చేసేది కాదు. అదైతే కర్మయోగంకంటె విశిష్ట మైనదే. అజ్ఞాని చేసే సంన్యాసం మాత్రం కర్మయోగం కంటె అపకృష్టమే(తక్కువదే)అని చెప్పి ఉండాలి. అందువల్ల శ్రీశంకరులు చెప్పినదే పంక రహితమైన వ్యాఖ్యానం. (భా. అ. ప్ర. పే. 209-210)

పైన ఉన్న అవతారికాభాగంలో భగవత్పాదులు అనాత్మవేత్త చేసే సంన్యాస - కర్మ యోగాల తారతమ్యమే ఇక్కడ విచారించబడుచున్నది అని ప్రతిపాదిస్తూ అనాత్మవేత్త చేసే సంన్యాసం కర్మైకదేశవిషయం,అనగా కర్మలో ఒక భాగాన్నే సంన్యసించకలుగుతాడు, యమదమాదు లుండడంచేత ఇది అనుష్ఠించడం కష్టం కూడ అన్నారు. దీనిని పట్టి సంన్యాసంలో రెండు భేదా లున్నట్లు స్పష్టం అవుతున్నది. ఆత్మవేత్త సంన్యసించిన తరువాత

ఆతనికి చేయవలసిన కర్మ ఏదీ ఉండదు,శరీరయాత్రోపయుక్త మైన చేష్టాభాసమే వానికి ఉంటుంది. పూర్తి ఆత్మజ్ఞానం లేనివాడు సంన్యసించినా వానికి దండతర్పణ - స్నాన - భిక్షాటనాది కర్మ చేయవలసి ఉంటుంది.

"ఆనృశంస్యం క్షమా సత్యమహింసా దమ ఆర్జవమ్,
ప్రీతిః ప్రసాదో మాధుర్యమక్రోధశ్చ యమా దశ"
దానమిజ్యా తపో ధ్యానం స్వాధ్యాయోపస్థనిగ్రహౌ,
వ్రతోపవాసౌ మౌనం చ స్నానం చ నియమా దశ"

అని చెప్పబడిన యమనియమాల సంరక్షణం కూడ కర్తవ్యమై ఉంటుంది.అందుచేతనే ఇతడు చేసిన సంన్యాసం కర్మైకదేశవిషయం.అనగా యజ్ఞాదికర్మలను విడచినా పూర్వోక్త ములైన ఇతరకర్మలు ఉంటాయి.

సర్వకర్మసంన్యాసం,కర్మైకదేశసంన్యాసం అని రెండు విధాలైన సంన్యాసం ఉన్న దనడంలో ప్రమాణం ఏమిటి అని ప్రశ్నించుకొని, శ్రీరామరాయకవి "భాష్యకారవచనమే ఇందుకు ప్రమాణం; కుటీచకాదులకు కొన్ని కర్మలుంటాయనీ, అవధూత యైన పరమహంసకు ఏ కర్మలూ ఉండ వనీ శాస్త్రంలో కూడ చెప్పబడింది" అని చెప్పారు. (భా.అ.ప్ర.పే. 208)

భాష్యమ్

"జ్యాయసీ చేత్కర్మణస్తే" (3.1) ఇత్యత్ర జ్ఞానకర్మణోః సహాసంభవాత్ **"యచ్ఛ్రేయ ఏతయోః తత్ బ్రూహి"** ఇత్యేవం పృష్టః అర్జునేన భగవాన్ సాంఖ్యానాం సంన్యాసినాం జ్ఞానయోగేన నిష్ఠా, పునః కర్మయోగేన యోగినాం నిష్ఠా ప్రోక్తా ఇతి నిర్ణయం చకార. **"న చ సంన్యసనాదేవ సిద్ధిం సమధిగచ్ఛతి"** (3.4) ఇతి వచనాత్ జ్ఞావసహితస్య తస్య సిద్ధిసాధనత్వం ఇష్టమ్; కర్మయోగస్య చ విధానాత్ (4.42) జ్ఞానరహితస్య సంన్యాసః శ్రేయాన్ కిం వా కర్మయోగః శ్రేయాన్ ఇతి ఏతయోః ప్రశస్యతరం బుభుత్సుః -

అర్జున ఉవాచ -

మూ. సంన్యాసం కర్మణాం కృష్ణ పునర్యోగం చ శంససి,
యచ్ఛ్రేయ ఏతయోరేకం తన్మే బ్రూహి సునిశ్చితమ్. 1

బాలానందిని

అ.వ. పైన యుక్తిపూర్వకంగా, సవిస్తరంగా చెప్పిన విషయాన్నే మళ్లీ సంక్షిప్తంగా చెపుతున్నారు - **జ్యాయసీ ఇతి :-** ఒకే వ్యక్తియందు, ఒకే సమయంలో జ్ఞానకర్మలు అసంభవములు గాన అర్జునుడు - **"జ్యాయసీ చేత్కర్మణస్తే"** అని అంటూ ఈ రెండింటిలో ఏది శ్రేయస్కరమో నాకు చెప్పు అని ప్రశ్నించగా భగవంతుడు సాంఖ్యులైన సంన్యాసులకు జ్ఞానయోగంచేత నిష్ఠ అనీ, యోగుల కైతే కర్మయోగంచేత నిష్ఠ అనీ నిర్ణయం చేశాడు. కేవలం సంన్యసించినంత మాత్రంచేత సిద్ధిని పొందబడు అని చెప్పడంవల్ల జ్ఞానసహితమైన సంన్యాసం సిద్ధికి సాధనం అని అంగీకరించబడింది. అట్లే కర్మయోగం కూడ విధించబడింది గాన అది కూడ సిద్ధికి సాధన అని అంగీకరించబడింది. (కర్మయోగస్య అన్నదాని తరవాత కూడ 'సిద్ధిసాధనత్వమిష్టమ్' అను పదాలు అన్వయించుకోవాలి). అయితే - జ్ఞాన రహితునికి సంన్యాసం మంచిదా లేక కర్మయోగం మంచిదా అని వీటిలోని విశేషాన్ని తెలుసుకోవాలనే ఇచ్ఛతో అర్జునుడు ఇలా అన్నాడు -

ప్ర.అ. సంన్యాసమితి :- కృష్ణ = కృష్ణా! కర్మణామ్ = కర్మలయొక్క, సంన్యాసమ్ = సంన్యాసమును, శంససి = ప్రశంసిస్తున్నావు. పునః = మళ్లీ, యోగం చ = యోగమును కూడ ప్రశంసిస్తున్నావు. ఏతయోః = ఈ రెండింటిలో, యత్ = ఏది, శ్రేయః = శ్రేయస్కరమో, **తత్** = అట్టి, ఏకమ్ = ఒకదానికి, మే = నాకు, సునిశ్చితమ్ = బాగా నిశ్చితంగా, బ్రూహి = చెప్పుము.

భాష్యమ్

సంన్యాసం పరిత్యాగం, కర్మణాం శాస్త్రీయాణామ్ అనుష్ఠానవిశేషాణాం, శంససి కథయసీత్యేతత్. పునః యోగం చ తేషామేవ అనుష్ఠానమ్, అవశ్యకర్తవ్యమ్, శంససి, అతః మే కతరత్ శ్రేయః ఇతి సంశయః- కిం కర్మానుష్ఠానం శ్రేయః కిం వా తద్ధానమ్ ఇతి, ప్రశవస్యతరం చ అనుష్ఠేయమ్; అతశ్చ యత్ శ్రేయః ప్రశస్యతరమ్ ఏతయోః కర్మసంన్యాసకర్మానుష్ఠానయోః, యదనుష్ఠాత్ శ్రేయోవాప్తిః మమ స్యాత్ ఇతి మన్యసే తత్ ఏకమ్ అన్యతరత్, సహ ఏకపురుషానుష్ఠేయత్వాసంభవాత్ మే బ్రూహి, సునిశ్చితమ్ అభిప్రేతం తవ ఇతి.

బాలానందిని

సంన్యాసమ్ ఇతి :- కర్మలయొక్క, శాస్త్రవిహితము లైన అనుష్ఠానవిశేషాలయొక్క పరిత్యాగాన్ని, ప్రశంసిస్తున్నావు. వాటిని గూర్చి చెపుతున్నావు అని అర్థం. మళ్లీ యోగాన్ని కూడా, ఆ కర్మల అనుష్ఠానమునే తప్పక చేయదగిన దానినిగా చెపుతూన్నావు. అందుచేత

ఏది శ్రేయస్కరము, కర్మానుష్ఠానం శ్రేయస్కరమా లేక కర్మలను పరిత్యజించడం శ్రేయస్కరమా అని నాకు సంశయం కలుగుచున్నది. ఏది ఎక్కువ పశస్యమో దానిని చెయ్యాలి. అందుచేత ఈ కర్మసంన్యాసకర్మానుష్ఠానాలలో ఏది శ్రేయస్సో, ఎక్కువ ప్రశస్యమైనదో, దేనిని అనుష్ఠించడంవల్ల నాకు శ్రేయఃప్రాప్తి కలుగుతుంది అని నీవు భావిస్తున్నావో అట్టి ఏదో ఒకదానిని, రెండింటినీ కలిపి ఒక పురుషుడు చేయడం అసంభవం గాన, నాకు సునిశ్చితంగా ఏది నీకు ఇష్టమైనదో అది చెప్పుము. 1

భాష్యమ్

స్వాభిప్రాయమ్ ఆచక్షాణః నిర్ణయాయ -

శ్రీ భగవానువాచ -

మూ. సంన్యాసః కర్మయోగశ్చ నిఃశ్రేయసకరావుభౌ
తయోస్తు కర్మసంన్యాసాత్ కర్మయోగో విశిష్యతే. 2

బాలానందిని

స్వేతి :- నిర్ణయంకొరకై భగవంతుడు తన అభిప్రాయం తెలుపుతూ ఇలా అన్నాడు-

ప్ర.అ. సంన్యాస ఇతి :- సంన్యాసః = సంన్యాసము, కర్మయోగః చ = కర్మయోగము, ఉభౌ = రెండూ కూడ, నిఃశ్రేయసకరౌ = మోక్షం చేసేవే. తు = కాని, తయోః = వాటిలో, కర్మసంన్యాసాత్ = కర్మసంన్యాసంకంటె, కర్మయోగః = కర్మయోగం, విశిష్యతే = విశిష్టంగా ఉన్నది.

భాష్యమ్

సంన్యాసః కర్మణాం పరిత్యాగః, కర్మయోగః చ, తేషామ్ అనుష్ఠానమ్, తౌ ఉభౌ అపి, నిఃశ్రేయసకరౌ నిఃశ్రేయసం మోక్షం కుర్వతే. జ్ఞానోత్పత్తిహేతుత్వేన ఉభౌ యద్యపి నిఃశ్రేయసకరౌ తథాపి, తయోః తు నిః శ్రేయసహేత్వోః కర్మసంన్యాసాత్ కేవలాత్ కర్మయోగః విశిష్యతే ఇతి కర్మయోగం స్తౌతి. 2

బాలానందిని

సంన్యాస ఇతి :- కర్మల పరిత్యాగము, కర్మల అనుష్ఠానము, ఈ రెండూ కూడ మోక్షాన్ని ఇస్తాయి. రెండూ కూడ జ్ఞానం కలగడానికి హేతువు లవడంచేత నిఃశ్రేయసాన్ని కలిగించే వైనా, అయినా కూడ, నిఃశ్రేయసహేతువు లైన వాటిలో, కేవలమైన (జ్ఞాన విహీన మైన) కర్మసంన్యాసంకంటె కర్మయోగం విశిష్ట మైనది అని కర్మయోగాన్ని స్తుతిస్తున్నాడు. 2

భాష్యమ్

కస్మాత్ ఇత్యాహ -

మూ. జ్ఞేయః స నిత్యసంన్యాసీ యో న ద్వేష్టి న కాఙ్క్షతి,
నిర్ద్వన్ద్వో హి మహాబాహో సుఖం బన్ధాత్ ప్రముచ్యతే. 3

బాలానందిని

కస్మాదితి :- ఎందువలన అనగా చెప్పుచున్నాడు -

ప్ర.అ. జ్ఞేయః ఇతి :- యః = ఎవడు, న ద్వేష్టి = ద్వేషించడో, న కాఙ్క్షతి = కోరడో, సః = అతడు, నిత్యసంన్యాసీ = నిత్యమూ సంన్యాసిగా, జ్ఞేయః = తెలియదగినవాడు. మహాబాహో = ఓ! మహాబాహూ! నిర్ద్వన్ద్వః = సుఖదుఃఖాదిద్వంద్వాలు లేనివాడు, బన్ధాత్ = బంధంనుండి, సుఖమ్ = అనాయాసంగా, ప్రముచ్యతే = విడవబడతాడు.

భాష్యమ్

జ్ఞేయ ఇతి :- జ్ఞేయః జ్ఞాతవ్యః, సః కర్మయోగీ, నిత్యసంనాసీ ఇతి యః న ద్వేష్టి కించిత్, న కాఙ్క్షతి సుఖదుఃఖే తత్సాధనే చ; ఏవంవిధః యః కర్మణి వర్తమానః అపి రాగద్వేషాద్యయోగాత్ సః నిత్యసంన్యాసీ ఇతి జ్ఞాతవ్యః ఇత్యర్థః. నిర్ద్వన్ద్వః ద్వన్ద్వవర్జితః, హి యస్మాత్, మహాబాహో, సుఖం బన్ధాత్ అనాయాసేన ప్రముచ్యతే. 3

బాలానందిని

జ్ఞేయ ఇతి :- ఆ కర్మయోగి నిత్యసంన్యాసి అని తెలియదగినవాడు - ఎవడు దేనినీ ద్వేషించడో, సుఖదుఃఖాలను కాని, వాటి సాధనాలను కాని కోరడో, అట్టివాడు కర్మయందు ప్రవర్తిస్తున్నా కూడ, రాగద్వేషాదులు లేనివా డవడంచేత నిత్యసంన్యాసి అని తెలియదగినవాడు అని అర్థం. ఎందువల అనగా - ఓ మహాబాహూ! ద్వంద్వాలు లేనివాడు బంధంనుండి అనాయాసంగా విముక్తు డవుతాడు. 3

భాష్యమ్

సంన్యాసకర్మయోగయోః భిన్నపురుషానుష్ఠేయయోః విరుద్ధయోః ఫలే అపి విరోధః యుక్తః, న తు ఉభయోః అపి నిఃశ్రేయసకరత్వమ్ ఏవ ఇతి ప్రాప్తే ఇదమ్ ఉచ్యతే -

మూ. సాంఖ్యయోగౌ పృథగ్బాలాః ప్రవదన్తి న పణ్డితాః,
ఏకమప్యాస్థితః సమ్యగుభయోర్విన్దతే ఫలమ్. 4

బాలానందిని

సంన్యాసేతి :- పరస్పరవిరుద్ధములు, వేరు వేరు పురుషులుచేత అనుష్ఠింపదగినవీ అయిన సంన్యాసకర్మయోగాల ఫలంలో కూడ విరోధ ఉండడం యుక్తం. అంతే కాని రెండూ నిఃశ్రేయసకరములే అవడం యుక్తం కాదు అని ప్రాప్తించగా (చెప్పవలసి ఉండగా) ఇది చెప్పబడుచున్నది -

ప్ర.అ. సాంఖ్యేతి :- సాంఖ్యయోగౌ = సాంఖ్యయోగాలు (జ్ఞానయోగ - కర్మయోగాలు) పృథక్ = వేరువేరైనవి అని, బాలాః = తెలివితక్కువవాళ్లు, ప్రవదన్తి = చెప్పుదురు. పణ్డితాః = పండితులు, న = అట్లు చెప్పరు. ఏకమ్ = ఒక్కదానిని, సమ్యక్ = బాగుగా, ఆస్థితః = అపి = అవలంబించిన వాడు కూడ, ఉభయోః = రెండింటి యొక్క ఫలమ్ = ఫలమును, = విన్దతే = పొందుతాడు.

భాష్యమ్

సాంఖ్యయోగావితి :- సాంఖ్యయోగౌ పృథక్ విరుద్ధభిన్నఫలౌ బాలాః ప్రవదన్తి, న పణ్డితాః. పణ్డితాః తు జ్ఞానినః ఏకం ఫలమ్ అవిరుద్ధమ్ ఇచ్ఛన్తి. కథమ్? ఏకమ్ అపి సాంఖ్యయోగయోః సమ్యక్ ఆస్థితః, సమ్యక్ అనుష్ఠితవాన్యితర్థః. ఉభయోః విన్దతే ఫలమ్. ఉభయోః తదేవ హి నిఃశ్రేయసం ఫలమ్ అతః న ఫలే విరోధః అస్తి.

బాలానందిని

సాంఖ్యేతి :- సాంఖ్యయోగములను, పృథక్ = విరుద్ధ మైన వేరు వేరు ఫలములు కలవాటినిగా, బాలులు అంటారు కాని పండితులు అనరు. పండితు లైతే, జ్ఞాను లైతే, విరుద్ధం కాని ఒకే ఫలమును రెండింటికీ అంగీకరిస్తారు. ఎట్లు? సాంఖ్యయోగాలలో ఏ ఒక్కదానినైనా బాగా అవలంబించినవాడు, బాగా అనుష్ఠించినవాడు అని అర్థం, రెండింటి ఫలాన్నీ పొందుతాడు, రెండింటికి నిఃశ్రేయసం అనేదే ఫలం కదా? అందువల్ల ఫలం విషయంలో విరోధం లేదు.

భాష్యమ్

నను సంన్యాసకర్మయోగశబ్దేన ప్రస్తుత్య సాంఖ్యయోగయోః ఫలైకత్వం కథమ్ ఇహ అప్రకృతం బ్రవీతి? నైష దోషః యద్యపి అర్జునేన సంన్యాసం కర్మయోగం చ కేవలమ్ అభిప్రేత్య ప్రశ్నః కృతః, భగవాన్ తు తదుపరి త్యాగేనైవ, స్వాభిప్రేతం చ విశేషం సంయోజ్య శబ్దాన్తరవాచ్యతయా ప్రతివచనం దదౌ సాంఖ్యయోగావితి. తౌ ఏవ సంన్యాసకర్మయోగౌ జ్ఞానతదుపాయసమబుద్ధిత్వాదిసంయుక్తౌ సాంఖ్యయోగ శబ్దవాచ్యౌ ఇతి భగవతః మతమ్. అతః న అప్రకృతప్రక్రియా. 4

బాలానందిని

నన్వితి :- (ప్రశ్న) సంన్యాసకర్మయోగశబ్దాలతో ఉపక్రమించి ఇక్కడ, అప్రకృతమైన, సాంఖ్యయోగాల ఫలం ఒకటే అను విషయం ఎలా చెపుతున్నాడు? (సమాధానం) ఈ దోషం లేదు. అర్జునుడు కేవలం సంన్యాసాన్ని కర్మయోగాన్నీ గూర్చి ప్రశ్నించినా కూడ భగవంతు డైతే ఆతడు పేర్కొన్నవాటిని విడవకుండానే, తాను చెప్పదలచిసన ఒక విశేషాన్ని కూడా చేర్చి, 'సాంఖ్యాయోగౌ' అని శబ్దాంతరం (మరొకశబ్దం) ప్రయోగించి ప్రతివచనం ఇచ్చాడు. జ్ఞానము, దానికి ఉపాయా లైన సమబుద్ధిత్వాదికమూ – వీటితో కలిస్తే సంన్యాస కర్మయోగాలే సాంఖ్య –యోగ శబ్దాలచేత చెప్పబడతాయి అని భగవంతుని మతం. అందువల్ల అప్రకృతవిషయాన్ని గూర్చి చెప్పడం అనేది లేదు. (జ్ఞానంతో కూడిన సంన్యాస్యాన్ని సాంఖ్యం అంటారు, సమత్వాదులతో కూడిన కర్మయోగాన్ని యోగం అంటారు అని భావం). 4

భాష్యమ్

ఏకస్యాపి సమ్యగనుష్ఠానాత్ కథమ్ ఉభయోః ఫలం విన్దతే ఇతి? ఉచ్యతే -

మూ. యత్సాంఖ్యైః ప్రాప్యతే స్థానం తద్యోగైరపి గమ్యతే,
ఏకం సాంఖ్యం చ యోగం చ యః పశ్యతి స పశ్యతి. 5

బాలానందిని

ఏకస్యేతి :- ఒకదానిని బాగా అనుష్ఠించినా కూడ రెండింటి ఫలాన్నీ ఎలా పొందుతాడు? చెప్పబడుచున్నది -

ప్ర.అ. యదితి :- సాంఖ్యైః = సాంఖ్యులచేత, యత్ స్థానమ్ = ఏ స్థానం, ప్రాప్యతే = పొందబడుతుందో, తత్ = అది, యోగైః అపి = యోగులచేత కూడ, గమ్యతే = పొందబడుతుంది. సాంఖ్యమ్ = సాంఖ్యమును, యోగం చ యోగమును, యః = ఎవడు, ఏకమ్ = ఒకేదానినిగా, పశ్యతి = చూస్తాడో, సః = అతడు, పశ్యతి = బాగా చూస్తున్నాడు.

భాష్యమ్

యదితి :- యత్ సాంఖ్యైః జ్ఞాననిష్ఠైః సంన్యాసిభిః, ప్రాప్యతే, స్థానం మోక్షాఖ్యం తత్, యోగైః అపి, జ్ఞాన ప్రాప్త్యుపాయత్వేన ఈశ్వరే సమర్ప్య కర్మాణి ఆత్మనః ఫలమ్ అనభిసంధాయ అనుతిష్ఠన్తి యే తే యోగినః, తైరపి, పరమార్థజ్ఞానసంన్యాసప్రాప్తి ద్వారేణ గమ్యతే ఇత్యభిప్రాయః. అతః ఏకం సాంఖ్యం యోగం చ యః పశ్యతి ఫలైకత్వాత్ సః సమ్యక్ పశ్యతీత్యర్థః. 5

బాలానందిని

యదితి :- జ్ఞాననిష్ఠులైన సంన్యాసులచేత మోక్షం అనే ఏ స్థానం పొందబడుతుందో అదే యోగులచేత కూడ, ఎవరైతే ఫలాన్ని తమకోసం కోరుకొనుకండా ఈశ్వరునికి సమర్పించి జ్ఞానప్రాప్తికి ఉపాయంగా కర్మలను ఆచరిస్తారో వాళ్లు యోగులు, వాళ్లచేత కూడ, పరమార్థజ్ఞానమును, సంన్యాసమును పొందడం ద్వారా పొందబడుతుంది అని అభిప్రాయం. అందుచేత, ఫలం ఒకటే అవడంవల్ల సాంఖ్యమును యోగాన్నీ ఎవడు ఒక్కటిగానే చూస్తాడో అతడు బాగా చూచినవాడవుతాడు అని అర్థం.

భాష్యమ్

ఏవం తర్హి యోగాత్ సంన్యాస ఏవ విశిష్యతే; కథం తర్హి ఇదమ్ ఉక్తం **"తయోస్తు కర్మసంన్యాసాత్ కర్మయోగో విశిష్యతే** (5.2) ఇతి? శృణు తత్ర కారణమ్. త్వయా పృష్టం కేవలం కర్మసంన్యాసం కర్మయోగం చ అభిప్రేత్య తయోః అన్యతరః కః శ్రేయాన్ ఇతి. తదనురూపం ప్రతివచనం మయా ఉక్తం కర్మసంన్యాసాత్ కర్మయోగః విశిష్యతే ఇతి జ్ఞానమ్ అనపేక్ష్య. జ్ఞానాపేక్షస్తు సంన్యాసః సాంఖ్యమ్ ఇతి మయా అభిప్రేతః. పరమార్థయోగః చ స ఏవ. యస్తు కర్మయోగః వైదికః సః తాదర్థ్యాత్ యోగః సంన్యాసః ఇతి చ ఉపచర్యతే.

బాలానందిని

ఏవమితి :- ఈ విధంగా నైతే (కర్మాచరణ చేసేవాళ్లకు శ్రేయః ప్రాప్తి ప్రత్యక్షంగా కాక జ్ఞానపూర్వకసంన్యాసం ద్వారానే కలుగుతుంది అని అంటే) అప్పుడు యోగంకంటె సంన్యాసమే విశిష్టమైన దవుతుంది. అలాంటప్పుడు "ఆ రెండింటలో కర్మసంన్యాసంకంటె కర్మయోగం విశిష్టమైనది" అని ఎలా చెప్పావు? అందుకు కారణం ఏమిటో విను. నువ్వు కేవల (జ్ఞానరహిత) సంన్యాసాన్ని కర్మయోగాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ రెండింటిలో ఏది శ్రేయస్కరము అని అడిగావు. నేను కూడ, నీ ప్రశ్నకు అనుగుణంగా, జ్ఞానాన్ని అపేక్షించకుండా (జ్ఞానం మాట దృష్టిలో ఉంచుకొనకుండా) కర్మసంన్యాసంకంటె కర్మయోగం మంచిది అని ప్రతివచనం చెప్పాను. జ్ఞానాపేక్షమైన సంన్యాసమైతే సాంఖ్యం అని నా అభిప్రాయం. అదే పరమార్థయోగం కూడ. వైదికమైన ఏ కర్మయోగం ఉన్నదో అది సాంఖ్యానికి ఉపయోగించే దవడంచేత యోగం అనీ, (జ్ఞేయః స నిత్యసంన్యాసీ" అని చెప్పినట్లు) సంన్యాస మనీ ఔపచారికంగా చెప్పబడుచున్నది.

వి. ఇక్కడ "అయం వివేకః" అని ప్రారంభించి శ్రీరామరాయకవి ఈ విధంగా విషయవివేచనం చేసి ఉన్నారు. సంన్యాసమూ కర్మయోగమూ కూడ పారమార్థికమూ

అపారమార్థికమూ అనే భేదంచేత ఒక్కొక్కటి రెండేసి విధాలు. ఆత్మవేత్త చేసిన సంన్యాసం పారమార్థికసంన్యాసం. అనాత్మవేత్త చేసినది అపారమార్థికసంన్యాసం. ఆత్మవేత్త లోకసంగ్రహం కొరకు చేసే యోగం పారమార్థికయోగం, అనాత్మవేత్త చిత్తశుద్ధికోసం చేసే యోగం అపారమార్థికయోగం. పారమార్థికసంన్యాసానికి పారమార్థికయోగానికీ భేదం లేదు. అందుకు కారణం ఏమనగా - సంన్యాసికి వలె యోగికి కూడ కర్తృత్వాద్యభిమానం లేకపోవడంచేత అతడు చేసే కర్మ అకర్మయే అని చెప్పబడింది. అట్లే అనాత్మవేత్త చేసే సంన్యాస - యోగాలకు కూడ భేదం లేదు. ఎందువల్ల ననగా - ఇద్దరు అనుష్ఠాతలకీ కూడ కర్తృత్వాద్యభిమానం ఉంటుంది. యజ్ఞాదులవలె యమాదులు కూడ కర్మలే. అందుచేత కేవల (జ్ఞానరహిత) సంన్యాసివిషయసమాధియోగం కర్మయోగంలో అంతర్భూతం అవుతుంది. లేదా - పారమార్థికమూ, జ్ఞానహీనమూ అని సంన్యాసం రెండు విధాలు. సమత్వాబుద్ధితో కూడినది, కేవలము అని కర్మయోగం రెండు విధాలు. పారమార్థిక సంన్యాసం సాంఖ్యం, సమత్వాదిబుద్ధి యుక్త మైన కర్మయోగం పరమార్థయోగం (భా.అ.ప్ర.పే. 213-214). 5

భాష్యమ్

కథం తాదర్థ్యమితి? ఉచ్యతే -

మూ. సంన్యాసస్తు మహాబాహో దుఃఖమాప్తుమయోగతః,
యోగయుక్తో మునిర్బ్రహ్మ నచిరేణాధిగచ్ఛతి. 6

బాలానందిని

కథమితి :- వైదిక మైన కర్మయోగం సాంఖ్యం పొందడం కోసం అనేది ఎట్లు? చెప్పబడుచున్నది -

ప్ర.అ. **సంన్యాస ఇతి :-** మహాబాహో = మహాబాహూ! సంన్యాసః తు = సంన్యాస మైతే, అయోగతః = యోగం లేకుండగా, ఆప్తుమ్ = పొందుటకు, దుఃఖమ్ = కష్ట మైనది. యోగయుక్తః = యోగంతో కూడిన, మునిః = ముని, నచిరేణ = శీఘ్రంగా, బ్రహ్మ = సంన్యాసాన్ని, అధిగచ్ఛతి = పొందుతాడు.

భాష్యమ్

సంన్యాస ఇతి :- సంన్యాసః తు పారమార్థికః, మహాబాహో, దుఃఖమ్ ఆప్తుమ్, అయోగతః యోగేన వినా. యోగయుక్తః వైదికేన కర్మయోగేన ఈశ్వరసమర్పితరూపేణ ఫలనిరపేక్షేణ యుక్తః, మునిః మననాత్ ఈశ్వరస్వరూపస్య మునిః, బ్రహ్మ, పరమాత్మ జ్ఞానలక్షణత్వాత్ ప్రకృతః సంన్యాసః బ్రహ్మ ఉచ్యతే. "న్యాస ఇతి బ్రహ్మా, బ్రహ్మా హి

పరః" (మహా నారా ఉ. 21.2) ఇతి శ్రుతేః. బ్రహ్మ పరమార్థసంన్యాసం పరమాత్మ జ్ఞాననిష్ఠాలక్షణం, నచిరేణ క్షిప్రమేవ అధిగచ్ఛతి ప్రాప్నోతి. అతః మయా ఉక్తం కర్మయోగః విశిష్యతే. 6

బాలానందిని

సంన్యాస ఇతి :- మహాబాహూ! పారమార్థికసంన్యాస మైతే యోగం లేకుండా పొందడానికి చాల కష్ట మైనది. యోగయుక్తు డైన అనగా ఈశ్వరునికి సమర్పించబడిన స్వరూపం గల ఫలాపేక్ష లేని వైదికకర్మయోగంతో కూడిన. ఈశ్వరస్వరూపమననం చేసే ముని, బ్రహ్మను, ప్రకృతమైన సంన్యాసం పరమాత్మజ్ఞానం లక్షణంగా గలది అవడంవల్ల బ్రహ్మ అని చెప్పబడుతుంది. **"న్యాస ఇతి .... బ్రహ్మ"** (సంన్యాసమే బ్రహ్మ, హిరణ్య గర్భుడు పరమాత్మ స్వరూపుడు కదా. ఇది కూడ పరమాత్మ స్వరూపమే గాన బ్రహ్మ) అను శ్రుతి ఈ అర్థాన్ని చెపుతున్నది. అట్టి బ్రహ్మను అనగా పరమాత్మజ్ఞానమునందు నిష్ఠ అనే లక్షణం గల పరమార్థసంన్యాసమును,శీఘ్రంగా పొందుతాడు. అందుచేతనే నేను **"కర్మయోగో విశిష్యతే"** అని చెప్పాను.

భా.అ.ప్ర. :- కర్మయోగయుక్తునికే ఆత్మ ప్రాప్తి సులభమైనది; జ్ఞానయోగం ఉన్నవాని కైతే కష్టసాధ్యమైనది" అని శ్రీరామానుజాచార్యులు చెప్పినది యుక్తం కాదు. ఆత్మప్రాప్తి అనగా ముక్తియా లేక జ్ఞానమా? మొదటిది అవడానికి వీలు లేదు; కర్మచేత ముక్తి రాదు కదా? ఆత్మప్రాప్తి ముక్తి అని నువ్వు అంగీకరించలేదు కూడ. రెండవది కూడ యుక్తం కాదు. ఏ ఆత్మజ్ఞానం కర్మయోగంచేత అనాయాసంగా లభిస్తుంది అని అంటున్నావో దాని యోగము జ్ఞానయోగం అనగా. అలాంటి జ్ఞానయోగంచేత జ్ఞానం లభించడం కష్టం ఎందుకవుతుంది? జ్ఞానయోగానికి సంబంధించిన జ్ఞానం పరోక్షం, కర్మయోగంచేత లభించే దైతే అపరోక్షం అని కూడ అనడం కుదరదు. పరోక్షజ్ఞానం లేకుండా అపరోక్షజ్ఞానం లభించదు కదా? అయినా కూడ అపరోక్షజ్ఞానం జ్ఞానయోగంచేతనే అనాయాసంగా లభిస్తుంది. కర్మయోగ మైతే పరోక్షజ్ఞానాన్ని ముందుగా పుట్టించి తరవాతనే అపరోక్ష జ్ఞానాన్ని కలిగించవచ్చును గాన అది బహిరంగసాధనం మాత్రమే (భా.అ. ప్ర. పే. 216)7

భాష్యమ్

యదా పునః అయం సమ్యగ్దర్శనప్రాప్త్యుపాయత్వేన -

మూ. యోగయుక్తో విశుద్ధాత్మా విజితాత్మా జితేన్ద్రియః,
సర్వభూతాత్మభూతాత్మా కుర్వన్నపి న లిప్యతే. 7

బాలానందిని

యదా ఇతి :- ఎప్పుడైతే ఇతడు సమ్యగ్దర్శనప్రాప్తికి ఉపాయంగా (శ్లోకంలోని యోగయుక్తః" తో అన్వయిస్తుంది) -

ప్ర.అ. యోగేతి :- యోగయుక్తః = యోగంతో కూడినవాడై, విశుద్ధాత్మా = పరిశుద్ధమైన అంతఃకరణం కలవాడై, విజితాత్మా = జయించబడిన దేహం కలవాడై, జితేన్ద్రియః = జయించబడిన ఇంద్రియాలు కలవాడై, సర్వభూతాత్మభూతాత్మా = సమస్త భూతాలకు ఆత్మయైన, అంతరాత్మగా ఉంటాడో, అప్పుడు, కుర్వన్ అపి = కర్మచేస్తున్నా కూడ, న లిప్యతే = లిప్తుడు కాడు.

భాష్యమ్

యోగేన యుక్తః యోగయుక్తః, విశుద్ధాత్మా విశుద్ధసత్త్వః, విజితాత్మా = విజితదేహః, జితేన్ద్రియశ్చ, సర్వభూతాత్మభూతాత్మా సర్వేషాం బ్రహ్మాదీనాం స్తమ్బపర్యన్తానాం భూతానామ్ ఆత్మభూతః ఆత్మా ప్రత్యక్చేతనః యస్య సః సర్వభూతాత్మ భూతాత్మా, సమ్యగ్దర్శీ ఇత్యర్థః. సః తత్రైవంవర్తమానః లోకసంగ్రహాయ కర్మ కుర్వన్నపి, న లిప్యతే న కర్మభిః బధ్యతే ఇత్యర్థః. 7

బాలానందిని

యోగేతి :- యోగమునందు యుక్తుడు, పరిశుద్ధ మైన బుద్ధి కలవాడు, జయించ బడిన శరీరం కలవాడు, జితేంద్రియుడు, బ్రహ్మ మొదలు స్తంబం వరకు ఉన్న భూతాలకు ఆత్మయైన ప్రత్యక్చేతన కలవాడు (తన ఆత్మయే సర్వభూతాల ఆత్మ అని ఎవడు అనుకుంటాడో అతడే సర్వభూతాత్మభూతాత్మ. ఈ జ్ఞానం బ్రహ్మాభేదజ్ఞానంవల్లనే కలుగుతుంది). అందుచేత "అహం బ్రహ్మాస్మి" అను సమ్యగ్జ్ఞానం కలవాడు అని దీనికి అర్థం; ఈ విధంగా ఉన్నవాడు లోకసంగ్రహంకొరకు కర్మ చేస్తున్నా కూడ లిప్తుడు కాడు; కర్మలచేత బంధింపబడడు అని అర్థం.

భా.అ. ప్ర. "సర్వభూతేత్యాదివిశేషణంచేత అన్ని ఆత్మలూ కూడ జ్ఞాన మనే ఒకే ఆకారం కలవి అవడంచేత పరస్పరము సామ్యం కలవి అను విషయం చెప్పబడుచున్నది" అని శ్రీ రామానూజాచార్యుల వ్యాఖ్య అసంగతం. మూలకర్త అభిప్రాయం అదే అయితే "సర్వభూతాత్మతుల్యాత్మా" అనియే చెప్పి ఉండేవాడు. సర్వదేహాలు భౌతికము లవడంచేత తుల్యములే అని చెప్పడం ఏ విధంగా వ్యర్థమో అట్లే సర్వాత్మల స్వరూపమూ తుల్యమే అని ఉపదేశించడం వ్యర్థం. అత్యంతము సామ్యం ఉన్నట్లయితే భేదానికి కారణమైన విశేషణం ఏదీ లేనప్పుడు వాటి మధ్య భేదం ఉన్న దని చెప్పడం కూడ యుక్తం కాదు. ఉపాధులవల్ల

భేదం అని అన్నట్లయితే అప్పుడు ఘటాద్యుపాధిభేదం ఉన్నా కూడ ఆకాశం ఒకటే అయినట్లు ఆత్మకూడ అభిన్నమే అని సిద్ధిస్తుంది.

మరొక విషయ మేమనగా - ఆత్మయొక్క ఆకారం అని చెప్పబడుచున్న ఈ జ్ఞానం చైతన్యమా వృత్తియా? రెండవ పక్షం యుక్తం కాదు. అని మనస్సువల్ల (లో) పుడుతుంది కదా? మొదటి పక్షం కూడ కుదరదు. చైతన్యం సమస్తవిశేషాల లయానికి సాక్షిగా ఉంటుందని సుషుప్త్యాదుల ద్వారా స్పష్టంగా తెలుస్తూన్నది. అలాంటి విశేషరహితము, పరిపూర్ణము, అపరిచ్ఛిన్నమూ అయిన చైతన్యంలో భేదం ఎలా ఉంటుంది? భేదం కలిగించేది ఏదీ లేదు కదా? అందుచేతనే కదా శ్రుతి "ఏకమేవాద్వితీయం బ్రహ్మ" అని ఉపదేశిస్తూన్నది? అందుచేత "ద్వితీయాద్వై భయం భవతి" అని శ్రుతి చెప్పినట్లు భయహేతు వైన ఈ భేదభావం చాలు. (భా.అ.ప్ర.పే. 216) 7

భాష్యమ్

న చా సౌ పరమర్థాతః కరోతి. అత :-

మూ. నైవ కించిత్కరోమీతి యుక్తో మన్యేత తత్త్వవిత్. 8

బాలానందిని

నేతి : ఇతడు వాస్తవంలో ఏమీ చేయడం లేదు. అందువల్ల -

ప్ర.అ. నైవేతి :- యుక్తః = సమాహిత మైన చిత్తం గల, తత్త్వవిత్ = తత్త్వవేత్త, కించిత్ = ఏమీ కూడ, నైవ కరోమి = నేను చేయుట లేదు అని, మన్యేత = తలచుచుండ వలెను.

భాష్యమ్

నైవ కించిత్కరోమీతి యుక్తః సమాహితః సన్, మన్యేత చిన్తయేత్, తత్త్వవిత్ - ఆత్మనః యాథాత్మ్యం తత్త్వం వేత్తీతి తత్త్వవిత్; పరమార్థదర్శీ ఇత్యర్థః. 8

బాలానందిని

నైవేతి :- ఆత్మయొక్క యథార్థస్వరూపం తత్త్వం; ఆ తత్త్వాన్ని తెలుసుకొన్న వాడు తత్త్వవిత్. పరమార్థం కనుగొన్నవాడు అని అర్థం. అలాంటి తత్త్వవేత్త యుక్తుడు, ఆత్మయందే నిలపబడిన చిత్తం కలవాడై నే నేమీ చేయుటలేదు అని అనుకొనాలి(అనుకొనుచుఉంటాడు). 8

భాష్యమ్

కదా కథం వా తత్త్వమ్ అవధారయన్ మన్యేత ఇతి ఉచ్యతే -

మూ. పశ్యన్ శృణ్వన్ స్పృశన్ జిఘ్రన్నశ్నన్ గచ్ఛన్ స్వపన్ శ్వసన్.
ప్రలపన్ విసృజన్ గృహ్ణన్నున్మిషన్నిమిషన్నపి,
ఇన్ద్రియాణీన్ద్రియార్థేషు వర్తన్త ఇతి ధారయన్. 9

బాలానందిని

కదేతి :- తత్త్వం నిశ్చయంగా తెలిసినవాడు ఎప్పుడు, ఏ విధంగా (నైవ చికిన్త్కరోమి అని) తలవవలెనో చెప్పుచున్నాడు -

ప్ర.అ. పశ్యన్ ఇతి:- పశ్యన్ = చూచుచు, శృణ్వన్ = వింటూ, స్పృశన్ = స్పృశిస్తూ, జిఘ్రన్ = వాసన చూచుచు, అశ్నన్ = తినుచు, గచ్ఛన్ = నడచుచు, స్వపన్ = నిద్రించుచు, శ్వసన్ = శ్వాస పీల్చుచు, ప్రలపన్ = మాటలాడుచు, విసృజన్ = విడచుచు, గృహ్ణన్ = గ్రహించుచు, ఉన్మిషన్ = కళ్ళు తెరచుచు, నిమిషన్నపి = కళ్లు మూయుచు, ఇన్ద్రియాణి = ఇంద్రియాలు, ఇన్ద్రియార్థేషు = ఇంద్రియాల విషయములందు, వర్తన్తే = ప్రవర్తిస్తూన్నవి, ఇతి = అని, ధారయన్ = నిశ్చయిస్తూ (మన్యేత = తలవవలెను)

భాష్యమ్

మన్యేతేతి పూర్వేణ సంబన్ధః. యస్య ఏవం తత్త్వవిదః సర్వకార్యకరణచేష్టాసు కర్మసు అకర్మైవ పశ్యతః సమ్యగ్దర్శినః తస్య సర్వకర్మసంన్యాసే ఏవ అధికారః, కర్మణః అభావదర్శనాత్. న హి మృగతృష్ణికాయామ్ ఉదకబుద్ధ్యా పానాయ ప్రవృత్త ఉదకాభావజ్ఞానేఽపి తత్రైవ పానప్రయోజనాయ ప్రవర్తతే. 9

బాలానందిని

మన్యేతేతి :- 'మన్యేత' అని వెనుకటి దానితో సంబంధం. ఈ విధంగా సమస్త దేహేంద్రియాల చేష్టారూపములైన కర్మలయందు అకర్మనే ఏ తత్త్వవేత్త చూస్తాడో అలాంటి సమ్యగ్దర్శికి, అతడు కర్మాభావాన్నే చూస్తాడు గాన, సర్వకర్మసంన్యాసమునందే అధికారం. ఎండమావులను చూచి నీళ్లు అనుకొని త్రాగడంకోసం ప్రవర్తించినవాడు, ఉదకం లేదని తెలిసిన తరువాత కూడ, పానం అనే ప్రయోజనం కోసం ఆ ఎండమావులయందే ప్రయత్నించడుకదా? 9

భాష్యమ్

యస్తు పునః అతత్త్వవిత్ ప్రవృత్తః చ కర్మయోగే -

మూ. బ్రహ్మణ్యాధాయ కర్మాణి సంగం త్యక్త్వా కరోతి యః,
లిప్యతే న స పాపేన పద్మపత్రమివామ్భసా. 10

బాలానందిని

యస్త్వితి :- ఎవడైతే తత్త్వవేత్త కాడో, కర్మయోగంలో ప్రవర్తిస్తాడో -

ప్ర.అ. బ్రహ్మణీతి :- యః = ఎవడు, బ్రహ్మణి = పరమేశ్వరునియందు, ఆధాయ = ఉంచి, సంగమ్ = సంగమును (ఫలాసక్తిని), త్యక్త్వా = విడచి, కర్మాణి = కర్మలను, కరోతి = చేస్తాడో, సః = అతడు, పద్మపత్రమ్ = తామరాకు, అమ్భసా ఇవ = నీటిచేత వలె, పాపేన = పాపంచేత, న లిప్యతే = లిప్తుడు కాడు.

భాష్యమ్

బ్రహ్మణి ఈశ్వరే, ఆధాయ నిక్షిప్య,తదర్థం కరోమి ఇతి భృత్యః ఇవ స్వామ్యర్థమ్, సర్వాణి కర్మాణి, మోక్షేఽపి ఫలే సంగం త్యక్త్వా, కరోతి యః సర్మాణి కర్మాణి, లిప్యతే న సః సంబధ్యతే, పద్మపత్రమ్ ఇవ, అమ్భసా ఉదకేన. 10

బాలానందిని

బ్రహ్మణీతి :- భృత్యుడు స్వామికోసం చేస్తున్నట్లుగా నేను పరమేశ్వరునికోసమే చేస్తున్నాను అని సమస్తకర్మలను పరమేశ్వరునియందే ఉంచి మోక్షరూపఫలం విషయంలో కూడ సంగం విడచి ఎవడు సర్వకర్మలను చేస్తాడో అతడు, పద్మపత్రం నీటిచేత వలె, పాపంచేత లిప్తుడు కాడు. 10

భాష్యమ్

కేవలం సత్త్వశుద్ధిమాత్రఫలమేవ తస్య కర్మణః స్యాత్, యస్మాత్ -

మూ. కాయేన మనసా బుద్ధ్యా కేవలైరిన్ద్రియైరపి,
యోగినః కర్మ కుర్వన్తి సంగం త్యక్త్వాఽఽత్మశుద్ధయే. 11

బాలానందిని

కేవలమితి :- ఆ కర్మకు కేవలం అంతఃకరణశుద్ధి అనే ఫలం మాత్రమే ఉంటుంది గాన -

ప్ర.అ. కాయేనేతి :- యోగినః = యోగులు, సంగమ్ = సంగమును, త్యక్త్వా = విడచి, కాయేన = శరీరంచేత, మనసా = మనస్సుచేత బుద్ధ్యా = బుద్ధిచేత, కేవలైః = కేవలములైన, ఇన్ద్రియైః అపి = ఇంద్రియాలచేత, ఆత్మశుద్ధియే = అంతఃకరణశుద్ధికొరకు, కర్మ = కర్మను, కుర్వన్తి = చేస్తున్నారు.

భాష్యమ్

కాయేన దేహేన, మనసా బుద్ధ్యా చ కేవలైః మమత్వవర్జితైః, ఈశ్వరాయైవ కర్మ కరోమి న మమ ఫలాయ ఇతి మమత్వబుద్ధిశూన్యైః ఇన్ద్రియైః అపి, కేవలశబ్దః కామాదిభిః అపి ప్రత్యేకం సంబధ్యతే సర్వవ్యాపారేషు మమతావర్జనాయ, యోగినః కర్మిణః, కర్మ కుర్వన్తి, సంగం త్యక్త్వా ఫలవిషయమ్, ఆత్మశుద్ధయే, సత్త్వశుద్ధయే ఇత్యర్థః. తస్మాత్ తత్రైవ తవ అధికారః ఇతి కురు కర్మైవ. 11

బాలానందిని

కాయేనేతి :– దేహంచేత, మనస్సుచేత, బుద్ధిచేత, కేవలములైన, మమత్వబుద్ధిలేని, నేను ఈశ్వరునికొరకే కర్మ చేస్తున్నాను, నా ఫలం కోసం కాదు అని మమకారం లేని ఇంద్రియాలచేతను, 'కేవలం' శబ్దం 'కాయేన' మొదలైనవాటితో కూడ ("కేవలేన కాయేన కేవలేన మనసా, కేవలయా బుద్ధ్యా" అని) వేరు వేరుగా అన్వయిస్తుంది. అలా అన్వయించడం చేత కాయ–మనో–బుద్ధులచేత చేసే కర్మల విషయంలో కూడ మమకారం ఉండకూడదు అను అర్థం లభిస్తుంది. యోగులు, కర్మలు ఆచరించేవాళ్లు, ఫలాన్ని గూర్చి సంగం విడచి సత్త్వశుద్ధికొరకు, అంతఃకరణశుద్ధికొరకు, కర్మలు చేస్తారు. (ఈ శ్లోకం అవతారిక చివర ఉన్న 'యస్మాత్' అనే దానిని ఇక్కడ అన్వయించుకోవాలి). (యోగులు ఈ విధంగా ఏ కారణంవల్ల కర్మలు చేస్తున్నారో) ఆ కారణంవల్ల నీకు దానియందే (ఆ విధమైన కర్మయందే) అధికారం. అందుచేత నువ్వు కర్మయే చెయ్యాలి. 11

భాష్యమ్

యస్మాచ్చ –

మూ. యుక్తః కర్మఫలం త్యక్త్వా శాన్తిమాప్నోతి నైష్ఠికీమ్,
అయుక్తః కామకారేణ ఫలే సక్తో నిబధ్యతే. 12

బాలానందిని

యస్మాచ్చేతి :– మరి ఏ కారణంవల్ల కూడ అనగా –

ప్ర.అ. **యుక్త ఇతి:–** యుక్తః = ఈశ్వరునియందు సమాహిత మైన చిత్తం కలవాడై. కర్మఫలమ్ = కర్మఫలాన్ని, త్యక్త్వా = విడచి, నైష్ఠికీమ్ = నిష్ఠయందు కలిగే, శాన్తిమ్ = శాంతిని, ఆప్నోతి = పొందుతాడు. అయుక్తః = సమాహితచిత్తుడు కానివాడు, కామకారేణ = కామ ప్రేరణచేత, ఫలే = ఫలమునందు, సక్తః = ఆసక్తుడై, నిబధ్యతే = బంధింపబడును.

భాష్యమ్

యుక్తః ఈశ్వరాయ కర్మాణి, న మమ ఫలాయ, ఇత్యేవం సమాహితః సన్ కర్మఫలం, త్యక్త్వా పరిత్యజ్య, శాన్తిం మోక్షాఖ్యామ్, ఆప్నోతి, నైష్ఠికీం నిష్ఠాయాం భవాం, సత్త్వశుద్ధిజ్ఞానప్రాప్తిసర్వకర్మసంన్యాసజ్ఞాననిష్ఠాక్రమేణ ఇతి వాక్యశేషః. యః తు పునః, అయుక్తః అసమాహితః, కామకారేణ – కరణం కారః; కామస్య కారః కామకారః,తేన, కామప్రేరితతయా ఇత్యర్థః.మమ ఫలాయ ఇదం కరోమి కర్మ ఇత్యేవం ఫలే సక్తః నిబధ్యతే. అతః త్వం యుక్తః భవ ఇత్యర్థః. 12

బాలానందిని

యుక్తః ఇతి :- కర్మలు ఈశ్వరునికొరకే కాని నా ఫలంకొరకు కాదు అని యుక్తుడై. అనగా సమాహిత మైన చిత్తం కలవాడై. కర్మఫలాన్ని త్యజించి మోక్ష మనే పేరు గల శాంతిని పొందుతాడు. నైష్ఠికీమ్ అనగా నిష్ఠయందు కలిగేది అని అర్థం. అంతః కరణశుద్ధి, జ్ఞానప్రాప్తి, సర్వకర్మసంన్యాసం, జ్ఞాననిష్ఠ అనే క్రమంచేత అని వాక్యశేషం (వాక్యం చివర చేర్చుకోవాలి). (అనగా ఈ విధంగా సమాహితుడై కర్మలు చేయువాడు ముందు అంతః కరణశుద్ధిని, తరవాత జ్ఞానాన్ని, తరవాత సర్వకర్మసంన్యాసాన్ని, తరవాత జ్ఞాననిష్ఠనూ పొంది ఆ నిష్ఠవల్ల కలిగే శాంతిని, మోక్షాన్ని పొందుతాడు అని భావం). ఎవడైతే - అసమాహితుడై కామకారంచేత – కారః అనగా చేయుట; కామంయొక్క కారం కామకారం. ఆ కామకారంచేత, అనగా కామంచేత ప్రేరేపింపబడిన వా డవడంచేత అని అర్థం. నాకీ ఫలం లభించడంకోసం ఈ కర్మ చేస్తున్నాను అని ఫలమునందు సక్తుడై బంధించబడతాడు. (అవతారికలోని "యస్మాచ్చ" అనేదానితో అన్వయించుకోవాలి. యుక్తుడు శాంతిని పొందుతాడు, అయుక్తుడు బంధం పొందుతాడు అనే కారణంవల్ల కూడ) నువ్వు యుక్తుడవు గానే అగుము అని అర్థం. 12

భాష్యమ్

యస్తు పరమార్థదర్శీ సః–

మూ. సర్వకర్మాణి మనసా సంన్యస్యాస్తే సుఖం వశీ,
నవద్వారే పురే దేహీ నైవ కుర్వన్నకారయన్. 13

బాలానందిని

యస్త్వితి :- ఎవ డైతే పరమార్థదర్శియో అట్టి -

ప్ర.అ. సర్వేతి:- దేహీ = దేహధారి యైన పురుషుడు, మనసా = మనస్సుచేత,

సర్వకర్మాణి = సమస్తమైన కర్మలను, సంన్యస్య = సంన్యసించి (పరిత్యజించి), వశీ = ఇంద్రియనిగ్రహవంతుడై, నైవ కుర్వన్ = ఏమీ చేయనివాడై, నకారయన్ = ఏమీ చేయించనివాడై, నవద్వారే = తొమ్మిది ద్వారాలు గల, పురే = పట్టణమునందు, సుఖమ్ సుఖంగా, ఆస్తే = ఉండును.

భాష్యమ్

సర్వాణి కర్మాణి సర్వకర్మాణి, సంన్యస్య పరిత్యజ్య, నిత్యం నైమిత్తికం కామ్యం ప్రతిషిద్ధం చ సర్వకర్మాణి, మనసా వివేకబుద్ధ్యా, కర్మాదౌ అకర్మదర్శనేన సంత్యజ్య ఇత్యర్థః. ఆస్తే తిష్ఠతి. సుఖం త్యక్తవాఙ్మనఃకాయచేష్టః నిరాయాసః ప్రసన్నచిత్తః ఆత్మనః అన్యత్ర నివృత్తబాహ్యసర్వప్రయోజనః ఇతి సుఖమ్ ఆస్తే ఇత్యుచ్యతే. వశీ జితేన్ద్రియః ఇత్యర్థః. క్వ కథమ్ ఆస్తే ఇత్యాహ - నవద్వారే పురే, సప్తశీర్షణ్యాని, ఆత్మనః ఉపలబ్ధి ద్వారాణి, అర్వాక్ ద్వే మూత్రపురీషవిసర్గార్థే, తైః ద్వారైః నవద్వారం పురమ్, ఉచ్యతే, శరీరమ్; పురమివ ఆత్మైకస్వామికం, తదర్థప్రయోజనైః చ ఇన్ద్రియమనో బుద్ధివిషయైః అనేకఫలవిజ్ఞానస్య ఉత్పాదకైః పౌరైః ఇవ అధిష్ఠితం, తస్మిన్ నవద్వారే పురే, దేహీ, సర్వం కర్మ సంన్యస్య ఆస్తే.

బాలానందిని

సర్వాణీతి :- సర్వకర్మలను విడచి, నిత్యము, నైమిత్తికము, కామ్యము ప్రతిషిద్ధము అని అనేక విధా లైన అన్ని కర్మలను, మనస్సుచేత, వివేకబుద్ధిచేత, అనగా కర్మాదులందు అకర్మాదిబుద్ధిచేత విడచి, సుఖంగా ఉంటాడు. వాచికములు, మానసికములు, కాయికములు అయిన చేష్టలను విడచి, ఆయాసం లేనివాడై, ప్రసన్నమైన మనస్సుకలవాడై, ఆత్మ తప్ప బాహ్యమైన సర్వప్రయోజనాలూ తొలగిపోయినవాడై ఉన్నవాడు సుఖంగా ఉన్నాడు అని చెప్పబడుచున్నాడు. వశీ అనగా జితేంద్రియుడు అని అర్థం. ఎక్కడ, ఎలా ఉంటాడో చెపుతున్నాడు - తొమ్మిది ద్వారాలు గల పురంలో (ఆత్మనః = తనకు) తనకు (పురుషునకు) జ్ఞానం కలగడానికి ద్వారా లైన శిరస్సులో ఉండే ఏడు ద్వారాలు (రెండు కళ్లు, రెండు ముక్కులు, రెండు చెవులు, నోరు). మూత్రపురీషాలను విడవడంకొరకు ఉపయోగించే క్రిందివి రెండు - ఈ తొమ్మిది ద్వారాలు గల శరీరం నవద్వారమైన పురం అని చెప్పబడు చున్నది. ఆత్మ (జీవాత్మ) ఒక్కడే స్వామిగా గలది, అనేకము లైన ఫలములు జ్ఞానాన్ని కలిగించేవి, ఆ ఆత్మకొరకై ప్రయోజనాలు సమకూర్చేవే అయిన, పౌరులవంటి, ఇంద్రియ - మనో - బుద్ధి - విషయాలచేత అధిష్ఠించబడినది అయిన ఈ శరీరం పురం వంటి పురం. దానియందు దేహి శారీరుడు, సర్వకర్మలను విడచి ఉంటాడు.

భాష్యమ్

కిం విశేషణేన? సర్వో హి దేహీ సంన్యాసీ అసంన్యాసీ వా దేహే ఏవ ఆస్తే; తత్ర అనర్థకం విశేషణమ్ ఇతి. ఉచ్యతే – యః తు అజ్ఞః దేహీ దేహేన్ద్రియసంఘాతాత్మమాత్రదర్శీ సః సర్వః గేహే భూమౌ ఆసనే వా ఆసే ఇతి మన్యతే – న హి దేహమాత్రాత్మదర్శినః గేహే ఇవ దేహే ఆసే ఇతి ప్రత్యయః సంభవతి. దేహాదిసంఘాతవ్యతిరిక్తాత్మదర్శినః తు దేహే ఆసే ఇతి ప్రత్యయః ఉపపద్యతే. పరకర్మణాం చ పరస్మిన్ ఆత్మని అవిద్యయా అధ్యారోపితానాం, విద్యయా వివేకజ్ఞానేన మనసా సంన్యాసః ఉపపద్యతే. ఉత్పన్నవివేకజ్ఞానస్య సర్వకర్మసంన్యాసినః అపి గేహే ఇవ దేహే ఏవ నవద్వారే పురే ఆసనం ప్రారబ్ధకర్మసంస్కారశేషానువృత్త్యా. దేహే ఏవ విశేషజ్ఞానోత్పత్తేః దేహే ఏవ ఆస్తే ఇతి అస్త్యేవ విశేషణఫలం, విద్వదవిద్వత్ప్రత్యయభేదాపేక్షత్వాత్.

బాలానందిని

కిమితి :– (ప్రశ్న) విశేషణం (సంన్యాసి దేహంలో ఉంటా డని విశేషించి చెప్పడం) ఎందుకు? సంన్యాసియైనా సంన్యాసి కాకపోయినా ప్రతీ దేహీ కూడ దేహంలోనే ఉంటాడు కదా? అలాంటప్పుడీ ఈ విశేషణం వ్యర్థం. (సమాధానం) చెప్పబడుచున్నది – దేహేంద్రియ సంఘాతమే ఆత్మ అనుకొనే అజ్ఞుడైన ప్రతీ దేహీ కూడ "నేను ఇంట్లో ఉన్నాను, నేలమీద ఉన్నాను, ఆసనంమీద ఉన్నాను" అని అనుకొంటాడు. దేహమే ఆత్మ అనుకొనేవానికి గృహంలో ఉన్నాను అనుకొన్నట్లు దేహంలో ఉన్నాను అను జ్ఞానం సంభవం కాదు కదా? దేహాదిసంఘాతంకంటె భిన్నమైన ఆత్మను తెలుసుకొన్నవాని కైతే "నేను దేహంలో ఉన్నాను" అనుకొనడం కుదురుతుంది. అవిద్యచేత దేహాదులకంటె భిన్నమైన ఆత్మయందు ఆరోపించబడిన ఇతరమైన దేహేంద్రియాదుల కర్మలను, విద్యచేత వివేకజ్ఞానంచేత, మనసా సంన్యసించడం కూడ కుదురుతుంది. వివేకజ్ఞానం కలిగిన సర్వకర్మసంన్యాసి కూడ ఫలం ఇవ్వడానికి ప్రారంభించిన కర్మయొక్క సంస్కారశేషం ఇంకా అనువర్తిస్తూండడంచేత, ఇంట్లో ఉన్నట్లు నవద్వారపురంలో ఉన్నాడు అని చెప్పడం జరుగుతూన్నది. వానికి విశేషవిజ్ఞానం దేహంలోనే కలిగింది గాన విద్వాంసుని జ్ఞానంలోను అవిద్వాంసుని జ్ఞానంలోను (వాళ్లు అనుకొనడంలో) ఉన్న భేదాన్ని పట్టి, విద్వాంసుడు దేహంలో ఉన్నాడు అని విశేషించి చెప్పడంలో ఫలం ఉంది.

భాష్యమ్

యద్యపి కార్యకరణకర్మాణి అవిద్యయా ఆత్మని అధ్యారోపితాని సంన్యస్య ఆస్తే ఇతి ఉక్తం తథాపి ఆత్మసమవాయి తు కర్తృత్వం కారయితృత్వం చ స్యాత్ ఇతి

ఆశఙ్క్య ఆహ - నైవ కుర్వన్ స్వయం, న కార్యకరణాని కారయన్ క్రియాసు ప్రవర్తయన్. కిం యత్ తత్ కర్తృత్వం కారయితృత్వం చ దేహినః స్వాత్మసమవాయి సత్ సంన్యాసాత్ న భవతి, యథా గచ్ఛతః గతిః గమనవ్యాపారపరిత్యాగేన స్యాత్ తద్వత్, కిం వా స్వతః ఏవ ఆత్మనః నాస్తి ఇతి? అత్ర ఉచ్యతే - నాస్తి ఆత్మనః స్వతః కర్తృత్వం కారయితృత్వం చ. ఉక్తం హి "అవికార్యోऽయముచ్యతే" (2.25), "శరీరస్థోऽపి కౌన్తేయ న కరోతి న లిప్యతే" (13.31) ఇతి "ధ్యాయతీవ లేలాయతీవ" (బృ.ఉ. 4-3.7) ఇతి చ శ్రుతేః. 13

బాలానందిని

యద్యపీతి :- అవిద్యచేత ఆత్మయందు ఆరోపించబడిన దేహేంద్రియాదుల కర్మలను సంన్యసించి ఉంటాడు అని చెప్పినా కూడ కర్తృత్వమూ, కారయితృత్వము కూడ ఆత్మ యందు సమవాయసంబంధంతో (అవినాభావసంబంధంతో) ఉండవచ్చును అని ఆశంకించు కొని - స్వయంగా తాను చేయనివాడై, కార్యకరణాలను క్రియలయందు ప్రవర్తింపచేయని వాడై ఉంటాడు అని చెపుతున్నాడు. (ప్రశ్న) దేహియొక్క ఆత్మతో సంబంధించియే ఉన్న కర్తృత్వకారయితృత్వాలు, నడిచేవాడు నడవడం అనే వ్యాపారం విడిచివేయడంవల్ల వానిలో ఉన్న గమనం లేకుండా పోయినట్లుగా, సంన్యాసంవల్ల లేకుండా పోతాయా లేక స్వతః గానే (అసలే) అవి ఆత్మలో లేవా? (సమాధానం) ఈ విషయంలో చెప్పబడుచున్నది. స్వతః ఆత్మకు కర్తృత్వకారయితృత్వాలు లేనే లేవు. "అవికార్యోऽయముచ్యతే" "శరీరస్థోऽపి కౌన్తేయ న కరోతి న లిప్యతే" అని చెప్పబడింది కదా? "ధ్యాయతీవ లేలాయతీవ" (ధ్యానిస్తున్నట్లూ చలిస్తున్నట్లు కనబడతాడు) అని శ్రుతి కూడ చెప్పుచున్నది.

భా.అ.ప్ర. "కర్మలను దేహంలో సంన్యసించి" అని శ్రీరామానుజాచార్యుల వ్యాఖ్యానం "వేదావినాశినమ్" ఇత్యాదిశ్లోకంలో "సంపూర్వకమైన న్యాసానికి త్యాగ మనే అర్థం కాని ఉంచడం అను అర్థం కుదరదు" ఇత్యాదికంచేత భాష్యకారులే నిరాకరించారు. (నిరాకరించిన అర్థాన్నే శ్రీరామానుజాచార్యులు తీసికొన్నారు).

మూ. న కర్తృత్వం న కర్మాణి లోకస్య సృజతి ప్రభుః,
న కర్మఫలసంయోగం స్వభావస్తు ప్రవర్తతే. 14

ప్ర.అ. నేతి :- ప్రభుః = ఆత్మ, లోకస్య = లోకమునకు, కర్తృత్వమ్ = కర్తృత్వాన్ని, న సృజతి = సృజించదు; కర్మాణి = కర్మలను, న = సృజించదు. కర్మఫలసంయోగమ్ = కర్మఫలాలతో సంబంధాన్ని, న = సృజించదు. తు = కాని స్వభావః = ప్రకృతి, ప్రవర్తతే = ప్రవర్తిస్తుంది.

భాష్యమ్

న కర్తృత్వమితి :- న కర్తృత్వం, స్వతః కురు ఇతి, నాపి కర్మాణి రథఘట ప్రాసాదాదీప్సితతమాని, లోకస్య, సృజతి ఉత్పాదయతి, ప్రభుః ఆత్మా నాపి రథాది కృతవతః తత్ఫలేన సంయోగం న కర్మఫలసంయోగమ్. యది కించదపి స్వతః న కరోతి న కారయతి చ దేహీ, కః తర్హి కుర్వన్ కారయన్ చ ప్రవర్తతే ఇతి? ఉచ్యతే, స్వభావస్తు, స్వః భావః స్వభావః అవిద్యాలక్షణా ప్రకృతిః మాయా ప్రవర్తతే, "దైవీ హి" (7.14) ఇత్యాదినా వక్ష్యమాణా. 14

బాలానందిని

న కర్తృత్వమితి :- ప్రభు వైన ఆత్మ లోకానికి, నువ్వు స్వయంగా చెయ్యి అని చెప్పి కర్తృత్వాన్ని కాని అత్యంతము ఈప్సితము లైన (పొందగోరబడిన) రథ - ఘట ప్రాసాదాదులను గాని, లోకానికి సృజించదు. లోకస్య అనగా లోకముయొక్క అని కూడ చెప్పవచ్చును. లోకంయొక్క కర్తృత్వాదులను సృజించదు. దేహి స్వతః ఏమీ చేయకపోతే, ఏమీ చేయించకపోతే చేస్తూ, చేయిస్తూ ప్రవర్తించేవా డెవడు? చెప్పబడుచున్నది. స్వః భావః = తన భావం, అవిద్యారూప మైన ప్రకృతి, "దైవీ హ్యేషా" ఇత్యాదికంచేత చెప్పబడ బోయే మాయ, ప్రవర్తిస్తూన్నది.

భా.అ. ప్ర. ఇక్కడ స్వభావం అనగా వాసన అని శ్రీరామానుజవ్యాఖ్య యుక్తం కాదు. అసంగమైన ఆత్మకు ప్రకృతిసంబంధమే అసంభవం అయినప్పుడు ఆ ప్రకృతిచేత సృజించబడిన దేహాదులయందు ఆత్మాభిమానంచేత కలిగే వాసన అసలే అసంభావ్యం. ధర్మరహిత మైన పరమానందచిత్స్వరూపుడైన ఆత్మయందు దేహాద్యాత్మాభిమానం గాని దానివల్ల కలిగిన వాసన గాని ఉండడం అయుక్తం (భా.అ.ప్ర.పే. 223. 14)

భాష్యమ్

పరమార్థతస్తు -

మూ. నాదత్తే కస్యచిత్పాపం న చైవ సుకృతం విభుః,
అజ్ఞానేనావృతం జ్ఞానం తేన ముహ్యన్తి జన్తవః. ~~13~~ 15

బాలానందిని

పరమార్థత ఇతి :- వాస్తవంలో నైతే

ప్ర.అ. నాదత్తే ఇతి :- కస్య చిత్ = ఎవనియొక్కా కూడ, పాపమ్ = పాపమును, విభుః = ప్రభువైన పరమాత్మ, న ఆదత్తే = తీసికొనదు. సుకృతం చైవ = పుణ్యమును

కూడ, న = తీసికొనదు. అజ్ఞానేన = అజ్ఞానంచేత, జ్ఞానమ్ = జ్ఞానము, ఆవృతమ్ = కప్పబడినది. తేన = దానిచేత, జన్తవః = మానవులు, ముహ్యన్తి = మోహం చెందుతున్నారు.

భాష్యమ్

నాదత్తే న చ గృహ్ణాతి భక్తస్యాపి కస్య చిత్ పాపం, న చ ఏవ ఆదత్తే సుకృతం భక్తైః ప్రయుక్తః విభుః. కిమర్థం తర్హి భక్తైః పూజాదిలక్షణం యాగదానహోమాదికం చ సుకృతం ప్రయుజ్య తే ఇతి? ఆహ–అజ్ఞానేన, ఆవృతం జ్ఞానం వివేకవిజ్ఞానం, తేన ముహ్యన్తి కరోమి, కారయామి, భోక్ష్యే, భోజయామి ఇత్యేవం మోహం గచ్ఛన్తి అవివేకినః సంసారిణః జన్తవః. 15

బాలానందిని

నాదత్తే ఇతి :- ప్రభువు, భక్తుడైనా కూడ ఎవనియొక్కా పాపాన్ని గ్రహించదు. భక్తులచేత చేయబడిన పుణ్యాన్ని కూడా తీసికొనదు. అయితే భక్తులచేత పూజాదిరూపము, యాగ - దాన - హోమాదికమూ అయిన పుణ్యం ఎందుకు చేయబడుచున్నది? చెప్పుచున్నాడు - అజ్ఞానంచేత వివేకజ్ఞానం ఆవరించబడింది. దానిచేత వివేక శూన్యులైన, సంసారులైన, మానవులు చేస్తున్నాను, చేయిస్తున్నాను, అనుభవిస్తాను, అనుభవింపచేస్తాను అని మోహం చెందుతున్నారు.

భా.అ.ప్ర. ఇక్కడ శ్రీరామానుజాచార్యులు - "నాదత్తే = తొలగించదు, అజ్ఞానేన = ప్రాచీనకర్మచేత వీని జ్ఞానం, ఆవృతమ్ = సంకుచితమైనది, తేన = ఆ అజ్ఞానంచేత" అని వ్యాఖ్యానించారు. అది అసంగతం. ఆదానం అన్నా అపనోదనం అన్నా ఒకటే అనడం అనుచితం. ఆదానం అపనోదనం అనేవి వేరు వేరు క్రియలు. 'ఆదత్తే' అనేదానికి తొలగించుట అని అర్థం చెప్పడం వ్యాకరణకోశాదులకు విరుద్ధం. ఆత్మజ్ఞానం సమస్తపుణ్య పాపాలనే దూదెకు అగ్ని అని "జ్ఞానాగ్నిదగ్ధకర్మాణమ్" అనే చోట చెప్పబడడంవల్ల ఆత్మ సుఖదుః ఖాలను తొలగించడానికి సమర్థమే గాన అపనోదనం చేయదు అనడం కూడ అయుక్తమే. అట్లే పుత్రాదులు పాపాన్నీ దుఃఖాన్నీ తొలగించడు అనడం కూడ అయుక్తమే. పుత్రాదులు ఆత్మలు గాన ఆత్మలలో పాపాదులు ఉండవు కదా? పుత్రాదులనగా పుత్రాదులు శరీరాదిసంఘాతము అని అర్థం అన్నట్లయితే అప్పుడు అ సంఘాతానికి ఆత్మతో సంబంధమే లేదు గాన 'తనకు సంబంధించినట్లుగా భావింపబడిన పుత్రాదులయొక్క,అని ఎలా అన్నావు? పుత్రాదికం స్వసంబంధి కాదు కాని ఆ విధంగా అభిమానించబడుచున్నది (తలవబడుతున్నది) అని చెప్పడం కూడ యుక్తం కాదు. స్వప్రకాశము, నిర్విశేషమూ అయిన ఆత్మకు అభిమానం కుదరదు కదా? ఇతడు నా పుత్రుడు, నేను వానికంటె భిన్నుడను, వాని తండ్రిని అని

ఎవడు తలుస్తున్నాడో అతడు దేహాదిసంఘాతమే. అచేతనమైన సంఘాతానికి అభిమానం ఎట్లు ఉంటుంది అనడం యుక్తం కాదు; దానిలో చిదాభాస ఉన్నది కదా? చిదాభాస లేకపోతే కేవల మైన అంతఃకరణానికి సంకల్పాదివ్యాపారం ఎలా ఉపపన్నం అవుతుంది? ఎవ డైతే పుత్రాదులకు గూర్చి ఇలాంటి అభిమానం కలవాడో అతడు పుత్రాదుల దుః ఖాన్ని యథాశక్తిగా పోగొడుతూనే ఉన్నాడు; తొలగించడంలేదని ఎలా అంటావు? అట్లే రావణాదు లైన దేహాదిసంఘాతాలు తమకు ప్రతికూల మైన రామాదులైన సంఘాతాల సుఖాన్ని; భార్యాపహారాదుల ద్వారా తొలగిస్తూనే ఉన్నాయి. అలాంటప్పుడు ప్రతికూలుడుగా అభిమతుడైనవాని సుఖాన్ని తొలగించుట లేదు అని చెప్పడం ఎట్లు కుదరుతుంది. అట్లే 'అజ్ఞాన' శబ్దానికి కర్మ అను అర్థం చెప్పడం కూడ అనుపపన్నమే. ఈ రెండింటికీ కార్య కారణభావం ఉండడంచేత ఆ రెండూ వేరైనవి. అజ్ఞానశబ్దంచేత జ్ఞానవిరోధి యైన కర్మ వివక్షితం అని అంటే అలాంటప్పుడు మూలకారుడు "అజ్ఞానేన" అని కాక 'కర్మణా' అనియే అని ఉండేవాడు. ఆవరణం అనేది ద్రవ్యం చేయవలసిన పని, కర్మ. అందుచేత ద్రవ్యం కాని ఆవరణం ఎలా అవుతుంది? అది కాదు; కర్మ జ్ఞానాన్ని ఆవరించడం అనగా కర్మ అనే హేతువుచేత జ్ఞానం సంకుచితం అవడం అని అర్థం అని అన్నా కూడ కుదరదు. కర్మ జ్ఞానావరణ రూప మైనది అని నువ్వు అంటున్నావు. జ్ఞానసంకోచనం కర్మయొక్క స్వరూపం కాదు.మరేమనగా ఇది గుణం మాత్రమే. కర్మకూడ గుణమే అంటాం అనడం కుదరదు. గుణకర్మలు వేరు కదా? పుణ్యాపుణ్యాల సంస్కారరూపంలో ఉన్న కర్మ గుణమే అనడం కూడ యుక్తం కాదు; అలాంటి గుణం సంస్కారరూపం గాన జ్ఞానావరణరూపం కాదు కదా?

మరొక విషయ మేమనగా - కర్మ జ్ఞానానికి ఉపాయం; అందుచేత ఇది అజ్ఞాన విరోధి కాదు కూడ. ఏ కర్మ జ్ఞానవిరోధియో ఆ కర్మనే ఇక్కడ గ్రహిస్తాం. అనడం కూడ యుక్తం కాదు. అజ్ఞానశబ్దం జ్ఞానానికి విరోధి యైన వస్తువు అని మాత్రమే బోధించడానికి సమర్థ మైనది గాన జ్ఞానవిరోధి యైన వస్తువిశేషాన్ని బోధించజాలదు. జ్ఞానవిరోధిగా ప్రత్యక్షంగా కనబడుతూన్న మాయ అనే అజ్ఞానం ఉండగా దాన్ని కాదని. మరొక అర్థాన్ని బోధించడం అసంభవం. అసురశబ్దం రాక్షసులను కాక అన్యులను బోధించజాలరు కదా? అందువల్ల 'నఞ్' కు విరోధార్థం అంగీకరించి, "న జ్ఞానమ్ అజ్ఞానమ్" అనగా జ్ఞానానికి విరోధియైనది అను అర్థం చెప్పినా కూడ అలాంటి అజ్ఞానం మాయయే కావాలి; అదే జ్ఞాన విరోధి కదా. కర్మ కాని, మరొకటి ఏదీ కాని తప్పక జ్ఞానవిరోధి అని చెప్పడానికి శక్యం కాదు. యజ్ఞాదికర్మలు, గురుశాస్త్రాదిద్వైతమూ కూడ జ్ఞానానికి ఉపాయం అవడంచేత జ్ఞానవిరుద్ధాలుగా కనబడడంలేదు కదా? అట్లే - 'తేన' అనే దానిచేత ప్రకృతమైన వాక్యార్థాన్ని పరామర్శించడం న్యాయం; దానిని విడచి 'తేన' అనే దానికి' అజ్ఞానంచేత' అను అర్థాన్ని

కల్పించడం అన్యాయ్యం. అజ్ఞానం జ్ఞానాన్ని ఆవరించడం ద్వారా మోహపెడు తుంది కాని సాక్షాత్తు మోహపెట్టదు; అందువల్ల అజ్ఞానం చేత మోహపడుతున్నారు అనడం అయుక్తం (భా.అ.ప్ర.పే. 224-225) 15

మూ. జ్ఞానేన తు తదజ్ఞానం యేషాం నాశితమాత్మనః,
తేషామాదిత్యవద్ జ్ఞానం ప్రకాశయతి తత్పరమ్. 16

ప్ర.అ. జ్ఞానేనేతి :- తు = కాని, జ్ఞానేన = జ్ఞానంచేత, యేషామ్ = ఎవరియొక్క అత్మనః = ఆత్మకుసంబంధించిన, అజ్ఞానమ్ = అజ్ఞానము, నాశితమ్ = నశింపచేయ బడినదో, తేషామ్=వాళ్లకు,జ్ఞానమ్=జ్ఞానము,ఆదిత్యవత్ = సూర్యునివలె,తత్=ఆ,పరమ్ = పరతత్త్వాన్ని,ప్రకాశయతి=ప్రకాశింపచేయును.

భాష్యమ్

జ్ఞానేనేతి:- జ్ఞానేన తు,యేన అజ్ఞానేన ఆవృతాః ముహ్యన్తి జన్తవః తత్ అజ్ఞానం యేషాం జన్తూనాం వివేకజ్ఞానేన ఆత్మవిషయేణ,నాశితమ్ ఆత్మనః భవతి,తేషాం జన్తూనామ్ ఆదిత్యవత్ యథా ఆదిత్యః సమస్తం వస్తుజాతమ్ అవభాసయతి, తద్వత్,జ్ఞానం జ్ఞేయం వస్తు సర్వం ప్రకాశయతి తత్ పరం పరమార్థతత్త్వమ్. 16

బాలానందిని

జ్ఞానేనేతి:- ఏ అజ్ఞానంచేత మోహింపబడినవారై జంతువులు(మానువులు)మోహం చెందుతున్నారో ఆ అజ్ఞానము,ఏ జంతువులయొక్కఆత్మవిషయక మైన(ఆత్మను గూర్చిన) తమ వివేకజ్ఞానంచేత నశింపచేయబడినది అవుతుందో,ఆ జంతువుల జ్ఞానం,ఆదిత్యుడు వలె,ఆదిత్యుడు ఏ విధంగా సమస్తవస్తుసముదాయాన్నీ ప్రకాశింపచేస్తాడో ఆ విధంగా, జ్ఞేయమైన(తెలియదగిన)సమస్తవస్తువును,ఆ పరమార్థతత్త్వాన్ని ప్రకాశింపచేస్తుంది.

భా.అ.ప్ర.:-ఇక్కడ శ్రీ రామానుజాచార్యులు-"నశించిన అజ్ఞానం గలవారిని గూర్చి చెపుతూ "తేషామ్"అని బహువచనం ప్రయోగించడంచేత ఆత్మస్వరూపములు అనేకము లనీ,ఆదిత్యుణ్ణి దృష్టాంతంగా చూపడంచేత కాంతి కాంతికలదీ వలె,జ్ఞాత జానం అనేవి వేరుగా ఉంటాయనీ,ఆత్మకు జ్ఞానం అనే ధర్మం ఉంటూందనీ ప్రతిపాదించ బడింది"అని చేసిన ప్రతిపాదన సారరహితమైనది."తేన ముహ్యన్తి జన్తవః"అని వెనుకటి శ్లోకంలో చెప్పబడిన జంతువులే ఈ శ్లోకంలో 'తేషామ్' అని తత్పదంచేత నిర్దేశించబడుతున్నారు. జంతువు లనగా భూతాలు,ప్రాణులు,అంతే కాని ఆత్మ కాదు. ఆత్మకు జంతుత్వం అసంభవం కదా? ఆత్మ పుట్టుక లేనిది."జాయతే ఇతి జన్తుః"అను వ్యుత్పత్తిచేత పుట్టుక గలది జంతువు.

జన్తవః అన్నా కూడ లక్షణచేత ఆత్మలే వివక్షితములు అని చెప్పిన ట్లయితే అప్పుడు స్వయంప్రకాశ మైన ఆత్మకు కూడ మోహం అని గొప్ప అనిష్టం వచ్చి పడుతుంది. మోహాదులు అంతఃకరణధర్మాలు కదా?

అంతఃకరణంతో తాదాత్మ్యాభిమానంవల్ల ఆత్మకు మోహం కలుగుతుంది అన్నట్ల యితే అప్పుడు ఈ జంతువులు నిరుపాధికాత్మలు కావు,సోపాధికములే అని చెప్పిన ట్లవుతుంది. అంతఃకరణాద్యుపాధులచేత ఏర్పడిన ఆత్మబహుత్వం మాకు కూడ అంగీ కార్యమే. ఇట్లే సోపాధికజంతువు లైన ఆత్మలకు మోహం అని చెప్పి "తేషామ్"అని తచ్ఛబ్దం చేత పరామర్శించబడిన ఆ జంతువులకే,అకస్మాత్తుగా నిరుపాధికత్వం ఎలా చెప్పబడు తుంది? అజ్ఞానం నశించినవాళ్లకు ఉపాధిలేశం కూడ ఉండదు అనడం కుదరదు. అజ్ఞానం నశించినంతమాత్రాన దాని కార్యమైన అంతఃకరణాద్యుపాధులు నశించవు కదా? వాస్తవం లో ఉపాధులు లేవు గాన,ఉపాధులు అజ్ఞానంవల్లనే ఏర్పడుచున్నాయి గాన అజ్ఞానం నశించిన తరువాత ఉపాధులు నశించకుండా ఎలా ఉంటాయి అనడానికి కూడ అవకాశం లేదు. ఎందువల్ల ననగా ఈ మాట పరమార్థవిషయం కాదు. పరమార్థంలో అయితే అజ్ఞానమే లేదు;అలాంటప్పుడు జ్ఞానంచేత అజ్ఞానం నశింపచేయబడిందని ఎలా అనడం? "న నిరోధో న చోత్పత్తిర్న బద్ధో న చ సాధకః,న ముముక్షుర్న వై ముక్తః ఇత్యేషా పరమార్థతా" అని కైవల్యోపనిషత్తు చెప్పుచున్నది. అందుచేత ఉపాధిభేదాన్ని పట్టే "తేషామ్" అని బహువచనం ఉపయోగించడానికి వీలున్నప్పుడు, గౌరవంవల్ల,ప్రమాణం లేకపోవడం వల్లా కూడ ఆత్మబహుత్వకల్పనం ఉపేక్షింపదగినది.

అట్లే ఆత్మ నిర్ధర్మకమైనది. అలాంటి ఆత్మయందు జ్ఞానం అనే ధర్మాన్ని కల్పించడం యుక్తం కాదు. అంతఃకరణం క్షీణించగానే ఈ వృత్తి కనబడడంలేదు. "తస్య భాసా"(ఆత్మ యొక్క కాంతిచేత,జ్ఞానంచేత)అను శ్రుతిని అనుసరించి జ్ఞానం ఆత్మధర్మం అనడం కుదరదు;అది 'రాహువుయొక్క శిరస్సు' అన్నట్లు ఔపచారికమైన(ఆరోపితమైన)భేదాన్నే చెపుతున్నది. "ఆత్మస్వరూప మైన జ్ఞానంచేత"అని దాని అర్థం. ఆత్మకు జ్ఞానం ఉన్నట్లయితే ఆ జ్ఞానం భూమిలోపల గంధం వలె,ఆత్మలోపల ఉంది అని చెప్పవలసి వస్తుంది. ఆత్మ అన్నింటికంటె ఆంతరము; లోపల ఉండేది)అని చెప్పినదానికి అది విరుద్ధం గాన అలా చెప్పడం అనిష్టం. "య ఆత్మానమన్తరో యమయతి" అను శ్రుతి ననుసరించి సర్వాంత రుడు పరమాత్మయేకాని ఆత్మ కాదు కదా అనడానికి వీలు లేదు. "ప్రమాత యైన ఆత్మను కూటస్థమైన ఏ ఆత్మ లోపల నున్నదై నియమిస్తుందో"అని ఆ శ్రుతికి అర్థం. కూటస్థము, సాక్షీ అయిన మరొక ఆత్మ ఏదీ కనబడకపోవడంచేతా, "సాక్షీ చేతా"అను శ్రుతి పరమాత్మ యే సాక్షి అని చెప్పడంచేత కూడ ఆత్మకంటే భిన్నమైన పరమాత్మ లేదు;మరేమనగా ఆత్మయే

పరమాత్మ. "కూటస్థో౽క్షర ఉచ్యతే" "ఉత్తమః పురుషస్త్వన్యః" అని ఇక్కడనే, కూటస్థంకంటె పరమాత్మ భిన్నంగా చెప్పబడ నున్నది కదా అనడం సరి కాదు;అక్కడ కూటస్థశబ్దంచేత మాయయే వివక్షితం. ఉత్తమపురుషుడు కూటస్థుని కంటె భిన్ను డైతే అపు డతడు కూటస్థుడు కాదు అని చెప్పిన ట్లవుతుంది;అపుడు వానికి అనిత్యత్వం ఏర్పడుతుంది గాన అది అనిష్టం.

జ్ఞాత అయిన ఆత్మ జ్ఞానవంతుడే అవుతాడు గాని జ్ఞానం ఎలా అవుతుంది అనడం యుక్తం కాదు. ఆత్మ జ్ఞానస్వరూపం అని నువ్వు కూడ అంగీకరించావు కదా? నిర్విశేష (నిర్వికల్పక)జ్ఞానాన్ని తార్కికాదులు కూడ అంగీకరించారు. నిర్విశేషజ్ఞానంలో జ్ఞాతృత్వం అనే విశేషం ఎలా ఉంటుంది అను ఆక్షేపణకు తావు లేదు,జ్ఞాతృత్వం కూడ కల్పితమే; లేదా జ్ఞాతృత్వం జ్ఞానంకంటె అభిన్న మైనది. (భా. అ. ప్ర. పే. 226-227). 16

భాష్యమ్

యత్పరం పరమార్థతత్త్వం జ్ఞానప్రకాశితమ్ -

మూ. తద్బుద్ధయస్తదాత్మానస్తన్నిష్ఠాస్తత్పరాయణాః,
గచ్ఛన్త్యపునరావృత్తిం జ్ఞాననిర్ధూతకల్మషాః. 17

బాలానందిని

యదితి:- ఏ పరమార్థతత్త్వం జ్ఞానంచేత ప్రకాశింపచేయబడినదో -

ప్ర. అ. తదితి:- తద్బుద్ధయః = దానియందే బుద్ధిగలవారు, తదాత్మానః = ఆ పరబ్రహ్మయే ఆత్మగా గలవారు. తన్నిష్ఠాః = దానియందే నిష్ఠ గలవారు, తత్పరాయణాః = అదే పరమగతిగా గలవారు అయిన, జ్ఞాననిర్ధూతకల్మషాః = జ్ఞానంచేత కడిగివేయ బడిన కల్మషం గల యతులు,అపునరావృత్తిమ్ = మరల అవృత్తి లేని స్థితిని, గచ్ఛన్తి = పొందుదురు.

భాష్యమ్

తస్మిన్ గతా బుద్ధిః యేషాం తే తద్బుద్ధయః, తదాత్మానః - తదేవ పరం బ్రహ్మ ఆత్మా యేషాం తే తదాత్మానః, తన్నిష్ఠాః-నిష్ఠా అభినివేశః,తాత్పర్యమ్-సర్వాణి కర్మాణి సంన్యస్య బ్రహ్మణ్యేవ అవస్థానం యేషాం తే తన్నిష్ఠాః, తత్పరాయణాః చ-తదేవ పరమ్ అయనం పరా గతిః యేషాం భవతి తే తత్పరాయణాః, కేవలాత్మరతయః ఇత్యర్థః. యేషాం జ్ఞానేన నాశితమ్ అజ్ఞానం తే గచ్ఛన్తి,ఏవం విధాః అపునరావృత్తిమ్ అపునర్దేహసంబన్ధం, జ్ఞాననిర్ధూతకల్మషాః యథోక్తేన జ్ఞానేన నిర్ధూతః నాశితః కల్మషః పాపాదిసంసారకారణదోషః యేషాం తే జ్ఞాననిర్ధూతకల్మషాః, యతయః ఇత్యర్థః.

బాలానందిని

తస్మిన్ ఇతి:-ఆ పరమార్థమునందు(ను)పొందిన బుద్ధి గలవారు,తదాత్మానః - ఆ పరమాత్మయే ఎవరికి ఆత్మయో అట్టివారు,తన్నిష్ఠాః- నిష్ఠా అనగా అభినివేశం,పట్టుదల, తాత్పర్యం;దానియందే ఆసక్తి,సర్వకర్మలను విడచి బ్రహ్మయందే ఉండడం. అట్టి నిష్ఠ ఎవరి కున్నదో వారు తన్నిష్ఠులు, తత్పరాయణాః-అదియే పరమ మైన గతిగా కలవారు, కేవలం ఆత్మయందు మాత్రమే రతి గలవారు అని అర్థం.ఎవరియొక్క ఆత్మవిషయక అజ్ఞానం జ్ఞానంచేత నశింపచేయబడినదో వాళ్లు,ఈ విధమైనవాళ్లు అపునరావృత్తిని, మళ్లీ దేహసంబంధం లేకపోవడాన్ని,పొందుతారు.జ్ఞాననిర్ధూతకల్మషాః-పైన చెప్పిన జ్ఞానంచేత ఎవరియొక్క పాపాదికమైన సంసారానికి కారణమైన దోషమైన, కల్మషం నశింపచేయబడిందో వాళ్లు,యతులు అని అర్థం. 17

భాష్యమ్

యేషాం జ్ఞానేన నాశితమ్ ఆత్మనః అజ్ఞానం తే పణ్డితాః కథం తత్త్వం పశ్యన్తి ఇత్యుచ్యతే-

మూ. విద్యావినయసంపన్నే బ్రాహ్మణే గవి హస్తిని,
శుని చైవ శ్వపాకే చ పణ్డితాః సమదర్శినః. 18

బాలానందిని

యేషామితి:- ఎవరి ఆత్మవిషయకమైన అజ్ఞానం జ్ఞానంచేత నశింపచేయబడినదో అట్టి పండితులు తత్త్వాన్ని ఎలా చూస్తారో చెప్పబడుతున్నది-

ప్ర.అ. విద్యేతి:- విద్యావినయసంపన్నే = విద్యావినయాలతో కూడిన,బ్రాహ్మణే= బ్రాహ్మణునియందు, గవి=గోవునందు,హస్తిని = ఏనుగయందు, శుని చైవ=కుక్కయందు, శ్వపాకే చ = కుక్కను వండుకొనేవానియందు, పణ్డితాః = పండితులు, సమదర్శినః = సమమైన బ్రహ్మను చూచే స్వభావం గలవారు.

భాష్యమ్

విద్యావినయసంపన్నే-విద్యా చ వినయశ్చ విద్యావినయౌ,వినయః ఉప శమః, తాభ్యాం విద్యావినయాభ్యాం సంపన్నః విద్యావినయసంపన్నః; విద్వాన్ వినీతః చ యః బ్రాహ్మణః తస్మిన్ బ్రాహ్మణే, గవి, హస్తిని, శుని చైవ శ్వపాకే చ పణ్డితాః సమదర్శినః విద్యావినయసంపన్నే ఉత్తమసంస్కారవతి బ్రాహ్మణే సాత్త్వికే, మధ్య మాయాం చ రాజస్యాం గవి సంస్కారహీనాయామ్, అత్యన్తమేవ కేవలతామసే హస్త్యాదౌ

చ సత్త్వాదిగుణైః తజ్జైః చ సంస్కారైః,తథా రాజసైః తామసైః చ సంస్కారైః అత్యన్తమేవ అస్పృష్టం సమమ్ ఏకమ్ అవిక్రియం బ్రహ్మ ద్రష్టుమ్ యేషాం తే పణ్డితాః సమదర్శినః. 18

బాలానందిని

విద్యేతి:- విద్యావినయసంపన్నే-వినయం అనగా ఉపశమం,అహంకార-ఔద్ధత్యాలు లేకపోవడం.విద్యావినయాలతో సంపన్నుడైన,విద్వాంసుడు వినయవంతుడు అయిన బ్రాహ్మణునియందు, గోవునందు,ఏనుగయందు,శునకమునందు,శ్వపాకునియందు పండితులు సమదర్శులు.విద్యాసంపన్నుడు ఉత్తతసంస్కారం కలవాడు సాత్త్వికుడు అయిన బ్రాహ్మణునియందు,రజోగుణప్రధానమైన సంస్కారవిహీనమైన మధ్యమకక్ష్యకు చెందిన గోవునందు,అత్యంతము కేవలతమోగుణప్రధానా లైన గజాదికము లందు, పండితులు, సత్త్వాదిగుణాలచేత కాని,వాటివల్ల కలిగిన సంస్కారాలచేత గాని,రాజసములు, తామసములు అయిన సంస్కారాలచేత గాని ఏ మాత్రము స్పృశింపబడని,సమమును అనగా ఏకము, వికారరహితము అయిన బ్రహ్మను చూచే శీలం (స్వభావం)కలవారు). 18

భాష్యమ్

నను అభోజ్యాన్నాః తే దోషవన్తః - "సమాసమాభ్యాం విషమసమే పూజాతః" (గౌ.ధ.సూ. 17.20)ఇతి స్మృతేః.న తే దోషవన్తః;కథమ్?

మూ. ఇహైవ తైర్జితః సర్గో యేషాం సామ్యే స్థితం మనః,
నిర్దోషం హి సమం బ్రహ్మ తస్మాద్బ్రహ్మణి తే స్థితాః. 19

బాలానందిని

నన్వితి:- (ప్రశ్న) ఈ విధంగా బ్రాహ్మణాదులయందు సమదర్శులు "సమాసమాభ్యాం విషమసమే పూజాతః"అను స్మృతి ననుసరించి దోషవంతు లవుతారు;వాళ్ల అన్నం తినకూడదు కదా?(సమాధానం)వాళ్లు దోషవంతులు కాదు.ఎట్లనగా-

వి. పై సూత్రానికి అర్థం ఇది-కులశీలవిద్యాదులచేత తుల్యుడు సముడు; అందుకు విపరీతమైనవాడు అసముడు.సమాసముల విషయంలో పూజలో విషమత్వసమత్వాలు చూపిన ట్లయితే,సమునితో కూడ పూజించే టప్పుడు వైషమ్యం చూపినా,అసమునితో పూజించడంవిషయంలో సామ్యం చూపినా, అనగా ఇద్దరు సమపూజార్హులైన పురుషుల విషయంలో ఒకనికి ఎక్కువ గౌరవం ఇచ్చి రెండవవానికి తక్కువ గౌరవం ఇచ్చినా, ఇద్దరు విషములను యోగ్యతలో పోలిక లేనివాళ్లని, సమంగా చూచినా అలా చేసినవాడు

దోషవంతుడు;వాని అన్నం తినకూడదు అని (అక్కడ ఉన్న ప్రకరణాన్ని పట్టి)ఈ సూత్రానికి అర్థం. ఈ ధర్మశాస్త్రం ప్రకారం బ్రాహ్మణాదుల విషయంలో సమదర్శిత్వం దోషం కాదా అని ప్రశ్న.

ప్ర.అ. ఇహైవేతి:- యేషామ్ = ఎవరియొక్క,మనః=మనస్సు,సామ్యే=సామ్యమునందు,స్థితమ్ =ఉన్నదో,తైః=వాళ్లచేత,ఇహైవ=ఇహలోకంలోనే,సర్గః=సృష్టి, జితః = జయించబడినది. సమమ్ = సమ మైన,బ్రహ్మ=బ్రహ్మ, నిర్దోషం హి = దోషాలు లేనిది కదా?తస్మాత్ = అందువల్ల, తే = సమదృష్టి కలవాళ్లు, బ్రహ్మణి = బ్రహ్మయందు, స్థితాః = ఉన్నారు.

భాష్యమ్

ఇహైవ జీవద్భిః ఏవ,తైః సమదర్శిభిః పణ్డితైః,జితః వశీకృతః, సర్గః జన్మ.సామ్యే సర్వభూతేషు బ్రహ్మణి సమభావే,స్థితం నిశ్చలీభూతం,మనః అన్తఃకరణమ్.నిర్దోషమ్- యద్యపి దోషవత్సు శ్వపాకాదిషు మూఢైః తద్దోషైః దోషవత్ ఇవ విభావ్యతే,తథాపి తద్దోషైః అసంస్పృష్టమ్ ఇతి నిర్దోషం దోషవర్జితం హి యస్మాత్;నాపి స్వగుణభేదభిన్నం, నిర్గుణత్వాత్ చైతన్యస్య. వక్ష్యతి చ భగవాన్ ఇచ్ఛాదీనాం క్షేత్రధర్మత్వమ్(13.6); "అనాదిత్వాన్నిర్గుణత్వాత్"(13.31)ఇతి చ.నాపి అన్త్య విశేషాః పరమాత్మనో విభేదకాః భవన్తి,ప్రతిశరీరం తేషాం సత్త్వే ప్రమాణానుపపత్తేఃఅతః సమం బ్రహ్మ ఏకం చ.తస్మాత్ బ్రహ్మణి తే స్థితాః.తస్మాత్ న దోషగన్ధమాత్రమ్ అపి తాన్ స్పృశతి;దేహాదిసంఘాతాత్మదర్శనాభిమానాభావాత్ తేషామ్.

బాలానందిని

ఇహైవేతి:- ఇక్కడనే,జీవించి ఉండగానే,సమదర్శు లైన ఆ పండితులచేత, ఎవరి అంతఃకరణం సామ్యమునందు,సమస్తభూతములయందు సమానమైన స్థితిగల బ్రహ్మ యందు, నిశ్చలంగా ఉంటుందో ఆ పండితులచేత,జన్మ జయించబడినది.దోషాలు గల శ్వపాకాదులలో దోషాలను పట్టి బ్రహ్మ కూడ దోషాలు కలది అని మూఢులు అనుకొన్నా కూడ వాళ్ల దోషాలచేత ఇది స్పృశింపబడదు గాన ఇది దోషరహితం కదా?చైతన్యం నిర్గుణ మైనది; అందుచేత తన గుణాలను పట్టి కూడ దీనికి భేదం లేదు, ఇచ్ఛాదు లన్నీ శరీరధర్మాలే అని భగవంతుడు చెప్పనున్నాడు."అనాదిత్వాత్ నిర్గుణత్వాత్"అని కూడ చెప్పనున్నాడు.(ఈ విధంగా దోషాలూలేవు గుణాలూ లేవు గాన బ్రహ్మ సర్వత్రా సమ మైనది).ఆత్మను వేరుచేసే అంత్యవిశేషాలు కూడ లేవు.ప్రతీశరీరంలోను విశేషా లుంటా యని చెప్పడానికి తగిన ప్రమాణం లేదు-అందువల్ల బ్రహ్మ సమము,ఏకము.అందుచేత

వాళ్ళు అలాంటి బ్రహ్మయందే ఉన్నారు. దేహాదిసంఘాతమునందు ఆత్మ అనే దృష్టి అభిమానమూ కూడ వీళ్లకు లేవు;అందువల్ల దోషలేశం కూడ వాళ్లను స్పృశించదు.

వి:- నిత్యము లైన పరమాణ్వాదిపదార్థా లున్నాయి. ఈ పరమాణువు ఆ పర మాణువుకంటె వేరు అని చెప్పడానికి ఇతరకారణా లేవీ లేకపోవడంచేత ప్రతీ నిత్య పదార్థంలోను 'విశేషం'అనేది ఒకటి ఉంటుంది. దానిని పట్టి వాటికి పరస్పరభేదం చెప్పాలి. ఈ పరమాణువులో ఒక విశేషం ఉంది;ఆ పరమాణువులో మరొకటి ఉంది. ఇది దానిలో లేదు,అది దీనిలో లేదు;అందుచేత ఈ రెండు పరమాణువులూ వేరు వేరు పదార్థాలు. అన్ని నిత్యపదార్థాల విషయంలోను ఇదే పద్ధతి అని వైశేషికసిద్ధాంతం. ఆత్మలలో ఇలాంటి విశేషా లున్నాయి అందుచేత ఆత్మలు పరస్పరభిన్నములు,ఆత్మ సమం కాదు అనడం కూడ కుదరదు. ఎందుచేత ననగా ఆత్మ నిర్గుణం. ఇంక శరీరాలలో విశేషా లుంటాయి,వాటిని పట్టి ఆత్మభేదం అనడం కూడా కుదరదు. ప్రతీ శరీరంలోను విశేషం ఉందని చెప్పడానికి తగిన ప్రమాణం ఏదీ లేదు. విశేషాలను అంగీకరించిన వైశేషికులు కూడ నిత్యపదార్థాలలోనే విశేషాలను అంగీకరించారు కాని శరీరవంటి అనిత్యపదార్థాలలో అంగీకరించలేదు.

భాష్యమ్

దేహాదిసంఘాతాత్మదర్శనాభిమానవద్విషయంతు తత్సూత్రం "సమాసమాభ్యాం విషమసమే పూజాతః"ఇతి పూజావిషయత్వవిశేషణాత్. దృశ్యతే హి బ్రహ్మవిత్. షడఙ్గవిత్, చతుర్వేదవిత్ ఇతి పూజాదానాదౌ గుణవిశేషసంబన్ధః కారణమ్. బ్రహ్మ తు సర్వగుణ దోషసంబన్ధవర్జితమ్ ఇత్యతః "బ్రహ్మణి తే స్థితాః" ఇతి యుక్తమ్. కర్మివిషయం చ "సమాసమాభ్యామ్"ఇత్యాది. ఇదం తు సర్వకర్మసంన్యాసి విషయం ప్రస్తుతం"సర్వకర్మాణి మనసా"ఇత్యారభ్య ఆ అధ్యాయపరిసమాప్తేః. 19

బాలానందిని

దేహాదీతి:-పూజించడానికి సంబంధించినది అనే విశేషం ఉండడంవల్ల "సమా సమాభ్యాం విషమసమే పూజాతః"అనే సూత్ర మైతే దేహాదిసంఘాతమునందు ఆత్మను చూడడం అనే అభిమానం కలవారి విషయంలో చెప్పినది. బ్రహ్మవేత్త,షడంగవేత్త,చతుర్వేద వేత్త అని,పూజాదానాదుల విషయంలో గుణశేషసంబంధం కారణంగా ఉన్నట్లు కనబడు చున్నది కదా? బ్రహ్మ మైతే సమస్తగుణదోషాలతో సంబంధం లేనిది. అందుచేత "బ్రహ్మణి తే స్థితాః"అని చెప్పడం యుక్త మైనదే. "సమాసమాభ్యామ్"ఇత్యాదికం కర్మలకు సంబంధించి నది. "సర్వకర్మాణి మనసా"అని ప్రారంభించి అధ్యాయసమాప్తివరకు ఉన్న ప్రస్తుత మైతే సర్వకర్మ సంన్యాసులను గూర్చిచెప్పినది.

భా.అ.ప్ర.:-ఇక్కడ "ఇహైవ తైర్జితః సర్గః"అను వాక్యం జీవించి ఉండగానే జన్మాదిరూప మైన సంసారం జయించబడింది అని చెపుతూ,జీవించి ఉన్నవాళ్లకే సంసార జయరూపమైన ముక్తిని ప్రతిపాదించడంచేత జీవన్ముక్తిని స్థాపించుచున్నది."కేవల జ్ఞానా కారు లవడంచేత ఆత్మలయందు సామ్యాన్ని అనుసంధానం చేసేవారు ముక్తులే అని అభిప్రాయం"అని శ్రీరామానుజాచార్యులు,"సంసారః జితః"అనగా "వాళ్లు ముక్తిని పొంది నట్లే"అని వేదాంతదేశికులూ మొత్తంమీద జీవన్ముక్తిని అంగీకరించారు.మరొక గతి లేదు; మూలానికి మరొక అర్థాన్ని కల్పించడానికి అవకాశం లేదు.అందుచేత జీవన్ముక్తిని నిరాకరిస్తూ వీళ్లూ,ద్వైతులూ చేసే అసమీచీనమైన వాదం దీనిచేత పరాహతమైనది. అది గీతకు విరుద్ధం. తా మిక్కడ అంగీకరించినదానికి విరుద్ధం.(భా.అ.ప్ర.పే.231) 19

భాష్యమ్

యస్మాత్ నిర్దోషం సమం బ్రహ్మ ఆత్మా తస్మాత్ -

మూ. న ప్రహృష్యేత్ ప్రియం ప్రాప్య నోద్విజేత్ప్రాప్య చాప్రియమ్,
స్థిరబుద్ధిరసంమూఢో బ్రహవిద్బ్రహ్మణి స్థితః. 20

బాలానందిని

యస్మాత్ ఇతి:- ఎందువలన బ్రహ్మ దోషరహితమో,సమమో,అదియే ఆత్మయో అందువలన-

ప్ర.అ.నేతి:- స్థిరబుద్ధిః=స్థిర మైన బుద్ధి కలవాడు,అసంమూఢః = మూఢుడు కానివాడు, బ్రహ్మణి=బ్రహ్మయందు,స్థితః=ఉన్నవాడూ అయిన,బ్రహ్మవిత్=బ్రహ్మవేత్త. ప్రియమ్ = ప్రియమును, ప్రాప్య=పొంది,న ప్రహృష్యేత్ = సంతోషించడు, అప్రియమ్= అప్రియమును, ప్రాప్య చ= పొందినా కూడ,న ఉద్విజేత్ = దుఃఖించడు. (సంభావనార్థకలిఙ్గా గ్రహించి అర్థం వ్రాయబడినది.బ్రహ్మవిత్ అని అంటూ సంతోషించకూడదు ఇత్యాదివిధంగా విధ్యర్థం చెప్పడం అంత యుక్తంగా ఉండదు).

భాష్యమ్

న ప్రహృష్యేత్ న ప్రహర్షం కుర్యాత్,ప్రియమ్ ఇష్టం,ప్రాప్య లబ్ధ్వా న ఉద్విజేత్ ప్రాప్య ఏవ చ,అప్రియమ్ అనిష్టం లబ్ధ్వా;దేహమాత్రాత్మదర్శినాం హి ప్రియాప్రియప్రాప్తీ, హర్షవిషాదస్థానే,న కేవలాత్మదర్శినః;తస్య ప్రియాప్రియప్రాప్త్యసంభవాత్.కిం చ సర్వ భూతేషు ఏకః సమః నిర్దోషః ఆత్మా ఇతి స్థిరా నిర్విచికిత్సా బుద్ధిః యస్య సః స్థిరబుద్ధిః అసంమూఢః సంమోహవర్జితః చ స్యాత్ యథోక్తబ్రహ్మవిత్,బ్రహ్మణి స్థితః అకర్మకృత్, సర్వకర్మసంన్యాసీ ఇత్యర్థః. 20

బాలానందిని

నేతి:- ఇష్టమైనదానిని పొంది సంతోషించడు. అనిష్టమైనదానిని పొంది కూడ ఉద్వేగం చెందడు. ప్రియాప్రియములు పొందడం దేహమే ఆత్మ అనుకొనేవాళ్లకు హర్ష విషాదహేతువు అవుతుంది కాని కేవలాత్మను చూచేవానికి కాదు. వానికి ప్రియాప్రియప్రాప్తియే ఉండదు. (ఇతరుల దృష్ట్యా వాటిని ప్రియాప్రియము లంటున్నాం కాని కేవలాత్మ దర్శికి ప్రియం అంటూ అప్రియం అంటూ ఉండదని భావం). మరియు సర్వభూతాలలోనూ కూడ సమము, నిర్దోషము అయిన ఒకే ఆత్మ ఉన్న దనే స్థిర మైన, సంశయం లేని, బుద్ధి కలవాడు స్థిరబుద్ధి, అలా స్థిరబుద్ధిగాను, సంమోహం లేనివాడుగాను ఉంటాడు. (స్యాత్, అధ్యాహారం తెచ్చుకొని అర్థం చెప్పబడింది). పైన చెప్పిన బ్రహ్మవేత్త, బ్రహ్మయందు ఉన్నవాడు, కర్మ చేయనివాడు, సర్వకర్మసంన్యాసి అయినవాడు (ఇలా ఉంటాడు) అని అర్థం.

వి:-భాష్యాన్ని పరిశీలించగా-"బ్రహ్మవేత్త ప్రియాప్రియాలను హర్షోద్వేగాలను పొందడు. స్థిరబుద్ధియై, అసంమూఢుడై బ్రహ్మయం దుంటాడు" అను అర్థం యుక్త మని తోస్తుంది. 20

భాష్యమ్

కిం చ బ్రహ్మణి స్థితః -

మూ. బాహ్యస్పర్శేష్వసక్తాత్మా విన్దత్యాత్మని యత్సుఖమ్,
స బ్రహ్మయోగయుక్తాత్మా సుఖమక్షయమశ్నుతే. 21

బాలానందిని

కిం చేతి:- మరియు బ్రహ్మయం దున్నవాడు -

ప్ర.అ. బాహ్యేతి:- బాహ్యస్పర్శేషు = బాహ్యములైన శబ్దాదులయందు, అసక్తాత్మా = లగ్నం కాని మనస్సు కలవాడు, ఆత్మని=ఆత్మయందు, యత్=ఏ, సుఖమ్ = సుఖం ఉంటుందో, దానిని, విన్దతి = పొందును. బ్రహ్మయోగయుక్తాత్మా = బ్రహ్మయందు సమాధి చేత సమాహితమైన చిత్తం కల, సః=అతడు, అక్షయమ్ = క్షయం లేని, సుఖమ్ = సుఖమును అశ్నుతే = పొందును.

భాష్యమ్

బాహ్యస్పర్శేషు-బాహ్యాశ్చ తే స్పర్శాః చ బాహ్యస్పర్శాః. స్పృశన్తే ఇతి స్పర్శాః శబ్దాదయః విషయాః, తేషు బాహ్యస్పర్శేషు అసక్తః ఆత్మా అన్తఃకరణం యస్య సః అయమ్ అసక్తాత్మా, విషయేషు ప్రీతివర్జితః సన్, విన్దతి లభతే ఆత్మని యత్ సుఖం

తత్ విన్దతి ఇత్యేతత్. సః బ్రహ్మయోగయుక్తాత్మా-బ్రహ్మణి యోగః సమాధిః బ్రహ్మ యోగః, తేన బ్రహ్మయోగేన యుక్తః సమాహితః,తస్మిన్ వ్యాపృతః,ఆత్మా, అన్తఃకరణం యస్య సః బ్రహ్మయోగయుక్తాత్మా.సుఖమ్ అక్షయమ్ అశ్నుతే వ్యాప్నోతి.తస్మాత్ బాహ్యవిషయప్రీతేః క్షణికాయాః ఇన్ద్రియాణి నివర్తయేత్ ఆత్మని అక్షయసుఖార్థీ ఇత్యర్థః. 21

బాలానందిని

బాహ్యేతి:- బాహ్యస్పర్శేషు-స్పర్శ లనగా స్పృశింపబడే శబ్దాదివిషయాలు, బాహ్య ములైన ఆ విషయాలయందు సక్తం కాని అంతఃకరణం కలవాడు,విషయాలయందు ప్రీతి లేనివాడు అయి ఆత్మయందు ఏ సుఖ మున్నదో దానిని పొందుతాడు. అ,బ్రహ్మయోగ యుక్తాత్మ-బ్రహ్మయోగం అనగా బ్రహ్మయందు సమాధి,చిత్తాన్ని స్థిరంగా నిలపడం;అదే యోగం;ఆ బ్రహ్మయోగంతో యుక్తుడై, సమాహితమైన,అనగా దానియందు నిరంతర ప్రవృత్తి చేస్తూన్న,ఆత్మ,అనగా అంతఃకరణం కలవాడు బ్రహ్మయోగయుక్తాత్మ.అతడు అక్షయమైన సుఖం పొందుతాడు.భాష్యకారులు శిష్యశిక్షకోసం అంటున్నారు(ఆనందగిరి). **తస్మాదితి:**-అందువల్ల ఆత్మలో ఉన్న అక్షయసుఖం కోరేవాడు క్షణిక మైన బాహ్యవిషయ ప్రీతినుండి ఇంద్రియాలను మరల్చుకోవాలి. 21

భాష్యమ్

ఇతశ్చ నివర్తయేత్ -

మూ. యే హి సంస్పర్శజా భోగా దుఃఖయోనయ ఏవ తే,
ఆద్యన్తవన్తః కౌన్తేయ న తేషు రమతే బుధః. 22

బాలానందిని

ఇతశ్చేతి:- ఈ కారణంవల్ల కూడ ఇంద్రియాలను మరల్చుకోవాలి-

ప్ర.అ. యే హీతి:- కౌన్తేయ=అర్జునా!సంస్పర్శజాః=విషయేంద్రియాల సంపర్కం వల్ల కలిగిన,యే=ఏ,భోగాః=భోగము లున్నవో,తే=అవి,దుఃఖయోనయః ఏవ=దుఃఖానికి కారణ మైనవే.ఆద్యన్తవన్తః=ఆది,అంతము కలవి. బుధః=పండితుడు,తేషు=వాటియందు, న రమతే=క్రీడించడు,ఆనందిచడు.

భాష్యమ్

యే,హి యస్మాత్,సంస్పర్శజాః విషయేన్ద్రియసంస్పర్శేభ్యః జాతాః భోగాః భుక్తయః, దుఃఖయోనయః ఏవ తే,అవిద్యాకృతత్వాత్.దృశ్యన్తే హి ఆధ్యాత్మికాదీని

దుఃఖాని తన్నిమిత్తాన్యేవ యథా ఇహ లోకే తథా పరలోకేఽపి ఇతి గమ్యతే. ఏవశబ్దాత్ న సంసారే సుఖస్య గన్ధమాత్రమ్ అపి అస్తి ఇతి బుద్ధ్వా విషయమృగతృష్ణికాయాః ఇన్ద్రియాణి నివర్తయేత్.న కేవలం దుఃఖయోనయః ఆద్యన్తవన్తః చ,ఆదిః విషయేన్ద్రియసంయోగః భోగానామ్ అన్తశ్చ తద్వియోగః ఏవ,అతః ఆద్యన్తవన్తః అనిత్యాః మధ్యక్షణభావిత్వాత్ ఇత్యర్థః.కౌన్తేయ న తేషు భోగేషు రమతే బుధః,భోగేషు,వివేకీ అవగతపరమార్థతత్త్వః.అత్యన్తమూఢానామేవ హి విషయేషు రతిః దృశ్యతే యథా పశుప్రభృతీనామ్. 22

బాలానందిని

యే ఇతి:- ఎందువలన అనగా-విషయేంద్రియసంబంధాలవలన కలిగే ఏ భోగాలున్నాయో అవి అవిద్యచేత కల్పింపబడిన వవడంవల్ల దుఃఖములకు కారణములే. ఆధ్యాత్మికాదిదుఃఖాలు విషయేంద్రియసంస్పర్శవల్లనే కలుగుతాయి కదా? ఈ లోకంలో ఎట్లో పరలోకంలో కూడ అట్లే అని ఏవశబ్దంవల్ల తెలుస్తూన్నది.సంసారంలో సుఖంయొక్క గంధం కూడ లేదని తెలుసుకొని విషయా లనే ఎండమావులనుండి ఇంద్రియాలను నివర్తింప చెయ్యాలి.అవి దుఃఖయోనులే కాదు ఆద్యంతాలు కలవి కూడ.భోగాల ఆది విషయేంద్రియసంయోగం.విషయేంద్రియవియోగం భోగాల అంతం.ఆద్యతాలు కల వవడంచేత అనిత్యమైనవి.అవి ఉండేది మధ్యక్షణంలోనే కదా?అర్జునా!బుధుడు,పరమార్థతత్త్వం తెలిసిన వివేకవంతుడు వాటియందు రమించడు.పశువులు మొదలైనవాటికి వలె అత్యంతమూఢులకే విషయాలయందు రతి కనుబడుచున్నది కదా? 22

భాష్యమ్

అయం చ శ్రేయోమార్గప్రతిపక్షీ కష్టతమః దోషః సర్వానర్థప్రాప్తిహేతుః దుర్నివారశ్చ ఇతి తత్పరిహారే యత్నాధిక్యం కర్తవ్యమ్ ఇత్యాహ భగవాన్-

మూ. శక్నోతీహైవ యః సోఢుం ప్రాక్ శరీరవిమోక్షణాత్,
కామక్రోధోద్భవం వేగం స యుక్తః స సుఖీ నరః. 23

బాలానందిని

అయమితి:- ఇది కూడ(చెప్పబోయేది కూడ)శ్రేయోమార్గానికి ప్రతిబంధకము,చాలా కష్టమూ అయిన దోషం.సకల అనర్థాల ప్రాప్తికి హేతువు.నివారించదానికి చాలా కష్టమైనది.దీనిని పరిహరించడం కోసం ఎక్కువ ప్రయత్నం చెయ్యాలి అని భగవంతుడు అంటున్నాడు-

ప్ర.అ. శక్నోతీతి:-యః = ఎవడు, ఇహైవ=ఇక్కడనే,శరీరవిమోక్షణాత్ ప్రాక్ = శరీరం విడవడానికి ముందు, కామక్రోధోద్భవమ్ = కామక్రోధాలవల్ల కలిగిన, వేగమ్ = వేగాన్ని, సోఢుమ్ = సహించడానికి, శక్తః = సమర్థుడో, సః నరః=ఆ నరుడు, యుక్తః =యోగం కలవాడు;సః=అతడే,సుఖీ=సుఖవంతుడు.

భాష్యమ్

శక్నోతి ఉత్సహతే,ఇహైవ జీవన్నేవ,సోఢుమ్ ప్రసహితుమ్.ప్రాక్ పూర్వమ్,శరీర విమోక్షణాత్,ఆ మరణాత్.మరణసీమాకరణం జీవతః అవశ్యంభావీ హి క్రామక్రోధో ద్భవః వేగః, అనన్తనిమిత్తవాన్ హి సః ఇతి.యావత్ మరణం తావత్ న విశ్రమ్భణీయః ఇత్యర్థః.కామః-ఇన్ద్రియగోచరప్రాప్తే ఇష్టే విషయే శ్రూయమాణే స్మర్యమాణే వా అనుభూతే సుఖహేతౌ యా గర్ధిః తృష్ణా సః కామః.క్రోధశ్చ-ఆత్మనః ప్రతికూలేషు దుఃఖహేతుషు దృశ్యమానేషు శ్రూయమాణేషు స్మర్యమాణేషు వా ద్వేషః సః క్రోధః; తౌ కామక్రోధౌ ఉద్భవః యస్య వేగస్య సః కామక్రోధోద్భవః వేగః,రోమాఞ్చనప్రహృష్ట నేత్రవదనాదిలిఙ్గః,అన్తఃకరణప్రక్షోభరూపః కామోద్భవః వేగః; గాత్రకమ్పప్రస్వేద సందష్టౌష్ఠ పుటరక్తనేత్రాదిలిఙ్గః క్రోదోద్భవః వేగః, తం కామక్రోధోద్భవం వేగం యః ఉత్సహతే ప్రసహతే సోఢుం ప్రసహితుం సః యుక్తః యోగీ సుఖీ చ ఇహ లోకే నరః. 23

బాలానందిని

శక్నోతీతి:- ఇక్కడనే,అనగా జీవించి ఉండగానే, ఎవడు శరీరం విడవడానికి పూర్వంవరకు,మరణంవరకు,సహించడానికి సమర్థుడో-జీవించి ఉన్నవానికి కామక్రోధాల వల్ల కలిగే వేగం తప్పక ఉంటుంది;ఎందువల్ల ననగా దానికి అనేకకారణాలు ఉంటాయి; అందుచేత మరణం హద్దుగా చెప్పబడింది; మరణించేవరకూ కూడ దీనిని నమ్మకూడదు అని అర్థం.(ఈ రెండూ ఎప్పుడైనా కలగవచ్చును)కామం అనగా- పూర్వం ఒక మాటు అనుభవించిన, సుఖహేతువైన ఒక ఇష్టమైన విషయం ఇంద్రియగోచరమైనా, వినబడినా, స్మరించబడినా దానియందు గర్ధి,అత్యాసక్తి 'కామం'. క్రోధ మనగా-తనకు ప్రతికూలము లైన దుఃఖహేతువు లైన వస్తువులు కనబడినవా వినబడినా స్మరింపబడినా వాటి విషయంలో ఏ ద్వేషం ఉంటుందో అది క్రోధం. ఆ కామక్రోధాలు ఏ వేగానికి ఉత్పత్తికారణములో అది కామక్రోధోద్భవ మైన వేగం.కామంవల్ల కలిగే వేగం ఒక విధమైన అంతఃకరణ ప్రక్షోభం.దానికి ఒడలు గగుర్పాటుచెందడం నేత్రాలు ముఖమూ వికసించడం మొదలైనవి గుర్తులు.శరీరం వణకడం,బాగా చెమట పట్టడం,పెదవి కరవడం,కళ్ళు ఎఱ్ఱబడడం మొదలైనది క్రోధంవల్ల కలిగే వేగానికి లింగం.కామక్రోదోద్భవ మైన ఆ వేగాన్ని సహించ

డానికి,నిలుపుకొనడానికి,ఎవడు సమర్థుడో అట్టి నరుడే ఈ లోకంలో యోగి,అతడే సుఖవంతుడు. 23

భాష్యమ్

కథంభూతశ్చ బ్రహ్మణి స్థితః బ్రహ్మ ప్రాప్నోతి ఇత్యాహ -

మూ. యోఽన్తఃసుఖోఽన్తరారామస్తథాన్తర్జ్యోతిరేవ యః,
స యోగీ బ్రహ్మనిర్వాణం బ్రహ్మభూతోఽధిగచ్ఛతి. 24

బాలానందిని

కథమితి:- ఇంకా ఎలాంటివాడైన బ్రహ్మనిష్ఠుడు బ్రహ్మను పొందుతాడో చెప్పుతున్నాడు -

ప్ర.అ.యః ఇతి:- యః = ఎవడు, అన్తఃసుఖః=ఆత్మయందు సుఖం కలవాడో, అన్తరారామః=ఆత్మయందే రమిస్తూంటాడో,యః=ఎవడు,అన్తర్జ్యోతిః ఏవ = ఆత్మయే జ్యోతిస్సుగా కలవాడో,సః=అట్టి,యోగీ=యోగి,బ్రహ్మభూతః=బ్రహ్మగా అయినవాడై, బ్రహ్మనిర్వాణమ్=బ్రహ్మయందు సుఖమును(బ్రహ్మరూప మైన మోక్షమును), అధిగచ్ఛతి=పొందును.

భాష్యమ్

యః అన్తఃసుఖః అన్తః ఆత్మని సుఖం యస్య సః అన్తః సుఖః,తథా అన్తః ఏవ ఆత్మని ఆరామః క్రీడా యస్య సః అన్తరారామః,తథా అన్తః ఆత్మైవ జ్యోతిః ప్రకాశః యస్య సః అన్తర్జ్యోతిః ఏవ,యః ఈదృశః సః యోగీ బ్రహ్మనిర్వాణం బ్రహ్మనిర్వృతిం మోక్షమ్ ఇహ జీవన్నేవ,బ్రహ్మభూతః సన్,అధిగచ్ఛతి ప్రాప్నోతి. 24

బాలానందిని

యః ఇతి:- ఎవడు అంతః=ఆత్మయందు,సుఖం కలవాడో,ఎవడు ఆత్మయందే ఆక్రీడ,విహారం,కలవాడో,అట్లే ఆత్మయే జ్యోతిస్సుగా,ప్రకాశగా, కలవాడో,ఎవడు ఇలాంటివాడో ఆ యోగి,బ్రహ్మయందు సుఖాన్ని,మోక్షాన్ని బ్రహ్మభూతుడై,ఇక్కడనే,ఈ శరీరంలోనే, పొందుతాడు. 24

భాష్యమ్

కించ-

మూ. లభన్తే బ్రహ్మనిర్వాణమృషయః క్షీణకల్మషాః,
ఛిన్నద్వైధా యతాత్మానః సర్వభూతహితే రతాః. 25

బాలానందిని

కిం చేతి:- మరియు -

ప్ర.అ. **లభన్త ఇతి**:- క్షీణకల్మషాః = క్షీణించిన పాపాలు గలవారు(పాపాలు క్షీణించినవారు),ఛిన్నద్వైధాః=ఛేదించబడిన సంశయం కలవారు,యతాత్మానః=నిగ్రహించుకొనబడిన ఇంద్రియాలు గలవారు,సర్వభూతహితే=సమస్తభూతాల హితమునందు, రతాః =ఆసక్తులు అయిన,ఋషయః=ఋషులు,బ్రహ్మనిర్వాణమ్=బ్రహ్మయందు ఆనందాన్ని, లభన్తే = పొందుతారు.

భాష్యమ్

లభన్తే బ్రహ్మనిర్వాణం మోక్షమ్,ఋషయః సమ్యగ్దర్శినః సంన్యాసినః,క్షీణకల్మషాః క్షీణపాపాదిదోషాః,ఛిన్నద్వైధాః ఛిన్నసంశయాః,యతాత్మానః సంయతేన్ద్రియాః సర్వభూతహితే రతాః సర్వేషాం భూతానాం హితే ఆనుకూల్యే రతాః అహింసకాః ఇత్యర్థః. 25

బాలానందిని

లభన్తే ఇతి:-బ్రహ్మనిర్వాణమ్-మోక్షమును,సమ్యగ్దర్శులైన సంన్యాసులు క్షీణించిన పాపాదిదోషాలు కలవారు,ఛేదించబడిన సంశయములు కలవారు,యతాత్ములు నిగ్రహించబడిన ఇంద్రియాలు కలవారు,సమస్తభూతముల,ప్రాణుల,హితమునందు,అనుకూలత్వమునందు ఆసక్తులు,హింస చేయనివారు అని అర్థం. 26

భాష్యమ్

కిం చ-

మూ. కామక్రోధవియుక్తానాం యతీనాం యతచేతసామ్,
అభితో బ్రహ్మనిర్వాణం వర్తతే విదితాత్మనామ్. 26

బాలానందిని

కించేతి:- మరియు -

ప్ర.అ. **కామేతి**:- కామక్రోధవియుక్తానామ్=కామక్రోధశూన్యులు,యతచేతసామ్ =నిగ్రహించబడిన మనస్సు కలవారు,విదితాత్మనామ్=తెలియబడిన ఆత్మ గలవారు అయిన,యతీనామ్=సంన్యాసులకు,అభితః=అంతటా,జీవించి ఉన్నప్పుడు మరణానంతరమూ కూడ,బ్రహ్మనిర్వాణమ్=మోక్షము,వర్తతే=ఉండును.

భాష్యమ్

కామక్రోధవియుక్తానాం-కామశ్చ క్రోధశ్చ కామక్రోధౌ,తాభ్యాం వియుక్తానాం, యతీనాం సంన్యాసినాం,యతచేతసాం సంయతాన్తఃకరణానామ్,అభితః ఉభయతః, జీవతాం మృతానాం చ బ్రహ్మనిర్వాణం మోక్షః,వర్తతే విదితాత్మనాం విదితః జ్ఞాతః ఆత్మా యేషాం తే విదితాత్మానః తేషాం విదితాత్మనాం సమ్యగర్శినామ్ ఇత్యర్థః. 26

బాలానందిని

కామేతి:- కామక్రోధాలచేత విడవబడినవారు, సంన్యాసులు,వశంలో ఉంచుకొనబడిన అంతఃకరణం కలవారు(అంతఃకరణాన్ని వశంలో ఉంచుకొన్నవారు)అయిన ఆత్మను తెలిసికొన్నవాళ్లకు,సమ్యగ్దర్శులకు అని అర్థం,వాళ్లు జీవించి ఉన్నప్పుడు మరణించిన తరువాత కూడ,మోక్షం ఉంటుంది(లభిస్తుంది). 26

భాష్యమ్

సమ్యగ్దర్శననిష్ఠానాం సంన్యాసినాం సద్యోముక్తిః ఉక్తా,కర్మయోగశ్చ ఈశ్వరార్పిత సర్వభావేన ఈశ్వరే బ్రహ్మణి ఆధాయ క్రియమాణః సత్త్వశుద్ధిజ్ఞానప్రాప్తి సర్వకర్మసంన్యాసక్రమేణ మోక్షాయ ఇతి భగవాన్ పదే పదే అబ్రవీత్,వక్ష్యతి చ. అథ ఇదానీం ధ్యానయోగం సమ్యగ్దర్శనస్యాన్తరఙ్గం విస్తరేణ వక్ష్యామీతి తస్య సూత్రస్థానీయాన్ శ్లోకాన్ ఉపదిశతి స్మ -

మూ. స్పర్శాన్ కృత్వా బహిర్బాహ్యాంశ్చక్షుశ్చైవాన్తరే భ్రువోః,
ప్రాణాపానౌ సమౌ కృత్వా నాసాభ్యన్తరచారిణౌ. 27

యతేన్ద్రియమనోబుద్ధిర్మునిర్మోక్షపరాయణః,
విగతేచ్ఛాభయక్రోధో యః సదా ముక్త ఏవ సః. 28

బాలానందిని

సమ్యగితి:- సమ్యగ్దనమునందు నిష్ఠ గల సంన్యాసులకు వెంటనే ముక్తి కలుగుతుందని చెప్పబడింది.పూర్తిగా ఈశ్వరార్పణబుద్ధితో,ఈశ్వరునియందు,బ్రహ్మయందు, ఉంచి చేయబడే కర్మయోగం అంతఃకరణశుద్ధి,జ్ఞానప్రాప్తి,సర్వకర్మసంన్యాసము అనే క్రమంచేత మోక్షానికి ఉపయోగిస్తుంది అని కూడ భగవంతుడు అడుగడుగునా చెప్పి ఉన్నాడు, చెప్పబోతున్నాడు.ఇంక ఇప్పుడు-సమ్యగ్దర్శనానికి అంతరంగ మైన ధ్యానయోగాన్ని గూర్చి విస్తారంగా(ముమ్ముందు)చెప్పబోతాను అనే అభిప్రాయంతో దానికి సూత్రం వంటి శ్లోకాలను ఉపదేశించాడు-

ప్ర.అ. స్పర్శానితి:- యః=ఏ, మునిః=ముని,బాహ్యాన్=బాహ్యములైన,స్పర్శాన్=శబ్దాదులను,బహిః=వెలుపలనే,కృత్వా = ఉంచి,చక్షుః చ=నేత్రమును,భ్రువోః=కనుబొమ్మల యొక్క అన్తరే ఏవ=మధ్యయందే ఉంచి,నాసాభ్యన్తరచారిణౌ=నాసికలోపల సంచరిస్తూన్న, ప్రాణాపానౌ=ప్రాణపానాలను,సమౌ=సమానమైనవాటినిగా,హెచ్చుతగ్గులు లేనివాటినిగా, కృత్వా=చేసి,యతేన్ద్రియమనోబుద్ధిః=వంశంలో ఉంచుకొనబడిన ఇంద్రియాలు,మనస్సు, బుద్ధి కలవాడై,విగతేచ్ఛాభయక్రోధః=ఇచ్ఛ,భయము,క్రోధము లేనివాడై,మోక్షపరాయణః =మోక్షమే ప్రధానలక్ష్యంగా కలవాడై ఉంటాడో,సః=అతడు,సదా=ఎల్లప్పుడు,ముక్తః ఏవ = ముక్తుడే.

భాష్యమ్

స్పర్శాన్ శబ్దాదీన్,కృత్వా బహిః,బాహ్యాన్ శ్రోతాదిద్వారేణ అన్తః బుద్ధౌ ప్రవేశితాః శబ్దాదయః విషయాః తాన్ అచిన్తయతః బాహ్యాః బహిః ఏవ కృతాః భవన్తి.తాన్ ఏవం బహిః కృత్వా చక్షుః చైవ అన్తరే భ్రువోః,కృత్వా ఇతి అనుషజ్యతే.తథా ప్రాణాపానౌ నాసాభ్యన్తరచారిణౌ సమౌ కృత్వా. 27

యతేన్ద్రియ ఇతి:-యతేన్ద్రియమనోబుద్ధిః-యతాని సంయతాని ఇన్ద్రియాణి మనః బుద్ధిశ్చ యస్య సః యతేన్ద్రియమనోబుద్ధిః,మననాత్ మునిః,సంన్యాసీ,మోక్ష పరాయణః ఏవ పరమ్ అయనం యస్య సః అయం మోక్షపరాయణః మునిః భవేత్. విగతేచ్ఛాభయక్రోధః-ఇచ్ఛా చ భయం చ క్రోధశ్చ ఇచ్ఛాభయక్రోధాః, తే విగతాః యస్మాత్ సః విగతేచ్ఛాభయక్రోధః. యః, ఏవం వర్తతే సదా సంన్యాసీ ముక్తః ఏవ సః, న తస్య మోక్షాయ అన్యః కర్తవ్యః అస్తి. 28

బాలానందిని

స్పర్శానితి:-బాహ్యములైన స్పర్శలను,అనగా శబ్దాదులను వెలుపలనేచేసి(ఉంచి). శ్రోత్రాదుల ద్వారా బుద్ధిలో ప్రవేశపెట్టబడిన శబ్దాదివిషయాలు వాటిని గూర్చి ఆలోచించని వానికి బాహ్యములుగానే,వెలుపలనే ఉంచబడినవి అవుతాయి; వాటిని ఈ విధంగా వెలుపల ఉంచి, దృష్టిని కనుబొమ్మల మధ్య,కృత్వా అనునది అన్వయిస్తుంది.చేసి, అట్లే నాసికలో తిరుగుతూన్న ప్రాణాపానాలను సమములనుగా చేసి 27

యతేన్ద్రియేతి:-యతేన్ద్రియమనోబుద్ధిః-ఎవని ఇంద్రియాలు మనస్సు బుద్ధి నియమించబడ్డాయో అతడు యతేంద్రియమనోబుద్ధి,అట్టిముని, మననం చేసేవాడు గాన ముని, ఈ విధంగా దేహంలో ఉంటూ మోక్షమే పర మైన గతి కలవాడు అయి ఉంటాడు. ఎవనినుండి ఇచ్ఛ(కోరికలు),భయం,క్రోధం తొలగిపోయినవో అతడు విగతేచ్ఛా

భయక్రోధుడు. ఏ సంన్యాసి ఈ విధంగా ఎల్లప్పుడూ ఉంటాడో అతడు(ఎల్లప్పుడూ)ముక్తుడే. మోక్షంకోసం అతడు చేయవలసిన మరొకటి ఏదీ లేదు. 28

భాష్యమ్

ఏవం సమాహితచిత్తేన కిం విజ్ఞేయమ్ ఇత్యుచ్యతే-

మూ. భోక్తారం యజ్ఞతపసాం సర్వలోకమహేశ్వరమ్,
సుహృదం సర్వభూతానాం జ్ఞాత్వా మాం శాన్తిమృచ్ఛతి. 29

ఇతి శ్రీ మహాభారతే శతసాహస్ర్యాం సంహితాయాం వైయాసిక్యాం భీష్మ పర్వణి శ్రీమద్భగవద్గీతాసు ఉపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే సంన్యాసయోగో నామ పఞ్చమోఽధ్యాయః

బాలానందిని

ఏవమితి:-ఈ విధంగా సమాహిత మైన (ఏకాగ్ర మైన)చిత్తం కలవానిచేత ఏమి తెలియదగినదో చెప్పుచున్నాడు-

ప్ర.అ. భోక్తారమితి:- యజ్ఞతపసామ్=యజ్ఞాలకు తపస్సులకు,భోక్తారమ్= అనుభవించేవాడను,సర్వలోకమహేశ్వరమ్=సమస్తలోకాలకు మహేశ్వరుడను,సర్వభూతానామ్ = సమస్తభూతాలకు,సుహృదమ్=మిత్రుడను అయిన,మామ్=నన్ను,జ్ఞాత్వా=తెలిసికొని, శాన్తిమ్=శాంతిని,ఋచ్ఛతి=పొందును.

భాష్యమ్

భోక్తారం యజ్ఞానాం తపసాం చ కర్తృరూపేణ దేవతారూపేణ చ,సర్వలోకమహేశ్వరం సర్వేషాం లోకానాం మహేశ్వరం సర్వలోకమహేశ్వరం,సుహృదం,సర్వభూతానాం సర్వప్రాణినాం,ప్రత్యుపకారనిరపేక్షతయా ఉపకారిణం సర్వభూతానాం హృదయేశయం,సర్వకర్మఫలాధ్యక్షం,సర్వప్రత్యయసాక్షిణం మాం నారాయణం జ్ఞాత్వా శాన్తిం సర్వసంసారోపరతిమ్ ఋచ్ఛతి ప్రాప్నోతి. 29

ఇతి శ్రీమత్పరమహంసపరివ్రాజకాచార్యగోవిన్దభగవత్పూజ్యపాద శిష్య శ్రీమచ్ఛఙ్కరభగవతః కృతౌ శ్రీభగవద్గీతాభాష్యే ప్రకృతిగర్భో నామ పఞ్చమోఽధ్యాయః

బాలానందిని

భోక్తారమితి:- కర్తృరూపంలోను దేవతారూపములోను కూడ యజ్ఞాలకూ తపస్సు లకూ భోక్తను(యజ్ఞతపఃఫలాలను అనుభవించేవాడను), సమస్తలోకాలకు గొప్ప ఈశ్వరుడను, సమస్తప్రాణులకు ప్రత్యుపకారాపేక్ష లేకుండా ఉపకారం చేసే స్నేహితుడను, సమస్తభూతాల హృదయాలలో ఉన్నవాడను,సమస్తకర్మల ఫలాల అధ్యక్షుడను,సమస్తజ్ఞానాలకు సాక్షినీ అయిన,నారాయణుడైన నన్ను తెలుసుకొని,శాంతిని,సర్వసంసారముల ఉపరతిని, వినాశమును (మోక్షమును) పొందును.

భా.అ.ప్ర.:-"నన్ను తెలిసికొని,కర్మయోగం అనగా నా ఆరాధనయే గాన దాని యందు సుఖంగా ప్రవర్తిస్తాడు అని అర్థం" అని ఇక్కడ శ్రీరామానుజాచార్యులు చెప్పినది అయుక్తం."మాం జ్ఞాత్వా శాన్తిమృచ్ఛతి"అని మూలంలో జ్ఞానానికి శాంతిప్రాప్తికీ మధ్య మరొక క్రియ ఉన్నదని చెప్పబడలేదు కదా?అలాంటి క్రియను కల్పించడం అప్రామాణికం. **"తమేవ విదిత్వాఽతిమృత్యుమేతి"**అను శ్రుతికి విరుద్ధం కూడ. **"సర్వకర్మాణి మనసా"** అని ప్రారంభించి సంన్యాసమే ప్రస్తుత మైనది కాని కర్మయోగం ప్రస్తుతం కాదు.'స్పర్శాన్' ఇత్యాదికంచేత ధ్యానయోగమే చెప్పబడింది కాన ఇక్కడ కర్మయోగానికి అవకాశమే లేదు. కర్మయోగానికి ఫల మైన చిత్తశుద్ధిచేత పొందదగిన జ్ఞానం లభించిన తరువాత మళ్లీ కర్మయోగాన్ని ఆచరించవలసిన ప్రసక్తి కూడ లేదు.(భా.అ.ప్ర.పే.240) 29

"బాలానందిని"అను శ్రీమద్భగవద్గీతాశాంకరభాష్యాంధ్రవ్యాఖ్యానంలో
పంచమాధ్యాయం సమాప్తం.

అథ షష్ఠోఽధ్యాయః

భాష్యమ్

అతీతానన్తరాధ్యాయాన్తే ధ్యానయోగస్య సమ్యగ్దర్శనం ప్రతి అన్తరఙ్గస్య సూత్ర భూతాః శ్లోకాః "స్పర్శాన్ కృత్వా బహిః"(5.27.29)ఇత్యాదయః ఉపదిష్టాః. తేషాం వృత్తిస్థానీయః అయం షష్ఠాధ్యాయః ఆరభ్యతే.తత్ర ధ్యానయోగస్య బహిరఙ్గం కర్మ ఇతి యావత్ ధ్యానయోగారోహణాసమర్థః తావత్ గృహస్థేన సమర్థేన కర్తవ్యం కర్మ ఇత్యతః తత్ స్తౌతి-అనాశ్రితః ఇతి.

బాలానందిని

అతీతేతి:- ఇప్పుడే గడచిన అధ్యాయం చివర సమ్యగ్దర్శనానికి అంతరంగ మైన ధ్యానయోగానికి సూత్రాల వంటి "స్పర్శాన్ కృత్వా బహిః" ఇత్యాదిశ్లోకాలు చెప్పబడ్డాయి. వాటికి వృత్తి(సూత్రవ్యాఖ్యానం వృత్తి)వంటి ఈ ఆరవ అధ్యాయం ప్రారంభిం చబడుచున్నది.

కర్మ ధ్యానయోగానికి బహిరంగం గాన ధ్యానయోగాన్ని అధిరోహించడానికి సమర్థుడు కానంతవరకు,అధికారం ఉన్న గృహస్థుడు కర్మ చేయవలసినదే. అందుచేత దానిని '**అనాశ్రితః**'అని స్తుతిస్తున్నాడు.

భాష్యమ్

నను కిమర్థం ధ్యానయోగారోహణసీమాకరణమ్,యావతా అనుష్ఠేయమేవ విహితం కర్మ యావజ్జీవమ్?న;**"ఆరురుక్షోర్మునేర్యోగం కర్మ కారణముచ్యతే"**(6.3)ఇతి విశేషణాత్;ఆరూఢస్య చ శమేన ఏవ సంబన్ధకథనాత్. ఆరురుక్షోః ఆరూఢస్య చ శమః కర్మ చ ఉభయం కర్తవ్యత్వేన అభిప్రేతం చేత్ స్యాత్ తదా 'ఆరురుక్షోః' "ఆరుఢస్య"చ ఇతి శమకర్మవిషయభేదేన విశేషణం విభాగకరణం చ అనర్థకం స్యాత్.

బాలానందిని

నన్వితి:- (ప్రశ్న) విహిత మైన కర్మను జీవించి ఉన్నంతకాలము అనుష్ఠించి తీరాలి కదా, అలాంటప్పుడు ధ్యానయోగాన్ని అధిష్ఠించడం అనే హద్దును (ధ్యానయోగం అధిరోహించేవరకు మాత్రమే కర్మ చెయ్యాలి అని) ఏర్పరచడం ఎందుకు?(సమాధానం) అది కాదు.**"ఆరురుక్షోర్మునేర్యోగం కర్మ కారణముచ్యతే"**అని విశేషణంవల్ల(విశేషించి చెప్పడంవల్ల)ఆరూఢునికి శమంతో మాత్రమే సంబంధం అని చెప్పబడింది. ఆరురుక్షువునకూ ఆరూఢునకూ ఇద్దరికీ కూడ శమము కర్మ రెండూ కూడ కర్తవ్యములే అని ఇష్టమైన పక్షంలో అప్పుడు శమము కర్మ అనే విషయాల భేదాన్ని పట్టి "ఆరురుక్షోః'అనీ 'ఆరూఢస్య'అనీ విశేషణం అర్థరహితం అవుతుంది.

భాష్యమ్

తత్ర ఆశ్రమిణాం కశ్చిత్ యోగమ్ ఆరురుక్షుః భవతి,ఆరూఢః చ కశ్చిత్,అన్యే న ఆరురుక్షవః, న ఆరూఢాః-తాన్ అపేక్ష్య "ఆరురుక్షోః" "ఆరూఢస్య" చ ఇతి విశేషణం విభాగకరణం చ ఉపపద్యతే ఏవ ఇతి చేత్-న "తస్యైవ"ఇతి వచనాత్,పునః యోగగ్రహణాచ్చ "యోగారూఢస్య"ఇతి. యః ఆసీత్ పూర్వం యోగమ్ ఆరురుక్షుః తస్యైవ ఆరూఢస్య శమః ఏవ కర్తవ్యః కారణం యోగఫలం ప్రతి ఉచ్యతే ఇతి. అతః న యావజ్జీవం కర్తవ్యత్వప్రాప్తిః కస్య చిదపి కర్మణః.

బాలానందిని

తత్రేతి:-(ప్రశ్న)గృహస్థాశ్రమములో ఒకడు యోగారోహణం చేయాలనే అభిలాష కలవాడు ఉంటాడు. ఒకడు ఆరూఢు డవుతాడు. కొంద రైతే ఆరురుక్షువులూ కారు. ఆరూఢులూ

కాకపోవచ్చును. అలాంటివాళ్లను దృష్టిలో ఉంచుకొని 'ఆరూఢస్య' అనీ 'ఆరురుక్షోః' అనీ విశేషణమూ, విభాగవచనమూ(వాళ్లను వేరు వేరుగా నిర్దేశించడమూ)ఉపపన్నం అవుతాయి అన్నట్లయితే(సమాధానం)అది కాదు. ఎందువల్ల ననగా 'తస్యైవ'(వానికే)అని చెప్పబడింది,'యోగారూఢస్య'అని మళ్లీ యోగాన్ని గూర్చి చెప్పబడింది. దీనిని పట్టి ఎవడైతే ముందుగా యోగారురుక్షువుగా ఉన్నాడో అతడే యోగారూఢు డైనప్పుడు యోగఫలాన్ని గూర్చి ఆతడు చేయవలసిన కారణం శమమే అని చెప్పబడుచున్నది. అందువల్ల ఏ కర్మా కూడ యావజ్జీవమూ కర్తవ్యమే అని చెప్పడానికి అవకాశం లేదు.

వి:-గృహస్థుడు ధ్యానయోగాన్ని అధిరోహించడానికి (సాధించి సంపాదించడానికి) సమర్థుడయే టంతవరకు కర్మ ఆచరించాలి అని సిద్ధాంతి చెప్పగా జీవించి ఉన్నత కాలము కర్మ చేయవలసిందే కదా? యోగారూఢు డయేవరకే కర్మ చెయ్యాలి అని ఎలా అంటావు అని పూర్వపక్షి ప్రశ్నించాడు. "ఆరురుక్షోర్మునేర్యోగమ్" అనే (ఈ అధ్యాయంలోనిదే మూడవ)శ్లోకం ధ్యానయోగాన్ని అధిరోహించాలి అనే కోరిక ఉన్నవాడు ధ్యానయోగప్రాప్తికి సాధనంగా కర్మ చెయ్యాలి,అతడే యోగారూఢు డైన తరువాత కర్మసంన్యాసం ద్వారా యోగఫలమైన సమ్యగ్దర్శనాన్ని పొందాలి అని చెపుతున్నది. అందుచేత యోగారూఢుడు చేయవలసినది సంన్యాసమే అని సిద్ధాంతి సమాధానం చెప్పాడు. అయితే పూర్వపక్షి-యోగారురుక్షువు యోగారూఢుడు ఒకే వ్యక్తి కాదు;లోకంలో మూడు రకాల పురుషులుంటారు-కొందరు యోగారురుక్షువులు,కొందరు యోగారూఢులు,కొందరు ఈ రెండు తెగలకు చెందనివాళ్లు. ఈ మూడవ తెగకు చెందినవాళ్లని దృష్టిలో పెట్టుకొని యోగారురుక్షువు, యోగారూఢుడు వేరు వేరుగా చెప్పబడ్డారు. అందుచేత అందరూ యావజ్జీవ శ్రుతివిహితాలైన కర్మలు ఆచరించవలసినదే అని అన్నాడు. అది యుక్తం కాదు;'తస్యైవ'అనే పదంచేత యోగారురుక్షువును నిర్దేశిస్తూ ఆతడే యోగారూఢు డైన ప్పుడు అతనికి కర్మలతో పని లేదు,కర్మసంన్యాసమే ఆతడు చేయవలసినది అని సిద్ధాంతి సమాధానం చెప్పాడు.

భాష్యమ్

యోగవిభ్రష్టవచనాచ్చ. గృహస్థస్య చేత్ కర్మిణః యోగః విహితః షష్ఠే అధ్యాయే సః యోగవిభ్రష్టః అపి కర్మగతిం,కర్మఫలం ప్రాప్నోతి ఇతి తస్య నాశాశఙ్కా అనుపపన్నా స్యాత్. అవశ్యం హి కృతం కర్మ,కామ్యం,నిత్యం వా,మోక్షస్య నిత్యత్వాత్ అనారభ్యత్వే,స్వం ఫలమ్ ఆరభతే ఏవ. నిత్యస్య చ కర్మణః వేదప్రమాణావబుద్ధత్వాత్ ఫలేన భవితవ్యమ్ ఇతి అవోచామ;అన్యథా వేదస్య అనర్థార్థత్వప్రసంగాత్ ఇతి. న చ కర్మణి సతి ఉభయ విభ్రష్టత్వవచనమ్ అర్థవత్. కర్మణః విభ్రంశకారణానుపపత్తేః.

బాలానందిని

యోగేతి: -యోగవిభ్రష్టుని గూర్చి చెప్పడంవల్ల కూడ యోగారూఢుడు యావజ్జీవం కర్మ చేయవలసిన పని లేదు). కర్మాచరణం చేసే గృహస్థునికే,షష్ఠాధ్యాయంలో,ధ్యానయోగం విధించబడిన ట్లయితే అతడు యోగభ్రష్టు డైనా కూడ కర్మగతిని,కర్మఫలాన్ని ఎలాగా పొందుతాడు గాన వానిని గూర్చి నాశాశంక అనుపపన్నం అవుతుంది. చేయబడినది కామ్యకర్మ యైనా,నిత్యకర్మ యైనా కూడ,అది నిత్య మైన మోక్షాన్ని పుట్టించే ప్రసక్తి లేదు గాన, తాను ఇవ్వవలసిన ఫలాన్ని తప్పక ఇవ్వనే ఇస్తుంది. వేదరూప మైన ప్రమాణంచేత తెలియబడిన దవడంచేత నిత్యకర్మకు కూడ ఫలం ఉండి తీరుతుంది అని వెనుక చెప్పి ఉన్నాం. అలా కాకపోతే వేదం అనర్థకర మైన విషయాన్ని చెప్పిన ట్లవుతుంది. (అనగా నిత్యకర్మవల్ల ఫలం లేదు. చేయకపోతే మాత్రం ప్రత్యవాయం కలుగుతుంది అనే మతంలో చేసినా చేయకపోయినా కష్టానికి మాత్రమే హేతు వైన నిత్యకర్మను వేదం బోధించడం అసంగతం-ఈ విషయం వెనుకనే చెప్పబడింది). కర్మ ఉంటూండగా ఉభయవిభ్రష్టత్వం చెప్పడంలో అర్థం లేదు. కర్మ నశించడానికి తగిన కారణం ఏదీ లేదు కదా.

వి:- ధ్యానయోగాభ్యాసం ప్రారంభించి కొంత కాలం నడిపించి ఏ కారణంచేత నైనా చివరివరకు సాధించజాలనివాడు ఇటు కర్మాచరణం చేసినవాడూ కాక అటు యోగమార్గం సాధించినవాడూ కాక ఉభయభ్రష్టు డవుతాడా- "కచ్చిన్నోభయవిభ్రష్టః ఛిన్నాభ్రమివ నశ్యతి"(6.38)-అని అర్జునుడు ప్రశ్నించగా శ్రీకృష్ణుడు "శుచీనాం శ్రీమతాం గేహే యోగభ్రష్టోఽభిజాయతే"(6.41)అని అంటూ అతడు ఉభయభ్రష్టుడు కాదు అని సమాధానం చెపుతాడు. యోగారురుక్షువునకు,యోగారూఢునికీ కర్మాచరణం కర్తవ్యమే అయితే యోగభ్రష్టుడు యోగాన్ని సాధించజాలకపోయినా అతడు చేస్తూన్న నిత్యకర్మలో, కామ్యకర్మలో ఉండనే ఉంటాయి కాబట్టి అతడు ఆ కర్మఫలం ఎలాగా అనుభవిస్తాడు. అతడు ఉభయభ్రష్టు డయ్యే ప్రసక్తి లేదు. అలాంటప్పుడు ఆ ప్రశ్న ప్రతివచనాలు అర్థ రహితా లవుతాయి. దీనిని పట్టి యోగారూఢునికే కాదు యోగారురుక్షువునకు కూడ కర్మాచరణం ఆవశ్యకం కాదని తెలుస్తూన్నది అని భావం.

భాష్యమ్

కర్మ కృతమ్ ఈశ్వరే సంన్యస్య (సంన్యస్తమ్)ఇత్యతః కర్తరి కర్మ ఫలం నారభేత ఇతి చేత్-న;సంన్యాసస్య అధికతరఫలహేతుత్వోపపత్తేః. మోక్షాయ ఏవ ఇతి చేత్-స్వకర్మణాం కృతానామ్ ఈశ్వరే న్యాసః మోక్షాయైవ,న ఫలాన్తరాయ యోగసహితః; యోగాచ్చ విభ్రష్టః,ఇత్యతః తం ప్రతి నాశాశఙ్కా యుక్తైవ ఇతి చేత్-న;"ఏకాకీ యత

చిత్తాత్మా నిరాశీరపరిగ్రహః"(6.10),"బ్రహ్మచారివ్రతే స్థితః"(6.14)ఇతి చ కర్మసంన్యాస విధానాత్.న చ అత్ర ధ్యానకాలే స్త్రీసహాయకత్వాశఙ్కా, యేన ఏకాకిత్వం విధీయతే. న చ గృహస్థస్య "నిరాశీరపరిగ్రహః"(6.10)ఇత్యాదివచనమ్ అనుకూలమ్. ఉభయభ్రష్ట ప్రశ్నానుపపత్తేః చ.

బాలానందిని

అవ.ముముక్షువు కర్మ చేసినా దానిని ఈశ్వరునకు అర్పించివేస్తాడు గాన అది ఫలం ఇవ్వదు;ఆ విధంగా అది నశించడానికి కారణం ఉంది కదా అని శంకిస్తున్నాడు - కర్మేతి:- చేయబడిన కర్మ ఈశ్వరునియందు సమర్పించబడినది గాన (యోగభ్రష్టుడు కర్మ చేసినా)ఆ కర్మ ఫలం ఇవ్వదు, (అదే దాని విభ్రంశానికి కారణం)అన్నట్లయితే అది యుక్తం కాదు;ఈశ్వరునియందు కర్మను సమర్పించడంవల్ల అధికతర మైన ఫలం కలుగు తుంది కదా?(పూ.వ.) అది ఇచ్చేది మోక్షాన్నే అన్నట్లయితే-యోగసహిత మైన స్వకర్మేశ్వర సమర్పణం, (అనగా స్వకర్మలను ఈశ్వరునియందు సమర్పించడం,యోగం ఈ రెండూ కలిసి)మోక్షాన్నే కలిగిస్తుంది కాని మరొక ఫలాన్ని దేనినీ ఇవ్వదు.అతడు ఎప్పుడు యోగ భ్రష్టు డైనాడో అప్పుడు అతనిని గూర్చి నాశాశంక యుక్తమే.(అనగా యోగయుక్తమైన కర్మసమర్పణం మోక్షం ఇస్తుంది.యోగం భ్రష్టం అవగానే కేవలకర్మ సమర్పణం ఆ ఫలం ఇవ్వజాలదు గాన ఆ కర్మా నశించినట్లే.ఈ విధంగా యోగభ్రష్టుడు నశిస్తాడు అను ఆశంక యుక్తమే).(సమాధానం)"ఏకాకీ యతచిత్తాత్మా నిరాశీరపరిగ్రహః","బ్రహ్మచారివ్రతే స్థితః"అని (వీనికి -ధ్యానయోగారురుక్షువునకు)కర్మసంన్యాసం విధించబడింది కదా?

అవ:-గృహస్థుడు ధ్యానసమయంలో స్త్రీని దగ్గర ఉంచుకొనకూడదు అని మాత్రమే ఏకాకీ(ఒంటరి)అనేదానికి అర్థం అని చెప్పవచ్చును.అని ఆశంకించుకొని అగ్నిహోత్రాది కర్మలు ఏ విధంగా పత్నీసాధ్యాలో, పత్నిని దగ్గర ఉంచుకొని చేయదగినవో), ఆ విధంగా ధ్యానం చేసేవాడు కూడ పత్నిని దగ్గర ఉంచుకోవడం అనే ప్రసక్తి లేదు గాన, ప్రసక్తి లేనిదానిని నిషేధించడం వ్యర్థం అని సమాధానం చెపుతున్నారు- న చేతి:-ధ్యాన సమయంలో స్త్రీసహాయుడై చెయ్యాలి అనే ఆశంక ఉంటే కదా ఏకాకిత్వాన్ని విధించ వలసి ఉంటుంది. (అందుచేత కర్మలు ఆచరించే వాని వలె కాక ధ్యానయోగంలో ఉన్నవాడు ఏకాకిగా ఉంటాడు అనే అభిప్రాయంతోనే ఈ పదం ప్రయోగించబడింది అని అర్థం). మరొక విషయ మేమనగా గృహస్థుని విషయంలో 'నిరాశీః'(కోరికలు లేనివాడు)"అపరి గ్రహః"(ధనాదిసంగ్రహణం లేనివాడు)ఇత్యాదివచనం అనుకూలం కాదు.(గృహస్థు డైనవాడు కోరికలతో,ధనాద్యార్జనం చెయ్యాలి కదా అని భావం).అట్లే "ఉభయవిభ్రష్టుడు కాడు కద"అను ప్రశ్న కూడ కుదరదు. (గృహస్థుడు జ్ఞానంనుండి భ్రష్టుడైనా కర్మభ్రష్టుడు కాడు; అట్లే అనుష్ఠిస్తూన్న కర్మ భ్రష్టమైనా

పూర్వకర్మ(యోగంతో పాటు కాక స్వతంత్రంగా చేసిన కర్మ)వానికి ఉండనే ఉంటుంది గాన ఇలాంటి ప్రశ్న గృహస్థుణ్ణి గూర్చి కుదరదు అని భావం).

భాష్యమ్

"అనాశ్రితః"ఇత్యనేన కర్మిణః ఏవ సంన్యాసిత్వం యోగిత్వం చ ఉక్తం, ప్రతిషిద్ధం చ నిరగ్నేః అక్రియస్య చ సంన్యాసిత్వం యోగిత్వం ఇతి చేత్-న;ధ్యానయోగం ప్రతి బహిరఙ్గస్య సతః కర్మణః ఫలాకాఙ్క్షాసంన్యాసస్తుతిపరత్వాత్. న కేవలం నిరగ్నిః అక్రియః ఏవ సంన్యాసీ యోగీ చ,కిం తర్హి కర్మ్యపి కర్మఫలాసఙ్గం సంన్యస్య కర్మయోగమ్ అనుతిష్ఠన్ సత్త్వశుద్ధ్యర్థం "సః సంన్యాసీ చ యోగీ చ భవతి" (6.1)ఇతి స్తూయతే.న చైకేన వాక్యేన కర్మఫలాసంగసంన్యాసస్తుతిః చతుర్థాశ్రమ ప్రతిషేధశ్చ ఉపపద్యతే. న చ ప్రసిద్ధం నిరగ్నేః అక్రియస్య పరమార్థసంన్యాసినః శ్రుతిస్మృతిపురాణేతిహాసయోగశాస్త్రవిహితం సంన్యాసిత్వం యోగిత్వం చ ప్రతిషేధతి భగవాన్.

బాలానందిని

అనాశ్రితేతి:-(ప్రశ్న)**"అనాశ్రితః కర్మఫలమ్"**ఇత్యాదిశ్లోకం కర్మియే(కర్మాచరణం చేసే గృహస్థుడే)సంన్యాసి అనీ,యోగి అనీ చెపుతున్నది,అగ్ని లేక,కర్మలు లేక ఉన్నవాడు సంన్యాసి కాని యోగి కాని కాదు అని కూడ చెపుతున్నది అని అంటే-(సమాధానం)అది యుక్తం కాదు.ధ్యానయోగానికి బహిరంగంగా ఉన్న కర్మవల్ల కలిగే ఫలమునందు ఆసక్తిని విడవడాన్ని స్తుతించడంలోనే ఈ శ్లోకంయొక్క తాత్పర్యం.నిరగ్ని అక్రియుడు అయినవాడే సంన్యాసికాదు,మరేమనగా కర్మఫలాసంక్తిని విడచి అంతఃకరణశుద్ధికొరకు కర్మయోగం అనుష్ఠిస్తూన్న కర్మి కూడ సంన్యాసియే,యోగియే అని స్తుతించబడుచున్నాడు. ఒకే వాక్యంచేత కర్మఫలా సంగసంన్యాసస్తుతి,సంన్యాసాశ్రమాన్ని నిషేధించడం అనేది ఉపపన్నం కాదు కదా?నిరగ్ని అక్రియుడు అయిన నిజమైన సంన్యాసియొక్కశ్రుతిస్మృతిపురాణేతిహాసయోగ శాస్త్రాలలో విధించబడిన ప్రసిద్ధమైన సంన్యాసిత్వాన్నీ యోగిత్వాన్నీ భగవంతుడు నిషేధించడం లేదు కూడ.

వి. ఒక వాక్యం ఒకే విషయాన్ని చెప్పాలి.ఒకే వాక్యం రెండు విషయాలను ప్రతిపాదిస్తున్నట్లు అర్థం చెపితే అది వాక్యభేదదోషం అనే దోషం.దీనిని శాస్త్రప్రకారు లెవ్వరూ అంగీకరించరు.అందుచేత ఈ వాక్యం ఫలత్యాగాన్ని స్తుతిస్తూన్నదని ఒక అర్థం. సంన్యాసాశ్రమం అనే ఆశ్రమమే లేదు అని చెపుతూన్న దని రెండవ అర్థం బోధిస్తూన్న దని అంటే వ్యాక్యభేదదోషం కలుగుతుం దని భావం.

భాష్యమ్

స్వవచన విరోధాచ్చ-"సర్వకర్మాణి మనసా సంన్యస్య....నైవ కుర్వన్ న కారయన్ ఆస్తే"(5.13),"మౌనీ సంతుష్టో యేన కేన చిత్,అనికేతః స్థిరమతిః" (12.19),"విహాయ కామాన్యః సర్వాన్ పుమాంశ్చరతి నిః స్పృహః" (2.71) "సర్వారమ్భపరిత్యాగీ"(12.16) ఇతి చ తత్ర తత్ర భగవతా స్వవచనాని దర్శితాని;తైః విరుధ్యేత చతుర్థాశ్రమప్రతిషేధః. తస్మాత్ మునేః యోగమ్ ఆరురుక్షోః ప్రతిపన్న గార్హస్థ్యస్య అగ్నిహోత్రాదికర్మఫలనిరపేక్షమ్ అనుష్ఠీయమానం ధ్యానయోగారోహిణ సాధనత్వం సత్త్వశుద్ధిద్వారేణ ప్రతిపద్యతే ఇతి "సః సంన్యాసీ చ యోగీ చ"ఇతి స్తూయతే-

బాలానందిని

స్వేతి:- ఇలా చెపితే భగవంతుడు అక్క డక్కడ చెప్పిన తన వచనాలతోనే విరోధం ఏర్పడుతుంది. "సర్వకర్మాణి మనసా సంన్యస్య నైవ కుర్వన్ న కారయన్ ఆస్తే"మౌనీ సంతుష్టః యేన కేనచిత్","అనికేతః స్థిరమతిః","విహాయ కామాన్ యః సర్వాన్ పుమాంశ్చరతి నిః స్పృహః","సర్వారమ్భపరిత్యాగీ'అని భగవంతునిచేత అక్క డక్కడ (సంన్యాసాన్ని విధిస్తూ) తన వచనాలు చూపబడ్డాయి(చెప్పబడ్డాయి).నాల్గవ ఆశ్రమాన్ని నిషేధించడం ఆ వాక్యాలకు విరుద్ధం అవుతుంది.అందుచేత-గార్హస్థ్యం స్వీకరించి ఉన్న,యోగారురుక్షు వైన మునికి, ఫలాపేక్ష లేకుండా చేయబడే అగ్నిహోత్రాదికర్మ సత్త్వశుద్ధి ద్వారా ధ్యానయోగాన్ని అధిరోహిం చడానికి సాధనం అవుతుంది గాన అతడే సంన్యాసి,యోగీ కూడ అని స్తుతించబడు తున్నాడు.

మూ. అనాశ్రితః కర్మఫలం కార్యం కర్మ కరోతి యః,
స సంన్యాసీ చ యోగీ చ న నిరగ్నిర్న చాక్రియః. 1

ప్ర.అ.అనాశ్రిత ఇతి:- యః=ఎవడు,కర్మఫలమ్=కర్మయొక్క ఫలాన్ని,అనాశ్రితః =ఆశ్రయించనివాడై(కోరనివాడై), కార్యమ్=చేయదగిన,కర్మ=కర్మను,కరోతి=చేస్తాడో,సః= అతడే,సంన్యాసీ చ=సంన్యాసి,యోగీ చ =యోగీ కూడ.నిరగ్నిః=అగ్ని లేనివాడు (హోమాదులు చేసే అగ్నిని తీసి వేసినవాడు మాత్రమే న=కాదు. అక్రియః చ = కర్మలు లేనివాడు మాత్రమే న=కాదు(ఇతడు కూడ సంన్యాసియే, యోగియే).

భాష్యమ్

అనాశ్రితః-న ఆశ్రితః,కిమ్?కర్మఫలం-కర్మణః ఫలం కర్మఫలం యత్ తత్ అనాశ్రితః,కర్మఫలతృష్ణారహితః ఇత్యర్థః.యో హి కర్మఫలతృష్ణావాన్ సః కర్మఫలమ్

ఆశ్రితః భవతి;అయం తు తద్విపరీతః, అనాశ్రితః కర్మఫలమ్,ఏవంభూతః సన్ కార్యం కర్తవ్యం,నిత్యం కామ్యవిపరీతమ్ అగ్నిహోత్రాదికం, కరోతి నిర్వర్తయతి;యః కశ్చిత్ ఈదృశః కర్మీ సః కర్మ్యన్తరేభ్యః విశిష్యతే ఇత్యేవమర్థమ్ ఆహ-సః సంన్యాసీ చ యోగీ చ ఇతి. సంన్యాసః పరిత్యాగః,సః యస్య అస్తి సః సంన్యాసీ చ యోగీ చ -యోగః చిత్త సమాధానం,సః యస్య అస్తి సః యోగీ చ ఇత్యేవంగుణసంపన్నః అయం మన్తవ్యః, న కేవలం నిరగ్నిః అక్రియ ఏవ సంన్యాసీ యోగీ చ ఇతి మన్తవ్యః. నిర్గతాః అగ్నయః కర్మాఙ్గభూతాః యస్మాత్ సః నిరగ్నిః,అనగ్నిః చ అనగ్నిసాధనా అపి అవిద్యమానాః క్రియాః తపోదానాదయః యస్య అసౌ అక్రియః. 1

బాలానందిని

అనాశ్రితః ఇతి:-అనాశ్రితుడై,ఆశ్రయించనివాడై,దేనిని?కర్మవల్ల ఏ ఫలం కలుగు తుందో దానిని ఆశ్రయించనివాడై,కర్మఫలములందు ఆసక్తి లేనివాడై అని అర్థం.ఎవని కైతే కర్మఫలమునందు ఆసక్తి ఉంటుందో అతడు కర్మఫలాన్ని ఆశ్రయించినవా డవుతాడు, ఇత డైతే అందుకు విపరీత మైనవాడు.అందువల్ల కర్మఫలాన్ని ఆశ్రయించనివాడు;ఇలాంటి వాడై,కార్యమైన,చేయదగిన కామ్యకర్మకు విపరీత మైన అగ్నిహోత్రాదినిత్యకర్మను నిర్వ ర్తిస్తాడో,చేస్తాడో ఏ ఇలాంటి కర్మి ఉంటాడో అతడు ఇతరకర్ములకంటె విశిష్టుడుగా ఉంటాడు అని చెప్పడంకొరకు "అతడే సంన్యాసి, యోగీ కూడ" అని చెపుతున్నాడు. సంన్యాసం అనగా విడచిపెట్టడం. సంన్యాసం కలవాడు సంన్యాసి.యోగం అనగా చిత్తాన్ని ఏకాగ్రంగా ఒక ఆలంబనంమీద నిలపడం.అది కలవాడు యోగి.ఈ విధమైన గుణాలు కలవాడు సంన్యాసి గాను యోగి గాను తెలియదగినవాడు.ఎవడు నిరగ్నియో,అక్రియుడో అతడే కాదు;ఇతడు కూడ సంన్యాసి అనీ యోగి అనీ తెలియదగినవాడు.ఎవనినుండి కర్మలకు అంగములైన అగ్నులు తొలగిపోయినవో, దూరమైనవో అతడు నిరగ్ని. అగ్ని అనే సాధనం లేని తపస్సు,దానం మొదలైన క్రియలు ఎవనికి లేవో(ఎవడు చేయడో)అతడు అక్రియుడు.

భా. అ.ప్ర.:-ఇక్కడ శ్రీరామానుజాచార్యులు-"ఎవడు కర్మ చేస్తాడో అతడు జ్ఞాన యోగనిష్ఠుడూ కర్మయోగనిష్ఠుడూ కూడ అవుతాడు.అతడు నిరగ్ని,అనగా కర్మలయందు ప్రవర్తించనివాడు,కాదు;అక్రియుడు,అనగా కేవలజ్ఞాననిష్ఠుడు కూడ కాదు.జ్ఞానయోగనిష్ఠుడు కేవలం జ్ఞానయోగనిష్ఠుడుగానే ఉంటాడు.కర్మయోగనిష్ఠుని కైతే ఉభయమూ(కర్మయోగ నిష్ఠత్వమూ జ్ఞానయోగనిష్ఠత్వమూ కూడ ఉంటుంది అని అభిప్రాయం"అని అన్నారు.అది నిఃసారమైన వ్యాఖ్య.ఏ కర్మి యైతే సంన్యాసి యోగీ కూడ అవుతాడు అని చెప్పబడ్డాడో ఆ కర్మియే నిరగ్ని కాదు.అక్రియుడు కూడ కాదు అని చెప్పడానికి ఎలా శక్యం అవుతుంది?

ఒకే కర్మ విషయంలో సంన్యాసిత్వాన్ని చెప్పడం,దానిని నిషేధించడం ఈ రెండూ ఉప పన్నములు కావు కదా?ఎందువల్లననగా అగ్ని,క్రియలూ లేకపోవడం సంన్యాసికే గాన 'నిరగ్ని','అక్రియ'శబ్దాలు సంన్యాసినే బోధిస్తాయి.'నిరగ్ని''అక్రియ'శబ్దాలు కర్మలయందు ప్రవర్తించని జ్ఞాననిష్ఠుణ్ణే బోధిస్తాయి కాని సంన్యాసిని బోధించవు అనడానికి వీలు లేదు. అలాంటివాడే (కర్మలలో ప్రవర్తించని జ్ఞాననిష్ఠుడే) కదా సంన్యాసి అంటే? గృహస్థుడు కర్మలలో ప్రవర్తించకపోవడం జ్ఞాననిష్ఠా అనేవి సంభవించవు కదా?కర్మల యందు ప్రవర్తించకపోవడమే కర్మసంన్యాసం,అదే జ్ఞాననిష్ఠ కూడ.నాస్తికుడు గాని వ్యాధి గ్రస్తుడు గాని అయిన గృహస్థుడు కూడ కర్మలలో ప్రవర్తించడు కదా అనడం యుక్తం కాదు;ఈ శాస్త్రంలో అలాంటి గృహస్థుని ప్రసక్తి లేదు.ఆస్తికుడు,సమర్థుడు (రోగాదులు లేనివాడు) అయిన గృహస్థుణ్ణి గూర్చియే"కర్మ కరోతి" అని చెప్పబడుచున్నది.

మరొక విషయ మేమనగా-కర్మయందు సంన్యాసిత్వము యోగిత్వమూ అనే రెండూ ఉంటా యని నీవు అంగీకరిస్తున్నావు;అవి "సంన్యాసీ చ యోగీ చ" అను చకారంచేతనే సిద్ధిస్తూన్నప్పుడు మళ్లీ"న నిరగ్నిః న చాక్రియః"అనిచెప్పడం పునరుక్తం అవుతుంది."కేవలం కర్మలలో ప్రవర్తించనివాడే కాదు,కేవలం జ్ఞాననిష్ఠుడే కాదు"అనే అర్థం "స సంన్యాసీ చ యోగీ చ"అనేదానివల్లనే సిద్ధిస్తుంది కదా అని భావం."కేవలం కర్మలయందు ప్రవర్తించనివాడే కాదు"అనగా "కర్మప్రవృత్తుడు కూడ"అని అర్థం వస్తుంది కాని "కర్మలయందు ప్రవర్తించినవాడు"అని కాదు.అప్పుడు "ఎవడైతే కర్మ చేస్తాడో అతడు కర్మలయందు ప్రవర్తించనివాడు జ్ఞాననిష్ఠుడూ కూడ"అని చెప్పి నట్లవుతుంది.కర్మలయందు ప్రవర్తించకపోవడం,జ్ఞాననిష్ఠత్వం-ఈ రెండూ ఒక్కటే గాన పునరుక్తత్వం వస్తుంది.నీవు చూపిన అన్వయాన్ని పట్టి-"ఎవడైతే కర్మ చేస్తాడో అతడు సంన్యాసి,యోగీకూడ,అనగా కర్మలయందు ప్రవర్తించనివాడు,జ్ఞాననిష్ఠుడూ కూడ,అను అర్థం సిద్ధిస్తుంది.అప్పుడు - కర్మకరణ-సంన్యాసాలు అనగా కర్మప్రవృత్తి-కర్మాప్రవృత్తులకు,కర్మనిష్ఠత్వ-జ్ఞాననిష్ఠత్వాల మధ్య నున్న విరోధం బాలుడికి కూడ తెలిసినదే. 'సంన్యాసీ'అన్నదానికి జ్ఞాననిష్ఠుడు అను అర్థం గ్రహించినా కూడ కర్మకరణ-కర్మాప్రవృత్తులమధ్య,కర్మయోగనిష్ఠత్వ-జ్ఞాన యోగనిష్ఠత్వాల మధ్య ఉన్న విరోధం స్పష్టమే.జ్ఞాననిష్ఠుడు-జ్ఞాననిష్ఠుడు అనీ, కర్మలలో ప్రవర్తించనివాడు అనీ ఒకే విషయం శబ్దంచేత,అర్థంచేత మళ్లీ మళ్లీ చెప్పినట్లు అవుతుంది. కర్మ చేసేవాడు కర్మయోగి అనే విషయం అందరికీ తెలిసినదే గాన"ఎవడు కర్మ చేస్తాడో అతడు యోగి'అని చెప్పడం వ్యర్థం పునరుక్తతాదోషగ్రస్తం కూడ.అట్లే "ఎవడు కర్మ చేస్తాడో అతడు నిరగ్ని కాదు,అక్రియుడు కాదు,'అతడు సాగ్నియే సక్రియుడే"అనే విషయం కూడ అందరికీ తెలిసినదే గాన "న నిరగ్నిర్నచాక్రియః"అని చెప్పడం వ్యర్థం, పునరుక్తం కూడ అవుతుంది.

కర్మయోగనిష్ఠుడు ఉభయనిష్ఠుడు అవుతాడు అనడం వ్యాహత మైనది;విరుద్ధమైన అర్థాన్ని చెప్పేది అవుతుంది.కర్మయోగనిష్ఠుడు కర్మయోగనిష్ఠుడుగాను,జ్ఞానయోగనిష్ఠుడు జ్ఞానయోగనిష్ఠుడుగాను,ఉభయనిష్ఠుడు ఉభయనిష్ఠుడుగాను అవాలి కాని కర్మనిష్ఠుడు కాని, జ్ఞానయోగనిష్ఠుడు కానిఉభయయోగనిష్ఠుడు కాజాలడు కదా?అట్లే-"జ్ఞానయోగేన సాంఖ్యానాం కర్మయోగేన యోగినామ్"అని భగవంతుడే సాంఖ్య-యోగాలు వేరు వేరు పురుషులచేత అనుష్ఠింపదగినవి అని చెప్పడంచేత,స్థితి-గతుల(నిలబడడం,నడవడం)వలె జ్ఞానకర్మలు పరస్పరవిరోధం కలవి అవడం చేతా ఒకే పురుషుడు ఉభయనిష్ఠ డవడం సంభవమే కాదు.ఈ విషయం వెనుక విస్తృతంగా ప్రతిపాదించబడింది.అందువల్ల కర్మయోగనిష్ఠునికి జ్ఞానయోగనిష్ఠత్వం కాని,ఉభయయోగనిష్ఠత్వం కాని స్వప్నంలో కూడ కుదరదు.భగవంతుడు ఇలాంటి అసంభావ్యమైన విషయాన్ని బోధిస్తే అతడు ప్రమాణం కాకుండా పోతాడు. (భా.అ.ప్ర.పే.249-250) 1

భాష్యమ్

నను చ నిరగ్నేః అక్రియస్యైవ శ్రుతిస్మృతియోగశాస్త్రేషు సంన్యాసిత్వం యోగిత్వం చ ప్రసిద్ధమ్;కథమిహ సాగ్నేః సక్రియస్య సంన్యాసిత్వం యోగిత్వం చ అప్రసిద్ధమ్ ఉచ్యతే ఇతి?నైష దోషః. కయా చిత్ గుణవృత్త్యా ఉభయస్య సంపిపాదయిషితత్వాత్.తత్ కథమ్?కర్మఫలసంకల్పసంన్యాసాత్ సంన్యాసిత్వం, యోగాఙ్గత్వేన చ కర్మానుష్ఠానాత్ కర్మఫలసంకల్పస్య వా చిత్తవిక్షేపహేతోః పరిత్యాగాత్ యోగిత్వం చ ఇతి గౌణమ్ ఉభయమ్;న పునః ముఖ్యం సంన్యాసిత్వం యోగిత్వం చ అభిప్రేతమ్ ఇత్యేతమ్ అర్థం దర్శయితుమాహ -

మూ. యం సంన్యాసమితి ప్రాహుర్యోగం తం విద్ధి పాణ్డవ,
న హ్యసంన్యస్తసంకల్పో యోగీ భవతి కశ్చన. 2

బాలానందిని

నన్వితి:-(ప్రశ్న)నిరగ్ని,అక్రియుడు అయినవాడే సంన్యాసి అనీ,యోగి అనీ శ్రుతి స్మృతియోగశాస్త్రాలలో ప్రసిద్ధంగా ఉంది;ఇక్కడ సక్రియునికే(కర్మాచరణం చేసేవానికే) సంన్యాసిత్వమూ,యోగిత్వమూ ఉంటుం దని అప్రసిద్ధమైన విషయం ఎలా చెప్పబడు చున్నది?(సమాధానం)ఈ దోషం లేదు(ఇది దోషం కాదు).ఒక విధమైన గుణవృత్తిచేత (లక్షణచేత)ఉభయము సంపాదించడానికి ఇక్కడ ఉద్దిష్ట మైనది.అదెట్లు?కర్మఫలసంకల్పాన్ని త్యజించడంచేత దీనికి సంన్యాసత్వం, యోగానికి అంగంగా కర్మానుష్ఠానం చేయడంవల్ల, లేదా చిత్తవిక్షేపానికి(చిత్తచాంచల్యానికి)హేతు వైన కర్మఫలసంకల్పాన్ని విడవడంచేత

యోగత్వం.(ఈ గుణాలను పట్టి కర్మయే సంన్యాస మనీ యోగ మనీ చెప్పబడుచున్నది). ఈ విధంగా సంన్యాసిత్వమూ,యోగిత్వమూ ఈ ఉభయమూ కూడ గౌణమే కాని ముఖ్య మైన సంనాసిత్వయోగిత్వాలు గ్రహించడానికి ఇష్టములు కావు అనే చెప్పదలచిన విషయాన్ని చూపడానికి చెపుతున్నాడు-

ప్ర. అ. యమితి:- పాణ్డవ=అర్జునా!యమ్=దేనిని,సంన్యాసమ్ ఇతి=సంన్యాసముగా, ప్రాహుః=చెప్పుచున్నారో,తమ్=దానిని,యోగమ్=కర్మయోగమునుగా,విద్ధి=తెలును కొనుము.అసంన్యస్తసంకల్పః=విడువబడని సంకల్పం గల,కశ్చన=ఎవ్వడూ కూడ,యోగీ = యోగిగా,న భవతి హి=కాదు కదా?

భాష్యమ్

యం సర్వకర్మతత్ఫలపరిత్యాగలక్షణం పరమార్థసంన్యాసమ్ ఇతి ప్రాహుః శ్రుతిస్మృతివిదః,యోగం కర్మానుష్ఠానలక్షణం తం పరమార్థసంన్యాసం విద్ధి జానీహి; హే పాణ్డవ.కర్మయోగస్య ప్రవృత్తిలక్షణస్య తద్విపరీతేన నివృత్తిలక్షణేన పరమార్థ సంన్యాసేన కీదృశం సామాన్యమ్ అఙ్గీకృత్య తద్భావః ఉచ్యతే ఇత్యపేక్షాయామ్ ఇద ముచ్యతే.అస్తి పరమార్థసన్యాసేన సాదృశ్యం కర్తృద్వారకం కర్మయోగస్య.యః హి పరమార్థసంన్యాసీ సః త్యక్తసర్వకర్మసాధనతయా సర్వకర్మతత్ఫలవిషయం సంకల్పం ప్రవృత్తిహేతుకామకారణం సంన్యస్యతి.అయమపి కర్మయోగీ కర్మ కుర్వాణః ఏవ ఫలవిషయం సంకల్పం సంన్యస్యతి ఇత్యేవమ్ అర్థం దర్శయన్ ఆహ-న,హి యస్మాత్ అసంన్యస్తసంకల్పః అపరిత్యక్తః ఫలవిషయః అభిసంధిః యేన సః అసంన్యస్తసం కల్పః, కశ్చన కశ్చిదపి, కర్మీ, యోగీ సమాధానవాన్,భవతి;న భవతీత్యర్థః.ఫలసంకల్పస్య చిత్తవిక్షేపహేతుత్వాత్. తస్మాత్ యః కశ్చన కర్మీ సంన్యస్తఫలసంకల్పః భవేత్, సః యోగీ సమాధానవాన్ అవిక్షిప్త చిత్తః భవేత్;చిత్తవిక్షేపహేతోః ఫలసంకల్పస్య సంన్యస్తత్వాత్ ఇత్యభిప్రాయః. ఏవం పరమార్థసంన్యాసకర్మయోగయోః కర్తృద్వారకం సంన్యాససామాన్యమ్ అపేక్ష్య **"యం సంన్యాసమితి ప్రాహుర్యోగం తం విద్ధి పాణ్డవ"**ఇతి కర్మయోగస్య స్తుత్యర్థం సంన్యాసత్వమ్ ఉక్తమ్. 2

బాలానందిని

యమితి:-అర్జునా! శ్రుతిస్మృతులు తెలిసినవారు సమస్తకర్మల, వాటి ఫలాల పరిత్యాగ మనే లక్షణం గల దేనిని పరమార్థసంన్యాసం అని అంటారో,కర్మానుష్ఠానరూప మైన యోగం ఆ పరమార్థసంన్యాసమే అని,తెలుసుకొనుము.ప్రవృత్తిరూప మైన కర్మ యోగానికి, దానికి విపరీత మైన నివృత్తిలక్షణ మైన పరమార్థసంన్యాసంతో ఎట్టి

సామాన్యాన్ని(సాధారణధర్మాన్ని,పోలికను)అంగీకరించి ఇదే అది అని చెప్పబడుచున్నది అను ప్రశ్నకు సమాధానంగా ఇది చెప్పబడుచున్నది-కర్మయోగానికి,కర్తద్వారా,పరమార్థ సంన్యాసంతో,సామ్యం ఉంది.(అనగా దీని కర్తయొక్క అభిప్రాయం ఏ విధంగా ఉంటుందో దాని కర్తయొక్క అభిప్రాయం కూడ అలాగే ఉంటుంది గాన ఈ రెండింటికీ పోలిక ఉంది). పరమార్థసంన్యాసి అయినవాడు సమస్తకర్మలను,వాటి సాధనాలను విడిచిపెట్టివేసినవా డవడంచేత ప్రవృత్తికి(కర్మాచరణచేయడానికి)కారణ మైన కామానికి కారణమైన, సమస్తకర్మలకు వాటి ఫలాలకూ సంబంధించిన సంకల్పాన్ని విడిచివేస్తాడు. ఈ కర్మయోగి కూడ,కర్మ చేస్తూనే,దాని ఫలానికి సంబంధించిన సంకల్పాన్ని పరిత్యజిస్తాడు.(ఈ విధంగా ఫలసంకల్పపరిత్యాగమే వాళ్ల ఇద్దరి మధ్యా ఉన్న పోలిక). ఈ విషయాన్ని చూపుతూ అంటున్నాడు-ఎందువల్ల ననగా,అసంన్యస్తసంకల్పు డైన-ఫలమును గూర్చిన అభిసంధి (సంకల్పం) ఎవనిచేత విడవడలేదో అలాంటివాడైన) ఏ కర్మీ కూడ,యోగి కాజాలడు;చిత్త సమాధానం ఉన్నవాడు కాజాలడు.ఫలసంకల్పం చిత్తవిక్షేపానికి హేతువు కదా?అందువల్ల ఏ కర్మి కర్మఫలాలకు సంబంధించిన సంకల్పాన్ని విడిచిపెడతాడో అతడు,చిత్తవిక్షేపానికి హేతువైన ఫలసంకల్పం విడవబడడంచేత,సమాధానవంతుడు,చిత్తావిక్షేపం లేనివాడు అవుతాడు అని అభిప్రాయం.ఈ విధంగా,కర్తల ద్వారా,పరామార్థసంన్యాసకర్మయోగాల మధ్య ఉన్న సంన్యాససామాన్యాన్ని(సంన్యాసం అనే సమానధర్మాన్ని)అపేక్షించి (దానిని పట్టి), కర్మయోగాన్ని స్తుతించడంకొరకై,"యం సంన్యాసమితి ప్రాహుర్యోగం తం విద్ధి పాణ్డవ" అని కర్మయోగానికి సంన్యాసత్వం(కర్మయోగం సంన్యాసం అని) చెప్పబడింది.

భా.అ.ప్ర.:-ఇక్కడ శ్రీరామానుజాచార్యులు-"సంన్యాసమ్=జ్ఞానయోగమును యోగమ్=కర్మయోగమునుగా,తెలుసుకో.ఆత్మయాథాత్మ్యజ్ఞానం కర్మయోగంలో అంతర్గతం కదా.ఆత్మ కానిదానియందు ఆత్మతాదాత్మ్యాభిమానం సంకల్పం.దానిని విడవనివాడు కర్మయోగి కానే కాడు"అని చెప్పారు.అది అయుక్తం.యోగంలో అంతర్గత మైన జ్ఞానం యోగశబ్దంచేత చెప్పబడుతుంది అనడమే అసలు విరుద్ధం.అట్లయితే పెట్టె లోపల నున్న వస్త్రాన్ని కూడ పెట్టె అనడానికి అవకాశం ఏర్పడుతుంది.ముఖ్యార్థాన్ని త్యజించడానికి కారణం లేనప్పుడు లాక్షణికార్థం గ్రహించడం అయుక్తం.కర్మయోగంలో జ్ఞానయోగం అంతర్గతం అనడం కూడ యుక్తం కాదు;జ్ఞానయోగం కర్మయోగంచేత సంపాదించవలసి నది.అట్లే ఆత్మ కానిదానియందు ఆత్మ అనే అభిమానం అధ్యాసం అవుతుంది కాని సంకల్పం కాదు.దానిని విడిచిపెడితే అసలు కర్మయోగమే లేకుండా పోతుంది;ఎందువల్ల ననగా ఆత్మకు కర్తృత్వం లేదు,అనాత్మలా జడ మైనది.జడమైన ఘటాదికానికి కర్తృత్వం ఉన్నట్లు లోకంలో కనబడడంలేదు వినబడడం లేదు.

మరొక విషయ మేమనగా–"నేను ఈ కర్మ చేస్తాను"అనే సంకల్పమే కర్మకు మూలం అనే విషయం అందరూ అంగీకరించినది. అది(సంకల్పం)ఆత్మ కాని అహంకారమునందు ఆత్మ అనే అభిమానంచేత కలుగుతుంది. కారణ మేమనగా–కర్తృత్వం అహంకారానికే కాని ఆత్మకు లేదు. ఆ అభిమానం కూడ పరిత్యజిస్తే కర్మయోగం ఎలా సిద్ధిస్తుంది. (కర్మయోగమే ఉండదు). అందుచేత కర్మయోగానికి అధ్యాసనివృత్తి అవశ్యకం కాదు,మరే మనగా దేహంకంటె అతిరిక్త మైన నిత్యమైన ఒక ఆత్మ అనేది ఉంది అను బుద్ధిమాత్రమే వానికి ఆవశ్యకం.

అనాత్మలు జడములు గాన,ఆత్మకు కర్తృత్వం లేదు గాన విధిశాస్త్రం వ్యర్థం అయిపోతుంది;"కర్తా శాస్త్రార్థవత్త్వాత్"అనే అధికరణాన్ని అనుసరించి కూడ ఆత్మ కర్తయే అనాలి అనడం యుక్తం కాదు. శాస్త్రాలు అవిద్యావంతునిగూర్చి చెప్పబడ్డాయి. అంతే కాక దేహాదులయందు ఆత్మాభిమానం కలవానికి కర్తృత్వం ఉంటుంది గాన శాస్త్రానికి వ్యర్థత్వం లేదు. పైన చూపిన అధికరణానికి కూడ విరోధం లేదు."నిష్కలం నిష్క్రియం శాన్తమ్" ఇత్యాది శ్రుతికి విరోధం కలుగుతుంది గాన ఆత్మ అకర్తయే. అలా కాక కర్తృత్వం ఉంటే భోక్తృత్వం కూడ ఉండాలి. రెండూ ఉంటే ఆత్మకు వికారం ఉంటుం దని అంగీకరించాలి. వికారిత్వం కూడ ఉంటే ఆత్మకు అనిత్యత్వం వస్తుంది. అప్పుడు"అజో నిత్యః శాశ్వతః","అవికార్యోఽ యముచ్యతే"అని గీతాశాస్త్రంలో చెప్పిన విషయమే అప్రమాణం అని చెప్పిన ట్లవుతుంది. అందువల్ల ఆత్మకు కర్తృత్వం లేదు అని సిద్ధాంతం. ఈ విధంగా ఆత్మ కర్త కాదు అని తెలుసుకొన్నవానికి "నే నీ కర్మ చేస్తాను"అనే సంకల్పం ఎలా కలుగుతుంది? అది ఉంటే కదా కర్మయోగంలో ప్రవర్తించడం? అందుచేత జ్ఞానం లేనివాడే కర్మయోగి. జ్ఞానంకోసం కదా అతడు కర్మయోగంలో ప్రవర్తిస్తున్నాడు? ముందుగానే జ్ఞాని అయి ఉంటే అతడు కర్మయోగంలో ఎందుకు ప్రవర్తిస్తాడు? అందుచేత జ్ఞానానికి కర్మయోగంలో అంతర్భావం లేదు. (భా. అ. ప్ర. పే. 252) 2

భాష్యమ్

ధ్యానయోగస్య ఫలనిరపేక్షః కర్మయోగః బహిరఙ్గం సాధనమ్ ఇతి తం సంన్యాసత్వేన స్తుత్వా అధునా కర్మయోగస్య ధ్యానయోగసాధనత్వం దర్శయితి–

మూ. ఆరురుక్షోర్మునేర్యోగం కర్మ కారణముచ్యతే,
యోగారూఢస్య తస్యైవ శమః కారణముచ్యతే. 3

బాలానందిని

ధ్యానేతి:– ఫలాపేక్ష లేని కర్మయోగం ధ్యానయోగానికి బహిరంగసాధనం అవడంచేత అదే సంన్యాసం అని దానిని స్తుతించి,కర్మయోగం ధ్యానయోగానికి సాధనం అనే విషయం ఇప్పుడు చూపుచున్నాడు–

ప్ర.అ.ఆరురుక్షోః ఇతి:- యోగమ్=ధానయోగమును,ఆరురుక్షోః=ఎక్క దలచు కొన్న,మునేః=మునికి,కర్మ=కర్మ,కారణమ్=సాధనముగా,ఉచ్యతే=చెప్పబడుచున్నది.యోగా రూఢస్య=యోగాన్ని అధిరోహించిన,తస్యైవ=వానికే,శమః=శమం(సంన్యాసం),కారణమ్= సాధనంగా,ఉచ్యతే=చెప్పబడుచున్నది.

భాష్యమ్

ఆరురుక్షోః ఆరోఢుమ్ ఇచ్ఛతః అనారూఢస్య,ధ్యానయోగే అవస్థాతుమ్ అశక్త స్యైవ ఇత్యర్థః.కస్య ఆరురుక్షోః?మునేః,కర్మఫలసంన్యాసినః ఇత్యర్థః.కిమ్ ఆరు రుక్షోః?యోగం;కర్మ,కారణం సాధనమ్ ఉచ్యతే.యోగారూఢస్య పునః తస్యైవ,శమః ఉపశమః,సర్వకర్మభ్యః నివృత్తిః,కారణం యోగారూఢత్వస్య సాధనమ్ ఉచ్యతే ఇత్యర్థః. యావత్ యావత్ కర్మభ్యః ఉపరమతే తావత్ తావత్ నిరాయాసస్య జితేన్ద్రియస్య చిత్తం సమాధీయతే.తథా సతి సః ఝటితి యోగారూఢో భవతి.తథా చ ఉక్తం వ్యాసేన-

"నైతాదృశం బ్రాహ్మణస్యాస్తి విత్తం
యథైకతా సమతా సత్యతా చ,
శీలం స్థితిర్దణ్డనిధానమార్జవం
తతస్తతశ్చోపరమః క్రియాభ్యః"(శాం.ప.175.38)ఇతి. 3

బాలానందిని

ఆరురుక్షోరితి:- ఆరురుక్షోః=ఆరోహించడానికి ఇచ్ఛ గల,ఇంకా ఆరూఢుడు కాని, ధ్యానయోగంలో నిలవడానికి సమర్థుడు కాని అని అర్థం.ఆరురుక్షు వైన ఎవనికి?మునికి. కర్మఫలాన్ని సంన్యసించినవానికి అని అర్థం.దేనిని ఎక్క దలచుకొన్నవాడు?యోగాన్ని. కర్మ కారణంగా,సాధనంగా చెప్పబడుచున్నది.అతడే యోగారూఢు డైన పిదప,వానికి శమం, ఉపశమం,సమస్తకర్మలనుండి నివర్తించడం,యోగారూఢత్వానికి సాధనంగా చెప్పబడు చున్నది.మెల్ల మెల్లగా కర్మలనుండి ఉపరమిస్తూన్నకొలదీ,ఆయాసరహితు డైన,జితేంద్రియు డైన సాధకుని చిత్తం ఏకాగ్రం అవుతుంది.అలా జరగగా హఠాత్తుగా యోగారూఢు డవు తాడు.ఈ విషయం వ్యాసునిచేత నైతాదృశం....క్రియాభ్యః"అని చెప్పబడింది. "బ్రాహ్మణునకు ఇలాంటి ధనం మరొకటి లేదు,ఎలాంటి దనగా- అన్ని ప్రాణులయందు ఏకత్వబుద్ధి (అభేదబుద్ధి),అందరి విషయంలోను సమత్వము,సత్యము,మంచి శీలము, స్థైర్యం,అహింస, వక్రత్వం లేకపోవడం ఆ యా క్రియలనుండి మెల్ల మెల్లగా ఉప రమించడం".

భా.అ.ప్ర.:-"ఆత్మను చూడడం అనే రూపం గల(ఆత్మావలోకన మనే)మోక్షం లభించేవరకు కర్మ చేయదగినదే అని అర్థం"అని శ్రీరామానుజాచార్యులు,"శమం అనగా కర్మలనుండి నివర్తించడమే కాని సంన్యాసం కాదు"అని వేదాంతదేశికులు చెప్పినది అసంగతం.వాళ్ల మతంలో ఆత్మావలోకనం మోక్షం కాదు కదా.కర్మచేత ఆత్మావలోకనం అసంభవం;అది వేదాంతవిచారంచేత గాని సమాధిచేత గాని సాధ్యం అవుతుంది.శమం అనగా కర్మ నివృత్తియే కాని సంన్యాసం కాదు అనడం అయుక్తం.కర్మి యైన గృహస్థునికి కర్మనివృత్తి అసంభవం;సంన్యాసికి కర్మ అసంభవం;అలాంటప్పుడు కర్మనివృత్తి సంన్యాసం కాకపోవడం ఏమిటి?ధ్యానయోగాధిరూఢు డైన గృహస్థునికి కర్మనివృత్తి కుదురుతుంది అనడం యుక్తం కాదు;ఎందువల్ల ననగా-గృహస్థుడు ధ్యానయోగాధిరూఢు డవడమే అసంభవం.అందువల్ల,కర్మసంన్యాసం లేకుండా కర్మనివృత్తి కలగదు గాన శమం అనగా అర్థం సంన్యాసమే(భా.అ.ప్ర.పే.254) 3

భాష్యమ్

అథ ఇదానీం కదా యోగారూఢః భవతి ఇత్యుచ్యతే-

మూ. యదా హి నేన్ద్రియార్థేషు న కర్మస్వనుషజ్జతే,
సర్వసంకల్పసంన్యాసీ యోగారూఢస్తదోచ్యతే. 4

బాలానందిని

అథేతి:- ఇంక ఇప్పుడు యోగారూఢు డెప్పు డవుతాడో చెప్పబడుచున్నది-

ప్ర.అ. యదేతి:- యదా=ఎప్పుడు,సర్వసంకల్పసంన్యాసీ=సమస్తమైన సంకల్పాలను విడచినవాడై,ఇన్ద్రియార్థేషు=ఇంద్రియాల విషయాలయందు,న అనుషజ్జతే=సక్తుడు కాడో, కర్మసు=కర్మలయందు,న=సక్తుడు కాడో,తదా=అప్పుడు,యోగారూఢః=యోగారూఢుడుగా, ఉచ్యతే = చెప్పబడుచున్నాడు.

భాష్యమ్

యదా సమాధీయమానచిత్తః యోగీ హి ఇన్ద్రియార్థేషు ఇన్ద్రియాణామ్ అర్థాః శబ్దాదయః తేషు ఇన్ద్రియార్థేషు,కర్మసు చ నిత్య నైమిత్తికకామ్యప్రతిషిద్ధేషు,ప్రయోజనాభావబుద్ధ్యా,న అనుషజ్జతే అనుషఙ్గం కర్తవ్యతాబుద్ధిం న కరోతి ఇత్యర్థః.సర్వసంకల్పసంన్యాసీ సర్వాన్ సంకల్పాన్ ఇహాముత్రార్థకామహేతూన్ సంన్యసితుం శీలమ్ అస్య ఇతి సర్వసంకల్పసంన్యాసీ,యోగారూఢః ప్రాప్తయోగః ఇత్యేతత్,తదా తస్మిన్ కాలే,ఉచ్యతే సర్వసంకల్పసంన్యాసీ ఇతి వచనాత్ సర్వాంశ్చ కామాన్ సర్వాణి చ కర్మాణి సంన్యసేత్ ఇత్యర్థః.

బాలానందిని

యదేతి:-ఎప్పుడు ఏకాగ్రంగా చేయబడుతూన్న చిత్తం గల యోగి,ఇంద్రియాలకు విషయా లైన శబ్దాదులయందు,నిత్యములు,నైమిత్తకములు,కామ్యములు,ప్రతిషిద్ధములు అయిన కర్మలయందూ కూడ సంగాన్ని చేయడో,వీటివల్ల ప్రయోజనం లేదు అను బుద్ధిచేత కర్తవ్యతాబుద్ధిని(చేయదగినవి అనే బుద్ధిని)చేయడో అని అర్థం.ఇహలోకంలోను పరలోకంలోను ఉన్న విషయాలపై కామానికి హేతువు లైన సంకల్పాలను సంన్యసించడం (విడిచిపెట్టడం)అనే స్వభావం గల అతడు,యోగారూఢు డని,పొందబడిన యోగం కలవాడు అని అర్థం.అప్పుడు చెప్పబడును."సర్వసంకల్పసంన్యాసీ"అని చెప్పడంచేత సమస్త మైన కామాలను,కర్మలను విడువవలెను అని అర్థం.

భాష్యమ్

సంకల్పమూలాః హి సర్వే కామాః-

"సంకల్పమూలః కామో వై యజ్ఞాః సంకల్పసంభవాః"(మను.స్మృ. 2.3)

"కామ జానామి తే మూలం సంకల్పాత్త్వం హి జాయసే,
న త్వాం సంకల్పయిష్యామి సమూలో వినశిష్యసి"(శాం.ప. 177.25)

ఇత్యాదిస్మృతేః. సర్వకామపరిత్యాగే చ సర్వకర్మసంన్యాసః సిద్ధో భవతి- **"స యథాకామో భవతి తత్క్రతుర్భవతి,యత్క్రతుర్భవతి తత్కర్మ కురుతే"** (బృ.ఉ.4.4.5) ఇత్యాదిశ్రుతిభ్యః; **"యద్యద్ధి కురుతే కర్మ తత్తత్కామస్య చేష్టితమ్"** (మను.స్మృ. 2.4) ఇత్యాదిస్మృతిభ్యశ్చ. న్యాయాచ్చ-న హి సర్వసంకల్పసంన్యాసే కశ్చిత్ స్పన్దితుమ్ అపి శక్తః.తస్మాత్ "సర్వ సంకల్పసంన్యాసీ"ఇతి వచనాత్ సర్వాన్ కామాన్ సర్వాణి కర్మాణి చ త్యాజయతి భగవాన్. 4

బాలానందిని

సంకల్పేతి:-అన్ని కామాలకు మూలం సంకల్పమే కదా?**"సంకల్పమూలః ....సంభవాః"**,(కామం సంకల్పంవల్ల పుడుతుంది;యజ్ఞాలు సంకల్పవల్లనే పుడతాయి కదా). **"కామ.... భవిష్యసి"**(ఓ!కామమా!నీకు మూలం ఏదో నాకు తెలుసు;నువ్వు సంకల్పం నుండి పుట్టుచున్నావు కదా?నేను నిన్ను గూర్చి సంకల్పమే చేయును;అప్పుడు నువ్వు నాలో పుట్టనే పుట్టవు)ఇత్యాదిస్మృతులు ఈ విషయమే చెప్పుచున్నాయి.సర్వకామాలను పరిత్యజిస్తే సర్వకర్మసంన్యాసం దానంతటఅదే సిద్ధిస్తుంది. అని "**స యథా...కురుతే**"(అతడు ఏ విధమైన కామం కలవాడై ఉంటాడో అట్టి సంకల్పం కలవాడు అవుతాడు.ఎట్టి సంకల్పం

కలవాడో అట్టి కర్మ చేస్తాడు). ఇత్యాదిశ్రుతులు చెపుతున్నాయి. "యద్యద్ధి...చేష్టితమ్"(ఏ యే కర్మ చేస్తాడో అది కామంయొక్క చేష్టయే) ఇత్యాదిస్మృతులు కూడ చెప్పుచున్నాయి. న్యాయం వల్ల కూడ(యుక్త్యను సారం కూడ)ఇది ఇట్లే. సర్వసంకల్పాలు విడిచివేసిన తరువాత ఎవ్వడూ కదలడానికి కూడ సమర్థుడు కాదు కదా?అందుచేత "సర్వసంకల్పసంన్యాసీ"అని అంటూ భగవంతుడు సమస్త కామాలు, సమస్తకర్మలను విడిపింపచేస్తున్నాడు(త్యజించాలని చెపుతున్నాడు).

భా.అ.ప్ర.:-"కర్మయోగం అనగా విషయాలతో సంబంధంలేకపోవడాన్ని అభ్యసించడమే"అని శ్రీరామానుజాచార్యులు చెప్పినది యుక్తం కాదు.కారణం ఏమనగా-కర్మలను చేయడం,విషయసంబంధం లేకపోవడం అనేవి పరస్పరవిరుద్ధ మైనవి. ఇంద్రియాలకు హవిస్సు మొదలైన విషయాలతో సంబంధం లేకపోతే యజ్ఞాదికర్మలు జరుగవు కదా?(భా.అ.ప్ర.పే.255) 4

భాష్యమ్

యదా ఏవం యోగారూఢః తదా తేన ఆత్మా ఆత్మనా ఉద్ధృతః భవతి సంసారాత్ అనర్థజాతాత్ అతః-

మూ. ఉద్ధరేదాత్మనాత్మానం నాత్మానమవసాదయేత్,
ఆత్మైవహ్యాత్మనో బన్ధురాత్మైవ రిపురాత్మనః. 5

బాలానందిని

యదేతి:- ఈ విధంగా ఎప్పుడు యోగారూఢు డవుతాడో అప్పుడు అతడు తనను తానే సంసారంనుంచి,అనర్థాల సముదాయంనుంచి ఉద్ధరించుకొన్నవా డవుతాడు. అందువల్ల-

ప్ర.అ. ఉద్ధరేదితి:- ఆత్మానమ్=తనను,ఆత్మనా=తనచేతనే,ఉద్ధరేత్=ఉద్ధరించు కొనవలెను.ఆత్మానమ్=తనను,న అవసాదయేత్=క్షీణింపచేయగూడదు.ఆత్మా ఏవ=తానే, ఆత్మనః=తనకు,బన్ధుః హి=బంధువు కదా?ఆత్మైవ=తానే,ఆత్మనః=తనకు రిపుః=శత్రువు.

భాష్యమ్

ఉద్ధరేదితి:-ఉద్ధరేత్,సంసారసాగరే నిమగ్నమ్,ఆత్మనా,ఆత్మానం,తతః ఉత్ ఊర్ధ్వం హరేత్ ఉద్ధరేత్,యోగరూఢతామాపాదయేత్ ఇత్యర్థః. న ఆత్మానమ్, అవసాదయేత్,న అధః నయేత్,న అధః గమయేత్.ఆత్మా ఏవ,హి యస్మాత్,ఆత్మనః బన్ధుః.న హి అన్యః కశ్చిత్ బన్ధుః యః సంసారముక్తయే భవతి. బన్ధుః అపి తావత్ మోక్షం ప్రతి ప్రతికూలః ఏవ,స్నేహాదిబన్ధనాయతనత్వాత్. తస్మాత్ యుక్తమ్

అవధారణమ్ "**ఆత్మైవహ్యాత్మనో బన్ధుః**"ఇతి. ఆత్మైవ రిపుః శత్రుః;యః అన్యః అపకారీ బాహ్యః శత్రుః సః అపి ఆత్మప్రయుక్తః ఏవ ఇతి యుక్తమ్ ఏవ అవధారణమ్ "**ఆత్మైవ రిపుః ఆత్మనః**" ఇతి. 5

బాలానందిని

ఉద్ధరేత్ ఇతి:- సంసారసాగరంలో మునిగి ఉన్న తనను తనచేతనే,ఉత్=పైకి, హరేత్=తీయవలెను.యోగారూఢు డయే టట్లు చేయవలెను అని అర్థం.తనను క్రిందకి పోనీయగూడదు.ఎందువల్ల ననగా ఆత్మకు ఆత్మయే (తనకు తానే)బంధువు. మరొక రెవరూ సంసారముక్తి కలిగించే బంధువు కాజాలడు కదా? స్నేహం మొదలైన బంధనాలకి కారణం అవడంచేత (దారపుత్రాది)బంధువు కూడ మోక్షానికి ప్రతికూలమే.అందువల్ల "**ఆత్మైవ హ్యాత్మనోబన్ధుః**"అని అవధారణం (నిశ్చయంగా చెప్పడం)యుక్తవే.ఆత్మయేశత్రువు.బాహ్యంగా కనబడే శత్రువు కూడ తనచేత ప్రేరేపింపబడినవాడై మాత్రమే అపకారం చేస్తాడు.(పైవాడెవరో తనకు అపకారం చేస్తున్నా డంటే అందుకు కారణం తానే అని భావం).అందుచేత "**ఆత్మైవ రిపురాత్మనః**"అను అవధారణం యుక్తమే.(ఇదే;ఇది ఇంతే అని నిశ్చితంగా చెప్పడం అవధారణం.'ఏవ'అనే అవ్యయం ఈ అర్థాన్ని బోధిస్తుంది. 5

భాష్యమ్

ఆత్మైవ బన్ధుః,ఆత్మైవ రిపుః ఆత్మనః ఇత్యుక్తమ్.తత్ర కింలక్షణః ఆత్మా ఆత్మనః బన్ధుః; కింలక్షణః వా ఆత్మనః రిపుః ఇతి ఉచ్యతే-

మూ. బన్ధురాత్మాత్మనస్తస్య యేనాత్మైవాత్మనా జితః,
అనాత్మనస్తు శత్రుత్వే వర్తేతాత్మైవ శత్రువత్. 6

బాలానందిని

ఆత్మైవేతి:- ఆత్మకు ఆత్మయే బంధువు,ఆత్మయే శత్రువు అని చెప్పబడింది.ఏ విధమైనఆత్మ ఆత్మకు బంధువో ఏ విధమైన ఆత్మ శత్రువో చెప్పబడుచున్నది-

ప్ర. అ. బన్ధురితి: -యేన=ఎవనిచేత,ఆత్మనా=ఆత్మచేత,ఆత్మా=శరీరేంద్రియాది సంఘాతం,జితః=జయింపబడిందో,తస్య=వానికి,ఆత్మనః=ఆత్మకు,ఆత్మా=ఆత్మయే,బన్ధుః =బంధువు. లేదాయేన ఆత్మనా=ఏ ఆత్మచేత,తస్య ఆత్మనః=ఆ ఆత్మకు అని అర్థం. అనాత్మనః తు=జయించబడని ఆత్మకలవానికైతే,ఆత్మైవ=ఆత్మయే, శత్రువత్=శత్రువువలె,శత్రుత్వే= శత్రుత్వమునందు,వర్తేత=ఉండును.

భాష్యమ్

బన్ధుః ఆత్మా ఆత్మనః తస్య-తస్య ఆత్మనః సః ఆత్మా బన్ధుః యేన ఆత్మనా ఆత్మైవ జితః,ఆత్మా కార్యకరణసంఘాతః యేన వశీకృతః,జితేన్ద్రియః ఇత్యర్థః.అనాత్మనః తు అజితాత్మనః తు,శత్రుత్వే శత్రుభావే,వర్తేత ఆత్మైవ శత్రువత్,యథాః అనాత్మా శత్రుః ఆత్మనః అపకారీ తథా ఆత్మా ఆత్మనః అపకారే వర్తేత ఇత్యర్థః. 6

బాలానందిని

బన్ధురితి:- బన్ధురాత్మాత్మనస్తస్య-ఆ ఆత్మకు,ఆ ఆత్మ బంధవు,ఏ ఆత్మచేత ఆత్మ జయించబడినదో,ఆత్మ,అనగా,దేహేంద్రియసంఘాతం దేనిచేత జయింపబడినదో,వశం చేసికొనబడినదో,జితేంద్రియుడు అని అర్థం.అనాత్మ కైతే,ఆత్మను జయించనివాని కైతే, ఆత్మయే శత్రువు వలె,శత్రుత్వంలో ఉంటుంది.అనాత్మ యైన (తనకంటె భిన్నుడుగా ఉన్న) శత్రువు ఏ విధంగా తనకు అపకారం చేస్తాడో అట్లే, ఆత్మయే ఆత్మకు అపకారం చేసేది అవుతుంది అని అర్థం. 6

మూ. జితాత్మనః ప్రశాన్తస్య పరమాత్మా సమాహితః,
శీతోష్ణసుఖదుఃఖేషు తథా మానాపమానయోః. 7

ప్ర.అ. జితేతి:-జితాత్మనః=జయించబడిన దేహేంద్రియాదులు కలవాడు, ప్రశాన్తస్య= ప్రశాంతుడు అయినవానికి,పరమాత్మా=పరమాత్మ,సమాహితః=సాక్షాత్తు ఆత్మగా ఉంటాడు. శీతోష్ణనుఖదుఃఖేషు=శీతోష్ణములయందు, నుఖదుఃఖములయందు, తథా=అట్లే,మానాపమానయోః=మానావమానములయందు(సముడుగా ఉంటాడు).

భాష్యమ్

జితాత్మన ఇతి:- జితాత్మనః-కార్యకరణాదిసంఘాతః ఆత్మా జితః యేన సః జితాత్మా,తస్య జితాత్మనః;ప్రశాన్తస్య ప్రసన్నాన్తఃకరణస్య సతః సంన్యాసినః,పరమాత్మా సమాహితః సాక్షాత్ ఆత్మభావేన వర్తతే ఇత్యర్థః.కిం చ,శీతోష్ణసుఖదుఃఖేషు,తథా మానే అపమానే చ మానపమానయోః పూజాపరిభవయోః సమః స్యాత్. 7

బాలానందిని

జితేతి: -ఎవనిచేత ఆత్మ అనగా కార్యకరణాదిసంఘాతం,జయించబడినదో అతడు జితాత్మ.జిత్మాత్ముడు,ప్రసన్నమైన అంతఃకరణం కలవాడు అయిన సంన్యాసికి పరమాత్మ సమాహితు డవుతాడు;సాక్షాత్తు ఆత్మగానే ఉంటాడు అని అర్థం.మరియు (ఆ సంన్యాసి) శీతోష్ణాలయందు,నుఖదుఃఖాలయందు అట్లే మానవమానాలయందు,అనగా పూజా తిరస్కారములయందు సముడుగా ఉంటాడు. 7

మూ. జ్ఞానవిజ్ఞానతృప్తాత్మా కూటస్థో విజితేన్ద్రియః,
యుక్త ఇత్యుచ్యతే యోగీ సమలోష్టాశ్మకాఞ్చనః. 8

ప్ర.అ.జ్ఞానేతి:- జ్ఞానవిజ్ఞానతృప్తాత్మా=జ్ఞానంచేత(శాస్త్రజ్ఞానంచేత),విజ్ఞానంచేత (శాస్త్రార్థానుభవంచేత)తృప్తి చెందిన మనస్సు కలవాడు,కూటస్థః=స్థిరంగా ఉన్నవాడు, విజితేన్ద్రియః= జయించబడిన ఇంద్రియాలు కలవాడు,సమలోష్టాశ్మకాఞ్చనః = సమాన మైన మట్టిబెడ్డ రాయి,బంగారము కలవాడు అయిన,యోగీ=యోగి,యుక్తః ఇతి = యుక్తుడు అని,ఉచ్యతే=చెప్పబడును.

భాష్యమ్

జ్ఞానేతి:-జ్ఞానవిజ్ఞానతృప్తాత్మా-జ్ఞానం శాస్త్రోక్తపదార్థానాం పరిజ్ఞానం,విజ్ఞానం తు శాస్త్రతః జ్ఞాతానాం తథైవ స్వానుభవకరణం,తాభ్యాం జ్ఞానవిజ్ఞానాభ్యాం,తృప్తః సంజాతాలంప్రత్యయః,ఆత్మా అన్తఃకరణం యస్య సః జ్ఞానవిజ్ఞానతృప్తాత్మా కూటస్థః అప్రకమ్ప్యః భవతి ఇత్యర్థః. విజితేన్ద్రియః చ. యః ఈదృశః,యుక్తః సమాహితః ఇతి సః ఉచ్యతే కథ్యతే.సః యోగీసమలోష్టాశ్మకాఞ్చనః లోష్టాశ్మకాఞ్చనాని సమాని యస్య సః సమలోష్టాశ్మకాఞ్చనః. 8

బాలానందిని

జ్ఞానేతి:- జ్ఞానవిజ్ఞానతృప్తాత్మా-శాస్త్రోక్తవిషయాలను తెలుసుకొనడం 'జ్ఞానం'. శాస్త్రంనుండి తెలుసుకొన్న విషయాలను తెలిసినవి తెలిసినట్లు తన అనుభవంలోనికి తెచ్చుకొనడం 'విజ్ఞానం'. ఈ జ్ఞానవిజ్ఞాలచేత తృప్తి చెందిన,అనగా చాలును(మరేవీ వద్దు) అను బుద్ధి పుట్టిన,ఆత్మ,అంతఃకరణం,ఎవనికో(ఎవని అంతఃకరణం తృప్తి చెందినదో) అతడు 'జ్ఞానవిజ్ఞానతృప్తాత్ము'.అలాంటివాడు కూటస్థుడు,చలింప చేయ శక్యం కానివాడు అవుతాడు అని అర్థం.జయించబడిన ఇంద్రియాలు కలవాడు కూడ.ఎవడు ఇలాంటివాడో అతడు 'యుక్తుడు'అని సమాహితు డని,(ఆత్మయందు ఏకాగ్ర మైన చిత్తం కలవా డని) చెప్పబడతాడు.ఆ యోగి,సమలోష్టాశ్మకాంచనుడు.వాని దృష్టిలో మట్టి,బెడ్డ,ఱాయి, బంగారమూ ఇవన్నీ సమానమే. 8

భాష్యమ్

కిం చ -

మూ. సుహృన్మిత్రార్యుదాసీనమధ్యస్థద్వేష్యబన్ధుషు,
సాధుష్వపి చ పాపేషు సమబుద్ధిర్విశిష్యతే. 9

బాలానందిని

కిం చేతి:- మరియు-

ప్ర.అ. సుహృదితి:- సుహృన్మిత్రార్యుదాసీనమధ్యస్థద్వేష్యబన్ధుషు=సుహృత్తులందు, మిత్రులందు,శత్రువులందు,ఉదాసీనులందు,మధ్యస్థులందు,ద్వేష్యులందు,బంధువులయందు, సాధుష్వపి=సత్పురుషులయందు,పాపేషు చ=పాపాత్ములయందూ కూడ,సమబుద్ధిః= సమానమైన బుద్ధి కలవాడు,విశిష్యతే=విశిష్టుడుగా ఉంటాడు.

భాష్యమ్

సుహృదిత్యాది శ్లోకార్ధమ్ ఏకం పదమ్.సుహృత్ ఇతి ప్రత్యుపకారమ్ అనపేక్ష్య ఉపకారకర్తా.మిత్రం స్నేహవాన్.అరిః శత్రుః.ఉదాసీనః న కస్యచిత్ పక్షం భజతే.మధ్యస్థః యః విరుద్ధయోః ఉభయోః హితైషీ.ద్వేష్యః ఆత్మనః అప్రియః.బన్ధుః -ఇత్యేతేషు,సాధుషు శాస్త్రానువర్తిషు,అపి చ,పాపేషు ప్రతిషిద్ధకర్మకారిషు సర్వేషు ఏతేషు సమబుద్ధిః 'కః కర్తా,కిం కర్మ (కః కింకర్మా)ఇతి అవ్యాపృతబుద్ధిః ఇత్యర్థః. విశిష్యతే.విముచ్యతే ఇతి వా పాఠాన్తరమ్.యోగరూఢానామ్ అయమ్ ఉత్తమః ఇత్యర్థః

బాలానందిని

సుహృదితి:-"సుహృన్మిత్ర"ఇత్యాదిశ్లోకపూర్వార్ధం అంతా కలిసి ఒక(సమాస)పదం. ప్రత్యుపకారం అపేక్షించకుండా ఉపకారం చేసేవాడు 'సుహృత్'. స్నేహం ఉన్నవాడు 'మిత్రుడు'.శత్రువు 'అరి'.ఎవరి పక్షమూ చేరనివాడు' 'ఉదాసీనుడు'.పోట్లాడుకొనుచున్న ఇద్దరి మేలు కోరేవాడు 'మధ్యస్థుడు'.తనకు అప్రియుడు 'ద్వేష్యుడు'. సంబంధం ఉన్నవాడు 'బంధువు' వీళ్ల విషయంలోను,శాస్త్రానుసారం ప్రవర్తించే సాధువుల విషయం లోను, నిషిద్ధకర్మలు ఆచరించే పాపాత్ముల విషయంలోను వీళ్లందరివిషయంలో సమానబుద్ధి కలవాడు,"కర్త ఎవడు, "కర్మ ఏమిటి?"అని ఆలోచన చేయని బుద్ధి కలవాడు(ఎవడు ఏమి చేస్తున్నారు అనే ఆలోచన లేనివాడు) విశిష్టుడుగా ఉంటాడు."విముచ్యతే"అని పాఠ్యాంతరమైనా గ్రహించవచ్చును.(ముక్తి పొందుతాడు అని అర్థం).అతడు యోగారూఢు లందరిలోను శ్రేష్ఠుడు అని అర్థం. 9

భాష్యమ్

అతః ఏవమ్ ఉక్తఫలప్రాప్తయే-

మూ. యోగీ యుఞ్జీత సతతమాత్మానం రహసి స్థితః,
ఏకాకీ యతచిత్తాత్మా నిరాశీరపరిగ్రహః. 9

బాలానందిని

అత ఇతి:- అందువల్ల-చెప్పబడిన ఫలం లభించడంకొరకు -

ప్ర.అ. యోగీతి:- యోగీ=యోగి,ఏకాకీ=ఒంటరిగా నున్నవాడై,యతచిత్తాత్మా =వశంలో ఉంచుకొనబడిన అంతఃకరణమూ దేహమూ కలవాడై,నిరాశీః=కోరికలు లేనివాడై,అపరిగ్రహః=ధనంసచయం లేనివాడై,రహసి = రహస్యప్రదేశమునందు,స్థితః=ఉన్న వాడై,సతతమ్=ఎల్లప్పుడూ,ఆత్మానమ్=అంతఃకరణమును,యుఞ్జీత=ఏకాగ్రముగా ఉండే టట్లు చేసికొనవలెను.

భాష్యమ్

యోగీ ధ్యాయీ,యుఞ్జీత సమాదధ్యాత్,సతతం సర్వదా,ఆత్మానమ్ అన్తః కరణమ్;రహసి ఏకాన్తే గిరిగుహాదౌ స్థితః సన్,ఏకాకీ అసహాయః,రహసి స్థితః ఏకాకీ చ ఇతి విశేషణాత్ సంన్యాసం కృత్వా ఇత్యర్థః.యతచిత్తాత్మా-చిత్తమ్ అన్తఃకరణం ఆత్మా దేహశ్చ సంయతౌ యస్య సః యతచిత్తాత్మా, నిరాశీః వీతతృష్ణః,అపరిగ్రహః చ పరిగ్రహరహితః ఇత్యర్థః.సంన్యాసిత్వేఽపి త్యక్తసర్వపరిగ్రహః సన్ యుఞ్జీత ఇత్యర్థః. 10

బాలానందిని

యోగీతి:-యోగియై అనగా ధ్యానం చేస్తున్నవాడై,ఎల్లప్పుడు ఆత్మను అనగా అంతః కరణమును ఏకాగ్రం చేయవలెను.పర్వతగుహ మొదలైన ఏకాంతప్రదేశంలో ఉన్నవాడై,ఎవ్వరూ సహాయంగా లేక,"రహసి స్థితః" 'ఏకాకీ'అని విశేషణాలచేత సంన్యాసం చేసి అని అర్థం.ఎవడు తన చిత్తమును,దేహాన్నీ నియమించుకొని ఉంటాడో అతడు యతచిత్తాత్ముడు.అలాంటి వాడై,ఆశలు లేనివాడై,వస్తుసముపార్జనం లేనివాడై.

అవ. సంన్యాసిగా ఉన్నవాడు ఎలాగా అపరిగ్రహుడుగా ఉంటాడు.అలాంటప్పుడు "అపరిగ్రహః"అని మళ్లీ చెప్పడం ఎందుకు అని ఆశంకించుకొని చెపుతున్నారు- సంన్యాసిత్వేఽపీతి:-సంన్యాసి యైన కూడ ఉండడానికి అవకాశం ఉన్న సమస్తపరిగ్రహా లను,(కౌపీనాదులను కూడ)విడచి ఏకాగ్రతను అభ్యసించాలి అని అర్థం.(సంన్యాసిని కదా ధర్మకార్యాలుచేయవచ్చును అనుకొని దేవాలయనిర్మాణాదులకోసం ధనోపార్జనాదులు చేయకూడదు అని శ్రీరామరాయకవి).

భా.అ.ప్ర.:-"యోగీ=కర్మయోగనిష్ఠుడు,యతచిత్తాత్మా=నియమించుకొనబడిన చిత్తము మనస్సు కలవాడై"అను శ్రీరామానుజవ్యాఖ్య అసంగతం.కర్మయోగానికి కారకాదుల

అపేక్ష ఉంటుంది గాన కర్మయోగి విజనప్రదేశంలో ఉండడం అసంభవం.'యతచిత్తః' అన్నా 'యతమనస్కః'అన్నా కావలసిన అర్థం లభిస్తూన్నప్పుడు 'యతచిత్తమనస్కః' అని అర్థం చెప్పడం అనావశ్యకం.చిత్తం మనస్సూ ఒకటే కదా?(భా.అ.ప్ర.పే.262)10

భాష్యమ్

అథ ఇదానీం యోగం యుఞ్జతః ఆసనాహారవిహారాదీనాం యోగసాధనత్వేన నియమః వక్తవ్యః,ప్రాప్తయోగస్య లక్షణం తత్ఫలాది చ ఇత్యతః ఆరభ్యతే.తత్ర ఆసనమేవ తావత్ ప్రథమమ్ ఉచ్యతే-

మూ. శుచౌ దేశే ప్రతిష్ఠాప్య స్థిరమాసనమాత్మనః,
నాత్యుచ్ఛ్రితం నాతినీచం చైలాజినకుశోత్తరమ్. 11

బాలానందిని

అథేతి:- ఇక, ఇప్పుడు యోగాభ్యాసం చేసేవాని ఆసన-ఆహార-విహారాదుల విషయంలో,అవి ఏ విధంగా ఉంటే యోగసాధనాలుగా ఉంటాయో ఆ నియమాలు చెప్పవలసి ఉంది.యోగాన్ని పొందినవాని లక్షణమూ,దాని ఫలం మొదలైనది కూడ చెప్పవలసి ఉంది.అందుచేత ఆరంభించబడుచున్నది.అందులో ముందుగా ఆసనాన్ని గూర్చియే చెప్పబడుచున్నది.

ప్ర.అ. శుచౌ ఇతి:- శుచౌ=పవిత్రమైన,దేశే=ప్రదేశమునందు,ఆత్మనః=తనకు, స్థిరమ్=స్థిరము,నాత్యుచ్ఛ్రితమ్=ఎక్కువ ఎత్తు కానిది,నాతినీచమ్=ఎక్కువ పల్లం కానిదీ, చైలాజినకుశోత్తరమ్=వస్త్రము,అజినము,దర్భలు పైన పైన గలది అయిన,ఆసనమ్= ఆసనమును,ప్రతిష్ఠాప్య=స్థాపించుకొని-

భాష్యమ్

శుచౌ శుద్ధే,వివిక్తే స్వభావతః సస్కారతః వా,దేశే స్థానే, ప్రతిష్ఠాప్య,స్థిరమ్ అచలమ్, ఆసనమ్ ఆత్మనః,ఆసనం,నాత్యుచ్ఛ్రితం న అతీవ ఉచ్ఛ్రితమ్,నాపి అతినీచం,తచ్చ చైలాజినకుశోత్తరమ్-చైలమ్ అజినం కుశాశ్చ ఉత్తరే యస్మిన్ ఆసనే తత్ ఆసనం చైలాజినకుశోత్తరమ్;పాఠక్రమాత్ విపరీతః అత్ర క్రమః చైలాదీనామ్. 11

బాలానందిని

శుచావితి:-పవిత్రమైనది,సహజంగా కాని,సంస్కరించడంచేత గాని పరిశుద్ధమైనది, అదే విధంగా సహజంగా గాని సంస్కారంచేత గాని వివిక్త మైనది(జనరహిత మైనది)

అయిన స్థానంలో తనకు కదలకుండా స్థిరంగా ఉండే ఆసనాన్ని స్థాపించుకొని,ఎక్కువ ఎత్తైనది కానిది,ఎక్కువ పల్లం కానిదీ అయినది,దేనిమీద చైలము,అజినము, కుశలు ఒక దానిమీద ఒకటి ఉన్నవో అట్టి చైలాజినకుశోత్తర మైన ఆసనాన్ని అమర్చుకొని,ఇక్కడ వస్త్రాదులకు పాఠక్రమంకంటె (ఏ వరుసలో అవి పఠించబడ్డాయో దానికంటె) విపరీతక్రమం గ్రహించాలి.అనగా ఆసనంమీద కుశలు,వాటి పై అజినం,దానిమీద వస్త్రమూ పరచుకోవాలి.

భాష్యమ్

ప్రతిష్ఠాప్య కిమ్?-

మూ. తత్రైకాగ్రం మనః కృత్వా యతచిత్తేన్ద్రియక్రియః,
ఉపవిశ్యాసనే యుఞ్జ్యాద్యోగమాత్మవిశుద్ధయే. 12

బాలానందిని

ప్రతిష్ఠాప్యేతి:- అమర్చుకొని - ఏమిటి?

ప్ర.అ. తత్రేతి:- తత్ర=ఆ పవిత్రైకాంతప్రదేశమునందు లేదా ఆ, ఆసనే=ఆసనముపై, ఉపవిశ్య=కూర్చొని,యతచిత్తేన్ద్రియక్రియః=నియమించబడిన చిత్తక్రియలు ఇంద్రియక్రియలు కలవాడై(చిత్తం పనులు ఇంద్రియాల పనులు నిలిపివేసినవాడై),మనః=మనస్సును, ఏకాగ్రమ్=ఒకే లక్ష్యం కలదానినిగా,కృత్వా=చేసి,ఆత్మవిశుద్ధయే=అంతఃకరణశుద్ధికొరకు, యోగమ్=యోగమును, యుఞ్జ్యాత్=అభ్యసించవలెను.

భాష్యమ్

తత్ర తస్మిన్ ఆసనే ఉపవిశ్య యోగం యుఞ్జ్యాత్ కథమ్?సర్వవిషయేభ్యః ఉపసంహృత్య ఏకాగ్రం మనః కృత్వా,యతచిత్తేన్ద్రియక్రియః-చిత్తం చ ఇన్ద్రియాణి చ చిత్తేన్ద్రియాణి,తేషాం క్రియాః సంయతాః యస్య సః యతచిత్తేన్ద్రియక్రియః;సః కిమర్థం యోగం యుఞ్జ్యాత్ ఇత్యాహ-ఆత్మవిశుద్ధయే - అన్తఃకరణస్య విశుద్ధ్యర్థమ్ ఇత్యేతత్. 12

బాలానందిని

తత్రేతి:-ఆ ఆసనంపైన కూర్చుండి యోగాభ్యాసం చెయ్యాలి.ఎట్లు?మనస్సును సమస్తవిషయాలనుండి ఉపసంహరించి ఏకాగ్రంగా ఉండేటట్లు చేసి,ఎవని చిత్తముయొక్క క్రియలు ఇంద్రియాల క్రియలు నియమించబడ్డాయో అతడు యతచిత్తేన్ద్రియ క్రియుడు. అలాంటివాడై అతడు ఎందుకు యోగం సాధించాలో చెపుతున్నాడు-ఆత్మ విశుద్ధయే=అంతఃకరణశుద్ధికొరకు అని అర్థం. 12

భాష్యమ్

బాహ్యమ్ ఆసనమ్ ఉక్తమ్;అధునా శరీరధారణం కథమ్ ఇత్యుచ్యతే-

మూ. సమం కాయశిరోగ్రీవం ధారయన్నచలం స్థిరః,
సంప్రేక్ష్య నాసికాగ్రం స్వం దిశశ్చానవలోకయన్. 13

బాలానందిని

బాహ్యమితి:-బాహ్య మైన ఆసనాన్ని గూర్చి చెప్పబడింది;ఇప్పుడు శరీరం ఏ విధంగా నిలబెట్టాలో చెపుతున్నాడు-

ప్రఅ.సమమితి:-కాయశిరోగ్రీవమ్=శరీరమును శిరస్సును కంఠమును,సమమ్=సమమైనవాటినిగాను(వంగకుండా నిట్టనిలువుగా ఉన్నవాటినిగాను)అచలమ్=కదలకుండాను,ధారయన్=ధరిస్తూ,స్థిరః=స్థిరుడై,స్వమ్ః = తనదైన,నాసికాగ్రమ్=ముక్కు చివరి భాగాన్ని,సంప్రేక్ష్య=చూచి(చూస్తూ)దిశః=దిక్కులను,అనవలోకయన్ఃచూడనివాడై-

భాష్యమ్

సమం కాయశిరోగ్రీవమ్-కాయశ్చ శిరశ్చ గ్రీవా చ కాయశిరోగ్రీవమ్, తత్ సమం ధారయన్,అచలం చ,సమం ధారయతః చలనం సంభవతి,అతః విశినష్టి అచలమ్ ఇతి. స్థిరః, స్థిరః భూత్వా ఇత్యర్థః,స్వం నాసికాగ్రం సంప్రేక్ష్య సమ్యక్ ప్రేక్షణం దర్శనం కృత్వా ఇవ ఇతి ఇవశబ్దః లుప్తః ద్రష్టవ్యః,న హి స్వనాసికాగ్రసంప్రేక్షణమ్ ఇహ విధిత్సితం,కిం తర్హి?చక్షుషోఃదృష్టిసంనిపాతః;స చ అన్తఃకరణసమాధానాపేక్షః వివక్షితః. స్వనాసికాగ్రసంప్రేక్షణమ్ ఏవ చేత్ వివక్షితం మనః తత్రైవ సమాధీయేత న ఆత్మని. ఆత్మని హి మనసః సమాధానం వక్ష్యతి-"ఆత్మ సంస్థం మనః కృత్వా" (6.25)ఇతి తస్మాత్ ఇవశబ్దలోపేన అక్ష్ణోః దృష్టిసంనిపాతః ఏవ సంప్రేక్ష్య ఇత్యుచ్యతే. దిశః చ అనవలోకయన్,దిశాం చ అవలోకనమ్ అన్తరా అకుర్వన్ ఇత్యేతత్.13

బాలానందిని

సమమితి:-శరీరాన్ని శిరస్సును కంఠాన్ని సమంగా ఉండే టట్లు,కదలకుండా ఉండే టట్లు ధరిస్తూ(నిలబెట్టుకొని),వీటిని సమంగా ధరించినా కూడ కదలడానికి అవకాశం ఉంది,అందుచేత 'అచలమ్'అని విశేషించి చెపుతున్నాడు.స్థిరంగా ఉన్నవాడై, తన నాసికయొక్క అగ్రభాగాన్ని,సంప్రేక్ష్య-బాగా చూడడం చేస్తూన్నవాడు వలె అని 'ఇవ'శబ్దం లుప్తం అయినట్లు చూచుకోవాలి.ఎందుచేత ననగా ఇక్కడ నాసికాగ్రాన్ని చూడా లని విధించడం ఉద్దిష్టం

కాదు;మరే మనగా నేత్రాల చూపును క్రిందకి వంచడం మాత్రమే. అంతఃకరణాన్ని స్థిరంగా నిలపడంకోసం దాని అవసరం ఉంది. తన నాసికాగ్రాన్ని చూడడమే వివక్షితం(చెప్పదానికి ఇచ్ఛయించబడినది)అయితే మనస్సు దానిమీదనే నిలుస్తుంది కాని ఆత్మయందు నిలబడదు."ఆత్మసంస్థం మనః కృత్వా"అని మనస్సును ఆత్మయందు నిలపాలి అని చెప్పనున్నాడు. అందుచేత ఇవశబ్దం లోపించడంచేత నేత్రాల చూపును క్రిందకి దింపడం మాత్రమే 'సంప్రేక్ష్య'అని చెప్పబడుచున్నది. దిక్కులను చూడనివాడై అనగా మధ్య మధ్య దిక్కులు వైపు చూడని వాడై అని అర్థం. 13

భాష్యమ్

కిం చ -

మూ. ప్రశాన్తాత్మా విగతభీర్బ్రహ్మచారివ్రతే స్థితః,
మనః సంయమ్య మచ్చిత్తో యుక్త ఆసీత మత్పరః. 14

బాలానందిని

కిం చేతి :- మరియు -

ప్ర.అ. ప్రశాన్తేతి :- ప్రశాన్తాత్మా = ప్రశాంత మైన అంతఃకరణం గలవాడై, విగత భీః = పోయిన భయం కలవాడై, బ్రహ్మచారివ్రతే స్థితః = బ్రహ్మచారి ఆచరించవలసిన వ్రతము నందున్నవాడై, మనః = మనస్సును, సంయమ్య = వశంలో ఉంచుకొని, మచ్చిత్తః = నా యందే చిత్తం కలవాడై, మత్పరః = నేనే అత్యుత్తమలక్ష్యంగా గలవాడై, యుక్తః = సమాహితుడై, ఆసీత = కూర్చుండవలెను.

భాష్యమ్

ప్రశాన్తా - ప్రకర్షేణ శాన్తః ఆత్మా అన్తఃకరణం యస్య సః అయం ప్రశాన్తాత్మా, విగతభీః విగతభయః బ్రహ్మచారివ్రతే స్థితః బ్రహ్మచారిణః వ్రతం బ్రహ్మచర్యం గురుశుశ్రూషా భిక్షాభుక్త్యాది, తస్మిన్ స్థితః, తదనుష్ఠాతా భవేత్ ఇత్యర్థః. కిం చ మనః సంయమ్య, మనసః వృత్తీః ఉపసంహృత్య ఇత్యేతత్; మచ్చిత్తః మయి పరమేశ్వరే చిత్తం యస్య సః అయం మచ్చిత్తః, యుక్తః సమాహితః సన్, ఆసీత ఉపవిశేత్. మత్పరః. అహం పరః యస్య సః అయం మత్పరః భవతి కశ్చిద్రాగీ స్త్రీచిత్తః, న తు స్త్రియమేవ పరత్వేన గృహ్ణాతి; కిం తర్హి రాజానాం మహాదేవం రా; అయం తు మచ్చిత్తః మత్పరశ్చ. 14

బాలానందిని

ప్రశాన్తేతి :- ఎవని ఆత్మ, అంతఃకరణం, ప్రకర్షచేత శాంత మైనదో అతడు ప్రశాంతాత్మ. భయం లేనివాడై, బ్రహ్మచారివ్రతంలో ఉన్నవాడై; బ్రహ్మచర్యం, గురుశుశ్రూష, భిక్షాన్నభోజనం మొదలైనది బ్రహ్మచారివ్రతం; దానియందు ఉన్నవాడై అనుష్ఠించాలి అని అర్థం. మరియు; మనస్సును నియమించి, మనస్సు యొక్క వృత్తులను ఉపసంహరించుకొని అని అర్థం; పరమేశ్వరుడ నైన నాయందే చిత్తం ఉన్నవాడై, యుక్తుడై అనగా ఏకాగ్రచిత్తుడై, నేనే పరుడనుగా గలవాడై (నన్ను మించిన ధ్యేయవస్తువు మరేదీ లేదను అభిప్రాయం కలవాడై) (ధ్యానంలో) కూర్చుండవలెను.

అ.వ.:- 'మచ్చిత్తః'అన్నా 'మత్పరః'అన్నా అర్థం ఒకటే కదా అని ఆశంకించుకొని మత్పరః అని ప్రయోగించడంలోని అభిప్రాయం చెపుతున్నారు-భవతీతి:-ఒక కాముకుడు స్త్రీయందే చిత్తం కలవాడు కావచ్చును.కాని అతడు ఆమెయే 'పర'(అత్యుత్తమురాలు, గొప్పది)అని అనుకొనడు.రాజు లేదా మహాదేవుడు పరుడు(సర్వోత్తముడు)అనియే అత డనుకొంటాడు.ఈ యోగి యైతే మచ్చిత్తుడు మత్పరుడు కూడ.(అందుచేత పౌనరుక్త్యదోషం లేదని భావం). 14

భాష్యమ్

అథ ఇదానీం యోగఫలమ్ ఉచ్యతే-

మూ. **యుఞ్జన్నేవం సదాత్మానం యోగీ నియతమానసః,**
శాన్తిం నిర్వాణపరమాం మత్సంస్థామధిగచ్ఛతి. **15**

భాష్యమ్

అథేతి:- ఇంక ఇప్పుడు యోగానికి ఫలం చెప్పబడుచున్నది-

ప్ర.అ. యుఞ్జన్నితి:- ఏవమ్=ఈ విధంగా,సదా=ఎల్లప్పుడు,ఆత్మానమ్=మనస్సును,యుఞ్జన్=బ్రహ్మయందు ఏకాగ్రం చేస్తూ,నియతమానసః=నియమించుకొనబడిన మనస్సు గల,యోగీ=యోగి,మత్సంస్థామ్=నాయందున్న (నాచేతిలో ఉన్న),నిర్వాణ పరమామ్=మోక్షం అనే గొప్ప నిష్ఠ గల,శాన్తిమ్=శాంతిని,సమధిగచ్ఛతి=పొందుతాడు.

భాష్యమ్

యుఞ్జన్ సమాధానం కుర్వన్,ఏవం యథోక్తేన విధానేన,సదా ఆత్మానం యోగీ నియతమానసః, నియతం సంయతం మానసం మనః యస్య సః అయం

నియతమానసః శాన్తిమ్ ఉపరతిం,నిర్వాణపరమామ్-నిర్వాణం మోక్షః,తత్ పరమా నిష్ఠా యస్యాః శాన్తేః సా నిర్వాణపరమా,తాం నిర్వాణ పరమాం,మత్సంస్థాం మదధీనామ్ అధిగచ్ఛతి ప్రాప్నోతి. 15

బాలానందిని

యుఞ్జన్నితి:- ఇంతవరకు చెప్పిన విధానంలో ఎల్లప్పుడు మనస్సును బ్రహ్మయందు ఏకాగ్రంగా ఉంచుతూ,నిగ్రహించుకొనబడిన మనస్సుగల యోగి మోక్షమే పరనిష్ఠగా గలది,నా అధీనము అయిన శాంతిని పొందుతాడు. 15

భాష్యమ్

ఇదానీం యోగినః ఆహారాదినియమః ఉచ్యతే-

మూ. నాత్యశ్నతస్తు యోగోఽస్తి న చైకాన్తమనశ్నతః,
న చాతిస్వప్నశీలస్య జాగ్రతో నైవ చార్జున. 16

బాలానందిని

ఇదానీమితి:- ఇప్పుడు యోగికి ఆహారదినియమం చెప్పబడుచున్నది-

ప్ర.అ.నేతి:- అర్జున=అర్జునా అత్యశ్నతః=అధికంగా ఆహారం తినేవానికి, యోగః =యోగం నాస్తి=లేదు.ఏకాన్తమ్=పూర్తిగా,అనశ్నతః చ =తిననివానికి కూడ,న=లేదు. అతిస్వప్నశీలస్య చ=అధికంగా నిద్రించే స్వభావం కలవానికి కూడ,న=లేదు. జాగ్రతః= చ = ఎక్కువ నిద్ర లేనివానికి కూడ,న ఏవ = లేదు.

భాష్యమ్

నాత్యశ్నతః ఆత్మసంమితమ్ అన్నపరిమాణమ్ అతీత్య అశ్నతః న యోగః అస్తి; న చ ఏకాన్తమ్ అనశ్నతః యోగః అస్తి."యదు హ వా ఆత్మసంమితమన్నం తదవతి, తన్న హినస్తి, యద్భూయో హినస్తి,తద్యత్కనీయోఽన్నం న తదవతి"(శత. బ్రా. 9. 2. 1. 2)ఇతి శ్రుతేః.తస్మాద్యోగీ న ఆత్మసంమితాత్ అన్నాత్ అధికం న్యూనం వా అశ్నీయాత్.అథవా యోగినః యోగశాస్త్రే పరిపఠితాత్ అన్నపరిమాణాత్ అతి మాత్రమ్ అశ్నతః యోగః నాస్తి.

ఉక్తం హి-

"అర్ధం సవ్యఞ్జనాన్నస్య తృతీయముదకస్య తు,
వాయోః సంచరణార్థం తు చతుర్థమవశేషయేత్".

ఇత్యాదిపరిమాణమ్. తథా-న చాతిస్వప్నశీలస్య యోగః భవతి, నైవ చ అతిమాత్రం జాగ్రతః యోగః భవతి చ అర్జున. 16

బాలానందిని

నేతి:- తనకు అవసర మైన అన్నపరిమాణం మించి తినేవానికి యోగం లేదు (సిద్ధించదు). పూర్తిగా తిననివానికి కూడ యోగం లేదు. "యదు...న తదవతి"(ఏ అన్నం తనకు చాలినంతగా ఉంటుందో అది రక్షిస్తుంది. అది హింసించదు. ఏది అధికమో అది హింసిస్తుంది. ఏది తక్కువో అది రక్షించదు)అని శ్రుతి చెప్పుచున్నది. అందువల్ల యోగి తనకు కావలసినదానికంటె అధిక మైన అన్నం కాని తక్కువైనది కాని తినకూడదు. లేదా - యోగశాస్త్రంలో యోగికి ఎంత పరిపఠితమో(చెప్పబడిందో)ఆ అన్నపరిమాణంకంటె అధికంగా తినేవారికి యోగం లేదు. "అర్ధమ్...అవశేషయేత్"(ఉదరంలోని సగభాగాన్ని వ్యంజనాలతో (కూరలు మొదలైనవాటితో)కూడిన అన్నానికి కేటాయించాలి; ఉదకానికి మూడవ వంతును, గాలి సంచరించడానికి నాల్గవ వంతు మిగల్చాలి)అని పరిమాణం చెప్పబడింది కద? అట్లే ఎక్కువ స్వప్నశీలునికి యోగం లేదు, ఎక్కువ మేల్కొని ఉండేవానికి కూడ లేదు.

వి:- అన్న పరిమాణాన్ని గూర్చి మరొక శ్లోకం ఆనందగిరి వ్యాఖ్యలో ఇవ్వబడింది.

"పూరయేదశనేనార్ధం తృతీయముదకేన తు,
వాయోః సంచరణార్థాయ చతుర్థమవశేషయేత్".

భాష్యార్కప్రకాశలోని శ్లోకపాఠం మరొక విధంగా ఉంది -

"ద్వౌ భాగౌ పూరయేదన్నైః తోయేనైకం ప్రపూరయేత్;
మారుతస్య ప్రచారార్థం చతుర్థమవశేషయేత్."

అన్నింటి భావం ఒకటే.

భాష్యమ్

కథం పునః యోగః భవతి ఇత్యుచ్యతే-

మూ. యుక్తాహారవిహారస్య యుక్తచేష్టస్య కర్మసు,
యుక్తస్వప్నావబోధస్య యోగో భవతి దుఃఖహా. 17

బాలానందిని

కథమితి:- యోగం ఏ విధంగా కలుగుతుందో చెపుతున్నాడు -

ప్ర.అ. యుక్తేతి:- యుక్తాహారవిహారస్య=తగిన నియమానుకూలంగా ఉన్న ఆహార విహారములు(గమనములు)కలవాడు, కర్మసు=కర్మలయందు, యుక్తచేష్టస్య=నియతములైన

చేష్టలు(ప్రవృత్తులు)కలవాడు, యుక్తస్వప్నావబోధస్య=నియతమైన నిద్ర జాగరణము కలవాడు అయిన యోగికి,దుఃఖహా=దుఃఖాన్ని తొలగించే, యోగః=యోగం; భవతి= కలుగును.

భాష్యమ్

యుక్తాహారవిహారస్య–ఆహ్రియతే ఇతి ఆహారః,అన్నమ్;విహారః పాదక్రమః తౌ యుక్తౌ నియతపరిమాణౌ యస్య,తథా, యుక్తచేష్టస్య–యుక్తా నియతా చేష్టా యస్య కర్మసు,తథా,యుక్తస్వప్నావబోధస్య–యుక్తౌ స్వప్నశ్చ అవబోధశ్చ తౌ నియతకాలౌ యస్య తస్య యుక్తాహారవిహారస్య యుక్తచేష్టస్య కర్మసు, యుక్తస్వప్నావబోధస్య యోగః భవతి,దుఃఖహా–దుఃఖాని సర్వాణి హన్తీతి దుఃఖహా– సర్వసంసారదుఃఖక్షయకృత్ యోగః భవతీత్యర్థః. **17**

బాలానందిని

యుక్తేతి:–"ఆహ్రియతే ఇతి ఆహారః"–లోనికి తీసికొనబడేది ఆహారం,అన్నం. విహారం అనగా పాదాలతో నడవడం.ఎవనియొక్క ఆహారవిహారాలు యుక్తంగా, అనగా నియతంగా, నియమబద్ధంగా ఉంటాయో అతడు యుక్తాహారవిహారుడు.అట్లే కర్మలయందు ఎవని చేష్ట నియతంగా ఉంటుందో అతడు యుక్తచేష్టుడు.ఎవని స్వప్నావబోధాలు నియతకాలనుసారం ఉంటాయో అతడు యుక్తస్వప్నావబోధుడు.ఈ విధంగా యుక్తాహారవిహారుడు,కర్మలయందు యుక్తచేష్టుడు,యుక్తస్వప్నావబోధుడు అయిన యోగికి (ఈ మూడూ కలిసి ఉండాలి కాని ఏ ఒక్కటున్నా చాలదు అని సూచించడంకోసం మూడు విశేషణాలు మళ్లీ అనువదించబడ్డాయి);సమస్తదుఃఖాలను నశింపచేసే సర్వసంసారదుఃఖాలను క్షీణింపచేసే యోగం కలుగుతుంది అని అర్థం.

వి:–అన్నం విషయంలో నియతత్వం పూర్వశ్లోకంలో చెప్పబడింది.యోజనంకంటె ఎక్కువ నడవకూడదు అనేది గమనంలో నియతత్వం. వాఙ్నియమాదికం చేష్టల నియతత్వం. రాత్రి మొదట పది గడియలు మేల్కొనాలి;మధ్య పది గడియాలు నిద్ర పోవాలి; చివరి పది గడయిలు మేల్కొన్నాలి ఇత్యాదికం స్వప్నప్రబోధాల నియతకాలం (ఆనందగిరి). 17

భాష్యమ్

అథ అధునా కదా యుక్తః భవతి ఇత్యుచ్యతే –

మూ. **యదా వినియతం చిత్తమాత్మన్యేవావతిష్ఠతే,**
నిఃస్పృహః సర్వకామేభ్యో యుక్త ఇత్యుచ్యతే తదా. **18**

బాలానందిని

అథేతి:- ఇక ఇప్పుడు ఎప్పుడు యుక్తు డవుతాడో చెప్పబడుచున్నది-

ప్ర.అ. **యదేతి**:- వినియతమ్=నియమించబడిన,చిత్తమ్=చిత్తము,యదా=ఎప్పుడు,ఆత్మన్యేవ=ఆత్మయందే,అవతిష్ఠతే=స్థిరంగా నిలచి ఉంటుందో,తదా=అప్పుడు, సర్వకామేభ్యః=సమస్తకామాలనుండి,నిఃస్పృహః=ఆసక్తి లేని అతడు,యుక్తః ఇతి=యుక్తుడు (యోగం సాధించినవాడు)అని,ఉచ్యతే=చెప్పబడును.

భాష్యమ్

యదా వినియతం చిత్తం విశేషేణ నియతం సంయతమ్ ఏకాగ్రతామ్ ఆపన్నం చిత్తం హిత్వా బాహ్యాచిన్తామ్ ఆత్మన్యేవ కేవలే అవతిష్ఠతే,స్వాత్మని స్థితిం లభతే ఇత్యర్థః. నిఃస్పృహః సర్వకామేభ్యః-నిర్గతా దృష్టాదృష్టవిషయేభ్యః స్పృహా తృష్ణా యస్య యోగినః సః, యుక్తః సమాహితః ఇతి ఉచ్యతే, తదా తస్మిన్ కాలే. 18

బాలానందిని

యదేతి:- ఎప్పుడు విశేషంగా నిగ్రహించబడిన,ఏకాగ్రత్వాన్ని పొందిన,చిత్తం బాహ్యావిషయాలకు సంబంధించిన ఆలోచనలను విడచి కేవలమైన ఆత్మయందే ఉంటుందో, స్వాత్మయందే స్థితిని పొందుతుందో అని అర్థం;సమస్తకామాల నుండి నిఃస్పృహుడైన, దృష్టములు అదృష్టములు అయిన విషయాలనుండి (యందు) ఎవని ఆశ తొలగిపోయినదో అతడు నిఃస్పృహుడు,అట్టి యోగి, ఆ కాలంలో,'యుక్తుడు', సమాహితుడు, ఆత్మయందే లగ్నమైన చిత్తం గలవాడు,అని చెప్పబడును. 18

భాష్యమ్

తస్య యోగినః సమాహితం యచ్చిత్తం తస్య ఉపమా ఉచ్యతే-

మూ. యథా దీపో నివాతస్థో నేఙ్గతే సోపమా స్మృతా,
యోగినో యతచిత్తస్య యుఞ్జతో యోగమాత్మనః. 19

బాలానందిని

తస్యేతి:- ఆ యోగియొక్క సమాహితమైన చిత్తానికి ఉపమ చెప్పబడుచున్నది-

ప్ర.అ. **యథేతి**:-ఆత్మనః =మనస్సుయొక్క,యోగమ్=యోగమును,యుఞ్జతః= అనుష్ఠిస్తూన్న,యతచిత్తస్య=నియమించబడిన చిత్తం గల,యోగినః=యోగికి,నివాతస్థః= గాలిలేని ప్రదేశంలో ఉన్న,దీపః=దీపం,యథా=ఏ విధంగా, న ఇఙ్గతే=చలించదో,సా=అది, ఉపమా=ఉపమగా(ఉపమానంగా)స్మృతా=చెప్పబడినది.

భాష్యమ్

యథా,దీపః ప్రదీపః,నివాతస్థః నివాతే వాతవర్జితే దేశే స్థితః,న ఇఙ్గతే న చలతి,సా, ఉపమీయతే అనయా ఇతి ఉపమా,యోగజ్ఞైః చిత్తప్రచారదర్శిభిః,స్మృతా చిన్తితా. యోగినః యతచిత్తస్య సంయతాన్తఃకరణస్య,యుఞ్జతః యోగమ్ అను తిష్ఠతః, ఆత్మనః సమాధిమ్ అనుతిష్ఠతః ఇత్యర్థః. 19

బాలానందిని

యథేతి:-గాలి లేని ప్రదేశంలో ఉన్న దీపం ఏ విధంగా చలించదో అది ఉపమగా; దేనితో పోల్చబడుతుందోఅది ఉపమ,ఉపమానం,ఉపమానంగా,చిత్తముయొక్క సంచారం తెలిసిన యోగశాస్త్రనిపుణులచేత,చెప్పబడింది. నియమించబడిన అంతఃకరణం కలవాడు, మనస్సుయొక్క యోగాన్ని(ఏకాగ్రతను)అనుష్ఠిస్తున్నవాడు అయిన యోగియొక్క(పైన చెప్పిన విశేషణాలు గల యోగియొక్క) స్థిరచిత్తానికి ఆ దీపం ఉపమానం అని భావం). 19

భాష్యమ్

ఏవం యోగాభ్యాసబలాత్ ఏకాగ్రీభూతం నివాతప్రదీపకల్పం సత్ -

మూ. యత్రోపరమతే చిత్తం నిరుద్ధం యోగసేవయా,
యత్ర చైవాత్మనాత్మానం పశ్యన్నాత్మని తుష్యతి. 20

బాలానందిని

ఏవమితి:-ఈ విధంగా యోగాభ్యాసబలంచేత ఏకాగ్రమై,నివాతప్రదేశంలో ఉన్న దీపంతో సమానమై (శ్లోకంలోని 'చిత్తమ్'తో అన్వయం)-

ప్ర.అ.యత్రేతి:-చిత్తమ్=చిత్తము,యత్ర=ఏ కాలంలో,యోగసేవయా=యోగము యొక్క సేవచేత,నిరుద్ధమ్=నిరోధించబడినదై,ఉపరమతే=ఉపరమించునో(శాంతించునో, వృత్తులు లేకుండా ఉండునో),యత్ర చ = ఏ కాలంలో,ఆత్మనా=అంతఃకరణంచేత, ఆత్మానమ్ ఏవ=పరమాత్మనే,పశ్యన్=చూస్తూ,ఆత్మని=తన ఆత్మయందే,తుష్యతి=సంతోషి స్తాడో,ఆనందిస్తాడో-(20,21,22శ్లోకాలకు 23వ శ్లోకంతో అన్వయం)

భాష్యమ్

యత్ర యస్మిన్ కాలే ఉపరమతే,చిత్తమ్,ఉపరతిం గచ్ఛతి,నిరుద్ధం సర్వతః నివారితప్రచారం,యోగసేవయా యోగానుష్ఠానేన,యత్ర చైవ యస్మిన్ చ కాలే, ఆత్మనా సమాధిపరిశుద్ధేన అన్తఃకరణేన,ఆత్మానం పరం చైతన్యజ్యోతిఃస్వరూపం,పశ్యన్ ఉప లభమానః,స్వే ఏవ ఆత్మని,తుష్యతి తుష్టిం భజతే. 20

బాలానందిని

యత్రేతి:-ఏ కాలమునందు -యోగానుష్ఠానంచేత ఏ వైపునకూ కూడ వెళ్లకుండా నిరోధించబడిన చిత్తం ఉపరమిస్తుందో, ఏ కాలంలో -సమాధిచేత పరిశుద్ధ మైన అంతఃకరణంచేత చైతన్యజ్యోతిఃస్వరూప మైన పరమాత్మను సాక్షాత్కరింపచేసికొని తన ఆత్మయందే సంతృప్తిని పొందుతాడో. 20

భాష్యమ్

కిం చ -

మూ. సుఖమాత్యన్తికం యత్తద్బుద్ధిగ్రాహ్యమతీన్ద్రియమ్,
వేత్తి యత్ర న చైవాయం స్థితశ్చలతి తత్త్వతః. 21

బాలానందిని

కిం చేతి:- మరియు -

ప్ర.అ. సుఖమితి:- యత్ర=ఏ కాలంలో-బుద్ధిగ్రాహ్యమ్=బుద్ధిచేతనే గ్రహించదగినది,అతీన్ద్రియమ్=ఇంద్రియాలను దాటినది(వాటికి గోచరం కానిది)అయిన, యత్ = ఏ,ఆత్యన్తికమ్=అత్యంతము కలిగే,మిక్కుటమైన,సుఖమ్ = సుఖ మున్నదో,తత్=దానిని, వేత్తి=తెలుసుకుంటాడో(అనుభవిస్తాడో),స్థితః=ఆత్మస్వరూపంలో నిలచిన,అయమ్=ఈ యోగి, తత్త్వతః=తత్త్వంనుండి,నైవ చ చలతి=చలించడో.

భాష్యమ్

సుఖమ్ ఆత్యన్తికమ్ అత్యన్తమ్ ఏవ భవతి ఇతి ఆత్యన్తికమ్, అనన్తమ్ ఇత్యర్థః. యత్,తత్,బుద్ధిగ్రాహ్యం బుద్ధ్యైవ ఇన్ద్రియనిరపేక్షయా గృహ్యతే ఇతి బుద్ధిగ్రాహ్యమ్, అతీన్ద్రియమ్ ఇన్ద్రియగోచరాతీతమ్,అవిషయజనితమ్ ఇత్యర్థః.వేత్తి తత్ ఈదృశం సుఖమ్ అనుభవతి,యత్ర యస్మిన్ కాలే,న చ,ఏవ,అయం విద్వాన్ ఆత్మస్వరూపే స్థితః,తస్మాత్,నైవ చలతి తత్త్వతః,తత్త్వస్వరూపాత్ న ప్రచ్యవతే ఇత్యర్థ 21

బాలానందిని

సుఖమితి:- అత్యంతము కలిగేది ఆత్యంతికం-అనంత మైనది అని అర్థం.అట్టి ఏ,బుద్ధిగ్రాహ్య మైన,ఇంద్రియాల అపేక్ష లేని బుద్ధిచేత గ్రహించదగిన,అతీంద్రియ మైన, ఇంద్రియగోచరం కాని,అనగా విషయాలవల్ల కలిగినది కానిది అని అర్థం,సుఖ మున్నదో,

దానిని,ఏ కాలమునందు అనుభవిస్తాడో,ఆత్మస్వరూపంలో ఉన్న ఈ విద్వాంసుడు దాని నుండి,తత్త్వస్వరూపంనుండి చలించడో. 21

భాష్యమ్

కిం చ -

మూ. యం లబ్ధ్వా చాపరం లాభం మన్యతే నాధికం తతః,
యస్మిన్ స్థితో న దుఃఖేన గురుణాఽపి విచాల్యతే. 22

బాలానందిని

కిం చేతి:- మరియు -

ప్ర.అ. యమితి: -యమ్=దేనిని,లబ్ధ్వా=పొంది,అపరమ్=ఇతరమైన,లాభమ్=లాభమును,తతః=దానికంటె,అధికమ్=అధికమైనదానినిగా,న చ మన్యతే=తలవడో, యస్మిన్=దేనియందు,స్థితః=ఉన్నవాడై,గురుణా అపి=గొప్పదైనా కూడ,దుఃఖేన=దుఃఖంచేత,న విచాల్యతే=చలింపబడడో-

భాష్యమ్

యం లబ్ధ్వా-యమ్ ఆత్మలాభం,లబ్ధ్వా ప్రాప్య,చ,అపరమ్ అన్యత్, లాభాన్తరం తతః అధికమ్ అస్తీతి న,మన్యతే చిన్తయతి,కిం చ యస్మిన్ ఆత్మతత్త్వే,స్థితః, దుఃఖేన శస్త్రనిపాతాదిలక్షణేన,గురుణా మహతాఽపి న విచాల్యతే. 22

బాలానందిని

యమితి:- ఏ ఆత్మలాభాన్ని పొందినతరువాత దానికంటె అధికమైన మరొక లాభం ఉన్న దని భావించడో,మరియు-ఏ ఆత్మతత్త్వంలో నిలిచినవాడు ఆయుధప్రహారం వంటి గొప్ప దుఃఖంచేత కూడ చలించడో- 22

భాష్యమ్

"యత్రోపరమతే"ఇత్యాద్యారభ్య యావద్భిః విశేషణైః విశిష్టః ఆత్మావస్థావిశేషః యోగః ఉక్తః -

మూ. తం విద్యాద్దుఃఖసంయోగవియోగం యోగసంజ్ఞితమ్,
స నిశ్చయేన యోక్తవ్యో యోగోఽనిర్విణ్ణచేతసా. 23

బాలానందిని

యత్రేతి:- "యత్రోపరమతే"(6.20)ఇత్యాదికంతో ప్రారంభించి ఎన్ని విశేషణాలతో కూడిన ఆత్మయందు నిలచి ఉండడంలో ఒక విశేష మైన ఏ యోగం చెప్పబడిందో-

ప్ర.అ. తమితి:-తమ్=అట్టి,దుఃఖసంయోగవియోగమ్=దుఃఖాలతో ఉన్న సంబంధం తొలగిపోవడాన్ని,యోగసంజ్ఞితమ్=యోగమనే పేరు గలదానినిగా,విద్యాత్=తెలుసుకొనవలెను.సః=అట్టి,యోగః=యోగం,అనిర్విణ్ణచేతసా=నిర్వేదం లేని చిత్తముతో,నిశ్చయేన=నిశ్చయపూర్వకంగా,యోక్తవ్యః=అనుష్ఠింపదగినది.

భాష్యమ్

తం విద్యాత్ విజానీయాత్,దుఃఖసంయోగవియోగం-దుఃఖైః సంయోగః దుఃఖ సంయోగః,తేన వియోగః దుఃఖసంయోగవియోగః,తం దుఃఖసంయోగవియోగం, యోగః ఇత్యేవ సంజ్ఞితం విపరీతలక్షణేన విద్యాత్ విజానీయాత్ ఇత్యర్థః. యోగఫలమ్ ఉపసంహృత్య పునః.అన్వారమ్భేణ యోగస్య కర్తవ్యతా ఉచ్యతే నిశ్చయానిర్వేదయోః యోగసాధనత్వవిధ్యర్థమ్.సః యథోక్తఫలః యోగః,నిశ్చయేన అధ్యవసాయేన యోక్తవ్యః అనిర్విణ్ణచేతసా,న నిర్విణ్ణమ్ అనిర్విణ్ణమ్;అనిర్విణ్ణం కిం తత్?చేతః,తేన,నిర్వేదరహితేన చేతసా చిత్తేన ఇత్యర్థః. 23

బాలానందిని

తమితి:-దుఃఖసంయోగవియోగమ్-దుఃఖాలతో సంబంధం దుఃఖసంయోగం. అది తొలగిపోవడం దుఃఖసంయోగవియోగం.దానిని విపరీతలక్షణచేత యోగం అనే పేరు కలదానినిగా తెలునుకొనవలెను.యోగంవల్ల లభించే ఫలాన్ని ఉపసంహరించి నిశ్చయ-అనిర్వేదాలు యోగసధనా లని విధించడంకొరకు,మళ్లీ అన్వారంభంచేత,యోగం కర్తవ్య మనే విషయం చెప్పబడుచున్నది.ఇంతవరకు చెప్పబడిన ఫలం గల యోగం, నిర్వేదం చెందని(విసుగుదల నిరుత్సాహమూ) లేని మనస్సుతో,దృఢమైన నిశ్చయంతో అనుష్ఠింపదగినది.

వి. ప్రసిద్ధ మైన అర్థానికి విపరీతమైన అర్థం చెప్పినప్పుడు ఆ అర్థం విపరీత లక్షణ అనే వృత్తిచేత(శబ్దవ్యాపారంచేత)చెప్పబడింది అని అంటారు.చీలమండల లోతు నీరు కూడ లేని కాలువను చూసి ఇక్కడ నీరు చాలా లోతుగా ఉంది అన్నప్పుడు అసలు లోతే లేదని అర్థం.ఇది విపరీతలక్షణచేత లభించిన అర్థం.అసలు దుఃఖాల వియోగం గాన 'వియోగం'అనాలి.కాని విపరీతలక్షణచేత 'యోగం'అని చెప్పబడుచున్నది.

ఒక విషయాన్ని ముగించి,దానిని గూర్చిన క్రొత్త అంశం ఏదో చెప్పడంకోసం దానిని మళ్ళీ పేర్కొనడం (ముచ్చటించడం)'అన్వారంభం'.

భా.అ.ప్ర.20వ శ్లోకంలోనే 'ఉపరమతే'అనుపదానికి శ్రీరామనుజాచార్యులు అధికంగా క్రీడిస్తాడు అని అర్థం చెప్పారు.అది అయుక్తం.'ఉప'అనే ఉపసర్గ చేర్చిన 'రమ'ధాతువుకు ఉపరతి అనే అర్థమే ప్రసిద్ధం గాన మరొక అర్థం చెప్పడం క్లిష్టకల్పనం అవుతుంది.'ఉపరమేత్,'ఉపరమః','ఉపరమ్య'ఇత్యాదులలో నువ్వు కూడ మేం చెప్పిన అర్థమే చెప్పావు కదా?(భా.అ.ప్ర.పే.270) 23

భాష్యమ్

కిం చ-

మూ. సంకల్పప్రభవాన్ కామాంస్త్యక్త్వా సర్వానశేషతః,
మనసైవేన్ద్రియగ్రామం వినియమ్య సమన్తతః. 24

బాలానందిని

కిం చేతి:- మరియు -

ప్ర.అ.సంకల్పేతి:- సంకల్పప్రభవాన్=సంకల్పంనుండి పుట్టిన,సర్వాన్=సమస్తమైన,కామాన్=కామాలను,అశేషతః=ఏమీ మిగలకుండా,త్యక్త్వా=విడచి,మనసైవ=మనస్సుచేతనే,సమన్తతః=అన్ని వైపులనుండి,ఇన్ద్రియగ్రామమ్=ఇంద్రియసముదాయమును, వినియమ్య=నియమించి(నిగ్రహించి)-

భాష్యమ్

సంకల్పప్రభవాన్-సంకల్పః ప్రభవః యేషాం కామానాం తే సంకల్పప్రభవాః కామాః,తాన్,త్యక్త్వా పరిత్యజ్య,సర్వాన్,అశేషేణ నిర్లేపేన,కిం చ-మనసైవ వివేకయుక్తేన, ఇన్ద్రియగ్రామమ్ ఇన్ద్రియసముదాయం వినియమ్య నియమనం కృత్వా సమన్తతః సమన్తాత్. 24

బాలానందిని

సంకల్పేతి:-సంకల్పము వేటి ఉత్పత్తికి కారణమో అవి సంకల్పప్రభవములు.అట్టి కామాలను అన్నింటిని,వాటి గంధం కూడ లేకుండా విడిచిపెట్టి,మరియు, వివేకయుక్తమైన మనస్సుచేతనే ఇంద్రియసముదాయమును అన్ని వైపుల నియమించి-

భా.అ.ప్ర."కోరబడతాయి కాబట్టి కామాలు,అనగా విషయాలు.అవి స్పర్శజా లనీ,సంకల్పజా లనీ రెండు విధాలు.వాటిలో శీతోష్ణాదులు స్పర్శజాలు;వాటిని స్వరూపతః విడవడానికి శక్యం కాదు;పుత్రమిత్రాదివిషయాలు సంకల్పంవల్ల పుట్టినవి. వాటిని స్వరూపంచేత విడిచివేయవచ్చు.అందుచేతనే సంకల్పంవల్ల కలిగిన కామా లన్నింటినీ విడిచిపెట్టాలి'అని ఇక్కడ శ్రీరామానుజాచార్యుల వ్యాఖ్య అయుక్తం.ఇక్కడ 'స్పర్శ'అనగా త్వగింద్రియంచేత గ్రహించదగిన గుణమా లేక విషయేంద్రియాసంబంధమా? మొదటి పక్షంలో–చల్లదనం,వెచ్చదనంఅనే భేదాలు గల స్పర్శయే విషయం గాన శీతోష్ణాదికం స్పర్శవల్ల పుట్టిన విషయం అనడం కుదరదు. అంతే కాక సంకల్పజం కాని స్పర్శజవిషయం ఉన్నట్లు సంకల్పజం కాని శబ్దాదివిషయాలుకూడ ఉన్నాయి గాన విషయాలు రెండు విధా లని చెప్పడం కుదరదు.గుహలో ఉన్న యోగి శీతస్పర్శను విడవగలుగుతాడు,నీళ్లలో ఉండి ఉష్ణస్పర్శను విడవగలుగుతాడు,అందుచేత అవి స్వరూపతః విడవడానికి శక్యం కానివి అనడం కూడ యుక్తం కాదు.స్పర్శ అనగా విషయేంద్రియసంబంధమే అను రెండవ పక్షాన్ని అంగీకరించిన పక్షంలో"విషయాలు విషయేంద్రియసంబంధరూపమైన స్పర్శవల్ల పుట్టినవి" అని చెప్పినట్లవుతుంది.అది అయుక్తం.విషయేంద్రియసంబంధం విషయోత్పత్తికి పూర్వమే, దానికి కారణంగా ఉండడంచేత,విషయోత్పత్తికి పూర్వమే విషయం ఉన్నట్లు సిద్ధిస్తుంది; ఆ విధంగా ఇంద్రియాలతో సంబంధించిన విషయాలనుండి విషయాలు పుట్టుచున్నా యనగా తననుంచే తాను పుట్టుచున్నట్లు అవుతుంది.విషయోత్పత్తికి పూర్వం విషయేంద్రియసంబంధం ఎలా కుదురుతుంది?అందువల్ల స్పర్శవల్ల పుట్టేవి భోగాలే కాని విషయాలు కావు.స్పర్శలు అనగా–"మాత్రాస్పర్శాస్తు కౌన్తేయ"అనే శ్లోకం దగ్గర వివరించి చెప్పినట్లు,"స్పృశ్యన్తే ఇతి స్పర్శాః"అను నిర్వచనా న్ననుసరించి విషయాలే.

అట్లే పుత్రమిత్రాదివిషయాలు కూడ తన సంకల్పంవల్ల పుట్టినవి కావు;మరే మనగా ఈశ్వరసంకల్పంవల్ల పుట్టినవి."తదైక్షత బహు స్యాం ప్రజాయేయ"అని సంకల్పించి ఈశ్వరుడే జగత్తును సృష్టించి నట్లు శ్రుతి చెప్పుచున్నది. "తత్సృష్ట్వా తదేవానుప్రావిశత్; సచ్చ త్యచ్చా భవత్; తత్తేజ ఐక్షత, తత్తేజః సృష్ట్వా"ఇత్యాదులు ఈ అర్థాన్ని చెప్పే శ్రుతివాక్యాలు.ఈశ్వర సంకల్పంవల్ల పుట్టిన ఈ విషయాలను స్వరూపంచేత విడవడానికి శక్యం కావు.సమస్త భూమికి అధిపతి యైన సార్వభౌముడు భూరూప మైన విషయాన్ని విడవజాలడు కదా.అతడు చేయకలిగినది ఏమనగా"అది నాది"అను అభిమానాన్ని త్యజించగలడు.జీవుని సంకల్పంచేత సృజించబడేది ఆ అభిమానరూపమైన ప్రపంచమే.అదే వానికి బంధహేతువు.ఒక శరీరం విషయంలో భార్య అనే బుద్ధి లేకపోయినా, మృన్మయమైన పొలంలో నాది అను బుద్ధి లేక పోయినా అది పురుషుణ్ణి బంధించవు కదా? జీవుని సంకల్పంవల్ల పుట్టిన, ఇది నాది అనే అభిమానరూపంలో ఉండే కామమయ మైన ప్రపంచాన్నే యోగి సర్వవిధాలా విడిచిపెట్టాలి.

అది యోగానికి అడ్డుతగులుతుంది. అందుచేతనే "సంకల్పప్రభవాన్ కామాంస్త్యక్త్వా సర్వానశేషతః" అని చెప్పబడింది. ఈశ్వరసంకల్పంచేత సృజించిన,చేలాజినకుశాసనాదిరూప మైన ప్రపంచ మైతే యోగానికి సాధనమే గాన దాని నంతనూ విడవడం ఉచితం కాదు;శక్యం కూడ కాదు. అందుచేత ఇక్కడ 'కామాః'అనగా విషయాభిలాషలే కాని విషయాలు కావు. (భా.అ.ప్ర.పే.270-271) 24

మూ. శనైః శనైరుపరమేద్బుద్ధ్యా ధృతిగృహీతయా,
ఆత్మసంస్థం మనః కృత్వా న కించిదపి చిన్తయేత్. 25

ప్ర.అ. శనైరితి:- ధృతిగృహీతయా=ధైర్యంచేత గ్రహింపబడిన(ధైర్యంతో కూడిన), బుద్ధ్యా=బుద్ధితో,శనైః శనైః= మెల్ల మెల్లగా,ఉపరమేత్=ఉపరమించవలెను.(విషయాలనుండి మరలవలెను).మనః=మనస్సును,ఆత్మసంస్థమ్=ఆత్మయందు ఉన్నదానినిగా,కృత్వా=చేసి, కించిదపి=దేనినీ కూడ,న చిన్తయేత్=ఆలోచించ కూడదు.

భాష్యమ్

శనైః శనైః,న సహసా,ఉపరమేత్ ఉపరతిం కుర్యాత్,కయా? బుద్ధ్యా.కింవిశిష్ట యా? ధృతిగృహీతయా-ధృత్యా ధైర్యేణ గృహీతయా ధృతిగృహీతయా.ధైర్యేణ యుక్తయా ఇత్యర్థః. ఆత్మసంస్థమ్-ఆత్మని సంస్థితమ్,ఆత్మైవ సర్వం,న తతః అన్యత్ కించిత్ అస్తి ఇత్యేవమ్ ఆత్మసంస్థం,మనః కృత్వా న కించిదపి చిన్తయేత్.ఏష యోగస్య పరమః విధిః. 25

బాలానందిని

శనైరితి:- మెల్ల మెల్లగా,అంతే కాని హఠాత్తుగా కాదు;ఉపరతిని(విషయాలనుండి వెనుకకు మరలడం ఉపరతి)చెయ్యాలి. దేనిచేత? బుద్ధిచేత.దేనితో కూడిన బుద్ధిచేత? ధైర్యము చేత గ్రహించబడినది;ధైర్యంతో కూడినది అని అర్థం.ఆత్మసంస్థమ్-ఆత్మయందు నిలిచిన దానినిగా,సర్వము ఆత్మయే;దానికంటె భిన్న మైనది ఏదీ లేదు అను భావంతో ఆత్మ సంస్థమైన దానినిగా,మనస్సును చేసి,దేనిని గూర్చీ కూడ ఆలోచించకూడదు.ఇది యోగానికి సంబం ధించిన గొప్ప విధి. 25

భాష్యమ్

తత్రైవమ్ ఆత్మసంస్థం మనః కర్తుం ప్రవృత్తః యోగీ-

మూ. యతో యతో నిశ్చరతి మనశ్చఞ్చలమస్థితమ్,
తతస్తతో నియమ్యైతదాత్మన్యేవ వశం నయేత్. 26

బాలానందిని

తత్రేతి:- ఈ విధంగా మనస్సును ఆత్మయందు నిలుపుటకు ప్రవర్తించిన యోగి-

ప్ర.అ. **యత ఇతి:-** చఞ్చలమ్=చంచలము,అస్థిరమ్=స్థిరం కానిదీ అయిన,మనః = మనస్సు, యతః యతః=ఏ యే నిమిత్తంవలన, నిశ్చరతి=బైటకు వెడుతుందో;తతస్తతః = అలాంటి ప్రతీదానినుండీ,ఏతత్=దీనిని,నియమ్య=నియమించి(అటు పోకుండా అడ్డుకొని), ఆత్మన్యేవ=ఆత్మయందే,వశం నయేత్=వశంగా అయే టట్లు చేయవలెను.

భాష్యమ్

యతః యతః యస్మాత్ యస్మాత్ నిమిత్తాత్ శబ్దాదేః,నిశ్చరతి బహిః గచ్ఛతి, స్వభావదోషాత్,మనః,చఞ్చలమ్ అత్యర్థం చలమ్,అత ఏవ అస్థిరం,తతః తతః తస్మాత్ తస్మాత్ శబ్దాదేః నిమిత్తాత్,నియమ్య,తత్తత్ నిమత్తం యాథాత్మ్యనిరూపణేన ఆభాసీకృత్య వైరాగ్యబావనయా చ,ఏతత్ మనః ఆత్మన్యేవ వశం నయేత్ ఆత్మవశ్యతామ్ ఆపాదయేత్. ఏవం యోగాభ్యాసబలాత్ యోగినః ఆత్మన్యేవ ప్రశామ్యతి మనః. 26

బాలానందిని

యతః ఇతి:-చాలా చలించేది,అందుచేతనే అస్థిరమూ అయిన మనస్సు,దానికి స్వభావసిద్ధంగా ఉన్న దోషంవల్ల,శబ్దం మొదలైన ఏ యే నిమిత్తాన్ని పట్టి బైటకు వెళ్లి పోతుందో ఆ యా శబ్దాదినిమిత్తంనుండి దానిని అడ్డుకొని,ఆ యా విషయాల యథార్థ స్వరూపాన్ని నిరూపించడంచేత, వైరాగ్యభావనచేత కూడ వాటిని ఆభాసలనుగా,నిఃసారమైన వాటినిగా చేసి,ఆత్మయందే వశ మయే టట్లు చేసికొనవలెను. ఈ విధంగా యోగాభ్యాస బలంవల్ల యోగియొక్క మనస్సు ఆత్మలోనే శాంతిస్తుంది. 26

మూ. ప్రశాన్తమనసం హ్యేనం యోగినం సుఖముత్తమమ్,
ఉపైతి శాన్తరజసం బ్రహ్మభూతమకల్మషమ్. 27

ప్ర.అ. **ప్రశాన్తేతి:-** ప్రశాన్తమనసమ్=మిక్కిలి శాంత మైన మనస్సు కలవాడు,శాన్త రజసమ్=శాంతించిన మోహాదులు కలవాడు, అకల్మషమ్=పాపములు లేనివాడు,బ్రహ్మ భూతమ్=బ్రహ్మగా-జీవన్ముక్తుడుగా ఉన్నవాడు అయిన,ఏవమ్=ఈ,యోగినమ్=యోగిని, ఉత్తమమ్=ఉత్తమ మైన,సుఖమ్=సుఖము,ఉపైతి=వచ్చి చేరుతుంది.

భాష్యమ్

ప్రశాన్తమనసం-ప్రశాన్తం మనః యస్య సః ప్రశాన్తమనాః,తం ప్రశాన్తమనసమ్, హి ఏనం యోగినం,సుఖమ్,ఉత్తమం నిరతిశయమ్,ఉపైతి ఉపగచ్ఛతి.శాన్తరజసం ప్రక్షీణమోహాదిక్లేశరజసమ్ ఇత్యర్థః.బ్రహ్మభూతం జీవన్ముక్తం,బ్రహ్మైవ సర్వమ్ ఇత్యేవం నిశ్చయవన్తం బ్రహ్మభూతమ్,అకల్మషం ధర్మాధర్మాదివర్జితమ్. 27

బాలానందిని

ప్రశాన్తేతి:- ఎవని మనస్సు ప్రశాంత మైనదో అతడు ప్రశాంతమనస్సు;అట్టి ఈ యోగిని ఉత్తమ మైన,నిరతిశయ మైన-దేనికంటె గొప్పది లేదో అట్టి-సుఖం పొందుతుంది. శాంతరజాః అనగా శాంతించిన మోహాదిక్లేశము లనే పరాగం గలవాడు.బ్రహ్మభూతమ్-సర్వము బ్రహ్మయే అను నిశ్చయం కలిగి జీవన్ముక్తుడైనవాడు బ్రహ్మభూతుడు;అట్టి బ్రహ్మ భూతుని,ధర్మాధర్మాదికల్మషాలు లేనివానిని. 27

మూ. యుఞ్జన్నేవం సదాత్మానం యోగీ విగతకల్మషః,
సుఖేన బ్రహ్మసంస్పర్శమత్యన్తం సుఖమశ్నుతే. 28

ప్ర.అ. యుఞ్జన్నితి:-ఏవమ్=ఈ విధంగా,సదా=ఎల్లప్పుడూ,ఆత్మానమ్=ఆత్మను, యుఞ్జన్=ఏకాగ్రచిత్తంతో చూస్తున్నవాడు,విగతకల్మః=తొలగిన పాపాలు కలవాడు, అయిన, యోగీ=యోగి,సుఖేన=అనాయాసంగా,బ్రహ్మసంస్పర్శం=బ్రహ్మయొక్క స్పర్శ గల, అత్యన్తమ్=చాలా గొప్పదైన,సుఖమ్=సుఖమును,అశ్నుతే=పొందును.

భాష్యమ్

యుఞ్జన్నితి:-యుఞ్జన్ ఏవం యథోక్తేన క్రమేణ,యోగీ,యోగాన్తరాయవర్జితః సదా ఆత్మానం,విగతకల్మషః విగతపాపః,సుఖేన అనాయాసేన,బ్రహ్మసంస్పర్శం బ్రహ్మణా పరేణ సంస్పర్శః యస్య తత్ బ్రహ్మసంస్పర్శం,సుఖమ్,అత్యన్తమ్ అన్తమ్ అతీత్య వర్తతే ఇతి అత్యన్తమ్,ఉత్కృష్టం,నిరతిశయమ్,అశ్నుతే వ్యాప్నోతి. 28

బాలానందిని

యుఞ్జన్నితి:-ఈ విధంగా,చెప్పిన క్రమంలో,ఎల్లప్పుడు,యోగానికి విఘ్నాలు లేకుండా,ఆత్మయందు స్థిరుడైన యోగి,పోయిన పాపాలు కలవాడై,అనాయాసంగా, బ్రహ్మ సంస్పర్శమ్-పరబ్రహ్మతో సంస్పర్శ దేనికి ఉంటుందో అట్టి బ్రహ్మసంస్పర్శమైన,అత్యంత మైన,అంతమును దాటి ఉన్న,ఉత్కృష్ట మైన,నిరతిశయ మైన సుఖాన్ని పొందుతాడు.

భాష్యమ్

ఇదానీం యోగస్య యత్ ఫలం బ్రహ్మాత్మైకత్వదర్శనం సర్వసంసారవిచ్ఛేద కారణం తత్ ప్రదర్శ్యతే-

మూ. సర్వభూతస్థమాత్మానం సర్వభూతాని చాత్మని,
ఈక్షతే యోగయుక్తాత్మా సర్వత్ర సమదర్శనః. 29

బాలానందిని

ఇదానీమితి:- యోగానికి ఏది ఫలమో,ఏది సకలసంసారంయొక్క విచ్ఛేదానికి కారణమో అట్టి బ్రహ్మాత్మైకత్వదర్శనం ఇప్పుడు చూపబడుచున్నది-

ప్ర.అ.సర్వేతి:-సర్వత్ర=అంతటా,సమదర్శనః=సమమైన బ్రహ్మను చూచే,యోగ యుక్తాత్మా=యోగంచేత సమాహితమైన అంతఃకరణం గల యోగి,ఆత్మానమ్=తనను, సర్వభూతస్థమ్=సమస్తభూతములయందు ఉన్నవానినిగాను,సర్వభూతాని=సమస్త భూతాలను,ఆత్మని చ=తనయందు,ఈక్షతే=చూస్తాడు.

భాష్యమ్

సర్వభూతస్థం సర్వేషు భూతేషు స్థితం స్వమ్ ఆత్మానమ్,సర్వభూతాని చ ఆత్మని బ్రహ్మాదీని స్తమ్బపర్యన్తాని చ సర్వభూతాని ఆత్మని ఏకతాం గతాని ఈక్షతే, యోగయుక్తాత్మా సమాహితాన్తఃకరణః,సర్వత్ర సమదర్శనః సర్వేషు బ్రహ్మాదిస్థావరాన్తేషు విషమేషు సర్వభూతేషు,సమం నిర్విశేషం బ్రహ్మాత్మైకత్వవిషయం దర్శనం జ్ఞానం యస్య సః సర్వత్ర సమదర్శనః. 29

బాలానందిని

సర్వేతి:-తనను సమస్తభూతములయందు ఉన్నవానినిగాను,బ్రహ్మాదిస్తంబపర్యం తము లైన సర్వభూతాలను తనయందు ఏకత్వం పొందినవాటిని గాను,చూస్తాడు. యోగ యుక్తాత్మా,అనగా సమాహిత మైన అంతఃకరణం కలవాడు, బ్రహ్మాదిస్తంబపర్యంతా లైన, విషమము లైన(ఒకదానితో ఒకదానికి పోలిక లేని)సమస్తభూతములయందు సమదర్శనుడు - సమానమైన,విశేషం లేని,బ్రహ్మాత్మైకత్వానికి సంబంధించిన,(బ్రహ్మ జీవాత్మ అభిన్నమునే అను)దర్శనం అనగా జ్ఞానం కలవాడు.

భా.అ.ప్ర.:-'స్వాత్మను సమస్తభూతాలతో సమాన మైన ఆకారం కలదానిని గాను, సమస్తభూతాలను స్వాత్మతో సమాన మైన ఆకారం కలవాటిని గాను చూస్తాడు"అను

శ్రీరామానుజవ్యాఖ్య అయుక్తం."సర్వభూతస్థమ్""ఆత్మని'అని సర్వభూతాలు,ఆత్మా కూడ అధికరణంగా చెప్పబడినవి కదా.ఈ విధంగా "అన్నిభూతములయందు ఉన్న" "ఆత్మ యందు"అని అధికరణత్వం(ఆధారత్వం)స్పష్టంగా చెప్పబడి నప్పుడు దానిని విడచి మరొక అర్థం చెప్పడం అయుక్తం.ఒకే ఆత్మ ఆధారమూ,ఆధేయమూ కూడ ఎలా అవుతుంది అనడానికి అవకాశం లేదు.ఆకాశంలో ఘటం,ఘటంలో ఆకాశమూ ఉండడం చూస్తున్నాం. అట్లే ఆత్మయందు భూతాలు,భూతాలలో ఆత్మ ఉంటుం దని ఊహించడంలో అసంభావ్యం ఏదీ లేదు.సర్వాంతరం (అన్నిటి లోపల నుండేది)సర్వాధారం(అన్నింటికి ఆధార మైనది)అని శ్రుతి కూడ చెప్పుచున్నది.జాగరావస్థలో దేహాలలో ఆత్మ ఉన్నట్లు,స్వప్నంలో ఆత్మయందు రథాదిప్రపంచం ఉన్నట్లు సర్వానుభవసిద్ధమే.స్వప్నంలో ఆత్మ తప్ప రథాదులకు అధికరణ మైనది మరొక టేదీ లేదు కదా?అందుచేత"సర్వభూతస్థమ్ ఆత్మానమ్"అనేదానికి "సకల భూతాలతో సమానమైన ఆకారం గల ఆత్మను"అనీ,"సర్వభూతాని చ ఆత్మని"అనేదానికి "సకలభూతాలను ఆత్మతో సమానమైన ఆకారం కలవాటినిగా"అనీ స్వమతంమీద నుండే పట్టుదలచేత చెప్పిన అర్థం మూలవిరుద్ధం అనే విషయం శ్రీరామానుజులకు కూడ తనకు తెలియనిది కాదు.

స్వాత్మకు సర్వభూతసమానాకారత్వం చెప్పిన తరువాత సర్వభూతాలకు స్వాత్మ సమానాకారత్వం సిద్ధిస్తూనే ఉన్నది.అలాంటప్పుడు మళ్లీ అది చెప్పడం కూడ అనావశ్యకం. మరొక విషయ మేమనగా-భూతశబ్దం మహాభూతా లనే అర్థంలోను,ప్రాణు లనే అర్థంలోను,మహాభూతకార్యా లనే అర్థంలోను ప్రయోగించబడుతుంది కాని ఆత్మ అనే అర్థంలో ప్రయోగించబడదు.ఆత్మ భూతం కాదు.ప్రాణం ఉన్నదే ఆత్మ అనడం యుక్తం కాదు; ఎందువల్ల ననగా-ఆత్మకు ప్రాణాదిసంబంధం లేదు.ఆత్మకు ప్రాణం ఉపాధి గాన అది ప్రాణియే కదా అనడం కుదరదు.అప్పుడు ఆకాశానికి ఘటం ఉపాధి గాన ఆకాశాన్ని 'ఘటీ' అనవలసివస్తుంది.ఉపాధి పారమార్థికం కాదు;ఇక్కడ పరమార్థాత్మతత్త్వం ఉపదేశిం చబడుతూన్నది.ఆత్మలకు బహుత్వం ఉన్నా,జాత్యేకవచనం అంగీకరించినా అప్పుడు ఘటాదులకు వలె ఆత్మలకు పరస్పరసామ్యం ఉంటుం దని తెలివితక్కువవానికి కూడ తెలిసిన విషయమే,అందుచేత ఈ ఉపదేశం వ్యర్థం;సామ్యం ఉన్న దని తెలుసుకొనడం వల్ల ఏమీ ఫలం కూడ లేదు.అందుచేత-భూతశబ్దానికి ఆత్మ అని అర్థం చెపితే అప్పుడు ఆత్మ ఆత్మయం దుండడం అసంభవం.భూతశబ్దానికి దేహాదిసంఘాతం అని అర్థ మైనట్ల యితే అప్పుడు దానికి(దేహాదిసంఘాతానికి)ఆత్మసమానాకారత్వం కుదరదు.దేహాదికం జడం ఆత్మ చేతనం.అందువల్ల రామానుజవ్యాఖ్య నిఃసారమైనది(భా.అ.ప్ర.పే.275- 276)29

భాష్యమ్

ఏతస్యైవ ఆత్మదర్శనస్య ఫలమ్ ఉచ్యతే-

మూ. యో మాం పశ్యతి సర్వత్ర సర్వం చ మయి పశ్యతి.
తస్యాహం న ప్రణశ్యామి స చ మే న ప్రణశ్యతి. 30

బాలానందిని

ఏతస్యేతి:-ఈ ఆత్మదర్శనానికే ఫలం చెప్పబడుచున్నది-

ప్ర.అ. యః ఇతి:- యః=ఎవడు,సర్వత్ర=అంతటా,అమ్=నన్ను,పశ్యతి=చూస్తాడో, సర్వం చ=అంతనూ కూడ, మయి=నాయందు,పశ్యతి=చూస్తాడో,తస్య=వానికి,అహమ్=నేను, న ప్రణశ్యామి=నశించను(దూరం కాను),సః చ=అతడు కూడ,మే=నాకు,న ప్రణశ్యతి= దూరం కాడు.

భాష్యమ్

యః మాం పశ్యతి వాసుదేవం,సర్వస్య ఆత్మానం,సర్వత్ర సర్వేషు భూతేషు,సర్వం చ బ్రహ్మాదిభూతజాతం మయి సర్వాత్మని పశ్యతి తస్య ఏవమ్ ఆత్మైకత్వదర్శినః ,అహమ్ ఈశ్వరః,న ప్రణశ్యామి న పరోక్షతాం గమిష్యామి. స చ మే న ప్రణశ్యతి, స చ విద్వాన్ మమ వాసుదేవస్య న ప్రణశ్యతి న పరోక్షీభవతి.తస్య చ మమ చ ఏకాత్మత్వాత్. స్వాత్మా హి నామ ఆత్మనః ప్రకాశః ఏవ(ప్రియః)ఏవ భవతి;యస్మాచ్చ అహమేవ సర్వాత్మై కత్వదర్శీ ఇత్యేతత్. 29

బాలానందిని

యః ఇతి:- ఎవడు సర్వాత్మ అయినవాడను,వాసుదేవు డను అయిన నన్ను సమస్తభూతాలలో చూస్తాడో,సమస్త మైన బ్రహ్మాదిభూతసముదాయాన్ని సర్వాత్మ నైన నా యందు చూస్తాడో, ఈ విధంగా ఆత్మయొక్క ఏకత్వాన్ని చూచేవానికి ఈశ్వరుడ నైన నేను నశించను,పరోక్షత్వాన్ని పొందను,(పరోక్షకుడుగా ఉండను).ఆ విద్వాంసుడు వాసుదేవుడనైన నాకు పరోక్షుడు కాడు.మే మిద్దరమూ ఒకే ఆత్మ కదా? స్వాత్మ తనకు ప్రత్యక్షంగానే(ప్రియగానే) ఉంటుంది.ఎందువల్ల ననగా సర్వాత్మైకత్వం చూచేవాడు నేనే అని భావం.

భా.అ.ప్ర.(పూర్వపక్షం)"తస్యాహం న ప్రణశ్యామి స చ మే న ప్రణశ్యతి"అని 'వానికి నేను','నాకు అతడు'అని అంటూ భగవంతుడు ఆత్మ - పరమాత్మలకు భేదమే చెపుతున్నాడు; 'తత్"అహం'శబ్దాలకు ఏకార్థత్వం కుదరదు అన్నట్లయితే -(సిద్ధాంతం)అది

యుక్తం కాదు. "సర్వభూతస్థమాత్మానం సర్వభూతాని చాత్మని"అని సర్వభూతస్థత్వము,సర్వ భూతాంతరత్వము అనే ఏ ధర్మం ఆత్మకు చెప్పబడిందో అదే ధర్మం "యో మాం పశ్యతి సర్వత్ర సర్వం చ మయి పశ్యతి"అని పరమాత్మకు కూడ చెప్పబడింది. ధర్మభేదం ఉంటేనే ధర్మిభేదం ఉంటుంది;ధర్మభేదమే కదా ధర్ముల భేదానికి కారణం? ఈ విధంగా 'సర్వభూతస్థమ్'"యో మామ్'అను వాక్యద్వయంచేత ఆత్మపరమాత్మల ఏకత్వాన్ని ప్రతి పాదించిన భగవంతుడు 'తస్యాహమ్' ఇత్యాదివాక్యద్వయంచేత ఆత్మపరమాత్మల భేదాన్ని ఎలా ప్రతిపాదిస్తాడు?

(పూ.ప.)సర్వభూతాలలో ఉన్న ఆత్మలో ఉండడంవల్ల పరమాత్మ సర్వభూతాలలో ఉన్నా డని చెప్పబడుచున్నాడు. పరమాత్మ సర్వభూతాలకీ ఆశ్రయం గాన సర్వభూతాలు పరమాత్మయందు ఉన్నా యని చెప్పబడుచున్నది. మంచంమీద ఉన్న పరుపుమీద శయనించిన పురుషుడు మంచంమీద శయనించాడనీ,దేహానికి ఆశ్రయ మైన ఆసనానికి ఆశ్రయ మైన ఆసనానికి ఆశ్రయమైన భూమి దేహానికి ఆశ్రయం అనీ అంటాం కదా? (సి)అనడం యుక్తం కాదు. పరమాత్మ ఆత్మయందు ఆ విధంగా ఉన్నాడు, ఆత్మ పరమాత్మయందు ఆ విధంగా ఉన్నది అని చెప్పడం వ్యాసుని అభిమత మైతే"సర్వ భూతస్థమాత్మానం సర్వభూతాని చాత్మని"అన్నదాని తరువాత,"ఈక్షతే మయి చాత్మానం తమాత్మని చ మామపి"అని ఋజుమార్గంలోనే చెప్పి ఉండేవాడు కాని వక్రమార్గంలో చెప్పేవాడు కాదు. వక్రమార్గాన్ని ఆశ్రయించడం వ్యర్థం,పఠితలకు క్లేశం కూడ కలిగిస్తుంది. "యో మాం పశ్యతి సర్వత్ర"అనేదానికి"అంతటా ఉన్న ఆత్మయందు నన్ను ఎవడు చూస్తాడో"అనే అర్థం నీవంటి మహానుభావు డెవడైనా గ్రహిస్తా డేమో!అవయవాలు కాని,అవకాశం కాని లేని ఆత్మయందు పరమాత్మ ఉండడానికి అవకాశం ఎక్కడ?ఆత్మకు అవయవాలు లేవనే విషయం అందరూ అంగీకరించినదే. అదే విధంగా అవయవాలు లేనిదానియందు అవకాశం కూడ ఉండదు;నిరవయవమైన పరమాణువులో అవకాశం ఉండదు కదా?

(పూ.స). అవయవాలు లేని బ్రహ్మయందు జగత్తు ఉండడానికి మాత్రం అవకాశం ఎలా ఉంటుంది అనడానికి (స)వీలులేదు. అలా అవకాశం లేకపోవడమే మాకు ఇష్టం. బ్రహ్మ సద్వితీయం అని అంటే జగత్తు బ్రహ్మయందు ఉంది అని చెప్పడం మాకు ఇష్టమై ఉండేది. రజ్జువు మీద సర్పం భాసించి నట్లు బ్రహ్మమీద జగత్తు భాసిస్తూన్నది అని అనేక పర్యాయాలు చెప్పి ఉన్నాం కదా? దీనిచేత-నిరయవము నిరవకాశము అయిన పరమాత్మయందు ఆత్మ ఉండడం అనేది కూడా నిరాకరించబడినట్లే. పరమాత్మలో మరొక ఆత్మ ఉంటుంది అంటే ఆ ఆత్మయే పరమాత్మకు అంతరం అవుతుంది గాన నీ వుదా హరించిన అంతర్యామిబ్రాహ్మణానికి విరోధం కలుగుతుంది. అందరికి అంతర మైనది కదా

పరమాత్మ అంటే? ఈ విధంగా ఆత్మలో పరమాత్మ ఉండడం,పరమాత్మయందు ఆత్మ ఉండడం కుదరదు గాన"సర్వభూతస్థమాత్మానమ్"అనే దానిచేత,"యో మాం పశ్యతి సర్వత్ర" అనేదానిచేత ఆత్మాభిన్నమైన పరమాత్మ,పరమాత్మాభిన్నమైన ఆత్మ అంతటా ఉన్న దని చెప్పబడింది కాని వేరు వేరు ఆత్మ లున్నట్లు చెప్పబడలేదు. ఈ విధంగా అద్వైతం సిద్ధించిన తరువాత 'తస్యాహమ్'అనీ,"స చ మే"అనీ భగవంతుడు ఆత్మేశ్వరులకు భేదం ఎలా చెపుతాడు?

(పూ.ప)వెనుకటి వాక్యాలలో విరోధం లేకపోతే లేకపోవచ్చును;అయినా కూడ 'తస్య అహమ్' 'స చ మే'అని స్పష్టంగా కనబడు తూన్న ఆత్మేశ్వరభేదాన్ని కప్పిపుచ్చడం ఎలా కుదురుతుంది?(సమాధానం)శ్రోతయైన అర్జునుడు జీవేశ్వరభేదబుద్ధితో ఉన్నాడు. అందుచేత అతనిని ఉద్దేశించి 'తస్యాహమ్' 'స చ మే'అని ఉపదేశం చేయబడింది. ఇది లోకప్రసిద్ధ మైన జీవేశ్వరభేదానికి అనువాదమే కాని తత్త్వనిర్ణయం కాదు. అందుచేత-ఏ పరమాత్మ తత్త్వవేత్తకు పరోక్షమైనవాడు కాదు;ఏ తత్త్వవేత్తను లోకం జీవు డని అనుకొంటూ న్నదో అతడు ఈశ్వరునికి పరోక్షమైనవాడు కాదు అని "తస్యాహం న ప్రణశ్యామి స చ మే న ప్రణశ్యతి"అనేదానికి అర్థం. ఈ విధంగా ఒకరి కొకరు పరోక్షం కాకుండా ఉండడానికి హేతువుగా'ఆత్మైకత్వాత్"అని భాష్యకారులు చెప్పి ఉన్నారు. చైతన్యస్వరూపంచేత జీవేశ్వరులు ఒక్కటే గాన వాళ్లకు అపరోక్ష్యం అనే శంక లేదు అని భావం. "తస్యాహం న ప్రణశ్యామి"అని చెపితేనే చెప్పవలసిన విషయం చెప్పిన ట్లవుతుంది. అయినా కూడ విషయాన్ని దృఢంగా ప్రతిపాదించడం కోసం "స చ మే న ప్రణశ్యతి"అని కూడ చెప్పబడింది.

"ఎవడు అంతటా,ఆత్మవస్తువులోనూ కూడ నన్ను చూస్తాడో,నాయందు సర్వాన్నీ, ఆత్మవస్తువునూ కూడ చూస్తాడో"అను రామానుజవ్యాఖ్య అసంగతం. "ఆత్మవస్తుని", "ఆత్మవస్తు"అని మూలంలో లేని పదాలను కల్పించడానికి ప్రమాణం లేదు. అర్థం కుదర దనే విషయం విశదీకరించి ఉన్నాం(భా.అ.ప్ర.పే.277-278) 30

భాష్యమ్

పూర్వశ్లోకార్థం సమ్యగ్దర్శనమనూద్య తత్ఫలం మోక్షః అభిధీయతే-

మూ. సర్వభూతస్థితం యో మాం భజత్యేకత్వమాస్థితః,
సర్వథా వర్తమానో௨ పి స యోగీ మయి వర్తతే. 31

బాలానందిని

పూర్వేతి:- వెనుకటి శ్లోకానికి అర్థమైన సమ్యగ్దర్శనాన్ని అనువదించి దాని ఫల మైన మోక్షం చెప్పబడుచున్నది-

ప్ర. అ.సర్వేతి:- యః=ఎవడు, సర్వభూతస్థితమ్=సమస్తభూతాలలో ఉన్న, మామ్= నన్ను, ఏకత్వమ్=ఏకత్వాన్ని, ఆస్థితః=అవలంబించినవాడై(తాను నాకంటె అభిన్నుడు అను భావం కలవాడై) భజతి=సేవిస్తాడో,సః యోగీ=ఆ యోగి, సర్వథా=అన్నివిధాల,వర్తమానః అపి=ఉంటున్నా కూడ,మయి=నాయందే,వర్తతే=ఉంటున్నాడు.

వి:-30వ శ్లోకం భాష్యం చివర"స్వాత్మా హి నామాత్మనః ప్రియః భవతి" అను వాక్యం ఉంది.ఆనందగిరి పాఠం ఇదే.కాని కొందరు ప్రియః కు బదులు 'ప్రకాశః' అను పాఠం ఇచ్చారు (శ్రీరామరాయకవి). ఒకరు 'ప్రకాశః' తరువాత 'ప్రియః'అనేది బ్రాకెట్లలో ఇచ్చారు.దీని తరువాత "యస్మాచ్చాహమేవ సర్వాత్మైకత్వదర్శీ"అను వాక్యం ఉంది.దీనికి "తస్మాత్" ఏకత్వదర్శనార్థం ప్రయతితవ్యమ్" ఇతి శేషః అని ఆనందగిరి ఒక వాక్యం అధ్యాహారం చేసికొని వ్యాఖ్యానించారు.శ్రీరామరాయకవి దీనిని రాబోవు శ్లోకానికి అవతారికలోని భాగంగా గ్రహించి-ఈ వాక్యం తరువాత 'సర్వేతి'ప్రతీక గ్రహించి "ఇత్యేతత్పూర్వ శ్లోకార్థమ్"...ఇత్యాదిఅవతారికావాక్యాన్ని కొనసాగించారు. మరొకరు "యస్మాత్...ఆత్మైకత్వదర్శీ ఇత్యేతత్..."ఇత్యాది విధంగా అవతారిక తీసికొన్నారు.ఈ వ్యాఖ్యల ప్రకారం చేసిన వాక్యవిభాగంలో అర్థం సరిగా కుదరడం లేదు.అందుచేత "యస్మాచ్చ అహమేవ సర్వాత్మైకత్వదర్శీ ఇత్యేతత్" అనేదానిని 30వ శ్లోకం భాష్యం చివరి వాక్యంగా గ్రహిస్తే సమన్వయం చక్కగా బాగుం టుంది.సర్వాత్మదర్శి నేను గాన మాకు పరస్పర ప్రియత్వం,పరోక్షత్వం ఉంటుంది కదా అని భావం."ఇత్యేతత్"అనగా అని అర్థం అని అర్థం.

భాష్యమ్

సర్వథా సర్వప్రకారైః వర్తమానః అపి సమ్యగ్దర్శీ యోగీ మయి వైష్ణవే పరమే పదే,వర్తతే,నిత్యముక్తః ఏవ సః;న మోక్షం ప్రతి కేన చిత్ ప్రతిబధ్యతే ఇత్యర్థః. 31

బాలానందిని

సర్వథేతి:- అన్ని విధాలా ఉన్నా కూడ(ఎలా ప్రవర్తించినా కూడ)సమ్యగ్దర్శనం గల యోగి,నాయందు,వైష్ణవ మైన పరమస్థానమునందు,ఉంటాడు.అతడు నిత్యముక్తుడే. మోక్షవిషయంలో వానికి ఎవరూ కూడ,ఏదీ కూడ,అడ్డు తగలజాలదు అని అర్థం.

భా.అ.ప్ర. మయి వర్తతే అనగా నా సామ్యాన్నే చూస్తాడు అనే శ్రీరామానుజ వ్యాఖ్యానం అసంగతం.ఆ పదాలవల్ల ఆ అర్థం లభించ దని అందరికీ తెలుసు. ఆత్మ పరమాత్మ అనే రెండు వస్తువులను చూస్తే రత్నాన్నీ గాజుముక్కనూ చూచి నప్పుడు వాటి సామ్యం అనాయాసంగా తెలిసి నట్లు,ఆత్మపరమాత్మల సామ్యం తెలియవచ్చును.కాని అది

లేదు. సమాధిలో కాని,ఇతరసమయాలలోగాని రెండింటిని చూడడం సంభవం కాదు;కేవలం ఆత్మ మాత్రమే కనబడుతుంది. ఎందువల్ల ననగా సమాధిలో అనుభవం మాత్రమే మిగులుతుంది,ఆత్మ అనుభవరూప మైనది. చతుర్భుజత్వాదు లున్న పిండం(దేహం)పరమాత్మ అయితే ద్విభుజత్వాదులున్న పిండం జీవాత్మ అయితే అప్పుడు బుద్ధిద్వయం ఉండడానికి అవకాశం ఉండవచ్చును. అప్పుడు కూడ సామ్యానికి అవకాశం లేదు;ఎందువల్ల ననగా ఈశ్వరుని విగ్రహం అప్రాకృతం(పాంచభౌతికం కాదు),జీవవిగ్రహం ప్రాకృతం. తనకంటె భిన్నుడైన పరమాత్మ తనచేత చూడబడితే అప్పుడు పరమాత్మకు జ్ఞేయత్వం సిద్ధిస్తుంది. అయితే. "సాక్షీ చేతా కేవలో నిర్గుణశ్చ"ఇత్యాదిశ్రుతి ఇందుకు అంగీకరించదు. "నాన్యో ఽతోఽస్తి ద్రష్టా"అను శ్రుతి పరమాత్మకు జ్ఞాతృత్వాన్ని మాత్రమే అంగీకరిస్తుంది కాని జ్ఞేయత్వాన్ని చెప్పడం లేదు. పరమాత్మ జ్ఞేయ మైతే ఘటాదుల వలె జడుడు అనిత్యుడు అవుతాడు కూడ. ఈ విధంగా ఆత్మ పరమాత్మ అనే రెండు వస్తువులను చూడడానికి అవకాశం లేకపోవడంచేత వాటికి సామ్యం ఉండడానికి అవకాశం లేదు. (భా.అ. ప్ర.పే.279) 31

భాష్యమ్

కిం చాన్యత్-

మూ. ఆత్మౌపమ్యేన సర్వత్ర సమం పశ్యతి యోఽర్జున,
సుఖం వా యది వా దుఃఖం స యోగీ పరమో మతః. 32

బాలానందిని

కిం చేతి:- మరొక విషయ మేమనగా-

ప్ర.అ. ఆత్మేతి:- అర్జున=అర్జునా!సర్వత్ర=సమస్తప్రాణులయందు,సుఖం వా = సుఖమును, దుఃఖం యది వా=మరియు దుఃఖమును,ఆత్మౌపమ్యేన=తననే ఉపమానంగా చేసికొని,సమమ్=(తనతో)సమమైనదానినిగా యః=ఎవడు పశ్యతి=చూస్తాడో,సః యోగీ= ఆ యోగి,పరమః =గొప్పవాడుగా, మతః=అంగీకరించబడినాడు.

భాష్యమ్

ఆత్మౌపమ్యేన-ఆత్మా స్వయమ్ ఏవ ఉపమీయతే(అనయా)ఇతి ఉపమా. తస్యాః ఉపమాయాః భావః ఔపమ్యమ్. తేన ఆత్మౌపమ్యేన,సర్వత్ర సర్వభూతేషు,సమం తుల్యమ్, పశ్యతి యః అర్జున,సః చ కిం సమం పశ్యతీతి? ఉచ్యతే-యథా మమ సుఖమ్ ఇష్టం తథా సర్వప్రాణినాం సుఖమ్ అనుకూలమ్. వా శబ్దః చార్థే. యది వా యచ్చ దుఃఖం మమ ప్రతికూలమ్ అనిష్టం యథా తథా సర్వప్రాణినాం దుఃఖం అనిష్టం ప్రతికూలమ్,

ఇత్యేవమ్,ఆత్మౌపమ్యేన సుఖదుఃఖే అనుకూలప్రతికూలే తుల్యతయా సర్వభూతేషు సమమం పశ్యతి,న కస్య చిత్ ప్రతికూలమ్ ఆచరతి అహింసకః ఇత్యర్థః.యః ఏవమ్ అహింసకః సమ్యగ్దర్శననిష్ఠః సః యోగీ పరమః ఉత్కృష్టః,మతః అభిప్రేతః సర్వ యోగినాం మధ్యే. 32

బాలానందిని

ఆత్మేతి:- అర్జునా! ఆత్మౌపమ్యేన -దేనితో పోల్చబడుతుందో అది ఉపమ-ఆత్మయే ఉపమ. ఉపమయొక్క ధర్మం ఔపమ్యం. ఆత్మౌపమ్యేన అనగా తానే ఉపమగా,ఉపమానంగా ఉండడం.అట్టి ఆత్మౌపమ్యంచేత,అన్ని భూతాలయందు,సమానంగా,ఎవడు చూస్తాడో. అతడు ఏమి చూస్తాడు?చెప్పబడుచున్నది(లేదా ఏమి చూస్తాడో చెప్పబడుచున్నది)"నాకు సుఖం ఎలా ఇష్టమో అట్లే సర్వప్రాణులకూ కూడ అనుకూల మైనది". 'వా'శబ్దం 'చ' అర్థంలో ప్రయోగించబడింది.యది వా-మరియు "ఏ దుఃఖం నాకు ప్రతికూలమో, అనిష్టమో,అట్లే సమస్తప్రాణులకు దుఃఖం అనిష్టం;ప్రతికూలమైనది."-ఈ విధంగా ఆత్మౌపమ్యంతో, అనుకూలప్రతికూల లైన సుఖదుఃఖాలను సమస్త భూతాలలో సమంగా చూస్తాడు;ఎవనికీ ప్రతికూలంగా చేయడు.హింసించడు అని అర్థం.ఈ విధంగా అహింస కుడై ఎవడు సమ్యగ్దర్శననిష్ఠుడై ఉంటాడో ఆ యోగి ఉత్కృష్టంగా,అందరి యోగులలో ఉత్తముడుగా,ఇష్టుడు (చెప్పబడుచున్నాడు).

భా.అ.ప్ర.:- శ్రీరామానుజాచార్యు లిక్కడ-"ఎవడు తన పుత్రజన్మమరణాదికాన్ని పరుల పుత్రజన్మమరణాదులతో సమానమైనదానినిగా చూస్తాడో"అని చేసిన వ్యాఖ్య అసంగతం.అర్థం బాగానే ఉన్నా మూలంలో ఈ అర్థాన్ని బోధించే పదాలు లేవు.మూలంలో ఆత్మయే ఉపమానంగా చెప్పబడింది.పరుల పుత్రజన్మమరణాదులతో కూడ తనకు సంబంధం లేదని చెప్పడం కష్టం.పరునికి(శత్రువుకు) పుత్రుడు జన్మిస్తే తనకు వైమనస్యం, మరణిస్తే సంతోషం ఇత్యాదివికారాలు కలగడం కూడ కనబడుతూన్నది.అట్లే తనకంటె పరుడైన బావమొదలైన వాళ్లకు పుత్రజన్మమరణాదులు కలిగినప్పుడు సుఖదుఃఖరూప వికారం కనబడుతూన్నది.ఆ వికారాలు కనబడడంచేత వానితో వీనికున్న సంబంధం ఊహించబడు తున్నది.సంబంధం లేకపోతే కార్యం పుట్టదు కదా?స్వపుత్రజన్మమరణాదికాన్ని శత్రుపుత్రజన్మమరణాదికం వలె చూడాలి అని చెపితే స్వపుత్రజన్మమరణాల విషయంలో కూడ దుఃఖసుఖాలు కర్తవ్యములు అని చెప్పినట్లు అవుతుంది. స్వబంధువుల పుత్ర జన్మమరణాదుల వలె అని అర్థం గ్రహిస్తే-తెలివితక్కువవాడు కూడ స్వబంధువుల పుత్రో దయాదికంవల్ల వలె స్వపుత్రోత్పత్త్యాదులలో కూడ సుఖాదికం తప్పక పొందుతాడు. అందువల్ల దీనిచేత స్వపుత్రజన్మమరణాదులకు పరపుత్రజన్మమరణాదులతో సామ్యం చెప్పబడుచున్నది

అని చెప్పడం కుదరదు. పోనీ ఇక్కడ పరు డనగా శత్రువూ కాదు, మిత్రుడూ కాదు,పరుడనగా ఉదాసీనుడు,వాని పుత్రజన్మమరణాలవల్ల తన కేమీ వికారం కలగదు కదా అనడం కూడ యుక్తం కాదు;సర్వసముడు;భూతదయాశాలీ అయిన పురుషునికి పరపుత్రమరణం కూడ దుఃఖం కలిగిస్తుంది కదా? అలా కాకపోతే అతడు దయావిహీను డవుతాడు. అందువల్ల- తనకు పుత్రజన్మ సుఖకరంగానూ,వాని మరణం దుఃఖకరణంగాను ఏ విధంగా ఉంటుందో అల్లే ఇతరునికి కూడ అని తెలిసికొని ఎవడు పరునకు పుత్రద్రోహం మొదలైన అనిష్టం చేయడో ఆ యోగి గొప్పవాడు అనియే శ్లోకానికి అర్థం.(భా.అ.ప్ర.పే.281) 32

భాష్యమ్

ఏతస్య యథోక్తస్య సమ్యగ్దర్శనలక్షణస్య యోగస్య దుఃఖసంపాద్యతామ్ ఆలక్ష్య శుశ్రూషుః ధ్రువం తత్ప్రాప్త్యుపాయమ్-

అర్జున ఉవాచ-

మూ. యోఽయం యోగస్త్వయా ప్రోక్తః సామ్యేన మధుసూదన,
ఏతస్యాహం న పశ్యామి చఞ్చలత్వాత్ స్థితిం స్థిరామ్. 33

బాలానందిని

ఏతస్యేతి:- ఇంతవరకూ చెప్పబడిన సమ్యగ్దర్శనరూప మైన యోగం సంపాదించడం చాలా కష్టం అనే విషయం చూచి,దానిని నిశ్చితంగా పొందడానికి తగిన ఉపాయాన్ని తెలుసుకొనదలచినవాడై-

అర్జునుడు ఇలా అన్నాడు -

ప్ర.అ. య ఇతి:- మధుసూదన=శ్రీకృష్ణా! త్వయా=నీచేత,సామ్యేన=సమత్వంతో కూడిన,యః=ఏ,అయమ్=ఈ,యోగః=యోగం,ప్రోక్తః=చెప్పబడినదో,చఞ్చలత్వాత్= మనస్సు చంచలమైన దవడంవల్ల,ఏతస్య=ఈ యోగంయొక్క స్థిరామ్=స్థిరమైన,స్థితిమ్=స్థితిని, న పశ్యామి=నేను చూచుటలేదు.

భాష్యమ్

యః అయం యోగః త్వయా ప్రోక్తః.సామ్యేన సమత్వేన,హే!మధుసూదన! ఏతస్య యోగస్య,అహం,న పశ్యామి న ఉపలభే,చఞ్చలత్వాత్ మనసః కిమ్? స్థిరామ్ అచలాం,స్థితిమ్.ప్రసిద్ధమేతత్. 33

బాలానందిని

యః ఇతి:–శ్రీకృష్ణా! సమత్వంతో కూడిన ఏ యోగాన్ని గూర్చి నువ్వు చెప్పావో, అది మనస్సు చంచల మైన దవడంవల్ల, స్థిరంగా నిలుస్తుం దని నేను అనుకోనను. ఈవిషయం ప్రసిద్ధమే. 33

మూ. చఞ్చలం హి మనః కృష్ణ ప్రమాథి బలవద్దృఢమ్,
తస్యాహం నిగ్రహం మన్యే వాయోరివ సుదుష్కరమ్. 34

ప్ర.అ. చఞ్చలమితి:– కృష్ణ=కృష్ణా! మనః=మనస్సు, ప్రమాథి=పీడించే స్వభావం గలది, బలవత్=బలం గలది, దృఢమ్=చాలా దృఢ మైనది. చఞ్చలం హి=చంచలము కదా? తస్య=దానియొక్క నిగ్రహమ్=నిగ్రహించడాన్ని, వాయోః=ఇవ=వాయువుయొక్క నిగ్రహమును వలె, సుదుష్కరమ్=చాలా చేయ శక్యం కానిదానినిగా, అహమ్=నేను, మన్యే=తలచుచున్నాను.

భాష్యమ్

చఞ్చలమితి:–చఞ్చలం హి మనః. కృష్ణేతి లేఖనార్థస్య రూపమ్; భక్తజనపాపాది దోషకర్షణాత్ కృష్ణః. న కేవలమ్ **అత్యర్థం** చఞ్చలం, ప్రమాథి చ ప్రమథనశీలం, ప్రమథ్నాతి శరీరమ్ ఇన్ద్రియాణి చ విక్షిపతి, పరవశీకరోతి. కిం చ బలవత్, న కేన చిత్ నియన్తుం శక్యమ్. కిం చ దృఢం తన్తునాగవత్ అచ్ఛేద్యం; తస్య ఏవంభూతస్య మనసః, అహం, నిగ్రహం నిరోధం, మన్యే, వాయోరివ–యథా వాయోః దుష్కరః నిగ్రహః తతోఽపి మనసః దుష్కరం మన్యే ఇత్యభిప్రాయః. 34

బాలానందిని

చఞ్చలమితి:– మనస్సు చంచలము కదా? వ్రాయుట గీయుట ఈడ్చుట అను అర్థం గల కృషధాతువునుండి కృష్ణ అను పదం నిష్పన్న మైనది. భక్తజనుల పాపాలు మొదలైన దోషాలను లాగుటవలన కృష్ణుడు. ఇది కేవలం చంచలమే కాదు, ప్రమథనశీలం గలది; మథించివేసే స్వభావం గలది. శరీరాన్ని ఇంద్రియాలను విక్షిప్తములనుగా, చెదిరిపోయే టట్లుగా, చేసి పరవశ మైనవాటిగా చేస్తుంది. మరియు బలం కలది. ఎవనిచేతా నియమించ డానికి శక్యం కానిది. మరియు–దృఢమైనది; తంతునాగం వలె(సముద్రంలో సంచరించే త్రాడు వలె ఉండే అతి బలం గల ఒక జంతువు. దీనికి వరుణపాశం అని కూడ పేరు)ఛేధించ డానికి శక్యం కానిది. ఇలాంటిదైన ఆ మనస్సును నిరోధించడం, వాయువును నిరోధించడం వలె, చేయ శక్యంకానిది. వాయువుయొక్క నిగ్రహం ఎలా చేయ శక్యం కాదో అట్లే మనస్సు యొక్క నిగ్రహం చేయ శక్యం కానిది అని అభిప్రాయం. 34

శ్రీభగవానువాచ-

భాష్యమ్

ఏవమేతత్ యథా బ్రవీషి-

మూ. **అసంశయం మహాబాహో మనో దుర్నిగ్రహం చలమ్,**
అభ్యాసేన తు కౌన్తేయ వైరాగ్యేణ చ గృహ్యతే. 35

బాలానందిని

శ్రీభగవంతుడు పలికెను- నువ్వు అంటూన్నది నిజమే -

ప్ర.అ. మహాబాహో=గొప్ప బాహువులు కలవాడా! కౌన్తేయ=అర్జునా!అసంశయమ్ = నిఃసంశయంగా,చలమ్=చంచలమైన,మనః=మనస్సు, దుర్నిగ్రహమ్=నిగ్రహించడానికి శక్యం కానిది.తు=కాని,అభ్యాసేన=అభ్యాసంచేత,వైరాగ్యేణ చ=వైరాగ్యంచేత,గృహ్యతే= గ్రహించబడును.

భాష్యమ్

అసంశయం నాస్తి సంశయః,మనః దుర్నిగ్రహం చలమ్ ఇత్యత్ర, హే, మహాబాహో!కిం తు,అభ్యాసేన తు-అభ్యాసో నామ చిత్తభూమౌ కస్యాం చిత్ సమాన ప్రత్యయా వృత్తిః చిత్తస్య.వైరాగ్యం నామ దృష్టాదృష్టభోగేషు దోషదర్శనాభ్యాసాత్ వైతృష్ణ్యం,తేన చ వైరాగ్యేణ గృహ్యతే విక్షేపరూపః ప్రచారః చిత్తస్య ఏవం తత్ మనః గృహ్యతే నిగృహ్యతే,నిరుధ్యతే ఇత్యర్థః. 33

బాలానందిని

అసంశయమితి:- ఓ!మహాబాహూ!మనస్సు నిగ్రహింప శక్యం కానిది.చంచలమైనది అనడంలో సందేహం లేదు.కాని అభ్యాసంచేత,అభ్యాస మనగా-ఒకానొక చిత్త భూమియందు(విష్ణుమూర్త్యాదిచిత్తవిషయమునందు)చిత్తంలో సమానమైన జ్ఞానంయొక్క (ఒకే జ్ఞానంయొక్క)ఆవృత్తి చేయడం.వైరాగ్యం అనగా చూచినవి చూడనివి అయిన ఇష్టములైన భోగాలలో ఉండే దోషాలను చూడడం అలవాటు చేసికొనడంవల్ల,ఆశ లేక పోవడం.ఆ వైరాగ్యంచేత విక్షేపరూపమైన చిత్తప్రచారం,(చిత్తం అటూ ఇటూ పారిపోతూ ఉండడం) గ్రహించబడుతుంది ఈ విధంగా ఆ మనస్సు నిగ్రహించబడుతుంది;నిరోధించబడుతుంది అని అర్థం. 35

భాష్యమ్

యః పునః అసం యతాత్మా తేన-

మూ. అసంయతాత్మనా యోగో దుష్ప్రాప ఇతి మే మతిః,
వశ్యాత్మనా తు యతతా శక్యోఽవాప్తుముపాయతః. 36

బాలానందిని

యః ఇతి:- ఎవడైతే అంతఃకరణాన్ని నిగ్రహించుకొనడో వానిచేత-

ప్ర.అ. అసంయతేతి:-అసంయతాత్మనా=నిగ్రహించుకొనబడని అంతఃకరణ కలవానిచేత,(అంతఃకరణం నిగ్రహించుకొననివానిచేత),యోగః=యోగం,దుష్ప్రాపః= పొందడానికి శక్యం కాదు,ఇతి=అని,మే=నాయొక్క మతిః=అభిప్రాయము. యతతా= ప్రయత్నంచేసే, వశ్యాత్మనా తు=స్వాధీన మైన మనస్సు కలవానిచేతనైతే,ఉపాయతః= ఉపాయంవల్ల,అవాప్తుమ్=పొందుటకు,శక్యః=శక్య మైనది.

భాష్యమ్

అసంయతాత్మనా అభ్యాసవైరాగ్యాభ్యామ్ అసంయతః ఆత్మా అన్తఃకరణం యస్య సః అయమ్ అసంయతాత్మా,తేన అసంయతాత్మనా.యోగః దుష్ప్రాపః దుఃఖేన ప్రాప్యతే ఇతి మే మతిః.యః తు పునః,వశ్యాత్మా అభ్యాసవైరాగ్యాభ్యాం వశ్యత్వమ్ ఆపాదితః ఆత్మా మనః యస్య సః అయం వశ్యాత్మా, తేన వశ్యాత్మనా తు యతతా భుయోఽపి ప్రయత్నం కుర్వతా,శక్యః అవాప్తుం యోగః,ఉపాయతః యథోక్తాత్ ఉపాయాత్. 36

బాలానందిని

అసంయతేతి:-అభ్యాసవైరాగ్యాలచేత ఎవని అంతఃకరణం నిగ్రహించబడలేదో అట్టి అసంయతాత్మచేత,యోగం, చాలా కష్టంచేత పొందబడుతుంది అని (పొంద శక్యం కాదు అని)నా అభిప్రాయం.ఎవ డైతే వశ్యాత్మయో,అభ్యాసవైరాగ్యాలచేత వశంలో ఉంచు కొనబడిన మనస్సు కలవాడో,మళ్లీ మళ్లీ ప్రయత్నం చేసే ఆ వశ్యాత్మునిచేత,యోగం పైన చెప్పిన ఉపాయంచేత పొంద శక్య మైనది. 36

భాష్యమ్

తత్ర యోగాభ్యాసాఙ్గీకరణేన పరలోకేహలోకప్రాప్తినిమిత్తాని కర్మాణి సంన్యస్తాని, యోగసిద్ధిఫలం చ మోక్షసాధనం సమ్యగ్దర్శనం న ప్రాప్తమ్ ఇతి యోగీ యోగమార్గాత్ మరణకాలే చలితచిత్తః ఇతి తస్య నాశమ్ ఆశఙ్క్య-

అర్జున ఉవాచ -

మూ. అయతిః శ్రద్ధయోపేతో యోగాచ్చలితమానసః,
అప్రాప్య యోగసంసిద్ధిం కాం గతిం కృష్ణ గచ్ఛతి. 37

బాలానందిని

తత్రేతి:-ఇది ఇలా ఉండగా-ఒకడు యోగాభ్యాసాన్ని స్వీకరించి పరలోకప్రాప్తికీ, ఇహలోకప్రాప్తికీ నిమిత్తా లైన కర్మలను విడిచివేశాడు. యోగసిద్ధియొక్క ఫలమైన, మోక్ష సాధన మైన సమ్యగ్జ్ఞానం కలగలేదు. అలాంటి యోగి మనస్సు మరణకాలంలో చలించి పోయింది. వానికి నాశం కలుగుతుం దని ఆశంకించి అర్జును డిలా అన్నాడు-

ప్ర. అ. అయతిః ఇతి:- కృష్ణ=కృష్ణా! అయతిః=ప్రయత్నం చేయనివాడు, శ్రద్ధయా = శ్రద్ధతో, ఉపేతః=కూడినవాడు, యోగాత్=యోగంనుండి, చలితమానసః=చలించిన మనస్సు కలవాడు అయిన పురుషుడు, యోగసంసిద్ధిమ్=యోగసిద్ధిని, అప్రాప్య=పొందక, కాం గతిమ్=ఏ గతిని, గచ్ఛతి=పొందును?

భాష్యమ్

అయతిః అప్రయత్నవాన్ యోగమార్గే, శ్రద్ధయా ఆస్తిక్యబుద్ధ్యా చ ఉపేతః, యోగాత్ అన్తకాలేఽపి చలితం మానసం యస్య సః చలితమానసః భ్రష్టస్మృతిః. సః అప్రాప్య యోగసంసిద్ధిం యోగఫలం సమ్యగ్దర్శనం కాం గతిం హే కృష్ణ గచ్ఛతి. 37

బాలానందిని

అయతిరితి:-యోగమార్గంలో ప్రయత్నం చేయనివాడు, ఆస్తిక్యబుద్ధి కలవాడు, మరణసమయంలో కూడ యోగంనుంచి చలించిన మనస్సు కలవాడు, స్మృతి తొలగి పోయినవాడు అయిన పురుషుడు, కృష్ణా! యోగానికి ఫలమైన సమ్యగ్దర్శనం పొందకుండా, ఏ గతిని పొందుతాడు? 37

మూ. కచ్చిన్నోభయవిభ్రష్టశ్ఛిన్నాభ్రమివ నశ్యతి,
అప్రతిష్ఠో మహాబాహో విమూఢో బ్రహ్మణః పథి. 38

ప్ర. అ.:- మహాబాహో=మహాబాహూ! అప్రతిష్ఠః=ఆశ్రయం లేనివాడై, బ్రహ్మణః =బ్రహ్మయొక్క పథి=మార్గమునందు, విమూఢః=మూఢుడై(దిక్కు తోచనివాడై), ఉభయవిభ్రష్టః =రెండింటినుండి (కర్మఫలంనుండీ యోగఫలంనుండీ భ్రష్టుడై) ఛిన్నాభ్రమ్ ఇవ= చెదరగొట్టబడిన మేఘం వలెన నశ్యతి కచ్చిత్=నశించిపోదు కదా?

భాష్యమ్

కచ్చిత్ ఇతి:-కచ్చిత్ కిమ్,న ఉభయవిభ్రష్టః కర్మమార్గాత్ యోగమార్గాచ్చ విభ్రష్టః సన్,ఛిన్నాభ్రమ్ ఇవ,నశ్యతి కిం వా న నశ్యతి,అప్రతిష్ఠః నిరాశ్రయః, హే మహాబాహో! విమూఢః సన్,బ్రహ్మణః పథి బ్రహ్మప్రాప్తిమార్గే. 38

బాలానందిని

కచ్చిదితి:- ఓ!మహాబాహూ!ఉభయభ్రష్టుడై,కర్మమార్గనుంచి యోగమార్గంనుంచీ కూడ భ్రష్టుడై,చెల్లాచెదురుచేయబడిన మేఘం వలె,నశిస్తాడా,లేక నశించడా?అప్రతిష్ఠుడై, అనగా ఆశ్రయం లేనివాడై,బ్రహ్మను పొందే మార్గంలో మూఢుడై.

భా.అ.ప్ర. స్వర్గాదులకు సాధనమైన కర్మ,ఫలాభిసంధి లేని ఈ పురుషునికి, స్వర్గాదిఫలం ఇవ్వలేకపోవడంచేత ఆశ్రయం కాకుండా అయిపోతుంది గాన ఇతడు అప్రతిష్ఠుడు అవుతాడు. ప్రారంభించిన బ్రహ్మమార్గంలో విమూఢుడై ఆ మార్గంనుండి చ్యుతుడైపోతాడు.ఈ విధంగా అతడు ఉభయభ్రష్టుడు"అని శ్రీరామానుజవ్యాఖ్య.అనుచితం. స్వర్గాదులకు సాధన మైనా కూడ కర్మ ఫలాభిసంధి లేకుండా చేసినప్పుడు చిత్తశుద్ధి; దురితక్షయము మొదలైన మహాఫలాన్ని ఇస్తుంది. ఈశ్వరార్పణబుద్ధితో చేసిన కర్మకు కూడ గొప్ప ఫలం ఉంటుంది.స్వర్గాదులకు సాధనం కాని నిత్యకర్మయొక్క ఫలం ఉండనే ఉంటుంది.అందుచేత గృహస్థుడు యోగమార్గాన్ని ఆశ్రయించినంతమాత్రాన కర్మమార్గభ్రష్టుడు కాడు.అందువల్ల ఈ ఉభయభ్రష్టత్వప్రశ్న గృహస్థుని విషయంలో ఉపపన్నం కాదు.ఈ విషయం శ్రీమచ్ఛంకరభగవత్పాదాచార్యులు అధ్యాయప్రారంభంలోనే ప్రతిపాదించి ఉన్నారు.(భా.అ.ప్ర. పే.285) 38

మూ. ఏతన్మే సంశయం కృష్ణ ఛేత్తుమర్హస్యశేషతః,
త్వదన్యః సంశయస్యాస్య ఛేత్తా న హ్యుపపద్యతే. 39

ప్ర.అ. ఏతదితి:- కృష్ణ=కృష్ణా! మే=నాయొక్క,ఏతత్=ఈ,సంశయమ్= సంశయమును,అశేషతః=పూర్తిగా,ఛేత్తుమ్=ఛేదించుటకు,అర్హసి=తగి ఉన్నావు.అస్య=ఈ, సంశయస్య=సంశయమునకు,ఛేత్తా=ఛేదించేవాడు,త్వదన్యః=నీకంటె అన్యుడు,న ఉపద్యతే హి = కుదరదు(లేదు)కదా?

భాష్యమ్

ఏతదితి:-ఏతత్ మే సంశయం,కృష్ణ,ఛేత్తుమ్ అపనేతుమ్,అర్హసి,అశేషతః, త్వదన్యః త్వత్తః అన్యః ఋషిః దేవః వా,ఛేత్తా నాశయితా సంశయస్య అస్య న, హి యస్మాత్, ఉపపద్యతే సంభవతి. అతః త్వమేవ ఛేత్తుమ్ అర్హసి ఇత్యర్థః. 39

బాలానందిని

ఏతదితి:- కృష్ణా! నువ్వు నా,ఈ సంశయాన్ని పూర్తిగా తొలగించవలెను. నీవు తప్ప ఋషి గాని,దేవత గాని మరెవ్వరూ ఈ సంశయాన్ని తొలగించడానికి సంభవం కాదు కదా?అందుచేత నువ్వే ఈ సంశయాన్ని ఛేదించాలి అని అర్థం. 39

శ్రీ భగవానువాచ-

మూ. పార్థ నైవేహ నాముత్ర వినాశస్తస్య విద్యతే.
న హి కల్యాణకృత్కశ్చిద్దుర్గతిం తాత గచ్ఛతి. 40

బాలానందిని

భగవంతుడు పలికెను -

ప్ర.అ. పార్థేతి:- పార్థ=అర్జునా!తస్య=వానికి, ఇహ=ఇహ లోకంలో, వినాశః =వినాశం,న ఏవ విద్యతే=లేదు;అముత్ర=పరలోకంలో కూడ,న=లేదు. తాత=తండ్రీ!కల్యాణకృత్=మంచి పని చేసేవాడు,కశ్చిత్=ఎవ్వడూ కూడ,దుర్గతిమ్= దుర్గతిని,న గచ్ఛతి హి=పొందదు కదా?

భాష్యమ్

పార్థేతి:- హే పార్థ!న ఏవ,ఇహ లోకే,న,అముత్ర పరస్మిన్ లోకే,వినాశః తస్య విద్యతే,నాస్తి;నాశః నామ పూర్వస్మాత్ హీనజన్మప్రాప్తిః,సః యోగభ్రష్టస్య నాస్తి, న,హి యస్మాత్,కల్యాణకృత్ శుభకృత్,కశ్చిత్,దుర్గతిం కుత్సితాం గతిం,హే తాత! తనోత్యాత్మానం పుత్రరూపేణ ఇతి పితా తాతః ఉచ్యతే.పితైవ పుత్రః ఇతి పుత్రోఽపి తాతః ఉచ్యతే.శిష్యోఽపి పుత్రవత్ ఇతి అపుత్రోఽపి తాతః ఉచ్యతే.యతః న గచ్ఛతి. 40

బాలానందిని

పార్థేతి:- అర్జునా! వానికి ఇహలోకంలో గాని,పరలోకంలో గాని వినాశం ఉండనే ఉండదు.నాశం అనగా-పూర్వం ఉన్న జన్మకంటె హీనమైన జన్మ లభించడం.అది యోగ భ్రష్టునికి ఉండదు.ఎందువల్ల ననగా-శుభమును చేసేవాడు ఎవడూ కూడ,దుర్గతిని,కుత్సిత మైన గతిని,ఓ! తాతా!-"తనోతి ఆత్మానం పుత్రరూపేణ ఇతి తాతః"(తనను పుత్రుని రూపంలో చేస్తాడు గాన తాతుడు)అను వ్యుత్పత్తిచేత తాతః అనగా తండ్రి."ఆత్మా వై పుత్రనామాసి"అను శ్రుతిని అనుసరించి తండ్రియే పుత్రుడు గాన పుత్రుడు గూడ తాతః అని చెప్పబడతాడు.

శిష్యుడు కూడ పుత్రుడు కాకపోయినా పుత్రుని వంటివాడు గాన 'తాతః'అని చెప్పబడతాడు. ఎందువల్ల పొందడో. 40

భాష్యమ్

కిం తు తస్య భవతి?

మూ. ప్రాప్య పుణ్యకృతాం లోకానుషిత్వా శాశ్వతీః సమాః,
శుచీనాం శ్రీమతాం గేహే యోగభ్రష్టోఽభిజాయతే. 41

బాలానందిని

కిమితి:- అయితే వానికి ఏమి జరుగుతుంది?

ప్ర.అ. ప్రాప్యేతి:- యోగభ్రష్టః=యోగభ్రష్టుడు,పుణ్యకృతామ్=పుణ్యాత్ములయొక్క లోకాన్=లోకాలను,ప్రాప్య=పొంది,శాశ్వతీః=శాశ్వతమైన,సమాః=సంవత్సరములను, ఉషిత్వా=నివసించి,శుచీనామ్=పవిత్రులైన,శ్రీమతామ్=ఐశ్వర్యవంతులయొక్క గేహే= గృహమునందు,అభిజాయతే=పుట్టును.

భాష్యమ్

యోగమార్గే ప్రవృత్తః సంన్యాసీ,సామర్థ్యాత్,ప్రాప్య గత్వా,పుణ్యకృతామ్ అశ్వమేధాదియాజినాం లోకాన్,తత్ర చ,ఉషిత్వా వాసమ్ అనుభూయ,శాశ్వతీః నిత్యాః, సమాః సంవత్సరాన్,తద్భోగక్షయే శుచీనామ్ యథోక్తకారిణాం శ్రీమతాం విభూతిమతాం గేహే యోగభ్రష్టః అభిజాయతే. 41

బాలానందిని

యోగమార్గంలో ప్రవర్తించిన సంన్యాసి యోగభ్రష్టు డైనప్పుడు,(కొంత) వరకు చేసిన యోగంయొక్క సామర్థ్యంవల్ల అశ్వమేధాదియాగాలు చేసిన పుణ్యాత్ములకు లభించే లోకాలను పొంది,అక్కడ నిత్యము లైన(అనేకములైన)లేదా దేవప్రమాణంచేత దీర్ఘములైన, సంవత్సరాలు నివాసం అనుభవించి,ఆ భోగం క్షీణించిన తరువాత, వేదోక్తధర్మాలను ఆచరించే శ్రీమంతుల గృహంలో పుడతాడు. 41

మూ. అథవా యోగినామేవ కులే భవతి ధీమతామ్,
ఏతద్ధి దుర్లభతరం లోకే జన్మ యదీదృశమ్. 42

ప్ర.అ. అథవేతి:- అథవా=లేదా,ధీమతామ్=బుద్ధిమంతులైన,యోగినామ్= యోగులయొక్కకులే ఏవ=కులమునందే,భవతి=పుట్టును, ఈదృశమ్=ఇట్టి, యత్=ఏ జన్మ=జన్మ ఉన్నదో,ఏతత్=ఇది,లోకే=లోకంలో,దుర్లభతరం హి=చాలా దుర్లభ మైనది కదా?

భాష్యమ్

అథేతి:- అథవా శ్రీమతాం కులాత్ అన్యస్మిన్ యోగినామేవ దరిద్రాణాం కులే భవతి జాయతే,ధీమతాం బుద్ధిమతామ్,ఏతత్ హి జన్మ యత్ దరిద్రాణాం యోగినాం కులే,దుర్లభతరం దుఃఖలభ్యతరం,పూర్వమ్ అపేక్ష్య,లోకే జన్మ యత్ ఈదృశం యథోక్తవిశేషణే కులే. 42

బాలానందిని

అథవేతి:- లేదా-శ్రీమంతుల కులంకంటె వేరైన దరిద్రులైన బుద్ధిమంతులైన యోగుల కులంలో పుడతాడు.దరిద్రులైన యోగుల కులంలో పుట్టడం అనేది, పైన చెప్పిన (ఐశ్వర్యవంతుల కులంలో)జన్మకంటె అధికంగా దుర్లభ మైనది. ఈదృశం జన్మ - చెప్పబడిన విశేషణాలు గల కులంలో పుట్టడం. 42

భాష్యమ్

యస్మాత్-

మూ. తత్ర తం బుద్ధిసంయోగం లభతే పౌర్వదేహికమ్,
యతతే చ తతో భూయః సంసిద్ధౌ కురునన్దన. 43

బాలానందిని

యస్మాదితి:- ఎందువల్ల ననగా-

తత్రేతి:- కురునన్దన=అర్జునా! తత్ర=ఆ జన్మయందు,(యోగికులమునందు),పౌర్వదేహికమ్=వెనుకటి దేహానికి సంబంధించిన,తమ్=ఆ,బుద్ధిసంయోగమ్=బుద్ధితో సంబంధమును,లభతే=పొందును. తతః=పిమ్మట(లేదా అందువల్ల),సంసిద్ధౌ=సిద్ధియందు (సిద్ధి కొరకు),భూయః=మళ్లీ, యతతే చ=ప్రయత్నిస్తాడు కూడ. 43

భాష్యమ్

తత్ర యోగినాం కులే తం,బుద్ధిసంయోగం-బుద్ధ్యా సంయోగం బుద్ధి సంయోగం, లభతే,పౌర్వదేహికం-పూర్వస్మిన్ దేహే భవం పౌర్వదేహికం,యతతే చ ప్రయత్నం కరోతి,తతః తస్మాత్ పూర్వకృతాత్ సంస్కారాత్ భూయః బహుతరం,సంసిద్ధౌ సంసిద్ధినిమిత్తం,హే కురునన్దన! 43

బాలానందిని

తత్రేతి:-అర్జునా! అతడు ఆ యోగికులంలో,పూర్వదేహంలో ఉన్న బుద్ధికోసం యోగాన్ని పొందుతాడు.ఆ సంస్కారంవల్ల అధికంగా సిద్ధికోసం ప్రయత్నిస్తాడు. 44

భాష్యమ్

కథం పూర్వదేహబుద్ధిసంయోగః ఇతి - తదుచ్యతే-

మూ. పూర్వాభ్యాసేన తేనైవ హ్రియతే హ్యవశోఽపి సః,
జిజ్ఞాసురపి యోగస్య శబ్దబ్రహ్మాతివర్తతే. 44

బాలానందిని

కథమితి:- పూర్వదేహానికి సంబంధించిన బుద్ధితో సంబంధం ఎలా కలుగు తుందో చెపుతున్నాడు -

ప్ర.అ. పూర్వేతి:- సః=అతడు,అవశః అపి= తన వశంలో లేకపోయినా(కావాలని ప్రయత్నించకపోయినా),తేన=ఆ, పూర్వాభ్యాసేనైవ=పూర్వజన్మకు సంబంధించిన అభ్యాసం చేతనే,హ్రియతే=లాగివేయబడును.యోగస్య=యోగముయొక్క,జిజ్ఞాసుఃఅపి=జిజ్ఞాసువు కూడ (యోగాన్ని గూర్చి తెలుసుకోవా లనే అభిలాష కలవాడు కూడ),శబ్దబ్రహ్మ= వేదోక్త కర్మమార్గమును,అతివర్తతే=అతిక్రమిస్తాడు.

భాష్యమ్

యః పూర్వజన్మని కృతః అభ్యాసః సః పూర్వాభ్యాసః, తేనైవ బలవంతా హ్రియతే, హి యస్మాత్,అవశః అపి,సః యోగభ్రష్టః.న కృతం చేత్ యోగాభ్యాసాత్ బలవత్తరమ్ అధర్మాదిలక్షణం కర్మ తదా యోగాభ్యాసజనితేన సంస్కారేణ హ్రియతే.అధర్మశ్చే ద్బలవత్తరః కృతః తేన యోగజః అపి సంస్కారః అభిభూయతే ఏవ. తత్క్షయే తు యోగజః సంస్కారః స్వయమేవ కార్యమ్ ఆరభతే.న దీర్ఘకాలస్థస్యాపి వినాశః తస్య అస్తి ఇత్యర్థః. జిజ్ఞాసుః అపి యోగస్య స్వరూపం జ్ఞాతుమ్ ఇచ్ఛన్ యోగమార్గే ప్రవృత్తః సంన్యాసీ యోగభ్రష్టః సామర్థ్యాత్, సః అపి,శబ్దబ్రహ్మ వేదోక్తకర్మానుష్ఠానఫలమ్ అతివర్తతే,అపాకరిష్యతి,కిముత బుద్ధ్వా యః యోగం తన్నిష్ఠః అభ్యాసం కుర్యాత్. 44

బాలానందిని

యః ఇతి:- పూర్వజన్మలో చేసిన అభ్యాసం పూర్వాభ్యాసం. బలం గల దానిచేతనే, యోగభ్రష్టుడు,అవశు డైనా కూడ,లాగబడతాడు.యోగాభ్యాసంవల్ల కలిగిన సంస్కారంకంటె బలవత్తరమైన ధర్మాధర్మాదిరూపమైన కర్మ ఏదీ చేయకపోతే అప్పుడు యోగాభ్యాసజనిత సంస్కారంచేత లాగబడతాడు.బలవత్తరమైన అధర్మం చేస్తే దానిచేత యోగజసంస్కారం కూడ తప్పక తిరస్కరించబడుతుంది.బలవత్తరమైన ఆ అధర్మం క్షీణించగానే యోగజసం స్కారం తన పని చేయడం ప్రారంభిస్తుంది.ఎంత దీర్ఘకాలం నిలచి ఉన్నా దానికి వినాశం

ఉండదు అని అర్థం. జిజ్ఞాసువు కూడ – అనగా యోగంయొక్క స్వరూపాన్ని తెలుసుకొనవలె నని కోరుతూ యోగమార్గంలో ప్రవేశించిన, యోగభ్రష్టు డైన సంన్యాసి కూడ, అని సామర్థ్యాన్ని పట్టి అర్థం. (అనగా కర్మలను ఆచరిస్తూ యోగమార్గాన్ని తెలుసు కొనదలచిన గృహస్థుడు అను అర్థం కుదరదు గాన సంన్యాసి అని చెప్పాలి అని భావం. కర్మ మార్గంలో ప్రవర్తిస్తూన్న కర్మి కర్మభ్రష్టుడు కాడు కదా?) అతడు కూడ, శబ్దబ్రహ్మను, వేదోక్త కర్మానుష్ఠానంవల్ల లభించే ఫలాన్ని, తొలగించుకొంటాడు. జిజ్ఞాసువే ఇట్లు చేయగల డంటే యోగాన్ని గూర్చి బాగా తెలుసుకొని, తన్నిష్ఠుడై యోగాభ్యాసం చేసేవాని మాట చెప్పాలా?

భా.అ.ప్ర.:– శబ్దబ్రహ్మ అనగా దేవమనుష్యాదిశబ్దాలచేత ప్రతిపాదింపబడే ప్రకృతి అని శ్రీరామానుజులు చెప్పినది దుష్టమైన అర్థం. బ్రహ్మశబ్దంచేతనే ప్రకృతి అనే అర్థం లభిస్తూన్నప్పుడు శబ్దపదం వ్యర్థం. శబ్దంచేత చెప్పదగిన బ్రహ్మయే ప్రకృతి అనబడుతుంది. మరొకటైతే పరబ్రహ్మయే అనడం యుక్తం కాదు. పరబ్రహ్మ కూడ పరబ్రహ్మశబ్దంచేత చెప్పబడుతుంది కదా? మూలంలో దేవమనుష్యాదివిశేషశబ్దం ఏదీ లేదు గాన ఇక్కడ దేవమనుష్యాదిశబ్దాలచేత బోధింపబడే బ్రహ్మయే వివక్షితం అనడం కూడ యుక్తం కాదు. 'శబ్ద' శబ్దానికి 'శబ్దం'చేత చెప్పడానికి యోగ్యమైన అనే అర్థం లక్షణను ఆశ్రయించక పోతే కుదరదు. అందుచేత మా మతంలో వలెనే మీరు కూడ లక్షణ అంగీకరించే ఉన్నారు. మరి – యోగజిజ్ఞాసువుచేత ప్రకృతి ఎలా అతిక్రమించబడుతుంది? ఏ విధంగానూ అతిక్రమించ బడజాలదు. నీ మతం ప్రకారం ప్రకృతి పరమాత్మాధీనంగాన, పరమాత్మ ఒక్కడే అతిక్రమించ కలుగుతాడు. ముక్తుడు కూడ భగవదనుగ్రహంచేతనే ప్రకృతిని దాటుతాడు కాని స్వయంగా దాట జాలడు. జిజ్ఞాసువు పరమాత్మ కాదు కదా? అతడు బద్ధజీవుడే. అతడు ప్రకృతిని ఎలా దాటుతాడు? యోగజిజ్ఞాసువు యోగాన్ని గూర్చి తెలుసుకొని, యోగాన్ని అనుష్ఠించి ప్రకృతిని దాటుతాడు అనే అభిప్రాయంతో 'జిజ్ఞాసుః'అని చెప్పబడింది అనడం కూడ యుక్తం కాదు. "జిజ్ఞాసుః అపి"అని 'అపి'శబ్దంచేత జిజ్ఞాసువు యోగాన్ని తెలిసికొన్నవానికంటె, యోగానుష్ఠాతకంటె వేరు అని చెప్పబడుచున్నాడు. అలా చెప్పకపోతే 'అపి'శబ్దం వ్యర్థం అవుతుంది.

మరొక విషయ మేమనగా యోగానుష్ఠానం చేసినవాడు కూడ యోగానుష్ఠాన మాత్రంచేత ప్రకృతిని దాటజాలడు; దానివల్ల కలిగిన సమ్యగ్జ్ఞానంచేతనే దాటగలుగుతాడు. ఈ విధంగా ప్రకృతిని దాటడం అనేది జ్ఞానికే కాని యోగికి శక్యం కాదు అని సిద్ధించగా యోగజిజ్ఞాసువుకు శక్యం కాదు అని వేరే చెప్పాలా?

ఇక్కడ–"జ్ఞానానందమయు డైన ఆత్మయైతే ఈ పరమాత్మకు శేషం"అని వేదాంత దేశికులు చెప్పినది కూడ అసంగతం. జ్ఞానానందమయుడు అన్నప్పుడు 'మయట్'

ప్రత్యయానికి ప్రాచుర్యం అని అర్థమా,వికారం అని అర్థమా,స్వార్థమేనా?ప్రాచుర్యం అను అర్థం చెపితే 'ఆనందం అధికంగా ఉన్న' అన్నప్పుడు స్వల్పంగా దుఃఖం కూడ ఉన్న దను భావం వస్తుంది గాన ఆ అర్థం కుదరదు.ఆత్మ నిర్వికారం గాన రెండవ అర్థం కుదరదు.మూడవ అర్థం గ్రహించే పక్షంలో 'మయట్'ను ప్రయోగించడం వ్యర్థం. వైలక్షణ్యాన్ని (భేదాను) బోధించే 'తు'శబ్దాన్ని ప్రయోగించడం కూడ అయుక్తం.ఇది పమమాత్మాపేక్షచేత వైలక్షణ్యమా,అనాత్మల అపేక్షచేతనా?మొదటి కాదు-నీ మంతంలో పరమాత్మ కూడ ఆనందమయుడు,జ్ఞానస్వరూపుడు కూడ కదా."ఆనన్దమయోఽభ్యాసాత్" అనే సూత్రంలో ఆనందమయుడు ఈశ్వరుడు అని నువ్వు చెప్పావు కదా?ఈ విధంగా జ్ఞానానందమయు డైన పరమాత్మ జ్ఞానానందమయుడే అయిన జీవునికంటె భిన్ను డెట్ల వుతాడు?మా మతంలో ఇద్దరూ ఆనందరూపులే గాన భేదం లేదు.రెండవ పక్షం కూడ కుదరదు- అనాత్మ లైన విజ్ఞానమయ - ఆనందమయకోశాలకు జ్ఞానానందమయ మైన ఆత్మకంటె వైలక్షణ్యం యుక్తి పూర్వకంగా ప్రతిపాదించడానికి శక్యం కాదు.విజ్ఞాన మయకోశం జీవుడు,ఆనందమయకోశం ఈశ్వరుడు అనడం కూడ యుక్తం కాదు;ఎందు వల్ల ననగా"విజ్ఞానమయమాత్మానముపసంక్రమ్య"అని విజ్ఞానమయానికి ఆనందమయంలో లయం చెప్పబడింది. జీవుడు నిత్యుడు గాన వానికి లయం కుదరదు.ఇట్లే ఆనందమయం కూడ ఆనందంలో లయం అవవచ్చును గాన అది ఈశ్వరుడు కాజాలదు. విజ్ఞానమయమూ,ఆనందమయమూ కూడ కోశం వలె (ఒర వలె) ఆవరకములు గాన అవి కోశా లని చెప్పబడుతున్నాయి.వాటి లోపలనున్నది ఆత్మ. ఈ విధంగా విజ్ఞాణమయ-ఆనందమయకోశాల ఆంతరమైన,జ్ఞానానందరూప మైన ఆత్మ పరమాత్మకు శేషం(అంగం) కాదు గాన ఇది అనన్యశేషం(దేనికీ శేషం కానిది);అన్నింటికి ఇదే శేషి(అంగి).ఈశ్వరుడు ఆత్మకంటె భిన్ను డైతే,ప్రపంచం వలె,ఈశ్వరుడు కూడ ఆత్మకే శేషం(అవయవం).జ్ఞానా నందరూప మైన ఆత్మకంటె భిన్నుడైన ఈశ్వరుడు జ్ఞానానందరూపు డవడానికి వీలులేదు. అలా అయితే భేదమే కుదరదు.మృన్మయమైన ఒక ఘటంకంటె మృన్మయమే అయిన మరొక ఘటం ఏ విధంగా భిన్నమో అదే విధంగా జ్ఞానానందరూప మైన ఆత్మకంటె జ్ఞానానందరూపుడైన ఈశ్వరుడు భిన్నుడు కావచ్చును అనడం కుదరదు.ఘటాలకు భేదం ఉండడానికి కారణం వాటి ఆకారాలలో భేదం.జీవేశ్వరుల కైతే జ్ఞాన మనే ఆకారం ఒక్కటే గాన,భేదకారణమైన మరొక ఆకారం ఏదీ లేదు.స్వరూపతః భేదం లేకపోయినా, ధర్మాలనుపట్టి భేదం ఉంది.ఆత్మ కించిత్‌జ్ఞం,పరమాత్మ సర్వజ్ఞుడు కదా అనడం యుక్తం కాదు.ఎందువల్ల ననగా-ఈ కించిద్‌జ్ఞత్వసర్వజ్ఞత్వాలు ఉపాధిధర్మాలు కాని ఆత్మధర్మాలు కావు.ఔపాధికభేదం యథార్థం కాదు.అందుచేత ఆత్మకంటె వేరుగా శేషియైన పరమాత్మ లేదు;ఆత్మయే అన్నింటికి శేషి(భా.అ.ప్ర.పే.290)

భాష్యమ్

కుతశ్చ యోగిత్వం శ్రేయః ఇతి-

మూ. ప్రయత్నాద్యతమానస్తు యోగీ సంశుద్ధకిల్బిషః,
అనేకజన్మసంసిద్ధస్తతో యాతి పరాం గతిమ్. 45

బాలానందిని

కుత ఇతి:- మరే కారణంవల్ల కూడ యోగిత్వం శ్రేయస్కర మైనది?

ప్ర. అ. ప్రయత్నేతి:- ప్రయత్నాత్=ప్రయత్నంవల్ల,తత్ర=ఆ యోగమార్గంలో, యతమానః=ప్రయత్నిస్తూన్న, యోగీ=యోగి,సంశుద్ధకిల్బిషః=శుద్ధమైన పాపాలు కలవాడై,అనేక జన్మసంసిద్ధః=అనేక జన్మయందు సంసిద్ధుడై(అనేక జన్మలలో క్రమక్రమంగా సిద్ధిని,జ్ఞానాన్ని సంపాదించి) తతః=పిమ్మట,పరామ్=గొప్ప, గతిమ్ = గతిని,యాతి=పొందును.

భాష్యమ్

ప్రయత్నాత్ యతమానః అధికం యతమానః తత్ర,'యోగీ'విద్వాన్ సంశుద్ధ కిల్బిషః విశుద్ధకిల్బిషః సంశుద్ధపాపః,అనేకేషు జన్మసు కించిత్ సంస్కారజాతమ్ ఉపచిత్య తేన ఉపచితేన అనేకజన్మకృతేన,సంసిద్ధః అనేకజన్మసంసిద్ధః లబ్ధసమ్యగ్దర్శనః సన్ యాతి,పరాం ప్రకృష్టాం గతిమ్. 45

బాలానందిని

ప్రయత్నాదితి:- ప్రయత్నంవల్ల యోగమార్గమునందు ప్రయత్నిస్తూన్న,అధికంగా ప్రయత్నిస్తూన్న అని అర్థం. విద్వాంసుడైన యోగి శుద్ధమైన పాపాలు కలవాడై,అనేక జన్మలలో కొంచెం కొంచెం సంస్కారసముదాయాన్ని ప్రోగు చేసికొని, బాగా పెరిగిన, అనేక జన్మలలో చేయబడిన ఆ సంస్కారంచేత సంసిద్ధుడై, సమ్యగ్దర్శనాన్ని పొంది, ప్రకృష్టమైన గతిని పొందుతాడు. 45

భాష్యమ్

యస్మాత్ ఏవం తస్మాత్-

మూ. తపస్విభ్యోఽధికో యోగీ జ్ఞానిభ్యోఽపి మతో ధికః,
కర్మిభ్యశ్చాధికో యోగీ తస్మాద్యోగీ భవార్జున. 46

బాలానందిని

యస్మాదితి:- ఇది ఇట్లు ఉంది గాన-

ప్ర.అ. తపస్విభ్యః ఇతి:- యోగీ=యోగి,తపస్విభ్యః=తపఃశాలులకంటె, అధికః=గొప్పవాడు, జ్ఞానిభ్యః అపి=జ్ఞానం కలవాళ్లకంటె కూడ,అధికః=అధికుడుగా,మతః = తెలియబడ్డాడు.కర్మిభ్యః చ= కర్మలకంటె కూడ,యోగీ=యోగి,అధికః=అధికుడు, అర్జున=అర్జునా! తస్మాత్= అందువల్ల,యోగీ=యోగివిగా, భవ=అగుము.

భాష్యమ్

తపస్విభ్యః అధికః యోగీ,జ్ఞానిభ్యః అపి,జ్ఞానమ్ అత్ర శాస్త్రపాణ్డిత్యం.తద్వద్భ్యో ఽపి, మతః జ్ఞాతః,అధికః శ్రేష్ఠః ఇతి, కర్మిభ్యః-అగ్నిహోత్రాది కర్మ-తద్వద్భ్యః అధికః యోగీ విశిష్టః యస్మాత్ తస్మాత్ యోగీ భవ అర్జున. 46

బాలానందిని

తపస్విభ్యః ఇతి:- యోగి తపస్వులకంటె,జ్ఞానులకంటె కూడ శ్రేష్ఠుడు అని తెలియబడుచున్నాడు. ఇక్కడ జ్ఞానం అనగా శాస్త్రపాండిత్యం.కర్మ అనగా అగ్నిహోత్రాదికర్మ. ఆ కర్మ గల కర్ములకంటె యోగి అధికుడు,విశిష్టుడు,అందువల్ల, ఓ!అర్జునా,యోగివి అగుము.

మూ. యోగినామపి సర్వేషాం మద్గతేనాన్తరాత్మనా,
శ్రద్ధావాన్ భజతే యో మాం స మే యుక్తతమో మతః. 47

ఇతి శ్రీ మహాభారతే శతసాహస్ర్యాం సంహితాయాం వైయాసిక్యాం భీష్మపర్వణి శ్రీమద్భగవద్గీతాసు ఉపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే శ్రీకృష్ణార్జున సంవాదే ధ్యానయోగో నామ షష్ఠోఽధ్యాయః

బాలానందిని

ప్ర.అ. యోగినామితి:- యః=ఎవడు,మద్గతేన=నన్నే పొందిన,అన్తరాత్మనా=మనస్సుతో,శ్రద్ధావాన్=శ్రద్ధ కలవాడై,మామ్=నన్ను,భజతే=సేవిస్తాడో,సః=అతడు, సర్వేషామ్ = సమస్తమైన,యోగినామ్=యోగులలో,యుక్తతమః=అత్యధికంగా యుక్తుడుగా, మే=నాకు,మతః=అంగీకరించబడినవాడు.

భాష్యమ్

యోగినామితి:- యోగినామపి సర్వేషాం రుద్రాదిత్యాదిధ్యానపరాయాణాం మధ్యే,మద్గతేన-మయి వాసుదేవే సమాహితేన,అన్తరాత్మనా అన్తఃకరణేన,శ్రద్ధావాన్

శ్రద్ధధానః సన్ భజతే యః మాం సః మే మమ యుక్తతమః అతిశయేన యుక్తః ,మతః అభి ప్రేతః. 47

ఇతి శ్రీమత్పరమహంసపరివ్రాజకాచార్యగోవిన్దభగవత్పూజ్యపాద శిష్యశ్రీమచ్ఛఙ్కరభగవతః కృతౌ శ్రీభగవద్గీతాభాష్యే అభ్యాస యోగో నామ షష్ఠోఽధ్యాయః

బాలానందిని

యోగినామితి:- రుద్రాదిత్యాదులను ధ్యానించడంలో ఆసక్తులైన అందరు యోగులలో కూడ,వాసుదేవుడ నైన,("వసన్తి అస్మిన్ జగన్తి ఇతి వాసుః" ఎవనియందు జగత్తు లన్నీ ఉంటాయో అతడు వాసువు."వాసుశ్చ అసౌ దేవశ్చ వాసుదేవః"-సకల జగన్నివాస మైనవాడు,స్వప్రకాశుడు అయిన పరమాత్మ వాసుదేవుడు)నాయందు స్థిరంగా నిలపబడిన అంతఃకరణముతో,శ్రద్ధ కలవాడై,విశ్వాసం కలవాడై ఎవడు నన్ను సేవిస్తాడో అతడు అతిశయంచేత యుక్తుడు,అధికంగా యుక్తుడు అని నాకు ఇష్టుడు;సంమత మైనవాడు.

వి.:-ఈ అధ్యాయషట్కంలో త్వంపదార్థస్వరూపం నిరూపించబడింది.

"బాలానందిని"అను శ్రీమద్భగవద్గీతాశాంకరభాష్యాంధ్రవ్యాఖ్యానంలో షష్ఠాధ్యయం సమాప్తం

(ప్రారంభంనుంచి మొత్తం శ్లోకాలు 251)

అథ సప్తమోఽధ్యాయః

భాష్యమ్

"యోగినామపి సర్వేషాం మద్గతేనాన్తరాత్మనా,
శ్రద్ధావాన్ భజతే యో మాం స మే యుక్తతమో మతః".

ఇతి ప్రశ్నబీజమ్ ఉపన్యస్య స్వయమేవ ఈదృశం మదీయం తత్త్వమ్,ఏవం మద్గతాన్తరాత్మా స్యాత్ ఇత్యేతత్ వివక్షుః-

శ్రీభగవానువాచ-

మూ. మయ్యాసక్తమనాః పార్థ యోగం యుఞ్జన్ మదాశ్రయః,
అసంశయం సమగ్రం మాం యథా జ్ఞాస్యసి తచ్ఛృణు. 1

బాలానందిని

యోగినామితి:–"యోగినామపి.....మతః"అని ప్రశ్న వేయడానికి తగిన బీజాన్ని వేసి "నా తత్త్వం ఇలాంటిది,ఈ విధంగా నాయందు మనస్సు ఉంచాలి"అని స్వయంగానే చెప్ప దలచినవాడై శ్రీభగవంతు డిలా అన్నాడు–

ప్ర.అ.మయీతి:– పార్థ=అర్జునా!మయి=నాయందు,ఆసక్తమనాః=లగ్నము చేయ బడిన మనస్సు కలవాడవై,మదాశ్రయః=నేనే ఆశ్రయం కలవాడవై,యోగం యుఞ్జన్= యోగాభ్యాసం చేస్తూ,మామ్=నన్ను,అసంశయమ్=సంశయము లేకుండా,సమగ్రమ్= పూర్తిగా, యథా=ఎట్లు,జ్ఞాస్యసి=తెలుసుకొనగలవో,తత్=దానిని,శృణు=వినుము.

భాష్యమ్

మయి వక్ష్యమాణవిశేషణే పరమేశ్వరే ఆసక్తం మనః యస్య సః మయ్యాసక్త మనాః,హే! పార్థ! యోగం యుఞ్జన్ మనఃసమాధానం కుర్వన్,మదాశ్రయః అహమేవ పరమేశ్వరః ఆశ్రయః యస్య సః మదాశ్రయః,యః హి కశ్చిత్ పురుషార్థేన కేన చిత్ అర్థీ భవతి సః తత్సాధనం కర్మ అగ్నిహోత్రాది తపః దానం వా కించిత్ ఆశ్రయం ప్రతిపద్యతే;అయం తు యోగీ మామేవ ఆశ్రయం ప్రతిపద్యతే, హిత్వా అన్యత్ సాధనాన్త రం,మయ్యేవ ఆసక్తమనాః భవతి.యః త్వమ్ ఏవంభూతః సన్ అసంశయం,సమగ్రం సమస్తం విభూతిబలశక్త్యైశ్వర్యాదిగుణసంపన్నం మాం,యథా యేన ప్రకారేణ,జ్ఞాస్యసి సంశయమ్ అన్తరేణ,ఏవమేవ భగవాన్ ఇతి,తత్ శృణు ఉచ్యమానం మయా. 1

బాలానందిని

మయీతి:–చెప్పబడ నున్న విశేషణాలు గల, పరమేశ్వరుడ నైన నాయందు లగ్నము చేయబడిన మనస్సు కలవాడవై,అర్జునా!మనఃసమాధానం చేస్తూ(మనస్సును ఏకాగ్రంగా చేస్తూ),పరమేశ్వరుడ నైన నన్నే ఆశ్రయంగా గ్రహించి,(లోకంలో)ఏదైన పురుషప్రయోజనం కావాలనుకొన్నవాడు దానికి సాధనమైన అగ్నిహోత్రాదికర్మను గాని తపస్సునుగాని,దానం కాని ఏదో ఒకదానిని ఆశ్రయంగా పొందుతాడు.ఈ యోగి యైతే ఇతర సాధనా లన్నీ విడచి నన్నే ఆశ్రయంగా పొందుతాడు;నాయందే ఆసక్తమైన మనస్సుతో ఉంటాడు.ఏ నీవు ఈ విధంగా ఉన్నవాడవై నిఃసంశయంగా,పూర్తిగా,విభూతి,బలము,శక్తి, ఐశ్వర్యం మొదలైన గుణాలతో సంపన్నుడ నైన నన్ను ఏ విధంగా,ఎట్టి సంశయమూ లేకుండా,భగవంతుడు ఈ విధంగానే ఉంటాడు అని గ్రహిస్తావో,నేను చెపుతూన్న దానిని వినుము.

భా.అ.ప్ర.:–యథా అనగా ఏ జ్ఞానంచేత అను శ్రీరామానుజాచార్యవ్యాఖ్య "ప్రకారవచనేథాల్"(ప్రకారం అనే అర్థంలో థాల్ ప్రత్యయం చేర్చాలి)అను పాణినీయ

సూత్రానికి విరుద్ధం గాన ఉపేక్షణీయు. మూలకారునికి ఇదే అభిప్రాయంఉంటే "యేన జ్ఞాస్యసి తచ్ఛృణు" అని ఉండేవాడు. (భా. అ. ప్ర. పే. 3) 1

భాష్యమ్

తచ్చ మద్విషయమ్ -

మూ. జ్ఞానం తేఽహం సవిజ్ఞానమిదం వక్ష్యామ్యశేషతః,
యద్ జ్ఞాత్వా నేహ భూయోఽన్యత్ జ్ఞాతవ్యమవశిష్యతే. 2

బాలానందిని

తచ్చేతి:- నాకు సంబంధించిన ఆ (జ్ఞానం అని శ్లోకంలోని పదంతో అన్వయం)

ప్ర. అ. జ్ఞానమితి: -సవిజ్ఞాన్=విజ్ఞానముతో కూడిన, ఇదమ్=ఈ, జ్ఞానమ్=జ్ఞానమును, అశేషతః=సంపూర్ణంగా, తే=నీకు, అహమ్=నేను, వక్ష్యామి=చెప్పెదను. యత్=దేనిని, జ్ఞాత్వా= తెలుసు కొని, భూయః=మళ్లీ, జ్ఞాతవ్యమ్=తెలియదగినది, అన్యత్=మరొకటి, న అవశిష్యతే= మిగలదో;

భాష్యమ్

జ్ఞానం, తే తుభ్యమ్, అహం, సవిజ్ఞానం విజ్ఞానసహితం స్వానుభవసంయుక్తమ్. ఇదం, వక్ష్యామి కథయిష్యామి, అశేషతః కార్త్స్న్యేన. తత్ జ్ఞానం వివక్షితం స్తౌతి శ్రోతుః అభిముఖీకరణాయ - యద్ జ్ఞాత్వా యద్ జ్ఞానం జ్ఞాత్వా, న ఇహ, భూయః పునః, జ్ఞాతవ్యం పురుషార్థసాధనమ్ అవశిష్యతే, న అవశేషః భవతి ఇతి మత్తత్త్వజ్ఞః యః సః సర్వజ్ఞః భవతి ఇత్యర్థః.

బాలానందిని

జ్ఞానమితి:- విజ్ఞానంతో, స్వానుభవంతో, కూడిన ఆ జ్ఞానాన్ని నేను నీకు పూర్తిగా చెప్పెదను. శ్రోతను అభిముఖుణ్ణిగా చేసికొనడంకొరకు ఆ జ్ఞానాన్ని స్తుతిస్తున్నాడు-ఏ జ్ఞానాన్ని పొంది ఇక్కడ ఇంక మళ్లీ తెలుసుకొనవలసినది, పురుషార్థానికి సాధన మైనది, ఏదీ ఉండదో. నా తత్త్వం తెలుసుకొన్నవాడు సర్వజ్ఞు డవుతాడు అని అర్థం.

భా. అ. ప్ర. ఇక్కడశ్రీరామానుజాచార్యులు-"నేను నాకంటె భిన్నమైన సమస్తచిద చిద్వస్తుసముదాయంనుండి, సమస్తమైన హేయములైన గుణాలకు విరుద్ధములైన అవధి లేని అతిశయం గల లెక్కింప శక్యం కాని కల్యాణగుణాలు కలవాడను అవడంచేత, వివిక్తు డను, వేరైనవాడను అను వివిక్తాకారమును గూర్చిన జ్ఞానం విజ్ఞానం. అలాంటి వివిక్తవిషయక

జ్ఞానంతో కూడ నా స్వరూపానికి సంబంధించిన జ్ఞానాన్ని చెప్పెదను''అని వ్యాఖ్యానించారు. అది అసంగతం. వివిక్తాకారవిషయజ్ఞానం విజ్ఞానం అన్నట్లయితే అవివిక్తాకారవిషయజ్ఞానం జ్ఞానం అని చెప్పవలసి ఉంటుంది. అప్పుడు స్వరూపవిషయజ్ఞానం జ్ఞానం అవడం కుదరదు. ఎందువల్ల ననగా నువ్వు చెప్పినట్లుగా ఈశ్వరస్వరూపం వివిక్తం గాన దాని జ్ఞానం కూడ వివిక్తవిషయజ్ఞానమే గాన అది కూడ విజ్ఞానం అనవలసి ఉంటుంది. "ఈశ్వరుడు,చిదచిద్వస్తుసముదాయంకంటె భిన్నుడు అనే జ్ఞానం'విజ్ఞానం'. ఈశ్వరుడు సచ్చిదానందమయుడు ఇత్యాది జ్ఞానం 'జ్ఞానం'అని కూడ చెప్పడం కుదరదు. అప్పుడు జ్ఞానవిజ్ఞానాలకు అన్యోన్యాశ్రయం కలుగుతుంది గాన రెండూ కూడ సిద్ధించకుండా పోతాయి. అదెట్లనగా ఈశ్వరుడు ప్రపంచంకంటె వివిక్తుడు అనే జ్ఞానం లేకుండా సచ్చిదానందమయత్వజ్ఞానం కలగదు;సచ్చిదానందమయత్వజ్ఞానం లేకుండా ప్రపంచ వివిక్తత్వజ్ఞానం కలగదు. ఈశ్వరుడు సచ్చిదానందరూపుడు,ప్రపంచం అనృతజడదుఃఖాత్మకం అను జ్ఞానం కలిగిన తరువాత ఈశ్వరుడు ప్రపంచంకంటె వివిక్తుడు అనే జ్ఞానం ఉపదేశం లేకుండానే కలుగుతుంది గాన'సవిజ్ఞానమ్'అను విశేషణం వ్యర్థం అవుతుంది. మరియు- అవివేకం అనగా అజ్ఞానం గాన వివేకజ్ఞానరూప మైన విజ్ఞానంకంటె అతిరిక్తమైన జ్ఞానం ఉండడం అప్రామాణికం. మరియు-ఘటం ఏదో పటం ఏదో వివేకం లేకుండా ఇది ఘటం ఇది పటం అను స్వరూపజ్ఞానం కలగదు.

(పూ.ప.)'ఘటం'అనే జ్ఞానం వేరు,"ఘటం పటంకంటె వేరైనది"అనే వివేకజ్ఞానం వేరు. జ్ఞానంలో ఘటంమాత్రమే విషయం,వివేకజ్ఞానంలో నైతే ఘటపటాలు,వాటి భేదమూ కూడ విషయం. అట్లే 'ఈశ్వరుడు' లేదా "ఈశ్వరుడు సచ్చిదానందరూపుడు'అను జ్ఞానం కంటె "ఈశ్వరుడు ప్రపంచంకంటె భిన్నుడు"అను వివేకజ్ఞానరూపమైన విజ్ఞానం విలక్షణ మైనది అని తప్పక అంగీకరించాలి అన్నట్లయితే(సి)అప్పుడు ఆకారంలో ఉన్న భేదాన్ని పట్టి జ్ఞాన-విజ్ఞానాలలో భేదం ఉన్నట్లు ఆకారభేదాన్ని పట్టి ఘటం,పటం,కుడ్యం ఇత్యాది జ్ఞానాలలో కూడ భేదం అంగీకరించవలసివస్తుంది. ఔను;అది అంతే అనడానికి వీలు లేదు విషయాలు వేరు వేరైనా విషయియైన జ్ఞానం అభిన్నమే అని కదా సిద్ధాంతం. అలా కాకపోతే విషయభేదాన్ని పట్టి జ్ఞానం భిన్నమై నట్లు ప్రతీ జ్ఞానంలోను జ్ఞాత వేరు అని చెప్పవలసి వస్తుంది. అప్పుడు ఒకే దేహంలో అనేకవిధాల జీవు లున్నా రని అంగీకరించ వలసి ఉంటుంది. (పూ.ప). చైతన్యరూప మైన జ్ఞానం ఒక్కటే అయినా బుద్ధివృత్తులు క్షణికములు గాన,బుద్ధివృత్తిరూపజ్ఞానాలు అనేకములే. క్షణక్షణానికీ మారుతూన్న వృత్తులు అభిన్నములని చెప్పడానికి శక్యం కాదు కదా అనడం(సి)యుక్తం కాదు. క్రియారూప మైన వృత్తి జడం;అది జ్ఞానం కాదు. వృత్తియందు ప్రతిఫలించిన చైతన్యమే జ్ఞానం. అందుచేత ఆ జ్ఞానంలో కూడ వృత్తిభేదం ఉన్నా,జ్ఞానభేదం లేదు. జ్ఞానం నిత్యం,స్వప్రకాశం. అందుచేత

దానికి జన్మాదికం లేదు;అది కేవలం వృత్తికే. ఆ జ్ఞానమే చైతన్యాత్మకు డైన ఈశ్వరుడు. ఈ విధంగా ఈశ్వరుడు ఆత్మా జ్ఞానైకస్వరూపు లని సిద్ధిస్తూన్నది.

(పూ.ప.)అంతఃకరణవృత్తియే ఉపచారంచేత జ్ఞానం అని చెప్పబడుచున్నది. ఆ వృత్తికే జ్ఞాన మనీ విజ్ఞాన మనీ రెండు భేదాలు. ఈశ్వరవిషయక మైన ఆ వృత్తియే "సచ్చిదానందరూపః ఈశ్వరః"అనీ,"ఈశ్వరః ప్రపఞ్చాద్విరిక్తః"అనీ ఇక్కడ చెప్పబడుచున్నది అని అంటే(సి) అది యుక్తం కాదు.వృత్తిజ్ఞానం అనీ,వృత్తివిజ్ఞానం అనీ ఎక్కడా ప్రసిద్ధి లేదు. నువ్వుచెప్పిన వృత్తివిజ్ఞానం కూడ వృత్తిజ్ఞానమే.'ఘటః'అనేది ఏ విధంగా వృత్తిజ్ఞానమో 'ఘటః పటాత్ భిన్నః'అను జ్ఞానం కూడ వృత్తిజ్ఞానమే కదా?

(పూ.ప.) ఘటాదిప్రత్యక్షస్థలంలో అంతఃకరణం చక్షుస్సు ద్వారా విషయం ఉన్న చోటుకు వెళ్లి విషయాకారంగా పరిణమిస్తుంది.దానినే వృత్తి అంటాం.'ఘటః'అనేది వృత్తిజ్ఞానమే అయినా "ఘటః పటాద్భిన్నః"అనేది వృత్తిజ్ఞానం కాదు.ఎందువల్ల ననగా ఘటపటాలు ప్రత్యక్షంగా చూడబడకపోయినా "ఘటః పటాత్ భిన్నః"అనే జ్ఞానం కలుగుతూన్నది.అందుచేత అంతఃకరణం ఘటపటరూపంలో పరిణామం చెందదంలేదు.అందుచేత "ఘటః పటాత్ భిన్నః"అనేది విజ్ఞానమే కాని వృత్తిజ్ఞానం కాదు అన్నట్లయితే(సి) అయినా కూడ వృత్తిజ్ఞాన-చైతన్యజ్ఞానాలకంటె భిన్న మైన విజ్ఞానం అనేది ఉన్నట్లు ఎక్కడా ప్రసిద్ధి లేదు.క్రొత్తగా దానిని కల్పించడం గౌరవం(అవసరం లేని బరువు)అవుతుంది. సుఖాద్యాకారమైన అంతఃకరణపరిణామం వలె ఘటపటభేదాకారాంతఃకరణపరిణామం కూడ కలగవలసియే ఉంటుంది గాన ఘటపటభేదజ్ఞానం కూడ వృత్తిజ్ఞానమే అని చెప్పడానికి అభ్యంతరం ఉండకూడదు.

(పూ.ప.)సరే;విజ్ఞానం కూడ వృత్తిజ్ఞానం అయితే కావచ్చును.అయినా కూడ ఘటజ్ఞానపటజ్ఞానాలు ఆకారంలో భేదం ఉండడంచేత ఏవిధం వేరు వేరు జ్ఞానాలో అదే విధంగా పైన చూపిన జ్ఞానవిజ్ఞానాలకు ఆకారభేదం ఉండడంవల్ల భేదం కల్పించ బడుతుంది అన్నట్లయితే(సి)నిజమే;కల్పిత మైన భేదం ఉంటే ఉండనీ;ఇక్కడ దానికి ప్రయోజనం లేదు.ఇక్కడ చెప్పదలచినది ఈశ్వరస్వరూపమే.తావన్మాత్రంచేతనే (ఈశ్వర స్వరూపం చెపితేనే)ఈశ్వరజగత్తుల మధ్య వైలక్షణ్యం ఉన్నట్లు తెలియనే తెలుస్తుంది.మరొక విషయమేమనగా-ప్రపంచవైలక్షణ్యం ఈశ్వరస్వరూపమే.ఈశ్వరుడు ప్రపంచంకంటె విలక్షణుడు అని తెలుసుకొననివాడు ఈశ్వరుణ్ణి తెలుసుకొననివాడే అవుతాడు. ఈశ్వర స్వరూపం ప్రపంచవిలక్షణం కదా?అందువల్ల జ్ఞానం అనగా ప్రపంచవిలక్షణు డైన సచ్చిదానందమయు డైన ఈశ్వరుని జ్ఞానమే;అంతే కాని ఆ జ్ఞానంలో ఒక భాగమైన, "ఈశ్వరుడు ప్రపంచంకంటె విలక్షణుడు"అనే జ్ఞానం విజ్ఞానం కాదు.

ఇంక-ఈశ్వరుడు చిదచిద్విలక్షణుడు అని ఏదైతే చెప్పబడిందో అక్కడ- ఈశ్వరునకు అచిద్వైలక్షణ్యం ఉన్నా కూడ చిద్వైలక్షణ్యం లేదు. ఎందువల్ల ననగా ఈశ్వరుడు చిద్రూపుడే. చిద్రూపుడు చిద్రూపునికంటె విలక్షణుడు ఎలా అవుతాడు?(పూ.ప.)ఇక్కడ చిచ్ఛబ్దం కించిద్జ్ఞుడు,దోషాలతో కూడినవాడూ అయిన జీవుణ్ణి బోధిస్తుంది;అలాంటి జీవునికంటె సర్వజ్ఞుడు,దోషరహితుడూ అయిన ఈశ్వరుడు విలక్షణుడే కదా అనడం యుక్తం కాదు.(సి.)చైతన్యం అనే అర్థాన్ని బోధించే చిచ్ఛబ్దం అలాంటి జీవుణ్ణి బోధించదు కదా?జీవేశ్వరు లిద్దరూ వాస్తవంలో చిన్మాత్రస్వరూపులు; వాళ్ల కించిద్జ్ఞత్వ-సర్వజ్ఞత్వాలు కేవలం ఉపాధిధర్మాలు.ఉపాధులైన ఘట-మఠాలు వేరు వేరైనా,ఉపహితమైన ఆకాశం ఏకరూపమే అయినట్లు మాయ అవిద్య అనే ఉపాధులు వేరైనా చైతన్యం ఏకరూపమే కదా? అందుచేత చిత్తు ధర్మరహితం గాన దానియందు కించిద్జత్వం మొదలైన జీవధర్మాలు ఉండవు.చిన్మాత్ర మైన ఈశ్వరునిలో కూడ కల్యాణగుణాలు ఉండడం సంభవం కాదు;ఎందువల్ల ననగా-కల్యాణగుణాలు సత్త్వగుణవికారాలు; చైతన్యం నిర్గుణం.సత్త్వము, చిత్త్వము, ఆనందమూ మొదలైన గుణాలు ఉంటాయి కదా; బ్రహ్మం నిర్గుణం ఎలా అవుతుంది అనే ప్రశ్నకు అవకాశం లేదు.అవి బ్రహ్మకంటే వేరైనవి కాదు.అవన్నీ బ్రహ్మస్వరూపాలే.ఒకే బ్రహ్మసద్రూపమూ,సత్తారూపమూ కూడ ఎలా అవుతుంది అనడానికి వీలు లేదు.నారాయణుడు తద్రూపుడు.తత్త్వరూపుడూ కూడా అని నువ్వు కూడ అంగీకరించావు కదా?"తదైక్షత" "తత్త్వం నారాయణః పరః" అని శ్రుతి కూడ చెపుతున్నది.అందుచేత 'తత్'శబ్ద-"తత్త్వ"శబ్దాలు ఏ విధంగా బ్రహ్మవాచకాలో అట్లే 'సత్' 'సత్తా' శబ్దాలు, 'చిత్' శబ్ద 'చిత్త్వ' శబ్దాలూ కూడ బ్రహ్మవాచకములే కాని ధర్మ-ధర్మివాచకాలు కావు. (పూ.ప)నిర్గుణమైన బ్రహ్మయందు నిర్గుణత్వం అనే ధర్మం ఉంది కదా?అది నిర్ధర్మకం ఎలా అవుతుంది అనడం (సి)యుక్తం కాదు. అట్లయితే-నిర్ధర్మకత్వం కూడ ధర్మరూపమే గాన నిర్ధర్మకత్వాభావమే ధర్మాభావరూపం అనవలసివస్తుంది.అది అంతే అనడం కుదరదు. నిర్ధర్మకత్వాభావం-ధర్మస్వరూపం గాన అది ధర్మాభావరూపం అని చెప్పడం కుదరకుండా పోతుంది.నిర్ధర్మకత్వం అనగా ధర్మా భావం మాత్రమే అన్నట్లయితే నిర్గుణత్వం కూడ గుణాభావమాత్రమే.అని అంగీకరించు. ఈవిధంగా నిర్గుణబ్రహ్మ నిర్ధర్మకం అని చెప్పడానికి అడ్డు ఏమీ లేదు.

మరొక విషయ మేమనగా-నిర్గుణబ్రహ్మలో ఉన్న నిర్గుణత్వం,సత్తాదికం వలె, బ్రహ్మరూప మైనదే.నిర్గుణత్వం అనగా గుణాల అభావమే కదా!బ్రహ్మ సర్వాభావరూప మైనది;అందుచేత గుణాభావం కూడ బ్రహ్మరూపమే.బ్రహ్మ ప్రపంచశూన్యం కదా?భావ రూపం కదా బ్రహ్మ;అది అభావరూపం ఎలా అవుతుంది అను ప్రశ్నకు అవకాశం లేదు. అభావరూప మైనది సర్వమూ భావరూపమే అయినట్లు భావరూపమైన బ్రహ్మ కూడ

అభావరూపం కావచ్చు;ఎందువల్ల ననగా భావాభావాల విషయంలో లోకంలో భ్రాంతి ఉంది. కాలత్రయంలోనూ లేకపోవడంచేత అభావరూపమైన జగత్తును లోకం భావం అనుకొంటూన్నది;తద్విలక్షణమైన బ్రహ్మను అభావం అనుకొంటూన్నది. అందుచేత లోకం సర్వాభావరూపం అనుకొంటూన్న భావపదార్థం బ్రహ్మయే;సత్యంగా పరిగణింప బడుతూన్న అభావపదార్థమే ప్రపచం. అందుచేత సర్వాభావ మైన బ్రహ్మ భావమే. సర్వా భావం భావం ఎలా అవుతుంది అనడానికి అవకాశం లేదు;ఘటాభావాభావం ఘటం అయినట్లు ఇది కూడ. సర్వమూ అభావరూప మైనప్పుడు సర్వాభావం అభావాభావం అవుతుంది కదా? అది భావమే. సరే;ఇంతటితో ప్రసక్తానుప్రసక్తచర్చ చాలును (భా. అ. ప్ర. పే. 7) 2

భాష్యమ్

అతః విశిష్టఫలత్వాత్ దుర్లభం జ్ఞానమ్. కథమ్ ఇత్యుచ్యతే-

మూ. మనుష్యాణాం సహస్రేషు కశ్చిద్యతతి సిద్ధయే,
యతతామపి సిద్ధానాం కశ్చిన్మాం వేత్తి తత్త్వతః. 3

బాలానందిని

అతః ఇతి:-అందువల్ల, విశిష్టమైన ఫలం కలదవడంచేత జ్ఞానం దుర్లభ మైనది. అదెట్లనగా-చెప్పబడుచున్నది-

ప్ర. అ. మనుష్యాణామితి:-మనుష్యాణామ్=మనుష్యులయొక్కసహస్రేషు=వేలలో, కశ్చిత్=ఏ ఒక్కడో,సిద్ధయే=సిద్ధికొరకు,యతతి=ప్రయత్నం చేస్తాడు. యతతామ్=ప్రయత్నం చేస్తూన్న,సిద్ధానామపి=సిద్ధులలో కూడ,కశ్చిత్=ఏ ఒక్కడో,మామ్=నన్ను,తత్త్వతః=యథార్థంగా,వేత్తి=తెలుసుకొంటాడు.

భాష్యమ్

మనుష్యాణాం మధ్యే,సహస్రేషు అనేకేషు,కశ్చిత్,యతతి ప్రయత్నం కరోతి, సిద్ధయే సిద్ధ్యర్థమ్. తేషాం యతతామపి సిద్ధానాం-సిద్ధా ఏవ హి తే యే మోక్షాయ యతన్తే-తేషాం, కశ్చిదేవ మాం వేత్తి తత్త్వతః యథావత్. 3

బాలానందిని

మనుష్యాణామ్ ఇతి:- ఎంతోమంది మనుష్యులలో ఏ ఒక్కడో సిద్ధికోసం ప్రయత్నం చేస్తాడు. ప్రయత్నం చేస్తూన్న ఆ సిద్ధులలో కూడ-మోక్షం కోసం ప్రయత్నం చేసేవాళ్లు సిద్ధులే కదా? ఏ ఒక్కడో మాత్రమే నన్ను యథార్థస్వరూపంలో తెలుసుకొంటాడు. 4

భా. అ.ప్ర.: "మనుష్య లనగా శాస్త్రాధికారానికి యోగ్యులు. వాళ్లలో, కొన్ని వేల మందిలో ఒక్కడే సిద్ధివరకు ప్రయత్నిస్తాడు. సిద్ధివరకు ప్రయత్నించే కొన్ని వేలమందిలో ఒక్కడే నన్ను తెలుసుకొని నా ద్వారా సిద్ధికొరకు ప్రయత్నిస్తాడు. నన్ను తెలిసికొన్న కొన్ని వేలమందిలో ఒక్కడే నేను ఎట్లున్నానో యథార్థరూపంలో తెలుసుకొంటాడు. ఎవ్వడూ తెలుసుకొనడు అని అభిప్రాయం. **"స మహాత్మా సుదుర్లభః"** **"మాం తు వేద న కశ్చన"** అని చెప్పబడుచున్నది" అని శ్రీరామానుజాచార్యుల వ్యాఖ్య అసంగతంగా ఉంది. దేవాదులకు కూడ శాస్త్రాధికారయోగ్యత్వం ఉన్న దని శారీరకసూత్రాలలో బాదరాయణుడు స్థాపించాడు కదా? "సిద్ధయే యతతే" అనేదానికి సిద్ధిపర్యంతం ప్రయత్నిస్తాడు అను అర్థం రాదు. "సిద్ధయే యతతే" అను రెండు పదాలు ఆవృత్తి చేసి వాక్యభేదం కల్పించడం న్యాయవిరుద్ధం. "మాం విదిత్వా మత్తః" అను మూలంలో లేని పదాలను కల్పించడం అప్రమాణం. సిద్ధి పర్యంతం ప్రయత్నించేవాళ్లలో ఒక్కడే సిద్ధికోసం ప్రయత్నిస్తాడు అను వాక్యం అన్వయం సరిగా లేదు. సిద్ధికోసం ప్రయత్నించేవా డనగా సిద్ధి పర్యంతం ప్రయత్నించేవాడే కదా? 'కశ్చిన్మాం వేత్తి' (ఏ ఒక్కడో నన్ను తెలుసుకొంటాడు) అన్నదానికి నన్ను ఎవ్వడూ తెలుసుకొనడు అను అర్థం కూడ అయుక్తమే; ఇక్కడ విపరీతలక్షణను ఆశ్రయించడానికి తగిన ప్రమాణం ఏదీ లేదు. "మాం తు వేద న కశ్చన" అనేది నాయందు భక్తిగలవాడు, నేనే శరణగా కలవాడు తప్ప ఇతరు డెవడూ తెలుసుకొనజాలడు అను అభిప్రాయంతో చెప్పబడింది. అలా కాక ఈశ్వరరతత్త్వం ఎవరికీ కూడ తెలియదు అని అంటే ఈశ్వరతత్త్వం సంప్రదాయసిద్ధం అవదు. అప్పుడు ఈశ్వరతత్త్వమే లేకుండా పోతుంది. **"దృశ్యతే త్వగ్ర్యయా బుద్ధ్యా"** అను శ్రుతి ఈశ్వరతత్త్వం తెలియ శక్య మైన దని చెపుతూన్నది. **"తమేవ విదిత్వా అతి మృత్యుమేతి"** అను శ్రుతి ఈశ్వరతత్త్వజ్ఞానంవల్లనే ముక్తి లభిస్తుంది అని చెపుతున్నది. ఈశ్వరతత్త్వం అగోచర మైతే ముక్తికొరకై ఎవ్వడూ కూడ వేదాంతశాస్త్రాధ్యయనానికి ప్రవర్తించడు. గృహస్థుణ్ణి సంన్యాసాశ్రమంలో ప్రవర్తింప చేసే ఈ శాస్త్రం అనర్థానికే హేతు వవుతుంది; ఎందుచేత ననగా- త్రివర్గానికి సాధన మైన గృహస్థాశ్రమాన్ని విడిచివేసి సంన్యాసాశ్రమం స్వీకరించడంవల్ల ఏమీ ప్రయోజనం కనబడడం లేదు కదా? అందువల్ల "నన్ను ఎవడో ధన్యుడు తెలుసుకొన కలుగుతాడు" అను అర్థమే కాని "నన్ను తెలుసుకొనజాలడు" అని కాదు.

"మనుష్యశబ్దం ఒక మనుష్యజాతిని చెప్పడం అనే అభిప్రాయంతో ప్రయోగించబడ లేదు; సిద్ధికోసం యత్నించడానికి యోగ్యుడు అనే అర్థంలో ప్రయోగింపబడింది" అని వేదాంతదేశికులు చెప్పినది కూడ అయుక్తం. ముఖ్యార్థాన్ని విడవడంలో కారణం లేదు. అర్జునుడు మనుష్యుడు గాన మనుష్యు లైన మీకు ఈ జ్ఞానం దుర్లభతరం అని చెప్పడమే భగవంతుని అభిప్రాయం. దేవాదులకు ఈ జ్ఞానం సులభమో దుర్లభమో తెలియడంవల్ల అర్జునునికి ప్రయోజనం ఏదీ లేదు.

సిద్ధికోసం ప్రయత్నించడం అనేది సర్వసాధరణమే;అందుచేత 'సిద్ధిపర్యన్తమ్'అని చెప్పబడింది అనే మాట కూడ అసత్.సిద్ధికోసం ప్రయత్నించడం కూడ సర్వసాధారణం కాదు కదా?అందరూ సిద్ధికోసం ప్రయత్నిస్తూన్నట్లు కనబడడంలేదు కదా?సర్వసాధారణ మైనది సంసారప్రయత్నం మాత్రమే.మరొక విషయ మేమనగా-ఎవడైతే సిద్ధికోసం ప్రయత్నిస్తాడో అతడే సిద్ధిపర్యంతం ప్రయత్నిస్తాడు.మధ్యలో ఆ ప్రయత్నం విడిచిపెట్టడు. దైవంచేత మరణించినా కూడ జన్మాంతరంలో తప్పక ప్రయత్నం చేస్తాడు.లేదా-సిద్ధి కోసం ప్రయత్నించే వేలమందిలో కూడ సిద్ధి కలిగే వరకూ ఏ ఒక్కడో ప్రయత్నిస్తాడు; సిద్ధికోసం ప్రయత్నించేవా ళ్లందరూ సిద్ధిపర్యంతం ప్రయత్నించడం అసంభవం కదా?సిద్ధి ఏ ఒక్కనికో మాత్రమే లభిస్తుంది.అయితే ఈ విషయం మూలకారుడు చెప్పలేదు.అది రామానుజులు చెపితే నిర్మూలమే అవుతుంది.

"యత్నించే సిద్ధులలో కూడ ఏ ఒక్కడో నన్ను తెలుసుకొంటాడు","నన్ను తెలుసు కొన్నవారిలో కూడ ఏ ఒక్కడో నన్ను యథార్థంగా తెలుసుకొంటాడు" అని రెండు వాక్యాలు ఇక్కడ వివక్షితములై ఉన్నాయి అనడం కూడ నిఃసారం.అలాంటి వివక్ష సూచించే పదం ఏదీ మూలంలో కనబడడంలేదు."యతతామపి సిద్ధానాం కశ్చిన్మాం వేత్తి","మద్విదాం సహస్రేషు కశ్చిన్మాం తత్త్వతః వేత్తి"అని మూలంలో లేదు కదా?ఈ కల్పనం అంతా కూడ నిర్మూలమే.నిర్మూలమే కాదు అసంగతం కూడ.ఎవడు నన్ను తెలుసుకొంటాడో అతడు నన్ను తత్త్వతః తెలుసుకొనడం లేదు;నన్ను తత్త్వతః తెలుసుకొన్నవాడు అన్యుడే అని చెప్పడం అయుక్తం కదా?ఈశ్వరుని తత్త్వతః తెలుసుకొన్నవానిని ఇతడు ఈశ్వరుణ్ణి తెలుసుకొన్నాడు అని అనరుకదా?ఈశ్వరుణ్ణి తత్త్వతః తెలుసుకొననివానిని ఇతడు ఈశ్వరుణ్ణి తెలుసుకొనలేదు అని అనరు కదా?(పూ.ప.)"మాం వేత్తి"నన్ను సామాన్య రూపంలో తెలుసుకొన్నాడు అనీ,"మాం తత్త్వతః వేత్తి"అనగా ఈశ్వరుణ్ణి విశేషరూపంలో తెలుసుకొన్నవాడు అనీ అభిప్రాయం అనడం కూడ(సి)యుక్తం కాదు.విశేషరహితచిన్మాత్రరూపుడైన ఈశ్వరునిలో సామాన్యవిశేషభావాలను కల్పించడం యుక్తం కాదు.పరోక్షత్వాపరోక్షత్వాలచేత (వేత్తి అనగా పరోక్షంగా తెలుసుకొంటున్నాడు,'తత్త్వతః వేత్తి'అనగా అపరోక్షంగా తెలుసుకొంటున్నాడు అని)భేదం ఉంది అని చెప్పడం కుదరదు."యత్సాక్షాదపరోక్షాద్ బ్రహ్మ"అని శ్రుతి చెప్పినట్లు ఈశ్వరుడు నిత్యాపరోక్షమైన బ్రహ్మ కదా?ఆత్మయే ఈశ్వరుడు కదా?ఆత్మ ఎవనికీ కూడ అప్రత్యక్షం కాదు.(పూ.ప.)ఈశ్వరుని స్వరూపస్వభావాల జ్ఞానాలను పట్టి ఈ భేదం కుదురుతుంది అనడం కూడ (సి)యుక్తం కాదు. ఈశ్వరస్వరూపం తెలుసుకొన్నవాడు ఈశ్వరస్వభావాన్ని కూడ తెలుసుకొన్నవాడే అవుతాడు. ఈశ్వరస్వభావం అంటే

ఈశ్వరస్వరూపమే కదా?స్వరూంకంటె వేరుగా స్వభావం అంటూ ఏదీ ఉండదు కదా?స్వరూపంకంటె భిన్నమైన స్వభావం ఏది ఉందో అది మాయయే. ఎందుచేత ననగా స్వరూపం ఒక్కటే సత్య మైనది.అందువల్ల-ఈశ్వరుణ్ణి తత్త్వతః తెలుసు కొన్నవాడే ఈశ్వరుణ్ణి తెలుసుకొన్నవాడు;ఎవడు ఈశ్వరుణ్ణి తత్త్వతః తెలిసికొనడో అతడు ఈశ్వరుణ్ణి తెలిసికొనలేదనే అర్థం(భా.అ.ప్ర.పే. 6-7) 3

భాష్యమ్

శ్రోతారం ప్రరోచనేన అభిముఖీకృత్య ఆహ-

మూ. భూమిరాపోఽనలో వాయుః ఖం మనో బుద్ధిదేవ చ
అహఙ్కార ఇతీయం మే భిన్నా ప్రకృతిరష్టధా. 4

బాలానందిని

శ్రోతారమితి:- ప్రదోచనంచేత శ్రోతను అభిముఖుని చేసికొని చెపుతున్నాడు-

ప్ర.అ.భూమిరితి:-భూమిః=భూమి,ఆపః=జలము,అనలః=అగ్ని,వాయుః =వాయువు,ఖమ్=ఆకాశము,మనః=మనస్సు,బుద్ధిః ఏవ చ=బుద్ధి,అహంకారః=అహంకారము,ఇతి=ఈ విధంగా,మే=నాయొక్క,ఇయమ్=ఈ,ప్రకృతిః=ప్రకృతి,అష్టధా=ఎనిమిది విధాలుగా,భిన్నా=భిన్న మైనది.

భాష్యమ్

భూమిరితి పృథివీ తన్మాత్రమ్ ఉచ్యతే,న స్థూలా;"భిన్నా ప్రకృతిరష్టధా"ఇతి వచనాత్.తథా అబాదయోఽపి తన్మాత్రాణ్యేవ ఉచ్యన్తే.ఆపః అనలః వాయుః ఖం,మనః ఇతి మనసః కారణమ్ అహంకారః గృహ్యతే,బుద్ధిః ఇతి అహంకారకారణం మహత్తత్త్వమ్.అహంకారః ఇతి అవిద్యాసంయుక్తమ్ అవ్యక్తమ్;యథా విషసంయుక్తమన్నం విషమ్ ఉచ్యతే ఏవమ్ అహంకారవాసనావత్ అవ్యక్తం మూలకారణమ్ అహంకారః ఇతి ఉచ్యతే,ప్రవర్తకత్వాత్ అహంకారస్య.అహంకార ఏవ హి సర్వస్య ప్రవృత్తిబీజం దృష్టం లోకే.ఇతి ఇయం యథోక్తా ప్రకృతిః,మే మమ,ఐశ్వరీ మాయాశక్తిః అష్టధా భిన్నా భేదమ్ ఆగతా. 4

బాలానందిని

భూమిరితి:-భూమిః అని పృథివీతన్మాత్రం(తన్మాత్రారూపంలో ఉన్న సూక్ష్మపృథివి) చెప్పబడుచున్నది;అంతే కాని స్థూలపృథివి కాదు;"భిన్నా ప్రకృతిరష్టధా"అని చెప్పడంవల్ల

(శబ్ద-స్పర్శ-రూప-రస--గంధరూపాలైన ఐదు తన్మాత్రలనుండి స్థూలభూతాలు పుట్టు చున్నాయి. అందుచేత తన్మాత్రలు సూక్ష్మభూతాలు,వాటినుండి పుట్టినవి స్థూలభూతాలు-పంచతన్మాత్రలు ప్రకృతులు, అనగా కారణములు. స్థూలభూతాలు వికృతులు,అనగా కార్యములు. స్థూలభూతాల వికృతులే కాని ప్రకృతులు కావు. ఇక్కడ భూమ్యాదులు నా ప్రకృతుల భేదములు అని చెప్పబడుచున్నది-అందుచేత స్థూలభూతాలను గ్రహించ కూడదు అని అభిప్రాయం). అట్లే ఉదకాదులు కూడ తన్మాత్రలే చెప్పబడుచున్నవి. ఉదకము, అగ్ని,వాయువు,ఆకాశము. మనస్సుకు కారణమైన అహంకారం మనశ్శబ్దంచేత చెప్పబడు చున్నది.(మనస్సు వికృతియే కాని దేనికీ ప్రకృతి కాదు. ఇక్కడ ఇది ప్రకృతులలో ఒకటి అని చెప్పబడుచున్నది గాన దాని ప్రకృతియైన అహంకారాన్ని గ్రహించాలి అని అర్థం). బుద్ధి అనగా అహంకారానికి కారణమైన మహత్తత్త్వం. (ఇలా చెప్పడానికి కారణం మనస్సు విషయంలో చెప్పినదే). అహంకారం అనగా అవిద్యతో కూడిన అవ్యక్తం. విషం కలిసిన అన్నాన్ని విషం అన్నట్లు అహంకారవాసనతో అవిద్యతో, కూడిన మూలకారణమైన అవ్యక్తం అహంకారాన్ని ప్రవర్తింపజేస్తుంది గాన అహంకారం అని చెప్పబడుచున్నది. అహంకారమే అందరి ప్రవృత్తికీ మూలకారణంగా లోకంలో చూడబడుచున్నది కదా? ఈ విధంగా, ఇంతవరకు చెప్పబడిన, నా ఈశ్వరమాయ యైన ప్రకృతి ఎనిమిది విధాలుగా వేరు వేరుగా ఉన్నది.

భా. అ. ప్ర.:- "భూమ్యాదిశబ్దాలు యథాశ్రుతంగా(ఎలా శ్లోకంలో వినబడు తున్నాయో అదే విధంగా)స్థూలభూతాదు లనే అర్థాలనే బోధిస్తాయి''అను శ్రీరామానుజోక్తి అసంగతం. స్థూలలభూతాదులకు ప్రకృతిత్వం లేదు గాన వాటిని గ్రహించకూడ దని భాష్యకారులే చెప్పి ఉన్నారు కదా?

"ఇది మొదట ఒక్కటిగానే ఉండేది;తరువాత ఎనిమిది విధాలుగా పరిణమించి నది"అను దేశికోక్తి కూడ అసంగతమే. ఇది పంభూత-మనస్-బుద్ధి-అహంకారరూపాలలో మాత్రమే పరిణమించినది అని చెప్పడానికి శక్యం కాదు. ఐదు భూతాలు, ఐదు ప్రాణాలు, పది ఇంద్రియాలు, ఐదు విషయాలు, మనస్సు, బుద్ధి, అహంకారం అను ఇరవై ఎనిమిది విధాలుగా పరిణమించినది అని చెప్పవలసి ఉంటుంది. ఘటరూపంలో పరిణమించిన మట్టి కంటె అతిరిక్తంగా(వేరుగా)పరిణామం చెందని మట్టి ఇంకా మిగిలి ఉన్నట్లు భూమ్యాదిరూపంలో పరిణమించిన ప్రకృతికంటె అతిరిక్తంగా,పరిణామం చెందని ప్రకృతి ఉంటుంది కాబట్టి "మొదట ఒక్కటే,తరువాత ఎనిమిది విధాలుగా పరిణమించినది"అని చెప్పడం అయుక్తం. కార్యాల స్వరూపంలో ఎనిమిది విధాలుగాను, కారణరూపంలో ఒకటిగాను తొమ్మిది విధాలుగా ఉన్నది అని చెప్పాలి. మొత్తం ప్రకృతి అంతా పరణమిస్తుంది

అని చెప్పిన ట్లయితే ఈశ్వరునకి ఉపాధియైన అవ్యాకృతమే లేకుండా పోతుంది. అది అంతే అనడం కుదరదు;సుషుప్తిలో అజ్ఞానానుభవం ఉంటూన్నది కదా?వ్యవహారకాలంలో కూడ"నేను అజ్ఞుడను"అను అనుభవంచేత సిద్ధ మైన అజ్ఞానం లేదనడం కుద రదు;ఘటంయొక్క అజ్ఞానం ఘటజ్ఞానంచేత నివర్తిస్తూన్నట్లు కనబడుతూనే ఉంది. అజ్ఞానం అనగా జ్ఞానాభావమే కాని మాయ కాదు అనడానికి వీలు లేదు;అనాది యైన భావపదార్థమై ఉండి జ్ఞానంచేత నివర్తింపచేయబడేది అజ్ఞానం అని మాయకు లక్షణం;ఈ లక్షణం అజ్ఞానానికి అన్వయిస్తుంది గాన అజ్ఞానం భావరూపమే."నాకు జ్ఞానం లేదు"అని ఎవ్వడూ అనుకొనడు;"నాకు అజ్ఞానం ఉంది"అనే అనుకొంటాడు. అందుచేత అజ్ఞానం భావరూపమే కాని అభావరూపం కాదు. (భా.అ.ప్ర. పే.9-10) 4

మూ. అపరేయమితస్త్వన్యాం ప్రకృతిం విద్ధి మే పరామ్,
జీవభూతాం మహాబాహో యయేదం ధార్యతే జగత్. 5

ప్ర.అ. అపరేతి:- ఇయమ్=ఇది, అపరా=అపరప్రకృతి. మహాబాహో=ఓ! మహా బాహూ! ఇతః=దీనికంటె,అన్యామ్=అన్యమైన,జీవభూతామ్=జీవుడుగా అయిన, (జీవ రూపంలో ఉన్న), మే=నా యొక్క పరామ్=శ్రేష్ఠమైన ప్రకృతిమ్=ప్రకృతిని గూర్చి,విద్ధి= తెలుసుకొనుము. యయా=దేనిచేత,ఇదం జగత్=ఈ జగత్తు,ధార్యతే=ధరించబడు చున్నదో.

భాష్యమ్

అపరేతి:- అపరా-న పరా నికృష్టా అశుద్ధా అనర్థకరీ సంసారబన్ధనాత్మికా ఇయమ్,ఇతః అస్యాః యథోక్తాయాః,తు,అన్యాం విశుద్ధాం ప్రకృతిం మమ ఆత్మభూతాం విద్ధి,మే,పరాం ప్రకృష్టాం,జీవభూతాం క్షేత్రజ్ఞలక్షణామ్,ప్రాణధారణనిమిత్తభూతాం,హే మహాబాహో!యయా ప్రకృత్యా ఇదం,ధార్యతే,జగత్,అన్తః ప్రవిష్టయా. 5

బాలానందిని

అపరేతి:- ఇది పర కానిది అపర,నికృష్ట మైనది,అశుద్ధ మైనది,అనర్థాలు కలిగించేది; సంసారబంధనరూప మైనది. ఇలాంటి దీనికంటె (అపరప్రకృతికంటె)భిన్నమైనది, విశుద్ధ మైనది ఆత్మ యైనది అయిన పర యైన అనగా)ప్రకృష్టమైన,జీవస్వరూప మైన,ప్రాణా ధారాణానికి నిమిత్త మైన నా ప్రకృతిని, ఓ బహాబాహూ! తెలుసుకొనుము. జగత్తు లోపల ప్రవేశించిన ఏ ప్రకృతిచేత ఈ జగత్తు నిలుపబడుచున్నదో.

వి.:-"జీవ ప్రాణాధారణే"అను ధాతువునుండి "జీవతి,ప్రాణాన్ ధారయతి,అస్మాత్ దేహః ఇతి జీవః"(ఎవనివలన ఈ దేహం ప్రాణాలను ధరిస్తూన్నదో అతడు జీవుడు)అను

వ్యుత్పత్తిని అనుసరించి జీవశబ్దం నిష్పన్న మైనది. అనగా దేహం ప్రాణాలను ధరించడానికి నిమిత్తం జీవుడు. జీవు డున్నంతవరకు దేహం ప్రాణాలను ధరిస్తుంది. జీవుడు తప్పుకొనగానే ప్రాణాలను విడుస్తుంది. సర్వవ్యాప్తుడు, పరిపూర్ణుడూ అయిన జీవునికి వాస్తవంలో గమనాగమనాదులు లేవు. అయినా కూడ ఘటరూప మైన ఉపాధిని పట్టి ఆకాశానికి గమనాగమనాదులు న్నట్లు చెప్పినట్లుగా బుద్ధిరూప మైన ఉపాధియొక్క గమనాగమనాదులను బట్టి జీవునకు కూడ అది ఉన్నట్లు చెప్పబడుచున్నది.

జీవుడు అనే ప్రకృతి జగత్తులో ప్రవేశించి దానిని నిలుపుచున్నది. అట్టి జీవరూప ప్రకృతి అంతర్యామి, నారాయణుడు ఇత్యాదిశబ్దాలచేత చెప్పబడుతుంది. "**అన్తర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణః స్థితః**"అను శ్రుతి ననుసరించి జత్తుకు లోపలా బైటా కూడ నారాయణు డున్నా కూడ లోపల ప్రవేశించి, అనగా లోపల వ్యాపించి ఉన్న ఆత్మయే జీవుడు; అతడే జగత్తును ధరిస్తున్నాడు అని ఇక్కడ చెప్పబడుచున్నది. ఇక్కడ లోపల ప్రవేశిం చడం అనగా లోపల వ్యాపించి ఉండడం. లేదా-"**తత్సృష్ట్వా తదేవానుప్రావిశత్**"అను శ్రుతి ననుసరించి బుద్ధిరూప మైన ఉపాధిని పట్టి అంతఃప్రవేశం అని కూడ చెప్పవచ్చును. ఈ అంతఃప్రవేశం స్థావరజంగమాత్మకదేహాలలోనే. అచేతనపదార్థాలలో ఈశ్వరానుప్రవేశం అంటూ ఉండదు. ఈ విధంగా లోపల వ్యాపించి ఉన్న చైతన్యమే జీవుడు, కూటస్థుడు, సాక్షి, ఆత్మ అని చెప్పబడుచున్నది. బైట వ్యాపించి ఉన్న చైతన్యం ఈశ్వరుడు, బ్రహ్మ అని చెప్పబడుచున్నది. వాస్తవంలో ఈ లోపల ఉండడం బైట ఉండడం అనేవి కల్పితాలే. (భా. అ. ప్ర. పే. (0-11).

భా. అ. ప్ర.:"ఈశ్వరునికి అచేతనరూపము, చేతనరూపము అయిన రెండు ప్రకృతు లున్నాయి. వాటిలో భోగ్యమైన అచేతనప్రకృతి "**భూమిరాపః**"అనే శ్లోకంచేత చూపబడింది. భోక్త యైన ఏ చేతనప్రకృతి ఉన్నదో అది ఇక్కడ చెప్పబడుచున్నది"అని శ్రీరామానుజా చార్యులు చెప్పినది యుక్తం కాదు. "**అవికార్యోఽయముచ్యతే**"అను వాక్యాన్ని(2.25) అనుసరించి చేతను డైన జీవునకు భోక్తృత్వం అనే వికారం నిషేధింపబడడంవల్ల 'అహం' అనే వృత్తిరూపంలో ఉండే, విజ్ఞానమయకోశమైన బుద్ధికి మాత్రమే భోక్తృత్వం ఉంటుంది. అయితే అది కూడ వాస్తవంలో జడమేగాన భోక్తృ-భోగ్యాత్మక మైన ప్రకృతి అచేతనమే. చేతనుడైన జీవునికి కర్తృత్వం లేదు గాన భోక్తృత్వం కూడ లేదు. "**ప్రకృతేః క్రియమాణాని గుణైః కర్మాణి సర్వశః, అహఙ్కారవిమూఢాత్మా కర్తాఽహమితి మన్యతే**"(3.27)"**న కరోతి న లిప్యతే**"(13.32)అని జీవునకు కర్తృత్వం లేదని ఇక్కడనే చెప్పబడింది. "**నిష్కలం నిష్క్రియం శాన్తమ్**"(శ్వే. ఉ. అ. 19)ఇత్యాదిశ్రుతి ననుసరించి కర్తయైన బుద్ధితో తాదాత్మ్యాన్ని అభ్యసించుకొనడంవల్లనే జీవుడు కర్త అనే భ్రమ కలుగుచున్నది. ఆ అధ్యాస లేని సుషుప్తిలో

జీవునకు కర్తృత్వం కనబడడంలేదు. కర్త కానివాడు భోక్త అవడానికి వీలు లేదు. అట్లయితే సోమయాగం చేసినవాడు కాక మరెవరికో స్వర్గరూపమైన ఫలం లభించే అవకాశం ఉంటుంది. నీ మతం ప్రకారం పరమాణుప్రమాణం గల భోక్తయైన జీవుడు సమస్తజగత్తును ధరించడం అనేది కూడ కుదరదు. (భా. అ. ప్ర. పే. 11) 5

మూ. ఏతద్యోనీని భూతాని సర్వాణీత్యుపధారయ,
అహం కృత్స్నస్య జగతః ప్రభవః ప్రలయస్తథా. 6

ప్ర. అ. **ఏతదితి**:– సర్వాణి=సమస్తమైన, భూతాని=భూతములు, ఏతద్యోనీని ఇతి= ఈ రెండు ప్రకృతులూ కారణముగా కలవిగా, ఉపధారయ=తెలుసుకొనుము. అహమ్= నేను, కృత్స్నస్య=సమస్తమైన, జగతః=జగత్తునకు, ప్రభవః=ఉత్పత్తిస్థాన మైనవాడను (కారణము). తథా=మరియు, ప్రలయః=లయస్థానము.

భాష్యమ్

ఏతదితి:–ఏతద్యోనీని–ఏతే పరాపరే క్షేత్రక్షేత్రజ్ఞలక్షణే ప్రకృతీ యోనిః యేషాం భూతానాం తాని ఏతద్యోనీని, భూతాని సర్వాణి ఇతి, ఉపధారయ జానీహి. యస్మాత్ మమ ప్రకృతీ, యోనిః కారణం, సర్వభూతానామ్ అతః అహమ్, కృత్స్నస్య సమస్తస్య, జగతః, ప్రభవః ఉత్పత్తిః, ప్రలయః వినాశః, తథా ప్రకృతిద్వయద్వారేణ అహం సర్వజ్ఞ ఈశ్వరః జగతః కారణమ్ ఇత్యర్థః. 6

బాలానందిని

ఏతదితి: సమస్తభూతములూ కూడ క్షేత్ర–క్షేత్రజ్ఞరూపా లైన పరాపరప్రకృతులే కారణంగా కలవి అని, తెలుసుకో. నా ప్రకృతులు సర్వభూతాలకు కారణం అవడంచేత నేను సమస్తజగత్తుయొక్క ఉత్పత్తి, వినాశమూ కూడ(అనగా)ఉత్పత్తిస్థానము, వినాశస్థానమూ కూడ). సర్వజ్ఞు డైన ఈశ్వరుడ నైన నేను రెండు ప్రకృతుల ద్వారా జగత్తుకు కారణ మైన వాడను అని అర్థం.

భా. అ. ప్ర. "చేతనాచేతనప్రకృతులకు రెండింటికీ కూడ ఈశ్వరుడు కారణం (రెండు ప్రకృతులూ ఈశ్వరునినుండి పుట్టాయి)"అని శ్రీరామానుజాచార్యు లన్నారు. అది అయుక్తం. **"అజో నిత్యః శాశ్వతోఽయం పురాణః"**అను వాక్యం జీవుడు ఈశ్వరునినుండి పుట్టడాన్ని నిషేధిస్తూన్నది. జీవునికి కూడ జన్మ ఉండే పక్షంలో**"జాతస్య హి ధ్రువో మృత్యుః"**అని చెప్పినట్లు జీవుడు కూడ నశించవలసి ఉంటుంది. అట్లే ప్రకృతి–పురుష–కాలాదులు అనాదులు లనినీవు కూడ అంగీకరించి ఉన్నావు. అందుచేత, 'అజామ్'ఇత్యాదిశ్రుత్యనుసారమూ కూడ మాయ

అనాది గాన అది కూడ ఈశ్వరునినుండి జనించలేదు. మాయ ఈశ్వరునినుండి పుట్టినది అని అంటే మాయోత్పత్తికి పూర్వం ఈశ్వరుడు మాయారహితు డని చెప్పవలసి వస్తుంది. అది **"మాయినం తు మహేశ్వరమ్"**అను శ్రుతికి విరుద్ధం. మాయ లేని ఈశ్వరునికి మాయను పుట్టించే శక్తి ఉండదు గాన మాయకు ఉత్పత్తి కుదరదు. శక్తి రూపమైన ఈశ్వరసామర్థ్యమే కదా మాయ అనగా? ఈ మాయను పుట్టించడానికి సామర్థ్యం అనే మరొక మాయ ఉన్న పక్షంలో ఆ మాయను పుట్టించ గల సామర్థ్యం అనే మరొక మాయను కల్పించ వలసి వస్తుంది. అది మరొక మాయచేత పుట్టించబడాలి; ఈ విధంగా అనవస్థాదోషం ఏర్పడుతుంది. ఈశ్వరసామర్థ్యంకంటె భిన్నమైన మరొక తత్త్వం ఉన్న దనడానికి ప్రమాణం లేదు. సాంఖ్యమతం అవైదికం గాన ప్రమాణం కాదు. అందుచేత జీవుడు వలె మాయ కూడ అనాదియే అని సిద్ధిస్తున్నది. అలాంటప్పుడు ఈశ్వరుడు దీనికి కారణం ఎలా అవుతాడు? అందువల్లనే కదా పరమేశ్వరుని నుండి జీవులు పుడతారు అనే భాగవతమతం బాదరాయణునిచేత శారీరకశాస్త్రంలో నిరాకరించబడింది? బుద్ధి అనే ఉపాధిచేత పరిచ్ఛిన్ను డవడమే జీవుని జన్మ-అది నశించగా అదే మోక్షం అనడం యుక్తం కాదు. ఉపాధియొక్క జన్మనాశాలను పట్టి ఉపహితమైన దానికి జన్మనాశాలు కలగవు కదా? అలా కాకపోతే ఘటంయొక్క జన్మనాశాలచేత ఆకాశానికి కూడ జన్మనాశాలను అంగీకరించవలసివస్తుంది. బుద్ధిపరిచ్ఛిన్నజీవుడు కూడ శరీర మనే ఉపాధియొక్క జన్మనాశాలను పట్టి జన్మనాశాలు పొందుతున్నా డని చెప్పవలసి వస్తుంది. అది అట్లే అనడానికి వీలు లేదు. "న హన్యతే హన్యమానే శరీరే"అని ఇక్కడనే చెప్పబడింది కదా? మరొక విషయ మేమనగా తత్త్వాన్ని చెప్పే సందర్భంలో ఔపాధికములూ అతాత్త్వికములూ అయిన జన్మనాశాలను గూర్చి చెప్పడం అయుక్తం. అందువల్ల జీవునకు మాయకూ కూడ ఈశ్వరుడు కారణం కాదు.

"మహానవ్యక్తే లీయతే, అవ్యక్తమక్షరే లీయతే, అక్షరం తమసి లీయతే, తమః పరే దేవే ఏకీభవతి"అను, ఆయన ఉదాహరించిన శ్రుతి ఆయన అభిప్రాయానికి అనుగుణ మైన అర్థాన్ని బోధించదు. అవ్యక్తత్వం, అక్షరత్వం, తమస్త్వం అనేవి ప్రకృతియొక్క అవస్థా విశేషాలు మాత్రమే. ప్రకృతి ఆత్మలో లీనం అవుతుంది అని మాకు అంగీకార్యమే. దాని కార్యం కానిది దానిలో ఎలా లీనం అవుతుంది అను ప్రశ్నకు తావులేదు, కార్యం కాక పోయినా ప్రగభావం లీనం అవడం కనబడుతున్నది. ఆకాశకార్యం కాకపోయినా మేఘం ఆకాశంలో లీనం అవడం కనబడుతున్నది. పత్తినుండి పుట్టినా వస్త్రం అగ్నిలో లీనం అవడం కనబడుతున్నది. అందుచేత కార్యం కారణంలోనే లీనం కావాలనే నియమం లేదు. ఇంతకీ ఈ శ్రుతి మాయ లీనం అవుతుంది అని చెప్పడంలేదు. మరే మనగా "తమస్సు పరమాత్మయందు ఏకం అవుతుంది" అని మాత్రమే చెపుతున్నది. ఏకీభావం అనగా-బ్రహ్మకంటె వేరుగా కార్యకరణాదిరూపంలో ఉండకపోవడమే.

అక్షరశబ్దానికి జీవు డని అర్థం కదా అనడం యుక్తం కాదు.'అక్షరమ్'అను నపుంసకలిగంశబ్దం జీవుణ్ణి బోధించదు.జీవుణ్ణి బోధించే అక్షరశబ్దం పుంలింగంలో ఉంటుంది. "అజో నిత్యః శాశ్వతోఽ యం పురాణః"అని జీవుడు నిత్యు డని చెప్పే శ్రుతే జీవుడు నశిస్తాడు అని చెపితే స్వవచోవ్యాఘాతం కదా?(పూ.ప)సుషుప్తిలో జీవుడు అజ్ఞానం ద్వారా బ్రహ్మలో లీనం అవుతున్నట్లు కనబడుతున్నది."**సతి సంపద్య న విదుః సతి సంపద్యామహే ఇతి**"అని శ్రుతి కూడ చెపుచున్నది.అనుభవం కూడ ఇందుకు అనుగుణంగా ఉంది.జీవసహితమైన అజ్ఞానం; తమస్సు,బ్రహ్మలో,పరమాత్మలో,లీనం అవుతుంది అనడం(సి)యుక్తం కాదు.జీవునకు బ్రహ్మయందు సంపత్తి అనగా బ్రహ్మరూపంలో ఉండడమే."**ప్రాజ్ఞేనాత్మనా సంపరిష్వక్తః**"అని మరొక శ్రుతి చెప్పుచున్నది.ఈ శ్రుతి–జీవుడు బ్రహ్మతో కలుస్తాడు అని చెపుతున్నది కదా అనకూడదు,అలా అయినా కూడ నశించిన జీవునకు బ్రహ్మతో సంగం కుదరదు కదా?పరస్పరసంగం అనేది ఉన్న రెండు పదార్థాలకే కుదురుతుంది; గగనానికి గగనకుసుమంతో సంగం ఉండదు కదా?అందుచేత జీవుడు అవిద్యాకల్పిత మైన సంసారిత్వాన్ని విడచి బ్రహ్మరూపంలో ఉండడమే "బ్రహ్మణా సంపత్తిః"అనగా. "జీవులు సత్తులో సంపన్నులై కూడ ఆ విషయం తెలుసుకొనడంలేదు"అని వాక్యశేషం చెపుతూన్నది. దీనిని పట్టి కూడా సత్సంపత్తి అనగా పైన చెప్పినదే.నశించిపోయిన జీవులు తెలుసుకొనే ప్రసక్తియే లేనప్పుడు అప్రసక్తమైనదానిని నిషేధించడం యుక్తం కాదు కదా?'న విదుః' అని జీవుల అజ్ఞానానుభవాన్ని చెపుతున్నది.జీవుల విషయంలో బహువచనప్రయోగం ఉపాధి బహుత్వాన్ని పట్టి కాని జీవబహుత్వాన్ని పట్టి కాదు. ఆత్మ ఒక్కటే కదా?

లేదా–జీవునకు ఉపాధి యైన అంతఃకరణం అజ్ఞానంలో లీనం అవుతుంది;అది బ్రహ్మలో లీనం అవుతుంది.ఈ విధంగా శ్రుతి ఉపాధిద్వారా కలిగిన జీవలయాన్ని మాత్రమే చెపుతున్నది కాని వాస్తవలయాన్ని కాదు. అపరిచ్ఛిన్నుడు, నిత్యుడు,పూర్ణుడు అయిన జీవునకు నాశం కుదరదు కదా?ఆ జీవుడే వాస్తవంలో బ్రహ్మ.ఘటాకాశంకంటె మహాకాశం భిన్నం అయితే జీవునికంటె బ్రహ్మ భిన్నమైనది అని చెప్పడానికి అవకాశం ఉంటుంది.ఈ విధంగా సుషుప్తిలోనైనా, ప్రలయంలోనైనా, ముక్తిలో నైనా, జీవుడు ఉపాధి లయం ద్వారా మాత్రమే బ్రహ్మరూపంలో ఉన్నాడు అని చెప్పబడుతుంది.సుషుప్తిప్రలయాలలో ఉపాధి వాసనారూపంలో ఉండడంచేత తిరిగి వస్తుంది;ముక్తిలో నైతే పూర్తిగా లీనం అవడంచేత తిరిగి రాదు.ఈ ఉపాధి కూడ జీవునియందు అజ్ఞానంచేత కల్పిత మైనది గాన జ్ఞానంచేత నివర్తిస్తుంది. అందుచేతనే ముక్తి జ్ఞానంవల్ల మాత్రమే లభిస్తుం దని శ్రుతులు చెపుతున్నాయి.

జీవునకు బ్రహ్మలో లయం అనగా ఉపాధిభంగమే అని నువ్వు కూడ అంగీకరిస్తే అపుడు నీ సిద్ధాంతాన్ని విడిచిపెట్టిన ట్లవుతుంది.నీ మతంలో సాయుజ్యం లేదు కదా? జీవుని లయం వాస్తవమే అంటే నిత్యత్వశ్రుతితో విరోధం.ప్రలయంలో జీవులు నశించి

మళ్లీ జగత్తులో క్రొత్త జీవులు పుట్టుకొని వస్తారు అన్నట్లయితే కృతనాశాకృతాభ్యాగమ ప్రసంగం(చేసిన పుణ్యాదులు ఫలం ఇవ్వకపోవడం,చేయని కర్మ ఫలాలు లభించడం 'కృతనాశాకృతాభ్యాగమప్రసంగం').స్రష్టయైన ఈశ్వరునికి వైషమ్యనైర్ఘృణ్యాదిదోషాలు ప్రసక్తము లవుతాయి.ఈశ్వరుడు కర్మలను అనుసరించి ఫలం ఇస్తాడు కాబట్టి ఈ దోషం లేదు అనడం కుదరదు.కర్త లైన జీవులే నశించి నప్పుడు కర్మ లెక్కడుంటాయి?కర్మ అనగా జీవుని అదృష్టమే కదా?"**న జాయతే మ్రియతే విపశ్చిన్నాయం భూత్వా భవితా వా న భూయః**"(2.20)అని భగవంతుడే ఇక్కడే చెప్పి ఉన్నాడు;శ్రుతి కూడ అలాగే చెప్పుతూన్నది.నువ్వ కూడ అలాగే వ్యాఖ్యానించావు.ఇప్పుడు జీవుడు లయం పొందుతా డని నువ్వే అంటే అది స్వవచనవిరోధం.

"**ప్రకృతిర్యా మయా ఖ్యాతాఽ ఽ వ్యక్తావ్యక్తస్వరూపిణీ,పురుషశ్చాప్యుభావేతౌ లీయేతే పరమాత్మని**"అని ఆతడు ఉదాహరించిన స్మృతి కూడ ప్రలయకాలంలో ప్రకృతిపురుషులు పరమాత్మలో వాస్తవంగా లీనం అవుతా రని చెప్పడంలేదు.అలా చెపితే విరుద్ధవచనం అవుతుంది.ప్రకృతి ఏ కార్యమూ చేయజాలక అణగి పోయినట్లు ఉంటుంది,బుద్ధిపరిచ్ఛిన్ను డైన జీవుడు కూడ ఆజ్ఞానంతో తాదాత్మ్యం పొంది లీనుడు వలె ఉంటాడు అని ఔపచారికమైన విలయాన్నే అది బోధిస్తూన్నది.అలా కాక ప్రలయంలో మాయ పూర్తిగా నశిస్తుంది అన్నట్లయితే జీవులు ఏ ప్రయత్నం అవసరం లేకుండానే మోక్షం పొందుతారు గాన మోక్షశాస్త్రం వ్యర్థం అవుతుంది.అందరు జీవులు ముక్తు లైతే ప్రపంచంలో మళ్లీ క్రొత్త జీవుల్ని సృష్టించవలసి వస్తుంది.అది అంతే అని అంటే జన్మనాశాలు లేని జీవునకు జన్మ నాశాలు రావలసి ఉండడం, కృతహానాకృతాభ్యాగమప్రసంగం, ఈశ్వరునికి వైషమ్యనైర్ఘృణ్య ప్రసంగం-ఇన్ని దోషాలు వస్తాయి.జీవునకు నాశాన్ని అంగీకరించిన పక్షంలో కూడ ఈ అన్ని దోషాలూ వస్తాయి.అందుచేత నిద్రించిన పురుషుణ్ణి బ్రహ్మలో లీనమైనా డని అన్నట్లే ప్రలయంలో కూడ జీవునకు వాస్తవ మైన లయం లేదు.ఉన్న జీవుడు నశించి లేని జీవుడు పుడతాడు అన్నట్లయితే"**నాఽసతో విద్యతే భావో నాభావో విద్యతే సతః**"(2.16)అను గీతావచనానికే విరోధం కలుగుతుంది-అసత్ సత్ అవడం గాని,సత్ అసత్ అవడం గాని కుదరదు గాన ఈ కల్పన అయుక్త మైనది.

(పూ.ప.) అయితే సత్తైన ప్రపంచానికి మాత్రం లయం ఎలా కలుగుతుంది?(సి) ప్రపంచం సత్తే కాదు.(పూ.ప.)అసత్తైతే ఎలా కనబడుతున్నది?శశశృంగం కనబడదు కదా?(సి)అసత్తైనా రజ్జుసర్పాదికం తెలియబడుచున్నది కదా?అసత్తైనా కూడ ప్రపంచం,శుక్తి రజతాదికం వలె,జ్ఞానగోచరం అవుతున్నది కావుననే ఇది మిథ్య అని మేం అంటున్నాం. ఏది కనబడుతుందో,కాని బాధించబడుతుందో అది,ఇంద్రజలాదికం వలె మిథ్యయైనది.

అందువల్ల నిత్యు డైన జీవునికి ప్రలయంలో కాని,ముక్తిలో కాని లయం లేదు.మాయకు కూడ ప్రలయంలో లయం లేదు;ముక్తిలోనే లయం.ప్రలయకాలంలో ప్రకృతిపురుషులకు లయం కలుగుతుంది అని చెప్పినది ఔపచారికమే.ఈ విధంగా ప్రకృతిపురుషులకు ప్రలయంలో లయం లేదుకావుననే ప్రపంచంలో వాటికి ఉత్పత్తి లేదు.అందువల్ల ప్రకృతి పురుషులకు ఈశ్వరుడు కారణం కాదు అనేది నిశ్చితం.(భా.అ.ప్ర.పే.15) 6

భాష్యమ్

యతః తస్మాత్ -

మూ. మత్తః పరతరం నాన్యత్కించిదస్తి ధనంజయ,
మయి సర్వమిదం ప్రోతం సూత్రే మణిగణా ఇవ. 7

బాలానందిని

యతః ఇతి:- నేను ఎందువలన సకలజగత్తుయొక్క ప్రభవముగా ప్రలయంగా ఉన్నానో అందువల్ల

ప్ర.అ. **మత్తః ఇతి**:- ధనంజయ=అర్జునా!మత్తః=నాకంటె,పరతరమ్=ఎక్కువ గొప్పదైన,అన్యత్=మరొకటి,కించిత్=ఏదీ కూడ,నాస్తి=లేదు.ఇదమ్=ఈ, సర్వమ్=అంతా కూడ,సూత్రే=దారమునందు,మణిగణాః ఇవ=మాణిక్యముల సముదాయములు వలె, మయి=నాయందు,ప్రోతమ్=గ్రుచ్చబడినది.

భాష్యమ్

మత్తః పరమేశ్వరాత్ పరతరమ్,అన్యత్ కారణాన్తరం,కించిత్,నాస్తి న విద్యతే, అహమేవ జగత్కారణమ్ ఇత్యర్థః.హే ధనంజయ! యస్మాత్ ఏవం తస్మాత్,మయి పరమేశ్వరే,సర్వాణి భూతాని,సర్వమ్ ఇదం జగత్,ప్రోతమ్ అనుస్యూతమ్ అనుగతమ్ అనువిద్ధం గ్రథితమ్ ఇత్యర్థః.దీర్ఘతన్తుషు పటవత్,సూత్రే చ మణిగణాః ఇవ.7

బాలానందిని

మత్తః ఇతి:-పరమేశ్వరుడ నైన నాకంటె గొప్పదైన,మరొక కారణం ఏదీ లేదు. జగత్కారణము నేనే అని అర్థం.ఓ! అర్జునా!ఇది ఇట్లు గాన,అందువలన,పరమేశ్వరుడ నైన నాయందు అన్ని భూతాలు,ఈ జగత్తు అంతా కూడ,పొడవైన దారాలమీద వస్త్రం వలె,దారమునందు మణుల సముదాయములు వలె వరుసగా గ్రుచ్చబడినది,అనుసరించి ఉన్నది,ఆధారపడి ఉన్నది.

భాష్యమ్

కేన కేన ధర్మేణ విశిష్టే త్వయి సర్వమ్ ఇదం ప్రోతమ్ ఇతి? ఉచ్యతే-

మూ. రసోఽహమప్సు కౌన్తేయ ప్రభాస్మి శశిసూర్యయోః,
ప్రణవః సర్వవేదేషు శబ్దః ఖే పౌరుషం నృషు. 8

బాలానందిని

కేనేతి:-ఏ యే ధర్మంతో కూడిన నీయందు ఇది అంతా అమర్చబడి ఉన్నది? చెప్పబడుచున్నది-

ప్ర.అ. కౌన్తేయ=అర్జునా!అహమ్=నేను,అప్సు=జలములో,రసః=రసముగా, అస్మి= అయి ఉన్నాను.శశిసూర్యయోః=చంద్రసూర్యులలో,ప్రభా=కాంతిగా ఉన్నాను.సర్వవేదేషు = సమస్తవేదములయందు,ప్రణవః=ఓంకారంగా ఉన్నాను.ఖే=ఆకాశమునందు,శబ్దః= శబ్దంగా ఉన్నాను.నృషు=మానవులలో,(పురుషులలో),పౌరుషమ్=పురుషత్వముగా ఉన్నాను.

భాష్యమ్

రసః అహమ్ అపాం యః సారః సః రసః,తస్మిన్ రసభూతే మయి ఆపః ప్రోతాః ఇత్యర్థః.ఏవం సర్వత్ర.యథా అహమ్ అప్సు రసః ఏవం ప్రభా అస్మి శశి సూర్యయోః.ప్రణవః ఓంకారః,సర్వవేదేషు,తస్మిన్ ప్రణవభూతే మయి సర్వే వేదాః ప్రోతాః.తథా,ఖే ఆకాశే,శబ్దః,సారభూతః;తస్మిన్ మయి ఖం ప్రోతమ్.తథా పౌరుషం పురుషస్య భావః,యతః పుంబుద్ధిః నృషు తస్మిన్ మయి పురుషాః ప్రోతాః. 8

బాలానందిని

రస ఇతి:-ఉదకముయొక్క సారమైన ఏ రసం ఉన్నదో అది నేను.రసమైన అట్టి నాయందు ఉదకం నిలచి ఉన్నది.ఈ విధంగా అంతటా అర్థం చెప్పుకొనవలెను.నేను ఏ విధంగా ఉదకంలో రసమునో అట్లే చంద్రసూర్యులలో కాంతిగా ఉన్నాను.సమస్తవేదాలలో ఓంకారంగా ఉన్నాను.ఓంకారమైన అట్టి నాయందు వేదాలు గ్రుచ్చబడి(నిలచి)ఉన్నవి.అట్లే ఆకాశమునందు సారమైన ఏ శబ్దం ఉన్నదో అట్టి నాయందు ఆకాశం నిలచి ఉన్నది.అట్లే పురుషులలో పౌరుషముగా, దేనిని పట్టి ఇతడు పురుషుడు అని చెప్పబడునో అట్టి పౌరుషంగా ఉన్న నామీద పురుషులు నిలచి(ఆధారపడి)ఉన్నారు. 8

మూ. పుణ్యో గన్ధః పృథివ్యాం చ తేజశ్చాస్మి విభావసౌ,
జీవనం సర్వభూతేషు తపశ్చాస్మి తపస్విషు. 9

బాలానందిని

ప్ర. అ. **పుణ్య ఇతి**:– పృథివ్యామ్=భూమియందు,పుణ్యః=గన్ధః=మంచిదైన గంధం గా ఉన్నాను. విభావసౌ=అగ్నియందు,తేజః చ=తేజస్సుగా కూడ ఉన్నాను. సర్వభూతేషు= సమస్తభూతాలలో,జీవనమ్=జీవనసాధనమై అన్నమై,ఉన్నాను. తపస్విషు=మునులలో, తపః చ = తపస్సుగ కూడ అయి ఉన్నాను.

భాష్యమ్

పుణ్య ఇతి:–పుణ్యః సురభిః గన్ధః పృథివ్యాం చ అహం,తస్మిన్ మయి గన్ధభూతే పృథివీ ప్రోతా. పుణ్యత్వం గన్ధస్య స్వభావతః పృథివ్యాం దర్శితమ్ అబాదిషు రసాదేః పుణ్యత్వోపలక్షణార్థమ్. అపుణ్యత్వం తు గన్ధాదీనామ్ అవిద్యాధర్మాద్యపేక్షం సంసారిణాం, భూతవిశేషసంసర్గనిమిత్తం భవతి. తేజః దీప్తిః చ,అస్మి,విభావసౌ అగ్నౌ. తథా జీవనం సర్వభూతేషు యేన జీవన్తి సర్వాణి భూతాని తజ్జీవనమ్. తపః చ అస్మి తపస్విషు,తస్మిన్ తపసి మయి తపస్వినః ప్రోతాః. 9

బాలానందిని

పుణ్య ఇతి:– పృథివిలో ఉన్న (పుణ్యగంధం)పరిమళం నేను. గంధమైన నాయందు పృథివి నిలచి ఉన్నది. స్వభావసిద్ధంగానే పృథివిలో ఉన్నట్లు చెప్పబడిన గంధంయొక్క పుణ్యత్వం రసాదుల పుణ్యత్వానికి కూడ ఉపలక్షణం. అనగా పుణ్యశబ్దాన్ని రసాదుల విషయంలో కూడ అన్వయించుకొని పుణ్యమైన, రసం,పుణ్యమైన శబ్దం ఇత్యాదివిధంగా గ్రహించాలి. అయితే గంధాదులలో అపుణ్యత్వం(చెడ్డతనం)కలగడానికి సంసారుల అవిద్య అధర్మం మొదలైనవాటిని పట్టి ఏర్పడిన భూతవిశేషాల సంబంధం కారణం. అగ్నిలోని తేజస్సుగా కూడ ఉన్నాను. అట్లే సమస్తభూతాలలో జీవనంగా,జీవనాధార మైన, అన్నంగా ఉన్నాను. తపఃశాలులలో తపస్సుగా కూడ ఉన్నాను. తపస్సుగా ఉన్న అట్టి నాయందు తపస్వులు ఆధారపడి ఉన్నారు. 9

మూ. బీజం మాం సర్వభూతానాం విద్ధి పార్థ సనాతనమ్,
బుద్ధిర్బుద్ధిమతామస్మి తేజస్తేజస్వినామహమ్. 10

బాలానందిని

ప్ర. అ. **బీజమితి**:–పార్థ=అర్జునా!మామ్=నన్ను,సర్వభూతానామ్=సమస్త భూతము లయొక్క సనాతనమ్=ప్రాచీనమైన,బీజమ్=బీజమునుగా,విద్ధి=తెలుసుకొనుము. అహమ్= నేను,బుద్ధిమతామ్=బుద్ధిమంతులయొక్క,బుద్ధిః=బుద్ధిగాను,తేజస్వినామ్=తేజఃశాలుల యొక్క తేజః=తేజస్సుగాను,అస్మి=అయి ఉన్నాను.

భాష్యమ్

బీజమితి:-బీజం ప్రరోహకారణం,విద్ధి,సర్వభూతానాం,హే పార్థ!సనాతనం చిరంతనమ్.కిం చ,బుద్ధిః వివేకశక్తిః అన్తఃకరణస్య,బుద్ధిమతాం వివేకశక్తిమతామ్,అస్మి, తేజః ప్రాగల్భ్యం,తద్వతాం తేజస్వినామ్ అహమ్. 10

బాలానందిని

బీజమితి:- అర్జునా!నన్ను,సమస్తభూతాలయొక్క ప్రాచీనమైన,అంకురించడానికి కారణమునుగా తెలిసికొనుము.అంతఃకరణంలో ఉన్న వివేకశక్తికి బుద్ధి అని పేరు.అట్టి వివేకశక్తి గలవారి బుద్ధిగా అయి ఉన్నాను.తేజస్సు అనగా ప్రగల్భత్వం.తేజశ్శాలుల ప్రగల్భత్వం నేను. 10

మూ. బలం బలవతాం చాహం కామరాగవివర్జితమ్,
ధర్మావిరుద్ధో భూతేషు కామోఽస్మి భరతర్షభ. 11

ప్ర.అ. **బలమితి**:-భరతర్షభ=భరతవంశీయులలో శ్రేష్ఠుడా!అహమ్=నేను, బలవతామ్=బలవంతులయొక్క,కామరాగవివర్జితమ్=కామరాగములు లేని,బలం చ= బలంగా కూడ ఉన్నాను.భూతేషు=ప్రాణులలో,ధర్మావిరుద్ధః=ధర్మానికి విరుద్ధం కాని, కామః =కామంగా,అస్మి=అయి ఉన్నాను.

భాష్యమ్

బలమితి:-బలం సామర్థ్యమ్ ఓజః,బలవతామ్,అహమ్.తచ్చ బలం కామరాగ వివర్జితం;కామశ్చ రాగశ్చ కామరాగౌ,కామః తృష్ణా అసంనికృష్టేషు విషయేషు.రాగః రఞ్జనా ప్రాప్తేషు విషయేషు;తాభ్యాం వివర్జితం,దేహాదిధారణమాత్రార్థః,బలం సత్త్వమ్, అహమ్ అస్మి,న తు యత్ సంసారిణాం తృష్ణారాగకారణమ్.కిం చ ధర్మావిరుద్ధః- ధర్మేణ శాస్త్రార్థేన అవిరుద్ధః,యః ప్రాణిషు భూతేషు,కామః దేహధారణమాత్రాద్యర్థః అశనపానాదివిషయః కామః అస్మి,హే భరతర్షభ. 11

బాలానందిని

బలమితి:-అర్జునా!బలవంతుల,బలం అనగా,సామర్థ్యం,ఓజస్సు,అట్టి బలంగా నే నున్నాను.ఆ బలం కూడ కామరాగాలతో శూన్య మైనది.దగ్గరగా లేని,(లభించని) విషయాలమీద కోరిక కామం.లభించిన విషయాలమీద ఆసక్తి(మమకారం)రాగం.అట్టి కామరాగాలు లేని,కేవలం దేహధారణమాత్రానికి అవసరమైన బలము నేను;అంతేనే కాని సంసారుల తృష్ణకు రాగానికీ ఏది కారణమో అట్టి బలం కాదు.మరియు,ప్రాణులలో

శాస్త్రార్థానికి విరుద్ధం కానిది,దేహధారణమాత్రానికి అవసర మైనది అయిన,అన్నపానాదు లను గూర్చిన ఏ కామం ఉన్నదో ఆ కామంగా నేను ఉన్నాను.

భాష్యమ్

కిం చ -

మూ. యే చైవ సాత్త్వికా భావా రాజసాస్తామసాశ్చ యే,
మత్త ఏవేతి తాన్విద్ధి న త్వహం తేషు తే మయి. 12

బాలానందిని

కిం చేతి:- మరియు

ప్ర.అ. **యే ఇతి**:- సాత్త్వికాః=సత్త్వగుణంనుండి పుట్టిన,యే చ ఏవ=ఏ,భావాః =పదార్థా లున్నాయో,రాజసాః=రజోగుణంవల్ల పుట్టినవి ఉన్నాయో,యే=ఏ,తామసాః చ=తమోగుణంవల్ల పుట్టినవి ఉన్నాయో,తాన్=వాటిని,మత్తః ఏవ ఇతి=నానుండే పుట్టినవి అని,విద్ధి=తెలుసుకొనుము. అహం తు=నేనైతే,తేషు=వాటిలో,న=లేను(వాటికి అధీనుడను కాను). తే=అవి,మయి=నాయం దున్నవి.(అవి నా అధీనంలో ఉన్నాయి).

భాష్యమ్

యే చైవ,సాత్త్వికాః సత్త్వనిర్వృత్తాః,భావాః పదార్థాః,రాజసాః రజోనిర్వృత్తాః, తామసాః తమోనిర్వృత్తాః చ యే కేచిత్ ప్రాణినాం స్వకర్మవశాత్ జాయన్తే భావాః, తాన్ మత్తః ఏవ జాయమానానిత్యేవం,విద్ధి,సర్వాన్ సమస్తానేవ. యద్యపి తే మత్తః జాయన్తే తథాపి,న తు అహం తేషు తదధీనః,తద్వశః,యథా సంసారిణః,తే పునః మయి, మద్వశాః మదధీనాః. 12

బాలానందిని

యే ఇతి:-సత్త్వగుణంవల్ల పుట్టిన ఏ పదార్థా లున్నవో,రజోగుణంవల్ల పుట్టినవి ఉన్నవో,తమోగుణంవల్ల పుట్టినవి ఉన్నవో,ఈ విధంగా ప్రాణుల కర్మవశంచేత పుట్టిన ఏ పదార్థా లున్నాయో అవన్నీ నానుండియే పుట్టినవి అని తెలుసుకో. అవి నానుండి పుట్టినా కూడ నేను వాటిలో లేను;సంసారుల వలె వాటికి అధీనుడను కాను. అవైతే నాయం దున్నాయి,నాకు అధీనములై ఉన్నాయి. 12

భాష్యమ్

ఏవంభూతమపి పరమేశ్వరం నిత్యశుద్ధబుద్ధముక్తస్వభావం సర్వభూతాత్మానం నిర్గుణం సంసారదోషబీజప్రదాహకారణం మాం నాభిజానాతి జగత్ ఇతి అనుక్రోశం దర్శయతి భగవాన్. తచ్చ కింనిమిత్తం జగతః అజ్ఞానమ్ ఇతి,ఉచ్యతే-

మూ. త్రిభిర్గుణమయైర్భావైరేభిః సర్వమిదం జగత్,
మోహితం నాభిజానాతి మామేభ్యః పరమవ్యయమ్. 13

బాలానందిని

ఏవమితి:-ఈ విధంగా పరమేశ్వరుడను,నిత్య-శుద్ధ-ముక్త స్వభావుడను,సర్వ భూతాల ఆత్మను నిర్గుణుడను,సంసారదోషాల బీజాలను కాల్చివేయడానికి కారణ మైన వాడను అయిన నన్ను కూడ ఈ జగత్తు గుర్తించలేకుండా ఉన్నది అని భగవంతుడు జాలి చూపుచున్నాడు.అయితే-జగత్తుయొక్క ఈ అజ్ఞానానికి కారణం ఏమో చెప్పబడు చున్నది-

ప్ర. అ. **త్రిభిరితి**:-గుణమయైః=గుణాల వికారాలైన,ఏభిః=ఈ,త్రిభిః=మూడు విధాలైన,భావైః=భావాలచేత,మోహితమ్=మోహింపబడినదై,ఇదం=ఈ,జగత్=జగత్తు, ఏభ్యః =వీటికంటె,పరమ్=అతీతుడ నైన,అవ్యయమ్=వికారములు లేని,మామ్=నన్ను,న అభిజానాతి=గుర్తించుటలేదు.

భాష్యమ్

త్రిభిః,గుణమయైః గుణవికారైః రాగద్వేషమోహాదిప్రకారైః,భావైః పదార్థైః ఏభిః యథోక్తైః,సర్వమ్ ఇదం ప్రాణిజాతం జగత్ మోహితమ్,అవివేకతామ్ ఆపాదితం సత్ న అభిజానాతి,మామ్ ఏభ్యః.యథోక్తేభ్యః గుణేభ్యః,పరం వ్యతిరిక్తం విలక్షణం చ, అవ్యయం వ్యయరహితం,జన్మాదిసర్వభావవికారవర్జితమ్ ఇత్యర్థః. 13

బాలానందిని

త్రిభిరితి:-గుణాల వికారాలైన రాగ-ద్వేష-మోహాదిరూపాలలో ఉన్న పైన చెప్ప బడిన ఈ మూడు పదార్థాలచేత ఈ జగత్తు,ప్రాణుల సముదాయం,వివేకశూన్యంగా చేయబడినదై,పైన చెప్పబడిన గుణాలకంటె వేరైన,విలక్షణుడ నైన,జన్మాదిసమస్తభావ వికారాలూ లేని నన్ను గుర్తించడంలేదు.

భాష్యమ్

కథం పునః దైవీమ్ ఏతాం త్రిగుణాత్మికాం వైష్ణవీం మాయామ్ అతిక్రామన్తీతి ఉచ్యతే-

మూ. దైవీ హ్యేషా గుణమయీ మమ మాయా దురత్యయా,
మామేవ యే ప్రపద్యన్తే మాయామేతాం తరన్తి తే. 14

బాలానందిని

కథమితి:-దేవునికి సంబంధించిన త్రిగుణాత్మక మైన ఈ వైష్ణవమాయను ఎలా దాటుతారో చెప్పబడుచున్నది-

ప్ర.అ.దైవీ=పరమేశ్వరునికి సంబంధించినది,గుణమయీ=త్రిగుణాత్మకమూ అయిన,ఏషా=ఈ,మమ మాయా=నా మాయ,దురత్యయా=దాట శక్యం కానిది. యే= ఎవరు,మామేవ=నన్నే,ప్రపద్యన్తే=పొందుతారో, తమ ఆత్మనుగా గ్రహిస్తారో,తే=వారు, ఏతాం మాయామ్=ఈ మాయను,తరన్తి=దాటుతారు.

భాష్యమ్

దైవీ దేవస్య మహేశ్వరస్య విష్ణోః స్వభూతా హి యస్మాత్ ఏషా యథోక్తా గుణమయీ మమ మాయా,దురత్యయా దుఃఖేన అత్యయః అతిక్రమణం యస్యాః సా దురత్యయా,తత్ర ఏవం సతి సర్వధర్మాన్ పరిత్యజ్య,మామేవ మాయావినం స్వాత్మ భూతం,సర్వాత్మనా యే ప్రపద్యన్తే తే మాయామ్ ఏతాం సర్వభూతమోహినీం,తరన్తి అతిక్రామన్తి.సంసారబన్ధనాత్ ముచ్యన్తే ఇత్యర్థః. 14

బాలానందిని

దైవీతి:-గుణమయ మైన,పైన చెప్పబడిన ఈ నా మాయ సర్వసమర్థుడ నైన, విష్ణువు నైన నాకు సంబంధించినది.అందువల్ల ఇది దాటడానికి శక్యం కానిది. ఇది ఇలా ఉండగా - ఎవరైతే సర్వధర్మాలను విడచి, మాయావినైన (మాయను వశంలో ఉంచుకొన్న) నన్నే తమ ఆత్మనుగా,అన్ని విధాలా పొందుతారో వాళ్లు అందరినీ మోహింప చేసే ఈ మాయను అతిక్రమిస్తారు.సంసారబంధంనుండి ముక్తు లవుతారు అని అర్థం.

భా.అ.ప్ర.:-ఇక్కడ రామానుజీయులు ఇలా అన్నారు -

"త్వదన్యః శరణం నాస్తి త్వమేవ శరణం మమ,
తస్మాత్కారుణ్యభావేన రక్ష రక్ష జనార్దన"

"జనార్దనా నీవు తప్ప నాకు శరణం లేదు.నువ్వే శరణం.అందుచేత కారుణ్యభావంతో రక్షించు,రక్షించు"అను నిశ్చయరూప మైన ప్రపత్తిమతం ఇక్కడ భగవంతునిచేత ఉపదేశించబడుచున్నది.'మామ్'అని చెప్పడంచేత (గీతాశ్లోకంలో)విష్ణువును ప్రపత్తి చెయ్యాలి అని,'ఏవ'అని చెప్పడంచేత మరొక దేవతను ప్రపత్తిచేయకూడదు అని, 'ప్రపద్యన్తే'అనడంచేత భక్తిజ్ఞానాదులకంటె ప్రపత్తియే గొప్పది గాన అది చెయ్యాలి అనీ,బహు వచనంచేత జీవభేదమూ, నన్ను ప్రపన్ను లవుతారు.అనడంచేత ప్రపత్తి అనే క్రియ చేసే జీవులకు ఆ

క్రియలో కర్మ యైన ఈశ్వరునకు భేదము ఉన్న దనీ;"మాయామేతాం తరన్తి తే"అనడంచేత ప్రపన్నులకు మాత్రమే మాయానివృత్తి కలిగి మోక్షం లభిస్తుంది అనీ తెలుస్తూన్నది. ఈ విధంగా స్వారస్యంతో అర్థం కుదురుతూండగా దానిని విడచి శంకరుడు చేసిన కుకల్పన అనాదరణీయము."

ఇక్కడ (సమాధానం)చెపుతున్నాం-ఇది ప్రపత్తిప్రకరణం కాదు. జ్ఞానాన్ని గూర్చి చెప్పే ప్రకరణం."**జ్ఞానం తేఽహం సవిజ్ఞానమిదం వక్ష్యామి**"(7.2)అని ఉపక్రమించి, "**తే బ్రహ్మ తద్విదుః కృత్స్నమ్**"(7.2)అని ఉపసంహరించబడబోతూన్నది."**ప్రియో హి జ్ఞానినో త్యర్థమ్**"(7.17)అని,"**జ్ఞానవాన్ మాం ప్రపద్యతే**"(7.19)అనీ మధ్యలో అనేక పర్యాయాలు జ్ఞానమే చెప్పబడింది. జ్ఞానికే ప్రపత్తి ఉపదేశించబడుచున్నది అనడానికి వీలు లేదు. జ్ఞానియొక్క స్వాత్మయే ఈశ్వరుడే గాన తనకంటె భిన్నుడైన,ప్రపత్తి చెంద వలసిన,ఈశ్వరుడే లేడు. ఈశ్వరుడే ఆత్మ అను విషయం-"**సర్వభూతస్థమాత్మానమ్**"(6.29) ఇత్యాదికంచేత చెప్పబడింది కదా?"**జ్ఞానీ త్వాత్మైవ మే మతః**"(7.18)అని ఇక్కడనే భగవం తుడు చెప్పాడు. ఈశ్వరుడు అంతర్యామి. అయితే ఆత్మకంటె వ్యతిరిక్తుడైన అంతర్యామి ఎవరూ కనబడడం లేదు. ఆత్మ వేరు ఈశ్వరుడు వేరు అన్నట్లయితే ఈశ్వరునికి సర్వాత్మత్వం కుదరకుండా పోతుంది."**ప్రపద్యన్తే**" అని ఉపాధుల బహుత్వాన్ని పట్టి బహువచనం ప్రయోగించబడింది. సోపాధిక మైనది ప్రపత్తి చేసేది;నిరుపాధికం ప్రపత్తి చేయదగినది. 'మామ్'అను అస్మచ్ఛబ్దం సహజంగా ఆత్మను చెపుతుంది;ఆత్మకంటె భిన్నమైన దైవతం ఏదీ లేదు. అన్ని శరీరాలచేత ఉపహితమైనది ఒక్కటే. విష్ణువు కూడ ఆత్మయే. శరీరం ఆత్మ కాదు గాన విష్ణువు కాదు. 'మామ్'అనుపదంచేత అనాత్మ యైన శరీరాన్ని గ్రహిస్తే అప్పుడు వక్త యైన, వసుదేవుని పుత్రుడైన శ్రీకృష్ణశరీరాన్ని గ్రహించవలసి ఉంటుంది. అది నశించి పోయినది గాన అంతకు పూర్వం ఉన్నవాళ్లు కాని,అధునాతనులు కాని దాని ప్రపత్తి చేయజాలరు. అనాత్మను ఉపాసిస్తే మాయను దాటడం కూడ శక్యం కాదు. ఆత్మను ఆశ్రయించుకొని ఉన్న మాయ ఆత్మసాక్షాత్కారం కలగకుండా నివర్తించదు. (భా. అ.ప్ర. పే. 24-25)

వి:-ఇక్క డొక విషయం గుర్తు ఉంచుకొనవలసి ఉంది. కొందరు అర్వాచీన సంప్రదాయానికి చెందినవారు కొన్ని విషయాలను కల్పించుకొని,'ప్రపత్తి'మొదలైన కొన్ని పారభాషికపదాలు కూడ కల్పించుకొని ఉండవచ్చును. అతిప్రాచీన మైన గ్రంథాలలో అక్కడక్కడ కనబడే ఆ పదాలకు తాము పారిభాషికంగా చెప్పుకొన్న అర్థమే అర్థం అని చెప్పడం కాని,ఈ పారిభాషికపదాలనే ఎన్నడూ వినని,కొన్ని శతాబ్దలకు పూర్వం ఉన్న, శ్రీశంకరాచార్యాదిభాష్యకారులను తప్పుపట్టడం కాని మహాసాహసం అవుతుంది. గాంధీ

గారు చెప్పిన చరఖానుగూర్చి"ఏవం ప్రవర్తితమ్" చక్రం ఇత్యాదిశ్లోకంలో ఉన్న దని అర్థం చెప్పినా,"**కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన**"ఇత్యాదివాక్యాను పట్టి కార్మికులకు వ్యతిరేకులైన పెట్టుబడిదారీ వ్యవస్థకు చెందినవారు భగవద్గీతాదులను రచించినట్లుగా స్పష్టం అవుతుంది అని ఎవరైనా ఆక్షేపించినా, రామాయణాదులకు దేవ్యాదిపరంగా అర్థాలు చెప్పినా అది ఏ విధంగా హాస్యాస్పదమో అలాగే ఇది కూడా ఉంటుంది. 14

భాష్యమ్

యది త్వాం ప్రపన్నాః మాయామేతాం తరన్తి కస్మాత్ త్వామేవ సర్వే న ప్రపద్యన్తే ఇతి? ఉచ్యతే -

మూ. న మాం దుష్కృతినో మూఢాః ప్రపద్యన్తే నరాధమాః,
మాయయాపహృతజ్ఞానా ఆసురం భావమాశ్రితాః. 15

బాలానందిని

యదీతి :- నిన్ను పొందినవాళ్లు ఈ మాయను తరించేట ట్లయితే అందరూ నిన్నే ఎందుచేత ఆశ్రయించరు? (సమాధానం) చెప్పబడుచున్నది -

ప్ర.అ. నేతి :- దుష్కృతినః = పాపాత్ములైన, మూఢాః = మూఢు లైన, నరాధమాః నరాధములు, మాయయా = మాయచేత, అపహృతజ్ఞానాః = అపహరించబడిన జ్ఞానం కలవారై, ఆసురమ్ = అసురులకు సంబంధించిన, భావమ్ = భావమును, ఆశ్రితాః = ఆశ్రయించినవారై, మామ్ = నన్ను, న ప్రపద్యన్తే = పొందడం లేదు.

భాష్యమ్

న మాం పరమేశ్వరం, దుష్కృతినః పాపకారిణః, మూఢాః ప్రపద్యన్తే నరాధమాః నరాణాం మధ్యే అధమాః నికృష్టాః తే చ మాయయా అపహృతజ్ఞానాః, ఆసురం భావం హింసానృతాదిలక్షణామ్ ఆశ్రితాః. 15

బాలానందిని

నేతి :- పరమేశ్వరుడ వైన నన్ను పాపాలు ఆచరించే మూఢు లైన నరాధములు, నరులలో నికృష్టు లైనవాళ్లు, మాయచేత అపహరించబడిన జ్ఞానం కలవారై, హింస, అసత్యం మొదలైన ఆసురస్వభావాన్ని ఆశ్రయించినవారై పొందుట లేదు. 15

భాష్యమ్

యే పునః నరోత్తమాః పుణ్యకర్మాణః

మూ. చతుర్విధా భజన్తే మాం జనాః సుకృతినోఽర్జున,
ఆర్తో జిజ్ఞాసురర్థార్థీ జ్ఞానీ చ భరతర్షభ. 16

బాలానందిని

యే ఇతి :- పుణ్య కర్మలు గల ఏ నరోత్తము లున్నారో -

ప్ర.అ. చతుర్విధా ఇతి :- భరతర్షభ = భరతవంశీయులలో శ్రేష్ఠుడ వైన, అర్జున = అర్జునా! ఆర్తః = కష్టాలలో ఉన్నవాడు, జిజ్ఞాసుః = తత్త్వం తెలుసుకొనదలచినవాడు, అర్థార్థీ = ధనం కోరేవాడు, జ్ఞానీ చ = జ్ఞానవంతుడు, చతుర్విధాః = నాలుగు విధా లైన, సుకృతినః = పుణ్యాత్ము లైన, జనాః జనులు, మామ్= నన్ను, భజన్తే = సేవిస్తూంటారు.

భాష్యమ్

చతుర్విధాః చతుష్ప్రకారాః, భజన్తే సేవన్తే, మాం జనాః సుకృతినః పుణ్యకర్మాణః హే అర్జున. ఆర్తః ఆర్తిపరిగృహీతః వ్యాఘ్రతస్కరరోగాదినా అభిభూతః ఆపన్నః, జిజ్ఞాసుః భగవత్తత్త్వం జ్ఞాతుమ్ ఇచ్ఛతి యః, అర్థార్థీ ధనకామః, జ్ఞానీ విష్ణోః తత్త్వవిత్ చ, హే! భరతర్షభ. 16

చతుర్విధాః ఇతి:-భరతర్షభా! అర్జునా!నాలుగు విధా లైన పుణ్యాత్ములు నన్ను సేవిస్తూంటారు.కష్టాలలో చికుకొన్నవాడు,దొంగలు పులులు రోగాలు మొదలైనవాటిచే ఆక్రమింపబడి ఆపదలలో ఉన్నవాడు,భగవత్తత్త్వం తెలుసుకోవా లనుకొనేవాడు,ధనము నందు కోరిక గలవాడు,విష్ణుతత్త్వం తెలిసినవాడు. 16

మూ. తేషాం జ్ఞానీ నిత్యయుక్త ఏకభక్తిర్విశిష్యతే,
ప్రియో హి జ్ఞానినోఽత్యర్థమహం స చ మమ ప్రియః. 17

ప్ర.అ. తేషామితి:-తేషామ్=వాళ్లలో,నిత్యయుక్తః=నిత్యమూ ఆత్మయందు ఏకాగ్ర మైన చిత్తం కలవాడు,ఏకభక్తిః=పరమాత్మయందు ఒక్కదానియందే భక్తి గలవాడు అయిన, జ్ఞానీ=జ్ఞాని,విశిష్యతే=విశిష్టుడుగా ఉంటాడు. అహమ్=నేను,జ్ఞానినః=జ్ఞానికి,అత్యర్థమ్= మిక్కిలి,ప్రియః=ఇష్టుడను,సః చ=అతడు కూడ,మమ=నాకు,ప్రియః=ఇష్టుడు.

భాష్యమ్

తేషామితి:-తేషాం చతుర్ణాం మధ్యే,జ్ఞానీ తత్త్వవిత్,తత్త్వవిత్త్వాత్ నిత్యయుక్తః భవతి ఏకభక్తిః చ,అన్యస్య భజనీయస్య అదర్శనాత్;అతః సః ఏకభక్తిః విశిష్యతే. విశేషణమ్ ఆధిక్యమ్ ఆపద్యతే అతిరిచ్యతే ఇత్యర్థః.ప్రియః,హి యస్మాత్,అహమ్

ఆత్మజ్ఞానినః అతః తస్య అహమ్ అత్యర్థం ప్రియః. ప్రసిద్ధం హి లోకే ఆత్మా ప్రియః భవతి ఇతి. తస్మాత్ జ్ఞానినః ఆత్మత్వాత్,వాసుదేవః ప్రియః భవతి ఇత్యర్థః. సః చ జ్ఞానీ మమ వాసుదేవస్య ఆత్మా ఏవ ఇతి మమ అత్యర్థం ప్రియః.

బాలానందిని

తేషామితి:-ఆ నాలుగు విధాలైనవాళ్లలో తత్త్వవేత్త,తత్త్వవేత్త అవడంవల్ల ఎల్లప్పుడూ యుక్తుడుగాను,సేవించవలసినది మరొకటి ఏదీ, లేదా ఎవరూ, లేకపోవడంచేత ఏకభక్తిగాను,(ఒకే ఆత్మయందు భక్తికలవాడుగాను)ఉంటాడు.అందువల్ల అట్టి ఏకభక్తి కలవాడు,విశేషాన్ని,ఆధిక్యాన్ని పొందుతాడు;(అందరిలోకి)గొప్పవాడుగా ఉంటాడు అని అర్థం.ఎందువల్ల ననగా-నేను జ్ఞానికి ఆత్మను, అందువల్ల నేను వానికి మిక్కిలి ఇష్ట మైన వాడను.ఆత్మ ప్రియ మైనది అని లోకంలో ప్రసిద్ధమే కదా?అందువల్ల జ్ఞానికి వాసుదేవుడు ఆత్మయే గాన ప్రియు డవుతాడు అని అర్థం.ఆ జ్ఞాని కూడ వాసుదేవుడ నైన నాకు ఆత్మయే గాన నాకు చాల ఇష్ట మైనవాడు.

భా.అ.ప్ర.:-"నేను మాత్రమే ప్రాప్యుడుగా గల(నన్ను మాత్రమే పొందవలసి ఉన్న) జ్ఞానికి నాతో సంబంధం నిత్య మైనది.నా ఒక్కనియందే భక్తి ఉంటుంది;అందుచేత అతడే విశిష్టుడు.నేను జ్ఞానికి ఎంత ఇష్టమైనవాడనో అది అత్యర్థం,చెప్పడానికి మించినది, అనగా సర్వజ్ఞుడను సర్వశక్తుడను అయిన నాకు కూడ,చెప్పడానికి శక్యం కాదు అని అర్థం.మిగిలిన ఇద్దరికీ అయితే వాళ్ల కోరిక తీరేవరకు నాతో సంబంధం ఉంటుంది. వాళ్లకు తమ అభిలాషయందు,దానికి సాధనంగా నాయందు భక్తి ఉంటుంది"అను శ్రీరామానుజాచార్యవ్యాఖ్య అయుక్తం.జీవునకు ఈశ్వరునితో నిత్యయోగం ఉన్నప్పుడు ఈశ్వరుడు నిత్యప్రాప్తుడే గాన ఇంక అతనికి ప్రాప్యత్వం ఏమిటి? అంతవరకూ పొందబడకుండా ఉన్నదే కదా ప్రాప్యం అయేది?పరోక్షుడు,పరమపదమైన వైకుంఠంలో ఉన్నవాడూ అయిన ఈశ్వరునితో జీవులకు నిత్యయోగం ఎలా ఉంటుంది?పరోక్షుడైన అంతర్యామితో నైనా నిత్యయోగం ఎలా ఉంటుంది?"నువ్వు ఇలా చెయ్యి"అని ప్రేరేపించే వా డెవడూ హృదయంలో ఉన్నట్లు ప్రత్యక్షంగా ఎవనికీతెలియడం లేదుకదా?జీవుడు పరతంత్రుడు(పరాధీనుడు) ఇత్యాదిలింగాలచేత అంతర్యామి అనుమేయుడే(అనుమాన ప్రమాణంచేత ఊహించ బడుతున్నాడే)కాని ప్రత్యక్షంగా కనబడడంలేదు.(పూ.ప.)"**అఙ్గుష్ఠ మాత్రః పురుషః మధ్య ఆత్మని తిష్ఠతి,ఆదిత్యవర్ణః**"(అంగుష్ఠప్రమాణం గల,ఆదిత్యుని వంటి వర్ణం గల పురుషుడు ఆత్మ మధ్యలో ఉన్నాడు)అను శ్రుతిని అనుసరించి సాకారు డైన ఈశ్వరుడే హృదయంలో ఉంటాడు అనడం(సి)యుక్తంకాదు.అవయవాలు లేని అణు వంత జీవునిలోపలఉండే. పరమాణుప్రమాణం కలవాడు కాని,నీ కిష్టు డైన ఈశ్వరునికి ఆకారం ఉండడం కుదరదు కదా? "**అశబ్దమస్పర్శమరూపమవ్యయమ్**"ఇత్యాదిశ్రుతులకు కూడ విరోధం కలుగు

తుంది. అంగుష్ఠమాత్రత్వాదికం కేవలం కల్పితరూపమే. (పూ.ప.) కల్పితమైన ఈశ్వరరూపం తోనే నిత్యయోగం మాకు అభిమతం అనడం(సి)యుక్తం కాదు. వాస్తవస్వరూపాన్ని విడవడంలో ప్రమాణం లేదు. రూపం కల్పించి నన్ను సేవించాలి అని భగవంతుడు చెప్పలేదు. అది కాక ఇది తత్త్వాన్ని చెప్పే ప్రకరణం.

అట్లే 'ఏకభక్తి'శబ్దం ఆత్మకంటె భిన్నమైన పరోక్షేశ్వరునియందు భక్తిని చెప్పదు, మరేమనగా ఆత్మభక్తి అనే అర్థాన్నే చెపుతుంది. వస్తుస్వరూపాన్ని చూడకుండా ఒక వస్తువు నందు ప్రీతిరూప మైన భక్తి కలగదు కూడ. అజ్ఞానులకు మాత్రమే ఉద్దిష్టమైన కల్పితమైన అర్చాదిస్వరూపంలో(దేవతావిగ్రహంలో)జ్ఞానికి ప్రీతి కలగదు. "**యో మాం సర్వేషు భూతేషు సన్తమాత్మానమీశ్వరమ్, హిత్వార్చాం భజతే మౌఢ్యాత్ భస్మన్యేవ జుహోతి సః**"(అన్ని భూతాలలోను ఉన్న ఆత్మ యైన, ఈశ్వరుడ నైన నన్ను విడచి, మూఢత్వంతో అర్చామూర్తిని పూజించేవాడు భస్మంలో హోమం చేస్తున్నాడు)అని శ్రీమద్భాగవతంలో వ్యాసుడు 'మౌఢ్యాత్' అని అంటూ అర్చాభజనాదికం మూఢజనులకు మాత్రమే ఉద్దిష్ట మైనది అని చెప్పి ఉన్నాడు– జ్ఞానితత్త్వవేత్తయే. సచ్చిదానందరూపమే తత్త్వం. అందుచేత జ్ఞానికి కల్పితమైన ఈశ్వరాకారంలో ప్రీతి పుట్టదు. "అహం జ్ఞానినః అభిధేయమతిక్రమ్య ప్రియః"అను నీవు ప్రయోగించిన వాక్యానికి సరియైన అన్వయం కుదరదు. "అభిధేయమ్ అతిక్రమ్య"(అర్థాన్ని అతిక్రమించి) అనేదానికి "చెప్పడానికి శక్యం కాదు. అనే అర్థం రాదు. "అభిధానమతిక్రమ్య" అనేదానికే అలాంటి అర్థం లభిస్తుంది. 'అత్యర్థమ్'అనేపదానికి ప్రసిద్ధమైన 'మిక్కిలి'అనే అర్థాన్ని విడవడంలో కారణం లేదు.

విషయాల ప్రియత్వంలో కూడ ఇయత్త(ఇంత అనే మాట)ఉండదు. అందుచేత ఈశ్వరప్రియత్వం ఇయత్తారహితం అని చెప్పడం అనర్థకం. ఎలా చెప్పా లనగా–విషయ ప్రియత్వం సాతిశయ మైనది, ఈశ్వరప్రియత్వ మైతే నిరతిశయమైనది అని చెప్పాలి. ఈశ్వరుడు ఆత్మభిన్నుడైతే ఈశ్వరప్రియత్వం కూడ నిరతిశయం అని చెప్పడం కుదరదు. నిరతిశయప్రియత్వం(దేనిని మించిన ప్రియత్వం ఉండదో అది)ఆత్మకు మాత్రమే అని శ్రుత్యాదిసిద్ధం. పరోక్షుడైన ఈశ్వరుణ్ణి కూడ ప్రియుడంటున్నాం అంటే అందుకు కారణం తనకు కావలసినవి ఈశ్వరుడు ఇవ్వడం. ఆ విధంగా ఆ పరోక్షేశ్వరుడు ఆత్మకే శేషం.

"స త్వాసక్తమతిః కృష్ణే దశ్యమానో మహోరగైః,
న వివేదాత్మనో గాత్రం తత్స్మృత్యాహ్లాదసంస్థితః"

(మహాసర్పాలచేత కరవబడుతూన్న ప్రహ్లాదుడు కృష్ణునియందు లగ్నమైన మనస్సు కలవాడై, కృష్ణుని స్మరణంవల్ల కలిగిన ఆనందంలో ఉండి, తన శరీరాన్ని కూడ తెలుసుకొన లేదు)అని ప్రహ్లాదునకు కృష్ణస్మరణంవల్ల కలిగిన దని చెప్పిన ఆనంద మైతే ఆత్మానందమే కాని తద్భిన్నం కాదు. కృష్ణుడే ఆత్మ కదా? సాకారేశ్వరుణ్ణి ధ్యానించడంవల్ల కలిగే ఆనందం

కూడ మామిడిపండు తింటూండగా కలిగే ఆనందంవలె ఆత్మానందానికి ప్రతిబింబమైన ఆనందమే కాని వేరు కాదు. కృష్ణుడు సాకారుడైన ఈశ్వరు డన్నట్లయితే కృష్ణస్మరణంవల్ల ప్రహ్లాదునకు కలిగిన ఆనందం సాతిశయే;ప్రతిబింబానందంకంటె బింబానందం సాతిశయమే కదా?

ఈశ్వరస్మరణంవల్ల భక్తునికి నిరతిశయానందం కలుగుతుంది గాన ఈశ్వరు డే విధంగా ప్రియతముడో అట్లే భక్తుణ్ణి స్మరించడంవల్ల ఈశ్వరునికి కూడ నిరతిశయా నందం కలుగుతుంది గాన ఈశ్వరునికి భక్తుడు ప్రియతముడు అని చెప్పడం కూడ అపహాస్యాస్పద మైనది. పరిపూర్ణానందు డైన ఈశ్వరునికి భక్తస్మరణంవల్ల అధికమైన ఆనందం లభిస్తుం దనీ,అది లేకపోతే ఆనందం నశిస్తుం దనీ కల్పించడం అప్రామాణికం, అయుక్తమూ కూడ. అప్పుడు ఆనందంకోసం ఈశ్వరుడు కూడ భక్తుణ్ణి స్మరించాలి అని చెప్పవలసి వస్తుంది. సర్వసేవ్యుడైన ఈశ్వరుడు కూడ స్వభక్తసేవకు దనవలసి వస్తుంది.

"ఆర్తో జిజ్ఞాసురర్థార్థీ జ్ఞానీ చ"అని నాలుగు రకాల సుకృతులను ఉపక్రమించి "తత్ర జ్ఞానీ విశిష్యతే"అని చెప్పి ఇంక మిగిలినవాళ్లను గూర్చి "తేషు"అని చెప్పవలసి ఉండగా "ఇతరయోః తు" (మిగిలిన ఇద్దరిలో నైతే)అని ద్వివచనంచేత నిర్దేశం అయుక్తం. ఆర్తుడు అర్థార్థి ఒకే తరగతికి చెందినవా ళ్లవడంచేత ఒక్కరుగా పరిగణింపబడ్డారు అనడం యుక్తం కాదు. ఆర్తుడు కానివాడు అర్థార్థి కావచ్చు, అర్థార్థి కానివాడు ఆర్తుడు కావచ్చుకదా? వ్యాధినివృత్తిరూప మైన ప్రయోజనాన్ని గాని,ధనరూపమైన ప్రయోజనాన్ని కోరడంగాని అర్థార్థిత్వం(అర్థం అనగా ప్రయోజనం)అని చెప్పుకొంటె ఇద్దరిలోనూ అర్థార్థిత్వం అనే ఏకత్వం ఉంది కదా అనడం కూడ యుక్తం కాదు. అప్పుడు జ్ఞానం కూడ ఒక ప్రయోజనమే గాన ఈ ముగ్గురినీ ఒకటిగానే చేసివేయవచ్చును. అప్పుడు అర్థార్థీ. జ్ఞానీ చేతి ద్వివిధా మామ్ ఉపాసతే అని అనాలి. అందుచేత ఇతరయోః అనడం అయుక్తమే. (భా.అ.ప్ర. పే. 18-19) 17

భాష్యమ్

న తర్హి ఆర్తాదయః త్రయః వాసుదేవస్య ప్రియాః?న; కిం తర్హి?

మూ. ఉదారాః సర్వ ఏవైతే జ్ఞానీ త్వాత్మైవ మే మతమ్,
ఆస్థితః స హి యుక్తాత్మా మామేవానుత్తమాం గతిమ్. 18

బాలానందిని

నేతి:-అయితే ఆర్తాదులు ముగ్గురూ వాసుదేవునికి ఇష్టులు కారా? అది కాదు, మరే మనగా-

ప్ర.అ. ఉదారా ఇతి :- ఏతే=వీళ్లు,సర్వే=అందరూ,ఉదారాః=ఏవ=ఉత్కృష్టమైనవారే. తు=కాని, జ్ఞానీ=జ్ఞాని,మే=నా యొక్క ఆత్మా ఏవ=ఆత్మయే అని,మతమ్=నా అభిప్రాయము. సః = అతడు,యుక్తాత్మా=ఏకాగ్రమైన చిత్తం కలవాడై,మామేవ=నన్నే,అనుత్తమామ్=గొప్పదైన, గతిమ్=గతినిగా,ఆస్థితః హి=అవలంబించి ఉన్నాడు కదా?

భాష్యమ్

ఉదారాః ఉత్కృష్టాః,సర్వే ఏవ ఏతే,త్రయః అపి మమ ప్రియాః ఏవ ఇత్యర్థః. న హి కశ్చిత్ మద్భక్తః మమ వాసుదేవస్య అప్రియః భవతి. జ్ఞానీ తు అత్యర్థం ప్రియః భవతి ఇతి విశేషః. తత్కస్మాదిత్యాహ–జ్ఞానీ తు ఆత్మైవ,న అన్యః మత్తః ఇతి,మే మమ,మతం నిశ్చయః. ఆస్థితః. ఆరోఢుం ప్రవృత్తః సః జ్ఞానీ,హి యస్మాత్,అహమేవ భగవాన్ వాసుదేవః,న అన్యః అస్మి ఇత్యేవం యుక్తాత్మా సమాహితచిత్తః సన్ మామేవ పరం బ్రహ్మ గన్తవ్యమ్ ఉత్తమాం గతిం గన్తుం ప్రవృత్తః ఇతి అర్థః. 18

బాలానందిని

ఉదారా ఇతి:-వీళ్లందరూ ఉత్కృష్టులే. ముగ్గురూ కూడ నాకు ప్రియులే. నా భక్తుడైనవా డెవడూకూడ వాసుదేవుడ నైన నాకు అప్రియుడు కాడు కదా? అయితే-జ్ఞానిమాత్రం చాలా ప్రియు డవుతాడు అనేది విశేషం. అదెందువల్ల అని చెపుతున్నాడు-జ్ఞాని యైతే ఆత్మయే,నాకంటె భిన్నుడు కాడు అని నా నిశ్చయం. ఎందువల్ల ననగా-ఆ జ్ఞాని"నేనే భగవంతుడైన వాసుదేవుడను;వేరు కాదు"అని సమాహితమైన చిత్తం కలవాడై,ఆరోహించ దానికి ప్రవర్తించినవాడై,పరబ్రహ్మ నైన నన్నే పొంద తగిన ఉత్తమగతినిగా పొందదానికి ప్రవర్తిస్తున్నాడు అని అర్థం. 18

భాష్యమ్

జ్ఞానీ పునరపి స్తూయతే -

మూ. బహూనాం జన్మనామన్తే జ్ఞానవాన్మాం ప్రపద్యతే,
వాసుదేవః సర్వమితి స మహాత్మా సుదుర్లభః. 19

బాలానందిని

జ్ఞానీ ఇతి:-జ్ఞాని మరల స్తుతింపబడుచున్నాడు -

బహూనామితి: -బహూనామ్=అనేకమైన,జన్మనామ్=జన్మలయొక్క,అన్తే= అంతమునందు, జ్ఞానవాన్=జ్ఞానవంతుడు,సర్వమ్=సమస్తమూ కూడ,వాసుదేవః=వాసుదేవుడే, ఇతి= అని, మామ్=నన్ను,ప్రపద్యతే=పొందును. సః=అట్టి,మహాత్మా= మహాత్ముడు,సుదుర్లభః=చాలా దుర్లభుడు.

భాష్యమ్

బహూనాం జన్మనాం జ్ఞానార్థసంస్కారాశ్రయాణామ్,అన్తే సమాప్తౌ,జ్ఞానవాన్ ప్రాప్తపరిపాకజ్ఞానః,మాం వాసుదేవం ప్రత్యగాత్మానం ప్రత్యక్షతః ప్రతిపద్యతే.కథమ్? వాసుదేవః సర్వమ్ ఇతి.యః ఏవం సర్వాత్మానం మాం ప్రపద్యతే స మహాత్మా,న తత్సమః అన్యః అస్తి అధికో వా, అతః సుదుర్లభః. **"మనుష్యాణాం సహస్రేషు"**(7.3) ఇత్యుక్తమ్. 19

బాలానందిని

బహూనామితి:- జ్ఞానమునకు ఉపయోగించు సంస్కారములకు(చిత్తశుద్ధి జనక సంస్కారములకు)హేతువైన అనేక జన్మల తరువాత,పరిపాకజ్ఞానం(జ్ఞానపరిపాకం)పొంది, జ్ఞానవంతుడు(తన) ప్రత్యగాత్మ నైన వాసుదేవుడనైన నన్ను ప్రత్యక్షంగా పొందుతాడు (తెలుసు కొంటాడు).ఏమని?సర్వమూ వాసుదేవుడే అని.ఎవడు ఈ విధంగా సర్వాత్మనైన నన్ను పొందుతాడో అట్టి మహాత్ముడు-అతనితో సముడు గాని అధికుడు అయిన మరొక డెవడూ కాని లేడు,అందువల్ల-చాలా దుర్లభ మైనవాడు.**"మనుష్యాణాం సహస్రేషు"**అని (వెనుక) చెప్పబడింది.

భాష్యమ్

ఆత్మైవ సర్వం వాసుదేవః ఇత్యేవమ్ అప్రతిపత్తౌ కారణమ్ ఉచ్యతే-

మూ. కామైస్తైస్తైర్హృతజ్ఞానాః ప్రపద్యన్తేఽన్యదేవతాః,
తం తం నియమమాస్థాయ ప్రకృత్యా నియతాః స్వయా. 20

బాలానందిని

ఆత్మేతి:-సర్వమూ కూడ ఆత్మయైెవ వాసుదేవుడే అని గ్రహించకపోవడానికి కారణం చెప్పబడుచున్నది -

ప్ర.అ.కామైరితి:- తైః తైః=ఆ యా,కామైః=కామాలచేత,హృతజ్ఞానాః=హరించ బడిన జ్ఞానం కలవారై,స్వయా=తమకు సంబంధించిన,ప్రకృత్యా=స్వభావంచేత,నియతాః =నియమించబడినవారై(వశము చేసికొనబడెనవారై),తం తమ్=ఆ యా,నియమమ్= నియమును,ఆస్థాయ=అవలంబించి,అన్యదేవతాః=ఇతరదేవతలను,ప్రపద్యన్తే=చేరు తుంటారు.

భాష్యమ్

కామైః తైః తైః పుత్రపశుస్వర్గాదివిషయైః,హృతజ్ఞానాః అపహృతవివేకజ్ఞానాః , ప్రపద్యన్తే,అన్యదేవతాః ప్రాప్నువన్తి,వాసుదేవాత్ ఆత్మనః అన్యాః దేవతాః తం తం

నియమం దేవతారాధనే ప్రసిద్ధః యః యః నియమః తం తమ్,ఆస్థాయ ఆశ్రిత్య, ప్రకృత్యా స్వభావేన జన్మాన్తరార్జితసంస్కారవిశేషేణ,నియతాః నియమితాః స్వయా ఆత్మీయయా. 20

బాలానందిని

కామైరితి:- పుత్ర-పశు-స్వర్గాదులకు సంబంధించిన ఆ యా కామాలచేత అపహరించబడిన వివేకజ్ఞానం కలవారై ఆత్మ యైన వాసుదేవునికంటె, అంతటా, నివసించే స్వయంప్రకాశ మైన ఆత్మకంటె, వేరైన దేవతలను చేరుతారు.దేవతలను ఆరాధించడంలో ఏ ఏ నియమాలు ప్రసిద్ధములో ఆ యా నియమాలను ఆశ్రయించి,తమ సంబంధ మైన స్వభావంచేత,జన్మాంతరంలో సంపాదించబడిన సంస్కారవిశేషంచేత నియమితులై.

భా.అ.ప్ర.:-శ్రీరామానుజాచార్యు లిక్కడ-"ప్రకృతిచేత అనగా పాపవాసనచేత నియమితులై,విష్ణువుకంటె భిన్ను లైన ఇంద్రాదిదేవతలను ఆశ్రయించి వాళ్లను అర్చిస్తారు" అన్నారు.అది అయుక్తం.పాపవాసనచేత నియతు లైనవారు దేవతాభజనమే చేయరు. దేవతారాధన చేయని ఎందరో నాస్తికు లున్నారు కదా?విష్ణుదేవారాధనం వలె ఇంద్ర రుద్రాదిదేవారాధనం కూడ పుణ్యవాసనచేతనే కలుగుతుంది.ఇంద్రాదిదేవుల వలె విష్ణు దేవుడు దేవత్వజాతికలవాడే గాన ఆతనిని ఆరాధించినవాడు రుద్రాదిదేవారాధకులకంటె గొప్పవాడు అని చెప్పడానికి వీలు లేదు.విష్ణువిగ్రహం ఏ విధంగా శుద్ధసత్త్వమయమో శివవిగ్రహం కూడ అట్లే శుద్ధసత్త్వమయ మైనది.బ్రహ్మాదివిగ్రహాలుకూడ సత్త్వమయములే గాన వైష్ణవ-శైవ-హైరణ్యగర్భ-కౌమార-శాక్తేయాదిప్రసిద్ధి వచ్చినది.నృసింహాద్యవతారాలలో విష్ణువులో కూడ తమోగుణం కనబడుతూన్నది.దక్షిణామూర్త్యాద్యవతారాలలో శివునిలో కూడ సత్త్వగుణం కనబడుతూన్నది.

మాయాసంబంధం కలిగి ఈశ్వరు డైన ఒకే ఆత్మ మాయలో ఉన్న సత్త్వాది గుణాల భేదంచేత స్రష్టృత్వం వివక్షిత మైనప్పుడు(చెప్పదలచినప్పుడు)బ్రహ్మ అనీ,పాలయి తృత్వం వివక్షితం అయినప్పుడు విష్ణు వనీ,సంహర్తృత్వం వివక్షితం అయి నప్పుడు రుద్రు డనీ పేర్లతో వ్యవహారమే తప్ప నిజమైన ఈశ్వరత్వం శరీరులైన(శరీరంగల)బ్రహ్మ విష్ణు రుద్రులకు లేదు.శరీరత్వము-ఈశ్వరత్వమూ అనేవి పరస్పరవిరుద్ధము లని సిద్ధాంతం. అందుచేత విష్ణుదేవుడు సత్త్వమయు డనీ,బ్రహ్మదేవుడు రాజసుడనీ,రుద్రదేవుడు తామసు డనీ కల్పించడానికి శక్యం కాదు.దేవత లందరూ సాత్త్వికులే,మనుష్యులు రాజసులు, వృక్షాదులు తామసములు.సత్త్వగుణోద్రేకం లేకపోతే దేవజన్మయే లభించదు.

మలిన సత్త్వాత్మక మైన అవిద్య జీవునకు ఉపాధి,శుద్ధసత్త్వాత్మకమైన మాయ ఈశ్వరునికి ఉపాధి.అలాంటప్పుడు మాయోపాధికు లైన బ్రహ్మరుద్రులు రాజసతామసు

లెట్లవుతారు?ఒకే ఈశ్వరునికి త్రిత్వం ఎలా ప్రసక్తం అవుతుంది?అందుచేత శరీరులైన బ్రహ్మవిష్ణురుద్రులు ముగ్గురూ కూడ ఈశ్వరుడు కాదు;మరేమనగా-సృష్టి-స్థితి-సంహారాలను పట్టి ఒకే ఈశ్వరునకు బ్రహ్మ,విష్ణువు,రుద్రుడు అనే నామాలు ప్రయోగించబడుతున్నాయి.అందువల్ల 'అన్యదేవతా'పదంచేత ఇంద్రరుద్రబ్రహ్మాదుల వలె విష్ణువు కూడ దేవుడే గాన అతడు కూడ గ్రహించబడతాడు.ఆత్మాపేక్షయా విష్ణువునకు అన్యత్వం ఉంది.దేవుడు మనుష్యాదుల వలె ఆత్మభిన్నుడే కదా?ఈ విధంగా ఆత్మకంటె అన్యుడైన విష్ణువును గాని,రుద్రుణ్ణి గాని,బ్రహ్మదేవుని గాని,మరే ఇతరదేవుణ్ణి గాని ఉపాసించే ప్రతీవాడూ కూడ కామహృతజ్ఞానుడే.ఎవడు నిష్కాముడో,లేదా మోక్షకాముడో అతడు ఒక్కడు మాత్రమే ఆత్మను ఉపాసిస్తాడు,లేదా పొందుతాడు.నిష్కాములై చిత్తశుద్ధికోసం విష్ణ్వాదులను ఉపాసించేవాళ్లు కూడ మధ్యస్థులే.వాళ్ళు సాకారబ్రహ్మను ఉపాసిస్తున్నారు గాన అజ్ఞులు కాదు, ప్రాజ్ఞులూ కాదు.

"మోక్షమిచ్ఛేజ్జనార్దనాత్"అను శ్రుతివాక్యాన్ని అనుసరించి విష్ణూపాసనం మోక్షప్రదం కదా అనడం కుదరదు;అక్కడ జనార్దనశబ్దానికి ఆత్మ అని అర్థం.లేదా విష్ణూపాసనం చిత్తశుద్ధి ద్వారా జ్ఞానాన్ని ఇస్తుంది కాబట్టి మోక్షప్రదం అని చెప్పుకొనవచ్చును.ఇదే విధంగా **"జ్ఞానం మహేశ్వరాదిచ్ఛేత్"**అని మహేశ్వరోపాసనం కూడ జ్ఞానప్రదం అని చెప్పబడింది. నిష్కాముడై ఏ దేవతను సర్వేశ్వరునిగా ఉపాసించినా చిత్తశుద్ధి కలిగి తీరు తుంది;విష్ణువునే ఉపాసించాలనే నియమం లేదు. నిర్గుణబ్రహ్మయందు కల్పితమైన అందరు వ్యక్తులూ కూడ సగుణబ్రహ్మ లనే చెప్పబడతారు.మాయచేత శరీరేంద్రియాదియుక్త మైన బ్రహ్మయే కదా సగుణబ్రహ్మ అనగా?ఈ సగుణబ్రహ్మత్వం పాషాణాలు, కఱ్ఱలు మొదలైనవాటిలో కూడ ఉంది.అలా కాకపోతే శ్రీరంగనాయక- జగన్నాథ స్వామ్యాదులు సగుణబ్రహ్మలు ఎలా అవుతారు?అయితే తెలివి తక్కువవాళ్లు పాషాదికం సగుణబ్రహ్మ అని ఎరుగరు.వాటిని పాషాణాదిరూపంలోనే చూస్తారు.అందుచేతనే **"వాసుదేవః సర్వమితి స మహాత్మా సు దుర్లభః"**అని చెప్పబడింది.నిర్గుణబ్రహ్మవేత్తయే మహాత్ముడు అనడానికి వీలులేదు.నిర్గుణబ్రహ్మవేత్తయే సగుణబ్రహ్మవేత్త కూడ అవుతాడు.నిర్గుణత్వసగుణత్వాలలో భేదం ఉన్నా బ్రహ్మలో భేదం లేదు కదా! నిర్గుణమైన ఒకే బ్రహ్మ మాయచేత సర్వజగ ద్రూపంలో సగుణంగా పరిణమించినది అని ఎవడు తెలుసుకొంటాడో అతడే బ్రహ్మవేత్త. అతడే మహాత్ముడు. అందువల్ల ఇంద్రాదుల వలె విష్ణువు కూడ అనాత్మయే(ఆత్మభిన్నుడే); లేదా విష్ణువు వలె ఇంద్రాదిదేవుడు కూడ సగుణబ్రహ్మయే గాన రుద్రాదిదేవోపాసనకంటె విష్ణుదేవోపాసనానికి ప్రాశస్త్యం ఏదీ లేదు.సర్వదేవభజనంకంటె ఆత్మభజనం ఒక్కటే ప్రశస్త మనే విషయం నిశ్చితం(భా. అ.ప్ర. పే. 38-39) 20

భాష్యమ్

తేషాం చ కామినామ్ -

**మూ. యో యో యాం యాం తనుం భక్తః శ్రద్ధయార్చితుమిచ్ఛతి,
తస్య తస్యాచలాం శ్రద్ధాం తామేవ విదధామ్యహమ్. 21**

బాలానందిని

తేషామితి:- ఆ కామవంతులలో కూడ-

యః ఇతి:- యః యః=ఏ యే,భక్తః = భక్తుడు,యాం యామ్=ఏ యే,తనుమ్=శరీరాన్ని(రూపాన్ని), శ్రద్ధయా=శ్రద్ధతో,అర్చితుమ్=పూజించుటకు,ఇచ్ఛతి=కోరుతాడో,తస్య తస్య=ఆ యా భక్తునకు,తామ్=ఆ,శ్రద్ధామేవ=శ్రద్ధనే,అహమ్=నేను, అచలామ్ = స్థిరమైనదానినిగా, విదధామి=చేస్తాను.

భాష్యమ్

యో యః కామీ,యాం యాం దేవతాతనుం శ్రద్ధయా సంయుక్తః భక్తశ్చ సన్ అర్చితుం పూజయితుమ్,ఇచ్ఛతి,తస్య తస్య కామినః,అచలాం స్థిరాం శ్రద్ధాం,తామేవ, విదధామి,స్థిరీకరోమి. 21

బాలానందిని

యః ఇతి:- ఏ యే కామి ఏ యే దేవతాస్వరూపాన్ని శ్రద్ధతో కూడినవాడై,భక్తుడు కూడ అయి పూజించడానికి కోరుతాడో ఆ యా కామికి అచలమైన శ్రద్ధను దానినే స్థిరీకరిస్తాను.

భా.అ.ప్ర.:-రామానుజాచార్యులు-"అంతర్యామినైన నాయొక్క ఏ యే ఆదిత్యాది రూప మైన శరీరాన్ని;"**య ఆదిత్యే తిష్ఠన్,యస్య ఆదిత్యః శరీరమ్**"ఇత్యాది శ్రుతులను అనుసరించి"అని వ్యాఖ్యానించారు.అది మా మతం ప్రకారం యుక్తమే అయినా నీ మతం ప్రకారం విరుద్ధమే.ఎందువల్ల ననగా-నీ మతంలో చిరచద్విశిష్టుడు,సకలకల్యాణ గుణనిలయుడు,దివ్యమంగలవిగ్రహుడు,శంఖచక్రాదిదివ్యాయుధధారి అయిన విష్ణువు పరమేశ్వరుడు కదా?అతనికి అంతర్యామిత్వంగాని,ఆదిత్యశరీరత్వం(ఆదిత్యుడు శరీరంగా కలిగి ఉండడం)గాని ఎలా కుదురుతుంది?ఆదిత్యాది శరీరాలు ఆ శరీరాలవిషయంలో అభిమానం గల జీవులకు సంబంధించినవి.ఆ యా శరీరాలతో సంబంధం ఉండడం వల్లనే ఆదిత్యాదులను జీవు లంటున్నాం.జీవుడు శారీరకుడు(శరీరం కలవాడు),శరీరాభిమాని)అని శారీరకసూత్రభాష్యాదులలో స్థాపించబడింది.

ఆదిత్యాదిశరీరాలలో ఆదిత్యాదిజీవు లుంటారు;వాళ్లల్లో ఈశ్వరు డుంటాడు అనడం కుదరదు.ఎందువల్ల ననగా-అణుపరిమాణులు,అవయవాలు లేనివారు అయిన జీవులలో దివ్యమంగళవిగ్రహం గల ఈశ్వరు డుండడం కుదరదు.మధ్యమపరిమాణం గలవాడు,

చిదచిద్విశిష్టుడు అయిన ఈశ్వరుడు చిత్‌లోపల ఉండడం శక్యం కాదు. మా మతం ప్రకారమైతే సర్వాత్మయైన ఈశ్వరునికి సర్వమూ శరీరమే గాన సర్వమూ ఈశ్వరతను వని చెప్పడం కుదురుతుంది. అంతా ఈశ్వరశరీరమే అయితే ఈశ్వరునికి శరీరం లేదు అని చెప్పే శ్రుతికి విరోధం కదా అను ఆశంకకు తావు లేదు; ఈశ్వరునికి వాస్తవంలో శరీరం లేకపోయినా మాయచేత అతడు సశరీరుడే అని సిద్ధాంతం. మాయచేత మాత్రం అశీరునికి సశరీరత్వం ఎలా కుదురుతుంది అనడానికి వీలు లేదు; మాయలో ఏదైనా సంభావ్యమే. ఊహింపశక్యం కాని సర్వవిషయాలను సంభవించే టట్లు చేయడమే మాయ అనగా(భా. అ. ప్ర. పే. 39)21

భాష్యమ్

యథైవ పూర్వం ప్రవృత్తః స్వభావతః యః యః యాం యాం దేవతా తనుం శ్రద్ధయా అర్చితుమ్ ఇచ్ఛతి-

మూ. స తయా శ్రద్ధయా యుక్తస్తస్యారాధనమీహతే,
లభతే చ తతః కామాన్ మయైవ విహితాన్ హితాన్. 22

బాలానందిని

యథైవేతి:-ఏ యే పురుషుడు, తన స్వభావాన్ని అనుసరించి పూర్వం ఏ శ్రద్ధచేత ప్రవర్తించినవాడై ఏ యే దేవతాశరీరాన్ని శ్రద్ధతో అర్చించడానికి ఇచ్ఛయిస్తాడో -

ప్ర. అ. **స ఇతి**:-సః=ఆ పురుషుడు, తయా=ఆ, శ్రద్ధయా=శ్రద్ధతో, యుక్తః=కూడినవాడై, తస్యాః=ఆ దేవతాశరీరముయొక్క, రాధనమ్=ఆరాధనమును, ఈహతే=కోరుతాడు (చేస్తాడు). తతః=ఆ శరీరంనుండియే(ఆ దేవతాస్వరూపంనుండియే) మయైవ=నాచేతనే, విహితాన్=ఇవ్వబడిన, హితాన్=హితములైన, కామాన్=కామాలను, లభతే=పొందుతాడు.

వి :- "యథైవ పూర్వం ప్రవృత్తః" అను పదాలను 21వ శ్లోకం భాష్యం చివర చేరిస్తే బాగుంటుంది. "ప్రారంభంలో ఏ శ్రద్ధతో ప్రవర్తించాడో దానిని స్థిరమైనదానినిగా చేస్తాను" అని అన్వయం.

భాష్యమ్

స తయేతి:-సః, తయా మద్విహితయా, శ్రద్ధయా యుక్తః సన్, తస్యాః దేవతాతన్వాః, రాధనమ్ ఆరాధనమ్, ఈహతే చేష్టతే, లభతే చ, తతః తస్యాః ఆరాధితాయాః దేవతాతన్వాః, కామాన్ ఈప్సితాన్, మయైవ పరమేశ్వరేణ సర్వజ్ఞేన, కర్మఫలవిభాగజ్ఞతయా, విహితాన్ నిర్మితాన్, తాన్, హి యస్మాత్, తే భగవతా విహితాః కామాః తస్మాత్ తానవశ్యం లభతే ఇత్యర్థః. హితాన్ ఇతి పదచ్ఛేదే హితత్వం కామానామ్ ఉపచరితం కల్ప్యం, న హి కామాః హితాః కస్య చిత్. 22

బాలానందిని

స ఇతి:-అతడు నేను స్థిరం చేసిన ఆ శ్రద్ధతో కూడినవాడై ఆదేవతాశరీరముయొక్క ఆరాధనం చేస్తాడు. ఆరాధించబడిన ఆ దేవతాతనువునుండి,కర్మఫలాల విభాగాన్ని తెలిసిన వాడ నవడంచేత,సర్వజ్ఞు డను,పరమేశ్వరు డను అయిన నాచేతనే నిర్మించబడిన (ఇవ్వ బడిన)కోరబడినవాటిని పొందుతాడు కదా. ఆ కామాలు భగవంతునిచేత ఇవ్వబడినవి కాబట్టి తప్పక వాటిని పొందుతాడు అని అర్థం. ("విహితాన్ హి తాన్"అను పదచ్ఛేదాన్ని అనుసరించి పై అర్థం చెప్పబడింది.'విహితాన్,హితాన్'అను పదచ్ఛేదం గ్రహించి చెప్తున్నారు) - హితాన్ అని పదచ్ఛేదం చేసిన పక్షంలో కామాలయందు హితత్వం ఉపచరించబడింది (ఆరోపించబడింది) అని చెప్పాలి. కామాలు ఎవనికీ కూడ నిజానికి హితాలు కావు కదా? 22

భాష్యమ్

యస్మాత్ అన్తవత్సాధనవ్యాపారాః అవివేకినః కామినశ్చ తే అతః -

మూ. **అన్తవత్తు ఫలం తేషాం తద్భవత్యల్పమేధసామ్,**
దేవాన్ దేవయజో యాన్తి మద్భక్తా యాన్తి మామపి. 23

బాలానందిని

యస్మాదితి:-ఏ కారణంవల్లవాళ్లు,అంతముతో కూడిన సాధనాలు వ్యాపారాలు (పనులు)కలవారో,అవివేకవంతులో కామం కలవారో అందువల్ల-

ప్ర.అ.అన్తవదితి:-అల్పమేధసామ్=అల్పబుద్ధులైన,తేషామ్=వాళ్లయొక్కతత్ ఫలం తు=ఆ ఫలమైతే,అన్తవత్=అంతం గలది,భవతి=అవుతుంది. దేవయజః=దేవతలను పూజించేవాళ్లు,దేవాన్=దేవతలను,యాన్తి=పొందుతారు. అపి=మరియుమద్భక్తాః=నా భక్తులు,మామ్=నన్ను,యాన్తి=పొందుదురు.

భాష్యమ్

అన్తవత్ వినాశి,తు,ఫలం తేషాం తత్ భవతి,అల్పమేధసామ్అల్పప్రజ్ఞానాం. దేవాన్ దేవయజః యాన్తి-దేవాన్ యజన్తీతి దేవయజః,తే దేవాన్యాన్తి,మద్భక్తాః యాన్తి మామపి. ఏవం సమానేஉపి ఆయాసే మామేవ న ప్రపద్యన్తే అనన్తఫలాయ, అహో ఖలు కష్టం వర్తన్తే ఇతి అనుక్రోశం దర్శయతి భగవాన్. 23

బాలానందిని

అన్తవదితి:-అల్పమైన ప్రజ్ఞ(బుద్ధి) గల వాళ్ల,ఆ ఫలం అంతం కలది,నశించేది. దేవతలను పూజించేవాళ్లు దేవతలను పొందుతారు. నా భక్తులు నన్ను పొందుతారు. ఈ

విధంగా ఆయాసం సమానంగానే ఉన్నా కూడ అనంతఫలంకోసం వాళ్లు నన్నే చేర వచ్చును కదా? అలా చేయడం లేదు. అయ్యో! పాపం ఎంత కష్టస్థితిలో ఉన్నారు! అని భగవంతుడు జాలి చూపుచున్నాడు. 23

భాష్యమ్

కింనిమిత్తం మామేవ న ప్రపద్యన్తే ఇతి ఉచ్యతే-

మూ. **అవ్యక్తం వ్యక్తిమాపన్నం మన్యన్తే మామబుద్ధయః,**
పరం భావమజానన్తో మమావ్యయమనుత్తమమ్. 24

బాలానందిని

కిమితి:- వాళ్లు ఎందుచేత నన్నే పొందడం(ఆశ్రయించడం)లేదో చెప్ప బడుచున్నది.

అవ్యక్తమితి:- మమ=నాయొక్క,అవ్యయమ్=వికారరహితము,అనుత్తమమ్=చాల ఉత్తమమూ అయిన,పరమ్=గొప్పదైన,భావమ్=స్వరూపమును,అజానన్తః=ఎరుగనివారై, అబుద్ధయః=బుద్ధిశూన్యు లైన వాళ్లు,మామ్=నన్ను,అవ్యక్తమ్=అవ్యక్తునిగాను(అవ్యక్తుడుగా ఉండి)వ్యక్తిమ్‌ఆపన్నమ్=వ్యక్తత్వాన్ని పొందినవానిని గాను,మన్యన్తే=తలచుచున్నారు.

భాష్యమ్

అవ్యక్తమ్=అప్రకాశం,వ్యక్తిమ్ ఆపన్నం ప్రకాశం గతమ్ ఇదనీం,మన్యన్తే మాం నిత్యప్రసిద్ధమ్ ఈశ్వరమపి సన్తమ్,అబుద్ధయః అవివేకినః,పరం భావం పరమ్ ఆత్మ స్వరూపమ్,అజానన్తః,అవివేకినః మమ అవ్యయం వ్యయరహితమ్,అనుత్తమం మదీయం భావమ్ అజానన్తః మన్యన్తే ఇత్యర్థః. 24

బాలానందిని

అవ్యక్తమితి:-నిత్యసిద్ధు డైన ఈశ్వరుడ నైనా కూడ నన్ను,వివేకం లేని వాళ్లు, గొప్పదైన ఆత్మస్వరూపం తెలియక,అంతవరకు కనబడకుండా (తెలియకుండా)నేను ఇప్పుడు కనబడుతున్నట్లుగా(తెలియబడుతూన్నట్లుగా)అనుకొంటున్నారు. వ్యయం(వికారం) లేనిదీ,నిరతిశయమూ అయిన నా తత్త్వాన్ని ఎరుగక అవివేకవంతులు ఇలా అనుకొంటు న్నా రని అర్థం.(నేను ఎల్లప్పుడూ,ఎట్టి వికారాలూ లేక,ఆత్మస్వరూపంలో అందరికీ ప్రత్యక్ష డనై ఉండనే ఉన్నాను.అయినా కూడ అవివేకులు నా యథార్థస్వరూపం తెలియక ఇంత వరకూ తెలియబడని నేను ఇప్పుడు తెలియబడుతున్నాను అని అనుకొంటున్నారు. అందు చేతనే నన్ను,ఆరాధనకోసమై,చేరడం లేదు అని భావం).

భా.అ.ప్ర.:-ఆత్మయే ఈశ్వరు డని తెలియక ఎక్కడనో వైకుంఠాదులలో పరోక్షంగా ఉన్న విష్ణువుమొదలైనవాళ్లను ఈశ్వరు డని అనుకొంటూ,పరోక్షుడైన ఈశ్వరుడు ఇప్పుడు శ్రీకృష్ణరూపంలో భక్తులను అనుగ్రహించడానికి,శిష్టులను రక్షించడానికి అవతరించాడు అని,ఆత్మానాత్మవివేకం లేనివారు,ఈశ్వరతత్త్వం ఎరుగని వారు అయిన మూఢజనులు తలుస్తున్నారు అని మొత్తం మీద ఈ శ్లోకానికి అర్థం.దీనిచేత ఆత్మపరమాత్మలకు భేదాన్ని చెప్పే ద్వైతులు,విశిష్టాద్వైతులు కూడ నిరాకృతులైనట్లే.

(ప్రశ్న)"సర్వేశ్వరుడైన విష్ణువు తన స్వభావాన్ని విడవకుండానే వసుదేవుని కుమారుడుగా అవతరించాడు అను నాయొక్క పరమైన తత్త్వాన్ని తెలియక,బుద్ధిరహితు లైన వాళ్లు, నేను కూడ,ప్రాకృతరాజకుమారుడు వలె ఇంతకు ముందు అభివ్యక్తుడు కాక, ఇప్పుడు కర్మవశంచేత అభివ్యక్తుడను అయినాను అని అనుకొంటున్నారు"అని రామానుజ భాష్యంలో చెప్పబడింది కదా?అలాంటప్పుడు ఈ శ్లోకంచేత విశిష్టాద్వైతం కూడ నిరసించ బడింది అని ఎలా అంటావు?(సమాధానం) ఆ భాష్యం అయుక్తం.ఎందువల్ల ననగా- కృష్ణావతారం ఇదివరకు వ్యక్తం కాలేదు;ఇప్పుడే వ్యక్తం అయింది అను విషయం తెలిసినదే. ఆ జ్ఞానం తెలినితక్కువవాని జ్ఞానం ఎలా అవుతుంది?త్రేతాయుగంలో కృష్ణావతారం లేదు,కలియుగంలోనూ లేదు; ద్వాపరాంతంలోనే ఉంది.అందుచేత కృష్ణావతారం పూర్వం వ్యక్తం కాకపోవడము,మధ్యలో వ్యక్తం అవడమూ సిద్ధమే.అట్లే ఆ అవతారంయొక్క వ్యయం కూడ సిద్ధమే.ద్వాపరం వెళ్లిపోగానే కృష్ణావతారం నశించిపోవడంచేత అది కలియుగంలో కనబడడంలేదు కదా?అలాంటప్పుడు కృష్ణావతారం అవ్యయం ఎలా అవుతుంది? లీలావశంచేత వ్యక్తుడ నైన నన్ను వీళ్లు కర్మవశంచేత వ్యక్త మైనట్లు అనుకొంటున్నారు;అందుచేత వీళ్లు అబుద్ధులు అనడానికి వీలు లేదు;మూలంలో "కర్మవశాత్"అనే పదం లేనప్పుడు దానిని కల్పించడానికి ప్రమాణం లేదు.కల్పించినా కూడ నీ ఇష్టం సిద్ధించదు.భాగవతంలోని విదురమైత్రేయసంవాదంలో వ్యాసుడు రచించిన ఒక ప్రశ్నోత్తర గ్రంథం ఉంది.చిన్మాత్రుడు,వికారాలు లేనివాడు,నిర్గుణుడు అయిన ఈశ్వరునకు లీలచేత కూడ గుణక్రియాసంబంధం ఎలా కలుగుతుంది?దేశకాలాదులచేత లోపించని జ్ఞానం గల ఈశ్వరునకు ప్రకృతిసంబంధం ఎలా కలుగుతుంది?భగవంతుడైన వానికి దుఃఖం (దౌర్భాగ్యం)కర్మలవల్ల క్లేశమూ ఎలా కలుగుతాయి?అని ప్రశ్నల సారం. మాయచేత అంతా కుదురుతుంది.నిద్రచేత జీవునికి తన శిరస్సు తెగిపోయినట్లు- అలాంటి వన్నీ కనబడతాయి కదా?నీరు కదలడం మూలాన చంద్రుడు కదులుతున్నట్లు కనబడుతున్నాడు కదా?అదే విధంగా ఆత్మలో వాస్తవంగానే లేకపోయినా మాయావశంవల్ల అనాత్మగుణాలు కనబడతాయి అని సమాధానం చెప్పబడింది.

ఇది ఇలా ఉండగా-నిర్విశేషచిన్మాత్ర మైన ఈశ్వరునకు లీలచేత మాత్రం జన్మాది సంబంధం ఎలా ఉంటుంది?వానికి కర్మవశంవల్ల కలగదు అని చెప్పడం ఎట్లు?భృగువు భార్యను చంపిన విష్ణువు భృగుశాపంచేత రామావతారంలో భార్యావియోగదుఃఖం అనుభవించాడు కదా?వాలిని చాటునుండి చంపినందుకు కృష్ణావతారంలో కిరాతశరతాడనం చేత శరీర త్యాగం జరిగింది కదా?ఈ విధంగా జన్మాంతరంలో చేసిన సుకృతదుష్కృతాలచేత కలిగిన సుఖదుఃఖాదులను అనుభవించిన కృష్ణావతారాదులు కర్మప్రయుక్తములు కావు అని చెప్పడం ఎలా కుదురుతుంది?లీలచేత తనకు దుఃఖాన్ని కలిగించే కర్మ ఎలా చేస్తాడు? ఎవ్వడూ కూడ లీలచేత అగ్నిలో పడడు కదా?లీలాకృత మైనా,కర్మకృత మైనా జన్మ జరామరణసుఖదుఃఖాదివికరసముదాయం అనుభవించేవాడు ఈశ్వరు డెలా అవుతాడు. 'అజః నిత్యః'అను శ్రుతి చెప్పి నట్లు ఈశ్వరుడు నిర్వికారుడు కదా?అందుచేత లీలచేత గాని,కర్మచేత గాని కృష్ణావతారం గ్రహించడం సంభవం కాదు.మాయచేత మాత్రం ఎలా సంభం అవుతుంది అనుప్రశ్నకు అవకాశం లేదు.మాయలో అన్నీ సంభవిస్తాయి. అందుచేత ఈశ్వరునికి వాస్తవంలో జన్మాది వికారం ఏదీ లేదు.కేవలం మాయచేతనే జన్మాదు లున్నట్లు కనబడుతున్నాడు అని పైన సూచించిన భాగవతంలోని ఘట్టానికి అర్థం.

అందువల్ల – నిత్యశుద్ధబుద్ధముక్తస్వభావం గల ఆత్మయైన ఈశ్వరుడు కృష్ణ రూపంలో అవతరించాడు,అంతవరకూ అతడు పరోక్షంగానే ఉన్నాడు అని ఎవరు అను కొంటారో వాళ్లు అబుద్ధులు.కృష్ణావతారం మాయామయ మైనా కూడ ప్రాకృతరాజ కుమారుని జన్మవంటిది అనుకొనేవాళ్లు కూడ అబుద్ధులే అయినా పైన చెప్పినవాళ్లు వీళ్లకంటె కూడ ఎక్కువ అబుద్ధులు.మొదటివాళ్లు ఆత్మానాత్మవివేకం లేనివాళ్లు,వీళ్లు అనాత్మలలోనే తారతమ్యం తెలియని వాళ్లు అని వీళ్లిద్దరికీ భేదం.(ఈ ప్రసంగాలలో శ్రీరామరాయకవి అవతారవాదానికి సంబంధించిన మరి కొన్ని విషయాలు కూడ చెప్పారు. జిజ్ఞాసువులు అవి అక్కడనే చూచుకొనవచ్చును).(భా.అ.ప్ర.పే.42-44) 24

భాష్యమ్

తదజ్ఞానం కింనిమిత్తమ్ ఇతి?ఉచ్యతే -

మూ. నాహం ప్రకాశః సర్వస్య యోగమాయాసమావృతః,
మూఢోఽయం నాభిజానాతి లోకో మామజమవ్యయమ్. 25

బలానందిని

తదితి:- ఆ అజ్ఞానం ఏ నిమిత్తంవల్ల కలిగినది?చెప్పబడుచున్నది-

ప్ర.అ. నేతి:- యోగమాయాసమావృతః=యోగమాయచేత కప్పబడిన,అహమ్=నేను, సర్వస్య=అందరికీ,ప్రకాశః=స్పష్టంగా తెలిసేవాడను,న=కాను. మూఢః=మూఢమైన, అయం లోకః=ఈ లోకం,అజమ్=పుట్టుక లేని,అవ్యయమ్=వికారము లేని,మామ్=నన్ను,న అభి జానాతి=గుర్తించలేదు.

భాష్యమ్

న అహం ప్రకాశః సర్వస్య లోకస్య,కేషాం చిదేవ మద్భక్తానాం ప్రకాశః అహమ్ ఇత్యభిప్రాయః. యోగమాయాసమావృతః-యోగః గుణానాం యుక్తిః ఘటనం,సైవ మాయా యోగమాయా,తయా యోగమాయయా,సమావృతః సంఛన్నః ఇత్యర్థః. అతః ఏవ మూఢః లోకః అయం న అభిజానాతి,మామ్ అజమ్ అవ్యయమ్. 25

బాలానందిని

నేతి:-నేను లోకు లందరికీ తెలియను.నా భక్తు లైన ఏ కొద్దిమందికో మాత్రమే నేను తెలుస్తాను అని అభిప్రాయం.యోగం అనగా గుణాల కలయిక.అదే మాయ.ఆ యోగమాయచేత కప్పబడిన అని అర్థం.అందువల్లనే మూఢ మైన ఈ లోకం అజుడను అయిన నన్ను గుర్తించజాలకుండా ఉన్నది. 25

భాష్యమ్

యయా యోగమాయయా సమావృతం మాం లోకః నాభిజానాతి న అసౌ యోగమాయా మదీయా సతీ మమేశ్వరస్య మాయావినః జ్ఞానం ప్రతిబధ్నాతి యథా అన్యస్యాపి మాయావినః మాయా జ్ఞానం తద్వత్;యతః ఏవమ్ అతః-

మూ. వేదాహం సమతీతాని వర్తమానాని చార్జున,
భవిష్యాణి చ భూతాని మాం తు వేద న కశ్చన. 26

బాలానందిని

యయా ఇతి:-ఏ యోగమాయచేత కప్పబడిన నన్ను లోకం గుర్తింపజాల కున్నదో ఆ యోగమాయ నాకు సంబంధించినదై,మాయావిని,పరమేశ్వరుడను అయిన నా జ్ఞానాన్ని, (లోకంలో)ఇతరు డైన మాయావియొక్క మాయ ఏ విధంగా వాని జ్ఞానాన్ని అడ్డుకొనదో అట్లే అడ్డుకొనదు. ఇది ఇట్లు ఉన్నది గాన -

ప్ర.అ.వేదేతి: -అర్జున=అర్జునా!అహమ్=నేను,సమతీతాని=గడచినవి, వర్తమానాని =ఇప్పుడు న్నవి,భవిష్యాణి చ=రాబోవునవి అయిన,భూతాని=భూతాలకు, వేద=ఎరుగుదును. మాం తు=నన్నైతే,కశ్చన=ఎవ్వడూ కూడ,న వేద=ఎరుగడు.

భాష్యమ్

అహం తు,వేద జానే,సమతీతాని సమతిక్రాన్తాని,భూతాని,వర్తమానాని చ అర్జున,భవిష్యాణి చ భూతాని వేద అహమ్.మాం వేద తు న కశ్చన,మద్భక్తం మచ్ఛరణమ్ ఏకం ముక్త్వా.మద్వేదనాభావాదేవ న మాం భజన్తే. 26

బాలానందిని

అహమితి:-నేనైతే గడచిపోయినవి భూతకాలానికి చెందినవి ఇప్పుడున్నవి, రాబోయేవి అయిన భూతాలను ఎరుగుదును.అర్జునా! నా భక్తుడు,నేనే ఏకైకశరణంగా గలవాడు అయిన పురుషుడు తప్ప మరెవ్వడూ నన్ను ఎరుగడు.నా తత్త్వాన్ని తెలుసుకొనక పోవడంచేతనే లోకం నన్ను సేవించుటలేదు.

భా.అ.ప్ర.:-"అవతరించిన ఈశ్వరుడ నైన,నన్ను,శ్రీకృష్ణుణ్ణి,ఎవడూ తెలుసు కొనుట లేదు"అని రామనుజాచార్యుల వ్యాఖ్య అసంగతం."ఈశ్వరమ్ అవతీర్ణం"అనే మూలంలో లేని పదాలను కల్పించడానికి ప్రమాణం లేదు."మాం కృష్ణం న వేద"(నన్ను కృష్ణుణ్ణి తెలుసుకొనుటలేదు) అనడం కూడ యుక్తం కాదు.ఆ కాలంలో ఉన్న జను లందరూ కృష్ణుణ్ణి ఎరుగుదురు కదా?(భా.అ.ప్ర.పే.53) 26

భాష్యమ్

కేన పునః త్వత్తత్త్వవేదనప్రతిబన్ధేన ప్రతిబద్ధాని సన్తి జాయమానాని సర్వ భూతాని త్వాం న విదన్తి?ఇత్యపేక్షాయామ్ ఇదమ్ ఆహ-

మూ. ఇచ్ఛాద్వేషసముత్థేన ద్వన్ద్వమోహేన భారత,
సర్వభూతాని సంమోహం సర్గే యాన్తి పరంతప. 27

బాలానందిని

కేనేతి:-నీ తత్త్వాన్ని తెలుసుకొనడానికి ప్రతిబంధక మైన దేనిచేత ప్రతిబంధింప బడినవై,పుడుతూన్న సర్వప్రాణులు నిన్ను తెలుసుకొనడంలేదు?అను ప్రశ్న కలుగగా ఇది చెపుతున్నాడు -

ప్ర.అ. ఇచ్ఛేతి:- పరంతప=శత్రువులను పీడించే,భారత=అర్జునా!సర్గే=సృష్టి యందు(జన్మసమయమునందు),సర్వభూతాని=సమస్తభూతాలూ కూడ,ఇచ్ఛాద్వేషసము త్థేన=ఇచ్ఛాద్వేషాలవల్ల కలిగే,ద్వన్ద్వమోహేన=(ఇచ్ఛాద్వేషములనే)ద్వంద్వాలలో మోహం చేత,సంమోహమ్=సంమోహమును,యాన్తి=పొందుచున్నవి.

భాష్యమ్

ఇచ్ఛాద్వేషసముత్థేన-ఇచ్ఛా చ ద్వేషశ్చ ఇచ్ఛాద్వేషౌ,తాభ్యాం సముత్తిష్ఠతి ఇతి ఇచ్ఛాద్వేషసముత్థః,తేన ఇచ్ఛాద్వేషసముత్థేన. కేన?ఇతి విశేషాపేక్షాయామ్ ఇదమ్ ఆహ- ద్వన్ద్వమోహేన-ద్వన్ద్వనిమిత్తః మోహః ద్వన్ద్వమోహః. తౌ ఏవ ఇచ్ఛాద్వేషౌ శీతోష్ణవత్ పరస్పరవిరుద్ధౌ సుఖదుఃఖతద్ధేతువిషయౌ యథాకాలం సర్వభూతైః సంబధ్యమానౌ ద్వన్ద్వశబ్దేన అభిధీయేతే. తత్ర యదా ఇచ్ఛాద్వేషౌ సుఖదుఃఖతద్ధేతు సంప్రాప్త్యా లబ్ధాత్మకౌ భవతః తదా తౌ సర్వభూతానాం ప్రజ్ఞాయాః స్వవశాపాదన ద్వారేణ పరమార్థాత్మతత్త్వవిషయజ్ఞానోత్పత్తిప్రతిబన్ధకారణం మోహం జనయతః. న హి ఇచ్ఛాద్వేషవశీకృతచిత్తస్య యథాభూతార్థవిషయజ్ఞానమ్ ఉత్పద్యతే బహిః అపి?కిము వక్తవ్యం తాభ్యామ్ ఆవిష్టబుద్ధేః సంమూఢస్య ప్రత్యగాత్మని బహుప్రతిబన్ధే జ్ఞానం నోత్పద్యతే ఇతి?అతః తేన ఇచ్ఛాద్వేషసముత్థేన ద్వన్ద్వమోహేన ప్రతిబద్ధజ్ఞానాని సర్వభూతాని సంమోహితాని మామ్ ఆత్మభూతం న జానన్తి;అతః ఏవ ఆత్మభావేన మాం న భజన్తే. 27

బాలానందిని

ఇచ్ఛేతి:-ఇచ్ఛాద్వేషములనుండి ఏది పుట్టుచున్నదో అది ఇచ్ఛాద్వేషసముత్థం. అట్టి,ఇచ్ఛాద్వేషసముత్థ మైన,దేనిచేత అను ప్రశ్న కలుగగా ఇది చెపుతున్నాడు- ద్వన్ద్వ మోహేన:- ద్వంద్వం నిమిత్తంగా గల మోహం ద్వంద్వమోహం.(ఇక్కడ)ఆ ఇచ్ఛాద్వేషాలే ద్వంద్వం. ఇవి శీతోష్ణాల వలె పరస్పరవిరుద్ధ మైనవి. ఇవి సుఖదుఃఖాలను,వాటి హేతువు లనూ గూర్చి కలుగుతూంటాయి. ఇవి ఆ యా కాలాలలో సమస్తభూతాలతోనూ సంబం ధిస్తూంటాయి(కలుగుతూంటాయి). ఇవే ద్వంద్వశబ్దంచేత (ఇక్కడ)చెప్పబడుతున్నాయి. ("ఇచ్ఛాద్వేషసముత్థేన ద్వన్ద్వమోహేన"అనగా ఇచ్ఛ ద్వేషము అనే ద్వంద్వంవల్ల పుట్టిన మోహంచేత అని అర్థం).సుఖదుఃఖాలు,వాటి కారణాలు సంప్రాప్తించినప్పుడు ఎప్పుడు ఇచ్ఛాద్వేషాలు పుడతాయో అప్పుడు అవి సమస్తభూతాల వివేకజ్ఞానాన్ని తమ వశం చేసికొని పరమార్థ మైన ఆత్మతత్త్వానికి సంబంధించిన జ్ఞానం పుట్టడానికి ప్రతిబంధానికి కారణమైన(ప్రతిబంధకమైన)మోహాన్ని పుట్టిస్తాయి.ఇచ్ఛాద్వేషాలచేత వశం చేసికొనబడిన చిత్తం కలవానికి బైట కూడ (లౌకికవిషయాలలో కూడ)పదార్థాలు ఉన్నవి ఉన్నట్లు జ్ఞానం కలగదు కదా?అలాంటప్పుడు ఇచ్ఛాద్వేషాలు ఆవేశించిన బుద్ధి కల సంమూఢునికి అనేకప్రతిబంధా లున్న ప్రత్యగాత్మవిషయంలో జ్ఞానం పుట్టదు అని వేరుగా చెప్పాలా! అందువల్ల, ఆ ఇచ్ఛాద్వేషాలవల్ల కలిగిన ద్వంద్వమోహంచేత,అర్జునా!సమస్తభూతాలూ కూడ

సంమోహితములై, సర్గమునందు,జన్మయందు,ఉత్పత్తికాలమునందు అని అర్థం; సంమూఢత్వాన్ని పొందుతాయి.సమస్తభూతాలు పుట్టుకతోనే ఈ ద్వంద్వమోహానికి వశమై పుడతాయి అని అభిప్రాయం.ఇది ఇట్లు గాన,ఈ ద్వంద్వమోహంచేత ప్రతిబద్ధమైన ప్రజ్ఞానం(వివేకం)కలవై సర్వభూతాలు సంమోహితములై తమ ఆత్మ నైన నన్ను తెలుసు కొనుటలేదు.అందువల్లనే నన్ను ఆత్మభావంతో సేవించుటలేదు. 27

భాష్యమ్

కే పునః అనేన ద్వన్ద్వమోహేన నిర్ముక్తాః సన్తః త్వాం విదిత్వా యథాశాస్త్రమ్ ఆత్మభావేన భజన్తే? ఇత్యపేక్షితమ్ అర్థం దర్శయితుమ్ ఉచ్యతే -

మూ. యేషాం త్వన్తగతం పాపం జనానాం పుణ్యకర్మణామ్,
తే ద్వన్ద్వమోహనిర్ముక్తా భజన్తే మాం దృఢవ్రతాః. 28

బాలానందిని

కే ఇతి:-అయితే ఎవరు ఈ ద్వంద్వమోహంనుండి విముక్తులై,నిన్ను శాస్త్రాను సారం తెలుసుకొని ఆత్మభావంతో భజిస్తారు? అపేక్షింపబడిన ఈ విషయాన్ని చూపడం కొరకు చెప్పబడుచున్నది-

ప్ర.అ. యేషామితి:-తు=కాని,పుణ్యకర్మణామ్=పుణ్యకర్మలు గల,యేషామ్=ఏ, జనానామ్=జనులయొక్క,పాపమ్=పాపము,అన్తగతమ్=అంతమును పొందినదో,తే=వారు ద్వన్ద్వమోహనిర్ముక్తాః=ఇచ్ఛాద్వేషము లనే ద్వంద్వముచే కలిగిన మోహంచేత విడువబడిన వారై,దృఢవ్రతాః=దృఢమైన నియమం(జ్ఞానం)గలవారై,మామ్=నన్ను,భజన్తే=సేవిస్తారు.

భాష్యమ్

యేషాం తు పునః అన్తగతం సమాప్తప్రాయం క్షీణం పాపం జనానాం పుణ్య కర్మణాం పుణ్యం కర్మ యేషాం సత్త్వశుద్ధికారణం విద్యతే తే పుణ్యకర్మాణః,తేషాం పుణ్యకర్మణాం,తే ద్వన్ద్వమోహనిర్ముక్తాః యథోక్తేన ద్వన్ద్వమోహేన నిర్ముక్తాః,భజన్తే, మాం పరమాత్మానం,దృఢవ్రతాః-ఏవమేవ పరమార్థతత్త్వం న అన్యథా ఇత్యేవం నిశ్చితవిజ్ఞానాః దృఢవ్రతాః ఉచ్యన్తే. 28

బాలానందిని

యేషామితి:-కాని పుణ్య మైన,సత్త్వశుద్ధికి కారణమైన కర్మ గల ఎవరియొక్క పాపం సమాప్తప్రాయమైనదో,క్షీణించినదో వాళ్లు పైన చెప్పిన ద్వంద్వమోహంచేత

విడవబడినవారై,దృఢవ్రతులై పరమాత్మ నైన నన్నే భజిస్తారు.పరమార్థతత్త్వం ఇట్లే కాని మరొకవిధం కాదు అని నిశ్చిత మైన జ్ఞానం కలవాళ్లు దృఢవ్రతు లని చెప్పబడు చున్నారు.

భాష్యమ్

తే కిమర్థం భజన్తే ఇత్యుచ్యతే -

మూ. జరామరణమోక్షాయ మామాశ్రిత్య యతన్తి యే,
తే బ్రహ్మ తద్విదుః కృత్స్నమధ్యాత్మం కర్మ చాఖిలమ్. 29

బాలానందిని

తే ఇతి:-వాళ్లు ఎందుకు భజిస్తారో చెప్పబడుచున్నది.

ప్ర. అ. జరేతి:- యే=ఎవరు,మామ్=నన్ను,ఆశ్రిత్య=ఆశ్రయించి, జరామరణ మోక్షాయ= జరామరణముల విముక్తికొరకు,యతన్తి= ప్రయత్నిస్తారో,తే=వారు, తత్=ఆ, బ్రహ్మ= బ్రహ్మను,కృత్స్నమ్= సమస్తమైన, అధ్యాత్మమ్= అధ్యాత్మమును,అఖిలమ్= సమాప్తమైన,కర్మ చ=కర్మను,విదుః=తెలుసుకొనుచున్నారు.

భాష్యమ్

జరామరణమోక్షాయ జరామరణమోక్షార్థం మాం పరమేశ్వరమ్ ఆశ్రిత్య, మత్స మాహితచిత్తాః సన్తః, యతన్తి ప్రయతన్తే, యే తే,తద్ విదుః,కృత్స్నం సమస్తమ్,అధ్యాత్మం ప్రత్యగాత్మవిషయం వస్తు తత్ విదుః,కర్మ చ అఖిలం సమస్తం విదుః. 29

బాలానందిని

జరేతి:-ఎవరు పరమేశ్వరుడ నైన నన్ను ఆశ్రయించి,అనగా నాయందు ఏకాగ్రం గా నిలపబడిన చిత్తం కలవారై,జరామరణములనుండి విముక్తికొరకు ప్రయత్నిస్తారో వాళ్లు పరమైన ఏ బ్రహ్మ ఉన్నదో దానిని తెలుసుకుంటారు.సమస్తమైన ప్రత్యగాత్మవిషయ మైన ప్రత్యగాత్మకు-జీవాత్మకు-సంబంధించిన)ఏ వస్తువు ఉన్నదో దానిని అంతనూ తెలిసికొంటారు.సమస్త మైన కర్మను కూడ తెలుసుకొంటారు. 29

మూ. సాధిభూతాధిదైవం మాం సాధియజ్ఞం చ యే విదుః,
ప్రయాణకాలేఽపి చ మాం తే విదుర్యుక్తచేతసః. 30

ఇతి శ్రీ మహాభారతే శతసాహస్ర్యాం సంహితాయాం వైయాసిక్యాం భీష్మపర్వణి శ్రీభగవద్గీతాసు ఉపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే శ్రీకృష్ణార్జున సంవాదే జ్ఞానవిజ్ఞానయోగో నామ సప్తమోఽధ్యాయః.

బాలానందిని

సాధిభూతేతి:- సాధిభూతాదిదైవమ్=అధిభూత-అధిదైవాలతో కూడిన, సాధియజ్ఞం చ=అధియజ్ఞంతో కూడిన,మామ్=నన్ను,యే=ఎవరు,విదుః=తెలుసుకొంటారో, యుక్తచేతసః =సమాహితచిత్తం గల,తే=వారు,ప్రయాణకాలేఽపి=మరణకాలంలో కూడ, మామ్=నన్ను, విదుః=తెలుసుకొంటారు.

భాష్యమ్

సాధీతి:-సాధిభూతాధిదైవం-అధిభూతం చ అధిదైవం చ అధిభూతాధిదైవమ్ సహ అధిభూతాధిదైవేన సాధిభూతాధిదైవం చ మాం యే విదుః సాధియజ్ఞం చ,సహ అధియజ్ఞేన సాధియజ్ఞం,యే విదుః,ప్రయాణకాలేఽపి చ మరణకాలేఽపి చ,మాం తే విదుః,యుక్తచేతసః సమాహితచిత్తాః ఇతి. 30

ఇతి శ్రీమత్పరమహంస పర్వ్రాజకాచార్య గోవిన్దభగవత్పూజ్యపాదశిష్య శ్రీమచ్ఛఙ్కరభగవతః కృతౌ శ్రీమద్భగవద్గీతాభాష్యే జ్ఞానవిజ్ఞానయోగో నామ సప్తమోఽధ్యాయః

బాలానందిని

సాధీతి:- అధిభూతంతోను అధిదైవంతోను కూడినవాడను,అధియజ్ఞంతో కూడిన వాడను అయిన నన్ను ఎవరు తెలుసుకుంటారో,సమాహిత మైన చిత్తంగల వాళ్లు,మరణ కాలంలో కూడ నన్ను తెలుసుకొంటారు. 30

'బాలానందిని'అను శ్రీమద్భగవద్గీతాశంకరభాష్యాంధ్రవ్యాఖ్యానమునందు
సప్తమధ్యాయం సమాప్తం
(అదినుండి శ్లోకాల సంఖ్య-281)

అథ అష్టమోఽధ్యాయః

భాష్యమ్

"తే బ్రహ్మ తద్విదుః కృత్స్నమ్"(7.29)ఇత్యాదినా భగవతా అర్జునస్య ప్రశ్న బీజాని ఉపదిష్టాని,అతః తత్ప్రశ్నార్థమ్-

అర్జున ఉవాచ -

మూ. కిం తద్ బ్రహ్మ కిమధ్యాత్మం కిం కర్మ పురుషోత్తమ,
అధిభూతం చ కిం ప్రోక్తమధిదైవం కిముచ్యతే. 1

అధియజ్ఞః కథం కోఽత్ర దేహేఽస్మిన్ మధుసూదన,
ప్రయాణకాలే చ కథం జ్ఞేయోఽసి నియతాత్మభిః. 2

భాష్యమ్

తే ఇతి:- "తే బ్రహ్మతద్విదుః కృత్స్నమ్"ఇత్యాదివాక్యాలలో భగవంతునిచేత అర్జునుని ప్రశ్నలకు బీజములు వేయబడినవి. అందువల్ల అట్లు ప్రశ్నించడానికి అర్జునుడు అన్నాడు.

ప్ర. అ. **కిమితి**: -తత్=ఆ,బ్రహ్మ=బ్రహ్మ,కిమ్=ఏమి?పురుషోత్తమ=ఓ!పురుష శ్రేష్ఠుడా!కర్మ=కర్మ,కిమ్=ఏమి. కిమ్=ఏది,అధిభూతమ్=అధిభూత మని, ప్రోక్తమ్=చెప్పబడినది?కిమ్=ఏది,అధిదైవమ్=అధిదైవమని,ఉచ్యతే=చెప్పబడుచున్నది? మధుసూదన=ఓ!మధుసూదనా!అత్ర=ఇక్కడ,అస్మిన్=ఈ,దేహే=దేహమునందు,అధియజ్ఞః=అధియజ్ఞం,కథమ్=ఎట్లు?కః=ఏది?ప్రయాణకాలే=మరణసమయమునందు,నియతాత్మభిః=నియతమైన అంతఃకరణం కలవాళ్లచేత,కథమ్=ఎట్లు. జ్ఞేయః=తెలియదగినవాడవు,అసి=అయి ఉన్నావు?

భాష్యమ్

ఏషాం ప్రశ్నానాం యథాక్రమం నిర్ణయాయ-

శ్రీభగవానువాచ-

మూ. అక్షరం బ్రహ్మ పరమం స్వభావోఽధ్యాత్మముచ్యతే,
భూతభావోద్భవకరో విసర్గః కర్మసంజ్ఞితః. 3

బాలానందిని

ఏషామితి: -యథాక్రమంగా ఈ ప్రశ్నలను నిర్ణయించడానికి శ్రీభగవంతుడు ఇలా అన్నాడు -

ప్ర. అ. **అక్షరమితి**: -అక్షరమ్=అక్షరమూ,పరమం బ్రహ్మ=పరబ్రహ్మ;స్వభావః=స్వభావం,అధ్యాత్మమ్=అధ్యాత్మంగా,ఉచ్యతే=చెప్పబడుచున్నది. భూతభావోద్భవకరః=భూతాల ఉనికిని చేసే,విసర్గః=హవిస్సు మొదలైనవాటి త్యాగం,కర్మసంజ్ఞితః=కర్మ అను పేరు గలది.

భాష్యమ్

అక్షరం న క్షరతీతి,పర ఆత్మా-"ఏతస్య వా అక్షరస్య ప్రశాసనే గార్గి"(బృ. ఉ. 3. 8. 9.)ఇతి శ్రుతేః.ఓంకారస్య చ "ఓమిత్యేకాక్షరం బ్రహ్మ"ఇతి,పరేణ విశేషణాత్

అగ్రహణమ్. "పరమమ్" ఇతి చ నిరతిశయే బ్రహ్మణి అక్షరే ఉపపన్నతరం విశేషణమ్. తస్యైవ పరస్య బ్రహ్మణః ప్రతిదేహం ప్రత్యగాత్మభావః స్వభావః స్వభావః అధ్యాత్మమ్ ఉచ్యతే. ఆత్మానం దేహమ్,అధికృత్య ప్రత్యగాత్మతయా ప్రవృత్తం పరమార్థబ్రహ్మావసానం వస్తు స్వభావః అధ్యాత్మమ్ ఉచ్యతే,అధ్యాత్మశబ్దేన అభిధీయతే. భూతభావోద్భవకరః- భూతానాం భావః భూతభావః. తస్య ఉద్భవః భూతభావోద్భవః. తం కరోతి ఇతి భూత భావోద్భవకరః;భూతవస్తూత్పత్తికరః ఇత్యర్థః. విసర్గః విసర్జనం దేవతోద్దేశేన చరుపురోడా శాదేః ద్రవ్యస్య పరిత్యాగః,సః ఏషః విసర్గలక్షణః యజ్ఞః కర్మసంజ్ఞితః;కర్మశబ్దితః ఇత్యేతత్. ఏతస్మాత్ హి బీజభూతాత్ వృష్ట్యాదిక్రమేణ స్థావరజఙ్గమాని భూతాని ఉద్భవన్తి. 3

బాలానందిని

అక్షరమితి:-"న క్షరతి ఇతి అక్షరమ్"-నశించనిది గాన అక్షరం. పరమాత్మ. "**ఏతస్య వా అక్షరస్య ప్రశాసనే గార్గి**"(గార్గీ! ఈ అక్షరంయొక్క శాసనం ప్రకారమే సర్వప్రపంచమూ ఉన్నది)అని శ్రుతి చెప్పుచున్నది. "**ఓమిత్యేకాక్షరం బ్రహ్మ**"అని శ్రుతిలో చెప్పబడిన ఓంకారాన్ని అక్షరశబ్దంచేత గ్రహించకూడదు. కారణ మేమనగా- ఇక్కడ "బ్రహ్మ పరమమ్"అని బ్రహ్మశబ్దానికి 'పరమమ్'అని విశేషణం ప్రయోగించబడింది. 'పరమమ్' అనే విశేషణం నిరతిశయమైన(దేనికంటె గొప్పది లేదో అట్టి)బ్రహ్మయైన అక్షరమునందే యుక్తతరంగా ఉంటుంది. (ఓంకారం కూడ బ్రహ్మ అని చెప్పబడినా,జడమైన ఆ ఓంకారం నిరతిశయమైన పరబ్రహ్మ కాజాలదు. అది కార్యం గాన సాతిశయమే అని భావం). ఆ పరబ్రహ్మయే ప్రతీ దేహమునందు ప్రత్యగాత్మగా(జీవుడుగా)ఉంటూన్నది. ఈ ప్రత్యగాత్మత్వం 'స్వభావం'. స్వభావం అధ్యాత్మ మని చెప్పబడుచున్నది. ఆత్మను,అనగా దేహాన్ని, అధిష్ఠించి ప్రత్యగాత్మగా ఉన్న,పరమార్థమైన బ్రహ్మయే చివరిదిగా గల వస్తువు, అనగా పరమార్థరూపమైన, బ్రహ్మ, స్వభావం,అది అధ్యాత్మశబ్దంచేత చెప్పబడుచున్నది. (అధ్యాత్మశబ్దానికి "**ఆత్మని ఇతి అధ్యాత్మమ్**"అని ప్రసిద్ధమైన అర్థం కాదు. అప్పుడు ఆత్మయందు అనే అర్థం మాత్రమే లభిస్తుంది. "**ఆత్మానమ్ అధికృత్య**"(ఆత్మను అధిష్ఠించి)అను విగ్రహంచేత దేహాన్ని అధిష్ఠించిన పరమాత్మ అను అర్థం లభిస్తుంది. అదే స్వభావం. స్వం అనగా తాను,బ్రహ్మ,అలా ప్రత్యగాత్మగా అగుట అని స్వభావ శబ్దానికి అర్థం. "**తత్సృష్ట్వా తదేవాను ప్రావిశత్**"అని శ్రుతిలో చెప్పినట్లు పరబ్రహ్మయే దేహాదులలో ప్రవేశించి ప్రత్యగత్మత్వాన్ని పొందుతున్నది అని భావం). భూతభావోద్భవకరః-భూతముల భావము,అనగా ఉనికి, భూతభావం- దానియొక్క పుట్టుకను చేసేది భూతభావోద్భవకరం. అనగా భూతవస్తువుల ఉత్పత్తిని చేసేది అని అర్థం. దేవతలను ఉద్దేశించి చరువు(పక్వాన్నాదికం)పురోడాశం మొదలైన ద్రవ్యాలను

విడవడం(ఇవ్వడం)విసర్గం. ఆ విసర్గరూప మైన యజ్ఞమే కర్మ అని చెప్పబడుచున్నది అని అర్థం. బీజమైన ఈ కర్మవలననే వృష్ట్యాదిక్రమంచేత స్థావరజంగమరూపా లైన భూతాలు పుట్టుచున్నాయి కదా? 3

మూ. అధిభూతం క్షరో భావః పురుషశ్చాధిదైవతమ్,
అధియజ్ఞోఽ హమేవాత్ర దేహే దేహభృతాం వర. 4

బాలానందిని

ప్ర.అ. **అధిభూతమితి** :- దేహభృతామ్=దేహధారులలో,వర =శ్రేష్ఠుడా!క్షరః =వినాశశీల మైన,భావః = వస్తువు,అధిభూతమ్=అధిభూతము. పురుషః=చ=పురుషుడు (హిరణ్యగర్భుడు), అధి దైవతమ్=అధిదైవతము. అత్ర=ఈ,దేహే=దేహమునందు, అహమేవ= నేనే,అధియజ్ఞః= అధి యజ్ఞము.

భాష్యమ్

అధిభూతమితి: -అధిభూతం ప్రాణిజాతం అధికృత్య భవతీతి. కః అసౌ? క్షరతీతి క్షరః,వినాశీ,భావః,యత్కిఞ్చిత్ జనిమత్ వస్తు ఇత్యర్థః. పురుషః-పూర్ణమనేన సర్వమ్ ఇతి, పురి శయనాత్ వా పురుషః. ఆదిత్యాన్తర్గతః హిరణ్యగర్భః సర్వప్రాణికరణానామ్ అనుగ్రాహకః సః అధిదైవతమ్. అధియజ్ఞః సర్వయజ్ఞాభిమానినీ దేవతా విష్ణ్వాఖ్యా "యజ్ఞో వై విష్ణుః" (తైసం. 174) ఇతి శ్రుతేః. సః హి విష్ణుః అహమేవ,అత్ర అస్మిన్ దేహే,యః యజ్ఞః తస్య అహమ్ అధియజ్ఞః. యజ్ఞో హి దేహనిర్వర్త్యత్వేన దేహసమవాయీ ఇతి దేహాధికరణః భవతి; దేహ భృతాం వర. 4

బాలానందిని

అధిభూతమితి :- ప్రాణిసముదాయానికి సంబంధించి ఉండేది అదిభూతం. అది ఏమిటి? నశించే స్వభావం గల వస్తువు; పుట్టుక గల ప్రతీ వస్తువూ అధిభూతం అని అర్థం. (అది దేహాదిరూపం, శీతోష్ణాదిరూపము) వేనితో ఇదంతా నిలబడినదో అతడు పురుషుడు; లేదా శరీరంలో ఉన్నవాడు పురుషుడు . ఆదిత్యునిలో ఉన్నవాడు, సమస్తప్రాణుల ఇంద్రియాలను అనుగ్రహించేవాడు (అవి పనిచేసే టట్లు చేసేవాడు) అయిన హిరణ్యగర్భుడు; అతడే అధిదైవతం. "యజ్ఞో వై విష్ణుః" అను శ్రుతిని అనుసరించి విష్ణు వను పేరుగల సర్వయజ్ఞాల అభిమానిదేవత అధియజ్ఞుడు. ఆ విష్ణువు నేనే. ఈ దేహంలో ఏ యజ్ఞం ఉన్నదో దానికి నేను అధియజ్ఞ మైనవాడను యజ్ఞం దేహంచేత చేయబడుతుంది గాన దేహంతో సంబంధించి ఉంటుంది. అందుచేత దేహం దీని ఆధారం. (అందుచేతనే 'ఈ దేహంలో' అని చెప్పబడిం దని అర్థం). దేహధారులలో శ్రేష్ఠుడా!

భా. అ. ప్ర. "ప్రకృతిచేత విడవబడిన క్షేత్రజ్ఞసమష్టిరూప మైన ఆత్మస్వరూపం 'బ్రహ్మ'. ఆత్మతో సంబంధించే భూతసూక్ష్మములు, వాటి వాసనలు మొదలైన ప్రకృతి 'స్వభావం' (అధ్యాత్మం). మనుష్యాదిపదార్థాలు పుట్టుకను చేసేది, యోషిత్పురుషుల సంసర్గంవల్ల కలిగేదీ అయిన రేతోవిసర్జనం 'కర్మ'. శబ్దస్పర్శాదులు, వాటి ఆశ్రయము అయిన క్షరమైన అధిభూతం ఇంద్రుడు ప్రజాపతి మొదలైన సమస్తదేవతల పైన ఉండేవాడు, విలక్షణమైన శబ్దాదులను అనుభవించేవాడు అయిన పురుషుడు 'అధిదైవతం'. యజ్ఞాలచేత ఆరాధించ దగినవారు, నా శరీరమూ అయిన ఇంద్రాదులలో ఆత్మగా ఉన్న నేనే అధియజ్ఞం. ముముక్షువులు- బ్రహ్మను పొందదగినదాని గాను, అధ్యాత్మాన్ని విడవదగినదానిని గాను, కర్మను ఉద్వేగకరం అవడంచేత పరిహరింపదగినదానిని గాను తెలుసుకోవాలి. ఐశ్వర్యం కోరేవాళ్లు అధిభూతాన్ని, అధిదైవత్వాన్నీ కూడ పొందదగినదానినిగా తెలుసుకోవాలి. మహాయజ్ఞాదు లైన నిత్యనైమిత్తికకర్మలను అను ష్ఠించేటప్పుడు ముగ్గురు అధికారులూ కూడ అధియజ్ఞాన్ని అనుసంధానం చేసుకోవాలి" అని శ్రీరామనుజాచార్యులు వ్యాఖ్యానించారు. ఇక్కడ చెప్పబడుచున్నది-"క్షేత్రజ్ఞం చాపి మాం విద్ధి"అని చెప్పనున్నాడు గాన క్షేత్రజ్ఞుడు ఒక్కడే. అందుచేత క్షేత్రజ్ఞుల సమష్టి అంటూ ఏదీ లేదు. అంతఃకరణభేదంచేత క్షేత్రజ్ఞభేదాన్ని అంగీకరించే పక్షంలో కూడ నీ మతం ప్రకారం ఈశ్వరుడు చిదచిచ్ఛరీరుడు గాన అతడు క్షేత్రజ్ఞసమష్టిరూపుడు కాజాలడు;క్షేత్రజ్ఞసమష్టి బ్రహ్మ,చిదచిచ్ఛరీరకుడైన ఈశ్వరుడు వేరు అనడం కూడ యుక్తం కాదు. అప్పుడు చిత్ అయిన బ్రహ్మ ఈశ్వరుని శరీరం అనవలసి వస్తుంది.

(పూ. ప.)పరమాత్మయైన బ్రహ్మకంటె వేరైన క్షేత్రజ్ఞసమష్టియే ఇక్కడ గౌణవృత్తి చేత బ్రహ్మశబ్దంచేత చెప్పబడుతుంది అన్నట్లయితే(సి)అది యుక్తం కాదు;ముఖ్యార్థాన్ని త్యజించడానికి కారణం లేదు కదా?"అక్షరం బ్రహ్మ పరమమ్"అన్నప్పుడు 'పరమమ్' 'బ్రహ్మ'రెండు శబ్దాలకు పరమాత్మయందే రూఢి కదా?'పరమమ్'అనగా ప్రకృతికంటె విలక్షణమైన అని అర్థం గ్రహిస్తాం అనడం కూడ యుక్తం కాదు. అప్పుడు ప్రకృతికంటె విలక్షణమైన పరబ్రహ్మనే గ్రహించవలసి ఉంటుంది;బ్రహ్మ క్షేత్రజ్ఞునికంటె భిన్నమైతే అచేతనం అని చెప్పవలసి వస్తుంది. క్షేత్రజ్ఞ-క్షేత్రజ్ఞులు తప్ప మరొక వస్తు వేదీ లేనే లేదు గాన క్షేత్ర క్షేత్రజ్ఞవిలక్షణ మైన బ్రహ్మయే సిద్ధించదు. బ్రహ్మతో సమాన మైన ధర్మాలు కల వాడవడంచేత క్షేత్రజ్ఞుడు బ్రహ్మగా చెప్పబడుతున్నాడు అంటే అప్పుడు 'అక్షరం బ్రహ్మ పరమమ్' అనే దానిని విడచి క్షేతజ్ఞసమష్టివరకు అర్థాన్ని కల్పించడం అప్రామాణికం అయుక్తం కూడ. మూలకారుడు పరమాక్షరసమష్టి బ్రహ్మ అని అని ఉన్నట్లయితే అప్పుడు క్షేత్రప్రజ్ఞసమష్టి అనడం బాగుండేది. అట్లే క్షేత్రజ్ఞసమష్టిరూప మైన ఆత్మ స్వరూపం అనడం కూడ యుక్తం కాదు. ఆత్మయే క్షేత్రజ్ఞుడు గాన ఆ ఆత్మయే దాని సమష్టిరూపం అనడం అయుక్తం. ఆత్మల సమష్టిరూపం క్షేత్రజ్ఞసమష్టిరూపం అనడం కూడ యుక్తం కాదు; ధాన్యపుగింజల

వలె ఆత్మలు రాశిగా లేవు కదా? క్షేత్రజ్ఞసమష్టి మైన ఆత్మస్వరూపం పరమాత్మయొక్క శరీరం అని చెప్పడం కూడ యుక్తం కాదు; ఆత్మ పరమాత్మశరీర మైనట్లయితే నశించవలసి వస్తుంది. "శీర్యతే ఇతి శరీరమ్" 'నశించేది కాబట్టి శరీరం' అని కదా శరీరశబ్దార్థం? పరమాత్మచేత నియమించబడుచున్నది గాన అది పరమాత్మశరీరం అనడం కూడ అయుక్తమే; అద్వితీయమైన ఆత్మయందు నియామకుడు మొదలైన ద్వైతానికి అవకాశం లేదు. సుషుప్తిలో ఆత్మ నియమించబడుచున్నట్లు కనబడడం లేదు కదా? వ్యవహార కాలంలో నైతే శరీరాదితాదాత్మ్యాధ్యాసంచేత నియామ్యత్వం కుదురుతుంది.... "ప్రకృతివినిర్ము క్తమైన ఆత్మస్వరూపం అంటే చైతన్యమే. అది క్షేత్రాన్ని తెలుసుకుంటుంది గాన క్షేత్రజ్ఞమే. ఉపాధులు లేకపోవడంచేత ఏకమే. ద్వైతం లేకపోవడంచేత అద్వైతమే. ప్రకృతిచేత విడవబడిన వస్తువునందు ఉపాధి గాని, ద్వైతం కాని ఉండదు కదా? ఈ విధమైన చైతన్యం సచ్చిదానందలక్షణమైన పరబ్రహ్మయే గాన 'అక్షరం పరమంబ్రహ్మ' అన్నదానికి భగవత్పాదులు చెప్పినట్లు బ్రహ్మ అనియే అర్థం కాని బ్రహ్మకంటె భిన్నమైన ఒక జీవుడు కాని, సకల జీవులు కాని కాదు. బ్రహ్మానతిరిక్తమైన జీవాత్మయే ప్రకృతివినిర్ముక్తం అవుతుంది, బ్రహ్మాతిరిక్తమైతే అది ప్రకృతి సంసృష్టమే.

అట్లే-"ఆత్మతో సంబంధిస్తూన్న భూతసూక్ష్మ-తద్వాసనాదికం"అనడం కూడ అయుక్తమే. అసంగ మైన ఆత్మయందు భూతసూక్ష్మాదిసంబంధం కుదరదు."అసంగో హ్యయం పురుషః"అని శ్రుతి చెప్పుచున్నది. మాయచేత అలాంటి సంబంధం ఉపపన్నం అవుతుంది కదా అనడానికి వీలు లేదు. నీ మతం ప్రకారం భూత సూక్ష్మాదులు సత్యములు గాన అవి మాయికము లనడానికి అవకాశం లేదు.అదే విధంగా సత్యమైన ప్రకృతినుండి ఆత్మ స్వరూపానికి వినిర్ముక్తి కూడ సంభవం కాదు.సత్యమైనది నివర్తిస్తున్నట్లు ఎక్కడా చూడబడలేదు, వినబడలేదు. సత్యమైన ప్రకృతి కూడ ఈశ్వరసేవ చేయడంచేత నివర్తి స్తుంది అంటే అప్పుడు ఈశ్వరుడు చిదచిద్విశిష్టుడు ఎలా అవుతాడు?ఈశ్వరునికి ప్రకృతి నివృత్తి ఉండదు అని అంటే,ఈశ్వరునికే ప్రకృతినివృత్తి లేకపోతే వానిని సేవించినవాళ్లకు దాని నివృత్తి ఎలా కలుగుతుంది? ప్రకృతిసంగం దోషం అయితే హేయగుణప్రత్యనీకుడైన ఈశ్వరునికి అది ఎలా ఉంటుంది? అది గుణ మైతే ముముక్షువునకు అది త్యాజ్యం ఎలా అవుతుంది? ఈశ్వరుని ప్రకృతిసంగం గుణమే,జీవునకు మాత్రం అది దోషం అని చెప్పడానికి కూడ వీలు లేదు;జీవేశ్వరు లిద్దరూ కూడ జ్ఞానస్వరూపులే అవడంచేత సమానధర్మవంతులై ఉండగా ప్రకృతిసంగం ఒకనికి గుణం మరొకనికి దోషం అని కల్పించడం అనుచితం అప్రమాణికం కూడ.

ఈశ్వరునికి శుద్ధప్రకృతిసంగం గుణం,జీవున కైతే అశుద్ధప్రకృతిసంగం దోషం అనడం కూడ యుక్తం కాదు; ముక్తుడైన జీవుడు ఈశ్వరునితో సమానధర్మాలు కలవాడై ఉంటాడు అని మీరు అంగీకరించారు కదా?అందుచేత ముక్తునికి శుద్ధప్రకృతిసంగం

తప్పక ఉంటుంది కదా–అలాంటప్పుడు ముక్తులచేత ప్రకృతివినిర్ముక్త మైన ఆత్మస్వరూపం ప్రాప్యం ఎలా అవుతుంది? అది కాదు; అశుద్ధప్రకృతివినిర్ముక్త మైన, శుద్ధప్రకృతిసంసృష్ట మైన ఆత్మరూపం ప్రాప్య అంటాం అనడం కూడ యుక్తం కాదు. అట్లయితే ఆత్మస్వరూపం, నిత్యసిద్ధమే గాన, అది అప్రాప్యం గాన, పొందవలసినది శుద్ధప్రకృతినే, అందుచేత ప్రాప్య మని తెలుసుకొనవలసినది ప్రకృతియే కాని ఆత్మస్వరూపం కాదు. అప్పుడు "అక్షరం బ్రహ్మ పరమమ్" అన్నదానికి "పరమము, శుద్ధము అయిన ప్రకృతి బ్రహ్మ" అని అర్థంచెల్పాలి కాని "ప్రకృతివినిర్ముక్తమైన ఆత్మరూపమైన బ్రహ్మ" అని చెప్పకూడదు. సరే; అలాగే చెపుతాం అనడం కుదరదు; స్వభావశబ్దం శుద్ధాశుద్ధప్రకృలను రెండింటినీ సమంగానే బోధిస్తున్న ప్పుడు అశుద్ధప్రకృతిబోధకం అనడానికి కారణం లేదు. "అక్షరం బ్రహ్మ పరమమ్" అనే దానిచేత శుద్ధప్రకృతి చెప్పబడింది గాన ఇక పరిశేషన్యాయంచేత, స్వభావశబ్దం అశుద్ధ ప్రకృతినే బోధిస్తుంది అనడానికి కూడ వీలులేదు; ఈశ్వరుడు కేవలం శుద్ధప్రకృతితో కూడి ఉంటాడు అని అంటే అశుద్ధప్రకృతి ఈశ్వరునికి సంబంధించినది కాదు అని చెప్పి నట్లువుతుంది; అప్పుడు సమస్తమూ కూడ ఈశ్వరునికి శరీరమే అను నీ మతానికి భంగం వాటిల్లుతుంది.

భూతసూక్ష్మాదులు జీవప్రకృతికార్యా లైతే జీవుడే జగత్తును సృష్టించినవా డవుతాడు; ఈశ్వరప్రకృతికార్యా లైతే జీవునికి వాటితో సంబంధం కుదరదు. వాటితో సంబంధం ఈశ్వరునికే ఉంటుంది గాన వాటిని విడిపించుకొనడంకోసం ఈశ్వరుడు కూడ మరొక ఈశ్వరుణ్ణి సేవించవలసి వస్తుంది. సర్వజగత్తుయొక్క సృష్ట్యాదులకు హేతు వైన ప్రకృతి ఒక్కటే గాన రెండు ప్రకృతులను, కల్పించడం అయుక్తం. జీవులు అనేకుల గాన అనేకమైన అశుద్ధప్రకృతులను కల్పించవలసి వస్తుంది.

మరొక విషయ మేమనగా–"దైవీ హ్యేషా గుణమయీ" అని చెప్పిన విధంగా ఈశ్వరప్రకృతి గుణమయ మైనది గాన దానికి శుద్ధత్వం కూడ కుదరదు. ఈశ్వర సంబంధి యైన ప్రకృతి శుద్ధ మైనది అన్నదానికి అర్థం శుద్ధసత్త్వాత్మకత్వం కదా? త్రిగుణమయప్రకృతి శుద్ధసత్త్వాత్మకం ఎలా అవుతుంది? శుద్ధసత్త్వాత్మక మైన ఈశ్వరప్రకృతినుండి తామసా లైన పృథివ్యాదిభూతాలు ఎలా పుడతాయి? జీవునకు మహాభూతస్రష్టృత్వం కుదరదు. అప్పుడు "ఆత్మన ఆకాశః సంభూతః" అను శ్రుతికి విరోధం కలుగుతుంది. "యతో వా ఇమాని భూతాని జాయన్తే" అను మరొక శ్రుతితో అన్వయించి అర్థం చెప్పగా ఇక్కడ ఆత్మశబ్దం పరమాత్మవాచకమే కాని జీవాత్మపరం కాదు. అందువల్ల గుణమయ మైన ప్రకృతి ఒక్కటే, అదే జగత్తును సృజించినది; దానిచేతనే భూతాలు మోహం చెంది ఉన్నాయి.

ఈశ్వరునికే శుద్ధప్రకృతి అనీ అశుద్ధ ప్రకృతి అనీ రెండు ప్రకృతు లున్నాయి; వాటిలో అశుద్ధప్రకృతిచేత జగత్సృష్ట్యాదికం చేస్తాడు, ఈశ్వరుని దివ్యమంగలమూర్తి శుద్ధప్రకృతి అని

అనడం కూడ యుక్తం కాదు. ఈశ్వరనిగ్రహం అప్రాకృతం అని చెప్పబడింది కదా? అప్రాకృతత్వం అనగా అశుద్ధప్రకృతికార్యం కాకపోవడమే అనడం యుక్తం కాదు;అలా కల్పించడానికి ప్రమాణం ఏమీ లేదు. జీవుడుగా ఉన్న ఈశ్వరప్రకృతి ఒకటి,భూమ్యాదులకు ఉపాదన మైన ప్రకృతి మరొకటి అని ఇక్కడనే చెప్పబడి ఉన్నప్పుడు తృతీయప్రకృతిని కల్పించడంలో ప్రమాణం లేదు, ఇది దీనికి విరుద్ధం కూడ. "అప్రాణో హ్యమనాః శుభ్రః" ఇత్యాదికంచేత ఈశ్వరునికి శరీరం నిషేధించబడింది గాన ఈశ్వరునికి విగ్రహం లేదు;సచ్చిదానందమయ మైన ఈశ్వరస్వరూపం తప్ప సమస్తమూ ప్రాకృతమే. అప్రాకృత మైనది అదొక్కటే. అందుచేత ఈశ్వరుని దివ్యమంగలమూ అప్రాకృతమూ అయిన స్వరూపం సచ్చిదానందమయం ఒక్కటే తప్ప మరొకటి లేదు.

వైకుంఠాదులలో విష్ణ్వాదిదేహసంఘాతం ఏదైతే ఉందో అది మాయామయమే; ఎందువల్ల ననగా–అది దృశ్యము,జడమూ కూడ. ఆ మూర్తిని ఉపాసించినవారికి దానితో సమానమైన దేహం మాత్రమే లభిస్తుంది కాని ముక్తి లభించదు. ముక్తి అనగా అశరీరత్వమే (శరీరం లేకపోవడమే). లింగశరీరభంగమే కదా మోక్షం?

ముముక్షువులు రేతోవిసర్జనరూప మైన కర్మ తెలుసుకోవాలి అని ఏదైతే చెప్పబడిందో అది విద్వాంసులకు శ్రవణానందకరంగా ఉంది!ఎందువల్ల ననగా క్రిమి-కీట - పక్షి-పశ్వాదులకు సహజంగా తెలిసిన మైథున మనే విషయాన్ని ముముక్షువులు కూడ తెలుసుకోవాలని చెప్పబడింది కదా! "జరామరణమోక్షాయ మామాశ్రిత్య యతన్తి యే,తే బ్రహ్మ తద్విదుః కృత్స్నమధ్యాత్మం కర్మ చాఖిలమ్"అని బ్రహ్మజ్ఞానం వలె మైథునకర్మజ్ఞానం కూడ భగవద్భక్తులకే, ఇతరులకు కాదు అని శ్రీకృష్ణుని ఆశయాన్ని వర్ణించిన నీ పాండిత్యం, ఆహా ఎంత అద్భుత మైనది!....

రేతో విసర్జనమే భూతభావోద్భవకరం అనడం కూడ యుక్తం కాదు. జరాయుజాలు, అండజాలు,స్వేదజాలు,ఉద్భిజ్జాలు అను నాలుగు విధాలైన ప్రాణులలో జరాయుజాండజాలు రేతోజములైనా స్వేదజోద్భిజ్జాలు రేతోజాలు కావు కదా? అట్లే "అత్ర దేహే"అని ప్రత్యక్షంగా కనబడుతూన్న అర్జునాదిదేహాలను బోధించే 'అత్ర'అను శబ్దం ఇంద్రాదులను బోధించడం కూడ అయుక్తం. ఇంద్రాదిదేహాలు పరోక్షములు కదా? ఈశ్వరుడు ఇంద్రాదిదేహాలలో వలె అర్జునాదిదేహాలలో కూడ ఉన్నాడు గాన, వాటిని పరిత్యజించడంలో కారణం లేదు.

'అధిదైవత'శబ్దానికి 'అతిదైవత'శబ్దానికి వలె దేవలపైన అను అర్థం చెప్పడం కూడ అయుక్తమే. 'అధియజ్ఞః, శబ్దానికి 'యజ్ఞారాధ్యుడు'అను అర్థం చెప్పడం కూడ అయుక్తమే. అధిశబ్దానికి పైన అను అర్థం కాని,ఆరాధ్యము అను అర్థం కాని లేదు. "ఆర్తో జిజ్ఞాసురర్థార్థీ జ్ఞానీ చ భరతర్షభ,చతుర్విధా భజన్తే మామ్"భగవంతుని సేవలో నలుగురు

అధికారు లుంటూండగా "త్రయాణామ్"అనడం లోపమే అని వెనుకనే చెప్పబడింది (భా.అ.ప్ర. పే.63-64) 4

మూ. అన్తకాలే చ మామేవ స్మరన్ముక్త్వా కలేబరమ్
యః ప్రయాతి స మద్భావం యాతి నాస్త్యత్ర సంశయః. 5

ప్ర.అ. అన్తేతి:- యః = ఎవడు,అన్తకాలే చ=మరణకాలమునందు కూడ,మామేవ = నన్నే,స్మరన్=స్మరిస్తూ,కలేబరమ్=శరీరాన్ని,త్యక్త్వా=విడచి,ప్రయాతి=మరణిస్తాడో,సః =అతడు,మద్భావమ్=నా స్వరూపమును, యాతి=పొందుతాడు.అత్ర=ఈ విషయము నందు,సంశయః=సంశయం,నాస్తి=లేదు.

భాష్యమ్

అన్తకాలే ఇతి:- అన్తకాలే చ మరణకాలే,మామేవ పరమేశ్వరం విష్ణుం,స్మరన్, ముక్త్వా పరిత్యజ్య,కలేబరం శరీరం,యః,ప్రయాతి గచ్ఛతి,సః మద్భావం వైష్ణవం తత్త్వం,యాతి;నాస్తి న విద్యతే,అత్ర అస్మిన్ అర్థే,సంశయః యాతి వా న వా ఇతి.5

బాలానందిని

అన్తేతి:- మరణకాలంలో కూడ విష్ణువు నైన,పరమేశ్వరుడ నైన,నన్నే స్మరిస్తూ ఎవడు శరీరం విడచి మరణిస్తాడో అతడు వైష్ణవతత్త్వాన్ని(పరమాత్మస్వరూపాన్ని) పొందుతాడు. ఈ విషయంలో పొందుతాడా పొందడా,అని సంశయం లేదు. 5

భాష్యమ్

న మద్విషయః ఏవ అయం నియమః;కిం తర్హి?-

మూ. యం యం వాపి స్మరన్ భావం త్యజత్యన్తే కలేబరమ్,
తం తమేవైతి కౌన్తేయ సదా తద్భావభావితః. 6

బాలానందిని

...నేతి:- ఈ నియమం నా విషయంలోనే కాదు;మరేమనగా-

ప్ర.అ.నేతి:- కౌన్తేయ=అర్జునా!యః=ఎవడు;సదా=ఎల్లప్పుడూ;తద్భావభావితః=ఆ దేవతాదులకు సంబంధించిన భావంచేత వాసితమైన చిత్తం కలవాడై, అన్తే=మరణ సమయమునందు,యం యం వాపి=ఏ ఏ,భావమ్=దేవతావిశేషాన్ని,స్మరన్=స్మరిస్తూ, కలేబరమ్=శరీరాన్ని,త్యజతి=విడుస్తాడో, అతడు,తం తమేవ=ఆ దేవతావిశేషాన్నే,ఏతి= పొందుతాడు.

భాష్యమ్

యం యమితి:- యం యం వాపి యం యం,భావం దేవతావిశేషం,స్మరన్ చిన్తయన్,త్యజతి పరిత్యజతి,అన్తే ప్రాణవియోగకాలే,కలేబరం శరీరమ్,తం తమేవ స్మృతం భావమ్ ఉపైతి నాన్యం,కౌన్తేయ!సదా సర్వదా,తద్భావభావితః-తస్మిన్ భావః తద్భావః,స భావితః స్మర్యమాణతయా అభ్యస్తః యేన సః తద్భావభావితః సన్. 6

బాలానందిని

యమితి:- అర్జునా!ప్రాణవియోగకాలంలో ఏ యే దేవతావిశేషాన్ని గూర్చి ఆలోచిస్తూ శరీరం విడిచిపెడతాడో స్మరించబడిన దానినే,పొందుతాడు.మరొకదానిని పొందడు. ఎల్లప్పుడు భావనచేయబడిన,అభ్యసించబడిన ఆ దేవతావిశేషమునందు ఉన్న భావం కలవాడైనవాడు. 6

భాష్యమ్

యస్మాత్ ఏవమ్ అన్త్యా భావనా దేహాన్తరప్రాప్తౌ కారణమ్-

మూ. తస్మాత్సర్వేషు కాలేషు మామనుస్మర యుధ్య చ,
మయ్యర్పితమనోబుద్ధిర్మామేవైష్యస్యసంశయః. 7

బాలానందిని

యస్మాదితి:- ఏ కారణంవల్ల చివరి భావన ఈ విధంగా దేహాంతరప్రాప్తికి కారణమో-

ప్ర.అ. తస్మాదితి:- తస్మాత్=ఆ కారణంవల్ల,సర్వేషు=సమస్త మైన,కాలేషు=కాలములయందు,మామ్=నన్ను,అనుస్మర=స్మరించుము. యుధ్య చ=యుద్ధము చేయుము కూడ.మయి=నాయందే,అర్పితమనోబుద్ధిః=అర్పించబడిన మనస్సూ బుద్ధీ కలవాడవై, మామేవ=నన్నే,ఏష్యసి=పొందగలవు;అసంశయః=సంశయం లేదు.

భాష్యమ్

తస్మాత్ సర్వేషు కాలేషు మామ్ అనుస్మర,యథాశాస్త్రం యుధ్య చ యుద్ధం చ స్వధర్మం కురు. మయి వాసుదేవే అర్పితే మనోబుద్ధీ యస్య తవ సః త్వం మయి అర్పితమనోబుద్ధిః సన్ మామేవ యథాస్మృతమ్,ఏష్యసి ఆగమిష్యసి, అసంశయః న సంశయః అత్ర విద్యతే. 7

బాలానందిని

తస్మాదితి:- అందువలన సమస్తకాలాలలోను నన్ను స్మరించుము;శాస్త్రానుసారంగా స్వధర్మమైన యుద్ధం కూడ చేయుము.వాసుదేవుడ నైన నాయందే మనోబుద్ధులను అర్పించి,ఏ విధంగా స్మరిస్తున్నావో అదే రూపంలో నన్ను పొందుతావు.దీని విషయంలో సంశయం లేదు. 7

భాష్యమ్

కించ-

మూ. అభ్యాసయోగయుక్తేన చేతసా నాన్యగామినా
పరమం పురుషం దివ్యం యాతి పార్థానుచిన్తయన్. 8

బాలానందిని

కిం చేతి:- మరియు

ప్ర.అ. **అభ్యాసేతి**:- పార్థ=అర్జునా!అభ్యాసయోగయుక్తేన=అభ్యాస మనే యోగంతో పనిచేస్తూన్న,నాన్యగామినా=మరియొక విషయాన్ని పొందని,చేతసా=చిత్తముతో,చిన్తయన్ = చింతిస్తూ, దివ్యమ్=దివ్య డైన, పరమం పురుషమ్= పరమపురుషుణ్ణి,యాతి= పొందును.

భాష్యమ్

అభ్యాసేతి:- అభ్యాసయోగయుక్తేన మయి చిత్తసమర్పణావిషయభూతే ఏకస్మిన్ తుల్యప్రత్యయావృత్తిలక్షణః విలక్షణప్రత్యయానన్తరితః అభ్యాసః,స చ అభ్యాసః యోగః, తేన యుక్తం తత్రైవ వ్యాపృతం యోగినః చేతః,తేన చేతసా నాన్యగామినా-న అన్యత్ర విషయాన్తరే గన్తుం శీలం అస్య ఇతి నాన్యగామి,తేన నాన్యగామినా,పరమం నిరతిశయం, పురుషం దివ్యం,దివి సూర్యమణ్డలే భవం,యాతి గచ్ఛతి,హే పార్థ! అనుచిన్తయన్,శాస్త్రాచార్యోపదేశమ్ అనుధ్యాయన్ ఇత్యేతత్. 8

బాలానందిని

అభ్యాసేతి:- ఓ అర్జునా! అభ్యాసయోగయుక్తేన-చిత్తమును ఉంచుటకు విషయ మైన నా ఒక్కనియందే సమానమైన (ఒకే విధమైన)జ్ఞానమును;ఇతరజ్ఞానముల అడ్డు ఏదీ లేకుండా, (ఒకే జ్ఞానాన్ని) ఆవృత్తిచేయడం అభ్యాసం.ఆ అభ్యాసమే యోగం.దానితో కూడిన,దాని యందే వ్యాపృతమైన(నిలకడగా పనిచేయుచున్న)యోగియొక్క చిత్తంచేత, మరొక విషయాన్ని దేనినీ గూర్చి వెళ్లని చిత్తంచేత,పరముడైన నిరతిశయు డైన(అంతకంటె మించిన వాడు లేని) దివ్యుడైన అనగా ద్యులోకములోని సూర్యమండలములో ఉన్న, పురుషుణ్ణి

పొందుతాడు. అనుచింతిస్తూ అనగా శాస్త్రమును ఆచార్యోపదేశమును అనుసరించి ధ్యానిస్తూ అని అర్థం. 8

భాష్యమ్

కింవిశిష్టం చ పురుషం యాతీతి ఉచ్యతే-

మూ. కవిం పురాణమనుశాసితార
మణోరణీయాంసమనుస్మరేద్యః,
సర్వస్య ధాతారమచిన్త్యరూప
మాదిత్యవర్ణం తమసః పరస్తాత్. 9

బాలానందిని

కిమితి:- ఎట్టి గుణాలతో కూడిన పురుషుణ్ణి చేరుతాడో చెప్పబడుచున్నది -

ప్ర.అ. కవిమితి :- యః - ఎవడు; కవిమ్ = కవీ, పురాణమ్ = ప్రాచీనుడు, అనుశాసితారమ్ = శాసించేవాడు, అణోః=అణువుకంటె, అణీయాంసమ్ = చిన్నవాడు, అయిన పురుషుణ్ణి; అనుస్మరేత్ = స్మరిస్తాడో, సర్వస్య = సమస్తమునకు, ధాతారమ్= ఉంచేవాడు, అచిన్త్యరూపమ్=ఊహింప శక్యం కాని రూపం గలవాడు, ఆదిత్యవర్ణమ్= ఆదిత్యుని వంటి వర్ణం కలవాడు, తమసః = తమసుకంటె, పరస్తాత్=అవతల (దూరంగా) ఉన్నవాడు అయిన పురుషుణ్ణి చింతిస్తూ వానిని పొందుతాడు.

భాష్యమ్

కవిం క్రాన్తదర్శినం సర్వజ్ఞం,పురాణం చిరన్తనమ్,అనుశాసితారం సర్వస్య జగతః ప్రశాసితారమ్,అణోః సూక్ష్మాత్ అపి,అణీయాంసం సూక్ష్మతరమ్,అనుస్మరేత్ అను చిన్తయేత్,యః కశ్చిత్ సర్వస్య కర్మఫలజాతస్య ధాతారం విచిత్రతయా ప్రాణిభ్యః విభక్తారం, విభజ్య ధాతారమ్,అచిన్త్యరూపం,న అస్య రూపం నియతం విద్యమానమపి కేన చిత్ చిన్తయితుమ్ శక్యతే ఇతి అచిన్త్యరూపః;తమ్,ఆదిత్యవర్ణమ్ ఆదిత్యస్యేవ నిత్యచైతన్యప్రకాశః వర్ణః యస్య తమ్ ఆదిత్యవర్ణం,తమసః పరస్తాత్ అజ్ఞానలక్షణాత్ మోహాన్ధకారాత్ పరం,తమ్ అనుచిన్తయన్ యాతి ఇతి పూర్వేణైవ సంబన్ధః. 9

బాలానందిని

కవిమితి: కవి అనగా ఇంద్రియాలకు గోచరం కాని భూతభవిష్యద్వర్తమానవిష యాలను తెలుసుకొనేవాడు,సర్వజ్ఞుడు,ప్రాచీనుడు,సమస్తజగత్తును శాసించువాడు,సూక్ష్మ మైనదానికంటె అధికసూక్ష్మ మైనవాడు అయిన పురుషుణ్ణి ఎవడు స్మరిస్తాడో,ప్రాణిసము

దాయానికి విచిత్రమైన కర్మఫలజాతాన్ని విభజించి ఇచ్చేవాడు,ఈతనికి నియతమైన రూపం ఉన్నా కూడ ఎవనిచేతను అది ఊహించడానికి కూడ శక్యం కానిది,అందుచేత అచింత్యరూపుడు,ఆదిత్యుని వంటి వర్ణము కలవాడు అనగా ఆదిత్యుడు ఏ విధంగా నిత్యప్రకాశస్వరూపుడో అట్లే నిత్యచైతన్యప్రకాశరూపుడు,అజ్ఞాన మనే అంధకారానికి అవతల ఉన్నవాడు,అయిన వానిని గూర్చి చింతించుచున్నవాడు ఆతనినే పొందుతాడు అని పూర్వశ్లోకంతో అన్వయం. 9

భాష్యమ్

కిం చ –

మూ. ప్రయాణకాలే మనసాఽచలేన
భక్త్యా యుక్తో యోగబలేన చైవ,
భ్రువోర్మధ్యే ప్రాణమావేశ్య సమ్య
క్స తం పరం పురుష ముపైతి దివ్యమ్. 10

బాలానందిని

కిం చేతి:– మరియు –

ప్ర. అ. ప్రయాణకాలే ఇతి:– ప్రయాణకాలే=మరణకాలమునందు,అచలేన=నిశ్చలమైన,మనసా=మనస్సుతోను,భక్త్యా=భక్తితోను,యోగబలేన చైవ=యోగబలంతోను,యుక్తః = కూడినవాడై,ప్రాణమ్=ప్రాణవాయువును,సమ్యక్=బాగుగా,భ్రువోః మధ్యే=కనుబొమ్మల మధ్యయందు, ఆవేశ్య=ఉంచి,దివ్యమ్=దివ్యుడైన,తం పరం పురుషమ్=ఆ పరమపురుషుణ్ణి, యాతి=పొందును.

భాష్యమ్

ప్రయాణకాలే మరణకాలే,మనసా,అచలేన చలనవర్జితేన,భక్త్యా యుక్తః భజనం భక్తిః తయా యుక్తః,యోగబలేన చైవ–యోగస్య బలం యోగబలమ్,తేన,సమాధిజ సంస్కారప్రచయజనితచిత్తస్థైర్యలక్షణం యోగబలం,తేన చ యుక్తః ఇత్యర్థః;పూర్వం హృదయపుణ్డరీకే వశీకృత్య చిత్తం తతః ఊర్ధ్వగామిన్యా నాడ్యా భూమిజయక్రమేణ భ్రువోః మధ్యే ప్రాణమ్,ఆవేశ్య స్థాపయిత్వా,సమ్యక్ అప్రమత్తః సన్,సః ఏవం బుద్ధిమాన్ యోగీ కవిం పురాణమిత్యాదిలక్షణం తం పరం పురుషమ్ ఉపైతి,ప్రతిపద్యతే,దివ్యం ద్యోతనాత్మకమ్. 10

బాలానందిని

ప్రయాణేతి:-మరణకాలంలో నిశ్చల మైన మనస్సుతోను భక్తితోను కూడినవాడై, సమాధివల్ల కలిగిన సంస్కారాభివృద్ధి(సంస్కారంయొక్క ప్రోగు)చేత కలిగిన చిత్తస్థైర్యరూప మైన యోగబలంతో కూడ కూడినవాడై,ముందుగా చిత్తమును హృదయపుండరీకంలో వశం చేసికొని(కదలకుండా నిలిపి)తరువాత పైకి వెళ్లే నాడిచేత,భూమ్యాదిభూతాలను క్రమంగా జయిస్తూ,కనుబొమ్మల మధ్య ప్రాణాన్ని నిలిపి,ఏమరుపాటు లేనివాడై,బుద్ధిమంతు డైన ఆ యోగి "కవిం పురాణమ్"ఇత్యాదిలక్షణాలు గల,ప్రకాశస్వరూపు డైన,ఆ పురుషుణ్ణి పొందుతాడు.

వి:- హృదయంనుండి బైటకు వచ్చే కుడి-ఎడమలలో ఉన్న ఇడాపింగళానాడులను నిరోధించి,అదే హృదయాగ్రంనుండి ఊర్ధ్వగమనశీల మైన సుషుమ్నానాడిచేత హృదయం లోని ప్రాణాన్ని తీసికొని వచ్చి,కంఠంలో వ్రేలాడుచున్న స్తనం వలె ఉన్న మాంసఖండం దగ్గరికి దానిని చేర్చి,ఆ మార్గం గుండా కనుబొమ్మల మధ్య దానిని నిలిపి,ఆ బ్రహ్మరంధ్రం ద్వారా నిష్క్రమించి పరమపురుషుణ్ణి పొందుతాడు అని అర్థం. భూమికాజయక్రమేణ అన్నప్పుడు భూమ్యాదిపంచభూతాల వశీకరణం అని అర్థం,వాటి చేష్టలను స్వాధీనంలో ఉంచుకొనడం;తద్వారా అని అర్థం(ఆనందగిరివ్యాఖ్య). 10

భాష్యమ్

(యోగమార్గానుగమనేనైవ బ్రహ్మవిద్యామన్తరేణాపి బ్రహ్మ ప్రాప్యతే ఇత్యేవం ప్రాప్తే ఇదముచ్యతే-)పునరపి వక్ష్యమాణేనోపాయేన ప్రతిపిత్సితస్య బ్రహ్మణః వేద విద్వదనాదివిశేషణవిశేష్యస్య అభిధానం కరోతి భగవాన్-

మూ. యదక్షరం వేదవిదో వదన్తి
విశన్తి యద్యతయో వీతరాగాః,
యదిచ్ఛన్తో బ్రహ్మచర్యం చరన్తి
తత్తే పదం సంగ్రహేణ ప్రవక్ష్యే. 11

బాలానందిని

యోగేతి:- బ్రహ్మవిద్య లేకపోయినా యోగమార్గాన్ని అనుసరించడంచేతనే బ్రహ్మను పొందవచ్చును అని ప్రాప్తించగా ఇది చెప్పబడుచున్నది. (బ్రాకెట్లలో ఇచ్చిన "యోగ మార్గానుగమనేన"ఇత్యాదివాక్యం కొన్ని ప్రతులలో లేదు.ఆనందగిరి కూడ వ్యాఖ్యా నించలేదు.రామరాయకవిగారి వ్యాఖ్య ఉన్న పుస్తకంలో మూలంలో ఈ వాక్యం ఉంది కాని.

దీనికి వారు కూడా వ్యాఖ్య వ్రాయలేదు. దీని అన్వయం ఉత్తరవాక్యంతో సరిగా కుదరడంలేదు గాన ఇది ప్రక్షిప్తమే అయి ఉంటుంది).

పునరపీతి:-తెలియకోరబడుచున్న,వేదవిత్తులు చెప్పడం మొదలైన విశేషణాలచేత విశేషితమైన బ్రహ్మను గూర్చి,భగవంతుడు,మళ్ళీ(ముందు)చెప్పనున్న(ఓంకారమనే)ఉపాయంతో చెపుతున్నాడు-

ప్ర.అ. యదితి:-యత్=దేనిని,అక్షరమ్=వినాశరహితమునుగా,వేదవిదః=వేదవేత్తలు,వదన్తి=చెప్పుచున్నారో;వీతరాగాః=తొలగిన రాగం గల,యతయః=యతులు, యత్ = దేనిని,విశన్తి=ప్రవేశిస్తున్నారో,యత్=దేనిని,ఇచ్ఛన్తః=కోరుచు, బ్రహ్మచర్యమ్=బ్రహ్మచర్యమును, చరన్తి=ఆచరించుచున్నారో,తత్=ఆ,పదమ్=స్థానమునుగూర్చి,తే=నీకు,సంగ్రహేణ=సంగ్రహంగా,ప్రవక్ష్యే=చెప్పెదను.

భాష్యమ్

యత్ అక్షరం – న క్షరతి ఇతి అక్షరమ్,అవినాశి,వేదవిదః వేదార్థజ్ఞాః వదన్తి **"తద్వా ఏతదక్షరం గార్గి బ్రాహ్మణా అభివదన్తి"**ఇతి శ్రుతేః. సర్వవిశేషనివర్తకత్వేన అభివదన్తి **"అస్థూలమ్ అనణు"**(బృ.ఉ.3.8.8)ఇత్యాది. కిం చ విశన్తి ప్రవిశన్తి సమ్యగ్దర్శనసంప్రాప్తౌ సత్యాం యత్ యతయః యతనశీలాః సంన్యాసినః,వీతరాగాః – విగతః రాగః యేభ్యః తే వీతరాగాః. యచ్చ అక్షరమ్ ఇచ్ఛన్తః,జ్ఞాతుమ్ ఇతి వాక్యశేషః బ్రహ్మచర్యం గురౌ చరన్తి–తత్ తే పదం,తత్ అక్షరాఖ్యం పదం పదనీయం,తే తుభ్యం, సంగ్రహేణ–సంగ్రహః సంక్షేపః తేన,సంక్షేపేణ,ప్రవక్ష్యే కథయిష్యామి. 11

బాలానందిని

యదితి:-వేదవేత్తలు వేదార్థం తెలిసినవారు,దేనిని అక్షరము,వినాశం లేనిది అని చెపుతున్నారో **"తద్వా...అభివదన్తి"**(ఓ!గార్గీ!అట్టి ఈ బ్రహ్మనే బ్రాహ్మణులు'అక్షరము' అని చెప్పు చున్నారు)అని శ్రుతి చెప్పుచున్నది.'అస్థూలమ్ అనణు"ఇత్యాదికంచేత సమస్త విశేషములను నివర్తింపచేసేదానినిగా(ఏ విశేషమూ లేనిదానినిగా) వర్ణిస్తున్నారో;మరియు వీతరాగులైన,ఎవరినుండి రాగం తొలగిపోయినదో అట్టి, ప్రయత్నశీలులైన యతులు సమ్యగ్దర్శనం(జ్ఞానం) కలగగానే దేనిని ప్రవేశిస్తున్నారో,ఏ అక్షరాన్ని కోరుచు, తెలుసుకొనుటకు,అని వాక్యశేషం(అధ్యాహారం), ఏ అక్షరాన్ని తెలుసుకొనుటకు కోరుచు, గురువునందు (గురువువద్ద)బ్రహ్మచర్యం ఆచరిస్తున్నారో అట్టి అక్షరం అనే పేరు గల,పదమును, ఏది పొందబడుతుందో అది పదం,పొందదగినస్థానమును,నీకు,సంక్షిప్తంగా చెపుతాను. 11

భాష్యమ్

"స యో హ వై తద్భగవన్ మనుష్యేషు ప్రాయణాన్తమోంకారమభిధ్యాయీత కతమం వా వ స తేన లోకం జయతీతి;తస్మై స హోవాచ,ఏతద్వై సత్యకామ పరం చాపరం చ బ్రహ్మ యత్ ఓంకారః"ఇత్యుపక్రమ్య "యః పునరేతం త్రిమాత్రేణోమిత్యేతే నైవాక్షరేణ పరం పురుషమభిధ్యాయీత...స సామభిరున్నీయతే బ్రహ్మలోకమ్"(ప్ర. ఉ. 5. 1. 2. 5)ఇత్యాదినా వచనేన,"అన్యత్ర ధర్మాదన్యత్రాధర్మాత్"ఇతి చ ఉపక్రమ్య "సర్వే వేదా యత్పదమామనన్తి,తపాంసి సర్వాణి చ యద్వదన్తి,యదిచ్ఛన్తో బ్రహ్మచర్యం చరన్తి తత్తే పదం సంగ్రహేణ బ్రవీమ్యోమిత్యేతత్"(క.ఉ.2-14,15)ఇత్యాదిభిశ్చ వచనైః పరస్య బ్రహ్మణః వాచకరూపేణ,ప్రతిమావత్ ప్రతీకరూపేణ వా పరబ్రహ్మప్రతిపత్తి సాధనత్వేన,మన్దమధ్యమ బుద్ధీనాం వివక్షితస్య ఓంకారస్య ఉపాసనం కాలాన్తరే ముక్తి ఫలమ్ ఉక్తం యత్,తదేవ ఇహాపి "కవిం పురాణమనుశాసితారమ్"ఇతి "యదక్షరం వేదవిదో వదన్తి"ఇతి చ ఉపన్యస్తస్య పరస్య బ్రహ్మణః పూర్వోక్తరూపేణ ప్రతిపత్త్యుపాయ భూతస్య ఓంకారస్య కాలాన్తరముక్తిఫలమ్ ఉపాసనం యోగధారణాసహితం వక్తవ్యమ్, ప్రసక్తానుప్రసక్తం చ యత్కించిత్ ఇత్యేమవర్థః ఉత్తరః గ్రన్థః ఆరభ్యతే-

మూ. సర్వద్వారాణి సంయమ్య మనో హృది నిరుధ్య చ,
మూర్ధ్న్యాధాయాత్మనః ప్రాణమాస్థితో యోగధారణామ్. 12

బాలానందిని

స ఇతి:- 'స యోహ...ఓంకారః"(భగవంతుడా!పూజ్యుడా! మనుష్యులలో,ఎవడు మరణించేవరకు ఓంకారాన్ని ధ్యానిస్తాడో అతడు దానిచేత ఏ లోకాన్ని జయిస్తాడు?(ఇది సత్యకాముడు పిప్పలాదుణ్ణి అడిగిన ప్రశ్న)అతడు వానికి ఇట్లు చెప్పాడు-సత్యకామా! ఓంకారం అనేది పరబ్రహ్మ అపరబ్రహ్మ కూడ)అని ఉపక్రమించి"యః పునః...అభిధ్యాయీత...బ్రహ్మలోకమ్"(ఎవడైతే అకార-ఉకార-మకారము లనే మూడు మాత్రలు గల ఈ అక్షరంచేత (ఓంకారంచేత)పరమపురుషుణ్ణి ధ్యానిస్తాడో... అతడు సామలచేత బ్రహ్మలోకం చేర్చబడతాడు)ఇత్యాదికమైన (ప్రశ్నోపనిషద్గతమైన)వచనంచేత,(ఇట్లే కఠోపనిషత్తులో) "అన్యత్ర ధర్మాతన్యత్రాధర్మాత్" (ధర్మంకంటె మరొక చోట అధర్మంకంటె మరొక చోట, అనగా ధర్మాధర్మాలు లేని,ధర్మాధర్మాలకు అతీతమైన)అని ఉపక్రమించి"సర్వే...ఏతత్" (సమస్తవేదాలు ఏ పదాన్ని చెపుచున్నాయో,సమస్త మైన కృచ్ఛ్రచాంద్రాయణాదితపస్సులు దేనిని చెప్పుచున్నాయో దేనిని పొందగోరినవాళ్లు బ్రహ్మచర్యాన్ని ఆచరిస్తున్నారో ఆ పదాన్ని (స్థానాన్ని)సంగ్రహంగా నీకు చెపుతాను;అది ఓమ్ ఇత్యాదివచనాలచేత, మందబుద్ధులకు

మధ్యమబుద్ధులకు పరబ్రహ్మను పొందడానికి సాధనంగా,పరబ్రహ్మవాచకంగాను,ప్రతిమాదుల వలె(విష్ణ్వాదులకు ప్రతీకగా ప్రతిమ ఉన్నట్లు)ప్రతీకరూపంలోను వివక్షితమైన (చెప్పడానికి ఉద్దేశించబడిన)ఓంకారంయొక్క ఉపాసనం కాలాంతరంలో ముక్తిరూప మైన ఫలాన్ని ఇస్తుంది అని చెప్పబడినది. అట్లే ఇక్కడ కూడ "కవిం పురాణమనుశాసితారమ్", "యదక్షరం వేదవిదో వదన్తి"అని చెప్పబడిన పరబ్రహ్మను తెలుసుకొనడానికి ఉపాయంగా చెప్పబడిన ఓంకారంయొక్క ఉపాసనమూ, ఏది కాలాంతరంలో ముక్తిరూప మైన ఫలం ఇస్తుందో అట్టి ఓఅంకారోపాసనమూ,యోగధారణాధికమూ కూడ చెప్పవలసిఉంది. ప్రసక్తానుప్రసక్తంగా మరి కొన్ని విషయాలు కూడ)చెప్పవలసి ఉన్నాయి.అందుకొరకై రాబోయే గ్రంథం('సర్వద్వారాణి'ఇత్యాదిగ్రంథం)ప్రారభించబడుచున్నది.

వి:- పైన ఉదాహరించిన ప్రశ్నోపనిషద్వాక్యాలలోను,కఠోపనిషద్వాక్యాలలోను ఓంకారోపాసనం చెప్పబడింది.ఓంకారం పరబ్రహ్మవాచకం,పరబ్రహ్మప్రతీకమూ కూడ. "బ్రహ్మ"అను పదానికి అర్థం'పరబ్రహ్మ'. ఈ విధంగా 'బ్రహ్మ'శబ్దం పరబ్రహ్మవాచకం.అట్లే "ఓమ్"అనే శబ్దం పరబ్రహ్మను బోధిస్తుంది. ఈ విధంగా ఇది 'పరబ్రహ్మ'యే. దాని ఉపాసన, పరబ్రహ్మ ప్రాప్తి-ఇవి ఉత్తమాధికారులకు చెప్పబడినవి. ప్రతిమమీద విష్ణువును ఆరోపించి అర్చనాదులు చేసినట్లు 'ఓమ్'అనే శబ్దాన్ని బ్రహ్మగా ధ్యానిస్తే అది బ్రహ్మకు ప్రతీకం అవుతుంది. అప్పు డది "అపరబ్రహ్మ". ఈ విధంగా ఓంకారం అర్థరూపంలో పరబ్రహ్మ, శబ్దరూపంలో అపరబ్రహ్మ.దీని ఉపాసన మందాధికారులను, మధ్యమాధికారు లను ఉద్దేశించి విధించబడింది. ఈ ఉపాసన చేసినవాళ్లు కాలాంతరంలో క్రమంగా ముక్తిని పొందుతారు. ఉపనిషత్తులలో ఏ బ్రహ్మ చెప్పబడిందో అదే బ్రహ్మ "కవిం పురాణమ్" ఇత్యాదివాక్యాలలో భగవద్గీతచేత చెప్పబడింది. ఆ బ్రహ్మను తెలుసుకొనడానికి,పొంద డానికి ఏ ఓంకారోపాసన ఉపనిషత్తులలో చెప్పబడిందో అదే ఇక్కడ కూడ చెప్పబడింది. దానికి తగిన సాధనం యోగధారణాదికం.అది రాబోయే గ్రంథంలో చెప్పబడుచున్నది అని అర్థం.

ప్ర.అ. సర్వేతి:- సర్వద్వారాణి=సమస్త ద్వారాలను(ఇంద్రియాలను), సంయమ్య = నిగ్రహించి, మనః చ=మనస్సును కూడ,హృది=హృదయమునందు,నిరుధ్య=నిరోధించి, ఆత్మనః=తనయొక్క,ప్రాణమ్=ప్రాణమును,మూర్ధ్ని=శిరస్సులో,ఆధాయ=ఉంచి,యోగధారణామ్=యోగధారణను,యోగంచేత నిశ్చలచిత్తస్థితిని,ఆస్థితః=అధిష్ఠించినవాడై("స యాతి పరమాం గతిమ్"అని ఉత్తరశ్లోకంతో అన్వయం).

భాష్యమ్

సర్వద్వారాణి-సర్వాణి చ తాని ద్వారాణి చ సర్వద్వారాణి,ఉపలబ్ధౌ-తాని సర్వాణి, సంయమ్య సంయమనం కృత్వా,మనః,హృది హృదయపుణ్డరీకే,నిరుధ్య

నిరోధం కృత్వా, నిష్ప్రచారమ్ ఆపాద్య,తత్ర వశీకృతేన మనసా హృదయాత్ ఊర్ధ్వగామిన్యా నాడ్యా ఊర్ధ్వమ్ ఆరుహ్య,మూర్ధని ఆధాయ ఆత్మనః ప్రాణమ్,అస్థితః ప్రవృత్తః, యోగధారణాం ధారయితుమ్. 12

బాలానందిని

సర్వేతి:-సమస్తమైన ద్వారాలను,జ్ఞానానికి ద్వారా లైన ఇంద్రియాలను అన్నిటినీ, నియమించుకొని,మనస్సును హృదయపద్మంలో నిరోధించి,అనగా సంచారం లేనిదానినిగా చేసి,అక్కడ వశంచేసికొనబడిన మనస్సుతో హృదయంనుండి పైకి వెళ్లే నాడి ద్వారా (సుషుమ్నద్వారా)తన ప్రాణాన్ని శిరస్సుమీద (బ్రహ్మరంధ్రం దగ్గర)నిలిపి,యోగధారణను ధరించడానికి ప్రవర్తించినవాడై-

భాష్యమ్

తత్రైవ చ ధారయన్-

మూ. ఓమిత్యేకాక్షరం బ్రహ్మ వ్యాహరన్ మామనుస్మరన్,
యః ప్రయాతి త్యజన్ దేహం స యాతి పరమాం గతిమ్. 13

బాలానందిని

తత్రైవేతి:- అక్కడనే (శిరస్సునందే)యోగధారణ చేస్తూ-

ప్ర.అ. ఓమితి:- యః ఎవడు,ఓమితి=ఓమ్ అని,ఏకాక్షరమ్=ఏకాక్షరరూప మైన బ్రహ్మ=బ్రహ్మను,వ్యాహరన్=ఉచ్చరిస్తూ,మామ్=నన్ను,అనుస్మరన్=స్మరిస్తూ,దేహమ్=దేహమును,త్యజన్=విడచుచు(విడచి),ప్రయాతి=వెడతాడో,సః=అతడు,పరమామ్=గొప్ప, గతిమ్=గతిని,ప్రయాతి=పొందును.

భాష్యమ్

ఓమితి ఏకాక్షరం బ్రహ్మ,బ్రహ్మణః అభిధానభూతమ్ ఓంకారం, వ్యాహరన్ ఉచ్చారయన్,తదర్థభూతం మామ్ ఈశ్వరమ్ అనుస్మరన్ అనుచిన్తయన్,యః ప్రయాతి, సః త్యజన్ పరిత్యజన్;దేహం శరీరం,"త్యజన్ దేహమ్"ఇతి ప్రయాణవిశేషణార్థం,దేహత్యాగేన ప్రయాణమ్ ఆత్మనః న స్వరూపనాశేన ఇత్యర్థః. స ఏవం త్యజన్ యాతి పరమాం ప్రకృష్టాం,గతిమ్. 14

బాలానందిని

ఓమితి:- 'ఓమ్'అను ఏకాక్షరరూప మైన బ్రహ్మను,బ్రహ్మయొక్క పేరైన ఓంకారాన్ని ఉచ్చరిస్తూ, ఆ ఓంకారముయొక్క అర్థమైన నన్ను చింతిస్తూ ఎవడైతే మరణిస్తాడో, శరీరాన్ని

విడిచిపెడుతూ మరణిస్తాడో, 'త్యజన్ దేహమ్' అనేది ప్రయాణంలోని విశేషాన్ని చెప్పడం కోసం, ఆత్మకు మరణం అనగా దేహత్యాగంచేతనే కాని (దేహత్యాగమే మరణం కాని) స్వరూపనాశనంచేత కాదు అని అర్థం. ఈ విధంగా త్యజించి వెళ్లేవాడు ప్రకృష్టమైన గతిని పొందుతాడు. 13

భాష్యమ్

కిం చ -

మూ. అనన్యచేతాః సతతం యో మాం స్మరతి నిత్యశః,
తస్యాహం సులభః పార్థ నిత్యయుక్తస్య యోగినః. 14

బాలానందిని

కిం చేతి :- మరియు -

ప్ర.అ. **అనన్యేతి :-** పార్థ = అర్జునా! యః = ఎవడు, అనన్యచేతాః = మరొక వస్తువునందు చిత్తము లేనివాడై, నిత్యశః = ఎల్లప్పుడు, సతతమ్ = నిరంతరంగా, మామ్ నన్ను, స్మరతి = స్మరిస్తాడో, తస్య = అట్టి, నిత్యయుక్తస్య = నిత్యము యుక్తుడైన, యోగినః = మనుష్యునకు, అహమ్ = నేను, సులభః = సులభుడను.

భాష్యమ్

అనన్యచేతాః న అనన్యవిషయే చేతః యస్య సః అయమ్ అనన్యచేతాః, యోగీ, సతతమ్ సర్వదా, యః మాం పరమేశ్వరం స్మరతి నిత్యశః, సతతమితి నైరన్తర్యముచ్యతే, నిత్యశః ఇతి దీర్ఘకాలత్వమ్ ఉచ్యతే, న షణ్మాసం సంవత్సరం వా; కిం తర్హి? యావజ్జీవం నైనన్తర్యేణ యః మాం స్మరతి ఇత్యర్థః. తస్య యోగినః, అహం, సులభః, సుఖేన లభ్యః, పార్థ, నిత్యయుక్తస్య సదా సమాహితస్య యోగినః యతః ఏవమ్ అతః అనన్యేచేతాః సన్ మయి సమాహితః భవేత్. 14

బాలానందిని

అనన్యేతి:- పార్థా! ఇతరవిషయమునందు ఎవని మనస్సు ఉండదో అతడు అనన్యచేతస్సు. అట్టి ఏ యోగి, ఎల్లప్పుడూ, పరమేశ్వరుడ నైన నిత్యము - సతతం అనే పదంచేత నైరన్తర్యం అనగా వ్యవధానం విచ్ఛేదం లేకపోవడం చెప్పబడుతుంది. నిత్యశః అని దీర్ఘకాలత్వం చెప్పబడుతుంది. ఆరు మాసాలు కాదు, సంవత్సరం కాదు, మరేమనగా జీవించి ఉన్నంతవరకు నిరంతరమూ నన్ను ఎవడు స్మరిస్తాడో అట్టి నిత్యయుక్తు డైన,

సమాహితు డైన యోగికి నేను సుఖంగా లభిస్తాను. అందువల్ల ఇతరవిషయాలమీద (వేటిమీద) చిత్తం ఉంచక ఎల్లప్పుడు నామీదనే సమాహితుడై ఉండాలి.

భా.అ.ప్ర. "అభ్యాసయోగయుక్తేన" ఇత్యాదికంచేత ఐశ్వర్యం కావాలని కోరిక గలవారు చేసే ఉపాసన, చివరి జ్ఞానంయొక్క పద్ధతీ చెప్పబడ్డాయి. "యదక్షరమ్" ఇత్యాదికంచేత కైవల్యం కోరేవాళ్ల ఉపాసనాప్రకారము, "అనన్యచేతాః" ఇత్యాదికంచేత జ్ఞానుల ఉపాసనాప్రకారమూ చెప్పబడ్డాయి అని శ్రీ రామానుజాచార్యుల వ్యాఖ్య అసంగతం. ఈ ఘట్టంలో "పరమం పురుషం దివ్యం యాతి" అని పరమపురుషప్రాప్తి చెప్పబడుచున్నది; ఐశ్వర్యార్థులకు పరమపురుషప్రాప్తి ఉండదు కదా! ఇక్కడ పరమపురుషప్రాప్తి అనగా పరమపురుషైశ్వర్యప్రాప్తి అనియే అర్థం అనడం యుక్తం కాదు; ముఖ్యార్థాన్ని పరిత్యజించి లాక్షణికార్థాన్ని గ్రహించడం అయుక్తం. ఈ శ్లోకాలు ఐశ్వర్యార్థిని గూర్చి చెపుతున్నాయి అనడానికి ప్రమాణం ఏదీ లేదు. ఉండి ఉంటే ఐశ్వర్యార్థికి పరమపురుషప్రాప్తి కుదరదు గాన, ముఖ్యార్థం కుదరకపోవడంచేత లాక్షణికార్థం గ్రహించడానికి అవకాశం ఉండేది. కాని మూలంలో అలా లేదు.

మరొక విషయ మేమనగా – ఐశ్వర్యార్థికి పునరావృత్తి ఉంటుం దని స్వయంగానే చెప్పనున్నాడు. "దివ్యం మామ్" అని చెప్పడంవల్ల ఈ పరమపురుషుడు విష్ణువే అని నువ్వే చెప్పావు. విష్ణువువల్ల ఐశ్వర్యప్రాప్తి అనగా విష్ణుసారూప్యమే, నాతో సమానమైన ఆకారం కలవా డవుతాడు అని కూడ నువ్వే చెప్పావు. ఈ విధంమైన సారూప్యం విష్ణులోకం చేరినవాళ్లకే కలుగుతుంది; అక్కడ ఉన్నవాళ్లకే శంఖచక్రచతుర్భుజాదులు ఉంటా యని చెప్పబడుచున్నది కదా? ఆ విష్ణులోకం పునరావృత్తి గలది కాదు అనే నీ మతం కదా; అలాంటప్పుడు ఐశ్వర్యార్థులైన విష్ణుభక్తులు సారూప్య పొందిన తరువాత పునరావృత్తి ఎలా ఉంటుంది? నీ మతంలో సాయుజ్యం (పరమాత్మలో కలసి పోవడం) లేదు కదా? ముక్తి అనగా సాలోక్యమేనా కావాలి, సారూప్యమే కావాలి, సామీప్యమేనా కావాలి. సారూప్యం పొందినవాళ్లకు కూడ పునరావృత్తి ఉంటే సాలోక్య – సామీప్యాలు పొందినవాళ్లకు కూడ పునరావృత్తి ఉండనే ఉంటుంది. అప్పుడు 'అపునరావృత్తి' అనే పదమే లేకుండా పోతుంది.

"మాముపేత్య తు కౌన్తేయ" అనేదానికి నా సాయుజ్యాన్ని పొందినవానికి అని అర్థం చెపితే నువ్వు నీ మతం వదులుకొన్న ట్లవుతుంది; పరమతంలో ప్రవేశించిన ట్లవుతుంది. "నా లోకాన్ని పొంది" అని అర్థం చెపితే విష్ణుసారూప్యం పొందిన ఐశ్వర్యార్థులకు పునరావృత్తి ఉండదు కూడ గాన స్వవచనవ్యాఘాతం కలుగుతుంది. ఈ విధంగా ఇది నీకు రెండు వైపులా ఉచ్చు ఉన్న త్రాడై కూర్చుంటుంది. విష్ణులోకం కూడ పునరావృత్తి అన్నట్లయితే "ఆబ్రహ్మభువనాల్లోకాః" అనేది కుదరదు; ఎందువల్ల ననగా బ్రహ్మలోకం పైన ఉన్న

విష్ణులోకం కూడ పునరావర్తి అయినప్పుడు బ్రహ్మలోకం కాకుండా ఎలా ఉంటుంది? అట్లు కాదు - ఐశ్వర్యార్థులు చతుర్ముఖాదిలోకాలకు మాత్రమే వెళ్ళి తిరిగి వస్తారు అని అనడం కూడ యుక్తం కాదు. ఐశ్వర్యార్థు లైనా కూడ విష్ణుసేవకులు విష్ణులోకానికే వెళ్లడం యుక్తం కాని చతుర్ముఖాదిలోకాలకు వెళ్లడం యుక్తం కాదు. నువ్వు కూడ అలాగే చెప్పి ఉన్నావు. అందుచేత విష్ణుభక్తు లైనా కూడ ఐశ్వర్యార్థులు విష్ణులోకం పొందరు; విష్ణుసారూప్యము పొందరు, మరేమనగా మనుష్యలోకమే పొందుతారు, లేదా స్వర్గం పొందుతారు అంతేనే కాని వాళ్లకి పునరావృత్తి లేకపోవడం అనేది లేదు.

వాళ్లు విష్ణులోకైశ్వర్యాన్ని కోరేవారైతే అప్పుడు వాళ్లు విష్ణులోకానికే వెడతారు; తిరిగి రారు. వీళ్ల వైకుంఠైశ్వర్యార్థిత్వం సకామత్వరూప మైనది కాదు; మోక్షార్థిత్వం వలె నిష్కామత్వరూపమే. ఈ విధంగా నిష్కాము లైన మోక్షకాములకు విష్ణులోకప్రాప్తి అపునరావృత్తి ఉచితమే. వీళ్లే కదా కైవల్యార్థు లగా? కైవల్యం అనగా మోక్షం. అంటే నీ మతంలో వైకుంఠప్రాప్తియే. జ్ఞాని కూడ కైవల్యార్థియే గాన వీళ్లిద్దరినీ (ఐశ్వర్యార్థులనూ జ్ఞానులను) వేరు చేయడం ఉచితం కాదు.

కైవల్య మనగా ఆత్మస్వరూపం, అది కైవల్యార్థులచేత పొందబడుతుంది. జ్ఞానిచేత నైతే పరమాత్మ పొందబడతాడు; ఈ విధంగా భేదం ఉన్నది అని చెప్పడం కుదరదు; కైవల్యార్థిచేత పొందబడే ఆత్మస్వరూపం కైవల్యార్థియే అయినప్పుడు ఆత్మకే ప్రాప్తృత్వము, ప్రాప్యత్వమూ రెండు ఎలా కుదురుతాయి? నిత్యసిద్ధ మైన ఆత్మస్వరూపం పురుషార్థం ఎలా అవుతుంది? కేవలాత్మకు పరమాత్మకూ భేదం ఎట్లు? ఆత్మ పరమాత్మలకు భేదం ఉంటే జ్ఞాని మాత్రం పరమాత్మను ఎలా పొందుతాడు? ఆత్మపరమాత్మలు పాలునీళ్లు వలె కలిసిపోతారు అనడం కూడా కుదరదు; రెండూ కూడ నిరయనములే కదా? అవయవాల సంయోగం ద్వారా కదా అవయవులు కలవడం అనేది? జ్ఞానైకస్వరూపులైన ఆత్మపరమాత్మలకు క్షీరనీరాలకు వలె విశేషం కూడా ఏమి లేదు. అలాంటి విశేషం ఏదైనా ఉంటే ఇది ఆత్మ ఇది పరమాత్మ అని వ్యవహారానికి అవకాశం ఉండేది. పాలలో నీరు వలె పరమాత్మలో ఆత్మ లీనమైపోతే అప్పుడు జీవునకు కలిగిన ఈ నిలయనావస్థ, లీనం అయిపోవడం, పురుషార్థం కాజాలరు. వాని స్వరూపమే లీనమై పోయినది కదా?

జీవుడు పరమాత్మలో ప్రవేశించి ఆనందం అనుభవిస్తా డనడం కూడ యుక్తం కాదు; పరిపూర్ణుడు, చైతన్యపు ముద్ద అయిన పరమాత్మలో ప్రవేశించడానికి అవకాశమే దొరకదు. పరమాత్మలో అవకాశం ఉంటుం దని అంటే అప్పుడు అది అపూర్ణం అవుతుంది. దానికి చలనం కూడ ఉంటుంది. ఇదంతా శ్రుతికి గీతాశాస్త్రానికి విరుద్ధం. "పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే" అని, "అచలో$\underline{\ }$యం సనాతనః" అని శాస్త్రం

చెపుతూన్నది. అందుచేత జ్ఞానికీ కైవల్యార్థికీ ఫలాన్ని పట్టి భేదం ఏదీ లేదు; ఎందువల్ల ననగా వాళ్లిద్దరూ పొందవలసినది బ్రహ్మయే కదా? నిత్యమూ పొందబడియే ఉన్న బ్రహ్మకు ప్రాప్యత్వం ఎలా ఉంటుంది అనడానికి వీలు లేదు. హిరణ్యనిధిదృష్టాంతంచేత నిత్యమూ పొందబడినదే అయినా బ్రహ్మ మాయచేత పొందబడనిది వలె ఉండడంచేత దాని జ్ఞానంవల్ల అది పొందబడుతుంది అని చెప్పడం జరుగుతూన్నది.

మరొక విషయ మేమనగా - "ఆ బ్రహ్మభువనాల్లోకాః పునరావర్తినోఽర్జున, మాముపేత్య తు కౌన్తేయ పునర్జన్మ న విద్యతే" అని పునరావృత్తి లేకపోవడం భగవత్ప్రాప్తిలోనే కాని ఆత్మప్రాప్తియందు లేదు. ఆత్మ భగవంతునికంటె భిన్నమైతే భగవంతుణ్ణి పొందినా పునరావృత్తి తప్పదు. "అవ్యక్తోఽక్షర ఇత్యుక్తస్తమాహుః పరమాం గతిమ్" యం ప్రాప్య నివర్తన్తే" అని ఆత్మప్రాప్తిలో కూడ పునరావృత్తి లేదు అనడం కుదరదు. ఇక్కడ అక్షరశబ్దానికి అర్థం పరమాత్మ. "ఏతస్య వా అక్షరస్య ప్రశాసనే గార్గి సూర్యాచన్ద్రమసౌ విధృతౌ తిష్ఠతః" అని శ్రుతి అక్షరశబ్దాన్ని పరమాత్మ అనే అర్థంలోనే ప్రయోగించినది. "యం ప్రాప్య న నివర్తన్తే తద్ధామ పరమం మమ" అను వాక్యశేషాన్ని పట్టి పునరావృత్తి లేకపోవడం విష్ణుధామ విషయంలోనే.

మరియు - శత్రువులచేత అపహకరించబడిన రాజ్యాన్ని రాజు ఏ విధంగా భగవదనుగ్రహాదులచేత మళ్లీ పొందుతాడో అట్లే కామక్రోధాదులచేత అపహరించబడిన ఆత్మస్వరూపాన్ని జీవుడు మళ్లీ భగవదనుగ్రహాదులచేత పొందుతాడు అని నీ అభిప్రాయం. అది కుదరదు. రాజుకంటె వేరుగా రాజ్యం ఉన్నట్లు జీవునికంటె వేరుగా ఆత్మస్వరూపం ఉంటే అలా చెప్పడం కుదురుతుంది. అది లేదు. ఆత్మ కున్న సచ్చిదానందస్వరూపం విడదీయరానిది కదా? సచ్చిదానందంకంటె భిన్నమైన ఆత్మస్వరూపమే లేదు కదా? అందుచేతనే అది స్వరూపం అని చెప్పబడుచున్నది. ఘటానికి స్వరూపం సన్నని మెడ మొదలైనది ఉండడం, ఆ స్వరూపంకంటె వేరుగా ఘటమనేదే లేదు; అట్లే ఇదీని. రాజుకు రాజ్యం స్వరూపం కాదు; రాజుకంటె వేరుగా ఉండేదే. అందువల్ల ఆత్మస్వరూపాన్ని ఎవరూ అపహరించడం అనేది ఉండదు. అప్పుడు అది అనిత్యం అయిపోతుంది. ఏదైనా క్రొత్తగా పొందబడితే అది ఉపాయసాధ్యం గాన అనిత్యమే. కార్యం అనిత్యము అని అందరూ అంగీకరించిన విషయమే కదా?

ప్రకృతితో సంసృష్టమై ఉన్నది ప్రకృతినుండి వియుక్తం అవుతుంది అని కూడ చెప్పడం కుదరదు. అసంగ మైనది ప్రకృతితో సంసృష్టం అవడమే ఉండదు. "అసంగో హ్యయం పురుషః" అని శ్రుతి చెప్పుచున్నది. "నిత్యః సర్వగతః స్థాణురచలోఽయం సనాతనః" అని గీత చెప్పుచున్నది.

సగుణముక్తి, నిర్గుణముక్తి అని రెండు విధాలైన ముక్తియే శారీరకశాస్త్రంలో చెప్పబడింది. నిర్గుణమూర్తి అనగా బ్రహ్మసాయుజ్యం. సత్యలోకప్రాప్తి సగుణముక్తి. ఇలా ఉండగా నువ్వు అక్షరప్రాప్తి అంటూ మూడవముక్తి కల్పిస్తున్నావు. అది శాస్త్రవిరుద్ధం. మరొక విషయం - అక్షరాన్ని పొందిన ఈ జీవులు ప్రకృతినుండి విడిపోయి పరమాత్మను పొందక ఎలా ఉండకలుగుతారు? అందరికీ ఆధార మైన పరమాత్మ పూర్ణుడు కదా? ఆకాశాన్ని పొందకుండా ఘటం ఉండకూడదు కదా? వీళ్లు పరమాత్మయందే ఉంటే అప్పుడు పరమాత్మ పొందబడియే ఉన్నాడు గాన జ్ఞానికీ కైవల్యార్థికీ భేదం ఏమిటి? జ్ఞానికి కూడ వైకుంఠప్రాప్తియే అయితే అప్పుడు ఐశ్వర్యార్థి - కైవల్యార్థులు ఒకటే అయి పోయారు గాన శ్రీ రామానుజులు చేసిన అధికారిత్రయకల్పన అనుచితం (భా.అ.ప్ర.పే. 79-80) 14.

భాష్యమ్

తవ సౌలభ్యేన కిం స్యాత్ ఇతి? ఉచ్యతే శృణు తత్ మమ సౌలభ్యేన యద్ భవతి -

మూ. మాముపేత్య పునర్జన్మ దుఃఖాలయమశాశ్వతమ్,
నాప్నువన్తి మహాత్మానః సంసిద్ధిం పరమాం గతాః. 15

బాలానందిని

తవేతి :- నీ సౌలభ్యంచేత ఏమి కలుగుతుంది? నా సౌలభ్యంచేత ఏమి కలుగుతందో చెపుతున్నాను, విను -

ప్ర.అ. మామితి :- పరమామ్ = గొప్పదైన, సంసిద్ధిమ్ = సిద్ధిని, గతాః = పొందిన, మహాత్మానః = మహాత్ములు, మామ్ = నన్ను, ఉపేత్య = పొంది, దుఃఖాలయమ్ = దుఖానికి నిలయము, అశాశ్వతమ్ = శాశ్వతం కానిదీ అయిన, జన్మ = జన్మను, పునః = మరల, న ఆప్నువన్తి = పొందరు.

భాష్యమ్

మామ్ ఉపేత్య, మామ్ ఈశ్వరమ్ ఉపేత్య, మద్భావమాపద్య, పునః జన్మ పునః ఉత్పత్తిం న ప్రాప్నువన్తి. కిం విశిష్టం పునర్జన్మ న ప్రాప్నువన్తి ఇతి తద్విశేషణమాహ - దుఃఖాలయం - దుఃఖానామ్ ఆధ్యాత్మికాదీనామ్ ఆలయమ్ ఆశ్రయమ్, ఆలీయన్తే యస్మిన్ దుఃఖానీతి దుఃఖాలయం జన్మ న కేవలం దుఃఖాలయమ్, అశాశ్వతమ్ అనవస్థితస్వరూపం చ న ఆప్నువన్తి ఈదృశం పునః జన్మ మహాత్మానః యతయః సంసిద్ధిం మోక్షాఖ్యాం పరమాం ప్రకృష్టాం, గతాః ప్రాప్తాః యే పునః మాం న ప్రాప్నువన్తి తే పునః ఆవర్తన్తే. 15

బాలానందిని

మామితి :- ఈశ్వరుడ నైన నన్ను పొంది, మత్స్వరూపాన్ని పొంది (నేనుగా అయి) మళ్లీ పుట్టుకను పొందరు. ఎలాంటి పునర్జన్మను పొందరో దానిలోని విశేషం చెపుతున్నాడు - ఆలయం అనగా దేనియందు దుఃఖాలు అణగి ఉంటాయో అది. ఆధ్యాత్మికం మొదలైన సమస్తదుఃఖాలకు ఆలయం, ఆశ్రయం అయిన, కేవలం దుఃఖాలయమే కాదు. అశాశ్వత మైనది; స్థిరంగా ఉండని రూపం గలది; అట్టి ఇలాంటి పునర్జన్మను, మోక్ష మనే ప్రకృష్టమైన సిద్ధి పొందిన మహాత్ములైన యతులు పొందరు. నన్ను పొందిన వారు మరల తిరిగి రారు.

భా. అ. ప్ర. ఈ శ్లోకం సాయుజ్యాన్ని (పరమాత్మతో కలిసిపోవడాన్ని స్పష్టంగా బోధిస్తూన్నది అందుచేత ఇది సాయుజ్యం లేదనే వాళ్లకు కంఠపాశం లాగ తగుల్కొంటుంది. "మాముపేత్య" అనుదానికి నా సాలోక్యాన్ని గాని నా సామీప్యాన్ని గాని నా సారూప్యాన్ని గాని అని అర్థం అని చెప్పడం కుదరదు. ముఖ్యార్థాన్ని విడచి లాక్షణికార్థం చెప్పడంలో కారణం కాని, ప్రమాణం కాని లేదు. 'రాజును పొంది; ఇత్యాదులలో వలె ఇక్కడ కూడ సంనిధి పొంది అనేదే ముఖ్యార్థం అనడం కుదరదు. అక్కడ రాజుతో ఐక్యం కుదరదు గాన "రాజసంనిధిని పొంది" అని అర్థం చెప్పుకొన్నా ఇక్కడ ముఖ్యార్థానికి బాధ లేదు గాన 'సంనిధి' అని అర్థాన్ని కల్పించడం యుక్తం కాదు. "కాన్తాం ప్రాప్య'' (కాంతను పొంది) ఇత్యాదులలో వలె ఇక్కడ కూడ జీవేశ్వరుల సంయోగం అర్థం అనడం కూడ కుదరదు. అవయవా లున్న రెండు ద్రవ్యాలకు సంయోగం కుదిరినా అవయవాలు లేనివాటికి సంయోగం కుదరదు. జీవేశ్వరులకు అవయవాలు లేవు అని అందరూ అంగీకరించిన విషయం. అందుచేతనే ఈశ్వరుడు చిత్తులతో (జీవులతో) కూడడం కుదరదు గాన చిదచిద్వి శిష్టుడు ఈశ్వరుడు అను వాదం కూడ అత్యంతము అయుక్త మైనది. సశరీరుడైన జీవుడు, లక్ష్మి వలె, అనంతుడు వలె, సశరీరు డైన ఈశ్వరుణ్ణి సంశ్లేషించుకొని ఉంటాడు అనడం యుక్తం కాదు. ఉపాధుల ద్వారా ఏర్పడిన సంశ్లేషం ఎల్లప్పుడూ అనిత్యమే. విశ్లేషం కూడ సంభవమే కదా? అప్పుడు మాముపేత్య న పునః ఆవర్తతే" అని చెప్పడం కుదరదు. లక్ష్మి కూడ విష్ణువును విడచి క్షీరసముద్రంలో మళ్లీ పుట్టినది కదా? సశీరులైన ముక్త జీవులు అసంఖ్యాకులు. అలాంటి జీవు లందరికీ పరిచ్ఛిన్నమైన విష్ణు శరీరంతో సంశ్లేషం అసంభవం. గరుత్మంతుడు, విష్వక్సేనుడు మొదలైనవాళ్లు విడిగానే ఉంటున్నారు కదా? ఈ విధమైన సశరీరేశ్వరుడే రామకృష్ణాదిరూపాలలో పునరావృత్తి పొందుతూండగా ఆ ఈశ్వరుని భక్తులకు పునరావృత్తి కైముతికన్యాయసిద్ధం (ఇంక వాళ్ల మాట చెప్పాలా). అందువల్ల ఈశ్వరునికి శరీరం లేదు. ఎవరితోనూ విశిష్టుడు (కలసినవాడు) కాదు. అవిద్యచేత సశరీరుడైనా కూడ జీవుడు విద్యచేత శరీరబంధంనుండి నిర్ముక్తుడై ఈశ్వరత్వాన్ని అశరీరత్వాన్ని, మోక్షాన్ని పొందుతాడు; తిరిగి రాడు అని నిర్ణీతవిషయం (భా.అ.ప్ర.పే. 81)

భాష్యమ్

కిం పునః త్వత్తః అన్యత్ ప్రాప్తాః పునః ఆవర్తన్తే ఇతి? ఉచ్యతే -

మూ. ఆబ్రహ్మభువనాల్లోకాః పునరావర్తినోఽర్జున,
మాముపేత్య తు కౌన్తేయ పునర్జన్మ న విద్యతే. 16

బాలానందిని

కిమితి :- అయితే - నిన్ను తప్ప మరొకదానిని పొందినవాళ్లు తిరిగి వస్తారా? చెప్పబడుచున్నది -

ప్ర.అ. ఆ బ్రహ్మేతి :- కౌన్తేయ = కుంతీపుత్రుడవైన, అర్జున = అర్జునా! ఆ బ్రహ్మభువనాత్ = బ్రహ్మలోకం వరకు, లోకాః = లోకములు, పునరావర్తినః = తిరిగి వచ్చేవే. తు = కాని. మామ్ = నన్ను, ఉపేత్య = పొది, పునః మరల, జన్మ = జన్మ, న విద్యతే = లేదు.

భాష్యమ్

ఆ బ్రహ్మేతి :- ఆ బ్రహ్మభువనాత్ - భవన్తి అస్మిన్ భూతాని ఇతి భువనమ్, బ్రహ్మణః భువనం బ్రహ్మభువనమ్. బ్రహ్మలోకః ఇత్యర్థః. ఆ బ్రహ్మభువనాత్ సహ బ్రహ్మ భువనేన, లోకాః సర్వే పునరావర్తినః పునరావర్తనస్వభావాః హే అర్జున! మామ్ ఏకమ్ ఉపేత్య తు, కౌన్తేయ! పునః జన్మ పునః ఉత్పత్తిః, న విద్యతే. 16

బాలానందిని

ఆ బ్రహ్మేతి :- అర్జునా! దేనియందు భూతాలు (ప్రాణులు) నివసిస్తారో అది భువనం. బ్రహ్మభువనం అనగా బ్రహ్మలోకం. బ్రహ్మలోకంతో సహా అన్ని లోకాలు తిరిగి వచ్చే స్వభావం గలవి. ఓ! కాన్తేయా! నన్ను పొందినట్లయితే మాత్రం మళ్లీ పుట్టుక ఉండదు. 16

భాష్యమ్

బ్రహ్మలోకసహితాః లోకాః కస్మాత్ పునరావర్తినః? కాలపరిచ్ఛిన్నత్వాత్; కథమ్?

మూ. సహస్రయుగపర్యన్తమహర్యద్బ్రహ్మణో విదుః
రాత్రిం యుగసహస్రాన్తాం తేఽహోరాత్రవిదో జనాః. 17

బాలానందిని

బ్రహ్మేతి :- బ్రహ్మలోకసహితము లైన లోకా లన్నీ ఎందువల్ల పునరావర్తనం కలవి? అవి కాలంచేత పరిచ్ఛిన్నములు (కొలవబడినవి) గాన; అదెట్లు?

ప్ర.అ. సహస్రేతి :- అహోరాత్రవిదః (బ్రహ్మయొక్క) అహోరాత్రాలను గూర్చి ఎరిగిన, తే = ఆ, జనాః = జనులు, యత్ = ఏ కారణంవల్ల, బ్రహ్మణః = బ్రాహ్మదేవుని యొక్క, అహః = పగటిని, సహస్రయుగపర్యన్తమ్ = వెయ్యి యుగాలు అంతంగా కలదానిని గాను, రాత్రిమ్ = రాత్రిని, యుగసహస్రాన్తామ్ = వేయి యుగాల అంతం కలదానిని గాను, విదుః = తెలుసుకొనుచున్నారో.

భాష్యమ్

సహస్రేతి :- సహస్రయుగపర్యన్తం - సహస్రం యుగాని పర్యన్తః పర్యవసానం యస్య అహ్నః తత్ అహః సహస్రయుగపర్యన్తం, బ్రహ్మణః ప్రజాపతేః విరాజః, విదుఃరాత్రిమపి యుగసహస్రాన్తామ్ అహఃపరిమాణామేవ, కే విదుః ఇత్యాహ - అహోరాత్రవిదః కాలసంఖ్యావిదః జనాః ఇత్యర్థః.యతః ఏవం కాలపరిచ్ఛిన్నాః తే అతః పునరావర్తినః లోకాః. 17

బాలానందిని

సహస్రేతి :- సహస్రయుగాలు పర్యంతం, అనగా అవసానం, దేనికో అది సహస్రయుగపర్యంతం, బ్రహ్మయొక్క అనగా అని విరాట్టు అని చెప్పబడే ప్రజాపతి యొక్క పగలు వెయ్యియుగములతో, పూర్తి అవుతుందని తెలుసుకొనుచున్నారు; చెప్పుచున్నారు. రాత్రి కూడ (వెయ్యి యుగాలలో పూర్తి అవుతుందని), పగటి ప్రమాణం ఎంతో అంటే ప్రమాణం కల దని చెప్పుచున్నారు. అలా చెప్పే వాళ్లెవరు అనగా చెప్పుచున్నాడు - అహోరాత్రాలను గూర్చి, తెలిసినవారు, కాలసంఖ్యను గూర్చి, తెలిసిన జనులు అని అర్థం. ఈ విధంగా బ్రహ్మలోకం వరకు ఉన్న లోకాలు కాలంచేత పరిచ్ఛిన్న ములు గాన అవి పునరావృత్తులు - తిరిగి వచ్చేవి; నశించేవి. 17

భాష్యమ్

ప్రజాపతేః అహని యద్ భవతి రాత్రౌ చ తదుచ్యతే -

మూ. అవ్యక్తాద్వ్యక్తయః సర్వాః ప్రభవన్త్యహరాగమే,
రాత్ర్యాగమే ప్రలీయన్తే తత్రైవావ్యక్తసంజ్ఞకే. 18

బాలానందిని

ప్రజాపతేరితి :- ప్రజాపతియొక్క పగటియందు రాత్రియందు ఏమి జరుగునో చెప్పబడుచున్నది -

అవ్యక్తాదితి :- అహరాగమే = పగలు రాగానే, అవ్యక్తాత్ = నిద్రావస్థనుండి, సర్వాః = సమస్తమైన, వ్యక్తయః = ప్రాణులు, ప్రభవన్తి = పుట్టుచున్నవి, రాత్ర్యాగమే = రాత్రి రాగానే, అవ్యక్తసంజ్ఞతే = అవ్యక్త మనే పేరు గల, తస్మిన్ = దాని యందే, ప్రలీయన్తే = లీన మగుచున్నవి.

భాష్యమ్

అవ్యక్తాత్ - అవ్యక్తం ప్రజాపతేః స్వాపావస్థా, తస్మాత్ అవ్యక్తాత్, వ్యక్తయః - వ్యజ్యన్తే ఇతి వ్యక్తయః స్థావరజఙ్గమలక్షణాః సర్వాః ప్రజాః, ప్రభవన్తి అభివ్యజ్యన్తే అహ్నః ఆగమః అహరాగమః, తస్మిన్ అహరాగమే కాలే, బ్రహ్మణః ప్రబోధకాలే. తథా రాత్ర్యాగమే బ్రహ్మణః స్వాపకాలే ప్రలీయన్తే. సర్వాః వ్యక్తయః తత్రైవ పూర్వోక్తే అవ్యక్తసంజ్ఞకే. 18

బాలానందిని

అవ్యక్తాత్ ఇతి :- అవ్యక్తం అనగా ప్రజాపతియొక్క నిద్రావస్థ. ఆ అవ్యక్తంనుండి, వ్యంజింపచేయబడేవి (పైకి కనబడే టట్లు చేయబడేవి) వ్యక్తులు. సమస్త మైన వ్యక్తులు, స్థావరజంగమ రూపా లైన సమస్తప్రజలు, అభివ్యక్తం అవుచున్నవి. (అంతవరకు కనబడకుండా అణిగి ఉన్నవి కనబడడం అభివ్యక్తం అవడం) పగటియొక్క ఆగమమునందు (పగలు వచ్చినప్పుడు), అనగా బ్రహ్మ మేల్కొన్నప్పుడు. అట్లే రాత్రి వచ్చినప్పుడు, బ్రహ్మ నిద్రపోయినప్పుడు, వెనుక చెప్పిన అవ్యక్తమునందే అణగిపోవుచున్నవి.

భా.అ.ప్ర. అవ్యక్తం అనగా బ్రహ్మదేవుని శరీరము అను శ్రీరామానుజవ్యాఖ్య అప్రామాణికము. ప్రాణులు బ్రహ్మశరీరంనుండి పుట్టి దానిలో లీనం కారు కదా?

భాష్యమ్

అకృతాభ్యాగమకృతవిప్రణాశదోషపరిహారార్థం బన్ధమోక్షశాస్త్రప్రవృత్తిసాఫల్య ప్రదర్శనార్థమ్, అవిద్యాదిక్లేశమూలకర్మాశయవశాచ్చ అవశః భూతగ్రామః భూత్వా భూత్వా ప్రలీయతే ఇత్యతః సంసారే వైరాగ్యప్రదర్శనార్థం చ ఇదమాహ -

మూ. భూతగ్రామః స ఏవాయం భూత్వా భూత్వా ప్రలీయతే,
రాత్ర్యాగమేఽవశః పార్థ ప్రభవత్యహరాగమే. 19

బాలానందిని

అకృతేతి :- అకృతాభ్యాగమము, కృతవిప్రణాశము అనే దోషాలను పరిహరించడం కోసము, బన్ధమోక్షాలను గూర్చి చెప్పే శాస్త్రంయొక్క ప్రవృత్తి సఫలం అవడంకోసము, ప్రాణిసముదాయం అవిద్యాదు లైన క్లేశాలు మూలంగా గల కర్మాశయంవల్ల, అవశమై (వశం తప్పి) అనేక పర్యాయాలు పుట్టీ పుట్టి విలయం చెందుతుంటుంది. అనే కారణం వల్ల సంసారం విషయంలో వైరాగ్యాన్ని చూపడంకోసమూ చెప్పుచున్నాడు -

వి. బ్రహ్మదేవుని పగలు ప్రారంభం కాగానే ప్రాణులు పుడుతూంటాయి. రాత్రి కాగానే విలీనమైపోతూంటాయి. ఈ విధంగా బ్రహ్మదేవుని అహోరాత్రాలను అనుసరించి ప్రాణుల ఉత్పత్తిప్రలయాలు జరుగుతూంటాయి అని చెప్పబడింది. రాత్ర్యా గమంలో క్రొత్త ప్రాణులు పుడతాయా అను ప్రశ్న కలుగుతుంది. దీనికి సమాధానం - ఏ ప్రాణులు విలీనము లయ్యాయో అవే మళ్లీ పుడుతూంటాయి. ఏవి పుట్టాయో అవే విలీనము లవుతూంటాయి. మళ్లీ పుడుతుంటాయి. మళ్లీ విలీనము లవుతుంటాయి. ఇలా కాకపోతే అకృతాభ్యాగమము, కృతవిప్రణాశము అనే దోషాలు కలుగుతాయి. ఒకడు తాను చేయని కర్మకు ఫలం అనుభవించడం అకృతాభ్యాగ్యమం. చేసిన కర్మ ఫలం ఇవ్వకుండా నశించడం కృతప్రణాశం. అంతకు ముందు లేని ప్రాణులు క్రొత్తగా పుట్టి సుఖదుఃఖాలు అనుభవిస్తున్నా రంటే వాళ్లలో కొందరికి సుఖం కొందరికి దుఃఖం కలగడానికి కారణ మైన కర్మాదికం లేకుండానే వాళ్లకి ఆ ఫలం కలుగుతున్న దని చెప్పాలి. అది యుక్తం కాదు. వివిధకర్మలు చేసిన ప్రాణు లందరూ ఒకే విధంగా, మళ్లీ లేవకుండా విలీనము లైపోతే వాళ్లు చేసిన కర్మలు ఏ ఫలమూ ఇవ్వకండా నశించా యని చెప్పాలి. కర్మ ఫలం ఇవ్వకుండా నశించడం కూడ అయుక్తమే. విలీనులైనవాళ్లే మళ్లీ పుడుతున్నారు, వీళ్లే మళ్లీ విలయం చెందుతారు అని అంగీకరిస్తే ఈ దోషాలు (అకృతాభ్యాగమ - కృతవిప్రణాశాలు) ఉండవు. అప్పుడే బంధహేతువు లైన కర్మాదులను గూర్చి చెప్పే బంధశాస్త్రం, మోక్షమార్గాన్ని ఉపదేశించే శాస్త్రమూ కూడ సార్థకము లవుతాయి. ఏ కారణమూ లేకుండానే సుఖదుఃఖాలు అనుభవించి చివరికి ఏ కారణమూ లేకుండానే అందరూ మళ్లీ లేవకుండా విలీనమై పోతా రంటే ఉపదేశా లన్నీ వ్యర్థమై పోతాయి. అవిద్య మొద లైన ఐదు క్లేశాలున్నాయి. "అవిద్యాస్మితారాగద్వేషాభినివేశాః క్లేశాః" (పా.యో.సూ. 2.3) అని యోగసూత్రం. అనిత్యములను నిత్యము లని, అశుచియైనదానిని శుచి యైన దని, దుఃఖాన్ని సుఖమనీ, అనాత్మను ఆత్మ అనీ అనుకొనడం అవిద్య. ఆత్మను బుద్ధిని కలిపి ఒకట్టిగా చూచుట అస్మిత. మరణభయం అభినివేశం. అవిద్య అస్మితాదులకు మూలకారణం. ధర్మాధర్మరూపము లైన కర్మల సముదాయానికి కర్మాశయ మని పేరు. దీనికి ఈ పంచక్లేశాలే కారణం. ఈ కర్మాయశానికి

వశమైపోయి ప్రాణిసముదాయం అంతా జన్మమరణపరంపరలో చిక్కుకొని తిరుగుతూ ఉంటుంది. ఈ విషయం తెలుసుకొన్న ట్లయితే వైరాగ్యం కలుగుతుంది. ఈ మూడు ప్రయోజనాలను ఉద్దేశించి చెప్పబడుచున్న దని అర్థం.

ప్ర.అ. భూతేతి :- పార్థ = అర్జునా! సః = ఆ, అయమ్ = ఈ, భూతగ్రామః ఏవ = ప్రాణిసముదాయమే, (పూర్వం ఉన్న భూతగ్రామమే), భూత్వా భూత్వా = పగటి ప్రారంభంలో పుడుతూ పుడుతూ, రాత్ర్యాగమే = బ్రహ్మదేవుని రాత్రి వచ్చినప్పుడు, అవశః = తన వశంలో తాను ఉండ జాలనిదై, ప్రలీయతే = అణగిపోవుచున్నది. అహరాగమే = బ్రహ్మదేవుని పగలు రాగానే, ప్రభవతి = పుట్టుచున్నది.

భాష్యమ్

భూతగ్రామః భూతసముదాయః స్థావరజఙ్గమలక్షణః యః పూర్వస్మిన్ కల్పే ఆసీత్ స ఏవ అయం, న అన్యః, భూత్వా భూత్వా అహరాగమే, ప్రలీయతే, పునః పునః రాత్ర్యాగమే, అహ్నః క్షయే అవశః అస్వతన్త్రః ఏవ, పార్థ ప్రభవతి అవశః ఏవ అహరాగమే. 19

బాలానందిని

భూతేతి :- స్థావరజంగమాత్మక మైన భూతసముదాయం, ఏది పూర్వకల్పంలో ఉండెనో అదే, ఇది మరొకటి కాదు; అహరాగమంలో పుట్టీ పుట్టి, పగలు గడచిపోగానే మాటి మాటికి, అవశమై, స్వాతంత్ర్యం ఏమీ లేనిదై, లీనం అయిపోతుంది. అర్జునా! పగలు రాగానే మళ్లీ ఆవిర్భవిస్తుంది. అప్పుడు కూడ అది అవశమే. 19

భాష్యమ్

యదుపన్యస్తమ్ అక్షరం తస్య ప్రాప్త్యుపాయః నిర్దిష్టః "ఓమిత్యేకాక్షరం బ్రహ్మ" ఇత్యాదినా. అథ ఇదానీమ్ అక్షరస్యైవ స్వరూపనిర్దిదిక్షయా ఇదమ్ ఉచ్యతే, అనేన యోగమార్గేణ ఇదం గన్తవ్యమ్ ఇతి -

మూ. పరస్తస్మాత్తు భావోఽన్యోఽవ్యక్తోఽవ్యక్తాత్సనాతనః,
యః స సర్వేషు భూతేషు నశ్యత్సు న వినశ్యతి. 20

బాలానందిని

యదితి :- ఏ అక్షరం చెప్పబడినదో దాని ప్రాప్తికి ఉపాయం "ఓమిత్యేరాక్షరం బ్రహ్మ" (8.13) ఇత్యాదికంచేత చెప్పబడినది. ఇప్పు డిక ఆ అక్షరంయొక్క స్వరూపాన్ని చెప్పా లనే ఇచ్ఛచేత ఈ యోగమార్గంచేత దీనిని పొందవచ్చును అని చెప్పబడుచున్నది-

ప్ర.అ. పర ఇతి :– తు = కాని, తస్మాత్ = ఆ, అవ్యక్తాత్ = అవ్యక్తముకంటె, పరః = వేరైన, అవ్యక్తః = ఇంద్రియగోచరము కాని, సనాతనః = అతిప్రాచీన మైన, భావః = అక్షరం అనే భావం, అన్యః = విలక్షణమైనది. యః = ఏది; సర్వేషు = సమస్త మైన, భూతేషు = భూతములు, నశ్యత్సు = నశించుచున్నా కూడ, న వినశ్యతి = నశించదో.

భాష్యమ్

పరః వ్యతిరిక్తః భిన్నః. కుతః? తస్మాత్ పూర్వోక్తాత్. తుశబ్దః అక్షరస్య వివక్షితస్య అవ్యక్తాత్ వైలక్షణ్యవిశేషణార్థః భావః అక్షరాఖ్యం పరం బ్రహ్మ, వ్యతిరిక్తత్వే సత్యపి సాలక్షణ్యప్రసంగః అస్తీతి తద్వినివృత్త్యర్థమాహ – అన్యః ఇతి. అన్యః విలక్షణః, స చ, అవ్యక్తః అనిన్ద్రియగోచరః. పరః తస్మాత్ ఇత్యుక్తమ్, కస్మాత్ పునః పరః? పూర్వోక్తాత్ భూతగ్రామబీజభూతాత్ అవిద్యాలక్షణాత్ అవ్యక్తాత్, సనాతనః చిరంతనః, యః సః భావః సర్వేషు భూతేషు బ్రహ్మాదిషు నశ్యత్సు న వినశ్యతి. 20

బాలానందిని

పర ఇతి :– పరము, వ్యతిరిక్తము, అనగా వేరైనది. దేనికంటె? తస్మాత్ = పూర్వం చెప్పబడినదానికంటె చెప్పదలచిన అక్షరం అవ్యక్తంకంటె విలక్షణ మైన దని విశేషించి చెప్పడానికి తుశబ్దం ప్రయోగించబడినది. భావం, అనగా అక్షరం అనే పరబ్రహ్మ వ్యతిరిక్తమే (భిన్నమే) అయినా కూడ సాలక్షణ్యప్రసంగం, రెండింటికీ సమానమైన లక్షణాలు ఉండే అవకాశం, ఉంది గాన దానిని నివర్తింపజేయడానికి అన్యః అని అంటున్నాడు. అన్యః అనగా విలక్షణ మైనది (పోలిక లేనిది). అది కూడ అవ్యక్తం అనగా ఇంద్రియాలకు గోచరం కానిది. దానికంటె పరము అని చెప్పబడింది, దేనికంటె పరం? వెనుక చెప్పబడినది, భూతగ్రామానికి బీజము అయిన అవిద్యారూపమైన అవ్యక్తంకంటె. అది చాల ప్రాచీనమైనది. ఏ భావం బ్రహ్మ మొదలు స్తంబం వరకు ఉన్న సమస్తభూతాలు నశించినా కూడ నశించదో ఆ భావం.

భా.అ.ప్ర. "ఇక్కడ చెప్పబడిన ఈ అవ్యక్తమైన అక్షరం జీవుడు. జాత్యేకవచనంచేత ఏకత్వనిర్దేశం చేయబడింది" అని శ్రీరామానుజాచార్యవ్యాఖ్య యుక్తం కాదు. ప్రాణాలను ధరించడం జీవుని లింగం. ప్రాణులైన జీవులు అవ్యక్తంనుండే పుడతాయి గాన అవి అవ్యక్తముకంటె పరములు, అన్యములు కావు. నశ్వరములు గాన వాటికి అవినాశిత్వం లేదు. నీవు అనుకొంటున్న ఈ జీవులు సర్వభూతశబ్దంచేత చెప్పబడడంచేత 'సమస్త భూతాలు నశిస్తూండగా' అనే దానిచేత ఇది కూడ పరామర్శింపబడతాయి. అక్షరం వీటికంటె విలక్షణ మైనది. లిఙ్గులైన (అనుమానప్రమాణంచేత తెలియబడు) జీవులు ప్రమాణం ద్వారా

వ్యక్తులే గాన వాళ్లు అవ్యక్తు లనడం కుదరదు. సర్వోపాధివినిర్ముక్త మైన అక్షరానికి ప్రాణం ఉండదు గాన ప్రాణధారణంవల్ల ఏర్పడిన జీవత్వం ఆ అక్షరానికి ఉండదు. అక్షరంకంటె అధికమైన పరమపురుషు డున్నట్లయితే "పురుషాన్న పరం కించిత్సా కాష్ఠా సా పరా గతిః" అను శ్రుతికి విరోధం కలుగుతుంది. అందుచేత ఈ అవ్యక్తమైన అక్షరం ప్రత్యగాత్మాభిన్నుడైన పరమాత్మయే. (భా.అ.ప్ర.పే. 91) 20

మూ. అవ్యక్తోఽక్షర ఇత్యుక్తస్తమాహుః పరమాం గతిమ్,
యం ప్రాప్య న నివర్తన్తే తద్ధామ పరమం మమ. 21

బాలానందిని

ప్ర.అ. **అవ్యక్త ఇతి :-** అవ్యక్తః = అవ్యక్తం, అక్షరః ఇతి = అక్షరము అని, ఉక్తః = చెప్పబడినాడు. తమ్ = ఆ అక్షరమును, పరమాం గతిమ్ = ఉత్తమమైన గతినిగా, ఆహుః = చెప్పుచున్నారు. యమ్ = పరమైన ఏ భావమును, ప్రాప్య = పొంది, న నివర్తన్తే = నివర్తించరో, తత్ = అది, మమ = నా యొక్క, పరమమ్ = పరమమైన, ధామ = స్థానము.

భాష్యమ్

అవ్యక్తః ఇతి :- యః అసౌ అవ్యక్తః అక్షరః ఇతి ఉక్తః, తమ్ ఏవ అక్షరసంజ్ఞకమ్ అవ్యక్తం భావమ్ ఆహుః, పరమాం ప్రకృష్టాం, గతిమ్. యం పరం భావం ప్రాప్య గత్వా, న నివర్తన్తే సంసారాయ, తత్ ధామ తత్ స్థానం, పరమం ప్రకృష్టం, మమ విష్ణోః పరమం పదమ్ ఇత్యర్థః. 21

బాలానందిని

అవ్యక్త ఇతి :- ఏ ఈ అవ్యక్తం అక్షర మని చెప్పబడిందో అక్షర మను పేరు గల ఆ అవ్యక్త మైన భావమునే ప్రకృష్టమైన గతినిగా చెప్పుచున్నారు. ఏ పరభావమును పొంది తిరిగి సంసారానికి రారో, ఆ స్థానం విష్ణువు నైన నాయొక్క ప్రకృష్టమైన స్థానము. పరమపదం అని అర్థం.

భా.అ.ప్ర. అచేతన మైన ప్రకృతి ఒక నియమనస్థానం (నిమించబడేది). జీవరూప మైన ప్రకృతి రెండవ నియమనస్థానం. ముక్తరూపమైనది పర మైన (గొప్ప) నియమనస్థానం అని శ్రీ రామానుజాచార్యుల వ్యాఖ్య అసంగతం. ముక్తాత్మస్వరూపం తనకంటె అభిన్నమే గాన తనచేత నియమించతగి ఉండడం కుదరదు. ముక్తునికి నియమనం ఉంటే అతడు ముక్తుడే కాదు; నియమనం దుఃఖహేతువు కదా? ముక్తిలో లేశమాత్రం కూడ దుఃఖం

ఉండకూడదు కదా? అనాత్మయైన అంతఃకరణం ఉన్నా కూడ, సుషుప్తిలో, దానితో తాదాత్మ్యాధ్యాసం లేకపోవడంచేత జీవునికి ఏ విధ మైన నియమనం కూడ లేనప్పుడు సర్వోపాధినాశానంతరం కూడ జీవునికి నియమనం ఎలా ఉంటుంది? అందుచేత జీవుని వాస్తవస్వరూపాన్ని తెలియకపోవడంచేత చెప్పిన మాట లివి.

'ధామ'అనేదానికి తేజస్సు అని ఈయనే చేసిన మరొక వ్యాఖ్య యుక్తమే. అయితే అక్షరం విష్ణువుకు శేషం అని చెప్పడం అయుక్తం. ఆత్మ అవడంచేత ఆత్మయే అన్నింటికీ శేషి, వ్యాపకం అవడంచేత ఆత్మయే విష్ణువు. అంతే కాక ప్రకృతితో విముక్తులై జ్ఞానమనే ఒకే ఆకారంతో ఉన్న ఆత్మపరమాత్మలకు శేషశేషిత్వకల్పన కూడ అయుక్తం. ముక్తుడు కూడ అపరిచ్ఛిన్నజ్ఞానరూపుడు గాన విష్ణువుకంటె వానికి వైలక్షణ్యం లేదు. పరిచ్ఛేదకం ఏదీ లేకపోవడంచేత జ్ఞానం అపరిచ్ఛిన్నం అయినప్పుడు జీవేశ్వరభేదకల్పన కూడ కుదరదు. (భా. అ. ప్ర. పే. 92) 21

భాష్యమ్

తల్లబ్ధేః ఉపాయః ఉచ్యతే-

మూ. పురుషః స పరః పార్థ భక్త్యా లభ్యస్త్వనన్యయా,
యస్యాన్తఃస్థాని భూతాని యేన సర్వమిదం తతమ్. 22

బాలానందిని

తదితి:- ఆ పరమపురుషుణ్ణి పొందదానికి ఉపాయం చెప్పబడుచున్నది-

పురుష ఇతి:- పార్థ=అర్జునా! భూతాని=భూతములు, యస్య=ఎవనియొక్క, అన్తఃస్థాని=లోపల ఉన్నవో, యేన=ఎవనిచేత, ఇదమ్=ఈ, సర్వమ్=సమస్తమూ, తతమ్=వ్యాపించబడినదో, సః=అట్టి, పరః పురుషః=పరమపురుషుడు, అనన్యయా=అనన్యమైన(మరి ఎవని విషయంలోనూ లేని), భక్త్యా=భక్తిచేత, లభ్యః=పొందదగినవాడు.

భాష్యమ్

పురుషః-పురి శయనాత్ పూర్ణత్వాద్వా, సః, పరః, పార్థ, పరః నిరతిశయః, యస్మాత్ పురుషాత్ న పరం కించిత్ సః, భక్త్యా, లభ్యః తు, జ్ఞానలక్షణయా, అనన్యయా ఆత్మవిషయయా, యస్య పురుషస్య అన్తఃస్థాని మధ్యస్థాని కార్యభూతాని భూతాని. కార్యం హి కారణస్య అన్తర్వర్తి భవతి. యేన పురుషేణ సర్వమ్ ఇదం జగత్ తతం వ్యాప్తమ్, ఆకాశేనేవ ఘటాది. 22

బాలానందిని

పురి=శరీరంలో,శయనాత్=శయినించడంవల్ల,ఉండడంవల్ల "పురుషుడు"లేదా పూర్ణుడవడంవల్ల పురుషుడు.అర్జునా!ఆ పురుషుడు పరుడు.పరు డనగా నిరతిశయుడు; ఏ పురుషునికంటె పరమైనది మరేది లేదో అట్టివాడు.అతడు,జ్ఞానరూపమైన,ఆత్మయే విషయంగా గల భక్తిచేత పొందదగినవాడు.కార్యములైన భూతాలు ఏ పురుషుని మధ్య యందున్నవో,కార్యం కారణంలోపల ఉంటుంది కదా?ఏ పురుషునిచేత, ఘటాదికం ఆకాశంచేత వలె ఈ జగత్తు అంతా వ్యాప్త మైనదో.

భా.అ.ప్ర:- "పురః పురుషః అనగా పరమపురుష డైన విష్ణువే కాని ప్రత్యగాత్మ కాదు.అతడు పురుషుడే కాని పరమపురుషుడు కాదు కదా?"అను శ్రీరామానుజాచార్యవ్యాఖ్య యుక్తం కాదు.ప్రత్యగభిన్నపరమాత్మనే గ్రహించడం యుక్తం.**"అవినాశి తు తద్విద్ధి యేన సర్వమిదం తతమ్"**(2.17)అనుదానిని నీవు కూడ పురుషపరంగానే వ్యాఖ్యానించావు కదా?ఆ పురుషుడే ఈ పరపురుషుడు అని స్పష్టంగా తెలుస్తూన్నది. ఎందువల్ల ననగా అక్కడ **"యేన సర్వమిదం తతమ్"**అని ఏ పురుషుడు వర్ణించబడినాడో అతడే ఆ మాటలతో సర్వవ్యాప్తుడుగా వర్ణించబడుచున్నాడు.ఇద్దరికి సర్వవ్యాప్తత్వం కుదరదు.అందుచేత ఆ పురుషుడే ఈ పరమపురుషుడు;ప్రత్యగభిన్నపరబ్రహ్మ.పురుషునికంటె వేరుగా పరమపురుష డంటూ ఎవ్వడూ లేదు. **"అవ్యక్తోఽక్షర ఉచ్యతే"**అను శ్లోకంలో చెప్పినవానికీ ఈ పురుషునికీ వైలక్షణ్యం కనబడుతున్నది;అది జీవేశ్వరభేదం ఉంటేనే కుదురుతుంది. అందుచేత జీవుడు అక్షరుడు,ఈశ్వరుడు పరమపురుషుడు అని చెప్పాలి అనడం కూడ యుక్తం కాదు.అవ్యక్తశ్లోకంలో పురుషుని స్వరూపం చెప్పబడింది.ఇక్కడ తత్ప్రాప్త్యుపాయం చెప్పబడింది.ఇదే 'తు'శబ్దం సూచిస్తున్నది.అందుచేత అక్కడ చెప్పిన పురుషుడు ఈ పురుషుడూ కూడ ఒక్కడే.(భా.అ.ప్ర. పే. 93-94) 22

భాష్యమ్

ప్రకృతానాం యోగినాం ప్రణవావేశితబ్రహ్మబుద్ధీనాం కాలాన్తరముక్తిభాజాం బ్రహ్మప్రతిపత్తయే ఉత్తరః మార్గః వక్తవ్యః ఇతి **"యత్ర కాలే"**ఇత్యాది వివక్షితార్థసమర్ప ణార్థమ్ ఉచ్యతే.ఆవృత్తిమార్గోపన్యాసః ఇతరమార్గస్తుత్యర్థః-

మూ. యత్ర కాలే త్వనావృత్తిమావృత్తిం చైవ యోగినః,
ప్రయాతా యాన్తి తం కాలం వక్ష్యామి భరతర్షభ. 23

బాలానందిని

ప్రకృతానామితి:- ప్రణవమునందు బ్రహ్మబుద్ధి చేసినవారు,కాలాంతరంలో ముక్తి పొందవలసినవారూ అయిన ప్రకృతు లైన(ఎవరిని గూర్చి ముచ్చటిస్తూన్నామో వారు

ప్రకృతులు)యోగులు బ్రహ్మను పొందడానికి ఉత్తరమార్గం చెప్పవలసి ఉంది గాన, చెప్పదలచిన ఆ విషయం చెప్పడం కోసం "యత్ర కాలే"ఇత్యాదికం చెప్పబడుచున్నది. ఆవృత్తిమార్గాన్ని గూర్చి చెప్పడం అనావృత్తిమార్గాన్ని స్తుతించడంకొరకు అనావృత్తి మార్గంకంటె తక్కువ దైన ఆవృత్తిమార్గాన్ని గూర్చి కూడ చెపితేనే దీనికంటె అది గొప్పది అనే నిశ్చయం కలుగుతుంది. అందుకోసం ఈ మార్గం కూడ చెప్పబడుచున్న దని అర్థం).

ప్ర.అ. యత్ర=ఏ, కాలే=కాలమునందు,ప్రయాతాః=మరణించిన,యోగినః= యోగులు, అనావృత్తిమ్=అనావృత్తిని,ఆవృత్తిం చైవ=ఆవృత్తినీ,యాన్తి=పొందుతారో,తం కాలమ్=ఆ కాలాన్ని గూర్చి,భరతర్షభ=అర్జునా,వక్ష్యామి=చెప్పెదను.

భాష్యమ్

"యత్ర కాలే ప్రయాతాః" ఇతి వ్యవహితేన సంబన్ధః. యత్ర యస్మిన్,కాలే తు, అనావృత్తిమ్ అపునర్జన్మ,ఆవృత్తిం తద్విపరీతాం చైవ;యోగినః ఇతి యోగినః కర్మిణశ్చ ఉచ్యన్తే. కర్మిణస్తు గుణతః "కర్మయోగేన యోగినామ్"ఇతి విశేషణాత్ యోగినః .యత్ర కాలే ప్రయాతాః మృతాః యోగినః అనావృత్తిం యాన్తి యత్ర కాలే చ ప్రయాతాః ఆవృత్తిం యాన్తి తం కాలం వక్ష్యామి భరతర్షభ. 23

బాలానందిని

యత్రేతి:- "యత్ర కాలే ప్రయాతాః"అని దూరంగా ఉన్న పదంతో అన్వయం. ఏ కాలంలో నైతే,పునర్జన్మ లేకపోవడాన్ని,దానికి విపరీతమైన పునర్జన్మను, "యోగినః"అని యోగులు కర్ములూ కూడ చెప్పబడుచున్నారు. కర్మ లాచరించేవారు కూడ "కర్మయోగేన యోగినామ్"అని విశేషించి చెప్పడంచేత యోగులే-అర్జునా!ఏ కాలంలో మరణించిన యోగులు అనావృత్తిని పొందుతారో,ఏ కాలంలో మరణించినవారు ఆవృత్తిని పొందుతారో అట్టి కాలాన్ని గూర్చి చెపుతాను. 23

మూ. అగ్నిర్జ్యోతిరహః శుక్లః షణ్మాసా ఉత్తరాయణమ్,
తత్ర ప్రయతా గచ్ఛన్తి బ్రహ్మ బ్రహ్మవిదో జనాః. 24

ప్ర.అ. అగ్నిరితి:- అగ్నిః=అగ్ని,జ్యోతిః=జ్యోతిస్సు,ఉత్తరాయణమ్=ఉత్తరాయణం, షట్ మాసాః=ఆరు మాసాలు,తత్ర=అప్పుడు,ప్రయాతాః=మరణించిన,బ్రహ్మవిదః=బ్రహ్మ వేత్త లైన,జనాః=జనులు,బ్రహ్మ=బ్రహ్మను,గచ్ఛన్తి=పొందుదురు.

భాష్యమ్

అగ్నిః కాలాభిమానినీ దేవతా. తథా జ్యోతిః దేవతైవ కాలాభిమానినీ. అథవా అగ్నిజ్యోతిషీ యథాశ్రుతే ఏవ దేవతే. భూయసా తు నిర్దేశః"యత్ర కాలే తం కాలమ్"

ఇతి ఆమ్రవణవత్. తథా అహర్దేవతా అహః, శుక్లః శుక్లపక్షదేవతా, షణ్మాసాః ఉత్తరాయణమ్; తత్రాపి దేవతైవ మార్గభూతా ఇతి స్థితః అన్యత్ర న్యాయః. తత్ర తస్మిన్ మార్గే, ప్రయాతాః మృతాః, గచ్ఛన్తి బ్రహ్మ బ్రహ్మవిదః బ్రహ్మోపాసనపరాః జనాః. క్రమేణ ఇతి వాక్యశేషః. న హి సద్యోముక్తిభాజాం సమ్యగ్దర్శననిష్ఠానాం గతిః ఆగతిః వా క్వచిత్ అస్తి- "న తస్య ప్రాణా ఉత్క్రామన్తి"(బృ. ఉ. 4. 4. 6)ఇతి శ్రుతేః. బ్రహ్మసంలీనప్రాణాః ఏవ తే; బ్రహ్మమయాః బ్రహ్మభూతాః ఏవ తే. క్రమేణ తు గచ్ఛన్తి బ్రహ్మ బ్రహ్మవిదః జనాః. 24

బాలానందిని

అగ్నిః ఇతి:- అగ్ని కాలాభిమానిదేవత. అట్లే జ్యోతిస్సు కూడ కాలాభిమాని దేవతయే. లేదా అగ్నిజ్యోతిస్సులు అవే పేర్లు గల దేవతలే. (కాలాభిమానిదేవత లని గ్రహించ వలసిన పని లేదు). "యత్ర కాలే" "తం కాలమ్"అని అధికంగా ఉన్నదానిని పట్టి నిర్దేశం చేయబడింది; ఆమ్రవణం అన్నట్లు. అట్లే అహః అనగా అహర్దేవత. శుక్లః అనగా శుక్లపక్షదేవత. ఉత్తరాయణం ఆరు మాసాలు. అక్కడ కూడ దేవతయే మార్గంగా ఉన్న దని మరొకచోట న్యాయం ఉంది. ఆ మార్గంలో మరణించిన బ్రహ్మవిదులు; అనగా బ్రహ్మోపాసనపరులైన జనులు, 'క్రమేణ'అని వాక్యంలో అధ్యాహారం. క్రమంగా బ్రహ్మను పొందుతారు. సమ్యగ్జ్ఞాననిష్ఠులైనవాళ్లకై వెంటనే ముక్తి కలుగుతుంది. అలాంటి వాళ్లకి ఎక్కడికీ వెళ్లడం గాని రావడం గాని ఉండదు. "న తస్య ప్రాణాః ఉత్క్రామన్తి" (జ్ఞానియొక్క ప్రాణాలు దేహం విడిచి వెళ్లవు)అని శ్రుతి చెప్పుచున్నది. వాళ్లు బ్రహ్మసంలీనప్రాణులు (వాళ్ల ప్రాణాలు బ్రహ్మలోనే లీనమవుతాయి). వాళ్లు బ్రహ్మమయులు బ్రహ్మగా అయినవాళ్లు. బ్రహ్మవిదులైన అనగా బ్రహ్మోపాసన చేసే, జను లైతే క్రమంగా బ్రహ్మను చేరుతారు.

వి:- ఉపాసకులు మొదలైనవాళ్లు మరణించినప్పుడు వారి వారి పుణ్యకర్మలను అనుసరించి వేరు వేరు మార్గాలలో వేరు వేరు స్థానాలకు వెడతారు. వాళ్లు మరణించిన కాలాన్నీ, పగలు రాత్రి మొదలైన సమయాన్నీ పట్టి ఆ యా కాలాదుల అధిష్ఠానదేవతలు వాళ్లను వరుసగా గమ్యస్థానం చేరుస్తారు. వాళ్లకు ఆతివాహికులు అని పేరు. ఈ రెండు మార్గాలలోను కూడ కాలానికి సంబంధించిన పేర్లు-పగలు, శుక్లపక్షం, ఉత్తరాయణం, రాత్రి, కృష్ణపక్షం, దక్షిణాయనం మొద లైనవి అధికంగా ఉన్నాయి. ఇవన్నీ మృతులు ప్రయాణం చేసే మార్గాలు. ఆ యా మార్గాలలో పగలు, రాత్రి మొదలైనవాటి అధిష్ఠాన దేవతలు వీళ్లను నడిపిస్తారు గాన అహరాదులు మార్గా లని చెప్పబడుచున్నాయి. వాస్తవానికి అవి మార్గాలు కాదు, మార్గాలలో నడిపేవి. వీటిలో అగ్ని, జ్యోతిస్సు, ధూమం మొద లైన కాలభిన్నాలు కూడ ఉన్నాయి. అయినా కూడ కాలాలే అధికసంఖ్యలో ఉండడంచేత "యత్ర కాలే" అనీ

"తం కాలమ్"అనీ మొత్తం మార్గాలన్నిటిని (ఆతివాహికదేవతల నందరినీ)కాలశబ్దంచేత నిర్దేశించడం జరిగింది. ఒక తోటలో మామిడిచెట్లు అధికసంఖ్యలో ఉన్నప్పుడు,అక్కడ కొన్ని ఇతరజాతివృక్షా లున్నా కూడ మామిడితోట అని ఎలా అంటామో అట్లే ఇది కూడ. అహరాది శబ్దాలు తదభిమానిదేవతలను బోధిస్తాయి కాని కేవలం అహరాదులను కాదు అని బ్రహ్మ సూత్రాలలో (చతుర్థాధ్యాయతృతీయపాదంలో) ప్రతిపాదించబడింది. ఇక్కడ భాష్యంలోని "స్థితోఽ న్యత్ర న్యాయః"అను పదాలకు అర్థం అదే. బ్రహ్మసూత్రోక్తన్యాయాన్ని అనుసరించి ఇక్కడ అభిమానిదేవత లను అర్థం గ్రహించాలి అని అర్థం. ఈ శ్లోకంలో చెప్పినది దేవయానం.

24

మూ. ధూమో రాత్రిస్తథా కృష్ణః షణ్మాసా దక్షిణాయనమ్,
తత్ర చాన్ద్రమసం జ్యోతిర్యోగీ ప్రాప్య నివర్తతే. 25

ప్ర.అ. **ధూమః ఇతి**:- ధూమః=ధూమము,రాత్రిః=రాత్రి,తథా=మరియు,కృష్ణః =కృష్ణపక్షము,దక్షిణాయనమ్=దక్షిణాయనము,షట్=మాసాః=ఆరు మాసాలు,తత్ర=అక్కడ, (మరణించిన), యోగీ=యోగి,చాన్ద్రమసమ్=చంద్రునికి సంబంధించిన,జ్యోతిః=జ్యోతిస్సును ప్రాప్య=పొంది,నివర్తతే=తిరిగివస్తాడు.

భాష్యమ్

ధూమ ఇతి:- ధూమః రాత్రిః ధూమాభిమానినీ రాత్ర్యభిమానినీ చ దేవతా,తథా, కృష్ణః కృష్ణపక్షేదేవతా,షణ్మాసాః దక్షిణాయనమ్ ఇతి చ పూర్వవద్దేవతైవ,తత్ర,చన్ద్రమసి భవం చాన్ద్రమసం జ్యోతిః ఫలమ్,ఇష్టాదికారీ యోగీ కర్మీ,ప్రాప్య భుక్త్వా తత్క్షయాత్ నివర్తతే. 25

బాలానందిని

ధూమ ఇతి:- ధూమము రాత్రి,అనగా ధూమాభిమానిదేవత రాత్ర్యభిమానిదేవత, అట్లే కృష్ణపక్షదేవత,దక్షిణాయనం ఆరుమాసాలు అన్నప్పుడు కూడ పూర్వము వలె దేవతయే. అక్కడ,చంద్రునిలో ఉన్న జ్యోతిస్సును పొంది,ఫలమును,యాగాదులుచేసే,యోగి కర్మి, అనుభవించి అది క్షీణించడంవల్ల తిరిగి వస్తాడు. 25

మూ. శుక్లకృష్ణే గతీ హ్యేతే జగతః శాశ్వతే మతే,
ఏకయా యాత్యనావృత్తిమన్యయాఽఽ వర్తతే పునః. 26

ప్ర.అ. **శుక్లేతి**:- ఏతే=ఈ,శుక్లకృష్ణే=శుక్లము కృష్ణమూ అయిన,గతీ=గతులు, జగతః =జగత్తునకు, శాశ్వతే=ఎల్లప్పుడూ ఉండేవిగా, మతే=చెప్పబడినవి. ఏకయా=ఒక

దానిచేత,అనావృత్తిమ్=అనావృత్తిని,యాతి=పొందును;అన్యయా=మరొకదానిచేత,పునః= మరల,ఆవర్తతే=తిరిగివచ్చును.

భాష్యమ్

శుక్లేతి:- శుక్లపక్షే–శుక్లా చ కృష్ణా చ శుక్లకృష్ణే.జ్ఞానప్రకాశకత్వాత్ శుక్లా, తదభావాత్ కృష్ణా.ఏతే శుక్లకృష్ణే హి గతీ జగతః ఇతి అధికృతానాం జ్ఞానకర్మణోః; న జగతః సర్వస్యైవ;ఏతే గతీ సంభవతః.శాశ్వతే నిత్యే సంసారస్య నిత్యత్వాత్,మతే అభిప్రేతే.తత్ర ఏకయా శుక్లయా,యాతి అనావృత్తిమ్.అన్యయా ఇతరయా ఆవర్తతే పునః భూయః. 26

బాలానందిని

శుక్లేతి:- శుక్లకృష్ణే–శుక్లము,కృష్ణము అయిన,జ్ఞానాన్ని ప్రకాశింపచేస్తుంది గాన శుక్లం,అది లేకపోవడంచేత కృష్ణం,అట్టి ఈ శుక్లకృష్ణగతులు,జగతః అనగా జ్ఞానకర్మలలో అధికారం కలవారికి అని అర్థం;అంతే కాని మొత్తం జగత్తునకు ఈ గతులు సంభవము కావు.సంసారం నిత్యం గాన ఇవి కూడ శాశ్వతములు,నిత్యములు.అంగీకరించబడినవి. వాటిలో ఒకదానిచేత,శుక్లగతిచేత, అనావృత్తిని పొందుతాడు;మరొకదానిచేత తిరిగి వస్తాడు.

మూ. నైతే సృతీ పార్థ జానన్ యోగీ ముహ్యతి కశ్చన,
తస్మాత్సర్వేషు కాలేషు యోగయుక్తో భవార్జున. 27

ప్ర.అ. నేతి:- పార్థ=అర్జునా!ఏతే=ఈ,సృతీ=గతులను,జానన్=ఎరిగిన,యోగీ = యోగి,కశ్చన=ఎవ్వడూ కూడ,న ముహ్యతి=మోహం చెందడు.అర్జున=అర్జునా!తస్మాత్= ఆ కారణంవల్ల,సర్వేషు=సమస్తమైన,కాలేషు=కాలాలలో,యోగయుక్తః=యోగంతో కూడిన వాడవుగా,భవ=అగుము.

భాష్యమ్

నైతే ఇతి:- న,ఏతే యథోక్తే,సృతీ మార్గౌ,పార్థ, జానన్ సంసారాయ ఏకా, అన్యా మోక్షాయ చ ఇతి,యోగీ, న ముహ్యతి కశ్చన కశ్చిదపి.తస్మాత్ సర్వేషు కాలేషు యోగయుక్తః సమాహితః భవ అర్జున. 27

బాలానందిని

నైతే ఇతి:- పార్థా!ఈ చెప్పబడిన రెండు మార్గా లను గూర్చి,ఒకటి సంసారానికి కారణం,మరొకటి మోక్షానికి హేతువు అని తెలుసుకొన్న యోగి ఎవ్వడూ కూడ మోహం చెందడు.అందువల్ల,అర్జునా!అన్ని కాలాలలోను యోగంతో కూడినవాడవుగా సమాహిత చిత్తుడవుగా ఉండుము. 27

భాష్యమ్

శృణు యోగస్య మాహాత్మ్యమ్-

మూ. వేదేషు యజ్ఞేషు తపస్సు చైవ
దానేషు యత్పుణ్యఫలం ప్రదిష్టమ్,
అత్యేతి తత్సర్వమిదం విదిత్వా
యోగీ పరం స్థానముపైతి చాద్యమ్. 28

ఇతి శ్రీ మహాభారతే శతసాహస్ర్యాం సంహితాయాం వైయాసిక్యాం భీష్మపర్వణి శ్రీమద్భగవద్గీతాసు ఉపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే తారకబ్రహ్మయోగో నామ అష్టమోఽ ధ్యాయః.

బాలానందిని

శృణ్వితి:- యోగముయొక్క మాహాత్మ్యాన్ని గూర్చి వినుము-

ప్ర.అ. వేదేష్వితి:- యోగీ=యోగి,ఇదమ్=దీనిని,విదిత్వా=తెలిసికొని,వేదేషు=వేదాలలోను, యజ్ఞేషు= యజ్ఞాలలోను,తపఃసు చైవ=తపస్సులలోను,దానేషు=దానాలలోను, యత్=ఏ, పుణ్యఫలమ్= పుణ్యముయొక్క ఫలం, ప్రదిష్టమ్=నిర్దేశించబడినదో,చెప్పబడినదో, తత్= దానిని,సర్వమ్= అంతను,అత్యేతి=అతిక్రమిస్తాడు. ఆద్యమ్=ఆదియందు ఉన్న,పరమ్= ఉత్తమమైన,స్థానమ్ =స్థానమును,ఉపైతి=పొందుతాడు.

భాష్యమ్

వేదేషు సమ్యక్ అధీతేషు,యజ్ఞేషు చ సాద్గుణ్యేన అనుష్ఠితేషు,తపః సు చ సుతప్తేషు,దానేషు చ సమ్యక్ దత్తేషు,యత్ ఏతేషు పుణ్యఫలం-పుణ్యస్య ఫలం పుణ్యఫలం,ప్రదిష్టం శాస్త్రేణ,అత్యేతి అతీత్య గచ్ఛతి,తత్ సర్వం ఫలజాతమ్,ఇదం విదిత్వా సప్తప్రశ్ననిర్ణయద్వారేణ ఉక్తం సమ్యక్ అవధార్య అనుష్ఠాయ,యోగీ,పరం ప్రకృష్టమ్, ఐశ్వరం స్థానమ్ ఉపైతి ప్రతిపద్యతే,ఆద్యమ్ ఆదౌ భవం,కారణం,బ్రహ్మ ఇత్యర్థః. 28

ఇతి శ్రీమత్పరమహంసపరివ్రాజకాచార్యగోవిన్దభగవత్పూజ్యపాద శిష్యశ్రీమదాచార్యశ్రీమచ్ఛఙ్కరభగవతః కృతౌ శ్రీమద్భగవద్గీతా భాష్యే బ్రహ్మాక్షరనిర్దేశో నామ అష్టమోఽ ధ్యాయః.

బాలానందిని

వేదేష్వితి:- చక్కగా అధ్యయనం చేయబడిన వేదాలలోను,ఏ లోపాలు లేకుండా అనుష్ఠించిన యజ్ఞాలలోను;-బాగా చేయబడిన తపస్సులలోను,బాగా ఇవ్వబడిన దానాల లోను,వీటి అన్నింటిలోను ఏ పుణ్యముయొక్క ఫలం శాస్త్రంచేత చెప్పబడినదో,ఆ సమస్త ఫలసముదాయమునూ కూడ అతిక్రమించి,పొందుతాడు-దీనిని తెలుసుకొని, "కిం తద్ బ్రహ్మ"ఇత్యాదులైన ఏడు ప్రశ్నల నిర్ణయం ద్వారా చెప్పబడినదానిని చక్కగా నిశ్చితంగా తెలుసుకొని,అనుష్ఠించి, యోగి,ప్రకృష్టమైన,ఈశ్వరునికి సంబంధించిన స్థానాన్ని పొందు తాడు.ఆదియందు ఉన్నది ఆద్యం.కారణం;బ్రహ్మ అని అర్థం. దానిని పొందుతాడు.

భా.అ.ప్ర."పరం స్థానం అనగా పరమపద మైన వైకుంఠమును"అని శ్రీరామాను జాచార్యుల వ్యాఖ్య యుక్తం కాదు.సత్యలోకంలోనే అవాంతరవిశేషమైన వైకుంఠం అనాది కాదు.ఆద్యం అనగా ఆది లేనిది అని ఆయనే వ్యాఖ్యానించి ఉన్నాడు."తదక్షరే పరమే వ్యోమన్"అను శ్రుతిలో చెప్పిన పరమవ్యోమరూప మైన వైకుంఠం అనాదియే అవడం కుదరదు.అక్షరపరమవ్యోమ బ్రహ్మయే కాని వైకుంఠం కాదు.పరమవ్యోమ అనగా భూతాకాశం కంటె భిన్నమైన చిదాకాశం.అది నాశరహితం అవడంచేత అక్షరం.చిత్ ప్రపంచశూన్యం గాన,నిర్లేపం గాన ఆకాశం అని చెప్పబడుతున్నది.ఆత్మకంటె అతిరిక్తంగా పరమవ్యోమ అనే వస్తువు ఒకటుంటే అప్పుడు అది ఆధారంగా గల,ఆధేయ మైన ఆత్మ దానికంటె న్యూనమే(చిన్నదే)అవుతుంది.ఆధేయం ఆధారంకంటె న్యూనమే కదా?బ్రహ్మ నిరతిశయం గాన అది కుదరదు.ఆత్మ గుణంచేతనే కాదు స్వరూపంచేత కూడ నిరతిశయమే. అలా కాకపోతే నిరతిశయత్వం విషయంలో అర్ధజరతీయన్యాయం అంగీకరించిన ట్లవుతుంది. సర్వాధారమైన బ్రహ్మకు వ్యోమ ఆధారం అని అంటే,అప్పుడు బ్రహ్మయొక్క సర్వాధార త్వానికి భంగం కలుగుతుంది. అట్లే పరమవ్యోమలో ఉన్న బ్రహ్మ సర్వవ్యాపి కూడ కాజాలదు.అందుచేత సర్వవ్యాపి,సర్వాధారము,సర్వాత్మా అయిన విష్ణువునకు నియతమైన స్థానం ఏదీ లేదు;ఆ స్థానాన్ని యోగి చేరే ప్రసక్తే లేదు.(భా.అ.ప్ర.పే.103-104)28

"బాలానందిని"అను శ్రీమద్భగవద్గీతాశాంకరభాష్యాంధ్రవ్యాఖ్యాన
మునందు అష్టమాధ్యాయం సమాప్తం.

అథ నవమోఽధ్యాయః

అష్టమే నాడీద్వారేణ ధారణాయోగః సగుణః ఉక్తః.తస్య చ ఫలమ్ అగ్న్యర్చి రాదిక్రమేణ కాలాన్తరే బ్రహ్మప్రాప్తిలక్షణమేవ అనావృత్తిరూపం నిర్దిష్టమ్. తత్రానేనైవ ప్రకారేణ మోక్షప్రాప్తిఫలమ్ అధిగమ్యతే న అన్యథా ఇతి తదాశఙ్కావ్యావివృత్సయా-

శ్రీభగవానువాచ-

మూ. ఇదం తు తే గుహ్యతమం ప్రవక్ష్యామ్యనసూయవే,
జ్ఞానం విజ్ఞానసహితం యద్ జ్ఞాత్వా మోక్ష్యసేఽ శుభాత్. 1

బాలానందిని

అష్టమే ఇతి:- ఎనిమిదవ అధ్యాయంలో నాడుల ద్వారా సగుణమైన(సర్వద్వార సంయమనాదిగుణాలతో కూడిన)ధారణాయోగం చెప్పబడింది. దానికి-అర్చిరాదిమార్గ క్రమంలో కాలాంతరంలో బ్రహ్మను పొందడం అనే అనావృత్తిరూప మైన ఫలం చెప్ప బడింది. మోక్షప్రాప్తి అనే ఫలం ఈ ప్రకారంచేతనే (సగుణోపాసనచేతనే)లభిస్తుంది కాని మరొక విధంగా లభించదు అను ఆశంకను నివారించవలె ననే ఇచ్ఛతో శ్రీభగవంతుడు ఇలా అన్నాడు-

ప్ర. అ. ఇదమితి:- అనసూయవే=అసూయ లేని,తే=నీకు,గుహ్యతమమ్=చాల రహస్య మైన,ఇదమ్=ఈ,విజ్ఞానసహితమ్=విజ్ఞానంతో కూడిన,జ్ఞానమ్=జ్ఞానమును, ప్రవక్ష్యామి=చెప్పెదను. యత్=దేనిని,జ్ఞాత్వా=తెలుసుకొని,అశుభాత్=అశుభంనుండి, మోక్ష్యసే=ముక్తుడవు అవుతావో.

భాష్యమ్

ఇదం బ్రహ్మజ్ఞానం,వక్ష్యమాణమ్ ఉక్తం చ పూర్వేషు అధ్యాయేషు తత్ బుద్ధౌ సంనిధీకృత్య 'ఇదమ్' ఇతి ఆహ. తుశబ్దః విశేషనిర్ధారణార్థః ఇదమేవ సమ్యగ్జ్ఞానం సాక్షాత్ మోక్షప్రాప్తిసాధనం"వాసుదేవః సర్వమితి"(7.19) "**ఆత్మైవేదం సర్వమ్**" (ఛా. ఉ. 7. 25. 2),"**ఏకమేవాద్వితీయమ్**"(ఛా. ఉ. 6. 2. 1)ఇత్యాదిశ్రుతిస్మృతిభ్యః;న అన్యత్ "**అథ యే అన్యథాఽతో విదుః అన్యరాజానః తే క్షయ్యలోకా భవన్తి**" (ఛా. ఉ. 7. 25. 2)ఇత్యాదిశ్రుతిభ్యశ్చ. తే తుభ్యం,గుహ్యతమం గోప్యతమం,ప్రవక్ష్యామి కథయిష్యామి. అనసూయవే అసూయారహితాయ. కిం తత్?జ్ఞానమ్. కిం విశిష్టమ్? విజ్ఞానసహితమ్ అనుభవయుక్తం యత్ జ్ఞానం,జ్ఞాత్వా ప్రాప్య,మోక్ష్యసే అశుభాత్ సంసారబన్ధనాత్. 1

బాలానందిని

ఇదమితి:-ఈ బ్రహ్మజ్ఞానమును-చెప్పబడబోయేది,వెనుకటి అధ్యాయాలలో చెప్ప బడినది అయిన బ్రహ్మజ్ఞానాన్ని బుద్ధిలో గ్రహించి(ఆకళించుకొని)"దీనిని" అని అంటు న్నాడు. (సాధారణంగా ఎదురుగా ఉన్నదానిని నిర్దేశించేటప్పుడు'ఇదమ్'(ఇది)అని అంటాం.

ఇక్కడ బ్రహ్మజ్ఞానం ఎదురుగా లేదుకదా;దానిని 'ఇది'అని నిర్దేశించడం ఎట్లు అని సందేహం కలగవచ్చును. అంతకు పూర్వం చెప్పినది,చెప్పబోయేది అయిన బ్రహ్మజ్ఞానం వక్త మనస్సులో ప్రత్యక్షంగా ఉంది గాన దానిని 'ఇదమ్' అని నిర్దేశిస్తున్నాడు అని అర్థం). 'తు'శబ్దం విశేషాన్ని నిర్ధారణచేస్తుంది. **"వాసుదేవః సర్వమితి"**,**"ఆత్మైవేదం సర్వమ్"** **"ఏకమే వాద్వితీయమ్"** ఇత్యాదిశ్రుతిస్మృతుల ననుసరించి సాక్షాత్తు మోక్షానికి సాధన మైనది ఈ సమ్యగ్జ్ఞానమే కాని మరొకటి ఏదీ కాదు అని విశేషాన్ని నిర్ధారణ చేయడం కోసం 'తు'శబ్దం ప్రయోగించబడింది. **"అథ...భవన్తి"**(ఎవరైతే అద్వైతానికి భిన్నంగా తత్త్వాన్ని గ్రహిస్తారో వాళ్లకు ఇతరులెవరో రాజులుగా,ఆరాధ్యులుగా ఉంటారు;వాళ్ల లోకాలు క్షీణిస్తాయి) ఇత్యాదిశ్రుతులు కూడ ఇట్లే చెప్పుచున్నవి. అసూయ(గుణాలను దోషాలనుగా చిత్రించే స్వభావం అసూయ)లేని నీకు,రహస్యంగా దాచదగిన దానిని చెపుతాను. ఏమిటది? జ్ఞానం. దేనితో కూడినది? విజ్ఞానంతో,అనుభవంతో కూడినది. ఏ జ్ఞానాన్ని తెలిసికొని, పొంది, అశుభంనుండి,సంసారబంధంనుండి ముక్తుడవు కాగలవో. 1

భాష్యమ్

తచ్చ స్తౌతి-

మూ. రాజవిద్యా రాజగుహ్యం పవిత్రమిదముత్తమమ్,
ప్రత్యక్షావగమం ధర్మ్యం సుసుఖం కర్తుమవ్యయమ్. 2

బాలానందిని

తచ్చేతి:- ఆ జ్ఞానాన్ని స్తుతిస్తున్నాడు -

ప్ర.అ. రాజేతి:- పవిత్రమ్=పవిత్రం,ఉత్తమమ్=ఉత్తమమైన, ఇదమ్=ఈ జ్ఞానం, రాజవిద్యా=విద్యలలో రాజు,రాజగుహ్యమ్=రహస్యాలలో రాజు,ప్రత్యక్షావగమమ్=ప్రత్య క్షంగా అనుభవించ శక్య మైనది;ధర్మ్యమ్=ధర్మానుసారంగా ఉండేది,కర్తుమ్=చేయుటకు, సుసుఖమ్=చాల సుఖమైనది(అనాయసంగా సంపాదించదగినది);అవ్యయమ్=నాశనం లేనిది.

భాష్యమ్

రాజవిద్యా-విద్యానాం రాజా,దీప్త్యతిశయవత్త్వాత్. దీప్యతే హి ఇయమ్ అతిశయేన బ్రహ్మవిద్యా సర్వవిద్యానామ్. తథా రాజగుహ్యం-గుహ్యానాం రాజా. పవిత్రం పావనమ్ ఇదమ్ ఉత్తమం సర్వేషాం పావనానాం శుద్ధికారణమిదం బ్రహ్మజ్ఞానమ్ ఉత్కృష్టతమమ్ అనేకజన్మసహస్రసంచితమపి దర్మాధర్మాది సమూలం కర్మ

క్షణమాత్రాద్ భస్మీకరోతి యతః అతః కిం తస్య పావనత్వం వక్తవ్యమ్?కిం చ ప్రత్యక్షావగమం ప్రత్యక్షేణ సుఖాదుఃఖాదేః ఇవ అవగమః యస్య తత్ ప్రత్యక్షావగమమ్. అనేకగుణవతః అపి ధర్మవిరుద్ధత్వం దృష్టం, న తథా ఆత్మజ్ఞానం ధర్మవిరోధి,ధర్మ్యం ధర్మాత్ అనపేతమ్. ఏవమపి స్యాత్ దుఃసంపాద్యమ్,అతః ఆహ సుసుఖం కర్తుమ్,యథా రత్నవివేకజ్ఞానమ్. తత్ర అల్పాయాసానాం కర్మణాం సుఖసంపాద్యానామ్ అల్పఫలత్వం దుష్కరాణాం చ మహాఫలత్వం దృష్టమ్ ఇతి,ఇదం తు సుఖసంపాద్యత్వాత్ ఫలక్షయాత్ వ్యేతి ఇతి ప్రాప్తమ్,అతః ఆహ–అవ్యయం,న అస్య ఫలతః కర్మవత్ వ్యయః అస్తీతి అవ్యయమ్,అతః శ్రద్ధేయమ్ ఆత్మజ్ఞానమ్. 2

బాలానందిని

రాజేతి:– ఎక్కువ తేజస్సు కలదవడంచేత ఇది విద్యలలో రాజు. ఈ బ్రహ్మవిద్య అన్ని విద్యలలో కాంతియొక్క అతిశయంచేత ప్రకాశిస్తూన్నది కదా?అట్లే రహస్యములలో రాజు. ఇది పవిత్రంచేసే అన్నింటిలోను ఉత్తమమైన పవిత్రం;శుద్ధికి కారణమైన ఈ బ్రహ్మజ్ఞానం పవిత్రవస్తువు లన్నింటిలోకీ చాలా ఉత్కృష్ట మైనది. ఇది అనేక జన్మసహస్రాలలో సంచితమైన ధర్మాధర్మాదికాన్ని సమూలంగా,క్షణకాలంలో,భస్మం చేస్తుంది. అందువల్ల దీనికి ఎంతటి పావనత్వం ఉన్నదో వేరుగా చెప్పాలా? మరియు–ప్రత్యక్షావగనుమ్– దేని అనుభవం,సుఖాదుల అనుభవం వలె,ప్రత్యక్షంగా పొంద దగినదో అది ప్రత్యక్షావగమమ్. (సుఖాదులను ప్రత్యక్షంగా ఎవరికి వారు అనుభవించి నట్లు బ్రహ్మజ్ఞానఫలాన్ని కూడ ఎవరికి వారే ప్రత్యక్షంగా అనువించవచ్చును). అనేకగుణా లున్నది కూడ ధర్మ విరుద్ధంగా ఉండడం కనబడుతుంది. ఆత్మజ్ఞానం మాత్రం ధర్మవిరోధి కాదు. అందుచేత ధర్మ్యం,ధర్మం నుండి దూరం కానిది. అయినా కూడ దీనిని సంపాదించడం చాల కష్టం కావచ్చు. అట్లు కాదని చెపుతున్నాడు–"సుసుఖం కర్తుమ్". రత్నవివేకజ్ఞానం వలె చేయడానికి చాలా సుఖ మైనది. (కొంచెం ఉపదేశంచేత నిరంతరపరీక్షణాభ్యాసంచేత ఏ విధంగా రత్న పరీక్షలో ప్రావీణ్యం అనాయాసంగా లభిస్తుందో అట్లే ఈ బ్రహ్మజ్ఞానం కూడ అని అర్థం). అయితే తక్కువ ప్రయాసతో సుఖంగా సంపాదించ గలిగిన (చేయ గలిగిన)కర్మల ఫలం అల్పంగా ఉన్నట్లు దుష్కరము లైన కర్మల ఫలం అధికంగా ఉన్నట్లు లోకంలో చూస్తున్నాం. అందుచేత ఇది సుఖసంపాద్యం అవడంచేత ఫలం క్షీణించడం ద్వారా నశిస్తుంది అని ప్రాప్తిస్తూన్నది (నశిస్తుంది అనవలసివస్తుంది). అందుచేత 'అవ్యయం' అంటున్నాడు. దీనికి ఫలనాశనం ద్వారా,కర్మకు వలె,వ్యయం లేదు;అందుచేత అవ్యయం. అందువల్ల ఆత్మజ్ఞానం పూర్తిగా నమ్మదగినది,శ్రద్ధ చూప దగినది. 2

భాష్యమ్

యే పునః-

మూ. అశ్రద్దధానాః పురుషా ధర్మస్యాస్య పరంతప,
అప్రాప్య మాం నివర్తన్తే మృత్యుసంసారవర్త్మని. 3

బాలానందిని

యే ఇతి:- యే పునః అనేదానికి శ్లోకంలోని "పురుషాః"తో అన్వయం.

ప్ర.అ. **అశ్రద్ధధానాః ఇతి:-** పరంతప=అర్జునా! యే పురుషాః పునః=ఏ పురుషులైతే,అస్య ధర్మస్య=ఈ ధర్మంవిషయంలో,అశద్ధధానాః=నమ్మిక లేనివాళ్లో,వాళ్లు, మామ్=నన్ను,అప్రాప్య=పొందక,మృత్యుసంసారవర్త్మని=మృత్యువుతో కూడిన సంసార మార్గంలో,నివర్తన్తే=ఉంటారు.

భాష్యమ్

అశ్రద్ధధానాః శ్రద్ధావిరహితాః ఆత్మజ్ఞానస్య ధర్మస్య అస్య స్వరూపే తత్ఫలే చ నాస్తికాః పాపకారిణః అసురాణామ్ ఉపనిషదం దేహమాత్రాత్మదర్శ నమేవ ప్రతిపన్నాః అసుతృపః పురుషాః,పరంతప,అప్రాప్య,మాం పరమేశ్వరం,మత్ప్రాప్తౌ నైవ ఆశఙ్కా ఇతి మత్ప్రాప్తిమార్గసాధనభేదభక్తిమాత్రమ్ అపి అప్రాప్య ఇత్యర్థః;నివర్తన్తే నిశ్చయేన ఆవర్తన్తే. క్వ? మృత్యుసంసారవర్త్మని-మృత్యుయుక్తః సంసారః మృత్యుసంసారః,తస్య వర్త్మ నరకతిర్యగాదిప్రాప్తిమార్గః,తస్మిన్నేవ వర్తన్తే ఇత్యర్థః. 3

బాలానందిని

అశ్రద్ధధానా ఇతి:-ఈ ధర్మముయొక్క అనగా ఆత్మజ్ఞానముయొక్క స్వరూపము నందు,ఫలమునందూ కూడ నమ్మకం లేని,నాస్తికులు,పాపాలు ఆచరించేవారు,అసురుల ఉపనిషత్తైన దేహమాత్రాత్మదర్శనాన్ని (దేహమే ఆత్మ అనే సిద్ధాంతాన్ని)అవలంబించిన అసుతృప్ లైన,(ప్రాణాలను తృప్తిపొందించడమే ఏకైకధ్యేయంగా గల) పురుషులు,ఓ!పరంతపా,పరమేశ్వరుడ నైన నన్ను పొందక,నిజానికి నన్ను పొందే శంకయే లేదు,అందుచేత నన్ను పొందడానికి తగిన మార్గానికి సాధనాలలో ఒకటైన భక్తిమాత్రమును కూడ పొందక అని అర్థం,తప్పక తిరుగుతూంటారు.ఎక్కడ?మృత్యుసంసారమార్గంలో.మృత్యువుతో కూడిన సంసారం మృత్యుసంసారం;దాని మార్గం నరకము తిర్యగ్జంతువులు మొదలైనవాటి జన్మ.వీటిని పొందే మార్గం,దానిలోనే ఉంటారు.తిరుగుతూంటారు అని అర్థం. 3

భాష్యమ్

స్తుత్యా అర్జునమ్ అభిముఖీకృత్య ఆహ-

మూ. మయా తతమిదం సర్వం జగదవ్యక్తమూర్తినా,
మత్స్థాని సర్వభూతాని న చాహం తేష్వవస్థితః. 4

బాలానందిని

స్తుత్యేతి:- బ్రహ్మజ్ఞానస్తుతిచేత అర్జునుణ్ణి అభిముఖునిగా చేసి(దానియందు ఆసక్తి కలవానినిగా చేసి)అంటున్నాడు.

ప్ర.అ. మయేతి:- అవ్యక్తమూర్తినా=వ్యక్తము కాని(ఇంద్రియాలకు గోచరము కాని)మూర్తి గల,మయా=నాచేత,సర్వమ్=సమస్త మైన,ఇదం జగత్=ఈ జగత్తు, తతమ్=వ్యాపించ బడినది.సర్వభూతాని=సమస్తభూతములు,మత్స్థాని=నాలో ఉన్నవి.అహం చ=నేనైతే, తేషు=వాటిలో,న అవస్థితః=లేను.

భాష్యమ్

మయా,మమ యః పరః భావః తేన,తతం వ్యాప్తం,సర్వమ్ ఇదం జగత్,అవ్యక్త మూర్తినా–న వ్యక్తా మూర్తిః స్వరూపం యస్య మమ సః అహమ్ అవ్యక్తమూర్తిః, తేన మయా అవ్యక్తమూర్తినా.కరణాగోచరస్వరూపేణ ఇత్యర్థః.తస్మిన్ మయి అవ్యక్తమూర్తౌ స్థితాని మత్స్థాని సర్వభూతాని బ్రహ్మాదిస్తంబపర్యన్తాని,న హి నిరాత్మకం కించిద్ భూతం వ్యవహారాయ అవకల్పతే,అతః మత్స్థాని మయా ఆత్మనా ఆత్మవత్త్వేన స్థితాని, అతః మయి స్థితాని ఇత్యుచ్యన్తే.తేషాం భూతానామ్ అహమేవ ఆత్మా ఇత్యతః తేషు స్థితః ఇతి మూఢబుద్ధీనామ్ అవభాసతే, అతః అహం బ్రవీమి న చ అహం తేషు అవస్థితః;మూర్తవత్ సంశ్లేషాభావేన;ఆకాశస్యాపి అన్తరతమః హి అహమ్.న హి అసంసర్గి వస్తు క్వచిత్ ఆధేయభావేన అవస్థితం భవతి. 4

బాలానందిని

మయేతి:- మయా–నాయొక్క ఏ పరమైన స్వరూపం ఉన్నదో దానిచేత,(శ్రీకృష్ణు డనే పేరు గల పరిచ్ఛిన్న మైన శరీరం అంతటా వ్యాపించి ఉండడం కుదరదు గాన నా యొక్క పరమైన, లోకాతీతమైన, నిరతిశయమైన స్వరూపంచేత అని అర్థంచెప్పబడింది). ఈ జగత్తు వ్యాపింపబడినది.నేను అవ్యక్తమూర్తిని,ఇంద్రియాలకు గోచరించని స్వరూపం కలవాడను;అలాంటి నాచేత వ్యాప్త మైనది.అవ్యక్తమూర్తి నైన నాయందు బ్రహ్మాదిస్తంబ పర్యంతము లైన సమస్తభూతములు ఉన్నాయి.ఆత్మ లేని ఏ భూతమూ కూడ వ్యవహార యోగ్యం కాదు.అందుచేత ఆత్మనైన నేనే వాటికి ఆత్మగా ఉన్నాను.ఆ విధంగా అవి నాయం దున్నవి అని చెప్పబడుచున్నది.(ఉదాహరణకి విద్యుచ్ఛక్తి ఉన్నప్పుడే ఫ్యాన్,దీపాలు మొదలైనవాటికి ఆవిధమైన వ్యవహారం ఉంటుంది.అది లేనప్పుడు అది ఫ్యానూ కాదు,

అవి దీపాలూ కావు.ఆవిధంగా ఔపచారికంగా ఫ్యాన్ మొదలైన వన్నీ విద్యుచ్ఛక్తిలో ఉన్నా యని చెప్పడం ఎలాంటిదో భూతా లన్నీ సర్వవ్యాప్త మైన ఆత్మలో ఉన్నా యని చెప్పడం కూడ అలాంటిదే). భూతా లన్నింటికీ నేనే ఆత్మను అని చెప్పడంచేత నేను భూతాలలో ఉన్నా నని మూఢబుద్ధులకు కనబడవచ్చును(వాళ్లు అనుకొనవచ్చును). అందుచేత చెవుతున్నాను-నేను ఆ భూతాలలో లేను.మూర్తవస్తువునకు (ఆకారం ఉన్నవస్తువు నకు)ఉన్నట్లు నాకు ఏ వస్తువుతోను సంశ్లేషం ఉండదు.నేను ఆకాశంకంటె లోపలివాడను. సంబంధించని వస్తువు దేనిలోను ఆధేయంగా ఉండదు కదా!అందుచేత నేను వాటిలో లేను అని అర్థం). 4

భాష్యమ్

అతః ఏవ అసంసర్గిత్వాత్ మమ-

మూ. న చ మత్స్థాని భూతాని పశ్య మే యోగమైశ్వరమ్,
భూతభృన్న చ భూతస్థో మమాత్మా భూతభావనః. 5

బాలానందిని

అతః ఇతి:- నేను దేనితోనూ కలవను గాన-

ప్ర.అ. **నేతి**:- భూతాని చ=భూతాలు కూడ,మత్స్థాని=నాలో ఉన్నవి,న=కాదు. మే=నాయొక్క, ఐశ్వరమ్=ఈశ్వరునికి సంబంధించిన,యోగం=తత్త్వమును,పశ్య= చూడుము.భూతభావనః=భూతాలను పుట్టించే.మమ ఆత్మా=నా ఆత్మ,భూతభృత్=భూతాల ను భరిస్తూన్నది;భూతస్థః=భూతములలో ఉన్నది,న చ=కాదు కూడ.

భాష్యమ్

న చ మత్స్థాని భూతాని బ్రహ్మాదీని పశ్య మే యోగం యుక్తిం ఘటనం,మమ ఐశ్వరమ్ ఈశ్వరస్య ఇమమ్ ఐశ్వరం యోగమ్,ఆత్మనః యథాత్మ్యమ్ ఇత్యర్థః.తథా చ శ్రుతిః అసంసర్గిత్వాత్ అసంగతాం దర్శయతి-"అసంగో న హి సజ్జతే"(బృ.ఉ.3.9.26) ఇతి.ఇదం చ ఆశ్చర్యమ్ అన్యత్ పశ్య భూతభృత్ అసంగః అపి సన్ భూతాని బిభర్తి, న చ భూతస్థః,యథోక్తేన న్యాయేన దర్శితత్వాత్ భూతస్థత్వాను పపత్తేః కథం పునరుచ్యతే "అసౌ మమ ఆత్మా"ఇతి?విభజ్య దేహాదిసంఘాతం తస్మిన్ అహంకారమ్ అధ్యారోప్య లోకబుద్ధిమ్ అనుసరన్ వ్యపదిశతి "మమ ఆత్మా"ఇతి.న పునః ఆత్మనః ఆత్మా అన్యః ఇతి లోకవత్ అజానన్.తథా భూతభావనః-భూతాని భావయతి ఉత్పాదయతి వర్ధయతీతి వా భూతభావనః. 5

బాలానందిని

న చేతి:- బ్రహ్మాదిభూతాలు నాలో లేవు కూడ. నాయొక్క ఈ యోగాన్ని,యుక్తిని, ఘటనను చూడుము. నాయొక్క ఈశ్వరునికి సంబంధించిన అనగా ఈశ్వరుడనైన నాకు సంబంధించిన, యోగాన్ని,అనగా ఆత్మయొక్క యథార్థస్వరూపాన్ని అని అర్థం. అందుచేతనే **"అసంగో న హిసజ్జతే"**(సంగంలేని ఆత్మ దేనితోను సక్తము కాదు)అను శ్రుతి ఆత్మ సంసర్గం లేని దవడంవల్ల దేనితోను సంగమును పొందదు అని చెప్పుచున్నది. ఈ మరొక ఆశ్చర్యం కూడ చూడుము-భూతభృత్తు,అనగా భూతాలను భరించేది, అయినా కూడ(నా ఆత్మ)భూతములలో లేదు. పైన చూపిన న్యాయం ప్రకారం భూతస్థత్వం కుదరదు అని చూపబడినది కదా?"ఇది నా ఆత్మ"అని ఎలా చెప్పబడుచున్నది?దేహాదిసంఘాతాన్ని వేరు చేసి,దానియందు అహంకారాన్ని ఆరోపించి(దేహాదిసంఘాతమే నేను అన్నట్లు ఆరోపించి) లోకబుద్ధిని అనుసరిస్తూ "నా ఆత్మ"అని అంటున్నాడు. అంతే కాని తనకంటె వేరుగా మరొక ఆత్మ ఉన్న దని లోకుల వలె అజ్ఞానంవల్ల అనడం లేదు.(నేను అని దేహాదిసంఘాతాన్ని నిర్దేశిస్తూ 'నా ఆత్మ'అని సర్వవ్యాప్తమైన ఆత్మ అనే అభిప్రాయంతోనే అంటున్నాడు కాని,తాను అనగా జీవు దనీ,తనకంటె(జీవునికంటె)భిన్నమైన ఆత్మ ఉన్న దనీ అభిప్రాయంతో కాదు అని అర్థం). అట్లే భూతభావనము,భూతాలను పుట్టిస్తుంది లేదా వృద్ధి పొందిస్తుంది గాన భూతభావనం. 5

భాష్యమ్

యథోక్తేన శ్లోకద్వయేన ఉక్తమ్ అర్థం దృష్టాన్తేన ఉపపాదయన్ ఆహ-

మూ. యథాకాశస్థితో నిత్యం వాయుః సర్వత్రగో మహాన్,
తథా సర్వాణి భూతాని మత్స్థానీత్యుపధారయ. 6

బాలానందిని

యథేతి:- పైన చెప్పిన శ్లోకద్వయంచేత చెప్పబడిన అర్థాన్ని దృష్టాంతంచేత సమర్థిస్తూ చెపుతున్నాడు.

ప్ర. అ. యథేతి:- సర్వత్రగః=అంతటికీ వెళ్లేది,మహాన్=గొప్పదీ అయిన,వాయుః = వాయువు,యథా=ఏ విధంగా,నిత్యమ్=ఎల్లప్పుడూ,ఆకాశస్థితః=ఆకాశంలో ఉన్నదో, తథా=అట్లు,సర్వాణి=సమస్తమైన,భూతాని=భూతములు,మత్స్థాని ఇతి=నాయందు ఉన్నవి అని,ఉపధారయ=గ్రహించుము.

భాష్యమ్

యథా లోకే,ఆకాశస్థితః ఆకాశే స్థితః,నిత్యం సదా,వాయుః సర్వత్ర గచ్ఛతీతి సర్వత్రగః,మహాన్ పరిమాణతః,తథా ఆకాశవత్ సర్వగతే మయి అసంశ్లేషేణైవ స్థితాని ఇత్యేవమ్ ఉపధారయ జానీహి. 6

బాలానందిని

యథేతి:- ఏ విధంగా లోకంలో,అంతటా ప్రసరించేది,గొప్ప పరిమాణం గలదీ అయిన వాయువు ఎల్లప్పుడూ ఆకాశంలో ఉంటుందో అట్లే(సమస్తభూతములు)ఆకాశం వలె అంతటా వ్యాపించి ఉన్ననాయందు,సంశ్లేషం లేకుండానే (నన్ను అంటుకొనకుండానే ఉన్నాయి అని తెలుసుకొనుము.

భా.అ.ప్ర. ఇక్కడ శ్రీరామానుజాచార్యులు –"అంతర్యామి నైన నాచేత సమస్తమూ వ్యాపించబడింది.సమస్తజగత్తుయొక్క ఉనికి నా అధీనంలో ఉన్నది గాన సమస్తమూ కూడ నాయం దున్నది.నా స్థితి వాటి అధీనం కాదు గాన నేను వాటిలో లేను.భూతాలు నాలో,ఘటంలో ఉదకం ఉన్నట్లు లేవు;ఆధారం లేని ఆకాశంలో కూడ నా ఆలంబనంచేత వాయువు ఏ విధంగా ఉంటుందో అదే విధంగా అంతా నాలో ఉంటున్నది"అని ప్రతి పాదించారు.ఇది అయుక్తం.అంతర్యామి సమస్తజగత్తుయొక్క లోపలనే వ్యాపించి ఉండ గలడు,బైట కూడ ఉండజాలడు.వాని పేరే అంతర్యామి కదా?ఈశ్వరుడు లోపల మాత్రమే వ్యాపించి ఉంటా డని చెప్పడం "అన్తర్బహిశ్చతత్సర్వం వ్యాప్య నారాయణః స్థితః"అను శ్రుతికి విరుద్ధం.సర్వవ్యాపి యైన ఈశ్వరుడు లోపలమాత్రమే ఉంటాడు అని సంకోచం చేయడం అన్యాయం కూడ.అంతర్యామి కాక మరొక డెవడూ బైట వ్యాపించి ఉన్నవాడు లేడు కదా?అలా ఉంటే ఒక ఈశ్వరుడు అంతర్వ్యాపి మరొకడు బహిర్వ్యాపి అని ఇద్దరు ఈశ్వరు లున్నా రని చెప్పవలసి వస్తుంది.

స్థావరజంగమాత్మకా లైన భూతాల స్థితి జీవాధీనమే కాని అంతర్యామ్యధీనం కాదు."జీవాపేతం వావ కిలేదం శరీరం మ్రియతే"(జీవరహిత మైతే ఈ శరీరం మరణి స్తుంది)అని శాస్త్రం చెపుతూన్నది.అంతర్యామి తొలగిపోవడంచేతనే మరణం కలుగుతుంది అననడానికి వీలులేదు.అంతర్యామి అచేతనాలలో కూడ ఉంటాడు గాన మృతశరీరం నుండి గాని,భస్మంనుండి గాని అంతర్యామి తొలగిపోవడం అసంభవం.

జీవుని స్థితి కూడ అంతర్యామిమీదనే ఆధారపడి ఉంది అనడం కుదరదు;నిత్యుడైన జీవుని స్థితి పరాధీనం అవడానికి వీలులేదు.జీవుడూ పరతంత్రుడే కదా అనడం కూడ కుదరదు;జీవుని పారతంత్ర్యం బుద్ధిని పట్టి వచ్చినది.అచేతనం చేతనపరతంత్రం అవు తుంది కాని చేతనుడు స్వతంత్రుడే.మూలకారుడు చెప్ప దలచుకున్నది ఇదే అయితే

"మద్వశాని తు భూతాని న చాహం తద్వశః పునః" అని చెప్పి ఉండేవాడు.ఘటంలో జలం ఉన్నట్లు భూతాలు ఈశ్వరునిలో లేవు అనడం కూడ యుక్తం కాదు,విశ్వరూపంలో భూతాలు ఈశ్వరునియందు ఆ విధంగానే ఉన్నాయి కదా.అలాగే విశ్వరూపం చూప బోతున్నాడు.నీ మతంలో చిదచిద్విశిష్టు డైన సాకారుడే ఈశ్వరుడు గాన విశ్వరూపుడు కూడ ఈశ్వరుడే కదా?సర్వాధికారము,తనకు మరొక ఆధారాన్ని అపేక్షించనిదీ అయిన వాయువు నిరాలంబమైనా కూడ ఆకాశంలోనే ఉండడం సంభవమే గాన అది ఈశ్వరుని చేత ధరించబడింది అను విశేషణం ఎందుకు?వాయువు ఈశ్వరునిచేత ధరించబడకపోతే మాత్రం నిరాలంబన మైన ఆకాశంలో కాక మరెక్క డుంటాడో చెప్పు.

వాయువు ఆకాశంలో ఉన్నట్లు భూతాలు నాలో ఉన్నాయి అని మాత్రమే మూలంలో ఉండగా "నా చేతనే ధరించబడిన వాయువు"అని మూలంలో లేనిదానిని కల్పించడంలో మూలం లేదు,ప్రమాణం లేదు,అయుక్తం కూడ.దార్ష్టాంతికం విషయంలో **"తథా మత్స్థాని భూతాని మద్గతానీతి భావయ"**అని మూలంలో లేదు కదా?ఆకాశంలో ఉన్న వాయువును ఈశ్వరుడే నిలిపి నట్లు ఈశ్వరునిలో ఉన్న జగత్తును ఈశ్వరుడు ధరిస్తున్నాడు (నిలుపుతున్నాడు)అని చెప్పడం కూడ అయుక్తం.దృష్టాంతంలో ఈశ్వరధృతమైన వాయువు ఈశ్వరునిలో లేదు కదా?అది ఈశ్వరునికంటె భిన్నమైన ఆకాశంలో ఉంటుంది. దార్ష్టాంతికంలో నైతే ఈశ్వరధృతాలైన భూతాలు ఈశ్వరునియందే ఉన్నాయి గాన ఈ రెండింటికి దృష్టాంతదార్ష్టాంతికభావం ఎలా కుదురుతుంది?లోపల ఉన్న ఈశ్వరునిచేత ధరింపబడినవి ఈశ్వరునిలో ఉండడం మాత్రం ఎట్లు?ఈశ్వరుడు బైట లేనే లేదు కదా?వెనుక "అంతర్యామి నైన నాచేత వ్యాప్త మైనది"అని నువ్వే చెప్పావు కదా? ఈశ్వరుడు బైట కూడ ఉన్నట్లయితే అప్పుడు వాయువుకు ఆకాశం వలె భూతాలకు ఆధారం ఎలాగా అవుతాడు,అప్పుడు ఈశ్వరునిచేత ధరింపబడి నట్లు వర్ణించడం ఎందుకు?

మరొక విషయం - ఈశ్వరునిచేత ధరింపబడడంచేతనే వాయువు ఆకాశంలో ఉంది అని చెప్పబడింది.ఆ ఆకాశం దేనిచేత ధరించబడింది?ఎక్కడ ఉంది?మనకు తెలియని ఆ విషయాన్నే సర్వజ్ఞుడు మనకు చెప్పాలి.వాయువు ఆకాశంలో ఉన్న దనే విషయం ప్రత్యక్షంగా అందరికీ తెలిసినదే.ఆకాశం ఈశ్వరునిచేత ధరింపబడి ఈశ్వరునియందు ఉన్నది అని అభిప్రాయ మైతే,దార్ష్టాంతికాన్ని అనుసరించి దానినే ఇక్కడ దృష్టాంతంగా ఇచ్చి ఉండాలి.

'మమ ఆత్మా" అనగా "నా సంకల్పం"అని ఇతడు చెప్పినది కూడ అసంగతమే.ఆత్మ శబ్దంయొక్క ముఖ్యార్థాన్ని విడవడంలో కారణం లేదు.భూతభావనం అనే క్రియలో ఆత్మ కర్త;సంకల్పం హేతువు మాత్రమే.కర్త యైన ఆత్మను విడచి సంకల్పం భూతభావనకర్త అని వర్ణించడం అయుక్తం. ఇలా చెప్ప దలచుకుంటే వ్యాసుడు **"ఆత్మనా భూతభావనః"**

అని ఉండేవాడు. నా సంకల్పమాత్రమే భూతభావనం, ఇంక నా మాట చెప్పాలా అని అర్థాపత్తిని సూచించడం. కోసం "మమాత్మా భూతభావనః"అని చెప్పబడింది అనడం కూడ యుక్తం కాదు. సంకల్పం లేకపోతే ఈశ్వరునికి భూతభావనత్వమే కుదరదు. "తదైక్షత బహు స్యాం ప్రజాయేయ"అను శ్రుతి సృష్టి సంకల్పపూర్వకంగా జరిగినది అని చెప్పుచున్నది. అందుచేత-"వసుదేవసుతు డను, కనబడుతూన్న అవయవసంనివేశం కలవా డను, పురుషు డను అయిన నాయొక్క ఆత్మయైన, స్వరూపమైన సచ్చిదానందరూపమైన పరమాత్మ"అను శంకరాచార్యోక్తార్థమే సమీచీన మైనది. (భా. అ. ప్ర. పే. 116-117)6

భాష్యమ్

ఏవం వాయుః ఆకాశే ఇవ మయి స్థితాని సర్వభూతాని స్థితికాలే; తాని-

మూ. సర్వభూతాని కౌన్తేయ ప్రకృతిం యాన్తి మామికామ్,
కల్పక్షయే పునస్తాని కల్పాదౌ విసృజామ్యహమ్. 7

బాలానందిని

ఏవమితి:- ఈ విధంగా వాయువు ఆకాశంలో ఉన్నట్లు, స్థితికాలంలోసర్వ భూతాలు నాలోనే ఉంటాయి. ఆ-

ప్ర. అ. సర్వేతి:- కౌన్తేయ=అర్జునా! సర్వభూతాని=సమస్తభూతాలు, కల్పక్షయే=కల్పాంతమునందు, మామికామ్=నాకు సంబంధించిన, ప్రకృతిమ్=ప్రకృతిని, యాన్తి=పొందును, కల్పాదౌ=కల్పప్రారంభంలో, పునః=మరల, తాని=వాటిని, అహమ్=నేను, విసృజామి=పుట్టిస్తాను.

భాష్యమ్

సర్వభూతాని, కౌన్తేయ, ప్రకృతిం త్రిగుణాత్మకామ్ అపరాం నికృష్టాం, యాన్తి, మామికాం మదీయాం, కల్పక్షయే ప్రలయకాలే. పునః భూయః తాని భూతాని ఉత్పత్తి కాలే కల్పాదౌ, విసృజామి ఉత్పాదయామి. అహం పూర్వవత్. 7

బాలానందిని

సర్వభూతానీతి:- (అ) సర్వభూతములు, అర్జునా! ప్రలయకాలంలో నాకు సంబంధించిన త్రిగుణాత్మకమైన, నికృష్టమైన అపరప్రకృతిని చేరుతాయి. మళ్లీ కల్పప్రారంభంలో, ఉత్పత్తికాలంలో, ఆ భూతాలను నేను, వెనుకటివలెనే, వెనుకటి కల్పంలో వలెనే, సృష్టిస్తాను. 7

భాష్యమ్

ఏవమ్ అవిద్యాలక్షణామ్-

మూ. ప్రకృతిం స్వామవష్టభ్య విసృజామి పునః పునః,
భూతగ్రామమిమం కృత్స్నమవశం ప్రకృతేర్వశాత్. 8

బాలానందిని

ఏవమితి:- ఈ విధంగా అవిద్యారూపమైన -

ప్ర.అ. ప్రకృతమితి:- స్వామ్=నాదైన,ప్రకృతిమ్=ప్రకృతిని,అవష్టభ్య=ఊతగా గొని,(వశం చేసికొని),ప్రకృతేః=స్వభావముయొక్కవశాత్=వశంవలన,అవశమ్=తన వశములో లేని,కృత్స్నమ్=సమస్తమైన,ఇమమ్=ఈ, భూతగ్రామమ్=భూతసముదాయమును,పునః పునః =మాటిమాటికి,విసృజామి=సృష్టిస్తూంటాను.

భాష్యమ్

ప్రకృతిం,స్వాం స్వీయామ్,అవష్టభ్య వశీకృత్య,విసృజామి పునః పునః ప్రకృతితః జాతం భూతగ్రామం భూతసముదాయమ్,ఇమం వర్తమానం,కృత్స్నం సమగ్రమ్, అవశమ్ అస్వతన్త్రం,అవిద్యాదిదోషైః పరవశీకృతం,ప్రకృతేః వశాత్ స్వభావవశాత్. 8

బాలానందిని

ప్రకృతిమితి:- నాదైన ప్రకృతిని వశం చేసికొని,స్వభావవశంచేత అవిద్య మొదలైన దోషాలకు పరవశమై అస్వతంత్రమై ఉన్న,ప్రకృతినుండి పుట్టిన,సమస్తమైన ఈ వర్తమాన భూతసముదాయాన్ని మాటిమాటికి సృజిస్తూంటాను. 8

భాష్యమ్

తర్హి తే పరమేశ్వరస్య భూతగ్రామం విషమం విదధతః తన్నిమిత్తాభ్యాం ధర్మాధర్మాభ్యాం సంబన్ధః స్యాత్ ఇతి?ఇదమాహ భగవాన్-

మూ. న చ మాం తాని కర్మాణి నిబధ్నన్తి ధనంజయ,
ఉదాసీనవదాసీనమసక్తం తేషు కర్మసు. 9

బాలానందిని

తర్హీతి:- అయితే,సమంగా లేని భూతగ్రామాన్ని ఆ విధంగా సృష్టించవల్ల కలిగిన ధర్మాధర్మాలతో పరమేశ్వరుడ వైన నీకు సంబంధం ఉంటుంది?(ఇట్లు ఆశంకించుకొని) భగవంతు డిట్లంటున్నాడు-

ప్ర.అ. నేతి:- ధనంజయ=అర్జునా!ఉదాసీనవత్=ఉదాసీనుడువలె;ఆసీనమ్= కూర్చున్నవాడను,తేషు=ఆ,కర్మసు=కర్మలయందు,అసక్తమ్=ఆసక్తి లేనివాడను అయిన, మామ్=నన్ను,తాని కర్మాణి=ఆ కర్మలు,న నిబధ్నన్తి=బంధించవు.

భాష్యమ్

న చ మామ్ ఈశం తాని భూతగ్రామస్య విషమవిసర్గనిమిత్తాని కర్మాణి నిబధ్నన్తి, ధనంజయ. తత్ర కర్మణామ్ అసంబద్ధత్వే కారణమ్ ఆహ–ఉదాసీనవత్ ఆసీనం,యథా ఉదాసీనః ఉపేక్షకః కశ్చిత్ తద్వత్ ఆసీనమ్;ఆత్మనః అవిక్రియత్వాత్, అసక్తం ఫలాసంగరహితమ్,అభిమానవర్జితమ్"అహం కరోమి"ఇతి తేషు కర్మసు. అతః అన్యస్యాపి కర్తృత్వాభిమానాభావః ఫలాసంగాభావశ్చ అబన్ధకారణమ్;అన్యథా కర్మభిః బధ్యతే మూఢః కోశకారవత్ ఇత్యభిప్రాయః. 9

బాలానందిని

న చేతి:- ధనంజయా! భూతసముదాయాన్ని విషమంగా సృష్టించడంవల్ల కలిగే కర్మలు ఈశ్వరుడ వైన నన్ను బంధించవు. ఆ కర్మలతో సంబంధం లేకపోవడానికి కారణం చెపుతున్నాడు–ఉదాసీనవదాసీనమ్. ఒక ఉదాసీనుడు, ఉపేక్షకుడు(దగ్గర ఉండి చూస్తూండే వాడు)ఎట్లో అట్లు కూర్చున్నవాడను,ఆత్మ వికారరహితం కదా?ఆ కర్మల విషయంలో నేను చూస్తున్నాను అను అహంకారం లేనివాడను,ఫలాసక్తి లేనివాడను. అందువల్ల లోకంలో ఇతరునికి కూడ కర్తృత్వాభిమానం లేకపోతే,ఫలాసంగం లేకపోతే బంధం కలగదు. అట్లు కాని పక్షంలో (గూడు కట్టుకొని దానిలోనే మరణించే)కోశకారక్రిమి వలె ఆ మూఢుడు కర్మలచేత బద్ధు డవుతాడు అని అభిప్రాయం. 9

భాష్యమ్

తత్ర"భూతగ్రామమ్ ఇమం విసృజామి","ఉదాసీనవత్ ఆసీనమ్"ఇతి చ విరుద్ధమ్ ఉచ్యతే ఇతి, తత్పరిహారార్థమ్ ఆహ–

మూ. మయాఽధ్యక్షేణ ప్రకృతిః సూయతే సచరాచరమ్,
హేతునానేన కౌన్తేయ జగద్విపరివర్తతే. 9

బాలానందిని

తత్రేతి:- అయితే–"నేను ఈ భూతగ్రామాన్ని సృజిస్తున్నాను"అని, "ఉదాసీనుడు వలె ఉన్నాను"అనీ ఇది విరుద్ధంగా చెప్పబడుచున్నది. దీనిని(విరోధాన్ని)పరిహరించడం కోసం చెపుతున్నాడు–

ప్ర.అ. మయేతి:- అధ్యక్షేణ=అధ్యక్షుడనైన,మయా=నాచేత(నేను అధ్యక్షుడుగా ఉండగా), ప్రకృతిః=ప్రకృతి,సచరాచరమ్=చరాచరములతో కూడిన జగత్తును,సూయతే= పుట్టించుచున్నది. కౌన్తేయ=అర్జునా!అనేన హేతునా=ఈ కారణంచేత,జగత్=జగత్తు, విపరివర్తతే=నడుస్తూంటుంది.

భాష్యమ్

మయా సర్వతః దృశిమాత్రస్వరూపేణ అవిక్రియాత్మనా అధ్యక్షేణ,మమ మాయా త్రిగుణాత్మికా అవిద్యాలక్షణా ప్రకృతిః,సూయతే ఉత్పాదయతి,సచరాచరం జగత్.తథా చ మన్త్రవర్ణః-**"ఏకో దేవః సర్వభూతేషు గూఢః సర్వవ్యాపీ సర్వభూతాన్తరాత్మా, కర్మాధ్యక్షః సర్వభూతాధివాసః సాక్షీ చేతా కేవలో నిర్గుణశ్చ"**(శ్వే.ఉ.6.11)ఇతి. హేతునా నిమిత్తేన అనేన అధ్యక్షత్వేన,కౌన్తేయ,జగత్ సచరాచరం వ్యక్తావ్యక్తాత్మకం విపరివర్తతే, సర్వావస్థాసు దృశికర్మత్వాపత్తినిమిత్తా హి జగతః సర్వా ప్రవృత్తిః "అహమిదం భోక్ష్యే, పశ్యామి ఇదమ్,శృణోమి ఇదమ్,సుఖమ్ అనుభవామి, దుఃఖమ్ అనుభవామి, తదర్థమ్ ఇదం కరిష్యామి,ఏతదర్థమ్ ఇదం కరిష్యే,ఇదం జ్ఞాస్యామి"ఇత్యాద్యా అవగతినిష్ఠా, అవగత్యవసానైవ.**"యో అస్యాధ్యక్షః పరమే వ్యోమన్"**(ఋ.సం.10.12.9.7; తై.బ్రా.2.8.9.)ఇత్యాదయశ్చ మన్త్రాః ఏతమర్థం దర్శయన్తి.తతశ్చ ఏకస్య దేవస్య సర్వాధ్యక్షభూతచైతన్యమాత్రస్య,పరమార్థతః సర్వభోగానభిసంబన్ధినః అన్యస్య చేతనాన్తరస్య అభావే భోక్తుః అన్యస్య అభావాత్.కింనిమిత్తా ఇయం సృష్టిః ఇతి అత్ర ప్రశ్నప్రతివచనే అనుపపన్నే,**"కో అద్ధా వేద క ఇహ ప్రవోచత్,కుత ఆజాతా కుత ఇయం విసృష్టిః"**(ఋ.సం.10.129.6;తై.బ్రా.2.8.9)ఇత్యాదిమన్త్రవర్ణేభ్యః.దర్శితం చ భగవతా-"అజ్ఞానేనావృతం జ్ఞానం తేన ముహ్యన్తి జన్తవః"(5.15) ఇతి. 10

బాలానందిని

మయా ఇతి:- అంతటా వ్యాపించి ఉన్న,దృశిమాత్ర(చైతన్యమాత్ర)స్వరూపుడనైన,వికారరహితఆత్మ యైన అధ్యక్షుడ నైన నాచేత(అనగా ఇలాంటి నేను అధ్యక్షుడుగా ఉండగా),నా మాయ,త్రిగుణాత్మకము,అవిద్యారూపము అయిన ప్రకృతి,చరాచరములతో కూడిన జగత్తును పుట్టించుచున్నది.అట్లే "ఏకో దేశః....నిర్గుణశ్చ"అను మంత్రవర్ణం చెప్పుచున్నది."సర్వభూతములలోను గూఢంగా ఉన్న,సర్వవ్యాపి,సర్వభూతాల అంతరాత్మ అయిన దేవుడు(ఆత్మ)ఒక్కడే. ఈ ఆత్మయే కర్మలకు అధ్యక్షుడు;సమస్తభూతాల నివాసస్థానం, సాక్షి,చిత్స్వరూపము,కేవలం,నిర్గుణం కూడ"అని దీని అర్థం).కౌన్తేయా! నిమిత్తమైన ఈ అధ్యక్షత్వంచేత చరాచరములతో కూడిన,వ్యక్తావ్యక్తాత్మక మైన ఈ జగత్తు నడుస్తూన్నది. అన్ని అవస్థలయందూ కూడ జగత్తుయొక్క సమస్త మైన ప్రవృత్తీ దృక్కు కర్మగా అవడమే నిమిత్తంగా కలది కదా?(దృక్కు కర్మగా అవడమే అన్ని ప్రవృత్తులకు మూలం కదా!)నేను దీనిని తింటాను,ఇది చూస్తున్నాను,ఇది వింటున్నాను,ఈ సుఖం అనుభవిస్తున్నాను,ఈ దుఃఖం అనుభవిస్తున్నాను,దానికోసం ఇది చేస్తాను,దీనికోసం ఇది చేస్తాను,ఇది తెలుసుకొంటాను"ఈ మొదలైన జగత్ప్రవృత్తి అవగతియందే జ్ఞానమునందే నిలిచి ఉంటూన్నది; అవగతియందే అంతం పొందుతూన్నది.**"యః అస్యాధ్యక్షః వరమే వ్యోమన్"**

(పరమాకాశమునందు దీనికి (జగత్తుకు)ఎవడు అధ్యక్షుడుగా ఉన్నాడో)ఇత్యాదిమంత్రాలు ఈ విషయాన్నే చూపుతున్నాయి.

వి:- అద్వైతసిద్ధాంతానికి సంబంధించిన ఒక ప్రధాన మైన విషయాన్ని శ్రీభగవత్పాదులు ప్రతిపాదిస్తున్నారు.నేను అధ్యక్షుడనుగా ఉండగా ప్రకృతి జగత్తును సృష్టిస్తూన్నది అని ఈ శ్లోకంలో చెప్పబడింది.ఒకడు పైన పర్యవేక్షణం చేస్తూండగా వాని క్రిందివాడు అతడు చెప్పిన విధంగా ఏదో ఒక కార్యం నిర్వహించడం వంటిది కాదు ఇది.నిర్గుణము, నిర్వికారము అయిన పరబ్రహ్మ సాక్షిగా ఉంటూండగా అనాదిగా నడుస్తూన్న జగత్సృష్టి-ప్రలయచక్రం ఇది.ఇది అనంతం.

ద్రష్ట (చూచేవాడు,తెలుసుకొనేవాడు)దృశ్యం (చూడబడేది-తెలియబడేది)అని రెండున్నాయి.వీటి మధ్య 'దృక్'అనేది ఉంది.దీనికి చూచుట,తెలివి అని అర్థం.ఇది చాలా ప్రధానమైనది.ఇది లేకపోతే ద్రష్టా లేదు దృశ్యమూ లేదు.ఈ 'దృక్-దృక్శక్తి,చిత్, చైతన్యం,చేతన ఇత్యాది నామాంతరాలతో కూడ వ్యవహరింపబడుతుంది. జగత్తులోని ఆ యా పదార్థాలు ఈ 'దృక్'కు(తెలియడం అనే క్రియకు)కర్మగా అయి నప్పుడే జగద్వ్యవహారం అంతా నడుస్తూంటుంది."నేను వినుచున్నాను,చూస్తున్నాను, అనుభవిస్తున్నాను, ఇది సాధించడంకోసం ఈ పని చేస్తాను"అని ఒకడు అనుకొంటున్నా డంటే ఆ యా పదార్థాలు 'దృక్'కు విషయాలయ్యా యని అర్థం. చూడడం, వినడం మొదలైన వాటిలో అన్నింటిలోనూ తెలివి(జ్ఞానం)అనుస్యూతంగా ఉంది.తెలుసుకొనడం అనే క్రియలో ఆ యా పదార్థాల కర్మ లయ్యాయి."నేను ఈ చిత్తరువును చూస్తున్నాను"అన్నప్పుడు చూడడం అనే జ్ఞానంలో చిత్తరువు కర్మ అయింది.భాష్యంలోని "దృశికర్మత్వాపత్తినిమిత్తా"అను పదానికి ఇదే అర్థం.ఈ దృశికర్మత్వాపత్తి సర్వావస్థలలోను, జాగ్రదాద్యవస్థలలో, బాల్యాద్యవస్థలలో, సృష్టి-స్థితి-సహారావస్థలలో నిరంతరం కనబడుతున్నది.ఇది లేకపోతే పుణ్యపాపాదిరూప కర్మాచరణం గాని,తత్ఫలానుభవం కాని,దానికోసం జగత్సృష్ట్యాదికం గాని లేదు.అందుచేత ఈ దృక్శక్తియే జగద్వ్యవహారా న్నంతనీ నడిపిస్తూన్నది.ఇదే శుద్ధచిద్రూపమైన ఆత్మ.ప్రకృతి సచరాచరజగత్తును పుట్టించడానికి ఆత్మ అధ్యక్షంగా ఉన్నది అనడానికి ఇదే భావం.

దృశ్యం అనగా జడపదార్థం.ద్రష్ట అంతఃకరణం.ఇది కూడ వాస్తవంలో జడ పదార్థమే అయినా ఇది సహజంగా అతి స్వచ్ఛస్వభావం కలది అవడంచేత చైతన్యచ్ఛాయ అధికంగా సంక్రమించి,చైతన్యాభాసరూపమై ద్రష్ట అవుతున్నది. పైన చూచిన విధంగా 'దృక్'మాత్రం,(పరిశుద్ధచైతన్యం మాత్రం)వాస్తవంలో నిర్వికారం,ఉదాసీనం. అందుచేత 'భూతగ్రామమిమమ్ విసృజామి'అని చెప్పినది ఔపచారికమే."ఉదాసీనవదాసీనమ్"అన్నదే యథార్థం.అందుచేత ఈ వాక్యాలకు పరస్పరవిరోధం లేదు.

తతశ్చేతి:-ఈ విధంగా-సర్వాధ్యక్ష మైన చైతన్యమాత్రస్వరూపుడు,ఒకే ఒకడు అయిన దేవుడు,పరమాత్మ ఏ భోగాలతోను సంబంధం లేనివాడుగా ఉండగా,మరొక చేతనపదార్థం

లేనప్పుడు మరొక భోక్త ఎవడూ లేనే లేడు గాన ఈ సృష్టికి నిమిత్తం ఏమిటి అని అంటూ ప్రశ్న,ప్రతివచనమూ కూడ అర్థరహితములే.(అనగా ఈ సృష్టి స్వరూపాన్ని గాని,దీని ప్రయోజనాదులను గాని చెప్పడానికి శక్యం కాదు గాన ఇదంతా మాయాకల్పితమే, అనిర్వచనీయమే,ఏకైకసత్యం శుద్ధచైతన్యమే అని అర్థం). ఈ విషయాన్ని "కో అద్ధా....విసృష్టిః "(ఈ పరమాత్మను తెలుసుకొన్నవా డెవడు!ఎవడు చెప్పగలడు!ఈ సృష్టి ఎక్కడినుండి వచ్చింది,ఎందుకు వచ్చింది)ఇత్యాదిమంత్రవర్ణాలు చెపుతున్నాయి. అందుచేతనే భగవంతుడు **"అజ్ఞానేనావృతం జ్ఞానం తేన ముహ్యన్తి జన్తవః"**అని చెప్పినాడు. (అనగా ఈ జగత్సృష్ట్యాదికం కేవలం మాయాకల్పితమే అని సూచించి ఉన్నాడు అని భావం). 10

భాష్యమ్

ఏవం మాం నిత్యశుద్ధముక్తస్వభావం సర్వజన్తూనామ్ ఆత్మానమపి సన్తమ్-

మూ. అవజానన్తి మాం మూఢా మానుషీం తనుమాశ్రితమ్,
పరం భావమజానన్తో మమ భూతమహేశ్వరమ్. 11

బాలానందిని

ఏవమితి:- ఈ విధంగా నిత్యశుద్ధముక్తస్వభావుడనై,సర్వప్రాణుల ఆత్మగా ఉన్నా కూడ నన్ను-

ప్ర.అ. అవజానన్తీతి:- మమ=నాయొక్క,భూతమహేశ్వరమ్=సర్వభూతాలకు గొప్ప ఈశ్వరుడైన,పరమ్=అత్యుత్తమ మైన,భావమ్=తత్త్వమును,అజానన్తః=ఎరుగనివారై, మూఢాః =మూఢులు,మానుషీమ్=మనుష్యసంబంధ మైన,తనుమ్=శరీరమును,ఆశ్రితమ్= ఆశ్రయించిన,మామ్=నన్ను,అవజానన్తి=అనాదరం చేస్తూంటారు.

భాష్యమ్

అవజానన్తి అవజ్ఞాం పరిభవం కుర్వన్తి,మాం,మూఢాః అవివేకినః మానుషీం మనుష్యసబన్ధినీమ్,తనుం దేహమ్,ఆశ్రితం,మనుష్యదేహేన వ్యవహరన్తమ్ ఇత్యేతత్; పరం ప్రకృష్టం,భావం పరమాతత్త్వమ్,ఆకాశకల్పమ్,ఆకాశాదపి అన్తరతరమ్,అజానన్తః మమ.భూతమహేశ్వరం భూతానాం మహాన్తమ్ ఈశ్వరమ్,స్వమ్ ఆత్మానమ్,తతశ్చ తస్య మమ అవజ్ఞానభావనేన ఆహతాః వరాకాః తే. 11

బాలానందిని

అవజానన్తీతి:-వివేకశూన్యులైన మూఢులు.మనుష్యసంబంధ మైన దేహాన్ని ఆశ్రయించిన,మనుష్యదేహంతో వ్యవహరిస్తూన్న(కార్యకలాపాలు సాగిస్తూన్న)అని అర్థం;

నన్ను అనాదరం చేస్తున్నారు. నాయొక్క ఆకాశంతో సమానము, ఆకాశంకంటె కూడ ఎక్కువ అంతరము(లోపల ఉండేది), తమ ఆత్మతత్త్వమే అయిన, ప్రకృష్ట మైన భావాన్ని, పరమాత్మ తత్త్వాన్ని తెలుసుకొనక. అందువల్ల నా విషయంలో నిరంతరమైన అనాదరభావం ఉండడం చేత, ఆ వరాకులు(ఎవరిని గూర్చి శోచించాలో, జాలిపడాలో వాళ్లు వరాకులు)చాలా నష్ట పడుచున్నారు.

భా. అ. ప్ర.:- "అసక్తం తేషు కర్మసు"అన్నదానికి "వైషమ్యానికి కారణమైన సంబంధం లేనివాడను"అని, "మయా అధ్యక్షేణ"అన్నదానికి "సత్యసంకల్పుడను, చూస్తూన్న వాడను అయిన నాచేత చూడబడిన"అనీ, "వశ్య మే యోగమైశ్వరమ్"అన్నప్పుడు"వసు దేవునికుమారుడ నైన నాయొక్క సత్యసంకల్పత్వం, దయారాహిత్యాదిదోషాలు లేకపోవడం ఇత్యాదికమైన యోగాన్ని చూడుము"అని ప్రకృతశ్లోకంలో-"మనుష్యదేహం ఆశ్రయించి నంతమాత్రాన అపారకారుణ్యము, ఔదార్యము, సౌశీల్యము, వాత్సల్యము మొదలైనవాటిచేతనే నేను మనుష్యత్వాన్ని ఆశ్రయించాను అను పరభావాన్ని తెలుసుకొనక, మూఢులు భూతమహేశ్వరుడనైన నన్ను తిరస్కరిస్తున్నారు"అనీ శ్రీరామానుజాచార్యులు చేసిన వ్యాఖ్య అయుక్తం. "తేషు కర్మసు"అను రెండు శబ్దాలవల్ల వైషమ్య మనే అర్థం లభించ దను విషయం అందరికీ తెలిసినదే. "ఆ కర్మలలో ఏ వైషమ్యం ఉన్నదో దానియందు సక్తుడను అని అర్థం"అని చెప్పడం కూడ వైషమ్యపదాన్ని అధ్యాహారం తెచ్చుకోవడం అనే గౌరవంవల్ల, ప్రమాణం లేకపోవడంవల్లా అయుక్తం. సర్వాంతర్యామి యైన ఈశ్వరుడు కర్మలలోని వైషమ్యానికి కారణం అవడంకూడ సంభవమే గాన దానితో సంబంధం లేదని ఎలా చెప్పడం?

సత్యసంకల్పుడ నైన నాచేత చూడబడిన ప్రకృతి అను అర్థం కూడ అయుక్తం. ప్రకృతి లేకుండా ఈశ్వరునికి సంకల్పం కుదరదు. సంకల్పం, మనోవృత్తి వలె, మాయావృత్తి కదా? అట్లే వసుదేవపుత్రుడ నైన నాయొక్క అను అర్థం కూడ అయుక్తం. వసుదేవుని పుత్రుడు దేహంమాత్రమే. ఆత్మ దానికంటె విలక్షణ మైనది. ఈశ్వరుడు ఆత్మ. వివేకవంతు డైన కృష్ణునికి ఆత్మవిషయంలో వసుదేవసూనుదేహంతో తాదాత్మ్యం అయుక్తం; అంతే కాక ఇదంతా ఇక్కడ అనుపయుక్తం.

"భూతమహేశ్వరమ్"అనేదానిని దూరంగా ఉన్న'మామ్'తో అన్వయించడం అయుక్తం. అట్లే "పరం భావమ్'అనేదానికి మనుష్యత్వాన్ని ఆశ్రయించడం అనే పరభావము అను అర్థం కూడ అయుక్తం. మనుష్యత్వసమాశ్రయణం పరభావం కాదు కదా? అప్రాకృతదివ్యవిగ్రహాన్ని ఆశ్రయించడం కదా పరభావం? అలా కాకపోతే మనం అందరం మనుష్యత్వాన్ని ఆశ్రయించడం కూడ పరభావం అని చెప్పవలసి వస్తుంది. వాత్సల్యాదుల చేత ఈశ్వరుడు మనుష్యత్వాన్ని ఆశ్రయించడం పరభావమే అనడం కుదరదు. అశరీరు

డైన ఈశ్వరుడు వాత్సల్యాదికారణాలచేత కూడ మనుష్యత్వాన్ని ఆశ్రయిండం కుదరదు. మనుష్యత్వం అనేది దేహానికి సంబంధించినది. ఈశ్వరుడు మనుష్యదేహాన్ని ఆశ్రయించడం కూడ పరభావం కాదు;అది మాయికభావమే. ఈశ్వరుని పరభావం అనగా సచ్చిదానంద రూపత్వం మాత్రమే. మిగిలిన దంతా ఉత్కృష్టం కాకపోవడంచేత అపరభావమే.

ఈశ్వరుడు మాయచేత మనుష్యదేహాన్ని ఆశ్రయించడం పరభావం అనడం కూడ యుక్తం కాదు;అప్పుడు పరమవ్యోమయందు నిలీనమైన ఈశ్వరీయాప్రాకృతదేహం అపరభావం అనవలసివస్తుంది. మాయచేత సమస్తచరాచరదేహాలనూ ఆశ్రయించిన ఈశ్వరుడు మనుష్యదేహాన్ని ఆశ్రయించడం మాత్రమే పరభావం ఎలా అవుతుంది? "మానుషీం తనుమ్ ఆశ్రితమ్" అని కంఠోక్తమైన మనుష్యశరీరాశ్రయణం 'పరం భావం'అని గూఢశబ్దాలచేత మళ్లీ చెప్పడం వ్యర్థమే కాదు క్లిష్టకల్పన కూడ. పూర్వం చెప్పిన అర్థాన్ని పరామర్శించే 'తత్''ఇదమ్'ఇత్యాది శబ్దా లేవీ మూలంలో లేవు కదా? (భా.అ.ప్ర. పే.126)

భాష్యమ్

కథమ్? -

మూ. మోఘాశా మోఘకర్మాణో మోఘజ్ఞానా విచేతసః,
రాక్షసీమాసురీం చైవ ప్రకృతిం మోహినీం శ్రితాః. 12

బాలానందిని

కథమ్ ఇతి:- వాళ్లు ఎట్లు ఆహతు లవుతారు అనగా-

ప్ర.అ. మోఘాశాః ఇతి:- మోఘాశాః=వ్యర్థమైన ఆశలు కలవారుగాను, మోఘ కర్మాణః=వ్యర్థమైన కర్మలు గలవారుగాను,మోఘజ్ఞానాః=వ్యర్థమైన జ్ఞానం కలవారుగాను, విచేతసః=సరియైన చిత్తం లేనివారు గాను,మోహినీమ్=మోహింపచేసే,రాక్షసీమ్=రాక్షస సంబంధమైన,ఆసురీం చైవ=అసురసంబంధమైన,ప్రకృతిమ్=స్వభావమును, శ్రితాః= ఆశ్రయించినవారుగాను అవుతారు.

భాష్యమ్

మోఘాశాః మోఘాః వృథా ఆశాః ఆశిషః యేషాం తే మోఘాశాః,తథా మోఘకర్మాణః-యాని చ అగ్నిహోత్రాదీని తైః అనుష్ఠీయమానాని కర్మాణి తాని చ తేషాం భగవత్పరిభవాత్,స్వాత్మభూతస్య అజ్ఞానాత్,మోఘాన్యేవ నిష్ఫలాని కర్మాణి భవన్తి ఇతి మోఘకర్మాణః. తథా మోఘజ్ఞానాః నిష్ఫలజ్ఞానాః,జ్ఞానమపి తేషాం

నిష్ఫలమేవ స్యాత్. విచేతసః విగతవివేకాః చ తే భవన్తి ఇత్యభిప్రాయః. కిం చ తే భవన్తి? రాక్షసీం రక్షసాం, ప్రకృతిం స్వభావమ్, ఆసురీమ్ అసురాణాం చ ప్రకృతిం, మోహినీం మోహకరీం, దేహాత్మవాదినీం, శ్రితాః ఆశ్రితాః ఛిన్ధి భిన్ధి, పిబ, ఖాద, పరస్వమ్ అపహర"ఇత్యేవం వదనశీలాః క్రూరకర్మాణః భవన్తీత్యర్థః. "అసూర్యా నామ తే లోకాః "(ఈ. ఉ. 3)ఇతి శ్రుతేః. 12

బాలానందిని

మోఘాశాః ఇతి:- మోఘాశాః-ఎవరి కోరికలు వ్యర్థము లవుతాయో వాళ్లు మోఘాశులు-అట్లే, మోఘకర్మాణః-భగవంతుణ్ణి తిరస్కరించడంచేత, తమ ఆత్మయే అయిన భగవంతుణ్ణి అవమానించడంచేత వాళ్లు చేసే అగ్నిహోత్రాదికర్మలు కూడ వ్యర్థము లవుతాయి గాన వాళ్లు మోఘకర్ములు. వాళ్ల జ్ఞానం కూడ నిష్ఫలమే అవుతుంది, అందుచేత వాళ్లు మోఘజ్ఞానులు. వాళ్లు చిత్తం లేనివాళ్లు కూడ, వివేకం లేనివాళ్లు కూడ అవుతారు అని అభిప్రాయం. వాళ్లు ఇంకా ఏమవుతారు! రాక్షసుల స్వభావాన్ని, అసురుల స్వభావాన్నీ అవలంబించి, మోహం కలిగించే, అనగా దేహమే ఆత్మ అని చెప్పే స్వభావాన్ని ఆశ్రయించిన వారై "నఱుకు, పగలకొట్టు, త్రాగు, తిను, పరధనాన్ని అపసంహరించు"ఈ విధంగా మాటలాడే స్వభావం కలవారై, క్రూరకర్మలు చేసేవారు అవుతారు అని అర్థం. "**అసుర్యా నామ తే లోకాః**" "అసురులకు సంబంధించిన లోకా లున్నాయి"అని శ్రుతి చెపుచున్నది. (అద్వితీయ పరమాత్మదృష్టి లేని లోకాలు (జన్మలు)అసురజన్మలే అని ఈ వాక్యానికి భావం. ఈ దృష్టితో చూస్తే కేవలభోగప్రధానాలైన దేవాదిజన్మలు కూడ అసురజన్మలే). 12

భాష్యమ్

యే పునః శ్రద్దధానాః భగవద్భక్తిలక్షణే మోక్షమార్గే ప్రవృత్తాః-

మూ. మహాత్మానస్తు మాం పార్థ దైవీం ప్రకృతిమాశ్రితాః,
భజన్త్యనన్యమనసో జ్ఞాత్వా భూతాదిమవ్యయమ్. 13

బాలానందిని

యే ఇతి:- ఎవళ్లైతే విశ్వాసవంతులై భగవద్భక్తిరూప మైన మోక్షమార్గంలో ప్రవర్తిస్తారో అట్టి -

ప్ర. అ. **మహాత్మాన ఇతి**:- మహాత్మానః తు=మహాత్ము లైతే; దైవీమ్= దేవతలకు సంబంధించిన, ప్రకృతిమ్=స్వభావమును, ఆశ్రితాః=ఆశ్రయించినవారై, మామ్=నన్ను, భూతాదిమ్=భూతాలకు కారణమునుగాను, అవ్యయమ్=నాశరహితుని గాను, జ్ఞాత్వా =తెలుసుకొని, అనన్యమనసః=మరియొకదానియందు మనస్సు లేనివారై, భజన్తి=సేవిస్తారు.

భాష్యమ్

మహాత్మానః తు అక్షుద్రచిత్తాః,మామ్ ఈశ్వరం,పార్థ,దైవీం దేవానాం ప్రకృతిం శమదమదయాశ్రద్ధాదిలక్షణామ్ ఆశ్రితాః సన్తః,భజన్తి సేవన్తే,అనన్యమనసః అనన్య చిత్తాఃజ్ఞాత్వా,భూతాదిమ్–భూతానాం వియదాదీనాం ప్రాణినాం చ ఆదిం కారణమ్, అవ్యయమ్. 13

బాలానందిని

మహాత్మానః ఇతి:– క్షుద్రము కాని చిత్తం కలవారైతే,అర్జునా! ఈశ్వరుడ నైన నన్ను, శమము,దమము,దయ, శ్రద్ధ మొదలైన దేవతల ప్రకృతిని ఆశ్రయించి,మరొకదానిమీద చిత్తం లేనివారై,నన్ను ఆకాశాదిభూతాలకు,ప్రాణులకు కూడ కారణమైనవానినిగాను, నాశరహితుని గాను తెలుసుకొని సేవిస్తారు. 13

భాష్యమ్

కథమ్?–

మూ. సతతం కీర్తయన్తో మాం యతన్తశ్చ దృఢవ్రతాః,
నమస్యన్తశ్చ మాం భక్త్యా నిత్యయుక్తా ఉపాసతే. 14

బాలానందిని

కథమితి:– ఎట్లు?

ప్ర.అ. **సతతమితి**:– మామ్=నన్ను, సతతమ్=ఎల్లప్పుడూ; కీర్తయన్తః=కీర్తిస్తూ, యతన్తః చ=ప్రయత్నంచేస్తూ,దృఢవ్రతాః=దృఢమైన వ్రతం గలవారై,నమస్యన్తః చ = నమస్కరిస్తూ,భక్త్యా=భక్తితో,నిత్యయుక్తాః=ఎల్లప్పుడు కూడినవారై, ఉపాసతే=సేవిస్తారు.

భాష్యమ్

సతతం సర్వదా భగవన్తం బ్రహ్మస్వరూపం మాం కీర్తయన్తః,యతన్తః చ ఇన్ద్రియోపసంహారశమదమదయాహింసాదిలక్షణాదిభిః ధర్మైః ప్రయతన్తః చ,దృఢవ్రతాః – దృఢం స్థిరమ్ అచాల్యం వ్రతం యేషాం తే దృఢవ్రతాః, నమస్యన్తః చ మాం హృదయేశయమ్ ఆత్మానం,భక్త్యా నిత్యయుక్తాః సన్తః ఉపాసతే సేవన్తే. 14

బాలానందిని

ఎల్లప్పుడు,భగవంతు డను బ్రహ్మస్వరూపు డను అయిన నన్ను కీర్తిస్తూ(కీర్తన మనగా వేదాంతశ్రవణము,ప్రణవజపము. ఆ. గి.)ఇంద్రియనిగ్రహము,శమము,దమము,

దయ,అహింస మొదలైన ధర్మాలతో ప్రయత్నిస్తూ,స్థిరమైన,చలింప చేయ శక్యం కాని బ్రహ్మచర్యాదివ్రతం కలవారై,నమస్కరిస్తూ-భక్తితో నిత్యమూ కూడినవారై, హృదయంలోనే ఉన్న ఆత్మ నైన నన్ను సేవిస్తూంటారు. 14

భాష్యమ్

తే కేన కేన ప్రకారేణ ఉపాసతే ఇత్యుచ్యతే-

మూ. జ్ఞానయజ్ఞేన చాప్యన్యే యజన్తో మాముపాసతే,
ఏకత్వేన పృథక్త్వేన బహుధా విశ్వతోముఖమ్. 15

బాలానందిని

తే ఇతి:- వాళ్లు ఏ యే ప్రకారంచేత ఉపాసిస్తారో చెప్పబడుచున్నది-

ప్ర.అ.జ్ఞానేతి:- అన్యేఽపి చ=కొందరు,జ్ఞానయజ్ఞేన=జ్ఞాన మనే యజ్ఞంచేత, యజన్తః=పూజిస్తూ,మామ్=నన్ను,ఏకత్వేన=ఏకత్వంచేత,పృథక్త్వేన=వేరు వేరుగాను, విశ్వతోముఖమ్=అన్ని వైపులా ముఖం గలవానినిగా,బహుధా=అనేకవిధాలుగాను,ఉపాసతే = ఉపాసిస్తున్నారు.

భాష్యమ్

జ్ఞానయజ్ఞేన-జ్ఞానమేవ భగవద్విషయం యజ్ఞః,తేన జ్ఞానయజ్ఞేన,యజన్తః పూజయన్తః,మామ్ ఈశ్వరం,చ అపి అన్యే,అన్యామ్ ఉపాసనాం పరిత్యజ్య, ఉపాసతే, తచ్చ జ్ఞానమ్ ఏకత్వేన ఏకమేవ పరం బ్రహ్మ ఇతి పరమార్థదర్శనేన యజన్తః ఉపాసతే. కేచిచ్చ పృథక్త్వేన ఆదిత్యచన్ద్రాదిభేదేన, స ఏవ భగవాన్ విష్ణుః ఆదిత్యాదిరూపేణ అవస్థితః ఇతి ఉపాసతే.కేచిత్ బహుధా అవస్థితః స ఏవ భగవాన్ సర్వతోముఖః విశ్వతోముఖః విశ్వరూపః ఇతి తం విశ్వరూపం సర్వతోముఖం,బహుధా బహు ప్రకారేణ ఉపాసతే. 15

బాలానందిని

జ్ఞానేతి:-జ్ఞానయజ్ఞేన-భగవంతుణ్ణి గూర్చిన జ్ఞానమే యజ్ఞం;ఆ జ్ఞానయజ్ఞంచేత పూజిస్తూ,ఇతరమైన ఉపాసనను విడచి,ఈశ్వరుడ నైన నన్ను ఉపాసిస్తూంటారు.ఆ జ్ఞానం "పరబ్రహ్మ ఒక్కటే"అను పరమార్థదర్శనరూపంలో ఉంటుంది.అట్టి జ్ఞానంచేత పూజిస్తూ సేవిస్తూంటారు.కొందరు పృథక్త్వజ్ఞానంతో, ఆదిత్యచంద్రాదిభేదంతో,ఆ భగవంతుడైన విష్ణువే ఆదిత్యారూపంలో ఉన్నాడు అను జ్ఞానంతో ఉపాసిస్తూంటారు.మరి కొందరు-ఆ భగవంతుడు

సర్వతోముఖుడై అన్ని వైపులా ముఖాలు కలవాడై,అనేకవిధాలుగా ఉన్నాడు అను జ్ఞానంతో, విశ్వతోముఖుణ్ణి అనేకవిధాల ఉపాసిస్తూంటారు.

భా.అ.ప్ర."మహాత్ములైన వాళ్లు భూతాదియైనవాడను,అవ్యయు డను,వాఙ్మనస్సులకు గోచరములు కాని నామ-కర్మ-స్వరూపాలు కలవాడను,పరమకారుణికుడ నగుటచేత సాధుపరిత్రాణంకొరకు మనుష్యుడుగా అవతరించినవా డను అయిన నన్ను తెలుసుకొని"అని, "చివరివరకూ కూడ నా దాస్యమునందే ఉద్యుక్తులై నన్ను ఉపాసిస్తారు"అనీ, అనేకవిధాలుగా,వేరుగా,విశ్వతోముఖుడ నైన,జగదాకారంలో అనేక ప్రకారాలలో ఉన్న నన్ను ఒకనినిగా ఉపాసిస్తారు"అనీ శ్రీరామానుజాచార్యుల వ్యాఖ్య అసంగత మైనది.మహాత్ములు కృష్ణావతారాన్ని ఉపాసిస్తారు అని అంటే రామావతారోపాసకులు క్షుద్రాత్ము లన్నట్లు అవుతుంది.మహాత్ములు రామకృష్ణాదిమనుష్యావతారాలను ఉపాసిస్తారు అని అంటే మత్స్యాద్యవతారోపాసకులు క్షుద్రాత్ములన్నట్లు అవుతుంది.అలా కాక మహాత్ములు అవతారాలను ఉపాసిస్తారు అని అంటే అప్పుడు పర-వ్యూహ-విభవ -అన్తర్యామి-అర్చారూపాలలో ఐదు విధాలుగా ఉన్న ఈశ్వరుని విభవాలను ఉపాసించినవారే మహాత్ములు, ఇతరు లందరూ క్షుద్రాత్ములు అని చెప్పినట్లవుతుంది. నిత్యవిభూతి యైన నారాయణుడు 'పరుడు'.వాసుదేవ-సంకర్షణ-ప్రద్యుమ్న-అనిరుద్ధులు "వ్యూహాలు". రామకృష్ణాద్యవతారాలు 'విభవాలు'.-హృదయదేశంలో ఉన్న ఈశ్వరుడు అంతర్యామి. వేకంటేశ్వర- శ్రీరంగ-భద్రాద్రిరామాదులు అర్చలు. (ప్రశ్న)మహాత్ములు కృష్ణావతారాన్నే ఉపాసిస్తారు అని మేం అనడం లేదు;మరే మనగా-మహాత్ములే కృష్ణా వతారాన్ని ఉపాసిస్తారు అని అంటున్నాం. (సమాధానం)అది అయుక్తం.క్షుద్రులు కూడ కృష్ణుణ్ణి ఉపాసించడం కనబడుతున్నది.కృష్ణుడు ఈశ్వరుడనే బుద్ధి మహాత్ములకే ఉంటుంది అనడం కూడ యుక్తం కాదు;అది క్షుద్రులకు ఉంటుంది.

(పూ.ప)కృష్ణుణ్ణి అనాదరం చేసేవాళ్లే క్షుద్రులు;ఆతనియందు ఈశ్వరత్వబుద్ధి ఉన్నవాళ్ళందరూ మహాత్ములే(సి)అనడం కూడ యుక్తం కాదు,అప్పుడు శ్రీరామ-నరసింహ -గణపతి-కుమార-శంకర-పార్వత్యాదులను ఎవరు తిరస్కరిస్తారో వాళ్లు క్షుద్రులు కాదు;వాళ్లయందు ఈశ్వరత్వబుద్ధి లేనివాళ్లు మహాత్ములే అన్నట్లు అవుతుంది.మాకు ఇష్టాపత్తియే(అది మాకు అంగీకార్యమే)అనడం కుదరదు;నీకు ఇష్టాపత్తి యైనా వైదికుల మైన మాకు అది అనిష్టం.శివ-విష్ణు-గణపతి-కుమారాదు లందరూ ఈశ్వరావతరాలే అనడంలో భేదం ఏదీ లేదు.అందుచేత అవతారియైన ఈశ్వరుణ్ణి విడచి అవతారమైన కృష్ణుణ్ణి భజించాలి అని చెప్పడం అయుక్తమే.ఇక్కడ ప్రస్తుత మైనది అవతారమే అనడానికి వీలు లేదు;"సర్వభూతాని"ఇత్యాదికంచేత ఇక్కడ ప్రకృతమైనవాడు ఈశ్వరుడు.

"మాం భూతాదిమవ్యయం జ్ఞాత్వా" అనేదానికి వాఙ్మనసేత్యాద్యర్థం చేర్చడం కూడ యుక్తం కాదు. ఆ పదాలకు ఆ అర్థం లేదు కదా? మరొక విషయ మేమనగా - మనుష్యుడుగా అవతరించినది దేహమే కాని ఈశ్వరుడు కాదు. అలాంటప్పుడు మనుష్యదేహంలో ఈశ్వరబుద్ధి ఉన్నవాళ్లు క్షుద్రాత్ములే కాని మహాత్ములు కారు. దేహాత్మబుద్ధి ఉండేది క్షుద్రాత్ములకే కదా? కృష్ణదేహాన్ని 'నేను' అని ఎవడు అభిమానిస్తాడో వానియందే మహాత్ములకు ఈశ్వరబుద్ధి అనడం కూడ యుక్తం కాదు. దేహాత్మభ్రమ ఉన్నవాడు సర్వజ్ఞేశ్వరు డెలా అవుతాడు? ఈశ్వరుడు కాని అతని యందు ఈశ్వరబుద్ధి ఉన్నవాళ్లు మహాత్మ లెలా అవుతారు? మహాత్ములకు కృష్ణదేహంలో ఈశ్వరదేహబుద్ధి ఉంటుంది అనడం కూడ కుదరదు. ఈశ్వరుడు అన్ని దేహాలలోను అంతర్యామిగా ఉన్నాడు గాన సర్వదేహాలు ఈశ్వర దేహాలే కదా? కృష్ణుని దేహంలోనే మహాత్ములకు అవతారత్వబుద్ధి ఉంటుంది అనడం కూడ యుక్తం కాదు. చిద్రూపుడైన ఈశ్వరుడు దేహంగా అవతరించడం కుదరదు కదా? కృష్ణదేహావచ్ఛిన్నమైన చైతన్యం విషయంలో అది ఈశ్వరాంశం గాన మాహాత్ములకు ఈశ్వరావతారబుద్ధి ఉంటుంది అనడం కూడ యుక్తం కాదు. బ్రహ్మాది స్తంబపర్యంతమైన సమస్త చరాచరదేహాలచేత అవచ్ఛిన్నమైన చైతన్యం ఈశ్వరాంశం అని "మమైవాంశో జీవలోకే **జీవభూతః సనాతనః**"అని చెప్పబడ నున్నది కదా? కృష్ణ దేహంలో ఉన్న చైతన్యము కూడ ఈశ్వరుడే కదా!

అందువల్ల చిన్మయుడైన ఈశ్వరుడు మనుష్యుడుగా అవతరించడం అనేది లేదు. కృష్ణశరీరావచ్ఛిన్నచైతన్యమే ఈశ్వరు డనే మాట కూడ లేదు. కృష్ణశరీరం మాయామయం గాన దానిచేత అవచ్ఛిన్నమైన చైతన్యమే సర్వేశ్వరుడు అని చెప్పడం కుదరదు; సమస్తమూ మాయామయమే కదా? అవచ్ఛేదకాలు వేరు వేరైనా చైతన్యం ఒక్కటే, అది పరిపూర్ణము కూడ. అందుచేత అంతటా ఉన్న పరిపూర్ణము, చిన్మయము, ఈశ్వరుడూ అయిన ఆత్మ యైన నన్ను తెలుసుకొని అను అర్థమే సమీచీన మైనది. అప్పుడే 'భూతాది''అవ్యయ'అనే పదాలు అనుగుణంగా ఉంటాయి.

అట్లే 'ఆత్మానన్త దాస్యమ్'అనేది కూడా అయుక్తమే. ఆత్మయే ఈశ్వరుడు, అదియే శేషి; అలాంటప్పుడు అది మరొకదానికి శేషం ఎలా అవుతుంది? అట్లే-వేరుగా ఉన్న, విశ్వతో ముఖుణ్ణి ఏకరూపంలో ఉపాసించడం అనేది కూడ అయుక్తం. అలాంటి ఉపాసన భ్రాంతిరూపం అవుతుంది. ఘటాలు, శరావాలు మొదలైన రూపాలలో వేరు వేరుగా ఉన్న మట్టి ఒక్కటే గాన దానిని మృత్త్వంతో ఉపాసన చేసినట్లు ఇది భ్రాంతిరూపం కాదు అనడం కూడ యుక్తం కాదు; వికారరహితుడైన ఈశ్వరునికి పరిణామం ఉండదు కదా? సూక్ష్మచిదచిద్విశిష్టుడైన ఈశ్వరుడు స్థూలజగదాకారంలో పరిణమించడం ఉంది కదా అనడం యుక్తం కాదు. అక్కడ విశేషణాంశంగా ఉన్న(ఈశ్వరుని)తో కలిసి ఉన్న దని చెప్పే)సూక్ష్మమైన అచిత్తే పరిణమిస్తున్నది కాని విశేష్యాంశమైన ఈశ్వరుడు స్థూలజగదా

కారంలో పరిణామం చెందడం లేదు. ఈశ్వరుని పృథక్త్వం అనగా స్థూలమైన జగత్తు శరీరంగా కలిగి ఉండడమే అనడం కూడ యుక్తం కాదు. శరీరాలు వేరైనా శరీరి యైన ఈశ్వరునికి పృథక్త్వం లేదు కదా? అలా కాకపోతే సూక్ష్మశరీరాలు కూడ వేరే గాన వాటితో విశిష్టు డైన ఈశ్వరుడు కూడ వేరు అనవలసి ఉంటుంది. అది అలాగే అని అంగీకరిస్తే ఈశ్వరుణ్ణి ఒకణ్ణిగా ఉపాసించడం సంభవం కాదు. అందుచేత స్థూలజగదాకారంలో నైనా, బహువిధాలుగా, వేరు వేరుగా పరిణమించడం అనేది ప్రకృతికే కాని ఈశ్వరునికి లేదు; అందుచేత ఈశ్వరుడు వేరుగా వేరుగా ఉండడం అనేది లేదు.

మా మతంలో నైతే మాయచేత ఈశ్వరుడు విశ్వరూపు డవడం కుదురుతుంది; ఎందువల్ల ననగా మాయలో అన్నీ సంభవిస్తాయి. అన్ని శరీరాలలోను ఒకే ఈశ్వరుడు వేరు వేరుగా ఉన్నాడు అనడం కూడ కుదరదు. ఒకటి వేరు వేరుగా ఉండడం భ్రాంతి కల్పితం. ఘటాల భేదం ఆకాశాన్ని భిన్నంగా చేయజాల నట్లు శరీరాల భేదం ఈశ్వరునికి భేదం కలిగించజాలదు. అందుచేతనే "ఏకో దేవః" ఇత్యాదిశ్రుతులు ఈశ్వరు డైన ఆత్మ ఒక్కటే అని ప్రతిపాదిస్తున్నాయి. సర్వశరీరాలలో ఉన్న ఈశ్వరుణ్ణి ఒక్కనినిగా సేవిస్తున్నారు. అంటే-అది మాకు సంమతమే; అయితే మూలంనుండి ఇలాంటి అర్థం లభించడం లేదు. (భా. అ. ప్ర. పే. 130) 15

భాష్యమ్

యది బహుభిః ప్రకారైః ఉపాసతే కథం త్వామేవ ఉపాసతే? ఇత్యత ఆహ-

మూ. అహం క్రతురహం యజ్ఞః స్వధాహమహమౌషధమ్,
మన్త్రోఽహమహమేవాజ్యమహమగ్నిరహం హుతమ్. 16

బాలానందిని

యదీతి: -అనేకప్రకారాలచేత ఉపాసిస్తూన్న ట్లయితే నిన్నే ఉపాసిస్తున్నా రనే మాట ఏమిటి? అందుకు సమాధానంగా చెపుతున్నాడు-

ప్ర. అ. అహమితి: -అహమ్=నేనే, క్రతుః=క్రతువు, అహమ్=నేనే, యజ్ఞః=యజ్ఞము, అహమ్=నేనే, స్వధా=స్వధ, అహమ్=నేనే, ఔషధమ్=ఔషధము, అహమ్=నేనే, మన్త్రః =మంత్రము, అహమ్=నేనే, ఆజ్యమ్=అజ్యము, అహమ్=నేనే, అగ్నిః=అగ్ని అహమ్=నేనే, హుతమ్=హోమము.

భాష్యమ్

అహం క్రతుః శ్రౌతకర్మభేదః అహమేవ. అహం యజ్ఞః స్మార్తః. కిం చ స్వధా అన్నమ్ అహం యత్ పితృభ్యః దీయతే. అహమ్ ఔషధం సర్వప్రాణిభిః యత్ అద్యతే

తత్ ఔషధశబ్దవాచ్యమ్. అథవా-స్వధేతి సర్వప్రాణిసాధారణమ్ అన్నమ్, ఔషధమితి వ్యాధ్యుపశమార్థం భేషజమ్. మన్త్రః అహమ్, యేన పితృభ్యః దేవతాభ్యశ్చ హవిః దీయతే. అహమేవ ఆజ్యం హవిశ్చ అహమ్; అగ్నిః యస్మిన్ హూయతే సః అగ్నిః అహమేవ; అహం హుతం హవనకర్మ చ. 16

బాలానందిని

అహమితి:- నేను క్రతువును. క్రతు వనగా శ్రుతివిహితమైన కర్మ, నేనే యజ్ఞం; స్మృతివిహితమైన కర్మ. మరియు పితృదేవతలకు సమర్పించే అన్నం(స్వధ)నేనే. నేను ఔషధము. ప్రాణు లందరిచేత తినబడే ఆహారం ఔషధశబ్దంచేత చెప్పబడుచున్నది. లేదా -స్వధా అనగా సర్వప్రాణులకు సాధారణమైన అన్నం. ఔషధ మనగా వ్యాధి శమించడం కోసం ఉపయోగించే మందు. దేనిచేత పితృదేవతలకు, దేవతలకు హవిస్సు ఇవ్వబడుతుందో ఆ మంత్రం నేను. నేనే హవిస్సును. దేనియందు హోమం చేయబడుతుందో ఆ అగ్ని నేనే. హోమం చేయడం అనే కర్మ కూడ నేనే. 16

భాష్యమ్

కిం చ-

మూ. పితాహమస్య జగతో మాతా ధాతా పితామహః,
వేద్యం పవిత్రమోంకార ఋక్ సామ యజురేవ చ. 17

బాలానందిని

కిం చేతి:- మరియు-

ప్ర.అ. **ఏతేతి**:- అహమ్=నేను, అస్య=ఈ, జగత్తుయొక్క పితా=తండ్రిని; మాతా= తల్లిని, ధాతా=కర్మఫలం ఇచ్చే విధాతను, పితామహః=పితామహుడను. వేద్యమ్=తెలియ దగినది నేను. పవిత్రమ్=పుణ్యకర్మ నేను. ఓంకారః=ఓంకారము, ఋక్ = ఋగ్వేదము, సామ =సామవేదము, యజుః ఏవ చః = యజుర్వేదమూ కూడ నేనే.

భాష్యమ్

పితా జనయితా, అహమ్, అస్య, జగతః, మాతా జనయిత్రీ, ధాతా కర్మఫలస్య ప్రాణిభ్యః విధాతా. పితామహః పితుః పితా, వేద్యం వేదితవ్యం, పవిత్రం పావనమ్, ఓంకారః చ, ఋక్, సామ, యజుః ఏవ చ. 17

బాలానందిని

పితా ఇతి:- నేను ఈ జగత్తును పుట్టించిన తండ్రిని;కనిన తల్లిని;ప్రాణులకు కర్మఫలాలను ఇచ్చే విధాతను.తండ్రియొక్క తండ్రిని.తెలియదగిన వస్తువు నేనే.పవిత్రమైన వస్తువు(పుణ్యకర్మాదికం)నేను.ఋక్-సామ-యజుర్వేదాలు నేను. 17

భా.అ.ప్ర.:- జగత్తులో అక్కడక్కడ దేవత్తాదుల పుత్రుల తండ్రులైన ఏ విష్ణు మిత్రాదులున్నారో,తల్లులుగా ఏ కలావత్యాదులు ఉన్నారో, పితామహులుగా ఏ యజ్ఞ దత్తాదులున్నారో,ధాతలుగా ఉపపతులైన ఏ శంభుదత్తాదు లున్నారో వాళ్లందరూ కూడ ఈశ్వరుడే.ఎందువల్ల ననగా వాళ్లందరూ ఈశ్వరుని శరీరమే;ఈశ్వరుడు వాళ్ల అంతర్యామి అని శ్రీరామానుజాచార్య వ్యాఖ్య అయుక్తం."జగతః పితా"అని మొత్తం జగత్తంతా సంతానమే అంటూన్నుడు జగత్తుకు విష్ణుమిత్రాదులకు పితృత్వాదికం కుదరదు కదా? మూల కారుని అభిప్రాయం ఇదే అయి ఉంటే"పితాహమస్య జగతః"అని కాకుండా "పితాహమత్ర జగతి"అని ఉండేవాడు.(భా.అ.ప్ర.పే.131) 17

భాష్యమ్

కిం చ-

మూ. గతిర్భర్తా ప్రభుః సాక్షీ నివాసః శరణం సుహృత్,
ప్రభవః ప్రలయః స్థానం నిధానం బీజమవ్యయమ్. 18

బాలానందిని

కిం చేతి:- మరియు -

ప్ర.అ. గతిరితి:- (అహమ్=నేను),గతిః=గతిని;భర్తా=పోషకుడను,ప్రభుః=ప్రభువును,సాక్షీ=సాక్షిని,నివాసః=నివాస మైనవాడను,శరణమ్=రక్షకుడను,సుహృత్=మిత్రుడను, ప్రభవః=ఉత్పత్తిస్థాన మైనవాడను,ప్రలయః=లయస్థాన మైనవాడను,స్థానమ్=స్థానమును, నిధానమ్=నిధిని;అవ్యయమ్=నాశము లేని,బీజమ్=బీజమును.

భాష్యమ్

గతిః కర్మఫలమ్,భర్తా పోష్టా,ప్రభుః స్వామీ,సాక్షీ ప్రాణినాం కృతాకృతస్య,నివాసః యస్మిన్ ప్రాణినః నివసన్తి,శరణమ్ ఆర్తానాం మత్ప్రపన్నానామ్ ఆర్తిహరః,సుహృత్ ప్రత్యుపకారానపేక్షీ సన్ ఉపకారీ.ప్రభవః ఉత్పత్తిః జగతః,ప్రలయః ప్రలీయతే యస్మిన్ ఇతి.తథా స్థానం తిష్ఠత్యస్మిన్ ఇతి.నిధానం నిక్షేపః కాలాన్తరోపభోగ్యం ప్రాణినామ్;బీజం ప్రరోహకారణం ప్రరోహధర్మిణామ్.అవ్యయం యావత్సంసారభావిత్వాత్ అవ్యయమ్.

న హి అబీజం కించిత్ ప్రరోహతి. నిత్యం చ ప్రరోహదర్శనాత్ బీజసంతతిః నిత్యా ఇతి గమ్యతే. 18

బాలానందిని

గతిరితి:- గతి అనగా కర్మఫలం. పోషించేవాడు, ప్రభువు, ప్రాణులు చేసిన కర్మలను చేయని కర్మలను చూస్తూ ఉండే సాక్షి, దేనియందు ప్రాణులు నివసిస్తారో అట్టి నివాసము, ఇవన్నీ, నేనే. కష్టాలలో ఉండి నన్ను ఆశ్రయించినవాళ్ల ఆర్తిని తొలగించే శరణము నేను. ప్రత్యుపకారం కోరకుండా ఉపకారం చేసే సుహృత్ నేను. జగత్తు దేనినుండి పుడుతుందో అట్టి ఉత్పత్తిస్థానము; దేనియందు లీనం అవుతుందో అట్టి ప్రలయస్థానము, అది నిలిచి ఉండే స్థానము నేనే. ప్రాణులు కాలాంతరంలో అనుభవించే నిధి, నిక్షేపం నేను. అంకురించే ధర్మం గలవి అంకురించడానికి కారణమైన బీజం, సంసారకారణం నేను. ఇది సంసారం ఉన్నంతవరకూ ఉంటూనే ఉంటుంది; అందుచేత అవ్యయం. బీజం లేకుండా ఏదీ అంకురించదు కదా? నిత్యమూ అంకురించడం కనబడుతూనే ఉన్నది గాన ఈ బీజం నశించనిది. (అనగా అనాది, అనంతము, నిరంతరప్రవర్తమానము అయిన ఈ సంసారానికి బీజం కూడ నేనే అని అర్థం).

భా. అ. ప్ర.:-ఇక్కడ కూడ శ్రీరామానుజాచార్యులు-జగత్తులో ఉన్న స్వర్గాదిగతులు పోషించేవాళ్లు, శాసించేవాళ్లు, సాక్షులు, ఇళ్లు, శరణం ఇచ్చే పురుషులు, హితైషులు, ప్రభవ ప్రలయస్థానం అనగా ఘటాదుల పుట్టుకకు అవి అణగిపోవడానికి స్థానమైన మట్టి మొదలైనవి, పుట్టింపతగినది ఉపసంహరింపదగినది అయిన ఘటాదికార్యము, అవ్యయములు, అనగా కారణాలు, ఇవన్నీ నేనే అని వ్యాఖ్యానించారు. వెనుక చూపిన దోషం ఇక్కడ కూడ పడుతుంది గాన ఈ భాష్యం ఉపేక్షింపదగినది. 18

భాష్యమ్

కిం చ-

మూ. తపామ్యహమహం వర్షం నిగృహ్ణామ్యుత్సృజామి చ,
అమృతం చైవ మృత్యుశ్చ సదసచ్చాహమర్జున. 19

బాలానందిని

కిం చేతి:- మరియు-

ప్ర. అ. తపామీతి:- అర్జున=అర్జునా! అహమ్=నేను; తపామి=తపింపచేస్తున్నాను. అహమ్=నేను, వర్షమ్=వర్షమును, నిగృహ్ణామి=నిగ్రహిస్తున్నాను(ఆపుతున్నాను), ఉత్సృజామి

చ=విడుచుచున్నాను కూడ. అమృతం చైవ=అమృతము,మరణాభావము,మృత్యుః చ = మృత్యువు కూడ నేనే. అహమ్=నేను,సత్=సత్పదార్థము,అసత్=అసత్పదార్థము కూడ.

భాష్యమ్

తపామి అహమ్,ఆదిత్యః భూత్వా కైశ్చిత్ రశ్మిభిః ఉల్బణైః అహం వర్షం, కైశ్చిత్ రశ్మిభిః ఉత్సృజామి,ఉత్సృజ్య పునః నిగృహ్ణామి కైశ్చిత్ రశ్మిభిః అష్టభిః మాసైః,పునః ఉత్సృజామి ప్రావృషి. అమృతం చైవ దేవానామ్,మృత్యుశ్చ మర్త్యానామ్. సత్-యస్య యత్ సంబన్ధితయా విద్యమానం,తద్విపరీతమ్ అసత్ చ ఏవ,అహమ్ అర్జున. న పునః అత్యన్తమేవ ఆసద్ భగవాన్ స్వయమ్ కార్యకారణే వా సదసతీ. యే పూర్వోక్తైః అనువృత్తిప్రకారైః ఏకత్వపృథక్త్వాదివిజ్ఞానైః మాం పూజయన్తః ఉపాసతే జ్ఞానవిదః తే యథావిజ్ఞానం మామేవ ప్రాప్నువన్తి. 19

బాలానందిని

తపామీతి:- నేను ఆదిత్యుడుగా ఉంటూ తీవ్రము లైన కొన్ని కిరణాలచేత తపింప చేస్తూంటాను. కొన్ని కిరణాలచేత వర్షం విడుస్తాను;విడిచి మళ్లీ కొన్ని కిరణాలచేత ఏనిమిది మాసాలచేత(మాసాలపాటు)వర్షాన్ని నిలిపివేస్తాను,మళ్లీ వర్షకాలంలో విడుస్తూం టాను. దేవతల అమృతం(మరణాభావం), మర్త్యుల మృత్యువు నేనే. ఏది దేనితో సంబంధిం చినదిగా ఉంటుందో అట్టి సత్ నేను. దానికి విపరీత మైన అసత్ కూడ,అర్జునా! నేనే,అంతే కాని,భగవంతుడు తాను అత్యంతాసత్ కాదు;లేదా కార్యకారణాలు సదసత్తులు ఎవరైతే పూర్వం చెప్పబడిన అనువృత్తిప్రకారాలచేత(భగవంతుణ్ణి అనువర్తించి సేవించే పద్ధతులచేత) ఏకత్వము పృథక్త్వము మొదలైన విజ్ఞానాలతో,యజ్ఞాలతో నన్ను పూజిస్తూ ఉపాసిస్తారో అట్టి జ్ఞానవేత్తలు ఆ యా విభిన్నజ్ఞానాలను పొందినవాళ్లు)తమ తమ విజ్ఞానాలను పట్టి నన్నే చేరుతారు.

వి:- "సద్ యస్య యత్...సదసతీ"అనే భాష్యవాక్యాలను కార్యకారణాలను గూర్చి చెప్పుచున్నట్లుగా గ్రహించి ఆనందగిరి వ్యాఖ్యానించారు. మృత్తు,తంతువులు మొదలైనవి ఘట-పటాదులకు కారణాలు. కారణాలైన ఈ మృదాదులు ఘటాదికార్యరూపాలు దాల్చినప్పుడు అవి ఆ కార్యాల రూపాలలో సత్‌లు. అవి ఆ రూపాలు దాల్చనప్పుడు ఆ కారణాలు ఆ కార్యరూపాలలో అసత్తులు,లేనివి. ఈ విధంగా ఏది, ఏ ఘటాదికం,ఏ మృదాదికంతో సంబంధించినదిగా ఉంటుందో అది,అప్పుడు,సత్,అందుకు విపరీత మైనప్పుడు,అనగా ఘటాదికం తన కారణంతో సంబంధించనపుడు అది కారణరూపంలోనే ఉంటుంది గాన అసత్. భగవంతుడు అసద్రూపుడు అన్నప్పుడు పూర్తిగా అసత్ అనకూడదు.

అప్పుడు కార్యకారణకల్పనకు అధిష్ఠానం లేకుండా పోతుంది. అయితే కార్యమే సత్ కారణం అసత్ అనవచ్చు కదా అని ఆశంకించుకొని'న కార్యకారణే వా సదసతీ' అని చెప్పబడింది. కార్యం సత్ అనడం కుదరదు. 'వాచారమ్భణం' ఇత్యాదిశ్రుతి కార్యం వాచారంభణం మాత్రమే అని చెప్పుతూన్నది. కారణం అసత్ అనడం కుదరదు; 'కథమసతః'ఇత్యాది శ్రుతి కారణం సత్ అని చెపుతూన్నది. ఇది ఆనందగిరివ్యాఖ్యాసారాంశం. కాని ఇది అక్షరానుగుణంగా ఉన్నట్లు లేదు. "సద్యస్య యత్"ఇత్యాదివాక్యంచేత ఒక విషయం ప్రతిపాదించి భగవత్పాదులు "కార్యకారణే వా సదసతీ"అని అంటున్నారు. దీనిని పట్టి ఇది మొదటి అర్థంకంటె భిన్నమైన మరొక అర్థం అన్నట్లు కనబడుతూన్నది. దీనిని ఆ విధంగా గ్రహించి శ్రీరామరాయకవి ఏ పుత్రాదులకు ఏది అనగా పిత్రాదిరూపమైన వస్తువు సంబంధిగా ఉన్నదో అది సత్,అసంబంధిగా ఉన్నది అసత్ అని అర్థం వ్రాశారు. ఈ అర్థం ప్రకారం చెప్పదలచిన భావం ఏమో స్పష్టంగా లేదు. దీని భావం ఇలా చెపుతే బాగుంటుంది. ఒక ఇల్లు ఉంది;అది నాకు సబంధించినది అను భావం ఉన్నంతవరకు అది నాకు 'సత్'గా నా సొత్తుగా ఉన్నది. ఆ భావం లేకపోతే అది నాకు అసత్తే; నాకు అది లేనట్లే. నా సొత్తు కాదు. ఈ విధంగా సదసత్పదాలకు ఒక అర్థం చెప్పి ఈ పదాలకు కార్యము కారణము అను అర్థాలు గ్రహించినా గ్రహించవచ్చును అని భగవత్పాదులు "కార్యకారణే వా సదసతీ"అన్నారు. అప్పుడు ఆనందగిరి చెప్పిన కార్యకారణపదార్థాలను సమన్వయించుకొనవచ్చును.

భా.అ.ప్ర.:- "సత్ అనగా వర్తమానం-ఉన్నది. అసత్ అనగా గడచిపోయినది. భవిష్యత్తులో రానున్నది"అని శ్రీరామానుజాచార్యవ్యాఖ్య అసంగతం. ప్రతీ వస్తువూ ఏదో ఒక ఆకారంలో వర్తమానమే కదా?(భా.అ.ప్ర. పే.133) 19

భాష్యమ్

యే పునః అజ్ఞాః కామకామాః-

మూ. త్రైవిద్యా మాం సోమపాః పూతపాపాః
యజ్ఞైరిష్ట్వా స్వర్గతిం ప్రార్థయన్తే,
తే పుణ్యమాసాద్య సురేన్ద్రలోక
మశ్నన్తి దివ్యాన్ దివి దేవభోగాన్. 20

బాలానందిని

యే ఇతి:- కాని కామాలయందు ఆసక్తి గల అజ్ఞులైతే -

ప్ర.అ. త్రైవిద్యా ఇతి:- త్రైవిద్యాః=మూడు వేదాలు తెలిసిన,సోమపాః=సోమపానం చేసినవాళ్లు,పూతపాపాః=శుద్ధము చేయబడిన పాపాలు గలవారై,యజ్ఞైః=యజ్ఞాలచేత,

మామ్=నన్ను,ఇష్ట్వా=పూజించి,స్వర్గతిమ్=స్వర్గగమనమును,ప్రార్థయన్తే=ప్రార్థించు చున్నారు. తే=వారు,పుణ్యమ్=పుణ్యమైన,సురేన్ద్రలోకమ్=దేవేంద్రలోకమును,ఆసాద్య=పొంది, దివి=స్వర్గమునందు,దివ్యాన్=దివ్యములైన,దేవభోగాన్=దేవతలు అనుభవించే భోగాలను, అశ్నన్తి=అనుభవిస్తూంటారు.

భాష్యమ్

త్రైవిద్యాః ఋగ్యజుఃసామవిదః,మాం వస్వాదిదేవరూపిణమ్,సోమపాః-సోమం పిబన్తి ఇతి సోమపాః,తేనైవ సోమపానేన పూతపాపాః శుద్ధకిల్బిషాః,యజ్ఞైః అగ్నిష్టో మాదిభిః,ఇష్ట్వా పూజయిత్వా,స్వర్గతిమ్-స్వర్గగమనం స్వర్గతిః తాం ప్రార్థయన్తే. తే చ పుణ్యం పుణ్యఫలమ్. ఆసాద్య సంప్రాప్య,సురేన్ద్రలోకం శతక్రతోః స్థానమ్,అశ్నన్తి భుఞ్జతే, దివ్యాన్ దివి భవాన్ అప్రాకృతాన్,దేవభోగాన్ దేవానాం భోగాః తాన్. 20

బాలానందిని

త్రైవిద్యా ఇతి:- ఋగ్యజుఃసామవేదములు తెలిసినవారు,సోమపానం చేసినవారు ఆ సోమపానంచేతనే శుద్ధమైన(తొలగిన)పాపములు కలవారు వస్వాదిదేవతాస్వరూపుడ నైన నన్ను అగ్నిష్టోమాదియజ్ఞాలచేత పూజించి,స్వర్గగమనాన్ని కోరుకుంటూ ఉంటారు. వాళ్లు పుణ్యపల మైన దేవేంద్రలోకం చేరి, స్వర్గలోకంలో నివసిస్తూ,ప్రాకృతములు కాని, దేవతలు అనుభవించే భోగాలను అనుభవిస్తూంటారు. 20

మూ. తే తం భుక్త్వా స్వర్గలోకం విశాలం
క్షీణే పుణ్యే మర్త్యలోకం విశన్తి,
ఏవం త్రయీధర్మమనుప్రపన్నా
గతాగతం కామకామా లభన్తే. 21

ప్ర.అ. తే ఇతి:- తే=వాళ్లు,విశాలమ్=విశాలమైన,తం స్వర్గలోకమ్=ఆ స్వర్గ లోకాన్ని,భుక్త్వా=అనుభవించి,పుణ్యే=పుణ్యము,క్షీణే=క్షీణించిన దగుచుండగా,మర్త్యలోకమ్ = మనుష్యలోకాన్ని,విశన్తి=ప్రవేశిస్తారు. ఏవమ్=ఈ విధంగా,త్రయీధర్మమ్=వేదత్రయోక్త ధర్మాన్ని,అనుప్రపన్నాః=పొందిన,కామకామాః=కామాభిలాష కలవారు,గతాగతమ్= గమనాగమనములను,భజన్తే=పొందుతూంటారు.

భాష్యమ్

తే తమితి:- తే తం భుక్త్వా స్వర్గలోకం,విశాలం విస్తీర్ణం,క్షీణే పుణ్యే మర్త్యలోకమ్ ఇమం విశన్తి ఆవిశన్తి. ఏవం హి యథోక్తేన ప్రకారేణ త్రయీధర్మం కేవలం వైదికం

కర్మ అనుప్రపన్నాః,గతాగతం-గతం చ ఆగతం చ గతాగతం గమనాగమనం, కామ కామాః కామాన్ కామయన్తే ఇతి కామకామాః లభన్తే.గతాగతమేవ న తు స్వాతన్త్ర్యం క్వచిత్ లభన్తే ఇత్యర్థః. 21

బాలానందిని

తే తమితి:- వాళ్లు విస్తీర్ణ మైన స్వర్గలోకాన్ని అనుభవించి పుణ్యము క్షీణించగా, ఈ మర్త్యలోకం ప్రవేశిస్తారు.ఈ విధంగా కేవలము వేదోక్త మైన కర్మను అనుసరించే కామాలను కోరుకొనేవారు గమనాగమనాలను పొందుతారు కాని ఎక్కడా స్వాతంత్ర్యాన్ని పొందరు అని అర్థం. 21

భాష్యమ్

యే పునః నిష్కామాః సమ్యగ్దర్శనాః -

మూ. అనన్యాశ్చిన్తయన్తో మాం యే జనాః పర్యుపాసతే,
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్. 22

బాలానందిని

యే ఇతి:- కాని నిష్కాము లైన ఏ సమ్యగ్దర్శనవంతులు(జ్ఞానులు)ఉన్నారో-

ప్ర.అ. అనన్యా ఇతి:- యే=ఏ,జనాః=జనులు,అనన్యాః=(నా కంటె)వేరుగా ఉండనివారై, చిన్తయన్తః=(నా) చింతనము చేస్తూ,మామ్=నన్ను,పర్యుపాసతే=సేవిస్తారో, నిత్యాభియుక్తానామ్=ఎల్లప్పుడు ప్రయత్నశీలులైన,తేషామ్=వాళ్లయొక్క,యోగక్షేమమ్= యోగక్షేమాలను,అహమ్=నేను,వహామి=వాళ్లకు అందజేస్తాను.

భాష్యమ్

అనన్యాః అపృథగ్భూతాః పరం దేవం నారాయణమ్ ఆత్మత్వేన గతాః సన్తః చిన్తయన్తః,మాం,యే జనాః సంన్యాసినః, పర్యుపాసతే,తేషాం పరమార్థదర్శినాం, నిత్యాభియుక్తానాం సతతాభియోగినాం,యోగక్షేమం-యోగః అప్రాప్తస్య ప్రాపణం,క్షేమః తద్రక్షణమ్.తదుభయం,వహామి ప్రాపయామి అహమ్ **"జ్ఞానీ త్వాత్మైవ మేమతమ్"** (7.18)"స చ మమ ప్రియః"(7.17) యస్మాత్ తస్మాత్ తే మమ ఆత్మభూతాః ప్రియాశ్చ ఇతి. నను అన్యేషామపి భక్తానాం యోగక్షేమం వహత్యేవ భగవాన్? సత్య మేవమ్;వహతి కిం తు అయం విశేషః-అన్యే యే భక్తాః తే స్వాత్మార్థం స్వయమపి యోగక్షేమమీహన్తే;అనన్యదర్శినః తు న ఆత్మార్థం యోగక్షేమమ్ ఈహన్తే.న హి తే

జీవితే మరణే వా ఆత్మనః గృద్ధిం కుర్వన్తి, కేవలమేవ భగవచ్ఛరణాః తే అతః భగవానేవ తేషాం యోగక్షేమం వహతి ఇతి. 22

బాలానందిని

అనన్యా ఇతి:- అనన్యులై, అనగా వేరుగా ఉండనివారై, పరమదేవుడైన నారాయణుణ్ణి ఆత్మగా (స్వస్వరూపంగా)పొందినవారై చింతిస్తూ ఏ సంన్యాసులు నన్ను సేవిస్తారో నిత్యము ప్రయత్నశీలులైన,పరమార్థజ్ఞానవంతులైన వాళ్ల యోగక్షేమాలను,పొందబడనిదానిని పొందింపచేయడం యోగం,దానిని రక్షించడం క్షేమం,ఆ రెండింటినీ, నేను (వాళ్లచేత) పొందింపచేస్తాను.**"జ్ఞానీ త్వాత్మైవ మే మతమ్", "స చ మమ ప్రియః"** కాబట్టి, వాళ్లు నా ఆత్మయే;ప్రియులు కూడ. (ప్రశ్న)ఇతరభక్తుల యోగక్షేమాలను కూడ భగవంతుడు వహిస్తాడు కదా?(సమాధానం)-అది నిజమే;వహిస్తాడు.అయితే ఒక్క విశేషం ఏమనగా- ఇతరభక్తులు తమకోసం తాము కూడ యోగక్షేమాలు కోరుకుంటూంటారు(అందుకు స్వయంగానే ప్రయత్నాలు చేసుకొంటూ ఎందుకైనా మంచిదన్నట్లు నన్నుకూడా చేరు తూంటారు). అనన్యదర్శు లైతే,అద్వితీయాత్మదర్శులైతే,తమకోసం యోగక్షేమాలను కోరు కొనరు. వాళ్లు తమ జీవితం విషయంలో కాని మరణం విషయంలో కాని ఆసక్తిని చూపరు. వాళ్లు కేవలం (పూర్తిగా)భగవచ్ఛరణులు.అందువల్ల భగవంతుడే వాళ్ల యోగ క్షేమాలను వహిస్తాడు.

భా.అ.ప్ర.:-"నా భక్తులయొక్క -నన్ను పొందడం అనే యోగాన్నీ తిరిగి రాకుండా ఉండడం అనే క్షేమాన్నీ వహిస్తాను"అను శ్రీరామానుజాచార్యవ్యాఖ్య అయుక్తం. పరిపూర్ణ చైతన్యరూపు డైన ఈశ్వరుడు ఎల్లప్పుడూ పొందబడే ఉన్నాడు గాన అతడు పొందబడక పోవడం అనేది లేదు కదా?ఈశ్వరుని పొందినవాళ్లకు పునరావృత్తిశంకయే ఉండదు; అలాంటప్పుడు అపునరావృత్తిరూప మైన క్షేమాన్ని వహిస్తాను అని చెప్పడం వ్యర్థం గాన అయుక్తం (భా.అ.ప్ర.పే.135) 22

భాష్యమ్

నను అన్యా అపి దేవతాః త్వమేవ చేత్, తద్భక్తాశ్చ త్వామేవ భజన్తే? సత్యమేవమ్-

మూ. యేఽప్యన్యదేవతాభక్తా యజన్తే శ్రద్ధయాన్వితాః,
తేఽపి మామేవ కౌన్తేయ యజన్త్యవిధిపూర్వకమ్. 23

బాలానందిని

నన్వితి:- ఇతరదేవతలు కూడ నువ్వే అయితే వాళ్ల భక్తులు కూడ నిన్నే సేవిస్తున్నారు కదా? ఇది నిజమే -

ప్ర.అ. యేఽప్యతి:- అన్యదేవతాభక్తాః అపి=ఇతరదేవతలయందు భక్తులైనా కూడ, యే=ఎవరు,శ్రద్ధయా=శ్రద్ధతో,అన్వితాః=కూడినవారై,యజన్తే=పూజిస్తారో, తేఽపి= వారు కూడ,కౌన్తేయ=అర్జునా! అవిధిపూర్వకమ్=జ్ఞానపూర్వకంగా కాకుండా,మామేవ= నన్నే,యజన్తి=పూజిస్తున్నారు.

భాష్యమ్

య ఇతి:- యేఽప్యన్యదేవతాభక్తాః-అన్యాసు దేవతాసు భక్తాః అన్యదేవతా భక్తాః సన్తః,యజన్తే పూజయన్తి,శ్రద్ధయా ఆస్తికయబుద్ధ్యా,అన్వితాః అనుగతాః తేఽపి మామేవ కౌన్తేయ,యజన్తి అవిధిపూర్వకమ్-అవిధిః అజ్ఞానం,తత్పూర్వకం యజన్తే ఇత్యర్థః. 23

బాలానందిని

య ఇతి:- అర్జునా! ఇతరదేవతలయందు భక్తి గలవారై ఎవరు ఆస్తిక్య బుద్ధితో కూడినవారై పూజిస్తారో వాళ్లు కూడ అజ్ఞానపూర్వకంగా,అనగా నన్నే పూజిస్తున్నా రని తెలియకుండా, నన్నే పూజిస్తున్నారు అని అర్థం. 23

భాష్యమ్

కస్మాత్ తే అవిధిపూర్వకం యజన్తే ఇతి? ఉచ్యతే; యస్మాత్ -

మూ. అహం హి సర్వయజ్ఞానాం భోక్తా చ ప్రభురేవ చ,
న తు మామభిజానన్తి తత్త్వేనాతశ్చ్యవన్తి తే. 24

బాలానందిని

కస్మాదితి:- వాళ్లు అజ్ఞానపూర్వకంగా ఎందుకు పూజిస్తున్నారు? చెప్పబడుచున్నది; ఎందువల్ల ననగా-

ప్ర.అ. అహమితి:- అహమ్=నేను, సర్వయజ్ఞానామ్=సమస్తయజ్ఞాలయొక్క,భోక్తా= భోక్తను;ప్రభుః ఏవ చ=ప్రభువును కూడ. తు =కాని,తే=వాళ్లు, తత్త్వేన=తత్త్వంచేత, మామ్=నన్ను, న అభిజానన్తి=గుర్తించుటలేదు. అతః=అందువల్ల,చ్యవన్తి=(ఫలమునుండి) జారిపోవుచున్నారు.

భాష్యమ్

అహం హి సర్వయజ్ఞానాం శ్రౌతానాం స్మార్తానాం చ సర్వేషాం యజ్ఞానాం, దేవతాత్వేన భోక్తా,చ ప్రభుః ఏవ చ;మత్స్వామికో హి యజ్ఞః-"అధియజ్ఞోఽహమేవాత్ర"

(8.4)ఇతి హి ఉక్తమ్. తథా న తు మామ్ అభిజానన్తి.తత్త్వేన యథావత్ అతశ్చ అవిధిపూర్వకమ్ ఇష్ట్వా యాగఫలాత్,చ్యవన్తి ప్రచ్యవన్తే తే. 24

బాలానందిని

అహమితి: – శ్రౌతములు,స్మార్తములూ అయిన సమస్త యజ్ఞాలకూ కూడ దేవతా స్వరూపుడ నగుటచేత నేను భోక్తను ప్రభువునూ కూడ.యజ్ఞానికి స్వామిని నేనే కదా? "అధియజ్ఞోఽ హమేవాత్ర"అని చెప్పబడింది కదా?ఆ విధంగా వాళ్లు నన్ను యథార్థరూపంలో గుర్తించుటలేదు. అందువల్ల అవిధిపూర్వకంగా పూజించి యాగఫలంనుంచి జారి పోతున్నారు. 24

భాష్యమ్

యేఽపి అన్యదేవతాభక్తిమత్త్వేన అవిధిపూర్వకం యజన్తే తేషామపి యాగఫలమ్ అవశ్యంభావి. కథమ్?

మూ. యాన్తి దేవవ్రతా దేవాన్ పితౄన్ యాన్తి పితృవ్రతాః,
భూతాని యాన్తి భూతేజ్యాః యాన్తి మద్యాజినోఽపి మామ్. 25

బాలానందిని

యేఽపీతి: – ఎవరైతే అన్యదేవతలయందు భక్తి కలవారవడంచేత అవిధిపూర్వకంగా పూజిస్తారో వాళ్లకు కూడ యాగఫలం తప్పక లభిస్తుంది. ఎట్లు?

ప్ర.అ. యాన్తీతి: – దేవవ్రతాః=దేవతావ్రతము(నియమభక్తులు)కలవారు,దేవాన్ = దేవతలను గూర్చి,యాన్తి=వెడతారు.పితృవ్రతాః=పితృవ్రతం కలవారు,పితౄన్ =పితృ దేవతలను,యాన్తి=పొందుతారు.భూతేజ్యాః=భూతాలను పూజించేవారు,భూతాని= భూతాలను,యాన్తి=పొందుతారు.మద్యాజినః అపి=నన్ను పూజించేవారు,మామ్=నన్ను, యాన్తి=పొందుతారు.

భాష్యమ్

యాన్తి గచ్ఛన్తి,దేవవ్రతాః దేవేషు వ్రతం నియమః భక్తిశ్చ యేషాం తే దేవవ్రతాః దేవాన్ యాన్తి.పితౄన్ అగ్నిష్వాత్తాదీన్ యాన్తి,పితృవ్రతాః శ్రాద్ధాదిక్రియాపరాః పితృ భక్తాః.భూతాని వినాయకమాతృగణచతుర్భగిన్యాదీని యాన్తి,భూతేజ్యాః భూతానాం పూజకాః.యాన్తి మద్యాజినః మద్యజనశీలాః వైష్ణవాః మామేవ.సమానేఽప్యాయసే మామేవ న భజన్తే అజ్ఞానాత్.తేన తే అల్పఫలభాజః భవన్తి ఇత్యర్థః. 25

బాలానందిని

యాన్తీతి:- దేవతల విషయంలో వ్రతం అనగా నియమము భక్తి ఉన్నవాళ్లు దేవతలను పొందుతారు. శ్రాద్ధాదికర్మలయందు ఆసక్తి గల పితృభక్తులు అగ్నిష్వాత్తాది పితృదేవతలను పొందుతారు. వినాయకులు(వీళ్లు విఘ్నేశ్వరుడు కాడు, ఒక గణానికి చెందిన వారు), మాతృగణము, చతుర్భగినులు మొదలైన భూతాలను పూజించేవాళ్లు భూతాలను పొందుతారు. నన్ను పూజించే స్వభావం గల వైష్ణవులు(ఈశ్వరుడైన ఆత్మయొక్క భక్తులు) నన్నే పొందుతారు. ఆయాసం సమానమే అయినా కూడ వాళ్లు అజ్ఞానంవల్ల నన్నే సేవించడంలేదు; అందువల్ల అల్పమైన ఫలం మాత్రమే పొందకలుగుతున్నారు అని అర్థం. 25

భా. అ. ప్ర. "దేవవ్రతులు, అనగా దేవతలను పూజిస్తాము అను సంకల్పం కలవాళ్లు, దేవతలను పొందుతారు" ఇత్యాదివిధంగా శ్రీరామానుజాచార్యులు చెప్పినది అయుక్తం. పని చేయకుండా సంకల్పమాత్రంచేత ఫలసిద్ధి కలగదు కదా? (భా. అ. ప్ర. పే. 137) 25

భాష్యమ్

న కేవలం మద్భక్తానామ్ అనావృత్తిలక్షణమ్ అనన్తఫలమ్; సుఖరాధనశ్చ అహమ్. కథమ్?

మూ. పత్రం పుష్పం ఫలం తోయం యో మే భక్త్యా ప్రయచ్ఛతి
తదహం భక్త్యుపహృతమశ్నామి ప్రయతాత్మనః. 26

బాలానందిని

నేతి:- నా భక్తులకు అనావృత్తిరూపమైన అనంతమైన ఫలం లభించడమే కాదు; నేను సుఖంగా ఆరాధించడానికి శక్యమైనవాడను కూడ. ఎట్లు?

ప్ర. అ. పత్రమితి:- యః=ఎవడు, మే=నాకు, భక్త్యా=భక్తితో, పత్రమ్=పత్రమును గాని, ఫలమ్=ఫలమును గాని, తోయమ్=ఉదకమును గాని, ప్రయచ్ఛతి=ఇస్తాడో, భక్త్యుప హృతమ్=భక్తితో సమర్పించబడిన, తత్ = దానిని, ప్రయతాత్మనః=పరిశుద్ధ మైన బుద్ధి గల ఆతనియొక్క, (లేదా ఆతని నుండి), అహమ్=నేను, అశ్నామి=గ్రహిస్తాను.

భాష్యమ్

పత్రం, పుష్పం, ఫలం, తోయమ్, ఉదకం, యః మే మహ్యామ్, భక్త్యా ప్రయచ్ఛతి, తత్ అహం పత్రాది, భక్త్యా ఉపహృతం భక్తిపూర్వకం ప్రాపితం భక్త్యుపహృతమ్, అశ్నామి గృహ్ణామి, ప్రయతాత్మనః శుద్ధబుద్ధేః. 26

బాలానందిని

పత్రమితి:- ఎవడు నాకు భక్తితో పత్రమును,పుష్పమును,ఫలమును, ఉదకమును ఇస్తాడో భక్తిపూర్వకంగా నాకు అందించబడిన ఆ పత్రాదికమును,శుద్ధమైన బుద్ధి గల వానినుండి నేను గ్రహిస్తాను.

భాష్యమ్

యతః ఏవమ్ అతః-

మూ. యత్కరోషి యదశ్నాసి యజ్జుహోషి దదాసి యత్,
యత్తపస్యసి కౌన్తేయ తత్కురుష్వ మదర్పణమ్. 27

బాలానందిని

యతః ఇతి:- ఇది ఇట్లు గాన,

ప్ర.అ. యదితి:- కౌన్తేయ=అర్జునా!యత్=ఏది,కరోషి=చేస్తున్నావో,యత్=ఏది, అశ్నాసి=తింటున్నావో,యత్=ఏది,జుహోషి=హోమం చేస్తున్నావో,యత్=ఏది, దదాసి= ఇస్తున్నావో,యత్=ఏది,తపస్యసి=(ఏ)తపస్సుచేస్తున్నావో,తత్=దానిని,మదర్పణమ్=నాకు అర్పణమునుగా,కురుష్వ=చేయుము.

భాష్యమ్

యత్ కరోషి,స్వతః ప్రాప్తం యత్ అశ్నాసి,యచ్చ జుహోషి హవనం నిర్వర్తయసి శ్రౌతం స్మార్తం వా,యత్,దదాసి ప్రయచ్ఛసి బ్రాహ్మణాదిభ్యః హిరణ్యాన్నాజ్యాది,యత్ తపస్యసి తపః చరసి,కౌన్తేయ,తత్ కురుష్వ మదర్పణమ్. 27

బాలానందిని

యదితి:- ఏ పని చేస్తున్నావో,దానంతట అదిగా వచ్చిన దేనిని తింటున్నావో, శ్రౌతము గాని స్మార్తం గాని అయిన ఏ హోమం చేస్తున్నావో, ఏ తపస్సు చేస్తున్నావో, అర్జునా! అది నాకు అర్పించుము. 27

భాష్యమ్

ఏవం కుర్వతః తవ యద్ భవతి తత్ శృణు -

మూ. శుభాశుభఫలైరేవం మోక్ష్యసే కర్మబన్ధనైః,
సంన్యాసయోగయుక్తాత్మా విముక్తో మాముపైష్యసి. 28

బాలానందిని

ఏవమితి:- ఈ విధంగా చేస్తూండగా నీకు ఏమవుతుందో వినుము-

శుభేతి:-ఏవమ్=ఈ విధంగా,శుభాశుభఫలైః=శుభాశుభఫలములు గల(ఫలము లిచ్చు), కర్మబన్ధనైః=కర్మ లనే బంధనములచేత,మోక్ష్యసే= విడువబడగలవు.సంన్యాస యుక్తాత్మా=సంన్యాసయోగముతో కూడిన అంతఃకరణం గలవాడవై,విముక్తః=ముక్తుడవై, మామ్=నన్ను, ఉపైష్యసి=పొందగలవు.

భాష్యమ్

శుభాశుభఫలైః-శుభాశుభే ఇష్టానిష్టే ఫలే యేషాం తాని శుభాశుభాఫలాని కర్మాణి,తైః శుభాశుభఫలైః,కర్మబన్ధనైః-కర్మాణ్యేవ బన్ధనాని,తైః కర్మబన్ధనైః,ఏవం మత్స మర్పణం కుర్వన్ మోక్ష్యసే.సః అయం సంన్యాసయోగః నామ సంన్యాసశ్చ అసౌ మత్సమర్పణతయా కర్మత్వాత్ యోగశ్చ అసౌ ఇతి,తేన సంన్యాసయోగేన యుక్తః, ఆత్మా అన్తఃకరణం యస్య తవ స త్వం సంన్యాసయోగయుక్తాత్మా సన్ విముక్తః కర్మ బన్ధనైః జీవన్నేవ,పతితే చ అస్మిన్ శరీరే,మామ్ ఉపైష్యసి ఆగమిష్యసి. 28

బాలానందిని

శుభేతి:- ఈ విధంగా నాకు సమర్పణం చేస్తూ, శుభాశుభఫలైః-ఏ కర్మల ఫలాలు ఇష్టములుగాను అనిష్టములుగాను ఉంటాయో అవి శుభాశుభఫలములు,అట్టి కర్మలే బంధనాలు, ఆ కర్బంధనాలచేత విడవబడగలవు.ఇది సంన్యాసయోగం.నాకు సమర్పించడంచేత ఇది సంన్యాసం;అట్లే కర్మ అవడంవల్ల కర్మయోగం.అట్టి సంన్యాస కర్మయోగంతో కూడిన అంతఃకరణం కలవాడవై నువ్వు జీవించి ఉండగానే కర్మబంధ నాలచేత విడువబడినవాడవై,ఈ శరీరం పతితం కాగానే నన్ను పొందగలవు. 28

భాష్యమ్

రాగద్వేషవాన్ తర్హి భగవాన్,యతః భక్తాన్ అనుగృహ్ణాతి న ఇతరాన్ ఇతి;తత్ న-

మూ. సమోఽహం సర్వభూతేషు న మే ద్వేష్యోఽస్తి న ప్రియః,
యే భజన్తి తు మాం భక్త్యా మయి తే తేషు చాప్యహమ్. 29

బాలానందిని

రాగేతి:- అయితే భగవంతునకు రాగద్వేషా లున్నా యని అర్థం. ఎందువల్ల ననగా భక్తుల్ని అనుగ్రహిస్తున్నాడు కాని ఇతరులను అనుగ్రహించడంలేదు;అది కాదు-

ప్రఅ. సమః ఇతి:- అహమ్=నేను,సర్వభూతేషు=సమస్తప్రాణులయందు,సమః =సమానుడను,మే=నాకు,ద్వేష్యః=ద్వేషింపదగినవాడు,న = లేదు;ప్రియః=ఇష్టుడు,న=లేదు. తు=కాని,యే=ఎవరు,మామ్=నన్ను,భక్త్యా=భక్తితో,భజన్తి=సేవిస్తారో,తే=వారు,మయి= నాయందుంటారు;అహం చాపి=నేను కూడ,తేషు=వాళ్లలో ఉంటాను.

భాష్యమ్

సమః తుల్యః,అహం సర్వభూతేషు,న మే ద్వేష్యః అస్తి న ప్రియః.అగ్నివత్ అహమ్. దూరస్థనాం యథా అగ్నిః శీతమ్ న అపనయతి సమీపమ్ ఉపసర్పతామ్ అపనయతి తథా అహం భక్తాన్ అనుగృహ్ణామి న ఇతరాన్.యే భజన్తి తు మామ్ ఈశ్వరం భక్త్యా మయి తే స్వభావతః ఏవ న మమ రాగనిమిత్తం మయి వర్తన్తే.తేషు చాపి అహం స్వభావతః ఏవ వర్తే న ఇతరేషు. నైతావతా తేషు ద్వేషః మమ. 29

బాలానందిని

సమ ఇతి:- నేను సమస్తభూతాలవిషయంలోను సముడను,తుల్యుడను.నాకు ద్వేషింపదగినవాడు గాని ప్రియుడు గాని లేదు.నేను అగ్నివంటివాడను.అగ్ని దూరంగా ఉన్నవాళ్ల చలిని ఏ విధంగా తొలగించదో,దగ్గరికి చేరుతూన్నవాళ్ల చలిని తొలగిస్తుందో అట్లే నేను భక్తులను అనుగ్రహిస్తాను కాని ఇతరులను అనుగ్రహించను.ఈశ్వరుడ నైన నన్ను ఎవరు భక్తితో సేవిస్తారో వాళ్లు స్వభావంచేతనే(సహజంగానే),అంతే కాని నాకు వాళ్లమీద రాగం ఉండడం అనే నిమిత్తంచేత కాదు,నాలో ఉంటారు.నేను కూడ స్వభావం చేతనే వాళ్లలో ఉంటాను కాని ఇతరులలో ఉండను;ఇంతమాత్రంచేత నాకు వాళ్లపైన ద్వేషం లేదు.

భా.అ.ప్ర.:-"దీని పిండితార్థం(సారం)ఏ మనగా నేను వాళ్లు కూడ పరస్పరం, పిత్రాదులయందు వలె భారం ఉంచినవాళ్లము"అని వేదాంతదేశికోక్తి సారరహితం.జీవులు తమ భారాన్ని ఈశ్వరునియందుంచినా,ఈశ్వరుడు జీవులయందు తన భారాన్ని ఉంచడం అనుపపన్నం.ఈశ్వరుడు స్వతంత్రుడు,సర్వరక్షకుడు.అందుచేత వానికి ఇతరులనుండి రక్షయొక్క అపేక్ష లేదు;అలాంటి అపేక్ష ఉంటే ఈశ్వరుడు తన భారాన్ని జీవునిమీద పడవేస్తాడు అనడం యుక్తంగా ఉండేది.జీవు డైతే పరాధీనుడు,తనను తాను రక్షించుకొన జాలడు;అందుచేత స్వరక్షాభారాన్ని ఈశ్వరునిమీద ఉంచుతాడు.అందుచేతనే జీవులు ఈశ్వరశరణాగతి చేయడం ఉంది కాని,ఈశ్వరుడు జీవశరణాగతి చేయడం లేదు. అలా కాకపోతే ఈశ్వరుని ఈశ్వరత్వానికే భంగం.(భా.అ.ప్ర.పే.140) 29

భాష్యమ్

శృణు మద్భక్తేః మాహాత్మ్యమ్ -

మూ. అపి చేత్సుదురాచారో భజతే మామనన్యభాక్,
సాధురేవ స మన్తవ్యః సమ్యగ్వ్యవసితో హి సః. 30

బాలానందిని

శృణ్వితి:- నా భక్తియొక్క మాహాత్మ్యాన్ని విను -

ప్ర.అ. అపీతి:- సుదురాచారః అపి చేత్=ఎంతో చెడ్డ ప్రవర్తన కలవాడైనా కూడ,ఎవడు, అనన్యభాక్=ఇతరులను సేవించనివాడై,మామ్=నన్ను,భజతే=సేవిస్తాడో, సః =అతడు,సాధుః=ఏవ=మంచివాడుగానే,మన్తవ్యః=తలవదగినవాడు. సః=అతడు,సమ్యక్ =బాగుగా,వ్యవసితః హి=నిశ్చయం కలవాడుగా ఉన్నాడు కదా?

భాష్యమ్

అపి చేత్ యద్యపి,సుష్ఠు దురాచారః అతీవ కుత్సితాచారః అపి,భజతే,మామ్, అనన్యభాక్ అనన్యభక్తిః సన్,సాధుః ఏవ సమ్యగ్వృత్తః ఏవ సః మన్తవ్యః జ్ఞాతవ్యః, సమ్యక్ యథావత్ వ్యవసితః,హి యస్మాత్,సాధునిశ్చయః సః. 30

బాలానందిని

అపీతి:- చాలా కుత్సితమైన ఆచారం కలవాడైనా కూడ,ఇతరులయందు భక్తి లేకుండా నన్ను సేవించువాడు మంచి నడవడిక కలవాడుగానే తెలియదగినవాడు. ఎందువల్ల ననగా-అతడు మంచి నిశ్చయం కలవాడు. 30

భాష్యమ్

ఉత్సృజ్య చ బాహ్యాం దురాచారతామ్ అన్తః సమ్యగ్వ్యవసాయసామర్థ్యాత్-

మూ. క్షిప్రం భవతి ధర్మాత్మా శశ్వచ్ఛాన్తిం నిగచ్ఛతి,
కౌన్తేయ ప్రతిజానీహి న మే భక్తః ప్రణశ్యతి. 31

బాలానందిని

ఉత్సృజ్యేతి:- లోపల(మనస్సులో)సాధువైన(మంచి) నిశ్చయం చేసికొని ఉండడం యొక్క సామర్థ్యంవల్ల బాహ్యంగా కనబడుతూన్న దురాచారత్వాన్ని విడచి -

ప్ర. అ. క్షిప్రమితి: - క్షిప్రమ్=శీఘ్రముగా,ధర్మాత్మా=ధర్మాత్ముడుగా,భవతి=అవుతాడు శశ్వత్=ఎల్లప్పుడూ కూడ,శాన్తిమ్=శాంతిని,నిగచ్ఛతి=పొందుతాడు.కౌన్తేయ=అర్జునా! ప్రతిజానీహి=నిశ్చితంగా ప్రతిజ్ఞ చెయ్యి, మే=నాయొక్క భక్తః=భక్తుడు,న ప్రణశ్యతి= నశించడు.

భాష్యమ్

క్షిప్రం శీఘ్రం,భవతి,ధర్మాత్మా ధర్మచిత్తః ఏవ,శశ్వత్ నిత్యం,శాన్తిం చ ఉపశమం, నిగచ్ఛతి ప్రాప్నోతి.శృణు పరమార్థం కౌన్తేయ,ప్రతిజానీహి నిశ్చితాం ప్రతిజ్ఞాం కురు, న మే భక్తః మయి సమర్పితాన్తరాత్మా మద్భక్తః న ప్రణశ్యతి ఇతి. 31

బాలానందిని

క్షిప్రమితి: -శీఘ్రంగా ధర్మమునందు చిత్తం కలవా డవుతాడు.ఎల్లప్పుడూ శాంతిని పొందుతాడు.అర్జునా యథార్థ మైన విషయం విను;నిశ్చిత మైన ప్రతిజ్ఞ చెయ్యి; నా భక్తుడు, నాయందు సమర్పించబడిన ఆత్మ గల నా భక్తుడు(ఎన్నటికీ)నశించడు.

భాష్యమ్

కిం చ-

మూ. మాం హి పార్థ వ్యపాశ్రిత్య యేఽపి స్యుః పాపయోనయః,
స్త్రియో వైశ్యాస్తథా శూద్రాస్తేఽపి యాన్తి పరాం గతిమ్. 32

బాలానందిని

కిం చేతి:- మరియు

ప్ర. అ. మామితి:- పార్థ=అర్జునా!యే అపి=ఎవరు,పాపయోనయః=పాపజన్మ కలవారు,స్యుః అయి ఉంటారో,స్త్రియః=స్త్రీలు,వైశ్యాః=వైశ్యులు,తథా=మరియు,శూద్రాః =శూద్రులు, తే అపి=వాళ్లుకూడ,మామ్=నన్ను,వ్యపాశ్రిత్య=ఆశ్రయించి, పరాం గతిమ్= ఉత్తమగతిని,యాన్తి=పొందుతారు.

భాష్యమ్

మాం హీతి:- మాం. హి యస్మాత్, పార్థ,వ్యపాశ్రిత్య మామ్ ఆశ్రయత్వేన గృహీత్వా, యే అపి స్యుః, పాపయోనయః,పాపా యోనిః యేసాం తే పాపయో నయః, పాపజన్మానః; కే తే ఇత్యాహ-స్త్రియః వైశ్యాః తథా శూద్రాః తే అపి యాన్తి గచ్ఛన్తి పరామ్ గతిం ప్రకృష్టాం గతిమ్. 32

బాలానందిని

మాం హీతి:- అర్జునా! నన్ను ఆశ్రయంగా గ్రహించి, ఎవ రైతే పాపజన్మ గలవారుగా ఉంటారో వాళ్లు కూడ, వాళ్లెవరో చెపుతున్నాడు - స్త్రీలు,వైశ్యులు, మరియు శూద్రులు కూడ,ఉత్కృష్టమైన గతిని ఎందువల్ల పొందుతున్నారో -

మూ. కిం పునర్బ్రాహ్మణాః పుణ్యా భక్తా రాజర్షయస్తథా,
అనిత్యమసుఖం లోకమిమం ప్రాప్య భజస్వ మామ్. 33

ప్ర.అ. **కిమితి**:- (అందువల్ల) పుణ్యాః=పుణ్యులైన భక్తాః=భక్తులైన బ్రాహ్మణాః= బ్రాహ్మణులు,తథా=అట్లే, రాజర్షయః=రాజర్షులు,(పొందుతారని), కిం పునః=చెప్పనేల, అనిత్యమ్=నిత్యము కానిది, అసుఖమ్=సుఖం లేనిదీ అయిన,ఇమమ్=ఈ,లోకమ్= లోకమును, ప్రాప్య=పొంది,మామ్=నన్ను భజస్వ=సేవించుము.

భాష్యమ్

కిం పునరితి:- కిం పునః బ్రాహ్మణాః,పుణ్యాః పుణ్యయోనయః,భక్తాః రాజర్షయః తథా,రాజానః చ తే ఋషయశ్చ ఇతి రాజర్షయః.యతః ఏవమ్ అతః అనిత్యం క్షణభఙ్గురమ్,అసుఖం చ సుఖవర్జితమ్ ఇమం లోకం మనుష్యలోకం ప్రాప్య పురుషార్థసాధనం దుర్లభం మనుష్యత్వం లబ్ధ్వా,భజస్వ సేవస్వ మామ్. 33

బాలానందిని

కిం పునః ఇతి:-పుణ్యయోను లైన,భక్తు లైన బ్రాహ్మణులు,అట్లే ఋషు లైన రాజులు రాజర్షులు,పొందుతా రని వేరే చెప్పాలా?ఇది ఇట్లు గాన,అనిత్యము,క్షణంలో నశించేది,సుఖరహితమూ అయిన ఈ మనుష్యలోకాన్ని పొంది,పురుషార్థం సాధించడానికి సాధనము,దుర్లభమూ అయిన మనుష్యత్వాన్ని పొంది(పొంది ఉన్నావు గాన), నన్ను సేవించుము.(మనుష్యమాత్రునికి భక్తిలో అధికారం ఉన్న దని భావం."భక్త్యధికారే జాతి నియమః నాస్తి"అని ఆనందగిరి). 33

భాష్యమ్

కథమ్?

మూ. మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు,
మామేవైష్యసి యుక్త్వైవమాత్మానం మత్పరాయణః. 34

ఇతి శ్రీ మహాభారతే శతసాహస్ర్యాం సంహితాయాం వైయాసిక్యాం

భీష్మపర్వణి శ్రీమద్భగవద్గీతాసు ఉపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగ శాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే రాజవిద్యారాజగుహ్యయోగో నామ నవమోఽధ్యాయః.

బాలానందిని

కథమితి:- ఎట్లు సేవించాలి?

ప్ర.అ. మన్మనా ఇతి:- మన్మనాః=నాయందు మనస్సు కలవాడవు,భవ=అగుము. మద్భక్తః=నా భక్తుడవుగా,మద్యాజీ=నన్ను పూజించేవాడవుగా,అగుము. మామ్=నన్ను, నమస్కురు=నమస్కరించుము. మత్పరాయణః=నేనే పరమగతిగా కలవాడవై,ఏవమ్=ఈ విధంగా,యుక్త్వా=చిత్తమును నిలిపి,ఆత్మానమ్=ఆత్మ నైన,మామేవ=నన్నే,ఏష్యసి=పొంద గలవు.

భాష్యమ్

మయి మనః యస్య త్వం మన్మనాః భవ. తథా మద్భక్తః భవ. మద్యాజీ మద్య జనశీలః భవ. మామేవ చ నమస్కురు.మామేవ ఈశ్వరమ్ ఏష్యసి ఆగమిష్యసి యుక్త్వా సమాధాయ చిత్తం.ఏవమ్,ఆత్మానమ్,అహం హి సర్వేషాం భూతానామ్ ఆత్మా, పరా చ గతిః,పరమ్ అయనమ్,తం మామ్,ఏవంభూతమ్ ఏష్యసి ఇతి అతీతేన సంబన్ధః. మత్పరాయణః సన్ ఇత్యర్థః. 34

ఇతి శ్రీ మత్పరమహంసపరివ్రాజకాచార్యగోవిన్దభగవత్పూజ్యపాదశిష్య శ్రీమచ్ఛఙ్కరభగవతః కృతౌ శ్రీభగవద్గీతాభాష్యే రాజవిద్యా రాజగుహ్యయోగో నామ నవమోఽధ్యాయః.

బాలానందిని

మయీతి:- నా యందు మనస్సు కలవాడవు అగుము.అట్లే నా భక్తుడవు అగుము. నన్ను పూజించే స్వభావం కలవాడవు అగుము.నన్నే నమస్కరించుము.ఈశ్వరుడనైన నన్నే పొందగలవు.యుక్త్వా=చిత్తమును ఏకాగ్రముచేసి.ఈ విధంగా,ఆత్మనైన,నేను సకల భూతాల ఆత్మను;పరమైన గతిని,పరాయణమును, ఈ విధంగా ఉన్న అట్టి నన్ను'ఏష్యసి' అను వెనుకటి పదంతో సంబంధం. నేనే పరమగతిగా కలవాడవై అని అర్థం. 34

"బాలానందిని"అను శ్రీభగవద్గీతాశాంకరభాష్యాంధ్రవ్యాఖ్యానమునందు రాజవిద్యారాజగుహ్యయోగం అను నవమాధ్యాయం సమాప్తం.

(మొదటినుండి శ్లోకాలు 343)

అథ దశమో౽ధ్యాయః

భాష్యమ్

సప్తమే అధ్యాయే భగవతః తత్త్వం విభూతయశ్చ ప్రకాశితాః, నవమే చ. అథ ఇదానీం యేషు యేషు భావేషు చిన్త్యః భగవాన్ తే తే భావాః వక్తవ్యాః. తత్త్వం చ భగవతః వక్తవ్యమ్ ఉక్తమపి,దుర్విజ్ఞేయత్వాత్ ఇత్యతః-

శ్రీభగవానువాచ-

మూ. భూయ ఏవ మహాబాహో శృణు మే పరమం వచః,
యత్తే౽హం ప్రీయమాణాయ వక్ష్యామి హితకామ్యయా. 1

బాలానందిని

సప్తమే ఇతి:- ఏడవ అధ్యాయంలోను నవమాధ్యాయంలోను భగవంతుని తత్త్వము విభూతులు ప్రకాశింపబడినవి.ఇంక ఇప్పుడు భగవంతుణ్ణి ఏ యే వస్తువులలో ధ్యానించాలో ఆ వస్తువులను గూర్చి చెప్పవలసి ఉంది.భగవత్తత్త్వాన్ని గూర్చి వెనుక చెప్పినా కూడ,దానిని తెలుసుకొనడం కష్ట మైనది గాన మళ్లీ చెప్పవలసి ఉంది. అందువల్ల భగవంతు డిలా అన్నాడు -

ప్ర.అ. భూయ ఇతి:- మహాబాహో=అర్జునా! భూయః ఏవ=మళ్లీ, మే=నా యొక్క, పరమమ్=గొప్పదైన, వచః=వచనమును,శృణు=వినుము.యత్=దేనిని,ప్రీయ మాణాయ= ఇష్టపడుతూన్న,తే=నీయొక్క,హితకామ్యయా=హితమునందు కోరికచేత, అహమ్ = నేను,వక్ష్యామి=చెప్పెదనో.

భాష్యమ్

భూయః ఇతి:- భూయః ఏవ పునః,హే మహాబాహో,శృణు, మే మదీయం పరమం ప్రకృష్టం నిరతిశయవస్తునః ప్రకాశకం,వచః వాక్యం,యత్ పరమం,తే తుభ్యం, ప్రీయమాణాయ,మద్వచనాత్ ప్రీయసే త్వమ్ అతీవ అమృతమివ పిబన్,తతః వక్ష్యామి హితకామ్యయా హితేచ్ఛయా. 1

బాలానందిని

భూయి ఇతి:-ఓ ! మహాబాహూ!మరల నాయొక్క ప్రకృష్ట మైన,నిరతిశయ మైన వస్తువును ప్రకాశింపచేసే దైన వాక్కును వినుము;పరమ మైన ఏ వాక్కును,నేను ప్రీతితో

కూడిన నీకు,నువ్వు నా మాటలతో అమృతం త్రాగినట్లు ఆనందిస్తున్నావు. అందువల్ల, నీ హితమునందు కోరికచేత చెప్పెదను. 1

భాష్యమ్

కిమర్థమ్ అహం వక్ష్యామి ఇత్యాహ –

మూ. న మే విదుః సురగణాః ప్రభవం న మహర్షయః,
అహమాదిర్హి దేవానాం మహర్షీణాం చ సర్వశః. 2

బాలానందిని

కిమర్థమితి:– నేను ఎందుకు చెపుతానో విను –

ప్ర.అ. నేతి:– మే=నాయొక్క,ప్రభవమ్=ఉత్పత్తిని,సురగణాః=దేవతాగణములు,న విదుః=ఎరుగవు.మహర్షయః=మహర్షులు.న=ఎరుగరు.అహమ్=నేను,సర్వశః=అన్ని విధాలా కూడ,దేవానామ్=దేవతలకు,మహర్షీణాం చ = మహర్షులకూ కూడ,ఆది హి = కారణమును కదా?

భాష్యమ్

న మే విదుః న జానన్తి సురగణాః బ్రహ్మాదయః. కిం తే న విదుః?మమ ప్రభవం ప్రభావం,ప్రభుశక్త్యతిశయమ్;అథవా ప్రభవం ప్రభవనమ్ ఉత్పత్తిం;నాపి మహర్షయః భృగ్వాదయః విదుః.కస్మాత్ తే న విదుః ఇతి ఉచ్యతే–అహమ్ ఆదిః కారణం హి యస్మాత్.దేవానాం మహర్షీనాం చ సర్వశః సర్వప్రకారైః. 2

బాలానందిని

నేతి:– బ్రహ్మాదిసురగణాలు ఎరుగరు?వారు దేనిని ఎరుగరు?నా యొక్క ప్రభావాన్ని,ప్రభుశక్త్యతిశయాన్ని,లేదా పుట్టుకను ఎరుగరు.భృగ్వాదిమహర్షులు కూడ ఎరుగరు.వాళ్లు ఎందువల్ల ఎరుగరో చెప్పబడుచున్నది.ఎందువలన నేను దేవతలకు, మహర్షులకూ కూడ అన్ని విధాలా కారణమైనవాడనో.

భాష్యమ్

కిం చ –

మూ. యో మామజమనాదిం చ వేత్తి లోకమహేశ్వరమ్,
అసంమూఢః స మర్త్యేషు సర్వపాపైః ప్రముచ్యతే. 3

బాలానందిని

కిం చేతి:– మరియు

ప్ర. అ. యః ఇతి:– యః=ఎవడు,మామ్=నన్ను,అజమ్=పుట్టుక లేనివానినిగాను, అనాదిం చ=ఆది లేనివానిని గాను,లోకమహేశ్వరమ్=లోకాల గొప్ప ఈశ్వరుని గాను, వేత్తి=తెలుసుకొంటాడో, మర్త్యేషు=మానవులలో,అసంమూఢః=సంమూఢుడు కాని, సః= అతడు,సర్వపాపైః=సమస్తపాపములచేత,ప్రముచ్యతే=విడువబడును.

భాష్యమ్

యః మామ్ అజమ్ అనాదిం చ,యస్మాత్ అహమ్ ఆదిః దేవానాం మహర్షీణాం చ,న మమ అన్యః ఆదిః విద్యతే,అతః అహమ్ అజః అనాదిః చ, అనాదిత్వమ్ అజత్వే హేతుః,తం మామ్ అజమ్ అనాదిం చ యః వేత్తి విజానాతి లోకమహేశ్వరం –లోకానాం మహాన్తమ్ ఈశ్వరం (తురీయమ్ అజ్ఞానతత్కార్యవర్జితమ్)అసంమూఢః సంమోహవర్జితః సః మర్త్యేషు మనుష్యేషు సర్వపాపైః సర్వైః పాపైః మతిపూర్వామతి పూర్వకృతైః ప్రముచ్యతే ప్రమోక్ష్యతే. 3

బాలానందిని

యః ఇతి:– ఎవడు నన్ను పుట్టుక లేనివానిని గాను,ఆది లేనివానిని గాను, నేను దేవతలకు మహర్షులకు ఆదిని గాన నాకు మరొకడు ఆదిగా(కారణంగా)లేడు.అందువల్ల నేను అజుడను,అనాదిని.అనాదిత్వం అజత్వానికి హేతువు.(అనాది కావుననే అజు డను అని అర్థం).లోకముల గొప్ప ప్రభువును గాను తెలుసుకొంటాడో(తురీయమ్,అజ్ఞాన తత్కార్యవర్జితమ్–అనగా జాగ్రత్స్వప్నసుషుప్త్యతీతీతుడ నైన శుద్ధస్వరూపం అయినవాడను, అజ్ఞానముతోను,దాని కార్యాలతోను శూన్యుడను అని అర్థం.ఇది కొన్ని ప్రతులలో లేదు. అనావశక్యం కూడ).సంమోహం లేని అతడు,మనుష్యులలో,బుద్ధిపూర్వకముగా చేసినవి, తెలియక చేసినవి అయిన సమస్తపాపాలచేత విడువబడును. 3

భా. అ. ప్ర.: భగవంతుడు ఇతరచేతనులతో సజాతీయుడు అను మోహం లేనివాడై ఎవడు నేను చిదచిద్విలక్షణు డను అవడంచేత సమస్తమైన చెడ్డ గుణాలకు విరుద్ధమైన అనంతకల్యాణగుణాలు కలవాడను అనీ,కర్మవల్ల కలిగే అచిత్తుతో సంబంధం అనే జన్మ లేనివాడ నవడంచేత బద్ధు లైన జీవులకంటె విలక్షణు డను అనీ,ఆది అజత్వమూ గల ముక్తాత్మలకంటె కూడ విలక్షణుడను అనీ,అజుడు అనాది అయిన ఈశ్వరు డను అనీ తెలుసుకొంటాడో అతడు సర్వపాపాలనుండి విముక్తు డవుతాడు అని శ్రీరామానుజాచార్య వ్యాఖ్య అసంగత మైనది.చిద్రూపుడైన ఈశ్వరుడు చిద్విలక్షణుడు ఎలా అవుతాడు?

"కేవలో నిర్గుణశ్చ"అని శ్రుతిచేత నిర్గుణుగా చెప్పబడినవాడు గుణాలకు నిలయం కాజాలడు. పుట్టుచూన్న దేహంతో సంబంధమే జన్మ అనగా;అందుచేత కర్మవల్ల ఏర్పడిన అచిత్సంబంధం జన్మ అని చెప్పడం అయుక్తం;దానితో గౌరవం (అనావశ్యకమైన అధిక కల్పన)కూడ ఉంది. ఈశ్వరునికి కూడ ఇలాంటి జన్మ ఉంటుంది గాన వానికి అజత్వం సిద్ధించదు;బద్ధజీవులకంటె వైలక్షణ్యం కూడ సిద్ధించదు. ఆదిమత్త్వము. అజత్వము అనేవి పరస్పరవిరుద్ధధర్మాలు. అవి ఒకచోట ఉండవు. అందుచేత ముక్తాత్మలు ఆదిమత్తులు. అజములు అనడం కుదరదు. ఈశ్వరుని సాయుజ్యం పొందిన ముక్తునికి ఈశ్వరునికంటె భేదం ఎలా ఉంటుంది?"బ్రహ్మవిద్ బ్రహ్మైవ భవతి"అను శ్రుతి సాయుజ్యాన్ని చెపుతున్నది కదా? అంతే కాక-"సాక్షీ చేతా"అని శ్రుతిలో చెప్పబడిన ఏకైకచేతనమైన ఈశ్వరునికి చేతనాంతరాలకంటె విజాతీయత్వం ఎలా కుదురుతుంది? మరొక చేతనం ఉంటే కదా అది ఈశ్వరునికి విజాతీయం అయేది?"నాన్యోఽతోఽస్తి ద్రష్టా"అను శ్రుతి బ్రహ్మభిన్నమైన చేతనం మరొక టేదీ లేదని చెపుతూన్నది. (భా. అ. ప్ర. పే. 246-47) 3

భాష్యమ్

ఇతశ్చాహం మహేశ్వరః లోకానామ్ -

మూ. **బుద్ధిర్జ్ఞానమసంమోహః క్షమా సత్యం దమః శమః,**
సుఖం దుఃఖం భవోఽభావో భయం చాభయమేవ చ. 4

బాలానందిని

ఇతశ్చేతి:- ఈ కారణంవల్ల కూడ నేను సర్వలోకమహేశ్వరుడను -

ప్ర. అ. **బుద్ధిరితి:-** బుద్ధిః=బుద్ధి,జ్ఞానమ్=జ్ఞానము,అసంమోహః=మోహం (బుద్ధి వైకల్యం)లేకపోవడము,క్షమా=ఓర్పు,సత్యమ్=సత్యము,దమః=దమము, శమః=శమము, సుఖమ్=సుఖము,దుఃఖమ్ః దుఖము,భవః=పుట్టుక,అభావః=వినాశము,భయం చ= భయము,అభయమ్ ఏవ చ=అభయము.

భాష్యమ్

బుద్ధిః అన్తఃకరణస్య సూక్ష్మాద్యర్థావబోధనసామర్థ్యమ్. తద్వన్తం బుద్ధిమానితి హి వదన్తి. జ్ఞానమ్ ఆత్మాదిపదార్థానామ్ అవబోధః. అసంమోహః ప్రత్యుత్పన్నేషు బోద్ధవ్యేషు వివేకపూర్వికా ప్రవృత్తిః. క్షమా ఆక్రుష్టస్య తాడితస్య వా అవికృతచిత్తతా. సత్యం యథాదృష్టస్య యథాశ్రుతస్య చ ఆత్మానుభవస్య పరబుద్ధిసంక్రాన్తయే తథైవ ఉచ్చార్యమాణా వాక్ సత్యమ్ ఉచ్యతే. దమః బాహ్యేన్ద్రియోపశమః. శమః అన్తఃకరణస్య

ఉపశమః సుఖమ్ ఆహ్లాదః. దుఃఖం సంతాపః. భవః ఉద్భవః. అభావః తద్విపర్యయః భయం చ త్రాసః. అభయమ్ ఏవ చ తద్విపరీతమ్. 4

బాలానందిని

బుద్ధిః ఇతి:- అంతఃకరణాని కున్న,సూక్ష్మాదివిషయాలను తెలుసుకొనకలిగిన సామర్థ్యం బుద్ధి. అది ఉన్నవానిని బుద్ధిమంతుడు అని అంటారు కదా? ఆత్మాదిపదార్థాలను తెలుసుకొనడం జ్ఞానం. తెలుసుకొనవలసిన విషయాలు ఉపస్థితము లైనప్పుడు వివేక పూర్వకంగా వాటి విషయంలో ప్రవర్తించడం అసంమోహం. ఎవరైనా తిట్టినా కొట్టినా చిత్తంలో వికారం చెందకుండా ఉండడం క్షమ. చూచినది చూచినట్లుగా, విన్నది విన్నట్లుగా తన అనుభవాన్ని ఇతరుల బుద్ధిలోనికి సంక్రమింపచేయడంకోసం,ఆ విధంగానే ఉచ్చరించబడే వాక్కు సత్యం అని చెప్పబడుతుంది. బాహ్యేంద్రియాల నిగ్రహం దమం. అంతఃకరణనిగ్రహం శమం. ఆనందం సుఖం. సంతాపం దుఃఖం. పుట్టుక భావం. దానికి విపరీతమైనది అభావం. త్రాసం భయం. దానికి విపరీత మైనది అభయం.

మూ. అహింసా సమతా తుష్టిస్తపో దానం యశోఽ యశః,

భవన్తి భావా భూతానాం మత్త ఏవ పృథగ్విధాః. 5

ప్ర.అ. అహింసేతి:- అహింసా=అహింస,సమతా=సమత్వము,తుష్టిః=సంతృప్తి, తపః=తపస్సు,దానమ్=దానము,యశః=కీర్తి,అయశః=అపకీర్తి,పృథగ్విధాః=వేరు వేరు విధాలైన,భావాః=భావాలు,భూతానామ్=భూతాలకు,మత్తఃఏవ=నావల్లనే,భవన్తి= కలుగు తూంటాయి.

భాష్యమ్

అహింసేతి:- అహింసా అపీడా ప్రాణినామ్. సమతా సమచిత్తతా. తుష్టిః సంతోషః పర్యాప్తబుద్ధిః లాభేషు. తపః ఇన్ద్రియసంయమపూర్వకం శరీరపీడనమ్. దానం యథాశక్తి సంవిభాగః. యశః ధర్మనిమిత్తా కీర్తిః. అయశస్తు అధర్మనిమిత్తా అకీర్తిః. భవన్తి భావాః యథోక్తాః బుద్ధ్యాదయః, భూతానాం ప్రాణినాం, మత్త ఏవ ఈశ్వరాత్, పృథగ్విధాః నానావిధాః స్వకర్మానురూపేణ. 5

బాలానందిని

అహింసేతి:- ప్రాణులకు పీడ కలిగించకుండా ఉండడం అహింస. సమాన మైన చిత్తం కలిగి ఉండడం(రాగద్వేషాలు లేకుండా ఉండడం)సమత. లభించిన వస్తువుల విషయంలో చాలును అను బుద్ధితో సంతోషం;సంతృప్తి. తుష్టి. ఇంద్రియాలను నిగ్రహించు

కొని శరీరాన్ని(ఉపవాసాదులచేత)పీడించడం తపస్సు. శక్త్యనుసారం ఇతరులకు ద్రవ్యం ఇవ్వడం దానం. ధర్మాచరణంవల్ల కలిగేది కీర్తి. అధర్మాచరణంవల్ల కలిగేది అకీర్తి. ఈ చెప్పబడిన అనేకవిధాలైన బుద్ధ్యాదిభావాలు ప్రాణులకు,వారి వారి కర్మలను అనుసరించి, ఈశ్వరుడ నైన నానుండియే కలుగుతాయి. 5

భాష్యమ్

కిం చ-

మూ. మహర్షయః సప్త పూర్వే చత్వారో మనవస్తథా,
మద్భావా మానసా జాతా యేషాం లోక ఇమాః ప్రజాః. 6

బాలానందిని

కిం చేతి:- మరియు -

ప్ర.అ. మహర్షయః ఇతి:- పూర్వే=పూర్వికులైన, సప్త=ఏడుగురు, మహర్షయః =మహర్షులు, తథా=అట్లే,చత్వారః =నలుగురు,మనవః=మనువులు,మద్భావాః=నా యందే నిలబడిన భావం కలవారు,మానసాః=(నా మనస్సుకు సంబంధించినవారై, జాతాః = పుట్టినారు. లోకే=లోకమునందు,ఇమాః ప్రజాః = ఈ ప్రజలు,యేషామ్ = ఎవరి సృష్టియో.

భాష్యమ్

మహర్షయః సప్త భృగ్వాదయః,పూర్వే అతీతకాలసంబన్ధినః,చత్వారః మనవః తథా సావర్ణాః ఇతి ప్రసిద్ధాః. తే చ,మద్భావాః మద్గతభావనాః,వైష్ణవేన సామర్థ్యేన ఉపేతాః మానసాః మనసైవ ఉత్పాదితాః మయా జాతాః ఉత్పన్నాః,యేషాం మనూనాం మహర్షీణాం చ సృష్టిః లోకే ఇమాః స్థావరజఙ్గమాః ప్రజాః. 6

బాలానందిని

మహర్షయః ఇతి:- పూర్వికులైన గడచిన కాలానికి సంబంధించిన,భృగ్వాదులైన ఏడుగురు మహర్షులు,అట్లే సావర్ణు లని ప్రసిద్ధు లైన నలుగురు మనువులు, వారందరూ, నామీదనే నిలచిన భావన కలవారు;విష్ణువుకు సంబంధించిన సామర్థ్యంతో కూడినవారు. మానసులు అనగా నాచేత మనస్సుచేత పుట్టింపబడినవారై,పుట్టారు. లోకంలో ఉన్న ఈ స్థావరజంగమరూపు లైన ప్రజలందరూ ఆ మనువులయొక్క మహర్షులయొక్క సృష్టియే.

మూ. ఏతాం విభూతిం యోగం చ మమ యో వేత్తి తత్త్వతః,
సోఽవికమ్పేన యోగేన యుజ్యతే నాత్ర సంశయః. 7

ప్ర.అ. **ఏతామితి**:- యః=ఎవడు,మమ=నాయొక్క,ఏతామ్=ఈ,విభూతిమ్= విస్తారమును,యోగం చ=యోగమును,తత్త్వతః=యథార్థంగా,వేత్తి=తెలుసుకొంటాడో, సః =అతడు,అవికమ్పేన=చంచలము కాని(స్థిరమైన),యోగేన=యోగముతో,యుజ్యతే= కూడుకొని ఉంటాడు.అత్ర=ఈ విషయములో,సంశయః=సంశయం,న=లేదు.

భాష్యమ్

ఏతామితి:-ఏతాం యథోక్తాం,విభూతిం విస్తారం,యోగం చ యుక్తిం చ ఆత్మనః ఘటనమ్,అథవా యోగైశ్వర్యసామర్థ్యం;సర్వజ్ఞత్వం యోగజం యోగః ఇత్యుచ్యతే.మమ మదీయం,యః,వేత్తి తత్త్వతః తత్త్వేన,యథావత్ ఇత్యేతత్.సః, అవికమ్పేన అప్రవిచలితేన, యోగేన సమ్యగ్దర్శనస్థైర్యలక్షణేన,యుజ్యతే సంబధ్యతే.న అత్ర సంశయః,న అస్మిన్ అర్థే సంశయః అస్తి. 7

బాలానందిని

ఏతామితి:-ఇంతవరకు చెప్పబడిన,నాయొక్క,విభూతిని అనగా జగద్రూపంతో విస్తరించడాన్ని,యుక్తిని అనగా పితృపితామహాదిరూపంలో ఆత్మను కూర్చడాన్ని,లేదా యోగైశ్వర్యసామర్థ్యాన్ని;యోగంవల్ల కలిగిన సర్వజ్ఞత్వం యోగం అని చెప్పబడుచున్నది; ఎవడు తత్త్వంచేత,ఉన్నది ఉన్నట్లుగా అని భావం;తెలుసుకొంటాడో,అతడు చలించని, సమ్యగ్దర్శనమునందు స్థిరంగా ఉండడం అనే యోగంతో,సంబంధిస్తాడు(ఆ యోగం కలవా డగుతాడు). ఈ విషయంలో సంశయం లేదు.

భా.అ.ప్ర.:- విభూతినిఅనగా ఐశ్వర్యాన్ని,యోగమును,అనగా కల్యాణగుణగణాన్ని, యోగేన అనగా భక్తియోగంచేత అని శ్రీరామానుజవ్యాఖ్యానం అయుక్తం. ఈశ్వరుని ఐశ్వర్యాదులను గూర్చి తెలియనివానికి కూడ ఈశ్వరునియందు భక్తియోగం కనబడుచున్నది కదా?అది తెలిసినవానికి వానియందు భక్తి కలగడం లోకంవల్లనే తెలుస్తూ న్నది గాన ఇక్కడ చెప్పడం వ్యర్థం కూడ. రాజులో ఉన్న ఐశ్వర్యాదిగుణాలను గూర్చి తెలిసినవాళ్లు రాజును సేవిస్తారు కదా? యోగశబ్దానికి కల్యాణగుణా లనే అర్థం లోకశాస్త్ర విరుద్ధం (భా.అ.ప్ర.పే.149) 7

భాష్యమ్

కీదృశేన అవికమ్పేన యోగేన యుజ్యతే ఇతి! ఉచ్యతే -

మూ. అహం సర్వస్య ప్రభవః మత్తః సర్వం ప్రవర్తతే,
ఇతి మత్వా భజన్తే మాం బుధా భావసమన్వితాః. 8

బాలానందిని

కీదృశేనేతి:- అవికంపమైన ఎట్టి యోగంతో యుక్తు డౌతాడు? చెప్పబడుచున్నది-

ప్ర.అ.:- అహమ్=నేను, సర్వస్య=సమస్తమునకు,ప్రభవః=ఉత్పత్తిస్థానమైనవాడను. సర్వమ్=సమస్తము,మత్తః=నానుండియే,ప్రవర్తతే=ప్రవర్తిస్తూన్నది. ఇతి=ఇట్లు, మత్వా తలచి (తలుస్తూ),భావసమన్వితాః=పరమార్థతత్త్వమునందు పట్టుదల గల,బుధాః=పండితులు, మామ్=నన్ను,భజన్తే=సేవిస్తారు.

భాష్యమ్

అహం పరం బ్రహ్మ వాసుదేవాఖ్యం,సర్వస్య జగతః,ప్రభవః ఉత్పత్తిః. మత్తః ఏవ స్థితినాశక్రియాఫలోపభోగలక్షణం విక్రియారూపం సర్వం జగత్ ప్రవర్తతే ఇత్యేవం మత్వా,భజన్తే సేవన్తే,మాం,బుధాః అవగతతత్త్వార్థాః,భావసమన్వితాః భావః భావనా, పరమార్థతత్త్వాభినివేశః. తేన సమన్వితాః సంయుక్తాః ఇత్యర్థః. 8

బాలానందిని

అహమితి:- నేను,అనగా వాసుదేవు డనే పేరు గల పరబ్రహ్మ నైన నేను,సమస్త జగత్తుయొక్క ఉత్పత్తిని(ఉత్పత్తిస్థానము). స్థితి నాశమూ క్రియాఫలాల భోగము అను లక్షణాలు గల,వికారరూపమైన సమస్తజగత్తు నానుండియే ప్రవర్తిస్తూన్నది అని తెలుసుకొని, భావసమన్వితు లైన-భావం అనగా భావన,పరమార్థతత్త్వం విషయంలో పట్టుదల,దానితో కూడిన,బుధులు,తత్త్వార్థం తెలిసికొన్నవారు,నన్ను సేవిస్తూంటారు.

భా.అ.ప్ర.:-"ఈశ్వరు డైన శ్రీకృష్ణుడు జగత్సృష్ట్యాదులకు హేతు వని తెలుసుకొని శ్రీకృష్ణ దను పేరు గల బ్రహ్మను,బుధులు భక్తియుక్తులు,సేవిస్తూంటారు"అని శ్రీరామానుజ వ్యాఖ్య అనుపపన్నం. శ్రీకృష్ణావతారానికి పూర్వం ఉన్నవాళ్లకీ,తరువాత ఉన్నవాళ్లకీ, కృష్ణావతారకాలంలో కూడ దూరంగా ఉన్నవాళ్లకీ శ్రీకృష్ణభజనం కుదరదు కదా? దగ్గర ఉన్న బుధులకు కూడ శ్రీకృష్ణదేహంలో ఈశ్వరబుద్ధి ఉండదు. సర్వవ్యాపి ఆత్మయే కదా? (భా.అ.ప్ర. పే.149) 8

భాష్యమ్

కిం చ-

మూ. మచ్చిత్తా మద్గతప్రాణా బోధయన్తః పరస్పరమ్,
కథయన్తశ్చ మాం నిత్యం తుష్యన్తి చ రమన్తి చ. 9

బాలానందిని

కిం చేతి:- మరియు -

ప్ర.అ. మచ్చిత్తా ఇతి:- మచ్చిత్తాః=నాయందే చిత్తము కలవారై, మద్గతప్రాణాః= నాయందే ఉన్న చక్షురాదీంద్రియాలు కలవారై,పరస్పరమ్=పరస్పరమును,బోధయన్తః = తెలుపుకొనుచు,మామ్=నన్ను గూర్చి,కథయన్తః చ= చెప్పుకొనుచు,నిత్యమ్=ఎల్లప్పుడు, తుష్యన్తి చ=సంతోషిస్తూంటారు,రమన్తి చ=క్రీడిస్తూంటారు.

భాష్యమ్

మచ్చిత్తా ఇతి:- మయి చిత్తం యేషాం తే మచ్చిత్తాః,మద్గతప్రాణాః మాం గతాః చక్షురాదయః ప్రాణాః యేషాం తే మద్గతప్రాణాః;మయి ఉపసంహృతకరణాః ఇత్యర్థః. అథవా-మద్గతప్రాణాః మద్గతజీవనాః ఇత్యేతత్. బోధయన్తః అవగమయన్తః, పరస్పరమ్ అన్యోన్యం,కథయన్తః జ్ఞానబలవీర్యాదిధర్మైః విశిష్టం మాం,తుష్యన్తి చ పరితోషమ్ ఉపయాన్తి,రమన్తి చ రతిం ప్రాప్నువన్తి ప్రియసంగత్యేవ. 9

బాలానందిని

మచ్చిత్తాః ఇతి:- నాయందే చిత్తము కలవారై,నన్ను పొందిన అనగా నాయందు ఉపసంహరించబడిన చక్షురాదీంద్రియాలు కలవారై(ప్రాణశబ్దానికి ఇంద్రియాలనే అర్థం శారీరకభాష్యాదులందుచెప్పబండి),లేదా నన్ను పొందిన జీవితములు కలవారై అని అర్థం; ఒకరి కొకరు బోధించుకొనుచు,జ్ఞాన-బల-వీర్యాదిధర్మాలతో కూడిన నన్ను గూర్చి ముచ్చ టించుకొనుచు సంతోషిస్తూంటారు,ఇష్టవస్తువు లభించడంచేత ఆనందించినట్లు,(లేదా ప్రియసమాగమం కలగడంవల్ల కామినులు రతిని పొందినట్లు)రమిస్తూంటారు.

వి:- ఈ శ్లోకంలో-

"తచ్చిన్తనం తత్కథనమన్యోన్యం తత్ప్రబోధనమ్,
ఏతదేకపరత్వం చ బ్రహ్మాభ్యాసం విదుర్బుధాః

అని ప్రసిద్ధ మైన బ్రహ్మాభ్యాసం చెప్పబడింది. 9

భాష్యమ్

యే యథోక్తప్రకారైః భజన్తే మాం భక్తాః సన్తః-

మూ. తేషాం సతతయుక్తానాం భజతాం ప్రీతిపూర్వమ్,
దదామి బుద్ధియోగం తం యేన మాముపయాన్తి తే. 10

బాలానందిని

యే ఇతి:- పైన చెప్పిన పద్ధతులచేత ఎవరు భక్తులై నన్ను సేవిస్తారో -

తేషామితి:- సతతయుక్తానామ్=ఎల్లప్పుడూ ఆసక్తితో ప్రవర్తిస్తూన్నవాళ్లు, ప్రీతి పూర్వకమ్=ప్రేమపూర్వకముగా,భజతామ్=సేవిస్తూన్నవాళ్లూ అయిన,తేషామ్=వాళ్లకు, తమ్=అట్టి,బుద్ధియోగమ్=బుద్ధియోగమును,దదామి=ఇస్తాను;యేన=దేనిచేత,తే=వాళ్లు మామ్=నన్ను,ఉపయాన్తి=పొందుతారో.

భాష్యమ్

తేషాం సతతయుక్తానాం నిత్యాభియుక్తానాం, నివృత్తసర్వబాహ్యైషణానాం, భజతాం సేవమానానాం, కిమ్ అర్థిత్వాదినా కారణేన?న ఇత్యాహ - ప్రీతిపూర్వకమ్ - ప్రీతిః స్నేహః,తత్పూర్వకం మాం భజతామ్ ఇత్యర్థః.దదామి ప్రయచ్ఛామి,బుద్ధి యోగం-బుద్ధిః సమ్యగ్దర్శనం మత్తత్త్వవిషయం,తేన యోగః బుద్ధియోగః,తం బుద్ధియోగమ్. యేన బుద్ధియోగేన సమ్యగ్దర్శనలక్షణేన, మాం పరమేశ్వరమ్ ఆత్మ భూతమ్, ఆత్మత్వేన,ఉపయాన్తి ప్రతిపద్యన్తే. కే తే?యే మచ్చిత్తత్వాదిప్రకారైః మాం భజన్తే. 10

బాలానందిని

తేషామితి:- ఎల్లప్పుడు ప్రయత్నం చేస్తూండేవాళ్లు,బాహ్యములైన సమస్తములైన కోరికలనుండి నివర్తించినవాళ్లు,సేవిస్తూన్నవాళ్లు,ధనాదులను కోరడం మొదలైన కారణం చేతనా?కాదు అని అంటున్నాడు-ప్రీతిపూర్వకముగా-స్నేహపూర్వకంగా నన్ను సేవిస్తూన్న వాళ్లు అని అర్థం.బుద్ధి అనగా నా తత్త్వాన్ని గూర్చిన సమ్యగ్దర్శనం;దానితో యోగం (సబంధం)బుద్ధియోగం.ఆ బుద్ధియోగాన్ని,అట్టివాళ్లకు ఇస్తాను.సమ్యగ్దర్శనరూప మైన ఏ బుద్ధియోగంచేత పరమేశ్వరుడను,ఆత్మనూ అయిన నన్ను ఆత్మగా పొందుతారో.ఎవరు వాళ్లు!ఎవరు మచ్చిత్తత్వం మొదలైన ప్రకారాలచేత నన్ను సేవిస్తారో వాళ్లు. 10

భాష్యమ్

కిమర్థం కస్య వా త్వత్ప్రాప్తిప్రతిబన్ధహేతోః నాశకం బుద్ధియోగం తేషాం త్వద్భక్తానాం దదాసి ఇత్యాకాఙ్క్షాయామ్ ఆహ -

మూ. తేషామేవానుకమ్పార్థమహమజ్ఞానజం తమః,
నాశయామ్యాత్మభావస్థో జ్ఞానదీపేన భాస్వతా. 11

బాలానందిని

కిమర్థమితి:- నీవు నీ భక్తులైనవాళ్లకు నిన్ను పొందడంలో ప్రతిబంధానికి హేతువైన దేనిని నశింపచేసే బుద్ధియోగాన్ని,ఎందుకు ఇస్తావు అను ఆకాంక్షలో చెప్పుచున్నాడు -

ప్ర.అ.తేషామితి:- అహమ్=నేను,ఆత్మభావస్థః=(వాళ్ల)అంతఃకరణ మనే స్థానము నందు,అంతఃకరణవృత్తియందు, ఉన్నవాడనై,తేషామ్=వాళ్లయొక్కఅనుకమ్పార్థమ్ ఏవ = (జాలి)అనుగ్రహంకొరకే,భాస్వతా=ప్రకాశిస్తూన్న,జ్ఞానదీపేన=జ్ఞాన మనే దీపంచేత, అజ్ఞానజమ్=అజ్ఞానంవల్ల కలిగిన,తమః=చీకటిని,నాశయామి=నశింపచేస్తాను.

భాష్యమ్

తేషామేవ కథం నామ శ్రేయః స్యాత్ ఇతి అనుకమ్పార్థం దయాహేతోః, అహమ్ అజ్ఞానజం అవివేకతః జాతం మిథ్యాప్రత్యయలక్షణం మోహాన్ధకారం తమః ,నాశయామి, ఆత్మభావస్థః ఆత్మనః భావః అన్తఃకరణాశయః తస్మిన్నేవ స్థితః సన్,జ్ఞానదీపేన వివేక ప్రత్యయరూపేణ భక్తిప్రసాదస్నేహాభిషిక్తేన మద్భావనాభినివేశవాతేరితేన బ్రహ్మచర్యాది సాధనసంస్కారవత్ప్రజ్ఞావర్తినా,విరక్తాన్తః కరణాధారేణ విషయవ్యావృత్తచిత్తరాగద్వేషా కలుషితనివాతాపవరకస్థేన, నిత్యప్రవృత్తైకాగ్ర్యధ్యా నజనితసమ్యగ్దర్శనభాస్వతా జ్ఞానదీపేనే త్యర్థః. 11

బాలానందిని

తేషామితి:- వీళ్లు ఎలా శ్రేయస్సు పొందుతారా అని వాళ్ల దయకొరకే, (వాళ్లపై దయచూపడంకొరకే)అజ్ఞానంవల్ల అనగా అవివేకంవల్ల, కలిగిన మిథ్యాజ్ఞానరూప మైన తమస్సును, మోహ మనే అంధకారాన్ని,ఆత్మభావం అనగా అంతఃకరణాశయం,అంతః కరణవృత్తి,దానియందే ఉంటూ ప్రకాశిస్తూన్న జ్ఞానదీపంచేత నశింపచేస్తాను. ఈ జ్ఞానదీపం వివేకబుద్ధిరూప మైనది.భక్తిచేత కలిగిన అనుగ్రహ మనే తైలంతో తడపబడినది.నా భావన యందు నిరంతరాసక్తి అనే గాలిచేత కదల్చబడినది.బ్రహ్మచర్యాదిసాధనాల సంస్కారంతో కూడిన ప్రజ్ఞ(బుద్ధి)అనే వత్తి కలది.దీనికి ఆధారం వైరాగ్యంతో కూడిన అంతః కరణం.విషయాలనుండి నివృత్తమైన,రాగద్వేషాలచేత కలుషితం కాని,చిత్త మనే, గాలి లేని గదిలో ఉంది.నిత్యమూ నడుస్తూండే(అవిచ్ఛిన్నమైన)ఏకాగ్రత గల ధ్యానంవల్ల కలిగిన సమ్యగ్దర్శనం అనే కాంతి గలది.అట్టి జ్ఞానదీపంచేత అని అర్థం. 11

భాష్యమ్

యథోక్తాం భగవతః విభూతిం యోగం చ శ్రుత్వా -

అర్జున ఉవాచ –

మూ. పరం బ్రహ్మ పరం ధామం పవిత్రం పరమం భవాన్,
పురుషం శాశ్వతం దివ్యమాదిదేవమజం విభుమ్. 12

బాలానందిని

యథోక్తామితి:– ఇంతవరకు చెప్పబడిన భగవంతుని విభూతిని,యోగాన్నీ విని–అర్జునుడు ఇట్లు పలికెను.

ప్ర.అ. పరమితి:– భవాన్=నీవు,పరం బ్రహ్మ=పరబ్రహ్మవు. పరమ్=అత్యున్నతమైన, ధామ=స్థానము. పరమమ్=గొప్ప,పవిత్రమ్=పవిత్రవస్తువు. (నిన్ను)శాశ్వతమ్=శాశ్వతమైనవాడు దివ్యమ్=దివ్యుడూ అయిన,పురుషమ్=పరుషునిగాను,ఆదిదేవమ్=ఆదిదేవుని గాను, అజమ్=జన్మరహితుని గాను,విభుమ్=ప్రభువును గాను,(ఉత్తరశ్లోకంలోని'ఆహుః'తో అన్వయం).

భాష్యమ్

పరం బ్రహ్మ పమాత్మా,పరం ధామ పరం తేజః,పవిత్రం పావనం పరమం ప్రకృష్టం భవాన్. పురుషం శాశ్వతం నిత్యం,దివ్యం దివి భవమ్,ఆదిదేవం సర్వదేవానామ్ ఆదౌ భవం దేవం,అజం,విభుం విభవనశీలమ్. 12

బాలానందిని

పరమితి:– నీవు పరమాత్మవు. ఉత్తమమైన స్థానము. గొప్ప తేజస్సు. ప్రకృష్టమైన పవిత్రింపచేసే వస్తువు. శాశ్వతుడు దివ్యుడైన పరమవ్యోమయం దున్న పురుషుడ వనీ,అందరు దేవతలకు అదియం దున్న దేవుడ వనీ(చెప్పుచున్నారు). 12

భాష్యమ్

ఈదృశమ్–

మూ. ఆహుస్త్వామృషయః సర్వే దేవర్షిర్నారదస్తథా,
అసితో దేవలో వ్యాసః స్వయం చైవ బ్రవీషి మే. 13

బాలానందిని

ఈదృశమితి:– ఇలాంటివానినిగా–

ప్ర.అ. ఆహుః ఇతి:- త్వామ్=నిన్ను గూర్చి,సర్వే=సమస్తమైన,ఋషయః=ఋషులు, తథా=మరియు,దేవర్షిః = దేవర్షియైన,నారదః=నారదుడు,అసితః=అసితుడు, దేవలః =దేవలుడు,వ్యాసః=వ్యాసుడు,అహుః=చెప్పుచున్నారు.స్వయమేవ=నీవే మే=నాకు,బ్రవీషి చ=చెప్పుచున్నావు కూడ.

భాష్యమ్

ఆహుః కథయన్తి,త్వామ్,ఋషయః వసిష్ఠాదయః సర్వే,దేవర్షిః నారదః తథా అసితః దేవలః అపి ఏవమ్ ఆహ వ్యాసః చ స్వయం చైవ బ్రవీషి మే. 13

బాలానందిని

ఆహురితి:- నిన్ను గూర్చి(పై విధంగా)వసిష్ఠాదు లందరూ దేవర్షియైన నారదుడు, అల్లే అసితుడు,దేవలుడూ కూడ ఇట్లు చెప్పుచున్నారు.వ్యాసుడు కూడ ఇట్లు చెప్పుచున్నాడు. స్వయంగా నువ్వు కూడ నాకు చెప్పుచున్నావు. 13

మూ. సర్వమేతదృతం మన్యే యన్మాం వదసి కేశవ,
న హి తే భగవన్ వ్యక్తిం విదుర్దేవా న దానవాః. 14

ప్ర.అ. సర్వమితి:- కేశవ=కృష్ణా! మామ్=నన్ను గూర్చి యత్=ఏది,వదసి=చెప్పు చున్నావో, ఏతత్ సర్వమ్=దీనినంతనూ,ఋతమ్=సత్యమునుగా,మన్యే=తలచుచున్నాను. భగవన్=ఓ! భగవంతుడా! తే=నీయొక్క వ్యక్తిమ్=పుట్టుకను,దేవాః=దేవతలు,న విదుః= ఎరుగరు.దానవాః-దానవులు,న=ఎరుగరు.

భాష్యమ్

సర్వమితి:- సర్వమేతత్ యథా ఉక్తమ్ ఋషిభిః త్వయా చ తత్,ఋతం సత్యమేవ,మన్యే యత్ మాం ప్రతి వదసి భాషసే,హే కేశవ. న హి,తే తవ,భగవన్, వ్యక్తిం ప్రభవం,విదుః న దేవాః, న దానవాః. 14

బాలానందిని

సర్వమితి: - ఓ!కేశవా!ఋషులచేత,నీచేత ఏది చెప్పబడినదో అది అంతా సత్యమే అని తలచుచున్నాను.నువ్వు నాతో ఏది చెప్పుచున్నావో అది.భగవంతుడా!నీ ఉత్పత్తిని దేవతలు కాని దానవులు కాని ఎరుగరు కదా? 14

భాష్యమ్

యతస్త్వం దేవాదీనామాదిః అతః-

మూ. స్వయమేవాత్మనాత్మానం వేత్థ త్వం పురుషోత్తమ,
భూతభావన భూతేశ దేవదేవ జగత్పతే. 15

బాలానందిని

యత ఇతి:- నీవు దేవాదులకు ఆది యైనవాడవు గాన-

ప్ర.అ. స్వయమేవేతి:- పురుషోత్తమ=పురుషులలో శ్రేష్ఠుడా!భూతభావన=భూతాలను సృష్టించినవాడా!భూతేశ=భూతాల(ప్రాణుల)ప్రభువా!దేవదేవ=దేవతల దేవత యైనవాడా!జగత్పతే=జగత్తుకు అధిపతీ!త్వమ్=నీవు,స్వయమేవ=స్వయంగానే,ఆత్మనా=ఆత్మచేత,ఆత్మానమ్=ఆత్మను గూర్చి,వేత్థ=ఎరుగుదువు.

భాష్యమ్

స్వయమేవ ఆత్మనా ఆత్మానం వేత్థ త్వం,నిరతిశయజ్ఞానైశ్వర్యబలాదిశక్తిమన్తమ్, ఈశ్వరం,పురుషోత్తమ, భూతాని భావయతీతి భూతభావనః, హే భూతభావన,భూతేశ భూతానామ్ ఈశితః,హే దేవదేవ,జగత్పతే. 15

బాలానందిని

స్వయమితి:-ఓ పురుషోత్తమా! భూతములను సృజించేవాడా! భూతాలపై సర్వాధికారాలు కలవాడా! ఓ! దేవదేవా! జగత్పతీ!నిన్ను గూర్చి నువ్వే తెలుసుకొనగలవాడవు. నిరతిశయమైన జ్ఞానము,ఐశ్వర్యము,బలము మొదలైన శక్తి కలవానినిగా నిన్ను ఎరుగుదువు.
15

మూ. వక్తుమర్హస్యశేషేణ దివ్యా హ్యాత్మవిభూతయః,
యాభిర్విభూతిభిర్లోకానిమాంస్త్వం వ్యాప్య తిష్ఠసి. 16

ప్ర.అ. వక్తుమితి:- యాభిః=ఏ,విభూతిభిః=విభూతులచేత,త్వమ్=నీవు,ఇమాన్=ఈ, లోకాన్=లోకాలను,వ్యాప్య=వ్యాపించి,తిష్ఠసి=ఉంటున్నావో అట్టి,ఆత్మవిభూతయః=నీ విభూతులు,దివ్యాః హి=దివ్యమైనవి కదా?(వాటిని గూర్చి), అశేషేణ=పూర్తిగా, వక్తుమ్=చెప్పుటకు,అర్హసి=తగి ఉన్నావు.

భాష్యమ్

వక్తుమితి:-వక్తుం కథయితుమ్,అర్హసి అశేషేణ,దివ్యాః హి ఆత్మవిభూతయః ఆత్మనః విభూతయః యాః తాః వక్తుమ్ అర్హసి.యాభిః విభూతిభిః ఆత్మనః మాహాత్మ్య విస్తరైః ఇమాన్ లోకాన్,త్వం వ్యాప్య తిష్ఠసి. 16

బాలానందిని

వక్తుమితి:- పూర్తిగా చెప్పుటకు తగి ఉన్నావు(చెప్పుము). దివ్యము లైన నీ విభూతులు ఏవి ఉన్నాయో వాటిని చెప్పుము. ఏ విభూతులచేత, అనగా మాహాత్మ్యంయొక్క విస్తరములచేత(విస్తృతస్వరూపాలచేత), ఈ లోకాలను వ్యాపించి ఉన్నావో. 16

మూ. కథం విద్యామహం యోగింస్త్వాం సదా పరిచిన్తయన్,
కేషు కేషు చ భావేషు చిన్త్యోఽసి భగవన్ మయా. 17

ప్ర.అ. కథమితి:- యోగిన్=ఓ!యోగీ! అహమ్=నేను, సదా=ఎల్లప్పుడూ, పరిచిన్తయన్=చింతిస్తూ(ధ్యానిస్తూ), త్వామ్=నిన్ను, కథమ్=ఎట్లు, విద్యామ్=తెలిసికొందును? భగవన్=ఓ!భగవంతుడా!కేషు కేషు=ఏ యే, భావేషు=వస్తువులలో, చిన్త్యః=చింతించదగినవాడవు, అసి=అయి ఉన్నావు.

మూ. విస్తరేణాత్మనో యోగం విభూతిం చ జనార్దన,
భూయః కథయ తృప్తిర్హి శృణ్వతో నాస్తి మేఽ మృతమ్. 18

ప్ర.అ. విస్తరేణేతి:- జనార్దన=శ్రీకృష్ణా! ఆత్మనః=నీయొక్క, యోగమ్=యోగమును, విభూతిం చ=విభూతిని, విస్తరేణ=విస్తరముతో(సవిస్తరంగా), భూయః=మరల, కథయ=చెప్పుము. అమృతమ్=అమృతమును, శృణ్వతః=వింటూన్న, మే=నాకు, తృప్తిః=తృప్తి, నాస్తి హి=లేదు కదా?

భాష్యమ్

విస్తరేణేతి:- విస్తరేణ ఆత్మనః యోగం యోగైశ్వర్యశక్తివిశేషః, విభూతిం చ, విస్తరం ధ్యేయపదార్థానాం, హే జనార్దన! అర్దతేః గతికర్మణః రూపమ్. అసురాణాం దేవప్రతిపక్షభూతానాం జనానాం నరకాదిగమయితృత్వాత్ జనార్దనః. అభ్యుదయనిఃశ్రేయసపురుషార్థప్రయోజనం సర్వైః జనైః యాచ్యతే ఇతి వా. భూయః పూర్వమ్ ఉక్తమ్ అపి కథయ. తృప్తిః హి పరితోషః యస్మాత్ నాస్తి మే శృణ్వతః త్వన్ముఖనిఃసృతవాక్యామృతమ్. 18

బాలానందిని

విస్తరేణేతి:- విస్తరముతో నీయొక్క యోగాన్ని, యోగ మని చెప్పబడే ఐశ్వర్యశక్తి విశేషాన్ని, విభూతిని, ధ్యానించ దగిన పదార్థాల విస్తరాన్ని, ఓ!జనార్దనా! ఇది గమనము అను

అర్థం గల అర్దధాతువుయొక్క రూపం.దేవతలకు శత్రువులైన జనులను నరకాదులను పొందించేవాడు గాన జనార్దనుడు.("అర్దయతీతి అర్దనః జనానామ్ అర్దనః"అని విగ్రహ వాక్యం).లేదా సకలజనులచేత అభ్యుదయము నిఃశ్రేయసము అను ప్రయోజనాన్ని గూర్చి యాచింపబడతాడు గాన జనార్దనః అని చెప్పవచ్చును.(అర్దధాతువునకు యాచించుట అని అర్థం కూడ ఉన్నది. జనైః అర్ద్యతే ఇతి జనార్దనః"అని విగ్రహవాక్యం).పూర్వం చెప్పబడినా కూడ మరల చెప్పుము.నీ ముఖంనుండి బయల్వెడలుతూన్న వాక్యామృతాన్ని వింటూన్న నాకు తృప్తి లేదు. 18

శ్రీభగవానువాచ-

మూ. హన్త తే కథయిష్యామి దివ్యా హ్యాత్మవిభూతయః,
ప్రాధాన్యతః కురుశ్రేష్ఠ నాస్త్యన్తో విస్తరస్య మే. 19

శ్రీ భగవంతుడు పలికెను -

ప్ర.అ. కురుశ్రేష్ఠ=కౌరవులలో శ్రేష్ఠుడా!ఆత్మవిభూతయః=నా విభూతులు,దివ్యాః హి= దివ్యమైనవి కదా!(లేదా దివ్యములైన నా ఏ విభూతులున్నాయో)వాటిని,హన్త=ఆహా! తే=నీకు,ప్రాధాన్యతః=ప్రాధాన్యంవల్ల,కథయిష్యామి=చెప్పెదను. మే=నాయొక్క విస్తరస్య= విస్తరమునకు,అన్తః=అంతము,నాస్తి=లేదు.

భాష్యమ్

హన్త తే ఇతి:- హన్త ఇదానీం తే దివ్యాః దివి భవాః,ఆత్మవిభూతయః ఆత్మనః మమ యాః విభూతయః యాః తాః కథయిష్యామి ఇత్యేతత్.ప్రాధాన్యతః యత్ర యత్ర ప్రధానా యా యా విభూతిః తాం తాం ప్రధానాం ప్రాధాన్యతః కథయిష్యామి అహం కురుశ్రేష్ఠ.అశేషతస్తు వర్షశతేనాపి న శక్యాః వక్తుం,యతః నాస్తి అన్తః విస్తరస్య మే మమ విభూతీనామ్ ఇత్యర్థః. 19

బాలానందిని

హన్తేతి:- ఆహా!ఇప్పుడు ద్యులోకంలో ఉండే అనగా ప్రాకృతములు,సర్వజనవేద్య ములు కాని,నా విభూతులు ఏవి ఉన్నాయో వాటిని చెపుతాను అని అర్థం. ప్రాధాన్యం వలన-ఎక్కడ ఏ యే విభూతి ప్రధాన మైనదో ఆ ప్రధానమైన విభూతిని చెప్పెదను. నేను. ఓ కురుశ్రేష్ఠా! పూర్తిగా నైతే నూరు సంవత్సరాలైనా చెప్పడానికి శక్యం కావు. ఎందువల్ల ననగా,నాయొక్క విస్తరానికి,నా విభూతుల విస్తరానికి అని అర్థం,అంతము లేదు. 19

భాష్యమ్

తత్ర ప్రథమమేవ తావత్ శృణు -

మూ. అహమాత్మా గుడాకేశ సర్వభూతాశయస్థితః,
అహమాదిశ్చ మధ్యం చ భూతానామన్త ఏవ చ. 20

బాలానందిని

తత్రేతి:- అందులో ముందుగానే చెపుతున్నాను విను-

ప్ర.అ. అహమితి:- గుడాకేశ=అర్జునా! అహమ్=నేను, సర్వభూతాశయస్థితః=అన్ని ప్రాణుల హృదయాలలో ఉన్న, ఆత్మా=ఆత్మను. అహమ్=నేను, భూతానామ్=భూతముల యొక్క ఆదిః చ=ఆదిని, మధ్యం చ=మధ్యమును, అన్తః ఏవ చ=అంతమును కూడ.

భాష్యమ్

అహమ్, ఆత్మా ప్రత్యగాత్మా, గుడాకేశ-గుడాకా నిద్రా, తస్యాః ఈశః గుడాకేశః జితనిద్రః ఇత్యర్థః. ఘనకేశః ఇతి వా. సర్వేషాం భూతానామ్, ఆశయే అన్తః హృది స్థితః అహమ్ ఆత్మా ప్రత్యగాత్మా నిత్యం ధ్యేయః. తదశక్తేన చ ఉత్తరేషు భావేషు చిన్త్యః అహం చిన్తయితుం శక్యః, యస్మాత్ అహమేవ ఆదిః భూతానాం కారణం, తథా మధ్యం స్థితిః, అన్తః ప్రలయః. 20

బాలానందిని

అహమితి:- నేను ప్రత్యగాత్మను, ఓ గుడాకేశా! గుడాకా అనగా నిద్ర. దానికి ఈశుడు గుడాకేశుడు. నిద్రను జయించినవా డని అర్థం. లేదా దట్టమైన కేశములు కలవాడు అని అర్థం. అన్ని ప్రాణుల ఆశయమునందు, లోపల, హృదయంలో, ప్రత్యగాత్మగా (జీవాత్మగా) ఉన్న నన్ను నిత్యము ధ్యానించవలెను. అట్లు చేయడానికి సమర్థుడు కానివాడు నన్ను చెప్పబోవు వస్తువులలో ధ్యానించాలి; ఎందువలన అనగా భూతాల ఆది(కారణం) నేనే; మధ్యం అనగా స్థితి, నేనే, వాటి అంతం, ప్రలయం కూడ నేనే.

భా.అ.ప్ర. శ్రీరామానుజాచార్యులు 'నేను సర్వభూతాశయములందు ఆత్మగా ఉన్నాను అని అంటూ నేను ఆ ప్రత్యగాత్మకు కూడ లోపలగా ఉన్న పరమాత్మను అని వ్యాఖ్యానించారు. ఇందుకు ప్రమాణంగా **"యః సర్వేషు తిష్ఠన్....య ఆత్మని తిష్ఠన్"**ఇత్యాది అంతర్యామిబ్రాహ్మణాన్ని ఉదాహరించారు. ఇది అయుక్తం. ప్రత్యగాత్మకంటె భిన్న మైన పరమాత్మ హృదయదేశంలో కనబడదు కదా? సమాధిలో-మనస్సు మొదలైన సమస్త

ప్రపంచముయొక్క అభావానికి సాక్షిగా ప్రత్యగాత్మమాత్రమే స్ఫురిస్తుంది. నిరంతరమైన ప్రజ్ఞానపు ముద్ద యైన ఆత్మలో మరొక టేదీ ఉండడం శక్యం కాదు. బ్రాహ్మణంలోని భూతశబ్దానికి ప్రాణు లనీ, ఆత్మశబ్దానికి బుద్ధి అనీ మాత్రమే అర్థం. అందుచేత అది చెప్పిన అర్థానికి ప్రమాణం కాజాలదు. (భా. అ. ప్ర. పే. 156-157) 20

భాష్యమ్

ఏవం చ ధ్యేయోఽహమ్ -

మూ. ఆదిత్యానామహం విష్ణుర్జ్యోతిషాం రవిరంశుమాన్,
మరీచిర్మరుతామస్మి నక్షత్రాణామహం శశీ. 21

బాలానందిని

ఏవమితి:- నేను ఈ ఈ ఆకారాలలో ధ్యానింపదగినవాడను-

ప్ర.అ. **ఆదిత్యానామితి**:- ఆదిత్యానామ్=ఆదిత్యులలో, విష్ణుః=విష్ణువు, అహమ్=నేను, జ్యోతిషామ్= జ్యోతిస్సులలో, అంశుమాన్=కిరణాలు గల, రవిః=సూర్యుడు నేను, మరుతామ్=మరుత్తు లను దేవతలలో, మరీచిః=మరీచి, అస్మి=నేను, నక్షత్రాణామ్=నక్షత్రాలలో, చన్ద్రమాః= చంద్రుడు, అహమ్=నేను.

భాష్యమ్

ఆదిత్యానాం ద్వాదశానాం విష్ణుః నామ ఆదిత్యః అహమ్. జ్యోతిషాం రవిః ప్రకాశయితౄణామ్, అంశుమాన్ రశ్మిమాన్. మరీచిః నామ మరుతాం మరుద్దేవతా భేదానామ్ అస్మి. నక్షత్రాణామ్ అహం, శశీ చన్ద్రమాః. 21

బాలానందిని

ఆదిత్యానామితి:- ద్వాదశాదిత్యులలో విష్ణు వను పేరు గల ఆదిత్యు డను నేను. కిరణాలు గల ప్రకాశింపచేసే జ్యోతిస్సులలో రవి నేను. మరుత్తు లను దేవతాభేదాలలో మరీచి అను పేరు కలవాడు నేను. నక్షత్రాలలో చంద్రుడు నేను. 21

మూ. వేదానాం సామవేదోఽస్మి దేవానామస్మి వాసవః,
ఇన్ద్రియాణాం మనశ్చాస్మి భూతానామస్మి చేతనా. 22

ప్ర.అ. **వేదానామితి**:- వేదానామ్=వేదాలలో, సామవేదః=సామవేదం, అస్మి=అయి ఉన్నాను, దేవానామ్=దేవతలలో, వాసవః=ఇంద్రుడు, అస్మి=అయి ఉన్నాను. ఇన్ద్రియాణామ్=

ఇంద్రియాలలో,మనః చః=మనస్సు,అస్మి=అయి ఉన్నాను. భూతానామ్=ప్రాణులలో,చేతనా = బుద్ధివృత్తి,అస్మి=అయి ఉన్నాను.

భాష్యమ్

వేదానామితి:- వేదానాం మధ్యే సామవేదః అస్మి. దేవానాం రుద్రాదిత్యాదీనాం వాసవః ఇన్ద్రః,అస్మి,ఇన్ద్రియాణామ్ ఏకాదశానాం చక్షురాదీనాం,మనః చ అస్మి,సంకల్ప వికల్పాత్మకం మనశ్చ అస్మి. భూతానామ్ అస్మి చేతనా కార్యకరణసంఘాతే నిత్యాభి వ్యక్తా బుద్ధివృత్తిః చేతనా. 22

బాలానందిని

వేదానామితి:- వేదాలలో సామవేదంగా ఉన్నాను. రుద్రులు ఆదిత్యులు మొదలైన దేవతలలో ఇంద్రు డను నేనే. పదకొండు చక్షురాదీంద్రియాలలో,సకంల్ప,వికల్పాత్మక మైన మనస్సు నేను. శరీరేంద్రియసముదాయమునందు నిత్యము అభివ్యక్తం అవుతున్న బుద్ధివృత్తి(అనగా జ్ఞానం)నేను. 22

మూ. రుద్రాణాం శంకరశ్చాస్మి విత్తేశో యక్షరక్షసామ్,
వసూనాం పావకశ్చాస్మి మేరుః శిఖరిణామహమ్. 23

ప్ర.అ. రుద్రాణామితి:- రుద్రాణామ్=రుద్రులలో,శంకరః చ=శంకరుడను,అస్మి= అయి ఉన్నాను. యక్షరక్షసామ్=యక్షులలో రాక్షసులలో,విత్తేశః=కుబేరుడుగాను,వసూనామ్ =వసువులలో,పావకః చ=పావకుడను. అస్మి=అయి ఉన్నాను. శిఖరిణామ్=పర్వతాలలో, మేరుః =మేరువు,అహమ్=నేను.

భాష్యమ్

రుద్రాణామితి:- రుద్రాణామ్ ఏకాదశానాం శంకరః చ అస్మి. విత్తేశః కుబేరః యక్షరక్షసాం యక్షాణాం రక్షసాం చ. వసూనామ్ అష్టానాం పావకః చ అస్మి అగ్నిః. మేరుః శిఖరిణాం శిఖరవతామ్,అహమ్. 23

బాలానందిని

రుద్రాణామితి:-ఏకాదశరుద్రులలో నేను శంకరుడను. యక్ష-రాక్షసులలో కుబేరు డను నేను. అష్టవసువులలో అగ్ని నేను. శిఖరములు కలవాటిలో మేరువు నేను. 23

మూ. పురోధసాం చ ముఖ్యం మాం విద్ధి పార్థ బృహస్పతిమ్,
సేనానీనామహం స్కన్దః సరసామస్మి సాగరః. 24

ప్ర. అ. పురోధసామితి:- పార్థ=అర్జునా! మామ్=నన్ను, పురోధసామ్=పురోహితులలో, ముఖ్యమ్=ముఖ్యుడైన, బృహస్పతిమ్=బృహస్పతినిగా, విద్ధి=తెలుసుకొనుము. సేనానీనామ్=సేనానాయకులలో, స్కన్దః=కుమారస్వామి, అహమ్=నేను, సరసామ్=సరస్సులలో సాగరః=సాగరం, అస్మి=అయి ఉన్నాను.

భాష్యమ్

పురోధసామితి:- పురోధసాం రాజపురోహితానాం, ముఖ్యం ప్రధానం, మాం, విద్ధి జానీహి, హే పార్థ! బృహస్పతిమ్. స హి ఇన్ద్రస్య ఇతి ముఖ్యః స్యాత్ పురోధాః. సేనానీనాం సేనాపతీనామ్, అహం స్కన్దః దేవసేనాపతిః. సరసాం యాని దేవఖాతాని సరాంసి తేషాం సరసాం సాగరః, అస్మి భవామి. 24

బాలానందిని

పురోధసామితి:- రాజపురోహితులలో ప్రధానుడైన బృహస్పతిని నన్నుగా, ఓ! అర్జునా! తెలుసుకొనుము. అతడు ఇంద్రుని పురోహితుడు గాన పురోహితులలో ప్రధానుడు. సేనాపతులలో దేవసేనాపతి యైన స్కందుడు నేను. దేవఖాతములైన, దేవతలు త్రవ్విన, ప్రకృతిసిద్ధా లైన సరస్సులలో సాగరం నేను. 24

మూ. మహర్షీణాం భృగురహం గిరామస్మ్యేకమక్షరమ్,
యజ్ఞానాం జపయజ్ఞోఽస్మి స్థావరాణాం హిమాలయః. 25

ప్ర. అ. మహర్షీణామితి:- మహర్షీణామ్ =మహర్షులలో, భృగుః=భృగువు, అహమ్=నేను. గిరామ్=వాక్కులలో, ఏకమ్=ఒక్క, అక్షరమ్=ఓంకారరూపమైన అక్షరముగా, అస్మి=నేను ఉన్నాను. యజ్ఞానామ్=యజ్ఞాలలో, జపయజ్ఞః=జపయజ్ఞంగా, అస్మి=అయి ఉన్నాను. స్థావరాణమ్=కదలకుండా నిలిచి ఉండేవాటిలో, హిమాలయః=హిమాలయం అయి ఉన్నాను.

భాష్యమ్

మహర్షీణామితి:- మహర్షీణాం భృగుః అహమ్. గిరాం వాచాం పదలక్షణానామ్ ఏకమ్ అక్షరమ్ ఓంకారః అస్మి. యజ్ఞానాం జపయజ్ఞః అస్మి. స్థావరాణాం స్థితిమతాం హిమాలయః. 25

బాలానందిని

మహర్షీణామితి:- మహర్షులలో భృగుమహర్షి నేను. పదరూపము లైన వాక్కులలో ఒక్క అక్షరమైన ఓంకారం నేను. యజ్ఞాలలో జపయజ్ఞం నేను. స్థావరములలో హిమాలయం నేను. 25

మూ. అశ్వత్థః సర్వవృక్షాణాం దేవర్షీణాం చ నారదః,
గన్ధర్వాణాం చిత్రరథః సిద్ధానాం కపిలో మునిః. 26

ప్ర.అ. **అశ్వత్థ ఇతి**:- సర్వవృక్షాణామ్=అన్ని వృక్షాలలో,అశ్వత్థః=రావి చెట్టు నేను. దేవర్షీణాం చ=దేవర్షులలో,నారదః=నారదుడను. గన్ధర్వాణామ్=గంధర్వులలో,చిత్రరథః =చిత్రరథుడను.సిద్ధానామ్=సిద్ధులలో,కపిలః మునిః=కపిలముని నేను.

భాష్యమ్

అశ్వత్థ ఇతి:- అశ్వత్థః సర్వవృక్షాణాం,దేవర్షీణాం చ నారదః-దేవా ఏవ సన్తః ఋషిత్వం ప్రాప్తాః మన్త్రదర్శిత్వాత్,తే దేవర్షయః,తేషాం నారదః అస్మి. గన్ధర్వాణాం చిత్రరథో నామ గన్ధర్వః అస్మి సిద్ధానాం-జన్మనైవ ధర్మజ్ఞానవైరాగ్యైశ్వర్యాతిశయం ప్రాప్తానాం కపిలః మునిః. 26

బాలానందిని

అశ్వత్థః ఇతి:- సమస్తవృక్షాలలో అశ్వత్థవృక్షం నేను.దేవతలే అయి ఉండి మంత్రములను చూచినవా ళ్లవడంచేత ఋషులు కూడ అయినవాళ్లు దేవర్షులు.వాళ్లలో నారదుడను నేను.గంధర్వులలో చిత్రరథు డనే గంధర్వు డను నేను.పుట్టుకతోనే ధర్మ-జ్ఞాన-వైరాగ్య-ఐశ్వర్యాల అతిశయం పొందినవాళ్లు సిద్ధులు.అలాంటి సిద్ధులలో కపిల ముని నేను. 26

మూ. ఉచ్చైఃశ్రవసమశ్వానాం విద్ధి మామమృతోద్భవమ్,
ఐరావతం గజేన్ద్రాణాం నరాణాం చ నరాధిపమ్. 27

ప్ర.అ. **ఉచ్చైఃశ్రవసమితి**:- అశ్వానామ్=అశ్వములలో,అమృతోద్భవమ్=అమృతం కొరకు జరిగిన సముద్రమథనంనుండి పుట్టిన(ఇది ఐరావతానికి కూడ వర్తిస్తుంది), ఉచ్చైః శ్రవసమ్=ఉచ్చైఃశ్రవస్సును,మామ్=నన్నుగా,విద్ధి=తెలుసుకొనుము.గజేన్ద్రాణామ్= గజేంద్రములలో,ఐరావతమ్=ఐరావతమును,నరాణాం చ=నరులో నరాధిపమ్=రాజును, నన్నుగా తెలసుకొనుము.

భాష్యమ్

ఉచ్చైరితి:-ఉచ్చైఃశ్రవసమ్ అశ్వానామ్ ఉచ్చైఃశ్రవానామ అశ్వః తం మాం,విద్ధి జానీహి,అమృతోద్భవమ్ అమృతనిమిత్తమథనోద్భవమ్.ఐరావతమ్ ఇరావత్యాః అపత్యం, గజేన్ద్రానాం హస్తీశ్వరాణాం తం మాం విద్ధి ఇత్యనువర్తతే.నరాణాం మనుష్యా ణాం చ నరాధిపం రాజానం మాం విద్ధి ఇతి జానీహి. 27

బాలానందిని

ఉచ్చైరితి:- అశ్వాలలో ఉచ్చైఃశ్రవస్ అను పేరు గల అశ్వమును నన్నుగా తెలుసు కొనుము. అమృతం నిమిత్తం చేసిన మథనంనుండి పుట్టినది. గజేంద్రాలలో, ఇరావతి సంతాన మైన ఐరావతాన్ని, మాం విద్ధి అనేది ఇక్కడ కూడ అనువర్తిస్తుంది. మనుష్యులలో రాజును నన్నుగా తెలుసుకొనుము. 27

మూ. ఆయుధానామహం వజ్రం ధేనూనామస్మి కామధుక్,
ప్రజనశ్చాస్మి కన్దర్పః సర్పాణామస్మి వాసుకిః. 28

ప్ర.అ. ఆయుధానామ్ ఇతి:- ఆయుధానామ్=ఆయుధాలలో, వజ్రమ్=వజ్రము, అహమ్=నేను, ధేనూనామ్=ధేనువులలో, కామధుక్=కామధేనువును, అస్మి=అయి ఉన్నాను. ప్రజనః=పుట్టించే(సంతానోత్పత్తికి కారణమైన), కన్దర్పః=మన్మథుడను. సర్పాణామ్=సర్పాలలో వాసుకిః=వాసుకిగా, అస్మి=అయిఉన్నాను.

భాష్యమ్

ఆయుధానామ్ ఇతి:- ఆయుధానామ్ అహం వజ్రం దధీచ్యస్థిసంభవమ్. ధేనూనాం దోగ్ధ్రీణాం అస్మి కామధుక్ వసిష్ఠస్య సర్వకామానాం దోగ్ధ్రీ, సామాన్యా వా కామధుక్. ప్రజనః ప్రజనయితా అస్మి కన్దర్పః కామః. సర్పాణాం సర్పభేధానామ్ అస్మి వాసుకిః సర్పరాజః.

బాలానందిని

ఆయుధానామితి:- ఆయుధాలలో, దధీచి అస్థులనుండి పుట్టిన వజ్రాయుధము నేను. పాలిచ్చే ధేనువులలో వసిష్ఠుని సమస్తకామాలను తీర్చే కామధేనువు లేదా ప్రసిద్ధమైన కామధేనువు నేను. సంతానోత్పత్తికి కారణమైన కందర్పుడు నేను. సర్పాలలో వాసుకి నేను.

మూ. అనన్తశ్చాస్మి నాగానాం వరుణో యాదసామహమ్,
పితౄణామర్యమా చాస్మి యమః సంయమతామహమ్. 29

ప్ర.అ. అనన్త ఇతి:- నాగానామ్=నాగాలలో, అనన్తః = అనంతుడను, అస్మి= అయి ఉన్నాను. యాదసామ్=జలదేవతలలో, వరుణః=వరుణుడు, అహమ్=నేను, పితౄణామ్= పితృదేవతలలో, అర్యమా చ=అర్యమగా, అస్మి= అయిఉన్నాను. సంయమతామ్= నిగ్రహించే వారిలో, యమః=యముడు, అహమ్=నేను.

భాష్యమ్

అనన్త ఇతి:- అనన్తః చ అస్మి నాగానాం నాగవిశేషాణాం నాగరాజః చ అస్మి. వరుణః యాదసామ్ అహమ్ అబ్దేవతానాం రాజా అహమ్. పితౄణామ్ అర్యమా నామ పితృరాజః చ అస్మి. యమః,సంయమతాం సంయమనం కుర్వతామ్ అహమ్. 29

బాలానందిని

అనన్త ఇతి:- నాగవిశేషాలలో అనంతు డను నాగరాజు నేను.జలనివాసులలో వరుణు డను జలదేవతారాజును నేను.పితృదేవతలలో అర్యమ అనుపితృదేవతారాజు నేను.నియమించే వాళ్లలో యముడు నేను. 29

మూ. ప్రహ్లాదశ్చాస్మి దైత్యానాం కాలః కలయతామహమ్,
మృగాణాం చ మృగేన్ద్రోఽహం వైనతేయశ్చ పక్షిణామ్. 30

ప్ర.అ. ప్రహ్లాద ఇతి:- దైత్యానామ్=దైత్యులలో ప్రహ్లాదః చ=ప్రహ్లాదుడను,అస్మి= అయి ఉన్నాను.కలయతామ్=గణనం చేసే వాళ్లలో,కాలః=కాలం,అహమ్=నేను. మృగాణాం చ=మృగాలలో,మృగేన్ద్రః=సింహము,అహమ్=నేను,పక్షిణామ్=పక్షులలో వైనతేయః చ=గరుత్మంతుడను.

భాష్యమ్

ప్రహ్లాద ఇతి:- ప్రహ్లాదః నామ చ అస్మి దైత్యానాం దితివంశ్యానామ్;కాలః కలయతాం గణనం కుర్వతామ్ అహమ్. మృగాణాం చ మృగేన్ద్రః సింహః వ్యాఘ్రో వా అహమ్.వైనతేయః చ గరుత్మాన్ వినతాసుతః పక్షిణాం పత్రిణామ్. 30

బాలానందిని

ప్రహ్లాద ఇతి:- దితివంశీయులలో ప్రహ్లాదుడను నేను.గణనం చేసేవాళ్లలో కాలం నేను.మృగాలలో సింహం లేదా వ్యాఘ్రుం నేను.పక్షులలో వినతాకుమారుడైన గరుత్మం తుడు నేను. 30

మూ. పవనః పవతామస్మి రామః శస్త్రభృతామహమ్,
ఝషాణాం మకరశ్చాస్మి స్రోతసామస్మి జాహ్నవీ. 31

ప్ర.అ. పవన ఇతి:- పవతామ్=పవిత్రింప చేసేవాటిలో,పవనః=వాయువును, అస్మి=అయిఉన్నాను. శస్త్రభృతామ్=శస్త్రధారులలో,రామః=రాముడు,అహమ్=నేను.

ఝషాణామ్=మత్స్యాలలో,మకరః చ=మొసలిని,అస్మి=అయి ఉన్నాను.స్రోతసామ్=నదులలో,జాహ్నవీ=గంగగా,అస్మి=అయి ఉన్నాను.

భాష్యమ్

పవన ఇతి:- పవనః వాయుః,పవతాం పావయితౄణామ్ అస్మి. రామః శస్త్రభృతామ్ అహం శస్త్రాణాం ధారయితౄణాం దాశరథిః రామః అహమ్.ఝషాణాం మత్స్యానాం మకరో నామ జాతివిశేషః అహమ్.స్రోతసామ్ అస్మి.జాహ్నవీ గఙ్గా. 31

బాలానందిని

పవన ఇతి:- పవిత్రింపచేసేవాటిలో వాయువుగా ఉన్నాను.శస్త్రములను ధరించే వారిలో దశరథకుమారు డైన రాముడు నేను.మత్స్యాలలో మకరం అనే ఒక జాతివిశేషం నేను.ప్రవహించే నదులలో గంగ నేను. 31

మూ. సర్గాణామాదిరన్తశ్చ మధ్యం చైవాహమర్జున,
అధ్యాత్మవిద్యా విద్యానాం వాదః ప్రవదతామహమ్. 32

ప్ర.అ. సర్గాణామ్ ఇతి:- అర్జున=అర్జునా! సర్గాణామ్=సృష్టులయొక్క ఆదిః=ఆది,అన్తఃచ=అంతము,మధ్యః చ=మధ్యమూ,అహమ్=నేనే.విద్యానామ్=విద్యలలో,అధ్యాత్మవిద్యా=అధ్యాత్మవిద్య నేను.ప్రవదతామ్=ప్రవాదం చేసేవాళ్ల ప్రవదనరీతులలో, వాదః=వాదము,అహమ్=నేను.

భాష్యమ్

సర్గాణామితి:- సృష్టీనామ్ ఆదిః అన్తః చ మధ్యం చ ఏవ అహమ్ ఉత్పత్తిస్థితిలయాః,అహమ్ అర్జున. భూతానాం జీవాధిష్ఠితానామేవ ఆదిః అన్తశ్చ ఇతి ఉక్తమ్ ఉపక్రమే, ఇహ తు సర్వస్యైవ సర్గమాత్రస్య ఇతి విశేషః అధ్యాత్మ విద్యానాం మోక్షార్థత్వాత్ ప్రధానమస్మి.వాదః అర్థనిర్ణయ హేతుత్వాత్,ప్రవదతాం ప్రధానమ్; అతః సః అహమ్ అస్మి.ప్రవక్తృద్వారేణ వదనభేదానామేవ వాదజల్పవితణ్డానామ్ ఇహ గ్రహణం ప్రవదతామ్ ఇతి. 32

బాలానందిని

సర్గాణామితి:-అర్జునా! సృష్టుల ఆది అంతము మధ్యమూ కూడ అనగా ఉత్పత్తి-స్థితి-లయాలు,నేను. జీవులచేత అధిష్ఠించబడిన భూతాల (ప్రాణుల)అద్యంతములను గూర్చి ప్రారంభంలో చెప్పబడింది.ఇక్కడ సృష్టించబడిన ప్రతీదానియొక్క అద్యంతాలు చెప్పబడు

చున్నవి అనేది భేదం. విద్యలలో అధ్యాత్మవిద్య మోక్షానికి ఉపకరించేది గాన ప్రధానం అవడంచేత అది నేను.ప్రవదనము చేసేవాళ్లలో, అర్థనిర్ణయానికి హేతువు గాన వాదం నేను.ప్రవక్తల ద్వారా ఇక్కడ వదనములలో భేదాలైన వాదజల్పవితండాలను 'ప్రవదతామ్'అనే దానిచేత గ్రహించాలి.

వి:- ఏదైన ఒక విషయంయొక్క తత్త్వం తెలుసుకొనడానికి పండితులు ఒకరు ఒక పక్షము మరొకరు మరొక పక్షము సమర్థిస్తూ చర్చ చేస్తారు.అలాంటి చర్చకు 'కథ'అని పారిభాషికనామధేయం. ఈ చర్చ మూడు తీరులలో జరగవచ్చును.వీటికి వాదము, జల్పము,వితండ అని పేర్లు.తత్త్వాన్ని తెలుసుకోవా లనే కోరిక గలవాళ్లు చేసే కథ 'వాదం'.దీనిలో ఎదుటివానికంటె తాను ఎక్కువ పండితుడు అని చూపించుకునే ప్రయత్నం ఉండదు.**"తత్త్వబుభుత్సోః కథా వాదః"**. పరపక్షాన్ని దూషించి తన పక్షాన్ని నిలబెట్టుకొనడం కోసం చేసే (రెండింటిని సాధించే)కథ 'జల్పం'-**"ఉభయసాధనవతీ విజిగీషుకథా జల్పః; స చ యథాసంభవం పరపక్షే దూషితే స్వపక్షస్థాపనపర్యవసానశ్చ"**. తన పక్షాన్ని స్థాపించ డానికి ప్రయత్నించకుండా ఏదో విధంగా పరపక్షాన్ని ఖండించడానికి చేసే కథ 'వితండ'. **"స్వపక్షస్థాపనహీనా పరపక్షదూషణావసానా వితణ్డా"**(తర్కభాష పే.230)'ప్రవదతామ్' అనగా ప్రవాదం(చర్చ)చేసేవాళ్లలో అని అర్థం.కాని ఇక్కడ ఆ అర్థం కాక ప్రవాదం చేసే వాళ్ల ప్రవదనాలలో అని అర్థం చెప్పుకోవాలి.అప్పుడే 'వాదః ప్రవదతామ్'అన్నదానికి అర్థం సరిగా కుదురుతుంది అని భాష్యంలోని చివరి వాక్యం భావం.

భా.అ.ప్ర.:- సృజింపబడేవి సర్గాలు.వాటిలో సృష్టిస్థితిలయహేతువులైనవాళ్లు అక్క డక్కడ ఉన్న స్రష్టలు,పాలించేవాళ్లు,సంహర్తలు కూడ నేనే అని శ్రీరామానుజవ్యాఖ్య అసంగత మైనది.ఈ అర్థం చెపితే ఫలానావాళ్లలో ఇది నేను అను నిర్ధారణ లభించడం లేదు.నిజానికి స్రష్టృత్వం మొదలైన మూడుధర్మాలలో ఏదో ఒకటి లేని ప్రాణియే లేదు. తృణాదులు కూడ కీటాదులను సృష్టిస్తాయి,పశ్వాదులను పాలిస్తాయి,సంహరిస్తాయి.అట్లే ఆదిః,అన్తః,మధ్యం అను ఏకవచనప్రయోగాలు కూడ కుదరవు.పాలనము నాశనము అను అర్థాన్ని బోధించే 'మధ్య''అంత'శబ్దాలకు పాలకుడు నాశకుడు అని లాక్షణికార్థాన్ని చెప్పడానికి తగిన ఆవశ్యకత కూడ లేదు.(భా.అ.ప్ర.పే.163) 32

మూ. అక్షరాణామకారోఽస్మి ద్వన్ద్వః సామాసికస్య చ,
అహమేవాక్షయః కాలో ధాతాహం విశ్వతోముఖః. 33

ప్ర.అ. అక్షరాణామితి:- అక్షరాణామ్=అక్షరాలలో,అకారః=అకారం,అస్మి= అయి ఉన్నాను.సామాసికస్య=సమాససముదాయంలో,ద్వన్ద్వః=ద్వంద్వసమాసము నేను.అక్షయః

=క్షయం లేని,కాలః=కాలం,అహమేవ=నేనే,సర్వతోముఖః=అన్ని వైపులా ముఖములు గల,ధాతా=కర్మఫలవిధాత,అహమ్=నేనే.

భాష్యమ్

అక్షరాణామితి:- అక్షరాణాం వర్ణానామ్ అకారః వర్ణః అస్మి.ద్వన్ద్వః సమాసః అస్మి, సామాసికస్య సమాసమూహస్య.కిం చ అహమేవ అక్షయః అక్షీణః,కాలః ప్రసిద్ధః క్షణాద్యాఖ్యః.అథవా పరమేశ్వరః కాలస్యాపి కాలః,అస్మి ధాతా అహం కర్మఫలస్య విధాతా జగతః;విశ్వతోముఖః సర్వతోముఖః. 33

బాలానందిని

అక్షరాణామితి:- అక్షరాలలో అకారంగా ఉన్నాను.సమాసాలలో ద్వంద్వసమాసం నేను.మరియు క్షీణించని,క్షణాదిరూపమైన ప్రసిద్ధమైన కాలం నేనే.సర్వజగత్తుకూ కర్మ ఫలాలను ఇచ్చే,అన్ని వైపులా ముఖాలు గల(నాలుగు ముఖాలు గల) (లేదా అన్ని విషయాలను చూడగలిగిన)ధాత నేనే. 33

మూ. మృత్యుః సర్వహరశ్చాహముద్భవశ్చ భవిష్యతామ్,
కీర్తిః శ్రీర్వాక్చ నారీణాం స్మృతిర్మేధా ధృతిః క్షమా. 34

ప్ర.అ. మృత్యురితి:- సర్వహరః=సమస్తమును హరించే మృత్యుః=మృత్యువు, అహమ్=నేను. భవిష్యతామ్=అభ్యుదయాన్ని పొందబోయేవాళ్లయొక్క ఉద్భవః చ=అభ్యు దయం కూడ నేను.నారీణామ్=స్త్రీలలో,కీర్తిః=కీర్తి,శ్రీః=శ్రీ. వాక్ చ=వాక్కు,స్మృతిః=స్మృతి, మేధా=మేధ,ధృతిః=ధైర్యము,క్షమా=ఓర్పు నేనే.

భాష్యమ్

మృత్యుః ద్వివిధః ధనాదిహరః ప్రాణహరశ్చ.తత్ర యః ప్రాణహరః సః సర్వహరః ఇత్యుచ్యతే.సః అహమిత్యర్థః.అథవా, పరః ఈశ్వరః ప్రలయే సర్వహరణాత్ సర్వ హరః, సః అహమ్.ఉద్భవః ఉత్కర్షః అభ్యుదయః,తత్ప్రాప్తిహేతుశ్చ అహం, కేషామ్? భవిష్యతాం భావికల్యాణానామ్ ఉత్కర్షప్రాప్తిహేతూనామ్ ఇత్యర్థః. కీర్తిః, శ్రీః వాక్ చ, నారీణాం, స్మృతిః, మేధా,ధృతిః క్షమా ఇత్యేతాః ఉత్తమాః స్త్రీణామ్ అహమ్ అస్మి, యాసామ్ ఆభాసమాత్రసంబన్ధేనాపి లోకః కృతార్థమ్ ఆత్మానం మన్యతే. 34

బాలానందిని

మృత్యురితి:- ధనాదులను హరించేది,ప్రాణాలను హరించేది అని మృత్యువు రెండు విధాలు.వాటిలో ప్రాణహరమృత్యువు సర్వహరం అని చెప్పబడుతుంది.ఆ మృత్యువు నేనే

అని అర్థం.లేదా ప్రలయకాలంలో పరమేశ్వరుడు సమస్తమును హరిస్తాడు గాన సర్వహరుడు. అతడు నేను.ఉద్భవం అనగా ఉత్కర్ష,అభ్యుదయం; అది లభించడానికి హేతువును నేను.ఎవరికి? కాల్యాణం కలగబోయేవారికి ఉత్కర్షను పొందడానికి యోగ్యులైన వాళ్లకు అని అర్థం. స్త్రీలలో కీర్తి,శ్రీ, వాక్కు,స్మృతి,మేధ,ధృతి(ధైర్యం)క్షమ(ఓర్పు)వీరు,అనగా కీర్త్యాద్యధిష్ఠానదేవతలు,ఎవరితో ఈషన్మాత్రం సంబంధం కలిగినా లోకులు తాము కృతార్థు లైనట్లు భావిస్తారో వారు నేనే.

భా.అ.ప్ర.:- యముని ఆదేశం ప్రకారం ప్రాణాలను హరించే అధికారం గల ఒకానొక పురుషుడు మృత్యువు అను వేదాంతదేశికవ్యాఖ్య అయుక్తం.అలాంటి పురుషు డొక డున్నట్లు ప్రమాణం ఏదీ లేదు.యమదూతలు అసంఖ్యాకులు.మృత్యుదేవతయే అనడం కూడ కుదరదు.ఆ దేవత భగవదాజ్ఞాపరతంత్రమే కాని భగవంతుని విభూతి కాదు. (భా.అ.ప్ర.పే.166) 34

మూ. బృహత్సామ తథా సామ్నాం గాయత్రీ ఛన్దసామహమ్,
మాసానాం మార్గశీర్షోఽహమృతూనాం కుసుమాకరః. 35

ప్ర.అ. బృహదితి:- తథా=మరియు సామ్నామ్= సామలలో,బృహత్సామ= బృహత్ అనే సామ,ఛన్దసామ్=ఛందస్సులలో,గాయత్రీ=గాయత్రి,అహమ్=నేనే. మాసానామ్=మాసాలలో,మార్గశీర్షః=మార్గశీర్షం,అహమ్=నేను, ఋతూనామ్=ఋతువులలో, కుసుమాకరః=వసంతము నేను.

భాష్యమ్

బృహత్సామేతి:- బృహత్సామ తథా సామ్నాం ప్రధానమ్ అస్మి."గాయత్రీ ఛన్దసా మహమ్"-గాయత్ర్యాదిఛన్దోవిశిష్టానామ్ ఋచాం గాయత్ర్యృక్ అహమ్ ఇత్యర్థః. మాసానాం మార్గశీర్షోఽహమ్ ఋతూనాం కుసుమాకరః. 35

బాలానందిని

బృహత్సామేతి:- సామలలో ప్రధానమైన బృహత్సామ నేను.గాయత్రి మొదలైన ఛందస్సులతో కూడిన ఋక్కులలో గాయత్రీఋక్కు నేను అని అర్థం. మాసాలలో మార్గ శీర్షము,ఋతువులలో వసంతము నేనే. 35

మూ. ద్యూతం ఛలయతామస్మి తేజస్తేజస్వినామహమ్,
జయోఽస్మి వ్యవసాయోఽస్మి సత్త్వం సత్త్వవతామహమ్. 36

ప్ర.అ. ద్యూతమితి:- ఛలయతామ్=మోసగించేవాటిలో,దూతమ్=ద్యూతముగా, అస్మి అయి ఉన్నాను. తేజస్వినామ్=తేజస్సు కలవాటియొక్క తేజః=తేజస్సు,అహమ్=నేనే. జయః=జయమునుగాను,వ్యవసాయః=ఉద్యమముగాను,అస్మి=అయి ఉన్నాను. సత్త్వవతామ్ =సత్త్వం కలవారి, సత్త్వమ్=సత్త్వగుణము,అహమ్=నేను.

భాష్యమ్

ద్యూతమితి:- ద్యూతమ్ అక్షదేవనాదిలక్షణం, ఛలయతాం ఛలస్య కర్తౄణామ్ అస్మి. తేజస్తేజస్వినామహం,జయః అస్మి జేతౄణాం,వ్యవసాయః అస్మి వ్యవసాయినామ్. సత్త్వం సత్త్వవతాం సాత్త్వికానామ్ అహమ్. 36

బాలానందిని

ద్యూతమితి:- మోసం చేసేవాళ్లలో ద్యూతమునేను. తేజఃశాలులయొక్క తేజస్సు నేను. విజేతలయొక్క జయం నేను. ఉద్యమం చేసేవాళ్ల ఉద్యమం నేను. సాత్త్వికులయొక్క సత్త్వగుణం నేను. 36

మూ. వృష్ణీనాం వాసుదేవోఽస్మి పాణ్డవానాం ధనంజయః,
మునీనామప్యహం వ్యాసః కవీనాముశనా కవిః. 37

ప్ర.అ. వృష్ణీనామితి:- వృష్ణీనామ్=యాదవులలో,వాసుదేవః=వాసుదేవుడను,అస్మి= అయి ఉన్నాను. పాణ్డవానామ్=పాండవులలో,ధనంజయః=అర్జునుడను. మునీనామ్ అపి= మునులలో,వ్యాసః=వ్యాసుడు,అహమ్=నేను,కవీనామ్=కవులలో,ఉశనా=శుక్రు డను, కవిః =కవి,నేను.

భాష్యమ్

వృష్ణీనామితి:- వృష్ణీనాం వాసుదేవః అస్మి అయమేవ అహం త్వత్సఖా. పాణ్డవానాం ధనంజయః త్వమేవ. మునీనాం మననశీలానాం సర్వపదార్థజ్ఞానినామపి అహం వ్యాసః కవీనాం క్రాన్తదర్శినాం ఉశనా కవిః అస్మి. 37

బాలానందిని

వృష్ణీనామితి:- యాదవులలో నీవు స్నేహితుడుగా గల (నీ స్నేహితుడ నైన) ఈ వాసుదేవు డను నేనే. పాండవులలో ధనంజయుడ నైన నువ్వే నేను. మననం చేసే స్వభావం గల.సర్వపదార్థజ్ఞానవంతులైన మునులలో వ్యాసుడు నేను. క్రాంతదర్శులైన కవులలో శుక్రుడు నేను. (ఇంద్రియాలకు గోచరించని విషయాలను చూడగలిగినవాడు క్రాంతదర్శి). 37

మూ. దణ్డో దమయతామస్మి నీతిరస్మి జిగీషతామ్,
మౌనం చైవాస్మి గుహ్యానాం జ్ఞానం జ్ఞానవతామహమ్. 38

ప్ర.అ. దణ్డ ఇతి:- దమయతామ్=అణచివేసేవారిలో,దణ్డః=దండముగా (శిక్షించడంగా), అస్మి=అయి ఉన్నాను. జిగీషతామ్=జయించదలచినవారిలో,నీతిః= నీతిగా అస్మి=అయి ఉన్నాను. గుహ్యానామ్=రహస్యాలలో,మౌనం చ=మౌనముగా,అస్మి=ఉన్నాను. జ్ఞానవతామ్= జ్ఞానవంతులయొక్క,జ్ఞానమ్=జ్ఞానము,అహమ్=నేను.

భాష్యమ్

దణ్డ ఇతి:- దణ్డః దమయతాం దమయితౄణామ్ అస్మి,అదాన్తానాం దమ కారణమ్. నీతిః అస్మి,జిగీషతాం జేతుమ్ ఇచ్ఛతామ్. మౌనం చ ఏవ అస్మి, గుహ్యానాం గోప్యానామ్. జ్ఞానం జ్ఞానవతామహమ్. 38

బాలానందిని

దణ్డ ఇతి:- లొంగనివాళ్లు లొంగే టట్లు చేయడానికి లొంగదీసుకునేవాళ్లు ఉపయోగించే దండం నేను. జయించదలచినవాళ్ల జయం నేను. రహస్యంగా ఉంచవలసిన వాటిలో మౌనం నేను.(మౌనం రహస్యరక్షణోపాయాలలో ప్రధానమైనది కదా?). జ్ఞాన వంతుల జ్ఞానం నేను. 38

మూ. యచ్చాపి సర్వభూతానాం బీజం తదహమర్జున,
న తదస్తి వినా యత్స్యాన్మయా భూతం చరాచరమ్. 39

ప్ర.అ. యదితి:- అర్జున=అర్జునా! యత్ చ అపి= ఏది,సర్వభూతానామ్= సమస్త భూతములయొక్క,బీజమ్=బీజ మున్నదో,తత్=అది,అహమ్=నేను,యత్=ఏది, మయా వినా=నేను లేకుండా,స్యాత్=ఉంటుందో,తత్=అట్టి,చరాచరమ్=చరం కాని అచరం కాని అయిన,భూతమ్=భూతము,న అస్తి=లేదు.

భాష్యమ్

యచ్చాపీతి:- యచ్చాపి సర్వభూతానాం,బీజం ప్రరోహకారణం,తత్ అహమ్ అర్జున.ప్రకరణోపసంహారార్థం విభూతిసంక్షేపమ్ ఆహ–న తత్ అస్తి భూతం చరాచరం చరమ్ అచరం వా,మయా వినా యత్ స్యాత్ భవేత్,మయా అపకృష్టం పరిత్యక్తం నిరాత్మకం శూన్యం హి తత్ స్యాత్,అతః మదాత్మకం సర్వమ్ ఇత్యర్థః. 39

బాలానందిని

యచ్చాపీతి:- అర్జునా! సర్వభూతాలు అంకురించడానికి(పుట్టడానికి)కారణ మైన ఏ బీజం ఉన్నదో అది నేనే.ప్రకరణాన్ని ఉపసంహరించడంకొరకై విభూతుల సంక్షేపాన్ని (సంక్షిప్తరూపంలో విభూతిని)చెప్పుచున్నాడు.నేను లేకుండా ఏది ఉంటుందో అలాంటి చరం కాని అచరం కాని ఉండదు.నాచేత విడవబడినది ఆత్మరహితమై,(స్వరూపరహితమై) శూన్యం అవుతుంది.అందుచేత సమస్తమూ కూడ మదాత్మక మైనది,(నా స్వరూపం గలది,నేనే ఆధారంగా గలది).

వి:-"మయా అపకృష్టమ్"దేనినుండి నేను నన్ను వెనుకకు తీసికొన్నానో అది అని అర్థం.అనగా నాచేత విడవబడినది అని అర్థం.'అపకృష్టమ్'కు బదులు 'అప్రవిష్టమ్' అను పాఠం కూడ ఉన్నది.ఆత్మయే సర్వాధారం గాన ఆధారం లేకపోతే ఏదీ ఉండదు అని ఉత్తరార్ధానికి భావం.

మూ. నాన్తోఽస్తి మమ దివ్యానాం విభూతీనాం పరన్తప,
ఏష తూద్దేశతః ప్రోక్తో విభూతేర్విస్తరో మయా. 40

ప్ర.అ. నేతి:- పరన్తప= శత్రువులను పీడించువాడా! దివ్యానామ్=దివ్యములైన, మమ=నాయొక్క,విభూతీనామ్=విభూతులకు,అన్తః=అంతము,నాస్తి=లేదు. విభూతేః= విభూతియొక్క,ఏషః=ఈ,విస్తరః తు=విస్తర మైతే, ఉద్దేశతః=కొంత భాగాన్ని మాత్రమే గ్రహించి, మయా=నాచేత,ప్రోక్తః=చెప్పబడినది.

భాష్యమ్

నాన్తోఽస్తీతి:-నాన్తః అస్తి మమ దివ్యానాం విభూతీనాం విస్తరాణాం పరన్తప న హి ఈశ్వరస్య సర్వాత్మనః దివ్యానాం విభూతీనామ్ ఇయత్తా శక్యా వక్తుం జ్ఞాతుం వా కేన చిత్.ఏషః తు ఉద్దేశతః ఏకదేశేన ప్రోక్తః విభూతేః విస్తరః మయా. 40

బాలానందిని

నాన్తోఽస్తీతి:-పరన్తపా!నా దివ్యమైన విభూతుల విస్తరములయొక్క అంతము లేదు.సర్వాత్ముడైన ఈశ్వరుని దివ్యవిభూతులు ఇన్ని అని చెప్పడానికి గాని తెలుసుకొన డానికి గాని ఎవరికీ శక్యం కాదు కదా?కాని విభూతియొక్క విస్తరం నాచేత ఏకదేశం మాత్రమే చెప్పబడినది. 40

మూ. యద్యద్విభూతిమత్సత్త్వం శ్రీమదూర్జితమేవ వా,
తత్తదేవావగచ్ఛ త్వం మమ తేజోంశసంభవమ్. 41

ప్ర.అ. యదితి:- విభూతిమత్=విభూతి కలది,శ్రీమత్=లక్ష్మి కలది,ఊర్జితమేవ వా=లేదా ఉత్సాహాతిశయం కలది అయిన,యత్ యత్=ఏ యే,సత్త్వమ్=సత్త్వమ్= వస్తు వున్నదో,తత్తత్=ఆ ప్రతీ వస్తువును,మమ=నాయొక్క తేజోంశసంభవమ్=తేజస్సుయొక్క అంశమునుండి పుట్టినదానినిగా,త్వమ్=నీవు,అవగచ్ఛ=తెలుసుకొనుము.

భాష్యమ్

యద్యదితి:- యద్యత్ లోకే,విభూతిమత్ విభూతియుక్తం,సత్త్వం వస్తు శ్రీమత్ ఊర్జితమ్ ఏవ వా, శ్రీః లక్ష్మీః,తయా సహితమ్ ఉత్సాహోపేతం వా, తత్ తత్,ఏవ అవగచ్ఛ త్వం విజానీహి,మమ ఈశ్వరస్య తేంజోంశసంభవం,తేజసః అంశః ఏకదేశః సంభవః యస్య తత్ తేజోంశసంభవమ్ ఇతి అవగచ్ఛ త్వమ్. 41

బాలానందిని

యద్యదితి:- లోకంలో విభూతితో కూడినది గాని,శ్రీః అనగా లక్ష్మి,లక్ష్మితో (శోభతో)కూడినది గాని, ఉత్సాహంతో కూడినది గాని అయిన ఏ యే వస్తువు ఉన్నదో ఆ ప్రతీ వస్తువును,ఈశ్వరుడనైన నా తేజస్సుయొక్క అంశం కారణంగా కలదానినిగా,(దానికి నా తేజోంశమే కారణ మని)నువ్వు తెలుసుకొనుము. 41

మూ. అథవా బహునైతేన కిం జ్ఞాతేన తవార్జున,
విష్టభ్యాహమిదం కృత్స్నమేకాంశేన స్థితో జగత్. 42

ఇతి శ్రీమహాభారతే శతసాహస్ర్యాం సంహితాయాం వైయాసిక్యాం భీష్మపర్వణి

శ్రీమద్భగవద్గీతాసు ఉపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే శ్రీకృష్ణార్జున సంవాదే విభూతియోగో నామ దశమోఽధ్యాయః

ప్ర.అ. అథవేతి:- అర్జున=అర్జునా!జ్ఞాతేన=తెలియబడిన,బహునా=అధికమైన, ఏతేన=దీనిచేత,తవ=నీకు,కిమ్=ఏమి ప్రయోజనము?అహమ్=నేను,ఏకాంశేన=ఒక అంశంచేత,కృత్స్నమ్=సమస్తమైన,ఇదమ్=ఈ,జగత్=జగత్తును,విష్టభ్య = నిలబెట్టి,స్థితః =ఉన్నాను.

భాష్యమ్

అథవేతి:- అథవా బహునా ఏవమాదినా కిం జ్ఞాతేన తవ 'అర్జున స్యాత్ సావశేషేణ?అశేషతః త్వమ్ ఇమమ్ ఉచ్యమానమ్ అర్థం శృణు-విష్టభ్య విశేషతః

స్తంభనం దృఢం కృత్వా ఇదం కృత్స్నం జగత్ ఏకాంశేన ఏకావయవేన ఏకపాదేన సర్వభూతస్వరూపేణ ఇత్యేతత్.తథా చ మన్త్రవర్ణః "పాదోఽ స్య విశ్వా భూతాని"(తై ఆ. 30. 12;ఋ.సం. 10. 90. 3)ఇతి-స్థితః అహం ఇతి. 42

ఇతి శ్రీమత్పరమహంసపరివ్రాజకాచార్యగోవిన్దభగవత్పూజ్యపాదశిష్య శ్రీమదాచార్యశంకరభగవతః కృతౌ శ్రీమద్భగవద్గీతభాష్యే విభూతి యోగో నామ దశమోఽ ధ్యాయః

బాలానందిని

అథవేతి:- లేదా-అర్జునా ఈ మొదలైనవాటిచేత,ఎంత చెప్పినా ఇంకా మిగిలి పోయేదానిచేత, నీకు ప్రయోజనం ఏ ముంటుంది?పూర్తిగా నే నిప్పుడు చెప్పుచున్న విషయం విను. ఈ జగత్తు నంతా సకలభూతరూప మైన ఒక అంశంచేత,అవయవంచేత, దృఢంగా నిలిపి ఉన్నాను."పాదోఽ స్య సర్వా భూతాని"(సమస్తభూతములు ఈ పరమాత్మయొక్క ఒక పాదం-నాల్గవవంతు)అని శ్రుతి ఈ విషయమునే చెప్పుచున్నది.

భా.అ.ప్ర.:- "నా మహిమముయొక్క అయుతాయుతాంశంచేత(పదివేలు అయుంతం)నిలిపి అను శ్రీరామానుజవ్యాఖ్య అయుక్తం.'ఏకాంశ'పదానికి 'అయుతాంశం' అనే అర్థం లభించదు;ఇక్కడ'మహిమ్నః'అను పదం లేదు కూడ.సమస్తజగత్తు భగవంతుని విభూతియే అని చెప్పవలసి ఉండగా జగత్తును నియమించడాన్ని గూర్చి చెప్పడం అనుచితం. అందుచేత శంకరోక్తార్థమే శంకరం(భా.అ.ప్ర.పే.175) 42

"బాలానందిని"అని శ్రీమద్భగవద్గీతాశాంకరభాష్యాంధ్రవ్యాఖ్యానమునందు దశమాధ్యాయం సమాప్తం.
(ప్రారంభంనుండి శ్లోకసంఖ్య 385)

అథ ఏకాదశోఽ ధ్యాయః

భాష్యమ్

భగవతః విభూతయః ఉక్తాః.తత్ర చ "విష్టభ్యాహమిదం కృత్స్నమేకాంశేన స్థితో జగత్" ఇతి భగవతా అభిహితం శ్రుత్వా యత్ జగత్ ఆత్మరూపమ్ ఆద్యమ్ ఐశ్వరం తత్సాక్షాత్కర్తుమిచ్ఛన్-

అర్జున ఉవాచ-

మూ. మదనుగ్రహాయ పరమం గుహ్యమధ్యాత్మసంజ్ఞితమ్,
యత్త్వయోక్తం వచస్తేన మోహోఽ యం విగతో మమ. 1

బాలానందిని

భగవతః ఇతి:- భగవంతుని విభూతులు చెప్పబడ్డాయి. "విష్టభ్యాహమిమం కృత్స్న మేకాంశేన స్థితో జగత్"అని కూడ భగవంతుడు చెప్పి ఉన్నాడు. ఇది విని ఏ జగత్తు ఆత్మస్వరూప మైనదో, ఆద్య మైన, ఈశ్వరునికి సంబంధించిన (ఈశ్వరుని ఒక అంశమైన) ఆ జగత్తును ప్రత్యక్షంగా చూడవలె నని కోరుతూ-

అర్జునుడు ఇలా అన్నాడు -

ప్ర.అ. **మదితి:-** మదనుగ్రహాయ=నా అనుగ్రహంకొరకు, పరమమ్=గొప్పది, గుహ్యమ్=రహస్య మైనది, అధ్యాత్మసంజ్ఞితమ్=అధ్యాత్మం అను పేరు కలది అయిన, యత్=ఏ, వచః=వచనము, త్వయా=నీచేత, ఉక్తమ్=చెప్పబడినదో, తేన=దానిచేత, మమ= నాయొక్క, అయమ్=ఈ, మోహః=మోహం, విగతః=పోయినది.

భాష్యమ్

మదనుగ్రహాయ మమ అనుగ్రహార్థం, పరమం నిరతిశయం, గుహ్యం గోప్యమ్ అధ్యాత్మసంజ్ఞితమ్ ఆత్మానాత్మవివేకవిషయం యత్ త్వయా ఉక్తం వచః వాక్యం తేన తే వచసా మోహః అయం విగతః మమ అవివేకబుద్ధిః అపగతా ఇత్యర్థః. 1

బాలానందిని

మదితి:- నా అనుగ్రహంకొరకు చాలా గొప్పది, రహస్య మైనది, అధ్యాత్మం అను పేరు గలది, ఆత్మానాత్మవివేకానికి సంబంధించినది అయిన ఏ వచనం నీచేత చెప్పబడినదో ఆ వచనంచేత నా మోహం తొలగిపోయినది. నా అవివేకబుద్ధి తొలగి పోయినది అని అర్థం.

భాష్యమ్

కిం చ-

మూ. భవాప్యయౌ హి భూతానాం శ్రుతౌ విస్తరశో మయా,
త్వత్తః కమలపత్రాక్ష మాహాత్మ్యమపి చావ్యయమ్. 1

బాలానందిని

కిం చేతి:- మరియు -

ప్ర.అ. **భవేతి:-** కమలపత్రాక్ష=కమలపత్రములవంటి నేత్రములు కలవాడా! భూతానామ్=భూతములయొక్క, భవాప్యయౌ=ఉత్పత్తిప్రలయాలు, విస్తరశః=సవిస్తరంగా, మయా=నాచేత, త్వత్తః=నీనుండి, శ్రుతౌ=వినబడినవి. అవ్యయమ్=క్షయం లేని, మహాత్మ్యమ్ అపి=నీ మాహాత్మ్యం కూడ వినబడినది.

భాష్యమ్

భవః ఉత్పత్తిః,అప్యయః ప్రలయః,భూతానాం తౌ భవాప్యయౌ,శ్రుతౌ విస్తరశః మయా,న సంక్షేపతః,త్వత్తః త్వత్సకాశాత్, కమలపత్రాక్ష-కమలస్య పత్రం కమలపత్రం, తద్వత్ అక్షిణీ యస్య తవ సః త్వం కమలపత్రాక్షః,హే కమలపత్రాక్ష, మాహాత్మ్యమ్ అపి చ అవ్యయమ్ అక్షయం శ్రుతమిత్యనువర్తతే. 2

బాలానందిని

భవ ఇతి:- భవం అనగా ఉత్పత్తి.అప్యయం అనగా ప్రలయం.భూతాల భవాప్యయాలు సవిస్తరంగా నాచేత నీనుండి వినబడినవి.కమలముయొక్క రేకువంటి నేత్రములు ఏ నీ కున్నదో అట్టి నీవు కమలపత్రాక్షుడవు.ఓ!కమలపత్రాక్షా,అక్షయమైన (నీ)మహాత్మ్యం కూడ,'శ్రుతమ్'అని అనువర్తిస్తుంది;వినబడినది. 2

మూ. ఏవమేతద్యథాత్థ త్వమాత్మానం పరమేశ్వర,
ద్రష్టుమిచ్ఛామి తే రూపమైశ్వరం పురుషోత్తమ. 3

ప్ర.అ. ఏవమితి:- పరమేశ్వర=పరమేశ్వరా!పురుషోత్తమ=పురుషులలో శ్రేష్ఠుడా! త్వమ్=నీవు,ఆత్మానమ్=తనను గూర్చి, యథా=ఎట్లు,ఆత్థ=చెప్పుచున్నావో,ఏతత్=ఇది, ఏవమ్=ఇట్లే,తే=నీయొక్క,ఐశ్వరమ్=ఈశ్వరునికి సంబంధించిన,రూపమ్=రూపమును, ద్రష్టుమ్=చూచుటకు,ఇచ్ఛామి=కోరుచున్నాను.

భాష్యమ్

ఏవమితి:- ఏవమ్ ఏతత్,న అన్యథా;యథా యేన ప్రకారేణ,ఆత్థ కథయసి, త్వమ్ ఆత్మానం పరమేశ్వర,తథాపి ద్రష్టుమ్ ఇచ్ఛామి,తే తవ,జ్ఞానైశ్వర్యశక్తిబల వీర్యతేజోభిః సంపన్నమ్,ఐశ్వరం వైష్ణవం రూపం పురుషోత్తమ. 3

బాలానందిని

ఏవమితి:-పరమేశ్వరా!నీవు నిన్ను గూర్చి ఎలా చెపుతున్నావో అది అట్లే, మరొక విధంగా ఉండుదు.అయినా కూడ,పురుషోత్తమా!జ్ఞాన-ఐశ్వర్య-బల-వీర్య-తేజస్సులతో సంపన్న మైన నీ ఐశ్వరమైన వైష్ణవ మైన రూపాన్ని చూడా లని కోరుచున్నాను. 3

మూ. మన్యసే యది తచ్ఛక్యం మయా ద్రష్టుమితి ప్రభో,
యోగేశ్వర తతో మే త్వం దర్శయాత్మానమవ్యయమ్. 4

ప్ర.అ. మన్యసే ఇతి:- ప్రభో=ఓ!ప్రభూ!యోగేశ్వర=యోగేశ్వరుడా!తత్=అది,

మయా=నాచేత,ద్రష్టుమ్=చూచుటకు,శక్యమ్ ఇతి=శక్య మైనది అని,మన్యసే యది=నీవు తలుస్తూన్నట్లయితే,తతః=అప్పుడు,అవ్యయమ్=నాశరహితమైన,ఆత్మానమ్=నిన్ను(నీ స్వరూపమును),మే=నాకు,దర్శయ=చూపుము.

భాష్యమ్

మన్యసే ఇతి:- మన్యసే చిన్తయసి,యది,మయా అర్జునేన,తత్ శక్యం ద్రష్టుమ్, ఇతి,ప్రభో స్వామిన్,యోగేశ్వర యోగినః యోగాః,తేషామ్ ఈశ్వరః యోగేశ్వరః,హే యోగేశ్వర;యస్మాత్ అహమ్ అతీవ అర్థీ ద్రష్టుమ్ తస్మాత్ మే మదర్థం,దర్శయ త్వమ్, ఆత్మానమ్ అవ్యయమ్. 4

బాలానందిని

మన్యసే ఇతి:- స్వామీ! యోగాః అనగా యోగులు.వాళ్లకు ఈశ్వరుడు యోగేశ్వరుడు;ఓ!యోగీశ్వరా!అర్జునుడ నైన నాచేత అది చూడడానికి శక్య మైనది అని నువ్వు అనుకొంటూన్నట్లయితే,దానిని చూడాలని నాకు చాల ఇచ్ఛ ఉన్నది గాన నాకోసమై నువ్వు వినాశరహితుడ వైన నిన్ను చూపుము. 4

భాష్యమ్

ఏవం చోదితః అర్జునేన-

శ్రీభగవానువాచ-

మూ. పశ్య మే పార్థ రూపాణి శతశోఽథ సహస్రశః,
నానావిధాని దివ్యాని నానావర్ణాకృతీని చ. 5

బాలానందిని

ఏవమితి:- ఈ విధంగా అర్జునునిచేత ప్రేరేపించబడినవాడై శ్రీభగవంతుడు ఇట్లు చెప్పెను-

ప్ర.అ. పశ్యేతి:- పార్థ=అర్జునా!నానావిధాని=అనేకవిధా లైనవి,నానావర్ణాకృతీని చ=అనేకవిధాలైన వర్ణాలు ఆకారాలు గలవి,దివ్యాని=దివ్యములు అయిన,శతశః=వందల కొలది,అథ=మరియు,సహస్రశః=వేలకొలది,మే రూపాణి=నా రూపాలను,పశ్య= చూడుము.

భాష్యమ్

పశ్య మే పార్థ రూపాణి శతశః అథ సహస్రశః,అనేకశః ఇత్యర్థః.తాని చ నానావిధాని అనేకప్రకారాణి,దివి భవాని దివ్యాని,అప్రాకృతాని,నానావర్ణాకృతీని చ

నానా విలక్షణాః నీలపీతాదిప్రకారాః వర్ణాః,తథా,ఆకృతయః అవయవసంస్థానవిశేషాః యేషాం రూపాణాం తాని నానావర్ణాకృతాని చ. 5

బాలానందిని

పశ్యేతి:- అర్జునా! వందల కొలది,వేల కొలది,అనేకవిధా లైన అని అర్థం,నా రూపాలను చూడుము.అవి అనేకప్రకారములలో ఉన్నవి,స్వర్గంలో ఉండేవి,అనగా ప్రాకృతములు కానివి,విలక్షణము లైన నీలము,పీతము మొదలైన రీతులలో ఉన్న వర్ణములు,ఆకారములు,అవయవసంఘటనవిశేషాలు కలవి;అట్టి నానావర్ణాకృతు లైన రూపాలను చూడుము. 5

మూ. పశ్యాదిత్యాన్ వసూన్ రుద్రానశ్వినౌ మరుతస్తథా,
బహూన్యదృష్టపూర్వాణి పశ్యాశ్చర్యాణి భారత. 6

ప్ర.అ. పశ్యేతి:- భారత=అర్జునా!ఆదిత్యాన్=ఆదిత్యులను,వసూన్=వసువులను, రుద్రాన్=రుద్రులను,అశ్వినౌ=అశ్వినీదేవతలను,తథా=అట్లే,మరుతః=మరుత్తులను,పశ్య= చూడుము.అదృష్టపూర్వాణి=పూర్వం ఎన్నడూ చూడబడని,ఆశ్చర్యాణి=ఆశ్చర్యాలను,పశ్య = చూడుము.

భాష్యమ్

పశ్యాదిత్యానితి:-పశ్య ఆదిత్యాన్ ద్వాదశ,వసూన్ అష్టౌ,రుద్రాన్ ఏకాదశ, అశ్వినౌ ద్వౌ, మరుతః సప్త సప్తగణాః యే తాన్,తథా,బహూని అన్యాన్యపి అదృష్ట పూర్వాణి మనుష్యలోకే త్వయా త్వత్తః అన్యేన వా కేన చిత్,పశ్య,ఆశ్చర్యాణి అద్భుతాని భారత. 6

బాలానందిని

పశ్యాదిత్యానితి:- పన్నెండుగురుఆదిత్యులను,అష్టవసువులను,ఏకాదశరుద్రులను, ఇద్దరు అశ్వినీదేవతలను, ఏడేసి గణాలుగా ఉన్న ఏడు మరుద్గణాలను అట్లే మనుష్యలోకంలో నీచేత గాని,నీకంటె వేరైన మరొకనిచేత గాని ఎవనిచేత పూర్వం ఎన్నడూ చూడబడని ఇతరమైన అద్భుతాలను చూడుము.ఓ!అర్జునా!. 6

భాష్యమ్

న కేవలమ్ ఏతావదేవ-

మూ. ఇహైకస్థం జగత్ కృత్స్నం పశ్యాద్య సచరాచరమ్,
మమ దేహే గుడాకేశ యచ్చాన్యద్ద్రష్టుమిచ్ఛసి. 7

బాలానందిని

నేతి:- కేవలం ఇంతమాత్రమే కాదు.

ప్ర.అ. **ఇహేతి:**- గుడాకేశ=అర్జునా! ఇహ=ఇక్కడ,మమ దేహే=నా దేహంలో, ఏకస్థమ్=ఒకే చోట నున్న, సచరాచరమ్=జంగమస్థావరాలతో కూడిన,కృత్స్నమ్=సమస్త మైన, జగత్=జగత్తును,అద్య=ఇప్పుడు,పశ్య=చూడుము. అన్యత్=ఇతరమైన, యత్=ఏ, అన్యత్ చ=ఇతరముమ కూడ,ద్రష్టుమ్=చూచుటకు,ఇచ్ఛసి=కోరుచున్నావో(దానిని కూడ చూడుము).

భాష్యమ్

ఇహ ఏకస్థమ్ ఏకస్మిన్ స్థితం జగత్,కృత్స్నం సమస్తం,పశ్య,అద్య,ఇదానీం, సచరాచరం సహ చరేణ అచరేణ చ వర్తతే,మమ దేహే,గుడాకేశ,యత్ చ అన్యత్ జయపరాజియాది యత్ శఙ్కసే**"యద్వా జయేమ యది వా నో జయేయుః"**(2.6)ఇతి యత్ అవోచః తదపి ద్రష్టుం యది ఇచ్ఛసి. 7

బాలానందిని

ఇహేతి:- అర్జునా! ఇక్కడ,నా దేహంలో,ఒకే చోట ఉన్న సమస్తజగత్తును, సచరాచరమైనదానిని,ఇప్పుడు చూడుము. ఇంకా ఏదైన ఇతరమైన జయపరాజయాదికాన్ని, దేనిని గూర్చి నువ్వు **"యద్వా జయేమ యది వా నో జయేయుః"**అని అంటూ శంకిస్తు న్నావో, దానిని కూడ చూడాలని నీవు కోరుచున్నట్లయితే,చూడుము. 7

భాష్యమ్

కిం తు-

మూ. న తు మాం శక్యసే ద్రష్టుమనేనైవ స్వచక్షుషా,
దివ్యం దదామి తే చక్షుః పశ్య మే యోగమైశ్వరమ్. 8

బాలానందిని

కిం త్వితి:-కాని,

ప్ర.అ. **నేతి:**- అనేన=ఈ,స్వచక్షుషా ఏవ=నీ నేత్రంతోనే,మామ్=నన్ను,ద్రష్టుం తు = చూచుటకొరకై, తే, న శక్యసే=సమర్థుడవు కావు. తే=నీకు,దివ్యమ్=దివ్యమైన,చక్షుః =నేత్రమును,దదామి=ఇస్తున్నాను,మే=నాయొక్క,ఐశ్వరమ్=ఈశ్వరునికి సంబంధించిన, యోగమ్=యోగమును,పశ్య=చూడుము.

భాష్యమ్

న తు,మాం విశ్వరూపధరం,శక్యసే ద్రష్టుమ్ అనేన ప్రాకృతేన స్వచక్షుషా, స్వకీయేన చక్షుషా.యేన తు శక్యసే ద్రష్టుం దివ్యేన,తత్ దివ్యం దదామి,తే తుభ్యమ్. చక్షుః.తేన పశ్య మే యోగమ్ ఐశ్వరమ్ ఈశ్వరస్య మమ ఐశ్వరం యోగం, యోగ శక్త్యతిశయమ్ ఇత్యర్థః. 8

బాలానందిని

నేతి:- కాని విశ్వరూపం ధరించిన నన్ను ప్రాకృతమైన ఈ నేత్రంతోనే,నీ నేత్రం తోనే, చూడజాలవు.దివ్యమైన ఏ చక్షుస్సుచేత చూడకలుగుతావో అట్టి దివ్యచక్షుస్సును నీకు ఇస్తున్నాను.దానితో,ఈశ్వరుడ నైన నా యోగాన్ని,యోగశక్త్యతిశయాన్ని అని అర్థం, చూడుము. 8

సంజయ ఉవాచ-

మూ. ఏవముక్త్వా తతో రాజన్ మహాయోగేశ్వరో హరిః,
దర్శయామాస పార్థాయ పరమం రూపమైశ్వరమ్. 9

సంజయుడు పలికెను-

ప్ర.అ. ఏవమితి:- రాజన్=రాజా! మహాయోగేశ్వరః=మహాయోగేశ్వరుడైన,హరిః =శ్రీకృష్ణుడు!ఏవమ్=ఇట్లు,ఉక్త్వా=పలికి తతః=అటుపిమ్మట,ఐశ్వరమ్=ఈశ్వరుని సంబంధమైన,పరమమ్=గొప్పదైన,రూపమ్=రూపమును,పార్థాయ=అర్జునునకు,దర్శయా మాస=చూపించెను.

భాష్యమ్

ఏవం యథోక్తప్రకారేణ,ఉక్త్వా తతః అనన్తరం రాజన్ ధృతరాష్ట్ర, మహాయోగే శ్వరః మహాంశ్చాసౌ యోగేశ్వరశ్చ,హరిః నారాయణః దర్శయామాస దర్శితవాన్, పార్థాయ పృథాసుతాయ,పరమం రూపం విశ్వరూపమ్ ఐశ్వరమ్. 9

బాలానందిని

ఏవమితి:- ధృతరాష్ట్రమహారాజా! గొప్పవాడూ యోగేశ్వరుడూ అయిన శ్రీకృష్ణుడు ఈ విధంగా పలికి కుంతీపుత్రునకు ఈశ్వరునికి సంబంధించిన పరమమైన విశ్వరూపము ను చూపెను. 9

మూ. అనేకవక్త్రనయనమనేకాద్భుతదర్శనమ్,
అనేకదివ్యాభరణం దివ్యానేకోద్యతాయుధమ్. 10

ప్ర.అ.అనేకేతి:- అనేకవక్త్రనయనమ్=అనేకములైన ముఖాలు నేత్రాలు కలది, అనేకాద్భుతదర్శనమ్=అనేకములైన ఆశ్చర్యకరములైన దృశ్యాలు కలది. అనేకదివ్యాభరణమ్ = అనేకములైన దివ్యములైన ఆభరణాలు కలది,దివ్యానేకోద్యతాయుధమ్=ఎత్తబడిన అనేకములైన దివ్యమైన ఆయుధాలు గలది.

భాష్యమ్

అనేకేతి:- అనేకవక్త్రనయనమ్-అనేకాని వక్త్రాణి నయనాని చ యస్మిన్ రూపే తత్ అనేకవక్త్రనయనమ్. అనేకాద్భుతదర్శనమ్-అనేకాని అద్భుతాని విస్మాపకాని దర్శనాని యస్మిన్ రూపే తత్ అనేకాద్భుతదర్శనం,తథా అనేకదివ్యాభరణమ్-అనేకాని దివ్యాని ఆభరణాని యస్మిన్ తత్ అనేకదివ్యాభరణమ్,తథా దివ్యానేకోద్యతా యుధమ్. దివ్యాని అనేకాని ఉద్యతాని ఆయుధాని యస్మిన్ తత్ దివ్యానేకోద్యతాయుధం, దర్శయామాసేతి పూర్వేణ సంబన్ధః. 10

బాలానందిని

అనేకేతి:-దేనియందు అనేకమైన ముఖాలు నేత్రాలు ఉన్నవో అట్టిది,అనేకమైన ఆశ్చర్యకరములైన దృశ్యాలు దేనియందు ఉన్నాయో అట్టిది. దివ్యములైన అనేకములైన ఆభరణాలు దేనియం దున్నాయో అట్టిది, దేనియందు దివ్యములైన అనేకములైన ఆయుధాలు ఎత్తబడి ఉన్నాయో అట్టిది అయిన విశ్వరూపాన్ని చూపించాడు అని వెనుకదానితో అన్వయం.

భాష్యమ్

కిం చ-

మూ. దివ్యమాల్యామ్బరధరం దివ్యగన్ధానులేపనమ్,
సర్వాశ్చర్యమయం దేవమనన్తం విశ్వతోముఖమ్. 11

బాలానందిని

కిం చేతి:- మరియు

దివ్యేతి:- దివ్యమాల్యామ్బరధరమ్=దివ్యములైన మాలలను వస్త్రములను ధరించి నది,దివ్యగన్ధానులేపనమ్=దివ్యములైన గంధముల పూత కలది,సర్వాశ్చర్యమయమ్=

సమస్తములైన ఆశ్చర్యములు అధికంగా ఉన్నది,దేవమ్=ప్రకాశించుచున్నది,అనన్తమ్= అంతం లేనిది విశ్వతోముఖమ్=అన్ని వైపులా ముఖములు కలది(అయిన రూపమును చూపెను).

భాష్యమ్

దివ్యమాల్యామ్బరధరమ్=దివ్యాని మాల్యాని పుష్పాణి అమ్బరాణి వస్త్రాణి చ ధ్రియన్తే యేన ఈశ్వరేణ తం దివ్యమాల్యామ్బరధరం,దివ్యగన్ధానులేపనమ్-దివ్యం గన్ధానులేపనం యస్య తం దివ్యగన్ధానులేపనం,సర్వాశ్చర్యమయం సర్వాశ్చర్యప్రాయమ్, అనన్తం న అస్య అన్తః అస్తి ఇతి అనన్తః తం,విశ్వతోముఖం సర్వతోముఖం సర్వభూతాత్మత్వాత్,తం దర్శయామాస,అర్జునః దదర్శ ఇతి వా అధ్యాహ్రియతే. 11

బాలానందిని

దివ్యేతి:- (తొమ్మిదవ శ్లోకానికి ఈ శ్లోకంలోని పదాలను విశేషణాలుగా గ్రహించి ప్రతిపదార్థం చూపబడింది.భాష్యకారులు దేవం అను పదం విశేష్యంగా గ్రహించి వ్యాఖ్యానించారు).దివ్యములైన పుష్పములు వస్త్రములు ధరించి ఉన్నావాడు,దివ్యమైన గంధానులేపనం గలవాడు-సమస్తములైన ఆశ్చర్యాలతో నిండినవాడు)అంతము లేనివాడు,అన్ని వైపులా ముఖములు కలవాడు,పరమేశ్వరుడు సర్వభూతస్వరూపుడు గాన సర్వభూతాల ముఖాలు పరమేశ్వరునివే కదా అని అర్థం,అట్టి దేవుణ్ణి,ఈశ్వరుణ్ణి,వానికి చూపెను అని లేదా అర్జునుడు చూచెను అని అధ్యాహారం. 11

భాష్యమ్

యా పునః భగవతః విశ్వరూపస్య భాః తస్యాః ఉపమా ఉచ్యతే-

మూ. దివి సూర్యసహస్రస్య భవేద్యుగపదుత్థితా,
యది భాః సదృశీ సా స్యాద్భాసస్తస్య మహాత్మనః. 12

బాలానందిని

యా ఇతి:- విశ్వరూపధారియైన భగవంతుని కాంతికి ఉపమానం చెప్పబడుచున్నది-

ప్ర.అ. దివీతి:- సూర్యసహస్రస్య=వేయి సూర్యులయొక్క,భాః=కాంతి,యుగపత్= ఒక్క మారుగా,దివి=ఆకాశమునందు,ఉత్థితా=లేచినది,భవేత్=అయితే,సా=ఆ కాంతి,తస్య =ఆ,మహాత్మనః=మహాత్మునియొక్క,భాసః=కాంతికి,సదృశీ=సమానమైనది,స్యాత్ యది= అవవచ్చు నేమో!

భాష్యమ్

దివి అన్తరిక్షే,తృతీయస్యాం వా దివి,సూర్యాణాం సహస్రం సూర్యసహస్రం,తస్య యుగవత్ ఉత్థితస్య యా యుగపత్ ఉత్థితా భాః సా యది సదృశీ స్యాత్ తస్య మహాత్మనః విశ్వరూపస్యైవ భాసః,యది వా న స్యాత్,తతోఽపి విశ్వరూపస్యైవ భాః అతిరిచ్యతే ఇత్యభిప్రాయః. 12

బాలానందిని

దివీతి:- అంతరిక్షమునందు,లేదా మూడవదైన ద్యులోకమునందు,ఒక్క మారుగా ఉదయించిన వేయి సూర్యుల,ఒక్క మారుగా బయలుదేరిన కాంతి ఆ మహాత్ముడైన విశ్వరూపుని కాంతికి సమానంగా ఉండవచ్చును;ఉండకపోవచ్చును కూడ.దానికంటె విశ్వరూపుని కాంతియే అధిక మైనది అని అభిప్రాయం. 12

భాష్యమ్

కిం చ-

మూ. తత్రైకస్థం జగత్కృత్స్నం ప్రవిభక్తమనేకధా,
అపశ్యద్దేవదేవస్య శరీరే పాణ్డవస్తదా. 13

బాలానందిని

కిం చేతి:- మరియు-

ప్ర.అ. తత్రేతి:- పాణ్డవః=అర్జునుడు,తదా=అప్పుడు,దేవదేవస్య=దేవదేవునియొక్క, తత్ర=ఆ,శరీరే=శరీరమునందు,ఏకస్థమ్=ఒకే చోట ఉన్న,అనేకధా=అనేకవిధాలుగా, ప్రవిభక్తమ్=వేరు వేరుగా ఉన్న,కృత్స్నమ్=సమస్త మైన,జగత్=జగత్తును,అపశ్యత్=చూచెను.

భాష్యమ్

తత్ర తస్మిన్ విశ్వరూపే,ఏకస్మిన్ స్థితమ్ ఏకస్థం జగత్ కృత్స్నం ప్రవిభక్తమ్ అనేకధా దేవపితృమనుష్యాదిభేదైః,అపశ్యత్ దృష్టవాన్,దేవదేవస్య హరేః,శరీరే,పాణ్డవః అర్జునః తదా. 13

బాలానందిని

తత్రేతి:- అప్పుడు అర్జునుడు దేవదేవు డైన విష్ణువుయొక్క ఆ విశ్వరూపమైన శరీరమునందు,దేవ-పితృ-మనుష్యాదిభేదాలతో అనేకవిధాలుగా విభక్తమై ఉన్న జగత్తు నంతనూ,ఒకే చోట ఉన్నదానిని,చూచాడు. 13

మూ. తతః స విస్మయావిష్టో హృష్టరోమా ధనంజయః,
ప్రణమ్య శిరసా దేవం కృతాఞ్జలిరభాషత. 14

ప్ర.అ. తతః ఇతి:- తతః=అటు పిమ్మట,విస్మయావిష్టః=ఆశ్చర్యముచేత ఆవేశించ బడిన,హృష్టరోమా=గగుర్పాటు చెందిన,ధనంజయః=అర్జునుడు,శిరసా=శిరస్సుతో, దేవమ్=ఆ విశ్వరూపుని,ప్రణమ్య=నమస్కరించి,కృతాంజలిః=చేయబడిన దోసిలి కలవాడై, అభాషత=పలికెను.

భాష్యమ్

తత ఇతి:- తతః తం దృష్ట్వా సః విస్మయేన ఆవిష్టః విస్మయావిష్టః,హృష్టాని రోమాణి యస్య సః అయం హృష్టరోమా చ అభవత్ ధనంజయః.ప్రణమ్య ప్రకర్షేణ నమనం కృత్వా ప్రహ్వీభూతః సన్ శిరసా,దేవం విశ్వరూపధరం,కృతాఞ్జలిః నమస్కారార్థం సంపుటీకృతహస్తః సన్ అభాషత ఉక్తవాన్. 14

బాలానందిని

తత ఇతి:- అటు పిమ్మట,అతనిని చూచి ఆశ్చర్యంచేత ఆవేశింపబడినవాడై, ధనంజయుడు నిలచిన రోమాలు కలవాడు అయ్యాడు.బాగా శిరస్సుచేత వంగినవాడై (శిరస్సు బాగా వంచి)నమస్కారం కొరకు దోసిలి ఘటించి,విశ్వరూపధరు డైన ఆ దేవుణ్ణి గూర్చి ఇట్లనెను. 14

భాష్యమ్

కథమ్?యత్త్వయా దర్శితం విశ్వరూపం తదహం పశ్యామి ఇతి స్వానుభవమ్ ఆవిష్కుర్వన్-

అర్జున ఉవాచ -

మూ. పశ్యామి దేవాంస్తవ దేవ దేహే
సర్వాంస్తథా భూతవిశేషసంఘాన్
బ్రహ్మాణమీశం కమలాసనస్థ
మృషీంశ్చ సర్వానురగాంశ్చ దివ్యాన్. 15

బాలానందిని

కథమితి:- ఎట్లు?నీచేత చూపబడిన విశ్వరూపాన్ని నేను చూస్తున్నాను అని అంటూ తన అనుభవాన్ని ఆవిష్కరిస్తూ అర్జునుడు ఇలా అన్నాడు-

ప్ర.అ. దేవ=ఓ!దేవా! తవ=నీయొక్క,దేహే=దేహమునందు,సర్వాన్=సమస్తమైన, దేవాన్=దేవతలను,తథా=అట్లే,భూతవిశేషసంఘాలన్=ఆ యా భూతాల సంఘాలను, కమలాసనస్థమ్=కమలాసనములపై ఉన్న,ఈశమ్=ప్రభువైన,బ్రహ్మను,సర్వాన్=సమస్తమైన, ఋషీన్=ఋషులను,దివ్యాన్=దివ్యులైన, ఉరగాన్=ఉరగులను,పశ్యామి=చూస్తున్నాను.

భాష్యమ్

పశ్యామి ఉపలభే,హే దేవ,తవ దేహే,దేవాన్ సర్వాన్ తథా భూతవిశేషసంఘాన్ – భూతవిశేషాణాం స్థావరజఙ్గమానాం నానాసంస్థానవిశేషాణాం సంఘాః భూతవిశేష సంఘాః తాన్, కిం చ బ్రహ్మాణం చతుర్ముఖమ్ ఈశితారం ప్రజానాం,కమలాసనస్థం పృథివీపద్మే మేరుకర్ణికాసనమధ్యస్థమ్ ఇత్యర్థః. ఋషీన్ చ వసిష్ఠాదీన్,సర్వాన్ ఉరగాన్ చ వాసుకిప్రభృతీన్,దివ్యాన్ దివి భవాన్. 15

బాలానందిని

పశ్యామీతి:– ఓ!దేవా!నీ దేహమునందు సమస్తదేవతలను,అనేకవిధా లైన ఆకారాలు గల స్థావరజంగమాత్మకము లైన సమస్తభూతాల సముదాయాలను,ప్రజల నియామకు డైన కమలాసనమునం దున్న,పృథివీపద్మమధ్యంలో మేరువుయొక్క మధ్యభాగ మనే ఆసనమునం దున్న, చతుర్ముఖుడైన బ్రహ్మదేవుణ్ణి,వసిష్ఠాదిఋషులను,స్వర్గంలో ఉండే వాసుకి మొదలైన ఉరగులను చూస్తున్నాను. 15

మూ. అనేకబాహూదరవక్త్రనేత్రం
పశ్యామి త్వా సర్వతోఽనన్తరూపమ్,
నాన్తం న మధ్యం న పునస్తవాదిం
పశ్యామి విశ్వేశ్వర విశ్వరూప. 16

ప్ర.అ. **అనేకేతి**:– అనేకబాహూదరవక్త్రనేత్రమ్=అనేకమైన బాహువులు,ఉదరము లు,ముఖములు నేత్రములు గల,అనన్తరూపమ్=అంతము లేని రూపాలు గల,త్వా=నిన్ను, సర్వతః=అన్ని వైపులందు,పశ్యామి=చూస్తున్నాను. విశ్వేశ్వర=విశ్వమునకు ఈశ్వరుడా! విశ్వరూప=ప్రపంచస్వరూపుడా!తవ=నీయొక్క,అన్తమ్=అంతమును(చివరిభాగమును), న పశ్యామి=నేను చూచుటలేదు. మధ్యమ్=మధ్యమును,న=చూచుటలేదు. పునః=మరియు, ఆదిమ్=ఆదిని,న=చూడడంలేదు.

భాష్యమ్

అనేకబాహూదరవక్త్రనేత్రమ్–అనేకే బాహవః ఉదరాణి వక్త్రాణి నేత్రాణి చ యస్య తవ సః త్వమ్ అనేకబాహూదరవక్త్రనేత్రః,తమ్ అనేకబాహూదరవక్త్రనేత్రం,

పశ్యామి త్వా తామ్,సర్వతః సర్వత్ర,అనన్తరూపమ్ అనన్తాని రూపాణి అస్య ఇతి అనన్తరూపం. న అన్తం,అన్తః అవసానం,న మధ్యం, మధ్యః నామ ద్వయోః కోట్యోః అన్తరం,న పునః తవ ఆదిం, తవ దేవస్య న అన్తం పశ్యామి,న మధ్యం పశ్యామి న పునః ఆదిం పశ్యామి,హే విశ్వేశ్వర,హే విశ్వరూప. 16

బాలానందిని

అనేకేతి:- ఓ విశ్వేశ్వరా!ఓ విశ్వరూపా!అనేకమైన బాహువులు,ఉదరములు, ముఖములు,నేత్రాలు,ఎవనికి ఉన్నవో అట్టివాడవు అంతటా అనంతములైన రూపాలు కలవాడవు అయిన నిన్ను చూస్తున్నాను.చివరి భాగమును మధ్య మనగా రెండు అంచుల మధ్యభాగము దానిని, నీ ఆదిని నేను చూడజాలకున్నాను. 16

భాష్యమ్

కిం చ-

మూ. కిరీటినం గదినం చక్రిణం చ
తేజోరాశిం సర్వతోదీప్తిమన్తమ్,
పశ్యామి త్వాం దుర్నిరీక్ష్యం సమన్తా
ద్దీప్తానలార్కద్యుతిమప్రమేయమ్. 17

బాలానందిని

కిం చేతి:- మరియు-

ప్ర.అ. కిరీటినమితి:- కిరీటినమ్=కిరీటం గలవాడవు.గదినమ్=గద కలవాడవు; చక్రిణం చ=చక్రం కలవాడవు,సర్వతః=అన్ని వైపులందు,దీప్తిమన్తమ్=కాంతిగల,తేజో రాశిమ్=తేజోరాశి అయినవాడవు,సమన్తాత్=అంతటా,దీప్తానలార్కద్యుతిమ్=ప్రజ్వలించు చున్న అగ్నియొక్క సూర్యునియొక్క కాంతి వంటి కాంతి గలవాడవు,దుర్నిరీక్ష్యమ్= చూడదానికి శక్యం కానివాడవు,అప్రమేయమ్=ఇట్టివాడ వని ఊహింప శక్యం కాని వాడవు అయిన,త్వామ్=నిన్ను,పశ్యామి=చూస్తున్నాను.

భాష్యమ్

కిరీటినం కిరీటం నామ శిరోభూషణవిశేషః,తత్ యస్య అస్తి సః కిరీటీ తం కిరీటినం,తథా గదినం-గదా యస్య విద్యతే ఇతి గదీతం గదినం,తథా చక్రిణమ్= చక్రమ్ అస్య అస్తీతి చక్రీ,తం చక్రిణమ్,తేజోరాశిం తేజఃపుఞ్జం,సర్వతోదీప్తిమన్తం-

సర్వతః దీప్తిః యస్య అస్తి సః సర్వతోదీప్తిమాన్ తం సర్వతోదీప్తిమన్తం,పశ్యామి త్వాం, దుర్నిరీక్ష్యమ్-దుఃఖేన నిరీక్ష్యః దుర్నిరీక్ష్యః;తం దుర్నిరీక్ష్యం,సమన్తాత్ సర్వత్ర దీప్తా నలార్కద్యుతిమ్-అనలశ్చ అర్కశ్చ అనలార్కౌ,దీప్తౌ అనలార్కౌ దీప్తానలార్కౌ తయోః దీప్తానలార్కయోః ద్యుతిః ఇవ ద్యుతిః తేజః యస్య తవ స త్వం దీప్తానలార్కద్యుతిః; తం దీప్తానలార్కద్యుతిమ్;అప్రమేయం-న ప్రమేయమ్ అప్రమేయం,అశక్యపరిచ్ఛేదమ్ ఇత్యర్థః. **17**

బాలానందిని

కిరీటినమితి:- కిరీట మనగా శిరస్సుమీద ధరించే ఒకానొక అలంకారవిశేషం. అది ఎవనికి ఉంటుందో అతడు కిరీటి,అట్టి వానిని,మరియు గద ఎవనికి ఉంటుందో అతడు గది,గది యైనవానిని,అట్లే,చక్రం వీనికి ఉన్నది గాన చక్రి,అట్టి చక్రిని,తేజస్సు యొక్క రాశిని-అన్ని వైపులా ప్రకాశ ఎవనికి ఉంటుందో అతడు సర్వతోదీప్తిమంతుడు, అట్టివానిని చాలా కష్టపడి చూడ శక్య మైనవానిని,అంతటా,ప్రకాశిస్తూన్న అగ్ని-సూర్యుల కాంతి వంటి కాంతి కలవానిని,ఇంత,ఇట్లు అని పరిచ్ఛేదము లేనివానిని,నిన్ను చూస్తున్నాను.

భాష్యమ్

ఇతః ఏవ తే యోగశక్తిదర్శనాత్ అనుమినోమి-

మూ. త్వమక్షరం పరమం వేదితవ్యం
త్వమస్య విశ్వస్య పరం నిధానమ్,
త్వమవ్యయః శాశ్వతధర్మగోప్తా
సనాతనస్త్వం పురుషో మతో మే. 18

బాలానందిని

ఇత ఇతి:- ఈ విధంగా నీ యోగశక్తిని చూడడంవల్ల ఊహిస్తున్నాను-

ప్ర.అ. త్వమితి:- త్వమ్=నీవు,వేదితవ్యమ్=తెలియదగిన పరమమ్ అక్షరమ్=నాశ రహిత మైన పరబ్రహ్మము. త్వమ్=నీవు,అస్య=ఈ, విశ్వస్య=ప్రపంచముయొక్క,పరమ్= గొప్ప, నిధానమ్=ఆశ్రయము. త్వమ్=నీవు;అవ్యయః=నాశము లేనివాడవు. శాశ్వతధర్మగోప్తా =శాశ్వత మైన ధర్మాన్ని రక్షించువాడవు. త్వమ్=నీవు;సనాతనః=ప్రాచీను డై . పురుషః పురుషుడవు అని,మే=నాకు,మతః=తోచుచున్నావు.

భాష్యమ్

త్వమ్,అక్షరమ్-న క్షరతీతి,పరమం బ్రహ్మ,వేదితవ్యం జ్ఞాతవ్యం ముముక్షుభిః. త్వమ్ అస్య విశ్వస్య సమస్తస్య జగతః పరం ప్రకృష్టం నిధానం-నిధీయతే అస్మిన్ ఇతి నిధానమ్,ఆశ్రయః ఇత్యర్థః. కిం చ త్వమ్ అవ్యయః,న తవ వ్యయః విద్యతే ఇతి అవ్యయః. శాశ్వతధర్మగోప్తా-శశ్వత్ భవః శాశ్వతః,నిత్యః,ధర్మః,తస్య గోప్తా శాశ్వతధర్మ గోప్తా,సనాతనః చిరంతనః త్వం పురుషః మతః అభిప్రేతః మే మమ. 18

బాలానందిని

త్వమితి:-నీవు ముముక్షువులచేత తెలియదగిన నాశనము లేని పరబ్రహ్మవు. నీవు సమస్తమైన ఈ ప్రపంచానికి నిధానం,ఉంచబడే చోటు;అనగా ఆశ్రయం. మరియు నీవు మార్పు లేనివాడవు. శాశ్వత మైన,నిత్య మైన,ధర్మాన్ని రక్షించువాడవు. చాల ప్రాచీనుడవు. అని నా అభిప్రాయము. 18

భాష్యమ్

కిం చ-

మూ. అనాదిమధ్యాన్తమనన్తవీర్య
మనన్తబాహుం శశిసూర్యనేత్రమ్,
పశ్యామి త్వాం దీప్తహుతాశవక్త్రం
స్వతేజసా విశ్వమిదం తపన్తమ్. **19**

బాలానందిని

కిం చేతి:- మరియు -

ప్ర. అ. **అనాదీతి:**-అనాదిమధ్యాన్తమ్=ఆది-మధ్య-అంతములు లేనివాడవు,అనన్తవీర్యమ్=అనంత మైన పరాక్రమం కలవాడవు. అనన్తబాహుమ్=అనంతము లైన బాహువులు కలవాడవు,శశిసూర్యనేత్రమ్=చంద్రసూర్యులు నేత్రములుగా కలవాడవు,దీప్తహుతాశవక్త్రమ్=మండుచున్న అగ్నియే ముఖంగా కలవాడవు,స్వతేజసా=తన తేజస్సుచేత, ఇదమ్=ఈ,విశ్వమ్=ప్రపంచమును,తపన్తమ్=తపింపచేయుచున్నవాడవు అయిన,త్వామ్ = నిన్ను,పశ్యామి=చూస్తున్నాను.

భాష్యమ్

అనాదిమధ్యాన్తమ్=ఆదిశ్చ మధ్యం చ అన్తశ్చ న విద్యతే యస్య సః అయమ్ అనాదిమధ్యాన్తః,తమ్-త్వామ్ అనాదిమధ్యాన్తమ్,అనన్తవీర్యమ్-న తవ వీర్యస్య అన్తః

అస్తి ఇతి అనన్తవీర్యః,తం త్వామ్ అనన్తవీర్యం,తథా అనన్తబాహుమ్-అనన్తాః బాహవః యస్య తవ సః త్వమ్ అనన్తబాహుః, తం త్వామ్ అనన్తబాహుం,శశిసూర్యనేత్రమ్-శశి సూర్యౌ నేత్రే యస్య తవ సః త్వం శశిసూర్యనేత్రః, తం త్వాం శశిసూర్యనేత్రం, చన్ద్రాదిత్యనయనం పశ్యామి త్వాం,దీప్తహుతాశవక్త్రమ్-దీప్తశ్చాసౌ హుతాశశ్చ సః వక్త్రం యస్య తవ స త్వం దీప్తహుతాశవక్త్రః,తం త్వాం దీప్తహుతాశవక్త్రమ్,స్వ తేజసా విశ్వమ్ ఇదం తపన్తం తాపయన్తమ్. 19

బాలానందిని

అనాదీతి:- ఆది మధ్యము అంతము లేనివాడవు,అంతములేని పరాక్రమము గలవాడవు,అనంతములైన బాహువులు కలవాడవు,చంద్రసూర్యులు నేత్రములుగా గలవాడవు,ప్రజ్వలిస్తూన్న అగ్నియే ముఖంగా గలవాడవు,తన తేజస్సుచేత ఈ ప్రపంచము నంతను ప్రజ్వలింపచేయుచున్నవాడవు అయిన నిన్ను చూస్తున్నాను.

మూ. ద్యావాపృథివ్యోరిదమన్తరం హి
వ్యాప్తం త్వయైకేన దిశశ్చ సర్వాః,
దృష్ట్వాద్భుతం రూపమిదం తవోగ్రం
లోకత్రయం ప్రవ్యథితం మహాత్మన్. 20

ప్ర.అ. **ద్యావేతి:-** త్వయా=నీచేత,ఏకేన=ఒక్కనిచేత,ద్యావాపృథివ్యోః=భూమ్యా కాశములయొక్క,ఇదమ్=ఈ,అన్తరమ్=మధ్యభాగము,వ్యాప్తమ్=వ్యాపించబడినది,సర్వాః= సమస్తమైన,దిశః చ=దిక్కులు కూడ,వ్యాపింపబడినవి. మహాత్మన్=మహాత్మా!తవ= నీయొక్క,ఉగ్రమ్=ఉగ్రమైన,అద్భుతమ్=ఆశ్చర్యకర మైన,ఇదమ్=ఈ, రూపమ్= రూపమును, దృష్ట్వా=చూచి,లోకత్రయమ్=లోకాల త్రయము,ప్రవ్యథితమ్=బాధబడినది (భయపడు చున్నది).

భాష్యమ్

ద్యావాపృథివ్యోః ఇదమ్ అన్తరం హి అన్తరిక్షం వ్యాప్తం,త్వయా ఏకేన విశ్వరూప ధరేణ,దిశః చ సర్వాః వ్యాప్తాః దృష్ట్వా ఉపలభ్య,అద్భుతమ్ విస్మాపకం,రూపమ్ ఇదం, తవ,ఉగ్రం క్రూరం,లోకానాం త్రయం లోకత్రయం,ప్రవ్యథితం భీతం,ప్రచలితం వా, హే మహాత్మన్ అక్షుద్రస్వభావ. 20

బాలానందిని

ద్యావేతి:-ఓ!మహాత్మా!క్షుద్రము కాని స్వభావం కలవాడా!విశ్వరూపం ధరించిన నీ ఒక్కనిచేత ఈ భూమ్యాకాశాల మధ్యభాగం;అంతరిక్షం, వ్యాపించబడింది. అన్ని దిక్కులూ

కూడ వ్యాపింపబడినవి. ఆశ్చర్యకరము,క్రూరమూ అయిన నీ ఈ రూపాన్ని చూచి మూడు లోకాలు భయబడుచున్నవి,చలించిపోతున్నాయి. 20

భాష్యమ్

అథ అధునా పురా "యద్వా జయేమ యది వా నో జయేయుః"(2.6)ఇతి అర్జునస్య సంశయః ఆసీత్,తన్నిర్ణయాయ పాణ్డవజయమ్ ఐకాన్తికం దర్శయామి ఇతి ప్రవృత్తః భగవాన్. తం పశ్యన్ ఆహ,కిం చ-

మూ. అమీ హి త్వాం సురసంఘా విశన్తి
కేచిద్భీతాః ప్రాఞ్జలయో గృణన్తి,
స్వస్తీత్యుక్త్వా మహర్షిసిద్ధసంఘాః
స్తువన్తి త్వాం స్తుతిభిః పుష్కలాభిః. 21

బాలానందిని

అథేతి:- అమీ=ఈ,సురసంఘాః=సురుల సముదాయాలు,త్వామ్=నిన్ను,విశన్తి హి=ప్రవేశిస్తున్నారు కదా?కేచిత్=కొందరు,భీతాః=భయపడినవారై,ప్రాఞ్జలయః=కట్టు బడిన దోసిలి కలవారై,గృణన్తి=స్తుతిస్తున్నారు. మహర్షిసిద్ధసంఘాః=మహర్షుల సిద్ధుల సంఘాలు,స్వస్తి ఇతి=స్వస్తి అని (క్షేమ మగుగాక అని) ఉక్త్వా=పలికి,పుష్కలాభిః=పరిపూర్ణ మైన,స్తుతిభిః =స్తుతులతో,త్వామ్=నిన్ను,స్తువన్తి=స్తుతిస్తున్నారు.

భాష్యమ్

అమీ హి యుధ్యమానాః యోద్ధారః త్వా త్వాం,సురసంఘాః యే అత్ర భూ భారావతారాయ అవతీర్ణాః వస్వాదిదేవసంఘాః మనుష్యసంస్థానాః త్వాం విశన్తి ప్రవిశన్తః దృశ్యన్తే,తత్ర కేచిద్ భీతాః ప్రాఞ్జలయః సన్తః,గృణన్తి స్తువన్తి త్వామ్, అన్యే పలాయనేఽ ప్యశక్తాః సన్తః. యుద్ధే ప్రత్యుపస్థితే ఉత్పాతాదినిమిత్తాన్యుపలక్ష్య స్వస్త్యస్తు జగతః ఇత్యుక్త్వా,మహర్షిసిద్ధసంఘాః,మహర్షీణాం సిద్ధానాం చ సంఘాః స్తువన్తి త్వాం స్తుతిభిః,పుష్కలాభిః సంపూర్ణాభిః. 21

బాలానందిని

అమీ ఇతి:- యుద్ధం చేస్తూన్న,యుద్ధం చేయబోతూన్న ఈ సురసంఘాలు, భూ భారం తొలగించడంకొరకు అవతరించిన మనుష్యరూపాలలో ఉన్న వస్వాదిదేవతల సంఘాలు,నిన్ను ప్రవేశిస్తున్నాయి. నీలో ప్రవేశిస్తున్నట్లు కనబడుచున్నాయి. పారిపోవడానికి

కూడ అసమర్థులైన మరి కొందరు దోసిళ్లు కట్టి నిన్ను స్తుతిస్తున్నారు. యుద్ధం దగ్గరపడడంతో ఉత్పాతాదులైన శకునాలను(రాబోయే వినాశాదులను సూచించే దుఃశకునాదులను) గుర్తించి జగత్తుకు క్షేమం అగు గాక అని అంటూ మహర్షిసిద్ధసంఘాలు సంపూర్ణము లైన స్తుతులతో నిన్ను స్తుతిస్తున్నారు. 21

భాష్యమ్

కిం చాన్యత్-

మూ. రుద్రాదిత్యా వసవో యే చ సాధ్యా
విశ్వేఽశ్వినౌ మరుతశ్చోష్మపాశ్చ,
గన్ధర్వయక్షాసురసిద్ధసంఘా
వీక్షన్తే త్వాం విస్మితాశ్చైవ సర్వే. 22

బాలానందిని

కిం చేతి:- మరి యొక విషయ మేమనగా-

ప్ర.అ. రుద్రేతి:- రుద్రాదిత్యాః=రుద్రులు ఆదిత్యులు,వసవః=మసువులు,యే చ = ఏ,విశ్వే=విశ్వేదేవత లున్నారో వాళ్లు,సాధ్యాః=సాధ్యు లున్నారో వారు,అశ్వినౌ= అశ్వినీదేవతలు,మరుతః చ=మరుత్రులు,ఊష్మపాః చ =ఊష్మపు లనే పితృదేవతలు, గన్ధర్వయక్షాసురసిద్ధసంఘాః=గంధర్వ-యక్ష-అసుర-సిద్ధసంఘాలు,త్వా=నిన్ను,వీక్షన్తే= చూస్తున్నారు. సర్వే ఏవ=అందరూ,విస్మితాః చ=ఆశ్చర్యపడుచున్నారు కూడ.

భాష్యమ్

రుద్రాదిత్యాః వసవః యే చ సాధ్యాః-రుద్రాదయః గణాః విశ్వే,అశ్వినౌ చ దేవౌ,మరుతశ్చ,ఊష్మపాశ్చ పితరః,గన్ధర్వయక్షాసురసిద్ధసంఘాః-గన్ధర్వాఃహాహా హూహూ ప్రభృతయః,యక్షాః, కుబేరప్రభృతయః, అసురాః విరోచనప్రభృతయః, సిద్ధాః కపిలాదయః తేషాం సంఘాః గన్ధర్వయక్షాసురసిద్ధసంఘాః తే,వీక్షన్తే పశ్యన్తి,త్వా త్వాం,విస్మితాః విస్మయమ్ ఆపన్నాః సన్తః త ఏవ సర్వే. 22

బాలానందిని

రుద్రేతి:-రుద్ర-ఆదిత్యులు,వసువులు,సాధ్యులు,రుద్రాదులు గణదేవతలు; విశ్వేదేవతలు,ఇద్దరు అశ్వినీదేవతలు,మరుత్తులు,ఊష్మపు లను పితృదేవతలు,గన్ధర్వ యక్షాసురసిద్ధసంఘాలు-హాహా-హూహూ మొదలైనవారు గంధర్వులు. కుబేరుడు

మొదలైనవాళ్లు యక్షులు. విరోచనులు మొదలైనవాళ్లు అసురులు. కపిలుడు మొదలైనవాళ్లు సిద్ధులు;వాళ్ల సంఘాలు,వాళ్లందరూ ఆశ్చర్యం పొందినవారై నిన్ను చూస్తున్నారు. 22

భాష్యమ్

యస్మాత్-

మూ. రూపం మహత్తే బహువక్త్రనేత్రం
మహాబాహో బహుబాహూరుపాదమ్,
బహూదరం బహుదంష్ట్రాకరాలం
దృష్ట్వా లోకాః ప్రవ్యథితాస్తథాహమ్. 23

బాలానందినీ

యస్మాదితి:- ఎందువలన అనగా-

ప్ర.అ. రూపమితి:- మహాబాహో=మహాబాహూ! బహువక్త్రనేత్రమ్=అనేకమైన ముఖాలు నేత్రాలు గలది,బహుబాహూరుపాదమ్=అనేక మైన బాహువులు,తొడల, పాదాలు గలది,బహూదరమ్=అనేకమైన ఉదరాలు గలది,బహుదంష్ట్రాకరాళమ్=అనేక మైన కోరలతో భయంకరంగా ఉన్నదిఅయిన,మహత్=గొప్పదైన,తే=నీయొక్క,రూపమ్= రూపమును, దృష్ట్వా=చూచి,లోకాః=లోకముల,ప్రవ్యథితాః=వ్యథ చెందినవి(చెందుచున్నవి). తథా=అట్లు, అహమ్=నేను కూడ వ్యథ చెందుచున్నాను.

భాష్యమ్

రూపం,మహత్ అతిప్రమాణం,తే తవ,బహువక్త్రనేత్రం-బహూని వక్త్రాణి ముఖాని,నేత్రాణి చక్షూంషి చ యస్మిన్ తత్ రూపం బహువక్త్రనేత్రం,హే మహాబాహో! బహుబాహూరుపాదం-బహవః బాహవః ఊరవః పాదాః చ యస్మిన్ రూపే తత్ బహుబాహూరుపాదం,కిం చ,బహూదరం బహూని ఉదరాణి యస్మిన్ ఇతి బహూదరం, బహుదంష్ట్రాకరాలం-బహ్వీభిః దంష్ట్రాభిః కరాలం వికృతం తత్ బహుదంష్ట్రాకరాలం, దృష్ట్వా రూపమ్ ఈదృశం లోకాః లౌకికాః,ప్రాణినః,ప్రవ్యథితాః ప్రచలితాః భయేన,తథా అహమపి. 23

బాలానందిని

రూపమితి:-ఓ! మహాబాహూ!అనేకమైన ముఖాలు నేత్రాలు ఉన్నది,అనేకమైన బాహువులు,తొడలు,పాదాలు ఉన్నది,మరియు అనేక మైన ఉదరాలు ఉన్నది,అనేక మైన

కోరలచేత వికృతంగా ఉన్నది అయిన, మహాప్రమాణం గల ఈ నీ రూపాన్ని చూచి లోకాలు వ్యథ చెందుచున్నవి; వణకిపోవుచున్నవి. నేను కూడ వ్యథ చెందుతున్నాను. 23

భాష్యమ్

తత్రేదం కారణమ్-

మూ. నభఃస్పృశం దీప్తమనేకవర్ణం
వ్యాత్తాననం దీప్తవిశాలనేత్రమ్,
దృష్ట్వా హి త్వా ప్రవ్యథితాన్తరాత్మా
ధృతిం న విన్దామి శమం చ విష్ణో. 24

బాలానందిని

తత్రేతి:- అందుకు కారణం ఇది-

ప్ర.అ. నభః ఇతి:- నభఃస్పృశమ్=ఆకాశాన్ని స్పృశించుచున్నవాడవు; దీప్తమ్=ప్రకాశించుచున్నవాడవు, అనేకవర్ణమ్=అనేకము లైన రంగులు గలవాడవు, వ్యాత్తాననమ్=తెరవబడిన నోళ్లు గలవాడవు, దీప్తవిశాలనేత్రమ్=ప్రజ్వలించుచున్న విశాలములైన నేత్రాలు గల వాడవు అయిన, త్వామ్=నిన్ను దృష్ట్వా=చూచి, విష్ణో = ఓ! విష్ణూ! ప్రవ్యథితాన్తరాత్మా=వ్యథ చెందిన అంతరాత్మ కలవాడనై, ధృతిమ్=ధైర్యమును, శమం చ=శమమును, న విన్దామి=పొంద జాలకున్నాను.

భాష్యమ్

నభఃస్పృశమ్ ద్యుస్పర్శమిత్యర్థః; దీప్తం ప్రజ్వలితమ్, అనేకవర్ణమ్ అనేకే వర్ణాః భయంకరాః నానాసంస్థానాః యస్మిన్ త్వయి తం త్వామ్ అనేకవర్ణం, వ్యాత్తాననం- వ్యాత్తాని వివృతాని ఆననాని ముఖాని యస్మిన్ త్వయి తం త్వాం వ్యాత్తాననం, దీప్త విశాలనేత్రం-దీప్తాని ప్రజ్వలితాని విశాలాని విస్తీర్ణాని నేత్రాణి యస్మిన్ త్వయి తం త్వాం దీప్తవిశాలనేత్రం, దృష్ట్వా హి త్వాం ప్రవ్యథితాన్తరాత్మా-ప్రవ్యథితః ప్రభీతః అన్తరాత్మా మనః యస్య సః అహం ప్రవ్యథితాన్తరాత్మా సన్ ధృతిం ధైర్యం న విన్దామి న లభే, శమం చ ఉపశమం మనస్తుష్టిం హే విష్ణో !

బాలానందిని

నభ ఇతి:- ద్యులోకాన్ని స్పృశిస్తున్నవాడవు, ప్రకాశిస్తూన్న అనేకపద్ధతులలో ఉన్న వర్ణాలు కలవాడవు, తెరవబడిన నోళ్లు కలవాడవు, మండుచూన్న విశాలములైన నేత్రాలు

గలవాడవు,అయిన నిన్ను చూచి చాలా భయపడిన మనస్సు కలవాడనై ధైర్యమును పొందజాలకున్నాను;మనస్సుకు సంతోషమును కూడ పొందజాలకున్నాను. 24

భాష్యమ్

కస్మాత్-

మూ. దంష్ట్రాకరాలాని చ తే ముఖాని
దృష్ట్వైవ కాలానలసంనిభాని,
దిశో న జానే న లభే చ శర్మ
ప్రసీద దేవేశ జగన్నివాస. 25

బాలానందిని

కస్మాదితి:- ఎందువలన అనగా-

ప్ర.అ. దంష్ట్రేతి:- దంష్ట్రాకరాలాని=కోరలతో వికృతంగా ఉన్న,కాలానలసంనిభాని=ప్రలయకాలాగ్నితో సమానములైన,తే ముఖాని=నీ ముఖాలను,దృష్ట్వా ఏవ=చూడగానే, దిశః=దిక్కులను,న జానే=తెలుసుకొనలేకున్నాను;శర్మ చ=సుఖమును కూడ,న లభే= పొందను.దేవేశ=దేవతల నియామకుడా!జగన్నివాస=జగత్తుకు నివాస మైనవాడా! ప్రసీద= అనుగ్రహించుము.

భాష్యమ్

దంష్ట్రాకరాలాని-దంష్ట్రాభిః కరాలాని వికృతాని,తే తవ,ముఖాని,దృష్ట్వా ఏవ ఉపలభ్య,కాలానలసంనిభాని-ప్రలయకాలే లోకానాం దాహకః అగ్నిః కాలానలః,తత్సం నిభాని కాలానలసదృశాని దృష్ట్వా ఇత్యేతత్.దిశః పూర్వాపరవివేకేన న జానే, దిఙ్మూఢః జాతః అస్మి,అతః న లభే చ నోపలభే చ శర్మ సుఖమ్,అతః ప్రసీద ప్రసన్నః భవ, హే దేవేశ, జగన్నివాస. 25

బాలానందిని

దంష్ట్రేతి:- కోరలచేత వికృతంగా ఉన్న,ప్రలయకాలంలో లోకాలను కాల్చివేసే అగ్ని కాలాగ్ని,ఆ కాలాగ్నితో సమానములైన నీ ముఖాలను చూడగానే,దిక్కులను ఇది తూర్పు,ఇది పడమర అను వివేకంచేత తెలుసుకొన జాలకున్నాను.దిఙ్మూఢు డను అయ్యాను.సుఖమును కూడ పొందుటలేదు.అందువల్ల ఓ! దేవేశా!ఓ!జగన్నివాసా! ప్రసన్నుడవు అగుము. 25

భాష్యమ్

యేభ్యః మమ పరాజయశఙ్కా ఆసీత్ సా చ అపగతా;యతః-

మూ. అమీ చ త్వాం ధృతరాష్ట్రస్య పుత్రాః
సర్వే సహైవావనిపాలసంఘైః,
భీష్మో ద్రోణః సూతపుత్రస్తథాసౌ
సహాస్మదీయైరపి యోధముఖ్యైః. 26

బాలానందిని

యేభ్యః ఇతి:- ఎవరినుండి పరాజయం కలుగుతుం దని నాకు శంక కలిగినదో అది పోయినది. ఎందువల్ల ననగా-

అమీ ఇతి:- ధృతరాష్ట్రస్య=ధృతరాష్ట్రునియొక్క,అమీ=ఈ,పుత్రాః=పుత్రులు, అవనిపాలసంఘైః=రాజులయొక్క సముదాయాలతో కూడ,భీష్మః=భీష్ముడు,ద్రోణః=ద్రోణుడూ, తథా=మరియు,అసౌ=ఈ,సూతపుత్రః=కర్ణుడూ,అస్మదీయైః=మనకు సంబంధించినవారైన, యోధముఖ్యైః సహ= ప్రధానులైన యోధులతో కూడ,త్వామ్=నిన్ను,(ప్రవేశిస్తున్నారు).

భాష్యమ్

అమీ చ,త్వాం,ధృతరాష్ట్రస్య పుత్రాః దుర్యోధనప్రభృతయః, "త్వరమాణాః విశన్తి" ఇతి వ్యవహితేన సంబన్ధః,సర్వే,సహైవ సంహతాః,అవనిపాలసంఘైః-అవనిం పృథ్వీం పాలయన్తీతి అవనిపాలాః,తేషాం సంఘైః, కిం చ,భీష్మః,ద్రోణః సూతపుత్రః కర్ణః, తథా అసౌ,సహ అస్మదీయైరపి ధృష్టద్యుమ్న ప్రభృతిభిః యోధముఖ్యైః-యోధానాం ముఖ్యైః ప్రధానైః సహ. 26

బాలానందిని

అమీ ఇతి:- ధృతరాష్ట్రుని పుత్రులైన ఈ దుర్యోధనాదులు "త్వరమాణాః విశన్తి" అను దూరంగా ఉన్నదానితో అన్వయం. తొందరపడుచు నిన్ను ప్రవేశిస్తున్నారు. పృథివిని పాలించే రాజుల సముదాయాలతో మరియు భీష్ముడు, ద్రోణుడు ఈ కర్ణుడు,మనవాళ్లైన ధృష్టద్యుమ్నుడు మొదలైన ప్రధానులైన యోధులతో కూడ - 26

మూ. వక్త్రాణి తే త్వరమాణా విశన్తి
దంష్ట్రాకరాళాని భయానకాని,

కే చిద్విలగ్నా దశనాన్తరేషు

సన్దృశ్యన్తే చూర్ణితైరుత్తమాఙ్గైః. 27

ప్ర. అ. వక్త్రాణీతి:- త్వరమాణాః = తొందరపడుచున్నవారై,దంష్ట్రాకరాళాని=కోరల చేత వికృతంగా ఉన్న,భయంకరాణి=భయంకరము లైన,తే వక్త్రాణి=నీ ముఖాలను, విశన్తి=ప్రవేశిస్తున్నారు.కే చిత్=కొందరు,చూర్ణితైః=చూర్ణం చేయబడిన,ఉత్తమాఙ్గైః=శిరస్సు లతో,దశనాన్తరేషు=దంతాల మధ్యలలో,విలగ్నాః=తగుల్కొని వ్రేలాడచున్నవారుగా, సన్దృశ్యన్తే=చూడబడుచున్నారు.

భాష్యమ్

వక్త్రాణి ముఖాని,తే తవ,త్వరమాణాః త్వరాయుక్తాః సన్తః విశన్తి-కింవిశిష్టాని ముఖాని?దంష్ట్రాకరాలాని,భయానకాని భయంకరాణి. కిం చ కేచిత్ ముఖాని ప్రవిష్టానాం మధ్యే విలగ్నాః దశనాన్తరేషు దన్తాన్తరేషు,మాంసమివ భక్షితం సన్దృశ్యన్తే ఉపలభ్యన్తే, చూర్ణితైః చూర్ణీకృతైః,ఉత్తమాఙ్గైః శిరోభిః. 27

బాలానందిని

వక్త్రాణీతి:- తొందరపడుతూ నీ ముఖాలను ప్రవేశిస్తున్నారు.ఎట్టి ముఖాలను? కోరలచేత వికృతంగా ఉన్నవి.భయంకర మైనవి.మరియు-ముఖాలను ప్రవేశించిన వాళ్లలో కొందరు,భక్షించబడిన మాంసం వలె చూర్ణంగా చేయబడిన శిరస్సులతో దంతాల మధ్య తగుల్కొని కనబడుచున్నారు. 27

భాష్యమ్

కథం ప్రవిశన్తి ముఖానీత్యాహ-

మూ. యథా నదీనాం బహవోఽమ్బువేగాః

సముద్రమేవాభిముఖా ద్రవన్తి,

తథా తవామీ నరలోకవీరా

విశన్తి వక్త్రాణ్యభివిజ్వలన్తి. 28

కథమితి:-ముఖాలలో ఎట్లు ప్రవేశిస్తున్నారో చెపుతున్నాడు-

ప్ర. అ. యథేతి:- నదీనామ్=నదులయొక్క,బహవః=అనేకమైన,అమ్బువేగాః= జలవేగాలు,సముద్రమేవ=సముద్రమునే గూర్చి,అభిముఖాః=అభిముఖములై,యథా=ఎట్లు ద్రవన్తి=శీఘ్రంగా ప్రవహిస్తాయో,తథా=అట్లే,అమీ=ఈ,నరలోకవీరాః=మనుష్యలోకంలోని

వీరులు,తవ=నీయొక్క,అభివిజ్వలన్తి=ప్రకాశిస్తూన్న,వక్త్రాణి=ముఖాలను,విశన్తి=ప్రవేశిస్తున్నారు.

భాష్యమ్

యథా నదీనాం స్రవన్తీనాం బహవః అనేకే అమ్బువేగాః-అమ్బూనాం వేగాః అమ్బువేగాః త్వరావిశేషాః సముద్రమ్ ఏవ అభిముఖాః ప్రతిముఖాః ద్రవన్తి ప్రవిశన్తి, తథా తద్వత్,తవ,అమీ భీష్మాదయః,నరలోకవీరాః మనుష్యలోకశూరాః,విశన్తి,వక్త్రాణి అభివిజ్వలన్తి ప్రకాశమానాని. 28

బాలానందిని

యథేతి:- నదుల అనేకములైన జలవేగాలు అభిముఖములుగా వెళ్లి సముద్రాన్నే ఏ విధంగా ప్రవేశిస్తాయో ఆ విధంగానే భీష్మదు మొదలైన మనుష్యలోకశూరులు ప్రకాశిస్తూన్న నీ ముఖాలను ప్రవేశిస్తున్నారు. 28

భాష్యమ్

తే కిమర్థం ప్రవిశన్తి కథం చ ఇత్యాహ-

మూ. యథా ప్రదీప్తం జ్వలనం పతఙ్గా
విశన్తి నాశాయ సమృద్ధవేగాః;
తథైవ నాశాయ విశన్తి లోకా
స్తవాపి వక్త్రాణి సమృద్ధవేగాః. 29

బాలానందిని

తే ఇతి:- వాళ్లు ఎందుకు ప్రవేశిస్తున్నారో చెపుతున్నాడు-

ప్ర.అ. సమృద్ధవేగాః=అధికమైన వేగం గల,పతఙ్గాః=మిడతలు, జ్వలన్తమ్=మండుచున్న, జ్వలనమ్=అగ్నిని,నాశాయ=నాశంకొరకు,యథా=ఎట్లు,విశన్తి=ప్రవేశిస్తాయో, తథైవ=అట్లే లోకాః అపి=లోకములు(జనులు)కూడ,సమృద్ధవేగాః=అధికమైన వేగం గలవారై, తవ=నీయొక్క వక్త్రాణి=ముఖాలను,విశన్తి=ప్రవేశిస్తున్నారు.

భాష్యమ్

యథా ప్రదీప్తం జ్వలనమ్ అగ్నిం పతఙ్గాః పక్షిణః,విశన్తి,నాశాయ వినాశాయ, సమృద్ధవేగాః-సమృద్ధః ఉద్భూతః వేగః గతిః యేషాం తే సమృద్ధవేగాః,తథైవ నాశాయ విశన్తి,లోకాః ప్రాణినః తవ అపి వక్త్రాణి సమృద్ధవేగాః. 29

బాలానందిని

యథేతి:- రెక్కల పురుగులు అధికమైన వేగం గలవై ఏ విధంగా ప్రజ్వలిస్తూన్న అగ్నిలో, నశించడంకొరకే ప్రవేశిస్తాయో అట్లే ప్రాణు లన్నీ అధిక మైన వేగం గలవై,నీ ముఖాలను, తమ వినాశంకొరకే ప్రవేశిస్తున్నాయి. 29

భాష్యమ్

త్వం పునః-

మూ. లేలిహ్యసే గ్రసమానః సమన్తా
ల్లోకాన్ సమగ్రాన్ వదనైర్జ్వలద్భిః,
తేజోభిరాపూర్య జగత్సమగ్రం
భాసస్తవోగ్రాః ప్రతపన్తి విష్ణో. 30

బాలానందిని

త్వమితి:- నీవైతే-

ప్ర.అ. లేలిహ్యసే ఇతి:- విష్ణో: = విష్ణూ,జ్వలద్భిః=ప్రజ్వలిస్తూన్న,వదనైః =ముఖాలతో, సమగ్రాన్=సంపూర్ణమైన,లోకాన్=ప్రాణులను,గ్రసమానః=మ్రింగివేయుచు, లేలిహ్యసే= మాటిమాటికీ నాకుచున్నావు.ఉగ్రాః=ఉగ్రములైన,తవ భాసః=నీ కాంతులు, సమగ్రమ్= సమస్తమైన,జగత్=జగత్తును,తేజోభిః=తేజస్సులతో,ఆపూర్య=నింపి, ప్రతపన్తి= అధికంగా తపింపచేయున్నవి. 30

భాష్యమ్

లేలిహ్యసే అస్వాదయసి,గ్రసమానః అన్తః ప్రవేశయన్,సమన్తతః లోకాన్, సమగ్రాన్ సమస్తాన్, వదనైః వక్త్రైః,జ్వలద్భిః దీప్యమానైః,తేజోభిః ఆపూర్య సంపూర్య, జగత్ సమగ్రం సమస్తమ్ ఇత్యేతత్.కిం చ భాసః దీప్తయః,తవ ఉగ్రాః క్రూరాః ప్రతపన్తి ప్రతాపం కుర్వన్తి,హే! విష్ణో వ్యాపనశీల. 30

బాలానందిని

లేలిహ్యసే ఇతి:- అంతటా వ్యాపించే స్వభావం కలవాడా! సమస్తప్రాణులను మ్రింగుచు, దేదీప్యమానములైన తేజస్సులతో సమస్తజగత్తును వ్యాపించి,అన్ని వైపులా మాటి మాటికి నాకుచున్నావు.మరియు క్రూరములైన నీ కాంతులు అధికంగా తపింప చేయుచున్నవి.

భాష్యమ్

యతః ఏవమ్ ఉగ్రస్వభావః అతః-

మూ. ఆఖ్యాహి మే కో భవానుగ్రరూపో
నమోఽస్తు తే దేవవర ప్రసీద,
విజ్ఞాతుమిచ్ఛామి భవన్తమాద్యం
న హి ప్రజానామి తవ ప్రవృత్తిమ్. 31

బాలానందిని

యతః ఇతి:- నువ్వు ఇంత ఉగ్రస్వభావుడవుగా ఉన్నావు గాన-

ప్ర. అ. **అఖ్యాహీతి:**- హే!దేవవర=ఓ!దేవతాశ్రేష్ఠుడా! తే=నీకు,నమః=నమస్కారము, అస్తు= అగుగాక,ప్రసీద=అనుగ్రహించుము,ఉగ్రరూపః=ఉగ్రమైన రూపం గల,భవాన్ =నీవు కః=ఎవ్వడవు?ఆఖ్యాహి=చెప్పుము. ఆద్యమ్=ఆద్యుడ వైన,భవన్తమ్=నిన్ను గూర్చి విజ్ఞాతుమ్=తెలుసుకొనుటకు,ఇచ్ఛామి=కోరుచున్నాను. తవ=నీయొక్క ప్రవృత్తిమ్= ప్రవృత్తిని,న హి ప్రజానామి=తెలుసుకొనకున్నాను కదా!?

భాష్యమ్

ఆఖ్యాహి కథయ,మే మహ్యం,కః భవాన్ ఉగ్రరూపః క్రూరాకారః నమః అస్తు తే తుభ్యం,హే దేవవర దేవానాం ప్రధాన,ప్రసీద ప్రసాదం కురు,విజ్ఞాతుం విశేషేణ జ్ఞాతుమ్ ఇచ్ఛామి భవన్తమ్,ఆద్యమ్,ఆదౌ భవమ్ ఆద్యమ్.న,హి యస్మాత్ ప్రజానామి తవ త్వదీయాం ప్రవృత్తిం చేష్టామ్. 31

బాలానందిని

ఆఖ్యాహీతి:- క్రూర మైన ఆకారం గల నువ్వు ఎవరివో నాకు చెప్పుము.దేవత లలో ప్రధానుడా! నీకు నమస్కారము అగుగాక.అనుగ్రహమును చేయుము.ఆదియం దున్న నిన్ను గూర్చి విశేషంగా తెలుసుకొన గోరుచున్నాను.ఎందువల్ల ననగా నీ ప్రవృత్తిని తెలుసుకొనజాలకున్నాను. 31

శ్రీభగవానువాచ-

మూ. కాలోఽస్మి లోకక్షయకృత్ ప్రవృద్ధో
లోకాన్సమాహర్తుమిహ ప్రవృత్తః,

ఋతేఽ పి త్వాం న భవిష్యన్తి సర్వే
యేఽ వస్థితాః ప్రత్యనీకేషు యోధాః. 32

శ్రీభగవంతుడు చెప్పెను.

ప్ర.అ. కాల ఇతి:- ఇహ=ఈ సమయంలో,లోకాన్=లోకులను,సమాహర్తుమ్=సంహరించుటకు,ప్రవృత్తః=ప్రవర్తించిన,ప్రవృద్ధః=వృద్ధిపొందిన,విజృంభించిన,లోకక్షయకృత్=లోకక్షయం చేసే,కాలః=కాలుడను,అస్మి=అయి ఉన్నాను.ప్రత్యనీకేషు=ఎదురెదురెదురుగా ఉన్న సేనలలో,యే=ఏ,యోధాః=యోధులు,అవస్థితాః=నిలచి ఉన్నారో,సర్వే=వాళ్లందరూ,త్వా ఋతేఽ పి=నీవు లేకపోయినా,న భవిష్యన్తి=ఉండరు.(నువ్వు యుద్ధం చేయకపోయినా వీళ్లు ఇంక ఉండేది లేదు అని భావం).

భాష్యమ్

కాలోఽ స్మీతి:- కాలః అస్మి లోకక్షయకృత్-లోకానాం క్షయం కరోతీతి లోకక్షయకృత్,ప్రవృద్ధః వృద్ధిం గతః,యదర్థం ప్రవృద్ధః తత్ శృణు-లోకాన్ సమాహర్తుం,సంహర్తుమ్,ఇహ అస్మిన్ కాలే,ప్రవృత్తః.ఋతేఽ పి వినాపి,త్వా త్వాం,న భవిష్యన్తి భీష్మద్రోణప్రభృతయః సర్వే యేభ్యః తవ ఆశఙ్కా,యే అవస్థితాః,ప్రత్యనీకేషు-అనీకమనీకం ప్రతి ప్రత్యనీకేషు ప్రతిపక్షభూతేషు అనీకేషు,యోధాః యోద్ధారః. 32

బాలానందిని

కాలోఽ స్మీతి:- లోకాలను నశింపచేసే,వృద్ధి పొందిన కాలు డను నేను.ఎందుకు వృద్ధి పొందానో,విజృభించానో విను.ఈ కాలంలో(సమయంలో)లోకాలను(ప్రాణులను) సంహరించడానికి ప్రవర్తించిన కాలుడను.నువ్వు లేకపోయినా (నువ్వు యుద్ధం చేసినా చేయకపోయినా)ఎదురెదు రెదురుగా ఉన్న ఈ అనీకాలలో ఏ భీష్మద్రోణకర్ణాదులు ఉన్నారో, ఎవరినుండి నీకు ఆశంక ఉన్నదో,ఆ యోధులు ఇంక జీవించరు.

వి.:- అనీకశబ్దానికి సామాన్యరూపంలో సైన్య మని అర్థం.అట్లే సైన్యంలోని కొన్ని విభాగాలకు (units) కూడ 'అనీకం'అని పేరు.ఈ అర్థంలోనే "అనీకమనీకం ప్రతి ప్రత్యనీకేషు" అని విగ్రహం చెప్పబడింది. 32

భాష్యమ్

యస్మాత్ ఏవమ్-

మూ. తస్మాత్త్వముత్తిష్ఠ యశో లభస్వ
జిత్వా శత్రూన్ భుఙ్క్ష్వ రాజ్యం సమృద్ధమ్,

మయ్యైవైతే నిహతః పూర్వమేవ
నిమిత్తమాత్రం భవ సవ్యసాచిన్. 33

బాలానందిని

యస్మాదితి:- ఇది ఇలా ఉన్నది గాన-

ప్ర.అ. తస్మాదితి:- తస్మాత్=ఆ కారణంవలన,త్వమ్=నువ్వు,ఉత్తిష్ఠ=లెమ్ము, యశః=కీర్తిని,లభస్వ=పొందుము. శత్రూన్=శత్రువులను,జిత్వా=జయించి సమృద్ధమ్=సమృద్ధమైన,రాజ్యమ్=రాజ్యమును,భుఙ్క్ష్వ=అనుభవించుము.ఏతే=వీళ్ళు, పూర్వమేవ=ముందుగానే,మయ్యైవ=నాచేతనే,నిహతాః=చంపబడ్డారు.సవ్యసాచిన్=అర్జునా!నిమిత్తమాత్రమ్=కేవలం నిమిత్తము మాత్రం,భవ=అగుము.

భాష్యమ్

తస్మాత్ త్వమ్ ఉత్తిష్ఠ,భీష్మద్రోణప్రభృతయః అతిరథాః అజేయాః దేవైరపి, అర్జునేన జితాః ఇతి యశః లభస్వ. కేవలం పుణ్యైః హి తత్ ప్రాప్యతే.జిత్వా శత్రూన్ దుర్యోధనప్రభృతీన్,భుఙ్క్ష్వ,రాజ్యం సమృద్ధమ్ అసపత్నమ్ అకణ్టకమ్.మయ్యైవ ఏతే నిహతాః నిశ్చయేన హతాః ప్రాణైః వియోజితాః పూర్వమేవ.నిమిత్తమాత్రం భవ త్వం, హే సవ్యసాచిన్,సవ్యేన వామేనాపి హస్తేన శరాణాం క్షేపాత్ సవ్యసాచీతి ఉచ్యతే అర్జునః. 33

బాలానందిని

తస్మాదితి:-అందువల్ల నువ్వు లెమ్ము.దేవతలచేత కూడ జయింప శక్యం కాని భీష్మద్రోణాదులైన అతిరథులు అర్జునునిచేత జయింపబడ్డారు అను కీర్తిని పొందుము. కేవలం పుణ్యాలచేతనే కీర్తి పొందబడుతుంది కదా?దుర్యోధనుడు మొదలైన శత్రువులను జయించి సమృద్ధము,శత్రువులు లేని,ఏ బాధలూ లేని రాజ్యాన్ని అనుభవించుము.వీళ్ళు ముందుగానే నాచేతనే నిశ్చితంగా చంపబడి ఉన్నారు.ఓ!సవ్యసాచీ!నువ్వు కేవలం నిమిత్తమాత్రంగా ఉండుము.ఎడమచేతితో కూడ బాణాలను ప్రయోగించడంచేత అర్జునునకు 'సవ్యసాచి'అని పేరు. 33

మూ. ద్రోణం చ భీష్మం చ జయద్రథం చ
కర్ణం తథాన్యానపి యోధవీరాన్,
మయా హతాంస్త్వం జహి మా వ్యథిష్ఠా
యుధ్యస్వ జేతాసి రణే సపత్నాన్. 34

ప్ర.అ. ద్రోణమితి:- మయా=నాచేత,హతాన్=చంపబడిన,ద్రోణం చ=ద్రోణుణ్ణి, భీష్మం చ=భీష్మణ్ణి,జయద్రథం చ=జయద్రథుణ్ణి,కర్ణమ్=కర్ణుణ్ణి,తథా=అట్లే,అన్యాన్= ఇతరులైన,యోధవీరాన్ అపి=వీరులైన యోధులను,త్వమ్=నువ్వు,జహి=చంపుము. మా వ్యథిష్ఠాః=కలవరపడకుము.యుధ్యస్వ=యుద్ధం చేయుము.రణే=యుద్ధంలో, సపత్నాన్ = శత్రువులను,జేతాసి=జయించగలవు.

భాష్యమ్

ద్రోణంచేతి:- ద్రోణం చ-యేషు యేషు యోధేషు అర్జునస్య ఆశఙ్కా తాన్ తాన్ వ్యపదిశతి భగవాన్ మయా హతాన్ ఇతి.తత్ర ద్రోణభీష్మయోస్తావత్ ప్రసిద్ధమ్ ఆశఙ్కాకారణమ్.ద్రోణః ధనుర్వేదాచార్యః దివ్యాస్త్రసంపన్నః ఆత్మనశ్చ విశేషతః గురుః గరిష్ఠః.భీష్మః స్వచ్ఛన్దమృత్యుః దివ్యాస్త్రసంపన్నశ్చ పరశురామేణ ద్వన్ద్వయుద్ధమ్ అగమత్; న చ పరాజితః.తథా జయద్రథః యస్య పితా తపః చరతి మమ పుత్రస్య శిరః భూమౌ పాతయిష్యతి యః తస్యాపి శిరః పతిష్యతీతి. కర్ణోఽపి వాసవదత్తయా శక్త్యా తు అమోఘయా సంపన్నః సూర్యపుత్రః కానీనః యతః,అతః తన్నామ్నైవ నిర్దేశః. మయా హతాన్ త్వం జహి నిమిత్తమాత్రేణ,మా వ్యథిష్ఠాః,తేభ్యో భయం మా కార్షీః. యుధ్యస్వ.జేతాసి దుర్యోధనప్రభృతీన్,రణే యుద్ధే సపత్నాన్ శత్రూన్. 34

బాలానందిని

ద్రోణం చేతి:- ఏ యే యోధుల విషయంలో అర్జునునకు ఆశంక ఉన్నదో వాళ్లను భగవంతుడు 'మయా హతాన్'అని నిర్దేశిస్తున్నాడు.ద్రోణభీష్ములు ఆశంకకు కారణం అవడం అనేది ప్రసిద్ధమే.ద్రోణుడు ధనర్వేదాచార్యుడు,దివ్యాస్త్రము లున్నవాడు,విశేషించి తనకు చాలా పూజ్యు డైన గురువు.భీష్ముడు ఇచ్ఛానుసారం మృత్యువు కలవాడు.దివ్యాస్త్ర సంపన్నుడు,పరశురామునితో ద్వంద్వయుద్ధం చేశాడు;ఓటమిని పొందలేదు.జయద్రథుని తండ్రి-నా పుత్రుని శిరస్సును ఎవడు క్రింద పడగొటతాడో వాని శిరస్సు కూడ పడుతుంది అని తపస్సు చేస్తున్నాడు.కర్ణుడు కూడ ఇంద్రు డిచ్చిన అమోఘ మైన శక్త్యాయుధం గలవాడు;సూర్యపుత్రుడు,కన్యాపుత్రుడు.అందుచేత వీళ్లందరినీ సామాన్యంగా యోధవీరులు అని అనకుండా వాళ్ల పేర్లు పెట్టి నిర్దేశించడం జరిగింది.నాచేత చంపబడిన వీళ్లను నువ్వు నిమిత్తమాత్రంగా ఉండి చంపుము వీళ్లకు భయపడకుము.యుద్ధం చెయ్యి.దుర్యో ధనాదిశత్రువులను యుద్ధంలో చంపగలవు. 34

సంజయ ఉవాచ-

మూ. ఏతచ్ఛ్రుత్వా వచనం కేశవస్య
కృతాఞ్జలిర్వేపమానః కిరీటీ,
నమస్కృత్వా భూయ ఏవాహ కృష్ణం
సగద్గదం భీతభీతః ప్రణమ్య 35

సంజయుడు పలికెను.

ప్ర.అ.ఏతదితి:- కేశవస్య=శ్రీకృష్ణునియొక్క,ఏతత్=ఈ,వచనమ్=వచనమును, శ్రుత్వా=విని,కిరీటీ=అర్జునుడు,వేపమానః=వణకిపోవుచున్నవాడై,కృతాఞ్జలిః=చేయబడిన దోసిలి కలవాడై,నమస్కృత్వా=నమస్కరించి భీతభీతః=చాలా భయపడుచు,ప్రణమ్య=బాగా వంగి,సగద్గదమ్=గద్గదస్వరముతో కూడినట్లుగా,కృష్ణమ్=కృష్ణుని గూర్చి,భూయః ఏవ= మరల,ఆహ=పలికెను.

భాష్యమ్

ఏతచ్ఛ్రుత్వేతి:- ఏతత్ శ్రుత్వా వచనం కేశవస్య పూర్వోక్తం కృతాఞ్జలిః సన్, వేపమానః కిరీటీ,నమస్కృత్వా,భూయః పునః ఏవ,ఆహ ఉక్తవాన్, కృష్ణం సగద్గదం, భయావిష్టస్య దుఃఖాభిఘాతాత్,స్నేహావిష్టస్య చ హర్షోద్భవాత్,అశ్రుపూర్ణనేత్రత్వే సతి శ్లేష్మణా కణ్ఠావరోధః తతః చ వాచః అపాటవం మన్దశబ్దత్వం యత్ సః గద్గదః;తేన సహ వర్తతే ఇతి సగద్గదం వచనమ్ ఆహేతి వచనక్రియావిశేషణమ్ ఏతత్.భీతభీతః పునః పునః భయావిష్టచేతాః సన్ ప్రణమ్య ప్రహ్వః భూత్వా ఆహ ఇతి వ్యవహితేన సంబన్ధః.అత్రావసరే సంజయవచనం సాభిప్రాయమ్.కథమ్?ద్రోణాదిషు అర్జునేన నిహతేషు అజేయేషు చతుర్షు నిరాశ్రయః దుర్యోధనః నిహతః ఏవేతి మత్వా ధృతరాష్ట్రః జయం ప్రతి నిరాశః సన్ సంధిం కరిష్యతి,తతః శాన్తిః ఉభయేషాం భవిష్యతి ఇతి.యదపి న అశ్రౌషీత్ ధృతరాష్ట్రః భవితవ్యవశాత్. 35

బాలానందిని

ఏతదితి:- కేశవుడు వెనుక పలికిన మాటలు విని అర్జునుడు అంజలి ఘటించి. వణకుచు నమస్కరించి కృష్ణుని గూర్చి మరల గద్గదస్వరముతో కూడునట్లుగా ఇట్లన్నాడు. భయం ఆవహించినవానికి దుఃఖముయొక్క దెబ్బవలన, స్నేహభావంతో నిండినవానికి సంతోషం కలగడంవలన,కళ్లు కన్నీటితో నిండగా కంఠం శ్లేష్మంచేత అడ్డుకొనబడుతుంది.

తరువాత మాట సరిగా పటువుగా ఉండదు. కంఠస్వరం కూడ మందంగా ఉంటుంది. ఇది 'గద్గదం'. దీనితో కూడునట్లుగా వచనం పలికాడు అని ఇది వచనక్రియకు విశేషణం. మాటి మాటికి భయావిష్టమైన మనస్సు కలవాడై బాగా వంగి పలికెను అని వ్యవహిత మైన పదంతో సంబంధం. ఈ సందర్భంలో సంజయుని వాక్యం సాభిప్రాయ మైనది. ఎట్లు? జయింప శక్యం కాని ద్రోణాదులను నలుగురినీ అర్జునుడు వధించిన పిమ్మట ఆశ్రయరహితు డైన దుర్యోధనుడు వధింపబడడం తప్పక జరుగుతుంది అని తెలిసికొని ధృతరాష్ట్రుడు జయం విషయంలో నిరాశుడై సంధి చేసుకొంటాడు. అప్పుడు ఉభయులకు శాంతి కలుగుతుంది. జరగవలసినది మరొక విధంగా ఉండడంవల్ల ధృతరాష్ట్రుడు ఇది కూడ వినలేదు. 35

అర్జున ఉవాచ-

మూ. స్థానే హృషీకేశ తవ ప్రకీర్త్యా
జగత్ప్రహృష్యత్యనురజ్యతే చ,
రక్షాంసి భీతాని దిశో ద్రవన్తి
సర్వే నమస్యన్తి చ సిద్ధసంఘాః. 36

అర్జునుడు పలికెను.

ప్ర.అ. స్థానే ఇతి:- హృషీకేశ=కృష్ణా! తవ=నీయొక్క ప్రకీర్త్యా=కీర్తిచేత, జగత్=జగత్తు, ప్రహృష్యతి=సంతోషిస్తున్నది; అనురజ్యతే చ=అనురాగమును కూడ పొందుచున్నది. స్థానే= ఇది యుక్తమే. రక్షాంసి=రక్షస్సులు, భీతాని=భయపడినవారై, దిశః=దిక్కులను గూర్చి, ద్రవన్తి= పరిగెత్తుచున్నారు. సర్వే=సమస్తమైన, సిద్ధసంఘాః చ=సిద్ధుల సముదాయములు గూడ, నమస్యన్తి=నమస్కరించుచున్నారు.

భాష్యమ్

స్థానే ఇతి:- స్థానే యుక్తమ్. కిం తత్? తవ ప్రకీర్త్యా త్వన్మాహాత్మ్యకీర్తనేన శ్రుతేన, హే! హృషీకేశ! యత్ జగత్ ప్రహృష్యతి, ప్రహర్షమ్ ఉపైతి, తత్, స్థానే యుక్తమ్ ఇత్యర్థః. అథవా విషయవిశేషణం స్థానే ఇతి. యుక్తః హర్షాదివిషయః భగవాన్; యతః ఈశ్వరః సర్వాత్మా సర్వభూతసుహృత్ చ ఇతి. తథా అనురజ్యతే అనురాగం చ ఉపైతి, తచ్చ విషయే ఇతి వ్యాఖ్యేయమ్. కిం చ రక్షాంసి, భీతాని భయావిష్టాని దిశః ద్రవన్తి గచ్ఛన్తి, తచ్చ స్థానే విషయే. సర్వే నమస్యన్తి నమస్కుర్వన్తి చ సిద్ధసంఘాః సిద్ధానాం సముదాయాః కపిలాదీనాం తచ్చ స్థానే. 36

బాలానందిని

స్థాన ఇతి:- శ్రీకృష్ణా! వినబడిన నీ మాహాత్మ్యసంకీర్తనంచేత,(నీ మాహాత్మ్యాన్ని కీర్తిస్తున్నప్పుడు వినడంచేత)జగత్తు సంతోషం పొందుతున్నది అనేది యుక్తమే.లేదా 'స్థానే'అనేది విషయానికి విశేషణం.అనగా ఆనందానికి విషయమైన పరమేశ్వరునకు విశేషణం.అనగా నువ్వు హర్షానికి విషయంగా ఉండడం యుక్తం.ఈశ్వరుడు సర్వాత్మ. సర్వసుహృత్ గాన పరమాత్మ ఆనందానికి విషయం అవడం యుక్తమే.మొదటి అర్థంలో ఆనందించడం యుక్తం అని,రెండవ అర్థంలో భగవంతుడు ఆనందవిషయం అవడం యుక్తం అనీ భావం.అనురాగమును కూడ పొందుచున్నవి.పరమేశ్వరుడు అనురాగానికి విషయం అవడం యుక్తం అని భావం.రాక్షసులు భయపడి దిక్కులను గూర్చి పారిపోవు చున్నారు. నువ్వు భయకారణం అవడం యుక్తం అని భావం.కపిలాదిసిద్ధసంఘాలు నమస్కరిస్తున్నాయి.అందుకు నువ్వు విషయం అవడం యుక్తమే అని అర్థం. 36

భాష్యమ్

భగవతః హర్షాదివిషయత్వే హేతుం దర్శయతి-

మూ. కస్మాచ్చ తే న నమేరన్ మహాత్మన్
గరీయసే బ్రహ్మణోఽప్యాదికర్త్రే,
అనన్త దేవేశ జగన్నివాస
త్వమక్షరం సదసత్తత్పరం యత్. 37

బాలానందిని

భగవతః ఇతి:- భగవంతుడు హర్షాదులకు విషయం అవడంలో హేతువును చూపుచున్నాడు -

ప్ర.అ. కస్మాదితి:- మహాత్మన్= మహాత్మా,గరీయసే=గొప్పవాడవు,బ్రహ్మణః అపి = హిరణ్యగర్భునికి కూడ,ఆదికర్త్రే=మొదటి కర్తవు అయిన,తే=నీకు,కస్మాత్=ఎందువలన, న=నమేరన్=నమస్కరించరు?అనన్త=అంతం లేనివాడా!దేవేశ = దేవతలకు ఈశుడా! జగన్ని వాస=జగత్తుకు నివాస మైనవాడా!త్వమ్=నీవు,యత్=ఏది,సత్=సత్తో,అసత్=అసత్తో, పరమ్=ఆ సదసత్తులకంటె పరమో,తత్=అట్టి,అక్షరమ్=అక్షరము(నాశరహితస్వరూపము).

భాష్యమ్

కస్మాచ్చ హేతోః,తే తుభ్యం న నమేరన్ న నమస్కుర్యుః మహాత్మన్! గరీయసే గురుతరాయ,బ్రహ్మణః హిరణ్యగర్భస్యాపి,ఆదికర్తా కారణమ్,తస్మాత్ ఆదికర్త్రే,కథమ్

ఏతే న నమస్కుర్యుః. అతః హర్షాదీనాం నమస్కారస్య చ స్థానం త్వమ్ అర్హః విషయః ఇత్యర్థః. హే అనన్త! దేవేశ! జగన్నివాస! త్వమ్ అక్షరం తత్ పరం యత్ వేదాన్తేషు శ్రూయతే. కిం తత్? సత్=విద్యమానమ్. అసచ్చ యత్ నాస్తి ఇతి బుద్ధిః తే ఉపధానభూతే (ఉపాధిభూతే) సదసతీ యస్య అక్షరస్య, యద్ద్వారేణ సత్ అసత్ ఇతి ఉపచర్యతే. పరమార్థతః తు సదసతః పరం తత్ యత్ అక్షరం వేదవిదః విదన్తి తత్ త్వమేవ న అన్యత్ ఇత్యభి ప్రాయః.

37

బాలానందిని

కస్మాదితి:- మహాత్మా! చాల గొప్పవాడవు. హిరణ్యగర్భునికి కూడ కారణ మైన వాడవు అయిన నీకు వీళ్లు ఎందుకు నమస్కరించరు? అందువలన నువ్వు హర్షాదులకు, నమస్కారానికి తగిన విషయము అని అర్థం. ఓ! అనంతా! దేవేశా జగన్నివాసా వేదాంతాలలో ఏది వినబడుచున్నదో అట్టి పరమైన అక్షరము. అది ఏది? ఉన్నది సత్; దేని విషయంలో లేదు అను బుద్ధి కలుగుతుందో అది అసత్. ఏ అక్షరానికి సదసత్తులు ఉపాధులో వేటి ద్వారా (వేటిని)పట్టి సత్ అనీ అసత్ అనీ ఏది ఉపచరించబడుచున్నదో (ఔపచారికంగా చెప్పబడుచున్నదో), ఏది వాస్తవంలో సదసత్తులకంటె పర మైనదో ఆ అక్షరం నువ్వే, మరొకటి (అక్షరంకంటె భిన్నుడవు)కాదు అని అభిప్రాయం.

వి:- వర్తమానకాలంతో సంబంధించిన జగత్తు సత్, భూత-భవిష్యజ్జగత్ అసత్. లేదా స్థూలావస్థమైన కార్యం సత్. సూక్ష్మావస్థ గల కారణం అసత్. ఈ రెండూ నీవే, వీటికి అతీత మైన అక్షరం నీవే అని భావం. 37

భాష్యమ్

పునరపి స్తౌతి:-

మూ. త్వమాదిదేవః పురుషః పురాణ

స్త్వమస్య విశ్వస్య పరం నిధానమ్,

వేత్తాసి వేద్యం చ పరం చ ధామ

త్వయా తతం విశ్వమనన్తరూప. 38

బాలానందిని

పునరపీతి:- మళ్లీ స్తుతిస్తున్నాడు-

త్వమితి:- త్వమ్=నీవు,ఆదిదేవః=మొట్టమొదటి దేవుడవు,పురాణః పురుషః=ప్రాచీనుడ వైన పురుషుడవు,త్వమ్=నీవు,అస్య=ఈ,విశ్వస్య=ప్రపంచముయొక్క,పరమ్=ఉత్కృష్టమైన,నిధానమ్=స్థానము. హే!అనన్తరూప=అనంతములైన రూపాలు కలవాడా! వేత్తా=తెలుసుకొనే,వేద్యమ్=తెలుసుకొనబడే,పరమ్=ఉత్తమమైన=ధామ చ=స్థానమూ కూడ,అసి=అయి ఉన్నావు.విశ్వమ్ ప్రపంచము,త్వయా=నీచేత,తతమ్=వ్యాప్త మైనది.

భాష్యమ్

త్వమ్ ఆదిదేవః,జగతః స్రష్టృత్వాత్,పురుషః పురి శయనాత్.పురాతనః చిరంతనః త్వమేవ అస్య విశ్వస్య పరం ప్రకృష్టం,నిధానమ్ నిధీయతే అస్మిన్ జగత్ సర్వం మహాప్రలయాదౌ ఇతి. కిం చ వేత్తా అసి;వేదితా అసి,సర్వస్యైవ వేద్యజాతస్య యచ్చ వేద్యం వేదనార్హం తచ్చ అసి.పరం చ ధామ పరమం పదం వైష్ణవమ్.త్వయా తతం వ్యాప్తం విశ్వం సమస్తమ్,అనన్తరూప-అన్తః న విద్యతే తవ రూపాణామ్. 38

బాలానందిని

త్వమితి:- నువ్వు జగత్తును సృష్టించినవాడవు గాన ఆదిదేవుడవు.శరీరంలో ఉండడం చేత పురుషుడవు.అతి ప్రాచీనుడవు.ఈ ప్రపంచానికి ఉత్కృష్ట మైన నిధానం,ప్రలయ కాలంలో ఈ జగత్తంతా ఎవనియందు ఉంచబడుతుందో అతడు నిధానం నువ్వు.మరియు తెలియదగిన ప్రతీదానినీ తెలుసుకొనేవాడవు నువ్వు.తెలియదగినది కూడ నువ్వే.అత్యుత్తమ మైన పరమపదము.వైష్ణవస్థానం నువ్వే.సమస్తమైన ప్రపంచము నీచేత వ్యాపింప బడినది.నీ రూపాలకు అంతం లేదు. 38

భాష్యమ్

కిం చ-

మూ. వాయుర్యమోఽ గ్నిర్వరుణః శశాఙ్కః
ప్రజాపతిస్త్వం ప్రపితామహశ్చ,
నమో నమస్తేఽస్తు సహస్రకృత్వః
పునశ్చ భూయోఽపి నమో నమస్తే. **39**

బాలానందిని

కిం చేతి:-మరియు-

ప్ర.అ. వాయురితి:- త్వత్=నీవు,వాయుః=వాయువు,యమః=యముడవు, అగ్నిః=అగ్నివి,వరుణః=వరుణడవు,శశాఙ్కః=చంద్రుడవు,ప్రజాపతిః=ప్రజాపతివి,ప్రపితామహః

=పితామహునకు కూడ తండ్రివి. తే=నీకు,సహస్రకృత్వః=వెయ్యి పర్యాయాలు, నమః నమః అస్తు=నమస్కార మగుగాక,నమస్కార మగుగాక. పునః చ=మరల,తే=నీకు,నమః=నమస్కారము;భూయః అపి=మరల,నమః=నమస్కారము.

భాష్యమ్

వాయుః త్వం యమశ్చ అగ్నిః,వరుణః అపాంపతిః,శశాఙ్కః చన్ద్రమాః, ప్రజాపతిః త్వం కశ్యపాదిః,ప్రపితామహః చ పితామహస్యాపి పితా ప్రపితామహః, బ్రహ్మణః అపి పితా ఇత్యర్థః.నమః నమః, తే తుభ్యమ్ అస్తు సహస్రకృత్వః,పునః చ భూయః అపి నమః నమః తే. బహుశః నమస్కారక్రియాభ్యాసావృత్తిగణనం కృత్వసుచా ఉచ్యతే, పునశ్చ భూయోஉపీతి శ్రద్ధాభక్త్యతిశయాత్ అపరితోషమ్ ఆత్మనః దర్శయతి. 39

బాలానందిని

వాయురితి:-నువ్వు వాయువు,యముడవు,అగ్నివి,జలప్రభు వైన వరుణుడవు, చంద్రుడవు. కశ్యపాదిప్రజాపతివి. పితామహునకు కూడ తండ్రివి, బ్రహ్మదేవునకు కూడ తండ్రివి అని అర్థం. నీకు వేయి పర్యాయాలు నమస్కారం అగుగాక. మళ్ళీ మళ్ళీ నమస్కారం నమస్కారం. 'సహస్రకృత్వః'అని 'కృత్వసుచ్'ప్రత్యయంచేత మాటి మాటికి నమస్కారం చేయడంయొక్క అవృత్తిని లెక్కపెట్టడం బోధించబడుతుంది. 'పునః చ'"భూయః అపి"అని శ్రద్ధాభక్తులఅతిశయంవల్ల తనకు తృప్తి లేకపోవడాన్ని సూచిస్తున్నది. 39

భాష్యమ్

తథా-

మూ. నమః పురస్తాదథ పృష్ఠతస్తే
నమోஉస్తు తే సర్వత ఏవ సర్వ,
అనన్తవీర్యామితవిక్రమస్త్వం
సర్వం సమాప్నోషి తతోஉసి సర్వః. 40

బాలానందిని

తథేతి:- అట్లే,(ఇంకా)-

ప్ర.అ. నమః ఇతి:- సర్వ=సర్వస్వరూపుడా!పురస్తాత్=తూర్పుదిక్కునందున్న, తే=నీకు,నమః=నమస్కారము. అథ=మరియు,పృష్ఠతః=వెనుకప్రక్క(పశ్చిమాన)ఉన్ననీకు నమస్కారము. సర్వతఃఏవ=అన్ని దిక్కులందుఉన్న,తే=నీకు,నమః అస్తు=నమస్కారం

అగుగాక. అనన్తవీర్యామితవిక్రమః=అనంతమైన వీర్యము అపరిమిత మైన పరాక్ర మమూగల, త్వమ్=నీవు,సర్వమ్=సమస్తమును,సమాప్నోషి=వ్యాపించి ఉన్నావు. తతః= అందువలన,సర్వః =సర్వస్వరూపుడవు అసి=అయి ఉన్నావు.

భాష్యమ్

నమః పురస్తాత్ పూర్వస్యాం దిశి,తుభ్యమ్ అథ పృష్ఠతః తే పృష్ఠతః అపి చ తే. నమః అస్తు. సర్వతః ఏవ సర్వాసు దిక్షు సర్వత్ర స్థితాయ, హే సర్వ! అనన్తవీర్యామిత విక్రమః—అనన్తం వీర్యమ్ అస్య అమితః విక్రమః అస్య,వీర్యం సామర్థ్యమ్,విక్రమః పరాక్రమః.వీర్యవానపి కశ్చిత్ శస్త్రాదివిషయే న పరాక్రమతే,మన్దపరాక్రమో వా. త్వం తు అనన్తవీర్యః అమితవిక్రమః చ ఇతి అనన్తవీర్యామితవిక్రమః.సర్వం సమస్తం జగత్ సమాప్నోషి సమ్యక్ ఏకేన ఆత్మనా వ్యాప్నోషి తతః తస్మాత్ అసి భవసి సర్వః. త్వయా వినాభూతం న కించిదస్తీత్యర్థః. 40

బాలానందిని

నమ ఇతి:- పూర్వదిశయం దున్న నీకు నమస్కారము.మరియు వెనుక ఉన్న నీకు నమస్కారము. అంతటా ఉన్నవాడా!సమస్తదిక్కులయందు ఉన్న నీకు నమస్కారము. అనంతమైన వీర్యము,అపరిమితమైన పరాక్రమమూ గల నీవు-వీర్యం అనగా సామర్థ్యం. విక్రమ మనగా పరాక్రమం.ఒకడు వీర్యవంతు డైనా కూడ శస్త్రాదుల విషయంలో పరాక్రమం చూపజాలడు, లేదా మంద మైన పరాక్రమం గలవాడుగా ఉంటాడు.నువ్వైతే అనంత వీర్యుడవు. అమితవిక్రముడవు.సమస్తమైన జగత్తును వ్యాపించి ఉన్నావు.ఒకే ఆత్మ స్వరూపంతో వ్యాపించి ఉన్నావు.అందువలన నువ్వు సర్వస్వరూపుడవుగా ఉన్నావు.నువ్వు లేని భూత మేదీ కూడ లేదు అని అర్థం. 40

భాష్యమ్

యతః అహం త్వన్మాహాత్మ్యాపరిజ్ఞానాపరాధీ అతః-

మూ. సఖేతి మత్వా ప్రసభం యదుక్తం
హే కృష్ణ హే యాదవ హే సఖేతి,
అజానతా మహిమానం తవేదం
మయాప్ర మాదాత్ప్రణయేన వాపి. 41

బాలానందిని

యతః ఇతి:– నేను నీ మాహాత్మ్యాన్ని తెలుసుకొనకపోవడం అనే అపరాధం చేసి ఉన్నాను గాన–

ప్ర.అ. సఖేతి:– సఖా ఇతి=స్నేహితుడవు అని,మత్వా=తలచి,ప్రసభమ్=తొందరపాటుతో, హే!కృష్ణ=ఓ!కృష్ణా! హే!యాదవ=ఓ!యాదవా! హే!సఖే! ఇతి=ఓ! స్నేహితుడా అని. యత్ ఉక్తమ్=ఏది పలకబడినదో,ఇదమ్=ఈవిశ్వరూపమును, తవ=నీయొక్కమహిమానమ్ =మహిమనుగా,అజానతా=ఎరుగని,మయా=నాచేత,ప్రమాదాత్=పొరబాటువలన గాని, ప్రణయేన వాపి=ప్రణయంచేత గాని(ఈ ఉత్తరార్ధానికి'ఉక్తమ్'అనువెనుక నున్నదానితో గాని 'అసత్కృతః అసి'అని రాబోయేదానితో కాని అన్వయం)–

భాష్యమ్

సఖా సమానవయాః ఇతి మత్వా జ్ఞాత్వా విపరీతబుద్ధ్యా,ప్రసభమ్ అభిభూయ, యత్ ఉక్తం హే కృష్ణ హే యాదవ హే సఖేతి చ అజానతా అజ్ఞానినా,మూఢేన,కిమ్ అజానతా ఇత్యాహ–మహిమానం మాహాత్మ్యం తవ ఇదమ్ ఈశ్వరస్య విశ్వరూపం,తవ ఇదం మహిమానమ్ అజానతా ఇతి వైయధికరణ్యేన సంబన్ధః. తవేమమితి పాఠో యద్యస్తి తదా సామానాధికరణ్యమేవ.మయా ప్రమాదాత్ విక్షిప్తచిత్తతయాప్రణయేన వా అపి–ప్రణయః నామ స్నేహనిమిత్తః విశ్రమ్భః;తేనాపి కారణేన యత్ ఉక్తవానస్మి. 41

బాలానందిని

సఖా ఇతి:– సమానమైన వయస్సు కలవాడవు కదా అనుకొని,విపరీతబుద్ధితో, తిరస్కరించి ఓ!కృష్ణా!యాదవా!మిత్రమా!అని ఏది పలకబడినదో,అజ్ఞాని నైన,మూఢుడ నైన(నాచేత) ఏది తెలియనివాడో చెప్పుచున్నాడు–ఇది అనగా ఈ విశ్వరూపం నీ మహిమ అని తెలియని అని వైయధికరణ్యంతో అన్వయం.'తవేమమ్'అను పాఠం ఉంటే సామానాధికరణ్యంచేతనే అన్వయం.నాచేత,చిత్తవిక్షేపంచేత గాని,ప్రణయంచేత గాని,ప్రణయం అనగా స్నేహంవల్ల కలిగిన నమ్మకం,దానిచేత ఏది పలికానో–

వి.:–'మహిమానమ్'అనేది పుంలింగంలో ఉన్నది.'ఇదమ్'.నపుసకలింగం. అందుచేత 'ఇదమ్'అనేదానిని మహిమానమ్ అనే దానికి విశేషణంగా చేసి 'ఈ మహిమను'అని సామానాధికరణ్యంచేత అన్వయం కుదరదు.అందుచేత "దీనిని అనగా ఈ విశ్వరూపాన్ని నీ మహిమనుగా"అని వైయధికరణ్యంతో(విశేషణవిశేష్యభావం లేకుండా)అన్వయించుకోవాలి. 'ఇదమ్'కు బదులు 'ఇమమ్'అను పాఠం ఉంటే సామానాధికరణ్యంతో అన్వయించెప్పుకొనవచ్చును.

మూ. యచ్చావహాసార్థమసత్కృతోఽసి
విహారశయ్యాసనభోజనేషు,
ఏకోఽథవాప్యచ్యుత తత్సమక్షం
తత్ క్షామయే త్వామహమప్రమేయమ్. 42

ప్ర.అ. యచ్చేతి: - అచ్యుత=కృష్ణా! ఏకః=ఒక్కడవుగా ఉన్నప్పుడు గాని, అథవా=లేక, తత్=ఆ విధంగా, సమక్షమ్=ప్రత్యక్షంగా గాని, విహారశయ్యాసనభోజనేషు=విహార-శయ్యా-ఆసన-భోజనాలయందు, అవహాసార్థమ్=పరిహాసంకొరకు. యత్ చ అసత్కృతః అసి= తిరస్కరింపబడ్డావు అనేది ఏది కలదో, తత్=దానిని, అహమ్=నేను, అప్రమేయమ్=అప్రమేయుడ వైన, త్వామ్=నిన్ను, క్షామయే=క్షమింపచేసుకొనుచున్నాను.

భాష్యమ్

యచ్చ అవహాసార్థం పరిహాసప్రయోజనాయ, అసత్కృతః పరిభూతః, అసి భవసి, క్వ? విహారశయ్యాసనభోజనేషు-విహరణం విహారః, పాదవ్యాయామః. శయనం శయ్యా, ఆసనమ్ ఆస్థాయికా, భోజనమ్ అదనమ్, ఇత్యేతేషు విహారశయ్యాసనభోజనేషు, ఏకః పరోక్షః సన్, అసత్కృతః అసి పరిభూతః అసి, అథవాపి హే అచ్యుత! తత్ సమక్షమ్, తచ్ఛబ్దః క్రియావిశేషణార్థః ప్రత్యక్షం వా అసత్కృతః అసి, తత్ సర్వమ్ అపరాధజాతం, క్షామయే క్షమాం కారయే, త్వామ్, అహమ్, అప్రమేయం ప్రమాణాతీతమ్. 42

బాలానందిని

యచ్చేతి: -పరిహాసంకొరకు తిరస్కరింపబడినావు అనేది ఏది కలదో-వేటియందు? విహారశయ్యాసనభోజనాలయందు. విహారం అనగా విహరణం; నడవడం. శయ్య అనగా శయినించడం. ఆసనం అనగా కూర్చొనడం. భోజనం అనగా తినడం. వీటియందు ఒంటరిగా ఉన్నప్పుడు అనగా పరోక్షంలో ఉండగా, తిరస్కరింపబడినావో, లేదా, ఓ! అచ్యుతా! 'తత్'అను పదం క్రియావిశేషణంగా ప్రయోగింపబడినది(ఆ విధంగా అని అర్థం). ప్రత్యక్షంగా తిరస్కరింపబడినావో, ఆ అపరాధసముదాయా న్నంత నీ ప్రమాణములకు అతీతుడ వైన నిన్ను, నేను, క్షమింపచేసికొనుచున్నాను. 42

భాష్యమ్

యతః త్వమ్-

మూ. పితాసి లోకస్య చరాచరస్య
త్వమస్య పూజ్యశ్చ గురుర్గరీయాన్,
న త్వత్సమోఽస్త్యభ్యధికః కుతోఽన్యో
లోకత్రయేఽ ప్యప్రతిమప్రభావ. 43

బాలానందిని

యతః ఇతి:-ఎందువలన నీవు-

ప్ర.అ. పితేతి:-అప్రతిమప్రభావ=సాటి లేని ప్రభావం కలవాడా!త్వమ్=నీవు, అస్య=ఈ,చరాచరస్య=చరాచరాత్మకమైన,లోకస్య=లోకముయొక్క పితా=తండ్రిని,అసి=అయి ఉన్నావు. గరీయాన్=చాల గొప్పవాడైన,గురుః=గురువుగా,పూజ్యః చ=పూజించతగిన వాడవుగా ఉన్నావు. లోకత్రయేఽ పి=మూడు లోకాలలోను కూడ,త్వత్సమః=నీతో సమానుడు, న=లేదు,అధికః=అధికుడైన,అన్యః=మరి యొకడు,కుతః=ఎక్కడినుండి వస్తాడు?

భాష్యమ్

పితా అసి జనయితా అసి,లోకస్య ప్రాణిజాతస్య,చరాచరస్య స్థావరజఙ్గమస్య. న కేవలం త్వమ్ అస్య జగతః పితా,పూజ్యః చ పూజార్హః; యతః గురుః గరీయాన్. గురుతరః కస్మా ద్గురుస్త్వమ్ ఇత్యాహ-న చ త్వత్సమః త్వత్తుల్యః అన్యః అస్తి.న హి ఈశ్వరద్వయం సంభవతి,అనేకేశ్వరత్వే వ్యవహారానుపపత్తేః.త్వత్సమః ఏవ తావత్ అన్యః న సంభవతి; కుతః ఏవ అన్యః అభ్యధికః స్యాత్?లోకత్రయేఽ పి అప్రతిమప్రభావ-ప్రతిమీయతే మయా సా ప్రతిమా; న విద్యతే ప్రతిమా యస్య తవ ప్రభావస్య సః త్వమ్ అప్రతిమ ప్రభావః. హే! అప్రతిమప్రభావ;నిరతిశయప్రభావ ఇత్యర్థః. 43

బాలానందిని

పితా ఇతి:-స్థావరజంగమరూప మైన ప్రాణిసముదాయానికి నీవు తండ్రివి. పుట్టించినవాడవు. నువ్వు జగత్తుకు కేవలం తండ్రివే కాదు;పూజింపదగినవాడవు కూడ. ఎందువల్ల ననగా-నీవు చాల గొప్పవాడవైన గురువు. నువ్వు ఎందుకు గురుతరుడ వనగా-చెప్పుచున్నాడు-నీతో సమానుడు లేడు. ఇద్దరు ఈశ్వరు లుండడం కుదరదు కదా;అనేకేశ్వరు లున్నట్లయితే లోకవ్యవహారం నడవదు,నీతో సమానుడే లేనప్పుడు నీకంటె అధికుడు మరొక డెలా ఉంటాడు?మూడు లోకాలలోను కూడ అప్రతిమప్రభావా;దేనిని ఎదురుగా ఉంచి కొలవబడుతుందో,తూచబడుతుందో అది ప్రతిమ. ఏ నీ ప్రభావానికి ప్రతిమ లేదో అట్టివాడవు. ఓ!అప్రతిమప్రభావా,నీ ప్రభావాన్ని మించిన మరొక ప్రభావం లేదు,అట్టివాడా!

భాష్యమ్

యతః ఏవమ్-

మూ. తస్మాత్ప్రణమ్య ప్రణిధాయ కాయం
ప్రసాదయే త్వామహమీశమీడ్యమ్,
పితేవ పుత్రస్య సఖేవ సఖ్యుః
ప్రియః ప్రియాయార్హసి దేవ సోఢుమ్. 44

బాలానందిని

యత ఇతి:- ఇది ఇట్లు గాన-

ప్ర. అ. **తస్మాదితి**:-తస్మాత్=ఆ కారణంవల్ల,ప్రణమ్య=నమస్కరించి,కాయమ్=శరీరమును,ప్రణిధాయ=బాగా వంచి,అహమ్=నేను, ఈశమ్=ప్రభువు, ఈడ్యమ్=స్తుతింప దగినవాడవూ అయిన,త్వామ్=నిన్ను,ప్రసాదయే=అనుగ్రహింపచేసుకొనుచున్నాను. పుత్రస్య =పుత్రుని అపరాధమును,పితేవ=తండ్రి వలె,సఖ్యుః=మిత్రుని అపరాధమును,సఖేవ= మిత్రుడు వలె,ప్రియాయాః=ప్రియురాలి అపరాధమును,ప్రియః=ప్రియుడు వలె,దేవ=ఓ! దేవా!సోఢుమ్=నా అపరాధమును సహించుటకు,అర్హసి=తగి ఉన్నావు.

భాష్యమ్

తస్మాత్,ప్రణమ్య నమస్కృత్య,ప్రణిధాయ ప్రకర్షేణ నీచైః ధృత్వా,కాయం శరీరమ్, ప్రసాదయే ప్రసాదం కారయే,త్వామ్,అహమ్, ఈశితారం, ఈడ్యం స్తుత్యమ్; త్వం పునః పుత్రస్య అపరాధే పితా యథా క్షమతే సర్వం,సఖేవ చ సఖ్యుః అపరాధం, యథా వా ప్రియః ప్రియాయాః అపరాధం క్షమతే ఏవమ్ అర్హసి, హే!దేవ!సోఢుం ప్రసహితుం, క్షన్తుమ్ ఇత్యర్థః. 44

బాలానందిని

తస్మాదితి:-అందువలన నమస్కరించి శరీరం బాగా క్రిందికి వంచి నేను ప్రభువు స్తుతింప తగినవాడవు అయిన నిన్ను అనుగ్రహింపచేసుకొనుచున్నాను. నీ వైతే పుత్రుని అపరాధాన్ని అంతనీ తండ్రి ఏ విధంగా క్షమిస్తాడో,మిత్రుడు మిత్రుని అపరాధాన్ని ఎలా క్షమిస్తాడో,ప్రియుడు ప్రియురాలి అపరాధాన్ని ఎలా క్షమిస్తాడో ఆ విధంగా,ఓ దేవా! సహించుటకు,క్షమించుటకు తగి ఉన్నావు. 44

మూ. అదృష్టపూర్వం హృషితో உస్మి దృష్ట్వా
భయేన చ ప్రవ్యథితం మనో మే,
తదేవ మే దర్శయ దేవ రూపం
ప్రసీద దేవేశ జగన్నివాస. 45

ప్ర.అ. అదృష్టేతి:- అదృష్టపూర్వమ్=పూర్వం ఎన్నడూ చూడబడని రూపాన్ని,దృష్ట్వా =చూచి,హృషితః అస్మి= సంతోషింపచేయబడ్డాను. మే మనః=నా మనస్సు,భయేన=భయం చేత,ప్రవ్యథితం చ=వ్యథచెందినది కూడ. దేవ=దేవా!దేవేశ=దేవతల నియామకుడా! జగన్నివాస=జగత్తుకు నివాస మైనవాడా!తత్=ఆ,రూపమేవ=రూపమునే,మే=నాకు, దర్శయ=చూపుము;ప్రసీద=అనుగ్రహించుము.

భాష్యమ్

అదృష్టపూర్వమితి:- అదృష్టపూర్వం న కదాదపి దృష్టపూర్వమ్ ఇదం విశ్వ రూపం తవ మయా అన్యైర్వా తదహం దృష్ట్వా,హృషితః అస్మి.భయేన చ ప్రవ్యథితం మనః మే,అతః తదేవ మే మమ,దర్శయ,హే దేవ!రూపం యత్ మత్సఖమ్;ప్రసీద దేవేశ,జగన్నివాస-జగతః నివాసః జగన్నివాసః,హే జగన్నివాస. 45

బాలానందిని

అదృష్టపూర్వమితి:- పూర్వం ఎన్నడూ నాచేత గాని,ఇతరులచేత గాని నీ ఈ విశ్వరూపం చూడబడలేదు.అట్టి విశ్వరూపాన్ని చూచి సంతోషించాను(గగుర్పాటు చెందాను). నా మనస్సు భయంచేత వ్యథ చెందినది.అందువల్ల. ఓ!దేవా!జగత్తునకు నివాస మైనవాడా! నాకు మిత్రుడుగా ఉన్న ఏ రూప మున్నదో దానిని చూపుము. అనుగ్రహించుము. 45

మూ. కిరీటినం గదినం చక్రహస్త
మిచ్ఛామి త్వాం ద్రష్టుమహం తథైవ,
తేనైవ రూపేణ చతుర్భుజేన
సహస్రబాహో భవ విశ్వమూర్తే. 46

ప్ర.అ. కిరీటినమితి:- తథైవ=వెనుకటి వలెనే,కిరీటినమ్=కిరీటం గలవాడవు, గదినమ్=గదకలవాడవు,చక్రహస్తమ్=చక్రం హస్తమునందు కలవాడవు అయిన,త్వామ్ =నిన్ను,ద్రష్టుమ్=చూచుటకు,అహమ్=నేను,ఇచ్ఛామి=కోరుచున్నాను.సహస్రబాహో=వేల కొలది బాహువులు కలవాడా!విశ్వమూర్తే=జగత్స్వరూపా!చతుర్భుజేన=నాలుగు భుజాలు గల,తేన=ఆ,రూపేణైవ=రూపంతోనే,భవ=ఉండుము.

భాష్యమ్

కిరీటినమితి:-కిరీటినం కిరీటవన్తం,తథా,గదినం గదావన్తం,చక్రహస్తమ్ ఇచ్ఛామి త్వాం ప్రార్థయే త్వాం ద్రష్టుమ్ అహం,తథైవ పూర్వవత్ ఇత్యర్థః.యతః ఏవం తస్మాత్,తేనైవ రూపేణ వసుదేవపుత్రరూపేణ,చతుర్భుజేన,సహస్రబాహో వార్తమానికేన విశ్వరూపేణ,భవ,విశ్వమూర్తే! ఉపసంహృత్య విశ్వరూపం తేనైవ రూపేణ వసుదేవపుత్రరూపేణ భవ ఇత్యర్థః. 46

బాలానందిని

కిరీటినమితి:-నేను నిన్ను ప్రార్థిస్తున్నాను-కిరీటము గలవాడవు,గద గలవాడవు, చక్రం హస్తమునందు కలవాడవు అయిన నిన్ను వెనుకటి వలెనే చూడా లని కోరుచున్నాను. అందువల్ల ప్రస్తుతం ఉన్న విశ్వరూపంతో సహస్రబాహువులు కలవాడా!నాలుగు భుజాలు గల అదే వసుదేవపుత్రరూపంతో ఉండుము. ఓ!విశ్వమూర్తీ!విశ్వరూపాన్ని ఉపసంహరించి ఆ వసుదేవపుత్రరూపంతోనే ఉండుము అని అర్థం. 46

భాష్యమ్

అర్జునం భీతమ్ ఉపలభ్య ఉపసంహృత్య విశ్వరూపం ప్రియవచనేన ఆశ్వాసయన్-

శ్రీభగవానువాచ-

మూ. మయా ప్రసన్నేన తవార్జునేదం
రూపం పరం దర్శితమాత్మయోగాత్,
తేజోమయం విశ్వమనన్తమాద్యం
యన్మే త్వదన్యేన న దృష్టపూర్వమ్. 47

బాలానందిని

అర్జునమితి:- అర్జునుడు భయపడుచున్నా డని గ్రహించి,విశ్వరూపాన్ని ఉపసంహ రించి,ప్రియవచనంతో ఓదారుస్తూ శ్రీభగవంతు డిట్లన్నాడు-

ప్ర.అ. **మయేతి**:- అర్జున=అర్జునా!మే=నాయొక్క,యత్=ఏ రూపం,త్వదన్యేన= నువ్వు తప్ప వేరెవ్వనిచేతా,న దృష్టపూర్వమ్=పూర్వం చూడబడలేదో,పరమ్=శ్రేష్ఠ మైనదీ, తేజోమయమ్=తేజోవికార మైనదీ,విశ్వమ్=జగద్రూప మైనదీ,అనన్తమ్=అంతం లేనిదీ, ఆద్యమ్=మొదటిదీ అయిన,ఇదమ్=ఈ,రూపమ్=రూపము,ఆత్మయోగాత్=నా యోగశక్తి వలన,ప్రసన్నేన=ప్రసన్నుడ నైన,మయా=నాచేత,తవ=నీకు,దర్శితమ్=చూప బడినది.

భాష్యమ్

మయా ప్రసన్నేన,ప్రసాదః నామ త్వయి అనుగ్రహబుద్ధిః,తద్వతా ప్రసన్నేన మయా తవ హే!అర్జున!పరం రూపం విశ్వరూపం,దర్శితమ్ ఆత్మయోగాత్ ఆత్మనః ఐశ్వర్యస్య సామర్థ్యాత్;తేజోమయం తేజఃప్రాయం,విశ్వం సమస్తమ్,అనన్తమ్ అన్తరహితమ్,ఆదౌ భవమ్ ఆద్యమ్,యద్రూపం,మే మమ,త్వదన్యేన త్వత్తః అన్యేన కేన చిత్ న దృష్టపూర్వమ్. 47

బాలానందిని

మయా ఇతి:-ప్రసాదం అనగా నిన్ను అనుగ్రహించా లనే బుద్ధి.అట్టి బుద్ధి గల ప్రసన్నుడనైన నాచేత,ఓ!అర్జునా!ఈ గొప్ప రూపం,విశ్వరూపం,నీకు చూపబడినది.నా యొక్క ఐశ్వర్యసామర్థ్యంవల్ల చూపబడినది.అత్యధిక మైన తేజస్సు కలది,సమస్తము, అంతము లేనిది,ఆదియందు ఉన్నదీ అయిన నా ఏ రూపం నీకంటె ఇతరునిచేత ఎవ్వనిచేతా కూడ పూర్వం చూపబడలేదో. 47

భాష్యమ్

ఆత్మనః మమ రూపదర్శనేన కృతార్థః ఏవ త్వం సంవృత్తః ఇతి తత్ స్తౌతి:-

మూ. న వేదయజ్ఞాధ్యయనైర్న దానై
ర్న చ క్రియాభిర్న తపోభిరుగ్రైః,
ఏవంరూపః శక్య అహం నృలోకే
ద్రష్టుం త్వదన్యేన కురుప్రవీర. 48

బాలానందిని

ఆత్మనః ఇతి:- ఆత్మ నైన నా రూపం చూడడంచేత నువ్వు కృతార్థుడవే అయినావు. అని అంటూ ఆ రూపాన్ని స్తుతిస్తూన్నాడు-

ప్ర.అ.నేతి:- కురుప్రవీర=అర్జునా! ఏవంరూపః=ఇట్టి రూపం గల,అహమ్=నేను, నృలోకే=మనుష్యలోకంలో,త్వదన్యేన=నీకంటె అన్యునిచేత,ద్రష్టుమ్=చూచుటకు,వేద యజ్ఞాధ్యయనైః=వేదాధ్యయనాలచేత,యజ్ఞాల అధ్యయనాలచేత,న శక్యః=శక్యమైనవాడను కాను.దానైః=దానాలచేత,న=కాను,క్రియాభిః చ=క్రియలచేత కూడ, న=కాను.ఉగ్రైః= ఉగ్రములైన,తపోభిః=తపస్సులచేత,న=కాను.

భాష్యమ్

న వేదయజ్ఞాధ్యయనైః న దానైః-చతుర్ణామపి వేదానామ్ అధ్యయనైః యథావత్ యజ్ఞాధ్యయనైశ్చ. వేదాధ్యయనైరేవ యజ్ఞాధ్యయనస్య సిద్ధత్వాత్ పృథక్ యజ్ఞాధ్యయన గ్రహణం యజ్ఞవిజ్ఞానోపలక్షణార్థమ్. తథా న దానైః తులాపురుషాదిభిః, న చ,క్రియాభిః అగ్నిహోత్రాదిభిః శ్రౌతాదిభిః, నాపి తపోభిః ఉగ్రైః చాన్ద్రాయణాదిభిః ఉగ్రైః ఘోరైః, ఏవంరూపః యథాదర్శితం విశ్వరూపం యస్య సః అహమ్ ఏవంరూపః, న శక్యః అహం,నృలోకే మనుష్యలోకే,ద్రష్టుం త్వదన్యేన త్వత్తః అన్యేన కురుప్రవీర. 48

బాలానందిని

నేతి:-అర్జునా! న వేదయజ్ఞాధ్యనైః దానైః-నాలుగు వేదాల అధ్యయనాలచేత, యథా శాస్త్రంగా యజ్ఞాల అధ్యయనాలు చేయడంచేత. వేదాధ్యయనంచేతనే యజ్ఞా ధ్యయనం కూడ సిద్ధిస్తుంది గాన వేరుగా యజ్ఞాధ్యయనాన్ని చెప్పడం యజ్ఞాలను గూర్చిన విజ్ఞానాన్ని (పరిపూర్ణవిధానఫలాదిజ్ఞానాన్ని)గ్రహించడంకోసం. అట్లే తులాపురుషాది దానాల చేత, అగ్నిహోత్రాదిశ్రౌతక్రియలచేత,ఉగ్రములైన చాంద్రాయణాదితపస్సులచేత ఏ నా విశ్వరూపం ఏ విధంగా చూపబడినదో అట్టి రూపం కలవాడనుగా నేను మనుష్యలోకంలో నువ్వు తప్ప మరెవ్వరిచేతా చూడడానికి శక్యమైనవాడను కాను. 48

మూ. మా తే వ్యథా మా చ విమూఢభావో
దృష్ట్వా రూపం ఘోరమీదృఙ్మమేదమ్,
వ్యపేతభీః ప్రీతమనాః పునస్త్వం
తదేవ మే రూపమిదం ప్రపశ్య. 49

ప్ర. అ. మా ఇతి:-మమ=నాయొక్క ఈదృక్=ఇట్టి,ఘోరమ్=భయంకరమైన, ఇదం రూపమ్=ఈ రూపమును,దృష్ట్వా=చూచి,తే=నీకు,వ్యథా=వ్యథ,మా=లేకుండుగాక. విమూఢభావః చ=విమూఢత్వం కూడ. మా=లేకపోవుగాక త్వమ్=నీవు,వ్యపేతభీః=తొలగిన భయం కలవాడవై,ప్రీతమనాః=సంతోషించిన మనస్సు కలవాడవై,మే=నాయొక్కతదేవ= అదే అయిన,ఇదం రూపమ్=ఈ రూపమును,పునః=మళ్లీ,ప్రపశ్య=చూడుము.

భాష్యమ్

మా తే వ్యథేతి:- మా తే వ్యథా-మా భూత్ తే భయమ్;మా చ విమూఢ భావః విమూఢచిత్తతా,దృష్ట్వా ఉపలభ్య,రూపం ఘోరమ్ ఈదృక్ యథాదర్శితం మమ ఇదం వ్యపేతభీః విగతభయః ప్రీతమనాః చ సన్ పునః భూయః త్వం తదేవ చతుర్భుజం శఙ్ఖచక్రగదాధరం తవ ఇష్టం రూపమ్ ఇదం ప్రపశ్య. 49

బాలానందిని

మా తే వ్యథేతి:- నీకు భయమూ చిత్తం మూఢం అయిపోవడము కలుగకుండు గాక-ఇలాంటి,నీకు ఏ విధంగా చూపబడినదో అట్టి నా రూపాన్ని చూచి. తొలగిన భయం కలవాడవై,సంతోషించిన మనస్సు కలవాడవై, నువ్వు మళ్లీ శంఖచక్రగదలను ధరించినదీ, నాలుగు భుజా లున్నదీ అయిన ఆ రూపమునే, ఇదిగో చూడుము. 49

సంజయ ఉవాచ-

మూ. ఇత్యర్జునం వాసుదేవస్తథోక్త్వా
స్వకం రూపం దర్శయామాస భూయః
ఆశ్వాసయామాస చ భీతమేనం
భూత్వా పునః సౌమ్యవపుర్మహాత్మా. 50

సంజయుడు పలికెను.

ప్ర.అ. ఇతీతి:- ఇతి=ఇట్లు,వాసుదేవః=కృష్ణుడు,అర్జునమ్=అర్జునుని గూర్చి,తథా = ఆ విధమైన మాటను,ఉక్త్వా=పలికి,స్వకమ్=తన సంబంధ మైన,రూపమ్=రూపమును, భూయః=మరల,దర్శయామాస=చూపెను. మహాత్మా=మహాత్ముడైన కృష్ణుడు -పునః=మళ్లీ, సౌమ్యవపుః=సౌమ్యమైన శరీరం కలవాడుగా,భూత్వా=అయి,భీతమ్=భయపడిఉన్న, ఏనమ్= వీనిని,ఆశ్వాసయామస చ=ఓదార్చెను కూడ.

భాష్యమ్

ఇత్యర్జునమితి:- ఇతి ఏవమ్,అర్జునం వాసుదేవః తథాభూతం వచనమ్ ఉక్త్వా స్వకం వసుదేవగృహే జాతం రూపం,దర్శయామాస దర్శితవాన్. భూయః పునః ఆశ్వాసయామాస చ ఆశ్వాసితవాన్ చ,భీతమ్ ఏనం భూత్వా పునః సౌమ్యవపుః ప్రసన్నదేహః మహాత్మా. 50

బాలానందిని

ఇత్యర్జునమితి:- ఇట్లు వాసుదేవుడు అర్జునునితో ఈ విధమైన వచనము పలికి వసుదేవుని ఇంట్లో జన్మించిన తన రూపం చూపించాడు. మహాత్ముడైన అతడు మళ్లీ సౌమ్యమైన శరీరం కలవాడై భయపడిన వీనిని ఓదార్చాడు. 50

అర్జున ఉవాచ-

మూ. దృష్ట్వేదం మానుషం రూపం తవ సౌమ్యం జనార్దన,
ఇదానీమస్మి సంవృత్తః సచేతాః ప్రకృతిం గతః. 51

అర్జునుడు పలికెను.

ప్ర.అ. దృష్ట్వేతి:- జనార్దన=కృష్ణా!తవ=నీయొక్క,సౌమ్యమ్=సౌమ్యమైన,ఇదమ్=ఈ,మానుషం రూపమ్=మనుష్యరూపమును,దృష్ట్వా=చూచి,ఇదానీమ్=ఇప్పుడు,సచేతాః ప్రసన్న మైన చిత్తం కలవాడను,సంవృత్తః అస్మి=అయి ఉన్నాను.ప్రకృతిమ్=స్వాస్థ్యమును, గతః=పొందినాను.

భాష్యమ్

దృష్ట్వేదమితి:- దృష్ట్వా ఇదం మానుషం రూపం మత్సఖం ప్రసన్నం తవ సౌమ్యం జనార్దన,ఇదానీమ్ అధునా,అస్మి సంవృత్తః సంజాతః,కిమ్?సచేతాః ప్రసన్న చిత్తః ప్రకృతిం స్వభావం గతశ్చ అస్మి. 51

బాలానందిని

దృష్ట్వా ఇతి:- ప్రసన్న మైన నా మిత్రమైన నీ మనుష్యరూపమును చూచి, జనార్దనా!ఇప్పుడు అయితిని.ఏమయితివి?ప్రసన్నచిత్తు డను అయితిని.స్వభావాన్ని పొందిన వాడను కూడ అయితిని.

శ్రీభగవానువాచ-

మూ. సుదుర్దర్శమిదం రూపం దృష్టవానసి యన్మమ,
దేవా అప్యస్య రూపస్య నిత్యం దర్శనకాఙ్క్షిణః. 52

శ్రీభగవంతుడు పలికెను.

ప్ర.అ. సుదుర్దర్శమితి:- మమ=నాయొక్క,సుదుర్దర్శమ్=చూచుటకు ఏ మాత్రము శక్యము కాని,ఇదమ్=ఈ,యత్=ఏ,రూపమ్=రూపమును,దృష్టవాన్ అసి=చూచి ఉన్నావో, దేవాః అపి=దేవతలు కూడ,నిత్యమ్=ఎల్లప్పుడు,అస్య రూపస్య=ఈ రూపముయొక్క దర్శన కాఙ్క్షిణః=దర్శనము కోరుచున్నారు.

భాష్యమ్

సుదుర్దర్శమితి:- సుదుర్దర్శం-సుష్ఠు దుఃఖేన దర్శనమ్ అస్య ఇతి సుదుర్దర్శమ్, ఇదం రూపం దృష్టవాన్ అసి యత్,మమ దేవాః అపి,అస్య మమ రూపస్య నిత్యం సర్వదా దర్శనకాఙ్క్షిణః దర్శనేప్సవః అపి న త్వమివ దృష్టవన్తః న ద్రక్ష్యన్తి చ ఇత్యభిప్రాయః. 52

బాలానందిని

సుదుర్దర్శమితి:- అతికష్టముచేత చూడ శక్యమైన ఈ నా ఏ రూపాన్ని నువ్వు చూచావో,దేవతలు కూడ,ఎల్లప్పుడు దీనిని చూడవలె నని కోరుకొనుతూంటారు. కాని నువ్వు చూచి నట్లు చూడలేరు. చూడరు కూడ అని అభిప్రాయం.

భాష్యమ్

కస్మాత్?-

మూ. నాహం వేదైర్న తపసా న దానేన న చేజ్యయా,
శక్య ఏవంవిధో ద్రష్టుం దృష్టవానసి మాం యథా. 53

బాలానందిని

కస్మాదితి:- ఎందువలన అనగా-

ప్ర.అ. నేతి:- మామ్=నన్ను,యథా=ఏ విధంగా,దృష్టవాన్ అసి=చూచినావో, ఏవంవిధః=ఇట్టి రూపం గల,అహమ్=నేను,వేదైః=వేదములచేత,ద్రష్టుమ్=చూచుటకు, న శక్యః=శక్యమైనవాడను కాను. తపసా=తపస్సుచేత,న=కాను,దానేన=దానంచేత, న=కాను, ఇజ్యయా చ=పూజచేత కూడ,న=కాను.

భాష్యమ్

న అహం వేదైః ఋగ్యజుఃసామాథర్వవేదైః చతుర్భిరపి,న తపసా ఉగ్రేణ చాన్ద్రాయణాదినా,న దానేన గోభూహిరణ్యాదినా,న చ ఇజ్యయా యజ్ఞేన పూజయా వా శక్యః,ఏవంవిధః యథా దర్శితప్రకారః,ద్రష్టుం దృష్టవానసి మాం యథా త్వమ్. 53

బాలానందిని

నాహమితి:- నువ్వు నన్ను ఎట్లు,ఈ విధంగా (నీకు)చూపబడిన ప్రకారం కల వానినిగా, చూచి ఉన్నావో, ఆ విధంగా ఋగ్యజుఃసామాథర్వవేదాలు నాల్గింటిచేతా కూడ (వాటి సాహాయ్యంతో)చూడడానికి శక్యమైనవాడను కాను. ఉగ్రమైన చాంద్రాయణాది తపస్సుచేత కాను. గోభూహిరణ్యాదిదానంచేత కూడ కాను;యజ్ఞంచేత లేదా పూజచేత కాను.

భాష్యమ్

కథం పునః శక్యః ఇతి? ఉచ్యతే-

మూ. భక్త్యా త్వనన్యయా శక్య అహమేవం విధోఽర్జున,
జ్ఞాతుం ద్రష్టుం చ తత్త్వేన ప్రవేష్టుం చ పరంతప. 54

బాలానందిని

కథమితి:- ఐతే ఎలా శక్యం అవుతావు?చెప్పబడుచున్నది-

భక్త్యా ఇతి:- పరంతప=శత్రుపీడాకరుడవైన,అర్జున=అర్జునా! ఏవంవిధః=ఇట్టి స్వరూపం గల,అహమ్=నేను,అనన్యయా=ఇతరుని విషయంలో ఎన్నడూ ఉండని, భక్త్యా తు=భక్తి మాత్రంచేతనే, జ్ఞాతుమ్ =తెలుసుకొనుటకు, తత్త్వతః=యథార్థంగా, ద్రష్టుమ్= చూచుటకు,ప్రవేష్టుం చ=ప్రవేశించుటకు,శక్యః=శక్యమైనవాడను.

భాష్యమ్

భక్త్యా తు,కింవిశిష్టయా ఇత్యాహ-అనన్యయా అపృథగ్భూతయా,భగవతః అన్యత్ర పృథక్ న కదా చిదపి (యా) భవతి (సా తు అనన్యా భక్తిః) సర్వైః అపి కరణైః వాసుదేవాత్ అన్యత్ న ఉపలభ్యతే యయా సా అనన్యా భక్తిః,తయా భక్త్యా శక్యః అహమ్, ఏవంవిధః విశ్వరూపప్రకారః,హే అర్జున,జ్ఞాతుం శాస్త్రతః,న కేవలం జ్ఞాతుం శాస్త్రతః,ద్రష్టుం చ సాక్షాత్కర్తుం తత్త్వతః తత్త్వేన ప్రవేష్టుం చ మోక్షం చ గన్తుం పరం తప. 54

బాలానందిని

భక్త్యా ఇతి:-కాని,భక్తిచేత,ఎట్టి భక్తిచేత అనగా చెపుతున్నాడు-అనన్యమైన వేరుగా కాని,ఏది ఎన్నడూ భగవంతునికంటె భిన్న మైన దేనియందూ ఉండదో అట్టి భక్తి అనన్య భక్తి,సమస్తఇంద్రియాలచేత వాసుదేవునికంటె భిన్నమైనది ఏదీ దేనిచేత తెలియబడదో అట్టి భక్తిచేత,ఈ విధమైన విశ్వరూపం గల,నేను శాస్త్రంచేత తెలుసుకొనదానికి,కేవలం శాస్త్రంచేత తెలుసుకొనదానికే కాదు,యథార్థస్వరూపంలో సాక్షాత్కరించుకొనదానికి కూడ, నన్ను ప్రవేశించదానికి,మోక్షం పొందదానికీ కూడ శక్యమైనవాడను. 54

భాష్యమ్

అధునా సర్వస్య గీతాశాస్త్రస్య సారభూతః అర్థః నిఃశ్రేయసార్థః,అనుష్ఠేయత్వేన సముచ్చిత్య ఉచ్యతే-

మూ. మత్కర్మకృన్మత్పరమో మద్భక్తః సంగవర్జితః,
నిర్వైరః సర్వభూతేషు యః స మామేతి పాణ్డవ. 55

ఇతి శ్రీమహాభారతే శతసాహస్ర్యాం సంహితాయాం వైయాసిక్యాం భీష్మపర్వణి శ్రీమద్భగవద్గీతాసు ఉపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే శ్రీకృష్ణార్జున సంవాదే విశ్వరూపదర్శనం నామ ఏకాదశోஉధ్యాయః

బాలానందిని

అధునేతి:- ఇప్పుడు,సమస్తమైన గీతాశాస్త్రానికీ సారమైనది,మోక్షమే ప్రయోజనంగా గలది(మోక్షానికి ఉపయోగించేది)అయిన విషయం సంక్షిప్తం చేసి చెప్పబడు చున్నది-

ప్ర.అ. మత్కర్మేతి:- పాణ్డవ=అర్జునా! యః=ఎవడు,మత్కర్మణకృత్=నాకొరకు కర్మలను చేస్తాడో,మత్పరమః=నేనే పరమగతిగా కలవాడు అవుతాడో,మద్భక్తః=నాయందు భక్తుడో,సంగవర్జితః=సంగము లేనివాడో,సర్వభూతేషు=సమస్తప్రాణులయందు,నిర్వైరః=వైరం లేనివాడో,సః=అతడు,మామ్=నన్ను,ఏతి=పొందుతాడు.

భాష్యమ్

మత్కర్మకృత్-మదర్థం కర్మ మత్కర్మ.తత్ కరోతీతి మత్కర్మకృత్;మత్పరమః-కరోతి భృత్యః స్వామికర్మ;న తు ఆత్మనః పరమా ప్రేత్య గన్తవ్యా గతిః ఇతి స్వామినం ప్రతిపద్యతే.అయం తు మత్కర్మకృత్ మామేవ పరమాం గతిం ప్రతిపద్యతే ఇతి మత్పరమః,అహం పరమః పరా గతిః యస్య సః అయమ్ మత్పరమః,తథా,మద్భక్తః మామేవ సర్వప్రకారైః సర్వాత్మనా సర్వోత్సాహేన భజతే ఇతి మద్భక్తః. సంగవర్జితః -ధనపుత్రమిత్ర కలత్ర బన్ధువర్గేషు సంగరవర్జితః,సంగః ప్రీతిః స్నేహః,తద్వర్జితః, నిర్వైరః నిర్గతవైరః, సర్వభూతేషు శత్రుభావరహితః,ఆత్మనః అత్యన్తాపకారప్రవృత్తేష్వపి, యః ఈదృశః మద్భక్తః,సః మామ్ ఏతి;అహమేవ తస్య పరా గతిః,న అన్యా గతిః కాచిత్ భవతి.అయం తవ ఉపదేశః ఇష్టః మయా ఉపదిష్టః, హే!పాణ్డవ! ఇతి.55

ఇతి శ్రీమత్పరమహంసపరివ్రాజకాచార్యగోవిన్దభగవత్పూజ్యపాదశిష్య శ్రీమచ్ఛఙ్కరభగవతః కృతౌ శ్రీభగవద్గీతాభాష్యే విశ్వరూపదర్శనం నామ ఏకాదశోஉధ్యాయః

బాలానందిని

మత్కర్మకృదితి:- నాకొరకు చేసే కర్మ మత్కర్మ;మత్కర్మ చేసేవాడు మత్కర్మకృత్. మత్పరమః-భృత్యుడు స్వామియొక్క పనులు చేస్తాడు;అయితే మరణించిన తరవాత తాను

పొంద వలసిన పరమగతి ఈ స్వామియే అని ఆతనిని పొందడు. ఈ మత్కర్మకృత్ అయితే నన్నే పరమగతినిగా ఆశ్రయిస్తాడు. అందుచేత మత్పరముడు. నేనే పరమమైన గతిగా కలవాడు. అల్లే మద్భక్తః–అన్ని విధాలా, సర్వాత్మనా, సమస్తమైన ఉత్సాహంతో (పరిపూర్ణోత్సాహంతో)నన్నే సేవిస్తాడు గాన మద్భక్తుడు సంగవర్జితః–సంగ మనగా ప్రీతి, స్నేహం. ధనపుత్రమిత్ర కలత్రబంధ్వాదుల విషయంలో సంగం లేనివాడు. నిర్వైరః సర్వభూతేషు–అన్ని ప్రాణులయందు, తనకు చాలా అపకారం చేయడానికి ప్రవర్తించిన వారియందు కూడ వైరం, శత్రుభావం, లేనివాడు. ఈ విధమైన ఏ నా భక్తు డున్నాడో అతడు నన్నే పొందుతాడు. వానికి పరమగతి నేనే, నేను తప్ప మరొక గతి వానికి లేదు. ఈ విధంగా ఓ! పాండవా! నాకు ఇష్ట మైన ఉపదేశం నీకు చేయబడింది. 55

"బాలానందిని"అను శ్రీమద్భగవద్గీతాశాంకరభాష్యాంధ్రవ్యాఖ్యానంలో
ఏకాదశాధ్యాయం సమాప్తం.
(మొదటినుండి శ్లోకాలు–440)

అథ ద్వాదశోఽధ్యాయః

భాష్యమ్

ద్వితీయప్రభృతిషు అధ్యాయేషు విభూత్యన్తేషు పరమాత్మనః బ్రహ్మణః అక్షరస్య విధ్వస్తసర్వవిశేషణస్య ఉపాసనమ్ ఉక్తమ్. సర్వయోగైశ్వర్యసర్వజ్ఞానశక్తిమత్సత్త్వోపాధేః ఈశ్వరస్య తవ చ ఉపాసనం తత్ర తత్ర ఉక్తమ్. విశ్వరూపాధ్యాయే తు ఐశ్వరమ్ ఆద్యం సమస్తజగదాత్మరూపం విశ్వరూపం త్వదీయం దర్శితమ్ ఉపాసనార్థమేవ త్వయా. తచ్చ దర్శయిత్వా ఉక్తవానసి "మత్కర్మకృత్"ఇత్యాది. అతః అహమ్ అనయోః ఉభయోః పక్షయోః విశిష్టతరబుభుత్సయా త్వాం పృచ్ఛామి ఇతి–

అర్జున ఉవాచ–

మూ. ఏవం సతతయుక్తా యే భక్తాస్త్వాం పర్యుపాసతే,
యే చాప్యక్షరమవ్యక్తం తేషాం కే యోగవిత్తమాః. 1

బాలానందిని

ద్వితీయేతి:– ద్వితీయాధ్యాయం మొదలు విభూత్యధ్యాయంవరకు ఉన్న అధ్యాయాలలో పరమాత్మ, అక్షరము, సమస్తవిశేషశూన్యము అయిన బ్రహ్మయొక్క ఉపాసనం చెప్పబడింది. సమస్త మైన ప్రపంచముయొక్క ఘటనయందు–సృష్టిస్థితిసంహారముల యందు, సామర్థ్యము(లేదా సమస్తములైన యోగాలు, ఐశ్వర్యము)సర్వజ్ఞానశక్తి గలవాడవు,

సత్త్వము ఉపాధిగా కలవాడవు అయిన నీ ఉపాసనం కూడ అక్కడక్కడ చెప్పబడింది. విశ్వ రూపాధ్యాయంలో నైతే ఆద్యము,సమస్తజగదాత్మకమూ అయిన నీ విశ్వరూపం కూడ నీచేత ఉపాసనంకొరకే చూపబడినది. విశ్వరూపం చూపించి "మత్కర్మకృత్". ఇత్యాదికం చెప్పి ఉన్నావు. అందుచేత ఈ రెండు పక్షాలలో ఏది ఎక్కువ విశిష్ట మైనదో తెలుసుకొన వలె ననే కోరికతో అడుగుతున్నాను అని అర్జునుడు పలికాడు-

ప్ర.అ. ఏవమితి:- ఏవమ్=ఈ విధంగా,సతతయుక్తాః=ఎల్లప్పుడూ ప్రవర్తిస్తూన్న వారై,యే=ఏ,భక్తాః=భక్తులు,త్వామ్=నిన్ను,పరుపాసతే=సేవిస్తారో,యే చ=ఎవరు,అవ్యక్తమ్ = అవ్యక్త మైన,అక్షరమ్=అక్షరమును సేవిస్తారో,తేషామ్=వారిలో,కే=ఎవరు,యోగవిత్తమాః =అధికంగా యోగం తెలిసినవారు(లేదా అధికంగా యోగాన్ని పొందినవారు, సాధించినవారు)? 1

భాష్యమ్

ఏవమితి అతీతానన్తరశ్లోకేన ఉక్తమ్ అర్థం పరామృశతి "మత్కర్మకృత్"ఇత్యాది నా. ఏవం సతతయుక్తాః నైరన్తర్యేణ భగవత్కర్మాదౌ యథోక్తేఽర్థే సమాహితాః సన్తః ప్రవృత్తా ఇత్యర్థః. యే భక్తాః అనన్యశరణాః సన్తః త్వాం యథాదర్శితం విశ్వరూపం పర్యుపాసతే ధ్యాయన్తి,తే,యే చాన్యేఽపి త్యక్తైషణాః సంన్యస్తసర్వకర్మాణః యథా విశేషితం బ్రహ్మాక్షరం నిరస్తసర్వోపాధిత్వాత్ అవ్యక్తమ్ అకరణగోచరం,యత్ హి లోకే కరణగోచరం తత్ వ్యక్తమ్ ఉచ్యతే;అఞ్జేః ధాతోః తత్కర్మకత్వాత్;ఇదం తు అక్షరం తద్విపరీతం,శిష్టైశ్చ ఉచ్యమానైః విశేషణైః విశిష్టం తత్ యే చాపి పర్యుపాసతే తేషామ్ ఉభయేషాం మధ్యే కే యోగవిత్తమాః,కే అతిశయనే యోగవిదః ఇత్యర్థః. 1

బాలానందిని

ఏవమితి:- 'ఏవమ్'అనే శబ్దంచేత 'మత్కర్మకృత్'ఇత్యాదికమైన దగ్గరగా వెనుకనే ఉన్న శ్లోకంచేత చెప్పబడిన అర్థాన్ని పరామర్శిస్తున్నాడు. ఏ విధంగా పైన చెప్పిన భగవత్కర్మా దులయందు నిరంతరము సమాహితులై,శ్రద్ధతో ప్రవర్తిస్తూన్నవారై, ఏ భక్తులు అనన్య శరణులై నిన్ను,పైన చూపిన విధంగా విశ్వరూపవంతుడ వైన నిన్ను, ధ్యానిస్తారో, ఏ ఇతరులు సర్వైషణలను విడచి,సర్వకర్మలను సంన్యసించినవారై,చెప్పబడిన విశేషణాలతో కూడినది, అక్షరము.సర్వోపాధిరహిత మవడంచేత అవ్యక్తమూ,అనగా ఇంద్రియగోచరం కానిదీ అయిన బ్రహ్మను ఉపాసిస్తారో,లోకంలో ఇంద్రియాలచే గ్రహించ శక్యమైనది వ్యక్తం అని చెప్పబడుతుంది;అఞ్జ్ధాతువు ఆ అర్థాన్నే బోధిస్తుంది. ఈ అక్షర మైతే అందుకు విపరీత మైనది;ఈ ప్రకరణంలో చెప్పబడిన విశిష్టము లైన విశేషణాలతో కూడిన,అట్టి అక్షరబ్రహ్మను

ఎవరు ఉపాసిస్తారో ఈ రెండు విధాల సాధకులలో ఎవరు అతిశయంచేత యోగం తెలిసిన వారు?

భా.అ.ప్ర.:- విశ్వరూపుడైన ఈశ్వరుణ్ణి ఉపాసించేవాళ్లు భక్తులు. ప్రత్యగాత్మను ఉపాసించేవాళ్లు జ్ఞానులు. వాళ్లిద్దరిమధ్య ఉన్న తారతమ్యాన్ని తెలుసుకొనవలె నని అర్జునుడు ప్రశ్నిస్తున్నాడు అను శ్రీరామానుజాచార్యుల అభిప్రాయం అయుక్తం. ఈ ప్రత్యగాత్మ జీవుడా పరమేశ్వరుడా! మొదటి పక్షంలో జీవునికంటె ఈశ్వరుడు ఉత్కృష్టుడు గాన జీవోపాసకునికంటె ఈశ్వరోపాసకుడు ఎలాగైనా ఉత్కృష్టుడే గాన ప్రశ్నకు అవకాశమే లేదు. రెండవ పక్షంలో స్వమతాన్ని విడచి పరమతం (అద్వైతమతం)అంగీకరించిన ట్లవుతుంది. మరొక విషయ మేమనగా-ఒకరిని ఉపాసించేవాళ్లు మరొకరిని పొందడం అనేది విరుద్ధ మైనది. జీవోపాసకులకు ఈశ్వరప్రాప్తి కలుగుతుం దని చెప్పబోతున్నాడు; ఎందువల్ల ననగా అక్షరాన్ని ఉపాసంచేవాళ్లు కూడ నన్నే పొందుతా రని చెప్పనున్నాడు కదా? 'మాం ప్రాప్నువన్తి'అనుదానికి నాతో సమానుణ్ణి పొందుతారు అను అర్థం చెప్పడం యుక్తం కాదు. ముఖ్యార్థం చెప్పడం కుదురుతున్నప్పుడు లాక్షణికార్థం గ్రహించడం అయుక్తం కదా? ఈ విధంగా బ్రహ్మ చెప్పబడుచున్నది గాన, బ్రహ్మోపాసకులకే బ్రహ్మప్రాప్తి సంభవం గాన ఈ అక్షరోపాసకులు బ్రహ్మోపాసకులే. అది ప్రత్యగభిన్నమైనదే.

మరొక విషయ మేమనగా-ఈశ్వరునకు నిరుపాధికము, సోపాధికము అని రెండు రూపా లున్నాయి. సచ్చిదానందలక్షణమైన చైతన్యం నిరూపాధికరూపం, విశ్వరూపాదిక మైతే సోపాధికరూపం అనే విషయం అంగీకరించబడినదే గాన, సోపాధికేశ్వరోపాసకులు నిరూపాధికేశ్వరోపాసకులూ ఇద్దరూ కూడ ఈశ్వరోపాసకులే గాన వాళ్లకి సామ్యం ఉండడం చేత వీళ్లలో యోగవిత్తములు ఎవరు అను జిజ్ఞాసతో అర్జునుడు ప్రశ్నించడం ఉపపన్నంగా ఉంటుంది కాని మరొక విధంగా ఉపపన్నం కాదు. ఈ విధంగా ప్రశ్న ఉపపన్నం అవాలంటే కూడ ఇక్కడ అక్షరం అనగా బ్రహ్మ అనియే చెప్పాలి కాని ప్రత్యగాత్మ అని కాదు. సోపాధికరూపోపాసకులకు సాక్షాత్తు మోక్షం ఉండనే ఉండదు గాన ప్రశ్నించకుండా కూడ అర్జునునకు ఆ వివేకం ఉంటుంది కదా అని అనడానికి లేదు. ఎందువల్ల ననగా "యస్స మామేతి"అని సోపాధికోపాసకులకు సాక్షాత్తు మోక్షం చెప్పబడింది. అయితే భగవంతుడు విరుద్ధమైన విషయం ఎలా చెప్పాడు అనడానికి వీలు లేదు. అలాంటి కర్మి జ్ఞానం ద్వారా నన్ను పొందుతాడు అనియే శ్రీకృష్ణుని అభిప్రాయం అని వెనుకనే చెప్పి ఉన్నాం కదా? విశ్వరూపోసకులకు సాక్షాన్మోక్షం లభించని పక్షంలో అర్జునుని ప్రశ్నకు సమాధానంగా భగవంతుడు భక్తులకు సాక్షాన్మోక్షం లేదు, జ్ఞానులకు మాత్రమే ఉంటుంది అని సమాధానం ఎందుకు చెప్పలేదు అన్నట్లయితే చెపుతున్నాను, విను, భగవంతుడు వ్యంగ్యమర్యాదచే అలా

చెప్పియే ఉన్నాడు. ఎట్లనగా–"మయ్యావేశ్య"అని భక్తులు యుక్త తములు అని మాత్రమే చెప్పబడింది. అక్షరోపాసకుల కైతే "తే ప్రాప్నువన్తి మామేవ"అని భగవత్ప్రాప్తియే చెప్పబడింది;అంతేనే కాని యుక్తతమత్వాదికం చెప్పబడలేదు. దీనిని పట్టి సాక్షాన్మోక్షం జ్ఞానులకు మాత్రమే;భక్తుల కైతే జ్ఞానం ద్వారా మోక్షం లభిస్తుంది అని భగవంతుని ఆశయ మని తెలుస్తూన్నది. శ్రీరామానుజభాష్యం ప్రకారమైతే ఈశ్వరోపాసకులు యుక్తతములు మాత్రమే. జీవోపాసకులు ఈశ్వరుణ్ణి పొందుతారు అని చాలా విరుద్ధ మైన అర్థం చెప్పినట్లవుతుంది. అందుచేత సగుణ-నిర్గుణబ్రహ్మోపాసకులైన యోగి – సాంఖ్యులలో ఎవరు ప్రశస్త మైనవారు అని తెలుసుకొనడంకోసమే అర్జునుడు ప్రశ్నిస్తు న్నా డని చెప్పడం యుక్తం. (భా. అ. ప్ర. పే. 205) 1

శ్రీభగవానువాచ-

భాష్యమ్

యే త్వక్షరోపాసకాః సమ్యగ్దర్శినః నివృత్తైషణాః తే తావత్తిష్ఠన్తు. తాన్ ప్రతి యద్వక్తవ్యం తదుపరిష్టాత్ వక్ష్యామః. యే తు ఇతరే-

మూ. మయ్యావేశ్య మనో యే మాం నిత్యయుక్తా ఉపాసతే,
శ్రద్ధయా పరయోపేతాస్తే మే యుక్తతమా మతాః. 2

బాలానందిని

యే త్వితి:– ఏషణలు నశించి సమ్యగ్దర్శనవంతులై అక్షరోపాసన చేసేవాళ్ల మాట అటుండనీ;వాళ్లను గూర్చి చెప్పవలసినది తరువాత చెపుతాం. ఏ ఇతరు లైతే-

భగవంతుడు పలికెను –

ప్ర.అ. మయీతి:– యే=ఎవరు,మయి=నాయందు,మనః=మనస్సును,ఆవేశ్య= నిలిపి,నిత్యయుక్తాః=ఎల్లప్పుడు లగ్నచిత్తులై,పరయా=గొప్ప, శ్రద్ధయా=శ్రద్ధతో,ఉపేతాః= కూడినవారై,మామ్=నన్ను ఉపాసతే=ఉపాసిస్తారో,తే=వాళ్లు,యుక్తతమాః=అత్యంతము యుక్తులుగా,మతాః=అంగీకరించబడినారు.

భాష్యమ్

మయి విశ్వరూపే పరమేశ్వరే,ఆవేశ్య సమాధాయ,మనః యే భక్తాః సన్తః మాం సర్వయోగేశ్వరాణామ్ అధీశ్వరం సర్వజ్ఞం,విముక్తరాగాదిక్లేశతిమిరదృష్టిం నిత్య యుక్తాః అతీతానన్తరాధ్యాయాన్తశ్లోకార్థన్యాయేన సతతయుక్తాః సన్తః ఉపాసతే. శ్రద్ధయా

పరయా ప్రకృష్టయా ఉపేతాః తే మే మమ,మతాః అభిప్రేతాః యుక్తతమాః ఇతి.నైరన్త ర్యేణ హి తే మచ్చిత్తతయా అహోరాత్రమ్ అతివాహయన్తి,అతః యుక్తం తాన్ ప్రతి యుక్తతమాః ఇతి వక్తుమ్. 2

బాలానందిని

మయీతి:- విశ్వరూపు డను పరమేశ్వరు డను అయిన నాయందు మనస్సును ఏకాగ్రము చేసి,ఎవళ్లు,భక్తులై,సర్వయోగేశ్వరులకు అధీశ్వరుడను,సర్వజ్ఞుడను,రాగాదిక్లేశము లనే తిమిరదోషం(రేచీకటి అనే దోషం)లేని దృష్టి కలవాడను అయిన నన్ను,ఈ అధ్యాయం వెనుకనే ఉన్న అధ్యాయం చివరి శ్లోకంలో చెప్పిన రీతిలో సతతయుక్తులై, గొప్ప శ్రద్ధతో కూడినవారై ఉపాసిస్తారో వాళ్లు నాకు యుక్తతము లని అంగీకరిపందగినవాళ్లు, వాళ్లు నిరంతరము నామీదనే చిత్తమును నిలిపి రాత్రింబవళ్లు గడుపుతూంటారు; అందుచేత వాళ్లను గూర్చి యుక్తతము లనడం యుక్తమే. 2

భాష్యమ్

కిమ్ ఇతరే యుక్తతమాః న భవన్తి?న;కిం తు తాన్ ప్రతి యద్వక్తవ్యం తత్ శృణు-

మూ. యే త్వక్షరమనిర్దేశ్యమవ్యక్తం పర్యుపాసతే,
సర్వత్రగమచిన్త్యం చ కూటస్థమచలం ధ్రువమ్. 3

బాలానందిని

కిమితి:- అయితే- ఇతరులు యుక్తతములు కారా?అట్లు కాదు;వాళ్లను గూర్చి ఏమని చెప్పాలో వినుము-

ప్ర.అ.యే ఇతి:- యే తు=ఎవరైతే అనిర్దేశ్యమ్=దీని స్వరూపం ఇది అని చెప్ప శక్యం కానిది,సర్వత్రగమ్=అంతటా వ్యాపించినది,అచిన్త్యమ్=ఊహింప శక్యం కానిది, కూటస్థమ్=కూటస్థమైనది,అచలమ్=కదలినిది,ధ్రువమ్=స్థిరమూ,అవ్యక్తమ్=వ్యక్తము కాని, అక్షరమ్=అక్షరమును, పర్యుపాసతే=సేవిస్తారో-

భాష్యమ్

యే తు అక్షరమ్,అనిర్దేశ్యమ్ అవ్యక్తత్వాత్ అశబ్దగోచరమ్ ఇతి న నిర్దేష్టుం శక్యతే,అతః అనిర్దేశ్యమ్,అవ్యక్తం-న కేనాపి ప్రమాణేన వ్యజ్యతే ఇతి అవ్యక్తమ్,పర్యు పాసతే పరి సమన్తాత్ ఉపాసతే;ఉపాసనం నామ యథాశాస్త్రమ్ ఉపాస్యస్య అర్థస్య

విషయీకరణేన,సామీప్యమ్ ఉపగమ్య తైలధారావత్ సమానప్రత్యయప్రవాహేణ దీర్ఘకాలం యత్ ఆసనం తత్ ఉపాసనమ్ ఆచక్షతే. అక్షరస్య విశేషణమ్ ఆహ–సర్వత్రగం వ్యోమవత్ వ్యాపి,అచిన్త్యం చ అవ్యక్తత్వాత్ అచిన్త్యమ్. యత్ హి కరణగోచరం తత్ మనసాపి చిన్త్యం,తద్విపరీతత్వాత్ అచిన్త్యమ్ అక్షరమ్. కూటస్థమ్–దృశ్యమానగుణమ్ అన్తర్దోషం వస్తు కూటం;కూటరూపం కూటసాక్ష్యమ్ ఇత్యాదౌ కూటశబ్దః ప్రసిద్ధో లోకే. తథా చ అవిద్యాద్యనేకసంసారబీజమ్ అన్తర్దోషవత్ మాయాఽవ్యాకృతాదిశబ్ద వాచ్య తయా–"మాయాం తు ప్రకృతిం విద్యాత్ మాయినం తు మహేశ్వరమ్" (శ్వే. ఉ. 4.10) "మమ మాయా దురత్యయా"(7.14)ఇత్యాదౌ ప్రసిద్ధం యత్ తత్ కూటమ్; తస్మిన్ కూటే స్థితం కూటస్థం తదధ్యక్ష తయా. అథవా రాశిః ఇవ స్థితం కూటస్థమ్;అతః ఏవ అచలం;యస్మాత్ అచలం తస్మాత్ ధ్రువం నిత్యమిత్యర్థః. 3

బాలానందిని

యే త్వితి:- ఎవరైతే–అనిర్దేశ్యము అవ్యక్తం అవడంచేత శబ్దమునకు గోచరం కాదు గాన నిర్దేశించుటకు శక్యము కానిది,ఏ ప్రమాణంచేతనూ కూడ తెలియబడేది కాదు గాన అవ్యక్తమూ అయిన అక్షరాన్ని,అన్ని విధాల ఉపాసిస్తారో;ఉపాసనం అనగా–ఉపాసించ దగిన వస్తువును శాస్త్రానుసారం విషయంగా చేసికొని(తెలుసుకొని)దాని దగ్గరకు చేరి(ఆ వస్తువుతో మానసికంగా సంనిహితత్వాన్ని ఏర్పరచుకొని)తైలధార వలె ఒకే తీరున ఉండే (ఒకే విధమైన)జ్ఞానప్రవాహంతో చాలా కాలం కూర్చొనడం ఉపాసనం అని చెపుతారు. అక్షరానికి విశేషణం చెపుతున్నాడు–'సర్వత్రగమ్'–ఆకాశం వలె వ్యాపించి ఉన్నది. అవ్యక్తం అవడంవల్ల ఊహింప శక్యం కానిది;ఇంద్రియాలకు గోచరమైనదానిని మనస్సుచేత కూడ చింతించవచ్చును. ఈ అక్షరం అందుకు విపరీతం,ఇంద్రియాగోరం,గాన అచింత్యం. కూటస్థమ్–పైకి గుణాలు కనబడుతూ లోపల దోషా లున్న వస్తువు'కూటం'.'కూటరూపం' 'కూటసాక్ష్యం'ఇత్యాదిప్రయోగాలలో ఈ శబ్దం(కూటశబ్దం)లోకంలో ఈ అర్థంలో ప్రసిద్ధంగా ఉన్నది. అట్లే ఏది అవిద్య మొదలైన అనేకసంసారములకు బీజమో,లోపల దోషం కలదో, **"మాయాం తు ప్రకృతిం విద్యాత్ మాయినం తు మహేశ్వరమ్","మమ మాయా దురత్యయా"** ఇత్యాదులలో 'మాయ','అవ్యాకృతం,ఇత్యాదిశబ్దాలచేత చెప్పబడేదిగా ప్రసిద్ధమో అది కూటం; ఆ కూటమునందు(మాయయందు)దాని అధ్యక్షముగా ఉన్నది. లేదా –రాశి వలె ఉన్నది కూటస్థం. (ధాన్యాదిరాశి అది ఉన్న ప్రదేశాన్నంతనీ ఆక్రమించుకొని ఉన్నట్లు జగత్తు నంతనూ ఆక్రమించి ఉన్నది అని భావం). అందువల్లనే అచల మైనది. అచలం కావుననే ధ్రువ మైనది,అనగా నిత్యము అని అర్థం.

భా.అ.ప్ర.:- “అక్షరమ్=ప్రత్యగాత్మస్వరూపము,అనిర్దేశ్యమ్=దేహంకంటె వేరైనది అగుటచేత దేవాదిశబ్దాలచేత నిర్దేశింపతగనిది.సర్వత్రగమ్=దేవాదిదేహాలలో ఉంటూన్నది. కూటస్థమ్=సర్వసాధారణము. అచలమ్=చ్యుతముకాని,నశించని,ఆకారం కలది”అని శ్రీరామానుజాచార్యవ్యాఖ్య అసంగతము.దేవాదిశబ్దాలచేత నిర్దేశింపబడక పోవడంచేత అక్షరం అనిర్దేశ్య మైనది అన్నట్లయితే బ్రహ్మ-ఆనందాదిశబ్దాలచేత అనిర్దేశ్యం గాన దేహం కూడ అనిర్దేశ్యం కావాలి.“యత్తదద్రేశమగ్రాహ్యమ్”“యతో వాచో నివర్తన్తే” ఇత్యాదిశ్రుతు లైతే ఆత్మ అనిర్దేశ్యం అని చెపుతున్నాయి కాని దేహం అనిర్దేశ్యం అని చెప్పడం లేదు. అట్లే నీ మతంలో అణురూపాలైన ఆత్మలు దేవాద్యనేకదేహాలలో ఎలా ఉంటాయి?అలాంటప్పుడు సర్వత్రగత్వం ఎలా కుదురుతుంది?కూటస్థశబ్దానికి సర్వ సాధారణము అను అర్థం చెప్పడం కూడ అయుక్తమే.సర్వసాధారణత్వమే కూటస్థత్వం అని అంటే పృథివ్యాదిపదార్థాలు కూడ పశు-పక్షి-మనుష్యాదిసర్వసాధారణాలు గాన అవి కూడ కూటస్థా లని చెప్పవలసి వస్తుంది.అట్లే అచలశబ్దానికి తన ఆకారంనుండి చలించనిది అను అర్థం చెప్పడం కూడ అయుక్తం.“న చలతీతి అచలమ్”కదలని అని అర్థం చెపితే సరిపోతూండగా “ఆకారంనుండి” అని అపాదానం కల్పించడం అయుక్తం. ఘటం కూడ తన ఆకారంనుండి చలించదు గాన అది కూడ అచలమే అని చెప్పవలసి ఉంటుంది.(భా.అ.ప్ర.పే.212-13) 3

భాష్యమ్

తేషాం ఫలమహ-

మూ. సంనియమ్యేన్ద్రియగ్రామం సర్వత్ర సమబుద్ధయః,
తే ప్రాప్నువన్తి మామేవ సర్వభూతహితే రతాః. 4

బాలానందిని

తేషామితి:- వాళ్లకు ఫలమును చెప్పుచున్నాడు-

ప్ర.అ. సంనియమ్యేతి:- ఇన్ద్రియగ్రామమ్=ఇంద్రియసముదాయమును, సంనియమ్య =నిగ్రహించుకొని,సర్వత్ర=అంతటా,సమబుద్ధయః=సమానబుద్ధి గలవారు,సర్వభూతహితే= సకలప్రాణుల హితమునందు; రతాః=ఆసక్తులు అయిన,తే=ఆ ఉపాసకులు,మామేవ=నన్నే ప్రాప్నువన్తి=పొందుతారు.

భాష్యమ్

సంనియమ్యేతి:-సంనియమ్య సమ్యక్ నియమ్య,సంహృత్య,ఇన్ద్రియగ్రామమ్ ఇన్ద్రియసముదాయం,సర్వత్ర సర్వస్మిన్ కాలే సమబుద్ధయః-సమా తుల్యా బుద్ధిః

యేషామ్ ఇష్టానిష్టాదౌ తే సమబుద్ధయః,తే యే ఏవంవిధాః తే,ప్రాప్నువన్తి మామేవ సర్వభూతహితే రతాః.న తు తేషాం వ్యక్తవ్యం కించిత్ మాం తే ప్రాప్నువన్తీతి.“జ్ఞానీ త్వాత్మైవ మే మతమ్”(7.18)ఇతి హి ఉక్తమ్.న హి భగవత్స్వరూపాణాం సతాం యుక్తతమత్వమ్ అయుక్తతమత్వం వా వాచ్యమ్. 4

బాలానందిని

సంనియమ్యేతి:- ఇంద్రియసముదాయాన్ని బాగుగా అదుపులో ఉంచుకొని,అన్ని కాలాలలోను,ఇష్టానిష్టములు లభించినప్పుడు,సమానమైన బుద్ధి గలవారు,సమస్త భూతముల హితమునందు ఆసక్తి కలవారు అయిన,వాళ్లు(ఆ ఉపాసకులు)నన్నే పొందుతారు.వాళ్లు నన్నే పొందుతారు గాన వాళ్ల విషయంలో చెప్పవలసినది ఏదీ లేదు.“**జ్ఞానీ త్వాత్మైవ మే మతమ్**”(జ్ఞాని మత్స్వరూపుడే)అని చెప్పబడింది కదా?భగవత్స్వరూపులైనవారి విషయంలో యుక్తతము లనీ అయుక్తతము లనీ ఏమీ చెప్పడం ఉండదు కదా?

భాష్యమ్

కిం తు-

మూ. క్లేశో ఽ ధికతరస్తేషామవ్యక్తాసక్తచేతసామ్,
అవ్యక్తా హి గతిర్దుఃఖం దేహవద్భిరవాప్యతే. 5

బాలానందిని

కిం త్వితి:- కాని-

ప్ర.అ. క్లేశ ఇతి:-అవ్యక్తాసక్తచేతసామ్=అవ్యక్త మైన అక్షరమునందు ఆసక్తమైన చిత్తం గల,తేషామ్=వాళ్లకు,క్లేశః=క్లేశము,అధికతరః=అధికమైనది.దేహవద్భిః=దేహాభిమానం గల=మానవులచేత,అవ్యక్తా=అవ్యక్తరూప మైన,గతిః=గతి,దుఃఖమ్=కష్టముగా, అవాప్యతే హి=పొందబడుతుంది కదా?

భాష్యమ్

క్లేశః అధికతరః-యద్యపి మత్కర్మాదిపరాణాం క్లేశః అధికః ఏవ,క్లేశః అధికతరః తు అక్షరాత్మనాం పరమార్థదర్శినాం దేహాభిమానపరిత్యాగనిమిత్తః,అవ్యక్తాసక్తచేతసామ్-అవ్యక్తే ఆసక్తం చేతః యేషాం తే అవ్యక్తాసక్తచేతసః,తేషామ్ అవ్యక్తాసక్తచేతసామ్. అవ్యక్తా హి యస్మాత్,యా గతిః అక్షరాత్మికా,దుఃఖం సా దేహవద్భిః దేహాభిమానవద్భిః అవాప్యతే,అతః క్లేశః అధికతరః.అక్షరోపాసకానాం యద్వర్తనం తత్ ఉపరిష్టాత్ (12.13-20) వక్ష్యామః. 6

బాలానందిని

క్లేశః ఇతి:- క్లేశః అధికతరః-మత్కర్మాదిపరులకు కూడ క్లేశం అధికంగానే ఉంటుంది; అయినా కూడ అక్షరమే ఆత్మగా భావించే పరమార్థజ్ఞానవంతులకు, అవ్యక్తమునందు ఆసక్తమైన చిత్తం కలవాళ్లకు,దేహాభిమానాన్ని పరిత్యజించడంవల్ల క్లేశం అధికతరంగా ఉంటుంది. ఎందువల్ల ననగా-దేహవంతులచేత అనగా దేహాభిమానం కలవాళ్లచేత అక్షరరూపమైన ఏ అవ్యక్త మైన గతి ఉన్నదో అది అతికష్టంచేత పొంద బడుతుంది. అందుచేత వాళ్ల క్లేశం అధికతర మైనది. అక్షరోపాసకుల ప్రవృత్తి ఏ విధంగా ఉంటుందో తరువాత (13-20శ్లోకాలలో)చెప్పగలం. 5

మూ. యే తు సర్వాణి కర్మాణి మయి సంన్యస్య మత్పరాః,
అనన్యేనైవ యోగేన మాం ధ్యాయన్త ఉపాసతే. 6

ప్ర.అ. యే త్వితి:-యే తు=ఎవరైతే,సర్వాణి=సమస్తమైన,కర్మాణి=కర్మలను, మయి=నాయందు,సంన్యస్య=సంన్యసించి,మత్పరాః=నేనే పరుడుగా గలవారై,(నేనే ఉత్తముడను అను బుద్ధి గలవరై),అనన్యేన=మరొకటి ఏదీ లేని,యోగేన=యోగంతో,మామ్ ఏవ=నన్నే,ధ్యాయన్తః=ధ్యానిస్తున్నవారై,ఉపాసతే=ఉపాసిస్తారో-

భాష్యమ్

యే త్వితి:- యే తు సర్వాణి కర్మాణి మయి ఈశ్వరే సంన్యస్య,మత్పరాః అహం పరః యేషాం తే మత్పరాః సన్తః,అనన్యేన ఏవ-అవిద్యమానమ్ అన్యత్ ఆలమ్బనం విశ్వరూపం దేవమ్ ఆత్మానం ముక్త్వా యస్య సః అనన్యః,తేన అనన్యేనైవ, కేన? యోగేన సమాధినా,మాం,ధ్యాయన్తః చిన్తయన్తః ఉపాసతే. 6

బాలానందిని

యే త్వితి:- ఎవరైతే సమస్తకర్మలను ఈశ్వరుడ నైన నాయందు సంన్యసించి,నేనే పరుడనుగా (అత్యుత్తముడనుగా)కలవారై,విశ్వరూపుడు,దేవుడూ అయిన ఆత్మ తప్ప మరొక ఆలంబనం లేని సమాధితో నన్ను ధ్యానిస్తూ ఉపాసిస్తారో-

భాష్యమ్

తేషాం కిమ్?-

మూ. తేషామహం సముద్ధర్తా మృత్యుసంసారసాగరాత్,
భవామి నచిరాత్ పార్థ మయ్యావేశితచేతసామ్. 7

బాలానందిని

తేషామితి:- వాళ్ల కేమిటి?-

ప్ర.అ. **తేషామితి**:- పార్థ=అర్జునా! మయి=నాయందు,ఆవేశితచేతసామ్=ఉంచబడిన చిత్తము గల,తేషామ్=వాళ్లకు,అహమ్=నేను,నచిరాత్=అచిరకాలంలో,మృత్యుసంసారసాగరాత్=మృత్యువుతో కూడిన సంసారసాగరమునుండి,సముద్ధర్తా=ఉద్ధరించు వాడను, భవామి=అవుతున్నాను(అవుతాను).

భాష్యమ్

తేషాం మదుపాసనైకపరాయణానామ్,అహమ్ ఈశ్వరః,సముద్ధర్తా.కుతః ఇత్యాహ- మృత్యుసంసారబన్ధనాత్;మృత్యుయుక్తః సంసారః మృత్యుసంసారః;స ఏవ సాగరః ఇవ సాగరః;దురుత్తరత్వాత్.తస్మాత్ మృత్యుసంసారసాగరాత్,అహం తేషాం సముద్ధర్తా భవామి,న చిరాత్,కిం తర్హి?క్షిప్రమ్ ఏవ, హే పార్థ,మయి ఆవేశితచేతసామ్-మయి విశ్వరూపే ఆవేశితం ప్రవేశితం సమాహితం చేతః యేషాం తే మయ్యావేశితచేతసః,తేషామ్. 7

బాలానందిని

తేషామితి:- నా ఉపాసమునందు ఒక్కదానియందే ఆసక్తు లైనవాళ్లకు,ఈశ్వరుడ నైన నేను ఉద్ధరించేవాడను;దేనినుండో చెపుతున్నాడు-మృత్యుసంసారసాగరాత్-మృత్యువుతో కూడిన సంసారం మృత్యుసంసారం.అదే దాటడానికి కష్టం అవడంవల్ల సాగరం వంటి సాగరం,ఆ మృత్యుసంసారసాగరం నుండి(ఇక్కడ "సః ఏవ సాగరః;సాగర ఇవ దురుత్తరత్వాత్"అను పాఠం ఉండి ఉంటుంది.అర్థంలో భేదం అంతగా లేదు).వాళ్లకు నేను,చిరకాలం కాకుండా,మరేమనగా శీఘ్రంగానే,ఓ!అర్జునా!ఉద్ధరించేవాడను అవుతాను. విశ్వరూపుడనైన నాయందు ప్రవేశపెట్టబడిన,స్థిరంగా నిలపబడిన,చిత్తము గలవాళ్లకు.

భా.అ.ప్ర.:- "మృత్యు వైన సంసార మనే సాగరం నుండి"అను శ్రీరామానుజాచార్యుల వ్యాఖ్య అయుక్తం.మృత్యువు కూడ సంసారంలో అంతర్గతమే గాన సంసారాన్ని మృత్యువుతో పోల్చడం అసంగతం."భక్తులను శీఘ్రంగా తరింపచేస్తాను;జ్ఞానుల నైతే చాలాకాలానికి తరింపచేస్తాను"అను వ్యాఖ్య కూడ యుక్తం కాదు.మోక్షానికి జ్ఞానమే అంతరంగసాధనంగా సంనిహిత మైనది గాన జ్ఞానులకే అచిరకాలంలో మోక్షం లభిస్తుంది, భక్తులకైతే జ్ఞానం ద్వారా క్రమంగా లభిస్తుంది గాన వాళ్లకు మోక్షం చిరకాలానికి లభిస్తుంది అని కదా సిద్ధాంతం?అట్లైతే 'నచిరాత్' అనడం వ్యర్థం కాదా అను అశంకకు తావు లేదు.

కేవలకర్మాపేక్షచేత(కేవలకర్మకంటె)అచిరకాలంలో అని చెప్పడంకోసం ఆ పదం ప్రయోగించ బడింది. యజ్ఞయాగాదికర్మలను చేసేవాళ్లకంటె విశ్వరూపోసకులకు చిత్తశుద్ధి శీఘ్రంగా కలుగుతుంది,తరువాత జ్ఞానం లభిస్తుంది అని భావం.(భా.అ.ప్ర. పే.219 - 210) 7

భాష్యమ్

యతః ఏవం తస్మాత్ -

మూ. మయ్యేవ మన ఆధత్స్వ మయి బుద్ధిం నివేశయ,
నివసిష్యసి మయ్యేవ అత ఊర్ధ్వం న సంశయః. 8

బాలానందిని

యతః ఇతి:- ఇది ఇట్లు కావున-

మయీతి:- మయి ఏవ=నాయందే,మనః=మనస్సును,ఆధత్స్వ=ఉంచుము. మయి=నాయందు,బుద్ధిమ్=బుద్ధిని,నివేశయ=నిలుపుము. **అతః** ఊర్ధ్వమ్=ఇటుపైన, మయ్యేవ=నాయందే,నివసిష్యసి=నివసించగలవు,సంశయః=సంశయము,న=లేదు.

భాష్యమ్

మయ్యేవ విశ్వరూపే ఈశ్వరే,మనః సంకల్పవికల్పాత్మకమ్,ఆధత్స్వ స్థాపయ. మయ్యేవ అధ్యవసాయం కుర్వతీం బుద్ధిమ్,ఆధత్స్వ నివేశయ. తతః తే కిం స్యాదితి శృణు-నివసిష్యసి నివత్స్యసి,నిశ్చయేన మదాత్మనా మయి నివాసం కరిష్యస్యేవ,అతః శరీరపాతాత్ ఊర్ధ్వం న సంశయః, సంశయః అత్ర న కర్తవ్యః. 8

బాలానందిని

మయ్యేవేతి:-విశ్వరూపుడను ఈశ్వరుడను అయిన నాయందే సంకల్పవికల్పాత్మక మైన మనస్సును ఉంచుము.నిశ్చయాన్ని చేసే బుద్ధిని నాయందే నిలుపుము.అప్పుడు నీ కేమి జరుగుతుందో వినుము-శరీరపాతం తరువాత నా రూపంతో నాయందే నిశ్చితంగా (తప్పక)నివసించగలవు.ఈ విషయంలో సందేహం చేయదగినది కాదు. 8

మూ. అథ చిత్తం సమాధాతుం న శక్నోషి మయి స్థిరమ్,
అభ్యాసయోగేన తతో మామిచ్ఛాప్తుం ధనంజయ. 9

ప్ర.అ. అథేతి:-ధనంజయ=అర్జునా!చిత్తమ్=చిత్తమును,మయి=నాయందు,స్థిరమ్ =స్థిరముగా,సమాధాతుమ్=ఏకాగ్రము చేయడానికి,అథ న శక్నోషి=సమర్థుడవు కాకపోతే,

తతః=అప్పుడు,అభ్యాసయోగేన=అభ్యాసయోగంచేత,మామ్=నన్ను,ఆప్తుమ్=పొందుటకు, ఇచ్ఛ=కోరుము.

భాష్యమ్

అథేతి:- అథ ఏవం యథా అవోచం తథా మయి చిత్తం సమాధాతుం స్థాపయితుం,స్థిరమ్ అచలం,న శక్నోషి చేత్,తతః పశ్చాత్,అభ్యాసయోగేన చిత్తస్య ఏకస్మిన్ ఆలమ్బనే సర్వతః సమాహృత్య పునః పునః స్థాపనమ్ అభ్యాసః,తత్పూర్వకః యోగః సమాధానలక్షణః,తేన అభ్యాసయోగేన,మాం విశ్వరూపమ్,ఇచ్ఛ ప్రార్థయస్వ,ఆప్తుం ప్రాప్తుం,హే ధనంజయః. 9

బాలానందిని

అథేతి:- అర్జునా! ఇట్లు ఏ విధంగా చెప్పానో ఆ విధంగా,నాయందు చిత్తమును స్థిరంగా నిలుపుటకు సమర్థుడవు కానిచో,తరువాత(అప్పుడు)అభ్యాసయోగంచేత చిత్తాన్ని ఇతరవస్తువు లన్నింటినుండీ ఉపసంహరించి ఒక ఆలంబనంలో మాటిమాటికీ నిలపడం అభ్యాసం.దాని ద్వారా సంపాదించబడిన చిత్తసమాధానరూప మైన యోగం అభ్యాసయోగం. అట్టి అభ్యాసయోగంచేత విశ్వరూపుడ నైన నన్ను పొందడానికి ప్రార్థించుము(అభిలాష కలవాడవు అగుము).(స్థూలమైన ప్రతిమ,పద్మము మొదలైన వస్తువులను ఎదుట ఉంచుకొని,మనస్సు అనేకవిధాల పరుగెత్తుచున్నా కూడ దానిని మాటి మాటికి వెనుకకు తెచ్చుకొనుచు, ఆ వస్తువునందే ఏకాగ్రంగా ఉండే టట్లు చేయడం అభ్యాసయోగం). 9

మూ. అభ్యాసేఽప్యసమర్థోఽసి మత్కర్మపరమో భవ,
మదర్థమపి కర్మాణి కుర్వన్ సిద్ధిమవాప్స్యసి. 10

ప్రఅ. **అభ్యాసేఽపీతి**:- అభ్యాసేఽపి=అభ్యాసమునందు కూడ,అసమర్థః=అసమర్థుడవు, అసి=అయినట్లయితే,మత్కర్మపరమః=నాకోసం చేసే కర్మలయందు శ్రద్ధ కలవాడవు, భవ=అగుము. మదర్థమ్=నానిమిత్తం,కర్మాణి=కర్మలను,కుర్వన్ అపి=చేస్తూన్నా కూడ, సిద్ధిమ్=సిద్ధిని,అవాప్స్యసి=పొందగలవు.

భాష్యమ్

అభ్యాసేఽపీతి:- అభ్యాసేఽపి,అసమర్థః అశక్తః,అసి తర్హి మత్కర్మపరమః భవ.మదర్థం కర్మ,తత్పరమః మత్కర్మప్రధానః ఇత్యర్థః.అభ్యాసేన వినా మదర్థమ్ అపి కర్మాణి కేవలం కుర్వన్,సిద్ధిం సత్త్వశుద్ధియోగజ్ఞానప్రాప్తిద్వారేణ అవాప్స్యసి. 10

బాలానందిని

అభ్యాసేఽపీతి:- అభ్యాసమునందు కూడ అశక్తుడ వైతే అప్పుడు నాకొరకు చేసే కర్మయే ప్రధానంగా కలవాడవు అగుము. అభ్యాసం లేకపోయినా, నాకొరకై కేవలం కర్మలను చేస్తున్నా అంతఃకరణశుద్ధి, యోగము, జ్ఞానము వీటి ద్వారా సిద్ధిని పొందగలవు.

మూ. అథైతదప్యశక్తోఽసి కర్తుం మద్యోగమాశ్రితః,
సర్వకర్మఫలత్యాగం తతః కురు యతాత్మవాన్. 11

ప్ర. అ. అథేతి:-ఏతదపి=దీనిని కూడ, కర్తుమ్=చేయుటకు, అథ అశక్తః అసి= అశక్తుడ వైతే, మద్యోగమ్=నా యోగమును, ఆశ్రితః=ఆశ్రయించినవాడవై, యతాత్మవాన్= నియతమైన అంతఃకరణం కలవాడవై, తతః=పిమ్మట, సర్వకర్మఫలత్యాగమ్=సర్వకర్మల ఫలముల త్యాగమును, కురు=చేయుము.

భాష్యమ్

అథైతదితి:-అథ పునః ఏతదపి యత్ ఉక్తం మత్కర్మపరత్వం తత్ కర్తుమ్ అశక్తః అసి, మద్యోగమ్ ఆశ్రితః-మయి క్రియమాణాని కర్మాణి సంన్యస్య యత్కరణం తేషామ్ అనుష్ఠానం సః మద్యోగః. తమ్ ఆశ్రితః సన్ సర్వకర్మఫలత్యాగం-సర్వేషాం కర్మణాం ఫలసంన్యాసం సర్వకర్మఫలత్యాగం, తతః అనన్తరం, కురు, యతాత్మవాన్ సంయతచిత్తః ఇత్యర్థః. 11

బాలానందిని

అథేతి:-అట్లు కాక, ఏ మత్కర్మపరత్వం చెప్పబడినదో దీనిని కూడ చేయుటకు అసమర్థుడ వైతే, మద్యోగాన్ని ఆశ్రయించి-చేసే కర్మలను నాయందు సంన్యసించి చేయడం అనేది ఏది ఉన్నదో అది మద్యోగం, దానిని ఆశ్రయించి, సమస్తకర్మల ఫలముల సంన్యాసమును, పిమ్మట, చేయుము; యతాత్ముడవై, నియమించుకొనబడిన చిత్తము కలవాడవై అని అర్థం.

భా. అ. ప్ర.:-మదర్థం కర్మాణి అనగా ఆలయనిర్మాణము, పూలతోటలు పెంచడము, దీపం వెలిగించడము, తుడవడము, నీళ్లు చల్లడము, పూతలు పూయడము, పువ్వులు తీసికొని రావడము, పూజలు నడిపించడము, నామసంకీర్తనము, ప్రదక్షిణము, స్తుతి, నమస్కారము మొదలైన నాకు సంబంధించిన కర్మలు; సర్వకర్మఫలత్యాగం అనగా సూత్రం యజ్ఞాదికర్మల ఫలమైన స్వర్గాదులను విడవడమే అని శ్రీరామానుజాచార్యుల వ్యాఖ్య అయుక్తం. యజ్ఞాది కర్మలు కూడ ఈశ్వరారాధనరూపములే గాన ఆలయనిర్మాణ్మాదుల వలె అవి కూడా ఈశ్వర

కర్మలే. అలా కాకపోతే శ్రుతి ఆలయనిర్మాణాదికర్మలనే విధించి ఉండేది కాని యజ్ఞాదులను విధించేది కాదు. "**త్రైవిద్యా మాం సోమపాః పూతపాపా యజ్ఞైరిష్ట్వా స్వర్గతిం ప్రార్థయన్తే**" ఇత్యాదివాక్యాలచేత భగవద్గీత కూడ యజ్ఞాదికర్మలు ఈశ్వరారాధన రూపములే అని చెపుతున్నది. మరొక విషయ మేమనగా-యజ్ఞాదులకంటె పుష్పాహరణాదులు సుకరమైనవి గాన యజ్ఞాదులు చేయడానికి అశక్తునికే పుష్పాహరణాదులలో అధికారం. అందుచేత "అథైతదప్యశక్తోఽసి"అని అంటూ పుష్పాహరణాదులయందు అశక్తునికి యజ్ఞాదికర్మఫల త్యాగవిధానం అయుక్తం... అంతే కాకుండా ఆలయ నిర్మాణాదులు పూర్త కర్మలు. వాటికి ఫలం చంద్రలోకప్రాప్తి. వాటి ఫలం త్యజించడం అనేది విధించబడలేదు. అందుచేత వాళ్లకు సత్త్వశుద్ధియే కలగదు. అలాంటప్పుడు మోక్షం మాట చెప్పాలా? "**అహ రహః సన్ధ్యాముపాసీత**" "**వసన్తే వసన్తే జ్యోతిషా యజేత**"ఇత్యాది శ్రుతులచేత విధించబడిన సంధ్యాయజ్ఞాదికర్మలను పరిత్యజించి ఆలయనిర్మాణాదికర్మలను స్వీకరిస్తే దుర్గతియే కలుగుతుంది. సంధ్యాదికర్మలు చేస్తూనే ఆలయనిర్మాణాచరణం చేయవచ్చును అనడం కుదరదు; ఈ పనులలో వ్యగ్రుడైనవాడు ఆ పనులు చేయజాలడు; యజ్ఞాదులయందు అధికారం లేనివాళ్లకు పరలోకభోగంకొరకే భగవంతుడు పూర్తకర్మలు విధించి ఉన్నాడు. (భా.అ.ప్ర.పే.221) 11

భాష్యమ్

ఇదానీం సర్వకర్మఫలత్యాగం స్తౌతి-

మూ. **శ్రేయో హి జ్ఞానమభ్యాసాద్ జ్ఞానద్ధ్యానం విశిష్యతే,**
ధ్యానాత్కర్మఫలత్యాగస్త్యాగాచ్ఛాన్తిరనన్తరమ్. **12**

బాలానందిని

ఇదానీమితి:- ఇప్పుడు సర్వకర్మఫలత్యాగాన్ని స్తుతిస్తున్నాడు-

ప్ర.అ.శ్రేయః ఇతి:- అభ్యాసాత్=అభ్యాసకంటె,జ్ఞానమ్=జ్ఞానము,శ్రేయః=ఎక్కువ ప్రశస్యమైనది. జ్ఞానాత్=జ్ఞానంకంటె,ధ్యానమ్=ధ్యానము,విశిష్యతే=విశిష్ట మైనది. ధ్యానాత్ = ధ్యానంకంటె,కర్మఫలత్యాగః=కర్మఫలముల త్యాగం విశిష్టమైనది. త్యాగాత్=కర్మఫల త్యాగంవల్ల,అనన్తరమ్=పిమ్మట(వెంటనే), శాన్తిః=శాంతి లభిస్తుంది.

భాష్యమ్

శ్రేయః హి ప్రశస్యతరం జ్ఞానం,కస్మాత్? అవివేకపూర్వకాత్ అభ్యాసాత్. తస్మాదపి జ్ఞానాత్ జ్ఞానపూర్వకం ధ్యానం విశిష్యతే. జ్ఞానవతః ధ్యానాదపి కర్మఫలత్యాగః విశిష్యతే ఇత్యనుషజ్యతే. ఏవం కర్మఫలత్యాగాత్ పూర్వవిశేషణవతః శాన్తిః ఉపశమః సహేతుకస్య సంసారస్య అనన్తరమేవ స్యాత్,న తు కాలాన్తరమ్ అపేక్షతే.

అజ్ఞస్య కర్మణి ప్రవృత్తస్య పూర్వోపాయానుష్ఠానాశక్తౌ సర్వకర్మణాం ఫలత్యాగః శ్రేయఃసాధనమ్ ఉపదిష్టం,న ప్రథమమేవ. అతః చ **"శ్రేయో హి జ్ఞానమభ్యాసాత్"**ఇతి ఉత్తరోత్తరవిశిష్టత్వోపదేశేన సర్వకర్మఫలత్యాగః స్తూయతే,సంపన్నసాధనానుష్ఠానాశక్తౌ అనుష్ఠేయత్వేన శ్రుతత్వాత్.కేన సాధర్మ్యేణ స్తుతిత్వమ్?**"యదా సర్వే ప్రముచ్యన్తే"** (కఠ.ఉ.6.14)ఇతి సర్వకామప్రహాణాత్ అమృతత్వమ్ ఉక్తం తత్ ప్రసిద్ధమ్.కామాశ్చ సర్వే శ్రౌతస్మార్తకర్మణాం ఫలాని తత్త్యాగే చ విదుషః జ్ఞాననిష్ఠస్య అనన్తరైవ శాన్తిః ఇతి సర్వకామత్యాగసామాన్యమ్ అజ్ఞకర్మఫలత్యాగస్య అస్తి ఇతి తత్సామాన్యాత్ సర్వకర్మ ఫలత్యాగస్తుతిః ఇయం ప్రరోచనార్థా.యథా అగస్త్యేన బ్రాహ్మణేన సముద్రః పీతః ఇతి ఇదానీన్తనాః అపి బ్రాహ్మణాః బ్రాహ్మణత్వసామాన్యాత్ స్తూయన్తే,ఏవం కర్మఫల త్యాగాత్ కర్మయోగస్య శ్రేయఃసాధనత్వమ్ అభిహితమ్. 12

బాలానందిని

శ్రేయః ఇతి:- జ్ఞానము ఎక్కువ ప్రశస్య మైనది కదా?దేనికంటె?వివేకపూర్వకం కాని (అజ్ఞుడు చేసే)అభ్యాసంకంటె.అజ్ఞానంకంటె కూడ జ్ఞానపూర్వక మైన ధ్యానం విశిష్ట మైనది.జ్ఞానంతో కూడిన ధ్యానంకంటె కూడ కర్మఫలత్యాగం విశిష్టము అని అన్వయిస్తుంది. ఈ విధంగా పూర్వవిశేషణా లున్న కర్మఫలత్యాగంవల్ల సహేతుకమైన సంసారముయొక్క (సంసారముయొక్క,దాని కారణమైన అవిద్యాదికముయొక్క కూడ)ఉపశమం వెంటనే కలుగుతుంది.కాలాతరంకొరకు నిరీక్షించదు.

వి:- 'పూర్వవిశేషణవతః'అనేది "కర్మఫలత్యాగాత్"అనేదానికి విశేషణంగా గ్రహిస్తే ధ్యానంకంటె ఉత్తమత్వం అనే విశేషణం గల కర్మఫలత్యాగంవల్ల అని అర్థం."పూర్వ విశేషణవతః"అనేదానిని షష్ఠ్యంతఖా గ్రహించి "నియతచిత్తు డైన పురుషునకు"అని ఆనందగిరివ్యాఖ్యలో అర్థం చెప్పబడింది.మొదటి అర్థం (శ్రీరామరాయకవి చెప్పినది) బాగున్నట్లు కనబడుతున్నది.

ఈ ఘట్టంలో మొదట "మయ్యేవ మన ఆధత్స్వ"ఇత్యాదికంచేత విశ్వరూపోపాసన చెప్పబడింది.తరువాత వరుసగా అది చేయజాలకపోతే అభ్యాసం చెయ్యి,అది చేయజాలక పోతే మత్కర్మపరముడవు అగుము,అదీ చేయజాలకపోతే సర్వకర్మఫలత్యాగం చెయ్యి అని చెప్పబడింది.ఇలా చెప్పినవాటిలో మొదటిది అన్నింటికంటె గొప్పదనీ,రెండవది దానికంటె తక్కువ దని,మూడవది దానికంటె తక్కువదని,నాల్గవది అన్నింటికంటె తక్కువ దనీ చెప్పిన విధానాన్ని పట్టి తెలుస్తూన్నది.అందుచేత ఈ శ్లోకంలో మొదట చెప్పిన మూడింటి కంటె కూడ ఫలత్యాగం గొప్ప దని చెప్పబడుతున్న దని గ్రహించడం యుక్తం కాదు. కాని ఈ

వరుసలో అభ్యాసాన్ని నిర్దేశించడంవల్ల వాటిని గూర్చియే చెపుతున్నా డనే భావం కలగవచ్చు. కాని ఈ శ్లోకంలో చెప్పిన జ్ఞాన-ధ్యానాలు వెనుక చెప్పబడలేదు. అందుచేత వెనుక చెప్పిన వాటితో ఏమీ సంబంధం లేకుండా ఫలత్యాగస్తుతికోసం క్రొత్తవి కొన్ని ఇక్కడ చెప్పబడుతున్నాయి అని గ్రహించడం యుక్తం. అందుచేత ఇక్కడ నున్న అభ్యాసం తొమ్మిదవ శ్లోకంలో చెప్పిన అభ్యాసం కాదు. అందుచేతనే భాష్యకారులు దీనికి "అవివేకపూర్వకాత్ అభ్యాసాత్"అని అర్థం చెప్పారు. అదే విధంగా ఆనందగిరి అభ్యాసశబ్దానికి జ్ఞానంకోసం చేసే శ్రవణాభ్యాసం లేదా, నిశ్చయపూర్వకమైన ధ్యానాభ్యాసం అని అర్థం చెప్పారు. (మొదటి అర్థం యుక్తం). జ్ఞానం అనగా శబ్దయుక్తులచేత ఆత్మను నిశ్చయించడం అని కూడ ఆయన అర్థం చెప్పారు. అందుచేత 8-10శ్లోకాలలో వైకల్పికంగా చెప్పిన నాలుగూ వేరు, ఈ శ్లోకంలో చెప్పినవి వేరు. నాల్గవదిమాత్రం ఒకటే.

అవ.:-కర్మఫలత్యాగం వెంటనే శాంతిని కలిగిస్తుంది అని చెప్పిన పక్షంలో శాంతిని కలిగించేది సమ్యగ్జ్ఞానం మాత్రమే అని చెప్పే శ్రుతిస్మృతులకు ఇది విరుద్ధం కదా అని ఆశంకించుకొని ఇది కేవలము స్తుతికోసం చెప్పినమాటే కాని వాస్తవం కాదు అని సమాధానం చెపుతున్నారు - **అజ్ఞస్యేతి** :- కర్మానుష్ఠానం చేయడం ప్రారంభించిన జ్ఞానరహితుడు పైన చెప్పిన (విశ్వరూపోపాసన-అభ్యాసయోగ - భగవత్కకర్మపర్వత్వము లనే) ఉపాయాలను అనుష్ఠించడానికి అసమర్థుడై నప్పుడు వానికి సర్వకర్మఫలత్యాగమే శ్రేయఃసాధనము అని ఉపదేశించబడినది; అంతే కాని ముందుగానే ఇది ఉపదేశించబడ లేదు. (దీనిని బట్టి ఇది పైవాటి కంటె తక్కువదే అని తెలుస్తూన్నది. కాని అజ్ఞుడైన కర్మప్రవృత్తునికి సర్వకర్మఫలత్యాగంమీద ఆసక్తికలగడంకోసం మాత్రమే) "శ్రేయో హి జ్ఞానమభ్యాసాత్" ఇత్యాదికం చేత ఉత్తరోత్తరోత్తరవిశిష్టత్వోపదేశంచేత (వెనుకటిదానికంటె తరువాతిది ఉత్కృష్టమైనది అని ఉపదేశించడంచేత) సర్వకర్మఫలత్యాగం స్తుతించబడుచున్నది. ఎందువల్ల ననగా సంపన్నములైన (సరియైన) సాధనాలను అనుష్ఠించడానికి శక్తి లేనప్పుడే ఇది అనుష్ఠించాలి అని చెప్పబడుచున్నది. (దీనిని పట్టి ఇది సంపన్నసాధనం కాదు అని స్పష్టం అవుతున్నది గాన ఇది స్తుతి మాత్రమే అని భావం). అయితే ఏ సామ్యంచేత ఇది స్తుతి అని గ్రహించాలి? (అనగా ఒక వ్యక్తిని బృహస్పతి అని స్తుతిస్తున్నామంటే బృహస్పతికీ వీనికీ అత్యధికమేధాశక్తి ఉండడం అనే సామ్యాన్ని పట్టి అలా స్తుతిస్తున్నాం. దీనిని సద్యఃశాంతిదాయకం అని స్తుతిస్తున్నాడంటే సద్యఃశాంతిని ఇచ్చే మరొకదానికీ దీనికీ ఏదో ఒక పోలిక ఉండాలి. అది ఏమిటి అని ప్రశ్న) "యదా సర్వే ప్రముచ్యన్తే" ఇత్యాదిశ్రుతి వాక్యాలు సర్వకామాలూ ఎప్పుడు తొలగిపోతాయో అప్పుడు అమృతత్వం (ముక్తి) కలుగుతుంది అని చెపుతున్నాయి. ఇది శ్రుతిప్రసిద్ధమైన విషయం. కామాః అనగా ("కామ్యన్తే ఇతి కామాః" అను వ్యుత్పత్తి

చేత) శ్రౌతములూ, స్మార్తములూ అయిన సర్వకర్మలఫలాలు. ఆ కర్మఫలాలను త్యజించగానే జ్ఞాననిష్ఠుడైన విద్వాంసునికి వెంటనే శాంతి కలుగుతుంది. అజ్ఞుడు చేసే కర్మఫల త్యాగానికి సర్వకామత్యాగం అనే సామాన్యం, పోలిక) ఉంది గాన దానిని పట్టి ప్రరోచనకొరకై, ఈ సర్వకర్మఫలత్యాగం స్తుతించబడుచున్నది. (జ్ఞానియైన విద్వాంసుడు సర్వకామపరిత్యాగం చేయడంచేత వెంటనే అమృతత్వం పొందుతా డని శ్రుతి చెప్పుచున్నది. ఈ అజ్ఞాని చేసేది కూడ సర్వకర్మఫలపరిత్యాగమే గాన వీనికి కూడ ఆ ఫలం లభిస్తుంది అని కేవలం ఇది స్తుతి మాత్రమే అని అర్థం). పూర్వం బ్రాహ్మణు డైన అగస్త్యుడు సముద్రం త్రాగివేయడంచేత కేవలం బ్రాహ్మణత్వసామ్యంచేత మామూలు బ్రాహ్మణులు కూడ ఏ విధంగా చాలా గొప్ప ప్రభావశాలు లన్నట్లు స్తుతింపబడుతున్నారో అట్లే ఇది కూడ. ఈ విధంగా కర్మఫల త్యాగం ద్వారా కర్మయోగం శ్రేయఃసాధన మని చెప్పబడింది. (అసలు కర్మలు చేయడం ఎందుకు, వాటి ఫలాలు త్యజించడం ఏదుకు; కర్మలే త్యజించవచ్చును కదా అనకూడదు; కర్మలు అనుష్ఠించాలి. వాటి ఫలంమాత్రం త్యజించాలి. ఈశ్వరార్పణబుద్ధితో కర్మల నాచరించడ మనే కర్మయోగం నిఃశ్రేయసకరం అని ఇక్కడ ప్రతిపాదించబడింది అని భావం).

భా.అ.ప్ర. ఇక్కడ శ్రీ రామానుజాచార్యులు ఈ విధంగా వ్యాఖ్యానించారు. "అభ్యాస మనగా భగవత్స్మృతిని అభ్యసించడం. దానికంటె ఆత్మను అపరోక్షరూపంలో ఉన్నది అని తెలుసుకొనడం ఆత్మహితంగాన అది ఎక్కువ శ్రేయస్కరం. జ్ఞానంకంటె ధ్యానం విశిష్టం. ధ్యానంకంటె ఫలం త్యజించి చేసిన కర్మయే విశిష్టం. దాని తరవాత పాపాలు తొలగిపోవడం చేత మనఃశాంతి కలుగుతుంది. మనస్సుశాంతించిన తరవాత ఆత్మధ్యానం సంపన్నం అవుతుంది; ధ్యానంవల్ల ఆత్మ అపరోక్షం అవుతుంది. ఆత్మ అపరోక్షం అయిన తరువాత గొప్ప భక్తి కలుగుతుంది. అందుచేత భక్తియోగాభ్యాసమునందు అశక్తునకు ఆత్మనిష్ఠయే శ్రేయస్కర మైనది. ఆత్మనిష్ఠు డైనా కూడ శాంతమనస్కుడు కాకపోతే వానికి ఆత్మజ్ఞానసహితము, ఫలాభిసంధిరహితమూ అయిన కర్మనిష్ఠయే శ్రేయస్కర మైనది అని అర్థం". ఈ వ్యాఖ్య అసంగత మైనది. విశ్వరూపోపాసన రూప మైన భక్తియోగంకంటె ఆత్మనిష్ఠయే చాల క్లిష్టమైనది అని "క్లేశోఽధికతరస్తేషామవ్యక్తాసక్తచేతసామ్" ఇత్యాదికం చేత చెప్పబడింది. అందుచేత భక్తియోగంకంటె జ్ఞానయోగమే సంపాదించడానికి చాల కష్టమైనది గాన జ్ఞానయోగాసమర్థునికే భక్తియోగంలో అధికారం. ఇది యుక్తమే కూడ. జ్ఞానయోగికి ఆత్మానాత్మవివేకము, అనాత్మలయందు ఆత్మాభిమానాన్ని విడిచి పెట్టడం, కళ్లు మూయడం తెరవడం మొదలైన కర్మలలో కర్తృత్వం దేహానికే కాని నాకు లేదు అనే జ్ఞానం, నాకు కర్తృత్వమే లేదు అని అనుసంధానం చేసుకొంటూ ఉండడం, ప్రపంచం మిథ్య అనే జ్ఞానం ఇత్యాదిగుణాలు ఎన్నో ఉండాలి. నేను విష్ణుశర్మ అనే పేరు గల బ్రాహ్మణుడను; మోక్షం కోసం భగవంతుడైన రామచంద్రుణ్ణి సేవిస్తున్నాను అని అనుకుంటే

చాలు భక్తియోగంలో. దీనిలో దేహాభిమానత్యాగం అవసరం లేదు, ఆత్మానాత్మవివేకం అవసరం లేదు; కర్తృత్వాభిమానాన్ని త్యజించవలసిన పని కూడ లేదు. అందుచేత భక్తియోగం సుకర మైనది. పత్రపుష్పాద్యుపకరణా లెన్నో సంపాదించుకొనవలసిన అవసరం ఉండడంచేత భక్తయోగం దుష్కరమే అన్నట్లయితే – దాని కంటె ఎక్కువ ఉపకరణాలతో చేయదగిన కర్మయోగం దానికంటె కూడ ఎక్కువ దుష్కరం గాన కర్మయోగాసమర్థునికే భక్తియోగంలో అధికారం అని చెప్పవలసి ఉంటుంది. అందుచేత మనఃక్లేశమే క్లేశం కాని కాయక్లేశం క్లేశం కాదు. అలా కాకపోతే కర్మయోగంకంటె కూడ వ్యవసాయం దుష్కరం అని చెప్పవలసి వస్తుంది.

ఈ విధంగా జ్ఞానయోగం దుష్కరం అవడంవల్లనే **"లోకేఽస్మిన్ ద్వివిధా నిష్ఠా పురా ప్రోక్తా మయానఘ, జ్ఞానయోగేన సాంఖ్యానాం కర్మయోగేన యోగినామ్"** అని జ్ఞానులకు జ్ఞానయోగం విధించబడింది. భక్తియోగం కర్మయోగం క్రిందికే వస్తుంది. భగవంతుడు రెండు నిష్ఠలే చెప్పి ఉన్నాడు గాన మూడవ నిష్ఠను కల్పించడం అయుక్తం. అందువల్ల జ్ఞానంయోగాశక్తునికోసమే కర్మయోగం కాని, కర్మయోగాంతర్గతమైన భక్తియోగం గాని శ్రేయఃప్రాప్తిహేతువుగా విధించబడింది గాన భక్తియోగాశక్తునికి జ్ఞానయోగం, జ్ఞానయోగాశక్తునికి కర్మయోగం అని చెప్పడం యుక్తం కాదు. భక్తియోగకర్మయోగాలు ఒకటే అయినప్పుడు వాటిలో ఒకటి జ్ఞానంకంటె గొప్ప దని,మరొకటి తక్కువ దని చెప్పడం అయుక్తం.

ఆత్మాపరోక్ష్యంవల్ల (ఆత్మను ప్రత్యక్షంగా తెలుసుకొనడంవల్ల)పరమైన భక్తి కలుగుతుంది అనడం కూడ అయుక్తమే.ఆత్మస్వరూపం ప్రత్యక్షంగా తెలుసుకొన్న విద్వాంసునికి ఆత్మయే ఈశ్వరుడు;వానికి ఆత్మకంటె భిన్నమైన ఈశ్వరుడే లేనప్పుడు భక్తిమార్గానికి అవకాశం ఎక్కడ?అది సేవించేవాడు సేవించబడేవాడు అను భేదంమీద ఆధారపడి ఉంటుంది కదా?ఆత్మకంటె ఈశ్వరుడు వేరే అనడానికి వీలు లేదు.**"జ్ఞానీ త్వాత్మైవ మే మతమ్"**అని భగవంతుడు చెప్పి ఉన్నాడు.అందరికీ ఆత్మ ఈశ్వరుడే.అన్ని భూతాల హృదయప్రదేశాలలో ఉన్నది ఆత్మ.అన్నింటికంటె లోపల ఉన్నవాడు ఈశ్వరుడే గాన ఆ ఈశ్వరుడే ఆత్మ.**"అథ యోఽన్యాం దేవతాముపాస్తే అన్యోఽసావన్యోఽహ మస్మీతి న స వేద యథా పశుః"**(నేను వేరు దేవత వేరు అని ఉపాసన చేసేవాడు అజ్ఞుడు;పశువు వంటివాడు)అని శ్రుతియే భిన్నాత్మజ్ఞానాన్ని నిందిస్తూన్నది.అందుచేత భిన్నాత్మజ్ఞానంవల్ల ఏర్పడిన ఈ భక్తియోగం అజ్ఞులకోసం మాత్రమే ఉద్దేశింపబడినది.**"తరతి శోకమాత్మవిత్"**(ఆత్మను తెలుసుకొన్నవాడు శోకాన్ని దాటుతాడు)అని శ్రుతి ఆత్మాపరోక్ష్యజ్ఞానంవల్లనే సంసారనివృత్తి అని చెపుతూండగా భక్తి జ్ఞానంకంటె పరం ఎలా అవుతుంది? జ్ఞానం లేకుండా భక్తిచేత సంసారం నివర్తించదుగాన భక్తిజ్ఞానంకంటె అపరమే కాని పరం కాదు.సంసారం అజ్ఞానంచేత

ఏర్పడినది;అది నశించాలంటే జ్ఞానం ఒక్కడే మార్గం. ఆత్మజ్ఞానంవల్ల ఆత్మానందం మాత్రమే లభిస్తుంది,భక్తిచేతనైతే బ్రహ్మానందం లభిస్తుంది అనడం యుక్తం కాదు. ఎందువల్లననగా ఆత్మానందమే బ్రహ్మానందం. నిజానికి భక్తునికి బ్రహ్మానందం లభించనే లభించదు. భక్తిదశలో భక్తునికి తాను కల్పించుకొన్న విశ్వరూపాన్ని అనుభవించడంవల్ల కలిగే ఆనందం మాత్రమే లభిస్తుంది. అది మాయాకల్పితమే. అందుచేత అనిత్యం. బ్రహ్మ నిత్యం గాన బ్రహ్మానందం నిత్య మైనది. అందుచేతనే ఫలాన్ని పట్టి జ్ఞానయోగం గొప్పది గాన దుష్కరమే అయినా దీనియందు జ్ఞానులు ప్రవర్తిస్తున్నారు. దుష్కరం అవడంవల్లనే ఇది జానులకు మాత్రమే సాధ్య మైనది. అజ్ఞులు దుష్కర మైనదానిని చేయజాలరు;ప్రాజ్ఞులు మాత్రమే చేయగలుగుతారు. అందువల్ల జ్ఞానులకై ఉద్దిష్టమైన జ్ఞానయోగంకంటె అజ్ఞులకోసం ఉద్దిష్టమైన భక్తియోగం ఏవిధంగానూ కూడ ఉత్కృష్టంకాదు; అపకృష్టమే. అందుచేత జ్ఞానయోగం విషయంలో శక్తుడు కానివానికే భక్తియోగం అనేది నిశ్చితం.

ఆత్మనిష్ఠునకు కూడ కర్మనిష్ఠయే శ్రేయస్కరం అని చెప్పినది కూడ యుక్తం కాదు. ఆత్మనిష్ఠా-కర్మనిష్ఠలు ఒకనిలో ఉండజాలవు. సర్వకర్మలను విడచినవానికే ఆత్మనిష్ఠలో అధికారం. సంన్యసించినవానికి ఇంక కర్మనిష్ఠతో సంబంధం కుదరదు. ఆత్మనిష్ఠకు యోగ్యత లేక విక్షిప్తమైన చిత్తం గల అజ్ఞునికొరకు మాత్రమే చిత్తశుద్ధినిమిత్తం కర్మనిష్ఠ విధించ బడింది. ఆత్మనిష్ఠుడు ఆత్మనిష్ఠచేతనే కృతకృత్యు డవుతాడు. జ్ఞానియే ఆత్మనిష్ఠుడు గాన వానికి కర్మాధికారం లేదని వేదావినాశినం ఇత్యాది శ్లోకభాష్యాదులలో వెనుకనే స్థాపించ బడింది. అందుచేత ఆత్మనిష్ఠాప్రాప్తికి అర్హుడు కాని అజ్ఞునకు మాత్రమే కర్మనిష్ఠ మంచిది అనే విషయం నిశ్చితం.

ఫలత్యాగంవల్ల మనఃశాంతి,మనఃశాంతివల్ల ఆత్మధ్యానం,ఆత్మధ్యానంవల్ల ఆత్మా పరోక్ష్యత్వం, ఆత్మాపరోక్షత్వంవల్ల భక్తి కలుగుతాయి అని చెప్పినది కూడ అయుక్తమే. ఆత్మాపరోక్షత్వంవల్ల భక్తి కలుగుతుంది అనే విషయం పైన నిరాకరించబడింది. ఆత్మా పరోక్షత్వం ఆత్మధ్యానంవల్ల మాత్రమే కలుగుతుం దనడం యుక్తం కాదు. ఆత్మోపాసనం చేయకపోయినా శ్రవణాదులవల్ల కూడా ఆత్మసాక్షాత్కారం కలుగుతుంది కదా? ఆత్మధ్యానం శ్రవణాదులయందు అశక్తుడైన అనుత్తమునికే విధించబడింది. ఉత్తమాధికారుల కైతే శ్రవణాదికమే విధించబడింది. మూలంలో-"త్యాగాచ్ఛాన్తిరనన్తరమ్"అని చెప్పినట్లు శాంతి తరువాత, ధ్యానం తరువాత జ్ఞానం అని క్రమం చెప్పబడలేదు. మరొక విషయ మేమనగా - త్యాగశాంతులకు వలె జ్ఞానధ్యానాలకు ఉపాయోపేయభావం గాని (ఒకటి ఉపాయం రెండవది ఉపేయం అని గాని)కార్యకారణభావం గాని వివక్షిత మైతే ఉపేయమైన (పొందదగిన) జ్ఞానంకంటె ఉపాయమైన ధ్యానం శ్రేష్ఠ మని చెప్పడం,అట్లే శాంతి ద్వారా ధ్యానానికి ఉపాయమైన త్యాగం ఉపేయమైన ధ్యానంకంటె శ్రేష్ఠమని చెప్పడమూ

అయుక్తం.ఉపాయంకంటె ఉపేయం ప్రశస్యతర మైనది కదా?ఉపేయం ప్రశస్యతరం అవడంచేతనే కదా అది లభించగానే ఉపాయాన్ని పరిత్యజిస్తారు?ఉపాయమే ప్రశస్యతర మైతే జనులు ఉపేయాన్ని కోరనే కోరరు.అభ్యాసానికి జ్ఞానం ఉపాయం అనడం కూడ యుక్తం కాదు.ఎందువల్ల ననగా-అభ్యాసం అవివేకపూర్వకమైనది.జ్ఞానం అవివేకాన్ని నశింపజేస్తుంది.

భక్తిమార్గంలో-దృశ్యమైన విశ్వరూపమే ఈశ్వరు డని అనుకొనేవాళ్లకు దానికంటె భిన్నమైన ద్రష్టయైన ఆత్మయొక్క జ్ఞానం కలిగిన తరువాత వాళ్లు విశ్వాత్మకమైన,అనాత్మ యైన దేహంమీద ఆసక్తులు కాజాలరు. సచ్చిదానందరూపము స్వాత్మా అయిన ఈశ్వరుని యందే వారు రక్తు లవుతారు.అందుచేత అభ్యాసంలో ఆత్మానాత్మవివేకం ఉండదు.అందు వల్ల కర్మమార్గంలో ప్రవర్తించే అజ్ఞునకు జ్ఞానమార్గంలో అధికారం ఉండదు గాన, విశ్వ రూపోపాసనాభ్యాసము,ఈశ్వరకర్మపరత్వము అనే ఉపాయాలను అనుష్ఠించే శక్తి కూడ లేదు గాన కర్మఫలత్యాగం మాత్రమే వానికి సుకరం,శాంతికి హేతు వవడంచేత (వానికి) శ్రేయస్కరము అని అర్థమే యుక్తం.(భా.అ.ప్ర.పే.226-227) 12

భాష్యమ్

అత్ర చ ఆత్మేశ్వరభేదమ్ ఆశ్రిత్య విశ్వరూపే ఈశ్వరే చేతఃసమాధానలక్షణం యోగః ఉక్తః,ఈశ్వరార్థం కర్మానుష్ఠానాది చ."అథైతదప్యశక్తో ఽసి"(12.11)ఇతి అజ్ఞాన కార్యసూచనాత్. న అభేదదర్శినః అక్షరోపాసకస్య కర్మయోగః ఉపపద్యతే ఇతి దర్శయతి. తథా కర్మయోగినః అక్షరోపాసనానుపపత్తిం దర్శయతి భగవాన్ "తే ప్రాప్నువన్తి మామేవ" (12.4)ఇతి అక్షరోపాసకానాం కైవల్యప్రాప్తౌ స్వాతన్త్ర్యమ్ ఉక్త్వా ఇతరేషాం పార తన్త్ర్యాత్ ఈశ్వరాధీనతాం దర్శితవాన్ "తేషామహం సముద్ధర్తా"(12-7)ఇతి.యది హి ఈశ్వరస్య ఆత్మభూతాః తే మతాః అభేదదర్శిత్వాత్ అక్షరస్వరూపా ఏవ తే ఇతి సముద్ధరణకర్మవిషయవచనం తాన్ ప్రతి అపేశలం స్యాత్.యస్మాచ్చ అర్జునస్య అత్యన్తమేవ హితైషీ భగవాన్ తస్య సమ్యగ్దర్శనానన్వితం కర్మయోగం భేదదృష్టిమన్తమ్ ఏవ ఉపదిశతి. న చ ఆత్మానమ్ ఈశ్వరం ప్రమాణతః బుద్ధ్వా కస్య చిత్ గుణభావం జగమిషతి కశ్చిత్?విరోధాత్. తస్మాత్ అక్షరోపాసకానాం సమ్యగ్దర్శననిష్ఠానాం సంన్యాసినాం త్యక్తసర్వైషణానాం "అద్వేష్టా సర్వభూతానామ్"ఇత్యాదిధర్మపూగం సాక్షాత్ అమృతత్వకారణం వక్ష్యామీతి ప్రవర్తతే-

మూ. అద్వేష్టా సర్వభూతానాం మైత్రః కరుణ ఏవ చ,
నిర్మమో నిరహంకారః సమదుఃఖసుఖః క్షమీ. 13

బాలానందిని

అత్ర చేతి: -ఇక్కడ-ఆత్మకు ఈశ్వరునకు భేదం ఉన్నట్లు అంగీకరించి విశ్వరూపుడైన ఈశ్వరునియందు చిత్తమును నిలపడం అనే స్వరూపం గల యోగం చెప్పబడింది; ఈశ్వరుని ఉద్దేశించి కర్మానుష్ఠానాదికం కూడ చెప్పబడింది. "**అథైతదప్యశక్తో౽సి**"అని అజ్ఞానముయొక్క కార్యమైన అశక్తిని సూచించడంచేత అభేదదృష్టి గల అక్షరోపాసకునకు కర్మయోగం కుదరదు అని చూపబడినది. అట్లే భగవంతుడు కర్మయోగులకు అక్షరోపాసన కుదరదు అని కూడ చూపుచున్నాడు. "**తే ప్రాప్నువన్తి మామేవ**"అనిఅక్షరోపాసకులకు కైవల్యప్రాప్తివిషయంలో స్వాతంత్ర్యాన్ని(ఇతరసాహాయ్యం అవసరం లేకుండా వాళ్లే కైవల్యం పొందుతారు అని)చెప్పి ఇతరులు మాత్రం ఈశ్వరాధీనులు పరతంత్రులు అని "తేషామహం సముద్ధర్తా"అని అనడం ద్వారా చూపించాడు. వాళ్లు ఈశ్వరుని ఆత్మయే అని ఎప్పుడు అంగీకరింపబడినారో అప్పుడు వాళ్లు అభేదదర్శు లవడంచేత అక్షరరూపులే గాన వాళ్లు సముద్ధరణం అనే క్రియలో విషయం అవుతారు అని అనడం (అనగా ఇతరునిచే ఉద్ధరించబడతారు అని చెప్పడం)అసంగతంగా ఉంటుంది. భగవంతుడు పూర్తిగా అర్జునుని హితాన్ని కోరేవాడు గాన అతనికి సమ్యగ్దర్శనంతో సంబంధం లేని,భేద దృష్టితో కూడిన కర్మయోగాన్నే ("**కురు కర్మైవ తస్మాత్త్వమ్**"ఇత్యాదికంచేత)బోధిస్తున్నాడు. తానే ఈశ్వరుడు అని ప్రమాణాల ద్వారా తెలుసుకొన్నవాడు ఎవ్వడూ కూడ దేనికీ గుణత్వాన్ని పొందడానికి ఇచ్ఛయించడు కదా. (కర్మలు చేసి నట్లయితే కర్మలో కర్తగా ఉండడం ద్వారా చేసేవాడు గుణం (అప్రధానుడు) అవుతాడు. తానే ఈశ్వరు డను జ్ఞానం కలిగినవానికి ఇలాంటి కర్మాచరణం కాని, తద్ద్వారా అప్రధానత్వం పొందడం గాని ఉండదు అని అర్థం). ఎందువల్ల ననగా ఈశ్వరాత్మత్వజ్ఞానమూ కర్మాచరణమూ పరస్పరవిరుద్ధము లైనవి. అందువల్ల- అక్షరోపాసకులు, సమ్యగ్దర్శనవంతులు, సమస్తములైన ఏషణలను విడచిన వారు అయిన సంన్యాసులకు సంబంధించినది,సాక్షాత్తు అమృతత్వానికి(మోక్షానికి) కారణమూ అయిన "**అద్వేష్టా సర్వభూతానామ్**"ఇత్యాదిధర్మ సముదాయాన్ని చెప్పడానికి ఉపక్రమిస్తున్నాడు-

ప్ర. అ. అద్వేష్టా ఇతి: -సర్వభూతానామ్=సమస్తభూతములయొక్క(ఏ ప్రాణినీ కూడ), అద్వేష్టా=ద్వేషించనివాడు,మైత్రః=మైత్రి కలవాడు,కరుణః ఏవ చ=దయావంతుడు,నిర్మమః = మమకారం లేనివాడు,నిరహంకారః=అహంకారం లేనివాడు,సమదుఃఖసుఖః=సమానమైన సుఖదుఃఖాలు కలవాడు. క్షమీ=ఓర్పు కలవాడు.

భాష్యమ్

అద్వేష్టా సర్వభూతానామ్-న ద్వేష్టా అద్వేష్టా ఆత్మనః దుఃఖహేతుమపి న కించిత్ ద్వేష్టి;సర్వాణి భూతాని ఆత్మత్వేన హి పశ్యతి. మైత్రః-మిత్రభావః మైత్రీ. మిత్ర

తయా వర్తతే ఇతి మైత్రః.కరుణః ఏవ చ-కరుణా కృపా దుఃఖితేషు దయా.తద్వాన్ కరుణః, సర్వభూతానామ్ అభయప్రదః సంన్యాసీ ఇత్యర్థః. నిర్మమః-మమప్రత్యయ వర్జితః. నిరహం కారః నిర్గతాహంప్రత్యయః.సమదుఃఖసుఖః.-సమే దుఃఖసుఖే రాగద్వేషయోః అప్రవర్తకే యస్య సః సమదుఃఖసుఖః.క్షమీ-క్షమావాన్ ఆక్రుష్టః అభిహతః వా అవిక్రియః ఏవ ఆస్తే. 13

బాలానందిని

అద్వేష్టేతి:- సకలభూతములకు అద్వేష్ట తనకు దుఃఖాన్ని కలిగించినా కూడ దేనినీ ద్వేషించడు.ఎందువల్ల ననగా సమస్తభూతాలను కూడ అతడు ఆత్మనుగానే చూస్తాడు. మైత్రి అనగా మిత్రత్వం.మిత్రత్వంతో ఉండేవాడు మైత్రుడు.దుఃఖంలో ఉన్నవాళ్లమీద దయ 'కరుణ'.ఆ కరుణ ఉన్నవాడు కరుణుడు.సమస్తప్రాణులకు అభయం ఇచ్చిన (నేను ఏ ప్రాణినీ హింసించను అని శపథం చేసిన)సంన్యాసి అని అర్థం.మమ అనే జ్ఞానం (నాది అనే బుద్ధి)లేనివాడు నిర్మముడు.అహమ్ అనే జ్ఞానం(నేను అను బుద్ధి)లేనివాడు నిరహంకారుడు.దుఃఖము సుఖమూ కూడ సమంగానే చూచేవాడు,అనగా ద్వేషాన్ని పుట్టించే దుఃఖాన్ని,రాగాన్ని పుట్టించే సుఖాన్ని సమంగా చూచేవాడు.ఓర్పు కలవాడు;అనగా నిందింపబడినా కొట్టబడినా ఎట్టి వికారమూ లేకుండా ఉంటాడు.

మూ. సంతుష్టః సతతం యోగీ యతాత్మా దృఢనిశ్చయః,
మయ్యర్పితమనోబుద్ధిర్యో మద్భక్తః స మే ప్రియః. 14

ప్ర.అ. సంతుష్ట ఇతి:- యః=ఎవడు,సతతమ్=ఎల్లప్పుడు,సంతుష్టః=సంతోషంతో ఉంటాడో,యోగీ=యోగియో,యతాత్మా=నిగ్రహించబడిన అంతఃకరణం కలవాడో,దృఢ నిశ్చయః=దృఢమైన నిశ్చయం కలవాడో,మయి=నాయందు,అర్పితమనోబుద్ధిః=ఉంచబడిన మనోబుద్ధులు కలవాడో,సః=అట్టి,మద్భక్తః=నాయందు భక్తి కలవాడు,మే=నాకు, ప్రియః =ఇష్టమైనవాడు.

భాష్యమ్

సంతుష్ట ఇతి:-సంతుష్టః,సతతం నిత్యం దేహస్థితికారణస్య లాభే అలాభే చ ఉత్పన్నాలంప్రత్యయః.తథా గుణవల్లాభే విపర్యయే చ సంతుష్టః సతతం,యోగీ సమా హితచిత్తః,యతాత్మా సంయతస్వభావః,దృఢనిశ్చయః-దృఢః స్థిరః నిశ్చయః అధ్యవసాయః యస్య ఆత్మతత్త్వవిషయే సః దృఢనిశ్చయః,మయి అర్పితమనోబుద్ధిః సంకల్పాత్మకం మనః అధ్యవసాయలక్షణా బుద్ధిః,తే మయ్యేవ అర్పితే స్థాపితే యస్య

సంన్యాసినః సః మయి అర్పితమనోబుద్ధిః,యః ఈదృశః మద్భక్తః సః మే ప్రియః. "ప్రియో హి జ్ఞానినో ఽత్యర్థమహం స చ మమ ప్రియః"(7-17)ఇతి సప్తమే అధ్యాయే సూచితం;తత్ ఇహ ప్రపఞ్చ్యతే. 14

బాలానందిని

సంతుష్ట ఇతి:- దేహస్థితికి కారణ మైన ఆహారాదికం లభించినా లభించక పోయినా చాలులే అను బుద్ధి పుట్టినవాడు,మంచిది లభించినా,దానికి విరుద్ధ మైనది లభించినా ఎల్లప్పుడూ సంతోషంతో ఉండేవాడు,స్థిరంగా నిలవబడిన చిత్తం కలవాడు, నిగ్రహించుకొనబడిన (అదుపులో ఉంచుకొనబడిన)స్వభావం కలవాడు,స్థిరమైన నిర్ణయం కలవాడు,అనగా ఆత్మతత్త్వం విషయంలో దృఢమైన నిశ్చయం కలవాడు,నాయందు సమర్పించబడిన సంకల్పాత్మకమైన మనస్సు నిశ్చయాత్మకమైన బుద్ధీ కలవాడు అట్టి నా భక్తు డైన ఏ సంన్యాసి ఉన్నాడో అతడు నాకు ప్రియుడు."ప్రియో హి జ్ఞానినోఽత్యర్థ మహం స చ మమ ప్రియః"అని సప్తమాధ్యాయంలో సూచించబడినదే ఇక్కడ విస్తృతంగా వర్ణించి చెప్పబడుచున్నది.

భా.అ.ప్ర.:-కర్మనిష్ఠుని ఉపాదేయము లైన గుణాలు అద్వేష్టా ఇత్యాదికంచేత చెప్పబడుచున్నాయి అని శ్రీరామానుజాచార్యుల వ్యాఖ్య అయుక్తం.కర్మయోగులకి నిర్మమత్వం మొదలైనవి ఉండడం అసంభవం.నేను బ్రాహ్మణుడను ఇత్యాదికమైన అభిమానం లేకుండా కర్మలయందు ప్రవృత్తి కుదరదు.మద్భక్తః అను పదానికి "నన్ను కర్మయోగంతో సేవిస్తున్నవాడు"అని అర్థం చెప్పడం అసంగతమే.'కర్మయోగంతో'అని మూలంలో లేని అర్థం కల్పించడానికి ప్రమాణం ఏమీ లేదు."జ్ఞాని నాకు ఇష్టుడు"అని సప్తమాధ్యాయంలో చెప్పిన స్వవాక్యంతో కర్మి నాకు ప్రియుడు అని ఇక్కడ చెప్పే అర్థం విరుద్ధం అవుతుంది. 'సతతం యోగీ"అనుదానికి ప్రకృతికంటె భిన్నమైన ఆత్మను అనుసంధానం చేసికొనడంలో ఆసక్తుడు అను అర్థం చెప్పడం కూడ అయుక్తమే. అక్షరోపాసకుడు చేయ దగిన ప్రకృతి వివిక్తాత్మానుసంధానం కర్ములకు కుదరదు.ఒకే పురుషుడు ఒకే సమయంలో ఆత్మాను సంధానకర్మానుష్ఠానాలు చేయజాలడు.అందుచేతనే-"**లోకేఽస్మిన్ ద్వివిధా నిష్ఠా పురా ప్రోక్తా మయానఘ,జ్ఞానయోగేన సాంఖ్యానాం కర్మయోగేన యోగినామ్**"అని ఇద్దరు అధికారులకు వేరు వేరుగా రెండు నిష్ఠలు చెప్పబడ్డాయి.ఈ ప్రకరణలో కూడ"**ఏవం సతతయుక్తా యే భక్తాస్త్వాం పర్యుపాసతే,యే చాప్యక్షరమవ్యక్తం తేషాం కే యోగవిత్తమాః**" అని భక్తులను ఆత్మోపాసకులను రెండు తరగతులుగా విభజిస్తూ కర్మయోగానికి అధికారులు వేరు అక్షరాత్మానుసంధానానికి అధికారులు వేరు అని చూపబడినది.భక్తులైన కర్మయోగులకే ఆత్మానుసంధానరూప మైన అక్షరోపాసనం చెప్పబడిన ట్లయితే ఆత్మోపాసక - భక్తుల

మధ్య యోగవిత్తము లెవరు అని అర్జునుడు ప్రశ్నించడం శక్యం కాదు.అందువల్ల ఆత్మానుసంధానపరులు కర్మలకంటె భిన్నులే.ఈ విషయం జ్ఞానకర్మసముచ్చయవాద నిరాకరణప్రసంగంలో అనేకపర్యాయాలు విశదీకరించబడినది.(భా.అ.ప్ర.పే.238)14

మూ. యస్మాన్నోద్విజతే లోకో లోకాన్నోద్విజతే చ యః,
హర్షామర్షభయోద్వేగైర్ముక్తో యః స చ మే ప్రియః. 15

ప్ర.అ. **యస్మాదితి**:- యస్మాత్=ఎవనినుండి,లోకః=లోకం,జనం,న ఉద్విజతే= ఉద్వేగమును చెందదో(ఉద్వేగ మనగా విసుగు,ఏవగింపు),యః చ=ఎవడు కూడ, లోకాత్ = లోకంనుండి,నోద్విజతే=ఉద్వేగం చెందడో,యః=ఎవడు,హర్షామర్షభయోద్వేగైః= సంతోష-కోప-ఉద్వేగములతో,ముక్తః=శూన్యుడో,సః చ=అతడు కూడ,మే=నాకు,ప్రియః =ఇష్టుడు.

భాష్యమ్

యస్మాదితి:- యస్మాత్ సంన్యాసినః న ఉద్విజతే న ఉద్వేగం గచ్ఛతి న సంతప్యతే న సంక్షుభ్యతే లోకః,తథా లోకాత్ న ఉద్విజతే చ యః, హర్షామర్ష భయోద్వేగైః - హర్షశ్చ అమర్షశ్చ భయం చ ఉద్వేగశ్చ తైః హర్షామర్షభయోద్వేగైః ముక్తః.హర్షః ప్రియలాభే అన్తఃకరణస్య ఉత్కర్షః రోమాఞ్చనా శ్రుపాతాదిలిఙ్గః అమర్షః అసహిష్ణుతా, భయం త్రాసః, ఉద్వేగః ఉద్విగ్నతా,తైః ముక్తః యః స చ మే ప్రియః. 15

బాలానందిని

యస్మాదితి:-ఏ సంన్యాసినుండి లోకం ఉద్వేగం చెందదో సంతాపం పొందదో, క్షోభ చెందదో,అట్లే ఎవడు లోకంనుండి ఉద్వేగం పొందడో,ప్రియమైనది ఏదైన లభించి నప్పుడు అంతఃకరణంలో కలిగే ఉత్కర్ష(మనస్సు ఉబ్బిపోవడం)దీనికి ఒళ్లు గగుర్పొడవ డము,కన్నీళ్లు రాలడం మొదలైనవి గుర్తు. అమర్షం అనగా(ఇతరుల మంచిని)సహించ లేకపోవడం,ఉద్వేగం అనగా దిగులు.ఈ హర్ష-అమర్ష-భయ-ఉద్వేగాలు లేనివాడు ఎవడో అతడు కూడ నాకు ఇష్టుడు. 15

మూ. అనపేక్షః శుచిర్దక్ష ఉదాసీనో గతవ్యథః,
సర్వారమ్భపరిత్యాగీ యో మద్భక్తః స మే ప్రియః. 16

ప్ర.అ. **అనపేక్ష ఇతి**:- యః=ఎవడు అనపేక్షః=దేనియందూ అపేక్ష(కోరిక) లేని వాడో,శుచిః=పరిశుద్ధుడో,దక్షః=నేర్పరియో, ఉదాసీనః=పక్షపాతం లేనివాడో,గతవ్యథః

=భయం లేనివాడో,సర్వారమ్భపరిత్యాగీ=సమస్తకార్యాలను త్యజించువాడో, మద్భక్తః= నా భక్తుడు సః=అతడు,మే=నాకు,ప్రియః=ఇష్టుడు.

భాష్యమ్

అనపేక్షః ఇతి:-దేహేన్ద్రియవిషయసమ్బన్ధాదిషు అపేక్షావిషయేషు అనపేక్షః నిఃస్పృహః,శుచిః బాహ్యేన అభ్యన్తరేణ చ శౌచేన సంపన్నః,దక్షః ప్రత్యుత్పన్నేషు కార్యేషు సద్యః యథావత్ ప్రతిపత్తుం సమర్థః,ఉదాసీనః న కస్య చిత్ మిత్రాదేః పక్షం భజతే యః స ఉదాసీనః,యతిః,గతవ్యథః గతభయః,సర్వారమ్భపరి త్యాగీ- ఆరభ్యన్తే ఇతి ఆరమ్భాః,ఇహాముత్రార్థఫలభోగార్థాని కామహేతూని కర్మాణి సర్వా రమ్భాః, తాన్ పరిత్యక్తుం శీలమ్ అస్యేతి సర్వారమ్భపరిత్యాగీ యః మద్భక్తః సః మే ప్రియః. 16

బాలానందిని

అనపేక్ష ఇతి:- ఎవడు అపేక్షకు విషయములైన(అపేక్షించబడే)దేహము,ఇంద్రియ విషయాల సంబంధములు మొదలైనవాటియందు అపేక్ష లేనివాడో అనగా స్పృహ(కోరిక) లేనివాడో,బాహ్యమైన శౌచముతోను,అంతఃకరణశౌచముతోను కూడినవాడో,ఏవైన పనులు వచ్చి పడినప్పుడు వెంటనే సమయస్ఫూర్తితో ఉన్నది ఉన్నట్లుగా తెలుసుకొనుటకు సమర్థుడో,మిత్రాదులైన ఎవరి పక్షమునూ అవలంబించడో,పోయిన భయం కలవాడో, ఆరంభించబడేవి ఆరంభాలు.ఇహాముత్రఫలముల భోగంకోసం చేసే, కామం హేతువుగా గల (కామంవల్ల ఆచరించే)కర్మలు సర్వారంభాలు.వాటిని విడిచే స్వభావం గలవాడో సర్వారంభపరిత్యాగియో అట్టి నా భక్తుడు నాకు ప్రియుడు. 16

భాష్యమ్

కిం చ-

మూ. యో న హృష్యతి న ద్వేష్టి న శోచతి న కాఙ్క్షతి,
శుభాశుభపరిత్యాగీ భక్తిమాన్ యః స మే ప్రియః. 17

బాలానందిని

కిం చేతి - మరియు-

ప్ర.అ. **య ఇతి**:- యః=ఎవడు, న హృష్యతి=సంతోషించడో,న ద్వేష్టి=ద్వేషించడో, న శోచతి=విచారించడో,న కాఙ్క్షతి=కోరడో,శుభాశుభపరిత్యాగీ= శుభాశుభకర్మలను త్యజించే

స్వభావం కలవాడో,యః=ఎవడు,భక్తిమాన్=భక్తికలవాడో, సః=అతడు, మే=నాకు,ప్రియః =ఇష్టుడు.

భాష్యమ్

యః న హృష్యతి ఇష్టప్రాప్తౌ,న ద్వేష్టి అనిష్టప్రాప్తౌ,న శోచతి ప్రియవియోగే,న చ అప్రాప్తం కాఙ్క్షతి,శుభాశుభే కర్మణీ పరిత్యక్తుం శీలమ్ అస్యేతి శుభాశుభపరిత్యాగీ, భక్తిమాన్ యః,స మే ప్రియః. 17

బాలానందిని

య ఇతి:- ఎవడు ఇష్ట మైనది లభించినప్పుడు సంతోషించడో,అనిష్టం ప్రాప్తించినప్పుడు ద్వేషించడో,ప్రియ మైనదానితో వియోగం కలిగి నప్పుడు దుఃఖించడో,లభించనిదానిని కోరడో,శుభాశుభకర్మలను త్యజించే స్వభావం కలవాడో,ఎవడు భక్తిమంతుడో అతడు నాకు ప్రియుడు. 17

మూ. సమః శత్రౌ చ మిత్రే చ తథా మానాపమానయోః,
శీతోష్ణసుఖదుఃఖేషు సమః సంగవివర్జితః. 18

ప్ర.అ. సమ ఇతి:- శత్రౌ చ=శత్రువు విషయంలోను,మిత్రే చ=మిత్రుని విషయంలోను,సమః=సమానమైనవాడు,తథా=అట్లే,మానాపమానయోః=మానావమానాలు రెండింటియందు,సమానమైనవాడు,శీతోష్ణసుఖదుఃఖేషు=శీతోష్ణములయందు సుఖదుఃఖాలయందు,సమః=సమానమైనవాడు,సంగవివర్జితః=దేనితోను సంగం లేనివాడు-

భాష్యమ్

సమః ఇతి:- సమః శత్రౌ చ మిత్రే చ,తథా,మానాపమానయోః పూజాపరిభవయోః,శీతోష్ణసుఖదుఃఖేషు సమః సర్వత్ర చ సంగవర్జితః.

బాలానందిని

సమ ఇతి:-శత్రువునందు మిత్రునియందు సమమైనవాడు,పూజ జరిగినా అవమానం జరిగినా సమంగా ఉండేవాడు.శీత-ఉష్ణ-సుఖ-దుఃఖాలలో సముడు,దేనితోను సంగం లేనివాడు- 18

భాష్యమ్

కిం చ-

మూ. తుల్యనిన్దాస్తుతిర్మౌనీ సన్తుష్టో యేన కేన చిత్,
అనికేతః స్థిరమతిర్భక్తిమాన్ మే ప్రియో నరః. 19

బాలానందిని

కిం చేతి:- మరియు-

ప్ర.అ. **తుల్యేతి**:- తుల్యనిన్దాస్తుతిః=సమానమైన నింద స్తుతి కలవాడు, మౌనీ=మౌనం కలవాడు,యేన కేనచిత్=దేనితోనైనా,సంతుష్టః=సంతోషించేవాడు,అనికేతః= నివాసం లేనివాడు,స్థిరమతిః=స్థిర మైన బుద్ధి కలవాడు,భక్తిమాన్=భక్తిమంతుడు అయిన, నరః =నరుడు,మే=నాకు,ప్రియః=ఇష్టుడు.

భాష్యమ్

తుల్యనిన్దాస్తుతిః-నిన్దా చ స్తుతిశ్చ నిన్దాస్తుతీ.తే తుల్యే యస్య సః తుల్యనిన్దాస్తుతిః. మౌనీ మౌనవాన్ సంయతవాక్,సంతుష్టః యేన కేన చిత్ శరీరస్థితిమాత్రేణ;తథా చోక్తమ్-

యేనకేన చిదాచ్ఛన్నో యేన కేన చిదాశితః,
యత్ర క్వచన శాయీ స్యాత్తం దేవా బ్రాహ్మణం విదుః"(శాం.ప.245.12)ఇతి

కిం చ-అనికేతః-నికేతః ఆశ్రయః నివాసః నియతః న విద్యతే యస్య సః అనికేతః 'నాగారే'ఇత్యాదిస్మృత్యన్తరాత్.స్థిరమతిః-స్థిరా పరమార్థవస్తువిషయా మతిః యస్య సః స్థిరమతిః,భక్తిమాన్ మే ప్రియః నరః. 19

బాలానందిని

తుల్యేతి:-నిందాస్తుతులను రెండింటినీ సమంగానే తీసికొనేవాడు,మౌనవంతుడు అనగా వాక్కును నియమించుకొన్నవాడు,ఏది దొరికితే దానితో,శరీరం నిలవడానికి ఉపయోగించేదానిమాత్రంతో 'సంతృప్తి చెందేవాడు, అట్లు చెప్పబడినది-"యేన...విదుః" (ఎవడు)ఏది దొరికితే దానితో శరీరం కప్పుకొంటాడో,ఏది లభిస్తే అది తింటాడో,ఎక్కడనో అక్కడ శయనిస్తాడో అట్టి వానిని దేవతలు బ్రాహ్మణు దని అంటారు",మరియు, నికేతం అనగా ఆశ్రయం,నియతమైన నివాసం లేనివాడు. 'నాగారే'ఇత్యాదిక మైన మరొక స్మృతి ఈ విషయమే చెపుతూన్నది.పరమార్థవస్తువు విషయంలో స్థిరమైన బుద్ధి కలవాడు.అట్టి భక్తిమంతుడైన పురుషుడు నాకు ప్రియుడు.

వి. "న కుడ్యాం నోదకే సంగో న చైలే న త్రిపుష్కరే,
నాగారే నాసనే నాన్నే యస్య వై మోక్షవిత్తు సః".

అని స్మృతివాక్యం.ఎవనికి కుటియందు సంగం ఉండదో,ఉదకమునందు ఉండదో, వస్త్రమునందు ఉండదో,త్రిపుష్కరక్షేత్రమునం దుండదో,గృహమునం దుండదో,ఆసనం మీద ఉండదో,అన్నమునందు ఉండదో అతడే మోక్షం పొందేవాడు అని దీని అర్థం. కుడీ అనేది కుటీకి రూపాంతరం కావచ్చును.పురాణప్రసిద్ధ మైన పుష్కరక్షేత్రమే త్రిపుష్కరం కావచ్చును.

భాష్యమ్

"అద్వేష్టా సర్వభూతానామ్"ఇత్యాదినా అక్షరస్యోపాసకానాం నివృత్తసర్వైషణానాం సంన్యాసినాం పరమార్థజ్ఞాననిష్ఠానాం ధర్మజాతమ్ ఉపక్రాన్తమ్ ఉపసంహ్రియతే-

మూ. యే తు ధర్మ్యామృతమిదం యథోక్తం పర్యుపాసతే,
శ్రద్దధానా మత్పరమా భక్తాస్తేఽతీవ మే ప్రియాః. 20

ఇతి శ్రీమహాభారతే శతసాహస్ర్యాం సంహితాయాం వైయాసిక్యాం
భీష్మపర్వణి
శ్రీమద్భగవద్గీతాసు ఉపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే భక్తియోగో నామ ద్వాదశోఽధ్యాయః

బాలానందిని

అద్వేష్టేతి:- అక్షరమును ఉపాసించేవారు,సమస్తైషణలను విడచినవారు,పరమార్థ జ్ఞాననిష్ఠులూ అయిన సంన్యాసులయొక్క"అద్వేష్టా సర్వభూతానామ్"ఇత్యాదికంచేత ప్రారంభించి చెప్పబడిన ధర్మసముదాయము ఉపసంహరించబడుచున్నది-

ప్ర.అ.యే ఇతి:-ధర్మ్యామృతమ్=ధర్మసంమతము అమృతము అయిన,ఇదమ్= ఈ ధర్మసముదాయమును,యథోక్తమ్=ఇంతవరకూ చెప్పిన విధంగా,యే=ఎవరు,శ్రద్దధానాః =శ్రద్ధావంతులై,విశ్వాసవంతులై,పర్యుపాసతే=అభ్యసిస్తారో,తే=అట్టి మత్పరమాః=నేనే పరముడుగా గల,భక్తాః=భక్తులు,మే=నాకు,అతీవ=ఎక్కువ,ప్రియాః=ఇష్టమైనవారు.

భాష్యమ్

యే తు సంన్యాసినః,ధర్మ్యామృతం-ధర్మాత్ అనపేతం ధర్మ్యం చ తత్ అమృతం చ తత్,అమృతత్వహేతుత్వాత్,ఇదం యథోక్తమ్"అద్వేష్టా సర్వభూతానామ్"ఇత్యాదినా, పర్యుపాసతే అనుతిష్ఠన్తి,శ్రద్దధానాః సన్తః మత్పరమాః యథోక్తః అహమ్ అక్షరాత్మా పరమః నిరతిశయా గతిః,యేషాం తే మత్పరమాః,మద్భక్తాశ్చ ఉత్తమాం పరమార్థ జ్ఞానలక్షణాం భక్తిమ్ ఆశ్రితాః,తే అతీవ మే ప్రియాః "ప్రియో హి జ్ఞానినోఽత్యర్థమ్" (7.17)ఇతి యత్ సూచితం తద్ వ్యాఖ్యాయ ఉపసంహృతం "భక్తాస్తేఽతీవ మే

ప్రియాః" ఇతి. యస్మాత్ ధర్మ్యామృతమ్ ఇదం యథోక్తమ్ అనుతిష్ఠన్ భగవతః విష్ణోః పరమేశ్వరస్య అతీవ మే ప్రియః భవతి తస్మాత్ ఇదం ధర్మ్యామృతం ముముక్షుణా యత్నతః అనుష్ఠేయం విష్ణోః ప్రియం పరం ధామ జిగమిషుణా ఇతి వాక్యార్థః. 20

ఇతి శ్రీ మత్పరమహంస పరివ్రాజకాచార్యగోవిన్దభగవత్పూజ్యపాదశిష్య శ్రీమదాచార్యశ్రీమచ్ఛఙ్కరభగవతః కృతౌ శ్రీభగవద్గీతాభాష్యే భక్తియోగో నామ ద్వాదశోఽధ్యాయః. 12

బాలానందిని

యే త్వితి:- ఏ సంన్యాసు లైతే-ధర్మంనుండి తొలగనిది ధర్మ్యం. అమృతత్వానికి హేతువు గాన అమృతం, ధర్మ్యము అమృతమూ అయినది, **"అద్వేష్టా సర్వభూతానామ్"** ఇత్యాదికంచేత చెప్పబడినది అయిన దీనిని, విశ్వాసము శ్రద్ధ కలవారై, వెనుక చెప్పబడిన అక్షరస్వరూపుడ నైన, నేనే నిరతిశయ మైన(చాలా గొప్పదైన)గతిగా కలవారై ఆచరిస్తారో, మద్భక్తు లైన, అనగా పరమార్థజ్ఞానరూపమైన ఉత్తమమైన భక్తిని ఆశ్రయించిన, వాళ్లు నాకు చాల ప్రియులు. **"ప్రియో హి జ్ఞానినః అత్యర్థమ్"**అని ఏది సూచించబడినదో అది వ్యాఖ్యానించి **"భక్తాస్తేఽతీవ మే ప్రియాః"**అని ఉపసంహరించబడింది. ధర్మ్యామృతమైన దీనిని చెప్పిన విధంగా అనుష్ఠించేవాడు నాకు, అనగా భగవంతుడైన విష్ణువునకు, పరమే శ్వరునకు చాల ప్రియుడు అవుతాడు గాన విష్ణువుయొక్క ప్రియ మైన, పరమైన స్థానాన్ని పొందగోరే ముముక్షువు ధర్మ్యామృతమైన దీనిని యత్నపూర్వకంగా అనుష్ఠించాలి అని వాక్యార్థం.

భా.అ.ప్ర. "అద్వేష్టా" ఇత్యాదికంచేత కర్మయోగి ధర్మాలు చెప్పబడ్డాయి. "యే తు"ఇత్యాదికంచేత భక్తియోగి ధర్మం చెప్పబడుచున్నది అని శ్రీరామానుజాచార్యుల వ్యాఖ్య యుక్తం కాదు. కర్మయోగంలో సర్వారంభపరిత్యాగం అనేది ఏ మాత్రమూ సంభవం కాదు అనే విషయం అందరికీ తెలిసినదే. గృహస్థు డైన కర్మికి అనికేతత్వం కూడ కుదరదు. అట్లే అజ్ఞుడైన కర్మికి ఆత్మచింతనం అసంభవం; అందుచేత "ఆత్మని స్థిరమతిః"అని చెప్పినది కూడ ఆతని విషయంలో కుదరదు. "యే తు"ఇత్యాదిశ్లోకం భక్తులను గూర్చి చెప్పినది అనడం కూడ యుక్తం కాదు; **"ధర్మ్యామృతమిదమ్"**అని 'ఇదమ్'శబ్దంచేత వెనుకచెప్పబడిన అర్థమే పరామర్శింపబడుచున్నది. వెనుక చెప్పినది కర్మియొక్క ధర్మం అని కద నీ అభిప్రాయం?

"యే తు"అని 'తు'శబ్దం ప్రయోగించడంవల్ల, "అతీవ మే ప్రియాః"అని 'అతీవ' శబ్దం ప్రయోగించడంవల్ల వెనుక చెప్పినదానికంటె భిన్నమైన విషయమే ఇక్కడ చెప్పబడు చున్నది అనడం కూడ కుదరదు. ఎందువల్ల ననగా ఇక్కడ 'తు' శబ్దం ఐశ్వరూపోపాసకుల కంటె జ్ఞాని విలక్షణుడు అని చెప్పడంకోసమే ప్రయోగించబడింది. నీకు జ్ఞాని ప్రియుడైతే

నీకు ప్రియతము డెవడు అను శంక కలగగా నాకు జ్ఞానియే ప్రియతముడు,మరొకడు కాదు అని చెప్పడంకోసమే ఇక్కడ 'అతీవ'శబ్దం ప్రయోగించబడినది. ఈశ్వరునికి జ్ఞాని కంటె ఎక్కువ ప్రియమైనవాడు ఎవడూ లేడు కదా.**"జ్ఞానీ త్వాత్మైవ మే మతమ్"**అని చెప్పబడింది. ఆత్మకంటె ప్రియ మైనది మరొకటి లేదనే విషయం సుప్రసిద్ధం. అందుచేత ప్రియ-ప్రియతర-ప్రియతమత్వభేదాల కిక్కడ తావు లేదు.**"జ్ఞానీ త్వాత్మైవ మే మతమ్"** అని చెప్పబడినవాడు భక్తుడే అనడానికి వీలు లేదు;'జ్ఞానీ'అని స్పష్టంగా చెప్పబడుచున్నది గదా? ఇక్కడ 'భక్తాః'అని కూడ చెప్పబడింది కదా అనడానికి వీలు లేదు.**"జ్ఞానీ త్వాత్మైవ మే మతమ్"**,"స చ మమ ప్రియః"అని వెనుక చెప్పినదానికి విరోధం లేకుండా ఉండడం కోసం ఇక్కడ భక్తశబ్దంచేత జ్ఞానినే గ్రహించాలి. (భా.అ.ప్ర.పే.243) 20

"బాలానందిని" అను శ్రీభగవద్గీతాశాంకరభాష్యాంధ్రవ్యాఖ్యానములో

ద్వాదశాధ్యాయం సంపూర్ణం

(ప్రారంభంనుంచి శ్లోకాల సంఖ్య-460)

అథ త్రయోదశోఽధ్యాయః

భాష్యమ్

సప్తమే అధ్యాయే సూచితే ద్వే ప్రకృతీ ఈశ్వరస్య–త్రిగుణాత్మికా అష్టధా భిన్నా అపరా, సంసారహేతుత్వాత్,పరా చ అన్యా జీవభూతా క్షేత్రజ్ఞలక్షణా ఈశ్వరాత్మికా, యాభ్యాం ప్రకృతిభ్యామ్ ఈశ్వరః జగదుత్పత్తిస్థితిలయహేతుత్వం ప్రతిపద్యతే.తత్ర క్షేత్రక్షేత్రజ్ఞలక్షణప్రకృతిద్వయనిరూపణద్వారేణ తద్వతః ఈశ్వరస్య తత్త్వనిర్ధారణార్థం క్షేత్రాధ్యాయః ఆరభ్యతే.అతీతానన్తరాధ్యాయే చ “అద్వేష్టా సర్వభూతానామ్”(12.13) ఇత్యాదినా యావదధ్యాయపరిసమాప్తిః తావత్తత్త్వజ్ఞానినాం సంన్యాసినాం నిష్ఠా యథా తే వర్తన్తే ఇత్యేతదుక్తమ్.కేన పునః తే తత్త్వజ్ఞానేన యుక్తాః యథోక్తధర్మాచరణాద్ భగవతః ప్రియాః భవన్తి ఇత్యేవమర్థః చ అయమ్ అధ్యాయః ఆరభ్యతే–ప్రకృతిశ్చ త్రిగుణాత్మికా సర్వకార్యకరణవిషయాకారేణ పరిణతా పురుషస్య భోగాపవర్గార్థకర్తవ్యతయా దేహేన్ద్రియాద్యాకారేణ సంహన్యతే.సోఽయం సంఘాతః ఇదం శరీరమ్;తదేతత్ శ్రీభగవానువచ

శ్రీభగవానుచ–

మూ. ఇదం శరీరం కౌన్తేయ క్షేత్రమిత్యభిధీయతే,
ఏతద్యో వేత్తి తం ప్రాహుః క్షేత్రజ్ఞ ఇతి తద్విదః.

బాలానందిని

సప్తమ ఇతి:- సప్తమాధ్యాయంలో ఈశ్వరుని రెండు ప్రకృతులు సూచింపబడ్డాయి. వాటిలో త్రిగుణాత్మక మైన,ఎనిమిది విధాలుగా ఉన్న,ప్రకృతి ఒకటి;ఇది సంసారానికి హేతువు అవడంచేత అపరప్రకృతి.క్షేత్రజ్ఞరూప మైనది,జీవుడుగా ఉన్నది,ఈశ్వరరూప మైనది అయిన ప్రకృతి రెండవది;అది పరప్రకృతి.ఈ ప్రకృతులతో ఈశ్వరుడు జగత్తుయొక్క ఉత్పత్తిస్థితిప్రలయాలకు హేతువు అవుతున్నాడు.క్షేత్రము క్షేత్రజ్ఞుడు అను రెండు ప్రకృతులను నిరూపించడం ద్వారా ఆ క్షేత్ర-క్షేత్రజ్ఞులతో కూడిన ఈశ్వరుని తత్త్వాన్ని నిర్ధారణ చేయడంకొరకు క్షేత్రాధ్యాయం ప్రారంభించబడుతూన్నది.గడచిన అనంతరాధ్యాయంలో"అద్వేష్టా సర్వభూతానామ్"అని ప్రారంభించి అధ్యాయసమాప్తి వరకు తత్త్వజ్ఞానం గల సంన్యాసుల నిష్ఠ,వాళ్లు ఏ విధంగా ప్రవర్తిస్తారు అనేది,చెప్పబడింది.వాళ్లు ఏ విధమైన తత్త్వజ్ఞానంతో కూడినవారై,యథోక్తమైన(పైన చెప్పిన విధంగా)ధర్మాన్ని ఆచరించడంవల్ల ఈశ్వరునికి ప్రియు లవుతారో చెప్పడంకోసం కూడ ఈ అధ్యాయం ప్రారంభించబడు చున్నది.సమస్తమైన కార్యాల(దేహాల)కరణాల(ఇంద్రియాల)విషయాల(దృశ్యభోగ్యవస్తువుల) ఆకారాలలో పరిణమించిన త్రిగుణాత్మక(సత్త్వరజస్తమోగుణాత్మకమైన) ప్రకృతి పురుషునకు భోగము అపవర్గము(మోక్షము)సంపాదించవలసి ఉండడంచేత, (అందుకు సాధన మైన)దేహేంద్రియాద్యాకారంలో సంహతం అవుతుంది(కలిసి ఏర్పడు తుంది).ఆ సంఘాతమే ఈ శరీరం.దీనిని గూర్చి భగవంతుడు చెపుతున్నాడు-

భగవంతుడు అన్నాడు -

ప్ర.అ. ఇదమితి:- కౌన్తేయ=అర్జునా!ఇదమ్=ఈ,శరీరమ్=శరీరము,క్షేత్రమితి= క్షేత్రము అని,అభిధీయతే=చెప్పబడుచున్నది.ఏతత్=దీనిని,యః=ఎవడు,వేత్తి=తెలుసు కొంటాడో,తమ్=వానిని,క్షేత్రజ్ఞః ఇతి=క్షేత్రజ్ఞుడు అని, తద్విదః=ఆ క్షేత్రజ్ఞుని గూర్చి తెలిసిన వారు,ప్రాహుః=చెప్పుచున్నారు.

భాష్యమ్

ఇదమితి సర్వనామ్నా ఉక్తం విశినష్టి శరీరమ్ ఇతి. హే కౌన్తేయ!క్షతత్రాణాత్, క్షయాత్,క్షరణాత్,క్షేత్రవద్వా అస్మిన్ కర్మఫలనిర్వృత్తేః క్షేత్రమ్ ఇతి.ఇతి శబ్దః ఏవం శబ్దపదార్థకః.క్షేత్రమ్ ఇతి ఏవం కథ్యతే.ఏతత్ శరీరం క్షేత్రం యః వేత్తి విజానాతి ఆపాదతలమస్తకం జ్ఞానేన విషయీకరోతి స్వాభావికేన ఔపదేశికేన వా వేదనేన విషయీ కరోతి విభాగశః, తం వేదితారం ప్రాహుః కథయన్తి క్షేత్రజ్ఞః ఇతి.ఇతి శబ్దః ఏవం పదార్థకః ఏవ పూర్వవత్.క్షేత్రజ్ఞ ఇతి ఏవమ్ ఆహుః కే?తద్విదః.తౌ క్షేత్రక్షేత్రజ్ఞౌ యే విదన్తి తే తద్విదః.

బాలానందిని

ఇదమితి:– 'ఇది'అని సర్వనామశబ్దంచేత చెప్పబడినదానిని విశేషించి(అదేదో) 'శరీరం'అని చెపుతున్నాడు. ఓ!అర్జునా!క్షయంనుండి(దెబ్బతగలకుండా)రక్షించడంవల్ల లేదా క్షీణించడంవల్ల(నశించడంవల్ల)లేదా క్షరణంవల్ల(తరగి పోవడంవల్ల)లేదా పొలమునందు వలె దీనిలో కర్మఫలము పండడంవల్ల ఈ శరీరం–'ఇతి'శబ్దానికి 'ఏవం'అను పదానికి ఏ అర్థమో ఆ అర్థం – క్షేత్రం అని చెప్పబడుచున్నది. ఈ శరీరాన్ని,క్షేత్రాన్ని,ఎవడు పాదాలనుండి శిరస్సు వరకు తన జ్ఞానానికి విషయం చేసుకుంటాడో,(తెలుసుకొంటాడో) సహజంగా కలిగిన లేదా ఉపదేశంవల్ల కలిగిన జ్ఞానంచేత ఏ విభాగానికి ఆ విభాగం విషయంగా చేసుకొంటాడో,అట్టి వేదితను(తెలుసుకునేవానిని)క్షేత్రజ్ఞుడు అని,వెనుకవలె ఇక్కడ కూడ ఇతి శబ్దం ఏవంశబ్దార్థం గలది–అంటున్నారు. ఎవరు?తద్విదులు. క్షేత్రక్షేత్రజ్ఞులను ఎవరు ఎరుగుదురో వారు. 1

భాష్యమ్

ఏవం క్షేత్రక్షేత్రజ్ఞౌ ఉక్తౌ. కిమ్ ఏతావన్మాత్రేణ జ్ఞానేన జ్ఞాతవ్యౌ ఇతి?న ఇత్యుచ్యతే–

మూ. క్షేత్రజ్ఞం చాపి మాం విద్ధి సర్వక్షేత్రేషు భారత,
క్షేత్రక్షేత్రజ్ఞయోర్జ్ఞానం యత్తద్ జ్ఞానం మతం మమ. 2

బాలానందిని

క్షేత్రేతి:–క్షేత్రక్షేత్రజ్ఞులు చెప్పబడ్డారు. అయితే వాళ్లు ఇంత మాత్రం జ్ఞానం చేతనే తెలియదగినవారా?(వాళ్లని గూర్చి తెలుసుకొనవలసినది ఇంతేనా?) కాదు అని చెప్పబడు చున్నది–

ప్ర. అ. క్షేత్రేతి:– భారత=అర్జునా!సర్వక్షేత్రేషు=సమస్తశరీరాలలోను ఉన్న,క్షేత్రజ్ఞం చాపి=క్షేత్రజ్ఞుణ్ణి కూడ,మామ్=నన్నుగా,విద్ధి=తెలుసుకొనుము. క్షేత్రక్షేత్రజ్ఞయోః=క్షేత్రక్షేత్ర జ్ఞులయొక్క, యత్=ఏ,జ్ఞానమ్=జ్ఞాన మున్నదో, తత్=అదే,జ్ఞానమ్=జ్ఞానముగా,మమ= నాకు,మతమ్=అంగీకరించబడినది.

భాష్యమ్

క్షేత్రజ్ఞం యథోక్తలక్షణం చాపి మాం పరమేశ్వరమ్ అసంసారిణం,విద్ధి జానీహి. సర్వక్షేత్రేషు యః క్షేత్రజ్ఞః బ్రహ్మాదిస్తమ్బపర్యన్తానేకక్షేత్రోపాధిప్రవిభక్తః తం నిరస్తసర్వో పాధిభేదం సదసదాదిశబ్దప్రత్యయాగోచరం విద్ధి ఇత్యభిప్రాయః. హే!భారత!యస్మాత్

క్షేత్రక్షేత్రజ్ఞేశ్వరయాథాత్మ్యవ్యతిరేకేణ న జ్ఞానగోచరమ్ అన్యత్ అవశిష్టమ్ అస్తి తస్మాత్ క్షేత్రక్షేత్రజ్ఞయోః జ్ఞేయభూతయోః జ్ఞానం క్షేత్రక్షేత్రజ్ఞౌ యేన జ్ఞానేన విషయీక్రియేతే తద్ జ్ఞానం,సమ్యగ్జ్ఞానమ్ ఇతి మతమ్ అభిప్రాయః,మమ ఈశ్వరస్య విష్ణోః.

బాలానందిని

క్షేత్రజ్ఞమితి:- చెప్పబడిన లక్షణాలు గల క్షేత్రజ్ఞుణ్ణి నన్నుగా,సంసారరహితుడైన ఈశ్వరునిగా తెలుసుకొనుము.(క్షేత్రజ్ఞుడు(జీవుడు)అసంసారి యైన పరమేశ్వరుడే అని తెలుసుకొనుము).ఏ క్షేత్రజ్ఞుడు అన్ని క్షేత్రాలలో ఉన్నాడో.బ్రహ్మ మొదలు స్తంబం వరకు ఉన్న అనేకశరీరా లనే ఉపాధులచే విభక్తుడై (వేరు వేరుగా కనబడుచు)ఉన్నాడో ఆ క్షేత్రజ్ఞుడే సర్వోపాధిభేదాలు తొలగిపోగానే 'సత్''అసత్'మొదలైన శబ్దాలవల్ల కలిగే జ్ఞానానికి గోచరం కానివాడు అని తెలుసుకొనుము అని అభిప్రాయం.(దృశ్యమైనదానిని 'సత్'అన వచ్చు.ఆత్మ దృశ్యం కాదు.అందుచేత దాని విషయంలో 'సత్'అను శబ్దం ప్రయోగించడానికి కుదరదు. లేదనడానికి వీలు లేదు గాన 'అసత్'శబ్దం కూడ దాని విషయంలో ప్రయోగించబడదు అని అర్థం).అర్జునా!క్షేత్రము,క్షేత్రజ్ఞుడు,ఈశ్వరుడు ఈ త్రయముయొక్క యథార్థస్వరూపం కాక జ్ఞానానికి గోచరమైన మరేదీ మిగలలేదు గాన జ్ఞేయము లైన క్షేత్రక్షేత్రజ్ఞుల ఏ జ్ఞానం ఉన్నదో,ఏ జ్ఞానం క్షేత్రక్షేత్రజ్ఞులను తనకు విషయంగా తెలుసు కొంటుందో ఆ జ్ఞానమే సమ్యగ్జ్ఞానము అని ఈశ్వరుడను,విష్ణువును అయిన నా అభిప్రాయం.

భాష్యమ్

నను సర్వక్షేత్రేషు ఏక ఏవ ఈశ్వరః న అన్యః తద్వ్యతిరిక్తః భోక్తా విద్యతే చేత్ తతః ఈశ్వరస్య సంసారిత్వం ప్రాప్తమ్;ఈశ్వరవ్యతిరేకేణ వా సంసారిణః అన్యస్య అభావాత్ సంసారాభావప్రసంగః;తచ్చ ఉభయమ్ అనిష్టమ్;బన్ధమోక్షతద్ధేతుశాస్త్రానర్థక్యప్రసంగాత్,ప్రత్యక్షాదిప్రమాణవిరోధాచ్చ.ప్రత్యక్షేణ తావత్ సుఖదుఃఖతద్ధేతులక్షణః సంసారః ఉపలభ్యతే.జగద్వైచిత్ర్యాచ్చ ధర్మాధర్మనిమిత్తః సంసారః అనుమీయతే.సర్వమ్ ఏతత్ అనుపపన్నమ్ ఆత్మేశ్వరైకత్వే.

బాలానందిని

నన్వితి:-(పూర్వపక్షం) అన్ని క్షేత్రాలలోను ఒకే ఈశ్వరుడు ఉన్నాడు;ఈశ్వరుని కంటె భిన్ను డైన భోక్త యైనవాడు ఎవడూ లేడు అన్నట్లయితే అప్పుడు ఈశ్వరుడు సంసారి అని చెప్పవలసి వస్తుంది;లేదా-ఈశ్వరునికంటె వేరుగా మరొక సంసారి ఎవడూ లేకపోవడంచేత సంసారమే లేదని చెప్పవలసివస్తుంది.రెండు పక్షాలూ అనిష్టములే; ఎందువల్ల ననగా బంధాన్ని గూర్చి,మోక్షాన్ని గూర్చి, బంధమోక్షాల హేతువులను గూర్చి చెప్పే శాస్త్రం

వ్యర్థం అయిపోతుంది.ప్రత్యక్షాదిప్రమాణాలతో విరోధం ఏర్పడుతుంది. (ప్రత్యక్షానుమానాది ప్రమాణాలకు విరుద్ధంగా చెప్పిన ట్లవుతుంది).సుఖము,దుఃఖము,వాటి కారణాలూ ఏతద్రూప మైన సంసారం ప్రత్యక్షంగా కనబడుచున్నది.జగత్తులో వైచిత్ర్యం కనబడడంచేత సంసారం ధర్మాధర్మములు నిమిత్తంగా గలది అని అనుమానం చేయబడుతుంది.ఆత్మ-ఈశ్వరైకత్వం అంగీకరిస్తే ఇదంతా అనుపపన్నం అవుతుంది.

వి:-జగత్తులో వైచిత్ర్యం కనబడుతున్నది.ఈ వైచిత్ర్యానికి కారణం ఏదో ఉండాలి. ఆ కారణం ఏమనగా ధర్మాధర్మాలే అని అనుమానప్రమాణంచేత ధర్మాధర్మాలు ఉన్నట్లు తెలుస్తూన్నది.ధర్మాధర్మాలను పట్టి జగత్తు ఉండా లని కూడ అనుమానప్రమాణంచేతనే తెలుస్తూన్నది అని భావం.

భాష్యమ్

న;జ్ఞానాజ్ఞానయోః అన్యత్వేన ఉపపత్తేః-"దూరమేతే విపరీతే విషూచీ అవిద్యా యా చ విద్యేతి జ్ఞాతా"(కఠ.ఉ.2.4).తథా చ తయోః విద్యావిద్యయోః ఫల భేదోఽపి విరుద్ధః నిర్దిష్టః-"శ్రేయశ్చ ప్రేయశ్చ"(కఠ.ఉ.2.2)ఇతి.విద్యావిషయః శ్రేయః, ప్రేయస్తు అవిద్యాకార్యమ్ ఇతి.తథా చ వ్యాసః-"ద్వావిమావథ పన్థానౌ" (శాం.ప. 240-6)ఇత్యాది "ఇమౌ ద్వావేవ పన్థానౌ"ఇత్యాది చ.ఇహ చ ద్వే నిష్ఠే ఉక్తే.అవిద్యా చ కార్యేణ సహ హాతవ్యా ఇతి శ్రుతిస్మృతిన్యాయేభ్యః అవగమ్యతే.శ్రుతయః తావత్-"ఇహ చేదవేదీదథ సత్యమస్తి న చేదిహావేదీన్మహతీ వినష్టిః "(కే.ఉ.2.5)"తమేవం విద్వానమృత ఇహ భవతి నాన్యః పన్థా విద్యతేఽయనాయ" (పురుషసూక్తే.తై.ఆ.3.12;శ్వే.ఉ.3.8), "విద్వాన్న బిభేతి కుతశ్చన" (తై.ఉ.2.4). అవిదుషః తు-"అథ తస్య భయం భవతి" (తై.ఉ.2-7),"అవిద్యాయామన్తరే వర్త మానాః"(కఠ.ఉ.2-5)"బ్రహ్మ వేద బ్రహ్మైవ భవతి"(ము.ఉ.3-2-9),"అన్యోఽ సావన్యోఽహ మస్మీతి న స వేద యథా పశురేవం స దేవానామ్" (బృ.ఉ.1-4-10) ఆత్మవిత్ యః-"సః సర్వంభవతి"(బృ.ఉ.1-4-10) "యదా చర్మవత్"(శ్వే.ఉ.6-20) ఇత్యాద్యాః సహస్రశః.స్మృతయశ్చ-"అజ్ఞానేనావృతం జ్ఞానం తేన ముహ్యన్తి జన్తవః "(5.15),"ఇహైవ తైర్జితః సర్గో యేషాం సామ్యే స్థితం మనః"(5.25),"సమం పశ్యన్ హి సర్వత్ర"(13-18)ఇత్యాద్యాః.

బాలానందిని

నేతి:-(సిద్ధాంతి) ఈ దోషం లేదు.జ్ఞానము అజ్ఞానము వేరు వేరు గాన ఇది కుదురుతుంది.(ఈశ్వరుడు)ఒక్కడే అయినా అవిద్యవల్ల సంసారిత్వము విద్యవల్ల

అసంసారిత్వము అను విభాగం ఉన్నది గాన అనుపపత్తి ఏదీ లేదు). "దూరమ్... జ్ఞాతా" (అవిద్య విద్య అని ఏవి చెప్పబడుచున్నవో ఇవి అత్యంతవిరుద్ధ మైనవి,వేరు వేరు మార్గాలు గలవి)అని చెప్పబడినది. ఈ విద్యావిద్యలకు శ్రేయస్సు ప్రేయస్సు అని విరుద్ధమైన వేరు వేరు ఫలాలు కూడ చెప్పబడినవి. విద్యావిషయం శ్రేయస్సు,అవిద్యవల్ల కలిగేది ప్రేయస్సు. అట్లే వ్యాసుడు కూడ"ఇవి రెండు మార్గాలు" ఇత్యాది విధంగాను,"ఈ రెండే మార్గాలు" ఇత్యాదివిధంగాను చెప్పి ఉన్నాడు. ఇక్కడ కూడ రెండు నిష్ఠలు చెప్పబడ్డాయి. విద్య చేత అవిద్యను తొలగించుకోవాలి అని శ్రుతి-స్మృతి-న్యాయాల ద్వారా తెలుస్తూన్నది. ముందుగా శ్రుతులు-"ఇహ... వినష్టిః"(ఇక్కడనే, ఈ దేహంలోనే, తత్త్వాన్ని తెలుసుకొన్నట్ల యితే సత్యం ఉంది, పునరావృత్తిరహిత మైన కైవల్యం ఉంది;ఈ శరీరం ఉండగానే తత్త్వాన్ని తెలుసుకొనక పోతే గొప్ప నష్టం కలగుతుంది),"**తమేవం... అయనాయ**"(ఆత్మను తెలుసుకొన్నవాడు ఇక్కడనే ముక్తు డవుతాడు;ముక్తికి మరొక మార్గం లేదు),"విద్వాన్... కుతశ్చన"(విద్వాంసుడు దేనినుండీ భయపడడు),అవిద్వాంసునకైతే"**అథ..భవతి**"(భయం కలుగుతుంది); "**అవిద్యాయామన్తరే వర్తమానాః**"(అవిద్యలో పడి కొట్టుకొంటున్నవాళ్లై)- "బ్రహ్మ వేద బ్రహ్మైవ **భవతి**"(బ్రహ్మను తెలుసుకొన్నవాడు బ్రహ్మయే అవుతాడు),"అన్యః ... దేవానామ్"(ఈ పూజింపబడే దేవుడు వేరు నేను వేరు అనుకొనేవాడు సరిగా తెలుసు కొనుటలేదు. వాడు దేవతలకు పశువువంటివాడు),ఎవరైతే ఆత్మవేత్తయో-"స ఇదం సర్వం భవతి"(అతడు ఇదంతా అవుతాడు(సర్వజగద్రూపు డవుతాడు)"యదా చర్మవత్", (మానవుడు ఆకాశాన్ని చర్మను చుట్టినట్లు ఏ విధంగా చుట్టలేడో అట్లే ప్రత్యగాత్మను పరమాత్మగా తెలుసుకొనకుండా ముక్తుడు" కాజాలడు)ఇత్యాది శ్రుతివాక్యాలు వేలకొలది ఉన్నాయి. "**అజ్ఞానేనన.... జన్తవః**","ఇహైవ....మనః","సమం పశ్యన్ హి సర్వత్ర"ఇత్యాదిస్మృతులు కూడ ఉన్నాయి.

భాష్యమ్

న్యాయతశ్చ-

"సర్పాన్ కుశాగ్రాణి తథోదపానం జ్ఞాత్వా మనుష్యాః పరివర్జయన్తి,

అజ్ఞానతస్తత్ర పతన్తి కేచిద్ జ్ఞానే ఫలం పశ్య యథా విశిష్టమ్"

(శాం.ప.చి.201.16) తథా చ దేహాదిషు ఆత్మబుద్ధిః అవిద్వాన్ రాగద్వేషాదిప్రయుక్తః ధర్మాధర్మానుష్ఠానకృత్ జాయతే మ్రియతే చ ఇత్యవగమ్యతే. దేహాదివ్యతిరిక్తాత్మదర్శినః రాగద్వేషాదిప్రహాణాపేక్ష ధర్మాధర్మప్రవృత్త్యుపశమనాత్ ప్రముచ్యన్తే ఇతి న కేన చిత్ ప్రత్యాఖ్యాతుం శక్యం న్యాయతః. తత్ర ఏవం సతి క్షేత్రజ్ఞస్య ఈశ్వరస్యైవ సతః అవిద్యాకృతోపాధిభేదతః సంసారిత్వమివ భవతి,యథా దేహాద్యాత్మత్వమ్ ఆత్మనః. సర్వజన్తూనాం హి ప్రసిద్ధః దేహాదిషు అనాత్మసు ఆత్మభావః నిశ్చితః అవిద్యా

కృతః, యథా స్థాణౌ పురుషనిశ్చయః. న చ ఏతావతా పురుషధర్మః స్థాణోః భవతి, స్థాణుధర్మో వా పురుషస్య;తథా న చైతన్యం ధర్మః దేహస్య, దేహధర్మో వా చేతనస్య, సుఖదుఃఖమోహాత్మకత్వాదిః ఆత్మనః న యుక్తః అవిద్యాకృతత్వావిశేషాత్, జరామృత్యువత్. న;అతుల్యత్వాత్ ఇతి చేత్-స్థాణుపురుషౌ జ్ఞేయౌ ఏవ సన్తౌ జ్ఞాత్రా అన్యోన్యస్మిన్ అధ్యస్తౌ అవిద్యయా;దేహాత్మనోః తు జ్ఞేయజ్ఞాత్రోః ఏవ ఇతరేతరేతరాధ్యాసః ఇతి న సమః దృష్టాన్తః;అతః దేహధర్మః జ్ఞేయః అపి జ్ఞాతుః ఆత్మనః భవతి ఇతి చేత్-న; అచైతన్యాదిప్రసంగాత్.యది హి జ్ఞేయస్య దేహాదేః క్షేత్రస్య ధర్మాః సుఖదుఃఖమోహేచ్ఛాదయః జ్ఞాతుః భవన్తి తర్హి జ్ఞేయస్య క్షేత్రస్య ధర్మాః కేచన ఆత్మనః అవిద్యాధ్యారోపితాః, జరామరణాదయస్తు న భవన్తి ఇతి విశేషహేతుః వక్తవ్యః. న భవన్తి ఇత్యస్తి అనుమానమ్ అవిద్యాధ్యారోపితత్వాత్,జరాదివత్ ఇతి;హేయత్వాత్ ఉపాదేయత్వాచ్చ ఇత్యాది.

బాలానందిని

న్యాయతశ్చేతి:-(అనర్థాలు నశించడం విద్యకు ఫలం.అనర్థం కలగడం అవిద్యకు ఫలం అనే విషయం)న్యాయంవల్ల(అన్వయవ్యతిరేకాలవల్ల)కూడ తెలుస్తూన్నది. "సర్పాన్... విశిష్టమ్"(మనుష్యులు (దారిలో ఉన్న)సర్పాలను,దర్భల ముళ్లను,నీళ్లు ఉన్న ప్రదేశాలను తెలుసుకొనడంవల్ల వాటిని దూరంగా పరిహరిస్తున్నారు.అవి తెలియకపోతే వాటిమీద పడుతున్నారు.జ్ఞానానికి ఎంత విశిష్ట మైన ఫలం ఉన్నదో తెలుసుకో)అని జ్ఞానవైశిష్ట్యం, జ్ఞానం ఉంటే లాభం లేకపోతే నష్టం చెప్పబడ్డాయి.అట్లే దేహాదులయందు ఆత్మబుద్ధి గల అవిద్వాంసుడు రాగద్వేషాలచేత ప్రేరేపింపబడినవాడై ధర్మాధర్మాలను ఆచరిస్తూ పుడుతుంటాడు,మరణిస్తుంటాడు.దేహాదులకంటె భిన్న మైన ఆత్మను తెలుసుకొన్నవాళ్లు రాగద్వేషాదులను విడచి,అలా విడవడంవల్ల ధర్మాధర్మాలయందు ప్రవర్తించకపోవడంచేత ముక్తు లవుతారు అనే విషయం,న్యాయాన్ని అంగీకరించే వా ళ్లెవరూ కూడ కాదనజాలరు. ఇది ఇలా ఉంటూండగా ఈశ్వరుడే అయి ఉన్న క్షేత్రజ్ఞునకు అవిద్యాకల్పిత మైన ఉపాధి భేదంవల్ల సంసారిత్వం వచ్చి నట్లు కనబడుతుంది(వాస్తవంలో జీవునికి సంసారిత్వం లేదని అర్థం).ఆత్మ దేహాదిస్వరూపం అన్నట్లు ఎలా కనబడుతున్నదో అట్లే ఇది కూడ. సకలప్రాణులకూ కూడ ఆత్మ కాని దేహాదులయందు,అవిద్యచేత,ఆత్మ అనే భావం నిశ్చితంగా ఉన్నట్లు ప్రసిద్ధంగా కనబడుతూన్నది కదా?స్థాణువునందు పురుషుడు అను నిశ్చయం ఎలాంటిదో ఇది కూడ అలాంటిదే.తావన్మాత్రంచేత పురుషధర్మం స్థాణువుకు కలగడం లేదు,స్థాణుధర్మం పురుషునకు కలగడంలేదు.అట్లే చైతన్యం అనే ధర్మం దేహానికి కలగదు,దేహధర్మం చేతనానికి సంక్రమించదు.అవిద్యచేత కల్పించబడినవి అవడంచేత

జర మృత్యువు మొదలైనవి ఏ విధంగా లేవో,సుఖదుఃఖమోహాత్మకత్వాదికం కూడ,అవిద్యా కల్పితమే గాన ఆత్మకు యుక్తం కాదు.(అందుచేత ముసలితనం మరణం మొదలైనవి అనాత్మ ధర్మాలే అనే కొందరి వాదం అసమంజసం అని భావం).

అవ. నువ్వు చూపిన స్థాణుపురుషదృష్టాంతానికి సుఖాదులు ఆత్మధర్మాలు కావు అనే దార్ష్టాంతికానికి భేదం ఉంది.అందుచేత ఈ దృష్టాంతం చూపి ఆత్మకు వాస్తవంలో సుఖదుఃఖాదులు లేవు అని చెప్పడం అయుక్తం అని పూర్వపక్షి ఆక్షేపిస్తున్నాడు-**న ఇతి**:- రెండూ సమానములు కాదు గాన నువ్వు చెప్పినది సరిగా లేదు అన్నట్లయితే-(దీనికే వివరణం) స్థాణువు పురుషుడు ఈ రెండూ జ్ఞేయములు. ఆ జ్ఞేయములైన స్థాణుపురుషులను జ్ఞాత(తెలుసుకొనే పురుషుడు)అవిద్యచేత ఒకదానిమీద ఒకదానిని ఆరోపిస్తున్నాడు. దేహాత్మల విషయంలో నైతే ఒకటి(దేహం)జ్ఞేయం,రెండవది(ఆత్మ)జ్ఞాత. అలాంటి జ్ఞేయ-జ్ఞాతల మధ్య పరస్పరాధ్యాస చేయబడుచున్నది గాన దృష్టాంతం సమం కాదు.అందువల్ల దేహధర్మం జ్ఞేయ మైనా జ్ఞాతయైన ఆత్మకు ఉండవచ్చును,(అనగా ఇది అధ్యాస కావలసిన పని లేదు)అన్నట్లయితే-(సిద్ధాంతి)అది యుక్తం కాదు.అలా చెపితే అచైతన్యాదులు (చైతన్యం లేకపోవడం మొదలైన దోషాలు)సంభవిస్తాయి.జ్ఞేయమైన దేహాదికమైన క్షేత్రంయొక్క ధర్మాలైన సుఖదుఃఖమోహాదులు జ్ఞాతకు (నిజంగానే)కలుగుతాయి అని అంటే అప్పుడు జ్ఞేయమైన దేహంయొక్క కొన్ని ధర్మాలు(సుఖదుఃఖాదులు మాత్రమే)అవిద్యచేత అధ్యారోపితములై ఆత్మకు కలుగుతాయి,జరామరణాదులు(ఆదిశబ్దంచేత చైతన్యరాహి త్యాదులు)మాత్రం కలగవు అనడానికి విశేషమైన హేతువును చూపవలసి ఉంటుంది. (సుఖాదులు ఆత్మకు కలగవు అనడానికి నీకు మాత్రం హేతు వేమి ఉన్నది అని అడుగుతే)- ఇవి కూడ జరామరణాదుల వలె ఆరోపింపబడినవే గాన ఆత్మకు ఉండవు,అట్లే ఇవి హేయము లవడంవల్ల,ఉపాదేయము లవడంవల్ల ఆత్మధర్మములు కావు అను అనుమానం ఇవి ఆత్మకు ధర్మాలుగా లేవు అనడానికి ప్రమాణంగా ఉంది.

వి. ఇక్కడ సుఖాదులు ఆత్మధర్మాలు కావని చెప్పడానికి కొన్నిహేతువులు చూప బడ్డాయి. **"సుఖాదయః ఆత్మధర్మా న భవన్తి,అవిద్యాధ్యారోపితత్వాత్,జరాదివత్"** (సుఖాదులు ఆత్మధర్మాలు కావు;అవిద్యచేత ఆరోపించబడినవి గాన;జరాదుల వలె)అని ఒక ప్రయోగం. **"సుఖాదయః ఆత్మని అధ్యారోపితా ఏవ;హేయత్వాత్ ఉపాదేయత్వాచ్చ, జరామరణాదివత్"**(సుఖాదులు ఆత్మయందు ఆరోపింపబడినవేకాని ఆత్మధర్మాలు కావు, హేయములు ఉపాదేయములు గాన,జరామరణాదుల వలె)అని రెండవ ప్రయోగం. సుఖాదులు ఆత్మధర్మా లైతే వాటిని ఆత్మ విడిచిపెట్టజాలదు;చైతన్యానందాదులను ఆత్మ విడవజాలదు కదా?అవి అనాత్మలధర్మములై ఆత్మయందు అధ్యసించబడకపోతే వాటిని

ఆత్మ గ్రహించజాలదు. మరొకదాని ధర్మాన్ని మరొకటి గ్రహింపజాలదు కదా? ఈ సుఖ దుఃఖాదులను జ్ఞాని విడిచిపెడుతున్నాడు, అజ్ఞాని గ్రహిస్తున్నాడు. ఎట్లనగా జరామరణాల వలె; దేహధర్మా లైన జరామరణాలు జ్ఞానిచేత విడవడబడుచున్నాయి. నేను జీర్ణించలేదు, మరణించలేదు. మరేమనగా దేహమే జీర్ణ మైనది, మరణించినది అని జ్ఞాని అనుకొంటాడు కదా? అజ్ఞుడైతే-"నేను జీర్ణుడ నైనాను, మరణించాను, మరణిస్తాను" అనుకొంటాడు గాన వాటిని గ్రహిస్తాడు, అందుచేత ఆత్మలో కనబడుతూన్న సమస్తమైన సుఖదుఃఖజరామరణాది దేహధర్మాలు అవిద్యచేత ఆత్మయందు అధ్యసించబడినవే కాని అనధ్యస్తములు కావు. ఆత్మకు సహజములు కావు. (ఇది భాష్యోత్కర్షప్రకాశికవ్యాఖ్య. పే. 15)

కాని ఆనందగిరి "హేయత్వాదుపాదేయత్వాచ్చ" అనే దానిని ఒకే హేతువుగా గ్రహించి "దీనికి ఆగమాపాయిత్వాత్" (వస్తూ పోతూంటాయి గాన) అని అర్థం చెప్పి "సుఖ దుఃఖాదికం నాత్మధర్మః; ఆగమాపాయిత్వాత్, సంసారవత్" (సుఖదుఃఖాదికం ఆత్మధర్మం కాదు, ఆగమాపాయి గాన, సంసారము వలె) అని ప్రయోగం చూపినారు. ఆది శబ్దంచేత జడత్వం, దృశ్యత్వం మొదలైన హేతువులచేత సుఖదుఃఖాదులు ఆత్మధర్మాలు కావు అని సాధించాలి అని కూడ చెప్పినారు. భాష్యోత్కర్షదీపిక అనువ్యాఖ్యానంలో కూడ ఈ విధంగానే చెప్పబడినది. (ఇది పూర్తిగా ఆనందగిరివ్యాఖ్యానుసారివ్యాఖ్య).

"హేయత్వాత్' 'ఉపాదేయత్వాత్' అనేవాటిని వేరు వేరు హేతువులుగా గ్రహించి అర్థం చెపితే బాగుంటుం దని తోస్తున్నది. కొన్నింటి విషయంలో ఒక్కొక్క హేతువును, కొన్నింటికి రెంటినీ కూడ అన్వయించవచ్చును. "దుఃఖం న ఆత్మధర్మః, హేయత్వాత్, వస్త్రాది వత్" (దుఃఖం ఆత్మధర్మం కాదు. ఇది విడవడానికి శక్యమైనది గాన, విడవడానికి శక్యమైన వస్త్రాదికం వలె). దుఃఖం ఆత్మధర్మమే అయితే మృత్తు గంధాన్ని ఏ విధంగా విడవజాలదో అట్లే ఆత్మ దీనిని విడవజాలకుండేది. అట్లే "సుఖం న ఆత్మధర్మః, ఉపాదేయత్వాత్, పునః వస్త్రాదివత్" (సుఖం -వైషయికసుఖం- ఆత్మధర్మం కాదు, అంతకుమునుపు లేనిది గ్రహించ బడుచున్నది గాన; వస్త్రం వలె అని మరొక ప్రయోగం. ఆత్మధర్మమే అయితే క్రొత్తగా కలగడం ఉండదు గాన సుఖం ఆత్మసహజధర్మం కాదని భావం. "క్రోధః న ఆత్మధర్మః, హేయత్వాత్, ఉపాదేయత్వాచ్చ, యథా భీః" (భయం వలె క్రోధం హేయమూ ఉపాదేయము కూడ అవడంచేత ఆత్మధర్మం కాదు అని అర్థం. ఇక్కడ 'హేయమ్' అనగా విడవడానికి శక్య మైనది, 'ఉపాదేయమ్' గ్రహించడానికి శక్య మైనది అని అర్థం.

భాష్యమ్

తత్రైవం సతి కర్తృత్వభోక్తృత్వలక్షణః సంసారః జ్ఞేయస్థః జ్ఞాతరి అవిద్యయా అధ్యారోపితః ఇతి న తేన జ్ఞాతుః కించిద్దుష్యతి. యథా బాలైః అధ్యారోపితేన ఆకాశస్య

తలమలినత్వాదినా. ఏవం చ సతి సర్వక్షేత్రేష్వపి సతః భగవతః క్షేత్రజ్ఞస్య ఈశ్వరస్య సంసారిత్వగన్ధమాత్రమ్ అపి న ఆశఙ్క్యమ్(న శక్యం వక్తుమ్). న హి క్వచిదపి లోకే అవిద్యాధ్యస్తేన ధర్మేణ కస్య చిత్ ఉపకారః అపకారో వా దృష్టః. యత్తు ఉక్తం న సమో దృష్టాన్తః ఇతి తత్ అసత్. కథమ్? అవిద్యాధ్యాసమాత్రం హి దృష్టాన్తదార్ష్టాన్తికయోః సాధర్మ్యం వివక్షితమ్; తత్ న వ్యభిచరతి. యత్తు జ్ఞాతరి వ్యభిచరతి ఇతి మన్యసే తస్యాపి అనైకాన్తికత్వం దర్శితం జరాదిభిః.

బాలానందిని

తత్రేతి:–ఇది ఇలా ఉండగా–జ్ఞేయమునం దున్న(జ్ఞేయమైన అంతఃకరణంలో ఉన్న)కర్తృత్వభోక్తృత్వరూప మైన సంసారం అవిద్యచేత జ్ఞాతయందు(ఆత్మయందు) ఆరోపించబడుచున్నది గాన దానివల్ల జ్ఞాతకు ఏ విధమైన దోషమూ కలుగదు. బాలులు (తెలివితక్కువాళ్లు)ఆరోపించిన (ఆకాశం)ఏదో ఒక పాత్రయొక్క తలం(మట్టు)వలె ఉన్నది, మలినంగా ఉన్నది ఇత్యాదికంచేత ఆకాశానికి ఏ విధమైన దోషమూ అంటదో అట్లే ఇక్కడ కూడ. ఇలాంటప్పుడు భగవంతు డైన క్షేత్రజ్ఞు డైన ఈశ్వరుడు సమస్తక్షేత్రాలలోను ఉన్నా కూడ ఆ ఈశ్వరునకు లేశమాత్రం కూడ సంసారిత్వం ఉంటుం దని ఆశకించ కూడదు(చెప్పడానికి శక్యం కాదు). లోకంలో ఎక్కడా కూడ అవిద్యచేత అధ్యసించబడిన ధర్మంచేత దేనికీ ఉపకారం గాని అపకారం గాని జరిగినట్లు చూడబడదు కదా? దృష్టాంతం సమంగా లేదు అని ఏ ఆక్షేపణ చేయబడిందో అది అయుక్తం. ఎట్లు? దృష్టాంతానికి దార్ష్టాంతికానికీ మధ్య అవిద్యచేత అధ్యాసచేయడం అనే సామ్యం మాత్రమే చెప్పదలచి నది(చూపదలచినది). (స్థాణువునందు పురుషత్వం ఏ విధంగా అధ్యసించబడినదో, అజ్ఞానంచేత ఆరోపించబడినదో, అట్లే దేహాదులయందు ఆత్మభావం ఆరోపించబడినది అన్నంతవరకే మేం చూపదలచిన సామ్యం). అది వ్యభిచరించడం లేదు. జ్ఞాతవిషయంలో వ్యభిచరిస్తాయి అని నువ్వు అనుకొన్నదానికి సమాధానంగా జరాదులచేత దానికి కూడ వ్యభిచారం చూపబడింది. (జరాదుల వలె సుఖాదులు కూడ ఆత్మధర్మాలు అవడానికి వీలు లేదు అని అనుమానప్రమాణప్రదర్శన పూర్వకంగా వెనుక చెప్పబడినది అని అర్థం).

భాష్యమ్

అవిద్యావత్త్వాత్ క్షేత్రజ్ఞస్య సంసారిత్వమ్ ఇతి చేత్; న అవిద్యాయాః తామసత్వాత్. తామసో హి ప్రత్యయః ఆవరణాత్మకత్వాత్ అవిద్యా, విపరీత గ్రాహకః, సంశయోపస్థాపకః వా అగ్రహణాత్మకో వా. వివేకప్రకాశభావే తదభావాత్. తామసే చ ఆవరణాత్మకే తిమి రాదిదోషే సతి అగ్రహణాదేః అవిద్యామాత్రస్య (అవిద్యాత్రయస్య)ఉపలబ్ధేః. అత్రాహ– ఏవం తర్హి జ్ఞాతృధర్మః అవిద్యా? న; కరణే చక్షుషి తైమిరికత్వాదిదోషోలబ్ధేః. యత్తు మన్యసే జ్ఞాతృధర్మః అవిద్యా, తదేవ చ

అవిద్యాధర్మవత్త్వం క్షేత్రజ్ఞస్య సంసారిత్వమ్;తత్ర యదుక్తమ్ ఈశ్వర ఏవ క్షేత్రజ్ఞః,న సంసారీ ఇత్యేతత్ అయుక్తమ్ ఇతి-తత్ న;యథా కరణే చక్షుషి విపరీత గ్రాహకాదిదోషస్య దర్శనాత్ న విపరీతాదిగ్రహణం తన్నిమిత్తో వా తైమిరికత్వాదిదోషః గ్రహీతుః,చక్షు షః సంస్కారేణ తిమిరే అపనీతే గ్రహీతుః అదర్శనాత్ న గ్రహీతుః ధర్మః యథా,తథా సర్వత్రైవ అగ్రహణవిపరీతసంశయప్రత్యయాః తన్నిమిత్తాః,కరణస్యైవ కస్య చిత్ భవితుమ్ అర్హన్తి.న జ్ఞాతుః క్షేత్రజ్ఞస్య.

బాలానందిని

అవిద్యేతి:-(పూ.ప. క్షేత్రజ్ఞుడు అవిద్య కలవా డవడంవల్ల అతడు సంసారి అవుతాడు అన్నట్లయితే-(సి)అట్లు కాదు.ఎందువల్ల ననగా అవిద్య తామసం,తమోగుణమయ మైనది.అవిద్య అనగా తామసమైన,తమోగుణమయ మైన ప్రత్యయం(జ్ఞానం). ఇది ఆవరణ రూప మైనది.(యథార్థస్వరూపాన్ని కప్పివేస్తుంది).అందుచేత ఇది విపరీతంగా గ్రహింప చేస్తుంది,లేదా సంశయం లేవదీస్తుంది.లేదా అగ్రహణాత్మక మైనది; అనగా విషయజ్ఞానాభావరూప మైనది.వివేకం అనే ప్రకాశం ఉంటే ఇది(అవిద్య)ఉండదు. గాన ఇది తామసం అని చెప్పబడినది.ఆవరణాత్మకము (ఆవరణం కలిగించేది)తామసము అయిన తిమిరం(రేచీకటి)మొదలైన దోషం ఉన్నప్పుడు అగ్రహణం మొదలైన అవిద్యాత్రయం(అగ్రహణ-సంశయ-విపరీతగ్రహణాలు)కనబడుతున్నాయి.ఇక్కడ (పూర్వపక్షి) అంటున్నాడు-అయితే అవిద్య జ్ఞాతయొక్క ధర్మం అన్నమాట?కాదు.తైమిరికత్వం మొదలైన దోషం కరణమైన(సాధనమైన-ఇంద్రియమైన)నేత్రంలో ఉన్నట్లు తెలుస్తూన్నది కదా?(దీనినే విశదీకరిస్తున్నారు)-అవిద్య జ్ఞాతయొక్క ధర్మం అనీ,ఈ అవిద్యారూపధర్మం కలిగి ఉండడమే క్షేత్రజ్ఞుని సంసారిత్వం అనగా అనీ,అందుచేత ఈశ్వరుడే క్షేత్రజ్ఞుడు సంసారి కాదు అని చెప్పడం యుక్తం కాదనీ ఏదైతే అనుకొంటున్నావో అది కాదు.విపరీతంగా గ్రహింప చేయడం మొదలైన దోషం సాధనమైన నేత్రంలో ఉండడంచేత గ్రహహీతకు(జ్ఞాతకు) విపరీతాదిగ్రహణం కాని,దాన్నిపట్టి తైమిదికత్వాదిదోషం గాని ఎలా లేదో,నేత్రానికి సంస్కారం చేసి తిమిరదోషం తొలగించగానే గ్రహీతలో అది కనబడకపోవడంచేత అది గ్రహీతయొక్క ధర్మం ఎలా కాదో,అట్లే అంతటా కూడ అవిద్యవల్ల కలిగే అగ్రహం-విపరీత ప్రత్యయ-సంశయప్రత్యయాలు ఏదో ఒక కరణానికి మాత్రమే సంబంధించి ఉండి ఉండాలి కాని క్షేత్రజ్ఞునకు సంబందించవు.

భాష్యమ్

సంవేద్యత్వాచ్చ తేషాం ప్రదీపప్రకాశవత్ న జ్ఞాతృధర్మత్వమ్.సంవేద్యత్వాదేవ స్వాత్మవ్యతిరిక్తసంవేద్యత్వమ్.సర్వకరణవియోగే చ కైవల్యే సర్వవాదిభిః అవిద్యాదిదోష

వత్త్వానభ్యుపగమాత్. ఆత్మనః యది క్షేత్రజ్ఞస్య అగ్న్యుష్ణవత్ స్వః ధర్మః, తతః న కదాచిదపి తేన వియోగః స్యాత్. అవిక్రియస్య చ వ్యోమవత్ సర్వగతస్య అమూర్తస్య ఆత్మనః కేన చిత్ సంయోగవియోగానుపపత్తేః సిద్ధం క్షేత్రజ్ఞస్య ఈశ్వరత్వమ్. **"అనాదిత్వాన్నిర్గుణత్వాత్"**(13-31)ఇతి ఈశ్వరవచనాచ్చ.

బాలానందిని

సంవేద్యత్వాదితి:-విపరీతగ్రహాదులు ప్రదీపప్రకాశ వలె సంవేద్యములు(తెలియ దగినవి-దృశ్యములు)అవడంవల్ల కూడ జ్ఞాతయొక్క ధర్మం కాజాలవు. సంవేద్యములవడంచేతనే అవి తమకంటె భిన్నమైనవానిచేత తెలియదగినవి.

వి:-"యద్యత్ వేద్యం తత్ తత్ స్వాతిరిక్తవేద్యమ్, యథా దీపాది"అని వ్యాప్తి. తెలియబడేది ప్రతీదీ కూడ తనకంటె (తెలియబడేదానికంటె)భిన్నమైనదానిచేతనే తెలియబడుతుంది; ఉదా-దీపకాంతివలె; అని దీని అర్థం. విపరీతగ్రహాదులు కూడ సంవేద్యములే గాన తమకంటె భిన్నమైన ఆత్మచేత గ్రహించబడతాయి అని తెలుస్తూన్నది. దీనిని పట్టి ఇవి వేదితయొక్క ధర్మాలు కావు అవి కూడ తెలుస్తూన్నది. **"సంవేదితా న సంవేద్యధర్మవాన్, వేదితృత్వాత్, యథా దేవదత్తః న సంవేద్యరూపాదిమాన్"**అని అనుమానప్రయోగం. దేవదత్తుడు రూపాదులను చూస్తున్నాడు. ఆ రూపాలు దేవదత్తుని ధర్మాలు కావు. చిత్రాదుల ధర్మాలు. అట్లే విపరీతగ్రహాదులు వాటిని ఏ క్షేత్రజ్ఞుడు చూస్తున్నాడో వాని ధర్మాలు కాజాలవు.

సర్వేతి:-మరొక విషయ మేమనగా-సమస్త ఇంద్రియాలతో వియోగం ఏర్పడే (ఏ ఇంద్రియాలూ ఉండని)కైవల్యావస్థలో అవిద్యాదిదోషా లుండ వని అందరు వాదులు (దార్శనికులూ)కూడ అంగీకరించిన విషయమే కదా?(అనగా కైవల్యావస్థలో ఆత్మ ఉన్నా ఇంద్రియాలు లేవు. ఆ అవస్థలో అవిద్య లేదనగా అవి వాస్తవంలో ఇంద్రియాల ధర్మమే అనీ,అవి లేకపోవడంచేత ఈ అవస్థలో అవిద్య లేదనీ అర్థ మవుతున్న దని భావం)వేడి అగ్నికి స్వాభావికమైన ధర్మంగా ఉన్నట్లు అవిద్యాదిదోషం క్షేత్రజ్ఞుడైన ఆత్మయొక్క ధర్మం అయిన పక్షంలో ఆత్మకు దానితో ఏ నాటికీ వియోగం కుదరదు. ఆకాశంవలె ఆత్మ వికారరహితమైనది; అంతటా వ్యాపించి ఉన్నది. అమూర్తం(మూర్తి లేనిది). అలాంటి ఆత్మకు దేనితోను సంయోగం గాని వియోగం గాని కుదరవు.(అందుచేత అవిద్యాదోషం ఆత్మకు ఆగంతుకంగా (ఇతరసంపర్కాదులచేత వచ్చినదిగా)కూడ చెప్పడానికి శక్యం కాదని అర్థం). అంతే కాకుండా **"అనాదిత్వాన్నిర్గుణత్వాత్"**ఇత్యాదివిధంగా భగవంతుడు చెప్ప నున్నాడు. ఈ విధంగా క్షేత్రజ్ఞుని ఈశ్వరత్వం (క్షేత్రజ్ఞుడు ఈశ్వరుడుగా ఉండడం)నిత్యమే.(ఎల్లప్పుడూ ఉన్నదే. క్రొత్తగా వచ్చేది కాదు).

భాష్యమ్

నన్వేవం సతి సంసారసంసారిత్వాభావే శాస్త్రానర్థక్యాదిదోషః స్యాదితి.న;సర్వైః అభ్యుపగతత్వాత్.సర్వైః హి ఆత్మవాదిభిః అభ్యుపగతః దోషః న ఏకేన పరిహర్తవ్యః భవతి.కథమ్ అభ్యుపగతః ఇతి?ముక్తానాం సంసారసంసారిత్వాభావః సర్వైరేవ ఆత్మ వాదిభిః ఇష్యతే.న చ తేషాం శాస్త్రానర్థక్యాదిదోషప్రాప్తిః అభ్యుపగతా.తథా నః క్షేత్ర జ్ఞానామ్ ఈశ్వరైకత్వే సతి శాస్త్రానర్థక్యం భవతు,అవిద్యావిషయే చ అర్థవత్త్వమ్;యథా ద్వైతినాం సర్వేషాం బన్ధావస్థాయామేవ శాస్త్రాద్యర్థవత్త్వం న ముక్తావస్థాయామ్ ఏవమ్.

బాలానందిని

నన్వితి:-(పూ.ప.)సంసారము,సంసారిత్వమూ అనేవి లేకపోతే శాస్త్రం వ్యర్థం అవడం మొదలైన దోషం ప్రాప్తిస్తుంది కదా?(సి.)రాదు.ఎందువల్ల ననగా ఇది అందరూ అంగీకరించిన విషయమే.ఆత్మవాదులు(దేహవ్యతిరిక్త మైన ఆత్మ ఉన్న దని అంగీకరించే వాళ్లు)అందరూ అంగీకరించిన దోషాన్ని ఒకరు పరిహరించవలసిన బాధ్యత లేదు. అందరూ ఎలా అంగీకరించారు అంటావా-ముక్తాత్మలలో సంసార మనీ,సంసారి అనీ వ్యవహారం ఉడ దని ఆత్మవాదు లందరూ అంగీకరిస్తున్నారు.అయినా శాస్త్రానర్థక్యదోషం ప్రాప్తిస్తుంది అని వాళ్లు అనుకొనడం లేదు.అట్లే మాకు కూడ క్షేత్రజ్ఞులకు ఈశ్వరైకత్వం ఉన్నప్పుడు (ఈశ్వరైకత్వజ్ఞానం కలిగినప్పుడు)శాస్త్రానర్థక్యం కలగుతే కలుగు గాక!అవిద్యా విషయంలో మాత్రం వాటికి అర్థవత్వం(ప్రయోజనం)ఉండనే ఉంది.ద్వైతు లందరికీ శాస్త్రాలకు సార్థకత్వం బంధావస్థలోనే కాని ముక్తావస్థలో ఏ విధంగా లేదో అలాగే మాకు కూడ.

భాష్యమ్

నను ఆత్మనః బన్ధముక్తావస్థే పరమార్థతః ఏవ వస్తుభూతే ద్వైతినాం నః సర్వేషామ్.అతః హేయోపాదేయతత్సాధనసద్భావే శాస్త్రాద్యర్థవత్త్వం స్యాత్;అద్వైతినాం పునః ద్వైతస్య అపరమార్థత్వాత్,అవిద్యాకృతత్వాత్,బన్ధావస్థాయాశ్చ ఆత్మనః అపరమా ర్థత్వే నిర్విషయత్వాత్ శాస్త్రానర్థక్యమ్ ఇతి చేత్;న ఆత్మనః అవస్థాభేదానుపపత్తేః. యది తావత్ ఆత్మనః బన్ధముక్తావస్థే యుగపత్ స్యాతాం క్రమేణ వా?యుగపత్ తావత్ విరోధాత్ న భవతః,స్థితిగతీ ఇవ ఏకస్మిన్.క్రమభావిత్వే చ నిర్నిమిత్తత్వే అనిర్మోక్షప్రసంగః.తథా చ సతి అభ్యుపగమహానిః.

బాలానందిని

నన్వితి: -(పూ.ప.)ద్వైతుల మైన మా అందరి మతాల ప్రకారం ఆత్మకు బంధావస్థ, ముక్తావస్థా కూడ యథార్థంగా ఉన్నవే.అందుచేత హేయమైన సంసారము దానికి హేతువు లైన కామాదిదోషాలు,ఉపాదేయ మైన మోక్షము దాని సాధనా లైన శమాదులూ కూడ

ఉన్నాయి గాన(వాటిని గూర్చి ఉపదేశించడానికి)శాస్త్రాదుల ప్రయోజనం ఉంటుంది. అద్వైతుల కైతే ద్వైతం పరమార్థం(సత్యం)కాదు. ఆత్మయొక్క బంధావస్థ కూడ అవిద్యచేత కల్పించబడిన దవడంచేత పరమార్థం కాదు. అప్పుడ శాస్త్రానికి విషయమే లేదు గాన శాస్త్రం వ్యర్థమే అవుతుంది అన్నట్లయితే-(సి)అది యుక్తం కాదు. ఆత్మకు అవస్థాభేదం ఉపపన్నం కాదు.(బంధావస్థ ఒకటి ముక్తావస్థ ఒకటి అవి రెండు అవస్థలు ఆత్మ కుంటా యనడం యుక్తం కాదు). ఆత్మకు బంధముక్తావస్థ లనేవి ఉంటే అవి ఒకే సమయంలో ఉంటాయా, క్రమంగా ఒకదాని తరువాత ఒకటి ఉంటాయా? ఒకే పురుషునిలో ఒకే సమయంలో గమనము, నిలబడడము ఏ విధంగా ఉపపన్నములు కావో అట్లే, అవి పరస్పర విరుద్ధము లవడంచేత ఆత్మయందు ఒకే సమయంలో ఉండడం కుదరదు. క్రమంగా ఉంటాయి అని అంగీకరించి నప్పుడు కూడ నిమిత్తం లేకుండా కలిగితే అనిర్మోక్ష ప్రసంగం. ఇతరనిమిత్తాన్ని పట్టి ఏర్పడతాయి అని అంటే స్వతః కావు గాన అపరమార్థము లని చెప్పాలి. అప్పుడు అభ్యుపగమహాని కలుగుతుంది.

వి:-ఆత్మకు బంధమోక్షాలు ఒకదాని తరువాత ఒకటి కలుగుతాయి అని చెప్పినా కూడ ఇవి నిమిత్తం ఏదీ లేకుండానే కలుగుతాయా లేక మరొకటి ఏదైనా వీటికి నిమిత్తం ఉండడంచేత కలుగుతాయా అని ప్రశ్న. ఏ నిమిత్తమూ లేకుండానే కలుగుతాయి అని అంటే బద్ధుడు సహజంగానే ఏ నిమిత్తమూ లేకుండానే బద్ధు డైనాడు గాన అతడు ఎప్పటికీ అలాగే బద్ధుడుగా ఉంటాడు, వానికి మోక్షం రాదు అని చెప్పవలసి వస్తుంది. మరొక ఏదో నిమిత్తంచేత బంధం కలుగుతుంది అన్నట్లయితే సహజంగా బంధం లేదని అర్థం. అప్పుడు ఆ బంధం యథార్థం కాదు అని చెప్పినట్లవుతుంది. అప్పుడు అభ్యుపగమహాని; అనగా బంధం పరమార్థమే అని మీరు అంగీకరించిన మతానికి భంగం కలుగుతుంది.

భాష్యమ్

కిం చ-బన్ధముక్తావస్థయోః పౌర్వాపర్యనిరూపణాయాం బన్ధావస్థా పూర్వం ప్రకల్ప్యా అనాదిమతీ, అన్తవతీ చ. తచ్చ ప్రమాణవిరుద్ధమ్. తథా మోక్షావస్థా ఆదిమతీ అనన్తా చ ప్రమాణవిరుద్ధైవ అభ్యుపగమ్యతే. న చ అవస్థావతః అవస్థాన్తరం గచ్ఛతః నిత్యత్వమ్ ఉపపాదయితుం శక్యమ్. అథ అనిత్యత్వదోషపరిహారాయ బన్ధముక్తావస్థా భేదః న కల్ప్యతే అతః ద్వైతినామపి శాస్త్రానర్థక్యాదిదోషః అపరిహార్యః ఏవ ఇతి సమానత్వాత్ న అద్వైతవాదినా పరిహర్తవ్యో దోషః.

బాలానందిని

కిం చేతి:- ఇంకొక విషయం-బంధముక్తావస్థలలో ఏది ముందు ఏది తరవాత అనేది చెప్పవలసినప్పుడు ముందు బంధావస్థ అనీ, దానికి ఆది లేదు గాని అంతం ఉందని కల్పించవలసి ఉంటుంది. అది ప్రమాణాలకి విరుద్ధం.(అనాదియైన భావరూప పదార్థం

ఆత్మ వలె నిత్య మైనది,దానికి అంతం ఉండదు అనే సర్వాంగీకృతమైన నియమానికి ఇది విరుద్ధం గాన ప్రమాణవిరుద్ధం). అట్లే మోక్షావస్థ (ఏదో ఒక కాలంలో లభిస్తుంది గాన)ఆది గలది,కాని అంతం లేనిది అని చెప్పడం కూడ ప్రమాణవిరుద్ధమే.(సాదియైన భావపదార్థం ఏనాటికైనా ఘటాదుల వలె నశిస్తుంది అనే నియమానికి విరుద్ధం గాన ఈ కల్పన కూడ ప్రమాణవిరుద్ధమే అని అర్థం).ఇంకొక విషయ మేమనగా-ఒక అవస్థలో ఉన్నది మరొక అవస్థను పొందుతే అది నిత్యం అని సమర్థించడానికి శక్యం కాదు.(పూర్వావస్థను విడవడంలో కొన్ని ధర్మాలు తొలగిపోవడం,ఉత్తరావస్థను పొందడంలో కొన్ని క్రొత్త ధర్మాలు చేరడం అనేది ఉంటుంది.అది నిత్యత్వానికి విరుద్ధం).అనిత్యత్వదోషాన్ని పరిహరించడంకోసం బంధావస్థ ముక్తావస్థ అనే భేదం కల్పించకపోతే అప్పుడు శాస్త్రానర్థ క్యాదిదోషం ద్వైతులకు కూడ పరిహరింపశక్యం కానిదే.అలాంటప్పుడు ఆ దోషాన్ని అద్వైతవాది మాత్రమే పరిహరించవలసిన పని లేదు.

భాష్యమ్

న చ శాస్త్రానర్థక్యమ్,యథాప్రసిద్ధావిద్వత్పురుషవిషయత్వాత్ శాస్త్రస్య,అవిదుషాం హి ఫలహేత్వోః అనాత్మనోః ఆత్మదర్శనం న విదుషామ్.విదుషాం హి ఫలహేతుభ్యామ్ ఆత్మనః అన్యత్వదర్శనే సతి తయోః అహమితి ఆత్మదర్శనానుపపత్తేః.న హి అత్యన్తమూఢః ఉన్మత్తాదిః అపి జలాగ్న్యోః ఛాయాప్రకాశయోః వా ఐకాత్మ్యం పశ్యతి; కిముత వివేకీ! తస్మాత్ న విధిప్రతిషేధశాస్త్రం తావత్ ఫలహేతుభ్యామ్ ఆత్మనః అన్యత్వదర్శినః భవతి.న హి"దేవదత్త త్వమ్ ఇదం కురు"ఇతి కస్మిన్ చిత్ కర్మణి నియుక్తే విష్ణుమిత్రః అహం నియుక్తః ఇతి తత్రస్థః నియోగం శృణ్వన్నపి ప్రతి పద్యతే. నియోగవిషయవివేకాగ్రహణాత్తు ఉపపద్యతే ప్రతిపత్తిః.తథా ఫలహేత్వోః అపి.

బాలానందిని

అవ:-ఈ దోషం అందరికీ సమానమే అయినప్పుడు నన్ను మాత్రమే ఆక్షేపించ డం యుక్తం కాదు అని పరిహాసపూర్వక మైన సమాధానం చెప్పి నిజానికి మా పక్షంలో లేదని చెప్పడానికై"అవిద్యావిషయే చార్థవత్త్వమ్"అని వెనుకటి వాక్యంలో సూచించిన విషయాన్ని విశదీకరిస్తున్నారు-**న చేతి:**-శాస్త్రానర్థక్యం కూడ లేదు.ఎందువల్ల ననగా శాస్త్రం లోకప్రసిద్ధి ఎట్లున్నదో అట్లే అవిద్వాంసుడైన పురుషుడు విషయంగా గలది(పురుషుణ్ణి ఉద్దేశించి చెప్పబడినది). అనాత్మ లైన ఫలహేతువులను ఆత్మగా అవిద్వాంసులు భావిస్తారు కాని విద్వాంసులు భావించరు. విద్వాంసుల కైతే ఆత్మ ఫలహేతువులకంటె భిన్న మైనది అనే జ్ఞానం ఉంటుంది గాన వాళ్లకు వాటి విషయంలో 'నేను'అను బుద్ధి ఉండదు.చాలా మూఢుడైన ఉన్మత్తుడు మొదలైనవాడు కూడ జలము అగ్ని, నీడ ఎండ ఒకటే అని

అనుకొనదు;అలాంటప్పుడు వివేకవంతుని మాట చెప్పాలా? అందుచేత ఆత్మ ఫలహేతువుల కంటె భిన్న మైనది అని తెలుసుకొన్నవాని విషయంలో విధిప్రతిషేధరూపమైన శాస్త్రం ప్రవర్తించదు.

వి. ఫలం అనగా భోక్తృత్వం. హేతు వనగా కర్తృత్వం. వాటి విషయంలో అహం బుద్ధి అనగా"నేను కర్తను,నేను భోక్తను"అనే బుద్ధి. లేదా ఫలం అనగా దేహవిశేషం, ఒకానొక దేహం. హేతువనగా అదృష్టం. వాటియందు అహంబుద్ధి అనగా నేను మనష్యుడను ఇత్యాదిబుద్ధి అని ఆనందగిరివ్యాఖ్య. ఫలం దేవాదిదేహం. హేతువు మనుష్యదేహం. వాటి యందు అహంబుద్ధి అనగా మనుష్యుడ నైన నేను యజ్ఞాదులు చేసి దేవుడ నవుతాను అను భావం అని భా.అ.ప్ర.

న హీతి:- "దేవదత్తా నువ్వు ఈ పని చెయ్యి"అని ఒక డొ క పనియందు నియుక్తు డైనప్పుడు అక్కడనే ఉన్న విష్ణుమిత్రుడు ఆ నియోగాన్ని విన్నా కూడ నేను ఆ పనియందు నియోగించబడ్డాను అని అనుకొనదు కదా? నియోగానికి విషయం(నియోగింప బడినవాడు)ఎవరో స్పష్టంగా తెలియకపోతే మాత్రం అలా(నేను నియోగింపబడ్డాను)అని అనుకొనవచ్చును. ఫలహేతువుల విషయంలో కూడ అట్లే. (అనగా ఫలహేతువులయందు ఆత్మాభిమానం ఉన్నవాడే,దేవదత్తత్వాభిమానం ఉన్నవాడు నియోగంలో ప్రవర్తించి నట్లు, శాస్త్రీయనియోగంలో ప్రవర్తిస్తాడు అని అభిప్రాయం. లేదా-సరిగా వినకపోవడంచేత ఈ పనికి దేవత్తుణ్ణే నియమిస్తున్నారు అని తెలియని ఆ ప్రక్కనున్నవాడు కూడ ప్రవర్తించదానికి అవకాశం ఉంది అనిభావం.

భాష్యమ్

నను ప్రాకృతసంబన్ధాపేక్షయా యుక్తైవ ప్రతిపత్తిః శాస్త్రార్థవిషయా ఫలహేతుభ్యామ్ అన్యాత్మదర్శనేఽపి సతి ఇష్టఫలహేతౌ ప్రవర్తితః అస్మి, అనిష్టఫల హేతోః చ నివర్తితః అస్మి ఇతి;యథా పితృపుత్రాదీనామ్ ఇతరేతరాత్మా న్యత్వదర్శనే సత్యపి అన్యోన్యనిషేధార్థప్రతిపత్తిః? న. వ్యతిరిక్తాత్మదర్శన ప్రతిపత్తేః ప్రాగేవ ఫలహేత్వో ఆత్మాభిమానస్య సిద్ధత్వాత్. ప్రతిపన్ననియోగప్రతిషేధార్థః హి ఫలహేతుభ్యామ్ అన్యత్వం ప్రతిపద్యతే,న పూర్వమ్. తస్మాత్ విధిప్రతిషేధశాస్త్రమ్ అవిద్వద్విషయమ్ ఇతి సిద్ధమ్.

బాలానందిని

నన్వితి:-(పూ.ప)ఆత్మ ఫలహేతువులకంటె భిన్న మైనది అను జ్ఞానం ఉన్నా కూడ ప్రాకృతమైన,అవిద్యాకల్పితమైన,సంబంధాన్ని పట్టి"ఇష్టఫలమునకు హేతువైన కర్మ యందు ప్రవర్తింపచేయబడుచున్నాను,అనిష్టఫలహేతు వైన కర్మనుంచి నివర్తింపచేయబడు చున్నాను"అని శాస్త్రార్థం విషయంలో విద్వాంసునకు కూడ ప్రతిపత్తి(జ్ఞానం,అభిప్రాయం)

ఉండవచ్చును కదా?(విద్వాంసునికి కూడ అనాదికాలంనుండి వస్తూ అంతవరకూ ఉన్న అవిద్యాసంబంధాన్ని పట్టి ఇలాంటి భావం కలగవచ్చును కదా అని భావం).తండ్రి కుమారుడు మొదలైనవారిలో తాము ఒకరినుండి ఒకరు వేరు అని తెలిసనవారైనా కూడ పరస్పరముయొక్క నియోగప్రతిషేధముల ప్రతిపత్తి ఎలా కనబడుచున్నదో అట్లే.

వి:- తండ్రికంటె తాను వేరని పుత్రునికి తెలియును,పుత్రునికంటె తాను వేరని తండ్రికి తెలియును.అయినా కూడ తండ్రి నిత్యకర్మాదులను చేయడానికి అశక్తుడైనప్పుడు కుమారుడు తండ్రికి విధించిన ఆ కర్మలు చేస్తున్నాడు;కుమారుడు అశక్తుడై నప్పుడు తండ్రి చేస్తున్నాడు ఇది ఆచారం. ఈ విధంగా అన్యత్వజ్ఞానం ఉన్నా కూడ వారు నియోగాదులలో ఏ విధంగా ప్రవర్తిస్తున్నారో అట్లే హేతుఫలాన్యాత్మత్వజ్ఞానం ఉన్నా కూడ విద్వాంసుడు శాస్త్రార్థంలో ప్రవర్తించవచ్చును అని భావం.

అవ:- పితృపుత్రాదులకు మిథ్యాభిమానం ఉండడంవల్ల వాళ్లు పరస్పరనియోగా దులలో ప్రవర్తించినా కూడ తత్త్వదర్శినికి అలాంటి మిథ్యాభిమానం ఉండదు గాన వానికి దేహాదిసంబంధాన్ని పట్టి కలిగే నియోగబుద్ధి కలగదు అని సమాధానం చెపుతున్నారు-
నేతి:- ఫలహేతువుల విషయంలో ఆత్మాభిమానం వాటికంటె ఆత్మ భిన్న మైనది అను జ్ఞానం కలగడానికి పూర్వం మాత్రమే ఉంటుంది.ఎవ డైతే ముందుగా నియోగప్రతిషేధాలు తనకు సంబంధించిన వని అనుకొంటాడో అతడే తరువాత ఆత్మ ఫలహేతువులకంటె భిన్నమైనది అని తెలుసుకొంటాడు.అందువల్ల విధిప్రతిషేధశాస్త్రం అవిద్వాంసునికి మాత్రమే సంబంధించినది అనే విషయం నిశ్చితం.

వి. బ్రహ్మసూత్రాలలోని సర్వాపేక్షాధికరణంలో యజ్ఞాదులను ఆచరించినవానికి చిత్తశుద్ధి ద్వారా వివిదిష(ఆత్మను తెలుసుకొనవలె ననే కోరిక)కలుగుతుంది అని స్థాపించ బడింది.ఆ న్యాయం ప్రకారం నియోగప్రతిషేధార్థాలను తెలుసుకొని,అవి తనకు సంబంధిం చిన వనే అభిప్రాయంతో యజ్ఞాదులు చేసిన తరువాతనే వానికి ఫలహేతువులకంటె ఆత్మ అన్య మైనది అనే జ్ఞానం కలుగుతుంది.ఆ జ్ఞానం కలిగిన తరువాత అతడు నియోగాద్యతీతు డవుతాడు అని భావం.

భాష్యమ్

నను "స్వర్గకామో యజేత""కలఞ్జం న భక్షయేత్"ఇత్యాదౌ ఆత్మవ్యతిరేక దర్శినామ్ అప్రవృత్తౌ కేవలదేహాద్యాత్మదృష్టీనాం చ-అతః కర్తుః అభావాత్ శాస్త్రానర్థక్యమ్ ఇతి చేత్-న;యథాప్రసిద్ధితః ఏవ ప్రవృత్తినివృత్త్యుపపత్తేః. ఈశ్వరక్షేత్రజ్ఞై కత్వదర్శీ బ్రహ్మవిత్ తావత్ న ప్రవర్తతే. తథా నైరాత్మ్యవాద్యపి నాస్తి పరలోకః ఇతి న

ప్రవర్తతే. యథాప్రసిద్ధితస్తు విధిప్రతిషేధశాస్త్రశ్రవణాన్యథానుపపత్త్యా అనుమితాత్మాస్తిత్వః ఆత్మవిశేషానభిజ్ఞః కర్మఫలసంజాతతృష్ణః శ్రద్దధానతయా చ ప్రవర్తతే ఇతి సర్వేషాం నః ప్రత్యక్షమ్;అతః న శాస్త్రానర్థక్యమ్. వివేకినామ్ అప్రవృత్తిదర్శనాత్ తదనుగామినామ్ అప్రవృత్తౌ శాస్త్రానర్థక్యమ్ ఇతి చేత్-న;కస్యచిదేవ వివేకోపపత్తేః. అనేకేషు హి ప్రాణిషు కశ్చిదేవ వివేకీ స్యాత్,యథా ఇదానీమ్.న చ వివేకినమ్ అనువర్తన్తే మూఢాః;రాగాది దోషతన్త్రత్వాత్ ప్రవృత్తేః.అభిచరణాదౌ చ ప్రవృత్తిదర్శనాత్.స్వాభావ్యాచ్చ ప్రవృత్తేః. "స్వభావస్తు ప్రవర్తతే"(5-14)ఇతి హి ఉక్తమ్.తస్మాత్ అవిద్యామాత్రం సంసారః యథాదృష్టవిషయః ఏవ;న క్షేత్రజ్ఞస్య కేవలస్య అవిద్యా తత్కార్యం చ.న చ మిథ్యాజ్ఞానం పరమార్థవస్తు దూషయితుం సమర్థమ్.న హి ఊషరదేశం పఙ్కీకర్తుం శక్నోతి మరీచ్యు దకం,తథా అవిద్యా క్షేత్రజ్ఞస్య న కించిత్ కర్తుం శక్నోతి.అతశ్చ ఇదముక్తం క్షేత్రజ్ఞం చాపి మాం విద్ధి"(13-2)"అజ్ఞానేనావృతం జ్ఞానమ్"(5-15)ఇతి చ.

బాలానందిని

అవ:-శాస్త్రం అవిద్వాంసుణ్ణి గూర్చి చెప్పబడింది అని పైన చెప్పిన విషయాన్ని విశదీకరిస్తున్నారు-నన్వితి:-(ప్రశ్న)"స్వర్గం కావాలనుకొన్నవాడు యాగం చెయ్యాలి" "కలంజం (విషం పూసిన బాణంతో చంపిన మృగంయొక్క మాంసం అనికొందరు; నీరుల్లి అని కొందరు)తినకూడదు ఇత్యాదివిధినిషేధాలలో ఆత్మవ్యతిరేకదర్శి ప్రవర్తించక పోతే,దేహమే ఆత్మ అనే దృష్టి కలవాళ్లూ ప్రవర్తించకపోతే కర్తయే లేకుండా పోతాడు గాన శాస్త్రం వ్యర్థం అవుతుంది అన్నట్లయితే-(సమాధానం)అట్లు కాదు;లోకప్రసిద్ధిని అనుసరించి (లోకంలో ఏ విధంగా కనబడుచున్నదో ఆ విధంగా)ప్రవృత్తినివృత్తులు కుదురుతాయి. ఈశ్వరుడు క్షేత్రజ్ఞుడూ కూడ ఒకటే అను జ్ఞానం గల బ్రహ్మవేత్త యైతే ప్రవర్తించడు. నైరాత్మ్యవాది(దేహమే కాని ఆత్మ లేదు అనేవాడు)కూడ పరలోకం లేదు అనే అభిప్రాయంతో ప్రవర్తించడు; అయితే- లోకప్రసిద్ధిని అనుసరించి యైతే(లోకంలో అందరూ అనుష్ఠిస్తున్నారు కదా అని అనుకొని) వినబడుతూన్న విధిప్రతిషేధశాస్త్రాలు మరొక విధంగా ఉపపన్నములు కావు గాన ఆత్మ ఉన్నది అని ఊహించినవాడు,కాని దాని విశేషం(యథార్థస్వరూపం)ఏమో తెలియనివాడు అయిన పురుషుడు కర్మఫలమునందు ఆశ పుట్టి,విశ్వాసంతో కర్మలయందు ప్రవర్తిస్తున్నాడు అనే విషయం మన కందరికీ ప్రత్యక్షమే. అందువల్ల శాస్త్రానర్థక్యం లేదు.

వి:- లోకంలో చాలామంది కర్మలు చేయడం చూస్తున్నాడు. శాస్త్రం విధినిషేధాలను బోధిస్తూన్నది.కాని వాటి ఫలం వెంటనే,ఈ జన్మలోనే కనబడడంలేదు.దీనిని పట్టి ఈ దేహంకంటె భిన్నమైన ఆత్మ ఒకటుం దని ఊహిస్తాడు.కాని ఆ ఆత్మయొక్క యథార్థ స్వరూపం

ఎలాంటిదో తెలియదు. దానికి కర్తృత్వము భోక్తృత్వమూ కూడ ఉన్నా యనే అనుకొంటాడు. ఆ భ్రాంతితోనే కర్మఫలాభిలాషతో కర్మ లాచరిస్తాడు. అలాంటి వాళ్ల విషయంలో, అవిద్యావంతుల విషయంలో, శాస్త్రం సార్థకమే అని అర్థం.

వివేకినామితి: –(ప్ర)(ఇలాంటి వాళ్లు ప్రత్యక్షంగా కనబడుతున్నట్లే)వివేకవంతులు కర్మాచరణలో ప్రవర్తించకపోవడం కనబడుతూన్నది గాన,వాళ్లను అనుసరించేవాళ్లు కూడ విధిప్రతిషేధాదివిషయంలో ప్రవర్తించకపోతే శాస్త్రం అనర్థకమే కదా?(సమాధానం)అట్లు కాదు. ఏ ఒక్కనికో మాత్రమే వివేకం కలుగుతుంది. అనేకప్రాణులలో ఏ ఒక్కడో మాత్రమే, ఈ నాడు మనం చూస్తున్నట్లుగానే,వివేకంవంతు డౌతాడు. మూఢులు వివేకవంతుణ్ణి అనుసరించరు. ఎందువల్ల ననగా–ప్రవృత్తి రాగాదిదోషాలను పట్టి కలుగుతుంది. ఎందరో అభిచారక్రియాదులందు ప్రవర్తించడం కనబడుతూన్నది. (ఇతరులను హింసించడంకోసం, చంపడంకోసం, చేసే కొన్ని ప్రక్రియలు,శ్యేనయాగాదులు,అభిచారక్రియలు). ప్రవృత్తి అనేది స్వభావంచేతనే జరిగిపోతూ ఉంటుంది. అందుచేతనే "స్వభావస్తు ప్రవర్తతే"అని చెప్పబడింది. అందుచేత సంసారం అవిద్యచేత ఏర్పడుతుంది;మనకు ఎలా కనబడుతున్నదో అట్లే దాని విషయం ఉంటుంది;అనగా అవిద్యావంతుడే సంసారి. కేవలు డైన(శుద్ధుడైన) క్షేత్ర జ్ఞునికి అవిద్యా ఉండదు దాని కార్య మైన సంసారాదికమూ ఉండదు. మిథ్యాజ్ఞానం పరమార్థవస్తువును దూషింపజాలదు. ఎండమావి నీరు ఊషరక్షేత్రాన్ని బురదగా మార్చ జాలదు కదా?అట్లే అవిద్య కూడ క్షేత్రజ్ఞునికి ఏమీ చేయడానికి సమర్థం కాదు. అందుచేతనే –"క్షేత్రజ్ఞం చాపి మాం విద్ధి"అని,"అజ్ఞానేనావృతం జ్ఞానమ్"అనీ చెప్పబడింది.

భాష్యమ్

అథ కిమిదం సంసారిణామ్ ఇవ "అహమ్ ఏవమ్""మమైవ ఇదమ్"ఇతి పణ్డితానామ్ అపి?శృణు–ఇదం తత్పాణ్డిత్యం యత్ క్షేత్ర ఏవ ఆత్మదర్శనమ్. యది పునః క్షేత్రజ్ఞమ్ అవిక్రియం పశ్యేయుః తతః న భోగం కర్మ వా ఆకాఙ్క్షేయుః మమ స్యాత్ ఇతి. విక్రియైవ భోగకర్మణీ. అథ ఏవం సతి ఫలార్థిత్వాత్ అవిద్వాన్ ప్రవర్తతే. విదుషః పునః అవిక్రియాత్మదర్శినః ఫలార్థిత్వాభావాత్ ప్రవృత్త్యనుపపత్తౌ కార్యకరణ సంఘాతవ్యాపారోపరమే నివృత్తిః ఉపచర్యతే.

బాలానందిని

అథేతి: –(ప్ర)అయితే–ఇదేమిటి –పండితులకు కూడ"నేను ఇలాంటి వాడను,""ఇది నాదే"అని,సంసారులకు వలె,భావం కనబడుతూన్నది?(సమాధానం)విను;దేహమునందే ఆత్మను చూడడమే ఈ(పండితుల)పాండిత్యం. క్షేత్రజ్ఞుడు వికారరహితుడు అని వాళ్లు

గ్రహిస్తే'ఇది నాకు కావాలి'అని భోగాన్ని కాని,కర్మను కాని కోరేవారు కాదు.భోగము కర్మా కూడ వికారాలే కదా?అయితే-ఈ విధంగా ఫలాన్ని కోరేవా డవడంచేత అవిద్వాంసుడు ప్రవర్తిస్తాడు.వికారరహితమైన ఆత్మను చూచిన విద్వాంసున కైతే ఫలంమీద కోరిక ఉండదు,అప్పుడు ప్రవృత్తి ఉండే అవకాశం లేదు;దేహేంద్రియాలు ఏ వ్యాపారమూ చేయకుండా ఉండడంతోఆతనియందు నివృత్తి ఆరోపించబడుచున్నది.(నివృత్తి అంటూ క్రొత్తగా ఒక క్రియ ఏదీ లేదు;దేహేంద్రియాదులు వాటి పనులు చేయడం మానివేయడమే నివృత్తి).

భాష్యమ్

ఇదం చ అన్యత్ పాణ్డిత్యం కస్య చిత్-అస్తు క్షేత్రజ్ఞః ఈశ్వరః ఏవ,క్షేత్రం చ అన్యత్ క్షేత్రజ్ఞస్య విషయః.అహం తు సంసారీ సుఖీ దుఃఖీ చ. సంసారోపరమశ్చ మమ కర్తవ్యః క్షేత్రక్షేత్రజ్ఞవిజ్ఞానేన ధ్యానేన చ ఈశ్వరం క్షేత్రజ్ఞం సాక్షాత్కృత్వా తత్స్వరూప జ్ఞానేన ఇతి.యశ్చ ఏవం బుధ్యతే యశ్చ బోధయతి న అసౌ క్షేత్రజ్ఞః ఇతి-ఏవం మన్వానః యః స పణ్డితాపసదః సంసారమోక్షయోః శాస్త్రస్య చ అర్థవత్త్వం కరోమి ఇతి, ఆత్మహా స్వయం మూఢః,అన్యాంశ్చ వ్యామోహయతి-శాస్త్రార్థసంప్రదాయరహితత్వాత్ శ్రుతహానిమ్ అశ్రుతకల్పనాం చ కుర్వన్.తస్మాత్ అసంప్రదాయవిత్ సర్వశాస్త్ర విదపి మూర్ఖవదేవ ఉపేక్షణీయః.

భాష్యమ్

ఇదమితి:-ఇలాంటి మరొక రకమైన పాండిత్యం కలవాడు కూడ ఒకడు ఉంటాడు-"క్షేత్రజ్ఞుడు ఈశ్వరుడే అగు గాక.వానికంటె భిన్నమైన క్షేత్రం కూడ ఆ క్షేత్రజ్ఞుడైన ఈశ్వరునికి విషయం అగు గాక.నేను మాత్రం సంసారిని,సుఖవంతుడను, దుఃఖవంతుడనూ కూడ.నేను క్షేత్రక్షేత్రజ్ఞులను తెలుసుకొని ధ్యానంచేత క్షేత్రజ్ఞుడైన ఈశ్వరుణ్ణి సాక్షాత్కరింపచేసికొని,ఆ ఈశ్వరుని స్వరూపంతో ఉండడం ద్వారా సంసారాన్ని నశింపచేసికోవాలి అంటాడు ఈ పండితుడు. సంసారమోక్షాలకీ శాస్త్రానికీ సార్థకత్వం సంపాదిస్తాను అని అంటూ ఎవడైతే తాను క్షేత్రజ్ఞుడు కాడని అనుకొంటాడో, ఇతరులకు కూడ ఆ విధంగా బోధిస్తాడో అతడు పండితాపసదుడు (నీచపండితుడు) శాస్త్రార్థసంప్రదాయం లేనివా డవడంవల్ల(సంప్రదాయం అనగా గురుశిష్యపరంపరయా అవిచ్ఛిన్నంగా ఒకే విధంగా వస్తూన్న జ్ఞానం)శ్రుతహానిని (స్పష్టంగా వినబడుతున్న దానిని కాదనడం (శ్రుతహాని)అశ్రుతకల్పనను (వినబడనిదానిని

కల్పించడం అశ్రుతకల్పన) చేస్తూ ఈ ఆత్మఘాతకుడు తాను మూఢుడై ఇతరులను కూడ మోహింపచేస్తున్నాడు. అందుచేత సంప్రదాయం తెలియనివానిని, అతడు సకలశాస్త్రాలు తెలిసినవాడే అయినా, మూర్ఖుణ్ణి వలె ఉపేక్షించాలి. (అలాంటివాని మాటలకు ఏమీ విలువ ఇవ్వవలసిన పని లేదు అని అర్థం).

వి. 'ఆత్మహా' అనగా ఆత్మను చంపినవాడు. ఒక విధంగా ఉన్న ఆత్మను గూర్చి మరొక విధంగా అర్థం చేసుకొన్నవాడు. ఆత్మఘాతకుడు. ఇక్కడ భగవత్పాదులు మూడు రకాల పండితులను గూర్చి ముచ్చటించారు. సరియైన ఆత్మానాత్మావివేకంతో ఆత్మస్వరూపాన్ని చక్కగా అర్థం చేసికొన్నవాళ్లు మొదటి తరగతికి చెందినవారు. "**విదుషః పునః అవిక్రియాత్మదర్శినః**" ఇత్యాది వాక్యంలో నిర్దేశించ బడినవారు ఆ పండితులు. శాస్త్రపాండిత్యం ఉన్నా కూడ అహంకారమమకారాలు పోనివారు రెండవ తరగతికి చెందిన పండితులు. "**అథ కిమిదం సంసారిణామివ**" ఇత్యాదివాక్యంచేత నిర్దేశించబడినవాళ్లు వీరు. ఇంక మూడవ రకం పండితు లున్నారు. "**ఇదం శరీరం కౌన్తేయ**" ఇత్యాదిశ్లోకంలో క్షేత్రాన్ని గూర్చి తెలుసుకొంటూన్నవాడు క్షేత్రజ్ఞుడు అని చెప్పబడింది. తన శరీరాన్ని గూర్చి తెలుసుకొనేవాడు జీవుడే గాన క్షేత్రజ్ఞు డనగా జీవుడు అని స్పష్టంగా తెలుస్తూన్నది. "**క్షేత్రజ్ఞం చాపి**" ఇత్యాదిశ్లోకంలో ఆ క్షేత్రజ్ఞుడే ఈశ్వరు డని స్పష్టంగా చెప్పబడింది. అయితే "జీవుడే ఈశ్వరుడైన పక్షంలో ఈ సుఖదుఃఖరూప మైన సంసారం ఎలా కుదురుతుంది? మోక్షం ఎలా కుదురుతుంది? శాస్త్రాలకు ప్రయోజనం ఏమి ఉంటుంది? అందుచేత క్షేత్రజ్ఞుడనగా ఈశ్వరుడే. జీవుడు ఈశ్వరుడు కాదు. సుఖదుఃఖాలు జీవునికి సహజంగా ఉంటాయి. అయితే క్షేత్రక్షేత్రజ్ఞుల స్వరూపాన్ని బాగా తెలునుకొని జీవుడు చివరికి ఈశ్వరస్వరూపు డవుతాడు. అంతవరకు జీవుని జీవత్వం, వాని సంసారం ఇవన్నీ సత్య మైనవే. ఇలా చెప్పితేనే బంధమోక్షవ్యవస్థ కుదురుతుంది. శాస్త్రానికి కూడ సార్థక్యం ఉంటుంది" అని చెప్పేవాళ్లు కొంద రున్నారు. వాళ్లు మూడవ తరగతికి చెందిన పండితులు. నిజానికి వీళ్లు కుత్సితులైన, శాస్త్రసంప్రదాయదూరులైన పండితులు. శాస్త్రం జీవబ్రహ్మైక్యాన్ని బోధిస్తూన్నది. దాని ప్రకారం జీవుడు ఎల్లప్పుడూ బ్రహ్మాభిన్నుడే. కొంత కాలం వేరుగా ఉండి తరువాత బ్రహ్మ అవడం అనేది లేదు. దీనికి విరుద్ధంగా మాటలాడే వాళ్లు పండితాపసదులే అని భగవత్పాదుల అభిప్రాయం. ఆ నాటికీ క్షేత్రజ్ఞు డనగా ఈశ్వరు డని అర్థం చెప్పేవాళ్లు ఉండేవా రని దీనిని పట్టి తెలుస్తూన్నది. ఇంత చెప్పినా శంకర భగవత్పాదుల అనంతరం కూడ ఈ అర్థమే చెప్పాలి అని వాదించే ఆచార్యులు ఆవిర్భవించడం ఆశ్చర్యజనకం.

భాష్యమ్

యదుక్తమ్-ఈశరస్య క్షేత్రజ్ఞైకత్వే సంసారిత్వం ప్రాప్నోతి,క్షేత్రజ్ఞానాం చేశ్వరైకత్వే సంసారిణః అభావాత్ సంసారాభావప్రసంగః ఇతి-ఏతౌ దోషౌ ప్రత్యుక్తౌ విద్యావిద్యయోః వైలక్షణ్యాభ్యుపగమాత్ ఇతి. కథమ్? అవిద్యాపరికల్పితదోషేణ తద్విషయం వస్తు పారమార్థికం న దుష్యతి ఇతి. తథా చ దృష్టాన్తః. దర్శితః మరీచ్యమ్బసా ఊషరదేశః న పఙ్కీక్రియతే ఇతి. సంసారిణః అభావాత్ సంసారాభావప్రసంగదోషోఽపి సంసారసంసారిణోః అవిద్యాకల్పితత్వోపపత్త్యా ప్రత్యుక్తః. నను అవిద్యావత్త్వ మేవ క్షేత్రజ్ఞస్య సంసారిత్వదోషః తత్కృతం చ దుఃఖిత్వాది ప్రత్యక్షమ్ ఉపలభ్యతే? న; జ్ఞేయస్య క్షేత్రధర్మత్వాత్; జ్ఞాతుః క్షేత్రజ్ఞస్య తత్కృతదోషానుపపత్తేః. యావత్ కించిత్ క్షేత్రజ్ఞస్య దోషజాతమ్ అవిద్యమానమ్ అసంజయసి తస్య జ్ఞేయత్వోపపత్తేః క్షేత్రధర్మత్వ మేవ న క్షేత్రజ్ఞధర్మత్వమ్. న చ తేన క్షేత్రజ్ఞః దుష్యతి, జ్ఞేయేన జ్ఞాతుః సంసర్గానుప పత్తేః. యది హి సంసర్గః స్యాత్ జ్ఞేయత్వమేవ న ఉపపద్యేత. యది ఆత్మనః ధర్మః అవిద్యావత్త్వం దుఃఖిత్వాది చ కథం భోః ప్రత్యక్షమ్ ఉపలభ్యతే? కథం వా క్షేత్రజ్ఞ ధర్మః? జ్ఞేయం చ సర్వం క్షేత్రం జ్ఞాతైవ క్షేత్రజ్ఞః ఇత్యవధారితే అవిద్యాదుఃఖిత్వాదేః క్షేత్రజ్ఞవిశేషణత్వం క్షేత్రజ్ఞధర్మత్వం, తస్య చ ప్రత్యక్షోపలభ్యత్వమ్ ఇతి విరుద్ధమ్ ఉచ్యతే అవిద్యామాత్రావష్టమ్భాత్ కేవలమ్.

బాలానందిని

యత్త్వితి:-ఈశ్వరుడు క్షేత్రజ్ఞునికంటె అభిన్ను డైతే వానికి సంసారిత్వం వచ్చి పడుతుంది(అతడు సంసారి అవాలి), క్షేత్రజ్ఞులు ఈశ్వరునికంటె అభిన్ను లైతే సంసారి లేకపోవడంవల్ల సంసారమే లేకుండా పోతుంది అని ఏది చెప్పబడిందో ఈ దోషాలు విద్యావిద్యలు విలక్షణములు అని అంగీకరించడంవల్ల పరికరింపబడ్డాయి. ఎట్లు? అవిద్య చేత కల్పింబడిన దోషంచేత ఆ దోషానికి విషయమైన (గురియైన)పారమార్థికవస్తువునకు దోషం అంట దని చెప్పబడింది. ఎండమావుల నీళ్లచేత ఊషరప్రదేశం బురదగా చేయ బడదు అని దీనికి దృష్టాంతం కూడ చూపబడినది. సంసారి లేకపోతే సంసారమే లేకుండా పోవాలి అనే దోషం కూడ సంసారసంసారులు అవిద్యాకల్పితములు అనే యుక్తి చెప్పడంచేత నిరాకరించబడింది. (ప్రశ్న) క్షేత్రజ్ఞుడు అవిద్యావంతుడై ఉండడమే కదా సంసారిత్వదోషం అనగా? ఆ దోషంవల్ల కలిగిన దుఃఖిత్వాదికం కూడ ప్రత్యక్షంగా కనబడుతూనే ఉన్నది? (సమాధానం)అది కాదు. జ్ఞేయం (తెలియబడేది ప్రతీదీ కూడ)క్షేత్రంయొక్క ధర్మమే గాన జ్ఞాత (తెలుసుకొనేవాడు)అయిన క్షేత్రజ్ఞునికి వాటివల్ల (జ్ఞేయములవల్ల) కలిగే దోషాలు

కలగడం అనేది ఉండదు.(పై భావాన్నే వివదీకరిస్తున్నారు)-(నిజానికి) క్షేత్రజ్ఞునిలో లేని ఏ దోషసముదాయాన్ని నీవు సంక్రమింపచేస్తున్నావో ఆ దోషసముదాయం అంతా జ్ఞేయమే అని చెప్పడానికి అవకాశం ఉన్నది గాన(జ్ఞేయమే గాన)అది క్షేత్రధర్మమే అవుతుంది కాని క్షేత్రజ్ఞధర్మం కాజాలదు.జ్ఞేయంతో జ్ఞాతకు సంబంధం అసంభవం గాన దానిచేత(క్షేత్రధర్మమైన దోషసముదాయంచేత)క్షేత్రజ్ఞునికి ఏ దోషమూ అంటదు.జ్ఞాతకు దానితో సంసర్గం(సంబంధం)ఉండేటట్లయితే అప్పుడు అది జ్ఞేయమే కాజాలదు.అవిద్యావత్త్వము,దుఃఖిత్వాదికము ఆత్మధర్మమే అయితే అది ప్రత్యక్షంగా ఎలా తెలియబడుతుంది?అది క్షేత్రజ్ఞుని ధర్మం ఎలా అవుతుంది.జ్ఞేయ మైనది ప్రతీదీ క్షేత్రమే; జ్ఞాతయే క్షేత్రజ్ఞుడు అని నిశ్చయించిన తరువాత అవిద్య దుఃఖిత్వం మొదలైనవి క్షేత్రజ్ఞునకు విశేషణా లనీ,అవి క్షేత్రజ్ఞుని ధర్మా లనీ,అలా అవుతూనే ప్రత్యక్షంగా తెలియబడుతున్నా యనీ విరుద్ధమైన ఇది అంతా కేవలం అవిద్యాలంబనంత మాత్రమే చెప్పబడుచున్నది.

వి. జ్ఞేయం అనగా తెలియబడేది.జ్ఞాత అనగా తెలుసుకొనేవాడు,జ్ఞేయం ఏదీ కూడ జ్ఞాతయొక్క ధర్మం అనడానికి వీలులేదు.జ్ఞాతయొక్క ధర్మం అవుతే అది జ్ఞేయమే కాదు. అవిద్య, దానిచేత కలిగే దుఃఖిత్వాదులు ప్రత్యక్షంగా తెలుస్తున్నాయి.అందుచేత జ్ఞేయాలు. ఇవి జ్ఞేయాలు అని ఒక ప్రక్క అంగీకరిస్తూనే ఇవి జ్ఞాతయొక్క ధర్మాలు అనడం కేవలం అవిద్యచేత,అజ్ఞానంచేత చెప్పే మాటలే అని భావం.

భాష్యమ్

అత్రాహ-సా అవిద్యా కస్యేతి.యస్య దృశ్యతే తస్యైవ.కస్య దృశ్యతే ఇతి? అత్రోచ్యతే-అవిద్యా కస్య దృశ్యతే ఇతి ప్రశ్నః నిరర్థకః. కథమ్?దృశ్యతే చేత్ అవిద్యా తద్వన్తమపి పశ్యసి.న చ తద్వతి ఉపలభ్యమానే సా కస్యేతి ప్రశ్నః యుక్తః. న హి గోమతి ఉపలభ్యమానే గావః కస్యేతి ప్రశ్నః అర్థవాన్ భవేత్.నను విషమః దృష్టాన్తః - గవాం తద్వతశ్చ ప్రత్యక్షత్వాత్ సంబన్ధః అపి ప్రత్యక్షః ఇతి ప్రశ్నః నిరర్థకః.న తథా అవిద్యా తద్వాన్ చ ప్రత్యక్షౌ,యతః ప్రశ్నః నిర్థకః స్యాత్.అప్రత్యక్షేణ అవిద్యావతా అవిద్యాసంబన్ధే జ్ఞాతే కిం తవ స్యాత్?అవిద్యాయాః అనర్థహేతుత్వాత్ పరిహర్తవ్యా స్యాత్.యస్య అవిద్యా సః తాం పరిహరిష్యతి. నను మమైవ అవిద్యా?జానాసి తర్హి అవిద్యాం తద్వన్తం చ ఆత్మానమ్.జానామి,న తు ప్రత్యక్షేణ. అనుమానేన చేత్ జానాసి కథం సంబన్ధగ్రహణమ్?న హి తవ జ్ఞాతుః జ్ఞేయభూతయా అవిద్యయా తత్కాలే సంబన్ధః గ్రహీతుం శక్యతే.అవిద్యాయాః విషయత్వేనైవ జ్ఞాతుః ఉపయుక్తత్వాత్.న చ జ్ఞాతుః అవిద్యాయాః చ సంబన్ధస్య యః గ్రహీతా,జ్ఞానం చ అన్యత్ తద్విషయం

సంభవతి, అనవస్థాప్రాప్తేః. యది జ్ఞాత్రాపి జ్ఞేయసంబన్ధో జ్ఞాయేత అన్యః జ్ఞాతా కల్ప్యః స్యాత్; తస్యాపి అన్యః తస్యాపి అన్యః ఇతి అనవస్థా అపరిహార్యా. యది పునః అవిద్యా జ్ఞేయా, అన్యద్వా జ్ఞేయం జ్ఞేయమేవ, తథా జ్ఞాతాపి జ్ఞాతైవ,న జ్ఞేయం భవతి. యదా చ ఏవమ్ అవిద్యాదుఃఖిత్వాద్యైః న జ్ఞాతుః క్షేత్రజ్ఞస్య కించిత్ దుష్యతి.

బాలానందిని

అవ. ఏ అవిద్య(మూలావిద్య,మాయ)విరుద్ధ మైనవాటిని కూడ నిర్వహిస్తుందో అది జడం అవడంచేత దానికి స్వాతంత్ర్యం లేదు. చిత్ విద్యాస్వరూపం గాన అది అవిద్యకు ఆశ్రయం అవడానికి వీలు లేదు. చిత్తుకంటె భిన్నమైన మరొక వస్తు వేదీ లేదు. అలాంటప్పుడు ఈ అవిద్యకు ఆశ్రయం ఏది అని పూర్వపక్షి ప్రశ్నిస్తున్నాడు-**అత్రాహేతి**:-ఇక్కడ (పూర్వపక్షి) ఇలా అంటున్నాడు-ఆ అవిద్య ఎవరిది?ఎవరిని ఆశ్రయించుకొని ఉన్నది? (సమాధానం) ఎవనికిఉన్నట్లు కనబడుతున్నదో వానిదే.ఎవనికి (ఎవనిలో)కనబడుతున్నది? ఇక్కడ చెప్పబడుచున్నది.(చెపుతున్నాను;విను)అవిద్య ఎవనిలో కనబడుచున్నది అనే ప్రశ్నకు అర్థం లేదు.ఎందువల్ల?అవిద్య కనబడుతూంటే అవిద్యా వంతుణ్ణి కూడ చూస్తూనే ఉన్నావు.అది కలవాడు కనబడుతూన్నప్పుడు అది ఎవరిది అను ప్రశ్న అయుక్తం.గోవు లున్నవాడు ఎదుట కనబడుతూండగా ఈ గోవులు ఎవరివి అను ప్రశ్నకు అర్థం(ప్రయోజనం) ఉండదు కదా?(పూ.ప).నువ్వు చూపిన దృష్టాంతం విషమమైనది(ప్రస్తుతవిషయానికీ నీవు చూపిన దృష్టాంతానికీ తేడా ఉంది).గోవులు గోవులు కలవాడూ కూడ ప్రత్యక్షంగా కనబడుతున్నారు గాన వాళ్ల సంబంధం కూడ ప్రత్యక్ష మైనది.అందుచేత ప్రశ్న నిరర్థకం కావచ్చును.ఆ విధంగా అవిద్యా అవిద్యావంతుడూ ప్రత్యక్షంగా కనబడడంలేదు.అందుచేత ఈ ప్రశ్న నిరర్థంకాదు.(సిద్ధాంతి)అప్రత్యక్షు డైన అవిద్యావంతునితో అవిద్యకు సంబంధం తెలిస్తే మాత్రం నీకు ఏమవుతుంది?(నీ కేమి ప్రయోజనం?)(పూ.ప.)అవిద్య అనర్థాలకు హేతువు గాన దానిని పరిహరించుకోవాలి. (సిద్ధాంతి) ఎవనికి అవిద్య ఉంటే అతడే దానిని పరిహరించుకొంటాడు.(పూ.ప)అవిద్య నాకే ఉంది కదా?(సిద్ధాంతి)అయితే అవిద్యను అవిద్యకలిగిన తననూ గూర్చి నీకు తెలుసు నన్న మాట?(పూ.ప.)తెలుసును;కాని ప్రత్యక్షంగా తెలియదు.(సిద్ధాంతి) అనుమానంచేత తెలుసుకొన్నావంటే సంబంధం గ్రహించడం ఎట్లు?

వి. అవిద్యాకార్య మైన సుఖదుఃఖాత్మకసంసారం కనబడుతూనే ఉన్నది గాన అవిద్య ప్రత్యక్షంగా కనబడుతూన్నది.ఆత్మ కూడ 'నేను' అనే స్వానుభవంచేత ప్రత్యక్షమే.అందుచేత ఆత్మకు అవిద్య ఉన్నది అను విషయం ప్రత్యక్షవేద్యం అనేది వస్తుస్థితి.ఈ విషయాన్ని ప్రతిపాదించడంకోసం ఈ ప్రశ్నోత్తరపరంపర ప్రవేశపెట్టబడింది."నాకు అవిద్య ఉన్నది"అని నాకు తెలియును గాని ప్రత్యక్షంగా తెలియదు అని పూర్వపక్షి అన్నాడు. దీని అర్థం

అనుమానం ద్వారా తెలుసుకొన్నాను అని. **"అహమ్ అవిద్యావాన్;అవిద్యా కార్యవత్త్వాత్; వ్యతిరేకేణ ముక్తాత్మవత్"**అని అనుమానప్రయోగంచేత నీకు అవిద్య ఉన్నట్లు గ్రహించావన్నమాట. (నాకు అవిద్య ఉంది;అవిద్యాకార్యాలైన సుఖదుఃఖాదులు ఉన్నాయి కావున;అవి ఎవరికి లేవో వాళ్లకు అవిద్య లేదు;ముక్తులకు వలె అని అనుమానప్రయోగానికి అర్థం).

అ.వ. కాని ఈ అనుమానం ద్వారా కూడ ఆత్మకు అవిద్యకూ సంబంధం ఉన్నట్లు గ్రహించడం కుదరదు అని సిద్ధాంతి అంటున్నాడు.ఎందువల్ల ననగా-తనకు అవిద్యా సంబంధం ఉన్నట్లు జ్ఞాత యైన ఆత్మయే తెలుసుకొంటూన్నదా,మరొక జ్ఞాత ఎవరైనా తెలుసుకొంటున్నారా?మొదటి పక్షం కుదరదు అని సిద్ధాంతి అంటున్నాడు-న **హీతి**: జ్ఞాత వైన నీకు జ్ఞేయమైన అవిద్యతో సంబంధం ఉన్నట్లు ఆ సమయంలో,(అనగా అవిద్యను గ్రహించే సమయంలో)శక్యం కాదు కదా?ఎందువల్ల ననగా ఆ సమయంలో జ్ఞాత అవిద్యను విషయంగా గ్రహించడంలోనే వినియోగింపబడ్డాడు.

వి. అవిద్యను గ్రహించే సమయంలో జ్ఞాత కర్తగా ఉన్నాడు.అదే సమయంలో ఆ జ్ఞాత తనకూ అవిద్యకూ ఉన్న సంబంధాన్ని గ్రహించజాలడు.సంబంధం అనేది ద్వినిష్ఠం, రెండింటిలో ఉంటుంది.జ్ఞాత తనకూ అవిద్యకూ ఉన్న సంబంధాన్ని గ్రహిస్తున్నా డనగా అవిద్యనూ,తననూ కూడ గ్రహిస్తున్నా డని అర్థం.అనగా అవిద్య ఏ విధంగా జ్ఞాతయొక్క జ్ఞానంలో విషయం(కర్మ)అయినదో అట్లే కర్తయైన జ్ఞాత కూడ విషయం(కర్మ) అయ్యాడు అని చెప్పాలి.ఒకే వ్యక్తి ఒకే సమయంలో కర్తగాను కర్మగాను ఉండడం శక్యం కాదు.ఆత్మ అనేది ఎన్నడూ జ్ఞేయం కాజాలదు.దేనిని ఇంద్రియాలచేత గాని,మనస్సుచేత గాని గ్రహిస్తామో అదే జ్ఞేయం.ఆత్మ వీటిచేత గ్రహించబడదు.స్వయంప్రకాశం.నన్ను నేను తెలుసుకొంటున్నాను అని అంటే అది ఔపచారికప్రయోగమే;నేను ఘటాన్ని తెలుసుకొను చున్నాను వంటిది కాదు.అందుచేత జ్ఞాత యైన ఆత్మ జ్ఞేయమైన అవిద్యను గ్రహించినా కూడ దానికీ తనకూ సంబంధం ఉందని మాత్రం గ్రహింపజాలదు అని భావం.

అ.వ. జ్ఞాతకు అవిద్యకూ ఉన్న సంబందాన్ని గ్రహించే జ్ఞాత ఉంటాడు.వాని జ్ఞానంలో వాటి సంబంధం విషయం అవుతుంది అనడం కూడ యుక్తం కా దని చెపుతున్నారు.న **చేతి**:-జ్ఞాతకు అవిద్యకు ఉన్న సంబంధాన్ని ఎవడు గ్రహిస్తాడో అట్టి జ్ఞాత, తద్విషయక మైన,అనగా జ్ఞాతృజ్ఞేయసంబంధం విషయంగా గల మరొక జ్ఞానము సంభవంకాదు.అలా చెప్పినట్లయితే అనవస్థాదోషం ఏర్పడుతుంది.జ్ఞాతతో జ్ఞేయానికి ఉన్న సంబంధం కూడ తెలియబడా లంటే దాన్ని తెలుసుకొనే మరొక జ్ఞాతను కల్పించాలి; ఆ జ్ఞాతకు జ్ఞాత మరొకడు;వాని జ్ఞాత మరొకడు అని అపరిహార్య మైన అనవస్థాదోషం ఏర్పడుతుంది.

వి: ఆత్మావిద్యల సంబంధాన్ని తెలుసుకొనడానికి మరొక జ్ఞాత ఉంటే ఆ జ్ఞాత యొక్క జ్ఞానంలో ఆత్మ కూడ విషయం(జ్ఞేయం)అవుతుంది. అప్పుడు ఆ జ్ఞేయానికీ జ్ఞాతకీ ఉన్న సంబంధాన్ని తెలుసుకొనడానికి మరొక జ్ఞాత ఉండాలి. ఈ విధంగా అనవస్థా దోషం ఏర్పడుతుంది.

యదిపునరితి:-అందువల్ల అవిద్య జ్ఞేయ మన్నా,మరొకటి ఏదైనా జ్ఞేయ మన్నా జ్ఞేయం ఎల్లప్పుడూ జ్ఞేయమే-(జ్ఞాత కాజాలదు). జ్ఞాత ఎల్లప్పుడూ జ్ఞాతయే జ్ఞేయం కాజాలదు.(ఆత్మ తనచేత గాని పరునిచేత గాని జ్ఞేయం కాదు. అది నిత్యానుభవగమ్యం. స్వప్రకాశం. అందుచేత దానికి అవిద్యాసంబంధం అప్రామాణికం. ప్రమాణాలచేత నిరూపించడానికి శక్యంకాదు. కాని లేదని చెప్పడానికి వీలులేదు. అందుచేత అవిద్య,తత్సం బంధమూ కూడ అనిర్వాచ్యాలే అని భావం). యథార్థస్థితి ఇలా ఉండడంచేత అవిద్యచేత గాని,అవిద్యాకల్పితాలైన దుఃఖిత్వాదులచేత గాని జ్ఞాత యైన క్షేత్రజ్ఞునికి ఏ దోషమూ అంటదు.

వి. ఈ ఘట్టంలోని భగవత్పాదప్రతిపిపాదయిషితవిషయాన్ని శ్రీరామరాయకవి చక్కగా విశదీకరించారు. మహాప్రకాశరూప మైన సూర్యునియందు గుడ్లగూబ అంధకారం ఉన్నట్లు చూస్తుంది. అదే విధంగా అసంగము స్వప్రకాశమూ అయిన ఆత్మయందు అజ్ఞులైన జనుల అనుభవం ప్రకారం,అప్రామాణికము,మిథ్యాభూతమూ,అనిర్వాచ్యమూ అయిన అజ్ఞాన మనేది ఒకటి ఉంది. గుడ్లగూబ అనుభవాన్ని పట్టి సూర్యునిలో ఉన్నట్లు కనబడు చున్న అంధకారం సూర్యునిలో ఏ విధంగా మూడు కాలాలలోనూ కూడ లేదో అజ్ఞుల అనుభవంచేత ఏర్పడిన ఈ అజ్ఞానం కూడ ఆత్మలో కాలత్రయంలోనూ కూడ లేదు. అందుచేత ఆత్మకు అవిద్యానంబంధం ఎట్లు ఏర్పడుచున్నది అనే ప్రశ్న నిరర్థక మైనది. ఆత్మకున్న అవిద్యాసంబంధం సత్యమైన దని మేం అనడం లేదు. అజ్ఞుల దృష్టి ప్రకార మైతే ఆత్మకు ఒక విధమైన అవిద్యాసంబంధం ఉంది. "అహమ్ అజ్ఞః"అనే లోకప్రసిద్ధమైన అనుభవం లేదనడానికి వీలులేదు కదా? అజ్ఞుల అనుభవంచేత సిద్ధించిన (ఉన్నట్లు) కనబడుతున్న) ఆత్మాశ్రయమైన ఈ అజ్ఞానం ఇంద్రజాలం వంటిది. దీనిని గూర్చి అతిగా విచారణ చేసి ప్రయోజనం లేదు. అందుచేతనే అనిర్వచనీయం అంటున్నాం. ఈ విధంగా అజ్ఞానమే అవిచారితసిద్ధ మైనప్పుడు దానికి ఆత్మతో సంబంధం ఉందా లేదా అనే విచారణ చేయడం ప్రారంభిస్తే ఏమీ తేలదు. ఈ విధంగా అవిద్యాసంబంధం నిరూపింప శక్యం కానప్పుడు అవిద్యాకార్యదుఃఖాదిసంబంధం కూడ నిరూపింప శక్యం కానిదే. అందుచేత ఆత్మ అసంగం,స్వప్రకాశం,చిద్రూపం. వాస్తవంలో దీనికి అవిద్యాదుఃఖాదులతో సంబంధం లేదు.

"అజ్ఞః అహమ్" దుఃఖీ అహమ్"ఇత్యాదిరీతులలో ఆత్మకు అజ్ఞానదుఃఖాదులతో సంబంధం ఉన్నట్లు ప్రత్యక్షంగా కనబడుతూండగా దానిని కప్పిపుచ్చడం ఎలా కుదురు

తుంది అనే ప్రశ్నకు అవకాశం లేదు.ప్రమాణాలకి విరుద్ధమైన విషయం, రజ్జుసర్పాదికం వలె ప్రత్యక్షంగా కనబడుతున్నా కూడ అది యథార్థంగా ఉన్నది అని చెప్పడం కుదరదు కదా?ఆత్మయందు అజ్ఞానాదిసంబంధం అప్రమాణికం అనే విషయం ఆచార్యలు చూపించియే ఉన్నారు.ఆ విషయమే సుఖంగా తెలియడంకోసం విశదీకరిస్తున్నాను.ఆత్మచేత అనుభవింపబడుతూన్న ఈ అజ్ఞానదుఃఖాదులు ఆత్మధర్మాలా అనాత్మధర్మాలా?ఆత్మధర్మాలను ఆత్మయే అనుభవించజాలదు గాన అవి ఆత్మధర్మా లనడానికి వీలు లేదు. ఆత్మధర్మాలను అనుభవించడానికి మరొక ఆత్మ లేదు.అలా ఉంటే అనవస్థాదోషం కలుగు తుంది."నాన్యోఽతోఽస్తి ద్రష్టా"అను శ్రుతికి విరోధం కూడ కలుగుతుంది.అందుచేత, పరిశేషన్యాయంచేత, అవి అనాత్మయైన అంతఃకరణంయొక్క ధర్మాలే అని చెప్పాలి. అలాంటప్పుడు అనాత్మ ధర్మాలకు ఆత్మతో సంబంధం ఎలా ఉంటుంది!ఘటంయొక్క ధర్మాలైన సన్నని మూతి మొదలైన ధర్మాలతో ద్రష్టయైన ఆత్మకు సంబంధం ఉండదు కదా? అచేతనమైన అంతఃకరణం అజ్ఞానానికి ఆశ్రయం ఎలా అవుతుంది అనే ఆశంకకు అవకాశం లేదు.అంతఃకరణం ఆత్మప్రతిబింబాన్ని గ్రహించడంచేత సచేతనమే. ఈ అనాత్మధర్మాలు అనాది యైన మాయచేత,రజ్జువుమీద సర్పం అధ్యసించబడినట్లు,ఆత్మ యందు అధ్యసించబడడంచేత అజ్ఞుడు "నేను సుఖవంతుడను, నేను దుఃఖవంతుడను"అని అనుకొంటూంటాడు. అధ్యసించబడిన అవిద్యాదుఃఖిత్వాదులచేత ఆత్మకు దోష మేమీ అంటదు.ఆత్మచేత అనుభవించబడు చున్న(తెలియబడుచున్న)ఈ మాయ అనాది యైనది;ఇది ఆత్మధర్మం కాదు;తనచేత అనుభవించబడేది తన ధర్మం కాజాలదు కదా?అనాత్మల ధర్మం కూడ కాదు.అనాత్మలు మాయాకార్యాలు కదా,మాయవల్ల పుట్టినవి కదా?అందుచేత ధర్మ మని గాని,ధర్మి అని గాని మాయను నిర్వచించడం శక్యం కాదు. (భా.అ.ప్ర.పే.40)

శ్రీశంకరభగవత్పాదులు ఈ విధమైన ప్రశ్నకే సూత్రభాష్యంలో కూడ సమాధానం చెప్పి ఉన్నారు–"కస్య పునః అయమ్ అప్రబోధః ఇతి చేత్,యః త్వం పృచ్ఛసి తస్య తే ఇతి వదామః.నను అహమ్ ఈశ్వర ఏవ ఉక్తః శ్రుత్యా?యద్యేవం ప్రతిబుద్ధః అసి,నాస్తి కస్య చిత్ అప్రబోధః"(బ్ర.సూ.శాం.భా. 4. 1. 3)."అజ్ఞానం అనుభవసిద్ధం.దానిని లేదనడం శక్యం కాదు.అందుచేత అభేదజ్ఞానానికి ముందు చిన్మాత్రుడవైన నువ్వే అజ్ఞానానికి ఆశ్రయము అని భావం"అని రత్నప్రభ.దీనిని గురించిన విస్తృతవివరణం భామతీబ్రహ్మ విద్యాభరణాను సారం బ్రహ్మసూత్రభాష్యవ్యాఖ్య యైన బాలానందినిలో ఇవ్వబడినది.

భాష్యమ్

నను అయమేవ దోషః యత్ దోషవత్క్షేత్రవిజ్ఞాతృత్వమ్?న. విజ్ఞానస్వరూపస్యైవ అవిక్రియస్య విజ్ఞాతృత్వోపచారాత్.యథా ఉష్ణతామాత్రేణ అగ్నేః తప్తిక్రియోపచారః

తద్వత్. యథా అత్రభగవతా క్రియాకారకఫలాత్మత్వాభావః ఆత్మని స్వత ఏవ దర్శితః అవిద్యాధ్యారోపితః ఏవ క్రియాకారకాదిః ఆత్మని ఉపచర్యతే తథా తత్ర తత్ర "య ఏనం వేత్తి హన్తారమ్"(2.19)"ప్రకృతేః క్రియమాణాని గుణైః కర్మాణి సర్వశః"(3.27) "నాదత్తే కస్య చిత్ పాపమ్"(5.15)ఇత్యాదిప్రకరణేషు దర్శితః,తథైవ చ వ్యాఖ్యాతమ్ అస్మాభిః. ఉత్తరేషు చ ప్రకరణేషు దర్శయిష్యామః.

హన్త తర్హి ఆత్మని క్రియాకారకఫలాత్మతాయాః స్వతః అభావే అవిద్యయా చ అధ్యారోపితత్వే కర్మాణి అవిద్వత్కర్తవ్యాన్యేవ,న విదుషామ్ ఇతి ప్రాప్తమ్?సత్యమ్;ఏవం ప్రాప్తమ్.ఏతదేవ చ"న హి దేహభృతా శక్యమ్" (18.11)ఇత్యత్ర దర్శయిష్యామః. సర్వ శాస్త్రోపసంహారప్రకరణే చ "సమాసేనైవ కౌన్తేయ నిష్ఠా జ్ఞానస్య యా పరా" (18.50) ఇత్యత్ర విశేషతః దర్శయిష్యామః.అలమ్ అత్ర బహుప్రపఞ్చేనేతి ఉపసంహ్రియతే. 2

బాలానందిని

నన్వితి:- (ఆక్షేపం)క్షేత్రజ్ఞునకు ఏ దోషమూ అంటదు అనడానికి వీలు లేదు; దోషం గల క్షేత్రాన్ని చూడడమే క్షేత్రజ్ఞునికి దోషం కదా?(సమాధానం)అట్లు కాదు.ఎట్టి వికారాలూ లేని విజ్ఞానస్వరూపు డైన ఆత్మకే విజ్ఞాతృత్వం ఆరోపించబడుచున్నది.అగ్ని కేవలం వేడిగా ఉంటుంది.తావన్మాత్రంచేతనే అగ్ని తపింపచేస్తున్నది అని అనడం ఎట్టిదో ఇది కూడ అట్టిదే.(ఆత్మ జ్ఞానస్వరూపం.ఇది జ్ఞాత (తెలుసుకొనేది)కాదు.అగ్ని వేడిగా ఉంటుంది.అంతే.అంది తపింపచేయడం అనే పని ఏమీ చేయదు.కేవలం అగ్ని దగ్గర ఉంటే ఆ ఉన్నవాళ్లకి తాపం కలుగుతుంది.తాపం విషయంలో అగ్నికి కర్తృత్వం లేదు. అయినా కూడ అగ్ని తపింపచేస్తూన్నది అని అంటారు.అట్లే తెలుసుకొనడం అనే పని చేస్తూన్నది అని దానియందు కర్తృత్వం ఆరోపించబడుచున్నది అని అర్థం).ఆత్మకు సహజంగానే క్రియారూపత్వం గాని,కారకరూపత్వం గాని,ఫలరూపత్వం గాని లేదు,అవిద్య చేత ఆరోపించబడిన క్రియాకారకాదికమే ఆత్మయందు ఆరోపించబడుచున్నది అని భగవంతుడు ఇక్కడ (ఈ అధ్యాయంలో)ఎట్లు చూపించాడో అట్లే "య ఏనం వేత్తి హన్తారమ్", "ప్రకృతేః క్రియమాణాని గుణైః కర్మాణి సర్వశః","నాదత్తే కస్య చిత్పాపమ్" ఇత్యాది ప్రకరణాలలో కూడ అక్కడక్కడ చూపబడినది;మేం కూడ ఆ విధంగానే వ్యాఖ్యానించి ఉన్నాం.రాబోయే ప్రకరణాలలో కూడ చూపగలం.

(ప్రశ్న)అయితే-ఆత్మకు సహజంగా క్రియాకారకఫలాత్మత్వం లేకపోతే,ఇదంతా అవిద్యచేతనే ఆరోపించబడిన దైతే,కర్మలు చేయవలసినది అవిద్వాంసులే,విద్వాంసులు

చేయవలసిన పని లేదు అని చెప్పినట్లయింది?(సమాధానం)నిజమే;ఇలాగే చెప్పి నట్లయినది. ఈ విషయాన్నే "న హి దేహభృతా శక్యమ్"అన్న చోట చూపగలం."సమాసేనైవ కౌన్తేయ నిష్ఠా జ్ఞానస్య యా పరా"అను సర్వశాస్త్రార్థోపసంహారప్రకరణంలో కూడ చూపగలం. ఇంక ఎక్కువ విస్తరించి చెప్పడం చాలును అను అభిప్రాయంతో ఉపసంహరిస్తున్నాం.

భా.అ.ప్ర. ఇక్కడ శ్రీరామానుజాచార్యులు "క్షేత్రజ్ఞం చాపి మాం విద్ధి"అని సామానాధి కరణ్యం (రెండు పదాలూ ఒకే విభక్తిలో వచనంలో ఉండి ఒకే వస్తువును నిర్దేశించడం) వల్ల ఈశ్వరుడై ఉన్నవానికే అజ్ఞానంవల్ల క్షేత్రజ్ఞత్వం కలిగి నట్లు అనిపిస్తుంది.దానిని నివర్తింపచేయడంకోసమే ఈ ఉపదేశం చేయబడుచున్నది."ఇది సర్పం కాదు,త్రాడు మాత్రమే"అని ఆప్తుని ఉపదేశంచేత సర్పభ్రమ నివర్తించి నట్లు ఆప్తతముడైన భగవంతుని ఈ ఉపదేశంచేత క్షేత్రజ్ఞుడ ననే భ్రమ తొలగిపోతుంది అని కొందరు అంటారు" అని అద్వైతిమతాన్ని ఉట్టంకించారు.దీని భావాన్నివివరిస్తూ వేదాంతదేశికులు, సర్వజ్ఞుడే అయిన ఈశ్వరునికే అజ్ఞానంవల్ల క్షేత్రజ్ఞుడ ననే భ్రాంతి కలుగుతున్నది.ఆ ఈశ్వరుడే క్షేత్రజ్ఞునకు ఉపదేశిస్తున్నాడు అని అంటూ వీళ్లు వ్యాకులంగా మాటలాడుతున్నారు"అని వ్రాశారు.

ఈ విషయంలో విచారణ చేయబడుచున్నది.ఈశ్వరుడే అజ్ఞానంవల్ల క్షేత్రజ్ఞు డైనాడు అని అద్వైతుల మైన మేము చెప్పలేదు.మరే మని చెప్పినా మనగా క్షేత్రజ్ఞుడు ఈశ్వరుడే అయి ఉండి కూడ అజ్ఞానంవల్ల సంసారి అవుతున్నాడు అని చెపుతున్నాం. అందుచేత ఈశ్వరునకు క్షేత్రజ్ఞు డను అను భ్రమలేదు.ఈశ్వరుని క్షేత్రజ్ఞత్వం ప్రమయే. ఎందువల్ల ననగా ఈశ్వరుడే క్షేత్రజ్ఞుడు.అతడు అసంసారి కూడ.అది కానిదానిని అదిగా భావించడం కదా భ్రమ అనగా?ఒకే సచ్చిదానందం సర్వాధికారిగా ఉండడం అనే ఈశనంచేత ఈశ్వరు డని చెప్పబడుచున్నాడు,క్షేత్రాన్ని గూర్చి తెలుసుకొనడంచేత క్షేత్రజ్ఞు డని చెప్పబడుచున్నాడు,అందువల్ల ఈశ్వరుని ఈశ్వరత్వం ఎలా భ్రమ కాదో క్షేత్రజ్ఞత్వం కూడ భ్రమ కాదు. "సాక్షీ చేతా"ఇత్యాదిమంత్రాన్ని అనుసరించి ఈశ్వరుడు సాక్షి అనే విషయం శ్రుతిప్రసిద్ధం."సమస్తమును ప్రత్యక్షంగా చూచేవాడు సాక్షి"అను వ్యుత్పత్తి ప్రకారం క్షేత్రజ్ఞుడై ఉండడమే సాక్షిగా ఉండడం జ్ఞేయమైన సమస్తమూ కూడ క్షేత్రమే. లోకంలో కూడ అంతా చూస్తున్నా ఉదాసీనుడుగా ఉన్నవానిని సాక్షి అంటారు.ద్రష్టయైన ఈశ్వరుడు కూడ ఉదాసీనుడు గాన వానికి ఎట్టి వికారాలూ ఉండవు.కలహించుచున్నవాళ్లకు ఉన్నట్లుగా సాక్షికి సుఖదుఃఖాదు లుండవు కదా?అందుచేతనే అతడు ఉదాసీనుడు.ఈ విధంగా ఎట్టి వికారాలూ లేనివాడడంచేతనే ఈశ్వరునికి సంసారిత్వం లేదు.సుఖదుఃఖాది వికారమే కదా సంసార మనగా?అందువల్ల అసంసారి యైన ఈశ్వరుడే క్షేత్రజ్ఞు డని మేం చెపు తున్నాం.ఇది సత్యమైన విషయమే కాని రజ్జుసర్పం వలె భ్రమ కాదు. రజ్జువునందు సర్పం కల్పించబడి నట్లు ఈశ్వరునియందు క్షేత్రజ్ఞుడు కల్పించబడ్డాడు అని మేం అనలేదు కదా?

ఇది ఇలా ఉండగా–ఈశ్వరునికి క్షేత్రజ్ఞుడ ననే భ్రమ ఉన్నది అని మేం చెప్పామని ఎవ రనుకొంటున్నారో వాళ్లే భ్రాంతులు,ఈశ్వరుడు కాని,మేం కాని భ్రాంతులం కాము.భ్రమకు హేతువైన అజ్ఞానం ఉండడంవల్ల మీకు భ్రమ కలగడం ఉపపన్నమే.ఈ అజ్ఞానంవల్లనే కదా ఈశ్వరుడు క్షేత్రజ్ఞునికంటె భిన్నుడనీ,క్షేత్రజ్ఞుడు సంసారి యైన జీవుడనీ మీకు భ్రమ కలుగుతూన్నది?క్షేత్రజ్ఞం చాపి ఇత్యాది శ్లోకానికి మీరు చేసిన అపార్థకల్పన కూడ అజ్ఞానమూలకమే.అదెట్లనగా–క్షేత్రజ్ఞుణ్ణి,మామ్=మదాత్మకుణ్ణిగా తెలుసుకొనుము. అపిశబ్దంవల్ల క్షేత్రమును కూడ మదాత్మకమునుగా తెలుసుకొనుము అని మీ వ్యాఖ్యానం. ఈ వ్యాఖ్యానంలో క్షేత్రజ్ఞశబ్దానికి అస్మచ్ఛబ్దానికీ కనబడుచున్న ముఖ్యమైన సామానాధికారణ్యానికి, క్షేత్రజ్ఞుణ్ణి నన్నుగా తెలుసుకొనుము అని చెప్పే సామానాధికరణ్యానికి, భంగం అనేది 'ఒక దోషం'.మామ్ అనే అసమస్తపదానికి మదాత్మకమ్ అని సమాసం కల్పించడం మరొక దోషం.మదాత్మకం అనేదానికి నా స్వరూపం కలదానినిగా అని అర్థం చెపితే తన మతం విడవడం అనేది(జీవుడు మీ మతం ప్రకారం పరమేశ్వరస్వరూపుడు కాడు కదా)మరొక దోషం.ఆత్మశబ్దానికి శరీరం(శరీరం కలవాడు)అను అర్థం గ్రహించి–జీవుడు శరీరి అవడంచేత దేహానికి ఏ విధంగా ఆత్మయో అదే విధంగా శరీరమైన జీవునకు ఈశ్వరుడు శరీరి అవడంచేత ఆత్మ అని అన్నట్లయితే నిత్యుడైన జీవుని విషయంలో "నశించేది కాబట్టి శరీరం"అను వ్యుత్పత్తిచేత సిద్ధమైన'శరీర'శబ్దం సరిగా ప్రవర్తించక పోవడం అనేది ఇంకొక దోషం.ఏది శీర్ణం అవుతుందో,నశిస్తుందో దానిని శరీరం అనాలి కాని నిత్యుడైన జీవుణ్ణి శరీరం అనకూడదు.ఈ దోషం పరిహరించడంకోసం జీవుడు అనిత్యుడే అని అంటే "అజో నిత్యః"అను గీతావాక్యానికి విరోధం మరొక దోషం. ఆత్మ (పరమాత్మ)శేషి (అంగి,అవయవి)అని అర్థం చెపితే దేనికీ శేషం కాక అన్నింటికీ శేషిగా ప్రసిద్ధమైన ఆత్మ యైన జీవుడు ఈశ్వరునికి శేషం(అవయవం)అని కల్పించడం మరొక దోషం.దేహం జీవునికి ఏ విధంగా అపృథక్సిద్ధవిశేషణమో(విడదీయరాని,ఎల్లప్పుడు కలిసి ఉండే విశేషణమో)అట్లే జీవుడు ఈశ్వరునికి అపృథక్‌సిద్ధవిశేషణం అవడంవల్ల ఈశ్వరాత్మకుడు అని అర్థం చెపితే దృష్టాంతము దార్‌ష్టాంతికము రెండూ కూడ అనుపపన్న ములే.దేహం 'నాది'అని చెప్పబడుతూన్నది.జీవుడు 'నేను'అని తెలియబడుతున్నాడు. ఈ విధంగా వేరు వేరుగా కనబడేవి అపృథక్సిద్ధా లెలా అవుతాయి?దేహంకంటె జీవుడు వేరుగా లేకపోతే అప్పుడు దేహాత్మవాదం అంగీకరించిన ట్లవుతుంది.జీవునికంటె వేరుగా దేహం సిద్ధించకపోతే (లేకపోతే)దేహానికి మరణం లేకుండా పోతుంది.దేహంనుంచి జీవుడు తొలగిపోయినప్పుడే కదా దేహం మరణించింది అంటాం?ఈశ్వరుడు జీవునికంటె అపృథక్సిద్ధుడైతే ఈశ్వరుడు సంసారి అవవలసి ఉంటుంది.జీవేశ్వరులకు అభేదం అంగీకరిస్తే తమ మతం విడచి పరమతం అంగీకరించిన ట్లుఅవుతుంది.ఈశ్వరుడు ఎల్లప్పుడూ జీవులతో సంబంధించి

ఉంటే అగ్ని సంగంవల్ల లోహానికి ఉష్ణత్వం కలిగి నట్లు జీవసంగంవల్ల ఈశ్వరుడు కూడ సంసారి అవవలసి ఉంటుంది. ఇద్దరూ కలిసే ఉన్నప్పుడు ఈశ్వరుడు నియామకుడు జీవుడు నియమ్యుడు(నియమింపదగినవాడు)అనే మాట కుదరదు. ఈశ్వరునికంటె జీవుడు పృథక్సిద్ధుడు కాకపోతే(వేరుగా లేకపోతే) సంసారీ ఉండడు, సంసారమూ ఉండదు. ఈశ్వరునిచేత నియమించబడడమే జీవుని స్వభావం అనడం కూడ యుక్తం కాదు;సుషుప్తిలో జీవేశ్వరుల మధ్య నియామ్యనియామకభావం కనబడడం లేదు కదా? మరొక విషయ మేమనగా-అధ్యాసం లేకుండా మరొక కారణంచేత దేనిచేత నైనా జీవుడు దేహాత్మకుడు అని కాని,దేహం జీవాత్మకం అనికాని అనడానికి అవకాశం ఉంటే అప్పుడు ఆ దృష్టాంతంచేత జీవుడు ఈశ్వరాత్ముడనీ లేదా ఈశ్వరుడు జీవాత్ము డనీ చెప్పడానికి వీలవుతుంది. అలాంటి దేదీ లేదు. విద్వాంసు డెవడూ కూడ తాను దేహాత్ముకు డనీ,దేహం స్వాత్మకం అనీ అనుకొనడం లేదు కదా?అలాంటప్పుడు సర్వజ్ఞు డైన భగవంతుడు తనను జీవాత్మకు డని గాని జీవుణ్ణి స్వాత్మకు డని గాని ఎలా అనుకొంటాడు? అందువల్ల దేహాత్మలకు గాని జీవేశ్వరులకు గాని సామానాధికరణ్యానికి హేతువు అపృథక్సిద్ధవిశేషణత్వం కాదు;అజ్ఞానమే హేతువు."క్షేత్రజ్ఞం చాపి మాం విద్ధి"అని జీవేశ్వరులకు సామానాధికరణ్యం కనబడుతూన్నది.దానికి హేతువైన అజ్ఞానం ఈశ్వరునిలో కుదరదు గాన నీ వ్యాఖ్యానమే దుష్టమైనది. నువ్వు చెప్పి నట్లు దేహం తనకంటె అపృథక్సిద్ధవిశేషణ మని అనుకొంటున్నా కూడ,వివేకవంతు డెవడూ,"నేను మనుష్యుడ నని తెలుసుకో" అనడు కదా?అలా అంటే సర్వజ్ఞుడైన ఈశ్వరుడు"జీవుడు నేనే అని తెలుసుకో"అని అని ఉండేవాడు. నన్ను దేవునిగా తెలుసుకో అని ఎవడైనా అంటే అతనికి దేహాత్మాభిమానం నశించలే దని అర్థం;ఎందువల్ల ననగా-దేవత్వమనుష్యత్వాదులు దేహధర్మాలే గాని జీవధర్మాలు కావు. ఈశ్వరునికి కూడ జీవునియందు ఆత్మాభిమానం పోలేదు అని అంటే అప్పుడు అతడు సర్వజ్ఞుడు కాకుండా పోతాడు;ఆత్మాభిమానం తొలగిపోయినది అని అంటే అప్పుడు నన్ను జీవుణ్ణిగా తెలుసుకొనుము అను ఉపదేశం కుదరదు.క్షేత్ర మైతే ఈశ్వరాత్మకం అన్న మాట నిజమే;ఎందువల్ల ననగా అది ఈశ్వరునియందు కల్పించబడిన దవడంచేత ఈశ్వరస్వరూప మైనదే.అధ్యస్తవస్తువునకు అధిష్ఠానమే స్వరూపం కదా? ఈశ్వరుడు క్షేత్రంయొక్క అంతరాత్మ అవడంచేత కూడ క్షేత్రం ఈశ్వరాత్మ కావచ్చును. అయినా కూడ ఇక్కడ నున్న 'అపి'శబ్దంచేత ఆ అర్థం సూచించబడినది అనడం యుక్తం కాదు.ఈశ్వరుడు సర్వక్షేత్రాంతరాత్మ అనే విషయం "సర్వక్షేత్రేషు"అని ప్రత్యక్షంగానే చెప్పబడినది కదా?క్షేత్రాలలో ఉన్నవాడు క్షేత్రాంతరాత్మయే కదా?క్షేత్రం ఈశ్వరునియందు కల్పితం గాన అది ఈశ్వరాత్మకం అని మాత్రం నీ మతం కాదు.అందుచేత అది ఇక్కడ అపిశబ్దంచేత వివక్షితము అని నువ్వు అంటే తన మతాన్ని విడచి పరమతాన్ని అంగీకరించి నట్లవుతుంది."సర్వక్షేత్రేషు

క్షేత్రజ్ఞమ్"అనే చోట "క్షేత్రజ్ఞమ్"అనేది జాత్యేకవచనం అని నువ్వు చెప్పినది కూడ అసంగతమే. అలా చెప్పడానికి ప్రమాణం ఏమీ లేదు. అదే అభిప్రాయ మైతే మూలకారుడు "క్షేత్రజ్ఞానపి మాం విద్ధి'అని ఉండేవాడు. సచ్చిదానందరూప మైన క్షేత్రజ్ఞునిలో జాతి ఏదీ ఉండదు. మరొక విషయ మేమనగా చాలా వ్యక్తు లుంటే జాతి ఉంటుంది. క్షేత్రజ్ఞుడు ఒక్కడే అయినప్పుడు జాతి ఏమిటి? అన్ని క్షేత్రాలలోను క్షేత్రజ్ఞుడు (జీవుడు)ఒక్కడే. ఆ క్షేత్రజ్ఞుడు పరమేశ్వరుడే అని గీతాచార్యుని ఉపదేశం.

"ఇక్కడ ఉపదేశిస్తూన్న వాసుదేవునికి ఆత్మయాథాత్మ్యసాక్షాత్కారం కలిగి అజ్ఞానం తొలగిపోయినదా లేదా? మొదటి పక్షంలో నిర్విశేషచిన్మాత్రరూపమైన ఆత్మలో అధ్యాస అసంభం గాన అర్జునాదిభేదదర్శనమూ, వాళ్లకు ఉపదేశించడం మొదలైన పనులు అసంభవములు. ఆత్మసాక్షాత్కారం లేక అజ్ఞానం తొలగలేదు అన్నట్లయితే ఆత్మస్వరూపం తెలియనివాడు ఉపదేశం ఎలా చేస్తాడు"-అని రామానుజాచార్యుల ఆక్షేపం కూడ అర్థ రహిత మైనది. ఆత్మయొక్క అజ్ఞానం తొలగిపోయిన దని గాని, తొలగిపోలే దని గాని అనుకొనే వాడు మూర్ఖుడే. ఎందువల్ల ననగా కాలత్రయంలోనూ కూడ ఆత్మలో అజ్ఞానం లేదు. వాసుదేవుడు ఆత్మయే అయినప్పుడు ఆతనికి అజ్ఞానం ఉండే ప్రసక్తి గాని, అది తొలగే ప్రసక్తి కాని ఎక్కడ ఉంటుంది? వాసుదేవుడు కౌన్తేయునికి ఉపదేశిస్తున్నా డనుకొనే వాడు ఆత్మతత్త్వజ్ఞానగంధం కూడ లేనివాడే. నిర్విశేషచిన్మాత్ర మైన ఆత్మ ఎవనికీ ఏమీ ఉపదేశించదు కదా? వాగాదులే లేవు కదా? ఉపదేశిస్తూన్నట్లు కనబడుతూన్నది దేహేంద్రి యాదిసముదాయమే కాని ఆత్మ కాదు. వ్యవహారదశలో ఉపదేశించేవాడు. ఉపదేశించబడే వాడు-ఇత్యాదిభేదాలు ఉపపన్న మైనవే.

నిజానికి ఉపదేశం కుదరకపోవడం అనే దోషం నీ మతంలోనే ఉంది. జీవాంత ర్యామి, జీవుడు శరీరంగా గలవాడు అయిన పరమాత్మ జీవుడు తన శరీరమే అని తెలుసి ఉండి కూడ వానికి ఉపదేశం ఎలా చేస్తాడు? జీవుడు వేరు, నేను వేరు, జీవుడు మదాత్మకుడు కాదు అను జ్ఞానం ఉన్నప్పుడే ఉపదేశం కుదురుతుంది. నేను మనుష్యుడను అని అనుకొనే మూఢుడు కూడ తన స్వరూపమైన శరీరానికి ఉపదేశం చేయడు కదా? నేను దేవదత్తుడను; ఈ విశ్వమిత్రుడు నాకంటె వేరైనవాడు అను జ్ఞానం ఉంటేనే కదా ఒకడు మరొకనికి ఉపదేశిస్తాడు? నేను జీవుని అంతరాత్మను; జీవునికంటె భిన్నమైనవాడను అనే జ్ఞానంచేత ఉపదేశిస్తున్నాడు అనడం కూడ యుక్తం కాదు. నేను దేహంకంటె వేరు; దేహానికి అంతరాత్మ ఐనవాడను; అను జ్ఞానం ఉన్నా కూడ జీవుడు తన దేహానికి ఉపదేశించడంలేదు కదా? ఇంతకీ ఏ జీవుడూ కూడ తనలో మరొక డెవడో ఉన్నా డనీ, అతడు శరీరం అనీ, తాను ఆతని శరీరం అనీ, అతడు తనకు ఉపదేశిస్తున్నా డనీ అనుకొనడం లేదు. అలా అనుకొంటే అనుభవబలాన్ని పట్టి శరీరి యైన ఈశ్వరుడు తన శరీరమైన జీవునికి ఉపదేశిస్తున్నాడు అనడానికి వీలుండేది.

శ్రీకృష్ణుడు అర్జునునకు ఉపదేశించడం అనే దృష్టాంతంయొక్క బలాన్ని బట్టి ఈ విధంగా అంగీకరించవచ్చును అనడం కూడ యుక్తం కాదు. అర్జునునకు బైట ఉన్నట్లు కనబడుతూన్న కృష్ణుడు అర్జునుని లోపల అంతరాత్మగా ఉన్నాడని చెప్పడానికి శక్యం కాదు కదా? అర్జునుని శరీరంలోని అంతరాత్మయే కృష్ణుని శరీరంలోని అంతరాత్మ కూడ అనడం కూడ యుక్తం కాదు. అప్పుడు ఏకాత్మవాదం అంగీకరించి నట్లవుతుంది. నువ్వు అనేకాత్మవాదివి కదా! అర్జునుని శరీరంలో అంతరాత్మగా ఉన్నవాడే కృష్ణుని శరీరంలో ప్రమాతగా(జ్ఞాతగా)ఉండి ఉపదేశిస్తున్నాడు అనడం కూడ కుదరదు. అర్జునశరీరప్రమాత లోపల అంతరాత్మ ఉన్నట్లు కృష్ణశరీరంలోని ప్రమాతలో కూడ తప్పకుండా అంతరాత్మ ఉండాలి. అర్జునప్రమాత్రంతరాత్మయే కృష్ణప్రమాతృరూపమైనది అనడం యుక్తం కాదు. అర్జునప్రమాత్రంతర్గతాంతరాత్మయే కృష్ణప్రమాత్రంతరాత్మ కదా? అలా కాక అంతరాత్మయే ప్రమాత అని చెపితే అంతర్యామిత్వం కుదరదు. ప్రమాతకు లోపల ఉండి వానిని నియమించేవాడే కదా అంతర్యామి అనగా? కృష్ణప్రమాతయే అర్జునాంతర్యామి అయితే కృష్ణ ప్రమాంత్రంతర్యామి అర్జునప్రమాత్రంతర్యామికి అంతర్యామి అని చెప్పవలసివస్తుంది. ఇది మాకు అంగీకార్యమే అనడానికి వీలు లేదు. అంతర్యామికి కూడ మరొక అంతర్యామిని కల్పిస్తే ఆ అంతర్యామికి మరొక అంతర్యామిని కల్పించాలి. ఈ విధంగా అనవస్థాదోషం కలుగుతుంది. అందుచేత అంతర్యామియైన ఈశ్వరుడు తన శరీరమైన జీవులకు ఉపదేశించడం అనేది కుదరదు. మరొక కారణ మేమనగా జీవులు తన శరీరమే గాన స్వాభిన్నులు; ఈశ్వరునికా ఇంద్రియాలు లేవు.

శంకరాచార్యులనే దృష్టిలో పెట్టుకొని-"శ్రుతివిరోధము, స్మృతివిరోధము, ఇతిహాస-పురాణవిరోధము, న్యాయవిరోధము, స్వవచనవిరోధము అనే ఇన్ని విరోధాలు గుర్తించక అజ్ఞానులు జగత్తును మోసగించడంకోసం ఇలాంటి వాదాలను ప్రవర్తింపచేశారు"అని శ్రీరామానుజాచార్యులు అన్నారు. ఆయనను సమర్థిస్తూ అద్వైతవాదం శ్రుత్యాదివిరుద్ధం అని వేదాంతదేశికులు ఆ విరోధాలను నిర్దేశించారు. వాటి నన్నింటినీ ఉటంకిస్తూ రామరాయకవి అతి విస్తృతమైన శాస్త్రీయమైన చర్చ చేసి వాటి నన్నింటికీ సమాధానాలు చెప్పారు. నిజానికి ఈ విరోధా లన్నీ శ్రీరామానుజమతంలోనే ఉన్నా యని శాస్త్రీయపద్ధతిలో ప్రతిపాదించారు. విస్తరభీతిచేత వాటిని ఇక్కడ చూపలేదు. (భా. అ. ప్ర. పే. 48-64).

భాష్యమ్

"ఇదం శరీరం కౌన్తేయ క్షేత్రమిత్యభిధీయతే" ఇత్యాదిశ్లోకోపదిష్టస్య క్షేత్రాధ్యాయార్థస్య సంగ్రహశ్లోకః అయముపన్యస్యతే "తత్ క్షేత్రం యచ్చ" ఇత్యాది. వ్యాచిఖ్యాసితస్య హి అర్థస్య సంగ్రహోపన్యాసః న్యాయ్యః ఇతి-

మూ. తత్ క్షేత్రం యచ్చ యాదృక్చ యద్వికారి యతశ్చ యత్,
స చ యో యత్ప్రభావశ్చ తత్సమాసేన మే శృణు. 3

బాలానందిని

ఇదమితి: -క్షేత్రాధ్యాయంయొక్క(13వఅధ్యాయంయొక్క) అర్థం"ఇదం శరీరం" ఇత్యాదిశ్లోకంచేత చెప్పబడింది. ఆ అర్థాన్నే సంగ్రహిస్తూ **"తత్ క్షేత్రం యచ్చ"**ఇత్యాదికమైన ఈ శ్లోకం చెప్పబడుచున్నది. వివరించి చెప్పదలచిన విషయాన్ని ముందుగా సంగ్రహరూపంలో చెపితే అది తెలుసుకొనడానికి సులువుగా ఉంటుం దని అట్లు చేయబడుచున్నది-

ప్ర. అ. తదితి: - తత్=ఆ,క్షేత్రమ్=క్షేత్రము,యత్=ఏదో,యాదృక్ చ=ఎటువంటిదో, యద్వికారి=ఏ వికారం కలదో,యతః=దేనినుండి,యత్=ఏ కార్యం పుట్టుచున్నదో, యః =ఏ క్షేత్రజ్ఞుడు చెప్పబడ్డాడో,సః చ=ఆ క్షేత్రజ్ఞుడు కూడ,యత్ప్రభావః చ=ఏ ప్రభావం కలవాడో,తత్=దానిని,సమాసేన=సంక్షేపంగా,మే=నా మాటలనుండి,శృణు=వినుము.

భాష్యమ్

యత్ నిర్దిష్టమ్**"ఇదం శరీరమ్"**ఇతి తత్ తచ్ఛబ్దేన పరామృశతి. యచ్చేదం నిర్దిష్టం క్షేత్రం తత్,యాదృక్ యాదృశం స్వకీయైః ధర్మైః, చ శబ్దః సముచ్చయార్థః. యద్వికారి-యః వికారః అస్య తత్ యద్వికారి;యతః యస్మాత్ చ యత్ కార్యమ్ ఉత్పద్యతే ఇతి వాక్యశేషః.సః చ యః క్షేత్రజ్ఞః నిర్దిష్టః సః యత్ప్రభావః యే ప్రభావాః ఉపాధికృతాః శక్తయః యస్య సః యత్ప్రభావః చ,తత్ క్షేత్రక్షేత్రజ్ఞయోః యాథాత్మ్యం యథావిశేషితం సమాసేన సంక్షేపేణ మే మమ వాక్యతః శృణు శృత్వా అవధారయ ఇత్యర్థః. 3

బాలానందిని

యదితి: - **"ఇదం శరీరమ్"**అని ఏది వెనుక నిర్దేశించబడినదో దానిని తచ్ఛబ్దంచేత పరామర్శిస్తున్నాడు. నిర్దేశించబడిన ఏ క్షేత్ర మున్నదో అది తన ధర్మాలచేత ఎటువంటిదో, 'చ'శబ్దం సముచ్చయాన్ని("అదికూడ"అని అర్థం చెపితే అది సముచ్చయం) బోధిస్తుంది. ఎట్టి వికారాలు కలదో,దేనినుండి ఏదో అనగా దేనినుండి ఏ కార్యం పుట్టు చున్నదో,అని వాక్యశేషం,ఏ క్షేత్రజ్ఞుడు నిర్దేశించబడినాడో అతడు యత్ప్రభావుడో అనగా ఉపాధులవల్ల కలిగిన ఏ యే ప్రభావాలు కలవాడో,క్షేత్రక్షేత్రజ్ఞుల ఆ యా విశేషాలతో కూడిన యథార్థస్వరూపాన్ని,సంక్షేపంగా వినుము;విని నిర్ధారణ చేసికొనుము అని అర్థం.

భా. అ. ప్ర. "ఆ క్షేత్రం,యచ్చ=ఏ ద్రవ్యమో, యాదృక్చ=వేటికి ఆశ్రయమో,దీని వివరాలు ఏవో,ఏ ప్రయోజనం కోసం ఇది పుట్టినదో,యత్=ఇది ఏ స్వరూపం గలదో,ఆ

క్షేత్రజ్ఞుడు,యః=ఏ స్వరూపం కలవాడో,ఏ ప్రభావాలు కలవాడో,అదంతా సంక్షేపంగా, మే=నానుండి వినుము"అను శ్రీరామానుజవ్యాఖ్య అనుచితం. శబ్దాదిగుణాలు కూడ క్షేత్రమే గాన క్షేత్రం ద్రవ్యమ్ అను నియమం లేదు."ఇదం శరీరమ్"అని క్షేత్రస్వరూపం చెప్పబడియే ఉన్నది గాన క్షేత్రం ఏ స్వరూపం గలది అను అర్థం అయుక్తం. క్షేత్రజ్ఞుడు ఎవడో అనేది కూడ వ్యర్థం. **"ఏతద్యో వేత్తి తం ప్రాహుః క్షేత్రజ్ఞ ఇతి తద్విదః"**అని జీవుడు క్షేత్రజ్ఞ డని చెప్పబడినది కదా?క్షేత్రజ్ఞుని స్వరూపం చెప్పలేదు కదా అని కూడ అనడానికి వీలు లేదు. "ఏతద్యో వేత్తి"అని క్షేత్రజ్ఞుడు జ్ఞానస్వరూపు డని చెప్పబడినది కదా?మే అనుదానికి నా నుండి అను అర్థం అయుక్తం. పంచమిలో 'మే' ఆదేశం లేదు కదా?(భా.అ.ప్ర. పే. 66-67)

భాష్యమ్

తత్ క్షేత్రక్షేత్రజ్ఞయోః యాథాత్మ్యం వివక్షితం స్తౌతి శ్రోతృబుద్ధిప్రరోచనార్థమ్-

మూ. ఋషిభిర్బహుధా గీతం ఛన్దోభిర్వివిధైః పృథక్,
బ్రహ్మసూత్రపదైశ్చైవ హేతుమద్భిర్వినిశ్చితైః. 4

బాలానందిని

తదితి:-చెప్ప దలచిన ఆ క్షేత్రక్షేత్రజ్ఞుల యథార్థస్వరూపాన్ని శ్రోతయొక్క బుద్ధిని సంతోషపెట్టడానికై(ఆకర్షించడానికై)స్తుతిస్తున్నాడు.

ప్ర.అ. ఋషిభిః ఇతి:-(క్షేత్ర-క్షేత్రజ్ఞస్వరూపం), ఋషిభిః=ఋషులచేత,బహుధా = అనేకవిధాలుగా,గీతమ్=చెప్పబడినది. వివిధైః=అనేకవిధాలైన,ఛన్దోభిః=ఋగాది ఛందస్సులచేత,పృథక్=వేరుగా,చెప్పబడినది. హేతుమద్భిః=యుక్తులు గలవి. వినిశ్చితైః =నిశ్చితములూ అయిన,బ్రహ్మసూత్రపదైః చైవ=బ్రహ్మను సూచించే వాక్యాలచేత కూడ చెప్పబడినది.

భాష్యమ్

ఋషిభిరితి:- ఋషిభిః వసిష్ఠాదిభిః,బహుధా బహుప్రకారం,గీతం కథితమ్, ఛన్దాంసి ఋగాదీని,తైః ఛన్దోభిః వివిధైః నానాభావైః నానాప్రాకారైః,పృథక్ వివేకతః, గీతమ్.కిం చ బ్రహ్మసూత్రపదైః చ ఏవ=బ్రహ్మణః సూచకాని వాక్యాని బ్రహ్మసూత్రాణి, తైః పద్యతే గమ్యతే జ్ఞాయతే బ్రహ్మేతి తాని పదాని ఉచ్యన్తే.తైః ఏవ చ క్షేత్రక్షేత్రజ్ఞ యాథాత్మ్యం గీతమ్ ఇత్యనువర్తతే-**"ఆత్మేత్యేవోపాసీత"**(బృ.ఉ. 1.4.7) ఇత్యేవమాదిభిః బ్రహ్మసూత్రపదైః ఆత్మా జ్ఞాయతే. హేతుమద్భిః యుక్తియుక్తైః,వినిశ్చితైః నిఃసంశయ రూపైః.నిశ్చయప్రత్యయోత్పాదకైః ఇత్యర్థః. 4

బాలానందిని

ఋషిభిః ఇతి:-వసిష్ఠాదిఋషులచేత అనేకవిధాలుగా చెప్పబడినది. ఛందస్సు లనగా ఋక్కులు మొద లైనవి. అనేకభావాలు-అనేకప్రకారములు గల ఆ ఛందస్సులచేత వివేకపూర్వకంగా(విస్పష్టంగా)చెప్పబడినది. మరియు-బ్రహ్మను సూచించే వాక్యాలు బ్రహ్మసూత్రాలు. బ్రహ్మ వేటిచేత తెలియబడుతుందో అవి పదాలు,అనగా వాక్యాలు. బ్రహ్మ సూత్రపదా లనగా బ్రహ్మను సూచించే వాక్యాలు. వాటిచేత కూడ క్షేత్రక్షేత్రజ్ఞయాథాత్మ్యం చెప్పబడుచున్నది అని అనువర్తిస్తుంది. **"ఆత్మేత్యేవోపాసీత"**ఇత్యాదిబ్రహ్మసూత్రపదాలచేత ఆత్మ తెలియబడుతుంది. అవి యుక్తియుక్తములు,నిఃసంశయరూపములు,అనగా నిశ్చయజ్ఞానాన్ని పుట్టించేవి అని అర్థం.

వి:-బ్రహ్మసూత్రా లనగా శారీరకసూత్రా లని ఆనందగిరి,రామరాయకవి మొదలైన వారు చెప్పారు కాని భాష్యపంక్తులను సరిగా పరిశీలించగా ఉపనిషద్వాక్యా లను అర్థం మాత్రమే లభిస్తుం దని మా అభిప్రాయం. 4

భాష్యమ్

స్తుత్వా అభిముఖీభూతాయ అర్జునాయ ఆహ-

మూ. మహాభూతాన్యహంకారో బుద్ధిరవ్యక్తమేవ చ
ఇన్ద్రియాణి దశైకం చ పఞ్చ చేన్ద్రియగోచరాః. 5

బాలానందిని

స్తుత్వేతి:-స్తుతిచేత అభిముఖుడైన అర్జునునికి చెపుతున్నాడు -

ప్ర.అ. మహాభూతానీతి:- మహాభూతాని=మహాభూతాలు,అహంకారః=అహం కారము బుద్ధిః=బుద్ధి,అవ్యక్తమ్ ఏవ చ=మరియు అవ్యక్తము,దశ ఇన్ద్రియాణి=పది ఇంద్రియాలు,ఏకం చ=ఒక ఇంద్రియ మైన మనస్సు, ఇన్ద్రియగోచరాః=ఇంద్రియాలకు గోచరము లైన(ఇంద్రియాలచేత గ్రహించబడు),పఞ్చ=శబ్దాదివిషయాలు ఐదు.

భాష్యమ్

మహాభూతాని-మహాన్తి చ తాని సర్వవికారవ్యాపకత్వాత్ భూతాని చ సూక్ష్మాణి, (న స్థూలాని)స్థూలాని తు ఇన్ద్రియగోచరశబ్దేన అభిధాయిష్యన్తే. అహంకారః మహాభూత కారణమ్ అహంప్రత్యయలక్షణః,అహంకారకారణం బుద్ధిః అధ్యవసాయలక్షణా; తత్కారణమ్ అవ్యక్తమేవ చ,న వ్యక్తమ్ అవ్యక్తమ్, అవ్యాకృతమ్,ఈశ్వరశక్తిః,**"మమ మాయా దురత్యయా"**(7.14)ఇత్యుక్తమ్. ఏవశబ్దః ప్రకృత్యవధారణార్థః. ఏతావత్ ఏవ

అష్టధా భిన్నా ప్రకృతిః. చశబ్దః భేదసముచ్చయార్థః. ఇన్ద్రియాణి దశ శ్రోత్రాదీని, పఞ్చ బుద్ధ్యుత్పాదకత్వాత్ బుద్ధీన్ద్రియాణి, వాక్పాణ్యాదీని పఞ్చ కర్మనిర్వర్తకత్వాత్ కర్మేన్ద్రియాణి, తాని దశ, ఏకం చ; కిం తత్? మనః ఏకాదశం సంకల్పాద్యాత్మకమ్. పఞ్చ చ ఇన్ద్రియగోచరాః శబ్దాదయః విషయాః. తాన్యేతాని సాంఖ్యాః చతుర్వింశతితత్త్వాని అచక్షతే. 5

బాలానందిని

మహాభూతానీతి: – మహాభూతాని–సర్వవికారాలను(కార్యాలను)వ్యాపించి ఉండడం చేత గొప్పవైన సూక్ష్మభూతాలు. (ఇక్కడ స్థూలభూతాలను గ్రహించకూడదు). స్థూలభూతాలైతే ఇన్ద్రియగోచరశబ్దంచేత చెప్పబడబోతున్నాయి. మహాభూతాలకు కారణము, నేను అనే జ్ఞానం లక్షణంగా గల అహంకారము, అహంకారానికి కారణమైన నిశ్చయాత్మక మైన బుద్ధి, బుద్ధికి కారణ మైన అవ్యక్తం. వ్యక్తం కానిది అవ్యక్తం. వ్యాకృతం కాని (సృష్టికి పూర్వం జగద్రూపంగా పరిణమించని) ఈశ్వరశక్తి. ఇదే "మమ మాయా దురత్యయా" అని వెనుక చెప్పబడినది. ఎనిమిది విధాలుగా భిన్నమై ఉన్న ప్రకృతి ఇంతయే అని ప్రకృతిని (ప్రకృతి భేదాలను) నిర్ధయించడంకొరకై 'ఏవ'శబ్దం ప్రయోగించబడినది. భేదాలను సముచ్చయం చేయడంకోసం 'చ'శబ్దం) (ప్రకృతీ దానితోపాటు తన్మాత్రాదిభేదాలూ కూడ అని చెప్పడం కోసం 'చ'శబ్దం ప్రయోగించబడింది. పది ఇంద్రియాలు. బుద్ధిని పుట్టించడంచేత బుద్ధీంద్రియాలని చెప్పబడే శ్రోత్రాదీంద్రియాలు ఐదు; కర్మలను చేసే వవడంచేత కర్మేంద్రి యాలనబడే వాక్–పాణ్యాదీంద్రియాలు ఐదు; మొత్తం పది. మరియు ఒకటి; ఏమిటది? సంకల్పాద్యాత్మక మైన మనస్సనే పదకొండవ ఇంద్రియం. ఇంద్రియాలకు గోచరము లైన ఐదు శబ్దాదివిషయాలు. వీటిని సాంఖ్యులు ఇరవైనాలుగుతత్త్వాలని అంటారు.

భాష్యమ్

అథేదానీమ్ ఆత్మగుణాః ఇతి యాన్ ఆచక్షతే వైశేషికాః తేఽపి క్షేత్రధర్మాః ఏవ, న తు క్షేత్రజ్ఞస్య ఇత్యాహ భగవాన్ –

మూ. ఇచ్ఛా ద్వేషః సుఖం దుఃఖం సంఘాతశ్చేతనా ధృతిః,
ఏతత్ క్షేత్రం సమాసేన సవికారముదాహృతమ్. 6

బాలానందిని

అథేతి: – ఇంక ఇప్పుడు – వైశేషికులు వేటిని ఆత్మధర్మా లంటారో అవి క్షేత్ర ధర్మాలే కాని క్షేత్రజ్ఞుని (జీవుని) ధర్మాలు కావు అని భగవంతుడు చెపుతున్నాడు–

ప్ర. అ. **ఇచ్ఛేతి**:- ఇచ్ఛా=ఇచ్ఛ,ద్వేషః=ద్వేషం,సుఖమ్=సుఖము,దుఃఖమ్=దుఃఖము, సంఘాతః=దేహేంద్రియసముదాయము,చేతనా=అంతఃకరణవృత్తిరూప మైన జ్ఞానము, ధృతిః =ధైర్యము,ఏతత్=ఇది,సవికారమ్=వికారాలతో(కార్యాలతో)కూడిన,క్షేత్రమ్ = క్షేత్రముగా, సమాసేన=సంక్షిప్తంగా,ఉదాహృతమ్=చెప్పబడినది.

భాష్యమ్

ఇచ్ఛా యజ్జాతీయం సుఖహేతుమ్ అర్థమ్ ఉపలబ్ధవాన్ పూర్వం పునః తజ్జాతీయమ్ ఉపలభమానః తమ్ ఆదాతుమ్ ఇచ్ఛతి సుఖహేతుః ఇతి,సా ఇయమ్ ఇచ్ఛా అన్తఃకరణధర్మః జ్ఞేయత్వాత్ క్షేత్రమ్. తథా ద్వేషః-యజ్జాతీయమ్ అర్థం దుఃఖహేతుత్వేన అనుభూతవాన్ పునః తజ్జాతీయమ్ ఉపలభమానః తం ద్వేష్టి,సః అయం ద్వేషః జ్ఞేయత్వాత్ క్షేత్రమేవ. తథా సుఖమ్ అనుకూలం ప్రసన్నసత్త్వాత్మకం జ్ఞేయత్వాత్ క్షేత్రమేవ. దుఃఖం ప్రతికూలంత్మకం జ్ఞేయత్వాత్ తదపి క్షేత్రమ్. సంఘాతః దేహేన్ద్రియాణాం సంహతిః. తస్యామ్ అభివ్యక్తా అన్తఃకరణవృత్తిః,తప్తే ఇవ లోహపిణ్డే అగ్నిః, ఆత్మచైతన్యాభాసరసవిద్ధా చేతనా;సా చ క్షేత్రం జ్ఞేయత్వాత్. ధృతిః యయా అవసాదప్రాప్తాని దేహేన్రియాణి ధ్రియన్తే;సా చ జ్ఞేయత్వాత్ క్షేత్రమ్. సర్వాన్తఃకరణధర్మోపలక్షణార్థమ్ ఇచ్ఛాది గ్రహణమ్. యత్ ఉక్తం తత్ ఉపసంహరతి-ఏతత్ క్షేత్రం సమాసేన,సవికారం సహ వికారేణ మహదాదినా ఉదాహృతమ్ ఉక్తమ్. యస్య క్షేత్రభేదజాతస్య సంహతిః "ఇదం శరీరం క్షేత్రమ్"ఇత్యుక్తం తత్ క్షేత్రం మహాభూతాదిభేదభిన్నం ధృత్యన్తమ్. 6

బాలానందిని

ఇచ్ఛేతి:-పూర్వం సుఖానికి హేతువైన,ఏ జాతికి చెందిన విషయాన్ని(వస్తువును) పొంది ఉన్నాడో ఆ జాతికే చెందిన వస్తువును మరల పొందినప్పుడు, ఇది నాకు సుఖహేతువుకదా అని అనుకొంటూ,దానిని గ్రహించడానికి ఇచ్ఛయిస్తాడు. ఇదే ఇచ్ఛ. ఇది అంతఃకరణధర్మం. జ్ఞేయం అవడంవల్ల ఇది క్షేత్రం. అట్లే-ఏ జాతికి చెందిన వస్తువును పూర్వమొకప్పుడు దుఃఖమునకు హేతువునుగా అనుభవించి ఉన్నాడోఆ జాతికే చెందిన వస్తువును మరల పొందినవాడై దానిని ద్వేషిస్తాడు. ఇది ద్వేషం. ఇది కూడ జ్ఞేయమే గాన క్షేత్రమే. అనుకూలంగా ఉండేది సుఖం. అప్పుడు అంతఃకరణం ప్రసన్నంగా ఉంటుంది. అది కూడ జ్ఞేయమే గాన క్షేత్రమే. ప్రతికూలస్వరూపం గల దుఃఖం కూడ జ్ఞేయమే గాన అది కూడ క్షేత్రమే. సంఘాత మనగా-దేహేంద్రియాల సముదాయం. బాగా కాల్చిన లోహపిండమునందు(ఇనుపగుండునందు)అగ్ని వలె,ఆ దేహేంద్రియ సంఘాతమునందు అభివ్యక్త మైనదీ(కనబడుచున్నదీ) ఆత్మయొక్క చైతన్యాభాసముయొక్క రసంతో కూడినది అయిన అంతఃకరణవృత్తి 'చేతన'. అది కూడ జ్ఞేయమే గాన క్షేత్రమే.

వి:- ఇనుపగుండును బాగా కాల్చగా దానియందు ఎట్లుగా అగ్ని అభివ్యక్తం అవుతుంది. అట్లే దేహేంద్రియాదిసంఘాతంలో బుద్ధివృత్తి అభివ్యక్తం అవుతుంది. అభివ్యక్త మైన అగ్ని ఇనుపగుండును అగ్ని వలె కనబడే టట్లు చేస్తుంది. అట్లే సర్వవ్యాప్తమైన ఆత్మచైతన్యం బుద్ధివృత్తిలో అభివ్యక్తమై ఆ బుద్ధివృత్తియే ఆత్మగా కనబడే టట్లు చేస్తుంది. అదే చేతన అది వాస్తవమైన చైతన్యం కాదు. చేతనాభాసమాత్రమే. ఇది ముఖ్యచైతన్యంచేత గ్రహించబడుతుంది. గాన ఇది కూడ క్షేత్రకోటిలోనికే చేరుతుంది. మొత్తం శరీరంలో ఒక విధమైన కదలికను కలిగించేది చేతన అని భావం.

ధృతిరితి: -దుర్బలములై సడలిపోతూన్న దేహేంద్రియాలను ఏది నిలబెడుతుందో అది ధృతి. అది కూడ జ్ఞేయమే గాన క్షేత్రమే. అంతఃకరణధర్మాలను అన్నింటిని ఉప లక్షణయా, బోధించడంకొరకు ఇచ్ఛాదులు గ్రహించబడినవి. (అనగా ఇక్కడ చెప్పిన ఇచ్ఛా-ద్వేష-సుఖ-దుఃఖాదులనే కాక హ్రీ-ధీ-భీఇత్యాదులైన ఇతరాంతఃకరణధర్మాలను కూడ గ్రహించాలి. అవన్నీక్షేత్రకోటిలోనే చేరుతాయి అనిభావం). ఏది చెప్పబడినదో దానిని ఉపసంహరిస్తున్నాడు- ఈ క్షేత్రం, సంక్షిప్తంగా, మహదాదివికారాలతో కూడ చెప్పబడినది. ఏ క్షేత్రముయొక్క కొన్ని భేదముల సముదాయము**"ఇదం శరీరం క్షేత్రమ్"**అని చెప్పబడి నదో మహాభూతాదిభేదములతో వేరు వేరుగా ధృతివరకు ఉన్న ఆ క్షేత్రము వివరించ బడినది.

వి."**ఇదం శరీరం కౌన్తేయ క్షేత్రమిత్యభిధీయతే**"అని క్షేత్ర మనగా ఈ శరీరమే అని చెప్పబడింది. కాని ఐదు-ఆరు శ్లోకాలలో మహాభూతాదులు క్షేత్ర మని చెప్పబడింది. ఈ రెండింటికి సమన్వయం ఎట్లు అనే ప్రశ్నకు సమాధానంగా పై వాక్యం చెప్పబడింది. మహాదాదిభేదాలతో ఉన్న క్షేత్రంలోని కొన్ని భేదాల కలయికవల్ల దేహం ఏర్పడుచున్నది గాన అది క్షేత్రం అని చెప్పబడింది. జీవుల శరీరం వ్యష్టిరూపమైన క్షేత్ర మైతే మహదాదిభేద సముదాయం సమష్టిక్షేత్రం.

భా.అ.ప్ర.:- "**ఇచ్ఛా ద్వేషః సుఖం దుఃఖమ్**"అని క్షేత్రకార్యములు, క్షేత్రముయొక్క వికారాలు చెప్పబడుచున్నాయి. ఈ ఇచ్ఛాదులు ఆత్మధర్మాలే అయినా ఇవి ఆత్మకు క్షేత్రంతో సంబంధం ఉండడంవల్ల కలిగినవి గాన క్షేత్రముయొక్క కార్యా లనీ, క్షేత్రంయొక్క వికారా లనీ చెప్పబడుచున్నాయి అని శ్రీరామానుజాచార్యుల వ్యాఖ్య అయుక్తం. ఇచ్ఛాదు లన్నీ మనోధర్మాలే అని "**కామః సంకల్పః**"ఇత్యాదిశ్రుతి చెపుతూన్నది. ఇవి ఆత్మధర్మా లైతే సుషుప్తిలో మనసు లీనమైనప్పుడు కూడ కనబడాలి; అలా కనబడడం లేదు. ఆత్మకు ఇచ్ఛాదిధర్మా లుంటే ఆత్మ సవికారం అవుతుంది; అనిత్యం కూడ అవుతుంది. తన ధర్మం తనచేత తెలియబడదు గాన, ఇచ్ఛాదులు ఆత్మ ధర్మా లైతే ఆత్మచేత తెలియబడగూడదు.

"స యది పితృలోకకామో భవతి సంకల్పాదేవాస్య పితరః సముత్తిష్ఠన్తి" ఇత్యాది శ్రుతి అంతఃకరణాదులు లేని ముక్తులకు కూడ సంకల్పం ఉన్నట్లు చెప్పుచున్నది గాన సంకల్పాదులు ఆత్మధర్మములే గాని అంతఃకరణధర్మములు కావు అనడం యుక్తం కాదు. పైన చెప్పిన ముక్తి సగుణముక్తి గాన అట్టి ముక్తి పొందినవాళ్లకు అంతఃకరణాదు లుంటాయి.కైవల్యంలో కామాదు లుండడానికి అవకాశం లేదు.సుఖాదులు ఆత్మధర్మ మైన జ్ఞానంయొక్క అవస్థావిశేషాలే అనడం యుక్తం కాదు.జ్ఞానస్వరూప మైన ఆత్మకు ధర్మంగా జ్ఞానాంతరం ఉంటుంది అని చెప్పడం అప్రమాణికం.స్వరూపమైన జ్ఞానంలో ధర్మమైన మరొక జ్ఞానం అంటూ ఉండదు కదా?ధర్మమైన జ్ఞానం కూడ జ్ఞానస్వరూపమే అయితే దానిని మరొక ధర్మం ఉంటుం దని చెప్పవలసి ఉంటుంది.ఇది అనవస్థాదోషానికి దారి తీస్తుంది.జ్ఞానస్వరూపత్వం లేకపోతే అది జ్ఞానమే కాజాలదు.ధర్మ-ధర్ములు రెండింటికీ ఒకే జ్ఞానం స్వరూపం అనడం కూడ యుక్తం కాదు;అప్పుడు ఒకటి ధర్మి రెండవది ధర్మం అనే భేదం కుదరదు."సోఽకామయత"అను శ్రుతి అంతఃకరణాదిరహితు డైన ఈశ్వరునికి కామం అనేది ఉన్నట్లు చెపుతూన్నది గాన కామాదులు ఆత్మధర్మములే అని చెప్పడం యుక్తం కాదు. ఈశ్వరునకు మాయాసంబంధంచేతనే కామసంకల్పాదులు కలుగుతున్నాయి గాన అవి మాయాధర్మాలే కాని ఈశ్వరధర్మాలు కావు.అందుచేత కామసంకల్పాదులు అంతః కరణధర్మాలే కానీ ఆత్మధర్మా లని చెప్పడం అయుక్తం. (భా.అ.ప్ర.పే.77-78)6

భాష్యమ్

క్షేత్రజ్ఞః వక్ష్యమాణవిశేషణః;యస్య సప్రభావస్య క్షేత్రజ్ఞస్య పరిజ్ఞానాత్ అమృతత్వం భవతి తం "జ్ఞేయం యత్తత్ ప్రవక్ష్యామి"(13.12)ఇత్యాదినా సవిశేషణం స్వయమేవ వక్ష్యతి భగవాన్'. అధునా తు తద్జ్ఞానసాధనగణమ్ అమానిత్వాదిలక్షణం, యస్మిన్ సతి తద్జ్ఞేయవిజ్ఞానే యోగ్యః అధికృతః భవతి,యత్పరః సంన్యాసీ జ్ఞాననిష్ఠః ఉచ్యతే,తమ్ అమానిత్వాదిగణం,జ్ఞానసాధనత్వాత్ జ్ఞానశబ్దవాచ్యం విదధాతి భగవాన్-

మూ. **అమానిత్వమదమ్భిత్వమహింసా క్షాన్తిరార్జవమ్,**
ఆచార్యోపాసనం శౌచం స్థైర్యమాత్మవినిగ్రహః. 7

బాలానందిని

క్షేత్రజ్ఞః ఇతి:- చెప్పబడబోయే విశేషణాలు కలవాడు క్షేత్రజ్ఞుడు.ప్రభావంతో కూడిన ఏ క్షేత్రజ్ఞుని జ్ఞానంవల్ల అమృతత్వం(మోక్షం)కలుగుతుందో,అట్టి,విశేషణాలతో కూడిన క్షేత్రజ్ఞుణ్ణి గూర్చి "జ్ఞేయం యత్తత్ ప్రవక్ష్యామి"ఇత్యాదికంచేత భగవంతుడు స్వయంగానే

చెప్పనున్నాడు. అయితే ఇప్పుడు-ఏ సాధనగణం ఉంటే జ్ఞేయుడైన ఆ క్షేత్రజ్ఞుణ్ణి తెలుసుకొనడంలో యోగ్యుడు గాను, అధికారిగాను ఉంటాడో, దేనియందు ఆసక్తుడైన సంన్యాసి జ్ఞాననిష్ఠు డని చెప్పబడతాడో అట్టి అమానిత్వాదిరూపము లైన జ్ఞానసాధనాల గణము చెప్పబడుచున్నది. ఈ అమానిత్వాదిగణము జ్ఞానానికి సాధనం గాన ఇదే జ్ఞానం అని చెప్పబడుచున్నది. అట్టి అమానిత్వాదిసాధనాల గణమును భగవంతుడు విధిస్తున్నాడు. (సాధకుడు వీటిని సంపాదించా లని బోధిస్తున్నాడు)-

ప్ర.అ. **అమానిత్వమితి**:- అమానిత్వమ్=గర్వం లేకపోవడము, అదమ్భిత్వమ్= డాంబికం లేకపోవడము, అహింసా=అహింస, ఆర్జవమ్=కౌటిల్యం లేకపోవడము, ఆచార్యోపాసనమ్=ఆచార్యసేవ, శౌచమ్=శుచిత్వము, స్థైర్యమ్=స్థిరత్వము, ఆత్మవినిగ్రహః=శరీరాన్ని నిగ్రహించుకొనడము.

భాష్యమ్

అమానిత్వమ్-మానినః భావః మానిత్వమ్; ఆత్మనః శ్లాఘనమ్. తదభావః అమానిత్వమ్. అదమ్భిత్వమ్-స్వధర్మప్రకటీకరణం దమ్భిత్వం. తదభావః అదమ్భిత్వమ్. అహింసా అహింసనమ్, ప్రాణినామ్ అపీడనమ్. క్షాన్తిః పరాపరాధప్రాప్తౌ అవిక్రియా. ఆర్జవమ్ ఋజుభావః, అవక్రత్వమ్. ఆచార్యోపాసనమ్-మోక్షసాధనోపదేష్టుః ఆచార్యస్య శుశ్రూషాదిప్రయోగేణ సేవనమ్. శౌచమ్-కాయమలానాం మృజ్జలాభ్యాం ప్రక్షాలనమ్, అన్తశ్చ మనసః ప్రతిపక్షభావనయా రాగాదిమలాపనయనం శౌచమ్. స్థైర్యమ్ స్థిరభావః మోక్షమార్గ ఏవ కృతాధ్యవసాయత్వమ్. ఆత్మవినిగ్రహః-ఆత్మనః అపకారకస్య ఆత్మశబ్దవాచ్యస్య కార్యకరణసంఘాతస్య, వినిగ్రహః స్వభావేన సర్వతః ప్రవృత్తస్య సన్మార్గే ఏవ నిరోధః ఆత్మవినిగ్రహః. 7

బాలానందిని

అమానిత్వమితి:-మానం(గర్వం)కలవాని ధర్మం మానిత్వం; అనగా తనను తాను పొగడుకొనడం. అది లేకపోవడం "**అమానిత్వం**". తాను చేసే ధర్మాన్ని గూర్చి చాటి చెప్పుకొనడం దంభం. అది లేక పోవడం "**అదంభిత్వం**". ప్రాణులను హింసించకపోవడం "**అహింస**". పరులనుండి అపరాధాలు జరిగినా కూడ వికారం చెందుకుండా ఉండడం "**క్షాంతి**". వ్యవహారాలలో ఋజువుగా, వక్రత్వం లేకుండా ప్రవర్తించడం "**ఆర్జవమ్**". మోక్షసాధనాలను ఉపదేశించే ఆచార్యుని శుశ్రూషాదులు చేస్తూ సేవించడం "**ఆచార్యోపాసనం**". శరీరంలో ఉన్న మలాలను మట్టి, నీళ్లు మొదలైనవాటితో కడిగికొనడము, మనస్సులో ఉన్న రాగాదిమలాలను ప్రతిపక్షభావనచేత తొలగించుకొన డమూ'శౌచం'.

స్థిరంగా ఉండడం,మోక్షమార్గమునందే నిశ్చితమైన బుద్ధితో ఉండడం "స్థైర్యం". ఆత్మశబ్దంచేత చెప్పబడే(ఆత్మ అని అనుకొనబడే)శరీరేంద్రియాదికము అమార్గ ప్రవృత్త మైనప్పుడు అపకారం చేస్తుంది. దానిని నిగ్రహించుకొనడం,అనగా సహజంగా అన్ని వైపులా (ఇటూ అటూ)ప్రవర్తిస్తూన్న ఆ కార్యాకరణసంఘాతాన్ని సన్మార్గంలోనే బంధించి ఉంచడం 'ఆత్మవినిగ్రహం'.

వి. మనస్సులో రాగాదులు ప్రవేశించినప్పుడు-"ఈ విధంగా నా మనస్సులో రాగాదులను ప్రవేశించనీయకూడదు. దీనివల్ల చాలా అపకారం జరుగుతుంది. అందువల్ల వైరాగ్యాదులను అలవరచు కోవాలి"అని అనుకొనడం ప్రతిపక్ష భావనం. హింసకు ప్రతిపక్ష మైన(విపరీతస్వరూపం గల,అహింస,రాగానికి ప్రతిపక్షమైన విరాగం మొదలైనవాటి భావన 'ప్రతిపక్షభావన'. దీనిచేత మానసికమలాలు క్షాళనచేయబడతాయి. ("వితర్కబాధనే ప్రతిపక్షభావనమ్""వితర్కాహింసాదయః... ప్రతిపక్షభావనమ్"యో. సూ. 2.33,34).

"ఆత్మవినిగ్రహః-ఆత్మనః,అపకారకస్య,ఆత్మశబ్దవాచ్యస్య కార్యకరణసంఘాతస్య వినిగ్రహః"అనే భాష్యవాక్యం విగ్రహప్రదర్శనపూర్వక మైన వ్యాఖ్యానం. ఆత్మనః=ఆత్మశబ్ద వాచ్యస్య కార్యకరణసంఘాతస్య"అని అన్వయం. కార్యకరణసంఘాతం అపకారక మైనప్పుడు దానిని నిగ్రహించుకొనడం అని అర్థం. ఆ అర్థమే"స్వభావేన సర్వతః ప్రవృత్తస్య"ఇత్యాది వాక్యంచేత వివరించబడినది. అందుచేత'అపకారకస్య'కు బదులు 'ఉపకారకస్య'అని పాఠాన్ని కల్పించడం అనావశ్యకం. 7

భాష్యమ్

కిం చ-

మూ. ఇన్ద్రియార్థేషు వైరాగ్యమనహంకార ఏవ చ,
జన్మమృత్యుజరావ్యాధిదుఃఖదోషానుదర్శనమ్. 8

బాలానందిని

కిం చేతి:- మరియు-

ప్ర. అ. ఇన్ద్రియేతి:- ఇన్ద్రియార్థేషు=ఇంద్రియవిషయములయందు,వైరాగ్యమ్= వైరాగ్యము,అనహంకారః ఏవ చ=అహంకారం లేకపోవడము,జన్మమృత్యుజరావ్యాధిదుః ఖదోషానుదర్శనమ్=జన్మ,మృత్యువు,ముసలితనము,వ్యాధులు-వీటియందు దోషాన్ని చూడడం-

భాష్యమ్

ఇన్ద్రియార్థేషు శబ్దాదిషు దృష్టాదృష్టేషు భోగేషు విరాగభావః వైరాగ్యమ్. అనహంకారః అహంకారాభావః ఏవ చ. జన్మమృత్యుజరావ్యాధిదుఃఖదోషానుదర్శనమ్–జన్మ చ మృత్యుః చ జరా చ వ్యాధయః చ దుఃఖాని చ తేషు జన్మాదిదుఃఖాన్తేషు ప్రత్యేకం దోషానుదర్శనమ్;జన్మని గర్భవాసయోనిద్వారనిఃసరణం దోషః;తస్య అనుదర్శనమ్ ఆలోచనమ్;తథా మృతౌ దోషానుదర్శనమ్. తథా జరాయాం ప్రజ్ఞాశక్తితేజోనిరోధ దోషానుదర్శనం పరిభూతతా చ ఇతి. తథా వ్యాధిషు శిరోరోగాదిషు దోషానుదర్శనమ్. తథా దుఃఖేషు అధ్యాత్మాధిభూతాధి దైవనిమిత్తేషు. అథవా దుఃఖాన్యేవ దోషః దుఃఖదోషః తస్య జన్మాదిషు పూర్వవత్ అనుదర్శనమ్. దుఃఖం జన్మ,దుఃఖం మృత్యుః, దుఃఖం జరా,దుఃఖం వ్యాధయః. దుఃఖనిమిత్తత్వాత్ జన్మాదయః దుఃఖం,న పునః స్వరూపేణైవ దుఃఖమితి. ఏవం జన్మాదిషు దుఃఖదోషానుదర్శనాత్ దేహేన్ద్రియ విషయభోగేషు వైరాగ్యమ్ ఉపజాయతే. తతః ప్రత్య గాత్మని ప్రవృత్తిః కరణానామ్ ఆత్మదర్శనాయ. ఏవం జ్ఞానహేతుత్వాత్ జ్ఞానముచ్యతే జన్మాదిదుఃఖదోషానుదర్శనమ్. 8

బాలానందిని

ఇన్ద్రియేతి:– ఇంద్రియార్థములయందు,అనగా చూడబడినవి చూడబడనివీ అయిన శబ్దాదిభోగాలయందు ఆసక్తి లేకపోవడము,వైరాగ్యమూ,అహంకారం లేకపోవడమూ,జన్మ మృత్యువు,జర,వ్యాధులు,దుఃఖాలు–జన్మ మొదలు దుఃఖాల వరకు ఉన్న వీటియందు ఒక్కొక్కదానిలో ఉన్న దోషాన్ని గుర్తించడం;గర్భంలో ఉండి యోనిద్వారా బైటకు రావడం అనేది జన్మలో నున్న దోషం. దానిని గూర్చి ఆలోచించడం;అట్లే మృత్యువులో నున్న దోషాన్ని గూర్చి ఆలోచించడం;అట్లే బుద్ధిబలం శక్తి తేజస్సు అణిగిపోవడం అందరిచేత తిరస్కరించబడడం అనేవి ముసలితనంలో ఉన్న దోషం;దానిని గూర్చి ఆలోచించడం;అట్లే శిరోరోగం మొదలైన వ్యాధులలోని దోషాన్ని గూర్చి ఆలోచించడం;అట్లే ఆధ్యాత్మ-అధిభూత-అధిదైవ నిమిత్తములైన దుఃఖాలలో ఉన్న దోషాన్ని పరిశీలించడం. లేదా – దుఃఖ దోష మనగా దుఃఖములే దోషం. జన్మాదులయందు,వెనుక చెప్పి నట్లు,దుఃఖ మనే దోషం ఉన్నట్లు గుర్తించడం. జన్మ దుఃఖం,మృత్యువు దుఃఖం,జర దుఃఖం,వ్యాధులు దుఃఖం. జన్మాదులు దుఃఖానికి నిమిత్తం అవడంచేత దుఃఖం అని చెప్పబడుతున్నాయి కాని అవే స్వరూపంచేత దుఃఖం కాదు. ఈ విధంగా జన్మాదుల విషయంలో దుఃఖదోషాన్ని చూడడంవల్ల దేహేంద్రియాలచేత అనుభవించదగిన విషయాల భోగాలమీద వైరాగ్యం కలుగుతుంది. అప్పుడు ఇంద్రియాలు ఆత్మదర్శనంకొరకై ప్రత్యగాత్మవిషయంలో ప్రవర్తిస్తాయి. ఈ విధంగా జన్మాదిదుఃఖదోషానుదర్శనం జ్ఞానానికి హేతువు గాన జ్ఞానమని చెప్పబడుచున్నది. 8

భాష్యమ్

కిం చ-

మూ. అసక్తిరనభిష్వఙ్గః పుత్రదారగృహాదిషు,
నిత్యం చ సమచిత్తత్వమిష్టానిష్టోపపత్తిషు. 9

బాలానందిని

కిం చేతి:- మరియు-

ప్ర.అ. అసక్తిరితి:-అసక్తిః=విషయాలమీద దృష్టి లేకపోవడము,పుత్రదారగృహాదిషు=పుత్రులు భార్య గృహము మొదలైనవాటియందు,అనభిష్వంగః=అత్యంతాసక్తి లేకపోవడము,ఇష్టానిష్టోపపత్తిషు=ఇష్టము లభించినప్పుడు అనిష్టము లభించినప్పుడూ కూడ,నిత్యమ్=ఎల్లప్పుడూ,సమచిత్తత్వమ్=సమానమైన చిత్తం కలిగి ఉండడం-

భాష్యమ్

అసక్తిః-సక్తిః సంగనిమిత్తేషు విషయేషు ప్రీతిమాత్రమ్; తదభావః అసక్తిః. అనభిష్వఙ్గః అభిష్వఙ్గాభావః.అభిష్వఙ్గః నామ సక్తివిశేషః ఏవ అనన్యాత్మ భావనా లక్షణః. యథా అన్యస్మిన్ సుఖిని దుఃఖిని వా అహమేవ సుఖీ దుఃఖీ చ,జీవతి మృతే వా అహమేవ జీవామి మరిష్యామి చ ఇతి.క్వ ఇత్యాహ-పుత్రదారగృహాదిషు.పుత్రేషు దారేషు గృహేషు;ఆదిగ్రహణాత్ అన్యేషు అపి అత్యన్తేష్టేషు దాసవర్గాదిషు.తచ్చ ఉభయం జ్ఞానార్థత్వాత్ జ్ఞానమ్ ఉచ్యతే.నిత్యం చ సమచిత్తత్వం తుల్యచిత్తతా. క్వ?ఇష్టానిష్టోపపత్తిషు.ఇష్టానామ్ అనిష్టానాం చ,ఉపపత్తయః సంప్రాప్తయః,తాసు ఇష్టానిష్టోపపత్తిషు-నిత్యమేవ తుల్యచిత్తతా.ఇష్టోపపత్తిషు న హృష్యతి,న కుప్యతి చ అనిష్టోపపత్తిషు. తచ్చ ఏతత్ సమచిత్తత్వం జ్ఞానమ్. 9

బాలానందిని

అసక్తిరితి:-సంగమునకు నిమిత్తాలైన విషయాలమీద ప్రీతి మాత్రం ఉంటే (ఇవి బాగున్నాయి అనే అభిప్రాయం మాత్రం ఉంటే)అది 'సక్తి'.అలాంటి సక్తి లేకపోవడం అసక్తి.అనభిష్వంగం అనగా అభిష్వంగం లేకపోవడం.వాళ్లే నేను,(వాళ్లకూ నాకూ తేడా లేదు)అనే భావన రూపంలో ఉండే ఆసక్తివిశేషం (అత్యధికమైన మమకారం)అభిష్వంగం. ఇతరుడు సుఖంగా ఉంటే నేను సుఖంగా ఉన్నా ననీ,అతడు దుఃఖపడుతూంటే నేను దుఃఖపడుతున్నా ననీ అతడు జీవించినా మరణించినా నేను జీవించి ఉన్నాను,మరణిస్తాను

అనీ ఈ విధంగా ఉంటుంది అభిష్వంగం. ఇది ఎవరి విషయంలోను? చెపుతున్నాడు- పుత్రదారగృహాదులయందు, పుత్రులయందు, పుత్రికలయందు, భార్యలందు, గృహాల యందు 'ఆది' అనడంచేత చాలా ఇష్టమైన ఇతరదాసవర్గాదులందు. ఈ రెండూ కూడ, (అసక్తి అనభిష్వంగమూ కూడ) జ్ఞానానికి ఉపయోగిస్తాయి గాన జ్ఞాన మని చెప్పబడు చున్నాయి. ఎల్లప్పుడు సమాన మైన చిత్తంతో ఉండడం. ఎక్కడ? ఇష్టానిష్టోపపత్తులయందు ఇష్టములు సంప్రాప్తించడం ఇష్టోపపత్తి. అనిష్టాలు సంప్రాప్తించడం అనిష్టోపపత్తి. వీటిలో ఎల్లప్పుడు ఒకే విధమైన చిత్తంతో ఉండడం. ఇష్టోపపత్తులయందు సంతోషించదు; అనిష్టోప పత్తులయందు కోపించదు. నిత్యమూ అట్టి ఈ సమచిత్తత్వమే జ్ఞానం. 9

భాష్యమ్

కిం చ-

మూ. మయి చానన్యయోగేన భక్తిరవ్యభిచారిణీ,
వివిక్తదేశసేవిత్వమరతిర్జనసంసది. 10

బాలానందిని

కిం చేతి:- మరియు-

ప్ర.అ. **మయీతి**:-అనన్యయోగేన=మరొక దెవడూ లేడు అనే అభిప్రాయంతో, మయి=నాయందు, అవ్యభిచారిణీ=మార్పులేని, నిశ్చితమైన, భక్తిః=భక్తి, వివిక్తదేశసేవిత్వమ్= జనశూన్యమైన ప్రదేశంలో ఉంటూండడము, జనసంసది=జనసమూహామునందు, అరతిః =ఆసక్తి లేకపోవడము.

భాష్యమ్

మయి చ ఈశ్వరే అనన్యయోగేన అపృథక్సమాధినా, "న అన్యః భగవతః వాసుదేవాత్ పరః అస్తి, అతః సః ఏవ నః గతిః" ఇత్యేవం నిశ్చితా అవ్యభిచారిణీ బుద్ధిః అనన్యయోగః. తేన భజనం భక్తిః, న వ్యభిచరణశీలా అవ్యభిచారిణీ. సా చ జ్ఞానమ్. వివిక్తదేశసేవిత్వమ్-వివిక్తః స్వభావతః సంస్కారేణ వా అశుచ్యాదిభిః సర్పవ్యాఘ్రాదిభిః చ రహితః అరణ్యనదీపులినదేవగృహాదిః వివిక్తో దేశః, తం సేవితుం శీలమ్ అస్య ఇతి వివిక్తదేశసేవీ. తద్భావః వివిక్తదేశసేవిత్వమ్. వివక్తేషు హి దేశేషు చిత్తం ప్రసీదతి యతః తతః ఆత్మాదిభావనా వివిక్తే ఉపజాయతే. అతః వివిక్తదేశసేవిత్వం జ్ఞానమ్ ఉచ్యతే. అరతిః అరమణం, జనసంసది-జనానాం ప్రాకృతానాం సంస్కార శూన్యానామ్ అవినీతానాం సంసత్ సమవాయః జనసంసత్ న సంస్కారవతాం

వినీతానాం సంసత్;తస్యాః జ్ఞానోపకారకత్వాత్. అతః ప్రాకృతజనసంసది అరతిః జ్ఞానార్థత్వాత్ జ్ఞానమ్. 10

బాలానందిని

మయీతి:-అనన్యయోగంతో,వేరుగా లేని సమాధితో-భగవంతుడైన వాసుదేవుని కంటె పరుడైన(ఉత్తముడైన)మరొక డెవడూ లేడు;అందుచేత ఆ వాసుదేవుడే నా గతి అను,మార్పు లేని,నిశ్చిత మైన బుద్ధియే అనన్యయోగం.అట్టి యోగంతో ఈశ్వరుడనైన నాయందు మార్పు లేని భక్తి.అది కూడ జ్ఞానమే.వివిక్తదేశసేవిత్వమ్-సహజంగానే గాని, సంస్కారంచేత (పురుషప్రయత్నంచేత) గాని అపవిత్రమైనవాటితోను,సర్పవ్యాఘ్రాదులతోను శూన్యమైన ప్రదేశం వివిక్తం.అరణ్యము,నదీతీరము,దేవతాగృహాదికమూ కూడ వివిక్త ప్రదేశం.దానిని సేవించే(అక్కడ నివసించే)స్వభావం కలవాడు వివిక్తదేశసేవి.వాని ధర్మం వివక్తదేశసేవిత్వం.వివిక్తప్రదేశాలలో చిత్తం ప్రసన్నంగా ఉంటుంది.అందువల్ల ఆ వివిక్త ప్రదేశంలో ఆత్మాదిచింతన కలుగుతుంది.అందువల్ల వివిక్తదేశసేవిత్వమే జ్ఞానం అని చెప్పబడుచున్నది.జనసంసత్తులో-సంస్కారం లేనివాళ్లూ,వినయవిహీనులూ అయిన ప్రాకృతజనుల సముదాయమే ఇక్కడ జనసంసత్ అనగా;అంతే కాని ఉత్తమసంస్కార వంతులు, వినయసంపన్నులూ అయిన జనుల సమవాయం ఇక్కడ 'జనసంసత్'గా గ్రహింపబడదు.ఎందువల్ల ననగా-అలాంటివాళ్ల సముదాయం జ్ఞానానికి ఉపకారకంగానే ఉంటుంది.అందువల్ల ప్రాకృతజనసంసత్తునందు ఆసక్తి లేకపోవడం జ్ఞానానికి హేతువు గాన జ్ఞానమని చెప్పబడుచున్నది. 10

భాష్యమ్

కిం చ-

మూ. అధ్యాత్మజ్ఞాననిత్యత్వం తత్త్వజ్ఞానార్థదర్శనమ్,
ఏతద్ జ్ఞానమితి ప్రోక్తమజ్ఞానం యదతోఽన్యథా. 11

బాలానందిని

కిం చేతి:- మరియు-

అధ్యాత్మేతి:- అధ్యాత్మజ్ఞాననిత్యత్వమ్=అధ్యాత్మజ్ఞానమునందు నిత్యమూ స్థిరంగా ఉండడము,తత్త్వజ్ఞానార్థదర్శనమ్=తత్త్వజ్ఞానముయొక్క ప్రయోజనాన్ని గూర్చి ఆలోచించడము,ఏతత్=ఇది,జ్ఞానమ్=ఇతి=జ్ఞాన మని,ప్రోక్తమ్=చెప్పబడినది. అతః=దీనికంటె,యత్=ఏది,అన్యథా=మరొక విధంగా ఉంటుందో అది, అజ్ఞానమ్=అజ్ఞానముగా,ప్రోక్తమ్=చెప్పబడినది.

భాష్యమ్

అధ్యాత్మజ్ఞాననిత్యత్వమ్-ఆత్మాదివిషయజ్ఞానమ్ అధ్యాత్మజ్ఞానమ్. తస్మిన్ నిత్యభావః నిత్యత్వమ్. అమానిత్వాదీనాం జ్ఞానసాధనానామ్ భావనాపరిపాకనిమిత్తం తత్త్వజ్ఞానం,తస్య అర్థః మోక్షః,సంసారోపరమః తస్య ఆలోచనం తత్త్వజ్ఞానార్థదర్శనమ్. తత్త్వజ్ఞానఫలాలోచనే హి తత్సాధనానుష్ఠానే ప్రవృత్తిః స్యాదితి. ఏతత్ అమానిత్వాది తత్త్వజ్ఞానార్థదర్శనాన్తమ్ ఉక్తం జ్ఞానమితి ప్రోక్తమ్; జ్ఞానార్థత్వాత్. అజ్ఞానం యత్ అతః అస్మాత్ యథోక్తాత్ అన్యథా విపర్యయేణ-మానిత్వమ్,దమ్భిత్వమ్,హింసా, అక్షాన్తిః, అనార్జవమ్ ఇత్యాది అజ్ఞానం విజ్ఞేయం పరిహరణాయ,సంసారప్రవృత్తి కారణత్వాత్ ఇతి. 11

బాలానందిని

అధ్యాత్మేతి:-ఆత్మాదులను గూర్చిన జ్ఞానం 'అధ్యాత్మజ్ఞానం'. నిత్యమూ ఆ అధ్యాత్మ జ్ఞానమునందు ఉండుట. అమానిత్వం మొదలైన జ్ఞానసాధనాల భావన పరిపక్వము కాగా, దానివలన తత్త్వజ్ఞానం కలుగుతుంది. ఆ తత్త్వజ్ఞానంయొక్క ప్రయోజనం(ఫలం)సంసార వినాశరూప మైన మోక్షం,దానిని గూర్చి ఆలోచించడం'తత్త్వజ్ఞానార్థదర్శనం'. తత్త్వజ్ఞానం వల్ల లభించే ఫలాన్ని గూర్చి ఆలోచించడంచేత దానికి తగిన సాధనాలను అనుష్ఠించడంలో ప్రవృత్తి కలుగుతుంది. అమానిత్వం మొదలు తత్త్వజ్ఞానార్థదర్శనం వరకు ఉన్న ఈ చెప్పిన దంతా జ్ఞానాన్ని కలిగించేది కాబట్టి జ్ఞానం అని చెప్పబడుచున్నది. ఈ చెప్పినదానికంటె విపరీతంగా(భిన్నంగా)ఉండే మానిత్వం,దంభిత్వం,హింస,అక్షమ,అనార్జవం మొదలైనది అజ్ఞానం. ఇది సంసారప్రవృత్తికి కారణం గాన పరిహరించడంకొరకై దీనిని కూడ తెలుసు కొనాలి.

భాష్యమ్

యథోక్తేన జ్ఞానేన జ్ఞాతవ్యం కిమిత్యాకాఙ్క్షాయామ్ ఆహ "**జ్ఞేయం యత్తత్**" ఇత్యాది. నను యమాః నియమాశ్చ అమానిత్వాదయః;న తైః జ్ఞేయం జ్ఞాయతే. న హి అమానిత్వాది కస్యచిత్ వస్తునః పరిచ్ఛేదకం దృష్టమ్. సర్వత్రైవ హి యద్విషయం జ్ఞానం తదేవ తస్య జ్ఞేయస్య పరిచ్ఛేదకం దృశ్యతే. న హి అన్యవిషయేణ జ్ఞానేన అన్యత్ ఉపలభ్యతే,యథా ఘటవిషయేణ జ్ఞానేన అగ్నిః. నైష దోషః. జ్ఞాననిమిత్తత్వాత్ జ్ఞానమ్ ఉచ్యతే ఇతి హి అవోచామ,జ్ఞానసహకారికారణత్వాచ్చ.

బాలానందిని

యథేతి:-ఇంతవరకు చెప్పబడిన జ్ఞానంచేత తెలియదగినది ఏది అను ఆకాంక్ష కలగగా"**జ్ఞేయం యత్తత్**"ఇత్యాదికం చెపుతున్నాడు.

అవ. అమానిత్వాదులు జ్ఞానం ఎలా అవుతాయి అని ఆశంకిస్తున్నాడు-**నన్వితి**:- అమానిత్వం మొదలైనవి యమాలు,నియమాలు మాత్రమే కదా? వాటిచేత తెలియదగిన వస్తువేదీ తెలియబడడంలేదు. అమానిత్వం మొదలైనవి ఏదైన ఒక వస్తువునకు పరిచ్ఛేదకములుగా,(ఒక వస్తువుయొక్క స్వరూపాన్ని ఇది ఇట్లు అని గుర్తించేవిగా)లేవు కదా? అంతటా కూడ దేనిని గూర్చిన జ్ఞానం కలుగుతుందో అది ఆ జ్ఞేయానికి పరిచ్ఛేదకంగా(జ్ఞేయస్వరూపనిరూపకంగా)కనబడుచున్నది.("ఇది ఘటము"అను జ్ఞానం కలిగిన దనగా ఆ జ్ఞానంలో ఘటస్వరూపం భాసిస్తూన్నది గాన ఆ జ్ఞానం ఘటానికి పరిచ్ఛేదకం అని చెప్పబడుతుంది)ఒక వస్తువు విషయంగా గల(ఒక వస్తువును గూర్చిన)జ్ఞానంచేత మరొక వస్తువు గ్రహింపబడదుకదా? ఉదాహరణకి ఘటవిషయకమైన జ్ఞానంచేత వహ్ని గ్రహించబడదు.(అందుచేత అమానిత్వాదులను గూర్చి వర్ణించి చెప్పడంచేత అమానిత్వాదు లంటే ఏమో తెలుస్తుంది కాని ఆత్మస్వరూపం తెలియదు గాన అమానిత్వాదులు ఆత్మజ్ఞానం కాజాలవు;వాటిని జ్ఞానం అనకూడదు అని భావం).(సమాధానం)-ఈ దోషం లేదు. ఇవి జ్ఞానానికి నిమిత్తము లవడంచేత జ్ఞాన మని చెప్పబడుచున్నాయి అని చెప్పి ఉన్నాం. జ్ఞానానికి సహకారికారణాలవడంవల్ల కూడ అవి జ్ఞానం అని చెప్పబడుతున్నాయి.(అనగా శ్రవణమననాదులు జ్ఞానానికి సాక్షాత్తు కారణాలు;అమానిత్వాదులు జ్ఞానం పుట్టించడంలో శ్రవణమననాదులకు సహకరిస్తాయి అని భావం).

వి. "తత్రాహింసాసత్యాస్తేయబ్రహ్మచర్యాపరిగ్రహా యమాః" "శౌచసంతోషతపః స్వాధ్యాయేశ్వరప్రణిధానాని నియమాః"(యోగసూత్రం2.30,32)అని అహింసాదియమనియమాలు యోగసూత్రాదులలో చెప్పబడ్డాయి. ఈ అమానిత్వాదులు కూడ వీటిలోనే చేరుతాయిగాన"యమా నియమాశ్చ అమానిత్వాదయః"అని భాష్యంలో చెప్పబడింది.

మూ. జ్ఞేయం యత్తత్ ప్రవక్ష్యామి యద్ జ్ఞాత్వాఽమృతమశ్నుతే,
అనాదిమత్పరం బ్రహ్మ న సత్తన్నాసదుచ్యతే. 12

ప్ర. అ. జ్ఞేయమితి:-యత్=ఏది,జ్ఞేయమ్=తెలియదగినదో,యత్=దేనిని,జ్ఞాత్వా=తెలిసికొని,అమృతమ్=మోక్షమును,అశ్నుతే=పొందునో,తత్=అట్టి,అనాదిమత్=ఆదిలేని, పరమ్=పరమైన,బ్రహ్మ=బ్రహ్మను గూర్చి,ప్రవక్ష్యామి=చెప్పెదను. తత్=అది,సత్=సత్ అని గాని,అసత్=అసత్ అని గాని,న ఉచ్యతే=చెప్పబడదు.

భాష్యమ్

జ్ఞేయం జ్ఞాతవ్యం యత్ తత్ ప్రవక్ష్యామి ప్రకర్షేణ యథావత్ వక్ష్యామి. కింఫలం తదితి ప్రరోచనేన శ్రోతుః అభిముఖీకరణాయ ఆహ-యత్ జ్ఞేయం జ్ఞాత్వా అమృతమ్

అశ్నుతే,న పునః మ్రియతే ఇత్యర్థః.అనాదిమత్–ఆదిః అస్య అస్తీతి ఆదిమత్.న ఆదిమత్. కిం తత్?పరం నిరతిశయం బ్రహ్మ జ్ఞేయమ్ ఇతి ప్రకృతమ్.

అత్ర కేచిత్"అనాది మత్పరమ్"ఇతి పదం ఛిన్దన్తి,బహువ్రీహిణోక్తే అర్థే మతుపః ఆనర్థక్యమ్ అనిష్టం స్యాదితి.అర్థవిశేషం చ దర్శయన్తి–అహం వాసుదేవాఖ్యా పరా శక్తిః యస్య తత్ మత్పరమ్ ఇతి.సత్యమ్ ఏవమ్ అపునరుక్తం స్యాత్ అర్థః చేత్ సంభవతి.న తు అర్థః సంభవతి,బ్రహ్మణః సర్వవిశేషప్రతిషేధేనైవ విజిజ్ఞాపయిషితత్వాత్ న సత్ న అసత్ ఉచ్యతే ఇతి.విశిష్టశక్తిమత్త్వప్రదర్శనం విశేషప్రతిషేధశ్చేతి విప్రతిషిద్ధమ్.తస్మాత్ మతుపః బహువ్రీహిణా సమానార్థత్వేఽపి ప్రయోగః శ్లోకపూరణార్థః.

బాలానందిని

జ్ఞేయమితి:–ఏది తెలియదగినదో దానిని గూర్చి ప్రకర్షణతో,ఉన్న దున్నట్లు చెప్పెదను.ఇలా చెప్పడానికి ఫలం ఏమి అని ప్రరోచనంచేత(ఆసక్తి కలిగించడంచేత) శ్రోతను అభిముఖుణ్ణిగా చేసికొనడానికై అంటున్నాడు–జ్ఞేయమైన దేనిని తెలుసుకొని అమృతత్వాన్ని పొందుతాడో,మరల మరణించడో అని అర్థం.అనాదిమత్–ఆదికలది ఆదిమత్.ఆదిమత్ కానిది అనాదిమత్.ఏమిటది?పరమైన,నిరతిశయమైన(దేనికంటె గొప్పది లేదో అట్టి)బ్రహ్మ. ఏది జ్ఞేయ మని ప్రకృతమో అది.

"అనాదిమత్పరమ్"అన్నప్పుడు(అనాది=ఆదిలేనిది అని)బహువ్రీహిచేతనే కావలసిన అర్థం చెప్పబడిన తరువాత'మతుప్' ప్రత్యయం అనావశ్యకంఅవుతుంది అనే అభిప్రాయం తో కొందరు'అనాది+మత్పరమ్'అని పదచ్ఛేదం చేస్తున్నారు.నేను,అనగా వాసుదేవు డను పేరు గల పరశక్తి దేనికో అది అని అర్థవిశేషం కూడ చెపుతున్నారు.

వి."ఫలానాది కలది","ఫలానా దానితో కూడినది"అనే అర్థంలో 'మతుప్'అనే ప్రత్యయం చేర్చబడుతుంది.'ధీమత్'(బుద్ధిగల)'కాన్తిమత్'(కాంతిగల)ఇత్యాదులు ఉదా హరణములు.'పీతామ్బరః'అను బహువ్రీహిసమాసం ఉంది.పచ్చని వస్త్రం కలవాడు అని అర్థం.'కలవాడు'అనే అర్థం బహువ్రీహిసమాసంచేతనే చెప్పబడుతూన్నది గాన ముందుగా "పీతం చ తత్ అమ్బరం చ"అని కర్మధారయ చేసి మళ్లీ 'మత్'చేర్చి 'పీతామ్బరవత్'అని ప్రయోగించకూడదు.అలా'మతుప్'చేర్చడం వ్యర్థం అవుతుంది. అందుచేతనే "న కర్మధారయా న్మత్వర్థీయః"అని వ్యాకరణనియమం. ప్రకృతంలో 'అనాది' శబ్దానికి "న విద్యతే ఆదిః యస్య తత్"అని బహువ్రీహి సమాసం చెప్పుకొంటే "ఆది లేనిది"అను అర్థం లభిస్తుంది. అందుచేత "ఆదిః అస్య అస్తీతి ఆదిమత్"(ఆది కలది ఆదిమత్)అని ముందు చెప్పుకొని తరువాత 'న ఆదిమత్ అనాదిమత్'అని నఞ్ సమాసం చెప్పడం అనావశ్యకం. అందుచేత

'అనాది+మత్పరం' అని పదచ్ఛేదం చెయ్యాలి."అహం పరః యస్య తత్ మత్పరమ్"అనగా నేనే పరమైన శక్తిగా గలది అని అర్థం అని ఈ వ్యాఖ్యాతల అభిప్రాయం.

సత్యమితి:- నిజమే!అర్థం కుదురుతే,ఈ విధంగా పదచ్ఛేదం చేయడంవల్ల పునరుక్తత్వ దోషం ఉండదు.కాని అర్థం కుదరడంలేదు.ఎందువల్ల ననగా-ఇక్కడ "**న సత్తన్నాసదుచ్యతే**"అని అంటూ బ్రహ్మ సమస్తవిశేషాల నిషేధం ద్వారానే ప్రతిపాదించ దానికి ఉద్దిష్ట మై ఉంది.(ఎలాంటి విశేషాలూ లేని బ్రహ్మను ప్రతిపాదించడం ఈ ఘట్టంలో ఉద్దేశింపబడినది).విశిష్టమైన శక్తి ఉన్నది అని చెప్పడం,విశేషాలను నిషేధించడం అనేవి పరస్పరవిరుద్ధ మైనవి.అందుచేత బహువ్రీహితో సమాన మైన అర్థాన్నే బోధించినా కూడ 'మతుప్'ప్రత్యయం శ్లోకం పూరించడంకోసమే ప్రయోగించబడింది.('అనాది పరం బ్రహ్మ'అంటే ఛందస్సు కుదరడం లేదు గాన"**అనాదిమత్ పరం బ్రహ్మ**"అనడం జరిగింది).

భాష్యమ్

"అమృతత్వఫలం జ్ఞేయం మయా ఉచ్యతే"ఇతి ప్రరోచనేన అభిముఖీకృత్య ఆహ-న సత్ తద్ జ్ఞేయముచ్యతే.నాప్యసత్తదుచ్యతే.నను మహతా పరికరబన్ధేన కణ్ఠ రవేణ ఉద్ఘుష్య "జ్ఞేయం ప్రవక్ష్యామి"ఇతి అననురూపమ్ ఉక్తం "న సత్తన్నాసదుచ్యతే" ఇతి?న;అనురూపమేవ ఉక్తమ్.కథమ్?సర్వాసు హి ఉపనిషత్సు జ్ఞేయం బ్రహ్మ "నేతి నేతి"(బృ.ఉ. 2. 3. 6)"అస్థూలమ్ అనణు"(బృ.ఉ. 3. 8. 8)ఇత్యాదినిషేధప్రతిషేధేనైవ నిర్దిశ్యతే,న "ఇదం తత్"ఇతి;వాచః అగోచరత్వాత్. నను న తద్ అస్తి యత్ వస్తు అస్తి శబ్దేన నోచ్యతే?అథ అస్తిశబ్దేన నోచ్యతే నాస్తి తద్ జ్ఞేయమ్.విప్రతిషిద్ధం చ జ్ఞేయం తత్ అస్తిశబ్దేన నోచ్యతే ఇతి.న తావత్ నాస్తి;నాస్తిబుద్ధ్యవిషయత్వాత్.

బాలానందిని

అమృతేతి:-అమృతత్వం ఫలంగా గల జ్ఞేయాన్ని గూర్చి చెపుతాను అని ప్రరోచనం ద్వారా(అర్జునుణ్ణి)అభిముఖుణ్ణిగా చేసికొని-"ఆ జేయం సత్ అనీ చెప్పబడదు,అసత్ అనీ చెప్పబడదు"అని అంటున్నాడు. (ప్రశ్న)గొప్ప పరికరబంధంతో(ఎంతో హడావుడి చేసి) "తెలుసుకొనదగినదానిని గూర్చి చెపుతాను"అని నోటితో అంటూ "**న సత్తన్నాసదుచ్యతే**" అని అనురూపం కాని(తగని)విధంగా చెప్పబడుచున్నది;ఇదేమిటి?(సమాధానం)కాదు;అను రూపంగానే చెప్పబడింది.ఎట్లు?అన్ని ఉపనిషత్తులలోనూ కూడ జ్ఞేయ మైన బ్రహ్మ "**నేతి నేతి**"(ఇది కాదు,ఇది కాదు),"**అస్థూలమనణు**"(స్థూలం కాదు,అణువు కాదు)ఇత్యాది విధంగా విశేషాలను నిషేధించడం ద్వారానే నిర్దేశింపబడుచున్నది.అంతే కాని"బ్రహ్మ అంటే ఇది"అని(ఒక వస్తువును)ఎదుట చూపి నట్లు చూపి)నిర్దేశించబడడం లేదు.అందుకు కారణ

మేమనగా-బ్రహ్మ వాక్కులకు గోచరం కాదు.(మాటలతో చెప్ప శక్య మైనది కాదు).(ప్రశ్న)ఏ వస్తువు 'అస్తి'శబ్దంచేత చెప్పబడదో(ఉన్నది అని చెప్పబడదో)అలాంటిది లేదు కదా?అలా కాకఅది 'అస్తి'శబ్దంచేత చెప్పబడకపోతే అది జ్ఞేయమే కాదు.ఒక ప్రక్క అది జ్ఞేయం (తెలియదగినది)అని అంటూ అది అస్తిశబ్దంచేత చెప్పబడదు అనడం విరుద్ధం కదా? (సమాధానం)జ్ఞేయ మైన బ్రహ్మ లేదనడ మైతే కుదరదు;ఎందువల్ల ననగా అది నాస్తిబుద్ధికి (లేదు అనే బుద్ధికి)విషయం కాదు.

భాష్యమ్

నను సర్వాః బుద్ధయః అస్తినాస్తిబుద్ధ్యనుగతా ఏవ?తత్రైవం సతి జ్ఞేయమపి అస్తిబుద్ధ్యనుగతప్రత్యయవిషయం వా స్యాత్ నాస్తిబుద్ధ్యనుగతప్రత్యయవిషయం వా స్యాత్. న;అతీన్ద్రియత్వేన ఉభయబుద్ధ్యనుగతప్రత్యయావిషయత్వాత్.యత్ హి ఇన్ద్రియ గమ్యం వస్తు ఘటాదికం తత్ అస్తిబుద్ధ్యనుగతప్రత్యయవిషయం వా స్యాత్ నాస్తిబుద్ధ్యను గతప్రత్యయవిషయం వా స్యాత్.ఇదం తు జ్ఞేయమ్ అతీన్ద్రియత్వేన శబ్దైకప్రమాణగమ్య త్వాత్ న ఘటాదివత్ ఉభయబుద్ధ్యనుగతప్రత్యయవిషయమ్ ఇత్యతః "న సత్తన్నాసత్" ఇతి ఉచ్యతే.యత్తూక్తం విరుద్ధమ్ ఉచ్యతే జ్ఞేయం తత్ న సత్ న అసత్ ఉచ్యతే ఇతి; న విరుద్ధమ్-"అన్యదేవ తద్విదితాదథో అవిదితాదధి"(కే.ఉ.1.3)ఇతిశ్రుతేః.శ్రుతిరపి విరుద్ధార్థా ఇతి చేత్-యథా యజ్ఞాయ శాలామారభ్య"కో హి తద్వేద యద్యముష్మిన్ లోకేఽస్తి వా న వేతి"(తై.సం.6.1.1)ఇతి చేత్-న;విదితావిదితాభ్యామన్యత్వశ్రుతేః అవశ్యవిజ్ఞేయార్థప్రతిపాదనపరత్వాత్."యద్యముష్మిన్"ఇత్యాది తు విధిశేషః అర్థ వాదః.

బాలానందిని

వన్యేతి:-(ప్రశ్న)అన్ని బుద్ధులూ(జ్ఞానాలూ)అస్తిబుద్ధితోను(ఉన్నది)అనే జ్ఞానంతోను నాస్తిబుద్ధితోను(లేదు అనే జ్ఞానంతోను)అనుగతంగానే)సంబంధించియే ఉంటాయి కదా? (అనగా-ఒక జ్ఞానం కలిగిన దనగా ఫలానా వస్తువు ఉన్నది అనే జ్ఞానం కాని,లేదు అనే జ్ఞానం కాని మాత్రమే కలుగుతుంది.ఉదాహరణకి 'ఇది ఘటం'అనే జ్ఞానం కలిగిన దనగా ఘటం ఉన్నట్లుగా-అస్తిత్వం-భాసిస్తూన్నది.'ఘటం లేదు'అంటే నాస్తిత్వం భాసి స్తూన్నది.అస్తిత్వనాస్తిత్వాలలో ఏదో ఒకటి భాసించని జ్ఞానం అంటూ ఉండ దని భావం). అలాంటప్పుడు జ్ఞేయం కూడ (జ్ఞేయ మైన బ్రహ్మ కూడ)'అస్తి'అనే జ్ఞానంతో అనుగతమైన జ్ఞానాని కైనా విషయం కావాలి లేదా 'నాస్తి'అనే జ్ఞానంతో అనుగత మైన ప్రత్యయానికి

(జ్ఞానానికి)విషయమైనా కావాలి.(జ్ఞేయం ఉన్నది అనేనా జ్ఞానం కలగాలి జ్ఞేయం లేదు అనేనా జ్ఞానం కలగాలి.అంతేనే కాని ఉంది లేదు అనే జ్ఞానం కలగకూడదు).(సమాధానం) ఈ దోషం లేదు.ఇది అతీంద్రియము(ఇంద్రియాల ద్వారా తెలియబడేది కాదు)గాన ఈ రెండు బుద్ధులకు (అస్తిబుద్ధికి నాస్తి బుద్ధికీ కూడ)సంబంధించిన ప్రత్యయంలో విషయం కాదు.ఇంద్రియాల ద్వారా తెలియ దగిన ఘటాదికం ఉన్న దంటే అది అస్తిబుద్ధ్యనుగత ప్రత్యయవిషయమేనా(ఉన్నది అనే జ్ఞానానికి గోచరమైనా)అవుతుంది లేదా నాస్తిబుద్ధ్యనుగత ప్రత్యయవిషయమేనా అవుతుంది.ఈ జ్ఞేయ మైతే అతీంద్రియం గాన కేవలము ఒక్క శబ్దప్రమాణం ద్వారా మాత్రమే తెలియదగినదిగా ఉంది.అందుచేత ఉభయబుద్ధ్యనుగత ప్రత్యయవిషయం కాదు.అందువల్లనే ఇది "న సత్""న అసత్"అని చెప్పబడుచున్నది.ఒక ప్రక్క అది జ్ఞేయం అని చెపుతూ అది సత్తు కాదు అసత్తూ కాదు అని చెప్పడం విరుద్ధం కదా అని ఏ ఆక్షేపం చేయబడిందో అది యుక్తం కాదు;ఎందువల్ల ననగా"**అన్యదేవ తద్విదితాదథో అవిదితాదధి**"(అది తెలియబడినదీ కాదు,తెలియబడనిదీ కాదు)అని శ్రుతియే ఈ విధంగా చెపుతూన్నది.(ప్రశ్న)స్వర్గఫలం ఇచ్చే ఒక యజ్ఞవిధానాన్ని ప్రస్తావించి, ఆ యజ్ఞంకోసం శాలను నిర్మించడానికి ప్రారంభించే సందర్భంలో"పరలోకం ఉందో లేదో ఎవరికి తెలియును?" అని సంశయాన్ని వెలిబుచ్చే శ్రుతి ఏ విధంగా విరుద్ధార్థమో అట్లే పైన ఉదాహరించిన శ్రుతి కూడ విరుద్ధార్థమే అనడం (సమాధానం)యుక్తం కాదు; ఎందువల్ల ననగా-"ఈ బ్రహ్మ విదితమూ కాదు అవిదితమూ కాదు"అని చెప్పే ఈ శ్రుతికి బ్రహ్మ ప్రత్యగాత్మాభిన్నము అని ప్రతిపాదించడంలోనే తాత్పర్యం గాన ఇది అప్రమాణం అనడానికి వీలు లేదు."యద్యముష్మిన్"ఇత్యాదివాక్య మైతే విధివాక్యానికి అంగంగా చెప్పబడినది గాన అర్థవాదం మాత్రమే.

భాష్యమ్

ఉపపత్తేశ్చ సదసదాదిశబ్దైః బ్రహ్మ నోచ్యతే ఇతి.సర్వో హి శబ్దః అర్థప్రకాశనాయ ప్రయుక్తః శ్రూయమాణః చ శ్రోతృభిః జాతిక్రియాగుణసంబన్ధద్వారేణ సంకేతగ్రహణ సవ్యపేక్షః అర్థం ప్రత్యాయయతి;న అన్యథా;అదృష్టత్వాత్.తద్యథా-గౌః అశ్వః ఇతి వా జాతితః,పచతి,పఠతి ఇతి వా క్రియాతః,శుక్లః కృష్ణః ఇతి వా గుణతః,ధనీ గోమాన్ ఇతి వా సంబన్ధతః,న తు బ్రహ్మ జాతిమత్,అతః న సదాదిశబ్దవాచ్యమ్;నాపి గుణవత్, యేన గుణశబ్దేన ఉచ్యేత;నిర్గుణత్వాత్;నాపి క్రియాశబ్దవాచ్యమ్,నిష్క్రియత్వాత్;"**నిష్కలం నిష్క్రియం శాన్తమ్**"ఇతి శ్రుతేః.న చ సంబన్ధీ;ఏకత్వాత్ అద్వయత్వాత్ అవిషయత్వాత్, ఆత్మత్వాత్ చ న కేనచిత్ శబ్దేన ఉచ్యతే ఇతి యుక్తమ్."**యతో వాచో నివర్తన్తే**"(తై.ఉ. 2.9.9)ఇత్యాదిశ్రుతిభిః చ.

బాలానందిని

ఉపపత్తేరితి:-ఉపపత్తిని (యుక్తిని)పట్టి కూడ సదసదాదిశబ్దాలచేత బ్రహ్మ చెప్పబడదు. అర్థాన్ని వ్యక్తం చేయడానికి (వక్తలచేత)ప్రయోగించబడినది,శ్రోతలచేత వినబడేది అయిన ప్రతీ శబ్దమూ కూడ జాతి-క్రియా-గుణ-సంబంధాల ద్వారా సంకేతమును గ్రహించడంయొక్క అపేక్ష గలదై అర్థాన్ని బోధిస్తుంది.(ఈ పదానికి ఇది అర్థం అనే జ్ఞానం సంకేతం. సంకేతం తెలిసినవానికే ఒక పదంవల్ల దాని అర్థం తెలుస్తుంది).సంకేత జ్ఞానాపేక్ష లేకుండా ఒక శబ్దం అర్థాన్ని బోధించడం కనబడదు.అది ఎట్లనగా-'గౌః' 'అశ్వః'అని జాతిద్వారా శబ్దార్థాల సంకేతం తెలుస్తుంది.(గోత్వం అనే జాతి గలది అశ్వత్వం అనే జాతి గలది అశ్వం అని తెలుస్తుంది).పచతి(వంట చేయుచున్నాడు)'పఠతి'(చదవడం చేయుచున్నాడు)ఇత్యాదులలో క్రియ ద్వారా సంకేతం తెలుస్తూన్నది.'శుక్లః''కృష్ణః'ఇత్యాదులలో(తెలుపు,నలుపు మొదలైన)గుణాల ద్వారా సంకేతం తెలుస్తూన్నది.'ధనీ'(ధనం కలవాడు-ధనంతో సంబంధం ఉన్నవాడు)'గోమాన్'(గోవులు కలవాడు)ఇత్యాదులలో ధనాదులతో ఉన్న సంబంధం ద్వారా సంకేతం తెలుస్తూన్నది.అయితే బ్రహ్మకు జాతి లేదు;అందుచేత సదాదిశబ్దాలచేత వాచ్యం కాదు.గుణవాచకశబ్దంచేత బోధించబడడానికి బ్రహ్మలో గుణాలు కూడ లేవు.అది నిర్గుణం కదా?"నిష్కలం నిష్క్రియం శాన్తమ్"ఇత్యాది శ్రుతిలో చెప్పినట్లు ఇది క్రియారహితం గాన క్రియాశబ్దంచేత కూడ చెప్పబడదు.బ్రహ్మ అనేది ఒకే ఒక వస్తువు,రెండవది ఏదీ లేదు;అందుచేత ఇది దేనితోను సంబంధించినది కూడ కాదు. ఈ విధంగా ఇది దేనికీ విషయం కాదు గాన,ఆత్మయే గాన ఏ శబ్దంచేతా కూడ చెప్పబడదు అని చెప్పడం యుక్తిసంగతం."యతో వాచో నివర్తన్తే"ఇత్యాదిశ్రుతులు కూడ బ్రహ్మ శబ్దవాచ్యం కాదని చెపుతున్నాయి.

భా.అ.ప్ర.ఇక్కడ శ్రీరామానుజాచార్యులు ఇలా ప్రతిపాదించారు-"ఇక్కడ బ్రహ్మ కంటె భిన్నుడైన క్షేత్రజ్ఞుని స్వరూపం శోధించబడుచున్నది.అమానిత్వం మొదలైన సాధనాల చేత ఏ ప్రత్యగాత్మస్వరూపం జ్ఞేయమో,పొందదగినదో,దానిని గూర్చి చెపుతాను.దేనిని తెలుసుకొని అమృతమును,అనగా జన్మమరణాదిరహితమైన ఆత్మను పొందుతాడో.ఆది లేనిది,అందువల్లనే అనంతం.మత్పరమ్- నేనే పరుడుగా,అనగా శేషిగా,గలది.బృహత్త్వమనే గుణం గలది గాన బ్రహ్మ.క్షేత్రజ్ఞుని తత్త్వము శరీరంకంటె భిన్న మైనది,స్వతః దీనికి శరీరాదులచేత పరిచ్ఛేదం లేదు అని అర్థం."బ్రహ్మణో హి ప్రతిష్ఠాహమమృతస్యావ్యయస్య చ"ఇత్యాది ప్రదేశాలలో బ్రహ్మశబ్దం ఆత్మ అనే అర్థంలో కూడ ప్రయోగించబడుచున్నది.ఇది సత్ కాదు అసత్ కాదు.ఆత్మ స్వరూపానికి కార్యరూపావస్థ గాని కారణరూపావస్థ గాని లేదు గాన ఇది సదసచ్ఛబ్దాలచేత చెప్పబడదు". ఇది అయుక్తం.ప్రత్యగాత్మస్వరూపం ప్రత్యగాత్మకంటె భిన్నమా అభిన్నమా? స్వస్వరూపం తనకంటె భిన్నం కాజాలదు గాన మొదటి

పక్షం కుదరదు.రెండవ పక్షం కూడ యుక్తం కాదు.పొందే ప్రత్యగాత్మకు తన స్వరూపం ప్రాప్యం (క్రొత్తగా పొందదగినది) కాదు కదా?జ్ఞానం అనే అర్థంలో ప్రసిద్ధమైన జ్ఞాధాతువునకు ఆ అర్థం విడచి ప్రాప్తి అనే అర్థం కల్పించడం కూడ అయుక్తం.అణుపరిమాణం గల జీవునకు బృహత్త్వం అనే గుణం అయుక్తం. అందుచేత బ్రహ్మశబ్దం జీవుడు అనే అర్థం చెప్పదు.స్వభావంచేత అణుప్రమాణం కలవాడే అయినా జీవుడు ముక్తావస్థలో బృహత్త్వం పొందుతాడు అని అంటే అప్పుడు క్రొత్తగా కొన్ని అవయవాలు వచ్చి చేరుతా యని చెప్పిన ట్లవుతుంది. సావయవు డైతే అనిత్యు డవుతాడు.జీవుడు నిరవయవుడు అదే నీ మతానికి భంగం కూడ వాటిల్లుతుంది. సంసారిదశలో జీవుడు శరీరపరిచ్ఛిన్ను డవడంచేత అణు పరిమాణుడు,ముక్తావస్థలో శరీరం లేకపోవడంచేత బృహత్ప్రమాణం కలవా డవుతాడు అనడం కూడ అయుక్తం. పరిచ్ఛేద్యుడు కాని జీవుడు పరిచ్ఛిన్ను డవడం కుదరదు.పరిచ్ఛేద్యు డైతే ఘటాదుల వలె అనిత్యత్వం ఏర్పడుతుంది.ఇంతకీ శరీరాదులచేత పరిచ్ఛేదం ఎవరికి? జీవునికి కాదు; ఎందువల్ల ననగా పరిచ్ఛిన్నుడుగా ఉన్నవాడే జీవుడు కదా?పరిచ్ఛేదానికి ముందు జీవుడే లేడు.ముందు కూడ ఉన్నాడు అని అంటే అప్పుడు అతడు అపరిచ్ఛిన్నుడే. ఔను,అంతే అనడానికి వీలు లేదు;అపరిచ్ఛిన్నుడు అణువు ఎలా అవుతాడు?పోనీ శరీరాదుల చేత పరమాత్మకు పరిచ్ఛేదం కలుగుతుంది అనడం యుక్తం కాదు.అప్పు డతడు జీవుడై పోతాడు.పరమాత్మకంటె జీవుడు వేరు అని కదా నీ మతం?

జీవునికి బృహత్త్వం లేకపోతే లేకపోనీ,బ్రహ్మశబ్దం రూఢిచేతనే ఆత్మను చెపుతుంది; "బ్రహ్మణో హి ప్రతిష్ఠాహమ్"అని ప్రయోగం ఉంది కదా అనడం కూడ యుక్తం కాదు. అక్కడ కూడ బ్రహ్మశబ్దం పరమాత్మనే చెపుతుంది అని చెప్పబడనున్నది.బ్రహ్మశబ్దానికి రూఢి పరమాత్మయందే.

అట్లే 'మత్పరమ్'అని చెప్పడం కూడ అయుక్తమే.బంధదశలో జీవుడు ఈశ్వరునికి శేషుడైనా ముక్తిలో కూడ శేషుడే అని కల్పించడం శక్యం కాదు.ఎందువల్ల ననగా–నీ మతం ప్రకారం కూడ ముక్తుడైన జీవుడు కూడ ఈశ్వరుడు వలె బృహత్ప్రమాణుడు,సచ్చిదా నందరూపుడూ కూడ కదా?"మమ సాధర్మ్యమాగతాః"అను గీతావాక్యాన్ని ప్రమాణంగా చూపుతూ ముక్తిలో జీవునకు ఈశ్వరసాధర్మ్యం ఉంటుం దని నువ్వు అంటావు కదా? సమానధర్మాలు గల రెండు వస్తువులకు పరస్పరము శేషశేషిభావం ఎలా కుదురుతుంది? ధనికత్వము దారిద్ర్యము మొదలైన అసమానధర్మా లున్న రాజభృత్యాదులలోనే శేషశేషిభావం ఉన్నట్లు లోకంలో కనబడుతున్నది కదా!ఈశ్వరుడు జీవునికంటె ఉత్కృష్టధర్మా లున్నవాడు అని అంటే "మమ సాధర్మ్యమాగతాః"అన్న గీతవచనానికి విరోధం కలుగుతుంది.

జీవేశ్వరు లిద్దరూ సచ్చిదానందరూపులే అయినా కూడ ముక్త డైన జీవునకు జగత్సృష్ట్యాదివ్యాపారం ఉండదు;ఈశ్వరునకు అది ఉంటుంది;అందుచేత జీవునికంటె

ఈశ్వరుడు ఉత్కృష్టడే అనడం కూడ యుక్తం కాదు.సగుణముక్తిక్షేత్రమైన హిరణ్యగర్భ లోకం చేరిన జీవులకు శరీరాదిపరిచ్ఛేదా లుండడంవల్ల ఆ ముక్తులకు అపరిచ్ఛిన్ను డైన ఈశ్వరునితో సాధర్మ్యం ఉండదు గాన వాళ్లకు జగద్వ్యాపారం ఉండదు అని మాత్రమే (జగద్వ్యాపారవర్జాధికరణంలో)సూత్రకారుని అభిప్రాయం.ముక్తజీవునికి వలె ఈశ్వరునికి కూడ శరీరం ఉంటుంది అనడం అయుక్తం.సశరీరుడైన హిరణ్యగర్భు డైనా, శివుడైనా, విష్ణువైనా,మరి యే దేవు డైనా జీవకోటిలోనికే చేరుతారు గాన వాళ్లకు ఈశ్వరత్వం లేదు.ఈశ్వరుడు అశరీరుడు.'బృహత్'అవడం వల్ల ఈశ్వరునికి పరిచ్ఛేదం ఉండడానికి వీలు లేదు.ముక్తజీవునికి కూడ ఈశ్వరునికి వలెనే శరీరం ఉండదు అని అంటే శరీరం లేని పక్షంలో భేదకారణం ఏదీ లేకపోవడంచేత జీవేశ్వరైక్యాన్ని అంగీకరించిన ట్లవుతుంది. బృహత్త్వం ఉండి పరిచ్ఛిన్నత్వం లేని రెండు వస్తువు లుండడానికి శక్యం కాదు కదా? జీవునిచేత ఈశ్వరుడు ఈశ్వరునిచేత జీవుడు పరిచ్ఛిన్ను లవడంచేత ఇద్దరికీ కూడ అపరిచ్ఛిన్నత్వం ఉండదు.దేశాన్ని పట్టి,కాలాన్ని పట్టి,అన్యవస్తువును పట్టి పరిచ్ఛేదం లేనిదానినే కదా అపరిచ్ఛిన్న మైన బ్రహ్మ అని అంటాం?జీవుడు బ్రహ్మకు శరీరమే గాన దానిని పట్టి బ్రహ్మకు పరిచ్ఛిన్నత్వం ఉండదు అనడం యుక్తం కాదు.జీవుడు తన శరీరం చేత పరిచ్ఛిన్ను డవుతున్నా డని నువ్వే అంటున్నావు కదా?శరీర-శరీరులు రెండు పదార్థాలా లేక ఒక పదార్థమేనా?మొదటి పక్షంలో పరస్పరం పరిచ్ఛేదం ఒప్పుకొన్నట్లే. రెండ వపక్షంలో శరీరశరీరిభావమే కుదరదు.అందువల్ల జీవుడు ఈశ్వరుడు అని ఇద్దరు ఉన్న పక్షంలో జీవునిచేత పరిచ్ఛిన్ను డవడంచేత పూర్ణత్వం(సర్వవ్యాప్తత్వం)అనే బృహత్త్వం లేదు గాన ఈశ్వరుడే బ్రహ్మ కాకుండా పోతాడు;అలాంటప్పుడు జీవుని మాట చెప్పాలా? జీవునికి బ్రహ్మత్వం సాధించాలని ప్రయత్నం చేసిన నువ్వు బ్రహ్మయొక్క బ్రహ్మత్వానికే ముప్పు తెచ్చిపెట్టావు?దీనిచేత ముక్తిలో ప్రకృతి ఉంటుంది అనే వాదం కూడ నిరాకృత మైనట్లే.ప్రకృతి ఉంటే దానిచేత బ్రహ్మ పరిచ్ఛిన్న మైపోతుంది.అందువల్ల పరమార్థంలో జీవేశ్వరభేదమూ లేదు,ప్రకృతి గాని దాని కార్యమైన జగత్తు గాని లేదు.అప్పుడే "ఏకమేవాద్వితీయం బ్రహ్మ"అనే శ్రుతి కుదురుతుంది(భా.అ.ప్ర.87-88) 12

భాష్యమ్

సచ్ఛబ్దప్రత్యయావిషయత్వాత్ అసత్త్వాశఙ్కాయాం జ్ఞేయస్య సర్వప్రాణికరణో పాధిద్వారేణ తదస్తిత్వం ప్రతిపాదయన్ తదాశఙ్కానివృత్త్యర్థమ్ ఆహ-

మూ. సర్వతఃపాణిపాదం తత్సర్వతోఽక్షిశిరోముఖమ్,
సర్వతఃశ్రుతిమల్లోకే సర్వమావృత్య తిష్ఠతి. 13

బాలానందిని

సచ్ఛబ్దేతి:- జ్ఞేయ మైన బ్రహ్మ సచ్ఛబ్దంవల్ల కలిగే జ్ఞానానికి విషయం కాదు గాన(ఉన్నది అని చెప్పడానికి శక్య మైనది కాదు గాన)అది అసలే లేదు అను ఆశంక కలగవచ్చును.ఆ ఆశకంను తొలగించడానికై,సమస్తప్రాణుల ఇంద్రియా లనే ఉపాధుల ద్వారా దాని ఉనికిని ప్రతిపాదిస్తూ చెపుతున్నాడు.(జ్ఞేయ మైన బ్రహ్మ ఇంద్రియగోచరం కాకపోవడంచేత'అసత్'అని చెప్పబడింది.అయితే అది పూర్తిగా లేనిది కాదు;శూన్యం కాదు.దాని సత్త్వాన్ని ఇంద్రియాల ద్వారా తెలుసుకొనడం శక్యం కాకపోయినా సమస్త ప్రాణుల శరీరేంద్రియాదులు దాని ఉపాధులుగా ఉన్నాయి.అవి ప్రత్యక్షంగా కనబడు తున్నాయి.వాటి ద్వారా బ్రహ్మాస్తిత్వాన్ని తెలిసికొనవచ్చును అని సూచించడానికై రాబోయే శ్లోకాలు చెప్పబడుచున్నాయి. అని భావం).

ప్ర.అ. సర్వతః ఇతి:- తత్=ఆ జ్ఞేయం;సర్వతఃపాణిపాదమ్=అన్ని వైపులా హస్తాలు, పాదాలూ కలది.సర్వతోఽక్షిశిరోముఖమ్=అన్ని వైపులా నేత్రాలు శిరస్సులు ముఖాలు గలది. సర్వతఃశ్రుతిమత్=అన్ని వైపులా చెవులు గలది.లోకే=లోకంలో,సర్వమ్ =సమస్తమును, ఆవృత్య=ఆవరించి,తిష్ఠతి=ఉన్నది.

భాష్యమ్

సర్వతఃపాణిపాదమ్ –సర్వతః పాణయః పాదాః చ అస్య ఇతి సర్వతఃపాణిపాదం తత్ జ్ఞేయమ్.సర్వప్రాణికరణోపాధిభిః క్షేత్రజ్ఞాస్తిత్వం విభావ్యతే.క్షేత్రజ్ఞశ్చ క్షేత్రోపాధితః ఉచ్యతే.క్షేత్రం చ పాణిపాదాదిభిః అనేకధా భిన్నమ్.క్షేత్రోపాధిభేదకృతం విశేషజాతం మిథ్యైవ క్షేత్రజ్ఞస్య ఇతి తదపనయనేన జ్ఞేయత్వమ్ ఉక్తం "న సత్తన్నాసదుచ్యతే"ఇతి. ఉపాధికృతం మిథ్యారూపమపి అస్తిత్వాధిగమాయ జ్ఞేయధర్మవత్ పరికల్ప్య ఉచ్యతే "సర్వతఃపాణిపాదమ్"ఇత్యాది.తథాహి సంప్రదాయవిదాం వచనమ్–"అధ్యారోపాప వాదాభ్యాం నిష్ప్రపఞ్చం ప్రపఞ్చ్యతే"ఇతి.సర్వత్ర సర్వదేహావయవత్వేన గమ్యమానాః పాణిపాదాదయః జ్ఞేయశక్తిసద్భావనిమిత్తస్వకార్యాః ఇతి జ్ఞేయసద్భావే లిఙ్గాని,జ్ఞేయస్య ఇతి ఉపచారతః ఉచ్యన్తే.తథా వ్యాఖ్యేయమన్యత్.సర్వతఃపాణిపాదం తత్ జ్ఞేయం;సర్వతః అక్షిశిరోముఖం సర్వతః అక్షీణి శిరాంసి ముఖాని చ యస్య తత్ సర్వతోక్షిశిరోముఖమ్. సర్వతః శ్రుతిమత్ శ్రుతిః శ్రవణేన్ద్రియం తత్ యస్య తత్ శ్రుతిమత్.లోకే ప్రాణినికాయే సర్వమ్ ఆవృత్య సంవ్యాప్య తిష్ఠతి స్థితిం లభతే. 13

బాలానందిని

సర్వత ఇతి:–అన్ని వైపులందు హస్తాలు పాదాలు దేనికో అది సర్వతఃపాణిపాదం. ఆ జ్ఞేయం అన్ని వైపులా చేతులూ కాళ్లూ కలది.సమస్తప్రాణుల ఇంద్రియా లనే ఉపాధుల

చేత క్షేత్రజ్ఞుని అస్తిత్వం తెలియబడుతుంది. (ఆత్మ సర్వగతం. అట్టి ఆత్మ ప్రత్యక్షంగా ఇంద్రియాదులకు గోచరం కాదు. కాని దానికి సమస్తప్రాణులు హస్తపాదాద్యవయవాలు, నేత్రాదీంద్రియాదులు ఆకాశానికి ఘటాదులు ఉపాధులుగా ఉన్నట్లు, ఉపాధులుగా ఉన్నాయి. ఈ అవయవేంద్రియాదుల వ్యాపారం ఒక చేతనుడు లేకుండా జరగదు గాన వీటిని పట్టి చేతనుడైన క్షేత్రజ్ఞు డొక డున్నాడని ఊహించబడుచున్నది అని అర్థం). క్షేత్రం ఉపాధిగా ఉండడంచేత(ఆత్మ)క్షేత్రజ్ఞు డని చెప్పబడుచున్నది. క్షేత్ర మైతే హస్తపాదాదులతో అనేక విధాలుగా వేరు వేరు రూపాలలో ఉన్నది. క్షేత్రరూప మైన ఉపాధుల భేదంచేత ఏర్పడిన విశేషాల సముదాయం అంతా క్షేత్రజ్ఞునికి ఆరోపించబడుతున్నాయి)వాటిని దూరం చేసి "న సత్తన్నాసదుచ్యతే"అని ఆత్మకు జ్ఞేయత్వం(ఆత్మజ్ఞేయ మని)చెప్పబడుచున్నది. క్షేత్రజ్ఞు దున్నాడు అని తెలియడంకోసం ఉపాధులచేత ఏర్పడినదైనా మిథ్యారూపాన్ని జ్ఞేయుడైన క్షేత్రజ్ఞుని ధర్మమునుగా కల్పించి "సర్వతఃపాణిపాదమ్"ఇత్యాదికం చెప్పబడుచున్నది. అందువల్లనే సంప్రదాయవేత్తలు"అధ్యారోపాపవాదాభ్యాం నిష్ప్రపఞ్చం ప్రపఞ్చ్యతే"అని చెప్పి ఉన్నారు. అంతటా, సమస్తదేహాల అవయవాలుగా కనబడుతున్న ప్రాణిపాదాదులు జ్ఞేయ మైన బ్రహ్మయొక్క శక్తి ఉండడమే నిమిత్తంగా గల తమ కార్యములు కలవి(అనగా అన్ని దేహాలలోను వాటి అవయవాలుగా కనబడుతూన్న హస్తపాదాదులు తమ తమ పనులు చేస్తున్నా యంటే అందుకు నిమిత్తం(జ్ఞేయమైన)బ్రహ్మయొక్క శక్తి ప్రేరకంగా ఉండడమే). అందుచేత ఇవి(హస్తపాదాదులు)బ్రహ్మ ఉన్నది అని చెప్పడానికి లింగాలు, అంతేనే కాని ఇవి జ్ఞేయానికి సంబంధించినవి కావు. అయినా కూడ ఉపచారంచేత (ఆరోపణచేత)జ్ఞేయానికి సంబంధించినవిగా చెప్పబడుచున్నాయి. (ఒక బండి నడచివెళ్లి పోతూన్నట్లు కనబడిన దనగా దానిని పట్టి ఒక తోలేవాడు, లాగే ఎద్దులు ఉన్నా యని ఊహిస్తాం. అంతేనే కాని ఆ బండి తోలేవానికి ఎడ్లకు సంబంధించినది కాదు. అయినా వాటికి సబంధం ఉన్నట్లు ఆరోపిస్తాం. అట్లే ఇది కూడ). మిగిలినవి కూడ (సర్వతోఽక్షిశిరోముఖమ్ ఇత్యాదులు కూడ)ఇట్లే వ్యాఖ్యానించాలి. ఆ జ్ఞేయం సర్వతఃపాణిపాదం. సర్వతోఽక్షిశిరోముఖం-అనగా అన్ని వైపులా నేత్రాలు శిరస్సులు ముఖాలు కలది. అన్ని వైపులా చెవులు గలది. లోకంలో, ప్రాణిసముదాయంలో అంతనూ వ్యాపించి ఉన్నది.

వి. బ్రహ్మ అద్వితీయము. నిర్గుణము, నిర్విశేషము, నిష్ప్రపంచము అనగా ప్రపంచంతో సంబంధం లేనిది. అట్టి బ్రహ్మను గూర్చి చెప్పడం శక్యం కాదు. అందుచేత ఈ బ్రహ్మయే జగత్తును సృష్టించిన దనీ, దానితో సంబంధం కల దనీ ముందుగా ఆరోపించి, లేని ప్రపంచస్రష్టృత్వాదికం ఉన్న దని, ప్రపంచం ఉన్న దనీ చెప్పి తరువాత అదంతా లేదు అని వివరించబడుతుంది అని"అధ్యారోపాపవాదాభ్యామ్"ఇత్యాదివాక్యానికి అర్థం. అధ్యారోపం అనగా లేనిదానిని, ఉన్నట్లు కనబడుతున్న దానిని, మిథ్యయైనదానిని బ్రహ్మయందు ఉన్నట్లు

చెప్పడం. చివరికి(నిజానికి)అది లేదు అని చెప్పడం అపవాదం. ఈ ప్రకరణంలో నిర్విశేషబ్రహ్మ జ్ఞేయంగా ప్రతిపాదించబడుతున్నది. దానిని గూర్చి తెలుసు కొనడానికై దానికి సంబంధించిన హస్తపాదాదివిశిష్టశరీరరూపా లైన ఉపాధులు చెప్ప బడుచున్నాయి అని భాష్యాశయం.

భా. అ. ప్ర. పరిశుద్ధమైన ఆ ఆత్మస్వరూపం అన్ని వైపులా ఉన్న హస్తాలు పాదాలు మొదలైన వాటి కార్యములయందు సమర్థ మైనది. "అపాణిపాదో జవనో గ్రహీతా"అను శ్రుతిని అనుసరించి పరమాత్మ అలాంటివాడు గాన ముక్తు డైన జీవుడు ఆ పరమాత్మతో సామ్యం పొందంచేత అలాంటివాడే. లోకంలో ఏ వస్తుసముదాయం ఉన్నదో దాని నంతనీ వ్యాపించి ఉంటుంది. దేశాదిపరిచ్ఛేదాలు లేని దవడంచేత సర్వగత మైనది అని అర్థం"అని శ్రీరామానుజాచార్యుల వ్యాఖ్య అసంగతం. కర్త కాని ఆత్మ పాణిపాదాదికార్యాలను చేయించ డం కుదరదు. "నిష్కలం నిష్క్రియం శాన్తమ్"ఇత్యాదిశ్రుతుల ననుసరించి ఆత్మకు గ్రహణం మొదలైన క్రియలు ఉండవు. "అపాణిపాదః"ఇత్యాదిశ్రుతి యైతే ఉపాధు లైన సమస్తేంద్రి యాల గుణాలైన జవనత్వం మొదలైన శక్తి గలది అని చెప్పడానికే ఉద్దిష్ట మైనది. సమస్తేం ద్రియాలకు శక్తి లభించేది ఈశ్వరశక్తినుండియే కదా? అణువైన జీవునకు బృహత్ప్రమాణం గల పరమాత్మతో సామ్యం ఉంటుం దని చెప్పడం పండితులకు హాస్యాస్పదంగానే ఉంటుంది. ఇట్లే పరిచ్ఛిన్నమైన అణువు(అణుపరిమాణం గల జీవుడు)దేశాదిపరిచ్ఛేదాలు లేనివా డనీ,అందుచేత సర్వగతు డనీ చెప్పడం సుతరాం అయుక్తం.

ముక్తిదశలో కూడ జీవుడు అణుస్వరూపుడే;అలా కాక అణుత్వం పోయి బృహత్త్వం వచ్చిన పక్షంలో స్వరూపానికి వికారం కలుగుతుంది గాన జీవాత్మ నిర్వికారం అని చెప్పే శ్రుతికి విరోధం కలుగుతుంది. అయితే ధర్మభూతజ్ఞానం ద్వారా జీవుడు సర్వవ్యాపి అని వేదాంతదేశికులు చెప్పినది కూడ అసంగతమే. మూలంలో లేని ధర్మభూతజ్ఞానం ద్వారా అనే దానిని కల్పించడానికి తగిన ప్రమాణం ఏమీ లేదు. ఏ ధర్మాలూ లేని జ్ఞానమే స్వరూపంగా గల జీవునిలో ధర్మభూతజ్ఞానం అంటూ ఒకటి ఉంటుం దని అంగీకరించడం కుదర దని వెనుకనే చెప్పి ఉన్నాం. పరమపదంలో ఉన్న ముక్తునికి ధర్మభూతజ్ఞానం ద్వారా కూడ సర్వవ్యాపిత్వం కుదరదు;ఎందువల్ల ననగా సమస్తవస్తు సముదాయం బ్రహ్మాండాతర్గత మైఉంది. పరమపదం బ్రహ్మాండానికి బైట ఉంది. ఇంటి బైట నున్నవాడు కంటితో ఇంట్లో ఉన్న ఘటాదుల్ని చూడ కలిగినట్లు పరమపదంలో ఉన్నవాడు కూడ బ్రహ్మాండంలో ఉన్న వస్తువులను చూడకలుగుతాడు అనడం యుక్తం కాదు. అప్పుడు సంసారదుఃఖంలో బాధపడుతూన్న అనేకప్రాణులను చూడడంచేత ముక్తునికి కూడ దుఃఖం కలిగే అవకాశం ఏర్పడుతుంది. అట్లే-జీవస్వరూపమైన జ్ఞానం నిర్వికారమే అయినా ధర్మజ్ఞానం సుఖదుః ఖాదులైన అనేకవిషయాలతో సంబంధించి ఉండడంవల్ల అది సవికారమే గాన ఆ

ధర్మభూతజ్ఞానాన్ని పట్టి జీవుడు కూడ సవికారుడు కావలసి ఉంటుంది. మా మతంలో నైతే నువ్వు చెప్పిన జీవధర్మభూతజ్ఞానం అంతఃకరణధర్మం గాన అంతఃకరణధర్మాన్ని పట్టి జీవునకు సవికారత్వం ఉండదు. అదే విధంగా మా మతం ప్రకారం ఈశ్వరున కున్న సర్వవిషయకజ్ఞానము కూడ మాయాధర్మమే గాన ఈశ్వరునకు కూడ ధర్మాన్ని పట్టి సవికారత్వం లేదు. మరొక విషయ మేమనగా- ధర్మమైన ఈ వృత్తిజ్ఞానం క్షణికం మాత్రమే క్షణాంతరంలో ఉండదు. ఈ క్షణంలో ఉన్న సుఖాదిపదార్థం క్షణాంతరంలో ఉండదు కదా? అలాంటప్పుడు క్షణాంతరంలో ఉన్న సుఖాదిజ్ఞానం ఈ క్షణంలో ఉన్న సుఖాదులను ఎలా వ్యాపిస్తుంది? అందుచేత అణుపరిమాణం గల జీవునకు ఏ విధంగానూ కూడ సర్వగతత్వం కుదరదు గాన సర్వగతం అవడంచేత దేశాదులచేత పరిచ్ఛిన్నం కాని పరిపూర్ణబ్రహ్మయే జీవు డని అంగీకరించాలి. 13

భాష్యమ్

ఉపాధిభూతపాణిపాదాదీన్ద్రియాధ్యారోపణాత్ జ్ఞేయస్య తద్వత్తాశఙ్కా మా భూత్ ఇత్యేవమర్థః శ్లోకారమ్భః -

మూ. సర్వేన్ద్రియగుణాభాసం సర్వేన్ద్రియవివర్జితమ్,
అసక్తం సర్వభృచ్చైవ నిర్గుణం గుణభోక్తృ చ. 14

బాలానందిని

ఉపాధీతి:- ఉపాధులైన పాణిపాదు లైన ఇంద్రియాలను ఆరోపించడంవలన జ్ఞేయానికి వాస్తవంగానే ఆ పాణిపాదాదు లున్నా యనే ఆశంక కలగకుండా ఉండడం కోసం శ్లోకం ప్రారంభించబడుచున్నది-

ప్ర. అ. సర్వేతి:- సర్వేన్ద్రియగుణాభాసమ్=(ఆ జ్ఞేయము) సమస్తమైన ఇంద్రియాల గుణాలచేత(పనులచేత)పనులు చేస్తున్నట్లు కనబడుచున్నది. సర్వేన్ద్రియవివర్జితమ్= సమస్తమైన ఇంద్రియాలతో శూన్యము. అసక్తమ్=దేనితోనూ సంబంధం లేనిది; సర్వభృత్ చ ఏవ= సమస్తమును భరించేది. నిర్గుణమ్=గుణాలు లేనిది; గుణభోక్తృ చ=గుణాలను అనుభవించేది.

భాష్యమ్

సర్వేన్ద్రియగుణాభాసమ్-సర్వాణి చ తాని ఇన్ద్రియాణి శ్రోత్రాదీని, బుద్ధీన్ద్రియ కర్మేన్ద్రియాఖ్యాని, అన్తఃకరణే చ బుద్ధిమనసీ జ్ఞేయోపాధిత్వస్య తుల్యత్వాత్ సర్వేన్ద్రియ గ్రహణేన గృహ్యేతే. అపి చ అన్తఃకరణోపాధిద్వారేణైవ శ్రోత్రాదీనామపి ఉపాధిత్వమ్.

ఇత్యతః అన్తఃకరణబహిష్కరణోపాధిభూతైః సర్వేన్ద్రియగుణైః అధ్యవసాయసంకల్పశ్రవణ వచనాదిభిః అవభాసతే ఇతి సర్వేన్ద్రియగుణాభాసమ్;సర్వేన్ద్రియవ్యాపారైః వ్యాపృతమివ తద్ జ్ఞేయమిత్యర్థః.**"ధ్యాయతీవ లేలాయతీవ"**(బృ.ఉ.4.3.7)ఇతి శ్రుతేః.కస్మాత్ పునః కారణాత్ న వ్యాపృతమేవ ఇతి గృహ్యతే ఇత్యతః ఆహ–సర్వేన్ద్రియవివర్జితం సర్వకరణ రహితమ్ ఇత్యర్థః.అతః న కరణవ్యాపారైః వ్యాపృతం తద్ జ్ఞేయమ్.యస్తు అయం మన్త్రః **"అపాణిపాదో జవనో గ్రహీతా పశ్యత్యచక్షుః స శృణోత్యకర్ణః"**(శ్వే.ఉ.3.19) ఇత్యాదిః సః సర్వేన్ద్రియోపాధిగుణానుగుణ్యభజనశక్తిమత్ తత్ జ్ఞేయమ్ ఇత్యేవం ప్రదర్శనార్థః.**"అన్ధో మణిమవిన్దత్"**(తై.ఆ.1.1)–ఇత్యాదిమన్త్రార్థవత్ తస్య మన్త్రస్య అర్థః. యస్మాత్ సర్వకరణవర్జితం తత్ జ్ఞేయం తస్మాత్ అసక్తం సర్వసంశ్లేషవర్జితమ్. యద్యపి ఏవం తథాపి సర్వభృత్ చ ఏవ.సదాస్పదం హి సర్వం,సర్వత్ర సద్బుద్ధ్యనుగమాత్.న హి మృగతృష్ణికాదయః అపి నిరాస్పదా భవన్తి.అతః సర్వభృత్ సర్వం బిభర్తి ఇతి.స్యాత్ ఇదం చ అన్యత్ జ్ఞేయస్య సత్త్వాధిగమద్వారమ్– నిర్గుణం– సత్త్వరజస్తమాంసి గుణాః తైః వర్జితం తత్ జ్ఞేయం,తథాపి గుణభోక్తృ చ–గుణానాం సత్త్వరజస్తమసాం శబ్దాది ద్వారేణ సుఖదుఃఖమోహాకారపరిణతానాం, భోక్తృ చ ఉపలబ్ధృ చ తత్ జ్ఞేయమ్– ఇత్యర్థః. 14

బాలానందిని

సర్వేన్ద్రియేతి:–బుద్ధీంద్రియములు కర్మేంద్రియములు అని చెప్పబడే సమస్త శ్రోత్రాదీంద్రియాలు, అంతఃకరణాలైన (అంతరింద్రియాలైన)బుద్ధిమనస్సులూ కూడ ఇంద్రియశబ్దంచేత గ్రహింపబడతాయి.జ్ఞేయానికి ఉపాధులుగా ఉండడంలో ఇవన్నీ సమానములే కదా?మరొక విషయ మేమనగా శ్రోత్రాదీంద్రియాలు అంతఃకరణరూప మైన ఉపాధి ద్వారా మాత్రమే జ్ఞేయానికి ఉపాధు లవుతున్నాయి.(ప్రధానమైన ఉపాధి అంతః కరణం,దాని ద్వారా శ్రోత్రాదులు ఉపాధి అని అర్థం).అందువల్ల అంతఃకరణ – బహిష్కరణముల ఉపాధులైన అధ్యవసాయ(నిశ్చయ)–సంకల్ప–శ్రవణ–వచనాదులైన సర్వేంద్రియగుణాలతో భాసిస్తూన్నది.ఆ జ్ఞేయము సమస్తము లైన ఇంద్రియాల వ్యాపారాల చేత వ్యాపారం కలది వలె కనబడుతున్నది.ఆ వ్యాపారా లన్నీ ఇంద్రియాలకే సంబంధించిన వైనా జ్ఞేయానికి వాటితో సంబంధం ఉన్నట్లు కనబడుచున్నది అని అర్థం). ఆత్మకు అంతః కరణం ఉపాధి యైతే దానికి బాహ్యేంద్రియాలు ఉపాధులు.అధ్యవసాయాదులు వాటికి ఉపాధులు.ఇవన్నీ ఆత్మకు సంబంధించి నట్లు కనబడుచున్నాయి.అందుచేత "అంతః కరణబహిష్కరణోపాధిభూతైః సర్వేన్ద్రియగుణైః"అని భాష్యంలో చెప్పబడింది).(బుద్ధ్యాదులు

ధ్యానిస్తూండగా ఆత్మ ధ్యానిస్తూన్నట్లు కనబడుచున్నది,అవి కదలు తూండగా ఆత్మ కదలుతూన్నట్లు కనబడుతున్నది అను అర్థంగల)"ధ్యాయతీవ లేలాయతీవ"అను శ్రుతివాక్యం ఈ అర్థాన్నే చెవుతూన్నది.ఇది నిజంగానే ఎందుచేత వ్యాపారం చేస్తున్నట్లు గ్రహించబడడంలేదు అను ప్రశ్నకు సమాధానం చెపుతున్నాడు-సర్వేన్ద్రియ వివర్జితమ్. సమస్తఇంద్రియములతో శూన్య మైనది(ఏ ఇంద్రియాలూ లేనిది)అని అర్థం. అందువల్ల ఆ జ్ఞేయం కరణాల (ఇంద్రియాల)వ్యాపారాల ద్వారా వ్యాపృతం(పని చేస్తూన్నది)కాదు. అయితే-"**అపాణిపాదః....అకర్ణ**"(హస్తాలు గాని పాదాలు కాని లేనిది, కాని వేగంగా వెడుతుంది.పట్టుకొంటుంది.కళ్లు లేక పోయినా చూస్తుంది; చెవులు లేకపోయినా వింటుంది) ఇత్యాది మంత్రానికి అర్థం ఏమనగా-ఆ జ్ఞేయమైన బ్రహ్మకు సమస్తము లైన ఇంద్రియ రూపము లైన ఉపాధుల గుణాలకు అనుగుణంగా ఉండ కలిగిన శక్తి ఉన్నది అని చెప్పడం మాత్రమే;అంతే కాని బ్రహ్మకు సాక్షాత్తు జవనత్వం (వేగంగా వెళ్లడం) మొదలైన కర్మ లున్నా యని అర్థం కాదు.ఈ మంత్రానికి "**అన్ధో మణిమవిన్దత్**" (గ్రుడ్డి వాడు మణిని చూచాడు)ఇత్యాదిమంత్రానికి ఏ విధంగా అర్థం చెప్పబడినదో అట్లే చెప్పాలి.

వి."**అన్ధోమణిమవిన్దత్,తమనఙ్గులిరావయత్,అగ్రీవః ప్రత్యముఞ్చత్,తమజిహ్వో అసశ్చత**"(గ్రుడ్డివాడు మణిని చూచాడు.దానిని వ్రేళ్లు లేనివాడు ఉంగరంలో ధరించాడు. కంఠం లేనివాడు హారంలాగ ధరించాడు,నాలుక లేనివాడు వర్ణించాడు)ఇత్యాదిమంత్రం ప్రత్యక్షవిరుద్ధం అవడంచేత దానిని అర్థవాదగా గ్రహించి మరొక విధంగా దానికి-దేనినో స్తుతించడంకోసమో నిందించడంకోసమో ఈ వాక్యం చెప్పబడిన దని గ్రహించి-అర్థం చెప్పుకోవాలి.ఇవి అర్థవాదలు.పై శ్రుతివాక్యాన్ని కూడ ఈ విధంగానే సమన్వయం చేసు కోవా లని అర్థం.

యస్మాదితి:- జ్ఞేయము ఏ కారణంవల్ల సమస్తేంద్రియశూన్యమో అందువల్ల ఏ విధమైన సంశ్లేషములు,సంబంధాలూ,లేనిది. అయినా కూడ అన్నింటినీ భరించేది.ప్రతీ వస్తువు సదాస్పదమే కదా?అనగా అన్నింటిలోను 'ఉన్నది''ఉన్నది'అను బుద్ధి అనుగతమై ఉండడంచేత ప్రతీవస్తువు సదాస్పదమే.ఎండమావులు మొదలైనవి కూడ ఆస్పదం(ఆధారం) లేకుండా ఉండవు.అందుచేత జ్ఞేయమైన ఈ బ్రహ్మ సమస్తమును భరిస్తూన్నది.అన్ని ఆరోపాలకీ ఆధారంగా ఉన్నది. (ఈ విషయం "నాసతో విద్యతే భావః"(2.16)ఇత్యాది శ్లోకభాష్యంలో వివరింపబడినది). ఇది కూడ(ఈ చెప్పబోయేది కూడ)జ్ఞేయం ఉన్న దని తెలుసుకొనడానికి ద్వారం అవుతుంది. ఇది నిర్గుణము.సత్త్వరజస్తమస్సు లనే గుణాలు లేనిది.అయినా కూడ గుణభోక్తృ.శబ్దాదుల ద్వారా సుఖ-దుఃఖ-మోహరూపాలలో పరిణామం చెందిన సత్త్వరజస్తమోగుణాలను గ్రహించేది అని అర్థం.

వి. సత్త్వగుణం సుఖహేతువు.రజోగుణం దుఃఖహేతువు.తమోగుణం మోహహేతువు. ఈ సత్త్వరజస్తమోగుణాలు శబ్దాదిరూపాలలో పరిణమించి తద్ద్వారా పురుషునికి సుఖదుఃఖమోహాలను కలిగిస్తాయి గాన అవే సుఖదుఃఖమోహరూపంలో పరిణామం చెందుతున్నా యని చెప్పబడింది.ఇది సాంఖ్యమతం.అయితే సుఖదుఃఖమోహాదులు పురుషునికి(జీవునికి) సంబంధించినవి కావు,జీవునకు ఉపాధిగా ఉన్న అంతఃకరణానికే అని అద్వైతుల అభిప్రాయం.

భా.అ.ప్ర. ఇక్కడ శ్రీరామానుజాచార్యులు ఈ విధంగా వ్యాఖ్యానించారు-"సర్వేన్ద్రియగుణాభాసమ్-సర్వేన్ద్రియవృత్తులచేత కూడ విషయాలను గ్రహించడానికి సమర్థమైనది. స్వభావంచేత నైతే సమస్తేంద్రియశూన్యం.ఇంద్రియవృత్తులు లేకుండానే అన్నింటినీ తెలుసుకొనగలదు.అసక్తమ్=స్వభావంచేత (సహజంగా)దేవాదిదేహాలతో సంబంధం లేనిది.సర్వభృత్=సమస్తదేహాలను భరించడానికి సమర్థమైంది.నిర్గుణమ్=సహజంగా సత్త్వాదిగుణాలు లేనిది;సత్త్వాదిగుణాలను అనుభవించడానికి సమర్థ మైనది కూడ". ఈ వ్యాఖ్య నిఃసారము. ఎందువల్ల ననగా మూలంలో ఉన్న పదాలకు ఈ అర్థాలు లేవు.లాక్షణికార్థములను గ్రహించడం అగతికగతి.ఆత్మ స్వభావసిద్ధంగా సర్వేంద్రియవివర్జితము,అసక్తము, నిర్గుణము అని చెప్పినప్పుడు సర్వేంద్రియగుణాభాసత్వ-సర్వభృత్త్వ-గుణభోక్తృత్వాలు ఆత్మకు సహజంగా లేవని తెలుస్తూన్నది. మళ్లీ చెప్పడం అనవసరం. ఈ విధంగా ఇది మూలవిరుద్ధంగా ఉంది. (భా.అ.ప్ర.పే.96) 14

భాష్యమ్

కిం చ-

మూ. బహిరన్తశ్చ భూతానామచరం చరమేవ చ,
సూక్ష్మత్వాత్తదవిజ్ఞేయం దూరస్థం చాన్తికే చ తత్. 15

బాలానందిని

కిం చేతి: మరియు -

ప్ర.అ. బహిరితి:- భూతామ్=భూతములయొక్క బహిః=వెలుపల,అన్తః చ=లోపల కూడ ఉన్నది.అచరమ్=కదలినిది;చరమ్ ఏవ చ=చరించేది కూడ.తత్=అది,సూక్ష్మత్వాత్ =సూక్ష్మం అవడంవలన,అవిజ్ఞేయమ్=తెలియ శక్యం కానిది.తత్=అది,దూరస్థమ్= దూరమునం దున్నది;అన్తికే చ=సమీపమునందు కూడ ఉన్నది.

భాష్యమ్

బహిః–త్వక్పర్యన్తం దేహమ్ ఆత్మత్వేన అవిద్యాకల్పితమ్ అపేక్ష్య తమేవ అవధిం కృత్వా బహిః ఉచ్యతే. తథా ప్రత్యగాత్మానమ్ అపేక్ష్య దేహమేవ అవధిం కృత్వా అన్తః ఉచ్యతే. బహిః అన్తః చ ఇత్యుక్తే మధ్యే అభావే ప్రాప్తే ఇదమ్ ఉచ్యతే–అచరం చరమేవ చ యత్ చరాచరం,దేహాభాసమపి తదేవ జ్ఞేయం యథా రజ్జుః సర్పా భాసః. యది అచరం చరమేవ చ వ్యవహారవిషయం సర్వం జ్ఞేయం కిమర్థమ్ ఇదమ్ ఇతి సర్వైః న విజ్ఞేయమ్ ఇతి? ఉచ్యతే–సత్యం;సర్వాభాసం తత్;తథాపి వ్యోమవత్ సూక్ష్మమ్; అతః సూక్ష్మత్వాత్ స్వేన రూపేణ తత్ జ్ఞేయమపి అవిజ్ఞేయమ్ అవిదుషామ్. విదుషాం తు "ఆత్మైవ ఇదం సర్వమ్"(బృ.ఉ.2.4.6)"బ్రహ్మైవేదం సర్వమ్" (బృ.ఉ.2.5.1) ఇత్యాదిప్రమాణతః నిత్యం విజ్ఞాతమ్. అవిజ్ఞాతతయా దూరస్థం వర్షస హస్రకోట్యాపి అవిదుషామ్ అప్రాప్యత్వాత్. అన్తికే చ తత్,ఆత్మత్వాత్ విదుషామ్. 15

బాలానందిని

బహిరితి:- బహిః–చర్మవరకు ఉన్న దేహమే ఆత్మ అని అవిద్యచేత కల్పించబడినది(భావించబడుచున్నది). ఆ దేహాన్ని అవధిగా చేసి (దానికి)(జ్ఞేయమైన బ్రహ్మ) వెలుపల ఉన్న దని చెప్పబడుచున్నది. అట్లే దేహాన్నే అవధిగా చేసి ప్రత్యగాత్మను అపేక్షించి(ప్రత్యగాత్మ దృష్ట్యా) లోపల (దేహంలోపల)ఉన్న దని చెప్పబడుచున్నది(జ్ఞేయమైన బ్రహ్మ సర్వగతం. అయితే–అవిద్యచేత దేహమే ఆత్మ అని అజ్ఞులచేత భావించబడుచున్నది. అందుచేత అది దేహానికి బైట ఉన్న దని చెప్పబడుచున్నది. దేహంలో ఉన్న ప్రత్యగాత్మ(జీవుడు)బ్రహ్మయే గాన దేహంలోపల ఉన్న దని చెప్పబడుచున్నది). జ్ఞేయం బైట ఉన్నది,లోపల ఉన్నది అని అంటే మధ్యలో అది లేదు(మధ్యలో నున్న దేహం బ్రహ్మ కాదు)అని చెప్పినట్లు అవుతుంది. ఆ ఆశంక తొలగించడానికై ఇది చెప్పబడుచున్నది. అచరము, చరమూ కూడ, చరాచరరూపమైన దేహాభాసం కూడ (దేహం వలె కనబడే చరాచరజగత్తు కూడ)ఆ జ్ఞేయమే. సర్పాభాసం రజ్జు వెట్లో అట్లే.(రజ్జువుమీద కనబడిన సర్పం రజ్జువే అయినట్లు బ్రహ్మయందు ఆరోపించబడిన చరాచరజగత్తు కూడ బ్రహ్మయే అని అర్థం). (ప్రశ్న) వ్యవహారవిషయమైన సమస్త మైన చరము అచరమూ కూడ జ్ఞేయమే అయితే "జ్ఞేయమైన ఆ బ్రహ్మ ఇది" అని అందరిచేత ఇది ఎందువల్ల గ్రహించబడడం లేదు? (సమాధానం) చెప్పబడుచున్నది. అది సకలచరాచరరూపంలో భాసిస్తూన్నది అనే మాట నిజమే అయినా కూడ అది ఆకాశం వలె సూక్ష్మ మైనది. అందుచేత అది స్వస్వరూపంచేత తెలియదగినదే అయినా (దాని స్వరూపం తెలుసుకొనడానికి అవకాశం ఉన్నా) అది అవిద్వాంసులకు తెలియదానికి శక్యం

కాదు. అయితే ఆత్మైవేదం సర్వమ్" (ఇదంతా ఆత్మయే), "బ్రహ్మైవేదం సర్వమ్" (ఇదంతా బ్రహ్మయే) ఇత్యాదిప్రమాణాలచేత విద్వాంసులకు ఎల్లప్పుడు తెలిసినదే. కొన్ని వేలకోట్ల సంవత్సరాలకు కూడ ఇది అవిద్వాంసులకు తెలియక పోవడంచేత దూరంగానే ఉంటుంది. విద్వాంసులకు ఇది తమ ఆత్మయే గాన, క్రొత్తగా పొందదగినది కాదు గాన, సమీపమునందే ఉంటుంది.

భా.అ.ప్ర. పృథివ్యాదిభూతాలను విడచి శరీరం లేనిదై బైట ఉంటుంది. వాటి లోపల కూడ ఉంటుంది. స్వతఃసిద్ధంగా అది అచరం. దేహం ధరించినప్పుడు చరం. ఈ విధంగా సర్వశక్తియుక్తమూ సర్వజ్ఞమూ అయిన ఆ అత్మతత్త్వం ఈ క్షేత్రంలో ఉన్నా కూడ అతిసూక్ష్మ మవడంచేత సంసారులచేత తెలియశక్యం కానిది" అని శ్రీ రామానుజాచార్యుల వ్యాఖ్య అయుక్తం. ముక్తిదశలో ఉన్న పరిశుద్ధాత్మస్వరూపానికి శరీరం ఉంటుందా, ఉండదా, లేక అది ఉభయవిధంగానూ ఉంటుందా? మొదటి పక్షంలో శరీరం బైట ఉండడం కుదరదు. రెండవ పక్షంలో శరీరంలో ఉండడం కుదరదు. సశరీరత్వ – అశరీరత్వాలు పరస్పరవిరుద్ధాలు గాన ఉభయవిధత్వం అనే మూడవ పక్షం కుదరదు. ఒకప్పుడు సశరీరంగా ఉంటుంది ఒకప్పుడు అశరీరంగా ఉంటుంది అనడం కూడ అయుక్తం. పరిశుద్ధాత్మస్వరూపానికి అప్పుడప్పుడు సశరీరత్వం ఉంటుంది అని చెప్పడం అయుక్తం కదా? ఎందువల్ల అనగా ఆత్మకున్న సశరీరత్వం ఉపాధికృతమే; అశరీరత్వమే దానికి సహజ మైనది. ఇట్లే పరిశుద్ధమైన పరిశుద్ధాత్మ స్వరూపం భూతాలలోపల ఎలా ఉంటుంది? భూతాలలోపల ఉన్నట్లయితే అది సశరీరమే అవుతుంది. పరిశుద్ధాత్మస్వరూపాన్ని గూర్చి చెప్పే ప్రకరణంలో "అది దేహం ధరించినప్పుడు చరం కూడ" అని చెప్పడం ఎట్లు కుదురుతుంది? దేహం ధరించినట్లయితే అది అపరిశుద్ధమే" అవుతుంది కదా ?

ఆత్మ స్వభావతః అచరం అని చెప్పడానికి కారణం అది పూర్ణంగా (అంతటా నిండి) ఉండడమా లేక ఇంద్రియాలు లేకపోవడమా? అణుప్రమాణమైన ఆత్మ పూర్ణం కాజాలదు గాన మొదటి పక్షం కుదరదు. అది పూర్ణ మైతే దానిని దేహం పరిచ్ఛిన్నం చేయజాలదు కూడ. **"అపాణిపాదో జవనో గ్రహీతా"** అను శ్రుతి కరణాలు లేకపోయినా ఆత్మకు గమనాదిక్రియ లున్నట్లు చెప్పుచున్నది గాన రెండవ పక్షం కుదరదు. ఈ విధంగా అచరత్వానికి తగిన హేతు వేదీ లేకపోవడంచేత ఆత్మకు చరత్వమే స్వాభావిక మని ప్రాప్తిస్తుంది. ఇది శ్రుతిస్మృత్యాదివిరుద్ధం. జీవుడు కించిద్జ్ఞుడు అల్పశక్తి, ఈశ్వరుడు సర్వజ్ఞుడు సర్వశక్తి అని చెప్పే మీరు పరిశుద్ధాత్మస్వరూపం సర్వజ్ఞము సర్వశక్తియుక్తము అని చెప్పడం విరుద్ధం. జీవుడు కూడ ఈ విధంగా సర్వజ్ఞుడూ సర్వశక్తుడూ అయితే జీవునికంటె అన్యుడైన ఈశ్వరుణ్ణి కల్పించడం ఎందుకు? జగత్సృష్ట్యాదులకొరకు కదా ఈశ్వరుణ్ణి అంగీకరిస్తూన్నది? అది సర్వజ్ఞుడు సర్వశక్తిమంతుడూ అయిన పురుషుడే

చేయకలుగుతాడు కదా? "యః సర్వజ్ఞః సర్వవిత్", "పరాస్య శక్తిర్వివిధైవ శ్రూయతే" ఇత్యాదిశ్రుతులు సర్వజ్ఞత్వసర్వశక్తత్వాదులు ఈశ్వరునికి మాత్రమే ఉంటాయని చెపుతూండగా జీవునకు సర్వజ్ఞత్వాదు లుంటా యని చెప్పడం శ్రుతివిరుద్ధం. జీవుని కున్న కించిద్‌జ్ఞత్వాదికం సర్వప్రసిద్ధం, దానిని నిరాకరించడం అయుక్తం. "అన్తర్బహిశ్చ భూతానామ్" అను మూలానికి ఒకప్పుడు బైట ఒకప్పుడు లోపల అని అర్థం చెప్పడం అయుక్తం. కదాచిత్ (ఒకప్పుడు) అను పదాన్ని అధ్యాహారం తెచ్చుకొనడంలో ప్రమాణం లేదు. "భూతానాం బహిః" అనేదానికి పృథివ్యాదిభూతాలను విడచి అని అర్థం చెప్పడం కూడ అయుక్తం. సర్వగతమైన ఆకాశాన్ని విడిచిపెట్టడం అసంభవం కదా? నీవు అంగీకరించే వైకుంఠంలో అవకాశం లేదనడం కుదరదు కదా? అవకాశమే కదా ఆకాశం అంటే? (బ్రా.ఆ.ప్ర. పే 99.100) 15

భాష్యమ్

కిం చ-

మూ. అవిభక్తం చ భూతేషు విభక్తమివ చ స్థితమ్,
భూతభర్తృ చ తద్ జ్ఞేయం గ్రసిష్ణు ప్రభవిష్ణు చ. 16

బాలానందిని

కిం చేతి:- మరియు-

ప్ర.అ. **అవిభక్తమితి:-** జ్ఞేయమ్=జ్ఞేయమైన,తత్=ఆ బ్రహ్మ,అవిభక్తమ్=విభజించ బడనిది.భూతేషు=ప్రాణిశరీరాలలో,విభక్తమివ=విభజించబడినది వలె,స్థితం చ=ఉన్నది కూడ.భూతభర్తృ చ=భూతాలను పోషించేది.గ్రసిష్ణు=భూతాలను మ్రింగివేసేది.ప్రభవిష్ణు చ=పుట్టించే స్వభావం కలది కూడ.

భాష్యమ్

అవిభక్తం చ,ప్రతిదేహం వ్యోమవత్ తత్ ఏకమ్,భూతేషు సర్వప్రాణిషు, విభక్తమివ చ స్థితం.దేహేష్వేవ విభావ్యమానత్వాత్.భూతభర్తృచ-భూతాని బిభర్తీతి తత్ జ్ఞేయం భూతభర్తృ చ స్థితికాలే.ప్రలయకాలే గ్రసిష్ణు గ్రసనశీలమ్.ఉత్పత్తికాలే ప్రభవిష్ణు చ ప్రభవనశీలం,యథా రజ్జ్వాదిః సర్పాదేః మిథ్యాకల్పితస్య. 16

బాలానందిని

అవిభక్తమితి:- ఆకాశం వలె ఒక్కటే అయిన ఆ జ్ఞేయం ప్రతీ దేహంలోను విభజింపబడకుండగానే ఉంటుంది.అయినా కూడ ఇది దేహాలలోనే కనబడుతున్నది గాన

సమస్తప్రాణులలోను విభజింపబడి ఉన్నట్లు కనబడుతుంది. స్థితికాలంలో భూతాలను భరించే స్వభావం గలది. ప్రలయకాలంలో భూతాలను మ్రింగివేస్తుంది. సృష్టిసమయంలో, మిథ్యాకల్పిత మైన సర్పాదికాన్ని రజ్జ్వాదికం ఏ విధంగా పుట్టిస్తుందో ఆ విధంగా, భూతాలను పుట్టింపచేసే స్వభావం గలది.

భా. అ. ప్ర. "అవిభక్తమ్-కేవలజ్ఞానస్వరూపం అవడంచేత, శుద్ధాత్మస్వరూపం, జాతితః (జాతినిపట్టి) ఒక్కటే. కాని అవిద్వాంసుల దృష్టిలో మాత్రం ఇతడు దేవుడు ఇతడు మనుష్యుడు ఇత్యాదివిధంగా వేరుగా ఉన్నట్లు కనబడుతుంది. భూతభర్తృ-శరీరాన్ని భరిస్తుంది. గ్రసిష్ణు -అన్నాదికం తింటుంది. ప్రభవిష్ణు=మ్రింగిన అన్నం మొదలైనవి రేతోరక్తాదిరూపంలో పరిణమించడానికి హేతువైనది." అను శ్రీరామానుజాచార్యుల వ్యాఖ్య అయుక్త మైనది. అవ్యక్త మైన ఆత్మ వేరు వేరు వ్యక్తులరూపంలో అనేకంగా ఉండడం కుదరదు గాన జాత్యేకత్వం ఎలా కుదురుతుంది. ధర్మశూన్యమైన ఆత్మలో జాత్యేకత్వం అనే ధర్మం ఎలా ఉంటుంది? వేరు వేరు వ్యక్తులుగా అనేకత్వం ఉంటే అది విద్వాంసులకు కూడ విభక్తంగానే కనబడాలి; అలాంటప్పుడు అవిద్వాంసులకే విభక్తం వలె కనబడుతుం దని చెప్పడం ఎట్లు కుదురుతుంది? విద్వాంసులకు దేవత్వం మొదలైన భ్రమ లేకపోయినా "నేను, నువ్వు, అతడు, దేవదత్తుడు" అని ప్రమయే కలుగుతుంది కదా? దేవత్వాదికం స్థూలదేహంయొక్క ధర్మం మాత్రమే అని ఎలా తెలుసుకొంటున్నావో అలాగే సుఖిత్వాదికం సూక్ష్మదేహంయొక్క ధర్మం అనీ, మోహం కారణదేహం యొక్క ధర్మం అనీ తెలుసుకో. ఈ విధంగా శరీరత్రయాన్ని ఆత్మనుండి వేరు చేసిన తరువాత ఆత్మకు భేదాన్ని కల్పించేది ఇక ఏముంది? అది ఏదైనా ఉంటే కదా ఆత్మ వేరు వేరు వ్యక్తులుగా అనేక మైనది అని చెప్పడానికి అవకాశం ఉంటుంది? అందుచేత "నువ్వు", "నేను" ఇత్యాదిభేదబుద్ధి కూడ భ్రమయే కాని ప్రమ కాదు.

"న త్వేవాహం జాతు నాసం న త్వం నేమే జనాధిపాః" అని ఈశ్వరుడే చెప్పి ఉన్నాడు గాన ఇది ప్రమయే అనడం యుక్తం కాదు. లోకదృష్టిని పురస్కరించుకొని అలా చెప్పబడింది. ఆత్మ శరీరాన్ని భరిస్తుం దని చెప్పడం కూడ యుక్తం కాదు. శరీరాన్ని భరించేవి ప్రాణాదులే కాని ఆత్మ కాదు కదా? మ్రింగడం మొదలైనవి కూడ ప్రాణాదుల ధర్మమే కాని ఆత్మధర్మం కాదు. ఆత్మధర్మం అన్నట్లయితే ఆత్మ సవికారం అని చెప్పవలసి వస్తుంది. ఇంద్రియరహిత మైన ఆత్మ అన్నాదికాన్ని మ్రింగజాలదు కదా? ప్రాణులచేత అధిష్ఠించబడిన శరీరమే నోటితో మ్రింగుతుంది. ఆ అన్నాదికం రక్తాదిరూపంలో పరిణమించడానికి హేతువు కూడ శరీరమే. మృతశరీరం దేనినీ మ్రింగడంలేదు కదా అను ఆశంకకు తావు లేదు; ప్రాణాలచేత అధిష్ఠింపబడిన శరీరమే మ్రింగుతుం దని చెప్పాం కదా? జీవుడు తొలగిపోయిన శరీరం మ్రింగడం మొదలైన పనులు చేయడంలేదు గాన మ్రింగడం

మొదలైనవి జీవుని ధర్మాలే అని చెప్పడం యుక్తం కాదు.క్షేత్రజ్ఞుడైన జీవుడు పరిపూర్ణుడు గాన అతడు తొలగిపోవడం అనేది ఉండదు.శరీరంనుండి తొలగిపోయేది లింగశరీరావచ్ఛిన్నమైన ప్రమాతయే. ఆ ప్రమాతకు సహజంగా గ్రసనసామర్థ్యం లేదు.స్థూలశరీరం లేకపోతే ప్రమాతకు గ్రసనం కుదరదు.అంతఃకరణరహితమైన కేవలశరీరమాత్రానికి కూడ గ్రసనాదిసామర్థ్యం లేదు;సుషుప్తిమూర్ఛాదులలో అది కనబడదంలేదు కదా? లింగశరీరంచేత అవచ్ఛిన్నమైన ప్రమాతయే శరీరావయవాల ద్వారా అన్నాదులు మ్రింగుతుంది, మనస్సు ద్వారా సుఖాద్యుపభోగం చేస్తుంది.అందుచేత అన్నగ్రసనాదికం చేసేది ప్రమాత్రధిష్ఠిత చైతన్యమే కాని క్షేత్రజ్ఞుడైన ఆత్మ కాదు.ప్రమాత శరీరంకంటె విలక్షణం.(భా.అ.ప్ర. పే.100-101) 16

భాష్యమ్

కిం చ-సర్వత్ర విద్యమానమపి సత్ న ఉపలభ్యతే చేత్ జ్ఞేయం తమః తర్హి? న.కిం తర్హి?

మూ. జ్యోతిషామపి తజ్జ్యోతిస్తమసః పరముచ్యతే
జ్ఞానం జ్ఞేయం జ్ఞానగమ్యం హృది సర్వస్య విష్ఠితమ్. 17

బాలానందిని

కిం చేతి:- మరియు - జ్ఞేయం అంతటా ఉన్నా కూడ గ్రహించబడకపోతే అది ఒక అంధకారం అన్నమాట!కాదు;మరేమనగా-

ప్ర.అ. జ్యోతిషామితి:- తత్=అది,జ్యోతిషామపి=సూర్యాదితేజస్సులకు కూడ, జ్యోతిః =తేజస్సు,తమసః=తమస్సుకంటె,అజ్ఞానంకంటె, పరమ్=పరమైనదిగా,దూరంగా, ఉన్నదిగా, ఉచ్యతే=చెప్పబడుచున్నది.జ్ఞానమ్=జ్ఞానము.జ్ఞేయమ్=తెలియదగినది.జ్ఞాన గమ్యమ్= జ్ఞానంచేత పొందదగినది,సర్వస్య=ప్రతిఒక్కనియొక్క,హృది=హృదయమునందు, విష్ఠితమ్= ఉంచబడినది.

భాష్యమ్

జ్యోతిషామ్ ఆదిత్యాదీనామ్ అపి,తత్ జ్ఞేయం,జ్యోతిః, ఆత్మచైతన్యజ్యోతిషా ఇద్ధాని హి ఆదిత్యాదీని జ్యోతీంషి దీప్యన్తే."యేన సూర్యస్తపతి తేజసేద్ధః" (తై.బ్రా.3.12.9), "తస్య భాసా సర్వమిదం విభాతి"(శ్వే.ఉ.6.14)ఇత్యాదిమన్త్రేభ్యః.స్మృతేశ్చ ఇహైవ "యదాదిత్యగతం తేజః"(15.12)ఇత్యాదేః.తమసః అజ్ఞానాత్, పరమ్ అసంస్పృష్టమ్, ఉచ్యతే. జ్ఞానాదేః దుఃఖసంపాదనబుద్ధ్యా ప్రాప్తావసాదస్య

ఉక్తమ్భు నార్థమ్ ఆహ- జ్ఞానమ్ - అమానిత్వాది(13.7.11); "జ్ఞేయం యత్తత్ ప్రవక్ష్యామి" (13.12.17) ఇత్యాదినా ఉక్తమ్. జ్ఞానగమ్యమ్-జ్ఞేయమేవ జ్ఞాతం సత్ జ్ఞానఫలమ్ ఇతి జ్ఞానగమ్యమ్ ఉచ్యతే. జ్ఞాయమానం తు తద్ జ్ఞేయమ్. తత్ ఏతత్ త్రయమపి హృది బుద్ధౌ సర్వస్య ప్రాణి జాతస్య,విష్ఠితం విశేషేణ స్థితమ్. తత్రైవ హి ఏతత్ త్రయం విభావ్యతే. 17

బాలానందిని

జ్యోతిషామితి:-ఆ జ్ఞేయము ఆదిత్యాదిజ్యోతిస్సులకు కూడ జ్యోతిస్సు. "**యేన సూర్యస్తపతి తేజసేద్ధః**"(ఏ ఆత్మచేత తేజస్సుచేత వృద్ధిపొందించబడినవాడై సూర్యుడు తపిస్తున్నాడో,ప్రకాశిస్తున్నాడో),"**తస్య భాసా సర్వమిదం విభాతి**"(ఆ ఆత్మయొక్క తేజస్సు చేతనే ఇదంతా ప్రకాశిస్తూన్నది). ఇత్యాదిశ్రుతులు చెప్పి నట్లు ఆదిత్యాదిజ్యోతిస్సులు కూడ ఆత్మచైతన్యముయొక్క జ్యోతిస్సుచేతనే ప్రకాశిస్తున్నాయి కదా?ఇక్కడనే ఉన్న "**యదాదిత్య గతం తేజః**"ఇత్యాదిస్మృతివాక్యం కూడ ఈ విషయమే చెపుతూన్నది. తమస్సుకంటె-అజ్ఞానముకంటె పరముగా, స్పృశించబడనిదిగా,చెప్పబడుచున్నది. జ్ఞానాదికాన్ని సంపాదించడం చాలా కష్టం గాన దిగులుచెందడానికి అవకాశం ఉన్న శ్రోతకు ఉత్సాహం కలిగించడానికై చెపుతున్నాడు-జ్ఞానము,(వెనుకచెప్పిన)అమానిత్వాదిజ్ఞానము,"**జ్ఞేయంయత్తత్ప్ర వక్ష్యామి**"అని ప్రారంభించి చెప్పిన జ్ఞేయము,జ్ఞానముచేత పొందతగినది,జ్ఞేయమే తెలియబడినప్పుడు అది జ్ఞానానికి ఫలం గాన జ్ఞానగమ్యం అని చెప్పబడుచున్నది. ఈ త్రయమూ కూడ (జ్ఞానము,జ్ఞేయము,జ్ఞానగమ్యము అను ఈ మూడు కూడ)సమస్తప్రాణి సముదాయముయొక్క బుద్ధియందు విశేషంగా ఉన్నది. ఈ త్రయము బుద్ధియందే చూడబడుతుంది కదా? 17

భాష్యమ్

యథోక్తార్థోపసంహారార్థః అయం శ్లోకః ఆరభ్యతే-

మూ. ఇతి క్షేత్రం తథా జ్ఞానం జ్ఞేయం చోక్తం సమాసతః,
మద్భక్త ఏతద్విజ్ఞాయ మద్భావాయోపపద్యతే. 18

బాలానందిని

యథోక్తేతి:-ఇంతవరకు చెప్పబడిన విషయాన్ని ఉపసంహరించడంకొరకై ఈ శ్లోకం ప్రారంభించబడుచున్నది-

ప్ర. అ. **ఇతీతి**:-ఇతి=ఈ విధంగా,క్షేత్రమ్=క్షేత్రము, తథా=మరియు,జ్ఞానమ్=జ్ఞానము,జ్ఞేయం చ=జ్ఞేయము,సమాసతః=సంగ్రహంగా, ఉక్తమ్=చెప్పబడినది. మద్భక్తః =నా

భక్తుడు,ఏతత్=దీనిని,విజ్ఞాయ=తెలుసుకొని,మద్భావాయ=నేనుగా అవడానికి, పరమాత్మత్వానికి,ఉపపద్యతే=తగినవా డవుతాడు.

భాష్యమ్

ఇతి ఏవమ్.క్షేత్రం మహాభూతాది ధృత్యన్తం (13.5-6),తథా జ్ఞానమ్ అమానిత్వాది తత్త్వజ్ఞానార్థదర్శనపర్యన్తమ్(13.7-11),జ్ఞేయం చ "జ్ఞేయంయత్తత్" (13.12) ఇత్యాది "తమసః పరముచ్యతే"(13.17)ఇత్యేవమన్తమ్,ఉక్తం సమాసతః సంక్షేపతః ఏతావాన్ హి సర్వః వేదార్థః గీతార్థశ్చ ఉపసంహృత్య ఉక్తః. అస్మిన్ సమ్యగ్దర్శనే కః అధిక్రియతే ఇతి ఉచ్యతే-మద్భక్తః-మయి సర్వేశ్వరే పరమగురౌ వాసుదేవే సమర్పితసర్వాత్మభావః. యత్ పశ్యతి శృణోతి స్పృశతి వా సర్వమేవ భగవాన్ వాసుదేవః "ఇత్యేవంగ్రహావిష్టబుద్ధిః మద్భక్తః సః ఏతత్ యథోక్తం సమ్యగ్దర్శనం విజ్ఞాయ, మద్భావాయ-మమ భావః మద్భావః,పరమాత్మభావః,తస్మై మద్భావాయ ఉపపద్యతే, మోక్షం గచ్ఛతి. 18

బాలానందిని

ఇతీతి:-ఈ విధంగా మహాభూతాలు మొదలు ధృతివరకు ఉన్న క్షేత్రము,అట్లే అమానిత్వం మొదలు తత్త్వజ్ఞానార్థదర్శనపర్యంతమూ ఉన్న జ్ఞానము,**"జ్ఞేయం యత్తత్ప్రవక్ష్యామి"**మొదలు **"తమసః పరముచ్యతే"**వరకు ఉన్న జ్ఞేయమూ కూడ సంక్షేపంగా చెప్పబడినది. ఇంతవరకు ఉన్న సమస్తమైన వేదార్థము,గీతార్థమూ కూడ ఉపసంహరించి చెప్పబడినది. ఈ సమ్యగ్దర్శనంలో ఎవనికి అధికారం ఉన్నదో చెప్పబడుచున్నది- ఈశ్వరుడను,పరమగురువునూ,వాసుదేవుడనూ అయిన నాయందు సర్వాత్మభావమును సమర్పించి(నేనే సర్వాత్మ సర్వాత్మస్వరూపుడను అని విశ్వసించి),ఏది చూచినా,ఏది వినినా, ఏది స్పృశించినా సమస్తమూ కూడ భగవంతుడైన వాసుదేవుడే అను విశ్వాసముతో కూడిన బుద్ధి కలవాడై ఉన్న నా భక్తుడు ఇంతవరకు చెప్పిన సమ్యగ్దర్శనమును తెలుసుకొని నా స్వరూపం కలవాడవడానికి,పరమాత్మత్వం పొందడానికి తగినవా డవుతాడు;మోక్షం పొందుతాడు. 18

భాష్యమ్

తత్ర సప్తమే అధ్యాయే ఈశ్వరస్య ద్వే ప్రకృతీ ఉపన్యస్తే పరాపరే క్షేత్రక్షేత్రజ్ఞలక్షణే. **"ఏతద్యోనీని భూతాని"**(7.6)ఇతి చోక్తమ్. క్షేత్రక్షేత్రజ్ఞప్రకృతిద్వయయోనిత్వం కథం భూతానామ్ ఇత్యయమ్ అర్థః అధునా ఉచ్యతే-

మూ. ప్రకృతిం పురుషం చైవ విద్ధ్యనాదీ ఉభావపి,
వికారాంశ్చ గుణాంశ్చైవ విద్ధి ప్రకృతిసంభవాన్. 19

బాలానందిని

తత్రేతి:-పరము అపరము అను,క్షేత్రక్షేత్రజ్ఞరూపాలైన రెండు ఈశ్వరప్రకృతులు సప్తమాధ్యాయంలో చెప్పబడ్డాయి. ఈ పర-అపరప్రకృతులనుండే భూతాలు జనించా యని కూడ చెప్పబడింది. భూతాలకు క్షేత్రక్షేత్రజ్ఞులు ఏ విధంగాకారణం అవుతున్నారు అనే విషయం ఇప్పుడు చెప్పబడుచున్నది-

ప్ర.అ. ప్రకృతిమితి:- ప్రకృతిమ్=ప్రకృతిని,పురుషం చైవ=పురుషుణ్ణీ,ఉభావపి= రెండింటినీ కూడ,అనాదినీ=ఆది లేనివాటిగా,విద్ధి=తెలుసుకొనుము. వికారాన్ చ=వికారములను,గుణాన్ చ ఏవ=గుణములనూ కూడ,ప్రకృతిసంభవాన్=ప్రకృతియే కారణముగా కలవాటినిగా,విద్ధి=తెలుసుకొనుము.

భాష్యమ్

ప్రకృతిం పురుషం చైవ ఈశ్వరస్య ప్రకృతీ, తౌ ప్రకృతిపురుషౌ ఉభౌ అపి అనాదీ విద్ధి. న విద్యతే ఆదిః యయోః తౌ అనాదీ. నిత్యేశ్వరత్వాదీశ్వరస్య తత్ప్రకృత్యో రపి యుక్తం నిత్యత్వేన భవితుమ్. ప్రకృతిద్వయవత్త్వమేవ హి ఈశ్వరస్య ఈశ్వరత్వమ్. యాభ్యాం ప్రకృతిభ్యామ్ ఈశ్వరః జగదుత్పత్తిస్థితిప్రలయహేతుః తే ద్వే ప్రకృతీ అనాదీ సత్యౌ సంసారస్య కారణమ్. "న ఆదీ అనాదీ"ఇతి తత్పురుషసమాసం కేచిత్ వర్ణయన్తి. తేన హి కిల ఈశ్వరస్య కారణత్వం సిధ్యతి. యది పునః ప్రకృతిపురుషావేవ నిత్యౌ స్యాతాం తత్కృతమేవ జగత్ న ఈశ్వరస్య జగతః కర్తృత్వమ్. తదసత్-ప్రాక్ ప్రకృతి పురుషయోః ఉత్పత్తేః ఈశితవ్యాభావాత్ ఈశ్వరస్య అనీశ్వరత్వప్రసంగాత్. సంసారస్య నిర్నిమిత్తత్వే అనిర్మోక్ష-ప్రసంగాత్,శాస్త్రానర్థక్యప్రసంగాత్,బన్ధమోక్షాభావప్రసంగాచ్చ. నిత్యత్వే పునః ఈశ్వరస్య ప్రకృత్యోః సర్వమ్ ఏతత్ ఉపపన్నం భవేత్. కథమ్? వికారాన్ చ గుణాన్ చ ఏవ,వక్ష్యమాణాన్ వికారాన్ బుద్ధ్యాదిదేహేన్ద్రియాన్తాన్,గుణాన్ చ సుఖదుఃఖమోహప్రత్యయాకారపరిణతాన్ విద్ధి జానీహి,ప్రకృతిసంభవాన్-ప్రకృతిః ఈశ్వరస్య వికారకారణశక్తిః త్రిగుణాత్మికా మాయా,సా సంభవః యేషాం వికారాణాం గుణానాం చ తాన్ వికారాన్ గుణాన్ చ విద్ధి,ప్రకృతిసంభవాన్ ప్రకృతిపరిణామాన్. 19

బాలానందిని

ప్రకృతిమితి:- ప్రకృతిని,పురుషుణ్ణి-ఈశ్వరుని ప్రకృతు లైన ప్రకృతిపురుషులను రెండింటినీ,ఆది లేనివాటినిగా తెలుసుకొనుము. వేటికి ఆది లేదో అవి అనాదులు (బహు

వ్రీహిసమాసం). ఈశ్వరుడు నిత్యేశ్వరుడు గాన(అనగా నిత్యమైన ఈశ్వరత్వం,నియమనశక్తి, కలవాడుగాన)వాని ప్రకృతులు కూడ నిత్యములే అయి ఉండడం యుక్తం. ఈశ్వరుని కున్న ఈశ్వరత్వం అనగా రెండు ప్రకృతులూ కలిగి ఉండడమే కదా? ఏ ప్రకృతులచేత (ఏ ప్రకృతులు కలిగి ఉండడంచేత)ఈశ్వరుడు జగత్తుయొక్క ఉత్పత్తి-స్థితి-ప్రలయాలకు హేతువు అగు చున్నాడో ఆ రెండుప్రకృతులూ కూడ అనాదులుగా ఉంటూ సంసారానికి కారణం అవుతున్నాయి.

కొందరు"న ఆదీ అనాదీ"(ఆదులు కానివి,ఆదినుండీ లేనివి అని అర్థం)అని తత్పురుషసమాసం చెపుతున్నారు.అలా చెప్పడంచేత ఈశ్వరునకు కారణత్వం సిద్ధిస్తుం దట(ఈశ్వరుడు కారణ మని చెప్పడం కుదురుతుందట).ప్రకృతిపురుషులే నిత్యము లైతే జగత్తు వాటిచేత సృజింపబడినదే అవుతుంది కాని ఈశ్వరునికి జగత్కర్తృత్వం (ఈశ్వరునిచేత జగత్తు సృజింపబడిన దనే మాట)కుదరదు(అని వీరి అభిప్రాయం). ఇది యుక్తం కాదు.ప్రకృతిపురుషులు పుట్టడానికి ముందు ఈశ్వరుడు నియమించవలసినది ఏదీ లేకపోవడంవల్ల ఈ శ్వరునకు అనీశ్వరత్వం ప్రసక్తం అవుతుంది.(ఈశ్వరుడు ఈశ్వరుడు కాకుండా పోతాడు.రాజ్యం ఉంటేనే కదా రాజనే మాట ఉంటుంది?)అట్లే- సంసారానికి నిమిత్తం అనేది లేకపోతే(ఏ నిమిత్తమూ లేకుండానే సంసారం వచ్చింది అని అంటే)మోక్షం అనేదే లేకుండా పోతుంది. (సంసారానికి ఏదో ఒక నిమిత్తం ఉన్నది అన్నట్లయితే ఆ నిమిత్తం తొలగగానే మోక్షం కలుగుతుంది అని నమ్మడానికి వీలుంటుంది. ఏ నిమిత్తమూ లేకుండానే సంసారం ఉన్నది అని అంటే అది పోవడానికి కారణం ఏదీ ఉండదు గాన అనిర్మోక్షప్రసంగం). అప్పుడు బంధమూ మోక్షము అనేవి లేకుండా పోతాయి,శాస్త్రం కూడ వ్యర్థం అవుతుంది.ఈశ్వరుని ప్రకృతులు రెండూ నిత్యము లైతే మాత్రం ఇదంతా కుదురుతుంది.ఎట్లు?చెప్పబడబోయే బుద్ధి మొదట దేహేంద్రియాల వరకూ ఉన్న వికారాలను,సుఖ-దుఃఖ-మోహాల జ్ఞానంయొక్క ఆకారంలో పరిణమించిన (సత్త్వరజస్తమో)గుణాలనూ కూడ ప్రకృతిసంభవములనుగా తెలుసుకొనుము.ప్రకృతి అనగా ఈశ్వరునియొక్క వికారకారణశక్తి (వికారాలకు కారణమైన శక్తి);త్రిగుణాత్మక మైన మాయ.ఏ వికారాలకు గుణాలకు కూడ ఆ ప్రకృతియే కారణమో అవి ప్రకృతిసంభవములు.అనగా ప్రకృతియొక్క పరిణామాలు అని తెలుసుకొనుము.

భా.అ.ప్ర. వికారాన్=ఇచ్ఛాద్వేషాదులను,గుణాన్=అమానిత్వాదులను అని శ్రీరామానుజవ్యాఖ్య అయుక్తం.ఇచ్ఛాదులు కూడ గుణాలే గాన,అమానిత్వాదులు కూడ వికారాలే గాన ఏదో ఒకదానిని చెప్పడంచేతనే రెండింటినీ చెప్పినట్లవుతుంది గాన రెండింటినీ చెప్పడం అవసరం ఉండదు.(భా.అ.ప్ర.పే.112)

భాష్యమ్

కే పునః తే వికారాః గుణాః చ ప్రకృతిసంభవాః?

మూ. కార్యక(కా)రణకర్తృత్వే హేతుః ప్రకృతిరుచ్యతే,
పురుషః సుఖదుఃఖానాం భోక్తృత్వే హేతురుచ్యతే. 20

బాలానందిని

కేఇతి:-అయితే-ప్రకృతినుండి పుట్టిన ఆ వికారాలు గుణాలు ఏవి?

ప్ర.అ.కార్యేతి:-ప్రకృతిః=ప్రకృతి,కార్యకరణకర్తృత్వే=శరీరేంద్రియాల కర్తృత్వమునందు(పుట్టించుటయందు), హేతుః-హేతువుగా,ఉచ్యతే=చెప్పబడుచున్నది,సుఖదుఃఖానామ్=సుఖదుఃఖాలయొక్క,భోక్తృత్వే=భోక్తృత్వమునందు,పురుషః=పురుషుడు, హేతుః=హేతువుగా,ఉచ్యతే=చెప్పబడుచున్నాడు.

భాష్యమ్

కార్యేతి:-కార్యం శరీరమ్;కరణాని తత్స్థాని త్రయోదశ, దేహస్యారమ్భకాణి భూతాని, విషయాశ్చ ప్రకృతిసంభవాః వికారాః పూర్వోక్తాః ఇహ కార్యగ్రహణేన గృహ్యన్తే.గుణాశ్చ ప్రకృతిసంభవాః సుఖదుఃఖమోహాత్మకాః కరణాశ్రయత్వాత్ కరణగ్రహణేన గృహ్యన్తే, తేషాం కార్యకరణానాం కర్తృత్వమ్ ఉత్పాదకత్వం యత్ తత్ కార్యకరణకర్తృత్వమ్; తస్మిన్ కార్యకరణకర్తృత్వే హేతుః కారణమ్,ఆరమ్భకత్వేన ప్రకృతిః ఉచ్యతే.ఏవం కార్యకరణకర్తృత్వేన సంసారస్య కారణం ప్రకృతిః. "కార్యకారణకర్తృత్వే"ఇత్యస్మిన్ అపి పాఠే కార్యం-యద్యస్య విపరిణామః తత్ తస్య కార్యమ్;వికారః. వికారి,కారణమ్.తయోః వికారవికారిణోః కార్యకారణయోః కర్తృత్వే ఇతి. అథవా షోడశవికారాః కార్యమ్.సప్త వికృతయః కారణమ్.తాన్యేవ కారకకారణాని ఉచ్యన్తే.తేషాం కర్తృత్వే హేతుః ప్రకృతిః ఉచ్యతే ఆరమ్భకత్వేనైవ.

బాలానందిని

కార్యేతి:-కార్యమ్ అనగా శరీరం.దానిలో ఉన్న పదమూడు(పంచజ్ఞానేంద్రియాలు, పంచకర్మేంద్రియాలు,మనస్సు,బుద్ధి అహంకారం అనే)ఇంద్రియాలు కరణాలు.దేహానికి ఆరంభకము లైన(దేనితో ఒక కార్యం చేయబడుతుందో అది దానికి ఆరంభకం.మట్టి కుండకి ఆరంభకం.ఉపాదనకారణం)పంచభూతాలు.విషయాలు అనే ప్రకృతినుండి పుట్టిన వెనుక చెప్పిన వికారాలు ఇక్కడ 'కార్య'శబ్దాన్ని ప్రయోగించడంచేత గ్రహించబడతాయి. ప్రకృతినుండే పుట్టిన సుఖదుఃఖమోహాత్మకాలైన గుణాలు,కరణాలను ఆశ్రయించి ఉండడం

చేత'కరణ'శబ్దంచేత గ్రహింపబడతాయి.ఆ కార్యకరణాలను పుట్టించడం "కార్యకరణ కర్తృత్వం".ప్రకృతి వీటికి ఆరంభకం గాన ఈ కార్యకరణకర్తృత్వంవిషయంలో హేతువు కారణము అని చెప్పబడుతూన్నది.ఈ విధంగా ప్రకృతి కార్యకరణాలను పుట్టించడంచేత సంసారానికి కారణం."కార్యకారణకర్తృత్వే"అనే పాఠంలో కూడ ఏది దేని పరిణామమో (కుండ మట్టియొక్క పరిణామం అయినట్లు)అది దాని కార్యం వికారం;కారణం వికారి.ఆ వికారవికారులయొక్క కార్యకారణాలయొక్క,కర్తృత్వమునందు (వాటిని పుట్టించుటయందు) లేదా పదహారు వికారాలు కార్యం.ఏడు ప్రకృతివికృతులు కారణం.అవే కారణాలని చెప్పబడుచున్నాయి.వాటికి ప్రకృతి ఆరంభకం గాన వాటి కర్తృత్వంలో(పుట్టించడంలో) హేతువు అని చెప్పబడుచున్నది.

వి.సాంఖ్యులు ఇవరైనాలుగు తత్త్వాలను అంగీకరిస్తారు.

"మూలప్రకృతిరవికృతిర్మహదాద్యాః ప్రకృతివికృతయః సప్త,
షోడశకశ్చ వికారో న ప్రకృతిర్న వికృతిః పురుషః" (సాంఖ్యకారిక. 2)

ప్రకృతి అనగా కారణం;వికృతి అనగా కార్యం.నిత్యము సత్త్వరజస్తమోగుణాత్మకము అయిన ఒక మూలప్రకృతి అనేది ఉంది.దీనినుండి క్రమంగా (ఒకదానినుండి ఒకటి అనే క్రమంలో)ఇతరతత్త్వాలు పుడుతున్నాయి.మూలప్రకృతి మాత్రం దేనినుండీ పుట్టలేదు. అందుచేత అది కేవలప్రకృతియే.ప్రకృతినుండి మహత్,మహత్తునుండి అహంకారం,దాని నుండి పంచసూక్ష్మభూతాలు(భూతతన్మాత్రలు)పుడుతున్నాయి.వీటినుండి మరికొన్ని తత్త్వాలు పుడుతున్నాయి.అందుచేత వాటి దృష్ట్యా ఇవి ప్రకృతులు;మూలప్రకృతి మొదలైన వాటివాటి కారణాలను పట్టి ఇవి వికృతులు. ఈ విధంగా ఈ ఏడింటికీ ప్రకృతి-వికృతు లని పేరు, పదకొండు ఇంద్రియాలు,పంచమహాభూతాలు(ఇవే విషయాలు),ఈ పదహారూ అహంకార సూక్ష్మభూతాదులనుండి పుడుతున్నాయి.అందుచేత ఇవి వికృతులు.వీటినుండి మరేవీ పుట్టటంలేదు గాన ఇవి ప్రకృతులు కావు."కార్యకారణ"శబ్దంచేత మహదాదులైన ఇరవైమూండింటిని గ్రహించవచ్చు నని భావం.

భాష్యమ్

పురుషశ్చ సంసారస్య కారణం యథా స్యాత్ తత్ ఉచ్యతే-పురుషః జీవః క్షేత్రజ్ఞః భోక్తా ఇతి పర్యాయః. సః సుఖదుఃఖానాం భోగ్యానాం,భోక్తృత్వే ఉపలబ్ధృత్వే హేతుః ఉచ్యతే.కథం పునః అనేన కార్యకరణకర్తృత్వేన సుఖదుఃఖభోక్తృత్వేన చ ప్రకృతిపురుషయోః సంసారకారణత్వమ్ ఉచ్యతే ఇతి?అత్రోచ్యతే-కార్యకరణసుఖదుః ఖరూపేణ హేతుఫలాత్మనా ప్రకృతేః పరిణామాభావే పురుషస్య చేతనస్య అసతి

తదుపలబ్ధృత్వే కుతః సంసారః స్యాత్?యదా పునః సుఖదుఃఖరూపేణ హేతుఫలాత్మనా పరిణతయా ప్రకృత్యా భోగ్యయా పురుషస్య తద్విపరీతస్య భోక్తృత్వేన అవిద్యారూపః సంయోగః స్యాత్ తదా సంసారః స్యాత్ ఇతి.అతః యత్ ప్రకృతిపురుషయోః కార్యకరణకర్తృత్వేన సుఖదుఃఖభోక్తృత్వేన చ సంసారకారణత్వమ్ ఉక్తం తత్ యుక్తమ్.కః పునః అయం సంసారః నామ?సుఖదుఃఖసంభోగః సంసారః.పురుషస్య సుఖదుఃఖానాం సంభోక్తృత్వం సంసారిత్వమ్ ఇతి. 20

బాలానందిని

పురుష ఇతి:- పురుషుడు సంసారానికి కారణం ఎలా అవుతాడో చెప్పబడుచున్నది - పురుషః,జీవః,క్షేత్రజ్ఞః,భోక్తా-ఈ పదాలు పర్యాయపదాలు.ఆ పురుషుడు భోగ్యాలైన సుఖదుఃఖాలను అనుభవించడంలో కారణ మని చెప్పబడుచున్నాడు.కార్యకరణకర్తృత్వంచేత ప్రకృతి,సుఖదుఃఖభోక్తృత్వంచేత పురుషుడూ సంసారకారణ మని ఎట్లు చెప్పబడు చున్నారు?ఇక్కడ(సమాధానం)చెప్పబడుచున్నది.ప్రకృతి కార్య-కరణ-సుఖ-దుఃఖ రూపాలలో హేతుఫలాలుగా పరిణమించకపోతే,చేతనుడైన పురుషునికి వాటిని గ్రహించడం అనేది లేకపోతే(పురుషుడు వాటిని గ్రహించకపోతే)సంసారం ఎలా ఉంటుంది?కార్య-కరణ-సుఖ-దుఃఖరూపంలో,హేతువలాలుగా పరిణమించిన భోగ్యమైన ప్రకృతితో అందుకు విపరీతుడైన(భోగ్యం కాక భోక్తయైన)పురుషునికి భోక్తృత్వంచేత(భోక్తగా)అవిద్యారూపమైన సంయోగం ఎప్పుడు ఏర్పడుతుందో అప్పుడు సంసారం ఉంటుంది.అందుచేత-కార్య-కరణకర్తృత్వం ద్వారా,సుఖదుఃఖభోక్తృత్వం ద్వారా, ప్రకృతిపురుషులు సంసారానికి కారణ మని ఏది చెప్పబడినదో అది యుక్తమే.ఏమిటి ఈ సంసారం అంటే?సుఖదుఃఖసంభోగమే సంసారం.పురుషుడు సుఖదుఃఖాలను అనుభవించడమే వానికి సంసారిత్వం.

భా.అ.ప్ర. కార్యకరణాలు క్రియలు చేయడానికి పురుషునిచేత అధిష్ఠింపబడిన (ప్రేరేపింపబడిన)ప్రకృతియే కారణం అని శ్రీరామానుజాచార్యుల వ్యాఖ్య అయుక్తం. ప్రకృతియొక్క పరిణామమైన కార్యకరణాలే పురుషాధిష్ఠితాలై క్రియలు చేస్తాయి అని చెప్పడానికి అవకాశం ఉన్నప్పుడు పురుషాధిష్ఠితమైన ప్రకృతి అందుకు కారణం అని చెప్పడం ఎందుకు?పురుషునిచేత అధిష్ఠింపబడిన బుద్ధి కార్యకరణాలు పనిచేయడానికి కారణం అని చెప్పడం కూడ యుక్తం కాదు.బుద్ధి కూడ కరణాలలో అంతర్గతమే కదా?పురుషుని చేత అధిష్ఠింపబడిన అజ్ఞానం కూడ కారణం కాదు.అలా చెప్పిన పక్షంలో సుషుప్తిలో కూడ పురుషాధిష్ఠితఅజ్ఞానం ఉంటుంది గాన కార్యకరణాలు పనులు చేయవలసి ఉంటుంది. ప్రకృతి పనులు చేయడానికి ఏ పురుషాధిష్ఠితత్వం కారణమో ఆ పురుషాధిష్ఠితత్వమే కార్యకరణాలు తమ పనులు చేయడానికి కారణం అని అన్నట్లయితే పురుషుడు

క్రియాకారిత్వానికి హేతు వని చెప్పిన ట్లవుతుంది.అది ప్రకృతి కర్తృత్వానికి హేతువు భోక్తృత్వానికి హేతువు పురుషుడు అను మూలానికి విరుద్ధం.మూలానికి విరోధం ఉన్నా కూడ"కర్తా శాస్త్రార్థవత్త్వాత్"అను బ్రహ్మసూత్రాన్ని అనుసరించిన ఈ అర్థం చెప్పబడుతూన్నది అనడం యుక్తం కాదు.ఎందువల్ల ననగా ఇది-

"ప్రకృత్యైవ చ కర్మాణి క్రియమాణాని సర్వశః,
యః పశ్యతి తదాత్మానమకర్తారం స పశ్యతి"
"ప్రకృత్యా క్రియమాణాని గుణకర్మాణి సర్వశః
అహంకారవిమూఢాత్మా కర్తాహమితి మన్యతే"

ఇత్యాదివాక్యాలకు విరుద్ధం.ఈ వాక్యాలకు విరుద్ధంగా ఆ సూత్రం కూడ కర్తృత్వం లేని ఆత్మకు కర్తృత్వం ప్రతిపాదిస్తూన్నది అనడం అయుక్తం.అహంకారం కర్త అనియే సూత్ర కారుని అభిప్రాయం.సూత్రకార-గీతకారు లిద్దరూ ఒకరే గాన విరుద్ధార్థం చెప్పడం అసంభవం.అందుచేత కర్తృత్వం ప్రకృతికే,భోక్తృత్వం పురుషునికి సంబంధించినది. ఈ భోక్తృత్వం కూడ అవిద్యాకల్పితమే.(భా.అ.ప్ర.పే.114-115) 20

భాష్యమ్

యత్పురుషస్య సుఖదుఃఖానాం భోక్తృత్వం సంసారిత్వమ్ ఇతి ఉక్తం తస్య కిం నిమిత్తమితి ఉచ్యతే-

మూ. పురుషః ప్రకృతిస్థో హి భుఙ్క్తే ప్రకృతిజాన్ గుణాన్,
కారణం గుణసంగోఽస్య సదసద్యోనిజన్మసు. 21

బాలానందిని

యదితి:- పురుషుడు సుఖదుఃఖాలను అనుభవించడమే వాని సంసారిత్వం అనగా అని చెప్పబడింది.దానికి నిమిత్తం ఏమిటో చెప్పబడుచున్నది-

ప్ర.అ.పురుష ఇతి:-పురుషః=పురుషుడు,ప్రకృతిస్థః=ప్రకృతియందు దున్నవాడై; ప్రకృతిజాన్=ప్రకృతివల్ల పుట్టిన,గుణాన్=గుణములను,భుఙ్క్తే హి=అనుభవిస్తాడు కదా? అస్య=వీనికి,గుణసంగః=గుణాలతో సంబంధము,సదసద్యోనిజన్మసు=మంచివి చెడ్డవి అయిన యోనులయందు జన్మల విషయంలో కారణమ్=కారణము.

భాష్యమ్

పురుషః భోక్తా,ప్రకృతిస్థః-ప్రకృతౌ అవిద్యాలక్షణాయాం కార్యకారణరూపేణ పరిణతాయాం స్థితః ప్రకృతిస్థః,ప్రకృతిమ్ ఆత్మత్వేన గతః ఇత్యేతత్.హి యస్మాత్ తస్మాత్ భుఙ్క్తే ఉపలభతే ఇత్యర్థః.ప్రకృతిజాన్ ప్రకృతితః జాతాన్ సుఖదుఃఖమోహా

కారాభివ్యక్తాన్ గుణాన్“సుఖీ-దుఃఖీ,మూఢః,పణ్డితః అహమ్”ఇత్యేవమ్. సత్యామపి అవిద్యాయాం సుఖదుఃఖమోహేషు గుణేషు భుజ్యమానేషు యః సంగః ఆత్మభావః, సంసారస్య సః ప్రధానం కారణం జన్మనః-**“స యథాకామో భవతి తత్క్రతుర్భవతి”** (బృ.ఉ. 4. 4. 5)ఇత్యాదిశ్రుతేః. తదేతత్ ఆహ-కారణం హేతుః గుణసంగః గుణేషు సంగః,అస్య పురుషస్య భోక్తుః,సదసద్యోనిజన్మసు-సత్యః చ అసత్యః చ యోనయః సదసద్యోనయః,తాసు సదసద్యోనిషు జన్మాని సదసద్యోనిజన్మాని,తేషు సదసద్యోని జన్మసు విషయభూతేషు కారణం గుణసంగః. అథవా, సదసద్యోనిజన్మసు అస్య సంసారస్య కారణం గుణసంగః ఇతి సంసారపదమ్ అధ్యాహార్యమ్. సద్యోనయః, దేవాదియోనయః, అసద్యోనయః పశ్వాదియోనయః, సామర్థ్యాత్ సదసద్యోనయః మనుష్యయోనయః అపి అవిరుద్ధాః ద్రష్టవ్యాః. ఏతత్ ఉక్తం భవతి-ప్రకృతిస్థత్వాఖ్యా అవిద్యా,గుణేషు చ సంగః కామః సంసారస్య కారణమ్ ఇతి. తచ్చ పరివర్జనాయ ఉచ్యతే. అస్య చ నివృత్తి కారణం జ్ఞానవైరాగ్యే ససంన్యాసే గీతశాస్త్రే ప్రసిద్ధమ్. తచ్చ జ్ఞానం పురస్తాత్ ఉపన్యస్తం క్షేత్రక్షేత్రజ్ఞవిషయమ్. “యద్ జ్ఞాత్వామృతమశ్నుతే” (13. 12)ఇతి. ఉక్తం చ అన్యాపోహేన అతద్ధర్మాధ్యారోపేణ చ(13. 13) 21

బాలానందిని

పురుషః ఇతి:- ఏ కారణంవల్ల భోక్త యైన పురుషుడు అవిద్య అనే లక్షణం గలది, కార్యకారణరూపంలో పరిణామం చెందినదీ అయిన ప్రకృతియందు ఉన్నవాడై, ప్రకృతియే తానని భావిస్తూన్నవాడై అని అర్థం. ఉంటాడో అందువల్ల,ప్రకృతివల్ల పుట్టిన, సుఖదుఃఖమోహాకారాలలో వ్యక్తము లైన గుణాలను అనుభవిస్తాడు;అనగా పొందుతాడు అని అర్థం. నేను సుఖవంతుడను,దుఃఖవంతుడను,మూఢుడను,పండితుడను ఇత్యాదివిధంగా అనుకొంటూ ఆ గుణాలను అనుభవిస్తాడు.

అవ. పురుషుని సంసారానికి కేవలం అవిద్య కారణం కాదు,దాని కార్యాలైన సుఖదుఃఖాదులు మాత్రమే కారణం కాదు,వాటి అనుభవం కూడ కాదు. సుషుప్తిలో అవన్నీ ఉన్నా కూడ పురుషునకు సంసారం లేదు కదా?మరేమనగా అధ్యాసయే సంసా రానికి ప్రధానకారణం అని చెపుతున్నారు-**సత్యామితి**:-అవిద్య ఉన్నా కూడ(అది ప్రధాన కారణం కాదు). అనుభవించబడుతూన్న సుఖదుఃఖమోహాలయందు ఏ సంగం,ఆత్మభావం, ఉన్నదో అదే సంసారానికి,జన్మకు ప్రధానకారణం. “**స యథాకామో.... భవతి**”(పురుషుడు ఏ కామం కలవాడుగా ఉంటాడో ఆ ఆలోచనలే చేస్తాడు)ఇత్యాదిశ్రుతులు ఈ విషయమే చెపుతున్నాయి. దీనినే చెపుతున్నాడు-భోక్తయైన ఈపురుషున కున్న గుణసంగమే సదసద్యోని

జన్మలయందు హేతువు. మంచి యోనులయందు చెడ్డ యోనులయందు జన్మలు కలగడం విషయంలో గుణసంగమే కారణము. లేదా-(అస్య అనుపదానికి ఈ పురుషునికి అని అర్థం చెప్పడానికి బదులు)"సంసారస్య"అనుపదం అధ్యాహారంతెచ్చుకొని సదసద్యోనిజన్మలయందు ఈ సంసారానికి గుణసంగం కారణం అని అర్థం చెప్పవచ్చును. సద్యోను లనగా దేవాదియోనులు. అసద్యోను లనగా పశ్వాదియోనులు. సామర్థ్యంవల్ల(సద్యోనులు అసద్యోనులు అని రెండు రకాల యోనులను చెప్పడంవల్ల)అవిరుద్ధము లైన మనుష్యయోనులు కూడ చూడదగినవి.(సద్యోని యైతే అసద్యోని కాదు అసద్యోనియైతే సద్యోని కాదు. ఇవి పరస్పర విరుద్ధములు. అందుచేత సదసద్యోను లంటూ ఉండకూడదు. అయినా కూడ మనుష్యజన్మ పుణ్యపాపాల కలయికవలన లభిస్తుంది అని శాస్త్రం చెప్పుచున్నది గాన ఇది సదసద్యోని అని చెప్పడంలో విరోధం లేదు అని భావం). ప్రకృతిస్థత్వం అనే అవిద్య, గుణాలలో సంగమము, కామము ఇవి సంసారానికి కారణం అని చెప్పినట్లయింది. ఇది (ఈ కారణం)పరిహరించడంకోసం చెప్పబడుచున్నది. సంన్యాససహితమైన జ్ఞానవైరాగ్యాలు (జ్ఞానవైరాగ్యసంన్యాసాలు)ఇది తొలగిపోవడానికి కారణం. ఇది గీతాశాస్త్రంలో ప్రసిద్ధం. క్షేత్రక్షేత్రజ్ఞులకు సంబంధించిన అజ్ఞానం వెనుక చెప్పబడినది. "యద్ జ్ఞాత్వామృత మశ్నుతే"అని అన్యాపోహంచేత, దానికి కాని ధర్మాలను ఆరోపించడంచేత చెప్పబడినది.

వి. "యద్జ్ఞాత్వామృతమశ్నుతే"మొదలు "న సత్తన్నాసదుచ్యతే"వరకు అన్యప్రపంచ నిషేధపూర్వకంగా ఆ జ్ఞానమే చెప్పబడింది. "సర్వతః పాణిపాదమ్"ఇత్యాదివాక్యాలలో ఆత్మధర్మాలు కానివాటిని దానియందు ఆరోపించి చెప్పబడింది. ఈ విధంగా అధ్యారోపాప వాదాలచేత ఆ జ్ఞానమే ప్రతిపాదించబడింది అని అర్థం.

భా. అ. ప్ర. "ప్రకృతితో సంసర్గంవల్ల పురుషునికి బంధం కలుగుతుంది. అది సత్య మైనదే. ప్రకృతిసంసర్గానికి హేతువు గుణాలతో సంసర్గం. ఇది బీజాంకురున్యాయంచేత అనాది, ఈ గుణసంగం అమానిత్వాదులవల్ల నివర్తిస్తుంది"అను శ్రీరామానుజవ్యాఖ్య అసంగతం. "అసంగో హ్యయం పురుషః"అని పురుషుడు సంగరహితు డని శ్రుతి చెప్పు చుండగా వానికి సంగం ఎట్లు కలుగుతుంది? ప్రకృతి సత్య మైతే దానితో పురుషునికి సంగం ఉంటుందేమో! అదే అసత్య మైనప్పుడు దానితో పురుషునకు సంగం ఏమిటి? "ఏకమేవాద్వితీయం బ్రహ్మ""నేహ నానా"ఇత్యాదిశ్రుతులు బ్రహ్మయందు ద్వితీయవస్తువును నిషేధిస్తున్నవి కదా! ప్రకృతిసంగమే అసత్యం అయినప్పుడు దానిచేత ఏర్పడిన గుణసంగం గాని బంధం గాని సత్యం ఎలా అవుతుంది? ప్రకృతిసంగంవల్ల ఏర్పడిన గుణసంగం ప్రకృతిసంగానికి హేతువవడం సర్వథా అయుక్తం. ఇక్కడ బీజాంకురన్యాయం వర్తించదు. ఎందువల్ల ననగా ప్రకృతిసంగం అనాది, గుణసంగం సాది. ప్రకృతిమాత్రమే

అనాది,దానితో సంగం మాత్రం సాదియే అనడం యుక్తం కాదు.అనాదులైన ప్రకృతి పురుషులు సంగం లేకుండా ఉండడం విషయంలో ప్రమాణం లేదు.అలా సంగం లేకుండా కొంతకాలం ఉన్న పక్షంలో వాటికి సంగం కలిగించే కారణం లేదు గాన సంగమే సిద్ధించదు. ప్రకృతిపురుషసంగానికి అజ్ఞానం హేతువు అనడం కూడ యుక్తం కాదు;అజ్ఞానమే ప్రకృతి కదా?అజ్ఞానం ప్రకృతికంటె భిన్న మైనది అని అన్నా కూడ ఆ అజ్ఞానానికీ పురుషునికీ సంగం ఉందా లేదా?మొదటి పక్షంలో సంగానికి హేతువు ఏది? రెండవపక్షంలో సంగానికి హేతువు లేకపోతే సంగం ఎలా సిద్ధిస్తుంది?అజ్ఞాన-పురుషసంగానికి మరొక హేతువే దైనా ఉంటే దానితో పురుషుని సంగానికి హేతు వేమిటి? ఈ విధంగా అనవస్థాదోషం కలుగుతుంది.అజ్ఞానపురుషసంగానికి హేతువు అజ్ఞానమే అన్నట్లయితే తన సంగానికి తానే హేతు వని చెప్పడంలో ఆత్మాశ్రయదోషం ఏర్పడు తుంది.అందుచేత ప్రకృతి పురుషసంగం అనాదియే అని అంగీకరించాలి.ఈ విధంగా అనాదియైన ప్రకృతిపురుష సంగమే గుణసంగానికి హేతువు;ఎందువల్ల ననగా-గుణాలు ప్రకృతిపురుష సంగజన్యాలు కాబట్టి వాటి సంగం కూడ దానినుండే కలిగింది.అలాంటప్పుడు గుణసం గం ప్రకృతిపురుషసంగానికి హేతు వని చెప్పడం మట్టి పుట్టడానికి ఘటం హేతు వని చెప్పి నట్లు పరిహాసాస్పదమే.

అమానిత్వాదులచేత సత్యమైన బంధం కూడ నివర్తిస్తుంది అని చెప్పడం కూడ యుక్తం కాదు.సత్య మైనది ఏదీ నివర్తించదు.నివర్తిస్తే అది సత్యం కాదు.(భా.అ. ప్ర.పే.118)

21

భాష్యమ్

తస్యైవ పునః సాక్షాత్ నిర్దేశః క్రియతే-

మూ. ఉపద్రష్టానుమన్తా చ భర్తా భోక్తా మహేశ్వరః,
పరమాత్మేతి చాప్యుక్తో దేహేఽస్మిన్ పురుషః పరః. 22

బాలానందిని

తస్యైవేతి:-ఆ పురుషుణ్ణి గూర్చియే సాక్షాత్తుగా నిర్దేశం చేయబడుచున్నది(అనగా పురుషుని స్వరూపం వర్ణించబడుచున్నది)-

ప్ర.అ. అస్మిన్=ఈ,దేహే=దేహంలో ఉన్న,పరః పురుషః=పరమపురుషుడు, ఉప ద్రష్టా=సాక్షిగా ఉండి చూచేవా డనీ,అనుమన్తా చ=అనుమతించేవా డనీ,భర్తా=పోషించేవా డనీ,భోక్తా=భోక్త యనీ,మహేశ్వరః=మహేశ్వరు డనీ,పరమాత్మేతి చ=పరమాత్మ అనీ కూడ,ఉక్తః=చెప్పబడ్డాడు.

భాష్యమ్

ఉపద్రష్టా – సమీపస్థః సన్ ద్రష్టా స్వయమ్ అవ్యాపృతః, యథా ఋత్విగ్యజమానేషు యజ్ఞకర్మవ్యాపృతేషు తటస్థః అన్యః అవ్యాపృతః యజ్ఞవిద్యాకుశలః ఋత్విగ్యజమానగుణదోషాణామ్ ఈక్షితా, తద్వత్ కార్యకరణవ్యాపారేషు అవ్యాపృతః అన్యః విలక్షణః తేషాం కార్యకరణానాం సవ్యాపారాణాం సామీప్యేన ద్రష్టా ఉపద్రష్టా. అథవా దేహచక్షుర్మనోబుద్ధ్యాత్మానః ద్రష్టారః. తేషాం బాహ్యః ద్రష్టా దేహః. తతః ఆరభ్య అన్తరతమః చ ప్రత్యక్ సమీపః ఆత్మా ద్రష్టా యతః పరః అన్తరః నాస్తి సః అతిశయసామీప్యేన ద్రష్టృత్వాత్ ఉపద్రష్టా. యజ్ఞోపద్రష్టృవద్వా సర్వవిషయీకరణాత్ ఉపద్రష్టా. అనుమన్తా చ–అనుమోదనమ్ అనుమననమ్. కుర్వత్సు తత్క్రియాసు పరితోషః. తత్కర్తా అనుమన్తా చ. అథవా అనుమన్తా – కార్యకరణప్రవృత్తిషు స్వయమ్ అప్రవృత్తః అపి ప్రవృత్తః ఇవ తదనుకూలః విభావ్యతే, తేన అనుమన్తా. అథవా ప్రవృత్తాన్ స్వవ్యాపారేషు తత్సాక్షిభూతః కదాచిదపి న నివారయతి ఇతి అనుమన్తా.

బాలానందిని.

ఉపద్రష్టా ఇతి :– ఉపద్రష్టా – సమీపమునందు ఉంటూ, తాను మాత్రం ఏమీ చేయకుండా చూస్తూండేవాడు. ఋత్విక్కులు, యజమానుడు యజ్ఞకర్మలో తమ తమ పనులు చేస్తూండగా యజ్ఞకర్మయందు నేర్పుగల మరొకడు తటస్థుడై ఏ పనీ చేయక ఋత్విక్కులు యజమానుడు చేస్తూన్న పనులలోని గుణదోషాలను ఏ విధంగా చూస్తూంటాడో అదే విధంగా దేహేంద్రియాలు చేసే పనులలో జోక్యం కలిగించుకొనకుండా ఆ యా పనులు చేస్తూన్న దేహేంద్రియాలను దగ్గరనుండి చూస్తూ ఉండేవాడు, వాటికంటె విలక్షణుడు అయిన అన్యుడు (మరొకడు) ఉపద్రష్ట. లేదా – దేహము నేత్రము మనస్సు బుద్ధి ఆత్మ ఇవి ద్రష్టలు. వాటిలో అన్నిటికంటె బాహ్యద్రష్ట దేహం. అది మొదలు అన్నింటికంటె చాల లోపల ఉన్న, ప్రత్యక్ అయిన, సమీపమునం దున్న ద్రష్ట ఆత్మ. దేనికంటె ఎక్కువ లోపల నున్న మరొక ద్రష్ట లేదో అట్టి ఆత్మ చాల దగ్గర నుండి చూడడంచేత ఉపద్రష్ట అవుతుంది. లేదా యజ్ఞోపద్రష్ట వలె (చిన్మాత్రస్వరూప మైన ఈ ఆత్మ సమస్తమును తెలుసుకొంటుంది కాబట్టి ఉపద్రష్ట. (మొదటి ఉపద్రష్ట ఋత్విగ్యజమానుల పనులలోని గుణదోషాలను చూస్తాడు అని చెప్పబడింది. ఇక్కడ గుణదోషదృష్టి లేకుండా సమస్త వ్యవహారాలను చూడడం అనే దానిలోనే సామ్యం అని సూచించబడింది). అనుమన్తా – అనుమననం అనగా అనుమోదించడం. కొందరు ఆ యా పనులు చేస్తూండగా ఆ పనుల విషయంలో సంతోషం. అది చేసేవాడు అనుమంత. లేదా దేహేంద్రియాలు ఆ యా పనులు చేస్తూన్నప్పుడు (ఆత్మ)

తాను చేయకపోయినా చేస్తున్నట్లు, ఆ పనులకు అనుకూలంగా ఉన్నట్లు కనబడుతుంది; అందుచేత అనుమంత. లేదా తమ తమ పనులు చేయడానికి ఉద్యుక్తులైనవాళ్లని, తాను సాక్షిమాత్రంగానే ఉంటూ, ఎన్నడూ నివారించదు గాన అనుమంత.

భాష్యమ్

భర్తా - భరణం నామ దేహేన్ద్రియమనోబుద్ధీనాం సంహతానాం చైతన్యాత్మ పారార్థ్యేన నిమిత్తభూతేన చైతన్యాభాసానాం యత్ స్వరూపధారణం తత్ చైతన్యాత్మ కృతమేవేతి భర్తా ఆత్మా ఉచ్యతే. భోక్తా - అగ్న్యుష్ణవత్ నిత్యచైతన్యస్వరూపేణ బుద్ధేః సుఖదుఃఖమోహాత్మకాః ప్రత్యయాః సర్వవిషయాః చైతన్యాత్మగ్రస్తాః ఇవ జాయమానాః విభక్తాః విభావ్యన్తే ఇతి భోక్తా ఆత్మా ఉచ్యతే. మహేశ్వరః - సర్వాత్మత్వాత్ స్వతన్త్రత్వాచ్చ మహాన్ ఈశ్వరశ్చ ఇతి మహేశ్వరః. పరమాత్మా దేహాదీనాం బుద్ధ్యన్తానాం ప్రత్యగాత్మత్వేన కల్పితానామ్ అవిద్యయా పరమః ఉత్కృష్టత్వాదిలక్షణః ఆత్మా ఇతి పరమాత్మా. సః అన్తః (తః) 'పరమాత్మా' ఇత్యనేన శబ్దేనచాపి ఉక్తః కథితః శ్రుతౌ. క్వ అసౌ? అస్మిన్ దేహే. పరః అవ్యక్తాత్, "ఉత్తమః పురుషస్త్వన్యః పరమాత్మేత్యు దాహృతః" (15-17) ఇతి యో వక్ష్యమాణః, "క్షేత్రజ్ఞం చాపి మాం విద్ధి" (13.2) ఇతి ఉపన్యస్తః వ్యాఖ్యాయ ఉపసంహృతశ్చ. 22

బాలానందిని

భర్తా ఇతి : భర్తా - భరణ మనగా - సంహతము లైన (అనగా ఒక దానితో ఒకటి కలిసి ఉన్న) దేహేంద్రియమనోబుద్ధులు చైతన్యరూపమైన ఆత్మకొరకై ఉద్దిష్టమై ఉండడం లేని అనే నిమిత్తంచేత చైతన్యం వలె కనబడుతూ వాటి స్వరూపంలో ఉండడం. దానికి కారణం ఆత్మయే గాన భర్త అని చెప్పబడుచున్నది.

వి. ఆత్మ చైతన్యస్వరూపం. దానికి ఉపకరించడం కోసమే దేహేంద్రియమనోబుద్ధులు కలిసిఉన్నాయి. ఈ విధంగా అవి పరార్థములు, తమకంటె పరమైన, ఇతరమైన, ఆత్మకొరకు ఉపకరిస్తాయి. అదే వీటి పారార్థ్యం అనగా. పారార్థ్యంచేత ఈ దేహేంద్రియాలు కలిసి ఉండి చైతన్యరూపమైన ఆత్మతో సంబంధం ఉండడంవల్ల ఇవి కూడ చైతన్యస్వరూపాల వలె కనబడుతున్నాయి. అందుచేత చైతన్యాభాసాలు. ఇవి అలాంటి చైతన్యాభాసరూపంలో సంహతాలై ఉన్నా యంటే అందుకు కారణం చైతన్యస్వరూపమైన ఆత్మయే. అందుచేత ఆత్మ వీటిని పోషించేదిగా ఉంది గాన, చైతన్యాభాసరూపంలో నిలబెట్టుచున్నది గాన, భర్త అని చెప్పబడుచున్నది. అనగా స్వతః అచేతనా లైన దేహేంద్రియాదులను చైతన్యం కలవాటినిగా చేస్తూన్నది గాన అది భర్త అని భావం.

భోక్తా ఇతి :- సమస్త విషయాలకు సంబంధించి బుద్ధిలో పుడుతూ సుఖ-దుఃఖ - మోహాత్మకాలైన ప్రత్యయాలు (వృత్తులు, జ్ఞానాలు) అగ్నియొక్క ఉష్ణం (వేడి వలె నిత్యమైన చైతన్యస్వరూపంతో చైతన్యరూప మైన ఆత్మచేత మ్రింగబడినది వలె వేరు వేరుగా కనబడుతున్నాయి. అందుచేత ఆత్మ భోక్త అని చెప్పబడుచున్నది.

వి. బుద్ధి సహజంగా అచేతనమైనది. అది చైతన్యస్వరూప మైన ఆత్మకు సన్నిహితంగా ఉండడంచేత నిత్యమైన ఆ ఆత్మచైతన్యం, అగ్నియొక్క ఉష్ణత్వం దగ్గర నున్న వస్తువుల మీద సంక్రమించి వాటిని ఆశ్రయించినట్లు, బుద్ధిని ఆశ్రయించి, ఆ యా విషయాలను గూర్చి బుద్ధిలో కలిగే సుఖ-దుఃఖ మోహాత్మకాలైన వృత్తులను కూడ వ్యాపిస్తుంది. అగ్నిలోని వేడి ప్రక్క నున్న నీటిలో వ్యాపించి దానిలో వేడి ఉన్నట్లు చూపడం ఎలాంటిదో చైతన్యం బుద్ధిని బుద్ధివృత్తులనూ ఆక్రమించి సహజంగా అచేతనాలైన వాటిని చైతన్యవంతములుగా కనబడే టట్లు చేస్తుంది. ఇలా చేయడంచేత ఆత్మ భోక్త అని చెప్పబడుచున్నది అని భావం.

మహేశ్వర ఇతి :- ఆత్మ సర్వాత్మకము, స్వతంత్రము కూడ. ఈ విధంగా గొప్పది, నియామకమూ కూడ గాన ఇది మహేశ్వరు డని చెప్పబడుచున్నది. పరమాత్మా - దేహం మొదలు బుద్ధి వరకు ఉన్న వన్నీ అవిద్యచేత ప్రత్యగాత్మగా కల్పించబడుతున్నాయి. వాటి అన్నింటిలోకీ ఆత్మ పరమము. ఉపద్రష్టృత్వం మొదలైన లక్షణాలు గలది గాన పరమాత్మ. అందుచేతనే ఇది శ్రుతిలో పరమాత్మ అనే శబ్దంచేత కూడ చెప్పబడినది. ఇది ఎక్కడ ఉన్నది? **"ఉత్తమః పురుషస్త్వన్యః పరమాత్మేత్యుదాహృతః"** అని ఏది చెప్పబడనున్నదో, దేనిని గూర్చి "క్షేత్రజ్ఞం చాపి మాం విద్ధి" అని చెప్పి, దాని స్వరూపాన్ని వివరించి ఉపసంహారం చేయబడినదో, అవ్యక్తంకంటె పరుడైన ఆ పురుషుడు దేహంలోనే ఉన్నాడు.

భా.అ.ప్ర. "ఈ దేహంలో ఉన్న పురుషుడు దేహప్రవృత్తికి అనుగుణమైన సంకల్పాదులచేత దేహానికి ఉపద్రష్ట, అనుమంత కూడ అవుతాడు. అట్లే దేహానికి భర్త దేహవ్యాపారంవల్ల కలిగే సుఖదుఃఖాలకు భోక్త కూడ అవుతాడు. అట్లే దేహాన్ని భరించడంచేత, దేహాన్ని నియమించడంచేత, దేహానికి శేషి అవడంచేత దేహేంద్రియ మనస్సులకు మహేశ్వరుడు కూడ అవుతాడు. దేహేంద్రియమనస్సులను గూర్చి పరమాత్మ అని కూడ చెప్పబడుతున్నాడు. ఇతడు పరిచ్ఛిన్నం కాని జ్ఞానశక్తి గల పరపురుషుడు. అనాదిగా ఉన్న ప్రకృతి సంబంధంచేత ఏర్పడిన గుణసంగంవల్ల కేవలం ఈ దేహానికి మాత్రమే మహేశ్వరుడు. దేహమాత్రానికే పరమాత్మ" అని శ్రీరామానుజాచార్యుల వ్యాఖ్య అనుచితము.

స్థూలదేహం ప్రవర్తించడానికి అనుగుణమైన సంకల్పం సూక్ష్మదేహమైన మనస్సు యొక్క ధర్మమే కాని పురుషునిది కాదు. అధ్యాస ఉంటే తప్ప ఒకదాని ధర్మం మరొకదానికి చెందదు కదా? నువ్వు అధ్యాసను అంగీకరించవు. పరమేశ్వరునికి కూడ ఈక్షణం స్వాభావికమే అని కదా నువ్వు అంటావు! అలాంటప్పుడు జీవుని మాట చెప్పాలా? అగ్నికి

వేడి వలె జీవునకు సంకల్పం స్వాభావికమే అయితే అది సుషుప్తిలో కూడ ఉండాలి; మూర్ఛాదిసమయాలలో కూడ కనబడాలి; కనబడడం లేదు. అందుచేత సంకల్పం పురుషధర్మం కాదు. అట్లే సుఖదుఃఖభోగం బుద్ధిదర్మం. అందుచేత సుఖదుఃఖభోక్తృత్వ రూపమైన సంసారం పురుషునికి సంభవించదు. **"అవికార్యోఽ యముచ్యతే"** అని ఇక్కడనే చెప్పబడింది కదా? అలాంటప్పుడు సుఖదాభోగరూప మైన వికారం వీని కెలా ఉంటుంది? గుణసంగంవల్ల కలుగుతుం దనడానికి కూడ వీలు లేదు. **"అసంగో హ్యయం పురుషః"** అను శ్రుతి ననుసరించి పరుషునికి ప్రకృతిసంగం గాని గుణసంగం గాని ఉండడానికి వీలు లేదు. మా మతంలోనైతే సంగం మిథ్యయే గాన ఆత్మకు ప్రకృతిగుణాదిసంగం కుదురుతుంది. నువ్వు సంగం సత్యం అంటావు కదా?

నీ వంటి విద్వాంసులు పురుషుని ఐశ్వర్యానికి సంకోచం (తగ్గించడం సంకోచం) కలిగిస్తారేమో నని భగవంతు డైన బాదరాయణుడు మహేశ్వరశబ్దం ప్రయోగించాడు. అయినా కూడ "దేహాదులవిషయంలో మహేశ్వరుడు" అని నువ్వు మహేశ్వరత్వాన్ని పరిమితం చేస్తాంటే నిన్ను శాసించగలవా డెవడు! ఈ విధంగా మహచ్ఛబ్దాన్ని నిరర్థకం చేస్తూన్న నీ మూలచ్ఛేదకపాండిత్యం ఎలాంటిదో స్పష్టంగా తెలుస్తూనే ఉంది. ఇక్కడ ప్రయోగించిన మహచ్ఛబ్దం **"మాయాం తు ప్రకృతిం విద్యాన్మాయినం తు మహేశ్వరమ్"** అను శ్రుతిలోని మహేశ్వరశబ్దాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రయోగించినది. "దేహేంద్రియమనస్సులను గూర్చి" అని మూలంలో లేని అర్థం ఎలా కల్పిస్తావు? మహేశ్వరశబ్దమూ పరమాత్మశబ్దమూ కూడ ఈశ్వరునియందు రూఢ మైనవి. జీవేశ్వరులకు భేదం ఉంటే ఆ శబ్దాలను జీవుని విషయంలో ఎలా ప్రయోగిస్తారు? "దేహమాత్రపరమేశ్వరః" "దేహమాత్రపరమాత్మా" అని గీతా శాస్త్రంలో ఎక్కడ నైనా ప్రయోగం ఉందా?

మరొక విషయం – జీవునికి దేహప్రాప్తి కర్మాధీన మైనది. అలాంటప్పుడు దేహాన్ని గూర్చి మాత్రం జీవునికి ఈశ్వరత్వం ఎక్కడుంది? వ్యాధిగ్రస్తుడు అడుగు తీసి అడుగు కూడ వేయజాలడు కదా? దేహం విషయంలో స్వాతంత్ర్యం ఉంటే జీవు లందరూ కాలవశం వల్ల పరమప్రేమాస్పదమైన దేహాన్ని విడచి యమలోకాదులకు ఎందుకు వెడతారు? అందుచేత కాలకర్మాదిపరాధీన మైన దేహం విషయంలో జీవునికి స్వాతంత్ర్యం లేదు. ఈ విధంగా దేహం విషయంలో కూడ వీనికి ఈశ్వరత్వం లేనప్పుడు మహేశ్వరత్వం ఎక్కడినుండి వస్తుంది? ఈ విధంగా జీవునికి దేహం విషయంలో ఏ మాత్రమూ స్వాతంత్ర్యం లేదు. వానికి సంకల్పాది విషయంలో కూడ స్వాతంత్ర్యం లేదు. సంకల్పాదికం కూడ కర్మాధీనమే... సత్యమైన పరమేశ్వరత్వాదికం పరమాత్మకే ఉంది. పరమాత్మాభిన్ను డవడంచేతనే జీవునకు కూడ అవి చెప్పబడుచున్నాయి. (భా. అ. ప్ర. పే. 126-27) 22

భాష్యమ్

తమేతం యథోక్తలక్షణమ్ ఆత్మానమ్ –

మూ. య ఏవం వేత్తి పురుషం ప్రకృతిం చ గుణైః సహ,
సర్వథా వర్తమానోఽపి న స భూయోఽభిజాయతే. 23

బాలానందిని

తమితి :- అట్టి, ఇంతవరకు చెప్పబడిన లక్షణాలు గల ఆత్మయైన –

ప్ర.అ. **య ఏవమితి.** పురుషమ్ = పురుషుణ్ణి, గుణైః చ సహ = గుణాలతో కూడ, ప్రకృతిం చ = ప్రకృతినీ, యః = ఎవడు, ఏవమ్ = ఈ విధంగా, వేత్తి = తెలుసుకొంటాడో, సః = అతడు, సర్వథా = అన్ని విధాల, వర్తమానః అపి = ప్రవర్తిస్తున్నా కూడ, భూయః = మరల, న అభిజాయతే = పుట్టడు.

భాష్యమ్

యః ఏవం యథోక్తప్రకారేణ, వేత్తి పురుషం సాక్షాత్ అహమితి, ప్రకృతిం చ యథోక్తామ్ అవిద్యాలక్షణాం గుణైః స్వవికారైః సహ, నివర్తితామ్ అభావమ్ ఆపాదితాం విద్యయా, సర్వథా సర్వప్రకారేణ వర్తమానః అపి సః భూయః పునః పతితే అస్మిన్ విద్వచ్ఛరీరే, దేహాన్తరాయ న అభిజాయతే, న ఉత్పద్యతే. దేహాన్తరం న గృహ్ణాతి ఇత్యర్థః. అపిశబ్దాత్ కిము వ్యక్తవ్యం స్వవృత్తః న జాయతే ఇతి అభిప్రాయః.

నను యద్యపి జ్ఞానోత్పత్త్యనన్తరం పునర్జన్మాభావః ఉక్తః తథాపి ప్రాగ్ జ్ఞానోత్పత్తేః కృతానాం కర్మణామ్, ఉత్తరకాలభావినాం చ యాని చ అతిక్రాన్తానేకజన్మకృతాని తేషాం ఫలమ్ అదత్త్వా నాశో న యుక్తః ఇతి స్యుః త్రీణి జన్మాని; కృతవిప్రణాశో హి న యుక్తః ఇతి, యథా ఫలే ప్రవృత్తానామ్ ఆరబ్ధజన్మనాం కర్మణామ్. న చ కర్మణాం విశేషః అవగమ్యతే. తస్మాత్ త్రిప్రకారాణ్య పి కర్మాణి త్రీణి జన్మాని ఆరభేరన్, సంహతాని వా సర్వాణి ఏకం జన్మ ఆరభేరన్. అన్యథా కృతవినాశే సతి సర్వత్ర అనాశ్వాసప్రసంగః, శాస్త్రార్థానర్థక్యం చ స్యాత్ ఇత్యతః ఇదమ్ అయుక్తం "న స భూయోఽభిజాయతే" ఇతి.

బాలానందిని

య ఇతి :- ఎవడు ఈ విధంగా పైన చెప్పిన విధంగా, ఆ పురుషుడు సాక్షాత్తు నేనే అని పురుషుణ్ణి గూర్చి తెలుసుకొంటాడో, పైన చెప్పిన అవిద్యారూప మైన ప్రకృతిని విద్యచేత, దాని గుణాలతో కూడ, వికారాలతో కూడ, నివర్తింపబడినదానినిగా, లేకుండా

చేయబడినదానినిగా తెలుసుకొంటాడో అతడు అన్ని విధాల ప్రవర్తిస్తున్నా కూడ (ఏ విధమైన జీవితం గడుపుతున్నా కూడ), జ్ఞానం కలిగిన ఈ శరీరం రాలిపోయిన తరవాత మళ్లీ పుట్టడు, మరొక దేహం ధరించడు అని అర్థం. స్వవృత్తంలో (తాను ఏట్టి జీవిత విధానంలో ఉండాలో దానిలో) ఉన్నవాడు మళ్లీ పుట్టడు అని నేరుగా చెప్పాలా అని అపి శబ్దం సూచిస్తున్నది.

(ఆశంక) జ్ఞానం కలిగిన తరవాత పునర్జన్మ ఉండదు అని చెప్పినా కూడ జ్ఞానం కలగడానికి పూర్వం చేసిన కర్మలు, తరువాత (జ్ఞానం కలిగిన తరువాత) చేసిన కర్మలు, గడచిన అనేక జన్మలలో చేసిన కర్మలు తమ తమ ఫలం ఇవ్వకుండా నశించడం యుక్తం కాదు గాన (కనీసం) మూడు జన్మలు కలుగుతాయి. చేసినది నశించడం యుక్తం కాదు కదా? ఫలం ఇవ్వడానికి ప్రారంభించిన కర్మలు ఏ విధంగా తమ ఫలాన్ని ఇస్తున్నాయో (పైన చెప్పిన మూడు విధాల కర్మల విషయం కూడ అట్లే). కర్మలలో (ఇది ఫలం ఇస్తుంది, ఇది ఇవ్వదు అని) విశేషం ఏదీ కనబడదు కదా? అందువల్ల మూడు రకాలైన కర్మలు మూడు జన్మలు ఆరంభించాలి, లేదా మూడూ కలిసి ఒక జన్మనైనా ప్రారంభించాలి. అలా కాక చేసిన కర్మ (ఫలం ఇవ్వకుండా) నశిస్తుంది అని అంటే ఇంక దేనిమీదా విశ్వాసం ఉండదు; శాస్త్రం కూడ వ్యర్థం అవుతుంది. అందుచేత "న స భూయోఽభిజాయతే" అని చెప్పడం యుక్తంగా లేదు.

భాష్యమ్

న; "క్షీయన్తే చాస్య కర్మాణి" (ము. ఉ. 2. 2. 8) "బ్రహ్మవేద బ్రహ్మైవ భవతి" (ము. ఉ. 3. 2. 9) "తస్య తావదేవ చిరమ్" (ఛా. ఉ. 6. 14. 2.) "ఇషీకాతూలవత్ సర్వాణి కర్మాణి ప్రదూయన్తే" (ఛా. ఉ. 5. 24. 3. అర్థతోనువాదం) ఇత్యాదిశ్రుతిశతేభ్యః ఉక్తః విదుషః సర్వకర్మదాహః. ఇహాపి చ ఉక్తః "యథైధాంసి" (4. 37) ఇత్యాదినా సర్వకర్మదాహః; వక్ష్యతి చ (18. 66) ఉపపత్తేశ్చ – అవిద్యాకామక్లేశబీజనిమిత్తాని హి కర్మాణి జన్మాన్తరాఙ్కురమ్ ఆరభన్తే. ఇహా పి చ సాహంకారాభిసంధీని కర్మాణి ఫలారమ్భకాణి న ఇతరాణి ఇతి తత్ర త్ర భగవతా ఉక్తమ్.

బీజాన్యగ్న్యుపదగ్ధాని న రోహన్తి యథా పునః,
జ్ఞానదగ్ధైస్తథా క్లేశైర్నాత్మా సంపద్యతే పునః. (వన. ప. 200. 108) ఇతి చ.

బాలానందిని

నేతి :- (సమాధానం) –అది కాదు. "క్షీయన్తే చాస్య కర్మాణి" (వీని కర్మలు క్షీణిస్తాయి), "బ్రహ్మ వేద బ్రహ్మైవ భవతి" (బ్రహ్మను తెలుసుకొన్నవాడు బ్రహ్మయే అవుతాడు)

"తస్య తావదేవ చిరమ్" (వానికి ప్రారబ్ధకర్మక్షయం కలగడమే ఆలస్యం వెంటనే మోక్షం కలుగుతుంది), "ఇషీకాతూలవత్... ప్రదూయన్తే" (ముంజి గడ్డిలోని దూదివలె జ్ఞానంచేత అన్ని కర్మలూ నశింపచేయబడతాయి) ఇత్యాదులైన వందలకొలది శ్రుతులు విద్వాంసుని సర్వకర్మలు దగ్ధము లౌతా యని చెప్పుచున్నాయి. భగవద్గీతలో కూడ 'యథైధాంసి' ఇత్యాదికంచేత సర్వకర్మదాహం చెప్పబడింది. ముందు కూడ చెప్పబోతాడు. యుక్తివల్ల కూడ ఇది యుక్తం. అవిద్య, కామం, క్లేశం అనే బీజాలు నిమిత్తాలుగా గల కర్మలు మరొక జన్మను ఆరంభిస్తాయి కదా? (జన్మకు కారణం అవుతాయి కదా?). అహంకారంతోను ఫలాపేక్షతోను చేసిన కర్మలే ఫలం ఇస్తాయి. ఇతరకర్మలు ఇవ్వవు అని అక్కడక్కడ, భగవద్గీతలో కూడ భగవంతుడు చెప్పి ఉన్నాడు. "బీజాని.. పునః" (అగ్నిచేత మాడ్చబడిన విత్తనాలు ఏ విధంగా మరల మొలవవో అట్లే జీవుడు, జ్ఞానంచేత కాల్చివేయబడిన క్లేశములచేత మళ్లీ జన్మ ఎత్తడు) అని కూడ చెప్పబడింది.

భాష్యమ్

అస్తు తావత్ జ్ఞానోత్పత్త్యుత్తరకాలకృతానాం కర్మణాం జ్ఞానేన దాహః, జ్ఞాన సహభావిత్వాత్. న తు ఇహ జన్మని జ్ఞానోత్పత్తేః ప్రాక్ కృతానామ్, అతీతానేకజన్మాన్తర కృతానాం చ దాహః యుక్తః. న; "సర్వకర్మాణి" ఇతి విశేషణాత్. జ్ఞానోత్తరకాలభావి నామేవ సర్వకర్మణామ్ ఇతి చేత్, న; సంకోచే కారణానుపపత్తేః. యత్తు ఉక్తం యథా వర్తమానజన్మారమ్భకాణి కర్మాణి న క్షీయన్తే ఫలదానాయ ప్రవృత్తాన్యేవ సత్యపి జ్ఞానే తథా అనారబ్ధఫలానామపి కర్మణాం క్షయః న యుక్తః ఇతి, తదసత్. కథమ్? తేషాం ముక్తేషువత్ ప్రవృత్తఫలత్వాత్. యథా పూర్వం లక్ష్యవేధాయ ముక్తః ఇషుః ధనుషః లక్ష్యవేధోత్తరకాలమపి ఆరబ్ధవేగక్షయాత్ పతనేనైవ నివర్తతే ఏవం శరీరారమ్భకం కర్మ శరీరస్థితిప్రయోజనే నివృత్తేఽపి ఆసంస్కారవేగక్షయాత్ పూర్వవత్ వర్తతే ఏవ. స ఏవ ఇషుః ప్రవృత్తినిమిత్తానారబ్ధవేగః తు అయుక్తః ధనుషి ప్రయుక్తః అపి ఉపసంహ్రియతే తథా అనారబ్ధఫలాని కర్మాణి స్వాశ్రయస్థాన్యేవ జ్ఞానేన నిర్బీజీక్రియన్తే ఇతి పతితే అస్మిన్ విద్వచ్ఛరీరే "న స భూయోఽభిజాయతే" ఇతి యుక్తమేవ ఉక్తమ్ ఇతి సిద్ధమ్. 23

బాలానందిని

అస్త్వితి :- (ఆ క్షేపం) జ్ఞానం కలిగిన తరవాత చేసిన కర్మలు జ్ఞానంతో కలిసి ఉన్నాయి గాన వాటిని జ్ఞానం కాల్చి వేస్తే కాల్చివేయవచ్చును. కాని ఈ జన్మలోనే జ్ఞానం

కలగడానికి పూర్వం చేయబడినవీ, గడిచిన అనేకజన్మాంతరాలలో చేయబడినవీ అయిన కర్మలను దహించడం యుక్తం కాదు. (సమాధానం) అట్లు కాదు. "సర్వకర్మాణి" అని విశేషణం ఉంది కదా? విశేషించి చెప్పబడినది కదా? (ప్రశ్న) జ్ఞానం కలిగిన తరవాత చేసిన సర్వకర్మలు అని అర్థం చెప్పాలి అని అంటే (సమాధానం) అది కాదు. అలా అర్థాన్ని సంకోచించడానికి తగిన ఉపపత్తి లేదు. వర్తమానమైన జన్మకు కారణమైన కర్మలు ఏ విధంగా క్షీణించవో, జ్ఞానం కలిగినా కూడ ఫలం ఇవ్వడానికే ప్రవర్తిస్తాయో, అట్లే ఫలం ఇవ్వడానికి ప్రారంభించని కర్మల క్షయం కూడ యుక్తం కాదు అని ఏది (పూర్వపక్షిచేత) చెప్పబడిందో అది యుక్తం కాదు. ఎట్లు? అవి (ప్రారబ్ధకర్మలు) విడవబడిన బాణం వలె ఫలం ఇవ్వడానికి ప్రారంభించాయి. ముందుగా ఒక లక్ష్యాన్ని కొట్టడానికి ధనస్సునుండి విడవబడిన బాణం ఆ లక్ష్యాన్ని కొట్టిన తరవాత కూడ ప్రారంభించిన వేగం క్షీణించిన తరవాత పడిపోవడంచేత మాత్రమే ఏ విధంగా నివర్తిస్తుందో (ఆగిపోతుందో) అట్లే శరీరాన్ని ఇచ్చిన కర్మ శరీరం నిలవడం అనే ప్రయోజనం నివర్తించినా (శరీరం నిలవడం మోక్షంకొరకే గాన మోక్షం అనే ప్రయోజనం పూర్తి అయినా) సంస్కారంవల్ల కలిగిన వేగం క్షీణించే వరకు వెనుకటి వలె ఉండనే ఉంటుంది. అదే బాణం దనస్సుమీద సంధించబడినా కూడ విడవబడనిదై ప్రవృత్తినిమిత్తమైన లక్ష్యాన్ని గూర్చి ప్రారంభించబడని వేగం గలదై ఎట్లు ఉపసంహరించబడుతుందో అట్లే ఫలం ఇవ్వడానికి ప్రారంభించని కర్మలు తమ ఆశ్రయములందు (జీవులయందు) ఉండగానే బీజం లేనివిగా చేయబడతాయి. అందుచేత ఈ విద్వచ్ఛరీరం రాలిపోయిన తరువాత **"న స భూయోఽభిజాయతే"** అని యుక్తంగానే చెప్పబడింది అని నిశ్చయం.

భా.అ.ప్ర. "ప్రకృతిపురుషవివేకసంపన్నుడు, సర్వథా వర్తమానః అపి = దేవమనుష్యాదిదేహాలలో చాల క్లేశంతో ఉన్నా కూడ, భూయః న అభిజాయతే = ప్రకృతితో సంబంధాన్ని పొందదు, ఆత్మను పొందుతాడు" అను శ్రీ రామానుజాచార్యవాఖ్య అయుక్తం. ప్రకృతిపురుషవివేకం ఉన్న వా డనగా విద్వాంసుడు కదా? వానికి దేవాదిదేహాలలో ఉన్నా క్లేశం ఉండదు. ప్రకృతిపురుషవివేకం లేకపోతే అతడు అవిద్వాంసుడే.... (భా.అ.ప్ర.పే. 133)

23

భాష్యమ్

అత్ర ఆత్మదర్శనే ఉపాయవికల్పాః ఇమే ధ్యానాదయః ఉచ్యన్తే –

మూ. ధ్యానేనాత్మని పశ్యన్తి కేచిదాత్మానమాత్మనా,
అన్యే సాంఖ్యేన యోగేన కర్మయోగేన చాపరే. 24

బాలానందిని

అత్రేతి :– ఆత్మదర్శనంకొరకు ధ్యానం మొదలైన ఉపాయవికల్పాలు (ఇష్టానుసారం అనుసరించ దగిన ఉపాయాలు) చెప్పబడుచున్నాయి–

ప్ర.అ. ధ్యానేనేతి :– కే చిత్ = కొందరు, ఆత్మానమ్ = ప్రత్యగాత్మను, ఆత్మనా = అంతఃకరణంచేత, ధ్యానేన = ధ్యానంద్వారా, ఆత్మని = బుద్ధియందు, పశ్యన్తి = చూచుచున్నారు. అన్యే = మరికొందరు, సాంఖ్యేన యోగేన = సాంఖ్యయోగంచేత, అపరే = ఇతరులు, కర్మయోగేన = కర్మయోగంచేత, (ఆత్మను) చూస్తున్నారు.

భాష్యమ్

ధ్యానేన – ధ్యానం నామ శబ్దాదిభ్యః విషయేభ్యః శ్రోత్రాదీని కరణాని మనసి ఉపసంహృత్య మనశ్చ ప్రత్యక్చేతయితరి, ఏకాగ్రతయా యచ్చిన్తనం తత్ ధ్యానమ్. తథా – ధ్యాయతీవ బకః, ధ్యాయతీవ పృథివీ, ధ్యాయన్తీవ పర్వతాః ఇతి ఉపమోపాదానాత్ తైలధారావత్ సంతతః అవిచ్ఛిన్న ప్రత్యయః ధ్యానమ్. తేన ధ్యానేన, ఆత్మని బుద్ధౌ, పశ్యన్తి ఆత్మానం ప్రత్యక్చేతనమ్, ఆత్మనా, ధ్యానసంస్కృతేన అన్తః కరణేన, కే చిత్ యోగినః. అన్యే సాంఖ్యేన యోగేన. సాంఖ్యం నామ – ఇమే సత్త్వరజస్తమాంసి గుణాః మయా దృశ్యాః; అహం తేభ్యః అన్యః, తద్వ్యాపారసాక్షిభూతః నిత్యః గుణవిలక్షణః ఆత్మా ఇతి చిన్తనం సాంఖ్యః యోగః" తేన పశ్యన్తి "**ఆత్మానమ్ ఆత్మనా** ఇతి వర్తతే. కర్మయోగేన – కర్మైవ యోగః. ఈశ్వరార్పణబుద్ధ్యా అనుష్ఠీయమానం ఘటనరూపం యోగార్థత్వాత్ యోగ ఉచ్యతే గుణతః. తేన సత్త్వశుద్ధిజ్ఞానోత్పత్తిద్వారేణ చ అపరే. 24

బాలానందిని

ధ్యానేనేతి :– శ్రోత్రాదీంద్రియాలను శబ్దాదులైన విషయాల వైపు వెళ్లకుండా మనస్సునందు ఉపసంహరించుకొని, మనస్సును ప్రత్యగాత్మయందు నిగ్రహించి (నిలిపి) ఏకాగ్రతతో చింతించడం ధ్యానం. అట్లే – కొంగ ధ్యానం చేస్తున్నట్లున్నది, పృథివి ధ్యానం చేస్తున్నట్లున్నది, పర్వతాలుధ్యానం చేస్తున్నట్లున్నాయి అని ఉపమను చెపుతూండడంవల్ల మధ్య తెగిపోకుండా తైలధార వలె నిరంతరమూ ఉండే జ్ఞానం ధ్యానం. అట్టి ధ్యానంచేత ప్రత్యగాత్మను, ధ్యానసంస్కృతమైన అంతఃకరణంచేత కొందరు యోగులు బుద్ధిలో చూస్తారు. మరి కొందరు సాంఖ్యయోగంచేత చూస్తారు. ఈ సత్త్వరజస్తమోగుణాలు నాకు దృశ్యాలు (వీటిని నేను చూడకలుగుతున్నాను). నేను వాటికంటె వేరు. వాటి వ్యాపారాలకు సాక్షిగా

ఉన్నదీ, నిత్యమూ, గుణాలకంటె విలక్షణమూ అయిన ఆత్మను ఆలోచించడమే సాంఖ్యయోగం. దానిచేత ఆత్మను ఆత్మచేత చూస్తారు. కర్మయోగంచేత - కొన్నింటిని సమకూర్చడం అనేదే కర్మ. దానిని ఈశ్వరార్పణబుద్ధితో చేసినప్పుడు అది యోగానికి ఉపకరిస్తుంది గాన యోగం అని గౌణంగా (లాక్షణికంగా) చెప్పబడుతుంది. అంతః కరణశుద్ధికి జ్ఞానోత్పత్తికీ కారణమైన ఆ కర్మయోగంచేత మరి కొందరు ఆత్మయందు ఆత్మను ఆత్మచేత చూస్తున్నారు.

భా.అ.ప్ర. యోగం కుదిరినవాళ్లకు ధ్యానయోగంలోను, అది కుదరనివాళ్లకు జ్ఞానయోగంలోను, ఉత్తములకు కర్మయోగంలోను అధికారం అని శ్రీరామానుజాచార్యులు చెప్పినది యుక్తంగా లేదు. ఉత్తము లైన విద్వాంసులకు సంన్యాసమునందే కాని కర్మయందు అధికారం లేదు. దేహాద్యభిమానం లేని విద్వాంసులు కర్మ ఎలా చేస్తారు? చిత్తం ఏకాగ్రంగా నిలుపుకొనజాలనివాళ్లకి (ధ్యానయోగం కుదరనివాళ్లకి) జ్ఞానయోగంలో అధికారం అన్నట్లయితే వింధ్యపర్వతం సముద్రంలో తేలాలి. చిత్తసమాధానం ఉంటేనే కదా ఆత్మానాత్మ వివేకం కలిగేది? విక్షిప్తచిత్తం కలవానికి అతిసూక్ష్మమైన ఆత్మయొక్క జ్ఞానం ఎలా కలుగుతుంది? సమాహితచిత్తులకు ధ్యానయోగాపేక్ష కూడ ఉండదు. (భా.అ.ప్ర.పే. 135) 24

మూ. అన్యే త్వేవమజానన్తః శ్రుత్వాన్యేభ్య ఉపాసతే,
తేఽపి చాతితరన్త్యేవ మృత్యుం శ్రుతిపరాయణాః. 25

ప్ర.అ. అన్యే ఇతి :- ఏవమ్ = ఇట్లు, అజానన్తః = తెలుసుకొని, అన్యే తు = మరికొందరైతే, అన్యేభ్యః = ఇతరలనుండి, శ్రుత్వా = విని, ఉపాసతే = ఉపాసిస్తారు. శ్రుతిపారాయణాః = ఇతరులు ఉపదేశించినదానిని వినడమునందు అత్యాసక్తులైన, తే అపి = వారు కూడ, మృత్యుమ్ = మృత్యువును, అతితరన్త్యేవ = తప్పక తరిస్తారు.

భాష్యమ్

అన్యే త్వితి :- అన్యే తు ఏతేషు వికల్పేషు అన్యతమేనాపి ఏవం యథోక్తమ్ ఆత్మానమ్ అజానన్తః, అన్యేభ్యః ఆచార్యేభ్యః శ్రుత్వా "ఇదమేవ చిన్తయత" ఇతి ఉక్తాః ఉపాసతే శ్రద్దధానాః సన్తః చిన్తయన్తి. తేఽపి చ. అతితరన్త్యేవ అతిక్రామన్త్యేవ, మృత్యుం మృత్యుయుక్తం సంసారమ్ ఇత్యేతత్. శ్రుతిపరాయణాః - శ్రుతిః శ్రవణం పరమ్ అయనం గమనం మోక్షమార్గప్రవృత్తౌ పరం సాధనం యేషాం తే శ్రుతిపరాయణాః, కేవలం పరోపదిష్టప్రమాణకాః, వివేకరహితాః ఇత్యభిప్రాయః. కిము వక్తవ్యం ప్రమాణం ప్రతి స్వతన్త్రాః వివేకినః మృత్యుమ్ అతిక్రామన్తి ఇత్యభిప్రాయః. 25

బాలానందిని

అన్యే ఇతి :- మరికొంద రైతే ఈ వికల్పాలలో ఏ ఒక్కదానిచేతనూ కూడ ఆత్మను తెలిసికొనజాలనివారై, ఇతరులనుండి, గురువులనుండి "దీన్ని గూర్చియే చింతించండి (ధ్యానించండి)" అని విని నమ్మకము కలవారై ధ్యానిస్తారు (ఆలోచిస్తారు). వాళ్లు కూడ మృత్యువును, అనగా మృత్యువుతో కూడిన సంసారమును, తప్పక దాటుతారు. మోక్షమార్గంలో ప్రవర్తించడంలో సాధనం ఎవరికో వారు శ్రుతిపరాయణులు. స్వయంగా వివేకం లేక కేవలము పరుల ఉపదేశమే ప్రమాణంగా గ్రహించేవారు అని అభిప్రాయం. ప్రమాణం విషయంలో స్వాతంత్ర్యం ఉండి వివేకవంతులైనవాళ్లు మృత్యువును దాటుతారు అని వేరుగా చెప్పవలెనా అని భావం.

భాష్యమ్

క్షేత్రజ్ఞేశ్వరైకత్వవిషయం జ్ఞానం మోక్షసాధనం **"యద్ జ్ఞాత్వామృతమశ్నుతే"** **(13.12)** ఇత్యుక్తమ్. తత్ కస్మాత్ హేతోః ఇతి తద్ధేతుప్రదర్శనాయ శ్లోకః ఆరభ్యతే. **యస్మాత్ -**

మూ. యావత్సంజాయతే కించిత్ సత్త్వం స్థావరజఙ్గమమ్,
క్షేత్రక్షేత్రజ్ఞసంయోగాత్తద్విద్ధి భరతర్షభ. 26

బాలానందిని

క్షేత్రజ్ఞేతి :- క్షేత్రజ్ఞ - ఈశ్వరుల ఏకత్వాన్ని గూర్చిన జ్ఞానం (జీవాత్మపరమాత్మలు వేరు కారు అనే జ్ఞానం) మోక్షానికి సాధన మని **"యద్ జ్ఞాత్వామృతమశ్నుతే" అను** వాక్యంలో చెప్పబడింది. అది ఎందువల్ల అని దానికి హేతువును చూపడానికై శ్లోకం ప్రారంభించబడుచున్నది -

ప్ర.అ. **యావదితి :-** స్థావరజఙ్గమమ్ = స్థావరజంగమాత్మకమైన, యావత్ = ఏ, కిం చిత్ సత్త్వమ్ = ఒకానొక వస్తువు, జాయతే = పుట్టుచున్నదో, తత్ = అది, క్షేత్రక్షేత్రజ్ఞ సంయోగాత్ = క్షేత్ర - క్షేత్రజ్ఞులు సంయోగంవల్ల (పుట్టుచున్నది) అని, భరతవర్షభ = అర్జునా, విద్ధి = తెలుసుకొనుము.

భాష్యమ్

యావత్ యత్, కిం చిత్, సంజాయతే సముత్పద్యతే, సత్త్వం వస్తు, కిమ్ **అవిశేషేణ?** న ఇత్యాహ - స్థావరజఙ్గమమ్ = స్థావరం జఙ్గమం చ; క్షేత్రక్షేత్రజ్ఞసం**యోగాత్ తత్** జాయతే ఇత్యేవం, విద్ధి జానీహి, హే భతరతర్షభ.

కః పునః అయం క్షేత్రక్షేత్రజ్ఞయోః సంయోగః అభిప్రేతః? న తావత్ రజ్జ్వేవ ఘటస్య అవయవసంశ్లేషద్వారకః సంబన్ధవిశేషః సంయోగః క్షేత్రేణ క్షేత్రజ్ఞస్య సంభవతి; ఆకాశవత్ నిరవయవత్వాత్. నాపి సమవాయలక్షణః, తన్తుపటయోరివ క్షేత్రక్షేత్రజ్ఞయోః ఇతరేతరకార్యకారణభావానభ్యుపగమాత్ ఇతి.

బాలానందిని

యావదితి:- ఏ ఒక్కటి యైనా గాని వస్తువు పుట్టుతున్నదో-అనగా ప్రతీ వస్తువూ కూడానా?కాదంటున్నాడు-స్థావరము జంగమము అయిన వస్తువు.అది క్షేత్రక్షేత్రజ్ఞుల సంయోగంవల్ల పుట్టుచున్నది అని,అర్జునా,తెలుసుకొనుము.

ఈ క్షేత్రక్షేత్రజ్ఞసంయోగం ఏ విధ మైనది అంగీకరించబడుచున్నది?ఘటానికి త్రాడుతో వలె అవయవాల కలయికవల్ల కలిగిన సంయోగరూప మైన సంబంధ మైతే క్షేత్ర-క్షేత్రజ్ఞులకు కుదరదు.ఎందువల్ల ననగా క్షేత్రజ్ఞుడు ఆకాశం వలె అవయవరహితుడు. దారానికి వస్త్రానికీ సమవాయసంబంధం ఉన్నట్లు సమవాయరూప మైన సంబంధం కూడ కుదరదు;ఎందువల్ల ననగా క్షేత్ర-క్షేత్రజ్ఞులలో ఒకటి కారణం రెండవది కార్యం అని అంగీకరించలేదు.

భాష్యమ్

ఉచ్యతే-క్షేత్రక్షేత్రజ్ఞయోః విషయవిషయిణోః భిన్నస్వభావయోః ఇతరేతర తద్ధర్మాధ్యాసలక్షణః సంయోగః క్షేత్రక్షేత్రజ్ఞస్వరూపవివేకాభావనిబన్ధనః,రజ్జుశుక్తికాదీనాం తద్వివేకజ్ఞానాభావాత్ అధ్యారోపితసర్పరజతాదిసంయోగవత్.సః అయమ్ అధ్యాసరూపః క్షేత్రక్షేత్రజ్ఞసంయోగః మిథ్యాజ్ఞానలక్షణః,యథాశాస్త్రం క్షేత్రక్షేత్రజ్ఞ లక్షణభేదపరిజ్ఞాన పూర్వకం ప్రాగ్ దర్శితరూపాత్ క్షేత్రాత్ ముఞ్జాదివ ఇషీకాం యథోక్తలక్షణం క్షేత్రజ్ఞం ప్రవిభజ్య **"న సత్తన్నాసదుచ్యతే"**(13.12)ఇత్యనేన నిరస్తసర్వోపాధివిశేషం జ్ఞేయం బ్రహ్మస్వరూపేణ యః పశ్యతి.క్షేత్రం చ మాయానిర్మిత హస్తి-స్వప్నదృష్టవస్తు-గన్ధర్వనగరాదివత్ అసదేవ సదివ అవభాసతే ఇత్యేవం నిశ్చిత విజ్ఞానః యః తస్య యథోక్త సమ్యగ్దర్శనవిరోధాత్ అపగచ్ఛతి మిథ్యాజ్ఞానమ్ తస్య జన్మహేతోః అపగమాత్.**"య ఏవం వేత్తి పురుషం ప్రకృతిం చ గుణైః సహ"**(13.23) ఇత్యనేన విద్వాన్ భూయః నాభిజాయతే ఇతి యదుక్తం తత్ ఉపపన్నమ్ ఉక్తమ్. 26

బాలానందిని

ఉచ్యతే ఇతి:- సమాధానం చెప్పబడుచున్నది.ఎదుట కనబడుతూన్న త్రాడు వేరు పాము వేరు,ముత్యపు చెప్ప వేరు వెండి వేరు.అయినా కూడ ఆ రెండింటిని వేరు వేరుగా

గుర్తించకపోవడంచేత త్రాడును పామని,ముత్యపుచిప్పను వెండి అనీ అనుకొంటు న్నారు. క్షేత్రం విషయం(తెలియబడేది). క్షేత్రజ్ఞుడు విషయి (తెలుసుకొనేవాడు). ఈ రెండూ పూర్తిగా వేరు వేరు స్వభావం గలవి. వీటి ధర్మాలు కూడ పరస్పరవిరుద్ధ మైనవి. అలాంటి స్థితిలో వాటి స్వరూపాన్ని సరిగా గుర్తించకపోవడంచేత,తత్స్వరూపవివేకం లేకపోవడం చేత,క్షేత్రమే క్షేత్రజ్ఞు డనీ,క్షేత్రజ్ఞుడే క్షేత్ర మనీ(దేహమే ఆత్మ అనీ,ఆత్మయే దేహ మనీ)క్షేత్రము నందు క్షేత్రజ్ఞుని ఆరోపం,క్షేత్రజ్ఞునియందు క్షేత్రంయొక్క ఆరోపం చేయబడుచున్నాయి. అట్లే క్షేత్రధర్మాలైన స్థూలత్వకృశత్వాదులను క్షేత్రజ్ఞునిమీద,క్షేత్రజ్ఞధర్మాలైన చైతన్యాదులను క్షేత్రంమీద ఆరోపించడం జరుగుచున్నది. ఈ ఆరోపణానికి అధ్యాస అని పేరు. (ఈ శ్లోకంలో చెప్పిన క్షేత్రక్షేత్రజ్ఞసంయోగం అనగా ఈ అధ్యాసయే. ఇది పైన చెప్పిన రజ్జువునందు సర్పారోపం(సర్పాధ్యాసం)వంటిది,శుక్తికయందు రజతారోపం(రజతాధ్యాసం) వంటిది. అధ్యాసరూప మైన ఈ క్షేత్రక్షేత్రజ్ఞసంయోగం మిథ్యాజ్ఞాన(అసత్యజ్ఞాన)లక్షణ మైనది (మిథ్యాజ్ఞానమే). శాస్త్రానుసారం క్షేత్ర-క్షేత్రజ్ఞుల లక్షణాలను(స్వరూపాలను)వాటి మధ్య నున్న భేదాన్ని తెలిసికొని వెనుక చెప్పిన స్వరూపం గల క్షేత్రంనుండి వెనుక చెప్పిన లక్షణం గల క్షేత్రజ్ఞుణ్ణి, ముంజగడ్డి నుండి ఇషీకను (ఒక గడ్డి లేదా ముంజగడ్డిలోని లోపలి ఈను) వలె వేరు చేసి,"న సత్తన్నాసదుచ్యతే"అని వెనుక చెప్పిన విధంగా) ఎవడైతే సమస్తమైన ఉపాధివిశేషాలను(లేదా ఉపాధులను ఇతరవిశేషాలను)దూరం చేసిన జ్ఞేయమైన బ్రహ్మను దాని యథార్థస్వరూపంలో చూస్తాడో(తెలుసుకొంటాడో),క్షేత్రం మాయానిర్మితమైన గజము వలె,స్వప్నంలో చూచిన వస్తువు వలె,గంధర్వనగరాదికం వలె అసత్తే అయినా కూడ సత్తు వలె భాసిస్తూన్నది అని నిశ్చితమైన జ్ఞానం కలవాడై ఉంటాడో, వాని మిథ్యాజ్ఞానం పైన చెప్పిన సమ్యగ్దర్శనానికి (తత్త్వజ్ఞానానికి)విరుద్ధం అవడంచేత నశిస్తుంది. జన్మకు హేతువైన ఆ మిథ్యాజ్ఞానం తొలగి పోవడంవల్ల "య ఏవం వేత్తి పురుషం ప్రకృతిం చ గుణైః సహ"అను శ్లోకంచేత విద్వాంసుడు మరల జనించడు అని ఏది చెప్పబడినదో అది యుక్తియుక్తంగానే చెప్ప బడింది. 26

భాష్యమ్

"న స భూయోఽభిజాయతే"(13.23)ఇతి సమ్యగ్దర్శనఫలమ్ అవిద్యాది సంసారబీజనివృత్తిద్వారేణ జన్మాభావః ఉక్తః. జన్మకారణం చ అవిద్యానిమిత్తః క్షేత్ర క్షేత్రజ్ఞసంయోగః ఉక్తః. అతః తస్యాః అవిద్యాయాః నివర్తకం సమ్యగ్దర్శనమ్ ఉక్తమ్ అపి పునః శబ్దాన్తరేణ ఉచ్యతే-

మూ. సమం సర్వేషు భూతేషు తిష్ఠన్తం పరమేశ్వరమ్,
వినశ్యత్స్వవినశ్యన్తం యః పశ్యతి స పశ్యతి. 27

బాలానందిని

నేతి:- "న స భూయోఽభిజాయతే"అని అవిద్య మొదలైన సంసారబీజాలు నివర్తించడం ద్వారా జన్మ లేకపోవడమే సమ్యగ్దర్శనానికి ఫలం అని చెప్పబడింది.అవిద్య కారణంగా గల (అవిద్యవల్ల కలిగిన)క్షేత్రక్షేత్రజ్ఞసంయోగం జన్మకు కారణం అని చెప్పబడింది.అందువల్ల ఆ అవిద్యను తొలగించే సమ్యగ్దర్శనం చెప్పబడినా కూడ మళ్లీ వేరు మాటలచేత చెప్పబడుచున్నది-

ప్ర.అ. సమమితి:- సర్వభూతేషు=సమస్తభూతములలో,సమమ్=సమంగా, తిష్ఠన్తమ్ =ఉంటున్న,వినశ్యత్సు=(దేహాదులు)నశిస్తూండగా,అవినశ్యన్తమ్=నశించని, పరమేశ్వరమ్ =పరమేశ్వరుణ్ణి,యః=ఎవడు,పశ్యతి=చూస్తాడో,సః=అతడే,పశ్యతి= చూస్తున్నాడు.

భాష్యమ్

సమం నిర్విశేషం,తిష్ఠన్తం స్థితిం కుర్వన్తం;క్వ?సర్వేషు భూతేషు బ్రహ్మాది స్థావరాన్తేషు ప్రాణిషు,కమ్?పరమేశ్వరం,దేహేన్ద్రియమనోబుద్ధ్యవ్యక్తాత్మనః అపేక్ష్య పరమేశ్వరః తం.సర్వేషు భూతేషు సమం తిష్ఠన్తమ్. తాని విశినష్టి వినశ్యత్సు ఇతి. తం చ పరమేశ్వరమ్ అవినశ్యన్తమ్ ఇతి భూతానాం పరమేశ్వరస్య చ అత్యన్తవైలక్షణ్య ప్రదర్శనార్థమ్.కథమ్?సర్వేషాం హి భావవికారాణాం జనిలక్షణః భావవికారః మూలమ్;జన్మోత్తరభావినః అన్యే సర్వే భావవికారాః.వినాశాత్ పరః న కశ్చిత్ అస్తి భావవికారః, భావాభావాత్. సతి హి ధర్మిణి ధర్మాః భవన్తి. అతః అన్త్యభావ వికారాభానువాదేన పూర్వభావినః సర్వే భావవికారాః ప్రతిషిద్ధాః భవన్తి సహ కార్యైః తస్మాత్ సర్వభూతవైలక్షణ్యమ్ అత్యన్తమేవ పరమేశ్వరస్య సిద్ధం నిర్విశేషత్వమ్ ఏకత్వం చ. యః ఏవం యథోక్తం పరమేశ్వరం పశ్యతి సః పశ్యతి. నను సర్వోఽపి లోకః పశ్యతి,కిం విశేషణేన ఇతి? సత్యమ్; పశ్యతి, కిం తు విపరీతం పశ్యతి. అతః విశినష్టి స ఏవ పశ్యతీతి. యథా తిమిరదోషదృష్టిః అనేకం చన్ద్రం పశ్యతి తమపేక్ష్య ఏకచన్ద్రదర్శీ విశిష్యతే స ఏవ పశ్యతీతి. తథైవ ఇహాపి ఏకమ్ అవిభక్తం యథోక్తమ్ ఆత్మానం యః పశ్యతి సః విభక్తానేకాత్మవిపరీతదర్శిభ్యః విశిష్యతే స ఏవ పశ్యతీతి. ఇతరే పశ్యన్తః అపి న పశ్యన్తి. విపరీతదర్శిత్వాత్. అనేక చన్ద్రదర్శివత్ ఇత్యర్థః. 27

బాలానందిని

ఏవమితి :- సమంగా, ఏ విశేషమూ (లేదా) లేకుండా, ఉంటున్న. ఎక్కడ? బ్రహ్మాది స్థావరాంతము లైన భూతాలలో, ప్రాణులలో. ఎవనిని? పరమేశ్వరుని. దేహ - ఇంద్రియ మనో - బుద్ధి - అవ్యక్త - జీవాత్మాపేక్షచేత (దేహాదులదృష్ట్యా) పరమేశ్వరు

డైనవానిని సమస్తభూతాలలో సమంగా ఉంటున్నవానిని. ఆ భూతాలను వినశ్యత్సు అని విశేషిస్తున్నాడు. వాటిలోని విశేషాన్ని చెపుతున్నాడు. ఆ పరమేశ్వరు డైతే నశించనివాడు అని చెప్పడం భూతాలకీ పరమాత్మకీ మధ్య నున్న అత్యధికమైన వైలక్షణాన్ని చూపడం కోసం. ఎట్లు? అన్ని భావవికారాలకు పుట్టడం అనే భావవికారం మూలం. వినాశం వరకూ ఉన్న భావవికారాలన్నీ పుట్టిన తరువాత కదా కలుగుతాయి? వినాశం తరవాత భావమే (పదార్థమే) లేదు గాన ఏ భావవికారమూ కూడ ఉండదు. ధర్మి (ధర్మాలు కలది) ఉంటే కద ధర్మా లుండేది? అందువల్ల చివరి భావవికారం లేదు అని అనువదించడం వల్ల (తెలిసిన ఉన్న, విషయాన్ని చెప్పడంవల్ల) దానికి ముందు ఉండే అన్ని భావవికారాలు వాటి కార్యాలతో సహా నిషేధింపబడి నట్లవుతుంది. అందుచేత పరమేశ్వరునికి నిర్విశేషత్వం (భావవికాలేవీ లేకపోవడంచేత) ఏకత్వమూ (అన్ని ప్రాణులలోను సమంగా ఉండడంచేత) సర్వభూతాల దృష్ట్యా పూర్తి వైలక్షణ్యం (భేదం) సిద్ధిస్తుంది.

వి. భావం అనగా పదార్థం, వస్తువు, ప్రతీ భావానికీ ఆరు వికారా లుంటాయి. **జాయతే** (పుడుతుంది), **అస్తి** (ఉన్నది), **వర్ధతే** (పెరుగుతుంది) **విపరిణమతే** (మార్పులు చెందుతుంది) **అపక్షీయతే** (క్షీణిస్తుంది. తరుగుతుంది). **నశ్యతి** (నశిస్తుంది) అనేవి ఆరు భావవికారాలు. ఈ భావవికారాల కార్యాలు కొంతకాలం పాటు ఆ వికారాలతో కలిసి ఉండే వాటి ఆధారాలైన వస్తువులే.

య ఇతి :- ఎవడైతే పైన చెప్పబడిన పరమేశ్వరుణ్ణి చూస్తాడో అతడే చూస్తాడు. (ఆశంక) ప్రతీవాడు చూస్తూనే ఉంటాడు కదా, అందుచేత ఎవడు చూస్తాడో అతడే చూస్తాడు అని ప్రత్యేకంగా (విశేషించి) చెప్పడం ఎందుకు? (సమాధానం) నిజమే చూస్తాడు కాని విపరీతంగా చూస్తాడు. అందుచేత "స ఏవ పశ్యతి" (అతడే చూస్తాడు) అని విశేషించి చెపుతున్నాడు. తిమిరదోషం ఉన్న చూపు కలవాడు అనేక చంద్రులను చూస్తుండగా వానిని అపేక్షించి (వానిని దృష్టిలో పెట్టుకొని) ఒక చంద్రుణ్ణి చూచేవాడు "స ఏవ పశ్యతి" అని ఎట్లు విశేషించి చెప్పబడతాడో అట్లే ఇక్కడ కూడ విభక్తము కాని (అనేకము కాని) ఒకే ఆత్మను పైన చెప్పిన విధంగా ఎవడు చూస్తాడో అతడు "అతడే చూస్తాడు" అని విపరీతదృష్టి కలవాడై విభక్తములైన అనేకములైన ఆత్మలను చూచేవాళ్లనుండి విశేషించి చెప్పబడుతున్నాడు. ఇతరులు అనేకచంద్రులను చూచేవారి వలె విపరీతంగా చూడడంచేత చూస్తూన్నా కూడ చూడడంలేదు అని అర్థం. 27

భాష్యమ్

యథోక్తస్య సమ్యగదర్శనస్య ఫలవచనేన స్తుతిః కర్తవ్యా ఇతి శ్లోకః ఆరభ్యతే-

మూ. **సమం పశ్యన్ హి సర్వత్ర సమవస్థితమీశ్వరమ్,**
న హినస్త్యాత్మనాత్మానం తతో యాతి పరాం గతిమ్. 28

బాలానందిని

యథోక్తస్యేతి :- వెనుక చెప్పబడిన సమ్యగ్దర్శనానికి ఫలం చెప్పడంచేత దాని స్తుతి చెయ్యాలి అనే అభిప్రాయంతో శ్లోకం ప్రారంభించబడుచున్నది -

ప్ర. అ. సమమితి :- సర్వత్ర = అన్ని ప్రాణులయందు, సమవస్థితమ్ = ఉన్న, ఈశ్వరమ్ = ఈశ్వరుణ్ణి, సమమ్ = సమంగా, పశ్యన్ = చూచుచున్నవాడు, ఆత్మనా = తనచేత, ఆత్మానమ్ = తనను, (ఎందువల్ల) న హినస్తి = హింసించడో, తతః = అందువల్ల, పరాం గతిమ్ = ఉత్తమగతిని, యాతి = పొందుతాడు.

భాష్యమ్

సమం పశ్యన్ ఉపలభమానః. యస్మాత్ సర్వత్ర సర్వభూతేషు, సమవస్థితం తుల్యతయా అవస్థితమ్ ఈశ్వరమ్ అతీతానన్తరశ్లోకోక్తలక్షణమిత్యర్థః.సమం పశ్యన్. కిమ్? న హినస్తి హింసాం కరోతి ఆత్మనా స్వేనైవ స్వమ్ ఆత్మామ్. తతః తదహింసనాత్ యాతి పరాం గతిమ్ మోక్షాఖ్యామ్. నను నైవ కశ్చిత్ ప్రాణీ స్వయం స్వమ్ ఆత్మానం హినస్తి; కథమ్ ఉచ్యతే అప్రాప్తం న హినస్తి ఇతి? యథా "న పృథివ్యామ్ నాన్తరిక్షే న దివ్యగ్నిః చేతవ్యః" (తై.సం. 5.2.7.1) ఇత్యాది? నైష దోషః. అజ్ఞానామ్ ఆత్మతిరస్కరణోపపత్తేః. సర్వో హి అజ్ఞః అత్యన్తప్రసిద్ధం సాక్షాత్ అపరోక్షమ్ ఆత్మానం తిరస్కృత్య అనాత్మానమ్ ఆత్మత్వేన పరిగృహ్య, తమపి ధర్మాధర్మౌ కృత్వా ఉపాత్తమ్ ఆత్మానం హత్వా అన్యమ్ ఆత్మానమ్ ఉపాదత్తే నవమ్. తం చైవ హత్వా నవమ్. తమపి హత్వా నవమ్. ఇత్యేవమ్ ఉపాత్తముపాత్తమ్ ఆత్మానం హన్తీతి ఆత్మహా సర్వః అజ్ఞః. యస్తు పరమార్థాత్మా అసావపి సర్వదా అవిద్యయా హత ఇవ విద్యమాన ఫలాభావాత్ ఇతి సర్వే ఏవ ఆత్మహనః ఏవ అవిద్వాంసః. యస్తు ఇతరః యథోక్తాత్మదర్శీ సః ఉభయథాపి ఆత్మనా ఆత్మానం న హినస్తి. తతః యాతి పరాం గతిం, యథోక్తం ఫలం తస్య భవతీత్యర్థః. 28

బాలానందిని

సమమితి :- సమంగా చూస్తూ, తెలుసుకొంటూ, ఎందువలన, సమస్తభూతాలలోను సమంగా ఉన్న ఈశ్వరుణ్ణి, వెనుకటి శ్లోకంలో చెప్పబడిన లక్షణాలు కలవానిని అని అర్థం. సమంగా చూస్తున్నవాడు - అయితే ఏమిటి? తనను తనచేతనే హింసంచడు; అందువల్ల అలా హింసించకపోవడంవల్ల ఉత్తమగతిని, మోక్ష మనేదానిని పొందుతాడు. (ఆశంక) ఏ ప్రాణీ కూడ తనను తాను హింసించదు కదా? అలాంటప్పుడు 'న హినస్తి' అని అవకాశమే

లేని ఆత్మహింసయొక్క అభావం ఎలా చెప్పబడుచున్నది? ఇది ఎట్లున్నదనగా - "అగ్నిచయనం (హోమాదికం కొరకు అగ్నిని ఏర్పరచడం) పృథివిమీద చేయకూడదు, అంతరిక్షంలో చెయగూడదు, ద్యులోకంలో చేయకూడదు" అన్నట్లున్నది. (అగ్నిచయనం పృథివిమీద చేయడానికి అవకాశం ఉంది గాన దానిని నిషేధించడం యుక్తమే. అంతరిక్షంలోను ద్యులోకంలోను చయనం చేసే ప్రసక్తి లేదు గాన ఈ నిషేధం నిరర్థకం. అది ఎట్లో ఆత్మను ఆత్మచేత చంపడు అనే నిషేధం కూడ నిరర్థకం అని భావం). (సమాధానం) ఈ దోషం లేదు అజ్ఞులు ఆత్మను తిరస్కరించడం కుదురుతుంది కదా? అజ్ఞానియైన ప్రతీ ఒక్కడూ సాక్షాత్తు ప్రత్యక్షంగా స్పష్టంగా తెలుస్తూన్న ఆత్మను తిరస్కరించి (ఆత్మను గుర్తించక) అనాత్మను (దేహాదికాన్ని) ఆత్మగా గ్రహించి (దేహాదికమే ఆత్మ అని అనుకొంటూ) ధర్మాధర్మాలను ఆచరించి సంపాదించిన ఆ ఆత్మను (దేహాదికాన్ని) చంపి (విడచి) మరొక క్రొత్త ఆత్మను గ్రహిస్తున్నాడు. దానిని చంపి మరొకదానిని గ్రహిస్తున్నాడు. ఇట్లే దానిని కూడ చంపి మరొకదానిని గ్రహిస్తున్నాడు. ఈ విధంగా గ్రహించీ గ్రహించి దానిని చంపుచున్నాడు. అందుచేత ప్రతీ అజ్ఞానీ కూడ ఆత్మహన్తయే (ఆత్మను చంపినవాడే). పరమార్థమైన ఆత్మ ఏది ఉందో అది కూడ అవిద్యచేత చంపబడినట్లే, ఎందువల్ల ననగా అది ఉన్నందువల్ల లభించవలసిన (అజ్ఞునికి) ఫలం లభించడంలేదు. ఈ విధంగా అవిద్వాంసు లందరూ ఆత్మఘాతకులే. వాళ్లకంటె భిన్నుడైన ఏ పైన చెప్పిన యథార్థాత్మ తత్త్వాన్ని చూచినవాడున్నాడో అతడు రెండు విధాలా కూడ ఆత్మను ఆత్మచేత హింసించడం లేదు. (దేహరూప మైన ఆత్మనూ హింసించడంలేదు యథార్థాత్మనూ హింసించడం లేదు). అందుచేత అతడు ఉత్తమగతిని పొందుతున్నాడు. చెప్పబడిన రీతిలో వానికి మోక్షరూపమైన ఫలం లభిస్తుంది అని అర్థం. 28

భాష్యమ్

సర్వభూతస్థమ్ ఈశం సమం పశ్యన్ న హినస్తి ఆత్మనా ఆత్మానమ్ ఇత్యుక్తమ్; తదనుపపన్నం, స్వగుణకర్మవైలక్షణ్యభేదభిన్నేషు ఆత్మసు ఇత్యేతత్ ఆశఙ్క్య ఆహ–

మూ. ప్రకృత్యైవ చ కర్మాణి క్రియమాణాని సర్వశః,
యః పశ్యతి తథాత్మానమకర్తారం స పశ్యతి. 29

ఆనందిని

సర్వేతి :– అన్ని భూతాలలోను సమంగా ఉన్న ఈశ్వరుణ్ణి చూచేవాడు తనను తన చేత హింసించుకొనడు అని చెప్పబడింది. తమ గుణాలయొక్క కర్మలయొక్క వైలక్షణ్యంచేత (అవి వేరు వేరు రీతులలో ఉండడంచేత) ఏర్పడిన భేదంచేత భిన్నము లైన (వేరు వేరుగా

ఉన్న) ఆత్మల విషయంలో అది (సమేశ్వరదర్శనం) కుదరదు అని ఆశంకించుకొని చెపుతున్నాడు -

ప్ర.అ. ప్రకృత్యైవేతి :- సర్వశః = అన్ని వైపులా, కర్మాణి = కర్మలను, ప్రకృత్యైవ = ప్రకృతిచేతనే, క్రియమాణాని = చేయబడుచున్నవాటినిగా, యః = ఎవడు, పశ్యతి = చూస్తాడో, తథా = మరియు, ఆత్మానమ్ = ఆత్మను, అకర్తారమ్ = కర్తకానిదానినిగా, చూస్తాడో, సః = అతడు సరిగా చూస్తున్నాడు.

భాష్యమ్

ప్రకృతిః భగవతః మాయా త్రిగుణాత్మికా. "మాయాం తు ప్రకృతిం విద్యాత్? శ్వే. ఉ.4.10) ఇతి మన్త్రవర్ణాత్. తయా ప్రకృత్యైవ న అన్యేన, మహదాదికార్యకారణాకారపరిణతయా కర్మాణి వాఙ్మనఃకాయారభ్యాణి, క్రియమాణాని నిర్వర్త్యమానాని, సర్వశః సర్వప్రకారైః, యః పశ్యతి ఉపలభతే, తథా ఆత్మానం క్షేత్రజ్ఞమ్, అకర్తారం సర్వోపాధివివర్జితం పశ్యతి సః పరమార్థదర్శీ ఇత్యభిప్రాయః. నిర్గుణస్య అకర్తుః నిర్విశేషస్య ఆకాశస్యేవ భేదే ప్రమాణానుపపత్తిః ఇత్యర్థః. 29

బాలానందిని

ప్రకృతిః ఇతి : - ప్రకృతి అనగా భగవంతుని త్రిగుణాత్మకమైన మాయ. "మాయాం తు ప్రకృతిం విద్యాత్" అని మంత్రం చెప్పుచున్నది. మహత్తు మొదలైన కార్యాల రూపంలోను కారణాల రూపంలోను పరిణమించిన ప్రకృతిచేతనే, మరి దేనిచేతనూ కాదు, మనోవాక్కాయాల చేత చేయ దగిన కర్మలు అన్ని ప్రకారాలచేత నిర్వర్తింపబడుతున్నాయి అని ఎవడు తెలుసుకుంటాడో, అట్లే ఆత్మను, క్షేత్రజ్ఞుణ్ణి, కర్త కానివానినిగా, సమస్తఉపాధులతో శూన్యునిగా చూస్తాడో అతడే పరమార్థాన్ని తెలుసుకొన్నవాడు అని అభిప్రాయం. ఆకాశానికి భేదం ఏ విధంగా ఉండదో అట్లే నిర్గుణమూ, కర్త కానిదీ, నిర్విశేషమూ అయిన ఆత్మకు భేదం ఉన్న దని చెప్పడంలో ప్రమాణం కుదరదు అని అర్థం. 29

భాష్యమ్

పునరపి తదేవ సమ్యగ్దర్శనం శబ్దాన్తరేణ ప్రపఞ్చయతి -

మూ. యదా భూతపృథగ్భావమేకస్థమనుపశ్యతి,
తత ఏవ చ విస్తారం బ్రహ్మ సంపద్యతే తదా 30

బాలానందిని

పునరపీతి :- ఆ సమ్యగ్దర్శనాన్నే మళ్లీ వేరే మాటలలో వివరిస్తున్నాడు -

ప్ర. అ. యదేతి: -యదా=ఎప్పుడు,భూతపృథగ్భావమ్=భూతాల వైవిధ్యమును, ఏకస్థమ్=ఒక్క ఆత్మయందే ఉన్నదానినిగా,అనుపశ్యతి=చూస్తాడో,తతః ఏవ=ఆ ఆత్మ నుండియే,విస్తారం చ=విస్తారమును కూడ చూస్తాడో,తదా=అప్పుడు,బ్రహ్మ=బ్రహ్మగా, సంపద్యతే=అవుతాడు.

భాష్యమ్

యదా యస్మిన్ కాలే,భూతపృథగ్భావమ్ భూతానాం పృథగ్భావం పృథక్త్వమ్, ఏకస్థమ్=ఏకస్మిన్ ఆత్మని స్థితమ్ ఏకస్థమ్ అనుపశ్యతి,శాస్త్రాచార్యోపదేశమ్అను ఆత్మానం ప్రత్యక్షత్వేన పశ్యతి "ఆత్మైవేదం సర్వమ్"(బృ. ఉ. 2. 4. 6)ఇతి,తతః ఏవ చ తస్మాదేవ చ విస్తారమ్ ఉత్పత్తిం వికాసమ్-"ఆత్మతః ప్రాణః, ఆత్మతః ఆశా,ఆత్మతః స్మరః,ఆత్మతః ఆకాశఃఆత్మతః తేజః,ఆత్మతః ఆపః,ఆత్మతః ఆవిర్భావతిరోభావౌ,ఆత్మతః అన్నమ్ "(ఛా. ఉ. 7.26.1) ఇత్యేవమాది ప్రకారైః విస్తారం యదా పశ్యతి. బ్రహ్మ సంపద్యతే బ్రహ్మైవ భవతి,తదా తస్మిన్ కాలే ఇత్యర్థః. 30

బాలానందిని

యదేతి:-ఏ కాలంలో భూతాల పృథక్త్వాన్ని,వేరు వేరుగా ఉండడాన్ని,ఒక ఆత్మ యందు ఉన్నదానినిగా చూస్తాడో(ఒక్క ఆత్మయందు భూతా లన్నీ వేరు వేరుగా కనబడు తున్నాయి అని తెలుసుకొంటాడో),శాస్త్రోపదేశాన్ని ఆచార్యోపదేశాన్నీ అనుసరించి (వాటిని పొందిన తరువాత)"ఇదంతా ఆత్మయే"అని ఆత్మను ప్రత్యక్షంగా చూస్తాడో,ఆ ఆత్మనుండియే విస్తారమును అనగా ఉత్పత్తిని, వికాసమును-ఆత్మనుండియే ప్రాణం పుట్టింది, ఆత్మనుండియే ఆశ(మనస్సు)ఆత్మనుండియే కామం,ఆత్మనుండియే ఆకాశం,ఆత్మనుండియే తేజస్సు, ఆత్మనుండియే జలం,ఆత్మనుండియే భూతాల ఆవిర్భావతిరోభావాలు(పుట్టడం లీనం అవడం) ఆత్మనుండియే అన్నం(భూమి)ఇత్యాదివిధాలుగా విస్తారమును ఎప్పుడు చూస్తాడో అప్పుడు (ఆ కాలంలో) బ్రహ్మగానే అవుతాడు అని అర్థం. 30

భాష్యమ్

ఏకస్య ఆత్మనః సర్వదేహాత్మత్వే తద్దోషసంబన్ధే ప్రాప్తే ఇదమ్ ఉచ్యతే-

మూ. అనాదిత్వాన్నిర్గుణత్వాత్పరమాత్మాయమవ్యయః,
శరీరస్థోఽపి కౌన్తేయ న కరోతి న లిప్యతే. 31

బాలానందిని

ఏకస్యేతి:-ఒకే ఆత్మ సమస్తదేహాల ఆత్మ అయితే ఆ దోషాలతో ఆత్మకు సంబంధం ప్రాప్తించగా(సంబంధం కలుగుతుంది అని ఆశంక కలుగగా ఇది చెప్పబడుచున్నది.

ప్ర.అ. అనాదిత్వాదితి:-కౌన్తేయ=అర్జునా! అనాదిత్వాత్=ఆది లేనిది అవడంవల్ల, నిర్గుణత్వాత్=గుణాలు లేనిది అవడం వల్ల,అవ్యయః=మార్పు లేని,అయమ్=ఈ, ఆత్మా =ఆత్మ,శరీరస్థః అపి=శరీరంలో ఉన్న దైనను,న కరోతి=చేయదు,న లిప్యతే=లిప్తము కాదు(దాని కేమీ అంటదు).

భాష్యమ్

అనాదిత్వాత్-అనాదేః భావః అనాదిత్వమ్. ఆదిః కారణమ్. తత్ యస్య నాస్తి తత్ అనాది. యత్ హి ఆదిమత్ తత స్స్వేన ఆత్మనా వ్యేతి;అయం తు అనాదిత్వాత్ నిరవయవః ఇతి కృత్వా న వ్యేతి. తథా నిర్గుణత్వాత్. సగుణో హి గుణవ్యయాత్ వ్యేతి, అయం తు నిర్గుణత్వాత్ న వ్యేతి ఇతి పరమాత్మా అయమ్ అవ్యయః నాస్య వ్యయః విద్యతే ఇత్యవ్యయః. యతః ఏవమ్ అతః శరీరస్థోఽపి,శరీరేషు ఆత్మనః ఉపలబ్ధిః భవతీతి శరీరస్థః ఉచ్యతే. తథాపి న కరోతి కర్మ. తదకరణాదేవ తత్ఫలేన న లిప్యతే. యః హి కర్తా సః కర్మఫలేన లిప్యతే. అయం తు అకర్తా,అతః. న ఫలేన లిప్యతే ఇత్యర్థః. కః పునః దేహేషు కరోతి లిప్యతే చ?యది తావత్ అన్యః పరమాత్మనః దేహీ కరోతి లిప్యతే చ తతః ఇదమ్ అనుపపన్నమ్ ఉక్తం క్షేత్రజ్ఞేశ్వరైకత్వం "క్షేత్రజ్ఞం చాపి మాం విద్ధి"(13.2)ఇత్యాది. అథ నాస్తి ఈశ్వరాత్ అన్యః దేహీ కః కరోతి కః లిప్యతే చ ఇతి వాచ్యమ్. పరో వా నాస్తీతి. సర్వథా దుర్విజ్ఞేయం దుర్వాచ్యం చేతి భగవత్ప్రోక్తమ్ ఔప నిషదం దర్శనం పరిత్యక్తం వైశేషికైః సాంఖ్యార్హతబౌద్ధైశ్చ.

బాలానందిని

అనాదిత్వాదితి:-అనాదిత్వాత్-అనాది యైనదాని ధర్మం అనాదిత్వం. ఆది,అనగా కారణం,దేనికి లేదో అది అనాది. దేనికి ఆది(కారణం)ఉంటుందో అది తన స్వరూపంచేత మార్పు చెందుతుంది. ఇదైతే అనాది గాన,అవయవాలు లేని దవడంచేత మార్పు చెందదు. నిర్గుణత్వంవల్ల కూడ అట్లే. గుణా లున్నది గుణాలు తొలగిపోవడంచేత మార్పు చెందు తుంది. ఇదైతే నిర్గుణం అవడంచేత మార్పు చెందదు. ఈ విధంగా ఈ పరమాత్మ అవ్యయం దీనికి వ్యయం(మార్పు)లేదు గాన అవ్యయం. అందువల్ల ఇది శరీరంలో ఉన్నా కూడ-(ఆత్మ సర్వగతమే;అయినా కూడ)ఆత్మయొక్క ఉపలబ్ధి(ఉన్[illegible] జ్ఞానం) శరీరాలలో కలుగుతుంది. అందుచేత శరీరస్థం అని చెప్పబడుతుంది. శరీరస్థ మైనా కూడ కర్మను చేయడంలేదు. కర్మ చేయకపోవడంచేతనే దాని ఫలంచేత లిప్తం కాదు. ఎవ డైతే కర్తయో అతడు కర్మఫలంచేత లిప్తు డౌతాడు. ఈ ఆత్మ యైతే కర్త కాదు;అందుచేత ఫలంచేత లిప్తం కాదు అని అర్థం. అయితే-దేహాలలో ఎవడు చేస్తున్నాడు? ఎవడు లిప్తు డవుతున్నాడు? పరమాత్మకంటె భిన్న

డైన దేహవంతుడు(జీవుడు)చేస్తూన్నట్లయితే, లిప్తు డవుతున్న ట్లయితే, అప్పుడు "క్షేత్రజ్ఞం చాపి మాం విద్ధి"అని చెప్పిన క్షేత్రజ్ఞేశ్వరుల ఏకత్వం అనుపపన్నం (అయుక్తం)అవుతుంది. అట్లు కాక-ఈశ్వరునికంటె వేరుగా దేహి లేకపోతే ఎవడు కర్మ చేస్తున్నాడో,కర్మఫలంచేత లిప్తు డవుతున్నాడో చెప్పవలసి ఉంది.లేదా పరమేశ్వరుడే లేడని చెప్పవలసి ఉంటుంది. అందుచేతనే భగవంతుడు బోధించిన ఈ ఔపనిషదసిద్ధాంతం అన్ని విధాలా అర్థం చేసికొన డానికి శక్యం కాకుండా ఉంది,చెప్పడానికి శక్యం కాకుండా ఉంది అనే కారణంచేతనే ఈ దర్శనాన్ని వైశేషికులూ, సాంఖ్యులూ, జైనులూ, బౌద్ధులూ పరిత్యజించారు (అంగీకరించలేదు).

భాష్యమ్

తత్రాయం పరిహారః భగవతా స్వేనైవ ఉక్తః "స్వభావస్తు ప్రవర్తతే"(5.14) ఇతి. అవిద్యామాత్రస్వభావో హి కరోతి లిప్యతే ఇతి వ్యవహారః భవతి,న తు పరమార్థతః ఏకస్మిన్ పరమాత్మని తత్ అస్తి. అతః ఏతస్మిన్ పరమార్థసాంఖ్యదర్శనే స్థితానాం జ్ఞాన నిష్ఠానాం పరమహంసపరివ్రాజకానాం తిరస్కృతావిద్యావ్యవహారాణాం కర్మాధికారః నాస్తి ఇతి తత్ర తత్ర దర్శితం భగవతా. 31

బాలానందిని

తత్రేతి:- ఈ ఆక్షేపానికి పరిహారం భగవంతుడే స్వయంగా "స్వభావస్తు ప్రవర్తతే" అని చెప్పి ఉన్నాడు, చేస్తున్నాడు, లిప్తు డౌతున్నాడు అను వ్యవహారం అవిద్యామాత్రమే స్వభావం గా కలది(అనగా అవిద్యచేత వ్యావహారికావస్థలో కనబడుతున్నది).అంతే కాని ఏక మైన (అద్వితీయమైన) ఆత్మయందు వాస్తవంలో అది (కర్తృత్వాదికం)లేదు.అందువల్లనే పరమార్థ మైన ఈ సాంఖ్యదర్శనంలో ఉన్న,జ్ఞాననిష్ఠులైన, అవిద్యావ్యవహారాన్ని తిరస్కరించిన (అవిద్యావ్యవహారం తొలగిపోయిన)పరమహంసపరివ్రాజకులకు కర్మాధికారం లేదని భగవంతునిచేత అక్క డక్కడ చూపబడింది. 31

భాష్యమ్

కిమివ న కరోతి న లిప్యతే ఇత్యత్ర దృష్టాన్తమ్ ఆహ-

మూ. యథా సర్వగతం సౌక్ష్మ్యాదాకాశం నోపలిప్యతే,
సర్వత్రావస్థితో దేహే తథాత్మా నోపలిప్యతే. 32

బాలానందిని

కిమివేతి:- ఆత్మ దేని వలె చేయడంలేదు;లిప్తం కావడంలేదు అను విషయంలో దృష్టాంతం చెపుతున్నాడు-

ప్ర. అ. యథేతి: -సర్వగతమ్=అంతటా ఉన్న,ఆకాశమ్=ఆకాశము,సౌక్ష్మ్యాత్= సూక్ష్మత్వంవలన,యథా=ఏ విధంగా,న ఉపలిప్యతే=లిప్తం కాదో,తథా=అల్లే,దేహే= దేహము నందు,సర్వత్ర=అంతటా(అన్నిదేహాలలోను), అవస్థితః=ఉన్న,ఆత్మా=ఆత్మ, న ఉపలిప్యతే = లిప్తం కాదు.

భాష్యమ్

యథా సర్వగతం సర్వవ్యాప్యపి సత్,సౌక్ష్మ్యాత్ సూక్ష్మభావాత్,ఆకాశం ఖం, న ఉపలిప్యతే న సంబధ్యతే,సర్వత్ర అవస్థితః దేహే తథా ఆత్మా న ఉపలిప్యతే. 32

యథేతి:- అంతటా వ్యాపించి ఉన్నా కూడ ఆకాశం,సూక్ష్మం అవడంవల్ల,దేనితోను ఏ విధంగా సంబంధించదో అల్లే అన్ని దేహాలలోను ఉన్న ఆత్మ లిప్తం కాదు. 32

భాష్యమ్

కిం చ-

మూ. యథా ప్రకాశయత్యేకః కృత్స్నం లోకమిమం రవిః,
క్షేత్రం క్షేత్రీ తథా కృత్స్నం ప్రకాశయతి భారత. 33

బాలానందిని

కిం చేతి:- మరియు-

ప్ర. అ. యథేతి:- భారత=అర్జునా! ఏకః=ఒక్క,రవిః=సూర్యుడు,యథా=ఏ విధంగా, కృత్స్నమ్=సమస్తమైన,లోకమ్=లోకమును,ప్రకాశయతి=ప్రకాశింపచేస్తున్నాడో, తథా= అల్లే,క్షేత్రీ=క్షేత్రంగల పరమాత్మ,కృత్స్నమ్=సమస్త మైన,క్షేత్రమ్=క్షేత్రమును, ప్రకాశయతి= ప్రకాశింపచేస్తున్నాడు.

భాష్యమ్

యథా, ప్రకాశయతి అవభాసయతి,ఏకః కృత్స్నం లోకమ్ ఇమం రవిః సవితా ఆదిత్యః,తథా తద్వత్,మహాభూతాదిధృత్యన్తం క్షేత్రమ్ ఏకః సన్ ప్రకాశయతి;కః?క్షేత్రీ, పరమాత్మా ఇత్యర్థః. రవిదృష్టాన్తః అత్ర ఆత్మనః ఉభయార్థః అపి భవతి,రవివత్ సర్వ క్షేత్రేషు ఏకః ఆత్మా అలేపకశ్చ ఇతి. 33

బాలానందిని

యథేతి:-ఒక సూర్యుడు,ఆదిత్యుడు,సమస్త మైన ఈ లోకాన్ని ఏ విధంగా ప్రకాశింపచేస్తున్నాడో అల్లే క్షేత్ర ప్రభు వైన పరమాత్మ,ఒక్కడే అయి ఉండి మహాభూతాలు మొదలు ధృతివరకు ఉన్న క్షేత్రాన్ని ప్రకాశింపచేస్తున్నాడు. ఇక్కడ ఆత్మకు ఇచ్చిన సూర్య

దృష్టాంతం-సూర్యుడు వలె సకలక్షేత్రాలలోను ఆత్మ ఒక్కటే,అలేపకం కూడ(లిప్తత్వం లేనిది కూడ)అని రెండు అర్థాలను బోధించడానికి ఉపయోగిస్తుంది. 33

భాష్యమ్

సమస్తాధ్యాయోపసంహారార్థః అయం శ్లోకః-

మూ. **క్షేత్రక్షేత్రజ్ఞయోరేవమన్తరం జ్ఞానచక్షుషా,**
భూతప్రకృతిమోక్షం చ యే విదుర్యాన్తి తే పరమ్. 34

ఇతి శ్రీమహాభారతే శతసాహస్ర్యాం సంహితాయాం వైయాసిక్యాం
భీష్మపర్వణి
శ్రీభగవద్గీతాసు ఉపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే
ప్రకృతిపురుషవివేకయోగో నామ త్రయోదశోఽధ్యాయః

బాలానందిని

సమస్తేతి:-ఈ శ్లోకం సమస్తాధ్యాయంలో ఉన్న విషయాన్ని ఉపసంహరించ దానికి చెప్పబడుచున్నది-

ప్ర.అ. **క్షేత్రేతి**:-యే=ఎవరు,ఏవమ్=ఈ విధంగా,క్షేత్రక్షేత్రజ్ఞయోః=క్షేత్ర,క్షేత్రజ్ఞుల, అన్తరమ్=భేదాన్నీ,భూతప్రకృతిమోక్షం చ=భూతముల ప్రకృతియొక్క విమోచనాన్నీ,జ్ఞాన చక్షుషా=జ్ఞాన మనే నేత్రంచేత,విదుః=తెలుసుకొంటారో,తే=వారు,పరమ్=పరమాత్మను, యాన్తి=పొందుతారు.

భాష్యమ్

క్షేత్రక్షేత్రజ్ఞయోః యథావ్యాఖ్యాతయోః,ఏవం యథాప్రదర్శితప్రకారేణ, అన్తరమ్ ఇతరేతరవైలక్షణ్యవిశేషం,జ్ఞానచక్షుషా-శాస్త్రాచార్యో పదేశజనితమ్ ఆత్మప్రాత్యయికం జ్ఞానం చక్షుః,తేన జ్ఞానచక్షుషా,భూతప్రకృతిమోక్షం చ-భూతానాం ప్రకృతిః అవిద్యాలక్షణా అవ్యక్తాఖ్యా తస్యాః భూతప్రకృతేః మోక్షణమ్ అభావగమనం చ,యే విదుః జానన్తి,యాన్తి గచ్ఛన్తి,తే,పరం పరమార్థతత్త్వం బ్రహ్మ,న పునః దేహమ్ ఆదదతే ఇత్యర్థః. 34

ఇతి శ్రీమత్పరమహంసపరివ్రాజకాచార్యగోవిన్దభగవత్పూజ్యపాదశిష్యశ్రీమ దాచార్యశ్రీశంకరభగవతః కృతౌ శ్రీభగవద్గీతాభాష్యే క్షేత్రక్షేత్రజ్ఞయోగో నామ త్రయోదశోఽధ్యాయః

బాలానందిని

క్షేత్రేతి:- వెనుక వివరించబడిన లక్షణాలు గల క్షేత్రక్షేత్రజ్ఞుల మధ్య నున్న వైలక్షణ్యాన్ని,(విభిన్నమైన స్వభావాన్ని)ఈ విధంగా,ఇంతవరకు చూపిన విధంగా,ఎవరు జ్ఞానచక్షుస్సుచేత-శాస్త్రంవల్లా,ఆచార్యోపదేశంవల్లా కలిగి,స్వానుభవానికి వచ్చిన జ్ఞానమే నేత్రం.ఆ జ్ఞానచక్షుస్సుచేత,భూతప్రకృతిమోక్షాన్నీ-భూతాల ప్రకృతి అనగా అవిద్యారూప మైన అవ్యక్త మనే పేరు గల ప్రకృతి.ఆభూతప్రకృతియొక్క మోక్షమును, అది తొలగిపోవ డాన్ని, తెలుసుకొంటారో వారు పరమార్థతత్త్వ మైన బ్రహ్మను పొందుతారు.మళ్లీ దేహం ధరించరు అని అర్థం. 34

"బాలానందిని"అను శ్రీమద్భగవద్గీతాశాంకరభాష్యాంధ్రవ్యాఖ్యానములో త్రయోదశాధ్యాయం సమాప్తం.

(ప్రారంభంనుంచి మొత్తం శ్లోకాలు 494)

అథ చతుర్దశః అధ్యాయః

భాష్యమ్

సర్వమ్ ఉత్పద్యమానం క్షేత్రక్షేత్రజ్ఞసంయోగాత్ ఉత్పద్యతే ఇత్యుక్తమ్.తత్ కథమ్ ఇతి ప్రదర్శనార్థం "పరం భూయః"ఇత్యాదిః అర్థః ఆరభ్యతే.అథవా-ఈశ్వరపరతన్త్రయోః క్షేత్రక్షేత్రజ్ఞయోః జగత్కారణత్వమ్;న సాంఖ్యానామ్ ఇవ స్వతన్త్రయోః ఇత్యేవమర్థం ప్రకృతి స్థత్వం,గుణేషు చ సంగః సంసారకారణమ్ ఇత్యుక్తమ్.కస్మిన్ గుణే కథం సంగః?కే వా గుణాః?కథం వా తే బధ్నన్తి?ఇతి,గుణేభ్యః చ మోక్షణం కథం స్యాత్?ముక్తస్య చ లక్షణం వక్తవ్యమ్ ఇత్యేవమర్థం చ-

శ్రీభగవానువాచ-

మూ. పరం భూయః ప్రవక్ష్యామి జ్ఞానానాం జ్ఞానముత్తమమ్,
యద్ జ్ఞాత్వా మునయః సర్వే పరాం సిద్ధిమితో గతాః. 1

బాలానందిని

సర్వమితి:- పుట్టుచున్న ప్రతీదీ క్షేత్రక్షేత్రజ్ఞుల సంయోగంవల్ల పుట్టుచున్నది అని చెప్పబడింది.అది ఎట్లు అని చూపడంకోసం "పరం భూయః"ఇత్యాదిక మైన అధ్యాయం ప్రారంభించబడుచున్నది.లేదా-ఈశ్వరాధీను లైన క్షేత్రక్షేత్రజ్ఞులే జగత్తుకు కారణం కాని సాంఖ్యులు చెప్పి నట్లు స్వతంత్రులైన క్షేత్రక్షేత్రజ్ఞులు కారణం కాదు అను విషయాన్ని చెప్పడంకోసము, ప్రకృతిస్థత్వము(ప్రకృతికి వశమై ఉండడం)గుణాలతో సంగమూ

సంసారానికి కారణం అని చెప్పబడింది,ఏ గుణంలో ఏ విధంగా సంగం ఏర్పడుతుంది, గుణాలు ఏవి,అవి ఎలా బంధిస్తాయి,గుణాలనుండి విడుదల పొందడం ఎట్లు,ముక్తుని లక్షణాలు కూడ చెప్పాలి,వీటి అన్నింటికోసమూ కూడ-

శ్రీభగవంతుడన్నాడు-

ప్ర.అ. పరమితి:- పరమ్=శ్రేష్ఠమైనది,జ్ఞానానామ్=జ్ఞానములలో,ఉత్తమమ్=ఉత్తమమూ అయిన, జ్ఞానమ్=జ్ఞానమును,భూయః=మళ్లీ,ప్రవక్ష్యామి=చెప్పెదను. యత్=దేనిని, జ్ఞాత్వా=తెలిసికొని,సర్వే=సమస్తమైన,మునయః=మునులు,ఇతః=ఈ దేహం విడచిన తరువాత,పరామ్=గొప్ప,సిద్ధిమ్=సిద్ధిని,గతాః=పొందినారో.

భాష్యమ్

పరం జ్ఞానమ్ ఇతి వ్యవహితేన సంబన్ధః. భూయః పునః,పూర్వేషు అధ్యాయేషు అసకృత్ ఉక్తమ్ అపి;ప్రవక్ష్యామి,తచ్చ,పరం పరవస్తువిషయత్వాత్. కిం తత్?జ్ఞానమ్. సర్వేషాం జ్ఞానానామ్ ఉత్తమమ్,ఉత్తమఫలత్వాత్.జ్ఞానానామ్ ఇతి న అమానిత్వాదీనామ్,కిం తర్హి?యజ్ఞాదిజ్ఞేయవస్తువిషయాణామ్ ఇతి. తాని న మోక్షాయ. ఇదం తు మోక్షాయ ఇతి పరోత్తమశబ్దాభ్యాం స్తౌతి శ్రోతృబుద్ధిరుచ్యుత్పాదనార్థమ్. యద్ జ్ఞాత్వా, యద్ జ్ఞానం జ్ఞాత్వా ప్రాప్య మునయః సంన్యాసినః మననశీలాః సర్వే పరాం సిద్ధిం మోక్షాఖ్యామ్ఇతః అస్మాత్ దేహబన్ధాత్ ఊర్ధ్వం గతాః ప్రాప్తాః. 1

పరమ్ ఇతి:- 'పరమ్' అనేదానికి 'జ్ఞానమ్'అను దూరంగా ఉన్నపదంతో అన్వయం. వెనుకటి అధ్యాయాలలో అనేకపర్యాయాలు చెప్పబడిన దైనా మళ్లీ చెప్పెదను. అది పరవస్తువుకు సంబంధించిన దవడంచేత పర మైనది.ఏమిటది?జ్ఞానం.ఉత్తమ ఫలాన్ని ఇచ్చే దవడంవల్ల అన్ని జ్ఞానాలలోకీ ఉత్తమము.'జ్ఞానానామ్'అనిచెప్పబడినవి అమానిత్వాదులు కాదు.(పదమూడవ అధ్యాయంలో 7-10శ్లోకాలలో చెప్పిన అమానిత్వాదులు కావు). మరేమనగా-యజ్ఞాదు లైన జ్ఞేయవస్తువులకు సంబంధించిన జ్ఞానాలు. యజ్ఞాదిజ్ఞానాలు మోక్షం ఇవ్వవు.ఇదైతే మోక్షం ఇస్తుంది అని శ్రోతయొక్క బుద్ధిలో రుచి కలిగించడం కోసం 'పరమ' 'ఉత్తమ' శబ్దాలచేత స్తుతిస్తున్నాడు.ఏ జ్ఞానాన్ని తెలుసుకొని అనగా పొంది, మననస్వభావం గల సంన్యాసు లందరూ ఈ దేహబంధనం తరువాత మోక్ష మనే గొప్ప సిద్ధిని పొందినారో. 1

భాష్యమ్

అస్యాః చ సిద్ధేః ఐకాన్తికత్వం దర్శయతి-

మూ. ఇదం జ్ఞానముపాశ్రిత్య మమ సాధర్మ్యమాగతాః,
సర్గేఽపి నోపజాయన్తే ప్రలయే న వ్యథన్తి చ. 2

బాలానందిని

అస్యా ఇతి:- ఈ సిద్ధి తప్పక కలుగుతుంది అని చెప్పుచున్నాడు-

ప్ర.అ. ఇదమితి:-ఇదమ్=ఈ,జ్ఞానమ్=జ్ఞానమును,ఉపాశ్రిత్య=ఆశ్రయించి, మమ=నాయొక్క,సాధర్మ్యమ్=సమానరూపత్వాన్ని(నా రూపాన్ని), ఆగతాః=పొందినవారు, సర్గేఽపి=సృష్టికాలంలో కూడ,న ఉపజాయన్తే=పుట్టడంలేదు(పుట్టరు). ప్రలయే=ప్రలయ కాలమునందు, న వ్యథన్తి=వ్యథ చెందడం లేదు(వ్యథచెందరు).

భాష్యమ్

ఇదం జ్ఞానం యథోక్తమ్,ఉపాశ్రిత్య జ్ఞానసాధనమ్ అనుష్ఠాయ ఇత్యేతత్.మమ పరమేశ్వరస్య,సాధర్మ్యం మత్స్వరూపతామ్,ఆగతాః ప్రాప్తాః ఇత్యర్థః న తు సమానధర్మ తాం సాధర్మ్యమ్;క్షేత్రజ్ఞేశ్వరయోః భేదానభ్యుపగమాత్ గీతశాస్త్రే. ఫలవాదశ్చాయం స్తుత్యర్థమ్ ఉచ్యతే.సర్గేఽపి సృష్టికాలేఽపి,న ఉపజాయన్తే న ఉత్పద్యన్తే.ప్రలయే బ్రహ్మణః అపి వినాశకాలే,న వ్యథన్తి చ వ్యథాం నాపద్యన్తే.న చ్యవన్తి ఇత్యర్థః. 2

బాలానందిని

ఇదమితి:-పైన చెప్పబడిన ఈ జ్ఞానాన్ని ఆశ్రయించి,అనగా జ్ఞానసాధనాలను అనుష్ఠించి అని భావం.పరమేశ్వరుడ నైన నాయొక్క సాధర్మ్యాన్ని,అనగా నా స్వరూపం కలిగి ఉండడాన్ని పొందిన అనియే అర్థం;అంతే కాని'సాధర్మ్యమ్'అనగా సమానమైన ధర్మాలు కలిగి ఉండడం అని అర్థం కాదు.ఎందువల్ల ననగా గీతాశాస్త్రంలో క్షేత్రజ్ఞునికీ ఈశ్వరునికీ మధ్య భేదం అంగీకరించబడదు.ఇక్కడ సరూపత్వం అనే ఫలం లభిస్తుం దని స్తుతికోసం చెప్పబడుచున్నది.(ఎల్లప్పుడూ బ్రహ్మయే అయినప్పుడు క్రొత్తగా బ్రహ్మ స్వరూపాన్ని పొందడ మేమిటి అను ఆశంక కలుగవచ్చును.క్రొత్తగా బ్రహ్మస్వరూపత్వం లభించకపోయినా లభిస్తుం దని చెప్పడం కేవలం స్తుతికోసమే అని భావం)సృష్టికాలంలో కూడ జనించరు;చతుర్ముఖబ్రహ్మ నశించే మహాప్రలయకాలంలో కూడ వ్యథ చెందరు; అనగా (ముక్తిస్థితినుండి)చ్యుతులు కారని అర్థం. 2

భాష్యమ్

క్షేత్రక్షేత్రజ్ఞసంయోగః ఈదృశః భూతకారణమ్ ఇత్యాహ-

మూ. మమ యోనిర్మహద్బ్రహ్మ తస్మిన్ గర్భం దధామ్యహమ్,
సంభవః సర్వభూతానాం తతో భవతి భారత. 3

బాలానందిని

క్షేత్రేతి:-ఈ విధమైన క్షేత్రక్షేత్రజ్ఞసంయోగం భూతాలకు కారణం అనిచెప్పు చున్నాడు-

ప్ర.అ.మమేతి:- మమ=నాయొక్క,యోనిః=ప్రకృతి,మహత్=గొప్ప దైన,బ్రహ్మ = బ్రహ్మ,తస్మిన్=దానియందు,అహమ్=నేను,గర్భమ్=గర్భమును,దధామి=ఉంచు చున్నాను. భారత=అర్జునా!తతః=దానివల్ల,సర్వభూతానామ్=సమస్తభూతములయొక్క సంభవః=ఉత్పత్తి, భవతి=అగుచున్నది.

భాష్యమ్

మమ స్వభూతా మదీయమాయా త్రిగుణాత్మికా ప్రకృతిః యోనిః,సర్వభూతానాం, సర్వకార్యేభ్యః బృహత్త్వాత్ భరణాత్ చ స్వవికారణాం మహత్ బ్రహ్మ ఇతి యోనిః ఏవ విశిష్యతే.తస్మిన్ మహతి బ్రహ్మణి యోనౌ,గర్భం హిరణ్యగర్భస్య జన్మనో బీజం,సర్వభూతజన్మకారణం బీజం,దధామి నిక్షిపామి.క్షేత్రక్షేత్రజ్ఞప్రకృతిద్వయశక్తిమాన్ ఈశ్వరః అహమ్ అవిద్యాకామకర్మోపాధిస్వరూపానువిధాయినం క్షేత్రజ్ఞం క్షేత్రేణ సంయోజయామీత్యర్థః.సంభవః ఉత్పత్తిః,సర్వభూతానాం హిరణ్యగర్భోత్పత్తిద్వారేణ, తతః తస్మాత్ గర్భాధానాత్,భవతి హే భారత. 3

బాలానందిని

మమేతి:- అర్జునా! నా సొత్తైన,నాకు సంబంధించిన, త్రిగుణాత్మక మైన మాయ యైన ప్రకృతియే సర్వభూతాలకు యోని.ఆ యోనియే, ప్రకృతియే, అన్ని కార్యాలకంటె (తననుండి పుట్టిన అన్నింటికంటె) గొప్పది అవడంవల్ల,తన వికారాలను (కార్యాలను) భరించడంవల్ల బ్రహ్మ అని విశేషంగా చెప్పబడుచున్నది.అట్టి గొప్ప బ్రహ్మ యైన యోని యందు (ప్రకృతియందు)హిరణ్యగర్భుని జన్మకు బీజము,సకలభూతాలజన్మకు (హిరణ్య గర్భుని ద్వారా) కారణమూ అయిన బీజాన్ని ఉంచుతున్నాను.క్షేత్ర-క్షేత్రజ్ఞరూప మైన ప్రకృతిద్వయ మనే శక్తి గల ఈశ్వరుడ నైన నేను అవిద్య కామము కర్మ అను ఉపాధుల స్వరూపాన్ని అనుసరించి ఉండే(వాటికి లొంగి ఉండే)క్షేత్రజ్ఞుణ్ణి క్షేత్రంతో కలుపుతాను అని అర్థం.ఆ గర్భధానంవల్ల హిరణ్యగర్భుని ఉత్పత్తి ద్వారా సమస్తభూతాల ఉత్పత్తి జరుగుతుంది.

వి. ప్రళయంలో,క్షేత్రజ్ఞుడు,స్థూలశరీరోపాధు లన్నీ నశించిపోవడంతో కారణ శరీరానికి ఉపాధులైన అవిద్యాదులతోను,సూక్ష్మశరీరానికి ఉపాధులైన కామాదులకు ఆశ్రయా లైన మనోబుద్ధ్యాదిరూపా లైన లింగములతోను కూడి ఈశ్వరుని ప్రకృతియైన మూలాజ్ఞానంలో అణగి ప్రలయం పూర్తి అయేవరకు ఉంటాడు.ప్రలయకాలం పూర్తి అయిన తరువాత ఉపాధులతో కూడి ఉన్న ఆ క్షేత్రజ్ఞుడే ఈశ్వరసకంల్పవశంచేత మళ్లీ స్థూలశరీరంతో కలుస్తాడు. ఈ స్థూలశరీరాలు క్రమంగా పుడతాయి.ముందు హిరణ్య గర్భు డనే పేరు గల స్థూలశరీరం పుడుతుంది. తరువాత ప్రజాపతి మనువు మొదలైనవాళ్లు పుడతారు.ఈ విధంగా హిరణ్యగర్భుని ద్వారా ఇతరభూతాల ఉత్పత్తి జరుగుతుంది. ఈ విధంగా "మమ యోనిర్మహద్బ్రహ్మ"ఇత్యాదివాక్యానికి భావం ఏ మనగా బ్రహ్మాధికారం పొందదానికి తగిన అదృష్టం గల ఒక క్షేత్రజ్ఞుడు లింగశరీరంతో ప్రకృతిలో విలీనుడై ఉంటాడు.పరమేశ్వరుడు తన సంకల్పంచేత ఆ క్షేత్రజ్ఞుణ్ణి హిరణ్యగర్భశరీరాకారంలో పరిణమించదానికి ఉన్ముఖంగా ఉన్న ప్రకృతితో కలుపుతాడు.అప్పుడు హిరణ్యగర్భుడు జనించి ఇతరభూతాలను క్రమంగా సృష్టిస్తాడు. 3

మూ. సర్వయోనిషు కౌన్తేయ మూర్తయః సంభవన్తి యాః,
తాసాం బ్రహ్మ మహద్యోనిరహం బీజప్రదః పితా. 4

ప్ర.అ. సర్వేతి:- కౌన్తేయ=అర్జునా!సర్వయోనిషు=అన్ని యోనులయందు,యాః = ఏ, మూర్తయః=మూర్తులు,సంభవన్తి=పుడుతున్నాయో,తాసామ్=వాటికి,మహత్ = గొప్పదైన,బ్రహ్మ=ప్రకృతి,యోనిః=కారణము. అహమ్=నేను,బీజప్రదః=బీజము నిచ్చే, పితా =తండ్రిని.

భాష్యమ్

సర్వయోనిష్వితి:- దేవపితృమనుష్యపశుమృగాదిసర్వయోనిషు,కౌన్తేయ, మూర్తయః దేహసంస్థానలక్షణాః మూర్ఛితాఙ్గావయవాః మూర్తయః సంభవన్తి యాః తాసాం మూర్తీనాం బ్రహ్మ మహత్ సర్వావస్థం యోనిః కారణమ్.అహమ్ ఈశః బీజప్రదః గర్భాధానస్య కర్తా పితా. 4

బాలానందిని

సర్వయోనిష్వితి:- దేవ-పితృ-మనుష్య-పశు-మృగాదు లైన సమస్తయోనులందు (జాతులయందు),అర్జునా,దేహముయొక్క సంస్థానం(ఒక విధమైన నిర్మాణం)లక్షణంగా గల,అస్పష్టంగా ఉన్న శరీరావయవాలు గల ఏ మూర్తులు పుడుతున్నాయో ఆ మూర్తులకు గొప్పదైన అనగా ఆ యా దేవ-పితృదేవాదిసకలావస్థలలో ఉన్న ప్రకృతి కారణం. ఈశ్వరుడ నైన నేను గర్భాధానం చేసే తండ్రిని.

వి. దేవపితృమనుష్యాదిజాతులలో జన్మించేవాళ్ల కందరికీ వాళ్ల తల్లిదండ్రులు కారణం అని అనుకొంటూంటారు. వాస్తవంలో ప్రకృతియే ఆ యా దేవాద్యవస్థలను పొంది పుట్టేవాళ్ల దేహాదులకు కారణం అవుతుంది. పరమేశ్వరుడే క్షేత్రజ్ఞుణ్ణి ఆ యా మూర్తులలోనికి పంపుతాడు అని భావం. 4

భాష్యమ్

కే గుణాః కథం బధ్నన్తి ఇత్యుచ్యతే-

మూ. సత్త్వం రజస్తమ ఇతి గుణాః ప్రకృతిసంభవాః,
నిభధ్నన్తి మహాబాహో దేహే దేహినమవ్యయమ్. 5

బాలానందిని

కే ఇతి:- ఏ గుణాలు ఏ విధంగా బంధిస్తాయో చెప్పబడుచున్నది-

ప్ర.అ. **సత్త్వమితి**:- మహాబాహో=అర్జునా!ప్రకృతిసంభవాః=ప్రకృతినుండి (భగవంతునిమాయనుండి)పుట్టిన,సత్త్వమ్=సత్త్వము,రజః=రజస్సు,తమః ఇతి=తమస్సూ అను,గుణాః=గుణాలు,అవ్యయమ్=మార్పులేని,దేహినమ్=దేహము గల జీవుని,దేహే = దేహమునందు,నిబధ్నన్తి=బంధిస్తాయి.

భాష్యమ్

సత్త్వం రజః తమః ఇత్యేవంనామానః,గుణాః ఇతి పారిభాషికః శబ్దః,న రూపాదివత్ ద్రవ్యాశ్రితాః.న చ గుణగుణినోః అన్యత్వమ్ అత్ర వివక్షితమ్,తస్మాద్ గుణాః ఇవ నిత్యపరతన్త్రాః క్షేత్రజ్ఞం ప్రతి;అవిద్యాత్మకత్వాత్ క్షేత్రజ్ఞం నిబధ్నన్తీవ. తమ్ ఆస్పదీకృత్య ఆత్మానం ప్రతిలభన్తే ఇతి నిబధ్నన్తి ఇత్యుచ్యతే. తే చ ప్రకృతిసంభవాః భగవన్మాయాసంభవాః;నిబధ్నన్తి ఇవ,మహాబాహో-మహాన్తౌ సమర్థతరౌ ఆజానుప్రలమ్బౌ బాహూ యస్య సః మహాబాహుః. హే మహాబాహో,దేహే శరీరే, దేహినం దేహవన్తమ్, అవ్యయమ్-అవ్యయత్వం చ ఉక్తమ్"**అనాదిత్వాత్**"(13-31) ఇత్యాదిశ్లోకే. నను "**దేహీ న లిప్యతే**"(13.31)ఇత్యుక్తమ్. తత్ కథమ్ ఇహ నిబధ్నన్తి ఇతి అన్యథా ఉచ్యతే?పరి హృతమ్ అస్మాభిః ఇవశబ్దేన నిబధ్నన్తీవ ఇతి. 5

బాలానందిని

సత్త్వమితి:- సత్త్వము,రజస్సు,తమస్సు అను పేర్లు గల,గుణాలు అనేది పారిభాషికశబ్దం. అంతేనేకాని (నైయాయికాదు లంగీకరించిన)గుణాల వలె ద్రవ్యాన్ని ఆశ్రయించినవి కావు.(అన్నింటినీ ఆశ్రయించి ఉంటాయి). గుణగుణులకు భేదం కూడ

ఇక్కడ వివక్షితం కాదు.(శుక్లరూపం వేరు దానికి ఆశ్రయమైన పటం వేరు అన్నట్లు సత్త్వాది గుణాలు గుణియైన ప్రకృతికంటె భిన్నంగా లేవు.ప్రకృతి త్రిగుణస్వరూపం). అందువల్ల గుణాల వలె(రూపాదిగుణాలు ఎల్లప్పుడు ఘటాదిద్రవ్యాలను ఆశ్రయించి వాటి అధీనమై నట్లు)ఇవి కూడ అవిద్యాత్మకములవడంవల్ల క్షేత్రజ్ఞుని గూర్చి నిత్యపరతంత్రములు (పరాధీనములు). క్షేత్రజ్ఞుణ్ణి ఆధారంగా చేసికొని అస్తిత్వాన్ని పొందుతున్నాయి గాన వానిని బంధిస్తున్నాయి అని చెప్పబడుచున్నాయి.

వి.గుణాలు అవిద్యాకార్యాలు గాన అవిద్యారూపాలు. అవిద్య అచేతనం గాన చేతన పరతంత్రం. అందుచేత ఇవి చైతన్యరూపుడైన క్షేత్రజ్ఞునికి అధీనాలు-లేదా అవిద్యాత్మ కత్వాత్ అనగా మిథ్యాభూతము లవడంవల్ల అని అర్థం. సర్పానికి రజ్జువు ఏవిధంగా ఆశ్రయమో మిథ్యాభూతమైన గుణాలకు ఆశ్రయం క్షేత్రజ్ఞుడు అని అర్థం. ఈ విధంగా ఇవి క్షేత్రజ్ఞపర తంత్రాలు. ఇవి క్షేత్రజ్ఞుణ్ణి బంధిస్తున్నట్లు కనబడతాయి. ఇవి క్షేత్రజ్ఞుణ్ణే ఆధారంగా చేసికొని అస్తిత్వం పొందుతున్నాయి. అందుచేత క్షేత్రజ్ఞుణ్ణి బంధిస్తున్నట్లు కనబడుతున్నాయి. సర్పాభాస చేత రజ్జువు కప్పబడినట్లు వీటిచేత క్షేత్రజ్ఞుడు బంధింపబడు చున్నాడు.

తే చేతి:-సుహాబాహూ!సమర్థతరములూ మోకాళ్లవరకు వ్రేలాడు చున్నవీ అయిన బాహువులు కలవాడా!ప్రకృతిసంభవము లైన,అనగా భగవంతుని మాయవలన పుట్టిన అవి(గుణాలు)శరీరంలో ఉన్న,అవ్యయు డైన దేహవంతుణ్ణి (దేహధారియైన జీవుణ్ణి) బంధిస్తూన్నట్లు ఉంటాయి. దేహియొక్క అవ్యయత్వం (దేహి అవ్యయుడు అనే విషయం) **"అనాదిత్వాత్"**ఇత్యాదిశ్లోకంలో చెప్పబడింది. ఆశంక **"దేహీ న లిప్యతే"**అని చెప్పబడింది కదా(అనాదిత్వాదిత్యాదిశ్లోకం లోనే);మరి ఇక్కడ అందుకు విరుద్ధంగా 'నిబధ్నన్తి'అని ఎలా చెప్పబడుచున్నది? ఈ ఆశంకను మేం 'నిబధ్నన్తి ఇవ'అని ఇవశబ్దాన్ని ప్రయోగించడం చేత పరిహరించి ఉన్నాం. (అవి బంధిస్తున్నట్లు కనబడుతున్నాయి కాని నిజంగా బంధించడం లేదు. అందుచేత దేహియొక్క అలిప్తత్వానికి భంగం లేదు అని అర్థం)5

భాష్యమ్

తత్ర సత్త్వాదీనాం సత్త్వస్యైవ తావత్ లక్షణమ్ ఉచ్యతే-

మూ. తత్ర సత్త్వం నిర్మలత్వాత్ప్రకాశకమనామయమ్,
సుఖసంగేన బధ్నాతి జ్ఞానసంగేన చానఘ. **6**

బాలానందిని

తత్రేతి:- ఆ సత్త్వం మొదలైనవాటిలో ముందుగా సత్త్వంయొక్క లక్షణం చెప్ప బడుచున్నది-

ప్ర.అ. తత్రేతి:- అనఘ=దోషరహితుడా!తత్ర=వాటిలో,నిర్మలత్వాత్=నిర్మల మవడంవల్ల,ప్రకాశకమ్=ప్రకాశింపచేసేది,అనామయమ్=దోషాలు లేనిదీ అయిన,సత్త్వమ్=సత్త్వగుణము,సుఖసంగేన=సుఖమునందు ఆసక్తి చేతను,జ్ఞానసంగేన చ=జ్ఞానము నందు ఆసక్తి చేతను,బధ్నాతి=బంధిస్తూన్నది.

భాష్యమ్

తత్ర సత్త్వమితి:- నిర్మలత్వాత్ స్ఫటికమణిః ఇవ ప్రకాశకమ్-అనామయం నిరుపద్రవం సత్త్వం తత్ నిబధ్నాతి.కథమ్?సుఖసంగేన.సుఖీ అహమ్ ఇతి విషయ భూతస్య సుఖస్య విషయిణి ఆత్మని సంశ్లేషాపాదనం మృషైవ సుఖే సంజనమ్ ఇతి.సా ఏషా అవిద్యా; న హి విషయధర్మః విషయిణః భవతి.ఇచ్ఛాది చ ధృత్యన్తం క్షేత్రస్యైవ విషయస్య ధర్మః ఇతి ఉక్తం భగవతా.అతః అవిద్యయైవ స్వకీయధర్మభూతయా విషయ విషయ్యవివేకలక్షణయా అస్వాత్మభూతే సుఖే సంజయతీవ;అసక్తం సక్తమివ కరోతి, అసుఖినం సుఖినమివ.తథా జ్ఞానసంగేన చ. జ్ఞానమితి సుఖసాహచర్యాత్ క్షేత్రస్య అన్తఃకరణస్యైవ ధర్మః,న ఆత్మనః.ఆత్మధర్మత్వే సంగానుపపత్తేః బన్ధానుపపత్తేశ్చ.సుఖే ఇవ జ్ఞానాదౌ సంగః మన్తవ్యః. హే అనఘ అవ్యసన. 6

బాలానందిని

తత్రేతి:- నిర్మలం అవడంవల్ల స్ఫటికమాణిక్యం వలె ప్రకాశింపచేసేది,ఆమయములు, ఉపద్రవములు లేనిది అయిన సత్త్వగుణం (దేహిని)బంధిస్తుంది.ఎట్లు?సుఖసంగం చేత.విషయమైన సుఖానికి విషయి యైన ఆత్మయందు సంబంధం లేకపోయినా ఉన్నట్లు కల్పించడం,నేను సుఖవంతుడను అనుకొనే టట్లు చేయడం-ఇది సుఖసంజనం.ఇది అవిద్య.విషయధర్మం(విషయ మైన అంతఃకరణంయొక్క ధర్మ మైన సుఖం) విషయికి సంబంధించినది కాదు కదా?ఇచ్ఛ మొదలు ధృతివరకు ఉన్న వన్నీ విషయ మైన క్షేత్రం యొక్క ధర్మాలే అని భగవంతునిచేత చెప్పబడింది(13.6).అందుచేత విషయ-విషయులను వేరు వేరుగా చూడకపోవడం అనే లక్షణంగలదీ,తన(దేహియొక్క)ధర్మమూ అయిన అవిద్యచేత(దేహిని)వాని ఆత్మకాని(అనగా వాని స్వరూపం కాని)సుఖమునందు సక్తుని వలె చేస్తున్నది.సక్తుడు కాకపోయినా సక్తుడు అన్నట్లు చేస్తూన్నది.సుఖం లేనివాడైనా సుఖం ఉన్నవానిని వలె చేస్తూన్నది.జ్ఞానసంగంచేత కూడ అట్లే బంధిస్తూన్నది.ఇక్కడ సుఖంతో కలిపి చెప్పడంచేత ఈ జ్ఞానం అంతఃకరణధర్మమే కాని ఆత్మధర్మం కాదు.ఆత్మధర్మం అయిన పక్షంలో(అది ఎప్పుడూ ఉన్నదే గాన) క్రొత్తగా సంగం అనేది కుదరదు; బంధం కూడ కుదరదు.సుఖం విషయంలో సంగం ఏ విధంగా ఏర్పడుతుం దని చెప్పబడినదో

జ్ఞానాదుల విషయంలో సంగం కూడ ఆ విధంగానే జరుగుతుంది అని అర్థం చేసికోవాలి. అనఘా,వ్యసనాలు లేనివాడా!

వి."అవిద్యయైవ స్వకీయధర్మభూతయా"అనగా క్షేత్రజ్ఞుని ధర్మమైన అవిద్యచేత అని అర్థం.సత్త్వగుణధర్మమైన అను అర్థం యుక్తంగా తోచదు.వాస్తవంలో అవిద్య ఆత్మ ధర్మం కాకపోయినా మరొక సంబంధం ఏదీ లేకపోవడంచేత,అచేతనమైన అవిద్య అస్వతంత్రం అవడంచేత ఇది ఆత్మధర్మం అని కల్పించి చెప్పబడుచున్నది అని ఆనందగిరి వివరించారు. 6

మూ. రజో రాగాత్మకం విద్ధి తృష్ణాసంగసముద్భవమ్,
తన్నిబధ్నాతి కౌన్తేయ కర్మసంగేన దేహినమ్. 7

ప్ర.అ.రజ ఇతి:- కౌన్తేయ=అర్జునా!రాగాత్మకమ్=రంగు వలె అంటుకొనే స్వభావం గల,రజః=రజోగుణమును,తృష్ణాసంగసముద్భవమ్=తృష్ణకు ఆసంగానికి కారణమైన దానినిగా,విద్ధి=తెలుసుకొనుము. తత్=అది,కర్మసంగేన=కర్మయందు ఆసక్తిచేత,దేహినమ్= దేహవంతుడైన జీవుణ్ణి,నిబధ్నాతి=బంధిస్తుంది.

భాష్యమ్

రజః రాగాత్మకమ్ ఇతి:-రజః రాగాత్మకం-రఞ్జనాత్ రాగః,గైరికాదివత్ రాగాత్మ కం,విద్ధి జానీహి. తృష్ణాసంగసముద్భవమ్-తృష్ణా అప్రాప్తాభిలాషః-ఆసంగః ప్రాప్తే విషయే మనసః ప్రీతిలక్షణః సంశ్లేషః. తృష్ణాసంగయోః సముద్భవం తృష్ణాసంగ సముద్భ వమ్. తత్ నిబధ్నాతి,తత్ రజః కౌన్తేయ,కర్మసంఖేన దృష్టాదృష్టార్థేషు కర్మసు సంజనం, తత్పరతా కర్మసంగః,తేన,నిబధ్నాతి రజః దేహినమ్. 7

బాలానందిని

రజో రాగాత్మకమితి:-రజోగుణం,రాగాత్మకమ్-రంజింపచేయడంవల్ల,తగుల్కొ నడంవల్ల రాగం.గైరికాదిధాతువుల వలె,రాగాత్మక మైనదానినిగా,(అంటుకొనే స్వభావం కలదానినిగా)తెలుసుకొనుము. తృష్ణాసంగసముద్భవమ్-తృష్ణ అనగా లభించనిదాని విషయంలో అభిలాష.ఆసంగం అనగా లభించిన విషయంలో మనస్సుయొక్క ప్రీతిరూప మైన సంశ్లేషం.(మనస్సు దానియందు లగ్నమై ఉండడం. అదే మనస్సుకు ఆ వస్తువుల వల్ల కలిగే ప్రీతి,ఆనందం). తృష్ణకు ఆసంగానికీ సముద్భవం,అనగా అవి పుట్టడానికి కారణం. అర్జునా!ఆ రజస్సు,దేహిని కర్మసంగంచేత-కనబడే ఫలాలు కలవి. కనబడని- ఎప్పుడో లభించే-ఫలం కలవి అయిన కర్మలయందు సంజనం,అనగా వాటియందు అత్యాసక్తి కర్మసంగం;దానిచేత బంధిస్తుంది.

మూ. తమస్త్వజ్ఞానజం విద్ధి మోహనం సర్వదేహినామ్,
ప్రమాదాలస్యనిద్రాభిస్తన్నిబధ్నాతి భారత. 8

ప్ర.అ. తమ ఇతి:- తమః తు=తమస్సునైతే, అజ్ఞానజమ్=అజ్ఞానంవల్ల కలిగిన దానినిగాను,సర్వదేహినామ్=అన్ని ప్రాణులకు,మోహనమ్=మోహం కలగజేసే దానిని గాను,విద్ధి=తెలుసుకొనుము. భారత=అర్జునా!తత్=అది,ప్రమాదాలస్యనిద్రాభిః=ప్రమాదం చేత(పొరబాటు పడడంచేత)అలసత్వంచేత,నిద్రచేత,నిబధ్నాతి=బంధిస్తుంది.

భాష్యమ్

తమస్త్వితి:- తమః తృతీయః గుణః,అజ్ఞానజమ్–అజ్ఞానాత్ జాతమ్ అజ్ఞానజం, విద్ధి,మోహనం మోహకరమ్ అవివేకకరం,సర్వదేహినాం సర్వేషాం దేహవతాం, ప్రమాదాలస్యనిద్రాభిః–ప్రమాదశ్చ ఆలస్యం చ నిద్రా చ ప్రమాదాలస్యనిద్రాః, తాభిః, తత్ తమః,నిబధ్నాతి భారత. 8

బాలానందిని

తమ ఇతి:- అర్జునా!తమోగుణము నైతే అజ్ఞానంవల్ల పుట్టినదానినిగా తెలుసుకొనుము.సమస్తప్రాణులకు మోహాన్ని,అవివేకాన్ని,కలిగించేది,ఆ తమస్సు ప్రమాద–ఆలస్య – నిద్రలచేత బంధిస్తుంది. 8

భాష్యమ్

పునః గుణానాం వ్యాపారః సంక్షేపతః ఉచ్యతే–

మూ. సత్త్వం సుఖే సంజయతి రజః కర్మణి భారత,
జ్ఞానమావృత్య తు తమః ప్రమాదే సంజయత్యుత. 9

బాలానందిని

పునరితి:- గుణాల వ్యాపారం(పని)సంక్షిప్తంగా మళ్లీ చెప్పబడుచున్నది–

ప్ర.అ. సత్త్వమితి:- భారత=అర్జునా!సత్త్వమ్=సత్త్వగుణము,సుఖే=సుఖమునందు, సంజయతి=సక్తు డయే టట్లు చేస్తుంది.రజః=రజోగుణం,కర్మణి=కర్మయందు సక్తుణ్ణి చేస్తుంది.తమః తు=తమోగుణ మైతే.జ్ఞానమ్=జ్ఞానమును,ఆవృత్య=కప్పివేసి,ప్రమాదే = ప్రమాదమునందు(పొరబడుటయందు), సంజయతి ఉత=తప్పక సక్తుణ్ణి చేస్తుంది.

భాష్యమ్

సత్త్వం సుఖే,సంజయతి సంశ్లేషయతి.రజః కర్మణి,హే భారత,సంజయతి

ఇతి వర్తతే. జ్ఞానం సత్త్వకృతం వివేకమ్ ఆవృత్య ఆచ్ఛాద్య తు తమః, స్వేన ఆవరణాత్మనా ప్రమాదే సంజయతి. ప్రమాదః నామ ప్రాప్తకర్తవ్యాకరణమ్. 9

బాలానందిని

సత్త్వమితి:- అర్జునా!సత్త్వగుణం సుఖంలో సక్తు డయే టట్లు చేస్తుంది. రజోగుణం కర్మయందు, 'సంజయతి'అనే పదం ఇక్కడికి కూడ అనువర్తిస్తుంది;(సక్తుణ్ణి చేస్తుంది). తమోగుణ మైతే ఆవరణస్వరూప మైన(కప్పివేయడమే స్వరూపంగా గల)తనచేత,జ్ఞానాన్ని,సత్త్వ గుణంచేత చేయబడిన(ఇవ్వబడిన)వివేకాన్ని ఆచ్ఛాదించి ప్రమాదంలో సక్తుణ్ణి చేస్తుంది. ప్రమాదం అనగా చేయవలసి యున్న పని చేయకపోవడం. 9

భాష్యమ్

ఉక్తం కార్యం కదా కుర్వన్తి గుణాః ఇతి ఉచ్యతే-

మూ. రజస్తమశ్చాభిభూయ సత్త్వం భవతి భారత,
రజః సత్త్వం తమశ్చైవ తమః సత్త్వం రజస్తథా. 10

బాలానందిని

ఉక్తమితి:-గుణాలు చెప్పబడిన కార్యాన్ని ఎప్పుడు చేస్తాయో చెప్పబడుతూన్నది-

ప్ర.అ. రజ ఇతి:-భారత=అర్జున,సత్త్వమ్=సత్త్వగుణము,రజః=రజోగుణమును, తమః చ=తమోగుణమును,అభిభూయ=అణగద్రొక్కి,భవతి=వృద్ధిచెందుచున్నది. రజః= రజోగుణము,సత్త్వమ్=సత్త్వగుణమును,తమః చ ఏవ=తమోగుణమును,అణగద్రొక్కి వృద్ధి పొందుచున్నది. తథా=అట్లే,తమః=తమోగుణము,సత్త్వమ్=సత్త్వగుణమును,రజః=రజో గుణమును అణగద్రొక్కి వృద్ధిపొందుచున్నది.

భాష్యమ్

రజ తమః చ ఉభౌ అపి అభిభూయ సత్త్వం,భవతి ఉద్భవతి వర్ధతే యదా తదా లబ్ధాత్మకం సత్త్వం స్వకార్యం జ్ఞానసుఖాది ఆరభతే, హే భారత!తథా రజోగుణః సత్త్వం తమః చ అపి అభిభూయ వర్ధతే యదా తదా కర్మ తృష్ణాది స్వకార్యమ్ ఆరభతే. తమ ఆఖ్యః గుణః సత్త్వం రజశ్చ ఉభావపి అభిభూయ తథైవ వర్ధతే యదా తదా జ్ఞానావరణాది స్వకార్యమ్ ఆరభతే. 10

బాలానందిని

రజ ఇతి:- సత్త్వము రజోగుణాన్ని తమోగుణాన్ని అణగద్రొక్కి ఎప్పుడు వృద్ధి

పొందుతుందో అప్పుడు తన కార్యమైన జ్ఞానము,సుఖమూ మొదలైనదానిని పుట్టిస్తుంది. అట్లే రజోగుణం సత్త్వ-తమోగుణాలను రెండింటిని అణగద్రొక్కి ఎప్పుడు వృద్ధి పొందు తుందో అప్పుడు కర్మను,తృష్ణ మొదలైనవాటిని కలిగిస్తుంది. అదే విధంగా తమోగుణం సత్త్వ-రజోగుణాలను అణగద్రొక్కి ఎప్పుడు వృద్ధి పొందుతుందో అప్పుడు జ్ఞానాన్ని కప్పివేయడం మొదలైన తాను చేసే కార్యాన్ని ప్రారంభిస్తుంది. 10

భాష్యమ్

యదా యః గుణ ఉద్భూతః భవతి తదా తస్య కిం లిఙ్గమ్ ఇతి ఉచ్యతే-

మూ. సర్వద్వారేషు దేహేఽస్మిన్ ప్రకాశ ఉపజాయతే,
జ్ఞానం యదా తదా విద్యాద్వివృద్ధం సత్త్వమిత్యుత. 11

బాలానందిని

యదా ఇతి:-ఏ గుణం ఎప్పుడు ఉద్బుద్ధం అవుతుందో(పైకి లేస్తుందో)అప్పుడు దానికి గుర్తు ఏమిటో చెప్పబడుచున్నది-

ప్ర.అ.సర్వేతి:- యదా=ఎప్పుడు,అస్మిన్=ఈ,దేహే=దేహమునందు,సర్వద్వారేషు= అన్ని ద్వారాలయందు,జ్ఞానమ్=జ్ఞానరూపమైన,ప్రకాశః=ప్రకాశ,ఉపజాయతే=పుడుతుందో, తదా=అప్పుడు,ఉత=అధికంగా, సత్త్వమ్=సత్త్వగుణము,ప్రవృద్ధమ్ఇతి=వృద్ధిపొందినది అని,విద్యాత్=తెలుసుకొనవలెను.

భాష్యమ్

సర్వద్వారేషు ఆత్మనః ఉపలబ్ధిద్వారాణి శ్రోత్రాదీని సర్వాణి కరణాని తేషు సర్వద్వారేషు,అన్తఃకరణస్య బుద్ధేః వృత్తిః ప్రకాశః దేహే అస్మిన్ ఉపజాయతే,తదేవ జ్ఞానం,యదా ఏవం ప్రకాశాఖ్యః ఉపజాయతే తదా జ్ఞానప్రకాశేన లిఙ్గేన విద్యాత్, వివృద్ధమ్ ఉద్భూతం,సత్త్వమ్ ఇతి,ఉత అపి. 11

బాలానందిని

సర్వేతి:- సర్వద్వారాలలోను-శ్రోత్రాదు లైన సమస్తేంద్రియాలు ఆత్మను తెలుసు కొనడానికి ద్వారాలు(ఆత్మ జ్ఞానస్వరూపం.ఆ జ్ఞానం శ్రోత్రాదీంద్రియాల ద్వారా పైకి కనబడుతుంది. అందుచేత ఆ ఇంద్రియాల ద్వారా ఆత్మయొక్క అస్తిత్వం తెలియబడుతుంది) ఆ సర్వద్వారాలలో, ఈ దేహమునందు,ప్రకాశ,బుద్ధియొక్క అంతఃకరణముయొక్క వృత్తి, అదే జ్ఞానం,కలుగుతుంది. ఈ విధంగా జ్ఞాన మనే పేరు గల ప్రకాశ ఎప్పుడు కలుగు

తుందో అప్పుడు జ్ఞానప్రకాశ మనే లింగంచేత(గుర్తుచేత)సత్త్వగుణం ఉద్భూత మైన దని (పెరిగినదని)గ్రహించాలి. 11

భాష్యమ్

రజసః ఉద్భూతస్య ఇదం చిహ్నమ్–

మూ. **లోభః ప్రవృత్తిరారమ్భః కర్మణామశమః స్పృహా,**
రజస్యేతాని జాయన్తే వివృద్ధే భరతర్షభ. **12**

బాలానందిని

రజస ఇతి:–ఇది ఉద్భూతమైన రజోగుణానికి చిహ్నం–

ప్ర.అ. **లోభ ఇతి**:– భరతర్షభ=అర్జునా!రజసి=రజోగుణం,వివృద్ధే=వృద్ధిపొందిన దగుచుండగా,లోభః=లోభము,ప్రవృత్తిః=ప్రవర్తన,కర్మణామ్=కర్మలయొక్క,ఆరమ్భః= ప్రారంభము,అశమః=శాంతి లేకపోవడము,స్పృహా=కోరిక,ఏతాని=ఇవి,జాయన్తే= కలుగుతాయి.

భాష్యమ్

లోభః పరద్రవ్యాదిత్సా,ప్రవృత్తిః ప్రవర్తనం సామాన్యచేష్టా,ఆరమ్భః,కస్య? కర్మణామ్.అశమః అనుపశమః,హర్షరాగాదిప్రవృత్తిః,స్పృహా సర్వసామాన్యవస్తువిషయా తృష్ణా,రజసి గుణే వివృద్ధే ఏతాని లిఙ్గాని,జాయన్తే హే భరతర్షభ. 12

బాలానందిని

లోభ ఇతి:– అర్జునా!లోభ మనగా పరుల ద్రవ్యాన్ని తీసికోవా లనే కోరిక.ప్రవృత్తి అనగా ప్రవర్తించడం,పనులు చేయడం,కర్మలను ప్రారంభించడం. అశమం అనగా మనస్సు ప్రశాంతంగా ఉండకపోవడం–హర్షము రాగమూ మొదలైనవి బయలుదేరడం. స్పృహా- సామాన్యరూపంలో వస్తువులమీద, ఏమేమో సంపాదించా లని,ఆశ,ఇవి (ఈ గుర్తులు) రజోగుణం వృద్ధి పొంది నప్పుడు పుడతాయి. 12

మూ. **అప్రకాశోఽప్రవృత్తిశ్చ ప్రమాదో మోహ ఏవ చ,**
తమస్యేతాని జాయన్తే వివృద్ధే కురునన్దన. **13**

ప్ర.అ. **అప్రకాశ ఇతి**:– కురునన్దన=అర్జునా! తమసి=తమోగుణం,వివృద్ధే=వృద్ధి పొందిన దగుచుండగా,అప్రకాశః=ప్రకాశ లేకపోవడం,అప్రవృత్తిః= ఏ పనియందూ

ప్రవర్తించకపోవడం,ప్రమాదః=పొరబాటు,మోహఃఏవ చ=ఏమరిపాటు,ఏతాని=ఇవి, జాయన్తే =కలుగుతాయి.

భాష్యమ్

అప్రకాశ ఇతి:- అప్రకాశః అవివేకః అత్యన్తమ్,అప్రవృత్తిః చ ప్రవృత్త్య భావః, తత్కార్యం ప్రమాదః,మోహః ఏవ చ అవివేకః,మూఢతా ఇత్యర్థః. తమసి గుణే వివృద్ధే ఏతాని లిఙ్గాని జాయన్తే హే కురునన్దన. 13

బాలానందిని

అప్రకాశ ఇతి:-అర్జునా!అప్రకాశం అనగా పూర్తిగా వివేకం లేకపోవడం,ప్రవృత్తి (పనులుచేయడం)లేకపోవడం,వీటి కార్యమైన(జ్ఞానం లేకపోవడంవల్ల పనులు చేయకపోవ డంవల్లా కలిగే)ప్రమాదమూ,మోహము అనగా అవివేకం,మూఢత్వ మని అర్థం.తమస్సు వృద్ధి పొందినప్పుడు ఈ లింగాలు కలుగుతాయి. 13

భాష్యమ్

మరణద్వారేణాపి యత్ ఫలం ప్రాప్యతే తదపి సంగరాగహేతుకం సర్వం గౌణమ్ ఏవ ఇతి దర్శయన్నాహ-

మూ. యదా సత్త్వే ప్రవృద్ధే తు ప్రలయం యాతి దేహభృత్,
తదోత్తమవిదాం లోకానమలాన్ ప్రతిపద్యతే. 14

బాలానందిని

మరణేతి:- మరణం ద్వారా కూడ ఏ ఫలం పొందబడుతుందో సంగరాగములు కారణంగా గల అది అంతా కూడ గుణాలవల్ల కలిగేదే అని చూపుతూ చెపుతున్నాడు-

ప్ర.అ. యదా ఇతి:- దేహభృత్=మనుష్యుడు,యదా=ఎప్పుడు,సత్త్వే=సత్త్వగుణం, ప్రవృద్ధే=వృద్ధిపొందిన దగుచుండగా,ప్రలయమ్=మరణమును,యాతి=పొందుతాడో, తదా=అప్పుడు,ఉత్తమవిదామ్=ఉత్తమమైన విషయాన్ని తెలిసినవారి యొక్క అమలాన్= నిర్మలములైన,లోకాన్=లోకాలను, ప్రతిపద్యతే=పొందుతాడు.

వి. అవతారికలోని'సంగరాగహేతుకమ్' అనుదానికి జీవించి ఉన్నప్పుడు ఏ విషయాలయందు ఆసక్తి,తృష్ణ ఉండి ఆ విషయాలను అనుష్ఠిస్తాడో దానిని పట్టి సత్త్వగుణం వల్ల లభించే విషయాలమీద ఆసక్తి చూపితే మరణకాలంలో ఆ సత్త్వం అభివృద్ధి చెంది ఉత్తమలోకాలను పొందుతాడు.ఇతరగుణాలకు సంబంధించిన విషయాలయందు ఆసక్తు డైతే మరణ సమయంలో అవి ఉద్భూతా లవడంచేత అందుకు తగిన ఫలాన్ని పొందుతాడు

అని అర్థం. 'సంగరాగహేతుకమ్' అనేది ఆనందగిరిసంమతమైన పాఠం. దానికి బదులు 'సహేతుకమ్' అని కొన్ని ప్రతులలో పాఠం ఉన్నది. ఫలాలూ, వాటి హేతువులూ కూడ గుణజన్యములే అని అర్థం.

భాష్యమ్

యదా సత్త్వే, ప్రవృద్ధే ఉద్భూతే, తు, ప్రలయం మరణం, యాతి ప్రతిపద్యతే, దేహభృత్ ఆత్మా, తదా ఉత్తమవిదాం మహదాదితత్త్వవిదామ్ ఇత్యేతత్. లోకాన్ అమలాన్ మలరహితాన్, ప్రతిపద్యతే, ప్రాప్నోతి ఇత్యేతత్. 14

బాలానందిని

యదేతి:- ఎప్పుడు సత్త్వం వృద్ధిపొంది నప్పుడు జీవుడు మరణమును పొందుతాడో అప్పుడు మహదాదితత్త్వాలను తెలుసుకొనువాళ్లకు లభించే నిర్మలములైన(బ్రహ్మలోకాది) లోకాలను పొందుతాడు. 14

మూ. రజసి ప్రలయం గత్వా కర్మసంగిషు జాయతే,
తథా ప్రలీనస్తమసి మూఢయోనిషు జాయతే. 15

ప్ర. అ. రజసీతి:- రజసి=రజోగుణం ఉద్భృద్ధం అయినప్పుడు, ప్రలయమ్=మరణమును, గత్వా=పొంది, కర్మసంగిషు=కర్మయందు ఆసక్తి గలవారిలో, జాయతే=పుడతాడు. తథా=అట్లే, తమసి=తమోగుణం ఉద్భృద్ధ మైనప్పుడు, ప్రలీనః=మరణించినవాడు, మూఢయోనిషు=మూఢములైన జాతులలో, జాయతే=పుడతాడు.

భాష్యమ్

రజసి గుణే వివృద్ధే, ప్రలయం మరణం, గత్వా ప్రాప్య, కర్మసంగిషు కర్మాసక్తియుక్తేషు మనుష్యేషు జాయతే. తథా తద్వదేవ, ప్రలీనః మృతః, తమసి వివృద్ధే, మూఢయోనిషు పశ్వాదియోనిషు జాయతే. 15

బాలానందిని

రజసీతి:- రజోగుణం వృద్ధి పొందినప్పుడు మరణమును పొంది కర్మాసక్తి గలవారిలో పుడతాడు. అట్లే తమస్సు వృద్ధిపొందినప్పుడు మరణించినవాడు పశ్వాదియోనులందు పుడతాడు. 15

భాష్యమ్

అతీతశ్లోకార్థస్యైవ సంక్షేపః ఉచ్యతే-

మూ. కర్మణః సుకృతస్యాహుః సాత్త్వికం నిర్మలం ఫలమ్,
రజసస్తు ఫలం దుఃఖమజ్ఞానం తమసః ఫలమ్. 16

బాలానందిని

అతీతేతి:- పై శ్లోకాల అర్థంయొక్కయే సంక్షేపం, ఆ అర్థమే సంక్షిప్తంగా, చెప్ప బడుచున్నది-

ప్ర.అ. కర్మణః ఇతి:- సుకృతస్య=పుణ్య మైన,కర్మణః=సాత్త్వికకర్మయొక్క ఫలమ్= ఫలమును,సాత్త్వికమ్=సాత్త్విక మైనదానిని గాను,నిర్మలమ్=మాలిన్యరహిత మైనదానిని గాను,ఆహుః=చెప్పుచున్నారు.రజసః తు=రజోగుణంయొక్క ఫలమ్=ఫలమును, దుఃఖమ్ = దుఃఖమును గాను,అజ్ఞానమ్=అజ్ఞానమున్కు,తమసః=తమస్సుయొక్క ఫలమ్=ఫలమును గాను,చెప్పుచున్నారు.

భాష్యమ్

కర్మణః సుకృతస్య సాత్త్వికస్యేత్యర్థః.ఆహుః శిష్టాః సాత్త్వికమ్ ఏవ నిర్మలం ఫలమ్ ఇతి.రజసః తు ఫలం దుఃఖం రాజసస్య కర్మణః ఇత్యర్థః-కర్మాధికారాత్. ఫలమపి దుఃఖమేవ కారణానురూప్యాత్ రాజసమేవ.తథా అజ్ఞానం తమసః తామసస్య కర్మణః అధర్మస్య పూర్వవత్. 16

బాలానందిని

కర్మణః ఇతి:- సుకృతరూప మైన కర్మయొక్క,సాత్త్వికకర్మయొక్క అని అర్థం,ఫలము సాత్త్వికమైనది నిర్మల మైనది అని శిష్టులు చెప్పుచున్నారు.రజస్సుయొక్కఫలం దుఃఖం. కర్మను గూర్చి చెప్పే ప్రసంగం గాన రాజసస్య అనగా రాజసకర్మయొక్క అని అర్థం.దాని ఫలం కూడ,కారణానికి అనురూపంగా ఉంటుంది గాన రాజసకర్మ ఫలం దుఃఖమే.తమస్సు యొక్క అనగా తామసకర్మయొక్క,అధర్మము యొక్క ఫలం అజ్ఞానమే అని వెనుకటి వలె (కార్యం కారణానురూపం గాన ఇత్యాది విధంగా) గ్రహించాలి. 16

భాష్యమ్

కిం చ గుణేభ్యః భవతి? -

మూ. సత్త్వాత్సంజాయతే జ్ఞానం రజసో లోభ ఏవ చ,
ప్రమాదమోహౌ తమసో భవతోఽజ్ఞానమేవ చ. 17

బాలానందిని

కించేతి:- గుణాలవల్ల ఇంకా ఏమి కలుగుతుంది?

ప్ర.అ. సత్త్వాదితి:- సత్త్వాత్=సత్త్వగుణంనుండి,జ్ఞానమ్=జ్ఞానము,సంజాయతే=పుట్టుచున్నది.రజసః=రజోగుణమునుండి,లోభః ఏవ చ=లోభం కలుగుచున్నది.తమసః=తమోగుణమునుండి,ప్రమాదమోహౌ=ప్రమాదమోహాలు,భవతః=కలుగుచున్నాయి. అజ్ఞానమ్ ఏవ చ=అజ్ఞానం కూడ కలుగుచున్నది.

భాష్యమ్

సత్త్వాత్ లబ్ధాత్మకాత్,సంజాయతే సముత్పద్యతే,జ్ఞానం,రజసః లోభః ఏవ చ,ప్రమాదమోహౌ చ ఉభౌ తమసః భవతః అజ్ఞానమ్ ఏవ చ. 17

బాలానందిని

సత్త్వాదితి:- ఉద్బుద్ధ మైన సత్త్వగుణంనుండి జ్ఞానం పుడుతుంది;రజోగుణం నుండి లోభం పుడుతుంది;తమోగుణంనుండి ప్రమాద-మోహాలు,అజ్ఞానమూ పుడతాయి. 17

భాష్యమ్

కిం చ-

మూ. ఊర్ధ్వం గచ్ఛన్తి సత్త్వస్థా మధ్యే తిష్ఠన్తి రాజసాః,
జఘన్యగుణవృత్తస్థా అధో గచ్ఛన్తి తామసాః. 18

బాలానందిని

కిం చేతి:- మరియు

ప్ర.అ. ఊర్ధ్వమితి:- సత్త్వస్థాః=సత్త్వగుణముయొక్క వృత్తమునందు(దాని కార్యాలైన జ్ఞాన-సుకృతకర్మాదులందు)ఉన్నవారు,ఊర్ధ్వమ్=పైకి,గచ్ఛన్తి=వెడతారు.రాజసాః =రజోగుణవృత్తంలో ఉన్నవాళ్లు,మధ్యే=మధ్యయందు,తిష్ఠన్తి=ఉంటారు.జఘన్యగుణవృతస్థాః=చివరిదైన లేదా నీచమైన తమోగుణంయొక్క వృత్తంలో ఉన్న మానవాః=మానవులు, అధః=క్రిందకి,గచ్ఛన్తి=వెడతారు.

భాష్యమ్

ఊర్ధ్వం గచ్ఛన్తి దేవలోకాదిషు ఉత్పద్యన్తే,సత్త్వస్థాః సత్త్వగుణవృత్తస్థాః.మధ్యే తిష్ఠన్తి మనుష్యేషు ఉత్పద్యన్తే రాజసాః.జఘన్యగుణవృత్తస్థాః-జఘన్యః చ అసౌ గుణః చ జఘన్యగుణః,తమః,తస్య వృత్తం నిద్రాలస్యాది.తస్మిన్ స్థితాః జఘన్యగణవృత్తస్థాః మూఢాః,అధః గచ్ఛన్తి,పశ్వాదిషు ఉత్పద్యన్తే తామసాః. 18

బాలానందిని

ఊర్ధ్వమితి:- సత్త్వగుణంయొక్క వృత్తమునం దున్నవాళ్లు పైకి వెడతారు;దేవ లోకాదులలో పుడతారు.రాజసులు మధ్యలో ఉంటారు;మనుష్యులలో పుడతారు.జఘన్య గుణవృత్తస్థాః-చివరిదైన లేదా నీచమైన గుణం జఘన్యగుణం అనగా తమోగుణం.దాని వృత్త మనగా నిద్ర ఆలస్యం మొదలైనది.దానియం దున్న జఘన్యగుణవృత్తస్థు లైన మూఢులు,తామసులు,క్రిందకి వెడతారు,పశ్వాదులలో పుడతారు. 18

భాష్యమ్

పురుషస్య ప్రకృతిస్థత్వరూపేణ మిథ్యాజ్ఞానేన యుక్తస్య భోగ్యేషు గుణేషు సుఖ దుఃఖమోహాత్మకేషు,"సుఖీ దుఃఖీ మూఢః అహమ్ అస్మి"ఇత్యేవంరూపః యః సంగః తత్ కారణం పురుషస్య సదసద్యోనిజన్మప్రాప్తిలక్షణస్య సంసారస్య ఇతి పూర్వాధ్యాయే సమాసేన యత్ ఉక్తం తత్ ఇహ-"సత్త్వం రజస్తమ ఇతి గుణాః ప్రకృతి సం భవాః" (14.5)ఇత్యారభ్య గుణస్వరూపం గుణవృత్తం స్వవృత్తేన చ గుణానాం బన్ధకత్వం గుణవృత్తనిబద్ధస్య చ పురుషస్య యా గతిః ఇత్యేతత్ సర్వం మిథ్యాజ్ఞానమ్ అజ్ఞాన మూలం బన్ధకారణం విస్తరేణ ఉక్త్వా అధునా సమ్యగ్దర్శనాత్ మోక్షః వక్తవ్యః ఇత్యాహ భగవాన్-

మూ. నాన్యం గుణేభ్యః కర్తారం యదా ద్రష్టానుపశ్యతి,
గుణేభ్యశ్చ పరం వేత్తి మద్భావం సోఽధిగచ్ఛతి. 19

బాలానందిని

పురుషస్యేతి:- ప్రకృతిస్థత్వరూపమైన (ప్రకృతితో పూర్తిగా సంబంధించి ఉండి పోవడం) అనే మిథ్యాజ్ఞానంతో కూడిన పురుషునకు సుఖదుఃఖమోహాత్మకాలైన గుణాలతో సంగం ఏర్పడి అతడు "నేను సుఖంగా ఉన్నాను,దుఃఖపడుతున్నాను,ఏమీ తెలియకుండా ఉన్నాను"ఇత్యాదివిధంగా అనుకొంటూ ఉంటాడు.పురుషుడు ఉత్తమజన్మలు పొందడం, అధమజన్మలు పొందడం అనే సంసారానికి ఈ గుణసంగమే కారణం.ఈ విషయం సంగ్రహంగా పూర్వాధ్యాయంలో చెప్పండింది.అక్కడ సంగ్రహంగా చెప్పిన ఆ విషయాన్నే ఈ అధ్యాయం లో "సత్త్వం రజస్తమ ఇతి గుణాః ప్రకృతిసంభవాః"అని ప్రారంభించి గుణాల స్వరూపము, గుణాల వృత్తము(అవి చేసే పని),గుణాలు స్వవృత్తంచేత పురుషుణ్ణి బంధించడము, గుణవృత్తాలచేత బద్ధుడైన పురుషునకు కలిగే గతి,దీని నంతనీ, బంధ కారణమూ,అజ్ఞానంవల్ల కలిగేదీ అయిన ఈ మిథ్యాజ్ఞానాన్ని అంతనీ విస్తరంతో చెప్పిన

తరువాత ఇప్పుడు సమ్యగ్దర్శనంవల్ల మోక్షం కలుగుతుంది అనే విషయం చెప్పా లనే అభిప్రాయంతో భగవంతుడు అంటున్నాడు -

ప్ర.అ. నాన్యమితి:- ద్రష్టా=విద్వాంసుడు,గుణేభ్యః=గుణాలకంటె,అన్యమ్= ఇతరుడైన, కర్తారమ్=కర్తను,యదా=ఎప్పుడు,న అనుపశ్యతి=చూడడో,గుణేభ్యః=గుణాల కంటె, పరమ్=వేరైన ఆత్మస్వరూపాన్ని,వేత్తి=తెలుసుకొంటాడో,సః=అతడు, మద్భావమ్=నా స్వరూపాన్ని అధిగచ్ఛతి=పొందుతాడు.

భాష్యమ్

న అన్యం కార్యకరణవిషయాకారపరిణతేభ్యః గుణేభ్యః కర్తారమ్ అన్యం యదా ద్రష్టా విద్వాన్ సన్ న అనుపశ్యతి.గుణాః ఏవ సర్వావస్థాః సర్వకర్మణాం కర్తారః ఇత్యేవం పశ్యతి;గుణేభ్యః చ పరం గుణవ్యాపారసాక్షిభూతం వేత్తి మద్భావం మమ భావం స ద్రష్టా అధిగచ్ఛతి.

("మద్భావం మమ భావం,వాసుదేవత్వం 'వాసుదేవః సర్వమ్'(7.19)ఇత్యేవం పశ్యన్"అని ఒక ప్రతిలో పాఠాంతరం). 19

బాలానందిని

నాన్యమితి:- ద్రష్టయైనవాడై,విద్వాంసుడై,కార్యములు(దేహాలు)గాను,ఇంద్రియాలు గాను,విషయాలుగాను పరిణమించిన గుణాలకంటె వేరుగా కర్తను ఎప్పుడు చూడడో, సమస్తమైన అవస్థలు గల(అన్ని)రూపాలలో ఉన్న గుణాలే సర్వకర్మలను చేస్తున్నాయి అని చూస్తాడో,గుణాలకంటె పరమైన,గుణాల వ్యాపారాలకు సాక్షిగా ఉన్న ఆత్మతత్త్వాన్ని తెలుసుకొంటాడో అతడు నా స్వరూపాన్ని పొందుతాడు.("వాసుదేవః సర్వమ్"అని చూచే ఆ విద్వాంసుడు వాసుదేవత్వాన్ని పొందుతాడు). 19

భాష్యమ్

కథమధిగచ్ఛతీత్యుచ్యతే -

మూ. **గుణానేతానతీత్య త్రీన్ దేహీ దేహసముద్భవాన్,**
జన్మమృత్యుజరాదుఃఖైర్విముక్తోఽమృతమశ్నుతే. 20

బాలానందిని

కథమితి:- (వాసుదేవస్వరూపాన్ని)ఎట్లు పొందుతాడో చెప్పబడుచున్నది-

ప్ర.అ. గుణానితి:- దేహీ=దేహవంతుడు,దేహసముద్భవాన్=దేహానికి కారణాలైన,

ఏతాన్=ఈ, త్రీన్=మూడు,గుణాన్=గుణాలను,అతీత్య=అతిక్రమించి,జన్మమృత్యుజరాదుఃఖైః=జన్మచేతను,మృత్యువుచేతను,ముసలితనంచేతను,దుఃఖాలచేతను,విముక్తః=విడపబడినవాడై,అమృతత్వమ్=మోక్షమును,అధిగచ్ఛతి=పొందును.

భాష్యమ్

గుణానేతాన్ యథోక్తాన్,అతీత్య జీవన్నేవ అతిక్రమ్య,మాయోపాధిభూతాన్ త్రీన్ దేహీ,దేహసముద్భవాన్ దేహోత్పత్తిబీజభూతాన్ జన్మమృత్యుజరాదుఃఖైః-జన్మ చ మృత్యుః చ జరా చ దుఃఖాని చ తైః జీవన్నేవ విముక్తః సన్ విద్వాన్ అమృతమ్ అశ్నుతే.ఏవం మద్భావం అధిగచ్ఛతీత్యర్థః. 20

బాలానందిని

గుణానితి:- చెప్పబడిన స్వరూపం గల ఈ గుణాలను దాటి,జీవించియుండగానే దేహవంతుడు మాయారూపోపాధు లైన దేహం పుట్టడానికి కారణా లైన ఈ మూడు గుణాలను జయించి, ఆ విద్వాంసుడు జీవించి ఉండగానే జన్మచేత మృత్యువుచేత జరచేత దుఃఖాలచేత విముక్తుడై అమృతాన్ని పొందుతాడు. ఈ విధంగా నా స్వరూపాన్ని పొందుతాడు అని అర్థం. 20

భాష్యమ్

జీవన్నేవ గుణానతీత్య అమృతమ్ అశ్నుతే ఇతి ప్రశ్నబీజం ప్రతిలభ్య -

అర్జున ఉవాచ-

మూ. కైర్లిఙ్గైస్త్రీన్ గుణానేతానతీతో భవతి ప్రభో,
కిమాచారః కథం చైతాంస్త్రీన్ గుణానతివర్తతే. 21

బాలానందిని

జీవన్నితి:- జీవించి ఉండగానే గుణాలను అతిక్రమించి అమృతాన్ని పొందుతాడు అని అనగానే ప్రశ్నకు బీజాన్ని పొంది-

అర్జునుడు పలికెను-

ప్ర. అ. కైరితి:- ప్రభో=ప్రభూ!ఏతాన్=ఈ,త్రీన్ గుణాన్=మూడు గుణాలను,కైః లిఙ్గైః=ఏ గుర్తులచేత,అతీతః=దాటినవాడు,భవతి=అవుతాడు?కిమాచారః=ఏ విధమైన ప్రవర్తన కలవాడై,ఏతాన్=ఈ,త్రీన్=మూడు,గుణాన్=గుణాలను, కథం చ=ఎట్లు, అతివర్తతే=దాటుతాడు?

భాష్యమ్

కైః,లిఙ్గైః చిహ్నైః,త్రీన్ ఏతాన్ వ్యాఖ్యాతాన్ గుణాన్ అతీతః అతిక్రాన్తః భవతి ప్రభో.కిమాచారః కః అస్య ఆచారః ఇతి కిమాచారః,కథం కేన చ ప్రకారేణ ఏతాన్ త్రీన్ గుణాన్ అతివర్తతే? 21

బాలానందిని

కైరితి:- ఏ చిహ్నాలచేత పైన వివరించబడిన ఈ మూడు గుణాలను అతిక్రమించినవా డవుతాడు?ప్రభూ!ఎట్టి ఆచారం కలవాడై,ఏ ప్రకారంచేత ఈ మూడు గుణాలను అతిక్రమిస్తాడు? 21

భాష్యమ్

గుణాతీతస్య లక్షణం గుణాతీతత్వోపాయం చ అర్జునేన పృష్టః అస్మిన్ శ్లోకే ప్రశ్నద్వయార్థం ప్రతివచనమ్-

శ్రీభగవానువాచ-

యత్ తావత్ కైః లిఙ్గైః యుక్తః గుణాతీతః భవతి ఇతి తత్ శృణు-

మూ. ప్రకాశం చ ప్రవృత్తిం చ మోహమేవ చ పాణ్డవ,
న ద్వేష్టి సంప్రవృత్తాని న నివృత్తాని కాఙ్క్షతి. 22

బాలానందిని

గుణేతి:-గుణాతీతుని లక్షణాన్నీ,గుణాతీతత్వానికి ఉపాయాన్నీ అర్జునునిచేత ప్రశ్నింపబడినవాడై భగవంతుడు ఈ శ్లోకంలో రెండు ప్రశ్నలకు ప్రతివచనమును చెప్పెను.గుణాతీతుడు ఏ లింగాలతో కూడినవాడై ఉంటాడో ముందుగా వినుము-

ప్ర.అ. ప్రకాశమితి:- పాణ్డవ=అర్జునా!సంప్రవృత్తాని=ప్రవర్తించిన,ప్రకాశం చ= ప్రకాశమును,ప్రవృత్తిం చ=ప్రవృత్తిని,మోహమ్ ఏవ చ=మోహాన్నీ కూడ,న ద్వేష్టి= ద్వేషించదు,నివృత్తాని=నివర్తించినవాటిని, న కాఙ్క్షతి=కోరదు.

భాష్యమ్

ప్రకాశం చ సత్త్వకార్యం,ప్రవృత్తిం చ రజఃకార్యం,మోహమ్ ఏన చ తమః కార్యమ్ ఇత్యేతాని న ద్వేష్టి సంప్రవృత్తాని,సమ్యక్ విషయభావేన ఉద్భూతాని.మమ తమసః ప్రత్యయః జాతః,తేన అహం మూఢః,తథా రాజసీ ప్రవృత్తిః మమ ఉత్పన్నా

దుఃఖాత్మికా,తేనాహం రజసా ప్రవర్తితః ప్రచలితః స్వరూపాత్,కష్టం మమ వర్తతే యః అయం మత్స్వరూపావస్థానాత్ భ్రంశః;తథా సాత్త్వికః గుణః ప్రకాశాత్మా మాం వివేకిత్వమ్ ఆపాదయన్ సుఖే చ సంజయన్ బధ్నాతి ఇతి తాని ద్వేష్టి అసమ్యగ్దర్శిత్వేన. తదేవం గుణాతీతః న ద్వేష్టి సంప్రవృత్తాని.యథా చ సాత్త్వికాదిపురుషః సాత్త్వికాది కార్యాణి ఆత్మానం ప్రతి ప్రకాశ్య నివృత్తాని కాఙ్క్షతి న తథా గుణాతీతః నివృత్తాని కాఙ్క్షతి ఇత్యర్థః.ఏతత్ న పరప్రత్యక్షం లిఙ్గం,కిం తర్హి స్వాత్మప్రత్యక్షత్వాత్ ఆత్మవిషయ మేవ ఏతత్ లక్షణమ్.న హి స్వాత్మవిషయం ద్వేషమ్ ఆకాఙ్క్షాం వా పరః పశ్యతి. 22

బాలానందిని

ప్రకాశమితి:- సంప్రవృత్తములైన,బాగుగా స్పష్టంగా తెలిసే టట్లు ప్రవర్తించిన, సత్త్వగుణకార్య మైన ప్రకాశమును,రజోగుణకార్య మైన ప్రవృత్తిని,తమోగుణకార్యమైన మోహాన్ని కూడ ద్వేషించడు.నాకు తామసమైన జ్ఞానం కలిగినది;అందుచేత నేను మూఢుడ నైనాను;నాకు దుఃఖస్వభావం గల రాజసప్రవృత్తి కలిగినది;ఆ రజోగుణంచేత ప్రవర్తింప బడినవాడనై నా స్వస్వరూపంనుండి చలించిపోయాను.నేను స్వస్వరూపంలో ఉండకుండా దానినుండి భ్రష్టుడ నవడం అనే ఈ గొప్ప కష్టం వచ్చి పడింది.అట్లే ప్రకాశరూప మైన సాత్త్వికగుణం నాకు వివేకిత్వాన్ని కలిగించి, నన్ను సుఖసక్తుణ్ణి చేసి బంధిస్తూన్నది;ఈ విధంగా సమ్యగ్దర్శనం లేకపోవడంచేత వాటిని ద్వేషిస్తాడు,కాని గుణాతీతుడు ప్రవర్తించిన ప్రకాశాదులను ఈ విధంగా ద్వేషించడు.సాత్త్వికాదిపురుషుడు (సత్త్వగుణం ఉద్బుద్ధమైన సాత్త్వికపురుషుడు)తన విషయంలో కనబడి నివర్తించిన సాత్త్వికాదికార్యాలను(ప్రకాశాదు లను)మళ్లీ కావాలని ఏ విధంగా కోరుకొంటాడో ఆ విధంగా గుణాతీతుడు నివర్తించిన ఆ కార్యాలను కోరుకొనడు అని అర్థం.ఇది ఎవనిమట్టుకు వానికి మాత్రమే తెలిసే లింగం గాని పరప్రత్యక్షం కాదు.అందుచేత ఈ లక్షణం తనకు తాను చూచుకొనవలసిన లక్షణం మాత్రమే.తనకు సంబంధించిన(తనలో ఉన్న)ద్వేషాన్ని గాని,ఆకాంక్షను గాని ఇతరుడు చూడడు కదా? 22

భాష్యమ్

అథ ఇదానీం గుణాతీతః కిమాచారః ఇతి ప్రశ్నస్య ప్రతివచనమ్ ఆహ-

మూ. ఉదాసీనవదాసీనో గుణైర్యో న విచాల్యతే,
గుణా వర్తన్త ఇత్యేవ యోఽవతిష్ఠతి నేఙ్గతే. 23

బాలానందిని

అథేతి:- ఇప్పుడు గుణాతీతుని ఆచారం(ప్రవర్తన)ఎలా ఉంటుంది అను ప్రశ్నకు ప్రతివచనం చెపుతున్నాడు-

ప్ర.అ. ఉదాసీనవదితి:-ఉదాసీనవత్=ఉదాసీనుడు వలె,ఆసీనః=కూర్చుని ఉన్న, యః=ఎవడు,గుణైః=గుణాలచేత,న విచాల్యతే=చలింపచేయబడడో,యః=ఎవడు,గుణాః =గుణాలు,వర్తన్తే=ప్రవర్తిస్తున్నాయి.ఇత్యేవ=అని మాత్రమే అనుకొంటూ,అవతిష్ఠతి= ఉంటాడో,న ఇఙ్గతే=కదలడో-

భాష్యమ్

ఉదాసీనవత్ యథా ఉదాసీనః న కస్య చిత్ పక్షం భజతే తథా అయం గుణాతీతత్వోపాయమార్గే అవస్థితః ఆసీనః ఆత్మవిత్ గుణైః యః సంన్యాసీ న విచాల్యతే వివేకదర్శనావస్థాతః.తత్ ఏతత్ స్ఫుటీకరోతి-గుణాః కార్యకరణవిషయాకారపరిణతాః అన్యోన్యస్మిన్ వర్తన్తే ఇతి యః అవతిష్ఠతి.ఛన్దోభఙ్గభయాత్ పరస్మైపదప్రయోగః."యో ఽనుతిష్ఠతి"ఇతి వా పాఠాన్తరమ్.న ఇఙ్గతే న చలతి,స్వరూపావస్థః ఏవ భవతీ త్యర్థః. 23

బాలానందిని

ఉదాసీనవదితి:- ఏ విధంగా ఉదాసీనుడు ఎవని పక్షమునూ సమర్థించడో అట్లే ఈ గుణాతీతత్వోపాయమార్గంలో ఉన్నవాడై కూర్చొని ఉన్న ఆత్మవేత్త యైన ఏ సంన్యాసి వివేకదర్శనస్థితినుండి కదల్చబడడో,దీనినే విశదీకరిస్తున్నాడు-శరీర-ఇంద్రియ-విషయాల ఆకారంలో పరిణమించిన గుణాలు ఒకదానిమీద ఒకటి ఉంటున్నాయి అని అనుకొంటూ ఉంటాడో.ఛందోభంగం కలుగుతుం దనే భయంవల్ల పరస్మైపదం ప్రయోగించబడినది. లేదా "యో ఽనుతిష్ఠతి"అని పాఠాంతరం ఉండవచ్చును."సమవప్రవిభ్యః స్థః"(1.3.22) అను పాణినిసూత్రం చేత 'అవ'అను ఉపసర్గ చేర్చినప్పుడు స్థాధాతువు ఆత్మనేపది అవుతుంది.అప్పుడు 'అవతిష్ఠతే'అని ప్రయోగించాలి.కాని "యో ఽవతిష్ఠతే నేఙ్గతే"అని అంటే ఛందస్సు కుదరదు.అందుచేత 'అవతిష్ఠతి'అని పరస్మైపదరూపం ప్రయోగించ బడింది. "అనుతిష్ఠతి" అని ఉంటే ఆ దోషం లేదు).నేఙ్గతే-చలించదు,స్వరూపంలోనే ఉంటాడు అని అర్థం. 23

భాష్యమ్

కిం చ-

మూ. సమదుఃఖసుఖః స్వస్థః సమలోష్టాశ్మకాఞ్చనః,
తుల్యప్రియాప్రియో ధీరస్తుల్యనిన్దాత్మసంస్తుతిః. 24

భాష్యమ్

కిం చేతి-మరియు -

ప్ర.అ.సమేతి:-(ఎవడు)సమదుఃఖసుఖః=సమానమైన దుఃఖసుఖాలు కలవాడో, స్వస్థః=మనోవికారం లేకుండా స్వస్థుడుగా ఉంటాడో,సమలోష్టాశ్మకాఞ్చనః=సమానమైన మట్టిబెడ్డా రాయి బంగారమూ కలవాడో,తుల్యప్రియాప్రియః=సమానమైన ప్రియము అప్రియము కలవాడో,ధీరః=ధీరుడో(నిశ్చలచిత్తుడో),తుల్యనిన్దాత్మసంస్తుతిః = సమానమైన నింద తన స్తుతి కల వాడో-

భాష్యమ్

సమదుఃఖసుఖః-సమే దుఃఖసుఖే యస్య సః సమదుఃఖసుఖః.స్వస్థః స్వే ఆత్మని స్థితః ప్రసన్నః;సమలోష్టాశ్మకాఞ్చనః-లోష్టం చ అశ్మా చ కాఞ్చనం చ సమాని యస్య సః సమలోష్టాశ్మకాఞ్చనః.తుల్యప్రియాప్రియః-ప్రియం చ అప్రియం చ ప్రియాప్రియే తుల్యే సమే యస్య సః అయం తుల్యప్రియాప్రియః.ధీరః ధీమాన్ తుల్యనిన్దాత్మసంస్తుతిః -నిన్దా చ ఆత్మసంస్తుతిశ్చ నిన్దాత్మసంస్తుతీ; తుల్యే నిన్దాత్మసంస్తుతీ యస్య సః తుల్య నిన్దాత్మసంస్తుతిః. 24

బాలానందిని

సమేతి:- దుఃఖసుఖాలు ఎవనికి సమ మైనవో అతడు సమదుఃఖసుఖుడు,తన ఆత్మయందు ఉన్నవాడు స్వస్థుడు;ప్రసన్నుడు,మట్టిబెడ్డా,రాయి,బంగారమూ కూడ ఎవనికి సమములో అతడు సమలోష్టాశ్మకాంచనుడు.ప్రియము అప్రియమూ కూడ ఎవనికి తుల్యములో అతడు తుల్యప్రియాప్రియుడు.ధీరుడు అనగా బుద్ధిమంతుడు.తుల్యమైన నింద ఆత్మస్తుతి(ఇతరులు చేసే తన స్తుతీ)ఎవనికో అతడు తుల్యనిందాత్మసంస్తుతి.(నింద కూడ పరకృతమే.ఇక్కడ దుఃఖసుఖాలు ప్రియాప్రియాలుఅనగా లోకదృష్టిలో ఏది దుఃఖమో ఏది సుఖమో,ఏది ప్రియమో ఏది అప్రియమో అవన్నీ వీని దృష్టిలో సమానములే కావు.నిజానికి దుఃఖసుఖాలు గాని ప్రియాప్రియాలు గాని వీనికి ఉండవు అని భావం).24

భాష్యమ్

కిం చ-

మూ. మానాపమానయోస్తుల్యస్తుల్యో మిత్రారిపక్షయోః,
సర్వారమ్భపరిత్యాగీ గుణాతీతః స ఉచ్యతే. 25

బాలానందిని

కిం చేతి: - మరియు-

ప్ర.అ. మానేతి: -(ఎవడు)మానాపమానయోః=మానావమానాలయందు,తుల్యః =తుల్యుడో,మిత్రారివక్షయోః=మిత్ర-శత్రువక్షాలలో,తుల్యః=తుల్యుడో,నర్వారమ్భ పరిత్యాగీ=సమస్తకార్యములను త్యజించేవాడో,సః=అతడు,గుణాతీతః=గుణాలను అతిక్ర మించినవాడుగా,ఉచ్యతే=చెప్పబడుచున్నాడు.

భాష్యమ్

మానాపమానయోః,తుల్యః నిర్వికారః,తుల్యః మిత్రారిపక్షయోః. యద్యపి ఉదాసీనాః భవన్తి కేచిత్ స్వాభిప్రాయేణ తథాపి పరాభిప్రాయేణ మిత్రారిపక్షయోః ఇవ భవన్తి ఇతి తుల్యః మిత్రారిపక్షయోః ఇత్యాహ. సర్వారమ్భపరిత్యాగీ-దృష్టాదృష్టార్థాని కర్మాణి ఆరభ్యన్తే ఇతి ఆరమ్భాః,సర్వాన్ ఆరమ్భాన్ పరిత్యక్తుం శీలమ్ అస్య ఇతి సర్వారమ్భపరిత్యాగీ. దేహధారణమాత్రనిమిత్తవ్యతిరేకేణ సర్వకర్మపరిత్యాగీ ఇత్యర్థః. గుణాతీతః సః ఉచ్యతే.

"ఉదాసీనవత్"ఇత్యాది "గుణాతీతః స ఉచ్యతే"ఇత్యేతదన్తమ్ ఉక్తం యావత్ యత్నసాధ్యం తావత్ సంన్యాసినా అనుష్ఠేయం గుణాతీతత్వసాధనం ముముక్షోః. స్థిరీభూతం తు స్వసంవేద్యం సత్ గుణాతీతస్య యతేః లక్షణం భవతి. 25

బాలానందిని

మానేతి: -మానావమానాలలో తుల్యుడు,సముడు,వికారం లేనివాడు. మిత్రపక్షం లోను శత్రుపక్షంలోను తుల్యుడు. కొందరు తమ అభిప్రాయంచేత ఉదాసీనులైనా కూడ పరాభిప్రాయంచేత మిత్రపక్ష-శత్రుపక్షాలలో ఉన్నట్లు కనబడతారు. అందుచేత మిత్రారిపక్షా లలో తుల్యుడు అని చెపుతున్నాడు. ఆరంభించబడతాయి కాబట్టి ఆరంభాలు. అనగా కర్మలు. దృష్టప్రయోజనములు అదృష్టప్రయోజనములు (ఫలం ఇక్కడే కనబడేవి ఇక్కడ కనబడనవి)అయిన సమస్తకర్మలను త్యజించే స్వభావం కలవాడు. దేహం నిలుపుకొనడం కోసం నిమిత్తమైన,కర్మలు తప్ప మిగిలిన కర్మల నన్నింటినీ త్యజించేవాడు అని అర్థం. అతడు గుణాతీతు డని చెప్పబడుచున్నాడు.

"ఉదాసీనవదాసీనమ్"అనేది మొదలు "గుణాతీతః స ఉచ్యతే" అనే వరకు ఎంత వరకు ప్రయత్నంచేత సాధించడానికి శక్యమో అంతవరకు సంన్యాసికి అనుష్ఠేయం. ఇదంతా ముముక్షువునకు గుణాతీతత్వానికి సాధనం. (ఇవి గుణాతీతుడు కావాలనుకొనే ముముక్షువు ప్రయత్నపూర్వకంగా ఆచరించవలసిన సాధనాలు). అయితే ఇదంతా స్థిర మైనప్పుడు,ఒకడు ఈ సాధనా లన్నీ సాధించకలిగి నప్పుడు,ఇదే గుణాతీతుడైన యతియొక్క లక్షణం అవుతుంది. ఈ లక్షణం స్వసంవేద్యం.దీనిని ఎవరు సంపాదించుకొన్నారో వాళ్లకే తెలియాలి గాని ఇతరులకు తెలియదు. 25

భాష్యమ్

అధునా కథం చ త్రీన్ గుణాన్ అతివర్తతే ఇతి ప్రశ్నస్య ప్రతివచనమ్ ఆహ–

మూ. మాం చ యోఽవ్యభిచారేణ భక్తియోగేన సేవతే,
స గుణాన్ సమతీత్యైతాన్ బ్రహ్మభూయాయ కల్పతే. 26

బాలానందిని

అధునేతి:– ఇప్పుడు మూడు గుణాలను ఎట్లు అతిక్రమిస్తాడు అను ప్రశ్నకు ప్రతివచనం చెప్పుచున్నాడు.(మా నాన్నగారు చదివిన భగవద్గీతాభాష్యం పుస్తకం మార్జిన్‌లో –"అయమ్ అన్యః గుణాతీతత్వాభ్యుపాయః విశిష్టతరః పూర్వస్మాత్ ఉచ్యతే"అను వాక్యం కూడ అవతారికాభాగంగా ఉన్నది.నాకు లభించిన రెండు మూడు ప్రతులలో లేదు.కాని ఆ వాక్యం కూడ శాంకరవాక్యం వలెనే ఉన్నది.'పూర్వం చెప్పినదానికంటె ఎక్కువ విశిష్ట మైన గుణాతీత్వాభ్యుపాయం మరొకటి చెప్పబడుచున్నది."అని దీని అర్థం.ఉదాసీనవదాసీన త్వాదులు సాధకావస్థలో ఉపాయాలు గాన వాటికంటె ఇది విశిష్ట మైనది అని భావం).

ప్ర.అ. మామితి:– యః=ఎవడు,అవ్యభిచారేణ=మార్పు లేని,భక్తియోగేన=భక్తి అనే యోగంతో,మాం చ=నన్ను,సేవతే=సేవిస్తాడో,సః=అతడు,ఏతాన్=ఈ,గుణాన్= గుణాలను,సమతీత్య=దాటి,బ్రహ్మభూయాయ=బ్రహ్మత్వంకొరకు,కల్పతే=సమర్థు డవుతాడు.

భాష్యమ్

మాం చ ఈశ్వరం నారాయణం సర్వభూతహృదయాశ్రితం యః యతిః కర్మీ వా అవ్యభిచారేణ న కదాచిత్ యః వ్యభిచరతి,భక్తియోగేన– భజనం భక్తిః,సైవ యోగః తేన భక్తియోగేన,సేవతే,సః గుణాన్ సమతీత్య,ఏతాన్ యథోక్తాన్, బ్రహ్మ భూయాయ– భవనం భూయః,బ్రహ్మభూయాయ బ్రహ్మభవనాయ మోక్షాయ, కల్పతే సమర్థః భవతి ఇత్యర్థః. 26

బాలానందిని

మామితి:- సమస్తహృదయాలలో ఉన్న ఈశ్వరుడ నైన నన్ను,నారాయణుణ్ణి, ఏ యతి గాని,కర్మాచరణం చేసే గృహస్థుడు గాని,ఏ నాటికీ మార్పు చెందని భక్తియోగంతో, భక్తి అనగా చేరి సేవించడం;అదే యోగం.అట్టి భక్తియోగంతో సేవిస్తాడో అతడు వెనుక చెప్పిన ఈ గుణాలను అతిక్రమించి,బ్రహ్మభూయానికి-భూయం అనగా అవడం.బ్రహ్మగా అవడం బ్రహ్మభూయం;బ్రహ్మభవనానికి,మోక్షానికి,సమర్థు డవుతాడు అని అర్థం. 26

భాష్యమ్

కుతః ఏతత్ ఇతి ఉచ్యతే-

మూ. బ్రహ్మణో హి ప్రతిష్ఠాహమమృతస్యావ్యయస్య చ,
శాశ్వతస్య చ ధర్మస్య సుఖస్యైకాన్తికస్య చ. 27

ఇతి శ్రీమహాభారతే శతసాహస్ర్యాం సంహితాయాం వైయాసిక్యాం
భీష్మపర్వణి
శ్రీభగవద్గీతాసు ఉపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే శ్రీకృష్ణార్జున
సంవాదే గుణత్రయవిభాగయోగో నామ చతుర్దశోఽధ్యాయః.

బాలానందిని

కుత ఇతి:- ఇది ఎందువల్ల?దీనికి సమాధానం చెప్పబడుచున్నది-

ప్ర.అ. బ్రహ్మణః ఇతి:- అహమ్=నేను,అమృతస్య=నాశరహితము,అవ్యయస్య = మార్పు లేనిదీ,శాశ్వతస్య=శాశ్వతము,ధర్మస్య=ధర్మరూపము(ధర్మప్రాప్యము),ఐకాన్తికస్య=తప్పక లభించే,మార్పులేని,సుఖస్య=సుఖమూ అయిన,బ్రహ్మణః=బ్రహ్మయొక్క ప్రతిష్ఠా = ప్రతిష్ఠను.

భాష్యమ్

బ్రహ్మణః పరమాత్మనః,హి యస్మాత్,ప్రతిష్ఠా అహం,ప్రతితిష్ఠతి అస్మిన్నితి ప్రతిష్ఠా, అహం ప్రత్యగాత్మా.కీదృశస్య బ్రహ్మణః?అమృతస్య అవినాశినః;అవ్యయస్య అవికారిణః,శాశ్వతస్య చ నిత్యస్య,ధర్మస్య జ్ఞానయోగధర్మప్రాప్యస్య,సుఖస్య ఆనన్దరూపస్య,ఐకాన్తికస్య అవ్యభిచారిణః.అమృతాదిస్వభావస్య పరబ్రహ్మణః ప్రత్యగాత్మా ప్రతిష్ఠా.సమ్యగ్జ్ఞానేన పరమాత్మతయా నిశ్చీయతే;తదేతత్ "బ్రహ్మభూయాయ కల్పతే" ఇత్యుక్తమ్.యయా చ ఈశ్వరశక్త్యా భక్తానుగ్రహాదిప్రయోజనాయ బ్రహ్మ ప్రతిష్ఠతే ప్రవర్తతే సా శక్తిః బ్రహ్మైవ అహమ్,శక్తిశక్తిమతోః అనన్యత్వాత్ ఇత్యభిప్రాయః.

అథవా-బ్రహ్మశబ్దవాచ్యత్వాత్ సవికల్పకం బ్రహ్మ-తస్య బ్రహ్మణః నిర్వికల్పకః అహమేవ,న అన్యః,ప్రతిష్ఠా ఆశ్రయః. కింవిశిష్టస్య? అమృతస్య అమరణధర్మకస్య, అవ్యయస్య వ్యయరహితస్య. కిం చ-శాశ్వతస్య నిత్యస్య ధర్మస్య జ్ఞాననిష్ఠాలక్షణస్య, సుఖస్య తజ్జనితస్య ఐకాన్తికస్య ఏకాన్తనియతస్య చ ప్రతిష్ఠా అహమ్ ఇతి వర్తతే. 27

ఇతి శ్రీమత్పరమహంసపరివ్రాజకాచార్యగోవిన్దభగవత్పూజ్య పాదశిష్యశ్రీమచ్ఛఙ్కరభగవతః కృతౌ శ్రీమద్భగవద్గీతాభాష్యే గుణత్రయవిభాగ యోగో నామ చతుర్దశోఽధ్యాయః.

బాలానందిని

బ్రహ్మణః ఇతి:- నేను బ్రహ్మకు,పరమాత్మకు ప్రతిష్ఠ అయినవాడను గాన;"**ప్రతి తిష్ఠతి అస్మిన్ ఇతి ప్రతిష్ఠా**" దీనియందు నిలిచిఉంటుంది అను విగ్రహంచేత ప్రతిష్ఠా అనగా నిలిచే స్థానం అని అర్థం.'అహం'అనగా ప్రత్యగాత్మయైన నేను(బ్రహ్మకు ప్రత్యగాత్మ ప్రతిష్ఠ అనగా ప్రత్యగాత్మయే బ్రహ్మ అని నిశ్చయింపబడుతుంది). ఎట్టి బ్రహ్మకు? వినాశం లేనిది,వికారం లేనిది,నిత్యము,ధర్మము అనగా జ్ఞానయోగ మనే ధర్మంచేత పొందదగినది. తప్పక అనగా నిశ్చితంగా ఆనందరూప మైనది. అమృతాదిస్వభావం గల పరమాత్మకు ప్రత్యగాత్మ ప్రతిష్ఠ. సమ్యగ్జ్ఞానంచేత ప్రత్యగాత్మ పరమాత్మగా నిశ్చయింపబడుతుంది గాన పరమాత్మకు ప్రత్యగాత్మ ప్రతిష్ఠ. ఈ విషయమే "బ్రహ్మభూయాయ కల్పతే"అనే వాక్యంచేత చెప్పబడింది. త్రిగుణాతీతుడు బ్రహ్మత్వాన్ని పొందడానికి సమర్థు డవుతాడు అని చెప్పబడింది. అలా చెప్పడానికి కారణం పరమాత్మకు ప్రత్యగాత్మ ప్రతిష్ఠ అవడమే. (ప్రత్యగాత్మయే పరమాత్మ గాన గుణాతీతు డైన ప్రత్యగాత్మ పరమాత్మత్వాన్ని పొందుతాడు అని భావం). ఏ ఈశ్వరశక్తిచేత బ్రహ్మ భక్తానుగ్రహం మొదలైన ప్రయోజనాలను సాధించ డంకోసం ప్రవర్తిస్తోందో ఆ శక్తియే బ్రహ్మ, ఆ బ్రహ్మ నేను. శక్తీ శక్తిమత్తూ(శక్తి కలదీ) అభిన్నములు కదా అని అభిప్రాయం.

వి. నన్ను భక్తియోగంతో ఎవడు సేవిస్తాడో అతడు గుణాతీతుడై బ్రహ్మగా అవుతాడు అని వెనుకటి శ్లోకంలో చెప్పబడింది. నిన్ను భజిస్తే మాత్రం బ్రహ్మ భావం ఎలా కలుగుతుంది అని ప్రశ్న ఉదయిస్తుంది. దానికి సమాధానంగా ఈ శ్లోకం చెప్పబడింది. నేను బ్రహ్మకు ప్రతిష్ఠను గాన నన్ను సేవించినవాడు బ్రహ్మభావాన్ని పొందుతాడు అని శ్రీ కృష్ణుడు చెపుతున్నాడు. భగవద్గీతలో శ్రీకృష్ణుడు తనను గూర్చి 'అహమ్'అని అనేక స్థలాలలో నిర్దేశిస్తాడు. అక్కడ ఉండే సందర్భాన్ని పట్టి శుద్ధమైన నిర్గుణబ్రహ్మ అని కొన్ని చోట్ల, శ్రీకృష్ణు డను పేరుతో ఉన్న వ్యక్తి అని కొన్నిచోట్ల గ్రహించవలసి ఉంటుంది. వ్యక్తి అని గ్రహించి నప్పుడు ప్రత్యగాత్మ అని అర్థం. శ్రీకృష్ణుణ్ణి ఈశ్వరుడుగా గ్రహించినా కూడ

మాయోపహితచైతన్యమే ఈశ్వరుడు గాన ఆ ఈశ్వరుడు ప్రస్తుతం ఈ శరీరంలో ఉన్నాడు గాన ప్రత్యగాత్మయే. "బ్రహ్మణః అహం ప్రతిష్ఠా"అని బ్రహ్మ,అహంశబ్దవాచ్య మైన శ్రీకృష్ణుడూ కూడ నిర్దేశింపబడ్డారు. బ్రహ్మను వేరుగా చెప్పడంచేత ఇక్కడ 'అహమ్' అని నిర్దేశింపబడిన శ్రీకృష్ణుణ్ణి శుద్ధ పరబ్రహ్మగా గ్రహించడానికి వీలు లేదు. ప్రత్యగాత్మ గానే గ్రహించాలి. వెనుకటి శ్లోకంలో 'మామ్' అని నిర్దేశించిన శ్రీకృష్ణుడే ఇక్కడ 'అహమ్' అని నిర్దేశించబడ్డాడు. అందుచేత ప్రత్యగాత్మ యైన శ్రీకృష్ణుణ్ణి సేవిస్తే బ్రహ్మభావం ఎలా కలుగుతుంది అనే ప్రశ్నకు సమాధానంగా బ్రహ్మకు ప్రతిష్ఠ శ్రీకృష్ణప్రత్యగాత్మ గాన, శ్రీకృష్ణుణ్ణి సేవిస్తే గుణాతీతత్వం ద్వారా బ్రహ్మభావం కలుగుతుంది అని సమాధానం చెప్పిన ట్లయింది. ఈ విషయాన్నే భాష్యకారులు "బ్రహ్మణః పరమాత్మనః" మొదలు "తదేతద్ బ్రహ్మభూయాయ కల్పతే ఇత్యుక్తమ్"అను భాష్యవాక్యాలలో వివరించారు. శ్రీకృష్ణరూపంలో ఉన్న ప్రత్యగాత్మ బ్రహ్మకు ప్రతిష్ఠ,బ్రహ్మాభిన్నం ఎట్లయింది అనే విషయాన్నే వివరిస్తూ "యయా చేశ్వరశక్త్యా.... అభిప్రాయః"అని అన్నారు. బ్రహ్మ భక్తానుగ్రహంకొరకు ఈశ్వరశక్తితో ప్రవర్తిస్తుంది. ఈశ్వరశక్తి అనగా పరిపాలనాసమర్థమైన లేదా ఈశ్వరరూప మైన శక్తి అని అర్థం. పరిపాలనాదికార్యం చేసే టప్పుడే ఈశ్వరత్వం ఉంటుంది. ఆ ఈశ్వరశక్తియే శ్రీకృష్ణు డనే ప్రత్యగాత్మ. శక్తిశక్తిమత్తులు అభిన్నులు గాన ఈ ఈశ్వరశక్తి బ్రహ్మయే. అందుచేత ఈశ్వరశక్తిరూపశ్రీకృష్ణాభిన్నబ్రహ్మను సేవించడంచేత భక్తుడు బ్రహ్మభావం పొందుతాడు అని అర్థం. ఈ విధంగా 'బ్రహ్మణః'అనుపదానికి శుద్ధబ్రహ్మ అను అర్థం గ్రహించి ముందుగా భాష్యకారులు "ఇత్యభిప్రాయః"వరకు ఉన్న పూర్తి భాష్యభాగంచేత వ్యాఖ్యానించారు.

ఇక్కడ "యయా చేశ్వరశక్త్యా....ఇత్యభిప్రాయః"అనే వాక్యంలో మరొకవ్యాఖ్య చెప్పబడింది అని శ్రీరామరాయకవి వ్రాశారు. కాని అది సంగతంగా ఉన్నట్లు తోచదు. "ఇత్యభిప్రాయః"అనడంచేత పై వాక్యాల భావమే ఈ వాక్యంలో వివరించబడిన దని స్పష్టంగా తెలుస్తూన్నది గదా?

అవ. ఈ విధంగా బ్రహ్మశబ్దానికి శుద్ధబ్రహ్మ అనే అర్థం గ్రహించి శ్లోకం వ్యాఖ్యానించి ఇప్పుడు సవికల్పకబ్రహ్మ అను అర్థాన్ని గ్రహించి వ్యాఖ్యానిస్తున్నారు–**అథవేతి**:- లేదా బ్రహ్మశబ్దంచేత చెప్పబడుచున్నది గాన (ఇక్కడ బ్రహ్మణః అనగా)సవికల్పకబ్రహ్మ అని అర్థం. ఆ బ్రహ్మకు నిర్వికల్పకబ్రహ్మ నైన నేనే ఆశ్రయము;మరొక ఆశ్రయం ఏదీ లేదు అని అర్థం(ఈ పక్షంలో 'అహమ్'శబ్దనిర్దిష్టుడైన శ్రీకృష్ణుడు ప్రత్యగాత్మగా కాక శుద్ధబ్రహ్మగా గ్రహించబడ్డాడు). ఏ విశేషములతో కూడిన సవికల్పబ్రహ్మకు? మరణరహి తము,వ్యయము (మార్పు)లేనిదీ అయిన బ్రహ్మకు(అనగా వాస్తవంలో సవికల్పబ్రహ్మ కూడ బ్రహ్మయే గాన అమృతత్వావ్యయత్వాదులు దానికి కూడ వర్తిస్తాయి అని భావం).

అవ. మొదటి వ్యాఖ్యానం ప్రకారం శ్లోకంలోని షష్ఠ్యంతా లన్నీ 'బ్రహ్మణః'కు విశేషణాలుగా గ్రహించబడ్డాయి. ఈ 'అథవా'అను వ్యాఖ్యానంలో ఉత్తరార్ధంలోని షష్ఠ్యం తాలు మరొక విధంగా వ్యాఖ్యానింపబడుతున్నాయి. **కిం చేతి:**- మరియు నిత్య మైన జ్ఞాననిష్ఠారూప మైన ధర్మానికి,దానివల్ల కలిగే తప్పక లభించే సుఖానికీ కూడ నేను ప్రతిష్ఠ అయినవాడను అని అన్వయిస్తుంది. 27

"బాలానందిని"అను శ్రీమద్భగవద్గీతాశాంకరభాష్యాంధ్రవ్యాఖ్యానంలో
చతుర్దశాధ్యాయం సమాప్తం
(మొదటినుండి శ్లోకాలసంఖ్య - 521)

అథ పఞ్చదశోఽ ధ్యాయః

భాష్యమ్

యస్మాత్ మదధీనం కర్మిణాం కర్మఫలం జ్ఞానినాం చ జ్ఞానఫలమ్ అతః భక్తి యోగేన మాం యే సేవన్తే తే మత్ప్రసాదాత్ జ్ఞానప్రాప్తిక్రమేణ గుణాతీతాః మోక్షం గచ్ఛన్తి;కిము వక్తవ్యమ్ ఆత్మనః తత్త్వమేవ సమ్యగ్ విజానన్తః ఇత్యతః భగవాన్ అర్జునేన అపృష్టమపి ఆత్మనః తత్త్వం వివక్షుః ఉవాచ-"ఊర్ధ్వమూలమ్"ఇత్యాది. తత్ర తావత్ వృక్షరూపకకల్పనయా వైరాగ్యహేతోః సంసారస్వరూపం వర్ణయతి.విరక్తస్య హి సంసారాత్ భగవత్తత్త్వజ్ఞానే అధికారః న అన్యస్య ఇతి-

శ్రీభగవానువాచ-

మూ. ఊర్ధ్వమూలమధఃశాఖమశ్వత్థం ప్రాహురవ్యయమ్,
ఛన్దాంసి యస్య పర్ణాని యస్తం వేద స వేదవిత్. 1

బాలానందిని

యస్మాదితి:-కర్మలు ఆచరించేవారికి కర్మలవల్ల కలిగే ఫలము,జ్ఞానవంతుల జ్ఞానఫలమూ కూడ నామీదనే ఆధారపడి ఉన్నాయి గాన భక్తియోగంచేత నన్ను ఎవరు సేవిస్తారో వాళ్లు నా అనుగ్రహంవల్ల జ్ఞానప్రాప్తి ద్వారా గుణాతీతులై మోక్షం పొందుతారు. ఆత్మతత్త్వాన్నే సరిగా తెలుసుకొన్నవాళ్ల మాట చెప్పాలా అను అభిప్రాయంతో,అర్జునుడు అడగకపోయినా కూడ ఆత్మతత్త్వాన్ని చెప్పదలచినవాడై "ఊర్ధ్వమూలమ్"ఇత్యాదికం చెప్పాడు.సంసారంనుండి వైరాగ్యం చెందినవానికే భగవంతుని తత్త్వం విషయంలో అధికారం కాని ఇతరులకు లేదు అను అభిప్రాయంతో వైరాగ్యం కలగడంకోసమై వృక్షం అనే రూపకాన్ని కల్పించి(సంసారంమీద వృక్షత్వాన్ని ఆరోపించి)సంసారస్వరూపం వర్ణి స్తున్నాడు-

శ్రీభగవంతు దన్నాడు-

ప్ర.అ. ఊర్ధ్వమూలమితి:- ఊర్ధ్వమూలమ్=బ్రహ్మయే మూలంగా గలది.అధః శాఖమ్=క్రిందికి కొమ్మలు గలది అయిన.అశ్వత్థమ్=అశ్వత్థవృక్షమును,అవ్యయమ్=నాశం లేనిదానినిగా,ఆహుః=చెప్పుదురు.యస్య=దేనికి,ఛన్దాంసి=వేదాలు,పర్ణాని=ఆకులో,తమ్= అట్టి ఆ వృక్షమును,యః=ఎవడు,వేద = ఎరుగునో, సః=అతడు,వేదవిత్=వేదవేత్త.

భాష్యమ్

ఊర్ధ్వమూలం-కాలతః సూక్ష్మత్వాత్,కారణత్వాత్,నిత్యత్వాత్,మహత్త్వాత్ చ "ఊర్ధ్వమ్ ఉచ్యతే బ్రహ్మ అవ్యక్తమాయాశక్తిమత్;తత్ మూలమ్ అస్య ఇతి సోఽయం సంసారవృక్షః ఊర్ధ్వమూలః.శ్రుతేశ్చ-"ఊర్ధ్వమూలోఽవాక్శాఖః ఏషోఽశ్వత్థః సనాతనః"(క.ఉ. 6.1)ఇతి పురాణే చ-

"అవ్యక్తమూలప్రభవస్తస్యైవానుగ్రహోత్థితః,
బుద్ధిస్కన్ధమయశ్చైవ ఇన్ద్రియాన్తరకోటరః,
మహాభూతవిశాఖశ్చ విషయైః పత్రవాంస్తథా,
ధర్మాధర్మసుపుష్పశ్చ సుఖదుఃఖఫలోదయః.
ఆజీవ్యః సర్వభూతానాం బ్రహ్మవృక్షః సనాతనః,
ఏతద్ బ్రహ్మవనం చైవ బ్రహ్మా చరతి నిత్యశః,
ఏతచ్ఛిత్త్వా చ భిత్త్వా చ జ్ఞానేన పరమాసినా
తతశ్చాత్మరతిం ప్రాప్య యస్మాన్నావర్తతే పునః".

(అశ్వ.పర్వ. 35,20-22,47.12-15)ఇత్యాది

తమ్ ఊర్ధ్వమూలం సంసారమాయామయం వృక్షమ్ అధఃశాఖమ్-మహదహంకారతన్మాత్రాదయః శాఖాః ఇవ అస్య అధః భవన్తి ఇతి సః అయమ్ అధఃశాఖః తమ్ అధఃశాఖమ్.న శ్వః అపి స్థాతా ఇతి అశ్వత్థః, తం క్షణప్రధ్వంసినమ్ అశ్వత్థం, ప్రాహుః కథయన్తి.

బాలానందిని

ఊర్ధ్వేతి:- అవ్యక్త మనే (అవ్యాకృతం అనే మాయాశక్తి గల బ్రహ్మ కాలంవల్ల, (కాలాన్నిపట్టి) అనగా అనాది గాన అని అర్థం, ("కాలంకంటె సూక్ష్మం అవడంవల్ల"అను వ్యాఖ్యానం అంత యుక్తం కాదని తోస్తుంది.సూక్ష్మత్వానికి ఆకాశాన్ని ఉదాహరణంగా ఇవ్వడం ఉంది గాని కాలాన్ని ఇవ్వడం లేదు)సూక్ష్మం అవడంవల్ల, కారణం అవడంవల్ల,

నిత్యం అవడంవల్ల, గొప్పది అవడంవల్లా, కూడ "ఊర్ధ్వమ్'అని చెప్పబడుతుంది. అది ఈ సంసారానికి మూలం గాన,కారణంగాన,సంసారం ఊర్ధ్వమూలం అని చెప్పబడుచున్నది. (ఈ విధంగా ఊర్ధ్వశబ్దానికి ఎత్తైనది,ఉత్కృష్టము అని అర్థం.సంసారమునందు వృక్షత్వా రోపణంచేత ఈ ఊర్ధ్వత్వానికి కూడ ఊర్ధ్వభాగావస్థితత్వరూపణం గమ్యమవుతున్నది). **"ఊర్ధ్వమూలోఽవాక్ శాఖః ఏషోఽశ్వత్థః సనాతనః"**అని శ్రుతి చెప్పుచున్నది. పురాణంలో కూడ-**"అవ్యక్తమూలప్రభవః.....నావర్తతే పునః"**(అవ్యక్త మనే మూలంనుండి పుట్టినది,దాని అనుగ్రహంచేతనే పెరిగినది,బుద్ధి అనే మాను గలది,ఇంద్రియా లనే మధ్య మధ్య నున్న తొఱ్ఱలు గలది,మహాభూతా లనే ఉపశాఖలు కలది,విషయా లనే ఆకులు గలది, ధర్మా ధర్మా లనే పుష్పాలు గలది,సుఖదుఃఖాలనే ఫలాలు గలది అయిన సనాతన మైన బ్రహ్మ వృక్షం (బ్రహ్మచేత అధిష్ఠించబడిన వృక్షం)సమస్తభూతాలకీ ఆజీవ్యం(జీవించడానికి ఆధార పడవలసినది). ఇదియే బ్రహ్మవనం(జీవరూపంలో ఉన్న బ్రహ్మ చేత సేవించబడేది). బ్రహ్మయే దీనియందు నిత్యము సాక్షిగా సంచరించుచ్నుది(ఉన్నది). జ్ఞాన మనే గొప్ప ఖడ్గంచేత దీనిని ఛేదించి,భేదించి,ఆత్మయందు రతిని(ఆసక్తిని)పొంది దానినుండి తిరిగి రాడు) అని చెప్పుచున్నది. ఊర్ధ్వమూల మైన,సంసారమాయామయమైన ఈ వృక్షమును క్రిందికి కొమ్మలు కలదానినిగా చెపుతున్నారు. మహత్-అహంకార-తన్మాత్రాదులు శాఖలవలె క్రిందికి ఉంటాయి.రేపు కూడ ఇది ఉండదు గాన అశ్వత్థం. క్షణంలో నశించేది అని చెపుతున్నారు.

భాష్యమ్

అవ్యయః-సంసారమాయాయాః అనాదికాలప్రవృత్తత్వాత్ సః అయం సంసారవృక్షః అవ్యయః,అనాద్యనన్తదేహాదిసంతానాశ్రయో హి సుప్రసిద్ధః,తమ్ అవ్యయమ్. తస్యైవ సంసారవృక్షస్య ఇదమ్ అన్యత్ విశేషణమ్-చన్దాంసి ఛాదనాత్ ఋగ్యజుఃసామలక్షణాని యస్య సంసారవృక్షస్య పర్ణానీవ పర్ణాని. యథా వృక్షస్య పరిరక్ష ణార్థాని పర్ణాని తథా వేదాః సంసారవృక్షపరిరక్షణార్థాః ధర్మాధర్మతద్ధేతుఫలప్రకాశనార్థ త్వాత్. యథావ్యాఖ్యాతం సంసారవృక్షం సమూలం యః తం వేద సః వేదవిత్,వేదార్థ విదిత్యర్థః. న హి సంసారవృక్షాత్ అస్మాత్ సమూలాత్ జ్ఞేయః అన్యః అణుమాత్రః అపి అవశిష్టః అస్తి;అతః సర్వజ్ఞః సః యః వేదార్థవిదితి సమూలవృక్షజ్ఞానం స్తౌతి. 1

బాలానందిని

అవ్యయమితి:-అవ్యయమ్-సంసారమాయ అనాదికాలంనుండి ప్రవర్తిస్తూన్నది. అందువల్ల ఈ సంసారవృక్షం అవ్యయం. అనాది అనంతమూ అయిన దేహాదుల సంతానాన్ని(అవిచ్ఛిన్న ప్రవాహాన్ని)ఆశ్రయించుకొని ఉన్నదిగా సుప్రసిద్ధము. అట్టి వ్యయ రహిత మైన,నాశరహిత మైన, ఈ సంసారవృక్షానికే ఇది మరొక విశేషణం,దానిలోని

విశేషం చెప్పే వాక్యం-ఋగ్యజుః సామరూపాలైన ఛందస్సులు, కప్పేవి అవడంవల్ల,ఈ సంసారవృక్షానికి పర్ణాల వంటి పర్ణాలు.ఆకులు వృక్షాన్ని రక్షించడంకోసం ఏ విధంగా ఉపకరిస్తాయో అట్లే వేదాలు, ధర్మాధర్మాలను అవి హేతువులుగా గల(ధర్మాధర్మాలవల్ల కలిగే)ఫలాలను ప్రకాశింప చేసేవి గాన సంసారవృక్షాన్ని రక్షించడానికి ఉపయోగిస్తాయి. పైన వివరించిన విధంగా మూలసహితమైన సంసారవృక్షాన్ని (సంసారవృక్షాన్నీ)దాని మూలాన్నీ ఎవడు తెలుసు కొంటాడో అతడు వేదవేత్త,అనగా వేదార్థం తెలిసినవాడు అని అర్థం.సమూలమైన ఈ సంసారవృక్షం తప్ప తెలియదగినది మరొకటి ఏదీ అణుమాత్రం కూడ మిగిలి లేదు కదా? అందుచేత అతడు (సంసారాన్నీ దానికి మూలమైన బ్రహ్మతత్త్వాన్నీ వేరు వేరుగా యథార్థరూపంలో తెలిసికొన్నవాడు)సర్వజ్ఞుడైన వేదార్థవేత్తయే అని సమూలవృక్షజ్ఞానాన్ని స్తుతిస్తున్నాడు. 1

భాష్యమ్

తస్యైవ సంసారవృక్షస్య అపరా అవయవకల్పనా ఉచ్యతే-

మూ. అధశ్చోర్ధ్వం ప్రసృతాస్తస్య శాఖా
గుణప్రవృద్ధా విషయప్రవాళాః,
అధశ్చ మూలాన్యనుసంతతాని
కర్మానుబన్ధీని మనుష్యలోకే. 2

బాలానందిని

తస్యైవేతి:-ఆ సంసారవృక్షానికే సంబంధించిన మరొక అవయవకల్పన చెప్పబడు చున్నది-

ప్ర.అ. **అధశ్చేతి**:- తస్య=ఆ సంసారవృక్షంయొక్క,గుణప్రవృద్ధాః=సత్త్వరజస్తమో గుణాలచేత వృద్ధిపొందినవి,విషయప్రవాలాః=శబ్దాదివిషయాలు చిగుళ్లుగా గలవి అయిన, **శాఖాః**=కొమ్మలు,**అధః** చ=క్రిందికి,**ఊర్ధ్వమ్**=పైకి,ప్రసృతాః=వ్యాపించినవి. కర్మానుబన్ధీని =కర్మలు అనుబంధాలు గల,మూలాని=మొందళ్లు,అధః=క్రింద మనుష్యలోకే= మనుష్య లోకములో,అనుసంతతాని=అల్లుకొని ఉన్నాయి.

భాష్యమ్

అధః మనుష్యాదిభ్యః యావత్ స్థావరమ్,ఊర్ధ్వం చ యావత్ బ్రహ్మణః విశ్వసృజః ధామ ఇత్యేతదన్తం యథాకర్మ యథాశ్రుతం జ్ఞానకర్మఫలాని తస్య వృక్షస్య శాఖాః ఇవ శాఖాః,ప్రసృతాః ప్రగతాః,గుణప్రవృద్ధాః-గుణైః సత్త్వరజస్తమోభిః ప్రవృద్ధాః

స్థూలీకృతాః ఉపాదానభూతైః,విషయప్రవాలాః-విషయాః శబ్దాదయః,ప్రవాలాః ఇవ దేహాదికర్మఫలేభ్యః శాఖాభ్యః అఙ్కురీభవన్తీవ,తేన విషయప్రవాలాః శాఖాః.సంసార వృక్షస్య పరమమూలమ్ ఉపాదానకారణం పూర్వమ్ ఉక్తమ్.అథ ఇదానీం కర్మఫల జనితరాగద్వేషాదివాసనాః మూలానీవ ధర్మాధర్మప్రవృత్తికారణాని అవాన్తరభావీని,తాని అధః చ దేహాద్యపేక్షయా మూలాని,అనుసంతతాని అనుప్రవిష్టాని,కర్మానుబన్ధీని-కర్మ ధర్మాధర్మలక్షణమ్,అనుబన్ధః పశ్చాద్భావీ యేషామ్ ఉద్భూతిమ్ అనుభవతీతి తాని కర్మాను బన్ధీని;మనుష్యలోకే-విశేషతః అత్ర హి మనుష్యాణాం కర్మాధికారః ప్రసిద్ధః 2

బాలానందిని

అధః ఇతి:- క్రింద,మనుష్యులు మొదలు స్థావరముల (వృక్షలతాదుల) వరకు, పైన జగత్స్రష్ట యైన బ్రహ్మయొక్క నివాసం వరకు,కర్మానుసారంగా,శాస్త్రంలో చెప్పబడిన రీతిలో కలిగే జ్ఞాన(ఉపాసనా)-కర్మలయొక్క ఫలాలు ఆ వృక్షంయొక్క శాఖల వలె శాఖలు గా వ్యాపించి ఉన్నాయి.(ఆ యా లోకాలలోని ఆ యా జీవుల కర్మ ఫలాలే సంసారవృక్షం యొక్కఅంతటా వ్యాపించిన శాఖలు అని అర్థం).ఇవి గుణప్రవృద్ధములు.వీటి ఉపాదాన కారణా లైన సత్త్వరజస్తమోగుణాలచేత లావుగా చేయబడ్డాయి.విషయాలే ప్రవాళములుగా గలవి.దేహాదులైన-కర్మఫలా లైన (దేహాదులు కర్మలవల్ల కలిగిన పలాలు ఆ దేహాది ఫలాలే శాఖలు).వాటినుండి శబ్దాదివిషయాలు అంకురిస్తున్నాయా అన్న ట్లున్నాయి.అందుచేత శాఖలు విషయప్రవాళములు(శాఖలకు విషయాలే చిగుళ్లు).సంసారవృక్షానికి పరమ మూలమైన ఉపాదానకరాణం(అవ్యక్తమాయాశక్తియుక్త మైన బ్రహ్మ ఉపాదానకారణ మని) వెనుకచెప్పబడింది.ఇక ఇప్పుడు ధర్మప్రవృత్తికి అధర్మప్రవృత్తికీ కారణా లైన,కర్మఫలంవల్ల కలిగిన రాగద్వేషాదివాసనలు మధ్య మధ్య ఉండే మొదళ్ల వంటివి(అని చెప్పబడుచున్నది). ఆ మూలాలు (శాఖలైన)దేహాదులకంటె క్రింద ప్రవేశించి ఉన్నాయి.(ప్రధానమైన మూలం చుట్టూ ఏర్పడి ఉన్నాయి).ఈ మూలాలు కర్మానుబంధులు కర్మలు అనుబంధంగా గలవి (వీటికి కర్మలు అనుబంధాలు-తరువాత వచ్చి చేరుతాయి).ధరాధర్మలక్షణ మైన కర్మ వేటికి అనుబంధమో,తరువాత వచ్చేదో,ఏవి పుట్టిన తరువాత వాటి పుట్టుకను అనుసరించి పుడుతుందో,అవి కర్మానుబంధులు.మనుష్యలోకంలో-విశేషించి ఈ లోకంలోనే మనుష్యులకు కర్మాధికారం ప్రసిద్ధం కదా? 2

భాష్యమ్

యస్తు అయం వర్ణితః సంసారవృక్షః-

మూ. న రూపమస్యేహ తథోపలభ్యతే
నాన్తో న చాదిర్నచ సంప్రతిష్ఠా,
అశ్వత్థమేనం సువిరూఢమూల
మసఙ్గశస్త్రేణ దృఢేన ఛిత్త్వా. 3

బాలానందిని

యస్త్వితి:- ఈ,ఏ సంసారవృక్షం వర్ణించబడినదో-

ప్ర.అ.నేతి: -అస్య=దీనియొక్కరూపమ్=రూపము,ఇహ=ఇక్కడ,న ఉపలభ్యతే=చూడబడడంలేదు.తథా=అట్లే,అన్తః=అంతము,న=చూడబడడంలేదు;ఆదిః చ=ఆది కూడ,న చ=చూడబడడంలేదు.సంప్రతిష్ఠా చ=స్థితి కూడ,న=చూడబడడంలేదు.సువిరూఢమూలమ్ =బాగా పెరిగిన మొదలు గల,ఏనమ్=ఈ,అశ్వత్థమ్=అశ్వత్థవృక్షాన్ని,దృఢేన=దృఢమైన, అసంగశస్త్రేణ=అసంగమనే శస్త్రంచేత,ఛిత్త్వా=ఛేదించి-

భాష్యమ్

న రూపమ్ అస్య ఇహ యథావర్ణితం తథా నైవ ఉపలభ్యతే,స్వప్నమరీచ్యుదక మాయాగన్ధర్వనగరసమత్వాత్;దృష్టనష్టస్వరూపః హి సః ఇత్యతః,న అన్తః పర్యన్తః నిష్ఠా సమాప్తిర్వా,విద్యతే.తథా న చ ఆదిః-ఇతః ఆరభ్య అయం ప్రవృత్తః ఇతి న కేనచిత్ గమ్యతే.న చ సంప్రతిష్ఠా స్థితిః, మధ్యమ్ అస్య న కేన చిత్ ఉపలభ్యతే. అశ్వత్థమ్ ఏనం యథోక్తం,సువిరూఢమూలం సుష్ఠు విరూఢాని మూలాని యస్య తమ్,ఏనం యథోక్తం,సువిరూఢమూలమ్ అసఙ్గశస్త్రేణ-అసంగః పుత్రవిత్తలోకైషణాదిభ్యః వ్యుత్థానం,తేన అసంగశస్త్రేణ,దృఢేన పరమాత్మాభిముఖ్య నిశ్చయదృఢీకృతేన, పునః పునః వివేకాభ్యాసాశ్మ నిశితేన,ఛిత్త్వా సంసారవృక్షం సబీజమ్ ఉద్ధృత్య. 3

బాలానందిని

నేతి:- దీని స్వరూపం ఏ విధంగా వర్ణించబడినదో ఆ విధంగా కనబడడం లేదు.ఎందువల్ల ననగా ఇది స్వప్నముతో,ఎండమావులలోని నీటితో మాయానిర్మిత మైన గంధర్వనగరంతో సమాన మవడంవల్ల కనబడి వెంటనే నశించే స్వరూపం గలది. అందుచేతనే దీనికి అంతం చివరిభాగం లేదా స్థితి లేదా సమాప్తి లేదు. అట్లే ఆది కూడ లేదు.ఈ సమయంనుండి ఇది ప్రారంభ మైనది అని ఎవనిచేతా కూడ తెలియబడడం లేదు. అట్లే దీని సంప్రతిష్ఠ,అనగా మధ్యం కూడ,ఎవనిచేత చూడబడడంలేదు.చెప్పబడిన విధంగా ఉన్నది,బాగా పాతుకొనిపోయిన మొదళ్లు గలదీ అయిన అశ్వత్థవృక్షాన్ని,పరమాత్మకు

అభిముఖంగా ఉండడంచేత నిశ్చయంచేత దృఢంగా చేయబడిన అసంగశస్త్రం చేత,పుత్ర-విత్త-లోకైషణాదులనుండి పైకి లేవడం(దూరంగా ఉండడం)అనేదే అసంగం;ఆ అసంగం అనే శస్త్రంచేత,మాటిమాటికి వివేకాన్ని అభ్యసించడం అనే నూరురాయిమీద నూరబడిన వాడిగా చేయబడిన శస్త్రంచేత,సంసారవృక్షాన్ని ఛేదించి,బీజంతో (కూకటి వ్రేళ్ళతో సహా)పెకిలించివేసి-

మూ. తతః పదం తత్పరిమార్గితవ్యం
యస్మిన్ గతా న నివర్తన్తి భూయః,
తమేవ చాద్యం పురుషం ప్రపద్యే
యతః ప్రవృత్తిః ప్రసృతా పురాణీ. 4

ప్ర.అ. **తతః ఇతి**:- తతః=అటు పిమ్మట,యస్మిన్=దేనియందు,గతాః=వెళ్లిన వాళ్లు,భూయః=మరల,న నివర్తన్తి=తిరిగి రారో,తత్=అట్టి,పదమ్=స్థానము,పరిమార్గిత వ్యమ్=వెదక తగినది. యతః=ఎవనినుండి,పురాణీ=ప్రాచీనమైన,ప్రవృత్తిః=సంసారవృక్షము యొక్క ప్రవృత్తి,ప్రసృతాః= విస్తరించినదో,తమ్=అట్టి,ఆద్యమ్=ప్రాచీను డైన,పురుషమ్ ఏవ చ=పురుషుణ్ణే,ప్రపద్యే=పొందుతాను (అని అనుకొంటూ పరమపదం వెదకతగినది).

భాష్యమ్

తతః ఇతి:- తతః పశ్చాత్,పదం వైష్ణవం,తత్ పరిమార్గితవ్యమ్. పరిమార్గణమ్ అన్వేషణమ్. జ్ఞాతవ్యమ్ ఇత్యర్థః. యస్మిన్ పదే గతాః ప్రవిష్టాః. న నివర్తన్తి న ఆవర్తన్తే, భూయః పునః,సంసారాయ. కథం పరిమార్గితవ్యమ్ ఇత్యాహ-తమేవ చ యః పదశబ్దేన ఉక్తః,ఆద్యమ్ ఆదౌ భవం పురుషం ప్రపద్యే ఇత్యేవం పరిమార్గితవ్యం తచ్ఛరణతయా ఇత్యర్థః. కః అసౌ పురుషః ఇతి ఉచ్యతే-యతః యస్మాత్ పురుషాత్. సంసారమాయా వృక్షప్రవృత్తిః,ప్రసృతా నిఃసృతా,ఐన్ద్రజాలికాదివ మాయా,పురాణీ చిరన్తనీ. 4

బాలానందిని

తతః ఇతి:- అటుపిమ్మట,(సంసారవృక్షాన్ని ఛేదించిన తరువాత)వైష్ణవ మైన పదము,(పరమాత్మకు సంబంధించిన,పరమాత్మరూప మైన,ఆ స్థానం)పరిమార్గితవ్యమ్-పరిమార్గణం అనగా అన్వేషించడం. తెలియదగినది అని అర్థం. ఏ పదములో ప్రవేశించిన వాళ్లు మళ్లీ ఈ సంసారానికి తిరిగి రారో. ఎట్లు తెలుసుకొనదగినదో చెపుతున్నాడు-ఏ పురుషుడు 'పద'శబ్దంచేత నిర్దేశించబడ్డాడో ఆ ఆద్యుడైన,ప్రారంభంనుండీ ఉన్న,పురుషుణ్ణి పొందుతాను అని అనుకొంటూ ఆతనినే శరణగా పొంది ఆ పదం తెలుసుకొనదగినది. ఈ

పురుష దెవడో చెప్పబడుచున్నది- ఏ పురుషునినుండి అతిప్రాచీన మైన సంసారమాయా వృక్షముయొక్క ప్రవృత్తి,ఇంద్రజాలికునినుండి మాయ వలె,ప్రసరించినదో ఆ పురుషుణ్ణి). 4

భాష్యమ్

కథంభూతాః తత్ పదం గచ్ఛన్తి ఇత్యుచ్యతే-

మూ. నిర్మానమోహా జితసంగదోషా
అధ్యాత్మవిద్యా వినివృత్తకామాః,
ద్వన్ద్వైర్విముక్తాః సుఖదుఃఖసంజ్ఞై
ర్గచ్ఛన్త్యమూఢాః పదమవ్యయం తత్. 5

బాలానందిని

కథమితి:- ఎలాంటివాళ్లు ఆ స్థానాన్ని పొందుతారో చెప్పబడుచున్నది- నిర్మానేతి:- నిర్మానమోహాః=మాన(అహంకార)మోహాలు తొలగిపోయినవాళ్లు,జితసంగదోషాః= జయించబడిన సంగదోషం కలవాళ్లు,అధ్యాత్మనిత్యాః=పరమాత్మచింతనమునందు నిత్యమూ ఆసక్తులు,వినివృత్తకామాః=తొలగిపోయిన కామాలు కలవారు,సుఖదుఃఖసంజ్ఞైః = సుఖదుఃఖము లనే పేరు గల,ద్వన్ద్వైః=ద్వంద్వాలచేత,విముక్తాః=విడవబడినవారు అయిన, అమూఢాః =మూఢులు కానివాళ్లు,అవ్యయమ్=నాశరహిత మైన,తత్=ఆ, పదమ్= స్థానమును గూర్చి, గచ్ఛన్తి=వెడతారు.

భాష్యమ్

నిర్మానమోహాః-మానశ్చ మోహశ్చ మానమోహౌ,తౌ నిర్గతౌ యేభ్యః తే నిర్మాన మోహాః,మానమోహవర్జితాః,జితసంగదోషాః-సంగ ఏవ దోషః సంగదోషః, జితః సంగదోషః యైః తే జితసంగదోషాః-అధ్యాత్మనిత్యాః పరమాత్మస్వరూపాలోచననిత్యాః తత్పరాః,వినివృత్తకామాః,-విశేషేణ నిర్లేపేన నివృత్తాః కామాః యేషాం తే వినివృత్త కామాః,యతయః సంన్యాసినః,ద్వన్ద్వైః ప్రియాప్రియాదిభిః విముక్తాః సుఖదుఃఖసంజ్ఞైః పరిత్యక్తాః,గచ్ఛన్తి,అమూఢాః మోహవర్జితాః,పదమ్ అవ్యయం తత్ యథోక్తమ్. 5

బాలానందిని

నిర్మానేతి:- మానమూ మోహమూ కూడ ఎవరినుండి తొలగిపోయాయో వాళ్లు నిర్మానమోహులు;మానమోహాలు లేనివాళ్లు. సంగమే(ఆ యా విషయాలమీద అత్యాసక్తియే) దోషం. ఆ సంగదోషం ఎవరిచేత జయింపబడినదో వాళ్లు జితసంగదోషులు;అధ్యాత్మనిత్యులు

అనగా పరమాత్మస్వరూపాన్ని ఆలోచించడంలోనే ఆసక్తి గలవారు. దానియందు ఆసక్తి గలవారు. వినివృత్తకాములు-విశేషంగా,లేశం కూడ మిగలకుండ, తొలగిన కామాలు గలవారు,సుఖదుఃఖము లనే పేర్లు గల(సుఖహేతువు లనీ దుఃఖహేతువు లనీ లోకంలో ప్రసిద్ధము లైన)ప్రియ-అప్రియాదిద్వంద్వాలచేత విడవబడినవారూ అయిన మోహంలేని, అమూఢులైన యతులు,సంన్యాసులు,నాశరహితమైన,వెనుక చెప్పిన స్వరూపం గల ఆ పదాన్ని పొందుతారు. 5

భాష్యమ్

తదేవ పదం పునః విశిష్యతే-

మూ. న తద్భాసయతే సూర్యో న శశాఙ్కో న పావకః,
యద్గత్వా న నివర్తన్తే తద్ధామ పరమం మమ. 6

బాలానందిని

తదేవేతి:- ఆ పదమే మరల విశేషించబడుచున్నది.(ఆ పదానికే సంబంధించిన విశేషం మళ్లీ చెప్పబడుచున్నది)-

ప్ర.అ. నేతి:- యత్=ఏ స్థానాన్ని గూర్చి,గత్వా=వెళ్లి,న నివర్తన్తే=తిరిగి రారో, తత్=అది, మమ=నాయొక్కపరమమ్=గొప్పదైన, ధామ=స్థానము,తత్=దానిని,సూర్యః = సూర్యుడు,న భాసయతే=ప్రకాశింపచేయదు. శశాఙ్కః=చంద్రుడు,న=ప్రకాశింపచేయదు, పావకః=అగ్ని,న=ప్రకాశింపచేయదు.

భాష్యమ్

తత్ ధామ ఇతి వ్యవహితేన ధామ్నా సంబన్ధః.ధామ తేజోరూపం పదం,న భాసయతే, సూర్యః ఆదిత్యః,సర్వావభాసనశక్తిమత్త్వేఽపి సతి. తథా న శశాఙ్కః చన్ద్రః, న పావకః న అగ్నిః అపి.యత్ ధామ వైష్ణవం పదం గత్వా ప్రాప్య,న నివర్తన్తే, యచ్చ సూర్యాదిః న భాసయతే తత్ ధామ పదం పరమం మమ విష్ణోః. 6

బాలానందిని

తదితి:- ఆ ధామను అని దూరంగా ఉన్న 'ధామ'తో సంబంధం. తేజోరూప మైన ఆ స్థానాన్ని అన్నింటినీ ప్రకాశింపచేసే శక్తి ఉన్నా కూడ ఆదిత్యుడు ప్రకాశింపచేయ జాలడు.అట్లే చంద్రుడు ప్రకాశింపచేయజాలడు.అగ్ని కూడ ప్రకాశింపచేయజాలడు.ఏ ధామను, విష్ణువునకు సంబంధించిన స్థానాన్ని,పొంది తిరిగి రారో,దేనిని సూర్యాదులు ప్రకాశింప చేయజాలరో అది విష్ణువైన నాయొక్క పరమమైన స్థానము. 6

భాష్యమ్

"యద్గత్వా న నివర్తన్తే" ఇత్యుక్తమ్. నను సర్వా హి గతిః అగత్యన్తా?"సంయోగా విప్రయోగాన్తాః" (స్త్రీ.ప. 2. 3,మోక్ష ప. 27-31;330. 20;రామా. అయో. 105. 16. ఇత్యాదౌ) ఇతి హి ప్రసిద్ధమ్?కథమ్ ఉచ్యతే తద్ధామ గతానాం నాస్తి నివృత్తిః ఇతి? శృణు తత్ర కారణమ్-

మూ. మమైవాంశో జీవలోకే జీవభూతః సనాతనః,
A.మనఃషష్ఠానీన్ద్రియాణి ప్రకృతిస్థాని కర్షతి. 7

బాలానందిని

యదితి:- "యద్గత్వా న నివర్తన్తే"అని చెప్పబడింది. (ప్రశ్న)ప్రతీ గమనమూ కూడ తిరిగి రావడంతో ముగుస్తుంది కదా?"సంయోగా విప్రయోగాన్తాః"(కలయికలు విడిపోవడంతోనే ముగుస్తాయి)అని కదా ప్రసిద్ధంగా ఉంది?ఆ ధామను పొందినవాళ్లకు తిరిగి రావడం అనేది లేదు అని ఎలా చెప్పబడుతుంది?(సమాధానం)అందుకు కారణం విను-

ప్ర.అ. మమేతి:- మమ=నాయొక్కసనాతనః=ప్రాచీనమైన అంశః ఏవః=అంశమే, జీవలోకే=సంసారమునందు,జీవభూతః=జీవుడుగా అయినదై,ప్రకృతిస్థాని=తమ తమ స్థానాలలో ఉన్న, మనఃషష్ఠాని=మనస్సు ఆరవదిగా గల,ఇన్ద్రియాణి=ఇంద్రియాలను, కర్షతి=లాగుచున్నది.

భాష్యమ్

మమైవ పరమాత్మనః,అంశః భాగః అవయవః ఏకదేశః ఇతి అనర్థాన్తరమ్. జీవలోకే-జీవానాం లోకే సంసారే,జీవభూతః భోక్తా కర్తా ఇతి ప్రసిద్ధః,సనాతనః యథా జలసూర్యకః సూర్యాంశః జలనిమిత్తాపాయే సూర్యమేవ గత్వా న నివర్తతే తేనైవ ఆత్మనా సంగచ్ఛతి ఏవమేవ. యథా వా ఘటాద్యుపాధిపరిచ్ఛినః ఘటాద్యాకాశః ఆకాశాంశః సన్ ఘటాదినిమిత్తాపాయే ఆకాశం ప్రాప్య న నివర్తతే ఇత్యేవమ్; అతః ఉపపన్నమ్ ఉక్తం "యద్గత్వా న నివర్తన్తే"ఇతి. నను నిరవయవస్య పరమాత్మనః కుతః అవయవః ఏకదేశః అంశః ఇతి?సావయవత్వే హి వినాశప్రసంగః అవయవవిభాగాత్. నైషః దోషః. అవిద్యాకృతోపాధిపరిచ్ఛిన్నః ఏకదేశః అంశః ఇవ కల్పితః యతః. దర్శితశ్చ అయమ్ అర్థః క్షేత్రాధ్యాయే (13) విస్తరశః. సః చ జీవః మదంశత్వేన కల్పితః కథం సంసరతి ఉత్క్రామతి చ ఇతి ఉచ్యతే-మనః షష్ఠాణి ఇన్ద్రియాణి శ్రోత్రాదీని ప్రకృతిస్థాని-స్వస్థానే కర్ణశష్కుల్యాదౌ ప్రకృతౌ స్థితాని కర్షతి ఆకర్షతి. 7

బాలానందిని

మమైవేతి:- పరమాత్మ నైన నాయొక్క సనాతన మైన అంశమే; అంశం అన్నా భాగం అన్నా, అవయవం అన్నా, ఏకదేశంఅన్నా ఒకటే అర్థం. జీవులలోక మైన సంసారంలో, జీవుడుగా అయి,భోక్త,కర్త అని ప్రసిద్ధంగా ఉన్నది. జలంలో ప్రతిఫలించిన సూర్యుడు ఏ విధంగా సూర్యుని అంశమో, అది జలం అనే నిమిత్తం తొలగగానే సూర్యుణ్ణే చేరి ఏ విధంగా తిరిగి రాదో ఆ సూర్యు డనే ఆత్మతో(తన స్వరూపంతో)కలిసిపోతుందో అట్లే,ఘటం మొదలైన ఉపాధులచేత పరిచ్ఛిన్న మైన,ఘటాకాశం ఆకాశంయొక్క అంశమే అయి ఉండి ఘటం మొదలైన నిమిత్తం తొలగిపోగానే ఆకాశాన్ని పొంది ఎలా తిరిగిరాదో అట్లే ఇది కూడ. అందువల్ల "యద్గత్వా న నివర్తన్తే"అని చెప్పినది యుక్తంగానే చెప్పబడింది. (ప్రశ్న) అవయవాలు లేని పరమాత్మకు అవయవం,ఏకదేశ(ఒక ముక్క)రూప మైన అంశం, ఎలా ఉంటుంది? పరమాత్మ సావయవం అయితే అవయవాలు విడిపోవడం ద్వారా నశించడానికి అవకాశం ఉంటుంది కదా?(సమాధానం)ఈ దోషం లేదు. అవిద్యచేత ఏర్పడిన ఉపాధిచేత పరిచ్ఛిన్న మైన ఒక భాగం, అంశం, ఉన్నట్లుగా కల్పించబడింది. ఈ విషయం క్షేత్రాధ్యాయం (పద మూడవ అధ్యాయం)లో సవిస్తరంగా చూపబడింది. నా అంశగా కల్పించబడిన ఆ జీవుడు సంసారంలో ఎలా ప్రవేశిస్తున్నాడో,దానిని ఎట్లు దాటుచున్నాడో చెప్పబడుచున్నది. "ప్రకృతిస్థములైన,తమ స్థానమైన చక్కిలం ఆకారంలో ఉండే చెవి మొదలైన ప్రకృతియందు ఉన్న,మనస్సు ఆరవదిగా గల శ్రోత్రాదీంద్రియాలను (మనస్సుతో కలిసి ఆరైన శ్రోత్రాదీంద్రి యాలను)ఆకర్షిస్తున్నాడు. 7

మూ. శరీరం యదవాప్నోతి యచ్చాప్యుత్క్రామతీశ్వరః,
గృహీత్వైతాని సంయాతి వాయుర్గన్ధానివాశయాత్. 8

ప్ర.అ. శరీరమితి:- ఈశ్వరః=శరీరాదులకు ప్రభువైన జీవుడు, యత్ చ అపి= ఎప్పుడైతే,ఉత్క్రామతి=శరీరంనుంచి పైకి లేస్తాడో,యత్=ఎప్పుడు,శరీరమ్=మరొక శరీరాన్ని, అవాప్నోతి=పొందుతాడో,అప్పుడు,వాయుః=వాయువు,ఆశయాత్=పుష్పాది స్థానమునుండి, గన్ధానివ=గంధములను వలె,ఏతాని=వీటిని(ఇంద్రియాలను)గృహీత్వా= గ్రహించి, సంయాతి =వెడతాడు.

భాష్యమ్

యచ్చాపి యదాచాపి ఉత్క్రామతి, ఈశ్వరః దేహాదిసంఘాతస్వామీ జీవః తదా కర్షతి ఇతి శ్లోకస్య ద్వితీయపాదః అర్థవశాత్ ప్రాథమ్యేన సంబధ్యతే. యదా చ పూర్వ స్మాత్ శరీరాత్ శరీరాన్తరమ్ అవాప్నోతి తదా గృహీత్వా ఏతాని మనఃషష్ఠాని ఇన్ద్రియాణి

సంయాతి సమ్యక్ యాతి గచ్ఛతి. కిమివ ఇత్యాహ–వాయుః పవనః గన్ధాన్ ఇవ, ఆశయాత్ పుష్పాదేః. 8

బాలానందిని

యచ్చాపీతి:- "దేహాదిసంఘాతానికి స్వామియైన జీవుడు ఎప్పుడైతే లేచిపోతాడో అప్పుడు లాగుతాడు"అని అర్థాన్ని పట్టి శ్లోకం ద్వితీయపాదాన్ని ముందుగా అన్వయించుకోవాలి. ఎప్పుడైతే వెనుకటి శరీరంనుండి మరొక శరీరం పొందుతాడో అప్పుడు మనస్సు ఆరవదిగా గల ఇంద్రియాలను గ్రహించి వెడలిపోతాడు. ఏది వలె అనగా చెపుతున్నాడు- వాయువు పుష్పం మొదలైన గంధస్థానంనుండి గంధాలను వలె. 8

భాష్యమ్

కాని పునః తాని ఇతి–

మూ. శ్రోత్రం చక్షుః స్పర్శనం చ రసనం ఘ్రాణమేవ చ,
అధిష్ఠాయ మనశ్చాయం విషయానుపసేవతే. 9

బాలానందిని

కానీతి:- అవి ఏవో చెపుతున్నాడు-

ప్ర. అ. శ్రోత్రమితి:- అయమ్=ఈ జీవుడు, శ్రోత్రమ్=చెవిని, చక్షుః=కంటిని, స్పర్శనమ్=త్వగింద్రియాన్ని, రసనం చ=నాలుకను, ఘ్రాణమ్ ఏవ చ=ముక్కును, మనః చ=మనస్సును, అధిష్ఠాయ=అధిష్ఠించి, విషయాన్=విషయాలను, ఉపసేవతే=అనుభవిస్తాడు.

భాష్యమ్

శ్రోత్రం చక్షుః స్పర్శనం చ త్వగిన్ద్రియం రసనం ఘ్రాణమ్ ఏవ చ, మనః షష్ఠమ్, ప్రత్యేకమ్ ఇన్ద్రియేణ సహ అధిష్ఠాయ దేహస్థః విషయాన్ శబ్దాదీన్ ఉపసేవతే. 9

బాలానందిని

శ్రోత్రమితి:- దేహంలో ఉన్న జీవుడు శ్రోత్రమును, నేత్రమును, త్వగింద్రియాన్ని, రసనేంద్రియాన్ని, ఘ్రాణేంద్రియాన్ని, ఆరవదైన మనస్సును ఒక్కొక్క ఇంద్రియంతోను (ఇంద్రియం ద్వారా)అధిష్ఠించి శబ్దాదులైన విషయాలను అనుభవిస్తాడు. 9

భాష్యమ్

ఏవం దేహగతం, దేహాత్ –

మూ. ఉత్క్రామన్తం స్థితం వాపి భుఞ్జానం వా గుణాన్వితమ్,
విమూఢా నానుపశ్యన్తి పశ్యన్తి జ్ఞానచక్షుషః. 10

బాలానందిని

ఏవమితి:- ఈ విధంగా దేహంలో ఉన్న జీవుణ్ణి,దేహంనుండి-

ప్ర.అ. ఉత్క్రామన్తమ్ ఇతి:- ఉత్క్రామన్తమ్=పైకి లేచిపోతున్నా,స్థితం వాపి=ఉన్నా, గుణాన్వితమ్=గుణాలతో కూడినవాడై,భుఞ్జానం వా=(శబ్దాదులను) అనుభవిస్తున్నా, విమూఢాః=మూఢులు,నానుపశ్యన్తి=గుర్తించడంలేదు.జ్ఞానచక్షుషః=జ్ఞాననేత్రం గలవాళ్లు, పశ్యన్తి=చూస్తున్నారు.

భాష్యమ్

ఉత్క్రామన్తం,పరిత్యజన్తం దేహం పూర్వోపాత్తం,స్థితం వా దేహే తిష్ఠన్తం,భుఞ్జానం వా శబ్దాదీన్ చ ఉపలభమానం,గుణాన్వితం సుఖదుఃఖమోహాఖ్యైః గుణైః అన్వితమ్ అనుగతం,సంయుక్తమిత్యర్థః.ఏవంభూతమ్ అపి ఏవమ్,అత్యన్తదర్శనగోచనప్రాప్తం, విమూఢాః దృష్టాదృష్టవిషయభోగబలాకృష్టచేతస్తయా,అనేకధా మూఢాః,న అనుపశ్యన్తి, అహో కష్టం వర్తతే ఇతి అనుక్రోశతి చ భగవాన్.యే తు పునః ప్రమాణజనితజ్ఞాన చక్షుషః తే ఏవం పశ్యన్తి జ్ఞానచక్షుషః,వివిక్తదృష్టయః ఇత్యర్థః. 10

బాలానందిని

ఉత్క్రామన్తమితి:-(దేహంనుండి)పైకి లేచిపోవుచున్నా,అనగా పూర్వం గ్రహించబడిన దేహాన్ని త్యజించుచునిన్నా,దేహంలోనే ఉన్నా,శబ్దాదులను అనుభవిస్తూన్నా,సుఖదుఃఖమోహా లనే గుణాలచేత అనుసరింపబడినా,వాటితో కూడి ఉన్నా అని అర్థం,ఈ విధంగా అత్యంతము దర్శనగోచరం పొందినా కూడ (స్పష్టంగా తెలుసుకొనడానికి తగినవాడుగా ఉన్నా కూడ)ఈ జీవుణ్ణి,దృష్టములు అదృష్టములు అయిన విషయాలను అనుభవించడంచేత బలాత్కారంగా లాగివేయబడిన మనస్సు కలవా రవడంచేత అనేకవిధాల మూఢులుగా ఉన్నవాళ్లు చూడజాలకున్నారు;అయ్యో!ఎంత కష్టం!అని భగవంతుడు జాలిపడుతున్నాడు. ఎవరైతే ప్రమాణంచేత (శాస్త్రప్రమాణంచేత)పుట్టిన జ్ఞాననేత్రంకలవారో,అట్టిజ్ఞానచక్షుస్సులు,వివేకం గలవారు,వీనిని చూస్తారు. 10

భాష్యమ్

కే చిత్తు-

మూ. యతన్తో యోగినశ్చైనం పశ్యన్త్యాత్మన్యవస్థితమ్,
యతన్తోఽప్యకృతాత్మానో నైనం పశ్యన్త్యచేతసః. 11

బాలానందిని

కేచిత్తు ఇతి:- కొంద రైతే-

ప్ర.అ.యతన్త ఇతి:- యోగినః=యోగులు,యతన్తః=ప్రయత్నం చేస్తూన్నవారై, ఏనమ్=ఈ ఆత్మను,పశ్యన్తి=చూచుచున్నారు. అకృతాత్మానః=సంస్కరింపబడని మనస్సులు గల,అచేతసః=వివేకజ్ఞానం లేని వాళ్లు,యతన్తః అపిః=ప్రయత్నం చేస్తూన్నా కూడ,ఆత్మని= అంతఃకరణములో,అవస్థితమ్=ఉన్న ఈ ఆత్మను,న పశ్యన్తి=చూడరు.

భాష్యమ్

యతన్తః ప్రయత్నం కుర్వన్తః,యోగినః చ సమాహితచిత్తాః,ఏనం ప్రకృతమ్ ఆత్మానం,పశ్యన్తి–అయమహమ్ అస్మి ఇతి ఉపలభన్తే. ఆత్మని స్వస్యాం బుద్ధౌ అవస్థితం యతన్తః అపి శాస్త్రాదిప్రమాణైః,అకృతాత్మానః అసంస్కృతాత్మానః తపసా ఇన్ద్రియజయేన చ దుశ్చరితాత్ అనుపరతాః అశాన్తదర్పాత్మానః ప్రయత్నం కుర్వన్తః అపి,న ఏనం పశ్యన్తి,అచేతసః అవివేకినః. 11

బాలానందిని

యతన్తః ఇతి:- ప్రయత్నం చేస్తూన్న యోగులు,చిత్తమును ఏకాగ్రం చేసిన యోగులు, ప్రకృతమైన ఈ ఆత్మను,ఏ ఆత్మను గూర్చి మాటలాడుచున్నామో ఆ ఆత్మను, 'ఇది నేను'అని తెలుసుకొనుచున్నారు. ఆత్మయందు,అనగా తమ బుద్ధియందు, ఉన్న ఈ ఆత్మను శాస్త్రాదిప్రమాణాలచేత శ్రవణమాత్రాదులచేత ప్రయత్నిస్తున్నాకూడ(లేదా శాస్త్రాది ప్రమాణైః అనేదానిని 'అకృతాత్మానః'తోఅన్వయించవచ్చును). శాస్త్రాదిప్రమాణాలచేత,తపస్సు చేత,ఇంద్రియజయంచేత సంస్కరింపబడని మనస్సు కలవారు,పాపాచరణంనుండి మరలనివారు,దర్పం శాంతించని అంతఃకరణం కలవారు ప్రయత్నంచేస్తూన్నా కూడ, అలాంటి అచేతస్కులు,వివేకం లేనివాళ్లు,ఈ ఆత్మను చూడరు. 11

భాష్యమ్

యత్ పదం సర్వస్య అవభాసకమ్ అపి అగ్న్యాదిత్యాదికం జ్యోతిః న అవభాసయతే,యత్ప్రాప్తాశ్చ ముముక్షవః పునః సంసారాభిముఖాః న నివర్తన్తే- యస్య చ పదస్య ఉపాధిభేదమనువిధీయమానా జీవాః ఘటాకాశాదయః ఇవ ఆకాశస్య అంశాః

తస్య పదస్య సర్వాత్మత్వం సర్వవ్యవహారాస్పదత్వం చ వివక్షుః చతుర్భిః శ్లోకైః విభూతి సంక్షేపమ్ ఆహ భగవాన్-

మూ. యదాదిత్యగతం తేజో జగద్భాసయతేఽఖిలమ్,
యచ్చన్ద్రమసి యచ్చాగ్నౌ తత్తేజో విద్ధి మామకమ్. 12

బాలానందిని

యదితి:- అంతనీ ప్రకాశింపచేసే దైనా అగ్ని-ఆదిత్యాదిజ్యోతిస్సు ఏ పదాన్ని ప్రకాశింపచేయజాలదో,దేనిని చేరిన ముముక్షువులు మళ్లీ సంసారానికి అభిముఖంగా రారో,ఘటాకాశాదులు ఆకాశానికి అంశాలై నట్లు,ఉపాధిభేదాన్ని పట్టి ఏర్పడిన జీవులు ఏ పదానికి అంశము లైనవారో ఆ పదం సర్వాత్మకము,సర్వవ్యవహారస్పదమూ కూడ (అన్ని వ్యవహారాలలోను ఈ పదం గోచరిస్తుంది అని)చెప్పదలచినవాడై భగవంతుడు నాలుగు శ్లోకాలచేత విభూతుల సంక్షేపాన్ని(ఆ పదంయొక్క విభూతులను సంక్షిప్తంగా) చెపుతున్నాడు-

ప్ర.అ. యదితి:- ఆదిత్యగతమ్=సూర్యునిలో ఉన్న,యత్=ఏ,తేజః=తేజస్సు, అఖిలమ్=సమస్తమైన,జగత్=జగత్తును,భాసయతే=ప్రకాశింపచేస్తూన్నదో,చన్ద్రమసి= చంద్రునియందు,యత్=ఏ తేజస్సు,ఉన్నదో,యత్ చ=ఏది,అగ్నౌ=అగ్నిలో ఉన్నదో,తత్ =ఆ,తేజః=తేజస్సును,మామకమ్=నాకు సంబంధించినదానినిగా,విద్ధి=తెలుసుకొనుము.

భాష్యమ్

యత్,ఆదిత్యగతమ్ ఆదిత్యాశ్రయం,కిం తత్?తేజః దీప్తిః,ప్రకాశః,జగత్ భాసయత్ ప్రకాశయతి అఖిలం సమస్తం,యత్,చన్ద్రమసి శశభృతి,తేజః అవభాసకం వర్తతే,యత్ చ అగ్నౌ హుతవహే,తత్ తేజః విద్ధి విజానీహి,మామకం మదీయం,మమ విష్ణోః తత్ జ్యోతిః.అథవా-యత్ ఆదిత్యగతం తేజః చైతన్యాత్మకం జ్యోతిః,యత్ చన్ద్రమసి, యచ్చ అగ్నౌ తత్ తేజః విద్ధి మామకం మదీయం,మమ విష్ణోః తత్ జ్యోతిః.

నను స్థావరేషు జఙ్గమేషు చ తత్ సమానం చైతన్యాత్మకం జ్యోతిః,తత్ర కథమ్ ఇదం విశేషణం"యదాదిత్యగతమ్"ఇత్యాది?నైష దోషః,సత్త్వాధిక్యాత్ ఆధిక్యోపపత్తేః.ఆదిత్యాదిషు హి సత్త్వమ్ అత్యన్తప్రకాశమ్ అత్యన్తభాస్వరమ్ అతః తత్రైవ ఆవిస్తరాం జ్యోతిః ఇతి తత్ విశేష్యతే,న తు తత్రైవ తత్ అధికమ్ ఇతి.యథా హి లోకే తుల్యేఽపి ముఖసంస్థానే న కాష్ఠకుడ్యాదౌ ముఖమ్ ఆవిర్భవతి,ఆదర్శాదౌ తు స్వచ్ఛే స్వచ్ఛతరే చ తారతమ్యేన ఆవిర్భవతి తద్వత్. 12

బాలానందిని

యదితి:- ఆదిత్యుణ్ణి ఆశ్రయించుకొని ఉన్న ఏ తేజస్సు,ఏ దీప్తి,ఏ ప్రకాశ సమస్త మైన జగత్తును ప్రకాశింపచేస్తూన్నదో,చంద్రునిలోను అగ్నిలోను ప్రకాశింపచేసే ఏ తేజస్సు ఉన్నదో ఆ తేజస్సు విష్ణువు నైన నాయొక్క తేజస్సు అని తెలుసుకొనుము.లేదా - ఆదిత్యునిలో చైతన్యరూప మైన ఏ తేజస్సు ఉన్నదో,చంద్రునిలోను అగ్నిలోను ఏది ఉన్నదో అది నాకు సంబంధించిన,విష్ణువు నైన నాకు సంబంధించిన,జ్యోతిస్సు అని తెలుసుకొనుము.

(ప్రశ్న)చైతన్యరూప మైన ఆ తేజస్సు స్థావరాలలోను జంగమాలలోను సమానంగానే ఉంటుంది కదా?అలాంటప్పుడు 'యదాదిత్యగతమ్'ఇత్యాదివిధంగా విశేషించి ఎందుకుచెప్పబడుచున్నది?(సమాధానం)ఈ దోషం లేదు.సత్త్వగుణంయొక్క ఆధిక్యాన్ని పట్టి చైతన్యంయొక్క ఆధిక్యం(ఆ యా వస్తువులలో)కుదురుతుంది.ఆదిత్యాదు లలో ఉన్న సత్త్వగుణం ఎక్కువ ప్రకాశవంతమై అధికంగా మెరుస్తూ ఉంటుంది.అందుచేత వాటిలోనే చైతన్యజోతిస్సు అధికంగా ఆవిష్కృతం అవుతుంది.అందుచేత అది ప్రత్యేకించి చెప్పబడుచున్నది కాని అక్కడ మాత్రమే అది అధికంగా ఉంటూన్న దని కాదు.లోకంలో ముఖంయొక్క అవయవనిర్మాణం(లేదా దగ్గరగా ఉండడం)సమానమే అయినా కఱ్ఱలు గోడలు మొదలైనవాటిలో ఆ ముఖం ఏ విధంగా ఆవిర్భవించదో,స్వచ్ఛమూ,బాగా స్వచ్ఛమూ అయిన అద్దం మొదలైనదానిలో ఏ విధంగా తారతమ్యంతో(స్వచ్ఛమైనదానిలో స్పష్టంగాను, స్వచ్ఛతరమైనదానిలో ఇంకా స్వచ్ఛంగాను)ఆవిర్భవిస్తుందో ఇది కూడ అట్లే.12

భాష్యమ్

కిం చ-

మూ. గామావిశ్య చ భూతాని ధారయామ్యహమోజసా,
పుష్ణామి చౌషధీః సర్వాః సోమో భూత్వా రసాత్మకః. 13

బాలానందిని

కిం చేతి:- మరియు-

ప్ర.అ. గామితి:- అహమ్=నేను,గామ్=భూమిని,ఆవిశ్య=ప్రవేశించి,ఓజసా= తేజస్సుతో,భూతాని=ప్రాణులను,ధారయామి=నిలుపుతున్నాను.రసాత్మకః=రసస్వరూపు డైన,సోమః=సోముడుగా,భూత్వా=అయి,సర్వాః=సమస్తమైన,ఓషధీః=ఓషధులను,పుష్ణామి =పోషించుచున్నాను.

భాష్యమ్

గాం పృథివీమ్,ఆవిశ్య ప్రవిశ్య,ధారయామి,భూతాని జగత్,అహమ్,ఓజసా బలేన;యత్ బలం కామరాగవివర్జితమ్ ఐశ్వరం జగద్విధారణాయ పృథివ్యాం ప్రవిష్టం, యేన గుర్వీ పృథివీ న అధః పతతి న విదీర్యతే చ,తథా చ మన్త్రవర్ణః-"యేన ద్యౌరుగ్రా పృథివీ చ దృఢా"(తై.సం. 4. 1. 8)ఇతి;"స దాధార పృథివీమ్"(తై.సం. 4. 1. 8) ఇత్యాదిశ్చ. అతః గామ్ ఆవిశ్య చ భూతాని చరాచరాణి ధారయామి ఇతి యుక్తమ్ ఉక్తమ్. కిం చ పృథివ్యాం జాతాః ఓషధీః సర్వాః వ్రీహియవాద్యాః పుష్ణామి పుష్టిమతీః రసస్వాదుమతీశ్చ కరోమి. సోమః భూత్వా,రసాత్మకః-సోమః సర్వరసాత్మకః రసస్వభావః సర్వరసానామ్ ఆకరః సోమః. సః హి సర్వాఓషధీః స్వాత్మరసానుప్రవేశేన పుష్ణాతి. 13

బాలానందిని

గామితి:-నేను భూమిని ప్రవేశించి ఓజస్సుచేత భూతాలను,జగత్తును,నిలబెట్టు చున్నాను. ఓజస్సుచేత,బలంచేత,కామరాగశూన్య మైన ఏ ఈశ్వరబలం జగత్తును భరించడంకోసం భూమిలో ప్రవేశించినదో,ఏది ప్రవేశించడంచేత అంత బరువైన దైనా కూడ భూమి క్రింద పడడంలేదో,ముక్క ముక్కలుగా చీలిపోవడంలేదో,-"యేన...దృఢా" (ఏ పరమాత్మచేత ద్యులోకం ఉగ్రంగాను భూలోకం దృఢం గాను ఉన్నాయో)అను మంత్రం ఈ విషయమే చెప్పుచున్నది."స దాధార పృథివీమ్"(అ పరమాత్మ భూమిని ధరించాడు) ఇత్యాదిమంత్రం కూడ.అందుచేత భూమిని ప్రవేశించి చరాచరభూతాలను ధరిస్తున్నాను అని యుక్తంగా చెప్పబడింది. మరియు,భూమిమీద పుట్టిన వరి,యవలు మొద లైన ఓషధులను,రసాత్మకుడైన సోముడుగా అయి పుష్టి కలవాటినిగా,రసమూ రుచీ కలవాటినిగా, చేస్తున్నాను. సోముడు సర్వరసస్వరూపుడు. రస స్వభావం కలవాడు అన్ని రసాలకి నిధానం. తనలోని రసంతో నింపి ఓషధుల నన్నింటిని పోషిస్తాడు. 13

భాష్యమ్

కిం చ-

మూ. **అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః,**
ప్రాణాపానసమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్. 14

బాలానందిని

కిం చేతి:- మరియు-

ప్ర.అ. **అహమితి**:- అహమ్=నేను,వైశ్వానరః=వైశ్వానరాగ్నిగా,భూత్వా=అయి, ప్రాణినామ్=ప్రాణులయొక్క దేహమ్=దేహమును,ఆశ్రితః=ఆశ్రయించినవాడనై,ప్రాణాపాన సమాయుక్తః=ప్రాణాపానాలతో కూడినవాడనై,చతుర్విధమ్=నాలుగు విధాలైన,అన్నమ్= అన్నమును,పచామి=జీర్ణం చేయుచున్నాను.

భాష్యమ్

అహమేవ వైశ్వానరః ఉదరస్థః అగ్నిః భూత్వా"**అయమగ్నిర్వైశ్వానరో యోఽయమన్తః పురుషే,యేనేదమన్నం పచ్యతే**"(బృ.ఉ.5.9.1)ఇత్యాదిశ్రుతేః,వైశ్వానరః సన్,ప్రాణినాం ప్రాణవతామ్,దేహమ్ ఆశ్రితః ప్రవిష్టః ప్రాణాపానసమాయుక్తః ప్రాణాపానాభ్యాం సమాయుక్తః సంయుక్తః,పచామి పక్తిం కరోమి,చతుర్విధం చతుష్ప్రకారమ్, అన్నమ్ అశనం,భోజ్యం,భక్ష్యం,చోష్యం,లేహ్యం చ.భోక్తా వైశ్వానరః అగ్నిః,భోజ్యమ్ అన్నం సోమః,తత్ ఏతత్ ఉభయమ్ అగ్నీషోమౌ సర్వమ్ ఇతి పశ్యతః అన్నదోషలేపః భవతి. 14

బాలానందిని

అహమేవేతి:- నేనే వైశ్వానరుడుగా,ఉదరంలో ఉన్న(జఠరాగ్నిగా)అయి "అయ.... పచ్యతే"(పురుషునిలో ఏ అగ్ని ఉన్నదో అది వైశ్వానరాగ్ని,దీనిచేత అన్నం జీర్ణం చేయబడును)అని శ్రుతి చెప్పినట్లు వైశ్వానరాగ్నిగా అయి ప్రాణుల దేహాన్ని ఆశ్రయించి, ప్రవేశించి,ప్రాణాపానాలతో కూడినవాడనై నాలుగు విధాలైన అన్నమును భోజ్యమ్(ఎక్కువ నమలకుండా తినతగినది),భక్ష్యం (నమిలి మ్రింగదగినది),చోష్యమ్(జుర్రదగినది),లేహ్యమ్ (నాకదగినది)అని నాలుగువిధాలైన అన్నాన్ని జీర్ణింపచేస్తున్నాను.భోక్త(తినేవాడు)వైశ్వానరుడు, అన్నం సోముడు,ఈ విధంగా ఈ రెండూ అగ్నీషోములు అని భావన చేసేవానికి అన్న దోషం వల్ల కలిగే లేపం(దోషం)కలగదు.(ఇది ప్రసంగవశంచేత చెప్పిన విషయం).14

భాష్యమ్

కిం చ-

మూ. సర్వస్య చాహం హృది సంనివిష్టో
మత్తః స్మృతిర్జ్ఞానమపోహనం చ,
వేదైశ్చ సర్వైరహమేవ వేద్యో
వేదాన్తకృద్వేదవిదేవ చాహమ్. 15

బాలానందిని

కిం చేతి- మరియు-

ప్ర.అ.సర్వస్యేతి:- అహమ్=నేను,సర్వస్య=అందరియొక్క హృది=హృదయంలో, సంనివిష్టః=ఉన్నాను.స్మృతిః=స్మరణము,జ్ఞానమ్=జ్ఞానము,అపోహనం చ = స్మృతిజ్ఞానాలు తొలగిపోవడమూ కూడ,మత్తః=నావల్లనే జరుగును.సర్వైః=సమస్తమైన, వేదైః=వేదాలచేత, అహమేవ=నేనే,వేద్యః=తెలియ దగినవాడను.అహమ్=నేను, వేదాన్త కృత్=వేదాంతమును చేసినవాడను;వేదవిత్ ఏవ చ=వేదవేత్తను కూడ.

భాష్యమ్

సర్వస్య ప్రాణిజాతస్య అహమ్ ఆత్మా సన్,హృది బుద్ధౌ,సంనివిష్టః.అతః మత్తః ఆత్మనః సర్వప్రాణినాం స్మృతిః జ్ఞానం తదపోహనం చ.యేషాం యథా పుణ్యకర్మిణాం పుణ్యకర్మానురోధేన జ్ఞానస్మృతీ భవతః తథా పాపకర్మిణాం పాపకర్మానురూపేణ స్మృతి జ్ఞానయోః,అపోహనం చ అపాయనమ్ అపగమనం చ, వేదైః చ సర్వైః, అహమేవ పరమాత్మా,వేద్యః వేదితవ్యః.వేదాన్తకృత్,వేదాన్తార్థసంప్రదాయకృత్ ఇత్యర్థః.వేదవిత్ వేదార్థవిదేవ చ అహమ్. 15

బాలానందిని

సర్వస్యేతి:-నేను ఆత్మగా సమస్తప్రాణిసముదాయంయొక్క బుద్ధిలో ఉంటాను. అందువలన స్మృతీ,జ్ఞానము,స్మృతిజ్ఞానాలు తొలగిపోవడమూ కూడ నావల్లనే కలుగుతాయి.పుణ్యకర్మలు గలవారికి ఏ విధంగా వాళ్ల పుణ్యకర్మలను అనుసరించి జ్ఞాన-స్మృతులు కలుగుతాయో అట్లే పాపకర్మ చేసినవాళ్లకు వాళ్ల పాపకర్మలను అనుసరించి స్మృతిజ్ఞానాల అపోహనం,తొలగిపోవడం జరుగుతూంటుంది.(సంపాదించే టప్పుడు ముందు జ్ఞానం తరువాత సంపాదించినదాని స్మృతి కలుగుతాయి.పోయే టప్పుడు స్మృతి ముందుగా పోతుంది,తరువాత జ్ఞానం అంతర్హితం అవుతుంది.అందుచేతనే భాష్యంలో "పుణ్యకర్మానురాధేన జ్ఞానస్మృతీ భవతః...పాపకర్మానురూపేణ స్మృతిజ్ఞానయోః అపోహనమ్"అని చెప్పబడింది).అన్ని వేదాలచేత తెలియదగినవాడను పరమాత్మ నైన నేనే.నేను వేదాంతకర్తను అనగా వేదాంతార్థసంప్రదాయాన్ని నడిపించేవాడను అని అర్థం. వేదవేత్తను,అనగా వేదార్థం తెలిసినవాడను కూడ. 15

భాష్యమ్

భగవతః ఈశ్వరస్య నారాయణాఖ్యస్య విభూతిసంక్షేపః ఉక్తః విశిష్టోపాధికృతః

"యదాదిత్యగతం తేజః"(15. 12)ఇత్యాదినా. అథ అధునా తస్యైవ క్షరాక్షరోపాధిప్ర విభక్తతయా నిరుపాధికస్య కేవలస్య స్వరూపనిర్దిధారయిషయా ఉత్తరశ్లోకా ఆరభ్యన్తే. తత్ర సర్వమేవ అతీతానాగతాధ్యాయార్థజాతం త్రిధా రాశీకృత్య ఆహ-

మూ. ద్వావిమౌ పురుషౌ లోకే క్షరశ్చాక్షర ఏవ చ,
క్షరః సర్వాణి భూతాని కూటస్థోఽక్షర ఉచ్యతే. 16

బాలానందిని

భగవత ఇతి:-"యదాదిత్యగతం తేజః"ఇత్యాదికంచేత నారాయణు డను పేరు గల భగవంతు డైన ఈశ్వరునియొక్క విశిష్టము లైన ఉపాధులను పట్టి ఏర్పడిన విభూతుల సంక్షేపం చెప్పబడినది. ఇక ఇప్పుడు క్షరము అక్షరము అనే ఉపాధులకంటె (ఉపాధుల నుండి)వేరు చేయబడడంచేత ఉపాధిరహితుడు,కేవలు (అద్వితీయుడు)అయిన ఆ ఈశ్వరునియొక్క స్వరూపాన్నే నిర్ధారణచేయాలనే అభిప్రాయంతో రాబోయే శ్లోకాలు ఆరంభించబడుతున్నాయి. ఆ సందర్భంలో గడచిన అధ్యాయాలలోను,రాబోయే అధ్యా యాలలోను ఉన్న విషయాలను మూడు రాశులుగా చేసి చెపుతున్నాడు-(క్షరం,అక్షరం, పరమాత్మ అని మూడు రాసులు).

ప్ర. అ. ద్వావితి:- లోకే=లోకంలో,క్షరః చ=క్షరం, అనీ,అక్షరః ఏవ చ=అక్షరం అనీ,ఇమౌ=ఈ రెండూ,ద్వౌ పురుషౌ=రెండు పురుషులు. సర్వాణి=సమస్తమైన,భూతాని =భూతములు,క్షరః=క్షరం అనీ, కూటస్థః=కూటస్థ మైనది,అక్షరః ఇతి=అక్షరం అని,ఉచ్యతే= చెప్పబడుతుంది.

భాష్యమ్

ద్వౌ ఇమౌ పృథక్ రాశీకృతౌ పురుషావితి ఉచ్యేతే,లోకే సంసారే. క్షరః చ క్షరతీతి క్షరః,వినాశీ ఏకః రాశిః,అపరః పురుషః అక్షరః తద్విపరీతః భగవతః మాయాశక్తిః, క్షరాఖ్యస్య పురుషస్య ఉత్పత్తిబీజమ్,అనేకసంసారి జన్తుకామకర్మాది సంస్కారాశ్రయః అక్షరః పురుషః ఉచ్యతే. కౌ తౌ పురుషౌ ఇత్యాహ స్వయమేవ భగవాన్-క్షరః సర్వాణి భూతాని సమస్తం వికారజాతమ్ ఇత్యర్థః. కూటస్థః-కూటః రాశిః,రాశిరివ స్థితః;అథవా కూటః మాయా వఞ్చనా జిహ్మతా కుటిలతా ఇతి పర్యాయాః. అనేకమాయాదిప్రకారేణ స్థితః కూటస్థః,సంసారబీజానన్త్యాత్ న క్షరతీతి అక్షరః ఉచ్యతే. 16

బాలానందిని

ద్వావితి:-లోకంలో,సంసారంలో వేరు వేరు రాశులుగా చేయబడిన ఈ రెండూ (ఇద్దరూ)పురుషు లని చెప్పబడుచున్నవి(న్నారు).క్షరము-"క్షరతీతి క్షరః"-ఒక రాశి నశించేది.రెండవ పురుషుడు అక్షరం;క్షరానికి విపరీతం.క్షర మనే పేరు గల పురుషుని ఉత్పత్తికి కారణమైన,భగవంతుని మాయాశక్తి,సంసారులైన అనేకప్రాణుల కామము కర్మ మొదలైన సంస్కారాలకు ఆశ్రయము.ఇదే అక్షరపురుషు డని చెప్పబడుచున్నది.ఆ పురుషులు రెండూ ఏవో భగవంతుడే స్వయంగా చెపుతున్నాడు.సకలభూతాలు,సమస్తమైన కార్యాల సముదాయము-అని అర్థం,క్షర మనే పురుషుడు.కూటస్థము-కూట మనగా(కదలకుండా ఉన్న పెద్ద)రాశి.కూటం వలె ఉన్నవాడు(ది)కూటస్థం.లేదా-కూటః,మాయా,వఞ్చనా, జిహ్మతా,కుటిలతా-ఇవన్నీ పర్యాయపదాలు.అనేకమాయాదుల రూపాలలో ఉన్నది కూటస్థం.సంసారబీజాలు అనంతాలు అవడంచేత ఎప్పటికీ తరగనిది గాన అక్షరం అని చెప్పబడుచున్నది. 16

భాష్యమ్

అభ్యాం క్షరాక్షరాభ్యాం విలక్షణః క్షరాక్షరోపాధిద్వయదోషేణ అస్పృష్టః నిత్యశుద్ధ ముక్తస్వభావః-

మూ. ఉత్తమః పురుషస్త్వన్యః పరమాత్మేత్యుదాహృతః,
యో లోకత్రయమావిశ్య బిభర్త్యవ్యయ ఈశ్వరః. 17

బాలానందిని

అభ్యామితి:-ఈ క్షరాక్షరాలకంటె విలక్షణుడు(భిన్నమైన లక్షణాలు,స్వభావం, కలవాడు)క్షరము అక్షరము అనే ఈ రెండు ఉపాధుల దోషాలచేత స్పృశింపబడనివాడు, నిత్యము,పరిశుద్ధము,జ్ఞానరూపము,ముక్తము అయిన స్వభావం కలవాడు అయిన-

ప్ర.అ. ఉత్తమః ఇతి:- అన్యః=వీటికంటె వేరైన,ఉత్తమః=ఉత్తము డైన,పురుషః తు=పురుషు డైతే,పరమాత్మా ఇతి=పరమాత్మ అని,ఉదాహృతః=చెప్పబడ్డాడు(బడు చున్నాడు).అవ్యయః=నాశరహితుడైన,ఈశ్వరః=ఈశ్వరుడైన,యః=ఏ పురుషుడు,లోక త్రయమ్=మూడు లోకాలను,ఆవిశ్య=ప్రవేశించి,బిభర్తి=భరించుచున్నాడో.

భాష్యమ్

ఉత్తమః ఉత్కృష్టతమః పురుషః తు,అన్యః అత్యన్తవిలక్షణః అభ్యాం,పరమాత్మా ఇతి-పరమః చ అసౌ దేహాద్యవిద్యాకృతాత్మభ్యః ఆత్మా చ సర్వభూతానాం ప్రత్యక్చేతనః

ఇత్యతః పరమాత్మా ఇతి ఉదాహృతః,ఉక్తః వేదాన్తేషు,సః ఏవ విశేష్యతే-యః లోకత్రయం భూర్భువఃస్వరాఖ్యం స్వకీయయా చైతన్యబలశక్త్యా,ఆవిశ్య ప్రవిశ్య,బిభర్తి-స్వరూప సద్భావమాత్రేణ బిభర్తి ధారయతి,అవ్యయః-న అస్య వ్యయః విద్యతే ఇతి అవ్యయః. ఈశ్వరః సర్వజ్ఞః నారాయణాఖ్యః ఈశనశీలః. 17

బాలానందిని

ఉత్తమ ఇతి:- అత్యంతము ఉత్కృష్టు డైన పురుషు డైతే ఈ రెండింటికంటె విలక్షణ మైనవాడు. ఈ పురుషుడు దేహం మొదలైన అవిద్యాకృతా లైన ఆత్మలకంటె పరముడు ఆత్మా కూడ,అనగా సమస్తభూతాలకు ప్రత్యగాత్మా కూడ;అందుచేత వేదాంతాలలో పరమాత్మ అని చెప్పబడుచున్నాడు.ఆ పరమాత్మయే విశేషింపబడుచున్నాడు. (ఆ పరమాత్మకే సంబంధించిన విశేషమే చెప్పబడుచున్నది)-ఏ పరమాత్మ భూర్భువఃస్వర్లోకా లనే మూడు లోకాలను చైతన్యబలశక్తితో ప్రవేశించి,స్వరూపంయొక్క ఉనికి మాత్రంచేతనే, ధరిస్తున్నాడో (పరమాత్మ లోకత్రయాన్ని ధరిస్తున్నా డనగా,నిలుపుతున్నా డనగా,ఎద్దు వీపుమీద బరువు మోసినట్లు మోస్తున్నా డని అర్థం కాదు.చైతన్యబలశక్తి రూపంతో మూడు లోకాలను నిండి ఉండడమే వాటిని ధరించడం అనగా అని అర్థం. ఉదాహరణకి-సూర్యుడు అందరిచేత పనులు చేయిస్తున్నా డనగా అర్థం సూర్యుడు ప్రకాశిస్తూ ఉండడమే).ఈ పరమాత్మకు వ్యయం,మార్పు లేదా నాశం,లేదు.అందుచేత అవ్యయుడు.ఈశ్వరుడు.సర్వజ్ఞుడై నారాయణు డనే పేరు గల ఈశనస్వభావం(నియమించే స్వభావం)కలవాడు. 17

భాష్యమ్

యథావ్యాఖ్యాతస్య ఈశ్వరస్య పురుషోత్తమః ఇత్యేతత్ నామ ప్రసిద్ధమ్.తస్య నామనిర్వచనప్రసిద్ధ్యా అర్థవత్త్వం నామ్నః దర్శయన్ నిరతిశయః అహమ్ ఈశ్వరః ఇతి ఆత్మానం దర్శయతి భగవాన్-

మూ. యస్మాత్ క్షరమతీతోఽహమక్షరాదపి చోత్తమః,
అతోఽస్మి లోకే వేదే చ ప్రథితః పురుషోత్తమః. 18

బాలానందిని

యథేతి:- పైన వివరింపబడిన స్వరూపం గల ఈశ్వరుని 'పురుషోత్తముడు'అనే పేరు ప్రసిద్ధ మైనది.ఆతని పేరుయొక్క నిర్వచనం ప్రసిద్ధంగా ఉండడంచేత ఆ పేరుయొక్క సార్థకత్వాన్ని(అది సార్థక మైన పేరు అని)చూపుచు నేను నిరతిశయుడైన(ఎవనిని మించిన వాడు లేడో అట్టి)ఈశ్వరుడను అని భగవంతుడు తనను చూపుతున్నాడు-

ప్ర.అ. యస్మాదితి:- యస్మాత్=ఎందువలన,అహమ్=నేను,క్షరమ్=క్షరమును, అతీతః=అతిక్రమించి ఉన్నవాడనో,అక్షరాదపి చ=అక్షరంకంటె కూడ,ఉత్తమః=ఉత్తముడనో, అతః=అందువల్ల,లోకే=లోకమునందు,వేదే చ=వేదమునందు కూడ,పురుషోత్తమః=పురుషోత్తము డనుగా,ప్రథితః=ప్రసిద్ధుడను.

భాష్యమ్

యస్మాదితి:-యస్మాత్ క్షరమ్ అతీతః అహం సంసారమాయావృక్షమ్ అశ్వత్థాఖ్యమ్ అతిక్రాన్తః అహమ్,అక్షరాదపి సంసారవృక్షబీజభూతాత్ అపి చ ఉత్తమః ఉత్కృష్టతమః ఊర్ధ్వతమః వా,అతః క్షరాక్షరాభ్యామ్ ఉత్తమత్వాత్,అస్మి భవామి,లోకే వేదే చ ప్రథితః ప్రఖ్యాతః,పురుషోత్తమః ఇత్యేవం మాం భక్తజనాః విదుః,కవయః కావ్యాదిషు చ ఇదం నామ నిబధ్నన్తి,పురుషోత్తమః ఇత్యనేన అభిధానేన అభిగృణన్తి. 18

బాలానందిని

యస్మాదితి:- ఎందువలన నన్ను అశ్వత్థ మనే పేరు గల సంసారమాయావృక్షమైన క్షరాన్ని అతిక్రమించి ఉన్నానో,సంసారానికి బీజమైన అక్షరంకంటె కూడ చాలా ఉత్కృష్ట మైనవాడనో,లేదా చాలా ఎత్తుగా ఉన్నానో,అందువల్ల,కరాక్షరములకంటె(క్షరాక్షరము లనే పురుషులకంటె)ఉత్తముడ నగుటవల్ల లోకంలోను వేదంలోనూ కూడ (పురుషోత్తముడుగా)ప్రసిద్ధుడను.నన్ను భక్తజనులు పురుషోత్తము డని అంటారు.కవులు కావ్యాదులలో కూడ ఈ పేరు కూరుస్తూంటారు,పురుషోత్తమః అనే పేరుతో పేర్కొంటూంటారు. 18

భాష్యమ్

అథ ఇదానీం యథానిరుక్తమ్ ఆత్మానం యః వేద తస్య ఇదం ఫలమ్ ఉచ్యతే-

మూ. **యో మామేవమసంమూఢో జానాతి పురుషోత్తమమ్,**
స సర్వవిద్భజతి మాం సర్వభావేన భారత. 19

బాలానందిని

అథేతి:- ఇంక ఇప్పుడు-తనను గూర్చి ఎవడు పైన నిర్వచించిన విధంగా తెలుసుకొంటాడో వానికి ఫలం చెప్పబడుచున్నది-

ప్ర.అ.య ఇతి:- భారత=అర్జునా!యః=ఎవడు,అసంమూఢః=మూఢుడు కానివాడై, మామ్=నన్ను,ఏవమ్=ఈ విధంగా,పురుషోత్తమమ్=పురుషోత్తమునిగా,జానాతి=తెలుసు

కొంటాడో,సః=అతడు,సర్వవిత్=అంతనూ తెలిసినవాడై,మామ్=నన్ను,సర్వభావేన=సర్వాత్మ భావంతో,భజతి=పొందుతాడు.

భాష్యమ్

యః మామ్ ఈశ్వరం యథోక్తవిశేషణమ్,ఏవం యథోక్తేన ప్రకారేణ,అసంమూఢః సంమోహావర్జితః సన్,జానాతి"అయమ్ అహమ్ అస్మి"ఇతి పురుషోత్తమమ్. సః సర్వవిత్ సర్వాత్మనా సర్వం వేత్తీతి సర్వజ్ఞః సర్వభూతస్థం భజతి మాం సర్వభావేన సర్వాత్మచిత్తతయా, హే భారత. 19

బాలానందిని

యః ఇతి:- అర్జునా! పైన చెప్పబడిన విశేషణాలు గల ఈశ్వరుడ నైన నన్ను,ఎవడు, మోహం లేనవాడై పైన చెప్పిన ప్రకారంగా పురుషోత్తమునిగా,నేను ఈ క్షరాక్షరాతీతు డను అని తెలుసుకొంటాడో, సర్వమును సర్వాత్మస్వరూపంలో గ్రహించడంచేత సర్వజ్ఞుడైన అతడు,సర్వభూతాలలోను ఉన్న నన్ను,సర్వభావంతో,అనగా సర్వాత్ముడ నైన నాయందు లగ్నమైన చిత్తంతో పొందుతాడు.(సాయుజ్యం పొందుతాడు). 19

భాష్యమ్

అస్మిన్ అధ్యాయే భగవత్తత్త్వజ్ఞానం మోక్షఫలమ్ ఉక్త్వా అథ ఇదానీం తత్ స్తౌతి-

మూ. ఇతి గుహ్యతమం శాస్త్రమిదముక్తం మయానఘ,
ఏతద్బుద్ధ్వా బుద్ధిమాన్ స్యాత్ కృతకృత్యశ్చ భారత. 20

ఇతి శ్రీమహాభారతే శతసాహస్ర్యాం సంహితాయాం వైయాసిక్యాం భీష్మపర్వణి శ్రీభగవద్గీతాసు ఉపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే పురుషోత్తమయోగో నామ పఞ్చదశోఽధ్యాయః.

బాలానందిని

అస్మిన్నితి:- ఈ అధ్యాయంలో మోక్షం ఫలంగా గల భగవత్తత్త్వజ్ఞానాన్ని గూర్చి చెప్పి ఇంక ఇప్పుడు దానిని స్తుతిస్తున్నాడు-

ప్ర.అ. ఇతీతి:- అనఘ=పాపాలు లేనివాడా!భారత=అర్జునా!మయా=నాచేత,ఇతి= ఈ విధంగా,గుహ్యతమమ్=చాల గుహ్యమైన,ఇదం శాస్త్రమ్=ఈ శాస్త్రము=ఉక్తమ్=చెప్పబడినది. ఏతత్=దీనిని,బుద్ధ్వా=తెలుసుకొని,బుద్ధిమాన్=బుద్ధిమంతుడు,కృతకృత్యః చ=కృతకృత్యుడు,స్యాత్=అగును.

భాష్యమ్

ఇతి ఏతత్ గుహ్యతమం గోప్యతమమ్,అత్యన్తరహస్యమ్ ఇత్యేతత్.కిం తత్? శాస్త్రమ్.యద్యపి గీతాఖ్యం సమస్తం శాస్త్రమ్ ఉచ్యతే తథాపి అయమేవ అధ్యాయః ఇహ శాస్త్రమ్ ఇతి ఉచ్యతే స్తుత్యర్థం.ప్రకరణాత్.సర్వో హి గీతాశాస్త్రార్థః అస్మిన్ అధ్యాయే సమాసేన ఉక్తః.న కేవలం గీతాశాస్త్రార్థ ఏవ,కిం తు సర్వశ్చ వేదార్థః ఇహ పరిసమాప్తః "యస్తం వేద స వేదవిత్"(15.1)"వేదైశ్చ సర్వైరహమేవ వేద్యః" (15.15)ఇతి చ ఉక్తమ్.ఇదమ్ ఉక్తం కథితం మయా హే అనఘ అపాప.ఏతత్ శాస్త్రం యథాదర్శితార్థం బుద్ధ్వా బుద్ధిమాన్,స్యాత్ భవేత్,న అన్యథా; కృతకృత్యః చ, భారత కృతం కృత్యం కర్తవ్యం యేన సః కృతకృత్యః.విశిష్టజన్మప్రసూతేన బ్రాహ్మణేన యత్ కర్తవ్యం తత్ సర్వం భగవత్తత్త్వే విదితే కృతం భవేత్ ఇత్యర్థః.న చ అన్యథా కర్తవ్యం పరిసమాప్యతే కస్య చిత్ ఇతి అభిప్రాయః.

"సర్వం కర్మాఖిలం పార్థ జ్ఞానే పరిసమాప్యతే".(4.33)

ఇతి చ ఉక్తమ్.

ఏతద్ధి జన్మసామగ్ర్యం (సాఫల్యం) బ్రాహ్మణస్య విశేషతః,
ప్రాప్యైతత్ కృతకృత్యో హి ద్విజో భవతి నాన్యథా (మ.స్మృ. 12.93)

ఇతి చ మానవం వచనమ్.యతః ఏతత్ పరమార్థతత్త్వం మత్తః శ్రుతవాన్ అసి తతః కృతార్థః త్వం భారత ఇతి. 20

ఇతి శ్రీమత్పరమహంసపరివ్రాజకాచార్యగోవిన్దభగవత్పూజ్యపాదశిష్య శ్రీమదాచార్యశ్రీశంకరభగవతః కృతౌ శ్రీమద్భగవద్గీతాభాష్యే పురుషోత్తమయోగో నామ పఞ్చదశోఽధ్యాయః.

బాలానందిని

ఇత్యేతదితి:- ఈ విధంగా బాగా రక్షించదగిన,చాలా రహస్య మైన,అని అర్థం. ఏమిటది?శాస్త్రం.మొత్తం గీత గీతాశాస్త్రం అని చెప్పబడినా కూడ,అయినా కూడ,ఇక్కడ, ప్రకరణాన్ని పట్టి, ఈ అధ్యాయమే, స్తుతించడంకోసం,శాస్త్ర మని చెప్పబడుచున్నది. ఎందువల్ల ననగా గీతాశాస్త్రంలోని సమస్త మైన అర్థమూ(విషయమూ)కూడ ఈ అధ్యాయం లో సంక్షిప్తంగా చెప్పబడింది.గీతార్థమే కాదు-సమస్తవేదార్థమూ కూడ దీనిలో(ఈ అధ్యాయంలో) సమాప్త మైనది."యస్తం వేద స వేదవిత్"అని "వేదైశ్చ సర్వైరహమేవ వేద్యః"అని కూడ

చెప్పబడింది. ఇది నాచేత చెప్పబడింది; ఓ పాపాలు లేని వాడా! ఈ శాస్త్రాన్ని పైన ఏ విధంగా అర్థం చూపబడిందో ఆవిధంగా తెలుసుకొని, బుద్ధిమంతు డవుతాడు. మరొక విధంగా బుద్ధిమంతుడు కాజాలడు. కృత్యము, చేయవలసిన పని, ఎవనిచేత చేయబడినదో అతడు కృతకృత్యుడు. అట్టి కృతకృత్యుడు కూడ అవుతాడు. అనగా విశిష్ట మైన జన్మలో పుట్టిన బ్రాహ్మణునిచేత ఏది కర్తవ్యమో, అదంతా, భగవత్తత్త్వం తెలుసుకొన్న ట్లయితే, చేయ బడినది అవుతుంది అని అర్థం. (భగవత్తత్త్వం తెలిసికొన్నవాడు బ్రాహ్మణజన్మ ఎత్తినవాడు చేయవలసిన ఏ కార్యా లున్నాయో అవన్నీ చేసినవా డవుతాడు). ఇది తెలుసుకొనకపోతే ఎవడూ తన కర్తవ్యాన్ని పూర్తి చేసి నట్లు కాదు అని అభిప్రాయం. "సర్వం కర్మాఖిలం పార్థ జ్ఞానే **పరిసమాప్యతే**"అని చెప్పబడింది. "**ఏతద్ధి....నాన్యథా**" (ఇదే (ఆత్మతత్త్వజ్ఞానమే) జన్మకు పరిపూర్ణత్వం. విశేషించి బ్రాహ్మణునికి. ద్విజుడు దీనిని పొంది మాత్రమే కృతకృత్యు డవుతాడు. మరొక విధంగా కృతకృత్యుడు కాడు)అని మనువు చెప్పిన వాక్యం. అర్జునా! నువ్వు ఈ పరమార్థతత్త్వాన్ని నానుండి విన్నావు గాన నవ్వు కృతకృత్యుడ వైనావు అని(భారత అని సంబోధించడంలోని)భావం. 20

"బాలానందిని"అను శ్రీమద్భగవద్గీతాశాంకరభాష్యాంధ్ర
వ్యాఖ్యానములో పంచదశాధ్యాయం సమాప్తం.
(ప్రారంభంనుండి 541 శ్లోకాలు)

అథ షోడశోఽధ్యాయః

భాష్యమ్

దైవీ ఆసురీ రాక్షసీ చేతి ప్రాణినాం ప్రకృతయః నవమే అధ్యాయే సూచితాః. తాసాం విస్తరేణ ప్రదర్శనాయ "**అభయం సత్త్వసంశుద్ధిః**"ఇత్యాదిః అధ్యాయః ఆరభ్యతే. తత్ర సంసారమోక్షాయ దైవీ ప్రకృతిః నిబన్ధాయ ఆసురీ రాక్షసీ చ ఇతి, దైవ్యాః ఆదానాయ ప్రదర్శనం క్రియతే, ఇతరయోః పరివర్జనాయ-

శ్రీభగవానువాచ-

మూ. అభయం సత్త్వసంశుద్ధిర్జ్ఞానయోగవ్యవస్థితిః,
దానం దమశ్చ యజ్ఞ శ్చ స్వాధ్యాయస్తప ఆర్జవమ్. 1

బాలానందిని

దైవీతి:- దైవి, ఆసురి, రాక్షసి అని ప్రాణుల ప్రకృతులు(దైవప్రకృతి, ఆసురప్రకృతి, రాక్షసప్రకృతి)నవమాధ్యాయంలో సూచింపబడ్డాయి. వాటిని సవిస్తరంగా చూపడం కోసం

"సత్త్వసంశుద్ధిః"ఇత్యాదికమైన అధ్యాయం ప్రారంభించబడుచున్నది. వాటిలో దైవప్రకృతి సంసారంనుండి మోక్షానికి ఉపకరిస్తుంది. ఆసుర-రాక్షసప్రకృతులు బంధానికి హేతువులు. అందుచేత స్వీకరించదానికై దైవప్రకృతి,పరిహరించదానికి మిగిలిన రెండుప్రకృతులు ప్రదర్శింపబడుచున్నాయి.

శ్రీభగవంతుడన్నాడు-

ప్ర. అ. అభయమితి:- అభయమ్=భయం లేకపోవడం,సత్త్వసంశుద్ధిః=అంతఃకరణ ముయొక్క శుద్ధి,జ్ఞానయోగవ్యవస్థితిః=శాస్త్రవిషయాన్ని తెలుసుకొనడంలోను దానిని అనుభవంలోనికి తెచ్చుకొనడంలోను స్థిరత్వము,దానమ్=దానము,దమః చ=బాహ్యేంద్రియ నిగ్రహం,యజ్ఞః చ=యజ్ఞము,స్వాధ్యాయః=స్వాధ్యాయము,తపః=తపస్సు,ఆర్జవమ్ =ఋజుత్వము.

భాష్యమ్

అభయమ్ అభీరుతా,సత్త్వసంశుద్ధిః-సత్త్వస్య అన్తఃకరణస్య సంశుద్ధిః సంవ్యవహారేషు పరవఞ్చనమాయానృతాదిపరివర్జనం,శుద్ధభావేన వ్యవహారః ఇత్యర్థః. జ్ఞానయోగ వ్యవస్థితిః-జ్ఞానం శాస్త్రతః ఆచార్యతశ్చ ఆత్మాదిపదార్థానామ్ అవగమః, అవగతానామ్ ఇన్ద్రియాద్యుపసంహారేణ ఏకాగ్రతయా స్వాత్మసంవేద్యతాపాదనం యోగః ; తయోః జ్ఞానయోగయోః వ్యవస్థితిః వ్యవస్థానం తన్నిష్ఠతా,ఏషా ప్రధానా దైవీ సాత్త్వికీ సంపత్. యత్ర (చ) యేషామ్ అధికృతానాం యా ప్రకృతిః సంభవతి సాత్త్వికీ సా ఉచ్యతే. దానం యథాశక్తి సంవిభాగః అన్నాదీనాం,దమః చ బాహ్యకరణానామ్ ఉపశమః,అన్తఃకరణస్య ఉపశమం శాన్తిం వక్ష్యతి. యజ్ఞః చ శ్రౌతః అగ్నిహోత్రాదిః. స్మార్తః చ దేవయజ్ఞాదిః. స్వాధ్యాయః ఋగ్వేదాద్యధ్యయనమ్ అదృష్టార్థం. తపః వక్ష్యమాణం శారీరాది. ఆర్జవం ఋజుత్వం సర్వదా. 1

బాలానందిని

అభయమితి:- భయం లేకపోవడం,అంతఃకరణముయొక్క సంశుద్ధి,పరులను వంచించడం,మాయ చేయడం,అసత్యం పలకడం మొదలైనవాటిని విడిచి పెట్టడం-శుద్ధమైన భావంతో వ్యవహరించడం అని అర్థం. జ్ఞానయోగవ్యవస్థితిః-శాస్త్రంనుండి ఆచార్యునినుండి ఆత్మాదిపదార్థాలను గూర్చి తెలుసుకొనడం జ్ఞానం. ఇంద్రియాదులను వశంలో ఉంచుకొని,తెలుసుకొన్నవిషయాలను ఏకాగ్రచిత్తంతో తన అనుభవంలోనికి వచ్చేటట్లు చేసికొనడం యోగం. ఆ జ్ఞానయోగాల వ్యవస్థానం,వాటియందు నిష్ఠ. ఇది (దైవసంపదలన్నింటిలోను)ప్రధానమైన సాత్త్వికమైన దేవసంపద.

వి. 'ఏషా'అనగా 'ధ్యానయోగవ్యవస్థితి'అని గ్రహించడం యుక్తం. అభయాదులు మూడూ అని వ్యాఖ్యాతలు వ్రాశారు. 'ఏషా'అని స్త్రీలింగనిర్దేశంచేత, ఏకవచన ప్రయోగం చేత మూడవదానినే గ్రహించడం యుక్త మని తోస్తుంది. మూడింటినీ గ్రహించవలసిన పక్షంలో భాష్యకారులే 'ఏతత్త్రయమ్'ఇత్యాదిపదాలచేత నిర్దేశించి ఉండేవారు.

యత్రేతి: -కొన్ని ప్రతులలో 'యత్ర'తరువాత 'చ' కూడ ఉన్నది. అది అనావశ్యకము. దేనియందు, ఎవరికి అధికారం ఉంటుందో వాళ్లకు ఏ ప్రకృతి పుడుతుందో అది సాత్త్విక ప్రకృతి అని చెప్పబడుచున్నది.

వి. ఈ వాక్యం భావం జాగర్తగా పరిశీలించవలసి ఉన్నది. "ఏషా ప్రధానా సాత్త్వికీ సంపత్"అను వాక్యంలో ఏతచ్ఛబ్దంచేత అభయాదులను మూడింటిని కొందరు వ్యాఖ్యాతలు గ్రహించా రని పైన చూచి ఉన్నాము. 'అభీరుతా'అనగా శాస్త్రోపదిష్టమైన అర్థం సందేహం లేకుండా అనుష్ఠించడానికి నిష్ఠ అని అర్థ మని ఆనందగిర్యాదులు వ్రాసినారు. ఈ వాక్యానికి ఆనందగిరి-"జ్ఞానమునందు గాని కర్మయందు గాని అధికారం కలవారికి అభీరుత్వం మొదలైన ఏ ప్రకృతి ఉన్నదో అది వారికి దానియందు సాత్త్వికప్రవృత్తి అని అర్థము''అని భావం వివరించారు. అట్లే ఇతరులు కూడ వివరించారు. భాష్యార్కప్రకాశలో-'యత్ర యేషామ్'అనగా బ్రహ్మచారి గృహస్థాదులకు బ్రహ్మచర్యాగ్నిహోత్రాదులందు, లేదా బ్రాహ్మణక్షత్రియాదులకు ఇజ్యాధ్యయనయుద్ధాదులందు''అని అర్థం చెప్పి "స్వస్వవర్ణాశ్రమవిహితానుష్ఠానం సాత్త్వికీ ప్రకృతిరిత్యర్థః"అని అన్నారు. ఈ వ్యాఖ్యలో కూడ 'ఏషా'అభయాదిత్రికం అని అర్థం గ్రహించబడింది. అనగా అభయాదిత్రికం ప్రధాన మైన సాత్త్విక మైన దైవసంపద అని ఈ వ్యాఖ్యానం అభిప్రాయం కూడ. కాని 'ఏషా' అనేదానిచేత జ్ఞానయోగవ్యవస్థితిమాత్రమే గ్రహించడం యుక్తం అని పైన చూచి ఉన్నాము. అభయసత్త్వసంశుద్ధులు ప్రధానదైవసంపదలో చేరినప్పుడు దానతపోయజ్ఞాదు లైన మిగిలిన ఇరవైమూడు అప్రధానం అని చెప్పడానికి కారణం ఏదీ లేదు. భాష్యం ప్రకారం సత్త్వసంశుద్ధి లౌకికశాస్త్రీయోభయవిషయాలకీ వర్తించేదీ. వీటి అన్నింటిలోనూ జ్ఞానయోగవ్యవస్థితి ప్రధాన మైనది, అది మోక్షహేతు వవడం ఇందుకు కారణం అనియే భాష్యకారుల అభిప్రాయం అయిఉంటుంది. ఈ శ్లోకం అవతారికలో"సంసారమోక్షాయ దైవీప్రకృతిః" అని వారే స్పష్టీకరించిఉన్నారు. అందుచేత 'యత్ర'అనే యచ్ఛబ్దంచేత పైవాక్యంలో ఏతచ్ఛబ్దంచేత నిర్దేశించబడిన జ్ఞానయోగవ్యవస్థితి పరామర్శించబడుచున్నది. ఈ వాక్యంలోని "యేషామ్"అనే పదానికి అంత ప్రాధాన్యం లేదు. పునఃతానిని తచ్ఛబ్దంచేత పరామర్శకూడ చేయలేదు. బహుశా 'చ'వలె ఇది కూడ ప్రక్షిప్తమై ఉంటుంది. "ఏ జ్ఞాన యోగవ్యవస్థితియందు అధికారం కలవారికి ఏ ప్రకృతి కలుగుతుందో అది సాత్త్వికి అని చెప్పబడుతుంది"అని ఈ వాక్యానికి అర్థం. ఈ విధంగా భగవత్పాదులు దీనిని తాము సాత్త్విక మని ఎందుకన్నారో సమర్థించుకొన్నారు.

దానమితి:-దాన మనగా యథాశక్తిగా అన్నాదులను ఇతరులకు పంచి ఇవ్వడం. దమం అనగా బాహ్యేంద్రియాలను శాంతింపచేసుకొనడం,వశంలో ఉంచుకొనడం. అంతః కరణనిగ్రహాన్ని 'శాంతి'శబ్దంచేత చెప్ప నున్నాడు. యజ్ఞ మనగా శ్రౌత మైన శ్రుతి విహిత మైన)అగ్నిహోత్రాదికము,స్మార్తమైన దేవతారాధనాదికం. (ఆదిశబ్దంచేత పితృయజ్ఞ-భూత యజ్ఞ-మనుష్యయజ్ఞాలు కూడ గ్రహించాలి). అదృష్టఫలంకోసం చేసే ఋగ్వేదాద్యధ్యయనం 'స్వాధ్యాయం'. చెప్పబడ నున్న,శరీరాదులచేత చేసే తపస్సు 'తపస్సు'. ఎల్లప్పుడు ఋజువుగా (కౌటిల్యం లేకుండా) ఉండడం ఆర్జవం. 1

భాష్యమ్

కిం చ-

మూ. అహింసా సత్యమక్రోధస్త్యాగః శాన్తిరపైశునమ్,
దయా భూతేష్వలోలుప్త్వం మార్దవం హ్రీరచాపలమ్. 2

బాలానందిని

కిం చేతి:- మరియు

ప్ర.అ. అహింసేతి:- అహింసా=అహింస,సత్యమ్=సత్యము,అక్రోధః=క్రోధం లేకపోవడము,త్యాగః=సంన్యాసము,శాన్తిః=మనోనిగ్రహము,మనఃశాంతి,అపైశునమ్= చాడీలు చెప్పకుండడం,భూతేషు=ప్రాణులయందు,దయా=దయ,అలోలుప్త్వమ్=విషయా సక్తి లేకపోవడం,మార్దవమ్=మృదుత్వము,హ్రీః=సిగ్గు(తప్పు పనులు చేయడానికి సంకోచం),అచాపలమ్=చపలత్వం లేకపోవడము (ప్రయోజనం లేనిపనులు చేయక పోవడము).

భాష్యమ్

అహింసా అహింసనమ్ ప్రాణినాం పీడావర్జనమ్,సత్యమ్-అప్రియానృతవర్జితం యథాభూతార్థవచనమ్,అక్రోధః-పరైః ఆక్రుష్టస్య అభిహతస్య వా ప్రాప్తస్య క్రోధస్య ఉపశమనమ్,త్యాగః సంన్యాసః,పూర్వం దానస్య ఉక్తత్వాత్,శాన్తిః అన్తఃకరణస్య ఉపశమః అపైశునమ్ అపిశునతా,పరస్మై పరరన్ధ్రప్రకటీకరణం పిశునతా తదభావః అపైశునమ్. దయా కృపా భూతేషు దుఃఖితేషు అలోలుప్త్వమ్ ఇన్ద్రియాణాం విషయసంనిధౌ అవిక్రియా,మార్దవం మృదుతా అక్రౌర్యమ్,హ్రీః లజ్జా,అచాపలమ్ అసతి ప్రయోజనే వాక్పాణిపాదాదీనామ్ అవ్యాపారయితృత్వమ్. 2

బాలానందిని

అహింసేతి:-హింసించకపోవడం ప్రాణులనుపీడించకుండా ఉండడం,సత్యము -అప్రియము అసత్యమూ లేని విధంగా ఉన్న దున్నట్లు చెప్పడం,అక్రోధం-పరులు తిట్టినా కొట్టినా రావడానికి అవకాశం ఉన్న క్రోధాన్ని తగ్గించుకొనడం,త్యాగం అనగా- దానాన్ని గూర్చి వెనుక చెప్పి ఉండడంవల్ల,ఇక్కడ సంన్యాస మని అర్థం.శాంతి-అంతః కరణం ప్రశాంతంగా ఉండడం,అపైశునం-పరుల లోపాలను ఎత్తి చూపడం పైశునం,అది లేకపోవడం అపైశునం,దయ-దుఃఖంలో ఉన్న ప్రాణులయందు కృప,అలోలుప్త్వం-విషయాలు దగ్గరా ఉన్నా కూడ ఇంద్రియాలు వికారం చెందకుండా ఉండడం,మార్దవం - మృదుత్వం, క్రౌర్యం లేకపోవడం,లజ్జ,అచాపలం-ప్రయోజనం ఏదీ లేనప్పుడు వాక్-పాణి-పాదాదులచేత పని చేయించకపోవడం. 2

భాష్యమ్

కిం చ-

మూ. తేజః క్షమా ధృతిః శౌచమద్రోహో నాతిమానితా,
భవన్తి సంపదం దైవీమభిజాతస్య భారత. 3

బాలానందిని

కిం చేతి:- మరియు-

ప్ర. అ. తేజ ఇతి:- భారత=అర్జునా,తేజః=తేజస్సు,క్షమా=ఓర్పు,ధృతి=ధైర్యము, శౌచమ్=శౌచము,అద్రోహః=ద్రోహం చేయకపోవడము,నాతిమానితా=తనను గూర్చి గొప్పగా తలవకపోవడం,దైవీమ్=దేవతలకు సంబంధించిన,సంపదమ్=సంపదను,అభి జాతస్య=అనుసరించి పుట్టినవానికి,భవన్తి=ఉండును.

భాష్యమ్

తేజః ప్రాగల్భ్యం, న త్వగ్గతా దీప్తిః,క్షమా-ఆక్రుష్టస్య తాడితస్య వా అన్తః విక్రియానుత్పత్తిః,ఉత్పన్నాయాం విక్రియాయాం ప్రశమనమ్ అక్రోధః ఇతి అవోచామ. ఇత్థం క్షమాయాః అక్రోధస్య చ విశేషః.ధృతిః-దేహేన్ద్రియేషు అవసాదం ప్రాప్తేషు తస్య ప్రతిషేధకః అన్తఃకరణవృత్తివిశేషః యేన ఉత్తమ్భితాని కరణాని దేహశ్చ న అవసీదన్తి.శౌచం ద్వివిధమ్-మృజ్జలకృతం బాహ్యమ్ ఆభ్యన్తరం చ మనోబుద్ధ్యోః నైర్మల్యం,మాయారాగాదికాలుష్యాభావః.ఏవం ద్వివిధం శౌచమ్.అద్రోహః పరజిఘాంసాభావః అహింసనమ్.నాతిమానితా-అత్యర్థం మానః అతిమానః.సః యస్య విద్యతే

సః అతిమానీ;తద్భావః అతిమానితా తదభావః నాతిమానితా;ఆత్మనః పూజ్యతాతిశయ భావనాభావః ఇత్యర్థః. భవన్తి అభయాదీని ఏతదన్తాని సంపదమ్ అభిజాతస్య. కింవిశిష్టాం సంపదమ్?దేవానాం సంపదమ్ అభిలక్ష్య జాతస్య,దైవవిభూత్యర్హస్య భావికల్యాణస్య ఇత్యర్థః హే భారత. 3

బాలానందిని

తేజ ఇతి:-తేజస్సు అనగా ప్రగల్భత్వం(మాటలు మొదలైనవాటిలో నిర్భయత్వం). అంతే కాని శరీరంమీద ఉన్న కాంతి కాదు.(ఇక్కడ చెప్పే వన్నీ మానసికధర్మాలు గుణాలూ గాన శరీరధర్మాలను గ్రహించకూడదు అని అర్థం).క్షమ, అనగా ఓర్పు.అనగా తిట్టినా కొట్టినా మనస్సులో ఏ వికారమూ పుట్టకపోవడం.పుట్టిన వికారాన్ని తగ్గించుకొనడం అక్రోధం అని చెప్పాం.క్షమకు అక్రోధానికీ ఇదే భేదం.ధృతి అనగా దేహేంద్రియాలు క్రుంగిపోయేటప్పుడు అవి అట్లు అవకుండా చేసే అంతఃకరణవృత్తివిశేషం;దేనిచేత నిలద్రొక్కుకొను నట్లు చేయబడిన ఇంద్రియాలు దేహమూ కూడ క్రుంగిపోవో అట్టి మనోవృత్తి (Will-power).శౌచం అనగా పరిశుభ్రంగా ఉండడం.ఇది రెండు రకాలు. మట్టితోను నీళ్లతోను చేసికొనే బాహ్యశౌచం.మనస్సు బుద్ధి నిర్మలంగా ఉండడం. మాయ రాగము మొదలైన కాలుష్యం లేకపోవడం ఆభ్యంతరశౌచం.ఈ విధంగా శౌచం రెండు విధాలు.పరులను హింసించా లనే కోరిక లేకపోవడం అద్రోహం.హింసించకపోవడం. నాతిమానితా-అతిమానం అనగా ఎక్కువ అహంభావం.అతిమానం ఉన్నవాడు అతిమాని. అతిమానియొక్క ధర్మం(స్వభావం) అతిమానిత. అతిమానిత లేకపోవడం నాతిమానిత. నేను చాలా పూజ్యుడను అనే భావన లేకపోవడం అని అర్థం.అభయం మొదలు దీని వరకూ ఉన్నవి.సంపదను గూర్చి పుట్టినవానికి ఉంటాయి,కలుగుతాయి.ఎట్టి విశేషంతో కూడిన సంపదను?దేవతల సంపదను లక్ష్యంగా చేసికొని పుట్టినవానికి.అనగా దేవతల కుండవలసిన విభూతులు ఉండడానికి తగినవానికి, అనగా భవిష్యత్తులో కల్యాణం రాబోయే వానికి అని అర్థం. 3

భాష్యమ్

అథ ఇదానీమ్ ఆసురీ సంపత్ ఉచ్యతే-

మూ. దమ్భో దర్పోఽతిమానశ్చ క్రోధః పారుష్యమేవ చ,
అజ్ఞానం చాభిజాతస్య పార్థ సంపదమాసురీమ్. 4

బాలానందిని

అథేతి:-ఇంక ఇప్పుడు అసురసంపద చెప్పబడుచున్నది-

ప్ర. అ. దమ్భః ఇతి: – పార్థ=అర్జునా! దమ్భః=డాంబికము,దర్పః=గర్వము,అతిమానః చ=ఎక్కువ అహంభావము,క్రోధః=కోపము,పారుష్యమ్ ఏవ చ=పరుషత్వము, అజ్ఞానం చ=అజ్ఞానము,ఆసురీం సంపదమ్=అసురసంపదను,అభిజాతస్య=సంబంధించి పుట్టినవానికి కలుగుతాయి.

భాష్యమ్

దమ్భః ధర్మధ్వజిత్వమ్,దర్పః విద్యాధనస్వజనాదినిమిత్తః ఉత్సేకః,అతిమానః పూర్వోక్తః, క్రోధః చ,పారుష్యమేవ చ-పరుషవచనం,యథా- కాణం చక్షుష్మాన్, విరూపం రూపవాన్, హీనాభిజనమ్ ఉత్తమాభిజనః ఇత్యాది,అజ్ఞానం చ అవివేకజ్ఞానం మిథ్యాప్రత్యయః కర్తవ్యాకర్తవ్యాదివిషయమ్,అభిజాతస్య,పార్థ కిమభిజాతస్య ఇత్యాహ-అసురాణాం సంపత్ ఆసురీ,తామ్ అభిజాతస్య ఇత్యర్థః. **4**

బాలానందిని

దంభం అనగా ధర్మధ్వజిత్వం ధర్మ మనే జండాను పైకి ఎగురవేసి ధర్మాత్ము డని అందరూ అనుకొనే టట్లు ప్రవర్తించడం.దర్పం అనగా ధనము స్వజనము మొదలై నవి నిమిత్తంగా గల(ధనాదులచేత)గర్వం,నేనే పూజ్యుడ ననే అహంభావం 'అతిమానం', క్రోధం,పరుషంగా మాటలాడడం-ఎట్లనగా గ్రుడివానిని గూర్చి మంచి కళ్లు కలవా డనీ, విరూపుని గూర్చి చాలా అందమైనవాడనీ,తక్కువబంధువర్గాదులు కలవానిని గూర్చి ఉత్తమమైన బంధువర్గాదులు కలవా డనీ ఇత్యాదివిధంగా మాటలాడటం,అజ్ఞాన మనగా అవివేకజ్ఞానం,కర్త-వ్యఅకర్తవ్యాదులను గూర్చి విరుద్ధమైన జ్ఞానం,ఇవి, అర్జునా!అభిజాతునకు దేనితో అభిజాతుడో చెపుతున్నాడు-అసురుల సంపద(స్వభావం)ఆసురసంపద,దానితో అభిజాతునకు,దాని వైపు వెళ్లే వానికి,ఉంటాయి అని అర్థం. **4**

భాష్యమ్

అనయోః సంపదోః కార్యమ్ ఉచ్యతే-

మూ. దైవీ సంపద్విమోక్షాయ నిబన్ధాయాసురీ మతా,
మా శుచః సంపదం దైవీమభిజాతోఽసి పాణ్డవ. 5

బాలానందిని

అనయోరితి: -దైవీ సంపద్=దైవసంపద,విమోక్షాయ=మోక్షం ఇవ్వడానికి సమర్థ మని,మతా=చెప్పబడినది. ఆసురీ=ఆసురసంపద,నిబన్ధాయ=బంధనానికి అని చెప్పబడినది. పాణ్డవ=అర్జునా!మా శుచః=దుఃఖించకుము,దైవీం సంపదమ్=దైవసంపదను,అభిజాతః =అనుసరించి పుట్టినవాడవు,అసి=అయిఉన్నావు.

భాష్యమ్

దైవీ సంపద్ యా సావి మోక్షాయ సంసారబన్ధనాత్;నిబన్ధాయ-నిబన్ధః నియతః బన్ధః నిబన్ధః,తదర్థమ్ ఆసురీ సంపత్ మతా అభిప్రేతా తథా రాక్షసీ,తత్ర ఏవమ్ ఉక్తే అర్జునస్య అన్తర్గతం భావం-"కిమహమ్ ఆసురసంపద్యుక్తః,కిం వా దైవసంపద్యుక్తః" ఇత్యేవమ్ ఆలోచనారూపమ్,ఆలక్ష్య ఆహ భగవాన్;మా శుచః శోకం మా కార్షీః. దైవీమ్,అభిజాతః అసి అభిలక్ష్య జాతః అసి,భావికల్యాణః త్వమ్ అసి ఇత్యర్థః. హే పాణ్డవ! 5

బాలానందిని

దైవీతి:-అర్జునా! దైవసంపద ఏదైతే ఉన్నదో అది సంసారబంధంనుండి విమోక్షానికీ,నిబంధం అనగా తప్పనిసరి యైన బంధం. ఆసురసంపద,అట్లే రాక్షససంపద కూడ, నిబంధానికీ, చెప్పబడింది(నవమాధ్యాయంలో దైవ-ఆసుర-రాక్షస ప్రకృతు లని మూడు ప్రకృతులను చెప్పినా ఇక్కడ ఆసుర-రాక్షస ప్రకృతులను ఒకటిగా గ్రహించి దైవ-ఆసుర సంపదలు చెప్పబడ్డాయి అని భావం).ఇలా చెప్పగానే "నాలో ఆసురసంపద ఉన్నదా,లేక దైవసంపద ఉన్నదా"అని అర్జునుని మనస్సులో కలిగిన భావం గ్రహించి భగవంతుడు -అంటున్నాడు.అర్జునా !విచారించకుము;నువ్వు దైవసంపదను అనుసరించి పుట్టినావు. మున్ముందు నీకు కల్యాణములు కలుగ నున్నాయి అని అర్థం.

మూ. ద్వౌ భూతసర్గౌ లోకేఽస్మిన్ దైవ ఆసుర ఏవ చ,
దైవో విస్తరశః ప్రోక్త ఆసురం పార్థ మే శృణు. 6

ప్ర.అ. ద్వౌ ఇతి:- పార్థ=అర్జునా! అస్మిన్=ఈ,లోకే=లోకంలో,దైవః=దైవము, ఆసురః ఏవ చ=ఆసురమూ అని,ద్వౌ=రెండు విధాలైన,భూతసర్గౌ=మనుష్యసృష్టులు ఉన్నవి.దైవః =దైవసర్గం,విస్తరశః=సవిస్తరంగా,ప్రోక్తః=చెప్పబడినది.ఆసురమ్=ఆసుర సర్గమును గూర్చి,మే=నానుండి,శృణు=వినుము.

భాష్యమ్

ద్వౌ భూతేతి:-ద్వౌ ద్విసంఖ్యాకౌ భూతసర్గౌ భూతానాం మనుష్యాణాం సర్గౌ సృష్టీ భూతసర్గౌ,సృజ్యేతే ఇతి సర్గౌ,భూతాన్యేవ సృజ్యమానాని దైవాసురసంపద్యుక్తాని ద్వౌ భూతసర్గౌ ఇతి ఉచ్యతే "ద్వయా హ ప్రాజాపత్యా దేవాశ్చాసురాశ్చ"(బృ. ఉ. 1. 3. 1) ఇతి శ్రుతేః.లోకే అస్మిన్ సంసారే ఇత్యర్థః.సర్వేషాం ద్వైవిధ్యోపపత్తేః.కౌ తౌ భూతసర్గౌ ఇత్యుచ్యేతే,ప్రకృతావేవ దైవః ఆసురః ఏవ చ.ఉక్తయోరేవ పునః అనువాదే ప్రయోజన మాహ-దైవః భూతసర్గః "అభయం సత్త్వసంశుద్ధిః"ఇత్యాదినా,విస్తరశః విస్తర

ప్రకారైః, ప్రోక్తః కథితః. న తు ఆసురః విస్తరశః; అతః తత్పరివర్జనార్థమ్ ఆసురం పార్థ! మే మమ వచనాత్ ఉచ్యమానం విస్తరశః శృణు అవధారయ. 6

బాలానందిని

ద్వౌ భూతేతి:- రెండు భూతసర్గాలు-భూతాలయొక్క అనగా మనుష్యులయొక్క సర్గములు,సృష్టులు భూతసర్గములు."సృజింపబడుతున్నాయి గాన సర్గములని చెప్ప బడుచున్నాయి"అనే. వ్యుత్పత్తిచేత సృజింపబడుచున్న,దైవాసురసంపద్యుక్తా లైన భూతాలే భూతసర్గా లని చెప్పబడుచున్నాయి.(భూతసర్గములు అనగా మనుష్యుల సృష్టులు అని మొదట ఒక అర్థం చెప్పి, సృజింపబడుచున్న మనుష్యులు అని మరొక అర్థం చెప్పబడినది. **"ద్వయా.... అసురాశ్చ"**(ప్రజాపతిచేత సృజించబడిన ప్రాణులు దేవత లనీ,అసురు లనీ రెండు రకాలు)అని శ్రుతి కూడ చెప్పుచున్నది.లోకే అనగా ఈ సంసారంలో అని అర్థం. అన్ని ప్రాణులు ఈ రెండు విధాలలో ఏదో ఒకదానికి చెందుతాయి గాన ఇట్లు చెప్పబడి నది.ఏమిటి ఆ భూతసర్గాలు అనగా? చెప్పబడుచున్నది-దైవము,ఆసురము.చెప్పినవాటినే మళ్లీ చెప్పడానికి ప్రయోజనాన్ని చెపుతున్నాడు.**"అభయం సత్త్వసంశుద్ధిః"**ఇత్యాదికంచేత దైవమైన భూతసర్గం సవిస్తరం చెప్పబడింది.ఆసురం సవిస్తరంగా చెప్పబడలేదు.అందువల్ల అర్జునా!ఆసురభూతసర్గాన్ని గూర్చి నేనే సవిస్త రంగా చెపుతున్నాను.నానుండి దీనిని వినుము;నిశ్చితంగా దీనిని గూర్చి తెలుసుకొనుము అని అర్థం.ఈ ఆసురసంపదను విడిచిపెట్టడమే దీనిని గూర్చి తెలిసికొన్నందుకు ప్రయోజనం. 6

భాష్యమ్

ఆఽధ్యాయపరిసమాప్తేః ఆసురీ సంపత్ ప్రాణివిశేషణత్వేన ప్రదర్శ్యతే;ప్రత్యక్షీ కరణేన చ శక్యతే అస్యాః పరివర్జనం కర్తుమ్ ఇతి-

మూ. ప్రవృత్తిం చ నివృత్తిం చ జనా న విదురాసురాః,
న శౌచం నాపి చాచారో న సత్యం తేషు విద్యతే. 7

బాలానందిని

అధ్యాయేతి:-ఆసురసంపదను గూర్చి స్పష్టంగా తెలుసుకొంటే దానిని విడిచిపెట్ట డానికి శక్యం అవుతుంది అనే అభిప్రాయంతో,అధ్యాయం చివరివరకు ఆసురసంపద ప్రాణుల విశేషణంగా(మానవులతో సంబంధించినదిగా)చూపబడుచున్నది-

ప్ర.అ. **ప్రవృత్తిమితి**:-ఆసురాః=ఆసురప్రకృతి గల,జనాః=జనులు,ప్రవృత్తిం చ= కర్తవ్యాలలో ప్రవర్తించడానిని,నివృత్తిం చ=అకర్తవ్యాలనుండి నివృత్తినీ,న విదుః=ఎరుగరు.

తేషు=వాళ్లలో,శౌచమ్=శౌచము,న విద్యతే=లేదు.ఆచారః అపి చ=సదాచారం కూడ,న =లేదు. సత్యమ్=సత్యము న=లేదు.

భాష్యమ్

ప్రవృత్తిం చ ప్రవర్తనం యస్మిన్ పురుషార్థసాధనే కర్తవ్యే ప్రవృత్తిః తామ్, నివృత్తిం చ తద్విపరీతాం,యస్మాత్ అనర్థహేతోః నివర్తితవ్యం సా నివృత్తిః,తాం చ,జనాః ఆసురాః న విదుః,న జానన్తి.న కేవలం ప్రవృత్తినివృత్తీ ఏవ న విదుః,న శౌచం,న అపి చ ఆచారః న సత్యం తేషు విద్యతే. అశౌచాః,అనాచారాః,మాయావినః అనృత వాదినః హి ఆసురాః. 7

బాలానందిని

ప్రవృత్తిమితి:- ఏ పురుషార్థసాధనం కర్తవ్యమో దానియందు ప్రవర్తించడాన్ని అందుకు విపరీతమైన దానినుండి నివర్తించడాన్ని,అనగా అనర్థహేతు వైన దేనినుండి నివర్తించాలో దానినీ,ఆసురసంపత్తి గల జనులు ఎరుగరు.ప్రవృత్తి నివృత్తులను ఎరుగక పోవడమే కాదు-వాళ్లలో శౌచము ఉండదు,ఆచారం ఉండదు,సత్యం కూడ ఉండదు. ఆసురప్రకృతి గలవాళ్లు శౌచం లేనివాళ్లు అనాచారులు,మాయావులు,అసత్యం పలికే వాళ్లు. 7

భాష్యమ్

కిం చ-

మూ. అసత్యమప్రతిష్ఠం తే జగదాహురనీశ్వరమ్,
అపరస్పరసంభూతం కిమన్యత్కామహైతుకమ్. 8

బాలానందిని

కిం చేతి:- మరియు-

ప్ర.అ. అసత్యమితి: -తే-వాళ్లు,జగత్=జగత్తును,అసత్యమ్=అసత్యమైనదానిని గాను,(జగత్తులో సత్య మనేదే లేదు,అంతా అబద్ధమే అనీ), అప్రతిష్ఠమ్=ఆధార మేమీ లేనిదానినిగాను,అపరస్పరసంభూతమ్=స్త్రీపురుషుల పరస్పరసంబంధంమాత్రముచేతనే పుట్టినదానినిగాను,కామహైతుకమ్=కామమే హేతువుగా కలదానినిగాను,ఆహుః=చెప్పు చున్నారు. అన్యత్=మరొక కారణం,కిమ్=ఏముంది(అంటారు).

భాష్యమ్

అసత్యం-యథా వయమ్ అనృతప్రాయాః తథా ఇదం జగత్ సర్వమ్ అసత్యమ్.

అప్రతిష్ఠం చ నాస్య ధర్మాధర్మౌ ప్రతిష్ఠా అతః అప్రతిష్ఠం చ ఇతి,తే ఆసురాః జనాః జగత్ ఆహుః అనీశ్వరమ్-న చ ధర్మాధర్మసవ్యపేక్షకః అస్య శాసితా ఈశ్వరః విద్యతే ఇత్యతః అనీశ్వరం జగత్ ఆహుః.కిం చ-అపరస్పరసంభూతం-కామప్రయుక్తయోః స్త్రీపురుషయోః అన్యోన్యసంయోగాత్ జగత్సర్వం సంభూతమ్.కిమ్ అన్యత్ జగతః కారణం,న కించిత్ దృష్టం ధర్మాధర్మాది కారణాన్తరం విద్యతే జగతః,కామ ఏవ ప్రాణినాం కారణమ్ ఇతి లోకాయతికదృష్టిరియమ్. 8

బాలానందిని

అసత్యమితి:-మనం ఏ విధంగా అబద్ధాలకోరులమో అట్లే ఈ జగత్తంతా అసత్యంతో నిండినది.ఇది అప్రతిష్ఠం.దీనికి ధర్మాధర్మాలు ప్రతిష్ఠ (నిలబెట్టేవి, కారణమైనవి)కావు; అని ఆసురప్రకృతి గల జనులు అంటారు.ఇది అనీశ్వరము.ధర్మాధర్మాలను ఆధారంగా చేసికొని శాసించే ఈశ్వరు డనేవాడు కూడ దీనికి లేదు;అందుచేత ఇది అనీశ్వరం అని అంటారు.మరొక విషయ మేమనగా-ఈ జగత్తంతా అపరస్పరసంభూతం,కామంచేత ప్రేరితులైన స్త్రీపురుషుల పరస్పరసంయోగంవల్ల పుట్టినది.ఇంకే ముంది?ఇది కామహైతుకం.జగత్తు కామమే హేతువుగా గలది.ఇది పుట్టిదానికి హేతువు స్త్రీపురుషుల కామం మాత్రమే.'కామహేతుకం'అన్నా 'కామహైతుకం'అన్నా ఒకటే అర్థం.ఇంతకు మించి జగత్తుకు కారణ మైనది మరొకటి ఏది కనబడుతుంది?కనబడని ధర్మాధర్మాదికారణం కూడ మరొకటి ఏదీ లేదు.ప్రాణుల కామమే జగత్తుకు కారణం అనే ఇది లోకాయతికుల (ప్రత్యక్షంగా కనబడేదానిని మాత్రమే నమ్మేవాళ్లు లోకాయతికులు,నాస్తికులు) మతం.

వి.'పర'అన్నా 'అపర'అన్నా అర్థం ఒకటే.మరొకరు అని అర్థం."పరశ్చ పరశ్చ పరస్పరమ్'అన్నట్లే "అపరశ్చ పరశ్చ అపరస్పరమ్"అని విగ్రహం.ఒకరితో ఒకరు అని అర్థం."అన్యశ్చ అన్యశ్చ అన్యోన్యమ్"అన్నట్లే. 8

మూ. ఏతాం దృష్టిమవష్టభ్య నష్టాత్మానోఽల్పబుద్ధయః,
ప్రభవన్త్యుగ్రకర్మాణః క్షయాయ జగతోఽహితాః. 9

ప్ర.అ. **ఏతామితి**:-ఏతామ్=ఈ,బుద్ధిమ్=బుద్ధిని,అవష్టభ్య=అవలంబించి (ఊతగా గొని),నష్టాత్మానః=నష్టమైన స్వభావం కలవారు,అల్పబుద్ధయః=అల్పమైన బుద్ధి కలవారు, ఉగ్రకర్మాణః=క్రూరమైన పనులు కలవారు,అహితాః=జగత్తునకు హితులుకాని వారు అయిన వీళ్ళు, జగతః=జగత్తుయొక్క,క్షయాయ=నాశమునకు ప్రభవన్తి=పుట్టుచున్నారు.

భాష్యమ్

ఏతామితి:- ఏతాం దృష్టిమ్ అవష్టభ్య ఆశ్రిత్య,నష్టాత్మానః నష్టస్వభావాః,విభ్రష్ట పరలోకసాధనాః,అల్పబుద్ధయః విషయవిషయా అల్పైవ బుద్ధిః యేషాం తే

అల్పబుద్ధయః ప్రభవన్తి ఉద్భవన్తి,ఉగ్రకర్మాణః క్రూరకర్మాణః,హింసాత్మకాః,క్షయాయ జగతః ప్రభవన్తి ఇతి సంబన్ధః. జగతః అహితాః శత్రవః ఇత్యర్థః.

బాలానందిని

ఏతామితి:-ఈ దృష్టిని ఆశ్రయించి నష్టమైన స్వభావం గలవారు,పరలోకసాధనాలు ఏవీ లేనివారు,భోగాలను గూర్చి మాత్రమే ఆలోచించే అల్పమైన బుద్ధిగలవారు క్రూరమైన పనులు చేసేవారు అయిన,హింసాప్రవృత్తి కలవారు, జగత్తుకు అహితులు, శత్రువులు అని అర్థం.ఇలాంటి ఆసురప్రకృతులు జగత్తుయొక్క వినాశానికి పుడుతూంటారు.

భాష్యమ్

తే చ-

మూ. కామమాశ్రిత్య దుష్పూరం దమ్భమానమదాన్వితాః,
మోహాద్ గృహీత్వాఽసద్గ్రాహాన్ ప్రవర్తన్తేఽశుచివ్రతాః. 10

బాలానందిని

తే చేతి:- వాళ్లు-

ప్ర.అ. కామమితి:- దుష్పూరమ్=నింప శక్యం కాని,కామమ్=కామమును,(కోరికలను), ఆశ్రిత్య=ఆశ్రయించి,దమ్భమానమదాన్వితాః=దంభముతోను మానముతోను మదంతోను కూడినవారై,మోహాత్=అజ్ఞానంవలన,అసద్గ్రాహాన్=చెడ్డ పట్టుదలలను, గృహీత్వా=పట్టుకొని,అశుచివ్రతాః=అపవిత్రమైన(పాపమైన)నిర్ణయాలు గలవారై,ప్రవర్తన్తే =ప్రవర్తిస్తూంటారు.

భాష్యమ్

కామమ్ ఇచ్ఛావిశేషమ్,ఆశ్రిత్య అవష్టభ్య,దుష్పూరమ్ అశక్యపూరణం,దమ్భమానమదాన్వితాః-దమ్భశ్చ మానశ్చ మదశ్చ దమ్భమానమదాః,తైః అన్వితాః దమ్భమాన మదాన్వితాః,మోహాత్ అవివేకతః,గృహీత్వా,అసద్గ్రాహాన్ అశుభనిశ్చయాన్, ప్రవర్తన్తే,లోకే,అశుచివ్రతాః,అశుచీని వ్రతాని యేషాం తే అశుచివ్రతాః. 10

బాలానందిని

కామమితి:-నింపడానికి శక్యం కాని కామాన్ని,ఒక విధమైన కోరికను ఆశ్రయించి డాంబికముతోను,అహంకారముతోను,గర్వంతోను కూడినవారై,మోహంవల్ల అవివేకంవల్ల

అశుభము లైన నిశ్చయాలను (మొండిపట్టుదలలను) గ్రహించి అపవిత్రాలైన నిర్ణయాలు కలవారై లోకంలో ప్రవర్తిస్తూంటారు. 10

భాష్యమ్

కిం చ-

మూ. చిన్తామపరిమేయాం చ ప్రలయన్తాముపాశ్రితాః,
కామోపభోగపరమా ఏతావదితి నిశ్చితాః. 11

బాలానందిని

కిం చేతి:- మరియు-

ప్ర. అ. చిన్తామితి: -అపరిమేయామ్=ఇంత అని చెప్పడానికి శక్యం కాని, ప్రలయాన్తామ్=మరణం వరకూ ఉండే, చిన్తామ్=చింతను, ఉపాశ్రితాః=ఆశ్రయించినవారై, కామోపభోగపరమాః=కామాల భోగములే పరమంగా(ప్రధానలక్ష్యంగా గలవారై), ఏతావత్ ఇతి= ఇదే పరమపురుషార్థము అని, నిశ్చితాః=నిశ్చయం కలవారై -

భాష్యమ్

చిన్తామ్, అపరిమేయాం చ న పరిమాతుం శక్యతే యస్యాః చిన్తాయాః ఇయత్తా సా అపరిమేయా, తామ్ అపరిమేయాం ప్రలయాన్తాం మరణాన్తామ్, ఉపాశ్రితాః, సదా చిన్తాపరా ఇత్యర్థః. కామోపభోగపరమాః-కామ్యన్తే ఇతి కామాః శబ్దాదయః, తదుపభోగపరమాః, అయమేవ పరమః పురుషార్థః యః కామోపభోగః ఇత్యేవం నిశ్చితాత్మానః ఏతావదితి నిశ్చితాః. 11

బాలానందిని

చిన్తామితి:- ఏ చింతయొక్క ఇయత్త(ఇంత అనే విషయం) కొలవడానికి శక్యం కాదో అది అపరిమేయ మైన చింత, ప్రలయంవరకు అనగా మరణించేవరకూ, ఉండే అట్టి చింతను ఆశ్రయించినవారై, ఎల్లప్పుడు చింతలోనే మునిగి ఉన్నవారై అని అర్థం. కామోపభోగపరములై-కోరబడేవి గాన కామాలు-శబ్దాదులు. వాటిని అనుభవించడమే ఉత్తమ విషయంగా గలవారై, ఈ కామోపభోగమే పరమపురుషార్థం అను నిశ్చయం గలవారై- 11

మూ. ఆశాపాశశతైర్బద్ధాః కామక్రోధపరాయణాః,
ఈహన్తే కామభోగార్థమన్యాయేనార్థసంచయాన్. 12

ప్ర.అ. **ఆశేతి**:-ఆశాపాశశతైః=వందల కొలది ఆశాపాశాలచేత,బద్ధాః=కట్టబడిన వారై,కామక్రోధపరాయణాః=కామక్రోధాలే ఉత్తమ మైన ఆశ్రయంగా గలవారై(పూర్తిగా కామక్రోధాలతో నిండినవారై), కామభోగార్థమ్=కామాల భోగంకొరకు,అన్యాయేన= అన్యాయంచేత,అర్థసంచయాన్=ధనముయొక్క కూడ బెట్టుటను,ఈహన్తే=కోరుతూంటారు.

భాష్యమ్

ఆశాపాశేతి:-ఆశాపాశశతైః-ఆశాః ఏవ పాశాః,తచ్ఛతైః ఆశాపాశశతైః, బద్ధాః, నియన్త్రితాః సన్తః సర్వతః ఆకృష్యమాణాః,కామక్రోధపరాయణాః కామక్రోధౌ పరమ్ అయనం పరః ఆశ్రయః యేషాం తే కామక్రోధపరాయణాః,ఈహన్తే చేష్టన్తే,కామ భోగార్థం కామభోగప్రయోజనాయ,న ధర్మార్థమ్,అన్యాయేన పరస్వాపహరణాదినా ఇత్యర్థః. కిమ్?అర్థసంచయాన్ అర్థప్రచయాన్. 12

బాలానందిని

ఆశేతి:- ఆశలే పాశాలు,వాటి శతాలచేత(వందలకొలది ఆశాపాశాలచేత)కట్ట బడి అన్ని వైపులకు లాగబడుచున్నవారై,కామక్రోధాలే ఉత్తమమైన ఆశ్రయంగా గలవారై, కామాలను అనుభవించడ మనే ప్రయోజనంకొరకు,అంతేనే కాని ధర్మాచరణంకొరకు కాదు,పనులు చేస్తారు,అన్యాయంచేత,పరధనాన్ని అపహరించడం మొదలైనదానిచేత. దేనిని గూర్చి(పనులుచేస్తారు)?ధనాన్ని ప్రోగుచేయడాన్ని గూర్చి. 12

భాష్యమ్

ఈదృశశ్చ తేషామ్ అభిప్రాయః-

మూ. ఇదమద్య మయా లబ్ధమిదం ప్రాప్స్యే మనోరథమ్,
ఇదమస్తీదమపి మే భవిష్యతి పునర్ధనమ్. 13

బాలానందిని

ఈదృశ ఇతి:-వాళ్ల అభిప్రాయం కూడ ఇలా ఉంటుంది-

ప్ర.అ. **ఇదమితి**:- అద్య=ఇప్పుడు,ఇదమ్=ఇది,లబ్ధమ్=పొందబడినది. ఇదమ్= దీనిని లప్స్యే=పొందగలను. మనోరథమ్=మనస్సుకు తృప్తికర మైన,ఇదమ్=ఇది,అస్తి= ఉన్నది. పునః=ఇంకా,ఇదమ్=ఈ,ధనమ్=ధనము,మే=నాకు,భవిష్యతి=ఉండగలదు (రాగలదు).

భాష్యమ్

ఇదం ద్రవ్యమ్,అద్య ఇదానీం,లబ్ధమ్.ఇదమ్ అన్యత్ ప్రాప్స్యే.మనోరథం మనస్తుష్టికరమ్ ఇదం చ అస్తి.ఇదమ్ అపి చ మే భవిష్యతి ఆగామిని సంవత్సరే పునః ధనమ్;తేన అహం ధనీ విఖ్యాతః భవిష్యామి. 13

బాలానందిని

ఇదమితి:-ఇప్పుడు నాచేత ఈ ద్రవ్యం సంపాదించబడింది.ఇంకా దీనిని సంపాదిస్తాను.మనస్సుకు సంతోషం కలిగించే ఇది ఉన్నది.మళ్లీ రాబోయే సంవత్సరంలో ఈ ధనం లభిస్తుంది.దానితో నేను ధనవంతుడనై ప్రసిద్ధుడను అవుతాను. 13

మూ. అసౌ మయా హతః శత్రుర్హనిష్యే చాపరానపి,
ఈశ్వరోఽహమహం భోగీ సిద్ధోఽహం బలవాన్ సుఖీ. 14

ప్ర.అ.అసౌ ఇతి:- మయా=నాచేత,అసౌ=ఈ,శత్రుః=శత్రువు,హతః=చంపబడ్డాడు.అపరానపి=మిగిలిన ఇతరశత్రువులనుకూడ,హనిష్యే=చంపుతాను.అహమ్=నేను, ఈశ్వరః=ప్రభువును(సర్వసమర్థుడను);అహమ్=నేను,భోగీ=భోగవంతుడను.అహమ్=నేను, సిద్ధః=సంపన్నుడను,బలవాన్=బలవంతుడను.సుఖీ=సుఖవంతుడను.

భాష్యమ్

అసౌ మయేతి:-అసౌ దేవదత్తనామా మయా హతః దుర్జయః శత్రుః. హనిష్యే చ అన్యాన్ వరాకాన్ అపరాన్ అపి.కిమేతే కరిష్యన్తి తపస్వినః?సర్వథాపి నాస్తి మత్తుల్యః.ఈశ్వరః అహమ్;అహం భోగీ,సర్వప్రకారేణ చ సిద్ధః అహం సంపన్నః పుత్రైః నప్తృభిః న కేవలం మానుషోఽహమ్.బలవాన్ సుఖీ చ అహమేవ,అన్యే తు భూమిభారాయ అవతీర్ణాః. 14

బాలానందిని

అసౌ ఇతి:- దేవదత్తు డనే పేరు గల జయించడానికి కష్ట మైనె ఈ శత్రువు నాచేత చంపబడ్డాడు.ఎందుకూ పనికిరాని మిగిలిన వాళ్లను కూడ చంపుతాను.ఈ చేతకాని వాళ్లు ఏం చేయగలరు?ఏ విధంగానూ కూడ నాతో సమానుడు లేడు.నేను సమర్థుడను. అన్ని విధాలా సిద్ధుడను(జీవితంలో విజయం సాధించినవాడనుSuccessful) పుత్రులతోను, మనుమల తోను,మునిమనుమలతోను సంపన్ను డను. నేను మామూలు మానవుడను కాను.నేనే బలవంతుడను;సుఖవంతుడను.మిగిలినవాళ్లందరూ భూభారానికే పుట్టారు. 14

మూ. ఆఢ్యోఽభిజనవానస్మి కోఽన్యోఽస్తి సదృశో మయా,
యక్ష్యే దాస్యామి మోదిష్య ఇత్యజ్ఞానవిమోహితాః. 15

ప్ర.అ. ఆఢ్య ఇతి:- ఆఢ్యః=ఐశ్వర్యవంతుడను,అభిజనవాన్=ఉన్నతవంశంలో పుట్టినవాడను,అస్మి=అయి ఉన్నాను.మయా=నాతో,సదృశః=సమానుడైన,అన్యః=మరియొకడు,కః=ఎవడు,అస్తి=ఉన్నాడు?యక్ష్యే=యాగాలు చేస్తాను?దాస్యామి=దానాలు చేస్తాను;మోదిష్యే=ఆనందిస్తాను.ఇతి=ఇట్లు;అజ్ఞానవిమోహితాః=అజ్ఞానంచేత మోహింపచేయబడినవారై-

భాష్యమ్

ఆఢ్య ఇతి:- ఆఢ్యః ధనేన.అభిజనవాన్ సప్తపురుషం శ్రోత్రియత్వాదిసంపన్నః, తేనాపి న మమ తుల్యః అస్తి కశ్చిత్. కః అన్యః అస్తి,సదృశః తుల్యః మయా?కించ-యక్ష్యే-యాగేనాపి అన్యాన్ అభి భవిష్యామి.దాస్యామి నటాదిభ్యః; మోదిష్యే హర్షం చ అతిశయం ప్రాప్స్యామి.ఇత్యేవమ్ అజ్ఞానేన విమోహితాః అజ్ఞానవిమోహితాః వివిధమ్ అవివేకభావమ్ ఆపన్నాః. 15

బాలానందిని

ఆఢ్య ఇతి:-ధనంతో నిండి ఉన్నాను.అభిజనవంతుడను.ఏడు తరాల పాటు శ్రోత్రియత్వం ఉన్నవాడను.ఈ విషయంలో కూడ నాతో సమానమైనవాడు ఎవడూ లేడు. నాతో సమానుడు మరొకడు ఎవ డున్నాడు?ఇంకా ఏమనగా-యాగాలు చేస్తాను.యాగంచేత కూడ ఇతరులను ఓడిస్తాను.నటాదులకు ధనం ఇస్తాను.అధికమైన ఆనందం పొందుతాను.ఈ విధంగా అజ్ఞానంచేత మోహింపబడినవారై,అనేక విధాలైన అవివేకం పొందినవారై. 15

మూ. అనేకచిత్తవిభ్రాన్తా మోహజాలసమావృతాః,
ప్రసక్తాః కామభోగేషు పతన్తి నరకేఽశుచౌ. 16

ప్ర.అ. అనేకేతి:- అనేకచిత్తవిభ్రాన్తాః=అనేకములైన చిత్తములతో (ఆలోచనలతో) తలలు తిరుగుతున్నవారై,మోహజాలసమావృతాః=మోహం (అజ్ఞానం)అనే వలచేత కప్పబడినవారై,కామభోగేషు=కామాల భోగములయందు,ప్రసక్తాః=అత్యాసక్తితో ప్రవర్తిస్తూన్నవారై,అశుచౌ=అపవిత్రమైన,నరకే=నరకమునందు,పతన్తి=పడుచున్నారు. 16

భాష్యమ్

అనేకేతి:- అనేకచిత్తవిభ్రాన్తాః-ఉక్తప్రకారైః చిత్తైః వివిధం భ్రాన్తాః అనేకచిత్త విభ్రాన్తాః;మోహజాలసమావృతాః-మోహః అవివేకః అజ్ఞానమ్.తదేవ జాలమ్ ఇవ, ఆవరణాత్మకత్వాత్.తేన సమావృతాః,ప్రసక్తాః కామభోగేషు,తత్రైవ నిషణ్ణాః సన్తః,తేన ఉపచితకల్మషాః,పతన్తి నరకే అశుచౌ,వైతరణ్యాదౌ. 16

బాలానందిని

అనేకేతి:-పైన చెప్పిన అనేకవిధా లైన చిత్తములతో అనేకవిధాల భ్రాంతి పొందిన వారై,మోహజాలసమావృతులై-మోహ మనగా అవివేకం,అజ్ఞానం.అది కప్పివేసే స్వభావం కలది గాన వలవంటిది.దానిచేత కప్పబడినవారై,కామభోగాలయందు ప్రసక్తులై,వాటిలోనే కూర్చున్నవారై,దానిచేత పెరిగిపోయిన కల్మషం(పాపం)గలవారై,అపవిత్ర మైన వైతరణ్యాది నరకంలో పడతారు. 16

మూ. ఆత్మసంభావితాః స్తబ్ధాః ధనమానమదాన్వితాః,
యజన్తే నామయజ్ఞైస్తే దమ్భేనావిధిపూర్వకమ్. 17

ప్ర. అ. ఆత్మేతి:-ఆత్మసంభావితాః=తమచేతనే గౌరవింపబడేవారు,స్తబ్ధాః=బిగిసి పోయి ఉండేవారు,ధనమానమదాన్వితాః=ధనంవల్ల కలిగిన అహంభావంతోను మదం తోను కూడిన వారు అయిన,తే=వాళ్లు,దమ్భేన=డాంబికంతో,నామయజ్ఞైః=పేరుకు యజ్ఞాలనబడేవాటితో, అవిధిపూర్వకమ్=యథావిధిగా కాకుండా,యజన్తే=యాగాలు చేస్తారు.

భాష్యమ్

ఆత్మేతి:- ఆత్మసంభావితాః సర్వగుణవిశిష్టతయా ఆత్మనైవ సంభావితాః న సాధుభిః,స్తబ్ధాః అప్రణతాత్మానః,ధనమానమదాన్వితాః ధననిమిత్తః మానః మదశ్చ, తాభ్యాం ధనమానమదాభ్యామ్ అన్వితాః,యజన్తే,నామయజ్ఞైః నామమాత్రైః యజ్ఞైః, తే, దమ్భేన ధర్మధ్వజితయా అవిధిపూర్వకమ్ విహితాఙ్గేతికర్తవ్యతారహితైః. 17

బాలానందిని

ఆత్మేతి:- సమస్తగుణాలు ఉన్నట్లుగా తమచేతనే గౌరవించుకొనబడేవాళ్లు.అంతేనే కాని సత్పురుషులచేత గౌరవింపబడనివాళ్లు,స్తబ్ధులు అనగా వినయం లేనివాళ్లు,ధనంవల్ల కలిగిన మానమదాలతో కూడినవాళ్లు అయిన వాళ్లు,దంభంతో,పైకి ధార్మికుల వలె కనబడ వలె ననే కోరికతో,పేరుకు మాత్రం యజ్ఞా లని చెప్పబడే యజ్ఞాలతో, అవిధి పూర్వకంగా,

శాస్త్రవిహితాలైన అంగాలు,విధానాలు లేని యజ్ఞాలతో,యజిస్తారు.("యజ్ఞైః యజన్తే"అనగా యజ్ఞాలు చేస్తారు అని అర్థం.యజ్ఞాలతో దేవతాపూజలు చేస్తారు అని భావం). 17

మూ. అహంకారం బలం దర్పం కామం క్రోధం చ సంశ్రితాః,
మామాత్మపరదేహేషు ప్రద్విషన్తోఽభ్యసూయకాః. 18

ప్రతి. **అహంకారమితి**:-అహంకారమ్=అహంకారమును,బలమ్=బలమును, దర్పమ్=గర్వాన్ని,కామమ్=కామమును,క్రోధం చ=క్రోధాన్నీ,సంశ్రితాః=ఆశ్రయించినవారై, ఆత్మపరదేహేషు=తమ దేహాలలోను పరుల దేహాలతోను ఉన్న,మామ్=నన్ను,ప్రద్విషన్తః =ద్వేషిస్తూన్నవారై,అభ్యసూయకాః=అసూయపడే స్వభావం కలవారై ఉంటారు.

భాష్యమ్

అహమితి:-అహంకారమ్-అహంకరణమ్ అహంకారః.విద్యమానైః అవిద్యమానైః చ గుణైః ఆత్మని అధ్యారోపితైః విశిష్టమ్ ఆత్మానమ్ అహమితి మన్యతే;సః అహంకారః అవిద్యాఖ్యః,కష్టతమః సర్వదోషాణాం మూలం,సర్వానర్థప్రవృత్తీనాం చ. తథా బలం పరాభిభవనిమిత్తం కామరాగాన్వితమ్.దర్పమ్-దర్పః నామ యస్య ఉద్భవే ధర్మమ్ అతిక్రామతి.సః అయమ్ అన్తఃకరణాశ్రయః దోషవిశేషః.కామమ్-స్త్ర్యాది విషయమ్.క్రోధమ్ అనిష్టవిషయమ్.ఏతాన్ అన్యాన్ చ మహతః దోషాన్ సంశ్రితాః. కిం చ తే మామ్ ఈశ్వరమ్ ఆత్మపరదేహేషు,స్వదేహే పరదేహేషు చ తద్బుద్ధికర్మసాక్షిభూతం మాం ప్రద్విషన్తః;మచ్ఛాసనాతివర్తిత్వం ప్రద్వేషః, తం కుర్వన్తః అభ్యసూయకాః సన్మార్గస్థానాం గుణేషు అసహమానాః. 18

బాలానందిని

అహమితి:-అహంకారమ్-'నేను నేను'అనుకొనడం అహంకారం.నిజంగా ఉన్నవీ, లేకపోయినా ఉన్నట్లు తనమీద ఆరోపించుకొన్నవీ అయిన గుణాలచేత తాను గొప్పవాడు అని అనుకొంటూ 'నేను నేను'అని అనుకొంటూంటాడు.ఇదే అహంకారం.అవిద్య(అజ్ఞానం) అనే పేరుగలది.చాల కష్ట మైనది.అన్ని దోషాలకీ,సమస్త మైన అనర్థకరము లైన ప్రవృత్తులకీ మూలం.అట్లే బలమును-పరులను తిరస్కరించడానికి నిమిత్త మైనది,కామంతోను రాగంతోను కూడినది అయిన బలాన్ని.దర్పమును-ఏది పుడితే ధర్మాన్ని అతిక్రమిస్తాడో అట్టి ఒకానొక అంతఃకరణంలో ఉండే దోషం దర్పం.స్త్రీలు మొదలైనవాటి విషయంలో కామమును, అనిష్టమైనదాని విషయంలో క్రోధాన్ని,వీటిని ఇంకా ఎన్నో గొప్ప దోషాలనూ ఆశ్రయిం చినవారై.మరియు-తమ దేహంలోను ఇతరులదేహాలలోను వాళ్ల బుద్ధులకు కర్మలకు సాక్షిగా ఉంటూన్న నన్ను ద్వేషిస్తూ. నా శాసనాన్ని (శాస్త్రం ద్వారా నేను విధించిన

ఆజ్ఞను)అతిక్రమించడమే నామీద ద్వేషం అనగా.దానిని చేస్తూ,సన్మార్గంలో ఉన్నవారిలో ఉన్న గుణాలను సహించనివారై(ఉంటారు). 18

మూ. తానహం ద్విషతః క్రూరాన్ సంసారేషు నరాధమాన్,
క్షిపామ్యజస్రమశుభానాసురీష్వేవ యోనిషు. 19

ప్ర.అ. **తానితి:**-ద్విషతః=ద్వేషించేవాళ్లు,క్రూరాన్=క్రూరులూ అయిన,తాన్=ఆ, అశుభాన్=చెడ్డవారైన,నరాధమాన్=నరాధములను,అహమ్=నేను,సంసారేషు=సంసారాలలో, ఆసురీషు=అసురులకు సంబంధించిన,యోనిషు=ఏవ=యోనులలోనే,అజస్రమ్=ఎల్లప్పుడు (ఈ పదం'అశుభాన్'తో అన్వయించినా అన్వయించవచ్చును).క్షిపామి=పడవేస్తాను.

భాష్యమ్

తానహమితి:-తాన్ అహం సర్వాన్ సన్మార్గప్రతిపక్షభూతాన్ సాధుద్వేషిణః ద్విషతః చ మాం క్రూరాన్,సంసారేష్వేవ నరకసంసారమార్గేషు,నరాధమాన్ అధర్మదోష వత్త్వాత్,క్షిపామి ప్రక్షిపామి.అజస్రం సంతతమ్,అశుభాన్ అశుభకర్మకారిణః ఆసురీష్వేవ క్రూరకర్మప్రాయాసు వ్యాఘ్రసింహాదియోనిషు క్షిపామి ఇత్యనేన సంబన్ధః. 19

బాలానందిని

తానహమితి:-సన్మార్గమునకు విరుద్ధంగా ఉండేవాళ్లు,సాధువులను ద్వేషించేవాళ్లు, నన్ను ద్వేషించేవాళ్లు,క్రూరులు అయిన ఆ నరాధములను,అధర్మదోషం కలవా రవడం వల్ల,నేను నరకానికి వెళ్లే మార్గాలలోనే పడవేస్తాను.ఎల్లప్పుడూ అశుభకర్మలు చేసే వాళ్లను క్రూరకర్మ అధికంగా చేసే వ్యాఘ్రసింహాదులైన ఆసురయోనులలోనే-'క్షిపామి'అనేదానితో అన్వయం. పడవేస్తాను. 19

మూ. ఆసురీం యోనిమాపన్నా మూఢా జన్మని జన్మని,
మామప్రాప్యైవ కౌన్తేయ తతో యాన్త్యధమాం గతిమ్. 20

ప్ర.అ. **ఆసురీమితి:**- కౌన్తేయ=అర్జునా!ఆసురీమ్=ఆసురియైన(అసురులకు సంబంధించిన) యోనిమ్=యోనిని,ఆపన్నాః=పొందినవాళ్లు,జన్మని జన్మని=ప్రతీ జన్మ యందు,మూఢాః=మూఢులై,మామ్=నన్ను,అప్రాప్యైవ=పొందకుండానే, తతః అపి=దాని కంటె కూడ,ఉన్న జన్మకంటె కూడ,అధమామ్=అధమమైన,గతిమ్=గతిని,యాన్తి= పొందుతారు.

భాష్యమ్

ఆసురీమితి:-ఆసురీం యోనిమ్,ఆపన్నాః ప్రతిపన్నాః,మూఢాః జన్మని జన్మని అవివేకినః ప్రతిజన్మ తమోబహులాస్వేవ యోనిషు జాయమానాః అధః గచ్ఛన్తః

మూఢాః మామ్ ఈశ్వరమ్,అప్రాప్య అనాసాద్యైవ, హే కౌన్తేయ,తతః తస్మాదపి,యాన్తి అధమాం గతిమ్. "మామ్ అప్రాప్య ఏవ"ఇతి న మత్ప్రాప్తౌ కాచిదప్యాశఙ్కా అస్తి,అతః మచ్ఛిష్టసాధుమార్గమ్ అప్రాప్యేత్యర్థః. 20

బాలానందిని

అసురీమితి:-ఆసురయోనిని పొందినవాళ్లు ప్రతీ జన్మయందు అవివేకవంతులై తమోగుణప్రధానా లైన యోనులలోనే పుడుతూ,క్రిందికి పోతూ ఈశ్వరుడ నైన నన్ను పొందక,అర్జునా!దానికంటె కూడ ఎక్కువ నీచమైన గతిని పొందుతూంటారు."మామ్ అప్రాప్య"అనగా-నన్ను పొందుతా రనే ఆశంక ఏ మాత్రమూ లేనే లేదు.అందువల్ల 'మామప్రాప్య'అనగా నేను బోధించిన సాధుమార్గాన్ని పొందక అని అర్థం. 21

భాష్యమ్

సర్వస్యాః ఆసుర్యాః సంపదః సంక్షేపః అయమ్ ఉచ్యతే.యస్మిన్ త్రివిధే సర్వః ఆసురసంపద్భేదః అనన్తః అపి అన్తర్భవతి,యత్పరిహారేణ పరిహృతః చ భవతి, యత్ మూలం సర్వస్య అనర్థస్య తత్ ఏతత్ ఉచ్యతే-

మూ. త్రివిధం నరకస్యేదం ద్వారం నాశనమాత్మనః,
కామః క్రోధస్తథా లోభస్తస్మాదేతత్త్రయం త్యజేత్. 21

బాలానందిని

సర్వస్యాః ఇతి:-సమస్త మైన ఆసురసంపదయొక్క సంక్షేపంగా ఇది చెప్పబడు చున్నది.అనంత మైనా కూడ సమస్తఆసురసంపద్భేదము మూడు విధాలైన దేనిలో అంతర్గ తం అవుతుందో,దేనిని పరిహరిస్తే ఆసురసంపద్భేదా లన్నీ పరిహరింపబడినవి అవుతాయో ఏది సమస్తానర్థాలకీ మూలమో అట్టి ఇది చెప్పబడుచున్నది.

ప్ర.అ. త్రివిధమితి:- కామః=కామము,క్రోధః=క్రోధము,తథా=మరియు,లోభః =లోభము,ఇదమ్=ఇది,ఆత్మనః=ఆత్మకు,నాశనమ్=నశింపచేసే,త్రివిధమ్=మూడు విధా లైన,ద్వారమ్=ద్వారము.తస్మాత్=అందువలన,ఏతత్=ఈ,త్రయమ్=త్రయమును,త్యజేత్= విడువవలెను.

భాష్యమ్

త్రివిధం త్రిప్రకారం నరకస్య ప్రాప్తౌ ఇదం ద్వారం,నాశనమ్ ఆత్మనః.యత్ ద్వారం ప్రవిశన్నేవ నశ్యతి ఆత్మా,కస్మై చిత్ పురుషార్థాయ యోగ్యః న భవతి ఇత్యేతత్.

అతః ఉచ్యతే."ద్వారం నాశనమాత్మనః"ఇతి.కిం తత్?కామః క్రోధః తథా లోభః. తస్మాత్ ఏతత్ త్రయం త్యజేత్.యతః ఏతత్ ద్వారం నాశనమ్ ఆత్మనః తస్మాత్ కామాదిత్రితయమ్ ఏతత్ త్యజేత్.త్యాగస్తుతిరియమ్. 21

బాలానందిని

త్రివిధమితి:-ఇది నరకం చేరడానికి మూడు విధాలైన ద్వారం.ఆత్మను నశింప చేసేది.ఈ ద్వారంలో ప్రవేశించగానే ఆత్మ నశిస్తుంది.ఏ పురుషార్థం సంపాదించడానికీ కూడ యోగ్యం కాకుండా పోతుంది అని అర్థం.అందువల్లనే "ద్వారం నాశనమాత్మనః" అని చెప్పబడుచున్నది.అది ఏమిటి?కామము,క్రోధము,మరియు లోభము. ఏ కారణంవల్ల ఇది ఆత్మను నశింపచేసే ద్వారమో అందువల్ల ఈ కామాదిత్రయాన్ని పరిత్యజించాలి అని వీటి పరిత్యాగం స్తుతించబడుచున్నది. 21

మూ. ఏతైర్విముక్తః కౌన్తేయ తమోద్వారైస్త్రిభిర్నరః,
ఆచరత్యాత్మనః శ్రేయస్తతో యాతి పరాం గతిమ్. 22

ప్ర.అ. ఏతైరితి:- కౌన్తేయ=అర్జునా!తమోద్వారైః=తమోగుణానికి(నరకానికి) ద్వారాలైన,ఏతైః=ఈ,త్రిభిః=మూడింటిచేత,విముక్తః=విడవబడిన,నరః=నరుడు,ఆత్మనః= తనకు,శ్రేయః=శ్రేయస్సును,ఆచరతి=చేయుచున్నాడు. తతః=అందువల్ల,పరాం గతిమ్= ఉత్తమగతిని,యాతి=పొందుచున్నాడు.

భాష్యమ్

ఏతైరితి:- ఏతైః విముక్తః కౌన్తేయ తమోద్వారైః,తమసః నరకస్య దుఃఖ మోహాత్మకస్య ద్వారాణి కామాదయః,తైః ఏతైః త్రిభిః విముక్తః నరః,ఆచరతి అనుతిష్ఠతి. కిమ్?ఆత్మనః శ్రేయః యత్ప్రతిబద్ధః పూర్వం న ఆచరతి తదపగమాత్ ఆచరతి.తతః తదాచరణాత్,యాతి పరాం గతిం మోక్షమ్ అపి ఇతి. 22

బాలానందిని

ఏతైరితి:-అర్జునా!దుఃఖమోహాత్మకమైన నరకానికి ద్వారాలు కామాదులు, ఈ మూడింటిచేత విడవబడినవాడు చేస్తాడు.ఏమి చేస్తాడు?తనకు శ్రేయస్సును చేస్తాడు.వేటి చేత ప్రతిబద్ధుడై(అడ్డుకొనబడినవాడై)పూర్వం చేయలేదో అవి పోవడంతో చేస్తాడు.వాటిని ఆచరించడంవల్ల ఉత్తమగతిని,మోక్షాన్ని,పొందుతాడు. 22

భాష్యమ్

సర్వస్య ఏతస్య ఆసురసంపత్పరివర్జనస్య శ్రేయఆచరణస్య చ శాస్త్రం కారణమ్. శాస్త్రప్రమాణాత్ ఉభయం కర్తుం శక్యం,న అన్యథా.అతః-

మూ. యః శాస్త్రవిధిముత్సృజ్య వర్తతే కామకారతః,
న స సిద్ధిమవాప్నోతి న సుఖం న పరాం గతిమ్. 23

బాలానందిని

సర్వస్యేతి:- ఈ అసురసంపదను విడిచిపెట్టడానికి,శ్రేయస్సును ఆచరించడానికి, అంతకీ కూడ శాస్త్రం కారణం. శాస్త్ర మనే ప్రమాణాన్ని అనుసరిస్తే ఈ రెండూ చేయడానికి శక్యం అవుతుంది కాని మరొక విధంగా కాదు. అందువల్ల-

ప్ర.అ.యః ఇతి:- యః=ఎవడు,శాస్త్రవిధిమ్=శాస్త్రనియమాన్ని,ఉత్సృజ్య=విడచి, కామకారతః=కామంయొక్క ప్రేరణవల్ల,వర్తతే=ప్రవర్తిస్తాడో,సః=అతడు,సిద్ధిమ్=సిద్ధిని,న అవాప్నోతి=పొందడు. సుఖమ్=సుఖమును,న=పొందడు. పరాం గతిమ్=ఉత్తమగతిని, న=పొందడు.

భాష్యమ్

యః శాస్త్రవిధిం కర్తవ్యాకర్తవ్యజ్ఞానకారణం విధిప్రతిషేధాఖ్యమ్,ఉత్సృజ్య త్యక్త్వా వర్తతే,కామకారతః కామప్రయుక్తః సన్,న,సః,సిద్ధిం పురుషార్థయోగ్యతామ్ అవాప్నోతి. న అపి అస్మిన్ లోకే సుఖం,నాపి పరాం ప్రకృష్టాం గతిం స్వర్గం మోక్షం వా. 23

బాలానందిని

యః ఇతి:- ఏది కర్తవ్యమో ఏది అకర్తవ్యమో తెలుసుకొనడానికి కారణము, విధిప్రతిషేధము లనే పేరు గలది అయిన శాస్త్రవిధిని విడచి ఎవడు కామంచేత ప్రేరేపింపబడినవాడై ప్రవర్తిస్తాడో అతడు సిద్ధిని,పురుషార్థాన్ని, గూర్చి యోగ్యత్వాన్ని పొందడు. ఈ లోకంలో సుఖం గాని,ప్రకృష్టగతి యైన స్వర్గాన్ని గాని మోక్షాన్ని గాని పొందడు. 23

మూ. తస్మాచ్ఛాస్త్రం ప్రమాణం తే కార్యాకార్యవ్యవస్థితౌ,
జ్ఞాత్వా శాస్త్రవిధానోక్తం కర్మ కర్తుమిహార్హసి. 24

ఇతి శ్రీమహాభారతే శతసాహస్ర్యాం సంహితాయాం వైయాసిక్యాం భీష్మపర్వణి శ్రీభగవద్గీతాసు ఉపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే దైవాసురసంపద్విభాగయోగో నామ షోడశోఽధ్యాయః

ప్ర.అ. తస్మాదితి:-తస్మాత్=అందువల్ల,కార్యాకార్యవ్యవస్థితౌ=కార్యాకార్యాల నిర్ణయమునందు,తే=నీకు,శాస్త్రమ్=శాస్త్రము,ప్రమాణమ్=ప్రమాణము. శాస్త్రవిధానోక్తమ్=

శాస్త్రవిధిలో చెప్పబడిన,కర్మ=కర్మను,జ్ఞాత్వా=తెలుసుకొని,ఇహ=ఇక్కడ,కర్మ=కర్మను, కర్తుమ్=చేయుటకు,అర్హసి=తగి ఉన్నావు.

భాష్యమ్

తస్మాదితి:- తస్మాత్ శాస్త్రం ప్రమాణం జ్ఞానసాధనం,తే తవ,కార్యాకార్యవ్యవస్థితౌ కర్తవ్యాకర్తవ్యవస్యవస్థాయామ్,అతః,జ్ఞాత్వా బుద్ధ్వా,శాస్త్రవిధానోక్తమ్-విధిః విధానమ్;శాస్త్రేణ విధానం శాస్త్రవిధానమ్;కుర్యాత్ న కుర్యాత్ ఇత్యేవం లక్షణమ్.తేన ఉక్తం స్వకర్మ యత్ తత్ కర్తుమ్ అర్హసి.ఇహ ఇతి కర్మాధికారభూమిప్రదర్శనార్థమ్ ఇతి. 24

ఇతి శ్రీమత్పరమహంసపరివ్రాజకాచార్య గోవిన్దభగవత్పాదపూజ్యశిష్య శ్రీమదాచార్యశ్రీశంకరభగవతః కృతౌ శ్రీభగవద్గీతాభాష్యే దైవాసుర సంపద్విభాగయోగో నామ షోడశః అధ్యాయః

బాలానందిని

తస్మాదితి:-అందువల్ల కర్తవ్యము ఏది అకర్తవ్యము ఏది అనే వ్యవస్థ చేయడంలో నీకు శాస్త్రమే ప్రమాణం.అందువల్ల-విధానం,అనగా విధి.ఇట్లు చెయ్యాలి,ఇట్లు చేయ కూడదు అనే రూపంలో ఉన్న శాస్త్రవిధిచేత చెప్పబడిన,నీవు చేయవలసిన కర్మ ఏది ఉన్నదో దానిని తెలుసుకొని ఆచరించాలి.కర్మలు చేయడానికి తగిన అధికారం ఈ భూమి యందు (భూలోకంలోనే)ఉంటుంది అని చూపడం కోసం'ఇహ'అని చెప్పబడింది. 24

"బాలానందిని"అను శ్రీమద్భగవద్గీతాశాంకరభాష్యాంధ్రవ్యాఖ్యానంలో
పదహారవఅధ్యాయం సమాప్తం
(ప్రారంభంనుండి 565 శ్లోకాలు)

అథ సప్తదశోఽధ్యాయః

భాష్యమ్

"తస్మాచ్ఛాస్త్రం ప్రమాణం తే"ఇతి భగవద్వాక్యాత్ లబ్ధప్రశ్నబీజః-

అర్జున ఉవాచ-

మూ. యే శాస్త్రవిధిముత్సృజ్య యజన్తే శ్రద్ధయాన్వితాః,
తేషాం నిష్ఠా తు కా కృష్ణ సత్త్వమాహో రజస్తమః. 1

బాలానందిని

తస్మాదితి:-"**తస్మాచ్ఛాస్త్రం ప్రమాణం తే**"అని భగవంతుని వాక్యం వినగానే ప్రశ్నించ డానికి బీజం లభించిన

అర్జునుడు ఇలా అన్నాడు-

ప్ర.అ. యే ఇతి:- కృష్ణ=కృష్ణా! యే=ఎవరు,శాస్త్రవిధిమ్=శాస్త్రవిధిని,ఉత్సృజ్య= విడచి,శ్రద్ధయా=శ్రద్ధతో,అన్వితాః=కూడినవారై,యజన్తే=పూజలు చేస్తారో,తేషామ్=వాళ్ల యొక్కనిష్ఠా=నిష్ఠ,కా=ఏది?సత్త్వమ్=సత్త్వగుణమా,ఆహో=లేక,రజః=రజోగుణమా,తమః= తమోగుణమా?

భాష్యమ్

యే కేచిత్ అవిశేషితాః,శాస్త్రవిధిం శాస్త్రవిధానం శ్రుతి-స్మృతిశాస్త్రచోదనామ్, ఉత్సృజ్య పరిత్యజ్య యజన్తే దేవాదీన్ పూజయన్తి,శ్రద్ధయా ఆస్తిక్యబుద్ధ్యా,అన్వితాః సంయుక్తాః సన్తః,శ్రుతిలక్షణం స్మృతిలక్షణం వా కంచిత్ శాస్త్రవిధిమ్ అపశ్యన్తః వృద్ధవ్యవహారదర్శ నాదేవ శ్రద్దధానతయా యే దేవాదీన్ పూజయన్తి తే ఇహ "**యే శాస్త్రవిధిముత్సృజ్య యజన్తే శ్రద్ధయాన్వితాః**"ఇత్యేవం గృహ్యన్తే.యే పునః కంచిత్ శాస్త్రవిధిమ్ ఉపలభమానాః ఏవ తమ్ ఉత్సృజ్య అయథావిధి దేవాదీన్ పూజయన్తి తే ఇహ "**యే శాస్త్రవిధిముత్సృజ్య యజన్తే**"ఇతి న పరిగృహ్యన్తే.కస్మాత్? శ్రద్ధయాన్వితత్వ విశేషణాత్ దేవాదిపూజావిధిపరం కించిత్ శాస్త్రం పశ్యన్తః ఏవ తత్ ఉత్సృజ్య అశ్రద్దధానతయా, తద్విహితాయాం దేవాదిపూజాయాం శ్రద్ధయా అన్వితాః ప్రవర్తన్తే ఇతి న శక్యతే కల్పయితుం యస్మాత్ తస్మాత్ పూర్వోక్తాః ఏవ "**యే శాస్త్రవిధిముత్సృజ్య యజన్తే శ్రద్ధయాన్వితాః**"ఇత్యత్ర గృహ్యన్తే.తేషామ్ ఏవంభూతానాం నిష్ఠా తు,కా,కృష్ణ,సత్త్వమ్ ఆహో రజః తమః?కిం సత్త్వం నిష్ఠా అవస్థానమ్,ఆహోస్విత్ రజః అథవా తమః? ఏతదుక్తం భవతి-యా తేషాం దేవాది విషయా పూజా సా కిం సాత్త్వికీ,ఆహోస్విత్ రాజసీ,ఉత తామసీ ఇతి. 1

బాలానందిని

యే ఇతి:-ఫలానావాళ్లు అని కాకుండా ఎవళ్లు శాస్త్రవిధానాన్ని,శ్రుతిస్మృతిరూప మైన శాస్త్రంలో విధించబడినదానిని విడచి,శ్రద్ధతో ఆస్తిక్యబుద్ధితో,కూడినవారై దేవాదులను పూజిస్తారో-శ్రుతిరూప మైన ఏదైన శాస్త్రవిధిని గాని,స్మృతిరూప మైన ఏదైన శాస్త్రవిధిని గాని చూడకుండగానే పెద్దలు చేస్తూన్నది చూడడంచేతనే నమ్మకంతో ఎవళ్లు పూజిస్తారో

వాళ్లే ఇక్కడ **"యే శాస్త్రవిధిముత్సృజ్య యజన్తే శ్రద్ధయాన్వితాః"**అనేదానిచేత గ్రహింపబడతారు. ఎవరైతే ఏదో ఒక శాస్త్రవిధిని చూచి కూడ దానిని విడచి శాస్త్రవిరుద్ధంగా దేవాదులను పూజిస్తారో వాళ్లు ఇక్కడ **"యే శాస్త్రవిధిముత్సృజ్య యజన్తే"**అనే వాక్యంచేత గ్రహింపబడరు. ఎందువల్ల? శ్రద్ధతో కూడినవారు అని విశేషణం ఉండడంవల్ల. దేవాదిపూజావిధిని తెలిపే ఒకానొక శాస్త్రాన్ని చూస్తున్నా కూడ నమ్మకం లేకపోవడంచేత ఆ శాస్త్రాన్ని విడిచివేసి దానిచేత విధించబడిన దేవాదిపూజలో శ్రద్ధ కలవారై ప్రవర్తిస్తారు అని కల్పించడం శక్యం కాదు గాన **"యే శాస్త్రవిధిముత్సృజ్య యజన్తే శ్రద్ధయాన్వితాః"**అన్నచోట వెనుక చెప్పబడినవాళ్లే గ్రహింపబడతారు. కృష్ణా! ఇలాంటివాళ్ల నిష్ఠ సత్త్వమా, రజస్సా, తమస్సా? వాళ్ల నిష్ఠ, వాళ్లు నిలిచినది సత్త్వగుణమా, లేక రజోగుణమా, లేక తమోగుణమా. ఇది చెప్పినట్లవుతుంది(దీని భావం ఇది)-వాళ్లు చేసే దేవాదివిషయమైన పూజ సాత్త్విక మైనదా రాజస మైనదా తామస మైనదా? 1

భాష్యమ్

సామాన్యవిషయః అయం ప్రశ్నః న అప్రవిభజ్య ప్రతివచనమ్ అర్హతి ఇతి-

శ్రీభగవానువాచ-

మూ. త్రివిధా భవతి శ్రద్ధా దేహినాం సా స్వభావజా,
సాత్త్వికీ రాజసీ చైవ తామసీ చేతి తాం శృణు. 2

బాలానందిని

సామాన్యే ఇతి:-ఈ ప్రశ్న సామాన్యవిషయ మైనది. ఫలానాదానిని గూర్చి అని కాకుండా అతివిస్తృతరూపంలో అడగబడిన ప్రశ్న. (Is of too general nature). అందుచేత ఎక్కడి కక్కడ విభజించి సమాధానం చెప్పవలసిన ప్రశ్న ఇది అనే అభిప్రాయంతో-

శ్రీభగవంతుడు ఇలా అన్నాడు-

ప్ర. అ. **త్రివిధా ఇతి**: -దేహినామ్=మానవులకు, సా=ఆ, శ్రద్ధా=శ్రద్ధ, స్వభావజా=వాళ్ల వాళ్ల స్వభావంవల్ల పుట్టినదై, సాత్త్వికీ=సాత్త్విక మనీ, రాజసీ=రాజసమనీ, తామసీ చ ఇతి=తామస మనీ, త్రివిధా=మూడు విధాలుగా, భవతి=ఉండును. తామ్=దానిని గూర్చి, శృణు=వినుము.

భాష్యమ్

త్రివిధా త్రిప్రకారా భవతి శ్రద్ధా యస్యాం నిష్ఠాయాం త్వం పృచ్ఛసి-దేహినాం

సా స్వభావజా. జన్మాన్తరకృతః ధర్మాదిసంస్కారః మరణకాలే అభివ్యక్తః స్వభావః ఉచ్యతే. తతః జాతా స్వభావజా. సాత్త్వికీ సత్త్వనిర్వృత్తా దేవపూజాదివిషయా రాజసీ రజోనిర్వృత్తా యకరక్షఃపూజాదివిషయా తామసీ తమోనిర్వృత్తా ప్రేతపిశాచాదిపూజావిషయా, ఏవం త్రివిధా, తామ్ ఉచ్యమానాం శ్రద్ధాం శృణు. 2

బాలానందిని

త్రివిధా ఇతి:-ఏ నిష్ఠయందు శ్రద్ధను గూర్చి నువ్వు ప్రశ్నిస్తున్నావో ఆ, మానవుల స్వభావసిద్ధ మైన నిష్ఠ మూడు విధాలుగా ఉంటుంది. జన్మాంతరమునందు చేయబడినదై మరణకాలంలో అభివ్యక్త మైన (పైకి త్రోసికొని వచ్చిన)ధర్మాదుల సంస్కారం స్వభావం అని చెప్పబడుతుంది. దానివల్ల పుట్టినది స్వభావజ సత్త్వగుణంవల్ల జనించిన దేవ పూజాదులను గూర్చిన శ్రద్ధ సాత్త్వికశ్రద్ధ. రజోగుణంచేత కలిగిన యక్షరక్షఃపూజాదులను గూర్చిన శ్రద్ధ రాజసశ్రద్ధ. తమోగుణంచేత కలిగిన ప్రేతపిశాచాదిపూజాదులను గూర్చిన శ్రద్ధ తామసశ్రద్ధ. ఈ విధంగా మూడు విధాలైన, చెప్పబడనున్న దానినిగూర్చి వినుము. 2

భాష్యమ్

సైవం త్రివిధా భవతి-

మూ. సత్త్వానురూపా సర్వస్య శ్రద్ధా భవతి భారత,
శ్రద్ధామయోఽయం పురుషః యో యచ్ఛ్రద్ధః స ఏవ సః. 3

బాలానందిని

సైవమితి:- మూడు విధాలుగా ఉండే -

ప్ర.అ. సత్త్వానురూపేతి:- శ్రద్ధా=శ్రద్ధ, సర్వస్య=ప్రతీవానికీ, సత్త్వానురూపా= వాని వాని అంతఃకరణమునకు అనుగుణంగా(తగినట్లుగా), భవతి=కలుగుతుంటుంది. భారత= అర్జునా! అయం పురుషః= ఈ పురుషుడు, శ్రద్ధామయః=శ్రద్ధతో నిండినవాడు, శ్రద్ధా-స్వరూపుడు. యః=ఎవడు, యచ్ఛ్రద్ధః=ఏ శ్రద్ధ కలవాడో, సః=వాడు, స ఏవ=ఆ శ్రద్ధకు అనుకూలుడే.

భాష్యమ్

సత్త్వానురూపా విశిష్టసంస్కారోపేతాన్తఃకరణానురూపా సర్వస్య ప్రాణిజాతస్య శ్రద్ధా భవతి భారత. యది ఏవం కిం స్యాత్ ఇత్యుచ్యతే-శ్రద్ధామయః శ్రద్ధాప్రాయః అయం పురుషః సంసారీ జీవః. కథమ్? యః యచ్ఛ్రద్ధః యా శ్రద్ధా యస్య జీవస్య సః యచ్ఛ్రద్ధః సః ఏవ తచ్ఛ్రద్ధానురూప ఏవ సః జీవః. 3

బాలానందిని

సత్త్వేతి:- సమస్తప్రాణిసముదాయముయొక్క శ్రద్ధ సంస్కారవిశేషముతో కూడిన (వారి వారి)అంతఃకరణమునకు అనురూపంగా ఉంటుంది.అయితే మాత్రం ఏమి అని చెప్పబడుచున్నది-ఈ పురుషుడు,సంసారి యైన జీవుడు, శ్రద్ధామయుడు,శ్రద్ధాప్రాయుడు, (శ్రద్ధయే వీని స్వరూపం)ఎట్లు?ఏ జీవుడు ఏ విధమైన శ్రద్ధ కలవాడో అతడు అదే శ్రద్ధకు అనుకూలంగా ప్రవర్తిస్తాడు. 3

భాష్యమ్

తతశ్చ కార్యేణ లిఙ్గేన దేవాదిపూజయా సత్త్వాదినిష్ఠా అనుమేయా ఇత్యాహ-

మూ. యజన్తే సాత్త్వికా దేవాన్ యక్షరక్షాంసి రాజసాః,
ప్రేతాన్ భూతగణాంశ్చాన్యే యజన్తే తామసా జనాః. 4

బాలానందిని

తతశ్చేతి:- అందువల్ల,కార్యమైన(సత్త్వనిష్ఠాదులవల్ల కలిగే)దేవాదిపూజారూప మైన లింగంచేత(హేతువుచేత,గుర్తుచేత)సత్త్వాదినిష్ఠ ఊహించదగినది,(ఒకడు దేవాది పూజ చేస్తుంటే వీనికి సత్త్వనిష్ఠ ఉంది అని ఊహిస్తాం,ఇత్యాదివిధంగా)అని చెపుతున్నాడు.

ప్ర.అ. యజన్తే ఇతి:- సాత్త్వికాః=సాత్త్వికులు,దేవాన్=దేవతలను,యజన్తే=పూజిస్తారు. రాజసాః=రాజసులు,యక్షరక్షాంసి=యక్షులను రాక్షసులను పూజిస్తారు. తామసాః =తామసులైన,అన్యే జనాః=ఇతరులు,ప్రేతాన్=ప్రేతులను,భూతగణాన్ చ=భూతాల సముదాయాలను,యజన్తే=పూజిస్తారు.

భాష్యమ్

యజన్తే పూజయన్తి,సాత్త్వికాః సత్త్వనిష్ఠాః,దేవాన్. యక్షరక్షాంసి రాజసాః.ప్రేతాన్ భూతగణాన్ చైవ సప్తమాతృకాదీన్ చ అన్యే యజన్తే తామసాః జనాః. 4

బాలానందిని

యజన్తే ఇతి:- సాత్త్వికులు,సత్త్వనిష్ఠులైనవాళ్లు దేవతలను పూజిస్తారు;రాజసులు (రజోనిష్ఠులు) యక్షులను రాక్షసులను పూజిస్తారు;తామసు లైన (తమోనిష్ఠులైన) ఇతర జనులు ప్రేతాలను సప్తమాతృకలు మొదలైన భూతగణాలను పూజిస్తారు. 4

భాష్యమ్

ఏవం కార్యతః నిర్ణీతాః సత్త్వాదినిష్ఠాః శాస్త్రవిధ్యుత్సర్గే తత్ర కశ్చిదేవ సహస్రేషు

దేవపూజాదితత్పరః సత్త్వనిష్ఠః భవతి,బాహుళ్యేన తు రజోనిష్ఠాః తమోనిష్ఠాః చ ఏవ ప్రాణినః భవన్తి కథమ్?

మూ. అశాస్త్రవిహితం ఘోరం తప్యన్తే యే తపో జనాః,
దమ్భాహంకారసంయుక్తాః కామరాగబలాన్వితాః. 5

బాలానందిని

ఏవమితి:-శాస్త్రవిధ్యుత్సర్గమునందు సత్త్వాదినిష్ఠలు ఈ విధంగా కార్యములను బట్టి నిర్ణయించబడ్డాయి.ఇది ఇలా ఉండగా-వేలమందిలో ఏ ఒక్కడో మాత్రమే దేవ పూజాదితత్పరు డవుతాడు,సత్త్వనిష్ఠుడై ఉంటాడు.ప్రాణులలో చాలామం దైతే రజోనిష్ఠులు గాను తమోనిష్ఠులు గాను ఉంటారు.ఎట్లనగా-

వి."యే శాస్త్రవిధిముత్సృజ్య"ఇత్యాది ప్రథమశ్లోకంలో శాస్త్రవిధిని విడచినవారు చేసే యజ్ఞాదికం ఏ విధంగా ఉంటుంది అని ప్రశ్నించబడింది.శాస్త్రవిధి విడిచిపెట్టి శాస్త్రంలో ఏమి విధించబడినదో తెలిసికొనకుండగా ఎవళ్లు ఆ యా పూజలలో ఆసక్తు లౌతారో వాళ్లు సాత్త్వికులా,రాజసులా,తామసులా అని తెలుసుకోవడానికి వాళ్లు చేసే పూజాదులే లింగాలు అని చెప్పబడింది.శాస్త్రవిధానం తెలుసుకొని చేసే వాళ్ల స్వరూపాన్ని గూర్చి శాస్త్రంచేతనే తెలుసుకొనవచ్చును,అనుమానం ద్వారా తెలుసుకొనవలసిన పని లేదు అని పై భాష్యవాక్యంలోని 'శాస్త్రవిధ్యుత్సర్గే'అనేదాని భావం.

ప్ర.అ.**అశాస్త్రేతి**:-యే=ఏ,జనాః=జనులు,దమ్భాహంకారసంయుక్తాః=దంభంతోను అహంకారంతోను కూడినవారై,కామరాగబలాన్వితాః=కామ-రాగాల బలంతో కూడిన వారై,అశాస్త్రవిహితమ్=శాస్త్రమునందు విధించబడని,ఘోరమ్=ఘోరమైన, తపః = తపస్సును, తప్యన్తే=చేస్తారో-

భాష్యమ్

అశాస్త్రవిహితం-న శాస్త్రవిహితమ్ అశాస్త్రవిహితమ్,ఘోరం పీడాకారం ప్రాణినామ్ ఆత్మనశ్చ-తపః తప్యన్తే నిర్వర్తయన్తి యే తపః.జనాః తే చ దమ్భాహంకార సంయుక్తాః-దమ్భశ్చ అహంకారశ్చ దమ్భాహంకారౌ, తాభ్యాం సంయుక్తాః దమ్భాహం కారసంయుక్తాః,కామరాగబలాన్వితాః-కామశ్చ రాగశ్చ కామరాగౌ,తత్కృతం బలం కామరాగబలమ్,తేన అన్వితాః,కామరాగబలైః వా అన్వితాః. 5

బాలానందిని

అశాస్త్రేతి:-ఏది శాస్త్రంచేత విధించబడలేదో అది అశాస్త్రవిహితం.అట్టి ఘోర మైన తనకూ ప్రాణులకూ కూడ పీడను కలిగించే తపస్సును, ఏ జనులు దంభంతోను

అహంకారంతోను కూడినవారై,కామ-రాగాలచేత చేయబడిన(కలిగిన)బలం కామరాగ బలం(కామరాగాల బలం),కామరాగబలంతో కూడినవారై లేదా కామంతోను,రాగంతోను బలంతోను కూడినవారై, చేస్తారో-

మూ. కర్శయన్తః శరీరస్థం భూతగ్రామమచేతసః,
మాం చైవాన్తఃశరీరస్థం తాన్విద్ధ్యాసురనిశ్చయాన్. 6

ప్ర.అ. కర్శయన్త ఇతి:- శరీరస్థమ్=శరీరంలో ఉన్న,భూతగ్రామమ్=ఇంద్రియాల సముదాయాన్నీ,అన్తఃశరీరస్థమ్=శరీరంలోపల ఉన్న,మాం చైవ=నన్నూ,కర్శయన్తః= కృశింపచేస్తూన్నవారై,అచేతసః=మనస్సు(వివేకం)లేనివారై(ఘోరతపస్సు చేస్తారో) తాన్ = వాళ్లను,ఆసురనిశ్చయాన్=ఆసురనిశ్చయం కలవాళ్లనుగా,విద్ధి=తెలుసుకొనుము.

భాష్యమ్

కర్శయన్త ఇతి:-కర్శయన్తః కృశీకుర్వన్తః,శరీరస్థం,భూతగ్రామం కరణ సముదాయమ్,అచేతసః అవివేకినః,మాం చ ఏవ తత్కర్మబుద్ధిసాక్షిభూతమ్ అన్తః శరీరస్థం కర్శయన్తః,మదనుశాసనాకరణమేవ మత్కర్శనమ్,తాన్ విద్ధి ఆసురనిశ్చయాన్ - ఆసురః నిశ్చయః యేషాం తే ఆసురనిశ్చయాః తాన్ పరిహరణార్థం విద్ధి ఇతి ఉపదేశః. 6

బాలానందిని

కర్శయన్త ఇతి:-శరీరంలో ఉన్న ఇంద్రియసముదాయాన్ని కృశింపచేస్తూన్నవారై, వివేకం లేనివారై,వాళ్ల కర్మలకు బుద్ధికీ సాక్షిగా శరీరంలో ఉన్న నన్ను కూడ కృశింప చేస్తూన్నవారై,నా శాసనం ప్రకారం చేయకపోవడమే నన్ను కృశింపచేయడ మనగా, ఎవరు (ఘోర మైన తపస్సు చేస్తారో)వాళ్లను ఆసురనిశ్చయం కలవాళ్లనుగా తెలుసుకొనుము.(లేదా ఆసురనిశ్చయం గల వాళ్లను గూర్చి తెలుసుకొనుము) అని వాళ్లను పరిహరించడం కోసం (వాళ్లనుండి లేదా అంటి ప్రవృత్తినుండి దూరంగా ఉండడం కోసం)ఉపదేశం చేయబడు చున్నది. 6

భాష్యమ్

ఆహారాణాం చ రస్యస్నిగ్ధాదివర్గత్రయరూపేణ భిన్నానాం యథాక్రమం సాత్త్విక రాజసతామసపురుషప్రియత్వదర్శనమిహ క్రియతే,రస్యస్నిగ్ధాదిషు ఆహారవిశేషేషు ఆత్మనః ప్రీత్యతిరేకేణ లిఙ్గేన సాత్త్వికత్వం రాజసత్వం తామసత్వం చ బుద్ధ్వా రజస్తమో లిఙ్గానామ్ ఆహారాణాం పరివర్జనార్థం సత్త్వలిఙ్గానాం చ ఉపాదానార్థమ్. తథా యజ్ఞా

దీనామపి సత్త్వాదిగుణభేదేన త్రివిధత్వప్రతిపాదనమ్ ఇహ రాజసతామసాన్ బుద్ధ్వా కథం ను నామ పరిత్యజేత్,సాత్త్వికానేవ అనుతిష్ఠేత్ ఇత్యేవమర్థమ్.

మూ. ఆహారస్త్వపి సర్వస్య త్రివిధో భవతి ప్రియః,
యజ్ఞస్తపస్తథా దానం తేషాం భేదమిమం శృణు. 7

బాలానందిని

ఆహారాణామితి:- రస్యము,స్నిగ్ధము ఇత్యాదులైన మూడు వర్గాలుగా వేరు వేరుగా ఉన్న ఆహారాలు క్రమంగా సాత్త్వికరాజసతామసపురుషులకు ప్రియంగా ఉంటాయి అని ఇక్కడ చెప్పబడుచున్నది. తనకు రస్యస్నిగ్ధాదు లైన ఆహారవిశేషాలలో ప్రీతి అధికంగా ఉండడ మనే గుర్తును పట్టి తాను సాత్త్వికుడా,రాజసుడా,తామసుడా అనే విషయం తెలుసుకొని రజస్తమోగుణలింగా లైన ఆహారాలను విసర్జించడంకొరకు,సత్త్వగుణలింగా లైన ఆహారాలను స్వీకరించడం కొరకు చెప్పబడుచున్నది. అట్లే,ఇక్కడ,యజ్ఞాదులు కూడ సత్త్వాదిగుణాల భేదంచేత మూడు విధా లైనవి అని చెప్పడం కూడ రాజస-తామస యజ్ఞాదులను గూర్చి తెలుసుకొని వాటిని ఎలా విడిచిపెట్టాలి;సాత్త్వికాలనే ఎలా అనుష్ఠించాలి అని బోధించడంకొరకు.

ప్ర. అ. ఆహార ఇతి: -సర్వస్య=ప్రతీవానికీ,త్రివిధః=మూడు విధాలైన, ఆహారః= ఆహారం,ప్రియః భవతి=ప్రియంగా ఉంటుంది. తథా అట్లే మూడు విధాలైన,యజ్ఞః= యజ్ఞము,తపః=తపస్సు, దానమ్=దానము,ప్రియంగా ఉంటాయి. తేషామ్=వాటియొక్క ఇమమ్=ఈ,భేదమ్=భేదమును,శృణు=వినుము.

భాష్యమ్

ఆహారః తు అపి సర్వస్య భోక్తుః త్రివిధః భవతి,ప్రియః ఇష్టః తథా యజ్ఞః, తథా తపః,తథా దానమ్. తేషామ్ ఆహారాదీనాం భేదమ్ ఇమం శృణు. 7

బాలానందిని

ఆహార ఇతి: -ప్రతీ భోక్తకూ మూడు విధాలైన ఆహారం ఇష్టంగా ఉంటుంది. అట్లే మూడు విధాలైన యజ్ఞము,తపస్సు,దానము ఇష్టంగా ఉంటాయి. వాటికి సంబంధించిన ఈ భేదాన్ని వినుము. 7

మూ. ఆయుస్సత్త్వబలారోగ్యసుఖప్రీతివివర్ధనాః,
రస్యాః స్నిగ్ధాః స్థిరా హృద్యా ఆహారాః సాత్త్వికప్రియాః. 8

ప్ర. అ. ఆయురితి: -ఆయుఃసత్త్వబలారోగ్యసుఖప్రీతివివర్ధనాః =ఆయుర్దాయాన్ని, సత్త్వాన్ని(చిత్తస్థైర్యంలేదా వీర్యం),బలాన్ని ఆరోగ్యాన్ని,సుఖాన్ని,(తనలోని ఆనందం), ప్రీతిని (ఇతరుల వృద్ధిని చూచి ఆనందం), వృద్ధి పొందించేవి, రస్యాః=రుచిగలవి, స్నిగ్ధాః=చమురు ఉన్నవి(ఎండిపోనివి) స్థిరాః=దేహంలో చిరకాలం నిలిచి పోషకాలుగా ఉండేవి,హృద్యాః= మనస్సుకు ఆహ్లాదకరములూ అయిన,ఆహారాః=ఆహారాలు,సాత్త్వికప్రియాః=సాత్త్వికులకు ఇష్ట మైనవి.

భాష్యమ్

ఆయురితి:-ఆయుశ్చ సత్త్వం చ బలం చ ఆరోగ్యం చ సుఖం చ ప్రీతిశ్చ తాసాం వివర్ధనాః ఆయుఃసత్త్వబలారోగ్యసుఖప్రీతివివర్ధనాః,తే చ,రస్యాః రసోపేతాః , స్నిగ్ధాః స్నేహవన్తః,స్థిరాః, చిరకాలస్థాయినో దేహే,హృద్యాః హృదయప్రియాః ఆహారాః సాత్త్వికప్రియాః సాత్త్వికస్య ఇష్టాః.

బాలానందిని

ఆయురితి: -ఆయుః-సత్త్వ-బల-ఆరోగ్య-సుఖ-ప్రీతులను వృద్ధిపొందించేవి,రస మున్నవి,స్నేహం ఉన్నవి,దేహంలో చిరకాలం ఉండేవి,హృదయానికి ప్రియములు అయిన ఆహారాలు సాత్త్వికునకు ఇష్ట మైనవి.

మూ. కట్వమ్లలవణాత్యుష్ణతీక్ష్ణరూక్షవిదాహినః,
ఆహారా రాజసస్యేష్టా దుఃఖశోకామయప్రదాః. 9

ప్ర. అ. కట్వమ్లలవణాత్యుష్ణతీక్ష్ణరూక్షవిదాహినః=చాల చేదుగాను,పుల్లగాను,ఉప్పగాను,వేడిగాను,కారంగాను,పొడి పొడిగాను,లోపల తాపం కలిగించేవిగాను ఉండేవి, దుఃఖశోకామయప్రదాః=దుఃఖాన్ని(తాత్కాలికమైన పీడ దుఃఖం)శ్లోకాన్నీ(ఇష్టవస్తువియోగం వల్ల కలిగే దుఃఖం శోకం),రోగాన్నీ ఇచ్చేవి అయిన,ఆహారాః=ఆహారాలు,రాజసస్య= రాజసునకు ఇష్టాః=ఇష్టమైనవి.

భాష్యమ్

కట్వితి:-కటుః లవణః అత్యుష్ణః,అతిశబ్దః కట్వాదిషు సర్వత్రయోజ్యః -అతికటుః అతితీక్ష్ణః ఇత్యేవమ్.కట్వమ్లలవణాత్యుష్ణతీక్ష్ణరూక్షవిదాహినః ఆహారాః రాజసస్య ఇష్టాః దుఃఖశోకామయప్రదాః-దుఃఖం చ శోకం చ ఆమయం చ ప్రయచ్ఛన్తి ఇతి దుఃఖ శోకామయప్రదాః. 9

బాలానందిని

కట్వితి:-చేదు,ఉప్పు,చాలా వేడి-'అతి'శబ్దం కట్వాదిశబ్దా లన్నింటితోను 'అతి కటుః' 'అతితీక్ష్ణః'ఇత్యాదివిధంగా అన్వయిస్తుంది.ఎక్కువ కటు-అమ్ల-లవణ-ఉష్ణ-తీక్ష్ణ-రూక్ష- విదాహులుగా ఉన్నవి,దుఃఖ-శోక-ఆమయాలను కలుగజేసేవి అయిన ఆహారాలు రాజసు నకు ఇష్టంగా ఉంటాయి.

మూ. యాతయామం గతరసం పూతి పర్యుషితం చ యత్,
ఉచ్ఛిష్టమపి చామేధ్యం భోజనం తామసప్రియమ్. 10

ప్రతి. యాతేతి:-యత్=ఏది, యాతయామమ్=సరిగా పక్వం కానిదో,గతరసమ్=వీర్యం పోయినదో,పూతి=పాసిపోయినదో,పర్యుషితం చ=నిలవ ఉన్నదో,ఉచ్ఛిష్టమ్ అపి=ఇతరులు తినగా లేదా తానే తినగా మిగిలినదో,అమేధ్యమ్=అపవిత్రమో,భోజనమ్=అట్టి భోజనం,తామసప్రియమ్=తామసులకు ఇష్టమైనది.

భాష్యమ్

యాతయామమితి:-యాతయామం మన్దపక్వం,నిర్వీర్యస్య గతరసేన ఉక్తత్వాత్, గతరసం రసవియుక్తం,పూతి దుర్గన్ధం,పర్యుషితం చ పక్వం సత్ రాత్ర్యన్తరితం చ,యత్, ఉచ్ఛిష్టమ్ అపి భుక్తశిష్టమ్ అపి, అమేధ్యమ్ అయజ్ఞార్హమ్,భోజనమ్ ఈదృశం తామసప్రియమ్. 10

బాలానందిని

యాతేతి:-నిర్వీర్య మైనదానిని గూర్చి 'గతరస'శబ్దంచేత చెప్పబడింది గాన "యాతయామమ్"అనగా(సరిగా పక్వం కానిది), కొంచెం పక్వ మైనది అని అర్థం.గతరసము అనగా రసం హరించిపోయినది,దుర్గంధం గలది,పర్యుషితము అనగా వండిన తరువాత ఒక రాత్రి వ్యవధానం ఉన్నది,ఉచ్ఛిష్టము,అమేధ్యము,అనగా పూజకు తగనిది అయిన భోజనం తామసునికి ఇష్టంగా ఉంటుంది. 10

భాష్యమ్

అథేదానీం యజ్ఞః త్రివిధః ఉచ్యతే-

మూ. అఫలాకాఙ్క్షిభిర్యజ్ఞో విధిదృష్టో య ఇజ్యతే,
యష్టవ్యమేవేతి మనః సమాధాయ స సాత్త్వికః. 11

బాలానందిని

అథేతి:-ఇప్పుడు మూడు విధాలైన యజ్ఞం చెప్పబడుచున్నది.

ప్ర.అ. **అఫలేతి**:-యష్టవ్యమ్ ఏవ=యాగం చేసి తీరవలసినదే,ఇతి=అని, మనః =మనస్సును, సమాధాయ=నిశ్చయం చేసి,అఫలాకాఙ్క్షిభిః=ఫలం కోరనివాళ్లచేత, విధి దృష్టః=శాస్త్రంలో చూడబడిన,యః=ఏ,యజ్ఞః=యజ్ఞము,ఇజ్యతే=చేయబడుతుందో,సః= అది, సాత్త్వికః=సాత్త్వికయజ్ఞము.

భాష్యమ్

అఫలాకాఙ్క్షిభిః అఫలార్థిభిః యజ్ఞః విధిదృష్టః శాస్త్రచోదనాదృష్టః,యః యజ్ఞః ఇజ్యతే నిర్వర్త్యతే,యష్టవ్యమేవేతి యజ్ఞస్వరూపనిర్వర్తనమేవ కార్యమ్ ఇతి మనః సమాధాయ,న అనేన పురుషార్థః మమ కర్తవ్యః ఇత్యేవం నిశ్చిత్య సః సాత్త్వికః యజ్ఞః ఉచ్యతే. 11

బాలానందిని

అఫలేతి:- శాస్త్రవిధిలో చూడబడిన (శాస్త్రవిధిద్వారా తెలిసికొనబడిన)ఏ యజ్ఞం ఫలమును కోరనివాళ్లచేత చేయబడుతుందో,ఏమైనా యజ్ఞం యొక్క స్వరూపం పూర్తి అయే టట్లు చెయ్యాలి,దీని ద్వారా నేను ప్రయోజనం ఏమీ సంపాదింపవలసిన పని లేదు. అని మనసా నిశ్చయించి చేయబడుతుందో,అది సాత్త్వికయజ్ఞ మని చెప్పబడు తుంది. 11

మూ. అభిసంధాయ తు ఫలం దమ్భార్థమపి చైవ యత్,
ఇజ్యతే భరతశ్రేష్ఠ తం యజ్ఞం విద్ధి రాజసమ్. 12

ప్ర.అ. భరతశ్రేష్ఠ=అర్జునా!ఫలమ్=ఫలమును,అభిసంధాయ=కోరి,దమ్భార్థమపి చైవ=దంభంకొరకు కూడ,యత్ ఇజ్యతే=యాగం చేయబడుతుంది అనేది కలదో,తం యజ్ఞమ్=ఆ యజ్ఞమును,రాజసమ్=రాజసమునుగా,విద్ధి=తెలుసుకొనుము.

భాష్యమ్

అభిసంధాయేతి:-అభిసంధాయ ఉద్దిశ్య,ఫలం,దమ్భార్థమ్ అపి చ ఏవ యత్ ఇజ్యతే,భరతశ్రేష్ఠ తం యజ్ఞం విద్ధి రాజసమ్. 12

బాలానందిని

అభీతి:-అర్జునా!ఫలాన్ని ఉద్దేశించి,దంభంకొరకూ కూడ చేయబడే యాగం రాజస మని తెలుసుకొనుము 12

మూ. విధిహీనమసృష్టాన్నం మన్త్రహీనమదక్షిణమ్,
శ్రద్ధావిరహితం యజ్ఞం తామసం పరిచక్షతే. 13

ప్ర.అ. విధిహీనమ్=శాస్త్రహీనము,అసృష్టాన్నమ్=ఇవ్వబడని అన్నం కలది,మన్త్రహీనమ్=మంత్రాలతో శూన్యము,అదక్షిణమ్=దక్షిణ లేనిది,శ్రద్ధావిరహితమ్=శ్రద్ధతో శూన్యము అయిన,యజ్ఞమ్=యజ్ఞమును,తామసమ్=తామసయజ్ఞమునుగా,పరిచక్షతే=చెప్పుచున్నారు.

భాష్యమ్

విధిహీనమితి:-విధిహీనం యథాచోదితవిపరీతమ్,అసృష్టానం బ్రాహ్మణేభ్యః న సృష్టం న దత్తం అన్నం యస్మిన్ యజ్ఞే సః అసృష్టాన్నః,తమ్ అసృష్టాన్నమ్,మన్త్రహీనం మన్త్రతః స్వరతః వర్ణతః వియుక్తం మన్త్రహీనమ్,అదక్షిణమ్ ఉక్తదక్షిణారహితం శ్రద్ధావిహీనం శ్రద్ధావిరహితం యజ్ఞం తామసం పరిచక్షతే తమోనిర్వృతం కథయన్తి. 13

బాలానందిని

విధీతి:-శాస్త్రంలో ఏ విధంగా విధించబడినదో దానికి విపరీత మైనది,ఏ యజ్ఞంలో బ్రాహ్మణులకు అన్నం ఇవ్వబడలేదో అది అసృష్టాన్నం;అట్టిదీ,మంత్రాలలో స్వరదోషాలు వర్ణదోషాలూ ఉన్నది,చెప్పబడిన దక్షిణలు ఇవ్వనిది,శ్రద్ధ లేకుండా చేయబడినది అయిన యజ్ఞమును తామస మని చెప్పుచున్నారు. 13

భాష్యమ్

అథ ఇదానీం తపః త్రివిధమ్ ఉచ్యతే-

మూ. దేవద్విజగురుప్రాజ్ఞపూజనం శౌచమార్జవమ్,
బ్రహ్మచర్యమహింసా చ శారీరం తప ఉచ్యతే. 14

బాలానందిని

అథేతి:-ఇక ఇప్పుడు త్రివిధమైన తపస్సు చెప్పబడుచున్నది-

ప్ర.అ. దేవేతి:-దేవద్విజగురుప్రాజ్ఞపూజనమ్=దేవతలయొక్క,ద్విజులయొక్క గురువులయొక్క పండితులయొక్క పూజ చేయడం,శౌచమ్=శుచిత్వము,ఆర్జవమ్=ఋజుత్వము,బ్రహ్మచర్యమ్=బ్రహ్మచర్యము,అహింసా చ=అహింస,శారీరమ్=శరీరానికి సంబంధించిన(శరీరంతో చేసే),తపః=తపస్సుగా,ఉచ్యతే=చెప్పబడుచున్నది.

భాష్యమ్

దేవాశ్చ ద్విజాశ్చ గురవశ్చ ప్రాజ్ఞాశ్చ దేవద్విజగురుప్రాజ్ఞాః,తేషాం పూజనం దేవదిజగురుప్రాజ్ఞపూజనం,శౌచమ్,ఆర్జవమ్ ఋజుత్వం,బ్రహ్మచర్యమ్,అహింసా చ

శరీరనిర్వర్త్యం శారీరమ్, శరీరప్రధానైః సర్వైరపి కార్యకరణైః కర్త్రాదిభిః సాధ్యం శారీరం తపః ఉచ్యతే. "పఞ్చైతే తస్య హేతవః"(18.15)ఇతి హి వక్ష్యతి. 14

బాలానందిని

దేవేతి:-దేవ-ద్విజ-గురు-పండితుల పూజ, శౌచము, ఋజుత్వము, బ్రహ్మచర్యము అహింస ఇవి శరీరంచేత చేయదగిన, శరీరం ప్రధానంగా గల సమస్తమైన కర్త మొదలైన దేహేంద్రియాలచేత సాధింపదగిన శారీరతపస్సు అని చెప్పబడుచున్నది(శరీరంచేత శరీరంలో ఉన్న అంతఃకరణాదులచేత కూడ చేయబడే దైనా వాటిలో శరీరం ప్రధాన మైనదవడంచేత ఇది శారీరతపస్సు అని చెప్పబడుచున్న దని అర్థం) **"అధిష్ఠానం తథా కర్తా"**(18.14) ఇత్యాదిశ్లోకంలో ఈ శరీరాదులు చెప్పబడనున్నాయి) 15

మూ. అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియహితం చ యత్,
స్వాధ్యాయాభ్యసనం చైవ వాఙ్మయం తప ఉచ్యతే. 15

ప్ర.అ. **అనుద్వేగేతి**:-యత్=ఏది, సత్యమ్=సత్య మైనదో, ప్రియహితం చ=ప్రియం గాను హితంగాను ఉంటుందో అట్టి, అనుద్వేగకరమ్=(ఇతరుల మనస్సుకు)కష్టం కలిగించని, వాక్యమ్=వాక్యము, స్వాధ్యాయాభ్యసనం చైవ=స్వాధ్యాయాభ్యాసము, వాఙ్మయం తపః = వాఙ్మయమైన తపస్సుగా, ఉచ్యతే=చెప్పబడుచున్నది.

భాష్యమ్

అనుద్వేగేతి:-అనుద్వేగకరం ప్రాణినామ్ అదుఃఖకరం వాక్యం సత్యం ప్రియ హితం చ యత్. ప్రియహితే దృష్టాదృష్టార్థే. అనుద్వేగకరత్వాదిభిః ధర్మైః వాక్యం విశేష్యతే. విశేషణధర్మసముచ్చయార్థః చ శబ్దః. పరప్రత్యాయనార్థం ప్రయుక్తస్య వాక్యస్య సత్యప్రియ తానుద్వేగకరత్వానామ్ అన్యతమేన, ద్వాభ్యాం, త్రిభిః వా హీనతా స్యాత్ యది న తత్ వాఙ్మయం తపః. తథా సత్యవాక్యస్య ఇతరేషామ్ అన్యతమేన ద్వాభ్యాం త్రిభిర్వా హీన తాయాం న వాఙ్మయతపస్త్వమ్. తథా ప్రియవాక్యస్యాపి ఇతరేషామ్ అన్యతమేన ద్వాభ్యాం త్రిభిర్వా హీనస్య న వాఙ్మయతపస్త్వమ్. తథా హితవాక్యస్యాపి ఇతరేషామ్ అన్యతమేన ద్వాభ్యాం త్రిభిర్వా వియుక్తస్య న వాఙ్మయతపస్త్వమ్. కిం పునః తత్ తపః? యత్ సత్యం వాక్యమ్ అనుద్వేగకరం ప్రియహితం చ యత్ తత్ పరమం తపః వాఙ్మయమ్. యథా-"శాన్తో భవ వత్స స్వాధ్యాయం యోగం చానుతిష్ఠ. తథా తే శ్రేయో భవిష్యతి". స్వాధ్యాయాభ్యసనం చైవ యథావిధి, వాఙ్మయం తపః ఉచ్యతే. 15

బాలానందిని

అనుద్వేగేతి:-ప్రాణులకు దుఃఖం కలిగించనిది,ప్రియము హితమూ అయిన ఏ వాక్యం ఉన్నదో అది.ప్రియహితాలు దృష్టాదృష్టార్థాలు.(ఇహలోకంలోను, తాత్కాలికంగాను) సుఖం కలిగించేది ప్రియం,దృష్టప్రయోజనం,పరలోకలోను,భవిష్యత్తులోను సుఖం కలిగించేది హితం అదృష్టప్రయోజనం).అనుద్వేకరత్వం మొదలైన ధర్మాలచేత వాక్యం విశేషింప బడుచున్నది.(ఇవి వాక్యంలో ఉండవలసిన విశేషాలు)విశేషణాలైన ధర్మాలకు సముచ్చ యాన్ని తెలపడంకోసం'చ'శబ్దం ప్రయోగించబడింది.(అనుద్వేగకరత్వం మొదలైన నాలుగు ధర్మాలు సమప్రాధాన్యం కలవి.అన్నీ కలిస్తేనే వాఙ్మయతపస్సు అవుతుంది అని సూచించడం కోసం 'చ'శబ్దం).ఇతరులకు ఏదైన ఒక విషయం తెలపడంకోసం వాక్యం ప్రయోగించబడు తుంది.దానిలో సత్యత్వప్రియత్వ-హితత్వ-అనుద్వేకరత్వాదులలో ఏ ఒకటి లోపించినా,రెండు లోపించినా,మూడు లోపించినా అది వాఙ్మయతపస్సు కాజాలదు.సత్యవాక్యం,మిగిలిన మూడింటిలో ఒకటి లోపించినా,రెండు లోపించినా, మూడు లోపించినా వాఙ్మయతపస్సు కాజాలదు.అట్లే ప్రియవాక్యం మిగిలిన మూడింటిలో ఒకటి లోపించినా,రెండు లోపించినా మూడు లోపించినా వాఙ్మయతపస్సు కాజాలదు.అట్లే హితవాక్యం కూడ మిగిలిన వాటిలో ఏ ఒకటో లోపించినా,రెండు లోపించినా, మూడు లోపించినా వాఙ్మయతపస్సు కాజాలదు. ఏమిటి ఆ తపస్సు?ఏ వాక్యం సత్యమో,అనుద్వేగ కరమో,ప్రియమో,హితమో అదే గొప్ప వాఙ్మయతపస్సు.ఉదాహరణకి-"వత్సా స్వాధ్యాయాన్ని యోగాన్నీ కూడ అనుష్ఠించుము.అలా చేస్తే నీకు శ్రేయస్సు కలుగుతుంది."ఇత్యాదివాక్యం నాలుగు ధర్మాలతోను కూడిన వాక్యం.యథావిధిగా స్వాధ్యాయాభ్యాసంచేయడం కూడ వాఙ్మయతపస్సు అని చెప్పబడుతుంది. 15

మూ. మనఃప్రసాదః సౌమ్యత్వం మౌనమాత్మవినిగ్రహః,
భావసంశుద్ధిరిత్యేతత్తపో మానసముచ్యతే. 16

ప్ర.అ.మన ఇతి:- మనఃప్రసాదః=మనస్సుయొక్క నిర్మలత్వం,సౌమ్యత్వమ్= సౌమ్యంగా ఉండడం,మౌనమ్=మౌనము,ఆత్మవినిగ్రహః=తనను తాను(మనస్సును) నిగ్రహించుకొనడం,భావసంశుద్ధిః=భావముయొక్క శుద్ధి,ఇత్యేతత్=ఇది,మానసమ్= మనసుకు సంబంధించిన,తపః=తపస్సుగా,ఉచ్యతే=చెప్పబడుచున్నది.

భాష్యమ్

మన ఇతి:-మనసః ప్రసాదః మనసః స్వచ్ఛ ప్రశాన్తిః స్వచ్ఛతాపాదనం మనసః ప్రసాదః. సౌమ్యత్వమ్-యత్ సౌమనస్యమ్ ఆహుః ముఖాదిప్రసాదకార్యోన్నేయా అన్తః

కరణస్య వృత్తిః. మౌనమ్ -వాక్సంయమోఽపి మనఃసంయమపూర్వకః భవతీతి కార్యేణ కారణమ్ ఉచ్యతే మనఃసంయమః మౌనమ్ ఇతి. ఆత్మవినిగ్రహః -మనోనిరోధః సర్వతః సామాన్యరూపః ఆత్మవినిగ్రహః;వాగ్విషయస్యైవ మనసః సంయమః మౌనమ్ ఇతి విశేషః. భావసంశుద్ధిః - పరైః వ్యవహారకాలే అమాయావిత్వం భావసంశుద్ధిః ఇత్యేతత్ తపః మానసమ్ ఉచ్యతే. 16

బాలానందిని

మన ఇతి: -మనఃప్రసాదం అనగా మనస్సుయొక్క ప్రశాంతి,మనస్సును స్వచ్ఛంగా చేసికొనడం మనస్సుయొక్క ప్రసాదం. ముఖాదులు ప్రసన్నంగా ఉండడం అనే కార్యం గల (ముఖాదులను ప్రసన్నంగా ఉండే టట్లు చేసే)అంతఃకరణవృత్తి సౌమ్యత్వం. దీనిని సౌమనస్యం అంటారు. మౌనం,అనగా వాక్కును (వాగింద్రియాన్ని)అదుపులో పెట్టుకొనడం కూడ మనః సంయమపూర్వకం. (మనస్సును అదుపులో పెట్టుకొంటేనే వాక్సంయమం కుదురుతుంది. అందుచేత) మనఃసంయమం కారణం,వాక్సంయమం కార్యం)అందువల్ల కార్యంచేత(వాక్సంయమంచేత) కారణమైన మనఃసంయమం మౌన మని చెప్పబడు తూన్నది. అనగా బలవంతంగా ఏదో విధంగా నోరుమూసికొని ఉండడం కాదు;మనః సంయమనం ద్వారా వాక్సంయమనం చేసుకోవాలి అని అర్థం). ఆత్మవినిగ్రహం అనగా మనోనిరోధం. సామన్యరూపంలో అన్ని వైపులనుండీ మనస్సును నిగ్రహించుకొనడం ఆత్మ వినిగ్రహం;వాక్కు విషయంలో మాత్రమే మనస్సును నిగ్రహించుకొనడం మౌనం అని ఈ రెండింటికీ భేదం. భావసంశుద్ధి-ఇతరులతో వ్యవహరించే టప్పుడు మాయావిగా ఉండకపోవడం భావసంశుద్ధి ఇదంతా మానస మైన తపస్సుగా చెప్పబడుచున్నది. 16

భాష్యమ్

యథోక్తం కాయికం వాచికం మానసం చ తపః తప్తం నరైః సత్త్వాదిభేదేన కథం త్రివిధం భవతీత్యుచ్యతే-

మూ. శ్రద్ధయా పరయా తప్తం తపస్తత్త్రివిధం నరైః,
అఫలాకాఙ్క్షిభిర్యుక్తైః సాత్త్వికం పరిచక్షతే. 17

బాలానందిని

యథోక్తమితి: -నరులు చేసిన,పైన చెప్పిన కాయికము,వాచికము,మానసికము అయిన తపస్సు సత్త్వాదిభేదంచేత ఎట్లు మూడు విధా లవుతుందో చెప్పబడుచున్నది-

ప్రతి. శద్ధయా ఇతి: -అఫలాకాఙ్క్షిభిః=ఫలమును కాంక్షించనివారు(కోరనివారు),

యుక్తైః=ఆసక్తితో పూనుకొన్నవారు అయిన,నరైః=నరులచేత,పరయా=గొప్పదైన,శ్రద్ధయా= శ్రద్ధతో,తప్తమ్=చేయబడిన,తత్=ఆ,తపః=తపస్సు సాత్త్వికమ్=సాత్త్వికతపస్సు=అని, పరిచక్షతే=చెప్పుదురు.

భాష్యమ్

శ్రద్ధయా ఆస్తిక్యబుద్ధ్యా,పరయా ప్రకృష్టయా,తప్తమ్ అనుష్ఠితమ్,తపః తత్ ప్రకృతమ్,త్రివిధం త్రిప్రకారం త్ర్యధిష్ఠానం,నరైః అనుష్ఠాతృభిః అఫలాకాఙ్క్షిభిః ఫలాకాఙ్క్షారహితైః,యుక్తైః సమాహితైః,యత్ ఈదృశం తపః సాత్త్వికం సత్త్వనిర్వృత్తం పరిచక్షతే,కథయన్తి శిష్టాః. 17

బాలానందిని

శ్రద్ధయేతి:-అధికమైన ఆస్తిక్యబుద్ధితో చేయబడిన ప్రకృతమైన,మూడు విధాలైన, మనోవాక్కాయా లనే మూడు అధిష్ఠానములు గల తపస్సు, ఫలమునందు కోరిక లేనివారు, సమాహితులు(ఏకాగ్రచిత్తులు)అయిన అనుష్ఠాతలచేత అనుష్ఠింపబడిన తపస్సు సాత్త్వికమని శిష్టులు చెప్పుదురు. 17

మూ. సత్కారమానపూజార్థం తపో దమ్భేన చైవ యత్,
క్రియతే తదిహ ప్రోక్తం రాజసం చలమధ్రువమ్. 18

ప్ర. అ. సత్కారేతి: -యత్=ఏ,తపః=తపస్సు,దమ్భేన=దంభముతో,సత్కారమానపూజార్థమ్=మంచివా డనే పేరుకోసము,గౌరవంకోసము,పూజకోసము,క్రియతే=చేయబడుతుందో,తత్=అది,రాజసమ్=రాజసమైన తపస్సుగా,ప్రోక్తమ్=చెప్పబడినది. ఇహ= ఇక్కడ,చలమ్=చంచల మైనది,అధ్రువమ్=అస్థిరమైనది.

భాష్యమ్

సత్కారేతి:-సత్కారమానపూజార్థమ్-సత్కారః సాధుకారః,సాధుః అయం తపస్వీ బ్రాహ్మణః ఇత్యేవమర్థం,మానః మాననం ప్రత్యుత్థానాభివాదనాని, తదర్థం,పూజా-పాదప్రక్షాలనార్చనాశయితృత్వాదిః,తదర్థం చ తపః సత్కారమానపూజార్థం,దమ్భేన చ ఏవ యత్ క్రియతే తపః తత్ ఇహ ప్రోక్తం రాజసం చలం,కాదాచిత్కఫలత్వేన అధ్రువమ్. 18

బాలానందిని

సత్కారేతి:-సత్కారమానపూజలకోసమై-తపఃశాలియైన ఈ బ్రాహ్మణుడు చాలా

సాధువు అని అనిపించుకొనడం సత్కారం;దానికోసము,ప్రత్యుత్థానము(ఎవరైనా వచ్చినప్పుడు ఆదరసూచకంగా లేచి దగ్గరికి వెళ్లడం ప్రత్యుత్థానం)నమస్కరించడం మొదలైన గౌరవం చేయడం మానం;దానికోసమూ,పాదాలు కడిగి పూజించి భోజనం పెట్టడం మొదలైనది పూజ,దానికోసము,దంభంతోను ఏ తపస్సు చేయబడుతుందో అది ఇక్కడ రాజస మనీ,చంచల మైన దనీ,అప్పు డప్పుడు మాత్రమే ఫలం (అసలు ఫలం ఎలాగా ఇవ్వదు;పైన చెప్పిన సత్కారాదిఫలం)ఇస్తుంది కాబట్టి అస్థిర మనీ చెప్ప బడుతుంది. 18

మూ. మూఢగ్రాహేణాత్మనో యత్ పీడయా క్రియతే తపః,
పరస్యోత్సాదనార్థం వా తత్తామసముదాహృతమ్. 19

ప్ర.అ. యత్=ఏ,తపః=తపస్సు,మూఢగ్రాహేణ=వివేకజ్ఞానం లేని మొండి పట్టుదలతో,ఆత్మనః=తనయొక్క,పీడయా=పీడచేత,క్రియతే=చేయబడుతుందో,పరస్య=ఇతరునియొక్క,ఉత్సాదనార్థం వా=వినాశంకోసమైనా చేయబడుతుందో,తత్=అది, తామసమ్=తామస మైన తపస్సుగా,ఉదాహృతమ్=చెప్పబడినది.

భాష్యమ్

మూఢేతి:-మూఢగ్రాహేణ అవివేకనిశ్చయేన,ఆత్మనః పీడయా క్రియతే యత్ తపః,పరస్య ఉత్సాదనార్థం వినాశార్థం వా తత్ తామసమ్ ఉదాహృతమ్. 19

బాలానందిని

మూఢేతి:-అవివేకంతో కూడిన నిశ్చయంతో, తనకు పీడతో(తనను తాను పీడించు కొంటూ),ఏ తపస్సు చేయబడుతుందో,లేదా పరుల వినాశంకొరకు చేయబడుతుందో ఆ తపస్సు తామస మని చెప్పబడుతుంది. 19

భాష్యమ్

ఇదానీం దానభేదః ఉచ్యతే-

మూ. దాతవ్యమితి యద్దానం దీయతేఽనుపకారిణే,
దేశే కాలే చ పాత్రే చ తద్దానం సాత్త్వికం స్మృతమ్. 20

బాలానందిని

ఇదానీమితి:-ఇప్పుడు దానాలలోని భేదం చెప్పబడుచున్నది-

ప్ర.అ. **దాతవ్యమితి**:-యత్=ఏ,దానమ్=దానము,దాతవ్యమ్ ఇతి=తప్పక ఇవ్వ వలసినదే అని,అనుపకారిణే=ఉపకారం చేయనివానికి,దేశే=తగిన దేశమునందు,కాలే

చ=తగిన కాలమునందు,పాత్రే చ=తగిన పాత్రయందు,దీయతే=ఇవ్వబడుతుందో,తత్= ఆ,దానమ్=దానము,సాత్త్వికమ్=సాత్త్వికదానంగా,స్మృతమ్=చెప్పబడినది.

భాష్యమ్

దాతవ్యమ్ ఇత్యేవం మనః కృత్వా యత్ దానం దీయతే అనుపకారిణే ప్రత్యుప కారాసమర్థాయ,సమర్థాయాపి నిరపేక్షం దీయతే,దేశే పుణ్యే కురుక్షేత్రాదౌ,కాలే సంక్రాన్త్యాదౌ,పాత్రే చ షడఙ్గవిత్ వేదపారగః ఇత్యాదౌ,తత్ దానం సాత్త్వికం స్మృతమ్. 20

బాలానందిని

దాతవ్యమితి:-ఇవ్వాలి అని నిశ్చయం చేసికొని ప్రత్యుపకారం చేయడానికి సమర్థుడు కానివానికీ,సమర్థుడైన వానినుండి ప్రత్యుపకారాన్ని అపేక్షించకుండానూ కురు క్షేత్రాదిపుణ్యక్షేత్రమునందు,సంక్రాంతి మొదలైన పుణ్యకాలమునందు,షడంగవేత్త యైన బ్రాహ్మణుడు ఇత్యాదిరీతిలో సత్పాత్ర అయిన వానికీ. ఏ దానం చేయబడుతుందో అది సాత్త్వికదానం. 20

మూ. యత్తు ప్రత్యుపకారార్థం ఫలముద్దిశ్య వా పునః,
దీయతే చ పరిక్లిష్టం తద్దానం రాజసం స్మృతమ్. 21

ప్ర. అ. యత్త్వితి:-యత్ తు=ఏ దాన మైతే,ప్రత్యుపకారార్థమ్=ప్రత్యుపకారం కొరకు,ఫలమ్=ఫలమును,ఉద్దిశ్య వా పునః=ఉద్దేశించి యైనా,దీయతే=ఇవ్వబడుతుందో, పరిక్లిష్టమ్=ఖేదంతో కూడి,తత్=ఆదానం,రాజసమ్=రాజసముగా,స్మృతమ్= చెప్పబడినది.

భాష్యమ్

యత్త్వితి:-యత్తు దానం ప్రత్యుపకారార్థం కాలే తు అయం మాం ప్రత్యుప కరిష్యతి ఇత్యేవమర్థం,ఫలం వా అస్య దానస్య మే భవిష్యతి అదృష్టమ్ ఇతి తదుద్దిశ్య పునః దీయతే చ,పరిక్లిష్టం ఖేదసంయుక్తం,తత్ రాజసం స్మృతమ్. 21

బాలానందిని

యత్త్వితి:-ఏ దాన మైతే ప్రత్యుపకారంకొరకు,సమయం వచ్చినప్పుడు ఇతడు నాకు ప్రత్యుపకారం చేస్తాడు అనే భావంతో,లేదా దీనివల్ల నాకు అదృష్టమైన ఫలం కలుగుతుంది అని దానిని ఉద్దేశించి కాని ఇవ్వబడుతుందో,ఖేదంతో కూడిన ఆ దానం రాజసదాన మని చెప్పబడుతుంది. 21

మూ. అదేశకాలే యద్దానమపాత్రేభ్యశ్చ దీయతే,
అసత్కృతమవజ్ఞాతం తత్తామసముదాహృతమ్. 22

ప్ర.అ. యత్=ఏ,దానమ్=దానము,అదేశకాలే=తగని దేశంలో తగని కాలంలో, అసత్కృతమ్=సత్కారము లేకుండగాను,అవజ్ఞాతమ్=అవమానపూర్వకంగాను,అపాత్రేభ్యః =అపాత్రలకు,దీయతే=ఇవ్వబడుతుందో,తత్=అది,తామసమ్=తామస మని,ఉదాహృతమ్ =చెప్పబడినది.

భాష్యమ్

అదేశేతి:-అదేశకాలే అపుణ్యే దేశే మ్లేచ్ఛాశుచ్యాదిసంకీర్ణే,అకాలే పుణ్యహేతుత్వేన అప్రఖ్యాతే సంక్రాన్త్యాదివిశేషరహితే,అపాత్రేభ్యః చ మూర్ఖతస్కరాదిభ్యః దేశాదిసంపత్తౌ చ,అసత్కృతం ప్రియవచనపాదప్రక్షాలనపూజాదిరహితమ్,అవజ్ఞాతం పాత్రపరిభవయుక్తం యత్ దానం తత్ తామసమ్ ఉదాహృతమ్. 22

బాలానందిని

అదేశేతి:-ఏ దానం మ్లేచ్ఛులు అపవిత్రులు మొదలైనవాళ్లతో నిండిన అపుణ్యమైన దేశంలోను,పుణ్యహేతువుగా ప్రసిద్ధం కాని,సంక్రాంత్యాదివిశేషా లేవీ లేని కాలంలోను, మూర్ఖులు(విద్యావిహీనులు)దొంగలు మొదలైనవాళ్లకి ఇవ్వబడినదో,దేశాదిసంపత్తి ఉన్నా కూడ,ప్రియవచనములు పాదప్రక్షాలనము పూజ మొదలైనవి లేనిదో, పాత్రను తిరస్కరించ డంతో కూడినదో అది తామస మని చెప్పబడినది. 22

భాష్యమ్

యజ్ఞదానతపఃప్రభృతీనాం సాద్గుణ్యకరణాయ అయమ్ ఉపదేశః ఉచ్యతే-

మూ. ఓంతత్సదితి నిర్దేశో బ్రహ్మణస్త్రివిధః స్మృతః,
బ్రాహ్మణాస్తేన వేదాశ్చ యజ్ఞాశ్చ విహితాః పురా. 23

బాలానందిని

యజ్ఞేతి:- యజ్ఞదానతపస్సులు మొదలైనవాటికి సాద్గుణ్యం(మంచి గుణం)సంపా దించడానికి ఈ ఉపదేశం చెప్పబడుచున్నది-(ఏదైన కర్మ సరిగా జరగడంలేదనే సందేహం కలిగినప్పుడు ఈ పదాలలో ఒక పదం ఉచ్చరిస్తే ఆ లోపం తీరుతుంది)-

ప్ర.అ.**ఓమితి**:-ఓమ్ తత్ సత్ ఇతి=ఓమ్ తత్ సత్ అని,త్రివిధః=మూడు విధాలైన, బ్రహ్మణః నిర్దేశః=బ్రహ్మయొక్క నిర్దేశం,స్మృతః=చెప్పబడినది.పురా=పూర్వం,తేన=ఆ

త్రివిధబ్రహ్మనిర్దేశంతో,బ్రాహ్మణాః=బ్రాహ్మణులు,వేదాః చ=వేదాలు, యజ్ఞాః చ=యజ్ఞాలు, విహితాః=విధించబడినవి.

భాష్యమ్

ఓమ్ తత్ సత్ ఇత్యేషః నిర్దేశః-నిర్దిశ్యతే అనేన ఇతి నిర్దేశః,త్రివిధః నామ నిర్దేశః బ్రహ్మణః,స్మృతః చిన్తితః వేదాన్తేషు బ్రహ్మవిద్భిః.బ్రాహ్మణాః తేన నిర్దేశేన త్రివిధేన వేదాశ్చ యజ్ఞాశ్చ విహితాః నిర్మితాః పురా పూర్వమ్ ఇతి నిర్దేశస్తుత్యర్థముచ్యతే. 23

బాలానందిని

ఓమితి:-'ఓమ్' 'తత్' 'సత్'అను నిర్దేశం,దేనిచేత నిర్దేశింపబడుతుందో చెప్పబడుతుందో అది నిర్దేశం.(అనగా పేరు).బ్రహ్మయొక్క మూడు విధాలైన నామనిర్దేశం, చెప్పబడింది.వేదాంతాలలో బ్రహ్మవేత్తలచేత చెప్పబడింది.ఆ మూడు విధాలైన నిర్దేశంచేత పూర్వం(ప్రజాపతిచేత)బ్రాహ్మణులు,వేదాలు,యజ్ఞాలు నిర్మించబడ్డాయి అని నిర్దేశాన్ని స్తుతించడంకోసం చెప్పబడుతున్నది. 23

మూ. తస్మాదోమిత్యుదాహృత్య యజ్ఞదానతపఃక్రియాః,
ప్రవర్తన్తే విధానోక్తాః సతతం బ్రహ్మవాదినామ్. 24

ప్ర.అ. తస్మాత్=అందువలన,బ్రహ్మవాదినామ్=బ్రహ్మవాదులయొక్క,విధానోక్తాః =శాస్త్రోక్తమైన,యజ్ఞదానతపఃక్రియాః=యజ్ఞముల దానముల తపస్సుల ఆచరణములు, సతతమ్=ఎల్లప్పుడూ, ఓమితి=ఓమ్ అని,ఉదాహృత్య=పలికి,ప్రవర్తన్తే=ప్రవర్తించుచున్నవి.

భాష్యమ్

తస్మాత్ ఓమితి ఉదాహృత్య ఉచ్చార్య,యజ్ఞదానతపఃక్రియా యజ్ఞాదిస్వరూపాః క్రియాః,ప్రవర్తన్తే,విధానోక్తాః శాస్త్రచోదితాః,సతతం సర్వదా బ్రహ్మవాదినాం బ్రహ్మవదన శీలానామ్. 24

బాలానందిని

తస్మాదితి:-అందువలన,బ్రహ్మవాదులయొక్క,అనగా వేదాధ్యయనతదుక్తవిషయ విమర్శనాశీలులయొక్క,శాస్త్రవిహితము లైన యజ్ఞాదిక్రియలు ఎల్లప్పుడు'ఓమ్'అని ఉచ్చరించి జరుగుచుండును.

మూ. తదిత్యనభిసంధాయ ఫలం యజ్ఞతపఃక్రియాః,
దానక్రియాశ్చ వివిధాః క్రియన్తే మోక్షకాఙ్క్షిభిః. 25

ప్ర.అ. తదితి:-మోక్షకాఙ్క్షిభిః=మోక్షమును కోరేవాళ్లచేత,తత్ ఇతి='తత్'అని ఉచ్చరించి, ఫలమ్=పలమును,అనభిసంధాయ=ఉద్దేశించక,యజ్ఞతపఃక్రియాః=యజ్ఞ క్రియలు తపః క్రియలు,వివిధాః=అనేకవిధాలైన,దానక్రియాః చ=దానక్రియలు,క్రియన్తే =చేయబడుచున్నవి.

భాష్యమ్

తదితి:- తదితి అనభిసంధాయ తదితి బ్రహ్మాభిధానమ్ ఉచ్చార్య అనభిసంధాయ చ కర్మణః ఫలం యజ్ఞతపఃక్రియాః యజ్ఞక్రియాశ్చ తపఃక్రియాశ్చ యజ్ఞతపఃక్రియాః దానక్రియాశ్చ వివిధాః క్షేత్రహిరణ్యప్రదానాదిలక్షణాః,క్రియన్తే నిర్వర్త్యన్తే,మోక్షకాఙ్క్షిభిః మోక్షార్థిభిః ముముక్షుభిః. 25

బాలానందిని

తదితి:-బ్రహ్మయొక్క నామమైన 'తత్'అనే పదాన్ని ఉచ్చరించి,కర్మఫలాన్ని అపేక్షించకుండగా,మోక్షం కావా లని కోరుకొనేవాళ్లచేత యజ్ఞక్రియలు,తపఃక్రియలు, భూదానసువర్ణదానాదు లైన అనేకవిధా లైన దానక్రియలూ చేయబడుచున్నవి. 25

భాష్యమ్

ఓంతచ్ఛబ్దయోః వినియోగః ఉక్తః,అథ ఇదానీం సచ్ఛబ్దస్య వినియోగః ఉచ్యతే-

మూ. సద్భావే సాధుభావే చ సదిత్యేతత్ప్రయుజ్యతే,
ప్రశస్తే కర్మణి తథా సచ్ఛబ్దః పార్థ యుజ్యతే. 26

బాలానందిని

ఓమితి:- 'ఓమ్'శబ్ద 'తత్'శబ్దాల వినియోగం చెప్పబడినది. ఇంక ఇప్పుడు తచ్ఛబ్దం యొక్క వినియోగం చెప్పబడుచున్నది.-

ప్ర.అ. సద్భావే ఇతి:-సత్ ఇత్యేతత్='సత్'అనే ఈ పదం,సద్భావే=ఉండబోతుంది అని చెప్పవలసి నప్పుడు,లేదా అంతకు పూర్వం లేనిది అప్పుడు ఉన్నది అని చెప్పేటప్పుడు, సాధుభావే చ=బాగున్నది అని చెప్పవలసినప్పుడు, ప్రయుజ్యతే = ప్రయోగించబడుతుంది. పార్థా=అర్జునా!తథా=అట్లే,ప్రశస్తే=ప్రశస్త మైన,కర్మణి=కర్మ యందు,సచ్ఛబ్దః=సచ్ఛబ్దం, యుజ్యతే=ప్రయోగించబడుతుంది.

భాష్యమ్

సద్భావే అసతః సద్భావే,యథా అవిద్యమానస్య పుత్రస్య జన్మని,తథా సాధు భావే అసద్వృత్తస్య అసాధోః సద్వృత్తతా సాధుభావః,తస్మిన్ సాధుభావే చ సత్ ఇత్యేతత్

అభిధానం బ్రహ్మణః ప్రయుజ్యతే,తత్ర ఉచ్యతే,అభిధీయతే.ప్రశస్తే కర్మణి వివాహాదౌ చ తథా సచ్ఛబ్దః పార్థ! యుజ్యతే ప్రయుజ్యతే ఇత్యేతత్. 26

బాలానందిని

సద్భావే ఇతి:-అంతకు మునుపు లేనిది ఇప్పుడు ఉన్నప్పుడు;ఉదాహరణకి అంతకు పూర్వం లేని పుత్రుడు పుట్టిన తరువాత ఉన్నాడు అని చెప్పబడుచున్నాడు;అట్లే, సాధు భావమునందు-చెడ్డ నడవడిక గల అసాధువు మంచి నడవడిక కలవా డవడం సాధు భావం;అట్టి సాధుభావమునందు 'సత్'అనే బ్రహ్మయొక్క పేరు,దానివిషయంలో ప్రయోగించబడుతుంది. అర్జునా!ప్రశస్తమైన వివాహాదికర్మయందు కూడ సచ్ఛబ్దం ప్రయోగించబడుతుంది.'యుజ్యతే'అనగా ప్రయుజ్యతే అన్నట్లు.

వి.లేనిది ఉన్నప్పుడు,చెడ్డగా ఉన్నది బాగైనప్పుడు,మంచి పని జరుగుచున్నప్పుడు "సన్ దేవదత్తస్య పుత్రః',దేవదత్తః సన్','సత్ వివాహకర్మ'ఇత్యాదివిధంగా సచ్ఛబ్దం ప్రయో గించబడుతుంది.ఇది బ్రహ్మకు పేరు గాన వేటితో ఈ శబ్దం చేర్చబడుతుందో వాటి మంచితనాన్ని సూచిస్తుంది. 26

మూ. యజ్ఞే తపసి దానే చ స్థితిః సదితి చోచ్యతే,
కర్మ చైవ తదర్థీయం సదిత్యేవాభిధీయతే. 27

ప్ర.అ. యజ్ఞే ఇతి:-యజ్ఞే=యజ్ఞమునందు,తపసి=తపస్సునందు,దానే చ= దానమునందూ కూడ,స్థితిః=స్థితి,నిలకడగా ఉండడం,సత్ ఇతి=సత్ అని, ఉచ్యతే=చెప్ప బడుచున్నది.తదర్థీయమ్=వాటికి(యజ్ఞతపోదానాలకు)సంబంధించిన,అవి ప్రయోజనం గల,అవి సాధించడానికి చేసే,లేదా ఓం-తత్-సత్ శబ్దాల అర్థమైన బ్రహ్మ ప్రయోజనంగా గల,బ్రహ్మకు సమర్పించే,కర్మ చైవ=కర్మ కూడ,సత్ ఇత్యేవ='సత్'అనియే,అభిధీయతే=చెప్ప బడుతుంది.

భాష్యమ్

యజ్ఞే యజ్ఞకర్మణి యా స్థితిః,తపసి చ యా స్థితిః,దానే చ యా స్థితిః సా చ సత్ ఇతి ఉచ్యతే విద్వద్భిః.కర్మ చ ఏవ,తదర్థీయం యజ్ఞదానతపోర్థీయమ్,అథవా యస్యాభిధానత్రయం ప్రకృతం తదర్థీయమ్,ఈశ్వరార్థీయమ్ ఇత్యేతత్;సత్ ఇత్యేవ అభిధీయతే.తత్ ఏతత్ యజ్ఞతప ఆది కర్మ అసాత్త్వికం విగుణమపి శ్రద్ధాపూర్వకం బ్రహ్మణః అభిధానత్రయోఽప్రయోగేణ సగుణం సాత్త్వికం సంపాధితం భవతి.27

బాలానందిని

యజ్ఞే ఇతి:-యజ్ఞకర్మయందు నిలిచి ఉండడం,తపస్సునందు నిలిచి ఉండడం దానమునందు నిలచి ఉండడమూ కూడ విద్వాంసులచేత "సత్"అని చెప్పబడుచున్నది. యజ్ఞదానతపస్సులు ప్రయోజనంగా గల,వాటికొరకై చేసే,కర్మ కూడ(ధనార్జనాదిప్రయత్నం కూడ)'సత్'అని చెప్పబడుచున్నది. లేదా ఈ మూడు పదాలు ఏ అర్థాన్ని (బ్రహ్మను) బోధిస్తాయో దానికొరకు (ఈశ్వరప్రీతికొరకు)చేసే కర్మ కూడ సత్ అని చెప్పబడుచున్నది. ఈ యజ్ఞతప ఆదికర్మ అసాత్త్వికమైనా,విగుణమైనా(లోపా లున్న దైనా)బ్రహ్మయొక్క నామధేయాలను మూడింటినీ శ్రద్ధాపూర్వకంగా ప్రయోగిస్తే సగుణంగాను సాత్త్వికంగాను అయే టట్లు చేయబడుతుంది. 27

భాష్యమ్

తత్ర చ సర్వత్ర శ్రద్ధాప్రధానతయా సర్వం సంపాద్యతే యస్మాత్ తస్మాత్-

మూ. అశ్రద్ధయా హుతం దత్తం తపస్తప్తం కృతం చ యత్,
అసదిత్యుచ్యతే పార్థ న చ తత్ప్రేత్య నో ఇహ. 28

ఇతి శ్రీమహాభారతే శతసాహస్ర్యాం సంహితాయాం వైయాసిక్యాం భీష్మపర్వణి శ్రీభగవద్గీతాసు ఉపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే శ్రద్ధాత్రయవిభాగయోగో నామ సప్తదశోఽధ్యాయః

బాలానందిని

తత్రేతి:-యజ్ఞాదు లన్నింటిలోను శ్రద్ధ ప్రధానంగా ఉంటేనే వాటిని అన్నింటినీ సంపన్నం (సగుణం)చేయవచ్చును గాన-

ప్ర.అ. **అశ్రద్ధయేతి**:- పార్థ=అర్జునా!అశ్రద్ధయా=అశ్రద్ధతో,హుతమ్=చేయబడిన హోమము,దత్తమ్=ఇవ్వబడిన,దానమ్=దానము,తప్తమ్=చేయబడిన,తపః=తపస్సు, యత్=ఏ పూజానమస్కారాదికము,కృతమ్=చేయబడినదో అదీ,అసత్=అసత్ అని,ఉచ్యతే =చెప్పబడుచున్నది. తత్=అది,ప్రేత్య=మరణించి(మరణానంతరం),న=ఉపయోగించదు, ఇహ చ=ఇహలోకంలో కూడ,నో=ఉపయోగించదు.

భాష్యమ్

అశ్రద్ధయా హుతం హవనం కృతమ్,దత్తం చ బ్రాహ్మణేభ్యః అశ్రద్ధయా,తపః తప్తమ్ అనుష్ఠితమ్ అశ్రద్ధయా,తథా అశ్రద్ధయైవ కృతం యత్ స్తుతినమస్కారాది

తత్ సర్వమ్ అసత్ ఇతి ఉచ్యతే;మత్ప్రాప్తిమార్గాబాహ్యత్వాత్,పార్థ.న చ తత్ బహ్వాయాసమపి ప్రేత్య ఫలాయ నో అపి ఇహార్థం;సాధుభిః నిన్దితత్వాత్ ఇతి. 28

ఇతి శ్రీమత్పరమహంస
పరివ్రాజకాచార్యగోవిన్దభగవత్పూజ్యపాదశిష్యశ్రీమదాచార్య
శ్రీశంకరభగవతః కృతౌ శ్రీభగవద్గీతాభాష్యే శ్రద్ధాత్రయవిభాగయోగో నామ
సప్తదశః అధ్యాయః

బాలానందిని

అశ్రద్ధయేతి:-అశ్రద్ధతో హోమం చేయబడినది,అశ్రద్ధతో బ్రాహ్మణులకు ఇవ్వబడినది,అశ్రద్ధతో చేయబడిన తపస్సు, అశ్రద్ధతో చేసిన స్తుతి-నమస్కారాదికము,అది అంతా కూడ అసత్ అని చెప్పబడుతుంది.అందుకు కారణం అవి ఏవీ నన్ను పొందడానికి సాధనా లైన మార్గాలు కావు.అర్జునా!అలాంటి హుతాదికం అధికమైన శ్రమతో చేయబడినా కూడ మరణానంతరమూ ఫలం ఇవ్వదు;ఇహలోకానికి కూడ ఉపయోగించదు.ఎందువల్ల ననగా ఇది సాధువులచేత నిందింపబడినది. 28

"బాలానందిని"అను శ్రీమద్భగవద్గీతాశాంకరభాష్యాంధ్రవ్యాఖ్యానమునందు
సప్తదశాధ్యాయం సమాప్తం

అథ అష్టాదశోఽధ్యాయః

భాష్యమ్

సర్వస్యైవ గీతాశాస్త్రస్య అర్థః అస్మిన్ అధ్యాయే ఉపసంహృత్య సర్వశ్చ వేదార్థః వక్తవ్య ఇత్యేవమర్థః అయమధ్యాయః ఆరభ్యతే.సర్వేషు అతీతేషు అధ్యాయేషు ఉక్తః అర్థః అస్మిన్ అధ్యాయే అవగమ్యతే. అర్జునః తు సంన్యాసత్యాగశబ్దార్థయోః ఏవ విశేషం బుభుత్సుః ఉవాచ-

అర్జున ఉవాచ-

మూ. సంన్యాసస్య మహాబాహో తత్త్వమిచ్ఛామి వేదితుమ్,
త్యాగస్య చ హృషీకేశ పృథక్కేశినిషూదన. 1

బాలానందిని

సర్వస్యేతి:-ఈ అధ్యాయంలో సమస్తగీతాశాస్త్రంయొక్క అర్థం ఉపసంహరించి చెప్పవలసి ఉన్నది,సమస్తవేదార్థము కూడ చెప్పవలసి ఉన్నది.అందుకొరకై ఈ అధ్యాయం

ప్రారంభించబడుచున్నది. గడచిన అన్ని అధ్యాయాలలోను చెప్పబడిన అర్థం ఈ అధ్యాయంలో తెలియబడుచున్నది. అయితే అర్జునుడు మాత్రం కేవలం 'సంన్యాస' 'త్యాగ' శబ్దాల అర్థాల విశేషాన్ని తెలుసుకొనదలచినవాడై అన్నాడు.

అర్జును డిట్లు అన్నాడు.

ప్ర.అ. **సంన్యాసస్యేతి**:-మహాబాహో=గొప్ప బాహువులు కలవాడా,హృషీకేశ= ఇంద్రియాలకు నియామకుడ వైనవాడా,కేశినిషూదన=కేశి అనే రాక్షసుణ్ణి సంహరించిన వాడా,సంన్యాసస్య=సంన్యాసముయొక్క,త్యాగస్య చ=త్యాగం యొక్కతత్త్వమ్=తత్త్వమును, వేదితుమ్=తెలుసుకొనుటకు,ఇచ్ఛామి=కోరుచున్నాను.

భాష్యమ్

సంన్యాసస్య-సంన్యాసశబ్దార్థస్య ఇత్యేతత్. హే మహాబాహో,తత్త్వమ్-తస్య భావః తత్త్వమ్;యాథాత్మ్యమ్ ఇత్యేతత్. ఇచ్ఛామి,వేదితుం,జ్ఞాతుం,త్యాగస్య చ-త్యాగశబ్దార్థస్య ఇత్యేతత్. హృషీకేశ,పృథక్ ఇతరేతరవిభాగతః. కేశినిషూదన-కేశినామా హయచ్ఛద్మా అసురః,తం నిషూదితవాన్ భగవాన్ వాసుదేవః తేన నామ్నా సంబోధ్యతే అర్జునేన. 1

బాలానందిని

సంన్యాసస్యేతి: -ఓ!మహాబాహూ!సంన్యాసముయొక్క-సంన్యాసశబ్దార్థముయొక్క అని అర్థం. తత్త్వమును-"తస్య భావః తత్త్వమ్"అను విగ్రహాన్ని బట్టి దానియొక్క ధర్మం తత్త్వం. అనగా యథార్థస్వరూపం. త్యాగముయొక్క త్యాగశబ్దార్థముయొక్క అని అర్థం. తత్త్వాన్ని ఆ రెండింటికీ ఉన్న భేదాన్ని అనుసరించి,హృషీకేశా!తెలుసుకొనగోరుచున్నాను. కేశి అనేవాడు అశ్వం రూపంలో వచ్చిన అసురుడు. భగవంతు డైన వాసుదేవుడు వానిని సంహరించాడు. ఆ పేరుతో అర్జునునిచేత సంబోధించబడుచున్నాడు. 1

భాష్యమ్

తత్ర తత్ర నిర్దిష్టౌ సంన్యాసత్యాగశబ్దౌ న నిర్లుణ్ఠితార్థౌ పూర్వేషు. అధ్యాయేషు. అతః అర్జునాయ పృష్టవతే తన్నిర్ణయాయ-

శ్రీభగవానువాచ-

మూ. కామ్యానాం కర్మణాం న్యాసం సంన్యాసం కవయో విదుః,
సర్వకర్మఫలత్యాగం ప్రాహుస్త్యాగం విచక్షణాః. 2

బాలానందిని

తత్రేతి:- వెనుకటి అధ్యాయాలలో అక్కడక్కడ సంన్యాస-త్యాగశబ్దాలు నిర్దేశించ బడినవి కాని వాటి అర్థాలు సుస్పష్టంగా చెప్పబడలేదు. అందుచేత(ఆ అర్థాలను గూర్చి) అర్జునునకు వాటి నిర్ణయంకొరకు భగవంతుడు ఇలా అన్నాడు-

శ్రీభగవంతు డనెను.

ప్ర.అ. కామ్యానామితి:- కామ్యానామ్=కామ్యము లైన,కర్మణామ్=కర్మలయొక్క న్యాసమ్=విడుచుటను,సంన్యాసమ్=సంన్యాసమునుగా,కవయః=పండితులు,వదన్తి= చెపుతున్నారు. సర్వకర్మఫలత్యాగమ్=సమస్తమైన కర్మల ఫలముయొక్క త్యాగమును,త్యాగమ్ = త్యాగమునుగా,విచక్షణాః=నేర్పరులు,ప్రాహుః=చెప్పుదురు.

భాష్యమ్

కామ్యానామ్ అశ్వమేధాదీనాం కర్మణాం,న్యాసం పరిత్యాగం,సంన్యాసం సంన్యాసశబ్దార్థమ్ అనుష్ఠేయత్వేన ప్రాప్తస్య అననుష్ఠానం,కవయః పణ్డితాః కేచిత్ విదుః విజానన్తి. నిత్యనైమిత్తికానామ్ అనుష్ఠీయమానానాం సర్వకర్మణామ్ ఆత్మసంబన్ధితయా ప్రాప్తస్య ఫలస్య పరిత్యాగః సర్వకర్మఫలత్యాగః,తం ప్రాహుః కథయన్తి త్యాగం త్యాగశబ్దార్థం విచక్షణాః పణ్డితాః. యది కామ్యకర్మపరిత్యాగః ఫలపరిత్యాగః వా అర్థః వక్తవ్యః,సర్వథాపి త్యాగమాత్రం సంన్యాసత్యాగశబ్దయో ఏకః అర్థః,న ఘటపటశబ్దౌ ఇవ జాత్యన్తరభూతార్థౌ. నను నిత్యనైమిత్తికానాం కర్మణాం ఫలమేవ నాస్తీత్యాహుః. కథముచ్యతే తేషాం ఫలత్యాగ ఇతి?యథా వన్ధ్యాయాః పుత్రత్యాగః. నైష దోషః. నిత్యానా మపి కర్మణాం భగవతా ఫలవత్త్వస్య ఇష్టత్వాత్. వక్ష్యతి హి భగవాన్- **"అనిష్టమిష్టం మిశ్రం చ"**(18.12)ఇతి,**"న తు సంన్యాసినామ్"**(18.12)ఇతి చ సంన్యాసినామేవ హి కేవలం కర్మఫలాసంబన్ధం దర్శయన్ అసంన్యాసినాం నిత్యకర్మఫలప్రాప్తిం **"భవ త్యత్యాగినాం ప్రేత్య"**(18.12)ఇతి దర్శయతి. 2

బాలానందిని

కామ్యానామితి:-అశ్వమేధాదికామ్యకర్మల పరిత్యాగమును సంన్యాసశబ్దముయొక్క అర్థమునుగా,అనగా ఏవి అనుష్ఠించా లని చెప్పబడినవో వాటిని అనుష్ఠించకపోవడమునుగా, కొందరు పండితులు తెలుసుకొనుచున్నారు. అనుష్ఠింపబడుచున్న నిత్యకర్మలయొక్క నైమిత్తిక కర్మలయొక్క ఫలమును తనకు సంబంధించనదిగా ప్రాప్తమైన(శాస్త్రోక్తమైన)ఫలమును, త్యజించడం సర్వకర్మఫలత్యాగం,అదే త్యాగ మని,త్యాగశబ్దానికి అర్థ మని పండితులు చెప్పుచున్నారు. కామ్యకర్మలను త్యజించడం అని అర్థం చెప్పినా ఫలాన్ని త్యజించడం అని

అర్థం చెప్పినా,అన్ని విధాలా కూడ "సంన్యాస""త్యాగ'శబ్దాలకు త్యాగము అని ఒకే అర్థం. అంతేనే కాని('సంన్యాస"త్యాగ'శబ్దాలు)'ఘట"పట'శబ్దాల వలె వేరు వేరు జాతు లనే అర్థం చెప్పే శబ్దాలు కావు.(ప్రశ్న)నిత్యనైమిత్తికకర్మలకు ఫలమే లేదంటారు కదా? అలాంటప్పుడు గొడ్రాలు పుత్రుణ్ని త్యజించింది అని చెప్పినట్లు,వాటి ఫలం త్యజింప బడుతుంది అని ఎట్లు చెప్పబడుతున్నది?(సమాధానం)ఈ దోషం లేదు.నిత్యకర్మలకు కూడ ఫలం ఉంటుం దని భగవంతుడు అంగీకరిస్తున్నాడు.భగవంతుడు "అనిష్టమిష్టమ్" అనీ,"న తు సంన్యాసినామేవ"అనీ కూడ చెప్పనున్నాడు. సంన్యాసులకు మాత్రమే కర్మఫలసంబంధం ఉండదు అని చెపుతూ అసంన్యాసుల కైతే నిత్యకర్మలఫలం లభిస్తుంది అని "భగవత్యత్యాగినాంప్రేత్య"అని చూపుతున్నాడు.

వి."అనిష్టమిష్టమ్"ఇత్యాదిశ్లోకంలో-అత్యాగులకు అనగా కర్మపలత్యాగం చేయని గృహస్థాదులకు అనిష్టమూ,ఇష్టము,మిశ్రము అని మూడు విదాలైన కర్మఫలం మరణా నంతరం లభిస్తుంది.సంన్యాసులకు మాత్రం ఎక్కడా కూడ ఫలం లభించదు అని చెప్ప నున్నాడు.దీనినిపట్టి కర్మఫలసంబంధం లేకపోవడం కేవలం సంన్యాసులకే ననీ,సంన్యాసులు కానివాళ్ల కైతే,వాళ్లు కర్మానుష్ఠానం చేస్తారు గాన,కర్మఫలసంబంధం ఉంటుంది అనీ తెలుస్తూన్నది.అందుచేత అసంన్యాసులు కర్మఫలపరిత్యాగం చేయవలసి ఉంటుంది. సంన్యాసుల కైతే కర్మానుష్ఠానమే ఉండదు గాన ఫలం పరిత్యజించే అవకాశమే ఉండదు. దీనిని పట్టి నిత్యనైమిత్తిక కర్మలకు ఫలం ఉంటుం దని తెలుస్తూన్నది అని భావం.2

మూ. త్యాజ్యం దోషవదిత్యేకే కర్మ ప్రాహుర్మనీషిణః,
యజ్ఞదానతపఃకర్మ న త్యాజ్యమితి చాపరే. 3

ప్ర.అ. **త్యాజ్యమితి**:-దోషవత్=దోషములు గల,కర్మ=కర్మ,త్యాజ్యమ్= విడువ దగినది,ఇతి=అని,ఏకే=కొందరు,మనీషిణః=బుద్ధిమంతులు,ప్రాహుః=చెప్పుచున్నారు. యజ్ఞదానతపఃకర్మ=యజ్ఞ-దాన-తపోరూప మైన కర్మ,న త్యాజ్యమ్=విడవదగినది కాదు, ఇతి చ=అని కూడ,అపరే=మరికొందరు,చెప్పుచున్నారు.

భాష్యమ్

త్యాజ్యందోషేతి:-త్యాజ్యం త్యక్తవ్యం,దోషవత్-దోషః అస్య అస్తీతి దోషవత్, కిం తత్?కర్మ బన్ధహేతుత్వాత్ సర్వమేవ, అథ వా దోషః యథా రాగాదిః త్యజ్యతే తథా త్యాజ్యమ్ ఇతి ఏకే ప్రాహుః మనీషిణః,పణ్డితాః సాంఖ్యాదిదృష్టిమ్ ఆశ్రితాః అధికృతానాం కర్మిణామపి ఇతి.తత్రైవ యజ్ఞదానతపఃకర్మ న త్యాజ్యమ్ ఇతి చ అపరే.

బాలానందిని

త్యాజ్యమితి:-దోషము గలది, విడువదగినది.ఏమి టది?కర్మ,బంధానికి హేతువు గాన సమస్తకర్మా కూడ విడవదగినది.లేదా('దోషవత్'అనగా దోషం వలె అని అర్థం).రాగం మొదలైన దోషం ఏ విధంగా విడవబడుతుందో అట్లే విడవదగినది అని కొందరు సాంఖ్యాదిదృష్టిని ఆశ్రయించిన పండితులు అంటున్నారు.కర్మయందు అధికారం గల కర్ములు కూడ వీటిని విడిచిపెట్టాలి అని అంటున్నారు.వాటిలోనే యజ్ఞము దానము తపస్సు అనే కర్మ విడువదగినది కాదు అని మరి కొంద రంటున్నారు.

భాష్యమ్

కర్మిణః ఏవ అధికృతాన్ అపేక్ష్య ఏతే వికల్పాః,న తు జ్ఞాననిష్ఠాన్ వ్యుత్థాయినః సంన్యాసినః అపేక్ష్య.**"జ్ఞానయోగేన సాంఖ్యానాం నిష్ఠా మయా పురా ప్రోక్తా"**(3.3) ఇతి కర్మాధికారాత్ అపోద్ధృతాః యే,న తాన్ ప్రతి చిన్తా.నను **"కర్మయోగేన యోగినామ్"** (3.3)ఇతి అధికృతాః పూర్వం విభక్తనిష్ఠాః అపి ఇహ సర్వశాస్త్రోపసంహారప్రకరణే యథా విచార్యన్తే తథా సాంఖ్యా అపి జ్ఞాననిష్ఠాః విచార్యన్తామ్ ఇతి.న; తేషాం మోహ దుఃఖనిమిత్తత్యాగానుపపత్తేః. న కాయక్లేశనిమిత్తాని దుఃఖాని సాంఖ్యాః ఆత్మని పశ్యన్తి; ఇచ్ఛాదీనాం క్షేత్రధర్మత్వేనైవ దర్శితత్వాత్.అతః తే న కాయక్లేశదుఃఖభయాత్ కర్మ పరిత్యజన్తి.నాపి తే కర్మాణి ఆత్మని పశ్యన్తి యేన నియతం కర్మ మోహాత్ పరిత్యజేయుః.గుణానాం కర్మ,**"నైవ కించిత్ కరోమి"**(5.8)ఇతి హి తే సంన్యస్యన్తి.**"సర్వ కర్మాణి మనసా సంన్యస్య"**(5.13)ఇత్యాదిభిః హి తత్త్వవిదః సంన్యాసప్రకారః ఉక్తః.

బాలానందిని

కర్మిణః ఇతి:-కర్మలలో అధికృతు లైన కర్ములను గూర్చియే ఈ వికల్పా లన్నీ కాని ఏషణాత్రయంనుండి వ్యుత్థితులై జ్ఞాననిష్ఠులైన సంన్యాసులను గూర్చి కాదు.**"జ్ఞాన యోగేన సాంఖ్యానాం నిష్ఠా మయా పురా ప్రోక్తా"**అని కర్మాధికారంనుండి ఎవరైతే వేరు చేయబడ్డారో వాళ్లను గూర్చిన చింత(విచారణ)కాదు ఇది.(ప్రశ్న)వెనుక **"కర్మయోగేన యోగినామ్"**అని ఏ కర్మాధికృతులు వేరు నిష్ఠ కలవారుగా(కర్మనిష్ఠ గలవారుగా)వేరుచేసి చెప్పబడ్డారో వాళ్లను గూర్చి ఈ సర్వశాస్త్రోపసంహారప్రకరణంలో విచారిస్తున్నట్లే జ్ఞాన నిష్ఠులైన సాంఖ్యులను గూర్చి కూడ విచారించవచ్చును కదా?(సమాధానం)-అది యుక్తం కాదు.ఎందువల్ల ననగా వాళ్లకు మోహము దుఃఖము నిమిత్తంగా గల త్యాగం ఉపపన్నం (యుక్తం)కాదు.ఇచ్ఛాదులు క్షేత్రధర్మాలే అని చూపబడి ఉండడంచేత వాళ్లు(సాంఖ్యుల) కాయక్లేశంవల్ల కలిగే

దుఃఖాలను ఆత్మయందు(ఆత్మకు సంబంధించినవాటిగా) చూడరు. అందుచేత వాళ్లు కాయక్లేశం కలుగుతుం దనే భయంచేత కర్మలను పరిత్యజించే ప్రసక్తి లేదు. అదే విధంగా వాళ్లు ఆత్మయందు కర్మలను (కర్మలు ఆత్మకు సంబంధించినవి అని)చూడరు. అలా చూస్తే వాళ్లు మోహంవల్ల కర్మలను పరిత్యజించడానికి అవకాశం ఉండేది. కర్మలు గుణాలకు సంబంధించినవి;నేను మాత్రం ఏమీ చేయడంలేదు అని అనుకొని కదా వాళ్లు సంన్యసిస్తున్నారు? "**సర్వకర్మాణి మనసా సంన్యస్య**"ఇత్యాదులచేత కదా తత్త్వవేత్త సంన్యసించే పద్ధతి చెప్పబడింది.

భాష్యమ్

తస్మాత్ యే అన్యే అధికృతాః కర్మణి అనాత్మవిదః,యేషాం చ మోహాత్ త్యాగః సంభవతి కాయక్లేశభయాచ్చ త ఏవ తామసాః త్యాగినః రాజసాః చ ఇతి నిన్ద్యన్తే కర్మిణామ్ అనాత్మజ్ఞానాం కర్మఫలత్యాగస్తుత్యర్థమ్. "**సర్వారమ్భపరిత్యాగీ**" "**మౌనీ సంతుష్టో యేన కేన చిత్**" "**అనికేతః స్థిరమతిః**"(12.16-19)ఇతి గుణాతీతలక్షణే చ పరమార్థసంన్యాసినః విశేషితత్వాత్. వక్ష్యతి చ "నిష్ఠా జ్ఞానస్య సా పరా"(18.50) ఇతి తస్మాత్ జ్ఞాననిష్ఠాః సంన్యాసినః న ఇహ వివక్షితాః. కర్మఫలత్యాగః ఏవ సాత్త్వికత్వేన గుణేన తామసత్వాద్యపేక్షయా సంన్యాసః ఉచ్యతే,న ముఖ్యః సర్వకర్మసంన్యాసః.

బాలానందిని

తస్మాదితి:-అందువల్ల కర్మయందు అధికృతు లైన ఏ అనాత్మవేత్త లున్నారో, ఎవరైతే మోహంవల్ల,కాయక్లేశభయంవల్లా కర్మను త్యజించడానికి అవకాశం ఉన్నదో వాళ్లే తామసులు రాజసులూ అయిన త్యాగులు అని నిందింపబడుచున్నారు. ఇలా నిందించడానికి ప్రయోజనం ఏ మనగా-అనాత్మజ్ఞు లైన కర్ములు చేసే కర్మఫలత్యాగాన్ని స్తుతించడమే. (అనగా ఆత్మవేత్తలు కాకపోవడంచేత కర్మలు చేయవలసి ఉండి కూడ ఎవరు అజ్ఞానంచేత గాని,కాయక్లేశానికి భయపడి గాని కర్మలను త్యజిస్తారో వాళ్లు చేసే త్యాగం రాజసం లేదా తామసం. అలాంటి వాళ్లకంటె ఆత్మజ్ఞానం లేకపోవడంచేత కర్మాచరణ చేస్తూ ఎవరు కర్మఫలాన్ని త్యజిస్తారో వాళ్లు ఉత్తములు అని వాళ్లని స్తుతించడం కోసం పై రకంవాళ్లు నిందించబడుతున్నారు అని అర్థం). పరమార్థసంన్యాసి (నిజమైన సంన్యాసి)ఎవరో-"**సర్వారమ్భపరిత్యాగీ మౌనీ సంతుష్టో యేన కేన చిత్**" "**అనికేతః స్థిరమతిః**"అని(అనే వాక్యాలలోను), గుణాతీతుని లక్షణం చెప్పే సందర్భంలోను వివిక్తంగా చెప్పబడింది. "**నిష్ఠా జ్ఞానస్య యా పరా**"అని కూడ చెప్పనున్నాడు. అందువల్ల ఇక్కడ జ్ఞాననిష్ఠు లైన సంన్యాసు లను గూర్చి చెప్పడానికి ఉద్దేశింపబడలేదు. సాత్త్వికత్వం అనే గుణం ఉండడంచేత, తామసత్వాదిదృష్ట్యా(వాటికంటె)

కర్మఫలత్యాగం సంన్యాసం అని చెప్పబడుచున్నది కాని ముఖ్య మైన సర్వకర్మసంన్యాసం (ఇక్కడ)చెప్పబడడంలేదు.

భాష్యమ్

సర్వకర్మసంన్యాసాసంభవే చ "న హి దేహభృతా"(18.11)ఇతి హేతువచనాత్ ముఖ్యః ఏవ ఇతి చేత్–న;హేతువచనస్య స్తుత్యర్థత్వాత్.యథా–"త్యాగాచ్ఛాన్తిరనన్తరమ్" (12.12)ఇతి కర్మఫలత్యాగస్తుతిః ఏవ,యథోక్తానేకపక్షానుష్ఠానాశక్తిమన్తమ్ అర్జునం అజ్ఞం ప్రతి విధానాత్,తథా ఇదమపి"న హి దేహభృతా శక్యమ్"(18.11)ఇతి కర్మఫల త్యాగస్తుత్యర్థం వచనమ్;న "సర్వకర్మాణి మనసా సంన్యస్య నైవ కుర్వన్ న కారయన్" (5.13)ఇత్యస్య పక్షస్య అపవాదః కేన చిత్ దర్శయితుం శక్యః.తస్మాత్ కర్మణి అధికృతాన్ ప్రత్యేవ ఏషః సంన్యాసత్యాగవికల్పః.యే తు పరమార్థదర్శినః సాంఖ్యాః,తేషాం జ్ఞాన నిష్ఠాయామేవ సర్వకర్మసంన్యాసలక్షణాయామ్ అధికారః,న అన్యత్ర,ఇతి న తే వికల్పార్హాః.తచ్చ ఉపపాదితమ్ అస్మాభిః–"వేదావినాశినమ్"(2.21)ఇత్యస్మిన్ ప్రదేశే తృతీయాదౌ చ. 3

బాలానందిని

సర్వేతి:-(ఆశంక)సర్వకర్మలను సంన్యసించడం అనేది కుదరదు అనే విషయాన్ని సమర్థిస్తూ "న హి దేహభృతా శక్యమ్"(దేహధారి ఎవడూ కర్మచేయకుండా ఉండజాలడు కదా?)అని చెప్పడంచేత (ఇక్కడ ప్రకృత మైనది)ముఖ్య మైన సంన్యాసమే అన్నట్లయితే-(సమాధానం)–అది యుక్తం కాదు.కేవలం స్తుతించడంకొరకే ఆ విధంగా హేతువు చెప్ప బడింది.(అనేక మైన పక్షాలు చెప్పి)చెప్పిన ఆ అనేకపక్షాలను అనుష్ఠించడానికి తగిన శక్తి లేని అజ్ఞాని యైన అర్జునుని గూర్చి విధించడంచేత"త్యాగాచ్ఛాన్తిః అనన్తరమ్"అనేది ఏ విధంగా కేవలం కర్మఫలత్యాగాన్ని స్తుతించడంకోసం మాత్రమే ఉద్దిష్ట మైనదో అట్లే ఈ "న హి దేహభృతా శక్యమ్"అనే వచనం కూడ కర్మఫలత్యాగస్తుతికొరకే చెప్పబడింది. అందుచేత "సర్వకర్మాణి మనసా సంన్యస్య,నైవ కుర్వన్ న కారయన్"అనే పక్షానికి అప వాదాన్ని ఎవ్వరూ కూడ చూపించజాలరు.అందుచేత ఈ (ఇక్కడ చెప్పిన)సంన్యాస–త్యాగ వికల్పం ఎవరైతే కర్మలయందు అధికారం కలవారో వాళ్లను గూర్చి మాత్రమే చెప్పబడింది.పరమార్థదర్శు లైన ఏ జ్ఞాను లున్నారో వాళ్లకి సర్వకర్మసంన్యాసరూప మైన జ్ఞాననిష్ఠయందే అధికారం కాని మరి దేనియందూ లేదు గాన వాళ్లకు ఈ వికల్పం వర్తించదు.ఈ విషయం మేం"వేదావినాశినమ్"అనే ప్రదేశంలోను,తృతీయాధ్యాయాదుల లోను ప్రతిపాదించి ఉన్నాం.

వి. సంన్యాసం తత్త్వం ఏమిటి,త్యాగం తత్త్వం ఏమిటి అని అర్జునుడు ప్రశ్నించగా కామ్యకర్మలను విడిచిపెట్టడం సంన్యాసం అనీ,నిత్యనైమిత్తికాదికర్మల ఫలాన్ని విడిచిపెట్టడం త్యాగం అనీ సమాధానం చెప్పబడింది.కామ్యకర్మత్యాగ మైనా ఫలత్యాగ మైనా ఈ రెండూ త్యాగాలే,అందుచేత సంన్యాస-త్యాగాలు రెండూ త్యాగమే గాన ఒకటే అని భాష్య కారులు వివరణం ఇచ్చారు.నాల్గవ శ్లోకంలోని త్యాగపదానికి అర్థం చెప్పడానికి అను గుణంగా ఇక్కడనే ఈ వివరణం ఇవ్వబడింది.బంధహేతువు గాన అన్ని విధా లైన కర్మా కూడ త్యజింపవలసినదే అని ఒక మతమూ,మిగిలిన కర్మలు విడిచిపెట్టినా యజ్ఞదాన తపోరూపకర్మలు మాత్రం విడవగూడదు అని మరొక మతమూ చెప్పబడ్డాయి. ఈ సందర్భంలో భగవత్పాదులు సైద్ధాంతికంగా ప్రధాన మైన ఒక విషయం ప్రతిపాదించారు. సాంఖ్యు లని చెప్పబడే జ్ఞానులకు ఏ కర్మలతోనూ సంబంధం లేదు, వాళ్లు సర్వకర్మసంన్యాసం చేయవలసినదే అని వెనుక చెప్పబడింది. ఆ సంన్యాసం ముఖ్యమైన సంన్యాసం. ఇక్కడ ఏ సంన్యాసం గూర్చి చర్చ చేయబడుచున్నదో అది పైన చెప్పిన జ్ఞానులు చేసే ముఖ్యసంన్యాసం కాదు. అజ్ఞానులు విహితము లైన కర్మలను తప్పక చేయవలసినదే. అయినా కూడ ఏ అజ్ఞానులు అలసత్వంచేతనో,కాయక్లేశానికి భయపడియో కర్మలను పరిత్యజిస్తారో (కర్మలు ఆచరించరో)వాళ్లకంటె ఏ అజ్ఞానులు కర్తవ్యకర్మలను ఆచరిస్తూ వాటి ఫలాలను మాత్రం పరిత్యజిస్తారో వాళ్లు గొప్పవారు అని మాత్రమే ఇక్కడ చెప్పబడుచున్నది.అనగా ఇక్కడ చర్చించబడుచున్నది అజ్ఞానులను గూర్చి మాత్రమే. అజ్ఞానులై ఉండి కూడ కర్మ చేయనివాళ్లకంటె కర్మలు చేస్తూ వాటి ఫలం పరిత్యజించే అజ్ఞానులు మేలు అని చెప్పడమే ఇక్కడ ఉద్దేశ్యం.జ్ఞానులై ముఖ్యమైన సర్వకర్మసంన్యాసం చేసేవాళ్ల ప్రసక్తి ఇక్కడ లేదు.వాళ్లు సర్వోత్తములే.అందుచేత వాళ్లకంటె కర్మలు చేస్తూ వాటి ఫలం త్యజించినవాళ్లు గొప్పవాళ్లు అని పరితలు భ్రాంతి చెందగూడదు అని భాష్యకారుల అభిప్రాయం. 3

భాష్యమ్

తత్రైతేషు వికల్పభేదేషు-

మూ. నిశ్చయం శృణు మే తత్ర త్యాగే భరతసత్తమ,
త్యాగో హి పురుషవ్యాఘ్ర త్రివిధః పరికీర్తితః. 4

బాలానందిని

తత్రేతి:- ఈ వేరు వేరు వికల్పాలు ఇలా ఉంటూండగా-

ప్ర.అ. నిశ్చయమితి: -భరతసత్తమ=అర్జునా,తత్ర=ఆ,త్యాగే=కర్మసంన్యాసకర్మఫల త్యాగాలలో ఇమిడి ఉన్న త్యాగం విషయంలో,మే=నాయొక్కనిశ్చయమ్=నిశ్చయమును.

శృణు=వినుము. పురుషవ్యాఘ్ర=పురుషశ్రేష్ఠుడా,త్యాగః=త్యాగం,త్రివిధః=మూడు విధము లైనదిగా,సంప్రకీర్తితః హి=చెప్పబడినది కదా?

భాష్యమ్

నిశ్చయం,శృణు అవధారయ,మే మమ వచనాత్,తత్ర త్యాగే త్యాగసంన్యాస వికల్పే యథాదర్శితే. భరతసత్తమ భరతానాం సాధుతమ. త్యాగః హి త్యాగసంన్యాసశబ్ద వాచ్యః హి యః అర్థః సః ఏకః ఏవ ఇత్యభిప్రేత్యాహ-త్యాగో హీతి- పురుషవ్యాఘ్ర, త్రివిధః త్రిప్రకారః తామసాదిప్రకారైః సంప్రకీర్తితః శాస్త్రేషు సమ్యక్ కథితః;యస్మాత్ తామసాదిభేదేన త్యాగసంన్యాసశబ్దవాచ్యః అర్థః అధికృతస్య కర్మిణః అనాత్మజ్ఞస్య త్రివిధః సంభవతి న పరమార్థదర్శినః ఇతి అయమ్ అర్థః దుర్జ్ఞానః తస్మాత్ అత్ర తత్త్వం న అన్యః వక్తుం సమర్థః. తస్మాత్ నిశ్చయం పరమార్థశాస్త్రార్థవిషయమ్ అధ్యవ సాయమ్ ఐశ్వరం శృణు. 4

బాలానందిని

నిశ్చయమితి:-భరతవంశీయులలో చాల సాధు వైనవాడా,పైన చూపబడిన త్యాగసంసంన్యాసముల వికల్పం విషయంలో నిశ్చయమును నా వచనంవల్ల వినుము. త్యాగః హి-'త్యాగ''సంన్యాస'శబ్దాలచేత చెప్పదగిన ఏ అర్థ మున్నదో అది ఒక్కటే అనే అభిప్రాయంతో త్యాగః హి అని అంటున్నాడు. పురుషశ్రేష్ఠుడా!త్యాగము తామసం మొదలైన ప్రకారాలచేత మూడు ప్రకారములు కలదిగా శాస్త్రాలలో బాగుగా (స్పష్టంగా) చెప్పబడినది. 'త్యాగ' 'సంన్యాస'శబ్దాలచేత చెప్పబడేది తామసాదిభేదంచేత త్రివిధమూ అయిన అర్థం, ఆత్మ జ్ఞానం లేనివాడు(అందుచేతనే)కర్మయందు అధికృతుడూ అయిన కర్మికి(కర్మి విషయంలో) మాత్రమే సంభవం అవుతుంది కాని పరమార్థదర్శికి(ఆత్మతత్త్వం తెలిసినవానికి) సంభవం కాదు అనే ఈ విషయం ఏ కారణంవల్ల తెలుసుకొనడానికి చాల కష్ట మైనదో ఆ కారణంవల్ల దీనిలోని తత్త్వాన్ని మరొక డెవడూ చెప్పడానికి సమర్థుడు కాడు. అందువల్ల పరమార్థ మైన శాస్త్రార్థానికి సంబంధించిన, ఈశ్వరునికి సంబంధించిన(ఈశ్వరుడు చేసిన) నిర్ణయాన్ని వినుము. 4

భాష్యమ్

కః పునః అసౌ నిశ్చయః ఇత్యతః ఆహ-

మూ. యజ్ఞో దానం తపః కర్మ న త్యాజ్యం కార్యమేవ తత్,
యజ్ఞో దానం తపశ్చైవ పావనాని మనీషిణామ్. 5

బాలానందిని

కః ఇతి:- ఆ నిష్చయం ఏమిటి అనగా చెపుతున్నాడు-

ప్ర.అ. యజ్ఞః ఇతి:-యజ్ఞః=యజ్ఞము,దానమ్=దానము,తపః=తపస్సు అను, కర్మ=కర్మ,న త్యాజ్యమ్=విడువదగినది కాదు.తత్=అది,కార్యమ్ ఏవ=తప్పక చేయ దగినదే.యజ్ఞః=యజ్ఞము,దానమ్=దానము,తపః చైవ=తపస్సూ కూడ,మనీషిణామ్= బుద్ధిమంతులకు,పావనాని=పవిత్రత్వము చేకూర్చేవి.

భాష్యమ్

యజ్ఞః దానం తపః ఇత్యేతత్ త్రివిధం కర్మ,న త్యాజ్యం న త్యక్తవ్యమ్.కార్యం కరణీయమ్ ఏవ తత్.కస్మాత్?యజ్ఞః దానం తపః చ ఏవ,పావనాని విశుద్ధికరాణి మనీషిణాం ఫలానభిసంధీనామ్ ఇత్యేతత్. 5

బాలానందిని

యజ్ఞ ఇతి:-యజ్ఞము దానము తపస్సు అని మూడు విధాలైన ఈ కర్మ విడువ దగినది కాదు.అది చేయదగినదే.ఎందువల్ల?యజ్ఞ-దాన-తపస్సులు బుద్ధిమంతులకు, అనగా ఫలాభిసంధి లేని బుద్ధిమంతులకు అని అర్థం, విశుద్ధికి కారణములు.5

మూ. ఏతాన్యపి తు కర్మాణి సంగం త్యక్త్వా ఫలాని చ
కర్తవ్యానీతి మే పార్థ నిశ్చితం మతముత్తమమ్. 6

ప్ర.అ.ఏతానీతి:- పార్థ=అర్జునా!ఏతాని=ఈ,కర్మాణ్యపి తు=యజ్ఞదానతపోరూపాలైన కర్మలు,సంగమ్=సంగమును,ఫలాని చ=ఫలములను,త్యక్త్వా=విడచి,కర్తవ్యాని=చేయ దగినవి,ఇతి=అని,మే=నాయొక్క,నిశ్చితమ్=నిశ్చితమైన,ఉత్తమమ్=ఉత్తమమైన,మతమ్= మతము.

భాష్యమ్

ఏతాన్యపీతి:-ఏతాన్యపి తు కర్మాణి యజ్ఞదానతపాంసి పావనాన్యుక్తాని, సంగమ్ ఆసక్తిం తేషు త్యక్త్వా,ఫలాని చ తేషాం త్యక్త్వా పరిత్యజ్య కర్తవ్యానీతి అనుష్ఠే యానీతి,మే మమ,నిశ్చితం మతమ్ ఉత్తమమ్. **"నిశ్చయం శృణు మే తత్ర"**ఇతి ప్రతిజ్ఞాయ,పావనత్వం చ హేతుమ్ ఉక్త్వా ఏతాన్యపి కర్మాణి కర్తవ్యాని ఇత్యేతత్ నిశ్చితం మతమ్ ఉత్తమమ్ ఇతి ప్రతిజ్ఞాతోపసంహార ఏవ, న అపూర్వార్థం వచనమ్ 'ఏతాన్యపి'ఇతి;ప్రకృతసంనికృష్టార్థత్వోపపత్తేః.సాసంగస్య ఫలార్థినః బన్ధహేతవః

ఏతాన్యపి కర్మాణి ముముక్షోః కర్తవ్యాని ఇతి అపిశబ్దస్యార్థః,న త్వన్యాని కర్మాణి అపేక్ష్య ఏతాన్యపి ఇత్యుచ్యతే.

బాలానందిని

ఏతాన్యపీతి:-పావనము లని చెప్పబడిన యజ్ఞదానతపోరూపాలైన ఈ కర్మలు కూడ,వాటియందు ఆసక్తిని విడచి,వాటి ఫలాలను కూడ విడచి,చేయదగినవి అని నా నిశ్చిత మైన,ఉత్తమ మైన మతము.**"నిశ్చయం శృణు మే తత్ర"**(ఆ విషయంలో నా నిశ్చితాభిప్రాయం చెపుతాను,విను)అని ప్రతిజ్ఞ చేసి,(యజ్ఞాదులు కర్తవ్యము లని చెప్పడానికి) అవి పావనము లవడమే హేతువు అని చెప్పి **"ఏతాన్యపి కర్మాణి కర్తవ్యాని ఇత్యేతత్ నిశ్చితం మతముత్తమమ్"**(అందుచేత)ఈ కర్మలు కూడ చేయదగినవి అని నా నిశ్చితమైన ఉత్తమ మైనమతము)అని మొదట ప్రతిజ్ఞ చేయబడిన(చెప్పబడిన)విషయాన్ని ఉపసంహా రించడంకోసం మాత్రమే(మళ్లీ)చెప్పబడుచున్నది;అంతే కాని క్రొత్త విషయం ఏమీ చెప్ప బడడంలేదు.(ఈ విధంగా భావం గ్రహిస్తేనే)'ఏతాని అపి'అని ప్రకృతమైన దగ్గర ఉన్న కర్మలను పరామర్శించడం అనేది కుదురుతుంది.ఆసక్తుడై ఫలాభిలాషతో చేసేవారికి బంధహేతువు లైన ఈ కర్మలు కూడ ముముక్షువునకు కర్తవ్యములే అని మాత్రమే'అపి' శబ్దానికి అర్థం;అంతే కాని ఇతరకర్మలను అపేక్షించి(అనగా ఇతర కర్మలతో పాటు ఈ కర్మలు కూడ అనే అర్థంలో)'ఏతాన్యపి'అని చెప్పబడడంలేదు.

వి.**"ఏతాని అపి కర్మాణి"**అని'అపి'శబ్దం ప్రయోగించి ఈ కర్మలు కూడ కర్తవ్యములు"అని చెప్పడంచేత ఈ కర్మలతో పాటు చేయదగిన ఇంకా ఇతరకర్మ లేవో కూడ ఉన్నా యని అర్థం వస్తుంది.కాని'అపి'శబ్దం ఆ అర్థాన్ని బోధించడానికి ప్రయోగించబడ లేదు.ఇందుకు కారణ మేమనగా-శ్రీకృష్ణుడు-ముందుగా"యజ్ఞాదులు త్యాజ్యములు కావని కొందరంటారు"అని చెప్పి, 'త్యాగం విషయంలో నా నిశ్చయం చెపుతాను విను" అని కూడ చెప్పి, యజ్ఞాదులు ఎందుచేత త్యాజ్యములు కావో,ఎందుచేత కర్తవ్యములో హేతువుగా అవి పావనములు అవడం అందుకు హేతువు అని చెప్పి,"ఇవి సంగఫలత్యాగపూర్వకంగా అనుష్ఠింపతగినవి"అని ఈ శ్లోకంలో ఉపసంహరించాడు.ఈ విధంగా మూడవ శ్లోకంలో ప్రస్తుతాలైన యజ్ఞాదులే నాలుగు-ఐదు-ఆరు శ్లోకాలలో నిర్దేశింపబడుచున్నాయి కాని ఇతరకర్మ లేవీ నిర్దేశించబడడంలేదు.అయితే "ఏతాన్యపి"అని'అపి'శబ్దాన్ని ప్రయో గించడానికి కారణ మేమనగా-సంగబుద్ధితోను ఫలాభిలాషతోను చేసిన ఏ యజ్ఞాదులు బంధహేతువులో ఆ యజ్ఞాదులు కూడ సంగఫలాభిలాషలు లేకుండా ఆచరించే ముముక్షువునకు బంధహేతువులు కావు అని చెప్పడం మాత్రమే.అందుచేత ఇతరకర్మలను కూడ దృష్టిలో పెట్టుకొని ఈ అపిశబ్దాన్ని ప్రయోగించలేదు అని భావం.

భాష్యమ్

అన్యే వర్ణయన్తి-నిత్యానాం కర్మణాం ఫలాభావాత్"సఙ్గం త్యక్త్వా ఫలాని చ" ఇతి నోపపద్యతే.ఏతాన్యపీతి యాని కామ్యాని కర్మాణి-నిత్యేభ్యః అన్యాని ఏతాన్యపి కర్తవ్యాని,కిముత యజ్ఞదానతపాంసి నిత్యాని ఇతి.తదసత్;నిత్యానామపి కర్మణాం ఫలవత్త్వస్య ఉపపాదితత్వాత్."యజ్ఞో దానం తపశ్చైవ పావనాని"ఇత్యాదివచనేన నిత్యాన్యపి కర్మాణి బన్ధహేతుత్వాశఙ్కయా జిహాసోః ముముక్షోః కుతః కామ్యేషు ప్రసంగః?"దూరేణ హ్యవరం కర్మ"(2.49)ఇతి చ నిన్దితత్వాత్."యజ్ఞార్థాత్కర్మణోఽన్యత్ర" (3.9)ఇతి చ కామ్యకర్మణాం బన్ధహేతుత్వస్య నిశ్చితత్వాత్."త్రైగుణ్యవిషయా వేదాః" (2.45)"త్రైవిద్యా మాం సోమపాః"(9.20)"క్షీణే పుణ్యే మర్త్యలోకం విశన్తి" (9.21)ఇతి చ.దూరవ్యవహితత్వాత్ చ న కామ్యేషు "ఏతాన్యపి"ఇతి వ్యపదేశః. 6

బాలానందిని

అన్యే ఇతి:-మరి కొందరు ఇలా అంటున్నారు-"నిత్యకర్మలకు ఫలం ఉండదు గాన "సంగం త్యక్త్వా ఫలాని చ"అని చెప్పడం కుదరదు.'ఏతాన్యపి'అనగా నిత్యకర్మలకంటె అన్యము లైన ఈ కామ్యకర్మలు కూడ చేయదగినవే;అలాంటప్పుడు నిత్యము లైన యజ్ఞదాన తపస్సుల మాట చెప్పాలా?"ఇది యుక్తం కాదు.నిత్యకర్మలకు కూడ ఫలం ఉంటుం దని "యజ్ఞో దానం తపశ్చైవ పావనాని"ఇత్యాదివాక్యంచేత ఉపపాదించబడినది కదా? (పవిత్రం అవడమే నిత్యకర్మానుష్ఠానికి ఫలం అని అర్థం).బంధహేతువు లనే ఆశంకచేత నిత్యకర్మలను కూడ విడవా లనుకొంటూన్న ముముక్షువునకు కామ్యకర్మలయందు ప్రవృత్తి ఎలా ఉంటుంది?"దూరేణ హ్యవరం కర్మ"అని కర్మ నిందింపబడినది కదా?"యజ్ఞార్థాత్కర్మణోఽన్యత్ర"అని కామ్యకర్మలు బంధహేతువు లని నిశ్చితంగా చెప్పబడింది."త్రైగుణ్యవిషయా వేదాః","త్రైవిద్యా మాం సోమపాః","క్షీణే పుణ్యే మర్త్యలోకం విశన్తి"అని కూడ చెప్పబడింది. (యజ్ఞదానాదులు వెనుకటి శ్లోకంలోనే చెప్పబడ్డాయి).కామ్యకర్మలు దూరంగా, వ్యవహితంగా ("కామ్యానాం కర్మణాం న్యాసం"అని)ఉన్నాయి.అందుచేత వ్యవహితంగా ఉన్న కామ్యకర్మలను "ఏతాన్యపి"అనేపదంచేత నిర్దేశించడం కుదరదు కూడ. 6

భాష్యమ్

తస్మాదజ్ఞస్యాధికృతస్య ముముక్షోః-

మూ. నియతస్య తు సంన్యాసః కర్మణో నోపపద్యతే,
మోహాత్తస్య పరిత్యాగస్తామసః పరికీర్తితః. 7

బాలానందిని

తస్మాదితి:-అందువల్ల అజ్ఞుడు(ఆత్మజ్ఞానం లేనివాడు)అధికృతుడు (శాస్త్రవిహిత కర్మలు అనుష్ఠించవలసినవాడు)అయిన ముముక్షువునకు-

ప్ర. అ. నియతస్యేతి: -నియతస్య=నిత్యమైన,కర్మణః=కర్మయొక్క సంన్యాసః=సంన్యాసము,న ఉపపద్యతే=ఉపపన్నము(యుక్తము)కాదు. మోహాత్=అజ్ఞానంవల్ల,తస్య=దాని యొక్క పరిత్యాగః=విడచుట,తామసః=తామసముగా,పరికీర్తితః=చెప్పబడినది.

భాష్యమ్

నియతస్య తు నిత్యస్య,సంన్యాసః పరిత్యాగః,కర్మణః న ఉపపద్యతే,అజ్ఞస్య పావనత్వస్యేష్టత్వాత్. మోహాత్ అజ్ఞానాత్ తస్య నియతస్య పరిత్యాగః,నియతం చ అవశ్యం కర్తవ్యం త్యజ్యతే చేతి విప్రతిషిద్ధమ్,అతః మోహనిమిత్తః పరిత్యాగః తామసః పరికీర్తితః. మోహః చ తమః ఇతి. 7

బాలానందిని

నియతస్య ఇతి: -నిత్యమైన కర్మయొక్క త్యాగము యుక్తం కాదు. అజ్ఞునికి పావనత్వం అవసరం కదా? అజ్ఞానంవల్ల దానిని,నిత్యకర్మను,త్యజించడం,ఒక ప్రక్క నియత మైనది అని చెపుతూ దానిని విడిచిపెట్టడం అనేది విప్రతిషిద్ధం. అందువల్ల మోహంచేత చేయబడే పరిత్యాగం,మోహం అంటే తమస్సే కాబట్టి,తామస మని చెప్పబడుచున్నది. 7

భాష్యమ్

కిం చ-

మూ. దుఃఖమిత్యేవ యత్కర్మ కాయక్లేశభయాత్త్యజేత్,
స కృత్వా రాజసం త్యాగం నైవ త్యాగఫలం లభేత్. 8

బాలానందిని

కిం చేతి:- మరియు-

ప్ర. అ. దుఃఖమితి: -దుఃఖమ్ ఇత్యేవ=దుఃఖజనకము అనే కారణంవల్ల మాత్రమే, కాయక్లేశంవల్ల కలిగే భయంవల్ల,కర్మ=కర్మను, యత్ త్యజేత్=త్యజించుట అనేది ఏది చేస్తాడో,సః=అతడు,రాజసం త్యాగమ్=రాజస మైన త్యాగాన్ని.కృత్వా=చేసి,త్యాగఫలమ్= త్యాగముయొక్క ఫలాన్ని, నైవ లభేత్=పొందడు.

భాష్యమ్

దుఃఖమిత్యేవ యత్ కర్మ,కాయక్లేశభయాత్ శరీరదుఃఖభయాత్ త్యజేత్ పరి త్యజేత్,సః కృత్వా రాజసం రజోనిర్వృత్తం త్యాగం,నైవ త్యాగఫలం జ్ఞానపూర్వకస్య సర్వకర్మ త్యాగస్య ఫలం మోక్షాఖ్యం న లభేత్,నైవ లభతే. 8

బాలానందిని

దుఃఖమితి:-దుఃఖము అనే కారణంవల్ల మాత్రమే,శరీరానికి దుఃఖం కలుగు తుందనే భయంవల్ల కర్మత్యాగం ఏది చేస్తాడో,అతడు రజోగుణంచేత జరిగిన ఆ త్యాగాన్ని చేసినా కూడ త్యాగఫలాన్ని,అనగా జ్ఞానం పొందిన తరువాత చేసే సర్వకర్మత్యాగంవల్ల కలిగే మోక్షరూప మైన ఫలాన్ని పొందదు. 8

భాష్యమ్

కః పునః సాత్త్వికః త్యాగః?

మూ. కార్యమిత్యేవ యత్కర్మ నియతం క్రియతేఽర్జున,
సంగం త్యక్త్వా ఫలం చైవ స త్యాగః సాత్త్వికో మతః. 9

బాలానందిని

కః ఇతి:-అయితే సాత్త్వికత్యాగం ఏది?

ప్ర.అ.**కార్యమితి**:-అర్జున==అర్జునా!యత్=ఏ,కర్మ=కర్మ,కార్యమ్ ఇత్యేవ=తప్పక చేయవలసినదే అని,నియతమ్=నిత్యమూ(లేదా నియతం కర్మ=నిత్యమైన కర్మ),సంగమ్= సంగమును,ఫలం చైవ=ఫలమును,త్యక్త్వా=విడచి,క్రియతే=చేయబడుతుందో,సః త్యాగః = ఆ త్యాగం,సాత్త్వికః=సాత్త్విక మైన త్యాగముగా,మతః=చెప్పబడినది.

భాష్యమ్

కార్యం కర్తవ్యమ్,ఇత్యేవ,యత్ కర్మ నియతం నిత్యం,క్రియతే నిర్వర్త్యతే, హే అర్జున,సంగం త్యక్త్వా ఫలం చైవ నిత్యానాం కర్మణాం ఫలవత్త్వే భగవద్వచనం ప్రమాణమ్ అవోచామ. అథవా యద్యపి ఫలం న శ్రూయతే నిత్యస్య కర్మణః తథాపి నిత్యం కర్మ కృతమ్ ఆత్మసంస్కారం ప్రత్యవాయపరిహారం వా ఫలం కరోతి ఆత్మనః ఇతి కల్పయత్యేవ అజ్ఞః.తత్ర తామపి కల్పనాం నివారయతి"ఫలం త్యక్త్వా"ఇత్యనేన. అతః సాధుఉక్తం"సంగం త్యక్త్వా ఫలం చ"ఇతి.సః త్యాగః నిత్యకర్మసు సంగఫలపరి త్యాగః,సాత్త్వికః సత్త్వనిర్వృత్తః మతః అభిమతః. నను కర్మపరిత్యాగః త్రివిధః సంన్యాసః

ఇతి చ ప్రకృతః;తత్ర తామసః రాజసః చ ఉక్తః త్యాగః.కథమ్ ఇహ సంగఫలత్యాగః తృతీయత్వేన ఉచ్యతే?యథా త్రయో బ్రాహ్మణాః ఆగతాః,తత్ర షడఙ్గవిదౌ ద్వౌ క్షత్రియః తృతీయః ఇతి తద్వత్.నైష దోషః; త్యాగసామాన్యేన స్తుత్యర్థత్వాత్.అస్తి హి కర్మసంన్యాసస్య ఫలాభిసంధిత్యాగస్య చ త్యాగత్వసామాన్యమ్;తత్ర రాజసతామసత్వేన కర్మత్యాగనిన్దయా కర్మఫలాభిసంధిత్యాగః సాత్త్వికత్వేన స్తూయతే-"స త్యాగః సాత్త్వికో మతః"ఇతి. 9ః

బాలానందిని

కార్యమితి:-అర్జునా!ఏ నిత్యకర్మ,ఇది తప్పక చేయవలసినదే అను దృష్టితో సంగాన్ని ఫలాన్ని త్యజించి ఆచరించబడుతుందో-నిత్యకర్మలకు ఫలం ఉంటుందనడంలో భగవద్వచనాన్ని ప్రమాణంగా చెప్పి ఉన్నాం.లేదా-నిత్యకర్మకు ఫలం ఉన్నట్లు వినబడక పోయినా కూడ నిత్యకర్మ ఆచరిస్తే అది తనకు ఆత్మసంస్కారం(అంతరంగసంస్కారం)గాని ప్రత్యవాయపరిహారం గాని ఫలం ఇస్తుంది అని అజ్ఞుడు కల్పించి తీరుతాడు."ఫలం త్యక్త్వా"అనే దానిచేత ఆ కల్పనను కూడ నివారిస్తున్నాడు.అందువల్ల "సంగం త్యక్త్వా ఫలాని చ"అని సరిగానే చెప్పబడింది.ఆ త్యాగము,అనగా నిత్యకర్మల విషయంలో సంగాన్ని ఫలాన్నీ త్యజించడం సత్త్వగుణంచేత జరిగినది అని అంగీకరింపబడుచున్నది.

(ఆశంక)కర్మపరిత్యాగము,మూడు విధాలైన సంన్యాసము అని ప్రకృతమైనది.(ఆ విషయాలను గూర్చి ప్రస్తుతం చర్చించబడుచున్నది).ఆ సందర్భంలో తామసత్యాగము రాజసత్యాగము చెప్పబడ్డాయి.ఇక్కడ మూడవదిగా (సాత్త్వికత్యాగం చెప్పాలి గాని) సంగఫలత్యాగం ఎలా చెప్పబడుచున్నది?ఇది ఎట్లున్న దనగా-"ముగ్గురు బ్రాహ్మణులు వచ్చారు.వారిలో షడంగాలు తెలిసినవాళ్లు ఇద్దరు,మూడవవాడు క్షత్రియుడు"అన్నట్లున్నది. (సమాధానం) ఈ దోషం లేదు.(రెండింటిలోనూ ఉన్న)త్యాగ మనే సామాన్యధర్మాన్ని పట్టి (కర్మత్యాగంలోను త్యాగం ఉంది,సంగఫలత్యాగంలోను త్యాగం ఉంది కాబట్టి) స్తుతికోసం ఇలా చెప్పబడింది.కర్మసంన్యాసానికి ఫలభిసంధిత్యాగానికీ త్యాగత్వం అనే సామాన్యం (సాధారణధర్మం)ఉన్నది కదా?ఆ రెండింటిలో కర్మత్యాగాన్ని రాజస మనీ తామస మనీ నిందించి కర్మఫలాభిసంధిత్యాగం"స త్యాగః సాత్త్వికో మతః"అని సాత్త్వికముగా స్తుతింపబడుచున్నది. 9

భాష్యమ్

యస్తు అధికృతః సంగం త్యక్త్వా ఫలాభిసంధిం చ నిత్యం కర్మ కరోతి తస్య ఫలరాగాదినా అకలుషీక్రియమాణమ్ అన్తఃకరణం నిత్యైః చ కర్మభిః సంస్క్రియమాణం

విశుధ్యతి. విశుద్ధం ప్రసన్నమ్ ఆత్మాలోచనక్షమం భవతి. తస్యైవ నిత్యకర్మానుష్ఠానేన విశుద్ధాన్తఃకరణస్య ఆత్మజ్ఞానాభిముఖస్య క్రమేణ యథా తన్నిష్ఠా స్యాత్ తత్ వక్తవ్యమ్ ఇత్యాహ-

మూ. న ద్వేష్ట్యకుశలం కర్మ కుశలే నానుషజ్జతే,
త్యాగీ సత్త్వసమావిష్టో మేధావీ ఛిన్నసంశయః. 10

బాలానందిని

యస్తు ఇతి:-కర్మాధికారం గల ఎవడైతే సంగాన్ని ఫలాభిసంధిని విడచి నిత్యకర్మ చేస్తాడో ఫలాసక్తి మొదలైనవాటిచేత కలుషం చేయబడని ఆతని అంతఃకరణం నిత్యకర్మల చేత సంస్కరింపబడినదై విశుద్ధం అవుతుంది; శుద్ధమై ప్రసన్నమై ఆత్మను చూడదానికి సమర్థం అవుతుంది. నిత్యకర్మానుష్ఠానంచేత విశుద్ధ మైన అంతఃకరణం కలవాడై ఆత్మజ్ఞానం విషయంలో అభిముఖుడుగా ఉన్న వానికే క్రమంగా ఆత్మనిష్ఠ ఎలా కలుగుతుందో చెప్పాలి గాన అది చెపుతున్నాడు-

ప్ర. అ. నేతి:-సత్త్వసమానిష్టః=సత్త్వగుణముతో నిండినవాడు, మేధావీ=మేధా వంతుడు, ఛిన్నసంశయః=ఛేదింపబడిన సంశయాలు కలవాడు అయిన, త్యాగీ=సంగ ఫలాలను త్యజించినవాడు, అకుశలమ్=బంధాదిహేతు వైన, కర్మ=కర్మను, న ద్వేష్టి= ద్వేషించదు, కుశలే= మంచి కర్మయందు, న అనుషజ్జతే=ఆసక్తుడు కాదు.

భాష్యమ్

న ద్వేష్టి అకుశలమ్ అశోభనం కామ్యం కర్మ, "శరీరారమ్భద్వారేణ సంసార కారణం, కిమనేన" ఇత్యేవమ్. కుశలే శోభనే నిత్యే కర్మణి "సత్త్వశుద్ధిజ్ఞానోత్పత్తితన్నిష్ఠా హేతుత్వేన మోక్షకారణమ్ ఇదమ్" ఇత్యేవం నానుషజ్జతే, తత్రాపి ప్రయోజనమ్ అపశ్యన్, అనుషఙ్గం ప్రీతిం, న కరోతి ఇత్యేతత్. కః పునరసౌ? త్యాగీ. పూర్వోక్తేన సంగఫలత్యాగేన తద్వాన్ త్యాగీ యః కర్మణి సంగం త్యక్త్వా తత్ఫలం చ నిత్యకర్మానుష్ఠాయీ సః త్యాగీ. కదా పునః అసౌ అకుశలం కర్మ న ద్వేష్టి కుశలే చ న అనుషజ్జతే ఇతి? ఉచ్యతే- సత్త్వసమావిష్టః-యదా సత్త్వేన ఆత్మానాత్మవివేకవిజ్ఞానహేతునా సమావిష్టః సంవ్యాప్తః సంయుక్తః ఇత్యేతత్. అతః ఏవ చ మేధావీ మేధయా ఆత్మజ్ఞానలక్షణయా ప్రజ్ఞయా సంయుక్తః, తద్వాన్ మేధావీ మేధావిత్వాత్ ఏవ ఛిన్నసంశయః-ఛిన్నః అవిద్యాకృతః సంశయః యస్య, ఆత్మస్వరూపావస్థానమేవ పరం నిఃశ్రేయససాధనం న అన్యత్ కించిత్ ఇత్యేవం నిశ్చయేన ఛిన్నసంశయః యః అధికృతః పురుషః పూర్వోక్తేన ప్రకారేణ

కర్మయోగానుష్ఠానేన క్రమేణ సంస్కృతాత్మా సన్ జన్మాదివిక్రియారహితత్వేన నిష్క్రియమ్ ఆత్మానమ్ ఆత్మత్వేన సంబుద్ధః సః సర్వకర్మాణి మనసా సంన్యస్య నైవ కుర్వన్న కారయన్ ఆసీనః నైష్కర్మ్యలక్షణాం జ్ఞాననిష్ఠామ్ అశ్నుతే ఇత్యేతత్.పూర్వోక్తస్య కర్మయోగస్య ప్రయోజనమ్ అనేన శ్లోకేన ఉక్తమ్. 10

బాలానందిని

న ద్వేష్టీతి:-"ఈ కామ్యకర్మ శరీరాన్ని ఇవ్వడం ద్వారా సంసారానికి కారణం అవుతుంది;ఇది ఎందుకు?"అని అశోభన మైన కామ్యకర్మను ద్వేషించడు."నిత్యకర్మ సత్త్వశుద్ధి(అంతఃకరణశుద్ధి)కి,జ్ఞానం కలగడానికి,జ్ఞాననిష్ఠకు హేతు వవడంచేత మోక్షానికి కారణ మైనది"అని కుశలకర్మయందు,శోభనమైన నిత్యకర్మయందు సక్తుడు కాడు.దాని ద్వారా సాధించవలసిన ప్రయోజనాన్ని దేనినీ చూడనివాడై దానియందు ఆసక్తుడు కాడు అని భావం.ఎవ డతడు?త్యాగి-వెనుక చెప్పిన సంగత్యాగంచేత ఫలత్యాగంచేత త్యాగి యైనవాడు.ఎవడు కర్మయందు సంగం విడచి,దాని ఫలం కూడ విడచి నిత్యకర్మలు అనుష్ఠిస్తాడో అతడు త్యాగి.అతడు ఎప్పుడు అకుశలకర్మను ద్వేషించడో కుశలకర్మయందు ఆసక్తుడు కాడో చెపుతున్నాడు.ఎప్పుడు ఆత్మానాత్మవివేకానికి హేతువైన సత్త్వంతో వ్యాప్తుడై, కూడినవాడై ఉంటాడో అప్పుడు.అందుచేతనే మేధావి ఆత్మజ్ఞానరూప మైన మేధతో,బుద్ధి బలంతో(ప్రజ్ఞతో) కూడినవాడు మేధావి.మేధావి అవడంవల్లనే ఛిన్నసంశయుడు.అవిద్యచేత ఏర్పడిన సంశయం తొలగిపోయినవాడు.ఆత్మస్వరూపంలో స్థిరంగా ఉండడమే గొప్ప నిఃశ్రేయససాధనము,మరొక సాధనం ఏదీ లేదు అను నిశ్చయంచేత ఛేదించబడిన సంశయాలు కలవాడు. అధికృతుడైన (కర్మాధికారం గల)ఏ పురుషుడు వెనుక చెప్పిన విధంగా కర్మయోగం అనుష్ఠిస్తూ క్రమంగా సంస్కృతమైన అంతఃకరణం కలవాడై,జన్మాదివికారా లేవీ లేనిదవడంచేత నిష్క్రియ మైన ఆత్మయే తన స్వస్వరూపము అని తెలుసుకొన్నవాడో అతడు సర్వకర్మలను మనసా సంన్యసించి,ఏమీ చేయక,చేయించక కూర్చున్నవాడై నైష్కర్మ్యరూప మైన(కర్మ లేకపోవడమనే స్వరూపం గల)జ్ఞాననిష్ఠను పొందుతాడు అని వెనుక చెప్పిన కర్మయోగంయొక్క ప్రయోజనమే ఈ శ్లోకంచేత చెప్పబడుచున్నది. 10

భాష్యమ్

యః పునః అధికృతః సన్ దేహాత్మాభిమానిత్వేన దేహభృత్ అజ్ఞః అబాధితాత్మకర్తృత్వాభిమానతయా అహం కర్తా ఇతి నిశ్చితబుద్ధిః తస్య అశేషకర్మపరిత్యాగస్య అశక్యత్వాత్ కర్మఫలత్యాగేన చోదితకర్మానుష్ఠానే ఏవ అధికారః న తత్త్యాగే ఇత్యేతమ్ అర్థం దర్శయితుమ్ ఆహ-

మూ. న హి దేహభృతా శక్యం త్యక్తుం కర్మాణ్యశేషతః,
యస్తు కర్మఫలత్యాగీ స త్యాగీత్యభిధీయతే. 11

బాలానందిని

యః పునరితి:-ఎవడైతే అధికృతుడై యుండి దేహాత్మాభిమానం (దేహమే ఆత్మ అనే అభిమానం)ఉండడంచేత దేహభృత్(దేహం ధరించినవాడు)గా ఉండి,అజ్ఞుడై,తనకు ఉన్న కర్తృత్వాభిమానం(నేను కర్తను అనే అభిమానం)బాధితం కాకపోవడంచేత నేనే కర్తను అని నిశ్చితబుద్ధికలవాడై ఉంటాడో అతడు సమస్తకర్మలను త్యజించడం అనేది శక్యం కాదు గాన అలాంటివానికి కర్మఫలాన్ని త్యజించి విహితములైన కర్మలను అనుష్ఠించడంలోనే అధికారం కాని వాటిని త్యజించడానికి అధికారం లేదు అనే విషయాన్ని చూపడానికి చెపుతున్నాడు.

ప్ర.అ.న హీతి:-దేహభృతా=దేహధారిచేత(దేహమే నేను అనుకొనేవానిచేత)కర్మాణి =కర్మలను,అశేషతః=పూర్తిగా,త్యక్తుమ్=విడచుటకు,న శక్యం హి=శక్యం కాదు కదా?తు= కాని,యః=ఎవడు,కర్మఫలత్యాగీ=కర్మఫలం విడిచిపెడతాడో,సః=అతడు,త్యాగీ ఇతి = త్యాగి అని, అభిధీయతే=చెప్పబడుచున్నాడు.

భాష్యమ్

న,హి యస్మాత్,దేహభృతా-దేహం బిభర్తీతి దేహభృత్,దేహాత్మాభిమానవాన్ దేహభృత్ ఉచ్యతే,న హి వివేకీ,స హి "వేదావినాశినమ్"(2.21)ఇత్యాదినా కర్తృత్వాధి కారాత్ నివర్తితః.అతః తేన దేహభృతా అజ్ఞేన,న శక్యం త్యక్తుం సంన్యసితుం కర్మాణి, అశేషతః నిఃశేషేణ.తస్మాత్ యస్తు అజ్ఞః అధికృతః నిత్యాని కర్మాణి కుర్వన్ కర్మఫలత్యాగీ కర్మఫలాభిసంధిమాత్రసంన్యాసీ,సః త్యాగీ ఇతి అభిధీయతే కర్మీ అపి సన్,ఇతి స్తుత్య భిప్రాయేణ.తస్మాత్ పరమార్థదర్శినా ఏవ,అదేహభృతా దేహాత్మభావరహితేన అశేషకర్మ సంన్యాసః శక్యతే కర్తుమ్. 11

బాలానందిని

న హీతి:-దేహం ధరించేవాడు దేహభృత్.దేహమునందు తాను అనే అభిమానం గలవాడు(దేహమే ఆత్మ అనుకొనేవాడు)'దేహభృత్'అని చెప్పబడుచున్నాడు.అతడు(దేహ భృత్)వివేకి కాడు కదా?అతడు(వివేకి)"వేదావినాశినమ్"ఇత్యాదికంచేత కర్తృత్వాధికారం నుండి మరల్చబడ్డాడు.అట్టి దేహభృత్తుచేత కర్మలను పూర్తిగా సంన్యసించుటకు ఏ కారణం వల్ల శక్యం కాదో అందువల్ల ఎవ డైతే అజ్ఞుడై అధికృతుడుగా ఉన్నాడో నిత్యకర్మలను

చేస్తూ కర్మఫలత్యాగియో,కర్మఫలాభిసంధిని మాత్రం విడిచిపెడతాడో అతడు కర్మియే అయినా కూడ త్యాగి అని చెప్పబడుచున్నాడు.అతనిని త్యాగి అనడం స్తుతికొరకు.అందువల్ల పరమార్థదర్శియై దేహాత్మభావం లేని దేహభృత్తు కానివానిచేతనే సర్వకర్మసంన్యాసం చేయడానికి శక్యం అవుతుంది.

వి. పరమార్థదర్శి అవడంచేత అట్టివానికి దేహాత్మభావం ఉండదు.దేహాత్మభావం ఉన్నవాడే దేహభృత్తు.దేహాత్మభావం లేని పరమార్థదర్శి దేహంతో ఉన్నట్లు ఇతరులకు కనబడినా అతడు దేహభృత్తు కాడు.అట్టివాడే సర్వకర్మసంన్యాసం చేయకలుగుతాడు. "పరమార్థదర్శినా ఏవ"అను పాఠానికి బదులు"పరమార్థదర్శిత్వేనైవ"అని కొన్ని ప్రతులలో పాఠం ఉంది.భావం సమానమే.పరమార్థదర్శిత్వం ఉంటేనే"అదేహభృత్తు"అవుతాడు అని అర్థం. 11

భాష్యమ్

కిం పునః తత్ ప్రయోజనం యత్ సర్వకర్మపరిత్యాగాత్ స్యాత్ ఇత్యుచ్యతే-

మూ. అనిష్టమిష్టం మిశ్రం చ త్రివిధం కర్మణః ఫలమ్,
భవత్యత్యాగినాం ప్రేత్య న తు సంన్యాసినాం క్వచిత్. 12

బాలానందిని

కిమితి:-సర్వకర్మపరిత్యాగంవల్ల ఏమి ప్రయోజనమో చెప్పబడుచున్నది-

ప్ర. అ. అనిష్టమితి:-అత్యాగినామ్=త్యాగులు కానివారికి,కర్మణః=కర్మయొక్క, అనిష్టమ్=ఇష్టము కానిది,ఇష్టమ్=ఇష్ట మైనది,మిశ్రం చ=మిశ్రము అను,త్రివిధమ్=మూడు విధాలైన,ఫలమ్=ఫలము,ప్రేత్య=మరణించిన తరువాత,భవతి=కలుగును;సంన్యాసినాం= సంన్యాసులకైతే, క్వచిత్=ఎక్కడా కూడ,న=కలుగదు.

భాష్యమ్

అనిష్టం నరకతిర్యగాదిలక్షణమ్,ఇష్టం దేవాదిలక్షణం,మిశ్రమ్ ఇష్టానిష్ట సంయుక్తం మనుష్యలక్షణం చ,ఏవం,త్రివిధం త్రిప్రకారం,కర్మణః ధర్మాధర్మలక్షణస్య, ఫలం బాహ్యానేకకారకవ్యాపారనిష్పన్నం సత్ అవిద్యాకృతమ్ ఇన్ద్రజాలమాయోపమం మహామోహకరం ప్రత్యగాత్మోపసర్పీవ.ఫల్గుతయా లయమ్ అదర్శనం గచ్ఛతీతి ఫలమ్ ఇతి ఫలనిర్వచనమ్;తత్ ఏతత్ ఏవంలక్షణం ఫలం భవతి అత్యాగినామ్ అజ్ఞానామ్ కర్మిణామ్ అపరమార్థసంన్యాసినాం,ప్రేత్య శరీరపాతాత్ ఊర్ధ్వమ్.న తు పరమార్థ సంన్యాసినాం పరమహంసపరివ్రాజకానాం కేవలజ్ఞాననిష్ఠానాం,క్వచిత్.న హి కేవల సమ్యగ్దర్శననిష్ఠా అవిద్యాసంసారబీజం న ఉన్మూలయతి కదాచిత్ ఇత్యర్థః. 12

బాలానందిని

అనిష్టమితి:-నరకము,తిర్యగ్జన్మము మొదలైన స్వరూపం గల అనిష్టఫలము, దేవాదిరూప మైన ఇష్టఫలము,ఇష్టానిష్టసంయుక్త మైన మనుష్యలక్షణ మైన ఫలమూ అని,ధర్మఅధర్మరూప మైన కర్మయొక్క ఫలము మూడు విధా లైనది.బాహ్యాము లైన అనేకవ్యాపారములచేత ఏర్పడేది,అవిద్యచేత చేయబడినది,ఇంద్రజాలంవంటిది, మహా మోహం కలిగించేది అయిన ఈ ఫలం ప్రత్యగాత్మకు సంబంధించినది వలె ఉంటుంది. ఫల్గు అనగా స్వల్పం అవడంచేత లయమును పొందుతుంది,కనబడకుండా పోతుంది గాన 'ఫలమ్'అని ఫలశబ్దనిర్వచనం.ఈ విధమైన అత్యాగులకు,అజ్ఞు లైన కర్మలకు, అపరమార్థ సంన్యాసులకు(ముఖ్యసంన్యాసులు కాని వాళ్లకు అనగా మోహంచేతనో క్లేశకర మనే భయంచేతనో కర్మను త్యజించేవాళ్లకు) శరీరపాతానంతరం కలుగుతుంది.అంతేనే కాని పరమార్థసంన్యాసులు,కేవలజ్ఞాననిష్ఠులూ అయిన పరమహంసపరివ్రాజకులకు ఎక్కడా కూడ కలగదు.కేవలసంన్యాసనిష్ఠ ఎన్నడూ కూడ సంసారబీజ మైన అవిద్యాదికాన్ని పెకిలించి వేయకుండా ఉండదు కదా అని అర్థం. 12

భాష్యమ్

అతః పరమార్థదర్శినః ఏవ అశేషకర్మసంన్యాసిత్వం సంభవతి అవిద్యాధ్యారోపితత్వాత్ ఆత్మని క్రియాకారకఫలానామ్;న తు అజ్ఞస్య అధిష్ఠానాదీని క్రియాకర్మాణి కారకాణి ఆత్మత్వేన పశ్యతః అశేషకర్మసంన్యాసః సంభవతి.తదేతత్ ఉత్తరైః శ్లోకైః దర్శయతి-

మూ. **పఞ్చైమాని మహాబాహో కారణాని నిబోధ మే,**
సాంఖ్యే కృతాన్తే ప్రోక్తాని సిద్ధయే సర్వకర్మణామ్. **13**

భాష్యమ్

అతః ఇతి:-అందువల్ల,క్రియ,కారకములు,ఫలములు ఆత్మయందు అవిద్యచేత ఆరోపించబడడంవల్ల పరమార్థసంన్యాసికి మాత్రమే అశేషకర్మసంన్యాసం సంభవం అవుతుంది.అంతేనే కాని క్రియలు ఆచరించే అధిష్ఠానం మొదలైన కారకాలను ఆత్మగా చూసే అజ్ఞునికి అశేషకర్మసంన్యాసం సంభవం కాదు.ఈ విషయమునే రాబోయే శ్లోకాలతో చూపుతున్నాడు-

ప్ర.అ.పఞ్చేతి:- మహాబాహో=మహాబాహూ,సర్వకర్మణామ్= సమస్తకర్మల యొక్క, సిద్ధయే=సిద్ధికొరకు, సాంఖ్యే=జ్ఞానమునకు సంబంధించిన, కృతాన్తే=

సిద్ధాంతమునందు (వేదాంతమునందు), ప్రోక్తాని=చెప్పబడిన, ఇమాని=ఈ, పఞ్చ= ఐదు, కారణాని=కారణాలను, మే=నానుండి,నిబోధ= తెలుసుకొనుము.

భాష్యమ్

పఞ్చ ఇమాని వక్ష్యమాణాని,హే మహాబాహో,కారణాని నిర్వర్తకాని,నిబోధ,మే మమ ఇతి ఉత్తరత్ర చేతఃసమాధానార్థం వస్తువైషమ్యప్రదర్శనార్థం చ తాని కారణాని జ్ఞాతవ్యతయా స్తౌతి.సాంఖ్యే-జ్ఞాతవ్యాః పదార్థాః సంఖ్యాయన్తే యస్మిన్ శాస్త్రే తత్ సాంఖ్యం;వేదాన్తః కృతాన్తే ఇతి తస్యైవ విశేషణమ్.కృతమితి కర్మ ఉచ్యతే.తస్య అన్తః కృతస్య పరిసమాప్తిః యత్ర సః కృతాన్తః కర్మాన్తః ఇత్యేతత్."యావానర్థ ఉదపానే" (2.46) "సర్వం కర్మాఖిలం పార్థ జ్ఞానే పరిసమాప్యతే"(4.33)ఇతి ఆత్మజ్ఞానే సంజాతే సర్వ కర్మణాం నివృత్తిం దర్శయతి.అతః తస్మిన్ ఆత్మజ్ఞానార్థే సాంఖ్యే కృతాన్తే వేదాన్తే ప్రోక్తాని కథితాని,సిద్ధయే నిష్పత్త్యర్థం సర్వకర్మణామ్. 13

బాలానందిని

పఞ్చేతి:-ఓ!మహాబాహూ!ఈ చెప్పబడబోయే ఐదు కారణాలను,ఫలాన్ని సంపాదించేవాటిని నానుండి వినుము అని అంటూ రాబోయే విషయంమీద మనస్సు నిలపకుండా, వస్తువులలో (అధిష్ఠానాదులలో) ఉన్న భేదాన్ని చూపడంకొరకు ఆ కారణాలను తెలియదగినవాటినిగా స్తుతిస్తున్నాడు. ఏ శాస్త్రంలో తెలియదగిన పదార్థాలు (జీవుడు, పరమాత్మ,అవిద్య, ఆత్మైక్యము, బంధ-మోక్షాలు మొదలైనవి)ప్రతిపాదించబడతాయో ఆ శాస్త్రం సాంఖ్యం.అనగా వేదాంతం.'కృతాన్తే'అనేది దానికే విశేషణం.'కృతమ్' అనగా కర్మ.దానికి పరిసమాప్తి దేనియందో,ఎక్కడ కర్మ అంతమును పొందుతుందో అది కృతాంతం."యావానర్థ ఉదపానే" "సర్వం కర్మాఖిలం పార్థ జ్ఞానే పరిసమాప్యతే" అని జ్ఞానం పుట్టగానే సర్వకర్మలు వెనుకకు మరలుతాయి (అంతం పొందుతాయి) అని చూపుచున్నాడు.అందువల్ల ఆ ఆత్మజ్ఞానం ప్రయోజనంగా గల సాంఖ్యకృతాంతమునందు వేదాంతమునందు చెప్పబడ్డవి.సర్వకర్మల సిద్ధికొరకు చెప్పడినవి. 13

భాష్యమ్

కాని తాని ఇత్యుచ్యతే-

మూ. **అధిష్ఠానం తథా కర్తా కరణం చ పృథగ్విధమ్,**
వివిధాశ్చ పృథక్చేష్టా దైవం చైవాత్ర పఞ్చమమ్. 14

బాలానందిని

కానీతి:-అవి ఏవో చెప్పబడుచున్నది-

ప్ర.అ. **అధిష్ఠానమితి**:-అధిష్ఠానమ్=శరీరము,తథా=మరియు,కర్తా=కర్తయు, పృథగ్విధమ్=వేరు వేరు విధాలైన,కరణం చ=ఇంద్రియము,తథా=అట్లే,వివిధాః=అనేక విధాలైన,పృథక్చేష్టాః=ప్రాణవాయువు సంబంధమైన వేరు వేరు చేష్టలు,అత్ర=వీటిలో (వీటితోపాటు),పఞ్చమమ్=ఐదవదైన,దైవం చ దైవము (ఆ యా దేవతలు) (ఈ ఐదూ సర్వకర్మలకు కారణాలు).

భాష్యమ్

అధిష్ఠానమ్-ఇచ్ఛాద్వేషసుఖదుఃఖజ్ఞానాదీనామ్ అభివ్యక్తేః ఆశ్రయః అధిష్ఠానం శరీరం,తథా కర్తా ఉపాధిలక్షణః భోక్తా,కరణం చ శ్రోత్రాదికం శబ్దాద్యుపలబ్ధయే, పృథగ్విధం నానా ప్రకారం ద్వాదశసంఖ్యం, వివిధాః చ,పృథక్ చేష్టాః వాయవీయాః ప్రాణాపానాదయః,దైవం చ ఏవ దైవమేవ చ,అత్ర ఏషు చతుర్షు పఞ్చమం, పఞ్చానాం పూరణమ్ ఆదిత్యాది చక్షురనుగ్రాహకమ్. **14**

బాలానందిని

అధిష్ఠానమ్ ఇతి:- ఇచ్ఛ ద్వేషము సుఖము జ్ఞానము మొదలైనవి అభివ్యక్తము లవడానికి ఆశ్రయ మైన అధిష్ఠానము అనగా శరీరము,మరియు,ఉపాధిరూప మైన (అంతః కరణరూప మైన)భోక్త యైన కర్త,శబ్దాదుల జ్ఞానానికి సాధనము అనేకవిధాలుగా ఉన్నది,పన్నెండు సంఖ్యలో ఉన్నదీ అయిన శ్రోత్రాదికమైన ఇంద్రియము (పంచజ్ఞానేంద్రియాలు,పంచకర్మేంద్రియాలు,బుద్ధి-మనస్సు),అనేకవిధా లైన ప్రాణాపానాదు లైన వాయువుకు సంబంధించిన చేష్టలు,ఈ నాలిగింటితో పాటు ఐదవ దయిన(ఐదు అంకెను పూరించే దైన)చక్షురాదులను అనుగ్రహించే ఆదిత్యాదిదైవము(అనగా ఆ యా ఇంద్రియాల అధిష్ఠాన దేవతాదిరూపంలో ఉన్న దైవము), (ఈ ఐదూ సర్వకర్మలకు కారణము లని చెప్పబడినవి అని వెనుకటి శ్లోకంతో అన్వయం). **14**

మూ. శరీరవాఙ్మనోభిర్యత్ కర్మ ప్రారభతే నరః,
న్యాయ్యం వా విపరీతం వా పఞ్చైతే తస్య హేతవః. 15

ప్ర.అ.**శరీరేతి**:-నరః=నరుడు,శరీరవాఙ్మనోభిః=శరీర-వాక్-మనస్సులచేత, న్యాయ్యం అ=న్యాయసంమతమైనా,విపరీతం వా=అందుకు విపరీత మైనా,యత్=ఏ కర్మ=కర్మను,ప్రారభతే=ప్రారంభిస్తున్నదో,తస్య=దానికి,ఏతే=ఇవి,పఞ్చ=ఐదు, హేతవః= హేతువులు.

భాష్యమ్

శరీరేతి:–శరీరవాఙ్మనోభిః యత్ కర్మ త్రిభిః ఏతైః,ప్రారభతే నిర్వర్తయతి,నరః న్యాయ్యం వా ధర్మ్యం శాస్త్రీయం,విపరీతం వా అశాస్త్రీయమ్ అధర్మ్యమ్,యచ్చ అపి నిమిషితచేష్టాది జీవనహేతుః తదపి పూర్వకృతధర్మాధర్మయోరేవ కార్యమ్ ఇతి న్యాయ్య విపరీతయోః ఏవ గ్రహణేన గృహీతమ్.పఞ్చ ఏతే యథోక్తాః తస్య సర్వస్యైవ కర్మణః హేతవః కారణాని.నను అధిష్ఠానాదీని సర్వకర్మణాం కారణాని,కథమ్ ఉచ్యతే శరీరవాఙ్మనోభిః కర్మ ప్రారభతే ఇతి?నైష దోషః.విధిప్రతిషేధలక్షణం సర్వం కర్మ శరీరాది త్రయప్రధానం–తదఙ్గతయా దర్శనశ్రవణాది చ జీవనలక్షణం త్రిధైవ రాశీకృతమ్ ఉచ్యతే శరీరాదిభిః ఆరభ్యతే ఇతి.ఫలకాలే౽పి తత్ప్రధానైః సాధనైః భుజ్యతే ఇతి పఞ్చానామేవ హేతుత్వం న విరుధ్యతే. 15

బాలానందిని

శరీరేతి:–నరుడు శరీరము వాక్కు మనస్సు అను ఈ మూడింటిచేత శాస్త్రవిహితమైన ధర్మసంమతమైన కర్మను గాని,అందుకు విపరీతమైన అశాస్త్రీయము ధర్మవిరుద్ధమూ అయిన కర్మను గాని దేనిని చేస్తాడో,జీవనానికి హేతువైన రెప్పపాటు వేయడం చేష్టలు మొదలైన కర్మ పూర్వం చేసిన ధర్మాధర్మాల కార్యమే గాన న్యాయ్య–విపరీతకర్మలను చెప్పడంచేత దానిని చెప్పి నట్లే.ఆ సమస్తకర్మకు పైన చెప్పిన ఈ ఐదూ కారణాలు.(ఆశంక)– సర్వకర్మలకు కారణాలు అధిష్ఠానాదులు కదా?"శరీరవాఙ్మనస్సులచేత కర్మ చేస్తాడు"అని ఇక్కడ ఎలా చెప్పబడుచున్నది?(సమాధానం)ఈ దోషం లేదు.విధిప్రతిషేధరూప మైన సమస్తకర్మకు శరీరాదిత్రయమే ప్రధానం.(ఏ కర్మ చేసినా ముఖ్యంగా వీటితో చేయవలసినదే).దర్శనం శ్రవణం మొదలైన జీవనలక్షణం ఆ శరీరాదిత్రయానికి అంగం గాన మూడు గానే రాశీకృతమై(మూడు సముదాయాలలోనే చేర్చబడినదై)"శరీరాదిభిః ఆరభతే" అని చెప్పబడింది. ఫలకాలంలో కర్మ శరీరాదిత్రయప్రధానము లైన సాధనాలచేతనే (ఇంద్రియ–ప్రాణాలచేతనే) అనుభవించబడుతుంది గాన ఐదూ హేతువు అని చెప్పడం విరుద్ధం కాదు.

వి."దర్శనశ్రవణాది చ జీవనలక్షణం"అన్నప్పుడు ఆదిశబ్దంచేత ప్రాణకర్మయైన చేష్ట కూడ గ్రహించబడుతుంది.చక్షురాదీంద్రియాలు దర్శనాదులచేత,ప్రాణాదులు చేష్టోత్పత్తి చేత శరీరాదులకు ఉపకరిస్తాయి గాన వాటి కంగాలు.అందుచేత వీటి పనులు కూడ శరీరాదులకు సంబంధించినట్లు గ్రహించి మూడు రాసులు,శరీరవాఙ్మనస్సులు మాత్రమే చెప్పబడినవి.ఫలకాలంలో కూడ కర్మను అనుభవించేవి (కర్మఫలాన్ని అనుభవించేవి) ప్రధానంగా శరీరాదులు.వాటి ద్వారా ఇంద్రియప్రాణాదులు ఫలాన్ని అనుభవిస్తాయి. ఈ

విధంగా ప్రధానంగా కొన్ని, వాటికి అంగాలుగా కొన్ని,మొత్తంమీద ఐదూ కర్మహేతువులే అని అర్థం. 15

మూ. తత్రైవం సతి కర్తారమాత్మానం కేవలం తు యః,
పశ్యత్యకృతబుద్ధిత్వాన్న స పశ్యతి దుర్మతిః 16

ప్ర.అ.**తత్రేతి**:-తత్ర=కర్మ,ఏవం సతి=ఈ విధంగా(ఐదింటిచేత చేయదగినదిగా) ఉంటూండగా,యః=ఎవడు,కేవలమ్=కేవలమూ,ఆత్మానమ్=ఆత్మను,కర్తారమ్=కర్తనుగా, పశ్యతి=చూస్తాడో,సః=ఆ,దుర్మతిః=దుర్బుద్ధి,అకృతబుద్ధిత్వాత్=సంస్కరింపబడని బుద్ధి కలవాడవడంచేత,న పశ్యతి=సరిగా చూడడంలేదు.

భాష్యమ్

తత్రేతి:-తత్రేతి ప్రకృతేన సంబధ్యతే.ఏవం సతి,ఏవం యథోక్తైః పఞ్చభిః **హేతుభిః** నిర్వర్త్యే సతి కర్మణి,తత్రైవం సతి ఇతి దుర్మతిత్వస్య హేతుత్వేన సంబధ్యతే. **తేషు** ఆత్మానమ్ అనన్యత్వేన అవిద్యయా పరికల్ప్య తైః క్రియమాణస్య కర్మణః అహమేవ కర్తా ఇతి కర్తారమ్ ఆత్మానం,కేవలం శుద్ధం, తు యః పశ్యతి అవిద్వాన్, కస్మాత్? వేదాన్తాచార్యోపదేశన్యాయైః అకృతబుద్ధిత్వాత్ అసంస్కృతబుద్ధిత్వాత్;యః అపి దేహాదివ్యతిరిక్తాత్మవాదీ అన్యమ్ ఆత్మానమేవ కేవలం కర్తారం పశ్యతి అసౌ అపి అకృతబుద్ధిః ఏవ.అతః అకృతబుద్ధిత్వాత్ న సః పశ్యతి ఆత్మనః తత్త్వం కర్మణో వా ఇత్యర్థః. అతః దుర్మతిః. కుత్సితా విపరీతా దుష్టా అజస్రం జననమరణ ప్రతిపత్తిహేతుభూతా మతిః అస్య ఇతి దుర్మతిః.సః పశ్యన్నపి న పశ్యతి;యథా తైమిరికః అనేకం చన్ద్రం,యథా వా అభ్రేషు ధావత్సు చన్ద్రం ధావన్తం,యథా వా వాహనే ఉపవిష్టః అన్యేషు ధావత్సు ఆత్మానం ధావన్తమ్. 16

బాలానందిని

తత్రేతి:- 'తత్ర'అనేది ప్రకృత మైన కర్మతో సంబంధిస్తుంది.కర్మ పైన చెప్పిన ఐదు హేతువులచేత చేయబడేదిగా ఉండగా,"తత్రైవం సతి"అనేది దుర్మతిత్వానికి హేతువుగా సంబంధిస్తుంది.(ఐదు హేతువు లుండగా ఒకే హేతు వున్న దని అనడం దుర్మతిత్వానికి లక్షణం అని అర్థం).వాటిలో ఆత్మ వాటికంటె వేరు కాదని అవిద్యచేత కల్పించి వాటిచేత చేయబడుచున్న కర్మకు నేనే కర్తను అని కేవలమైన,శుద్ధమైన ఆత్మను కర్తనుగా ఏ అవిద్వాంసుడు చూస్తాడో;ఎందువల్ల?వేదాంతంచేత,ఆచార్యోపదేశంచేత న్యాయంచేత సంస్కరింపబడని బుద్ధికలవాడవడంవల్ల.ఆత్మ దేహాదులకంటె భిన్నము అని చెప్పేవాడు

కూడ, ఎవడు వాటికంటె భిన్న మైన ఆత్మ మాత్రమే కర్త అని అంటాడో అతడు కూడ అకృతబుద్ధియే. అకృతబుద్ధి అవడంవల్లనే ఆత్మయొక్క యథార్థస్వరూపాన్ని గాని, కర్మయొక్క యథార్థస్వభావాన్ని గాని తెలుసుకొనడం లేదు. అందువల్లనే ఇతడు దుర్మతి. వీని మతి కుత్సిత మైనది. విపరీత మైనది, ఎల్లప్పుడు జననమరణాలు పొందుతూండడానికి హేతు వైనది; అట్టి మతికలవాడవడంచేత ఇతడు దుర్మతి. అతడు చూస్తున్నా కూడ చూడడంలేదు. రేచీకటి ఉన్నవాడు అనేకచంద్రులను ఎలా చూస్తాడో, మేఘాలు పరుగెడుతూండగా చంద్రుడు పరుగెత్తుతున్నా డని అనుకొంటాడో, వాహనంలో కూర్చున్నవాడు ఇతరులు శీఘ్రంగా వెడుతూండగా (ప్రక్క నున్న రైలు కదులుతూన్నప్పుడు తాను కూర్చొన్న రైలు కదులుతూన్న దని అనుకొన్నట్లు) తాను వెడుతున్నట్లు అనుకొంటాడో అట్లే. 16

భాష్యమ్

కః పునః సుమతిః యః సమ్యక్ పశ్యతీతి? ఉచ్యతే-

మూ. యస్య నాహంకృతో భావో బుద్ధిర్యస్య న లిప్యతే,
హత్వాపి స ఇమాన్ లోకాన్ న హన్తి న నిబధ్యతే. 17

బాలానందిని

క ఇతి: -బాగా చూసే సుమతి ఎవడు? చెప్పబడుచున్నది-

ప్ర. అ. యస్యేతి: -యస్య=ఎవనియొక్క, భావః=భావము, న అహంకృతః=అహం కారం కలది కాదో, యస్య=ఎవనియొక్క, బుద్ధిః=బుద్ధి, న లిప్యతే=లిప్తము కాదో, సః=అతడు, ఇమాన్=ఈ, లోకాన్=లోకాలను, హత్వా అపి=చంపి కూడ, న హన్తి=చంపుటలేదు, న నిబధ్యతే=బద్ధుడు కాదు.

భాష్యమ్

యస్య శాస్త్రాచార్యోపదేశన్యాయసంస్కృతాత్మనః, న భవతి, అహంకృతః అహం కర్తా ఇత్యేవంలక్షణః, భావః భావనా ప్రత్యయః "ఏతే ఏవ పఞ్చ అధిష్ఠానాదయః అవిద్యయా ఆత్మని కల్పితాః సర్వకర్మణాం కర్తారః, న అహమ్, అహం తు తద్వ్యాపారాణాం సాక్షిభూతః "అప్రాణః అమనాః శుభ్రః అక్షరాత్ పరతః పరః" (ము. ఉ. 2. 1. 2) కేవలః అవిక్రియః ఇత్యేవం పశ్యతి ఇత్యేతత్. బుద్ధిః అన్తః కరణం యస్య ఆత్మనః ఉపాధిభూతా న లిప్యతే న అనుశాయినీ భవతి-ఇదమ్ అహమ్ అకార్షమ్, తేనాహం నరకం గమిష్యామి" ఇత్యేవం యస్య బుద్ధిః న లిప్యతే సః సుమతిః సః పశ్యతి. హత్వా అపి సః ఇమాన్ లోకాన్ సర్వాన్ ప్రాణినః ఇత్యర్థః. న హన్తి హననక్రియాం న కరోతి, న నిబధ్యతే నాపి తత్కార్యేణ అధర్మఫలేన సంబధ్యతే.

నను హత్వాపి న హన్తీతి విప్రతిషిద్ధమ్ ఉచ్యతే యద్యపి స్తుతిః?నైష దోషః. లౌకికపారమార్థికదృష్ట్యపేక్షయా తదుపపత్తేః. దేహాద్యాత్మబుద్ధ్యా హన్తాహమితి లౌకికీం దృష్టిమ్ ఆశ్రిత్య హత్వాపి ఇత్యాహ. యథాదర్శితాం పారమార్థికీం దృష్టిమ్ ఆశ్రిత్య"న హన్తి న నిబధ్యతే" ఇతి;తత్ ఉభయమ్ ఉపపద్యతే ఏవ.

బాలానందిని

యస్యేతి: -శాస్త్రంచేత,ఆచార్యోపదేశంచేత,న్యాయంచేత సంస్కరించబడిన బుద్ధి గల ఎవనికి నేను కర్తను అనుభావం,భావన,జ్ఞానం, కలగదో,అనగా అధిష్ఠానాదులు ఐదూ కూడ అవిద్యచేత ఆత్మయందు కల్పించబడినవి,అవే సమస్త కర్మలూ చేస్తూంటాయి,నేను చేయుటలేదు,నే నైతే కేవలం అవి చేసే పనులకు సాక్షిమాత్రంగా ఉంటున్నాను,ప్రాణములు కాని మనస్సు కాని లేనివాడను,పరిశుద్ధుడను,పరమైన అక్షరంకంటె పరుడను,కేవలుడను, వికారశూన్యుడను అని ఎవడు చూస్తాడో అని అర్థం.ఏ ఆత్మకు ఉపాధి యైన బుద్ధి లిప్తము కాదో,పశ్చాత్తాపము కలది కాదో;నేను ఈ అకార్యం చేశాను,దానిచేత నేను నరకానికి వెడతాను అని ఎవని బుద్ధి లిప్తము కాదో,అట్టి సుమతియే చూస్తాడు.అతడు ఈ లోకాలన్నింటినీ,అన్ని ప్రాణులనూ అని అర్థం.చంపినా కూడ చంపడు,చంపడం అనే పని చేయడం లేదు.అలా చపండంవల్ల కలిగే అధర్మఫలంతో సంబంధం కలవాడు కాదు.

(ఆశంక)ఎంత స్తుతియే అయినా-చంపినా కూడ చంపడంలేదు అని ఇది విరుద్ధంగా చెప్పబడుచున్నది కదా?(సమాధానం) లౌకికదృష్టిచేత పారమార్థికదృష్టిచేత ఇలా చెప్పడం ఉపపన్నమే అవుతుంది.దేహాదులయందు ఆత్మబుద్ధితో "నేను చంపువాడను" అనే లౌకికదృష్టిని అనుసరించి "హత్వాపి"అని చెప్పబధుచున్నది.పైన చూపబడిన పారమార్థికదృష్టిని అనుసరించి "న హన్తి న నిబధ్యతే"అని చెప్పబడుచున్నది. అందువల్ల ఉభయమూ కూడ ఉపపన్నమే.

భాష్యమ్

నను అధిష్ఠానాదిభిః సంభూయ కరోత్యేవ ఆత్మా "**కర్తారమ్ ఆత్మానం కేవలం తు**"(18.16)ఇతి కేవలశబ్దప్రయోగాత్?నైష దోషః.ఆత్మనః అవిక్రియస్వభావత్వే అధిష్ఠానాదిభిః సంహతత్వానుపపత్తేః. విక్రియావతః హి అన్యైః సంహననం సంభవతి, సంహత్య వా కర్తృత్వం స్యాత్ న తు అవిక్రియస్య ఆత్మనః కేన చిత్ సంహననమ్ అస్తి ఇతి న సంభూయ కర్తృత్వమ్ ఉపపద్యతే.అతః కేవలత్వమ్ ఆత్మనః స్వాభావికమితి కేవలశబ్దః అనువాదమాత్రమ్.అవిక్రియత్వం చ ఆత్మనః శ్రుతిస్మృతిన్యాయప్రసిద్ధమ్-"**అవికార్యోఽయముచ్యతే**"(2.25)"**గుణైరేవ కర్మాణి క్రియన్తే**"(3.27),

"శరీరస్థోఽపి న కరోతి"(13.31)ఇత్యాది అసకృత్ ఉపపాదితం గీతాస్వేవ తావత్. శ్రుతిషు చ-**"ధ్యాయతీవ లేలాయతీవ"**(బృ.ఉ.4.3.7)ఇత్యేవమాద్యాసు.న్యాయతశ్చ-నిరవయవమ్ అపరతన్త్రమ్,అవిక్రియమ్ ఆత్మతత్త్వమ్ ఇతి రాజమార్గః.విక్రియావత్త్వాభ్యుపగమేఽపి ఆత్మనః స్వకీయా ఏవ విక్రియా స్వస్య భవితుమ్ అర్హతి.న అధిష్ఠానాదీనాం కర్మాణి ఆత్మకర్తృకాణి స్యుః. న హి పరస్య కర్మ పరేణ అకృతమ్ ఆగన్తుమ్ అర్హతి.యత్తు అవిద్యయా గమితం న తత్ తస్య;యథా రజతత్వం న శుక్తికాయాః, యథా వా తలమలవత్త్వం బాలైః గమితమ్ అవిద్యయా న ఆకాశస్య.తథా అధిష్ఠానాదివిక్రియాపి తేషామేవ ఇతి న ఆత్మనః.తస్మాత్ యుక్తమ్ ఉక్తమ్ అహంకృతత్వబుద్ధిలేపాభావాత్ విద్వాన్ న హన్తి న నిబధ్యతే ఇతి. **"నాయం హన్తి న హన్యతే"**ఇతి ప్రతిజ్ఞాయ **"న జాయతే"**ఇత్యాది హేతువచనేన అవిక్రియత్వమ్ ఆత్మనః ఉక్త్వా**"వేదావినాశినమ్"**(2.19;20.21)ఇతి విదుషః కర్మాధికారనివృత్తిం శాస్త్రాదౌ సంక్షేపతః ఉక్త్వా, మధ్యే ప్రసారితాం, తత్ర తత్ర ప్రసఙ్గం కృత్వా ఇహ ఉపసంహరతి శాస్త్రార్థపిణ్డీకరణాయ **"విద్వాన్ న హన్తి న నిబధ్యతే"**ఇతి.ఏవం చ సతి దేహభృత్త్వాభిమానానుపపత్తౌ అవిద్యాకృతాశేషకర్మసంన్యాసోపపత్తేః సంన్యాసినామ్ అనిష్టాది త్రివిధం కర్మణః ఫలం(18.12)న భవతి ఇతి ఉపపన్నమ్;తద్విపర్యయాచ్చ ఇతరేషాం భవతి ఇతి ఏతత్ చ అపరిహార్యమ్ ఇతి ఏషః గీతాశాస్త్రార్థః ఉపసంహృతః. స ఏవ సర్వవేదార్థసారః నిపుణమతిభిః పణ్డితైః విచార్య ప్రతిపత్తవ్యః ఇతి తత్ర తత్ర ప్రకరణవిభాగేన దర్శితః అస్మాభిః శాస్త్రన్యాయానుసారేణ. 17

బాలానందిని

నన్వితి:-(ఆశంక)**"కర్తారమ్ ఆత్మానం కేవలం తు"**అని 'కేవల'శబ్దం ప్రయోగించడంచేత ఆత్మ అధిష్ఠానాదులతో కలిసి చేస్తూనే ఉంటూంది కదా?

వి.కేవల మైన ఆత్మ(ఆత్మ మాత్రమే)కర్త అనుకొనేవాడు అకృతబుద్ధి అని చెప్పడం చేత ఆత్మ తాను ఒంటరిగా కర్త కాకపోయినా అధిష్ఠానాదులతో(దేహాదులతో)కలిసి కర్తగా ఉంటూన్నది అను అర్థం వస్తుంది కదా అని భావం.

నైష ఇతి:-(సమాధానం)ఈ దోషం లేదు.ఆత్మ వికారరహితమై నప్పుడు(వికారాలు లేక పోవడమే ఆత్మస్వభావం అయి ఉండగా)అది అధిష్ఠానాదులతో కలవడం అనేది ఉపపన్నం కాదు కదా?వికారం కలది ఇతరవస్తువులతో కలవడం గాని, కలిసి కర్తగా ఉండడం గాని కుదరవచ్చును;అంతేకాని వికారరహిత మైన ఆత్మ దేనితోనూ కలవడం గాని,కలిసి కర్తగా అవడం గాని ఉపపన్నం కాదు.అందుచేత ఆత్మ కేవలంగా ఉండడం

(దేనితోను సంబంధం లేకుండా ఉండడం)స్వాభావికం గాన కేవలమైన ఆత్మ అని చెప్పడం అనువాదమాత్రమే(అంతే కాని అది కేవలంగా ఉన్నప్పుడు దానికి కర్తృత్వం ఉండదు; అధిష్ఠానాదులతో కలిసి నప్పుడు కర్తృత్వం కలుగుతుంది అని చెప్పడం ఉద్దేశ్యం కాదు). ఆత్మ వికారరహితం అనే విషయం శ్రుతులలోను స్మృతులలోనూ కూడ ప్రసిద్ధం,న్యాయం (యుక్తి)చేత కూడ సిద్ధిస్తుంది."ఆత్మ అవికార్య మని చెప్పబడుచున్నది","కర్మలు గుణాల చేతనే చేయబడుచున్నాయి"."శరీరంలో ఉన్నా కూడ చేయుడంలేదు"ఇత్యాదిరీతులలో (ఆత్మకు వికారం లేదనే విషయం)భగవద్గీతలోనే అనేక పర్యాయాలు ప్రతిపాదించబడినది.అట్లే "ధ్యాయతీవ లేలాయతీవ"(ఆత్మ ధ్యానంచేస్తున్నట్లు,ఆ యా చేష్టలు చేస్తున్నట్లూ కనబడుతుంది,వాస్తవంగా అవన్నీ చేసేది బుద్ధియే)ఇత్యాదిశ్రుతులలో కూడ చెప్పబడింది. న్యాయాన్ని పట్టి కూడ ఇదే సిద్ధిస్తుంది.ఆత్మతత్త్వం అవయవరహితం,పరాధీనం కానిది, వికారాలు లేనిది అనేది రాజమార్గం.ఆత్మకు వికారం ఉంటుం దని అంగీకరించినా కూడ ఆత్మకు దాని సంబంధమైన వికారమే దానికి ఉండాలి.(అంతే కాని అధిష్ఠానాదుల వికారాలు ఆత్మకు సంబంధించవు.

వి. వాస్తవంలో ఆత్మకు వికారమే లేదు. వికారం ఉంటుంది అని అన్నా కూడ దానికి వికారం తనలో ఉన్న కర్మచేతనే కలగాలి. ఆత్మకు కర్మ లేదని పైన చెప్పబడింది అని భావం.

నేతి :- అధిష్ఠానాదుల కర్మలు ఆత్మకర్తృకాలు (ఆత్మచేత చేయబడినవి) అవడానికి వీలు లేదు. ఒకదాని కర్మ, మరొకదానిచేత చేయబడనిది, మరొకదానికి చెందడం కుదరదు కదా? ఏది అవిద్యచేత మరొకదానికి చెంది నట్లు చేయబడినదో, అది దానిది కాజాలదు. రజతత్వం శుక్తికకు ఏ విధంగా సంబంధించినది కాదో అవిద్యచేత బాలలుచే ఆకాశాన్ని పొందించబడిన (ఆకాశమునందు ఆరోపించబడిన) తలమలవత్త్వం (అడుగు భాగము, మాలిన్యము ఉండడం అనేది) ఏ విధంగా ఆకాశానికి చెందదో అట్లే అధిష్ఠానాదుల వికారం కూడ వాటికే సంబంధిస్తుంది కాని ఆత్మకు సంబంధించదు. అందుచేత - అహంకారము బుద్ధి బుద్ధిలేపమూ లేకపోవడంచేత విద్వాంసుడు చంపడు బంధించబడడు అని చెప్పినది యుక్తమే. "నాయం హన్తి న హన్యతే" అని ముందుగా ప్రతిజ్ఞ చేసి, "న జాయతే" ఇత్యాదులచే అందుకు (ఈ ఆత్మ చంపదు చంపబడదు అనుదానికి) హేతువును చెప్పడంద్వారా ఆత్మ వికారహితము అని చెప్పి, "వేదావినాశినమ్" అని శాస్త్రాదియందే విద్వాంసునకు కర్మాధికారం లేదని సంక్షిప్తంగా చెప్పి, అక్కడక్కడ ప్రసంగం చేసి విస్తరంగా మధ్యయందు ప్రతిపాదించిన ఆ కర్మాధికారనివృత్తిని, శాస్త్రార్థాన్ని అంతని ఒక చోట చేర్చి చూపడానికై, "విద్వాన్నహన్తి న నిబధ్యతే" అని ఉపసంహరిస్తున్నాడు. (విద్వాంసునకు

కర్మాధికారం లేదు అని అంటేనే) విద్వాంసునకు "దేహవంతుడను" అను ‹ భిమానం కుదరదు గాన అవిద్యవల్ల ఏర్పడిన సమస్తకర్మలను సంన్యసించడం కుదురుతుంది; అప్పుడు సంన్యాసులకు అనిష్టాది రూప మైన మూడువిధాలైన కర్మఫలం ఉండదు అని చెప్పడం కుదురుతుంది. అయితే అవిద్వాంసులు ఇందుకు విపరీతంగా ఉంటారు గాన (దేహవంతులము అనే అభిమానంతో ఉంటారు గాన) వాళ్లకు ఆ త్రివిధ మైన ఫలం తప్పక కలుగుతుంది అని గీతాశాస్త్రం యొక్క అర్థం ఇక్కడ ఉపసంహరించబడింది. సర్వవేదార్థసార మైన ఇది (ఈ గీతాశాస్త్ర సారం) నేర్పుతో కూడిన బుద్ధి గల పండితులచేత విచారించి గ్రహించదగినది. అందుచేతనే అక్క డక్కడ ఆ యా ప్రకరణాలను విభజించి మేం శాస్త్రానుసారంగాను, న్యాయాను సారంగాను దీనిని స్పష్టంగా ప్రతిపాదించి ఉన్నాం. 17

భాష్యమ్

అథేదానీం కర్మణాం ప్రవర్తకముచ్యతే -

మూ. జ్ఞానం జ్ఞేయం పరిజ్ఞాతా త్రివిధా కర్మచోదనా,
కరణం కర్మ కర్తేతి త్రివిధః కర్మసంగ్రహః. 18

బాలానందిని

అథేతి :- ఇటుపైన ఇక్కడ కర్మలకు ప్రవర్తకమును గూర్చి (కర్మలు చేయుటకు ప్రవర్తింపచేసేదానిని గూర్చి) చెప్పబడుచున్నది -

ప్ర.అ. జ్ఞానమితి :- జ్ఞానమ్ = జ్ఞానము, జ్ఞేయమ్ = తెలియదగినది, పరిజ్ఞాతా = తెలుసుకొనేవాడు అని, కర్మచోదనా = కర్మల విషయంలో ప్రవర్తింపచేసేది, త్రివిధా = మూడు విధా లైనది. కరణమ్ = సాధనము, కర్మ = క్రియ ద్వారా సంపాదించదానికి ఉద్దేశింపబడిన కర్మ, కర్తా = క్రియ చేసేవాడు, ఇతి = అని, కర్మసంగ్రహః = కర్మయొక్క సంగ్రహము, (కర్మతో = క్రియతో- ప్రత్యక్షంగా సంబంధించినది). త్రివిధః = మూడు విధము లైనది.

భాష్యమ్

జ్ఞానమ్ - జ్ఞాయతే అనేన ఇతి సర్వవిషయమ్ అవిశేషేణ ఉచ్యతే. తథా జ్ఞేయం జ్ఞాతవ్యం, తదపి సామాన్యేనైవ సర్వమ్ ఉచ్యతే. తథా పరిజ్ఞాతా ఉపాధిలక్షణః అవిద్యాకల్పితః భోక్తా, ఇత్యేతత్ త్రయమ్ ఏషామ్ అవిశేషేణ సర్వకర్మణాం ప్రవర్తికా, త్రివిధా త్రిప్రకారా కర్మచోదనా, జ్ఞానాదీనాం హి త్రయాణాం సంనిపాతే హానోపాదా నాదిప్రయోజనః సర్వకర్మారమ్భః స్యాత్; తతః పఞ్చభిః అధిష్ఠానాదిభిః ఆరబ్ధం వాఙ్మనః

కాయాశ్రయభేదేన త్రిధా రాశీభూతం త్రిషు కరణాదిషు సంగృహ్యతే ఇత్యేతదుచ్యతే. కరణమ్ - క్రియతే అనేనేతి బాహ్యం శ్రోత్రాది, అన్తఃస్థం బుద్ధ్యాది. కర్మ ఈప్సితతమం కర్తుః క్రియయా వ్యాప్యమానం, కర్తా కరణానాం వ్యాపారయితా ఉపాధిలక్షణః ఇతి త్రివిధః త్రిప్రకారః కర్మసంగ్రహః. సంగృహ్యతే అస్మిన్ ఇతి కర్మణః సంగ్రహః కర్మ ఏషు హి త్రిషు సమవైతి, తేన అయం త్రివిధః కర్మసంగ్రహః. 18

బాలానందిని

జ్ఞానమితి :- జ్ఞాయతే అనేన ఇతి జ్ఞానమ్ - దేనిచేత తెలియబడుతుందో అది అని విశేషం లేకుండా (ఫలానాదానియొక్క జ్ఞానం అనే విశేషం లేకుండా) సమస్తవస్తువులను గూర్చిన జ్ఞానం సామాన్యరూపంలో చెప్పబడుచున్నది. (ప్రతీ జ్ఞానమూ కూడ అని అర్థం). అట్లే జ్ఞేయం అనగా తెలియదగినది, కూడ సామాన్యరూపంలోనే సమస్తజ్ఞేయమూ చెప్పబడు చున్నది. అట్లే పరిజ్ఞాత - కల్పితుడైన భోక్త పరిజ్ఞాత ఉపాధి లక్షణంగా గల (అంతః కరణాద్యుపాధ్యుపహితుడైన) అవిద్యచేత కల్పితుడైన భోక్త పరిజ్ఞాత అని చెప్పబడుచున్నాడు. వీటియొక్క ఈ త్రయము ఫలానా కర్మ అనే విశేషం ఏదీ లేకుండా అన్ని కర్మలను ప్రవర్తింపచేసే, నడిపించే, మూడు విధాలైన కర్మచోదన. జ్ఞానాదులు మూడు కలుస్తేనే హానము (విడిచిపెట్టడము) ఉపాదానము మొదలైన ప్రయోజనాలు గల సమస్తకర్మల ప్రారంభం జరుగుతుంది; అటుపిమ్మట అదిష్ఠానం మొదలైన ఐదింటిచేత ప్రారంభించబడిన ఆ కర్మ వాక్కు, మనస్సు, కాయము అనే (మూడు) ఆశ్రయాల భేదంచేత మూడు రాసులుగా భిన్నమై (మూడు విధాలుగా ఏర్పడి) కరణం మొదలైన మూడింటియందు సంగ్రహించ బడుతుంది (వాటితో సంబంధిస్తుంది) అనే విషయం చెప్పబడుచున్నది - "క్రియతే అనేన" (దీనిచేత చేయబడుతుంది) అనే వ్యుత్పత్తిచేత కరణ మనగా బాహ్య మైన శ్రోత్రాదికము, లోపల నున్న అంతఃకరణము అని అర్థం. కర్మ అనగా ఈప్సితమం. కర్త యొక్క క్రియచేత (క్రియ ద్వారా) పొందడానికి అత్యధికంగా కోరబడేది. కరణాలను ప్రవర్తింపచేసే ఉపాధిలక్షణుడు, ఉపాధులతో కూడిన ఆత్మ, కర్త. ఈ విధంగా కర్మసంగ్రహం మూడు విధా లైనది. "సంగృహ్యతే అస్మిన్ సంగ్రహః" (దీనియందు సంగ్రహించబడుతుంది) అనే విగ్రహంచేత కర్మసంగ్రహం మూడు విధాలైనది. కర్మ ఈ మూడింటియందు సంబంధించి ఉంటుంది గాన ఇది త్రివిధమైన కర్మసంగ్రహం. 18

భాష్యమ్

అథ ఇదానీం క్రియాకారఫలానాం సర్వేషాం గుణాత్మకత్వాత్ సత్త్వరజస్తమో గుణ భేదతః త్రివిధః భేదః వక్తవ్యః ఇతి ఆరభ్యతే -

మూ. జ్ఞానం కర్మ చ కర్తా చ త్రిధైవ గుణభేదతః,
ప్రోచ్యతే గుణసంఖ్యానే యథావచ్ఛృణు తాన్యపి. 19

బాలానందిని

అథేతి :- సమస్తమైన క్రియా - కారక- ఫలాలు గుణస్వరూపములు గాన, వాటికి సత్త్వరజస్తమోగుణాలచేత భేదాన్ని పట్టి మూడేసి భేదాలు ఉంటాయి. ఇప్పుడు ఇక ఆ భేదాలు చెప్పడానికి ఆరంభింపబడుచున్నది -

ప్ర.అ. జ్ఞానమితి :- జ్ఞానమ్ = జ్ఞానము, కర్మ చ = కర్మా, కర్తా చ = కర్తా కూడ, గుణభేదతః = గుణాల భేదాన్ని అనుసరించి, త్రిధా ఏవ = మూడు విధాలుగా, గుణసంఖ్యానే = గుణాలను గూర్చి ప్రతిపాదించే సాంఖ్యశాస్త్రమునందు, ప్రోచ్యతే = చెప్పబడుచున్నది. తాని అపి = వాటిని కూడ, యథావత్ = యథార్థంగా, యథార్థ స్వరూపంలో, శృణు = వినుము.

భాష్యమ్

జ్ఞానం కర్మ చ, కర్మ క్రియా, న కారకం పారిభాషికమ్ ఈప్సితతమం కర్మ; కర్తా చ నిర్వర్తకః క్రియాణామ్. త్రిధైవ - అవధారణం గుణవ్యతిరిక్తజాత్యన్తరాభావ ప్రదర్శనార్థమ్. గుణభేదతః సత్త్వాదిభేదేన ఇత్యర్థః. ప్రోచ్యతే కథ్యతే, గుణసంఖ్యానే కాపిలే శాస్త్రే. తదపి గుణసంఖ్యానం శాస్త్రం గుణభోక్తృవిషయే ప్రమాణమేవ పరమార్థబ్రహ్మైకత్వవిషయే యద్యపి విరుధ్యతే. తే హి కాపిలాః గుణగౌణవ్యాపార నిరూపణే అభియుక్తాః ఇతి తచ్ఛాస్త్రమపి వక్ష్యమాణార్థస్తుత్యర్థత్వేన ఉపాదీయతే ఇతి న విరోధః. యథావత్ యథాన్యాయం యథాశాస్త్రం, శృణు తాన్యపి జ్ఞానాదీని తద్భేదజాతాని గుణభేదకృతాని, శృణు వక్ష్యమాణే అర్థే మనఃసమాధిం కురు ఇత్యర్థః. 19

బాలానందిని

జ్ఞానమితి :- జ్ఞానమూ, కర్మా - ఇక్కడ కర్మ అనగా క్రియ; అంతే కాని పారిభాషిక మైన, "కర్తురీప్సితతమం కర్మ" అని వైయాకరణులు చెప్పిన కర్మ కాదు. కర్త అనగా క్రియలు చేసేవాడు. "మూడు విధాలుగానే" అని 'ఏవ' శబ్దం ప్రయోగించి అవధారణం - గుణాలకంటె భిన్నంగా మరొక జాతి లేదు అని చూపడంకోసం చేయబడుచున్నది. గుణభేదతః అనగా సత్త్వగుణాదుల భేదంవల్ల అని అర్థం. గుణసంఖ్యానంలో అనగా కపిలముని ప్రవర్తిత

మైన సాంఖ్యశాస్త్రంలో చెప్పబడుచున్నది. ఆ గుణసంఖ్యాన శాస్త్రానికీ వేదాంతానికీ పరమార్థమైన బ్రహ్మయొక్క ఏకత్వం విషయంలో విరోధం ఉన్నా కూడ ఆ శాస్త్రం గుణాల విషయంలో భోక్త విషయంలోనూ ప్రమాణమే. ఆ కాపిలులు (కపిలమ తానుయాయులు) కూడ గుణాల వ్యాపారాలను, గుణాలకు సంబంధించినవాటి వ్యాపారాలను నిరూపించడంలో ప్రామాణికులే గాన వారి శాస్త్రం కూడ చెప్పబడబోయే విషయాన్ని స్తుతించడం కోసం గ్రహించబడుతుంది గాన (ఆ విషయంలో ఆ శాస్త్రంతో వేదాంతశాస్త్రానికి) విరోధం లేదు. యథావత్తుగా, న్యాయానుసారంగా, శాస్త్రానుసారంగా ఆ జ్ఞానాదులను, గుణభేదంవల్ల ఏర్పడిన వాటి భేదసముదాయాలను వినుము; చెప్పబడబోయే విషయంలో మనస్సును శ్రద్ధగా నిలుపుము అని అర్థం. 19

భాష్యమ్

జ్ఞానస్య తు తావత్ త్రివిధత్వమ్ ఉచ్యతే -

మూ. సర్వభూతేషు యేనైకం భావమవ్యయమీక్షతే,
అవిభక్తం విభక్తేషు తద్ జ్ఞానం విద్ధి సాత్త్వికమ్. 20

బాలానందిని

జ్ఞానస్యేతి :- ముందుగా జ్ఞానం ఏ విధంగా త్రివిధమో చెప్పబడుచున్నది -

ప్ర.అ. సర్వేతి :- యేన = ఏ జ్ఞానంచేత, విభక్తేషు = వేరువేరుగా విభజింపబడి ఉన్న, సర్వభూతేషు = సమస్తభూతములయందు (లోను), అవిభక్తమ్ = విభిన్నము కాని, ఏకమ్ = ఒకే ఒక, అవ్యయమ్ = వినాశరహిత మైన, భావమ్ = భావమును, వస్తువును, ఈక్షతే = చూస్తాడో, తత్ = ఆ, జ్ఞానమ్ = జ్ఞానమును, సాత్త్వికమ్ = సాత్త్వికజ్ఞానమునుగా, విద్ధి = తెలుసుకొనుము.

భాష్యమ్

సర్వభూతేషు అవ్యక్తాదిస్థావరాన్తేషు భూతేషు యేన, ఏకం, భావం వస్తు, భావశబ్దః వస్తువాచీ, ఏకమ్ ఆత్మవస్తు ఇత్యర్థః అవ్యయమ్ - న వ్యేతి స్వాత్మనా ధర్మైర్వా; కూటస్థమ్ ఇత్యర్థః. ఈక్షతే యేన జ్ఞానేన పశ్యతి తం చ భావమ్ అవిభక్తం ప్రతిదేహం విభక్తేషు దేహభేదేషు న విభక్తం తత్ ఆత్మవస్తు, వ్యోమవత్ నిరన్తరమ్ ఇత్యర్థః. తద్ జ్ఞానమ్ అద్వైతాత్మదర్శనమ్. సాత్త్వికం సమ్యగ్దర్శనం విద్ధి ఇతి. యాని ద్వైతదర్శనాని అసమ్యగ్భూతాని రాజసాని తామసాని చేతి న సాక్షాత్ సంసారోచ్ఛిత్తయే భవన్తి. 20

బాలానందిని

సర్వేతి :- ఏ జ్ఞానంచేత అవ్యక్తం మొదలు స్థావరంవరకు ఉన్న భూతాలలో ఒక భావమును; భావశబ్దం వస్తువును బోధిస్తుంది. ఒక్క ఆత్మవస్తువును అని అర్థం. స్వస్వరూపంచేత గాని, తన ధర్మాలచేత గాని ఏది మార్పుచెందదో (నశించదో) అది అవ్యయం. (ఒక వస్తువు మార్పుచెందా లంటే నశించా లంటే దాని స్వరూప మైనా మారాలి, దానిలోని కొన్ని ధార్మా లేనా తొలగిపోవాలి. అలాంటివి రెండూ లేనిది అవ్యయం). కూటస్థనిత్య మని అర్థం. విభక్తములుగా ఉన్న దేహభేదాలలో అవిభక్తంగా ఉన్న ఏకైకమైన ఆకాశం వలె నిరంతర మైన ఆత్మవస్తువును ఏ జ్ఞానంచేత తెలుసుకొంటాడో ఆ జ్ఞానము, ఆ అద్వైతాత్మదర్శనం సాత్త్వికమైన సమ్యగ్దర్శనము అని తెలుసుకొనుము. ద్వైతదర్శనాలు ఏవి ఉన్నాయో అవన్నీ రాజసములు లేదా తామసములు, అందుచేత అసమ్యగ్దర్శనాలు. అవి సాక్షాత్తుగా సంసారం తొలగించదానికి సమర్థములు కావు. (పరంపరయా కావచ్చు నని భావం). 20

మూ. పృథక్త్వేన తు యద్ జ్ఞానం నానాభావన్ పృథగ్విధాన్,
వేత్తి సర్వేషు భూతేషు తద్ జ్ఞానం విద్ధి రాజసమ్. 21

ప్ర.అ. పృథక్త్వేనేతి :- యత్ = ఏ, జ్ఞానమ్ = జ్ఞానము, పృథక్త్వేన = భిన్నత్వంతో ఉంటుందో, సర్వేషు = సమస్తమైన, భూతేషు = భూతములయందు, పృథగ్విధాన్ = వేరు వేరు విధాలైన, భావాన్ = భావాలను (వస్తువులను, వేత్తి = తెలుసుకొనుచున్నదో, తత్ = ఆ, జ్ఞానమ్ = జ్ఞానమును, రాజసమ్ = రజోగుణముతో సంబంధించినదానినిగా, విద్ధి = తెలుసుకొనుము.

భాష్యమ్

పృథక్త్వేనేతి :- పృథక్త్వేన తు భేదేన, ప్రతిశరీరమ్ అన్యత్వేన యత్ జ్ఞానం నానాభావాన్ భిన్నాన్ ఆత్మనః పృథగ్విధాన్ పృథక్ప్రకారాన్ భిన్నలక్షణానిత్యర్థః, వేత్తి విజానాతి తద్ జ్ఞానం సర్వేషు భూతేషు జ్ఞానస్య కర్తృత్వాసంభవాత్ యేన జ్ఞానేన వేత్తి ఇత్యన్వయః. తద్ జ్ఞానం విద్ధి రాజసం రజోనిర్వృత్తమ్. 21

బాలానందిని

పృథక్త్వేనేతి :- ఏ జ్ఞానము పృథక్త్వంతో అనగా ప్రతీశరీరమునందు వేరు వేరు అని, సమస్తభూతాలలో వేరు వేరు ప్రకారములు గల అనగా వేరు వేరు లక్షణాలు గల వేరు వేరు ఆత్మలను తెలుసుకొంటుందో, జ్ఞానం కర్తగా ఉండడం అసంభవం గాన (ఏ

జ్ఞానం తెలుసుకొంటుందో అనగా) ఏ జ్ఞానంచేత తెలుసుకొంటాడో అర్థం, ఆ జ్ఞానం రజోగుణంచేత ఏర్పడిన దని తెలుసుకొనుము.

మూ. యత్తు కృత్స్నవదేకస్మిన్ కార్యే సక్తమహేతుకమ్,
అతత్త్వార్థవదల్పం చ తత్తామసముదాహృతమ్. 22

ప్ర.అ. యదితి :- యత్తు = ఏ జ్ఞాన మైతే, ఏకస్మిన్ కార్యే = ఒక కార్య మైన శరీరాదికమునందు, కృత్స్నవత్ = సమస్తమునందు వలె, (ఒక చిన్న పదార్థమే సమస్తమూ అన్నట్లు, సక్తమ్ = ఆసక్తమైనదో, అహేతుకమ్ = యుక్తులు లేనిదో, అతత్త్వార్థవత్ = తత్త్వార్థమునకు సంబంధించినది కాదో, అల్పం చ= అల్పమో, తత్ = ఆ జ్ఞానం, తామసమ్, = తమోగుణజన్య మైనదిగా ఉదాహృతమ్ = చెప్పబడినది.

భాష్యమ్

యత్త్వితి :- యత్తు జ్ఞానం, కృత్స్నవత్ సమస్తవత్ సర్వవిషయమివ, ఏకస్మిన్ కార్యే దేహే బహిః వా ప్రతిమాదౌ, సక్తమ్ ఏతావానేవ ఆత్మా ఈశ్వరో వా, న అతః పరమ్ అస్తీతి, యథా నగ్నక్షపణకాదీనాం శరీరానువర్తీ దేహపరిమాణః జీవః, ఈశ్వరో వా పాషాణదార్వాది మాత్రః ఇత్యేవమ్ ఏకస్మిన్ కార్యే సక్తమ్, అహేతుకం హేతువర్జితం నిర్యుక్తికమ్, అతత్త్వార్థవత్ - యథాభూతః అర్థః తత్త్వార్థః, సః అస్య జ్ఞేయభూతః అస్తి ఇతి తత్త్వార్థవత్, న తత్త్వార్థవత్ అతత్త్వార్థవత్, అహేతుకత్వాదేవ అల్పం చ అల్పవిషయత్వాత్ అల్పఫలత్వాద్వా, తత్ తామసమ్ ఉదాహృతమ్, తామసానాం హి ప్రాణినామ్ అవివేకినామ్ ఈదృశం జ్ఞానం దృశ్యతే. 22

బాలానందిని

యత్త్వితి :- ఏ జ్ఞానము ఒక కార్యమునందు అనగా దేహమునందు గాని, బైటనున్న ప్రతిమాదికమునందు గాని, ఆత్మ అంటే ఇంతమాత్రమే లేదా ఈశ్వరు డంటే ఇదే (ఈ ప్రతిమాదికమే), ఇంతకు మించి మరేదీ లేదు అని సమస్తమైన జ్ఞానము వలె అనగా సమస్తమును తన విషయమునుగా గ్రహించినది వలె సక్తమై ఉంటుందో, ఉదాహరణకు - నగ్నజైనపన్యాస్యాదులు దేహాన్ని అనుసరించి ఉండే జీవుడు దేహపరిణామం కలవాడు అని అంటారు. మరికొందరు ఈశ్వరు డనగా రాయి లేదా కట్టె మొదలైనది మాత్రమే అని అంటారు. ఈ విధంగా ఏ జ్ఞానం ఒకే కార్యమునందు సక్తమై (లగ్నమై) ఉంటుందో, హేతువులు లేనిదై యుక్తి శూన్యమై ఉంటుందో, అతత్త్వార్థవత్తుగా ఉంటుందో - యథాభూత మైన అర్థం, ఉన్నది ఉన్నట్లుగా కనబడే అర్థం(విషయం)తత్త్వార్థం;అట్టి తత్త్వార్థం ఏ జ్ఞానానికి

విషయంగా ఉంటుందో(ఏ జ్ఞానంచేత తత్త్వార్థం తెలియబడుతుందో)అది తత్త్వార్థవత్. తత్త్వార్థవత్ కానిది అతత్త్వార్థవత్. అది అతత్త్వార్థవత్ అవడానికి కారణం అది అహేతుకం అవడం;తగిన హేతువులు యుక్తులు లేనిది అవడం. అట్లే అల్పమైన విషయం కల దవడంవల్ల లేదా అల్పమైన ఫలం కల దవడంవల్ల అల్పమో అట్టి జ్ఞానం తామస మని చెప్పబడుచున్నది. తమః ప్రధానులై వివేకరహితులైన ప్రాణుల జ్ఞానం ఇదే విధంగా ఉన్నట్లు కనబడుచున్నది కదా? 22

భాష్యమ్

అథ కర్మణః త్రైవిధ్యమ్ ఉచ్యతే-

మూ. నియతం సంగరహితమరాగద్వేషతః కృతమ్,
అఫలప్రేప్సునా కర్మ యత్తత్సాత్త్వికముచ్యతే. 23

బాలానందిని

అథేతి:–ఇంక కర్మయొక్క త్రివిధత్వం చెప్పబడుచున్నది–

ప్ర. అ. నియతమితి: – యత్=ఏ,నియతమ్=నిత్యమైన,కర్మ=కర్మ,సంగరహితమ్= సంగము లేకుండా,అరాగద్వేషతః=రాగద్వేషములు లేకుండగా,అఫలప్రేప్సునా=ఫలమును పొందవలె నను కోరిక లేనివానిచేత,కృతమ్=చేయబడినదో,తత్=అది,సాత్త్వికమ్=సాత్త్విక మైన కర్మగా,ఉచ్యతే=చెప్పబడుచున్నది.

భాష్యమ్

నియతం నిత్యం,సంగరహితమ్ ఆసక్తివర్జితమ్,అరాగద్వేషతః కృతం-రాగ ప్రయుక్తేన ద్వేషప్రయుక్తేన చ కృతం రాగద్వేషతః కృతం,తద్విపరీతం కృతమ్ అరాగ ద్వేషతః కృతమ్,అఫలప్రేప్సునా-ఫలం ప్రేప్సతీతి ఫలప్రేప్సుః,ఫలతృష్ణః, తద్విపరీతేన అఫలప్రే ప్సునా కర్త్రా కృతం కర్మ యత్ తత్ సాత్త్వికమ్ ఉచ్యతే. 23

బాలానందిని

నియతమితి: -ఆసక్తి లేనిది,రాగముచేత ప్రేరేపించబడినవానిచేత, ద్వేషంచేత ప్రేరేపింపబడినవానిచేత చేయబడినది రాగద్వేషతఃకృతం; అందుకు విపరీతంగా, అనగా రాగద్వేషాలచేత ప్రేరేపింపబడనివానిచేత,చేయబడినది "అరాగద్వేషతఃకృతం". ఫలం పొందా లని కోరేవాడు ఫలప్రేప్సువు. అనగా పలమునందు ఆసక్తి గలవాడు. అందుకు విపరీతు డైన,అనగా ఫలమునందు ఆసక్తి లేని కర్తచేత చేయబడిన ఏ నిత్యకర్మ గలదో అది సాత్త్విక మని చెప్పబడుచున్నది. 23

మూ. యత్తు కామేప్సునా కర్మ సాహంకారేణ వా పునః,
క్రియతే బహులాయాసం తద్రాజసముదాహృతమ్. 24

ప్ర.అ.యత్తు ఇతి: -కామేప్సునా=కామములను పొందదలచినవానిచేత,సాహంకారేణ వా పునః=లేదా అహంకారవంతునిచేత,బహులాయాసమ్=అధిక మైన ఆయాసము గల,యత్తు=ఏ కర్మ యైతే,క్రియతే=చేయబడుతుందో,తత్=అది,రాజసమ్=రాజస కర్మగా, ఉదాహృతమ్=చెప్పబడినది.

భాష్యమ్

యత్త్వితి: -యత్తు,కామేప్సునా ఫలప్రేప్సునా ఇత్యర్థః;కర్మ సాహంకారేణ వా-సాహంకారేణేతి న తత్త్వజ్ఞానాపేక్షయా;కిం తర్హి?లౌకికశ్రోత్రియనిరహంకారాపేక్షయా. యో హి పరమార్థనిరహంకారః ఆత్మవిత్ న తస్య కామేప్సుత్వబహులాయాసకర్తృత్వ ప్రాప్తిః అస్తి. సాత్త్వికస్యాపి కర్మణః అనాత్మవిత్ సాహంకారః కర్తా,కిముత రాజసతామసయోః.లోకే అనాత్మవిదపి శ్రోత్రియః నిరహంకారః ఉచ్యతే- నిరహంకారః అయం బ్రాహ్మణః ఇతి. తస్మాత్ తదపేక్షయైవ సాహంకారేణ వా ఇత్యుక్తమ్.పునఃశబ్దః పాదపూరణార్థః.క్రియతే బహులాయాసం కర్త్రా మహతా ఆయాసేన నిర్వర్త్యతే తత్ కర్మ రాజసమ్ ఉదా హృతమ్. 24

బాలానందిని

యత్త్వితి: -ఏ కర్మ యైతే కామములను పొంద గోరేవానిచేత గాని ఫలములను పొంద గోరేవానిచేత గాని,అహంకారంతో కూడినవానిచేత గాని-ఇక్కడ"సాహంకారేణ" అని తత్త్వజ్ఞానాన్ని దృష్టిలో పెట్టుకొని చెప్పబడలేదు.మరేమనగా లౌకికుడైన శ్రోత్రియుని అహంకారాభావాన్ని దృష్టిలో పెట్టుకొని చెప్పబడినది.నిజంగా అహంకారం లేని ఆత్మవేత్త కామేప్సువై ఉండడం,బహులాయాస మైన కర్మలను చేయడం అనే ప్రసక్తియే ఉండదు కదా?ఆత్మవేత్త కాని కర్త సాత్త్వికకర్మను కూడ అహంకారంతో చేస్తాడు;అలాంటప్పుడు రాజసతామసకర్మలను అహంకారంతో చేస్తా డని వేరుగా చెప్పాలా?అయితే లౌకికు డైన అనాత్మవేత్త యైన శ్రోత్రియుడు కూడ అహంకారం లేనివాడు అని,"ఈ బ్రాహ్మణునికి అహంకారం లేదు"అని చెప్పడం ఉంది.అందువల్ల అలాంటివానిని దృష్టిలో పెట్టుకొని "సాహంకారేణ వా"అని చెప్పబడింది.'పునః'శబ్దం పాదపూరణంకోసం ప్రయోగించబడి నది.కర్తచేత చాలా శ్రమతో ఏ కర్మ చేయబడుతుందో ఆ కర్మ రాజస మని చెప్పబడినది.

వి.'సాహంకారేణ'అని చెప్పడంలో ఉద్దేశ్యం ఆత్మజ్ఞానియై ఉండి ఎవడైతే అహంకారంతో కర్మ చేస్తాడో ఆ కర్మ రాజసం అని చెప్పడం కాదు.ఆత్మజ్ఞాని యైనవానికి

అహంకారం గాని,కామేప్సుత్వం గాని బహులాయాసకర్మకర్తృత్వం గాని ఉండే ప్రసక్తియే లేదు కదా? లోకంలో కొందరు శ్రోత్రియులు అహంకారరహితులై కర్మలను ఆచరించేవాళ్లు కనబడుతున్నారు. కాని వాళ్లు ఆత్మజ్ఞానవంతులు కారు. వాళ్లను దృష్టిలో పెట్టుకొని 'సాహం కారేణ'అని చెప్పబడింది. ఆ శ్రోత్రియుల వలె నిరహంకారుడు కాక సాహంకారు డైన కర్త చేసే కర్మ రాజసము అని భావం. 24

మూ. అనుబన్ధం క్షయం హింసామనపేక్ష్య చ పౌరుషమ్,
మోహాదారభ్యతే కర్మ యత్తత్తామసముచ్యతే. 25

ప్ర. అ. **అనుబన్ధమితి**: -అనుబన్ధమ్=తరువాత వచ్చేదానిని, క్షయమ్=నష్టాన్ని, హింసామ్=పరహింసను, పౌరుషం చ=పౌరుషమును, అనపేక్ష్య=చూచుకొనకుండగా, యత్=ఏ, కర్మ=కర్మ, ఆరభ్యతే=ప్రారంభించబడుతుందో, తత్=అది తామసమ్=తామస కర్మగా, ఉచ్యతే=చెప్పబడుచున్నది.

భాష్యమ్

అనుబన్ధమితి: -అనుబన్ధం పశ్చాద్భావి యత్ వస్తు సః అనుబన్ధః ఉచ్యతే. తం చ అనుబన్ధం, క్షయం యస్మిన్ కర్మణి క్రియమాణే శక్తిక్షయః అర్థక్షయః వా స్యాత్ తం క్షయమ్, హింసాం ప్రాణిపీడామ్, అనపేక్ష్య చ పౌరుషం పురుషకారం, శక్నోమి ఇదం కర్మ సమాపయితుమ్ ఇత్యేవమ్ ఆత్మసామర్థ్యమ్; ఇత్యేతాని అనుబన్ధాదీని అనపేక్ష్య పౌరుషాన్తాని, మోహాత్ అవివేకతః ఆరభ్యతే కర్మ యత్ తామసం తమోనిర్వృత్తమ్ ఉచ్యతే. 25

బాలానందిని

అనుబన్ధమితి: -ఏ వస్తువు (ఒకదాని)తరువాత ఉంటుందో, జరుగుతుందో, అది అనుబంధ మని చెప్పబడుతుంది. ఆ అనుబంధాన్ని(ఒక పని చేసిన తరువాత కలిగే దుష్ఫలితాదులను), ఏ కర్మ చేస్తే శక్తిక్షయం కాని, ధనక్షయం కాని కలుగుతుందో దానినీ, ప్రాణులకు కలిగే పీడనూ, పురుషకారమును-"నేను ఈ పని పూర్తి చేయకలుగుతాను"అని తన సామర్థ్యాన్నీ-ఈ విధంగా అనుబంధం మొదలు పౌరుషం వరకు ఉన్నవాటిని చూచుకొన కుండా అవివేకంవల్ల ప్రారంభించబడే కర్మ తామసమని, తమోగుణంచేత చేయబడే దని, చెప్పబడుచున్నది. 25

మూ. ముక్తసంగోऽనహంవాదీ ధృత్యుత్సాహసమన్వితః,
సిద్ధ్యసిద్ధ్యోర్నిర్వికారః కర్తా సాత్త్విక ఉచ్యతే. 26

ప్ర.అ. ముక్తేతి: -ముక్తసంగః=విడువబడిన సంగం గలవాడు,అనహంవాదీ= "నేను, నేను"అని అననివాడు,ధృత్యుత్సాహసమన్వితః=ధైర్యంతోను (నిలకడతోను)ఉత్సాహం తోను కూడినవాడు,సిద్ధ్యసిద్ధ్యోః=సిద్ధియందు అసిద్ధియందు (కర్మ ఫలించినా ఫలించక పోయినా) వికారం లేనివాడు అయిన,కర్తా=కర్త,సాత్త్వికః=సాత్త్వికుడుగా,ఉచ్యతే= చెప్పబడు చున్నాడు.

భాష్యమ్

ముక్తేతి: -ముక్తసంగః-ముక్తః పరిత్యక్తః సంగః యేన సః ముక్తసంగః,అనహం వాదీ న అహంవదనశీలః,ధృత్యుత్సాహసమన్వితః-ధృతిః ధారణమ్ ఉత్సాహః ఉద్యమః తాభ్యాం సమన్వితః సంయుక్తః ధృత్యుత్సాహసమన్వితః,సిద్ధసిద్ధ్యోః క్రియమాణస్య కర్మణః ఫలసిద్ధౌ అసిద్ధౌ చ సిద్ధ్యసిద్ధ్యోః నిర్వికారః,కేవలం శాస్త్రప్రమాణప్రయుక్తః న ఫలానురాగాదినా యుక్తః యః సః నిర్వికారః ఉచ్యతే,ఏవంభూతః కర్తా యః సః సాత్త్వికః ఉచ్యతే. 26

బాలానందిని

ముక్తేతి: -ముక్తసంగుడు-ఎవనిచేత సంగం(ఆసక్తి)విడవబడినదో అట్టివాడు,'నేను' నేను'అని అనుకొననివాడు,ధృతి అనగా ధారణం నిలకడ. ఉత్సాహం అనగా ఉద్యమం (ప్రయత్నం). వాటితో కూడినవాడు ధృత్యుత్సాహసమన్వితుడు. కర్మయొక్క ఫలం సిద్ధించినా సిద్ధించకపోయినా నిర్వికారుడు;కేవలం శాస్త్రప్రమాణంతో కూడినవాడు(శాస్త్రం చెప్పినది గాన చెయ్యాలి అని మాత్రమే అనుకొనేవాడు)ఫలమునందు ఆసక్తి మొదలైనది లేనివాడు నిర్వికారు డని (వికారం లేనివా డని)చెప్పబడుచున్నాడు.అట్టి కర్త సాత్త్వికుడు అని చెప్పబడుచున్నాడు. 26

మూ. రాగీ కర్మఫలప్రేప్సుర్లుబ్ధో హింసాత్మకోఽశుచిః,
హర్షశోకాన్వితః కర్తా రాజసః పరికీర్తితః. 27

ప్ర.అ. రాగీ=ఆసక్తి కలవాడు,కర్మఫలప్రేప్సుః=కర్మఫలమును పొంద గోరిక కలవాడు,లుబ్ధః=ఆశ కలవాడు,హింసాత్మకః=హింసాస్వభావం గలవాడు.అశుచిః =అపవిత్రుడు,హర్షశోకాన్వితః=హర్షశోకాలతో కూడినవాడు అయిన,కర్తా=కర్త,రాజసః =రాజసుడుగా,పరికీర్తితః=చెప్పబడ్డాడు.

భాష్యమ్

రాగీతి: -రాగః అస్య అస్తీతి రాగీ,కర్మఫలప్రేప్సుః కర్మఫలార్థీ లుబ్ధః పరద్రవ్యేషు సంజాతతృష్ణఃతీర్థాదౌ చ స్వద్రవ్యాపరిత్యాగీ,హింసాత్మకః పరిపీడాస్వభావః.అశుచిః

బాహ్యాన్తఃశౌచవర్జితః,హర్షశోకాన్వితః ఇష్టప్రాప్తౌ హర్షః అనిష్టప్రాప్తౌ ఇష్టవియోగే చ శోకః తాభ్యాం హర్షశోకాభ్యామ్,అన్వితః సంయుక్తః,తస్యైవ చ కర్మణః సంపత్తివిపత్త్యోః హర్షశోకౌ స్యాతాం తాభ్యాం సంయుక్తః యః కర్తా సః రాజసః పరికీర్తితః. 27

బాలానందిని

రాగీతి:-ఎక్కువ ఆసక్తి కలవాడు,కర్మఫలం కోరేవాడు,లుబ్ధుడు అనగా ఇతరుల ద్రవ్యములయందు ఆశ పుట్టినవాడు,అట్లే తగిన పవిత్రక్షేత్రపాత్రాదులలో తన ద్రవ్యం ఇవ్వనివాడు,పరులను పీడించే స్వభావం కలవాడు,బాహ్యశౌచ-అంతఃశౌచాలు లేనివాడు, ఇష్టము లభించి నప్పుడు హర్షమును,అనిష్టం ప్రాప్తించినప్పుడు ఇష్టవస్తువు దూరమైనప్పుడు శోకమును పొందేవాడు,ఆ కర్మయే సరిగా జరిగి నప్పుడు చెడిపోయి నప్పుడు హర్షశోకాలు కలుగుతాయి;అవి కలవాడు అయిన కర్త రాజసు డని చెప్పబడుచున్నాడు. 27

మూ. అయుక్తః ప్రాకృతః స్తబ్ధః శఠో నైష్కృతికోఽలసః,
విషాదీ దీర్ఘసూత్రీ చ కర్తా తామస ఉచ్యతే. 28

ప్ర.అ. అయుక్తః ఇతి:-అయుక్తః=ఒక పనిలో నిలకడ లేనివాడు,ప్రాకృతః=ఏ మాత్రము మంచి సంస్కారం లేనివాడు,స్తబ్ధః=మొండివాడు,శఠః=మోసం చేసేవాడు,నైష్కృతికః=పరులవృత్తికి భంగం కలిగించేవాడు,అలసః=సోమరి,విషాదీ=దేవిరించే స్వభావం కలవాడు,దీర్ఘసూత్రః=దీర్ఘాలోచన చేసేవాడు అయిన,కర్తా=కర్త,తామసః=తామసుడుగా, ఉచ్యతే=చెప్పబడుచున్నాడు.

భాష్యమ్

అయుక్తః ఇతి:-అయుక్తః అసమాహితః,ప్రాకృతః అత్యన్తాసంస్కృతబుద్ధిః బాలసమః,స్తబ్ధః దణ్డవత్ న నమతి కస్మై చిత్.శఠః మాయావీ శక్తిగూహనకారీ, నైష్కృతికః పరవృత్తిచ్ఛేదనపరః,అలసః అప్రవృత్తిశీలః కర్తవ్యేష్వపి,విషాదీ సర్వదా అవసన్నస్వభావఃదీర్ఘసూత్రీ చ కర్తవ్యానాం దీర్ఘప్రసారణః,యత్ అద్య శ్వః వా కర్తవ్యం తత్ మాసేనాపి న కరోతి, యః చ ఏవం భూతః కర్తా సః తామసః ఉచ్యతే. 28

బాలానందిని

అయుక్తః ఇతి:- మనస్సు నిలపజాలనివాడు,చిన్నపిల్లవాడు వలె ఏ మాత్రము బుద్ధిసంస్కారం లేనివాడు,స్తబ్ధుడు-కట్టె వలె ఎవరికీ వంగనివాడు,మాయావి శక్తి కప్పిపుచ్చుకునేవాడు(ఒళ్లు దాచుకొనేవాడు)పరుల వృత్తిని ఛేదించేవాడు,చేయవలసిన పనుల విషయంలో కూడ ప్రవర్తించకపోవడం అనే స్వభావం గలవాడు,ఎల్లప్పుడు దేనికో ఒకదానికి

మూలుగు తూండేవాడు,దీర్ఘసూత్రి,అనగా చేయవలసిన పనులు నాన్చేవాడు, ఈ వేళ రేపు చేయవలసిన పని మాసానికి కూడ చేయడు,అట్టి కర్త తామసు డని చెప్పబడుచున్నాడు. 28

మూ. బుద్ధేర్భేదం ధృతేశ్చైవ గుణతస్త్రివిధం శృణు,
ప్రోచ్యమానమశేషేణ పృథక్త్వేన ధనంజయ. 29

ప్ర.అ.**బుద్ధేరితి**:-ధనంజయ=అర్జునా!పృథక్త్వేన=వేరు వేరుగా,ప్రోచ్యమానమ్= చెప్పబడుచున్న,బుద్ధేః=బుద్ధియొక్కధృతేః చ ఏవ=ధృతియొక్క గుణతః=గుణాలనుపట్టి, త్రివిధమ్=మూడు విధాలైన,భేదమ్=భేదమును,అశేషేణ=పూర్తిగా,శృణు=వినుము.

భాష్యమ్

బుద్ధేర్భేదమితి:-బుద్ధేః భేదం ధృతేశ్చైవ భేదం గుణతః సత్త్వాదిగుణతః, త్రివిధం శృణు ఇతి సూత్రోపన్యాసః.ప్రోచ్యమానం కథ్యమానమ్,అశేషేణ నిరవశేషతః ,యథావత్,పృథక్త్వేన వివేకతః,ధనంజయ దిగ్విజయే మానుషం దైవం చ ప్రభూతం ధనమ్ అజయత్,తేన అసౌ ధనంజయః అర్జునః. 29

బాలానందిని

బుద్ధేరితి:-సత్త్వాదిగుణాలను బట్టి మూడు విధాలైన బుద్ధియొక్క భేదాన్ని,ధృతి యొక్క భేదాన్ని అని సూత్రరూపంలో చెప్పడం జరిగింది.(దానికే వివరణం)-ఏమీ మిగల్చకుండా,ఉన్నదున్నట్లుగా,వివేకముతో అనగా దేనికి అది విడగొట్టి చెప్పబడు చున్నది.దిగ్విజయం సందర్భంలో మనుష్యులకు దేవతలకు సంబంధించిన అత్యధిక మైన ధనాన్ని జయించి ఉన్నాడు.అందుచేత ఈ అర్జునుడు ధనంజయుడు. 29

మూ. ప్రవృత్తిం చ నివృత్తిం చ కార్యకార్యే భయాభయే,
బన్ధం మోక్షం చ యా వేత్తి బుద్ధిః సా పార్థ సాత్త్వికీ. 30

ప్ర.అ. **ప్రవృత్తిమితి**:- పార్థ=అర్జునా,యా=ఏ,బుద్ధిః=బుద్ధి,ప్రవృత్తిం చ=కర్మ మార్గమును,నివృత్తిం చ=నివృత్తిమార్గమును,కార్యాకార్యే=కార్య-అకార్యములను, భయా భయే=భయమును అభయమును,బన్ధమ్=బంధమును,మోక్షం చ=మోక్షమును,వేత్తి= తెలుసుకొనుచున్నదో,సా=ఆ బుద్ధి,సాత్త్వికీ=సాత్త్విక మైన బుద్ధి.

భాష్యమ్

ప్రవృత్తిం చేతి:-ప్రవృత్తిం చ-ప్రవృత్తిః ప్రవర్తనం ꠰ ధహేతుః కర్మమార్గః. నివృత్తిం చ-నివృత్తిః మోక్షహేతుః సంన్యాసమార్గః.బన్ధమోక్షసమానవాక్యత్వాత్

ప్రవృత్తినివృత్తీ కర్మసంన్యాసమార్గౌ ఇతి అవగమ్యతే. కార్యాకార్యే,విహితప్రతిషిద్ధే కర్తవ్యాకర్తవ్యే,కరణాకరణే ఇత్యేతత్. కస్య?దేశకాలాద్యపేక్షయా దృష్టాదృష్టార్థానాం కర్మణామ్. భయాభయే–బిభేత్యస్మాదితి భయమ్;తద్విపరీతమ్ అభయమ్, భయం చ అభయం చ భయాభయే;దృష్టాదృష్టవిషయయోః భయాభయయోః కారణే ఇత్యర్థః. బన్ధం సహేతుకం మోక్షం చ సహేతుకం యా వేత్తి విజనాతి బుద్ధిః సా పార్థ సాత్త్వికీ. తత్ర జ్ఞానం బుద్ధేః వృత్తిః,బుద్ధిః తు వృత్తిమతీ. ధృతిః అపి వృత్తివిశేషః ఏవ బుద్ధేః. 30

బాలానందిని

ప్రవృత్తిం చేతి:-ప్రవృత్తి అనగా ప్రవర్తించడం;అనగా బంధానికి హేతువైన కర్మ మార్గం. నివృత్తి అనగా మోక్షానికి హేతువైన సంన్యాసమార్గం. బంధమోక్షాలను గూర్చి చెప్పిన వాక్యంలోనే (శ్లోకంలోనే)ప్రవృత్తినివృత్తులను చెప్పడంచేత ఈ పదాలకు కర్మమార్గ–సంన్యాసమార్గా లని అర్థ మని తెలుస్తూన్నది. కార్యాకార్యములను,అనగా విధించబడిన కర్తవ్యాన్ని నిషేధించబడిన అకర్తవ్యాన్ని చేయడమును చేయకపోవడమును అని భావం. దేనియొక్క?(ఏది చేయడం ఏది చేయకపోవడం?)దేశ-కాలాదుల అపేక్షచేత (వాటిని పట్టి) దృష్టఫలములు అదృష్టఫలములు (ఫలం కనబడేవి కనబడనివి)అయిన కర్మలయొక్క (కరణాకరణములను)భయాభయములను–దేనినుండి భయపడతారో అది భయం. అందుకు విపరీతమైనది (దేనికి భయపడరో అది)అభయం. భయాభయే అనగా కంటికి కనబడేది(ఇక్కడనే తెలిసేవి)కనబడనివి అయిన భయాభయకారణములు అని అర్థం. బంధమును దాని హేతువును,మోక్షమును దాని హేతువును ఏది తెలుసుకొంటుందో ఆ బుద్ధి,అర్జునా, సాత్త్వికబుద్ధి. అక్కడ(బుద్ధి తెలుసుకొంటుంది అనగా)జ్ఞానం (తెలుసు కొనడం) బుద్ధియొక్క వృత్తి;బుద్ధి వృత్తిమత్(వృత్తి కలది). అట్లే ధృతి కూడ బుద్ధివృత్తులలో ఒక విశేషమే. 30

మూ. యయా ధర్మమధర్మం చ కార్యం చా కార్యమేవ చ,
అయథావత్ప్రజానాతి బుద్ధిః సా పార్థ రాజసీ. 31

ప్ర. అ. యయేతి:-పార్థ=అర్జునా!యయా=ఏ బుద్ధిచేత,ధర్మమ్=ధర్మమును, అధర్మం చ=అధర్మమును,కార్యం చ=కార్యమును అకార్యమ్ ఏవ చ=అకార్యమును అయథావత్= అయథార్థరూపంలో, ప్రజానాతి=తెలుసుకొంటాడో,సా బుద్ధిః=ఆ బుద్ధి, రాజసీ= రాజసబుద్ధి.

భాష్యమ్

యయేతి:-యయా,ధర్మం శాస్త్రచోదితమ్,అధర్మం చ తత్ప్రతిషిద్ధం కార్యం చ అకార్యమ్ ఏవ చ పూర్వోక్తే ఏవ కార్యాకార్యే అయథావత్ న యథావత్ సర్వతః నిర్ణయేన న ప్రజానాతి బుద్ధిః సా పార్థ రాజసీ. 31

బాలానందిని

యయేతి:-దేనిచేత,శాస్త్రవిహిత మైన ధర్మాన్ని,శాస్త్రనిషిద్ధ మైన అధర్మాన్ని పైన చెప్పిన కార్యాకార్యములను సర్వవిధాలా నిర్ణయించి గ్రహించదో ఆ బుద్ధి అర్జునా, రాజసబుద్ధి. 31

మూ. అధర్మం ధర్మమితి యా మన్యతే తమసాఽఽవృతా,
సర్వార్థాన్విపరీతాంశ్చ బుద్ధిః సా పార్థ తామసీ. 32

ప్ర.అ. **అధర్మమితి**:-పార్థ=అర్జునా!తమసా= తమోగుణంచేత,ఆవృతా= ఆవరించబడినదై,యా=ఏ బుద్ధి,అధర్మమ్=అధర్మమును,ధర్మమ్ ఇతి=ధర్మమని,మన్యతే=తలుస్తుందో,సర్వార్థాన్=అన్ని విషయాలను,విపరీతాన్=విపరీతములుగా గ్రహిస్తుందో, సా బుద్ధిః=ఆబుద్ధి,తామసీ=తామసబుద్ధి.

భాష్యమ్

అధర్మమితి:-అధర్మం ప్రతిషిద్ధం,ధర్మం విహితమ్ ఇతి,యా మన్యతే జానాతి తమసా ఆవృతా సతీ సర్వార్థాన్ సర్వానేవ జ్ఞేయపదార్థాన్ విపరీతాన్ చ విపరీతానేవ విజానాతి బుద్ధిః సా పార్థ తామసీ. 32

బాలానందిని

అధర్మమితి:- నిషిద్ధ మైనదానిని విహిత మైనదానినిగా ఏ బుద్ధి తమస్సుచేత ఆవరింబడినదై గ్రహిస్తుందో సమస్తము లైన జ్ఞేయపదార్థాలనూ కూడ విపరీతములగానే గ్రహిస్తుందో ఆ బుద్ధి అర్జునా! తామసబుద్ధి. 32

మూ. ధృత్యా యయా ధారయతే మనః ప్రాణేన్ద్రియక్రియాః,
యోగేనావ్యభిచారిణ్యా ధృతిః సా పార్థ సాత్త్వికీ. 33

ప్ర.అ.పార్థ=అర్జునా! యోగేన=యోగముతో,అవ్యభిచారిణ్యా=వ్యభిచరించని, అనగా నిత్యము ఏకాగ్రతతో కూడిన,యయా=ఏ,ధృత్యా=ధృతిచేత,మనఃప్రాణేన్ద్రియక్రియాః =మనస్సుయొక్క,ప్రాణముయొక్క,ఇంద్రియాలయొక్క క్రియలను,ధారయతే= ధరించునో (నిలబెట్టునో),సా=ఆ,ధృతిః=ధృతి,సాత్త్వికీ=సాత్త్వికమైనది.

భాష్యమ్

ధృత్యేతి:-ధృత్యా యయా అవ్యభిచారిణ్యా ఇతి వ్యవహితేః సంబన్ధః. ధారయతే, కిమ్? మనఃప్రాణేన్ద్రియక్రియాః-మనశ్చ ప్రాణాశ్చ ఇన్ద్రియాణి చ మనఃప్రాణేన్ద్రియాణి,

తేషాం క్రియాః చేష్టాః తాః ఉచ్ఛాస్త్రమార్గప్రవృత్తేః ధారయతి. ధృత్యా హి ధార్యమాణాః ఉచ్ఛాస్త్రవిషయాః న భవన్తి. యోగేన సమాధినా అవ్యభిచారిణ్యా నిత్యసమాధ్యనుగతయా ఇత్యర్థః. ఏతదుక్తం భవతి– అవ్యభిచారిణ్యా ధృత్యా మనః ప్రాణేన్ద్రియక్రియాః ధారయమాణః యోగేన ధారయతి ఇతి. యా ఏవం లక్షణా ధృతిః సా పార్థ సాత్త్వికీ. 33

బాలానందిని

ధృత్యా ఇతి:–'యయా ధృత్యా'అనేదానికి "అవ్యభిచారిణ్యా"అను దూరంగా ఉన్న పదంతో అన్వయం. ఏ ధృతిచేత ధరిస్తాడో;దేనిని? మనస్సుయొక్క ప్రాణంయొక్క ఇంద్రియాల యొక్క క్రియలను అనగా చేష్టలను శాస్త్రవిరుద్ధమైన మార్గమునందు ప్రవర్తించడమునుండి అడ్డుకొంటాడో ఎందువల్ల ననగా–ధృతిచేత నిలపబడినవి(మానసాది చేష్టలు)శాస్త్రవిరుద్ధ మార్గంలో ప్రవర్తించవు. యోగంతో, సమాధితో(పరబ్రహ్మనిష్ఠతో)వ్యభి చరించని ధృతిచేత అనగా నిత్యము సమాధితో సంబంధించి యున్నది అని అర్థం. ఇది చెప్పిన ట్లయింది(దీని భావం ఇది)–మనఃప్రాణేంద్రియక్రియలను ధరించేవాడు (సన్మార్గంలో నిలిపేవాడు) వాటిని యోగంతో(బ్రహ్మసమాధానంతో)అవ్యభిచారియైన (సర్వదా సంబంధించి ఉన్న)ధృతిచేత ధరిస్తున్నాడు. ఈ లక్షణము గల ఏ ధృతి యున్నదో అది,అర్జునా,సాత్త్విక ధృతి. 33

మూ. యయా తు ధర్మకామార్థాన్ ధృత్యా ధారయతేఽర్జున,
ప్రసంగేన ఫలాకాఙ్క్షీ ధృతిః సా పార్థ రాజసీ. 34

ప్ర.అ. **యయేతి**:– అర్జున=అర్జునా!తు=కాని,యయా ధృత్యా=ఏ ధృతిచేత, ఫలాకాఙ్క్షీ=ఫలమును కోరుచు,ధర్మకామార్థాన్=ధర్మకామార్థాలను, ప్రసంగేన=ప్రసంగ వశంచేత, ధారయతే=ధరించునో,సా ధృతిః=ఆ ధృతి,రాజసీ=రజఃప్రధానమైనది.

భాష్యమ్

యయేతి:– యయా తు ధర్మకామార్థాన్–ధర్మశ్చ కామశ్చ అర్థశ్చ ధర్మకామార్థాః,తాన్ ధర్మకామార్థాన్ ధృత్యా యయా ధారయతే మనసి నిత్యకర్త వ్యరూపానవ ధారయతే, హే!అర్జున!ప్రసంగేన యస్య యస్య ధర్మాదేః ధారణ ప్రసంగః తేన తేన ప్రసంగేన, ఫలాకాఙ్క్షీ చ భవతి యః పురుషః తస్య ధృతిః యా సా పార్థ రాజసీ. 34

బాలానందిని

యయేతి:– అర్జునా,ఏ పురుషుడు, ధర్మార్థకామాలలో దాని దాని ప్రసంగం వచ్చి నప్పుడు ఏ ధృతిచేత ఆ ధర్మార్థకామాలలో ఒక్కొక్కదానిని ధరిస్తాడో,అనగా ఇది నిత్యకర్తవ్యము అని మనస్సులో నిర్ధారణ చేసుకొంటాడో,ఫలం కూడ కోరుతూ ఉంటాడో, వాని ధృతి

రాజసధృతి. (ఫలాభిలాషాపూర్వకంగా ఆ యా సమయాలలో ధర్మార్థకామాలలో ఒక్కొక్కదానిని ఏ స్థిరబుద్ధితో సేవిస్తాడో అది రాజసధృతి అని భావం). 34

మూ. యయా స్వప్నం భయం శోకం విషాదం మదమేవ చ,
న విముఞ్చతి దుర్మేధా ధృతిః సా పార్థ తామసీ. 35

ప్ర.అ. **యయేతి**:- దుర్మేధాః=దుష్టబుద్ధి గల పురుషుడు,యయా=దేనిచేత,స్వప్నమ్ = నిద్రను,భయమ్=భయమును,శోకమ్=శోకమును,విషాదమ్=దిగులును,మదమ్ ఏవ చ=గర్వమును,న విముఞ్చతి=విడువడో,సా ధృతిః=ఆ ధృతి,తామసీ=తామసిగా,మతా= చెప్పబడినది.

భాష్యమ్

యయేతి:-యయా,స్వప్నం,నిద్రాం,భయం త్రాసం,శోకం,విషాదమ్ అవసాదం విషణ్ణతాం,మదం-విషయసేవామ్ ఆత్మనః బహుమన్యమానః మత్తః ఇవ మదమేవ చ, మనసి నిత్యమేవ కర్తవ్యరూపతయా కుర్వన్ న విముఞ్చతి,ధారయత్యేవ-దుర్మేధాః కుత్సితమేధాః పురుషః యః తస్య ధృతిః యా సా తామసీ మతా. 35

బాలానందిని

యయేతి:-కుత్సితమైన మేధ గల ఏ పురుషుడు,ఏ ధృతిచేత,నిద్రను,భయమును, శోకమును,దిగులుచెందుటను,తాను చేస్తూన్న విషయసేవయే గొప్పదని అనుకొంటూ మత్తుడు వలె ఉండి మదాన్నీ-(వీటి నన్నింటినీ)కర్తవ్యము లన్నట్లు నిత్యమూ మనస్సులో చేస్తూ విడవకుండా ఉంటాడో ఆ ధృతి తామసధృతి అని చెప్పబడినది. 35

భాష్యమ్

గుణభేదేన క్రియాణాం కారకాణాం చ త్రిధా భేదః ఉక్తః. అథ ఇదానీం ఫలస్య చ సుఖస్య త్రిధా భేదః ఉచ్యతే-

మూ. సుఖం త్విదానీం త్రివిధం శృణు మే భరతర్షభ,
అభ్యాసాద్రమతే యత్ర దుఃఖాన్తం చ నిగచ్ఛతి. 36

బాలానందిని

గుణేతి:-గుణభేదాన్ని పట్టి క్రియలకు కారకాలకు ఏర్పడే మూడు విధాలైన భేదం చెప్పబడింది. ఇంక ఇప్పుడు ఫలమైన సుఖానికి ఉండే మూడు విధాలైన భేదం చెప్పబడుచున్నది-

ప్ర.అ. సుఖమితి:- భరతర్షభ=భరతవంశంలో శ్రేష్ఠుడా,ఇదానీమ్=ఇప్పుడు, త్రివిధమ్=మూడు విధాలైన,సుఖం తు=సుఖమును గూర్చి యైతే,మే=నానుండి శృణు= వినుము. యత్ర=దేనియందు,అభ్యాసాత్=అభ్యాసంవల్ల,రమతే=క్రీడిస్తాడో,దుఃఖాన్తమ్= దుఃఖముయొక్క అంతమును, నిగచ్ఛతి చ=పొందుతాడో కూడ.

భాష్యమ్

సుఖం తు ఇదానీం త్రివిధం,శృణు సమాధానం కురు ఇత్యేతత్.మే మమ,భరతర్షభ.అభ్యాసాత్ పరిచయాత్ ఆవృత్తేః.రమతే రతిం ప్రతిపద్యతే,యత్ర యస్మిన్ సుఖానుభవే;దుఃఖా న్తం చ దుఃఖావసానం దుఃఖోపశమం చ,నిగచ్ఛతి నిశ్చయేన ప్రాప్నోతి. 36

బాలానందిని

సుఖమితి:-భరతర్షభా! ఇప్పుడైతే త్రివిధ మైన సుఖమును గూర్చి నాకు వినుము. సావధానచిత్తు డవుగా ఉండుము అని అర్థం.ఏ సుఖానుభవమునందు,అభ్యాసంవల్ల, పరిచయంవల్ల,ఆవృత్తివల్ల ఆనందమును పొందుతాడో దుఃఖనాశాన్ని,దుఃఖశాంతిని కూడ తప్పక పొందుతాడో. 36

మూ. యత్తదగ్రే విషమివ పరిణామేఽమృతోపమమ్,
తత్సుఖం సాత్త్వికం ప్రోక్తమాత్మబుద్ధిప్రసాదజమ్. 37

ప్ర.అ.యదితి:-యత్=ఏ,తత్=ఆ సుఖం,అగ్రే=ప్రారంభంలో,విషమ్=ఇవ= విషంవలె ఉంటుందో,పరిణామే=పరిణామమునందు,అమృతోపమమ్=అమృతం వలె ఉంటుందో,తత్=అట్టి,ఆత్మబుద్ధిప్రసాదజమ్=తన బుద్ధియొక్క నిర్మలత్వంవల్ల పుట్టిన, సుఖమ్=సుఖము,సాత్త్వికమ్=సాత్త్విక మని,ప్రోక్తమ్=చెప్పబడినది.

భాష్యమ్

యదితి:-యత్ తత్ సుఖమ్,అగ్రే పూర్వం ప్రథమసంనిపాతే జ్ఞానవైరాగ్యసమాధ్యారమ్భే అత్యన్తాయాసపూర్వకత్వాత్ విషమివ దుఃఖాత్మకం భవతి,పరిణామే జ్ఞానవైరాగ్యాదిపరిపాకజం సుఖమ్ అమృతోపమం తత్ సుఖం సాత్త్వికం ప్రోక్తం విద్వద్భిః, ఆత్మనః బుద్ధిః ఆత్మబుద్ధిః,ఆత్మబుద్ధేః ప్రసాదః నైర్మల్యం సలిలవత్ స్వచ్ఛతా, తతః జాతమ్ ఆత్మబుద్ధిప్రసాదజమ్.ఆత్మవిషయా వా ఆత్మాలమ్బనా వా బుద్ధిః, ఆత్మబుద్ధిః, తత్ప్రసాదప్రకర్షాత్ వా జాతమ్ ఇత్యేతత్;తస్మాత్ సాత్త్వికం తత్. 37

బాలానందిని

యదితి:- ఏ సుఖం,మొదట,జ్ఞానము వైరాగ్యము ధ్యానము సమాధి-వీటిని ప్రారంభించిన మొట్టమొదటి ఘట్టంలో చాలా ఆయాసం(శ్రమ)తో కూడిన దవడంవల్ల విషంవలె దుఃఖాత్మకంగా ఉంటుందో,పరిణామంలో,జ్ఞానవైరాగ్యాదులు పక్వం అవడం చేత కలిగిన ఏ సుఖం అమృతం వలె ఉంటుందో అది సాత్త్విక మని విద్వాంసులచేత చెప్పబడినది.ఆత్మబుద్ధి అనగా తన బుద్ధి.ఆత్మబుద్ధియొక్క ప్రసాదంవల్ల నిర్మలత్వంవల్ల, ఉదకం వలె స్వచ్ఛంగా ఉండడం ప్రసాదం దానివల్ల పుట్టినది,లేదా ఆత్మ విషయంగా, ఆలంబనంగా గల బుద్ధి ఆత్మబుద్ధి,దాని ప్రసాదంవల్ల,ప్రకర్షణవల్ల(ఆధిక్యంవల్ల)పుట్టినది అని అర్థం.అందువల్లనే అది సాత్త్విక మైనది. 37

మూ. విషయేన్ద్రియసంయోగాద్యత్తదగ్రేఽమృతోపమమ్,
పరిణామే విషమివ తత్సుఖం రాజసం స్మృతమ్. 38

ప్ర. అ. విషయేతి:-విషయేన్ద్రియసంయోగాత్=విషయములయొక్క ఇంద్రియముల యొక్క సంయోగం(సంబంధం)వల్ల పుట్టిన,యత్=ఏ,తత్=ఆ సుఖం,అగ్రే=మొదట, అమృతోపమమ్=అమృతం వలె ఉంటుందో,పరిణామే=పరిణామమునందు,విషమివ= విషం వలె ఉంటుందో,తత్=ఆ,సుఖమ్=సుఖము,రాజసమ్=రాజసముగా,స్మృతమ్= చెప్పబడినది.

భాష్యమ్

విషయేతి:-విషయేన్ద్రియసంయోగాత్ యత్,తత్ సుఖం జాయతే,అగ్రే ప్రథమ క్షణే,అమృతోపమమ్ అమృతసమం,పరిణామే విషమ్ ఇవ,బలవీర్యరూపప్రజ్ఞామేధా ధనోత్సాహహానిహేతుత్వాత్,అధర్మతజ్జనితనరకాదిహేతుత్వాచ్చ పరిణామే తదుపభోగ పరిణామాన్తే విషమివ తత్సుఖం రాజసం స్మృతమ్. 38

బాలానందిని

విషయేతి:-ఏ సుఖం విషయాల(భోగ్యవస్తువుల)యొక్క ఇంద్రియాలయొక్క సంబంధంవల్ల కలుగుతుందో,మొదటి క్షణంలో అమృతం వలె ఉంటుందో,పరిణామంలో - బల-వీర్య-రూప-ప్రజ్ఞా-మేధా-ధన-ఉత్సాహాల హానికి హేతువు అవడంవల్ల లేదా అధర్మానికి, దానివల్ల కలిగే నరకాదులకు హేతువు అవడంవల్ల, ఆ భోగాల పరిణామం చివర విషం వలె ఉంటుందో ఆ సుఖం రాజససుఖ మని చెప్పబడినది. 38

మూ. యదగ్రే చానుబన్ధే చ సుఖం మోహనమాత్మనః,
నిద్రాలస్యప్రమాదోత్థం తత్తామసముదాహృతమ్. 39

ప్ర. అ. యదితి: - యత్=ఏ,సుఖమ్=సుఖము,నిద్రాలస్యప్రమాదోత్థమ్=నిద్రవల్ల సోమరితనంవల్ల పొరబాటు చేయడంవల్ల కలిగినదో,అగ్రే చ=ప్రారంభంలోను,అనుబన్ధే= చ=అంతమునందూ కూడ,ఆత్మనః=తనకు,మోహనమ్=మోహాన్ని కలిగించేదో,తత్=అది, తామసమ్=తామససుఖముగా,ఉదాహృతమ్=చెప్పబడినది.

భాష్యమ్

యదగ్రేచేతి: -యత్ అగ్రే చ,అనుబన్ధే చ అవసానోత్తరకాలే,సుఖం,మోహనం మోహకరమ్,ఆత్మనః,నిద్రాలస్యప్రమాదోత్థమ్-నిద్రా చ ఆలస్యం చ ప్రమాదశ్చ ఇత్యే తేభ్యః సముత్తిష్ఠతీతి నిద్రాలస్యప్రమాదోత్థం తత్ తామసమ్ ఉదాహృతమ్. 39

బాలానందిని

యదితి: -ఏది ప్రారంభమునందు,అనుభవించడం పూర్తియైన తరువాత కూడా తనకు మోహాన్ని కలిగిస్తుందో,నిద్రా-అలస్య-ప్రమాదాలనుండి పుడుతుందో అది తామససుఖ మని చెప్పబడినది. 39

భాష్యమ్

అథ ఇదానీం ప్రకరణోపసంహారార్థః శ్లోకః ఆరభ్యతే-

మూ. న తదస్తి పృథివ్యాం వా దివి దేవేషు వా పునః,
సత్త్వం ప్రకృతిజైర్ముక్తం యదేభిః స్యాత్త్రిభిర్గుణైః. 40

బాలానందిని

అథేతి: -ఇంక ఇప్పుడు ఈ ప్రకరణాన్ని ఉపసంహరించడంకోసం ఉద్దిష్టమైనశ్లోకం ప్రారంభించబడుచున్నది-

ప్ర. అ. నేతి: -పృథివ్యామ్=భూమిమీద గాని,దివి=స్వర్గంలో గాని,పునః=మరియు, దేవేషు వా =దేవతలలో గాని,యత్=ఏ,సత్త్వమ్=ప్రాణి,ప్రకృతిజైః=ప్రకృతినుండి పుట్టిన, ఏభిః=ఈ, త్రిభిః=మూడు,గుణైః=గుణాలచేత,ముక్తమ్=విడవబడినది,స్యాత్=అగునో, తత్=అది,న అస్తి=లేదు.

భాష్యమ్

న తత్ అస్తి తత్ నాస్తి,పృథివ్యాం వా మనుష్యాది సత్త్వం ప్రాణిజాతమ్ అన్యద్వా అప్రాణిజాతమ్,దివి దేవేషు వా పునః,సత్త్వం ప్రకృతిజైః ప్రకృతితః జాతైః ఏభిః త్రిభిః గుణైః సత్త్వాదిభిః,ముక్తం పరిత్యక్తం యత్ స్యాత్ భవేత్ న తత్ అస్తి ఇతి పూర్వేణ సంబన్ధః. 40

బాలానందిని

నేతి:-పృథివియందు మనుష్యాదిప్రాణిసముదాయం గాని,మరొక అప్రాణిసముదాయం(స్థావరాల సముదాయం)గాని,దేవతలలో ఏదైన ప్రాణి గాని అలాంటిది ఏదీ లేదు,ఏది ప్రకృతినుండి పుట్టిన సత్త్వాదులైన మూడు గుణములచేత విడువబడినదో (వాటితో సంబంధము లేనిదో)అట్టిది లేదు అని వెనుకటి దానితో సంబంధం.40

భాష్యమ్

సర్వః సంసారః క్రియాకారకఫలలక్షణః సత్త్వరజస్తమోగుణాత్మకః అవిద్యాపరికల్పితః సమూలః అనర్థః ఉక్తః.వృక్షమూలకల్పనయా చ "**ఊర్ధ్వమూలమ్**"(15.1) ఇత్యాదినా;"**తం చ అసంగశస్త్రేణ దృఢేన ఛిత్త్వా తతః పదం తత్పరిమార్గితవ్యమ్**" (15,3,4)ఇతి చ ఉక్తమ్.తత్ర చ సర్వస్య త్రిగుణాత్మకత్వాత్ సంసారకారణనివృత్త్యనుపపత్తౌ ప్రాప్తాయాం యథా తన్నివృత్తిః స్యాత్ తథా వక్తవ్యమ్;సర్వశ్చ గీతాశాస్త్రార్థః ఉపసంహర్తవ్యః.ఏతావానేవ చ సర్వవేదస్మృత్యర్థః పురుషార్థమ్ ఇచ్ఛద్భిః అనుష్ఠేయః ఇత్యేవమర్థం చ "బ్రాహ్మణక్షత్రియవిశామ్"ఇత్యాదిః ఆరభ్యతే-

మూ. బ్రాహ్మణక్షత్రియవిశాం శూద్రాణాం చ పరంతప,
కర్మాణి ప్రవిభక్తాని స్వభావప్రభవైర్గుణైః. 41

బాలానందిని

సర్వ ఇతి:-క్రియలు,కారకాలు(క్రియాసాధనాలు)ఫలాలు అనే స్వరూపం గలది, సత్త్వరజస్తమోగుణాత్మకము అవిద్యాకల్పితము,అయిన సమస్తమైన సంసారము దాని మూలంతో సహా అనర్థకర మని(ఇంతవరకు)ప్రతిపాదించబడినది.లేదా సమస్తసంసారము కూడ సత్త్వరజస్తమోగుణాత్మకము అని ప్రతిపాదించబడినది."**ఊర్ధ్వమూలమ్**"ఇత్యాదికంచేత వృక్షరూపకాన్ని కల్పించడం ద్వారా కూడ సంసారం(పదిహేనవ అధ్యాయంలో కూడ) చెప్పబడినది.దానిని అసంగ మనే దృఢమైన ఖడ్గంచేత ఛేదించి దానికంటె పరమైన స్థానం అన్వేషింపదగినది అని కూడ(అక్కడ)చెప్పబడినది.ఇది ఇలా ఉండగా-సమస్తమూ కూడ త్రిగుణాత్మకం అవడంచేత సంసారకారణం నివర్తించదు అని ప్రాప్తించగా(అనే అభిప్రాయం కలగడానికి అవకాశం ఉండగా)అది ఎలా నివర్తిస్తుందో చెప్పవలసి ఉన్నది. సమస్త మైన గీతాశాస్త్రార్థాన్ని ఉపసంహరించవలసి ఉన్నది.పురుషార్థాన్ని కోరేవాళ్లు అనుష్ఠించ దగిన సమస్తమైన వేదస్మృతులలో ప్రతిపాదించిన విషయం ఇదే అని కూడ చెప్పడం కోసం "బ్రాహ్మణక్షత్రియవిశామ్"ఇత్యాదిగ్రంథభాగం ప్రారంభించబడుచున్నది.

ప్ర.అ.బ్రాహ్మణేతి: -పరంతప=శత్రుపీడకుడవైన అర్జునా!బ్రాహ్మణక్షత్రియవిశామ్= బ్రాహ్మణ-క్షత్రియ-వైశ్యులయొక్క,శూద్రాణాం చ=శూద్రులయొక్క,కర్మాణి=కర్మలు,స్వభావ ప్రభవైః=స్వభావంవల్ల పుట్టిన,గుణైః=గుణములచేత,ప్రవిభక్తాని=విభజింపబడి ఉన్నవి.

భాష్యమ్

బ్రాహ్మణాశ్చ క్షత్రియాశ్చ విశశ్చ బ్రాహ్మణక్షత్రియవిశః,తేషాం బ్రాహ్మణక్షత్రియ విశామ్;శూద్రాణాం చ-శూద్రాణామ్ అసమాసకరణమ్ ఏకజాతిత్వే సతి వేదే అనధి కారాత్. హే!పరంతప!కర్మాణి ప్రవిభక్తాని ఇతరేతరవిభాగేన వ్యవస్థాపి తాని.కేన?స్వభావ ప్రభవైః గుణైః.స్వభావః ఈశ్వరస్య ప్రకృతిః త్రిగుణాత్మికా మాయా.సా ప్రభవః యేషాం గుణానాం తే స్వభావప్రభావాః,తైః శమాదీని గుణాని ప్రవిభక్తాని బ్రాహ్మణాదీనామ్. అథవా బ్రాహ్మణస్వభావస్య సత్త్వగుణః ప్రభవః కారణమ్.తథా క్షత్రియస్వభావస్య సత్త్వోపసర్జనం రజః ప్రభవః.వైశ్యస్వభావస్య తమ ఉపసర్జనం రజః ప్రభవః.శూద్రస్వ భావస్య రజఉపసర్జనం తమః ప్రభవః;ప్రశాన్త్యైశ్వర్యేహామూఢతాదర్శనాత్ చతుర్ణామ్. అథవా జన్మాన్తరకృతసంస్కారః ప్రాణినాం వర్తమానజన్మని స్వకార్యాభిముఖత్వేన అభివ్యక్తః స్వభావః,సః ప్రభవః యేషాం గుణానాం తే స్వభావప్రభవాః గుణాః.గుణ ప్రాదుర్భావస్య నిష్కారణత్వానుపపత్తేః స్వభావం కారణమ్ ఇతి కారణవిశేషోపాదానమ్. ఏవం స్వభావప్రభవైః ప్రకృతిప్రభవైః సత్త్వరజస్తమోభిః గుణైః స్వకార్యానురూపేణ శమాదీని కర్మాణి ప్రవిభక్తాని.నను శాస్త్రప్రవిభక్తాని శాస్త్రేణ విహితాని బ్రాహ్మణాదీనాం శమాదీని కర్మాణి;కథమ్ ఉచ్యతే సత్త్వాదిగుణప్రవిభక్తానీతి?నైష దోషః.కర్మాణి ప్రవిభక్తాని న గుణానపేక్ష్యైవ ఇతి శాస్త్రప్రభవిభక్తాన్యపి గుణప్రవిభక్తానీతి ఉచ్యన్తే. 41

బాలానందిని

బ్రాహ్మణాశ్చేతి: - బ్రాహ్మణక్షత్రియవైశ్యులకు,శూద్రులకు("బ్రాహ్మణక్షత్రియవిశామ్" అని మూడు వర్ణాలవాళ్ళను సమాసంలో పేర్కొని)శూద్రులను సమాసంలో చేర్చకపోవడానికి కారణం వాళ్లు ఒకే జాతి(జన్మ) కలవాళ్లవడం,వాళ్లకు వేదాధికారం లేకపోవడమూను. ఓ!అర్జునా!కర్మలు విభక్తములై ఉన్నవి;ఎవరివి వారికి విభజించి నిర్ణయించబడినవి. దేనిచేత?స్వభావప్రభములైన గుణాలచేత(దీనికి మూడు విధాల అర్థం చెపుతున్నారు) స్వభావ మనగా ఈశ్వరుని ప్రకృతియైన త్రిగుణాత్మక మైన మాయ.అది కారణం వేటికో అవి స్వభావప్రభములైన గుణాలు,(స్వభావనుండి, ప్రకృతినుండి పుట్టిన గుణాలు).వాటిచేత బ్రాహ్మణాదులకు శమాదు లైన కర్మలు వేరు వేరుగా నిర్ణయింబడినవి.(ఇప్పుడు ప్రకృతివల్ల

పుట్టిన గుణాలు అను అర్థానికి బదులు మరొక అర్థం చెపుతున్నారు)లేదా - బ్రాహ్మణ స్వభావానికి సత్త్వగుణం కారణం. క్షత్రియస్వభావానికి సత్త్వగుణం అప్రధానంగా గల(సత్త్వ గుణం తక్కువ పాలులో ఉన్న)రజోగుణం కారణం. వైశ్యస్వభావానికి తమోగుణం అప్రధానం గల రజోగుణం కారణం. శూద్రస్వభావానికి రజోగుణం అప్రధానంగా గల తమోగుణం కారణం. ఎందువల్ల ననగా-ఆ నలుగురిలో(వరుసగా)ప్రశాంతి, ఐశ్వర్యం (ప్రభుశక్తి),ఆశ (ధనాదితృష్ణ) మూఢత్వం(తెలివితక్కువతనం) అనే గుణాలు కనబడు తున్నాయి. (మూడు గుణాలు ప్రకృతినుండి పుట్టినవి అన్నప్పుడు ప్రకృతి గుణాలకు ఉపాదాన కారణం. బ్రాహ్మణాదులస్వభావాలు గుణాలనుండి పుతున్నా యన్నప్పుడు స్వభా వాలకి గుణాలు నిమిత్తకారణం. ఇప్పుడు మూడవ అర్థం చెపుతున్నారు)-లేదా స్వభావం అనగా ప్రాణులకు జరుగుతూన్న జన్మలో తన కార్యానికి అభిముఖంగా(తానివ్వవలసిన ఫలాన్ని ఇవ్వడానికి సిద్ధంగా ఉండే)పూర్వజన్మకృతమైన కర్మలవల్ల కలిగిన సంస్కారం. అది (అట్టి సంస్కారం)ఏ గుణాలకు కారణమో అవి స్వభావప్రభవము లైన గుణాలు. (ఇక్కడ గుణాలు) సంస్కారరూపమైన స్వభావంనుండి పుడుతున్నాయి అనగా ఆ సంస్కార బలంచేత గుణాలు తమ తమ పనులు చేయడానికి అభిముఖము లవుతున్నాయి అని అర్థం). గుణాల ప్రాదుర్భావం (అవి ఉద్బుద్ధములై తమ పనులు చేయడం) ఏ కారణమూ లేకుండానే జరుగుచున్నది అని చెప్పడం యుక్తం కాదు గాన వాటికి స్వభావం కారణ మని కారణవిశేషం చెప్పబడుచున్నది. ఈ విధంగా స్వభావప్రభవములైన, ప్రకృతిప్రభవము లైన, సత్త్వరజస్తమో గుణములచేత తమ తమ కార్యాలకు అనురూపంగా శమాదికర్మలు వేరువేరుగా విభజించబడినవి.

వి. భగవత్పాదులు"స్వభావప్రభవైః గుణైః"అనేదానిని మూడు విధాల వ్యాఖ్యానిం చారు. కాని ఉపసంహారవాక్యంలో "స్వభావప్రభావైః ప్రకృతిప్రభవైః"అని చెప్పడంచేత ఒక్క వ్యాఖ్యనే అంగీకరించినట్లు అవుతుంది. అందుచేత 'ప్రకృతిప్రభవైః'అనేది భాష్యకారులు ప్రయోగించిన పదం కాదేమో అని మా ఊహ. ఆనందగిరి ఈ పదం గ్రహించ కుండా (పై వాక్యానికి వ్రాసిన వ్యాఖ్యలో)"స్వభావప్రభవైః సత్త్వాది గుణైః"అని మాత్రమే అన్నారు.

నన్వితి: -(ఆశంక)బ్రాహ్మణాదుల శమాది కర్మలు శాస్త్రముచేత విధింపబడి ఉన్నాయి కదా? శాస్త్రముచేత విభక్తములై ఉన్నాయి కదా? అలాంటప్పుడు సత్త్వాదిగుణాలచేత ప్రవిభక్తములు అని ఎట్లు చెప్పబడుచున్నది? (సమాధానం)-ఈ దోషం లేదు. బ్రాహ్మ ణాదులు అనుష్ఠించవలసిన శమాదికర్మలు శాస్త్రంచేత కూడ సత్త్వాదిగుణవిశేషాలను అపేక్షించియే ప్రవిభక్తములై ఉన్నాయి కాని గుణాల అపేక్ష లేకుండా కాదు; అందుచేత శాస్త్రప్రభవిభక్తములే అయినా కూడ కర్మలు గుణప్రవిభక్తములు అని చెప్పబడుతున్నాయి.

భాష్యమ్

కాని పునః తాని కర్మాణి ఇతి ఉచ్యన్తే-

మూ. శమో దమస్తపః శౌచం క్షాన్తిరార్జవమేవ చ,
జ్ఞానం విజ్ఞానమాస్తిక్యం బ్రహ్మకర్మ స్వభావజమ్. 42

బాలానందిని

కానీతి:-అయితే ఆ కర్మలు ఏవి అనే విషయం చెప్పబడుచున్నది-

ప్ర.అ. శమః=అంతఃకరణశమము,దమః=చక్షురాదిబాహ్యేంద్రియాల నిగ్రహము, తపః=తపస్సు,శౌచమ్=శుచిత్వము,క్షాన్తిః=ఓర్పు,ఆర్జవమేవ చ=ఋజుత్వము,జ్ఞానమ్= శాస్త్రీయవిషయాల జ్ఞానము,విజ్ఞానమ్=శాస్త్రవిషయాల అనుభవరూపజ్ఞానము,ఆస్తిక్యమ్ =వేదాదులయందు ప్రామాణ్యబుద్ధి,స్వభావజమ్=స్వభావంవల్ల పుట్టిన,బ్రహ్మకర్మ= బ్రాహ్మణకర్మ.

భాష్యమ్

శమః దమశ్చ యథావ్యాఖ్యాతార్థౌ(16.1;2).తపః యథోక్తం శారీరాది (17.14-16).శౌచం యథావ్యాఖ్యాతమ్(16.3).క్షాన్తిః క్షమా-ఆర్జవమ్ ఋజుతైవ. జ్ఞానం, విజ్ఞానం, ఆస్తిక్యమ్ అస్తిభావః శ్రద్ధధానతా ఆగమార్థేషు, బ్రహ్మకర్మ బ్రాహ్మణ జాతేః కర్మ బ్రహ్మకర్మ స్వభావజమ్. యదుక్తం "స్వభావప్రభవైః గుణైః ప్రవిభక్తాని" (18.41) ఇతి తదేవ ఉక్తం స్వభావజమ్ ఇతి. 42

బాలానందిని

శమ ఇతి:-వెనుక వ్యాఖ్యానించబడిన అర్థాలు గల శమదమాలు,పైన చెప్పబడిన శారీరాదితపస్సు వెనుక వివరించబడిన శౌచము,ఓర్పు,వక్రత్వం లేకపోవడం,జ్ఞానము, విజ్ఞానము,ఆస్తిక్యము,అనగా శాస్త్రీయవిషయాలలో శ్రద్ధ ఇవి బ్రాహ్మణజాతియొక్క స్వభావజ మైన కర్మ."స్వభావప్రభవైః గుణైః ప్రవిభక్తాని"అనివెనుక చెప్పబడినదే ఇక్కడ "స్వభావజమ్"అని చెప్పబడుచున్నది.

మూ. శౌర్యం తేజో ధృతిర్దాక్ష్యం యుద్ధే చాప్యపలాయనమ్,
దానమీశ్వరభావశ్చ క్షత్రకర్మ స్వభావజమ్. 43

ప్ర.అ. **శౌర్యమితి**:-శౌర్యమ్=శూరత్వము,తేజః=తేజస్సు,ధృతిః=చిత్తస్థైర్యము, దాక్ష్యమ్=నేర్పు,యుద్ధే=యుద్ధమునందు,అపలాయనం చ=పారిపోకుండా ఉండడము,

దానమ్=దానము, ఈశ్వరభావః చ=ప్రభుత్వము, స్వభావజమ్=స్వభావజమైన, క్షత్రకర్మ= క్షత్రియజాతియొక్క కర్మ.

భాష్యమ్

శౌర్యమితి: –శూరస్య భావః తేజః ప్రాగల్భ్యమ్ ధృతిః ధారణం సర్వావస్థాసు అనవసాదః భవతి యయా ధృత్యా ఉత్తమ్భితస్య. దాక్ష్యం దక్షస్య భావః సహసా ప్రత్యుత్పన్నేషు కార్యేషు అవ్యామోహేన ప్రవృత్తిః. యుద్ధే చ అపి అపలాయనమ్ అపరాఙ్ముఖీభావః శత్రుభ్యః. దానం దేయేషు ముక్తహస్తతా. ఈశ్వరభావః చ ఈశ్వరస్య భావః ప్రభుశక్తిప్రకటీకరణమ్ ఈశితవ్యాన్ ప్రతి. క్షత్త్రకర్మ క్షత్త్రియజాతేః విహితం కర్మ క్షత్త్రకర్మ స్వభావజమ్.

బాలానందిని

శౌర్యమితి: –శూరుని ధర్మం(లక్షణం)శౌర్యం. తేజస్సు అనగా ప్రాగల్భ్యం, నిర్భయం గా ఉండడం, ధృతి అనగా ధారణం, నిలబెట్టుకొనడం. ఏ ధృతిచేత తనను తాను నిలబెట్టు కొన్నవాడు ఎట్టి పరిస్థితిలోను క్రుంగిపోడో అది. దక్షుని ధర్మం(లక్షణం)దాక్ష్యం. **హఠాత్తుగా**, తలవని తలంపుగా వచ్చి పడిన క్లిష్టపరిస్థితులలో కూడ కంగారుపడకుండా కర్తవ్యములను ఆచరించడం దాక్ష్యం. యుద్ధాలలో శత్రువులను ఎదుర్కొనకుండా పారిపోవడం అనేది లేకపోవడం. ఇవ్వవలసిన చోట చేయి విడచి ఇవ్వడం దానం. ఎవరిని నియమించాలో వాళ్ల విషయంలో ప్రభుశక్తిని ప్రకటీకరించడం ఈశ్వరభావం. ఇది క్షత్రియజాతికి స్వభావ విహిత మైన కర్మ. 43

మూ. కృషిగౌరక్ష్యవాణిజ్యం వైశ్యకర్మ స్వభావజమ్,
పరిచర్యాత్మకం కర్మ శూద్రస్యాపి స్వభావజమ్. 44

ప్ర. అ. కృషీతి: –కృషిగౌరక్ష్యవాణిజ్యమ్=వ్యవసాయం చేయడం, గోవులను రక్షించడం, వర్తకం ఇవి, వైశ్యస్య అపి=వైశ్యునకు, స్వభావజమ్=స్వభావజ మైన కర్మ, పరిచర్యా త్మకమ్= సేవచేయడం అనే, కర్మ=కర్మ, శూద్రస్య=అపి=శూద్రునకు, స్వభావజమ్=స్వభావజ మైన కర్మ.

భాష్యమ్

కృషీతి: –కృషి గౌరక్ష్యవాణిజ్యమ్–కృషిః చ గౌరక్ష్యం చ వాణిజ్యం చ కృషి గౌరక్ష్యవాణిజ్యమ్. కృషిః భూమేః విలేఖనమ్. గౌరక్ష్యమ్–గాః రక్షతి ఇతి గోరక్షః. తద్భావః గౌరక్ష్యం, పాశుపాల్యమ్ వాణిజ్యం వణిక్కర్మ క్రయవిక్రయాదిలక్షణమ్. వైశ్యకర్మ వైశ్య జాతేః కర్మ వైశ్యకర్మ, స్వభావజమ్. పరిచర్యాత్మకం శుశ్రూషాస్వభావం కర్మ శూద్రస్య అపి స్వభావజమ్. 44

బాలానందిని

కృషీతి:–కృషిగౌరక్ష్యవాణిజ్యమ్–కృషి అనగా భూమి దున్నడం.గోవులను లక్షించే వాడు గోరక్షుడు.వాని ధర్మం గౌరక్ష్యం.అనగా పాశుపల్యం(పశువులను పాలించడం). వర్తకుడు చేసే కొనడం అమ్మడం మొదలైన పని వాణిజ్యం.ఇది వైశ్యజాతికి స్వభావజ మైన కర్మ.శశ్రూషచేయడం అనేది శూద్రుని స్వభావజ మైన కర్మ. **44**

భాష్యమ్

ఏతేషాం జాతివిహితానాం కర్మణాం సమ్యక్ అనుష్ఠితానాం స్వర్గప్రాప్తిః ఫలం స్వభావతః–**"వర్ణా ఆశ్రమాశ్చ స్వకర్మనిష్ఠాః ప్రేత్య కర్మఫలమ్ అనుభూయ తతః శేషేణ విశిష్టదేశజాతికులధర్మాయుఃశ్రుతవిత్తసుఖమేధసః జన్మ ప్రతిపద్యన్తే"** (గౌ.ధ.సూ.11.29) ఇత్యాదిస్మృతిభ్యః.పురాణే చ వర్ణినామ్ ఆశ్రమిణాం చ లోకఫల భేదవిశేషస్మరణాత్. కారణాన్తరాత్తు ఇదం వక్ష్యమాణం ఫలమ్–

మూ. స్వే స్వే కర్మణ్యభిరతః సంసిద్ధిం లభతే నరః,
స్వకర్మనిరతః సిద్ధిం యథా విన్దతి తచ్ఛృణు. 45

బాలానందిని

ఏతేషామితి:–"వర్ణాః....ప్రతిపద్యన్తే"తమ తమ కర్మలయందు నిష్ఠ గల వర్ణాలు ఆశ్రమాలు(వర్ణాలవాళ్లు ఆశ్రమాలవాళ్లు) మరణించిన తరువాత కర్మఫలం అనుభవించి తరువాత మిగిలిన కర్మచేత విశిష్టమైన జాతి,కులము,ధర్మము,ఆయుర్దాయము,విద్య, ధనము,సుఖము,బుద్ధిబలము కలవారై జన్మ పొందుతూంటారు ఇత్యాది స్మృతులను అనుసరించి, ఆ యా వర్ణాలవాళ్లకు,ఆశ్రమాలవాళ్లకు లోకభేదాలు,ఫలభేదాలు,వాటిలో విశేషాలు లభిస్తాయి అని పురాణాలలో చెప్పడంవల్లా కూడ ఆ యా జాతులవాళ్లకు విధించబడిన కర్మలను చక్కగా ఆచరిస్తే స్వభావతః(సహజంగానే) స్వర్గం లభిస్తుంది. ఇంక ఇప్పుడు చెప్ప నున్న ఫలం ఇతరకారణాల వల్ల (మోక్షభిలాషచేత కర్మాచరణాదులవల్ల) కలుగుతుంది–

ప్ర.అ. స్వే స్వే ఇతి:– స్వే స్వే=తన తన,కర్మణి=కర్మయందు,అభిరతః=ఆసక్తుడైన, నరః=నరుడు,సంసిద్ధమ్=సిద్ధిని,లభతే=పొందును.స్వకర్మనిరతః=తన కర్మయందు నిరతు డైనవాడు,యథా=ఎట్లు,సిద్ధిమ్=సిద్ధిని,విన్దతి=పొందుతాడో,తత్=దానిని,శృణు=వినుము.

భాష్యమ్

స్వే స్వే యథోక్తలక్షణభేదే,కర్మణి,అభిరతః తత్పరః,సంసిద్ధిమ్– స్వకర్మాను ష్ఠానాత్ అశుద్ధిక్షయే సతి కాయేన్ద్రియాణాం జ్ఞాననిష్ఠాయోగ్యతా లక్షణాం, లభతే

ప్రాప్నోతి,నరః అధికృతః పురుషః. కిం స్వకర్మానుష్ఠానతః ఏవ సాక్షాత్ సంసిద్ధిః?న. కథం తర్హి?స్వకర్మనిరతః సిద్ధిం యథా యేన ప్రకారేణ విన్దతి తత్ శృణు. 45

బాలానందిని

స్వే స్వే ఇతి:- పైన చెప్పబడిన స్వరూపభేదం గల తన తన కర్మయందు శ్రద్ధా వంతుడై ఆచరించే నరుడు,అధికారి యైన పురుషుడు,సంసిద్ధిని తన కర్మలను చేయడంవల్ల శరీర-ఇంద్రియాల అశుద్ధి తొలగిపోవడంతో జ్ఞాననిష్ఠకు యోగ్యత అనే సంసిద్ధిని, పొందుతాడు. అయితే స్వకర్మానుష్ఠానమాత్రంచేతనే సాక్షాత్తుగా సంసిద్ధి కలుగుతుందా?అట్లు కాదు. మరి ఎట్లు?స్వకర్మనిరతుడు ఏ విధంగా సిద్ధిని పొందుతాడో వినుము. 45

మూ. యతః ప్రవృత్తిర్భూతానాం యేన సర్వమిదం తతమ్,
స్వకర్మణా తమభ్యర్చ్య సిద్ధిం విన్దతి మానవః. 46

ప్ర.అ. యతః ఇతి:- యతః=ఏ పరమాత్మవల్ల,భూతానామ్=ప్రాణులయొక్క ప్రవృత్తిః =తమ తమ పనులలో ప్రవర్తించడం జరుగుతున్నదో,యేన=ఏ పరమాత్మచేత, ఇదం సర్వమ్=ఇది అంతా,తతమ్=వ్యాపింపబడిఉన్నదో. తమ్=ఆ పరమాత్మను,స్వకర్మణా =తన కర్మచేత,అభ్యర్చ్య=పూజించి,మానవః=మానవుడు,సిద్ధిమ్=సిద్ధిని,విన్దతి= పొందుతాడు.

భాష్యమ్

యతః ఇతి:-యతః యస్మాత్,ప్రవృత్తిః ఉత్పత్తిః చేష్టా వా, యస్మాత్ అన్తర్యామిణః ఈశ్వరాత్,భూతానాం ప్రాణినాం స్యాత్,యేన ఈశ్వరేణ సర్వమ్ ఇదం జగత్, తతం వ్యాప్తం,స్వకర్మణా పూర్వోక్తేన ప్రతివర్ణం,తమ్ ఈశ్వరమ్ అభ్యర్చ్య పూజయిత్వా ఆరాధ్య కేవలం జ్ఞాననిష్ఠాయోగ్యతాలక్షణాం సిద్ధిం విన్దతి,మానవః మనుష్యః. 46

బాలానందిని

యతః ఇతి:-అంతర్యామి యైన ఏ ఈశ్వరునివల్ల ప్రాణుల ఉత్పత్తి లేదా చేష్ట (ఆ యా పనులు చేయడం)జరుగుతున్నదో,ఏ ఈశ్వరునిచేత ఈ జగత్తు అంతా వ్యాపింపబడినదై ఉన్నదో ఆ ఈశ్వరుణ్ణి ప్రతీ వర్ణంవాళ్లకు విధించబడిన,వెనుక చెప్పిన కర్మచేత పూజించి,ఆరాధించి,మనుష్యుడు కేవలము జ్ఞాననిష్ఠకు యోగ్యత్వం అనే సిద్ధిని మాత్రమే (మోక్షాన్ని కాదు)పొందుతాడు. 46

భాష్యమ్

యతః ఏవమ్ అతః-

మూ. శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మాత్స్వనుష్ఠితాత్,
స్వభావనియతం కర్మ కుర్వన్నాప్నోతి కిల్బిషమ్. 47

బాలానందిని

యతః ఇతి:- ఇది ఇట్లు గాన-

ప్ర.అ.శ్రేయానితి:-స్వధర్మః=స్వధర్మము(తనకు శాస్త్రం విధించిన ధర్మం),విగుణః =లోపా లున్నదైనా కూడ(హింసాదులతో కూడినాకూడ),స్వనుష్ఠితాత్=బాగా అనుష్ఠించ బడిన,పరధర్మాత్=పరుల ధర్మంకంటె,శ్రేయాన్=ఎక్కువ ప్రశంసింపదగినది.స్వభావ నియతమ్ =స్వభావంచేత నిశ్చితమైన,కర్మ=కర్మను,కుర్వన్=చేస్తూన్నవాడు,కిల్బిషమ్= పాపమును,న ఆప్నోతి=పొందదు.

భాష్యమ్

శ్రేయాన్ ప్రశస్యతరః,స్వః ధర్మః,విగుణః అపి ఇతి అపిశబ్దః ద్రష్టవ్యః పర ధర్మాత్ స్వనుష్ఠితాత్.స్వభావనియతం స్వభావేన నియతం;యత్ ఉక్తం స్వభావజమ్ ఇతి తదేవ ఉక్తం స్వభావనియతమ్ ఇతి.యథా విషజాతస్యేవ కృమేః విషం న దోష కరం తథా స్వభావనియతం కర్మ కుర్వన్ న ఆప్నోతి కిల్బిషం పాపమ్. 47

బాలానందిని

శ్రేయానితి:-తన ధర్మం,'విగుణః'తరువాత 'అపి'శబ్దం ఉన్నట్లు అర్థం చెప్పుకోవాలి.విగుణ మైనా కూడ,(దోషా లున్నదైనా కూడ)బాగా అనుష్ఠించబడిన పరుల ధర్మంకంటె(పరుల ధర్మాన్ని స్వీకరించి దానిని బాగా అనుష్ఠించడంకంటె) ఎక్కువ ప్రశం సింపదగినది.స్వభావంచేత నియత మైనది స్వభావనియతం. 'స్వభావజమ్'అని చెప్పినదే 'స్వభావనియతమ్'అని చెప్పబడుచున్నది.విషంలోనే పుట్టిన పురుగుకు విషం ఏ విధంగా దోషం కలిగించదో అట్లే స్వభావనియత మైన కర్మను చేసేవాడు పాపం పొందదు.(హింసా భూయిష్టం అవడంచేత యుద్ధం చేయను అని అర్జును డన్నదానికి ఇది సమాధానం)47

భాష్యమ్

స్వభావనియతం కర్మ కుర్వాణః విషజాతః ఇవ కృమిః కిల్బిషం న ఆప్నోతి ఇత్యుక్తమ్.పరధర్మః చ భయావహః ఇతి.అనాత్మజ్ఞశ్చ"న హి కశ్చిత్ క్షణమపి అకర్మకృత్ తిష్ఠతి"(3.5)ఇతి అతః-

మూ. సహజం కర్మ కౌన్తేయ సదోషమపి న త్యజేత్,
సర్వారమ్భా హి దోషేణ ధూమేనాగ్నిరివావృతాః. 48

బాలానందిని

స్వభావేతి:–స్వభావనియత మైన కర్మను ఆచరించేవాడు విషంలో పుట్టిన కృమి వలె పాపం పొందదు అని చెప్పబడినది.పరధర్మం భయం కలిగించేది అని కూడ చెప్పబడినది.అనాత్మజ్ఞు డైన వా డెవ్వడూ కూడ,క్షణకాలం కూడ కర్మ చేయకుండా ఉండ జాలడు గాన,అందువల్ల–

ప్ర.అ.సహజమితి:–కౌన్తేయ=అర్జునా! సహజమ్=సహజమైన,కర్మ=కర్మను, సదోషమ్ అపి=దోషంతో కూడిన దైనాకూడ,న త్యజేత్=విడువగూడదు.సర్వారమ్భాః= సమస్త మైన కర్మలు,ధూమేన=ధూమంచేత,అగ్నిః ఇవ=అగ్నివలె,దోషేణ=దోషంచేత, ఆవృతాః హి=కప్పబడి ఉన్నవి కదా?

భాష్యమ్

సహజమ్ సహ జన్మనైవ ఉత్పన్నం సహజమ్–కిం తత్?కర్మ కౌన్తేయ, సదోషమపి త్రిగుణత్వాత్,న త్యజేత్ సర్వారమ్భాః–ఆరభ్యన్తే ఇతి ఆరమ్భాః,సర్వకర్మాణీ త్యేతత్ ప్రకరణాత్. యే కేచిత్ ఆరమ్భాః స్వధర్మాః పరధర్మాః చ తే సర్వేహి యస్మాత్, త్రిగుణాత్మకత్వమ్ అత్ర హేతుః.త్రిగుణాత్మకత్వాత్,దోషేణ,ధూమేన సహజేన,అగ్నిః ఇవ ఆవృతాః.సహజస్య కర్మణః స్వధర్మాఖ్యస్య పరిత్యాగేన పరధర్మానుష్ఠానేఽపి దోషాత్ నైవ ముచ్యతే;భయావహః చ పరధర్మః.న చ శక్యతే అశేషతః త్యక్తుమ్ అజ్ఞేన కర్మ యతః తస్మాత్ న త్యజేదిత్యర్థః.

బాలానందిని

సహజమితి:–అర్జునా!త్రిగుణాత్మకం అవడంవల్ల దోషంతో కూడినదే అయినా, సహజమైన తన పుట్టుకతో పుట్టిన,కర్మను విడవగూడదు.ఆరంభము లనగా ఆరభించ బడేవి,కర్మలు.సమస్తకర్మలు అని ప్రకరణాన్ని పట్టి(కర్మలను గూర్చి చెపుతూన్న ప్రకరణం గాన)గ్రహించాలి.ఏ యే కర్మ లున్నాయో,స్వధర్మా లైనా,పరధర్మా లైనా,అవన్నీ,ఎందువల్ల? ఇక్కడ త్రిగుణాత్మకములై ఉండడం హేతువు;త్రిగుణాత్మకములై ఉండడంవల్ల,సహజ మైన ధూమంచేత అగ్ని కప్పబడి నట్లు దోషంచేత కప్పబడ్డాయో అందువల్ల,సహజమైన, స్వధర్మరూపమైన కర్మను పరిత్యజించి పరధర్మాన్ని అనుష్ఠించినా కూడ దోషంనుండి విముక్తుడు కాడు.పరధర్మం భయావహం కూడ,అజ్ఞుడు(జ్ఞానం లేని వాడు)కర్మను పూర్తిగా విడవజాలడు గాన దానిని (స్వధర్మాన్ని)విడువకూడదు అని అర్థం.

భాష్యమ్

కిమ్ అశేషతః త్యక్తుమ్ అశక్యం కర్మ ఇతి న త్యజేత్,కిం వా సహజస్య కర్మణః త్యాగే దోషో భవతి ఇతి? కిం చాతః? యది తావత్ అశేషతః త్యక్తుమ్ అశక్యమితి న త్యాజ్యం సహజం కర్మ ఏవం తర్హి అశేషతః త్యాగే గుణః ఏవ స్యాత్ ఇతి ప్రసిద్ధం భవతి. సత్యమ్ ఏవమ్;అశేషతః త్యాగ ఏవ నోపపద్యతే ఇతి చేత్-కిం నిత్యప్రచలితాత్మకః పురుషః యథా సాంఖ్యానాం గుణాః,కిం వా క్రియైవ కారకం,యథా బౌద్ధానాం పఞ్చస్కన్ధాః క్షణప్రధ్వంసినః? ఉయభథాపి కర్మణః అశేషతః త్యాగః న సంభవతి. అథ తృతీయః అపి పక్షః-యదా కరోతి తదా సక్రియం వస్తు,యదా న కరోతి తదా నిష్క్రియం వస్తు తదేవ;తత్ర ఏవం సతి శక్యం కర్మ అశేషతః త్యక్తుమ్. అయం తు అస్మిన్ తృతీయే పక్షే విశేషః-న నిత్యప్రచలితం వస్తు,నాపి క్రియైవ కారకం,కిం తర్హి వ్యవస్థితే ద్రవ్యే అవిద్యమానా క్రియా ఉత్పద్యతే,విద్యమానా చ వినశ్యతి.

బాలానందిని

కిమితి:-(ఆశంక)కర్మను పూర్తిగా త్యజించడం శక్యం కాదు గాన దానిని త్యజించ కూడదా లేక సహజమైన కర్మను త్యజిస్తే దోషం కలుగుతుంది గాన త్యజించకూడదా? (సిద్ధాంతి ప్రశ్న)ఏదైతే మాత్రం ఏమిటి? (పూర్వపక్షి తన అభిప్రాయం విశదీకరిస్తున్నాడు) సహజకర్మను పూర్తిగా త్యజించడం శక్యం కాదు కాబట్టి దానిని విడవకూడదు అన్నట్లయితే (ఎవ్వరూ చేయజాలని సముద్రపానం అగస్త్యుడు చేయడం చాలా గొప్ప పని అన్నట్లు) ఎవరైనా కర్మను పూర్తిగా విడవకలిగితే అది గుణమే అని చెప్పిన ట్లవుతుంది. (సిద్ధాంతి ఆశంక) ఇది నిజమే(సర్వకర్మలను త్యజించకలిగితే అది గుణము అనే మాట నిజమే) కాని పూర్తిగా విడవడమే కుదరదు అన్నట్లయితే-(ఈ విషయమే విశదీకరిస్తున్నాడు). సాంఖ్యుల మతం ప్రకారం గుణాలు ఎల్లప్పుడూ కదులుతూనే ఉంటాయి (పని చేస్తూనే ఉంటాయి)అన్నట్లు పురుషుడు (ఆత్మ)నిత్యమూ చలించడమే(పని చెయడమే)స్వభావం కలవాడు అని చెప్పినా,బౌద్ధుల క్షణప్రధ్వంసులైన పంచస్కంధాల వలె క్రియయే కారకం (కర్త)అని చెప్పినా రెండు విధాలా కూడ కర్మను పూర్తిగా విడవడం కుదరదు.

వి.గుణాలు ఎల్లప్పుడు చలిస్తూనే ఉంటాయి అని సాంఖ్యులు అంగీకరిస్తారు. గుణాల వలె పురుషుడు (ఆత్మ)కూడ నిత్యమూ పని చేస్తూనే ఉంటుం దని అంగీకరిస్తే అప్పుడు ఆత్మ ఏదో ఒక కర్మ చేస్తూనే ఉంటుంది గాన సర్వకర్మత్యాగం కుదరదు. అట్లే బౌద్ధులు రూప-విజ్ఞాన-వేదనా-సంజ్ఞా-సంస్కారా లనే ఐదు స్కంధా లున్నా యనీ,అవి క్షణవిధ్వంసులనీ,అనగా పుట్టిన మరుక్షణంలోనే నశిస్తా యనీ అందుచేత క్షణికా లనీ

అంగీ కరిస్తారు. విషయాలకు ఇంద్రియాలకు రూపస్కంధం అని పేరు. ఆలయవిజ్ఞాన-ప్రవృత్తి విజ్ఞానాల ప్రవాహానికి విజ్ఞానస్కంధం అని పేరు. నేను అనే విజ్ఞానం ఆలయవిజ్ఞానం. దాని ప్రవాహమే ఆత్మ. ఇది అనే విజ్ఞానం ప్రవృత్తివిజ్ఞానం. రూపస్కంధ-విజ్ఞానస్కంధాల సంబంధంచేత కలిగిన సుఖదుఃఖాద్యనుభవప్రవాహం వేదనాస్కంధం. 'గోవు'ఇత్యాది సంజ్ఞలతో కూడిన జ్ఞానప్రవాహం సంజ్ఞాస్కంధం. రాగద్వేషాదిక్లేశాలు మదమానాద్యుపక్లేశాలు ధర్మాధర్మాలు సంస్కారస్కంధం. పుట్టిన మరుక్షణంలోనే నశించే ఇవన్నీ పుట్టడం నశించడం అనే క్రియలతో నిత్యసంబద్ధములై ఉంటాయి గాన ఒక విధంగా ఇవన్నీ క్రియారూపములే. వాటి వలె ఆత్మ కూడ క్రియారూపమే అయిన పక్షంలో కూడ అది పూర్తిగా కర్మను త్యజించడం అసంభవం అని అర్థం.

అవ. రెండు పక్షాల ప్రకారమూ కూడ కర్మను త్యజించడం కుదరదు గాన వైశేషికుడు మూడవ పక్షాన్ని ప్రతిపాదిస్తున్నాడు-**అథేతి**:-ఇప్పుడు మూడవ పక్షం కూడ ఉంది. ఒక వస్తువు ఏదైన పని చేస్తూన్నప్పుడు సక్రియం అవుతుంది. ఏమీ చేయనప్పుడు అదే నిష్క్రియం అవుతుంది. ఇది ఈ విధంగా ఉండడంచేత కర్మను పూర్తిగా త్యజించడం శక్యం అవుతుంది. ఈ మూడవ పక్షంలోని విశేష మేమనగా వస్తువు(సాంఖ్యుల గుణాల వలె)నిత్యప్రచలితమూ కాదు(బౌద్ధుల క్షణికస్కంధాల విషయలోవలె)క్రియమే కారకమూ కాదు. మరి ఏమనగా ఒక ద్రవ్యం స్థిరంగా ఉండగా దానియందు అంతకు మునుపు లేని క్రియ పుడుతుంది, ఉన్న క్రియ నశిస్తుంది.

భాష్యమ్

శుద్ధం ద్రవ్యం శక్తిమత్ అవతిష్ఠతే ఇత్యేవమాహుః కాణాదాః. తదేవ చ కారకమ్ ఇతి, అస్మిన్ పక్షే కో దోషః ఇతి. అయమేవ తు దోషః యతః తు అభాగవతం మతమ్ ఇదమ్. కథం జ్ఞాయతే? యత ఆహ భగవాన్"నాసతో విద్యతే భావః" (2.16) ఇత్యాది. కాణాదానాం హి అసతో భావః సతః చ అభావః; ఇతి ఇదం మతమ్ అభాగవతమ్. అభాగవతత్వేఽపి న్యాయవత్ చేత్ కో దోషః ఇతి చేత్, ఉచ్యతే-దోషవత్తు ఇదం సర్వ ప్రమాణవిరోధాత్. కథమ్? యది తావత్ ద్వ్యణుకాది ద్రవ్యం ప్రాక్ ఉత్పత్తేః అత్యన్తమేవ అసత్ ఉత్పన్నం చ స్థితం కంచిత్ కాలం పునః అసత్త్వమేవ ఆపద్యతే తథా చ సతి అసదేవ సత్ సత్ జాయతే, సదేవ అసత్త్వమ్ ఆపద్యతే, అభావః భావః భవతి, భావశ్చ అభావః ఇతి; తత్ర అభావః జాయమానః ప్రాగుత్పత్తేః శశవిషాణకల్పః సమవాయ్యసమవాయినిమిత్తాఖ్యం కారణమపేక్ష్య జాయతే ఇతి. న చ ఏవమ్ అభావః ఉత్పద్యతే కారణం చ అపేక్షతే ఇతి శక్యం వక్తుమ్; అసతాం శశవిషాణాదీనామ్

అదర్శనాత్. భావాత్మకాశ్చేత్ ఘటాదయః ఉత్పద్యమానాః కిం చిత్ అభివ్యక్తికారణ మాత్రమ్ అపేక్ష్య ఉత్పద్యన్తే ఇతి శక్యం ప్రతిపత్తుమ్. కిం చ అసతః చ సద్భావే సతః చ అసద్భావే న క్వచిత్ ప్రమాణప్రమేయవ్యవహారే విశ్వాసః కస్య చిత్ స్యాత్. సత్ సదేవ అసత్ సదేవ ఇతి నిశ్చయానుపపత్తేః.

బాలానందిని

శుద్ధమితి:-(ఈ విధంగా)శుద్ధమైన (అనగా క్రియాశూన్య మైన)ద్రవ్యం శక్తి మత్తుగా (అప్పు డప్పుడు క్రియను చేసే శక్తి కలదై) ఉంటుంది;అదే కారకం (అనగా క్రియను చేయకలిగిన శక్తి కలిగిఉండడమే కర్తృత్వం అనగా,ఎల్లప్పుడూ క్రియ చేస్తూనే ఉండవలసిన పనిలేదు) అని కాణాదు లంటారు. ఈ(తృతీయ)పక్షంలో దోషం ఏ మున్నది?(సిద్ధాంతి)ఇది భగవంతునికి అంగీకారయోగ్యం కాని మత మనేదే దోషం.ఎలా తెలుస్తూన్నది?ఎందువల్ల ననగా-భగవంతుడు "నాసతో విద్యతే భావః"(అసత్తునుండి భావపదార్థం పుట్టదు)అని అంటున్నాడు.మరి కాణాదులకు (కాణాదమతంప్రకారం) అసత్తునుండి భావం పుడుతుంది, సత్ అభావరూపం అవుతుంది(లేకుండా పోతుంది)కదా?అందువల్ల ఈ మతం అభాగవతం.అభాగవతం అయితే మాత్రం యుక్తియుక్త మైతే దోషం ఏమిటి అని అంటే- చెప్పబడుచున్నది.ఇది సర్వప్రమాణాలకు విరుద్ధం గాన దోషయుక్త మైన మతం.ఎట్లు? ద్వ్యణుకం మొదలైన ద్రవ్యం అది పుట్టడానికి పూర్వం అత్యంతము అసత్తే అయి,పుట్టి కొంతకాలం ఉండి మళ్లీ పూర్తిగా అసత్తే అయిపోతుంది అన్నట్లయితే అప్పుడు అసత్తు సత్తు అవుతుంది, సత్తు అసత్త్వాన్ని పొందుతుంది అభావం భావం అవుతుంది భావం అభావం అవుతుంది (అని చెప్పిన ట్లవుతుంది). ఉత్పత్తికి పూర్వం చెవులపిల్లి కొమ్ము వంటి అభావం తాను పుట్టడానిని సమవాయి-అసమవాయి-నిమిత్తకారణాలను అపేక్షించి పుడుతుంది అని చెప్పవలసి ఉంటుంది.ఈ విధంగా అభావం పుడుతుం దని గాని, కారణాలను అపేక్షిస్తుం దని కాని చెప్పడానికి శక్యం కాదు.ఎందువల్ల ననగా అత్యంతా సత్తు లైన శశవిషణాదులలో ఇది(ఉత్పత్తి,కారణాపేక్ష)కనబడడం లేదు.(అందుచేత మృదా దులనుండి పుట్టుచున్న)ఘటాదులు భావాత్మకములు అని అన్నట్లయితే అది పుట్టే టప్పుడు తాము అభివ్యక్తం అవడానికి(పైకి కనబడడానికి)మాత్రమే కారణాన్ని అపేక్షిస్తాయి అని తెలుసుకొనడానికి శక్యం అవుతుంది.మరొక విషయ మేమనగా-అసత్తు సత్తు అయితే.సత్తు అసత్తైతే ప్రమాణప్రమేయవ్యవహారంలో దేనిలోనూ కూడ ఎవనికీ విశ్వాసం ఉండదు. ఎందువల్ల ననగా అప్పుడు సత్తు ఎన్నటికీ సత్తే, అసత్తు ఎన్నటికీ అసత్తే అను నిశ్చయం కుదరదు.

వి. మృత్తు(మట్టి)దారములు మొదలైన కారణాలనుండి ఘటం,వస్త్రం మొదలైన కార్యాలు పుడుతున్నాయి.మృత్తు మొదలైన కారణాలకు సమవాయికారణం అని పేరు. దానినే వేదాంతులు ఉపాదానకారణం అంటారు. ఈ కారణాలనుండి పుట్టే కార్యాలు అవి పుట్టకమునుపు కూడ ఉన్నాయా లేక అంతకు మునుపు లేనివే క్రొత్తగా పుడుతున్నాయా అనేది ప్రశ్న.అంతకు పూర్వం లేని కార్యాలు క్రొత్తగా పుడుతున్నాయి అని నైయాయికులు వైశేషికులు అంటారు.దీనికి అసత్కార్యవాదం అని పేరు.అది యుక్తం కాదు;పుట్టడానికి ముందు కూడ కార్యం తన ఉపాదాన(సమవాయి)కారణంలో లీనం అయి ఉంటుంది. పురుషప్రయత్నాదులచేత అదే పైకి కనబడుతుంది.దీనినే పుట్టడం అంటారు అని సాంఖ్యులు మొదలైనవాళ్లు అంటారు.దీనికి సత్కార్యవాదం అని పేరు.సమవాయికారణం, అసమవాయి కారణం,నిమిత్తకారణం అని కారణం మూడు విధాలు. ఉదాహరణకి- పటానికి తంతువులు సమవాయికారణం,తంతువుల సంయోగం(ఒకదానితో ఒకటి కలవడం) అసమవాయి కారణం.వస్త్రం నేసే తంతువాయుడు మగ్గం మొదలైనవి నిమిత్త కారణాలు. ఉత్పత్తికి పూర్వం కార్యం పూర్తిగా అసత్తు, చెవులపిల్లికొమ్ము వంటిది,అని చెప్పడం యుక్తం కాదు. అలాంటిదానికి సమవాయి-అసమవాయి-నిమిత్తకారణాలతో సంబంధం కుదరదు కదా? చెవులపిల్లి కొమ్ముకు వాటితో సంబంధం కలగడం గాని అది పుట్టడం గాని కనబడడం లేదు కదా?అసత్తైన కార్యమే పుడుతుందంటే ఇసుకలోనుంచి తైలం పుట్టాలి;అందుచేత తన కారణంలో ఉన్న కార్యమే అంతవరకూ పైకి కనబడకుండా ఉండి కులాలాదుల వ్యాపారంచేత పైకి కనబడుతుంది.పై కారణా లేవీ అసలే లేని వస్తువును పుట్టింపజాలవు. ఉన్నదానినే పైకి కనబడే టట్లు చేస్తాయి అని సత్కార్యవాదులు అంటారు.భగవంతుడు కూడ"**నాసతో విద్యతే భావః నాభావో విద్యతే సతః**"అని ఈ సత్కార్యవాదాన్నే ప్రతిపాదించాడు.ఒక కార్యం నశించిందంటే అది తన కార్యంలో లీనమై కనబడకుండా పోయింది అంతే.అసత్తు సత్తు అవుతుంది సత్తు అసత్తు అవుతుంది అని అంటే దేనినుండి దేనిని సంపాదించాలో తెలియక లోకులు గందరగోళం పరిస్థితిలో పడిపోతారు.అందుచేత కాణాదమతానుసారంగా ఏ క్రియా లేకుండా ద్రవ్యంలో అంతకు మునుపు అసలే లేని కార్యం పుడుతుంది అని చెప్పడం భాగవతమతవిరుద్ధ మని అర్థం.

భాష్యమ్

కిం చ ఉత్పద్యతే ఇతి ద్వ్యణుకాదేః ద్రవ్యస్య స్వకారణసత్తాసంబన్ధమ్ ఆహుః. ప్రాక్ ఉత్పత్తేశ్చ అసత్ పశ్చాత్ స్వకారణవ్యాపారమపేక్ష్య స్వకారణైః పరమాణుభిః సత్తయా చ సమవాయలక్షణేన సంబన్ధేన సంబధ్యతే.సంబద్ధం సత్ కారణసమవేతం సద్భవతి.తత్ర వక్తవ్యమ్-కథమ్ అసతః సత్ కారణం భవేత్,సంబన్ధో

వా కేన చిత్. న హి వన్ధ్యాపుత్రస్య సతా సంబన్ధః వా కారణం వా కేన చిత్ ప్రమాణతః కల్పయితుం శక్యమ్. నను నైవ వైశేషికైః అభావస్య సంబన్ధః కల్ప్యతే. ద్వ్యణుకాదీనాం హి ద్రవ్యాణాం స్వకారణేన సమవాయలక్షణః సంబన్ధః సతామ్ ఏవ ఉచ్యతే. న; సంబన్ధాత్ ప్రాక్ సత్త్వానభ్యుపగమాత్. న హి వైశేషికైః కులాలదణ్డిచక్రాదివ్యాపారాత్ ప్రాక్ ఘటాదీనామ్ అస్తిత్వమ్ ఇష్యతే. న చ మృదః ఏవ ఘటాద్యాకార ప్రాప్తిమ్ ఇచ్ఛన్తి. తతః చ అసతః ఏవ సంబన్ధః పారిశేష్యాత్ ఇష్టః భవతి.

బాలానందిని

కిం చేతి:-మరొక విషయ మేమనగా-(అసత్కార్యవాదులు పరమాణ్వాదులనుండి ద్వ్యణుకాదికం)'పుట్టుచున్నది'అని అంటూ ద్వ్యణుకం మొదలైన ద్రవ్యానికి తమ కారణము తోను సత్తతోను సంబంధాన్ని చెపుతున్నారు.(పై వాక్యం భావమే విశదీకరిస్తున్నారు). పుట్టడానికి ముందు అసత్తుగా ఉన్నది (ద్వ్యణుకరూప మైన కార్యం)తన కారణముల యొక్క వ్యాపారాన్ని అపేక్షించి(వ్యాపారాన్ని పట్టి)తన కారణ మైన పరమాణువులతోను, సత్తతోను(ఉనికి తోను)సమవాయ మనే సంబంధంచేత సంబంధిస్తుంది. ఈ విధంగా సంబంధించినదై కారణముతో సమవేతమై(సమవాయసంబంధంచేత సంబంధించినదై) సత్ అవుతుంది(అని అసత్కార్యవాదు లంటారు). ఈ విషయంలో-అసత్తుకు సత్ కారణం ఎలా అవుతుందో,అసత్తుకు దేనితో నైనా సంబంధం ఎలా కలుగుతుందో చెప్పవలసి ఉంది.వంధ్యాపుత్రునికి (గొడ్రాలి పుత్రునికి) సత్తుతో సంబంధం గాని, కారణం గాని ప్రమాణ పూర్వకంగా ఎవనిచేతా కల్పించడానికి శక్యం కాదు కదా?(ఆశంక) వైశేషికులు అభావానికి సంబంధం కల్పించడం లేదు?సత్ లైన ద్వ్యణుకాదులకే తమ కారణంతో సమవాయ రూపమైన సంబంధం ఉంటుం దని మాత్రమే కదా వాళ్లు అంటారు? (సమాధానం) అలా కాదు; సంబంధానికి ముందు(కార్యాలకు కారణంతో సంబంధం కలగడానికి ముందు)అసత్త్వం(కార్యం అసత్ అని)అంగీకరిస్తున్నారు కదా?కుమ్మరి,దండము, చక్రము మొదలైనవాటి వ్యాపారానికి ముందు ఘటాదులు ఉన్నా యని వైశేషికులు అంగీకరించరు కదా?మట్టియే ఘటాద్యాకారాన్ని పొందుతుంది అని అంగీకరించరు కదా? అందుచేత, పరిశేషన్యాయంచేత,అసత్తుకే (అసత్తైన కార్యానికే)సత్తుతో(సత్తైన కారణంతో) సంబంధం అంగీకరించిన ట్లవుతుంది.

భాష్యమ్

నను అసతోఽపి సమవాయలక్షణః సంబన్ధః న విరుద్ధః? న;వన్ధ్యాపుత్రాదీనామ్ అదర్శనాత్.ఘటాదేరేవ ప్రాగభావస్య స్వకారణసంబన్ధః భవతి న వన్ధ్యాపుత్రాదేః,

అభావస్య తుల్యత్వేఽపి ఇతి విశేషః అభావస్య వక్తవ్యః. ఏకస్య అభావః,ద్వయోః అభావః, సర్వస్య అభావః ప్రాగభావః,ప్రధ్వంసాభావః,ఇతరేతరాభావః,అత్యన్తాభావః, ఇతి లక్షణతః న కేన చిత్ విశేషః దర్శయితుం శక్యః. అసతి చ విశేషే ఘటస్య ప్రాగభావః ఏవ కులాలాదిభిః ఘటభావమ్ ఆప(పా)ద్యతే,సంబధ్యతే చ భావేన కపాలాఖ్యేన స్వకారణేన, సర్వవ్యవహారయోగ్యః చ భవతి;న తు ఘటస్యైవ ప్రధ్వంసాభావః అభావత్వే సత్యపి ఇతి;ప్రధ్వంసాద్యభావానాం న క్వచిత్ వ్యవహారయోగ్యత్వం ప్రాగభావస్యైవ ద్వ్యణుకాదిద్రవ్యాఖ్యస్య ఉత్పత్త్యాదివ్యవహారార్హత్వమ్. ఇతి-ఏతత్ అసమఞ్జసమ్ అభావత్వావిశేషాత్ అత్యన్తప్రధ్వంసాభావయోః ఇవ.

బాలానందిని

నన్వితి:-(పూర్వపక్షి)అసత్తుకు కూడ సమవాయరూప మైన సంబంధం(తన కారణంతో)విరుద్ధం కాదు కదా?(అసత్తుకు సత్తుతో సంయోగరూప మైన సంబంధం ఉండదు గాని సమవాయసంబంధం ఉండవచ్చును అని పూర్వపక్షి అభిప్రాయం).(సిద్ధాంతి) అది యుక్తం కాదు.వంధ్యాపుత్రాదుల విషయంలో ఇది కనబడడంలేదు కదా?ఘటాదుల ప్రాగభావము అభావమే;వంధ్యాపుత్రాదుల అభావమూ అభావమే. ఈ విధంగా ఈ రెండింటికీ అభావత్వం సమానమే అయినా కూడ ఘటాదిప్రాగభావానికే స్వకారణంతో సమవాయ సంబంధం ఉంటుంది. వంధ్యాపుత్రాభావాదులకు ఉండదు అని చెప్పడానికి తగిన కారణం చెప్పవలసి ఉంటుంది, ఒకదానియొక్క అభావం,రెండింటి అభావం, అన్నింటి అభావం, ప్రాగభావం,ప్రధ్వంసాభావం,ఇతరేతరాభావం,అత్యంతాభావం అంటూ ఎవడూ కూడ ఈ అభావాల మధ్య భేదాన్ని లక్షణపూర్వకంగా చెప్పలేదు.

వి.ఒక కార్యం పుట్టడానికి ముందు అది లేదు;ఆ అభావం ప్రాగభావం ప్రాగభావానికి ఆది లేదు. కార్యం పుట్టగానే అది నశిస్తుంది. ఒక వస్తువు నశించగా దాని అభావం ఏర్పడుతుంది. అది ప్రధ్వంసాభావం. ఘటం పటం కాదు,పటం ఘటం కాదు అని చెప్పే అభావం ఇతరేతరాభావం. శశవిషణాదులు అసలే ఉండవు. ఈ అభావం అత్యంతాభావం అని వైశేషికాదులు అంటారు. అభావా లన్నీ ఒకటేఅయినప్పుడు ఇలాంటి విశేషాలు చెప్పడం కేవలం వాఙ్మాత్రమేకాని వాస్తవంలో ఈ అభావా లన్నీ ఒక్కటే అని భావం.

అసతీతి:-ఈ విధంగా అభావాలలో విశేషం ఏదీ లేనప్పుడు ఘటప్రాగభావమే కులాలాదులచేత(కులాలాదిప్రయత్నంచేత)ఘటత్వాన్ని పొందుతుంది(ఘటంగా అవుతుంది) కపాలా లనే తన కారణంతో సంబంధిస్తుంది,సమస్తవ్యవహారాలకు(పనులకు- జలాహరణా

దులకు)యోగ్యం అవుతుంది;అంతేనే కాని,అభావమే అయినా ఘటప్రధ్వంసాభావం ఇలాంటి సంబంధ-వ్యవహారాదులను పొందదు,ప్రధ్వంసాభావాదులు ఎక్కడా వ్యవహారయోగ్యాలుగా ఉండవు,ద్వ్యణుకాదిద్రవ్యరూప మైన ప్రాగభావం మాత్రమేత ఉత్పత్త్యాదివ్యవహారాలకు తగి ఉంటుంది అనడం అసమంజసం,అత్యంతాభావ- ప్రధ్వంసాభావాలు ఏ విధంగా అభావాలో అదే విధంగా ఇది(ప్రాగభావం)కూడ అభావమే కదా?

భాష్యమ్

నను నైవ అస్మాభిః ప్రాగభావస్య భావాపత్తిః ఉచ్యతే?భావస్యైవ హి తర్హి భావాపత్తిః యథా ఘటస్య ఘటాపత్తిః పటస్య వా పటాపత్తిః?ఏతదపి అభావస్య భావాపత్తివదేవ ప్రమాణవిరుద్ధమ్.సాంఖ్యస్యాపి యః పరిణామపక్షః సః అపి అపూర్వధర్మోత్పత్తివినాశాఙ్గీకరణాత్ వైశిషికపక్షాత్ న విశిష్యతే.అభివ్యక్తితిరోభావాఙ్గీకరణేఽపి అభివ్యక్తితిరోభావయోః విద్యమానత్వావిద్యమానత్వనిరూపణే పూర్వవదేవ ప్రమాణవిరోధః. ఏతేన కారణస్యైవ సంస్థానమ్ ఉత్పత్త్యాది ఇత్యేతదపి ప్రత్యుక్తమ్.

బాలానందిని

నన్వితి:-(పూ.ప).ప్రాగభావం భావం అవుతుం దని మేం చెప్పడం లేదు కదా?(సి). అయితే భావమే భావం అవుతుం దని చెపుతున్నా రన్నమాట-ఘటం ఘటం అవుతూన్నది,పటం పటం అవుతూన్నది అని చెప్పినట్లు?అభావం భావం అవుతుం దనిచెప్పడం విరుద్ధం అయినట్లే ఇది కూడ విరుద్ధమే.

అవ. ఈ విధంగా వైశేషికుల అసత్కార్యవాదం అయుక్తం అని చెప్పి సాంఖ్యులు చెప్పే సత్కార్యవాదం కూడ చివరికి అసత్కార్యవాదం వంటిదే అని చెపుతున్నారు-**సాంఖ్యస్యాపీతి:**-సాంఖ్యుడు చెప్పే పరిణామపక్షం కూడ (మట్టి కుండగా మారుతుంది,బంగారం కుండలంగా మారుతుంది అని చేప్పే వాదం పరిణామవాదం)అపూర్వ మైన(పూర్వం లేని)ధర్మం. పుడుతున్నట్లు నశిస్తూన్నట్లు అంగీకరించడంవల్ల వైశేషికపక్షంకంటె భిన్నం కాదు.(పూర్వం లేని క్రొత్త పరిణామం పుడుతూన్నది;అంతవరకూ ఉన్న పూర్వపరిణామం నశిస్తూన్నది అని చెప్పడంచేత అసత్తు అసత్తే,సత్తు సత్తే అను వ్యవస్థకు వాళ్ల మతంలో కూడ భంగం కలుగుతూన్నది గాన అది కూడ వైశేషికమతంవంటిదే అని అభిప్రాయం.

అవ. కార్యం,పూర్వం కూడ కారణరూపంలో సత్తే.అయితే అప్పు డది అవ్యక్తంగా ఉంటుంది.కారకాల వ్యాపారంచేత వ్యక్తం అవుతుంది.వ్యక్తం అయినప్పుడు పుట్టింది అంటున్నాం,వ్యక్తం కాకుండా లీనమైపోయి నప్పుడు నశించినది అంటున్నాం;అంతే- అని ఆశంకించి సమాధానం చెపుతున్నారు-**అభివ్యక్తీతి:**-అభివ్యక్తి-తిరోభావాలను అంగీ

కరించినా కూడ అభివ్యక్తితిరోభావాలు కారకవ్యాపారానికి ముందు ఉన్నాయా లేదా అని ప్రశ్నకు సమాధానం చెప్పడం కుదరదు గాన వెనుకటి వలె ప్రమాణవిరోధం ఉంటుంది.

వి.కారకవ్యాపారానికి పూర్వం అనభివ్యక్తి వలె అభివ్యక్తి కూడ ఉందా లేదా!ఉంటే కారకవ్యాపారం వ్యర్థం.అప్పుడు వాటికి సంబంధించిన ప్రమాణాలకు విరోధం.అది లేకపోతే లేనిదానిని పుట్టించడం కుదరదు.ఇట్లే కారకవ్యాపారానికి పూర్వం వ్యక్తత్వం వలె అవ్యక్తత్వం కూడ ఉన్నదా లేదా?రెండు పక్షాలలోను కూడ అదే దోషం అని భావం.

ఏతేనేతి:-దీనిచేత-కారణం ఆ యా ఆకారాలలో ఉండడమే ఉత్పత్త్యాదికం అనగా అను వాదం కూడ నిరాకృతమైనట్లే.

వి.కారణమే కార్యరూపాన్ని ధరిస్తే ఉత్పత్తి అంటున్నాం,ఆ రూపాన్ని విడచి స్వరూపం స్వీకరిస్తే నాశం అంటున్నాం అని కొందరు అంటారు.అది కూడ అయుక్తమే. పూర్వరూపం ఉన్నా,నష్టమైనా కూడ ఒకటి మరొకదాని రూపాన్ని పొందడం లేదా విడవడం అనుపపన్నం కదా అని భావం.

భాష్యమ్

పారిశేష్యాత్ సత్ ఏకమేవ వస్తు అవిద్యయా ఉత్పత్తివినాశాదిభిః ధర్మైః నటవత్ అనేకధా వికల్ప్యతే ఇతి ఇదం భాగవతం మతమ్ ఉక్తమ్ **"నాసతో విద్యతే భావః"** (2.16)ఇత్యస్మిన్ శ్లోకే;సత్ప్రత్యయస్య వ్యభిచారాత్ అవ్యభిచారాచ్చ ఇతరేషామ్ ఇతి. కథం తర్హి ఆత్మనః అవిక్రియత్వే అశేషతః కర్మణః త్యాగః న ఉపపద్యతే ఇతి?యది వస్తుభూతాః గుణాః యది వా అవిద్యాకల్పితాః తద్ధర్మః కర్మ,తదా ఆత్మని అవిద్యాధ్యారోపితమేవ ఇతి అవిద్వాన్ **"న హి కశ్చిత్ క్షణమపి అశేషతః త్యక్తుం శక్నోతి"**(3.5) ఇతి ఉక్తమ్.విద్వాన్ తు పునః విద్యయా అవిద్యాయాం నివృత్తాయాం శక్నోతి ఏవ అశేషతః కర్మ పరిత్యక్తుమ్,అవిద్యాధ్యారోపితస్య శేషానుపపత్తేః.న హి తైమిరికదృష్ట్యా అధ్యారోపితస్య ద్విచన్ద్రాదేః తిమిరాపనయేఽపి శేషః అవతిష్ఠతే.ఏవం చ సతి ఇదమ్ ఉపపన్నం-**"సర్వకర్మాణి మనసా"**(5.13)ఇత్యాది,**"స్వే స్వే కర్మణ్యభిరతః సంసిద్ధిం లభతే నరః"**(18.45),**"స్వకర్మణా తమభ్యర్చ్య సిద్ధిం విన్దతి మానవః"**(18.46)ఇతి చ. 48

బాలానందిని

పారిశేష్యాదితి:-పరిశేషన్యాయంచేత-ఒకే వస్తువు అవిద్యచేత ఉత్పత్తివినాశాది ధర్మాలతో,నటుడు వలె,అనేకవిధాలుగా కల్పించబడుచున్నది అనే భగవంతుడుని మతం

"నాసతో విద్యతే భావః"ఇత్యాదిశ్లోకంలో చెప్పబడింది;ఎందువల్ల ననగా సత్ ప్రత్యయం వ్యభిచరించడంలేదు;ఇతరప్రత్యయా లన్నీ వ్యభిచరిస్తున్నాయి. ("ఘటః సన్","కపాలః సన్","మృత్ సతీ"ఇత్యాదివిధంగా ఘటకపాలాదిజ్ఞానం మారుతున్నా కూడ సత్ అనే జ్ఞానం మాత్రం అన్నింటిలోను అనుస్యూతంగా వస్తూన్నది.అందుచేత మృత్-కపాల-ఘటాదులరూపంలో ప్రకాశిస్తూన్నది సత్పదార్థమే అని భావం).(ఆశంక)ఆత్మ వికారరహిత మైన పక్షంలో కర్మలను పూర్తిగా విడవవచ్చును గాన త్యజించడం కుదరదు అని "సహజం కర్మ సదోషమపి న త్యజేత్"ఇత్యాదులచేత ఎందుకు చెప్పబడింది?(సమాధానం) గుణాలు సత్యములే అన్నా,లేదా అవిద్యాకల్పితములు అని అన్నా కూడ వాటి ధర్మ మైన కర్మ ఆత్మయందు అవిద్యచేత ఆరోపించబడినది గాన అవిద్వాంసుడు "క్షణకాలం కూడ ఎవ్వడూ కర్మను విడువజాలడు"అని చెప్పబడింది.(గుణాలు సత్యములైనా అవిద్యాకల్పితా లైనా కూడ కర్మమాత్రం ఆ గుణాలకే సంబంధించినది కాని ఆత్మకు సంబంధించినది కాదు.అజ్ఞాని మాత్రం ఆ కర్మను తనపై అధ్యసించుకొంటున్నాడు.అలా అధ్యసించుకొంటూ న్నంతకాలము వాడు క్షణకాలం కూడ కర్మ చేయకుండా ఉండజాలడు అని మాత్రమే పై వాక్యానికి అర్థం అని భావం).అయితే-విద్వాంసు డైతే, అవిద్యచేత అవిద్య నివర్తించగానే కర్మను పూర్తిగా విడవగలుగుతాడు.అవిద్యచేత ఆరోపించబడినది మిగలడం అనేది కుదరదు కదా?తిమిరదోషం ఉన్న దృష్టిచేత ఆరోపించబడిన ద్విచంద్రాదిజ్ఞానం ఆ తిమిరదోషం పోయిన తరు వాత కూడ మిగిలి ఉండదు కదా?ఇది ఇలా ఉన్నది గాన "సర్వకర్మాణి మనసా"అని విద్వాంసుడు సర్వకర్మలను త్యజిస్తా డని చెప్పడమూ,"స్వేస్వే... నరః" అనీ"స్వకర్మణా...మానవః"అనీ అవిద్వాంసుడు మాత్రం కర్మలు విడవడం కుదరదు అని చెప్పడము ఈ రెండూ కూడ కుదురుతాయి. 48

భాష్యమ్

యా చ కర్మజా సిద్ధిః ఉక్తా జ్ఞాననిష్ఠాయోగ్యతాలక్షణా తస్యాః ఫలభూతా నైష్కర్మ్యసిద్ధిః జ్ఞాననిష్ఠాలక్షణా వక్తవ్యా ఇతి శ్లోకః ఆరభ్యతే-

మూ. అసక్తబుద్ధిః సర్వత్ర జితాత్మా విగతస్పృహః,
నైష్కర్మ్యసిద్ధిం పరమాం సంన్యాసేనాధిగచ్ఛతి. 49

బాలానందిని

యేతి:-కర్మవల్ల కలిగే జ్ఞాననిష్ఠాయోగ్యత్వరూప మైన ఏ సిద్ధి చెప్పబడినదో (కర్మలను ఆచరించడంవల్ల జ్ఞాననిష్ఠ సంపాదించడానికి యోగ్యత లభిస్తుంది;అది కర్మలవల్ల కలిగే సిద్ధి.అట్టి ఏ సిద్ధి చెప్పబడినదో)దానికి (కర్మజసిద్ధికి) ఫల మైన జ్ఞాననిష్ఠారూప మైన

నైష్కర్మ్యసిద్ధి(జ్ఞాననిష్ఠయే నైష్కర్మ్యసిద్ధి)చెప్పవలసి ఉన్నది గాన శ్లోకం ప్రారంభించ బడుచున్నది-

ప్ర.అ.అసక్తేతి:-సర్వత్ర=అంతటా(దేనియందూ కూడ),అసక్తబుద్ధిః=సక్తము కాని బుద్ధి కలవాడు,జితాత్మా=జయించబడిన మనస్సు కలవాడు,విగతస్పృహః=తొలగిన ఆశలు కలవాడు అయిన జ్ఞాని,సంన్యాసేన=సంన్యాసంచేత,పరమామ్=గొప్పదైన,నైష్కర్మ్య సిద్ధిమ్=నైష్కర్మ్యసిద్ధిని,అధిగచ్ఛతి=పొందుతాడు.

భాష్యమ్

అసక్తబుద్ధిః-అసక్తా సంగరహితా బుద్ధిః అన్తఃకరణం యస్య సః అసక్త బుద్ధిః, సర్వత్ర పుత్రదారాదిషు ఆసక్తినిమిత్తేషు;జితాత్మా-జితః వశీకృతః ఆత్మా అన్తః కరణం యస్య సః జితాత్మా;విగతస్పృహః-విగతా స్పృహా తృష్ణా దేహజీవితభోగేషు యస్మాత్ సః విగతస్పృహః.యః ఏవం భూతః ఆత్మజ్ఞః సః నైష్కర్మ్యసిద్ధిమ్-నిర్గతాని కర్మాణి యస్మాత్ నిష్క్రియబ్రహ్మాత్మసంబోధాత్ సః నిష్కర్మా.తస్య భావః నైష్కర్మ్యమ్. నైష్కర్మ్యం చ తత్ సిద్ధిః చ సా నైష్కర్మ్యసిద్ధిః.నైష్కర్మ్యస్య వా సిద్ధిః నిష్క్రియాత్మస్వరూ పావస్థానలక్షణస్య సిద్ధిః నిష్పత్తిః,తాం నైష్కర్మ్యసిద్ధిం,పరమాం ప్రకృష్టాం కర్మజసిద్ధి విలక్షణాం సద్యోముక్త్యవస్థానరూపాం,సంన్యాసేన సమ్యగ్దర్శనేన,తత్పూర్వకేణ వా సర్వకర్మసంన్యా సేన,అధిగచ్ఛతి ప్రాప్నోతి. తథా చ ఉక్తమ్-"సర్వకర్మాణి మనసా సంన్యస్య నైవ కుర్వన్న కారయన్ ఆస్తే"(5.13)ఇతి. 49

బాలానందిని

అసక్తేతి:-అసక్త మైన,సంగరహిత మైన,బుద్ధి,అంతఃకరణం ఎవనికో అతడు అసక్తబుద్ధి.అంతటా,అనగా ఆసక్తినిమిత్తము లైన పుత్రదారాదులందు ఎవడు తనను, అంతః కరణాన్ని జయించాడో,వశం చేసికొన్నాడో,అతడు జితాత్మ.దేహమునందు జీవితమునందు భోగాలయందు ఆశ ఎవనినుండి తొలగిపోయినదో అతడు విగత స్పృహుడు.ఈ విధంగా అయిన ఏ ఆత్మజ్ఞు డున్నాడో అతడు నైష్కర్మ్యసిద్ధిని-నిష్క్రియమైన బ్రహ్మయే నా ఆత్మ అనుజ్ఞానం గల ఎవనినుండి కర్మలు పైకి లేచి పోయినవో అతడు నిష్కర్ముడు.నిష్కర్ముని ధర్మం నైష్కర్మ్యం(నిష్కర్ముడుగా ఉండుట).నైష్కర్మ్యమే సిద్ధి.లేదా నైష్కర్మ్యముయొక్క నిష్క్రియమైన ఆత్మయొక్క స్వరూపంలో(ఆత్మగా)ఉండడం అనే నైష్కర్మ్యము యొక్క సిద్ధి నైష్కర్మ్యసిద్ధి. (వెనుకటిది కర్మధారయసమాసం;ఇది షష్ఠీతత్పురుష). సిద్ధి అనగా కలుగుట.అట్టి పరమ మైన,ఉత్కృష్ట మైన,కర్మవల్ల కలిగిన సిద్ధికంటె విలక్షణమైన వెంటనే ముక్తుడుగా ఉండడం అనే స్వరూపం గల నైష్కర్మ్యసిద్ధిని సంన్యాసంచేత,అనగా సమగ్దర్శనంచేత లేదా

సమ్యగ్దర్శనపూర్వక మైన (సమ్యగ్దర్శనం పొందిన తరువాత చేసిన) సర్వకర్మసంన్యాసంచేత పొందుతాడు. ఈ విషయమే "సర్వకర్మాణి... ఆస్తే" అని(వెనుక)చెప్పబడినది. 49

భాష్యమ్

పూర్వోక్తేన స్వకర్మానుష్ఠానేన ఈశ్వరాభ్యర్చనరూపేణ జనితాం ప్రాగుక్తలక్షణాం సిద్ధిం ప్రాప్తస్య ఉత్పన్నాత్మవివేకజ్ఞానస్య కేవలాత్మజ్ఞాననిష్ఠారూపా నైష్కర్మ్యలక్షణా సిద్ధిః యేన క్రమేణ భవతి తత్ వక్తవ్యమ్ ఇతి ఆహ-

మూ. సిద్ధిం ప్రాప్తో యథా బ్రహ్మ తథాఽఽప్నోతి నిబోధ మే,
సమాసేనైవ కౌన్తేయ నిష్ఠా జ్ఞానస్య యా పరా. 50

బాలానందిని

పూర్వేతి:-వెనుక చెప్పబడిన ఈ శ్వరార్చనరూప మైన స్వకర్మానుష్ఠానంచేత (అనగా స్వకర్మానుష్ఠానమే ఈశ్వరాభ్యర్చన;దానిచేత లేదా ఈశ్వరార్పణబుద్ధితో చేయడం చేత ఈశ్వరారాధనరూప మైన స్వకర్మానుష్ఠానంచేత)పుట్టింపబడిన,వెనుక చెప్పబడిన స్వరూపం గల సిద్ధిని(అనగా జ్ఞాననిష్ఠకు యోగ్యుడగుట అనే సిద్ధిని)పొంది ఆత్మవివేకజ్ఞానం కలిగినవానికి కేవల మైన ఆత్మయొక్క జ్ఞానమునందే స్థిరంగా ఉండడం అనే స్వరూపం గల నైష్కర్మ్యలక్షణ మైన(నైష్కర్మ్యం అనే)సిద్ధి ఏ క్రమంచేత కలుగుతుందో చెప్పవలసి ఉన్నది గాన చెపుతున్నాడు-

ప్ర. అ. **సిద్ధిమితి:**-కౌన్తేయ=అర్జునా!సిద్ధిమ్=సిద్ధిని,జ్ఞాననిష్ఠాయోగ్యతను,ప్రాప్తః =పొందినవాడు,బ్రహ్మ=బ్రహ్మను,యథా=ఎట్లు,ఆప్నోతి=పొందుతాడో,తథా=అట్లు(ఆ విషయమును),జ్ఞానస్య=జ్ఞానముయొక్కపరా=గొప్పదైన,యా=ఏ,పరా కాష్ఠా=గొప్పకాష్ఠ ఉన్నదో దానినీ,మే=నా మాటలనుండి, సమాసేన=సంగ్రహంగానే,నిబోధ = తెలుసుకొనుము.

భాష్యమ్

సిద్ధిం ప్రాప్తః స్వకర్మణా ఈశ్వరం సమభ్యర్చ్య తత్ప్రసాదజాం కాయేన్ద్రియాణాం జ్ఞాననిష్ఠాయోగ్యతాలక్షణాం సిద్ధిం ప్రాప్తః,సిద్ధిం ప్రాప్తః ఇతి తదనువాదః ఉత్తరార్థః. కిం తదుత్తరం యదర్థః అనువాదః ఇతి? ఉచ్యతే-యథా యేన ప్రకారేణ,జ్ఞాననిష్ఠారూపేణ బ్రహ్మ పరమాత్మానమ్ ఆప్నోతి తథా తం ప్రకారం జ్ఞాననిష్ఠాప్రాప్తిక్రమం,మే మమ,వచనాత్ నిబోధ త్వం నిశ్చయేన అవధారయ ఇత్యేతత్. కిం విస్తరేణ? నేత్యాహ- సమాసేనైవ సంక్షేపేణైవ హే కౌన్తేయ. "యథా బ్రహ్మ ప్రాప్నోతి తథా నిబోధ" ఇత్యనేన యా ప్రతిజ్ఞాతా బ్రహ్మప్రాప్తిః తామ్ ఇదంతయా దర్శయితుమ్ ఆహ-"నిష్ఠా జ్ఞానస్య

యా పరా"ఇతి. నిష్ఠా పర్యవసానం,పరిసమాప్తిః ఇత్యేతత్. కస్య?బ్రహ్మజ్ఞానస్య. యా పరా పరిసమాప్తిః ఇత్యేతత్. కస్య?బ్రహ్మజ్ఞానస్య. యా పరా పరిసమాప్తిః. కీదృశీ సా?యాదృశమ్ ఆత్మజ్ఞానమ్. కీదృక్ తత్?యాదృశః ఆత్మా. కీదృశః అసౌ?యాదృశః భగవతా ఉక్తః ఉపనిషద్వాక్యైః చ,న్యాయతః చ.

బాలానందిని

సిద్ధిమితి:-సిద్ధిని పొందినవాడు;తన కర్మచేత ఈశ్వరుణ్ణి ఆరాధించి ఆ ఈశ్వరుని అనుగ్రహంవల్ల కలిగిన,దేహేంద్రియాలు జ్ఞాననిష్ఠకు యోగ్యములుగా ఉండడ మనే లక్షణం(స్వరూపం)గల సిద్ధిని పొందినవాడు."సిద్ధిని పొందినవాడు"అని అంటూ దానిని (సిద్ధిప్రాప్తిని లేదా ప్రాప్తుని) అనువదించడం(మళ్లీ పేర్కొనడం)ఉత్తరముకొరకు(తరువాత దానిని గూర్చిన మరొక విషయం చెప్పడంకొరకు).దేనిని గూర్చి అనువాదం చేయబడు చున్నదో ఆ ఉత్తరం ఏది?చెప్పబడుచున్నది(ఆ ఉత్తర మేదో చెపుతున్నాం;విను).జ్ఞాన నిష్ఠారూప మైన ఏ ప్రకారంచేత బ్రహ్మను,పరమాత్మను పొందుతాడో ఆ ప్రకారమును, జ్ఞాననిష్ఠాప్రాప్తిక్రమాన్ని నా మాటవల్ల తెలుసుకొనుము.నిశ్చితంగా నిర్ధారణ చేయుము అని అర్థం.

వి."జ్ఞాననిష్ఠాయోగ్యతారూప మైన సిద్ధిని పొందినవాడు ఏ విధంగా బ్రహ్మను పొందుతాడో"అనడంవల్ల జ్ఞాననిష్ఠాయోగ్యతను పొందితే చాలు,అతడు బ్రహ్మను పొందుతాడు అని అనుకొనవచ్చును.అది యుక్తం కాదు.జ్ఞాననిష్ఠయోగ్యతను పొందిన తరువాత జ్ఞాననిష్ఠను పొందాలి;తరువాతనే బ్రహ్మప్రాప్తి.అందుచేత జ్ఞాననిష్ఠాయోగ్యతను పొందినవాడు,ఏ విధంగా జ్ఞాననిష్ఠను పొంది తరువాత బ్రహ్మను పొందుతాడో ఆ విషయం తెలుసుకో అని ఈ వాక్యానికి భావం అని చెప్పడానికి ఈ విధంగా వివరణం చేయబడింది.

కిమితి:-అయితే సవిస్తరంగానా?కాదంటున్నాడు,సంక్షేపంచేతనే(సంక్షిప్తంగానే) ఓ!అర్జునా!."ఏ విధంగా బ్రహ్మను పొందుతాడో ఆ విధాన్ని తెలుసుకొనుము"అని అంటూ ఏ బ్రహ్మప్రాప్తి ప్రతిజ్ఞ చేయబడినదో అది ఇది అని చూపడానికై-"నిష్ఠా జ్ఞానస్య యా పరా"అని చెపుతున్నాడు.నిష్ఠ అనగా పర్యవసానం;పరిసమాప్తి అని అర్థం.దేనియొక్క? బ్రహ్మజ్ఞానముయొక్క. బ్రహ్మజ్ఞానముయొక్క ఏ పరిసమాప్తి ఉన్నదో అది అది ఎట్టిది?ఆత్మ జ్ఞానం ఎట్టిదో(అట్టిది). అది(ఆత్మజ్ఞానం) ఎట్టిది?ఆత్మ ఎట్టిదో అట్టిది. అది(ఆత్మ)ఎట్టిది? భగవంతునిచేత,ఉపనిషద్వాక్యాలచేత ఏ విధ మైన ఆత్మ చెప్పబడిందో,యుక్తిచేత కూడ ఏ విధ మైనది సిద్ధిస్తుందోఅట్టిది.

భాష్యమ్

నను విషయాకారం జ్ఞానమ్;న విషయః నాపి ఆకారవాన్ ఆత్మా ఇష్యతే క్వచిత్?నను"ఆదిత్యవర్ణమ్";(శ్వే.ఉ.3.8.)"భారూపః"(ఛా.ఉ.3.14.2),"స్వయం జ్యోతిః"(బృ.ఉ.4.3.9)ఇతి ఆకారవత్త్వమ్ ఆత్మనః శ్రూయతే?న;తమోరూపత్వ ప్రతిషేధార్థత్వాత్ తేషాం వాక్యానామ్.ద్రవ్యగుణాద్యాకారప్రతిషేధే ఆత్మనః తమోరూపత్వే ప్రాప్తే తత్ప్రతిషేధార్థాని ఆదిత్యవర్ణమ్ ఇత్యాది వాక్యాని;'అరూపమ్'(క.ఉ.3.15)ఇతి చ విశేషతః రూపప్రతిషేధాత్.అవిషయత్వాచ్చ-"న సందృశే తిష్ఠతి రూపమస్య న చక్షుషా పశ్యతి కశ్చనైనమ్"(శ్వే.ఉ.4.20)"అశబ్దమస్పర్శమ్"(క.ఉ.3.15) ఇత్యాదేః.తస్మాత్ ఆత్మాకారం జ్ఞానమ్ ఇత్యనుపపన్నమ్.కథం తర్హి ఆత్మనః జ్ఞానమ్?సర్వం హి యద్విషయం యత్ జ్ఞానం తత్ తదాకారం భవతి;నిరాకారః చ ఆత్మా ఇత్యుక్తమ్? జ్ఞానాత్మనోశ్చ ఉభయోః నిరాకారత్వే కథం తద్భావనానిష్ఠా ఇతి?న;అత్యన్తనిర్మలత్వ స్వచ్ఛత్వసూక్ష్మత్వోపపత్తేః ఆత్మనః,బుద్ధేశ్చ ఆత్మసమనైర్మల్యా ద్యుపపత్తేః ఆత్మచైతన్యా కారాభాసత్వోపపత్తిః.బుద్ధ్యాభాసం మనః, తదాభాసాని ఇన్ద్రియాణి,ఇన్ద్రియాభాసశ్చ దేహః,అతః లౌకికైః దేహమాత్రే ఏవ ఆత్మదృష్టిః క్రియతే.

బాలానందిని

నన్వితి : (ఆశంక) జ్ఞానం విషయాకారంగా ఉంటుంది కదా? ఆత్మ విషయం అని కాని, ఆకారం కలది అని కాని ఎక్కడా కూడ అంగీకరించబడడం లేదు కదా?

వి. ఘటాన్ని చూచి నప్పుడు "ఇది ఘటం" అను జ్ఞానం కలుగుతుంది. ఘటానికి ఆకారం ఉంటుంది గాన అది జ్ఞానంలో విషయం అవుతుంది. జ్ఞానానికి గోచరం అవుతుంది. ఈ విధంగా "ఇది ఘటము" అనే జ్ఞానం ఘట మనే విషయం కలది. "ఇది పటం" అనే జ్ఞానం పటం అనే విషయం కలది. ఆత్మకు ఆకారం లేనప్పుడు అది జ్ఞానంలో విషయం ఎలా అవుతుంది? ఆత్మాకారమైన, ఆత్మ ఏ జ్ఞానమునందు విషయమో అట్టి, జ్ఞానం అంటూ ఎలా ఉంటుంది అని ప్రశ్న.

నన్వితి : (సమాధానం) ఆత్మ ఆదిత్యుని వర్ణం వంటి వర్ణం కలది; తేజోరూపమైనది; స్వయంగా ప్రకాశించేది అని ఆత్మకు ఆకారం ఉందన్నట్లు శ్రుతులలో వినబడుతున్నది కదా? (అందుచేత జ్ఞానంలో అది విషయం కావచ్చును కదా అని మధ్యలో చెప్పిన సమాధానం). (మొదట ఆశంక చేసినవాని ప్రశ్న) – ఆ వాక్యా లన్నీ ఆత్మ తమోరూపం కాదు అని చెప్పడానికి మాత్రమే ఉద్దిష్ట మైనది. (అంతే కాని ఆత్మకు ఆకారం ఉందని చెప్పడం వాటి ఉద్దేశ్యం కాదు). ఆత్మ ద్రవ్యం కాదు, గుణం కాదు, అలాంటిది ఏదీ కాదు

అని చెప్పి నప్పుడు అది తమోరూప మైనది అని అశంక కలగవచ్చును; అలా అది తమోరూపం కూడ కాదు అని చెప్పడమే **"ఆదిత్యవర్ణమ్"** ఇత్యాదివాక్యాల ప్రయోజనం. **'అరూపమ్'** అని విశేషించి ఆత్మకు రూపం లేదు అని చెప్పబడింది కూడ. "న సందృశే ... ఏనమ్" (దీని రూపం చూడడానికి రాదు; దానిని ఎవడు కూడ నేత్రంతో చూడజాలడు) అని, **"అశబ్దమస్పర్శమ్"** అనీ, ఇలాంటి వాక్యాలను అనుసరించి ఇది విషయం (జ్ఞానగోచరం) కూడ కాదు. అందువల్ల "ఆత్మాకార మైన జ్ఞానము" అనడం కుదరదు. అలాంటప్పుడు ఆత్మయొక్క జ్ఞానం ఎలా కుదురుతుంది? ఏ జ్ఞానం ఏది విషయంగా కలిగి ఉంటుందో (ఏ జ్ఞానంలో ఏది విషయమో) ఆ జ్ఞానం ఆ విషయం ఆకారంగా కలదై ఉంటుంది. (ఏ జ్ఞానంలో ఏది విషయమో ఆ జ్ఞానానికి ఆ విషయం ఆకారంగా ఉంటుంది. ఇది అన్ని జ్ఞానాలలలోను ఉంటే నియమం). కాని ఆత్మ నిరాకార మని చెప్పబడింది. (అలాం టప్పుడు ఆత్మాకార మైన జ్ఞానం ఎలా కలుగుతుంది?) జ్ఞానమూ ఆత్మా రెండు కూడ నిరాకారము లైనప్పుడు ఆత్మజ్ఞాననిష్ఠ అంటూ ఎలా కుదురుతుంది?

ఏ. 'తద్భావనానిష్ఠా' అన్నప్పుడు 'తత్' అనగా ఆత్మజ్ఞానం. భావన అనగా మాటిమాటికీ అనుసంధానం చేయడం. 'తద్భావనా' అనగా ఆత్మజ్ఞానాన్ని మాటిమాటికి అనుసంధానం చేయడం. ఆ భావనయొక్క నిష్ఠ అనగా దాని సమాప్తి. ఈ విధంగా తద్భావనానిష్ఠా అనగా ఆత్మసాక్షాత్కారదార్ఢ్యం అని అర్థం.

నేతి :- (సిద్ధాంతి సమాధానం) – ఆత్మ అత్యంతము నిర్మలంగాను, స్వచ్ఛంగాను, సూక్ష్మంగాను (ఇంద్రియాలకు గోచరం కానిది గాను) ఉండడం ఉపపన్నమే (యుక్తమే). బుద్ధి కూడ ఆత్మ వలె నైర్మల్యాదులు కలదిగా ఉండడం కుదురుతుంది గాన ఇది చైతన్యము యొక్క ఆకారముయొక్క ఆభాసగా ఉండడం కుదురుతుంది. (అనగా చైతన్యం వలె కనబడుతుంది). అట్లే మనస్సు బుద్ధ్యాభాసం (బుద్ధియొక్క లక్షణాలతో కనబడుతుంది) ఇంద్రియాలు మనస్సుయొక్క ఆభాసతో ఉంటాయి. దేహం ఇంద్రియాభాసమై కనబడుతుంది. (ఆత్మ అతిస్వచ్ఛ మైనది, నిర్మల మైనది, సూక్ష్మ మైనది, బుద్ధి కూడ ఆత్మ వలె స్వచ్ఛ మవడంచేత, ఆత్మసంబంధంచేత అది చైతన్యం కలది వలె, చైతన్యరూపంలో కనబడుతుంది. బుద్ధిసంబంధంవల్ల మనస్సు చైతన్యరూపంగా కనబడుతుంది. మనఃసంబంధం వల్ల ఇంద్రియాలు చైతన్యవంతములుగా కనబడతాయి. ఇంద్రియసంబంధంవల్ల దేహం చైతన్యవంతంగా కనబడుతుంది. ఈ విధంగా వెనుకకి పోగా పోగా దేహేంద్రియాదులు చైతన్యాభాసములుగా కనబడడానికి మూలకారణం ఆత్మ; చైతన్యాభిన్న మైన ఆత్మ అని భావం). అందువల్లనే (పామరులు) లౌకికులు దేహమే ఆత్మ అని అనుకుంటున్నారు.

భాష్యమ్

దేహచైతన్యవాదినశ్చ లోకాయతికాః చైతన్యవిశిష్టః కాయః పురుషః ఇత్యాహుః, తథా అన్యే ఇన్ద్రియచైతన్యవాదినః. అన్యే మన శ్చైతన్యవాదినః అన్యే బుద్ధిచైతన్యవాదినః తతోఽపి ఆన్తరమ్ అవ్యక్తమ్ అవ్యాకృతాఖ్యమ్ అవిద్యావస్థమ్ ఆత్మత్వేన ప్రతిపన్నాః కేచిత్. సర్వత్ర హి బుద్ధ్యాదిదేహాన్తే ఆత్మచైతన్యాభాసతా ఆత్మభ్రాన్తికారణమ్ ఇత్య తః ఆత్మవిషయం జ్ఞానం న విధాతవ్యమ్; కిం తర్హి? నామరూపాద్యనాత్మా ధ్యారోపణ నివృత్తిః ఏవ కార్యా, న ఆత్మచైతన్యవిజ్ఞానమ్, అవిద్యాధ్యారోపితసర్వపదార్థాకారైరేవ విశిష్టతయా గృహ్యమాణత్వాత్.

బాలానందిని

దేహేతి :- దేహానికే చైతన్యం ఉన్న దని చెప్పే లోకాయతికులు " చైతన్యవిశిష్టమైన (చైతన్యంతో కూడిన) దేహమే పురుషుడు" అని అంటున్నారు. అట్లే కొందరు ఇంద్రియాలే చైతన్యం అని చెప్పేవా ళ్లున్నారు; మరి కొందరు మనస్సే చైతన్య మని చెపుతున్నారు. మరికొందరు బుద్ధియే చైతన్య మని చెపుతున్నారు. బుద్ధికంటె కూడ లోపలిదైన అవ్యాకృత మనే పేరు గల, అవిద్యావస్థలో ఉన్న, అవ్యక్తా న్ని ఆత్మ అని కొందరు అంగీకరిస్తున్నారు. బుద్ధి మొదలు దేహం వరకూ ఉన్న అన్నింటిలోనూ కూడ ఆత్మచైతాన్యాభ్యాసం ఉండడమే (ఆత్మచైతన్యం ఆభాసించడమే) ఆత్మ అనే భ్రాంతికి కారణం గాన ఆత్మ విషయక మైన (ఆత్మను గూర్చిన) జ్ఞానం విధించవలసిన పని లేదు.("ఆత్మా ద్రష్టవ్యః" ఇత్యాదుల చేత ఆత్మను తెలుసుకోవాలి అని క్రొత్తగా విధించవలసిన పని లేదు; ఎందువల్ల ననగా ప్రతీ ఒక్కడూ బుద్ధి మొదలు దేహంవరకూ ఉన్న వాటిలో ఏదో ఒక దానిని ఆత్మగా భావిస్తూనే ఉన్నాడు). మరేమనగా – నామము రూపము మొదలైన అనాత్మల అధ్యారోపముయొక్క నివృత్తిమాత్రమే (ఇది ఆత్మ కాదు ఇది ఆత్మ కాదు అని నామరూపాదులను నిషేధించడం మాత్రమే) చేయదగినది, అంతే కాని ఆత్మచైతన్యమును తెలుసుకొనవలె నని విధించ నవసరం లేదు. అవిద్యచేత ఆరోపితములైన బుద్ధి, ఇంద్రియాలు మొద లైన సర్వపదార్థాల ఆకారములతో కలిపి చైతన్యం గ్రహింపబడుచూతూనే ఉన్నది కదా?

భాష్యమ్

అత ఏవ హి విజ్ఞానవాదినః బౌద్ధాః విజ్ఞానవ్యతిరేకేణ వస్త్వేవ నాస్తి ఇతి ప్రతిపన్నాః, ప్రమాణాన్తరనిరపేక్షతాం చ స్వసంవాదిత్వాభ్యుపగమేన. తస్మాత్ అవిద్యాధ్యారోపణనిరాకరణమాత్రం బ్రహ్మణి కర్తవ్యం, న తు బ్రహ్మజ్ఞానే యత్నః. అత్యన్తప్రసిద్ధత్వాత్. అవిద్యాకల్పితనామరూపవిశేషాకారాపహృతబుద్ధిత్వాత్ అత్యన్త

ప్రసిద్ధం సువిజ్ఞేయమ్ ఆసన్నతరమ్ ఆత్మభూతమ్ అపి అప్రసిద్ధం దుర్విజ్ఞేయమ్ అతిదూరమ్ అన్యత్ ఇవ చ ప్రతిభాతి అవివేకినామ్. బాహ్యాకారనివృత్తబుద్ధీనాం తు లబ్ధగుర్వాత్మప్రసాదానాం న అతః పరం సుఖం సుప్రసిద్ధం సువిజ్ఞేయం స్వాసన్నమ్ అస్తి. తథా చ ఉక్తమ్ - "ప్రత్యక్షావగమం ధర్మ్యమ్ (9.2) ఇత్యాది.

బాలానందిని

అత ఏవేతి :- అందువలననే విజ్ఞానం తప్ప మరొక వస్తువే లేదనీ, ప్రతీ వస్తువూ కూడ తన చేతనే, విజ్ఞానంచేతనే, తెలియబడుచున్నది గాన దానిని తెలుసుకొనడానికి ఇతరప్రమాణముల అపేక్ష లేదనీ విజ్ఞానవాదులైన బౌద్ధులు అంగీకరిస్తున్నారు.

వి. దేహ-ఇంద్రియ-మనో-బుద్ధి-అవ్యక్తాలు తెలియబడుతూన్నప్పుడు వాటితో కూడ చైతన్యం కూడ తెలియబడుతున్నది. మరొక విధంగా వాటి జ్ఞానం కుదరదు. అవి జడములు కదా? అందుచేతనే విజ్ఞానవాదులు - సమస్తజ్ఞేయవస్తువూ కూడ జ్ఞానమిశ్రమం గానే ఉంటుంది గాన జ్ఞానంకంటె వేరుగా జ్ఞేయం లేదు. స్వప్నదృష్టములైన వస్తువులు జ్ఞానంకంటె వేరుగా లేవు కదా, అని అంటున్నారు. ఈ మతం అంగీకార్యం కాకపోయినా వీళ్లు ఇలా అనడానికి కారణం దేహేంద్రియాదులతో చైతన్యం (జ్ఞానం) భాసించడమే అని చెప్పడానికి ఈ మతం ఉదాహరించబడింది.

తస్మాదితి :- అందువల్ల బ్రహ్మవిషయంలో అవిద్యాకృతము లైన అధ్యారోపణల నిరాకరణం మాత్రమే చేయదగినది కాని బ్రహ్మజ్ఞానం కోసం క్రొత్తగా ప్రయత్నం ఏదీ చేయవలసిన పని లేదు. బ్రహ్మ అత్యంతము ప్రసిద్ధమే కదా? అవివేకుల బుద్ధి అవిద్యచేత కల్పించబడిన నామ-రూపవిశేషాల ఆకారముచేత అపహరింపబడడంచేత బ్రహ్మ అత్యంతము ప్రసిద్ధ మైనా, అనాయసంగా తెలియదగిన దైనా, చాలా సన్నిహితంగా ఉన్నా, ఆత్మయే అయినా కూడ అప్రసిద్ధం వలె, తెలియ శక్యం కానిది వలె, చాల దూరమైనది వలె, తనకంటె భిన్న మైనది వలె తోచుచున్నది. గురువులయొక్క, ఆత్మ యొక్క అనుగ్రహమును పొంది బాహ్యాకారమునుండి నివర్తించిన బుద్ధి కలవారి కైతే ఈ బ్రహ్మకంటె అధికముగా సుఖ మైనదీ, సుప్రసిద్ధ మైనదీ, అనాయాసంగా తెలుసుకొనదగినదీ, అతిసంనిహిత మైనదీ మరొకటి లేదు. అందుచేతనే "ప్రత్యక్షావగమంధర్మ్యమ్" ఇత్యాదికం చెప్పబడింది.

భాష్యమ్

కేచిత్తు పణ్డితం మన్యాః నిరాకారత్వాత్ ఆత్మవస్తు నోపైతి బుద్ధిః, అతః దుఃసాధ్యా సమ్యగ్జ్ఞాననిష్ఠా ఇత్యాహుః. సత్యమేవం గురుసంప్రదాయరహితానామ్

అశ్రుతవేదాన్తానామ్ అత్యన్తబహిర్విషయాసక్తబుద్ధీనాం సమ్యక్ప్రమాణేషు అకృతశ్రమాణామ్; తద్విపరీతానాం తు లౌకికగ్రాహ్యగ్రాహకద్వైతవస్తుని సద్బుద్ధిః నితరాం దుఃసంపాద్యా, ఆత్మచైతన్యవ్యతిరేకేణ వస్త్వన్తరస్య అనుపలబ్ధేః. యథా చ ఏతత్ ఏవమేవ న అన్యథా ఇతి అవోచామ. ఉక్తం చ భగవతా – **'యస్యాం జాగ్రతి భూతాని సా నిశా పశ్యతో మునేః'** (2.69). తస్మాత్ బాహ్యాకారభేదబుద్ధినివృత్తిః ఏవ ఆత్మస్వరూపాలమ్బనే కారణమ్. న హి ఆత్మా నామ కస్య చిత్ కదాచిత్ అప్రసిద్ధః ప్రాప్యః హేయః ఉపాదేయః వా. అప్రసిద్ధే హి తస్మిన్ ఆత్మని అస్వార్థాః సర్వాః ప్రవృత్తయః ప్రవర్తేరన్. న చ దేహాద్యచేతనార్థత్వం శక్యం కల్పయితుమ్. న చ సుఖార్థం సుఖం దుఃఖార్థం వా దుఃఖమ్. ఆత్మావగత్యవసానార్థత్వాత్ చ సర్వవ్యవహారస్య (బ్ర.సూ. 3.4.26,27) తస్మాత్ యథా స్వదేహస్య పరిచ్ఛేదాయ న ప్రమాణాన్తరాపేక్షా తతోఽపి ఆత్మన అన్తరతమత్వాత్ తదవగతిం ప్రతి న ప్రమాణాన్తరాపేక్షా ఇతి ఆత్మజ్ఞాననిష్ఠా వివేకినాం సుప్రసిద్ధా ఇతి సిద్ధమ్.

బాలానందిని

కేచిదితి :- మేమే పండితులం అనుకొనే కొంద రైతే – ఆత్మ వస్తువు నిరాకారం గాన బుద్ధి దానిని పొందజాలదు. అందుచేత సమ్యగ్జ్ఞాననిష్ఠ సాధింప శక్యంకానిది అని అంటున్నారు. గురుసంప్రదాయం లేనివాళ్ళు వేదాంతాలు విననివాళ్ళు. అత్యంతము బాహ్యవిషయాలమీద ఆసక్తి గల బుద్ధి కలవాళ్ళు ప్రమాణాల విషయంలో బాగా పరిశ్రమ చేయినవాళ్లూ అయినవాళ్ల విషయంలో ఇది నిజమే! కాని వీళ్లకు విపరీతమైనవాళ్లకు (పైలాంటివాళ్లు కానివాళ్లకు) లౌకికాలైన గ్రహింపదగినవి, గ్రహించేవి అయిన ద్వైతవస్తువు విషయంలో సద్బుద్ధి (అది నిజంగా ఉన్నది అనే బుద్ధి) ఏ విధంగానూ కూడ కలగడానికి శక్యం కాదు; అందుకు కారణ మేమనగా ఆత్మచైతన్యం తప్ప మరొక వస్తు వేదీ వాళ్లకు కనబడదు. ఇది ఇట్లే కాని మరొక విధంగా ఉండదు అనే విషయాన్ని (వెనుక) చెప్పి ఉన్నాం. భగవంతుడు కూడ – **"యస్యాం జాగ్రతి భూతాని సా ని శా పశ్యతో మునేః"** అని చెప్పి ఉన్నాడు. అందువల్ల ఆత్మస్వరూపాన్ని ఆలంబించడానికి కారణం బాహ్యములైన ఆకారాల భేదజ్ఞానం నివర్తించడం మాత్రమే. ఎందువల్ల ననగా ఆత్మ అనేది ఎవనికీ, ఎన్నడూ అప్రసిద్ధమై, క్రొత్తగా పొందదగినదిగా గాని, విడువవలసినదిగా గాని, గ్రహింపదగినదిగా గాని, లేదు. ఆ ఆత్మ అప్రసిద్ధం అయిన పక్షంలో సమస్త మైన వ్యాపారాలు (పనులు) తనకొరకు చేసేవి అని చెప్పడానికి వీలు లేనివిగా ఉండేవి. (అనగా ఆత్మ అనేది, నేను అని చెప్పబడేది, ఒకటి ఉన్నది కావుననే దానికోసమై అందరూ ఆ యా పనులు చేస్తున్నారు. అది లేకపోతే ఎవరికోసం చేస్తారు అని భావం). ఈ పనులు

అచేతనములైన దేహాదులకోసం అనడం యుక్తం కాదు. (అచేతనములకు వ్యాపారంవల్ల ప్రయోజనం ఏమీ ఉండదు కదా?) సుఖం సుఖం కోసమే, దుఃఖం దుఃఖం కోసమే అనడం కూడ యుక్తం కాదు. (అవి అనుభవించే వాడు ఒక డుండాలి కదా అని భావం). మరొక విషయ మేనగా సమస్తవ్యవహారమూ కూడ ఆత్మజ్ఞానం కోసమే.

వి. యజ్ఞాదివ్యవహారం చివరికి ఆత్మజ్ఞానం కొరకేగాని ఆత్మ అనేది ప్రసిద్ధం కాకపోతే దానినిమిత్తమైకర్మాచరణం కుదరదు అని భావం. సమస్తవ్యవహారమూ కూడ ఆత్మావగతి అనగా ఆత్మజ్ఞానం,అనే అవసానమే అనగా చివరిఫలమే, ప్రయోజనంగా గలది కదా అని "ఆత్మావగత్యవససానార్థత్వాచ్చ సర్వవ్యవహారస్య" అనుదాని అర్థం. ఇది ఆనందగిరి వ్రాసిన అర్థం. కాని యజ్ఞాదులు ఆత్మావగతిప్రయోజనములు కావచ్చును గాని సర్వవ్యవహారములు కావు కదా? అందుచేత దీనికి - సకలవ్యవహారాలకు ఆత్మావగతి, అనగా తాను అనుభవించడం, అనేదే చివరి ప్రయోజనం కదా; అనగా సుఖమైనా దుఃఖ మైనా ఆ యా కర్మలు ఆచరించినవాడే అనుభవించవలసి ఉంటుంది కదా అని అర్థం చెపితే బాగుంటుంది. సుఖదుఃఖాలు ఉన్నాయంటే వాటిని అనుభవించేవాడు కూడా ఉండాలి గాన ఆత్మ సర్వప్రసిద్ధమే అని భావం.

తస్మాదితి :- అందువల్ల - తన దేహంయొక్క పరిచ్ఛేదంకొరకు (ఇది ఇంత ఉంది, ఇలా ఉంది అని తెలుసుకొనడం కొరకు) ఇతర ప్రమాణాల అపేక్ష ఏ విధంగా ఉండదో, ఆత్మ దానికంటె కూడ ఎక్కువ లోపలిది అవడంచేత, దానిని తెలుసుకొనడానికి ఇతరప్రమాణాల అపేక్ష ఉండదు. అందుచేత వివేకవంతులకు ఆత్మజ్ఞాననిష్ఠ సుప్రసిద్ధము (అప్రయత్నంగా సిద్ధించినది) అని సిద్ధించినది.

భాష్యమ్

యేషామ్ అపి నిరాకారం జ్ఞానమ్ అప్రత్యక్షం తేషామపి, జ్ఞానవశైవ జ్ఞేయావగతిః ఇతి జ్ఞానమ్ అత్యన్తం ప్రసిద్ధం సుఖాదిదేవ ఇతి అభ్యుపగన్తవ్యమ్. జిజ్ఞాసానుపపత్తేశ్చ. అప్రసిద్ధం చేత్ జ్ఞానం జ్ఞేయవత్ జిజ్ఞాస్యేత. యథా జ్ఞేయం ఘటాదిలక్షణం జ్ఞానేన జ్ఞాతా వ్యాప్తుమ్ ఇచ్ఛతి తథా జ్ఞానమపి జ్ఞానాన్తరేణ జ్ఞాతా వ్యాప్తుమ్ ఇచ్ఛేత్. న చ ఏతత్ అస్తి. అతః అత్యన్తప్రసిద్ధం జ్ఞానమ్, జ్ఞాతాపి అతః ఏవ ప్రసిద్ధః ఇతి. తస్మాత్ జ్ఞానే యత్నః న కర్తవ్యః, కిం తు అనాత్మని ఆత్మబుద్ధి నివృత్తౌ ఏవ. తస్మాత్ జ్ఞాననిష్ఠా సుసంపాద్యా. 50

బాలానందిని

యేషామితి :- ఎవరికి కూడ (ఎవరి అభిప్రాయం ప్రకారం కూడ) నిరాకార మైన

జ్ఞానం ప్రత్యక్షం కాదో వాళ్లకు కూడ జ్ఞేయముయొక్క జ్ఞానం జ్ఞానంచేతనే కలుగుతుంది గాన జ్ఞానం సుఖాదుల వలెనే అత్యంతము ప్రసిద్ధ మైనదే అని అంగీకరించాలి.

వి. ఏ జ్ఞానంలోని విషయం ఆకారం లేనిదో ఆ జ్ఞానం ఆ విషయం వలెనే ప్రత్యక్షం కాదు అని కొందరు చెప్పవచ్చును. ఉదాహరణకి శశశృంగం విషయంగా గల శశశృంగజ్ఞానం నిరాకారం గాన ఆ జ్ఞానం ప్రత్యక్షం కాదు అని చెప్పవచ్చును. కాని ఆ జ్ఞానంలో కూడ శశశృంగం నిరాకారమే అయినా దానిని గూర్చిన జ్ఞానం కలిగింది కదా? అందుచేత సుఖాదిజ్ఞానం వలె ఇది కూడ ప్రసిద్ధమే అని అర్థం.

జిజ్ఞాసేతి :- తెలుసుకోవాలనే ఇచ్ఛ (జ్ఞానం విషయంలో) కుదరదు. అందువల్ల కూడ జ్ఞానం ఎల్లప్పుడూ ప్రసిద్ధమే. జ్ఞానం అప్రసిద్ధం అయితే జ్ఞేయం వలె తెలుసుకోవాలి అని కోరబడి ఉండేది. ఘటాదిరూపమైన జ్ఞేయవస్తువు (తెలుసుకొనదగిన) వస్తువును జ్ఞాత ఏ విధంగా జ్ఞానంచేత పొందా లని కోరుతాడో అట్లే జ్ఞానమును కూడ జ్ఞాత మరొక జ్ఞానంచేత వ్యాపించడానికి (తన జ్ఞానానికి విషయంగా చేయడానికి) కోరుకోవాలి. అలాంటిది ఏదీ కాదు. అందువల్ల జ్ఞానం అత్యంతప్రసిద్ధం. ఆ కారణంవల్లనే (జ్ఞానం ప్రసిద్ధం గాన) జ్ఞాత కూడ ప్రసిద్ధుడే గాన జ్ఞానం విషయంలో ప్రయత్నం చేయవలసిన పనిలేదు. మరే మనగా ఆత్మ కానివాటి విషయంలో ఉన్న ఆత్మబుద్ధిని నివారించడానికి మాత్రమే ప్రయత్నం చెయ్యాలి. అందువల్ల ఆత్మనిష్ఠ సంపాదించడం సులభమే.

వి. ఘటం, పటం మొదలైనవి జ్ఞేయములు, తెలుసుకొనదగినవి. అందుచేత వీటిని తెలుసుకోవాలి అని జ్ఞాత ఇచ్ఛయించి అందుకు ప్రయత్నిస్తాడు. ఘటజ్ఞానం కలిగింది. ఈ జ్ఞానాన్ని తెలుసుకోవాలి ఎవ్వడూ అనుకొనడు. అది స్వయంప్రకాశం. జ్ఞేయం కాదు. ఈ విధంగా జ్ఞానం విషయంలో జిజ్ఞాస (తెలుసుకోవా లనే ఇచ్ఛ) ఉండదు గాన అది ప్రసిద్ధం. జ్ఞానం వలె జ్ఞాత కూడ ప్రసిద్ధుడే; ఎప్పుడూ ఉన్న వాడే. అందుచేత ఆత్మజ్ఞానం విషయంలో ప్రయత్నం చేయ నవసరం లేదు. ప్రయత్నం చేయవలసిన దల్లా ఆత్మ కాని దేహాదులను ఆత్మ అనుకొనడాన్ని తొలగించడానికే. అది తొలిగితే ఆత్మ తనంతట తానే భాసిస్తుంది. ఆ విధంగా ఆత్మనిష్ఠను సంపాదించడంలో కష్టం ఏమీ లేదు అని అర్థం. 50

భాష్యమ్

సేయం జ్ఞానస్య పరా నిష్ఠా ఉచ్యతే కథం కార్యా ఇతి -

మూ. బుద్ధ్యా విశుద్ధయా యుక్తో ధృత్యాత్మానం నియమ్య చ,
శబ్దాదీన్ విషయాంస్త్యక్త్వా రాగద్వేషౌ వ్యుదస్య చ. 51

బాలానందిని

సేయమితి :- అట్టి ఈ జ్ఞానముయొక్క పరనిష్ఠ ఎట్లు చేయదగినదో చెప్పబడుచున్నది.

ప్ర.అ. బుద్ధ్యా ఇతి :- విశుద్ధయా = పరిశుద్ధమైన, బుద్ధ్యా = బుద్ధితో, యుక్తః = కూడినవాడై, ధృత్యా = ధైర్యంతో, ఆత్మానమ్ = తనను, నియమ్య చ = నియమించుకొని, శబ్దాదీన్ = శబ్దం మొదలైన, విషయాన్ = విషయాలను, త్యక్త్వా = విడచి, రాగద్వేషౌ = రాగద్వేషములను, వ్యుదస్య చ = ప్రారద్రోలి -

భాష్యమ్

బుద్ధ్యా అధ్యవసాయాత్మికయా, విశుద్ధయా మాయారహితయా, యుక్తః సంపన్నః, ధృత్యా ధైర్యేణ, ఆత్మానం కార్యకరణసంఘాతం, నియమ్య చ నియమనం కృత్వా వశీకృత్య, శబ్దాదీన్ - శబ్దః ఆదిః యేషాం తే శబ్దాదయః, తాన్ విషయాన్ త్యక్త్వా, సామర్థ్యాత్ శరీరస్థితిమాత్రహేతుభూతాన్ కేవలాన్ ముక్త్వా తతః అధికసుఖార్థాన్ త్యక్త్వా ఇత్యర్థః. శరీరస్థిత్యర్థత్వేన ప్రాప్తేషు చ రాగద్వేషౌ, వ్యుదస్య చ పరిత్యజ్య. 51

బాలానందిని

బుద్ధ్యేతి :- మాయ (మోసం) లేని నిశ్చయరూప మైన బుద్ధితో కూడినవాడై, ధైర్యముచేత తనను, తన దేహేంద్రియాదులను, నియమనం చేసికొని, వశం చేసికొని శబ్దాదివిషయాలను విడచి, సామర్థ్యంవల్ల అనగా జీవించి ఉన్నంతవరకు శబ్దాదివిషయాలను పూర్తిగా విడవడం కుదరదు గాన, శరీరం నిలవడానికి మాత్రం హేతువు లైన శబ్దాదులు తప్ప అంతకంటె అధిక మైన సుఖహేతువు లైన శబ్దాదులను విడచి అని అర్థం. శరీరస్థితి కోసం లభించే వస్తువులవిషయంలో కూడ రాగద్వేషాలను విడచి- 51

భాష్యమ్

తతః

మూ. వివిక్తసేవీ లఘ్వాశీ యతవాక్కాయమానసః,
ధ్యానయోగపరో నిత్యం వైరాగ్యం సముపాశ్రితః. 52

బాలానందిని

తతః ఇతి :- అటు పిమ్మట -

ప్ర.అ. వివిక్తేతి :- వివిక్తసేవీ = నిర్జనప్రదేశమును సేవిస్తూన్నవాడై, లఘ్వాశీ = అల్పమైన ఆహారమును తినువాడై, యతవాక్కాయమానసః = నిగ్రహించుకొనబడిన వాక్కు శరీరము మనస్సు కలవాడై, నిత్యమ్ = ఎల్లప్పుడూ, ధ్యానయోగపరః = ధ్యానయోగముల యందు నిరతుడై, వైరాగ్యమ్ = వైరాగ్యమును, సముపాశ్రితః = ఆశ్రయించినవాడై -

భాష్యమ్

వివిక్తసేవీ - అరణ్యనదీపులినగిరిగుహాదీన్ వివిక్తాన్ దేశాన్ సేవితుం శీలమ్ అస్య ఇతి వివిక్తసేవీ, లఘ్వాశీ లఘ్వశనశీలః, వివిక్తసేవాలఘ్వశనయోః నిద్రాదిదోషనివర్తకత్వేన చిత్తప్రసాదహేతుత్వాత్ గ్రహణమ్. యతవాక్కాయమానసః - వాక్ చ కాయః చ మానసం చ యతాని సంయతాని యస్య జ్ఞాననిష్ఠస్య సః జ్ఞాననిష్ఠః యతిః యతవాక్కాయమానసః స్యాత్. ఏవమ్ ఉపరతసర్వకరణః సన్, ధ్యానయోగపరః - ధ్యానమ్ ఆత్మస్వరూపచిన్తనమ్; యోగః ఆత్మవిషయే ఏవ ఏకాగ్రీకరణమ్; తౌ ధ్యానయోగౌ పర్వతేన కర్తవ్యౌ యస్య సః ధ్యానయోగపరః నిత్యమ్; మన్త్రజపాద్యన్యకర్తవ్యాభావప్రదర్శనార్థమ్. వైరాగ్యం విరాగభావః దృష్టాదృష్టేషు విషయేషు వైతృష్ణ్యం సముపాశ్రితః సమ్యక్ ఉపాశ్రితః నిత్యమేవ ఇత్యర్థః. 52

బాలానందిని

వివిక్తేతి :- అరణ్యము, నదుల ఇసుకతిన్నెలు, పర్వతగుహలు మొదలైన నిర్జన ప్రదేశాలను సేవించే స్వభావం కలవాడై, లఘువుగా ఆహారం తినే స్వభావం కలవాడై, నిద్ర మొదలైన దోషాలను తొలగించి, చిత్తం ప్రసన్నం అవడానికి హేతువులు అవడంచేత వివిక్తసేవ లఘుభోజనము చెప్పబడ్డాయి. జ్ఞాననిష్ఠు డైన ఏ సంన్యాసి తన వాక్కును కాయమును మనస్సును నిగ్రహించుకుంటాడో అతడు యతవాక్కాయమానసుడు. యతవాక్కాయమానసుడుగా ఉండాలి. ఈ విధంగా ఉపరతములైన (క్రియాశూన్యములైన) సమస్తేంద్రియములు కలవాడై ధ్యానయోగపరుడై - ఆత్మస్వరూపాన్ని గూర్చి చింతించడం ధ్యానం. ఆత్మ విషయమునందే (మనస్సును) ఏకాగ్రమును చేయడం యోగం. అట్టి ధ్యాన - యోగములు ఎవనికి అత్యుత్తమ కర్తవ్యములుగా చేయదగినవో అతడు ధ్యానయోగపరుడు. ధ్యానయోగములే తప్ప మంత్రజపం మొదలైన ఇతరకర్తవ్యము లేవీ ఉండకూడదు అని చూపడం కోసం 'నిత్యమూ' అని చెప్పబడినది. వైరాగ్య మనగా చూచినవి చూడనివి అయిన విషయాలమీద ఆసక్తి లేకపోవడం; దానిని బాగా ఆశ్రయించినవాడై; నిత్యమూ ఆశ్రయించినవాడై అని అర్థం. 52

భాష్యమ్

కిం చ -

మూ. అహంకారం బలం దర్పం కామం క్రోధం పరిగ్రహమ్,
విముచ్య నిర్మమః శాన్తో బ్రహ్మభూయాయ కల్పతే. 53

బాలానందిని

కించేతి :- మరియు

ప్ర.అ. అహంకారమితి :- అహంకారమ్ = అహంకారమును, బలమ్ = బలమును, దర్పమ్ = గర్వమును, కామమ్ = కామమును, క్రోధమ్= క్రోధమును, పరిగ్రహమ్ = ధనం ప్రోగుచేసి కొనడాన్నీ, విముచ్య = విడచి, నిర్మమః = మమకారం లేని, శాన్తః శాంతు డైనవాడు, బ్రహ్మభూయాయ = బ్రహ్మగా అవడానికి, కల్పతే = సమర్థు డవుతాడు.

భాష్యమ్

అహంకారమ్ అహంకరణమ్ అహంకారః దేహేంద్రియాదిషు, తమ్ బలం సామర్థ్యం కామరాగాదియుక్తం న ఇతరత్ శరీరాదిసామర్థ్యం, స్వాభావికత్వేన త్యాగస్య అశక్యత్వాత్. దర్పః నామ హర్షానన్తరభావీ ధర్మాతిక్రమహేతుః, **"హృష్టో దృప్యతి, దృప్తో ధర్మమతిక్రామతి"** (ఆపద.సూ. 1.13.4) ఇతి స్మరణాత్. తం చ, కామమ్ ఇచ్ఛాం, క్రోధం ద్వేషం, పరిగ్రహమ్ ఇన్ద్రియమనోగతదోషపరిత్యాగేఽపి శరీరధారణ ప్రసంగేన ధర్మానుష్ఠాననిమిత్తేన వా బాహ్యః పరిగ్రహః ప్రాప్తః, తం చ, విముచ్య పరిత్యజ్య పరమహంసపరివ్రాజకః భూత్వా దేహజీవనమాత్రేఽపి నిర్గతమమభావః నిర్మమః, అతః ఏవ శాన్తః ఉపరతః, యః సంహృతాయాసః యతిః జ్ఞాననిష్ఠః, బ్రహ్మభూయాయ బ్రహ్మభవనాయ, కల్పతే సమర్థః భవతి. 53

బాలానందిని

అహంకారమితి :- దేహేంద్రియాదుల విషయంలో ఇవే నేను అనే భావం అహంకారం , దానినీ; బలాన్నీ, అనగా కామరాగాదులతో కూడిన సామర్థ్యాన్నీ, అంతే కాని బలమనగా శరీరాదిసామర్థ్యం కాదు; స్వభావసిద్ధ మైనదానిని విడవడానికి శక్యం కాదు కదా? దర్పం అనగా హర్షం తరవాత కలిగే గర్వం, ధర్మాన్ని అతిక్రమించడానికి హేతు వైనది. **"హృష్టః .... అతిక్రామతి"** (ఆనందించినవాడు, ఎక్కువ ఆనందించడానికి తగిన అధికారైశ్వర్యాదు లున్నవాడు, దర్పం పొందుతాడు; దృప్తుడు ధర్మం అతిక్రమిస్తాడు)

అని స్మృతి చెప్పుచున్నది. ఆ దర్పాన్నీ, ఇచ్ఛను, ద్వేషాన్నీ పరిగ్రహమునూ – ఇంద్రియాల లోను మనస్సులోను ఉన్న దోషాలను విడిచిపెట్టినా కూడ శరీరధారణప్రసంగంచేత (శరీరపోషణాదికం కోసం), లేదా ధర్మానుష్ఠాన మనే నిమిత్తంచేత బాహ్యమైన పరిగ్రహం (బాహ్యవస్తువులను సేకరించడం) ప్రాప్త మవుతుంది, పరిగ్రహానికి అవకాశం ఏర్పడుతుంది. దానినీ విడచి పరమహంసపరివ్రాజకుడై, దేహంయొక్క జీవనం విషయంలో కూడ మమకారం లేనివాడై, శాంతు డైన సర్వవ్యవహారాలనుండి విరతుడైన, అన్ని ఆయాసములను ఉపసంహరించుకొన్న ఏ జ్ఞాననిష్ఠు డైన యతి ఉన్నాడో అతడు బ్రహ్మ అవడానికి సమర్థుడవుతాడు. 53

భాష్యమ్

అనేన క్రమేణ –

మూ. బ్రహ్మభూతః ప్రసన్నాత్మా న శోచతి న కాఙ్క్షతి,
సమః సర్వేషు భూతేషు మద్భక్తిం లభతే పరామ్. 54

బాలానందిని

అనేనేతి :– ఈ క్రమంచేత –

ప్ర. అ. బ్రహ్మేతి :– బ్రహ్మభూతః = బ్రహ్మనుపొందినవాడు, ప్రసన్నాత్మా = ప్రసన్నమైన అంతఃకరణం కలవాడై, న శోచతి = దుఃఖించడు, న కాఙ్క్షతి = కోరడు. సర్వేషు = సమస్తమైన, భూతేషు = భూతములయందు, సమః = సముడై, పరామ్ = గొప్ప దైన, మద్భక్తిమ్ = నా భక్తిని, లభతే = పొందుతాడు.

భాష్యమ్

బ్రహ్మభూతః బ్రహ్మప్రాప్తః, ప్రసన్నాత్మా లబ్ధాధ్యాత్మప్రసాద స్వభావః, న శోచతి కించిత్ అర్థవైకల్యమ్ ఆత్మనః వైగుణ్యం చ ఉద్దిశ్య న శోచతి న సంతప్యతే. న కాఙ్క్షతి. బ్రహ్మభూతస్య అయం స్వభావః అనూద్యతే న శోచతి న కాఙ్క్షతి ఇతి. న హి అప్రాప్తవిషయాకాఙ్క్షా బ్రహ్మవిదః ఉపపద్యతే. న హృష్యతి ఇతి వా పాఠః. సమః సర్వేషు భూతేషు ఆత్మౌపమ్యేన సర్వేషు భూతేషు సుఖం దుఃఖం వా సమమేవ పశ్యతి ఇత్యర్థః; న ఆత్మసమదర్శనమ్ ఇహ, తస్య వక్ష్యమాణత్వాత్ – **"భక్త్యా మామభిజానాతి"** (18–55) ఇతి. ఏవంభూతః జ్ఞాననిష్ఠః, మద్భక్తిం మయి పరమేశ్వరే భక్తిం భజనం, పరామ్ ఉత్తమాం జ్ఞానలక్షణాం చతుర్థీం లభతే "చతుర్విధా భజన్తే మామ్" ఇతి హి ఉక్తమ్. 54

బాలానందిని

బ్రహ్మేతి :- బ్రహ్మను పొందినవాడు, (బ్రహ్మయే స్వస్వరూపం అని అనుభవిస్తున్న వాడు) అధ్యాత్మప్రసాదస్వభావమును పొందినవాడై, (అనగా తనలో పరమానంద రూప మైన స్వభావాన్ని పొందినవాడై) తన అర్థవైకల్యమును గాని (ఏదైన ఒక వస్తువుయొక్క కొదవను గాని), గుణలోపమును గాని గూర్చి బాధపడడు, ఏదీ కోరడు. **'న శోచతి' 'న కాఙ్క్షతి'** అని బ్రహ్మభూతుని స్వభావం అనువదింపబడుతున్నది. (అనగా అవన్నీ ఉన్నవాడే బ్రహ్మభూతుడు గాన వానికి ఉన్న లక్షణాలే చెప్పబడుతున్నాయి కాని క్రొత్తగా అతడు ఇవి సంపాదిస్తాడు అని చెప్పుటలేదు అని భావం). బ్రహ్మవేత్తకు అంతవరకు లభించని విషయం మీద కోరిక ఉపపన్నం (యుక్తం) కాదు కదా? లేదా 'న కాఙ్క్షతి' కి బదులు 'న హృష్యతి' అని పాఠం గ్రహించవచ్చును. సమస్తప్రాణుల విషయంలో సముడు. తనను ఉపమానంగా చూచుకొంటూ సమస్తభూతాలలోను సుఖదుఃఖాలను సమంగా చూచువాడు (నాకు సుఖం ఎట్లు ఇష్టమో ఇతరులకు కూడ అట్లే ఇష్టం, నాకు దుఃఖం ఎట్లు అనిష్టమో అట్లే ఇతరులకు కూడ అని భావించేవాడు) అని అర్థం. అంతేకాని అన్ని భూతాలలోను సమంగా ఉన్న ఆత్మను చూస్తాడు అని అర్థం కాదు. ఎందువల్ల ననగా - ఆ విషయంలో **"భక్త్యా మామభి జానాతి"** అని ఉత్తరశ్లోకంలో చెప్పబడనున్నది. ఇలాంటి జ్ఞాననిష్ఠుడు మద్భక్తిని, పరమేశ్వరుడ నైన నాయందు భక్తిని, భజనమును, ఉత్తమము, జ్ఞానరూపము, నాల్గవదీ అయిన భక్తిని పొందుతాడు. "చతుర్విధా భజన్తే మామ్" అని చెప్పబడింది కదా?

వి. ఆర్తుడు, జిజ్ఞాసువు, అర్థార్థి, జ్ఞాని అని నాలుగు రకాలవాళ్లు నన్ను భజిస్తారు అని చెప్పబడింది. పై లక్షణాలు గల బ్రహ్మభూతుడు జ్ఞానిగా నన్ను భజిస్తాడు, నన్నే పొందుతాడు అని అర్థం. 54

భాష్యమ్

తతః జ్ఞానలక్షణయా -

మూ. భక్త్యా మామభిజానాతి యావాన్యశ్చాస్మి తత్త్వతః,
తతో మాం తత్త్వతో జ్ఞాత్వా విశతే తదనన్తరమ్. 55

బాలానందిని

తతః ఇతి :- అటుపిమ్మట జ్ఞానరూప మైన -

ప్ర.అ. భక్త్యా ఇతి :- భక్త్యా = భక్తిచేత, యావాన్ = నేను ఎంతటివాడనో, యః చ = ఎవడనో, తత్త్వతః = యథార్థంగా, మామ్ = నన్ను, అభిజానాతి = గుర్తిస్తాడు. తతః

పిమ్మట, మామ్ = నన్ను, తత్త్వతః = యథార్థరూపంలో, జ్ఞాత్వా = తెలిసికొని, తదనన్తరమ్ = దానితరవాత, విశతే = నాలో ప్రవేశిస్తాడు.

భాష్యమ్

భక్త్యా మామ్ అభిజానాతి యావాన్ అహమ్ ఉపాధికృతవిస్తరభేదః, యః చ అహం విధ్వస్తసర్వోపాధిభేదః ఉత్తమపురుషః ఆకాశకల్పః, తం మామ్ అద్వైతచైతన్యమాత్రైకరసమ్, అజమ్, అజరమ్, అమరమ్, అభయమ్, అనిధనం తత్త్వతః అభిజానాతి. తతః మామ్ ఏవం తత్త్వతః జ్ఞాత్వా విశతే తదన్తరం మామ్ ఏవ. న అత్ర జ్ఞానానన్తర ప్రవేశక్రియే భిన్నే వివక్షితే **"జ్ఞాత్వా విశతే తదనన్తరమ్"** ఇతి, కిం తర్హి? ఫలాన్తరాభావ జ్ఞానమాత్రమేవ, **"క్షేత్రజ్ఞం చాపి మాం విద్ధి"** (13.2) ఇత్యుక్తత్వాత్.

బాలానందిని

భక్త్యా ఇతి :- నేను ఎంతటివాడనో, ఉపాధులచేత కల్పించబడిన అతివిస్తరరూపమైన (అతివిస్తృతమైన) ఎన్ని ఎన్ని భేదాలు కలవాడనో (ఆ యా ఉపాధుల భేదంచేత అతివిస్తృతమైన జగదాదిరూపంలో నేను ఏ విధంగా కనబడుతున్నానో అని అర్థం). నేను ఎవడనో, అనగా సమస్తము లైన ఉపాధికృతభేదాలు తొలగించగా నేను ఏ విధంగా ఆకాశం వంటి ఉత్తమరుపుషడనో, అట్టి ద్వితీయవస్తువు లేనివాడను, కేవలచైతన్యస్వరూపుడను, పుట్టుక, ముసలితనము, మరణము, భయము, నాశనము లేనివాడను అయిన నన్ను, నా యథార్థస్వరూపంలో తెలుసుకొంటాడు. ఈ విధంగా నన్ను యథార్థరూపంలో (నా యథార్థరూపాన్ని) తెలుసుకొని, తరవాత నన్నే పొందుతాడు. ఇక్కడ (ముందు) తెలుసుకొనడము తరవాత ప్రవేశించడమూ అనే రెండు క్రియలను **"జ్ఞాత్వా విశతే తదనన్తరమ్"** అని చెప్పడం ఉద్దేశ్యం కాదు; మరే మనగా - మరొకఫలం ఏదీ లేదని తెలుసుకొనడం మాత్రమే. **"క్షేత్రజ్ఞం చాపి మాం విద్ది"** (జీవుడను కూడ నేనే అని తెలుసుకో) అని చెప్పబడింది కదా? అందుచేత ముందు తెలుసుకొని తరవాత పరమేశ్వరునిలో ప్రవేశించడం అంటూ రెండు పనులు లేవు. పరమేశ్వరుడను అని తెలుసుకొనడం మాత్రమే; తరవాత కర్తవ్యం ఏదీ లేదు అని భావం).

భాష్యమ్

నను విరుద్ధమ్ ఇదమ్ ఉక్తమ్ జ్ఞానస్య యా పరా నిష్ఠా తయా మామ్ అభిజానాతి ఇతి? కథం విరుద్ధమ్ ఇతి చేత్, ఉచ్యతే - యదైవ యస్మిన్ విషయే జ్ఞానమ్ ఉత్పద్యతే జ్ఞాతుః తదైవ తం విషయమ్ అభిజానాతి జ్ఞాతా ఇతి న జ్ఞాననిష్ఠాం

జ్ఞానావృత్తిలక్షణామ్ అపేక్షతే ఇతి. తతశ్చ జ్ఞానేన నాభిజానాతి, జ్ఞానావృత్త్యా తు జ్ఞాననిష్ఠయా అభిజానాతి ఇతి. నైష దోషః, జ్ఞానస్య స్వాత్మోత్పత్తిపరిపాకహేతుయుక్తస్య ప్రతిపక్షవిహీనస్య యత్ ఆత్మానుభవనిశ్చయావసానత్వం తస్య నిష్ఠాశబ్దాభిలాపాత్. శాస్త్రాచార్యోపదేశేన జ్ఞానోత్పత్తిపరిపాకహేతుం సహకారికారణం బుద్ధివిశుద్ధ్యాద్యమ్ అమానిత్వాది చ (13.7) అపేక్ష్య జనితస్య క్షేత్రజ్ఞపరమాత్మైకత్వజ్ఞానస్య కర్తృత్వాది కారకభేదబుద్ధినిబన్ధనసర్వకర్మసంన్యాససహితస్య స్వాత్మానుభవనిశ్చయరూపేణ యత్ అవస్థానం సా పరా జ్ఞాననిష్ఠా ఇత్యుచ్యతే. సా ఇయం జ్ఞాననిష్ఠా ఆర్తాది భక్తిత్రయాపేక్షయా పరా చతుర్థీ భక్తిః ఇతి ఉక్తా (3.17) తయా పరయా భక్త్యా భగవన్తం తత్త్వతః అభిజానాతి, యదనన్తరమేవ ఈశ్వరక్షేత్రజ్ఞభేదబుద్ధిః అశేషతః నివర్తతే. అతః జ్ఞాననిష్ఠాలక్షణయా భక్త్యా మామ్ అభిజానాతి ఇతి వచనం న విరుధ్యతే

బాలానందిని

నన్వితి :- (ఆశంక) జ్ఞానముయొక్క ఏ పరాకష్ఠ (అత్యున్నతస్థితి) ఉన్నదో దానిచేత నన్ను గుర్తిస్తాడు అని ఇది విరుద్ధంగా చెప్పబడినది (అని చెప్పబడినది విరుద్ధంగా ఉన్నది). ఎట్లు విరుద్ధంగా ఉన్నది అన్నట్లయితే చెప్పబడుచున్నది - జ్ఞాతకు (తెలుసుకొనేవానికి) ఎప్పు డైతే దేని విషయంలో జ్ఞానం కలుగుతుందో అప్పుడే అతడు ఆ విషయాన్ని గుర్తిస్తాడు గాన జ్ఞానము యొక్క ఆవృత్తి అనే స్వరూపం గల జ్ఞాననిష్ఠను అపేక్షించదు. (ఒక వస్తువును తెలుసుకొన్నా డంటే ఆ వస్తువును వెంటనే గుర్తిస్తాడు. అందుచేత ఆ వస్తువును గుర్తించడానికి మాటిమాటికి ఆ జ్ఞానం చేయవలసిన (కలగలవలసిన) పని లేదు. అందుచేత జ్ఞాననిష్ఠ అనావశ్యకము అని భావం). అందువల్ల (ఒకసారి కలిగిన) జ్ఞానంచేత గుర్తించడు, జ్ఞానాల ఆవృత్తి అనే రూపం గల జ్ఞాననిష్ఠచేత గుర్తిస్తాడు అని చెప్పడం విరుద్ధం. (సమాధానం) ఈ దోషం లేదు. తాను (అనగా జ్ఞానం) పుట్టడానికీ అది పరిపాకం చెందడానికీ కావలసిన హేతువులతో కూడినది, తనకు విరుద్ధమైనవి ఏవీ (తాను కలగకుండా కాని పరిపాకం చెందకుండా ఉండడానికి గాని పనిచేసేవీ అయినవి ఏవీ) లేనిదీ అయిన జ్ఞానం చివరికి ఆత్మానుభవముయొక్క నిశ్చయంతో ఉండడం అనేది ఏది కలదో దానికే నిష్ఠ అని పేరు. శాస్త్రంచేత ఆచార్యోపదేశంచేత జ్ఞానం పుట్టి పరిపాకం చెందా లంటే అందుకు బుద్ధి విశుద్ధి, అమానిత్వం మొద లైనది సహకారికారణంగా ఉండాలి. (శాస్త్రాచార్యోపదేశం ప్రధానకారణం, బుద్ధిశుద్ధ్యాదికంసహకారికారణం). అలాంటి సహకారికారణంవల్ల పుట్టిన, కర్త మొదలైన కారకాల భేదజ్ఞానంవల్ల కలిగే సర్వకర్మలయొక్క సంన్యాసంతో కూడిన (సర్వకర్మసంన్యాసపూర్వకమైన) క్షేత్రజ్ఞ - పరమాత్మాభేదజ్ఞానం నిశ్చిత మైన స్వాత్మానుభవ రూపంలో ఉండడమే పరజ్ఞాననిష్ఠ అని చెప్పబడింది. అట్టి పరమైన భక్తిచేత భగవంతుణ్ణి

యథార్థరూపంలో తెలుసుకొంటాడు. దాని తరవాతనే ఈశ్వరుడు వేరు క్షేత్రజ్ఞుడు వేరు అను బుద్ధి పూర్తిగా తొలగిపోతుంది. అందుచేత "జ్ఞాననిష్ఠారూపమైన భక్తిచేత నన్ను గుర్తిస్తాడు" అని చెప్పడంలో విరోధం (దోషం) ఏదీ లేదు.

భాష్యమ్

అత్ర చ సర్వం నివృత్తివిధాయి శాస్త్రం వేదాన్తేతిహాసపురాణస్మృతిలక్షణమ్ అర్థవత్ భవతి – **"విదిత్వా .... వ్యుత్థాయాథ భిక్షాచర్యం చరన్తి"** (బృ.ఉ.3.5.1), **"తస్మాన్న్యాసమేషాం తపసామతిరిక్తమాహుః"** (మహానారా ఉ.21.1), **"న్యాస ఏవాత్యరేచత్"** (మహానారా. ఉ21.2) ఇతి, **"సంన్యాసః కర్మణాం న్యాసః"** (18.2) **"వేదానిమం చ లోకమముం చ పరిత్యజ్య"** (ఆప.ధ.సూ.2.23.13), **"త్యజ ధర్మమధర్మం చ"** (శాం.ప. 329, 40, 331.44) **ఇత్యాది** ఇహ చ (5.13) ప్రదర్శితాని వాక్యాని. న చ తేషాం వాక్యానామ్ ఆనర్థక్యం యుక్తమ్. న చ అర్థవాదత్వమ్, స్వప్రకరణస్థత్వాత్; ప్రత్యగాత్మావిక్రియస్వరూపనిష్ఠ(ష్ఠా) త్వాచ్చ మోక్షస్య. న హి పూర్వసముద్రం జిగమిషోః ప్రాతిలోమ్యేన ప్రత్యక్సముద్రం జిగమిషుణా సమానమార్గత్వం సంభవతి. ప్రత్యగాత్మవిషయప్రత్యయసంతానకరణాభినివేశశ్చ జ్ఞాననిష్ఠా సా చ ప్రత్యక్సముద్రగమనవత్ కర్మణా సహభావిత్వేన విరుధ్యతే. పర్వతసర్షపయోః ఇవ అన్తరవాన్ విరోధః ప్రమాణవిదాం నిశ్చితః. తస్మాత్ సర్వకర్మ సంన్యాసేనైవ జ్ఞాననిష్ఠా కార్యా ఇతి సిద్ధమ్. 53

బాలానందిని

అత్రేతి :– వేదాంతములు, ఇతిహాసములు, పురాణములు, స్మృతులు – **ఈ** రూపంలో ఉన్న నివృత్తిమార్గాన్ని ఉపదేశించే శాస్త్రం అంతా కూడ ఈ **జ్ఞాననిష్ఠయందే** సార్థకం అవుతుంది. **"విదిత్వా ..... చరన్తి"** (తెలుసుకొని... పిమ్మట దారేషణాదుల **నుండి** లేచి భిక్షాచరణం చేస్తున్నారు), **"తస్మాత్ ..... ఆహుః"** (అందువల్ల తపస్సులలో సంన్యాసమే గొప్ప దని అంటున్నారు), **"న్యాస ఏవాత్యరేచ యత్"** (న్యాసమే అత్యుత్కృష్టమాయెను) అని, **"సంన్యాసః కర్మణాం న్యాసః" "వేదాన్ ...... పరిత్యజ్య"** (వేదాలను ఈ లోకాన్ని పరలోకాన్ని పరిత్యజించి), **"త్యజ ధర్మమధర్మం చ"** (ధర్మాన్ని అధర్మాన్నీ కూడ విడిచిపెట్టుము) ఇత్యాదికం (సార్థకం అవుతుంది). ఇక్కడూకడ భగవద్గీతలోనే అనేక వాక్యములు చూపబడినవి. ఈ వాక్యా లన్నీ వ్యర్థములు (అర్థరహితములు) అవడం యుక్తం కాదు. కేవలం అర్థవాదాలు మాత్రమే అనడానికి కూడ వీలు కాదు; ఇవి తమ ప్రకరణాలలో ఉన్నాయి కదా?

vi. ఏదైన ఒక విషయం ప్రధానంగా చెప్పదలచి దానిని చెప్పి, తరవాత ఆ విషయాన్ని స్తుతించడం కోసమో, నిందించడంకోసమో చెప్పిన 'సోఽ రోదీత్' ఇత్యాదివాక్యాలకు అర్థాలకు అంతగా ప్రాధాన్యం ఉండదు. అందుచేత అవి అర్థవాదలు కావచ్చు. ఏ విషయం ప్రధానంగా చెప్పడానికి ఉద్దేశించబడిందో అది దాని ప్రకరణంలో ప్రధానమైనది గాన అది అర్థవాదం అనడానికి వీలు లేదు. ఈ వాక్యా లన్నీ సంన్యాస పూర్వకజ్ఞానానికి ప్రాధాన్యం ఇస్తూ చెప్పిన వాక్యాలు గాన ఇవి అర్థవాదము లనడం యుక్తం కాదు.

ప్రత్యగాత్మేతి :- మోక్ష మనగా ప్రత్యగాత్మయైన, వికారరహిత మైన స్వరూపము నందు స్థితియే. (అందుచేత సంన్యాసవిధాయకములైన పై వాక్యాలకు ప్రాధాన్యం అంగీకరించి జ్ఞాననిష్ఠయే మోక్షసాధనం లేదా మోక్షం అని చెప్పాలి. కర్మతో మోక్షాని కేమీ సంబంధం లేదు అని భావం). తూర్పు సముద్రం దగ్గరికి వెళ్లా లనుకొనేవాడు, తనకు వ్యతిరేకంగా పశ్చిమసముద్రం వైపు వెడదామనుకొని వెళ్లేవానితో కలిసి ఒకే మార్గంలో ప్రయాణించడం సంభవం కాదు కదా? జ్ఞాననిష్ఠ అనగా ప్రత్యగాత్మను గూర్చిన జ్ఞానము యొక్క నిరంతర ప్రవాహాన్ని ప్రసరింపచేయడంలో పట్టుదల. అది పశ్చిమ సముద్రానికి వెళ్లడం వలె కర్మతో కలవడానికి విరుద్ధం అవుతుంది. ఈ రెండింటి మధ్యా (జ్ఞానమార్గకర్మమార్గాల మధ్య) ఉన్న విరోధం పర్వతానికి ఆవగింజకూ ఉన్న భేదం వంటిది అని ప్రమాణవేత్తల నిశ్చితాభిప్రాయం. అందుచేత జ్ఞాననిష్ఠ సర్వకర్మసంన్యాసంచేత (పూర్వకంగా) చేయదగినది అని నిశ్చితం. 55

భాష్యమ్

స్వకర్మణా భగవతః అభ్యర్చనభక్తియోగస్య సిద్ధిప్రాప్తిః ఫలం, జ్ఞాన నిష్ఠాయోగ్యతా. యన్నిమిత్తా జ్ఞాననిష్ఠా మోక్షఫలావసానా సః భగవద్భక్తియోగః అధునా స్తూయతే శాస్త్రార్థోపసంహారప్రకరణే శాస్త్రార్థనిశ్చయదార్ఢ్యాయ -

మూ. సర్వకర్మాణ్యపి సదా కుర్వాణో మద్వ్యపాశ్రయః,
మత్ప్రసాదాదవాప్నోతి శాశ్వతం పదమవ్యయమ్. 56

బాలానందిని

స్వకర్మణేతి :- స్వకర్మచేత భగవంతుణ్ణి అర్చించడం అనే భక్తియోగానికి సిద్ధి లభించడం ఫలం, అదే జ్ఞాననిష్ఠకు యోగ్యత్వం అనగా. మోక్షరూప మైన ఫలమే అవసానంగా గల (చివరికి మోక్షరూప మైన ఫలం ఇచ్చే) జ్ఞాననిష్ఠ ఏది నిమిత్తంగా గలదో (దేనివల్ల కలుగుతుందో) ఆ భగవద్భక్తియోగం ఇప్పుడు, శాస్త్రార్థాన్ని ఉపసంహరించే ప్రకరణంలో, శాస్త్రార్థనిశ్చయం దృఢంగా కలగడం కొరకు, స్తుతించబడుచున్నది -

ప్ర. అ. సర్వేతి :- మద్వ్యపాశ్రయః = నేను ఆశ్రయింగా కలవాడై, సదా = ఎల్లప్పుడు, సర్వకర్మాణి = అన్ని విధాలైన కర్మలను, కుర్వాణః అపి = చేస్తూన్నవాడైనను, మత్ప్రసాదాత్ = నా అనుగ్రహంవల్ల, శాశ్వతమ్ = శాశ్వతమైన, అవ్యయమ్ = నాశరహిత మైన,పదమ్ = స్థానమును, ఆప్నోతి = పొందుతాడు.

భాష్యమ్

సర్వకర్మాణి ప్రతిషిద్ధాన్యపి, సదా కుర్వాణః అనుతిష్ఠన్ మద్వ్యపాశ్రయః అహం వాసుదేవ ఈశ్వరః వ్యపాశ్రయః యస్య సః మద్వ్యపాశ్రయః, మయి అర్పితసర్వాత్మభావః ఇత్యర్థః; సః అపి, మత్ప్రసాదాత్ మమ ఈశ్వరస్య ప్రసాదాత్, అవాప్నోతి, శాశ్వతం నిత్యం వైష్ణవం పదమ్ అవ్యయమ్. 56

బాలానందిని

సర్వేతి :- అన్ని కర్మలను, ప్రతిషిద్ధకర్మలను కూడ, ఎల్లప్పుడూ చేస్తూన్నా వాసుదేవుడను ఈశ్వరుడను అయిన నేను ఆశ్రయంగా గలవాడు, నాయందే సర్వాత్మభావాన్ని అర్పించినవాడు, అతడు కూడ, ఈశ్వరు డైన నా అనుగ్రహంవల్ల నిత్యము, అవ్యయము అయిన వైష్ణవపదాన్ని పొందుతాడు. 56

భాష్యమ్

యస్మాత్ ఏవం తస్మాత్ -

మూ. చేతసా సర్వకర్మాణి మయి సంన్యస్య మత్పరః,
బుద్ధియోగముపాశ్రిత్య మచ్చిత్తః సతతం భవ. 57

బాలానందిని

య.స్మాదితి :- ఏ కారణంవల్ల ఇది ఇలా ఉందో ఆ కారణంవల్ల -

ప్ర.అ. చేతసా ఇతి :- చేతసా = చిత్తముచేత, సర్వకర్మాణి = సమస్తకర్మలను, మయి = నాయందు, సంన్యస్య = సంన్యసించి, మత్పరః = నేనే పరుడనుగా (ఉత్తమ గతిగా) కలవాడవై, బుద్ధియోగమ్ = బుద్ధియోగమును, ఉపాశ్రిత్య = ఆశ్రయించి, సతతమ్ = ఎల్లప్పుడు, మచ్చిత్తః = నా యందే చిత్తము కలవాడవు, భవ = అగుము.

భాష్యమ్

చేతసా వివేకబుద్ధ్యా, సర్వకర్మాణి దృష్టాదృష్టార్థాని, మయి ఈశ్వరే సంన్యస్య "యత్కరోషి యదశ్నాసి" (9.27) ఇత్యుక్తన్యాయేన, మత్పరః- అహం వాసుదేవః

పరఃయస్యతవసః త్వం మత్పరః సన్, బుద్ధియోగం మయి సమాహితబుద్ధిత్వం బుద్ధియోగః, తం బుద్ధియోగమ్ ఉపాశ్రిత్య, ఆశ్రయః అనన్యశరణత్వమ్, మచ్చిత్తః మయ్యేవ చిత్తం యస్య తవ సః త్వం మచ్చిత్తః సన్ సతతం సర్వదా భవ. 57

బాలానందిని

చేతసేతి :- ఇక్కడనే కనబడే ప్రయోజనములు గలది, ఇక్కడ కనబడిన ప్రయోజనములు గలది అయిన సమస్తకర్మలను వివేకబుద్ధితో, ఈశ్వరుడ నైన నాయందు, "యత్కరోషి యదశ్నాపి" అని చెప్పినవిధంగా, సంన్యసించి, వాసుదేవుడ నైన నేనే పరుడనుగా కలవాడవై, బుద్ధియోగాన్ని ఆశ్రయించి, ఆశ్రయం అనగా మరొక శరణం ఏదీ లేకపోవడం; ఎల్లప్పుడు నాయందే చిత్తము నిలిపినవాడవు అగుము. 57

మూ. మచ్చిత్తః సర్వదుర్గాణి మత్ప్రసాతాత్తరిష్యసి,
అథ చేత్త్వమహంకారాన్న శ్రోష్యసి వినజ్క్ష్యసి. 58

ప్ర.అ. మచ్చిత్త ఇతి :- మచ్చిత్తః = నా యందే చిత్తం కలవాడవై, మత్ప్రసాదాత్= నా అనుగ్రహంవల్ల, సర్వదుర్గాణి = సమస్తములైన దుర్గములను (కష్టాలను), తరిష్యసి = దాటగలవు. అథ = అట్లు కాక, త్వమ్ = నీవు, అహంకారాత్ = అహంకారంవలన, న శ్రోష్యసి చేత్= వినకపోతే, వినజ్క్ష్యసి = నశించగలవు.

భాష్యమ్

మచ్చిత్తః, సర్వదుర్గాణి సర్వాణి దుస్తరాణి సంసారహేతుజాతాని, మత్ప్రసాదాత్, తరిష్యసి అతిక్రమిష్యసి, అథ చేత్ యది, త్వం, మదుక్తమ్ అహంకారాత్ పణ్డితః అహమ్ ఇతి, న శ్రోష్యసి న గ్రహీష్యసి, తతః త్వం వినజ్క్ష్యసి వినాశం గమిష్యసి. 58

బాలానందిని

మచ్చిత్త ఇతి :- నాయందే చిత్తము కలవాడవై దాటడానికి శక్యం కాని సంసారహేతు సముదాయాలను కూడ నా అనుగ్రహంచేత దాటగలవు. అలా కాక "నేను పండితుడను" అను అహంకారంతో నేను చెప్పినది వినకపోయినట్లయితే అప్పుడు నీవు నశిస్తావు. 58

భాష్యమ్

ఇదం చ త్వయా న మన్తవ్యమ్ - "స్వతన్త్రః అహమ్, కిమర్థం పరోక్తం కరిష్యామి" ఇతి -

మూ. యదహంకారమాశ్రిత్య న యోత్స్య ఇతి మన్యసే,
మిథ్యైష వ్యవసాయస్తే ప్రకృతిస్త్వాం నియోక్ష్యతి. 59

బాలానందిని

ఇదమితి :- "నేను స్వతంత్రుడను; ఇతరులు చెప్పినట్లు ఎందుకు చెయ్యాలి?" అని కూడ నువ్వు అనుకొనగూడదు -

యదితి :- అహంకారమ్ = అహంకారమును ఆశ్రిత్య = ఆశ్రయించి, న యోత్స్యే ఇతి = యుద్ధము చేయను అని, యత్ మన్యసే = నువ్వు అనుకొనడం ఏది కలదో, తే = నీయొక్క, ఏషః వ్యవసాయః = ఈ నిర్ణయం, మిథ్యా = అసత్య మైనది. ప్రకృతిః = ప్రకృతి (స్వభావం), త్వామ్ = నిన్ను, నియోక్ష్యతి = నియమించగలదు.

భాష్యమ్

యచ్చ ఏతత్ త్వమ్ అహంకారమ్ ఆశ్రిత్య, న యోత్స్యే ఇతి న యుద్ధం కరిష్యామి ఇతి, మన్యస్తే చిన్తయసి, నిశ్చయం కరోషి, మిథ్యా ఏషః వ్యవసాయః నిశ్చయః, తే తవ, యస్మాత్ ప్రకృతిః క్షత్రస్వభావః త్వాం నియోక్ష్యతి. 59

బాలానందిని

యచ్చేతి :- నువ్వు అహంకారాన్ని ఆశ్రయించి (అహంకారంతో) నేను యుద్ధం చేయను అని ఏ ఆలోచన, నిశ్చయం, చేస్తున్నావో అది మిథ్య యైన (సారంలేని) నిశ్చయమే. ఎందువల్ల ననగా ప్రకృతియే, క్షత్రియస్వభావమే నిన్ను నియమిస్తుంది (నీచేత యుద్ధం చేయిస్తుంది). 59

భాష్యమ్

యస్మాచ్చ -

మూ. స్వభావజేన కౌన్తేయ నిబద్ధః స్వేన కర్మణా,
కర్తుం నేచ్ఛసి యన్మోహాత్కరిష్యస్యవశోఽపి తత్. 60

బాలానందిని

యస్మాచ్చ ఇతి :- ఎందువల్ల కూడ అని అంటే -

ప్ర. అ. స్వభావజేనేతి :- కౌన్తేయ = అర్జునా! మోహాత్ = మోహంవల్ల (తెలివితక్కువ తనంవల్ల) యత్ = ఏ, కర్మ = పనిని, కర్తుమ్ = చేయుటకు, న ఇచ్ఛసి = నువ్వు కోరడం లేదో, తత్ = ఆ పనిని, స్వభావజేన = స్వభావంచేత కలిగిన, స్వేన= నీకు సంబంధించిన, కర్మణా = కర్మచేత, నిబద్ధః = బంధించబడినవాడవై, అవశః = అపి ఇష్టం లేనివాడవై, వశం తప్పిన వాడవైనా, కరిష్యసి = చేయగలవు.

భాష్యమ్

స్వభావజేన శౌర్యాదినా యథోక్తేన కౌన్తేయ! నిబద్ధః నిశ్చయేన బద్ధః, స్వేన

ఆత్మీయేన, కర్మణా కర్తుం న ఇచ్ఛసి యత్ కర్మ, మోహాత్ అవివేకతః, కరిష్యసి అవశః అపి, పరవశ ఏవ, తత్ కర్మ. 60

బాలానందిని

స్వభావేతి :- అర్జునా! అవివేకంవల్ల, ఏ కర్మను చేయను అని అంటున్నావో ఆ కర్మను, స్వభావసిద్ధ మైన ("శౌర్యం తేజః" 8.43 ఇత్యాదికం చేత) వెనుక చెప్పబడిన, నీకు సంబంధించిన కర్మచేత పరవశుడవే అయి చేయగలవు. 60

భాష్యమ్

యస్మాత్ -

మూ. ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి
భ్రామయన్ సర్వభూతాని యన్త్రారూఢాని మాయయా. 61

బాలానందిని

యస్మాదితి :- ఎందువలన అనగా -

ప్ర.అ. ఈశ్వర ఇతి :- అర్జున = అర్జునా! ఈశ్వరః = ఈశ్వరుడు, యన్త్రారూఢాని = యంత్రమును ఎక్కిన (ఎక్కినవివలె ఉన్న), సర్వభూతాని = సమస్తప్రాణులను, మాయయా = మాయచేత, భ్రామయన్ = త్రిప్పుచు, సర్వభూతానామ్ = సమస్తప్రాణుల, హృద్దేశే = హృదయప్రదేశమునందు, తిష్ఠతి = ఉంటున్నాడు.

భాష్యమ్

ఈశ్వరః ఈశనశీలః నారాయణః, సర్వభూతానాం సర్వప్రాణినాం, హృద్దేశే హృదయదేశే, అర్జున - శుక్లాన్తరాత్మస్వభావః విశుద్ధాన్తఃకరణః ఇతి, "అహశ్చ కృష్ణమహరర్జునం చ" (ఋ.సం. 6.9.1) ఇతి దర్శనాత్. తిష్ఠతి స్థితిం లభతే. సః కథం తిష్ఠతి ఇత్యాహ - భ్రామయన్ భ్రమణం కారయన్, సర్వభూతాని, యన్త్రారూఢాని యన్త్రాణి ఆరూఢాని, అధిష్ఠితాని ఇవ ఇతి ఇవశబ్దః అత్ర ద్రష్టవ్యః. యథా దారుకృతపురుషాదీని యన్త్రారూఢాని మాయయా ఛద్మనా భ్రామయన్ తిష్ఠతి ఇతి సంబన్ధః. 61

బాలానందిని

ఈశ్వరఇతి:-ఈశ్వరుడు (సకలప్రాణులను) నియమించే స్వభావం గల నారాయణుడు, సమస్తభూతముల హృదయప్రదేశమునందు, అర్జునా! **"అహశ్చ కృష్ణమర్జునం చ"** (ఒక పగలు నల్లగా కలుషంగా ఉంటుంది, ఒక పగలు స్వచ్ఛంగా ఉంటుంది) అను శ్రుతిలో ప్రయోగించి నట్లు అర్జునశబ్దానికి తెల్లని అంతరాత్మస్వభావం కలవాడు, పరిశుద్ధమైన

అంతఃకరణం కలవాడు అని అర్థం; ఉంటున్నాడు. ఈశ్వరు డెట్లు ఉంటున్నాడో చెపుతున్నాడు – సమస్తభూతాలను 'యన్త్రారూఢాని' అన్నప్పుడు 'ఇవ' శబ్దం కూడ ఉన్నట్లు గ్రహించాలి. యంత్రముమీద ఎక్కినవాటిని వలె, యంత్రంమీద ఎక్కిన కఱ్ఱబొమ్మలను వలె, మాయచేత త్రిప్పుచూ, ఉంటాడు అని అన్వయం. 61

మూ. తమేవ శరణం గచ్ఛ సర్వభావేన భారత,
తత్ప్రసాదాత్పరాం శాన్తిం స్థానం ప్రాప్స్యసి శాశ్వతమ్. 62

ప్ర.అ. **తమితి** : భారత = అర్జునా, తమ్ ఏవ = అట్టి ఆ ఈశ్వరుణ్ణే, సర్వభావేన = సర్వాత్మనా (అన్ని విధాలా), శరణం గచ్ఛ = శరణము పొందుము. తత్ప్రసాదాత్ = ఆ పరమేశ్వరుని అనుగ్రహంవలన, పరామ్ = గొప్ప, శాన్తిమ్ = శాంతిని, శాశ్వతమ్ = శాశ్వత మైన, స్థానమ్ = స్థానమును, ప్రాప్స్యసి = పొందగలవు.

భాష్యమ్

తమేవ ఈశ్వరం, శరణమ్ ఆశ్రయం సంసారార్తిహరణార్థం, గచ్ఛ ఆశ్రయ, సర్వభావేన సర్వాత్మనా, హే భారత! తతః తత్ప్రసాదాత్ ఈశ్వరానుగ్రహాత్, పరాం ప్రకృష్టాం, శాన్తిం పరామ్ ఉపరతిం, స్థానం చ మమ విష్ణోః పరమం పదమ్ అవాప్స్యసి, శాశ్వతం నిత్యమ్. 62

బాలానందిని

తమేవేతి :– ఓ! అర్జునా! సంసారదుఃఖాన్ని పో గొట్టడం కొరకు, ఆ ఈశ్వరుణ్ణే సర్వాత్మనా శరణమును పొందుము, ఆశ్రయించుము. అటుపిమ్మట ఆ ఈశ్వరానుగ్రహం వల్ల ప్రకృష్టమైన శాంతిని, విష్ణువునైన నాయొక్క నిత్య మైన స్థానాన్ని పొందగలవు. 62

మూ. ఇతి తే జ్ఞానమాఖ్యాతం గుహ్యాద్గుహ్యతరం మయా,
విమృశ్యైతదశేషేణ యథేచ్ఛసి తథా కురు. 63

ప్ర.అ. **ఇతీతి** :– ఇతి = ఈ విధంగా, గుహ్యాత్ = రహస్యమైనదానికంటె, గుహ్యతరమ్ = ఎక్కువ రహస్యమైన, జ్ఞానమ్ = జ్ఞానము, మయా = నాచేత, తే = నీకు, అఖ్యాతమ్ = చెప్పబడినది, ఏతత్ = దీనిని, అశేషేణ = పూర్తిగా, విమృశ్య = విమర్శించి, యథా = ఎట్లు, ఇచ్ఛసి = కోరుచున్నావో, తథా = అట్లు, కురు = చేయుము.

భాష్యమ్

ఇతి ఏతత్, తే తుభ్యం, జ్ఞానమ్, ఆఖ్యాతం కథితం, గుహ్యాత్ గోప్యాత్ గుహ్యతరమ్ అతిశయేన గుహ్యమ్, రహస్యమ్ ఇత్యర్థః. మయా సర్వజ్ఞేన ఈశ్వరేణ. విమృశ్య విమర్శనమ్ ఆలోచనం కృత్వా ఏతత్ యథోక్తం శాస్త్రమ్ అశేషేణ సమస్తం యథోక్తం చ అర్థజాతం, యథా ఇచ్ఛసి తథా కురు. 63

బాలానందిని

ఇతీతి :- సర్వజ్ఞుడను ఈశ్వరుడను అయిన నాచేత, ఈ విధంగా, దాచదగినదాని కంటె ఎక్కువ దాచదగిన, రహస్యమైన అని అర్థం; జ్ఞానం నీకు చెప్పబడినది. చెప్పబడిన ఈ సమస్తశాస్త్రమును, చెప్పబడిన విషయసముదాయమును బాగుగా విమర్శించి, విమర్శ పూర్వకంగా ఆలోచించి నీకు ఎట్లు చేయవలె నని ఉంటే అట్లు చేయుము.

భాష్యమ్

భూయోఽపి మయా ఉచ్యమానం శృణు -

మూ. సర్వగుహ్యతమం భూయః శృణు మే పరమం వచః,
ఇష్టోఽసి మే దృఢమితి తతో వక్ష్యామి తే హితమ్. 64

బాలానందిని

భూయ ఇతి :- మళ్లీ నాచేత చెప్పబడుచున్నదానిని వినుము -

ప్ర.అ. సర్వేతి :- మే = నా యొక్క, సర్వగుహ్యతమమ్ = అన్నింటికంటె అతిరహస్య మైన, పరమమ్ = గొప్పదైన, వచః = వచనమును, భూయః = మరల, శృణు = వినుము, మే = నాకు, దృఢమ్ = అత్యధికముగా, ఇష్టః అసి = ఇష్టుడ వయి ఉన్నావు; ఇతి = ఇందుచేత; తతః = ఆ కారంవల్ల, తే= నీకు, హితమ్ = హితమును, వక్ష్యామి = చెప్పగలను.

భాష్యమ్

సర్వగుహ్యతమం సర్వగుహ్యేభ్యః అత్యన్తరహస్యమ్, ఉక్తమపి అసకృత్, భూయః పునః, శృణు మే పరమం వచః, ప్రకృష్టం వచః వాక్యమ్ న భయాత్ నాపి అర్థకారణాత్ వా వక్ష్యామి; కిం తర్హి? ఇష్టః ప్రియః, అసి మే మమ, దృఢమ్ అవ్యభిచారేణ ఇతి కృత్వా, తతః తేన కారణేన, వక్ష్యామి కథయిష్యామి, తే హితం పరం జ్ఞానప్రాప్తి సాధనమ్ తద్ధి సర్వహితానాం హితతమమ్. 64

బాలానందిని

సర్వేతి :- అన్ని రహస్యాలకంటె అత్యంతము రహస్యమైన నా ప్రకృష్టమైన వాక్యమును, పూర్వం అనేకపర్యాయాలు చెప్పబడిన దైనా కూడ, మళ్లీ వినుము. భయంవల్లనో ధనాభిలాషచేతనో నేను చెప్పడంలేదు; మరేమనగా - నాకు నీవు, ఎట్టి మార్పు లేకుండా ఇష్టుడవు గాన, ఆ కారణంచేత నీకు పరమహిత మైనదానిని, జ్ఞానప్రాప్తికి సాధన మైనదానిని చెపుతాను. అది హితాలన్నింటిలోకి హితతమం కదా? 64

భాష్యమ్

కిం తదిత్యాహ-

మూ. మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు.
మామేవైష్యసి సత్యం తే ప్రతిజానే ప్రియోఽసి మే. 65

బాలానందిని

కిమితి :– ఏమి టా హితం అనగా చెపుతున్నాడు –

ప్ర.అ. మన్మనా ఇతి :– మన్మనాః = నాయందే మనస్సు కలవాడవు, మద్భక్తః = నా భక్తుడవు, మద్యాజీ = నన్నే పూజించే స్వభావం కలవాడవు, భవ = అగుము. మామ్ = నన్ను, నమస్కురు = నమస్కరించుము. మామేవ = నన్నే, ఏష్యసి = పొందగలవు. మే = నాకు, ప్రియః = ఇష్టుడవు, అసి = అయి ఉన్నావు; తే = నీకు, సత్యమ్ = సత్యముగా, ప్రతిజానే = ప్రతిజ్ఞ చేయచున్నాను.

భాష్యమ్

మన్మనాః భవ మచ్చిత్తః భవ; మద్భక్తః భవ మద్భజనః భవ; మద్యాజీ మద్యజన శీలః భవ. మాం నమస్కురు నమస్కారమపి మమైవ కురు. తత్ర ఏవం వర్తమానః వాసుదేవే ఏవ సర్వసమర్పితసాధ్యసాధనప్రయోజనః, మామేవ ఏష్యసి ఆగమిష్యసి, సత్యం తే తవ ప్రతిజానే, సత్యాం ప్రతిజ్ఞాం కరోమి ఏతస్మిన్ వస్తునీత్యర్థః. యతః ప్రియః అసి మే. ఏవం భగవతః సత్యప్రతిజ్ఞత్వం బుద్ధ్వా భగవద్భక్తేః అవశ్యం భావిమోక్షఫలమ్ అవధార్య భగవచ్ఛరణైకపరాయణః భవేదితి వాక్యార్థః. 65

బాలానందిని

మన్మనా ఇతి :– నామీద చిత్తము కలవాడవు అగుము (నామీదనే నీ చిత్తము నుంచుము). నన్ను భజించేవాడవు అగుము. నన్ను పూజించే స్వభావం కలవాడవు అగుము. నమస్కారం కూడ నాకే చేయుము. సాధ్యమును, సాధనాలను, ప్రయోజనాన్ని అన్నింటినీ వాసుదేవునియందే సమర్పించి ఈ విధంగా ప్రవర్తిస్తూ నన్నే పొందగలవు. నీకు సత్యంగా ప్రతిజ్ఞ చేస్తున్నాను. ఈ విషయంలో నీకు సత్యమైన ప్రతిజ్ఞను చేస్తున్నాను. ఎందువల్ల ననగా నీవు నాకు ఇష్టుడవు. ఈ విధంగా భగవంతుడు సత్యమైన ప్రతిజ్ఞ కలవాడు అని తెలిసికొని, భగవద్భక్తివలన మోక్షరూప మైన ఫలం తప్పక కలుగుతుం దని నిశ్చయించుకొని కేవలం భగవంతుణ్ణి శరణుపొందడం అనేదానియందు ఒకదానియందే ఆసక్తుడు కావలెను అని వాక్యార్థం. (ఇది శ్రేయోర్థుల నందరినీ ఉద్దేశించి చేసిన ఉపదేశ మని భావం). 65

భాష్యమ్

కర్మయోగనిష్ఠాయాః పరమరహస్యమ్ ఈశ్వరశరణతామ్ ఉపసంహృత్య ఇదానీం కర్మయోగనిష్ఠాఫలం సమ్యగ్దర్శనం సర్వవేదాన్తవిహితం వక్తవ్యమ్ ఇత్యాహ–

మూ. సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ,
అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుభః. 66

బాలానందిని

కర్మేతి :- కర్మయోగనిష్ఠయొక్క పరమరహస్య మైన ఈశ్వరశరణత్వాన్ని (ఈశ్వరుడే రక్షకుడుగా కలిగి ఉండడాన్ని) ఉపసంహరించి ఇప్పుడు కర్మయోగనిష్ఠకు ఫలమైన, సమస్తవేదాంతాలలో విధించబడిన సమ్యగ్దర్శనం చెప్పవలసి ఉన్నది గాన దానిని గూర్చి చెపుతున్నాడు. (కర్మయోగనిష్ఠకు చివరిమెట్టు. పరమరహస్యం ఈశ్వరశరణాగతి. ఈశ్వరుడే శరణ మనే దృఢవిశ్వాసంతో ఈశ్వరార్పణబుద్ధితో కర్మాచరణమే కర్మయోగనిష్ఠ. దాని వల్ల కలిగే ఫలం ఉపనిషత్ప్రతిపాదిత అద్వితీయాత్మజ్ఞానం. పైన ఈశ్వరశరణాగతిని గూర్చి చెప్పి ఇప్పుడు సమగ్దర్శనాన్ని గూర్చి చెప్పబడుచున్నది అని అర్థం) -

ప్ర.అ. సర్వేతి :- సర్వధర్మాన్ = సమస్తకర్మలను, పరిత్యజ్య= విడచి, సంన్యసించి, మామ్ = నన్ను, ఏకమ్ = అద్వితీయాత్మస్వరూపమునుగా, శరణం వ్రజ = శరణ పొందుము, అహమ్ = నేను, త్వా = నిన్ను, సర్వపాపేభ్యః = సమస్తపాపాలనుండి, మోక్షయిష్యామి = విడిపించెదను. మా శుచః = దుఃఖించకుము.

భాష్యమ్

సర్వధర్మాన్ - సర్వే చ తే ధర్మాశ్చ సర్వధర్మాః తాన్. ధర్మశబ్దేనాత్ర అధర్మః అపి గృహ్యతే, నైష్కర్మ్యస్య వివక్షితత్వాత్ **"నావిరతో దుశ్చరితాత్"** (క.ఠ. 2.24) **"త్యజ ధర్మమధర్మం చ"** (శాం.ప. 329.40; 331.44) ఇత్యాదిశ్రుతిస్మృతిభ్యః. సర్వధర్మాన్ పరిత్యజ్య, సంన్యస్య సర్వకర్మాణి ఇత్యేతత్. మామ్ ఏకం సర్వాత్మానం సమం సర్వభూతస్థితమ్ ఈశ్వరమ్ (అచ్యుతం గర్భజన్మ జరామరణవర్జితమ్) అహమేవ ఇతి ఏకం శరణం వ్రజ. న మత్తః అన్యత్ అస్తి ఇత్యవధారయ ఇత్యర్థః. అహం త్వా త్వామ్, ఏవం నిశ్చితబుద్ధిం, సర్వపాపేభ్యః సర్వధర్మాధర్మబన్ధరూపేభ్యః మోక్షయిష్యామి, స్వాత్మభావప్రకాశీకరణేన. ఉక్తం హి **"నాశయామ్యాత్మభావస్థో జ్ఞానదీపేన భాస్వతా"** (10.11) ఇతి. అతః మా శుచః శోకం మాకార్షీః ఇత్యర్థః.

బాలానందిని

సర్వేతి :- సమస్తధర్మములను -ఇక్కడ ధర్మశబ్దంచేత అధర్మం కూడ గ్రహించబడుతుంది. ఎందువల్ల ననగా నైష్కర్మ్యం వివక్షితం (ఏ కర్మలూ లేకపోవడాన్ని చెప్పా లని ఇక్కడ ఉద్దేశింపబడినది) **"నావిరతః దుశ్చరితాత్"** (పాపమునుండి విరమించనివాడు ఆత్మను తెలుసుకొనజాలడు) అని, **"త్యజ ధర్మమధర్మం చ"** (ధర్మాన్నీ అధర్మాన్నీ కూడ త్యజించుము) అని శ్రుతి-స్మృతులు చెప్పుచున్నవి కూడ. సర్వధర్మాలను విడచి, సర్వకర్మలను సంన్యసించి అని అర్థం. అందరికీ ఒకే ఆత్మను,

అన్ని భూతాలలో ఉన్నవాడను, ఈశ్వరుడను, అచ్యుతడను (నాశరహితుడను) గర్భము నుండి జన్మ జర మరణము లేనివాడను అయిన నన్ను ఒక్కనినే శరణుపొందుము; నేను ఆ ఈశ్వరుడను అని, "నా కంటె అన్యము ఏదీ లేదు" అనీ నిర్ధారణ చేసి కొనుము. "నేనే ఈశ్వరుడను" అను భావనయే శరణుజొచ్చుట అని భావం). ఈ విధంగా నిశ్చితమైన బుద్ధి గల నిన్ను నేను సర్వపాపములనుండి, సమస్తమైన ధర్మాధర్మబంధనరూపము లైన పాపములనుండి, విడిపిస్తాను; నీ యథార్థాత్మ స్వరూపమును ప్రకాశింపచేయడం ద్వారా (పాపాదిబంధనములనుండి విడిపిస్తాను). **"నాశయామ్యాత్మభావస్థః జ్ఞానదీపేన భాస్వతా"** అని వెనుక కూడ చెప్పబడినది. అందువల్ల శోకమును చేయకుము.

భాష్యమ్

అస్మిన్ హి గీతాశాస్త్రే పరం నిఃశ్రేయససాధనం నిశ్చితం కిం జ్ఞానం, కిం కర్మ వా ఆహోస్విత్ ఉభయమ్ ఇతి. కుతః సంశయః? **"యద్ జ్ఞాత్వామృతమశ్నుతే"** (18.12), **"తతో మాం తత్త్వతో జ్ఞాత్వా విశతే తదనన్తరమ్"** (18.55) ఇత్యాదీని వాక్యాని కేవలజ్ఞానాత్ నిఃశ్రేయసప్రాప్తిం దర్శయన్తి. **"కర్మణ్యేవాధికారస్తే"** (2-47), **"కురు కర్మైవ"** (4.15) ఇత్యేతమాదీని కర్మణామ్ ఆవశ్యకతాం దర్శయన్తి. ఏవం జ్ఞానకర్మణోః కర్తవ్యత్వోపదేశాత్ సముచ్చితయోః అపి నిఃశ్రేయసహేతుత్వం స్యాత్ ఇతి భవేత్ సంశయః.

బాలానందిని

అస్మిన్నితి :- ఈ గీతాశాస్త్రంలో జ్ఞానం ఉత్తమ మైన మోక్షసాధన మని నిశ్చయించబడినదా, లేక కర్మయా లేక రెండూనా? ఈ సంశయం ఎందుకు కలుగుతున్నది? **"యద్ జ్ఞాత్వామృతమశ్నుతే", "తతో... తదనన్తరమ్"** మొదలైన వాక్యాలు కేవలజ్ఞానం వల్లనే నిఃశ్రేయసం లభిస్తుం దని చెపుతున్నాయి. **"కర్మణ్యేవాధికారస్తే", "కురు కర్మైవ తస్మాత్త్వమ్"** ఇత్యాదివాక్యాలు కర్మలు తప్పక చేయదగినవి అని చూపుతున్నాయి. అట్లే - జ్ఞానకర్మలు రెండూ చెయ్యాలని ఉపదేశించడంవల్ల సముచ్చితము లైన జ్ఞానకర్మలు (జ్ఞానకర్మలు కలిసియే) నిఃశ్రేయసానికి హేతువు అని సంశయం కూడ కలగవచ్చును.

భాష్యమ్

కిం పునః అత్ర మీమాంసాఫలమ్? నను ఏతదేవ - ఏషామ్ అన్యతమస్య పరమనిఃశ్రేయససాధనత్వావధారణమ్? అతః విస్తీర్ణతరం మీమాంస్యమ్ ఏతత్.

ఆత్మజ్ఞానస్య తు కేవలస్య నిఃశ్రేయసహేతుత్వమ్; భేదప్రత్యయనివర్తకత్వేన కైవల్య ఫలావసానాత్వాత్. క్రియాకారకఫలభేదబుద్ధిః అవిద్యయా ఆత్మని నిత్యప్రవృత్తా "మమ కర్మ", "అహం కర్తా", "అముష్మై ఫలాయ ఇదం కరిష్యామి" ఇతి ఇయమ్ అవిద్యా అనాదికాలప్రవృత్తా. అస్యాః అవిద్యాయాః నివర్తకమ్ – "అయమ్ అహమ్ అస్మి కేవలః అకర్తా అక్రియః అఫలః, న మత్తః అన్యః అస్తి కశ్చిత్" ఇత్యేవంరూపమ్ ఆత్మ విషయం జ్ఞానమ్ ఉత్పద్యమానమ్; కర్మప్రవృత్తిహేతుభూతాయాః భేదబుద్ధేః నివర్తక త్వాత్. తుశబ్దః పక్షద్వయవ్యావృత్త్యర్థః–న కేవలేభ్యః కర్మభ్యః, న చ జ్ఞానకర్మభ్యాం సముచ్చితాభ్యాం నిఃశ్రేయసప్రాప్తిః ఇతి పక్షద్వయం నివర్తయతి. అకార్యత్వాచ్చ నిఃశ్రేయసస్య కర్మసాధనత్వానుపపత్తిః.న హి నిత్యం వస్తు కర్మణా జ్ఞానేన వా క్రియతే.

బాలానందిని

కిమితి :– (ప్రశ్న) ఇక్కడ ఈ మీమాంస చేసినందుకు ఫలం ఏమిటి? (సమాధానం) వీటిలో ఏది పరమనిఃశ్రేయసానికి సాధనమో నిర్ణయించడమే ఫలం. అందుచేత ఈ విషయాన్ని అతివిస్తృతంగా మీమాంస చెయ్యాలి.

అవ. ముందుగా సిద్ధాంతవాక్యాన్ని చెపుతున్నారు :– ఆత్మేతి :– ఆత్మజ్ఞానం భేదబుద్ధిని తొలగించి కైవల్యం అనే ఫలాన్ని చివరికి ఇస్తుంది గాన కేవలం ఆత్మజ్ఞానం మాత్రమే నిఃశ్రేయసహేతువు. ఆత్మవిషయంలో అవిద్యచేత క్రియలు, కారకాలు, ఫలాలు అనే భేదబుద్ధి నిత్యమూ ప్రవర్తిస్తూన్నది. "ఇది నా కర్మ", "నేను కర్తను", "ఫలానా ఫలం కోసం ఈ పని చేస్తాను" అని ఈ అవిద్య అనాదికాలంనుంచి ప్రవర్తిస్తూన్నది. "ఈ నేను కేవలుడను (అద్వితీయుడను) కర్తను కాను, క్రియలు లేనివాడను; ఫలాలు లేనివాడను, నాకంటె వేరుగా ఎవ్వడూ లేడు" అని ఆత్మవిషయంలో కలిగే జ్ఞానం ఈ అవిద్యను నివర్తింపచేస్తుంది. (పై సిద్ధాంతవాక్యంలోని) 'తు' శబ్దం ("ఆత్మజ్ఞానస్య తు" లోని తుశబ్దం) పక్షద్వయాన్ని నివారించడంకోసం ప్రయోగించబడినది. కేవలం కర్మలవల్ల మాత్రం మోక్షం కలుగదు; సముచ్చితములైన జ్ఞానకర్మలవల్ల కలుగదు అని సూచిస్తూ ఆ రెండు పక్షాలను నివారిస్తూన్నది. మోక్షం అనేది క్రొత్తగా పుట్టింపదగినది కాదు. అందువల్ల కూడ దీనికి కర్మసాధనం అని చెప్పడం ఉపపన్నం కాదు. నిత్యమైన వస్తువు కర్మచేత గాని, జ్ఞానంచేత గాని పుట్టింపబడదు కదా?

భాష్యమ్

కేవలజ్ఞానమప్యనర్థకం తర్హి? న; అవిద్యానివర్తకత్వే సతి దృష్టకైవల్యఫలావ సానత్వాత్. అవిద్యాతమో నివర్తకస్య జ్ఞానస్య దృష్టం కైవల్యఫలావసానత్వమ్; రజ్జ్వాది

విషయే సర్పాద్యజ్ఞానతమోనివర్తకప్రదీపప్రకాశఫలవత్. వినివృత్తసర్వవికల్పరజ్జు కైవల్యావసానం హి ప్రకాశఫలం; తథా జ్ఞానమ్. దృష్టార్థానాం చ ఛిదిక్రియాగ్ని మన్థనాదీనాం వ్యాపృతకర్త్రాదికారకాణాం ద్వైధీభావవాగ్నిదర్శనాదిఫలాత్ అన్యఫలే వ్యాపృతస్య జ్ఞాత్రాదికారకస్య ఆత్మకైవల్యఫలాత్ అన్యఫలే కర్మాన్తరే వ్యాపారానుపపత్తిః యథాతథా జ్ఞాననిష్ఠాక్రియాయాం దృష్టార్థాయాం వ్యాపృతస్య జ్ఞాత్రాదికారకస్య ఆత్మకైవల్యఫలాత్ అన్యఫలే కర్మాన్తరే ప్రవృత్తిః అనుపపన్నా ఇతి న జ్ఞాననిష్ఠా కర్మసహితా ఉపపద్యతే. భుజ్యగ్నిహోత్రాదిక్రియావత్ స్యాత్ ఇతి చేత్, న; కైవల్యఫలే జ్ఞానే క్రియాఫలార్థిత్వానుపపత్తేః కైవల్యఫలే హి జ్ఞానే ప్రాప్తే సర్వతః సంప్లుతోదకే ఫలే కూపతడాగాదిఫలార్థిత్వాభావవత్ ఫలాన్తరే తత్సాధన భూతాయాం వా క్రియా యామ్ అర్థిత్వానుపపత్తిః. న హి రాజ్యప్రాప్తిఫలే కర్మణి వ్యాపృతస్య క్షేత్రప్రాప్తిఫలే వ్యాపారోపపత్తిః తద్విషయం చ అర్థిత్వమ్. తస్మాత్ న కర్మణః అస్తి నిఃశ్రేయస సాధనత్వమ్.

బాలానందిని

కేవలేతి :- (ప్రశ్న) అటైతే కేవలజ్ఞానం కూడ వ్యర్థమే కదా. (నిత్యమైన మోక్షం దేనిచేతా) పుట్టించబడేది కాదు గాన కర్మ ఏ విధంగా పుట్టించజాలదో జ్ఞానం కూడ మోక్షాన్ని పుట్టించ జాలదు అని ప్రష్ట అభిప్రాయం) (సమాధానం) అది కాదు; జ్ఞానం అవిద్యానివర్తకం గాన అది చివరికి కైవల్యమనే ఫలాన్ని ఇస్తుంది. (ఈ విషయమే వివరిస్తున్నారు) - అవిద్య అనే తమస్సును నివర్తింపచేసే జ్ఞానం చివరికి కైవల్య మనే ఫలాన్ని ఇవ్వడం కనబడుచున్నది. త్రాడు మొదలైనవాటి విషయంలో సర్పం మొదలైన (సర్పజ్ఞానం మొదలైన) తమస్సును తొలగించే దీపప్రకాశముయొక్క ఫలం ఎట్లో అట్లే ఇది కూడ. (దీపప్రకాశం రజ్జువు విషయంలో కలిగిన సర్పాదిభ్రాంతి అనే తమస్సును తొలగిస్తూన్నది. అదే ఆ దీపప్రభకు ఫలం. అట్లే జ్ఞానానికి ఫలం కూడా అజ్ఞాననివృత్తియే; అదే కైవల్యం అని భావం) ఛేదనక్రియ మంథనక్రియ మొద లైన క్రియలు చేయడానికి ప్రవర్తిస్తూన్న కర్త్రాదికారకాలకు రెండు ముక్కలుగా చీలుట, అగ్ని కనబడుట ఇత్యాది ఫలాలు తప్ప ఇతర కర్మలయందు ఏ విధంగా వ్యాపారం ఉండదో అట్లే ప్రత్యక్షంగా కనబడే ఫలం గల జ్ఞాననిష్ఠ అనే క్రియయందు వ్యాపృతము లైన (ఉద్యుక్తములైన) జ్ఞాత మొదలైన కారకాలకు ఆత్మకైవల్య మనే ఫలం తప్ప వేరొక ఫలం ఇచ్చే మరొక కర్మయందు ప్రవర్తించడం అనుపపన్నం గాన జ్ఞాననిష్ఠకు కర్మసాహిత్యం కుదరదు.

వి. కట్టను ఛేదించడం అనే క్రియ ఉంది. కట్టల రాపిడిచేత అగ్నిని పుట్టించడం అనే క్రియ ఉంది. మొదటి క్రియకు ఫలం కట్టె రెండు ముక్కలుగా చీలడం. రెండవ

క్రియకు ఫలం అగ్ని కనబడడం. ఈ ఫలంకోసం పనులు చేసే కర్త్రాదికారకాలు కేవలం ఈ పనులు చేయడానికే ఉద్యుక్తము లౌతాయి కాని మరొక ఫలం ఏదో ఇచ్చే మరొక పని చేయడానికి ఉద్యుక్తములు కావు. జ్ఞాననిష్ఠ అనేది ఒక క్రియ. దీని ఫలం ఆత్మ సాక్షాత్కారం. ఈ ఫలం కోసం జ్ఞాననిష్ఠ అనే క్రియ చేయడానికి ఉద్యుక్తా లైన జ్ఞాత మొదలైన కారకాలు ఈ ఫలం కాక మరొక (స్వర్గాది) ఫలాన్ని ఇచ్చే ఇతరకర్మలయందు ప్రవర్తించవు. అందుచేత జ్ఞానానికి ఇతరకర్మలతో సాహిత్యం కుదరదు. (ఆశంక) భుజించుట, అగ్నిహోత్రం చేయుట అనే రెండు క్రియలవలె జ్ఞానక్రియలతో పాటు ఇతరక్రియలు (కర్మలు) చేయవచ్చును కదా అని అంటే.

వి. ఒకే పురుషుడు తృప్తి అను ఫలం ఇచ్చే భోజనక్రియ చేస్తున్నాడు, స్వర్గాది ఫలం ఇచ్చే అగ్నిహోత్రాదికం చేస్తున్నాడు. ఒక ఫలం ఇచ్చే ఒక పని చేస్తున్నవాడే మరొక ఫలం ఇచ్చే మరొక పని చేస్తూన్నాడు కదా అని పృచ్ఛకుని ఆశయం.

నేతి :- (సమాధానం) అది యుక్తం కాదు. కైవల్యం ఫలంగా గల జ్ఞానం కలిగిన తరవాత క్రియాఫలాన్ని కోరడం అనేది ఉపపన్నం కాదు కదా? అంతటా పొంగి పొరలుతూన్న ఉదకం అనే ఫలం లభించిన తరవాత నూతులు, చెరువులు మొదలైనవాటిని తవ్వడం అనే క్రియయందు కోరిక ఉండ నట్లు కైవల్య మనే ఫలం గల జ్ఞానం లభించిన తరవాత మరొక ఫలం విషయంలో గాని, దానికి సాధనమైన క్రియయందు గాని కోరిక ఉండడం కుదరదు కదా? రాజ్యప్రాప్తి అనే పలం ఇచ్చే పనిలో ఉద్యుక్తు డైనవాడు చిన్న పొలం లభించడ మనే ఫలం విషయంలో ఉద్యుక్తు డౌతాడు అనడం కాని, దానియందు ఆసక్తి కలవాడుగా ఉంటాడు అనడం కాని ఉపపన్నం కాదు కదా? అందువల్ల కర్మ నిఃశ్రేయసాధనం కాజాలదు.

భాష్యమ్

న చ జ్ఞానకర్మణోః సముచ్చితయోః. నాపి జ్ఞానస్య కైవల్యఫలస్య కర్మసాహాయ్యాపేక్షా; అవిద్యానివర్తకత్వేన విరోధాత్. న హి తమః తమసః నివర్తకమ్. అతః కేవలమేవ జ్ఞానం నిఃశ్రేయససాధనమ్ న; నిత్యాకరణే ప్రత్యరాయప్రాప్తేః కైవల్యస్య చ నిత్యత్వాత్. యత్ తావత్ కేవలజ్ఞానాత్ కైవల్యప్రాప్తిః ఇత్యేతత్ అసత్. యతః నిత్యానాం కర్మణాం శ్రుత్యుక్తానామ్ అకరణే ప్రత్యవాయః నరకాదిప్రాప్తిలక్షణః స్యాత్. నను ఏవం తర్హి కర్మభ్యః మోక్షః నాస్తి ఇతి అనిర్మోక్ష ఏవ? నైష దోషః. నిత్యత్వాత్ మోక్షస్య. నిత్యానాం కర్మణామ్ అనుష్ఠానాత్ ప్రత్యవాయస్య అప్రాప్తిః. ప్రతిషిద్ధస్య చ అకరణాత్ అనిష్ట శరీరానుపపత్తిః. కామ్యానాం చ వర్జనాత్ ఇష్టశరీరానుపపత్తిః. వర్తమానశరీరార్భకస్య చ కర్మణః ఫలోపభోగపక్షయే, పతితే అస్మిన్ శరీరే దేహాన్తరోత్పత్తౌ చ కారణాభావాత్ ఆత్మనః, రాగాదీనాం చ అకరణాత్, స్వరూపావస్థానమేవ కైవల్యమ్ ఇతి అయత్న సిద్ధం కైవల్యమితి.

బాలానందిని

న చేతి :- సముచ్చితము లైన (కలిసిన) జ్ఞానకర్మలు నిఃశ్రేయసానికి సాధనా లవుతాయి. అనడం కూడ కుదరదు. (కర్మతో కలిసిన జ్ఞానం సాధనం కాక పోయినా జ్ఞానం మోక్షం కలిగించడానికి కర్మను అపేక్షిస్తుంది అను ఆశంకకు సమాధానం చెపుతున్నారు. సముచ్చితము లైనప్పుడు రెండింటికి సమప్రాధాన్యం ఉంటుంది. కర్మ సహాయంగా మాత్రం ఉంటుంది. ప్రధానంగా మోక్షాన్ని ఇచ్చేది జ్ఞానమే అని ఈ పక్షంలో అభిప్రాయం) – కైవల్యం ఫలంగా గల జ్ఞానానికి కర్మయొక్క సాహాయ్యం అవసరం అవుతుంది అనడం కూడ యుక్తం కాదు. ఎందువల్ల ననగా జ్ఞానం అవిద్యను అడ్డుకుంటుంది గాన జ్ఞానానికీ కర్మకూ విరోధం. (అవిద్య ఉన్నవాడే కర్మాచరణం చేయడం కుదురుతుంది. అలాంటి అవిద్యామూలక మైన కర్మాచరణం అవిద్యను పోగొట్టే జ్ఞానానికి సహకారి కాజాల దని భావం). చీకటి చీకటిని పోగొట్టదు కదా? (అవిద్యామూలక మైన కర్మ అవిద్యను పోగొట్ట దని భావం). అందుచేత ఒక్క జ్ఞానం మాత్రమే నిఃశ్రేయసానికి సాధనం.

అ.వ. కేవలం జ్ఞానమే మోక్షసాధనం అనుదానిని ఆక్షేపిస్తున్నాడు – న ఇతి:- నువ్వు చెప్పినది యుక్తం కాదు; నిత్య కర్మలు చేయకపోతే ప్రత్యవాయం కలుగుతుంది కదా? కైవల్యం నిత్య మైనది కదా? (దీనినే వివరిస్తున్నాడు) – కేవలం జ్ఞానంవల్లనే కైవల్యం లభిస్తుంది అని చెప్పినది యుక్తం కాదు. ఎందువల్ల ననగా శ్రుతివిహితము లైన నిత్యకర్మలను ఆచరించకపోతే నరకాదిప్రాప్తి వంటి ప్రత్యవాయం కలుగుతుంది. (అందుచేత నిత్యకర్మలు తప్పకుడా చెయ్యాలి గాన నిత్యకర్మసహితజ్ఞానంవల్లనే మోక్షం కలగాలి కేవల జ్ఞానంవల్ల కలగదు అని పూర్వపక్షి అభిప్రాయం). (సిద్ధాంతి ప్రశ్నిస్తున్నాడు) – అయితే కర్మలవల్ల మోక్షం కలుగదు గాన మోక్షం అనేదే ఉండ దని చెప్పవలసి వస్తుంది. కదా? (వేదవిహితా లైన నిత్యనైమిత్తకకర్మలను తప్పక అనుష్ఠించా లని అంటున్నావు. జ్ఞానసముచ్చితము లైనా సముచ్చితముల కాకపోయినా కర్మలు మోక్షహేతువులు కావు అని వెనుక నిశ్చయించి ఉన్నాం. నీ మతం ప్రకారం కేవలజ్ఞానం ఉండే ప్రసిక్తి లేదు; అందుచేత దానివల్ల మోక్షం రాదు. అలాం టప్పుడు అసలు మోక్ష మనేదే లేకుండా పోతుంది కదా అని సిద్ధాంతి చేసిన ఈ ప్రశ్నకు భావం). (పూర్వపక్షి సమాధానం– "కైవల్యస్య చ నిత్యత్వాత్" అని వెనుకటి వాక్యం అర్థం వివరిస్తున్నాడు పూర్వపక్షి)– మోక్షం నిత్యం కదా? (అందుచేత మోక్షం ఎలా కలుగుతుందో చెపుతున్నాడు) – నిత్యకర్మలను అనుష్ఠించడం వల్ల ప్రత్యవాయం రాదు. ప్రతిషిద్ధమైన పాపకర్మలను చేయకపోవడంవల్ల అనిష్టమైన (దుఃఖహేతువు లైన) శరీరాలు రావు. కామ్యకర్మలను చేయకపోవడంవల్ల ఇష్టశరీరాలు (స్వర్గాదులకు వెళ్లడానికి ఉపయోగించే శరీరాలు) కలుగవు. ఏ కర్మయొక్క ఫలితంగా వర్తమాన శరీరం లభించినదో ఆ కర్మ యొక్క ఫలాన్ని అనుభవించడంచేత ఆ

కర్మ క్షీణించగా, ఈ శరీరం రాలిపోయిన తరవాత మరొక శరీరం రావడానికి కారణం ఏదీ లేకపోవడం వల్ల, ఆత్మ (శరీరం లేని ఆత్మ) రాగాదులను చేయకపోవడంవల్లా, ఆ ఆత్మ స్వస్వరూపంలోనే ఉండిపోతుంది. అదే కైవల్యం. ఈ విధంగా కైవల్యం ఏ ప్రయత్నమూ లేకుండానే సిద్ధిస్తుంది.

భాష్యమ్

అతిక్రాన్తానేకజన్మాన్తరకృతస్య స్వర్గనరకాదిప్రాప్తిఫలస్య అనారబ్ధకార్యస్య ఉపభోగానుపపత్తేః క్షయాభావః ఇతి చేత్ – న; నిత్యకర్మానుష్ఠానాయాసదుఃఖోపభోగస్య తత్ఫలోపభోగత్వోపపత్తేః. ప్రాయశ్చిత్తవద్వా పూర్వోపాత్తదురితక్షయార్థత్వాత్ నిత్యకర్మణామ్. ఆరబ్ధానాం చ ఉపభోగేనైవ కర్మణాం క్షీణత్వాత్, అపూర్వాణాం చ కర్మణామ్ అనారమ్భే అయత్నసిద్ధం కైవల్యమ్ ఇతి; న; **"తమేవ విదిత్వాఽతి మృత్యుమేతి నాన్యః పన్థా విద్యతేఽయనాయ"** (శ్వే.ఉ.3.8) ఇతి విద్యాయాః అన్యః పన్థాః మోక్షాయ న విద్యతే ఇతి శ్రుతేః. చర్మవత్ ఆకాశవేష్టనాసంభవవత్ అవిదుషః మోక్షాసంభవశ్రుతేః (శ్వే.ఉ. 6.20) **"జ్ఞానాత్ కైవల్యమాప్నోతి"** ఇతి చ పురాణ స్మృతేః.అనారబ్ధఫలానాం పుణ్యానాం కర్మణాం క్షయానుపపత్తేశ్చ. యథా పూర్వోపాత్తానాం దురితానామ్ అనారబ్ధలఫలానాం స్యాత్ సంభవః, తథా పుణ్యానామ్ అనారబ్ధఫలానాం స్యాత్ సంభవః. తేషాం చ దేహాన్తరమ్ అకృత్వా క్షయానుపపత్తౌ మోక్షానుపపత్తిః ధర్మాధర్మ హేతూనాం చ రాగద్వేషమోహానామ్ అన్యత్ర ఆత్మజ్ఞానాత్ ఉచ్ఛేదానుపపత్తేః ధర్మాధర్మోచ్ఛేదానుపపత్తిః నిత్యానాం. చ కర్మణాం పుణ్యఫలత్వశ్రుతేః – **"వర్ణా ఆశ్రమాశ్చ స్వకర్మనిష్ఠాః"** (గౌ.ధ. సూ.11.29) ఇత్యాదిస్మృతేశ్చ కర్మక్షయానుపపత్తిః.

బాలానందిని

అతిక్రాన్తేతి :– (పూర్వపక్షి తానే ఒక ఆక్షేపణ చేసుకొని సమాధానం చెపుతున్నాడు) – గడచిన అనేక జన్మాంతరాలలో చేసిన ఎంతో కర్మ ఉంటుంది. అది స్వర్గప్రాప్తిని నరకప్రాప్తిని ఫలంగా ఇవ్వవలసి ఉంటుంది. అది తన ఫలం ఇవ్వడానికి ఇంకా ప్రారంభించనప్పుడు దానిని అనుభవించడం కుదరదు గాన అది క్షీణించడం కుదరదు అన్నట్లయితే అది యుక్తం కాదు; ఎందువల్ల ననగా నిత్యకర్మలను ఆచరించడంలో ఉండే ఆయాసము యొక్క అనుభవమ్మే,ఆ పూర్వజన్మకృతకర్మల ఫలం అని చెప్పవచ్చును; లేదా ప్రాయశ్చిత్తం ఏ విధంగా చేసిన పాపానికి పరిహారమో అట్లే నిత్యకర్మలు కూడ పూర్వం చేసి ఉన్న పాపం నశించడానికి ఉపయోగిస్తాయి; అదే వాటి ప్రయోజనం అని చెప్పవచ్చును.

ఆరబ్ధకర్మలు (ఫలాన్ని ఇవ్వడానికి ప్రారంభించిన కర్మలు) ఫలోపభోగంచేతనే క్షీణిస్తాయి. క్రొత్త కర్మ లేవీ చేయడం లేదు; ఈ విధంగా కైవల్యం అప్రయత్నంగానే (జ్ఞానాపేక్ష లేకుండానే) సిద్ధిస్తుంది. (సిద్ధాంతి సమాధానం) ఇది యుక్తం కాదు. **"తమేవ .... అయనాయ"** అను శ్రుతి మోక్షానికి విద్య (జ్ఞానం) తప్ప మరొక మార్గం లేదని చెప్పుచున్నది. ఆకాశాన్ని చర్మను చుట్టి నట్లు చుట్టడం ఏ విధంగా అసంభవమో అట్లే అవిద్వాంసునికి (జ్ఞానం లేనివానికి) మోక్షం అసంభవం అని మరొక శ్రుతి చెప్పుచున్నది.

వి. "యదా చర్మవదాకాశం వేష్టయిష్యన్తి మానవాః,
తదా దేవమవిజ్ఞాయ దుఃఖస్యాన్తో భవిష్యతి" అని శ్రుతి.

"మానవులు అకాశాన్ని చర్మను చుట్టి నట్లు చుట్టకలిగి నప్పుడు పరమాత్మను తెలుసుకొనకుండగానే సంసారం అంత మవుతుంది అని దీని అర్థం.

జ్ఞానాదితి :- జ్ఞానంవల్ల కైవల్యం పొందుతాడు అని పురాణరూపా లైన స్మృతులు (లేదా పురాణాలు స్మృతులు) చెపుతున్నాయి. మరొక విషయ మేమనగా తమ ఫలం ఇవ్వడానికి ప్రారంభించని పుణ్యకర్మలు క్షీణించడం కుదరదు.(దీనినే విశదీకరిస్తున్నారు) – ఫలం ఇవ్వడానికి ప్రారంభించని (అనారబ్ధఫలములైన) పూర్వోపాత్తదురితాలు ఉండడానికి ఏ విధంగా అవకాశం ఉందో అట్లే అనారబ్ధఫలా లైన పూర్వోపాత్తపుణ్యాలు ఉండడానికి కూడ అవకాశం ఉంది. అవి మరొక దేహం ఇవ్వకుండా క్షీణించడం కుదరదు గాన మోక్షం కుదరదు. అట్లే – ధర్మాధర్మాలకు హేతువు లైన రాగద్వేషమోహాలు ఆత్మజ్ఞానం కలిగితే తప్ప మరొక విధంగా నశించవు గాన ధర్మాధర్మాలు నశించడం కుదరదు. మరొక విషయ మేమనగా – నిత్యకర్మలవల్ల పుణ్యలోకాలు లభిస్తాయి. అని (**"కర్మణా పితృ లోకః"** ఇత్యాది) శ్రుతులు చెపుతున్నాయి, "వర్ణా ఆశ్రమాశ్చ స్వకర్మనిష్ఠాః" ఇత్యాది స్మృతులు కూడ ఆ విషయమే చెపుతున్నాయి. అందువల్ల కర్మ క్షీణించడం అనేది కుదరదు.

భాష్యమ్

యే తు ఆహుః నిత్యాని కర్మాణి దుఃఖరూపత్వాత్ పూర్వకృతదురితకర్మణాం ఫలమేవ, న తు తేషాం స్వరూపవ్యతిరేకేణ అన్యత్ ఫలమ్ అస్తి, అశ్రుతత్వాత్. జీవనాదినిమిత్తే చ విధానాత్ ఇతి–న;అప్రవృత్తానాం ఫలదానాసంభవాత్,దుఃఖఫలవిశేషానుపపత్తిశ్చ స్యాత్.యదుక్తం పూర్వజన్మకృతదురితానాం కర్మణాం ఫలం నిత్యకర్మానుష్ఠానాయాసదుఃఖం భుజ్యతే ఇతి,తత్ అసత్.న హి మరణకాలే ఫలదానాయ అనఙ్కురీభూతస్య కర్మణః ఫలమ్ అన్యకర్మారబ్ధే జన్మని ఉపభుజ్యతే ఇతి ఉపపత్తిః.అన్యథా స్వర్గఫలోపభోగాయ అగ్నిహోత్రాదికర్మారబ్ధే జన్మని నరకకర్మఫలోపభోగానుపపత్తిః

న స్యాత్. తస్య దురితదుఃఖవిశేషఫలత్వానుపపత్తేశ్చ. అనేకేషు హి దురితేషు సంభవత్సు భిన్నదుఃఖసాధనఫలేషు నిత్యకర్మానుష్ఠానాయాసదుఃఖమాత్రఫలేషు కల్ప్యమానేషు ద్వన్ద్వరోగాదిబాధానిమిత్తం న హి శక్యతే కల్పయితుమ్-నిత్యకర్మానుష్ఠానాయాసదుఃఖమేవ పూర్వకృతదురితఫలం,న శిరసా పాషాణవహనాదిదుఃఖమ్ ఇతి.

బాలానందని

యే త్వితి:-"నిత్య కర్మలు దుఃఖరూప మైనవి గాన అవి పూర్వజన్మలలో చేసిన పాప కర్మల ఫలమే. అవే ఫలం అవడంచేత వాటి స్వరూపంకంటె వేరుగా వాటికి మరొక ఫలం అంటూ ఏదీ లేదు;ఎందువల్ల ననగా-అలాంటి ఫలం ఉన్న దని శాస్త్రంలో వినబడడం లేదు;ఇవి జీవనాదినిమిత్తాన్ని పురస్కరించుకొని విధించబడ్డాయి కూడ.("జీవించి ఉన్ననాళ్లు అగ్నిహోత్రం చెయ్యాలి"ఇత్యాదివిధంగా అగ్నిహోత్రాదికర్మలు విధించబడ్డాయి. అగ్నిహోత్రం ఎందుకు చెయ్యాలి అని అడిగితే నీవు జీవించి ఉన్నావు కనుక అని సమాధానం. ఈ విధంగా ఈ నిత్యకర్మలకు నిమిత్తం జీవించిఉండడమే కాని ఏదో ఫలం సంపాదించడం కాదు అని అర్థం. అందుచేత వీటికి ఫలం లేదు అని భావం)"అని ఎవరు అంటున్నారో వారు అనేది యుక్తం కాదు. ఎందువల్ల ననగా ప్రవర్తించనివి ఫలం ఇవ్వడం సంభవం కాదు;దుఃఖరూప మైన ఫలవిశేషాలు కుదరకుండా పోతాయి. (ఈ వాక్యానికి అర్థం వివరిస్తున్నారు)-పూర్వజన్మలో చేసిన పాపకర్మల ఫలంగా నిత్యకర్మలను అనుష్ఠించడం అనే దుఃఖం అనుభవించబడుతుంది అని చెప్పిన... అయుక్తం. మరణ కాలంలో ఫలం ఇవ్వడానికి అంకురించని కర్మయొక్క ఫలం మరొక కర్మచేత ఏర్పడిన జన్మలో అనుభవించబడుతుంది అనడం యుక్తం కాదు కదా? అలా కాకపోతే స్వర్గ మనే ఫలాన్ని అనుభవించడానికి అగ్నిహోత్రాదికర్మలచే ప్రారంభించబడిన (కలిగించబడిన) జన్మలో నరకరూప మైన కర్మఫలాన్ని అనుభవించడం అనుపపన్నం అని చెప్పడానికి అవకాశం ఉండదు.

వి. ప్రతీ జీవునికీ,అనేకజన్మలలో చేయగా చేయగా ప్రోగు పడిన అత్యధికమైన కర్మ ఉంటుంది. ఇది సంచితకర్మ. ఈ కర్మలోని ఒక చిన్న అంశం మూలాన ఒక జన్మ లభిస్తుంది. ఆ కర్మాంశంయొక్క ఫలాన్ని(సుదుఃఖరూప మైనదానిని) అనుభవించిన తరువాత ఆ జన్మ పూర్తి అవుతుంది. అతడు మరణించే సమయానికి ఆతని పేర నిలవ ఉన్న కర్మరాశిలో ఒక అంశం ఫలం ఇవ్వడానికి అభిముఖం అవుతుంది. ఏ కర్మ ఫలాభిముఖమై క్రొత్త జన్మను ఇస్తుంది అనే విషయం ఆ యా కర్మల ప్రాబల్యదౌర్బల్యాలను పట్టి పరమేశ్వరుడు నిర్ణయించాలి. అప్పుడు ఆ కర్మయొక్క ఫలాన్ని అనుభవించడానికి జీవుడు మరొక జన్మ ఎత్తుతాడు. ఏ కర్మను పట్టి ఈ జన్మను పొందాడో ఆ కర్మకు ప్రారబ్ధకర్మ అనిపేరు. ఆ

ప్రారబ్ధకర్మయొక్క ఫలాన్ని మాత్రమే ఈ జన్మలో అనుభవిస్తాడు గాని తనదే అయి నిలవలో ఉన్న ఇతరకర్మల ఫలితాన్ని ఈ జన్మలో అనుభవించడు. ఒకడు స్వర్గాన్ని ఇచ్చే పుణ్యకర్మ చేశాడు. నరకాన్ని ఇచ్చే పాపకర్మా చేశాడు. పుణ్యకర్మఫల మైన స్వర్గాన్ని అనుభవిస్తూన్న కాలంలో పాపకర్మ నరకరూప మైన ఫలం ఇవ్వజాలదు. అందుకు కారణం అది అప్పుడు ఫలోన్ముఖం కాకపోవడమే. అందుచేత ఏదో ఒక కర్మను పట్టి వచ్చిన జన్మలో ఈ జన్మకు కారణం కాని మరొక కర్మయొక్క (పాపముయొక్క) ఫలం నిత్యకర్మానుష్ఠానక్లేశరూపంలో అనుభవించబడుచున్నది అని చెప్పడం యుక్తం కాదు అని భావం.

తస్యేతి:-అది (నిత్యకర్మానుష్ఠానక్లేశం)దురితంవల్ల కలిగే దుఃఖవిశేషరూప మైన ఫలం అని చెప్పడం కూడ కుదరదు. వేరు వేరు విధాలైన దుఃఖాలకు సాధనాలు, ఆ దుఃఖాలు ఫలంగా కలవి అయిన అనేకవిధా లైన దురితాలు ఉండడానికి అవకాశం ఉన్నప్పుడు అవన్నీ నిత్యకర్మానుష్ఠానాయాసరూప మైన ఫలం మాత్రమే కలవి(వాటి కన్నింటికీ నిత్యకర్మానుష్ఠానాయాసదుఃఖమే ఫలం)అని కల్పిచిన ట్లయితే శీతోష్ణాదిద్వంద్వాలవల్ల రోగాదులవల్లా కలిగే బాధకు నిమిత్తమైన పాపం ఏదో కల్పించడానికి శక్యం కాదు;ఎందువల్ల ననగా నీ అభిప్రాయం ప్రకారం నిత్యకర్మానుష్ఠానాయాస దుఃఖమే పూర్వజన్మకృతపాపాలకు ఫలం, తలమీద బాయి మోయడం మొదలైన దుఃఖం పూర్వజన్మకృతపాపఫలం కాదు కదా?

భాష్యమ్

అప్రకృతం చ ఇదమ్ ఉచ్యతే-నిత్యకర్మానుష్ఠానాయాసదుఃఖం పూర్వకృత దురితకర్మఫలమ్ ఇతి. కథమ్? అప్రసూతఫలస్య పూర్వకృతదురితస్య క్షయః న ఉపపద్యతే ఇతి ప్రకృతమ్. తత్ర ప్రసూతఫలస్య కర్మణః ఫలం నిత్యకర్మానుష్ఠానాయాసదుఃఖమ్ ఆహ భవాన్ న అప్రసూతఫలస్య ఇతి. అథ సర్వమేవ పూర్వకృతం దురితం ప్రసూత ఫలమేవ ఇతి మన్యతే భవాన్ తతః నిత్యకర్మానుష్ఠానాయాసదుఃఖమేవ ఫలమితి విశేషణమ్ అయుక్తమ్;నిత్యకర్మవిధ్యానర్థక్యప్రసంగశ్చ, ఉపభోగేనైవ ప్రసూతఫలస్య దురితకర్మణః క్షయోపపత్తేః.

బాలానందిని

అప్రకృతమితి: నిత్యకర్మానుష్ఠానాయాసరూప మైన దుఃఖం పూర్వం చేసిన పాపకర్మకు ఫలం అని నువ్వు అప్రకృతమైన (ఏ విషయాన్ని గూర్చి మనం)చర్చిస్తున్నామో దానికి సంబంధించని)దానిని చెపుతున్నావు. ఎట్లు? ఫలం ఇవ్వడానికి ప్రారంభించని పూర్వకృత పాపం క్షీణించడం కుదరదు అనేది ప్రకృత మైన విషయం. అయితే నువ్వు ఫలం ఇవ్వడానికి

ప్రారంభించిన కర్మయొక్క ఫలమైన నిత్యకర్మానుష్ఠానా యాసదుఃఖాన్ని గూర్చి మాటలాడుతున్నావు. అంతేనే కాని అప్రసూతఫల మైన కర్మయొక్క ఫలమును గూర్చి చెప్పడం లేదు. అట్లు కాక పూర్వం చేసిన మొత్తం పాపం అంతా ప్రసూతఫలమే(ఈ జన్మలో ఫలం ఇవ్వడానికి ప్రారంభిస్తుంది)అని నీ అభిప్రాయ మైతే అప్పుడు పూర్వజన్మలలో చేసిన అన్ని పాపాలకీ నిత్యకర్మానుష్ఠానాయాసదుఃఖం ఒక్కటే ఫలం అని విశేషించి చెప్పడం యుక్తం కాదు.(వేరు వేరు పాపాలకు వేరు వేరు ఫలాలు ఉండాలి కదా అని భావం).మరొక విషయ మేమనగా-పూర్వజన్మకృతపాపా లన్నీ ఈ జన్మలోనే ఫలాన్ని ఇవ్వడానికి ఉన్ముఖము లైనప్పుడు ఆ ఫలాలను అనుభవించడంచేతనే ఆ పాపాలు క్షీణం అవుతాయి;అలాం టప్పుడు ఆ పాపాలు క్షీణించడంకోసం నిత్యకర్మలను విధించడం అనావశ్యకం.

భాష్యమ్

కిం చ శ్రుతస్య నిత్యస్య దుఃఖం కర్మణః చేత్ ఫలం నిత్యకర్మానుష్ఠానాయాసాదేవ తత్ దృశ్యతే,వ్యాయామాదివత్;తదన్యస్య ఇతి కల్పనానుపపత్తిః. జీవనాదినిమిత్తే చ విధానాత్ నిత్యానాం కర్మణాం ప్రాయశ్చిత్తవత్ పూర్వకృతదురితఫలత్వానుప పత్తిః. యస్మిన్ పాపకర్మనిమిత్తే యత్ విహితం ప్రాయశ్చిత్తం న తు తస్య పాపస్య తత్ ఫలమ్.అథ తస్యైవ పాపస్య నిమిత్తస్య ప్రాయశ్చిత్తదుఃఖం ఫలం జీవనాదినిమిత్త మపి నిత్యకర్మానుష్ఠానాయాసుదుఃఖం జీవనాదినిమిత్తస్యైవ తత్ ఫలం ప్రసజ్యేత,నిత్య ప్రాయశ్చిత్తయోః నైమిత్తికత్వావిశేషాత్.

బాలానందిని

కిం చేతి:-మరొక విషయ మేమనగా-శాస్త్రవిహిత మైన నిత్యకర్మకు ఫలం దుఃఖమే అయితే వ్యాయామాదులవల్ల వలె,నిత్యకర్మానుష్ఠానాయాసంవల్లనే అది(దుఃఖం) కనబడుచున్నది గాన,అది మరొకదాని ఫలం అని కల్పించడం అనుపపన్నం.

వి.నిత్యకర్మలను అనుష్ఠించడంవల్ల కలిగే శ్రమ అనే దుఃఖం పూర్వజన్మకృతపాప ఫలం అని అంటున్నావు.వ్యాయామం చేయడంవల్ల పరుగెత్తడంవల్ల శ్రమ కలుగుతున్నది. ఈ దుఃఖం దేని ఫలం అని అంటే వ్యాయామాదులు చేయడంయొక్క ఫలం అని ప్రత్యక్షంగా కనబడుతూనే ఉంది.అదే విధంగా నిత్యకర్మానుష్ఠాయాసదుఃఖం దేని ఫలం అనగా నిత్యకర్మానుష్ఠానంయొక్క ఫలం అని ప్రత్యక్షంగా కనబడుతూండగా ఇది పూర్వ జన్మకృతపాపాల ఫలం అని చెప్పడం అయుక్తం.

మరొకవిషయం-జీవనాదినిమిత్తాన్ని పురస్కరించుకొని నిత్యకర్మలు విధించ బడ్డాయి గాన అవి ప్రాయశ్చిత్తం వలెనే,పూర్వకృతదురితఫలం అనడం అనుపపన్నం.

వి. కర్మానుష్ఠానాదులలో ఏదైన లోపం కలిగి నప్పుడు దాని పరిహారం కోసం ఏదో ఒక ప్రాయశ్చిత్తం విధింపబడుతుంది. ఆ కర్మానుస్ఠానలోపం అనే నిమిత్తాన్ని పురస్క రించుకొని ఆ ప్రాయశ్చిత్తం చేయబడుతున్నది,ఇది ఏ పాపానికీ ఫలం కాదు. నువ్వు జీవించి నన్నాళ్లూ నిత్యకర్మలు చెయ్యాలి అని విధింబడింది. అనగా ఈ నిత్యకర్మలకు నిమిత్తం ఒకడు జీవించి ఉండడమే. ఈ విధంగా నిత్యకర్మ కూడ ప్రాయశ్చిత్తం వలె, నిమిత్తాన్ని పురస్కరించుకొని విధించబడినది గాన పూర్వపాపాల ఫలం అవడానికి వీలు లేదు.

అవ. ఈ విషయాన్నే విశదీకరిస్తున్నారు- యస్మిన్నితి:- ఏ పాపకర్మను నిమిత్తంగా చేసికొని ఏ ప్రాయశ్చిత్తం విధించబడిందో ఆ ప్రాయశ్చిత్తం ఆ పాపానికే ఫలం కాదు. అలా కాదు- ప్రాయశ్చిత్తదుఃఖం నిమిత్తమైన ఆ పాపానికే ఫలం అని అంటే అప్పుడు జీవనాదికం నిమిత్తంగాగల నిత్యకర్మానుష్ఠానాయాసదుఃఖం కూడ జీవనాదినిమిత్తానికే ఫలం అని చెప్పవలసి వస్తుంది. (పైన చూచి నట్లు) నిత్యకర్మ ప్రాయశ్చిత్తమూ కూడ నైమిత్తికము లనే విషయంలో భేదం లేదు కదా? (రెండూ నైమిత్తికాలే కదా?)

భాష్యమ్

కిం చాన్యత్-నిత్యస్య కామ్యస్య చ అగ్నిహోత్రాదేః అనుష్ఠానాయాసదుఃఖస్య తుల్యత్వాత్ నిత్యామష్ఠానాయాసదుఃఖమేవ పూర్వకృతదురితస్య ఫలం న తు కామ్యానుష్ఠానాయాసదుఃఖమ్ ఇతి విశేషః నాస్తీతి తదపి పూర్వకృతదురితఫలం ప్రసజ్యేత. తథా చ సతి నిత్యానాం ఫలాశ్రవణాత్ తద్విధా నాన్యథాన్యథానుపపత్తేశ్చ నిత్యానుష్ఠానాయాసదుఃఖం పూర్వకృతదురితఫలమ్ ఇతి అర్థాపత్తికల్పనా అనుపపన్నా. ఏవం విధానాన్యథానుపపత్తేః అనుష్ఠానాయాసదుఃఖవ్యతిరిక్తఫలత్వానుమానాచ్చ నిత్యానామ్. విరోధాచ్చ. విరుద్ధం చ ఇదమ్ ఉచ్యతే-నిత్యకర్మణి అనుష్ఠీయమానే అన్యస్య కర్మణః ఫలం భుజ్యతే ఇతి, అభ్యుపగమ్యమానే స ఏవ ఉపభోగః నిత్యస్యకర్మణః ఫలమితి, నిత్యస్య కర్మణః ఫలాభావః ఇతి చ విరుద్ధమ్ ఉచ్యతే. కిం చ కామ్యాగ్ని హోత్రాదౌ అనుష్ఠీయమానే నిత్యమపి అగ్నిహోత్రాది తన్త్రేణైవ అనుష్ఠితం భవతీతి తదాయాస దుఃఖేనైవ కామ్యాగ్నిహోత్రాదిఫలమ్ ఉపక్షీణం స్యాత్. తత్తన్త్రత్వాత్.

బాలానందిని

కిం చేతి:-మరొక విషయం-నిత్యాగ్నిహోత్రాదిక మైనా కామ్యాగ్నిహోత్రాదిక మైనా వాటిని అనుష్ఠించడంవల్ల కలిగే ఆయాసం, దుఃఖం సమానమే గాన నిత్యాగ్నిహోత్రాద్య నుష్ఠానాయాసదుఃఖమే పూర్వం చేసిన దురితానికి ఫలం,కామ్యాగ్నిహోత్రాద్యను ష్ఠానాయా సదుఃఖం కాదు అని చెప్పడానికి తగిన విశేషం ఏమీ లేదు గాన అది కూడ (కామ్యం కూడ)పూర్వపాపఫలమే అని చెప్పవలసి వస్తుంది.

వి. నిత్యాగ్నిహోత్రం చేస్తూన్నవాడే అదే అగ్నిహోత్రాన్ని ఏదైన కోరికతో అనుష్ఠిస్తే అది నిత్యాగ్నిహోత్రము కామ్యాగ్నిహోత్రమూ కూడ అవుతుంది. రెండు అగ్నిహోత్రాలను వేరు వేరుగా చేయ నవసరంలేదు. దీనినే తంత్రంచేత (ఒకే పర్యాయం రెండు విధాలైన కర్మను చేయడం తంత్రం)చేయడం అంటారు.

తథా చేతి:-అలా అయినప్పుడు నిత్యకర్మలకు ఫలం వినబడకపోవడంవల్ల, వాటిని విధించడం మరొక విధంగా కుదరదు గాన నిత్యానుష్ఠానాయాసదుఃఖం పూర్వ జన్మకృతపాపఫలం అని అర్థాపత్తిని కల్పించడం యుక్తం కాదు. ఈ విధంగానే(కామ్యాగ్ని హోత్రాదుల వలెనే)విధానం మరొక విధంగా కుదరదు గాన నిత్యకర్మలకు (కూడ)అనుష్ఠానా యాసంకంటె భిన్నమైన ఫలం ఉంటుం దని అనుమానంచేత చెప్పవలసి ఉంటుంది.

వి. ప్రత్యక్షంగా కనబడుతూన్న ఒక విషయాన్ని బట్టి కనబడని మరొక విషయాన్ని ఊహించి తెలుసుకొనడం అర్థాపత్తి. దేవదత్తుడు స్పష్టంగా బలిసి ఉన్నట్లు కనబడుతున్నాడు. అతడు పగలు భోజనం చేస్తూన్నట్లు చూడలేదు. పగలు భోజనం చేయకపోయినా బలిసి ఉండడాన్ని బట్టి రాత్రి భోజనం చేస్తున్నట్లు ఊహించబడుతుంది. అదే విధంగా నిత్యకర్మలను శ్రుతి విధిస్తూన్నది. వాటికి ఫలానా ఫలం అని ఏమీ చెప్పలేదు. శ్రుతిచేత విధించబడిన కర్మకు ఏదో ఒక ఫలం తప్పక ఉండాలి గాన పూర్వజన్మకృతదురితక్షయమే ఫలం అని చెప్పవలసి ఉంటుంది అని పూర్వపక్షి వాదం. అది యుక్తం కాదు. పైన చూచి నట్లు నిత్యాగ్నిహోత్రాన్నే కామంతో చేస్తే అది ఫలాన్ని ఇస్తూన్నది. అయితే దానిని అనుష్ఠించ డంలో ఆయాసం ఉండనే ఉంది. అలా అనుష్ఠానాయాసదుఃఖంతో పాటు అది ఇష్టఫలాన్ని కూడ ఇస్తూన్నది. అదే విధంగా నిత్యకర్మకూడ ప్రత్యక్షంగా కనబడుతూన్న అనుష్ఠానాయాస దుఃఖంతో పాటు మరొక ఫలం ఏదో కూడ ఇస్తుంది అని అనుమానప్రమాణంచేత తెలుస్తూన్నది గాన నువ్వు చూపిన అర్థాపత్తి అనుపపన్నం అని సిద్ధాంతి అభిప్రాయం.

విరోధాచ్చేతి:-విరోధం కూడ ఉన్నది. నీచేత విరుద్ధ మైన మాట చెప్పబడుచున్నది; ఎట్లనగా-నిత్యకర్మను అనుష్ఠించే టప్పుడు మరొక కర్మయొక్క (పూర్వజన్మకృత పాపకర్మ యొక్క)ఫలం అనుభవించబడుచున్నది అని నువ్వు అంటున్నావు. అప్పుడు నిత్యకర్మకు పూర్వపాపఫలానుభవమే ఫలం అన్నట్లు అయింది. అలాంటప్పుడు నిత్యకర్మకు పాపకర్మ ఫలానుభవం ఫలం ఒక ప్రక్క చెపుతూ మరొక ప్రక్క నిత్యకర్మకు ఫలం లేదు అనడం పరస్పర విరుద్ధంగా చెప్పడమే. మరొక విషయ మేమనగా- కామ్యాగ్నిహోత్రాదికం చేస్తూన్నప్పుడు తంత్రంచేత నిత్యాగ్నిహోత్రాదికం కూడ చేసినట్లే అవుతుంది గాన దానిని అనుష్ఠించడంవల్ల కలిగిన ఆయాస మనే దుఃఖంచేతనే కామ్యాగ్నిహోత్రాదుల ఫలం ఉపక్షీణం అయిపోతుంది. ఎందుచేత ననగా ఈ కామ్యాగ్నిహోత్రాదికం నిత్యాగ్నిహోత్రాదికంతో కలిసిపోయింది కదా?

వి. తంత్రవిధానంలో ప్రతిదినమూ చేసే నిత్యాగ్నిహోత్రాదికమే ఏదో ఒక కోరికతో చేస్తే కామ్యకర్మ కూడ అవుతుం దని మీమాంసవాదుల అభిప్రాయం. ఆ కర్మ ఒకే పర్యాయం చేయబడుతుంది కాని మొదట నిత్యం చేసి లేదా కామ్యం చేసి తరువాత కామ్యం లేదా నిత్యం చేయడం అనేది ఉండదు. అందుచేతనే అది తంత్రవిధానం అయింది. ఏదో పనిమీద తిరుపతి వెళ్లి శ్రీవెంకటేశ్వరస్వామి దర్శనం చేసుకొన్నట్లు. ఇక్కడ సిద్ధాంతి చెప్పే దేమనగా- ఈ అగ్నిహోత్రాద్యనుష్ఠానంలో శ్రమ ఉంది. అది పూర్వజన్మకృతపాపఫలం అని నువ్వు అంటున్నావు. అందుచేత ఇది ఒక ఫలం ఇచ్చి వేసినది గాన కామ్యఫలం ఇవ్వజాలదు. కామ్మకర్మఫలం కూడ ఈ నిత్యకర్మఫలంతోనే ఉపక్షీణం అయిపోయింది. జ్వరానికి ఒక ఔషధం సేవిస్తాం. అది జ్వరం తగ్గిస్తుంది. అది బలం కూడ చేస్తుందా అంటే చేయదు. దాని శక్తి జ్వరం తగ్గించడంలోనే ఉపక్షీణం అయిపోయింది. ఉపక్షీణం అవడం అనగా ఇదే.

భాష్యమ్

అథ కామ్యాగ్నిహోత్రాదిఫలమ్ అన్యదేవ స్వర్గాది, తదనుష్ఠానాయాసదుఃఖమపి భిన్నం ప్రసజ్యేత. న చ తదస్తి; దృష్టవిరోధాత్. న హి కామ్యానుష్ఠానాయాసదుఃఖాత్ కేవలనిత్యానుష్ఠాయాసదుఃఖం భిద్యతే. కిం చాన్యత్-అవిహితమ్ అప్రతిషిద్ధం చ కర్మ తత్కాలఫలం న తు శాస్త్రచోదితం ప్రతిషిద్ధం వా తత్కాలఫలమ్. భవేద్యది తదా స్వర్గాదిష్వపి అదృష్టఫలశాసనేన ఉద్యమః న స్యాత్. అగ్నిహోత్రాదీనామేవ కర్మస్వరూపావిశేషే అనుష్ఠానాయాసదుఃఖమాత్రేణ ఉపక్షయః నిత్యానామ్ కామ్యానాం చ స్వర్గాదిమహాఫలత్వమ్ అఙ్గేతికర్తవ్యతాద్యాధిక్యే తు అసతి ఫలకామిత్వమాత్రేణ ఇతి న శక్యం కల్పయితుమ్. తస్మాత్ న నిత్యానాం కర్మణామ్ అదృష్టఫలభావః కదాచిదపి ఉపపద్యతే.

బాలానందిని

అథేతి:-అట్లు కాక కామ్యాగ్నిహోత్రాదికానాకి స్వర్గాదిక మైనది మరొకటేదో మాత్రమే ఫలం అని అంటే అప్పుడు దానిని అనుష్ఠించడంలో కలిగే అయాసదుఃఖం కూడ వేరుగానే ఉండాలి. కాని అట్లు లేదు. అలా ఉంది అంటే అది కనబడుతూన్నదానికి విరుద్ధం. కామ్యానుష్ఠానాయాసదుఃఖంకంటె కేవలనిత్యానుష్ఠానదుఃఖం వేరుగా కనబడడం లేదు కదా? మరొక విషయం-శాస్త్రంచేత విధించబడనిది నిషేధించబడనిదీ అయిన (భోజన-సంవాహనాది)కర్మకు ఫలం వెంటనే కనబడుతుంది. శాస్త్రచోదితమైన కర్మకు కాని నిషిద్ధకర్మకు కాని ఫలం వెంటనే కనబడదు. వెంటనే కలిగే పక్షంలో స్వర్గాదుల విషయంలో కనబడని ఫలాన్ని గూర్చి చెప్పబడుతూన్నది గాన (మనుష్యుడు) ఉద్యమించడం ఉండదు. (అందుచేత నిత్యకర్మలు కూడ శాస్త్రచోదితాలే గాన వాటి ఫలం అనుష్ఠానాయాసదుఃఖమాత్రరూపంలో

వెంటనే కనబడుతుంది అనడం యుక్తం కాదు అని భావం).మరొక విషయ మేమనగా నిత్యాగ్నిహోత్రాదుల స్వరూపము కామ్యాగ్ని హోత్రాదుల స్వరూపమూ ఒకటే అయి నప్పుడు నిత్యాగ్నిహోత్రాదులు అనుష్ఠానాయాసదుఃఖమాత్రంచేతనే ఉపక్షయం పొందుతాయి కామ్యాగ్నిహోత్రాదులు మాత్రం,వాటి అంగాలలోను, ఇతికర్తవ్యతలో(చేసే విధానంలోను) భేదం ఏమీ లేనప్పుడు (లేకపోయినా) స్వర్గం మొద లైన మహాఫలం ఇస్తాయి అని కల్పించడం యుక్తం కాదు.అందుచేత నిత్యకర్మలకు అదృష్ట మైన ఫలం లేకపోవడం అనేది ఎన్నడూ కుదరదు.

భాష్యమ్

అతశ్చ అవిద్యాపూర్వకస్య కర్మణః విద్యా ఏవ,శుభస్య అశుభస్య వా,క్షయ కారణమ్ అశేషతః,న నిత్యకర్మానుష్ఠానమ్.అవిద్యాకామబీజం హి సర్వమేవ కర్మ. తథా ఉపపాదితమ్ అవిద్వద్విషయం కర్మ,విద్వద్విషయా సర్వకర్మసంన్యాసపూర్వికా జ్ఞాననిష్ఠా – **"ఉభౌ తౌ న విజానీతః"(2.19),"వేదావినాశినం నిత్యమ్"(2.21), "జ్ఞానయోగేనసాంఖ్యానాం కర్మయోగేనయోగినామ్"(3.3)"అజ్ఞానాం కర్మసంగినామ్" (3.26), "తత్త్వవిత్తు మహాబాహో...గుణాగుణేషు వర్తన్త ఇతి మత్వా న సజ్జతే" (3.28)."సర్వ కర్మాణి మనసా సంన్యస్యాస్తే"(5.13),"నైవ కించిత్కరోమీతి యుక్తో మన్యేత తత్త్వవిత్" (5.8)**,అర్థాత్ అజ్ఞః కరోమీతి,**"ఆరురుక్షోః కర్మ కారణం, ఆరూఢస్య యోగస్థస్య శమః ఏవ కారణమ్"(6.3)**,ఉదారాః త్రయః అపి అజ్ఞాః–**"జ్ఞానీ త్వాత్మైవ మే మతమ్" (7.28)**, అజ్ఞాః కర్మిణః **"గతాగతం కామకామా లభన్తే" (9.21), "అనన్యాశ్చిన్తయన్తో మాం నిత్యయుక్తాః యథోక్తమ్ ఆత్మానమ్ ఆకాశకల్పమ్ ఉపాసతే" (9.22)"దదామి బుద్ధియోగం తం యేన మాముపయాన్తి తే"(10.10)–**అర్థాత్ న కర్మిణః అజ్ఞాః ఉపయాన్తి.భగవత్కర్మకారిణః యే యుక్తతమాః అపి కర్మిణః అజ్ఞాః తే ఉత్తరోత్తరహీనఫలత్యాగావసానసాధనాః. (12.6.11)

అనిర్దేశ్యాక్షరోపాసకాః తు "అద్వేష్టా సర్వభూతానామ్"(12.13.20)ఇతి ఆ అధ్యాయపరిసమాప్తి ఉక్తసాధనాః క్షేత్రాధ్యాయాద్యధ్యాయత్రయోక్తజ్ఞానసాధనాశ్చ (13.7.11,14.22–26,15.3–5).అధిష్ఠానాదిపఞ్చకహేతుకసర్వకర్మసంన్యాసినామ్ (18.14) ఆత్మైకత్వాకర్తృత్వజ్ఞానవతాం పరస్యాం జ్ఞాననిష్ఠాయాం వర్తమానానాం భగవత్తత్త్వవిదామ్ అనిష్టాదికర్మఫలత్రయం (18.12)పరమహంసపరివ్రాజకానామేవ లబ్ధభగవత్స్వరూపాత్మైకత్వశరణానాం న భవతి,భవతి చ అన్యేషామ్ అజ్ఞానాం కర్మిణామ్ అసంన్యాసినామ్ ఇత్యేషః గీతాశాస్త్రోక్తకర్తవ్యార్థస్య విభాగః.

బాలానందిని

అతశ్చేతి:-సమస్తమైన కర్మా కూడ (నిత్య మైనా తద్భిన్న మైనా)అవిద్య కామము బీజంగా కలది.(అవిద్యాకామాలవల్లనే అందరూ ఆ యా కర్మలయందు ప్రవర్తిస్తూంటారు. ఇది అన్నికర్మలకు సంబంధించిన విషయం)అందువల్ల అవిద్యాపూర్వకమైన (మూలకమైన) కర్మ,అది శుభకర్మ యైనా అశుభక యైనా,క్షీణించాలంటే అందుకు కారణం విద్య మాత్రమే.నిత్యకర్మానుష్ఠానం(అశుభ)కర్మక్షయానికి కారణం కాదు. ఈ విషయం వెనుక ప్రతిపాదించబడినది.కర్మ అవిద్వాంసునకు సంబంధించినది,కర్మసంన్యాసపూర్వకమైన జ్ఞాననిష్ఠ విద్వాంసునకు సంబంధించినది,(అవిద్వాంసునకే కర్మయందు అధికారం. విద్వాంసునకు మాత్రం కర్మ సంన్యాసపూర్వక మైన జ్ఞాననిష్ఠయందు అధికారం).

అవ.ఈ విషయాన్ని ప్రతిపాదించే వాక్యాలను ఉదాహరిస్తున్నారు.**"ఉభౌ తౌ న విజానీతః"** కర్తృత్వాన్ని తనయందు ఆరోపించుకొన్నవాడు,కర్మత్వాన్ని ఆరోపించుకొన్నవాడు కూడ ఆత్మను తెలుసుకొనజాలరు.అందుచేత కర్మ అజ్ఞానమూలకం అని ఈ వాక్యం సూచించుచున్నది),**"వేదావినాశినం నిత్యమ్"**(ఆత్మస్వరూపం తెలిసినవానికి కర్మ సంన్యాసమునందే అధికార మని ఈ వాక్యం సూచిస్తూన్నది),**"జ్ఞానయోగేన.... యోగినామ్"** (అధికారిభేదంచేత నిష్ఠాభేద మని ఈ వాక్యం చెప్పుచున్నది);**"అజ్ఞానాం కర్మసఙ్గినామ్"** (అజ్ఞులకే కర్మసంగ మని ఈ వాక్యం చెప్పుచున్నది).**"తత్త్వవిత్తు...న సజ్జతే"**(విద్వాంసునకు సంన్యాసపూర్వకజ్ఞాననిష్ఠయందు అధికార మని ఈ వాక్యం భావం),**"సర్వకర్మాణి మనసా సంన్యస్యాస్తే"**(ఇది దీనితరువాత వాక్యమూ కూడ జ్ఞాననిష్ఠాధికారిని గూర్చి చెప్పుచున్నవి), **"నైవ కించిత్ కరోమీతి యుక్తో మన్యేత తత్త్వవిత్"**అనగా అజ్ఞుడే కర్మలు చేస్తాడు అని అర్థం."ముక్తిమార్గాన్ని అధిష్ఠించదలచినవానికి చిత్తశుద్ధికారణమైన కర్మ ఉపయోగిస్తుంది. ఆరూఢుడై యోగంలో ఉన్నవానికి కర్మసంన్యాసమే కర్తవ్యం"అనీ,**"ఉదారాః....మతమ్"** (జ్ఞానియే సర్వోత్తముడు అని ఈ వాక్యం సూచిస్తూన్నది.అజ్ఞు లైన కర్మఠులు"ఆయా ఫలాలను కోరుతూ కోరుతూ ఆ యా లోకాలకు వెడుతూ వస్తూ ఉంటారు",అని,"ఎవరైతే అనన్యశరణులై,నిత్యయుక్తులై ఆకాశంతో సమాన మైన,కల్మషరహిత మైన ఆత్మను సేవిస్తారో"అని,**"దదామి బుద్ధియోగం తం యేన మాముపయాన్తి తే"**అనీ,అనగా కర్మఠులైన అజ్ఞులు నన్ను పొందజాలరు అని అర్థం;(ఈ వాక్యాలు కర్మ అజ్ఞవిషయ మనీ,జ్ఞాననిష్ఠ విద్వద్విషయ మనీ చెపుతున్నాయి అని భావం).

అవ.భగవత్కర్మకారులు యుక్తతము లని(మయ్యావేశ్య ఇత్యాదిశ్లోకాలలో 12.2) చెప్పబడినది.అట్టివారు కర్మఠు లైనా భగవంతుణ్ణి పొందుతారు కదా అని ఆశంకించుకొని

సమాధానం చెప్తున్నారు-**భగవత్కర్మకారిణః ఇతి**: -భగవత్కర్మకారు లైన ఏ కర్ములైన (కర్మలు ఆచరించేవారైన)అజ్ఞు లున్నారో వారు యుక్తతములే అయినా కూడ ఉత్తరోత్త రము హీనమైనవీ ఫలత్యాగం చివర ఉన్నవీ అయిన సాధనాలు కలవారు.(అనగా చిత్త సమాధానం చేయడం మంచిది.అది చేయజాలనివాడు అభ్యాసయోగం చెయ్యాలి. అందుకు కూడ అసమర్థుడు భగవత్కర్మపరుడు కావాలి.అదీ చేయజాలనివాడు సర్వకర్మఫలత్యాగం చెయ్యాలి.ఈ విధంగా ఇక్కడ చెప్పబడిన నాల్గు సాధనాలలో పూర్వపూర్వంకంటె ఉత్తరోత్తరం హీనం(తక్కువది). ఈ విధంగా కర్ములైన అజ్ఞు లందరూ వేరు వేరు సాధనాలను అవలంబించే సాధకులే గాన క ర్ములెవ్వరూ సాక్షాత్తుగా భగవంతుణ్ణి పొందజాలరు అని భావం). అనిర్దేశ్య మైన(వర్ణింప శక్యం కాని)అక్షరాన్ని ఉపాసించే వారైతే(12వఅధ్యాయంలో)"**అద్వేష్టా సర్వభూతానామ్**"అని మొదలు అధ్యాయం చివరి వరకు చెప్పబడిన సాధనాలు కలవారు,క్షేత్రాధ్యాయం మొదలు మూడు (13,14,15) అధ్యాయాలలో చెప్పబడిన జ్ఞానసాధనాలు కూడ కలవారు.(వాళ్ల సాధనాలు అక్కడ చెప్పబడ్డాయి అని అర్థం).అధిష్ఠానం మొదలైన ఐదు హేతువులు గల సర్వకర్మలను సంన్యసించినవారు,ఆత్మ ఏకము, కర్తృత్వరహితము అను జ్ఞానం కలవారు,అత్యుత్తమమైన జ్ఞాననిష్ఠలో ఉన్నవారు, భగవత్తత్త్వమును తెలుసుకొన్నవారు,భగవత్స్వరూపమైన ఆత్మయొక్క ఏకత్వాన్ని శరణుగా పొందినవారు(ఆత్మ భగవత్స్వరూపము,అది ఒక్కటే అను జ్ఞానాని శరణుగా పొందినవారు) అయిన పరమహంసపరివ్రాజకులకు మాత్రమే అనిష్టాదికర్మత్రయముయొక్క ఫలం కలగదు.ఇదే గీతాశాస్త్రంలో చెప్పబడిన కర్తవ్యాకర్తవ్య విషయాల విభాగం.

భాష్యమ్

అవిద్యాపూర్వకత్వం సర్వస్య కర్మణః అసిద్ధమ్ ఇతి చేత్,న;బ్రహ్మహత్యాదివత్. యద్యపి శాస్త్రావగతం నిత్యం కర్మ తథాపి అవిద్యావతః ఏవ భవతి.యథా ప్రతిషేధ శాస్త్రావగతమపి బ్రహ్మహత్యాదిలక్షణం కర్మ అనర్థకారణమ్ అవిద్యాకామాదిదోషవతః భవతి,అన్యథా ప్రవృత్త్యనుపపత్తేః తథా నిత్యనైమిత్తికకామ్యాన్యపి ఇతి.వ్యతిరిక్తాత్మని అజ్ఞాతే ప్రవృత్తిః నిత్యాదికర్మసు అనుపపన్నా ఇతి చేత్,న.చలనాత్మకస్య కర్మణః అనాత్మకర్తృకస్య "అహం కరోమి"ఇతి ప్రవృత్తిదర్శనాత్దేహాదిసంఘాతే అహం ప్రత్యయః గౌణః న మిథ్యా ఇతి చేత్,న; తత్కార్యేష్వపి గౌణత్వోపపత్తేఃఆత్మీయే దేహాది సంఘాతే అహంప్రత్యయః గౌణః యథా ఆత్మీయే పుత్రే "ఆత్మా వై పుత్రనామాసి"(తై.స. 2.11)ఇతి.లోకే చాపి"మమ ప్రాణః ఏవ అయం గౌః"ఇతి తద్వత్.నైవాయం మిథ్యా ప్రత్యయః.మిథ్యాప్రత్యయస్తు స్థాణుపురుషయోః అగృహ్యమాణవిశేషయోః

బాలానందిని

అవిద్యేతి:-(ఆక్షేపం)సమస్తకర్మకు అవిద్యాపూర్వకత్వం అసిద్ధం(అన్ని కర్మలూ కూడ అవిద్యామూలకములే,అవిద్యచేతనే చేయబడుచున్నవి,అనేది యుక్తం కాదు)అన్నట్లయితే(సమాధానం)ఇది యుక్తం కాదు.బ్రహ్మహత్యాదుల వలె.(దీనినే వివరిస్తున్నారు-) నిత్యకర్మ శాస్త్రబోధితమే అయినా కూడ ఇది అవిద్యావంతునకు మాత్రమే సంబంధించి ఉంటుంది (అవిద్యావంతుడు మాత్రమే చేస్తాడు).అనర్థానికి కారణ మైన బ్రహ్మహత్య మొదలైన కర్మ ప్రతిషేధశాస్త్రం(ఆ యా కర్మలను చేయకూడదు అని చెప్పే శాస్త్రం ప్రతిషేధ శాస్త్రం) ద్వారా తెలియబడినా కూడ అవిద్య కామము మొదలైన దోషా లున్నవానికే. సంబంధించినదిగా ఎలా ఉంటుందో,అలా కాకపోతే (అవిద్యాకామాదులు లేకపోతే)ప్రవర్తనయే కుదరదు కదా,అట్లే నిత్య-నైమిత్తిక-కామ్యకర్మలు కూడ అవిద్యాదివంతునకే (ఆక్షేపం)దేహాదులకంటె భిన్నమైన ఆత్మ ఉన్నది అనే జ్ఞానం లేకపోతే నిత్యకర్మాదులలో ప్రవృత్తియే ఉండదు కదా(దేహంకంటె వేరుగా నిత్యమైన ఆత్మ ఉన్నది.దేహపాతానంతరం కూడ జన్మాంతరాలలో కర్మఫలాన్ని ఆ ఆత్మ అనుభవిస్తుంది అనే జ్ఞానం ఉన్నవాడే నిత్యకర్మాదులు చేస్తాడు.అందుచేత కర్మ చేసేవాడు అవిద్యావంతుడే అనడం అయుక్తం కదా అని భావం).(సమాధానం)ఇది యుక్తంకాదు-అనాత్మకర్తృకమైన,చలనరూప మైన కర్మ విషయంలో "నేను చేస్తున్నాను"అని ప్రవృత్తి కనబడుచున్నది కదా?

వి. కర్మలో తప్పక చలనం ఉంటుంది.అందుచేత అది చలనాత్మకం.ఆత్మ అచలం. అందుచేత కర్మకు ఆత్మ కర్త కాదు.అనాత్మయైన దేహాదికమే కర్త.అయినా కూడ నేను చేస్తున్నాను అని మనుష్యుడు ప్రవర్తిస్తున్నాడు.అందుచేత ఈ విధమైన కర్మప్రవృత్తి అవిద్యామూలకమే.ఇలా కర్మ చేసే వానికి దేహంకంటె వ్యతిరిక్త మైన ఆత్మ ఉన్న దనే జ్ఞానం ఉంది గాని ఆ ఆత్మ కర్తృత్వ-భోక్తృత్వాదులు లేనిది అనే జ్ఞానం లేదు.అందుచేతనే నేను కర్తను అని అనుకొంటున్నాడు. ఈ విధంగా సర్వకర్మలు అవిద్యామూలకములే అని భావం."అనాత్మకర్తృకస్య"అను దానికి 'ఆత్మ కర్తగా లేనిది'అని, ఆత్మ కాని అంతఃకరణ దేహాదికం కర్తగా కలది అనీ రెండు అర్థాలు చెప్పవచ్చును.

అవ. దేహాదులు కర్తగా ఉండగా "నేను కర్తను"అనుకొంటున్నాడు.ఇది మిథ్యా జ్ఞానం అవిద్యామూలకం అని చెప్పడం యుక్తం కాదు."సింహో మాణవకః"ఇత్యాది జ్ఞానం వలె ఇది గౌణమైన జ్ఞానం అని ఆశంకించుకొని సమాధానం చెపుతున్నారు. **దేహేతి**:-(ఆశంక)-దేహాదిసంఘాతమునందు అహంప్రత్యయం '(నేను అనే బుద్ధి)గౌణమే కాని మిథ్య కాదు అన్నట్లయితే (సమాధానం)-అది యుక్తం కాదు.ఇది గౌణప్రత్యయ మైతే దీని కార్యములు(ఈ జ్ఞానంవల్ల కలిగిన కర్మలు)గౌణములే కావాలి. (అవి గౌణములే అయితే వాటివల్ల కలిగే కార్యాలైన అనర్థాల నివృత్తికోసం హేతువును అన్వేషించడం ఉండకూడదు అని భావం).రాబోయే వాక్యాలలో పై ఆశంకాసమాధానాలనే విశదీకరిస్తు న్నారు-**ఆత్మీయే**

ఇతి: -(ఆశంక)"ఆత్మా వై పుత్రనామాసి"(నువ్వే పుత్రు డనే పేరుతో ఉన్నావు)అని శ్రుతిలో చెప్పబడింది;ఈ విధంగా తన పుత్రుని విషయంలో నేనే అను భావం ఉన్నట్లు,లోకంలో కూడ"ఈ ఎద్దు నా ప్రాణం"అన్నట్లు తనకు సంబంధించిన దేహాదిసంఘాతం విషయంలో 'నేను'అనే బుద్ధి గౌణమే.అంతే కాని ఇది మిథ్యాప్రత్యయం కాదు.మిథ్యాప్రత్యయం ఎలాంటి చోట అనగా స్థాణు-పురుషుల మధ్య ఉన్న విశేషాన్ని గుర్తించనప్పుడు స్థాణువును (బెట్టుమోడును)చూచి పురుష డనుకొన్నప్పుడు "ఇది పురుషుడు"అని కలిగిన ప్రత్యయం.

భాష్యమ్

న గౌణప్రత్యయస్య ముఖ్యకార్యార్థత్వమ్,అధికరణస్తుత్యర్థత్వాత్ లుప్తోపమా శబ్దేన.యథా "సింహః దేవదత్తః""అగ్నిః మాణవకః"ఇతి సింహః ఇవ అగ్నిః ఇవ క్రౌర్యపైఙ్గల్యాదిసామాన్యవత్త్వాత్ దేవదత్తమాణవకాధికరణస్తుత్యర్థమేవ,న తు సింహ కార్యమ్ అగ్నికార్యం వా గౌణశబ్దప్రత్యయనిమిత్తం కించిత్ సాధ్యతే.మిథ్యాప్రత్యయ కార్యం తు అనర్థమ్ అనుభవతి.

బాలానందిని

సమాధానవాక్యమైన "తత్కార్యేష్వపి గౌణత్వోపపత్తేః"అనేదానిని వివరిస్తున్నారు. నేతి: -గౌణప్రత్యయస్థలంలో శౌర్యాదులకు ఏది అధికరణమో (ఏ సామాన్యగుణాలను పట్టి ఈ గౌణప్రత్యయం కలుగుచున్నదో ఆ గుణాలకు ఏది ఆధారమో)దానిని స్తుతించడమే దీని ప్రయోజనం.దాని నిమిత్తం లుప్తోపమాశబ్దం(ఉపమావాచకం లోపించిన వాక్యం) ప్రయోగించబడుతుంది.అందుచేత దీనికి ముఖ్యకార్యాన్ని సాధించడం ప్రయోజనం కాదు. ఎట్లనగా-"సింహః దేవదత్తః"(దేవత్తుడు సింహం),"అగ్నిః మాణవకః"(పిల్లవాడు అగ్ని)అనే గౌణప్రత్యయం శౌర్యము,పచ్చదనమూ మొదలైన సామాన్యం(పోలిక,సమానధర్మాలు ఉండడంవల్ల(దేవదత్తుడు)సింహం వంటివాడు,(పిల్లవాడు)అగ్నివంటివాడు అని అధికరణమైన (శౌర్యపైంగల్యాదులకు ఆధారమైన)దేవదత్తమాణవకులను స్తుతించడం కోసమే.అంతే కాని ఈ గౌణప్రత్యయాన్ని పట్టి(దేవదత్త-మాణవుకులచేత)సింహం చేసే పని కాని,అగ్ని చేసే పని కాని ఏదీ సాధించబడదు. అయితే (మనుష్యుడు)మిథ్యాప్రత్యయానికి కార్యమైన(మిథ్యాప్రత్యయంవల్ల కలిగిన) అనర్థాన్ని అనుభవిస్తున్నాడు.

భాష్యమ్

గౌణప్రత్యయవిషయం చ జానాతి "న ఏష సింహః దేవదత్తః స్యాత్", "న అయమ్ అగ్నిః మాణవకః"ఇతి.తథా గౌణేన దేహాదిసంఘాతేన ఆత్మనా కృతం కర్మ న ముఖ్యేన అహంప్రత్యయవిషయేణ ఆత్మనా కృతం స్యాత్.న హి గౌణసింహాగ్నిభ్యాం

కృతం కర్మ ముఖ్యసంహాగ్నిభ్యాం కృతం స్యాత్.న చ క్రౌర్యేణ పైఙ్గల్యేన వా ముఖ్య సింహాగ్న్యోః కార్యం కించిత్ క్రియతే,స్తుత్యర్థత్వేన ఉపక్షీణత్వాత్.స్తూయమానౌ చ జానీతః"నాహం సింహః""నాహమగ్నిః"ఇతి,న సింహస్య కర్మ మమ అగ్నేశ్చ ఇతి;తథా న సంఘాతస్య కర్మ మమ ముఖ్యస్య ఆత్మనః ఇతి ప్రత్యయః యుక్తతరః స్యాత్,న పునః "అహం కర్తా" "మమ కర్మ"ఇతి

బాలానందిని

గాణేతి :- గౌణప్రత్యయానికి విషయ మైనవానిని గూర్చి "ఈ దేవదత్తుడు సింహం కాదు. "ఈ పిల్లవాడు అగ్ని కాదు" అని గౌణప్రత్యయం కలవాడు ఎరుగును. అదే విధంగా దేహాదిసంఘాతరూప మైన గౌణాత్మచేత చేయబడిన కర్మ 'అహం' అనే జ్ఞానంలో గోచరమైన ముఖ్యాత్మచేత చేయబడింది కాకూడదు. గౌణసింహాగ్నులు చేసిన కర్మముఖ్యసింహాగ్నులు చేసినది కాజాలదు కదా? క్రౌర్యంచేత గాని పింగలత్వంచేత గాని ముఖ్యసింహాగ్నులు చేసే కార్య మేమీ చేయబడదు కదా? వీటి ప్రయోజనం కేవలం స్తుతికోసం ఉపయోగించడం ద్వారా శాంతించింది; (అంతకు మించి ఏమీ చేయజాలదు). అలా స్తుతింపబడినవాళ్లు కూడ – నేను సింహాన్ని కాను, నేను అగ్నిని కాను, నా పని సింహం చేసే పని కాదు. నా పని అగ్ని చేసే పని కాదు అని ఎరుగుదురు. అదే విధంగా "దేహాదిసంఘాతం చేసే కర్మ ముఖ్యాత్మ లైన నా కర్మ కాదు" అను జ్ఞానమే చాల యుక్త మైనది కాని "నేను కర్తను, ఇది నా కర్మ "అను జ్ఞానం యుక్తం" కాదు. (అందుచేత ఇది మిథ్యాజ్ఞానమే కాని గౌణజ్ఞానం కాదని భావం).

భాష్యమ్

యచ్చ ఆహుః ఆత్మీయైః స్మృతీచ్ఛాప్రయత్నైః కర్మహేతుభిః ఆత్మా కరోతి ఇతి, న; తేషాం మిథ్యాప్రత్యయపూర్వకత్వాత్ మిథ్యాప్రత్యయనిమిత్తేష్టానిష్టానుభూత క్రియాఫలజనితసంస్కారపూర్వకాః హి స్మృతీచ్ఛాప్రయత్నాదయః యథా అస్మిన్ జన్మని దేహాదిసంఘాతాభిమానరాగద్వేషాదికృతౌ ధర్మాధర్మౌ తత్ఫలానుభవశ్చ తథా అతీతే అతీతతరేఽపి జన్మని ఇతి అనాదిః అవిద్యాకృతః సంసారః అతీతః అనాగతశ్చ అనుమేయః. తతశ్చ సర్వకర్మసంన్యాసాత్ జ్ఞాననిష్ఠాయామ్ ఆత్యన్తికః సంసారోపరమః ఇతి సిద్ధమ్.

బాలానందిని

అవ. దేహేంద్రియాదిసంఘాతం విషయంలో 'నేను' అనే బుద్ధి మిథ్యాబుద్ధియే అయినా ఆత్మకు సంబంధించిన స్మతి, ఇచ్ఛా – ప్రయత్నాలచేత ఆత్మ కర్త కర్మలను

ఆచరిస్తుంది. అందుచేత ఆత్మకు కర్మసంబంధం ముఖ్యమే అను మతాన్ని అనువదించి నిరాకరిస్తున్నారు. **యచ్చేతి :-** తనకు సంబంధించినవి, కర్మకు హేతువులూ అయిన స్మృతీచ్ఛాప్రయత్నాల చేతనే ఆత్మ కర్మలు చేస్తూంటుంది అని కొందరు అంటూన్నది యుక్తం కాదు. ఎందువల్ల ననగా అవి మిథ్యాప్రత్యయంచేతనే (ఆత్మకు) ఏర్పడినవి. మిథ్యాప్రయత్నంచేత కొన్ని క్రియాఫలాలు ఇష్టములు గాను కొన్ని అనిష్టములు గాను కనబడుతుంటాయి. అలాంటి క్రియాఫలాలలను అనుభవించడంవల్ల కలిగిన సంస్కారాలను పట్టి స్మృతి - ఇచ్ఛా - ప్రయత్నాదులు కలుగుతుంటాయి. ఈ జన్మలో చేసిన ధర్మాధర్మాలు, వాటి ఫలాల అనుభవమూ కూడ ఏ విధంగా దేహాదిసంఘాతాభిమానంచేత, రాగద్వేషాదుల చేత కలుగుతున్నాయో గడచిన జన్మలోను, దానికి ముందు జన్మలోను కూడ అదే విధంగా కలిగి ఉంటాయి. ఈ విధంగా గడిచి పోయినది, రాబోయేది అయిన సంసారం అవిద్యా కృతమే అని అనుమానప్రమాణం చేత తెలుసుకోవాలి. అందువల్ల సర్వకర్మసంన్యాసంవల్ల జ్ఞాననిష్ఠ కలిగినప్పుడే పూర్తిగా సంసారోపరమం కలుగుతుంది అనే విషయం నిశ్చితం.

భాష్యమ్

అవిద్యాత్మకత్వాచ్చ దేహాభిమానస్య తన్నివృత్తౌ దేహానుపపత్తేః సంసారానుపపత్తిః దేహాదిసంఘాతే ఆత్మాభిమానః అవిద్యాత్మకః. న హి లోకే గవాదిభ్యః అన్యః అహం మత్తశ్చ అన్యే గవాదయః ఇతి జానన్ తేషు అహమితి ప్రత్యయం మన్యతే కశ్చిత్. అజానన్ తు స్థాణౌ పురుషవిజ్ఞానవత్ అవివేకతః దేహాదిసంఘాతే కుర్యాత్ అహమితి ప్రత్యయం న వివేకతో జానన్. యస్తు **"ఆత్మా వై పుత్రనామాసి"** ఇతి పుత్రే అహం ప్రత్యయః స తు జన్యజనకసంబన్ధనిమిత్తః గౌణః గౌణేన చ ఆత్మనా భోజనాదివత్ పరమార్థకార్యం న శక్యతే కర్తుం గౌణసింహాగ్నిభ్యాం ముఖ్యసింహాగ్నికార్యవత్.

బాలానందిని

అవిద్యేతి : దేహాభిమానం అవిద్యారూప మైనది (అవిద్యచేత **కలిగినది**) గాన అది (అవిద్య) పోగానే దేహం కూడ ఉండడం కుదరదు గాన సంసారం ఉండదు. దేహాదుల సంఘాతం విషయంలో ఆత్మాభిమానం అవిద్యాత్మక మైనది. గోవులు మొదలైనవాటికంటె నేను అన్యుడను, నాకంటె గవాదులు అన్యములు అని తెలుసుకొన్నవా డెవడూ లోకంలో, "అవే నేను" అను అనుకొనడు కదా? తెలియనివా డైతే మాత్రం, స్థాణువును పురుషునిగా గ్రహించినట్లు, అవివేకంచేత దేహాదిసంఘాతం విషయంలో నేను అనే బుద్ధిని చేయవచ్చును గాని వివేకంతో తెలిసినవాడు అలా చేయడు. **"ఆత్మా వై పుత్రనామాసి"** అని పుత్రునియందు ఏ అహంప్రత్యయం (నేనే అనే భావం) ఉన్నదో అది గౌణం; దీనికి నిమిత్తం పుత్రునికీ

వానికీ ఉన్న జన్యజనకభావసంబంధం. గౌణాలైన సింహాగ్నులచేత ముఖ్యసింహాగ్నుల కార్యం చేయడానికి ఏ విధంగా శక్యం కాదో అట్లే గౌణాత్మచేత (దేహాదింసఘాతంచేత) భోజనాది కార్యం చేయడానికి శక్యం అయినట్లు. పరమార్థకార్యం (ఆత్మయొక్క సత్యమైన కార్యం) చేయడానికి శక్యం కాదు.

వి. దేహేంద్రియాదిసంఘాతం గౌణాత్మ. అది చేయకలిగిన కార్యం భోజనాదికం. అది ఏ కార్యం చేసినా, భోజనాదికార్యం వలె దాని కార్యమే అవుతుంది కాని ఆత్మయొక్క కార్యం కాదు. గౌణసింహాగ్నులు ముఖ్యసింహాగ్నుల కార్యాలను చేయజాలవు. అవి చేసే కార్యా లేవైనా కనబడితే అవి వాటికి సంబంధించినవే. అదే విధంగా గౌణాత్మలో కనబడే కార్యా లన్నీ దానికి సంబంధించినవే కాని ముఖ్యాత్మకు సంబంధించినవి కావు అని భావం. గౌణాత్మలైన పుత్రాదులు తండ్రి చేయవలసిన భోజనాదులు ఏ విధంగా చేయజాలరో అట్లే గౌణాత్మ యైన దేహాదిసంఘాతం ముఖ్యాత్మయొక్క కార్యం చేయజాలదు అని కొందరు ఈ వాక్యానికి భావం వ్రాశారు. భావం బాగానే ఉంది కాని ఏతద్వాక్యనిర్మాణం తదనుగుణంగా లేదు. "గౌణసింహాగ్నిభ్యాం ముఖ్యసింహాగ్నికార్యవత్"అని భాష్యకారులే ఉదాహరణం చూపుతున్నప్పుడు ఇక్కడ పుత్రోదాహరణం భాష్యకారాభిమతం కాదని తోస్తూన్నది.

భాష్యమ్

అదృష్టవిషయచోదనాప్రామాణ్యాత్ ఆత్మకర్తవ్యం గౌణైః దేహేన్ద్రియాదిభిః క్రియతే ఇతి చేత్–న;అవిద్యాకృతాత్మకత్వాత్ తేషామ్. న గౌణా ఆత్మానః దేహేన్ద్రియాదయః. కథం తర్హి? మిథ్యాప్రత్యయేనైవ అసంగస్య ఆత్మనః సంగత్యా ఆత్మత్వమ్ ఆపాద్యతే,తద్భావే భావాత్ తదభావే చాభావాత్. అవివేకినాం అజ్ఞానాం బాలానాం దృశ్యతే. – "దీర్ఘః అహమ్""గౌరః అహమ్"ఇతి దేహాదిసంఘాతే అహంప్రత్యయః న తు వివేకినామ్ అన్యః అహం దేహాదిసంఘాతాత్ ఇతి జ్ఞానవతాం తత్కాలే దేహాదిసంఘాతే అహంప్రత్యయః భవతి. తస్మాత్ మిథ్యాప్రత్యయాభావే అభావాత్ తత్కృతః ఏవ;న గౌణః. పృథక్గృహ్యమాణవిశేషసామాన్యయోః హి సింహదేవదత్తయోః అగ్నిమాణవకయోః వాగౌణః ప్రత్యయః శబ్దప్రయోగః వా స్యాత్,న అగృహ్యమాణ సామాన్యవిశేషయోః.

బాలానందిని

అదృష్టేతి: –చూడబడని(ప్రత్యక్షాదులకు గోచరము కాని)విషయములను(స్వర్గాదులను)గూర్చిన బోధనల(శ్రౌతవిధివాక్యాల)(ప్రామాణ్యాన్ని పట్టి ఆత్మచేత చేయదగిన దానిని

గౌణములైన దేహేంద్రియాదులు చేస్తాయి అన్నట్లయితే-అది యుక్తం కాదు.ఎందువల్ల ననగా అవి (దేహేంద్రియాదులు)అవిద్యచేత ఆత్మలుగా చేయబడినవి-ఆత్మలుగా భ్రాంతి చేత గ్రహించబడుచున్నవి.(స్వర్గాదిఫలముల నిమిత్తం యాగాదులను శ్రుతి విధించు చున్నది.స్వర్గాదులు ప్రత్యక్షాదిగోచరాలు కావు.అయినా కూడ శ్రుతి పరమప్రమాణం అవడంచేత,దేహాతిరిక్త మైన ఆత్మ ఉన్నదనీ, దేహాంతరాలచేత ఆ ఆత్మయే స్వర్గాదిఫలాలను అనుభవించగల దనీ అంగీకరిస్తున్నాం.అయితే శుద్ధాత్మకు కర్తృత్వాదులు లేవు.అందుచేత దాని గౌణాత్మయైన దేహేంద్రియాదిసంఘాతం శుద్ధాత్మకు ఫలానుభవం నిమిత్తం కర్మలు చేస్తుంది అని చెప్పవచ్చును కదా?అని పూర్వపక్షి అభిప్రాయం.అవి అవిద్యచేత మాత్రమే ఆత్మగా భావించబడుచున్నాయి గాని వాటికి గౌణాత్మత్వం లేదు అని సమాధానం.ఈ విషయమే రాబోవు వాక్యాలలో విశదీకరించబడుచున్నది) దేహేంద్రియాదులు గౌణాత్మలు కావు.మరే మనగా-మిథ్యాప్రత్యయంచేతనే సంగరహిత మైన ఆత్మతో సంనిహితాలు ఉండడంచేత ఆత్మత్వాన్ని పొందింపబడుతున్నాయి (ఆత్మలుగా భావింపబడుతున్నాయి); ఎందువల్ల ననగా మిథ్యాప్రత్యయం ఉన్నప్పుడే వాటికి ఆత్మత్వం భాసిస్తూన్నది,అది లేనప్పుడు భాసించడం లేదు.అజ్ఞానం ఉన్న కాలంలో వివేకం లేని బాలలకు(అజ్ఞులకు)మాత్రమే "నేను పొడవుగా ఉన్నాను,తెల్లగా ఉన్నాను"అని దేహాదుల సంఘాతం విషయంలో అహంబుద్ధి కలుగు తూన్నది గాని,దేహాదిసంఘాతంకంటె నేను భిన్నుడను అను జ్ఞానం గల వివేకం కలవారికి ఆ సమయంలో దేహాదిసంఘాతం విషయంలో నేను అనే బుద్ధి కలగడంలేదు.ఈ విధంగా మిథ్యాజ్ఞానం ఉన్నప్పుడు మాత్రమే ఈ అహంప్రత్యయం ఉండడంవల్ల ఇది మిథ్యాప్రత్యయంచేత పుట్టినదే కాని గౌణం కాదు.వేరు వేరుగా గ్రహింపబడిన విశేష సామాన్యాలు గల సింహదేవదత్తుల విషయంలో గాని,అగ్నిమాణవకుల విషయంలో గాని కలిగిన ప్రత్యయంగాని,శబ్దప్రయోగం గాని గౌణం కావచ్చును గాని గ్రహింపబడని సామాన్యవిశేషాలు కలవాటి విషయంలో గౌణం కాదు.(దేవదత్తునికి మాత్రమే చెందిన కొన్ని విశేషలక్షణా లుంటాయి,సింహానికి మాత్రమే చెందిన కొన్ని విశేషలక్షణా లుంటాయి. దేవదత్తునిలోను సింహంలోను సమంగా ఉన్న కొన్ని సమానధర్మాలు క్రౌర్యం మొదలైనవి ఉంటాయి.అగ్ని -మాణవకులలో కూడ ఇట్లే ఈ విశేషలక్షణాలను సామాన్యలక్షణాలనూ గుర్తించిన పురుషుడే, సింహం వేరు దేవదత్తుడు వేరు,అట్లే అగ్ని వేరు మాణవకుడు వేరు అని స్పష్టంగా తెలిసినవాడే, సామాన్యధర్మాలను పురస్కరించుకొని ఒకప్పుడు "దేవదత్తుడు సింహం"అనీ 'మాణవుకు అగ్ని'అనీ అనుకొనవచ్చును,అలా శబ్దాలు ప్రయోగించవచ్చును. ఆ ప్రతీతి గౌణం.దేహాదిసంఘాతంలో ఆత్మబుద్ధి అలాంటిది కాదు గాన ఇది మిథ్యా ప్రత్యయమే,గౌణం కాదు).

భాష్యమ్

యత్తూక్తం శ్రుతిప్రామాణ్యాత్ ఇతి-న;తత్ర్పామాణ్యస్య అదృష్టవిషయత్వాత్. ప్రత్యక్షాదిప్రమాణానుపలబ్ధే హి విషయే అగ్నిహోత్రాదిసాధ్యసాధనసంబన్ధే శ్రుతేః ప్రామాణ్యం,న ప్రత్యక్షాదివిషయే. అదృష్టదర్శనార్థత్వాత్ ప్రామాణ్యస్య.తస్మాత్ న దృష్ట మిథ్యాజ్ఞాననిమిత్తస్య అహంప్రత్యయస్య దేహాదిసంఘాతే గౌణత్వం కల్పయితుం శక్యమ్.న హి శ్రుతిశతమపి శీతః అగ్నిః అప్రకాశో వా ఇతి బ్రువత్ ప్రామాణ్యమ్ ఉపైతి.యది బ్రూయాత్ శీతః అగ్నిః అప్రకాశో వా ఇతి తథాప్యర్థాన్తరం శ్రుతేః వివక్షితం కల్ప్యమ్,ప్రామాణ్యాన్యథానుపపత్తేః,న తు ప్రమాణాన్తరవిరుద్ధం స్వవచన విరుద్ధం వా.

బాలానందిని

యదితి:-శ్రుతిప్రామాణ్యాన్ని పట్టి(దేహాదిసంఘాతమునందు ఆత్మప్రత్యయం గౌణం)అని ఏది చెప్పబడినదో అది యుక్తం కాదు.ఎందువల్లననగా-శ్రుతియొక్క ప్రామాణ్యం (ప్రత్యక్షాదులచేత)చూడబడనివాటి విషయంలో మాత్రమే.శ్రుతికి ప్రామాణ్యం ప్రత్యక్షదాదులచేత తెలియబడని.అగ్నిహోత్రం మొదలైన వాటి విషయంలోను సాధ్య సాధనాల (స్వర్గ-తత్సాధనకర్మాదుల)సంబంధం మొదలైన వాటి విషయంలోను మాత్రమే, అంతే కాని ప్రత్యక్షాదులకు విషయమైనవాటిలో శ్రుతికి ప్రామాణ్యం లేదు.ప్రామాణ్యం అదృష్టమైనదానిని చూపించడం కోసం కదా?("అజ్ఞాతార్థజ్ఞాపకం ప్రమాణమ్" "తెలియని విషయాన్ని తెలిపేది ప్రమాణం"అని ప్రమాణలక్షణం.అందుచేత ప్రత్యక్షాదుల ద్వారా తెలియని విషయాన్ని చెప్పిన శ్రుతివాక్యం మాత్రమే ప్రమాణం కాని తద్విరుద్ధమైన విషయం చెప్పే శ్రుతివాక్యం ప్రమాణం కాదు అని భావం).అందువల్ల కనబడుతూన్న మిథ్యాజ్ఞానం నిమిత్తంగా చేసికొని దేహాదిసంఘాతం విషయంలో కలిగే అహంప్రత్యయం గౌణం అని కల్పించడానికి శక్యం కాదు.అగ్ని చల్లగా ఉంటుంది,ప్రకాశరహితము అని వంద శ్రుతివాక్యాలు చెప్పినా అవి ప్రమాణం కాజాలవు.కదా?అగ్ని శీతం అని కాని అప్రకాశం అని కాని శ్రుతి చెప్పినా కూడ,శ్రుతికి ఏదో విధంగా ప్రామాణ్యం చెప్పాలి గాన ఆ శ్రుతి అక్కడ ఏ విషయాన్ని ప్రధానంగా చెప్పడానికి ప్రయత్నిస్తూన్నదో ఆ అర్థాన్ని కల్పించాలి కాని ప్రమాణాంతరాలకు కాని,మరొక శ్రుతివాక్యానికే కాని విరుద్ధ మైన అర్థం చెప్పకూడదు.

భాష్యమ్

కర్మణః మిథ్యాప్రత్యయవత్కర్తృకత్వాత్ కర్తుః అభావే శ్రుతేః అప్రామాణ్యమ్ ఇతి చేత్-న;బ్రహ్మవిద్యాయామ్ అర్థవత్త్వోపపత్తేః.కర్మవిధిశ్రుతివత్ బ్రహ్మవిద్యావిధి

శ్రుతేః అప్రామాణ్యప్రసంగః ఇతి చేత్-న. బాధకప్రత్యయానుపపత్తేః. యథా బ్రహ్మవిద్యా విధి శ్రుత్యా ఆత్మన్యవగతే దేహాదిసంఘాతే అహంప్రత్యయః బాధ్యతే తథా ఆత్మన్యేవ ఆత్మావగతిః న కదాచిత్ అపి బాధితుం శక్యా,ఫలావ్యతిరేకావగతేః;యథా అగ్నిః ఉష్ణః ప్రకాశశ్చ ఇతి.న చ కర్మవిధిశ్రుతేః అప్రామాణ్యం,పూర్వపూర్వప్రవృత్తినిరోధేన ఉత్తరోత్తరాపూర్వప్రవృత్తిజననస్య ప్రత్యగాత్మాభిముఖ్యప్రవృత్త్యుత్పాదనార్థత్వాత్. మిథ్యాత్వేఽపి ఉపాయస్య ఉపేయసత్యతయా సత్యత్వమేవ స్యాత్,యథా అర్థవాదానాం విధిశేషాణామ్. లోకేఽపి బాలోన్మత్తాదీనాం పయఆదౌ పాయయితవ్యే చూడావర్ధనాది వచనమ్. ప్రకారాన్తరస్థానాం చ సాక్షాదేవ ప్రామాణ్యసిద్ధిః,ప్రాగాత్మ జ్ఞానాత్, దేహాభిమాన నిమిత్తప్రత్యక్షాదిప్రామాణ్యవత్.

బాలానందిని

కర్మణః ఇతి: -మిథ్యాప్రత్యయం కలవాడే కర్మలకు కర్తగా ఉండాలి గాన(కర్మ లను ఆచరించాలి గాన)కర్త లేకపోతే శ్రుతి అప్రమాణం అవుతుంది కదా అన్నట్లయితే- అది యుక్తం కాదు;ఎందువల్ల ననగా బ్రహ్మవిద్య విషయంలో శ్రుతికి ప్రామాణ్యం కుదురుతుంది. కర్మవిధిశ్రుతివలెనే బ్రహ్మవిద్యావిధిశ్రుతి కూడ అప్రమాణమే అవవలసి ఉంటుంది కదా అనడం యుక్తం కాదు.బ్రహ్మవిద్యను విధించి శ్రుతిచేత ఆత్మ తెలియ బడిన తరువాత దేహాది సంఘాతం విషయంలో(అంతవరకూ ఉన్న)అహంప్రత్యయం (దేహాది సంఘాతమే నేను అనే జ్ఞానం)ఏ విధంగా బాధించబడుతుందో ఆ విధంగా ఆత్మవిషయంలో కలిగిన ఇదే ఆత్మ అనే జ్ఞానం ఎన్నడూ,ఎవనిచేతా,ఏ విధంగానూ కూడ బాధించడానికి శక్యం కాదు;ఎందువల్ల ననగా ఆ జ్ఞానం అగ్ని వేడిగా ఉంటుంది, ప్రకాశరూపం కూడ అనే జ్ఞానం వలె ఫలానికి(అజ్ఞాననివృత్తికి)విరుద్ధంగా లేని జ్ఞానం (ఉన్నది ఉన్నట్లుగా తెలుసుకొనడం).(నువ్వు ఆశకంకించి నట్లు)కర్మవిధిశ్రుతికి కూడ అప్రామాణ్యం లేదు; ఎందువల్ల ననగా-పూర్వపూర్వప్రవృత్తులను అరికట్టి అపూర్వములైన ఉత్తరోత్తరప్రవృత్తులను కలిగించడం ప్రత్యగాత్మవిషయంలో అభిముఖత్వం అనే ప్రవృత్తిని పుట్టించడం కోసం ఉద్దిష్ట మైనది.

వి.అనాదికాలంనుంచి అనేకవ్యాపారాలలో ప్రవృత్తి కలుగుతూ వస్తూన్నది.కర్మవిధి శ్రుతి అలాంటి సహజప్రవృత్తులను క్రమంగా అడ్డుకొని అలౌకికా లైన యాగాదుల విషయంలో ప్రవృత్తిని,ఒకదాని తరువాత ఒకదానిని ఆచరించే అలవాటును పెంపొందించి, తద్వారా చిత్తశుద్ధి కలిగించి ప్రత్యగాత్మస్వరూపజ్ఞానం విషయంలో ఉన్ముఖత్వాన్ని కలిగిస్తుంది.ఆ విధంగా దీని ప్రామాణ్యం అక్షతమే అని భావం.

అవ.శ్రుతియే మిథ్య అయినప్పుడు దానివల్ల కలిగిన జ్ఞానం ప్రమాణం ఎలా అవుతుంది అని ఆశంకించుకొని సమాధానం చెపుతున్నాడు-మిథ్యాత్వేఽపీతి:- విధి వాక్యానికి శేషము లైన(అంగా లైన)అర్థవాదల వలె,ఉపాయ మైన(ఆత్మతత్త్వ జ్ఞానానికి సాధనమైన)శ్రుతి మిథ్య యైనా కూడ ఉపేయ మైనది(పొందదగినది) సత్యమే గాన ఉపాయానికి కూడ సత్యత్వం లభిస్తుంది.(ఉపాయం కూడ సత్యమే).

వి.అర్థవాదాదుల ద్వారా బోధించబడిన అర్థం సత్యం కాకపోవచ్చును.అయినా కూడ ఆ అర్థవాదలు విధివాక్యాలకు అంగములు గాన,ప్రమాణము లైన విధివాక్యాలకు అంగా లవడంచేత అవి కూడ ప్రమాణములే అని(పూర్వమీమాంసకాదులు)అంగీకరించి నట్లు మిథ్యాభూతశ్రుతివాక్యాలకు ప్రతిపాదింపబడే విషయంయొక్క సత్యత్వాన్ని పట్టి సత్యత్వప్రామాణ్యాలు అంగీకరించాలి అని అర్థం.

లోకేఽపీతి:-(ఇది అలౌకికము లైన శ్రుతుల విషయంలోనే కాదు)లోకంలో కూడ బాలులు ఉన్మత్తులు మొదలైనవాళ్లచేత పాలు మొదలైనవి త్రాగించవలసి వచ్చినప్పుడు"జుట్టు పెరుగుతుంది"ఇత్యాదివచనం ఎట్లో అట్లే ఇక్కడ కూడ.(పాలు త్రాగడానికి మందు మ్రింగడానికి మారాం చేస్తూన్న పిల్లవానికి"చూడా తే వర్ధతే తాత గుడూచీం పిబ సాంప్రతమ్"(నాయనా వెంటనే గుడూచీకషాయం త్రాగు;నీజుట్టు పెరుగుతుంది)అని చెప్పి అది త్రాగిస్తారు.జుట్టు పెరగడం అనేది అసత్య మైనా కషాయపానతజ్జన్యలాభాదులు సత్యములే అని భావం).

అవ.కర్మకాండశ్రుతులకు పైన చెప్పినట్లు పరంపరయా ప్రామాణ్యం సిద్ధించినా ప్రత్యక్షప్రమాణ్యం లేదు కదా అని ఆశంకించుకొని ఆత్మజ్ఞానానికి ముందు **వాటికి కూడ** ప్రత్యక్షప్రామాణ్యం ఉంది అని చెపుతున్నారు- ప్రకారేతి:- మరొక ప్రకారంలో ఉన్న శ్రుతులు కూడ,అనగా ఆత్మజ్ఞానోదయంకంటె ముందు ప్రవర్తించే శ్రుతులు కూడ,దేహాభి మానం నిమిత్తం గల (దేహాభిమానం ఉన్నప్పుడు మాత్రమే కలిగే)ప్రత్యక్షాదులు ఏ విధంగా, సాక్షాత్తు గానే ప్రమాణాలో,ఆ విధంగానే సాక్షాత్ప్రమాణాలు.

భాష్యమ్

యత్తు మన్యసే-స్వయమ్ అవ్యాప్రియమాణః అపి ఆత్మా సంనిధిమాత్రేణ కరోతి,తదేవ చ ముఖ్యం కర్తృత్వమ్ ఆత్మనః.యథా రాజా యుధ్యమానేషు యోధేషు యుధ్యతే ఇతి ప్రసిద్ధం,స్వయమ్ అయుధ్యమానః అపి సంనిధానాదేవ, జితః పరాజిత శ్చేతి చ,తథా సేనాపతిః వాచైవ కరోతి క్రియాఫలసంబన్ధశ్చ రాజ్ఞః సేనాపతేశ్చ దృష్టః; యథా చ ఋత్విక్కర్మ యజమానస్య,తథా దేహాదీనాం కర్మ ఆత్మకృతం

స్యాత్,తత్ఫలస్య ఆత్మగామిత్వాత్, యథాచ భ్రామకస్య లోహభ్రామయితృ త్వాత్ అవ్యాపృతస్యైవ ముఖ్యమేవ కర్తృత్వం తథా చ ఆత్మనః ఇతి-తదసత్. అకుర్వతః కారకత్వప్రసంగాత్.కారకమ్ అనేకప్రకారమ్ఇతి చేత్-న;రాజప్రభృతీనాం ముఖ్యస్యాపి కర్తృత్వస్య దర్శనాత్.రాజా తావత్ స్వవ్యాపారేణాపి యుధ్యతే;యోధానాం (చ)యోధయితృత్వే ధనదానే చ ముఖ్యమేవ కర్తృత్వమ్;తథా జయపరాజయ ఫలోపభోగే. తథా యజమానస్యాపి ప్రధానత్యాగే దక్షిణాదానే చ ముఖ్యమేవ కర్తృత్వమ్.తస్మాత్ అవ్యాపృతస్య కర్తృత్వోపచారః యః సః గౌణః ఇత్యవగమ్యతే.

బాలానందిని

యత్త్వితి:-(ఆశంక) ఆత్మ స్వయంగా వ్యాపారం(పని)చేయకపోయినా దగ్గర ఉండడం మాత్రంచేతనే చేస్తున్నాడు.అదే ఆత్మకు ఉన్న ముఖ్యమైన కర్తృత్వం.యోధులు యుద్ధం చేస్తూండగా రాజు తాను యుద్ధం చేయకపోయినా కూడ కేవలం దగ్గర ఉన్నంత మాత్రంచేతనే యుద్ధం చేస్తున్నా డనీ జయించినా డనీ,ఓడింపబడినా డనీ ప్రసిద్ధంగా ఉన్నది.సేనాపతి కూడ మాటమాత్రంచేతనే చేస్తూంటాడు(మాటలాడడం మాత్రమే చేస్తూంటాడు)క్రియవల్ల కలిగే ఫలం మాత్రం రాజుకు సేనాపతికీ కనబడుచున్నది. ఋత్విక్కులు చేసే కర్మ యజమానులకు చెందుతూన్నది. అదేవిధంగా దేహాదులు చేసిన కర్మయొక్క ఫలం ఆత్మకు **చెందుతూ**న్నది గాన ఆ కర్మ కూడ ఆత్మ చేసినదే అవుతుంది. సూదంటురాయి తానేమీ పని చేయకపోయినా లోహాన్ని త్రిప్పడంచేత ముఖ్యమైన (భ్రామణక్రియా)కర్తృత్వం దానికే చెందుతుంది అని నువ్వు అనుకొంటూ న్నది(సమాధానం) యుక్తం కాదు.అలా చెప్పిన ట్లయితే పని చేయని వానికి(దానికి)కూడ కారకత్వం చెప్పవలసి వస్తుంది.(పనిచేసేవానికే (దానికే)కారకం అనే పేరు గదా అని భావం).కారకం అనేకప్రకారాలలో ఉండవచ్చును కదా అనడం యుక్తం కాదు.రాజు మొదలైనవారికి ముఖ్యమైన కారకత్వం కూడ కనబడుచున్నది కదా?రాజైతే తన వ్యాపారం చేత కూడ యుద్ధం చేస్తాడు.యుద్ధభటులచేత యుద్ధం చేయించడంలోను,ధనం ఇవ్వడం లోను,జయ-పరాజయాలవల్ల కలిగే ఫలాన్ని అనుభవించడంలోనూ కూడ వారికి ముఖ్య మైన కర్తృత్వమే ఉన్నది.అట్లే యజమానునికి కూడ ప్రధానహోమద్రవ్యాలత్యాగంలోను (అముకదేవతాయై స్వాహా,అముకదేవతాయై ఇదం న మమ"ఇత్యాదిత్యాగవచనాలను ఉచ్చరించడంలోను)దక్షిణ ఇవ్వడంలోను ముఖ్యమైన కర్తృత్వమే ఉన్నది.అందువల్ల వ్యాపారం చేయనివానికి కర్తృత్వం ఉన్నట్లు ఉపచారం(ఆరోపం)ఏది ఉన్నదో అది గౌణమే అన్నట్లు కనబడుతూన్నది.

భాష్యమ్

యది ముఖ్యం కర్తృత్వం స్వవ్యాపరలక్షణం న ఉపలభ్యతే రాజయజమాన ప్రభృతీనాం తదా సంనిధిమాత్రేణాపి కర్తృత్వం ముఖ్యం కల్ప్యేత-యథా భ్రామకస్య లోహభ్రామణేన. న తథా రాజయజమానాదీనాం స్వవ్యాపారః న ఉపలభ్యతే. తస్మాత్ సంనిధిమాత్రేణ కర్తృత్వం గౌణమేవ. తథా చ తత్ఫలసంబన్ధః అపి గౌణః ఏవ స్యాత్. న గౌణేన ముఖ్యం కార్యం నిర్వర్త్యతే. తస్మాత్ అసదేవ ఏతత్ గీయతే దేహాదీనాం వ్యాపారేణ అవ్యాపృతః ఆత్మా కర్తా భోక్తా చ స్యాత్ ఇతి. భ్రాన్తినిమిత్తం తు సర్వమ్ ఉపపద్యతే; యథా స్వప్నే మాయాయాం చ ఏవమ్. న చ దేహాద్యాత్మప్రత్యయభ్రాన్తి సన్తానవిచ్ఛేదేషు సుషుప్తిసమాధ్యాదిషు కర్తృత్వభోక్తృత్వాద్యనర్థః ఉపలభ్యతే. తస్మాత్ భ్రాన్తిప్రత్యయనిమిత్తః ఏవ అయం సంసారభ్రమః న తు పరమార్థ ఇతి, సమ్యగ్దర్శనాత్ అత్యన్తమేవ ఉపరమః ఇతి సిద్ధమ్. 66

బాలానందిని

యదీతి:-రాజు, యజమానుడు మొదలైనవాళ్లకు స్వయంగా పనిచేయడం అనే లక్షణం గల ముఖ్యమైన కర్తృత్వం కనబడకపోతే అప్పుడు, లోహాన్ని త్రిప్పడంచేత అయస్కాంతానికి వలె, వాళ్ల కున్న ముఖ్యమైన కర్తృత్వం సంనిధిమాత్రంచేతనే అని కల్పించవలసిన అవసరం ఉండేది. అయితే రాజయజమానాదులు స్వవ్యాపారం(స్వయంగా పనిలో పాల్గొనడం)లేదనే మాట లేదు.(వాళ్లు పాల్గొంటూనే ఉన్నారు). అందుచేత సంనిధి మాత్రంచేత కలిగిన -కర్తృత్వం గౌణమే.(ఆత్మ కున్న కర్తృత్వం గౌణమే అని భావం). కర్తృత్వం గౌణం అయినప్పుడు దాని ఫలంతో సంబంధం కూడ గౌణమే కావాలి. గౌణ మైన కర్తృత్వంచేత(కర్మచేత)ముఖ్యమైన కార్యం జరిపింపబడదు కదా? ఆత్మ స్వయంగా వ్యాపారం చేయకపోయినా దేహాదుల వ్యాపారంచేత కర్తా భోక్తా కూడ అవుతాడు అంటూ ఈ పాట చెడ్డదే. భ్రాంతిని పట్టియైతే అంతా కుదురుతుంది. స్వప్నంలోను మాయలోను ఎట్లో భ్రాంతిలో కూడ అట్లే. దేహాదులయందు ఆత్మ అనే భ్రాంతియొక్క నిరంతరప్రవాహానికి విచ్ఛేదరూపా లైన(అడ్డంకు లైన)సుషుప్తి-సమాధ్యాదులలో ఆత్మకు కర్తృత్వం భోక్తృత్వం మొదలైన అనర్థం ఏదీ కనబడడంలేదు కదా? అందుచేత ఈ సంసారభ్రమ భ్రాంతి జ్ఞానమే నిమిత్తంగా గలది(భ్రాంతి జ్ఞానంవల్లనే కలిగినది)కాని పరమార్థ మైనది కాదు అనీ, సమ్యగ్దర్శనంవల్ల ఇది (సంసారభ్రమ)పూర్తిగా తొలగి పోతుం దనీ సిద్ధ మైనది(నిశ్చిత మైన విషయం). 66

భాష్యమ్

సర్వం గీతాశాస్త్రార్థమ్ ఉపసంహృత్య అస్మిన్నధ్యాయే,విశేషతశ్చ అన్తే ఇహ శాస్త్రార్థదార్ఢ్యాయ సంక్షేపేణ ఉపసంహారం కృత్వా,**అథ ఇదానీం** శాస్త్రసంప్రదాయవిధిమ్ ఆహ-

మూ. ఇదం తే నాతపస్కాయ నాభక్తాయ కదా చన,
న చాశుశ్రూషవే వాచ్యం న చ మాం యోఽభ్యసూయతి. 67

బాలానందిని

సర్వమ్ ఇతి:-ఈ అధ్యాయంలో గీతాశాస్త్రంలో ప్రతిపాదించబడిన సమస్త విషయాన్ని ఉపసంహరించి,ఇక్కడ అంతమునందు,విశేషించి,శాస్త్రార్థం దృఢంగా తెలియడంకొరకు సంక్షిప్తరూపంలో ఉపసంహారం చేసి ఇంక ఇప్పుడు శాస్త్రసంప్రదాయపద్ధతిని గూర్చి చెప్పుచున్నాడు-

ప్ర.అ.ఇదమితి:-ఇదమ్=ఇది,తే=నీకు(నీచేత),అతపస్కాయ=తపస్సు లేనివానికి, న వాచ్యమ్=చెప్ప దగినది కాదు.అభక్తాయ=భక్తుడు కానివానికి,కదాచన=ఎన్నడూ కూడ,న= చెప్పకూడదు.అశుశ్రూషవే చ=వినాలనే కోరిక లేనివానికి కూడ,న=చెప్పకూడదు. మామ్=నన్ను(పరమేశ్వరుణ్ణి),యః=ఎవడు,అభ్యసూయతి= ద్వేషిస్తాడో వానికి కూడ,న చ=చెప్పకూడదు.

భాష్యమ్

ఇదం శాస్త్రం,తే తవ హితాయ మయోక్తం సంసారవిచ్ఛిత్తయే,అతపస్కాయ తపోరహితాయ,న వాచ్యమ్ ఇతి వ్యవహితేన సంబధ్యతే-తపస్వినేఽపి అభక్తాయ గురుదేవభక్తిరహితాయ,కదాచన కస్యామపి అవస్థాయాం న వాచ్యమ్.భక్తః తపస్వ్యపి సన్ న శుశ్రూషుః యః భవతి తస్మై అపి న వాచ్యమ్.న చ యః మాం వాసుదేవం ప్రాకృతం మనుష్యం మత్వా అభ్యసూయతి,ఆత్మప్రశంసాదిదోషాధ్యారోపణేన మమ ఈశ్వరత్వమ్ అజానన్ న సహతే అసౌ అపి అయోగ్యః;తస్మై అపి న వాచ్యమ్.భగవతి భక్తాయ తపస్వినే శుశ్రూషవే అనసూయవే చ వాచ్యం శాస్త్రమ్ ఇతి సామర్థ్యాత్ గమ్యతే.తత్ర మేధావినే తపస్వినే వా ఇతి అనయోః వికల్పదర్శనాత్ శుశ్రూషాభక్తి యుక్తాయ తపస్వినే,తద్యుక్తాయ మేధావినే వా వాచ్యమ్.శుశ్రూషాభక్తివియుక్తాయ న తపస్వినే న భక్తాయ నాపి మేధావినే వాచ్యమ్.భగవతి అసూయాయుక్తాయ సమస్త గుణవతేఽపి న వాచ్యమ్.గురుశుశ్రూషాభక్తిమతే చ వాచ్యమ్ ఇత్యేష శాస్త్రసంప్రదాయ విధిః. 67

బాలానందిని

ఇదమితి:-నీ హితంకొరకు,సంసారవిచ్ఛిత్తి(వినాశం)కొరకు నీకు నాచే చెప్పబడిన ఈ శాస్త్రం తపస్సు లేనివానికి చెప్పదగినది కాదు అని దూరంగా ఉన్నదానితో (న వాచ్యమ్ అనేదానితో)సంబధిస్తుంది.తపస్సు కలవాడే అయినా గురువులందు దేవతలయందు భక్తి లేనివానికి,ఎట్టి పరిస్థితిలోనూ కూడ చెప్పదగినది కాదు.భక్తుడైనా,తపస్వి అయినా,ఎవడు వినవలె నని కోరిక గలవాడు కాడో వానికి కూడ చెప్పదగినది కాదు. వాసుదేవుడ నైన (సర్వజగద్వ్యాప్తు డైన పరమాత్మ నైన)నన్ను ప్రాకృతమానవునిగా తలచి, ఆత్మప్రశంసాదిదోషాలను(నన్ను నేను ప్రశంసించుకొనుచున్నాను ఇత్యాది దోషాలను) ఆరోపించి,నా ఈశ్వరత్వాన్ని తెలుసుకొనక నన్ను ఎవడు సహించడో అతడు కూడ అయోగ్యుడే;వానికి కూడ చెప్పదగినది కాదు.భగవంతునియందు భక్తి గలవాడు,తపఃశాలి,వినడానికి కోరిక కలవాడు.అసూయ లేనివాడు అయిన మనుష్యునకు ఈ శాస్త్రం బోధింపదగినది అని సామర్థ్యంవల్ల(ఇక్కడ చెప్పినదానిని అంతనూ బట్టి)తెలుస్తూన్నది.

అవ.ఇలాంటి శాస్త్రాన్ని మేధావికి బోధించాలి అని ఇతరస్మృతులలో ఉన్నది. దానిని దృష్టిలో పెట్టుకొని చెప్పుచున్నారు-**తత్రేతి**:-మేధావికి (**విషయం శీఘ్రంగా** గ్రహించే శక్తి,గ్రహించినదానిని స్థిరంగా జ్ఞాపకం ఉంచుకొనే శక్తీ ఉన్నవాడు మేధావి)గాని, తపస్వికి గాని బోధించాలి అని వికల్పం కనబడడంవల్ల శుశ్రూషా-భక్తు లున్న తపస్వికి గాని, శుశ్రూషాభక్తు లున్న మేధావికి గాని బోధించాలి. తపస్వి యైనా మేధావి యైనా శుశ్రూషా భక్తులు లేకపోతే వానికి బోధించకూడదు.భగవంతునియందు అసూయ కలవానికి మాత్రం, వానికి ఇతరగుణా లన్నీ ఉన్నా కూడ బోధించకూడదు.గురుశుశ్రూషా (గురు సేవా)భక్తు లున్నవానికి బోధించాలి అని ఇది శాస్త్రసంప్రదాయవిధి. 67

భాష్యమ్

సంప్రదాయస్య కర్తుః ఫలమ్ ఇదానీమ్ ఆహ-

మూ. య ఇమం పరమం గుహ్యం మద్భక్తేష్వభిధాస్యతి,
భక్తిం మయి పరాం కృత్వా మామేవైష్యత్యసంశయః. 68

బాలానందిని

సంప్రదాయస్యేతి:-సంప్రదాయాన్ని అనుసరించేవానికి కలిగే ఫలాన్ని ఇప్పుడు చెప్పుచున్నాడు-

ప్ర.అ. **య ఇతి**:-యః=ఎవడు,మయి=నాయందు,పరామ్=గొప్పదైన, భక్తిమ్=భక్తిని,కృత్వా=చేసి,ఇమమ్=ఈ, పరమమ్=గొప్ప,గుహ్యమ్=రహస్యమును,మద్భక్తేషు= నా భక్తులయందు,అభిధాస్యతి=చెప్పగలడో,అతడు,మామేవ=నన్నే,ఏష్యతి=పొందగలడు. అసంశయః=సంశయం లేదు.

భాష్యమ్

యః ఇమం యథోక్తం పరమం నిఃశ్రేయసార్థం కేశవార్జునయోః సంవాద రూపం గ్రన్థం,గుహ్యం గోప్యమ్,మద్భక్తేషు మయి భక్తివత్సు,అభిధాస్యతి వక్ష్యతి గ్రన్థతః అర్థతః చ స్థాపయిష్యతి ఇత్యర్థః,యథా త్వయి మయా. భక్తేః పునః గ్రహణాత్ భక్తిమాత్రేణ కేవలేన శాస్త్రసంపాదనే పాత్రం భవతి ఇతి గమ్యతే.కథమ్ అభిధాస్యతి ఇతి ఉచ్యతే-భక్తిం మయి పరాం కృత్వా భగవతః పరమగురోః అచ్యుతస్య శుశ్రూషా మయా క్రియతే ఇత్యేవం కృత్వా ఇత్యర్థః.తస్యేదం ఫలమ్-మామేవ ఏష్యతి,ముచ్యతే ఏవ;అత్ర సంశయః న కర్తవ్యః. 68

బాలానందిని

య ఇతి:-ఎవడు,ఇంతవరకూ చెప్పబడిన,గొప్పదైన,అనగా మోక్షము ప్రయోజనంగా గల,కేశవార్జునుల సంవాదరూప మైన,రహస్య మైన గ్రంథాన్ని నాయందు భక్తి గలవారియందు చెపుతాడో,గ్రంథరూపంలోను,అర్థరూపంలోను కూడ స్థాపిస్తాడో అని అర్థం,నేను నీయందు ఉంచి నట్లు స్థాపిస్తాడో,(పై శ్లోకంలో ఒకసారిచెప్పిన)భక్తిని మళ్ళీ చెప్పడంవల్ల భక్తి ఉంటే చాలు ఈ శాస్త్రం బోధించడానికి (ఇవ్వడానికి)పాత్రు డవుతాడు అని తెలుస్తూన్నది.ఎట్లు చెపుతాడో చెప్పబడుచున్నది-నాయందు గొప్ప భక్తిని చేసి.(ఈ శాస్త్రాన్ని ఉపదేశించడం ద్వారా)నేను భగవంతుడు,పరమగురువు అయిన అచ్యుతుని సేవ చేస్తున్నాను అను భావన చేసి అని అర్థం.వానికి ఇది ఫలం-నన్నే పొందుతాడు.తప్పక ముక్తు డవుతాడు.ఈ విషయంలో సంశయించకూడదు. 68

భాష్యమ్

కిం చ-

మూ. న చ తస్మాన్మనుష్యేషు కశ్చిన్మే ప్రియకృత్తమః,
భవితా న చ మే తస్మాదన్యః ప్రియతరో భువిః. **69**

బాలానందిని

కిం చేతి:- మరొక విషయ మేమనగా-

నేతి:- మనుష్యేషు=మనుష్యులలో,తస్మాత్=వానికంటె,మే=నాకు,ప్రియకృత్తమః =ఎక్కువ ప్రియం చేసేవాడు,న చ=లేడు కూడ. భువిః=భూలోకంలో,తస్మాత్=వానికంటె మే=నాకు,ప్రియతరః=ఎక్కువ ప్రియ మైనవాడు,అన్యః=మరి యొకడు,న భవితా చ=ఉండబోడు కూడ.

భాష్యమ్

న చ తస్మాత్ శాస్త్రసంప్రదాయకృతః,మనుష్యేషు మనుష్యాణాం మధ్యే కశ్చిత్, మే మమ ప్రియకృత్తమః అతిశయేన ప్రియకృత్,తతః అన్యః ప్రియకృత్తమః,నాస్త్యేవ ఇత్యర్థః. వర్తమానేషు.న చ భవితా భవిష్యత్యపి కాలే,తస్మాత్ ద్వితీయః అన్యః ప్రియతరః భువి లోకే అస్మిన్. 69

బాలానందిని

నేతి:-శాస్త్రసంప్రదాయాన్ని నిలబెట్టినవానికంటె నాకు ఎక్కువ ప్రియమును చేసినవాడు ఎవడూ కూడ ఇప్పు డున్న మనుష్యులలో లేడు.ఈ లోకంలో వానికంటె వేరైనవాడు మరొక డెవడూ నాకు ఎక్కువ ప్రియ మైనవాడు,భవిష్యత్కాలంలో కూడ ఉండడు. 69

భాష్యమ్

యః అపి-

మూ. అధ్యేష్యతే చ య ఇమం ధర్మ్యం సంవాదమావయోః,
జ్ఞానయజ్ఞేన తేనాహమిష్టః స్యామితి మే మతిః. 70

బాలానందిని

య ఇతి:- ఎవడు కూడ-

ప్ర.అ.య ఇతి:-యః=ఎవడు,ఆవయోః=మన ఇద్దరియొక్క,ధర్మ్యమ్=ధర్మసమంత మైన,ఇమమ్=ఈ,సంవాదమ్=సంవాదమును,అధ్యేష్యతే చ=చదువుతాడో,తేన= వానిచేత,అహమ్=నేను,జ్ఞానయజ్ఞేన=జ్ఞానయజ్ఞంచేత,ఇష్టః=పూజించబడినవాడను, స్యామ్ =అగుదును,ఇతి=అని,మే=నాయొక్క,మతిః=నిశ్చయము.

భాష్యమ్

అధేష్యతే చ పఠిష్యతి యః ఇమం,ధర్మ్యం ధర్మాత్ అనపేతం సంవాదరూపం గ్రన్థమ్ ఆవయోః,తేన ఇదం కృతం స్యాత్-విధిజపోపాంశుమానసానాం యజ్ఞానాం

జ్ఞానయజ్ఞః మానసత్వాత్ విశిష్టతమః ఇత్యతః తేన జ్ఞానయజ్ఞేన,గీతాశాస్త్రస్య అధ్యయనం స్తూయతే.ఫలవిధిః ఏవవా. తేన అధ్యయనేన అహమ్ ఇష్టః పూజితః,స్యాం భవేయమ్,ఇతి, మే మమ, మతిః నిశ్చయః. 70

బాలానందిని

అధ్యేష్యతే ఇతి:- ధర్మమునుండి దూరము కాని(ధర్మసంమతమైన)మన ఇద్దరి సంవాదం రూపంలో ఉన్న ఈ గ్రంథాన్ని ఎవడు చదువుతాడో,వానిచేత ఇది చేయబడినది అవుతుంది-విధి(హవిరాదులతో చేసేది)-జప-ఉపాంశు-మానసయజ్ఞాలలో మానసం అవడంచేత జ్ఞానయజ్ఞం చాలా విశిష్టమైనది గాన అట్టి జ్ఞానయజ్ఞంచేత,వానిచేత,ఆ అధ్యయనం ద్వారా,నేను పూజింపబడినవాడను అగుదును అని నా నిశ్చయం. ఈ విధంగా గీతశాస్త్రాధ్యయనం స్తుతించబడుచున్నది.లేదా దీని అధ్యయనం చేసినవానికి దేవతాదులను గూర్చిన జ్ఞానయజ్ఞంవల్ల కలిగే ఫలం కలుగుతుంది అని ఇది ఫలవిధియే అని యైనా గ్రహించవచ్చును. 70

భాష్యమ్

అథ శ్రోతురిదం ఫలమ్-

మూ. శ్రద్ధావాననసూయశ్చ శృణుయాదపి యో నరః,
సోఽపి ముక్తః శుభాన్ లోకాన్ ప్రాప్నుయాత్పుణ్యకర్మణామ్. 71

బాలానందిని

అథేతి:-ఇటుపైన శ్రోతకు కలుగు ఈ ఫలం చెప్పబడుచున్నది-

శ్రద్ధేతి:- యః నరః=ఏ మనుష్యుడు,శ్రద్ధావాన్=శ్రద్ధ కలవాడై,అనసూయః చ= అసూయలేనివాడు కూడ అయి,శృణుయాత్ అపి=వినడం మాత్రమే చేస్తాడో, సః అపి= అతడు కూడ,ముక్తః =పాపవిముక్తుడై,పుణ్యకర్మణామ్=పుణ్యకర్మ కలవాళ్లయొక్క శుభాన్= ప్రశస్తము లైన, లోకాన్=లోకాలను,ప్రాప్నుయాత్=పొందును.

భాష్యమ్

శ్రద్ధావాన్ శ్రద్దధానః,అనసూయః చ అసూయావర్జితః సన్,ఇమం గ్రన్థం శృణుయాదపి య నరః అపి శబ్దాత్ కిముత అర్థజ్ఞానవాన్,సః అపి పాపాత్ ముక్తః శుభాన్ ప్రశస్తాన్,లోకాన్ ప్రాప్నుయాత్,పుణ్యకర్మణామ్ అగ్నిహోత్రాదికర్మవతామ్. 71

బాలానందిని

శ్రద్ధావానితి:-పూర్తి నమ్మకం కలవాడై,అసూయ లేనివాడై,ఏ నరుడు ఈ గ్రంథాన్ని వినడంమాత్రమే చేస్తాడో"శృణుయాత్ అపి"అని అపిశబ్దాన్ని ప్రయోగించడంచేత అర్థ జ్ఞానం ఉన్నవాని మాట చెప్పాలా అని అర్థం.పాపాలనుండి ముక్తుడై అగ్నిహోత్రాదిపుణ్య కర్మలు చేసేవాళ్లకు లభించే ప్రశస్తములైన లోకాలను పొందుతాడు. 71

భాష్యమ్

శిష్యస్య శాస్త్రార్థగ్రహణాగ్రహణవివేకబుభుత్సయా పృచ్ఛతి.తదగ్రహణే జ్ఞాతే పునః గ్రాహయిష్యామి ఉపాయాన్తరేణాపీతి ప్రష్టుః అభిప్రాయః. యత్నాన్తరమ్ ఆస్థాయ శిష్యః కృతార్థః కర్తవ్యః ఇతి ఆచార్యధర్మః ప్రదర్శితః భవతి.

మూ. కచ్చిదేతచ్ఛ్రుతం పార్థ త్వయైకాగ్రేణ చేతసా,
కచ్చిదజ్ఞానసంమోహః ప్రనష్టస్తే ధనంజయ. 72

బాలానందిని

శిష్యస్యేతి:-శిష్యుడు విషయం గ్రహించాడా లేదా అని వివేకపూర్వకంగా (స్పష్టంగా) తెలుసుకొనవలె ననే కోరికతో ప్రశ్నిస్తున్నాడు.అతనికి తెలియలేదనే విషయం తెలిస్తే మరొక ఉపాయంచేత మళ్ళీ బోధిద్దాం అని ప్రష్టయొక్క అభిప్రాయం.మరొక ప్రయత్నాన్ని అవలంబించి (ఏదో విధంగా)శిష్యుణ్ణి కృతార్థుణ్ణి చెయ్యాలి అనే ఆచార్యధర్మం(ఈ విధంగా) చూపబడినది అవుతుంది.

ప్ర.అ. పార్థ=అర్జునా!ఏతత్=ఇది,త్వయా=నీచేత,ఏకాగ్రేణ=చేతసా=ఏకాగ్ర చిత్తంతో,కచ్చిత్ శ్రుతమ్=వినబడినదా?ధనంజయ=అర్జునా!తే=నీయొక్క అజ్ఞానసంమోహః =అజ్ఞానంవల్ల కలిగిన మోహం,ప్రనష్టః కచ్చిత్=నశించినదా?

భాష్యమ్

కచ్చిత్ కిమ్ ఏతత్ మయా ఉక్తం,శ్రుతం శ్రవణేన అవధారితమ్,పార్థ,కిం త్వయా ఏకాగ్రేణ,చేతసా చిత్తేన,కిం వా ప్రమాదితమ్?కచ్చిత్ అజ్ఞానసంమోహః అజ్ఞాననిమిత్తః సంమోహః,విచిత్తభావః అవివేకతా,స్వాభావికః కిం ప్రనష్టః?యదర్థః అయం శాస్త్రశ్రవణాయాసః తవ,మమ చ ఉపదేష్టృత్వాయాసః ప్రవృత్తః తే తవ, ధనంజయ. 72

బాలానందిని

కచిదితి:- అర్జునా!నాచేత చెప్పబడిన ఇది నీచేత ఏకాగ్రమైన చిత్తంతో విని నిశ్చయింపబడినదా(నిశ్చితంగా తెలియబడినదా)లేక పొరబాటు చేయబడినదా?స్వాభావిక మైన అజ్ఞానసంమోహం,అనగా అజ్ఞానం నిమిత్తంగా గల సంమోహం,చిత్తం సరిగా పనిచేయకపోవడం,వివేకంలేక పోవడం నశించినది కదా?దేని నిమిత్తమై నీవు ఈ శాస్త్రం వినే శ్రమను అనుభవించావో నేను ఉపదేశించడం అనే శ్రమను వహించానో అట్టి అజ్ఞాననాశం నీకు కలిగినదా ఓ ధనంజయా. 72

అర్జున ఉవాచ-

మూ. నష్టో మోహః స్మృతిర్లబ్ధా త్వత్ప్రసాదాన్మయాచ్యుత,
స్థితోఽస్మి గతసందేహః కరిష్యే వచనం తవ. 73

అర్జునుడు పలికెను-

ప్ర.అ. నష్టః ఇతి:- అచ్యుత=కృష్ణా! త్వత్ప్రసాదాత్= నీ అనుగ్రహం వల్ల, మోహః =మోహం, నష్టః=నశించినది, స్మృతిః=స్మృతి,లబ్ధా పొందబడినది. గతసందేహః=పోయిన సందేహాలు కలవాడనై స్థితః అస్మి=(నీ ఆజ్ఞలో)నిలచి ఉన్నాను. తవ=నీయొక్క వచనమ్ = వచనమును,కరిష్యే=చేసెదను.

భాష్యమ్

నష్టః మోహః అజ్ఞానజః సమస్తసంసారానర్థహేతుః సాగరః ఇవ దుస్తరః; స్మృతిః చ ఆత్మతత్త్వవిషయా లబ్ధా. యస్యాః లాభాత్ సర్వహృదయగ్రన్థీనాం విప్రమోక్షః త్వత్ప్రసాదాత్ తవ ప్రసాదాత్.మయా త్వత్ప్రసాదమ్ ఆశ్రితేన అచ్యుత.అనేన మోహనాశనప్రశ్నప్రతివచనేన సర్వశాస్త్రార్థజ్ఞానఫలమ్ ఏతావదేవ ఇతి నిశ్చితం దర్శితం భవతి,యదుత అజ్ఞానమోహనాశః ఆత్మస్మృతిలాభశ్చ ఇతి.తథా చ శ్రుతౌ అనాత్మవిత్ శోచతీతి ఉపన్యస్య ఆత్మజ్ఞానే సర్వగ్రన్థివిప్రమోక్షః ఉక్తః.**"భిద్యతే హృదయ గ్రన్థిః "**(ము.ఉ.2.2.8)**"తత్ర కో మోహః కః శోకః ఏకత్వమనుపశ్యతః"**(ఈ.ఉ.7)ఇతి చ మన్త్రవర్ణః.అథ ఇదానీం త్వచ్ఛాసనే స్థితః అస్మి గతసందేహః ముక్తసంశయః.కరిష్యే వచనం తవ.అహం త్వత్ప్రసాదాత్ కృతార్థః,న మే కర్తవ్యమ్ అస్తి ఇత్యభిప్రాయః. 73

బాలానందిని

నష్టః ఇతి:- కృష్ణా! అజ్ఞానంవల్ల కలిగినది,సమస్తమైన సంసారరూపానర్థానికి హేతువూ,సాగరం వలె దాట శక్యం కానిదీ అయిన మోహం నశించినది.నాచేత ఆత్మ తత్త్వాన్ని గూర్చిన స్మృతి, ఏది లభించడంవల్ల సమస్తహృదయగ్రంథులు (కామాలు) విడిపోతాయో అట్టి స్మృతి పొందబడినది కూడ.నీ అనుగ్రహంవల్ల,నీ అనుగ్రహాన్ని

ఆశ్రయించిన నాచేత(పొందబడినది). మోహనాశాన్ని గూర్చి ఈ ప్రశ్న ప్రతివచనాలచేత సమస్తశాస్త్రార్థజ్ఞానానికి ఫలం ఇదే అని నిశ్చితంగా చూపబడినది-అది ఏదనగా అజ్ఞాన సంమోహం నశించడం,ఆత్మస్మృతిలాభమూ అనేవి అని. అందుచేతనే శ్రుతిలో-ఆత్మ జ్ఞానం లేనివాడనై శోకంతో ఉన్నాను అని చెప్పి(ఛాందోగ్యంలో నారదుడు సనత్కుమారునితో చెప్పినట్లు ఆత్మజ్ఞానం కలగగానే సర్వగ్రంథుల విమోచనం చెప్పబడింది. "భిద్యతే హృదయగ్రన్థిః", "తత్ర కో మోహః కః శోకః ఏకత్వమనుపశ్యతః"(పరమాత్మను చూడగానే హృదయగ్రంథి విడిపోతుంది""ఏకత్వాన్ని చూచేవానికి మోహం ఏమిటి,శోకం ఏమిటి") అని మంత్రవర్ణం చెప్పుచున్నది. ఇంక ఇప్పుడు విడవబడిన సందేహం కలవాడనై నీ ఆజ్ఞలో ఉన్నాను,నీ మాట (నువ్వు చెప్పినట్లు)చేస్తాను. నీ అనుగ్రహంవల్ల కృతార్థుడను అయినాను, నాకు మరొక కర్తవ్యం ఏదీ లేదు అని అభిప్రాయం. 73

భాష్యమ్

పరిసమాప్తః శాస్త్రార్థః. అథ ఇదానీం కథాసంబన్ధదర్శనార్థమ్-

సంజయ ఉవాచ-

మూ. ఇత్యహం వాసుదేవస్య పార్థస్య చ మహాత్మనః,
సంవాదమిమమశ్రౌషమద్భుతం రోమహర్షణమ్. 74

బాలానందిని

పరిసమాప్త ఇతి:-శాస్త్రార్థం సమాప్త మైనది. ఇంక ఇప్పుడు కథతో సంబంధాన్ని చూపడం కోసం-

సంజయుడు ఇట్లు పలికాడు-

ప్ర.అ. ఇతీతి:- అహమ్=నేను,మహాత్మనః=మహాత్ముడైన,వాసుదేవస్య=కృష్ణుని యొక్క(మహాత్ముడైన)పార్థస్య చ=అర్జునునియొక్క,ఇమమ్=ఈ,అద్భుతమ్=ఆశ్చర్యకరము, రోమహర్షణమ్=గగుర్పాటు కలిగించేది అయిన,సంవాదమ్=సంవాదమును,ఇతి=ఈ విధంగా,అశ్రౌషమ్=విన్నాను.

భాష్యమ్

ఇతి ఏవమ్,అహం,వాసుదేవస్య పార్థస్య చ మహాత్మనః సంవాదమ్ ఇమమ్ యథోక్తమ్,అశ్రౌషమ్ శ్రుతవాన్ అస్మి,అద్భుతమ్ అత్యన్తవిస్మయకరం,రోమహర్షణమ్ రోమాఞ్చకరమ్.

భాలానందిని

ఇతీతి:-ఈ విధంగా నేను మహాత్ముడైన కృష్ణునియొక్కఅర్జునునియొక్క ఈ పైన చెప్పబడిన,చాల ఆశ్చర్యకర మైన,రోమాంచం కలిగించే సంవాదం విన్నాను. 74

భాష్యమ్.

తం చ ఇమమ్-

మూ. వ్యాసప్రసాదాచ్ఛ్రుతవానేతం గుహ్యమహం పరమ్,
యోగం యోగేశ్వరాత్ కృష్ణాత్సాక్షాత్కథయతః స్వయమ్. 75

బాలానందిని

తమితి:- అట్టి దీనిని-

ప్ర. అ. వ్యాసేతి:-అహమ్=నేను,పరమ్=మిక్కిలి,గుహ్యమ్=రహస్యమైనదీ, యోగమ్=యోగమునకు సంబంధించినదీ అయిన,ఏతమ్=ఈ సంవాదమును,సాక్షాత్= సాక్షాత్తూ,కథయతః=చెప్పుచున్న,యోగేశ్వరాత్=యోగేశ్వరుడైన,కృష్ణాత్=కృష్ణునినుండి, స్వయమ్=స్వయంగా,వ్యాసప్రసాదాత్=వ్యాసుని అనుగ్రహంవల్ల,శ్రుతవాన్=విన్నాను.

భాష్యమ్

వ్యాసప్రసాదాత్ తతః దివ్యచక్షుర్లాభాత్,శ్రుతవాన్,ఏతం సంవాదం గుహ్యమ్, అహం,పరం,యోగం,యోగార్థత్వాత్.సంవాదమ్ ఇమమ్,యోగమేవ వా యోగేశ్వరాత్ కృష్ణాత్,సాక్షాత్,కథయతః స్వయమ్ న పరంపరాతః. 75

బాలానందిని

వ్యాసేతి:-చాల రహస్య మైనది,యోగం ప్రయోజనంగా కల దవడంచేత యోగ రూపమైనదీ అయిన ఈ సంవాదాన్ని,యోగేశ్వరుడైన కృష్ణుడు సాక్షాత్తు చెప్పుచుండగా, వ్యాసుని అనుగ్రహంవలన,వ్యాసునివలన దివ్యదృష్టి లభించడంవలన,నేను స్వయంగా విన్నాను.అంతే కాని పరంపరచేత కాదు;(వారూ వీరూ చెప్పగా వినలేదు). 75

మూ. రాజన్ సంస్మృత్య సంస్మృత్య సంవాదమిమమద్భుతమ్,
కేశవార్జునయోః పుణ్యం హృష్యామి చ ముహుర్ముహుః. 76

ప్ర. అ. రాజన్నితి:-రాజన్=రాజా,కేశవార్జునయోః=కృష్ణార్జునులయొక్క,అద్భుతమ్= ఆశ్చర్యకరము,పుణ్యమ్=పుణ్యమూ అయిన,ఇమమ్=ఈ,సంవాదమ్=సంవాదమును, ముహుః ముహుః =మాటిమాటికి,సంస్మృత్య సంస్మృత్య=స్మరించీ స్మరించి,హృష్యామి చ=సంతోషి స్తున్నాను కూడ.

భాష్యమ్

హే రాజన్ **ధృతరాష్ట్ర**,సంస్మృత్య సంస్మృత్య సంవాదమ్ ఇమమ్ అద్భుతం కేశవార్జునయోః పుణ్యం శ్రవణాదపి పాపహరం శ్రుత్వా హృష్యామి చ ముహుః ముహుః ప్రతిక్షణమ్. 76

బాలానందిని

హే రాజన్నితి:-ఓ! ధృతరాష్ట్రమహారాజా! అద్భుతము,వింటే కూడ పాపాన్ని హరించేదీ అయిన కేశవార్జునుల ఈ సంవాదాన్ని విని, మాటిమాటికి ప్రతీ క్షణమూ, స్మరించి స్మరించి సంతోషిస్తున్నాను కూడ. 76

మూ. తచ్చ సంస్మృత్య సంస్మృత్య రూపమత్యద్భుతం హరేః,
విస్మయో మే మహాన్ రాజన్ హృష్యామి చ పునః పునః. 77

ప్ర.అ.తచ్చేతి:-రాజన్=రాజా!హరేః=విష్ణువుయొక్క,అత్యద్భుతమ్=చాలా అద్భుతమైన,తత్=ఆ,రూపమ్=రూపమును,సంస్మృత్య సంస్మృత్య=స్మరించీ, స్మరించీ, మే=నాకు, మహాన్=గొప్ప,విస్మయః=ఆశ్చర్యం కలుగుచున్నది.పునః పునః=మాటిమాటికి,హృష్యామి చ=సంతోషిస్తున్నాను కూడ.

భాష్యమ్

తచ్చ సంస్మృత్య సంస్మృత్య రూపమ్ అత్యద్భుతం హరేః,విశ్వరూపం,విస్మయః మే మహాన్, హే రాజన్,హృష్యామి చ పునః పునః. 77

బాలానందిని

తచ్చేతి:- ఓ!రాజా!విష్ణువుయొక్క ఆ అద్భుత మైన విశ్వరూపాన్ని స్మరించీ స్మరించి నాకు గొప్ప ఆశ్చర్యం కలుగుచున్నది.మాటి మాటికి సంతోషిస్తున్నాను కూడ. 77

భాష్యమ్

కిం బహునా?

మూ. యత్ర యోగేశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః,
తత్ర శ్రీర్విజయో భూతిర్ధ్రువా నీతిర్మతిర్మమ. 78

ఇతి శ్రీ మహాభారతే శతసాహస్ర్యాం సంహితాయాం వైయాసిక్యాం భీష్మపర్వణి శ్రీమద్భగవద్గీతాసు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే మోక్షసంన్యాసయోగో నామ అష్టాదశోఽధ్యాయః

బాలానందిని

కిమితి:- చాలా చెప్పి ఏమి ప్రయోజనం?

ప్ర.అ.యత్రేతి:-యోగేశ్వరః=యోగాలకు ప్రభువైన,కృష్ణః=కృష్ణుడు,యత్ర=ఎక్కడ ఉంటాడో,ధనుర్ధరః=ధనుర్ధారియైన,పార్థః=అర్జునుడు,యత్ర=ఎక్కడ ఉంటాడో,తత్ర=అక్కడ,

శ్రీః=ఐశ్వర్యము,విజయః=విజయము,భూతిః=వైభవము,ధ్రువా=స్థిరమైన,నీతిః=నీతి ఉంటుందని, మమ=నాయొక్క,మతిః=బుద్ధి(నిశ్చయము).

భాష్యమ్

యత్ర యస్మిన్ పక్షే,యోగేశ్వరః సర్వయోగానామ్ ఈశ్వరః,తత్ప్రభవత్వాత్ సర్వయోగబీజస్య,కృష్ణః,యత్ర పార్థః యస్మిన్ పక్షే ధనుర్ధరః గాణ్డీవధన్వా,తత్ర శ్రీః తస్మిన్ పాణ్డవానాం పక్షే,విజయః,తత్రైవ చ భూతిః-శ్రియో విశేషః విస్తారః భూతిః, ధ్రువా అవ్యభిచారిణీ,నీతిః నయః ఇతి ఏవం,మతిః మమ ఇతి. 78

ఇతి శ్రీమత్పరమహంసపరివ్రాజకాచార్యగోవిన్దభగవత్పూజ్యపాదశిష్య శ్రీమదాచార్యశ్రీశంకరభగవతః కృతౌ శ్రీమద్భగవద్గీతాభాష్యే మోక్షసంన్యాసయోగో నామ అష్టాదశోఽధ్యాయః.

బాలానందిని

యత్రేతి: - సమస్తము లైన యోగాలకుఈశ్వరుడైన, సమస్తయోగాల బీజము కృష్ణుడే కారణంగా కలదవడంవల్ల(కృష్ణునినుండియే పుట్టుటవలన)యోగేశ్వరుడైన, కృష్ణుడు ఏ పక్షంలో ఉంటాడో,గాండీవధనస్సును ధరించిన అర్జునుడు ఏ పక్షంలో ఉంటాడో అట్టి పాండవుల పక్షంలో ఐశ్వర్యము,విజయము,భూతి,శ్రీయొక్క విశేషమే, విస్తారమే భూతి,వ్యభిచరించని (తప్పక సత్ఫలితాన్ని ఇచ్చే)నీతి ఉంటాయి అని నా నిశ్చయము.

పుల్లెల శ్రీరామచంద్రుడు రచించిన
"బాలానందిని"
అను శ్రీభగవద్గీతాశాంకరభాష్యాంధ్రవ్యాఖ్యానమునందు
అష్టాదశాధ్యాయం సమాప్తం.

యత్కృపాలేశసంసర్గాద్వ్యాఖ్యేయం రచితా మయా,
తస్యైవ జానకీజానేః పదయోరియమర్ప్యతే.

దేవతానుగ్రహః పిత్రోస్తపశ్చాచార్యసత్కృపా,
కర్త్రాస్మద్గ్రన్థజాతస్య కరణం కేవలం వయమ్.

శ్రీః శ్రీః శ్రీః శ్రీః శ్రీః

3-3-2001

AHAM BRAHMASMI

OM SRI MATRE NAMAHA

यदा यदा हि धर्मस्य ग्लानिर्भवती भारत।
अभ्युत्थानमधर्मस्य तदाऽऽत्मानं सृजाम्यहम ।।

శ్రీః

అనుబంధం - 1

భగవద్గీతాశ్లోకానామ్ అకారాద్యాద్యక్షరసూచీ

శ్లోక ప్రతీకాని	అ. శ్లో.
అకీర్తిం చాపి భూతాని	2.34
అక్షరం బ్రహ్మ పరమమ్	8.3
అక్షరాణామకారోఽస్మి	10.33
అగ్నిర్జ్యోతిరహః శుక్లః	8.24
అచ్ఛేద్యోఽయమదాహ్యోఽయమ్	2.24
అజోఽపి సన్నవ్యయాత్మా	4.6
అజ్ఞశ్చాశ్రద్దధానశ్చ	4.40
అత్ర శూరా మహేష్వాసాః	1.4
అథ కేన ప్రయుక్తోఽయమ్	3.36
అథ చిత్తం సమాధాతుమ్	12.9
అథ చేత్త్వమిదం ధర్మ్యమ్	2.33
అథ చైవం నిత్యజాతమ్	2.26
అథవా బహునైతేన	6.42
అథవా యోగినామేవ	10.42
అథ వ్యవస్థితాన్ దృష్ట్వా	1.20
అథైతదప్యశక్తోఽసి	12.11
అదృష్టపూర్వం హృషితోఽస్మి	11.45
అదేశకాలే యద్దానమ్	17.22
అద్వేష్టా సర్వభూతానామ్	12.13
అధర్మం ధర్మమితి యా	18.32
అధర్మాభిభవాత్కృష్ణ	1.41
అధశ్చోర్ధ్వం ప్రసృతాస్తస్య	15.2
అధిభూతం క్షరో భావః	8.4
అధియజ్ఞః కథం కోఽత్ర	8.2
అధిష్ఠానం తథా కర్తా	18.14
అధ్యాత్మజ్ఞాననిత్యత్వమ్	13.11
అధ్యేష్యతే చ య ఇమమ్	18.70
అనన్తవిజయం రాజా	1.16
అనన్తశ్చాస్మి నాగానామ్	10.29
అనన్యచేతాః సతతమ్	18.14
అనన్యాశ్చిన్తయన్తో మామ్	9.22
అనపేక్షః శుచిర్దక్షః	12.16
అనాదిత్వాన్నిర్గుణత్వాత్	13.31
అనాదిమధ్యాన్తమనన్త	11.19
అనాశ్రితః కర్మఫలమ్	6.1
అనిష్టమిష్టం మిశ్రం చ	18.12
అనుద్వేగకరం వాక్యమ్	17.15
అనుబన్ధం క్షయం హింసామ్	18.25
అనేకచిత్తవిభ్రాన్తాః	16.16
అనేకబాహూదరవక్త్రనేత్రమ్	11.16
అనేకవక్త్రనయనమ్	11.10
అన్తకాలే చ మామేవ	8.5
అన్తవత్తు ఫలం తేషామ్	7.23
అన్తవన్త ఇమే దేహాః	2.18
అన్నాద్భవన్తి భూతాని	3.14
అన్యే చ బహవః శూరాః	1.9
అన్యే త్వేవమజానన్తః	13.25
అపరం భవతో జన్మ	4.4
అపరే నియతాహారాః	4.30
అపరేయమితస్త్వన్యామ్	7.5
అపర్యాప్తం తదస్మాకమ్	1.10
అపానే జుహ్వతి ప్రాణమ్	4.29
అపి చేత్సుదురాచారో	9.30
అపి చేదసి పాపేభ్యః	4.36
అప్రకాశోఽప్రవృత్తిశ్చ	14.13
అఫలాకాఙ్క్షిభిర్యజ్ఞో	17.11
అభయం సత్త్వసంశుద్ధిః	16.1

అభిసంధాయ తు ఫలమ్ 17.12
అభ్యాసయోగయుక్తేన 8.8
అభ్యాసేఽప్యసమర్థోఽసి 12.10
అమానిత్వమదమ్భిత్వమ్ 13.7
అమీ చ త్వాం ధృతరాష్ట్రస్య 11.26
అమీ హి త్వాం సురసంఘాః 11.21
అయనేషు చ సర్వేషు 1.11
అయతిః శ్రద్ధయోపేతః 6.37
అయుక్తః ప్రాకృతః స్తబ్ధః 18.28
అవజానన్తి మాం మూఢాః 9.11
అవాచ్యవాదాంశ్చ బహూన్ 2.36
అవినాశి తు తద్విద్ధి 2.17
అవిభక్తం చ భూతేషు 13.16
అవ్యక్తాదీని భూతాని 2.28
అవ్యక్తాద్వ్యక్తయః సర్వాః 8.18
అవ్యక్తోఽక్షర ఇత్యుక్తః 8.21
అవ్యక్తోఽయమచిన్త్యోఽయమ్ 2.25
అవ్యక్తం వ్యక్తిమాపన్నమ్ 7.24
అశాస్త్రవిహితం ఘోరమ్ 17.5
అశోచ్యానన్వశోచస్త్వమ్ 2.11
అశ్రద్దధానాః పురుషాః 9.3
అశ్రద్ధయా హుతం దత్తమ్ 17.28
అశ్వత్థః సర్వవృక్షాణామ్ 10.26
అసక్తబుద్ధిః సర్వత్ర 18.49
అసక్తిరనభిష్వఙ్గః 13.9
అసత్యమప్రతిష్ఠం తే 16.8
అసౌ మయా హతః శత్రుః 13.14
అసంయతాత్మనా యోగో 6.36
అసంశయం మహాబాహో 6.35
అస్మాకం తు విశిష్టా యే 1.7
అహం క్రతురహం యజ్ఞః 9.16
అహంకారం బలం దర్పమ్ 16.18
అహంకారం బలం దర్పమ్ 18.53
అహమాత్మా గుడాకేశ 10.20
అహం వైశ్వానరో భూత్వా 15.14
అహం సర్వస్య ప్రభవః 10.8
అహం హి సర్వయజ్ఞానామ్ 9.24
అహింసా సత్యమక్రోధః 16.2
అహింసా సమతా తుష్టిః 10.5
అహో బత మహత్పాపమ్ 1,45
ఆఖ్యాహి మే కో భవాన్ 11.31
ఆచార్యాః పితరః పుత్రాః 1.34
ఆఢ్యోఽభిజనవానస్మి 16.15
ఆత్మసంభావితాః స్తబ్ధాః 16.17
ఆత్మౌపమ్యేన సర్వత్ర 6.32
ఆదిత్యానామహం విష్ణుః 10.21
ఆపూర్యమాణమచల 2.70
ఆబ్రహ్మభువనాల్లోకాః 8.16
ఆయుధానామహం వజ్రమ్ 10.28
ఆయుః సత్త్వబలారోగ్య 17.8
ఆరురుక్షోర్మునేర్యోగమ్ 6.3
ఆవృతం జ్ఞానమేతేన 3.39
ఆశాపాశశతైర్బద్ధాః 16.12
ఆశ్చర్యవత్పశ్యతి 2.29
ఆసురీం యోనిమాపన్నాః 16.20
ఆహారస్త్వపి సర్వస్య 17.7
ఆహుస్త్వామృషయః సర్వే 10.13

ఇ

ఇచ్ఛాద్వేషసముత్థేన 7.27
ఇచ్ఛా ద్వేషః సుఖమ్ 13.6
ఇతి గుహ్యతమం శాస్త్రమ్ 15.20
ఇతి తే జ్ఞానమాఖ్యాతమ్ 18.63
ఇతి క్షేత్రం తథా జ్ఞానమ్ 13.18
ఇత్యర్జునం వాసుదేవః 11.50
ఇత్యహం వాసుదేవస్య 18.74
ఇదమద్య మయా లబ్ధమ్ 16.13

ఇదం తు తే గుహ్యతమమ్ 9.1
ఇదం తే నాతపస్కాయ 18.67
ఇదం శరీరం కౌన్తేయ 13.1
ఇదం జ్ఞానముపాశ్రిత్య 14.2
ఇన్ద్రియస్యేన్ద్రియస్యార్థే 3.34
ఇన్ద్రియాణాం హి చరతామ్ 2.67
ఇన్ద్రియాణి పరాణ్యాహుః 3.42
ఇన్ద్రియాణి మనో బుద్ధిః 3.40
ఇన్ద్రియార్థేషు వైరాగ్యమ్ 13.8
ఇమం వివస్వతే యోగమ్ 4.1
ఇష్టాన్ భోగాన్ హి 3.12
ఇహైకస్థం జగత్కృత్స్నమ్ 11.7
ఇహైవ తైర్జితః సర్గః 5.19

ఈ

ఈశ్వరః సర్వభూతానామ్ 18.61

ఉ

ఉచ్చైఃశ్రవసమశ్వానామ్ 10.27
ఉత్క్రామన్తం స్థితం వాపి 15.10
ఉత్తమః పురుషస్త్వన్యః 15.17
ఉత్సన్నకులధర్మాణామ్ 1.44
ఉత్సీదేయురిమే లోకాః 3.24
ఉదారాః సర్వ ఏవైతే 7.18
ఉదాసీనవదాసీనః 14.23
ఉద్ధరేదాత్మనాత్మానమ్ 6.5
ఉపద్రష్టానుమన్తా చ 13.22

ఊ

ఊర్ధ్వం గచ్ఛన్తి సత్త్వస్థాః 14.18
ఊర్ధ్వమూలమధఃశాఖమ్ 15.1

ఋ

ఋషిభిర్బహుధా గీతమ్ 13.4

ఏ

ఏతచ్ఛ్రుత్వా వచనమ్ 11.35
ఏతద్యోనీని భూతాని 7.6
ఏతన్మే సంశయం కృష్ణ 6.39
ఏతాన్న హన్తుమిచ్ఛామి 1.35
ఏతాన్యపి తు కర్మాణి 18.6
ఏతాం దృష్టిమవష్టభ్య 16.9
ఏతాం విభూతిం యోగం చ 10.7
ఏతైర్విముక్తః కౌన్తేయ 16.22
ఏవముక్తో హృషీకేశః 1.24
ఏవముక్త్వార్జునః సంఖ్యే 1.47
ఏవముక్త్వా తతో రాజన్ 11.9
ఏవముక్త్వా హృషీకేశమ్ 2.9
ఏవమేతద్యథాత్థ త్వమ్ 11.3
ఏవం పరమ్పరాప్రాప్తమ్ 4.2
ఏవం ప్రవర్తితం చక్రమ్ 3.16
ఏవం బహువిధా యజ్ఞాః 4.32
ఏవం బుద్ధేః పరం బుద్ధ్వా 3.43
ఏవం సతతయుక్తా యే 12.1
ఏవం జ్ఞాత్వా కృతం కర్మ 4.15
ఏషా తేఽభిహితా సాంఖ్యే 2.39
ఏషా బ్రాహ్మీ స్థితిః పార్థ 2.72

ఓ

ఓమిత్యేకాక్షరం బ్రహ్మ 8.13

ఓం

ఓం తత్సదితినిర్దేశః 17.23

క

కచ్చిన్నోభయవిభ్రష్టః 6.38
కచ్చిదేతచ్ఛ్రుతం పార్థ 18.72
కట్వమ్లలవణాత్యుష్ణ 17.9
కథం న జ్ఞేయమస్మాభిః 1.39
కథం భీష్మమహం సంఖ్యే 2.4
కథం విద్యామహం యోగిన్ 10.17
కర్మజం బుద్ధియుక్తా హి 2.51
కర్మణః సుకృతస్యాహుః 14.26
కర్మణైవ హి సంసిద్ధిమ్ 3.10

కర్మణోహ్యపి బోద్ధవ్యమ్ 4.17
కర్మణ్యకర్మ యః పశ్యేత్ 4.18
కర్మణ్యేవాధికారస్తే 2.47
కర్మ బ్రహ్మోద్భవం విద్ధి 3.15
కర్మేన్ద్రియాణి సంయమ్య 3.6
కర్శయన్తః శరీరస్థమ్ 17.6
కవిం పురాణమనుశాసితారమ్ 8.9
కస్మాచ్చ తే న నమేరన్ 11.37
కాఙ్క్షన్తః కర్మణాం సిద్ధిమ్ 4.12
కామ ఏష క్రోధ ఏషః 3.37
కామక్రోధవిముక్తానామ్ 5.26
కామమాశ్రిత్య దుష్పూరమ్ 16.10
కామాత్మానః స్వర్గపరాః 2.43
కామైస్తైస్తైర్హృతజ్ఞానాః 7.20
కామ్యానాం కర్మణామ్ 18.2
కాయేన మనసా బుద్ధ్యా 5.11
కార్పణ్యదోషోపహత 2.7
కార్యకారణకర్తృత్వే 13.20
కార్యమిత్యేవ యత్కర్మ 18.9
కాలోఽస్మి లోకక్షయ 11.32
కాశ్యశ్చ పరమేష్వాసః 1.17
కిం కర్మ కిమకర్మేతి 4.16
కిం తద్ బ్రహ్మ కిమధ్యాత్మమ్ 8.1
కిం పునర్బ్రాహ్మణాః పుణ్యాః 9.33
కుతస్త్వా కశ్మలమిదమ్ 2.2
కులక్షయే ప్రణశ్యన్తి 1.40
కృపయా పరయావిష్టో 1.28
కృషిగౌరక్ష్యవాణిజ్యమ్ 18.44
కైర్లిఙ్గైస్త్రీన్ గుణానేతాన్ 14.21
క్రోధాద్భవతి సంమోహః 2.63
క్లేశోఽధికతరస్తేషామ్ 12.5
క్లైబ్యం మా స్మ గమః పార్థ 2.3
క్షిప్రం భవతి ధర్మాత్మా 9.31
క్షేత్రక్షేత్రజ్ఞయోరేవమ్ 13.34
క్షేత్రజ్ఞం చాపి మాం విద్ధి 13.2

గ

గతసంగస్య ముక్తస్య 4.23
గతిర్భర్తా ప్రభుః సాక్షీ 9.18
గాణ్డీవం స్రంసతే హస్తాత్ 1.30
గామావిశ్య చ భూతాని 15.13
గుణానేతానతీత్య త్రీన్ 14.20
గురూనహత్వా హి మహాను 2.5

చ

చఞ్చలం హి మనః కృష్ణ 6.34
చతుర్విధా భజన్తే మామ్ 7.16
చాతుర్వర్ణ్యం మయా సృష్టమ్ 4.13
చిన్తామపరిమేయాం చ 16.11
చేతసా సర్వకర్మాణి 18.57

జ

జన్మ కర్మ చ మే దివ్యమ్ 4.2
జరామరణమోక్షాయ 7.29
జాతస్య హి ధ్రువో మృత్యుః 2.27
జితాత్మనః ప్రశాన్తస్య 6.7
జ్ఞానయజ్ఞేన చాప్యన్యే 9.15
జ్ఞానవిజ్ఞానతృప్తాత్మా 6.8
జ్ఞానేన తు తదజ్ఞానమ్ 5.16
జ్ఞానం కర్మ చ కర్తా చ 18.19
జ్ఞానం తేఽహం సవిజ్ఞానమ్ 7.2
జ్ఞానం జ్ఞేయం పరిజ్ఞాతా 18.18
జ్ఞేయః స నిత్యసంన్యాసీ 5.3
జ్ఞేయం యత్తత్ప్రవక్ష్యామి 13.12
జ్యాయసీ చేత్కర్మణస్తే 3.1
జోతిషామపి తజ్జ్యోతిః 13.17

త

తతః పదం తత్పరిమార్గి 15.4
తచ్చ సంస్మృత్య సంస్మృత్య 18.77

తతః శఙ్ఖాశ్చ భేర్యశ్చ	1.13
తతః శ్వేతైర్హయైర్యుక్తే	1.14
తతః స విస్మయావిష్టో	11.14
తత్త్వవిత్తు మహాబాహో	3.28
తత్ర తం బుద్ధిసంయోగమ్	6.43
తత్ర సత్త్వం నిర్మలత్వాత్	14.6
తత్రాపశ్యత్ స్థితాన్ పార్థః	1.26
తత్రైకస్థం జగత్కృత్స్నమ్	11.13
తత్రైకాగ్రం మనః కృత్వా	6.12
తత్రైవం సతి కర్తారమ్	18.16
తత్ క్షేత్రం యచ్చ యాదృక్చ	13.3
తదిత్యనభిసంధాయ	17.25
తద్బుద్ధయస్తదాత్మానః	5.17
తద్విద్ధి ప్రణిపాతేన	4.34
తపస్విభ్యోఽధికో యోగీ	6.46
తపామ్యహమహం వర్షమ్	9.19
తపస్త్వజ్ఞానజం విద్ధి	14.8
తమువాచ హృషీకేశః	2.10
తమేవ శరణం గచ్ఛ	18.62
తస్మాచ్ఛాస్త్రం ప్రమాణం తే	16.24
తస్మాత్ప్రణమ్య ప్రణిధాయ	11.44
తస్మాత్త్వమిన్ద్రియాణ్యాదౌ	3.41
తస్మాత్త్వముత్తిష్ఠ యశో	11.33
తస్మాత్సర్వేషు కాలేషు	8.7
తస్మాదసక్తః సతతమ్	3.19
తస్మాదజ్ఞానసంభూతమ్	4.42
తస్మాదోమిత్యుదాహృత్య	17.24
తస్మాద్యస్య మహాబాహో	2.68
తస్మాన్నార్హా వయం హన్తుమ్	1.37
తస్య సంజనయన్ హర్షమ్	1.12
తం విద్యాద్దుఃఖసంయోగ	6.23
తం తథా కృపయావిష్టమ్	2.1
తానహం ద్విషతః క్రూరాన్	16.19
తాని సర్వాణి సంయమ్య	2.61
తుల్యనిన్దాస్తుతిర్మౌనీ	12.19
తేజః క్షమా ధృతిః శౌచమ్	16.3
తే తం భుక్త్వా స్వర్గలోకం	9.21
తేషామహం సముద్ధర్తా	12.7
తేషామేవానుకమ్పార్థమ్	10.11
తేషాం సతతయుక్తానామ్	10.10
తేషాం జ్ఞానీ నిత్యయుక్తః	7.17
త్యక్త్వా కర్మఫలాసంగమ్	4.20
త్యాజ్యం దోషవదిత్యేకే	18.3
త్రిభిర్గుణమయైర్భావైః	7.13
త్రివిధా భవతి శ్రద్ధా	17.2
త్రివిధం నరకస్యేదమ్	16.21
త్రైగుణ్యవిషయా వేదాః	2.45
త్రైవిద్యా మాం సోమపాః	9.20
త్వమక్షరం పరమం వేది	11.18
త్వమాదిదేవః పురుషః	11.38
ద	
దణ్డో దమయతామస్మి	10.38
దమ్భో దర్పోఽభిమానశ్చ	16.4
దంష్ట్రాకరాలాని చ తే	11.25
దాతవ్యమితి యద్దానమ్	17.20
దివి సూర్యసహస్రస్య	11.12
దివ్యమాల్యామ్బరధరమ్	11.11
దుఃఖమిత్యేవ యత్కర్మ	18.8
దుఃఖేష్వనుద్విగ్నమనాః	2.56
దూరేణహ్యవరం కర్మ	2.49
దృష్ట్వా తు పాణ్డవానీకమ్	1.2
దృష్ట్వేదం మానుషం రూపమ్	11.51
దేవద్విజగురుప్రాజ్ఞ	17.14
దేవాన్ భావయతానేన	3.11
దేహీ నిత్యమవధ్యోఽయమ్	2.30
దేహినోఽస్మిన్ యథా దేహే	2.13

దైవమేవాపరే యజ్ఞమ్ 4.25
దైవీ హ్యేషా గుణమయీ 7.14
దైవీ సంపద్విమోక్షాయ 16.5
దోషైరేతైః కులఘ్నానామ్ 1.43
ద్యావాపృథివ్యోరిదమన్తరం 11.20
ద్యూతం ఛలయతామస్మి 10.36
ద్రవ్యయజ్ఞాస్తపోయజ్ఞాః 4.28
ద్రుపదో ద్రౌపదేయాశ్చ 1.18
ద్రోణం చ భీష్మం చ 11.34
ద్వావిమౌ పురుషౌ లోకే 15.16
ద్వౌ భూతసర్గౌ లోకే 16.6

ధ

ధర్మక్షేత్రే కురుక్షేత్రే 1.1
ధూమో రాత్రిస్తథా కృష్ణః 8.25
ధూమేనావ్రియతే వహ్నిః 3.38
ధృత్యా యయా ధారయతే 18.33
ధృష్టకేతుశ్చేకితానః 1.5
ధ్యానేనాత్మని పశ్యన్తి 13.24
ధ్యాయతో విషయాన్ పుంసః 2.62

న

న కర్తృత్వం న కర్మాణి 5.14
న కర్మణామనారమ్భాత్ 3.4
న కాఙ్క్షే విజయం కృష్ణ 1.32
న చ తస్మాన్మనుష్యేషు 18.69
న చ మత్స్థాని భూతాని 9.5
న చ మాం తాని కర్మాణి 9.9
న చైతద్విద్మః కతరన్నో 2.6
న జాయతే మ్రియతే వా 2.20
న తదస్తి పృథివ్యాం వా 18.40
న తద్భాసయతే సూర్యో 15.6
న తు మాం శక్యసే ద్రష్టుమ్ 11.8
న త్వేవాహం జాతు నాసమ్ 2.12
న ద్వేష్ట్యకుశలం కర్మ 18.10
న ప్రహృష్యేత్ప్రియం ప్రాప్య 5.20
న బుద్ధిభేదం జనయేత్ 3.26
నభఃస్పృశం దీప్తమనేక 11.24
నమః పురస్తాదథ పృష్ఠతస్తే 11.40
న మాం కర్మాణి లిమ్పన్తి 4.14
న మాం దుష్కృతినో మూఢాః 7.15
న మే పార్థాస్తి కర్తవ్యమ్ 3.22
న మే విదుః సురగణాః 10.2
న రూపమస్యేహ తథోప 15.3
న వేదయజ్ఞాధ్యయనైః 11.48
నష్టో మోహః స్మృతిర్లబ్ధా 18.73
న హి కశ్చిత్ క్షణమపి 3.5
న హి దేహభృతా శక్యమ్ 18.11
న హి ప్రపశ్యామి మమాప 2.8
న హి జ్ఞానేన సదృశమ్ 4.38
నాత్యశ్నతస్తు యోగోఽస్తి 6.16
నాదత్తే కస్య చిత్ పాపమ్ 5.15
నాన్తోఽస్తి మమ దివ్యానామ్ 10.40
నాన్యం గుణేభ్యః కర్తారమ్ 14.19
నాసతో విద్యతే భావో 2.16
నాస్తి బుద్ధిరయుక్తస్య 2.66
నాహం ప్రకాశః సర్వస్య 7.25
నాహం వేదైర్న తపసా 11.53
నిమిత్తాని చ పశ్యామి 1.31
నియతస్య తు సంన్యాసః 18.7
నియతం కురు కర్మ త్వమ్ 3.8
నియతం సంగరహితమ్ 18.23
నిరాశీర్యతచిత్తాత్మా 4.21
నిర్మానమోహా జితసంగ 15.5
నిశ్చయం శృణు మే తత్ర 18.4
నిహత్య ధార్తరాష్ట్రాన్నః 1.36
నేహాభిక్రమనాశోఽస్తి 2.40
నైతే సృతీ పార్థ జానన్ 8.27

నైనం ఛిన్దన్తి శస్త్రాణి 23
నైవ కించిత్కరోమీతి 5.8
నైవ తస్య కృతేనార్థః 3.18

ప

పఞ్చైతాని మహాబాహో 18.13
పత్రం పుష్పం ఫలం తోయమ్ 9.26
పరస్తస్మాత్తు భావోఽన్యో 8.20
పరం బ్రహ్మ పరం ధామ 10.12
పరం భూయః ప్రవక్ష్యామి 14.1
పరిత్రాణాయ సాధూనామ్ 4.8
పవనః పవతామస్మి 10.31
పశ్య మే పార్థ రూపాణి 11.5
పశ్యాదిత్యాన్ వసూన్ 11.6
పశ్యామి దేవాంస్తవ దేవ 11.15
పశ్యైతాం పాణ్డుపుత్రాణామ్ 1.3
పాఞ్చజన్యం హృషీకేశో 1.15
పార్థ నైవేహ నాముత్ర 6.40
పితాసి లోకస్య 11.43
పితాహమస్య జగతః 9.17
పుణ్యో గన్ధః పృథివ్యాం చ 7.9
పురుషః ప్రకృతిస్థో హి 13.21
పురుషః స పరః పార్థ 8.22
పురోధసాం చ ముఖ్యం మామ్ 10.24
పూర్వాభ్యాసేన తేనైవ 6.44
పృథక్త్వేన తు యద్ జ్ఞానమ్ 18.21
ప్రకాశం చ ప్రవృత్తిం చ 14.22
ప్రకృతిం స్వామవష్టభ్య 9.8
ప్రకృతిం పురుషం చైవ 13.19
ప్రకృతేః క్రియమాణాని 3.27
ప్రకృతేర్గుణసంమూఢాః 3.29
ప్రకృత్యైవ చ కర్మాణి 13.29
ప్రజహాతి యదా కామాన్ 2.55
ప్రయత్నాద్యతమానస్తు 6.45
ప్రయాణకాలే మనసా 8.10
ప్రలపన్ విసృజన్ గృహ్ణన్ 5.9
ప్రవృత్తిం చ నివృత్తిం చ 16.7
ప్రవృత్తిం చ నివృత్తిం చ 18.30
ప్రశాన్తమనసం హ్యేనమ్ 6.27
ప్రశాన్తాత్మా విగతభీః 6.14
ప్రసాదే సర్వదుఃఖానామ్ 2.65
ప్రహ్లాదశ్చాస్మి దైత్యానామ్ 10.30
ప్రాప్య పుణ్యకృతాం లోకాన్ 6.41

బ

బన్ధురాత్మాత్మనస్తస్య 6.6
బలం బలవతాం చాహమ్ 7.11
బహిరన్తశ్చ భూతానామ్ 13.15
బహూనాం జన్మనామన్తే 7.19
బహూని మే వ్యతీతాని 4.5
బాహ్యస్పర్శేష్వసక్తాత్మా 5.21
బీజం మాం సర్వభూతానామ్ 7.10
బుద్ధియుక్తో జహాతీహ 2.50
బుద్ధిర్జ్ఞానమసంమోహః 10.4
బుద్ధేర్భేదం ధృతేశ్చైవ 18.29
బుద్ధ్యా విశుద్ధయా యుక్తో 18.51
బృహత్సామ తథా సామ్నామ్ 10.35
బ్రహ్మణో హి ప్రతిష్ఠాహమ్ 14.27
బ్రహ్మణ్యాధాయ కర్మాణి 5.10
బ్రహ్మభూతః ప్రసన్నాత్మా 18.14
బ్రహ్మార్పణం బ్రహ్మహవిః 4.24
బ్రాహ్మణక్షత్రియవిశామ్ 18.41

భ

భక్త్యా త్వనన్యయా శక్యః 11.54
భక్త్యా మామభిజానాతి 18.55
భయాద్రణాదుపరతమ్ 2.35
భవాన్ భీష్మశ్చ కర్ణశ్చ 1.8
భవాప్యయౌ హి భూతానామ్ 11.2

భీష్మద్రోణప్రముఖతః 1.25
భూతగ్రామః స ఏవాయమ్ 8.19
భూమిరాపో౽నలో వాయుః 7.4
భూయ ఏవ మహాబాహో 10.1
భోక్తారం యజ్ఞతపసామ్ 5.59
భోగైశ్వర్యప్రసక్తానామ్ 2.44

మ

మచ్చిత్తః సర్వదుర్గాణి 18.58
మచ్చిత్తా మద్గతప్రాణాః 10.9
మత్కర్మకృన్మత్పరమో 11.55
మత్తః పరతరం నాన్యత్ 7.7
మదనుగ్రహాయ పరమమ్ 11.1
మనఃప్రసాదః సౌమ్యత్వమ్ 17.16
మనుష్యాణాం సహస్రేషు 7.3
మన్మనా భవ మద్భక్తో 9.34
మన్మనా భవ మద్భక్తో 18.65
మన్యసే యది తచ్ఛక్యమ్ 11.4
మమ యోనిర్మహద్బ్రహ్మ 14.3
మమైవాంశో జీవలోకే 15.7
మయా తతమిదం సర్వమ్ 9.4
మయాధ్యక్షేణ ప్రకృతిః 9.10
మయా ప్రసన్నేన తవా 11.47
మయి చానన్యయోగేన 13.10
మయి సర్వాణి కర్మాణి 3.30
మయ్యావేశ్య మనో యే మామ్ 12.2
మయ్యాసక్తమనాః పార్థ 7.1
మయ్యేవ మన ఆధత్స్వ 12.8
మహర్షయః సప్త పూర్వే 10.6
మహర్షీణాం భృగురహమ్ 10.25
మహాత్మానస్తు మాం పార్థ 9.13
మహాభూతాన్యహంకారః 13.5
మా తే వ్యథా మా చ 11.49
మాత్రాస్పర్శాస్తు కౌన్తేయ 2.14
మానాపమానయోస్తుల్యః 14.25
మాముపేత్య పునర్జన్మ 8.15
మాం చ యో౽వ్యభిచారేణ 14.16
మాం హి పార్థ వ్యపాశ్రిత్య 9.32
ముక్తసంగో౽నహంవాదీ 18.26
మూఢగ్రాహేణాత్మనో యత్ 17.19
మృత్యుః సర్వహరశ్చాహమ్ 10.34
మోఘాశా మోఘకర్మాణః 9.12

య

య ఇదం పరమం గుహ్యమ్ 18.68
య ఏవం వేత్తి హన్తారమ్ 2.19
య ఏవం వేత్తి పురుషమ్ 13.23
యచ్చాపి సర్వభూతానామ్ 10.39
యచ్చావహాసార్థమస 11.42
యజన్తే సాత్త్వికా దేవాన్ 17.4
యజ్ఞశిష్టామృతభుజః 4.31
యజ్ఞశిష్టాశినః సన్తః 3.13
యజ్ఞార్థాత్కర్మణో౽న్యత్ర 3.9
యజ్ఞే తపసి దానే చ 17.27
యజ్ఞో దానం తపః కర్మ 18.5
యతతో హ్యపి కౌన్తేయ 2.60
యతన్తో యోగినశ్చైనమ్ 15.11
యతః ప్రవృత్తిర్భూతానామ్ 18.46
యతేన్ద్రియమనోబుద్ధిః 5.28
యతో యతో నిశ్చరతి 6.26
యత్కరోషి యదశ్నాసి 9.27
యత్తు కామేప్సునా కర్మ 18.24
యత్తు కృత్స్నవదేకస్మిన్ 18.22
యత్తు ప్రత్యుపకారార్థమ్ 17.21
యత్ర కాలే త్వనావృత్తిమ్ 8.23
యత్ర యోగేశ్వరః కృష్ణః 18.78
యత్రోపరమతే చిత్తమ్ 6.20
యత్సాంఖ్యైః ప్రాప్యతే స్థానమ్ 5.5

యథాకాశస్థితో నిత్యమ్	9.6
యథా దీపో నివాతస్థో	6.19
యథా నదీనాం బహవః ప్రవాహాః	11.28
యథా ప్రకాశయత్యేకః	13.25
యథా ప్రదీప్తం జ్వలనమ్	11.29
యథా సర్వగతం సౌక్ష్మ్యాత్	13.32
యథైధాంసి సమిద్ధోఽగ్ని	4.37
యదగ్రే చానుబన్ధే చ	18.39
యదహంకారమాశ్రిత్య	18.59
యదక్షరం వేదవిదో	8.11
యదా తే మోహకలిలమ్	2.52
యదాదిత్యగతం తేజో	15.12
యదా భూతపృథగ్భావమ్	13.30
యదా యదా హి ధర్మస్య	4.7
యదా వినియతం చిత్తమ్	6.18
యదా సత్త్వే ప్రవృద్ధే తు	14.14
యదా సంహరతే చాయమ్	2.58
యదా హి నేన్ద్రియార్థేషు	6.4
యది మామప్రతీకారమ్	1.46
యది హ్యహం న వర్తేయ	3.23
యదృచ్ఛయా చోపపన్నమ్	2.32
యదృచ్ఛాలాభసంతుష్టః	4.22
యద్ జ్ఞాత్వా న పునర్మోహమ్	4.35
యద్యదాచరతి శ్రేష్ఠః	3.21
యద్యద్విభూతిమత్సత్త్వమ్	10.41
యద్యప్యేతే న పశ్యన్తి	1.38
యయా తు ధర్మకామార్థాన్	18.34
యయా ధర్మమధర్మం చ	18.31
యయా స్వప్నం భయం శోకమ్	18.35
యస్త్విన్ద్రియాణి మనసా	3.7
యస్మాత్ క్షరమతీతోఽహమ్	15.18
యస్మాన్నోద్విజతే లోకో	12.15
యస్య నాహంకృతో భావః	18.17
యస్య సర్వే సమారమ్భాః	4.19
యం యం వాపి స్మరన్ భావమ్	8.6
యం లబ్ధ్వా చాపరం లాభమ్	6.22
యం సంన్యాసమితి ప్రాహుః	6.2
యం హి న వ్యథయన్త్యేతే	2.15
యః శాస్త్రవిధిముత్సృజ్య	16.23
యః సర్వత్రానభిస్నేహః	2.57
యాతయామం గతరసమ్	17.10
యా నిశా సర్వభూతానామ్	2.69
యాన్తి దేవవ్రతా దేవాన్	9.25
యామిమాం పుష్పితాం వాచమ్	2.42
యావత్సంజాయతే కించిత్	13.26
యావదేతాన్నిరీక్షేఽహమ్	1.22
యావానర్థ ఉదపానే	2.46
యుక్తః కర్మఫలం త్యక్త్వా	5.12
యుక్తాహారవిహారస్య	6.17
యుఞ్జన్నేవం సదాత్మానమ్	6.15
యుఞ్జన్నేవం సదాత్మానమ్	6.28
యుధామన్యుశ్చ విక్రాన్తః	1.6
యే చైవ సాత్త్వికా భావాః	7.12
యే తు ధర్మ్యామృతమిదమ్	12.20
యే తు సర్వాణి కర్మాణి	12.6
యే త్వక్షరమనిర్దేశ్యమ్	12.3
యే త్వేతదభ్యసూయన్తః	3.12
యేఽప్యన్యదేవతాభక్తాః	9.23
యే మే మతమిదం నిత్యమ్	3.31
యే యథా మాం ప్రపద్యన్తే	4.11
యే శాస్త్రవిధిముత్సృజ్య	17.1
యేషామర్థే కాఙ్క్షితం నో	1.33
యేషాం త్వన్తగతం పాపమ్	7.28
యే ఽపి సంస్పర్శజా భోగాః	5.22
యోగయుక్తో విశుద్ధాత్మా	5.7
యోగసంన్యస్తకర్మాణమ్	4.41

యోగస్థః కురు కర్మాణి 2.48
యోగినామపి సర్వేషామ్ 6.47
యోగీ యుఞ్జీత సతతమ్ 6.10
యోత్స్యమానానవేక్షేఽహమ్ 1.23
యో న హృష్యతి న ద్వేష్టి 12.17
యోఽన్తఃసుఖోఽన్తరారామః 5.24
యో మామజమనాదిం చ 10.3
యో మామేవమసంమూఢో 15.19
యో మాం పశ్యతి సర్వత్ర 6.30
యో యో యాం యాం తనుం భక్తః 7.21
యోఽయం యోగస్త్వయా ప్రోక్తః 6.33

ర

రజస్తమశ్చాభిభూయ 14.10
రజసి ప్రలయం గత్వా 14.15
రజో రాగాత్మకం విద్ధి 14.7
రసోఽహమప్సు కౌన్తేయ 7.8
రాగద్వేషవిముక్తైస్తు 2.64
రాగీ కర్మఫలప్రేప్సుః 18.27
రాజన్ సంస్మృత్య సంస్మృత్య 18.76
రాజవిద్యా రాజగుహ్యమ్ 9.2
రుద్రాణాం శంకరశ్చాస్మి 10.23
రుద్రాదిత్యా వసవో యే చ 11.22
రూపం మహత్తే బహువక్త్ర 11.23

ల

లభన్తే బ్రహ్మనిర్వాణమ్ 5.25
లేలిహ్యసే గ్రసమానః 11.30
లోకేఽస్మిన్ ద్వివిధా 3.3
లోభః ప్రవృత్తిరారమ్భః 14.12

వ

వక్తుమర్హస్యశేషేణ 10.16
వక్త్రాణి తే త్వరమాణాః 11.27
వాయుర్యమోఽగ్నిర్వరుణః 11.39
వాసాంసి జీర్ణాని యథా 2.22
విద్యావినయసంపన్నే 5.18
విధిహీనమసృష్టాన్నమ్ 17.13
వివిక్తసేవీ లఘ్వాశీ 18.52
విషయా వినివర్తన్తే 12.59
విషయేన్ద్రియసంయోగాత్ 18.38
విస్తరేణాత్మనో యోగమ్ 10.18
విహాయ కామాన్యః సర్వాన్ 2.71
వీతరాగభయక్రోధాః 4.10
వృష్ణీనాం వాసుదేవోఽస్మి 10.37
వేదానాం సామవేదోఽస్మి 10.22
వేదావినాశినం నిత్యమ్ 2.21
వేదాహం సమతీతాని 7.26
వేదేషు యజ్ఞేషు తపఃసు 8.28
వ్యవసాయాత్మికా బుద్ధిః 2.41
వ్యామిశ్రేణేవ వాక్యేన 3.2
వ్యాసప్రసాదాచ్ఛ్రుతవాన్ 18.75

శ

శక్నోతీహైవ యః సోఢుమ్ 5.23
శనైః శనైరుపరమేత్ 6.25
శమో దమస్తపః శౌచమ్ 18.42
శరీరం యదవాప్నోతి 15.8
శరీరవాఙ్మనోభిర్యత్ 18.15
శుక్లకృష్ణే గతీ హ్యేతే 8.26
శుచౌ దేశే ప్రతిష్ఠాప్య 6.11
శుభాశుభఫలైరేవమ్ 9.28
శౌర్యం తేజో ధృతిర్దాక్ష్యమ్ 18.43
శ్రద్ధయా పరయా తప్తమ్ 17.10
శ్రద్ధావాననసూయశ్చ 18.71
శ్రద్ధావాన్ లభతే జ్ఞానమ్ 4.39
శ్రుతివిప్రతిపన్నా తే 2.53
శ్రేయాన్ ద్రవ్యమయాద్యజ్ఞాత్ 4.33
శ్రేయాన్ స్వధర్మో విగుణః 3.35
శ్రేయాన్ స్వధర్మో విగుణః 18.47

శ్రేయో హి జ్ఞానమభ్యాసాత్ 12.12
శ్రోత్రాదీనీన్ద్రియాణ్యన్యే 4.26
శ్రోత్రం చక్షుః స్పర్శనం చ 15.9
శ్వశురాన్ సుహృదశ్చైవ 1.27

స

స ఏవాయం మయా తేఽద్య 4.3
సక్తాః కర్మణ్యవిద్వాంసః 3.25
సఖేతి మత్వా ప్రసభమ్ 11.41
స ఘోషో ధార్తరాష్ట్రాణామ్ 1.19
సతతం కీర్తయన్తో మామ్ 9.14
స తయా శ్రద్ధయా యుక్తః 7.22
సత్కారమానపూజార్థమ్ 17.18
సత్త్వం రజస్తమ ఇతి 14.5
సత్త్వం సుఖే సఞ్జయతి 14.9
సత్త్వాత్సంజాయతే జ్ఞానమ్ 14.17
సత్త్వానురూపా సర్వస్య 17.3
సదృశం చేష్టతే స్వస్యాః 3.33
సద్భావే సాధుభావే చ 17.26
సమదుఃఖసుఖః స్వస్థః 14.24
సమం కాయశిరోగ్రీవమ్ 6.13
సమం పశ్యన్ హి సర్వత్ర 13.28
సమం సర్వేషు భూతేషు 13.27
సమః శత్రౌ చ మిత్రే చ 12.18
సమోహం సర్వభూతేషు 9.29
సర్గాణామాదిరన్తశ్చ 10.32
సర్వకర్మాణి మనసా 5.13
సర్వకర్మాణ్యపి సదా 18.56
సర్వగుహ్యతమం భూయః 18.64
సర్వతః పాణిపాదం తత్ 13.13
సర్వద్వారాణి సంయమ్య 8.12
సర్వద్వారేషు దేహేఽస్మిన్ 14.11
సర్వధర్మాన్ పరిత్యజ్య 18.66
సర్వభూతస్థమాత్మానమ్ 6.29
సర్వభూతస్థితం యో మామ్ 6.31
సర్వభూతాని కౌన్తేయ 9.7
సర్వభూతేషు యేనైకమ్ 18.20
సర్వమేతదృతం మన్యే 10.14
సర్వయోనిషు కౌన్తేయ 14.4
సర్వస్య చాహం హృది 15.15
సర్వాణీన్ద్రియకర్మాణి 4.27
సర్వేన్ద్రియగుణాభాసమ్ 13.14
సహజం కర్మ కౌన్తేయ 18.48
సహయజ్ఞాః ప్రజాః సృష్ట్వా 3.10
సహస్రయుగపర్యన్తమ్ 8.17
సంకరో నరకాయైవ 1.42
సంకల్పప్రభవాన్ కామాన్ 6.24
సంతుష్టః సతతం యోగీ 12.14
సంనియమ్యేన్ద్రియగ్రామమ్ 12.4
సంన్యాసస్తు మహాబాహో 18.1
సంన్యాసః కర్మయోగశ్చ 5.2
సాధిభూతాధిదైవం మామ్ 7.30
సాంఖ్యయోగౌ పృథగ్బాలాః 5.4
సిద్ధిం ప్రాప్తో యథా 18.50
సీదన్తి మమ గాత్రాణి 1.29
సుఖదుఃఖే సమే కృత్వా 2.38
సుఖమాత్యన్తికం యత్తత్ 6.21
సుఖం త్విదానీం త్రివిధమ్ 18.36
సుదుర్దర్శమిదం రూపమ్ 11.52
సుహృన్మిత్రార్యుదాసీన 6.9
స్థానే హృషీకేశ తవ 11.36
స్థితప్రజ్ఞస్య కా భాషా 2.54
స్పర్శాన్ కృత్వా బహిర్బాహ్యాన్ 5.27
స్వధర్మమపి చావేక్ష్య 2.31
స్వభావజేన కౌన్తేయ 18.60
స్వయమేవాత్మనాత్మానమ్ 10.15
స్వే స్వే కర్మణ్యభిరతః 18.45

హ

హతో వా ప్రాప్స్యసి స్వర్గమ్ 2.37
హన్త తే కథయిష్యామి 10.19
హృషీకేశం తదా వాక్యమ్ 1.21

అనుబంధం - 2

శ్రీ శంకరభాష్యోదాహృతానామ్ ఉపనిషదాదివాక్యానాం (భగవద్గీతావాక్యభిన్నానాం) అకారాదిక్రమేణ సూచీ

అగ్నౌ ప్రాస్తాహుతిః సమ్యగాదిత్యముపతిష్ఠతే,
ఆదిత్యాజ్జాయతే వృష్టిర్వృష్టేరన్నం తతః ప్రజాః
(మను.స్మృ. 3.76) 3.14

అథ తస్య భయం భవతి (తై.ఉ. 2.7) 13.2

అథ యోఽన్యాం దేవతాముపాస్తేఽన్యోఽసావన్యోఽహ మస్మి ఇతి న స వేద యథా పశుదేవ స దేవానామ్ (బృ.ఉ. 3.4.10) 4.12

అదర్శనాదాపతితః పునశ్చాదర్శనం గతః
(మ.భా.స్త్రీ.ప. 2.13) 2.28

అనాత్మవిచ్ఛేచామి (ఛా.ఉ. 7.1) 18.73

అన్ధో మణిమవిన్దత్ (తై.ఆ. 1.11) 13.14

అన్యత్ర ధర్మాదన్యత్రాధర్మాత్...
సర్వే వేదాయత్పరమామనన్తి తపాంసి
సర్వాణి చ యద్వదన్తి యదిచ్ఛన్తో బ్రహ్మచర్యం
చరన్తి తత్తే పదం సంగ్రహేణ బ్రవీమ్యోమిత్యేతత్
(క.ఉ. 2.13.14) 8.11

అన్యదేవ తద్విదితాదథోఽవిదితాదధి
(కే.ఉ. 1.3) 13.12

అన్యోఽసావన్యోఽహమస్మీతి న స వేద
యథా పశురేవ స దేవానామ్ (బృ.ఉ. 1.4.10)
13.2

అపాణిపాదో జవనో గ్రహీతా పశ్యత్యచక్షుః
స శృణోత్యకర్ణః (శ్వే.ఉ. 3.19) 13.14

అప్రాణో హ్యమనాః శుభ్రో హ్యక్షరాత్పరతః
పరః (ము.ఉ. 2.1.2) 18.17

అయమగ్నిర్వైశ్వానరో యోఽయమన్తః
పురుషే యేనేదమన్నం పచ్యతే
(బృ.ఉ. 7.9.1) 15.14

అయాచితమసంక్లప్తముపపన్నం యదృ
చ్ఛయా (బోధాయన ధ.సూ. 21.8.12) 4.12

అవిద్యాయామన్తరే వర్తమానాః (క.ఉ. 2.5) 13.2

అశబ్దమస్పర్శమ్ (క.ఉ. 3.15) 18.50

అసంగో న హి సజ్జతే (బృ.ఉ. 5.9.26) 9.5

అస్థూమనణు (బృ.ఉ. 5.8.8) 8.11, 13.12

అహశ్చ కృష్ణమహరర్జునం చ
(ఋ.సం3.9.1) 18.61

అరూపమ్ (క.ఉ. 3.15) 18.50

ఆ

ఆత్మతః ప్రాణః ఆత్మత ఆశా ఆత్మతః
స్మరః ఆత్మత ఆకాశః ఆత్మతస్తేజః
ఆత్మత ఆపః ఆత్మన ఆవిర్భావతిరో
భావౌ ఆత్మనోఽన్నమ్(ఛా.ఉ. 7.2.61) 13.30

ఆత్మా వై పుత్రనామాసి (తై.సం. 2.11) 18.67

ఆత్మేత్యేవోపాసీత (బృ.ఉ. 3.4.7) 13.4

ఆత్మైవేదం సర్వం (బృ.ఉ. 4.4.6)
(ఛా.ఉ. 7.25.2) 13.15

ఆదిత్యవర్ణమ్ 18.50

ఇ

ఇషీకాతూలవత్సర్వాణి కర్మాణి ప్రదూయన్తే
(ఛా.ఉ. 5.24.3) (అర్థతోనువాదః) 13.23

ఇహ చేదవేదీదథ సత్యమస్తి న చేదిహా
వేదీన్మహతీ వినష్టిః (కే.ఉ. 2.5) 13.2

ఉ

ఉత్పత్తిం ప్రలయం చైవ భూతానామా
గతిం గతిమ్,వేత్తి విద్యామవిద్యాం చ
స వాచ్యో భగవానితి(వి.పు. 6.5.78) 3.16

ఊ

ఊర్ధ్వమూలోఽవాక్శాఖః ఏషోఽశ్వత్థః
సనాతనః (క.ఉ. 3.2.1) 15.1

ఏ

ఏకమేవాద్వితీయమ్ (ఛా. ఉ. 6. 2. 1) 9.1

ఏకో దేవః సర్వభూతేషు గూఢః సర్వవ్యాపీ సర్వభూతాన్తరాత్మా. కర్మాధ్యక్షః సర్వభూతాధివాసః సాక్షీ చేతా కేవలో నిర్గుణశ్చ (శ్వే. ఉ. 6. 11) 9.10

ఏతద్ధి జన్మసామగ్ర్యమ్ బ్రాహ్మణస్య విశేషతః, ప్రాప్యైతత్ కృతకృత్యో హి ద్విజో భవతి నాన్యథా (మ. స్మృ. 12. 93) 15.20

ఏతద్వై తదక్షరం గార్గి బ్రాహ్మణా అభివదన్తి (బృ. ఉ. 5. 8. 8) 8.11

ఏతమేవ ప్రవ్రాజినో లోకమిచ్ఛన్తో బ్రాహ్మణాః ప్రవ్రజన్తి కిం ప్రజయా కరిష్యామో యేషాం నోఽయమాత్మా యం లోకః (బృ. ఉ. 6. 4. 22) 2.11

ఏతస్య వా అక్షరస్య ప్రశాసనే గార్గి (బృ. ఉ. 5. 8. 9) 8.3

ఐ

ఐశ్వర్యస్య సమగ్రస్య వీర్యస్య యశసః శ్రియః,వైరాగ్యస్యాథ మోక్షస్య షణ్ణాం భగ ఇతీరణా (వి. పు. 6. 5. 74) 3.36

క

కథమసతః సజ్జాయేత (ఛా. ఉ. 6. 2. 2) 3.1

కర్మణా బధ్యతే జన్తుర్విద్యయా చ విముచ్యతే. తస్మాత్కర్మ న కుర్వన్తి యతయః పారదర్శినః (శాం. ప. 141. 7) 3.1

కామ జానామి తే మూలం సంకల్పాత్కిల జాయసే,న త్వాం సంకల్పయిష్యామి సమూలో న భవిష్యసి (మో. ధ. ప. 177. 25) 6.4

కో అద్ధా వేద క ఇహ ప్రవోచత్కుత ఆజాతా కుత ఇయం విసృష్టిః (తై. బ్రా. 2. 8. 9) 9.10

క్షీయన్తే చాస్య కర్మాణి (ము. ఉ. 2. 2. 8) 13.23

జ్ఞానముత్పద్యతే పుంసాం క్షయాత్పాపస్య కర్మణః, యథాదర్శతలప్రఖ్యే పశ్యత్యాత్మానమాత్మని 3.4

తత్ర కో మోహః కః శోకః ఏకత్వమనుపశ్యతః (ఈశా. ఉ.) 18.73

తమేతం వేదానువచనేన బ్రాహ్మణా వివిదిషన్తి యజ్ఞేన (బృ. ఉ. 4. 4. 22) 3.4

తమేవ విదిత్వాతిమృత్యుమేతి నాన్యః పన్థా విద్యతేఽయనాయ(నృసింహపూ. ఉ. 6) 13.2

తస్మాన్న్యాసమేషాం తపసామతిరిక్తమాహుః (మహానా. ఉ. 24. 1) 3. 1;18.55

తస్య తావదేవచిరమ్ (ఛా. ఉ. 6. 14. 2) 13.23

తస్య భాసా సర్వమిదం విభాతి(శ్వే. ఉ. 6. 14)13.17

త్యజ ధర్మమధర్మం చ ఉభే సత్యానృతే త్యజ,ఉభే సత్యానృతే త్యక్త్వా యేన త్యజసి తత్త్యజ. సంసారమేవ నిఃసారం దృష్ట్వా సారదిదృక్షయా. ప్రవజన్త్యకృతోద్వాహాః పరం వైరాగ్యమాశ్రితాః 3.1

దూ

దూరమేతే విపరీతే విషూచీ అవిద్యా యా చ విద్యేతి జ్ఞాతా (క. ఉ. 2. 4) 13.1

ద్వయా హ వై ప్రాజాపత్యా దేవాశ్చాసురాశ్చ (బృ. ఉ. 3. 3. 1) 16.6

ద్వావిమావథ పన్థానౌ (మోక్షధర్మ24. 6) 2.21

ధ్యా

ధ్యాయతీవ పృథివీ... ధ్యాయన్తీవ పర్వతాః (ఛా. ఉ. 7. 6. 1) 13.24

ధ్యాయతీవ లేలాయతీవ (బృ. ఉ. 6. 3. 7) 5. 3;13. 14;18. 17

న

న కర్మణాన ప్రజయా ధనేన జ్ఞానేనైకే

అమృత్వమానశుః (తై.ఉ.4.12) 3.1
న పృథావ్యాంనాన్తరిక్షే నదివ్యగ్నిశ్చేతవ్యః (తై.సం. 5.2.7)
న సన్దృశే తిష్ఠతి రూపమస్య న చక్షుషా పశ్యతి కశ్చనైనమ్(శ్వే.ఉ.4.20) 18.50
నావిరతో దుశ్చరితాత్ (క.ఉ.1.2.24) 18.65
నిష్కలం నిష్క్రియం శాన్తమ్ (శ్వే.ఉ.6.19) 13.12
నేతి నేతి (బృ.ఉ.6.4.2) 4.25;13.12
నైతాదృశం బ్రాహ్మణస్యాస్తి విత్తం యథైకతా సమతా సత్యతా చ. శీలం స్థితిర్దణ్డ నిధానమార్జవం తతస్తతశ్చోపరమః క్రియాభ్యః(శాం.ప.175.38) 6.3
న్యాస ఇతి బ్రహ్మా బ్రహ్మా హి పరః (తై,.ఉ.4.78) 6.3
న్యాస ఏవాత్యరేచ. యత్ (మహానారా ఉ.21.2) 3.1;18.55
పాణ్డిత్యం నిర్విద్య (బృ.ఉ.5.5.1) 2.11
పాదోఽస్య విశ్వా భూతాని (తై.అ.3.12) 10.42
పుత్రైషణాయాశ్చ విత్తైషణాయాశ్చ లోకైషణాయాశ్చ వ్యుత్థాయాథ బ్రహ్మచర్యం చరన్తి (బృ.ఉ.5.51) 3.1
పితృలోకప్రాప్తిసాధనం విద్యాం చ దైవం విత్తం దేవలోకప్రాప్తిసాధనం సోఽకాయమత (బృ.ఉ.3.4.17) (ఆర్థికమేతత్) 2.10

బ

బ్రహ్మచర్యాదేవ ప్రవజేత్ (జాబా.ఉ.4) 3.1
బ్రహ్మ వేద బ్రహ్మైవ భవతి (ము.ఉ.3.2.9) 13.2
బ్రహ్మైవేదం సర్వమ్ (బృ.ఉ.4.5.1) 13.15
భారూపః (ఛా.ఉ.3.14.21) 18.50

భ

భిద్యతే హృదయగ్రన్థిః (ము.ఉ.2.2.8) 18.73

మ

మనసైవానుద్రష్టవ్యమ్ (బృ.ఉ.6.4.19) 2.21
మాయాం తు ప్రకృతిం విద్యాన్మాయినం తు మహేశ్వరమ్ (శ్వే.ఉ.4.10) 12.3;13.39

య

యజ్ఞో వై విష్ణుః(తై.సం.1.7.4) 3.9;8.4
యతో వాచో నివర్తన్తే (తై.ఉ.2.4.9) 13.12
యత్సాక్షాదపరోక్షాద్బ్రహ్మ య ఆత్మా సర్వాన్తరః (బృ.ఉ.5.4.1) 2.18;4.25
యథా కృతాయ విజితాయాధరేయాః సంయన్త్యేవమేనం సర్వం తదభిసమేతి యత్కిం చ ప్రజాః సాధు కుర్వన్తి యస్తద్వేద యత్స వేద (ఛా.ఉ.4.1.4) 4.33
యదా చర్మవత్ (శ్వే.ఉ.6.20) 13.2
యదా సర్వే ప్రముచ్యన్తే (క.ఉ.6.14) 12.12
యదుహ వా ఆత్మసంమితమన్నం తదవతి తన్న హినస్తి యద్భూయో హినస్తి తద్యత్కనీయోఽన్నం న తదవతి (శ.బ్రా.9.2.1.2) 6.16
యద్యద్ధి కురుతే జన్తుస్తత్తత్కామస్య చేష్టితమ్ (మను.స్మృ.2.4) 6.4
యద్యముష్మిన్ లోకేఽస్తి వా నవేతి (తై.సం.6.1.1)
యేన కేన చిదాచ్ఛన్నో యేన కేన చిదాశితః, యత్ర క్వచన శాయీ స్యాత్తం దేవా బ్రాహ్మణం విదుః (శాం.ప.245.12)12.19
యేనద్యౌరుగ్రా పృథివీచ దృఢా (తై.సం.4.1.8) 15.13
యేన సూర్యస్తపతి తేజసేద్ధః (తై.ఉ.3.12.9) 13.17
యో అస్యాధ్యక్షః పరమే వ్యోమన్ (తై.బ్రా.2.8.9) 9.10
యో వా ఏతదక్షరం గార్గ్యవిదిత్వాస్మాల్లోకాత్ప్రైతి స కృపణః (బృ.ఉ.5.8.10) 2.49
వర్ణా ఆశ్రమాశ్చ స్వధర్మనిష్ఠాః ప్రేత్య కర్మఫల

మనుభూయః తతః శేషేణ విశిష్టదేశ
జాతికులధర్మాయుఃశ్రుతవృత్తవిత్త
సుఖమేధసో జన్మ ప్రతిపద్యన్తే
(ఆప. ధ. సూ. 2. 2. 2. 3) 18.44;18.67
విజ్ఞానమానన్దం బ్రహ్మ (బృ. ఉ. 5. 9. 28) 4.25
విదిత్వావ్యుత్థాయ భిక్షాచర్యం చరన్తి
(బృ. ఉ. 5. 5. 1) 18.55
విద్వాన్న బిభేతి కుతశ్చన (తై. ఉ. 2. 4) 13.2

శ

శ్రేయశ్చ ప్రేయశ్చ (క. ఉ. 2. 2) 13.2

స

స ఇదం సర్వం భవతి (బృ. ఉ. 3. 4)
సత్యం జ్ఞానమనన్తం బ్రహ్మ (తై. ఉ. 2. 1) 4.25
స దాధారపృథివీమ్ (తై. సం. 4. 1. 8) 15.13
సమాసమాభ్యాం విషమసమే పూజాతః
(గౌ. సూ. 17. 20) 5.19
స యథాకామో భవతి తత్క్రతుర్భవతి
(బృ. ఉ. 6. 4. 5) 6.4;13.21
స యో హ వై భగవన్మనుష్యేషు ప్రాయణాన్తమోం
కారమభిధ్యాయీత కతమం వావ స తేన లోకం
జయతీతి తస్మై స హోవాచ,ఏతద్వై సత్యకామ
పరం చాపరం చ బ్రహ్మ యదోంకారః....
యః పునరేతం త్రిమాత్రేణోమిత్యనేనైవాక్షరేణ
పరం పురుషమభిధ్యాయీత...సామభిరున్నీయతే
బ్రహ్మలోకమ్ (ప్ర. ఉ. 5. 1. 2. 5) 8.11
సర్వాన్ కుశాగ్రాణి తథోదపానం జ్ఞాత్వా మనుష్యాః
పరివర్జయన్తి. అజ్ఞానతస్తత్ర పతన్తి కేచిత్
జ్ఞానే ఫలం పశ్య యథా విశిష్టమ్
(శా. ప. 201. 16) 13.2
సర్వం తదభిసమేతి యత్కించిత్ ప్రజాః సాధు
కుర్వన్తి యస్తద్వేద యత్సవేద
(ఛా. ఉ. 4. 1. 4) 2.46
స హి ధర్మః సుపర్యాప్తో బ్రహ్మణః పదవేదనే,
(ఆశ్వమేధికపర్వణి 6. 12)తత్రైవ అనుగీతాయామ్
నైవ ధర్మీ న చాధర్మీ న చైవ హి శుభాశుభీ,యః స్యా
దేకాసనే లీనః తూష్ణీం కించిదచిన్తయన్
(అవతరణే) 1.1
సంకల్పమూలః కామో వై యజ్ఞాః సంకల్పసంభవాః
(మను. స్మృ. 2. 2) 6.4
స్వయంజ్యోతిః (బృ. ఉ. 6. 3. 9) 18.50

హ్మ

హృష్టో దృప్యతి,దృప్తో ధర్మమతిక్రామతి
(అప. ధ. సూ. 1. 13. 4) 18.53

అనుబంధం - 3

భగవద్గీతాభాష్యంలోని కొన్ని శంకరవచనసుధాబిందువులు

1. బ్రాహ్మణత్వస్య హి రక్షణే రక్షితః స్యాద్వైదికో ధర్మః, తదధీనత్వాద్వర్ణాశ్రమభేదానామ్. (ఉపోద్ఘాతభాష్యమ్).
2. స్వప్రయోజనాభావేఽపి భూతానుజిఘృక్షయా వైదికం ధర్మద్వయమ్ అర్జునాయ శోకమోహమహోదధౌ నిమగ్నాయ ఉపదిదేశ, గుణాధికైర్హి గృహీతః అనుష్ఠీయమానశ్చ ధర్మః ప్రచయం గమిష్యతీతి (ఉపోద్ఘాతభాష్యమ్)
3. అభ్యుదయార్థోఽపి ప్రవృత్తిలక్షణో ధర్మః వర్ణా నాశ్రమాంశ్చోద్దిశ్య విహితః,సః దేవాదిస్థానప్రాప్తిహేతు రపి సన్ ఈశ్వరార్పణబుద్ధ్యా నుష్ఠీయమానః సత్త్వశు ద్ధయే భవతి ఫలాభిసంధివర్జితః (ఉపోద్ఘాతభాష్యమ్)
4. సర్వప్రాణినాం శోకమోహాదిదోషావిష్టచేతసాం స్వభావత ఏవ స్వధర్మపరిత్యాగః ప్రతిషిద్ధసేవా చ స్యాత్. స్వధర్మే ప్రవృత్తానామపి తేషాం వాఙ్మనఃకాయాదీనాం ప్రవృత్తిః ఫలాభిసంధిపూర్వికైవ సాహంకారా చ భవతి (2.11)
5. సంసారబీజభూతౌ శోకమోహౌ.తయోశ్చ సర్వకర్మ సంన్యాసపూర్వకాత్ ఆత్మజ్ఞానాత్ నాన్యతో నివృత్తిరితి తదుపదిదిక్షుః సర్వలోకానుగ్రహార్థమ్ అర్జునం నిమిత్తీకృత్యాహ భగవాన్ వాసుదేవః (2.11)
6. న హి పిత్తప్రశమనార్థివః వైద్యేన మధురం శీతలం చ భోక్తవ్యమ్ ఇత్యుపదిష్టే తయోరన్యత్పిత్తప్రశమనకారణం బ్రూహి ఇతి ప్రశ్నః సంభవతి. (2.11)
7. న హి అత్ర యుద్ధకర్తవ్యతా విధీయతే,యుద్ధే ప్రవృత్త ఏవ హి అసౌ శోకమోహప్రతిబద్ధః తూష్ణీమాస్తే. అతః తస్య ప్రతిబన్ధాపనయనమాత్రం భగవతా క్రియతే- తస్మాద్యుధ్యస్వేతి. (2.16)
8. విదుషః కర్మాసంభవవచనాత్ యాని కర్మాణి శాస్త్రేణ విధీయన్తే తాని అవిదుషో విహితానీతి భగవతో నిశ్చయోఽవగమ్యతే (1.21)
9. శాస్త్రాచార్యోపదేశశమదమాదిసంస్కృతం మనః ఆత్మదర్శనే కరణమ్ (2.21)

10. నైతేషాం శ్లోకానాం పౌనరుక్త్యం చోదనీయమ్... దుర్బో
ధత్వాదాత్మవస్తునః పునః పునః ప్రసంగమాపాద్య
శబ్దాన్తరేణ తదేవ వస్తు నిరూపయతి భగవాన్ వాసుదేవః
కథం ను నామ సంసారిణామవ్యక్తం తత్త్వం బుద్ధిగోచరతామాపన్నం
సత్ సంసారనివృత్తయే స్యాదితి. (2.24)

11. యోగస్థః కురు కర్మాణి కేవలమీశ్వరార్థమ్;తత్రాపి "ఈశ్వరో మే
తుష్యతు"ఇతి సంగం త్యక్త్వా.(2.48)

12. సర్వత్రైవ హి అధ్యాత్మశాస్త్రే కృతార్థలక్షణాని యాని తాన్యేవ
సాధనాని ఉపదిశ్యన్తే,యత్నసాధ్యత్వాత్.యాని యత్న
సాధ్యాని సాధనాని లక్షణాని చ భవన్తి తాని (2.54)

13. తావదేవహి పురుషః యావదన్తఃకరణం తదీయం కార్యా
కార్యవిషయవివేకయోగ్యమ్.తదయోగ్యత్వే నష్ట ఏవ
పురుషో భవతి. (2.63)

14. మోక్షస్య చ అకార్యత్వాత్ ముముక్షోః కర్మానర్థక్యమ్ (3.1)

15. యది విహితాకరణాత్ అసంభావ్యమపి ప్రత్యవాయం
బ్రూయాద్వేదః తదా అనర్థకరః వేద అప్రమాణమిత్యుక్తం
స్యాత్.విహితస్య కరణాకరణయోః దుఃఖమాత్ర
ఫలత్వాత్ (3.1)

16. తస్మాత్ అజ్ఞేన అధికృతేన కర్తవ్యమేవ కర్మ. (3.16)

17. ప్రారబ్ధకర్మాయత్తః త్వం లోకసంగ్రహమేవాపి,లోకస్య
ఉన్మార్గప్రవృత్తినివారణం లోకసంగ్రహః,తమేవాపి ప్రయో
జనం సంపశ్యన్ కర్తుమర్హసి. (3.20)

18. ప్రకృతిర్నామ పూర్వకృతధర్మాధర్మాదిసంస్కారః వర్తమానజన్మాదౌ
అభివ్యక్తః.(3.31)

19. యది సర్వో జన్తుః ఆత్మనః ప్రకృతిసదృశమేవ చేష్టతే,
న చ ప్రకృతిశూన్యః కశ్చిదస్తి,తతః పురుషకారస్య విష
యానుపపత్తేః శాస్త్రానర్థక్యప్రాప్తౌ ఇదముచ్యతే. (3.34)

20. యదా పునః రాగద్వేషౌ తత్ప్రతిపక్షేణ నియమయతి తదా
శాస్త్రదృష్టిరేవ పురుషః భవతి,న ప్రకృతివశః (3.34)

21. కామో హి ఉద్భూతః రజః ప్రవర్తయన్ పురుషం ప్రవర్త
యతి."తృష్ణయా అహం కారితః"ఇతి దుఃఖినాం రజఃకార్యే
సేవాదౌ ప్రవృత్తానాం ప్రలాపః శ్రూయతే.(3.37).

22. "క్షిప్రం హి మానుషే లోకే"ఇతి విశేషణాత్ అన్యేష్వపి కర్మ
ఫలసిద్ధిం దర్శయతి భగవాన్. (4.12)

23. తదేతత్ ఉక్తప్రతివచనమపి అసకృత్ అత్యన్తవిప
రీతదర్శనభావితతయా మోముహ్యమానో లోకః శ్రుతమపి
అసకృత్ తత్త్వం విస్మృత్య విస్మృత్య మిథ్యాప్రసంగమవతార్య
అవతార్య చోదయతి ఇతి పునః పునః ఉత్తరమాహ భగ
వాన్,దుర్విజ్ఞేయత్వం చ అలక్ష్య వస్తునః (4.18)

24. నాపి నిత్యానామకరణాత్ అభావాత్ ప్రత్యవాయ
భావోత్పత్తిః,"నాసతో విద్యతే భావః"ఇతి వచనాత్....
న చ నిష్ఫలం విదధ్యాత్ కర్మ శాస్త్రమ్,దుఃఖస్వరూపత్వాత్,దుఃఖస్య
చ బుద్ధిపూర్వకతయా కార్యత్వానుపపత్తేః.తదకరణే చ నరకపాతా
భ్యుపగమాత్ అనర్థాయైవ ఉభయథాపి కరణే అకరణే చ శాస్త్రం
కల్పితం స్యాత్ (4.18).

25. జ్ఞానవన్తోఽపి కేచిత్ యథావత్ తత్త్వదర్శనశీలాః,అపరే న.అతో
విశినష్టి తత్త్వదర్శినః ఇతి.యే సమ్యగ్దర్శినః తైః ఉపదిష్టం జ్ఞానం
కార్యక్షమం భవతి నేతరత్ ఇతి భగవతో మతమ్.(4.34).

26. సంన్యాసకర్మయోగౌ జ్ఞాన-తదుపాయసమబుద్ధిత్వాదిసంయుక్తౌ
సాంఖ్యయోగశబ్దవాచ్యౌ ఇతి భగవతః మతమ్ (5.4).

27. దృశ్యతే హి బ్రహ్మవిత్ షడఙ్గవిత్,చతుర్వేదవిత్,ఇతి పూజనాదౌ
గుణవిశేషసంబన్ధః కారణమ్ (5.19).

28. స్వం నాసికాగ్రం సంప్రేక్ష్య సమ్యక్ ప్రేక్షణం కృత్వేవ ఇతి
ఇవశబ్దో లుప్తో ద్రష్టవ్యః.న హి స్వనాసికాగ్రప్రేక్షణమిహ
విధిత్సితమ్,కిం తర్హి? చక్షుషో? దృష్టిసంనిపాతః.స చ
అన్తఃకరణసమాధానాపేక్షో వివక్షితః.స్వనాసికాగ్రసంప్రేక్షణ
మేవ చేత్ వివక్షితం,మనః తత్రైవ సమాధీయేత నాత్మని. (6.13)

29. ఏకస్య దేవస్య సర్వాధ్యక్షభూతచైతన్యమాత్రస్య
పరమార్థతః సర్వభోగానభిసంధినః అన్యస్య చేతనాన్తరస్య
అభావే భోక్తుః అన్యస్య అభావాత్ కింనిమిత్తా

ఇయం సృష్టిః ఇత్యత్ర ప్రశ్నప్రతివచనే అనుపపన్నే-"కో అద్ధా వేద క ఇహ ప్రవోచత్,కుత ఆజాతా కుత ఇయం విసృష్టిః" ఇత్యాదిమన్త్రవర్ణేభ్యః (9.10).

30. జ్ఞానదీపేన వివేకప్రత్యయరూపేణ భక్తి ప్రసాదస్నేహాభిషిక్తేన,మద్భావనాభినివేశవాతేరితేన,బ్రహ్మచర్యాది సాధనసంస్కారవత్ప్రజ్ఞావర్తినా,విరక్తాన్తఃకరణాధారేణ విషయవ్యావృత్తచిత్తరాగద్వేషాకలుషితనివాతాపవరకస్థేన,నిత్య ప్రవృత్తైకాగ్ర్యధ్యానజనితసమ్యగ్దర్శనభాస్వతా జ్ఞానదీపేనేత్యర్థః (10.11)

31. బ్రహ్మాణం చతుర్ముఖమ్.... కమలాసనస్థం పృథివీపద్మ మధ్యే మేరుకర్ణికాసనస్థమిత్యర్థః. (11.15)

32. న హి ఈశ్వరద్వయం సంభవతి,అనేకేశ్వరత్వే.వ్యవహారా నుపపత్తేః (11.43)

33. యథా అగస్త్యేన బ్రాహ్మణేన సముద్రః పీతః ఇతి ఇదానీంతనాః అపి బ్రాహ్మణాః బ్రాహ్మణత్వసామాన్యాత్ స్తూయన్తే ఏవం కర్మఫలత్యాగాత్ కర్మయోగస్య శ్రేయఃసాదనత్వమ్ అభిహితమ్.(12.12)

34. అవిద్యామాత్రం సంసారః....న క్షేత్రజ్ఞస్య కేవలస్య అవిద్యా తత్కార్యం చ.న చ మిథ్యాజ్ఞానం పరమార్థవస్తు దూష యితుం సమర్థమ్.న హి ఊరషదేశం స్నేహేన పఙ్కీకర్తుం శక్నోతి మరీచ్యుదకమ్.తథా అవిద్యా క్షేత్రజ్ఞస్య న కించిత్కర్తుం శక్నోతి (13.2).

35. నను సర్వక్షేత్రేషు ఏక ఏవ ఈశ్వరః.న అన్యః తద్వ్యతిరిక్తః భోక్తా విద్యతే చేత్ తతః ఈశ్వరస్య సంసారిత్వం ప్రాప్తమ్. ఈశ్వ రవ్యతిరేకేణ వా అన్యస్య సంసారిణః అభావాత్ సంసారాభావప్రసంగః తచ్చోభయమనిష్టమ్... ప్రత్యక్షేణ తావత్....సంసారః ఉపలభ్యతే. జగద్వైచిత్ర్యోపలబ్ధేశ్చ ధర్మాధర్మనిమిత్తః సంసారః అనుమీయతే.సర్వమేతత్ అనుపపన్నమాత్మేశ్వరైకత్వే.న.జ్ఞానా జ్ఞానయోః అన్యత్వేనోపపత్తేః.... (13.2).

36. సర్వజన్తూనాం హి ప్రసిద్ధః దేహాదిషు అనాత్మసు ఆత్మభావః నిశ్చితః అవిద్యాకృతః;యథా స్థాణౌ పురుషనిశ్చయః.న చ

ఏతావతా పురుషధర్మః స్థాణోః భవతి,స్థాణుధర్మో వా పురుషస్య
తథా న చైతన్యధర్మః దేహస్య దేహధర్మో వా చేతనస్య....
అవిద్యాకృతత్వావిశేషాత్,జరామృత్యువత్. (13.2).

36. సంసారసంసారిత్వాభావే శాస్త్రానర్థక్యాదిదోషః స్యాదితి
చేత్-న;సర్వైరభ్యుపగతత్వాత్.సర్వైర్హి ఆత్మవాదిభిః
అభ్యుపగతః దోషః న ఏకేన పరిహర్తవ్యః భవతి
.... ముక్తాత్మనాం హి సంసారసంసారిత్వవ్యవహారాభావః సర్వై
రపి ఆత్మవాదిభిః ఇష్యతే.న చ తేషాం శాస్త్రానర్థక్యాది
దోషప్రాప్తిః అభ్యుపగతా.తథా నః క్షేత్రజ్ఞానామ్ ఈశ్వ
రైకత్వే సతి శాస్త్రానర్థక్యం భవతు,అవిద్యావిషయే చ
అర్థవత్త్వమ్-యథా ద్వైతినాం సర్వేషాం
బన్ధావస్థాయామేవ శాస్త్రాద్యర్థవత్త్వం న ముక్తావస్థా
యామ్ ఏవమ్ (13.2).

37. అథ కిమిదం సంసారిణమివ "అహమేవమ్" "మమైవేదమ్"
ఇతి పణ్డితానామపి?శృణు-ఇదం తత్పాణ్డిత్యం యత్
క్షేత్రే ఏవ ఆత్మదర్శనమ్.యది పునః క్షేత్రజ్ఞమ్ అవి
క్రియం పశ్యేయుః,తతః న భోగం కర్మ వా ఆకాఙ్క్షే
యుః-"మమ స్యాత్"ఇతి.విక్రియైవ భోగకర్మణీ (13.2).

38. ఇదం చ అన్యత్ పాణ్డిత్యం కేషాంచిత్-అస్తు క్షేత్రజ్ఞః
ఈశ్వర ఏవ.క్షేత్రం చ అన్యత్ క్షేత్రజ్ఞస్యైవ విషయః.
అహం తు సంసారీ సుఖీ దుఃఖీ చ.సంసారోపరమశ్చ
మమ కర్తవ్యః క్షేత్రక్షేత్రజ్ఞవిజ్ఞానేన ధ్యానేన చ ఈశ్వరం
సాక్షాత్కృత్వా తత్స్వరూపావస్థానేన ఇతి....ఏవం మన్వానః
యః సః పణ్డితాపసదః,సంసారమోక్షయోః శాస్త్రస్య చ
అర్థవత్త్వం కరోమీతి;ఆత్మహా స్వయం మూఢః అన్యాంశ్చ
వ్యామోహయతి శాస్త్రార్థసంప్రదాయరహితత్వాత్ శ్రుత
హానిమ్ అశ్రుతకల్పనాం చ కుర్వన్.తస్మాత్ అసంప్రదాయ
విత్ సర్వశాస్త్రవిదపి మూర్ఖవదేవ ఉపేక్షణీయః (13.2).

39. అత్రాహ-"సా అవిద్యా కస్య?"ఇతి.యస్య దృశ్యతే తస్యైవ.
"కస్య దృశ్యతే?"ఇతి.అత్రోచ్యతే-"అవిద్యా కస్య దృశ్యతే?"

ఇతి ప్రశ్నః నిరర్థకః. కథమ్? దృశ్యతే చేదవిద్యా తద్వ
న్తమపి పశ్యసి. న చ తద్వతి ఉపలభ్యమానే సా కస్య
ఇతి ప్రశ్నో యుక్తః. న హి గోమతి ఉపలభ్యమానే "గావః
కస్య?' ఇతి ప్రశ్నః అర్థవాన్ భవతి నను విషమో దృష్టాన్తః. గవాం
తద్వతశ్చ ప్రత్యక్షత్వాత్ తత్సంబన్ధోఽపి ప్రత్యక్ష ఇతి ప్రశ్నః నిరర్థకః.
న తథా అవిద్యా తద్వాంశ్చ ప్రత్యక్షౌ యతః ప్రశ్నః నిరర్థకః స్యాత్.
అప్రత్యక్షేణ అవిద్యావతా అవిద్యాసంబన్ధే జ్ఞాతే కిం తవ స్యాత్?
అవిద్యాయాః అనర్థహేతుత్వాత్ పరిహర్తవ్యా స్యాత్, యస్య
అవిద్యా స తాం పరిహరిష్యతి. నను మమైవ అవిద్యా. జానాసి తర్హి
అవిద్యాం తద్వన్తం చ ఆత్మానమ్? (13.2).

40. సర్వో హి శబ్దః అర్థప్రకాశనాయ ప్రయుక్తః, శ్రూయమాణశ్చ
శ్రోతృభిః జాతిగుణక్రియాసంబన్ధద్వారేణ సంకేతగ్రహణ
సవ్యపేక్షః అర్థం ప్రత్యాయయతి. న అన్యథా; అదృష్టత్వాత్
తద్యథా-గౌః అశ్వః ఇతి వా జాతితః. పచతి, పఠతి ఇతి వా
క్రియాతః. శుక్లః, కృష్ణః ఇతి వా గుణతః. ధనీ గోమాన్
ఇతి వా సబన్ధతః. (13.12).

41. కః పునః అయం సంసారో నామ? సుఖదుఃఖసంభోగః సం
సారః. పురుషస్య సుఖదుఃఖానాం సంభోక్తృత్వం సంసారి
త్వమ్ ఇతి. (13.20).

42. యథాశాస్త్రం క్షేత్రక్షేత్రలక్షణభేదపరిజ్ఞానపూర్వకం
ప్రాక్ దర్శితరూపాత్ క్షేత్రాత్, ముఞ్జాదివేషీకాం
యథోక్తలక్షణం ప్రవిభజ్య "న సత్తన్నాసదుచ్యతే" ఇత్య
నేన నిరస్తసర్వోపాధివిశేషం జ్ఞేయం బ్రహ్మ స్వరూపేణ
యః పశ్యతి, క్షేత్రం చ మాయానిర్మితహస్తిస్వప్నదృష్టవస్తుగన్ధర్వ
నగరాదివత్ అసదేవ సదివ భాసతే ఇత్యేవం నిశ్చితవిజ్ఞానః
యః, తస్య యథోక్తసమ్యగ్దర్శనవిరోధాత్ అపగచ్ఛతి
మిథ్యాజ్ఞానమ్. (13.26).

43. ఏతస్మిన్ పరమార్థసాంఖ్యదర్శనే స్థితానాం జ్ఞాననిష్ఠానాం పరమ
హంసపరివ్రాజకానాం తిరస్కృతావిద్యావ్యవహారాణాం కర్మాధి
కారో నాస్తీతి తత్ర తత్ర దర్శితం భగవతా. (13.31).

44. యద్యపి ఉదాసీనా భవన్తి కేచిత్ స్వాభిప్రాయేణ,తథాపి పరాభిప్రాయేణ మిత్రారిపక్షయోరివ భవన్తి ఇతి "తుల్యో మిత్రా పక్షయోః"ఇత్యాహ.(14.25).

45. 'ఉదాసీనవత్'ఇత్యాది "గుణాతీతః స ఉచ్యతే"ఇత్యేతదన్తమ్ ఉక్తం యావత్ యత్నసాధ్యం తావత్ సంన్యాసినః అనుష్ఠేయం గుణాతీతత్వసాధనం ముముక్షోః.స్థిరీభూతం తు స్వసం వేద్యం సత్ గుణాతీతస్య యతేః లక్షణం భవతి. (14.26).

46. యయా ఈశ్వరశక్త్యా భక్తానుగ్రహాదిప్రయోజనాయ బ్రహ్మ ప్రతిష్ఠతే,ప్రవర్తతే,సా శక్తిః బ్రహ్మైవ అహమ్;శక్తి శక్తిమతోః అనన్యత్వాత్ ఇత్యభిప్రాయః (14.27).

47. విరక్తస్య హి సంసారాత్ భగవత్తత్త్వజ్ఞానే అధికారః నాన్యస్య (15.1).

48. మమైవ,పరమాత్మనః.... అంశః...సంసారే జీవభూతః కర్తా భోక్తా ఇతి ప్రసిద్ధః సనాతనః చిరంతనః.యథా జలసూర్యకసూర్యాంశః జలనిమిత్తాపాయే సూర్యమేవ గత్వా న నివర్తతే తథా అయమప్యంశః తేనైవ ఆత్మనా న గచ్ఛతి ఏవమేవ;యథా ఘటాద్యుపాధిపరిచ్ఛినః ఘటాద్యాకాశః ఆకాశాంశః సన్ ఘటాదినిమిత్తాపాయే ఆకాశం ప్రాప్య న నివర్తతే. అతః ఉపపన్నముక్తమ్–"యద్గత్వా న నివర్తన్తే"ఇతి (15.7).

49. నను నిరవయవస్య పరమాత్మనః కుతః అవయవః ఏకదేశః అంశః ఇతి?సావయవత్వే చ వినాశప్రసంగః అవయవ విభాగాత్.నైష దోషః.అవిద్యాకృతోపాధిపరిచ్ఛిన్నః ఏకదేశః అంశ ఇవ కల్పితః యతః (15.7).

50. ఆదిత్యాదిషు హి సత్త్వం అత్యన్తప్రకాశమ్ అత్యన్తభాస్వరమ్ అతః తత్రైవ ఆవిస్తరాం జ్యోతిః ఇతి తత్ (చైతన్యాత్మకం జ్యోతిః)విశిష్యతే.న తు తత్రైవ తత్ అధికమితి యథా హి లోకే తుల్యేఽపి ముఖసంస్థానే న కాష్ఠకుడ్యా దౌ ముఖమావిర్భవతి,ఆదర్శాదౌ తు స్వచ్ఛే స్వచ్ఛ తరే చ తారతమ్యేవ ఆవిర్భవతి,తద్వత్. (15.12)

51. గుణసంఖ్యానే కాపిలే శాస్త్రే.తదపి గుణసంఖ్యానశాస్త్రం గుణభోక్తృవిషయే ప్రమాణమేవ పరమార్థబ్రహ్మైకత్వ

విషయే యద్యపి విరుధ్యతే తథాపి. తే హి కాపిలాః
గుణగౌణవ్యాపారనిరూపణే అభియుక్తాః ఇతి తచ్ఛా
స్త్రమపి వక్ష్యమాణార్థస్తుత్యర్థత్వేన ఉపాదీయతే ఇతి న
విరోధః (18.19).

52. ఏతేషాం జాతివిహితానాం కర్మణాం సమ్యగనుష్ఠితానాం
స్వర్గప్రాప్తిః ఫలం స్వభావతః. (18.43).

53. స్వభావనియతం కర్మ కుర్వాణః విషజః ఇవ కృమిః కిల్బి
షం న ఆప్నోతీతి ఉక్తమ్. (18.48).

54. సహజస్య కర్మణః స్వధర్మాఖ్యస్య పరిత్యాగేణ పరధర్మా
నుష్ఠానేఽ పి దోషాత్ నైవ ముచ్యతే. భయావహశ్చ పరధర్మః. (18.48).

55. ఏకస్య అభావః, ద్వయోః అభావః, సర్వస్య అభావః
ప్రాగభావః, ప్రధ్వంసాభావః, ఇతరేతరాభావః, అత్యన్తా
భావః ఇతి లక్షణతో న కేన చిత్ విశేషః దర్శయితుం
శక్యః (18.48).

56. విద్వాంస్తు పునః విద్యయా అవిద్యాయాం నివృత్తాయాం శక్నో
త్యేవ అశేషతః కర్మ పరిత్యక్తుమ్. అవిద్యాధ్యారోపితస్య
శేషానుపపత్తేః. న హి తైమిరికదృష్ట్యా అధ్యారోపి
తస్య ద్విచన్ద్రాదేః తిమిరాపగమేఽ పి శేషః అవతి
ష్ఠతే (18.48).

57. జ్ఞానాత్మనోశ్చ ఉభయోర్నిరాకారత్వే కథం తద్భావనా
నిష్ఠా ఇతి. న; అత్యన్తనిర్మలత్వాతిస్వచ్ఛత్వా
తిసూక్ష్మత్వోపపత్తేః ఆత్మనః. బుద్ధేశ్చ ఆత్మవత్ నైర్మ
ల్యాద్యుపపత్తేః ఆత్మచైతన్యాకారాభాసత్వోపపత్తిః.
బుద్ధ్యాభాసం మనః, తదాభాసానీన్ద్రియాణి; ఇన్ద్రి
యాభాసశ్చ దేహః. అతః లౌకికైః దేహమాత్ర ఏవ ఆత్మదృష్టిః
క్రియతే (18.50).

58. కేచిత్తు పణ్డితంమన్యాః "నిరాకారత్వాత్ ఆత్మవస్తు నోపైతి
బుద్ధిః. అతః దుఃసాధ్యా సమగ్జ్ఞాననిష్ఠా ఇత్యాహుః.
సత్యమేవం గురుసంప్రదాయరహితానామశ్రుతవేదాన్తానామ్
అత్యన్తబహిర్విషయాసక్తబుద్ధీనాం సమ్యక్ ప్రమాణేషు

అకృతశ్రమాణామ్. తద్విపరీతానాం తు లౌకికగ్రాహ్యగ్రాహక
ద్వైతవస్తుని సద్బుద్ధిః నితరాం దుఃసంపాదా,ఆత్మచైత
న్యవ్యతిరేకేణ వస్త్వన్తరస్య అనుపలబ్ధేః (18.50).

59. యథా స్వదేహస్య పరిచ్ఛేదాయ న ప్రమాణాన్తరాపేక్షా
తతోఽప్యాత్మనః అన్తరతమత్వాత్ తదవగతిం ప్రతి న ప్రమా
ణాన్తరాపేక్షా (18.50).

60. ధ్యానయోగపరః నిత్యం,నిత్యగ్రహణం మన్త్రజపా
ద్యన్యకర్తవ్యాభావప్రదర్శనార్థమ్. (18.52).

61. న హి పూర్వసముద్రం జిగమిషోః ప్రాతిలోమ్యేన ప్రత్యక్సము
ద్రజిగమిషుణా సమానమార్గత్వం సంభవతి.ప్రత్యగాత్మ
విషయప్రత్యయసంతానకరణాభినివేశశ్చ జ్ఞాననిష్ఠా;
సా చ ప్రత్యక్సముద్రగమనవత్ కర్మణా సహ
భావిత్వేన విరుధ్యతే.పర్వతసర్షపయోరివ అన్తరవాన్
విరోధః ప్రమాణవిదాం నిశ్చితః (18.55).

62. అకార్యత్వాచ్చ నిఃశ్రేయసస్య కర్మసాధనత్వానుపపత్తిః.
న హి నిత్యం వస్తు కర్మణా జ్ఞానేన వా క్రియతే. (18.66)

63. న కర్మణోఽస్తి నిఃశ్రేయససాధనత్వమ్.న చ జ్ఞానకర్మణోః
సముచ్చితయోః.నాపి జ్ఞానస్య కైవల్యఫలస్య కర్మసాహా
య్యాపేక్షా;అవిద్యానివర్తకత్వేన విరోధాత్.న హి తమః
తమసః నివర్తకమ్. అతః కేవలమేవ జ్ఞానం నిఃశ్రేయస
ఫలమ్ (18.66).

64. అవిహితమప్రతిషిద్ధం చ కర్మ తత్కాలఫలమ్.న తు శాస్త్ర
చోదితం ప్రతిషిద్ధం వా తత్కాలఫలం భవేత్. (18.66).

65. భక్తేః పునర్గ్రహణాత్ భక్తిమాత్రేణ కేవలేన శాస్త్ర
సంప్రదానే పాత్రం భవతీతి గమ్యతే. (18.68).

66. శిష్యస్య శాస్త్రార్థగ్రహణాగ్రహణవివేకబుభుత్సయా
పృచ్ఛతి.తదగ్రహణే జ్ఞాతే పునః గ్రాహయిష్యామి
ఉపాయాన్తరేణాపి ఇతి ప్రష్టుః అభిప్రాయః. యత్నా
న్తరం చాస్థాయ శిష్యస్య కృతార్థతా కర్తవ్యా ఇత్యా
చార్యధర్మః ప్రదర్శితః భవతి (18.72).

67. అనేన మోహనాశప్రశ్నప్రతివచనేన సర్వశాస్త్రార్థ
జ్ఞానఫలమేతదేవేతి నిశ్చితం దర్శితం భవతి, యతః
జ్ఞానాత్ మోహనాశః ఆత్మస్మృతిలాభశ్చేతి (18.73).

68. యథా చ సాత్త్వికాదిపురుషః సాత్త్వికాదికార్యా
ణ్యాత్మానం ప్రతి ప్రకాశ్య నివృత్తాని కాఙ్క్షతి
న తథా గుణాతీతః నివృత్తాని కాఙ్క్షతీత్యర్థః.
ఏతన్న పరప్రత్యక్షం లిఙ్గం, కిం తర్హి? స్వాత్మ
ప్రత్యక్షత్వాత్ ఆత్మవిషయమేవ ఏతల్లక్ష
ణమ్. న హి స్వాత్మవిషయం ద్వేషమాకా
ఙ్క్షాం వా పరః పశ్యతి (14.22).

69. క్షేత్రక్షేత్రజ్ఞయోర్విషయవిషయిణోః
భిన్నస్వభావయోః ఇతరేతరతద్ధర్మాధ్యా
సలక్షణః సంయోగః క్షేత్రక్షేత్రజ్ఞస్వరూ
పవివేకాభావనిబన్ధనః రజ్జుశుక్తి
కాదీనాం తద్వివేకజ్ఞానాభావాదధ్యారోపిత
సర్పరజతాదిసంయోగవత్. సోఽయమధ్యాస
స్వరూపః క్షేత్రక్షేత్రజ్ఞసంయోగః మిథ్యా
జ్ఞానలక్షణః (బ్రహ్మసూత్రభాష్యస్థాధ్యాసభాష్య
గతవాక్యానుకారి వాక్యమ్ (13.26)

70. మిథ్యాత్వేఽప్యుపాయస్య ఉపేయసత్యతయా
సత్యత్వమేవ స్యాత్; యథా అర్థవాదానాం
విధిశేషాణామ్. లోకేఽపి బాలోన్మత్తాదీనాం
పయఆదౌ పాయయితవ్యే చూడావర్ధనాది
వచనమ్. ప్రకారాన్తరస్థానాం చ
సాక్షాదేవ ప్రామాణ్యసిద్ధిః ప్రాగాత్మజ్ఞానాత్
దేహాభిమాననిమిత్తప్రత్యక్షాదిప్రామణ్యవత్ (18.66)



అనుబంధం - 4

మహామహోపాధ్యాయ పుల్లెల శ్రీరామచంద్రుడు

రచించిన గ్రంథాల, రచనా వర్ష క్రమానుసారంగా, పట్టిక.

1. 1953 హిందీ తెలుగు వ్యాకరణము
2. 1962 గీతాంజలిః : రవీంద్రుని గీతాంజలికి మందాక్రాంతా వృత్తంలో సంస్కృతానువాదం
3. 1963 రాఘవశతకము
4. 1964 కుమతీశతకము (సుమతి శతకానికి పారడీ)
5. 1964 తెనాలి రామలింగని కథలు
6. 1964 సుసంహితభారతమ్: ఆరు అంకాల సంస్కృత నాటకం
7. 1971 లఘు సిద్ధాంత కౌముది : తెలుగులో విస్తృత వ్యాఖ్య
8. 1971 తెలుగు సంస్కృత నిఘంటువు
9. 1974 మన మతములు సంప్రదాయములు
10. 1977 కాళిదాసు కవితా సౌరభము
11. 1977 వక్రోక్తి జీవితమ్ : తెలుగులో విస్తృత వ్యాఖ్య
12. 1977 ధమ్మపదమ్ : సంస్కృతాంగ్లభాషలలోనికి టిప్పణీ సహితానువాదము
13. 1977 వాక్యపదీయమ్ : కొంతభాగం. ఇతర పండితులతో, సంస్కృత మూలానికి తెలుగు వ్యాఖ్య PART-I
14. 1978 వివేక చూడామణి : మూలానికి, శ్రీ చంద్ర శేఖర భారతీ స్వాములవారి సంస్కృత వ్యాఖ్యకు తెలుగు అనువాదం
15. 1979 "ఆంథాలజీ ఆఫ్ ఇండియన్ లిటరేచర్స్" సంస్కృతానికి సంబంధించిన ఆంగ్ల భాషలోని భాగానికి తెలుగు అనువాదం.
16. 1979 రత్నావళి : తెలుగు అనువాదము
17. 1979 రాగరోచిః :శ్రీ ఓరుగంటి రామచంద్రయ్య గారి తెలుగు మూలానికి సంస్కృతానువాదము
18. 1979 భామహుని 'కావ్యాలంకారః' : తెలుగు వ్యాఖ్య
19. 1979 'కావ్యమీమాంసా' : రాజశేఖరుని సంస్కృత మూలానికి తెలుగులో వ్యాఖ్యానము.
20. 1979 బాణభట్ట : కె.కృష్ణమూర్తిగారి ఇంగ్లీషు మూలానికి తెలుగు అనువాదం
21. 1979 ది కంట్రిబ్యూషన్ ఆఫ్ ఆంధ్రాస్ టు బుద్ధిజమ్; శ్రీ కె.సచ్చిదానందమూర్తిగారి ఆంగ్లమూలానికి తెలుగు అనువాదం.
22. 1980 వామనుని కావ్యాలంకారసూత్రవృత్తిః : తెలుగులో విస్తృత వ్యాఖ్య
23. 1981 దండి "కావ్యాదర్శః". తెలుగులో విస్తృత వ్యాఖ్య
24. 1981 వాక్యపదీయమ్ : కొంతభాగం; ఇతర పండితులతో తెలుగు వ్యాఖ్య PART-II
25. 1981 సుందరపాండ్యుని 'నీతిద్విషష్టికా' తెలుగులో వ్యాఖ్య
26. 1982 నీలకంఠుని 'కలివిడంబనమ్' : తెలుగులో వ్యాఖ్య
27. 1982 నీలకంఠుని "వైరాగ్య శతకమ్" : తెలుగులో వ్యాఖ్య
28. 1982 నీలకంఠదీక్షితుని 'సభారంజన శతకమ్' : తెలుగులో వ్యాఖ్య
29. 1983 క్షేమేంద్రుని "ఔచిత్యవిచారచర్చా" : తెలుగులో వ్యాఖ్య

30. 1983 క్షేమేంద్రుని "కవికణ్ఠాభరణమ్" : తెలుగులో వ్యాఖ్య
31. 1983 క్షేమేంద్రుని "సువృత్తతిలకమ్" : తెలుగులో వ్యాఖ్య
32. 1983 క్షేమేంద్రుని "సేవ్యసేవకోపదేశః" : తెలుగులో వ్యాఖ్య
33. 1983 ది కంట్రిబ్యూషన్ ఆఫ్ పండితరాజ జగన్నాథ టు సంస్కృత పొయటిక్స్ : 1968లో ఇంగ్లీషులో వ్రాసిన పిహెచ్. డి. థీసిస్ 1983లో ముద్రితము
34. 1983 "నిబన్ధ భాస్కరః" సంస్కృత భాషలో 12 వ్యాసాలు
35. 1983 "పారసీకలోకోక్తయః" : పెర్షియన్ భాష లోని సామెతల సంస్కృతానువాదం 397 శ్లోకాలలో
36. 1983 భారతీయ విజ్ఞానవేత్తలు : పాణిని, కౌటిల్యుడు, కణాదుడు, ఆర్యభట్టు, భాస్కరాచార్యులు, వరాహమిహిరుడు – వీరిని గూర్చి తెలుగులో
37. 1984 రూపకపరిచయః : సంస్కృతంలో
38. 1984 తైత్తిరీయోపనిషత్ : తెలుగులో వ్యాఖ్య
39. 1984 కేనోపనిషత్ : తెలుగువ్యాఖ్య
40. 1984 ప్రశ్నోపనిషత్ : తెలుగు వ్యాఖ్య
41. 1984 ముండోపనిషత్ : తెలుగు వ్యాఖ్య
42. 1984 మాండూక్యోపనిషత్ : తెలుగు వ్యాఖ్య
43. 1984 నాగార్జున : శ్రీ కె. సచ్చిదానందమూర్తి గారి ఆంగ్లమూలానికి తెలుగు అనువాదం.
44. 1986 వ్యాసమహర్షి
45. 1986 పండితరాజజగన్నాథ : ఇంగ్లీషులో
46. 1986 భవభూతి : జి.కె.భట్‌గారి ఇంగ్లీషు మూలానికి తెలుగు అనువాదం.
47. 1986 శ్రీమద్రామాయణమ్. బాలకాండ టీకాతాత్పర్యాలు
48. 1987 మహాకవి కాళిదాసు
49. 1988 శ్రీరామ సహస్రనామస్తోత్రమ్
50. 1988 శ్రీత్యాగరాజ సహస్రనామ స్తోత్రమ్
51. 1989 సూర్యదణ్డకః : సంస్కృత వ్యాఖ్య
52. 1989 అగ్నిపురాణం PART-I : తెలుగు అనువాదం
53. 1989 అగ్నిపురాణం PART-II : తెలుగు అనువాదం
54. 1990 శ్రీమద్రామయణము,అయోధ్యాకాండ టీకాతాత్పర్యమ PART-I
55. 1991 భాసుడు – V. – వేంకటాచలంగారి ఇంగ్లీషు మూలానికి తెలుగు అనువాదం.
56. 1991 శ్రీమద్రామయణము : అయోధ్యకాండ, టీకాతాత్పర్యములు
57. 1992 పాతంజలయోగసూత్రం. తెలుగులో విస్తృత వ్యాఖ్య
58. 1992 సంస్కృత సూక్తి రత్నకోశః PART-I తెలుగు అనువాదంతో
59. 1992 జీవన్ముక్తి వివేకః : తెలుగు అనువాదం
60. 1993 సంస్కృతసూక్తిరత్నకోశః : PART-II తెలుగు అనువాదంతో
61. 1993 శ్రీమద్రామాయణమ్ : అరణ్యకాండ – టీకాతాత్పర్యములు
62. 1993 శ్రీమద్రామాయణమ్ : కిష్కింధాకాండ టీకాతాత్పర్యములు
63. 1993. శ్రీరామచంద్రలఘుకావ్య సంగ్రహః (1.వ్యాఘ్రీ తనయ సంవాదః 2.వసన్తాగమనమ్ 3. మహాన్‌భారతోఽహమ్ 4.న కదాచిదనీదృశం జగత్ 5.ఆధునిక కావ్యలక్షణమ్ 6. భారతదేశస్య స్వరాజ్యాధిగమః 7. హాస్యగుటికాః 8.శబరీ 9. నెహ్రూవిషయే చరమ శ్లోకాః 10. కవికులకోకిలః 11.సౌమ్యోదదాతు సౌమ్యతామ్ 12.సంస్కృత భాషా

13. ముక్తకాని 14. శ్రీరామకృష్ణపరమ హంస సూక్తయః 15. అద్వైతమతే ప్రశస్తాః గుణాః 16. అద్వైతం పరమ రహస్యమ్ 17. అద్వైతమేవ వైదికం దర్శనమ్ 18. సమస్యాపూర్తయః శ్రీరామ స్తుతిశ్చ 19. అనూదితాని మహాదేవీ వర్మణః గీతాని 20-22 (కథాత్రయీ) (1)నగరే శృఙ్గాటకమ్ (2) జీర్ణచ్ఛత్రమ్ (3)భిషజో భైషజ్యమ్ (ఏకాఙ్కికా శిఖా

64. 1993 స్తుతిమఞ్జరీ : (1) వినాయకాష్టకమ్ (2)ముక్తీశ్వరాష్టకమ్ (3)ముక్తీశ్వర వర్ణ మాలాస్తోత్రమ్ (4) శ్రీవేంకటేశ్వర శరణాగతిః (5) ఆర్యాశతకమ్ (వేంక టేశ్వరస్తుతిః) (6) శ్రీ చన్ద్ర శేఖరేన్ద్ర సరస్వతీ వద్యకునువెూపహారః (7)శ్రీరామకృష్ణ పరమ హంస స్తుతిః (8)శ్రీరాఘవేంద్రాష్టకమ్ (9)శ్రీచన్ద్ర శేఖరభారతీశరణాగతిః (10)వివిధ స్తుతయః

65. 1994 శ్రీమద్రామాయణమ్ : సుందరకాండ : టీకాతాత్పర్యాలు

66. 1995 శ్రీమద్రామాయణమ్ : యుద్ధకాండ-1 టీకాతాత్పర్యాలు

67. 1994 శ్రీమద్రామాయణమ్. ఉత్తరకాండ PART-I టీకాతాత్పర్యాలు

68. 1994 చాణక్య నీతి సూత్రాణి: తెలుగు అనువాదం

69. 1995 శ్రీమద్రామాయణమ్ : యుద్ధకాండ PART-II టీకాతాత్పర్యాలు

70. 1995 సంస్కృత వ్యాఖ్యాన - విమర్శ సంప్రదాయం

71. 1995 శ్రీమద్రామాయణం ఉత్తరకాండ PART-II టీకా తాత్పర్యాలు

72. 1995 నీతివాక్యామృతమ్ : తెలుగు అనువాదం

73. 1995 నాగానందము : తెలుగు అనువాదము

74. 1995 కావ్యప్రకాశః : తెలుగులో విస్తృత వ్యాఖ్య

75. 1996 శ్యామలాదండకం : తెలుగు వ్యాఖ్య

76. 1996 Some unexplored aspects of the Rasa theory. B.M. చతుర్వేదిగారి హిందీ మూలానికి ఆంగ్లానువాదం)

77. 1996 వైజ్ఞానిక షాణ్ముఖమ్ : సంస్కృతంలో

78. 1997 కోఽసై రసః? సంస్కృతంలో

1998 న్యాయశాస్త్రవేత్తలలో రాజనీతి విశారదుడు : జస్టిస్ అల్లాడి కుప్పుస్వామిగారి ఆంగ్ల మూలానికి తెలుగు అనువాదం.

79. 1998 ధ్వన్యాలోకః : సంస్కృత మూలానికి తెలుగులో విస్తృత వ్యాఖ్య.

80. 1998 ధ్వన్యాలోకలోచనమ్ : తెలుగులో విస్తృత వ్యాఖ్య

81 1998 Egalitarian and peace seeking trait of the Indian mind.

82. 1999 కౌటిల్యస్య అర్థశాస్త్రమ్ : తెలుగులో వివరణాత్మకాను వాదం

83. 1999 అలంకారశాస్త్రము - ఆధునిక సాహిత్యము

84. 1999 The Upanishadic Philosophy

85. 2000 జగద్వంద్యులైన జగద్గురువు : శృంగేరి పీఠాధిపతులు జగద్గురు శ్రీ భారతీ తీర్థ స్వాములవారి చరిత్ర

86. 2000 బ్రహ్మసూత్ర శాంకరభాష్యమ్. తెలుగులో విస్తృత వ్యాఖ్య (రెండు సంపుటములు)

87. 2000 అధ్యాత్మరామాయణము. టీకాతాత్ప ర్యములు (ఒక శిష్యమణి సహకారంతో)

88. 2000 Influence of Sanskrit on Telugu - Language and Literature.

89. 2001 ఆదిత్య సుప్రభాత స్తోత్రమ్

90. 2001 శ్రీభగవద్గీతా శాంకర భాష్యమ్ : తెలుగులో విస్తృత వ్యాఖ్య

91. 1949 1949లో రచించబడిన హిందీ - తెలుగు నిఘంటువును ఒక పుస్తక ప్రచురణకర్త తనపేర ప్రకటించుకున్నాడు.